# రామాయణ విషవృక్షం

[3 భాగాలూ కలిసిన సంపుటం]



రంగనాయకమ్మ

# రామాయణ విషవృక్షం

## [ 3 భాగాలూ కలిసిన సంపుటం ]

ఈ సంపుటంలో, చిట్ట చివర్లో,
4 వ ముద్రణ సమయంలో ( 2012 లో ) కొన్ని
కొత్త వ్యాసాలు చేర్చాను. ఆ కొత్త వ్యాసాలు
కూడా 'రామాయణం' కధకు సంబంధించినవే.
వాటి వివరాలన్నీ అక్కడే తెలుస్తాయి.

## రంగనాయకమ్మ

**స్వీట్ హోమ్ పబ్లికేషన్స్**
76, లేక్-సైడ్ కాలనీ
( దుర్గం చెరువు దగ్గిర )
జూబ్లీ హిల్స్ పోస్టు
**హైదరాబాదు - 500 033**

రామాయణ విషవృక్షం
( కథలూ, వ్యాసాలూ, ఫుట్‌నోట్లూ )

పేజీలు : 756
[ రాయల్ సైజులో
హార్డ్ బౌండ్ తో ]
ధర : 250 రూ.లు

3 భాగాలూ కలిసిన
ఈ సంపుటానికి,
**1** వ ముద్రణ : 2005 మార్చి
**2** వ ముద్రణ : 2006 అక్టోబరు
**3** వ ముద్రణ : 2008 మే
**4** వ ముద్రణ : 2012 ఫిబ్రవరి

అట్టల మీద బొమ్మలు : **త్రిగుణ్**

కంపోజింగ్ & పేజ్ మేకప్ :
**ఎన్. ధనలక్ష్మి, ఎన్. రఘురామయ్య**

**ముద్రణ :**
చరితా ఇంప్రెషన్స్
1-19-1126/బి,
ఆజామాబాదు ఇండిస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 520 020.

**బైండింగ్:**
వై.వి. రెడ్డి బైండింగ్ వర్క్స్,
మూసారాంబాగ్, హైదరాబాదు - 36.

**ప్రతులకు :**
అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ - 520 002
(ఫోన్ : 0866-2431181)

రంగనాయకమ్మ అడ్రసు :
76, లేక్ సైడ్ కాలనీ
( దుర్గం చెరువు దగ్గిర )
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# విషయ సూచిక

[ఈ పుస్తకం, మొత్తం 4 భాగాలుగా ఉంది]

ముందు మాట పేజీ **6**

## 1వ భాగం

పీ ఠి క **9**

## 2వ భాగం

వి ష వృ క్షం ప్రా రం భం

[ఈ భాగంలో: ఉపోద్ఘాతం, 16 కథలూ, 11 లింకులూ, 4 వ్యాసాలూ, 504 ఫుట్‌నోట్లూ ఉన్నాయి]

**ఉపోద్ఘాతం: 'రామాయణం'లో బాలకాండ ప్రారంభం 89**

**1.** **ఇదీ రామాయణం!**.............. (కథ-1)......... 96

**2.** లింకు-1 (మొదటి కథ తర్వాత 2వ కథ వరకూ)....... 114

**3.** **చెప్పుల పాలైన సింహాసనం!**.. (కథ-2)...... 125

**4.** లింకు-2................................................ 239

**5.** **ఇలాగే జరిగింది!** ................. (కథ-3)....... 253

**6.** లింకు-3................................................ 266

**7.** **అతని కంటే ఘనుడు!** .......... (కథ-4)....... 270

**8.** లింకు-4................................................ 281

**9.** **రావొద్దంటే విన్నదా!** ............. (కథ-5)....... 287

**10.** లింకు-5................................................ 305

**11.** **కామ శాస్త్రులు!...............** (కథ-6)....... 312

**12.** **తోడు దొంగలు!**
[రాముడూ - సుగ్రీవుడూ].......... (కథ-7)....... 322

**13.** **స్నేహ బండారం!.............** (కథ-8)....... 365

**14.** లింకు - 6 .............................................. 390

**15.** **సీతా రావణులు**.................. (కథ-9)....... 407

**16.** లింకు - 7 .............................................. 428

**17.** **కాణీ ఖర్చులేని బహుమానం** (కథ-10) .. ... 438

**18.** **ఎంతో ఉత్తముణ్ణి!**
**ఎన్ని కష్టాలో నాకు!!** .......... (కథ-11)....... 458

**19.** **మూడో దొంగ!**
[విభీషణుడు] ....................... (కథ-12)....... 473

**20.** లింకు - 8 .............................................. 492

**21.** **రాముడు పోయాడా?** ......... (కథ-13)....... 499

**22.** లింకు - 9 .............................................. 506

**23.** **పంచాయితీ! ................** (కథ-14)....... 562

**24.** లింకు- 10.............................................. 576

**25.** **చెప్పుల చోట్లో రాముడు!** .... (కథ-15)....... 579

**26.** లింకు- 11.............................................. 598

**27.** **రామ రాజ్యం సొగసు!......** (కథ-16)....... 611

**28.** రామాయణం చదివినా, విన్నా లాభాలేమిటి? ....... 639

**29.** కవిగా వాల్మీకి .......................................... 642

**30.** దేవుళ్ళూ - భక్తీ........................................ 653

**31.** రామాయణ సంస్కృతిని ఎందుకు  తిరస్కరించాలి? 655

# 3వ భాగం

## కొందరు రామాయణ విమర్శకులు 657

[ఈ భాగంలో, **8** మంది విమర్శకులు ఉన్నారు]

**1.** నార్ల వెంకటేశ్వర రావు గారి ప్రక్షిప్తాల పరిశీలన ......... 657
★ సుబ్బయ్య పంతులు గారి
ప్రక్షిప్తాలు లేని పవిత్ర రామాయణం! .................. 667
★ వెంకన్న, 'విషవృక్షాన్ని ఒప్పుకుంటాడా? .............. 672

**2.** కొడవటిగంటి కుటుంబ రావు గారి సమీక్ష గురించి:
రామాయణం సాహిత్యం కాదా? ............................ 673

**3.** కొత్త సత్యనారాయణ చౌదరి గారి
"రామాయణ రహస్యాలు" .................................. 683

**4.** త్రిపురనేని రామస్వామి చౌదరి గారి "శంబుక వధ" ..... 692

**5.** సురవరము ప్రతాపరెడ్డి గారి
"రామాయణ విశేషములు" ................................. 701

**6.** ముద్దుకృష్ణ గారి "అశోకం" ................................. 709

**7.** చలం గారి "సీత అగ్నిప్రవేశం" ............................ 715

**8.** పెరియార్ ఇ.వి.రామస్వామి గారి
"రామాయణ – ఎ ట్రూ రీడింగ్" .......................... 719

# 4వ భాగం

## 'విషవృక్షం' మీద కొన్ని అభిప్రాయాలు 733

[అనుకూలమైనవీ, వ్యతిరేకమైనవీ కూడా]

★

# ముందు మాట

**'రా**మాయణ విషవృక్షం' ఇప్పటి వరకూ **3** భాగాలుగా (3 వేరు వేరు పుస్తకాలుగా) ఉంది. కానీ ఇప్పటి నించీ ఆ **3** భాగాలూ ఒకే సంపుటంగా (ఒకే పుస్తకంగా) కలిసిపోతున్నాయి.

'విషవృక్షం'లో **మొదటి** భాగాన్ని 1974లోనూ, **2**వ భాగాన్ని 1975లోనూ, **3**వ భాగాన్ని 1976లోనూ రాశాను. ఆ నాటి నించీ ఇప్పటి వరకూ **మొదటి** భాగం 7 ముద్రణలూ, **2**వ భాగం 6 ముద్రణలూ, **3**వ భాగం 4 ముద్రణలూ వచ్చాయి. ఇప్పుడు ఇది, అన్ని భాగాలూ కలిసిపోయిన సంపుటానికి మొదటి ముద్రణ.

ఈ భాగాలు వేరు వేరుగా ఉన్నప్పుడు, వాటికి వేరు వేరు పీఠికలు రాశాను. అంతే కాదు, ఒక భాగానికి రీప్రింటు జరిగినప్పుడల్లా అందులో ఒకటో రెండో సవరణలు చేస్తూ, కొత్త ముందు మాటలు రాస్తూ వచ్చాను.

ఇప్పుడు, అన్ని భాగాలూ కలిసిపోయిన ఈ సంపుటం కోసం, కొన్ని మార్పులు చేశాను. వాటిని పాఠకులకు చెప్పాలి.

**1.** వాల్మీకి రామాయణానికి గతంలో చదివిన అనువాదాల్ని ఇప్పుడు మళ్ళీ చూశాను. ఎక్కడ ఏ సందేహం కలిగినా, అనువాదాల్నీ, వాటికి మూలం అయిన శ్లోకాల్నీ, మళ్ళీ మళ్ళీ చూసి స్పష్టం చేసుకున్నాను. కొన్ని సందర్భాల్లో, అనువాదకులు చేసిన పొరపాటు వ్యాఖ్యానాల్ని గతంలో నేను యధాతధంగా తీసుకున్నట్టు గమనించి అలాంటి పొరపాట్లు సవరించాను.

**2.** అనువాదాలతో సంబంధం లేకుండా నా పొరపాట్లు కూడా కొన్ని జరిగాయి. ఉదా: తాటకిని గురించి చెప్పిన చోట, తాటకి 'విల్లు' పట్టుకున్నట్టు గతంలో రాశాను. కానీ, వాల్మీకి మూలంలో, తాటకి, విల్లు ఉపయోగించదు. అలాగే, శూర్పణఖ, రాముడితో మాట్లాడుతూ, 'సీతా స్వయంవరానికి మా అన్న కూడా వెళ్ళాడు' అని చెప్పినట్టు గతంలో రాశాను. కానీ, వాల్మీకి మూలంలో అది లేదు. ఇలా, కొన్ని సందర్భాల్లో మూలాన్ని మళ్ళీ చూసి అలాంటి పొరపాట్లన్నీ తీసేశాను.

**3.** గతంలో, **'మందర'** పాత్రని ఇవ్వలేదు. ఇప్పుడు ఆ పాత్రని కూడా చేర్చాను.

**4.** 'పీఠిక'లో అక్కడక్కడా తగ్గింపులూ, అక్కడక్కడా హెచ్చింపులూ, రెండూ చేశాను. ముఖ్యంగా, శ్రమ దోపిడీలో 'అదనపు విలువ'ని వివరించే భాగాల్ని ఇప్పుడు తీసేశాను. ఎందుకంటే, ఇప్పుడు ఆ విషయాలు 'కాపిటల్ పరిచయం' ద్వారా తెలుసుకోవడానికి వీలుంది. గతంలో, ఈ పీఠిక రాసే నాటికి, ఆ పుస్తకం లేదు. 'రామాయణ' కథా కాలం కన్నా ఎన్నో వేల సంవత్సరాల కిందటే ప్రారంభమైపోయిన బానిసత్వం, శ్రమ దోపిడీ, ధనిక పేద తేడాలూ – వంటి విషయాల గురించి చెప్పకుండా రామాయణ సంస్కృతిని విమర్శిస్తే, అది అర్ధం కాదు. కాబట్టి, అప్పుడు ఆ నాటికి నాకు చేతనైన పద్ధతిలో పీఠికలోనే ఆ విషయాలు

చెప్పడానికి ప్రయత్నించాను. కానీ, శ్రమ దోపిడీ గురించి తెలుసుకోవడం 'కాపిటల్' ద్వారా సాధ్యమైనట్టు ఇంకే రకంగానూ సాధ్యం కాదు. ఇప్పుడు 'కాపిటల్ పరిచయం' వుంది కాబట్టి, ఆ విషయాన్ని ఈ పీఠిక నించి తగ్గించినా ఇబ్బంది వుండదు. అందుకే, ఆ విషయాలు తగ్గించి పీఠికని కొంచెం క్లుప్తంచేశాను.

**5.** ఆర్థిక విషయాలు చెప్పడంలో గత ముద్రణల్లో కొన్ని పొరపాట్లు చెయ్యడమూ, వాటి మీద తర్వాత ముద్రణల్లో కొత్త ఫుట్ నోట్లు ఇవ్వడమూ చేస్తూ వచ్చాను కదా? అలాంటి పొరపాట్ల గురించి ఇప్పుడేం చేశానంటే, అవసరమైన సవరణలన్నీ అసలు పాఠంలోనే చేసి, వాటి మీద వున్న ఫుట్ నోట్లు తీసేశాను. అంతే కాదు. సవరణలతో సంబంధం లేని ఫుట్ నోట్లని కూడా, అంటే, ఆ ఫుట్‌నోట్లలో విషయాల్ని, అసలు పాఠంలోకే మార్చాను. ఇప్పుడు 'పీఠిక'లో ఫుట్ నోట్లు వుండవు.

**6.** కథల్లోనూ, లింకుల్లోనూ మార్పులు లేవు. కానీ, ఎక్కడైనా సవరణలు అవసరమైన చోట్ల చిన్న చిన్న మార్పులు తప్పలేదు. కథలకు వున్న ఫుట్ నోట్లలో పొరపాట్లు లేని సందర్భాల్లో కూడా, క్లుప్తత కోసం అక్కడక్కడా తగ్గించాను. అంతే కాదు, వాల్మీకి మూలం నించి ఎక్కువ ఆధారాలు చూపించడం కోసం ఇప్పుడు గతంలో కన్నా ఎక్కువ ఫుట్ నోట్లు ఇచ్చాను. దాని వల్ల కథల్లో ఫుట్ నోట్లు పెరిగాయి. లింకుల్లో కూడా బ్రాకెట్లలో ఇచ్చే వ్యాఖ్యలు గతంలో కన్నా పెరిగాయి.

**7.** 'కైక కోరిన వరాలు' అమలు జరిగాయా, కవి, ఏక పత్నీ వ్రతాన్ని బోధించాడా-వంటి విషయాల గురించి ఇప్పుడు వివరణలు పెరిగాయి. 'వెంకన్న విషవృక్షాన్ని ఒప్పుకుంటాడా?' లాంటి చిన్న శీర్షికలు ఇప్పుడు కొత్తగా చేరాయి.

**8.** గతంలో, 'విషవృక్షం', 3 పుస్తకాలుగా వేరు వేరు కాలాల్లో వచ్చింది కాబట్టి, (వాటి రీప్రింట్లు కూడా వేరు వేరు సమయాల్లో వచ్చాయి కాబట్టి), వాటికి వేరు వేరు పీఠికలు రాశాను. ఇప్పుడు, ఆ పీఠికల్లో నించి కొన్ని భాగాల్ని తీసి వెయ్యడమూ, కొన్ని భాగాల్ని వేరే చోట్లకు మార్చడమూ చేశాను. ఉదా: నార్ల వెంకటేశ్వరరావు గారి మీదా, కొడవటిగంటి కుటుంబరావు గారి మీదా వున్న వ్యాసాలు, గతంలో, 2వ భాగం తాలూకు ముందు మాటలో వున్నాయి. వాటిని ఇప్పుడు, 'కొందరు రామాయణ విమర్శకులు' భాగంలోకి మార్చాను.

మొత్తం మీద ఇలాంటి మార్పుల వల్ల ఏం జరిగిందంటే – పీఠికలో గానీ, ఫుట్ నోట్లలో గానీ, ఇతర వ్యాసాల్లో గానీ, అన్ని పేరాలూ గత ముద్రణల్లో వున్నట్టే వుండకపోవచ్చు. కొన్ని పేరాలు అసలే లేకపోవచ్చు కూడా. కానీ, దీనివల్ల 'విషయం'లో మార్పేమీ జరగదు. గతంలో కన్నా ఎక్కువ సరిగానూ, ఎక్కువ తేలికగానూ చెప్పడానికే ఈ మార్పులన్నీ అవసరమయ్యాయి.

రంగనాయకమ్మ
17-2-2005

"ప్రతీ యుగంలోనూ ప్రజలను శాసించే భావాలు, ఆ నాటి పాలక వర్గ భావాలే.

సమాజంలో విప్లవం తెచ్చే భావాలు – అని ఎవరైనా అన్నారంటే, పాత సమాజంలో కొత్త సమాజ బీజాలు మొలకెత్తాయన్న మాట! పాత సమాజ పరిస్తితులతో పాటు, పాత భావాలు క్షీణిస్తున్నాయన్నమాట!

బూర్జువా దృష్టికి, వర్గ ఆస్తి అదృశ్యం కావడం ఉత్పత్తే అదృశ్యం కావడంగా ఎలాగైతే కనపడుతుందో అలాగే, ఆ దృష్టికి, వర్గ సంస్కృతి అదృశ్యం కావడం మొత్తం సంస్కృతే అదృశ్యం కావడంగా కనపడుతుంది. ఏ సంస్కృతి పోతుందని బూర్జువా ఏడుస్తాడో ఆ సంస్కృతి, అధికాధిక ప్రజలకు యంత్రాల్లా శ్రమచేసే శిక్షణ మాత్రమే" – **మార్క్సు ఎంగెల్సులు**

(కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక)

★ ★ ★

"నిన్ను నువ్వు తెలుసుకో" అంటారు వేదాంతులు.

అవును, మార్క్సిస్టులు కూడా అదే అంటారు!

"నిన్ను నువ్వు తెలుసుకో!

నువ్వు ఏ వర్గమో తెలుసుకో!"

–ఒక మార్క్సిస్టు

# 1వ భాగం

# పీ ఠి క

ఈ పుస్తకం మొహం చూసిం తర్వాతో, నాలుగు ముక్కలు చదివిం తర్వాతో, ఒక అగ్గి పుల్ల గీసి అంటించాలని బుద్ధి పుట్టవచ్చు ధర్మాత్ములకు! అంటిస్తే తగలబడేవి కాయితాలేగానీ ఆలోచనలు కావు. అవి, చరిత్ర అనుభవాలనుంచే సహజ గతిలో పుట్టి పెరుగుతాయి. ఈ సత్యాన్ని విస్మరించి ప్రయోజనం లేదు.

రామాయణానికి 'విషవృక్షం' అని పేరు పెట్టడం ఎంత హేతువాదుల్ని అయినా తట పటాయించేటట్టు చేస్తే, ఆ దోషం రామాయణానిదే గానీ నాది కాదు. ఈ 'విష వృక్షం' ఏ విత్తులోంచి మొలకెత్తిందో, ఇది ఇంత కాలం ఏ విష సర్పాలకు ఆశ్రయం ఇస్తోందో తెలిస్తే, ఈ పేరు దీనికి ఎంత ఖచ్చితంగా సరిపోతుందో అర్థమవుతుంది.

ఈ పుస్తకం — పిడివాదాల పండితులకూ, గుళ్ళ దాసుళ్ళకూ, సూట్లు వేసే భక్తులకూ, కట్టూ బొట్టూ జుట్టూ మార్చడమే అభ్యుదయమని విర్ర వీగే మూర్ఖ స్త్రీ రత్నాలకూ — కాదు. మనసుల్లో ఇంకా ఏ స్వార్థమూ ఏ మౌఢ్యమూ ప్రవేశించక, కంటికి కనబడే వాస్తవాలకూ, ఆలోచనలకూ, నిష్కల్మషంగా, చైతన్యవంతంగా, మనసులు తెరిచే చిన్నపిల్లల కోసమూ; వారపత్రికలూ, సామాన్య నవలలూ తప్ప, ఇతర ఆలోచనలతో గానీ, ఇతర జ్ఞానంతో గానీ పరిచయం లేని యువతీ యువ కుల కోసమూనూ!

ఇది — ఈ వర్గ వ్యవస్థలో, తర తరాలుగా ఆర్థిక, సాంఘిక, రాజకీయ దోపిడీలకు గురి అవుతూ, విముక్తి లేని నికృష్ట దయనీయ జీవితా లలో మగ్గుతోన్న అశేష ప్రజానీక ప్రయోజనాల కోసం ఏ కొంచెమైనా ఉపయోగపడాలని నా ఆశ!

"పాతనంతా తిరస్కరించడమే అభివృద్ధి అనుకుంటారు కొందరు" అనేది, నూతనమైన ఆలోచనలమీద ఒక విమర్శ! కానీ, ఇది 'పాత' కాదు, 'పాత' అయిపోలేదు. 'రామాయణం' ప్రచారం చేసే విలువలూ, సంస్కృతీ ఈ నాటికీ నిత్య జీవితాల్లో ప్రతిబింబిస్తూనే వున్నాయి. ఈ నాటి సాంఘిక సమస్యలకు 'రామ నామ జపాన్ని' పరిష్కారంగా చెప్పే ఏ ఒక్క సంఘటన అయినా చాలు — ఆ గ్రంథం 'పాతదయిపోలేదని' నిర్ణ యించడానికి!

ఈ ప్రయత్నానికి అర్థం — పాతనంతా తిర స్కరించడం కాదు. 'పాత' అంతా మానవ చరిత్రే. ఆ 'చరిత్ర పరిణామం'లో, రామాయణ పుట్టు పూర్వోత్తరాల్నీ, దాని స్వభావ స్వరూపాల్నీ, దాన్ని నిత్యం ప్రచారం చేసే వ్యవస్థ నిజ స్వరూపాన్నీ, వీటిని స్పష్టం చెయ్యడమే, దీని లక్ష్యం.

"'రామాయణాన్ని' అనేక మంది కవులు అనేక రకాలుగా రాశారు. వాల్మీకినే ఆధారం చేసుకుని కూడా రక రకాల కథలు వచ్చాయి. వాటిలో దేన్ని ఆధారంగా తీసుకోగలం?" అన్నది ఒక ప్రశ్న. దేన్ని ఆధారంగా తీసుకున్నా వాటన్నిటి లక్ష్యమూ ఒకటే. ఈ విషయం ఈ పీఠికలోనే ముందు ముందు వివరంగా చూస్తాం.

"అసలు రామాయణం జరిగిందా, లేదా? 'జరిగింది' అయితే, అందులో మనుషులందరూ ఎప్పుడో చచ్చిపోయారు కదా? వాళ్ళని గురించి ఇప్పుడు తర్జన భర్జనలు చేసి ఏం లాభం? 'జరగనిది' అయితే, ఒక కట్టు కథని గురించి

ఇంతగా ఆలోచించి ఏం ప్రయోజనం?" అనేవి కూడా చాలా ముఖ్యమైన ప్రశ్నలు. కానీ, రామాయణం 'జరిగింది' అయినా, 'జరగంది' అయినా, మనకు కావలసింది అందులోంచి బయటపడే 'విషయాలు.' రాముడు, కొన్నాళ్ళు బతికిన మనిషి అయినా, లేదా ఒక కవి సృష్టించిన 'పాత్ర' అయినా, రెండూ ఒకటే.

**ఈ కథ వల్ల మనకు స్పష్టమయ్యేది ఇదీ:**

★ సమాజం అప్పటికే ధనిక, పేద వర్గాలుగా విడిపోయి వుంది.

★ దశరథుడూ, రాముడూ, రావణుడూ వంటి రాజులు, ధనిక వర్గ ప్రయోజనాల కోసం నిరంకుశంగా రాజ్యాలు పరిపాలించిన ధనిక వర్గ ప్రతినిధులు. అసలు వాళ్ళే స్వయంగా భూములూ సిరి సంపదలూ గల ఆస్తిపరులు. ధనికులు.

★ స్త్రీలు అస్వతంత్రులుగా, వ్యక్తిత్వ శూన్యులుగా, పురుషాధికారపు అంధకారంలో జీవచ్ఛవ జీవితాలు గడిపారు.

★ సామాన్య ప్రజానీకం — పేదతనంలో, కుల భేదాలలో, ముష్టితనంలో, వేశ్యావృత్తిలో, మత మౌఢ్యంలో, ఒక జాతి ఇంకో జాతినీ ఒక వర్గం ఇంకో వర్గాన్నీ పీడించే యుద్ధాలలో, వెయ్యి నిలువుల లోతున కూరుకుపోయి వున్నారు.

★ పాలక వర్గ దోపిడీ సాహిత్యమూ, దోపిడీ సంస్కృతీ, సూక్ష్మక్రిములై ప్రజల అస్తుల్నీ, ఆత్మల్నీ పట్టేశాయి.

ఈ రకంగా, ఆ కాలపు ఆర్థిక రాజకీయ సాంఘిక ధర్మాలూ, నీతులూ 'రామాయణ కథ'లో కనపడతాయి. కొన్ని, ఈ కాలానికి కూడా అదే రూపంలోనూ; కొన్ని, కొంత మార్పులతోనూ చెలామణీ అవుతున్నాయి. ఇదే మనకు ముఖ్యం. రామాయణం 'జరగడం' మీదా, 'జరగకపోవడం' మీదా, ఈ విషయాల్లో మార్పేమీ రాదు.

# రామ కథ

'రామాయణం' గురించి మొదట కొంచెంగా చూద్దాం. వేలాది సంవత్సరాల నుంచీ, కోట్లాది ప్రజలు, 'రామ కథ' మీద భక్తి శ్రద్ధలు చూపిస్తు న్నారు. 'రామ' అన్న శబ్దం విన్నంతనే మనసు పులకించి చేతులు జోడిస్తారు. దానికి కారణం, ఆ పాత్రమీద ప్రజలకు ఉన్న అపారమైన గౌరవం! నమ్మకం! అంత గౌరవానికీ, అంత నమ్మకానికీ, అంత పూజ్యతకీ, రాముడు అర్హుడేనా? — ఈ ప్రశ్న, 'మహా పాపం'లాగ కనపడ వచ్చు.

'రామాయణం' గురించి సాధారణంగా అందరికీ తెలిసిన కథేమిటంటే: రాముడికి న్యాయంగా రావలసిన రాజ్యం ఇవ్వకుండా తండ్రి అతన్ని అరణ్యాలకు పంపించేశాడు. రాముడు, భార్య అయిన సీతతో సహా నానా బాధలూ పడుతూ అడవుల్లో జీవిస్తూ వుంటే, అక్కడ కూడా సుఖం లేకుండా ఒక దుర్మార్గుడు సీతని ఎత్తుకుపోయాడు. రాముడు దుఃఖ సముద్రంలో మునిగిపోయి — తర్వాత తన వీరత్వంతో యుద్ధం జేసి, ఆ దుర్మార్గుణ్ణి చంపి, భార్యని తెచ్చుకున్నాడు. రాజ్యానికి వచ్చి ప్రజల్ని సుఖంగా పరిపాలిస్తూ వుంటే, మళ్ళీ ఆ భార్యా భర్తలకు వియోగం! ఈ విధంగా మొదటినుంచీ చివరి వరకూ కథ వింటోంటే వొకటే కష్టాలు! శోకం! శోకం! శోకం! గుండెలు కరిగి ప్రవహించేన్ని కన్నీళ్ళు కారుస్తారు ఒక్కొక్కరూ!

ఈ కథంతా ఇలాగే నిజమైతే, ఎవరి గుండె అయినా కరగవలసిందే. కానీ, రామాయణంలో కథ ఇదేనా? నిజం ఇంతేనా? వాల్మీకి రాసిన కథ ప్రకారమే చూసినా, అసలు, రాముడికి తండ్రి

రాజ్యంమీద హక్కు వుందా? అతన్ని అడవులకు పంపడం అన్యాయంగానే జరిగిందా? అడవుల్లో రాముడు నిజంగా రాజకీయాలకు దూరంగా 'ఋషిత్వంతో' గడిపాడా? అతనికి నిజంగా పితృ భక్తి వుందా? అతను నిజంగా వీరుడేనా? అతను రావణుడితో యుద్ధం, భార్య కోసమే చేశాడా? తర్వాత కాలంలో ప్రజల్ని సుభిక్షంగా పరిపాలించాడా? — ఇటువంటి అనేక నిజానిజాలు, రాముణ్ణి పూజించే ఈ కోట్ల జనంలో ఎంత మందికి తెలుసు? ఇలాంటి విషయాలు ఎప్పుడైనా ఏ హరి కథకులైనా, ఏ పండితులైనా, దాపరికాలు లేకుండా చెప్పారా? అసలు ఈ విషయాలు వారికైనా తెలుసా?

ప్రజల్లో చదువుకున్నవారే తక్కువ. అందులోనూ కావ్యాలూ పురాణాలూ చదివేవారు మరీ తక్కువ. అందరూ ఇలాంటి కథల్ని హరిదాసుల ద్వారానో, జముకుల కథకుల ద్వారానో, జానపద గీతాల ద్వారానో, పురాణాలు చెప్పే పండితుల ద్వారానో వింటూ వుంటారు. పురాణ పండితులు తప్ప మిగతా వారెవ్వరూ అసలు రామాయణం కథ చదివి వుండరు. జముకుల కథలు చెప్పేవారూ, జానపద గీతాలు పాడేవారూ, హరికథలు చెప్పేవారూ కూడా వంశపారంపర్యంగా వచ్చే పాటలూ కథలూ మాత్రం నేర్చుకుని, వాటినే జనానికి చెప్పి పొట్టపోసుకుంటూ వుంటారు. అసలు కథ వీరికి కూడా తెలీదు.

తెలిసేది — ఒక్క పండితులకే. కానీ వారు, ఉన్నది ఉన్నట్టు చెప్పరు. అంటే, ఈ కథని అసలు కవి అయిన వాల్మీకి చాలా నిజాయితీగా రాశాడనీ, దాన్ని ఈ పండితులే ప్రజలకు చెప్పడం లేదనీ – కాదు.

'రామాయణం' కథ వాల్మీకికన్నా పూర్వం నించీ కూడా ప్రచారంలో వుండి వుంటుంది. అలా వున్న కథని, ఆ కవి, తన కవిత్వంతో, శ్లోకాలలోకి తెచ్చాడు. అలా కథని తయారు చేసేటప్పుడు అనేక మర్మాలతో చెప్పాడు. ఎన్ని మర్మాలతో చెప్పినా, ఆ కవి, కొన్ని సందర్భాల్లో అయినా కొన్ని నిజాలు చెప్పక తప్పలేదు. కానీ, ఈ పండితులు, ఆ మాత్రం నిజాల్ని కూడా (కవి చెప్పిన వాటిని కూడా) జనాలకు తెలియనివ్వరు. ఈ విషయాలన్నీ ఇందులో కథలు చదివేటప్పుడు వివరంగా అర్థమవుతాయి.

ప్రజల వరకూ చేరే ఏ కథలూ, మర్మాలూ ముసుగులూ లేనంత సత్యంగా, స్పష్టంగా బయటకు రావు. ఉదాహరణకి — రాముడు జ్యేష్ఠ కుమారుడైనా, అతనికి తండ్రి రాజ్యం మీద హక్కు లేదు! రాజ్యం భరతుడిదే! ఎందుకంటే, దశరధుడు కైకని పెళ్ళి చేసుకునేటప్పుడు, కైక బిడ్డకే రాజ్యం ఇస్తానని వాగ్దానం చేసి వున్నాడు. <u>ఈ విషయం వాల్మీకి రాసిందే. ఇది రామాయణాని కంతటికీ ఆధారమయినంత ముఖ్య విషయం.</u> ఇంత ముఖ్య విషయాన్ని కవి చాలా అల్ప విషయంగా ఒక మూలకు తోసేసి, దాని సంగతి ఎప్పటికో ఎత్తాడు! రాముడు అడవుల్లో వున్నప్పుడు .... అప్పుడు బైటపడింది ఆ విషయం! పైగా, రాముడి నోటి ద్వారానే! అంటే, ఆ సంగతి రాముడికి మొదటినించీ తెలుసన్న మాట!

రాముడికి, భరతుడి హక్కు సంగతి తెలియక పోవడం వల్లనే పట్టాభిషేకానికి సిద్ధపడితే, అది రాముడి తప్పు అవదు. కానీ, ఆ విషయం తెలిసి కూడా రాముడు పట్టాభిషేకానికి సిద్ధపడ్డాడంటే, అది రాముడి కపటత్వం అవదూ? 'భరతుడి హక్కు సంగతి రాముడికి కూడా తెలుసు' అన్నట్టు కవి ఎందుకు రాశాడు? 'రాముడికేమీ తెలియకే పట్టాభిషేకానికి అంగీకరించాడు' అన్నట్టే కథ నడపవచ్చు కదా? కవి అలా ఎందుకు చెయ్యలేదు? — ఇలాంటి సందేహాలు చాలా వస్తాయి మనకి. కానీ, ఈ కథలో కొన్ని సందేహాలకు జవాబులే దొరకవు.

రాముడి పాత్రమీద కవికి ఎంత మూఢభక్తి

అంటే, ఆ పాత్ర ఏం చేస్తే అదే సత్యం! భరతుడి హక్కు సంగతి తెలిసి కూడా రాముడు పట్టాభిషేకానికి సిద్ధమైతే, అలా సిద్ధమైనవాడు రాముడు కాబట్టి, అదే ధర్మం! 'శ్రీరాముడిలో దోషం చూడ వచ్చునా?' అనే మూర్ఖత్వంతో వుంటాడు కవి. అలాంటి కవి ఆ పాత్రని నడపడంలో ఏం జాగ్రత్త వహిస్తాడు? అసలు శ్రీరాముడి పాత్రని కవి నడపడం కాదు, ఆ పాత్రే కవిని నడుపుతుంది. కవి, ఆ పాత్రని పూజిస్తూనే కథని నడుపుతాడు. ఆ పాత్రకి భజన చెయ్యడమే కవి పని. అలాంటప్పుడు, ఆ పాత్ర గురించి జాగ్రత్త పడవలసిన అవసరం కవికి ఎలా కనపడుతుంది?

'రాజ్యం భరతుడికే హక్కు' అనే నిజం కథలోనే వుంది. అలాంటప్పుడు, దాన్ని మభ్యపరిచి కథని ఇంకో దారిన నడపడమూ, రాముడికేదో అన్యాయం జరిగినట్టు జనాల్ని నమ్మించాలని చూడడమూ, జనం దాన్ని నిజంగానే నమ్మడమూ — ఇవన్నీ ఎంత హాస్యాస్పదమైన విషయాలు! ఎంత మోసకారి విషయాలు!

రాముడికి రాజ్యంమీద హక్కే లేనప్పుడు, ఇక రాముడికి జరిగిన అన్యాయం ఏముంది? రాముడికి రాజ్యం దక్కలేదని అందరూ శోకాలు పెట్టడంలో అర్థం ఏముంది? దశరథుడు, చివరికి, రాజ్యాన్ని భరతుడికి ఇవ్వడానికే ఒప్పుకున్నాడంటే, రాజ్యం భరతుడిదే అని తేలినట్టే కదా? భరతుడి హక్కే నిజం అయితే, రాముడి హక్కు అబద్ధం అయిపోవలసిందే కదా? 'రామాయణం' కథే, దాని 'గొప్పతనమే' అబద్ధం అయిపోతుంది కదా?

కవి, 'భరతుడి హక్కు' గురించి ఎందుకు చెప్పాడంటే, 'ఒక సత్యాన్ని దాచకుండా చెపుదాం' అని కాదు. ఆ కథ ప్రకారం, ఆ అంశాన్ని కూడా చెప్పక తప్పదు కాబట్టి, దాన్నికూడా చెప్పాడు. ఒక వ్యక్తి, కొన్ని విషయాల గురించి మాట్లాడుతూ వుంటాడనుకుందాం. అందులో కొన్ని సంగతులు చెప్పడం అతనికి ఇష్టం లేకపోతే వాటిని మరుగు పర్చాలనే ప్రయత్నిస్తాడు. కానీ, అతని నిర్లక్ష్యం వల్లనో, తెలివి తక్కువతనం వల్లనో, ఒక మాటకీ, ఇంకో మాటకీ పొంతన లేనివిధంగా మాట్లాడితే, అతని మాటల్లోనే అతను దాచబోయిన విషయాలు బయటపడతాయి. ఆ సంగతి అతను గుర్తించడు. ఆ రకంగా అతను దాచాలనుకున్న నిజాలు కూడా బైటికి తెలుస్తాయి. ఆ నిజాలు, అతను పైకి చెప్పినదానికి విరుద్ధంగా వుంటాయి. అవి కూడా అతని ద్వారా తెలిసినవే గానీ, మనం ఎక్కడో సంపాదించినవో, స్వయంగా కల్పించినవో అవవు. 'రామాయణం'లో అనేక సందర్భాలలో కవి చేసింది ఇదే. సత్యాల్ని మభ్యపెడుతూ, అసత్యాల్నే ఆకాశానికెత్తి కీర్తించటం! ఈ దాపరికాలకోసం కవి పడ్డ తాపత్రయాన్ని అడుగడుగునా చూస్తాం.

**ఈ** 'విష వృక్షం'లో కథలు, నమ్మలేని విధంగా వుండొచ్చు. ఎందుకంటే, మనకు ఇంతవరకూ రామాయణంలో వున్న అసలు విషయాలు ఇంత వివరంగా తెలియవు గనక.

'విషవృక్షం' కథల్లో కొన్ని సంఘటనలూ సంభాషణలూ మూల కథలో లేనివే. కానీ, మూలానికి విరుద్ధమైనవి కావు. అంటే ఇక్కడ ఒక సంఘటనని కొత్తగా చెప్పినప్పటికీ, దానికి ఆధారం మూలంలోదే. పాత్రలూ, వాటి స్వభావాలూ కూడా మూలకథలో లాగానే నడుస్తాయి. సంభాషణలకూ, విమర్శలకూ కూడా వాల్మీకి మూలకథే ఆధారం. అయితే, ఈ విషవృక్షంలో కొత్తగా చెప్పింది ఏమిటి? ఇంతవరకూ మరుగుపడి వున్న విశేషాల్ని స్పష్టం చెయ్యడమూ, వాటికి గల సాంఘిక అర్థాల్ని వివరించడానికి ప్రయత్నించడమూ — ఇదీ ఈ పుస్తకంలో చేసిన పని.

ఈ కథల్లో ముఖ్యంగా నాలుగు విషయాలు వుంటాయి — 1. కవి చెప్పవలసి వుండి కూడా చెప్పనివి. 2. చెప్పడానికి ఇష్ట పడనివి.

3. చెప్పినా, మసిపూసి మారేడుకాయ చేసినవి. 4. చాలా స్పష్టంగా చెప్పినవి. — ఇక్కడ ఒక్కొక్క విషయానికి ఒకటి రెండు ఉదాహరణలు చూద్దాం.

**1. కవి, చెప్పవలసి వుండికూడా చెప్పనివి:** గొడ్లని కూడా పేజీల తరబడీ వర్ణించిన కవి, 'ఊర్మిళ' సంగతి ఎక్కడా ఎత్తలేదు. ఈ పాత్ర గురించి ఒక్కమాటైనా చెప్పవలసిన అవసరం లేదా? భర్తతో అడవికి వెళ్ళిన సీత గొప్ప పతివ్రత అయినప్పుడు, భర్తతో వెళ్ళని ఊర్మిళ సీత అంత పతివ్రత అవదు కదా? కాబట్టి, ఈ ఆధారంతో, ఊర్మిళ, భర్త పట్ల అనాసక్తంగా ఉందనీ, ఈమె సీత అంత మహా పతివ్రత కాదనీ నేను రాస్తే, అది నా స్వంత కల్పన అవుతుందా? ఇది, మూలంలో లేని సంఘటనే అయినా, నేను రాసిందాన్ని, 'మూల విరుద్ధం' అనటానికి వీలుందా?

దశరథుడు సీతకి 14 సంవత్సరాలకు సరిపోయే చీరలూ, ఆభరణాలూ, సుగంధ ద్రవ్యాలూ, కొడుకులకు అస్త్రాలూ, కవచాలూ, ఆయుధాలూ, గంపా, పలుగూ — వంటి సామానులన్నీ ఇస్తాడు. అవన్నీ గుహుడి రాజ్యం వరకూ రథం మీద వెళ్ళాయి. అక్కడ గుహుడి మనుషులు వాటిని పడవమీద గంగ దాటించారు. కవి, అక్కడి వరకూ ఆ సామాన్ల గురించి చెప్పాడు. తర్వాత వాటి సంగతి ఎత్తలేదు. అక్కణ్ణించీ ఆ వస్తువులన్నీ ఎలా వెళ్ళాయి? ఎగిరాయా? పరిచారకులు మోశారా? అవన్నీ అడవుల్లోకి ఏ విధంగా వెళ్ళాయి? ఈ సంగతి కవి చెప్పలేదు. చెప్పకపోయినా ఆ సామానంతా ఎవరు మోశారో నేను రాస్తే, అది మూలానికి ద్రోహం చేసినట్టు అవుతుందా?

**2. కవికి, చెప్పటానికి ఇష్టం లేనివి:** రాముడూ, లక్ష్మణుడూ, సీతా అడవుల వెంటా, అప్పుడప్పుడూ పల్లెలవెంటా నడిచి వెళ్తూ వుంటారు. వారికి దారి పొడుగునా 'రుషులే'గానీ ఇంకెవ్వరూ తారసపడరు. ఎందుచేత? పల్లెల్లో సామాన్య ప్రజలెవ్వరూ ఉండరా? ఎందుకు వుండరు? ఉంటారు. కానీ, వారిని గురించి చెప్పడం కవికి ఇష్టంలేని విషయం. ఎప్పుడూ రుషుల వంటి మహాత్ముల గురించే చెప్పాలి. కానీ, అడవుల్లో, ఆటవికులో; కట్టెల మనుషులో కనపడ్డారని రాయడం వల్ల కావ్య సౌందర్యమేమీ కొరతపడదు. అయినా కవి అలాంటివారిని చెప్పలేదు. నేను, వాళ్ళని కూడా చెప్పాను. దారిలో అక్కడక్కడా కొందరు రైతులూ, కట్టెల మనుషులూ, ఒక చాకలీ, భిక్షకుడూ, జానపదులూ, ఇతర ప్రయాణీకులూ, వీరికి తారసపడ్డారని నేను రాస్తే, అది మూల కథకు విరుద్ధం అవుతుందా? "అలా వీల్లేదు. అక్కడ పేదలు కనబడడం జరగదు. అది తప్పు" అని వాదించడానికి వీలుందా?

కవి, ఏ పాత్రకీ, నోటితో మాట్లాడే మాటలే గానీ, మనసులో ఆలోచనలు ఎక్కడా చెప్పడు, చిన్న రాముడు తాటకిని చంపే సమయంలో కొంతసేపు మనసులో తర్కించుకోవడం తప్ప! "మనో వాక్కాయ కర్మలా" అనే మాటలు అక్కడక్కడా కనపడతాయి. అంటే — మనసూ, వాక్కూ, కర్మా వొక్కటిగానే వున్నాయని చెప్పడం. ఒక్కోసారి అలా వుండకపోవడం కూడా జరుగుతుందనే కదా? ఒక పాత్ర ఒక అభిప్రాయాన్ని బయటికి చెప్పినప్పుడు, ఆ పాత్రకి మనసులో కూడా అదే విధంగా ఉండనూ వచ్చు, ఉండక పోనూ వచ్చు. మనిషి మనసులో, తనకు ఇష్టం లేని విషయాల్నీ, కార్యాల్నీ ప్రశ్నించి, తర్కించి, వ్యతిరేకించే కంఠాలుంటాయి. అందుచేత అలాంటి కంఠాలు కూడా విష వృక్షం కథల్లో పాత్రలుగా వుంటాయి. ఆ పాత్రలు — 'రాముడి ఆత్మ', 'లక్ష్మణుడి ఇంగితం', 'సీతలో సీత' అనే పేర్లతో వుంటాయి. అవి అప్పుడప్పుడూ ఆ వ్యక్తుల మనోభావాల్ని ప్రకటిస్తూ వుంటాయి. ఇది మూలకథకి ద్రోహం చెయ్యడం అవదు.

**3. కవి, మసి పూసి మారేడు కాయ చేసినవి:** రాముడికి శత్రుపక్షం — రాక్షసులు. ఈ రాక్షసులు, ఏ జీవశాస్త్రంలోనూ లేని కవి స్వంత సృష్టి. కథంతా దీనిమీదే ఆధారపడి వుంటుంది. కానీ ఈ కల్పనని యథాతథంగా అంగీకరించవలసిన అవసరం పాఠకులకు వుండదు.

విష వృక్షం కథల్లో అందరూ మనుషులే. ఇది మూలానికి విరుద్ధమే. అయినప్పటికీ, ఇది లోక జ్ఞానానికి విరుద్ధం కాదు.

కవి మసిబూసి మారేడుకాయ చేసిన విషయాల్లో చాలా ముఖ్యమైంది — రాముడి పాత్ర. దీన్ని గురించి ఈ కథల పొడుగునా చాలా వివరంగా చూస్తాం.

**4. కవి, స్పష్టంగా చెప్పినవి:** కొన్ని విషయాలు కథలో ఎక్కడో ఒకచోట బయటపడతాయి. రాముడూ సీతా లక్ష్మణుడూ గంగ దాటి అడవుల్లోకి వెళ్ళిన రాత్రి రాముడు, లక్ష్మణుడి ముందు తన దుఃఖమంతా వెళ్ళబోసుకుంటాడు. అప్పుడు అతను మాటల మధ్య, "లక్ష్మణా! నా తల్లి అంతఃపురంలో, పక్షులు కూడా 'కైకని చంపు, కైక కాలు కొరుకు' అని తిట్టి, నా తల్లికి ఆనందం కలిగిస్తాయి. పక్షులు కలిగించే పాటి సంతోషం కూడా నా తల్లికి నేను కలిగించలేకపోయాను" అని వాపోతాడు. (రాముడికి తల్లిమీద ప్రేమ — అని తొందరపడి భ్రమపడకండి! కారణం తర్వాత తెలుస్తుంది).

వాల్మీకి కథని చదివితే, 'కౌసల్య అంతః పురంలో పక్షులు కైకని తిడతాయి' అనే విషయం, ఎప్పుడో రాముడు అడవిలో ఏడ్చేదాకా తెలీదు. ఈ విషయం సందర్భోచితంగా ఉండాలంటే, కథలో కౌసల్య అంతఃపుర ఘట్టం మొట్టమొదటి సారి వచ్చినప్పుడే, అక్కడ పంజరాలలో పక్షుల్నీ, కైకకి వ్యతిరేకమైన వాతావరణాన్నీ, చూపించవచ్చును. కౌసల్య పెంచే పక్షులు, కైకని తిట్టే విషయం, కవి స్పష్టంగా చెప్పిందే కాబట్టి.

అలాగే, లక్ష్మణుడి 'దాస్యగుణం' గురించి కూడా కవి స్పష్టంగా చెప్పాడు. పంచవటికి చేరిన తర్వాత రాముడు లక్ష్మణుడితో "ఎక్కడ ఇల్లు కట్టుకోవచ్చునో అనువైన ప్రదేశం చూడు లక్ష్మణా!" అంటాడు. అప్పుడు లక్ష్మణుడు వినయ విధేయతలతో వొణికి, "నేను స్వతంత్రుణ్ణి కాను. నేను నిర్ణయం చేస్తే అది నేను స్వతంత్రంగా చేసినట్టు అవుతుంది. అందుచేత మీరే నిర్ణయించి ఆజ్ఞాపిస్తే నేను ఇల్లు కడతాను" అని వొంగి నమస్కారం చేస్తాడు. లక్ష్మణుడు అన్నగారికి దాస్యం చేయడం తప్ప ఏ విషయంలోనూ స్వతంత్రంగా ప్రవర్తించడు — అనే విషయాన్ని కవి, వనవాసంలో పదేళ్ళు జరిగిపోయిం తర్వాత చెప్తాడు. దాని ఆధారంతోనే నేను ఈ కథల్లో లక్ష్మణుడి ప్రవర్తనని మొదటి నుంచీ దాస్య గుణంతోనే చూపించాను.

ఈ రకంగా, ఈ కథల్లో నేను చేసిన మార్పులు ఇంతవరకూ చెప్పిన **4** అంశాలకూ సంబంధించి వుంటాయి.

ఇప్పుడు రాముడి పాత్ర గురించి కొంచెం చూద్దాం.

# శ్రీరాముడు!

రాముడు ఏ కాశీమజిలీ కథల్లో రాజ కుమారుడో అయితే అతన్ని గురించి పట్టించుకునే పని లేదు. కానీ రాముడు అలాంటి కథల్లో పాత్ర కాదు. ఈయన సాక్షాత్తూ భగవంతుడు! కోట్లాది జనంనించి నిత్య పూజలందుకునే ఈ రాముడు, ఈ కథ ప్రకారం, ఎటువంటివాడు? ఎలా జీవించాడు? ఎలా ప్రవర్తించాడు? లోకానికి ఎటువంటి విషయాలు నేర్పాడు? ఈ సంగతులు తెలుసుకోవడం చాలా ముఖ్యం.

రాముణ్ణి, కవి, ఏ సుగుణాలు కలవాడని కథ పొడుగునా వర్ణించాడో అవి అతనికి మచ్చుకైనా లేవు. కవి, రాముణ్ణి — వీరుడూ, జ్ఞానీ, స్థిత

ప్రజ్ఞుడూ, వేదాంతీ, సర్వజ్ఞుడూ, రుషీ — అంటూ సమస్తమైన వర్ణనలతోటీ, ముంచెత్తుతాడు. కానీ, ఆ కవి చెప్పే కథ ప్రకారమే చూస్తే, రాముడు, ఆ వర్ణనలకు సరిగ్గా విరుద్ధమైన పనులన్నీ చేస్తూ వుంటాడు.

రాముడికి నిజంగా వున్న లక్షణాలు: (1) లోకాన్ని మోసపుచ్చే అబద్ధపు వ్రతాలు, (2) ఎప్పుడూ ఎదటివారికి నీతులు బోధిస్తూ వుండటం, (3) కపట గాంభీర్యం, (4) రెండు నాలికల మాటలు, (5) తనే జ్ఞానిననే అజ్ఞానం, (6) తనకు సేవలు చేసే ఆప్తుల్ని శంకించి హేళన చేసే అహంకారం, (7) నిస్సహాయుల్ని ఘోరాతి ఘోరంగా హింసించే క్రూరత్వం — ఇటువంటి బోలెడు అవలక్షణాలూ, దుర్గుణాలూ రాముడిలో ఈ కథల పొడుగునా రుజువులతో సహా కనపడ తాయి.

కవి చెప్పిన ప్రకారమే చూసినా, రాముడి పితృభక్తి అబద్ధం! సత్యవ్రతాలు అబద్ధం! వీరత్వం అబద్ధం! రుషీత్వం అబద్ధం! దైవత్వం అబద్ధం! జ్ఞానం అబద్ధం! సమస్త సద్గుణాలూ అబద్ధమే!

కవి ఎందుకిలా చేశాడు? పితృవాక్య పరి పాలన రాముడి వ్రతమని వర్ణించిన కవి, రాముడు అడవుల్లో కూర్చుని తండ్రిని చెడామడా తిట్టినట్టు ఎందుకు రాశాడు?

రాముణ్ణి గొప్ప వీరుడిగా వర్ణించిన కవి, రాక్షసుడు సీతని ఎత్తుకు పోతూంటే, రాముడు వెంటనే సీతని రక్షించే ప్రయత్నం చెయ్యకుండా ఏడుస్తూ కూర్చున్నట్టు ఎందుకు రాశాడు? రాముడు ఏమీ చెయ్యకుండా ఏడవటం ఏమిటీ; లక్ష్మణుడు అతన్ని మందలించటం ఏమిటీ? ఇలాంటి చాలా సహజమైన సందేహాలు వస్తాయి ముందు ముందు కథల్లో. 'భరతుడి రాజ్యం హక్కు' విషయంలో లాగానే ఈ విషయాలకు కూడా, కవి, ఏవో అతుకులబొంత కారణాలు చెప్తాడు.

అసలు 'పితృవాక్య పరిపాలన' అనేది ఒక బూటకపు ధర్మం. ఆ ధర్మం పాటించడానికి నానా బాధలూ పడాలంటే, ఏ కొడుక్కీ ఆత్మలోంచి నిజమైన సంతోషం రాదు. కానీ సమాజంలో అదే గొప్ప కీర్తిగా చెలామణి అవుతోంది కాబట్టి, దాన్ని సంతోషంగా పాటిస్తున్నట్టు పైకి నటన! ఆత్మ వంచనా, పర వంచనా! కీర్తి కాంక్ష! గొప్ప ఆద ర్శాన్ని పాటిస్తున్నాననే భ్రమ!

కీర్తికోసం వీపుమీద ఒక పర్వతం ఎత్తుకుంటే, తిన్నగా నడవడం సాధ్యమేనా? — కాదు. అది ఎలా సాధ్యం కాదో, ఈ బూటకపు సంఘ నీతులూ, గందరగోళపు ధర్మాలూ పాటించవలసి వస్తే, ఏ వ్యక్తీ వీటికోసం స్వచ్ఛంగా, నిష్కల్మ షంగా, నిర్విచారంగా ప్రవర్తించడం సాధ్యం కాదు. సమాజం వ్యక్తి మీద తలకు మించిన బరువు ఎత్తడం తప్పుగానీ, వ్యక్తి తిన్నగా నడవ లేకపోవడంలో తప్పు లేదు. ఆ మోయలేని బరువుతో, ఆ వంకర నడక చాలా సహజం. కవి ఆ సహజత్వాన్ని, తనకు తెలీకుండానే చిత్రించాడు ఎక్కడికక్కడ.

కవి రాసే అనేక నీతులు పరస్పర విరుద్ధంగా వుండడానికి కారణం, ఆ నీతుల్ని నిర్దేశించే సమా జంలో హేతువాదానికీ తర్కజ్ఞానానికీ స్థానం లేక పోవడమే. సమాజంలోనే లేని తర్కజ్ఞానాన్ని కవి తన రచనలో చూపించలేడు.

ప్రకృతికి విరుద్ధమైన కల్పనలతో, కపటత్వా లతో, మర్మ గుణాలతో ఆత్మ వంచన చేసుకునే సమాజంలో, కవీ వంచకుడే; అతని పాత్రలూ వంచకులే! అందుకే తండ్రిని హీనాతిహీనంగా తిట్టినా, రాముడు, పితృవాక్య పరిపాలకుడే. అడుగడుగునా పిరికితనం ప్రదర్శించినా, అతను మహావీరుడే! దుర్గుణాల పుట్ట అయినా, సద్గుణ సంపన్నుడే! అదే, సమాజం చేసుకునే ఆత్మ వంచనా, పర వంచనానూ!

రాముడికి బాల్యంలో కొంత సహజ చైత

న్యంతో కొన్ని ప్రశ్నలు కలిగాయి. కానీ రుషుల ధర్మాలూ, పండితుల చర్చలూ అతనిలో సహజ చైతన్యాన్ని చంపేశాయి. తనకు సంతృప్తి లేకుండానే, పెద్దల నీతులకు తలవొంచిననాడే అతను అస్వతంత్రుడై పోయాడు. చిన్నతనంలోనే ముసలివాడైపోయాడు. అతనికి బాల్యం తర్వాత కాలమంతా వృద్ధాప్యమే గానీ యౌవ్వనం లేదు. అతను, తండ్రుల్నీ, తాతల్నీ అనుకరించడం తప్ప, సహజ సందేహాలూ, సంఘర్షణా లేని జీవచ్ఛవ స్థితికి చేరాడు. అతనిలో అశాంతీ, అసంతృప్తీ అనేక వికృత చేష్టల్లో బయటపడక తప్పలేదు.

ఇక్కడ స్పష్టంగా గ్రహించవలసిన విషయం ఏమిటంటే — రాముడు పాటించిన ధర్మాలూ, నీతులూ అతనికా వికృత రూపాన్ని ప్రసాదించాయి. 'రామాయణం'లో ప్రతీ పాత్రా, ఆనాటి సంఘ ధర్మాల ఆదర్శాలతో, రాజులుగానో, పితృవాక్య పరిపాలకులుగానో, పతివ్రతలుగానో, అలా ఆనాటి విలువలకు ప్రతిబింబాలుగా నిలిచినవే.

## అభూత కల్పనలూ, హేతు వాదమూ!

**వా**ల్మీకి రామాయణం నిండా అతిశయోక్తులూ, అభూత కల్పనలూ ఎక్కడికక్కడ కిక్కిరిసి వుంటాయి. సూర్య చంద్రుల్ని ఆపడం, కొండల్ని ఎత్తడం, నదుల్ని తాగెయ్యడం, సముద్రాల్ని ఇంకించడం, చచ్చిపోయిన వాళ్ళు మళ్ళీ కనబడి మాట్లాడడం — ఇలాంటివి ఎన్నో! ఇటువంటివన్నీ ప్రకృతి ధర్మాలకు విరుద్ధమైనవి. అయినప్పటికీ, ఇటువంటి కథలద్వారా ఏం గ్రహించాలంటే, ప్రకృతిని జయించాలని మానవులకు వుండే వాంఛే, ఇటువంటి కథలుగా వెలువడింది అని గ్రహించాలి. ఈ 'అభూత కల్పన (మిత్) గురించి, ఈ పుస్తకంలోనే వేరే చోట్ల వివరంగా చూస్తాం. కాబట్టి ఇక్కడ ఈ విషయం ఇంతటితో చాలు.

రాముడు అడవికి పోతోంటే పక్షులూ జంతువులూ మూర్ఛపోయాయనీ, సూర్యచంద్రులు కాంతి తగ్గిపోయారనీ, ఇలా కవి తన బాధని ప్రకృతి పరితాపంగా మార్చి రాస్తాడు. దీనికి నవ్వి వూరుకోవాలి. అంతమాత్రాన ఈ అతిశయోక్తులన్నిటినీ అంగీకరించినట్టు అవదు.

సాధారణంగా హేతువాదులు, కవి చేసిన కల్పనలో పైపై రూపాలతో మాత్రమే పోట్లాడుతూ వుంటారు. అసలు ఏ విషయాల్ని ముఖ్యంగా పట్టించుకోవాలో వాటి జోలికి పోరు. ఉదాహరణకి, అహల్య ఇంద్రుడితో కలసిన సంగతి తెలిసి, ఆమె భర్త, ఆమెని ఎవరికీ కనపడకుండా పొగలాగ అయిపొమ్మని శపించి, తను మరో చోటికి వెళ్ళిపోతాడు. ఈ విషయంలో మన దృష్టి వెంటనే "శపించడం వుంటుందా? మనిషిని పొగలాగ చెయ్యడం సాధ్యమా? అలా జరుగుతుందా?" అనే తర్కం మీదికి పోతుంది. ఇది ప్రకృతి విషయాలకు సంబంధించిన తర్కం. కానీ ఇక్కడ ఇంకో విషయం కూడా వుంది. పర పురుషుడితో కలిసిన భార్యని భర్త దండించి త్యజించి వెళ్ళిపోయాడనే విషయం. ఇది సామాజిక విషయం. పరపురుషుణ్ణి కలవడం పాతివ్రత్యం కానప్పుడు, అహల్య ఇంద్రుడితో ఎందుకు కలిసింది? ఈ విషయం గౌతముడికి తెలియకుండా వుంటే ఏమయ్యేది? గౌతముడు ఇంద్రుణ్ణి కూడా శపించినప్పటికీ (ఈ కథని, మొదటి లింకులో వివరంగా చూస్తాం) ఆ శాపాన్ని రుషులంతా వెంటనే సర్దుబాటు చేసేసి ఇంద్రుడికేమీ హాని లేకుండా శాప విమోచనం కలిగించారు. అలాగే అహల్యకి కూడా ఎందుకు చెయ్యలేదు? అహల్య నేరానికి ఆమెని ఆమె భర్త వదిలేసి వెళ్ళిపోయాడు గానీ, ఇంద్రుడి నేరానికి అతన్ని అతని భార్య ఎందుకు వదలలేదు? ఈ కథల్లో ఎక్కడా పర స్త్రీలతో కలిసిన భర్తల్ని భార్యలు తిరస్కరించి త్యజించే

సంఘటనలు వుండవు, ఎందుకు? ఇటువంటి విషయాల గురించి తర్కించడం సామాజిక విషయాలకు సంబంధించిన హేతువాదం.

ఈ కథని బట్టి మనకు తెలియవలసిన దేమిటంటే — స్త్రీ, పర పురుషులతో కలవడం తప్పు కాని కాలంకూడా వొకప్పుడు వుండేది. కొంత కాలానికి అది తప్పు అయింది. దండన పొందేటంతటి నేరం అయింది. కానీ ఈ శిక్ష పురుషుడికి లేదు. శిక్షలు పడుతున్నప్పటికీ, స్త్రీలు, పాత సాంప్రదాయాల ప్రకారమే అప్పుడప్పుడూ ప్రవర్తిస్తున్నారు. దానికి ఫలితంగా శిక్షలు అనుభ విస్తున్నారు. 'పాతివ్రత్యం' ఇంకా స్త్రీ స్వభావాన్ని గాఢంగా అలుముకోలేదు. ఇటువంటి స్థితిలోనే అహల్య, భర్త దండనకు భయపడకుండా ఇంద్రు డితో ఇష్టపడే కలిసింది. గౌతముడు వెంటనే వచ్చి ఇంద్రుణ్ణి చూడకపోతే, అహల్య చేసిన పని రహస్యంగానే వుండిపోయేది. ఎందరో రుషి పత్నులూ సామాన్య స్త్రీలూ ఈ రకమైన రహస్య సంబంధాలతో కాలం గడిపారనడంలో సందేహం లేదు. ఈ కామ సంబంధాలలో స్త్రీకి శిక్ష పడి, పురుషుడికి శిక్ష పడకపోవడంలో పురుషుడి ఆధిక్యత ఏమిటి? అది ఎట్లా సంక్రమించింది? సంఘం దాన్ని ఎందుచేత ఆమోదించింది? — ఈ ప్రశ్నలు ఇంకా తేలవలసి వుంది. వాటికి నిజమైన కారణాలు తెలియడం అంటే, సాంఘిక నీతుల మూల కారణాలు తెలియడమే. ఇంత 'చరిత్ర' తెలియడానికి వీలైన ఇలాంటి కథల గురించి, "శపించడం ఏమిటి? అలా జరుగు తుందా?" అని ప్రశ్నిస్తే, అది పైపై రూపాన్ని మాత్రమే ప్రశ్నించడం. అదీ అవసరమే. దానితో పాటు, సామాజిక విషయాన్ని కూడా గ్రహించడం అవసరం.

**ఇలాంటిదే ఇంకో విషయం:** పదేళ్ళు వర్షాలు లేవు. లోకాలన్నీ దగ్ధమౌతున్నాయి. అనసూయ తన పాతివ్రత్యంతో రుషులకోసం చెట్లకి పళ్ళూ, గంగలో నీళ్ళూ, సృష్టించింది. ఇదీ కథ! దీనిమీద కూడా మన లోకజ్ఞానం, ప్రశ్నల వర్షం కురిపిస్తుంది — "ఏ మనిషికైనా పళ్ళూ నీళ్ళూ సృష్టించడం సాధ్యమవుతుందా? అంత సృష్టించగలిగేప్పుడు పళ్ళని చెట్లకే సృష్టించడం ఎందుకూ? చెట్లెక్కే శ్రమ మాత్రం ఎందుకూ? పళ్ళని చేతుల్లోనే సృష్టించరాదూ?" ఇలా ఎంతైనా తర్కించవచ్చు. కానీ, మన ప్రశ్నలు ఇంతటితోనే ఆగిపోతే, ఈ కథనించి మనం తెలుసుకునేదేమీ వుండదు. ఈ కథలో కొన్ని సాంఘిక విషయా లున్నాయి. అవేమిటంటే — స్త్రీలు పూర్తిగా పాతి వ్రత్యాన్ని ఆమోదించారు. అది సమాజంలో 'గౌరవప్రదం' అయిపోయింది. అంతే కాదు, ఈ పతివ్రత, పళ్ళూ నీళ్ళూ సృష్టించింది ఎవరి కోసం?— రుషులకోసం! రుషులకోసం మాత్రమే ఎందుకు సృష్టించాలి? లోకాలన్నీ దగ్ధమవుతున్న ప్పుడు ప్రజలందరూ కష్టాలు పడుతూ వుండరా? అందర్నీ రక్షించాలి కదా? "సమస్త జనుల కోసమూ సృష్టించింది" అని ఎందుకు చెప్పలేదు? ఎందుకంటే, చెప్పేవారికి, 'సమస్త జనుల శ్రేయస్సూ' అవసరంలేదు గనక! రుషుల రక్షణ ఒక్కటే వారి ధర్మం గనక! ఎవరికే శక్తిసామర్థ్యా లున్నా, ఎక్కడే సిరి సంపదలున్నా, అవి రుషుల కోసం మాత్రమే వుపయోగపడాలి. ఎందుచేత? ఇతర ప్రజల సంగతేమిటి?

# రాజులు ప్రజల్ని ఎలా పరిపాలిస్తారు?

ఏ రాజు అయినా, రాజ్యం ఎందుకు చేస్తాడో, ఏ విధంగా చేస్తాడో, 'వాల్మీకి రామా యణం' నించి కొన్ని ఉదాహరణలు చూద్దాం.

**1. దశరథుడి మాటల్లో:** రాముడికి పట్టాభి షేకం జరిగే వార్త తెలిసి కైక, దశరథుడు రాగానే మాట్లాడకుండా ఉదాసీనంగా ఉంటుంది. దశ రథుడు కారణం తెలియనట్టు ఆమెని బతి

మాలుతూ ఇలా అంటాడు — "కైకేయీ! ఎందుకీ విచారం చెప్పు? నువ్వేం కోరితే అది చేస్తాను. ఎవర్నయినా చంపించాలని ఉందా, చెప్పు? అత డెంత నిర్దోషి అయినా నీ సంతోషం కోసం చంపించేస్తాను. ఎవర్నయినా రక్షించాలని ఉందా, చెప్పు? అతడెంత దోషి అయినా అతడి శిక్ష రద్దు చేయిస్తాను. ఎవరయినా భాగ్యవంతుణ్ణి దరిద్రుణ్ణి చెయ్యాలని ఉందా? వెంటనే చెప్పు! నా సైన్యాన్ని పంపి అతని ధన ధాన్యాలన్నీ కొల్ల గొట్టించి ఈ రాత్రికే అతణ్ణి దరిద్రుణ్ణి చేయిం చేస్తాను. లేకపోతే, ఎవరైనా నిరుపేదని ధన వంతుణ్ణి చెయ్యాలని ఉందా? అతడికి సమస్త సిరి సంపదలూ ఇచ్చి ధనవంతుణ్ణి చేస్తాను". ఈ విధంగా సాగుతుంది దశరథ మహారాజుగారి ప్రేలాపన! ఈ దశరథుణ్ణి చాలా 'ఆదర్శవంతుడైన రాజు' అని కవి వర్ణిస్తాడు. ప్రజలూ నమ్ముతారు. ఈ రాజు కీర్తి కాంతులు దశ దిశలా వ్యాపిస్తాయి. అసలు విషయం చూస్తే మాత్రం ఇదీ!

ఏ రాజైనా తను తల్చుకున్నది యధేచ్ఛగా, న్యాయాన్యాయాలతో సంబంధం లేకుండా, చేసెయ్యగలడన్న మాట! రాజు ప్రాపకంగానీ, రాణుల ప్రాపకంగానీ సంపాదించుకోగలిగితే, ఎవరైనా ఎటువంటి కార్యాలైనా సాధించుకో గలరన్న మాట! వారి ఆగ్రహానికి గురైనవారు అతీ గతీ లేకుండా సర్వ నాశనం అయిపోతారన్న మాట! అందుచేత, ఒక వ్యక్తి చేసే 'నిరంకుశ పాలన'లో ప్రజలకు న్యాయం జరిగే మాట కల్ల! దశరధుడు రాజ్యం చేసినా అంతే; రాముడు రాజ్యం చేసినా అంతే; పుల్లయ్య రాజ్యం చేసినా అంతే!

**2. రాజుల గురించీ, రాజ్యపాలన గురించీ, రాముడి మాటల్లో:** వనవాసానికి బయల్దేరవలసి వచ్చినప్పుడు మొదట రాముడు తనతో సీతని తీసుకువెళ్ళడానికి ఒప్పుకోడు. ఆమెని అంతఃపురంలోనే ఉండమని చెప్పి, ఈ రకంగా హెచ్చరికలు చేస్తాడు. "భరతుడు మహా రాజవుతున్నాడు. అతని దగ్గర నువ్వు చాలా విన యంగా ఉండాలి సుమా! అతని ఎదుట నన్నె ప్పుడూ పొగడకు! రాజులు తమని తప్ప ఇతరుల్ని పొగిడితే సహించ లేరు. తమకి విధేయతగా ఉండి సేవలు చేసే వారినే సుఖంగా ఉండని స్తారు. లేకపోతే స్వంత బిడ్డల మీదైనా సరే ద్వేషం పెట్టుకుని వారి అంతు చూస్తారు. నేను తిరిగి వచ్చేవరకూ భరతుడికీ, అతని భార్యలకూ, సేవలు చేసుకుంటూ గడుపు!" అంటాడు. రాముడు చెప్పిన ఈ మాటల్లో, రాజు లుగా వుండేవాళ్ళు న్యాయంగా వుంటారో, అన్యా యంగా వుంటారో తెలుస్తోంది కదా?

**గంగ ఒడ్డున రథం దిగిన తర్వాత, తిరిగి అయోధ్యకు వెళ్ళడానికి సిద్ధమైన సుమంత్రు డితో రాముడు:** "భరతుణ్ణీ, నా తండ్రినీ సేవించు కుంటూ ఉండు! రాజులు అపజయాలూ, దుఃఖాలూ భరించరు. తమ మనసుల్లో కోర్కెలన్నీ నిర్విఘ్నంగా తీర్చుకోవడానికే రాజులు రాజ్యాలు చెయ్యాలని కలలుగంటారు. భరతుడికి సేవలు చేస్తూ ఉండమని నా తల్లితో చెప్పు! చిన్నవాడనే నిర్లక్ష్యం కూడదు. రాజుని పూజించడానికి వయ సుతో నిమిత్తం లేదు. సిరిసంపదల వల్లనే రాజు అందరికన్నా అధికుడూ, పూజ్యుడూ అవుతాడు!"

**చిత్రకూటంలో, లక్ష్మణుడితో రాముడు:** "నే నసలు రాజ్యం ఎందుకు చెయ్యాలనుకున్నానో తెలుసా? నా తమ్ములందరూ సిరి సంపదలతో, రాజ భోగాలతో, సర్వసౌఖ్యాలతో ఎల్లకాలం తుల తూగాలని!"

ఈ రకంగా, రాముడు తన కోర్కెలు తీర్చుకో డానికీ, తన బంధుమిత్రుల్ని సుఖపెట్టడానికీ, తనకు విధేయంగా లేని ప్రజల అంతు తేల్చ డానికీ, రాజ్యం చెయ్యాలనుకున్నాడన్నమాట! ఇలా పరిపాలించే రాముడి రాజ్యమేనా ప్రజలు కలలుగనే 'రామ రాజ్యం?'

**3. రాముడు అయోధ్య వొదిలి వెళ్ళి పోయాక కౌసల్య దశరథుణ్ణి దుయ్యబడుతూ:** "రాముడికెంత అన్యాయం చేశావూ! రాముడు పద్నాలుగేళ్ళ తర్వాత వొస్తే మాత్రం భరతుడు తన చేతిలో ఉన్న రాజ్యమూ, ధనాగారమూ అప్పుడు వదులుతాడా? వొదిలితే మాత్రం నా కొడుకు తీసుకుంటాడా? గుణహీనులైన బ్రాహ్మలకు ముందు భోజనాలు పెట్టి, గుణవంతులైన బ్రాహ్మలకు తర్వాత పెడితే, వారు తింటారా? ఇంకో మృగం తిని వొదిలేసిన మాంసం పెద్దపులి తింటుందా? ఇంకొకరు సారం పీల్చేసిన మద్యం రాముడు తాగుతాడా? భరతుడు ముందు అనుభవించిన రాజ్యాన్ని, తర్వాత రాముడు తీసుకుంటాడా?" (మహా చక్కగా తీసుకున్నాడు. అది వేరే సంగతి.) — ఈ విధంగా సాగుతుంది మహారాణీగారి ప్రసంగం!

రాజ్యం అంటే ఒక 'మామిడి పండు!' రాజ్యాన్ని ఒక రాజు ముందు చీకుతాడు, ఇంకో రాజు తర్వాత చీకుతాడు. భరతుడు కొన్నాళ్ళు రాజ్యం చేశాక రాముడు రాజ్యం చేస్తే (రాజ్యాన్ని భరతుడు చీకింతర్వాత రాముడు చీకితే), అది 'ఎంగిలి రాజ్యం' అయిపోతుంది! ఇంతకీ, ఆ రాజ్యాన్ని భరతుడి కన్నా ముందు ఎవరూ చీకి, ఎంగిలి చెయ్యలేదా? ఈ కోసల 'రాజ్యం పండు' ఇప్పుడే కొత్తగా చెట్టుకి పండింది! ఇప్పుడు దాన్ని, భరతుడి కన్నా ముందు చీకితేనే, కీర్తీ, పౌరుషం, నిలబడతాయి రాముడికి! ఇదీ కవిగారి తర్కం! రాజ్యాన్ని 'తినడం!' ఆలోచిస్తే ఇది చాలా సత్యమైన పోలికేనని తోస్తుంది. రాజు చేసే ఘన కార్యం, ప్రజల్ని వారి సుఖంకోసం పాలించడం కాదు, రాజ్యాలు దిగమింగడమే! పండులో రసం జుర్రినట్టు రాజ్యంలో సుఖాలూ, లాభాలూ, తన స్వంతానికి నొల్లుకోవడమే! అందుకే భరతుడి కన్నా ముందు రాముడే రాజ్యం చీకాలని కవిగారి వాదం.

**4. రాజుని ధర్మ శాస్త్రాలుగానీ, న్యాయ చట్టాలుగానీ, ఏ విధంగా రక్షిస్తూ ఉంటాయో చూడండి:** దశరథుడు వేటాడుతూ కరణుడనే ముని కుమారుణ్ణి అశ్రద్ధగా బాణంతో కొడతాడు. ఆ బాలుడు చచ్చిపోతూ దశరథుడికే ధైర్యం చెప్పే ఘట్టం కవిగారు అద్భుతంగా చిత్రించారు. ఆ ముని కుమారుడు మరణ వేదన పడుతూనే, "రాజా! నన్ను కొట్టడం వల్ల నీకు బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంటుందని దిగులు పడుతున్నావేమో. నేను బ్రాహ్మడిని కాను సుమా! శూద్ర స్త్రీకీ, వైశ్యుడికీ పుట్టినవాణ్ణి. నన్ను చంపడంవల్ల నీకు బ్రహ్మహత్యా పాతకం కలగదు. ధైర్యంగా ఉండు! దుఃఖపడకు!" అని రాజునే ఓదార్చి కన్ను మూశాడు.

పవిత్ర బ్రాహ్మల్ని తప్ప, వెధవ శూద్రుల్ని చంపడంవల్ల కూడా పాపం వొస్తుందా? కుక్కల్నీ, నక్కల్నీ, పురుగుల్నీ చంపడంవల్ల పాపం వొస్తుందా ఎక్కడైనా? — ఈ సంగతి చక్కగా ఒక శూద్రుడి నోటి వెంటే చెప్పించారు కవి. ఈ పిల్లవాడు, తండ్రిలాగ వైశ్యుడు కాలేదు. తల్లిలాగ శూద్రుడే అయ్యాడు.

ఈ బాలుడి తల్లిదండ్రులు గుడ్డివాళ్ళు, చీమకైనా హాని చేయకుండా అడవిలో ఒక మూల కూర్చుని దేవుణ్ణి ప్రార్థించుకుంటూ కొడుకునే నేత్రాలుగా నమ్ముకుని బతుకుతున్నారు. ఈ కొడుకు లేకపోతే వారికి దోసెడు మంచినీళ్ళు వచ్చే దారి లేదు. వారి దుఃఖమంతా దశరథుడు నించుని చూశాడు. చివరికి ఆ తల్లిదండ్రులు, కొడుకు లేకపోతే మరుక్షణం నించీ తమకు రాబోయే కష్టాలు తల్చుకుని కొడుకు చితిలో పడి ఆత్మహత్యలు చేసుకున్నారు. దాన్ని కూడా దశరథుడు అలాగే చూస్తూ నించున్నాడు. అయినా అతనికి పాపం అంటుకోలేదు! ఎందుకంటే, వారు బ్రాహ్మణులు కారు కాబట్టి!

దశరథుడు, ఆ వృద్ధుల్ని ఓదార్చి వారి ఆత్మ

హత్యల్ని ఆపవచ్చు. వారికి వేళపట్టుకి పళ్ళూ నీళ్ళూ అందించడానికి ఒక పరిచారకుణ్ణి నియమించవచ్చు. కానీ, దశరథుడు ఆ బాధ్యతలేవీ పాటించలేదు. వాళ్ళు బ్రాహ్మణులు కారు కాబట్టి, దశరథుడు ఏం చేసినా అది అన్యాయం అవలేదు. ఈ రకమైన ధర్మాలతో, మహారాజులు ప్రజల్ని కన్నబిడ్డల్ని చూసినట్టు చూస్తారని 'రామాయణ' కవి ఉద్ఘాటించాడు!

## కొన్ని నవ్వించే విషయాలు!

**1.** దశరథుడు కైక కోరిన వరాలకు అదిరిపడి "భర్త ముద్దుగా వరాలు కోరుకోమంటే మాత్రం చక్కగా భర్తకు సంతోషం కలిగించే వరాలు కోరాలిగానీ, భర్తకు నష్టం కలిగించే వరాలు కోరవచ్చునా?" అని విసుక్కున్నాడు. చక్కగా భార్యలు చీరలో, నగలో కోరుకుంటే, దశరథ మహారాజు గారు వాటిని తక్షణం తెప్పించి ఇచ్చి తమ కీర్తికాంతులు నలుదిశలా వెదజల్లేవారే! అంత కీర్తి తప్పిపోయినందుకు మహారాజు భార్య మీద మండిపడ్డాడు —"దుష్టురాలా! నీ వరాలవల్ల నేను రాముణ్ణి అడవికి పంపిస్తే ఆ దుఃఖంతో నేను చచ్చిపోతాను. నా కోసం రాముడు చచ్చిపోతాడు. సీత చచ్చిపోతుంది. లక్ష్మణుడు చచ్చిపోతాడు. భరతుడు చచ్చిపోతాడు. శతృఘ్నుడు చచ్చిపోతాడు. రాణులందరూ చచ్చిపోతారు. జంతువులన్నీ చచ్చిపోతాయి. ప్రజలందరూ చచ్చిపోతారు. అంత ఘోర నష్టం కలుగుతుంది నీ వల్ల" అంటూ తనతో పాటు చచ్చిపోయే వాళ్ళ పట్టీ చదివాడు.

లక్ష్మణుడు గుహుడితో, "మేం వనవాసా నికి పోతున్నాం. ఇక మా తండ్రేం బతుకుతాడు? ఇప్పుడు ఆ అయోధ్యకి పోయి చూస్తే, రాజు పోయిన దుఃఖంతో జనం అందరూ చచ్చిపోయి ఉంటారు. పిల్లులూ, గబ్బిలాలూ ఇళ్ళనిండా తిరుగుతూ ఉంటాయి" అంటాడు.

కానీ, తమాషా ఏమిటంటే — దశరథుడు చచ్చిపోయిం తర్వాత వొక్కరన్నా చచ్చిపోలేదు. పైగా అయోధ్యలో సందడి ఇంకా ఎక్కువయింది. "ముసలి రాజు పోయాడు. పెద్ద కొడుకు అడవుల్లో ఉన్నాడు! భరతుడింకా రాలేదు. ఇప్పుడేం జరుగుతుందో!" అనే ఉత్సాహంతో జనం ఎక్కడికక్కడ కబుర్లలో మునిగి ఉన్నారు.

'దశరథుడు చచ్చిపోతే రాజ్యంలో అందరూ చచ్చిపోతారు' అని వర్ణించడం మొదలుపెట్టినప్పుడు, కవికి ఒక సందేహం రాదా? 'రేపొద్దున్న దశరథుడు నిజంగానే చచ్చిపోయినప్పుడు అతని కోసం ఎవ్వరూ చచ్చిపోరు కదా? అప్పుడు ఈ వర్ణన అంతా నవ్వులపాలై పోతుందే' అనే సందేహం రాదా?

**2.** అసలు రామాయణానికంతకీ ఆధారం— దశరథుడు సత్యం తప్పలేకనే కైకకి వరాలిచ్చాడనే విషయం. కానీ ఇంత ముఖ్యమైన దశరథుడి సత్య వ్రతం మీద, మొత్తం గ్రంథంలో ఏవొక్క పాత్రకీ విశ్వాసం ఉండదు. రాముడుగానీ, లక్ష్మణుడు గానీ, భరతుడుగానీ, శతృఘ్నుడు గానీ, కౌసల్య గానీ, సుమంత్రుడు వంటి మంత్రులుగానీ, వశిష్టుడి వంటి పురోహితులుగానీ — ఇలా ఎవ్వరూ దశరథుడి సత్యవ్రతాన్ని నమ్మరు.

భరతుడికి వచ్చిన కలలో, కవి, దశరథుణ్ణి, నూనె గుండిగలో ముంచి, పేడ గుంటలో దొర్లించి, గాడిద మీద తిప్పించి, నానా పాట్లూ పెడతాడు.

ఆఖరికి, దశరథుడే ఒప్పుకోడు తన సత్యాన్ని! "నేను మాట ఇచ్చాను కాబట్టి, ఆ మాట తప్పలేక కైక అడిగిన వరాలు ఇస్తున్నాను" అనడు. అస్తమానూ "కామంతో ఆడదానికి లొంగిపోయి ఇంత పని చేశాను" అంటూ ఉంటాడు.

చివరికి, ఆ సత్య వ్రత రహస్యం — 'ఆడ

దానికి లొంగడం ఎంత అనర్థమో' బోధించడం కింద తేలుతుంది.

**3.** రాముడికి రాజ్యం ఇవ్వలేదని, కౌసల్య, దశరథుణ్ణి తిడుతూ, "నా కొడుక్కే కోపం వొస్తేనా? ఆకాశాన్నీ, స్వర్గాన్నీ బాణాలతో కింద పడగొట్టేస్తాడు! భూమండలాన్ని నిశ్చలం చేసేస్తాడు!" అంటుంది. రాముడికి సరిగ్గా కోపం వస్తే ఎంత బాగుండేదో! ఆకాశం, స్వర్గం, కింద పడి వుంటే ఇప్పుడు మనం చూసే వాళ్ళం కదా?

**4.** తననూ, సారథినీ, రథాన్నీ, గుర్రాలనూ రక్షించుకుంటూ 11 వేల మంది శత్రువీరుల్తో వొక్కసారిగా యుద్ధంచేసి జయిస్తాడని, ఋషులు, రాముణ్ణి పొగుడుతూ ఉంటారు. అలాంటి రాముడు, గంగ దాటి అడవిలో కాలు మోపగానే, చుట్టూ చూస్తూ, "లక్ష్మణా! నువ్వు రాకపోతే సీతని రక్షించడం చాలా కష్టం అయిపోయేది. మీరిద్దరూ ముందు నడవండి! నేను వెనుక నడుస్తాను. మిమ్మల్ని వెనకనుంచి రక్షిస్తూ ఉంటాను" అంటాడు. అడవుల్లో రక్షించవలసిన వాళ్ళు వెనక నడవాలా, ముందు నడవాలా?

**5.** రాముడు అక్కడక్కడా భలే జోకు లేశాడు.

"సూర్యోదయాల్నీ, సూర్యాస్తమయాల్నీ చూసి ప్రజలు సంతోషిస్తూ ఉంటారు. ఎంత అజ్ఞానులో! ఒక పూట వయసు తరిగిపోయిందే అని తెలుసుకుని దుఃఖపడరు" అంటాడు.

ప్రజలంతా తెల్లారగానే కెవ్వుమని అరిచి, రాత్రి కాగానే బావురుమని ఏడ్చే జ్ఞానం నేర్చుకోవాలన్న మాట! పూట పూటా అలాగే!

"మనం చేసే పనుల్లో కొన్ని జరుగుతాయి, కొన్ని జరగవు. అది విధి కాకపోతే ఇంకేమిటి?"

"వర్తకులు వర్తకాలు చేస్తూ వుంటేనే కదా ప్రజలెంతో సుఖపడేది?"

రాముడు కూడా 'విధి' గురించీ, 'వర్తకాల' గురించీ మాట్లాడడం!

**6.** రాముడు వనవాసానికి బయల్దేరేటప్పుడు సీత కూడా వొస్తానంటుంది, రాముడు మొదట వొప్పుకోడు. అప్పుడు సీత ప్రశ్న — "నేను కొంత కాలం అడవుల్లో నివసిస్తానని జ్యోతిష్కులయిన బ్రాహ్మణులు చెప్పారు. ఇప్పుడు నన్ను తీసుకు వెళ్ళకపోతే ఆ జ్యోతిష్యం నిజం ఎలా అవుతుంది? నన్ను కూడా మీ వెంట తీసుకువెళ్ళి బ్రాహ్మల మాట నిజం చెయ్యాలి గదా?"

అవును మరి. జ్యోతిష్కులయిన బ్రాహ్మల మాటకి కాస్త సాయం పట్టాలి! సాయం చేస్తేనే ఆ మాటలు నిజం అవుతాయి!

**7.** భరతుడు తాత గారింట్లో ఉన్నాడు. తల్లి అడిగిన వరాల సంగతీ, రాముడు అడవులకు పోయిన సంగతీ, దశరథుడు చచ్చిపోయిన సంగతీ, అతనికి తెలీదు. ఈ సంగతులేవీ చెప్పకుండా భరతుణ్ణి అయోధ్యకు తీసుకుపోవటానికి దూతలు వచ్చారు. భరతుడు వారిని విశేషాలడుగుతూ ఇలా అంటాడు — "పూజ్యురాలయిన కౌసల్య క్షేమమేనా? వినయ సంపన్నురాలయిన సుమిత్ర కూడా క్షేమమేనా? నా తండ్రీ, నా సోదరులూ కూడా క్షేమమే కదా? కపటీ, అహంభావీ, ముక్కోపీ, గర్విష్టీ, మిడిమిడి జ్ఞానం గలదీ అయిన నా తల్లి ఎలా ఉంది?"

దీన్ని, కవిగారి అతి తెలివి అనాలో, ఇంకేమన్నా అనాలో, ఆలోచించవలసిందే!

**8.** దశరథుడు పోయిం తర్వాత పురోహితులంతా సభ చేసి ఇలా నిర్ణయిస్తారు ఏకగ్రీవంగా. "రాజులేని దేశంలో మేఘాలు గర్జించవు. మెరుపులు మెరవ్వు, వర్షాలు కురవ్వు. శిక్షించే వారు లేక భార్యలు భర్తలకూ, కొడుకులు తండ్రులకూ, లొంగి ఉండరు."

అంటే, భార్యలు భర్తలకూ, కొడుకులు తండ్రులకూ లొంగి ఉండేది, శిక్షలు పడతాయనే భయం మూలానే అన్నమాట! ఇష్టంతో కాదన్నమాట!

రాజు ఎందుకు వుండాలో చెపుతూ పురోహితులు ఇంకా ఇలా కూడా అంటారు — "వర్ణా

శ్రమ ధర్మాల్ని లెక్క చెయ్యక, పరలోక భయం విడిచి నాస్తికులైన వారు, రాజు శిక్షలవల్లే సన్మార్గు లవుతారు.”

కవిగారికి, నాస్తికుల్ని గురించి బొత్తిగా తెలిసి నట్టు లేదు! నాస్తికులు, శిక్షలకు భయపడి, నాస్తికత్వాన్ని వదిలేసి, భక్తులుగా మారతారని కవి అనుకుంటున్నాడు.

“రాజే లేకపోతే పురాణ కథలు చెప్పే వారికీ, వినే వారికీ ఫలితం దక్కదు. రాజే ప్రజల్ని కన్న బిడ్డలవలె రక్షిస్తాడు.”

రాజు ప్రజల్ని ఎంత రక్షిస్తాడో చూశాంగా ఇంతకు ముందే?

**9.** భరతుడు రాముణ్ణి అడవుల్లోంచి మళ్ళీ రాజ్యానికి తీసుకురావాలని మందీ మార్బలంతో బయల్దేరాడు. దారిలో భరద్వాజ మహర్షి ఆశ్రమం ఉంటుంది. ఆ రుషి, భరతుణ్ణి “రాము డికి హాని చెయ్యాలనే బయల్దేరావా?” అని అడిగాడు.

“కాదు మునీశ్వరా! మా అన్నగార్ని తీసుకు రావాలనే వెళుతున్నాను” అన్నాడు భరతుడు.

“అవును. ఆ సంగతి నేను యోగ దృష్టితోనే గ్రహించాను. అయినా, నిజమో కాదోనని దృఢీక రించుకొనుటకు అడిగాను” అంటాడు.

తన యోగ దృష్టి సరిగ్గా పని చేస్తోందో లేదో చూసుకోవడంగావున్ను ఇది, ఇంజన్ని ఒకసారి ఆడించి చూసుకున్నట్టు!

**10.** రాముడూ, సీతా, లక్ష్మణుడూ వన వాసంలో అత్రి ముని ఆశ్రమానికి వెళ్తారు. అత్రి ముని భార్య అనసూయ, మహా పతివ్రత. వృద్ధు రాలు. నెరిసిన జుట్టూ, వొణికే శరీరం. ఆమె సీతకు పూలదండా, అంగరాగాలూ ఇస్తుంది. “నా దగ్గిర తపస్సు చాలా మిగిలి ఉంది. నా తపోశక్తితో నీకీ బహుమానాలిస్తున్నాను. నిత్యం ఈ పూలదండ ధరిస్తే నువ్వు నిత్య యవ్వనవతిగా ఉంటావు. ఈ అంగరాగాలతో నీ సౌందర్యం ఇనుమడిస్తుంది. ఇవి ధరిస్తే యవ్వనంతో నీ భర్తకి సంతోషం కలిగిస్తావు” అంటుంది.

మరి తన మాట? తనెందుకు వాటిని ధరించి నిత్య యవ్వనవతిగా ఉండలేదు? అత్రి మహా ముని గారికి ఆ ముగ్గుబుట్ట తలే ఇష్టం కావున్ను!

ఈ రకమైన మహత్తర హాస్య ఘట్టాల్ని ఈ గ్రంథం పొడుగునా ఇంకా అనేకం చూస్తాం!

## ఆ నాటికీ ఈ నాటికీ జీవితాల్లో పోలికలు!

ఏ నాడో రాసిన రామాయణ ధర్మాలకూ, ఈ నాడు మన నిత్యజీవితాలకూ ఎంత దగ్గిర పోలిక లున్నాయో చూడండి!

**1.** సీత తన గురించి అనసూయకు చెప్తూ, “నాకు యుక్త వయస్సు వొచ్చినప్పటినించీ నా తండ్రి దుఃఖ సముద్రంలో మునిగిపోయాడు. ఆడపిల్ల తండ్రి దేవేంద్రుడైనా అందరిలోనూ లోకువ కావలసినవాడే కదా?” అంటుంది. ఈ నాటి ఆడపిల్లల పెళ్ళి సమస్యకీ, రామాయణంలో సీత పెళ్ళి సమస్యకీ ఏమయినా తేడా ఉందా? ఎంత ఆశ్చర్యకరమైన విషయం ఇది! ఆడపిల్లని కనడమే ఒక అవమానం, ఆనాటికీ ఈ నాటికీ! ఇన్ని వేల సంవత్సరాల దీర్ఘకాలంలో ఈ సాంఘిక స్థితి ఎందుకు మారలేదు?

**2.** గుహుడు బోయకులం వాడు. రాముడు అడవికిపోతూ దారిలో గుహుడి రాజ్యానికి వస్తాడు. లక్ష్మణుడు ఆ రాత్రి నిద్రపోకుండా అన్నగారికి కాపలా కాస్తూ ఉంటాడు. అతనితో గుహుడు, “నాయనా! మీరు రాజపుత్రులు. మీరు సుఖపడవలసిన వారు. నువ్వు సుఖంగా నిద్రపో! నేనూ, నా మనుషులూ, మీకు సేవలు చేస్తాం. మాబోటి వాళ్ళం కష్టపడాలిగానీ, మీరు గాదు” అని తన సాంఘిక హీనత్వాన్ని ప్రదర్శిస్తాడు. ఎక్కువ కులాల వాళ్ళు, ఏ శ్రమలూ చెయ్య

కూడదు. వాళ్ళకి తక్కువ కులాల వాళ్ళే సేవలు చెయ్యాలి.

భరతుడు కౌసల్యతో, తన తల్లి చేసిన దుష్కార్యంతో తన కెంతమాత్రం సంబంధం లేదని వాపోతూ ఇలా చెప్పుకుంటాడు. "నేనే ఈ నేరంలో భాగస్తుణ్ణి అయితే, నీచ జాతులకు సేవ చేసిన పాపం కలుగుతుంది నాకు" అని తనను తను శపించుకుంటాడు. చిన్న కులాల వారు పెద్ద కులాల వార్ని గౌరవించడమూ, పెద్ద కులాల వారు చిన్న కులాల వారిని నీచులని హేళన చెయ్యడమూ — ఇది ఒక సాంఘిక ధర్మంగా అయిపోయింది. ఆ నాటికీ ఈ నాటికీ ఈ కుల భేదాలు చెక్కు చెదరకుండానే ఉన్నాయి!

**3.** 'రామాయణం'లో భర్తలు ఏ కార్యాలు చేసినా భార్యల్ని సంప్రదించరు. దశరధుడు చిన్న రాముణ్ణి విశ్వామిత్రుడితో పంపడం గురించిగానీ, పెద్ద రాముడికి పట్టాభిషేకం నిర్ణయించడం గురించిగానీ, గొప్ప గొప్ప యజ్ఞ యాగాలు చెయ్యబోవడంగానీ, ఎన్నడూ ఏదీ కౌసల్యకయినా చెప్ప లేదు. ఈ నాటికీ, భర్తలు భార్యల్ని జీవిత భాగస్తులుగా పరిగణించరు. "నువ్వు నోరు మూసుకుని లోపలికి ఫో!" అని భర్తగారు, సినిమాల్లోనూ, నవలల్లోనూ కసిరినప్పుడు, ఆ భార్య ఆయన పురుష గాంభీర్యానికి ముగ్ధురాలైపోతుంది. ముసి ముసి నవ్వుల్తో — "చాల్లెద్దురూ!" అంటూ, ఒక గుమ్మంలోంచి పోయి, ఇంకో గుమ్మంలోంచి తిరి గొస్తుంది.

**4.** రాముడూ, లక్ష్మణుడూ ఎక్కడికి పోయినా "దశరథ మహారాజు పుత్రులం" అంటారేగాని తల్లుల పేర్లు చెప్పరు. ఈ నాడు కూడా చట్టాల్లోనూ, సంఘంలోనూ, తల్లి అనే జీవితో ఏమీ పని ఉండదు. ఒక కొడుకు, తన గురించి ఎక్కడైనా చెప్పుకోవలసి వస్తే, "ఫలానా జగన్నాధం గారి అబ్బాయినండీ" అని తండ్రి గురించే చెప్పుకుంటాడు. తల్లి ఏ స్త్రీ అయినా ఒకటే. తండ్రి మాత్రం 'జగన్నాధం గారే కావడం' తన అదృష్టం అన్నట్టు! అలా గర్వపడిపోతూ చెప్పే యువకుణ్ణి చూసి "అలాగా" అని సంతృప్తి పడిపోతారు వినే వాళ్ళు. "మీ అమ్మ ఎవరు?" అనే ప్రశ్న రాదు. సమాజంలో ఆ ప్రశ్న ఇంకా పుట్టలేదు. తల్లి అనే ప్రాణి ఒకటి ఉందని, ధర్మశాస్త్రాలూ, ప్రభుత్వ చట్టాలూ, ఆఖరికి మలేరియా డిపార్టుమెంటు అతనూ కూడా ఒప్పుకోరు.

**5.** దశరధుడు పోయిన తర్వాత భరతుడు అయోధ్యకు వొస్తూ నగరంలో ప్రవేశిస్తాడు. రథం లోంచి చుట్టూ చూస్తూ ఇలా అంటాడు. "మంగళ వాద్యాలు వినబడవేం? కాముకులు ఉద్యాన వనాలలో క్రీడించి తెలతెల వారుతోంటే త్వర త్వరగా గృహాలకు వెళ్ళిపోతూ కనిపించేవారు పూర్వం. ఇప్పుడు కనబడరేం?"

వ్యభిచారులు కనబడనందుకు భరతుడు చింతిస్తాడు. రాత్రులు ఉద్యానవనాలలో గడిపి, తెలతెల వారుతోంటే త్వరత్వరగా ఇళ్ళకు చేరే వాళ్ళు వ్యభిచారులేగానీ భార్యాభర్తలు కారు కదా? అలాంటి అవసరం భార్యాభర్తలకు ఉండదు కదా? అయోధ్యలో ఉద్యానవనాలకూ, ఈ నాటి వ్యభిచార గృహాలకూ ఏమైనా తేడా ఉందా?

ఇలా చూస్తూ పోతే ఈ పోలికలకు అంతం ఉండదు. ధనిక — పేద తేడాలూ, కులభేదాలూ, పురుషాధిక్యతా, స్త్రీల పరాధీనతా, వ్యభిచారం, లంచగొండితనం, ముష్టి ఎత్తుతూ జీవించడం, ఇలా ఎన్నో లక్షణాలు ఆ నాడూ ఉన్నాయి, ఈ నాడూ ఉన్నాయి.

ఇన్ని వేల సంవత్సరాల తర్వాత, ఇంత సైన్సూ ఇంత నాగరికతా పెరిగిన తర్వాత కూడా, గతానికీ ఇప్పటికీ ఒకటే పరిస్థితి! ఒకటే ధర్మాలు, ఒక్కటే నీతులు, ఒకే రకం సమస్యలు! ఈ పరిస్థితుల్లో ఎందుకు మార్పు రాలేదు?

"కాలం మారింది. మనం చాలా ఎదిగాం. 20వ శతాబ్దంలో ఉన్నాం" అని విర్రవీగుతారు.

అది పూర్తిగా నిజం కాదు. శతాబ్దాల లెక్క ప్రకారం అయితే మనం 20వ శతాబ్దంలోనే ఉన్నాం. కానీ, ఆ ఇరవయ్యో శతాబ్దం ప్రసాదించిన విజ్ఞానం వేపుగానీ, అనుభవాల వేపుగానీ, మనం ఇంకా మళ్ళలేదు. సంవత్సరాల లెక్కగాక, జీవిత సమస్యల లెక్క చూసుకుంటే, మనం ఉన్నది ఇరవయ్యో శతాబ్దంలో కాదు.., రాముడి కాలంలో! ఆ రాముడు, తన పూర్వుల కాలంలో ఉన్నాడు! అంటే, మనం ఇప్పుడు ఉన్నది రాముడికి పూర్వుల కాలంలో!

# ఈ 'పీఠిక' అసలు లక్ష్యం

ఒక మత గ్రంథం గానీ, ఒక నీతి శాస్త్రం గానీ, ఒక కావ్యంగానీ, ఇలా సాంఘిక స్థితిగతుల్ని ప్రతిబింబించే ఏ పుస్తకం చదివినా, దానితో కొందరు గాఢంగా ఏకీభవించడమూ, కొందరు దాన్ని తీవ్రంగా వ్యతిరేకించడమూ జరుగుతూ ఉంటుంది. ఒకే పుస్తకం, ఒకే సమాజంలోని మనుషులకు, పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలెందుకు కలిగిస్తుంది? 'రామాయణాన్నే' తీసుకుందాం. అందులో ధర్మాల్ని కొందరు ఎందుకు సమర్థిస్తారు? ఆ ధర్మాల్నే కొందరు ఎందుకు తిరస్కరిస్తారు? బిడ్డ జన్మకి తల్లిదండ్రులిద్దరూ కారణం అయినప్పుడు, 'పితృభక్తి'నే ప్రత్యేక వ్రతంగా ఎందుకు చెప్పవలసి వచ్చింది? 'మాతృభక్తి' కూడా ఒక వ్రతంగా ఎందుకు లేదు? పురుషుడికి, 'పత్నీవ్రతం' ధర్మం అవలేదు. పైగా, అతనికి అనేక మంది స్త్రీలతో కామ సంబంధాల స్వేచ్ఛ ఉంది. స్త్రీలకు మాత్రం 'పాతివ్రత్యం' గొప్ప ధర్మం అయింది. ఎందుకు? స్త్రీలలో, కొందరు పతివ్రతలూ, కొందరు వేశ్యలూ అవుతారు. ఎందుకు? మనుషుల్లో, ఎక్కువ — తక్కువ భేదాలున్నాయి, ఎందుకు? — ఇటువంటి అనేక ప్రశ్నలకు సరైన జవాబులు కావాలి.

"అసలీ ప్రశ్నలేమిటి? ఏ నాడో మన పెద్దలు అలా పెట్టారు! మన సంస్కృతి అలా ఉంది!" అని గొణిగితే సరిపోదు.

"మన పెద్దలు అలా పెట్టారు, సరే! ఎందుకు అలా పెట్టారు? మన సంస్కృతి అలా ఉంది, సరే! ఎందుకు అలా ఉంది?" అని మళ్ళీ కొత్త ప్రశ్నలు వస్తాయి.

ప్రశ్న అనేది వచ్చిందంటే, దానికి జవాబు కావాలి కదా? మట్టిలో మొలకెత్తే గడ్డిపోచని "ఆగు! మొలకెత్తకు! వేదాలూ, రుషులూ వొద్దంటున్నారు! మానెయ్! మొలకెత్తడం తప్పు, ఊరుకో!" అని ఆజ్ఞాపిస్తే ఏం జరుగుతుందో, ప్రశ్నల్ని మొలకెత్త వద్దని ఆజ్ఞాపించినా అదే జరుగుతుంది.

పెద్దలనించీ, వారి అనుభవాలనించీ మనం సంపాదించవలసింది ప్రశ్నల్ని చంపుకొనే జ్ఞానం కాదు, వాటిని తీర్చుకునే జ్ఞానం.

'రామాయణం' లాంటి ఏ మత కథ అయినా, దైవ భక్తి కథలాగే కనపడుతుంది. అది, 'దైవభక్తి' అయినా, 'రాజభక్తి' అయినా, 'బ్రాహ్మణభక్తి' అయినా, ఇంకో భక్తి అయినా, ఈ భక్తులన్నీ ఏమిటి? వీటితో మనుషులకు నిజంగా అవసరం వుందా? ఏం అవసరం?

ఈ కథల్లో, మానవ చరిత్ర ఏమైనా వుందా? రామాయణం వల్ల వెనకటి కాలం ఏమైనా కనపడుతుందా? ఈ కథ ఏ కాలాన్ని చూపిస్తుంది? ఇది, మనుషులకు ఏం చెపుతుంది? — ఏ మత కథల్ని చూసినా, ఏ పురాణాల్ని విన్నా, ఇలాంటి విషయాలు ఆలోచించాలి.

మనుషుల చరిత్ర మనుషులకు తెలియాలి.

గతమూ, ప్రస్తుతమూ, భవిష్యత్తూ అంతా! మనకు అందినంత వరకూ, అర్థమైనంత వరకూ, సాధ్యమైనంత వరకూ!

'రామాయణం' అయినా, ఇంకో గ్రంథమైనా, చరిత్రలో ఎక్కడో ఒక దశ నించి పుట్టుకొచ్చి వుంటుంది. ఆ దశ, చరిత్రలో ఎక్కడ వుందో తెలియకపోతే, ఆ కథలో విషయాలు ఎలా అర్థం చేసుకుంటాం?

కాబట్టి, 'చరిత్ర' కొంచెమైనా తెలియాలి. ఈ పరిశీలన ఎంత క్లుప్తంగా సాగినా, సుదీర్ఘంగానే వుంటుంది. మానవ చరిత్ర సుదీర్ఘంగానే సాగింది కదా? ఆ చరిత్రలోనించే ఈ కథ పుట్టుకొచ్చింది కదా? ముందు వెనకలు తెలియకుండా ఒక గ్రంథాన్ని ఎలా అర్థం చేసుకుంటాం?

ఈ విషయాల్ని వివరించడమే ఈ పీఠిక అసలు లక్ష్యం. ఇంతవరకూ చెప్పింది, 'రామాయణాన్ని' కొంచెంగా పరిచయం చెయ్యడానికి మాత్రమే.

'మానవ చరిత్ర'ని, ప్రకృతిలో ఏ సహజ కార్యంతోనైనా పోల్చవచ్చు. ఉదాహరణకి, నీటి ప్రవాహంతో పోల్చి చూద్దాం. ప్రవాహం, వర్షపాతం మీదా, భూమి ఎత్తుపల్లాల మీదా, ఆధారపడి ఉంటుంది. వర్షం లేకపోతే ప్రవాహం ఎండిపోతుంది. భూమి ఎత్తుగా ఉంటే, ప్రవాహం వెనక్కి తిరుగుతుంది. భూమి పల్లంగా ఉంటే, ప్రవాహం వేగం అవుతుంది. భూమి చదునుగా ఉంటే, ప్రవాహం మందగిస్తుంది. ప్రపంచంలో ఏ ప్రదేశంలో మారుమూల నీటి ప్రవాహానికైనా ఈ సూత్రాలు వర్తిస్తాయి.

అలాగే మానవ చరిత్రకి కూడా కొన్ని ప్రత్యేక సూత్రాలు ఉన్నాయి. ప్రపంచంలో ఏ దేశంలో అయినా, ఎంత 'నాగరికత' సాధించిన వాళ్ళయినా, ఎంత ఆటవిక స్థితిలో ఉన్నవాళ్ళ చరిత్రలైనా, ఒకే సూత్రం ప్రకారం నడిచాయి. నడుస్తున్నాయి.

ఈ చరిత్రలో ఏ సంఘటనా హఠాత్తుగా తటస్థించదు. మానవులు విల్లుని కనిపెట్టడం, ఒక్క పూటలో, ఒక్క క్షణంలో, జరిగిన సంఘటన కాదు. దాని వెనక ఎన్నో వందల, వేల అనుభవాలు ఉంటాయి! అలాగే 'పెరుగు తోడు పెట్టడం' ఒక్కరోజు తెలుసుకున్న విషయం కాదు. దాని వెనక పాలని ఉపయోగించే జ్ఞానం, జంతువుల్ని మచ్చిక చేసే జ్ఞానం, వేటలో జంతువుల్ని బంధించే జ్ఞానం, ఇలా వెనకటి కాలంనించీ ఎంతో జ్ఞానం తెలిసిన తర్వాతే 'పెరుగు' సంగతి తెలిసే అవ కాశం ఉంది. ఇది ఒక కోణమైతే, ఇంకో కోణంలో 'సాంఘికమైన' నీతులూ, ధర్మాలూ కూడా హఠాత్తుగా వొచ్చిపడ్డవి కావు.

'పాతివ్రత్యాన్నే' తీసుకుందాం. మానవజాతి ఉద్భవించగానే, మానవులు జంతువులలాగ చెట్టు తొర్రల్లో తలదాచుకునే కాలంలోనే, 'పాతివ్రత్యం' ప్రారంభమైందా? మానవులింకా జంతువుల్నించీ, శీతోష్ణ స్థితులనించీ, నిగ్రహించి నిలబడాలి. ఆహారం సంపాదించుకునే విధానాలు గ్రహించాలి. స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవాలి, ఒక సంఘంగా బతుకుతూ ఉండాలి, ఒక పురుషుడూ, ఒక స్త్రీ భార్యాభర్తలుగా జీవించే సంబంధాన్ని కనిపెట్టాలి, భార్యని భర్తకి విధేయంగానూ, భర్తగాని పురుషులతో సంబంధాలు లేకుండానూ ఉంచవలసిన అవసరం ఏదో భర్తకు కలగాలి. అప్పటికిగానీ, 'పాతివ్రత్యం' అనే ఒక ఆలోచన మానవ సమాజంలో ప్రవేశించదు.

ఏ ధర్మాన్ని తీసుకున్నా, ఏ సంబంధాన్ని తీసుకున్నా, దాని వెనక ఏదో చరిత్ర ఉంటుంది. ఏదో కారణం ఉంటుంది. అది ఎవరికో అవసరమై ఉంటుంది.

'రాజు' అనేవాడు, చరిత్రలో ఎందుకు ప్రారంభమయ్యాడు? 'ప్రజల్ని పాలించడం' అంటే ఏమిటి? అసలు 'ప్రజలు' అంటే ఏమిటి? రాజులు ఇంకా లేని కాలంలో ఎవరు పాలిం

చారు? మానవులు చెట్ల తొర్రల్లో జీవించే కాలం నించే 'రాజు' ఉన్నాడా? ఎప్పుడు వచ్చాడు? ఎందుకు వచ్చాడు?

ఇప్పుడు ప్రజల్ని ఎవరు పరిపాలిస్తున్నారు? ఈ పరిపాలనకీ, రాజు పరిపాలనకీ సంబంధం ఏమిటి? తేడా ఏమిటి? ప్రజల్ని ఎవరో ఒకరు పరిపాలించవలసిందేనా? — ఈ రకం ప్రశ్నలన్నిటికీ జవాబులు ఉన్నాయి. మనం చెయ్యవలసిందంతా — మన హృదయాల్నీ మెదళ్ళనీ, జ్ఞానం వేపూ సత్యం వేపూ, తెరిచి ఉంచడమే.

## మానవ జాతి ప్రారంభంలో...!

'**మా**నవులు' అనే ప్రాణులు లేకుండా ఈ భూమండలం 500 కోట్ల సంవత్సరాలు తిరిగింది! భూమిమీద నదులున్నాయి. సముద్రాలున్నాయి. పర్వతాలున్నాయి. వృక్షాలున్నాయి. జంతువులున్నాయి. కానీ, మానవులింకా లేరు. ఇంకా పుట్ట లేదు! అన్ని వందల కోట్ల సంవత్సరాలూ — సూర్యోదయాలూ సూర్యాస్తమయాలూ జరుగుతూనే ఉన్నాయి. వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వెన్నెలలు విరుస్తూనే ఉన్నాయి. గ్రహణాలు పడుతూనే ఉన్నాయి. తుఫాన్లు లేస్తూనే ఉన్నాయి. కానీ, ఇంకా మానవులు లేరు!

ఎప్పటికో ప్రారంభమయ్యారు మానవులు! అంటే, మానవ జంతువులు. ఆ పురాతన మానవ జంతువులు, 'పరిణామ క్రమం'లో మానవులుగా మారడం జరిగి ఈనాటికి ఐదారు లక్షల సంవత్సరాలు మాత్రమే అయిందని శాస్త్రజ్ఞుల అంచనా!

ఆది మానవులు — గుహల్లోనూ, చెట్ల తొర్రల్లోనూ, నదీతీరాల వెంటా, గుంపులు గుంపులుగా జంతువులలాగే నగ్నంగా జీవించేవారు. అప్పుడు మానవులకు ప్రకృతి గురించి ఏమీ తెలీదు. చెట్లకు కాసే కాయలూ, పళ్ళూ, దుంపలూ, ఆకులూ అలములూ — వారి ఆహారం! నిద్రపోయే జంతువునో, పరిగెత్తే జంతువునో, రాయి విసిరో, చెట్టుకొమ్మ విసిరో గాయపర్చడమే — అప్పటి వేట!

మానవుల ప్రయత్నాలు లేకుండానే, భూమి మీద చెట్లు, ప్రకృతి సహజంగా కాయలు కాస్తూ ఉంటాయి. నేల లోపల దుంపలు తయారవుతూ ఉంటాయి. నీళ్ళ మడుగుల నిండా చేపలూ, అడవుల నిండా జంతువులూ పుట్టి పెరుగుతూ ఉంటాయి. మనుషులు చెయ్యవలసిందంతా, వాటిని సేకరించుకోవడమే.

కాయలూ పళ్ళూ కావాలంటే, చెట్లు ఎక్కాలి. లేదా, రాళ్ళు విసిరి వాటిని పడగొట్టాలి. ఇది ఒక 'శ్రమ' (పని). నేల లోపల ఉన్న దుంపలు కావాలంటే, వాటిని తవ్వుకోవాలి. ఇది ఇంకో శ్రమ. దుంపల్ని తవ్వడానికి ఏదో ఒక 'పనిముట్టు' కావాలి. ఒక బండ రాతిని సూదిగా అరగదీస్తే, ఆ అరగదియ్యడమూ ఒక శ్రమే. ఆ శ్రమతో ఒక 'పనిముట్టు' తయారవుతుంది. ఆ పనిముట్టుతో నేలని తవ్వితే దుంపలు దొరుకుతాయి. చెట్ల కొమ్మలతో ఒక పొడవాటి ఈటెని తయారు చేసుకుని, దానితో జంతువుల్ని వేటాడితే మాంసం దొరుకుతుంది.

ఈ కాయలూ దుంపలూ జంతువులూ అన్నీ ప్రకృతిలో ఉన్నవే. వాటిని సేకరించడం కోసం పనిముట్లుగా ఉపయోగపడే కట్టెలూ రాళ్ళూ రప్పలూ కూడా ప్రకృతిలో ఉన్నవే. మనుషులు చెయ్యవలసిందంతా, రకరకాల శ్రమలే (పనులు). ఈ శ్రమలు చెయ్యడమే, మానవ జంతువుల్ని క్రమంగా మానవులుగా మార్చింది.

చిన్న చిన్న శ్రమలు ప్రారంభమైన దగ్గిర్నించీ మనుషులు జంతు దశనించి అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. ఈ అభివృద్ధి క్రమాన్ని చరిత్ర పరిశోధకులు — 'ఆటవిక దశలూ, అనాగరిక దశలూ, నాగరిక దశలూ' అనే పేర్లతో, కొన్ని

దశలుగా విభజించారు.

ప్రారంభంలో, రకరకాల రాళ్ళూ, చెట్ల కొమ్మలూ మానవులకు పనిముట్లుగానూ, ఆయు ధాలుగానూ వున్నట్టు ఊహించాలి. ఆ కాలంలో, దట్టమైన చెట్ల తోపుల్లోనూ, గుహల్లోనూ మాన వుల నివాసాల్ని ఊహించాలి.

ఈ దశలో నరమాంస భక్షణ కూడా సాగింది.

**[ఇది, ఆటవిక దశల్లో - ప్రారంభ దశ]**

ఆ కాలంలో, ఒక మనుషుల గుంపులో, స్త్రీ పురుషులందరి మధ్యా కామ సంబంధాలు ఉంటాయి. ఒక స్త్రీ, ఒక బిడ్డని కంటే, ఆ బిడ్డ మొగ బిడ్డ అయితే, కొన్ని సంవత్సరాల తర్వాత, తల్లికీ కొడుక్కీ కూడా కామ సంబంధం ఉండే అవకాశం ఉంది. ఆ బిడ్డ ఆడబిడ్డ అయితే, తండ్రికీ, కూతురికీ కూడా అంతే. ఒకే తల్లికి పుట్టిన ఆడా — మగా పిల్లల మధ్య కూడా అంతే!

కొంతకాలం ఈ విధంగా జరిగిన తర్వాత, 'నిప్పు'ని కనిపెట్టడం గొప్ప అభివృద్ధి. 'నిప్పు' అనేది అడవుల్లో ఎక్కడో అక్కడ చెట్లు తగల బడడం ద్వారా కనపడుతూనే ఉంటుంది. నిప్పు అతి వేడిగా ఉంటుందనీ, అది అన్నిటినీ దహి స్తుందనీ, దానితో కొన్ని పనులు జరుగుతాయనీ, దాన్ని ఫలానా రకంగా తయారు చెయ్యవచ్చుననీ, గ్రహించడమే — నిప్పుని కనిపెట్టడం. నిప్పులో, దుంపల్నీ, చేపల్నీ మాంసాన్నీ కాల్చుకుని, కొత్త పోషకాహారంతో, మానవులు శీతోష్ణస్థితుల్ని నిగ్ర హించే దశకు ఎదిగారు.

నిప్పుని ఎప్పుడూ ఆరిపోనివ్వకుండా, ఎప్పుడూ మండుతూ వుండేలాగ చేసుకోవలసి వచ్చింది. క్రమంగా అది, మానవుల జీవితాల్లో 'పవిత్రమైన అగ్నిహోత్రం' అయింది.

**[నిప్పుని కనిపెట్టడం, ఆటవిక దశల్లో - మధ్య దశ]**

'నిప్పు' తర్వాత ప్రధానమైన వస్తువు 'విల్లు!' 'విల్లు'ని కనిపెట్టడంతో, మానవులు, జంతువుల మీద 'అధికారులు' అయిపోయారు. విల్లుని తయారుచేసే విధానం తెలిశాక, ఆహారం సంపా దించుకోవడంలో పూర్వం కన్నా అభివృద్ధి జరి గింది. వేటాడడానికి 'విల్లు' అనే కొత్త పనిముట్టు ప్రారంభమైందన్న మాట! వేట — నిత్యకృత్యంగా, ప్రధాన జీవనాధారంగా అయింది.

**['విల్లు'ని కనిపెట్టడం, ఆటవిక దశల్లో - ఆఖరి దశ]**

మట్టితో చిప్పలూ కుండలూ చెయ్యడం ప్రారంభమైంది. అంటే, గతంలో లేని కొత్త వస్తు వులు ప్రారంభమయ్యాయి.

**[కుండలు చెయ్యడం కనిపెట్టిన దశ - అనాగరిక దశల్లో ప్రారంభ దశ]**

కొన్ని రకాల పక్షుల్నీ జంతువుల్ని పెంచడం, మొక్కా మొటికా పెంచడం కూడా ప్రారంభ మయ్యాయి.

**[పశువుల్ని పెంచడం, అనాగరిక దశల్లో- మధ్య దశ]**

పశువుల్ని పెంచడం తెలిసిన తర్వాత, వాటి మేతకోసం, నదీతీరాల వెంట పచ్చిక గల ప్రదే శాలకూ, పుష్కలంగా నీరుగల ప్రదేశాలకూ మాన వులు గుంపులు గుంపులుగా సంచారాలు చేసే వారు.

పచ్చి ఇటుకలతో ఇళ్ళు కట్టుకోవడం కూడా ప్రారంభమైంది.

ఈ దశలోనే, రాగీ, తగరం వంటి తేలిక లోహాల్ని కనిపెట్టారు. ఇంకా, 'ఇనుము' లేదు.

**['ఇనుము'ని కనిపెట్టింది, అనాగరిక దశల్లో - చివరి దశ.]**

అనాగరిక దశల్లోని మధ్య దశ వరకూ మనుషులు ప్రపంచంలో ప్రతీ ప్రదేశంలోనూ ఒక్కలాగే అభివృద్ధి చెందారు. ఆ తర్వాత అభి

వృద్ధి, ఒక్కో ప్రదేశంలో ఒక్కో రకంగా జరిగింది. ప్రకృతి వనరుల్లో తేడాలే అభివృద్ధుల్లో హెచ్చు తగ్గుల్ని నిర్ణయించాయి.

1492లో కొలంబస్, అమెరికాని కనిపెట్టే వరకూ అమెరికాలో మనుషులు ఆటవిక దశలోనే ఉన్నారు. కారణం అక్కడ మచ్చికయ్యే జంతువులూ, వ్యవసాయానికి వీలయిన ధాన్యాలూ, ఒకటి రెండు రకాలు తప్ప ఎక్కువ లేకపోవడమే.

పూర్వార్ధ గోళంలో (ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఖండాల్లో) మచ్చికయ్యే జంతువులెన్నో ఉన్నాయి. వ్యవసాయానికి పనికి వచ్చే ధాన్యాలెన్నో ఉన్నాయి. (మనిషి ప్రయత్నంతో సంబంధం లేకుండానే పక్షులూ జంతువులూ ప్రకృతిలో పుట్టి పెరుగుతూ ఉంటాయి కదా? అలాగే, రకరకాల చెట్లూ, ధాన్యాలూ కూడా అడవుల్లో వాటికవే పెరుగుతూ ఉంటాయి. మనుషులు చెయ్యవలసింది — వాటిని తెలుసుకోవడమే.)

# సాంఘిక సంబంధాలు

**'మా**నవ చరిత్ర'లో, 'సాంఘిక సంబంధాల' ప్రారంభాన్ని, చరిత్రకారులు, 'గణ సమాజం'గా అభివర్ణించారు. ఈ గణ సమాజ జీవితం, ఏనాడో ఆటవిక దశల్లో మధ్యదశ నించే ప్రారంభమయింది.

('సమాజం' అన్నా, 'సంఘం' అన్నా, 'వ్యవస్థ' అన్నా, 'విధానం' అన్నా — ఈ మాటలన్నిటికీ అర్థం ఒకటే.)

ఈ గణ సమాజ ప్రారంభంలో, గుంపుల జీవితంలో, కామ సంబంధాలలో ఏమీ మార్పు లేదు. ఒక స్త్రీకి బిడ్డ పుట్టినప్పుడు, తండ్రి ఎవరనే ఆలోచనకే ఆ నాడు తావు లేదు. బిడ్డ పుట్టడానికి పురుషుడు కూడా కారకుడేనన్న సంగతి అప్పుడు మానవులకు తెలీదు. పిల్లల్ని తల్లి ద్వారా గుర్తించడం మాత్రమే జరిగేది. అంటే 'ఫలానా ఆమె బిడ్డ' అని చెప్పడం మాత్రమే.

ఒక స్త్రీకి పుట్టిన కూతుళ్ళూ కొడుకులూ, మళ్ళీ ఆ కూతుళ్ళకు పుట్టిన కూతుళ్ళూ కొడుకులూ, తర్వాత మనవరాళ్ళకు పుట్టిన కూతుళ్ళూ కొడుకులూ, ఈ రకంగా ఒక స్త్రీ సంతానం ద్వారా వృద్ధి అయిన సంతానం అంతా కలిసి, ఒక ప్రత్యేక గుంపు అవుతుంది. ఈ గుంపులో మొగవాళ్ళు కూడా ఉంటారు. కానీ వారివల్ల ఏ స్త్రీకి గర్భం కలిగిందో, ఏ బిడ్డ ఏ పురుషుడి సంతానమో గుర్తించే అవకాశం వుండదు. ఒక స్త్రీ తాలూకు ఆడ సంతానంవల్ల వృద్ధి అయిన గుంపే 'గణం.' ఆ గుంపులో, వృద్ధ స్త్రీ ఎవరు బతికి ఉంటే ఆమె 'గణ మాత'. ఆ గుంపులో పుట్టిన పిల్లలంతా (ఆడపిల్లలూ, మొగపిల్లలూ కూడా) ఆ గణానికే చెందుతారు. బిడ్డల్ని పెంచుకోవడం తల్లి బాధ్యతే. గణంలో ఉన్న పురుషులకు 'తండ్రి బాధ్యతల' వంటివేమీ ఉండవు. దీనికి, 'మాతృస్వామ్య విధానం (తల్లే స్వామినిగా ఉన్న విధానం)' అని పేరు.

అటువంటి కొన్ని గణాలు కలిసి ఒక 'కూటమి.' కొన్ని కూటాలు కలిసి ఒక 'తెగ'. ఈ తెగంతా కొంత ప్రదేశాన్ని తమ స్వంతంగా ఆక్రమించి ఒక చోట నివసిస్తుంది. ఈ తెగ సరిహద్దుల అవతల ఇంకో తెగ ఉంటుంది. అలాగే చుట్టుపట్ల ఎన్నో తెగలు ఉంటాయి. ఈ తెగలకు, తోడేలు, కొంగ, ఎద్దు, డేగ — వంటి జంతువుల పేర్లు ఉంటాయి. ఒక తెగలో ఉండే వేరువేరు గణాలకు కూడా వేరువేరు పేర్లు ఉంటాయి. గణం పేరు, వ్యక్తి పేరుతో కలిసి, అది వ్యక్తికి పూర్తి పేరుగా ఉంటుంది. (ఇప్పటి ఇంటి పేర్లకూ, గోత్రాలకూ మూలం, ఈ గణాల పేర్లే కావచ్చు.)

ఇరుగు పొరుగు తెగల మధ్య నిరంతరం కలహాలు రేగుతూ ఉండేవి. ప్రధానంగా పళ్ళచెట్లూ, పచ్చిక భూములూ, నీటి మడుగులూ — వంటి ప్రకృతి వనరులకోసం ఈ కలహాలు సాగేవి. ఒక

తెగ ప్రదేశాన్ని ఇంకో తెగ ఆక్రమించబోయి నప్పుడు గానీ, ఒక తెగలో వ్యక్తిని ఇంకో తెగ వ్యక్తి గాయపర్చడమో, అవమానపర్చడమో జరిగితే గానీ, తమ తెగని రక్షించుకోవడం, శత్రువుల మీద పగతీర్చుకోవడం, ఆ తెగలో వ్యక్తులందరికీ సమాన బాధ్యత. ఇందులో స్త్రీ పురుష భేదం లేదు. అందరూ తెగకోసం పోరాడేవారే.

## తెగ పరిపాలన!

గణంలో వ్యవహారాల్ని నిర్వహించుకోవడం 'గణ పరిపాలన.' అన్ని గణాలనూ నిర్వహించుకోవడం— 'తెగ పరిపాలన.' వేటల ద్వారా, అడవి చెట్ల ద్వారా, పశువుల పెంపకాలద్వారా ఆహారాన్ని సమకూర్చుకోవడమూ; ఇతర తెగలతో యుద్ధాలో, సంధులో, స్నేహాలో ప్రకటించుకోవడమూ — ఇవే తెగల పరిపాలనలో ముఖ్యాంశాలు.

తెగల నాయకుల్లో స్త్రీలూ పురుషులూ కూడా ఉంటారు. వీరు, తెగ ప్రజల్లో వారే. ఈ నాయకులకు ప్రత్యేక హక్కులేమీ ఉండవు.

కాలక్రమంలో 'గణ పతి'గా (విఘ్నేశ్వరుడుగా) పూజలందుకునేది — ఈ గణాల, తెగల నాయకులే.

రెండు తెగల మధ్య యుద్ధం జరిగినప్పుడు, గెల్చిన తెగవారు, ఓడిన తెగవారిని పూర్తిగా చంపి వేయడమో, అడవుల్లో చాలా దూరం తరిమి వేయడమో చేసేవారు. లేదా, ఒక్కోసారి తమ తెగలో కలుపుకుని తమతో సమానమైన వ్యక్తులుగా ఏదో ఒక గణం పేరు ఇచ్చి, గణ సభ్యులుగా గుర్తించడమో — చేసేవారు.

## వేరు వేరు గుంపులకు పెళ్ళి!

పూర్వం, ఒక గణం లోపల మాత్రమే ఉండే (ఒక గుంపు హద్దుల్ని దాటకుండా ఉండే) సంబంధాలు తర్వాత కాలంలో కొంత మారాయి. ఒక గణం, ఇంకో గణంతో (ఒక తెగలోనే — ఒక గుంపు ఇంకో గుంపుతో), సంబంధాలు పెట్టుకోవడం వచ్చింది.

ఒక తెగలో, 2 గణాలు ఉన్నాయి అనుకుందాం. 1వ గణంలో స్త్రీలు, 2వ గణంలో పురుషులతోటీ; 1వ గణంలో పురుషులు, 2వ గణంలో స్త్రీలతోటీ — కలుస్తారు. అంటే, ఇది గణానికీ గణానికీ పెళ్ళి. దీన్నే "గుంపుపెళ్ళి" అంటారు. ఒక గణంలో పురుషుడికి, రెండో గణంలో స్త్రీలంతా భార్యలే. ఒక గణంలో స్త్రీకి, రెండో గణంలో పురుషులంతా భర్తలే.

ఈ మార్పువల్ల, తల్లీ కొడుకుల కామ సంబంధాల్లో నిషేధం ప్రారంభమవుతుంది. ఎలాగంటే — పూర్వం, ఒక గుంపులో స్త్రీ పురుషులే కలవడంవల్ల, తల్లీ కొడుకుల మధ్య కూడా సంబంధాలకు అవకాశం ఉంటుంది. ఇప్పుడు, ఒక గణంలో పుట్టిన మొగ పిల్లవాడు, పెద్దవాడై, ఇంకో గణంలో స్త్రీలతో కలుస్తాడేగానీ, తన గణంలో స్త్రీలతో కలవడు. దీనివల్ల, ఆ పురుషుడికి, తన తల్లితోటీ తన అక్క చెల్లెళ్ళతోటీ సంబంధాలు ఆగిపోతాయి.

కానీ, ఈ మార్పు, తండ్రీ కూతుళ్ళ విషయంలో ఇంకా ప్రారంభం కాదు. ఎందుకంటే, ఒక గణంలో పుట్టిన ఆడ పిల్లకు తండ్రి అయిన పురుషుడు, రెండో గణంలో ఉంటాడు. ఈ ఆడపిల్ల పెద్దదై, రెండో గణంలో పురుషులతో కలిసినప్పుడు, తన తండ్రితో కలవడం కూడా జరగవచ్చు.

జీవితాల్లో ఒక మార్పు ప్రారంభమైనప్పుడు, దాన్ని తక్షణం అందరూ పాటిస్తారనీ, పాత సంఘటనలు మళ్ళీ ఎక్కడా జరగవనీ అర్థంకాదు. కొత్త మార్పు స్థిరపడడానికి కొన్ని వందల సంవత్సరాలు పట్టినా పట్టవచ్చు. పాత పరిస్థితి క్రమంగా తగ్గుతూ కాలక్రమంలో పూర్తిగా మాసిపోతుంది.

ఈ రకంగా, ఒక విషయం దాదాపుగా మాసి పోయిన తర్వాత కూడా అది చాలా అరుదుగా ఎక్కడైనా జరిగితే, అలాంటి వాటిని 'అవశేషాలు' అంటారు. క్రమంగా ఆ అవశేషాలు కూడా అంతరిస్తాయి.

## గణ సమాజంలో ఆస్తి హక్కులు!

'గణం'లో ఒక స్త్రీకిగానీ, ఒక పురుషుడికి గానీ, రాతి పనిముట్లూ, జంతు చర్మాలూ వంటి స్వంత వస్తువులు కొన్ని తప్పనిసరిగా ఉంటాయి. ఒక వ్యక్తి ఉన్నంత కాలమూ ఎవరి వస్తువులు వారి ఆస్తే. ఆ వ్యక్తి తదనంతరం, ఆ వస్తువులు ఆ గణం ఆస్తిగానే ఉండిపోతాయి. అవి ఇతర గణాలకు చెందవు.

స్త్రీ వస్తువులు అయితే, ఆమె సంతానానికే ఉంటాయి — ఆ సంతానం ఆ గణంలోనే ఉంటుంది కాబట్టి. పురుషుడి వస్తువుల్ని, అతని సంతానానికి ఇచ్చే వీలు ఉండదు. ఎందుకంటే, అతని సంతానం, ఇంకో గణంలో ఉంటుంది. ఒక గణంలో వస్తువులు ఇంకో గణంలోకి వెళ్ళకూడదు కాబట్టి, పురుషుడి వస్తువులు, ఇంకో గణంలో ఉన్న సంతానానికి వెళ్ళవు. (రెండో గణంలో ఉన్న పిల్లల్లో, ఎవరు తన పిల్లలో గుర్తించడానికి ఏ పురుషుడికీ వీలు ఉండదు. అది వేరే సంగతి.) కాబట్టి, పురుషుడి వస్తువులు, అతని గణంలోనే, అతని తోడబుట్టిన వాళ్ళకూ, అక్క చెల్లెళ్ళ పిల్లలకూ చెందుతాయి. (మేన గోడళ్ళకూ, మేనల్లుళ్ళకూ. వాళ్ళు, మేనమామ ఉన్న గణంలోనే ఉంటారు కాబట్టి. కూతుళ్ళ పిల్లల్ని దగ్గిర వాళ్ళుగానూ, కొడుకుల పిల్లల్ని దూరపు వాళ్ళుగానూ భావించడం, కొన్ని ప్రాంతాల్లో ఈనాటికీ ఉంది. ఇది, వేల సంవత్స రాల నాటి గణ సమాజపు సాంప్రదాయమే అను కోవచ్చు.)

## గుంపు పెళ్ళి తర్వాత 'జంటపెళ్ళి!'

ఒక గణానికీ ఇంకో గణానికీ పెళ్ళి జరిగే విధానం కొంతకాలం నడిచిన తర్వాత ('కొంత కాలం' అన్నప్పుడల్లా, కొన్ని వందల, వేల సంవ త్సర కాలాన్ని ఊహించవచ్చు), 'జంటపెళ్ళి' అనే కొత్త విధానం వచ్చింది. ఇది ఒక గణంలో ఉండే ఒక స్త్రీకీ, ఇంకో గణంలో ఉండే ఒక పురుషుడికీ జరుగుతుంది. ఇద్దరు వ్యక్తులకు మాత్రమే. అంటే, ఒక 'జంట'కు. ఆ ఇద్దరూ భార్యాభర్తలవు తారు.

ఈ 'జంటపెళ్ళి' తర్వాత కూడా ఆ వ్యక్తులు, పెళ్ళికి ముందు వున్న తమ గణాలకే చెంది ఉంటారు. భార్య పేరు, భర్తగణం ప్రకారం మారడంగానీ; భర్త పేరు, భార్య గణం ప్రకారం మారడంగానీ జరగదు. ఒక వ్యక్తిని, రెండో వ్యక్తి ద్వారా గుర్తించడం ఎవరి విషయంలోనూ జర గదు. ఇద్దరూ, గతంలో లాగే, తమ గణాలకే చెంది ఎవరికి వారు స్వతంత్ర వ్యక్తులుగానే ఉంటారు.

'జంటపెళ్ళి' వల్ల 'భార్యాభర్తలు' అయిన వాళ్ళు, ఇతరులతో కామ సంబంధాలు వదులుకో నక్కరలేదు. అంటే, ఆ స్త్రీ — తన భర్తతోనూ, ఇతర పురుషులతోనూ కూడా ఉంటుంది. అలాగే, ఆ పురుషుడు — తన భార్యతోనూ, ఇతర స్త్రీల తోనూ కూడా ఉంటాడు.

ఈ జంటపెళ్ళి జరిగిన స్త్రీకి, బిడ్డ పుడితే, ఆ బిడ్డకి తండ్రి ఎవరో తెలియడానికి, ఇక్కడ కూడా వీలు ఉండదు. ఎందుకంటే, ఆ స్త్రీకి, భర్తతోనే గాక ఇతర పురుషులతో కూడా సంబంధాలు ఉంటాయి కాబట్టి.

ఒక స్త్రీకి బిడ్డ పుట్టినప్పుడు, ఆ బిడ్డకి అసలు తండ్రి, ఆ స్త్రీకి భర్తగా వున్న పురుషుడే కానూ వచ్చు; కాకపోనూ వచ్చు.

ఈ జంటపెళ్ళి విధానంలో తండ్రీ కూతుళ్ళ కామ సంబంధాల్లో కూడా  నిషేధం ప్రారంభ

మవుతుంది. ఎలాగంటే: 'జంటపెళ్ళి'లో, ఇద్దరు స్త్రీ పురుషులు భార్యాభర్తలుగా ఉంటారు కదా? ఆ స్త్రీకి బిడ్డ పుడితే, ఆ బిడ్డకి, ఆ పురుషుడే — తండ్రి. (అతను నిజం తండ్రి అయినా, కాక పోయినా.) ఆ బిడ్డ, ఆడ బిడ్డ అయితే, ఆ బిడ్డకీ, ఆ తండ్రికీ శారీరక సంబంధం ఉండకూడదు. ఆ రకంగా, ఆ నిషేధం ప్రారంభమవుతుంది.

ఆ బిడ్డకు, ఆ తండ్రే నిజం తండ్రి అనుకుందాం. అప్పుడు, ఆ నిషేధం, తండ్రీ కూతుళ్ళ మధ్య నిజమైన నిషేధంగానే ఉంటుంది. కానీ, ఆ బిడ్డకు, ఆ తండ్రి, నిజం తండ్రి కాదనుకుందాం. అప్పుడు, ఆ నిషేధం, నిజమైన తండ్రీ కూతుళ్ళ మధ్య నిషేధంగా గాక, తండ్రీ కూతుళ్ళ వరసలతో ఉన్న వాళ్ళమధ్య నిషేధంగా మాత్రమే ఉంటుంది.

'జంట పెళ్ళి' విధానంలో, 'ఆస్తి' గురించి చూస్తే, ఇక్కడ కూడా పురుషుడి ఆస్తి, అతని భార్యకుగానీ, ఆ భార్యకు పుట్టిన సంతానానికి గానీ, చెందదు. ఆ సంతానం ఆ తండ్రికే పుట్టిన వాళ్ళు అయినా కూడా. ఎందుకంటే, ఆస్తి, వేరే గణానికి చెందకూడదు కాబట్టి. భార్యగానీ, ఆమె బిడ్డలుగానీ, వేరే గణం వాళ్ళు అవుతారు కాబట్టి, ఆ ఆస్తి వాళ్ళకు వెళ్ళదు.

బిడ్డల వేపునించి చూస్తే, ఆ బిడ్డలకు, తండ్రి వేపునించి ఆస్తి రాదు. మేనమామ వేపు నించి ఆస్తి వస్తుంది. కాబట్టి, గణ వ్యవస్థలో, పిల్లలకు, తండ్రికన్నా మేనమామే దగ్గిర బంధువు అవుతాడు.

## గణ సమాజంలో 'మతం!'

గణాన్ని పరిపాలించే నాయకులే పురోహితులుగా కూడా వ్యవహరించేవారు. ప్రతీ తెగకీ, వారి అనుభవజ్ఞానాన్ని బట్టీ, పరిస్థితుల్ని బట్టీ, అనేక విశ్వాసాలూ, అభిప్రాయాలూ, ఆచారాలూ ఏర్పడ్డాయి. దేని మత కార్యకలాపాలు దానికి ఉన్నాయి. అప్పటికి వారికి ప్రకృతి గురించి ఏమీ తెలీదు. మెరుపుల్నీ, ఉరుముల్నీ, వర్షాన్నీ, చీకట్నీ, భూకంపాల్నీ, వరదల్నీ, ఇలాంటి అన్నిటినీ అతీత శక్తులుగా భావించి పూజించారు. సాధారణంగా అన్ని తెగలలోనూ దేవుళ్ళు స్త్రీలే. గణ మాతలుగా వుండేది స్త్రీలే కాబట్టి, అతీత శక్తిగలది స్త్రీ మూర్తే నని ఆ నాటి విశ్వాసం. పెళ్ళిళ్ళూ, పిల్లలు పుట్టిన ఉత్సవాలూ, శతృవుల్ని గెలవాలనే మొక్కులూ, గెల్చినప్పుడు విజయోత్సవాలూ, దేవతలకు బలులిచ్చే తంతులూ, చచ్చిపోయినవారి అంత్యక్రియలూ, యుద్ధాలలో దొరికిన వారిని గణంలోకి తీసుకునే కార్యకలాపాలూ — ఇటువంటి వ్యవహారాలతో 'మతం' ప్రారంభమైంది.

ప్రకృతి గురించి చాలా తక్కువగా తెలిసిన విషయాలకూ, పెద్దల ద్వారా విన్న విషయాలకూ, మరికొన్ని జోడించి, ప్రకృతిని జయించి వేలాది సంవత్సరాలు జీవించడమూ, గాలిలో ఎగరడమూ, నదుల్ని వెంట తీసుకురావడమూ వంటి కల్పనలతో, ఊహాశక్తితో, కథలల్లుకు న్నారు. వారి కోరికలే, ఊహలే, కళల రూపాలు ధరించాయి.

## గణ సమాజంలో జ్ఞానాభివృద్ధి!

కాలక్రమంలో ప్రకృతి గురించీ, జీవితం గురించీ, అనుభవాలు పెరుగుతోన్నకొద్దీ ఆలోచనాశక్తి కలిగి, మనిషి మేధస్సు వికసించడం ప్రారంభించింది. మొక్కల్ని పెంచడం, జంతువుల బొచ్చుతో తాళ్ళూ బట్టలూ తయారుచెయ్యడం, పత్తినుంచి దారం తియ్యడం, చేతిమగ్గం కనిపెట్టడం — వంటి పనులతో అభివృద్ధి ప్రారంభమయింది. ఇదంతా కొన్ని వందల, వేల సంవత్సరాల అనుభవాల జ్ఞానంతో జరిగింది. లోహాల్ని కనిపెట్టడం, అందులోనూ ఇనుముని కనిపెట్టడం, చరిత్రగతిలోనే అద్భుతమైన అభివృద్ధి. పూర్వం రాతి పనిముట్లతోనూ, చెక్క పనిముట్లతోనూ చేసుకున్న పనులన్నీ ఇప్పుడు ఇనప పనిముట్లతో చేసుకోవచ్చును. గునపం, గొడ్డలీ,

పారా — వంటి ఇనప పనిముట్లతో పెద్ద పెద్ద రాళ్ళని తవ్వి తీయవచ్చును. ఎంత పెద్ద వృక్షాల నైనా పడగొట్టి నేలని చదును చేయవచ్చును. ఇనప నాగలితో భూమిని తేలికగా దున్నవచ్చును. నదులనించి దూర ప్రదేశాలకు కాలవలు తవ్వుకో వచ్చును — ఈ రకంగా, వ్యవసాయం ప్రారంభ మైంది. మొదట్లో పశువుల మేత కోసం పండిం చిన ధాన్యాలు, క్రమంగా మనుషులకు కూడా ఆహారం అయ్యాయి. ధాన్యాల్ని ఆహారంగా వాడు కోవడం తెలిసిన తర్వాత, ఆహార సమస్య తగ్గు ముఖం పట్టింది.

ఈ విధంగా — పశువుల్ని మచ్చిక చేసుకుని పాలు తియ్యడం, వాటిద్వారా మాంసమూ చర్మాలూ సంపాదించడం, పశువుల్ని వ్యవ సాయం పనుల్లో ఉపయోగించడం, ఇళ్ళు కట్టు కోవడం — ఇవన్నీ అత్యవసరంగా జరగవలసిన పనులు. నిత్య జీవితావసరాలు.

గణ వ్యవస్థలో — తిండీ, బట్టా, నివాసం, శత్రుతెగలనించి రక్షణా — ఈ కార్యాలన్నిటి లోనూ, ప్రతీ వ్యక్తీ పాలు పంచుకునేవారే. అందరూ పనులు చేసేవారే. అందరికీ బాధ్య తలూ, హక్కులూ అన్నీ సమానం. 'సమానత్వం' అనే స్పృహ లేకుండానే ఆనాటి సంబంధాలు అలా ఉన్నాయి.

## ఉత్పత్తీ - శ్రమా

**జీ**వితావసరాలు తీరడానికి ఏయే వస్తువులూ పదార్థాలూ కావాలో అదే 'ఉత్పత్తి.' ఆ ఉత్పత్తిని తయారుచేసుకోవడం కోసం, ఎలాంటి పనులు జరగాలో అదంతా 'శ్రమ.'

జంతువులైతే ఆహారాన్ని స్వయంగా ఉత్పత్తి చేసుకోవు. ప్రకృతిమీదే ఆధారపడి, ప్రకృతిలో ఏది దొరికితే అదే తిని జీవిస్తాయి. మనుషులు కూడా ప్రారంభంలో అలా జీవించినవాళ్ళే. కానీ క్రమంగా, ప్రకృతిలో దొరికే పదార్థాలతోనే, తమకు కావలసిన వస్తువుల్నీ, పదార్థాల్నీ తయారుచేసుకోవడం నేర్చుకున్నారు.

భూమీ, భూమిమీద మొక్కలూ, వాటికి ధాన్యాలూ; పక్షులూ జంతువులూ; భూమి లోపల లోహాలూ; నదులూ సముద్రాలూ — అన్నీ ప్రకృతే. అన్నీ ప్రకృతి వనరులే. అన్నీ ప్రకృతి ఇచ్చి నవే. వాటిని ఉపయోగించుకోవడమే మనుషులు నేర్చుకోవాలి. మనుషులు కూడా ప్రకృతిలో భాగమే.

<u>ప్రకృతిని ఏ మనిషీ తయారు చెయ్యలేదు. కాబట్టి, ప్రకృతిలో ఏ భాగమూ ఏ మనిషికీ స్వంతం అవదు.</u> కానీ, ప్రకృతిని ఏ మనిషి అయినా ఉపయోగించుకోవచ్చు. భూమిమీద నివాసం ఏర్పర్చుకోవచ్చు. మొక్కలు పెంచుకో వచ్చు. ప్రకృతిని ఏ అవసరం కోసం అయినా వాడుకోవచ్చు. కానీ, దాన్ని తన స్వంత ఆస్తిగా ఆక్రమించడానికి ఏ మనిషికీ హక్కు ఉండదు.

ఒక అవసరంకోసం ఏ పని చేసినా అది ఒక 'శ్రమకార్యం'. దానికే ఇంకో పేరు — 'ఉత్పత్తి కార్యం.'

ఏ శ్రమ జరగాలన్నా మొదట 'భూమి' ఉండాలి. తర్వాత కొన్ని 'పనిముట్లు' ఉండాలి. భూమితో సహా ఈ పనిముట్లన్నీ కలిసి — 'శ్రమ సాధనాలు'. లేదా 'ఉత్పత్తి సాధనాలు.' వీటిని 'పనిముట్లు' అనీ, 'పరికరాలు' అనీ, 'సాధనాలు' అనీ, ఏ పేరుతో అయినా అనవచ్చు.

ఉత్పత్తి సాధనాలు ఉన్నంత మాత్రాన్నే ఉత్పత్తి రాదు. భూమి మీద నాగలి పెట్టి మనిషి పని చెయ్యకుండా కూర్చుంటే ధాన్యం పండదు. నది ఒడ్డున కడవపెట్టి, మనిషి అక్కడే నిలబడితే కడవలోకి నీళ్ళు రావు. ఏ అవసరం తీరాలన్నా మనుషులు దానికి కావలసిన పనులన్నీ చెయ్యాలి. పనిచేసే విధానాల్ని తమ అనుభవాల ద్వారా అభివృద్ధి పరుచుకుంటూ ఉండాలి.

'పని' అన్నా, 'శ్రమ' అన్నా ఒకటే. అయితే, నది ఒడ్డున షికారుగా తిరగడం, ఇద్దరు మనుషులు మాట్లాడుకోవడం — వంటి కార్యాలు శ్రమలు కావు.

'భాషాశాస్త్రం'లో ఉండే అర్థం ప్రకారం, ఏ కదలిక అయినా 'పనే' (క్రియే). తిరగడం, తినడం, తాగడం, మాట్లాడడం — అన్నీ 'పనులే' (క్రియలే). కానీ ఇక్కడ, ఆ అర్థాలతో చూడ కూడదు. 'శ్రమ' అన్నప్పుడు, ప్రతీ పనీ —'శ్రమ' కాదు. 'జీవితావసరాల' కోసం జరిగే పనులే శ్రమలు. వేటాడడం, కుండలు చెయ్యడం, పాలు పితకడం, మొక్కల్ని పెంచడం, బట్టలు నేయడం, దుస్తులు కుట్టడం, బండి తోలడం — ఇలాంటివన్నీ 'శ్రమలు', లేదా 'ఉత్పత్తి కార్యాలు'.

చెక్క నాగలితో చేసే పనినే ఇనప నాగలితో చేస్తే, అదే సమయంలో ఎక్కువ పని జరుగుతుంది. ఎక్కువ భూమిని దున్నవచ్చు. పని ముట్టులో మార్పు జరగడంవల్ల, దున్నే శ్రమకు, ఉత్పత్తి శక్తి పెరిగిందని అర్థం. అనుభవాలు పెరుగుతూ ఉన్నకొద్దీ అన్ని రకాల శ్రమలకూ ఉత్పత్తి శక్తులు పెరుగుతూనే ఉంటాయి.

'గణ సమాజం'లో ప్రతీవ్యక్తీ, స్త్రీలూ పురుషులూ అందరూ శ్రమలు చేస్తారని చూశాం. అందరూ ఉత్పత్తి కార్యాల్లో పాల్గొంటారు. వేటాడడం, పంటలు పండించడం, ఇళ్ళు కట్టడం — లాంటి పనులు కొందరు కలసి సమిష్టిగా చేస్తే; పాలు పితకడం, బండి తోలడం లాంటి పనులు విడివిడిగా చేస్తారు. ఆ పని స్వభావాన్ని బట్టి ఏ పని ఎలా జరగాలో అలా జరుగుతుంది.

అందరూ శ్రమ చెయ్యడం అంటే, ఎవరి కోసం వాళ్ళే శ్రమ చేసుకుంటున్నారనీ, ఎవరి శ్రమతోనే వాళ్ళు జీవిస్తున్నారనీ అర్థం. అందుకే ఇక్కడ అందరూ సమానులు. ఒకరికన్నా ఒకరు అధికులూ కారు, అధములూ కారు.

మనుషులందరూ కలిసి, ఒక చోట, ఒక 'గుంపు'గా (ఒక 'బృందం'గా) జీవిస్తూ ఉంటే, అది మనుషుల 'సంఘం'. లేదా, 'సమాజం'. లేదా 'వ్యవస్థ.'

మనుషుల 'సంఘం'లో, ఆ మనుషుల మధ్య ఉండే 'సంబంధాలు' ఎలాంటివి? — ఈ విషయమే సరిగా అర్థం చేసుకోవాలి.

జంతువుల విషయంలో — 'రక్త సంబంధాలు' మాత్రమే ఉంటాయి. ఒక జంతువుకీ ఇంకో జంతువుకీ మధ్య 'శ్రమ సంబంధాలు' ఉండవు. కానీ, మనుషుల విషయంలో, ఈ రెండు రకాల సంబంధాలూ ఉంటాయి.

రక్త సంబంధాలు — ప్రకృతి సహజమైనవి. ఇవి, అన్ని రకాల ప్రాణులకూ ఉంటాయి.

శ్రమ సంబంధాలు — సాంఘికమైనవి. ఇవి మనుషుల మధ్య మాత్రమే ఉంటాయి. దీన్ని వేరే మాటల్లో చెప్తే, మనుషుల మధ్య మాత్రమే ఉండే సంబంధాలు — 'శ్రమ సంబంధాలు.'

<u>'మానవ సంబంధాలు' అన్నప్పుడు, 'రక్త సంబంధాల' ప్రసక్తి అనవసరం. 'శ్రమ సంబంధాలనే' చూడాలి. అంటే, మానవ సంబంధాలు అంటే, శ్రమ సంబంధాలే.</u> 'మానవులు' అంటే, శ్రమలు చేసే ప్రాణులు. లేదా, శ్రమలు చేసే జంతువులు. 'మానవ' అంటే — 'శ్రమ చేసే' అని అర్థం. ఈ లక్షణమే లేకపోతే, మానవులు కూడా గడ్డి తింటూ బతికే జంతువులే. కాబట్టి, 'మానవులు' అనగానే శ్రమా, శ్రమ సంబంధాలూ గుర్తు రావాలి.

'గణ సమాజం'లో అందరూ శ్రమ చేసేవారే కాబట్టి, అందరూ 'సమానులు.' ఆ మనుషుల మధ్య సంబంధాలు, సమానుల మధ్య సంబంధాలు. ఇలాంటి జీవిత విధానాన్ని చరిత్రకారులు, **'ఆదిమ కమ్యూనిజం'** అన్నారు. 'కమ్యూనిజం' అంటే 'సమానత్వ విధానం.' లేదా, 'సమ సమాజం.' ఆ మనుషులకు — 'సమానత్వం' అనీ, 'అసమానత్వం' అనీ, ఆ తేడా లేవీ తెలి

యవు. కానీ, ఆ మనుషుల మధ్య వున్న శ్రమ సంబంధాల స్వభావం — సమానత్వమే. అందుకే అది ఆదిమ కాలంనాటి కమ్యూనిజం.

## గణ సమాజంలో, స్త్రీ-పురుషుల మధ్య శ్రమ విభజన!

స్త్రీ — పురుషుల మధ్య ఈ నాడు ఉన్న శ్రమ విభజనని మొదట ఒకసారి చెప్పుకోవాలి. స్త్రీలకు ఇంటి పనీ, పురుషులకు బైటి పనీ! స్త్రీలలో కొందరు, బైట పని కూడా చేసినా, ఇంటి పని బాధ్యత అంతా స్త్రీలదే! ఇదే స్త్రీ పురుషుల మధ్య ఏ నాటినించో ఈ నాటివరకూ కూడా ఉన్న శ్రమ విభజన.

ఒకనాడు, గణ సమాజంలో 'సమానులుగా ఉన్న' స్త్రీ పురుషుల మధ్య ఈ విభజన ఇలా ఎందుకు ప్రారంభమైంది? — ఈ విషయం మీద చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. కానీ, ఎక్కువ తార్కికంగా కనపడే జవాబు ఒకటి ఉంది. స్త్రీ పురుషుల మధ్య శారీరకంగా ఉన్న తేడాయే వారి శ్రమల మధ్య కొంత తేడాకు దారితీసి ఉంటుంది — అనేదే ఆ జవాబు. స్త్రీ పురుషుల మధ్య శారీరకమైన తేడా — గర్భాన్ని మోసి బిడ్డని కని పాలిచ్చి సంరక్షించే విషయంలోనే.

ఆటవిక స్త్రీ, వేటలో ఎంత నేర్పరి అయినా, నిండు గర్భవతిగా ఉన్న స్థితిలోనైనా ఆమె, తన ఆహారానికి గణంలో ఇతర్ల మీద ఆధారపడక తప్పదు. పసిపిల్లల్ని క్రూరజంతువుల నించి రక్షించడానికి అయినా ఆమె ఒక రక్షణ ఇచ్చే ప్రదేశంలో నివాసం ఏర్పరచుకోక తప్పదు. ఇలాంటి కారణాల చేతనే స్త్రీ పురుషుల నిత్య కృత్యాలలో ఒక రకమయిన కేటాయింపు జరిగి ఉండాలి. ఇదే ఎక్కువ తార్కికంగా కనిపిస్తోంది. సురక్షితమైన ప్రదేశాల్లో ఉంటూ బిడ్డల్ని పెంచడం, ఆహారం తయారుచెయ్యడం, తోటల పెంపకం, చేతి పనులూ, పశువుల సంరక్షణా వంటి పనుల్ని స్త్రీలూ; వేటా, ఇతర తెగలతో యుద్ధాలూ, వ్యవసాయం వంటి పనుల్ని పురుషులూ చేయడం — అనే పరిస్తితి ఏర్పడింది.

ఆదిలో ఈ శ్రమ విభజన, ఆ నాటి పరిస్తితుల్ని బట్టే ప్రారంభమైంది. ఈ శ్రమ విభజన వల్ల, ఆ నాడు స్త్రీ స్థాయిలో మార్పేమీ జరగలేదు. దీని వల్ల పురుషుడి స్థాయి కన్నా స్త్రీ స్థాయి హీనం కాలేదు.

ఈ శ్రమ విభజన ఆదిలో ఎలా ఎప్పుడు ప్రారంభమైందో ఈ నాడు మనం స్పష్టంగా గ్రహించలేకపోయినా, చరిత్రకు తెలిసినప్పటి నించి, స్త్రీ పురుషుల మధ్య శ్రమ విభజన ఇలాగే ఉంది. స్త్రీలకు ఇంటి పనీ, పురుషులకు బైటి పనీ అనే పద్ధతిలో.

## గణ సమాజంలో 'మారకాలు'!

ప్రతీ తెగా, అందులో ప్రతీ గణమూ, కొన్ని వస్తువుల్నీ పదార్థాల్నీ ఉత్పత్తి చేసుకుంటుంది. వేట పనిముట్లూ; జంతువుల కొమ్ములూ చర్మాలూ, ఉన్నీ, మాంసమూ, చేపలూ; తేనే, పాలూ, ధాన్యాలూ — వంటి రకరకాల వస్తువుల్ని ఒక తెగ, తన వస్తువుల్లో కొన్నిటిని ఇతర తెగలకు ఇచ్చి, వాటికి బదులుగా ఆ తెగల నించి తనకు కావలసిన వస్తువుల్ని తీసుకుంటే, అది, వస్తువుల మారకం. ఈ వస్తువులకు 'ధరల' లాంటివేమీ ఉండవు. ఒక వస్తువుని ఇచ్చి, ఇంకో వస్తువుని తీసుకోవడమే. అంతే. అదే ఆ నాటి మారకం.

రెండు వస్తువులకు మారకం జరగడం అంటే, అందులో, ప్రతి వస్తువుకీ ఎంతో కొంత 'విలువ'

ఉంటుంది. 'విలువ' అంటే, ఒక వస్తువుని తయారు చెయ్యడానికి అవసరమైన మొత్తం శ్రమే. విలువకి కారణం — శ్రమే. కానీ, ఆ విషయాలేవీ ఆ నాడు తెలియవు. ఆ నాడే కాదు, మారకాలు సాగుతూనే ఉన్నా, 'విలువకి కారణం శ్రమే' అనే సంగతి, వందల వేల సంవత్సరాల దాకా తెలియదు.

తెగల మధ్య వస్తువుల మారకాలు జరగడం అంటే, ఆ మనుషుల మధ్య, ఒకరి శ్రమని ఒకరు ఉపయోగించుకుంటున్నారని అర్థం. ఆ రకంగా, ఆ మనుషుల మధ్య 'శ్రమల సంబంధాలు' ఏర్పడుతున్నాయని అర్థం.

ప్రారంభంలో, మారకాలన్నీ ఖచ్చితమైన విలువ లెక్కలేవీ లేకుండా, ఎలా బడితే అలా (ఆర్బిట్రరీగా) జరిగినవే. క్రమంగా ఎన్నో అనుభవాల వల్ల, వస్తువుల రకాల్ని బట్టి, వాటిమధ్య మారకాల పాళ్ళు ఏర్పడడం ప్రారంభమైంది.

ఆ నాటి మారకాలు, దగ్గిర ప్రదేశాల్లో మాత్రమే జరిగేవి. ఆ మారకాలు, క్రమంగా, 'డబ్బు' పుట్టడానికి దారితీశాయి. 'డబ్బు' అంటే, అది కూడా ఒక వస్తువే. కానీ, అది, ఇతర వస్తువుల మారకాలన్నిటికీ 'మధ్యవర్తి'గా పనిచేసే వస్తువు. ఆ పని, ఏ రకం వస్తువు చేస్తుందో అదే — 'డబ్బు!'

'డబ్బు'తో పాటే, వస్తువులకు ధరలూ, వస్తువుల్ని అమ్మడాలూ కొనడాలూ అన్నీ ప్రారంభమయ్యాయి.

వస్తువు 'విలువ'ని, డబ్బు కొలత ద్వారా చెప్తే అది 'ధర'.

వస్తువుని ఇచ్చి, డబ్బు తీసుకుంటే అది, వస్తువుని 'అమ్మడం'. డబ్బుని ఇచ్చి వస్తువుని తీసుకుంటే, అది వస్తువుని 'కొనడం.'

ఈ అమ్మడాలూ కొనడాలూ, వేరువేరు గణాల మధ్యగానీ, తెగల మధ్యగానీ, ఆ వస్తువుల మారకాలు ఎవరికి అవసరమో ఆ మనుషుల మధ్య, ముఖాముఖీగానే జరిగేవి. వస్తువుల్ని ఒక చోట కొని, ఇంకో చోట అమ్మి, కొంత 'లాభం' సంపాదించే 'వర్తకులు' అనే వాళ్ళు ఆ నాటికి ఇంకా లేరు.

# గణ సమాజం పతనం, శ్రమ దోపిడీ ప్రారంభం!

గణ సమాజంలోనే క్రమంగా 'బానిసత్వానికి' బీజాలు పడ్డాయి.

వేరువేరు తెగలకు మధ్య జరిగే దాడుల్లో, గెల్చిన తెగ, ఓడిపోయి పట్టుబడిన తెగ మనుషుల్ని, చంపివెయ్యడమో, తమతో సమానులుగా తమ తెగలోకి పూర్వంలాగ చేర్చుకోవడమో ఇప్పుడు ఆగిపోయాయి! అలా దొరికిన శత్రువుల్ని, తమకు 'బానిసలు'గా చేసుకుని, వారితో తమ తెగలో శ్రమలు చేయించుకోవడం ప్రారంభమైంది.

ప్రారంభంలో, ఉత్పత్తి శక్తుల పెరుగుదలే ఈ పరిణామానికి దారితీసింది. ఎలాగంటే: ఒక మనిషి రోజంతా శ్రమచేసి, అంటే రోజంతా చెట్ల వెంటా పుట్లవెంటా తిరిగీ, వేటాడీ, సంపాదించే ఆహారం, ఆ మనిషి పోషణకు మాత్రమే సరిపోయేదిగా ఉంటుందనుకుందాం. ఆహారాన్ని అంతకన్నా అదనంగా సేకరించగలిగే (ఉత్పత్తి చెయ్యగలిగే) పరిస్తితి లేదనుకుందాం. అలాంటి పరిస్తితుల్లో, ఒక మనిషి, ఇంకో మనిషిని తన బానిసగా ఉంచడం సాధ్యంకాదు. ఎందుకంటే, ఆ బానిస ద్వారా యజమానికి కొంత ఉత్పత్తి మిగలదు. ఆ బానిస, ఎంత తక్కువ ఆహారాన్ని సేకరిస్తాడో దానినే, యజమాని లాక్కుంటాడనుకుందాం. ఆ బానిసకోసం ఏమీ మిగల్చకుండా, అంతా తనే స్వాధీనపరుచుకుంటాడనుకుందాం.

అలా జరిగితే బానిసకు ఆహారం లేక, అతను చాలా త్వరగా చచ్చిపోతాడు. బానిస, చచ్చి పోకుండా బతికి ఉండాలంటే, రోజూ అతడు ఉత్పత్తి చేసే దాంట్లో నించి కొంత ఆహారం అతనే వాడుకోవాలి. ఆ పైన మిగిలేదాన్నే యజమాని తీసుకోగలడు. అంటే, ఒక బృందం, ఇంకో బృందాన్ని బానిసలుగా ఉంచాలంటే, అది ఎప్పుడు సాధ్యమవుతుందంటే, ఒక మనిషి చేసే శ్రమవల్ల, అతని జీవితావసరాలు తీరగా, ఇంకా కొంత 'అదనం' కూడా ఉత్పత్తి అయ్యే పరిస్తితి ఉండాలి. ఉత్పత్తి శక్తులు ఆ స్థాయిలో ఉండాలి. అలాంటి పరిస్తితులు లేకపోతే, అంటే, ఒక మనిషి ఉత్పత్తి చేసేదాంట్లో నించి కొంత భాగాన్ని ఇంకో మనిషి తీసుకోగలిగే పరిస్తితి లేకపోతే, బానిసత్వం ప్రారంభం కాదు. దానికి అవకాశం ఉండదు.

తెగల మధ్య కొట్లాటలూ శతృత్వాలూ ఆది నించీ ఉన్నాయి. అవి, జంతువుల మధ్య కొట్లాటల లాంటివే. ఆ శతృత్వాలు అలా ఉండగా, దానికి తోడు ఈ ఉత్పత్తి శక్తుల అభివృద్ధి కూడా కలిసి, శతృవుల్ని బానిసలుగా (దాసదాసీలుగా) మార్చే విధానానికి దారితీసింది.

ఈ బానిసలుగా మారే మనుషులకు, ఈ కొత్త పరిస్తితి, వెనకటి పరిస్తితి కన్నా మెరుగైనదే. ఎందుకంటే తెగల కొట్లాటల్లో ఓడిపోయి, శతృవుల చేతుల్లో చచ్చిపోవడం కన్నా, ఏదో ఒక కారణంతో బతికి ఉండే ఈ పరిస్తితి, ఆ చచ్చిపోవలసిన మనిషికి — అభివృద్ధే. ఆ రకంగా, ఆ మార్పు, మానవ సమాజాని కంతటికీ కూడా అభివృద్ధే. కానీ, సమాజానికి ఈ అభివృద్ధి, 'బానిసత్వం'తోటీ, 'సేవకత్వం'తోటీ ప్రారంభమైంది!

ఏ నాడో, చరిత్రకి అందనంత ప్రాచీన కాలంలో ప్రారంభమైన 'బానిస వ్యవస్థ,' ఐరోపా ఖండాన్ని నిన్న మొన్న 2 వేల సంవత్సరాల కిందటి వరకూ ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించింది.

ఒక యజమాని కుటుంబమూ, అతని బానిసల కుటుంబాలూ కలిసి — ఒక 'ఫామిలీ.' బానిసలందరూ యజమాని ఆస్తే కాబట్టి, బానిసలందరూ కూడా యజమాని కుటుంబమే. ఈ 'ఫామిలీ' అనే మాటని మొదట్లో రోమనులు ఉపయోగించారు. ఆ నాడు, 'ఫామిలీ' అంటే, ఇప్పుడు ఉన్న అర్థం కాదు. ఇప్పుడు, ఫామిలీ అంటే, భార్యాభర్తలూ పిల్లలూ మాత్రమే. (ఒక రకంగా చూస్తే, ఈ అర్థం కూడా పాత రకం అర్థం లాంటిదే. పురుషుడికి, భార్యాబిడ్డలు కూడా బానిసలే కదా?)

ఒక యజమానికీ, అతని బానిసకూ ఉన్న సంబంధం— ఎలాంటి సంబంధం? — అది 'రక్త సంబంధం' కాదు. 'శ్రమ సంబంధం.' కానీ, ఈ శ్రమ సంబంధంలో, ఒకరి శ్రమ, ఒకరికి మారడం కాదు; ఎప్పుడూ బానిస శ్రమే యజమానికి అందుతూ ఉంటుంది. యజమాని శ్రమ బానిసకు అందేదేమీ వుండదు.

ఒక 'తెగ'లో, యజమాని తనమూ — బానిసత్వమూ ఎలా కలిసి జీవించాయో చెప్పుకోవడానికి తగినంత సమాచారం మనకు లేక పోయినా, 'బానిసత్వం' అనేది తెగల కాలం నాటినించే ప్రారంభమైందని గ్రహించాలి.

ఒక తెగనే ఒక 'సమాజం'గా తీసుకుంటే, అందులో, కొందరు మానవులు యజమానులూ, కొందరు మానవులు బానిసలూ! జీవితావసర వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోవడానికి కావలసిన శ్రమలన్నీ బానిసలే చేస్తారు. బానిసలు, తమ పోషణ కోసమేగాక, యజమానుల పోషణకోసం కూడా శ్రమలు చెయ్యవలసి ఉంటుంది. అంటే, యజమానులు, తమ శ్రమ మీద తాము జీవించడం గాక, బానిసల శ్రమల మీద జీవిస్తారని అర్థం. ఈ రకంగా 'బానిసత్వం' ప్రారంభమవడం అంటే, యజమానులు, బానిసల శ్రమని దోచడం ప్రారంభమైందని అర్థం. ఇది **'శ్రమ దోపిడీ!'**

దీనివల్ల, శ్రమ చేసే బానిసలు ఒక వర్గంగానూ, శ్రమని దోచే యజమానులు ఇంకో వర్గంగానూ 'వర్గ భేదాలు' ప్రారంభమయ్యాయి.

బానిస స్త్రీ పురుషులు చేసే రక రకాల శ్రమలతో, యజమాని కుటుంబాలకు అనేక ఉత్పత్తుల రాసులు అందుతాయి. అవే ఆ కుటుంబాలకు — సిరి సంపదలు!

రెండో వేపు; ఒక బానిస, రోజంతా, రాత్రింబవళ్ళూ చేసే శ్రమల ద్వారా తయారయ్యే ఉత్పత్తులలోనించి ఎంతో భాగాన్ని యజమాని కుటుంబంకోసం పోగొట్టుకుంటాడు. అతని శ్రమ అంతా అతనికి దక్కదు కాబట్టి, ఆ బానిస అతి తక్కువ ఉత్పత్తులతోనే జీవించవలసి వస్తుంది. అదే — నిరుపేదతనం! ప్రతీ బానిసా నిరుపేదతనంతోనే జీవిస్తాడు.

యజమాని కుటుంబానికి — కలిమీ;
బానిస కుటుంబానికి — లేమీ!

సమాజంలో, కలిమి లేములకు మూల కారణం — యజమాని వర్గం, సేవక వర్గాన్ని చేసే శ్రమ దోపిడీయే. ఇదంతా ఏనాడో, వందల, వేల సంవత్సరాల కిందటే ప్రారంభమైపోయింది!

తెగల జనాభా, నదీతీరాల్నీ, వ్యవసాయ భూముల్నీ వెతుక్కుంటూ దూర ప్రాంతాలకు కూడా దండయాత్రలు చేస్తూ పోయేవారు.

ఈ దండయాత్రల స్తితిలోనే, ఇప్పటికి 10 వేల సంవత్సరాల కిందట, 'ఆర్యులు' అనే తెగ వారు, భారత దేశానికి (అప్పుడు, ఈ ప్రదేశానికి ఆ పేరు లేదు), ఉత్తరం వైపునించి దండయాత్రలు చేస్తూ వచ్చారని చరిత్రకారుల అంచనా! గుర్రాలు లాగే బళ్ళూ, పశువుల మందలూ వారివెంట ఉండడం వారి ప్రత్యేకత. ఆర్యులు వచ్చి ఉత్తర భారతంలో నివసిస్తూ వున్న ద్రావిడుల్ని దక్షిణం వేపు తరిమి ఉత్తరాన్ని ఆక్రమించారు. అప్పటికీ, ఆర్యుల సాంఘిక జీవితం, గణవ్యవస్థగా ఉన్నదే. ద్రావిడులు కొన్ని ప్రాంతాలలో గణ వ్యవస్థలోనూ, కొన్ని ప్రాంతాలలో దాన్ని దాటి బానిస వ్యవస్థలోనూ ఉన్నారు.

కాలక్రమంలో కొన్ని తెగలు పూర్తిగా క్షీణించి పోవడం, కొన్ని తెగలు వృద్ధి చెంది అనేక తెగలుగా చీలడం జరిగింది. రానురానూ వ్యవసాయమే ముఖ్యాధారమై వొక్కో తెగా వొక్కో ప్రదేశంలో స్థిరపడ్డాయి.

## 'స్వంత ఆస్తి' పుట్టుకతో, గణ వ్యవస్థ ఛిన్నాభిన్నం!

క్రమంగా గణాల సంపద అధికమౌతూ వచ్చింది. భూముల్నీ, తోటల్నీ, పశువుల మందల్నీ నిర్వహించడం కోసం, ఆ బాధ్యతల్ని, తాత్కాలికంగా గణంలో సమిష్టి గృహాలకు అప్పగించడం జరిగింది. క్రమంగా ఆ ఆస్తులు, వ్యక్తుల ఆధీనంలోకి వచ్చాయి. ఒక పశువుల మందని పెంచడమో, కొంత భూమిని సేద్యం చెయ్యడమో చేసే పురుషుడు, (ఆ శ్రమలు, బానిసల ద్వారా చేయిస్తూ), ఆ ఆస్తిని, స్వంతానికి ఆక్రమించుకోవడం ప్రారంభమైంది. గణ వ్యవస్థ నియమాల్ని ధిక్కరించడం ప్రారంభమైంది.

స్వంత ఆస్తి విధానం ప్రారంభమవడంతోనే, యజమాని వర్గం, బానిసల శ్రమలతో తయారైన ఉత్పత్తుల్లో కొన్నిటిని అమ్మి 'డబ్బు' సంపాదించడమూ, 'డబ్బు'ని అప్పులు ఇవ్వడమూ, అప్పుల మీద వడ్డీలు సంపాదించడమూ, ఇతరుల ఆస్తుల్ని తాకట్లు పట్టడమూ — వంటి ఆర్థిక విషయాలన్నీ ప్రారంభమయ్యాయి.

'ధనికులూ — పేదలూ' అన్నప్పుడు, ఆ పేదలందరూ 'బానిసలే' అని అర్థం కాదు. బానిసలు కాకుండా కూడా పేదలుగా ఉండడం జరగవచ్చు. (ఆ వివరాలన్నీ ఇక్కడ చెప్పుకోలేము.)

వ్యక్తికి స్వంత ఆస్తి ఉండే 'వ్యక్తి ఆస్తి విధానం' అనాగరిక దశల్లో చివరి దశ ముగిసేనాటికే బలపడిపోయింది. మొత్తంగా మానవ చరిత్రలో 'శ్రమ దోపిడీ' అనేది, గణ వ్యవస్థలో సాగిన సమిష్టి జీవిత విధానానికి పూర్తిగా వ్యతిరేకం.

స్వంత ఆస్తి విధానం ప్రారంభమైన తర్వాత, యజమాని వర్గానికి (ధనిక వర్గానికి), తన ఆస్తి హక్కుల్ని నిలబెట్టుకోవడం కోసం, 'రాజ్యాంగ యంత్రం' అనే కొత్త ఏర్పాటు అవసరమైంది. ప్రభుత్వమూ, దాని శాసనాలూ, న్యాయ స్థానాలూ (కోర్టులు), కారాగారాలూ (జైళ్ళు), రక్షక భటులూ (పోలీసు), సైన్యం (మిలిటరీ) — ఇవన్నీ 'రాజ్యాంగ యంత్రం'లో భాగాలే.

ఈ రాజ్యాంగ యంత్రం, గణ వ్యవస్థ స్వభావ స్వరూపాల్ని మార్చివేసింది. ఈ రాజ్యాంగం ప్రకారం — బానిసల్ని స్వంత ఆస్తిగా ఉంచుకోవడమూ, వారిని అమ్మడమూ కొనడమూ చంపడమూ — యజమానులకు పవిత్రమైన హక్కులు. భూమిని స్వంత ఆస్తిగా ఆక్రమించడం కూడా ఇంకో పవిత్రమైన హక్కు! ఈ హక్కుల్ని వ్యతిరేకించేవాళ్ళు — సంఘ ద్రోహులు! శిక్షార్హులు! ఈ రాజ్యాంగం పూర్తిగా యజమాని వర్గానికి అనుకూలమైన రాజ్యాంగం.

ఈ పవిత్ర యజమాని వర్గ రాజ్యాంగం, పుస్తక రూపంగా వచ్చిందని అర్థం కాదు. అప్పటికి ఇంకా 'లిపి'ని ('రాత'ని) కనిపెట్టడమే జరగలేదు. 'లిపి' రావడానికి ఎంతో కాలంముందే, బానిసత్వమూ దాన్ని సమర్థించే రాజ్యాంగమూ ఏర్పడిపోయాయి.

ఈ రాజ్యాంగం ద్వారా బయల్దేరిన నూతన శాసనాలు అమలు జరగాలంటే, యజమాని వర్గానికి 'అంగబలం' కావాలి. అదే, రక్షక భటులూ, సైన్యమూ.

గణ వ్యవస్థలో ఇలాంటివేవీ లేవు — అక్కడ వర్గాలే లేవు కాబట్టి.

రక్షక భటులుగా, ప్రారంభంలో పనిచేసిన వారు, యజమాని వర్గం చేతుల్లో ఉండే బానిసలే. వీరు చెయ్యవలసింది — ఇతర బానిసల్ని అణచడంలో యజమానులకు అండగా పనిచెయ్యడం!

సంఘంలో, గణ వ్యవస్థా ప్రభావమే ఇంకా ఎక్కువగా ఉన్న కాలంలో, ఈ రక్షక భటులుగానూ, సైనికులుగానూ పనిచెయ్యడాన్ని, చాలా నీచకార్యంగా ఎంచేవారు. కానీ, స్వంత ఆస్తి విధానం పూర్తిగా బలపడిన తర్వాత, పోలీసులోనూ, సైన్యంలోనూ, గూఢచారి శాఖలలోనూ పనిచెయ్యడం చాలా కీర్తిగా మారింది. ఆ పనులకు, పూర్వపు సాంఘిక నీచత్వంపోయి వాటి విలువ పెరిగింది. ఈ రక్షక భటులకు తర్వాత రూపాలే చతురంగ సేనలూ, ఇప్పటి సి.ఆర్.పీ.లూ, ఎస్.ఆర్.పీ.లూ, ఇంకా అనేక రూపాల్లో ఉన్న మిలిటరీ అంతా!

కొత్త రాజ్యాంగంలో, 'పన్నుల' విధానం అనేది కూడా కొత్తగా పుట్టుకువచ్చింది. ప్రభుత్వం నడవాలంటే, ఉద్యోగుల జీతాలకూ, సైనికుల పోషణకూ, ఇంకా అవసరమైన ఖర్చులకూ, డబ్బు కావాలి. దాన్ని 'పన్నుల' రూపంలో ప్రజలందరూ కట్టాలి. గణ వ్యవస్థలో ఈ రకం ఖర్చులే లేవు కాబట్టి అక్కడ ఈ పన్నుల వ్యవ హారం కూడా లేదు.

ఈ కొత్త రాజ్యాంగంలో, బానిస యజమానులందరూ ప్రభుత్వానికి పన్నులు కడతారు. బానిసలు, పన్నులు కట్టేదేమీ ఉండదు. కానీ, యజమానుల చేతుల్లో ఉండే డబ్బు అంతా బానిసల శ్రమవల్ల వచ్చిందే కాబట్టి, యజమానులు కట్టే పన్నులన్నీ బానిసల డబ్బే.

యజమానులు కట్టే పన్నులు, వారి ఆస్తి హక్కుల్ని రక్షించే ప్రభుత్వాన్ని నడుపుతాయి. ఆ ప్రభుత్వం, బానిసల్ని అణిచే అధికార శక్తిగా పనిచేస్తుంది. అంటే, బానిసల శ్రమే (బానిసల నించి యజమాని వర్గం లాగే శ్రమే) బానిసల్ని

అణిచే శక్తిగా పనిచేస్తుందన్న మాట!

బానిస వర్గాన్ని అణచడానికి అవసరమైన పనులు చేసేదీ బానిసలే; దానికి కావలసిన డబ్బు సమకూర్చేదీ బానిసలే!

కానీ, ఇదంతా ఆనాడు ఏ వర్గానికీ తెలీదు!

## వైరుధ్యం!

వైరుధ్యం అంటే విరుద్ధత. వ్యతిరేకత. రెండు విషయాల మధ్యగానీ, రెండు పరిస్తితుల మధ్య గానీ, పొంతన లేనితనం ఉంటే, అక్కడ వైరుధ్యం ఉందని అర్థం. బానిస — యజమాని వర్గాల మధ్య వైరుధ్యం ఉంటుంది. 'వర్గాల మధ్య వైరుధ్యం' అంటే, అది, ఇద్దరు వ్యక్తుల మధ్య విరోధం కాదు. అది, రెండు బృందాల మధ్య విరోధం. ఆ బృందాల జీవన పరిస్తితుల మధ్యా, వాటి ప్రయోజనాల మధ్యా, విరోధం. ఒక వర్గానికి మేలు అయ్యే విషయం, ఇంకో వర్గానికి కీడు అవుతుంది. ఒక వేపు సౌఖ్యం అయ్యే పరిస్తితి, ఇంకో వేపు కష్టం అవుతుంది.

ఇలాంటి వైరుధ్యం, సామరస్యాలతోటీ, సంప్రదింపుల తోటీ, సంస్కరణలతోటీ, పరిష్కారం అవదు. ఆ పరిస్తితులు సమానం అయితేనే, అది పరిష్కారం అవుతుంది. వర్గాల మధ్య వైరుధ్యం పోవాలంటే, వర్గాలే లేకుండా పోవాలి.

ప్రతీ మనిషీ శ్రమ చెయ్యాలి. ఎవరి శ్రమతోనే వారు జీవించాలి. అప్పుడు, యజమానులూ, బానిసలూ అనే విభజనే వుండదు. శ్రమ దోపిడీయే వుండదు. అప్పుడు మనుషులందరూ 'సమానులుగా' జీవించే సాంఘిక పరిస్తితులు ఏర్పడతాయి.

కానీ ఆ పరిస్తితి ఆ నాటికి ఇంకా వేల, వేల సంవత్సరాల దూరంలో ఉంది! వర్గాలు అప్పుడప్పుడే తలెత్తాయి. అవి ఇంకా వేరువేరు రూపాల్లోకి మారవలసి ఉంది! ఇంకా ఎంతో చరిత్ర జరగవలసి ఉంది! అప్పటికి గానీ పరిష్కారాన్ని ఊహించలేము.

'గణ సమాజంలో వర్గభేదాలు తలెత్తాయి' అన్నప్పుడు, మొత్తం గణ సమాజాన్ని కొన్ని వేల సంవత్సరాల కాలంగా ఊహించాలి. అక్కడ, ప్రారంభంలో లేని శ్రమ దోపిడీ, శతృవర్గాలూ క్రమక్రమంగా తలెత్తాయని ఊహించాలి. గణ సమాజపు ప్రారంభ కాలమూ, చివరికాలమూ ఒకే స్వభావంతో లేవని ఊహించాలి.

## కొత్త సమాజంలో కుల భేదాలు!

గణ సమాజంలో 'కులం' అనే భావనే లేదు. చేసే పనుల్లో (వృత్తుల్లో) తేడాలున్నప్పటికీ, అవి సమిష్టి జీవనంలో భాగంగా జరిగేవే. అక్కడ సాంఘికంగా హెచ్చుతగ్గులు లేవు. అందరూ సమానమైన గుర్తింపుగల సభ్యులే. 'వ్యక్తి ఆస్తి' విధానాన్ని బలపర్చిన కొత్త ధర్మాలు — ధనిక వర్గాన్ని అగ్ర వర్గంగానూ, పేద వర్గాన్ని అధమ వర్గంగానూ విడగొట్టాయి. ఈ అధమ వర్గం వారిలో, కాలక్రమంలో, వారు చాలా కాలంగా చేసే వృత్తుల్ని బట్టి, భూమి దున్నేవారనీ, చేతి పనుల వారనీ, అట్టడుగు శారీరక శ్రమల వారనీ, 'శ్రమ–విభజన' జరిగింది. వీరిలోనే, శూద్రులూ, ఇంకా తక్కువ వారూ అనే విభజన కూడా జరిగింది.

ఈ 'కులాల' వ్యవస్థ, భారతదేశంలోనే కనపడుతోంది. శ్రమ దోపిడీవల్ల ఏర్పడ్డ వర్గభేదాలు ప్రపంచమంతటా ఉన్నప్పటికీ, ఆ భేదాలు, ఎక్కువ – తక్కువ కులాల రూపంలో భారతదేశంలోనే తలెత్తడానికి, ఇక్కడ ఉన్న ప్రత్యేక పరిస్తితులు ఏమిటి? — ఈ విషయం మీద చరిత్ర పరిశోధకులు, సంతృప్తికరమైన కారణాలు చూపించలేదు.

భారతదేశంలో ఉండే వర్గ భేదాలకు తోడు, ఇక్కడ ఉండిన 'ఏవో ప్రత్యేక పరిస్తితులు' కూడా

కలిసి, ఇక్కడ జనాభాలో ఎక్కువ తక్కువ కులాలు ప్రారంభమైనట్టు ఊహించాలి. ఈ తేడాలు, ప్రారంభంలో, బ్రాహ్మణ — క్షత్రియ — వైశ్య — శూద్ర కులాలుగా తలెత్తాయి. ఆ తేడాలే క్రమంగా అనేక వందల కులాలుగా విస్తరించాయి.

ఆదినించీ చరిత్రలో, తక్కువ కులాల వారే నిరుపేదలుగా ఉండడం కనపడుతోంది. తక్కువ కులాల వారిలో, 'ధనిక వర్గం' అనదగ్గవారు సాధారణంగా ఉండరు. ఎక్కడైనా అలాంటి ఉదాహరణలు ఉంటే, అవి చాలా తక్కువ. అవి, లేని వాటితో సమానం.

పెద్ద కులాల వారిలో, ధనికులూ పేదలూ కూడా ఉంటారు. కానీ, ఈ పెద్ద కులాల పేదలు, సాంఘికంగా హీనత్వం అనుభవించరు. అయినప్పటికీ ఈ పేదలు కూడా పేదల వర్గం కిందకే చేరతారు. ఈ పేదలు కూడా ధనిక వర్గంద్వారా శ్రమ దోపిడీకి గురి అవుతారు.

## కొత్త సమాజంలో స్త్రీ పురుష సంబంధాలు

గణ సమాజంలో, స్త్రీ పురుషుల మధ్య ఒక శ్రమ విభజన జరిగిందని చూశాం. ఆ శ్రమ విభజన, కాలక్రమంలో, స్త్రీలు — బయటి కార్యాలు తక్కువగానూ, ఇంటి కార్యాలు ఎక్కువగానూ నిర్వహించే విధానానికి దారితీసింది.

పురుషులు — వేటా, వ్యవసాయమూ, పశువుల పెంపకమూ, శతృతెగలతో యుద్ధాలూ — వంటి కార్యాల్లో ఉండడంవల్ల, వాటిద్వారా 'ఆస్తి'ని సంపాదించడానికి, స్త్రీలకు లేని అవకాశాలు పురుషులకు ఏర్పడ్డాయి.

'పురుషులు' అన్నప్పుడు, పురుషులందరూ ఒకే స్తితిలో ఉన్నారని అర్థం కాదు. బానిసలుగా ఉన్న పురుషులకు, వారి శరీరాలే వారివి కావు. అలాంటి పురుషులకు 'ఆస్తిని సంపాదించడం' అనే అవకాశమే ఉండదు. ఆస్తిని, ఏ స్తితిలో ఉన్న పురుషులు సంపాదించగలరో (యజమానులే సంపాదించగలరు), వారినే ఇక్కడ దృష్టిలో పెట్టుకోవాలి.

స్త్రీ — పురుషుల మధ్య మొట్టమొదటి శ్రమ విభజన జరిగిన తర్వాత, పురుషుడు చేసే బయటి కార్యాల్లో 'ఆస్తి'ని సంపాదించే అవకాశాలు ఏర్పడ్డాయనీ, గృహ కార్యాలకే పరిమితమైన స్త్రీలకు అలాంటి అవకాశాలు లేవనీ — ఊహించాలి.

గణ సమాజంలో, గృహ కార్యాలు కూడా, సమిష్టిగా అందరికీ అవసరమయ్యే ముఖ్య స్థానంలోనే ఉండేవి. కాలక్రమంలో, అది (గృహ కార్యం) క్రమంగా, ఒక కుటుంబానికి మాత్రమే సంబంధించిన కార్యంగా మారింది. స్త్రీలలో కొంత జనాభా బయటి పనులు కూడా చేస్తూనే ఉన్నప్పటికీ, ఆ స్త్రీలకు కూడా గృహ నిర్వహణే ప్రధాన కర్తవ్యం అయింది. గృహ నిర్వహణ కోసం చేసే ఏ శ్రమా 'విలువ'గా ('డబ్బు'గా) మారదు కాబట్టి, స్త్రీకి, పురుషులలాగా ఆస్తిని సంపాదించే అవకాశాలు కలగలేదు. — ఈ విధంగా, స్త్రీ పురుషుల మధ్య ఒక కాలంలో సహజావసరాల కోసం జరిగిన శ్రమ విభజనే, కాలక్రమంలో, ఆస్తిని సంపాదించే విషయంలో విరుద్ధ పరిస్తితులకు దారితీసిందని ఊహించాలి.

పురుషుడికి 'ఆస్తి లేని కాలం' వరకే — 'జంట పెళ్ళిళ్ళ' దశ. ఆస్తి ప్రారంభమైన తర్వాత, అది 'దంపతీ వివాహానికి' దారితీసింది.

**దంపతీ వివాహం:** ఇది, 'జంట పెళ్ళి' తర్వాత వచ్చిన రూపం. ఇందులో ప్రధానమైన మార్పు: స్త్రీకి, భర్తతో తప్ప, ఇతర పురుషులతో సంబంధాలు ఉండకూడదు. పురుషుడి విషయంలో అయితే, ఈ నిబంధన ఉండదు. అతనికి ఎన్ని పెళ్ళిళ్ళయినా జరగవచ్చు. ఎంతమంది భార్య లైనా, ఎన్ని తాత్కాలిక సంబంధాలైనా ఉండ

వచ్చు. కానీ, 'భార్య'గా ఉండే స్త్రీ విషయంలో మాత్రం, ఆమె స్వేచ్ఛ అంతా భర్త ఆధీనంలోకి వెళ్ళిపోయింది.

'భార్య' అయిన స్త్రీకి ఇతర పురుషులతో సంబంధాలు ఉండకూడదనే నిబంధన ఎందు కంటే, ఆమెకు పుట్టే బిడ్డలు, ఇతర పురుషుల ద్వారా పుట్టకూడదు. భర్త ద్వారానే పుట్టాలి. ఆ భర్తే ఆ బిడ్డలకు తండ్రిగా ఉండాలి. — పురుషుడి ఆస్తి, అతని బిడ్డలకు చెందడానికే ఈ ఏర్పాటు!

'గుంపు పెళ్ళి' కాలంలోగానీ, 'జంటపెళ్ళి' కాలంలోగానీ, పురుషుడికి ఎక్కువ ఆస్తి ఏర్పడే పరిస్తితి లేదు. విల్లులూ, చర్మాలూ, కొమ్ము బూరలూ లాంటి చిన్న చిన్న వస్తువులు తప్ప, ఆ దశల్లో అంతకన్నా ఆస్తి లేదు. కానీ, క్రమంగా, భూమీ, డబ్బూ కూడా ఆస్తిగా కూడుతోన్న కొద్దీ, 'ఆస్తి వారసత్వపు' అవసరం తలెత్తింది.

పురుషుడికి ఆస్తి ఏర్పడడమూ, అది అతని బిడ్డలకే చెందవలసి రావడమూ — అనే కారణాల వల్లనే, స్త్రీ మీద అనేక కొత్త నిబంధనలు ప్రారంభమయ్యాయి.

ఈ కొత్త నిబంధనల ప్రకారం, వివాహం జరిగిన వెంటనే ఆ స్త్రీకి, ఆమె గణం మారి పోతుంది. అప్పటినించి ఆమె, భర్త గణానికే చెందుతుంది. భర్త ఇంటిపేరే ఆమె ఇంటిపేరు అవుతుంది. బిడ్డలు, తల్లి గణానికి గాక, తండ్రి గణానికే చెందుతారు. తండ్రి ఇంటిపేరే, బిడ్డల ఇంటి పేరు అవుతుంది. — ఈ రకంగా, దంపతీ వివాహం వల్ల, స్త్రీనీ, బిడ్డల్నీ సమాజం గుర్తించే విషయంలో, వారిని 'ఫలానా పురుషుడి భార్య'గా, 'ఫలానా పురుషుడి బిడ్డలు'గా, పురుషుడి ద్వారానే గుర్తించే మార్పు జరుగుతుంది.

దంపతీ వివాహం, స్త్రీకి, ఇంకా కూడా అనేక నిబంధనలు నిర్దేశిస్తుంది. ఇందులో, పాతివ్రత్యం అనేది అతి ముఖ్యమైనది. స్త్రీ ఎప్పుడూ భర్తపట్ల వినయ విధేయతలతో మెలగాలి. భర్తనే దైవంగా ఎంచి పూజించాలి. భర్తనే యజమానిగా ఎంచి, అతని అదుపాజ్ఞల్లో జీవించాలి. జీవితాంతమూ ఎన్నడూ భర్తని విడిచి పెట్టకూడదు — ఇలాంటి నిబంధనలన్నీ కలిసి, 'పాతివ్రత్యం' అనే సాంప్ర దాయానికి దారి తీశాయి.

పురుషుడికి ఈ నిబంధనలేవీ లేవు. అతను స్వతంత్రుడు! స్త్రీకి యజమాని! స్త్రీ మీద సర్వాధి కారి! భార్యగనక భర్తపట్ల అవిధేయంగా ప్రవర్తిస్తే, ఆమెని చంపివేసే హక్కుకూడా భర్తకు ఉంటుంది.

ఈ రకమైన 'దంపతీ వివాహ ధర్మాలు' ప్రారంభమయ్యాక, ధనిక కుటుంబాల్లో, స్త్రీల నివాసాలకోసం, పరపురుషులకు అభేద్యంగా ఉండే, గాలీ వెలుతురూ సోకని చీకటి గృహాలు తయారయ్యాయి. ఈ కుటుంబాల్లో ఆడపిల్లలు చిన్నతనంనించీ చీకటి గదుల్లోనే మసులుతూ, రాబోయే భర్తలకోసం నిరీక్షిస్తూ, 'పవిత్రంగా' జీవించడం నేర్చుకోవలసి వచ్చింది. ఈ ఆడ పిల్లలు నిర్వహించవలసిన విధి — తమకు భర్త లుగా వచ్చే పురుషుల ఆస్తులకు వారసుల్ని కన డమే! ఆవులు దూడల్ని కన్నట్టు! ఆవులైతే ఆడ దూడల్ని కనాలి. కానీ, మనుష్య ఆవులైతే, మొగ పిల్లల్నే కనాలి. ఎందుకంటే — తండ్రి ఆస్తిమీద వారసత్వపు హక్కులు మొగ పిల్లలకు మాత్రమే. ఆడ పిల్లలకు కాదు.

స్త్రీలను, ఆస్తులకూ హక్కులకూ దూరంగా ఉంచే విధానం ఇది. ఆడపిల్లలకు, తండ్రి ఆస్తిలో వారసత్వపు హక్కులు వుండవు. వారికి, కేవలం 'కట్న కానుకల' రూపంలో, స్వల్పమైన ఆస్తిని మాత్రమే ఇవ్వడం వచ్చింది.

కొడుకులు లేకపోతే, ఆ తండ్రి, తన గణం లోనే ఒక మొగ పిల్లవాడికి, దత్తత పేరుతో, తన ఆస్తిని అప్పజెపుతాడు.

పురుషుడి స్వంత ఆస్తి విధానం, అప్పటి వరకూ ఉన్న మాతృస్వామ్యాన్ని 'పితృస్వామ్యం'గా మార్చివేసింది. 'పితృస్వామ్యం' అంటే — పిల్లల

మీద తండ్రే (తల్లిగాక) 'స్వామి'గా, హక్కుదారుగా ఉండే విధానం. పిల్లల మీదే కాదు, ఆ పిల్లల తల్లిమీద కూడా! ఆ స్త్రీ, ఫలానా పురుషుడి భార్య! ఆ పిల్లలు ఫలానా పురుషుడి పిల్లలు!

**వేశ్యరికం:** పురుషుల స్వంత ఆస్తి విధా నంతో, వారి అధికారం బలపడిన దాని ఫలితమే సమాజంలో 'వేశ్యరికం.' తెగల యుద్ధాల్లో దొరికిన శత్రుస్త్రీలతో, జయించిన తెగల పురుషులు, తమకు కావలసిన సంబంధాలతో గడిపేవారు.

స్త్రీ, పురుషుణ్ణి కామ సంబంధాలతో ఆనంద పెట్టడం, పవిత్రమైన దేవకార్యం — అని ఒక మత భావన ప్రారంభమైంది. ఈ కార్యం కోసం కొందరు స్త్రీలు 'దేవదాసీలు'గా ఉండి, పురుషుల్ని ఆనందపెడుతూ ఉండేవారు. తర్వాత కాలంలో వారి భుక్తికి భూములు ఇవ్వడం కూడా వచ్చింది. కాలక్రమంలో వీరు తమ దగ్గిరికి వచ్చే పురుషుల నించి కూడా ధనం కోరేవారు.

ఒక పురుషుడు తన డబ్బుతోటే ఒక వేశ్యని పోషించగలిగితే, ఆ వేశ్యకి ఇతర పురుషులతో సంబంధాలు లేకుండా ఆమెని ఆ పురుషుడు తన 'ఉంపుడు కత్తె'గా ఉంచుకునేవాడు. పురుషుడి ఆర్థిక స్థోమతని బట్టీ, హోదాని బట్టీ, ఎందరు ఉంపుడు కత్తెల్ని అయినా పెట్టుకోవచ్చు. భార్యకీ, ఉంపుడు కత్తెకీ తేడా ఏమిటంటే — ఉంపుడు కత్తెకు పుట్టిన పిల్లలకు ఆస్తి హక్కులు ఉండవు. వారు కేవలం, ఆ ధనిక పురుషుడి దయాధర్మాల మీదే బతుకుతారు.

సంఘంలో వేశ్యరికం ప్రారంభమవడం అంటే, స్త్రీలలో కొందరు 'పతివ్రతలు' గానూ, కొందరు 'వేశ్యలు'గానూ అయిపోయారని అర్థం.

**ముష్టి:** సంఘంలో ఒక వేపు కలిమీ, ఇంకోవేపు లేమీ ప్రారంభమైన తర్వాత, (అంటే, 'శ్రమ దోపిడీ' ప్రారంభమైన తర్వాత), ధనికులు మరింత ధనికులూ, పేదలు మరింత పేదలూ అవడం కొనసాగుతూనే ఉంది. పేద జనాభాలో అట్టడుగు విభాగాల వారు, తిండి లేక మలమల మాడే స్తితికి కూడా చేరతారు. దానివల్ల అనేక రకాల నేరాలు తలెత్తుతాయి. ముఖ్యంగా, పేదలు, ధనికుల ఇళ్ళమీద పడి దోచుకోవడం లాంటి నేరాలు. ఆ పేదజనం బతకడానికి ఏదో ఒక మార్గం లేకపోతే, అది ధనిక వర్గానికే పెను ముప్పుగా తయారవుతుంది. ఆ వర్గం, ఆ ముప్పు నించి బైటపడే మార్గాల్లో ఒకటి — పేదలకు దానధర్మాలు చెయ్యడం! వాటిలో అట్టడుగు రూపం —ముష్టి పడెయ్యడం!

దానం చేసే మనిషి గొప్ప దయతో ఆ పని చేస్తున్నట్టుగా కనపడుతుంది. కానీ, ఆ పనికి అర్థం — వాళ్ళ స్వంత రక్షణే! "ఇదుగో! మీకు ఈ బిచ్చం వెయ్యవలసిన అవసరం మాకేమీ లేదు. అయినా మీరు పేదవాళ్ళు కదా అని దయతో ఇలా బిచ్చం పెడుతున్నాం. మా దయతో సంతృప్తిపడి బతకండి! మా సిరిసంపదల వేపు కన్నెత్తి చూడకండి!" అని ఆ ధర్మాత్ములు పేదలకు చెపుతున్నారన్న మాట!

అయితే, ఆ ధనిక వర్గంలోనే, దానధర్మాలు చెయ్యనివాళ్ళు అనేక మంది వుండగా, దాన ధర్మాలు చేసేవాళ్ళు తక్కువ మందే ఉంటారు. వారివల్ల పేద సాదలకు తాత్కాలికంగా అయినా బిచ్చాలు దొరుకుతాయి. అందుకే దానధర్మాలు చేసేవారు దయగలవారే అవుతారు.

దాన ధర్మాలు చేసేవారు, 'కీర్తి' కోసమూ, 'పుణ్యం' వస్తుందనే నమ్మకాలతోనూ కూడా అవి చేస్తారు.

వ్యక్తి స్వంత ఆస్తి విధానంవల్ల ఈ మార్పులన్నీ జరుగుతోంటే, ఈ మార్పులవల్ల బాధలకు గురిఅయ్యేవాళ్ళు ఈ మార్పుల్ని సంతోషంగా ఆమోదించారని అర్థం కాదు. బాధలుపడే వారి వ్యతిరేకతా ధిక్కారమూ లేకుండా ఏ మార్పూ జరగదు. కానీ, అలాంటి ధిక్కారాలన్నిటినీ అణచడానికే ధనిక వర్గం ఏర్పాటు చేసుకున్న కొత్త రాజ్యాంగమూ, దాని పరిపాలనా ఉన్నాయి.

## వ్యక్తి స్వంత ఆస్తి విధానం వల్ల ఫలితాలు

**1.** యజమానితనమూ — బానిసత్వమూ. అంటే, శ్రమ దోపిడీ ప్రారంభం.

**2.** యజమాని వర్గమే — ధనిక వర్గం. అదే పరిపాలన చేసే వర్గం. శ్రమచేసే వర్గం — పేద వర్గం. అది ప్రజల వర్గం. ఈ రకంగా, మనుషులు రెండు వర్గాలుగా విడిపోతారు.

**3.** యజమానులు బానిసలతో శ్రమ చేయించడం ప్రారంభించి, తాము క్రమంగా శ్రమ చెయ్యడం మానివేశారు. అప్పటినించీ శ్రమ చెయ్యడం అనేది నీచ లక్షణంగానూ, శ్రమ చెయ్యకుండా జీవించడం ఉన్నత లక్షణంగానూ మారాయి.

**4.** హక్కులన్నీ ధనిక వర్గానివి. బాధ్యతలన్నీ శ్రామిక వర్గానివి.

**5.** మాతృ స్వామ్యం, పితృ స్వామ్యంగా మారింది. స్త్రీలలో — పాతివ్రత్యమూ, వేశ్యరికమూ తలెత్తాయి.

**6.** పురుషుడికీ, పురుషుడికీ మధ్య (యజమానికీ బానిసకూ మధ్య) ఎక్కువ తక్కువలు; స్త్రీకీ స్త్రీకీ మధ్య (యజమానిరాలికీ బానిస స్త్రీకీ మధ్య) ఎక్కువ తక్కువలు; స్త్రీకీ, పురుషుడికీ మధ్య (కుటుంబంలో స్త్రీ పురుషుల మధ్య) ఎక్కువ తక్కువలు! — ఈ తేడాలన్నీ ఏర్పడ్డాయి.

సమాజంలో జరిగే మిగిలిన మార్పులన్నీ, ఈ ప్రధానమైన మార్పులకే సంబంధించి ఉంటాయి.

ప్రపంచ సాహిత్యంలో ఏ మత గ్రంథాన్ని తీసుకున్నా, అది బోధించే సాంప్రదాయాల లోనూ, నీతులలోనూ, స్వంత ఆస్తి విధానం వల్ల వచ్చిన ఈ లక్షణాలన్నీ కనపడతాయి.

'రామాయణం'లో కూడా ఈ లక్షణాలన్నీ ముందు ముందు చూడబోతున్నాము.

## కలాల సైన్యం!

స్వంత ఆస్తి విధానం స్థిరపడడం కోసం ఎలాంటి మార్పులైతే అవసరమవుతాయో వాటిని, యజమాని వర్గం, కేవలం 'దండ నీతి'తో మాత్రమే సాధించలేదు. దండ నీతి, అన్ని సందర్భాలకూ పనికిరాదు. ఒక బానిస, తన యజమానికీ; ఒక భార్య, తన భర్తకీ — అణిగిమణిగి ఉండేలాగ చెయ్యడానికి, వేరే రకం బోధనలు కూడా ఉండాలి. అణగారి పోవలసినవాళ్ళు, ఆ పనిని తమ స్వంత ఇష్టంతోనే చేసే విధంగా వారికి బోధించాలి.

ధనిక వర్గ శ్రేయస్సుకోసం ప్రజలకు వినయ విధేయతలు నేర్పే బాధ్యత తమ భుజాల మీద వేసుకున్నది ఎవరో కాదు — కవులే! వీరు కత్తుల సైన్యం కాదు. 'కలాల సైన్యం.' (అప్పుడు కలాలూ లేవు, ఘంటాలూ లేవు. లిపే లేదు. అంతా నోటి కథల ద్వారా చేసే ప్రచారమే! — ఇది ఇంకా అనాగరిక దశే. నాగరిక దశలోగాని 'లిపి' ప్రారంభం కాదు).

ఈ కలాల సైన్యం ధనిక వర్గంలో వ్యక్తులే. వీరు ముఖ్యంగా మతానికి సంబంధించిన విషయాలూ, కార్యకలాపాలూ చూసే పూజారులు (ఏ దేశంలో అయినా). ధనిక వర్గం స్థిరపడడమే వీరికి ప్రయోజనం. సమిష్టిగా జీవించాలనే గణ వ్యవస్థ ప్రభావం ఉన్న ప్రజల మనసుల్లో నించి పాత భావాలు పోయి కొత్త భావాలు వ్యాపించి, అవి ఎల్లకాలం నిలిచేటట్టు చెయ్యాలి. స్త్రీలు వారికై వారే స్వేచ్ఛను ద్వేషించి, వినయంతో, అణకువతో, భర్తల పాదాలు నాకేటట్టు చెయ్యాలి. కొడుకులు తల్లుల్ని గాక, తండ్రుల్నే భయ భక్తులతో, వినయ విధేయతలతో కొలిచేటట్టు చెయ్యాలి. పేదవారు, తమ పేదతనం తమ దురదృష్టమేననీ, తక్కువ కులాల్లో పుట్టడం తమ దురదృష్టమేననీ, సరిపెట్టుకునేటట్టు చెయ్యాలి.

వేశ్యలు, తమ వృత్తి గొప్ప పుణ్య కార్యం అనుకునేటట్టు చెయ్యాలి! — ప్రజలలో ఈ రక మైన మానసికమైన మార్పులన్నీ జరగడానికి కలాల సైన్యం సృష్టించిన అద్భుతమైన ఆయు ధాలు ఇవీ: చేసుకున్న కర్మ, పాపం - పుణ్యం, స్వర్గం - నరకం, జన్మా - పునర్జన్మా! — ఇటు వంటి భావాలు!

వీటిలో ఒక్క విషయంతో కూడా గణ వ్యవస్థకి అవసరం కలగలేదు!

ఈ చేసుకున్న కర్మా, పునర్జన్మా, పాప పుణ్యాలూ, స్వర్గ నరకాలూ, వంటి భావాలన్నీ కలిసి కొత్త మత నమ్మకాల్ని సృష్టించాయి. పూర్తిగా అబద్ధమూ అజ్ఞానమూ అయినదాన్ని! ప్రజలు, ఈ అజ్ఞానంలో పడి, తమ మొహాలు స్వర్గ నరకాల వేపు తిప్పి వుంచడం దోపిడీ వర్గా నికి కావాలి. దోపిడీ వర్గం కూడా ఈ అజ్ఞానం లోనే వుంటుంది. కానీ, ఈ అజ్ఞానం, పేద వర్గానికి హాని కలిగించినట్టుగా, ధనిక వర్గానికి హాని కలిగించదు.

<u>'మతం' అనేది, ఏ నాటినించో ధనిక వర్గానికి సేవచేసే అంగంగా తయారైపోయింది.</u> ఈ మత బోధకులు, ఎవరికి ఎలా బోధించాలో అలా బోధించే చాతుర్యాలు సంపాదించారు.

స్త్రీలు, పతివ్రతలుగా ఉంటూ, భర్తలకు సేవలు చేస్తే, పుణ్యం సంపాదించి స్వర్గానికి వెళ్తారు. — దీనికోసం బోలెడు కథలు! ఫలానా ఫలానా ఫలానా పతివ్రతలు, అలాగే స్వర్గానికి వెళ్ళారు — అని!

బానిసలు — యజమానులకు విశ్వాస పాత్రు లుగా ఉంటూ, నిష్కల్మషంగా సేవలు చేస్తే, పుణ్యం సంపాదించి, స్వర్గానికి వెళ్తారు. — దీని కోసం బోలెడు కథలు! ఫలానా ఫలానా సేవకులు అలాగే మోక్షాలు పొందారు — అని!

పేదలు — ధనికుల పట్ల, అసూయా ద్వేషాలు లేకుండా వినయ విధేయతలతో మెలిగితే, వారు పుణ్యం సంపాదించి, మరు జన్మల్లో ధనికులుగా పుడతారు. ఫలానా ఫలానా నిరుపేద సేవ కులు అలాగే మహా ధనికులుగా పుట్టారు — అని!

ధనికవర్గ ప్రయోజనాలకు ఏది ఉపయోగ పడుతుందో అది — పుణ్యం! ఏది హాని చేస్తుందో అది — పాపం!

సాటి మానవుల్ని, అడుక్కుతింటూ జీవించే స్తితికి నెట్టి, ముష్టితనానికి కూడా గొప్ప అర్థాలు కల్పించి, దానికొక దేవుణ్ణి కూడా (శివుణ్ణి) సృష్టిం చారు! 'బిచ్చగాళ్ళంతా దేవుళ్ళే' అని, మతం, బిచ్చగాళ్ళకు దైవత్వం కల్పించింది.

ఈ కథలన్నీ రాసిన వాళ్ళెవరు? — కవులే. వీరి చేతుల్లో, ధనిక వర్గానికీ, అందులో పురుషాధి పత్యానికీ సహకరించే మత కథలు, అసంఖ్యా కంగా తయారయ్యాయి. మూర్ఖులు రాసిన ఈ కథలు, ప్రజల్ని మూర్ఖుల్ని చెయ్యడానికి కంకణం కట్టుకున్నాయి.

మొదట్లో స్త్రీలూ, పేదలూ నరకం వేపే మొగ్గారు. ధిక్కారంతో కొట్లాటలతో, అవిధేయ తతో, అన్నీ పాపాలే చేశారు. కానీ కాలక్రమంలో, వేలాది సంవత్సరాల అలవాటుతో అణిగిపోయి, నెమ్మదిగా తలలు వాల్చేశారు. పూర్తిగా ఆత్మ ల్లోంచి లొంగిపోయారు. స్త్రీలు, 'స్వేచ్ఛ' అనే ఆలో చనే మర్చిపోయి, పూర్వం స్త్రీలు పతివ్రతలుగా ఉండేవారు కారనే కథలు విని, బుగ్గలు నొక్కుకునే స్థితికి చేరారు. పేదలు, పుణ్యం చేసుకుని ధని కులుగా పుట్టడం కోసం, వచ్చే జన్మల వేపు మొహాలు తిప్పారు.

ఇక్కడితో గణవ్యవస్థ దశలన్నీ పూర్తి అయ్యాయి. ఇక మనం దాని సంగతి మర్చి పోవచ్చు. వ్యక్తి ఆస్తి బలపడే ముందు వరకూ ఉన్న గణవ్యవస్థే, మాతృస్వామ్య వ్యవస్థ. అదే **'ఆదిమ కమ్యూనిజం.'** మానవ చరిత్రలో ఈ గణ వ్యవస్థ, ఆటవిక మధ్య దశలో పుట్టి, అనాగరిక చివరి దశ వరకూ ఉన్నతిలో సాగి,

నాగరిక దశల ప్రారంభంతో అంతరించి పోయింది.

విల్లు — ఆటవిక మానవుడికీ,
కత్తి — అనాగరిక మానవుడికీ,
మందు గుండు — నాగరిక మానవుడికీ,
చిహ్నాలు!

## దోపిడీ వ్యవస్థా, సిగ్గూ లజ్జా లేని సంస్కృతీ!

ఏ సమాజంలో అయినా **3** రంగాలు ఉంటాయి. (1) ఆర్థిక రంగం (2) రాజకీయ రంగం (3) సాంఘిక రంగం — ఈ **3** రంగాలకూ ఒక సమన్వయం ఉంటుంది. ఈ **3** రంగాలూ ఒకే లక్ష్యంకోసం, ఒకే మార్గంలో పనిచేస్తాయి.

మానవులు జీవించడానికి అనేక రకాల శ్రమలు జరగాలి. శ్రమలు జరగడానికి, భూమీ, ఇతర శ్రమ సాధనాలూ, కావాలి. 'శ్రమ సాధనాల'కూ, మానవుల మధ్య వున్న 'శ్రమ సంబంధాల'కూ సంబంధించినదంతా — ఆర్థిక రంగం. ఆర్థిక రంగం ఏ స్వభావంతో ఉంటే, రాజకీయ — సాంఘిక రంగాలు కూడా ఆ స్వభావం తోటే ఉంటాయి.

గణ వ్యవస్థలో, ఆర్థికరంగం, శ్రమదోపిడీలేని స్వభావంతో ఉండేది కాబట్టి, అక్కడ ఇతర రంగాలు కూడా అదే స్వభావంతో ఉండేవి. అక్కడ 'రాజకీయాలు' అనేవే లేవు. సాంఘిక రంగంలో, అసమానత్వపు ధర్మాలేవీ లేవు.

ఆర్థిక రంగంలో శ్రమ దోపిడీ ప్రారంభమైన తర్వాత, దాన్ని నిలబెట్టే రాజకీయాలే, దాన్ని నిలబెట్టే సాంఘిక ధర్మాలే, ప్రారంభమయ్యాయి.

శ్రమ దోపిడీ లేని సమాజంలో అయినా, అది ఉన్న సమాజంలో అయినా, అన్ని రంగాలకూ సంబంధించిన భావాల మొత్తమే — ఆ సమాజపు 'సంస్కృతి' (కల్చర్).

మొత్తం ప్రపంచాన్ని తీసుకుంటే, దోపిడీ శ్రమ సంబంధాలు ఉన్న ఏ దేశంలో అయినా, ఏ ప్రాంతంలో అయినా, 'సంస్కృతి' అనేదంతా ఒకే రకంగా ఉంటుంది. ధనిక – పేద తేడాలు ఎక్కడైనా ఉంటాయి. పురుషాధిక్యతా – స్త్రీల పరాధీనతా ఎక్కడైనా ఉంటాయి. వేశ్యరికమూ, ముష్టితనమూ, నేరాలూ ఎక్కడైనా ఉంటాయి. మత నమ్మకాలు లేనిచోటు ఎక్కడా ఉండదు. ఇలాంటి లక్షణాలన్నీ ప్రతీచోటా ఉంటాయి. అందుకే అన్ని ప్రాంతాల సంస్కృతులూ ఒకటే.

అయితే, కొన్నిచోట్ల కొన్ని ప్రత్యేక పరిస్తితులు ఉండవచ్చు. ఉదాహరణకి, భారతదేశంలో 'కుల భేదాల' లాంటివి. ఇక్కడ ఈ ప్రత్యేక పరిస్తితి వుంటే, ఇంకోచోట ఇంకో రకం ప్రత్యేక పరిస్తితీ, దానివల్ల వచ్చే అసమానత్వాలూ ఉండవచ్చు.

వేరు వేరు ప్రాంతాల సంస్కృతుల మధ్య తేడాలేమైనా ఉంటే, అవన్నీ వేష భాషలకూ, ఆహారపుటలవాట్లకూ, ఇంకా ఆ రకం విధానాలకూ సంబంధించినవిగా మాత్రమే ఉంటాయి. ఒక ప్రాంతంలో స్త్రీలు చీరలు కడితే, ఇంకో ప్రాంతంలో స్త్రీలు గౌనులూ, మూడో ప్రాంతంలో స్త్రీలు పైజమాలూ ధరించవచ్చు. ఎవరి దుస్తులు ఎలా ఉన్నా, అందరిలోనూ ధనిక – పేద తేడాలు ఉంటాయి. చీరలు కట్టే స్త్రీలలోనూ ధనిక – పేద తేడాలు ఉంటాయి; గౌనులు వేసే స్త్రీలలోనూ ఆ తేడాలు ఉంటాయి. మూడో రకంలోనూ అంతే. ఇలాంటి తేడాలన్నీ పైపై తేడాలు. అసలు విషయం అన్ని ప్రాంతాల సంస్కృతీ ఒకటే.

'శ్రమ దోపిడీ' అనే మాట, 'శ్రమ సంబంధాల్లో సాగే దోపిడీకే' వర్తిస్తుంది. కానీ, ఆ సంబంధాల్లో దోపిడీ ఉన్నప్పుడు, రాజకీయ — సాంఘిక రంగాల్లో కూడా 'దోపిడీ' లక్షణాలు గల సంబంధాలే ఏర్పడతాయి.

'కుల భేదాల్ని' తీసుకుంటే, బ్రాహ్మణ కుల

స్తుడు, తనని తను అత్యున్నతుడిగా భావించుకుంటాడు. "నేను అధికుణ్ణి. చిన్న కులాల వాళ్ళందరూ అల్పులు. అందరూ నన్ను గౌరవించాలి" అనుకుంటాడు. ఈ భావాలు, ఈ వ్యక్తికి, 'దోపిడీ వ్యవస్థ' ద్వారా ఏర్పడినవే. ఇలా భావించే బ్రాహ్మణ కులస్తుడు, ఇతర కులాల వారికి లేని ఎన్నో హక్కుల్ని తను పొందుతున్నాడు కాబట్టి, ఇతను 'సాంఘికంగా' దోపిడీదారుడే. మనుషుల మధ్య ఈ 'అసమానత,' దోపిడీ పునాది వల్ల ఏర్పడిన ఒక 'ఫలితం.'

'శ్రమ దోపిడీ' అనేది — అలాంటి ఒక 'ఫలితం' కాదు. అదే 'మూలం.' ఆర్థిక రంగంలో వున్న 'శ్రమ దోపిడీ' అనే మూల కారణం వల్ల, ఇతర రంగాలు కూడా అదే లక్షణాలతో ఉంటాయి కాబట్టి, రాజకీయమైన అసమానతల్ని 'రాజకీయ దోపిడీ' అనీ, సాంఘికమైన అసమానతల్ని 'సాంఘిక దోపిడీ' అనీ, అనవచ్చు. కానీ, ఈ రంగాల వెనకవున్న 'శ్రమ దోపిడీ' అనే ఆర్థిక కారణాన్ని ఎప్పుడూ స్పృహలో ఉంచుకోవాలి.

స్త్రీ పురుషుల విషయం తీసుకుంటే — ధనిక వర్గంలో ఉండే స్త్రీ పురుష సంబంధాలే పేద వర్గానికి కూడా విస్తరిస్తాయి. పురుషుడు అనే వాడు (ఏ 'వర్గం'లో అయినా, ఏ 'కులం'లో అయినా), స్త్రీల హక్కుల్ని దోచుకునే దోపిడీదారుడే.

ఒక పేద పురుషుణ్ణి, అతని యజమానితో పోలిస్తే, ఆ ఇద్దరికీ ఉన్న సంబంధంలో, ఆ పేద వ్యక్తి అస్వతంత్రుడే. అతను, యజమాని ఆజ్ఞల ప్రకారం నడవవలసినవాడే. కానీ, ఆ పేద పురుషుణ్ణే అతని భార్యతో పోలిస్తే, ఆ సంబంధంలో అతను స్వతంత్రుడు. అతనే ఆ స్త్రీకి — యజమాని. భార్యకు భర్త యజమానిగా ఉండడం అంటే, అది శ్రమ దోపిడీ కాకపోయినా, స్త్రీ హక్కుల్ని పురుషుడు దోచుకుంటున్నాడని అర్థం. ఈ రకంగా, అన్ని రంగాలలోనూ, అన్ని సంబంధాలలోనూ సాగే దోపిడీయే, ఆ సమాజానికి 'పవిత్ర సంస్కృతి' అవుతుంది.

## పాలించే వర్గ భావాలే ప్రజల భావాలు!

ధనిక వర్గంలో స్త్రీల మీద పాతివ్రత్య నిబంధనలూ, కొడుకుల మీద పితృభక్తి నిబంధనలూ — ఇవన్నీ 'ఆస్తి వారసత్వాల' నించి పుట్టుకొచ్చినవే. <u>పురుషాధిక్యత అనేది, పురుషుడి ఆస్తితో ముడిపడి ఉన్న విషయం.</u>

పేద వర్గంలో పురుషులకు ఏ ఆస్తులూ లేకపోయినా, కాలక్రమంలో, ధనిక వర్గ భావాలే పేద వర్గ భావాలైపోతాయి. ధనిక వర్గమే పాలించే వర్గం కాబట్టి, ఆ వర్గ ప్రభావమే సమాజం అంతా వుంటుంది. పాలించే వర్గ భావాలే ప్రజల భావాలు అవుతాయి! పాలించే వర్గ సంస్కృతే ప్రజల సంస్కృతి అవుతుంది!

పేద వర్గ పురుషుడు కూడా, తన భార్య, పర పురుషుల్ని కన్నెత్తి చూడని పతివ్రతగానే ఉండాలనీ, తన బిడ్డలు తన ఆజ్ఞ జవదాటని విధేయులుగానే ఉండాలనీ, ఆశిస్తాడు. ధనిక వర్గంలోలాగే పేద వర్గంలో కూడా స్త్రీల మీద భర్తల ఆంక్షలూ ఆధిపత్యాలూ పెద్దఎత్తున కొనసాగుతాయి.

ఇక్కడ ఒక విషయంలో స్పష్టత ఉండాలి. 'పురుషుడు, స్త్రీని పతివ్రతగా మార్చి, ఆమె మీద అధికారిగా మారి, ఆమె స్వేచ్ఛని అరికట్టాడు' అనడం అంటే, 'స్త్రీలకు పరపురుషులతో కూడా సంబంధాలు ఉండవలసిందే, స్వేచ్ఛ అంటే అదే, ఆ స్వేచ్ఛ స్త్రీలకు ఉండవలసిందే' అని చెపుతున్నట్టు అర్థం కాదు. ఇక్కడ పురుషుడి మీద విమర్శ ఏమిటంటే — తను పర స్త్రీలతో తిరిగే స్వేచ్ఛతో ఉంటూ, తన స్త్రీని మాత్రం పతివ్రతగా మార్చాడు — అని!

ఇద్దరు స్త్రీ — పురుషులు భార్యాభర్తలు అయినప్పుడు, భార్యకి పరపురుషులతో సంబంధాలు

ఉండరాదంటే, భర్తకి కూడా పరస్త్రీలతో సంబంధాలు ఉండరాదు. అలాంటి భార్యాభర్తల సంబంధమే వైరుధ్యాలు లేని సరైన స్త్రీ — పురుష సంబంధంగా ఉంటుంది. కానీ, అలాంటి 'సరైన' సంబంధాన్ని ఆ నాడే, అంటే, పురుషుడి స్వంత ఆస్తి తలెత్తుతోన్ననాడే, ఊహించలేము. కానీ, స్త్రీ మీద పురుషుడి ఆధిపత్యం, పురుషుడి స్వంత ఆస్తి ద్వారా ప్రారంభమైన పరిస్తితే. ఆస్తిలేని పేద వర్గంలో కూడా!

ధనిక వర్గంలో పురుషులు ఏ శ్రమలూ చెయ్యనట్టే, ఆ వర్గంలో స్త్రీలు కూడా ఏ శ్రమలూ చెయ్యరు. బయట జరిగే ఉత్పత్తి కార్యాలకు దూరంగా ఉంటారు. ఈ స్త్రీలు, తండ్రుల ఆస్తులమీదా, భర్తల ఆస్తుల మీదా ఆధారపడి జీవిస్తారు.

పేద వర్గంలో స్త్రీలు బయటి శ్రమల్లో కూడా వుంటారు. వ్యవసాయంలోనూ చేతివృత్తుల్లోనూ ఉంటారు. అంటే ఈ స్త్రీలు, తమ పోషణ తామే కొంతైనా చేసుకోగలిగే స్తితిలో వుంటారు. అయినప్పటికీ, పేద స్త్రీ కూడా భర్త ఆధిపత్యానికి లొంగి ఉంటుంది. ఎందుకంటే, ధనిక వర్గ సంస్కృతే, దాని భావజాలమే, పేద వర్గాన్ని కూడా ప్రభావితం చేస్తాయి.

## సాంస్కృతిక సైన్యం!

సమాజంలో, రకరకాల 'కళలు' ఉంటాయి. గానమూ, కవిత్వమూ, అభినయమూ, చిత్రలేఖనమూ — వంటివి. ఈ కళాకారులందరూ దోపిడీ సమాజంలో పుట్టి పెరిగేవారే కాబట్టి, వీరందరూ ఆ భావాలతోనే ఉంటారు. వీరు, తమ భావాలనే, తమ కళలద్వారా సమాజానికి అందిస్తారు. కవుల్ని మాత్రమే విడిగా చూస్తే, అది 'కలాల సైన్యం.' మొత్తం కళాకారులందర్నీ కలిపి చూస్తే, దాన్ని 'సాంస్కృతిక సైన్యం' అనవచ్చు.

కత్తుల సైన్యానికి కూడా, సాంస్కృతిక సైన్యమే సాంస్కృతిక భావాలు నూరిపోస్తుంది. వీరు ప్రచారం చేసే ఒక్కో నీతి, వంద కత్తులకన్నా వాడి అయినది. ఈ 'నీతి కత్తులు' సామాన్య ప్రజానీకానికి చేసిన గాయాల్నీ, కలిగించిన ఆత్మ వికలత్వాల్నీ ముందు ముందు కొన్ని వేల సంవత్సరాల వరకూ చూస్తాం. (అంటే, ఇప్పుడు కూడా. ఇంకా ఈ నాటి సమాజంలో కూడా.)

## రాజుల పుట్టుక!

దోపిడీ వ్యవస్థ పరిపాలనలోనే, ఇతర శత్రు తెగల దాడుల్నించి రక్షణకి కోటలూ, పట్టణాలూ వెలిశాయి. కొన్ని కొన్ని తెగలు కలిసి, వారు ఆక్రమించుకున్న ప్రదేశాలు కూడా కలిసి, ఒకే తెగ పరిపాలన కిందకు రావడం జరుగుతుంది. యుద్ధాలలో ఓడిన తెగల్ని సామంతులుగా చేసుకోవడం ప్రారంభమైంది. పరిపాలన చేసే తెగ తాలూకు అధికారంలో ఉన్న ప్రదేశమంతా 'ఒక రాజ్యం'. దాని అధిపతే — 'రాజు!'

ఆ రాజ్యం, చాలా చిన్నదైనా కావచ్చు; కొంచెం పెద్దదైనా కావచ్చు. అది, కొన్ని సరిహద్దుల్లో ఉన్న పరిపాలనా ప్రాంతం. ఒక రాజ్యాన్ని 'ఒక దేశం' అని కూడా అనవచ్చు. 'రాజ్యం' అన్నా, 'దేశం' అన్నా, అది ఒక పరిపాలనా ప్రాంతమే.

'రాజు' అనే వాడికి కొంత భూమి స్వంత ఆస్తిగా ఉంటుంది. ఆ భూమిని పండించే బానిస జనాభా, ఇతర సేవక గణాలూ కూడా అతని ఆధీనంలో ఉంటారు. ఆ రాజ్యంలో, రాజుకిలాగే ఇతర ధనికులకు కూడా స్వంత భూములూ, వాటిని పండించే నిరుపేద జనాభా ఉంటారు. రాజు 'పరిపాలన' అంతా — ఆ ధనిక వర్గ ప్రయోజనాల కోసమే. ఆ వర్గం అంతా ఆ రాజుకి అనుకూలంగా వుంటుంది.

'రాజు' అనేవాడు ఎప్పుడూ ఇరుగు పొరుగు రాజ్యాల మీదపడి (ఇరుగు పొరుగు ప్రాంతాల

మీద) యుద్ధాలు చేసి, ఆ రాజ్యాల్ని కూడా (ఆ భూముల్ని కూడా) ఆక్రమించడానికి ప్రయత్నిస్తాడు. అలా ఆక్రమించిన భూముల్ని, జయించిన దేశంలో ఉన్న పెద్ద పెద్ద ధనవంతులందరూ పంచుకుంటారు. ఆ భూముల ద్వారా మరింత ధనం సంపాదిస్తారు. మళ్ళీ ఇంకో రాజ్యం మీదకి బైల్దేరతారు.

ఎక్కువ ప్రదేశాల్ని ఆక్రమించగలిగే రాజు — మహా రాజు! మహా వీరుడు! ఆ మహా వీరత్వం ఇంకా ముదిరితే, వాడు — చక్రవర్తి!

మత కథల నిండా అత్యద్భుతంగా కనపడే కథానాయకులు — రాజులే! 'రాజు' అంటే అందరికీ (ధనికులకూ పేదలకూ కూడా) విపరీతమైన ఆకర్షణ! అతని అధికార స్థానం మీదా, అతని సిరిసంపదల రాసులమీదా ఉండే ఆకర్షణ అది!

'కథ' అంటే, 'రాజు' గురించే! అనగనగా ఒక రాజు! 'రాజు' లేకపోతే కథే ఉండదు.

రాజులు ఏనాడో చేసిన యుద్ధాల్ని తల్చుకుని జనం ఈనాటికీ పొంగిపోతూ ఉంటారు. రాజుల వీరత్వాన్నీ శూరత్వాన్నీ పవిత్ర గాధలుగా చెప్పుకుంటూ ఉంటారు. కానీ, 'యుద్ధం' అంటే ఏమిటి? — ఇంకో ప్రాంతపు మనుషుల్ని చంపడం! వాళ్ళకి, 'శత్రువులు' అనే పేరు పెట్టి! యుద్ధం తర్వాత జరిగేదేమిటి? గెలిచిన దేశపు ధనికవర్గం, ఓడిన దేశపు భూముల్నీ వెండి బంగారాల్నీ, మనుషుల్నీ, తమ ఆస్తులుగా ఆక్రమించడం! గెలిచిన దేశపు వ్యాపారులు, ఓడిన దేశంలో కూడా వ్యాపారాలు సాగిస్తూ, లాభాలు పెంచుకోవడం! దీని సారాంశం — ఒక దేశపు ధనిక వర్గపు అధికారం, ఇంకో దేశపు ధనికవర్గం చేతుల్లోకి మారడమే.

ఓడిన దేశపు ప్రజలు కూడా, గెలిచిన దేశపు రాజునే తమ కొత్త రాజుగా స్వీకరించి, ఆ రాజుకే హారతులు పడతారు. ఏ రాజు అయినా ఒకటే అనుకోండీ! రాజు మారితే ప్రజలకు వచ్చే కొత్త నష్టం ఏముంటుంది?

ఒక యుద్ధంవల్ల రెండు దేశాల్లోనూ సామాన్య ప్రజలకూ, సైనికులకూ కలిగే ప్రయోజనాలేమిటి? వారికేం కొత్త సంపదలు వచ్చి పడతాయి? ఓడినా గెల్చినా, సైనికులు, మళ్ళీ సైనికులుగా ఉండవలసిందే. జన్మంతా రాజుల కోసం యుద్ధాలు చేసిపెడుతూ చావడమో, అంగవైకల్యాలతో బయటపడడమో మాత్రమేకదా వారికి జరిగేది? — "నా దేశం. నా భూమి. ఈ దేశానికి అన్ని పక్కల వాళ్ళూ నాకు శత్రువులే. ప్రాణాలయినా ధారపోసి పోరాడతాను. విజయమో, వీరస్వర్గమో!" అని మెదళ్ళలోకి ఎక్కిన జబ్బు సంస్కృతి వాళ్ళని మూర్ఖుల్ని చెయ్యకపోతే, ఏ సైనికుడు ఏ రాజుకోసం ప్రాణాలిస్తాడు?

ఏ హరికథల్లోనో, జముకుల కథల్లోనో, 'రామ — రావణ యుద్ధాన్ని' విని, మురిసిపోవాల్సిన పనేమైనా ఉందా? యుద్ధంలో రామ — లక్ష్మణులు మూర్ఛలు పోయారంటేనే భక్తులకు దుఃఖం ఆగదు. మరి, ప్రతీ యుద్ధంలోనూ కాళ్ళు తెగీ, చేతులు తెగీ, తలలు తెగీ, యుద్ధ రంగంలో దొర్లి చచ్చిపోయే వేలాది సైనికుల మాటేమిటి? యుద్ధాలనేవి ఏ రాజు చేసినా వాటివల్ల కష్టాలూ, అశాంతీ, పీడా, గగ్గోలూ తప్ప, సామాన్య ప్రజలకు దొరికే సుఖాలేమిటి?

భారతదేశంలో ఒక రాజు 'గొప్పగా పరిపాలించడం' అంటే దాని అర్థం, యుద్ధాలు చేసి ఇతర దేశాల్ని కొల్లగొట్టి, ధనికుల ఆస్తుల్ని పెంచి, వారి సిరిసంపదలు వృద్ధి చేశాడు. వ్యాపారుల లాభాలు పెంచాడు. వేద ధర్మాల ప్రకారం యజ్ఞ యాగాలు చేసి, బ్రాహ్మలకు దాన ధర్మాలు చేశాడు. పేదలు పేదలుగానే ఉండేటట్టూ, సేవకులు సేవకులుగానే, బిచ్చగాళ్ళు బిచ్చగాళ్ళుగానే ఉండేటట్టూ చేశాడు. వేశ్యా వృత్తి వృద్ధి పొందేటట్టు చేశాడు. కులాలు కలిసిపోకుండా, 'వర్ణ సంకరం జరగకుండా' చూశాడు. స్త్రీలకు

హక్కులు లేకుండా చూశాడు. సైనికులు విశ్వాసంగా యుద్ధాలు చేసేటట్టు చూశాడు — ఈ రకంగా, దేశం 'సుభిక్షం'గా ఉండేటట్టు చేశాడు! ఇలాంటి రాజ్య పరిపాలన వల్ల, ఎవరికి సుఖం? ఎవరికి మంచి? ఇలా పరిపాలించే రాజు — ఆర్య రాజా, ద్రావిడ రాజా — అనే తర్కాలెందుకు?

రాముడేం చేశాడు? రావణుడేం చేశాడు? అశోకుడేం చేశాడు? చంద్రగుప్తుడేం చేశాడు? శ్రీకృష్ణ దేవరాయలేం చేశాడు? — ఇవి కాదు మనకు కావలసిన ప్రశ్నలు. అసలు రాజులేం చేశారు? — ఇదీ కావాలి.

ఈనాడు మనం రాజుల వీరత్వాల గురించి కథలు చదివినప్పుడు, ఆ రాజు — రాముడైనా, రావణుడైనా, ఆ వీరత్వాలు చూసి తన్మయత్వాలు చెందనక్కరలేదు. 'రాజు' అనేవాడు ఎవ్వడైనా, ఆ సమాజంలో ఉన్న ధనిక వర్గానికే ప్రతినిధి! ఆ వర్గం అంతా, ఆ వ్యక్తికి, తమ తరుఫున పరిపాలించే అధికారం ఇచ్చిందని అర్థం. ఆ అధికారం ఇవ్వడం — ఈ నాటి 'ఎన్నికల' రూపంలో జరగకపోవచ్చు. ధనికవర్గ సమర్ధన లేకుండా ఏ వ్యక్తీ రాజుగా ఆ స్థానంలో నిలబడలేడు.

# మత సాహిత్యం, లేదా పురాణ సాహిత్యం

**చ**రిత్రలోకి రాజులు పుట్టుకొచ్చిన దశకన్నా ముందే అన్ని దేశాలలోనూ సాహిత్యమూ కళలూ ఉన్నాయి. 'లిపి'ని కనిపెట్టడమూ, సాహిత్యం లిఖిత రూపంగా రావడమూ, ఇలాంటి వెనకటి దశల్లోనే ప్రారంభమయ్యాయి. ఈ సాహిత్యం — 'మత సాహిత్యం'గా, 'పురాణ సాహిత్యం'గా, ప్రచారం అయింది.

భారతదేశంలో మొట్టమొదటి సాహిత్య గ్రంధాలు — 'వేదాలు'. తర్వాత కాలంలో వచ్చినవి — 'రామాయణం, భారతం' వగైరాలు. వీటిలో గత గణ వ్యవస్థ 'అవశేషాలు' స్పష్టంగానే కనపడతాయి. అయితే, ఆ అవశేషాల్ని ఈ గ్రంధాలు సమర్థించవు. ఈ మత గ్రంధాలలోని కథల్ని ఒక వరసలో చూసినప్పుడు, ఆనాటి సమాజ లక్షణాలు కొన్నయినా కనపడతాయి.

మత గ్రంధాలు చెప్పే కథల్లో స్త్రీ — పురుష సంబంధాలు ఎలా మారుతూ వచ్చాయో ఇప్పుడు చూడండి!

స్త్రీకి భర్తగానీ, పిల్లలకు తండ్రిగానీ లేని కథలు ఉన్నాయి. పెళ్ళి లేకుండా బిడ్డలు పుట్టినా, సమాజం దాన్ని తప్పు కాని సహజ విషయంగానే గుర్తిస్తుంది (జబల కథ).

పెళ్ళి కాకుండా బిడ్డల్ని కంటే సమాజంలో దోషం అయిన కథలూ (కుంతి, కర్ణుణ్ణి కని వదిలెయ్యడం): భర్త ఇష్ట ప్రకారమే పర పురుషులతో పిల్లల్ని కన్న కథలూ (కుంతి, భర్త అయిన పాండురాజు ఆమోదంతోనే యముడితోటీ, వాయు దేవుడితోటీ, దేవేంద్రుడితోటీ, బిడ్డల్ని కనడం; వాలి సుగ్రీవులూ, హనుమంతుడూ, తల్లులు వివాహాలు చేసుకున్న పురుషులతోగాక, ఇతర పురుషుల సంబంధాలతో పుట్టిన వాళ్ళే.) భార్య, పర పురుషుడితో శయనించి అతడికి అతిధి సత్కారం చేసినందుకు భర్త సంతోషించే కథలూ (సుదర్శనుడూ, ఓఘవతీ కథ):

'స్త్రీ — దేవతామూర్తుల' కథలూ; గణాధిపతి కథలూ; కొడుకులు తల్లిని మాత్రమే పూజించే కథలూ (కౌసల్య, రాముణ్ణి వనవాసానికి వెళ్ళొద్దనీ, తల్లినే పూజించి కాశ్యపుడు స్వర్గానికి వెళ్ళాడనీ చెప్పిన కథ); దితీ, అదితీ, వినతా, కద్రువా కథల్లో తల్లిద్వారానే బిడ్డల్ని గుర్తించడం; భార్యాభర్తలు విడిపోతే బిడ్డలు తల్లితోనే వున్న కథలూ (ఘటోత్కచుడు, తండ్రి అయిన భీముడితో గాక తల్లి అయిన హిడింబితోనే ఉండడం); స్త్రీ, పర పురుషుడి ద్వారా బిడ్డని కంటే ఆ బిడ్డని, ఆ పురుషుడికే ఇచ్చేసి భర్తతో యధాప్రకారం కాపరం

చేసే కథలూ (తార, చంద్రుడి వల్ల బిడ్డని కని, ఆ బిడ్డని చంద్రుడికి ఇచ్చి తిరిగి భర్తతోనే ఉండడం).

తల్లిదండ్రుల్లో ఎవర్ని గౌరవించాలో తెలీక కొడుకులు తటపటాయించే కథలూ (గౌత ముడూ, గౌతమీ భార్యాభర్తలు. చిరకారి వారి కొడుకు. తల్లి, ఒక అతిథితో కలుస్తుంది. తండ్రికి కోపం వచ్చి గౌతమిని చంపెయ్యమని కొడుకుని ఆజ్ఞాపిస్తాడు. కొడుకుకి తల్లి ప్రవర్తనలో తప్పు కనపడదు. తల్లి, పూర్వ సాంప్రదాయ ప్రకారమే అతిథికి మర్యాద చేసిందని భావిస్తాడు. కొడుకు ఇలా తటపటాయిస్తూ ఉండగా భర్తకూడా కోపం తగ్గి ఊరుకుంటాడు. పితృస్వామ్య వ్యవస్థ ధర్మాలు ప్రారంభమైనప్పటికీ, అవి అప్పటికి ఇంకా బలంగా లేవని అర్థం);

భర్తకు తెలియకుండా రహస్యంగా ప్రియుణ్ణి కలిసే కథలు (కృష్ణుడూ, గోపికలూ);

గణనాయకులు, సమిష్టి జీవితానికి వ్యతిరేకత చూపే కథలు చాలా ఉన్నాయి. ఉదా: పూర్వం దేవతలంతా సమిష్టిగా యజ్ఞం చేస్తారు. మొదట్లో యజ్ఞఫలాన్ని సమానంగా పంచుకోవాలనే నిర్ణయం మీద, విష్ణువుని యజ్ఞాధిపతిని చేస్తారు. యజ్ఞం ముగిసేసరికి, విష్ణువు, యజ్ఞఫలాన్ని అందరికీ పంచడానికి తిరస్కరిస్తాడు. దేవతలంతా విష్ణువుతో యుద్ధం చెయ్యబోతారు గానీ, యజ్ఞ ధర్మం ప్రకారం, యజ్ఞాధిపతి దగ్గిర తప్ప మిగతా వారి దగ్గిర ఆయుధాలు ఉండకూడదు. ఆయు ధాలు లేని దేవతలంతా విష్ణువు ఆయుధాలకు జడిసిపోతారు. విష్ణువు, ఇక శత్రుభయం లేదని, విల్లుని భూమిమీద నించోబెట్టి దాని కొనమీద గడ్డం ఆన్చి విశ్రాంతిగా నించుని ఉంటాడు. దేవతలంతా తెల్లచీమల్ని పిలిచి "ఆ విల్లుతాడు కొరికెయ్యండి" అని చెపుతారు. చీమలు అలాగే చేస్తాయి. తాడుని తెంచగానే విల్లుకొన మహా శక్తితో పైకిలేచి విష్ణువు తలని ఎగరేసుకు పోతుంది. దేవతలు జయిస్తారు. ఇదీ కథ. ఈ కథ, గణవ్యవస్థలో ఆస్తి కలహాల్ని ప్రతిబింబి స్తోంది. అప్పటికి సమిష్టి జీవితాన్ని కోరేవారే ఎక్కువ మంది ఉండడం చేత, విష్ణువే ఓడిపోయి నట్టు కథ తయారైంది. రానురానూ వ్యక్తి ఆస్తి బలపడ్డ తర్వాత, ఈ విష్ణువే ధనికవర్గ నాయకుడై మొత్తం సమాజానికే అధిపతి అయ్యే కథలు పుట్టుకొచ్చాయి.

'కుల భేదాల' కథలెన్నో కూడా ఉన్నాయి.

ఛండాలుడికి స్వర్గప్రాప్తి లేని కథలూ; శూద్రులూ, స్త్రీలూ, విద్యలకు దూరంగా ఉండ వలసిన కథలూ ఉన్నాయి.

దానధర్మాలూ చేసి కీర్తి ప్రతిష్టలు తెచ్చుకున్న దాతల కథలూ;

దేవతలు, దేవ వేశ్యలతోటీ; రాజులు, రాజ వేశ్యలతోటీ గడిపే కథలూ;

స్త్రీ దేవతల మహిమలు తగ్గి, పురుష దేవుళ్ళ మహత్యాలు పెరిగే కథలూ;

కొడుకులు తల్లిని ధిక్కరించి తండ్రిని మాత్రమే పూజించే కథలూ; కొడుకులు తండ్రి మాట ధిక్కరిస్తే తండ్రిచేత దండన పొందే కథలూ (విశ్వామిత్రుడు, కొడుకుల్ని శపించడం);

పరపురుషుల్ని కలవడం కొంచెం నేరమైన కథలూ (అహల్య); పూర్తిగా నేరమైన కథలూ (జమదగ్నీ — రేణుకా. కొడుకైన పరశురాముడు తండ్రికి పూర్తిగా విధేయుడై తల్లిని చంపేస్తాడు.); భర్తకు సంతోషం కలిగించే కార్యాలు చేస్తే, భార్యకు వరాలిచ్చే కథలూ; మొగసంతానం కోసమే తపస్సులు చేసే కథలూ (ఏ కథలోనూ కూతుళ్ళు పుట్టరు. పుడితే కథా నాయకుడు పుట్టిం తర్వాత అతనికి భార్య కావాలి కాబట్టే పుడతారు); కొడుకులు లేక, మోక్షం లేక, పితృదేవతలు చెట్ల వెంట వేళ్ళాడే కథలూ;

వడ్డీ వ్యాపారాల కథలూ (హరిశ్చంద్రుడి కథ, 'అప్పుని వడ్డీతో సహా తీర్చడమే సత్యవ్రతం' అని చెప్తుంది. 'భార్యాబిడ్డల్ని అమ్మి అయినా సరే అప్పు

తీర్చాలి. అప్పటికీ సరిపోకపోతే తనను తను అమ్ముకుని అయినా అప్పు తీర్చాలి' అని పూర్వపు ఏథెన్స్ రాజ్యాంగంలో ఒక చట్టం ఉంది. అది సరిగ్గా మన హరిశ్చంద్రుడి కథ్తై కూర్చుంది! అప్పు తీసుకున్న మనిషి, అప్పుని వడ్డీతో సహా తీర్చడం కోసం, తను బానిసగా అయినాసరే అయిపోవాలి. అంత దాటరానివి వడ్డీ లెక్కలు!);

రాజులు తమ ఆధీనంలో ఉన్న శూద్ర స్త్రీలను (బానిస స్త్రీలను) రుత్విక్కులకూ, బ్రాహ్మణులకూ దానాలిచ్చిన కథలూ;

స్త్రీలు పతివ్రతలుగానూ, కొడుకులు పితృవాక్య పరిపాలకులుగానూ మారిన కథలూ;

కొందరు జనులు పుట్టుకతోనే పరిచారకులుగా, దాసదాసీలుగా, పుట్టే కథలూ; (పాల సముద్రం చిలికినప్పుడు అందులోనించి అప్సరసలతోపాటు పరిచారికలు కూడా పుడతారు);

యజ్ఞాలు చెయ్యని రాజుకీ, యుద్ధాల్లోంచి పారిపోయిన సైనికుడికీ, 'నీచ జాతులకు సేవ చేసిన ఉన్నత కులజుడికి చుట్టుకునే లాంటి మహాపాపం' చుట్టుకున్న కథలూ;

ఒక వేపు భోగలాలసతనీ, ఇంకోవేపు సన్యాసాన్నీ సమర్థించే కథలూ!

ఇలాంటి రకరకాల కథలు కోకొల్లలు! మత గ్రంథాలలో, పురాణ గ్రంథాలలో కథలన్నిటినీ విపులంగా పరిశీలిస్తే, వాటిలో కొంతవరకూ చరిత్ర నడక కనబడుతుంది. అంటే, <u>చరిత్ర పరిణామంతో సమానంగా, సమానకాలంలో ఈ కథల సృష్టి జరిగిందని అర్థం కాదు.</u>

పురాతన కథల్లో చాలా కథలు, గతకాలం నాటి ఏదో ఒక దశని ప్రతిబింబిస్తాయి. ఈ కథల్ని సృష్టించిన కవులు, చరిత్ర పరిణామాన్ని పరిశోధించి ఈ రకమైన సృష్టి చేశారని కాదు. ఈ పురాతన కథల్ని శాస్త్రీయ పరిశోధనలతో సమంగా చూడాలనీ కాదు. ఆ పరిశోధనలకు ఈ కథలు చాలా సమాచారం ఇస్తాయి. ఈ కథల్ని చరిత్ర పరిణామంతో చాలావరకు అన్వయించుకోవచ్చును.

తవ్వకాల్లోంచి బయటపడ్డ ఒక పాత రాతి కత్తిగానీ, కొన్ని కుండ పెంకులుగానీ, పూర్వుల జీవితాల గురించి ఎంత సమాచారం ఇస్తాయో, ఈ కథలు కూడా చరిత్రని గ్రహించడంలో అంత సమాచారం ఇస్తాయి.

ఇటువంటి కథలు ఒక్క భారతదేశంలోనే కాదు, అన్నిచోట్లా ఉన్నాయి. ప్రపంచంలో అన్ని దేశాలకూ ఈ రకం సాహిత్యం ఉంది. అన్ని దేశాల చరిత్రలూ ఈ దశల మీదుగానే (మొదట సమిష్టిగా జీవించి, తర్వాత స్వంత ఆస్తి ఏర్పాటు కోసం పాత వ్యవస్థని మార్చి, కొత్త వ్యవస్థని ప్రచారంచేసే దశల మీదుగానే) నడవడం చేత, అందరి సాహిత్యమూ ఇదే.

'రామాయణం'లో రాముడు, తల్లిని నిర్లక్ష్యం చేసినట్టు, గ్రీకు పురాణ గ్రంథం అయిన 'ఒడెస్సే'లో నాయకుడు కూడా తల్లిని అవమానిస్తాడు. 'రామాయణం'లో దశరథుడు, శూద్ర భార్యలతోటీ ఉంపుడు కత్తెలతోటీ గడిపినట్టు, గ్రీకు 'ఇలియడ్'లో సేనాపతులు, హోదాల ప్రకారం బానిస స్త్రీలను పంచుకుంటారు. అన్ని దేశాల సాహిత్యంలోనూ ఈ రకం పోలికలు కనబడతాయి. వాటిని సృష్టించిన కారణం ఒక్కటే కాబట్టి. "ఈ సాహిత్యమంతా ఏ రకంగా పుట్టింది?" అనే ప్రశ్నకి ఇప్పుడు మనకు జవాబు దొరుకుతుంది. చరిత్ర పరిణామం ఇప్పుడు కొంతైనా తెలియడం వల్ల.

'రామాయణం'లో స్త్రీ పాత్రలన్నీ కొంత వరకూ స్వేచ్ఛ కనబరుస్తాయి. కౌసల్య, దశరథుణ్ణీ; సీత, రాముణ్ణీ; నిర్మొహమాటంగా విమర్శిస్తారు. తర్కవితర్కాలు చేస్తారు. తాటకి యుద్ధం, కైక సాహసం, అహల్యా శూర్పణఖా అయోముఖీల ప్రణయాలూ — ఇవన్నీ, మాతృస్వామ్య దశ అవశేషాలు. కాని మళ్ళీ ఈ పాత్రలే, ఈ

కథల్లోనే, చాలా వినయంగా పితృస్వామ్య స్థితికి ఇచ్ఛా పూర్వకంగా లొంగుతాయి.

లక్ష్మణుడి పాత్ర బానిస దశని ప్రతిబింబి స్తుంది. 'భాతృ వాక్య పరిపాలన' అనేది సాహిత్యం వేసుకున్న ముసుగు.

రాముడి పాత్ర గురించి చెప్పే పనే లేదు. వ్యవస్థ ధర్మాలన్నీ ఈ ఒక్క పాత్ర నిండా కిక్కిరిసి ఉంటాయి. తల్లిని ధిక్కరించి తండ్రిని పూజించడం, భార్య మీద అధికారం, ప్రజల్ని నిరంకుశంగా పాలించడం, ధనిక వ్యవస్థ మనుగడని కాపాడడం — ఈ లక్షణాలన్నిటికీ ప్రతిబింబం — రాముడు!.

సీత పాత్ర గురించి తల్చుకోగానే 'ఎంత గొప్ప పతివ్రతో' అనుకుంటాం. అసలు 'పతివ్రత' అంటే ఏమిటి? ఒక స్త్రీ ఎలా మారితే 'పతివ్రత' అవు తుంది?

**పతివ్రత:** రాచరికపు దశనాటికి, ధనిక వర్గాల స్త్రీల నివాసాల కోసం 'అంతఃపురాలు' వెలిశాయని చూశాం. ప్రతీ ధనికుడూ, గృహం లోపలి భాగాల్ని పోతుటీగ అయినా దూరనంత కట్టుదిట్టాలతో ఉంచేవాడు. వాటిచుట్టూ దాస దాసీల కాపలాలు! అనేక దేశాల్లో, మొగ బానిసల్ని 'ఖొజ్జాల్ని' (నపుంసకుల్ని) చేసి, అంతఃపురాల కాపలాలకు నియోగించేవారు. అంతఃపుర స్త్రీలూ, బయట కాపలా కాసే ఖొజ్జాలూ, దాసీలూ, అందరూ బానిస స్థితిలో ఉన్నవారే. అందరూ ధనిక పురుషుడి దౌర్జన్యానికి గురి అవుతోన్న వారే.

గృహాల లోపల అగాధాల్లో నివసించే స్త్రీలకు, బయటి లోకంతో సంబంధాలు ఉండవు. తండ్రినీ, అన్నదమ్ముల్నీ, భర్తనీ, మేనమామలు వంటివాళ్ళనీ తప్ప, జీవితంలో పరపురుషుల్ని చూసీ, మాట్లాడీ ఉండరు. భర్తలతో అయినా, లేచి నిలబడి, తలలు వొంచుకుని, తెరల చాటునించి వినయంగా ఏ సంవత్సరానికి ఒక్కసారో సంభాషి స్తారు. ఆ భర్తలకు అనేక మంది భార్యలూ, ఉంపుడు కత్తెలూ, తిరుగుళ్ళూ ఉంటాయి కాబట్టి, వాడు ఒక భార్య దగ్గిరికి రావడానికి సంవత్సర కాలం పడుతుంది!

ఈ స్త్రీల దౌర్భాగ్యాల్ని గుర్తించకుండా, సిగ్గూ లజ్జా వదిలేసిన మన కవి పుంగవులు, "ఎండ కన్నెరగని చిన్నది" అనీ, "అంతఃపుర గవాక్షంవద్ద మెరుపు కన్నె మెరిసింది" అనీ, అవాకులూ చవా కులూ వాగి, దాన్నే గొప్ప కవిత్వంగా వేలకొద్దీ సంవత్సరాల తరబడీ చెలామణీ చేసుకుంటు న్నారు. ఆ ఎండ కన్నెరగని చిన్నదానికి 'పాండు రోగం' వొచ్చిన సంగతిగానీ; ప్రకృతి సహజ వాంఛలు తీరని స్త్రీలు జీవితాంతం మూర్ఛ జబ్బులతో కృంగిపోయారనిగానీ; స్వేచ్ఛకోసం ధిక్కారం చేసి ఎందరో స్త్రీలు ఉరికంబాలెక్కా రనిగానీ; అంతఃపురాలు కక్షలతో, కావేశాలతో, రోగాలతో, తెగుళ్ళతో కులకుల్లాడాయనిగానీ ఈ రకం దుఃఖాల్ని ఏ కవీ, ఎక్కడా వర్ణించలేదు.

ఈ కారుచీకట్లోంచీ, ఈ అంధకారంలోంచీ, ఈ మానసిక — శారీరక రుగ్మతల్లోంచీ తయారైన స్త్రీ వికృత రూపమే — 'పతివ్రత!' పతివ్రతలుగా మారితే సంఘం ఇచ్చే విలువకీ, కీర్తికీ, స్త్రీలు లొంగిపోయారు. వారికై వారే తమ మీద ఆంక్షలూ, ఆజ్ఞలూ, పురుషుడి పెత్తనాలూ కోరే స్థితికి వచ్చారు.

"స్త్రీకి భర్తే దైవం. భర్త ఆజ్ఞల్ని పాటించడం కన్నా స్త్రీకి వేరే లోకం లేదు. స్త్రీ ఎప్పుడూ భర్తకు వినయ విధేయతలతో లొంగివుండాలి. భర్త ఎటు వంటి వాడైనా, జారుడైనా, చోరుడైనా, నిర్దయు డైనా, ఆ భర్తనే పూజించాలి. స్త్రీకి జన్మజన్మలకూ ఒక్కడే భర్త — ఈ రకం సంధి ప్రేలాపన, స్త్రీ రక్తంలోకీ, అణువుల్లోకీ, ఆత్మల్లోకీ దిగి, ఇంకి, జీర్ణించి పోయింది.

సంకెళ్ళు తీసేసినా పారిపోని ఖైదీలే పతి వ్రతలు!

"మా కాళ్ళూ చేతులూ బోసిగా ఉన్నాయి. మాకు సంకెళ్ళు వెయ్యండి! సంకెళ్ళే మా శరీరాలకు అందం" అని సంకెళ్ళనే ఆభరణాలుగా నమ్ముతూ, సంకెళ్ళ కోసం పరితపించే స్తితికి చేరిపోయారు స్త్రీలు.

స్త్రీలు ఇంత నికృష్టమైన హీన స్థితికి చేరారంటే, ఇదంతా కవులు సృష్టించిన కట్టు కథల వల్లనే జరిగింది. కవులూ కళాకారులూ, తమ విషపు నీతులతో, దొంగ ధర్మాలతో, మోసకారి ఆశలతో, స్త్రీల సామాజిక కార్యకలాపాల్నీ స్వతంత్ర ప్రవర్తననీ అరికట్టి, వారి ఆత్మల్ని సమూలంగా నాశనం చేసేశారన్న మాట!

పతివ్రతలకు నీతులు రాసిన కవులే, ఆ ఘంటాలతోనే, వేశ్యలకు జాణతనాలూ, సరస గానాలూ, కామ శాస్త్రాలూ రచించారు! కవులు నిర్వహించిన పాత్ర ఏమిటంటే — పురుషుల కోసం, ఒక వేపు పతివ్రత భార్యల్నీ, ఇంకోవేపు విలాస స్త్రీలనీ, సిద్ధం చెయ్యడమే.

కొడుకులు, తండ్రులకు విధేయతతో ప్రవర్తించడం గొప్ప సాంఘిక ధర్మం అయిపోయింది. తండ్రి నించి ఆస్తిని అందుకునే కొడుకు, తండ్రి పట్ల విధేయతతో మెలగక తప్పదు. కొడుకు విధేయత చూపకపోతే, తండ్రి, తన ఆస్తిని కొడుకుకి ఇవ్వకపోవచ్చు కూడా. ఆస్తి సంబంధమే కొడుకుల్ని తండ్రులకు కట్టిపడేసి ఉంచుతుంది. పితృభక్తి ఒక పవిత్ర ధర్మంగా మారిపోతుంది. తండ్రి ఆస్తిముందు, 'తల్లి' అనేది, సోదిలోకి కూడా రాని మనిషి అయిపోతుంది.

కొడుకులు ఎప్పుడూ తండ్రుల పక్షమే వహిస్తారు. తండ్రులకే సేవలూ పూజలూ చేస్తారు. తండ్రుల్ని సుఖపెట్టే కార్యాలే చేస్తారు. వృద్ధుడైన తండ్రికోసం, తన యవ్వనాలు ధారపోసి తండ్రి కళ్ళముందు కొడుకులే వృద్ధులైపోతారు! ముసలి తండ్రి చేసుకోబోయే 'వందో' పెళ్ళికోసం, కొడుకు, తన ఆస్తి హక్కులు వదులుకుని, తన వివాహం మానుకుని, తనకు పిల్లలు పుట్టకుండా బ్రహ్మచర్యం పాటిస్తాడు! (భీష్ముడి కథ)

రామాయణం కథ అంతా మొదటినించీ చివరి వరకూ తండ్రినించి అందే 'ఆస్తి'కోసం ('రాజ్యం' కోసం) పెనుగులాటే!

ఇలాంటి కథలు ఒకటా, రెండా? ప్రపంచ మతాలనిండా ఇవే కథలు! ఇలాంటి కోట్ల కొద్దీ కథలతో కవివరేణ్యులు సాహిత్యాన్నంతా నింపేశారు.

ఇక్కడ 'పాతివ్రత్యం' గురించి ఇంకో కోణం చూడాలి. పాతివ్రత్యం గురించి చర్చించేటప్పుడు, ఒక ఆశ్చర్యకరమైన నిజం కనపడుతుంది. చరిత్రలో, స్త్రీ–పురుష సంబంధాలు, 'ఒక స్త్రీ — ఒక పురుషుడూ' అనే ఉన్నత స్థాయికి చేరడానికి, స్త్రీల వేపునించి ప్రారంభమైన ఈ పాతివ్రత్యమే మొదటి దశ. ఈ మార్పు పురుషుడి విషయంలో కూడా జరిగినప్పుడు, స్త్రీ–పురుషుల సంబంధం ఉన్నత స్థాయికి చేరుతుంది.

భార్య, తన భర్తతో మాత్రమే సంబంధంతో వుండడం — అనే పద్ధతి ప్రారంభం కాకపోతే, సమాజంలో 'అసలు తండ్రి'కి స్థానమే వుండదు.

భార్య — తన భర్తతో మాత్రమే సంబంధంతో వుండడం — అనే సాంప్రదాయం, భర్త — తన భార్యతో మాత్రమే సంబంధంతో వుండడం అనే సాంప్రదాయానికి కూడా దారితీస్తుంది. ఇరు పక్షాలూ ఒకే నియమం మీద ఆధారపడినప్పుడు, అది వైరుధ్యాలు లేని సంబంధం అవుతుంది. స్త్రీ పురుషుల మధ్య అలాంటి సంబంధం, తండ్రి స్థానాన్ని స్పష్టం చేస్తుంది. వ్యభిచార సంబంధాల్ని అంతం చేస్తుంది. ఈ రకంగా ఇది, స్త్రీ పురుషుల మధ్యా, తల్లిదండ్రులకూ బిడ్డలకూ మధ్యా, ఉన్నత మానవ సంస్కారంతో సాగే సంబంధాల్ని ఏర్పరుస్తుంది. కానీ, ఇది స్త్రీల మీద దుర్భరమైన హింసలతో ప్రారంభమైంది.

బానిసత్వం, ఒకనాటి సమాజంలో, అభివృద్ధి

కరమైన మార్పు అయినట్టుగానే, స్త్రీలతో ప్రారంభ మైన పాతివ్రత్యం కూడా చరిత్ర దశల్లో అభివృద్ధి కరమైన మార్పే అవుతుంది. అది అభివృద్ధికరమైన మార్పులకే దారి తీస్తుంది.

కానీ, ఇలా అనడం అంటే, బానిసత్వం పేరు తోటీ, పాతివ్రత్యం పేరుతోటీ జరిగిన హింసల్నీ క్రూరత్వాల్నీ సమర్థిస్తున్నట్టూ, 'అవి అలా జరగ వలసిందే' అని చెపుతున్నట్టూ అర్థం కాదు.

బలవంతాలూ క్రూరత్వాలూ లేని సంబం ధాలు ఏర్పడడానికి ప్రారంభాలు, బలవంతాల తోటీ క్రూరత్వాలతోటీ సాగాయి.

ఈ రకంగా, గణసమాజం తర్వాత ప్రారంభ మైన శ్రమ దోపిడీ ఫలితంగానే, ధనికవర్గ రాజ్యాంగ యంత్రమూ, దాని అధిపతి అయిన రాజూ, బానిస ప్రజల్ని అణచివేసే వర్గ పరి పాలనా, స్త్రీల మీద నిబంధనలూ — ఇవన్నీ ప్రారంభమయ్యాయి.

ఆ ప్రారంభ కాలంలో ఇంకా 'ప్రజాస్వామ్యం' అనే మాట లేదు. దానికోసం ఇంకా వందల, వేల సంవత్సరాల దూరం ప్రయాణం చెయ్యాలి.

## మొత్తం చరిత్రలో వేరువేరు సమాజాలు!

**మా**నవ చరిత్రని, 'శ్రమ సంబంధాల' కోణంలో చూస్తే, దాన్ని ఇన్ని దశలుగా వర్గీక రించవచ్చు.

1. **గణ సమాజం:** ఇక్కడ శ్రమ దోపిడీ లేదు. వర్గాలు లేవు.
2. **బానిస సమాజం:** శ్రమదోపిడీ ప్రారంభం. వర్గాలు ప్రారంభం.
3. **భూస్వామ్య సమాజం:** శ్రమదోపిడీ సాగుతూనే ఉంటుంది.
4. **పెట్టుబడిదారీ సమాజం:** శ్రమ దోపిడీ సాగుతూనే ఉంటుంది.
5. **సోషలిస్టు సమాజం:** శ్రమ దోపిడీని తీసివేసే మార్పులు ప్రారంభం.
6. **కమ్యూనిస్టు సమాజం:** శ్రమ దోపిడీ ఆగిపోతుంది. సమానత్వానికి తగిన శ్రమ సంబంధాలే కొనసాగుతూ ఉంటాయి.

సమాజంలో, ఈ మార్పులు ఎందుకు జరుగు తాయి? శ్రమ సంబంధాల్లో ఏయే అంశాలు మారడంవల్ల సమాజంలో ఈ మార్పులు వస్తాయి? — ఈ అంశాల్ని చూడాలంటే, మార్క్సు రాసిన **'కాపిటల్'** ద్వారా మాత్రమే చూడగలం. అదంతా ఇక్కడ చూడడం సాధ్యం కాదు. కాబట్టి, ఇక్కడ చాలా క్లుప్తంగా చెప్పుకోవలిసిందే.

ఒక మత గ్రంథంలో కథ, (ఉదా: రామా యణంలో కథ) ఎంత న్యాయంగా వుందో తెలుసు కోవాలంటే, ఇంతవరకూ చూసిన చరిత్రేగాక, ఇంకా కొన్ని విషయాలు తెలియాలి.

సమాజ స్వభావం తెలిస్తే తప్ప, ఒక కథని గానీ, అందులో పాత్రల్నిగానీ, అవి పాటించిన ధర్మాల్నిగానీ, సరిగా అర్థం చేసుకోలేం. అందుకే, సమాజానికి సంబంధించి ఇంకా కొన్ని వివరాలు చూడాలి.

సమాజంలో కొందరు మనుషులు శ్రమలు చెయ్యకపోవడం వల్లనే మనుషులు రెండు రకా లుగా విడిపోయారనీ, వర్గాలు ప్రారంభమయ్యా యనీ చూశాం.

'వర్గ సమాజం' అన్నప్పుడు, ఆ సమాజంలో వుండే మొత్తం జనాభా అంతా, (స్త్రీలూ పురు షులూ; పిల్లలూ పెద్దలూ; ధనికులూ పేదలూ అంతా) ఆ వర్గాలలోనే వున్నారని ఊహించాలి. ఏ వర్గానికీ చెందని మనుషులు ఎవరూ ఉండరు. (ఇక్కడ ఇంతకన్నా వివరాలు చెప్పుకోలేము.)

అన్ని దేశాలకూ 'ఒకే స్వభావం' గల చరిత్ర వుంటుంది. దోపిడీ శ్రమ సంబంధాల్ని కొన సాగించే స్వభావం గల చరిత్ర. శతృవర్గాలు గల చరిత్ర. కానీ, ఆ చరిత్ర కూడా దేశాల పరిస్తితుల్ని

బట్టి కొంత కొంత తేడాలతో వుంటుంది. ఈ రకంగా ప్రతీ దేశానికీ దేని చరిత్ర దానికి కొంత ప్రత్యేకంగా కూడా వుంటుంది. ఏ దేశ ప్రజలు ఆ దేశ చరిత్రని పరిశీలించి, దాని వర్గాల్నీ, దాని దశల్నీ తెలుసుకోవాలి. కానీ, శ్రమదోపిడీ అనేది వున్నప్పుడు, సాధారణంగా అన్ని దేశాల చరిత్రలూ ఒకే రకమైన దశల మీదుగా సాగుతాయి, కొన్ని కొన్ని తేడాలతో.

'ప్రజాస్వామ్యం' అనే మాట పెట్టుబడిదారీ సమాజంలో గానీ ప్రారంభం కాదు.

ఈ నాడు, ప్రపంచంలో చాలా దేశాలు పెట్టుబడిదారీ పార్లమెంటరీ సమాజాలుగానూ, కొన్ని దేశాలు ఇంకా రాజులు పాలించే సమాజాలుగానూ వున్నాయి.

కొన్ని దేశాలు, 'సోషలిజం'లో మొదటి అడుగులు మాత్రమే వేసి, మళ్ళీ పెట్టుబడిదారీ సమాజాలుగానే వెనక్కి తిరిగాయి.

'కమ్యూనిజం' అనేది ఇంకా దూరపు ఆదర్శంగానే వుంది. ఇంకా 'ఊహ'గానే, 'సిద్ధాంత రూపం'లోనే వుంది.

ఈ 'మానవ చరిత్ర'లో, మన పరిశీలనా గ్రంథమైన **'రామాయణం'**— భూస్వామ్య సమాజపు సాహిత్యం. కానీ అది వెనకటి గణసమాజ లక్షణాల్నీ, బానిస సమాజ లక్షణాల్నీ కూడా కలుపుకున్న సాహిత్యం. దీన్ని ఈనాటి పెట్టుబడిదారీ సమాజం కూడా నెత్తిన పెట్టుకుంటుంది.

'రామాయణ, భారతాల' వంటి మత సాహిత్యం కన్నా ఎంతో పూర్వమే 'శ్రమ దోపిడీ' ప్రారంభమై పోయింది కాబట్టి, ఆ దోపిడీ సమాజాల్ని చూసుకుంటూ రావాలి. అది తెలిస్తేనే, ఈ సాహిత్యంలో వుండే దోపిడీ లక్షణాల్ని అర్థం చేసుకోగలం. ఈనాటి పెట్టుబడిదారీ సమాజాన్ని కూడా తెలుసుకుంటేనే అది, రామాయణం వంటి మత సాహిత్యాల్ని ఎందుకు సమర్థిస్తుందో అర్థం చేసుకోగలం.

శ్రమ దోపిడీ, బానిస విధానంలో ప్రారంభమైంది కాబట్టి, అక్కడినించీ తెలుసుకోవాలి.

## 'బానిస సమాజం'లో శత్రువర్గాలు

ఇక్కడ, బానిసలూ, బానిస యజమానులూ శత్రువర్గాలు. 'భూమి' అంతా యజమాని వర్గానిదే, (భూమి — ప్రకృతిలోది. అది ఎవరి శ్రమతోటీ తయారైనది కాదు. దాన్ని తమ ఆస్తిగా ఆక్రమించడానికి ఎవరికీ నిజమైన హక్కు వుండదు.) ఈ బానిస సమాజంలో, 'శ్రమ సాధనాలే'గాక, శ్రమచేసే మనుషులు కూడా యజమాని వర్గపు ఆస్తే. శ్రమ చేసే మనిషికి, యజమాని, 'జీతం' ఇవ్వడం ఇక్కడ ఇంకా ప్రారంభం కాదు. ఒక బానిస చేసే శ్రమవల్ల తయారైన ఉత్పత్తులలోనించి, ఆ బానిస పోషణకు ఖర్చయ్యే భాగమే ఆ బానిసకు అందే 'జీతం' లాంటిది. కానీ, అది ఆ పేరుతో వుండదు. బానిస జీవించి వుండడం కోసం ఆ భాగం బానిసకు పోగా, మిగిలిన ఉత్పత్తుల భాగం అంతా యజమాని కుటుంబానికే అందుతుంది.

బానిస చేసిన శ్రమలోనించి బానిస కోసమే ఖర్చయిన భాగాన్ని తీసివేస్తే, మిగిలినది 'అదనం'. అది, అదనపు శ్రమ. దాన్ని ఉత్పత్తిగా చూస్తే, అది 'అదనపు ఉత్పత్తి.' దాన్ని డబ్బుగా చూస్తే, అది 'అదనపు విలువ' (అదనపు డబ్బు).

మొత్తం బానిసల్నీ, మొత్తం యజమానుల్నీ తీసుకుంటే, యజమాని వర్గం అంతా, బానిసల 'అదనపు శ్రమ' మీదే జీవిస్తుంది.

కానీ, ఈ 'శ్రమ దోపిడీ' గురించి, ఆ నాడు ఇంకా ఏ వర్గానికీ తెలియదు. ఎందుకంటే, ఆ నాడు ఏ శ్రమకీ, ఏ ఉత్పత్తికీ, డబ్బు లెక్కలు లేవు. బానిసలు, యజమానుల కుటుంబాల కోసం, వ్యవసాయం దగ్గిర్నించీ ఇంటి పనుల వరకూ అనేక రకాల శ్రమలు చేస్తారు. ఆ శ్రమల వల్ల

తయారైన ఉత్పత్తుల విలువ ఎంత? అందు లోనించి బానిసలకు అందిన భాగం ఎంత? అది పోగా యజమానికి మిగిలిన భాగం ఎంత? — ఈ రకంగా, దేనికీ లెక్కలు వుండవు. కాబట్టి, ఆనాడు, 'అదనపు శ్రమ'ని గానీ, 'అదనపు విలువ'ని గానీ, అర్థం చేసుకోవడానికి అవకాశమే లేదు.

కానీ, అప్పులూ, వడ్డీలూ, వర్తక లాభాలూ, బానిస సమాజంలోనే ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఇంకా 'భూమి కౌలు' అనే మాట లేదు.

యజమానుల పరిపాలన, బానిస వర్గాన్ని అణిచే విధంగా సాగుతూ వున్నప్పటికీ, బానిసలు, పోరాటాలు చెయ్యకుండా ఆగలేదు. వర్గాల మధ్య జరిగే పోరాటాలే 'వర్గ పోరాటాలు.' కాల క్రమంలో అనేక వేల సంవత్సరాల నాటికి, బానిసల పోరాటాలే, వారు బానిసత్వాన్ని వది లించుకునేలాగ చేశాయి. కానీ, శ్రమ దోపిడీ ఎప్పటిలాగే వుంది.

## 'భూస్వామ్య సమాజం'లో శత్రు వర్గాలు

ఇక్కడ — భూస్వాములూ, భూమిమీద శ్రమలు చేసి పంటలు పండించే కౌలు రైతులూ, శత్రువర్గాలు. ఇక్కడ యజమాని వర్గానికి, శ్రమ సాధనాల మీద ఆస్తి హక్కులన్నీ ఎప్పటిలాగే వుండి, శ్రమచేసే మనుషుల మీద హక్కులు మాత్రమే కొన్ని తగ్గుతాయి.

ఇక్కడ, 'భూమి కౌలు' అనే మాట ఒకటి కొత్తగా ఆస్తి సంబంధాలలోకి ప్రవేశిస్తుంది. శ్రమ చేసే కౌలు రైతులు, యజమానుల స్వంత ఆస్తులుగా వున్న భూముల్ని కౌళ్ళకు తీసుకుని, వాటిలో పంటలు పండించి, ఆ పంటలోనించి భూస్వాములకు కౌళ్ళు చెల్లించి, మిగిలిన ఉత్ప త్తితో తమ పోషణ జరుపుకుంటారు.

శ్రమచేసే మనిషికి 'జీతం' పద్ధతి ఇక్కడ కూడా ఇంకా ప్రారంభం కాదు.

శ్రమలన్నీ శ్రామికులే (కౌలు రైతులు) చేస్తారు. భూమిలో పండిన పంటలోనించి, కౌలు రైతుల పోషణకు పోగా మిగిలినదంతా యజ మానికే.

'శ్రమ దోపిడీ' సంగతి ఇక్కడ కూడా ఏ వర్గానికీ తెలియదు.

ఇక్కడ కూడా వర్గ పోరాటాలు సాగాయి.

## 'పెట్టుబడిదారీ సమాజం'లో శత్రు వర్గాలు

ఇక్కడ — దోపిడీ వర్గంలో, 'ఉత్పాదక పెట్టు బడిదారుల విభాగం' అనే విభాగం ఒకటి కొత్తగా ప్రారంభమవుతుంది. ఇక్కడ, భూస్వాములూ పెట్టుబడిదారులూ కూడా దోపిడీ వర్గంలోనే వేరు వేరు భాగాలు. దాని వ్యతిరేకవర్గం — కార్మికులు (శ్రామికులు).

ఇక్కడ — శ్రమచేసే మనిషికి డబ్బుతో 'జీతం' పద్ధతి ప్రారంభమవుతుంది. అంతేగాక, ఇక్కడ, పెట్టుబడిదారుడు శ్రామికులద్వారా ఉత్పత్తి చేయించే ఉత్పత్తుల్లో అత్యధిక భాగం, అమ్మకాల లోకి వెళ్తుంది. ప్రతీ ఉత్పత్తికీ 'ధర' వుంటుంది.

పెట్టుబడిదారుడు, కొంత 'పెట్టుబడి' పెట్టి ('శ్రమ సాధనాల' మీదా, 'జీతాల' మీదా), శ్రామికులతో సరుకుని ఉత్పత్తి చేయించి అమ్ముతాడు. అలా వచ్చిన డబ్బులో నించి మొదట పెట్టిన ఖర్చుల్ని (పెట్టుబడిని) వెనక్కి తీసేస్తే, కొంత డబ్బు అదనంగా మిగులుతుంది. అది, పెట్టుబడికి 'వడ్డీ — లాభాలు'గానూ, ఆ ఉత్పత్తి ఏ పని స్థలంలో జరిగిందో ఆ భూమికి 'కౌలు'గానూ, పంపకాలవుతుంది.

ఇక్కడ ప్రతీ అంశానికీ ఖచ్చితమైన డబ్బు లెక్కలు వుంటాయి. సరుకు విలువ ఎంతా, దాని ఖర్చులు ఎంతా, మిగిలింది ఎంతా — అని లెక్కలు కట్టడానికి ఇక్కడ వీలవుతుంది. (అంటే,

శ్రామికుల శ్రమలోనించి పెట్టుబడిదారుడికి పోయే భాగాన్ని లెక్క కట్టడానికి.)

శ్రామికులకు జీతాల పద్ధతీ, సరుకుని ఉత్పత్తి చేసే అన్ని అంశాలకూ డబ్బు లెక్కలూ ఏర్పడిన పెట్టుబడిదారీ విధానంలోనే, 'శ్రమ దోపిడీ రహస్యాన్ని' కనిపెట్టడం సాధ్యమైంది. ఈ పని **మార్క్సు** ద్వారా జరిగింది.

శ్రామికుల అదనపు విలువే, 'వడ్డీలూ – లాభాలూ – భూమి కౌళ్ళూ' అనే పేర్లతో యజమానులకు పంపకాలవుతుంది. ఈ సంగతి గ్రహించడం వల్ల, ఈ గ్రహింపుతో, గత సమాజాల్నీ, భవిష్యత్ సమాజాన్నీ కూడా అర్థం చేసుకోవడం సాధ్యమైంది.

పెట్టుబడిదారీ సమాజంలో నిలబడి వెనకటి సమాజాల వేపు చూస్తే, 'బానిస సమాజం'లోనూ, 'భూస్వామ్య సమాజం'లోనూ జరిగిందంతా కూడా శ్రమ దోపిడీయే — అని గ్రహించవచ్చు. అదే అవగాహనతో, వెనకటి సమాజాల్లో వర్గాల్నీ, వర్గ పోరాటాల్నీ అర్థం చేసుకోవచ్చు.

అలాగే, పెట్టుబడిదారీ సమాజంలో నిలబడి, భవిష్యత్ కాలంవేపు చూస్తే, శ్రమ దోపిడీని తీసి వెయ్యడం ఎలా సాధ్యమో కూడా గ్రహించవచ్చు. యజమానివర్గం చేసే శ్రమదోపిడీ నించి శ్రామిక వర్గం, తనను తను విముక్తి చేసుకోవాలి. దానికి అవసరమైన జ్ఞానంతో పోరాటాలు చెయ్యాలి.

యజమాని వర్గం చేతుల్లో వున్న భూమి, ప్రకృతిలోదే. అది ఎవరిదీ కాదు. భూమిగాక ఇతర శ్రమ సాధనాలూ, డబ్బూ, శ్రామికవర్గం చేసిన శ్రమలతో ఉత్పత్తి అయినవే. అంటే, యజమాని వర్గపు స్వంత ఆస్తిగా కనపడేదంతా శ్రామిక వర్గపు స్వంత ఆస్తే!

ప్రతీ మనిషీ తన పోషణకోసం తనే శ్రమచేసి తీరాలి. శ్రమ చెయ్యకుండా జీవిస్తోన్న మనుషులు, ఇతరుల శ్రమమీద, అంటే శ్రమదోపిడీ మీద, జీవిస్తున్నారని అర్థం.

**కాబట్టి, శ్రామిక వర్గం — దోపిడీ నించి విముక్తి చెందే మార్గం ఏమిటంటే:** యజమాని వర్గం, ఏ ఆస్తి హక్కుల ద్వారా అయితే, భూమి కౌళ్ళనీ, వడ్డీ లాభాల్నీ తమ ఆదాయాలుగా పొందుతూ, స్వంత శ్రమ లేకుండా జీవిస్తోందో, ఆ ఆస్తి హక్కుల్ని రద్దు చెయ్యడమే. యజమాని వర్గం కూడా శ్రమచేసి తీరేలాగ చెయ్యడమే. ఇది, శ్రామిక వర్గం చేసే వర్గ పోరాటాల ద్వారానే సాధ్యమవుతుంది.

ఎవరికోసం వాళ్ళు శ్రమ చేసుకున్నప్పుడు, ఇతరుల శ్రమని దోచవలసిన అవసరం వుండదు. శ్రమదోపిడీ లేనప్పుడు, వర్గాలే వుండవు. యజమానీ శ్రామిక భేదాలే వుండవు. చివరికి అది సమానత్వ శ్రమ సంబంధాలతో, వర్గాలే లేని సమాజంగా రూపుదిద్దుకుంటుంది.

ఈ మార్పుల్ని ప్రారంభించేది భవిష్యత్ సోషలిస్టు సమాజం అవుతుంది.

శ్రమ దోపిడీ అనేది — వందల, వేల సంవత్సరాల నించీ సాగుతూనే వున్నా, దాన్ని అర్థం చేసుకోవడం పెట్టుబడిదారీ సమాజంలో మాత్రమే సాధ్యమైంది.

శ్రమ దోపిడీని సాగించే సమాజం ఎన్ని రకాలుగా మారినా, అది, 'రూపం'లో మార్పే. వెనకటి దోపిడీ సమాజాలలాగే, పెట్టుబడిదారీ సమాజం కూడా దోపిడీ సమాజమే.

భూస్వాములూ, పెట్టుబడిదారులూ ఒకే వర్గంలో (దోపిడీ వర్గంలో) భాగాలే. కానీ, ఒకప్పుడు, వాళ్ళకి ఆ సంగతి తెలీదు. ప్రారంభంలో వాళ్ళు ఒకర్ని ఒకరు శత్రువర్గాలుగానే భావించుకున్నారు. పెట్టుబడిదారీ విధానం కొత్తగా తలెత్తుతోన్న కాలంలో — పెట్టుబడిదారులకూ, అప్పటికి రాజ్యాధికారంలో వున్న భూస్వామ్య ప్రభువులకూ అనేక పోరాటాలు జరిగాయి. ఎందుకంటే: పెట్టుబడిదారుల వేపునించి చూస్తే — వారి పరిశ్రమలకు 'జీతాల' పద్ధతి మీద పనిచేసే శ్రామికులు

కావాలి. శ్రమలు చేసే జనాభా అంతా భూస్వాముల భూముల్ని సాగుచేసే శ్రమలలోనూ, వారి కోసమే అవసరమయ్యే ఇతర శ్రమలలోనూ నిమగ్నమై వుండేవారు. పెట్టుబడిదారులు, తమ పరిశ్రమలకోసం, భూస్వాములకూ కౌలు రైతులకూ వుండే బంధాల్ని వీలైనంత వరకూ తెంచడానికే ప్రయత్నించారు.

భూస్వాముల వేపునించి చూస్తే — పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి చెందడం తమ ప్రయోజనాలకు వ్యతిరేకమని భూస్వాముల వర్గం ప్రారంభ కాలంలో అభిప్రాయపడింది. రాజులూ, ఫ్యూడల్ ప్రభువులూ, మతాధిపతులూ — పెట్టుబడిదారీ వర్గాన్ని అణిచివెయ్యాలనే లక్ష్యంతో, వారి పరిశ్రమలపై అధికమైన పన్నులు వెయ్యడమూ, స్వేచ్ఛా వ్యాపారానికి వీలులేని ఆంక్షలు విధించడమూ ప్రారంభించారు. చట్టాలు చేసే హక్కూ, పరిపాలన చేసే అధికారమూ, సైన్యమూ అన్నీ ఫ్యూడల్ ప్రభుత్వాల ఆధీనంలోనే వుండడం వల్ల, ఫ్యూడల్ వర్గాధిపత్యం నశిస్తే తప్ప పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి చెందలేని స్తితి ఏర్పడింది.

పెట్టుబడిదారులు మొదట ఈ ఆటంకాలన్నిటినీ శాంతియుతంగానే తొలగించుకోవడానికి చూశారు. పిటీషన్లతోటీ, పన్నులు చెల్లించకుండా నిరాకరణలతోటీ ప్రయత్నించారు.

ఫ్యూడల్ ప్రభుత్వాల్ని ఇవేవీ కదిలించలేకపోయాయి. నూతనంగా తల ఎత్తుతోన్న పెట్టుబడిదారీ వర్గం, భూస్వామ్య వర్గంతో (దాని ప్రభుత్వంతో), పోరాటాలే తన మార్గంగా ఎంచుకుంది. రాజుకి వ్యతిరేకంగా శ్రామిక ప్రజల్ని తిరుగుబాట్లకు ప్రోత్సహించింది. ఫ్యూడల్ సంకెళ్ళలో ఇరుక్కునివున్న రైతు ప్రజలూ, చేతి వృత్తుల ప్రజలూ పెట్టుబడిదారీ వర్గానికే అనుకూలంగా ప్రవర్తించారు.

పెట్టుబడిదారులు, శ్రామిక ప్రజల్ని తమకు అండగా చేసుకుని, ఫ్యూడల్ పరిపాలనపై సాయుధ పోరాటాలు జరిపారు. ఈ పోరాటాలు శతాబ్దాల తరబడీ సాగాయి.

మొట్టమొదట బ్రిటన్‌లో, 17వ శతాబ్దంలో, పెట్టుబడిదారీ వర్గం, ఫ్యూడల్ వర్గాన్ని ఓడించి, అప్పుడు అధికారంలో వున్న 1వ ఛార్లెస్ రాజుని చంపి, అధికారం హస్తగతం చేసుకుంది. తనే పాలకవర్గమై, తన అభివృద్ధికి అవసరమైన శాసనాలు చేసుకుంటూ, ఫ్యూడల్ బంధనాల నించి బయటపడింది.

తర్వాత, 18వ శతాబ్దం ఆఖర్లో, ఫ్రాన్సులో కూడా, పెట్టుబడిదారీ వర్గం, ఫ్యూడల్ వర్గాన్ని ఓడించి అధికారంలోకి రాగలిగింది.

కాలక్రమంలో, అనేక దేశాల్లో పెట్టుబడిదారీ ప్రభుత్వాలే అధికారంలోకి వచ్చాయి.

కానీ, భారతదేశంలో — బ్రిటన్‌లోనూ, ఫ్రాన్స్‌లోనూ జరిగిన మాదిరిగా జరగలేదు. ఇక్కడ, పెట్టుబడిదారీ వర్గం, ఫ్యూడల్ వర్గం మీద పోరాటం చెయ్యడం ద్వారా అధికారంలోకి రాలేదు. ఫ్యూడల్ రాజుల పరిపాలనలో వున్న భారతదేశాన్ని బ్రిటిష్ పెట్టుబడిదారులు ఆక్రమించి పరిపాలించడం ద్వారా ఇక్కడ పెట్టుబడిదారీ విధానం ప్రారంభమైంది.

బ్రిటన్‌లో ఒకప్పుడు విప్లవకర వర్గంగా కనపడిన పెట్టుబడిదారీ వర్గం, త్వరలోనే ఫ్యూడల్ వర్గంతో రాజీపడి, తన నిజ స్వభావాన్ని బైట పెట్టింది. ఆ రెండు వర్గాలూ చాలా త్వరలోనే ఐక్యం అయ్యాయి. నిజానికి, అవి వేరు వేరు వర్గాలు కావు. ఒకే వర్గంలో ('దోపిడీ వర్గం'లో) వేరు వేరు బృందాలు మాత్రమే.

'శ్రామిక వర్గం' నించి లాగే 'అదనపు విలువ'లో ఒక భాగాన్ని భూస్వాముల బృందం 'భూమి కౌలు' పేరుతో తింటే, ఇంకో భాగాన్ని పెట్టుబడిదార్ల బృందం 'వడ్డీ — లాభాల' పేర్లతో తింటుంది. ఈ బృందాలు రెండూ తమ స్వంత శ్రమలు లేకుండా, శ్రామిక వర్గాన్ని దోచుకుంటూ బతికేవే. అందుకే వాటికి త్వరలోనే సఖ్యత కుదిరింది.

ఆ రెండు బృందాలకూ ఉమ్మడి శత్రువు — శ్రామిక వర్గమే. శ్రామిక వర్గాన్ని అణిచి వుంచా లంటే, దోపిడీ వర్గంలో బృందాలన్నీ ఐకమత్యంతో వుండాలి. ఈ అవగాహనే బ్రిటన్ పెట్టుబడిదారీ వర్గానికి, కొత్త తెలివితేటలు ఇచ్చింది. ఒకప్పుడు ఫ్యూడల్ రాజుని చంపివేసిన బ్రిటన్ పెట్టుబడిదారీ వర్గం, మళ్ళీ అదే ఫ్యూడల్ రాజులకు సాదరంగా సింహాసనం అప్పగించింది. కాకపోతే, రాజుల పాలనలో వుండే కొన్ని నిరంకుశమైన హక్కుల్ని రద్దుచేసి. పెట్టుబడిదారీ పరిపాలనలో ఎన్నికలూ పార్లమెంటులూ ప్రారంభమైనప్పటికీ, ఆ పెట్టు బడిదారీ పార్లమెంటూ, ఫ్యూడల్ రాచరికమూ, చెట్టా పట్టాలేసుకుని బ్రిటన్‌లో ఈ నాటికీ సాగు తున్నాయి. బ్రిటన్ పెట్టుబడిదారీ వర్గం, ఫ్యూడల్ రాజులకు తమ అధికారంలో భాగం ఇచ్చిందంటే, అది ఆ బృందాల ఐక్యతకు రుజువే.

'రాజు' అనేవాడు, ఏ నాడో బానిస సమా జంలో ప్రారంభమై, ఇంకా పెట్టుబడిదారీ సమా జంలో కూడా నిలిచే వున్నాడు!

పెట్టుబడిదారీ దేశాల్లో కూడా శ్రామిక ప్రజలు, ఇంకా రాజుల్నీ, రాణుల్నీ, వాళ్ళ విలాస జీవితాల్నీ భరించగలిగేటంత వెనకబడి వున్నారు. వారానికోసారి మారే రాజుల ప్రేమ కథలే ప్రజలకు ముచ్చట గొలిపే శృంగార కథలవు తున్నాయి.

'పెట్టుబడిదారుడి'కి (కేపిటలిస్టుకి) ఇంకో పేరు 'బూర్జువా.' పెట్టుబడిదారీ సమాజానికి ఇంకో పేరు — బూర్జువా సమాజం. ఏ మాట వాడినా ఒకటే.

పెట్టుబడిదారీ సమాజం, గత సమాజాల కన్నా విప్లవకరమైనదిగా పైకి కనపడుతుంది. ఎందుకంటే, ఈ సమాజంలోనే శ్రామికులకు 'జీతాల' పద్ధతి ప్రారంభమయింది. 'సెలవుల' పద్ధతీ, పని పరిస్థితుల్లో ఇతర హక్కులూ ప్రారంభమయ్యాయి. రాజకీయంగా — ఫ్యూడల్ నిరంకుశత్వాల స్థానంలో, ఎన్నికలూ, ప్రజా స్వామ్యమూ, పార్లమెంటులూ ప్రారంభ మయ్యాయి. గత సమాజాలతో పోలిస్తే, ఇలాంటి మార్పులన్నీ శ్రామిక వర్గానికి కూడా అభివృద్ధి కరమైన అంశాలే.

పెట్టుబడిదారీ విధానంలో, యంత్రాల ప్రవేశంవల్ల, స్త్రీలకూ పిల్లలకూ కూడా మిల్లుల్లో పనిచేసే అవకాశాలు కలిగాయి.

భారతదేశం వంటి దేశంలో, వెనకటి సమా జాల్లో గడ్డకట్టి వుండే 'కుల భేదాల'వంటి మూఢ నమ్మకాలు, క్రమంగా వెనకడుగులు వెయ్యడం ప్రారంభమయింది.

వ్యవసాయం పనుల్లోగానీ, చేతివృత్తుల్లో గానీ, వేరు వేరు కులాల వారు దూరదూరంగా వుంటూ పనులు చెయ్యడం సాధ్యమే. కానీ, యంత్రాల దగ్గిరగానీ, బస్సుల వంటి వాటిలో ప్రయాణాలు చేసేటప్పుడు గానీ, కులాల పట్టిం పులు గత పరిస్తితుల్లో లాగ అంత గడ్డకట్టి నిల బడలేవు.

అంతేకాదు, వెనకటి సమాజాలలో పనిచేసే శ్రామికులకు అక్షర జ్ఞానం లేకపోయినా ఆ పను లకు ఆటంకం వుండదు, కానీ, పెట్టుబడిదారీ విధానంలో, చిన్నా పెద్దా యంత్రాల దగ్గిర పని చేసే శ్రామికులకు కొంత అక్షర జ్ఞానమూ, కొన్ని రకాల సాంకేతికమైన ట్రయినింగులూ అవసర మవుతాయి.

ఈ రకంగా, పెట్టుబడిదారీ విధానంలో తప్పనిసరిగా 'అభివృద్ధి' అనదగ్గ మార్పులు కొన్ని ప్రారంభమయ్యాయి. కానీ, ఆ మార్పులన్నీ ఆ వర్గానికి అనుకూలమైన పరిస్తితులు ఏర్పడడం కోసమే. ఈ ఉత్పత్తి విధానం, తనకు ఎలాంటి మార్పులు అవసరమో, ఎంత వరకూ అవ సరమో, అలాంటి వాటినే, అంతవరకే, ప్రోత్స హిస్తుంది.

"స్త్రీలపై పురుషాధిక్యత నశించాలి. స్త్రీలు

వంటింటి కుందేళ్ళు కారు, పురుషులకు బానిసలు కారు" అంటూ, పెట్టుబడిదారీ సమాజంలో కొత్త నినాదాలు బైల్దేరాయంటే, అది, స్త్రీలు స్వతంత్రు లైన వ్యక్తులుగా జీవించాలనే లక్ష్యంతో కాదు, పెట్టుబడిదారీ పరిశ్రమల్లో రకరకాల పనుల్లోకి (ఉద్యోగాల్లోకి) స్త్రీ కార్మికులు చవకగా దొరక డానికే.

"కుల — మత — జాతుల భేదాలు నశిం చాలి!" వంటి నినాదాలు కూడా ఈ రకానివే. ఆ మార్పులవల్ల కూడా దోపిడీ వర్గానికి 'ఏదో లాభం' వుంటుంది.

పెట్టుబడిదారీ నినాదాలు, నిజమైన స్వేచ్ఛా సమానత్వాల్ని కోరేవి అయితే, అసలు ఆ వర్గం, 'యజమాని వర్గం'గానే వుండదు. శ్రామికుల స్వేచ్ఛా సమానత్వాల్ని హరిస్తే తప్ప, ఒక మనిషి, యజమానిగా ఉండలేడు. యజమానిగా వున్న మనిషి 'స్వేచ్ఛ' గురించి మాట్లాడుతున్నాడంటే, 'తన స్వేచ్ఛ' గురించే మాట్లాడుతున్నాడని అర్థం.

కానీ, పెట్టుబడిదారీ సమాజంలో అభివృద్ధి, ఆ వర్గ ప్రయోజనాల కోసమే అయినా, దాని ప్రభావం, ఆ పరిమితుల్లోనే ఆగదు. ఆ భావాలు మరింత అభివృద్ధి వేపు కూడా దారితీస్తాయి. దాన్ని పెట్టుబడిదారీ వర్గం ఆపజాలదు.

ఫ్యూడల్ సంకుచిత భావాల నించి బైటపడే ప్రయత్నాలు — అభివృద్ధి వేపు నడకే. పెట్టుబడి దారీ వర్గ నినాదాలతో ఉత్తేజం పొందిన అభ్యు దయ వాదులూ, సంఘ సంస్కర్తలూ, ఫ్యూడల్ భావజాలాన్ని కొంత వరకూ ఛేదించగలిగారు కూడా.

కానీ, దోపిడీ సంబంధాల పునాది మీద నిలబడ్డ ఈ అభ్యుదయం ఎంతో దూరం సాగదు. పది అడుగుల్లోనే అది ఆగి తీరుతుంది. పెట్టు బడిదారీ సమాజాల్లో కూడా పూర్వపు దోపిడీ సమాజాల రుగ్మతలన్నీ సాగుతూనే వుంటాయి.

శ్రమ దోపిడీ వున్న ఈ సమాజంలో, వర్గ భేదాలూ, కలిమి లేములూ, ఎప్పటిలాగే వుంటాయి.

రాచరికానికి బదులుగా ఇక్కడ పార్లమెంట్ల ద్వారా 'ప్రజాస్వామ్యం' బైల్దేరినా, అది పెట్టుబడి దారుల ప్రజాస్వామ్యమే. ఆ హక్కుల్ని ఆ వర్గ జనా భాయే ఉపయోగించుకోగలుగుతుంది. 'రాజు'కి బదులుగా ఎన్నికల ద్వారా ప్రధాన మంత్రులూ, ప్రెసిడెంట్లూ, సింహాసనాలు ఎక్కుతారు. వీరి పరి పాలనలో జరిగేదంతా కూడా దోపిడీ శ్రమ సంబంధాల్నీ, దోపిడీదారుల ఆస్తి హక్కుల్నీ, నిల బెట్టడమే.

శ్రామిక వర్గాన్ని అణిచివుంచే రాజ్యాంగ యంత్రమూ, దాని పరిపాలనా మరింత గట్టి పడతాయి.

ఇక్కడ, శ్రామిక వర్గానికి 'నిరుద్యోగం' అనే కొత్త సమస్య ఒకటి ప్రారంభమవుతుంది. ఇది గత సమాజాల్లో లేని సమస్య.

కుటుంబంలో స్త్రీ పురుషుల మధ్య యజమానీ బానిస సంబంధాలు కొంత మారినా, పురుషాధి క్యతే ఇంకా కుటుంబాన్ని ఏలుతూ వుంటుంది.

వేశ్యరికం, 'పడుపు వృత్తి' పేరుతో మరింత నీచస్థాయికి దిగజారుతుంది. స్త్రీలకు అవమాన కరమైన ఈ నీచత్వాన్ని ఒక 'వృత్తి'గా మార్చి, దానికి లైసెన్సులు ఇవ్వడం, పెట్టుబడిదారీ సమా జంలోనే ప్రారంభమవుతుంది. ఈ సమాజం, శ్రామికవర్గ స్త్రీలను బికారులుగా మార్చి వారికి చూపించే బతుకుదెరువు — పడుపు వృత్తే!

ధనికులు మరింత ధనికులుగానూ, పేదలు మరింత పేదలుగానూ, మారతారు. ముష్టి ఎత్తి జీవించే జనమూ, అనాథలూ మరింత ఎక్కువవు తారు.

సంస్కృతి అంతా దోపిడీ సంస్కృతే, చిన్న చిన్న మార్పులతో! స్వర్గ నరకాల మీద నమ్మకాలు, అదృష్ట దురదృష్టాల మీదకు మళ్ళుతాయి. 'రంభ' మీద కోరిక 'సినిమా స్టారు' మీదకి తిరుగుతుంది.

కర్మ సిద్ధాంతమూ, పునర్జన్మ సిద్ధాంతమూ, అలాగే వుంటాయి. 'రుషులకు' బదులుగా 'బాబాలు' బయల్దేరుతారు. వీరు, తపస్సులకు బదులుగా 'ఆత్మల్లోకి తొంగి చూసుకోవడాలు' నేర్పుతారు. సైన్సు పండితులు, గ్రహణ స్నానాలు చేసే స్థితి లోనే వుంటారు. స్త్రీలు, నోములూ వ్రతాలతో పాటు 'పార్టీలు' జరిపే స్థాయికి ఎదుగుతారు. పెట్టుబడిదారీ వ్యాపార సంస్కృతి ఆధిక్యతలో, ఫ్యూడల్ మూఢ సంస్కృతే విరాజిల్లుతూ వుంటుంది.

సాహిత్యం కొంత మారినట్టు కనబడుతుంది. అదికూడా 'గుణం'లో కాదు; 'రూపం'లోనే. వెన కటి కాలంనాటి మానవులు ప్రకృతి శక్తుల్ని అర్థం చేసుకోలేరు కాబట్టి, అక్కడ శారీరక వీరత్వాలకూ, తపోమహిమలకూ ప్రాధాన్యత వుంటుంది. పాలించే వర్గపు సాహస గాథలే ఆనాడు కవితా వస్తువులవుతాయి. కానీ, పెట్టుబడిదారీ సాహి త్యంలో శారీరక వీరత్వానికి స్థానం వుండదు. దానివల్ల సంపదలు రావు కాబట్టి. శారీరక వీరత్వంతో దోచుకోవడం అనాగరీకం అయ్యి, డిగ్రీలవల్లా, వ్యాపారాలవల్లా, తెలివితేటలవల్లా దోచుకోవడం నాగరికం అవుతుంది. ఫ్యూడల్ కథల్లో కథానాయకుడు కీలుగుర్రం మీదో, మాయ తివాచీ మీదో స్వర్గానికి పోయివస్తే, బూర్జువా కథానాయకుడు విమానాల మీద విదేశాలకు వెళ్ళివస్తాడు. ఈ రెండు కాలాల సాహిత్యం లోనూ, పేద వర్గానికి చెందిన పాత్రలు కథా నాయకులుగా వుండవు. ఫ్యూడల్ కథలో, భార్యని శంకించిన భర్త, ఆమెని రాయిగానో, రప్పగానో శపిస్తే; బూర్జువా కథల్లో — విడాకులివ్వడమో పిస్టల్‌తో షూట్ చెయ్యడమో, జరుగుతుంది. రెండు చోట్లా విషయం ఒకటే. — ఈ రకంగా, ఏ అంశంలో చూసినా, వెనకటి దోపిడీ సమాజా లకూ పెట్టుబడిదారీ సమాజానికీ రూప భేదాలే గానీ గుణ భేదాలేమీ వుండవు — పెట్టుబడిదారీ రకం మార్పులు తప్ప!

# ప్రేమా - పెళ్ళీ!

**బా**నిస సమాజంలోగానీ, భూస్వామ్య సమాజంలోగానీ, పెళ్ళికి ప్రేమ కారణం కాదు. (అప్పటికి స్త్రీ పురుషులు ప్రేమనే ఎరగరని దీని అర్థం కాదు.) పెట్టుబడిదారీ సమాజంలోనే ప్రేమ వివాహాలకు అవకాశాలు ఏర్పడతాయి.

భూస్వామ్య సమాజంలో, పురుషుడి శారీరక వీరత్వమే శత్రువులతో యుద్ధాలు చేసే, సంపదల్ని కూడబెట్టే సాధనం కాబట్టి, స్త్రీలు, వీరుల్ని కోరు కోవడం జరిగేది. రాజకుమారుల ప్రేమ కథల్లో స్త్రీలు కోరింది — ఆ పురుషుల వీరత్వాన్నీ, ఆ వీరత్వం ద్వారా వచ్చే సిరిసంపదల్నీ. పురుషులు కోరింది — పెళ్ళిద్వారా లభించే అర్థబలాన్నీ, అంగబలాన్నీ.

రాముడికీ, సీతకీ జరిగిన పెళ్ళికూడా ఇటు వంటిదే. రాముడి వీరత్వమే వారి పెళ్ళికి కారణం. అంత వీరత్వం రావణుడికే వుండి, ఆ విల్లు పోటీలో రావణుడే నెగ్గితే, సీత రావణుణ్ణే పెళ్ళిచేసుకుని, ఎప్పుడైనా రాముడు కనబడితే, 'పర పురుషుడు కదా' అని తెరల చాటుకి తప్పు కునేదే!

"ఆ విల్లుని విరిచేటంత వీరత్వం రాముడికి మాత్రమే వుంది" అనేటట్టయితే, అది విల్లు దృఢ త్వానికీ, రాముడి వీరత్వానికీ గల సంబంధమే గానీ, సీతకీ, రాముడికీ గల ప్రేమ సంబంధం కాదు. వారి మధ్య వున్నది, స్త్రీలను అణకువగా వుంచే సంస్కృతి నేర్పిన 'దాంపత్య ధర్మం' మాత్రమే.

బూర్జువా సమాజంలో స్త్రీలకు కొంచెం స్వేచ్ఛా, కొంచెం విద్యా, నాలుగయిదు అడుగుల వరకూ అభివృద్ధీ, సమాజపు ఇతర ఆచారాలలో కూడా కొంత మార్పూ కలగడంచేత, స్త్రీ — పురు షుల మధ్య పెళ్ళికి ముందే పరిచయాలూ, 'ప్రేమ జపాలూ' ప్రారంభమవుతాయి. తల్లిదండ్రులు

కుదిర్చే సంబంధాలు గాకుండా, తమ స్వంత ఇష్టాలకు కొంత ప్రాధాన్యత ఇచ్చుకోవటం జరుగుతుంది. కానీ ఈ ప్రేమ — గుణగణాల్ని కూడా చీల్చి చూసినప్పుడు, అది సమాజ పరిధిని దాటి, దాని కట్టుబాట్లకు అతీతంగా ఏర్పడేది కాదని తేలుతుంది.

ఒక యువకుడికి కుల నమ్మకాలు గాఢంగా వున్నాయి అనుకుందాం. తన కులంమీదే ఎక్కువ అభిమానం. అతను తన కులంలోనే ఒక అమ్మాయిని ఇష్టపడ్డాడు. ఆ సంబంధానికి అతని పెద్దలు అంగీకరించలేదు. కానీ, పెళ్ళి విషయంలో అతను పెద్దల ఇష్టాయిష్టాలకు విలువ ఇవ్వదల్చుకోలేదు. "ఇది నా జీవిత వ్యవహారం. ఇందులో ఇతర్ల ఇష్టాయిష్టాల ప్రసక్తి అనవసరం" అని అతను సరిగానే ఆలోచించగలిగాడు. పెద్దల వ్యతిరేకతని లక్ష్యపెట్టకుండా, తన ఇష్టానికే ప్రాధాన్యత ఇచ్చుకుని ఆ పెళ్ళి చేసుకున్నాడు. అతని 'ప్రేమ', పెద్దల అధికారాన్ని తిరస్కరించేలాగ చెయ్యగలిగినా, అది ఇంకా 'కులం అనే హద్దుల లోపలే' ఆగిపోయింది. ఇంకో కులం స్త్రీతో అయితే పెళ్ళిని అతను ఊహించలేడు. అంటే, అతని ప్రేమ 'కులం హద్దుల్ని' దాటదు. అతను ఆ హద్దుల దగ్గిరే ఆగిపోయే బలహీనతలో వున్నాడు.

ఇంకో యువకుడికి కులం పట్టింపులు లేవనుకుందాం. అతను కుల భేదాల్ని తేలిగ్గానే తిరస్కరించగలడు. వేరే కులంలో బాగా చదువుకున్న, ఉద్యోగస్తురాలైన స్త్రీని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. అయితే, ఈ ప్రేమ కూడా కొన్ని హద్దుల్లోనే వుందని చెప్పుకోవలసి వస్తుంది. ఎలాగంటే, అతను, ఒక కూలీల కుటుంబంలో చదువులేని పిల్లని ప్రేమించగలడా? ఆ పరిస్తితిలో వున్న స్త్రీ మీద అతనికి ప్రేమ కలుగుతుందా? (అలాంటి స్త్రీ మీద ప్రేమ కలగాలనీ, అలా కలగకపోతే అది నేరం అనీ, దీని అర్థం కాదు.)

'ప్రేమ' అనేది, సమాజంలో వున్న అవకాశాల్ని బట్టే ఏర్పడుతుంది. ఆ అవకాశాలు చాలా సంకుచితంగా వున్నప్పుడు, ప్రేమ కూడా ఆ సంకుచితమైన హద్దులకే లోబడి వుంటుంది.

అందం, ఆరోగ్యం, చదువూ, ఆస్తీ, ఉద్యోగం, ఇవన్నీ సమాజం కల్పించే హద్దులు. దోపిడీ సమాజంలో ఇవి కొందరికే వుంటాయి. ఎక్కువ మందికి వుండవు. అలాంటి సమాజంలో, ఒక యువతి గానీ యువకుడు గానీ ఆరోగ్యంగా వున్నారంటే, అది వారి ప్రయోజకత్వం కాదు, అలా వుండడానికి వారికి అవకాశాలు వున్నాయి. మంచి ఆహారమూ, పరిశుభ్రమైన బట్టలూ, పరిశుభ్రమైన నివాసమూ, ఆందోళన లేని ఏర్పాట్లూ, అన్నిటినీ ఇచ్చే ఆర్థిక పరిస్తితీ వున్నాయి. శ్రామిక కుటుంబాల జనాభాలో ఈ అవకాశాలేవీ వుండవు.

ఒక యువకుడు గొప్పగా వీణ వాయించే నేర్పరి అనుకుందాం. కేవలం ఈ నేర్పుకే అతణ్ణి ఒక యువతి ఇష్టపడింది అనుకుందాం. ఇది కూడా చదువు విషయం లాంటిదే. నిరుపేద కుటుంబాల్లో యువకులకు వీణలు నేర్చుకోడానికో, ఇతర కళాసాధనలకో అవకాశాలు వుండవు. కోట్లకొద్దీ ప్రజలకు లేని అవకాశాలు కొన్ని వందల మందికి మాత్రమే వుంటాయి. మన యువతి, ప్రేమ పేరుతో ఆ తక్కువ మంది నించి మాత్రమే ఎవరినో ఒకరిని ఎంచుకోవడం జరుగుతుంది. అందరికీ అన్ని అవకాశాలూ లేని సమాజంలో, ఈ ఎంచుకోవడాలు, ఏదో ఒక పరిధిలో వుండిపోతాయి.

అందరికీ అన్ని అవకాశాలూ వున్న సమాజంలోనే, ఈ ఎంచుకోవడాలు నిజమైన స్వేచ్ఛతో సాగుతాయి. అందులో, వారిని బంధించే కట్టుబాట్లుగానీ, వారు దాటలేని హద్దులుగానీ, వుండవు.

ఇంకో రకంగా చూద్దాం. ఒక యువకుడు

ఒక యువతిని ప్రేమించాడు. ఆమె, ఇంకో పురుషుడి ద్వారా బలత్కారానికి గురి అయింది. ఆమెని ప్రేమించిన యువకుడికి ఆమె మీద విముఖత కలిగిందనుకుందాం. అతని ప్రేమ, 'స్త్రీ పవిత్రత' అనే సాంప్రదాయం మీద ప్రేమేగానీ, ఆమె మీద ప్రేమకాదు — అనే అర్థానికి రావలసి వస్తుంది.

అలాగే, ధనం పోయి నిరుపేదగా మారడం వల్ల ఒక పురుషుడి మీద స్త్రీకి ప్రేమ పోతే, అప్పటి దాకా ఆమె ప్రేమ అతని ధనం మీదేగానీ అతని మీద కాదు.

ఈ రకంగా, ప్రేమ, ఆ సమాజం ఇచ్చే భావాల్ని బట్టి, అనేక పరిమితులతో వుంటుంది.

'ప్రేమ' ద్వారా దగ్గిరై, సాధారణ ఇబ్బందులన్నిటినీ ధిక్కరించి పెళ్ళి చేసుకున్న ప్రేయసీ ప్రియులు, చాలా తక్కువ కాలంలోనే 'సాంప్రదాయ దాంపత్య జీవితం'లో కూరుకుపోతారు. ప్రియుడు — 'భర్త'గా మారి, తర్వాత 'యజమాని'గా మారతాడు. ప్రియురాలు — 'భార్య'గానూ, తర్వాత సేవకురాలిగానూ! ప్రేమ, చడీ చప్పుడూ కాకుండా మాయమవుతుంది.

"ప్రేమ వివాహాలు కూడా భగ్నమవుతాయి, ఎందుకు?" అనే ప్రశ్నకి జవాబు ఇదే. పెద్దలు కుదిర్చిన వివాహాలు, ఏ కారణాలవల్ల ఘర్షణలో పడతాయో (పురుషుడి ఆధిక్యతా — స్త్రీ లొంగుబాటుతనమూ అనే కారణాలవల్ల ఘర్షణలో పడతాయి), ప్రేమ వివాహాలు కూడా అవే కారణాల వల్ల ఘర్షణలో పడతాయి. ఇద్దరు స్త్రీ — పురుషులకు పరస్పరాకర్షణ కలిగినంత మాత్రానే చాలదు. స్త్రీ — పురుష సంబంధాల్లో ఆధిక్యతా, సేవకత్వమూ వున్నప్పుడు, ప్రేమ కూడా ఆ విలువలకే తలవంచుతుంది.

కానీ, ఫ్యూడల్ సమాజపు స్త్రీలలో దాంపత్యం పట్ల వుండే మూఢత్వమూ, నిస్తబ్దతా, పెట్టుబడిదారీ సమాజపు స్త్రీలలో కొంత తగ్గడం మొదలవుతుంది. దానికి అనుగుణంగానే, ఫ్యూడల్ సమాజపు పురుషుల్లో వుండే ఆధిక్యతలూ, అహంకారాలూ, పెట్టుబడిదారీ సమాజపు పురుషుల్లో కూడా కొంత తగ్గుముఖం పడతాయి. కానీ, ఈ తగ్గుదలలు చెప్పుకోదగ్గ స్థాయిల్లో వుండవు. పెట్టుబడిదారీ సమాజం కూడా పురుషుడి ఆస్తి మీద సాగే దోపిడీ సమాజమే. ఈ సమాజంలో కూడా స్త్రీలు, తమ పోషణకూ రక్షణకూ పురుషుల మీద ఆధారపడే పరిస్థితులు వుంటాయి. కాబట్టి, ఈ సమాజంలో కూడా స్త్రీ పురుష సంబంధాలు వెనకటి స్వభావంతోనే సాగుతూ వుంటాయి.

## పెట్టుబడిదారీ యుద్ధాలు!

పెట్టుబడిదారీ సమాజంలో కూడా 'యుద్ధం' అనే బీభత్సం మానవ జీవితాల్ని వదలదు. పెట్టుబడిదారులు, తమ సరుకుల్ని ప్రపంచమంతా అమ్ముకోవాలనీ, తమ పెట్టుబడులు ప్రపంచం నిండా పెట్టాలనీ, వేరువేరు దేశాల నించి శ్రామికుల్నీ ముడిపదార్థాల్నీ చవకగా సంపాదించాలనీ, పోటీలుపడి ప్రయత్నిస్తారు. ఆ పోటీలే యుద్ధాలకు దారితీస్తూ వుంటాయి. ఒక యుద్ధం, ఇంకో యుద్ధాన్ని, గతం కన్నా పెద్ద యుద్ధాన్ని, తప్పనిసరి చేస్తుంది.

వెనకటి సమాజాల్లో యుద్ధాలు కర్రలతోటీ కత్తులతోటీ సాగితే, బూర్జువా యుద్ధాలు 'నాగరీకమైన' తుపాకులతోటీ బాంబులతోటీ సాగుతాయి. ఈ సమాజంలో అన్ని రంగాలలోనూ ఉత్పత్తి శక్తులు ఊహాతీతమైన స్థాయికి పెరిగినట్టే, ఇతర దేశాల్ని నాశనం చేసే యుద్ధ శక్తులు కూడా అలాగే పెరుగుతాయి.

'యుద్ధం' అనే మాట రెండక్షరాలే. దాని బీభత్సం, వికృతత్వం, వినాశనం — మాటలకందనివి. ఏ నాడో, మానవులు జంతు స్థాయిలో వున్నప్పుడు, తెగల మధ్య ప్రారంభమైన కొట్లాటలు, పెట్టుబడిదారీ సమాజంలో కూడా తగ్గవు. పైగా,

ఇంకా ఉధృతం అవుతాయి. ప్రపంచ శ్రామిక వర్గం నించి సంపాదించే 'అదనపు విలువ'కోసం, వేరువేరు దేశాల పెట్టుబడిదారుల మధ్య పోటీలే, యుద్ధాలకు దారితీస్తాయి.

ఎక్కడో మారుమూల కుగ్రామంలో, గుడిసెలో తల్లి ఒడిలో పాలు తాగే పసికందు మీద బాంబు పడుతుంది. ఎందుకు? — కొందరు పెట్టుబడిదారుల సరుకు అమ్మకాల కోసం! ఎక్కువ లాభాల కోసం!

"నాకీ ఇహలోకంతో సంబంధం లేదు. నా వ్యవహారం అంతా దేవుళ్ళతోనే" అని అడవుల్లో కూర్చుని జపాలు చేసుకునే హిందూ సన్యాసుల్ని కూడా బాంబులు వదలవు. అవి నిర్దోషి ప్రజలందరితోటీ సంబంధాలు పెట్టుకుంటాయి. ఈ బూర్జువా యుద్ధాలనించి ప్రకృతిలో ఏ జీవీ తప్పించుకుని బైటపడలేదు.

ఇటువంటి సుందర లోకమే పెట్టుబడిదారీ సమాజం. ఇది బానిస సమాజపు కొనసాగింపే. శ్రమ దోపిడీ సంబంధాల కొనసాగింపే.

ప్రపంచంలో ఈ నాడు, అన్ని దేశాల్లోనూ పెట్టుబడిదారీ సంబంధాలే వున్నాయి. శ్రామిక వర్గానికి ఇంకా జీతాలులేని బానిస విధానం ఎక్కడా లేదు. అలాగే, కేవలం కౌలు రైతులే వుండే విధానం కూడా ఎక్కడా లేదు. (ఏ దేశంలో వర్గ సంబంధాల్ని ఆ దేశపు శ్రామిక వర్గం పరిశీలించుకోవాలి.)

యజమాని వర్గానికి — భూమి కౌళ్ళూ, వడ్డీ లాభాలూ;

శ్రామిక వర్గానికి — జీతాలూ!

ఈ శ్రమ దోపిడీ సంబంధాలే ప్రతీ చోటా వున్నాయి.

కొన్ని దేశాల్లో, ఇంకా ఎన్నికలే లేని రాచరిక ప్రభుత్వాలూ; కొన్ని దేశాల్లో, ఎన్నికల మీద సాగే బూర్జువా శాసన సభలూ— రాజ్యమేలుతున్నాయి. సారాంశంలో, యజమానివర్గం, శ్రామికవర్గాన్ని 'పరిపాలన' పేరుతో అణిచి వుంచుతోంది.

వెనకటి కాలంనించీ ఇంకా ఈనాటికీ అమలులో వున్న ఈ విషయాల్ని అర్థం చేసుకోకపోతే, వెనకటి సాహిత్యాన్నిగానీ ఈ నాటి సాహిత్యాన్నిగానీ, అర్థం చేసుకోలేము.

శ్రామిక వర్గం, యజమాని వర్గంతో వెనకటి కాలంనించీ కూడా పోరాడుతూనే వుంది. కానీ, ఆ పోరాటాలు, శ్రామిక వర్గాన్ని ఒక రూపంలో నించి ఇంకో రూపంలోకి మార్చడం మాత్రమే చేశాయి. (బానిసల్ని కౌలు రైతులుగానూ, కౌలు రైతుల్ని కార్మికులుగానూ, మార్చాయి.) శ్రమ దోపిడీ గురించి తెలిసిన తర్వాత జరిగే పోరాటం, అలా మాత్రమే వుండకూడదు. ఇది, మొత్తంగా దోపిడీని సాగనివ్వకుండా చేసే పోరాటంగా వుండాలి. తనని ఇంకో వర్గం దోచకుండా శ్రామిక వర్గం చేసుకోవాలి.

ఇప్పుడు, అలాంటి సమ సమాజాన్ని కూడా ఊహించాలి. అదే కమ్యూనిస్టు సమాజం. దాని ప్రారంభ దశ — 'సోషలిజం.'

## కమ్యూనిస్టు సమాజంలో మానవ సంబంధాలు

**ఈ** కొత్త సమాజం, 'సోషలిజం'గా గానీ, దానికన్నా ముందు మరొక విప్లవ దశగా గానీ, ప్రారంభమవుతుంది. ఆ కొత్త సమాజం, తర్వాత ఇంకా కొన్ని దశలద్వారా వర్గ భేదాల్ని పూర్తిగా తీసి వెయ్యగలుగుతుంది. అప్పటినించే అది కమ్యూనిజం.

ఆ సమాజంలో ఏర్పడే మానవ సంబంధాల్ని ఇలా ఊహించవచ్చు.

**1.** అందరూ శ్రమ చేస్తారు. కొందరు యజమానులుగానూ, కొందరు శ్రామికులుగానూ వుండరు. యజమానీ శ్రామిక సంబంధాలే అంతర్ధానమవుతాయి. అప్పుడు అందరూ 'ఉత్పత్తి

దారులే'. 'శ్రమదోపిడీ' వుండదు.

**2.** దోపిడీ, స్వంత ఆస్తి హక్కులు వుండవు. భూమిద్వారా కౌలునీ, పెట్టుబడిద్వారా వడ్డీ లాభాల్నీ తమ ఆదాయాలుగా పొందే హక్కులు ఎవరికీ వుండవు. ఎవరి స్వంత శ్రమే వారికి జీవనాధారంగా వుంటుంది.

పెట్టుబడిదారీ వ్యక్తి ఆస్తులు, సమిష్టి ఆస్తులుగా మారతాయి. వ్యక్తికి ఆస్తి హక్కులే లేనప్పుడు, ఆ ఆస్తులమీద వారసత్వపు హక్కుల ప్రశ్నే వుండదు.

**3.** భూమిగానీ పెట్టుబడులుగానీ ఒకరి ఆస్తులుగా లేకపోవడం వల్ల, అవి నిర్వహించే పాత్రలే మారిపోతాయి. అవి, యజమానులకు ఆదాయాల్ని ఇచ్చే ఆస్తులుగా గాక, కేవలం 'ఉత్పత్తి సాధనాలు'గా మాత్రమే వుంటాయి. పరిశ్రమల్లో పోటీలూ, సరుకుల గుట్టలూ, మార్కెట్ల కోసం వేటలూ, చివరికి యుద్ధాలూ — ఈ పరి స్తితులన్నీ అంతర్ధానమవుతాయి. జనాభా అవస రాల్ని బట్టే ఒక ప్లాను ప్రకారం ఉత్పత్తి చేసుకోవడమూ, దాన్ని వాడుకోవడమూ వుంటాయి.

**4.** శ్రమ దోపిడీ లేకపోవడంవల్ల ఒక వేపు సిరిసంపదలూ, ఇంకోవేపు పేదతనమూ — అనే తేడాలు వుండవు. వ్యక్తుల్ని ఎక్కువ తక్కువలుగా విభజించే మేధాశ్రమలకూ శారీరక శ్రమలకూ మధ్యా; స్త్రీల శ్రమకూ పురుషుల శ్రమకూ మధ్యా; వెనకటి కాలంనించీ వున్న దోపిడీ సమాజాల శ్రమ విభజన, 'సోషలిస్టు శ్రమ విభజన'గా మారుతుంది. ఈ మార్పు, 'సమానత్వం' అనే ప్రధాన సూత్రం మీద ఆధారపడే శ్రమ సంబంధాల్ని ఏర్పరుస్తుంది.

**5.** నూతన శ్రమ విభజనవల్ల, ఇంటి పనులకు సంబంధించి స్త్రీలపై ఎక్కువ భారం ఉండదు. బిడ్డల పెంపకమూ, వృద్ధుల సంరక్షణా వంటి పనులు స్త్రీలకు కాళ్ళ సంకెళ్ళుగా ఉండవు. ఆ పనుల్ని గృహాల్లో పురుషులు కూడా చెయ్యడం వల్ల, అవి స్త్రీ పురుషులిద్దరికీ సంతోష కార్యాలుగా మారతాయి.

**6.** సమాన ఆర్థిక పరిస్తితులూ సమాన హక్కులూ ఏర్పడతాయి కాబట్టి, స్త్రీలు, స్వతంత్ర వ్యక్తిత్వాలతో జీవించే పరిస్తితులు ఏర్పడతాయి. స్త్రీలు, తమని తామే పోషించుకోగలరు కాబట్టి ఇక్కడ స్త్రీలు, తమ పోషణకోసం గానీ, రక్షణ కోసంగానీ, పురుషుల మీద ఆధారపడే పరిస్తితి వుండదు — ఈ రకంగా, 'పురుషాధిక్యతకు పునాది' అంతర్ధానమవుతుంది.

**7.** సమాజంలో ఒక మనిషిని గుర్తించడానికి ఒక స్వంత పేరూ, ఒక ఇంటిపేరూ (ఒక 'ప్రత్యేకమైన' పేరూ, ఒక 'సమిష్టి'పేరూ) అత్యవసరం. ఒక బిడ్డని గుర్తించాలంటే, బిడ్డకి స్వంతపేరు ఎలాంటిదైనా వుండవచ్చు. దాన్ని గురించి సమస్య వుండదు. కానీ, బిడ్డ 'ఇంటిపేరు' ఎలా వుండాలి? వెనకటి సమాజాల్లో, ప్రారంభంలో, పిల్లలకు తల్లి గణం పేరే ఇంటి పేరుగా వుండేది. తర్వాత కాలంలో, తండ్రి గణం పేరు రావడం మొదలైంది. అదే ఈ నాటికీ సాగుతోంది. ఏ దేశంలో చూసినా, పిల్లల ఇంటిపేరు, తండ్రిద్వారా వచ్చే పేరుగానే వుంటుంది. అది పురుషాధిక్య సమాజ లక్షణం. కాబట్టి, ఇది 'స్త్రీ — పురుష సమానత్వ సూత్రానికి' అనుగుణంగా మారాలి. ఈ ఇంటి పేరు — కేవలం తండ్రి ద్వారా రావడంగానీ, లేదా కేవలం తల్లి ద్వారా రావడంగానీ, రెండూ తప్పే అవుతాయి. తల్లిదండ్రులిద్దరికీ సంబంధించిన గుర్తులు రెండూ కలిసి బిడ్డకు ఇంటి పేరుగా వుండాలి. తల్లిదండ్రుల 'అసలు పేర్లు రెండూ కలిసి' బిడ్డకి ఇంటిపేరుగా రావడం సరైన పద్ధతిగా తేలుతుంది. అలా ఏర్పడిన ఇంటి పేరుతోపాటు, 'అసలు పేరు' కూడా కలిసి, అది బిడ్డకు పూర్తి పేరు అవుతుంది.

('ఇంటి పేరు ఎలా వుండడం నూటికి నూరు పాళ్ళూ సరైనది?' అనే వ్యాసంలో నేను ఈ

విషయం ఎక్కువ వివరంగా చర్చించాను. ఆ వ్యాసం — 'కట్నం హత్యల్ని ఆపలేమా?' అనే నా వ్యాసాల పుస్తకంలో వుంది.)

**8.** వెనకటి సమాజాల సంస్కృతి ప్రకారం, బిడ్డమీద హక్కులు తండ్రికేగానీ తల్లికి వుండవు. ఈ నాటి వరకూ బిడ్డకు పోషకుడూ యజమానీ తండ్రే. ఇది, సమానత్వ సూత్రానికి అనుగుణంగా మారితే, బిడ్డలకు తల్లిదండ్రులిద్దరూ పోషకులే. బిడ్డమీద తల్లిదండ్రులిద్దరికీ సమాన హక్కులూ సమాన బాధ్యతలూ వుంటాయి. 'యజమాని తనం' అనేది ఏ సంబంధంలోనూ వుండకూడదు కాబట్టి, బిడ్డలకు తల్లిగానీ తండ్రిగానీ యజమానులు కారు, వాళ్ళు 'తల్లిదండ్రులు' మాత్రమే. ఒక మనిషికి ఇంకో మనిషి యజమాని కాకూడదు కాబట్టి, 'సమాజం'లో గానీ, 'కుటుంబం'లో గానీ, యజమానులూ యజమానితనాలూ వుండవు. దోపిడీ సమాజాల సంబంధాలన్నీ మారిపోయినప్పుడు, ఆ భాషే మారిపోతుంది.

**9.** సమాజంలో పేదతనం లేనప్పుడు, వేశ్యా వృత్తీ, బిచ్చమెత్తి జీవించడమూ, నేరాలూ, శిక్షలూ వంటి రుగ్మతలన్నీ అంతర్ధానమవుతాయి.

**10.** వెనకటినించీ ఇప్పటివరకూ వున్న సమాజాలలో పెళ్ళిళ్ళు, ప్రధానంగా భూమి ఆస్తీ, డబ్బూ, కట్న కానుకల వంటి విషయాల మీదా, కుల — మతాల వంటి సాంప్రదాయాల మీదా, పెద్దల ఇష్టాయిష్టాలమీదా, ఆధారపడి వుంటాయి. కానీ, నూతన సమాజంలో యువతీ యువకుల సహజీవనాలు, సమానత్వ భావాలమీదా, స్నేహానురాగాల మీదా మాత్రమే ఆధారపడతాయి. వైరుధ్యాలు లేని అటువంటి సంబంధాలు, నిజమైన సంతోషాలతో స్థిరంగా నిలుస్తాయి.

**11.** పురుషుడి స్వంత ఆస్తి విధానం వల్ల, ఆ ఆస్తి అతని బిడ్డలకే చెందడంకోసం, భార్యలకు 'పాతివ్రత్య ధర్మం' ఏర్పడిందని చూశాం. అయితే, స్వంత ఆస్తి విధానమూ, వారసత్వపు హక్కులూ పోయినప్పుడు, స్త్రీ పురుష సంబంధాలలో ఏ నిబంధనలూ లేని ఆటవిక కాలపు పరిస్థితే తిరిగి వస్తుందా? — అలా జరగదు. ఎందుకంటే, పాత కాలపు సంబంధాలు, జంతువుల సంబంధాల లాంటివి కాబట్టి. అభివృద్ధి చెందిన మానవ సంస్కారానికీ, పశుతుల్యమైన కామ సంబంధాలకూ పొసగదు. పాత సంబంధాలు అనేక వైరుధ్యాలకు దారితీస్తాయి. (ఈ వైరుధ్యాల్ని నేను, 'అసమానత్వంలోనించి, అసమానత్వంలోకే!' అనే పుస్తకంలో చర్చించాను.)

స్త్రీకి పాతివ్రత్యం అనేది, పురుషుడి స్వంత ఆస్తి విధానం వల్లనే ప్రారంభమైనా, ఆ ఆస్తి విధానం పోయినప్పుడు, ఆ పాతివ్రత్యంలో వున్న అన్ని లక్షణాలూ నశించవు. స్త్రీని పురుషుడికి బానిసగా మార్చే లక్షణాలే నశిస్తాయి. అవి నశించవలసిందే. శారీరక సంబంధాల విషయంలో, భార్య, భర్తకే పరిమితమై వుండడం — అనే లక్షణం నశించదు. అది స్థిరంగా వుండవలసిన లక్షణమే. దానికి తోడు, భర్త కూడా భార్యకే పరిమితమై వుండడం — అనే లక్షణం కూడా స్థిర పడుతుంది. ఈ భార్యాభర్తల సంబంధం, ఎటువంటి బలవంతాలూ లేకుండా, వారి అనురాగం మీద ఆధారపడి వుంటుంది. అదే హేతుబద్ధ సంబంధం. స్త్రీ — పురుష సంబంధాలు, స్నేహానురాగాలతో ప్రారంభమై కొనసాగడమే ఉన్నత మానవ సంస్కారం. దానికి విరుద్ధమైన లక్షణాలే నశించాలి.

**12.** 'మతం' విషయంలో పూర్వపు మూఢ విశ్వాసాలన్నీ సన్నగిల్లిపోతాయి. పూర్వం, జీవిత సమస్యలకు మార్గాలు తెలియక, ప్రజలు, దేవుళ్ళని ప్రార్థించుకునేవారు. కానీ, ఇక్కడ ఏ దేవుళ్ళ దయాధర్మాలూ అవసరం లేకుండానే, సమాజంలో జీవించే విధానంవల్లనే కష్టాలన్నీ తీరడమూ, పూర్వపు రకం సమస్యలు తలెత్తకపోవడమూ చూస్తారు. సమస్యలన్నీ శ్రమ దోపిడీకి

సంబంధించినవేనని అనుభవాల ద్వారా అర్థం చేసుకుంటారు. ఈ నూతన జ్ఞానంతో ప్రజల్లో, దేవుళ్ళ పట్టూ, మతాల పట్టూ, బలహీనపడి పోతాయి. అదృష్ట దురదృష్టాలూ జోస్యాలూ, కర్మలూ పునర్జన్మలూ, స్వర్గ నరకాలూ — వంటి నమ్మకాలన్నీ ఆవిరైపోతాయి. దేవుళ్ళ భజనలు ఆగుతాయి. దేవుళ్ళ గుళ్ళు పాఠశాలలుగానో, ఆస్పత్రులుగానో మారిపోతాయి.

**13.** వర్గాలే లేని సమాజాన్ని ఊహిస్తున్నాం. వర్గాలే లేని నాడు, ఒక వర్గాన్ని ఇంకో వర్గం అణచడం వుండదు. దోపిడీ సమాజాల్లో, దోపిడీ వర్గం, శ్రామికవర్గాన్ని అణిచివుంచే పరిపాలన చేస్తుంది. దోపిడీని తీసివేసే సోషలిజం ప్రారంభమైన తర్వాత, శ్రామికవర్గం, దోపిడీ వర్గంనించి ఆస్తి హక్కుల్ని తీసివెయ్యడానికీ, దోపిడీ వర్గం కూడా శ్రమ చేసేలాగ చెయ్యడానికీ, పాతకాలపు శ్రమ విభజనని మార్చడానికీ, దోపిడీ వర్గాన్ని అదుపులో వుంచే పరిపాలన ప్రారంభిస్తుంది. ఇది, శ్రామికవర్గం, తనని తను రక్షించుకోవడానికి (ఆత్మ రక్షణకు) చెయ్యవలసిన వర్గ పోరాటం. ఈ పోరాటంద్వారా, వర్గాలు నశించి పోవడం ప్రారంభమవుతుంది. క్రమంగా అవి అంతర్ధానమవుతాయి. సమాజంలో అందరూ యజమానీ శ్రామిక భేదాలు లేని, సహచరులైన ఉత్పత్తిదారులుగా, తయారవుతారు. వర్గాలే లేనప్పుడు, శత్రువర్గాన్ని అణిచే పరిపాలనతో అవసరమే వుండదు. అప్పుడు సమాజానికి ఉత్పత్తి క్రమాన్నీ పంపిణీ క్రమాన్నీ నిర్వహించుకునే సహజ అవసరాలు మాత్రమే మిగులుతాయి. అది 'వర్గ పరిపాలన' లాంటిది కాదు. వర్గ రాజ్యాంగ యంత్రమే నశిస్తుంది. దాని అంగాలన్నీ అంతర్ధానమవుతాయి.

ఈ రకంగా దోపిడీ సమాజం, వర్గపోరాటాల ద్వారానే 'కమ్యూనిస్టు సమాజం'గా మారవలసి వుంటుంది.

# అభివృద్ధికి గమ్యం!

శ్రమ సంబంధాల్లో, శత్రువైరుధ్యాలు నశించి, 'సమానత్వం' అనే స్వభావం (గుణం) ఏర్పడిందనుకుందాం. తర్వాత ఇంకా ఏం జరగాలి? అభివృద్ధి ఇంకా ఎక్కడి దాకా జరగాలి? — సమాజం, శత్రువైరుధ్యాలన్నీ నశించే దశకు చేరి, సమానత్వం ఏర్పడితే, ఇక తర్వాత జరగవలసింది, ఆ స్వభావం స్థిరంగా కొనసాగుతూ వుండడమే. సమానత్వం స్థిరంగా నిలబడడమే అభివృద్ధికి గమ్యం!

ఒక మనిషికి ఆరోగ్యం పూర్తిగా సరిగా వున్నప్పుడు, ఆ ఆరోగ్యం ఇంకా అభివృద్ధి చెందవలసిందేమీ వుండదు. అందులో ఏదైనా లోపం వుంటే, ఆ లోపం పోవడమే అభివృద్ధి. ఏ లోపమూ లేనప్పుడు, అది ఇంకా అభివృద్ధి చెందడం వుండదు. ఆరోగ్యం ఏర్పడిన తర్వాత, ఆ పైన జరగవలసింది ఆ ఆరోగ్యం అలా కొనసాగడమే. ఏ సమస్యలో అభివృద్ధి సంగతైనా అంతే.

'అభివృద్ధి' అనే దానికి అంతం వుండదనీ, సమాజం ఇంకా ఇంకా ఎప్పుడూ అభివృద్ధి చెందుతూనే వుంటుందనీ, భావించకూడదు. ఏ సమస్యలో అయినా అందులో శత్రువైరుధ్యాలు పోయే వరకే మార్పు జరుగుతుంది. ఆ స్థితి ఏర్పడిన తర్వాత, ఇక ఆ స్థితే కొనసాగుతుంది. ఆ స్థితిలో కూడా 'మిత్ర వైరుధ్యాలు' వుంటాయి. అవి కొన్ని పరిస్థితుల్లో తాత్కాలికంగా తలెత్తుతూ, చర్చల ద్వారానూ, అనుభవాల ద్వారానూ, ఎప్పటికప్పుడు పరిష్కారమైపోతూ వుంటాయి. ఆ రకంగా, ఆ స్థితిలో కూడా సమాజంలో పరిస్థితులు మారుతూనే వుంటాయి. కానీ, ఆ మార్పులు సమాజ 'స్వభావాన్ని' మార్చవు. ఆ మార్పులు కూడా సమానత్వానికే అనుగుణంగా వుంటూ, అవి, అప్పటికే వున్న స్థితికి కొనసాగింపుగా మాత్రమే వుంటాయి.

'సమానత్వం అనే గుణం'లో ఏమాత్రం వ్యతిరేకమైన మార్పు జరిగినా, అది మళ్ళీ 'అసమానత్వానికి' దారితీస్తుంది. అక్కడ మళ్ళీ శతృవైరుధ్యాలు ప్రారంభమవుతాయి. అవి మారాలంటే, మళ్ళీ సమానత్వం ఏర్పడవలసిందే.

సమానత్వ సంబంధాలు ఏర్పడిన తర్వాత, ఇక అప్పటి నించీ జరగవలసింది, ఆ స్తితి స్తిరంగా కొనసాగడమే. వ్యక్తి బాధ్యత అయినా, సమాజ బాధ్యత అయినా, ఆ స్తితిని కొనసాగించడమే.

దోపిడీ సమాజాల్లో ఎలాంటి సమస్యలు పుట్టుకొస్తాయో వాటికి పునాది లేకుండా చెయ్యడం వల్లనే అది — 'కమ్యూనిజం' అవుతుంది. ఈ రకంగా, 'కమ్యూనిస్టు సమాజం', మానవ చరిత్రలో వేలాది సంవత్సరాలుగా సాగుతోన్న శ్రమ దోపిడీకి చరమగీతం పాడుతుంది.

## దోపిడీ సమాజాల నీతి సూత్రాలు!

ఏ మత గ్రంథాన్ని చూసినా, అందులో వందల వందల నీతులు కనపడతాయి. 'రామాయణం'లో మరీనూ. అందులో ఎవరు నోరు తెరిచినా కరుకుల్లాంటి ఒక వంద నీతులు చెప్పకుండా నోరుముయ్యరు. అసలు నీతులు చెప్పడానికే నోళ్ళు తెరుస్తారు. ఆ నీతుల్ని అర్థం చేసుకోవాలంటే, ముందు ఈ రకం నీతులతో పరిచయం వుండాలి.

ఒక దోపిడీ నీతిని విన్నప్పుడు, అది సమానత్వ సంబంధాలలో అయితే ఎలా మారవలసి వుంటుందో ఊహించాలి. మచ్చుకి, కొన్ని నీతులు చూడండి!

**★ "ఇతరుల సిరి సంపదలు చూసి, అసూయ చెందరాదు."**

దీన్ని చూడగానే 'ఎంత మంచి మాటలో!' అనిపిస్తాయి. కానీ, సిరిసంపదలు కొందరికే ఎందుకు వుంటాయి? అందరికీ ఎందుకు వుండవు? సిరిసంపదలు వున్నవాళ్ళకి సుఖాలూ ఆనందాలూ, అవి లేనివాళ్ళకి కష్టాలూ దుఃఖాలూ కలుగుతూ వుంటే, అవి వున్న వాళ్ళమీద, అవి లేనివాళ్ళకి అసూయలు కలగకుండా ఎలా వుంటాయి? వర్గ భేదాల గురించి తెలియనప్పుడు, ఈ నీతిలో తప్పేమీ కనపడదు. కానీ, ఈ నీతి, ధనికుల్ని చూసి, పేదలు అసూయ చెందరాదని చెపుతుంది. ఇది, సిరిసంపదలు గల వర్గాన్ని, పేదవర్గం నించి కాపాడే నీతి. ధనికుల మీద పేదలకు అసూయా ద్వేషాలు కలగకుండా వుండడం ధనికులకు చాలా క్షేమం.

కానీ, ఈ నీతి సమానత్వానికి అనుగుణంగా మారితే — "సిరి సంపదలు కొందరికే కాదు, అందరికీ వుండాలి. ఇతరులకు అసూయ కలిగించేటంత సిరిసంపదలు ఎవరికీ వుండరాదు" అవుతుంది.

**★ "నీ శతృవుని, నీ వలె ప్రేమించు!"**

ఇది కూడా ధనికులకు రక్షణ కలిగించే నీతే.

శత్రువూ, ప్రేమా — విరుద్ధ విషయాలు. రెంటికీ పొత్తు కుదరదు. ఒకటి వున్నచోట ఒకటి వుండవు.

బానిసా, యజమానీ — శతృవులు. 'శతృవుని ప్రేమించు' అనే మాటలు, బానిసకోసం చెప్పినవే గానీ, యజమాని కోసం చెప్పినవి కావు.

యజమాని, బానిసని ప్రేమించాలంటే, బానిసని బానిసగానే వుంచకూడదు. బానిసని వదిలెయ్యాలి. అప్పుడు, యజమానికి తిండే వుండదు. జీవితమే వుండదు. కాబట్టి, ఈ నీతి, 'బానిసని వదిలెయ్యి' అని యజమానికి చెప్పడం కోసం కాదు.

ఇది, బానిస కోసమే — 'నీ యజమానిని ద్వేషించకు! అతని మీద పోరాటానికి దిగకు! యజమాని మీద ప్రేమ పెంచుకో! అతనికి

ప్రేమతో సేవలు చెయ్యి!' అని బానిసకు బోధించడానికే. ఇలాంటి నీతులవల్ల, బానిసలు, యజమానులకు అణకువగా మారడమే జరుగుతుంది గానీ, యజమానులు బానిసల్ని వదిలెయ్యడం జరగదు.

"శతృవుని ప్రేమించు" అనడం అంటే, "శతృవులు వుంటారు. అది తప్పదు. అయినా శతృవుల్ని ప్రేమించాలి" అని చెప్పడమే. కానీ, మనుషుల మధ్య శతృత్వాలు వుండగా, శతృవుల్ని ప్రేమించడం జరగదు.

నిజానికి, మానవ సంబంధాలన్నిటా 'ప్రేమ' వుండవలసిందే. 'ప్రేమ'కీ, కమ్యూనిస్టు నీతికీ వ్యతిరేకతేదీ లేదు. కానీ, మనుషుల మధ్య ప్రేమ వుండడం ఎప్పుడు సాధ్యమంటే — ఆ సంబంధాలన్నీ 'ఒకే న్యాయం' మీద వున్నప్పుడు! అలా గాక, ఆ సంబంధాల్లో అన్యాయం వుంటే, అన్యాయానికి గురి అయ్యే మనిషి, అన్యాయం చేసే మనిషిని, ప్రేమించవలసిన అవసరం లేదు. అలా జరిగితే, అది తనకే హాని చేసుకోవడం. అలాంటి పని, ఆ అన్యాయం నించి బైటపడే మార్గాన్ని ఆ మనిషికి చూపించదు. కాబట్టి, ఏ సమాజంలో అయినా, శ్రామిక వర్గానికి యజమాని వర్గం మీద ప్రేమ అర్ధ రహితం! ఆత్మ ద్రోహం!

మానవ సంబంధాల్లో శతృత్వాలు లేని పరిస్తితులు వుంటేనే అన్ని వేపులా స్నేహానురాగాలు సాధ్యమవుతాయి. కాబట్టి, 'శతృవుని ప్రేమించు' అనే కపటనీతి, సమానత్వ సంబంధాలలో ఎలా మారుతుందంటే — "ఇతర మానవుల మీద ద్వేషం లేకుండా వుండడానికి, ఆ ఇతరులతో శతృ సంబంధాలే లేకుండా చేసుకో! శతృ పరిస్తితులతో పోరాడు!" — ఈ నీతి, అన్ని రకాల శతృ పరిస్తితులకూ వర్తిస్తుంది. ఇది, శతృ సంబంధాలనే తీసివెయ్యగలుగుతుంది.

**★ "ఈ చెంపమీద కొడితే, ఆ చెంప చూపించు!"**

ఇది, కొట్టే వాళ్ళని ప్రోత్సహించి చెంపలు గల వాళ్ళని అణగార్చే నీతి!

తన చెంపమీద కొడితే ఊరుకునే మనిషి, తనని దోపిడీ చేసినా వూరుకుంటాడు. ఇక వాడు, తన బాధల్లోనించి బైటపడే మార్గమే తెలుసుకోడు. కాబట్టి, ఈ దోపిడీ నీతి, "ఎదటివాడు నీ చెంపమీద కొట్టడానికి చెయ్యెత్తగానే, నువ్వే వాడి పళ్ళు రాలగొట్టు!" అని మారుతుంది. ఇది ఆత్మ రక్షణా నీతి!

**★ "స్త్రీకి వినయం వుండాలి. దాసుడికి విశ్వాసం వుండాలి. కష్టాల్లో సహనం వుండాలి."**

ఇది, ఇలా మారాలి — 'వినయం, విశ్వాసం, సహనం — అన్నీ స్త్రీలకే కాదు, దాసులకే కాదు, ప్రతీ మనిషికీ వుండాలి. అలా కాక, అవి కొందరికే వుండాలంటే, వాటి అర్ధాలే మారిపోతాయి. అప్పుడు — వినయం హీనుల లక్షణం. విశ్వాసం కుక్కల లక్షణం. సహనం గాడిదల లక్షణం అవుతాయి.'

★ ఫ్యూడల్, బూర్జువా వ్యవస్థలు, దాన ధర్మాల్ని గొప్ప పుణ్య కార్యాలుగా వర్ణిస్తాయి. కానీ కమ్యూనిస్టు వ్యవస్థలో, దాన ధర్మాలు పట్టి బతకవలసిన అవసరం ఎవరికీ వుండదు. అలాంటి చోట, దాన ధర్మాలు చెయ్యడం, సాటి వ్యక్తిని అల్పుడిగా జమకట్టి అవమానం చెయ్యడం అవుతుంది. దానధర్మాలు స్వీకరించడం, ఆత్మగౌరవం లేని నీచకార్యం అవుతుంది.

**★ "అసత్యమాడరాదు!"**

అప్పులు తీసుకున్న వాళ్ళు, అప్పుల్ని వడ్డీలతో సహా తీర్చేలాగ చెయ్యడానికి ఈ నీతి. కానీ, దోపిడీయే పెద్ద అసత్యం కాదూ? వడ్డీ లాభాలు లాగడం అసత్య జీవితం కాదూ?

**★ "దొంగతనం చెయ్యరాదు!"**

ధనవంతుల ఆస్తులకు పేదల నించి రక్షణ వుండాలి కదా? కానీ, యజమాని వర్గం, శ్రామిక వర్గంనించీ 'అదనపు విలువ'ని లాగడమే పెద్ద

దొంగతనం కాదూ? దాన్ని మించిన దొంగతనం ఏముంది?

ఇంకా ఈ రకం నీతులు కోకొల్లలు! ఈ నీతుల్ని విడిగా చూస్తే, ఇవన్నీ చాలా మంచివే. 'అసత్యమాడరాదు; దొంగతనం చెయ్యరాదు' అనడంలో తప్పేముంది? అవి మంచి మాటలే. కానీ, సమాజమే పెద్ద అసత్యం మీదా, దొంగ తనం మీదా నిలబడి వున్నప్పుడు, ఈ నీతులన్నీ కపటత్వాలే. ఈ నీతుల్ని యజమాని వర్గం పాటిం చదు. వీటిని పాటించాలని పేదవర్గం ప్రయ త్నించినా, అది దానికి సాధ్యం కాదు. చివరికి ఏ వర్గమూ వాటిని పాటించదు. అంటే, ఈ నీతు లన్నీ ఆచరణకు రాని కపటత్వాలే.

వర్గ సమాజం, తను 'అన్యాయం' మీద నిల బడి వుండి, వ్యక్తుల్ని మాత్రం నీతివంతులుగా వుండమంటుంది. అందుకే అది చెప్పేవన్నీ తప్పుడు నీతులే, తప్పుడు ధర్మాలే, తప్పుడు సిద్ధాంతాలే!

వ్యక్తులు నీతివంతులుగా వుండాలంటే, సమా జమే నీతివంతంగా వుండాలి. అది, 'అందరూ శ్రమచెయ్యడం' అనే నీతి మీద నిలబడి వుండాలి. అదే — కమ్యూనిస్టు నీతి! అదే — సమానత్వాన్ని ఇచ్చే నీతి! ఈ రకంగా, కమ్యూనిస్టు నీతి, దోపిడీ సమాజాల నీతులకు ప్రతీ విషయంలోనూ వ్యతిరే కంగానే వుంటుంది.

# ఆదిమ కమ్యూనిజమూ ఉన్నత కమ్యూనిజమూ ఒకటి కావు!

'గణ వ్యవస్థ' కూడా వర్గాలు లేని సమాజమే కాబట్టి, దాన్ని 'ఆదిమ కమ్యూనిజం' అంటారని చూశాం. కానీ, కమ్యూనిస్టు ఉన్నత దశని, పూర్వపు గణవ్యవస్థతో పోల్చకూడదు. ఎందు కంటే, 'వర్గాలు లేకపోవడం' అనే విషయంలో తప్ప, మిగిలిన విషయాల్లో అవి రెండూ ఒకే రకం కావు.

గణ వ్యవస్థ నాటి మానవులకు ప్రకృతి గురించి ఏ జ్ఞానమూ వుండదు. ఆ నాడు ఒక గణంలో జనాభా, ఒకే బృందంగా, సమిష్టి నియ మాలతో జీవించారంటే, అది ఆ నాటి అవసరం. క్రూర జంతువుల బారినించీ, శత్రు తెగల దాడుల నించీ రక్షణకోసం, ఆ నాడు ఆ సమిష్టితనం తప్పనిసరి. పక్షుల గుంపులూ, జంతువుల మందలూ ఎలాంటి సమిష్టితనాలతో జీవిస్తాయో, ఆనాటి మనుషుల సమిష్టితనం కూడా అలాం టిదే. కానీ, కమ్యూనిస్టు సమాజపు సమిష్టితనం అలాంటిది కాదు. ఇది, 'శ్రమ సాధనాల' మీద హక్కులలోనూ, 'శ్రమ సంబంధాల'లోనూ మాత్రమే సమిష్టితనం. ఇక్కడ ఎవరి వ్యక్తిగత జీవితం వారికి వుంటుంది.

గణ వ్యవస్థలో సమిష్టితనం, ప్రకృతి సహజ అవసరాల కోసం అయితే, కమ్యూనిస్టు సమా జంలో సమిష్టితనం, నూతన మానవ సంస్కారా లతో ఏర్పర్చుకునేది.

గణ వ్యవస్థలో జీవితాన్ని చూసి "అది సత్య కాలం. సత్యయుగం. ఆ యుగంలో ధర్మం నాలుగుపాదాలా నడిచేది" అంటారు. కానీ, ఆ నాడు ధర్మానికీ సత్యానికీ అర్థాలే వేరు. ఆ నాడు, పక్క ప్రాంతంలో వున్న ఇంకో తెగతో యుద్ధమూ, ఆ మనుషుల్ని చంపెయ్యడమూ కూడా ధర్మమే! సత్యమే. అది ఆ నాటికి తగిన ధర్మం.

కానీ, కమ్యూనిస్టు సమాజంలో యుద్ధాలూ చంపడాలూ — ధర్మాలు కావు. ఇక్కడ శతృత్వా లకే ఆస్కారం వుండకూడదు. ఇది, సంపూర్ణంగా అభివృద్ధి చెందిన మానవ సంస్కారం. అందుకే, ఈ కమ్యూనిస్టు సమాజాన్ని ఆదిమ కమ్యూనిజం లాంటి అజ్ఞానపు సమాజంతో సమానం చెయ్య కూడదు. రెంటినీ ఒకే రకంగా జమకట్టకూడదు.

మానవ చరిత్రని ఒక వరస క్రమంలో చూస్తే, గణ సమాజం కన్నా బానిస సమాజం అభివృద్ధి కరమైనదే. దానికన్నా భూస్వామ్య సమాజమూ, భూస్వామ్య సమాజం కన్నా పెట్టుబడిదారీ సమాజమూ, అభివృద్ధికరమైనవే. అన్నిటినీ మించి కమ్యూనిస్టు సమాజం — సమూలమైన, విప్లవకరమైన మార్పు. అంటే, చరిత్ర పరిణామం అభివృద్ధి వేపే జరుగుతోందని అర్థం.

కానీ, పెట్టుబడిదారీ సమాజంలో ఏర్పడే 'డబ్బు దృష్టి' వల్లా, డబ్బు సంబంధాల వల్లా, ఈ సమాజం, వెనకటి సమాజాల కన్నా అభివృద్ధి కరమైనదిగా కనపడదు. మానవ జీవితాల్లో వెనకటి కాలపు విలువలన్నీ హరించిపోయినట్టు కనపడుతుంది. వ్యాపార సంబంధాలతో నిండిపోయిన పెట్టుబడిదారీ సమాజంలో నిలబడి చూసినప్పుడు, వ్యాపార సంబంధాలు అంతగా లేని భూస్వామ్య సమాజం ఎంతో ఉత్తమోత్తమమైనదిగా కనపడుతుంది. ప్రస్తుత ప్రపంచం బొత్తిగా చెడిపోయినట్టు కనపడుతుంది.

ప్రస్తుత ప్రపంచం చెడిపోయివున్న మాట నిజమే. కానీ, వెనకటి దోపిడీ సమాజాలు ఇంత కన్నా చెడిపోయినవే. అక్కడ దీనికన్నా ఉత్తమత్వాలేమీ లేవు. దేని దుష్టత్వాలు దానికి వున్నాయి.

ఇవ్వాళ్టి ప్రపంచం చెడిపోయింది కాబట్టి, మనకు కావలసింది — రేపటి ప్రపంచం! అంతే గానీ, మళ్ళీ నిన్నటి ప్రపంచం కాదు.

బూర్జువా దుష్ట ప్రపంచాన్నించి విముక్తి మార్గం — సమానత్వ ప్రపంచం. శ్రమ దోపిడీని తీసివెయ్యగల కమ్యూనిజం. అంతేగానీ, మళ్ళీ వెనకటి ఫ్యూడల్ ప్రపంచమో, బానిస ప్రపంచమో కాదు.

'చరిత్ర'లో ఈ దశలన్నిటినీ తెలుసుకోగలిగినప్పుడు, 'రామాయణం' లాంటి మత గ్రంధాలు, ఏ దశలో, ఏ లక్ష్యంతో పుట్టుకొచ్చాయో, అవి ఇంకా ఎవరికి సేవ చేస్తున్నాయో, అర్థం చేసుకోగలం. ఈ నాటి పెట్టుబడిదారీ సమాజం కూడా మత గ్రంధాల్ని ఎందుకు నెత్తిన పెట్టుకుంటున్నదో గ్రహించుకోగలం. ఎందుకంటే, ఇది కూడా దోపిడీ సమాజమే కాబట్టి. ప్రజల్ని మూఢ నమ్మకాల్లో నించి కదలనివ్వకుండా చెయ్యడమే దానికి కావాలి. అందుకే పెట్టుబడిదారీ వర్గం, మతాల్నీ, మత సాహిత్యాల్నీ నెత్తిన పెట్టుకుంటుంది. ప్రజల్ని సోషలిజం వేపు తలలు తిప్పకుండా చేసే మార్గాలన్నిటినీ నెత్తిన పెట్టుకుంటుంది.

# ప్రవక్తలూ, సంఘ సంస్కర్తలూ!

ఇప్పటివరకూ చూసిన 'మానవ చరిత్ర'లో, 'శ్రమదోపిడీ' అనేది ఎప్పుడు ప్రారంభమైందో అప్పటినించే 'దుఃఖం' ప్రారంభమైంది. ఆ దుఃఖాన్ని చూసి స్పందించిన దయార్ద్ర హృదయులు కూడా లోకంలో ఎప్పుడూ వున్నారు. కానీ వారు, ఆ దుఃఖంనించి విముక్తి మార్గం చూపించలేక పోయారు.

ఏసుక్రీస్తులూ, బుద్ధులూ మానవ దుఃఖాన్ని అణుమాత్రం కూడా తగ్గించలేకపోయారు. కారణం — ఆ మార్గం వారికి తెలియదు కాబట్టి. అసలు కారణం తెలియకుండా చెప్పిన నీతులు, సమస్యలకు అసలైన పరిష్కారాలు కాలేక పోయాయి. 'ఒక చెంపమీద కొడితే, ఇంకో చెంప చూపించు, ఇతరుల సిరిసంపదలకు అసూయ చెందకు' లాంటి సూక్తులు బాధితులకు విముక్తి మార్గం చూపించలేకపోయాయి.

పేదలపై, ఆర్తులపై, దుఃఖితులపై కరుణ చూపిన ప్రవక్తలు కూడా తమకు తెలియకుండానే ధనిక వర్గానికి అనుకూలమైన నీతులే ప్రబోధించి, బాధితుల్ని నిస్సహాయుల్నీ, ధనవంతుల్నే బలవంతుల్నీ చేశారు. అందుకే ధనిక వర్గాలు, ఈ

ప్రవక్తలకు క్రమంగా సమాజంలో గొప్ప స్థానాలు కల్పించి, వారి సూక్తుల్ని సువర్ణాక్షరాలతో లిఖించి, ప్రజల్లో ప్రచారం చేస్తారు.

ప్రవక్తల తర్వాత స్థానం సంఘ సంస్కర్తలది.

## సంస్కరణ వాదం, మాట్ల విధానమే!

సంఘ సంస్కర్తలు కూడా మానవుల కష్టాలకు అమితంగా చలిస్తారు. తమకు అన్యాయంగా కనపడే విషయాల్ని మార్చాలని తాపత్రయ పడతారు. అయితే, వీరికి సంఘంలో ఎక్కడో ఒక మూల మాత్రమే కొంత అన్యాయం జరుగుతోన్నట్టు తోస్తుంది. ఒక్కో సంస్కర్తకీ ఒక్కో మూల! కొందరు — 'కులాంతర వివాహాలు జరిగితే చాలు, ఇక మానవులకు కష్టాలే ఉండవు' అంటారు, కొందరు —'దేవుడి పూజలు ఆగిపోతే, ఇక ఏ సమస్యా వుండదు' అంటారు. కొందరికి 'స్త్రీ జనోద్ధరణ' ముఖ్యం. కట్నాలివ్వకుండా పెళ్ళిళ్ళు చెయ్యగలిగితే చాలు! లేకపోతే, స్త్రీలు అప్పడాలూ, వొడియాలూ చేసుకుంటూ బతికితే, ఇక స్త్రీలకు ఏ సమస్యా వుండదు. 'అప్పడాల సంస్కరణ' ద్వారానే స్త్రీల పడుపువృత్తీ, పేదరికం, ముష్టితనం అన్నీ నశించిపోతాయి!

కొందరు మేధావి సంస్కర్తలు, పెట్టుబడిదారీ విధానాన్ని పన్నెత్తుమాట అనకుండా, అది సృష్టించే యుద్ధాల్ని సంస్కరించగలం — అనుకుంటారు. అలాగే, కార్మికులకు కొంచెం వేతనాలు పెంచితే, వారి జీవితాలు చక్కబడిపోతాయి — అనుకుంటారు. ఇంకా అలాగే, ప్రభుత్వ పరిపాలనలో అవినీతి కనపడితే, 'మంత్రుల్ని మార్చితే, పరిపాలన నిష్కళంకమవుతుంది' అను కుంటారు. ఉన్న దాంట్లోనే పైపై మార్పులు!

సంస్కర్తలెప్పుడూ సమస్యకి మూలకారణం గురించీ, దాని శాశ్వత పరిష్కారం గురించీ, పట్టించుకోరు. తమకు అలవాటుగా తెలిసిన మార్గాలనే సూచిస్తారు. కానీ, అది ఆ సమస్యకు సరైన పరిష్కారం కాకపోవడం చేత, దానికి కొందరు వ్యక్తులు ప్రభావితులైనా, దానివల్ల సమాజానికేమీ చలనం ఉండదు.

కట్నాల సమస్యనే తీసుకుందాం. ఇది ఎవరికి సమస్య? ఇచ్చే వాళ్ళకే సమస్య. తీసుకునే వాళ్ళకు కాదు. అంటే, ఈ చిన్న సమస్యలో, రెండు వర్గాలున్నాయి. వాటిమధ్య వైరుధ్యం వుంది. ఒక సంస్కర్త బయల్దేరి ఈ వైరుధ్యాన్ని ఏ విధంగా పరిష్కరిస్తాడు? ఈ సమస్యకు పునాది ఏమిటి? స్త్రీలు, పురుషులకు డబ్బు ఎందుకు ఇవ్వవలసి వస్తోంది? ఏం జరిగితే, పెళ్ళిళ్ళు ఆర్థిక సంబంధాల మీద ఆధారపడకుండా జరుగుతాయి?

'కట్న కానుకల'నేవి, 'ఆస్తి' మూలంనించి పుట్టు కొచ్చిన సమస్య. ఆస్తిలేని వర్గాన్ని కూడా ఈ సమస్య పట్టుకుంటుంది. స్వంత ఆస్తి లేకుండా పోవడమే దీనికి పరిష్కారం. ఈ విషయాల్ని ఒక సంస్కర్త చక్కగానే అర్థం చేసుకున్నా, ఆ శాశ్విత పరిష్కారం తక్షణం దొరికేది కాదు కాబట్టి, సంస్కర్త తాత్కాలిక పరిష్కారాల కోసమే ప్రయత్నించవలసి వస్తుంది. "కట్నాలు ఇచ్చి పెళ్ళి చేసుకోవడం స్త్రీకి అవమానం. తీసుకోవడం పురుషుడి నీచత్వం" అని సంస్కర్త మంచి మనసుతోటే ఉపన్యసిస్తాడనుకుందాం. ఆ ఉపన్యాసం విన్న యువకుల్లో ఒకరో ఇద్దరో ఆ మాటలకు ప్రభావితులవుతారు. అలాంటి ఉత్సాహంతో, కట్నాలు లేకుండా పెళ్ళిళ్ళు చేసుకున్నవాళ్ళు పది మంది అయితే, అందులో ఏడెనిమిది మంది యువకులు చాలా తొందరగానే పశ్చాత్తాపంలో పడిపోతారు. జీవితంలో ఇతర ఆర్థిక ఇబ్బందుల వల్ల గాని, ముఖ్యంగా నిరుద్యోగంవల్లగానీ, కట్నం తీసుకోకపోవటం చాలా తెలివితక్కువ పనిగా వారికి తోస్తుంది.

ఈ కట్నాలు తీసుకోని బాపతులో కొందరు

యువకులు నిత్యం భార్యవేపు — "హు, నేను కాబట్టి కట్నం తీసుకోకుండా నిన్ను చేసుకున్నాను. చూడు, ఎంత త్యాగం చేశానో!" అన్నట్టు చూస్తూ వుంటారు. ఇక ఆ దౌర్భాగ్యపు భార్య — "నిజమే నండీ! మీరు చాలా గొప్పవారు. మా చుట్టాల్లో అందరూ మీ గురించి చెప్పుకుంటారు" అని ప్రతీ క్షణం కృతజ్ఞతా భారంతో వొంగివొంగి కొన్నాళ్ళకు గూని కూడా తెచ్చుకుంటుంది. భర్త వినే టట్టు, పని మనిషికో, పక్కింటి పిన్నిగారికో, రెండు పూటలా — "మా ఆయన కట్నం తీసుకో లేదు సుమా!" అని చెప్పి, ఆ విశాల హృదయుణ్ణి సంతోషపెడుతూనే వుంటుంది. ఒక సమస్యని పరిష్కరించడం, ఇలా ఇతర సమస్యల్నీ ఇతర సంఘర్షణల్నీ సృష్టించడం కోసమా?

సంస్కర్తలవల్ల ప్రభావితులై కట్నాల్ని నిజంగా అసహ్యించుకునే యువకులు కూడా తప్పకుండా ఉంటారు. అయితే, అది కూడా ఆ సమస్యకు నిజ మైన పరిష్కారం కాదు. కట్నం తీసుకోవడంగానీ, తీసుకోకపోవడం గానీ, పురుషుడి ఇష్టాయిష్టాల మీద ఆధారపడి వుంటుంది కాబట్టి, అది పరి ష్కారం కాదు. ఒక పురుషుడు, కట్నం తీసుకోవా లని ఆశించినా తీసుకోలేని పరిస్తితి వుండాలి. సమాజంలోనే ఆ సాంప్రదాయం లేకుండా వుండాలి. అదీ పరిష్కారం.

వరకట్నాలూ, స్త్రీల దాస్యం, పేదరికం, వేశ్యా వృత్తీ, ముష్టితనం, మతమౌఢ్యం, కులభేదాలూ — ఇవన్నీ సమాజానికి వేరువేరు సమస్యలు కావు. ఈ కురుపులన్నీ ఒకే జబ్బునించి పుట్టినవే. వాటికి వైద్యం (పరిష్కారం) వేరు వేరుగా ఉండదు.

ఏదో ఒక జబ్బు గురించి ఆలోచించండి! 'ఫ్లూ' జ్వరాన్ని తీసుకోండి. దాంతోపాటు చలీ, తలనొప్పీ, కాళ్ళనొప్పులూ, చేతుల నొప్పులూ, పళ్ళపోటూ లాంటి లక్షణాలెన్నో వస్తాయి. తల నొప్పి సంస్కర్త — "తల నొప్పి ఒక్కటీ తగ్గిస్తే చాలు, మనిషి నిక్షేపంలా లేచి తిరుగుతాడు" అని వాదిస్తాడు. పళ్ళపోటు సంస్కర్త — "ముందు పళ్ళ పోటు తగ్గించాలి. దాంతో అన్నీ సర్దుకుంటాయి" అని తర్కిస్తాడు. కొందరు సంస్కర్తలు —కాళ్ళ నొప్పులవేపూ, కొందరు — చేతుల నొప్పులవేపూ మొగ్గుతారు. కొందరు చలి వేపూ! 'అసలు జబ్బు'ని తగ్గించాలని గ్రహించే వ్యక్తి పూర్తి జ్ఞానంగల వైద్యుడు అవుతాడు. ఒక మూల కాస్త ఉపశమనం కలిగించే సంస్కర్త, అలాంటి వైద్యుడు కాలేడు.

సమాజంలో ఒకే కారణంలోంచి పుట్టిన సమస్యల్ని సంస్కర్తలు దేనికి దాన్ని విడదీసి చూస్తారు. కుల నిర్మూలనని కోరే సంస్కర్త, స్త్రీల సమస్యలు పట్టించుకోడు. నాస్తికత్వం ప్రచారం చేసే సంస్కర్త, రాజకీయాల వేపు కన్నెత్తి చూడడు. వీటన్నిటి మధ్యా ఒక సమన్వయం వుందనీ, అన్నిటికీ విడరాని బంధం వుందనీ, సంస్కర్తలు గమనించనే గమనించరు. ఈ పరిస్థితి ఎంత హాస్యాస్పదం అంటే "శరీర ఆరోగ్యం గోల నాకెందుకు, ఈ వేలు ఒక్కటీ బలిస్తే చాలు" అన్నట్టు వుంటుంది. శరీరారోగ్యంతో సంబంధం లేకుండా వేలుని వొక్కదాన్నీ బలిపించడం ఎంత అసాధ్యమో, సమాజంలో ఎంత చిన్న సమస్యని అయినా సమాజాభివృద్ధినించి విడదీసి పరిష్క రించడం అంత అసాధ్యం. సమాజం గురించి సరైన అవగాహన లేని వ్యక్తులే సంస్కరణ వాదంతో సమాజానికేదో చెయ్యగలం అను కుంటారు. అందుకే, సమాజాన్నీ, సంస్కర్తల్నీ, ఏనుగుతోటీ ఏనుగుని వర్ణించే గుడ్డివాళ్ళతోటీ పోల్చవచ్చు.

ఒక కథలో — ఏనుగుని మొత్తంగా చూడలేని గుడ్డివాళ్ళు, దాన్ని అక్కడక్కడా తడిమి చూసి, తమ చేతికి తగిలిన అవయవాల్ని మాత్రమే పూర్తి ఏనుగు అనుకుంటారు. ఏనుగు తొండాన్ని తడిమి చూసిన గుడ్డివాడు, "ఏనుగంటే నాకు తెలీదా? మెత్తగా, పొడుగ్గా వుంటుంది" అంటాడు. ఏనుగు

చెవిని తడిమిన గుడ్డివాడు, "ఏనుగంటే మెత్తగా పొడుగ్గా వుండదు, వెడల్పుగా చేటలాగ వుంటుంది" అంటాడు. ఏనుగు కాలుని తడిమిన గుడ్డివాడు, "ఏనుగు పొడుగ్గానూ వుండదు, వెడల్పుగానూ వుండదు. గుండ్రంగా స్తంభంలాగ వుంటుంది" అంటాడు. ఏనుగు తోకని తడిమిన నాలుగో గుడ్డివాడు, "అసలు మీకెవ్వరికీ ఏనుగు గురించి తెలీదు. ఏనుగు సన్నగా చీపురు పుల్లలాగ వుంటుంది" అని వాదిస్తాడు. ఈ రకంగా, మొత్తం ఏనుగుని చూడలేని ఈ గుడ్డి వాళ్ళకన్నా, మొత్తం సమాజ స్వరూపాన్ని చూడ లేని సంస్కర్తలు, ఎక్కువ జ్ఞానులేమీ కారు.

సమాజంలో వున్న లోపాలకు, సంస్కర్తలు చూపించే పరిష్కారాలు కన్నాల గిన్నెలకు మాట్లు వెయ్యడం లాంటివి మాత్రమే. ఒక రకంగా చూస్తే, మాట్లవాళ్ళే నయం. తమకు డబ్బు లొస్తాయని ప్రతీ గిన్నికీ అడుగంతా తీసెయ్యాలని వాదిస్తూ వుంటారు. సంస్కర్తలు ఆ మాత్రం తిరగుబాటు కూడా ప్రదర్శించరు. అంగుళం వరకో, అంగుళంన్నర వరకో మార్పు చాలం టారు.

ఒక రచయిత, తన కథలో, పేదల బాధలు తెగ వర్ణించి, పాఠకులతో కన్నీళ్ళు కార్పించి, చివరికి, ఆ పేదలు దేవుణ్ణి పూజించడంవల్ల దేవుడి దయతో కష్టాలనించి బైటపడ్డారని కథని ముగించాడనుకుందాం. ఆ రచయిత, శ్రమ దోపిడీ గురించి తెలియకనే అలా చెప్పి వుంటే, అతను నిర్దోషే. కానీ అతను ఎంత నిర్దోషి అయినా, అతను చెప్పింది పేదల్ని దారి తప్పించ డానికీ, ధనికులకు మేలు చెయ్యడానికీ, ఉపయోగ పడుతుంది.

ఒక ఫ్యాక్టరీ యజమాని గొప్ప మానవత్వం గలవాడనీ, తన కార్మికుల్ని కన్నబిడ్డలవలే చూసు కుంటాడనీ, చివరికి తన ఆస్తినంతా కార్మికులకే పంచి ఇచ్చేశాడనీ, ఒక కథ, చెప్పిందనుకుందాం. ఆ కథ, కార్మిక ప్రజలకు యజమానుల మీద భ్రమలు కల్పించి, వారిని దారి తప్పిస్తుంది.

'దశరథ మహారాజు ప్రజల్ని కన్నబిడ్డల వలే పరిపాలించాడు!'

'శ్రీరామ చంద్రుడు, ప్రజల్ని సుభిక్షంగా పాలించాడు!'

ఇలాంటి కథలు, ప్రజల్ని వందల, వేల సంవత్సరాల నించీ ఈ నాటికీ అజ్ఞానంలో పడేసి ఉంచుతున్నాయి.

పిచ్చివాడు, తన చేతిలో కత్తితో ఇంకో మని షిని పొడిస్తే, వాడు ఆ పని తెలిసి చేసినా తెలియక చేసినా, ఆ కత్తి, దాని పని అది చెయ్యకమానదు. అలాగే, కవి చేతిలో కలం కూడా అదే పని చేస్తుంది. అది, నిజాలూ చెప్పవచ్చు; అబద్ధాలూ చెప్పవచ్చు. నిజం చెప్తే, బాధలు పడే వాళ్ళకు మేలు. అబద్ధం చెప్తే, బాధలు పెట్టేవాళ్ళకు మేలు.

కొందరు రచయితలు, 'పేదతనమే ఉత్త మోత్తమ జీవితం' అయినట్టు దాన్ని వర్ణిస్తారు. వారి ప్రకారం — పేదవారు నిర్మలత్వంతో, నిరా డంబరత్వంతో వెలిగిపోతూ వుంటారు. పేదల ఆత్మలు శాంతితో, ఆనందంతో పొంగిపోతూ వుంటాయి. ఆ వర్ణనలు చూస్తే, "అబ్బా! పేదలు ఎంత భాగ్యవంతులు! అలా బిచ్చమెత్తు కుంటూ గుడిసెల్లో జీవించడం ఎంత అదృష్టం!" అని పేద రికం మీద ఎంతో ఆశ కలుగుతుంది.

పేదరికాన్ని సినిమాల్లో చూసినప్పుడు, దాని మీద చెప్పలేనంత ఆకర్షణ కలుగుతుంది.

పేదరికపు దుర్భరత్వాన్ని సుఖ సంతోషాలిచ్చే పరిస్తితిగా వర్ణించడం అంటే, అది పేద వర్గానికి ఎంత ద్రోహం!

కూలి వాడల్లో 'పారిశుద్ధ్య' ప్రచారం చేసే సంస్కర్తలు, ఇస్త్రీ బట్టలు వేసుకొచ్చి, కూలి స్త్రీలతో చేసే సంభాషణ ఇలా వుంటుంది:

"పిల్లల్ని పరిశుభ్రంగా పెంచాలమ్మా!"

కూలి స్త్రీల అయోమయం చూపులు!

"గుడిసెల చుట్టూ ఈ మురికి కాలువలూ, ఈ పందులూ, ఈ బురదా ఇవన్నీ ఏమిటి? పిల్లలకి ఈ మురికిలో ఆడితే చాలా జబ్బులొస్తాయి."

"మరి ఎక్కడ ఆడుకుంటారు?"

సంస్కర్తకి జవాబు తోచదు. పిల్లలు మురికిలో ఆడకూడదని తెలుసుగానీ, మరి ఎక్కడ ఆడాలని చెప్పాలో తెలీదు. చక్కని గాలీ వెలుతురూ వచ్చే ఇళ్ళూ, మురుగుపోయే పద్ధతులూ, చుట్టూ విశాలమైన స్థలాలూ, అన్నీ అందరికీ వుండాలని సంస్కర్తకి తెలీదు. 'అయినా పేద పిల్లలకు కూడా ఆటలేమిటి?' అన్నట్టు చూస్తాడు. వాళ్ళు ఎక్కడ ఆడాలో చెప్పడం మానేసి, దుమ్ము పూసుకుని తన చుట్టూ మూగుతోన్న పిల్లల్ని తప్పించుకుని దూరం దూరంగా జరుగుతూ, "రెండు పూటలా సబ్బుతో తోమి పిల్లలకి శుభ్రంగా స్నానం చేయించాలమ్మా! బట్టలు మార్చాలమ్మా!"

పిల్లలూ, తల్లులూ తెల్ల మొహాలు!.

సబ్బు! స్నానం! రెండు పూటలా స్నానాలు! రెండు పూటలా బట్టలు మార్చటాలు! ఏం మాటలో అయ్యి!

ఎవరన్నా సబ్బు మొహం తెలిసినామె, ఆశ్చర్యంగా, "మా కాడ సబ్బేదీ?" అంటే, మిగతా వాళ్ళు, "అసలు నీళ్ళెయ్యీ?" అంటారు.

ఈ సారి సంస్కర్త తెల్లబోతాడు. ఏం చోద్యం వీళ్ళ మాటలూ! సబ్బుండదా? నీళ్ళన్నా వుండవా? వాళ్ళకి ఏం వుంటాయో ఏం వుండవో తెలిస్తే, అతను 'సంస్కర్త' ఎందుకవుతాడు? 'విప్లవకారుడే' అయ్యేవాడు!

ఆయన చివరికి మళ్ళీ — "పిల్లల్ని సుభ్రంగా పెంచాలమ్మా" అని బోధించి, ఆ నిరాశలో ఒక గొప్ప వ్యాసం రాస్తాడు! "కూలివాడల్లో దుర్గంధం కన్నా, కూలి స్త్రీలలో మూర్ఖత్వం, అజ్ఞానం, అధికంగా వున్నాయి. వారికి వెంటనే రాత్రి పాఠశాలలు పెట్టి చదువుచెప్పే ఏర్పాట్లు చెయ్యాలి ప్రభుత్వం" — అదీ ఆయన కని పెట్టింది! సంస్కర్తలు ఈ స్థాయిని మించి ఎదగరు. లేదా, ఈ స్థాయిలో ఆగిపోయినవారే సంస్కర్తలు!

ఈ సంస్కర్తల్లో, రచయితల్లో, అందరూ ధనికవర్గం వారై వుండరు. చాలామంది శ్రామికవర్గంలోనే, మేధావి సెక్షన్లకు చెందినవారై వుంటారు. కానీ వీరికి 'వర్గ భేదాల' గురించి ఏమాత్రమూ తెలీదు. వారి జీవితాల గురించే వారికి తెలీదు. ధనిక వర్గం, వేల సంవత్సరాల నించీ బోధిస్తూ వున్న సిద్ధాంతాలనే నమ్ముతూ, వాటినే జీర్ణించుకుని, వాటినే గౌరవిస్తూ, వాటినే తమ కళల ద్వారా, మళ్ళీ మళ్ళీ ప్రచారం చేస్తూ, తమకు తెలియకుండా ధనిక వర్గానికే, సేవచేస్తూ వుంటారు. ఆ రకంగా తమకు తాము హాని చేసుకుంటూ వుంటారు!

# మళ్ళీ 'రామాయణం' గురించి

**ఈ** 'పీఠిక'లో, మొదట 'రామాయణం' గురించి కొంచెం చూసి, దాన్ని ఆపి, మానవ సమాజ క్రమాన్ని కొంచెంగా చూశాం. ఎందుకంటే, ఆ క్రమం తెలిస్తేనే, ఈ కథ ప్రచారం చేసే విలువలు ఏ వర్గానికి అనుకూలమో, ఏ వర్గానికి వ్యతిరేకమో — అర్థం చేసుకోగలం. అందుకే చరిత్ర క్రమాన్ని చూశాం. ఇప్పుడు మళ్ళీ రామాయణం గురించే చెప్పుకోవాలి.

## కల్పనా - వాస్తవం

'రామాయణం' కథలో ఉన్నది — మనుషులే కాదు, దేవతలూ రాక్షసులూ వానరులూ

యక్షులూ గంధర్వులూ నాగులూ కిన్నెరలూ కింపురుషులూ — ఇలా అనేక రకాల వాళ్ళు వుంటారు.

మనుషుల సంగతి సరే. రాక్షసులైతే రెండేసి తలలూ, మూడేసి తలలూ, పదేసి తలలూ, ఎద్దు మొహాలూ, గాడిద మొహాలూ, కుక్క మొహాలూ నక్క మొహాలూ — ఇలా నానా వికారాలతో వుంటారు. వీళ్ళు కామ రూపులు. అంటే కోరిన రూపంలోకి మారగలరు. (అయినా వికార రూపాల్లోనే వుంటారు!)

వానరులకు తోకలు వుంటాయి. (పురుషులకే. స్త్రీలకు తోకలు వున్నట్టు కవి ఎక్కడా చెప్పలేదు. కవి చేసిన మంచి పనుల్లో ఇది ఒకటి!)

మిగిలిన వాళ్ళందరూ దేవతలే. వాళ్ళు మహా సౌందర్యవంతులు. ఎప్పుడూ ఎగురుతూ దూకుతూ పాడుతూ తిరుగుతూ వుంటారు.

ఈ రాక్షసులూ, వానరులూ, దేవతలూ వుంటారని, ఇదంతా నమ్ముతున్న వాళ్ళు ఇప్పటికీ వున్నారు. పామరులు కాదు. పండితులే. పామర పండితులు!

ఇంతకీ, ఈ వానరులూ, రాక్షసులూ, దేవతలూ — వీరంతా ఎవరు? ప్రకృతిలో ఇలాంటి జీవులు ఉన్నారా? దీనిమీద పరిశోధన ఇవ్వాళ అక్కరలేదు. ఇదంతా కవుల కల్పనా చాతుర్యం! వెనకటి కాలంలో కథల్ని ఇలాంటి కల్పనలతో (మైతాలజీ పద్ధతిలో) చెప్పుకునేవారు. నిజ జీవితాల్లో జరగడానికి సాధ్యంకాని విషయాలతో, ఆశలతో, కథల్ని సృష్టించుకునేవారు. ఇలాంటి కథలు, దేవుళ్ళ మహిమలూ వరాలూ శాపాలూ వంటి అభూత కల్పనలతో నిండిపోయి వుంటాయి. అయినప్పటికీ ఆ కథల్లోనే సాంఘిక జీవిత సారాంశం కూడా వుంటుంది. మనకు కావలసింది ఆ రచనా విధానం కాదు, ఆ సాంఘిక సారాంశమే.

కథలో వుండే ప్రతీ కల్పననీ మనం వాస్తవంలోకి మార్చేసుకోవాలి. అలా మార్చేసుకుంటే, రాక్షసులూ వానరులూ దేవతలూ యక్షులూ గిక్షులూ అందరూ — మానవులే. అందరూ ఒకే శరీర ధర్మాలు కలవారే.

జాంబవంతుడు ఎలుగ్గొడ్డు. ఆయన కూతురు జాంబవతి. ఆమెని మానవుడైన శ్రీకృష్ణుడు పెళ్ళి చేసుకున్నాడు! (ఇది, రామాయణంలో కథ కాదు.)

అంజన వానర స్త్రీ. వాయుదేవుడు దేవత. వీరిద్దరికీ హనుమంతుడు పుట్టాడు.

అలాగే వాలి ఇంద్రుడికీ, సుగ్రీవుడు సూర్యుడికీ పుట్టారు. భీముడికీ, హిడింబి అనే రాక్షస స్త్రీకీ ఘటోత్కచుడు పుట్టాడు. అర్జునుడికీ, ఉలూచి అనే నాగస్త్రీకీ ఇలావంతుడు పుట్టాడు. (వానర స్త్రీకీ, దేవతా పురుషుడికీ పుట్టిన హనుమంతుడు, తల్లిలాగే వానరుడయ్యాడు. రాక్షస స్త్రీకీ, మానవుడికీ పుట్టిన ఘటోత్కచుడు, తల్లిలాగే రాక్షసుడయ్యాడు. నాగస్త్రీకీ, మానవుడికీ పుట్టిన ఇలావంతుడు తల్లిలాగే నాగుడయ్యాడు. ఇలాంటి కథల్ని, గణ వ్యవస్థలో పిల్లలు, తల్లి గణానికి చెందడం — అనే విషయంతో పోల్చుకోవచ్చును. ఈ పిల్లలు, తండ్రుల దగ్గిర గాక తల్లుల దగ్గిరే వున్నారు.)

రాక్షస స్త్రీ అయిన శూర్పణఖ, మానవుడైన రాముణ్ణి పెళ్ళి చేసుకోమని కోరుతుంది. రాక్షసుడైన రావణుడు, మానవ స్త్రీ అయిన సీతని పెళ్ళి చేసుకోమని కోరతాడు. — ఈ రకంగా వందల కొద్దీ ఉదాహరణలు చూడవొచ్చు. వీటివల్ల — మానవులకూ, వానరులకూ; వానరులకూ, దేవతలకూ; దేవతలకూ, రాక్షసులకూ; రాక్షసులకూ, మానవులకూ; ఎటునించి ఎటు చూసినా, అందరికీ మధ్య చాలా సహజమైన శరీర సంబంధాలున్నాయనే విషయం అర్థమవుతుంది.

మనిషికీ కోతికీ, కోతికీ పక్షికీ, పక్షికీ పాముకీ, పాముకీ మనిషికీ — శరీర సంబంధాలుండడం, పిల్లలు పుట్టడం, సాధ్యంకాదు గదా?

"ఇప్పుడు సాధ్యంకాదు గానీ, ఆ రోజుల్లో సాధ్యమేనేమో!" అని ఊగిసలాడతారు కొందరు, అమాయకంగానే. కానీ, 'ఆ రోజులూ — ఈ రోజులూ' అనే తేడా సమాజ విషయాలలోనేగానీ, ప్రకృతి ధర్మాలలో కాదు. పక్షికీ మనిషికీ పిల్లలు పుట్టడం, ఆ రోజుల్లోనూ జరగదు, ఈ రోజుల్లోనూ జరగదు, ఏ రోజుల్లోనూ జరగదు.

దీన్నిబట్టి, రాక్షసులూ, వానరులూ, దేవతలూ, నాగులూ, యక్షులూ, గంధర్వులూ, అందరూ మానవులేనని అర్థం. అందరూ వేరే వేరే జాతులవారో, తెగలవారో, దూర దూర ప్రదేశాల వారో అయి వుంటారు — అనుకోవాలి. ఈ తెగల పేర్లన్నీ ప్రకృతిలో వుండే పక్షుల పేర్లూ, జంతువుల పేర్లూ, వృక్షాల పేర్లూ — లాంటివే.

రాముడి జాతికీ, రావణుడి జాతికీ, భూముల కోసం బద్ధ శతృత్వం వుంది.

రాముడి జాతికీ, ఇతర జాతులకూ అంత స్పష్టమైన శతృత్వం లేదు. రామాయణ కవి (వాల్మీకి) — రాముడి పక్షంవాడు. రాముడు రక్షించే సాంప్రదాయాలవేపూ, సమాజ ధర్మాల వేపూ నిలబడ్డవాడు.

'రామాయణం'లో, కవి, రాక్షసజాతి వారిని మహావికృతమైన వారిగా, మహాదుర్మార్గులుగా, చిత్రించాడు. వానరుల్ని కూడా వికృతంగానే చిత్రించి, కొన్ని సందర్భాల్లో పరిహాసాలు కూడా చేశాడు. ఎటువంటి విమర్శా లేకుండా, చాలా గౌరవంతో, భక్తితో చూసింది, రాముడి వంశం వారిని మాత్రమే.

ఈ 'విషవృక్షం' కథల్లో అందరూ మానవులే. దీనివల్ల కథలో తేడా ఏమీ రాదు. ఎందుకంటే, తోక వున్న హనుమంతుడు 'వాల్మీకి రామాయణం'లో ఎలాంటి పాత్ర నిర్వహిస్తాడో, మానవుడైన హనుమంతుడు విషవృక్షం కథల్లో, అదేరకం పాత్ర నిర్వహిస్తాడు. పది తలల రావణుడు ఎలా ప్రవర్తిస్తాడో, మానవుడైన రావణుడు కూడా అలాగే ప్రవర్తిస్తాడు. ఈ 'విషవృక్షం'లో — అసలు కథని గానీ, పాత్రల నడకని గానీ, వారి స్వభావాల్ని గానీ మార్చిందేమీ లేదు. కాబట్టి ఇందులో ఏదీ వాల్మీకికి విరుద్ధం కాదు.

## 'శాస్త్రజ్ఞానం' అంటే ఏమిటి?

వాల్మీకి కల్పన ప్రకారం — మారీచుడు రాక్షసుడు. ఏ రూపంలోకి కావాలంటే ఆ రూపంలోకి మారిపోగలడు. రావణుడి ఆజ్ఞవల్ల చాలా అందమైన లేడిగా అయ్యాడు!

జటాయువు — పక్షి, హనుమంతుడు — కోతి. అయినా చక్కగా మాట్లాడతారు.

రాత్రులు వెన్నెల్లో పడుకుని ఇలాంటి కథలు చిన్న పిల్లలకు చెపుతాం. వాటి సహజాసహజాల గురించి వాళ్ళేమీ ప్రశ్నలు వెయ్యరు. పక్షి ఎలా మాట్లాడుతుంది? కోతి ఎలా మాట్లాడుతుంది? మనం చూసే పక్షులన్నీ అరుస్తాయిగానీ మాట్లాడవేం? — అని పిల్లలు ప్రశ్నించరు. పిల్లల మెదడు బాల్యావస్థలోనే వుంటుంది. దానికి, ఆలోచించే, తర్కించే శక్తి అంతగా వుండదు. వారికి లోకజ్ఞానం కూడా వుండదు. కాబట్టి పిల్లలు తర్కించకుండా, చాలా సరదాగా, ఆనందంగా, ఏది చెప్తే అది వింటారు. కథలో ఉన్న దాన్ని ఉన్నట్టు నమ్ముతారు.

పెద్దవాళ్ళు కూడా ఈ కథల్ని చిన్న పిల్లలు నమ్మినట్టే నమ్మితే, వారు కూడా చిన్న పిల్లల దశలో వున్నట్టే కదా? కానీ, పెద్దవారికి, చిన్న పిల్లలకు లేని లోకజ్ఞానం వుంటుంది. వారు నిత్యమూ చూసే లోకంలో కోతులు మాట్లాడవని తెలుసు. అయినా, ఈ కథలు విన్నప్పుడు, 'వెన

కటి రోజుల్లో కోతులు మాట్లాడేవ'నే నమ్ముతారు. అంటే, ఒక విషయం అర్థం చేసుకోవడానికి 'లోకజ్ఞానం' సరిపోదన్నమాట! 'కోతులు మాట్లాడడం అసహజం. అసలు అది ప్రకృతిలో జరగడానికి సాధ్యం కాదు' అని తెలియాలంటే, కోతి శరీర నిర్మాణమూ, మనిషి శరీర నిర్మాణమూ, రెండూ తెలియాలి. మనుషులు ఎందుకు మాట్లాడగలరో, జంతువులూ పక్షులూ ఎందుకు మాట్లాడలేవో, శరీర నిర్మాణాల ద్వారా కారణాలు తెలియాలి. ఈ రకంగా ఒక విషయానికి సంబంధించిన 'అసలు కారణాలు' తెలియడమే 'శాస్త్రజ్ఞానం.' ఇది, ప్రకృతికి సంబంధించిన శాస్త్రజ్ఞానం.

జరగడానికి సాధ్యంకాని ఒక విషయాన్ని, అది జరుగుతుందని మనం ఎంత గాఢంగా నమ్మినా, అది జరగదు. చీకట్లో తాడుని చూసి పాము అనుకుని ఎంత గాఢంగా నమ్మినా, ఆ తాడు, పాముగా మారదు. దానికి ఎవరి నమ్మకాలతోటీ, ఊహలతోటీ, కల్పనలతోటీ, కవిత్వాలతోటీ, సంబంధం వుండదు. తాడు తాడుగానే వుంటుంది. అయితే, అసలు నిజం గ్రహించడానికి చిన్న దీపం తెచ్చుకుంటే చాలు. కానీ, అన్ని విషయాలూ ఇంత తేలిగ్గా అర్థం చేసుకోటానికి వీలుండదు. 'భూమి బల్లలా లేదు, గుండ్రంగా వుంది' అనే విషయం అర్థం చేసుకోవటం తేలిక కాదు. ఎందుకంటే — భూమి బల్లలా వుండడమే మనకు కనపడుతోంది. ఇది లోకజ్ఞానం. భూమి గుండ్రంగా వుండడం కళ్ళకు కనబడే విషయం కాదు. అది లోకజ్ఞానం కాదు. అంటే, భూమి ఎలా వుందో 'అసలు విషయం' గ్రహించడానికి లోకజ్ఞానం సరిపోదు. భూమి ఒక బ్రహ్మాండమైన బంతి అనీ, అది ఒక ఖాళీలో గిరగిరా తిరుగుతోందనీ, అర్థం చేసుకోవాలంటే, కొంత ఊహాశక్తి కావాలి. ఇంకా అనేక విషయాలు తెలియాలి.

"భూమి గుండ్రంగా వుంటుంది. నేను చెప్పాను, నమ్ము" అంటే నమ్మడానికి వీలుండదు. ఎవరికి వారికే స్వతంత్రమైన ఆలోచన కావాలి. సూర్యుడికీ, భూమికీ వున్న సంబంధం తెలియాలి. రాత్రీ, పగలూ ఏర్పడడం అనే సత్యంతో, భూమి గుండ్రనితనాన్నీ, భూమి తిరగడాన్నీ రుజువు చేసుకోవాలి. అప్పుడు గానీ, భూమి గుండ్రంగా వుందనే విషయం అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అలాగే, ప్రకృతిలో ఇంకే విషయాన్ని అర్థం చేసుకోవటానికైనా సామాన్య లోకజ్ఞానం చాలదు. 'శాస్త్రజ్ఞానం' కావాలి.

కోడిగుడ్డు కోడిపిల్లగా మారుతుంది గానీ, రాయి కోడిపిల్లగా మారదు. ఎందుచేత? — కోడిపిల్లకి కావలసిన అనుకూల పరిస్థితులు కోడిగుడ్డులోనే వున్నాయి, రాయిలో లేవు. కాబట్టీ రాయి కోడిపిల్లగా మారదు. కోడిపిల్లగానే కాదు, తన ధర్మాలకు విరుద్ధమైన ఏ ఇతర పదార్థంగా కూడా మారదు. ఏ దేవుళ్ళో, రుషులో, మాంత్రికులో, గొప్ప మహిమలతో, తపశ్శక్తులతో, రాయిని పువ్వుగానో, పిట్టగానో, మిఠాయి ఉండగానో మార్చడం చెయ్యలేరు. అది నూటికి నూరుపాళ్ళూ అసాధ్యం. అసలు దేవుళ్ళూ, రుషులూ, ప్రకృతి విరుద్ధమైన కార్యాలు చెయ్యగలిగే మహిమల్నీ, తపశ్శక్తుల్నీ సంపాదించడం అనేదే అసహజమైన విషయం. అంటే, ముందు దేవుళ్ళే అసహజం. ఆ దేవుళ్ళని నమ్మి రుషులు తపస్సులు చేస్తారు. వారు ఏ విద్యలైనా సాధించగలిగితే, అవి ప్రకృతిలో జరగడానికి వీలైనవే అయివుంటాయి. అవి, మిగిలిన మానవులకు తెలియనివి కావచ్చు. అంతేగానీ, ప్రకృతి విరుద్ధమైన కార్యాలు మాత్రం ఏ రుషులూ చెయ్యలేరు.

మానవులు ఎన్నో వేల సంవత్సరాలు ఎన్నో అసహజత్వాలతో కట్టు కథలు (మైథాలజీ) సృష్టించుకున్నారు. వాటినే ఆరాధించారు.

'మానవ చరిత్ర'ని భౌతిక దృష్టితో చూసే జ్ఞానాన్ని సమాజానికి నేర్పిన **మార్క్సు**, ఈ విషయం గురించి ఏమంటున్నాడో చూడండి!

> "కల్పిత గాథలన్నీ (మైథాలజీ), తమ ఊహలలో 'ప్రకృతి శక్తుల్ని' జయిస్తాయి. ఊహలలో, ప్రకృతి శక్తుల మీద ఆధిపత్యం వహిస్తాయి. ఊహలలో, ప్రకృతినంతా తమకు ఇష్టమైనట్టు మార్చేసుకుంటాయి. మానవులు, ఊహల్లో మాత్రమే గాకుండా, నిజంగానే ప్రకృతి శక్తుల్ని జయించగలిగి నప్పుడు, ఈ కల్పనలన్నీ ఎక్కడి వక్కడ అంత రించిపోతాయి." ('ఏ కాంట్రి బ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ'. పేజీ 216. ప్రచురణ: ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో 1970.)

కట్టు కథలు చదివి, "ఆc, ఏదో మూర్ఖులు అలా రాసేశారు" అనుకున్నామంటే, వెనకటి సమాజంలో కట్టు కథల సృష్టికి కారణం గ్రహించ లేకపోతున్నామన్న మాట. ఒక కథలో, కథా నాయకుడు పక్షి అయిపోయి ఆకాశంలో ప్రయాణం చేస్తాడు. లేదా, పక్షి మీద కూర్చుని సుఖంగా తిరుగుతాడు. అది ఆనాటి మానవులకు చాలా సంతోషం. వాస్తవంలో చెయ్యలేని పని చేస్తున్నామనే సంతోషం. మన విష్ణుమూర్తి పక్షుల మీదే తిరుగుతాడు. కట్టు కథలకు ఈ దేశం ఆ దేశం అనే తేడా లేదు. అన్నిచోట్లా ప్రాచీన మాన వులు ప్రకృతిని జయించినట్టే కథలు రాసు కున్నారు. మన రాముడు, కోపం వచ్చినప్పుడల్లా సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ 'పడగొట్టేస్తా, పడగొట్టేస్తా' అంటాడు (ఒక్కసారీ పడగొట్టలేదనుకోండీ!)

ప్రాచీన చైనా పురాణాల్లో, చక్కగా ఒక వీరుడేం చేశాడో తెలుసా? అప్పుడు ఆకాశం మీద 10 మంది సూర్యుళ్ళు ఉండేవారు. ఆ వేడికి భూమిమీద పచ్చదనం అంతా హరించిపోయేది. చైనా రాజుగారికి కోపం వొచ్చేసింది. 'ఈ' అనే గొప్ప విలుకాణ్ణి పిలిచి — "సూర్యుళ్ళని పడ గొట్టెయ్యి" అన్నాడు. అప్పుడు 'ఈ', తొమ్మిది మంది సూర్యుళ్ళని పడగొట్టేసి, "లోకం బొత్తిగా చీకటైపోతుందిలే" అని ఒక్క సూర్యుణ్ణి ఉండ నిచ్చాడు. ఆ చైనా వీరుడు, అంత సాహసంతో సూర్యుళ్ళని పడగొట్టకపోతే, ఈ పాటికి లోకాలు భస్మమైపోయి వుండేవే!

మన హనుమంతుడు పర్వతం అంత పెద్ద వాడిగానూ, పిల్లి అంత చిన్నవాడిగానూ కూడా అయి పోగలడు. కానీ, సన్ అంత వూ కుంగ్ అనే చైనా వానరుడైతే, మనిషిగా, చెట్టుగా, కొండగా, పాముగా, పిట్టగా, పువ్వుగా, మొత్తం 72 రూపా ల్లోకి మారిపోగలడు. 73 రూపాల్లోకి మారే వీరుడెవ్వడూ లేకపోవడం చేత ఈయన్ని ఎవరూ జయించలేకపోయారు.

మన జటాయువూ, సంపాతీ, హను మంతుడూ సూర్యుడి దగ్గిరికి వెళ్ళాలని సరదాపడి మధ్యలోనే కిందపడ్డారుగానీ, కువావూ అనే ఇంకో చైనా వీరుడు, సూర్యుడితో "నువ్వు తొంద రగా నడుస్తావో, నేను తొందరగా నడుస్తానో" అని పందెంవేసి, సూర్యుణ్ణే ఓడించేశాడు! సూర్యుడే నడవలేక వెనకబడిపోయాడు. ఈ చైనా వీరుళ్ళు భలేగా ఉన్నారు కదూ?

ఈ నాడు మానవులు భూమిమీదా, నీటి లోనూ, ఆకాశంలోనూ, అన్ని మార్గాల్లోనూ ప్రయాణాలు చెయ్యగలరు. ఇప్పుడు మనకు నదుల్లో మునిగి పాతాళానికి పోయే నాగకన్యల మీదో, ఆకాశంలో ఎగిరి స్వర్గానికి పోయే రెక్కల దేవతలమీదో పూర్వం ఉన్నంత ఆసక్తి వుండదు. (ఆ కథలు, ఇప్పుడూ ఎప్పుడూ చాలా సరదాగా ఉంటాయి. అంతవరకే.) ఈనాడు, 'మాయ తివాచీలు' ఎక్కాలని కలలు కనం. విమానాలు ఎక్కాలని కోరుకుంటాం. రాకెట్‌తో చంద్రుడి

దగ్గిరికి పోవాలని ఆశ పడతాం. అంటే, మన ఆలోచనలు 'కల్పన'ని వదిలి (మాయ తివాచీల్నీ, కీలు గుర్రాల్నీ వదిలి), జరగడానికి వీలున్న వాస్తవ స్థితికి వస్తున్నాయి. కొంతయినా శాస్త్రీయ దృక్పథం ఏర్పడుతోంది. కానీ, అది ఇంకా చాలా తక్కువ కోణాల్లో మాత్రమే.

శాస్త్రజ్ఞానం ఎరగని మానవులు, వర్షాలు లేక, నదులు ఎండి, జీవితాలు దుర్భరం అయిపోయి నప్పుడు, ఊహలలో వర్షాలు కురిపించుకుని సంతోషపడతారు. ఆ ఊహలే 'కథ'రూపం ధరి స్తాయి. ఆ కథలో మహర్షికి సమస్త శక్తులూ ఉంటాయి. ప్రజలందరూ ఆయన్ని వర్షాలు కురి పించమని ప్రార్థిస్తారు. రుషిగారు గొప్ప కరుణతో, చిరునవ్వుతో చెయ్యి ఇటూ అటూ తిప్పుతారు. ఇక చూసుకోండి! వర్షాలతో ఏళ్ళూ, వూళ్ళూ ఏకమైపోతాయి. నదులు పొంగి పొర్లిపోతాయి. మరుక్షణంలోనే చెట్లన్నీ పళ్ళ గుత్తులతో భారంగా వొంగిపోతాయి. పూలతోటలన్నీ నేల కనబడ కుండా విరగబూస్తాయి.

"ఇక చాలు, చాలు" అని ప్రజలంతా వర్షం వొద్దని గోల పెడతారు. మళ్ళీ రుషిని ప్రార్థిస్తారు. ఆయన మళ్ళీ అంత చక్కని చిరునవ్వుతో, చెయ్యి ఎత్తి —"ఆగు" అని వర్షాన్ని ఆజ్ఞాపిస్తాడు.

గంగానది, భగీరథుడి రథం వెంట, రథం ఎటు తిరిగితే అటు ప్రవహిస్తూ వెళ్ళడం — అసహజమే. కానీ, నీళ్ళు ఎక్కడ వుంటే అక్కడికి చేరే ఆది మానవులు, నదీతీర ప్రాంతాల కోసం కొట్టుకునే కాలంలో నదుల్ని మానవులు తన కిష్టమైన చోటుకి తీసుకుపోవడం — ఒక అద్భుత మైన ఊహ! నీటిని భూమి అంతా పరిగెత్తించా లనే తీవ్రమైన కోరికతో ఊహించుకున్న కథ అది.

చచ్చిపోయినవారికి నీటితో తర్పణాలు వొదిలితే వారు స్వర్గానికి చేరతారనేది, ఈ నాటికీ వున్న సమాజ విశ్వాసం. నదుల్ని భూమి మీద ఎక్కడికైనా మళ్ళించగలిగే శాస్త్రజ్ఞానం దొరికి నప్పుడు, తపస్సు చేసి, నదిని రథం వెంట లాక్కు పోవడం, నీరంతా జుట్టులో బంధించెయ్యడం, నదినే అమాంతంగా తాగెయ్యడం – ఇలాంటి కట్టు కథల్ని అల్లుకునే అవసరం వుండదు.

నీరూ, గాలీ, భూమీ, అగ్నీ వంటి ప్రకృతి శక్తులన్నీ ఏదో ఒక రూపం ధరించి మానవుల్లాగ, పక్షుల్లాగ, జంతువుల్లాగ, ప్రవర్తించడమూ; అప్పుడే పుట్టిన శిశువు మరుక్షణంలోనే పెరిగి పెద్దవాడై యుద్ధాలు చేసి శత్రువుల్ని జయించ డమూ; నక్షత్రాలూ, సూర్య చంద్రులూ మనిషి ఆధీనంలోకి వచ్చి వినయంగా ఆజ్ఞలు పాటించ డమూ; పెద్ద గోళంలోంచి వేల కొద్దీ పిల్లలు పుట్టడమూ; ఒక్క హుంకారంతో శత్రువుల్ని భస్మం చెయ్యడమూ; పాల సముద్రాలూ, పెరుగు సముద్రాలూ, నేతి సముద్రాలూ, పాయసం సము ద్రాలూ, తాలింపు మజ్జిగ పులుసు సముద్రాలూ; వాటిని చిలికితే అందులోంచి అమృతాలూ, హాలా హలాలూ, అందమైన స్త్రీలూ, విలువైన వస్తు వులూ, రావడాలూ; కల్పవృక్షాలూ, కామధేను వులూ ఏది కోరితే అది వెంటనే సృష్టించి ఇవ్వ డమూ; వందలాది సంవత్సరాలు సంభోగించ డమూ; తపశ్శక్తితో స్వర్గాల్ని సృష్టించడమూ; మనిషి స్వర్గంలోకి ఎగురుతూ వెళ్ళడమూ; దేవతల సహాయంతో శత్రువుల్ని ఓడించడమూ — ఇటువంటి అనేకమైన కట్టుకథలకు కారణం, ఆ కార్యాలేవీ జరిగేవి కావు కాబట్టి, అవి జరగాలని, ఊహల్లోనే ఆ కోరికలు తీర్చుకుని ఆనందించ డమే. కోరికలే ఆ కథలన్నీ.

మానవులు శాస్త్రజ్ఞానం నేర్చుకొని తమ కోరికల్లో ఏది సాధ్యమో, ఏది అసాధ్యమో గ్రహించగలిగితే; తమ అజ్ఞానం నుంచి ఎదిగి ప్రకృతి శక్తుల్ని తమ అవసరాల కోసం ఉప యోగించుకోగలిగితే; ఏ అసహజత్వాలకీ, ఏ కల్పనకీ తావు వుండదు.

ఈ నాడు కూడా కుండెడు నీళ్ళకోసం మైళ్ళ కొద్దీ దూరం పోవలసిన మనుషులకు, రుషిగారు వర్షాలు కురిపించే కథ సంతోషం కలిగించ కుండా ఎలా ఉంటుంది? వారిని 'శాస్త్రజ్ఞానం లేని మూర్ఖులు' అనడంలో అర్థమేమీ ఉండదు. శాస్త్రజ్ఞానం అనేది కేవలం పుస్తకాల్లో వుంటే చాలదు. దానివల్ల నిత్య జీవితావసరాలు తీరుతూ వుంటేనే అది జీవితాల్లో కలిసిపోతుంది.

'రామాయణం' లాంటి కథల్ని ఇంకా చదువు తున్నాం అంటే, ఆ కథల్లో అడుగడుగునా ఎన్నెన్నో పాత్రలద్వారా జరిగే 'అద్భుతాలు' ఇంకా మనల్ని ఆకట్టుకుంటూనే ఉన్నాయన్నమాట! మన జీవితా లకు ఇంకా దేవుళ్ళమీదా, అద్భుతాల మీదా ఆశలు పెట్టుకుని బతకవలసిన అవసరం ఉందన్నమాట! ఈ సమాజ పరిస్థితుల్ని గ్రహిం చడం కూడా ఒక శాస్త్రమే.

'చదువు' సంగతి తీసుకోండి! మానవ సమా జంలో రాయడం, చదవడం ప్రారంభమై, వేల కొద్దీ సంవత్సరాలు అయింది. ఎన్నో విద్యలూ, ఎన్నో శాస్త్రాలూ అభివృద్ధి అయ్యాయి. అయినా, ఈ నాటికీ, చదువు మొహం ఎరగని మనుషులు ఉన్నారు! (భారతదేశంలో నూటికి 70 మందికి చదువు లేదు!)

'మాదిగ అప్పిగాడికి' చదువు రాదు. అతని తండ్రికీ రాదు, తాతకీ రాదు, ముత్తాతకీ రాదు. రేపు, అతని పిల్లలకూ రాదు. మనవలకూ రాదు.

రామశాస్త్రులు గారింట్లో అందరూ పండి తులే! ఆయన తండ్రి కలెక్టరు. ఆయన తాత వేద పండితుడు. ఆయన ముత్తాత ఒక రాజుగారి దగ్గిర పౌరోహిత్యం చేశాడు. ఇప్పుడు రామ శాస్త్రులు కొడుకు డాక్టరీ చదువుతున్నాడు. కూతురు మొన్నే అమెరికా వెళ్ళింది. పెద్ద మన వడు కాన్వెంటులో చదువుతున్నాడు.

ఈ వాస్తవాల్ని మనం సమాజంలో నిత్యం చూస్తూనే ఉన్నాం.

గుడ్డి బిచ్చగత్తె, చంటిబిడ్డని తుక్కు డబ్బా పక్కన పడుకోబెట్టి, గిన్ని గలగలలాడిస్తూ, అరుస్తూ ఉంటుంది. ఆమె ముందునించీ వందల కొద్దీ కార్లు, బట్టల షాపులవేపూ, హోటళ్ళ వేపూ, సినిమాల వేపూ, క్లబ్బుల వేపూ, పార్టీల వేపూ దేవుడి గుళ్ళవేపూ దూసుకుపోతూ ఉంటాయి.

ఇవన్నీ కొత్త విషయాలు కావు. ఇదంతా సామాన్య లోకజ్ఞానం. కానీ, ఈ తేడాల ఆంత ర్యాన్ని చెప్పడానికి, సామాన్య లోకజ్ఞానం చాలదు, 'శాస్త్ర జ్ఞానం' కావాలి.

'శాస్త్ర జ్ఞానం' అంటే ఎప్పుడూ 2 విషయాలు గుర్తు పెట్టుకోవాలి.

1. 'ప్రకృతి'కి సంబంధించిన శాస్త్రజ్ఞానం.
2. 'సమాజాని'కి సంబంధించిన శాస్త్ర జ్ఞానం.

'ప్రకృతి'లో ఎన్నో శక్తులున్నాయి. సమస్తమైన వనరులూ ఉన్నాయి. ఆ వనరులతో సంపదల్ని సృష్టించడంలో ఏ పాత్రా లేని వర్గానికే అవి స్వంతం అవుతున్నాయి. నిజమైన సృష్టి కర్తలకు అవి పరాయివే.

ప్రకృతి జ్ఞానాన్ని ఎంత కనిపెట్టినా అది వృధా! సమాజంలో జరుగుతోన్న శ్రమ దోపిడీని కనిపెట్టి, దాన్ని అరికట్టగలిగినప్పుడే, సమాజాని కంతటికీ శాస్త్రజ్ఞానం కలుగుతుంది.

'రామాయణం' కథలోకి ప్రవేశించే ముందు ఇంకా ఒక ముఖ్య విషయం తెలుసుకోవాలి. అది 'ప్రక్షిప్తాల' విషయం.

## 'ప్రక్షిప్తాల' ఘోష!

'ప్రక్షిప్తం' అంటే, 'చేర్చబడ్డది' (చేర్చినది) అని అర్థం. చేర్చినది — దేనికి? వాల్మీకి రాసిన మూలానికి. 'రామాయణం' గురించి చూసే టప్పుడు ప్రక్షిప్తాల విషయం ఒకటి వుందని తెలుసుకోవడం చాలా అవసరం.

రామాయణ పరిశోధకుల్లో కొందరు, "వాల్మీకి పేరుతో ఇప్పుడు వున్న రామాయణం అంతా వాల్మీకి రాసింది కాదు. వాల్మీకి రాసింది 10 వేల శ్లోకాలే. తర్వాత కాలపు కవులు దాన్ని ఇంకా పెంచి 24 వేల శ్లోకాలు చేశారు" అంటారు.

కొందరు పరిశోధకులైతే ఇప్పుడు వున్న రామాయణంలో ఏ యే భాగాలు ప్రక్షిప్తాలై వుంటాయో, వారి పరిశీలన ప్రకారం, ఆ వివరాలన్నీ చెపుతారు.

ఇప్పుడు వున్న 'వాల్మీకి రామాయణం', సంస్కృతంలో, 7 కాండలుగా (భాగాలుగా) వుంది.

| | |
|---|---|
| 1. బాల కాండ | |
| 2. అయోధ్య కాండ | 5. సుందర కాండ |
| 3. అరణ్య కాండ | 6. యుద్ధ కాండ |
| 4. కిష్కింధా కాండ | 7. ఉత్తర కాండ |

ఈ 7 కాండల్లోనూ కలిసి మొత్తం 24 వేల శ్లోకాలు వున్నాయని పండితులు అంటున్నారు. (లెక్క పెడితే ఇది ఎవరికైనా తెలిసే విషయమే. నేను లెక్క పెట్టలేదు.)

భక్తులైన పరిశోధకులందరూ 'రామాయణం కథ పూర్తిగా జరిగిందే, అది చరిత్రే' అని నమ్ముతారు. వారు, కథలో వున్న మహిమలన్నిటినీ కూడా నమ్ముతారు.

ఈ కథని పుస్తక రూపంగా రాయడం (తాటాకుల వంటి ఆకులమీద రాయడం) ఏ కాలంలో జరిగింది? ఈ విషయం గురించి పరిశోధకుల్లో ఏకాభిప్రాయం లేదు. ఈ కథని, ఇంకా ఎవరూ రాయక పూర్వంనించీ కూడా ఇది ప్రజలలో ప్రచారంలో ఉండి ఉంటుందనే విషయం మాత్రం అందరూ అంగీకరిస్తారు. ('ప్రచారం'లో అంటే, చిన్న చిన్న కథల రూపంలోనూ, ఎవరికెలా చేతనయితే అలా తయారుచేసుకున్న పాటల రూపంలోనూ, ఈ కథని ప్రజలు చెప్పుకునే వారని అనుకోవాలి.)

రామాయణం కథని మొట్టమొదట రాసిన వాడు వాల్మీకి — అనే అభిప్రాయం దాదాపు అందరికీ వుంది. మొట్టమొదట రాయడం అంటే, ప్రజలు చెప్పుకునే కథల్నీ, పాడుకునే పాటల్నీ, ఎలా వున్నవాటిని అలాగే రాత లోకి 'ఎక్కించడం' చేశాడని అర్థం కాదు. కథనంతా, ఒక ఛందస్సుతో, వ్యాకరణ యుక్తంగా, రెండేసి పాదాలు గల శ్లోకాలుగా తన కవితా శక్తితో తయారు చేస్తూ రాశాడు.

ఆ రాయడం ఏ కాలంలో జరిగిందనే విషయం మీద రక రకాల అభిప్రాయాలున్నాయి. కొందరు మూర్ధాగ్రేసర పండితోత్తములైతే ఇలా లెక్కలు కడతారు. "శ్రీ మహావిష్ణువు రామావతారం ఎత్తింది త్రేతాయుగంలో కదా? రాముడు రాజ్యం చేస్తూ వున్నప్పుడే వాల్మీకి రామకథ రాశాడు కదా? ఆ రకంగా లెక్కలు కడితే రామాయణం రాసి దాదాపు 9 లక్షల సంవత్సరాలై వుంటుంది" అంటారు.

బ్రహ్మలోకం, విష్ణులోకం, గోలోకం, గీలోకం, లాంటి మాటలన్నీ భక్తుల ఊహాలోకాలు. ప్రకృతిలో ఎక్కడాలేని లోకాలు ఇవి. అలాగే కాలాన్ని లెక్కకట్టడంలో, కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం — లాంటి యుగాలు కూడా అవాస్తవికమైన అభిప్రాయాలే. ఇదంతా మత గ్రంథాల్లో వుండే పౌరాణిక భాష. (పురాణాల భాష.) కాబట్టి, ఈ '9 లక్షల సంవత్సరాల' వాదం, నవ్వుకోడానికి మాత్రమే పనికి వస్తుంది.

రామాయణ, భారతాల గురించి కష్టపడి పరిశోధనలు చేసిన వారిలో కొందరు — "రామాయణం రాసి 2 వేల, 5 వందల సంవత్సరాలై ఉంటుంది" అంటే, మరికొందరు, "వెయ్యి సంవత్సరాలై ఉంటుంది" అంటారు. ఈ రెంటికీ

మధ్య కాలాల్ని చెప్పేవారూ ఉన్నారు. ఈ ప్రకారం చూసినా, ఇది వందలమీదా, వేలమీదా సంగతే.

అప్పటి నించీ, ఈ వందల కొద్దీ వేలకొద్దీ సంవత్సరాల కాలంలో, ఎంతో మంది కవులు, రామాయణం పొడుగునా ఎవరికి తోచినట్టు వారు కొత్త కొత్త ఘట్టాలు చేర్చేసి (సంస్కృతం లోనే) కథని చాలా పెంచుతూ వచ్చారని విమర్శ కులు అంటున్నారు. అలా కొత్తగా చేర్చిన ఘట్టా లనే 'ప్రక్షిప్తాలు' అంటారు. (ప్రక్షిప్తం = చేర్చ బడ్డది)

ఈ ప్రక్షిప్తాల్ని చేర్చడం ఎలా జరిగి ఉంటుం దనే విషయం గురించి, ఎవరి ఊహకు తోచినట్టు వారు నిర్ణయించుకోవలసిందే. ఒక కవిగారి ఇంట్లో వాల్మీకి రామాయణం (తాటాకుల గ్రంథం) ఉంటుందనుకుందాం. ఆయన దాన్ని నిత్యం చదువుతూ ఉంటారు కదా? ఒక ఘట్టాన్ని కొంచెం పెంచాలనో, కొత్త శ్లోకం ఏదయినా రాయాలనో ఆయనకి బుద్ధి పుట్టవచ్చు. ఆయన ఒక్కడూ గానీ, కొందరు కవులు కలిసిగానీ, ఆ పని చేస్తారు. ఆ కొత్త తాటాకు భాగం పాత గ్రంథం మధ్యలో చేరుతుంది. కొంత కాలానికి ఆ గ్రంథమే గానీ, దాని నకలు గానీ, ఇంకో కవి చేతిలో పడుతుంది. ఆయనకి కూడా ఏమయినా చేర్చాలని ఉత్సాహం కలిగితే, దానికి, ఇంకో కొత్త తాటాకు చేరుతుంది. (ఇది ఒక ఊహ. ఇలాగే జరిగి ఉంటుందని కాదు.)

భారతదేశంలో, వాల్మీకి పేరుతోనే మూడో, నాలుగో రకాల రామాయణాలు ఉన్నాయట! వాటన్నిటిలోనూ సుమారు వెయ్యి శ్లోకాల వరకూ ఒక్కలాగే వుండి, మిగిలినవి ఒక గ్రంథానికీ, ఇంకో గ్రంథానికీ సంబంధం లేకుండా వున్నా యట. ఇప్పుడు మనం చదువుతున్న 'వాల్మీకి రామాయణం' కూడా వాటిలో ఒకటి.

మొదట్లో వాల్మీకి రాసిన చిన్న కథ, వందల కొద్దీ, వేలకొద్దీ సంవత్సరాల కాలంలో చాలా 'పెద్దకథ'గా మారటం నిజమే అయితే, అది ఒక సహజ పరిణామం. ఎందుకంటే, ఆ కాలం తాటా కుల మీద రాసే కాలం కాబట్టి, ఒక తాటాకుల కట్టలో అక్కడక్కడా కొత్త తాటాకుల్ని చేర్చడం సాధ్యమే. ఈ కాలంలో అయితే, అంటే, కాయి తాల మీద ప్రింటు చేసి, వాటిని ఒక పుస్తకంగా కుట్టి, వాటిని లైబ్రరీలలో భద్రపరిచే కాలంలో అయితే, ఒక పుస్తకంలోకి కొత్త పేజీలు జొప్పిం చడం సాధ్యం కాదు. ప్రత్యేకంగా మోసం చెయ్య దల్చుకుంటే, మొత్తం పుస్తకాన్నంతా రీప్రింటు చెయ్యవలసి వస్తుంది. ఉన్న పుస్తకంలోకే కొత్త పేజీలు చేర్చడం సాధ్యంకాదు. తాటాకుల కట్టల కాలంలో అయితే, దీనికి ఇబ్బందే వుండదు.

కానీ, ప్రక్షిప్తాల కవులు చేసింది, మోసంగా కాదు. రామాయణం కథ మీద భక్తితోనే. తమ భక్తిని కూడా ప్రదర్శించుకోడానికే తమకు నచ్చిన ఘట్టాల్లో తమకు తోచినవన్నీ చేర్చారు.

వందల సంవత్సరాలనించీ జనాలకు తెలిసి వున్న రామాయణం ఈ ప్రక్షిప్తాలన్నిటితోటీ కలిసి వున్నదే. అవన్నీ ఆ కథలోనే భాగాలైపోయి వున్నాయి. నిన్న మొన్న చేరిన ప్రక్షిప్తాలేవీ లేవు.

'రామాయణం'లోనే కాదు అలా జరిగింది. భారత, భాగవతాల్లో కూడా ప్రక్షిప్తాలున్నాయనే వాదం ఉంది. ప్రక్షిప్తాలు చేరడం, ఆనాటి సమాజ పరిస్థితినిబట్టి జరిగిన సహజ విషయం. దాన్ని అలాగే తీసుకోవాలి, ప్రక్షిప్తాలు చేర్చిన వారంతా ఆ పనిలో తప్పులేదని భావించిన వాళ్ళే.

కానీ, వాల్మీకి భక్తులు కొందరు ప్రక్షిప్తాల్ని అంత సహజ విషయంగా తీసుకోరు.

ఈ భక్తుల్లో రెండు రకాల వారు వున్నారు. మొదటి రకం వారు, 'రామాయణం'లో ప్రక్షిప్తా లున్నాయంటే ఒప్పుకోరు. వీరు దాదాపు రామా

యణం అంతా వాల్మీకి రాసిందే అంటారు. రెండో రకం వారు, రామాయణంలో చాలా భాగాలు ప్రక్షిప్తాలేనంటారు. వాల్మీకి మొదట్లో రాసింది చాలా తక్కువే అంటారు. అది, ప్రక్షిప్తాల మధ్య పడి అస్తవ్యస్తం అయిపోయిందంటారు. ప్రక్షిప్తా లన్నీ కలిసి వాల్మీకి కావ్య గౌరవాన్ని సర్వనాశనం చేసేశాయంటారు. వీరికి ప్రక్షిప్తాలమీద చెప్ప లేనంత విముఖత.

వాల్మీకి భక్తుల్లో మొదటి రకంవారు, అసలు రామాయణంలో ఏ సందేహానికీ విలువ ఇవ్వరు. దేన్నీ విమర్శనా దృష్టితో చూడరు. ప్రతీ అవక తవకకీ గొప్ప ఆధ్యాత్మిక అర్థాలు చెప్పుకుంటారు. పైకి అవకతవకగా కనపడే దాంట్లో ఏదో అద్భుత రహస్యం, ఇమిడి ఉందంటారు. అసలు, దాన్ని అర్థం చేసుకోవడమే సాధ్యంకాదు పొమ్మంటారు.

రెండోరకం వారు, 'రామాయణం'లో ఉన్న అవక తవకల్లో కొన్నిటిని అయినా ఒప్పు కుంటారు. అయితే, వాటన్నిటికీ ఏకైక కారణం ప్రక్షిప్తాలే! సమస్తమైన తప్పుల్నీ ప్రక్షిప్తాల మీదకి గెంటేస్తారు! "వాల్మీకి మొదట చాలా గొప్పగా, ఉదాత్తంగా, రమ్యంగా, సహజంగా రాస్తే, తర్వాత కవులే అంతా తప్పులతడక చేసేశారు. రామా యణంలో ఏ లోపానికీ వాల్మీకి బాధ్యత లేదు" అంటారు ప్రతిచోటా. వాల్మీకిని వెనకేసుకొచ్చి ప్రక్షిప్తాల మీద కత్తి కడతారు. 'వాల్మీకి కూడా ఏమైనా తప్పులు చేశాడేమో' అనే అభిప్రాయం ఊహామాత్రంగా కూడా కలగనివ్వరు. 'రామా యణంలో లోపాలకి ప్రక్షిప్తాలే కాకుండా ఇంకే మైనా కారణాలున్నాయేమో' అన్న ఆలోచనకే తావు ఇవ్వరు.

ఈ రెండు రకాల వారూ వాల్మీకి భక్తులే. మొదటిరకం వారు మూఢ భక్తులు. రెండోరకం వారు గడుసు భక్తులు. మొదటిరకం భక్తుల్ని వొది లేద్దాం, అది తర్కానికి లొంగే వ్యవహారం కాదు. రెండో రకం భక్తుల అభిప్రాయాలే కొంచెం చూడాలి.

వీరిలో కొందరి ప్రకారం, 'బాల కాండ' అంతా ప్రక్షిప్తమే. 'ఉత్తర కాండ' అంతా ప్రక్షిప్తమే. ఇక మధ్యలో మిగిలిన 5 కాండల్లో కూడా అనేక ఘట్టాలు ప్రక్షిప్తాలే. ఇవన్నీ తీసేస్తే మిగిలేదే అసలైన రామాయణం. అందులో ఏ తప్పులూ, అవకతవకలూ వుండవు — ఇదీ వీరి అభి ప్రాయం.

కానీ, రామాయణంలో అవకతవకలన్నీ ప్రక్షిప్తాల మూలాన్నే వచ్చాయనీ, అవి లేకపోతే ఆ కథ అద్భుతంగా వుండేదనీ అనుకోవడం పూర్తిగా తప్పు. అది, కవిత్వ చరిత్రమీదా, సామా జిక విషయాల మీదా అవగాహన లేనితనం.

రామాయణంలో రచనా విధానం మైతాలజీ పద్ధతిలో నడిచింది. ఆ కథ, ఆటవిక — బానిస — భూస్వామ్య సమాజాల కవితా ధర్మాలతో నడి చింది. ఇలాంటి కథని, అవకతవకలు లేకుం డానూ వైరుధ్యాలు లేకుండానూ రాయడం ఏ కవికీ సాధ్యం కాదు.

వాల్మీకి కథలోకి, ప్రక్షిప్తాల ద్వారా నిజంగానే కొన్ని భాగాలు చేరాయి — అనుకుందాం. ప్రక్షి ప్తాల కవులకు కూడా ఏదో ఒక పేరు వుండాలి కాబట్టి, ఆ కవులందర్నీ కలిపి 'గీల్మీకి' అందాం. మైతాలజీ పద్ధతిలోనూ, అబద్ధపు విలువలతోనూ నడిచిన కథలో, గీల్మీకే కాదు, వాల్మీకి రాసిన భాగాల్లో కూడా అవకతవకలు తప్పవు.

ప్రక్షిప్తాల కవులు, కథ స్వభావాన్ని ఎక్కడా మార్చలేదు. వాల్మీకి చెప్పిన నీతుల్నే ధర్మాల్నే ఇంకా ఇంకా గట్టిగా చెప్పడానికే వీరు తమ కవితా శక్తుల్ని ఉపయోగించారు. రాముడి పితృ భక్తి విషయంలోగానీ, సీత పాతివ్రత్యం విష యంలోగానీ, ఏ ప్రక్షిప్తం కవీ, ఏ గీల్మీకీ, వాల్మీ కితో విభేదించడు. రాముణ్ణి కీర్తించి, రావణుణ్ణి

నీచపరచడానికి ఏ ప్రక్షిప్తం కవీ సంకోచించడు. కథ స్వభావం మారనప్పుడు, అందులోకి ఎన్ని వేల శ్లోకాలు చేరితే మాత్రం ఏమిటి?

కవుల దాకా పోనక్కరలేదు. హరికథలు చెప్పే వారు కూడా ఏ దేవుడి కథ చెప్పినా, తమ కల్ప నలు జోడించి మరీ చెపుతారు. సినిమాల వాళ్ళు, రాముళ్ళనీ కృష్ణుళ్ళనీ కొత్త కొత్త పద్ధతుల్లో సృష్టిస్తూ వుంటారు. ఎవరు ఎలా ఎన్ని చేర్చినా, ఎన్ని మార్చినా, ఆ చేర్పులూ మార్పులూ అసలు కథ స్వభావానికి అనుగుణంగానే నడుస్తాయి.

కల్పనల సంగతి తీసుకుందాం.

'దశరథుడికి 60 వేల సంవత్సరాల వయసు' అనేది అసహజమే. కానీ, అది ఆనాడు కథలు చెప్పే పద్ధతి. ఎక్కువ సంవత్సరాలు జీవించాలనే ఆశని కథల్లో అలా చెప్పుకున్నారు. మనుషులు వేలకొద్దీ సంవత్సరాలు జీవించరని వాల్మీకికి తెలుసు. అయినా ఆయన అలాగే రాశాడు. ఎందుకంటే ఆయన కన్నా పూర్వంనించీ కథల్ని కట్టుకథలుగా చెప్పే పద్ధతి వుంది. దాన్నే ఆయన పాటించాడు. ఆ నాడు, కథల్లో సహజత్వానికీ తర్కానికీ స్థానం వుండదు. సమాజం వాటిని పట్టించుకోదు.

ఈ కాలంలో అయితే ఏ రచయిత అయినా "దశరథ రామయ్యకి 2 వేల సంవత్సరాల వయసు" అని రాస్తాడా? "హనుమంతరావు కన్యా కుమారినించి కొలంబోకి తన శక్తితో ఎగిరి వెళ్ళాడు" అని రాస్తాడా? ఈ నాడు ఒక రచ యితకి, మహిమల మీద ఎంత నమ్మకం వున్నా, ఆ నమ్మకాలన్నీ తన బుర్రలో దాచుకోవలసిందే గానీ అలా రాయలేడు. ఎందుకు రాయలేడు? ఈ నాటి సమాజానికి, కొన్ని విషయాల్లో, కథల్లో కూడా రాయడానికి వీల్లేనంత శాస్త్రజ్ఞానం కలిగింది.

అలాంటి శాస్త్రజ్ఞానం లేని సమాజంలో, కల్ప నలే, మహిమలే కళల్ని ఆక్రమించాయి. రాజులు 60 వేల సంవత్సరాలు జీవిస్తారు. రుషులు 10 వేల సంవత్సరాలు తపస్సులు చేస్తారు. అలాంటి కల్పనల్లోనే కాదు. జీవిత కష్టసుఖాల్ని చెప్పే చోట్ల కూడా తర్కం వుండదు. వాల్మీకి రాసినా అంతే. గీల్మీకి రాసినా అంతే!

కానీ ప్రక్షిప్తాల విమర్శకులు ఈ సంగతులేవీ అర్థం చేసుకోరు. కథలో ఏదైనా ఒక విషయం అవకతవకగా కనపడితే, వెంటనే — "వాల్మీకి అయితే ఇలా రాయడు. ఇది ప్రక్షిప్తాల కవుల పనే" అంటారు. మరి, వాల్మీకి చెయ్యని అంత అవకతవక పని ఇంకో కవి మాత్రం ఎందుకు చేస్తాడు — అనే ప్రశ్న వేసుకోరు. ఒక తప్పు కన పడితే చాలు, 'ఇది ప్రక్షిప్తాల పనే!' అదే కరక్ట యిన, తెలివైన జవాబు — అనుకుంటారు. వాల్మీకిని రక్షించగలమనే మూఢభక్తితో, ప్రతీ దాన్నీ ప్రక్షిప్తాల మీదకి తోసేస్తూ వుంటారు.

ప్రతీచోటా 'ఇది ప్రక్షిప్తమే' అనుకుంటే, అది సరైన జవాబు అవదు. 'ప్రక్షిప్తం కవి మాత్రం ఇలా ఎందుకు రాశాడు?' అని ప్రశ్నించుకుంటేనే జవాబుకోసం వెతుక్కుంటాం. కారణం దొరుకు తుంది. ఒక కథని, అందులో ఒక ఘట్టాన్ని, వాల్మీకి రాశాడా, గీల్మీకి రాశాడా అనేది మనకు అనవసరం. ఆ రాసిన కవి ఏం రాశారు? ఆ రాసిన విషయాలు ఏమిటి? — ఇదే మనకు కావాలి. ప్రతీచోటా ఆ దృష్టితోనే చూడాలి.

ప్రక్షిప్తాల గురించి ఇంకా కొన్ని విషయాలు కథ అంతా తెలిసిన తర్వాత చివర్లో చూడాలి.

★ ★ ★

**కొం**దరు సాహిత్య పరిశోధకులు రామా యణం కథని, ఆర్యులకూ ద్రావిడులకూ జరిగిన యుద్ధంగా భావిస్తారు. అది నిజమే కావచ్చు. కానీ, 'ఆర్య జాతీ— ద్రావిడ జాతీ' అనే మాటలూ, ఆ పేర్లూ, వాల్మీకి కథలో కనపడవు. దేవతలూ

రాక్షసులూ, బ్రాహ్మణులూ శూద్రులూ— ఇలాంటి మాటలే వుంటాయి. దేవతలూ బ్రాహ్మణులూ రాముడూ — ఒక పక్షం. దీని వ్యతిరేక పక్షం, రాక్షసులు. దాని నాయకుడు — రావణుడు. ఆర్య — ద్రావిడ పరిశోధకుల ప్రకారం, రాముడి పక్షాన్ని 'ఆర్యులు' అనీ, రావణుడి పక్షాన్ని 'ద్రావిడులు' అనీ అర్థాలు తియ్యవచ్చు.

ఈ పరిశోధకుల్లో కొందరు — ఆర్యరాజు వేపు చేరితే, కొందరు — ద్రావిడ రాజువేపు చేరతారు. రాముడు ఆర్య రాజూ, రావణుడు ద్రావిడ రాజూ అయితే కావచ్చు. అయితే ఏమిటి? ఆ జాతుల తేడాల వల్ల, ఆ రాజుల పరిపాలనల్లోగానీ, ఆ సమాజాల స్వభావాల్లో గానీ, ఏమైనా తేడాలు వున్నాయా? కథలో అలాంటి తేడా లేమీ లేవు. (ఈ సంగతులు, కథ లోపలికి వెళ్ళినప్పుడు తెలుస్తాయి.)

'రామాయణం' ఒక్క భారతదేశంలోనే గాక, చైనా, టిబెట్, మలయా, కాంబోడియా, జావా, థాయ్‌లాండ్ — వంటి ఇతర ఆసియా దేశాల్లో కూడా రకరకాల పేర్లతో, రకరకాల కథలతో, ప్రచారంలో వుందని కొందరు పరిశోధకులు అంటారు. వీరు — "ఈ కథ భారతదేశానిది కాదు కదా? అలాంటప్పుడు, దీనిమీద చర్చ లెందుకు?" అంటారు.

కానీ, రామాయణం ఇతర దేశాల్లో కూడా వుంటే వుండవచ్చు. ఈ దేశంలో కూడా వుంది కదా? ఇది, ఈ దేశంలో ఏనాటినించో ప్రచారంలో వుంది. ఈ కథ, ఈ దేశంలో కవి రాసింది కాదనీ, ఇది ఏ దేశంలోనో పుట్టి ఇక్కడికి వచ్చిందనీ, నిజంగానే కొన్ని పరిశోధనలవల్ల తేలిందనుకుందాం. దానివల్ల తేడా ఏమీరాదు. దాని జన్మస్థలం ఏదైనప్పటికీ, అది ఇక్కడ కూడా వుంది కాబట్టి, దాని ప్రభావం ఈ సమాజం మీద కూడా వుంది.

ఒక సాహిత్యం నించిగానీ, ఒక సిద్ధాంతం నించిగానీ నేర్చుకోవలసింది — అది మనదా, కాదా; అది ఇక్కడ పుట్టిందా, లేదా — అనే దాన్ని బట్టి కాదు. ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ వున్నది మనుషులే. ప్రతీచోటా మంచిచెడ్డలు వుంటాయి. 'మంచి'ని ఇతరుల నించి కూడా తీసుకోవాలి. 'చెడ్డ'ని అది మనదే అయినా దాన్ని తిరస్కరించాలి. 'అది మంచా, చెడ్డా' అని చూడకుండా, 'అది మనదా, కాదా' అని చూడడం అంటే, అది స్వదేశ దురహంకారమే.

'రామాయణం' పేరుతో అనేక రకాల రామాయణాలు వున్నాయి. వాల్మీకి రామాయణం, తులసీ రామాయణం, కంబ రామాయణం, భాస్కర రామాయణం, మొల్ల రామాయణం, ఇలా. కానీ, వాల్మీకి రామాయణం తర్వాతే, దాని ప్రభావంతో వచ్చినవే మిగిలిన రామాయణాలన్నీ. రామాయణాలు ఎన్ని వందలు వున్నా అన్నిటి సారాంశమూ ఒకటే.

నేను ఈ 'విషవృక్షం' కోసం వాల్మీకి రామాయణాన్నే ఆధారం చేసుకున్నాను. నా ప్రశ్నలూ, విమర్శలూ అన్నీ వాల్మీకి కథమీదే వుంటాయి. ఇతర రామాయణాల్లో కథల్నీ, సంఘటనల్నీ, నేను ముట్టుకోలేదు.

## 'విష వృక్షం' ఆలోచన ఎలా ప్రారంభమైంది?

శ్రీరామచంద్రుల వారి అనుజ్ఞ ప్రకారం, లక్ష్మణస్వామి వారు, శూర్పణఖ ముక్కూ చెవులూ కోసే వీరోచిత ఘట్టాన్ని, రేడియో హరిదాసుగారు మహోత్సాహంతో పొంగుతూ వర్ణిస్తున్నారు — ఒక రాత్రి. ఆ కథని తమ కబుర్ల మధ్య, ఇక్కడో ముక్కా అక్కడో ముక్కా మాత్రమే విన్న **కుటుంబరావూ, గాంధీలు,** ఆ హరి కథ మీద

కోపంతో "శూర్పణఖ" అనే పేరుతో ఒక కథ రాశారు — కొన్నాళ్ళకి. ఆ ఇద్దరూ అప్పుడో కథా ఇప్పుడో కథా రాస్తూ వున్న కొత్త రచయితలు. ఆ కథని వారు నా అభిప్రాయం కోసం నాకు ఇచ్చారు.

అందులో విషయాలు కొన్ని నాకు చాలా నచ్చాయి. అందులో రాముడి కపటత్వం, లక్ష్మ ణుడి బానిసత్వం క్రూరత్వం — అవన్నీ ఆ పాత్రల గురించి ఇంకా ఆలోచించేటట్టు చేశాయి.

అయినప్పటికీ, ఆ కథ, హరి దాసు చెప్పిన మాటలమీద ఆధారపడి రాసిందేగానీ, అసలు కవి (వాల్మీకి) ఇచ్చిన సంఘటనల్ని ఆధారం చేసుకుని రాసింది కాదు. అసలు కథ ఎలా వుందో చూడా లనిపించింది నాకు. వెంటనే 'వాల్మీకి రామా యణం' సంపాదించి (గట్టుపల్లి శేషా చార్యులు గారి అనువాదం), అందులో శూర్పణఖ ఘట్టాల కోసం వెతికి చదివాను. కానీ, ఆ పాత్రల్ని అర్థం చేసుకోవాలంటే, అది చాలదనిపించింది. మొత్తం రామాయణాన్ని 'బాల కాండ' నించీ మొదలుపెట్టి, చిట్టచివరిదాకా చదివాను.

మొదటి పేజీనించీ చివరి పేజీదాకా ఒకటే ఆశ్చర్యం! ఒకటే సందేహాలు!

అప్పటికి చాలా సంవత్సరాల కిందటే, నా **'స్వీట్ హోమ్'** నవలలో రాముడి పాత్ర మీద చాలా విమర్శలు చేసి వున్నాను. కానీ, అప్పటి వరకూ 'రామాయణం'లో కొన్ని సంఘటనలు తెలియడమేగానీ, దాన్ని ఇప్పుడు చదివిన పద్ధతిలో ఎప్పుడూ చదవలేదు. రామాయణం కథ పాత కాలపు మత సాహిత్యం అని తెలుసుగానీ, ఇది మరీ ఇంత బరితెగించినంత అవక తవకలతో చలామణీ అవుతోందని తెలీదు. దాన్ని చదవడం పూర్తిచేసే సరికి, "దీన్నా జనం ఇంత అమాయకంగా నమ్ముతున్నదీ!" అని చాలా ఆశ్చర్యం కలిగింది.

అసలు రాముడికి రాజ్యం మీద హక్కే లేనప్పుడు, ఆ సంగతి అతనికి తెలిసి కూడా ఏమీ ఎరగనట్టు పట్టాభిషేకానికి సిద్ధపడడం ఏమిటి? వనవాసంలో రుషి జీవితం గడపవలసి వుంటే, అక్కడ ఆయుధాలతో తిరుగుతూ యుద్ధాలు చెయ్యడం ఏమిటి? రాజ్యాన్ని భరతుడికే ఇవ్వ వలసి వుండగా, రాముడు తన చెప్పుల్ని సింహా సనం ఎక్కించడానికి ఒప్పుకోవడం ఏమిటి? రామలక్ష్మణుల సహోదరత్వంలో, 'యజమానీ సేవకుల సంబంధం' తప్ప, అంతకన్నా వున్న గొప్ప సంబంధం ఏమిటి? చిన్నప్పుడు 'తాటకి'నీ, పెద్దయ్యాక 'వాలి'నీ, ఇంకా అలాంటి చంపుళ్ళన్నీ చెయ్యడంలో రాముడు పాటించిన ధర్మాలు ఏమిటి? అసలు రాముడు, రావణుడికి చెందిన జనస్తానం దాకా ఎందుకు వెళ్ళినట్టు? ఇదంతా ఇతర ప్రాంతాల్ని ఆక్రమించడం కోసం చేసిన యుద్ధం తప్ప, ఇందులో అంతకన్నా గొప్ప సత్యం ఏం వుంది?

అసలు రాముడికీ రావణుడికీ తేడా ఏముంది? ఇద్దరూ రాజులే! ఇద్దరూ ధనికులే; ధనిక వర్గ ప్రతినిధులే. ఇద్దరూ, ప్రజలకు వ్యతిరేకులే! ఇద్దరి రాజ్యాలలోనూ పేదతనాలూ, ముష్టితనాలూ, వేశ్యలూ, స్త్రీల బానిసత్వాలూ — అన్నీ వున్నాయి.

ఈ సంగతులన్నీ పాఠకులకు తెలియాలి కదా? చెప్పకపోతే ఎలా తెలుస్తుంది? దీనిమీద ఏమైనా రాయాలి — అనే ఆలోచన ప్రారంభ మైంది.

వాల్మీకి రామాయణానికి ఇద్దరు పండితుల అనువాదాలు చదివాను.

**(1) గట్టుపల్లి శేషాచార్యులుగారు చేసినది, (2) చదలవాడ సుందర రామశాస్త్రులు గారు చేసినది.** ఈ అను వాదాలు, సంస్కృత శ్లోకాలకు ప్రతి పదార్థాలూ, తాత్పర్యాలూ వున్నవే.

అదే కాలంలో, 'మార్క్సిజం' గురించి కూడా దొరికిన పుస్తకాలు చదువుతూ అర్థం చేసుకోవ డానికి ప్రయత్నిస్తున్నాను. శ్రమ దోపిడీ, వర్గాలూ, వర్గ పోరాటాలూ, బానిస —భూస్వామ్య — పెట్టు బడిదారీ సమాజాలూ, రాజుల పరిపాలనలూ, ప్రజల తిరుగుబాట్లూ — ఇవన్నీ అప్పుడప్పుడే కొత్త జ్ఞానాన్ని ఇస్తున్నాయి. మార్క్సిజం ఇచ్చిన ఈ అవగాహనతో, 'ఏ రాజు అయినా ఒకటే, ఏ జాతి అయినా ఒకటే' అనే అభిప్రాయానికి వచ్చాను. ఈ అభిప్రాయం స్థిరపడిన తర్వాత, ఈ 'రామాయణం' గురించి పాఠకులకు చాలా చెప్పా లనిపించింది. చాలా రాయాలనిపించింది.

వెంటనే దీనిమీద రాయడం మొదలు పెట్టాను. మొదట, 'ఇదీ రామాయణం' అనే కథ రాశాను. ఇందులో, చిన్నరాముడు, తాటకిని చంపడం వరకూ జరుగుతుంది.

దాని తర్వాత, కుటుంబరావు గాంధీలు రాసిన 'శూర్పణఖ' కథని కొంత మార్చి, మళ్ళీ రాసి, దానికి 'ఇలాగే జరిగింది' అని పేరు పెట్టాను. దాని తర్వాత, 'చెప్పుల పాలైన సింహా సనం' కూడా రాయడం మొదలుపెట్టాను. అది పూర్తి అవకముందే, మొదటి 2 కథల్నీ 'ఆంధ్ర జ్యోతి' వారపత్రికకు పంపించాను. 'ఇదీ రామా యణం' కథని — నా పేరుతోటీ; 'ఇలాగే జరి గింది' కథని —దాని అసలు రచయితల పేర్లతో పాటు నా పేరు కూడా కలిపి 3 పేర్లతోటీ, పంపించాను. ఈ రెండు కథలూ, ఆ పత్రికలో, 1974 ఫిబ్రవరిలో ప్రారంభమై కొన్ని వారాల పాటు వచ్చాయి.

'చెప్పుల పాలైన సింహాసనం' కథ కూడా రాశాక, దాన్ని పత్రిక్కి పంపలేదు. ఎందుకంటే, కొన్ని కారణాలవల్ల, ఆ కథని ఆ పత్రిక వారు వెయ్యరనే అభిప్రాయం కలిగింది. అప్పటికి 3 కథలు తయారై వున్నాయి కాబట్టి, వాటినే మొదటి భాగంగా తేవాలనుకున్నాను. ఆ పుస్త కానికి కొంచెం పెద్ద 'పీఠిక' కూడా రాశాను.

ఏ మత గ్రంథాన్ని అయినా ప్రజల ప్రయోజ నాల దృష్టితో చూస్తే, అది ప్రజలకు — విష వృక్షమే! 'పవిత్ర గ్రంథం' అని అందరూ అనుకునే రామాయణం అయినా అంతే! ప్రజల్ని అజ్ఞానం లోనూ, బానిసత్వంలోనూ వుంచడం తప్ప అంత కన్నా అది ప్రజలకు చేసే మేలు ఏమీ ఉండదు. అందుకే దానికి **'రామాయణ విషవృక్షం'** అని పేరుపెట్టాను.

ఆ రకంగా, 1974లో, 'రామాయణ విష వృక్షం' మొదటి భాగం వచ్చింది. తర్వాత, 75లో 2వ భాగమూ, 76లో 3వ భాగమూ కూడా వచ్చాయి.

రామాయణంలో కొన్ని సంఘటనల్ని 'కథలు' గానూ, కొన్ని సంఘటనల్ని కథకీ కథకీ మధ్య 'లింకులు' గానూ రాశాను. అవసరమనిపించిన ప్రతీచోటా మూలం నించి ఆధారాలు చూపిస్తూ చాలా ఫుట్‌నోట్లు ఇచ్చాను. ఈ రకంగా, 'విష వృక్షం' పని, 3 సంవత్సరాలు పట్టింది.

**మార్క్సిజం ఇచ్చే జ్ఞానమే లేకపోతే, ఈ 'విష వృక్షం' ఉండేది కాదు.**

**ఈ పీఠిక చాలా పెద్దదే అయింది. కానీ, తప్పలేదు.**

**ఇక ఇప్పుడు, 'రామాయణం' కథలోకి వెళ్ళ వచ్చు.**

అసలు కథ, **'బాల కాండ'**తో ప్రారంభమవుతుంది.

★

# 2వ భాగం
# వాల్మీకి 'రామాయణం'
# 'బాల కాండ' ప్రారంభం

వాల్మీకి మహాముని నారద మహామునిని – "ఈ లోకంలో గుణవంతుడూ, పరాక్రమవంతుడూ, ధర్మాత్ముడూ, సత్యవ్రతుడూ అయిన పురుష డెవడు? సదాచార సంపన్నుడూ, సమస్త జీవుల్నీ ప్రేమించే వాడూ, విద్వాంసుడూ, సమర్థుడూ, అందరికీ ప్రియంగా కనపడేవాడూ ఎవడు? తనను తను తెలుసు కునే ఆత్మ జ్ఞానీ, కోపాన్ని జయించిన వాడూ, వర్చశ్శాలీ, అసూయా రహితుడూ ఎవడు? కోపం కలిగినప్పుడు దేవతలకైనా భయం కలిగించే వాడెవడు? అలాంటి పురుషుడెవడైనా వున్నాడా?" అని అడిగాడు.

[ఈ ప్రారంభంలోనే పాఠకులకు ఒక సందేహం వస్తుంది. 'వాల్మీకి, నారదుణ్ణి ఇలా అడిగాడు' అని చెపుతున్నది ఎవరు? ఈ కథకి కవి ఎవరు? వాల్మీకి కాదా? ఇంకో కవి ఎవరైనా ఈ కథ చెపుతున్నాడా?– అని. కానీ, ఈ కథ చెపుతున్నది వాల్మీకే. ఇంకో కవి కాదు. వాల్మీకి ఈ కథని చెప్పే టప్పుడు, "నేను నారద మహామునిని ఇలా అడిగాను" అనే పద్ధతిలో చెప్పడు, "వాల్మీకి మహాముని, నారద మహామునిని ఇలా అడిగాడు" అనే పద్ధతిలో చెపుతాడు. ఇది, ఆ నాటి రచనా విధానం అనుకోవాలి. ఇక్కడ ఇంకో కవి ఎవరో ఈ కథ చెపుతున్నాడనుకోకూడదు.]

లోకాలన్నీ ఎరిగివున్న నారద మహాముని, వాల్మీకి మహాముని ప్రశ్నలు విని ఇలా చెప్పాడు. "వాల్మీకి మహర్షీ! నువ్వు అడిగిన గుణాలు దుర్లభాలు. అవి ఏ పురుషుడిలోనూ వుండవు. కానీ అటువంటి సద్గుణాలన్నీ కలిగిన పురుషుడు వున్నాడు. ఇక్ష్వాకు వంశంలో రాము డనే పేరుగల పురుషుడున్నాడు. అతడు ఇంద్రియాల్ని జయించిన వాడు.[1] మహా వీరుడు. ఆచార సంపన్నుడు. సౌందర్య వంతుడు. బుద్ధిమంతుడు. నీతి నియమాలు చక్కగా ఎరిగినవాడు. చక్కగా సంభాషించగలవాడు. శత్రు భయంకరుడు. ఎముకలు కనపడని సుందరమైన అంగ సౌష్టవం కలవాడు. విశాలాక్షుడు, ఐశ్వర్య వంతుడు. ఆర్తత్రాణ పరాయణుడు. జనులకు హితం చేసేవాడు. జ్ఞాని. స్వజనుల్ని రక్షించే వాడు. ధర్మం కాపాడేవాడు. ధనుర్విద్య అంతా క్షుణ్ణంగా ఎరిగిన వాడు. సమస్త శాస్త్రాలూ తెలిసిన వాడు. ప్రతిభా వంతుడు. ఎన్నడూ అధైర్యపడని వాడు. ఎదటివారి శక్తి సామర్థ్యాలు నేర్పుగా గ్రహించగల వాడు. నదులన్నిటికీ సముద్రుడు అండగా వున్నట్టు, సత్పురుషుల కందరికీ అండగా వుండు వాడు. సముద్రం అంత గంభీరుడు, హిమవత్పర్వతం అంత ధీరుడు. విష్ణుమూర్తి అంత పరా క్రమవంతుడు. చంద్రుడిలాగ ప్రియదర్శనుడు. కోపంలో కాలాగ్ని వంటివాడు. ఓర్పులో భూదేవితో సమానుడు. దాన ధర్మాలు చేయడంలో కుబేరుని వంటివాడు. ధర్మ పరిపాలనలో ధర్మదేవతే. – ఇటువంటివాడు, దశరథుడి

---

**1.** కొందరు పండితుల ప్రకారం – ఈ **'బాల కాండ'** అంతా ప్రక్షిప్తమే. కానీ, ఈ రచనా విధానాన్నిబట్టి, ఈ కథ బాల కాండతో విషయాలతో మొదలవడమే సరిగా వుంది. ఏది చదివినా, అందులో విషయాన్ని ప్రశ్నించుకుంటూ చదవాలి. ఆలోచించకుండా చదువుకు పోవడం కాదు. ఉదాహరణకి: కోపాన్ని జయించిన వాడికి మళ్ళీ కోపం రావడం ఏమిటి? 'కోపం వచ్చినప్పుడు, దేవతలకైనా భయం కలిగించడం' – అట! అంటే, కోపం రావడమే నిజం గానీ, దాన్ని జయించడం నిజం కాదన్న మాట! అలాగే 'అసూయ లేనివాడెవడైనా వున్నాడా?' అనే ప్రశ్న కూడా. 'అసూయ లేకపోవడం' అసాధ్యమైన విషయం అన్నమాట! 'కోపం జయించిన వాడు' అని చెప్పిన తర్వాత కూడా కోపం వచ్చినప్పుడు, 'అసూయ లేనివాడు' అని చెప్పిన తర్వాత మాత్రం అసూయ రాకూడదా? వాల్మీకి ఎన్నో సుగుణాలు వర్ణించి 'అలాంటి వాడు ఉన్నాడా?' అని అడిగాడు కదా? 'ఉన్నాడు' అని నారదుడు చెప్పినా, ఆ సుగుణాలన్నీ అసత్యాలు కూడా కావచ్చన్నమాట – కోపాన్ని జయించడం అసత్యం అయినట్టే! ★

పెద్ద కుమారుడైన శ్రీరాముడు!

దశరథుడు, పెద్దకొడుక్కే పట్టాభిషేకం చెయ్యాలని ప్రయత్నాలు చేశాడు. కానీ దశరథుడి భార్య కైక, పూర్వం వరాలు పొంది వుండడం చేత, రామ వన వాసాన్నీ, భరతుడి పట్టాభిషేకాన్నీ వరాలుగా కోరింది. సత్య వాక్పరిపాలకుడైన దశరథుడు, పూర్వం భార్యకు వరాలు ఇచ్చి వుండడంవల్ల, ప్రియ పుత్రుడైన రాముణ్ణి వనాలకు పంపించాడు. రాముడు పరాక్రమవంతుడై కూడా తండ్రి ఆజ్ఞకోసం రుషి వేషంతో వనాలకు వెళ్ళాడు. అతని వెంట లక్ష్మణుడు కూడా వెళ్ళాడు. లక్ష్మణుడు, సుమిత్ర కొడుకు. రాముని భార్య సీత. ఆమె జనక మహారాజు కూతురు. సీత బహు ఉత్తమురాలు. సీత కూడా భర్తతో అడవులకు వెళ్ళింది. వారిని ముగ్గుర్నీ, పౌరులూ, దశరథుడూ చాలా దూరం సాగ నంపారు. రాముడు గంగాతీరాన శృంగబేర పురంలో దిగి, రథం వెనక్కి పంపించేశాడు. ఆ పట్నం రాజు గుహుడు. అతడు బోయరాజు. దశరథుడికీ, అతనికీ స్నేహం. అతను రాముణ్ణి గంగ దాటించాడు. తర్వాత, వారు అడవులు దాటుకుంటూ భరద్వాజ మహర్షి ఆశ్రమం చూసి, చిత్రకూట పర్వత సమీపంలో పర్ణశాల నిర్మించుకుని సుఖంగా వున్నారు.

రాముడు వెళ్ళిపోయిం తర్వాత దశరథుడు మర ణించాడు. పురోహితులూ, మిత్రులూ భరతుడికి పట్టం కట్టబోయారుగానీ భరతుడు అంగీకరించ లేదు. చిత్ర కూటం వెళ్ళి రాముణ్ణే రాజ్యం తీసుకోమని కోరాడు. రాముడు అంగీకరించలేదు. పాదుకలు మాత్రం ఇచ్చాడు. భరతుడు ఆ పాదుకల పక్షాన రాజ్య పాలన ప్రారంభించాడు.

రాముడు, చిత్రకూటానికి ప్రజలు వస్తూ వుంటారని భావించి దండకారణ్యం వెళ్ళిపోయాడు. ఆ మహా రణ్యంలో రాముడు విరాధుడనే రాక్షసుణ్ణి చంపాడు. శరభంగ మహర్షినీ, సుతీక్ష్ణ మహర్షినీ, అగస్త్య మహర్షినీ దర్శించాడు. అగస్త్యుడిచ్చిన ఆయుధాలు పుచ్చుకున్నాడు. అక్కడ మహర్షులంతా చేరి రాక్షసుల్ని సంహరించమని రాముణ్ణి కోరారు. రాముడు అలాగేనని వారికి మాట ఇచ్చాడు.

రాముడు అక్కడ వుంటూ వుండగా శూర్పణఖ వచ్చింది. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కూ చెవులూ కోసి పంపించాడు. తర్వాత ఖరుడు గొప్ప సేనతో వచ్చి రాముడిమీద పడ్డాడు. రాముడు వారినందర్నీ చంపేసి జన స్థానంలో రాక్షస పురుగు లేకుండా చేసేశాడు.

లంకలో రావణుడు ఇదంతా విని, కోపగించి, మారీచుణ్ణి వెంటబెట్టుకు వచ్చి, మాయోపాయంతో సీతని ఎత్తుకుపోయాడు.

రాముడు జటాయువు ద్వారా జరిగిందంతా విని దుఃఖిస్తూ సీతని వెదుకుతూ బయల్దేరాడు. దారిలో కబంధుడనే రాక్షసుణ్ణి చంపాడు. శబరిని కలుసు కున్నాడు.

పంపా తీరాన హనుమంతుడనే వానరుణ్ణి చూసి అతనిద్వారా సుగ్రీవుడి స్నేహం సంపాదించి, వాలిని చంపి, సుగ్రీవుణ్ణి వానర రాజ్యానికి రాజుని చేశాడు. తర్వాత సుగ్రీవుడు సీతని వెదకడానికి వానరుల్ని అన్ని దిక్కులకూ పంపించాడు.

హనుమంతుడు లంకకు పోయి సీతని చూసి లంక తగలబెట్టి వచ్చాడు.

తర్వాత రాముడు వానర సేనతో బయల్దేరి సముద్రంమీద సేతువు కట్టి, లంకకు పోయి, రావణుణ్ణి చంపాడు.

రాముడు సీతని శంకించి స్వీకరించనని తిరస్క రించాడు. సీత అగ్నిప్రవేశం చేసి 'నిష్కళంక'గా రుజువు చేసుకున్న తర్వాత స్వీకరించాడు.

తర్వాత, విభీషణుణ్ణి లంకకు రాజుని చేసి పుష్పక విమానంమీద అయోధ్యకు చేరి రుషివేషం విప్పేసి రాజు అయ్యాడు."

**[నారదుడు, ఇప్పటివరకూ - జరిగిపోయిన సంగతులు చెప్పినట్టు భూతకాల క్రియలతో చెప్పాడు. ఇంకా తర్వాత చెప్పిన దాంట్లో కొంత వరకూ, ప్రస్తుతం జరుగుతూ వున్నదాన్ని చెప్పి నట్టు వర్తమాన క్రియలతోటీ, తర్వాత దాన్ని భవిష్యత్ క్రియలతోటీ చెప్పాడు. అంటే, దీన్ని ఎలా అర్థం చేసుకోవాలంటే - నారదుడు వాల్మీకికి రాముడి గురించి చెపుతూ వున్న ఈ సమయం లోనే రాముడు అయోధ్యలో రాజ్యం చేస్తూ వున్నాడన్నమాట!**

**"గొప్ప సద్గుణాలు గల పురుషుడెవడైనా వున్నాడా?" అని వాల్మీకి నారదుణ్ణి అడిగింది, రాముడు రాజ్యం చేస్తూవున్న కాలంలోనే!**

**వాల్మీకి అడిగిన దానికి నారదుడు- "అయ్యో, లేకేం? అయోధ్యలో రాముడనే మహా సద్గుణ సంపన్నుడు వున్నాడు. చాలా కష్టాలు పడి, పద్నాలుగేళ్ళు వనవాసం చేసి ఈ మధ్యనే రావణుణ్ణి చంపి, అయోధ్యకు తిరిగి వచ్చి,**

**చక్కగా రాజ్యం చేస్తూ వున్నాడు! ఇంకా 11 వేల సంవత్సరాల వరకూ కూడా రాజ్యం చేస్తాడు" అని, జరిగిందీ జరగబోయేదీ అంతా చెపుతున్నాడు.**

**అయితే, వాల్మీకి వున్నది రాముడి రాజ్యంలోనే కదా? నారదుడు చెప్పేదాకా 'రాముడనే మహానుభావుడు' వున్నాడనే సంగతి వాల్మీకి మహామునికి తెలియనే తెలియదా? దశరథ మహారాజూ, ఆయన పుత్రులూ, రాముడు పద్నాలుగేళ్ళు వనవాసం చెయ్యడం, రావణ వధా, రాముడు అయోధ్యకు తిరిగి రావడం, ఇదంతా వాల్మీకికి తెలియదా? 'రాముడ'నే రాజు పేరే ఇప్పటిదాకా ఈయన వినలేదా? - ఇంత వింతగా ప్రారంభమవుతుంది 'రామాయణం' కథ! నారదుడు ఇంకా తర్వాత చెప్పే దాంట్లో 'ఉత్తర కాండ'లో సంగతులేమీ రావు. సీతని అడవుల్లో వదిలెయ్యడం, అక్కడ కుశలవులు పుట్టడం - ఈ సంగతులు ఇక్కడ వుండవు.]**

నారదుడు ఇంకా తర్వాత ఇలా చెపుతాడు – "రామ రాజ్యంలో దేశం సుభిక్షంగా వుంది. జనులందరూ సుఖంగా వున్నారు. రాముడు, వందలకొద్దీ అశ్వమేధ యాగాలూ, కోట్లకొద్దీ గోదానాలూ చేసి, బ్రాహ్మణులకు కోట్లకొద్దీ ధనం ఇస్తాడు. వందలకొద్దీ రాజ వంశాలు స్థాపిస్తాడు. ఈ రకంగా రాముడు 11 వేల సంవత్సరాలు రాజ్యంచేసి అప్పుడు బ్రహ్మలోకం వెళ్ళిపోతాడు. ఈ రామ చరిత్ర పరమ పవిత్రం. వేదాలతో సమానం. ఇది చదివిన వారు ఈ లోకంలో సకల సౌఖ్యాలూ అనుభవించి స్వర్గానికి కూడా వెళ్తారు" – ఈ రకంగా నారదుడు రామగాథ చెప్పి ఆకాశమార్గాన దేవలోకం వెళ్ళిపోయాడు.

తర్వాత వాల్మీకి, భరద్వాజుడనే శిష్యుణ్ణి వెంట పెట్టుకుని తమసా నదికి వెళ్ళి, ఒక రేవులో దిగి స్నానం చేసి పంచ కట్టుకుని చెట్లకింద తిరుగుతూ ఒక క్రౌంచ పక్షుల జంటని చూశాడు. ఆ పక్షులు రెండూ ఉల్లాసంగా కూస్తూ సంచరిస్తున్నాయి. అంతలో ఒక బోయవాడు దూరంనించి బాణం కొట్టాడు. మొగ పక్షి కిందపడి చచ్చిపోయింది. ఆడ పక్షి దీనంగా ఏడ్చింది. ఆ దృశ్యం చూడగానే వాల్మీకి మహర్షి, కోపంతో – "ఓయీ బోయవాడా! నువ్వెంతో కాలం బ్రతకవురా! కామ మోహితమై వుండిన పక్షుల జంటలో ఒకదాన్ని చంపావు" అన్నాడు.

ఆ మాటలు అని వాల్మీకి ఆశ్చర్యపడుతూ శిష్యుడి వేపు చూసి – "నేనన్నదేమిటో చూశావా? లయబద్ధంగా గీతంలాగ వుంది. వీణమీద పాడడానికి కూడా అనువుగా వుంది. శోకిస్తూ వున్న నా నోట వెలువడినది శ్లోకమే గాని వేరు కాదు" అన్నాడు.

భరద్వాజుడు కూడా – "అవును. సందేహం లేదు" అని అంగీకరించాడు.

వాల్మీకి ఆ శ్లోకం గురించే ఆలోచిస్తూ ఆశ్రమానికి వెళ్ళాడు.

లోకాలన్నీ సృష్టించేవాడూ, నాలుగు ముఖాలు గలవాడూ అయిన బ్రహ్మ అక్కడికి వచ్చాడు. వాల్మీకి చాలా సంతోషించి బ్రహ్మని ఆహ్వానించి పూజించి కూర్చోబెట్టాడు.

బ్రహ్మ, వాల్మీకితో – "మహర్షీ! నా సంకల్పం వల్లనే నీ నోటివెంట శ్లోకం వెలువడింది. ఈ శక్తితోనే 'రామ చరిత్ర' అంతా రచించు. రామ కథ అంతా నారదుడు చెప్పాడు కదా? ఇంకా రామ కథలో నీకు తెలియని రహస్యాలన్నీ కూడా నా అనుగ్రహంవల్ల తెలిసిపోతాయి. నువ్వు రాసిందేదీ అసత్యం అవదు. పర్వతాలూ నదులూ భూలోకంలో వున్నంత కాలమూ నువ్వు రచించిన రామ కథ వుంటుంది. రామాయణం ప్రచారంలో వున్నంత కాలమూ నువ్వు నా లోకాలలో సంచరిస్తూ వుంటావు" అని చెప్పి అంతర్ధానమైపోయాడు.

వాల్మీకీ, వాల్మీకి శిష్యులూ చాలా సంతోషించారు. అంతకుపూర్వం వాల్మీకి చెప్పిన శ్లోకాన్నే అందరూ మననం చేసుకున్నారు.

"ఇటువంటి శ్లోకాలతోనే నేను రామ కథ రచిస్తాను" అన్నాడు వాల్మీకి.

వెంటనే ఆ రుషి అనేక వందల శ్లోకాలతో రామ కథ రచించాడు. రామ కథా, రావణ వధా, అందరూ శ్రద్ధగా వినండి!

★ ★ ★

**వా**ల్మీకి, రామ కథలో వివరాలు తెలుసు కోవడానికి తూర్పు దిక్కుకి తిరిగి దర్భలమీద కూర్చుని అంతరదృష్టితో చూశాడు.

(వాల్మీకి, రామ కథ రాసేశాడని ఇంతకుముందే చెప్పి, మళ్ళీ అదే కథ రాయడానికి వివరాలకోసం ఇప్పుడు ఆలోచిస్తున్నట్టు చెప్పడం ఏమిటనే ప్రశ్న వస్తుంది. కానీ, ఇది రచనా శిల్పానికి సంబంధించిన విషయం. రామాయణంలో దాదాపు అన్ని ఘట్టాలూ ఇలాగే జరుగుతాయి. ముందు ఒకసారి క్లుప్తంగా చెప్పేసి, మళ్ళీ దాన్నే తర్వాత వివరంగా చెప్పడం ఉంటుంది. దీన్ని తప్పుగానో, పొరపాటుగానో, అర్థం

చేసుకోకూడదు. ఇది ఒక రచనా విధానం.)

వాల్మీకికి, రామ కథలో విషయాలన్నీ అర్థమై పోయాయి. యోగ దృష్టితో అంతా గ్రహించి రామ చరిత్ర రచించాడు. అందులో రామ జననమూ, అతని బలపరాక్రమాలూ, అతనంటే లోకాలకు గల ప్రీతీ, విశ్వామిత్రుడితో కలుసుకున్నప్పుడు జరిగిన వింత వింత కథలూ ...... (ఈ రకంగా ఇక్కడ రామాయణంలో ముఖ్య ఘట్టాల ప్రసక్తి అంతా వచ్చింది. 'ఉత్తర కాండ' ప్రసక్తి కూడా వచ్చింది ఇక్కడ) – ఇలాగ వాల్మీకి మహర్షి రామ కథ సమస్తమూ ఏడు కాండల్లో వర్ణించాడు.

★ ★ ★

**వా**ల్మీకి మహర్షి ఈ రామాయణం అంతా రాముడు రాజ్యం చేస్తూ వున్నప్పుడు రచించాడు. ఇందులో వున్న శ్లోకాలు ఇరవై నాలుగు వేలు. సర్గలు ఐదు వందలు. ఉత్తర కాండతో కూడా కలిపి ఏడు కాండలు.

ఇదంతా రచించిన తర్వాత వాల్మీకి – "ఇది ప్రజల ముందు ఎవరు ప్రకటిస్తారు?" అని ఆలోచనల్లో మునిగాడు. ముని వేషధారులైన కుశలవులు వచ్చి వాల్మీకి పాదాలు పట్టుకున్నారు. వారు వాల్మీకి ఆశ్రమం లోనే వుంటున్నారు. వారిద్దరూ అన్నదమ్ములు, రాముడి కొడుకులు.

వాల్మీకి, రామ కథ పాడడం వారికి నేర్పాడు. ఆ కుశలవులు, రుషుల సమావేశాలలోనూ, బ్రాహ్మణుల సభలలోనూ, సాధుజనులు చేరిన ప్రదేశాలలోనూ రామ కథ పాడుతూ వుండేవారు. రుషులూ, ప్రజలూ, వారి గాన మాధుర్యానికి సంతోషించి, నార బట్టలూ, కల శాలూ వంటి బహుమానాలు ఇస్తూ వుండేవారు.[2]

కుశలవులు రామ కథ పాడుతున్నారనే సంగతి విని రాముడు వారిని పిలిపించి సభలో పాడించాడు. "ఈ ముని కుమారులు రాజ లక్షణాలతో తేజరిల్లుతున్నారు. ఈ గానం నాకు చాలా సంతోషం కలిగిస్తోంది" అన్నాడు రాముడు.

# 'వాల్మీకి రామాయణం'లో అసలు కథ ప్రారంభం

**ఈ** భూమిని ఏలిన రాజు లందరిలోనూ ఇక్ష్వాకు వంశీయులు చాలా గొప్పవారు. ఎన్నడూ యుద్ధాలలో అపజయం ఎరగరు. ఈ భూమి, ఇక్ష్వాకు వంశీయులకే పుట్టుకు వచ్చిందా అన్నట్టుండేది. వారిలో సగరుడనే రాజు చాలా ప్రసిద్ధి పొందాడు. అతనివల్లనే సముద్రం పుట్టింది. అతనికి 60 వేల మంది కొడుకులు. తండ్రి యుద్ధాలకు బయల్దేరితే, ఆ కొడుకు లందరూ యుద్ధా లకు వెళ్ళేవారు.[3]

ఈ ఇక్ష్వాకు వంశీయులదే కోసల దేశం. అది సరయూనది సమీపాన వుంది. ఆ దేశంలో వున్న నగరా లన్నిటిలోనూ అయోధ్య గొప్ప నగరం. దాన్ని మనువు నిర్మించాడు. ఇక్ష్వాకు రాజులందరికీ అయోధ్య రాజ ధాని. ఆ నగరం తీర్చిదిద్దినట్టు వుంటుంది.

రాజ్యం పెంపు చేసుకోవడంలో మిక్కిలి నేర్పుగల దశరథుడనే రాజు అయోధ్యలో నివశిస్తూ వుండే వాడు.[4]

స్త్రీలకు వడ్డాణం వున్నట్టు అయోధ్య చుట్టూ ప్రాకారం వుంది. యుద్ధ యంత్రాలున్నాయి. ఫిరంగులు (శతఘ్నులు) వున్నాయి. ఆ నగరం నిండా మేడలే. ఎన్ని కరువులు వచ్చినా, ఎన్ని దీర్ఘయుద్ధాలు తటస్థించినా, ఆ నగరంలో ఆహార సామాగ్రి కొంచమైనా తరగదు. దేశ

---

**2.** కుశలవులు 'రామాయణం' పాడడం అంటే, కేవలం రామాయణాన్ని ఒక్కదాన్నే పాడారు – అని అర్థం చేసుకోకూడదు. ఊళ్ళ వెంట తిరిగి, అనేక రకాల కథలు పాడి, బిచ్చాలూ పాత బట్టలూ సంపాదించుకుంటూ బతికే జానపదుల నిరుపేద జీవితాల్ని ఇక్కడ అర్థం చేసుకోవాలి. ★

**3.** పూర్వం, గణాలుగా, తెగలుగా, బతికే కాలంలో, క్రూర జంతువుల వల్లా, శత్రువుల వల్లా ఎప్పుడూ జనం చచ్చిపోతూ వుండేవారు. అలాంటి దశలో ప్రతీ గణంలోనూ, తెగలోనూ, ఎక్కువమంది జనం కావాలని కోరుకుంటూ వుండేవారు. శత్రు తెగలతో యుద్ధాలు చేసి జయించడానికీ, ఉత్పత్తిని పెంచుకోడానికీ, జనం ఎక్కువగా వుండటమే అవసరం. ఎక్కువమంది జనం కావాలనే కోరికకు కథా రూపమే '60 వేల మంది' కొడుకులు! వారు తండ్రితో కలిసి యుద్ధాలకు వెళ్ళారు. వాళ్ళతో అవసరం అదే. ★

**4.** 'రాజ్యం పెంపు చేసుకోవడంలో మిక్కిలి నేర్పుగల రాజు' అట!

ఏమిటా నేర్పరితనం? రాజ్యం ఎలా 'పెంపు' అవుతుంది? ఇతర రాజ్యాల్ని కలుపుకుంటేనే. అంటే, చుట్టుపట్ల ప్రాంతాల మీద దాడులు చేసి, యుద్ధాలు చేసి, ఆ ప్రాంతాల్ని ఆక్రమించుకోవడంలో దశరథుడు నేర్పరి అన్నమాట! దురాక్రమణలనే గొప్ప వీరత్వంలాగ కవి వర్ణిస్తున్నాడు! ★

దేశాల నించి వచ్చిన కుబేరుల వంటి వర్తకులు ఎందరో ఆ నగరంలో వర్తకాలు చేసుకుంటూ వున్నారు. సామంత రాజు లెందరో వున్నారు. స్త్రీల నాట్య బృందాలెన్నో వున్నాయి ('వధూ నాటక సంఘః' అనే మాటలు కవి వాడాడు).

ఆ నగరంలో నాస్తికు లెవ్వరూ లేరు. రాజభక్తి లేని వారెవ్వరూ లేరు.

ఆ నగరంలో బ్రాహ్మణులందరూ ఉత్తములే. మహ ర్షుల వంటి వారే. క్షత్రియులందరూ మహా పరాక్రమ వంతులు. పులుల్నీ, సింహాల్నీ ఆయుధాలు లేకుండా చేతులతోనే చంపివెయ్యగలరు. అలాంటి బ్రాహ్మణుల తోటీ, క్షత్రియుల తోటీ, నిండి వున్న అయోధ్యను, దశ రథుడు, ఇంద్రుడు స్వర్గం పరి పాలించినట్టు పరిపాలిస్తు న్నాడు.

ఆ నగరంలో క్షత్రియు లందరూ బ్రాహ్మణుల ఆజ్ఞలు అనుసరిస్తూ వుంటారు. వైశ్యులందరూ క్షత్రి యుల ఆజ్ఞలు అనుసరిస్తూ వుంటారు. శూద్రులు, బ్రాహ్మణులకూ, క్షత్రియులకూ, వైశ్యులకూ సేవచేసు కుంటూ వుంటారు. (అయోధ్యలో 'పౌరుల్ని' వర్ణించే వర్ణనలన్నీ మొదటి 3 వర్ణాల వారికి సంబంధించినవి మాత్రమే. శూద్రులకు సంబంధించినవి కావు. శూద్రులు, మిగతా వర్ణాలకు సేవకులు.)

ఆ నగరంలో వేలకొద్దీ, లక్షలకొద్దీ, గుర్రాలూ ఏనుగులూ వున్నాయి.

దశరథుడికి ఎనమండుగురు మంత్రులున్నారు. (సుమంత్రుడు ఆ మంత్రుల్లో ఒకడు) వశిష్టుడూ, వామ దేవుడూ ఇద్దరూ పురోహితులు. వీరు మంత్రికార్యాలు కూడా నిర్వర్తిస్తారు. జాబాలి కేవలం రుత్విజుడు. వీరంతా, ధన కనక రత్న రాసులతో రాజ బొక్కసం నింపడంలోనూ, చతురంగ బలాలను కట్టుబాట్లలో వుంచడంలోనూ, రాజుకి సహాయపడుతూ వుంటారు. యుద్ధాలు ప్రకటించడంలోనూ, సంధులు చేసుకోవడం లోనూ వారు బహు నేర్పరులు. అలాంటి మంత్రులతో కలిసి దశరథుడు కోసలను పరిపాలిస్తూ వున్నాడు.

దశరథ మహారాజుకి కొడుకులు లేరు. 'కొడుకుల కోసం ఆశ్వమేధ యాగం చేస్తే బాగుండును' అను కున్నాడు దశరథుడు. (అన్నాళ్ళూ అశ్వమేధమే చెయ్య లేదా? – కథ, ఒక 'అశ్వమేధం' నించి మొదలవుతోంది.)

దశరథుడు వెంటనే సుమంత్రుణ్ణి పిలిచి, మంత్రుల్నీ, పురోహితుల్నీ తీసుకురమ్మన్నాడు. జాబాలీ, వశిష్టుడూ, అంతా వచ్చారు.

"పుత్ర సంతానం కోసం యజ్ఞం చెయ్యాలని వుంది" అన్నాడు దశరథుడు.

వశిష్టుడు పురోహితులతో ఆలోచించి – "అవును. నీ సంకల్పం బాగుంది. అలాగే చెయ్యి. తప్పకుండా కొడుకులు పుడతారు" అన్నాడు.

దశరథుడు మంత్రుల్ని చూసి – "యజ్ఞానికి అవసర మైన ఏర్పాట్లన్నీ చెయ్యండి" అని ఆజ్ఞాపించాడు.

తర్వాత దశరథుడు భార్యల దగ్గిరికి వెళ్ళి – "నేను కొడుకుల కోసం యజ్ఞం చేస్తున్నాను. మీరు దీక్షగా వుండండి" అని చెప్పాడు.

★ ★ ★

**త**ర్వాత సుమంత్రుడు దశరథుడితో ఈ రకంగా చెప్పాడు – "మహారాజా! పుత్రులు కలగడానికి వశి ష్టాదులు చెప్పిన ఈ ఉపాయం నేను ఇతిహాస రూపంగా ఇదివరకే విన్నాను. పూర్వం సనత్కుమార మహర్షి రుషు లకు ఒక కథ ఇలా చెప్పాడు. "ఇప్పుడు కాశ్యపునకు విభండకుడనే కొడుకు వున్నాడు. ఈ విభండకునికి రుష్య శృంగుడనే కొడుకు పుడతాడు. అతనికి తను నివశించే అడవి తప్ప, చుట్టూ చాలా ప్రపంచం వుందని తెలి యదు. పట్టణాలూ నగరాలూ వుంటాయనీ, అక్కడ రక రకాల మనుషులు వుంటారనీ, రకరకాల వస్తువులు వుంటాయనీ, తెలీదు. తన తండ్రిని తప్ప ఇతర మానవు లెవ్వర్నీ చూడకుండా పెరిగి పెద్దవాడవుతాడు.[5]

అప్పుడు రోమపాదుడనే రాజు అంగదేశం పాలిస్తూ వుంటాడు. అతని అధర్మ ప్రవర్తన వల్ల, ఒకసారి రాజ్యంలో అనావృష్టి సంభవిస్తుంది. (ఆ అధర్మ ప్రవర్తన ఏమిటో చెప్పలేదు. అప్పుడప్పుడూ రాజులు కూడా అధ ర్మంగా ప్రవర్తిస్తారు గానీ, బ్రాహ్మణులు మాత్రం ఎన్నడూ అధర్మంగా ప్రవర్తించరు.) అంగ దేశానికి రుష్యశృంగుణ్ణి తీసుకు రాగలిగితే వర్షాలు కురుస్తాయని పురోహితులు చెపుతారు. రోమపాదుడు సంతోషించి, రుష్యశృంగుడి కోసం వేశ్యల్ని ('గణిక') పంపుతాడు. వారు రుష్య శృంగుణ్ణి ఏకాంతంగా కలుసుకుని, రకరకాల తిను బండారాలు ఇచ్చి, మభ్యపెట్టి, అతన్ని అంగదేశం

---

**5.** పూర్వం ఆటవిక దశలనాటి మానవులు, తాము జీవించే ప్రదేశం తప్ప, చుట్టూ దూరంగా చాలా ప్రపంచం వుందని తెలియకుండానే తరతరాలు గడిపేస్తూ వుండేవారు. అటువంటి స్థితికి ప్రతిబింబమే ఈ రుష్యశృంగుడి కథ. ఈ కథలో రుష్య శృంగుడి తండ్రి ప్రసక్తేగానీ తల్లి ప్రసక్తి ఉండదు. ★

తీసుకువస్తారు. రుష్యశృంగుడు రాగానే అంగదేశంలో వర్షాలు కురిసి పంటలు పండుతాయి. రోమపాదుడు తన కూతురు శాంతకీ రుష్యశృంగుడికీ పెళ్ళిచేస్తాడు.[6] రుష్య శృంగుడు భార్యతో కలిసి అంగదేశంలోనే వుంటాడు.

ఇక్ష్వాకు వంశంలో దశరథుడనే రాజు పుడతాడు. అతడు రోమపాదుడి దగ్గిరికి వెళ్ళి – "రుష్యశృంగుణ్ణి మా దేశం పంపవలసింది. నాతో యజ్ఞం రుష్యశృంగుడే చేయించాలని నా కోరిక" అని అడుగుతాడు. రోమ పాదుడు అంగీకరించి రుష్య శృంగుణ్ణి పంపుతాడు. దశ రథుడి యజ్ఞం ముగిసి నలుగురు కొడుకులు పుడతారు." సుమంత్రుడు అంతవరకూ చెప్పి, తర్వాత "ఇదంతా సన త్కుమార మహర్షి పూర్వం ఎప్పుడో చెప్పాడు. కాబట్టి, దశరథ మహారాజా, నువ్వు రుష్య శృంగుణ్ణే పిలిపించి యజ్ఞం చేయించాలి" అన్నాడు. (రుష్యశృంగుడు సుమం త్రుడికి చుట్టంలాగున్నాడు. ఎలాగైనా ఈసారి యజ్ఞంలో పౌరోహిత్యం రుష్య శృంగుడికే ఇప్పించాలని చూస్తున్నాడు సుమంత్రుడు.)

వశిష్టుడితోగాక ఇంకో బ్రాహ్మణ్ణి పిలిపించి యజ్ఞం చేయిస్తే వశిష్టుడు అసూయ పడవొచ్చునని దశరథుడు అనుకున్నాడు. వశిష్టుణ్ణి పిలిపించి సనత్కుమారుడు చెప్పిన కథ చెప్పి, వశిష్టుడి అనుమతి తీసుకుని, రుష్య శృంగుడి కోసం రోమపాదుడి దగ్గిరికి వెళ్ళాడు.

రోమపాదుడు దశరథుణ్ణి చూసి సంతోషించి రుష్య శృంగుడితో – "దశరథుడు మనకు మిత్రుడు, బంధువు" అని చెప్పాడు. రుష్యశృంగుడు దశరథుణ్ణి పూజించాడు. దశరథుడు తన యజ్ఞం రుష్యశృంగుడే చేయించాలని అడిగి, శాంతనీ, రుష్యశృంగుణ్ణి తన దేశం తీసుకు వచ్చాడు.[7]

★ ★ ★

సంవత్సరం గడిచింది. దేశ దేశాలన్నీ తిరిగి యజ్ఞాశ్వం వచ్చింది. సరయూనది వొడ్డున యజ్ఞం ప్రారంభమైంది. బ్రాహ్మణులంతా నూర్గురేసి శిష్యులతో వచ్చారు. దిగంబరులైన సన్యాసులూ వచ్చారు.[8] స్త్రీలూ, పిల్లలూ ఎప్పుడూ అన్నం తింటూ, తృప్తి లేక మళ్ళీ మళ్ళీ తింటూ సంతోషిస్తున్నారు. పదార్థాలన్నీ పర్వతా లంతంత గుట్టలు పోస్తున్నారు.

యజ్ఞంలో యూప స్థంభాలకు కట్టిన మొత్తం పశు వులు మూడు వందలు. దశరథ మహారాజు ఉత్త మాశ్వాన్ని కూడా ఆ పశువులలో చేర్చారు. ఆ రాత్రంతా కౌసల్య ఆ గుర్రంతో గడిపింది. తర్వాత ఆ గుర్రం మెదడు తీసి హోమం చేశారు. తర్వాత గుర్రం అంగా లన్నీ హోమం చేశారు.[9]

దశరథుడు తన భూమి అంతా రుత్విక్కులకు దానం చేశాడు. వారు దాన్ని తిరిగి రాజుకే ఇచ్చి వెండి బంగా రాలు స్వీకరించారు. దశరథుడు తన దగ్గిర ఏమీ మిగల కుండా దాన ధర్మాలు చేసేశాడు. అంతా అయిపోయిం తర్వాత ఒక పేద బ్రాహ్మణుడు వచ్చి అడిగితే, చేతి

---

**6.** ముని కుమారులకూ క్షత్రియ కన్యలకూ పెళ్ళిళ్ళు జరగడాలూ, రాజులు బ్రాహ్మణ కన్యల్ని వివాహాలు చేసుకోవడాలూ, ఈ కథల్లో అక్కడక్కడా చూస్తాం. వర్ణాలనేవి, ఇంకా స్పష్టంగా ఏర్పడక పూర్వం, ఒక వృత్తికి సంబంధించిన వ్యక్తులు, ఇంకో వృత్తికి సంబంధించిన వ్యక్తుల్ని పెళ్ళి చేసుకోవడం – అనే విషయంతో దీన్ని అన్వయించుకోవచ్చు. ఒక కథాకాలంలో గానీ, ఒక పాత్ర జీవిత కాలంలో గానీ, అనేక వెనక దశల ఆచారాలు మిళితమైపోయి కనపడుతూ వుంటాయి. ★

**7. బాల కాండ, సర్గ 11, శ్లోకం 17**: రోమపాదుడు రుష్యశృంగుడితో దశరథుణ్ణి గురించి చెప్పిన చోట – "శాంతను కన్న తండ్రి దశరథుడే" అని చెప్పినట్టు కొంత మంది అనువాదకులు అనువాదం చేశారు (సఖ్యమ్ = స్నేహం, సంబంధకం = బంధుత్వం – అనే మాటల్ని ఆధారం చేసుకుని). శాంత దశరథుడి కూతురేననీ, రాముడికి అక్క అనీ, ప్రజల్లో నమ్మకం వుంది. కానీ, సంస్కృత శ్లోకంలో అదేమీ లేదు. ★

**8.** 'దిగంబరులైన సన్యాసులు' అనేదాన్ని ఎలా అర్థం చేసుకోవచ్చంటే: ఆటవిక కాలంలో మనుషులందరూ ఎంతో కాలం దిగంబరులుగా జీవించిన వారే. ఆకులూ అలములూ జంతుచర్మాలూ నారబట్టలూ చుట్టుకోవడం అలవాటవుతూ వున్నప్పుడు, అందరూ దాన్ని ఒకేసారి పాటించరు. కొందరు ఏదో ఒకటి చుట్టుకోవడమూ, కొందరు ఇంకా దిగంబరంగానే వుండడమూ, ఈ రెండు విధానాలూ నడుస్తూ వుంటాయి. ఈ దిగంబరంగా తిరగడం భారత దేశపు సన్యాసుల్లో 'ప్రాచీన కాలపు పవిత్రమైన ఆచారం'గా ఈనాటికీ వుంది! ★

**9. బాల కాండ, సర్గ 14, శ్లోకం 32**: 'కౌసల్య ఆ రాత్రి యజ్ఞాశ్వంతో గడిపింది.' ఈ శ్లోకంలో ఇంతకన్నా వివరంగా లేదు. దీన్ని ఒక మత నమ్మకంగా అనుకోవచ్చు. ఆ రాత్రి, కౌసల్య, ఆ గుర్రం దగ్గిర కూర్చుంది అన్నట్టు. కానీ కొందరు విమర్శ కులు దీనికి ఎలాంటి అర్థం చెపుతారంటే – 'కౌసల్య ఆ రాత్రి ఆ గుర్రంతో కామ సంబంధంగా గడిపింది' అని చెపుతారు. ఇలాంటి వికృతమైన అర్థాలు తియ్యడంవల్ల విమర్శకులు సాధించేదేమీ వుండదు. ★

మురుగుకూడా తీసి ఇచ్చేశాడు.[10]

అశ్వ మేధం ముగిసిం తర్వాత రుష్యశృంగుడు కొంచెం ఆలోచించి – "రాజా! సంతానం కలిగించ డానికి 'పుత్రకామేష్టి' అనే యజ్ఞం ఉంది. అది చేస్తాను" అని అది ప్రారంభించాడు. (ఇదేమిటి? అశ్వమేధం చేసింది ఎందుకు మరి? ఇప్పుడు మళ్ళీ పుత్రకామేష్టా? ఆ పుత్రకామేష్టేదో మొదటే చెయ్య వచ్చుకదా? పురో హితులందరికీ మళ్ళీ దాన ధర్మాలిప్పించాలని ఈ ఎత్తు! ఎంతో అమాయకంగా అడవుల్లో వుండే రుష్యశృంగుడు నగరంలోకి వచ్చాక ఎంత గడుసువాడయ్యాడో!)

దశరథుడు చేస్తోన్న పుత్రకామేష్టికి – దేవతలూ, గంధర్వులూ, సిద్ధులూ, చారణులూ, అందరూ వచ్చారు. వారంతా, అక్కడికి వచ్చిన బ్రహ్మతో – "రావణుడనే రాక్షసుడికి పూర్వం నువ్వు వరాలిచ్చావు. వాడు లోకా లన్నిటినీ పీడిస్తున్నాడు" అని గోలపెట్టారు. బ్రహ్మ "విచారించకండి. రావణుడు మానవుడి వల్ల చావు కలగకూడదని కోరలేదు. అందుచేత వాడు మానవుడి చేతిలోనే మరణిస్తాడు" అని చెప్పాడు.

అప్పుడే అక్కడికి శంఖు చక్రాలతో మహావిష్ణువు వచ్చాడు. దేవతలందరూ విష్ణువుని ప్రార్థించారు. విష్ణువు వారికి అభయమిచ్చాడు – "మీరేం విచారించకండి. నేనే మనుష్య జన్మతో రావణుణ్ణి సంహరించి ఈ భూమిని పాలిస్తాను" అన్నాడు. విష్ణువు, తనే దశరథుడికి నలుగురు కొడుకులై పుట్టాలని నిశ్చయించుకున్నాడు.

దశరథుడు చేస్తోన్న పుత్రకామేష్టి హోమ గుండం లోంచి ఒక మహా పురుషుడు బంగారు గిన్నెతో పాయసం పట్టుకు వచ్చి దశరథుడికిచ్చి – "ఇది నీ భార్యలకు పంచు. నీకు పుత్రులు కలుగుతారు" అని చెప్పి మాయమైపోయాడు. (అక్కడే వుంటే, కొడుకులు కలగకపోతే పట్టుకుంటారని గావున్ను.)

దశరథుడు సంతోషించి, పాయసంలో సగం కౌసల్యకిచ్చాడు. మిగిలిన సగంలో సగం (అంటే, 'పావు'ని) సుమిత్రకు ఇచ్చాడు, మిగిలిన పావులో సగం (అంటే, 'పరక'ని) కైకకు ఇచ్చాడు. మిగిలిన పరకని మళ్ళీ సుమిత్రకు ఇచ్చాడు.[11]

ఆ పాయసం తిని రాణులు గర్భాలు ధరించారు. ఈ రకంగా శ్రీ మహావిష్ణువు దశరథుడి భార్యల గర్భాలలోకి ప్రవేశించిన తర్వాత, దేవతలూ, గంధ ర్వులూ, సిద్ధులూ, చారణులూ అంతా, బ్రహ్మ ఆజ్ఞ చొప్పున, కోట్ల కొద్దీ వానరుల్నీ, ఎలుగుల్నీ కన్నారు. వారంతా పుట్టి మహావీరులై వున్నారు.

అప్పుడు కౌసల్యకు రాముడు పుట్టాడు. రాముడు విష్ణుమూర్తిలో సగం అంశ. తర్వాత కైకకు భరతుడు. భరతుడు పరక అంశ. తర్వాత సుమిత్రకు లక్ష్మణుడూ, శతృఘ్నుడూ పుట్టారు. వారిద్దరూ చెరో పరకన్నరా!

దశరథుడు కొడుకులు పుట్టాక ఆనందంతో బ్రాహ్మ ణులకు అపారంగా దానధర్మాలు చేశాడు.

దశరథుడి కొడుకులు పెరిగి పెద్దవారవుతున్నారు. సమస్త విద్యలలో ఆరితేరారు. అందరిలోనూ రాముడు మరీ గొప్పవాడయ్యాడు. అతనికి ధనుర్విద్య అంటే ప్రత్యేకమైన ఇష్టం.

లక్ష్మణుడు ఎల్లకాలం రాముణ్ణి అనుసరించి వుంటాడు. అలాగే శతృఘ్నుడు భరతుణ్ణి అనుసరించి వుంటాడు.

కొడుకుల్ని చూసి దశరథుడు ఆనందంతో రోజులు గడుపుతూ వున్నాడు. కొడుకులకు వివాహాలు చెయ్యా లని ఆలోచిస్తూ ఉన్నాడు. ఇలా వుండగా ఒకనాడు విశ్వామిత్రుడు అయోధ్యకు, దశరథ మహారాజు దగ్గిరికి వచ్చాడు. ★

---

**10.** బ్రాహ్మణుడైనా సరే, పేదవాడైతే అతనికి యజ్ఞ యాగాలవల్లా, దాన ధర్మాలవల్లా లాభించేదేమీ వుండదు. గాజో, మురుగో, పిడికెడు బిచ్చమో తప్ప! అసలైన భూదానాలూ, గోదానాలూ, సువర్ణ దానాలూ అన్నీ పురోహిత వర్గానికీ, ధనిక బ్రాహ్మణులకూ మాత్రమే. పేద బ్రాహ్మణులకు అలాంటివి దొరకవు. ★

**11.** దశరథుడి పంపకాలు చూడండి. అంత ప్రత్యేక పద్ధతిలో పంచడంలో రహస్యం ఏమిటి? – పాయసం ముగ్గురు భార్యలకూ సమానంగా ఇచ్చేస్తాడనుకోండీ. రాముడు, మిగతా వాళ్ళతో సమానం అయిపోతాడు. కొంప మునిగిపోతుంది. అందుచేత ముందు సగం కౌసల్యకి! అంటే రాముడు విష్ణువులో సగం అంశ. తర్వాతయినా మిగిలింది, మిగిలిన భార్యలకు సమానంగా ఇచ్చెయ్యవొచ్చు. కానీ అప్పుడు కూడా కొంప మునిగిపోతుంది. ఎలాగంటే, సుమిత్రకి ఇద్దరు కొడుకులు పుట్టాలి కథలో. కైకకి ఒక్కడే. కైకకీ, సుమిత్రకీ పాయసాన్ని సమానంగా ఇస్తే, ఇద్దరికీ చెరో 'పావు' వెళ్తుంది. కైక కొడుకైన భరతుడు ఒక్కడే విష్ణువులో పావు అంశా; సుమిత్ర కొడుకులు ఇద్దరూ కలిసి పావు అంశా అవుతారు. అది, కవికి ఇష్టం లేనట్టుగా వుంది. భరతుడి అంశకన్నా లక్ష్మణుడి అంశనే ఎక్కువగా వుంచాలనేది కవి అభిప్రాయంలాగ వుంది. అందుకే, భరతుణ్ణి 'పరక' అంశతోటీ, లక్ష్మణుణ్ణీ శతృఘ్నుణ్ణీ చెరొక 'పరకన్నర' అంశతోటీ, చేశాడు. ఈ కారణం తప్ప, ఈ కథ ప్రకారం, ఈ పంపకాలకి ఇంకే కారణమూ కనపడదు. ఇక్కడ, దశరథుడికి ముగ్గురు భార్యలు ఉన్నట్టు తెలుస్తోంది. కానీ, ఈ రాజుగారి భార్యల సంఖ్య ఇంతే కాదు. దీనికి ఇంకో 350 మందిని కలపండి! మొత్తం 353 మంది భార్యలు! ఈ సంగతి, అయోధ్యా కాండలో తెలుస్తుంది (సర్గ 39; శ్లోకం 36లో). ఒక రాజుకి **353** మంది భార్యలంటే, ఈ లెక్క ఏమిటి? ఆలోచించి చూడండి! ★

## కథ-1

# ఇదీ రామాయణం!

దశరథ మహారాజు ఒక మధ్యాహ్నం వేళ తన రాజభవనంలో ఒకరిద్దరు మంత్రులతో, పురోహితులతో, బహు సంతోషంగా ఇష్టాగోష్ఠి జరుపుతున్నాడు. వివిధ విషయాలనంతరం కొడుకుల ఆటపాటల గురించి ముచ్చటించి – "పిల్లలకు పధ్నాలుగేళ్ళు నిండాయి. ఇక పెళ్ళిళ్ళు చేసెయ్యాలి. మన కీర్తి ప్రతిష్టలకు తగిన సంబంధాలు చూడాలి మీరే" అంటూ వశిష్టుణ్ణీ, సుమంత్రుణ్ణీ ఉత్సాహంగా చూశాడు.

"శుభం! శుభం!" అంటూ అందరూ సంతోషం ప్రకటించారు.

"అటులనే చేయవచ్చును" అని వశిష్టుడు అంగీకరించాడు.

అంతలో ఇద్దరు ద్వారపాలకులు కంగారుగా పరుగెత్తుకు వచ్చి అందరికీ వంగి దణ్ణాలు పెడుతూ "మహారాజా! విశ్వామిత్ర మహర్షి దయచేశారు" అని విన్నవించారు.

మహారాజు దిగ్గునలేచి– "విశ్వామిత్రుల వారే! ఏమీ నా భాగ్యం! ఎక్కడ? ఎక్కడ?" అంటూ బయల్దేరాడు.

మంత్రులూ పురోహితులూ మహారాజు వెంట నడిచారు.

దండ కమండలాలతో, పిడికెడు జుట్టుముడితో, మెడకూ చేతులకూ రుద్రాక్ష మాలలతో, నార బట్టలతో, తీక్షణమైన చూపులతో సాక్షాత్కరించిన విశ్వా మిత్రుడి ఎదుట అందరూ భక్తితో మోకరిల్లారు.

దశరథుడు పొంగిపోతూ – "బ్రహ్మర్షీ! మీ రాకతో నా జన్మ సార్థకమైంది. నా రాజ్యం పావనమైంది. దయ చేయండి!" అంటూ జోడించిన చేతులతో మార్గం చూపిస్తూ రుషిని ఆహ్వానించాడు.

"బ్రహ్మర్షీ!" అన్న పిలుపు బహు కర్ణానందం కలిగించి విశ్వామిత్రుడు మందహాసం చిందించాడు.

వశిష్టాదులంతా– "ధన్యులం మునీశ్వరా! ఈ దినం తమ దర్శన భాగ్యం పొందగలిగాము" అంటూ ఎవరి సంతోషం వారు ప్రకటించారు.

గొప్ప భక్తితో వినయ విధేయతలతో ప్రారంభమైన అతిథి మర్యాదలకు తృప్తిపడి విశ్వామిత్రుడు చిరునవ్వుతో తల పంకిస్తూ, ముందుకు అడుగు వేశాడు.

దశరథ మహారాజు, రుషి వెంట నడుస్తూ "ఆహా! తపస్సే రూపుదాల్చినట్టు తేజోరాశిగా ప్రకాశిస్తున్నారు బ్రాహ్మణ శ్రేష్టులు. ఏమి అదృష్టం నాది! పురుషుడికి ఎందరు స్త్రీలతో సంబంధాలు వున్నప్పటికీ తన కుల సతికి మొగబిడ్డ కలిగినప్పుడు మాత్రమే ఎంత ఆనందం కలుగుతుందో అంత ఆనందం మీ రాకవల్ల నాకు కలిగింది స్వామీ! తన శక్తి సామర్ధ్యాలతో నిమిత్తం లేకుండా హఠాత్తుగా గొప్ప ధనం వచ్చి పడితే ఎంత ఆనందం కలుగుతుందో అంత ఆనందం మీ దర్శన భాగ్యంవల్ల కలిగింది స్వామీ!" అంటూ తన ఆనంద పారవశ్యాన్ని రకరకాల పోలికలతో వర్ణిస్తూ విశ్వామిత్రుణ్ణి ఆనంద పెట్టే ప్రయత్నం చేశాడు.

విశ్వామిత్రుడు కూడా మహారాజుని సంతోషపరిచేందుకు అభయహస్తం పట్టి – "నీకు శుభమగు గాక! నీకు మంగళమగుగాక!" అంటూ అడుగుకోసారి ఆశీర్వదిస్తూ రాజమందిరంలో ప్రవేశించాడు.

అప్సరసల వంటి పరిచారికలు బంగారు పళ్ళెంతో చల్లని నీళ్ళు తెచ్చి విశ్వామిత్రుడి పాదాలు పళ్ళెంలో వుంచి కడిగి, పట్టుపీతాంబరాలతో పాదాలు వొత్తి, వాటిని పూల తివాచీమీద వుంచారు.

వశిష్టుడు బంగారు గిన్నెతో చేతులు కడిగే నీళ్ళు ఇచ్చాడు. అర్ఘ్యపాద్యాది మర్యాదల అనంతరం విశ్వామిత్ర మహర్షి మందహాసంతో రాజసం వుట్టిపడే ఉన్నతాసనం మీద ఆశీనుడయ్యాడు. చుట్టూ మహా రాజుతో పాటు మంత్రులూ, పురోహితులూ వినయంగా నిలబడ్డారు.

మరికొందరు పరిచారకులు రత్నాలు పొదిగిన, మానవుల జీవితాల కన్నా విలువైన బంగారు గిన్నెలతో, నవనవలాడే రకరకాల పళ్ళూ, ఎంతటి రుషులకు కూడా చూసినంతనే చవులూరించే రుచ్య పదార్థాలూ తెచ్చి బ్రహ్మర్షి ఎదుట అమర్చారు.

మహారాజు, చేతులు జోడిస్తూ – "స్వీకరించండి స్వామీ! ఎంత దూరం నుంచి వేంచేశారో! మార్గ మధ్యంలో ఏమైనా భుజించారో లేదో! ఆరగించండి స్వామీ!" అంటూ ప్రార్థించాడు.

విశ్వామిత్రుడు మందహాసంతో పళ్ళన్నీ వొదిలి

తేనెలూరే జిలేబి వంటి పదార్థం తీసి నోట్లో వేసు కుంటూ, "వశిష్టా! తమరు కూడా స్వీకరించండి" అని సభా మర్యాద పాటించాడు.

అందరూ ఆసనాల్లో కూర్చుని పరిచారకులు అందిం చగా సంతుష్టిగా అల్పాహారాలు ఆరగించారు.

దశరథుడికి, మొహమంతా పరమానందంతో వెలుగుతోన్నా, "ఈ ముని ఇంత అకస్మాత్తుగా ఎందుకు వేంచేసినట్లో?" అని మనసు కలవర పడుతోనే వుంది.

విశ్వామిత్రుడు చిరునవ్వులతో తల పంకిస్తున్నా లోలోన – "వచ్చిన కార్యానికేమీ ఆటంకం జరగదు కదా?" అని సందేహపడుతూ చూశాడు.

వశిష్టుడూ, మంత్రులూ ఎవరి ఊహగానాలలో వారు ఉన్నారు.

దశరథుడా నిశ్శబ్దాన్ని భరించలేక – "మీ రాక మా అయోధ్యా నగరాన్నే పావనం చేసింది స్వామీ!" అని మళ్ళీ సంతోషించాడు పదోసారి.

"నీకు శుభమగుగాక" అని విశ్వామిత్రుడు మహా రాజుని పదోసారి దీవించి, "అంతా క్షేమమే కదా?" అంటూ కుశల ప్రశ్నలలోకి దిగి, "ఏమైనా కొత్త రాజ్యాలు ఆక్రమించావా? శత్రువులందర్నీ జయిం చావా?" అని చిరునవ్వుతో ప్రశ్నించాడు.[12]

మహారాజు కించిత్తు నిరుత్సాహపడుతూ "జయిం చాలనే ఉత్సాహం ఉన్నది స్వామీ! కానీ ఈ వయసులో" అని ఆగాడు.

"వయస్సు దేమున్నది రాజా? నీ అక్షౌహిణీ సేన లకూ, చతురంగ బలాలకూ వయస్సు మీరలేదు కదా? నీ మంత్రులు స్వామి భక్తిపరులైతే ....."

"బ్రహ్మర్షులు మన్నించాలి!" అంటూ సుమంత్రుడు లేచి వినయంగా నమస్కరించి – "మహా రాజులు పసి బిడ్డల ముద్దు ముచ్చట్లతో రాజ్యకాంక్షను రవ్వంత అలక్ష్యం చేసిన మాట వాస్తవమే. కానీ శత్రురాజులు కూడా బలవంతులై వున్నారని మునీశ్వరులు గ్రహిం చాలి" అని విన్నవించాడు.

విశ్వామిత్రుడు తల పంకించి, ఆ ప్రస్తావన వొదిలి – "సరేలే మహారాజా! నీ పుత్రులు ప్రయోజకులు కాగలరు గదా? నువ్వు విరమించిన కార్యం వారు సంపూర్ణం చేస్తారు" అని మహారాజుని మిక్కిలి సంతోష పెట్టి, "సామంత రాజులందరూ నీకు లొంగి వుంటు న్నారా?" అని ఇంకో ప్రశ్న వేశాడు.

దశరథుడు పౌరుషపడి – "ఎంతమాట! సామ్రా జ్యాధిపతుల్ని ధిక్కరించి స్వేచ్ఛ కోరే సాహసమా సామం తులకు? ప్రతి ఏటా చిల్లిగవ్వతో సహా కప్పాలు కడు తూనే వున్నారు. ఎల్లకాలమూ మన సామ్రాజ్యాధిపత్యం నీడన బ్రతకడానికే ఇచ్ఛగిస్తున్నారు. కానీ ...." అని సందేహిస్తూ ఆగాడు.

"ఏమి?"

"కొన్ని తూర్పు రాజ్యాలలో ప్రజలు అప్పు డప్పుడూ ...."

"అలజడులా?" – అలజడి పడుతూ అడిగాడు విశ్వామిత్రుడు.

సుమంత్రుడు వీరోచితంగా లేచి "అలజడులా? ఎవరో విద్రోహగుంపుల రాజభక్తి వ్యతిరేక కార్యాలు కూడా అలజడులేనా? సామ్రాజ్యాధిపతులు చూస్తూ మిన్నకుంటారా? లెక్కకు మించిన సైన్యాలను పంపి విద్రోహ చర్యలన్నింటినీ అరికట్టి, సామంత రాజ్యాలలో ఎప్పటికప్పుడు శాంతి స్థాపన కలిగిస్తూనే వుంటిమి గదా?" అని వివరించాడు.

"బాగు బాగు, దశరథా! నీ ముఖ్యమంత్రి వర్యుడు నీకు తగినవాడే! చిన్న పామును కూడా పెద్ద కర్రతో కొట్టమన్నారు వేదాల్లో! రాజు అన్నవాడెన్నడూ నీరసుడు కారాదు. ప్రజల తిరుగుబాట్లను సహించరాదు. మరి, వీరులనూ, విద్వాంసులనూ పుష్కలంగా ధన ధాన్యాలిచ్చి నీకు అనుకూలంగా వుంచుకొంటున్నావా? అది చాలా ముఖ్యం సుమా!"

"చిత్తం! వశిష్టుల వారి ఆజ్ఞ ప్రకారమే నడుస్తు న్నాను బ్రహ్మర్షీ! కవులనూ, కళాకారులనూ, వీరులనూ, శూరులనూ, ఎప్పటికప్పుడు బహుమతులతో, సన్మానా లతో, గొప్పగొప్ప పదవులతో, సంతోష పరుస్తూనే ఉన్నాను. వారు ఎల్లప్పుడూ మనకు విశ్వాసపాత్రులే."

"అవును. వారెన్నడూ సుఖలాలసను వొదల లేరు. వారి విషయంలో ఆ మాత్రం జాగ్రత్త చాలు. శాస్త్రో క్తంగా ఏటా యజ్ఞయాగాదులు చేస్తున్నావా?"

"చిత్తం! ఈ రాజ్యంలో వైదిక కర్మలకు లోటు జరుగుతుందా స్వామీ?"

---

**12.** బాల కాండ, సర్గ 19, శ్లోకం 45 నించి: విశ్వామిత్రుడు, దశరథుణ్ణి అతని సిరి సంపదల గురించీ, బొక్కసం గురించీ, శతృవుల గురించీ, చాలా కుశల ప్రశ్నలు అడుగుతాడు – 'నీ రాజ్యంలో అందరూ కుశలమే కదా? నీ బొక్కసం సమృద్ధమై అవ్యయంగా వుంది కదా? నీ సామంతులందరూ నీకు లొంగి వున్నారు కదా? నీ శతృవులందరూ పరాజితులైపోయారు కదా? యజ్ఞయాగాది వైదిక కర్మలు నిర్విఘ్నంగా సాగుతున్నాయి కదా?' – ఈ విధంగా. రుషులు, ఏ రాజుని కలిసినా మొదట ఇవే కుశల ప్రశ్నలు! ఆ రాజు, ఇరుగు పొరుగు రాజ్యాలు కూడా లాగేసుకుంటూ, తన సిరిసంపదలు పెంచుకుంటూ వుండాలి. రాజులు అలా అభివృద్ధి చెందాలని వారికి రుషుల ఆశీస్సులూ, దీవెనలూ! ★

"ఎన్నడూ జరగరాదు. దేవతలనూ, రుషులనూ, బ్రాహ్మణులనూ అసంతృప్తి చెందించే రాజు ఎంతో కాలం నిలువలేదు."

"గ్రహించాను. ఏటా దేశ దేశాల బ్రాహ్మల్నీ, రుషుల్నీ రావించి గోదానం, భూదానం, కన్యాదానం, సువర్ణదానం – ఎవరేది కోరితే అది చేసి సంతోష పరుస్తూనే వున్నాను మునీశ్వరా!"

విశ్వామిత్రుడు సంతృప్తిపడి చిరునవ్వుతో తల పంకించాడు – "బ్రాహ్మణులకు చేసిన దానధర్మాలతో బొక్కసం వెల్తిపడిందని రాజు విచారించరాదు. నీ మంత్రులు సమర్థులైతే ఎప్పటికప్పుడు ధన సేకరణ చెయ్యగలరు."

ఇంకో మంత్రి వినయంగా లేచి నమస్కరించాడు. "మహర్షులు మన్నించాలి! తమరు ఆశించిన విధంగానే ఎప్పటికప్పుడు ప్రజల మీద పన్నులతో రాజ బొక్కసాన్ని నిండుగా వుంచి, మహారాజుని సంతోషపెడుతూనే వున్నాము స్వామీ!" అని విన్నవించాడు.

"మహా బాగు! రాజ్యమంతా యజ్ఞ యాగాది కర్మలతో ఆధ్యాత్మిక చింతన పెంపొందించకపోతే కలుపు మొక్కలవలె నాస్తికులు తలలెత్తుతారు సుమా!"

"ఆ ఎత్తిన తలలను తుంచివేసే కర్తవ్యం మాదే స్వామీ! నాస్తికులను ఉపేక్షించేటంత నాస్తికులమా మేము?" – మంత్రి తన వంతు వీరత్వం ప్రదర్శించాడు.

విశ్వామిత్రుడు చిరునవ్వుతో – "దశరథా! నీ మంత్రులు మహా సమర్థులోయీ! నీ రాజ్యపాలనలో ఇక నాకెట్టి సందేహమూ లేదు. కానీ, బ్రాహ్మలు శూద్రులతో కర్మలు చేయించడం లేదుగదా?" అని కొంచెం సందేహిస్తూ ఆగాడు – తాను బ్రాహ్మణుడు కాకపూర్వం ఛండాలుడికి కూడా యజ్ఞార్హత కలిగించిన విశ్వామిత్రుడు.

దశరథుడు వినయంతో చేతులు ముడిచి "నా రాజ్యంలో బ్రాహ్మణులకు ఏమి లోటని అంతటి అనుచిత కార్యాలు చేసే దుస్థితి వారికి కలుగుతుంది స్వామీ?" అని నొచ్చుకున్నాడు.

విశ్వామిత్రుడు రుద్రాక్షమాలలు సర్దుకొని, మీగడతో చేసిన తీపి వంటకం నోట్లో వేసుకుని, కొంచెం సర్దుకుని కూర్చుంటూ – "మహారాజా! నీ రాజ్యంలో క్షత్రియులంతా బ్రాహ్మల్ని పూజిస్తున్నారా? వైశ్యులు క్షత్రియుల్ని గౌరవిస్తున్నారా? శూద్రులు అందరినీ సేవిస్తున్నారా? ఎన్నడూ వర్ణసంకరం జరగడం లేదు కదా?" అంటూ నాలికమీద తీపి రుచితో, 'వర్ణసంకరం' మీద ప్రశ్నలు కురిపించాడు.

ఆఖరి ప్రశ్నకు దశరథుడు కొంచెం కలవరపడ్డాడు. ఒకటి రెండు మాసాల కిందట దశరథ మహారాజు సంధ్యవేళ వ్యాహ్యాళి నుంచి తిరిగివస్తూ, నీళ్ళ కడవతో నడచి వొస్తున్న వొక శూద్ర స్త్రీని చూసి కామించి, తెచ్చి అంతఃపురంలో వుంచిన సంగతి వశిష్ఠుల వారికీ, సుమంత్రుడికీ తప్ప ఎవ్వరికీ తెలీదన్న ధైర్యంతో తేరుకొని, గంభీరంగా మాట్లాడాలనే ప్రయత్నంలో ఆసనం దిగి ప్రారంభించాడు. "వర్ణసంకరమా! కోసల రాజ్యంలో అంతటి ఘోరమా! ఒక ఉదంతం నివేదిస్తాను, ఆలకించండి స్వామీ! మొన్న ఒక రాచ చిన్నది యౌవన ప్రభావం వల్ల ఒక వైశ్య యువకుణ్ణి మోహించి వివాహమాడాలని కోరింది. తల్లిదండ్రులూ, బంధువులూ, పెద్దలూ, పురోహితులూ, అందరూ సర్వవిధాలా కూడదని చెప్పి చూశారు. కానీ వారిద్దరూ మంచి చెడ్డలు తెలియని అజ్ఞానంతో ఈ నగరం నుంచి పరారీ అయి ఒక క్షుద్ర దేవతా సమక్షంలో వివాహం చేసుకున్నారు. కానీ అటువంటి హీనకార్యం ధర్మ వివాహం కానేరదని వేద వేదాంగాలు ఘోషిస్తున్నాయి కదా? – తక్షణమే ఆ యువతి తండ్రి మాకు విన్నపం చేస్తే, 'ఔరా! మా రాజ్యంలో ఇంత అనుచిత కార్యమా? ఇట్టి వర్ణసంకరమా?' అని నా మంత్రులు మిక్కిలి విచారించి – ఎట్టి అలక్ష్యమూ, జాప్యమూ జరగకుండా వందలకొద్దీ భటుల్ని వారి గాలింపుకై వినియోగించారు. భటులు మరుసటి దినమే వారిని పట్టి బంధించి జయప్రదంగా తిరిగి వచ్చారు. మా న్యాయాధిపతులు ఆ కుర్రవాడికి కఠిన కారాగారశిక్ష విధించారు. ఆ చిన్నదానిని స్వకులంలో ఒక ధనవంతుడైన యోగ్యుడికిచ్చి పెద్దలు శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు" అని చెప్పి వర్ణసంకర కార్యాన్ని అరికట్టిన గర్వంతో నిలబడ్డాడు దశరథుడు.

"శుభం!" అని సంతోషించాడు విశ్వామిత్రుడు. కానీ ఆ రాచ చిన్నది, ఆ వేదయుక్త వివాహం జరిగిన మర్నాడే ఆత్మహత్య చేసుకుని మరణించిన సంగతి మహారాజు వరకూ రాలేదు. వచ్చినా అది మహా ముని వరకూ పోదు.

విశ్వామిత్రుడు కించిత్తు విచారిస్తూ – "అజ్ఞానులైన ప్రజలు నిత్యమూ ఏదో ఒక అనుచిత కార్యం చెయ్యక మానరు రాజా! వాటిని అరికట్టి, ధర్మం నాలుగు పాదాలూ నడిచే రీతిగా పాలించడమే రాజు ధర్మం. అందుకే కదా ప్రజల కార్యకలాపాలు చారుల ద్వారా రాజు గ్రహిస్తూ ఉండడం? మరొక సందేహం రాజా! ప్రజలు రాజభక్తులై వుంటున్నారా? స్త్రీలు వ్రతాలూ, నోములూ క్రమం తప్పక చేస్తున్నారా? కొడుకులు, తండ్రుల్ని గౌరవిస్తున్నారా? భార్యలు భర్తల్ని పూజిస్తూ విధేయులుగా వుంటున్నారా? పామరులు, పురాణ శ్రవణంతో సంతోషపడుతున్నారా? – రాజా! ఇవన్నీ నిత్యం తెలుసుకొంటూ వుండాలి నువ్వు" అని హెచ్చ

రించాడు.

విశ్వామిత్రుడు కుశల ప్రశ్నల మధ్య చేసే నీతి బోధలు, జీవితమంతా రాజ్యపాలన చేసిన వృద్ధ మహా రాజుకి కష్టం కలిగినప్పటికీ, పైకి సంతోషంతో పొంగి పోతూ చెప్పుకొచ్చాడు – "బ్రహ్మర్షీ! నా పట్ల కరుణచేతనే తమరిన్ని విధాల ప్రశ్నించి నా యోగక్షేమాలు విచారిస్తు న్నారు. ధన్యుడిని! ఈ రాజ్య పాలనలో ఆదినుంచి నాకెట్టి ఇబ్బందులూ లేవు. నా బంధుమిత్రులంతా నా సామ్రాజ్యంలోనే పెద్ద పెద్ద పదవుల్లో నాకు కుడిభుజంగా వున్నారు. నా మంత్రులు నాకు నమ్మకస్తులై, విశ్వాస పాత్రులై, రాజ్య విస్తరణకూ, సామంతరాజ్యాల నిర్వ హణకూ అను కూలురుగా వున్నారు. నా చతురంగ బలాలు ఎల్లప్పుడూ శత్రురాజ్యాల మీదకు ఉరికే ఉత్సా హంతో పొంగి పొర్లుతూ వున్నాయి. నా బొక్కసం నిండా అంతులేని ధనధాన్యాలున్నాయి. ఆయుధాగారాల నిండా మితిలేని ఆయుధాలూ, శతఘ్నులూ వున్నాయి. ప్రజలు, దేనికీ ఫిర్యాదుచేసే ధైర్యంలేక అణిగిమణిగి వినయంగా వున్నారు. పురోహితుల ఆదేశానుసారం వైదిక కర్మలు నిర్వహిస్తూ బ్రాహ్మణోత్తముల ఆశీస్సులతో సుఖంగా రాజ్యపాలన చేసుకొంటున్నాను" అని తన భోగాధిక్య తను ప్రకటించాడు.

విశ్వామిత్రుడు తల పంకించి – "బహు సమర్థు డివే! అయితే అటువంటి మహారాజువయిన నువ్వు కూడా పురోహితుల ఆజ్ఞలకు లొంగి వుంటున్నావు కదా?" అని హాస్యమాడాడు.

"ఈ ఆస్థానంలో ఏ పురోహితుడినైనా, ఏ రుత్విక్కు నయినా ప్రశ్నించి తెలుసుకోవచ్చునే మునీశ్వరులు!" అని దశరథ మహారాజు కొంచెం చిన్న బుచ్చుకున్నాడు.

వశిష్ఠుడు కలగజేసుకుని – "విశ్వామిత్రా! దశరథ మహారాజు ధర్మ సూక్ష్మాలన్నీ ఎరిగినవాడు. మహారాజుని ఇంతగా పరీక్షించటం ధర్మం కాదు" అని మందహాసం చిందించాడు.

విశ్వామిత్రుడు దశరథుణ్ణి సంతోషపెట్టే ధోరణితో "రాజా! సలక్షణంగా శోభిల్లుతోన్న నీ రాజ్యపాలన నాకు మహదానందం కలిగించింది. అందుకే శ్రీ మహా విష్ణువు నీ గర్భాన జన్మించాడు. నీకు మంగళమగుగాక!" అని చెయ్యెత్తి ఆశీర్వదించాడు.

ఆ మహారాజు చేసే శాస్త్రోక్త పరిపాలనకు మెచ్చి భగవంతుడు కూడా రాజు పట్టే అయ్యాడని విశ్వా మిత్ర మహర్షి చెప్పిన దానికి దశరథ మహారాజు చాలా సంతో షించాడు.

మాటల మధ్య విశ్వామిత్రుడు నాలుగు పళ్ళేలలోని పదార్థాలన్నీ ఖాళీచేసి, నాలుగు వెండిచెంబుల మీగడ పాలు తాగి సంతుష్టుడై, భారంగా వెనక్కి వాలుతూ, అరమోడ్పు కన్నులతో – "రాజా! నీకు జయమగుగాక!" అని నోటిమాటలతో దీవించి వూరుకున్నాడు, చెయ్యెత్త లేక!

విశ్వామిత్రుడి రాక గురించి దశరధుడికి మళ్ళీ శంక ప్రారంభమైంది. కొంత తటపటాయించి "బ్రహ్మర్షీ! తమరు దయచేసిన కార్యమేమో ఈ సేవకుడికి విన్న వించండి! తమ ఆజ్ఞాపాలనే నా ధర్మంగా పాటిస్తాను" అని ప్రార్థించాడు.

"బ్రహ్మర్షీ!" అన్న పిలుపు ఎప్పుడు చెవులబడ్డా విశ్వామిత్రుడికి శరీరం పులకరిస్తుంది. తనని బ్రాహ్మణు డిగా లోకం గుర్తించినందుకు హృదయమంతా ఆనంద సాగరమవుతుంది. ఆ సంతోష పారవశ్యంలో భుక్తా యాసం మరిచి కొంచెం ముందుకు వొంగుతూ "రాజా! ఒక పవిత్ర యజ్ఞం ప్రారంభించాను. ఎప్పుడూ ప్రారం భమేగాని, దాన్ని పూర్తి చేసి దేవతల్ని సత్కరించే భాగ్యం లేనట్లున్నది" అని ఆగాడు.

"ఏమీ? ఏమి ఆటంకము? విశ్వామిత్ర మహర్షి తల పెట్టిన యాగ విధికి కూడా ఆటంకమా!" అని మహా రాజూ, మిగిలిన వారూ ఆశ్చర్యచకితులయ్యారు.

"అడవులలో మా జీవితాల గురించి మీకు తెలియని దేమున్నది రాజా? యజ్ఞ యాగాదుల్ని విఘ్నం చేసే రాక్షసుల మధ్య, తలపెట్టిన కార్యం జయప్రదం కావడం బహు కష్టం కదా?"

"మహర్షీ! ఆ క్షుద్ర రాక్షసుల్ని తమరు శపించ వచ్చునే!"

"కూడదు. ఈ యాగ విధి అటువంటిది. ఈ కార్యం చేస్తూ మధ్యలో కోపం తెచ్చుకోకూడదు. ఎవరినీ శపించ కూడదు. లేకుంటేనా? ఆ నీచ రాక్షసుల్ని నల్లుల్లో, బల్లుల్లో కమ్మని శపించనా? పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయనే నమ్మకంతో ఎన్నో పర్యాయాలు యాగం ప్రారంభించాను. హఠాత్తుగా జరిగిన విఘ్నాలతో విసిగి వేసారిపోయాను. చివరకు తీవ్రంగా యోచించి నా ఆశ్రమం నుంచి బయల్దేరి నీ దగ్గరకు వచ్చాను."

"మహాప్రసాదం! ఏమి శలవు?"

విశ్వామిత్రుడు తలతిప్పి మౌనం వహించాడు.

"సందేహమేల స్వామీ? బ్రాహ్మణోత్తముల ఆజ్ఞలకు బద్ధుణ్ణి గదా? ఆడిన మాట తప్పడం మా వంశంలో లేదని తమ రెరుగరా?"

"ఎరుగకేమి రాజా? రఘుకులంలో పుట్టిన నువ్వు మాట తప్పగలవా? అటు సూర్యుడు ఇటు పొడిచినా అసత్య మాడగలవా? వినగానే కలవర పడతావేమోనని సందేహిస్తున్నాను. అసలు సంగతి శాంతంగా విని అర్థం చేసుకో సుమా! నీ జ్యేష్ఠ పుత్రుణ్ణి – రాముణ్ణి – నాతో పంపు! అందుకే వచ్చాను."

అందరూ తెల్లబోయారు.

దశరథుడు నిర్ఘాంతపోయాడు.

"రాముణ్ణా? ఆ రాక్షసుల్ని జయించడానికి రాముణ్ణి పంపనా? అయ్యో! వృద్ధుడితో పరిహాసమా స్వామీ?"

విశ్వామిత్రుడు ఆదినించీ కఠోరంగా వుండదల చాడు – "అంతదూరం నుంచి నీతో పరిహాసానికి వొచ్చిన వాడినా నేను? రాజా! మొదటే చెప్పాను గదా, కలవరపాటు కూడదని? అనేక విషయాలు యోచించి రాముడికోసం వచ్చాను. నేనే శత్రు హింసకు తలపడితే, నా యాగాన్ని నేనే విఘ్నం చేసుకున్న వాణ్ణి అవుతాను. అదిన్నూగాక, విశ్వామిత్రుడికి బ్రహ్మర్షి అయినా కోపం పోలేదన్న లోకనింద భరించాలి. రాజా! నాలో విశ్వాసం వుంచు! రాముడు చిన్నవాడనే సందేహం వొద్దు! నా రక్షణలో అతను సురక్షితంగా వుంటాడు. రాముడికి సమస్త విద్యలూ చెపుతాను. అజేయమైన ఆయుధాలు ఇస్తాను. నేను వెనక వుండి అతనితో పని జరిపిస్తాను" అని దశరథుడి మొహం పరీక్షగా చూశాడు.

దశరథుడు మరింతగా దుఃఖపడుతూ, "అయ్యో! ఇది పరిహాసం కానే కాదా? నా చెవులు సత్యమైన మాటలే వింటున్నాయా? మహర్షీ! నిన్న మొన్నటి వరకూ రాక్షసుల కథలు చెప్పి నిద్రపుచ్చే వారు బిడ్డల్ని దాదులు. కథలు వింటేనే భయపడే పసివాడు రాక్షసులతో యుద్ధం ఎలా చేస్తాడు? ఇంకా ఆట పాటలు వొదలని వయసు. ధనుర్విద్య కూడా పూర్తి కాలేదు. శత్రువు బలా బలాలు ఏ విధంగా అంచనా కడతాడు? ఇంత వింత ఎక్క డయినా జరిగిందా? విశ్వామిత్ర మహర్షీ! ఆ పసి కందుతో తమ కేమి పని జరుగుతుంది? స్వయంగా నేను బయల్దేరి వొస్తాను ఆ రాక్షసుల్ని అణచడానికి. సంతోషమేనా?" అని ఆశగా చూశాడు.

"రాక్షసులంటే నీ సామంత రాజులనుకున్నావా, నీ బెదిరింపులకు లొంగడానికి? ఈ వయసులో నువ్వేం యుద్ధం చేస్తావు?"

"నా చతురంగ బలాలను పంపిస్తాను. నా సేన వీరాధివీరులు. మహాశూరులు. యుద్ధ నిపుణులు. సమ ర్థులు. సాహసికులు."

"జీత బత్తెములమీద పనిచేసే నీ సేన సంగతి నాకు చెప్పవలెనా రాజా? ప్రాణములకు తెగించి పోరాడే ఆ రాక్షస వీరుల ఎదుట నీ సేన ఎక్కడ నిలబడగలదు?"

దశరథుడు హతాశుడై – "ఎవరా వీరులు? వారి బలా బలాలెట్టివి? వారి పోరాట లక్ష్యమేమిటి?" అని ఆతృతగా ప్రశ్నించాడు.

విశ్వామిత్రుడు రుద్రాక్ష మాలలు సవరించుకొని కమండలం వొక దండ కిందనించి తీసి, ఇంకో దండ కింద పెడుతూ వ్యంగ్యంగా "పవిత్ర వైదిక కర్మకాండల వ్యతిరేకతే వారి పోరాట లక్ష్యం. అది క్షుద్ర రాక్షస కుల జుల జన్మ లక్షణమేగదా మహా రాజా! లక్ష్య సాధన కన్నా దేవ బ్రాహ్మణ హింసే వారికి పరమానందం" అని దశరథుడి ముఖ కవళికలు పరిశీలించాడు.

"వారికి నాయకుడున్నాడా మహర్షీ?"

"లంకాధిపతి రావణుణ్ణి గూర్చి వినలేదా?"

"రావణుడా!" – అదిరిపడ్డాడు మహారాజు. పురో హితులు ఆసనాలలో సర్దుకుని వెనక్కి జరిగారు. మంత్రులు ఆందోళన పడుతూ వొకరి మొహాలొకరు చూసుకున్నారు.

"బ్రహ్మ ఇచ్చిన వరాలవల్ల వాడు మదించి విర్రవీగు తున్నాడు. దేవతలనే తన ఆజ్ఞానుసారం నడిపిస్తున్నాడు. వాడు వన విహారాలు చేసేటప్పుడు గాలి తన తీవ్రత నంతా ఆపుకొని మృదువుగా వీచాలి. సూర్యుడు తన ప్రకాశమంతా తగ్గించుకొని చల్లగా వెలగాలి. సము ద్రుడు తన హోరు మానుకుని శాంతంగా కదలాలి. మునీశ్వరులు అప్సరసలతో క్రీడిస్తే వాడు సహించడు గదా? ఎక్కడా, ఎవ్వరూ యజ్ఞ యాగాది కర్మలు తలిచే పనిలేదు గదా? వెయ్యి సంగతులెందుకు రాజా? దేవ తల్నీ, రుషుల్నీ, బ్రాహ్మల్నీ అణిచి వెయ్యడమే వాడి రాక్షస పరిపాలన లక్ష్యం!"

దశరథుడికి లోపల వొణుకు ప్రారంభమైంది. పెద్ద పెద్ద జరీపువ్వుల పట్టు బట్టలు బరువుగా వుండడంచేత మహారాజు శరీర కంపనాలు ఎవరికంటా పడలేదు. "ఇంకా నయం, యుద్ధానికి బయలుదేరాను కాను" అని సంతోషపడి అంతలోనే నీరసపడిన కంఠంతో – "దేవతలూ, గంధర్వులూ కూడా ఎదుట నిలబడలేని ఆ రావణుణ్ణి నేను జయించలేను సుమా! అయినా మనలో మనమాట! బ్రహ్మ అంతటివాడు వరాలిచ్చిన తర్వాత ఆ రాక్షస రాజుని ఎవరు మాత్రం జయించగలరు?" అని ఉస్సురన్నాడు.

విశ్వామిత్రుడు కోపపడుతూ – "మహారాజువై యుండి అజ్ఞానివలె మాట్లాడెదవేమి? శ్రీ మహా విష్ణువుకి తప్ప, బ్రహ్మరుద్రాదులకు, వారే వరాలు ఇచ్చినప్పటికీ, సంపూర్ణంగా రక్షించే శక్తి వారికి లేదని ఎరుగవా?" అని మందలించాడు.

వశిష్ఠుడు శాంతస్వరంతో ప్రారంభించాడు. "మహా రాజా! రావణునికి వరం ఇచ్చిందీ బ్రహ్మే, అతనికి కీడు మూడే ఉపాయం చెప్పిందీ బ్రహ్మే. తనని ప్రార్థించి తపస్సు చేశాడనే మొహమాటం కొద్దీ వరం ఇవ్వడమే గానీ, దేవాధిపతి అయిన బ్రహ్మకు, ఒక రాక్షస రాజుపైన స్నేహ మమకారాలెందుకుంటాయి? దేవతలకూ, వారిని పూజించే బ్రాహ్మణులకూ శాశ్వతంగా హాని కలిగే పని బ్రహ్మ ఎందుకు చేస్తాడు? నాలుగునోళ్ళు గలవాడు

నాలుగు మాటలు మాట్లాడినా దోషం లేదు కదా? రావణుడు ఎంత వీరుడయినా మరణం లేనివాడని మాత్రం తలచ వొద్దు!" అని ధర్మ సూక్ష్మాలు బోధించాడు.

విశ్వామిత్రుడు ఉత్సాహవంతుడై – "ఇప్పుడు రావణునితో తలపడే అత్యవసరమేమీ లేదు రాజా! వాడు నిర్లక్ష్యంతో తన అనుచరుల్ని మాత్రమే యాగ విధ్వంసక చేష్టలకు వినియోగిస్తున్నాడు. ముఖ్యంగా తాటకీ, మారీచ సుబాహులూ అనేవాళ్ళు మా ఆశ్రమ ప్రాంతంలో బహుకంటకులుగా వున్నారు. ముందు వారిని హతమార్చాలి!" అని రాజు మొహం తీక్షణంగా పరిశీలించాడు.

మహారాజు మళ్ళీ తీరని విచారంలో మునిగిపోయాడు – "అయ్యో! నా రాముణ్ణి విడిచి వొక్క క్షణం కూడా జీవించలేనే! ఎన్నో సంవత్సరాలు బిడ్డల కోసం దుఃఖించి దుఃఖించి ఎన్నో వ్రతాలు చేసి కన్నాను రాముణ్ణి మునీశ్వరా! ఆ రాక్షస యుద్ధంలోకి నా ముద్దుల కొడుకుని ఎలా పంపగలను?" అని తలవాల్చి దుఃఖించాడు.

రాజు ధోరణికి విశ్వామిత్రుడు అగ్నిలో ఆజ్యం పోసినట్టు భగ్గుమన్నాడు, అది యాగం చేసే సమయం కాకపోవడంచేత! – "తల్లి పుట్టింటి సంగతి మేనమామకు చెప్పినట్టుంది రాజా నీ వరస. నీ పురుషత్వం వల్లనే బిడ్డల్ని కన్నట్టు మాట్లాడుతున్నావే! భూలోకంలో రాక్షసజాతి నాశనానికే గదా రాముడు పుట్టింది? రావణ వధకే కదా మహావిష్ణువు రాముడై జన్మించింది? సర్వమూ మరిచినట్టున్నావే! నీ తదనంతరం ఈ విశాల సామ్రాజ్యానికి వారసుడు రాముడే గదా? రాజ్యంలో వొకమూల అశాంతీ, అలజడులూ రేగుతూ వుంటే యువరాజుని అసమర్థుడిగా ఆటపాటలతో వుంచుతావా? ప్రజా ధిక్కారాలను ఎప్పటికప్పుడే అణచవలెనని ఎరుగవా? వృద్ధుడవై నీ జ్ఞానం నశించింది. ఎంత బోధించినా గ్రహించ లేకుండా వున్నావు. సరే! నేను పోతాను. భూమండలమంతా దేవ బ్రాహ్మణులకు నిలువ నీడలేకుండా చేసే రాక్షస రాజ్యమై విస్తరించనియ్యి! ఆడిన మాట తప్పావనే కీర్తితో జన్మజన్మల వరకూ నీ ప్రతిష్ఠ ప్రకాశించనియ్యి!" అంటూ పట్టరాని కోపంతో వూగుతూ లేచి నిలబడ్డాడు.

వశిష్ఠుడు ఆసనం నించి చటుక్కున లేచివొచ్చి విశ్వామిత్రుణ్ణి శాంతంగా కూర్చోబెడుతూ, "శాంతించండి బ్రహ్మర్షీ, శాంతించండి!" అంటూ, కోపాగ్నిని జయించిన బ్రహ్మర్షిని అతి ప్రయత్నంమీద శాంత పరచాడు. దశరథుడి దగ్గిరికి వెళ్ళి – "మహా రాజా! మాట తప్పవలసిన దౌర్భాగ్యం నీ కెందుకు కలగాలి? ఈ బ్రహ్మర్షి శక్తిని నువ్వేమీ అంచనా కట్టలేకపోయావు. ఈ రుషి రక్షణలో వున్న రాముడికి అస్త్రవిద్య తెలిసినా తెలియకపోయినా హాని కలగదు. ఈ మునికి తెలిసినన్ని ఆయుధాలూ, అస్త్ర శస్త్రాలూ, ఇప్పటికి లోకంలో ఎవ్వరికీ తెలియవు. రాక్షస వధ కోసం ఇంకా కొత్త అస్త్రాలు కూడా సృష్టించగల సమర్థుడు ఈ ముని. నీ చతురంగ బలాలనీ, అక్షౌహిణీ సేనల్నీ తీసుకువెళ్ళి యుద్ధం చేయిస్తే – 'వనాలలో తపస్సు చేసుకునే మునులకు యుద్ధాలేమిట'ని లోకం పరిహసించ వచ్చునని ఈ ముని కించపడుతున్నాడు. తన అస్త్రాలన్నీ ఇతరులకిచ్చి వారితో తన కార్యం పూర్తి చేయించుకున్నందువల్ల ఆ నింద కలగదు. తనుచేసే మేలు యువరాజుకే చేయాలని ఇంతగా అడుగుతున్నాడు. పాముని కర్రతో కొట్టినట్టు రాక్షసుల్ని రాముడి ద్వారా సంహరిస్తాడు. కర్త విశ్వామిత్రుడే. ఈ లోక ధర్మాలను నిర్దేశించేదీ, రక్షించేదీ బ్రాహ్మణులే అని గ్రహించు! బ్రాహ్మణులు కోరేదెప్పుడూ సామ్రాజ్యాల క్షేమమే కదా?" అంటూ శాంతంగా నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు.

దశరథుడేమీ విన్నట్టు లేదు. ఇష్టా యిష్టాలు ప్రకటించకుండా విచారిస్తూ మౌనం వహించాడు.

వశిష్ఠుడి మొహంమీద చిరునవ్వు చెదరలేదు. చిటపటలాడుతోన్న విశ్వామిత్రుని వేపు ధైర్యపరిచే చూపు చూసి, మళ్ళీ దశరథుడితో – "మహారాజా! అనృత దోషాన్ని మించిన దోషం లేదని శాస్త్రాలలో వినలేదా? ఇంత కాలమూ అనేకానేక యజ్ఞ యాగాదులు చేశావు. నిత్యపూజలూ, వ్రతాలూ చేశావు. బ్రాహ్మణ సేవా, అతిథి సత్కారాలూ చేశావు. అన్నదానాలూ, వస్త్రదానాలూ చేశావు. నూతులూ, చెరువులూ తవ్వించావు. సేతు నిర్మాణాలూ, ఆరామ నిర్మాణాలూ చేశావు. ఇన్ని పుణ్యకార్యాల వల్ల నీకు జన్మరహిత మోక్షం సిద్ధించవలసి వుండగా, ఇప్పుడీ విధంగా ఒక్క మాట తప్పి, సంపాదించుకున్న పుణ్యమంతా నిష్ప్రయోజనం చేసుకుంటావా? మళ్ళీ మళ్ళీ ఈ క్షుద్ర భూలోకంలోనే జన్మించి ఈ లౌకిక బాధలు అనుభవిస్తూ జన్మలెత్తుతూ వుంటావా?" అని ప్రశ్నించి దయగా చూశాడు.

దశరథుడు వొణుకుతూ దీర్ఘాలోచనలో మునిగాడు ఎంతో ధనం ఖర్చుచేసి ఎన్నెన్నో పుణ్య కార్యాలు చేస్తే చివరికి ఫలితం ఇదా? యజ్ఞాలూ, యాగాలూ చేసింది దేవతలు సంతోషిస్తారనా, తనకు పుణ్యం వొస్తుందని గానీ? నూతులూ, చెరువులూ తవ్వించింది ప్రజలు నీరు తాగుతారనా, తనకు పుణ్యం వొచ్చే కార్యాలని గానీ? వంతెనలు కట్టించింది ప్రజలు సుఖంగా రాకపోకలు చేస్తారనా, తనకు పుణ్యం వొస్తుందని గానీ? ప్రజల కోసమే అయితే శాస్త్రాలలో చెప్పని కార్యాలు కూడా బోలెడు చేయాలి. అశాస్త్రీయమైన పనులూ, పుణ్యకార్యాలని చెప్పని పనులూ ఎందుకు చేస్తాడు ఏ రాజైనా?

ఎన్నో పుణ్యకార్యాలు చేసి సంపాదించిన పుణ్యం అంతా వృధా చేసుకోవడం ఏమి తెలివి? ఈ బ్రహ్మర్షి, బిరుదులు సంపాదించాడే గాని వీసమెత్తు కూడా కోపం తగ్గించుకోలేదు. ఏమని శపిస్తాడో ఏమి చెప్పగలం? పిల్లివో బల్లివో కమ్మని శపించాడంటే, ఈ వృద్ధాప్యంలో ఇక ఆ ఖర్మ కూడా ఎందుకు? ఎవరి భాగ్యం ఎలా వుంటే అలా జరుగుతుంది. తనేం చెయ్యగలడు? అన్నిటికీ ఆ శ్రీ మహావిష్ణువే వున్నాడు" అని నిట్టూర్చాడు. తల పంకిస్తూ విశ్వామిత్రుడికి అతి వినయంగా నమస్కరిస్తూ – "బ్రహ్మర్షీ! తీరని మమకారంలో పడి అజ్ఞానివలె ప్రవర్తించాను, మన్నించండి! తమ కోరిక ప్రకారమే రాముణ్ణి పంపిస్తాను" అని, పరిచారికల్ని చూసి "రాముణ్ణి పిలుచుకు రండి!" అని ఆజ్ఞాపించాడు.

విశ్వామిత్రుడి మొహం, గ్రహణం విడిచిన చంద్రుడి వలె కోపోగ్రత తగ్గి తేటగా మెరిసింది.

ఎక్కడివారక్కడ స్వస్థులై ఊపిరులు పీల్చారు.

రాముడు వచ్చే వరకూ వశిష్టుడు దశరథ మహారాజుతో విశ్వామిత్రుడి శక్తి సామర్థ్యాలు వర్ణిస్తూనే వున్నాడు. "మహారాజా! విశ్వామిత్రుడు బ్రాహ్మణుడు కాక పూర్వం అజ్ఞానంవల్ల కొన్ని అనుచిత కార్యాలు చేశాడు, నిజమే. నా వంటి పురోహితులందర్నీ ధిక్కరించి ఛండాలుడితో యాగం చేయించాడు! దేవతల్నే ధిక్కరించి సృష్టికి ప్రతి సృష్టి చేశాడు! పరోపకారాల కోసం ఎప్పటికప్పుడు తన తపశ్శక్తినంతా ధారపోసి నిష్కారణంగా బ్రహ్మర్షి పదవిని చాలా జాప్యం చేసుకున్నాడు! కానీ, బ్రాహ్మణత్వం సిద్ధించిన తర్వాత ఈయన పరిపూర్ణ జ్ఞానవంతుడయ్యాడు. వైదిక కర్మలు శాస్త్రోక్తంగా మాత్రమే నిర్వర్తించాలని గ్రహించాడు. ఎట్టి సాంకర్యానికీ తావులేకుండా వర్ణభేదాలు పాటించాలని గ్రహించాడు. లోక ధర్మాలన్నీ గ్రహించి పతివ్రతలకూ, బ్రాహ్మణులకూ ప్రీతిపాత్రుడయ్యాడు. ఎన్నడయినా లోక ప్రళయం సంభవిస్తే రుషుల రక్షణకూ, రాక్షస శిక్షణకూ అంతులేని ఆయుధాలు కూడబెట్టి వుంచాడు. దశరథ మహారాజా! ఇటువంటి మహానుభావుడి చేతిలో రాముణ్ణి వుంచడానికి నువ్వెంతో సంతోషించాలి" అని బోధించాడు.

దశరథుడు చాలా వరకు సంతోషించినట్టే కనిపించాడు. "వశిష్ట మహర్షీ! ఈ పెద్ద వయసులో బిడ్డల ఆటపాటలతో నిర్విచారంగా కాలం గడుపుతూ వుండడం చేత, నా రాముణ్ణి విడిచి వుండలేకనేగానీ, రాక్షస సంహారానికి విముఖుడను కానుగదా?" అని విన్నవించాడు.

అందరూ ఉత్కంఠతో రాముడికోసం నిరీక్షిస్తూ వుండగా రాముడు చిరునవ్వుతో వచ్చాడు. వెనకాలే లక్ష్మణుడు! రాగానే ఇద్దరూ వినయంగా అందరికీ నమస్కారాలు చేసి తండ్రి దగ్గిరికి వచ్చి నిలబడ్డారు. కౌమార ప్రాయంలో ముద్దులు మూటకడుతోన్న పధ్నాలుగేళ్ళ ప్రాయంలో వున్నారు అన్నదమ్ములు. విశాలమైన కళ్ళతో, చెక్కిళ్ళతో, ఫాలభాగాలతో ఇద్దరి కిద్దరూ సౌందర్య రాసులు! గిరజాల తలకట్లు! అరుణ తిలకాల నిలువు బొట్లు! ధగధగ మెరిసే పట్టుబట్టలు! ఒంటినిండా వజ్ర వైఢూర్యాల ఆభరణాలు! ఇద్దరికీ శరీర వర్ణంలో మాత్రమే తేడా. రాముడు నీలాకాశపు వర్ణంతో వుంటే, లక్ష్మణుడు ఉషోదయంలా వున్నాడు. బంతి ఆటలోంచి వచ్చిన కారణంగా చిరు చెమటలతో కొంచెం ఆయాసపడుతూ అమాయకంగా, నిర్మలంగా, చిరునవ్వులతో నిలబడి వున్నారు.

దశరథుడు, రాముణ్ణి తదేకంగా చూసి కళ్ళు చెమ్మగిలి కొడుకును దగ్గిరికి తీసుకుని శిరస్సు ముద్దాడాడు – "నాయనా! నిన్నొక రాచకార్యం మీద పిలిపించాను. విశ్వామిత్ర మహర్షి, నీ మీద కరుణతో నిన్ను తీసుకు వెళ్ళడానికి దయచేశారు. పంపుతానని మాట ఇచ్చాను. నువ్విప్పుడు అడవుల్లో వారి ఆశ్రమానికి వెళ్ళవలసి వుంది" అని కొంచెం నేరం చేసినట్టు తల వొంచుకున్నాడు.

రాముడు పంచెతో నుదుటిమీద చెమట వొత్తుకున్నాడు. బంతి ఆట మహోత్సాహంగా సాగుతూ వుంది తోటలో. భరతుడూ శత్రుఘ్నుడూ వారి స్నేహితులూ ఎదటి పక్షంలో ఆట గెలవడానికి సిద్ధంగా వున్నారు. అంతలో తండ్రి పిలుపు! "ఇప్పుడే వస్తాను. ఆట ఆపమ"ని చెప్పి వొచ్చాడు తను స్నేహితుల్తో. మరుక్షణంలో వెళ్ళవచ్చుగదా అని వస్తే, ఇక్కడ ఇంత హఠాత్తుగా, ఎవరో మునీశ్వరుడితో, ఏదో రాచకార్యం మీద, అడవుల్లోకి వెళ్ళమంటున్నాడు తండ్రి!

ఇప్పుడు అడవుల్లోకి! స్నేహితుల్ని వొదిలిపెట్టి! తోటనిండా పెంపుడు పక్షులూ, జింకలూ – అన్నిటినీ వొదిలిపెట్టి!

అంతఃపురంలో తల్లీ, పినతల్లులూ, దాదులూ; ఎన్నో కధలూ, ఎన్నెన్నో పాటలూ, నాట్యాలూ, నవ్వులూ – అన్నిటినీ వొదిలిపెట్టి! ఎందుకా అడవుల్లోకి? ఆ మునికి తనతో ఏం రాచకార్యం? ఇంకెవరినైనా పంపవచ్చునే!

లక్ష్మణుడు కూడా అదే ఆలోచిస్తూ – "మనం వెళ్ళవొద్దు అన్నా!" అని రాముడితో చెప్పాలని కంటి చూపులతో ప్రయత్నిస్తున్నాడు.

రాముడు ఎవరినీ చూడకుండా మౌనంగా

నించున్నాడు.

అతని అయిష్టత ముఖ కవళికల్లో స్పష్టంగా కన బడుతోంది.

విశ్వామిత్రుడు ఆందోళన పడుతూ వశిష్టుడి వేపు చూశాడు.

వశిష్టుడు హెచ్చరికగా దశరథుణ్ణి చూశాడు.

దశరథుడు రాముడి ధోరణికి కలవరపడుతూ "నాయనా! ఎందుకు సందేహిస్తున్నావు? యువ రాజువై పుట్టిన నీకీ రాచకార్యాలు తప్పవుగదా? వశిష్టులవారూ, సుమంత్రుల వారూ, నేనూ, ఎన్నో విధాల యోచించి నిన్నీ కార్యానికి పిలిపించాము" అన్నాడు.

రాముడు దానికీ జవాబు ఇవ్వక మౌనం వహిం చాడు.

దశరథుడు, కొడుకు మౌనాన్ని అవమానంగా తలచి – "ఇంతకాలమూ మన రఘువంశంలో ఏ పుత్రుడూ, ఏ తండ్రి ఆజ్ఞనీ మీరలేదు. ఇప్పుడు నువ్వు వెళ్ళనని తిరస్కరిస్తే, నీకు తండ్రిమాట మీరావనే నిందా, నాకు ఆడినమాట తప్పిన పాపమూ చుట్టుకుంటాయి. నాయనా! ఈ విధంగా నేను సంపాదించుకున్న పుణ్య మంతా నిష్ఫలమై పోవలసిందేనా?" అంటూ రుద్ధ కంఠంతో తన 'పుణ్య' సంపాదనకు ముక్కు పచ్చలారని బాలుడి సహాయభిక్ష అర్థించాడు.

రాముడు, తండ్రి దైన్యాన్ని భరించలేక, వంశ ప్రతి ష్టకూ, పుణ్యలోకాలకూ ఉత్తేజితుడై – "తండ్రి గారూ! తమ ఇష్టప్రకారమే పంపించండి! పితృవాక్య పరిపాలనా భాగ్యం నాకు కలిగించండి! మీ ఆజ్ఞమీరను" అంటూ తండ్రికి వొంగి నమస్కరించాడు.

లక్ష్మణుడు కూడా తన అయిష్టం మరిచిపోయి సంతృప్తిపడి నించున్నాడు.

విశ్వామిత్రుడి మొహం ధైర్యంతో తేటపడింది. "రామా! నీకు శుభం! పెద్దల్నీ, రుషుల్నీ గౌరవించే నువ్వు గొప్పరాజువై కీర్తి సాధిస్తావు" అని రాముణ్ణి దీవించాడు.

పురోహితులూ, మంత్రులూ సంతోషించారు.

మరుక్షణంలోనే ఆ వార్త అంతఃపురంలోకి ప్రవే శించింది.

కౌసల్య చాలా విచారించింది – "రుషుల మంత్రాం గాల ముందూ, రాజుల నిర్ణయాల ముందూ, కన్న తల్లు లైతేనేమి, స్త్రీలు నిమిత్త మాత్రులే గదా?" అని నిట్టూ ర్చింది.

త్వరత్వరగా ప్రయాణ సన్నాహాలు జరిగాయి. బంతి ఆట స్నేహితులు బంతి పట్టుకుని రామ లక్ష్మణులకోసం వచ్చారు. హఠాత్తుగా ఆ ప్రయాణ సన్నాహాలు చూసి ఏమీ ప్రశ్నించలేక ఖిన్నులై నిలబడ్డారు.

రాముడు ధనస్సూ, బాణాలూ ధరించి తండ్రి ముందు వినయంగా నిలబడి వున్నాడు. లక్ష్మణుడు కూడా అతనితో ప్రయాణానికి సిద్ధమై వున్నాడు.

దశరథుడు రాముడికి హితోక్తులు చెపుతూ "నాయనా! ఇక విశ్వామిత్రులే నీ గురువర్యులు. ఆయన ఆజ్ఞకు బద్ధుడివై నడవాలి. చెప్పింది చెయ్యాలి. ఆయన మాటలకు ఎదురు ప్రశ్నలు వెయ్యకు. తర్క వితర్కాలు జరపకు" అని బోధించాడు. లక్ష్మణుణ్ణి దగ్గిరికి తీసు కుంటూ "నాయనా! జీవాత్మ పరమాత్మను విడిచి వుండ నట్టు, ఎన్నడూ అన్నను విడిచి వుండకు. సోదర శుశ్రూష నీ మహాభాగ్యం" అని జ్ఞానబోధ చేశాడు.

రామలక్ష్మణులు విశ్వామిత్రుడి ముందు నిల బడ్డారు.

దశరథుడి కళ్ళు కన్నీళ్ళతో నిండి చెరువు లయ్యాయి.

అందరి మనసులూ విచార సముద్రాలయ్యాయి.

విశ్వామిత్రుడు ఆసనంనుంచి లేచి దండ కమండ లాలు చేతిలోకి తీసుకుని ప్రయాణానికి సిద్ధపడుతూ – "దశరథ మహారాజా! పామరునివలె విచారించుట ఎందుకు? లోకజ్ఞానమే లేని నీ కొడుకుని నా వెంట తీసుకుపోయి ఎంత ప్రయోజకుణ్ణి చేసి నీ కప్పగిస్తానో నువ్వే చూస్తావు. ఈ కార్యం ముగిసిన తర్వాత మిధిలా నగరానికి తీసుకువెళ్తాను. రాముడు అక్కడ జనక మహా రాజు జరుపుతూ వున్న పరీక్షలో పాల్గొని శివ ధను ర్భంగం చేస్తాడు. నీకు మహాలక్ష్మి వంటి కోడలు వస్తుంది" అని హాస్యమాడాడు.

దశరథుడు అశ్రునయనాలతో చిరునవ్వు నవ్వాడు.

విశ్వామిత్రుడు అందరినీ ఆశీర్వదిస్తూ ముందు నడిచాడు.

రాముడు స్నేహితులవేపు కన్నెత్తి చూడకుండా తల వొంచుకుని గురువుని అనుసరించాడు. లక్ష్మణుడు, స్నేహంతో రాముడి వెనక![13]

★ ★ ★

**13.** ఈ ఘట్టంలో, రాక్షసుల్ని చంపడంకోసం అంత చిన్న పిల్లవాణ్ణి తీసుకు వెళ్ళడం ఏమిటి – అనే పద్ధతిలో ప్రశ్నించ కూడదు. ఈ కథలో, రాక్షసులు – కల్పన. రాక్షసుల్ని చిన్న పిల్లలు చంపడం కూడా – కల్పనే. ఈ రెండు కల్పనలకూ సరి పోతుంది. ఈ కథ ప్రకారం, రాముడి అవతారమే రాక్షస వధకోసం. ఆ పని రాముడి చిన్నతనంనించే ప్రారంభమవుతోంది. కృష్ణుడి కథల్లో అయితే, పాలుతాగే పసిపిల్లవాడే రాక్షసుల్ని చంపాడు. 'విషవృక్షం' కథల్లో అందరూ మనుషులే. కథలో ఘట్టాలు, ఆ మనుషుల మధ్యే జరుగుతాయి. ★

రామ – లక్ష్మణులు విశ్వామిత్రుడి వెంట సరయూ నదీ తీరాన నడుస్తున్నారు. నది, తీరాల వెంట వృక్ష శోభతో మనోహరంగా ప్రవహిస్తోంది. అడవి అంతా ఎన్నడూ చూడని మహావృక్షాలతోటీ, యధేచ్ఛగా సంచరించే జంతువులతోటీ, ఆశ్చర్యం గొలుపుతోంది.

నగర పరిసరాల్నీ, పరిచితుల్నీ ఎంతో దూరాన వొదిలి, ఆ నగ్న ప్రకృతిలో, అన్నదమ్ములిద్దరూ పూర్వం కన్నా సన్నిహితులయ్యారు. ఇనుమడించిన ఆత్మీయతతో మాట్లాడుకుంటూ “అదిగో, ఆ చిలక మన చిలకలాగే వుంది! ఆ గోరింక ఎంత అందంగా వుందో! ఆ లేడిపిల్ల ఎంత ముద్దుగా వుందో! ఆ ఆకుపచ్చ పూలు చూడు, మనం ఎన్నడూ చూడ లేదే!” అంటూ ఒకర్ని ఒకరు హెచ్చరించుకొంటూ, వింతరంగుల పక్షుల్నీ, కొత్త కాంతుల పువ్వుల్నీ చూసి ఆనందిస్తున్నారు.

బయల్దేరింది మొదలూ విశ్వామిత్రుడు, రాముడితో, వెనక తరాల క్షత్రియ వీరగాథలు చెబుతూనే వున్నాడు. ఏ రాజు ఏ రకంగా యుద్ధాలు చేశాడో, ఏ రాజు ఎందరు శత్రువుల్ని జయించాడో, ఏ మహా రాజు ఎంత విశాల సామ్రాజ్యాన్ని పరిపాలించాడో వర్ణించాడు.

రాముడి కా కథల్లో ఏమీ ఆసక్తి కలగలేదు. నదిలో ప్రతిఫలించే నీలాకాశాన్నీ, నదీతీరాల్లో గుత్తులు గుత్తులుగా పూసిన రంగురంగుల పువ్వుల్నీ, మధుర మధుర ధ్వనుల్తో ఎగిరే పిట్టల్నీ చూడటంలో మునిగాడు.

విశ్వామిత్రుడు దశరథ మహారాజు వీరత్వాన్ని కూడా వర్ణించడం మొదలుపెట్టాడు. – “రామా! నీ జన్మ కాలంలో నీ తండ్రి చేసిన అశ్వమేధయాగ వైభవాన్ని వర్ణించడానికి సాక్షాత్తూ బ్రహ్మదేవుడు దిగి రావాలి!” అని ప్రారంభించేసరికి, అన్న దమ్ములిద్దరూ, ప్రకృతి సౌందర్యారాధన మరిచి, గురువు వేపు మొహాలు తిప్పి, ఆయన చెప్పే మాటలు ఉత్సాహంతో వినడం మొదలు పెట్టారు.

“దేశాల మీదకు విడిచిన అశ్వం కొన్ని మాసాలకు తిరిగి రాజ్యం చేరగానే నీ తండ్రి గొప్ప ఏర్పాట్లతో యజ్ఞం ప్రారంభించాడు.”

రాముడికి ఆదిలోనే సందేహం కలిగింది “గురువర్యా! దేశాల మీదకు విడిచిన అశ్వాన్ని ఎవరూ బంధించనే లేదా? ఇరుగు పొరుగు రాజ్యాలలో వీరులే లేరా?” అని వినయంగా ప్రశ్నించాడు.

విశ్వామిత్రుడు మందహాసం చిందించి – “లేక కాదు నాయనా! అది ఒక స్నేహ ధర్మం! ఒక రాజు యజ్ఞాశ్వాన్ని విడిచినప్పుడు మిగిలిన రాజులు దాన్ని పుణ్యకార్యంగా తలచి అశ్వాన్ని స్వేచ్ఛగా పోనిస్తారు. అశ్వాన్ని బంధించి యుద్ధానికి పిల్చిన రాజులెవ్వరూ లేకపోవడం చేత యజ్ఞం చేసిన రాజుకి దేశ దేశాలూ జయించిన కీర్తి సిద్ధిస్తుంది” అని ఆగాడు.

రాముడు ఆశ్చర్యపడి – “అలా సంపాదించిన కీర్తి గొప్ప కీర్తి ఎలా అవుతుంది గురువర్యా?” అని ప్రశ్నించాడు.

విశ్వామిత్రుడు రాముడి మొహంలోకి దీర్ఘంగా చూశాడు “ఎన్నడో పూర్వకాలంలో మహారుషులు వేదాలలో బోధించిన ధర్మాలివి. ఈనాటి వరకూ సమస్త జనులూ వాటిని మహాప్రసాదంగా స్వీకరిస్తున్నారుగాని, ప్రశ్నించడం లేదు. నీ తండ్రి నీ కిచ్చిన ఆజ్ఞ గుర్తులేదా? పెద్దలతో తర్క వితర్కాలు జరప వచ్చునా?” అని మందలింపుగా చూశాడు.

రాముడు ఖిన్నుడై – “మన్నించండి గురుదేవా!” అని తల వొంచుకున్నాడు.

“దానికేమిలే. బాలుడివి. ముందుకాలంలో భయ భక్తులు నువ్వే అలవర్చుకుంటావు” అని రాముణ్ణి మన్నించి విశ్వామిత్రుడు ఆదిలోనే ఆగిపోయిన యాగ వర్ణన మళ్ళీ ప్రారంభించాడు. “రామా! శ్రద్ధగా విను! నీ తండ్రి చేసిన యాగ సన్నాహాలకే సంవత్సరకాలం పట్టింది. దేశ దేశాల రాజాధిరాజులూ యాగానికి వచ్చారు. మునీశ్వరులు అడవులు విడిచి గుంపులు గుంపులుగా వచ్చారు. బ్రాహ్మణోత్తములు బహు దూర ప్రాంతాల నుంచి కూడా శిష్య బృందాలతో వచ్చారు. రుష్యశృంగ మహర్షి ఆధ్వర్యంలో కర్మకాండలన్నీ నిర్విఘ్నంగా జరిగాయి. రుత్విక్కులు వందలాది యాగ పశువుల్ని బలి ఇచ్చి వాటికి స్వర్గప్రాప్తి కలిగించారు. రుషులూ, బ్రాహ్మణులూ అగ్నిహోత్రంలో వ్రేల్చిన మాంసం తిని తరించారు. రామా! శాస్త్రంలో చెప్పిన విధంగా సూర్య చంద్రాది దేవతలు మిక్కిలి సంతోషించి, యాగశాలకు వచ్చి తమ హవిర్భాగాలు స్వీకరించి వెళ్ళారు. నీ తండ్రి ....”

“సూర్యుడూ, చంద్రుడూ యాగశాలకు స్వయంగా వచ్చారా!” అని రాముడు గురుభయాన్ని కూడా ధిక్కరించి మధ్యలో విస్మయంగా అడిగాడు.

విశ్వామిత్రుడు సంకోచిస్తూ చూశాడు – “వారే స్వయంగా రాకపోతేనేమి? వారు ఆకాశంలో, స్వర్గంలో వున్నారు కదా? రామా! యాగశాలలో కొందరు బ్రాహ్మణోత్తముల్ని ఇంద్రుడిగానూ, సూర్యుడిగానూ, చంద్రుడిగానూ నియమించి, వారికి దేవతల ప్రసాదాలు ఇచ్చి సంతోషపెడతారు. నీ తల్లి ఎన్నడూ, ఏ పూజలోనూ నిన్ను బాల గణపతిగా నియమించి పూజించలేదూ?”

రాముడికి అంతఃపురంలో జరిగే వ్రతాలూ, నోములూ గుర్తొచ్చాయి. “అవును” అని సంతృప్తి పడ్డాడు చిరునవ్వు నవ్వుతూ.

“ఇటువంటి శంకలతో పెద్దల మాటలు సందేహించి ప్రశ్నించడం దోషం రామా! గ్రహించవేమి?

ఇక విను! యజ్ఞానంతరం నీ తండ్రి సమస్త రాజ్యాన్నీ రుత్విక్కులకు దానంచేశాడు. శాస్త్రంలో చెప్పిన విధంగానే నీ తండ్రి వినయ విధేయతలకు రుత్విక్కులు సంతోషించి 'రాజా! ఎల్లప్పుడూ వేదాధ్యయనంతో అడవులలో నిరాడంబరంగా కాలం గడిపే మాకు భూమి ఎందుకు? రాజ్యభారం వహించటానికి నువ్వే సమర్థుడివి. దీనికి బదులుగా మాకు ధనం ఇయ్యి!' అని అడిగారు. నీ తండ్రి బహు వినయంతో రుత్విక్కులందరికీ మణుగుల కొలదీ బంగారమూ, వెండీ, ధనధాన్యాలూ, ఇంకా బలిసిన గోవుల్నీ, సౌందర్యరాశులైన స్త్రీలనీ కూడా ఇచ్చి సంతోషపెట్టాడు."

"ఎల్లప్పుడూ వేదాధ్యయనంతో అడవులలో కాలం గడిపే రుషులకు వెండి బంగారాలూ, ధన ధాన్యాలూ, సౌందర్యరాశులైన స్త్రీలూ మాత్రం ఎందుకు గురుదేవా?" అని ప్రశ్నించాలని రాముడి మనసు చాలా ఆరాట పడింది. అయినా మౌనంగా లక్ష్మణుణ్ణి చూస్తూ, కళ్ళతో మాట్లాడాలని ప్రయత్నిస్తూ, ముందుకు నడిచాడు గురువు వెనక.

విశ్వామిత్రుడు మళ్ళీ ప్రారంభించాడు. "ఏటేటా రాజులందరూ వందలకొలదీ యాగాలు చేసి, బ్రాహ్మల్నీ, దేవతల్నీ సంతోషపెడుతూనే ఉంటారు. రామా! వింటున్నావా? అటు చూడు! పొద్దు వాలుతోంది. ఇక్కడ నదీ తీరం పరిశుభ్రంగా వుంది. కాళ్ళూ, చేతులూ కడుక్కుని శుద్ధుడివై రా! 'బలా, అతిబలా' అనే రెండు విద్యలు ఉపదేశిస్తాను" అని ఆగి, తీరంలో విశాలంగా వున్న ఒక చెట్టుకింద నిలబడ్డాడు.

రాముడు, లక్ష్మణుణ్ణి చూశాడు రమ్మని.

"అతనికి కాదు. నీకు మాత్రమే ఉపదేశిస్తాను" అన్నాడు గురుదేవుడు.[14]

రాముడు కొంచెం ఆశ్చర్యపడ్డాడు. అక్కడే ఆగి నది వేపు చూస్తూ నిలబడ్డాడు. తమ అయోధ్యా నగరంలో గురువులందరూ ధనుర్విద్య అయినా, శాస్త్ర పాఠాలయినా, వ్యాకరణాది విషయాలయినా, వేద మంత్రాలయినా, అన్నదమ్ములందరికీ, సమంగానే, నేర్పించారు గదా? విద్యలనేవి అందరూ నేర్వ దగ్గవే గదా?

రాముడు, నిరుత్సాహంగా నిలబడ్డ లక్ష్మణుణ్ణి ప్రేమతో చూసి, నిర్భయంగా విశ్వామిత్రుణ్ణి – "ఆ విద్యలు లక్ష్మణుడికి నిషిద్ధమా గురువర్యా?" అని వినయంగా అడిగాడు.

విశ్వామిత్రుడు అసహనంగా – "నిషిద్ధమే. ఇతను అనర్హుడు" అని కఠినంగా చూశాడు.

"నా సోదరుడే గదా?"

"కావచ్చు. నీలో దైవాంశ అత్యధికం. ఇతనిలో అత్యల్పం. ఏలనంటావేమో, వివరంగా చెబుతాను, శ్రద్ధతో గ్రహించు! నీ తండ్రి పుత్రకామేష్టి చేసినప్పుడు దేవతలందరూ ఆ యాగానికి వచ్చారు. అందరూ కలసి లోక కంటకుడిగా వున్న రావణుని సంహారానికి ఉపాయాలు ఆలోచించారు. బ్రహ్మ ఆధ్వర్యంతో శ్రీ మహావిష్ణువుని ప్రార్థించారు, విష్ణువునే మానవజన్మ ఎత్తి, దశరథ మహారాజు గర్భాన జ్యేష్ఠ పుత్రుడై పుట్టి రావణ వధ చెయ్యమని! శ్రీ మహావిష్ణువు అందుకు అంగీకరించి రాముడై పుడతానని దేవతలను వూరడించి అంతర్ధానమయ్యాడు."

రాముడు అమితాశ్చర్యంతో వింటున్నాడు.

"తరువాత శ్రీ మహావిష్ణువు తన అంశనంతా పాయసంలో కలిపి ఒక భూతంద్వారా అగ్నిహోత్ర మార్గాన నీ తండ్రికి పంపించాడు. నీ తండ్రి మిక్కిలి సంతోషించి ఆ పాయసాన్ని మీ తల్లుల దగ్గరకు తీసుకు వెళ్ళాడు. మొదట పాయసాన్ని రెండు భాగాలు చేసి, ఒక భాగం నీ తల్లి కౌసల్య కిచ్చాడు" అంటూ ఆ పాయసం పంపకాల గురించి చెప్పాడు. "అనగా నీ తల్లి అర్ధభాగాన్ని భుజించి నిన్ను కన్నది. అందుచేత, నువ్వు శ్రీ మహావిష్ణువులో అర్ధాంశ! లక్ష్మణుడు పరకన్నర అంశ. శత్రుఘ్నుడు పరకన్నర. భరతుడు పరక మాత్రమే. రామా! గ్రహించావా? సమస్త విద్యలూ నువ్వే స్వీకరించాలి. నీ చేతనే ఈ లోక కల్యాణం జరగాలి. ఈ జగత్తులో అలవిమాలిన రావణాది రాక్షసుల్ని సంహరించడానికి పుట్టినవాడివి నువ్వే" అని విశ్వామిత్రుడు 'సత్యాసత్యాలు' విశదం చేసి చిరునవ్వు నవ్వాడు.

రాముడు సంభ్రమంగా తనను తను చూసుకున్నాడు. ఖిన్నుడై తల వొంచుకుని నిలబడి వున్న లక్ష్మణుణ్ణి చూశాడు. రాముడికి ఆ క్షణాలలో ప్రప్రథమంగా తన ఔన్నత్యం అవగతమైంది. తన తండ్రి ఆ పాయసమంతా తన తల్లికి మాత్రమే ఇచ్చి తనని శ్రీ మహావిష్ణువుతో సమానమైన పూర్ణాంశగల వాడిగా చెయ్యనందుకు, తన ఔన్నత్యాన్ని గ్రహించుకున్న రాముడు, చాలా విచారించాడు.

జన్మ రహస్యం తెలిసి తన అల్పత్వం స్పష్టంగా అర్థం చేసుకున్న లక్ష్మణుడితో విశ్వామిత్రుడు – "లక్ష్మణా! మీ తారతమ్యాలు నువ్వు కూడా గ్రహించావు

---

**14.** **బాల కాండ, సర్గ 22, శ్లోకాలు 12, 14:** విశ్వామిత్రుడు ఆ మంత్రాలు రాముడికి మాత్రమే చెపుతాడు. లక్ష్మణుడి మాట ఎత్తడు. "రామా! మిత్ర సమూహ రూపముగ నుండు బలామ్ – అతి బలామ్ అను విద్యలను నీవు గ్రహింపుము. ఈ మంత్ర బలముచే మూడు లోకములలోనూ నీకు సమానుడెవ్వడునూ నుండడు." ★

గదా? శ్రీరామ దాస్యమే నీ ఐశ్వర్యం! ఇతని సేవకే నీ జీవితం కైంకర్యం!" అని బోధించాడు.

లక్ష్మణుడు వినయంగా గురువుకీ, అన్నకీ నమస్కరిస్తూ "మహాభాగ్యం!" అన్నాడు, తన తండ్రి పురోహితులతో అనే విధంగా.

రాముడు ధనుర్బాణాలు చెట్టుకింద పెట్టి నదిలోకి దిగి కాళ్ళూ, చేతులూ కడుక్కుని వచ్చాడు. విశ్వామిత్రుడు రాముణ్ణి చెట్టుచాటుకి తీసుకువెళ్ళి మంత్రోపదేశం చేశాడు. "రామా! ఈ విద్యవల్ల నీకు ఎప్పుడూ శరీర రుగ్మతలు రావు. సమస్త లోకాలనూ జయించే వీరుడివి కాగలవు. తర్క వితర్కాలలో నేర్పరివీ, జ్ఞానివీ, అవుతావు. నీ స్వబుద్ధితో ఎంతటి కార్యాలైనా నిర్ణయించుకుంటావు" అని ఆ విద్యల మహిమలు వివరించాడు.

ఎవరు నేర్చుకుంటే వారికే ఆ మహిమలన్నింటినీ ప్రసాదించగల ఆ విద్యల్ని, తాను మాత్రమే స్వీకరించిన ఆనందంతో రాముడు మంత్రోచ్చారణ చేస్తూ చెట్టుచాటు నుంచి బయటికి వచ్చాడు.

లక్ష్మణుడు నవ్వుతూ దగ్గిరకు రాబోతే, రాముడు గంభీరంగా మొహం తిప్పుకున్నాడు.

విశ్వామిత్రుడు మళ్ళీ మొదలుపెట్టాడు. "రామా! ఇంకా నా దగ్గిర అనేకానేక అస్త్రశస్త్రాలున్నాయి. యుద్ధాలలో శత్రువుల్ని బలాత్కారంగా బంధించి తెచ్చే అస్త్రాలున్నాయి. సమస్త దేవతల్నీ ఆధీనంలోకి తెచ్చుకునే అస్త్రాలున్నాయి. ఇతరుల తేజస్సునంతా ఆకర్షించి హరించే అస్త్రాలున్నాయి. క్రమంగా అన్నీ నీ కిస్తాను."

ఆ మాటలు రాముణ్ణి చాలా సంతోషపెట్టాయి.

ముగ్గురూ ఆ రాత్రి వెన్నెల్లో ఆ నదీతీరంలో ఒక మహావృక్షం కింద పండుటాకుల శయ్యల్లో విశ్రమించారు.

పాలసముద్రంవలె అడవిగాచిన వెన్నెల్లో, గూళ్ళల్లో పక్షులూ, పొదల్లో జంతువులూ, భూమి నిండా క్రిమికీటకాలూ, నీటినిండా జలచరాలూ, సొక్కి సోలి ప్రకృతి సుఖంలో మైమరచి విశ్రమించి వున్నాయి.

విశ్వామిత్రుడు విష్ణుభక్తిని గూర్చి కథలు అనేకం చెప్పాడు. రాముడు పుట్టిన తర్వాత రావణ వధలో రాముడికి సహాయం చెయ్యడానికి లక్షలాదిగా పుట్టిన వానరుల్ని గూర్చీ, ఎలుగుల్ని గూర్చీ చెప్పాడు. సమస్త దేవతలూ, రుషులూ మనసుల్లోంచీ, ఆత్మల్లోంచీ పవిత్రంగా బిడ్డల్ని కన్న చరిత్రలు చెప్పాడు. ఇంద్రుడు – వాలినీ, సూర్యుడు – సుగ్రీవుణ్ణీ, వాయుదేవుడు – హనుమంతుణ్ణీ, బృహస్పతి – తారుణ్ణీ, రామ సహాయానికే కన్నారు, పవిత్రంగా. బ్రహ్మ జాంబవంతుణ్ణి ఆవలింతలో నించి కన్నాడు. ఇంకెందరో దేవతలూ సిద్ధులూ, తుమ్మీ, దగ్గీ, వీపు గోక్కునీ పవిత్రంగా బిడ్డల్ని కన్న చరిత్రలెన్నో విశ్వామిత్రుడు చెప్పాడు. దక్ష ప్రజాపతి కూతుళ్ళు రాక్షసవధ కోసమే అనేక అస్త్రశస్త్రాలను కన్న ఉదంతం చెప్పాడు. తన ఆధీనంలో వున్న ఆయుధాలన్నీ అవేననీ, అవి రాముడి సేవకే సిద్ధంగా వున్నాయనీ చెప్పి ముగించాడు.[15]

రాముడు, గురువు మాటలు భక్తిశ్రద్ధలతో విన్నాడు. ఏ గాథా అసహజంగా తోచలేదు. ఏ చరిత్రనీ సందేహించి ప్రశ్నించలేదు. ఆ దైవభక్తీ, ఆ మహిమలూ, ఆ వరాలూ, ఆ శాపాలూ, అలౌకిక విశేషాలూ అన్నీ, వింటున్నకొద్దీ మనసుని పులకరింపజేశాయి. దైవత్వం సిద్ధించిన రాముడు, హేతు వాదశక్తి నశించి, ఆలోచన మాని, నిద్రకుపక్రమించాడు.

పడుకున్నది మొదలూ లక్ష్మణుడు పరిపరి విధాల ఆలోచిస్తున్నాడు. అన్నకు గురువర్యులతో సంభాషించడానికేగానీ, తనతో మాట్లాడే తీరిక చిక్కడం లేదు. ఈ రాక్షస సంహారంలో తను చెయ్యదగ్గ రాచకార్యమేమీ వున్నట్టు లేదు. అక్కడ ఇంటి దగ్గర ఎందరో స్నేహితులున్నారు. ఏ విద్య నేర్చుకున్నా భరతుడితో, శత్రుఘ్నుడితో, సమంగా నేర్చుకో వచ్చును. తన తల్లి ఎంతో ప్రేమతో మాట్లాడుతూ వుంటుంది. అడుగడుగునా ముద్దుచేస్తూ వుంటారు దాదులు. అక్కడ అందర్నీ వొదిలిపెట్టి వచ్చాడు. ఇక్కడ ఇంత అలక్ష్యం తనంటే! తను అయోధ్యా నగరానికి పోవాలని కోరితే, గురువర్యులు తనని ఏ బాటసారుల వెంటైనా పంపించగలరు. కానీ శ్రీ మహావిష్ణువు సేవ .... ఆయనకు శుశ్రూషచేసే భాగ్యం .... ఎన్నో కథలలో విష్ణుభక్తులకు లభించిన స్వర్గసౌఖ్యాలు .... తండ్రి ఆజ్ఞ .... గురువు ఆజ్ఞ – ఎటూ నిర్ణయించుకోలేని లక్ష్మణుడు కూడా నిస్సహాయుడై నిద్ర కుపక్రమించాడు.

★ ★ ★

తెల్లవారి పక్షుల కలకలలతోపాటు లేచి చల్లని నదిలో స్నానాలు చేశారు ముగ్గురూ. రామ లక్ష్మణులు గాయిత్రి జపించి సూర్య నమస్కారాలు చేసి, గురువుకి సాష్టాంగ నమస్కారాలు చేసి, మళ్ళీ ప్రయాణం సాగించారు.

కొంత సేపటికి సరయూ నది గంగానదిలో కలిసే

---

**15.** ఈ ఆయుధాలన్నీ ఎందుకు? యుద్ధాలకోసం! ఇతర ప్రాంతాల మీద దాడులూ, ఆ మనుషుల్ని చంపడాలూ, ఆ భూముల్ని లాక్కోవడాలూ! అది ధర్మం! వీరత్వం! యుద్ధాలు లేనప్పుడు యజ్ఞాలూ యాగాలూ! అక్కడ బలులిచ్చి జంతువుల్నీ మనుషుల్నీ చంపడాలు! అది పుణ్యం! ★

ప్రదేశంలో ఒక ఆశ్రమం చూశారు. అక్కడ కొందరు రుషులు గుంపులుగా కూర్చుని వేదగానం చేస్తూ ఆనం దిస్తున్నారు.

రాముడు విశ్వామిత్రుణ్ణి – "గురుదేవా! ఈ పవిత్రా శ్రమం ఎవరిది? ఈ స్థలం ప్రసిద్ధి ఏమిటి?" అని అడిగాడు.

విశ్వామిత్రుడు చాలా సంతోషించి చెప్పుకొచ్చాడు. – "జిజ్ఞాస అంటే ఇటువంటిదే రామా! ఇది రుద్రుడి ఆశ్రమం. ఈ రుషులంతా రుద్రుడి శిష్యులు. పూర్వం రుద్రుడు ఇక్కడ కొంతకాలం తపస్సు చేశాడు. ఆ కాలంలో పార్వతి రుద్రుణ్ణి మోహించి విరహ వేదన చెందింది. మూర్ఖుడైన మన్మథుడు పార్వతికి మేలు చేయగల ననుకుని రుద్రుణ్ణి మన్మథవశుణ్ణి చేసి తపస్సు నుంచి లేపాలని ప్రయత్నించాడు. "రుద్రా! ఎందుకీ తపస్సు? ఈ వసంత రుతు సౌందర్యం చూడు! దిక్కు దిక్కునా కోయిల కూతలు .... కొమ్మకొమ్మనా నెమళ్ళ నడకలు .... వనమంతా ఈ నూతన చైతన్యం .... ఈ వినూత్న పుష్ప సౌగంధాలలో, ఈ సంధ్యారుణ ప్రకృతి శోభని ఒక్కసారి కన్నెత్తి చూడు! మోహపూరిత విరహ తాపంతో ఇనుమడించిన నీ ప్రియురాలి సౌందర్యం చూడు! నీ ఉపేక్షతో నిరుత్సాహపడిన నీ చెలి విలాస యౌవ్వనం చూడు! రుద్రా! ఇక ఈ తపస్సు చాలించి ఈ పరిమళభరిత వెన్నెలరాత్రి నీ ప్రేయసి మనోరథం ఈడేర్చు!" అని ప్రేలాపన సాగించాడు.

రుద్రు డా ప్రకృతి శోభలో మన్మథుడి మాటలకు చలించి, తన తపస్సుని భంగం చేసిన దుష్టుణ్ణి మూడో కన్ను తెరిచి భస్మం చేశాడు. రామా! ఆ విధంగా ఈ ఆశ్రమంలోనే మన్మథుడు తన దుస్సాహసానికి తనే నాశనం అయ్యాడు!" అని, రుద్రుడి కార్యంలో అనౌ చిత్యం గ్రహించని విశ్వామిత్రుడు ఆ ఆశ్రమ ప్రసిద్ధి వివరించాడు.

అనేక విఘ్నాలనూ, ఘోర పరీక్షలనూ, మనో శక్తితో ధిక్కరించి జయించి సాధించేదే తపస్సు. మన్మ థుడు కలిగించిన ఆటంకానికి చలించకుండా రుద్రుడు తన నిగ్రహశక్తి ఎంత గొప్పదో సర్వలోకాలకూ రుజువు చేయవచ్చు. అటువంటి అవకాశం కలిగించిన మన్మథు డికి తను కృతజ్ఞుడై కూడా వుండవచ్చు. అలా చేయక పోగా, రుద్రుడు, తన నిగ్రహాన్ని సడలించే ప్రయత్నాలు ఎవ్వరూ చేయరాదనీ, ఇతరులు కలిగించే ప్రశాంతతతో తను తపస్సు ముగించి కీర్తివంతుడు కావాలనీ, తలి చాడు. లోకప్రియుడైన మన్మథుణ్ణి అజ్ఞానంతో శపించిన రుద్రుడి దుష్టత్వం ఆ కథ చెప్పిన గురువుకి అవగతం కానట్టే రాముడికి కూడా అవగతం కాలేదు.

గురువు ఇంకా చెప్పుకొచ్చాడు – "రామా! ఈ మన్మథుడు అనంగుడై కూడా వివేకవంతుడు కాలేదు సుమా! ఒకసారి నా వంటి రుషి పుంగవుణ్ణి కూడా కామంలో కీడ్చి తపోభంగం కలిగించాడు. మేనక నాతో సహచర్యంచేసి ఒక బిడ్డని కూడా కన్నది. అప్పటికి నేనీ మన్మథ మాయాజాలం నుంచి బయటపడగలిగాను. నా ముందు కంపిస్తూ నించున్న ఆ స్త్రీని త్యజించి, నా పవిత్ర తపస్సుకోసం మరో దిక్కుకి పోయాను. ఆమె తన లోకానికి తను పోయింది."

"ఆ పసిబిడ్డ?" తడబడుతూ అడిగాడు రాముడు.

"మేనక నా ధర్మపత్ని కాదని ఎరిగికూడా ఆ బిడ్డ గురించి ప్రశ్న ఎందుకు? వేశ్య బిడ్డను సాకే బాధ్యత నాకేమి కలిగింది? రామా! చిన్నవాడివి, నీకీ ధర్మ సూక్ష్మాలు తెలియవు.[16]

మన్మథ మాయ గురించి మరో ఉదంతం చెబుతాను విను! ఇంకో దిక్కున నేను ఘోరంగా తపస్సు చేస్తూ వుండగా, ఇంద్రుని ఆజ్ఞల వల్ల నా తపోభంగానికి రంభ వచ్చింది. అపురూప సౌందర్యవతి. పూలవనాలలో తక్కుతూ తారుతూ, మదాలస వలె తిరుగుతోంది. స్త్రీ వాంఛవేపు నా శరీరం మొగ్గుతుండగా కఠినంగా నిగ్ర హించుకున్నాను. రంభని శిలవై పొమ్మని శపించి శాంతించాను. ఎన్నో సంవత్సరాలు గడిచిన తర్వాత ఒక బ్రాహ్మణోత్తముడి అనుగ్రహంతో ఆమె మళ్ళీ సజీవ

---

**16.** వాల్మీకి కథలో, **మేనక** ప్రసక్తి ఈ సందర్భంలో రాదు. ఇంకా కొంత దూరం పోయాక, బాలకాండలోనే 63వ సర్గలో వస్తుంది. అక్కడ వున్న మేనక ప్రసక్తిని నేను ఈ సందర్భంలోకి మార్చాను. ఎందుకంటే, ఇక్కడ మన్మథుణ్ణి రుద్రుడు శపించడం గురించి వచ్చింది. మన్మథుడు విశ్వామిత్రుడి తపస్సు కూడా పాడుచేశాడని ఇంకో రుషి వేరే సందర్భంలో రాముడికి చెపుతాడు. ఆ కథని కూడా ఇక్కడికి మార్చాను. మన్మథుడు, విశ్వామిత్రుడి తపస్సుని కూడా పాడుచేసిన కథని ఇక్కడే చెప్పడంవల్ల, మేనక ప్రసక్తి ఇక్కడే వచ్చింది. ఈ రుషులందరూ ఎప్పుడూ ఆడవాళ్ళ వెంటపడుతూ తమ తప్పుల్ని మన్మథుడి మీదకి గెంటుతూ వుంటారు. – 63వ సర్గలో, మేనక ప్రసక్తి వచ్చిన సందర్భంలో కూడా, మేనకకు **శకుంతల** పుట్టడం సంగతి వుండదు. శకుంతల పసిబిడ్డగా వున్నప్పుడు, తల్లి దండ్రులిద్దరూ (మేనకా, విశ్వామిత్రుడూ కూడా) ఆ బిడ్డని వదిలేసి ఎవరి దారిన వాళ్ళు పోయారనే కథ రామాయణంలో గాక, వేరే పుస్తకాల్లో చదువుతాము. కానీ, ఇక్కడ మేనకా విశ్వామిత్రుల కథ వుంది కాబట్టి, ఈ సందర్భంలో **శకుంతల** సంగతి కూడా ప్రస్తావించాను. ఆ బిడ్డని విశ్వామిత్రుడు కూడా వదిలేశాడనే సంగతి చిన్న రాముడికి తెలియాలని. రాముడు ఇంకా చిన్న వయసులో వుండడంవల్ల కొన్ని విషయాలకు న్యాయంగానే స్పందిస్తున్నాడు. పిల్లల్ని కని చెట్లలోనో పుట్లలోనో పారెయ్యడం ఏనాటి నించో జరుగుతోంది! ★

ప్రాణి కాగలదని శాప విమోచనం వివరించాను" అని ఆగాడు విశ్వా మిత్రుడు.

"రంభని శపించడం ఎందుకు గురుదేవా? ఆమె, ఇంద్రుడి ఆజ్ఞ వల్లనే వచ్చింది కదా? సేవకులు, యజ మానుల ఆజ్ఞల ప్రకారం నడుస్తారు కదా?" అనబోయి చప్పున ఆగిపోయాడు రాముడు.

తన తపోభంగానికి రంభని పంపిన ఇంద్రుడికి ఆ తపోభంగంవల్ల సిద్ధించబోయే ప్రయోజనం ఏమిటో తెలిసి కూడా ఆ నిస్సహాయ పరిచారిక మీద తన శక్తి సామర్థ్యాలు గుప్పించిన విశ్వామిత్రుడూ; రంభ పొందిన శిక్షని తనకు జరిగిన అవమానంగా భావించక, ఆమె శాప విమోచనకై తన వీరత్వంతో ఏమీ చేయక, ఆమెని అలాగే విడిచిన ఇంద్రుడూ – రాముడి మన సంతా అంతులేని అయోమయాన్నీ, శూన్యాన్నీ సృష్టించి, ఆలోచనా రహితుణ్ణి చేశారు. నిర్లిప్తంగా గురువు వెంట నడిచాడు రాముడు.

అంతలో ఆశ్రమంలో మునులంతా విశ్వామిత్రుణ్ణి చూసి వినయంగా ఆహ్వానిస్తూ చుట్టూ చేరారు. కుశల ప్రశ్నల తర్వాత అందరూ ఎంతో విచారం వెలిబుచ్చుతూ చెప్పడం మొదలుపెట్టారు. "విశ్వామిత్ర మహర్షీ! ఈ ప్రాంతంలో రాక్షస పీడతో వేగలేకుండా వున్నాము. కళ్ళు మూసుకుని తపస్సు చేసుకుంటూ వుంటే, 'తిని కూర్చుని తపస్సేవిటని' రాక్షసులు హఠాత్తుగా వచ్చి మమ్మల్ని చెదరగొడుతున్నారు. మొన్న ఒక రుషి పుంగవుణ్ణి పర్వ తాల మీదికి మోసుకుపోయి కిందికి దొర్లించారు. ఒక మునీశ్వరుణ్ణి గొయ్యితీసి కంఠం వరకూ కప్పెట్టి పోయారు. ఒక సిద్ధుడి గడ్డాలూ మీసాలూ కత్తిరించి, గొడ్డలి ఇచ్చి కట్టెలు కొట్టించారు. విశ్వామిత్రా! ఏమిటీ ఘోరం? ఎన్నడయినా విన్నామా? ఈ ఆశ్రమం విడిచి పోక తప్పదని నిర్ణయించుకున్నాము" అని అనేక విధాల వాపోయారు. ఏ రుషి నోట విన్నా అదే ఆలాపనగా వుంది.

విశ్వామిత్రుడు ఎంతో ఖేదపడి "విచారించవొద్దు. మన కష్టాలు తీరేకాలం వచ్చింది. శ్రీ మహా విష్ణువు రాక్షస నాశనానికై శ్రీరాముడిగా జన్మించిన సంగతి మీరెరిగినదే కదా? ఆ కార్యానికే మేము బయల్దేరాము. మీరీ స్థానం విడిచి ఎక్కడికీ పోయే పని లేదు" అని ఆ మునులందరికి ఎన్నో విధాల ధైర్యం చెప్పాడు.[17]

మునులందరూ రాముడికి నమస్కరించారు. విష్ణు లీలలు గానం చేశారు. రాముడి శరీరం పులకరించింది. తన జన్మకారణం మళ్ళీ స్పష్టంగా అవగాహనైంది. రాక్ష సుల్ని సంహరించి పుణ్యాత్ములైన మునులగోడు తీర్చాలనే ఆరాటం రేగింది.

లక్ష్మణుడికి కూడా అన్నగారు చేయబోయే రాక్షస సంహారంలో తన శక్తికొద్దీ సహకరించాలనే పట్టుదల కలి గింది.

తర్వాత, విశ్వామిత్రుడూ, రామ లక్ష్మణులూ ముసు లిచ్చిన పడవలో గంగానది దాటి ఒక కీకారణ్యంలో ప్రవేశించారు.

★ ★ ★

**ఆ** అరణ్యం మహా భయంకరంగా వుంది ఎక్కడా బాటసారులు లేరు. కాలి బాటలే లేవు. భూమి అంతా ముళ్ళ పొదలతో, పురుగుల ధ్వనితో నిండి వుంది. చెట్ల కొమ్మలు పక్క చెట్ల కొమ్మలతో పెనవేసుకుని సూర్య కిరణాలకు కూడా అభేద్యంగా వున్నాయి. క్రూరమృగాల అరుపులు ఎంతో సమీపం నుంచే వినవస్తున్నాయి. కొమ్మల చుట్టూ ఎన్నో రకాల పాములు తీగలవలె వేళ్ళా డుతూ హఠాత్తుగా కిందపడి జరజరా పాకుతున్నాయి. కత్తులవంటి ముక్కులతో, గోళ్ళతో కొన్ని పక్షులు బాణా లకు కూడా బెదరక మీదిమీదికి పొడవొస్తున్నాయి. అడవి పందులూ, ఏనుగులూ యధేచ్ఛగా తిరుగు తున్నాయి.

లక్ష్మణుడికి ఇంటికి పోనందుకు పశ్చాత్తాపం మొదలైంది.

రాముడు బెదురు చూపులు చూస్తూ, "గురుదేవా! ఈ అడవి ఇంత భయంకరంగా వున్నదేమి?" అని అడిగాడు.

విశ్వామిత్రుడు నలుదిక్కులూ తీక్షణంగా చూసి గబగబా ముందుకు సాగుతూ చెప్పాడు – "రామా! ఒకప్పుడీ ప్రదేశమంతా రుషి ఆశ్రమాలతో, జప తపా లతో కన్నుల పండువుగా వుండేది. కొంతకాలానికి **'తాటకి'** అనే మహాబలం గల ఒక రాక్షసి కొంత రాక్షసుల గుంపుతో ఇక్కడ నివాసం ప్రారంభించి ఈ ప్రదేశాన్నంతా రుషులకు వాసయోగ్యం కాకుండా చేసే సింది. అందుకే ఈ ప్రదేశాన్ని 'తాటకావనం' అంటారు."

"ఒక అబలకు అంత బలం ఎలా వచ్చింది గురుదేవా?"

---

**17.**ఎంతో కాలంనించీ రాక్షసులు నివశిస్తోన్న భూములలోకి 'కొత్త వాళ్ళు' రావడంవల్ల, రాక్షసులు, కొత్త వాళ్ళని వెళ్ళగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. హఠాత్తుగా వాళ్ళ మీద పడి యుద్ధాలు చేస్తున్నారు. ఈ వాస్తవం, కొత్త వాళ్ళపక్షం కవి చేతిలో ఇంకో రకంగా మారిపోయింది – 'ప్రశాంతంగా తపస్సులు చేసుకోవడానికి వచ్చిన రుషుల్ని రాక్షసులు దుర్మార్గంగా హింసిస్తున్నారు' అని! ★

"ఒక యక్షుడికి బ్రహ్మ ఇచ్చిన వరంవల్ల అది మొదటే అంత బలంతో యక్షుడి కూతురిగా పుట్టింది. బ్రహ్మచేసే కార్యాలన్నీ ఇటువంటివే" అని బ్రహ్మ మీద విసుగు ప్రకటించాడు విశ్వామిత్రుడు.

రాముడు సహజ కుతూహలంతో – "యక్ష స్త్రీ రాక్షసి ఎలా అయ్యింది గురువర్యా?" అని మళ్ళీ ప్రశ్నించాడు.

"తాటకి భర్త సుందుణ్ణి, అగస్త్య మహర్షి సంహరించాడు."

"ఎందుకు?"

"రామా! మహర్షి ఏ కార్యం చేసినా 'ఎందుకు?' అని ప్రశ్నించరాదు. మహర్షు లెప్పుడూ లోక కళ్యాణం కోసమే చేస్తారు. సుందుణ్ణి చంపినప్పటి నుంచీ తాటకీ, దాని కొడుకు మారీచుడూ, అగస్త్యుణ్ణి బాధించటం మొదలుపెట్టారు. నిత్యం అతడి ఆశ్రమానికి వచ్చి ఆ మునిని దూషించి వెళుతూ ఉండే వారు. ఆ పీడ పడలేక ఆ తల్లీ కొడుకులిద్దర్నీ రాక్షసులై పొమ్మని శపించాడా మహర్షి. అప్పటి నుంచీ అది రాక్షస గుంపుతో ఈ చుట్టు పక్కల రుషుల్ని పీడిస్తూ వుంది. ఈ ప్రదేశాలన్నీ నిర్జనారణ్యాలుగా చేసేసింది."

రాముడు మౌనంగా విన్నాడు. సగం దైవత్వం సిద్ధించిన రాముడిలో ఇంకా సగం మానవత్వం మిగిలి ఉండడంచేత, తాటకి ఉదంతం అతనికి కొంత అన్యాయంగానే తోచింది. ఆమె భర్తని చంపడమేగాక ఆమెనూ, ఆమె బిడ్డనూ శపించడమా? రాక్షసులుగా మారిన తర్వాత, ఆ అమానుష చేష్టలు చెయ్యడంలో వారి దోషమేముంది?

విశ్వామిత్రుడు తీక్షణంగా పరిసరాలు గాలిస్తూ, "రామా! ఈ ప్రాంతాలలోనే తాటకి తిరుగుతూ వుంటుంది. అది మెరుపులాగ దాడి చేసి మాయమవుతుంది. జాగరూకుడవై నడవాలి" అని హెచ్చరించాడు.

రాముడు ఎక్కడైనా తాటకి కనబడుతుందేమోనని చుట్టూ ఆతృతగా చూశాడు. విశ్వామిత్రుడు వడి వడిగా అడుగులు వేస్తూ రాక్షస మాయల గురించి రాముడికి చెబుతూనే వున్నాడు.

రాముడి మనసు తాటకి చరిత్రలోనే లీనమై వుంది – చిన్నతనం నుంచీ తల్లి దగ్గరా, పినతల్లుల దగ్గరా, దాదుల దగ్గరా, దాసీల దగ్గరా, ఎందరో వీరుల కథలూ, పతివ్రతల కథలూ, విన్నాడు. ఆ వీరులు ప్రాణాలకు కూడా తెగించి యుద్ధాలు చేస్తారు. ఆ పతివ్రతలు భర్తల క్షేమంకోసం, భర్తల ప్రాణాలకోసం, ఎన్నో అద్భుతాలు చేస్తారు. సూర్యుణ్ణి ఆపుతారు, చంద్రుణ్ణి ఆపుతారు. గాలిని బంధిస్తారు, సముద్రాలు ఇంకిస్తారు. ఒక్క భర్త శ్రేయస్సు కోసం చరాచర జీవరాసులకూ హాని కలిగించే లోక భీకర కార్యాలు చేస్తారు. అయినప్పటికీ ఆ పతివ్రత మీద దేవతలు కోపించరు. శపించరు. ఆ పతివ్రతల దగ్గిరికే గగ్గోలుపెడుతూ పరుగు పరుగున వస్తారు. పతివ్రతల పాదాలకు మొక్కి కోరిన వరాలిస్తారు. సిరి సంపదలిస్తారు. యుగయుగాల వరకూ ఆ పతివ్రతల్ని లోకం కీర్తిస్తూనే వుంటుంది. అందుకే, రాముడు ఆ కథలు విన్నప్పుడల్లా తానొక గొప్ప వీరుణ్ణి కావాలనీ, తన భార్య మహా పతివ్రత కావాలనీ, కోరుకుంటాడు.

ఈ తాటకి కూడా గొప్ప పతివ్రతే కదా? ఈమె చేసిన ఘోర నేరం ఏమిటి? తన భర్తని చంపిన శత్రువు మీద పగ కలగడం అన్యాయమా? ఆమెను శపించడమే న్యాయమా?– ఈ న్యాయాన్యాయాలూ ధర్మ సూక్ష్మాలూ చాలా తికమకగా, అయోమయంగా వున్నాయి రాముడికి. గురువుని ప్రశ్నించి సందేహ నివృత్తి చేసుకునే ధైర్యం లేదా శిష్యుడికి! అర్ధ శ్రీమహా విష్ణువుకి!

విశ్వామిత్రుడు లక్ష్మణుడి వేపు కన్నెత్తి అయినా చూడడం లేదు. అతన్ని పలకరించడం లేదు.

"రామా! తొందరగా అడుగు వెయ్యి! ఈ సమీపంలోనే వామనాశ్రమం వుంది. దాని ప్రసిద్ధి కూడా చెపుతాను విను! పూర్వం బలి చక్రవర్తి అనే ఒక రాక్షసరాజు ఇంద్రుడిని కూడా జయించి దేవరాజ్యం ఆక్రమించుకున్నాడు. ఎల్లకాలమూ దేవతల పక్షమే అయిన శ్రీమహా విష్ణువు ఆ రాక్షస రాజుని అణచడానికి ఈ ఆశ్రమంలోనే వామనావతారం ఎత్తాడు. బలిచక్రవర్తి గొప్ప యాగం చేస్తూ కోరిన వరాలన్నీ ఇస్తున్నాడని గ్రహించి వామనుడు బ్రాహ్మణ వేషంలో బలిచక్రవర్తి దగ్గిరికి వెళ్ళి మూడడుగుల భూమిని భిక్ష అడిగాడు. బలిచక్రవర్తి గురువు, వామనుణ్ణి కపటవేషధారి అని శంకించి, చక్రవర్తిని హెచ్చరించాడు. అయినప్పటికీ ఆ జ్ఞానహీనుడు వామనుడి తేజస్సుకి పరవశుడై దానం ఇవ్వడానికే సిద్ధపడ్డాడు. తక్షణమే వామనుడు తన శరీరాన్ని భూమండలమంతా, ఆకాశ మండలమంతా విస్తరించి, ఒక పాదం భూమినిండా, రెండో పాదం ఆకాశంనిండా నింపి, "బలీ! మూడో అడుగు కోసం స్థలం ఎక్కడ ఇస్తావు?" అని చిరునవ్వుతో ప్రశ్నించాడు.

బలి చక్రవర్తి తన అంతం గ్రహించి, శ్రీ మహా విష్ణువు పాదం కింద హతుడయి పోవడమే మహా భాగ్యంగా తలచి వినయంతో శిరస్సు వొంచి – "దేవా! నా శిరస్సుపై వుంచండి!" అన్నాడు. వామనుడు మహోత్సాహంతో పర్వతాకారంతో వున్న తన పాదం బలి చక్రవర్తి శిరస్సుపై మోపి బలిని మరు క్షణంలో పాతాళంలోకి అణిచేసి, మళ్ళీ దేవరాజ్యమంతా ఇంద్రుడికిచ్చి తను వైకుంఠానికి వెళ్ళిపోయాడు. రామా! విన్నావా?

నేను విష్ణుభక్తుణ్ణి కావడంచేత ఈ వామనాశ్రమంలో నివసిస్తున్నాను. అదిగో, ఆ తాటి చెట్ల వెనక కాన వస్తుంది ఆశ్రమం, చూడు!" అని విశ్వామిత్రుడు ఉత్సాహంతో వేగంగా నడక సాగించాడు.

తాటకి చింతనతో వున్న రాముడికి, బలి గాథ కూడా అన్యాయంగానే తోచింది. ఇంద్రుణ్ణి వీరుడు అనే కదా రుషులు కీర్తిస్తారు? వీరత్వమే శ్లాఘనీయం అయినప్పుడు, బలిచక్రవర్తి తన వీరత్వంతో ఇంద్రుణ్ణి జయించి దేవరాజ్యాన్ని ఆక్రమించడంలో తప్పేముంది? శ్రీమహావిష్ణువుకి రాక్షస ద్వేషం ఎందుకు? తనను పూజించే భక్తుల్ని రక్షిస్తాడే! విష్ణుభక్తిగల బలిచక్రవర్తిని అణచాలనే పట్టుదలెందుకు? ప్రత్యక్షంగా తలపడలేక, వీరోచితంగా దానం ఇచ్చిన దాతను మోసగించి వెన్నుపోటు పొడవటం కీర్తివంతమా? అసమర్థుడైన ఇంద్రుడికి తిరిగి దేవ రాజ్యం కట్టబెట్టటం సమర్థనీయమా? ఏమిటీ ధర్మ సూక్ష్మాలు? వీటిలో పరోక్షంగా రహస్య సత్యాలు లేవుగదా! ఎవరు తనకీ సందేహ నివృత్తి చేస్తారు?

లక్ష్మణుడికి కూడా ఒక సందేహం ప్రారంభమైంది "వామనుడు భూమినిండా పాదం మోపినప్పుడు, బలిచక్రవర్తీ, అతని పరివారమూ, ఎక్కడ వున్నారు? చీమలవలే ఆ పాదం ఎక్కి కూర్చున్నారా? – తప్పు! పెద్దలు చెప్పిన విషయాల్ని అవినయంగా సందేహించకూడదు" అని పశ్చాత్తాపం చెంది మొహం తిప్పి లెంపలేసుకున్నాడు.

ముగ్గురూ విశ్వామిత్రుడి ఆశ్రమంలో ప్రవేశించారు. ఆశ్రమం చుట్టూ ఎన్నో రకాల చెట్లు, పూలతో, పళ్ళతో, గాలికి ఊగుతూ మనోహరంగా వున్నాయి. పిట్టలు కిచకిచల్తో పళ్ళని పొడిచి తింటోంటే ఒక సిద్ధుడు రాళ్ళు విసిరి వాటిని ఎగర గొడుతున్నాడు. కొందరు రుషులు దూరం నించి విశ్వామిత్రుణ్ణి చూసి సంతోషంతో ఎదురొచ్చి నమస్కారాలు చేశారు. వెళ్ళిన కార్యం దివ్యంగా ముగించుకుని రాముణ్ణి తీసుకువచ్చినందుకు విశ్వామిత్రుణ్ణి చాలా కీర్తించారు. "విశ్వామిత్రా! ఈ దినం నువ్వు తప్పక రాగలవని మేము నిరీక్షిస్తూనే వున్నాము. చుట్టుపక్కల గ్రామ ప్రజలందరికీ నువ్వు చేయబోయే యాగ వార్త అందించాము. అందరూఈ రాత్రికే ధనధాన్యాలు సమర్పిస్తారు. ఇతర ఆశ్రమాల మునులు కూడా ఈ రాత్రికే వేంచేస్తారు. రేపు నువ్వు నిర్విఘ్నంగా యాగం ప్రారంభించవచ్చును" అని అంతవరకూ జరిగిన ఏర్పాట్లన్నీ విన్నవించారు.

విశ్వామిత్రుడు చాలా సంతోషించి – "రామా, ఇటురా! ఈ అరుగుమీద సుఖంగా కూర్చో!" అని రాముణ్ణి పిల్చి కూర్చోబెట్టాడు. లక్ష్మణుడు కూడా ఒక మెట్టుకింద తలవంచుకుని కూర్చున్నాడు.

★ ★ ★

మర్నాడే విశ్వామిత్రుడు యాగం ప్రారంభించాడు. ఇరుగు పొరుగు గ్రామాలనించి రకరకాల ధాన్యాలు బళ్ళకొద్దీ వచ్చాయి. ఎందరో సంపన్న గృహస్తులు ధనం సమర్పించి వెళ్ళారు. పాలు పెరుగులూ, నేతులూ, కూరగాయలూ కావిళ్ళ కొద్దీ వచ్చాయి. రుషులూ, బ్రాహ్మలూ నేల ఈనినట్టు గుంపులు గుంపులుగా వచ్చారు. రాక్షస భయం వున్నప్పటికీ విశ్వామిత్రుడికి కోపం వస్తుందని కొందరూ, రాముడు రాక్షసుల్ని చంపే చోద్యం చూడ వచ్చునని కొందరూ, ధనధాన్యాలకూ పప్పు భోజనాలకూ ఆశించి కొందరూ, సూర్యోదయానికి ముందే వచ్చి చేరారు.

యాగ ప్రయత్నాలన్నీ చురుగ్గా సాగాయి. రుత్విక్కులు యాగ వేదిక చుట్టూ జేరి మంత్రోచ్చారణ ప్రారంభించారు. పరిశుద్ధమైన నేతులతో అగ్నిహోత్రాలు నాలికలు చాచి ప్రజ్వరిల్లుతున్నాయి.

రామలక్ష్మణులు ధనుర్ధారులై రుషులకు దూరంగా విశాలమైన ఆశ్రమ పరిసరాలకు కావలి కాస్తున్నారు.

సంధ్యాసమయం వరకూ యాగకర్మ నిర్విఘ్నంగా సాగింది.

"శ్రీరామచంద్రా! రాక్షసులు వొచ్చే వేళ అయింది. బహు జాగరూకుడవై మెలగాలి సుమా!" అని మునులంతా హెచ్చరికలు చేశారు.

రాముడి ఆతృత అధికమైంది. కథలలో విన్న రాక్షసుల ఆకారాలు కళ్ళలో మెదిలాయి. వికార శరీరాలతో, లంబోదరాలతో, కత్తులవలె వాడిగల గోళ్ళతో, కోరలతో, వికటాట్ట హాసాలు చేస్తూ ఎగురుతూ వొచ్చి మీదకు ఉరికే రాక్షసులతో ఇప్పుడు యుద్ధమా!

రాముడు, భీతిగా సందేహంగా లక్ష్మణుణ్ణి చూశాడు.

అంతకాలానికి రాముడు తనని అంత దయగా చూసినందుకు లక్ష్మణుడు పులకించి సంతోషంతో నమస్కారం చేశాడు.

"లక్ష్మణా! తాటకిని చూడాలని ఎంతో కోరికగా లేదూ?"

"అవును అన్నగారూ! ఆ రాక్షసిని మీరు జయించాలి."

ఇద్దరి కళ్ళూ తీవ్రంగా ఆకాశమంతా వెతికాయి. మేఘాలూ, కొండలూ ఎరుపెక్కాయి. చెట్ల ఆకులు తళతళ మెరుస్తున్నాయి. పక్షులు కోలాహలంగా ఎగురుతున్నాయి. కన్నుల పండువుగా సూర్యాస్తమయం జరుగుతోంది.

రాముడు అప్రమత్తుడై తిరుగుతోండగా దూరంగా

ఎక్కడో ఒక దీర్ఘశంఖారావం విన వొచ్చింది. ఆకు పందిళ్ళ కింద కూర్చుని ఆధ్యాత్మిక చర్చల్లో మునిగిన రుషులు గగ్గోలుపడి వొకరి కాళ్ళు వొకరు తొక్కుకుంటూ లేచి ఆశ్రమాలలోకి పరుగు లెత్తారు.

రాముడు బాణం ఎక్కుపెట్టి ధైర్యంగా నిలబడ్డాడు.

దూరంగా చెట్లకింద నుంచి ఒక స్త్రీ వీరత్వంతో నడిచి వొస్తోంది!

"తాటకి! తాటకి!" అని రుషులు గజగజ వొణికారు.

రాముడు విస్మయంతో తాటకిని చూస్తూ చేష్టలు దక్కి నిలబడ్డాడు.

ఆమెకి రాక్షస లక్షణా లేకోశానా లేవు. నిత్యమూ అడవుల్లో తిరిగే ఆటవిక స్త్రీవలె వుంది. చెయ్యెత్తు మనిషి! రేగిన జుట్టుముడి. బిగించి కట్టిన రంగు చీర. మొల చుట్టూ కత్తులు! దీక్షతో, అనిర్వచ నీయమైన కాంతితో వెలిగే చూపులు!

దూరంనుంచి తాటకి రామలక్ష్మణుల్ని చూసింది. రుషుల వ్యూహమంతా గ్రహించింది. ఇంకా పసితనం వొదలని ఆ బాలకుల్ని తాటకి ప్రత్యర్థులుగా భావించదనీ, వారితో యుద్ధానికి తలపడదనీ, ఆ అవకాశ మాత్రంలో రాముడి బాణం తాటకిని వధిస్తుందనీ విశ్వామిత్రుడి ఉపాయంగా తాటకి గ్రహించింది. నిశ్చేష్టుడై నిలబడ్డ రాముణ్ణి చూసి, చిరునవ్వుతో సమీపంగా వొచ్చింది.

"నాయనలారా! ఎవరు మీరు? కఠోరమైన ఈ అడవులలోకి కోమలమైన పాదాలతో నడిచి వొచ్చారా? ముక్కుపచ్చలారని మీరు, పసిబిడ్డలవలె ముద్దులొలికే మీరు, ఇక్కడ నిర్వహించే రాచకార్యాలేమిటి? ఆట పాటలతో తిరగవలసిన మీకీ ధనుర్బాణాలెందుకు? ఈ ఆశ్రమ కాపలా లెందుకు? పెద్దలందరూ అసమర్థులై, పిరికిపందలై, మిమ్మల్నీ ఘోరకార్యానికి నియోగించారా?" అని రుషులమీద కోపంతో పిల్లల్ని దయగా చూసింది.

రాముడు తాటకిని నఖశిఖపర్యంతమూ ఉత్సుకతతో చూస్తూ – "నువ్వేనా తాటకివి? ఎందుకు నువ్వీ వైదిక కర్మలకు ఆటంకం కలిగిస్తున్నావు? ఎందుకీ తపోధనుల్ని నిర్దయగా హింసిస్తున్నావు?" అని ప్రశ్నించాడు.

తాటకి ఆశ్రమాల వేపు అవహేళనగా చూసింది. అగ్నిహోత్రాల వేపు వెటకారంగా చూసింది – "మానవుల సమస్త సిరిసంపదల్నీ బ్రాహ్మణులు మాత్రమే దోచుకునే ఈ స్వార్థకర్మలా వైదిక కర్మలు? మానవులతో పాటు పశుపక్ష్యాది సమస్త జీవరాసులూ తిన గోరే ఈ నవధాన్యాలనూ, రుచ్య పదార్థాలనూ, నేతులనూ, పెరుగులనూ అగ్నిపాలు చేసే ఈ మూర్ఖకర్మలా వైదిక కర్మలు? వందలాది జంతుహింసలేగాక, నరులను కూడా యాగ పశువుల్ని చేసే ఈ క్షుద్ర కర్మలా వైదిక కర్మలు? బాలుడా! పాప పుణ్యాల భీతితో, స్వర్గ నరకాల మాయతో, ఈ రుషులు చేసే లోకవంచనా నిజమైన తపస్సు? పామర ప్రజల కష్టసుఖాలెన్నడూ ఆలోచింపని రాజ్య పాలకులు, ప్రజల రక్తమాంసాలు పీల్చిపీల్చి సేకరించిన ధనాన్ని, దానధర్మాల పేరిట తమ వొడుల్లో నింపుకునే ఈ దయాశూన్యులా గొప్ప తపోధనులు?

చాతుర్వర్ణ మౌఢ్యంతో ప్రజల్ని చీలికలు చేసి, మానవాళిలో తారతమ్యాలు సృష్టించి, తమకై ప్రత్యేక హక్కులతో, భోగాలతో, నీతులతో, స్వర్గాలతో, సహజ ప్రకృతీ సత్యాన్వేషణకు అంధులై, తమ విద్యాపాటవాన్ని నిష్ప్రయోజనం చేసే ఈ జ్ఞానహీనులా మహా తపస్సంపన్నులు?

జీవితాంతమూ కామక్రోధాలు జయించలేక స్త్రీలను అనుభవించి నిరసించే ఈ నీచులు, బిడ్డల్ని సృజించి త్యజించే ఈ క్రూరులు, కన్న బిడ్డల్ని కూడా యజ్ఞపశువులుగా అమ్మే ఈ లోభులు, తపో గర్వాలతో నిరపరాధుల్ని కూడా శపించే ఈ అహంకారులు, ఎన్నడూ క్షమా దయా శాంతమూ సహనమూ లేక సమస్త జీవరాసులకూ హాని చేసే ఈ ముక్కోపులు, వీరా మహర్షులూ, రాజర్షులూ, బ్రహ్మర్షులూ?

లోక సౌందర్యాలకు కళ్ళు మూసీ, ప్రకృతి సౌరభాలకు ముక్కు బిగించీ, తల కిందకీ కాళ్ళు పైకీ ఎత్తి, లోక ధర్మాలను కూడా తల్లకిందులు చేస్తూ, హాస్యగాళ్ళ వలె మొగ్గలు వేస్తూ, సంవత్సరాల తరబడీ కంఠాలు పెగుల్చుకుని తమ వికార ఓంకార శబ్దాలు శూన్యంలోకి పంపుతూ, సమాజ శ్రేయస్సు నించి పరారీ అయిన ఈ వ్యర్థజీవులు మానవ విరోధులే గానీ లోక కళ్యాణ కారులా?

నాయనా! వీరు కోరే సంపద ఏ ఆధ్యాత్మిక తపస్సూ కాదు, అలౌకిక యశస్సూ కాదు. అంతులేని స్వార్థం! తమ ఆజ్ఞానుసారం మానవ చరిత్రల్ని నడిపే అధికార దాహం! పక్షపాత శాస్త్రగ్రంథాలలో వేదాంతం కాదు, మానవుల మొహాలలో, రక్తమాంసాలలో వేదాంతం చూడు! జ్ఞానరహిత సిద్ధాంత చర్చల్లో ధర్మం కాదు, నిజ జీవితాచరణలో ధర్మం చూడు!

జ్ఞానంకోసం, సత్యంకోసం, సర్వమానవ సౌఖ్యం కోసం, మూర్ఖ వేదకర్మల వ్యతిరేకతే మా ధ్యేయంగా, ఈ కపట రుషుల పరాజయమే మా లక్ష్యంగా పోరాడే మమ్మల్ని 'రాక్షసుల'ని పరిహసించే ఈ అమానుషాధముల అండకై నిలబడ్డావా ఆయుధాలతో?" – తాటకి మాటలు ఆపి చిరునవ్వుతో చూసింది.

ఎన్నడూ వినని రుషి నిందకు నిర్ఘాంతపోయి వున్న

రాముడు కొంచెం సిగ్గుపడి తలవొంచుకుని తల్లిని ప్రశ్నించే బిడ్డవలె – "ఈ కర్మకాండలు జరపకపోతే దేవతలెలా సంతోషిస్తారు?" అని ఆశ్చర్యంగా చూశాడు.

"దేవతలు సూర్యచంద్రాది ప్రకృతి శక్తులు. వారికి మానవులు కలిగించే సుఖ దుఃఖాలతో నిమిత్తం వుంటుందా? .......... ఎందుకు ఆశ్చర్యపోతావు? నీ రుషుల ప్రకారమే అయినా, 'ఎవరా దేవతలు? వారికీ కర్మకాండల వల్ల ఏమి ప్రయోజనం?' అని ఆలోచించావా? రుషుల దృష్టిలో, దేవతలు కూడా తమ వంటివారే. తమలాగే దేవతలు కూడా సిరిసంపదల్లో వాటాలు కోరుతారని రుషులు భావిస్తారు. ఈ యజ్ఞ యాగాల్లో పూజలు జరిగేది దేవతల పేర్లతోనే. కానీ, ఆ దేవతలు స్వయంగా పూజాస్థలాలకు వచ్చి దేనినీ స్వీకరించరు కదా? ఈ రుషులే దేవతల పేర్లతో ధన ధాన్యాల్లో పెద్ద పెద్ద వాటాలు పొందుతారు. అవి దేవతలకే అందినట్టుగా భావించాలని చెపుతారు. నాయనా! ఈ రుషుల్నీ, రుషులు చెప్పే దేవతల్నీ సంతోషపెట్టాలనే వ్యర్థారాటం ఎందుకు? ఈ విశాల ప్రపంచమంతటా నీ కంటి ముందున్న సమస్త మానవుల్నీ సంతోష పెట్టరాదా?"

"రామా! దానితో ఏమిటా నాస్తిక ప్రసంగం?"

వెనుకనుంచి విశ్వామిత్రుడు ఉగ్రుడై గర్జించాడు. – "అది రాక్షసి! రుషుల్నీ బ్రాహ్మల్నీ పీడించి యజ్ఞాలు ధ్వంసంచేసే నీచురాలు! దాన్ని చంపు!" అని ఆజ్ఞాపించాడు.

తాటకి మెరుపులాగ చెట్లలోకి మాయమై, ఆశ్రమాల వైపు రాళ్ళు రువ్వడం మొదలుపెట్టింది. రుషులు భీతావహులై పరుగులెత్తుతూ "రామా! దాన్ని చంపు! దాన్ని చంపు! మమ్మల్ని రక్షించు!" అని కేకలు పెట్టారు.

రాముడు తాటకిని చంపడం ఊహించి కంపించాడు. స్త్రీని చంపడమా? అంత సత్యమైన విషయాలు మాట్లాడిన స్త్రీని! చిన్నతనంలో తను ఒకసారి చిలిపితనానికి ఒక దాసిని కొడితే, తన తల్లి ఎంతో విచారించి "నాయనా! స్త్రీలను కొట్టవచ్చునా? నీ ప్రతాపమంతా ఆడవారి మీదనా?" అని మందలించింది. ఆ క్షణం నుంచి తల్లిమాట వేదవాక్యం అయింది. ఇప్పుడీ స్త్రీని చంపడమా నిష్కారణంగా?

"రామా! ఎందుకు సందేహిస్తున్నావు? 'స్త్రీ' అనే ఆలోచనకూడదు. ప్రజల రక్షణకోసం ఎంత క్రూరమైన పని అయినా, ఎంత అపకీర్తి కలిగించే పని అయినా, రాజు చేయాలి. రాక్షస భీతితో, అశాంతితో కంపించే ఈ రుషిపుంగవుల్నీ, బ్రాహ్మణోత్తముల్నీ చూడు! ప్రజలంటే ఇంకెవరనుకున్నావు? వేద శాస్త్రాలు చదవడానికి కూడా అర్హత లేక, వెయ్యి జన్మలెత్తినా స్వర్గంలో తొలి మెట్టు కూడా చేరలేక, క్షుద్ర క్రిమికీటకాలవలె మట్టిలో, చెమటలో, అశుచులుగా, మూర్ఖులుగా, బ్రతుకులీడ్చే పామరులా ప్రజలు? ఈ వైదిక కర్మల మహాత్యమే కదా ప్రకృతిని నిర్దేశించేదీ, సూర్యుణ్ణి ప్రకాశింపజేసేదీ? భూమిలో వర్షం కురిపించేదీ, పంటలు పండించేదీ అదే! ఈ కర్మకాండలకు రక్షణే లేకపోతే ప్రళయం సంభవించదా? లోకాలు నశించిపోవా? రామా! ఇక జాప్యం తగదు. బాణం ఎక్కుపెట్టు! సూర్యుడు పూర్తిగా కనుమరుగయ్యాడు. నలుమూలలా చీకట్లు ముంచుకొస్తున్నాయి. రాక్షసులు నిశాచరులు. ఈ చెట్లూ, పుట్టలూ, ఈ పర్వతాలూ, వారికి కొట్టిన పిండి. రాత్రి వేళల్లో మనం వారిని జయించలేము. అతిబల మంత్రం ఉచ్చరించి ఆ బాణం విడిచిపెట్టు!" విశ్వామిత్రుడు పరుషంగా మాట్లాడుతూ తొందర పెట్టాడు.[18]

---

**18.** బాల కాండ, సర్గ 25: వాల్మీకి కథలో, రాముడు తాటకితో సంభాషించడం ఉండదు. కానీ, అతనికి తాటకి గురించి కొన్ని సందేహాలు ఉంటాయి. 'తాటకి ఎవరు? దానికి వెయ్యేనుగుల బలం ఎలా వచ్చింది?' అని విశ్వామిత్రుణ్ణి అడుగుతాడు. అంతేకాదు. తాటకిని తొందరగా చంపమని విశ్వామిత్రుడు రాముడికి మళ్ళీ మళ్ళీ చెపుతాడు – 'స్త్రీ అని సందేహించకు! దయా దాక్షిణ్యాలు విడిచిపెట్టు! గతంలో మహామహా వీరులే స్త్రీలను చంపారు! తాటకి, దుష్టురాలు! దాన్ని దయదలచకు!' అంటూ హెచ్చరికలు చేస్తాడు. అంటే, తాటకి మీద బాణాలు వెయ్యడానికి రాముడు సందేహిస్తున్నాడనీ, ఆమెపట్ల కొంత దయగా వున్నాడనీ, అర్థం. కాబట్టి, నా కథలో, రాముడు తాటకితో కొంత సంభాషిస్తాడు. ఆమెని, కొన్ని ప్రశ్నలు అడుగుతాడు.

తాటకి, రాముడితో యజ్ఞ యాగాల్ని తిరస్కరిస్తూ మాట్లాడుతుంది. దీనికి ఆధారం ఏమిటంటే, రాక్షసుల రాజు అయిన రావణుడు ఒక సందర్భంలో యజ్ఞ కర్మల్ని వ్యతిరేకిస్తాడు. ఇంద్రజిత్తు యజ్ఞం చేస్తూ వుంటే (ఉత్తర కాండలో), రావణుడు వచ్చి, "నువ్వు చేస్తున్న పని మంచిది కాదు. నేయీ మొదలైన ద్రవ్యాలతో మన శత్రువులైన దేవతల్ని పూజిస్తున్నావు. ఇది తప్పు" అంటాడు. తాటకి వాదనకు దీనినే ఆధారంగా తీసుకున్నాను. తినే పదార్థాల్ని వ్యర్థం చేస్తూ యజ్ఞాలు చెయ్యడం గురించి తాటకి వ్యతిరేకించడంలోనూ, ఆమె రుషుల్ని విమర్శించడంలోనూ, పొరపాటు లేదు.

కానీ, తాటకి వాదనలో, 'నాస్తిక ధ్వని' కూడా కొంత వుంది. "స్వర్గ నరకాల మాయతో ...." అనీ, "తమ వికార ఓంకారాన్ని శూన్యంలోకి పంపుతూ ..." అనీ, ... ఈ రకమైన మాటలు వాడడం ఆ పాత్ర స్థాయికి తగినది కాదు. స్వర్గ నరకాలు మాయే – అనీ, ఓంకారాలు ఏ దేవుళ్ళకీ చేరకుండా శూన్యంలోకి మాత్రమే పోతాయనీ, గ్రహించే నాస్తిక జ్ఞానం ➔

రాముడు అప్రయత్నంగా బాణం ఎక్కుపెట్టి నిల బడ్డాడు.

తాటకి ఎంతో దయతో నవ్విన నవ్వు, ప్రేమతో మాట్లాడిన మాటలు, ఆమె పతిభక్తి, జ్ఞానసంపద, సర్వ మానవ శ్రేయస్సుకై ఆమె ఆరాటం, అన్నీ కళ్ళ ముందు కదిలాయి. ఆ క్షణాలలో చేతిలో ఆ బాణం విశ్వామిత్రుడి వేపు తిప్పాలనిపించింది రాముడికి! కానీ, తరతరాలుగా రక్తంలో, నరనరానా జీర్ణించిన బలహీనతలతో, ఋషుల పాదాలు పూజించే మనో దాస్యంతో, నిస్సహాయుడై నిల బడ్డాడు.

అరణ్యమంతా చీకటి కమ్మింది. చెట్ల చాటు నించి ఆశ్రమాల వేపు కురిసే రాళ్ళ వర్షం అధికమైంది. మారీచ సుబాహులు కూడా యుద్ధంలోకి దిగారని విశ్వా మిత్రుడు గ్రహించాడు. ఋషులు కొందరు శాస్త్రోక్తంగా "చచ్చితిని! చచ్చితిని!" అంటూ హాహాకారాలు చేస్తూ ఆశ్ర మాల చుట్టూ పరుగు లెత్తారు. కొందరు ఆశ్రమాలలో కిక్కిరిసి నక్కారు. ఆపత్సమయంలో కూడా ఎవ్వరికీ విల్లు పట్టే ధైర్యం లేదు.

విశ్వామిత్రుడు రాముడి అలక్ష్యాన్ని సహించలేక కోపోద్రేకంతో తీక్షణంగా చూశాడు – "రామా! నీ తండ్రి ఆజ్ఞ ధిక్కరించావా? పితృవాక్య పరిపాలనే త్యజించావా? పురోహితులూ, గురువులూ చెప్పింది చెయ్యక రాజువై రాజ్యపాలన ఏ విధంగా చేస్తావు? సాక్షాత్తూ శ్రీమహా విష్ణువైన నువ్వు, రాక్షస సంహారానికే జన్మించావని మరిచావా? రామా! అలక్ష్యం తగదు. ఆ బాణం విడిచి పెట్టు!" అని గర్జించాడు.

రాముడు – బల, అతిబల విద్యలవల్ల తర్క వితర్కా లలో జ్ఞానిగానీ, నేర్పరిగానీ అయిన లక్షణా లెక్కడా లేవు. స్వబుద్ధితో కార్యం నిర్ణయించుకునే శక్తి కూడా అలవడ లేదు. నిర్వికారుడై బాణం విడిచి పెట్టాడు. వెంట వెంటనే తీవ్రంగా కొన్ని బాణాలు వేశాడు.

ఒక బాణం తాటకి గుండెల్లో తగిలింది. కొన్ని, కాళ్ళకీ చేతులకీ తగిలాయి. తాటకి మొదలు నరికిన చెట్టులా కూలి మరణించింది.

లక్ష్మణుడు, మరణించిన తాటకి మీదకు మరి కొన్ని బాణాలువేసి ముక్కూ చెవులూ ఖండించి తన పరకన్నర దైవాంశనీ సద్వినియోగం చేశాడు.

మారీచుడూ, సుబాహుడూ కొంతసేపు రాముడితో యుద్ధం చేశారు. సుబాహుడు మరణించాడు. మారీ చుడు యుద్ధం ఆపి, అప్పటికి కనుమరుగయ్యాడు.

ఋషులు ఆనంద నాట్యాలు చేశారు.

యాగం నిర్విఘ్నంగా ముగిసింది.

మునులందరూ రాముడి చుట్టూ చేరి వేనోళ్ళ కీర్తిం చారు – "ఏ రాక్షస సంహారానికి శ్రీమహా విష్ణువు శ్రీరా ముడై జన్మించాడో ఆ పవిత్ర కార్యం ప్రారంభమైంది. శుభం .... శుభం ...." అని సంతోషించారు.

"రామా! ఇప్పుడే నీకు అనేక అస్త్రాలిస్తాను" అని విశ్వామిత్రుడు పట్టరాని ఆనందంతో చెప్పాడు.

"శ్రీరాముడే లోకకళ్యాణం చెయ్యగలడు. దేవతల్ని సంతోష పెట్టగలడు. ఇతనే సమర్థుడు! యోగ్యుడు!"

"రామా! నీవు పూజ్యుడివయ్యావు మాకు!"

"శ్రీరామా! నీ లీలలు పామరు లెరుగలేరు!"

అంతకీర్తి అనుభవించిన రాముడికి, మనసులో, ప్రప్రథమంగా తను చేసిన అధర్మకార్యం వల్ల తలెత్తిన బాధ, తాటకిని చంపిన క్లేశం, పటాపంచలై పోయింది.

చిరునవ్వుతో ఋషులవేపు తిరిగాడు.[19] ★

---

➔ తాటకి పాత్రకు వుండడం సాధ్యం కాదు. ఈ నాస్తిక ధ్వని లేకుండా వుంటే, తాటకి మాట్లాడిన మిగిలిన మాటల్లో పొరపాటేమీ లేదు. కానీ ఆ నాస్తిక ధ్వనిని కూడా తీసివెయ్యకుండా అలాగే వుంచాను. ★

**19.** బాల కాండ, సర్గ 26: 'వాల్మీకి రామాయణం'లో **తాటకి**ని చంపడం 'తాటకావనం'లోనే జరుగుతుంది. ఆ తర్వాతే విశ్వామిత్రుడి ఆశ్రమంలో యాగం ప్రారంభం అవుతుంది. యాగం ఏడు రోజులు జరుగుతుంది. ఐదో రోజున రాముడు మారీచుడితోనూ, సుబాహుడితోనూ యుద్ధం చేస్తాడు. యాగ కాలంలో విశ్వామిత్రుడు మౌనంగా వుంటాడు.

**నేను చేసిన మార్పు**: తాటకితో యుద్ధం తాటకావనంలో గాక, విశ్వామిత్రుడి ఆశ్రమం దగ్గిరే యాగ కాలంలోనే జరగడం. విశ్వామిత్రుడు రాముడితో తాటకిని చంపడానికి తాటకావనంలో చెప్పిన మాటలన్నీ ఇక్కడ చెప్పడం కోసం మౌనం విడిచి పెట్టవలసి రావడం. దీనివల్ల ప్రదేశాల మార్పు తప్ప కథకి ద్రోహమేమీ జరగదు.

తాటకి విషయంలో రామ లక్ష్మణుల వీరత్వం ఇలా ఉంటుంది:

"ఆ రాక్షసి కురిపించిన రాళ్ళ వానకు శ్రీరాముడు బాణములతో దాని చేతులను ఖండించెను."

"ఛేదించబడిన భుజములు గలదియు, దస్సియుండునదియు నగు .... తాటకి ముక్కు చెవులు లక్ష్మణుడు ఛేదించెను."

రాజుల కాలాల్లో, ప్రజలకు వేసిన శిక్షల్లో, ముక్కులూ చెవులూ కొయ్యడాలూ, కాళ్ళూ చేతులూ నరకడాలూ – వంటి కౄర శిక్షలు వుండేవి. ఆ 'కౄరత్వాలే' రామాయణం'లో వీరత్వాలూ, పవిత్ర కార్యాలూ అయ్యాయి! ★

# లింకు-1

# మొదటి కథ తర్వాత 2వ కథ వరకూ

[మొదటి కథ – రాముడు, తాటకిని చంపడంతో ముగిసింది.

2వ కథ – దశరథుడు, రాముడికి పట్టాభిషేకం తలపెట్టే సంఘటనతో ప్రారంభ మవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య వున్న రామాయణం కథని, ఇక్కడ క్లుప్తంగా చూస్తాం. ఇది, ఆ రెండు కథల్నీ కలిపే 'లింకు' భాగం. బ్రాకెట్లలో వున్న వ్యాఖ్యలూ, ఫుట్‌నోట్లూ నావి.

ఈ భాగంలో, విశ్వామిత్రుడు చిన్న రాముడికి చాలా కథలు చెప్పాడు. ఆ కథలన్నీ తను పెద్దల ద్వారా విన్నానని చెప్పాడు. ఈ కథల్లో– వేలకొద్దీ సంవత్సరాలు జీవించడాలూ, తపస్సులూ, వరాలూ, శాపాలూ– వంటి మహిమలెన్నో వుంటాయి. ఈ మహిమల్ని – 'ప్రకృతి దృష్టి'తోటీ, 'సాంఘిక దృష్టి' తోటీ కూడా అర్థం చేసుకుంటూ వుండాలి. ఉదా: 'శపించడం' అంటే తిట్టడం; దూషించడం. 'వరం ఇవ్వడం' అంటే– దీవించడం; ఆశీర్వదించడం. సంఘంలో మనుషుల మధ్య జరిగే విషయాలే, మత కథల్లో, మహిమల రూపంలోకి మారి పోతాయి. ఈ లింకుల్లో కనపడే కథ, 'సాంఘిక' పద్ధతిలోగాక, మైతాలజీ పద్ధతిలోనే వుంటుంది.]

**విశ్వామిత్రుడి యాగం పూర్తి అయింది. రుషులందరూ బయల్దేరుతూ– "మిథిలానగర రాజు జనకుడు గొప్ప యాగం చేస్తున్నాడు. మేమంతా అక్కడికే వెళ్తున్నాం. రాముడు కూడా అక్కడికి వస్తే గొప్ప శివ ధనుస్సుని చూడవచ్చును" అన్నారు.**

**విశ్వామిత్రుడావార్తకి సంతోషించి రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ వెంటబెట్టుకుని తనుకూడా రుషులతో బయల్దేరాడు.** రాముడు దారిలో ఒక ప్రదేశంలో – "ఈ దేశం పేరేమిటి? దీని చరిత్రేమిటి?" అని అడిగాడు.

విశ్వామిత్రుడు – "రామా! పెద్దలద్వారా విన్న కథ చెబుతాను విను!" అని ప్రారంభించి ఈ రకంగా చెప్పాడు: పూర్వం కుశనాభుడనే ఒక రాజు వుండే వాడు. అతనికి నూరుమంది కూతుళ్ళు. వాళ్ళు ఒక రోజు వనంలో విహరిస్తూ వుండగా వాయుదేవుడు వారిని చూసి అందర్నీ పెళ్ళిచేసుకుని దేవలోకానికి తీసుకు వెళ్తానన్నాడు. ఆ రాజ కుమార్తెలు కోపంతో "మా తండ్రి ఎవరికి కన్యాదానం చేస్తే వారిని పరిగ్రహిస్తాం గానీ స్వతంత్రించంగదా? మమ్మల్నీ, మా తండ్రినీ అవమానిస్తావెందుకు దుష్టుడా!" అని వాయుదేవుణ్ణి దూషించారు (తండ్రి ప్రసక్తేగానీ, తల్లి ప్రసక్తి లేదు!)

వాయుదేవుడికి కోపంవచ్చి వాళ్ళందరి శరీరాల్లోనూ బలాత్కారంగా ప్రవేశించి గూనివాళ్ళని చేసేశాడు. ఆ సంగతి రాజుకి తెలిసి కూతుళ్ళని ఓదార్చాడు. "ఐశ్వర్యవంతులైన దేవతల్ని క్షమించడమే గొప్ప కార్యం. మీకు ఓర్పే ముఖ్యం" అని బోధించి వారికి పెళ్ళి సంబంధాలు చూడటం ప్రారంభించాడు.[20]

కుశనాభుడి రాజ్యంలోనే చూళి అనే మహర్షి బ్రహ్మకోసం తపస్సు చేస్తూ వుండేవాడు. ఆ రుషికి సోమద అనే గంధర్వ స్త్రీ సేవలు చేసేది. చూళి, ఆమె సేవకు మెచ్చి వరం కోరుకోమన్నాడు. సోమద "నాకు భర్తలేదు. నేను ఎవరికీ భార్యను కాను. నీ తపోమహిమ చేత నాకు కొడుకు కావాలి" అని అడిగింది. చూళి తన మనో సంకల్పంతో ఆమెకు కొడుకుని పుట్టించాడు.[21] అతడే బ్రహ్మదత్తుడనే రాజు. కుశనాభుడు తన కూతు

---

**20.** "ఐశ్వర్యవంతులైన దేవతల్ని క్షమించడం" అనే మాటల్లో 'సిరి సంపదలూ, అధికారాలూ గలవారు చేసే చర్యలు నేరాలు కావు' అనే అర్థాన్ని గ్రహించాలి. ధర్మాలన్నీ ధనికుల కోసమే! ★

**21.** ఇటువంటి సందర్భాలవల్లనే చరిత్రలో వివిధ దశలూ అర్థమవుతాయి. స్త్రీ, ఏ పురుషుడితోనైనా బిడ్డల్ని కనవచ్చుననే సాంఘిక దశకి ప్రతిబింబం ఈ కథ. తపోమహిమతో కొడుకుని పుట్టించడం అనేది, సాహిత్యం వేసుకున్న ముసుగు. ➔

ళ్ళని బ్రహ్మదత్తుడి కిచ్చాడు. వారి గూనితనం పోయింది.

కుశనాభుడు, కూతుళ్ళు వెళ్ళిపోయాక కొడుకు కోసం పుత్రకామేష్టి చేశాడు. అప్పుడు అతని ముసలి తండ్రి– "నాయనా! నీకు గాధి పుడతాడు" అని చెప్పాడు. అలాగే గాధి పుట్టాడు. ఆ గాధే నా తండ్రి. (విశ్వామిత్రుడి తండ్రి.) మా అక్క సత్యవతి. ఆమె భర్త రుచీకుడనే రుషి. ఆమె మహాపతివ్రత కావడం చేత శరీరంతోనే స్వర్గానికి వెళ్ళిపోయింది. అంతేగాక కౌశికా నదిగా కూడా ప్రవహిస్తోంది. అదే ఈ దేశ చరిత్ర" అని చెప్పాడు విశ్వామిత్రుడు.

రాముడు ఏ సందేహాలూ లేక సంతోషించాడు.

అందరూ ఆ రాత్రి ఒకచోట విశ్రమించి మర్నాడు కొంతదూరం నడిచి గంగానది చేరారు.

"ఈ నది వృత్తాంతం ఏమిటి?" అని అడిగాడు రాముడు వినయంగా.

"హిమవంతుడనే ఒక పర్వతం వుంది. అతని భార్య మనోరమ. ఆమె మేరు పర్వతం కూతురు. వారికి గంగా, పార్వతీ (ఉమా) అనే కూతుళ్ళు ఇద్దరు. పార్వతి ఉగ్రమైన తపస్సు చేసింది. తండ్రి ఆమెని అంతకన్నా ఉగ్రమైన తపస్సుచేసే రుద్రుడి కిచ్చి పెళ్ళి చేశాడు.

రుద్రుడు పార్వతితో సంభోగం ప్రారంభించాడు. ఆ స్థితిలోనే నూరు సంవత్సరాలు గడిచాయి. అంత దీర్ఘ కాల సంభోగంవల్ల పార్వతికి గొప్ప శక్తిగల భూతం పుడుతుందేమోనని దేవతలంతా భయపడ్డారు. అందరూ వచ్చి రుద్రునితో – "నీ వీర్యాన్ని బయటకు విడిచిపెడితే ఆ తేజస్సుని లోకాలు భరించలేవు. దాన్ని నీలోనే ఇముడ్చుకో" అని ప్రార్థించారు.[22]

రుద్రుడు 'సరే' అని అంగీకరించి తన వీర్యాన్ని భూమిమీద విడిచి పెట్టాడు.

రుద్రుడి వీర్యం భూమిమీద పడగానే భూమి బద్దలవుతుందని దేవతలు జడిసి అగ్నిని ప్రార్థించారు. అగ్ని ఆ వీర్యాన్ని దహించాడు. అది తెల్లని పర్వతం అయింది. తర్వాత దానిమీద అడవి పుట్టింది. అందులో ఆరు ముఖాలతో షణ్ముఖుడు పుట్టాడు. పార్వతికి దేవతల మీద కోపంవచ్చి – "నా గర్భంలో బిడ్డని పుట్టకుండా చేశారు. రుద్రుడికి నాతో సంబంధం తప్పించారు. అందుచేత మీ భార్యలకు కూడా బిడ్డలు పుట్టరు" అని శపించింది. తర్వాత భూమితో – "భూమీ! దుష్టురాలా! నాకు బిడ్డ పుట్టకుండా చేశావు. నీ బిడ్డల వల్ల నీకు సుఖం వుండదు. రకరకాల రాజులకు భార్యవవుతావు" అని భూమిని కూడా శపించి (రుద్రుణ్ణి మాత్రం ఏమీ అనకుండా), మళ్ళీ భర్తతో కలిసి తపస్సుకి వెళ్ళి పోయింది."

అంతవరకూ విని, ఆ కథకి రాముడు చాలా సంతోషించి – "గంగ కథకూడా సవిస్తరంగా వినాలని వుంది" అని ఉత్సాహంగా అడిగాడు.

విశ్వామిత్రుడు మళ్ళీ ప్రారంభించాడు:

ఇక గంగ కథ చెబుతాను, విను! దేవతలు హిమవంతుని దగ్గిరికి వచ్చి – 'గంగ తన కిష్టమైనట్లు ప్రవహించకూడదు. మూడు మార్గాలుగా చీలి ప్రవహించాలి' అని కోరారు. హిమవంతుడు సంతోషించి గంగని దేవతల కిచ్చాడు. గంగ దేవ లోకానికి వెళ్ళిపోయింది.

పూర్వం దేవతలు బ్రహ్మ దగ్గిరికి వచ్చి – "మన సేనాపతి తపస్సు చేస్తున్నాడు. కొత్త సేనాపతిని నియమించు" అని అడిగారు. బ్రహ్మ "దేవతల భార్యలకు బిడ్డలు పుట్టకూడదని పార్వతి శపించింది కదా? అందువల్ల అగ్నిదేవుడు తన భార్యవల్ల కాకుండా గంగవల్ల ఒక బిడ్డని కంటాడు" అని చెప్పాడు. (భార్యాభర్తలు కాని స్త్రీ పురుషులు బిడ్డల్ని కనే కాలం!)

దేవతలు సంతోషించి అగ్నిని ప్రార్థించారు, బిడ్డని కనమని. అగ్ని గంగా నది దగ్గిరికి వెళ్ళి, "దేవీ! నువ్వు నా వల్ల గర్భవతివి కావాలి. దేవతలు కోరుతున్నారు" అని చెప్పాడు. గంగ స్త్రీ రూపం ధరించి వచ్చింది. గర్భవతి అయింది. చాలా దుఃఖపడుతూ – "అగ్నీ! నీ తేజస్సుతో భారంగా వున్న ఈ గర్భం మొయ్యలేకపోతున్నాను" అంది. అగ్ని "నీ గర్భం తీసి ఒక పర్వతం మీద పెట్టు" అన్నాడు. గంగ, నదీ ప్రవాహంలోంచి గర్భాన్ని తీసి, పూర్వం రుద్రుని వీర్యాన్ని అగ్ని కాల్చగా తెల్లగా అయిన పర్వతం మీద పెట్టింది. ఆ గర్భంలోంచి కొన్ని ద్రవాలు తొణికి భూమిమీద పడి, బంగారం, వెండీ, రాగీ, తగరం – వంటి లోహాలన్నీ పుట్టాయి. గర్భంలోంచి ఒక బిడ్డ పుట్టాడు. ఆ బిడ్డకు ఆరు ముఖాలు. ఆ బిడ్డని పెంచమని దేవతలు కృత్తికా నక్షత్రాలకు అప్పగించారు. ఆ నక్షత్రాల స్తనాలలో పాలు వొచ్చాయి. ఆ బిడ్డ ఆరు ముఖాలతో పాలు తాగి కార్తికేయుడయ్యాడు. ఆ బిడ్డ ఒక పగలు పాలు తాగి పెరిగిపోయి రాక్షససైన్యాల్ని జయించాడు. దేవతలు సంతో

➔ అసలు విషయం, సోమద, చూళివల్ల బిడ్డని కనడం. అలా పుట్టిన బిడ్డకి ఆనాటి సంఘంలో 'మంచి స్థానం' వున్న విషయం కూడా గ్రహించాలి. ★

**22.** ఆ స్థితిలో దేవతలంతా ఆ భార్యా భర్తలముందు నిలబడడం అనేది మనకిప్పుడు జుగుప్సాకరం. జంతువుల సంభోగాలూ, పక్షుల సంభోగాలూ ఎంత బహిరంగమో, ఆటవిక దశలో మనుషుల సంభోగాలు కూడా అంతా బహిరంగమే. తాపీ ధర్మారావుగారి "దేవాలయాల మీద బూతుబొమ్మలెందుకు?" పుస్తకంలో, ఈ బహిరంగ సంభోగాల ప్రసక్తి వుంది. అయితే, దీర్ఘకాల సంభోగం అనేది, మానవులు ఆశతో కల్పించుకున్న కథ. ★

షించి అతనిని సేనాధిపతిని చేశారు. కార్తికేయుడే కుమారస్వామి. అతడే స్కంధుడు. అతని యెడల భక్తిగల వారు స్కంధ సాలోక్యం పొందుతారు!" అని విశ్వామిత్రుడు కధని పూర్తి చెయ్యగా రాముడు చాలా సంతోషించాడు.

"రామా! గంగానది భూలోకానికి యెలా దిగిందో చెబుతాను విను!" అని మళ్ళీ ప్రారంభించాడు విశ్వామిత్రుడు – "పూర్వం సగరుడనే రాజు వుండేవాడు. అతనికి బిడ్డలు లేరని నూరు సంవత్సరాలు తపస్సు చేశాడు. భృగుమహర్షి ప్రత్యక్షమయ్యాడు. (బ్రహ్మకి ఖాళీలేక ఈయన్ని పంపినట్టున్నాడు) ఆ రుషి రెండు వరాలిచ్చాడు. రాజు పెద్ద భార్యకు వంశాన్ని వృద్ధిచేసే ఒక్క కొడుకూ, రెండవ భార్యకు 60 వేల మంది కొడుకులూ పుడతారని చెప్పాడు. అందరూ సంతోషించారు. కొంత కాలానికి పెద్ద భార్య అసమంజుణ్ణి కన్నది. రెండో భార్య ఒక పెద్ద బంతివంటి గోళాన్ని కన్నది. అది బద్ధలై 60 వేలమంది పిల్లలు పుట్టారు. వారందరినీ దాసీలు నేతి కుండలలో పెట్టి పెంచారు. అందరూ పెద్దవాళ్ళయ్యారు. సగరుడి పెద్ద భార్య కొడుకు చాలా దుష్టుడయ్యాడు. పసిపిల్లల్ని నదిలో ముంచి చంపి ఆనందించే వాడు (వంశానికి కీర్తి తెస్తాడని మహర్షి ఇచ్చిన వరం ఇలా పనిచేసింది!) అతని దుష్టత్వానికి, తండ్రి, కొడుకుని రాజ్యంనుంచి వెళ్ళగొట్టాడు. ఆ దుష్టుడికి అంశువంతుడనే కొడుకు కూడా వున్నాడు. అతడు చాలా మంచి వాడు.

ఒకసారి సగర చక్రవర్తి అశ్వమేధయాగం ప్రారంభించాడు. ఇంద్రుడు రాక్షస వేషంతో వచ్చి ఆ అశ్వాన్ని ఎత్తుకుపోయాడు.[23] సగరుడు 60 వేల మంది కొడుకుల్నీ పిల్చి గుర్రాన్ని వెతికి తీసుకు రమ్మన్నాడు. సగరుడి కొడుకులందరూ భూమి అంతా గాలించారు. పాతాళలోకాన్ని చీల్చుకుంటూ అడుక్కి వెళ్ళారు. గుర్రం కనపడలేదు. తండ్రి దగ్గిరి కొచ్చి ఆ మాటే చెప్పారు. తండ్రి కోపంతో మళ్ళీ వెళ్ళమన్నాడు. ఈసారి ఇంకా లోతుగా తవ్వుకుంటూ వెళ్ళారు. అక్కడ నాలుగు దిక్కులా భూమిని మోస్తోన్న గొప్ప ఏనుగుల్ని చూశారు. ఆ ఏనుగులు ఎప్పుడైనా శ్రమ తీర్చుకోడానికి తలలు ఇటూ అటూ పంకించినప్పుడే భూకంపాలు లేస్తాయి!" అని విశ్వామిత్రుడు కథ కొంచెం ఆపాడు.

రాముడు భూకంపాలకు కారణం తెలిసి చాలా సంతోషించాడు.

విశ్వామిత్రుడు మళ్ళీ ప్రారంభించాడు. "సగరుడి కొడుకులు ఇంకా కొంత దూరంపోయి కపిల మహర్షినీ, అతని సమీపంలో మేత మేస్తోన్న యాగాశ్వాన్నీ చూశారు. చాలా కోపంతో మహర్షిని 'దుష్టుడా! మా గుర్రాన్ని దొంగిలించావు కదా' అని రుషిని దూషించారు. కపిల మహర్షి కళ్ళెర్రజేసి హుంకరించాడు. సగరుడి కొడుకులందరూ భస్మమైపోయారు. ఎంత కాలానికీ కొడుకులు రాకపోవడం వల్ల సగరుడు అంశుమంతుణ్ణి (మనవణ్ణి) పిల్చి. 'నువ్వు గుర్రాన్ని తీసుకురా! నా యాగం పూర్తికాకుండా వుంది' అని పంపించాడు. అంశువంతుడు కూడా ఆ ప్రదేశానికి వచ్చి తన పినతండ్రుల చావు గురించి విని, జల తర్పణాలు విడిచిపెట్టాలని నీటికోసం వెతికాడు. నీరు దొరకలేదు. గరుడుడు కనబడి – 'వీరికి గంగా నీటితో తర్పణాలు విడిస్తేనే స్వర్గప్రాప్తి కలుగుతుంది' అని చెప్పి యాగాశ్వాన్ని ఇచ్చాడు. (కపిల మహర్షే మయ్యాడు? ఇంద్రుడేమయ్యాడు? ఈ గరుడుడి కా గుర్రం ఎలా దొరికింది? – ఈ సందేహాలు వచ్చిన వాళ్ళు అజ్ఞానులు. జవాబులు దొరకవు.) అంశుమంతుడు గుర్రాన్ని తీసుకుపోయి తాతకిచ్చాడు. యాగం పరిపూర్తయిందని సగరుడు సంతోషించాడు. 30 వేల సంవత్సరాలు రాజ్యం చేసి స్వర్గానికి వెళ్ళిపోయాడా రాజు. (30 వేల సంవత్సరాలు రాజ్యం చెయ్యాలని ఎంత కోరికో!)

తర్వాత అంశుమంతుడు రాజయ్యాడు. కొంత కాలం రాజ్యం పాలించి, తన కొడుకైన దిలీపుడికి పట్టం కట్టి, అరణ్యాలకు పోయి గంగ కోసం 32 వేల సంవత్సరాలు తపస్సుచేసి, గంగ రాకుండానే స్వర్గానికి వెళ్ళిపోయాడు.

దిలీపుడు కూడా తాతల విముక్తికోసం గంగను తేలేకపోయాడు. అతని కొడుకు భగీరథుడు వెయ్యి సంవత్సరాలు తపస్సు చేశాడు. బ్రహ్మ సంతోషించి ప్రత్యక్షమై విషయం తెలుసుకొని – 'గంగను భరించే వాడు శివుడే. శివుణ్ణి ప్రార్థించు!' అని చెప్పాడు. భగీరథుడు బొటనవేలి మీద నుంచుని ఒక సంవత్సరం శివుడి కోసం తపస్సు చేశాడు. (కాలాన్ని చెప్పడంలో చాలా ఖచ్చితంగా, సత్యంగా వున్నట్టు కనపడటం కోసం ఈ 'ఒక సంవత్సరం!')

శివుడు పార్వతితో సహా ప్రత్యక్షమై విషయం విని "సరే, గంగని నేనే భరిస్తాను" అన్నాడు. (భగీరథుడు, అసలు కావలసిన గంగ కోసమే తపస్సు చెయ్యవచ్చు

**23.** ఇంద్రుడు రాక్షస వేషంతో ఎందుకు వచ్చాడు? గుర్రాన్ని ఎవరో రాక్షసుడెత్తుకు పోయాడనే భ్రమ కల్గించడానికి! రాక్షసులు యజ్ఞాలు పాడుచేస్తారని రుషులు గోలపెడతారుగానీ, ఇంద్రుడు పాడుచేసిన యజ్ఞాలూ, తపస్సులూ, అతడు చేసిన శిశు హత్యలూ, మోసాలూ, ఏ రాక్షసుడు చేశాడో లెక్కలు కట్టండి! ఇక్కడ అసలు విషయం ఏమిటంటే, వేరే తెగలనించీ గుర్రాల్నీ, పశువుల్నీ ఎత్తుకుపోవడం అన్నమాట ఇది! ★

కదా? కానీ ఆడ దేవతలకోసం తపస్సులు వుండవు!) గంగ మహావేగంతో దేవలోకం నుంచి "నా వేగంతో శంకరుణ్ణి కూడా ప్రవాహంలో కలిపేసుకుని ప్రవహిస్తాను" అనుకుంటూ శివుడి జుట్టులో పడింది. శివుడు గంగ గర్వం గ్రహించి జడలు దట్టం చేశాడు. గంగ శివుడి జడల్లో ఇరుక్కు పోయి సుళ్ళు తిరగడం మొదలు పెట్టింది. ఎన్ని సంవత్సరాలైనా కింద పడలేకపోయింది. భగీరథుడు గంగ కనబడక మళ్ళీ శివుణ్ణి గురించి తపస్సు చేశాడు. శివుడు సంతోషించి గంగని విడిచి పెట్టాడు. గంగ భూమిమీదపడి ప్రవహించడంలో ఏడు పాయలుగా చీలి ఒక పాయ భగీరథుడి వెనకాలే, రథం ఎటు తిరిగితే అటుపోయింది. దారిలో ఒక చోట జహ్ను మహర్షి యాగం చేస్తున్నాడు. గంగ ఆ ఆశ్రమంలో విసురుగా ప్రవహించింది. ఆ మహర్షికి కోపంవచ్చి గంగని పూర్తిగా తాగేశాడు. దేవతలంతా జహ్ను మహర్షిని పూజించారు, గంగని విడిచి పెట్టమని. మహర్షి సంతోషించి గంగని చెవుల్లోంచి విడిచిపెట్టాడు. ఆ విధంగా గంగ, జహ్ను మహర్షి కూతురు 'జాహ్నవి' అయింది.

తర్వాత మళ్ళీ గంగ భగీరథుడి వెంట పాతాళానికి పోయి సగరుడి కొడుకుల భస్మరాసులు తడిపింది. వారంతా స్వర్గానికి వెళ్ళిపోయారు. గంగ తన భర్త అయిన సముద్రుడితో కలిసింది. భగీరథుడు ఎన్నో వేల సంవత్సరాలు రాజ్యంచేసి స్వర్గానికి వెళ్ళిపోయాడు. రామా! ఈ గంగా మహాత్యం విన్న వారికి ధనం, కీర్తీ, ఆయుష్షూ, పుణ్యం, స్వర్గం అన్నీ లభిస్తాయి" అని కథ ముగించాడు విశ్వామిత్రుడు.

రాముడు గంగ కథకి చాలా ఆనందించాడు. ఆ రాత్రి గడిచింది. తెల్లవారిన తరువాత గంగానదిని దాటారు. అవతలి ఒడ్డున 'విశాల' అనే పట్టణం కన పడింది. రాముడు – "గురువర్యా! మీరు చెప్పే కథలు నాకు ఎంతో సంతోషం కలిగిస్తున్నాయి. ఈ విశాల చరిత్ర ఏమిటి?" అని అడిగాడు.

విశ్వామిత్రుడు ప్రారంభించాడు. "పూర్వం కాశ్యప మహర్షికి దితీ, అదితీ అనే ఇద్దరు భార్యలు. ఆ సవతుల కొడుకులకు, వృద్ధాప్యమూ రోగాలూ రాకుండా చేసు కొనే అమృతం సంపాదించాలని ఆలోచన కలిగింది. పాల సముద్రాన్ని మధించాలని వాసుకి అనే పాముని తాడుగానూ, మందర పర్వతాన్ని కవ్వంగానూ చేసి సముద్రాన్ని చిలకడం ప్రారంభించారు. ఆ విధంగా వెయ్యి సంవత్సరాలు మధించేటప్పటికి, వాసుకి ఘోరమైన విషాన్ని కక్కి, అక్కడ వున్న రాళ్ళని పళ్ళతో కొరికింది. ఆ రాళ్ళన్నీ భగభగ మండుతూ ప్రపంచాన్ని దహించడం మొదలు పెట్టాయి. దేవతలు భయపడి, శివుడి కోసం ప్రార్థించారు. శివుడూ, విష్ణువూ, కూడా ప్రత్యక్ష మయ్యారు. విష్ణువు శివుడితో – "రుద్రా! దేవతలలో ప్రథముడివి. ఈ కార్యంలో ప్రథమంగా బయటపడ్డ పదార్థం నీదే, స్వీకరించు!" అని చెప్పి అంతర్ధాన మయ్యాడు. శివుడు, ఆ సర్పం కక్కిన విషాన్ని మింగి వెళ్ళిపోయాడు. మళ్ళీ సముద్రాన్ని మథించారు. కవ్వం పాతాళంలోకి దిగిపోయింది. దేవతలు విష్ణువుని ప్రార్థించారు – కవ్వాన్ని ఎత్తమని. విష్ణువు పెద్ద తాబేలుగా మారి సముద్రం అడుగుకి చేరి పర్వతాన్ని పైకెత్తి వీపుమీద పెట్టుకున్నాడు. ఆ విష్ణువే దేవతల మధ్యలో కూడా నిలబడి సముద్రాన్ని చిలికాడు. ఆ విధంగా మళ్ళీ వెయ్యి సంవత్సరాలు చిలకగా, దండ కమండలాలు ధరించిన ధన్వంతరీ, 60 కోట్ల మంది అప్సరసలూ బయటకు వచ్చారు. అప్సరసలతో కోట్ల కొలది 'పరిచారికలు' కూడా వచ్చారు. (కొందరు మానవులు పుట్టుక తోనే దాస దాసీలవుతారని అర్థం.) తర్వాత స్త్రీ రూపంలో సుర (మద్యం) వచ్చింది. దాన్ని దితి కొడుకులు స్వీకరించ లేదు. అదితి కొడుకులు స్వీకరించారు. సుర తాగని వారు అసురులూ, తాగిన వారు సురలూ, అనగా దేవతలూ, అయ్యారు. (అంటే, మద్యం తాగే తాగు బోతులు – దేవతలూ, తాగని వారు రాక్షసులూ అన్న మాట! ఏమంటారో మహాత్మాగాంధీ గారు!).

తర్వాత పాల సముద్రం నించి కౌస్తుభమణీ, అమృతమూ వచ్చాయి. ఆ అమృతంకోసం అసురులకూ, దేవతలకూ యుద్ధం జరిగింది. (దితి కొడుకులకూ, అదితి కొడుకులకూ.) విష్ణువు మోహిని వేషంలో వచ్చి అమృతాన్ని సంగ్రహించుకుని పోయాడు. అదితి పెద్ద కొడుకైన ఇంద్రుడు, దేవతల బలంతో అసురుల్ని ఓడించాడు. దితి తన కొడుకు లందరూ మరణించారని దుఃఖించి భర్తతో – "నీ రెండో భార్య కొడుకులు, నా బిడ్డల్ని చంపేశారు. ఇంద్రుణ్ణి చంపే కొడుకుకోసం తపస్సు చేస్తాను. అనుజ్ఞ ఇయ్యి!" అంది. ఆమె భర్త ఆమె గర్భాన్ని చేత్తో తడిమి – "నీకు శుభం కలుగుతుంది. వెయ్యి సంవత్సరాలు పవిత్రంగా వుండు. అప్పుడు నా దయ వల్ల పుత్రుణ్ణి కంటావు" అని చెప్పి తపస్సుకోసం వెళ్ళిపోయాడు. దితి కూడా సంతోషించి ఇంకో వైపు తపస్సు కోసం వెళ్ళింది. (ఇద్దరూ ఒకే వేపన్నా కాదు. మరి వెయ్యి సంవత్సరాలకైతే మాత్రం కొడుకు ఎలా పుడతాడు?)

దితి తపస్సు చేస్తోందని విన్నాడు ఇంద్రుడు. ఆమె ప్రయత్నం మాన్పడానికి ఆమె అనుగ్రహం కోసం ఆమెకు సేవలు చేయడం ప్రారంభించాడు. దితి సంతోషించి "నా బిడ్డవల్ల నీకేమీ హాని లేకుండా చేస్తాను" అని చెప్పింది. ఆ విధంగా తపస్సులో వెయ్యి సంవత్సరాలకు

పది సంవత్సరాలు తక్కువగా వుండగా – (అబ్బా, ఎంత ఖచ్చితమైన లెఖ్ఖ!) ఒకసారి దితి, పాదాల్లో శిరస్సు పెట్టుకొని నిద్రపోతూ వుంది. పాదాలమీద తల వెంట్రుకలు పడడంవల్ల ఆమె అశుచి అయిపోయింది కదా అని ఇంద్రుడు సంతోషించాడు. ఆమె యోని ద్వారంలోంచి కడుపులోకి వెళ్ళి గర్భాన్ని ముక్కలు ముక్కలుగా ఛేదించాడు. శిశువు ఏడవడం మొదలు పెట్టింది. ఆ ఏడుపు విని దితి నిద్రలోంచి లేచింది. ఇంద్రుడు శిశువుని "ఏడవకు, ఏడవకు" అని వారిస్తూ మళ్ళీ ముక్కలు చేశాడు. దితి, ఇంద్రుడితో శిశువుని చంపవద్దని చెప్పింది. ఇంద్రుడు, తల్లి మాట గౌరవించి బయటకి వచ్చేశాడు, పని ముగించి. (తల్లిని గౌరవించడం ఇంద్రుడి దగ్గరే నేర్చుకోవాలి జనులందరూ!) బయటికి వచ్చిన ఇంద్రుడు దితికి నమస్కరిస్తూ "నీ వెంట్రుకలు పాదాలకు తగిలాయి. అశుచి వయ్యావు. అందుకనే ఈ పని చేశాను" అన్నాడు. దితి విచారించి – "అవును. నేనే అజాగ్రత్తగా వున్నాను. నీ అపరాధం లేదు"[24] అని ఒప్పుకుని – "నా గర్భంలో ముక్కలన్నీ శిశువులై పుట్టి దేవతలవుతారు" అన్నది. తర్వాత దితీ, ఇంద్రుడూ స్వర్గానికి వెళ్ళిపోయారు. ఇదిగో, ఈ ప్రదేశంలోనే దితికి ఇంద్రుడు సేవలు చేశాడు రామా! ఇప్పుడీ దేశాన్ని సుమతి అనే రాజు పరిపాలిస్తున్నాడు" అని విశ్వామిత్రుడు ఆ ప్రదేశం మహత్యం చెప్పాడు.

విశ్వామిత్రుడు వచ్చాడని తెలిసి సుమతి అక్కడికి వచ్చి కుశల ప్రశ్నలు వేసి ఆతిథ్యం ఇచ్చాడు. ఆ రాత్రి అక్కడ గడిపి మర్నాడు మిథిలానగరానికి చేరారు.

ఆ నగర సమీపంలో ఒక రుషి ఆశ్రమం నిర్జనంగా కనబడింది. "ఈ ఆశ్రమం ఇంత నిర్జనంగా వుందేమి?" అని రాముడు అడిగాడు. విశ్వామిత్రుడు మళ్ళీ ప్రారంభించాడు "ఇది గౌతమ మహర్షి ఆశ్రమం. ఆయన భార్య అహల్య. ఒకసారి ఇంద్రుడు గౌతముని వేషంలో వచ్చి "అహల్యా! నీవు అందంగా వున్నావు. నిన్ను కోరుతున్నాను" అని అడిగాడు. అహల్య అతడు ఇంద్రుడని తెలిసికూడా అతనితో సంగమాన్ని సంతోషంగా అంగీకరించింది. తర్వాత "ఇంద్రా! చాలా సంతోషించాను. తొందరగా వెళ్ళిపో. నిన్నూ, నన్నూ రక్షించుకోవాలి కదా?" అని ఇంద్రుణ్ణి హెచ్చరించింది. ఇంద్రుడు వెళ్ళబోయేంతలో గౌతముడు వచ్చి ఇంద్రుణ్ణి చూచి సంగతంతా గ్రహించి "నీ బీజాలు నేలమీద పడిపోవాలి" అని శపించాడు. ఇంద్రుడి బీజాలు భూమిమీద పడిపోయాయి. ఇంద్రుడు వెళ్ళిపోయాడు. గౌతముడు భార్యని కూడా శపించాడు – "ఎవరికీ కనపడని గాలిగా, ధూళిగా, అయిపోతావు. అన్నహారాలు లేకుండా తిరుగుతూ వుంటావు. దశరథ పుత్రుడు రాముడు ఈ మార్గంలో వొచ్చినప్పుడు (అప్పటికి రాముడు పుట్టనైనా లేదు), అతని పాదధూళి తగిలి, లోభ మోహాలు విడిచి మళ్ళీ నన్ను చేరుతావు" అని చెప్పి తపస్సు కోసం వెళ్ళిపోయాడు.

ఇంద్రుడు రుషులందర్నీ పిలిచి "నాకు కొత్త బీజాలు తెచ్చి పెట్టండి" అని అడిగాడు. రుషులు, ఒక యాగం జరుగుతున్న చోటికిపోయి "ఈ మేక బీజాలు ఇవ్వండి. ఇకనించీ బీజాలులేని మేకని చంపినా మీకు ఫలం కలుగుతుంది" అని ధర్మాన్ని మార్చుచేశారు. (ఐశ్వర్యవంతులకోసం, సంఘం, ధర్మాల్ని తారుమారు చేస్తూ వుంటుంది.) ఇంద్రుడు మేకబీజాలు పెట్టుకొని సంతోషించాడు. (ఈ రకమైన కథలు వింటూ పెరిగిన ఏ పిల్లలైనా రాముడి కన్నా తెలివిగా వుండగలరా?)

"రామా! అహల్యని చూసి ఆమెకు శాపవిముక్తి కలిగించు! ఆమెని రక్షించు!" అంటూ విశ్వా మిత్రుడు, ఆ ఆశ్రమంలో ప్రవేశించాడు.

రాముడు తన దైవత్వానికి ఎంతో సంతోషించి, ఆశ్రమంలో ఎవ్వరికీ కనబడకుండా గాలిలో పొగ లాగ వున్న అహల్యని చూశాడు. ఆమె శాప విముక్తురాలై అందరికీ కనబడింది. రాముడూ, లక్ష్మణుడూ అహల్య పాదాలకు నమస్కరించారు. గౌతముడు కూడా వచ్చాడు. రాముణ్ణి పూజించి అహల్యతో కలిసి తపస్సుకి వెళ్ళిపోయాడు. (పరపురుషుడితో కలిసిన భార్యని భర్త మొదట కొంత దండించినా మళ్ళీ ఆమెని స్వీకరించడం ఈ కథలో చూస్తాం.)[25]

తర్వాత విశ్వామిత్రుడూ, రాముడూ, రుషులూ, జనక మహారాజు యాగం చేస్తోన్న యాగశాలకు వెళ్ళారు. (రాముడి వెనక లక్ష్మణుడు కూడా ఎప్పుడూ వుంటాడు. కానీ అతనితో పని పడితేగానీ అతని పేరు చెప్పరు.) వేదఘోష! బ్రాహ్మల గుంపులు! కిక్కిరిసిన పర్ణశాలలు!

విశ్వామిత్రుడు వచ్చాడని తెలిసి జనక మహా రాజు తన పురోహితుడయిన శతానందుడితో కలిసి వచ్చాడు. శతానందుడు, అహల్య కొడుకు. అతడు "విశ్వామిత్రా! విధివశాన జరిగిన నా తల్లి చరిత్ర రాముడికి చెప్పావా?

---

**24.** దేవతలలో ముఖ్యుడైన ఇంద్రుడిమీద ఎక్కడా నేరం మోపరు. అతడి నేరాలకు ఇతరుల ప్రవర్తననే కారణంగా చెపుతారు అన్ని కథల్లోనూ. ★

**25.** అహల్య ప్రవర్తనని, తర్వాత కాలంనాటి వ్యభిచారంలాగ అర్థం చేసుకోకూడదు. పాత నీతి మారి, 'పాతివ్రత్యం' ప్రవేశిస్తోందని అర్థం చేసుకోవాలి. ★

నా తల్లి శాప విముక్తురాలై రాముణ్ణి పూజించిందా?' అని విశ్వామిత్రుణ్ణి అడిగి సంగతంతా విని సంతో షించాడు.

జనకుడు కూడా విశ్వామిత్రుణ్ణి కుశల ప్రశ్నలు వేసి, రాముడు చేసిన పుణ్యకార్యమైన తాటకి వధ గురించి విని, రాముడు శివ ధనుర్భంగానికి వచ్చి నందుకు చాలా ఆనందించాడు.

శతానందుడు రాముడితో - "రామా! విశ్వా మిత్రుడు నీకు గొప్పమేలు చేయగలవాడు. అతని చరిత్ర చెబుతాను విను!" అని విశ్వామిత్రుడి చరిత్ర చెప్పడం ప్రారంభించాడు. "విశ్వామిత్రుడు గాధి కొడుకు. అనేక వేల సంవత్సరాలు రాజ్యం చేశాడు. ఒకసారి విశ్వా మిత్రుడు భూ ప్రదక్షిణం చేస్తూ సేనలతో వశిష్టుడి ఆశ్ర మానికి వెళ్ళాడు. ఆ ఆశ్రమంలో అనేకమంది రుషు లున్నారు. కొందరు ఏమీ తినకుండా, తాగకుండా గాలి మాత్రం పీల్చి వుంటారు. కొందరు నీళ్ళు మాత్రమే తాగుతారు. కొందరు పండి, రాలిపడ్డ ఆకులు మాత్రం తినేవారు. బ్రహ్మ తోకనించీ పుట్టిన వాలఖిల్యులు కొందరూ (బ్రహ్మకి తోక!), బ్రహ్మ గోళ్ళనుంచీ పుట్టిన వైఖానసులు కొందరూ! అంత గొప్ప ఆశ్రమం వశిష్టు డిది! వశిష్టుడు విశ్వామిత్రుడి రాకకు సంతోషించి "రాజా! శత్రువుల్ని జయించావా? భృత్యులు నీకు లొంగి వుంటున్నారా? నీ సేనలూ, నీ కోశమూ, నీ మిత్రులూ కుశలమేనా?" అని కుశల ప్రశ్నలు వేశాడు. "నువ్వు మహారాజువి. ఆతిథ్యం ఇస్తే రాజులకే ఇవ్వాలి. రాజే పూజనీయుడు. నా ఆతిథ్యం స్వీకరించు" అని అడిగాడు. విశ్వామిత్రుడు కాదన్నా వశిష్టుడు బలవంతం చేశాడు. వశిష్టుడి దగ్గిర వున్న కామధేనువు పదార్థాలన్నీ క్షణాల్లో సిద్ధం చేసింది.[26] విశ్వామిత్రుడు ఆతిథ్యం స్వీకరించి - "బ్రహ్మర్షీ! ఈ కామధేనువు నీ కెందుకు? విలువయిన వస్తువులు రాజుల దగ్గిర వుండాలి. దీన్ని నాకియ్యి" అని అడిగాడు. వశిష్టుడు ఇయ్యనన్నాడు. విశ్వామిత్రుడు లక్షలాది గోవుల్నీ, బళ్ళకొద్దీ వెండి బంగారాల్నీ, అంతు లేని సంపదల్నీ ఇస్తానన్నాడు. (ఒక ఆవుని కొనే ప్రయ త్నంగా దీన్ని అర్థం చేసుకోవాలి.) వశిష్టుడు ఒప్పు కోలేదు. విశ్వామిత్రుడు తన ప్రయత్నాలన్నీ విఫలమై కామధేనువుని బలవంతంగా తీసుకు పోయే ప్రయత్నం చేశాడు. (పశువుల్ని ఎత్తుకు పోవడం ఇది.)

కామధేనువు తన శరీరావయవాల నుంచి సైనికుల్ని సృష్టించింది. గొప్ప యుద్ధం జరిగింది. విశ్వా మిత్రుడు ఓడిపోయాడు. ఆ యుద్ధంలో విశ్వామిత్రుడి కొడుకులు నూరు మంది చచ్చిపోయారు. విశ్వా మిత్రుడు విరక్తిపడి రాజ్యం కొడుక్కి అప్పగించి, (ఈ కొడుకెలా వచ్చాడు?) తపస్సుకి పోయి రుద్రుడికోసం తపస్సు చేశాడు. రుద్రుడు ప్రత్యక్షమై "ఏం కావాలి?" అని అడిగాడు. (భక్తుడి మనసులో కోరికేమిటో తెలియదా దేవుడికి?) "ధనుర్వేదం అంతా నాకు తెలిసిపోయే వరం కావాలి" అని కోరాడు విశ్వా మిత్రుడు. "అలాగే" అని రుద్రుడు మాయమయ్యాడు. విశ్వామిత్రుడు సంతోషించి, మళ్ళీ వశిష్టుడి మీదికి యుద్ధానికి వెళ్ళి బాణాలు ప్రయో గించాడు. ఎన్ని అస్త్రాలూ శస్త్రాలూ ప్రయోగించినా అన్నీ వృథా అయ్యాయి. (దేవతల వరాలు అలాగాక ఇంకెలా వుంటాయి?) వశిష్టుడు బ్రహ్మదండంతో ఎదురు నిల బడ్డాడు. విశ్వామిత్రుడు దాన్ని జయించలేక పోయాడు. సిగ్గుపడిపోయి - "బ్రహ్మదండాన్ని జయించలేని నా ధనుర్విద్య వల్ల ఏం ప్రయోజనం? బ్రహ్మబలం ముందు (బ్రాహ్మణ బలం ముందు) క్షత్రియ బలం అల్పమైనది. నేను బ్రహ్మత్వాన్ని సాధిస్తాను" అని మళ్ళీ భార్యతో సహా తపస్సుకి వెళ్ళిపోయాడు. వెయ్యి సంవత్సరాలు తపస్సు చేశాడు. ఈలోగా కొంత మంది కొడుకుల్ని కన్నాడు. (అందుకే మరి తపస్సు అంత ఆలస్యం అయింది!) అప్పటికి బ్రహ్మ వచ్చి - "విశ్వామిత్రా! నువ్వు రాజర్షి వయ్యావు" అని చెప్పాడు. విశ్వామిత్రుడికి బ్రహ్మర్షిని కాలేదని కోపం వచ్చి మళ్ళీ తపస్సు చేశాడు.

అప్పుడు త్రిశంకుడనే ఒక రాజు వుండేవాడు. ఆ రాజుకి శరీరంతో స్వర్గానికి వెళ్ళాలని బుద్ధి పుట్టింది. వశిష్టుణ్ణి పిలిచి - "శరీరంతో స్వర్గానికి పోయే యజ్ఞం చేయించండి నాతో" అన్నాడు. వశిష్టుడు "అలాంటి యజ్ఞం ఏదీ లేదు" అన్నాడు. త్రిశంకుడు వూరుకోక వశిష్టుడి కొడుకుల్ని అడిగాడు. వారు చాలా కోప్పడి "వశిష్ట దంతటి పురోహితుడు కాదన్న తర్వాత నువ్వా ప్రయత్నం మాను కోనందుకు ఛండాలుడవై పోతావు" అని రాజుని శపించారు. వెంటనే త్రిశంకుడు నల్లగా అయిపోయాడు. శరీరమూ, వెంట్రుకలూ బిరుసు అయి పోయాయి. బట్టలు తోలువీ, నగలు ఇనుపవీ, అయి పోయాయి.

త్రిశంకుడి వెంట వచ్చిన మంత్రులూ, జనులూ పారిపోయారు. త్రిశంకుడు దుఃఖపడుతూ విశ్వా మిత్రుడి దగ్గిరికి వెళ్ళాడు. విశ్వామిత్రుడు అంతా విని వశిష్టుడికి వ్యతిరేకంగా ఒక కార్యంచేసే అవకాశం

**26.** కామధేనువు అనేది సమృద్ధిగా పాలిచ్చే ఆవు. కల్పవృక్షం అనేది సమృద్ధిగా కాచే చెట్టు. పశువుల్ని మచ్చిక చేసుకుని వాటినించి పాలూ పెరుగూ వెన్నా నెయ్యిలాంటి రకరకాల పదార్థాలూ; చెట్లని పెంచుతూ వాటినించీ రకరకాల ధాన్యాలూ, ఫలాలూ పొందడం ప్రారంభమైన కాలాన్ని ఊహించాలి. ఎన్నడూ ఒట్టిపోని ఆవూ, ఎన్నడూ వాడిపోని చెట్టూ కావాలనే ఆశలకు కథా రూపమే కామధేనువూ, కల్పవృక్షమూ వంటివి. ★

వొచ్చినందుకు సంతోషించి "రాజా! నిన్నీ ఛండాల రూపంతోటే స్వర్గానికి పంపిస్తాను" అని మాట ఇచ్చాడు. శిష్యుల్ని పిలిచి "రుషులందర్నీ యాగానికి పిల్చుకు రండి. ఎవరయినా రావడానికి నిరాకరిస్తే వాళ్ళేమన్నారో నాకు చెప్పండి" అని శిష్యుల్ని పంపించాడు. చాలా మంది రుషులు వచ్చారుగానీ, వశిష్టుడి కొడుకులు రాలేదు. "యాగం చేసేవాడు ఛండాలుడూ, చేయించే వాడు క్షత్రియుడూనా? దేవతలూ, రుషులూ ఎలా వొస్తారు?" అని వారు పరిహాసాలు చేశారని విశ్వామిత్రు డికి శిష్యులు చెప్పారు. విశ్వా మిత్రుడు మండిపడుతూ "నన్ను దూషించిన వారు యమలోకానికి పోయి 700 జన్మల వరకూ శవాల్ని తింటూ వుంటారు. వికార స్వరూ పాలు గల వాళ్ళయి ఈ లోకంలో కుక్క మాంసం తింటూ సంచరిస్తూ వుంటారు" అని శపించాడు. (ఈ శాపం గందర గోళంగా వుంది. వాళ్ళు యమలోకానికి పోయారో, ఈ లోకంలోనే వున్నారో, ఎటు పోయారో, ఏ మాంసం తిన్నారో, పండితులు తేల్చాలి.)

విశ్వామిత్రుడు తర్వాత యాగప్రయత్నాలు ప్రారం భించాడు రుషులందరూ జడిసి గుసగుస లాడుకుంటూ విశ్వామిత్రుడి ఇష్ట ప్రకారమే చేశారు. కానీ హవిర్భా గాలు తీసుకోవడానికి దేవతలెవ్వరూ రాలేదు. విశ్వా మిత్రుడికి కోపం వచ్చి త్రిశంకుడితో, "రాజా! నా తప శ్శక్తి చాలా మిగిలివుంది. దాని ప్రభావంతో నువ్వు స్వర్గా నికి వెళ్ళిపో" అన్నాడు. త్రిశంకుడు అందరూ చూస్తుం డగా ఎగిరి ఆకాశంలోంచి స్వర్గంలోకి వెళ్ళిపోయాడు. అక్కడ ఇంద్రుడు కోపంతో – "మూర్ఖుడా! నువ్వు ఇక్కడ వుండటానికి తగవు" అని కిందకు తోసేశాడు. త్రిశం కుడు తల్లకిందులుగా పడిపోతూ "విశ్వామిత్రా! రక్షించు! రక్షించు!" అని అరిచాడు. కిందినించి విశ్వామిత్రుడు రౌద్రంగా "అక్కడే వుండు! అక్కడే వుండు! అక్కడ నీ కోసం ప్రత్యేకంగా ఇంకో స్వర్గం సృష్టిస్తాను" అని అరిచి, అక్కడ సప్త రుషుల్నీ, నక్షత్రాల్నీ సృష్టించి, ఇంకా స్వర్గంలో వుండవలసినవన్నీ సృష్టించడానికి పూను కున్నాడు. దేవతలంతా జడిసి "విశ్వామిత్రా! నీ ప్రయ త్నాలు ఆపు. ఛండాలుడు స్వర్గానికి తగడు" అన్నారు. విశ్వామిత్రుడు తన పట్టు వదలటానికి ఇష్ట పడక – "నేనీ రాజుకి మాట ఇచ్చాను. ఈ రెండో స్వర్గంలో ఇతడు వుండవలసిందే" అని భీష్మించాడు. దేవతలు కొంత రాజీపడి – "సరే! త్రిశంకుడీ స్వర్గంలో తల్ల కిందులుగానే వుంటాడు" అని వొప్పుకున్నారు. యాగం ముగిసింది.

తర్వాత విశ్వామిత్రుడు – "ఈ ప్రదేశంలో తపస్సు చేస్తే విఘ్నం కలిగింది. (ఛండాలుడికి స్వర్గం ఇవ్వడం కోసం, తన తపస్సుకి ఆటంకం కలిగితే యేం? దాన్ని, 'ఆటంకం' అనుకోవడం ఎందుకు? ఆ పనికోసం తపస్సు పోవడం విశ్వామిత్రుడికి ఇష్టం లేదన్నమాట!) ఇంకో దిక్కుకి పోతాను" అని ఇంకో చోటుకి పోయి ఘోర తపస్సు చేశాడు.

ఆ సమయంలో అంబరీషుడనే రాజు ఒక యాగం చేయటం ప్రారంభించాడు. యజ్ఞపశువుని ఇంద్రుడు ఎత్తుకుపోయాడు. పురోహితులు రాజుతో "నీ అజాగ్రత్త వల్లనే ఈ విధంగా జరిగింది. ఇది ఇలా జరగటం దోషం. ప్రాయశ్చిత్తంగా నర పశువుని తీసుకొచ్చి యజ్ఞం చెయ్యాలి" అని చెప్పారు.[27] అంబరీషుడు ధనధాన్యాల్నీ అనేక వేలగోవుల్నీ తీసుకొని ఒక మనిషిని కొనడానికి బయల్దేరాడు. దారిలో రుచీకుడనే బ్రహ్మర్షి ఆశ్రమాని కెళ్ళాడు. (విశ్వా మిత్రుడి అక్క సత్యవతి. ఆమె భర్తకూడా రుచీకుడే. ఆయనా, ఈయనా ఒకరేనా?)

అంబరీషుడు రుచీకుడితో "బ్రహ్మర్షీ! నా యజ్ఞం నిలిచిపోయింది. నీ కొడుకుల్లో ఒకణ్ణి యజ్ఞపశువుగా ఇవ్వాలి" అని అడిగాడు. ఆ బ్రహ్మర్షి "నా పెద్ద కొడుకుని మాత్రం ఇవ్వను" అన్నాడు. (కన్న బిడ్డల్ని ఇంత పక్ష పాతంతో చూసే ఈయన, కామ, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యాలు జయించిన మహర్షి!) రుచీకుడి భార్య – "ఆఖరి కొడుకుని మాత్రం నేనివ్వను" అంది. మధ్య కొడుకు శునశ్శేపుడు – "నా తల్లిదండ్రులు నన్ను అమ్మ డానికి సిద్ధంగానే వున్నారు. నన్ను తీసుకుపో రాజా!" అని దుఃఖ పడుతూ వొప్పుకున్నాడు. రాజు సంతోషించి, బ్రహ్మర్షికి కూడా సంతోషం కలిగేంత ధనమూ, గోవులూ ఇచ్చి శునశ్శేపుణ్ణి రథంలో ఎక్కించుకొని, ప్రయాణ మయ్యాడు. దారిలో రథం ఆగినచోట శునశ్శేపుడు విశ్వా మిత్రుణ్ణి చూసి, వెళ్ళి అతడి వొడిలోపడి "తల్లిదండ్రులు లేనివాణ్ణి. నన్ను రక్షించు! అంబరీషుడి యజ్ఞమూ పూర్తి కావాలి, నేను మరణించకుండానూ వుండాలి" అని ప్రార్థించాడు. విశ్వామిత్రుడు శునశ్శేపుణ్ణి రక్షిస్తానని మాట ఇచ్చి, తన కొడుకుల్ని పిలిచి "ఈ రుషి కుమా రుణ్ణి రక్షించాలి. మీలో ఒకరు యజ్ఞ పశువుగా వెళ్ళి దేవతల్ని సంతోషపెట్టండి! తండ్రులందరూ కొడుకుల్ని తమ ఆజ్ఞల ప్రకారం నడవడానికే కంటారు. పితృవాక్య పరిపాలన చేసే అదృష్టం మీకిప్పుడు కలిగింది. నా

---

**27.** మానవ చరిత్రలో, ఆటవిక దశలో నరబలులివ్వడం, నరమాంసం తినడం కూడా వుంది. దాని అవశేషమే ఈ కథలో నరపశువులతో యజ్ఞం చెయ్యడం. ఆ యజ్ఞపశువుని ఎత్తుకుపోయినవాడు ఇంద్రుడు కాబట్టి, అతనిమీద నేరం ఆరోపించ కూడదు కాబట్టి, అది రాజు అజాగ్రత్త అయింది! ఆ ఎత్తుకుపోయిన వాడు రాక్షసుడైతే, అది రాజు అజాగ్రత్త అవదు. రాక్షసుడి తప్పు అవుతుంది! ★

మాట నెరవేర్చండి!" అన్నాడు.

విశ్వామిత్రుడి కొడుకులు తండ్రి మాటలకు వెటకారంగా – "తన బిడ్డల్ని విడిచి ఇతరుల బిడ్డల్ని కాపాడడం, మంచి పదార్థాలు కాదని కుక్క మాంసం తినడం లాంటిది" అని నవ్వారు.[28] విశ్వామిత్రుడు మండిపడి – "తండ్రి మాటకు ఎదురు చెబితే ఏం నష్టం జరుగుతోందోనన్న భయమైనా లేదా? పితృవాక్య పరి పాలననే ధర్మమని గ్రహించలేరా? వెయ్యి సంవత్సరాలు కుక్క మాంసం తింటూ జీవించండి!" అని కొడుకుల్ని శపించాడు. శునశ్శేపుడితో "నాయనా! నీకు రెండు మంత్రాలు ఉపదేశిస్తాను. నిన్ను యూపస్తంభానికి కట్టినప్పుడు అవి గానం చేసుకో! నిర్భయంగా వుండు!" అని ధైర్యం చెప్పాడు. (అదేదో మొదటే చెబితే కాదూ?)

శునశ్శేపుడు ధైర్యంగా రథం ఎక్కి కూర్చున్నాడు. తర్వాత, యాగంలో విశ్వామిత్రుడు ఉపదేశించిన మంత్రాలు స్మరిస్తూ ఇంద్రుణ్ణి ప్రార్థించాడు. ఇంద్రుడు సంతోషించి – శునశ్శేపుడికి దీర్ఘాయుష్షు ఇచ్చి అంబరీషుడికి యాగ ఫలం కూడా ఇచ్చాడు.[29]

విశ్వామిత్రుడు మళ్ళీ వేయి సంవత్సరాలు తపస్సు చేశాడు. బ్రహ్మ వచ్చి – "నువ్వు రుషి వయ్యావు" అని చెప్పాడు. విశ్వామిత్రుడు మళ్ళీ తపస్సు చేశాడు. ఒక నాడు మేనక అనే అప్సరస నదిలో స్నానంచేస్తూ కనబడింది. విశ్వామిత్రుడు కామంతో – "అప్సరసా! నా ఆశ్రమంలో ఉండు. నా శరీర తాపం చల్లార్చు!" అని అడిగాడు. మేనక ఒప్పుకుంది. ఇద్దరూ కలిసి వుండగా పది సంవత్సరాలు గడిచాయి. అప్పటికి విశ్వామిత్రుడికి మళ్ళీ తపస్సు గుర్తొచ్చింది "దేవతలే నా తపోభంగం చేశారు" అని కోపం వచ్చింది. భయపడుతోన్న మేనకని వెళ్ళి పొమ్మని చెప్పాడు.[30]

ఇంకో దిక్కుకిపోయి ఇంకో వెయ్యి సంవత్సరాల ఘోర తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై, "నువ్వింకా ఇంద్రియాల్ని జయించలేదు" అని చెప్పి మాయమయ్యాడు.

విశ్వామిత్రుడు మళ్ళీ అగ్నిలో, చలిలో, జలంలో నిలబడి తపస్సులు చేశాడు. ఇంద్రుడు భయపడి రంభని పిలిచి "రంభా! విశ్వామిత్రుడికి తపోభంగం చేసి దేవతలకు సహాయం చేయాలి" అని ఆజ్ఞాపించాడు. (తపోభంగాలు దేవతలకెలా సహాయపడతాయో చెప్పలేదు.) రంభ జంకుతూ "విశ్వామిత్రుడు కోపిష్టి, నన్ను శపిస్తాడని భయంగా వుంది. నన్ను దయతల్చు" అని ప్రార్థించింది. ఇంద్రుడు వినకుండా – "నేను కోయిలనై చెట్టుమీద నించి కూస్తూ వుంటాను. మన్మథుడు కూడా వొస్తాడు. నువ్వు చాలా అందంగా తయారయి బయల్దేరు" అని ఆజ్ఞాపించాడు. రంభ చేసేదేమీ లేక, విశ్వామిత్రుడి ముందుకు వెళ్ళింది.

విశ్వామిత్రుడు రంభ సౌందర్యం చూచి కంగారుపడి మండిపడుతూ – "కామ క్రోధాలు జయించాలని తపస్సు చేస్తోన్న నన్ను కామంలో పడేస్తావా? వెయ్యి సంవత్సరాలు రాయివైపడి వుండు!" అని శపించి – "ఎవరైనా తపశ్శాలి అయిన బ్రాహ్మణుడు నిన్ను శాప విముక్తురాల్ని చేస్తాడు" అని శాపవిముక్తి చెప్పాడు.

రంభ శిల అయింది. దేవేంద్రుడు పారిపోయాడు.

విశ్వామిత్రుడు, తనకింకా కోపం పోలేదని గ్రహించుకుని – "ఇక నుంచి మాటే మాట్లాడను. ఆహారం ముట్టను. శ్వాసయినా వొదలను. శరీరాన్ని శుష్కించు కుంటాను. ఇంద్రియాల్ని జయించి బ్రాహ్మణ్యం సంపాదిస్తాను" అని నిర్ణయించుకున్నాడు. (తిండీ నీళ్ళూ మాని, చిక్కి శల్యమై జవసత్వాలు పోయి ఒక మూలపడి వుండడం, ఇంద్రియాల్ని జయించడం అన్నమాట! ఒంట్లో శక్తి లేనప్పుడు కామ క్రోధాలెట్లా కలుగుతాయి? అవి కలగ కూడదంటే, 'న్యాయం' మీద ఆధారపడి, న్యాయంగా ప్రవర్తించాలి).

విశ్వామిత్రుడు ఇంకో దిక్కుకి పోయి వెయ్యి సంవత్సరాలు తపస్సు పూర్తి చేశాడు. ఆ తపస్సు పూర్తిచేసి అన్నం తినడానికి సిద్ధపడేసరికి ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి అన్నం అడిగాడు. విశ్వా మిత్రుడు అన్నం ఇచ్చేశాడు. ఇంకో వెయ్యి సంవత్సరాలు శ్వాస వదలకుండా తపస్సు చేశాడు. విశ్వామిత్రుడి తలలోంచి పొగ రావడం మొదలు పెట్టింది. ఆ వేడికి లోకాలన్నీ నశించిపోవడం మొదలైంది. బ్రహ్మ భయపడి – "విశ్వామిత్రా!

---

**28.** తండ్రి ఆజ్ఞల్ని ఇంకా వేదవాక్కుగా పాటించక, తండ్రిని ధిక్కరించే దశని ఈ కథలో చూస్తాం. అయితే అది నేరం అవడమూ, శిక్షపడడమూ కూడా ఈ దశలో వుంది. బలవంతంగా దండనతో కొడుకుల్ని విధేయుల్ని చేసుకోవడమే తర్వాత దశగా మారుతుంది. ★

**29.** ఈ కథలో రుచీకుడు విశ్వామిత్రుడికి అక్క భర్త అయితే శునశ్శేపుడు విశ్వామిత్రుడికి మేనల్లుడు. మేనమామ మేనల్లుడి రక్షణ బాధ్యతని తీసుకోవడమూ, తండ్రులకు కొడుకుల రక్షణ మీద శ్రద్ధ లేకపోవడమూ, ఈ కథలో కనపడుతోంది. ★

**30.** **బాల కాండ**, సర్గ 63: శతానందుడు, విశ్వామిత్రుడి చరిత్రని రాముడికి చెప్పేఘట్టంలోనే **మేనక** ప్రసక్తి వస్తుంది. దీన్నే నేను తాటకావనం దగ్గిరికి మార్చి చెప్పాను. ఇక్కడ, మేనక కథలో, ఆమెకు శకుంతల పుట్టడమూ, ఆ బిడ్డని వదిలి మేనక వెళ్ళిపోవడమూ, ఈ విషయాలేవీ వుండవు. వాటిని నేనే చేర్చాను. ★

నీ బ్రాహ్మణ్యాన్ని వశిష్ఠుడు అంగీకరించాలి” అని షరతుపెట్టాడు. వశిష్ఠుడు వచ్చి – “సరే, బ్రహ్మర్షి వయ్యావులే” అని ఒప్పుకున్నాడు.

బ్రహ్మర్షి విశ్వామిత్రుడు, బ్రహ్మర్షి వశిష్ఠుడితో స్నేహం చేశాడు. రామా! ఇదీ విశ్వామిత్రుడి చరిత్ర” అని శతానందుడు (అహల్య కొడుకు) రాముడికి చెప్పడం ముగించాడు.

జనకుడు చాలా సంతోషించి – “విశ్వామిత్రా! నీ కథ విని ధన్యుణ్ణయ్యాను. ఇక శెలవిప్పించు” అని పురోహితులతో లేచి వెళ్ళిపోయాడు.

మర్నాడు విశ్వామిత్రుడు రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ వెంటబెట్టుకుని జనకుడి దగ్గిరికి వెళ్ళి – “ఈ అన్నదమ్ములిద్దరూ నీ దగ్గిరవున్న గొప్ప ధనుస్సు చూడాలని కుతూహలపడుతున్నారు” అని చెప్పాడు.

జనకుడు – “ఈ శివధనుస్సు నా దగ్గిర ఎందుచేత వున్నదో చెబుతాను, వినండి!” అని ప్రారంభించాడు. (ఎంత చిన్న సందుదొరికినా పది పెద్ద కథలు చెప్పేస్తూ వుంటారు.)

“పూర్వం దక్ష ప్రజాపతి యజ్ఞం చేసినప్పుడు రుద్రుడికి హవిర్భాగం ఇవ్వలేదు. రుద్రుడు కోపించి హవిర్భాగాలు తీసుకున్న దేవతల తలలు నరకడానికి ఈ ధనుస్సు ఎక్కుపెట్టాడు. దేవతలు భయపడి క్షమాపణ కోరారు. రుద్రుడు జాలిపడి ఆ ధనుస్సు వారికి ఇచ్చేశాడు. వారు ఆ ధనుస్సుని దేవరాతుడనే రాజు దగ్గిర వుంచారు. ఆ దేవరాతుడు మా పూర్వీకుడు. అప్పటి నుంచీ ఇది మా దగ్గిర వుంది. నేను యాగం చెయ్యడానికి భూమిని బాగుచేయిస్తూ వుండగా ఒక బిడ్డ బయటకి వొచ్చింది. ఆ బిడ్డ మా పోషణలో పెరిగి పెద్దదయింది. ఆమె సీత. ఈ శివధనుస్సుని ఎక్కుపెట్టడమే ఆమెకు ఇచ్చే కన్యాశుల్కం. చాలా మంది రాజులు సీతను పెళ్ళి చేసుకోవాలని కోరి, ధనుస్సు ఎక్కుపెట్టే ప్రయత్నాలు చేశారు. కానీ ఎవ్వరూ ఆ కార్యం చెయ్యలేక పోయారు. నేను ఎవ్వరికీ సీతను ఇవ్వనన్నాను. ఆ రాజులందరూ కోపంతో మిథిలను ముట్టడించి ఒక సంవత్సర కాలం పీడించారు. నా బలం సన్నగిల్లింది. అప్పుడు నేను తపస్సు చేసి దేవతల దయ సంపాదించాను. వారు నాకు చతురంగ బలాలు ఇచ్చారు. తర్వాత నా శత్రువులందరూ యుద్ధంలో ఓడిపోయి పారిపోయారు. ఇప్పుడు రాముడు ఈ శివధనుస్సు ఎక్కుపెడితే సీత నిచ్చి పెళ్ళి చేస్తాను” అని చెప్పి మంత్రులకు ధనుస్సు తెమ్మని ఆజ్ఞాపించాడు.

అయిదు వేల మంది వీర సైనికులు ఎనిమిది చక్రాల బండి మీద ధనుస్సు పెట్టిని ఈడ్చుకుని వొచ్చారు. జనకుడు విశ్వామిత్రుడితో “విశ్వామిత్రా! ముల్లోకాలలో వీరులెవ్వరూ ఎక్కుపెట్టలేని శివ ధనుస్సు ఇదే. రామలక్ష్మణులకు చూపించు!” అన్నాడు.

విశ్వామిత్రుడు రాముడితో “రామా! శివధనస్సు చూడు!” అని అనుమతించాడు.

రాముడులేచి ధనుస్సు పెట్టి మూత తెరిచి చూసి, ధనుస్సుని మధ్యలో పట్టుకుని పైకి ఎత్తాడు. అల్లెతాడు లాగి ఎక్కు పెట్టాడు. ధనుస్సు పెద్ద ధ్వని చేస్తూ విరిగింది. విశ్వామిత్రుడూ, జనకుడూ, రాముడూ, లక్ష్మణుడూ తప్ప, సభలో వారందరూ మూర్ఛ పడిపోయారు.

జనకుడు – “విశ్వామిత్రా! రాముడి పరాక్రమం కళ్ళారా చూశాను! చాలా ఆశ్చర్యంగా, నమ్మలేనిదిగా వుందీ కార్యం!” అని సంతోషించాడు. “సీతను ఒక మహావీరునికే ఇవ్వాలనుకున్నాను. నా కోరిక ఈడేరింది. సీత దశరథుని కోడలై 12 తరాలవరకూ జనక వంశంలో కీర్తి తెస్తుంది. నా మంత్రులు అయోధ్యకు పోయి ఈ సంగతులన్నీ చెప్పి దశరథ మహారాజుని తీసుకు వస్తారు. నీ అనుమతి కావాలి” అని అడిగాడు. విశ్వామిత్రుడు – “అలాగే చేయ వచ్చును” అని అనుమతించాడు.[31]

జనక మహారాజు మంత్రులు అయోధ్యకు బయలుదేరారు. సంగతంతా దశరథ మహారాజుకి చెప్పారు. దశరథుడు, తన పురోహితులతో “మీరు కూడా అంతా విన్నారు. జనకుడి సదాచార సంపద మీకు ఇష్టమైనట్లయితే (ఇష్టం కాకపోతే?) రేపే మిథిలకు పోదాం. మీ అభిప్రాయం శెల వివ్వండి!” అని అడిగాడు. పురోహితులందరూ ఒప్పు కున్నారు!

దశరథుడు చతురంగ సేనలతో ప్రయాణంచేసి మిథిలకు చేరాడు. జనకుడు సంతోషించి – “రఘు వంశం వారితో సంబంధంవల్ల మా వంశానికి గౌరవం కలుగుతోంది. రేపు ఉదయాన్నే బ్రహ్మ వివాహం ఏర్పాటు చేశాము” అని చెప్పాడు.

దశరథుడు – “కన్యనీ, గోవునీ, వెండి బంగారాలనీ దానం పుచ్చుకొనేవారు, దానం ఇచ్చేవారి ఇష్టప్రకారం చేయవలసిందే కదా? నీ ఇష్ట ప్రకారమే జరపవచ్చును” అని వొప్పుకున్నాడు.

ఆ రాత్రి సంతోషంగా గడిచింది.

---

**31.** జనక మహారాజు పెళ్ళిళ్ళ నిర్ణయాలు చేస్తూవుంటే, దానికి రాముడు మొదట ఒప్పుకోడు. తన తండ్రి అంగీకారం తీసుకోవాలంటాడు. ఈ సంగతి ఈ సర్గలో వుండదు. సీత, అనసూయతో తన పెళ్ళి ముచ్చట్లు చెప్పే సందర్భంలో అలా చెపుతుంది. దాన్ని తర్వాత, ఆ సందర్భంలో చూస్తాం. సీతని పెళ్ళి చేసుకోవడం కోసం ఆ విల్లుని విరవడానికి రావణుడుకూడా వచ్చినట్టు కొన్ని కథల్లో వింటాం. కానీ, వాల్మీకి రామాయణంలో అది లేదు. ఈ విల్లు విషయంలో రావణుడి ప్రసక్తి లేదు. ★

మర్నాడు జనకుడు, పురోహితుడితో – "నా తమ్ముడు కుశధ్వజుడు సాంకాశ్యపురంలో నివసిస్తు న్నాడు. అతడిని చూడాలి నేను" అన్నాడు. దూతలు పోయి కుశధ్వజుణ్ణి తీసుకువచ్చారు. జనకుడు దశరధు డికి కబురు పంపించాడు.

దశరధుడు జనకుడి మందిరానికి వచ్చి – "మహా రాజా! వశిష్టుడు మా వంశ క్రమాన్ని తెలియజేస్తాడు వినవలసింది" అని కోరాడు.

వశిష్టుడు ప్రారంభించాడు. "బ్రహ్మ కొడుకు మరీచి. మరీచి కొడుకు కాశ్యపుడు. కాశ్యపుడి కొడుకు ......" అంటూ వంశ క్రమమంతా చెప్పి చివరికి – "దశరధుడి కొడుకులు రామ – లక్ష్మణులు. వారికి నీ కూతుళ్ళ నివ్వవలసింది" అని ముగించాడు.

జనకుడు – "నా వంశక్రమాన్ని కూడా తెలియ జేస్తాను" అంటూ తను ప్రారంభించాడు. "పూర్వం నిమి అనే రాజు వుండేవాడు. అతని కొడుకు మిధి. మిధి కొడుకు ......." అంటూ తన వంశక్రమమంతా చెప్పి – "హ్రస్వరోముని పెద్ద కొడుకుని నేను. నా పెద్ద కూతురు సీతని రాముడికీ, రెండో కూతురు ఊర్మిళని లక్ష్మణుడికీ ఇస్తాను" అని ముగించాడు.

విశ్వామిత్రుడు అందుకుని – "రాజా! నీ తమ్ముడికి కూడా ఇద్దరు కూతుళ్ళు వున్నారు. వారిని భరతుడికీ, శతృఘ్నుడికీ ఇవ్వమని కోరుతున్నాను" అనగానే జన కుడు సంతోషంగా అంగీకరించాడు. "అలాగే కాని వ్వండి! మీ వంటి రుషి శ్రేష్టుల అభీష్టమే జరుగుతుంది. నా సింహాసనం మీదా, నా తమ్ముడి సింహాసనం మీదా, దశరధుడి సింహాసనం మీదా, మీరే కూర్చోండి! ఈ మూడు రాజ్యాలలో మీ ఇష్ట ప్రకారమే ప్రభుత్వం చేయండి!" అని కోరాడు.[32] దశరధుడు సంతోషించి తన విడిదికి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు దశరధుడు కొడుకులందరి పేరిటా లక్షలాది గోవులూ, ధన ధాన్యాలూ బ్రాహ్మలకు దానం చేశాడు.

ఆ రోజే భరతుడి మేనమామ యుధాజిత్తు మిధిలకు వచ్చి దశరధుడితో – "నా తండ్రి కేకయ రాజు భరతుణ్ణి చూడాలని కోరుతున్నాడు. నేను అయోధ్యకు పోతే నువ్వూ, నీ కొడుకులూ పెళ్ళికి ఇక్కడికి వచ్చారని తెలి సింది. వెంటనే ఇక్కడికి వచ్చాను" అని చెప్పాడు. (ఈ పెళ్ళిళ్ళకి భరతుడి మేన మామనీ, తాతనీ పిలవలేదన్న మాట!)

ఆ రాత్రి గడిచింది. దశరధుడు కొడుకుల్ని తీసు కుని యాగశాలకు వెళ్ళాడు. అక్కడ వివాహాల కార్య క్రమాలు ప్రారంభమయ్యాయి.

జనకుడు రాముడితో – "నా కూతురు సీత నీకు సహధర్మచారిణిగా వుంటుంది. ఎప్పుడూ పతివ్రతగా, నీడవలే నిన్ను విడవకుండా వుంటుంది. ఈమెను స్వీక రించు!" అని కోరాడు. "లక్ష్మణా! నువ్వు ఊర్మిళ హస్తం పట్టుకో! భరతా! నువ్వు మాండవిని స్వీకరించు! శతృఘ్నా! నువ్వు శ్రుతకీర్తిని వరించు!" అని నలుగురు కూతుళ్ళనీ దానాలు చేశాడు. వివాహాలు ముగిశాయి.[33] ఆ రాత్రి గడిచిన తర్వాత విశ్వామిత్రుడు అందరికీ చెప్పి తన దారిన వెళ్ళిపోయాడు.

దశరధుడు కూడా అయోధ్యకు బయలుదేరాడు. జనకుడు కూతుళ్ళకు లక్షలాది గోవుల్నిచ్చాడు. పట్టు వస్త్రాలూ, ఆభరణాలూ ఇచ్చాడు. చతురంగ బలాల్నీ, దాసదాసీల్నీ ఇచ్చాడు.

దశరధుడు కొడుకులతో, కోడళ్ళతో, పరి వారంతో, అయోధ్యకు పోతూ వుండగా పక్షులు గట్టిగా అరిచాయి. జంతువులు ఒకవేపు నుంచి ఇంకోవేపుకి వెళ్ళాయి. అది చూసి దశరధుడు – "పక్షులు అశుభాన్నీ, జంతువులు శుభాన్ని సూచిస్తున్నాయి. దీనికి కారణం ఏమిటి?" అని వశిష్టుణ్ణి అడిగాడు. దానికి వశిష్టుడు – "కష్టం వచ్చి త్వరగానే తొలగిపోతుంది" అని అర్ధం చెప్పాడు.

అంతలో పెద్దగాలీ, చీకటీ ఆక్రమించాయి. రుషులూ రాజులూ తప్ప సామాన్య జనులందరూ తెలివి తప్పి పడిపోయారు.[34]

అంతలో భీకరంగా వున్న పరశురాముడు కన పడ్డాడు. రుషులు – "పరశు రాముడు తండ్రి వధ వల్ల రాజులపై కోపించి పూర్వం రాజులందర్నీ చంపి కోపం తీర్చుకున్నాడు కదా? ఇప్పుడు మళ్ళీ హింస పెట్టడు

---

**32.** ఆ మూడు రాజ్యాలూ పురోహితులకూ, రుషులకూ దానం చేసినట్టు అర్ధం. దానధర్మాల పేరిట, రుషులూ, పురోహితులూ రాజ్యాల్ని తమ ఆధీనంలోకి తీసుకుని, మళ్ళీ రాజులకు అప్పగిస్తూ వుంటారు. రాజులు, రుషులయెడ వినయ విధేయతలతో వుండే సాంప్రదాయం ఇది. ★

**33.** "రేపే ముహూర్తం నిర్ణయించాం" అని జనకుడు చెప్పిన తర్వాత మూడో రోజున వివాహాలు జరిగాయి. 'రేపే' అంటే అర్ధం 'మూడో రోజు' అన్నమాట! ★

**34.** పక్షుల కూతలకూ, జంతువుల అరుపులకూ, గాలి దుమ్ములకూ, చప్పుళ్ళకూ, మహామహా రుషులూ రాజ్యాధిపతులూ తప్ప, సామాన్యులయిన రధాలు తోలే వారూ, సామానులు మోసేవారూ, సైనికులూ, గోవుల్ని తోలేవారూ; పల్లకీలూ మేనాలూ మోసేవారూ – ఇటువంటి క్షుద్రులందరూ తెలివి తప్పి పడిపోతూ వుంటారు! ఐశ్వర్యవంతుల్నీ, హోదాగల వారినీ, పెద్దకులాల వారినీ తప్ప, కష్టపడి బతికే పేదవారిని ఎప్పటికప్పుడు కవులు ఏ స్థాయిలో వుంచారో గ్రహించాలి. ★

కదా?" అనుకుంటూ అర్ఘ్యం ఇచ్చారు. పరశురాముడు స్వీకరించి రాముణ్ణి చూస్తూ – "నువ్వు శివ ధనుస్సు విరిచావని విన్నాను. ఆశ్చర్యంగా వుంది. నీ పరాక్రమం తెలుసుకోవాలని ఇంకో గొప్ప ధనుస్సు తీసుకు వొచ్చాను. దీన్నిబాణంతో సంధించి నీ బలం చూపించు. తర్వాత నీతో ద్వంద్వయుద్ధం చేస్తాను" అన్నాడు.

దశరథుడు భయపడి వొణుకుతూ – "పరశురామా! ఇక క్షత్రియవధ చేయనని ఇంద్రుడి దగ్గర వాగ్దానం చేశావు. కాశ్యపుడికి భూమి అంతా దానం చేసి అరణ్యాల్లో వుంటున్నావు. ఇప్పుడు నన్ను సర్వనాశనం చేస్తావా? రాముణ్ణి చంపితే మేము జీవించలేము" అన్నాడు.

పరశు రాముడు వినిపించుకోకుండా– "రాముడూ! పూర్వం ఈ రెండు ధనుస్సులూ విశ్వకర్మ చేశాడు. రెండూ సమాన శక్తిగలవే. దేవతలు రుద్రుడికి ఒకటీ, రెండో దాన్ని విష్ణువుకీ ఇచ్చారు. ఎవరు బలవంతులో తెలుసుకోవాలని దేవతలకు కోరిక కలిగి బ్రహ్మతో చెప్పారు. బ్రహ్మ, విష్ణువుకీ, రుద్రుడికీ విరోధం కలిగించాడు. వాళ్ళిద్దరూ ఘోరయుద్ధం చేశారు. విష్ణువు హుంకారంతో శివుడు స్థంభించి ఓడిపోయాడు. శివ ధనుస్సు విరిగింది. (ఆ విరిగిందాన్నే అన్నమాట రాముడు మళ్ళీ విరిచింది!) విష్ణువే పరాక్రమవంతుడని దేవతలు గ్రహించారు. దేవతల ప్రార్ధనతో ఇద్దరూ శాంతి పొందారు. రుద్రుడు కోపంతో తన ధనుస్సుని దేవరాతుడనే రాజుకి ఇచ్చేశాడు. (అదన్నమాట ఇద్దరూ శాంతి పొందడం!) విష్ణువు తన ధనుస్సు రుచీకుడికి ఇచ్చాడు. ఆయన దాన్ని నా తండ్రికిచ్చాడు. నా తండ్రి తపస్సు చేస్తోండగా కార్తవీర్యార్జునుడు నా తండ్రిని చంపాడు. నేను కోపం పట్టలేక 12 సార్లు దండెత్తి రాజులందర్నీ చంపేశాను. భూమినంతా నేనే ఆక్రమించుకున్నాను. యజ్ఞంచేసి భూమి అంతా కాశ్యపుడికి దక్షిణ ఇచ్చేసి అడవులకు పోయి తపస్సు చేసుకుంటున్నాను. ఇప్పుడు నీ సంగతి విని బయల్దేరి వచ్చాను. ఈ విష్ణు ధనుస్సుని ఎక్కుపెట్టు! నువ్వు ఎంత వీరుడివో చూస్తాను" అన్నాడు.

అదంతా విని రాముడు – "నీ గురించి విన్నాను. తండ్రిని చంపిన శత్రువుల శేషం లేకుండా చేశావు. మంచిదే. కానీ నా వీరత్వాన్ని అవమానించి మాట్లాడావు. నేను సహించను. నా పరాక్రమం ఇప్పుడు చూడు" అంటూ రాముడు పరశురాముడి చేతిలో ధనుస్సూ, బాణం అందుకున్నాడు. ధనుస్సు తాడు లాగి బాణం సంధించి కోపంతో "నువ్వు బ్రాహ్మడివి. విశ్వామిత్రుడి బంధువువి. నిన్ను సంహరించను. నేను ఎక్కు పెట్టిన బాణం వ్యర్థం కారాదు. నీ నడక శక్తినిగానీ, నీ తపో శక్తిని గానీ కొడతాను. దేన్ని కొట్టమంటావో చెప్పు" అని అడిగాడు. పరశురాముడు నిర్వీర్యుడై – "రామా! కాశ్యపుడు నా భూమినంతా దానం తీసుకొని 'నా రాజ్యంలో నువ్వు వుండరాదు' అన్నాడు. అప్పట్నించీ అరణ్యాలలో తిరుగుతున్నాను. అందుచేత నా నడక శక్తిని కొట్టవద్దు! నా తపశ్శక్తిని కొట్టు" అన్నాడు. (తపస్సుదేముంది? మళ్ళీ చేసుకోవచ్చు!)

రాముడు బాణం విడిచిపెట్టాడు. పరశురాముడు వెళ్ళిపోయాడు. చీకట్లు తొలగిపోయాయి. జనులకు తెలివొచ్చింది. రాముడు విష్ణు ధనుస్సుని అదృశ్య రూపంలో వచ్చిన వరుణుడికి ఇచ్చాడు.

దశరథుడు అయోధ్య చేరాడు.

నగరం అంతా అలంకరించి వుంచారు. కౌసల్యా, సుమిత్రా, కైకా కోడళ్ళను అంతఃపురాలకు తీసుకుపోయారు. పెళ్ళికూతుళ్ళు బ్రాహ్మలకు దానాలు చేసి భర్తలతో సుఖంగా వున్నారు.

కొంతకాలం అయ్యాక దశరథుడు భరతుడితో "నీకోసం నీ మేనమామ వచ్చి చాలాకాలం అయింది. నువ్వు బయలుదేరి నీ తాత దగ్గిరికి వెళ్ళు" అన్నాడు. భరతుడు శతృఘ్నుడితో బయలుదేరి వెళ్ళిపోయాడు.

రాముడూ లక్ష్మణుడూ తండ్రికి సేవలు చేస్తూ వున్నారు. రాముడు వినయ విధేయతలతో మసలుతున్నాడు. రాముడి ప్రవర్తనకు దశరథుడూ, పురోహితులూ సంతోషిస్తున్నారు.

రాముడు సీతతో అనేక భోగాలు అనుభవిస్తూ సుఖంగా కాలం గడుపుతున్నాడు. తండ్రి ఇష్టపడి చేసిన భార్య అవడం చేతనే సీతంటే రాముడికి ఇష్టం. (సీతని పెళ్ళాడాలనే షరతుకి ఒప్పుకొని ధనుస్సుని విరిచిం తర్వాత తండ్రి ఇష్టపడి నిర్ణయించడం ఎక్కడుంది?)

సీత పతివ్రతా స్వభావంగలది. ఎప్పుడూ భర్తకు ఉపచారాలు చేస్తూ వుంటుంది. పైగా చాలా అందమైనది. ఈ కారణాల వల్లనే రాముడికి సీతంటే ఇష్టం. సీతకు కూడా భర్తతో భోగ జీవితం ఆనందంగా సాగుతూ వుంది.

**ఇక్కడితో, 'బాల కాండ' ముగుస్తుంది.**

**తర్వాత, 2వ కథ నించి 'అయోధ్యాకాండ'ప్రారంభమవుతుంది.★**

## కథ-2

# చెప్పుల పాలైన సింహాసనం!

సింహాసనం మీద కూర్చున్న దశరథ మహారాజు, ఆస్థాన పురోహితులతో, మంత్రులతో, అతిథి రాజులతో, బ్రాహ్మణులతో నిండి వున్న సభలో, రాముణ్ణి ఆదరంగా చిరునవ్వుతో చూస్తూ – "నాయనా రామా! ఈ విశాల కోసల సామ్రాజ్యానికి నిన్నే పట్టాభిషిక్తుణ్ణి చెయ్యాలని నిశ్చయించా నోయి!" అన్నాడు వృద్ధాప్యంలో, సంతోషంతో వొణుకుతూ.

వజ్ర వైఢూర్యాది రత్నాలు పొదిగిన ఆభరణాలతో, జలతారు పట్టుబట్టలతో ధగధగ మెరిసిపోతూ రాముడు ఆసనం మీద నుంచి లేచి నిలబడి వినయంగా తల వొంచాడు. తన మనోభావా లితరులకు తెలియనివ్వని స్వభావంగల రాముడు, అంత రంగంలో ఉరకలు వేస్తోన్న ఆనంద తరంగాలను అదిమిపట్టి నిర్వికారమైన చూపుతో తండ్రికి వొంగి నమస్కరిస్తూ – "తండ్రిగారి ఆజ్ఞ ఏదయితే అదే మహాభాగ్యంగా స్వీకరిస్తాను" అని సింహాసనం వేపు చూశాడు తలెత్తి. ఆ రత్నఖచిత సింహాసనం మీద తండ్రి స్థానంలో తనే కూర్చున్న అనుభూతి కలిగి అతడి శరీరం పులకరించింది. ఆనందంతో పాటు, తండ్రి వాగ్దానంతో ఆశ్చర్యం కూడా కలిగింది. తండ్రి నోట తను విన్న మాటలు ...... సత్యమేనా? "కోసల సామ్రాజ్యానికి .... నిన్నే .... పట్టాభిషిక్తుణ్ణి ...." అవే మాటలు మననం చేసుకుంటూ .... క్రీకంట సభలో నలుదిక్కులూ పరికిస్తూ మౌనంగా నిలబడ్డాడు.

సభలో అందరూ ఆ వార్తకి చాలా సుముఖులుగా వున్నట్టు నవ్వు మొహాలతో కనపడ్డారు. రాముడి మొహం మీద చిరునవ్వు వెలిగింది.

దశరథుడికి కూడా కొండంత భారం తీరినట్ట యింది. తన తదనంతరం రాజ్యం భరతుడి కివ్వాలా, రాముడి కివ్వాలా అనే ఆలోచనలతో మహారాజు చాలా ఏళ్ళుగా శాంతి లేకుండా సతమతమవుతున్నాడు. చివరికి ఈనాటికి ఒక నిర్ణయం ప్రకటించాడు! భారం తీరింది!

కానీ, ఒక్కసారి పిడుగుపాటులా గతం గర్జించింది! మహారాజుకి గుండెలు దడదడలాడాయి. కిందటి మూడు వందల యాభయి ఇద్దరు భార్యలకు కూడా బిడ్డల్ని కనలేని దశరథ మహారాజు, ఎంతో ఓరిమీ, శాంతమూ, సహనమూ కలవాడు గనుక, మూడు వందల యాభై మూడో భార్యని కూడా పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు ఒకనాడు. ఆమెకూ బిడ్డలు కలగకపోతే మూడు వందల యాభయి నాలుగో భార్యనీ, తర్వాత మూడు వందల యాభయి ఐదో భార్యనీ – అలాగే శాంతంగా పెళ్ళిళ్ళు చేసుకుంటూ పోతే, నాలుగు వందల వొకటో భార్యకో; ఐదు వందల ఆరో భార్యకో, ఏడు వందల తొమ్మిదో భార్యకో – అప్పటికీ బిడ్డలు కలగకపోయినా తొందరపడకూడదు కదా? అలాగే ఓర్పుతో పెళ్ళిళ్ళు చేసుకుంటూ పోతే, ఎనిమిది వందల ఎనభయి ఎనిమిదో భార్యకో, తొమ్మిది వందల తొంభయి తొమ్మిదో భార్యకో, ఏ వెయ్యో భార్యకయినా మొగ బిడ్డ పుట్టక పోతాడా? అప్పటికీ కడుపు పండకపోతే .... వెయ్యి న్నొకటో .... "సహనమే భూషణం" అని వేదాల్లో చెప్పారు. "నిదానమే ప్రధానం" అని పెద్దలూ అన్నారు. దేశదేశాల రాజకన్యలూ అందుబాటులో వుండగా, ఒక సామ్రాజ్యాధిపతి మూడు వందల యాభయి ఇద్దరు భార్యల్ని మాత్రమే నమ్ముకుని సంతానం లేకుండా వుండి పోవడమేనా? ఎంత అవమానం! ఎంత తెలివి మాలినతనం! ఆ విధంగా ఆలోచించి ఆనాడు మళ్ళీ.... పెళ్ళికి .... మళ్ళీ .... మళ్ళీ .... మళ్ళీ .... మళ్ళీ .... మళ్ళీ .... మళ్ళీ .... మళ్ళీ .... మళ్ళీ మూడు వందల యాభయి మూడో మళ్ళీ పెళ్ళికి నిర్ణయించుకున్న వృద్ధ మహారాజు, తన శరీర సౌందర్యానికి చేసుకోదగ్గ జాగ్రత్తలన్నీ చేసుకొని, చుట్టుపక్కల దేశాల కన్యలందరూ అయిపోవడం చేత, మహావేగంగా పోయే గుర్రాలమీద పోతే వారం రోజులు పట్టేంత దూరదేశం వెళ్ళి కేకయ రాజుతో పెళ్ళి సంప్రదింపులు సాగించాడు.

కేకయ రాజు తన రాజ్యానికి ఒక మహారాజ్య సంబంధం వొచ్చినందుకు చాలా సంతోషించి, అంతలో కూతురు సంగతి జ్ఞాపకంవొచ్చి కొంచెం విచారిస్తూ – "దశరథ మహారాజా! నీకు భార్యలు కొంచెం ఎక్కువగానే వున్నారు. నా కూతురు చక్కనిది. చాలా చిన్నది. దానికి పుట్టే బిడ్డల గతేమిగాను?" అని సందేహించి దిగులు పడ్డాడు.

తన కూతురికి ఈ వొణికే పురుషుడితో వివాహం జరిగితే అసలు పిల్లలు పుడతారా – అనే సందేహం రాలేదా తండ్రికి! ఈ పురుష పుంగవుడితో, మూడు

వందల యాభయి ఇద్దరు భార్యలకు పుట్టని బిడ్డలు తన కూతురికి మాత్రం పుడతారా – అన్న సందేహమూ రాలేదు! కానీ, తన కూతురు కనబోయే కుమారుడికి రాజ్యం వొస్తుందా రాదా – అన్న సందేహం మాత్రం వొచ్చేసింది! అందుకే అంత దిగులు పడుతూ అడిగాడు.

వృద్ధ మహారాజు అప్పుడే కైక అందచందాలు వినివున్న వూపులో – "నా భార్యలందరూ మహా పతివ్రత లనీ, బిడ్డల్ని కనరనీ, రుజువైపోయింది కదా రాజా? ఇక నీ కూతురువల్లనే బిడ్డలు కలగాలి నాకు. నా తద నంతరం నా సామ్రాజ్యమంతా నీ మనుమడిదే కదా? నా పతివ్రత భార్యలు ఎన్నడూ నా ఆజ్ఞ మీరరు!" అని మీసాలు సవరించుకున్నాడు. వేళ్ళ రంగుని చూసుకుని, మర్చిపోయి మీసాలు ముట్టుకున్నందుకు పశ్చాత్తాపం జెంది తను కూర్చున్న ఆసనం వెనక పట్టుదిళ్ళ మూలల్లో గొప్ప సంగీత జ్ఞానంతో దరువువేసి, వేళ్ళ రంగు కొంత వొదుల్చుకున్నాడు.

ఆ లోగా కేకయరాజు దీర్ఘాలోచనలోంచి తేరుకుని విస్మయంగా – "ఏమో, చెప్పలేం మహారాజా! దైవలీలలు విచిత్రాలు కదా? నీ పాత భార్యలకు కూడా బిడ్డలు కలగవొచ్చును, చెప్పలేం" అని దైవ మహిమలు ఏకరువు పెట్టాడు.

ఆ మహిమలేవీ సరిగ్గా వినకుండా దశరథ మహా రాజు పౌరుషపడి – "నా పాత భార్యలకు కొడుకులు కలిగితే మాత్రం? నేను మాట తప్పుతానా?" అని మీసాలు మళ్ళీ సర్దుకోబోయి చటుక్కున ఆగి నిగ్రహించు కుని పట్టు దిళ్ళని మెలిపెడుతూ – "మా ఇక్ష్వాకు వంశ కీర్తి ప్రతిష్టలు ఎరగని విధంగా మాట్లాడతావేం రాజా? అటు సూర్యుడు ఇటు పొడుచుగాక! సముద్రాలు ఇంకు గాక! ప్రకృతి స్థంభించుగాక! ఈ దశరథ మహారాజు మాట తప్పడు. కైక పుత్రుడికే నా సామ్రాజ్యమంతా ఇచ్చి, అతడినే రాజుని చేస్తాను" అనేసి మీసాలు మెలి దిప్పి, మళ్ళీ వేళ్ళకు రంగు అంటించుకుని అమితంగా నొచ్చుకున్నాడు.

కేకయరాజుకి సందేహం తీరింది. వెంటనే లాంఛ నాలన్నీ జరిపించి పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించాడు.

రాజకుమార్తె కైక సౌందర్యరాశి. యుద్ధాలలో రథాలు నడపగలిగే సాహసం కలది. పరిచారికల ద్వారా పెళ్ళికుమారుడి సౌందర్య పోషణ చరిత్రా, మీసాల రంగు తీరుతెన్నులూ, చెంపలమీద ముడతల వొంపు సొంపులూ, శరీర కంపనాలూ అన్నీ విన్న కైక, తల్లి దగ్గిర అలకతో అసంతృప్తి ప్రకటించింది.

ఆ తల్లి, వేలాది సంవత్సరాల నించీ తల్లులందరూ కూతుళ్ళను మందలించే విధంగానే కూతుర్ని మందలిం చింది – "పిచ్చిదానా! పురుషుడికి ముసలితనమేమిటి? అందులోనూ రాజులకు కూడా ముసలితనం వొస్తుందా? దశరథ మహా రాజుకి మహావుంటే 60 సంవత్సరా లుంటాయి! అదేం పెద్ద వయస్సా? ఆయన కెంతమంది భార్యలుంటేనేం? నువ్వే కడగొట్టు భార్యవి అవుతావు. పురుషులు, చిన్న భార్యల్నే ముద్దుగా చూసుకుంటారు. నీ భర్త, నిన్నే ఎంతో ముద్దుగా చూసుకుంటాడు. నీ సవతులకు పిల్లలు లేరు. నీ కొడుక్కే రాజ్యం వొస్తుంది. అంతకన్నా ఏం కావాలమ్మా ఆడ జన్మకీ? పెళ్ళి నాటికి వృద్ధుడు అవనంత మాత్రాన నీ తండ్రివల్ల నేనేం సుఖపడుతున్నానో ఎరగవా?" అని నిట్టూర్చింది.

తన తల్లిదండ్రుల సంగతులన్నీ తెలిసిన కైక ఆలో చనల్లో పడింది. కైక తండ్రికి అన్ని జంతువుల భాషలూ, పక్షుల భాషలూ, సమస్త జీవరాసుల భాషలూ తెలుసు. ఎప్పుడూ ఆయన చీమల మాటలూ, దోమల మాటలూ విని ఆనందిస్తూ వుంటాడేగానీ భార్యతో ముద్దుగా వొక్క మాటా మాట్లాడడు.

ఒకసారి వొక భర్త చీమా, భార్య చీమా పోట్లాడు కోవడం విన్నాడాయన. భర్త చీమ, భార్యతో – "ఆ ఎర్ర చీమగాడివేపు ఎందుకు చూశావు?" అంది కోపంగా.

భార్య చీమ, ఆ ఎర్రచీమగాడి వేపు మళ్ళీ చూసి, "ఎంత బాగున్నాడో! అతని శరీరచ్ఛాయా, సుందర రూపమూ, ఆజాను బాహువులూ, విశాల నేత్రాలూ, అంత సౌందర్యాన్ని నేను చూడకుండా వుండలేను సుమా!" అని నిష్కర్షగా చెప్పేసింది.

భర్త చీమ మండిపడుతూ – "పాపిష్టిదానా! పర చీమల్ని కన్నెత్తి చూడడం పతివ్రతల లక్షణం కాదని ఎరుగవూ? నీచురాలా! మా నల్లచీమ వంశ కీర్తి ప్రతి ష్టలు మంటగలిపేటట్టున్నావే!" అని మీది మీది కెళ్ళి భార్యని కరవబోయింది.

భార్య చీమ మండిపడుతూ ధిక్కారంగా చూసి, "నీ నూకగింజ నువ్వు సంపాదించుకుంటున్నావు; నా నూక గింజ నేను సంపాదించుకుంటున్నాను. ఇక నీ పెత్తనం ఏమిటి నా మీద? మనుషుల లాగ ఈ కేక లేమిటి నా మీద? స్వతంత్రంగా బతికే దిక్కులేని క్షుద్ర మానవ స్త్రీలకులాగ నాకా పాతివ్రత్యం పీడ ఎందుకు? నన్నింత అవమానం చేసింతర్వాత నీలాంటి నీచుడితో నేనుం డను. నా దారిన నేను పోతున్నా. నువ్వూ, నీ ఘన వంశమూ నాకు పనికి రావు" అని నిర్లక్ష్యంగా ఎర్ర చీమతో కలిసి వెళ్ళిపోయింది.

కేకయరాజు ఆ సంభాషణంతా విని కుతకుత ఉడికి పోయాడు. ఆ దుష్టచీమని కాలికింద వేసి వొక్కపాము పాముదామనుకున్నాడు గానీ అప్పటికే ఆ అశ్లీల చీమ ఎర్రచీమతో చట్టాపట్టా లేసుకుని గోడ నెరదలోకి తప్పు కోవడంవల్ల కోపం తీరక పళ్ళు పట పట కొరికి –

"హు! లోకం ఎంత కలుషితమై పోయిందో కదా!" అని విషాదంగా నవ్వాడు.

కైక తల్లి ఆసక్తిగా – "ఎందుకలా విచారంగా నవ్వుతున్నారూ?" అని అడిగింది.

కేకయరాజు, విషయమంతా చెప్పబోయి చటుక్కున ఆగిపోయాడు. ఆ బరితెగించిన చీమ మాటలు మానవ స్త్రీలను ఉత్తేజపరిచి, జ్ఞానోదయం కలిగించి, చెడగొట్టి తీరుతాయని ఆలోచించి, అసలు సంగతి భార్యకు చెప్పకుండా ఆగిపోయాడు. ఆ విషాదపు నవ్వూ మానలేదు.

కైక తల్లి చాలా ఆందోళనపడి ఆస్థాన వైద్యుల్ని పిలిపించింది.

రాజు ఎంత వారించినా వినకుండా వైద్యులంతా అతన్ని బంధించి నోట్లో గిన్నెలకొద్దీ కషాయాలు గుమ్మరించి, కళ్ళల్లో కలికాలు పెట్టి, శిరస్సుమీద దరువులు వేసి, రాజుని అరుపుల మధ్యా పెడబొబ్బల మధ్యా వొదిలేసి, చూర్ణాల సంచులు సర్దుకుని వెళ్ళిపోయారు. ఆ సంఘటనతో కైక తల్లిదండ్రుల మధ్య ద్వేషాలు తారాస్థాయి నందుకున్నాయి. అప్పటినించి తన తండ్రి, తన తల్లిని వొదిలి పూర్తిగా వేశ్యలతో గడుపుతోన్న సంగతి కైకకు తెలుసు.[35]

తల్లి నిట్టూర్పుకి కైక ఆలోచనలో పడింది. "పడుచు భర్తని చేసుకుంటే మాత్రం రాజకుటుంబాల్లో ఆ ముచ్చట ఎన్నాళ్ళు? నెల తిరక్కుండానే ఇంకో భార్యని తెచ్చుకుంటాడు కదా? అది అసలే దుర్భరం. ఈ వృద్ధరాజుని చేసుకుంటే నేనే చివరి భార్యగా వుండవచ్చును. వృద్ధ భర్త ప్రేమలోనే సంతోషంగా వుండవొచ్చును" అనుకుంది.

ఇంకా మోహంమీద విచారమూ, ఆలోచనలూ పోకుండానే కైకకి వివాహం జరిగిపోయింది.

దశరథుడు కొత్త చిన్న భార్యతో రాజ్యానికి వొచ్చి నప్పట్నించీ మిగిలిన భార్యలందరూ పూర్వపు కావేషాలన్నీ మరిచి వొక్క పక్షం అయిపోయారు. సవతులందరూ కౌసల్య అంతఃపురంలో చేరి కైక గర్వం గురించీ, కైక మిడిసిపాటు గురించీ, రక రకాలుగా చెప్పుకునేవారు ఎప్పుడూ. రోజూ అవే కబుర్లు. అవే ముచ్చట్లు. కౌసల్య పెంచే పిట్టలుకూడా పంజరాల్లోంచి ముక్కులు బయటికిపెట్టి – "కైకని చంపు! కైకా .... ఛో! కైక .... కాలు .... కొరుకు ....!" అని దాసీలు నేర్పిన మాటలన్నీ ముద్దు ముద్దుగా అంటోంటే అందరూ విరగబడి నవ్వేవారు.

కైక అంతఃపుర దాసీల్ని, ఇతర రాణుల దాసీలు మాటలమధ్య గడుసుదనంగా – "మీ రాణీకి ఆరోగ్యం బాగుందా? నెల తప్పిందా ఏమిటి?" అని అడిగేవారు ప్రతీ నెలా. కైక దాసీలకు కోపం వొచ్చి "మీ రాణులకు తప్పని నెల మా రాణీకెలా తప్పుతుందమ్మా?" అని ఈసడించేవారు.

"మహారాజుని ఆవిడొక్కతే కట్టి పడేసుకుందిగా?"

"చేతనయితే మీ రాణులూ కట్టి పడేసుకోరాదూ? మా రాణీమీద అంత ఏడుపెందుకూ?"

"అవున్లే! మహారాజు మీ చేతుల్లో వున్నాడు. ఎలా వాగినా వాగుతారు."

చివరికా కజ్జాలు చిలికి చిలికి గాలివాన అయ్యేవి. ఆ వార్తలు రాణులందరికీ చేరేవి. మళ్ళీ కౌసల్య అంతఃపురానికి పట్టుతెరలు రెపరెపలాడుతూ మేనాలు పరుగులు! కౌసల్య అంతఃపురమంతా కోలాహలం! గదుల నిండా గుసగుసలు! దాసీల అభినయాలు! వర్ణనలు! రాణీల సందేహాలూ చెంపల నొక్కుళ్ళూ, మధ్య మధ్య నవ్వులూ! పిట్టల అరుపులూ కూతలూ!

కొత్త వార్తలొచ్చేవరకూ అదే కాలక్షేపం!

రోజులలా వుండగా – కైక భాగ్యమో దౌర్భాగ్యమో, ఆమెతోపాటు కౌసల్యా, సుమిత్రాకూడా గర్భవతులయ్యారు. ముగ్గురూ కొడుకుల్ని కన్నారు.

అన్ని వందల మంది స్త్రీల మధ్య నలుగురు పసిబిడ్డలు కనబడేసరికి, ఎండి బీటలు వారిన భూమిమీద చల్లని వానజల్లులు కురిసినట్టు అందరి మనస్సులూ సంతోష సముద్రాలయ్యాయి. అందరి మధ్యా అప్పటికి ద్వేషాలు తగ్గి స్నేహాలు ప్రారంభమయ్యాయి. నెలలూ, సంవత్సరాలూ నిశ్చింతగా దొర్లిపోయాయి.

నలుగురు పిల్లలూ ఒకే ఈడు వాళ్ళయినప్పటికీ రాముడూ భరతుడూ ప్రత్యేక గుర్తింపు గలవాళ్ళయ్యారు. అంతఃపురాలలో, రాముడికి, పట్టపురాణీ కొడుకనే

**35. అయోధ్యాకాండ, సర్గ 35, శ్లోకాలు 16 నించి 24 వరకూ:** రాముడు వనవాసానికి బయల్దేరుతూ వున్నప్పుడు సుమంత్రుడు కైకని తిడుతూ, "నువ్వూ, నీ తల్లి లాగానే దుష్టురాలివి" అని ఈ చీమల సంగతి చెపుతాడు. కేకయరాజుకి సమస్త జీవరాసుల భాషలూ తెలుసుకోగలిగే వరం వుంది. ఒకసారి ఆయన పడుకున్న మంచం కింద జృంభకమనే చీమ మాటలాడడం విని కేకయరాజు చాలా నవ్వాడు. (ఒక్క చీమే ఎలా మాటాడుకుంటుంది? ఇంకో చీమతో మాట్లాడిందని అర్థం. ఆ మాటలేమిటో కవి చెప్పలేదు. కానీ, మొత్తానికి అవేవో భార్యలకు చెప్పగూడని మాటలే.) కైక తల్లి, భర్త నవ్వుకి కారణం అడిగింది. "అది చెప్పకూడదు. చెప్తే నాకు మరణమే" అన్నాడు భర్త. "కాదు, నన్ను పరిహాసం చేస్తూ నవ్వావు. అందుకే చెప్పడంలేదు" అంది కైక తల్లి. రాజుకి కోపం వొచ్చి భార్యని విడిచిపెట్టేసి రాజ్యం నించి వెళ్ళగొట్టేశాడు. (పెళ్ళాన్ని వొదిలెయ్యడానికి, చీమ కథో, దోమ కథో అండ!) ★

గౌరవం! భరతుడికి, కాబోయే యువరాజనే మర్యాద! దశరథుడి వాగ్దానం సంగతి పురోహితులకూ, రాణు లందరికీ తెలుసు.

లక్ష్మణుడూ, శతృఘ్నుడూ మాత్రం ఏ ప్రత్యేకతా లేక, రాముడికీ భరతుడికీ నీడలైపోయారు.

కైక, ముసలిభర్త గారాబంలో తలమున్కలౌతూ, ఆ వొక్క బిడ్డని చూసుకోడానికి కూడా బద్ధకించి, కొడుకుని ఎప్పుడూ పుట్టింట్లోనే వుంచేది. కేకయ రాజు కూడా మనవడంటే ముద్దువల్ల భరతుణ్ణి ఎక్కువగా తన దగ్గిరే వుంచుకునేవాడు. శతృఘ్నుడు, భరతుడి ప్రాపకం కోసం ఎప్పుడూ అతన్నే అంటి పెట్టుకుని వుండేవాడు.

చిన్నతనం నించీ దశరథుడి దగ్గిర పెరిగింది రాముడూ, లక్ష్మణుడూ మాత్రమే. తండ్రి దృష్టి అంతా, ప్రత్యేక స్వభావంగల రాముడిమీదే కేంద్రీకరించుకు పోయింది.

రాముడు, చిన్నతనంనించీ మిగిలిన ముగ్గురి కన్నా గడుసువాడు. తెలివయినవాడు. ఎవరి దగ్గిరెలా మస లాలో తెలిసినవాడు. తండ్రి దగ్గిర అతి వినయం చూపి స్తాడు. "ఇటువంటి పుత్రుడులేని జన్మ ఎందుకు!" అని తండ్రి సంతోషించేటట్టు ప్రవర్తిస్తాడు. బ్రాహ్మల దగ్గిరా, పురోహితుల దగ్గిరా మహా భక్తి కనబరుస్తాడు. "రాముణ్ణి మించిన ఉత్తముడు ముల్లోకాలలోనూ లేడు!" అని వారు ప్రశంసిస్తారు.

రాముడు, తన తండ్రి వొక్కసారి కన్నెత్తి చూచిన ఏ స్త్రీనైనా తనకు తల్లి వరస – అనే భావిస్తాడు. అటువంటి వరస తల్లులు కూడా ఎన్నో వందల మంది వున్నారు. అంతఃపురాలలో, తన తల్లి కనబడినా, పినతల్లులు కన బడినా, వరస తల్లులు కనబడినా, రాముడు ఎంతో గౌరవం చూపిస్తాడు. "నమస్కారం తల్లిగారూ!" అంటూ వొంగి నమస్కారాలు చేస్తాడు. ఎదిగిన కొడుకు అంత గౌరవించి నమస్కారాలు పెడుతోంటే ఆ స్త్రీలందరూ ఎవరికి వారే ఎంతో సంతోషం కలిగి, కళ్ళు చెమ్మగిలి "వెయ్యేళ్ళు జీవించు నాయనా!" అని ఆశీర్వదిస్తారు. "రాముడు నా కొడుకేనమ్మా! కౌసల్య కొడుకు కానేకాడు" అని సవతులతో హాస్యాలాడుతూ వాదులాడుతారు.

రాముడు – తిథి, వార, నక్షత్ర లగ్నాల ప్రకారం పర్వదినాలలో బిచ్చగాళ్ళకు బిచ్చాలు వెయ్యడమో, సంతర్పణలు చెయ్యడమో చేస్తూ వుంటాడు. తిథీ లగ్నాలు మంచివి కాకపోయినా, అవి పర్వదినాలు కాక పోయినా ఆకలేసే బిచ్చగాళ్ళు – "రామయ్య మళ్ళీ ఎప్పుడు సంతర్పణ చేస్తాడో! పుణ్యాత్ముడు! మళ్ళీ ఎప్పుడు దయతో చెయ్యి విదిలిస్తాడో! మొన్న పండుగ నాడు నా జోలిలో దోసెడు వడ్లు పోశాడు ధర్మాత్ముడు!" అని మురుస్తూ చెప్పుకుంటూ ఆశతో ఎదురు చూస్తూ వుంటారు.

రాముడు, బ్రాహ్మలకు గోదానాలూ, భూదానాలూ చేస్తూ, యజ్ఞాలూ యాగాలూ చేసే రాజుకే మహాకీర్తీ, స్వర్గమూ లభిస్తాయని విశ్వసిస్తాడు. రాముడు, అన్ని దిక్కులా అందరి అభిమానాలూ పొందగలిగాడు.

రాముడు, చిన్నప్పుడు చందమామని ఆశ్చర్యంగా చూసినట్టు, చిన్నప్పుడు శాస్త్ర ధర్మాల్ని కూడా ఆశ్చర్యంగా చూసి కొంత ప్రశ్నించాడు. ఎదుగుతోన్న కొద్దీ, చంద మామ గురించి కొత్తగా ఏమీ తెలియక పోయినా ప్రశ్న లడగడం మానేసినట్టే, చందమామ అలవాటైపోయినట్టే, శాస్త్రధర్మాలు కూడా అలవాటై పోయాయి. విశ్వామిత్ర మహర్షి శిష్యరికంలో వేద ధర్మాలన్నీ నరనరానికీ పాకి, రక్తంలో ఇంకి, అణువుల్లో జీర్ణమై, సదాచార సంపన్ను డయ్యాడు.

దశరథుడి ఆశలన్నీ, మమకారాలన్నీ రాముడి మీదే కూడుకున్నాయి. పిల్లలు ఎదుగుతోన్నకొద్దీ, ఆ సత్య వంతుడు, భరతుడికి హక్కయిన రాజ్యాన్ని భరతుడికి గాక రాముడి కేవిధంగా ఇవ్వగలనా అని మథన పడడం ప్రారంభించాడు. దశరథుడు అప్పటి నించి, భరతుణ్ణి ఎక్కువగా తాతగారింట్లో వుంచడానికే ఇష్టపడేవాడు. భరతుడికి దేశంలో ఎక్కువ పలుకుబడి లేకుండా, ఎక్కువ మంది స్నేహితులు లేకుండా చెయ్యాలనే ప్రయత్నిం చాడు.

తన తండ్రి, కేకయరాజు కిచ్చినమాట సంగతి రాముడు కూడా ఎప్పుడో తల్లి దగ్గర చూచాయగా విన్నాడు. అప్పటినుంచీ సందేహమే – తండ్రి ఏం చేస్తా డోనని. రాజ్యాన్ని తనకిస్తాడో భరతుడికిస్తాడోనని! తన వినయ సంపత్తిని అధికం చేశాడు, అంత కన్నా చేసే దేమీలేక.

దశరథ మహారాజు, రాజ్యం ఎవరికివ్వాలో పాతిక సంవత్సరాలు ఆలోచించి చివరికి వొకరోజు తెగించి పురోహితులతో సంప్రదించాడు. కేకయ రాజుకిచ్చిన వాగ్దానం సంగతి తెలిసి వున్న వశిష్ఠుడు తనకేమీ పట్ట నట్టు వూరుకున్నాడు. ఎవరు రాజయినా తమ అస్తిత్వాల కేమీ నష్టం రాని పురోహితులందరూ మహారాజుని సంతోషపెట్టడానికి – "నీ ఇష్టప్రకారమే చెయ్యి రాజా! పట్టమహిషి కొడుకు రాజ్యార్హుడే కదా?" అని సమర్థిం చారు.

దశరథుడికి బాగా ధైర్యం వొచ్చింది. రాజ్యం రాము డికే ఇవ్వాలని నిశ్చయించి ఆ మాటే ఆ నాడు సభలో ప్రకటించాడు. తండ్రి, కేకయ రాజుకిచ్చిన వాగ్దానం తప్పడం రాముడికి కొంత ఆశ్చర్యం కలిగించినా, దాన్ని మించి కలిగిన ఆనందంలో అది కొట్టుకుపోయింది.

★ ★ ★

పట్టాభిషేక వార్తని సభలో ప్రకటించిన తరువాత దశరథుడు రాముణ్ణి తన రహస్య మందిరంలోకి పిలిపించాడు.[36] "నాయనా! నేనిక పెద్ద వాణ్ణయి పోయాను" అని నిట్టూర్చాడు. కైక తర్వాత, పాతిక ముప్పై ఏళ్ళనించి ఇతర స్త్రీలతో ఏవో చాటుమాటు వ్యవహారాలేగానీ, ఒక్క కొత్త పెళ్ళి కూడా చేసుకోకపోవడం చేత జీవితం మీద విరక్తి కలిగి తన వృద్ధాప్యాన్ని తనే ఒప్పుకున్నాడు. ఒప్పుకుని నిట్టూర్చాక – "పెద్దవాణ్ణయితే ఏమిటి? ధర్మ శాస్త్రాల్లో తప్పని చెప్పని సుఖాలన్నీ స్వేచ్ఛగా అనుభవించాను. వందలకొద్దీ యాగాలుచేసి దేవతల రుణం తీర్చుకున్నాను. అనేకమైన దానధర్మాలు చేసి బ్రాహ్మణుల రుణమూ తీర్చుకున్నాను. రకరకాల సుఖాలనుభవించి శరీర రుణమూ తీర్చుకున్నాను. ఇక నేను స్వర్గానికి వెళ్ళడానికి సిద్ధంగా వున్నాను" అని తృప్తిగా చూశాడు. ప్రజల్ని పరిపాలించిన మహారాజు ప్రజలకేం చేశాడో మాత్రం చెప్పలేదు.

రాముడు తండ్రి మాటలు విని అతి వినయంగా చేతులు ముడిచి, తలవొంచి, నడుం వొంచి "తండ్రిగారూ! మీరు తప్పకుండా స్వర్గానికే వెళతారు. మన వంశంలో పితృదేవతలందరూ స్వర్గంలోనే వున్నారు కదా?" అంటూ నేల చూపులు చూస్తూ నిలబడ్డాడు.

"అవున్నాయనా! ఇప్పుడు సంగతి ఏమిటంటే" అంటూ దశరథుడు ఇటూ అటూ చూసి కంఠం తగ్గించి తల ఆడిస్తూ ప్రారంభించాడు. "ఈ పట్టాభిషేక కార్యం చాలా తొందరగా జరిగిపోవాలి. భరతుడు వాళ్ళ తాతగారింట్లో వున్నాడు కాబట్టి భయం లేదు గానీ అతడిక్కడికి రాకుండానే ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా జరిగిపోవాలి. నీకు రాజ్యం ఇవ్వడానికి భరతుడు ఒప్పుకోవచ్చు గానీ, అయినా అతణ్ణి నమ్మడం మంచిది కాదు. జాప్యం చేసినకొద్దీ ఎలాంటి అవాంతరాలొస్తాయో ఎరగం. రేపు లగ్నం చాలా మంచిదంటున్నారు పురోహితులు. రేపే నువ్వు పట్టాభిషేకం చేసేసుకుంటే మంచిది. ఈ వార్త బయటపడ్డదంటే భరతుడి తరఫు మనుష్యుల్నించి నీకు ప్రమాదం వుంటుంది. నీ స్నేహితుల్నీ, నమ్మకస్తుల్నీ, దగ్గిర పెట్టుకుని చాలా జాగ్రత్తగా వుండాలి సుమా!" అని హెచ్చరించి ఆందోళనతో దగ్గుతూ పట్టుదిళ్ళ మీదకు వొరిగాడు.

రాముడు, తండ్రి మాటలకు ఏ మాత్రమూ ఆశ్చర్య పడలేదు. భరతుణ్ణి శంకించడమా? ఎందుకు? ఎందుకు? భరతుడు రాకుండానే తనకు పట్టాభిషేకమా? లక్ష్మణుడి మీదా, శతృఘ్నుడి మీదా లేని శంక భరతుడి మీదే ఎందుకు? – రాముడికా సందేహమే లేదు. తండ్రి, భరతుణ్ణి ఎందుకు శంకిస్తున్నాడో రాముడికి చక్కగానే తెలుసు. తండ్రి వాగ్దానం సంగతి తెలియని వాడైతే తండ్రి మాటలకు నిర్ఘాంత పోయేవాడే. "లక్ష్మణుణ్ణీ శతృఘ్నుణ్ణీ వదిలి భరతుణ్ణే ఎందుకు శంకించవలసి వచ్చింది?" అని తండ్రిని ప్రశ్నించేవాడే.

కానీ, భరతుడి గురించి ఎందుకు శంకించాలో రాముడికి అంతా తెలుసు కాబట్టే తండ్రిని ప్రశ్నించకుండా మౌనం వహించాడు.

అంతా తెలిసివున్న రాముడు తండ్రితో – "ఇది ధర్మమా? చేసిన వాగ్దానం తప్పడం నీకు న్యాయమా, ఈ పట్టాభిషేకానికి ఆమోదించడం నాకు న్యాయమా? దీనికి నేను అంగీకరించలేను" అన లేదు. "వాగ్దాన భంగంచేసి అపకీర్తి తెచ్చుకోవద్దు! భరతుడినే పిలిపించి అతడికే పట్టాభిషేకం జరిపించు!" అని, దారితప్పిన తండ్రికి కర్తవ్య బోధ చెయ్యలేదు. "భరతుడినే రాజుగా ప్రజలందరితో పాటు నేనూ సంతోషంగా స్వీకరిస్తాను. నా గురించి సందేహించవద్దు" అని తండ్రికి తనపట్ల విశ్వాసం కలిగించే ప్రయత్నం చెయ్యలేదు.

రాజ్యం భరతుడికే హక్కనే విషయం అంతఃపురాలలో తప్ప ప్రజలకు తెలియదు కాబట్టి, బయటికి రాని విషయాల గురించి ధర్మా ధర్మ చర్చలు చెయ్యడం తెలివయిన పని కాదని రాముడికి బాగా తెలుసు.

విషయమేమిటో తనకేమీ పట్టనట్టూ, తండ్రి ఎలా చెపితే అలా నడవడమే తన కర్తవ్యం అయినట్టూ, రాముడు, తండ్రిమాటలు వింటూ వినయంగా తలవంచి వూరుకున్నాడు.

"వెళ్ళు నాయనా! జాగ్రత్తతో మసలుకో!" అని దశరథుడు రాముణ్ణి హెచ్చరించి కైక మందిరానికి వెళ్ళాలని నెమ్మదిగా వొణుకుతూ లేచాడు.

"చిత్తం! మహారాజు ఆజ్ఞ ప్రకారమే చేస్తాను" అని రాముడు వొంగి నమస్కరించి గంభీరంగా బయటికి నడిచాడు. ఈ సంతోష వార్త తల్లికి చెప్పాలనే ఉత్సాహంతో, తను కౌసల్య అంతఃపురానికి బయల్దేరాడు.

అక్కడికా వార్త ఎప్పుడో చేరింది. రాణులందరూ అక్కడే వున్నారు. సీతా, లక్ష్మణుడూ కూడా అక్కడే వున్నారు. అందరి మొహాలూ సంతోషంతో వెలిగిపోతున్నాయి. కౌసల్య ఆ వార్త విన్న వెంటనే బ్రాహ్మల్ని పిలిపించి పూజలు ప్రారంభించింది. అంతఃపురమంతా వేద ఘోషతో, వాయిద్యాలతో దద్దరిల్లుతోంది, రాముడు వెళ్ళేటప్పటికి.

---

**36.** **అయోధ్యాకాండ**, సర్గ **4** **అంతా**: దశరథుడు రాముడితో ప్రత్యేకంగా ఏం మాట్లాడాడో, ఆ మాటల అంతరార్థం ఏమిటో ఇక్కడ తెలుస్తుంది. ★

రాముడు చిరునవ్వుతో తల్లి దగ్గిరికి వెళ్ళి వినయంగా – "అమ్మా! నాకే పట్టాభిషేకం చేస్తామని సభలో తండ్రిగారు వాగ్దానం చేశారు" అని గంభీరంగా చూడబోయాడు. ఎంత ప్రయత్నించినా కళ్ళల్లో సంతోషాన్నీ, పెదాలమీద ముసిముసి నవ్వుల్నీ, గాంభీర్యం చాటున దాచలేకపోయాడు.

కౌసల్య పరమానందంతో – "విన్నాను నాయనా! ఎన్నాళ్ళకీ శుభవార్త చెవినబడిందీ!" అని నిట్టూర్చింది. "నువ్వు కలకాలం జీవించాలి. నీ శత్రువులందరూ మరణించాలి" అని ఆశీర్వదించింది. "నువ్వు పుట్టిన ఘడియలు మంచివి. ఎంతో వినయ విధేయతలతో నీ తండ్రి దయ సంపాదించావు. నీకు రాజ్యం రావాలని ఎన్ని పూజలూ వ్రతాలూ చేశానో! నువ్వు రాజువైతే ఇక నాకూ, సుమిత్రకూ ఏం లోటు? మన బంధువులందరూ సంతోషిస్తారు" అని పట్టలేని ఆనందంతో చుట్టూ చూసింది.

రాణులందరూ రాజ మాత కాబోతున్న కౌసల్య దయకోసం చుట్టూ అర్రులు చాచుతూ కనబడ్డారు. ఎవరికి వారే కౌసల్యతో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నారు. రాముణ్ణి నవ్వు మొహాలతో ఆశీర్వదిస్తున్నారు.

ఆ ఆశీర్వాదాలలోంచి తల తిప్పి రాముడు, తన పక్కనే వినయంగా నిలబడి వున్న లక్ష్మణుణ్ణి చూసి, ఆ వినయానికి రోజూ కన్నా ఎక్కువగా, కొత్తగా సంతోషించాడు. ఎంత వినయ సంపన్నుడయినా, ఎంత ఆప్తుడైనా, తనకు కలగని భాగ్యం ఇతరులకు కలిగినప్పుడు మానవ హృదయంలో ఏ మూలనో అసూయాద్వేషాలు తలెత్తవచ్చునని రాముడి అభిప్రాయం. లక్ష్మణుడు మాత్రం అసూయాద్వేషాలకు అతీతుడా? లక్ష్మణుణ్ణి సంతోషపెట్టడానికి చిరు నవ్వుతో – "లక్ష్మణా! పేరుకి రాజుని నేనయినా నువ్వు కూడా పరోక్షంగా రాజువే. ఈ రాజ్యభోగాలన్నీ నీ ఇష్టం వొచ్చినట్టు అనుభవించు! నా రాజ్యంలో నీకేమీ లోటు వుండదు సుమా!" అని గంభీరంగా చూశాడు.

భరతుడు కాకుండా, రాముడు రాజవుతున్నందుకు లక్ష్మణుడికి ఎంతో ఆనందంగా వుంది. భరతుడి రాజ్యంలో అయితే, తనకు ఏ ప్రత్యేకతా వుండదు. అప్పుడు తను అనామకుడిగా వుండవలసిందే. రాముడి రాజ్యంలో అయితే తన స్థానం వేరు. అప్పుడు తన కీర్తి ప్రతిష్టలు ఇనుమడిస్తాయి. రాముడు అన్నట్టు, లక్ష్మణుడికి, తనే రాజయినంత ఆనందం కలుగుతోంది. వినయంగా తల వొంచుకుని – "నాకీ రాజ భోగాలేల అన్నగారూ? మీ దయే మహా ప్రసాదం! మీ పాద సేవే నా సౌభాగ్యం!" అని నడుం ఇంకా వొంచి అన్నగారి పాదాల మీదకు వొంగి నమస్కారం చేశాడు.

తరవాత రాముడు సీతవేపు తల తిప్పీ తిప్పకుండా – "చూశావా? నాకు భార్యవై మహారాణీ వవుతున్నావు" అన్నట్టు – లోకంలో భర్తలందరూ భార్యల వేపు – తమ ఆస్తితో, తమ హోదాతో, తమ కీర్తితో మాత్రమే గుర్తింపు పొందే భార్యలవేపు గర్వంగా, దయగా, విలాసంగా, అహంకారంగా చూసే విధంగా – వీరోచితంగా, రాజోచితంగా, భర్తోచితంగా చూశాడు.

సీత, అంతమంది అత్తగార్ల ఎదుట భర్త తనవేపు క్రీగంట చూసినందుకు సిగ్గుపడిపోయి తలవొంచుకుంది.

పరిచారికలందరూ సీత చుట్టూ చేరి – "అబ్బో! చిన్న మహారాణీగారి కెంత సిగ్గో! కొంచెం మాట్లాడవమ్మా! రేపట్నించీ మాకేమీ శిక్షలు వేయించవు కదా?" అంటూ భయం నటిస్తూ సీతని ఆట పట్టించారు.

సీత అత్తగారి వెనక దాక్కుంది.

కౌసల్య నవ్వుతూ – "ఊరుకోండ్రా! మీ హాస్యాలూ మీరూనూ ...." అంటూ దాసీల్ని ముద్దుగా కోప్పడింది.

పౌర్ణమినాటి సముద్రం లాగు కౌసల్య అంతఃపురం నవ్వులతో, కేకలతో, ఆటలతో, దాసీల పరుగులతో, పిట్టల అరుపులతో, ఆనంద సముద్రం అయిపోయింది.

★ ★ ★

కైక అంతఃపురం నిశ్శబ్దంలో మునిగి వుంది. దాసీలు, నడిచే బొమ్మలలాగ నిరుత్సాహంగా తిరుగుతున్నారు. బాగా చీకటి పడిన తర్వాత అక్కడో దీపం .... అక్కడో దీపం .... వెలిగించారు. మహారాజు వచ్చే వేళ అయిందని ఎప్పట్లాగే ఎవరి పనులు వాళ్ళు చేశారు. పూల దండలు గుచ్చారు. స్నానానికి పన్నీరు తయారు చేశారు. గదుల నిండా సుగంధ ద్రవ్యాలు అమర్చారు. మహారాజు తినే పదార్థాలన్నీ సిద్ధం చేశారు. అన్నీ చేసి ఎక్కడి వాళ్ళక్కడ విచారపడుతూ కూర్చున్నారు.

రాముడి పట్టాభిషేక వార్త, కైక మందిరంలో, మొట్టమొదట **మందర** చెవిన పడింది. ఆమె నిర్ఘాంతపోయి 'నిజమా!' అని కలవరపడింది.

మందర – కైకని, ప్రాణ సమానంగా చూసుకునే పరిచారిక. వృద్ధురాలు. ఆమె, ఏనాడో కైక వివాహం తర్వాత, కైకతోపాటే, ఆమె పుట్టింటినించి వచ్చింది. ఆనాటినించి కైక యోగక్షేమాలు చూసుకోవడమే ఆమె బాధ్యత. కైకని చిన్నతనంనించి అంటిపెట్టుకుని వున్న దాసి అవడంవల్ల, మందరకు కైకదగ్గిర చనువు ఎక్కువ. కైకకు కూడా మందర అంటే, పూర్తిగా నమ్మకమూ, అభిమానమూ.

ఆ వార్త వినగానే మందర – "విన్నావా తల్లీ? విన్నావా?" అంటూ ఆందోళనపడుతూ వచ్చింది కైక పడక దగ్గిరికి.

"ఏవిటే? ఏమిటి వినడం?" అంది కైక, పడక మీద తలతిప్పి చిరునవ్వుతో.

"ఏవిటా? గుండెలు చిక్కబట్టుకో! లేచి వనవాసానికి బైల్దేరు! నీ సవతులు నీకు అదే చెయ్యబోతున్నారులే!"

"ఏవిటా మాటలు మందరా? నోటికి ఎంత వస్తే అంతేనా? ఏమైంది ఇప్పుడు?"

"ఏమైందో నీ పెనిమిటినే అడుగు! మహారాజు ఎంతకి తెగించాడో చూశావా? పెద్ద కుమారుడికి పట్టాభిషేకం చెయ్యబోతున్నాడు! రేపేనట!"

"ఎవరికీ? రాముడికా? రేపా? ఎక్కడ విన్నావు నువ్వు?"

"విన్నానమ్మా! అంతా తెలుసుకునే వస్తున్నాను. నీ పెళ్ళికి ముందు నీ తండ్రికి ఇచ్చిన మాటనేం చేశాడు మహారాజు? అదంతా మరిచేపోయాడా?"

"ఎందుకే మందరా, తెలిసీ తెలీని మాటలు? ఊరుకో!"

"నా మాటలు కొట్టెయ్యకు సుమా! అసలు నీ పెనిమిటి ఇచ్చిన మాట గుర్తు వుందా, మరిచి పోయావా?"

"ఎందుకు లేదు? మహారాజు సత్యసంధుడు! ఆయన ఎన్నడూ మాట తప్పడు! ఆయనకు అన్నీ తెలుసు!"

"తెలుసమ్మా! తెలిసే చేస్తున్నాడు అంతా!"

కైక శాంతంగా నవ్వింది – "పోనీ చెయ్యనియ్యి! భరతుడు ఒకటీ, రాముడు ఒకటీనా? ఇద్దరూ నా కొడుకులే కదా?"

"ఇద్దరేనా, ఇంకో ఇద్దరు లేరూ? నలుగురూ నీ కొడుకులేనమ్మా!"

"అవునే! మంచి మాటే అన్నావు. అందరూ నా కొడుకులే! ఇద్దరేమిటి, నలుగురూ నా కొడుకులే!"

"పిచ్చిపిల్లవా, మంచిపిల్లవా? ఈ మాత్రానికి ఆ నాడు నీ పెనిమిటితో వాగ్దానం ఎందుకు చేయించుకున్నావమ్మా?"

"నేను చేయించుకున్నానా? తండ్రిగారు అడిగారు. మహారాజుగారు సరేనన్నారు. అయినా మందరా, ఆ నాడు అక్కలకు బిడ్డలు లేరు కాబట్టి, ఆయన ఆ మాట అన్నారు. ఇప్పుడు మహారాజు గారికి నలుగురు కుమారులు వున్నారు కదా? శ్రీరాముడు పెద్దావిడ కుమారుడే కదా? పోనీ అలాగే జరగనియ్యి! ఎవరైతేనేమిటి? అందరూ మన బిడ్డలే!"

"అయ్యో, ఎంత అమాయకురాలివమ్మా! నీ పెనిమిటి, ఇచ్చిన మాట తప్పుతున్నాడన్న బాధే లేదు నీకు! ఆయన, పెద్ద కుమారుడినే సింహాసనం ఎక్కించదలిస్తే, నీతో ఒక్కమాట చెప్పవద్దూ? నిన్ను అనుమతి అడగవద్దూ? అసలు నీ తండ్రిని పిలిపించి 'ఇదుగో, ఆనాడు నీకామాట ఇచ్చాను, ఈనాడు ఇలా చెయ్యదల్చుకున్నాను' అని ఆయనకి చెప్పుకోవద్దా? అసలు, పట్టాభిషేకానికి నీ తండ్రినీ, నీ కొడుకునీ పిలిపించవద్దూ? ఇదేం చోద్యమమ్మా? భరతుడు లేకుండానే అన్నగారికి పట్టాభిషేకమా?" చెంపలు నొక్కుకుంటూ మందర విస్తుపోయింది.

కైక కొంచెం నవ్వింది – "వశిష్టుల వారైనా మహారాజుకి చెప్పి వుండరా? మంచి ముహూర్తం రేపే కుదిరిందేమోనే! బంధువుల్ని పిలిపించడానికి సమయం లేకపోయిందేమోనే!"

"చాల్లేవమ్మా! పెనిమిటి మీద ఈగ వాలనివ్వవు. భరతుడు, బంధువా? అతడు లేకుండా ఇంట్లో శుభ కార్యమా? ముహూర్తాలకేం, ఎప్పటికప్పుడే వుంటాయి. ఇంకో ముహూర్తమే దొరకదా? పంచాంగం అంతా ఈ పూటే తగలబడిపోతోందా?"

కైక నవ్వి వూరుకుంది. మందరతో చిరునవ్వుతోనే మాట్లాడుతోన్నా, కైక మనసులో, భర్త ప్రవర్తన పట్ల అసంతృప్తే కలిగింది. మహారాజు, ఇంత మాట తప్పడమా? మరి సత్యవ్రతం ఏమైంది? కాలం గడిస్తే, సత్యం కూడా పరగడుపేనా?

"అవునే మందరా! రాముడు మాత్రం ఎలా ఆమోదించాడు దీనికి? అన్నీ ధర్మోచితంగానే చేస్తాడు కదా? నేను నమ్మను. రాముడు అంగీకరించి వుండడు!"

"సరిపోయింది! నీ వెర్రి నీదే! అసలు మనిషే అంగీకరించకపోతే బయట ప్రయత్నాలన్నీ ఎందుకు జరుగుతున్నాయి? తండ్రీ కొడుకులు ఏకమయ్యారని తోచడం లేదూ? 'ఎవరు అడ్డగిస్తారులే' అని నమ్మకం కాబోలు! నీ కొడుకు అసలే లేడు! ఇక, నువ్వా? పెనిమిటిని చూస్తే చాలు, పరవశించిపోతావు. ఇక అడ్డుకునే దెవరమ్మా?"

కైక చిరునవ్వుతో చూసింది – "నువ్వు లేవూ?"

"ఆఁ, ఉన్నాను! ఎందుకూ? తిండికే! నీ తండ్రి నన్ను నీతోపాటు ఎందుకు పంపాడనుకున్నావు? తిని తిరగమని పంపాడా, నీ కష్టసుఖాలు చూసుకోమని పంపాడా? అందుకే ఇంత మొత్తుకుంటున్నాను. వినకపోతే చెడేది ఎవరు? నువ్వే! నీతోపాటే నేనూనూ! రేపటి నించీ చూద్దువుగాని, ఏం జరుగుతుందో! 'పెద్దకొడుకు' అని మురుస్తున్నావే, ఆ కొడుకు రేపు రాజు అవుతాడు. నీ పెద్ద సవితి రాజమాత అవుతుంది. ఇక ఆవిడ దర్పం చూడగలమా? ఆవిడ కోడలు – మహారాణీ! నీ కోడళ్ళూ నీ కొడుకూ నువ్వూ అందరూ వాళ్ళకు దాసులై బతకవలిసిందే!"

"ఊరుకోవే తెలివిమాలిన దానా! ఊరుకో! ఏవిటా

మాటలు? సీత ఎంత ఉత్తమురాలో మనం ఎరగమా? అక్కలు మాత్రం? వాళ్ళూ నా వంటివాళ్ళే కదా?"

"ఆఁ, నీ వంటి వాళ్ళే! అందుకేనా ఎప్పుడూ నిన్నాడి పోసుకుంటూ వుంటారు?"

"చాల్లెద్దూ! ఎప్పుడో ఏదో అన్నారని ...."

"అలాగే కొట్టిపారెయ్యి! రేపు అనుభవించేనాడు కళ్ళు తెరుద్దువు గానిలే!"

"సరేలే, ఊరుకో! మహారాజుని అడుగుతాలే! సరేనా?"

"ఇప్పటికి అన్నావు ఆ మాట! అడగడం కాదు, కడిగిపెట్టు!"

"ఏమిటా వెర్రి వాగుడు? మహారాజుని తప్పు పట్టే టంత దానివయ్యావా? నోరు సంభాళించుకో!"

"అవునమ్మా! నా నోరు చెడ్డదే! నీకేం కష్టం వచ్చి పడుతుందోనని నా మతి తప్పిపోతోంది. నీకు చీమ కుట్టినట్టన్నా లేదు!"

"పిచ్చిదానా! అంతే గ్రహించావు. రాముడిలా చేస్తు న్నాడంటే, నాకెంత వింతగా వుందో నీకేం తెలుసు?"

"అసలు కొంటెతనమంతా ఆయనలో వుందమ్మా! మహారాజు నవుదామని ఆరాట పడుతున్నట్టున్నాడు!"

"అవుతాడులే 'మహారాజు'! చూద్దువుగాని."

"ఏమో తల్లీ! నీకు రావలసిన కష్టం కాదు. నలుగురు బిడ్డల్నీ నీ బిడ్డలే అనుకున్నావు. వాళ్ళు మాత్రం నిన్ను రెండు కళ్ళతోటీ చూడలేరు."

"ఊరుకో! నాకు చాలా తలపోటుగా వుంది, నువ్వు వెళ్ళు!"

"విశ్రాంతిగా పడుకో తల్లీ! బాలని పంపిస్తాను. ఔషధం రాస్తుంది."

"వొద్దు! ఎవరూ వొద్దు! ఒంటరిగా ఉండనివ్వండి నన్ను!"

"సరేనమ్మా! వెళ్తున్నాను" అంటూ మందర కళ్ళ నీళ్ళతో బైటికి వెళ్ళిపోయింది.[37]

అంతఃపురం చుట్టూ తోటలో గూళ్ళకు చేరే పక్షుల అరుపుల మధ్య మహారాజు తోటలో రథం దిగి, విశాలమైన గదుల్లోంచి నడుస్తూ గాలి పరిమళాలకు ఉత్తేజితుడవుతూ కైక పడకటింట్లోకి ప్రవేశించాడు.

పూలు పరిచిన పాన్పు బోసిగా కనిపించింది. నిత్యం రతీదేవిలా అలంకరించుకొని తను రాగానే కౌగిట్లోకి చేరే భార్య కనపడకపోవడం వల్ల ఆ వృద్ధ భర్త విరహం ఇనుమడించింది. దాసీలు చూపించిన ప్రకారం ఆతృతగా పూలతోటలోంచి ప్రత్యేక మందిరంలోకి వెళ్ళాడు.

అటువంటి సంధ్యవేళ పరిచారికలతో కబుర్లాడుతూ తోటలో విహరించే కైక, వొంటరిగా పాన్పు మీద దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుని వుంది. వొక్క దీపం మాత్రమే ఆమెకు తోడుగా వుంది.

కైకని చూడగానే ఆమె చాలా విచారపడుతున్నట్టు దశరథుడికి అర్థమైంది. ఏదో సందేహం కూడా కలిగింది. ధైర్యంగా ఉండాలని ప్రయత్నిస్తూ దగ్గిరికి చేరాడు – "కైకేయీ! ఏం జరిగింది? .... ఇక్కడ .... నువొక్కత్తెవూ .... ఇంత వొంటరిగా .... ఆరోగ్యమేమయినా

---

**37. అయోధ్యా, సర్గలు 7, 8, 9: మందర** ప్రసక్తి ఈ 3 సర్గల నిండా నడుస్తుంది. వాల్మీకి వర్ణన ప్రకారం, మందర దుష్టురాలు. అంద చందాలు లేని గూనిది. కైకకు దుర్మార్గపు ఆలోచనలు బోధించిన దాసి. ఈ మందర, కైకతో, కైక పుట్టింటి నించి వచ్చిన దాసి ('జ్ఞాతి దాసి' అన్నాడు కవి). మందర చెయ్యవలసిందంతా కైక క్షేమం గురించి చూసుకోవడమే. మందర గురించి కైక 'నీవు నా హితము కోరుదానవు. నాకు చేదోడుగ నుండు దానవు' అంటుంది. దశరథుడు, కైకని పెళ్ళి చేసుకునేటప్పుడు ఇచ్చిన మాటని తప్పడానికి ఇప్పుడు సిద్ధపడుతోంటే, కైకని హెచ్చరించడమే తన ధర్మంగా మందర ఎంచుకుంది. అంటే, మందర యజమానురాలికి విశ్వాస పాత్రురాలిగా పనిచేసిందన్నమాట! కాబట్టి, మందర ఉత్తమ పాత్రగా లెక్కకు రావాలి. దుష్ట పాత్రగా కాదు.

ఇక్కడ రచనా విధానానికి చెందిన ఒక విషయం ఉంది. ఏమిటంటే – స్త్రీల శరీరాల్ని పురుషులు వర్ణించడమే కాదు, స్త్రీలు వర్ణించడం కూడా వుంటుంది. కైక, మందర అంగాంగాల్నీ వర్ణిస్తూ "నీ స్తనములు వృద్ధినొంది యున్నవి. నీ తొడలు పొడవుగా నున్నవి. నీ నడుము .... నీ వీపు ...." ఇలా చాలా వర్ణిస్తుంది.

ఇక్కడ ఇంకో విషయం: మందర, కైకతో – 'రాముడు రాజైతే అతని స్త్రీలందరూ సుఖభోగాలనుభవిస్తారు. నీ కొడుకూ నీ కోడళ్ళూ భోగాలు లేని వాళ్ళయిపోతారు' అని వర్ణించే చోట 'రామస్య పరమా హ స్త్రియః' అన్నాడు కవి. అంటే 'రాముడి ఉత్తమ స్త్రీలు' అని అర్థం. 'రాముడి స్త్రీలు' అనే ఈ మాటల మీద, 'రాముడికి సీతగాక వేరే భార్యలు కూడా ఉన్నారా?' అనే చర్చ ఉంది. ఈ రకం చర్చ, మొత్తం రామాయణం కథలో 3 సందర్భాల్లో ఉంటుంది. ఇది, మొదటి సందర్భం. 'రాముడి ఉత్తమ స్త్రీలు' అనే మాటల్ని పట్టుకుని, 'ఆ స్త్రీలు రాముడి భార్యలా' అని సందేహించడం అర్థంలేని సందేహం. 'రాముడి ఉత్తమ స్త్రీలు' అంటే, రాముడి తల్లీ, రాముడి భార్యా, రాముడి పక్షానవున్న ఇతర తల్లులూ కూడా అందులోకి వస్తారు. కైకకి వ్యతిరేక పక్షం రాచస్త్రీలందరూ రాముడి ఉత్తమ స్త్రీలే. అంతేగానీ, 'రాముడి స్త్రీలు' అనే మాటలకు 'రాముడి భార్యలు' అనే అర్థం తియ్యడం అర్థంలేని విషయం. ★

.... దాసీలెవ్వరూ చెప్పలేదే! ఈ సుగంధాల మత్తుతో శిరోభారం కలిగిందా? పూలరేకులు వొత్తుకుని శరీరం కందిందా? వనాల్లో విహరిస్తే పాదాలు నొచ్చాయా? – ఏం జరిగినా ఎందరో వైద్యులున్నారు కదా? క్షణాలలో పరుగు పరుగున వొచ్చి నీ పాద సేవచేస్తారు కదా? అయ్యో! ఎంత బాధపడుతున్నావో, నాతో చెప్పవేమీ?" అని వొణుకుతూ, గదుల్లోంచీ, తోటలోంచీ నడిచి వొచ్చినందుకు ఆయాసపడుతూ కైక సరసన శయ్యమీద కూర్చున్నాడు.

కైక, కరగబోయిన మనస్సుని కఠినం చేసుకొని మౌనం వహించింది.

దశరధుడు అలసట తగ్గి – కైక మౌనం రాజ వైద్యులు ఛేదించలేనిదని గ్రహించి, తన ముద్దుల భార్యని తనే బ్రతిమాలి, బామాలి, బుజ్జగించి లాలించి పాలించాలని ఆలోచించి, మీసాల వెనక నవ్వులో శృంగార రసం మేళవించి – "కైకేయీ! ఎందుకింత అలక? అప్సరసలాంటి నీవొంటిమీద అలంకారాలేవీ? పట్టుచీర ఏదీ? ఎన్నడైనా నా మీద కోపగించావా? నీ కోరికలన్నీ చెల్లించే మహారాజుని నేనుండగా ఇంత దీనంగా విచారించవలసిన అవసరం నీకేమి కల్గింది? ఓహో! నీ ప్రియుణ్ణి నేనింత ఆలస్యంగా వొచ్చాననా కోపం? ఏం చెయ్యను చెప్పు దేవీ? ఎన్నో రాచకార్యాలు .... చిక్కులు .... మంత్రాంగాలు ...." అంటూ కైకని కౌగలించుకోబోయాడు.

కైక దూరంగా జరిగింది. కఠినంగా తల తిప్పు కుంది.

దశరధుడు తెల్లబోయి, అది శరీర రుగ్మత కాదనీ, ప్రణయ కలహం కూడా కాదనీ గ్రహించి, కంగారు పడ్డాడు. అంతటి మహారాజయిన తను వొక్క భార్య అలక తీర్చలేకపోవడం మిక్కిలి అవ మానంగా భావించి, కంఠంలో హారాలు సర్దుకొని, మీసాలు సవరించు కున్నాడు – "కైకేయీ! నిన్నెవరయినా బాధించారా? అవ మానించారా? ఎవరి మీదైనా పగ తీర్చుకోవాలా? చెప్పు! అతడెంత నిర్దోషి అయినా, నీ సంతోషం కోసం, అతణ్ణి చంపిం చేస్తాను. లేకపోతే ఎంత దోషినైనా నువ్వు కోరితే శిక్ష ఆపించి రక్షిస్తాను. పోనీ ఎవరయినా భాగ్య వంతుణ్ణి దరిద్రుణ్ణి చెయ్యాలని వుందా? వెంటనే చెప్పు. సైన్యాన్ని పంపి అతడి ధనధాన్యాలన్నీ కొల్లగొట్టించి ఈ రాత్రికే అతణ్ణి దరిద్రుణ్ణి చేయించేస్తాను. లేకపోతే నువ్వు కోరాలేగానీ ఎంత దరిద్రుణ్ణి అయినా ధన వంతుణ్ణి చేస్తాను. చెప్పు కైకేయీ! సౌందర్యరాశివి. నువ్వు నా కళ్ళముందు ఈ విధంగా దుఃఖించడం నేను చూడగలనా? నా భార్యల్లో నీకన్నా ప్రియమైన వాళ్ళె వరూ లేరు కదా నాకిప్పుడు? నీ ముద్దు తీర్చకపోతే నేను జీవించి ఎందుకు? సూర్యుడు అస్త మించని రాజ్యం నాది. ఏం కావాలో కోరుకో! అంతా కావాలంటే కోరుకో! నా ప్రాణాలు కావాలంటే కోరుకో!"– తన ప్రాణాలు మాత్రం కైక కోరదనే నమ్మకంతో గాలికి పండుటాకులు రాలుతోన్నట్టు వరాలు కురిపించాడు దశరధుడు. ఎదటివాళ్ళు ఏమాత్రమూ కోరని వాటిని ఇచ్చెయ్యగల దాతల్లో దశరధుడు మహా దిట్ట! నెలకో కొత్త భార్యకి ప్రాణాలు ఇచ్చేసే పాత అలవాటు చొప్పున, కైకకు ప్రాణాలూ, రాజ్యాలూ, వాగ్దానాలు చేస్తూనే 'ఎందుకింత పట్టు పట్టింది?' అని ఆలోచనలో పడ్డాడు.

కైక, మౌనం వొదిలి సంభాషణలోకి దిగింది.

"రాముడికి పట్టాభిషేకం జరుగబోతోందని విన్నాను. నిజమేనా?" అని సూటిగా అడిగింది.

దశరధుడు కంగారుపడి సర్దుకుని నవ్వు మొహంతో – "ఆ శుభవార్త నా నోటితో నేనే చెప్పాలని వొచ్చాను. ఇంతకు ముందే విన్నావన్నమాట! నీకు సంతోషంగా లేదూ దేవీ? మన రాముడికే పట్టాభిషేకం ...." అంటూ నవ్వబోయి కైక ముఖ కవళికలకు జంకి భీతిగా చూశాడు.

"పట్టాభిషేకం ఎప్పుడు?"

"రేపే."

"ఎవరికయినా ఆహ్వానాలు పంపించారా మహా రాజులు?"

"ఈ రాత్రికి ప్రయాణంచేసి రాగలిగే దగ్గిర దేశాల రాజులకు మాత్రం పంపించాము."

"నా తండ్రికి?"

దశరధుడు జంకుతూ తల తిప్పుకున్నాడు. "వ్యవధి లేదుగా?"

కైక తీక్షణంగా చూసింది – "వ్యవధి వుండకూడదనే కదా రేపటికే ముహూర్తం నిర్ణయించింది? సువిశాల కోసల సామ్రాజ్య వారసుడి పట్టాభిషేక మహోత్సవాన్ని ఇంత హఠాత్తుగా, ఇంత రహస్యంగా, ఒక్క దినంలో నిర్ణయించవలసిన అగత్యం ఎందుకు కలిగింది మహా రాజుకి?"

మహారాజు తడబడుతూ – "ఈ మధ్య నా శరీర స్థితి .... నా ఆరోగ్యం .... నా .... ముహూర్తం .... బ్రాహ్మలు ...." అని చెప్పుకొచ్చాడు.

"మహారాజా! చాలించండి మీ అసత్యాలు! మీ మంత్రాంగం నేను గ్రహించలేనిది కాదు. కోసల సామ్రా జ్యానికి నిజమైన వారసుడెవరో మహారాజు మర్చి పోయినా నేను మర్చిపోలేదు. ఆనాడు, నన్ను పెళ్ళి చేసు కున్న నాడు, మీ రాజ్యమంతా నా బిడ్డకే ఇస్తానని మీరు చేసిన వాగ్దానం ఏ గంగలో కలిసింది?"

మహారాజు నిర్ఘాంతపోయి కూర్చున్నాడు. తన

వాగ్దానం సంగతి మహారాజు ఏ నాడూ మరిచి పోలేదు. దాన్ని కైక ఏ నాడో మర్చిపోయిందని రాజుకి గాఢ నమ్మకం. ఏ నాడో పాతికేళ్ళనాటి సంగతి ఇంకా జ్ఞాపకం పెట్టుకొని, తనంటే ఎంతో వినయ విధేయత లతో ప్రవర్తించే భార్య, ఇంత నిర్భయంగా ప్రశ్నించగల దని ఆ వృద్ధ మహారాజు కలలో కూడా ఊహించలేదు. భరతుణ్ణీ, అతడి తాతనీ, ఏమార్చగలిగితే, రామ పట్టాభి షేకం నిర్విఘ్నంగా జరిగిపోతుందని భావించాడే గానీ .....

"మాట్లాడరేం మహారాజా? సత్యసంధులు చేయ దగ్గ పనేనా ఇది? ఎప్పటి వాగ్దానాలు అప్పుడే కాల దోషం పట్టిపోవలసిందేనా? లోకానికి తెలియని సత్యా లన్నీ అసత్యాలై మరుగునపడి పోవలసిందేనా?"

"కైకేయీ! అంత ఆగ్రహం కూడదు. రాముడు నీ బిడ్డతో సమానమే కదా? అందరిలోనూ రాముడు బహు యోగ్యుడూ, సమర్థుడూ అని నువ్వు ఎరుగుదువు కదా? జ్యేష్ఠ పుత్రుడికే రాజ్యం సంక్రమించాలని శాస్త్రాలన్నీ చెపుతున్నాయి కదా?"

"మహారాజా! ఆడినమాట తప్పరాదని మాత్రం శాస్త్రాలు చెప్పడం లేదా? ఆ నాడు మీరు ఎవరికి వాగ్దానం చేశారో వారిని పిలిపించి రాముడి యోగ్య తలూ, భరతుడి అయోగ్యతలూ ఏకరువు పెట్టండి! అంత వరకూ రామ పట్టాభిషేకం జరగడానికి నే నంగీక రించను."

అన్ని వందల మంది భార్యలలో ఎన్నడూ స్త్రీల అవి ధేయత ఎరగని మహారాజుకి పట్టరాని కోపం వచ్చింది – "ఏమిటీ? నువ్వంగీకరించవూ? మహా బాగు! నీ అంగీకారం ఎవరికి కావాలి? నేను వాగ్దానం చేసింది నీకు గాదు. నా కార్యాన్ని ధిక్కరించే హక్కు నీకెలా కలిగింది?" అని నిర్లక్ష్యంగా తల తిప్పాడు.

కైక అంతవరకూ నిగ్రహించుకున్న కోపాన్ని అణచలేకపోయింది – "నీ దౌర్జన్యకార్యాన్ని ధిక్కరించడా నికి నాకుగాక ఇంకెవరికి హక్కు వుంది మహారాజా? నీ సత్య వ్రతం ఎంత సత్యమో నువ్వు నిరూపించుకున్నావు. నా ధిక్కారానికి నాకున్న హక్కేమిటో నేను నిరూ పించుకుంటాను. మునుపు దేవాసుర యుద్ధంలో నువ్వు దేవతల పక్షాన సంబరాసురుడితో యుద్ధానికి పోయి నప్పటి సంగతులేమయినా గుర్తు వున్నాయా? యుద్ధంలో నువ్వు మూర్ఛపోతే నేను రథాన్ని రహస్య స్థలానికి తోలుకుపోయాను. నువ్వు రెండుసార్లు శత్రువు లకు చిక్కబోతే రక్షించాను, గుర్తుందా? తర్వాత నువ్వు చాలా సంతోషించి నాకిస్తానన్న వరాల సంగతి కూడా మర్చిపోలేదు కదా? పోనీ ఆ వరాలడిగే హక్కయినా వుంది కదా నా కిప్పుడు?" అని ధిక్కారంగా చూసింది.

దశరథుడు లోపల కంపిస్తూ తెచ్చి పెట్టుకున్న గాంభీర్యంతో – "నీ వరాలు నీ కివ్వడానికి ఈ దశ రథ మహారాజు ఎప్పుడూ సిద్ధమే" అని మీసం సవరించాడు.

కైక, తన హక్కు తను కోరుతున్నాననే నమ్మ కంతో నిస్సంకోచంగా – "మహారాజా! తక్షణమే భరతుణ్ణి పిలిపించి అతడికే పట్టాభిషేకం చెయ్యాలి! రాముణ్ణి రుషి వేషంతో ఇప్పుడే దండకారణ్యాలకు పంపాలి! ఈ రెండు వరాలూ నేను కోరుతున్నాను" అంది.

దశరథుడు వెర్రి చూపు చూశాడు. కైక కేమయినా మతి భ్రమించిందా? లేక తనేమయినా పొరపాటు విన్నాడా? భరతుడికి రాజ్యం ఇవ్వాలా? రాముణ్ణి అడవు లకు పంపాలా? ఇవేం వరాలు? లోకంలో ఏ స్త్రీ అయినా ఎన్నడయినా ఈ విధంగా కోరిందా! – నిర్ఘాంత పడి, చేష్టలు దక్కి, కూర్చున్నాడు.

"నీకేం కావాలో కోరుకో" అని దశరథుడు పూర్వం ఎందరు భార్యలతోనో అన్నప్పుడు, వారు ముద్దుగా – "రత్నాల వర్తకుడొచ్చాడు. వొక రత్నాలహారం కొని పెట్టరా?" అనో, "మా బంధువు లొచ్చారు, వారికోసం పట్టుచీరలు తెప్పించరా?" అనో, అడిగేవారు. వెంటనే ఆ నగలో, చీరలో తెప్పించి ఇచ్చి, ఆ భార్యలను ఉద్ధ రించినట్టు వారి మోహాలు గర్వంగా చూసేవాడు మహా రాజు. అటువంటి చిట్టిపొట్టి కోరికలు మాత్రమే తీర్చడం తెలిసిన దశరథుడు, కైక ఎంత సాహసంతో ఎంత చిత్రమైన కోరికలు కోరుతుందో ఊహించలేకపోయాడు.

కైక కొంతసేపు నిరీక్షించి – "మహారాజా! నా వరాలు అనుగ్రహించినట్లేనా?" అని ప్రశ్నించింది.

దశరథుడు రౌద్రంగా, భరించలేని ఆవేశంతో, తన ఉపాయాలేవీ ఫలించకపోగా ఎదురు తిరి గాయన్న కక్షతో, మండిపడిపోతూ – "ఏం వరాలు? దుర్మార్గు రాలా! నీ కొడుక్కి రాజ్యం ఇవ్వాలా? నా కొడుకుని అడవికి పంపాలా? బుద్ధిలేనిదానా! లోకమంతా రాముణ్ణి కీర్తిస్తూ వుంటే నీకింత పాపపు బుద్దెలా పుట్టింది? సుగుణాల రాశిని ... రాముణ్ణి, అడవికి పంపమనడానికి నీకు నోరెలా వచ్చింది? సిగ్గులేనిదానా! నీ మొహం మండా!" అంటూ తిట్లకి లంకించుకున్నాడు.

కైక ఏమీ జంకక పరిహాసంగా చూసింది. "దశరథ మహారాజా! నీలో దుర్మార్గం అంతా నాకు ఆపాదించడం ఏమి ధర్మం? నా బిడ్డ క్షేమం నేను కోరడం దుర్మార్గమా? రాముణ్ణి నేను అకారణంగా అడవులకు పంపమన్నానా? తనకు హక్కులేని రాజ్యం కోసం రాముడు ఏ కపట ప్రయత్నాలూ చెయ్యకుండా వుంటే అతణ్ణి నేను శత్రువుగా భావించే దానినా? ఇవ్వాళ తనకు హక్కులేని సింహాసనం ఎక్కటానికి సిద్ధపడ్డవాడు, రేపు భరతుడు రాజ్యం చేస్తూ వుంటే, చూస్తూ వూరుకుంటాడా?

రాముడిక్కడే వుంటే, అతడి బంధువులూ, స్నేహితులూ, అతడి పరివారమూ, నిత్యం అతణ్ణి ప్రోత్సహించి కల్లోలాలకు దించకుండా వుంటారా? రాజ్య కాంక్షలతో రాచ కుటుంబాలలో జరిగే దురంతాలు నే నెరగనివా? మహారాజా! సింహాసనం చుట్టూ శత్రు మూకల్ని అప్పగించి, నా బిడ్డకు రాజ్యం ఇచ్చి మాత్రం ఏం ప్రయోజనం? భరతుడు రాజ్యపాలనలో స్థిరపడేవరకూ రాముడు ఈ దేశంలో వుండటానికి వీల్లేదని నేను కోరడంలో తప్పేముంది?" అని నిర్భ యంగా మాట్లాడింది.

దశరథుడు ఆశ్చర్యంతో మాట పెగలక చూస్తూ వుండిపోయాడు. కొన్ని క్షణాల కిందటే తన ముద్దుల కొడుకైన రాముణ్ణి రహస్య మందిరంలోకి పిలిచి, "నాయనా! భరతుడి మనుషులవలన నీకు ప్రమాదం వుంటుంది. జాగ్రత్తతో మసలుకో సుమా!" అని తను ఏ రక్షణకోసం హెచ్చరించాడో, ఆ రక్షణ కోసమే కైక తన బిడ్డకు ఏర్పాట్లు చేస్తోంటే విస్తుబోయి చూడడం తప్ప ఏమీ చెయ్యలేని స్థితిలో పడ్డాడు.

"మహారాజా! రాముడినే రాజుని చేయాలని నీ మనసులో కోరిక రేగితే, ఆ మాట సత్యంగా నాతో చెప్పి వుండవలసింది. 'కైకా! నేను ఈ నాటికీ నా వాగ్దానం తప్పను. రాజ్యం భరతుడికే హక్కని నేనూ అంగీకరిస్తాను. కానీ, నువ్వు కూడా అంగీకరిస్తే, రాముడినే రాజుగా చేయాలని నా మనసు కోరుతోంది. అయినా హక్కు నీదే కాబట్టి, నువ్వు ఎలా కోరితే అదే చేస్తాను' అని నీ మనసులో మాట నాతో చెప్పకపోయావా? నువ్వు అంత సత్యసంధుడిగా ప్రవర్తిస్తే, నేను సంతోషంగా రామపట్టాభిషేకానికి అంగీకరించేదాన్ని.

రాజా! రాజ్యం భరతుడికే హక్కనే మాట నా తండ్రిగానీ నేనుగానీ ఏనాడూ భరతుడికి చెప్పలేదు. ఈ నాటి వరకూ ఆ ధ్యాసే మాకు లేదు. నీ సత్యవ్రతం మీదే నమ్మకం పెట్టుకుని నిశ్చింతగా వున్నాము. నువ్వు భరతుణ్ణి పిలిపించి 'నాయనా! రాజ్యం నీకే ఇస్తానని మీ తాతకి ఏనాడో మాట ఇచ్చాను. కానీ, రాముడే రాజుగా వుండాలని నా మనసు కోరుతోంది. నువ్వు సంతోషంగా అంగీకరిస్తేనే ఆ విధంగా చేయగలను. నీ అభిప్రాయం చెప్పు!" అని అతణ్ణి అడగక పోయావా? నీ సత్యానికి సంతోషించి నా తండ్రీ, నేనూ, నా కొడుకూ, అందరం నీకు ఆనందం కలిగించే విధంగా నడుచుకునే వాళ్ళమే కదా? నీకీ అసత్యదోషం తప్పేది కదా?

కానీ, నువ్వేం చేశావు? నువ్వూ నీ కొడుకూ నీ పురోహితులూ అందరూ కలిసి నన్ను వంచించడానికి చూశారు. నీ దుర్మార్గం నేను సాగనివ్వను. నువ్వు ఎలా నిర్ణయించావో తొందరగా నాకు తేల్చి చెప్పు!"

కైక, తన పట్టు వదలదని దశరథుడికి ఇంకా దృఢంగా అర్థమైంది.

ఎంతో సేపు, ఎన్నో విధాల ఆలోచించగా, చివరికి కైకని మంచి మాటలతో నెమ్మదిగా ఒప్పించడం తప్ప వేరే మార్గంలేదని కూడా అర్థమైంది. తన పురుషత్వమూ మహారాజత్వమూ భర్తృత్వమూ అన్నీ కాస్సేపయినా పక్కన పెట్టక తప్పదని అర్థమైంది. కైకకు మనసు కరిగి, దయగలిగే విధంగా మాట్లా డడం మొదలుపెట్టాడు – "కైకేయీ! పతివ్రతవు నువ్వు! పతివ్రతలయిన స్త్రీలు భర్తని ఇలా దుఃఖ పెట్టవొచ్చునా? వరాలు ఇస్తానని భర్త అంటే మాత్రం భర్త ఇష్టానికి వ్యతిరేకమైన వరాలు కోరవచ్చునా? పురోహితులు రేపే మంచిదని ముహూర్తం నిర్ణయించారు. పట్టాభిషేక ప్రయత్నాలన్నీ జరుగుతున్నాయి. తెల్లవారేసరికి రాజులందరూ వొస్తారు. వారందరికీ ఏం చెప్పను? సభలో ప్రకటించిన మాట అబద్ధం ఎలా చెయ్యను? చాటునో, మాటునో అయితే, దాని సంగతి వేరు. కైకేయీ! ఎన్నో సంవత్సరాలు కీర్తి ప్రతిష్టలతో రాజ్యంచేసిన మహారాజుని! నిన్ను అగ్ని సాక్షిగా పాణిగ్రహణం చేసిన భర్తని! నీ పాదాలకు నమస్కారం చేస్తున్నాను. నా కీర్తి కాపాడు! నీ పంతం విడిచి పెట్టు!" అంటూ తలవొంచాడు, దుఃఖ భారంతో వణుకుతూ.

కైక అసహ్యపడి దూరంగా తొలిగింది. "ఎందరు స్త్రీల పాదాలకు నమస్కారాలు చేసి వారి కిచ్చిన వాగ్దానాలు వెనక్కి తీసుకున్నావో, ఎందర్ని ప్రాధేయపడి నీ దోషాలన్నీ పడకటిళ్ళలోనే భూస్థాపితం చేసి ఇంత కీర్తి ప్రతిష్టలు సంపాదించావో, నాకిప్పుడర్థమవుతోంది. మహారాజా! 60 సంవత్సరాల వృద్ధ భర్తని కట్టుకుని, నా యవ్వనోత్సాహానికి తిలోదకాలిచ్చి పతివ్రతనై బ్రతుకుతున్నాననే కరుణ అయినా లేదా నా మీద? ఇంత కాలానికి నేను కోరిన కోరికని సంతోషంతో నెరవేర్చవచ్చునే!" అని విస్మయంగా చూసింది.

దశరథుడికి మళ్ళీ కోపం పెల్లుబికింది. 'బుద్ధి లేని దానా! ఆడదానివై యుండి భర్తతో తర్కవితర్కాలు జరుపుతున్నావా? మూర్ఖురాలా!' అని మనసులో తిట్టుకొని, పైకి లాలింపుగా చూశాడు – "కైకేయీ! తామర రేకుల వలె బహు సుందరమైన నీ కళ్ళు ఎంత ఎరుపెక్కాయో చూడు. చంద్రబింబం వలె మెరిసే నీ మొహం ఎంత వాడిపోయిందో చూడు. రంభనీ, రతీదేవినీ తలదన్నే సుందరివి నువ్వు. నీ శరీరం వలెనే నీ మనసు కూడా బహు సుందరమే" అని వర్ణిస్తూ తన మనసులో 'పాపిష్టి దానా! నీ అందం పాము అందం లాంటిది. నాకింత అపకీర్తి తీసుకు వొస్తావనే సంగతి తెలీక బుద్ధిలేని వాణ్ణయి వరాలిచ్చాను నీకు' అని తనని తను తిట్టుకుని, మళ్ళీ కైకతో "నువ్వు మహా బుద్ధిమంతురాలివని నేనెరు

గుదును. నన్ను పరీక్ష చేయడానికని అంటున్నావుగానీ, నీలాంటి పతివ్రత లింకెవరున్నారు? నువ్వు భర్తని కష్టపెట్టగలవా? పోనీ రాజ్యం నువ్వే తీసుకో. కానీ మళ్ళీ రాముడికే ఇయ్యి! నీకు నేను వరాలు ఇచ్చినట్టూ అవుతుంది. రాముడికి రాజ్యమూ దక్కుతుంది. మనకిద్దరికీ కీర్తీ, స్వర్గమూ లభిస్తాయి" అని స్వర్గానికి అడ్డదారి కనిపెట్టి సంతోషంగా చూడబోయాడు.

ఎంత వృద్ధుడయినా అంతకాలమూ భర్తని ప్రేమిస్తూనే వున్న కైకకి ఆ భర్తలో హీనత్వం అంత స్పష్టంగా చూసి సిగ్గు కలిగింది "మహారాజా! నీలో ఇంత నైచ్యం నేను కలలో కూడా ఊహించలేను. నాకు వివాహ కాలంలో, యుద్ధకాలంలో, చివరికి ఒక్క ఘడియ కిందట కూడా ఎన్నో వాగ్దానాలు చేశావు. నేను ఏది కోరితే అది తీరుస్తానన్నావు. కానీ, నా కోరికేదీ తీర్చక పోగా నీ కార్యం నువ్వు సాధించుకోవాలని చూస్తున్నావు. నువ్వు నన్ను మొదటే కోరితే, రాజ్యాన్ని రాముడికి ఇవ్వడానికి సంతోషంగా ఒప్పుకునే దానినే. కానీ, ఇప్పుడు దానికి అంగీకరించను. రాజ్యం మళ్ళీ రాముడికి ఇవ్వడానికే అయితే నిన్ను వరాలు కోరడం ఎందుకు? మహా రాజా! ఇన్ని మర్మాలెందుకు? నాకు వరాలు ఇవ్వనని చెప్పరాదా? శాస్త్రాలకూ, దేవతలకూ, రుషులకూ, నీ సత్య సంధత ఏపాటిదో చాటి చెప్పుకోరాదా? నాకై నేను మాత్రం నా హక్కుని విడిచిపెట్టను. నాకు కీర్తీ వద్దు, స్వర్గమూ వద్దు. నీ వంటి అబద్ధీకు లంతా చేరే స్వర్గం నేను కోరను" అంది నిస్సంకోచంగా.

కైక నిర్లక్ష్యాన్ని భరించలేక దశరధుడికి కోపం కట్టలు తెంచుకొని వురికింది – "సిగ్గులేని దానా! బుద్ధి లేని దానా! భర్తతో ఇంత నిర్భయంగా వాదిస్తున్నావు, పిశాచం పట్టిందా ఏమి? పాపిష్టిదానా! పాప పుణ్యాలకు కూడా వెరవకుండా వున్నావు. మూర్ఖురాలా! ఈ క్షణం నించీ నువ్వు నా భార్యవే కాదు, నీ కొడుకు నా కొడుకూ కాదు. ఏమనుకున్నావో! నా తదనంతరం నువ్వుగానీ, నీ కొడుకుగానీ, నాకు ఉత్తరక్రియలు చెయ్యడానికి వీలు లేదు. ఆలోచించుకో! భరతుడికి రాజ్యం ఇచ్చి, రాముణ్ణి అడవికి పంపిన తర్వాత ఎన్ని అనర్థాలు జరుగుతాయో గ్రహించుకో! నా రాముడి కోసం దుఃఖించి దుఃఖించి నేను చచ్చిపోతాను. నా కోసం నువ్వు తప్ప రాణులందరూ చచ్చిపోతారు. కౌసల్య చచ్చిపోతుంది. సుమిత్ర చచ్చిపోతుంది. లక్ష్మణుడు చచ్చిపోతాడు. శతృఘ్నుడు చచ్చిపోతాడు. సీత చచ్చిపోతుంది. రాజ్యంలో ప్రజలందరూ చచ్చిపోతారు. జంతువులు చచ్చిపోతాయి. పక్షులు చచ్చిపోతాయి. అప్పుడిక ముండమోపివై, నువ్వూ నీ కొడుకూ జనంలేని రాజ్యాన్ని పరిపాలించుకోవచ్చు" అని వొణుకుతూ కైకని కోపంతో కాల్చేసేటట్టు చూశాడు.

కైక ఎప్పటి నిర్లక్ష్యంతోనే పరిహాసంగా నవ్వింది – "మహారాజా! రాముడు అడవికి పోయినతర్వాత వయో వృద్ధుడివి కాబట్టి నీ సంగతి నేను చెప్పలేను గానీ, మిగిలినవాళ్ళు ఎవ్వరూ చచ్చిపోరు. నిశ్చింతగా వుండు! కపట స్నేహాలూ, మాయోపాయాలూ, శుష్క ప్రియాలూ, అసూయా ద్వేషాలూ లుకలుకలాడే ఈ అంతఃపురాలలో, వొకరికోసం వొకరు ప్రాణ త్యాగాలు చేసేటంతటి ప్రేమానురాగాలా? నీ కోసం రాణులందరూ చచ్చిపోతారా? ఏ స్త్రీని నీ ప్రేమతో బంధించావు, నీ కోసం ఆత్మార్పణ చేయడానికి? పతివ్రతలం కాబట్టి, నిస్సహాయులం కాబట్టి, నిన్ను అంటిపెట్టుకొని జీవిస్తున్నాంగానీ, పరలోకాలకు కూడా నిన్నే అనుసరించే దౌర్భాగ్యం ఎందుకు మాకు? అందరూ చచ్చిపోతారని దుఃఖపడే అగత్యం లేదు. సీతా, లక్ష్మణుడూ, రాము డెక్కడవుంటే అక్కడే సంతోషంగా వుంటారు. ఇక ప్రజలా? ఎక్కడో సింహాసనాల మీద రాజుల మార్పులూ, మరణాలూ, ప్రజల్ని కదిలిస్తాయా? రాజుల కుటుంబ కలహాలూ, అంతరంగ దుఃఖాలూ, ప్రజల్ని తాకుతాయా? ఎప్పుడూ తమ కష్టాల్ని పెడచెవిన పెట్టే రాజులకోసం ప్రజలు కన్నీరు కారుస్తారా? సరే, ప్రజలు రాముడి కోసం చచ్చిపోతారో, భరతుడి కోసం బ్రతికే వుంటారో, రేపే చూడవొచ్చును. మహారాజా! ఎందుకిన్ని వ్యర్థాలోచనలు? ప్రస్తుత కార్యం నిర్ణయించరాదా?" అని మళ్ళీ సూటిగా ప్రశ్నించింది.

దశరధుడు, తనిక ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో, అసమర్థతతో తలవొంచి కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ – "అయ్యో! నేనంటే ఎంతో వినయ విధేయతలు గల పుత్రుణ్ణి అరణ్యాలకు పంపనా? హంస తూలికా తల్పాల మీద శయనించే రాముడు, దుమ్ములో, ధూళిలో, కటిక నేలమీద పడుకుంటాడా? రకరకాల రుచ్య వంటకాలు భుజించే రాముడు, గడ్డలో, దుంపలో తిని తృప్తిపడతాడా? రాముణ్ణి విడిచి వొక్కక్షణం అయినా జీవించగలనా? సూర్యుడు లేకపోయినా లోకాలు నిలుస్తాయి గానీ, రాముడు లేకపోతే ఈ దేశదేశాలూ మాడి మసైపోవా! నాయనా, రామా! నిన్నొదిలి నేనెలా జీవించ నోయీ!" అంటూ దుఃఖించటం ప్రారంభించాడు.

కైక భరించలేక అసహనంతో – "ఎందుకీ కన్నీళ్ళు? శోకించడమేనా ప్రేమని వెల్లడించే మార్గం? రాముడి మీద నీకంత అనురాగమే వుంటే, నా వరాలు ఇవ్వడం మానెయ్యి! నువ్వు ఇవ్వని రాజ్యాన్ని నేను యుద్ధంచేసి లాక్కోబోవడం లేదు. నీ ప్రియ పుత్రుడికోసం, నాకు చేసిన వాగ్దానాలన్నీ వదులుకో! అసత్య దోషానికయినా సిద్ధపడి. పుణ్య లోకాలూ స్వర్గ సౌఖ్యాలూ వదులుకో!

అంతేగానీ కడవలకొద్దీ కన్నీళ్ళు కారుస్తూ శుష్కప్రియాలు వల్లించి శూన్యహస్తాలు చూపించే నీ ప్రేమని, మూర్ఖులు తప్ప ఎవరు విశ్వసిస్తారు? నువ్వు ఎంత దుఃఖించినా ప్రయోజనం లేదు మహారాజా! రేపు సూర్యోదయంలోగా ఏదో ఒక నిర్ణయం చెయ్యి!" అని కైక, మాటలు ఆపి, ఆ మందిరంలోంచి వెళ్ళి పోయింది.

సాధారణ స్త్రీలంతా ఏ పొగడ్తలకి, ఏ బలహీన తలకి, ఏ లోక నిందలకి, ఏ అపకీర్తులకి భయపడి లొంగిపోతారో, ఆ ఉపాయాలన్నిటినీ కైక దగ్గిర ఉప యోగించి, కైక అచంచల స్థైర్యం ముందు ఘోర పరా జయం పొందిన దశరథ మహారాజు, కైక, అంత ధిక్కా రంగా సంభాషణ చాలించి వెళ్ళిపోవడంతో పూర్వంకన్నా రెచ్చిపోయాడు. "నీ మొహం మండా! నీ పళ్ళురాలా! పాపిష్టిదానా! మా వంశంలో చిచ్చుపెట్టాలని దాపు రించావు కదే దుర్మార్గురాలా! నీ దుంపతెగా! నువ్వు చావడం మంచిది. అసలు ఆడ మూక అంతా చచ్చి నాశనమైపోవటం మంచిది, భర్త మాట కెదురాడని మహాపతివ్రతలు మాత్రం మిగిలి" అంటూ మళ్ళీ తిట్ల కుపక్రమించాడు.

కైక హక్కులూ, కైక ప్రశ్నలూ, కైక తర్కమూ, ఆ తిట్ల ప్రవాహంలో కొంతసేపు మునిగిపోయినా, మళ్ళీ పైకి లేచాయి. మహారాజు ఏమీ చెయ్యలేని ఆందోళనతో, కంగారుతో, దుఃఖంతో, కోపంతో, వొణుకుతూ, గొణు గుతూ, మూలుగుతూ, తిట్టుతూ, గడిపాడు చాలాసేపు.

అప్పటికి అర్ధరాత్రి దాటింది. అంతులేని ఆలోచనల మధ్య, దశరథుడికి, గత విషయం వొకటి చటుక్కున గుర్తు వచ్చింది. దశరథుడు, చిన్నతనంలో వొకప్పుడు అడవిలో వేటాడుతూ నది వొడ్డున నీళ్ళశబ్దం విని, ఏదో జంతువని భ్రమించి, బాణంతో కరణుడనే ఒక ముని కుమారుణ్ణి కొట్టి చంపాడు. అతడు బ్రాహ్మణ కుమా రుడు కాకపోవడంచేత, దశరథుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకోలేదు. అయినప్పటికీ ఆ మునికుమా రుడి తండ్రి అయిన శూద్ర రుషి దుఃఖిస్తూ "మహారాజా! నువ్వుకూడా పుత్ర వియోగంతోనే మరణిస్తావు" అని దూషించాడు. 'శూద్ర రుషి వాక్కే జరుగుతుందా?' అని దశరథుడు ఆ తిట్లని ఎన్నడూ లక్ష్యపెట్టలేదు. కానీ, ఇప్పుడు అలాగే జరుగుతుందేమోనని భీతి ప్రారంభ మైంది.[38]

అంతఃపురం అంతా ఎన్నడూ ఎరగనంత నిశ్శబ్దమై పోయింది. చుట్టూ తోట, చీకట్లో నిశ్చలంగా వుంది. వొక్క మనిషి మాటగానీ, వొక్క పిట్ట కూతగానీ వినబడ నంత వంటరితనంలో కూర్చుని వున్నాడు దశరథుడు. కైకకి వరాలు ఇవ్వాలా, తిరస్కరించాలా? – ఆ ధర్మ సంకటంలో పడి కొట్టుకుంటున్నాడు. వరాలు ఇస్తే రాముణ్ణి అడవికి పంపించాలి! ఇవ్వకపోతే అసత్య దోషంతో తను నరకంలో పడిపోవాలి! అది ఊహించ డానికే భయంకరంగా వుంది. లోకంలో ఎంత అప్రతిష్ఠ! ఎంత అపకీర్తి!

ఇక్ష్వాకు వంశంలో పుట్టిన పూర్వపు పురుషు లందరూ స్వర్గంలో ఎన్నెన్నో సుఖాలు అనుభవిస్తున్నారని దశరథుడి నమ్మకం. వారంతా స్వర్గంలో వుండగా, తను అసత్యదోషంతో నరక కూపంలో పడి వుండడమా? స్వర్గంలో అమృతపానం చేస్తూ, దేవ వేశ్యల అధరామృత పానం చేస్తూ, దేవేంద్ర సభలో ఉన్నతాసనం మీద కూర్చునే మహాభాగ్యాన్ని వదలవలసిందేనా? ఇన్ని సంవ త్సరాలు దాన ధర్మాలూ, ఎన్నో యజ్ఞయాగాలూ, ఎన్నో సత్కార్యాలూ చేసి చేసి సంపాదించుకున్న పుణ్యమంతా వ్యర్థమేనా? "ఏమీ? పామరునివలే ఆలోచిస్తున్నానేమీ?

---

**38. అయోధ్యా, సర్గ 63, శ్లోకాలు 14 నించీ చివరివరకూ: + సర్గ 64, 1 నించీ 58 వరకూ:** రాముడు వనవాసానికి వెళ్ళిపోయింతర్వాత, సుమంత్రుడు రథం వెనక్కి తోలుకువచ్చి, రాముడి గురించి దశరథుడికి చెప్పిన తర్వాత, దశరథుడు దుఃఖిస్తూ, తనకు ఒక శాపం వుందనే సంగతి కౌసల్యకి చెపుతూ, కరణుడనే ముని కుమారుడిని గురించి చెపుతాడు. దశరథుడు, కౌసల్యతో కూడా పెళ్ళికాక పూర్వం ఒకసారి అడవిలో వేటాడుతూ నదిలో నీళ్ళు ముంచుకుంటున్న ముని కుమారుణ్ణి బాణంతో కొట్టాడు. ఆ ముని కుమారుడు తనతో ఎలా మాట్లాడాడని దశరథుడు చెపుతున్నాడో చూడండి. "బ్రహ్మహత్యా దోషము కలుగునని భయము కలిగిన వాడనగు నా మనో భావమును రుషి పుత్రుడు కనిపెట్టెను. వాడిపోవుచుండు వాడును, మిగుల దుఃఖముగలవాడును, సంకటపడు చుండువాడును, గాలుసేతులు పడిపోవుచుండు వాడును, బ్రాణము పోవుచుండగా బొరలుచుండువాడును నగు రుషి పుత్రుడు ధైర్యముచే దుఃఖమును సైచుకొని నాతో విటులనెను – "రాజా! నేను తెలివి గలిగి యున్నాను. (తెలివిలేని మాటలనుకుంటారేమోనని, తెలివిలో వుండే చెప్పాడు సుమా అని కవి చాలా జాగ్రత్తగా చెపుతున్నాడు) రాజా! నేను బ్రాహ్మణుడనుగాను. నన్ను బాణముతో కొట్టినందువలన నీకు బ్రహ్మహత్యా పాతకము కలుగునను చింతను విడువుము. దుఃఖించవలదు. నేను వైశ్యునికి శూద్ర స్త్రీవలన కలిగితిని." (ఆ ముని కుమారుడి బాధ అంతా దశరథుడికి బ్రహ్మహత్యా పాతకం కలుగుతుందేమో అనా?) తర్వాత ఆ ముని కుమారుడు చచ్చిపోవడం, అతని తల్లిదండ్రుల దుఃఖం, వారు దశరథుణ్ణి శపించడం – మొదలైన విషయా లన్నీ దశరథుడు కౌసల్యకు చెబుతాడు. శపించడం అంటే కీడు జరగాలని దూషించడం. ★

తండ్రెవరు, కొడు కెవరు? ఇవన్నీ లౌకిక బంధాలు. ఎవరి మోక్ష సాధనంకోసం వారు ప్రయత్నించవలసిందే గానీ, ఈ క్షుద్ర మమకారాలలో ఇరుక్కుని మోక్షప్రాప్తిని దూరం చేసుకోవచ్చునా? ఈ వృద్ధాప్యంలో ఆడినమాట తప్పాననే అపకీర్తి నాకెందుకు? 'సత్యమే బ్రహ్మం, సత్యమే ధర్మం, సత్యపాలన వల్లనే మోక్షం లభిస్తుంది' అని వేదాలు చెపుతున్నాయి కదా? అట్లే కానిమ్ము" అని తలపోస్తూ దశరథుడు విశాలమైన కిటికీలోంచి ఆకాశం వేపు చూస్తూ స్వర్గారోహణ సౌఖ్యాన్ని ఊహిస్తూ కళ్ళు మూసుకున్నాడు.

★ ★ ★

**తె**ల్లవారింది. తోట లేచింది. వైతాళికులు వచ్చి తాళాలతో, వీణలతో, మద్దెళ్ళతో, ఇక్ష్వాకు వంశ చరిత్రంతా వర్ణించారు. పూర్వరాజులు చేసిన యజ్ఞ యాగాలూ, సంపాదించిన కీర్తి ప్రతిష్టలూ, గానం చేశారు. చివరికి, "దశరథ మహారాజా, మేలుకో!" అని మేలుకొలుపులు చెప్పి వెళ్ళారు.

అందమైన పడుచు వేశ్యలు మహారాజుకి స్నానం చేయించడానికి బంగారు బిందెలతో పన్నీరు తయారు చేసి, మహారాజు ఉదయంపూట సేవించవలసిన ఔషధాలు సిద్ధం చేశారు.

అప్పటికి కైక దశరథుడి ముందు నిలబడింది "మహారాజా! ఏమని నిర్ణయించావు?"

దశరథుడు తలవాల్చి – "ధర్మపాశంలో చిక్కుకుపోయాను. అశక్తుడిని. రాముణ్ణి పిలిపించు!" అని నిట్టూర్చాడు.

కైక దశరథుణ్ణి నిర్లక్ష్యంగా చూసి కదిలింది.

దశరథుడి రథంతోలే సారథీ, మంత్రీ, అంతఃపురాలలో అందరి దగ్గరా చనువుగా తిరిగే వృద్ధుడూ అయిన సుమంత్రుడు, అప్పుడే దశరథుడు పడుకుని వున్న గది గుమ్మంలోకి వచ్చి, ఎప్పుడూ రాజునీ, రాణుల్నీ పొగడ్తలతో సంతోషపెట్టే అలవాటు చొప్పున, దశరథుడికి ప్రియంగా మాటలు ప్రారంభించాడు – "దశరథ మహారాజా! తూరుపు తెల్ల వారింది. రామ పట్టాభిషేకం చూడాలని సూర్యుడు కూడా మహోత్సాహంతో వొస్తున్నాడు. అయోధ్యా నగర వీధులన్నీ కోలాహలంతో నిండివున్నాయి. పట్టాభిషేకానికి సమస్త ధాన్యాలూ పదార్థాలూ వొస్తువులూ సమకూరాయి. సింహాసనం, పులిచర్మం, అగ్ని హోత్రం, సిద్ధంగా వున్నాయి. సుందరులయిన వేశ్యలంతా వచ్చారు. బ్రాహ్మణ దానధర్మాలకు లక్షలాది గోవులూ, వెండి బంగారాలూ, సిద్ధంగా వున్నాయి. వేలాది బ్రాహ్మలూ, ఆచార్యులూ వేంచేశారు! ఎందరో రాజులు విలువయిన కానుకలు తీసుకు వొచ్చి విశ్రాంతి మందిరాలలో వున్నారు. సమీప గ్రామాలనించి వర్తకులూ, సంపన్నులూ, శ్రేష్టులూ వచ్చారు. మహారాజా! సుముహూర్తం సమీపిస్తోంది. వశిష్టుల వారు నీకీ వార్తలన్నీ చెప్పమని నన్ను పంపించారు" అంటూ గబగబా యాకరువు పెట్టాడు.

అన్నీ విన్న కైక ఏమాత్రం చలించకుండా సుమంత్రుడితో – "వెంటనే వెళ్ళి రాముణ్ణి ఇక్కడికి పిలుచుకురా!" అని ఆజ్ఞాపించింది.

దశరథుడు ఏం చెపుతాడోనని సుమంత్రుడు కదలకుండా నించున్నాడు.

దశరథుడు సుమంత్రుడి మీద మండిపడుతూ "కదలవేం? కైక ఆజ్ఞ నా ఆజ్ఞ అని ఎరుగవా? వెళ్ళు! రాముణ్ణి తక్షణం రమ్మన్నానని తీసుకురా!" అని గర్జించాడు.

★ ★ ★

**ఆ** ఉదయం – రాముడు ఝాము రాత్రి వుండగానే లేచి పూజలూ వ్రతాలూ ముగించుకొని, అలంకారాలు పూర్తి చేసుకొని, రథం సిద్ధం చేయించి, ఇక తండ్రిగారి పిలుపుకోసం ఎదురు చూస్తూ, మిత్రులతో ఆలోచనలు చేస్తూ, వాకిలివేపు మొహంపెట్టి కూర్చుని వున్నాడు.

లక్ష్మణుడు బండెడు చీకటి నెత్తిన వేసుకుని అర్ధరాత్రే అన్నగారి మందిరానికి చేరాడు. అక్కడికి చేరిన దగ్గిర్నించీ అన్నగారి ఇంగితం గ్రహించి తండ్రి కబురుకోసం, మందిరం బయటే కాపలా వున్నాడు.

స్నేహితుల మధ్య రాముడు, వొంటినిండా ధగ ధగలాడే అలంకారాలతో మబ్బుల్లో చంద్రుడిలా మెరిసిపోతున్నాడు. వొక్క కిరీటం తప్ప పట్టాభిషేక లాంఛనాలన్నీ ధరించి వున్నాడు. ఆనందంతో కళ కళ లాడుతున్నాడు. స్నేహితులంతా చుట్టూ జేరి "మహారాజ కళ వుట్టిపడుతోందోయి అప్పుడే!" అని హాస్యాలు సాగిస్తున్నారు.

ముందు చూపుగల కొందరు మిత్రులు – "పరిస్థితులు ఏ క్షణంలో మారినా మారవచ్చును. కార్యం జరిగేవరకూ నమ్మడానికి వీలులేదు" అని సందేహిస్తున్నారు.

అలాంటి సమయంలో సుమంత్రుడు వచ్చి నవ్వుతూ – "రామా! నీ తండ్రి నిన్ను వెంటనే కైక మందిరానికి తీసుకు రమ్మన్నాడు. బయల్దేరు! బయల్దేరు!" అని తొందరపెట్టాడు.

రాముడు ఆనందపడుతూ – "కైక మంది రానికా? అక్కడ కెందుకు?" అని గంభీరంగా చూశాడు.

రాముడి మిత్రులు – "మహారాజు అక్కడి నుంచి ఇంకా బయల్దేరనే లేదా?" అని ప్రశ్నలు కురిపించారు.

సుమంత్రుడి జవాబేమీ వినకుండానే లేచి రాముడు

లోపలికి సీత దగ్గిరికి వెళ్ళాడు. తనకోసం సుమంత్రుడు వొచ్చిన సంగతి చెప్పి "సీతా! నాకు పట్టాభిషేకం జరగడం కైకకు ఇష్టంలాగే తోస్తోంది. అవును, పినతల్లి చాలా ఉత్తమురాలు. మహా పతివ్రత. భర్తమాట కెదురాడదు. నా పట్టాభిషేకానికి ఇక ఏమీ ఆటంకాలు జరగవు.[39] తప్పకుండా ఈ లగ్నంలోనే కార్యం జరిగిపోతుంది. సరే! బయలుదేరి వెళతాను" అంటూ బయటికి నడిచాడు.

సీత, కొన్ని సంవత్సరాల క్రితం అత్తగారింటికి వొచ్చినప్పట్నించీ ఈ రాజ్యాధికారం గురించి అత్తగారూ, భర్తగారూ అప్పుడప్పుడూ సందేహాలు వెలిబుచ్చడం వింటూనే వుంది. ఇంత హఠాత్తుగా తన భర్తకే పట్టాభిషేకం జరగబోతోందంటే, ఆమెకు పరమానందం కలిగింది. ముఖం పూర్ణ చంద్ర బింబమై పోయింది. ఆ కార్యం నిర్విఘ్నంగా జరిగిపోవాలని కోరుతూ భర్తని తలవాకిలి వరకూ సాగనంపి, ద్వారబంధం దగ్గిరే ఆగి తెరల వెనక్కి తప్పుకుంది.

రాముడు బయటికి వెళ్ళేసరికి అక్కడ లక్ష్మణుడు వినయంగా తలవాల్చి నిలబడి వున్నాడు. వాకిట్లో వెండి రథం అలంకరించి సిద్ధంగా వుంది. రాముడు రథం మీద గంభీరంగా ఆశీనుడయ్యాడు. లక్ష్మణుడు కూడా రథం ఎక్కి రాముడి వెనక విసనకర్రతో విసురుతూ నించున్నాడు. రథం వెంట ఏనుగులమీదా, గుర్రాల మీదా రాముడి స్నేహితులూ, బంధువులూ పరివారమూ వెంబడించారు. మేళతాళాలతో, వేశ్యల నాట్యాలతో, ఊరేగింపు బయల్దేరింది. వేద పఠనంతో, బ్రాహ్మలు నడిచారు. దారి పొడుగునా జనం కిట కిటలాడుతూ వేశ్యల్నీ, గుర్రాల్నీ, ఏనుగుల్నీ చూస్తూ నించున్నారు.

సంపన్న కుటుంబాల స్త్రీలు, రకరకాలుగా అలంకారాలు చేసుకొని, మేడలమీద నుంచి రథం మీదకు పూలు విసురుతూ, కాబోయే మహారాజు కంటపడాలని విశ్వప్రయత్నాలు చేశారు. "సీత ఎంత అదృష్టవంతురాలో! మహారాణీ అవుతోంది. నేనే రాముడి భార్యనయితే మహారాణీ నయ్యేదాన్ని కదా?" అని ఎవరికి వారే, రాముణ్ణి భర్తగా పొంద నందుకు గాక, మహారాణీ కాలేనందుకు విచా రించారు.

రాముడు గంభీరంగా కూర్చుని, దారిపొడుగునా జనం ఏం చెప్పుకుంటున్నారోనని రెండు చెవులూ రెండు వేపులకూ నిగిడ్చి వినడానికి ప్రయత్నిస్తోనే వున్నాడు. ఎవ్వరూ భరతుడి సంగతి ఎత్తడం లేదు కదా? తన పట్టాభిషేకం అధర్మం అని చెప్పుకోవడం లేదు కదా? – ఎంత ప్రయత్నించినా రణగొణ ధ్వనులే తప్ప జనాల మాటలేవీ వినబడలేదు. పామర ప్రజల కెప్పుడూ రాజ కార్యాల లోతు పాతులు తెలియవని రాముడికి తెలుసు. దేశంలో ఏ చిన్న మార్పు జరిగినా సామాన్యులు అకారణంగానే ఉత్తేజం పొంది సంతోషిస్తారని కూడా రాముడికి తెలుసు. అటువంటి అమాయకమైన సంతోషం, ఉత్సాహం, రాముడు ఆ ఊరేగింపులో, చాలామంది మొహాలమీద చూశాడు.

"మన రాజకుమారుడు బుద్ధిమంతుడు. ధర్మాత్ముడు. మనం ఈ కొత్తరాజు పరిపాలనలో పూర్వం కన్నా సుఖపడతాము" అని ప్రజలు కొత్త ఆశలతో చెప్పుకునే మాటలు కొన్ని ఎప్పటికో రాముడి చెవుల బడ్డాయి. అతడి మొహం నిండా ముసిముసి నవ్వులు విరిశాయి. తన తండ్రి పరిపాలనలో ప్రజలు పడ్డ కష్టాలేమిటో, తను వారికిచ్చే కొత్త సుఖాలేమిటో ఆలోచించే వ్యవధి లేదు – కొత్త మహారాజుకి.

రాముడి మనుషులు కొందరు ప్రజల గుంపుల్లో అక్కడక్కడా చేరి, మహోత్సాహంతో – "రాముడు ఎటువంటి ఆటంకాలూ లేకుండా నిర్విఘ్నంగా పట్టాభిషేకం చేసుకుంటే చాలు మనకు. అంతకన్నా ఇతర సుఖాలేమీ అక్కర్లేదు. స్వర్గం కూడా అక్కర లేదు" అంటున్నారు. తమ సుఖాలూ స్వర్గాలూ రాముడి పట్టాభిషేకం మీదే ఆధారపడి వున్న ఆ మనుషులు, అదే ప్రజాభిప్రాయంగా తోపించేటట్టుగా ప్రజలతో సంభాషిస్తున్నారు.

రాముడు గంభీరంగా లక్ష్మణుణ్ణి చూస్తూ – "లక్ష్మణా! వింటున్నావా జనుల వాక్యాలు?" అని మెత్తని కంఠంతో చిరునవ్వుతో ప్రశ్నించాడు.

"వింటున్నాను అన్నగారూ! మీకు తప్పకుండా పట్టాభిషేకం జరిగిపోతుంది. ఇక ఆగదు" అని లక్ష్మణుడు వినయంగా విన్నవించాడు.

రాముడు – వేద పఠనంతో, వాయిద్యాలతో, నాట్య గానాలతో, మేళ తాళాలతో ఊరేగుతూ, దేవా లయాలూ సభాస్థలాలూ ఉద్యానవనాలూ చుట్టు కుంటూ – చివరికి కైక అంతఃపురానికి చేరాడు.

ఊరేగింపు అంతఃపురం ముందు ఆగింది. ఏనుగుల ఘీంకారాలతో, గుర్రాల సకిలింపులతో, ప్రజల కోలాహలంతో, ఆ ప్రదేశం నిండిపోయింది.

రాముడు రథం దిగి ఒంటరిగా తండ్రి మందిరం లోకి నడిచాడు. అక్కడ, తండ్రి శయ్యాగారంలో దృశ్యం చూడగానే, రాముడికి హృదయ చలనం స్తంభించి పోయినంత పని అయింది!

**39.** **అయోధ్యా**, సర్గ 16: రాముడు సీతతో కైకగురించి ఎంత ప్రత్యేకంగా చెబుతాడో చూడండి! తన పట్టాభిషేకానికి ఆటంకపెట్టే హక్కు కైకకి వుందనే భయం రాముడి మాటల్లో స్పష్టంగా బయటపడుతుంది. ★

తండ్రి కళ్ళు మూసుకుని ఇంకా శయ్యమీదే పడుకుని వున్నాడు! ఇంకా రాత్రి దుస్తులతోనే! భళ్ళున తెల్లవారినా! ఏదైనా రుగ్మత సోకలేదు కదా?

పక్కనే పినతల్లి! మౌనంతో!

రాముడు వినయంగా తండ్రి పడుకుని వున్న పాన్పుకి వొంగి నమస్కరించి, తర్వాత కైక కూర్చున్న ఆసనానికి కూడా శ్రద్ధగా ప్రణామంచేసి, లేచి పక్కన నిలబడ్డాడు – మెడ వొంచి, నడుం వొంచి, చేతులు జోడించి, మనిషే వొంగి!

దశరథుడు నీళ్ళు నిండిన కళ్ళతో కొంచెం తల ఎత్తి – "నాయనా! రామా! వొచ్చావా!" అని ఇంకేమీ మాట్లాడలేనట్టు మొహం తిప్పుకుని కళ్ళు మూసుకున్నాడు.

రాముడు, తండ్రి ధోరణి చూస్తూ నిర్ఘాంతపోయాడు! ఎన్నో విధాల అలంకరించుకొని సంతోషంతో పొంగిపోతూ వుండడానికి బదులు, తండ్రి ఎంతో దుఃఖపడుతున్నాడు! నిట్టూరుస్తున్నాడు! వొణుకుతున్నాడు! ఏమైనా జరిగిందా?

రాముడు కైక వేపు తలతిప్పకుండా చూశాడు. ఆమె మొహం కూడా ప్రశాంతంగా లేక ఏదో మార్పు గోచరిస్తోంది.

ఆ క్షణంలోనే రాముడి మనసులో సందేహం తల ఎత్తింది. ఏమీ జరగలేదు కదా? తండ్రిగారి కేమైంది? హఠాత్తుగా అనారోగ్యం కలగలేదు కదా? అనారోగ్యమయితే రాజవైద్యులు సేవలు చేస్తూ వుండే వారే కదా? మరి మహారాజు ఈ విధంగా వుండడానికి కారణం ఏమయివుంటుంది? మొదటి నుంచీ శంకించినట్టే జరగ లేదు కదా?

రాముడు అప్రయత్నంగా కైకకు నమస్కరిస్తూ – "పినతల్లీ! నా తండ్రిగారు ఆరోగ్యంగా వున్నారు కదా? నేనేమయినా తెలియని అపరాధం చేశానా? నా మీద కోపగించారా తండ్రిగారు? లేక ఏదయినా అశుభవార్త తెలిసిందా? మీరిద్దరూ ఇంత మౌనంగా వున్నారే! కారణమేమిటి?" అంటూ ఆతృతగా ప్రశ్నలు కురిపించాడు.

కైక, రాముణ్ణి పరిశీలిస్తూ జాప్యం లేకుండా, "నీ తండ్రి కేమీ అనారోగ్యం లేదు నాయనా! మనో దౌర్బల్యంతో బాధపడుతున్నాడు. ఒక ధర్మపాశంలో చిక్కుకుని నీతో సంప్రదించడానికి సిగ్గు పడుతున్నాడు" అని వూరుకుంది.

రాముడు తెల్లబోయి తండ్రివేపు చూశాడు, "దశరథ మహారాజుకి మనో దౌర్బల్యమా! నా తండ్రికి నాపై అవిశ్వాసమా? ఎంత దురదృష్టం! రాముడు పితృవాక్య పరిపాలకుడని లోకం ఎరగదా? నా తండ్రి నన్ను కనుచూపు మాత్రంతో ఆజ్ఞాపించవొచ్చునే! పినతల్లీ! నా తండ్రి దుఃఖ కారణమేమిటో నువ్వు చెప్పు! నీ మాట వేదాక్షరంగా భావించి ఆచరిస్తాను. నిప్పుల్లో దూకమంటే దూకుతాను. సముద్రంలో ఉరకమంటే ఉరుకుతాను. కాలకూటవిషం మింగమంటే మింగుతాను" అంటూ ఆవేశంతో వూగాడు.

కైక రాముణ్ణి నిశితంగా చూసింది. చిన్నతనం నించీ అతనిమీద ఏర్పడ్డ మమకారాన్ని ఛేదించుకుంటూ నిర్లిప్తంగా నవ్వింది – "వాగ్దానాలు గుప్పించడంలో తండ్రిని మించిన కొడుకువే. నీ తండ్రి తక్షణం రమ్మని కబురు పంపితే, నువ్వు నగరమంతా ఊరేగుతూ రావడంలో అర్థమేమిటి? కోసల సామ్రాజ్యానికి నిజమయిన వారసుడెవరో తెలియకే నువ్వీ పట్టాభిషేకానికి ఊరేగింపుతో తరలి వొచ్చావా?" అని విస్మయంగా చూసింది.

రాముడు నిర్ఘాంతపడి నించున్నాడు.

"రాముడెంతో యోగ్యుడూ, ధార్మికుడూ అంటారే! నీకు హక్కులేదని తెలిసీ, సింహాసనం ఎక్కడానికెలా సిద్ధపడ్డావు నాయనా?"

అనుకున్నంతా అయింది! అనుకున్నంతా! పిన తల్లి కఠినంగా ప్రశ్నిస్తోంది. ఏదో వొక జవాబు చెప్పక తప్పని పరిస్థితి ఏర్పడింది.

రాముడు తొందరగా తేరుకొని చురుగ్గా ఆలోచించాడు. – "పినతల్లీ! నా తండ్రి ఆజ్ఞ పాలించడం తప్ప నాకు ఇతర లోకం లేదు. 'తండ్రి ఆజ్ఞ, ధర్మమా, అధర్మమా?' అని నేను ఆలోచించను. పితృవాక్య పాలన నా వ్రతం! నా తండ్రి ఆజ్ఞగానే నేను పట్టాభిషేకానికి సిద్ధ పడ్డాను" అంటూ వినయంగా తలవంచాడు.

"సరే నాయనా! ఇది కూడా నీ తండ్రి ఆజ్ఞగానే పాటించు! నీ తండ్రి నన్ను పెళ్ళాడినప్పుడు నా బిడ్డకే రాజ్యం ఇస్తానని వాగ్దానం చేశాడు. ఆ హక్కు నేనిప్పుడు అడుగుతున్నాను. మీరు పుట్టక పూర్వం దేవాసుర యుద్ధంలో నేను నీ తండ్రిని రక్షించినందుకు నీ తండ్రి నాకు సంతోషంతో రెండు వరాలు వాగ్దానం చేశాడు. వాటినే నే నిప్పుడు కోరుతున్నాను."

రాముడు ఆందోళనతో కూడా నిశ్చలంగా వింటున్నాడు.

"రామా! నీ తండ్రి ఎంత సత్యవంతుడో, నువ్వు ఎంత పితృవాక్య పరిపాలకుడివో ఇప్పుడే వెల్లడించండి లోకానికి. ఈ విశాల సామ్రాజ్యానికి నా బిడ్డ భరతుడే రాజు కావాలి! నువ్వు రుషి వేషంతో దండకారణ్యాలలో పద్నాలుగు సంవత్సరాలు నివసించాలి! ఈ పట్టాభిషేక ప్రయత్నాలన్నీ విడిచిపెట్టి జడలూ కృష్ణాజినమూ ధరించి ఇప్పుడే వనవాసానికి బయలుదేరు!"

రాముడు నిశ్చేష్టుడై శిలా విగ్రహం అయిపోయాడు! "ఏమిటీ ఘోరం? ఏమిటిది?" అన్నట్టు తండ్రివేపు బేలగా చూశాడు.

దశరథుడు మొహం చాటుచేసుకుని, హఠాత్తుగా దగ్గు తెర తెచ్చుకుని, ఒక పక్కకి వొరిగాడు.

తండ్రి అభిప్రాయం సమూలంగా మారిపోయిందని రాముడికి చాలా స్పష్టంగా అర్థమైంది. ప్రూన్పడిపో యాడు. ఆశలన్నీ నిరాశలై, కలలు కల్లలై, భయాలూ సందేహాలూ నిజమై, కనుచూపు మేరలో సాక్షాత్కరించిన సుఖమయ భవిష్యత్తు చెదిరి మాయమై, శూన్య జీవితం మిగిలినప్పుడు మానవుడి కెలాంటి దుఃఖం – ఎలాంటి వ్యధ – ఎంత ఆవేదన కలుగుతాయో అన్నీ అంతగానూ కలిగాయి రాముడికి. కన్నెత్తయినా చూడకుండా అంత నిర్లిప్తంగా పడుకున్న తండ్రిమీద, శాస్త్ర ధర్మాలు బోధించే వినయ విధేయతలు కొనగోటిలోనైనా నిలవనంత క్రోధం కలిగింది. తండ్రి ఎంత స్వార్థపరుడు! ఎంత కాముకుడు! ఎంత స్త్రీ లోలుడు! తన కీర్తి ప్రతిష్టల కోసం, తండ్రినే దైవంగా సేవించే కన్నకొడుక్కి ఇచ్చే ప్రతిఫలం ఇదా? ఇదేనా తన తండ్రి పుత్రప్రేమ? ఇప్పుడు యోచించీ, విచారించీ ప్రయోజనం లేదు. కైక అడిగినట్టే ఇతరులు కూడా అడిగే పరిస్థితి తెచ్చుకోవడం తెలివయిన పని కాదు. తండ్రి ఆజ్ఞకు బద్ధుడయినట్టు ప్రవర్తించడమే ఉత్తమం.

రాముడు తన భవిష్యత్తును గురించి చురుగ్గా నిర్ణయం చేసుకుని తనను తను సంభాళించుకున్నాడు. చిరునవ్వుతో వినయంగా చూశాడు. "పినతల్లీ! నీ కోరి కలు తప్పకుండా నెరవేరుతాయి. ఈ భాగ్యానికి నువ్వు మహారాజుని వరాలు అడగాలా? మొదటే నాతో చెప్ప వచ్చునే! నా స్వభావం నువ్వెరగనిదా? భరతుడు మాత్రం ఎవరు? నా తోడ బుట్టినవాడే కదా? భరతుడంటే నాకెంత అనురాగమో నీకు మాత్రం తెలియదా? అతడి కోసం నా సిరిసంపదల్నీ, నా ప్రాణాల్నీ, నా భార్యనీ కూడా సంతోషంగా ఇచ్చేసేవాణ్ణి కదా? ఇక రాజ్యం ఇవ్వకుండా వుంటానా? నీ కోరిక ప్రకారమే కానియ్యి. నే నీనాడే నారవస్త్రాలతో వనవాసానికి బయలుదేరు తాను" అని వొంగి నమస్కరించాడు. తన మాటల మంచితనానికి కైక పశ్చాత్తాపపడి, "అయ్యో! ఇటువంటి ఉత్తముణ్ణి అరణ్యాలకు పంపనా?" అని సిగ్గు పడి, "వొద్దులే నాయనా! వొద్దులే! నీకే పట్టాభిషేకం జరగ నియ్యి!" అని తన వరాలు వొదిలిపెట్టకపోతుందా అని కైక మొహం ఆశగా చూశాడు.

కైక నిట్టూర్చి – "మంచిది నాయనా! అలాగే చెయ్యి! నువ్వంటే నాకు ప్రేమ లేక కాదు. నా బిడ్డ కోసం తల్లిగా నా ధర్మం నేను నిర్వర్తించాను. రాజకీయమంతా ఎరిగిన నీకు నేను చెప్పవలసిందేమీ లేదు. బుద్ధిమంతుడవై నీ తండ్రి ఆజ్ఞలు అంగీకరించావు. తన వాగ్దానాలు నిలు స్తాయో లేదో, తనకు సత్యలోకాలు కలుగుతాయో లేదోనని నీ తండ్రి ఎంతో మధనపడుతున్నాడు. ఇక ఆయనకు చాలా సంతోషం కలుగుతుంది" అని దశ రథుడి వేపు చూసింది.

మహారాజు అప్పటికి ధైర్యం కూడగట్టుకొని, రంభా పరిష్వంగ భాగ్యం కల్లకాదనే ఆనందంలో పైకి లేచి, దీనంగా తలవాల్చి కూర్చుని వున్నాడు.

రాముడు, కైక వరాలు విడిచిపెడుతుందనే ఆశ నిరాశ చేసుకున్నాడు. తన విషయంలో తండ్రి దయ దల్చకపోదనే ఆశతో తండ్రిని వోర చూపులు చూస్తూ కైకతో సంభాషణ సాగించాడు – "నేను పుత్రుణ్ణయి పుట్టి నా తండ్రికి అసత్య దోషం కలగనిస్తానా? తండ్రి సేవకు ఉపయోగపడని నా జన్మెందుకు, కాల్చనా? తండ్రి ఆజ్ఞ మీరే కొడుకుకూడా ఒక కొడుకేనా? అసలు తండ్రుల ఆజ్ఞల్ని కొడుకులెట్లు ధిక్కరించగలరో నాకు పర మాశ్చర్యం. నేను మాత్రం నా తండ్రి సంతోషం తప్ప ఏదీ కోరను. పితృవాక్య పరిపాలనలో నాకు కలిగే ఆనందం ఏ సుఖాల వల్లనూ కలగదు. నా తండ్రి ఆనం దమే నా ఆనందం. నాకు రాజ్యమూ అక్కరలేదు, స్వర్గమూ అక్కరలేదు, సీతా అక్కరలేదు, నా ప్రాణాలూ అక్కరలేదు. సముద్రుడంత గొప్పవాడైన నా తండ్రి దుఃఖించడం నేను భరించగలనా?" అంటూ తన పితృ భక్తిని రకరకాలుగా యాకరువు పెట్టాడు.

తన భక్తికి తండ్రి ఉత్తేజపరుడై, తనపై అను రాగం పొంగిపొర్లి – "నాయనా! నువ్వు అరణ్యాలకు పోనేవద్దు! నాకు నరకం వస్తే రానియ్యి, నేను కైక కోర్కెలు తీర్చను. అసత్య దోషానికే తలపడతాను. పద, నీకే పట్టాభిషేకం చేస్తాను" అని హఠాత్తుగా పక్కమీదనించి లేస్తాడని, సము ద్రంలో కొట్టుకుపోయే వాడు గడ్డిపోచకోసం ఆరాట పడ్డట్టు, తండ్రి దయ కోసం ఆఖరి ఆశగా వినయంగా చూస్తూ వొంగి నిలబడ్డాడు రాముడు.

అంతసేపూ కూర్చుని వున్న దశరథ మహారాజు, మళ్ళీ దగ్గు తెచ్చుకుని, మొహం తిప్పుకుని, అటు తిరిగి మౌనంగా పడుకున్నాడు.

రాముడికి పట్టరాని కోపం వచ్చింది. కళ్ళు భగ భగ మండాయి. శరీరమంతా నరాలు బుసబుస పొంగాయి. రక్తం వీరావేశంతో చిందులు తొక్కింది. చేయి కత్తి పిడిమీదకు పోయింది.

కిందటిరోజు నిండుసభలో తన పట్టాభిషేక వార్తని ప్రకటించిన మనిషి, తనని రహస్య మందిరంలోకి పిలి పించి మంతనాలు జరిపిన మనిషి, ఇప్పుడు నోరువిప్పి ఒక్కమాట కూడా మాట్లాడడేం? అధికారాలన్నీ ముద్దుల భార్యకే అప్పగించి జీవచ్ఛవంలా పడి వున్నాడేం? తండ్రిగా చెప్పవలసినదేదో తనే చెప్పరాదూ? తనే ఆజ్ఞా పించరాదూ? .... మొహం చెల్లడం లేదా మహారాజుకి?

తండ్రి నిర్దయ చూసిన క్షణంలో ఎంత తీవ్ర సంచలనం కలిగిందో మరుక్షణంలో తన నిస్సహాయత గుర్తువొచ్చి అంత విరక్తి ముంచుకు వచ్చింది రాముడికి. నిర్లిప్తమైన చూపులతో మొహం వాల్చి ఎంతోసేపు మౌనంగా నించున్నాడు – "పిన తల్లీ! నాకీ సిరిసంపదల మీదా, రాజ్యపాలన మీదా, ఎంతమాత్రం మమకారం లేదు సుమా! నే నసలు రుషివంటి వాణ్ణి! క్షత్రియ ధర్మమే మోక్ష మార్గమనీ, తండ్రి ఆజ్ఞే నాకు శరణ్యమనీ, ధర్మ బద్ధంగా రాజ్యం చేద్దామనీ ఆశించానుగానీ ...." అంటూ, అవకాశాలు చెయ్యిదాటి పోయింతర్వాత లోకంలో అందరూ మాట్లాడే వేదాంతమే రాముడూ మాట్లాడాడు – "రాజ్యం దక్కదని నా కెంత మాత్రం చింత లేదు. ఈ సుఖాలన్నీ వొదిలేసి వనవాసానికి బయలుదేరుతాను. అక్కడ ఆ కీకారణ్యాల్లో, క్రూర జంతువుల మధ్య, జనం వుండని ఆ భయంకర ప్రదే శాల్లో, ఏ ఆకో అలమో తింటూ పద్నాలుగేళ్ళు పడి వుంటాను. ఎందుకుండనూ? .... ఊఁ, ఉంటాను" అని గొణుగుతూ, నిట్టూరుస్తూ, కోపం తమాయించు కుంటూ, నిలబడ్డాడు.

ఆ క్షణాలలో – ఆ సంఘర్షణలో – అతని అంత రాత్మ ప్రకృతి సహజ చైతన్యంతో, ఎంత బలహీనంగా నైనా కొంత తలఎత్తింది – "ఇంత కపట నాటకం ఆడే ఖర్మెందుకు నాకు? నే నాడను. నా కిష్టం లేదు. నేనా దండకారణ్యాలకు వెళ్ళాలా? నేను వెళ్ళను. నాకు రాజ్యం ఇవ్వకపోతే మానండి. నన్ను మనుష్యుల్లోంచి జంతువుల్లోకి తరిమే హక్కెవరికుంది? ఎవరికీ లేదు. నా కిష్టంలేని పని నాతో తండ్రి మాత్రం చేయిస్తాడా? నేను చెయ్యను. ఎందుకు చెయ్యాలి? తండ్రికి కొడుకు లింత భయంకర దాస్యం ఎందుకు చెయ్యాలి? నేను చెయ్యను. రమ్మను వేదాల్ని! చింపి పోగులు పెడతాను! రమ్మను దేవుళ్ళని! నరికి ముక్కలు చేస్తాను! తండ్రి ఆజ్ఞట, ఆజ్ఞ! నేను పాటించను! నా ఇష్టం! నా ఇష్టం! నా ఇష్టం!" అంటూ అంతరాత్మ కీచుగొంతుతో గావు కేకలు ప్రారంభించింది. ఆత్మలోంచి ఆ ధిక్కారంతో రాముడి శరీరం పులకరించింది. మొహం తేజస్సుతో, కాంతితో కళకళ్ళాడింది. అణువణువులోనూ స్వేచ్ఛని అనుభవించే ఆనందం! ఎన్నడూ ఎరగని గొప్ప శాంతి!

రాముడు వొక్క క్షణం ఆ తన్మయత్వంలో వూగి అదిరిపడ్డాడు. ఏమిటీ కేకలు? ఏమిటీ శబ్దాలు? ఎక్క ణ్ణించి? ఆత్మలో నించా? తన ఆత్మలో నించా? ఇంత అవిధేయత, ఇంత ధిక్కారం, తన ఆత్మ నించేనా? ఎక్క డిదీ ఆత్మ? పితృభక్తినీ, వేదసారాన్నీ నరాల్లో నింపుకుని, సాగి ఎదిగిన ఈ శరీరంలో ఈ అపవిత్ర ఆత్మ ఎలా జొరబడింది? ఇంత క్షుద్ర దైవదూషణ ఎలా చేసింది? ఇంత తుచ్ఛ నాస్తిక కేకలు ఎలా వేసింది? సహించరాదు. ఈ ఆత్మ స్వేచ్ఛని సహించరాదు. నిరంకుశత్వంతో క్షణ క్షణమూ విజృంభించి తన కీర్తిప్రతిష్ఠల్ని నవ్వులపాలు చేసే ఈ ఆత్మస్థితిని నాశనం చెయ్యాలి!

రాముడు తన కోపం అంతా ఆత్మ మీదకు మళ్ళిం చుకుని రౌద్రంతో మండిపడుతూ, కత్తులవలె మెరుస్తోన్న పితృభక్తినీ, వేదసారాన్నీ చెరో చేత్తో అందుకుని, ఎగిరి ఆత్మమీదకి వొక్క ఉరుకు ఉరికాడు. అసలే బలహీనంగా వున్న ఆ ఆత్మని గుద్ది – చరిచి – తొక్కి – కుమ్మి – పొడిచి – కుళ్ళ బొడిచి – ఇక వెయ్యి జన్మలకు కూడా లేవదనే నమ్మకంతో దాన్ని కాలికింద సీలమండలో ఒక మూల నరంలోకి తోసి, మొహంమీద కలవరం తుడిచేసి ప్రశాంతత పులుముకుని వినయంతో పినతల్లి ముందు చేతులు జోడిస్తూ – "పినతల్లీ! ఇక నేను వెళ్ళివొస్తాను. భరతుడు తండ్రిగారికి శుశ్రూష చేసేటట్టు చూడు. పితృ సేవే పరమధర్మం కదా అని చెపుతున్నాను" అంటూ, ఆ ఆఖరి క్షణంలో అయినా తండ్రి కరిగి హఠాత్తుగా "రామా!" అని అరిచి, తనని వెనక్కి పిలిచి "పద పట్టాభి షేకానికి" అంటాడేమోనని వెనక్కి .... వెనక్కి చూసు కుంటూ, గదులు దాటి, నడవలు దాటి, మందిరం దాటి, బయటికి వెళ్ళిపోయాడు.

అక్కడ లక్ష్మణుడు తలవొంచి నిలబడి వున్నాడు.

రాముడు అంతసేపూ రకరకాలుగా వొంచిన మెడా, నడుమూ సవరదీసుకుంటూ, తిన్నగా నడవటానికి ప్రయత్నిస్తూ, గాంభీర్యం వుట్టిపడే మొహం పెట్టి ముందుకు నడిచాడు.

★ ★ ★

బ్రాహ్మలతో పూజలు చేయిస్తోన్న కౌసల్య, కొడుకు రావడం చూసి కళకళ్ళాడే ముఖంతో – "నాయనా!" అంటూ దగ్గిరికి వొచ్చింది – "నిన్నీ అలంకారాల్లో చూస్తోంటే కన్నుల పండుగలాగ వుంది. కోసల సామ్రా జ్యానికి మహారాజువైనాక నీ మొహంలో ఇంకా ఎంత రాజకళ వుట్టిపడుతుందో కదా! నీ తండ్రి, మాట తప్పడు. నీ కిప్పుడే పట్టాభిషేకం చేస్తాడు. కొంచెంసేపు విశ్రాంతిగా ఈ ఆసనం మీద కూర్చో నాయనా! నీ కిష్టమైన ఫలహారాలు భుజించు" అంటూ ప్రేమగా ఆసనం చూపించింది.

రాముడికి ఎంత ప్రయత్నించినా దుఃఖం ఆగలేదు. విరక్తితో – "దండకారణ్యాలలో కఠిన శిలల మీద కూర్చోవలసిన నాకీ మణిమయ ఆసనాలెందుకమ్మా?" అని తల వొంచుకున్నాడు.

కౌసల్య తెల్లబోతూ "ఏవిటి నాయనా? ఏమిటి నువ్వంటున్నది?" అని కంగారుపడింది.

లక్ష్మణుడు కూడా ఏమీ అర్థంగాక ఆతృతగా చూశాడు.

రాముడు వెంటనే తేరుకుని, గాంభీర్యం తెచ్చి పెట్టుకుని – "అమ్మా! దుఃఖపడకు! ధైర్యంతో విను! నా తండ్రి దశరథ మహారాజు భరతుడికే రాజ్యం ఇవ్వడానికి నిశ్చయించాడు. నన్ను తాపసిగా గడపమని, నాకు పద్నాలుగేళ్ళు వనవాసం ఆజ్ఞాపించాడు. నన్ను పినతల్లి మందిరానికి పిలిపించి ఈ వార్తలు చెప్పాడు" అని వూరుకున్నాడు.

కౌసల్య నిర్ఘాంతపోతూ అంతా అర్థం చేసుకుంది. ఏ భయంతో నిత్యం గుండెలు అదురుతూ బతుకుతోందో ఆ పిడుగు పడనే పడింది! చివరికి రాజ్యం భరతుడికే దక్కుతోందా? ఇన్నాళ్ళూ రాముణ్ణి ఆశపెట్టి చివరికి వంచన చెయ్యడమేనా? అదీగాక వనవాసమా? పద్నాలుగు సంవత్సరాలా? – పెద్ద కంఠంతో భోరున ఏడుస్తూ కూలబడిపోయింది.

ఆమె శోకంతో అంతఃపురంలో పూజలూ, మంగళ వాయిద్యాలూ ఆగిపోయాయి. రాణులూ దాసీలూ నిశ్చేష్టులై నిలబడ్డారు.

కౌసల్య గతాన్నంతా తలపోసుకుంటూ ఏడ్చింది – "ఎంత ఘోరమైన వార్త విన్నాను! ఎంత దురదృష్టవంతురాల్ని! ఇన్నేళ్ళూ చేసిన పూజలూ వ్రతాలూ ఏ గంగలో కలిసిపోయాయి! ఇంత కాలమూ నీ తండ్రి వల్ల ఏ సుఖమూ అనుభవించలేదు కదా? నెలకో సవితిని తెచ్చి నా గుండెల్లో కుంపట్లు పెట్టాడేగానీ నన్నెన్నడూ ఆనంద పెట్టలేదు కదా? నువ్వు పుట్టింతర్వాత నాకిక లోటులేదని ఎన్నో కలలు కన్నాను. నీకు ఉపనయనం అయింది మొదలూ పదిహేడు సంవత్సరాలుగా నీకు రాజ్యం వొస్తుందని ఎదురు చూస్తూనే వున్నాను. చివరికి ఇంత ఘోరం జరిగిందా! కైక పంతమే నెగ్గిందా! ఇక రాణులందరూ కైక అండన చేరుతారు. నా మీద సూటీ పోటీ విసుర్లు విసురుతారు. పెద్దరాణినన్న పేరేగానీ, ఇప్పటికే కైక దాసీలకన్నా హీనంగా వున్నాను. ఇంక నాకేం గౌరవం వుంటుంది? రేపటినించి కైక అహంకారాన్నెలా భరించను? అయ్యో! నాకు చావెప్పుడొస్తుంది?" అంటూ కంటికీమంటికీ ఏకధారగా ఏడుస్తూ, భరతుడి రాజ్యంలో, కైక నిరంకుశత్వంలో, తనకు జరిగే అవమానాలు తల్చుకొని తల్చుకొని వాపోయింది.

కైక కూడా సరిగ్గా అదే భయంతో – రాముడి రాజ్యంలో, కౌసల్య అధికారంలో, తనకు జరిగే నిరాదరణ ఊహించి కంపించిందని కౌసల్య ఎరగదు.

విషయం విన్న లక్ష్మణుడు ఆవేశంతో ఊగాడు. రాముడికే రాజ్యం రాకపోతే తన స్థితి ఎంత హీనమో ఊహించి భయపడ్డాడు. చేతి కందిన స్వర్గం జారిపోయిన కక్షలో లక్ష్మణుడికి ఎన్నడూ ఎరగని తెగింపూ, సాహసమూ పుట్టుకొచ్చాయి – "అన్న గారూ! రాజ్యాధికారం విషయంలో మాత్రం మీరు తండ్రిమాట వింటానంటే లాభం లేదు.[40] ఆయన వృద్ధుడైపోయాడు. మతి తప్పింది. స్త్రీ వాంఛ చావక, ఆ ముద్దుల భార్య ఎలా ఆడిస్తే అలా ఆడుతున్నాడు. ఇదంతా భరతుడికి రాజ్యం కట్టబెట్టటానికి దశరథుడూ, కైకా కలిసి చేసే కుట్ర! ఆడదాని మాట ప్రకారం నడవడం పరమ నీచం! మీవంటి పురుషోత్తములు ఆడదానిమాట ప్రకారం వనవాసానికి పోవడమా? అంత నీచకార్యం చేయకూడదు. ఈ స్థితిలో తండ్రి మాట లక్ష్యపెట్టవలసిన అగత్యం లేదు" అంటూ రౌద్రంగా అరిచాడు. అంతలోనే కొంచెం కంఠం తగ్గించి – "అన్నగారూ! పట్టాభిషేకానికి సమస్తం సిద్ధంగా వుంది. ముందు పట్టాభిషేకం జరిగిపోనివ్వండి! రాజ్యం ఆక్రమించుకుందాం. భరతుడి మనుషు లెవరయినా అడ్డొస్తే నా వీరత్వంతో, నా బాహుబలంతో, వారి అంతు తేలుస్తాను. ఎన్నికోట్ల అక్షౌహిణీ సేనల్నయినా నాశనం చేసేస్తాను. అలంకారానికి వున్నాయా నా చేతుల్లో కత్తులూ, బాణాలూ? మహారాజే అడ్డొస్తే ఒక్క వేటుతో నరికిపారేద్దాం. వృద్ధుడు కదా అని మీకు దయ కలిగితే కారాగారంలో పడేసి వుంచుదాం. మనల్ని ధిక్కరించి భరతుడికి రాజ్యం ఎలా ఇస్తాడో చూద్దాం" అంటూ ఒరలోంచి కత్తి సర్రున లాగి నడుం ఎత్తి గాలితో యుద్ధం ప్రారంభించాడు.

రాముడికి అమితాశ్చర్యం కలిగింది, లక్ష్మణుడి మాటలకు! ఎన్నడూ తలయెత్తి అయినా నిలబడని లక్ష్మణుణ్ణి కూడా ఈ రాజ్యకాంక్ష ఇంత ఉత్తేజపరిచిందా! అధికారంలో, సంపదల్లో వున్న మహత్యమా ఇది! "తండ్రిని చంపేద్దాం! రాజ్యం ఆక్రమించుదాం!" ఎంత సాహసంతో అనగలిగాడు!

కీర్తి ప్రతిష్టలకు జడిసి, తను పైకి అనలేని మాటలన్నీ సాహసంతో ప్రకటిస్తోన్న లక్ష్మణుడి మీద అసూయతో రాముడికి చాలా కోపం వచ్చింది. తన ఎదుటే తన తండ్రిని దూషించే దుస్సాహసమా! ఎదటి వారిలో తప్పు దొరకబుచ్చుకుని మందలించి నీతులు చెప్పే ఉత్సాహంతో రాముడు లక్ష్మణుణ్ణి కోపంగా చూశాడు – "లక్ష్మణా! ముందు కత్తి ఒరలో పెట్టు! మంచిచెడ్డలు గ్రహించకుండా స్త్రీలు మాట్లాడినట్టు పురుష పుంగవుడివి

**40.** **అయోధ్యా**, సర్గలు 20, 23: లక్ష్మణుడి రాజ్య కాంక్షా, దైవ ధిక్కారం కౌసల్యకు భర్తపైగల అసహ్యం, మాతృస్వామ్య వ్యవస్థ అవశేషాలూ, పితృస్వామ్య వ్యవస్థతో స్థిరపడుతోన్న సాంప్రదాయాలూ – ఇవన్నీ ఇక్కడ కనబడతాయి. ★

నువ్వు కూడా మాట్లాడతావేమోయీ! మన వంశకీర్తి ప్రతిష్టలు విస్మరించినట్టున్నావే! దశరథ పుత్రుడు మాట్లాడవలసిన తీరేనా ఇది? మన తండ్రిగారికి, అసత్య దోషం వలన పుణ్యలోకాలు పొందలేనేమోనని చింత కలిగింది. తండ్రిగారి చింత పోగొట్టి, ఆనందపెట్టి, వారిని పుణ్యలోకాలకు పంపి, మనంకూడా ఆ లోకాలకు పోవాలి కదా? ధర్మ సూక్ష్మాలెరుగని పామరుడివైనావేమోయీ?" అంటూ మెత్తని మాటలతో కఠినంగా మందలించాడు.

లక్ష్మణుడు ఒక్క క్షణం తటపటాయించి కత్తి ఒరలోకి దింపి తల మాత్రం వంచకుండా నించున్నాడు.

రాముడు లక్ష్మణుణ్ణి మందలించాడేగానీ, తన లోంచి పొంగే అశాంతినీ, దుఃఖాన్నీ, అణచుకోలేక పోయాడు. తనలో రేగే ప్రశ్నలకు సమాధానంగా తనకు తను నచ్చచెప్పుకుంటూ – "లక్ష్మణా! అంతా విధి కృతమోయీ! దైవ నిర్ణయం! కైకేయి నిమిత్త మాతృరాలు! పినతల్లి ప్రేమ మనం ఎరగనిదా? ఆమె ఇటువంటి వరాలు కోరిందంటే ఇది మన కర్మ ఫలితమే అని తెలియడం లేదా? ఎందుకో దైవమే ఇలా చేశాడు. ఎందుకో ఈ వనవాసం నిర్దేశించాడు" అని ఎందుకో నిట్టూర్చాడు. సాటి మానవ మాత్రులే తమకు అన్యాయమో, అవమానమో చెయ్యగలిగారనుకుంటే భరించలేక తమ దుఃఖాలకూ అపజయాలకూ లోకాతీతమైన విలువలు కల్పించుకుని సంతృప్తిపడే లోకస్వభావంతో, రాముడు, తన వన వాసాన్ని ఏ మహత్తర ప్రయోజనాల కోసమో దైవమే నిర్ణయించాడని లక్ష్మణుణ్ణి నమ్మించే, తనను తను నమ్మించుకునే ప్రయత్నం చేశాడు.

ఆ రాజ్య భ్రష్టత్వం భరతుడికో, మరే రాజ కుమారుడికో జరిగివుంటే, లక్ష్మణుడు 'విధి కృతాన్ని' గాఢంగా నమ్మేవాడే. 'వాళ్ళ ఖర్మవల్ల వాళ్ళకు అలా జరిగింది' అనుకునేవాడే. కానీ, తనకు కలిగిన నష్టాన్నీ, దాన్ని కలిగించిన శత్రువుల్నీ కళ్ళెదుట స్పష్టంగా చూస్తూ, దానికి ఇంకేదో కారణం కల్పించుకోవడం ఆ క్షణాలలో అతనికి చాలా అజ్ఞానంగా తోచింది. ఏ మారుమూల నరాలలోనో మూలుగుతోన్న తర్క జ్ఞానాన్ని బయటికి తీస్తూ వొంగి అన్న గారికి నమస్కరించి – "మన్నించండి అన్న గారూ! దైవం ఎప్పుడయినా, ఎవరికయినా, కనిపించాడా? మన్నించండి అన్నగారూ!" అని జంకుతూ ప్రశ్నించి వొణుకుతూ నిలబడ్డాడు.

ఒక అజ్ఞానికి జ్ఞానబోధ చేసే అవకాశం కలిగినందుకు రాముడికి పరమ సంతోషం కలిగింది గానీ, లక్ష్మణుడు వొణుకుతూ అడిగిన ప్రశ్నకూడా రాముణ్ణి చాలా ఇబ్బందిపెట్టింది. అలాంటి ప్రశ్నలు రాముడు చిన్నతనంలో చాలా కాలం ఎందరో రుషుల్ని అడిగాడు. దైవం గురించి ఎన్నో చర్చలు చేశాడు, సహజ కుతూహలంతో. "దైవాన్ని మీరెవరయినా చూశారా? ఈ జగత్ సృష్టికి కారణం తెలుసుకున్నారా? జగత్తుని దైవం సృష్టిస్తే, ఆ దైవాన్ని ఎవరు సృష్టించారు?" అనే రకం ప్రశ్నలు చాలా అడిగాడు. అటువంటి ప్రశ్నలకు రుషులు రాముడికి నమ్మకం కలిగే జవాబులు చెప్పలేకపోయారు.

"దైవం గురించి మాకు తెలిసిందింతే నాయనా! మేము విన్నదే నీకు చెప్పాము. ఇంతకన్నా మాకేమీ తెలీదు" అని ఒక్క రుషి అయినా, ఒక్కసారయినా వొప్పుకోలేదు. తత్తర బిత్తరపడి, కిందా మీదా పెట్టి "వేదాలలో పూర్వులు చెప్పిందాన్ని ప్రశ్నించకూడదు నాయనా!" అని ప్రస్తుత జ్ఞాన చర్చని వెనక్కి వేద కాలానికి తోశారు.

"వేదా లెవరు వ్రాశారు స్వామీ?" అని అడిగాడు రాముడు, ఏనాడో.

"అయ్యో! వేదాలు అపౌరుషేయాలని వినలేదా? వాటిని పురుషుడు రాయనేలేదు. భగవంతుడు సృష్టించాడు!"

"అంటే దేవుడు ఆకాశంలో వ్రాసి కిందపడేశాడా స్వామీ? ఏ దేశంలో పడేశాడు? అలా పడెయ్యడం ఎవరు చూశారు?"

"నువ్వు చిన్నవాడివి .... రామా!"

"చిన్నవాడివి .... చిన్నవాడివి ... అంటారెందుకు? అంత చిన్నవాడి సందేహాలు కూడా తీర్చలేరే! మీవంటి తపోధనులే దైవం గురించి చెప్పలేక పోతే చిన్నవారికి జ్ఞానం ఎట్లా తెలుస్తుంది?" అని రాముడు దురుసుగానే ప్రశ్నించాడు – చిన్నవాడు కాబట్టే, ఆ నాటికి ఇంకా వినయ విధేయతలు పూర్తిగా ఎరగనివాడు కాబట్టే. రాముడికి, వేదాలన్నీ నేర్చిన తర్వాత కూడా యజ్ఞ యాగాల గురించీ, దాన ధర్మాల గురించీ తప్ప, దేవుడి సందేహాలు తీరనే లేదు. "కొత్త ఊహనీ, కొత్త ఆలోచననీ, కొత్త జ్ఞానాన్నీ ఆహ్వానించి స్వీకరించలేక, వేదసూత్రాల తోనే, రుషి వచనాలతోనే ఆగమని ఆజ్ఞాపించడం ఎందుకు? జ్ఞానార్జనకు సరిహద్దులు విధించడం ఎందుకు?" అనే ప్రశ్నలు అప్పుడప్పుడూ విద్యుల్లతల్లా రాముడి మానసాకాశంలో కూడా మెరిసి మాయమవుతూ ఉండేవి.

ఇప్పుడా బాల్య జన్మ, జిజ్ఞాస జన్మ గతించింది. రానురానూ సందేహాలకు సమాధానాలు దొరక్క పోగా, సందేహాలే నశించాయి. శాస్త్రధర్మాలతో రాజీ కుదిరింది. కీర్తి ప్రతిష్ఠల మత్తు ఆవరించింది.

లక్ష్మణుడికి ఇంకో ప్రశ్నేదీ అడిగే ధైర్యం రాకుండా, రాముడు వీలయినంత పెద్దతనం, గాంభీర్యం ఉట్టిపడే మొహంపెట్టి– "నాయనా! దైవాన్ని ఎవరయినా చూశారా అని అడిగావు. కానీ, దైవం వున్నాడని ధర్మశాస్త్రాలు చెపుతున్నాయి. ధర్మ శాస్త్రాలూ రుషులూ చెప్పిన దైవాన్ని

మనం ఎన్నడూ శంకించరాదు" అని, వొక్క "రాదు"తో ఆ ప్రశ్నని దాచివేశాడు. ఒకప్పుడు తన సందేహాలకు రుషులు ఏ జవాబులు చెపితే తను అసంతృప్తితో, అశాంతితో విల విలలాడేవాడో, ఆ జవాబులు తనే ఇతరులకు చెప్పడానికి సంకోచం లేని స్థితికి ఎదిగాడు రాముడు! "లక్ష్మణా! ఇక విధి అంటావా? తప్పకుండా చెబుతాను విను. ఇది విధికృతం కాకపోతే నన్నంతగా ప్రేమించే కైకేయికీ దుష్టబుద్ధి ఎందుకు పుట్టింది? రాచ కులంలో పుట్టిన కైకేయి క్షుద్ర స్త్రీ వలే భర్త కెందుకు దుఃఖం కలిగిస్తోంది? ఇంకా సందేహ మెందుకు? విధి బలీయమని తెలియడం లేదూ? ఎంత శ్రద్ధగా చేసిన పనులయినా కొన్ని జరగవు. ఎంత అశ్రద్ధగా చేసినా కొన్ని జరుగుతాయి. అది కర్మ కాకపోతే ఇంకేమంటావు? మన కార్యం మంచిగా జరిగితే, దైవం మనకు అనుకూలంగా వున్నాడని గ్రహించాలి. కార్యం చెడిపోతే, దైవం మనకు వ్యతిరేకంగా వున్నాడని అర్థం చేసుకోవాలి. విశ్వామిత్రుల వంటి మహా రుషులు, కామ – క్రోధాలకు లొంగిపోయి తపస్సులు భగ్నం చేసుకున్నారంటే, అది కర్మ కాకపోతే ఏమిటి? సుఖదుఃఖాలూ, కోపతాపాలూ, లాభనష్టాలూ, చావు పుటకలూ అన్నీ, దైవ నిర్ణయాలే సుమా!" అని, తను రుషుల దగ్గిర నేర్చుకున్న బ్రహ్మజ్ఞానాన్ని యధాతథంగా ప్రవచించాడు. చివరకి – "నువ్వింకా చిన్నవాడివి. నీ జ్ఞాన సముపార్జన చాలదు" అని ముక్తాయింపు పలికాడు – తనూ లక్ష్మణుడూ వొక్క రోజే పుట్టిన సంగతి మర్చిపోయి!

లక్ష్మణుడి మెదడులో, కొంచెం తల ఎత్తిన తర్కజ్ఞానం, కొంచెం మెడ కూడా ఎత్తి ఆలోచించింది. రాముడి తర్కంతో అతనికి ఏ సందేహమూ తీరలేదు. పైగా, అనేక కొత్త సందేహాలు కలిగాయి. 'కైక దుష్టబుద్ధికి కారణం స్పష్టంగానే వుంది. తన బిడ్డకే రాజ్యం ఇప్పించాలనే స్వార్థకాంక్ష అది. దాన్ని ధిక్కరించాలే గానీ, దాన్నే దైవ నిర్ణయం అని ఆమోదిస్తామా' అనే సందేహంతో వూగాడు.

లక్ష్మణుడి కళ్ళల్లో భయంగా తొంగిచూసే ధైర్యాన్ని చూసి రాముడు, మళ్ళీ ఏదో ప్రశ్న రాబోతోందని జంకి – "లక్ష్మణా! రాజ్యం పోయిందనే కదా నీకీ విచారమంతా? దీన్ని నేను కర్మ అనే నమ్మాను. నా పరితాపమంతా అందుకే నిగ్రహించుకున్నాను. నువ్వుకూడా అలాగే సరిపెట్టుకో!" అని, లక్ష్మణుడి ప్రశ్నల బారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. తన వనవాసం తన కర్మే అయినప్పుడు, అది తను పూర్వం చేసిన ఏ అపరాధానికో దైవం తనకు విధించిన శిక్షే అయినప్పుడు, ఇక తన తండ్రి ఆజ్ఞకోసం చేసే త్యాగం ఏమిటో రాముడు ఉద్ఘాటించలేదు.

అన్నగారు రాజ్యం వొదలటానికే నిశ్చయించాడనే ఊహ లక్ష్మణుణ్ణి వెర్రివాణ్ణి చేసింది. ఈ విశాల కోసల సామ్రాజ్యాన్ని శాశ్వతంగా వొదలడమేనా? ఈ మహోన్నతమైన భవనాలూ, ఎందరో సంపన్నులయిన బంధుమిత్రులూ, నాట్య గానాలతో ప్రేమ కలాపాలతో ఉత్తేజపరిచే ఉద్యాన వనాలూ, వేద ఘోషలతో పండిత చర్చలతో ఆనందపెట్టే యజ్ఞశాలలూ, నిత్య పూజలతో వ్రతాలతో శుభాలతో పునీతమయ్యే మంగళకరమైన దేవాలయాలూ, జాతి గుర్రాలు పూన్చిన రధాలలో సుఖమయిన విహారాలూ, నగరమంతా దేశమంతా ఎందరో సుందరులయిన వేశ్యలూ – ఇన్ని సుఖాలున్న దేశాన్ని, అయోధ్యా నగరాన్ని, సమస్త రాజభోగాల్ని విడిచి అడవులలో జీవించడమా? ఎంత తెలివి తక్కువ!

రాముడు బోధించిన బ్రహ్మజ్ఞానాన్ని రాజ్య భోగాలే జయించి, లక్ష్మణుడు ఆవేశంగా ఊగాడు. "అన్నగారూ! నేను విధిని నమ్మను. దైవాన్ని వ్యతిరేకిస్తాను. నిరుపేదలకూ, శక్తిహీనులకూ కర్మ వుంటుందిగానీ, మన బోటి వీరులకు కర్మ ఎందుకు? పరాక్రమవంతులూ, సమర్థులూ, తమ శక్తితోనే కార్యాలు సాధించుకోవాలిగానీ దైవానికి లొంగకూడదు. మహారాజా! ఇక మీరే ప్రభువు మాకు. దశరథుణ్ణి సింహాసనం మీద నుంచి పడదోసి మీరే తక్షణం పట్టాభిషేకం చేసుకుని రాజ్యం ఆక్రమించండి! 'రాజు సైన్యాలతో మనం యుద్ధం చేయగలమా? మనకు అంత బలం ఎక్కడిది?' అనే సందేహం వున్నట్టు తోస్తోంది మీకు. మనం వీరులం. మన మిత్రులందరూ పరాక్రమవంతులు. అందరెందుకు, నేను వొక్కడినీ చాలనా? ఎన్ని కోట్ల సైన్యాన్ని అయినా సర్వనాశనం చెయ్యనా? అప్పుడే తెలుస్తుంది దైవనిర్ణయం ఎక్కువో, మానవ ప్రయత్నం ఎక్కువో!" లక్ష్మణుడికి, తనే తనకు ఒక మహోన్నత శక్తిగా కనబడ్డాడు. వీరావేశంతో మళ్ళీ సర్రున కత్తి బయటకు లాగాడు.

అంతవరకూ కొడుకుల మాటలకు అడ్డువచ్చే ధైర్యంలేక బొటబొటా కన్నీళ్ళు కారుస్తూ నించున్న కౌసల్య, లక్ష్మణుడి మాటలకు అమితంగా సంతోషిస్తూ రాముణ్ణి దీనంగా చూసింది. – "నాయనా! తమ్ముడి మాటలు విన్నావు కదా? ఆ పైన చెయ్యవలసిన కార్యం చెయ్యి!" అంటూ ఆశగా చూసింది. 'నీ తండ్రిని బంధించో, వధించో ఏదో విధంగా రాజ్యం మాత్రం నువ్వు ఆక్రమించు! నువ్వు మహా రాజువి కావాలి. నేను రాజమాతని కావాలి. నా సవతులందరూ, కైక కూడా, నా అధికారంలో బ్రతకాలి' అనే భావం కౌసల్య ఆతృతలో, హెచ్చరికలో, గోచరించింది.

రాముడు దీర్ఘాలోచనలో మునిగి నిశ్చలంగా నించున్నాడు. సీలమండలోంచి ఏదో జరజరా మోకాలివరకూ

ఎక్కినట్టు తోచింది. లక్ష్మణుడి మాటలు కూడా ఆచర ణీయంగానే వున్నాయి. శక్తి కలిగి కూడా నిస్సహాయుల లాగ తల వొంచడం ఎందుకు? తల్లిగారి అభీష్టంకూడా అదే కదా? స్వతంత్రించి రాజ్యం ఆక్రమించితే ....? మహా రాజు నైతే ....? కోసల సామ్రాజ్యాధిపతి నయితే ....?

అదిరిపడి కాలు ఝాడించాడు రాముడు. అంత రాత్మ జర్రున జారి సీలమండలో పడి నడుం బెణికి మూలిగింది. లక్ష్మణుడి వీరాలాపాలవల్ల తనుకూడా ఉద్రేకానికి లోనవుతున్నాడే! పూర్తిగా లొంగిపోతాననే భయంతో, రాముడు, లక్ష్మణుణ్ణి తీక్షణంగా చూశాడు "లక్ష్మణా! పిచ్చి పట్టిందా ఏమి? ఉన్మాదివలె పేలు తున్నావే! శ్రీరాముడు తండ్రి ఆజ్ఞ ధిక్కరించి రాజ్యాన్ని ఆక్రమించడమా? కలలోనయినా జరుగుతుందా? మాన వులు బ్రతికేదే స్వల్పకాలం. కీర్తి ప్రతిష్టలు వొదులుకొని తుచ్ఛమైన భూమికోసం ఆరాటపడే అల్పుడినని భావిం చావా నన్ను? నీ పరాక్రమంతో గ్రహాల మార్గాలు తప్పించగలవేమోగానీ, శ్రీరాముణ్ణి ధర్మమార్గం తప్పించ గలవా?" అంటూ రౌద్రంతో మండిపడ్డాడు.

లక్ష్మణుడి తల వొంగిపోయింది. చేతిలో కత్తి వొర లోకి జారిపోయింది.

లక్ష్మణుడు చేసిన ప్రోత్సాహానికి లొంగని, ధర్మ మార్గం వీడని, తన మనో నిగ్రహానికి, అమితంగా గర్వం కలిగింది రాముడికి.

కౌసల్య నిరాశతో కన్నీరు కారుస్తూ – "నాయనా! నీకిది ధర్మమేనా? ముసలి తల్లిని విడిచిపోతావా? నీ తండ్రికి వేరే పుత్రులున్నారు. నువ్వులేని లోటు నీ తండ్రిని బాధించదు. నువ్వు తప్ప నా కెవరున్నారోయీ? తల్లి మాట వినడం మాత్రం నీకు ధర్మంకాదా? పూర్వం కాశ్యపుడు తల్లికి శుశ్రూష చేసి స్వర్గం పొందలేదా? తండ్రిని విడిచి తల్లిని సేవిస్తే స్వర్గం రాదేమోనన్న భీతికి తావులేదు కదా?" అంటూ, తనపట్ల ప్రేమతో గాక స్వర్గంకోసం ఆరాటపడే కొడుకుని కన్నీళ్ళతో చూసింది.

రాముడు తల అడ్డంగా తిప్పాడు – "అమ్మా! ఆ రోజులు గతించాయి. తండ్రు లెవరో తెలియని అజ్ఞాన కాలంలో బిడ్డలంతా తల్లుల్నే పూజించే వారని నేనూ కొన్ని కథలు విన్నాను. కానీ కాలం మారింది. పితృభక్తినే ధర్మశాస్త్రాలన్నీ ఘోషిస్తున్నాయి. మా ఇక్ష్వాకు వంశంలో తండ్రుల ఆజ్ఞలే పాటిస్తారు కొడుకులు. సగర పుత్రులు తండ్రి ఆజ్ఞ పాటించి పాతాళాన్ని తవ్వుతూపోయి ప్రాణాలు కూడా అర్పించిన కథ వినలేదా? పరశు రాముడు తండ్రి ఆజ్ఞకోసం తల్లిని కూడా చంపిన పుణ్య గాథ వినలేదా? తల్లికి దుఃఖం కలిగినా సరే, తండ్రికి సంతోషం కలిగే కార్యాలే చెయ్యాలి కొడుకులు. నా తండ్రి గొప్ప సామ్రాజ్యాధిపతి. అంతటి మహారాజు మాట ధిక్కరించి నీ మాట పాటించమని కోరడం నీకు మాత్రం తగునా?" అంటూ రాముడు వొకరకం గాంభీ ర్యంతో తల్లిని మందలించాడు.

కౌసల్య తల వాల్చుకుంది. ఆమెకు చాలా సిగ్గు కలిగింది. నవమాసాలూ మోసి, కని, తన పొత్తిళ్ళలో పెంచి పెద్దచేసిన బిడ్డ, ఈ నాటికి తన ఎదురుగా నిలబడి – "తల్లి ఎవరు? తల్లిని పూజిస్తే ఏమి ప్రయో జనం? నా తండ్రి సిరిసంపదలు .... నా వంశ కీర్తి ప్రతిష్టలు ... నా పుణ్యలోకాలు ...." అంటోంటే, ఆ తల్లికి జీవితం మీద ఎన్నడూ ఎరగనంత విరక్తి కలి గింది. జల జల కన్నీళ్ళు రాల్చింది "నాయనా! నువ్వే రిగిన ధర్మాలేవీ ఎరగనిదాన్ని. నువ్వు లేకుండా వొక్క ఘడియకూడా బ్రతకలేని దాన్ని. ఎక్కడ వున్నా నిన్ను చూస్తూ వుండడమే నేను కోరేది. ఈ అంతఃపురంలో శోకం తప్ప నాకిక మిగిలేదేమీ లేదు. నేను కూడా నీ వెంట అడవుల్లోకి వొస్తాను. నీ బాగోగులు చూస్తూ కాలం గడుపుతాను. నన్ను కూడా నీ వెంట తీసుకు వెళ్ళు" అని కళ్ళు వొత్తుకుంది.

రాముడు, తల్లి అజ్ఞానానికి చింతించాడు. "అమ్మా! నీ వంటి ఉత్తమ స్త్రీలు మాట్లాడతగ్గ మాటలేనా ఇవి? స్త్రీ, భర్తను విడిచి జీవించవచ్చునా? స్త్రీకి పతిసేవే కదా మోక్ష మార్గం?"

కౌసల్యకు భర్త గుర్తొచ్చి వొళ్ళంతా జలదరించింది. "నాకే మోక్షాలూ, స్వర్గాలూ వొద్దు నాయనా! బతికిన నాలుగు రోజులూ నిన్ను చూసుకుంటూ బతికితే అదే నాకు స్వర్గం!"

తల్లి అవినయానికి రాముడికి చాలా కోపం వచ్చింది – "ఈ విధంగా మాట్లాడటం స్త్రీకి ధర్మం కాదు. స్త్రీకి భర్తే దైవం. పతి సేవ చెయ్యకపోతే ఎన్ని పూజలు చేసినా, ఎన్ని వ్రతాలు చేసినా, వ్యర్థమే. భర్త ఎటువంటి వాడయినా సరే, ఆ భర్తనే దైవంగా ఎంచి పూజించని స్త్రీ, పరమ పాపిష్టురాలు. దేవతలకూ, బ్రాహ్మణులకూ ఎన్నడూ నమస్కరించకపోయినా, భర్తకు శ్రద్ధతో శుశ్రూ షలు చేసే స్త్రీలు సునాయాసంగా స్వర్గం పొందుతారు. అక్కడ కూడా భర్తకు సేవ చేసుకుంటూ ఆనందం పొంద వచ్చును. ఈ సదాచారాలన్నీ వేదాల్లోనూ, స్మృతుల్లోనూ పెద్దలు చెప్పగా వినలేదా?" అంటూ రాముడు తల్లిని కఠినంగా చూశాడు.

కౌసల్య కన్నీళ్ళతో తలవొంచుకుంది. ఏనాడో ఆరేళ్ళ బాలికగా అత్త వారింటికి వచ్చింది. అప్పటికే స్త్రీ లోలుడైన భర్తని అమాయకంగా నమ్మి, ఆ భర్త ప్రేమ కోసమే అర్రులు చాచి ఎదిగింది. తన సౌందర్యాన్నీ, యౌవనాన్నీ, ఆత్మనీ, సౌఖ్యాన్నీ, ఆ భర్తకే కైంకర్యం

చేసింది. జీవితం పొడుగునా ఆ భర్త ఎందరు సవతుల్ని తెచ్చినా, ఎంత అవమానించినా, ఎంత తిరస్కారం చూపినా, లోకధర్మంగా ఆ భర్త నీడనే బతికి వృద్ధురాలై పోయింది. ఈ వృద్ధాప్యంలో ఈ నాడు తన బిడ్డ తనకు స్త్రీల ధర్మాలూ, పాతివ్రత్యమూ కొత్తగా నేర్పుతూంటే, ఆ వెర్రితల్లి, కొడుకుని అయోమయంగా చూసింది. పురుషుడు, తల్లినయినా, తోబుట్టువునయినా, స్త్రీలుగా మాత్రమే చూస్తాడనీ, వారిని జీవితాంతమూ పురుషుల ఆధిపత్యానికి అప్పగించే శాస్త్ర ధర్మాలతో బంధింప చూస్తాడనీ ఎరగని ఆ అమాయకపు తల్లి, రాముణ్ణి ఇంకా పసిబిడ్డగానే, ఏ స్వార్ధమూ ఏ భేదభావమూ లేని బాలుడిగానే భావించి సంతృప్తిపడింది. కొడుకుని ఆపే ప్రయత్నం విరమించుకొంది – "నీ కోరికే పాటిస్తాను. నీ తండ్రి సేవతోనే నా కాలమంతా గడుపుకుంటాను. అరణ్యాలకు వెళ్ళిరా నాయనా! నీ సత్యవ్రతమే నిన్ను కాపాడుతుంది. దేవతలూ, పితృ దేవతలూ, సూర్య చంద్రులూ, దిక్పాలురూ, అగ్ని హోత్రాలూ, నక్షత్ర మండలాలూ, సమస్త ప్రకృతి శక్తులూ నిన్ను కాపాడుతాయి. నీ క్షేమంకోసమే పూజలు చేస్తాను. హోమాలు చేస్తాను. బ్రాహ్మలకు దానాలు చేస్తాను. నా పుణ్యమంతా నిన్ను కష్టాల నించీ, క్రూరమృగాల నించీ, రాక్షసులనించీ, సమస్త ఆపదలనించీ, కాపాడుతుంది. పద్నాలుగు సంవత్సరాల దాకా నీ రాకకోసం ప్రాణాలు నిలుపుకొని, కళ్ళు జ్యోతులు చేసుకొని, నిరీక్షిస్తూ వుంటాను. సుఖంగా జీవించు నాయనా!" అంటూ కౌసల్య కన్నీళ్ళతో ఆసనం మీదకు వొరిగి దుఃఖ సముద్రంలో మునిగి పోయింది.[41]

ఆ తల్లిని విడిచి రాముడు పితృభక్తితో, కీర్తి కాంక్షతో, తర్వాత కార్యానికి కదిలాడు.

★ ★ ★

"నేను కూడా మీ వెంట వస్తాను. మిమ్మల్ని విడిచి ఒక్క క్షణం కూడా జీవించలేను" అని సీత ఎటువంటి కలవరమూ లేకుండా కళ్ళెత్తి నిర్మలంగా చూసింది భర్తని.

పట్టాభిషేకం ఆగిపోయిందని వినగానే ఆమెకు మితిమీరిన దుఃఖం కలగలేదు. భర్త మహారాజు కాలేదనే స్పృహే కలగలేదు. భర్త తనను విడిచి పద్నాలుగు సంవత్సరాలు దూరమౌతున్నాడనే ఊహతో కంపించి పోయింది. రాజభోగాలన్నీ విడిచి తన భర్త వనవాసానికి సిద్ధమవుతూండగా తను శూన్య ఏకాకి జీవితం గడపాలని భయపడింది. తడిసిన కళ్ళతో అమాయకంగా భర్తని చూస్తూ "నన్ను విడిచి వెళ్ళకండి స్వామీ!" అని జంకుతూ అడిగింది.

రాముడు ఆశ్చర్యంగా – "ఏమిటీ వింత?" అన్నట్టు చూశాడు. అంతఃపుర కట్టుబాట్లతో, సూర్య చంద్రుల్ని కూడా తేరిచూడకూడని మర్యాదలతో జీవించవలసిన రాచ స్త్రీ, అరణ్యాలకు రావడమా! ఎంతమాత్రం కూడదే! "మంచి చెడ్డలు తెలిసే మాట్లాడుతున్నావా? అరణ్యాలలో జీవితం అంటే ఏమిటనుకున్నావు?" అని సీతని విస్మయంగా చూశాడు.

సీత వినయంగా కళ్ళు వాల్చింది.

రాముడు, గంభీరంగా సాగించాడు – "సీతా! ఎన్నడయినా అరణ్యాలు చూశావా? అరణ్యాల గురించి విన్నావా? కారడవులు మహా భయంకరంగా వుంటాయి సుమా! సింహాలూ పులులూ ఎలుగులూ అడవిదున్నలూ గర్జిస్తూ పట్టపగలే విచ్చలవిడిగా తిరుగుతూ వుంటాయి. భయంకరమైన సర్పాలు పర్వతాలవలే మార్గాల కడ్డంగా పడుకొని పొరాడుతూ వుంటాయి. నదులనిండా మొసళ్ళు తెప్పల వలె తేలి ఈదుతూ వుంటాయి. అడవంతా, మహా వృక్షాల కొమ్మలన్నీ అల్లుకుపోయి సూర్య చంద్రుల కాంతికూడా జొరబడక అంధకార బంధురంగా వుంటుంది. లతలు పెనవేసుకున్న కొమ్మలవెంట పాములు పాకుతూ, లతో, పామో తెలీక, హఠాత్తుగా జారి మీదపడి ...." అంటూ రాముడు జలదరింపుతో భుజాలు కదిలించాడు – "సీతా! వింటున్నావా? అడవుల్లో నేలంతా మొనలుదేరిన రాళ్ళతో, కత్తుల వంటి రెల్లుతో నిండిపోయి, వాటి మధ్య తేళ్ళతో, మిడతలతో, అడవి ఈగలతో, సూదులవలె పొడిచే పురుగులతో, అడుగుదీసి అడుగు వెయ్యడానికే అసాధ్యంగా వుంటుంది. పచ్చనిగడ్డిలో పచ్చని పా .... ము .... లు" అంటూ ఆగిపోయాడు.

సీత కళ్ళు వాల్చి వింటూనే వుంది.

రాముడు పాముల్ని వదిలేసి, మళ్ళీ ప్రారంభించాడు.

"ఒక్కో కాలంలో అడవులన్నీ సమూలంగా వూగే ఈదురు గాలులూ, ఒక్కో కాలంలో అడవులన్నీ సముద్రాలుగా మారేంతటి వర్షాలూ, రెప్పపాటులో అడవుల్ని సమూలంగా తుడిచిపెట్టే దావానలాలూ .... సీతా!" అని ఇక ఊహించలేక ఆగిపోయాడు రాముడు. పితృ భక్తిలో

---

**41.** **అయోధ్యా, సర్గ 39, శ్లోకం 36**: దశరధుడికి – కౌసల్య, సుమిత్రా, కైకా అనే ముగ్గురు భార్యలేగాక, ఇంకా 350 మంది భార్యలు ఉన్నారనే సంగతి ఈ సందర్భంలో తెలుస్తుంది. "రాముడు, తన తల్లికి సవివరముగా నింతమట్టుకు జెప్పి, యంత తన తల్లులను **మున్నూట యేబది మందిని** పరికించి చూసెను. తన తల్లివలె దుఃఖించుచున్న తల్లులకు ప్రణమిల్లెను."

ఈ రాజుగారికి 353 మంది భార్యలు! **రోజుకో భార్య!** ★

ఏమో అనుకున్నాడుగానీ, ఇప్పుడు ఆలోచిస్తోంటే అరణ్య జీవితం శత్రువులకు కూడా వొద్దనిపిస్తోంది. ఈ ఘోరా లన్నీ తెలిసే తనకు వనవాసం ఆజ్ఞాపించాడా తన తండ్రి? ఎంత దుర్మార్గం! తనకు వనవాస శిక్షా? ఎందుకు? ఏం నేరం చేసినందుకు? తండ్రి ఆజ్ఞ చొప్పున పట్టాభిషేకానికి సిద్ధపడినందుకా? తండ్రి ఆజ్ఞని ఎలా మీరగలడు? అది నేరం అయితే, అది తండ్రి నేరమే. శిక్ష తనకా? ఆ తండ్రికేం శిక్ష వెయ్యాలి? ఎవరు వెయ్యాలి?

సీతకోసం తను చేసిన వర్ణనలో అరణ్యాల భీకరత్వ మంతా కొత్తగా కళ్ళకు కట్టి, రాముడికి, తండ్రి మీద మరొక ఆగ్రహ తరంగం రేగింది.

సీత, అడవి వర్ణన విని ఏమీ చలించక, చిరు నవ్వుతో చూసింది. ప్రతీ భార్యకూ భర్త సామర్ధ్యం మీద మొదట్లో కొంతకాలం పాటు వుండే విశ్వాసం వంటి విశ్వాసంతో భర్తని చూసింది – "స్వామీ! మీరు చెప్పిన వన్నీ నాకు సుఖాలేగానీ కష్టాలుగావు. మహా పరాక్రమ వంతులు మీరు నన్ను రక్షించగలరు. మీ నీడలో నిల బడితే నాకే సర్పాల భయమూ, ఏ కష్టాల భయమూ, ఏ క్రూరమృగాల భయమూ వుండదు" అని నిశ్చింతగా చూసి కళ్ళు వాల్చింది.

రాముడు, తన అడవి వర్ణనతో తనే జంకుతూ సందేహిస్తూ ఆలోచనలో పడ్డాడు. చిన్నతనం నించి పరి చారకుల సేవలతో, అంగ భటుల రక్షణతో, సుఖంగా సురక్షితంగా ఇంతకాలం పెరిగి, ఇప్పుడు వొంటరిగా అడవుల్లో బ్రతకాలంటే ఎంత వీరుడయినా తనే చలి స్తోంటే, వెనకాల ఇంకో భారమా? ఏ పులో సింహమో తరిమినప్పుడు, బాణం జారిపోయినా, మంత్రం మర్చి పోయినా, పరిగెత్తడమో చెట్టెక్కడమో చెయ్యాలి కదా? ఇక అబలనెలా రక్షించడం? అదీగాక, రహస్య మంది రాల్లో, గదుల్లో, తెరల్లో, మర్యాదగా జీవించవలసిన స్త్రీలు, బట్టబయలుగా అడవుల్లో తిరగడం ఎంత అప రాధం! ఎంత అప్రతిష్ట! ఎందరో పరపురుషులు, స్త్రీల అంద చందాల్ని తేరిపారచూసే కాముకులు – సీతని కూడా – అబ్బా! ఊహించడానికే దుస్సహంగా వుందే! వీల్లేదు!

సీతని వొప్పించాలని రాముడు నేర్పుగా, మృదు వుగా ప్రారంభించాడు – "నా వీరత్వంతో క్రూర జంతు వుల భయం లేకుండా చెయ్యగలను. కానీ, అడవుల్లో ఏం సుఖపడతావు సీతా? మంచి భోజనమా? సుఖమైన నివాసమా? దాస దాసీలా? ఎన్నడూ ఎండ కన్నెరుగని నువ్వు ఆకో అలమో తిని కటిక నేలమీద నిద్రపోతావా? నీకు సేవలు చేసే వాళ్ళుండరు. నువ్వే ఎందరో అతిథు లకూ, రుషులకూ, నాకూ సేవలు చేస్తూ వుండాలి. మానవ స్త్రీల నెత్తుకు పోవాలని ఎందరో రాక్షసులు తిరుగుతూ వుంటారు. అది మరీ భయంకరం. నా మాట విను! భర్త చెప్పినట్టు వినడం భార్య ధర్మం. అడవుల్లోకి వొచ్చే ప్రసక్తి వొదిలిపెట్టు!" అని, సీత ఇక ఆ ప్రసక్తి ఎత్తరాదన్నంత గంభీరంగా చూశాడు. "సీతా! ఇక్కడే వుండి అత్తమామలకు సేవలు చేస్తూ వుండు! ప్రతి దినమూ నా తండ్రికీ, నా మూడు వందల యాభయి ముగ్గురు తల్లులకూ, నమస్కారాలు చేస్తూ వుండు! బ్రాహ్మణులకూ, దేవతలకూ, పూజలు చేస్తూ వుండు! భరతుడు మహారాజు అవుతున్నాడు. అతని దగ్గర చాలా వినయంగా వుండాలి సుమా! లేకపోతే, నిన్ను పోషించ వలసిన అవసరం అతడికేమీ వుండదు. భరతుడి భార్య లకు అనుకూలంగా, వారి ఇష్ట ప్రకారం ప్రవర్తించు! భరతుడి దగ్గిర నన్నెప్పుడూ పొగడకు సుమా! రాజులు తమను తప్ప ఇతరులను పొగిడితే సహించలేరు. తమకు విధేయతగా వుండి సేవలు చేసే వాళ్ళనే సుఖంగా వుండ నిస్తారు. లేకపోతే స్వంత బిడ్డలమీదనయినా ద్వేషం పెట్టుకుంటారు. అందుకే నువ్వు భరతుడి ద్వేషానికి గురికావటం మంచిది కాదు. నేను వొచ్చేవరకూ ఉప వాసాలూ పూజలూ వ్రతాలూ చేసుకుంటూ, భరతుడికీ అతడి భార్యలకూ సేవలు చేసుకుంటూ, కాలం గడుపు!" అంటూ కర్తవ్యబోధ చేసి నిర్వికారంగా చూశాడు. అన్ని సంవత్సరాలుగా తనతో భక్తిగా జీవిస్తున్న భార్యని ఇతరు లకు దాసీని చేస్తున్నానన్న దుఃఖమే కలగలేదు రాము డికి. మహారాజుల సేవలో సౌఖ్యమేగాని నైచ్యం కనబడ లేదు.

సీతకు, భర్త మాటలు విని ఎన్నడూ ఎరగనంత కోపమూ, దుఃఖమూ కలిగాయి. అవమాన భారంతో కంపిస్తూ కళ్ళెత్తి చూసింది. "భార్యను ఇతరుల దాస్యానికి వొదిలి వెళ్ళడం నీకు పౌరుషమా, భర్తని విడిచి పరులకు సేవలు చేసుకు బ్రతకడం నాకు గౌరవమా? యవ్వ నంలో వున్న భార్యని పరపురుషుల కిచ్చి జీవించే క్షుద్రుడివలె, నన్ను, నీ తమ్ముడి దయా ధర్మాలకు విడిచి పెట్టడం నీ వంటి వీరుడికే తగును! అందుకేనా నా తండ్రి నన్ను నీ చేతుల్లో పెట్టింది? నిన్ను విడిచి నీ తల్లి దండ్రుల సేవలు చెయ్యవలసిన అవసరం నాకు లేదు. నాకు నీ సేవ ముఖ్యంగానీ వారి సేవలు ముఖ్యం కాదు" అంటూ తలవొంచి కన్నీళ్ళు కార్చింది. కొంత సేపటికి కోపం ఉపశమించగానే దైవవంటి భర్తను నిందించా ననే పరితాపం ప్రారంభమైంది.

సీత, చిన్నతనం నించీ ఎందరో పతివ్రతల గాథలు విని భక్తితో పులకించి, అవే తనకు మార్గ దర్శకం అను కుంది. ఎలాంటి కష్టాల్లోనైనా భర్తకు దూరం కాకూడ దనుకుంది. సావిత్రి, యముణ్ణి కూడా మెప్పించి భర్తను

బ్రతికించుకోలేదా? పది సంవత్సరాలు వర్షాలు లేక లోకాలు దగ్ధమౌతోంటే మహాపతివ్రత అనసూయ రుషులకోసం గంగలో నీళ్ళూ, చెట్లకి పళ్ళూ సృష్టించ లేదా? దేవకార్యంకోసం పది రాత్రుల్ని వొక్కరాత్రిగా చేసి మన్ననలు పొందలేదా? ఎందరు స్త్రీలు, భర్తల సేవలతో కీర్తిప్రతిష్టలు సంపాదించుకోలేదు! పతివ్రతలు కాని స్త్రీల జన్మలెందుకు? ఎంత వ్యర్థం! – సీత, పుట్టినప్పటినించి భర్త పాదసేవకే సిద్ధంగా వుంది. ఆమెకు ప్రతీ క్షణమూ పాతివ్రత్య మహిమల ఆలోచనలే గానీ, సత్యాసత్యాల ప్రశ్నలు లేవు. సహజా సహజాల సందేహాలు లేవు.

భర్తకు రాజ్యం రాకపోయినా, వనవాసమనగానే, సీతకు సంతోషం కూడా కలిగింది. కష్టాలలోనే తన పాతి వ్రత్యాన్ని లోకానికి వెల్లడి చెయ్యాలని ఆరాట పడింది. తీరా భర్త తనను విడిచి వెళతానంటే, భరించలేక అలా ధిక్కారంగా మాట్లాడిందిగానీ, భయ భక్తులు తగ్గి కాదు. తన భర్త ఎందుకో తనను వెంట తీసుకు వెళ్ళటానికి సందేహిస్తున్నాడు. అంత పరా క్రమవంతుడికి తనను రక్షించడం కష్టమేమీ కాదే! అంతఃపురాలలో వుండ వలసిన స్త్రీ అడవులలో జీవించడం మర్యాద కాదనా? తన భర్త తన సౌశీల్యాన్ని శంకిస్తున్నాడా?

సీత, కళ్ళలోంచి కన్నీళ్ళు జలజలా రాల్చుతూ, నిశ్చ లంగా నిల్చునివున్న భర్తని చూసింది. "స్వామీ! మీరులేని జీవితాన్ని ఒక్క క్షణంకూడా ఊహించలేను. స్త్రీలు స్వతంత్రులు కారనీ, భర్తతోనే జీవించాలనీ, బ్రాహ్మలు వేదాలు చదువుతోండగా ఎన్నోసార్లు విన్నాను. నా తల్లిదండ్రులు కూడా చిన్నతనంలోనే నాకీ ధర్మాలన్నీ నేర్పారు. పతి సేవను మించిన పుణ్యకార్యం లేదని నిత్యం మీరు నాకు బోధిస్తూనే వున్నారు. ఇహ – పరలోకాలలో స్త్రీకి భర్తేకదా దైవం? పతివ్రత అయిన స్త్రీ, భర్త కష్టసుఖాలను తనవిగానే అనుభవించాలి కదా? మీ పాద సేవకోసం త్రిలోకాధిపత్యాన్ని కూడా త్యజించ గల నాకీ అంతఃపుర భోగాలెంత? స్వామీ! ఎందుకు సందేహిస్తున్నారు నన్ను?"

తనని అంతఃపురాల బైటికి తీసుకువెళ్ళడానికి భర్త ఎందుకు సందేహిస్తున్నాడో సీత గ్రహించకపోలేదు. తన సౌశీల్యం మీద భర్తకు నమ్మకం కలిగించాలని ఆరాట పడింది. "స్వామీ! నన్ను నమ్మండి! క్షుద్ర స్త్రీలవలే పర పురుషుల్ని కన్నెత్తి అయినా చూస్తానా? భర్త కీర్తినీ, కుల గౌరవాన్నీ కళంకపరిచే కార్యాలు మనసులోనైనా తల పెడతానా? నన్ను విశ్వసించండి ప్రభూ! ఈ చరాచర జగత్తులో మీ పాదసేవ తప్ప ఇతరమేమీ కోరను .... కోరను" అని సీత, రాముడికి విశ్వాసం కలిగేటంత నిర్మలంగా, వినయంగా, చూసింది.

రాముడు చాలా చలించాడు – సీత వినయానికి. తన సందేహం ఆమె గ్రహించినందుకు కొంచెం కలవర పడ్డాడు. తన భార్య అంత పతి భక్తి కలదని రాముడికి అంతవరకూ తెలియదు. అతని మొహం సంతృప్తితో వెలిగింది. తను పితృవాక్య పరిపాలకుడేగాక, తన భార్య మహాపతివ్రత అని ఈ సమయంలోనే లోకానికి విదితం అవుతుంది. ఆ కీర్తి కోసమయినా సీతను తనతో తీసుకు వెళ్ళక తప్పదు. యౌవనంలో వున్న భార్యను ఇతరుల అండన విడిచే కన్నా తన రక్షణలో వుంచుకోవడమే ఉత్తమం. ఈ వయసులో పద్నాలుగు సంవత్సరాలు భార్యలేని జీవితం కూడా కష్టమే. సీతను విడవడం తనకూ సౌఖ్యం కాదు.

దీర్ఘాలోచనలో మునిగి గంభీరంగా నించున్న భర్తని సీత ఆందోళనగా చూసింది – "ప్రభూ! ఎందుకింత నిర్దయ నా మీద? ఆ అరణ్యాలలో నా కోసం మీ కేమీ శ్రమ కలిగించను. ఎన్నడూ సుఖ భోగాలాశించను. ముందు మీరు తినగా మిగిలినదే నేను తింటాను. నా సేవలతో మిమ్మల్ని సంతోష పెడతాను. అడవుల్లో ఎక్కడా మీ పాదాలకు ముళ్ళు గుచ్చుకోకుండా నేనే ముందు నడిచి దారులు సరి చేస్తాను. మీ సహజీవ నంతో ఘోరారణ్యాలన్నీ నాకు ఉద్యాన వనాలవుతాయి. సుందర సరోవరాల్లో, నిర్మల నదీతీరాల్లో, ఉన్నత పర్వత సానువుల్లో, సూర్య చంద్రుల కాంతిలో, సహజ ప్రకృతీ సౌందర్యంలో లీనమై, మనం ఏకమై, ఎన్ని వేల సంవత్స రాలయినా ఈ క్షుద్ర రాజభోగాలు మరిచి జీవించ వచ్చును" అని భర్తని ప్రేమగా చూసింది.

రాముడికి ఆ ప్రేమ నిండా పాతివ్రత్యమే కన పడింది. ఆ ప్రకృతి ఆరాధన నిండా స్త్రీల వినయమే గోచరించింది. రాముడు, మనసునిండా తృప్తితో, భార్య ఇంకా ఇంకా కనబరిచే పాతివ్రత్యంకోసం మౌనం వహించి గంభీరంగా వింటూ నిలబడ్డాడు.

భర్త నోటివెంట జవాబులేక సీతకు దుఃఖం పొంగింది– "స్వామీ! నన్ను తీసుకువెళ్ళడం మీకెంత మాత్రం ఇష్టంలేనట్టు తోస్తోంది. నన్ను విడిచి మీరు అటు కదిలిన మరుక్షణంలోనే నేను ఏదో విధంగా ఆత్మ హత్య చేసుకుని చచ్చిపోతాను. స్త్రీకి జన్మజన్మలకూ ఒక్క పురుషుడే భర్త అని వేదాలలో విన్నాను. వొచ్చే జన్మలో అయినా మీతో కలిసి జీవిస్తాను. మన బంధం ఈ జన్మతో తీరేది కాదు" అని తల వొంచి జల జలా కన్నీళ్ళు రాల్చింది.

అప్పటికి రాముడి మనోవాంఛ సంపూర్ణంగా ఈడే రింది. తనకోసం తన భార్య మరణానికి కూడా సిద్ధపడు తుందని విన్నప్పుడు పురుషుడికి కలిగే గొప్ప సంతృ ప్తితో, రాముడు సీతని చిరునవ్వుతో చూశాడు – "సీతా! నువ్వు మహా పతివ్రతవు కాబట్టి భర్తను విడిచి జీవించ

కూడదని నిశ్చయించుకున్నావు. నీ పతి భక్తివల్లే నీ పుట్టింటికీ, అత్తింటికీ, ఎంతో కీర్తి కలుగుతుంది. ఇక నిన్ను విడిచి నేనెన్నడూ వుండను. నిన్ను విడిచి నేను స్వర్గానికి కూడా వెళ్ళను. నిన్ను నాతో తప్పకుండా వన వాసానికి తీసుకువెళతాను. అక్కడ నువ్వు నా పాద సేవచేసుకుంటూ ఆనందంగా వుండవచ్చును. నిన్ను పరీక్షించడానికే ఇంతసేపూ ఈ విధంగా మాట్లాడానని గ్రహించు" అని రాముడు గర్వంగా చూశాడు. ఇక మీదట తన భార్య పాతివ్రత్యానికి ఎప్పటికప్పుడు పరీ క్షలు పెట్టాలనే నూతన జ్ఞానోదయం కలిగింది రాము డికి.

సీత సంతోషంతో వొంగి భర్త పాదాలకు నమస్క రించింది. "స్వామీ! ఎన్ని కఠిన అగ్ని పరీక్షలయినా పెట్టండి! ఈ అభాగ్యురాలి మీద మీకు దయ వున్నంత కాలం నేను మీ దాసినేనని రుజువు చేసుకుంటాను!" అని, ఎన్నడో విన్న ఒక కథలో పతివ్రత మాట్లాడిన మాటలే మాట్లాడింది.

రాముడికి మళ్ళీ అడవులూ పాములూ జ్ఞాపకం వొచ్చి, కొన్ని క్షణాల పాటు మర్చిపోయిన దిగులు ఒక్క సారిగా ముంచుకొచ్చింది. "సీతా! పితృ ఆజ్ఞ జవదాట రాదు. ఏం చెయ్యగలం? మనం అడవుల్లో జీవించక తప్పదు" అని తల పంకించాడు. మళ్ళీ తలెత్తుతోన్న అయిష్టాన్ని ఛేదించడానికి, తనకు తను నచ్చచెప్పు కుంటూ – "సీతా! పురుషుడికి తండ్రిని మించిన దైవం లేదని శాస్త్రాల్లో చెప్పారు. తండ్రిని తిరస్కరించి 'కంటికే కనిపించని' దైవాన్నెలా ఆరాధించగలం?[42] పితృభక్తివల్ల పరలోకాలలో ఎంతో పుణ్యం కలుగుతుంది. సత్యంవల్ల గానీ, ధర్మం వల్లగానీ, యజ్ఞ యాగాదులవల్ల గానీ, అంత పుణ్యం కలగదు. పితృ శుశ్రూషవల్లే స్వర్గం కలుగుతుంది. దేవలోకం, గంధర్వలోకం, గోలోకం, ఇంకా ఎన్నో లోకాలకు వెళ్ళి చివరకు బ్రహ్మలోకాన్ని పొందవచ్చునని శాస్త్రాల్లో చెప్పారు. పితృభక్తి వలన నేనూ, పతిభక్తి వలన నువ్వూ, కీర్తి ప్రతిష్టలు పొంద గలం" అని ఆగాడు. అన్ని లోకాలు దొరుకుతాయని చెప్పుకున్న తర్వాత, అప్పటికి మనసంతా ఉత్తేజం పొంది, వనవాస భీతిని మించిన ఉత్సాహం కలిగింది. "సీతా! జాప్యం చెయ్యకు! మన సమస్త సిరిసంపదలూ బ్రాహ్మలకు దానధర్మాలు చేసెయ్యి!" అని రాముడు, తర్వాత ప్రయత్నాల్లోకి చురుగ్గా కదిలాడు.

బ్రాహ్మణులందరికీ, దానధర్మాలు స్వీకరించమని దండోరా వేయించాడు.

అంతఃపురంలో ముఖ్య దాసీలను గంభీరంగా చూస్తూ రాముడు – "నా మందిరమూ, లక్ష్మణుడి మందిరమూ, నిత్యం పరిశుభ్రం చేసి శ్రద్ధగా కాపా డుతూ ఉండండి! మేము లేము కదా అని ఈ అంతః పుర రక్షణని అశ్రద్ధ చెయ్యకూడదు. మేము మళ్ళీ ఇక్కడకు రావలసినవాళ్ళమే. జాగ్రత్తలు పాటించండి!" అని ఆజ్ఞాపించాడు.

దాన ధర్మాల వార్త విని బ్రాహ్మలు సంతోషంతో నేల ఈనినట్టు గుంపులు గుంపులుగా వొచ్చారు. నిరు పేదలూ, బిచ్చగాళ్ళూ కూడా వొచ్చి దూరంగా వాకిలి బయట ఆక్రమించి, రాముడు అడవులకు వెళ్ళిపోతు న్నాడనే సంగతి విచారంతో చెప్పుకుంటూ కూర్చున్నారు.

రాముడు, తన ధనాగారాల్లోంచి ధనధాన్యాలూ, వెండి బంగారాలూ, వజ్ర వైఢూర్యాలూ, విలువయిన ఆభరణాలూ, వస్త్రాలూ, కుప్పతెప్పలుగా తెప్పించి బ్రాహ్మణులకు దానాలు ప్రారంభించాడు. ఆ సిరి సంపద లన్నీ రాముడు లక్ష్మణుడితోటీ, తన అను చరులతోటీ కలిసి, శత్రు రాజ్యాలలో అనేక పట్టణాల మీద దాడులు చేసి తెచ్చుకున్నవి! రాముడికి ప్రత్యేక భవనాలూ, రహస్య మందిరాలూ, తోటలూ, గోశాలలూ, రథాలూ, గుర్రాలూ, అనేకం వున్నాయి. అదంతా రాముడి ప్రత్యేక సంపద.

బ్రాహ్మలు, దశరథుణ్ణీ, కైకనీ నిందించడం వింటూ రాముడు ఆనందిస్తూనే వున్నాడు. "ఈ సమస్త సిరిసంప దలూ నా పరాక్రమంతో సంపాదించుకున్నవే.[43] ఇందులో చిల్లిగవ్వ అయినా దశరథ మహారాజు ధనం లేదు. ఎవరి కేది కావాలో అది స్వీకరించండి. బ్రాహ్మ లకు ఉపయోగపడినప్పుడే నా సంపదకు సార్థకత" అంటూ రాముడు గంభీరంగా దానధర్మాలు కొనసాగిం చాడు. బ్రాహ్మలకు దాసీలను కూడా దానం చేశాడు. తన మిత్రులకు రథాలూ, గుర్రాలూ, ధనరాసులూ పంచిపెట్టాడు. "ఎవరికేది అర్థమో అది ఇవ్వండి!" అని దాసీలను హెచ్చరించాడు.

"రామా! నీ వంటి ఉత్తముడు ముల్లోకాలలోనూ లేదు. కష్టాలు కలకాలం నిలవవు. వనవాసం ముగించి తిరిగిరాగానే ఇంతకు వేయిరెట్లు సిరి సంపదలు సంపా దించుకోగలవు. నీకు శుభమగు గాక!" అంటూ

---

**42.** **అయోధ్యా**, సర్గ **30**, **శ్లోకం 33**: 'దైవం కంటికి కనిపించదనే' నగ్న సత్యాన్ని రాముడే వెల్లడించాడు. ★

**43.** **అయోధ్యా**, సర్గ **32**, **శ్లోకాలు 42, 44**: తండ్రిగారి సిరి సంపదలతో సంబంధం లేకుండా రాముడు ఆ సంపదంతా ప్రత్యేకంగా తన 'పరాక్రమం'తో సంపాదించాడు. అంటే, ఏ విధంగా సంపాదించినట్టు? ఇతర ప్రాంతాలమీద దాడులుచేసి! పరులను ఆక్రమించడమే 'పరాక్రమం!' ★

బ్రాహ్మలు రాముణ్ణి దీవించారు. వెండి బంగారాలతో నిండిన మూటల బరువుకి కైకని తల్చుకొని సంతోషిస్తూ.

బ్రాహ్మలనూ, మిత్రులనూ సంతోషపెట్టిన తర్వాత, రాముడు, దాస దాసీలకు కూడా కొన్నికొన్ని కానుకలు ఇచ్చాడు.

చిట్టచివర, గుంపులు గుంపులుగా చేరిన బిచ్చ గాళ్ళకు దాసీలు గుప్పెడు గుప్పెడు బిచ్చాలు వేశారు.[44]

★ ★ ★

**ఊ**ర్మిళ అప్పుడే చిత్రం పూర్తిచేసి చేతిలో కుంచె అలాగే పట్టుకొని చిరునవ్వుతో చిత్రాన్ని తదేకంగా చూస్తోంది. ఆ చిత్రంలో రెండు తెల్లటి పక్షులు! నిండుగా పూసిన కొమ్మమీద వొకదాని రెక్కల్లో వొకటి వొదు గుతూ! వొకదాని ముక్కు వొకటి ముద్దాడుతూ!

ఊర్మిళ ఎంతో సంతోషంతో తోటలోకి చూసింది. తోటనిండా ఎన్నో వందల పక్షులు. రంగు రంగులు. రక రకాలు. అరుస్తూ, దూకుతూ ఎగురుతూ. ఎక్కడా తను గీసిన రకం లేవు. మళ్ళీ మళ్ళీ చిత్రాన్ని చూసింది. అన్ని వందల పక్షులు ప్రాణాలతో అలా కొమ్మకొమ్మకీ ఎగురుతోంటే, ఎందుకీ నిర్జీవ చిత్రం? ఇంత నిశ్చ లత్వంలో ఏం సౌందర్యం వుంది? వాస్తవానికి ఇంత దూరమైన కల్పన, వాస్తవ శరీర మనోధర్మాలకెలా ఆనందం కలిగిస్తుంది?

చిత్రాన్ని అసంతృప్తిగా చూస్తూ వుండిపోయింది ఊర్మిళ.

అంతలో ఆమె కెంతో ప్రియమైన దాసి వాసంతి పరిగెత్తుకుంటూ వొచ్చి, ఊర్మిళ నిరుత్సాహంగా కూర్చున్న తీరుచూసి చెప్పబోయే విషయం ఆపి, పక్షుల చిత్రం వేపు చూస్తూ సంతోషంగా – "ఎంత బాగుందో! ఎప్పుడు గీశావమ్మా?" అని ఆశ్చర్యపడింది.

ఊర్మిళ సందేహిస్తూ – "గీశాను గానీ వాసంతీ, ఇలాంటి పక్షులు తోటలో ఎక్కడా కనబడడం లేదే! ఏం పక్షులివి? పావురాలా? పాలపిట్టలా? నా చిత్రలేఖనం సరికొత్త సృష్టి చేస్తోందే!" అని నవ్వింది.

వాసంతి కూడా నవ్వి – "మన బొమ్మలకు మనం కొత్త పేర్లు పెట్టుకుందాం. ఇవి, ఊర్మిళ పక్షులు. బాగుందా?" అని ఊర్మిళని ప్రేమగా చూసింది.

"నీ మొహంలే. తప్పేమిటో చెప్పమంటే కొత్త పేర్లు పెడతావేం? ఇలా కూర్చో! తిన్నగా చూడు! ఎంతసేపు అలా కదలకుండా, మాట్లాడుకోకుండా, నిర్జీవంగా కూర్చుంటాయి? అలాగే చూస్తూ వుండు శ్రద్ధగా! ఎంత భయం వేస్తుందో చూడు! చచ్చిపోయినట్టు కనపడతాయి చూడు!"

వాసంతి ఊర్మిళని దయగా చూసింది. ఊర్మిళ మాటల్లో విషాదం వాసంతికి చాలా స్పష్టంగా తెలుసు.

"వాసంతీ! నిజం చెప్పవే! ఇవి రాళ్ళలాగు బిగుసుకు పోయినట్టు లేవూ? ఈ జంటని చూస్తోంటే ఎవరు జ్ఞాపకం వొస్తున్నారు నీకు?"

"నాకెవరూ జ్ఞాపకం రావడం లేదమ్మా."

"అన్నీ అబద్ధాలు. నాకు తెలుసులే. ఎందుకే అంత రహస్యం? నేను చెప్పనా? ఈ జీవంలేని బొమ్మల్లో, 'ఊర్మిళా – లక్ష్మణుడూ' కనిపించడం లేదూ?"

"ఛ! ఏం మాటలమ్మా? ఎందుకలా దిగులు పడతావు?"

"దిగులా? నాకా? పిచ్చిదానిలాగున్నావే!" అని ఊర్మిళ నిరుత్సాహంగా నవ్వింది.

ఊర్మిళకు భర్తతో మధుర జీవితం వొక కల అయి పోయింది. లక్ష్మణుడు, సర్వశక్తులూ అన్నగారి సేవకే కేంద్రీకరించాడు. సోదర భక్తీ, సోదర శుశ్రూషా తన జీవిత ధర్మాలుగా చేసుకున్నాడు. 'భ్రాతృవాక్య పరి పాలనే' వ్రతంగా ఆచరిస్తున్నాడు.

పురుషుడు, తండ్రినో, అన్ననో, బ్రాహ్మల్నో సేవించి తరించే ధర్మాలెన్నో శాస్త్రాలలో రాశారుగానీ, భార్యని ప్రేమించి జీవించే ధర్మాన్ని ఏ శాస్త్రంలోనూ చెప్పలేదు.

లక్ష్మణుడికి, వివాహమూ భార్య రావడమూ అన్నీ, పురోహితులు నిర్ణయించిన లగ్నాలలో, పెద్దల వంశ మర్యాదలతో, శాస్త్రోక్తంగా జరిగిపోయాయి. తర్వాత ఆ విషయాలన్నీ మర్చిపోయాడు.

ఊర్మిళ, భర్త అనురాగంకోసం కొంతకాలం చాలా ఆశతో ప్రేమతో నిరీక్షించింది. కాలం, ఆమెకు నిరాశ లోనే ఊరట కలిగించింది. సంగీత సాధనతో, చిత్ర లేఖనంతో, చెలికత్తెల ఆటపాటలతో, కొంత కాలం నూతనోత్సాహంతోనూ, కొంతకాలం నిరుత్సాహం తోనూ, గడుస్తూ వుంటుంది, ఆమెకు.

"ఎంత దురదృష్టవంతురాలివి తల్లీ! తోడులేని జీవితం అయిపోయింది!" అని దాసీలు విచారించి నప్పుడు ఊర్మిళ ఎంతో కరుణతో నవ్వుతుంది. "ఈ అంతఃపురాలలో ఇన్ని వందల మంది రాణులూ, పరి చారికలూ, ఎన్నడూ పురుష స్పర్శ ఎరగని జీవితాలు

---

**44. అయోధ్యా, సర్గ 32, శ్లోకం 45:** రాముడు బ్రాహ్మలకూ, మిత్రులకూ, పరిచారికలకూ, బిచ్చగాళ్ళకూ 'యధార్హ సన్మానాలు' చేశాడు (ఎవరి కేది అర్హమో అది). అంటే, రాముడి వంటి రాజు సమస్త సిరిసంపదలూ పంచిపెట్టినప్పుడు కూడా బిచ్చగాళ్ళకు దొరికేది పిడికెడు గింజలు మాత్రమే. బిచ్చగాళ్ళకు అర్హమైనది బిచ్చమే. మహా దాతల దాన ధర్మాలవల్ల కటిక దరిద్రులకూ, బిచ్చగాళ్ళకూ వొరిగేదేమీ వుండదు. విలువయిన దానాలన్నీ కొందరికే అందుతాయి. ★

గడపడం లేదా? ఇంత విషాదం నా కళ్ళముందు చూస్తూ, నేను సుఖపడితే మాత్రం నాకు సిగ్గు కాదా? మీ దురదృష్టాన్ని పంచుకోవడమే నాకు సంతోషంగా వుంది" అంటూ వుంటుంది. ఆ భావనే ఆమెకు శాంతి నిచ్చింది.

ఊర్మిళ, తోటలో ఎగిరే పక్షులమీదనించి కొంచెం దృష్టి మరల్చి – "వాసంతీ! పెద్దాయన పట్టాభిషేకం ఆగిందట కదా? ఏం చేస్తున్నారిప్పుడు?" అని తనకేమీ పట్టనట్టు మళ్ళీ తోటవేపు మొహం తిప్పింది.

వాసంతి, దగ్గిరికి వొస్తూ – "అందుకేనమ్మా నేను కంగారుపడుతూ వొచ్చాను. అన్ని ఏర్పాట్లూ జరిగిపో యాయి. సీతాదేవికూడా భర్తతో అరణ్యాలకు వెళు తోంది. నీ భర్త కూడా అన్నగారితో ...."

ఊర్మిళ నవ్వి – "పిచ్చిదానా, అది వేరే చెప్పాలా?" అని కొత్త పక్షులకోసం బయటికి చూసింది.

"అమ్మా, నువ్వు కూడా నీ భర్తతో బయల్దేరుతావా?" అని వాసంతి ప్రేమగా అడిగింది.

ఊర్మిళ తలతిప్పి తెల్లబోతూ – "నా భర్తతోనా? ఎవరూ నా భర్త?" అని కోపంగా చూసింది.

వాసంతి నచ్చచెప్పే ధోరణిలో – "అలా అంటే లోకం మెచ్చుతుందా తల్లీ? అటుపోయి చూడు! సీతా దేవిని మహాపతివ్రత అని బ్రాహ్మలంతా కీర్తిస్తున్నారు. నీకు మాత్రం అపకీర్తి ఎందుకు?" అని ప్రేమగా మంద లించింది.

ఊర్మిళ లక్ష్యపెట్టక – "సీతకు కలిగినంత పతిభక్తి నాకెట్లా కలుగుతుందే!" అని నవ్వింది.

"భర్త ఎటువంటి వాడయినా అతడినే అనుసరించా లని ధర్మశాస్త్రాలన్నీ చెప్పాయంటారే! నీకు మాత్రం తెలియదా? పతి సేవచేసిన స్త్రీలకు స్వర్గ ప్రాప్తి కలుగు తుంది కదా?"

"పురుషులకైతే స్వర్గాలూ, రంభ కౌగిళ్ళూ గానీ, ఆడవాళ్ళేం చేసుకుంటారే స్వర్గాన్నీ?"

"అక్కడకూడా పతిసేవ చేసుకుంటూ ...."

"ఇంకా నయం! అక్కడ కూడా ఈ భర్తేనా ఏమిటి నాకు?"

"అమ్మా! నువ్విలా హాస్యాలతో జాగుచేస్తే కుదరదు. అవతల, వారంతా బయల్దేరుతున్నారు."

"బయల్దేరనియ్యి! వారి ఆశలు వారివి. ఆ తండ్రి పుణ్యం కోసం కొడుకుని అడవికి పంపిస్తున్నాడు. ఆ కొడుకు, పుణ్యంకోసం తండ్రిని వొదిలి వెళుతున్నాడు. ఏం పుణ్యమే అదీ? చూడ్డానికి కనబడుతుందా? ఏం చేసుకుంటారే దాన్నీ? ... వాసంతీ! మా పుట్టింట్లో ఒక నాస్తిక బ్రాహ్మడుండేవాడు. ఆయనకూడా చాలా శాస్త్రాలు చదివాడు. ఎన్నడూ పూజలూ వ్రతాలూ చేసే వాడుకాదు. ఎక్కడా దాన ధర్మాలు పట్టేవాడు కాదు. ఎంత గొప్పగా వుండేవే ఆయన మాటలు! సీత, ఆయన మాటలు చెవులబడితేనే పాపం అనుకునేది. ఆయన నవ్వుతూ మా అక్కకి – 'మహా పతివ్రత వవుతావు తల్లీ' అని హాస్యంగా జోస్యం చెప్పేవాడు. నిజంగానే ఆయన జోస్యం ఇవ్వాళ నిజమైంది. వాసంతీ! నాకు తెలీక అడుగుతానూ, స్వర్గంలో మన ముసలి మహారాజుని కూడా రంభ కౌగిలించుకుంటుందా? ఈయన మళ్ళీ పడుచువాడవుతాడా, లేకపోతే రంభ కౌగిట్లో కూడా వొణుకుతూ దగ్గుతూ వుంటాడా? పాపం రంభ కర్మ కావున్ను! ... అవునుగానీ వాసంతీ! ముందు దశరథ మహారాజూ, తర్వాత ఆయన కొడుకులూ కూడా ఆ రంభ కౌగిట్లోనే ఓలలాడతారా? అబ్బ! ఏం ఘోరమే! నాకిక ఆ స్వర్గం సంగతి చెప్పకు! నా శక్తికొద్దీ పాపం చేసుకుని నరకానికే పోతాను. ఇక చాలుగానీ వీణలు తీసుకురా! కొత్త పాటలు సాధన చేద్దాం" అని ఊర్మిళ మళ్ళీ పక్షుల చిత్రంవేపు చూసింది. ఆ చిత్రం చాలా సుందరంగా కనబడింది. పక్షులు రెండూ జీవంతో కువకువలాడుతున్నట్టే తోచాయి.

ఊర్మిళ సంతోషంగా – "వాసంతీ! వీటికిప్పుడు ప్రాణాలొస్తే ....?" అని ఆశ్చర్యంగా చూసింది.

వాసంతి నవ్వి – "నీ తల మీదనుంచి ఎగిరి తోట లోకి పారిపోతాయి" అంటూ వీణ తెచ్చి ఊర్మిళ కందిం చింది.

★ ★ ★

రాముడు అరణ్యాలకు వెళ్తున్నాడనే వార్త పట్టణ మంతా పాకింది. ఎక్కడ చూసినా జనం ఆ సంగతే మాట్లాడుకోవడం మొదలుపెట్టారు.

బ్రాహ్మలూ, రాజ బంధువులూ, ఉన్నతోద్యోగులూ, సంపన్నులూ దశరథుడి మందిరంనిండా నిండి పోయారు. ఎక్కడికక్కడ గుంపులుగా చేరారు.

"రాముడికెంత పితృ భక్తి! ఆహా! ఎంత ఉత్తముడు!"

"దశరథుడిదెంత సత్య మార్గం! ఎంత ధర్మాత్ముడు! ఓహో!"

"కైకేయి ఎంత దుర్మార్గురాలు! ఎంత కఠినంగా తండ్రీ కొడుకుల్ని విడదీస్తోందో!"

గట్టిగా మాట్లాడుకుంటూ నిట్టూరుస్తున్నారు. ఇటూ అటూ చూసి పక్క వాళ్ళతో రహస్యంగా – "అసలు భర తుడికే రాజ్యం హక్కటయ్యా! దశరథుడేనాడో మామ గారికి వాగ్దానం చేశాడట! మన కిన్నాళ్ళూ తెలీదు సుమా! మరి మహారాజు ఇప్పుడు ఆడిన మాట తప్ప డానికెలా సిద్ధపడ్డాడో! పైగా సత్యవంతుడనే కీర్తి కూడానూ. అసలు మనకీ సంగతి తెలిస్తే భరతుడితోటే వ్యవహారాలవీ చూసుకునే వాళ్ళం .... గట్టిగా మాట్లా

దకు .... ఎవరో వొస్తున్నారు" అంటూ గుసగుసలాడు కుంటున్నారు.

కొందరు మేధావులు చాలా విచారిస్తూ – "మహా రాజు చాలా తెలివి తక్కువ పని చేశాడు సుమా! కైకని ఏదో వంకతో పుట్టింటికి పంపించి రాముడికి పట్టాభిషేకం చేస్తే సరిపోయేది కాదూ?" అని తల పోస్తున్నారు.

"అంత మోసం చేస్తే కేకయరాజు వూరుకుంటాడా? సైన్యాలతో రాడూ?"

"వొస్తే రాముడు చూసుకుంటాడు! అతనేం చేత కానివాడా? మహారాజు ఇన్నేళ్ళు రాజ్యంచేసి ఇంత చిన్న రాజకీయం గ్రహించలేకపోయాడే!"

"కైక ఆడది కదా, అంత తెలివీ, సాహసం వుండ వనుకున్నాడేమో!"

"ఏమోగాని రేపు భరతుడు వొచ్చాక మనం అతడి పట్టు సంపాదించాలి" అంటూ చర్చించుకుంటూ పైకి మళ్ళీ – "ఆహా! రాముడెంత యోగ్యుడో! ఎంత ఉత్త ముడో!" అంటూ చెప్పుకుంటున్నారు.

జనంలో పైకి వినబడే పొగడ్తలు వింటూ, రాముడు, మొహం గంభీరంగా పెట్టి దశరధుడి ముందు నిలబడి వున్నాడు – నార పంచతో! పట్టు బట్టలు లేవు. ఆభర ణాలు లేవు. ఎప్పుడూ సౌందర్యంతో కళకళలాడే ఆ రాముడూ, ఈ రాముడూ, వొక రాముడేనా – అన్నంత సందేహం కలిగింది జనానికి.

లక్ష్మణుడుకూడా నార పంచతో అన్నగారి పక్కన నిలబడివున్నాడు.

సీత పట్టుచీర మీద నారచీర కప్పుకుని సిగ్గుతో తల వంచుకుని నిలబడి వుంది.

రుషుల వేషాలతో వనవాసానికి సిద్ధంగా వున్న కొడుకుల్ని చూసిన తర్వాత, దశరధుడికి అప్పటికి ధైర్యం కలిగింది. రాముడు తనను ధిక్కరించి రాజ్యం ఆక్ర మించే ప్రయత్నం చెయ్యడనే నమ్మకం కుదిరింది. అంత వరకూ కొడుకులతో 'ఒక్కమాటైనా' మాట్లాడని తండ్రి, తలవొంచి కన్నీళ్ళు కారుస్తూ ప్రారంభించాడు. "నాయనా! కైకకి వరాలిచ్చి మోసపోయాను. సత్య పాశంతో కట్టుబడిపోయాను. అయినప్పటికీ నువ్వు అడ వుల్లో జీవించడం నాకు సమ్మతం కాదు. నన్ను ధిక్కరించి నువ్వే పట్టాభిషేకం చేసుకో. నువ్వు నా కళ్ళముందు వుంటే నాకదే మహాభాగ్యం నాయనా! నా వంటి తండ్రిని పూజించడం మాత్రం ఎందుకు?" అని తల వాలేసి కూర్చున్నాడు.[45]

తండ్రి మాటల వెనక తండ్రి మనసులో అభిప్రాయ మేమిటో రాముడికి తెలియనిది కాదు. తను పట్టాభిషే కానికి సిద్ధపడి వొచ్చినప్పుడు కన్నెత్తయినా చూడని తండ్రి, తన సర్వస్వమూ దానధర్మాలు చేసేసి నార గుడ్డలతో అడవికి పోతూ వుంటే – "నాయనా! నన్ను ధిక్కరించి రాజ్యం తీసుకో" అనడం రాముడి కేమీ ఓదార్పు కలిగించలేదు. కొడుకుల స్వేచ్ఛనీ, ధిక్కారాన్నీ, తన తండ్రి మహావమానంగా, అపకీర్తిగా భావిస్తాడని రాముడికి చిన్నతనం నించీ అనుభవమే. లోకానికి తన ధార్మికత్వం ప్రకటించాలని మాత్రమే తండ్రి ఆ మాట లంటున్నాడని గ్రహించిన రాముడు, ఆ లోకానికి, తన ఔన్నత్యాన్ని కూడా చూపించాలని ఇంకా వినయంగా వొంగాడు "మహారాజా! నేను మీ పుత్రుణ్ణి! మీ భృత్యుణ్ణి! కన్నతండ్రినీ, ప్రభువునీ ధిక్కరించే పాపానికి వొడిగట్ట గలనా? మీ సంతోషం కోసం నా సర్వసుఖాల్నీ, నా ప్రాణాన్నీ, స్వర్గాన్నీ, సీతనీ కూడా విడిచిపెట్టగలను" అని ఇంకా వొంగి నమస్కరించాడు.

సరసనే తలవొంచుకుని నించుని వున్న సీత నిర్ఘాంతపోతూ తలెత్తింది. "సీతా! నిన్ను విడిచి స్వర్గానికి కూడా వెళ్ళను" అన్న మధుర శబ్దాలు ఇంకా చెవుల్లో నిలిచే వున్నాయి. అంతలోనే మళ్ళీ – "నీ కోసం సీతని కూడా విడిచిపెడతాను" అని తండ్రితో అంటోన్న భర్తని చూసి సీత ఖిన్నురాలై తల వొంచుకుంది.

రాణుల శోకాలతో అంతఃపుర మందిరాలు దద్దరిల్లు తున్నాయి.

దశరధుడు కొంచెం దగ్గి, తల పంకిస్తూ – "నే నెరుగుదును నాయనా! నువ్వు సద్గుణ సంపన్నుడివి. రఘుకులానికే కీర్తి తెస్తావు. తండ్రి సంతోషం కోసం ఇంత త్యాగం చేస్తున్నావు. ఇలా నువ్వు తప్ప లోకంలో ఇంకెవరు చేస్తారు? అబ్బే! ఎవరూ చెయ్యరు. రాముడు రాముడే. నీ పితృభక్తీ .... నీ త్యాగనిరతీ ...." నిజంగానే దగ్గువొచ్చి పొగడ్తలు ఆపవలసి వొచ్చింది. తర్వాత రావలసిన గొప్పగొప్ప పొగడ్తల్ని దగ్గుతెర మింగేసింది.

రాముడి మొహం గాంభీర్యంతో నిండింది.

దశరధుడు దగ్గడం ఆపి, తల కిందకీ మీదకీ

---

**45.**అయోధ్యా, సర్గ 34, 35, 36: రాముడు రాజ్యం వదిలి వెళ్తూ వుండగా దశరధుడు మాట్లాడిన మాటల్లో సత్యమెంతో కపటమెంతో చూడండి! "నన్ను ధిక్కరించి నువ్వే పట్టాభిషేకం చేసుకో" అని కొడుకుతో అనడం, నిజంగా కొడుకు ఆ పని చెయ్యాలనే కోరికతోనేనా? రాముడు నిజంగా తనని వ్యతిరేకించి రాజ్యం ఆక్రమిస్తే దశరధుడు సంతోషిస్తాడా? – సంతో షించడు. మరి ఆ రకం మాటలెందుకు? లోకంకోసం అనాలి కాబట్టి అనడం. అంతా ఆత్మ వంచనా, లోక వంచనా. ఆ సమాజ నియమాల్లోనే, ఆ సత్యవ్రతాల్లోనే, ఆ మనుషుల జీవిత విధానాల్లోనే, ఆ వంచన వుంది. ★

వూపుతూ చెప్పుకొచ్చాడు. – “అరణ్యాలకు పోవద్దంటే మానవు కదా? నీ పట్టుదల గొప్పది. నిన్ను నీ పితృభక్తి నుంచి నేనుమాత్రం మళ్ళించగలనా? నా పాద సేవవల్ల నీకు ఇహ – పరలోక సుఖాలన్నీ కలుగు తాయి. సందేహం లేదు” అని, కొడుకు ఇహ పర లోకాల్ని ఎక్కడ సందేహిస్తాడోనని ధైర్యంచెప్పి మళ్ళీ వూగుతూ ప్రారంభించాడు. “నాయనా! అరణ్యాలలో కూడా సుఖంగానే వుండవొచ్చును. అవును, ఏమంత కష్టం కాదు. అడవులనిండా గొప్ప గొప్ప వృక్షాలూ, నదులూ, ఎన్నో రకాల పక్షులూ .... అవన్నీ చూస్తోంటే సంతోషంగానే గడుస్తుంది. నిత్యం జంతువుల్ని వేటా డుతూ, పుణ్య క్షేత్రాలు సందర్శిస్తూ, ఋషులతో వేద చర్చలు జరుపుతూ .... ఊఁ .... ఫర్వాలేదు, బాగానే వుంటుంది. ఈ రాత్రికి మాత్రం ఆగు. నీకు కావలసిన వన్నీ తిని రేపు ఉదయాన్నే బయల్దేరి వెళ్ళవచ్చును” అని దయగా చూసి దగ్గడం మొదలుపెట్టాడు.

రాముడు తన గాంభీర్యంలో కూడా నిర్ఘాంత పోతూ చూశాడు. తను ఎన్నో సుఖాలు వొదులుకుని కష్ట భూయిష్టమైన వనవాసానికి పోతూ వుంటే, ‘అక్కడ కూడా బాగానే వుంటుంద’ని అంతమంది జనం ముందు .... కైక ముందు, తండ్రి అనడం, రాముడికి చాలా కష్టం కలిగించింది. తండ్రే అలా అంటే, తను చేస్తున్న త్యాగం ఏమంత గొప్పది కాదని లోకం పరిగణించదూ? వన వాసం కూడా సౌఖ్యమే అయితే, తను చేసే త్యాగం ఏమిటి? – రాముడికే ఆ సందేహం వచ్చి నిరుత్సాహం కలిగింది. లోపల నిష్ఠూరంతో, పైకి తండ్రిని గంభీరంగా చూస్తూ “ఒద్దు మహారాజా! కావలసినవన్నీ ఈ రాత్రి తిన్నంత మాత్రాన రేపటి నుంచీ నాకెవరు పెడతారు? అక్కడే ఆకో అలమో, గడ్డో గాదమో తింటాను. కొండల్లో కోనల్లో, రాళ్ళల్లో రప్పల్లో పడి తిరుగుతాను. మీ ఆజ్ఞ వల్ల అన్నీ సుఖంగానే వుంటాయి. నా గురించి ఎన్నడూ విచారించకండి!” అని తల వొంచుకున్నాడు.

దశరథుడు కొంచెం సిగ్గుపడ్డాడు. తన నిర్దోషి త్వాన్ని ప్రకటించడానికి వెంటనే ఒక మంత్రిని పిలిచి – “తక్షణం రాముడితో సైన్యాల్ని పంపు! వీరుల్ని పంపు! వేశ్యల్ని పంపు! వర్తకుల్ని పంపు! ధన ధాన్యాలు పంపు! రాముడికి అడవుల్లో ఏమీ లోటు లేకుండా అక్కడ అన్నీ ఏర్పాటు చెయ్యి!” అని ఆజ్ఞాపించాడు.

అంతవరకూ మౌనంగా వున్న కైక వెంటనే కలగ జేసుకుంది – “మహారాజా! రాముడు నారబట్టలతో అడవుల్లో ఋషుల జీవనం గడపాలని నేను మొదటే అడిగాను. అతడి వెంట చిల్లిగవ్వయినా పంపడానికి వీలులేదు. సైన్యాలూ, వీరులూ, సమస్త సిరిసంపదలూ ఇచ్చి అతణ్ణి మళ్ళీ బలసంపన్నుణ్ణి చేసే పక్షంలో అడవు లకు పంపడం ఎందుకు?” అని నిష్కర్షగా వ్యతిరేకిం చింది.

దశరథుడు కోపంతో మండిపడుతూ – “ఎంత దుష్టురాలివైపోయావే! నీ మొహం మండా! రాముణ్ణి ఇన్ని కష్టాలు పెడుతున్నావే, ఇంకా చాలలేదా?” అని వురిమి చూశాడు.

“రాముణ్ణి కష్టాలు పెట్టేది నేను కాదు, నువ్వు! అతడు నిన్ను పూజించే కష్టాలు తెచ్చుకుంటున్నాడు. రాజ్యంకోసం నీతో మంత్రాంగం చేసి తన కష్టాలు తనే తెచ్చుకున్నాడు. లక్ష్మణుణ్ణో శతృఘ్నుణ్ణో అడవులకు పంపమని నేను కోరానా? తనకు హక్కులేని రాజ్యాన్ని తీసుకోవడానికి అతడెందుకు సిద్ధపడాలి? అయినా, రాముడు స్థితప్రజ్ఞుడంటారే ఋషులు! సుఖానికి సంతో షించడనీ, కష్టానికి దుఃఖించడనీ కీర్తిస్తారే! అంత స్థిత ప్రజ్ఞుడికి రాజభోగాలైతే ఏమిటి, వనవాసం అయితే ఏమిటి? అటువంటి వాడికోసం మీరంతా ఇంతగా దుఃఖిస్తారెందుకు?” అని తీక్షణంగా చూసింది కైక.

రాముడు ఆ ప్రసక్తి తప్పించాలని గంభీరంగా “మహారాజా! గుర్రాన్నే విడిచినవాడికి జీనుతో పనే ముంది? తపో జీవనంతో గడిపే నా కోసం, సైన్యాలూ వీరులూ ఎందుకు? మీరు దుఃఖించకండి! ఈ సిరి సంపదలూ, ఈ సుందర పట్టణాలూ అన్నీ నేను త్యజిస్తున్నాను. ఈ విశాల సామ్రాజ్యాన్ని నేను భరతుడి కోసం త్యాగం చేస్తున్నాను. భరతుణ్ణి పిలిపించి అతడికే పట్టాభి షేకం చెయ్యండి” అని నిర్వికారంగా చూశాడు.

“శుభం! శుభం!” అని బ్రాహ్మలు కేకలు పెట్టారు, అలవాటు చొప్పున.

కైక కనుబొమలు ముడుస్తూ – “రామా! నువ్వీ రాజ్యమంతా భరతుడికి త్యాగం చేస్తున్నావనడం సమం జసం కాదు సుమా! నీది కానిదాన్ని నువ్వు త్యాగం చెయ్యడం ఏమిటి? నువ్వు స్వీకరించనిదాన్ని త్యజించడం ఏమిటి? రాజ్యం ఇప్పటికీ దశరథ మహా రాజుదే. అందులో నీ దయాధర్మాలకు ఆస్కారం లేదు” అని రాముణ్ణి మందలించింది.

దశరథుడు తలవొంచి గొణుక్కుంటూ – “నీ మొహం మండా! పాపిష్టిదానా! పదిమందిలో నవ్వుల పాలు చేశావు కదే! నీ దుంపతెగా! నీకు చావు రానూ!” అని తిట్టుకుంటూ వొణుకుతూ కూర్చున్నాడు.

రాముడు తలవొంచుకుని నించున్నాడు. సీతకు భర్తమీద కోపంపోయి ప్రేమ పొంగి కళ్ళు చెమర్చాయి.

సీతని కూడా కైకేయి అడవులకు పంపుతోందని బంధువులూ, పురోహితులూ కైకని దూషించడం ప్రారం భించారు. కొన్ని మాటలు కైక చెవిన కూడా పడ్డాయి.

కైక తీక్షణంగా ఆ జనం వేపు చూస్తూ – “సీత

కూడా వెళ్ళాలని నేను కోరలేదు. అధిక ప్రసంగాలు చాలించండి!" అనడంతో అందరూ మౌనాలు వహించారు.

సీత అందరినీ సంతోషపెట్టడానికి – "నా కోసం మీరు విచారించకండి. నా భర్త వెంట నేను వెళ్ళక మానను. నేను పూజించవలసిన నా భర్త పాదాలు అడవుల్లో తిరుగుతూ వుండగా నేను ఇక్కడెలా వుండ గలను?" అంది.

"బాగు, బాగు!" అని మళ్ళీ కేకలేశారు బ్రాహ్మలు.

వశిష్టుడి ఆధ్వర్యంలో పురోహితులంతా చర్చించి, సీత నారబట్టలు కట్టుకోనవసరం లేదనీ, అంతః పురాలలో వున్నట్టే విలువయిన చీరలతో, ఆభరణాలతో, అలంకారాలతో వుండవొచ్చుననీ, తేల్చారు.

దశరధుడు మంత్రుల్ని పిలిచి – "సీతకు కావలసిన వస్త్రాలూ, ఆభరణాలూ తెప్పించి ఇవ్వండి!" అని ఆజ్ఞాపించాడు.

వెంటనే పురోహితులంతా, పద్నాలుగు సంవత్సరాల వరకూ రాచ స్త్రీకి ఎన్ని చీరలు అవసరమవుతాయో లెక్కలు వేశారు. పంచాంగాలు తిప్పారు. పుణ్యదినాలు చూశారు. వాటికి పండుగలూ పబ్బాలూ కలిపి కూడారు. పూజలూ, వ్రతాలూ జోడించారు. అన్ని కార్యాలకూ దశరథ మహారాజు కోడలికి సరికొత్త పట్టుచీరలు వుండవలసిందే. సంవత్సరానికి నూరు చీరలకు పైగా లెక్క తేలింది. ఎంత తగ్గించినా సంవత్సరానికి నలభయి చీరలయినా వుంచక తప్పలేదు. పద్నాలుగు సంవత్సరాలకు 560 చీరలయ్యాయి. ఆ పైన ఆభరణాలూ, అలంకార వస్తువులూ, సుగంధ ద్రవ్యాలూ, పసుపు కుంకాలూ, రాముడికీ లక్ష్మణుడికీ రెండేసి జతల నార బట్టలూ, కవచాలూ, అస్త్రాలూ – అన్నీ సర్ది, ముత్తయిదువులంతా పర్వతం అంత మూట తయారుచేశారు.

'రుషి జీవితం గడపవలసిన వాడికి కవచాలూ అస్త్రాలూ ఎందుకు?' అని ఆశ్చర్యపోయినవాళ్ళు ఆశ్చర్యపోయారు.

సీత తెల్లని పట్టుచీర కట్టుకుని, వంటినిండా నగలు పెట్టుకుని, తల్లో పువ్వులు పెట్టుకుని, ప్రయాణానికి సిద్ధ మయింది.

కోడలి పాతివ్రత్యానికి కౌసల్య చాలా సంతోషంతో చూసింది. జీవితమంతా భర్త అనాదరంతో దుఃఖించి, పాతివ్రత్యానికి విసిగి, భర్త మొహం చూడడానికే రోత పడుతూ, తన భర్తని తన కొడుకు వధించి అయినా రాజ్యం ఆక్రమించాలని కోరుకున్న కౌసల్య, కోడల్ని దగ్గిరికి తీసుకుంటూ పతివ్రతా ధర్మాలు బోధించడం మొదలుపెట్టింది. "అమ్మా! స్త్రీకి భర్తే దైవం. భర్త సేవ కన్నా స్త్రీకి వేరు జీవితం లేదు సుమా! నువ్వింకా చిన్న దానివి. స్త్రీల బుద్ధి గ్రహించలేవు. ఆడదాని బుద్ధికి నిలకడ వుండదు. మహా చెడ్డది అది. భర్త ప్రేమించిన కొద్దీ అతణ్ణి చులకన చేస్తారు ఆడవాళ్ళు. భర్త పేదవాడయ్యాడో అతణ్ణి పూర్వం గౌరవించినట్టు గౌరవించక అవమానాలు చేస్తారు. భర్త ఏ ముచ్చట కోసమో ఇంకో పెళ్ళి చేసుకోవడం వంటి ఏ చిన్న పని చేసినా, దాన్ని మహాపరాధంగా ఎంచి రాద్ధాంతం చేస్తారు. ఆడదాని బుద్ధి వికారపు బుద్ధి సుమా!" అంటూ, ఆ దెప్పుళ్ళన్నీ కైక గ్రహిస్తోందో లేదోనని అప్పుడప్పుడూ అటు క్రీగంట చూస్తూ మళ్ళీ కొనసాగించింది. – "నువ్వు మాత్రం అటువంటి దుష్ట స్వభావం చేరనివ్వకు తల్లీ! నీ భర్తకు రాజ్యం పోయింది కదా అని అతణ్ణి చులకన చెయ్యకు. అతణ్ణి దైవంగా పూజిస్తూ వుండాలి!" అంటూ నీతులు బోధించి, కైక దుర్మార్గాన్నీ తన సౌశీల్యాన్నీ జనం గ్రహించారో లేదో అని తహ తహ లాడింది.

జీవితకాలమంతా – అస్వతంత్రతతో, అసూయా ద్వేషాలతో, శుష్కాడంబరాలతో, శూన్య ధర్మాలతో, జుగుప్సాకరమయిన నీతులతో, సారహీనంగా కాల గర్భంలో కలిసిపోయి, చరమ దశలో... వృద్ధాప్యంలో ... నిరుత్సాహంలో ... కళ్ళెత్తి చూసినప్పుడు, ఏ అంతఃపుర స్త్రీకయినా పడమటి దిక్కులో కనపడే ఆఖరి వెలుగు – ఆ 'పాతివ్రత్యం'! ఆ కీర్తి కాంతి!!

కన్నీళ్ళతో మొహం వొంచుకున్న అత్తగారికి, సీత భక్తితో నమస్కరిస్తూ – "దుష్ట స్త్రీలతో నన్ను పోల్చ వద్దు. చిన్నతనంలోనే నా తల్లి దండ్రులు పతివ్రతా ధర్మాలన్నీ నేర్పారు నాకు. నా ప్రాణాలయినా విడుస్తాను గానీ, నా భర్త పాదాలు విడువను" అని రాముడి పాదాలవేపు వొంగి నమస్కరించింది.[46]

మళ్ళీ అంతఃపురం శోకాలతో ప్రతిధ్వనించింది.

సుమంత్రుడు రథం తోలుకు వొచ్చాడు.

దశరధుడికి రాముణ్ణి వొదలడం కష్టంగానే వుంది. అటువంటి వినయ సంపన్నుణ్ణి, రోజుకు వందసార్లు వొంగి నమస్కరించే కొడుకుని, అన్ని సంవత్సరాలు వొదిలి, కొన్ని వేల నమస్కారాలు లేకుండా వుండాలంటే, దుఃఖం ముంచుకొచ్చింది. వొణుకుతూ తల ఆడిస్తూ, "నా కెందుకీ సత్యవ్రతాలు? ఎందుకీ ధర్మనిష్టలు? అయ్యో, నేను అధర్మపరుణ్ణి అయితే ఎంత బాగుండును! బొత్తిగా ఇంత మాట తప్పని పుణ్యశాలిని అయిపో

---

**46.** అయోధ్యా, సర్గ 39, శ్లోకాలు 20 నించి 25: కౌసల్య మాటలు. శ్లోకాలు 27-31: సీత మాటలు.
స్త్రీలు చెడ్డ వాళ్ళని స్త్రీలే చెపుతున్నారు. స్త్రీలు చెడ్డగా ప్రవర్తిస్తారని ఈ స్త్రీలు నిజంగానే నమ్ముతున్నారు! ★

యానే!" అంటూ తన సద్గుణాలు తల్చుకుని దుఃఖించాడు. రాముణ్ణి కొంచెం సిగ్గుతో సంకోచంగా చూస్తూ, "నాయనా! లగ్నం మంచిగా వుంది. బయల్దేరు. దారుల్లో ముళ్ళూ అవీ లేకుండా చూసుకుంటూ నడవాలి సుమా! ఎప్పటి కప్పుడు శుభ ముహూర్తాలు చూసుకుంటూ కార్యాలు చెయ్యాలి" అని తల వాల్చి కన్నీళ్ళు కార్చాడు – "నువ్వు లేకపోతే ఇక నేనెలా జీవించ గలను?" అని, ఇక తను జీవించడం కుదరదేమోనని దుఃఖించడం ప్రారంభించాడు.

అందరూ విషాదంలో, ఉద్వేగంలో మునిగిపోయారు. నిట్టూర్పులతో, వెక్కిళ్ళతో, కళ్ళు వొత్తుకుంటూ రథం చుట్టూ చేరారు.

సుమంత్రుడు ముందుతొట్లో కూర్చుని, పగ్గాలు చేతిలోకి తీసుకున్నాడు. రాముడూ, లక్ష్మణుడూ, సీతా పెద్దలందరికీ నమస్కారాలు చేసి రథం ఎక్కారు. రథం మీద బట్టల మూటా, కత్తులూ, కవచాలూ, ఒక గంపా, దుంపలు తవ్వుకునే పలుగూ, గొడ్డలీ సర్దిపెట్టారు. రథం కదిలింది. ఎండలో నించున్న గుర్రాలు తలలు ఝాడించి, పరుగు లంకించుకున్నాయి.

దశరథుడు ఏడుస్తూ పరిచారికల చేతుల్లో వాలిపోయాడు – రాత్రి నించి ఏమీ తినక.

సుమిత్ర, లక్ష్మణుణ్ణే చూస్తూ కళ్ళనిండా నీళ్ళతో నిలబడింది.

కౌసల్య, రాజమర్యాదలన్నీ మరిచి పెద్ద కంఠంతో – "నాయనా, రామా! నాయనా!" అంటూ రథం వెనకే పరుగెత్తబోయింది. దాసీలు ఆమెని బలవంతంగా లోపలికి తీసుకుపోయారు.

ఒంటరిగా తన గదిలో కూర్చున్న కైక, జలజలా రాలుతోన్న కన్నీళ్ళు వొత్తుకుంది.

వీధుల్లో గుమిగూడిన జనం, రుషి వేషాలతో రథంలో వెళుతోన్న రాజకుమారుల్ని విచారపడుతూ చూశారు.

"రుషులు, నడిచి వెళ్ళాలిగానీ, రథా లెక్కవొచ్చునా?" అని ఎవరో, ఎవరి చెవిలోకో వొక సందేహం విసిరారు.

రథం వేగంగా సాగుతోంది.

అంతఃపురాలనించి శోకాలూ, వొక వీణ తీగల సన్నని విషాద స్వరాలూ, రథాన్ని కొంతదూరం వెంటాడాయి.

మహా పండితులూ, జ్యోతిశ్శాస్త్ర విద్వాంసులూ అయిన పురోహితులు నిర్ణయించిన 'పట్టాభిషేక' ముహూర్తం, 'వనవాస' ముహూర్తంగా మారిపోయింది!

★ ★ ★

రథం ఆ సాయంకాలం వరకూ ప్రయాణంచేసి తమసా నదీ తీరం చేరింది. గుర్రాలు అలిసి రొప్పుతున్నాయి. మనుషులకు కూడా అలసట కలిగింది. ఆ రాత్రి అక్కడే ఆగుదామన్నాడు రాముడు. సుమంత్రుడు రథం విప్పి గుర్రాలకు నీళ్ళు పెట్టి మేత వేశాడు.

నదీతీరం ప్రశాంతంగా వుంది. దూరాన చెట్ల చాటున సూర్యుడస్తమిస్తున్నాడు. నదిలో అక్కడక్కడా సూర్య కిరణాలు పడి నీళ్ళు తళతళ మెరుస్తున్నాయి. గాలి చల్లగా పరిమళంగా కొమ్మలలోంచి పూలని తాకుతూ వొస్తోంది. ఆకాశం నిండా పక్షులు గుంపులు గుంపులుగా ఎగురుతూ రకరకాల కూతలతో కోలాహలం చేస్తున్నాయి.

అందరూ నదిలో కాళ్ళు కడుక్కుని సూర్య నమస్కారాలు చేశారు.

రాముడూ, సీతా, వొక చెట్టుకింద కూర్చున్నారు. లక్ష్మణుడు కొంచెం దూరంలో తలవాల్చి నించున్నాడు.

సీత చిరునవ్వుతో, ఎగిరే పక్షులవేపూ, నదిలో ఎగిరే వాటి నీడలవేపూ చూస్తోంది సంతోషంతో. గొప్ప వీరుడూ, సమర్థుడూ అయిన భర్త సరసన వున్నాడనే స్పృహతో నిర్విచారంగా వుంది.

లక్ష్మణుడు వనవాసానికి సిద్ధమయిన క్షణంలోనే విచారాలన్నీ వొదిలేశాడు. సోదర శుశ్రూష కేంలోటు చేస్తానో అన్న ధ్యాస తప్ప వేరే చింత లేదు అతనికిప్పుడు.

రాముడు మాత్రం, ఒక్కపూటలో అంతా కలగా మారిపోయిన విషయాల్ని విస్మరించలేకపోతున్నాడు. నమ్మలేనంత దిగ్భ్రమతో విచారపడుతూ తలవాల్చి కూర్చున్నాడు.

చీకటి అలుముకుంటోంది. పక్షుల సందడి ఎక్కువయింది. నది మీద గాలి మరీ చల్లనవుతోంది.

రాముడు నది వేపు చూశాడు. పక్షుల వేపు చూశాడు – "లక్ష్మణా! అటు చూడు, నది శోకించి కన్నీళ్ళతో నిండినట్టు వుంది! ఇటు చూడు, పక్షుల కూతలతో అడవి రోదిస్తున్నట్టు వుంది!" అని, తన బాధ ప్రకృతికి కూడా బాధ అయింది కదా అని, నిట్టూర్చాడు.

సీత, వొక గూటిలో వొదిగిన రెండు పక్షులవేపు చూస్తూ, భర్త అమాయకత్వానికి మురిసి – "అది పక్షులు రోదించడం కాదు. గూళ్ళకు చేరుకున్నాయి. మన తోటలో కూడా రోజూ సాయంత్రాలు ఇలాగే గోల చేస్తాయి పిట్టలన్నీ" అంది నవ్వుతూ.

రాముడికి తన తోటా, ఆ అంతఃపురం, ఆ పట్టణం అన్నీ కళ్ళలో మెదిలి – "లక్ష్మణా! ఇప్పుడు మన వారందరూ మనకోసం దుఃఖపడుతూ వుంటారు. ప్రజలందరూ మన కష్టాల గురించే శోకిస్తూ వుంటారు" అని మళ్ళీ తల వొంచుకుని విచారంలో మునిగాడు.

కొంతసేపటికి లక్ష్మణుడు లేచి పండుటాకులన్నీ పోగుచేసి పక్క తయారు చేశాడు. రాముడు పళ్ళు అయినా తినే ఉత్సాహం లేక మంచినీళ్ళు తాగి పడుకోవ డానికి సిద్ధపడుతూ సీతని చూశాడు. వయసులో వున్న ఆడది! వొంటినిండా నగలు! చెపితే విన్నది కాదు .... క్రూర మృగాలు లేకపోవచ్చు గానీ, దొంగలూ, కాము కులూ వుండరనే నమ్మకమేమిటి? పోతుటీగ అయినా దూరని అంతఃపురాలలో స్త్రీలకెంత రక్షణ! పైట జారు తున్నట్టుందే! .... చూసుకోదేం?– హెచ్చరికగా సీత మొహంలోకి చూశాడు.

సీత చిరునవ్వు నవ్వింది.

"సీతా, చలిగా వున్నట్టుంది. చీర భుజాల చుట్టూ కప్పుకో!"

"అవును, కొంచెం చలిగానే వుంది" అని సీత పైట తీసి భుజాల చుట్టూ కప్పుకుని పిట్టలాగ ముడుచుకుంది.

సుమంత్రుడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

లక్ష్మణుడు, ఆ దంపతుల కష్టం చూడలేక తల వొంచుకున్నాడు.

రాముడు మళ్ళీ చుట్టూ చూసి – "లక్ష్మణా! ఆ చీరల మూట జాగ్రత్త! మన దగ్గిరగా పెట్టు. అప్పు డప్పుడూ నాలుగు వేపులా చూస్తూ వుండు!" అని మళ్ళీ సీతని చూశాడు.

అవసరమైనప్పుడు తనను తను రక్షించుకుంటూ, రథాన్నీ గుర్రాల్నీ సారథినీ రక్షిస్తూ, 11 వేల మంది శత్రు వీరులతో యుద్ధం చెయ్యగలడని రుషులు పొగిడే రాముడు, చుట్టూ చూసి, సీతను చూసి, లక్ష్మణుణ్ణి చూస్తూ – "లక్ష్మణా! నువ్వు రావడం చాలా మంచిద యింది. లేకపోతే సీతని రక్షించడం నా ఒక్కడికీ కష్టమై పోయేది" అని కొంచెం ధైర్యంగా ఆకులమీదకు వొరి గాడు.[47]

సీత ఆశ్చర్యంగా భర్తవేపు చూసింది. లక్ష్మణుడు రాకపోతే, తన భర్తకి తనని రక్షించడం కష్టమయ్యేదా? భర్త ఆజ్ఞని ధిక్కరించి వొక్క అడుగయినా తప్పుగా వెయ్యననీ, గీచిన గీటు దాటననీ, తను ఎన్నో విధాల చెప్పలేదా? తన ప్రవర్తన మీద అంత విశ్వాసం లేదా? సీత, సిగ్గుపడి తల వొంచుకుంది.

లక్ష్మణుడు తయారుచేసిన ఆకుల పక్క మీద వాలిన రాముడు, శరీరానికి ఆకులు గుచ్చుకుంటోంటే లేచి చేతులతో ఆకులన్నీ సరిచేసుకున్నాడు. సీత మనసు మెత్త నయింది. ఎన్నడూ కష్టం ఎరగని సుకుమారుడు! మహా రాజు కావలసిన పుణ్యపురుషుడు! ఆయనకా ఇంత దయనీయ స్థితి! సీత మనసు ఆర్ద్రతతో ద్రవించింది. భర్తని తన వొడిలో కష్టం తెలియకుండా నిద్రపుచ్చాలని తహ తహ కలిగింది. లక్ష్మణుడూ, సుమంత్రుడూ వుండగా అటు చూడడానికే సిగ్గు కలిగి వూరుకుంది. మూటలో నించి నాలుగు చీరలు తీసి ఆ ఆకుల మీద వొత్తుగా పక్కవేద్దామని అయినా సీతకు తోచ లేదు. భర్తకు సేవలు చెయ్యాలనే ఆరాటమే గానీ, ఆమె ఎప్పుడూ ఎవరికీ సేవలు చేసింది కాదు. సేవలు చెయ్యడం తెలిసిందీ కాదు.

రాముడు ఆకులు సరిచేసుకుంటూ, గంధపుచెక్క పానుపులూ, పట్టు పరుపులూ, నున్నని దిళ్ళూ, మంచం తెరలూ గుర్తొచ్చి – "లక్ష్మణా! ఇక నువ్వు ఇల్లూ వాకిలీ, సుఖాలూ తలుచుకోకూడదు సుమా! మనం రుషులం! రుషుల జీవితం గడపాలి .... ఆ చీరల మూట దగ్గరగా పెట్టావా? నగలుకూడా వున్నాయి. కొంచెం చూస్తూ వుండు చుట్టూ. ఈ రాత్రే మన వనవాసంలో మొట్ట మొదటి రోజు. ఎలాగో తెల్లవారితే ఒక రోజు అయి పోయినట్టే. ఇంకా 13 సంవత్సరాల 11 నెలల 29 రోజులు గడిస్తే చాలు!" అని సీతవేపు తిరిగి పడు కున్నాడు – ఎందుకయినా మంచిదని.

అన్నగారు నిద్రపోయారని నమ్మకం కలిగాక లక్ష్మణుడు మూటని దగ్గిరగా పెట్టుకుని సుమంత్రుడితో మాటలు మొదలుపెట్టాడు – "ఈ నాటికి అన్నగారికీ దురదృష్టం రాసి పెట్టి వుంది. ఆయన సౌశీల్యం మా తండ్రి ఏం గుర్తించాడు? తెగించి పట్టాభిషేకం చేసు కోమని నేను ఎన్నో విధాల చెప్పాను అన్నగారికి. ఏం లాభం? ఆయన సద్గుణాలు ఆయనవీ. చూడు, ఎలా నేలమీద పడుకున్నాడో! ఇంత కష్టం కళ్ళారా చూస్తూ నేను ఏమీ చెయ్యలేక పోతున్నాను" అని బొటబొటా కన్నీళ్ళు కార్చాడు.

రాముడు ఆకులమీద పడుకున్నాడేగానీ కన్ను మూత పడడం లేదు. ఆకులపక్క చాలా ఇబ్బందిగా వుంది. వీపుకింద ఈనెలు ముళ్ళలాగ గుచ్చుకుంటు న్నాయి. సన్న చీమలు వొళ్ళంతా ఎగబాకుతున్నాయి. వొక చోట దులుపుకుంటే వొక చోట ఎక్కుతున్నాయి. కడుపులో ఆకలి. గత రాత్రినించి ఏమీ తినలేదు. పట్టాభిషేకమూ లేదు, ఏమీ లేదుగానీ, ఉపవాసాలూ జాగారాలూ జపాలూ తపాలూ తప్పలేదు .... దుష్ట పక్షి తీతువు ఎలా కూస్తోందో! ఇంకేం కీడు చేస్తుందిలే. చెయ్యాల్సిందంతా చేసేసింది. అబ్బ! ఇదేదో చీమల పుట్టలాగ వుందే!

---

**47.** **అయోధ్యా, సర్గ 46, శ్లోకం 9**: ఇంకా కోసల దేశమైనా దాటలేదు. అప్పుడే సీతని రక్షించడం సమస్య అయిపోయింది రాముడికి! తమ్ముడు సహాయంగా వుండడం తల్చుకుని ధైర్యం తెచ్చుకుంటున్నాడు! ★

'రాముడు స్థిత ప్రజ్ఞుడు, కష్టసుఖాలు వొక్కలాగే అనుభవిస్తాడు, లౌకిక సుఖ దుఃఖాలకు అతీతుడు' అని నిత్యం రుషులు పొగుడుతారు కదా అని, నిజమే కావున్ను అనుకుని, రాముడు స్థిరంగా నిద్రపోవాలని మళ్ళీ వొరిగాడు. కానీ.... అంతలోనే ఎగిరిపడి వీపు దులుపుకున్నాడు – "పితృవాక్య పరిపాలన కొంచెం కష్టంగానే తోస్తోంది" అని మొదటిరాత్రే వొప్పుకోకా, తన మనసుకి తను చెప్పుకోకా తప్పలేదు. భుజాలు దులుపుకుని – "సింహాలున్నా ఫర్వాలేదు, చీమలు లేక పోతే బాగుండును" అని విసుక్కుంటూ మళ్ళీ పడు కున్నాడు.

★ ★ ★

సుమంత్రుడు తెల్లవారకుండానే లేచి రథం కట్టాడు. సీత నిద్రమత్తుతో రథంలో మూటమీదకు వొరిగి పడుకుంది. తెల్లవార్లూ సీతకీ, మూటకీ కాపలా కాస్తూ వుండడంవల్ల, లక్ష్మణుడికి రథం సాగుతోంటే చల్ల గాలిలో సుఖంగా నిద్రపట్టింది.

రాముడు మాత్రం విడిచిపోతోన్న కోసల రాజ్యాన్నీ, ఊళ్ళనీ, మనుషుల్నీ శ్రద్ధగా చూస్తూ, సుమంత్రుడితో వొక్కోమాట మాట్లాడుతూ కూర్చున్నాడు.

తూరుపు తెల్లవారుతోంది. ఆకాశం కొంచెం మబ్బులు పట్టివుంది. చల్ల గాలిలో గుర్రాలు ఉత్సా హంగా పరిగెడుతున్నాయి.

మనుషులు కావిళ్ళతో, నాగళ్ళతో, పందుం పుల్ల లతో, అక్కడక్కడా తారసపడుతున్నారు. ఎవరేం మాట్లాడుకుంటున్నారో అని రాముడు శ్రద్ధగా వినడానికి ప్రయత్నిస్తున్నాడు. రథం హోరు, చక్రాల కిరకిరలు, గుర్రాల గిట్టల చప్పుళ్ళ మధ్య, ఇక్కడో మాటా అక్కడో మాటా వినపడుతున్నాయి.

"బావా! సుట్టముక్కుంటే ఇస్తావంటయ్యా?"

"రాత్రి మా ఆవు ముండ కట్టుతాడు తెంచు కుందయ్యా! ఎటు పోయిందో ఏంటో? చేలల్లో పడిం దేమో సూడాలి."

"ఈ ఏడాది నువ్వు పిల్లిపిసరేశావా?"

"మా ఆడది కళ్ళాపుకి పేడ తెమ్మందిలే. సల్లో లెగి సొచ్చాను."

గ్రామస్తుల క్షుద్ర సంభాషణలేవో కొన్ని చెవిన పడ్డాయి. శ్రీరాముడు వనవాసానికి వెళుతున్నాడని ఎవ రికీ తెలిసినట్టు లేదు.

రాముడు తల పంకిస్తూ – "పామరులు లోక విషయాలేమీ పట్టించుకోరు" అని నిరుత్సాహపడ్డాడు.

రథం పొలాల పక్క మట్టి బాటవెంట సాగుతోంది. ఎటు చూసినా పొలాలన్నీ దున్ని వున్నాయి. భూమి అంతా, దయతో పాలిచ్చే తల్లిలాగ, ధాన్యం పండించి ఇవ్వడానికి సిద్ధంగా వుంది.

అక్కడక్కడా పొలాల మీదనించి కేకలు వినబడు తున్నాయి, గాలి వాలునుబట్టి. ఒకచోట కొందరు మను షులు, పక్క చేలో వాళ్ళతో గట్టిగా మాట్లాడు కుంటు న్నారు. ఇంకో పొలంలో వాళ్ళు నాగళ్ళు దున్నుతూ తిరుగు కేకలు పెడుతున్నారు.

రాముడు సుమంత్రుడితో – "రథం నెమ్మదిగా పోనియ్యి! ఈ పొలాల సౌందర్యం చూసుకుంటూ పోవ చ్చును" అని చుట్టూ చూశాడు.

సుమంత్రుడు కళ్ళేలు లాగి గుర్రాలవేగం తగ్గిం చాడు.

ఒక రైతు పెద్ద కంఠంతో – "నువ్విన్నా వంటయ్యా ఎంకన్నా? నిన్న రాజుగారింట్లో శానా గొడవ జరి గిందంట" అని కేక పెట్టాడు.

"నీకెల్లా తెలిసిందెహే?"

"రాత్రి వొకాయన గుర్రంమీద ఎళతా సెప్పా డయ్యా! నేనేం అబద్ధాలోణ్ణనుకున్నావా? దశరథ మహారాజు పెద్ద కొడుక్కి రాజ్యం ఇస్తానంటే చిన్న రాణీ గారుససేమిరా వొల్లకాదందంట! పైగా పెద్దాయన్ని అడవుల్లోకి పంపెయ్యమందంట! సూశావంటయ్యా! ఎంత గోరం! తెల్లార్లూ కంటికి కును కట్టలేదంటే నమ్ము! మా ఆడది తెగ ఏడిసింది ...."

"మీ ఆడది ఏడవందెప్పుళ్ళేగానీ, అసలు కతశానా వుంది. నేసెప్తా ఇను. భరతుడికే అక్కంటయ్యా రాజ్యం. కైకమ్మని పెళ్ళాడినప్పుడు 'నా రాజ్యవంతా నీ కొడుక్కే ఇచ్చేత్తా'నన్నాడంట ముసలాయన. మరి పెద్దరాజు మాత్రం ఇచ్చినమాట తప్పటం బాగుందంటావేంటి? ఆ ముక్కే కైకమ్మ నిల్దీసి అడిగితే తెల్లమొకం ఏశాడంట!"

"నీ కెట్టా తెలుసు ఇయ్యన్నీ?"

"మా పెద్దోడు నిన్న అయోధ్య ఎళ్ళాడులే. అర్ధ రాత్రొచ్చి అన్నీ చెప్పాడు."

"అలాగా? అయితే మాత్రం సుకుమారంగా పెరిగి నోణ్ణి అడవులకు పంపుద్దా? మన్లాగ పేడపిసుక్కునే వోడనుకున్నావా రాముడు? బుద్ధిలేకండా మాట్టాడతా వేంటయ్యా?"

"బుద్ధిలేం దెవరికయ్యా? సిమ్మాసనం ఎనకాల గోతులు తవ్వుతా వుంటే రాజ్యంలోంచి ఎల్లగొట్టకేం సేత్తారయ్యా? ఆవిడికి రావలసింది ఆవిడ అడిగిందీ, తప్పేంటీ? వరాలిస్తానన్నాక ఇవ్వాలా వొద్దా?"

ఇంకో కంఠం – "ఏంటీ? పెద్దరాజు వరాలిచ్చాడా? మహారాజు గాబట్టి ఇచ్చాడు. నా లాంటోణ్ణయితే పెళ్ళా నికో కోగ్గుడ్డన్నా కొనలేను."

"ఆ ఇచ్చాళ్ళే. మా గొప్ప వొరాలు ...."

చేలల్లో మనుషులు వొకచోట చేరి, రెండు పక్షా

లుగా వాదించుకోవడం మొదలెట్టారు.

దూరంనించి ఒక రైతు కోపంగా – "మీ దుంపలెగ్గ! అటు సూడండెహె! బారెడు పొద్దెక్కింది. పన్లు మానుకుని ఆ వూసులేంటంట! రాముడు రాజైతే మనకేంటీ, భరతుడు రాజైతే మనకేంటీ, పుల్లయ్య రాజైతే మనకేంటి? మనకాడ పన్నులీసుకోకుండా వొదుల్తాడా ఏ రాజన్నా? పెద్దోళ్ళ గోలలు మనకెందుగ్గానీ .... వొరే! పుల్లయ్యా! నువ్విలా రా ...." అని అందర్నీ మందలిస్తున్నాడు.

రాముడు మొహం తిప్పుకుని – "రథం వేగంగా పోనియ్యవోయ్! గంగానది తొందరగా చేరాలి" అని సుమంత్రుణ్ణి తొందర చేశాడు.

రథం వేగం హెచ్చి పల్లెలూ, పట్టణాలూ, చిన్న చిన్న అడవులూ, నదులూ దాటుకుంటూ కోసల దేశపు సరిహద్దుల వరకూ ప్రయాణం చేసింది. రాముడు రథం ఆపించి కోసల రాజ్యంవేపు భక్తితో, మమకారంతో చూశాడు.

ధన ధాన్యాలతో, పట్టణాలతో, యాగశాలలతో, పశు గణాలతో ఉద్యానవనాలతో, అడవులతో, నదులతో, ఎంతో సుందరమయిన దేశం కోసల. రాజయిన వాడు అనేక భోగాలు అనుభవించడానికి తగిన సిరులూ, ప్రదేశాలూగల దేశం కోసల. ఎన్నో వందల సంవత్సరాల నించీ రాజ కుటుంబంలో జ్యేష్టపుత్రులే పరిపాలిస్తున్నారు కోసలని. ఈనాటికి జరిగిన మార్పుని తలుచుకుంటూ విచారిస్తూ రాముడు కోసలవేపు తిరిగి నమస్కారం చేశాడు – "ఓ కోసల దేశమా! అయోధ్యా పట్టణమా! దశరథ మహారాజు జ్యేష్టపుత్రుణ్ణి. నేను మిమ్మల్ని విడిచి అడవికి పోతున్నాను. పద్నాలుగు సంవత్సరాల తర్వాత మళ్ళీవొచ్చి మీ దర్శనం చేసుకుంటాను. నన్ను మర్చిపోకండి!" అని ప్రార్థించాడు.

రథం మళ్ళీ ప్రయాణం సాగించింది. సంధ్యా కాలానికి శృంగబేరపురం సమీపంలో గంగాతీరం చేరింది. పచ్చగా చిగిర్చి, నిండుగా పూసివున్న వొక పెద్ద చెట్టు కింద రథం ఆపాడు సుమంత్రుడు. అందరూ దిగి నదిలో స్నానాలు చేసి, సంధ్యా వందనాలు చేసి, చెట్టు కింద విశ్రాంతిగా కూర్చున్నారు.

నదిమీదనుంచి చల్లగాలి వీస్తోంది. విశాలమైన గంగాతీరం అంతా చెట్లతో నిండి, అద్భుత శోభతో ప్రకాశిస్తోంది. చెట్లకింద ఎంతో కాలంనించి రాలి పడ్డ పూలు ఎత్తుగా అరుగులలాగ పెరిగి వున్నాయి. కొమ్మల నిండా కొత్తపూలు కళ్ళు తెరుస్తున్నాయి. నది, తీరాల మీద పూలచెట్లతో చెంపల చుట్టూ పూలు పెట్టుకున్న స్త్రీలాగ సొగసుగా వుంది. ఎన్నో పక్షులు సందడిగా కూస్తూ గుంపులు గుంపులుగా తీరంలో వాలుతున్నాయి. నీళ్ళలో ముక్కులు ముంచి చెట్ల మీదకు ఎగురుతున్నాయి. దూరంగా వొక లేడి, చిన్న పిల్లతో తీరంవేపు వొచ్చింది. లేడిపిల్ల నీళ్ళు చిందిస్తూ గంతులేస్తోంటే సీత సంతోషంగా చూస్తోంది.

రాముడు సీతతో – "ఈ మహానది వైకుంఠంలో విష్ణు పాదాలలో పుట్టి, శివ జటాజూటంలో పడి, పాతాళానికి చేరింది. ఈ సృష్ట్యాది నించీ ముల్లోకాలలోనూ ప్రవహిస్తోంది. దేవతలు కూడా ఈ నదిలో స్నానాలుచేసి పాపాలు పోగొట్టుకుంటారు" అని నదీ వృత్తాంతం చెప్పి నదిని వర్ణించాడు.

భర్తలు ఏ అబద్ధాలు చెప్పినా, ఏ అతిశయోక్తులూ ఏ అభూత కల్పనలూ చెప్పినా, మనసంతా తెరుచుకుని నమ్మే స్త్రీల గుణంతో సీత, భర్త మాటలు ఎంతో భక్తితో నమ్మింది – "ఆహా! నా భర్తకు ఎన్నో విషయాలు తెలుసు కదా! ఎంతటి జ్ఞాన వంతుడో కదా!" అని మురిసింది.

వర్షాలకు కొండల్లో పుట్టి, మైదానాలను సారవంతం చేస్తూ, వందలాది సంవత్సరాలనించీ సమస్త జీవరాశికీ దాహార్తి తీరుస్తూ, ఎన్ని కోట్ల ముకుళిత హస్తాల వందనాలో, ఎన్ని ప్రాణుల సజల నయన కృతజ్ఞతా వీక్షణాలో పొందుతూ, శాంత గంభీరమై ప్రవహిస్తోన్న గంగానది, ఏమీ ఎరగని అమాయకపు సీతలాగే వుంది.

నీళ్ళలో ఆడుకుంటోన్న లేడిపిల్ల, వాళ్ళమ్మ నీళ్ళు తాగి చెట్లలోకి వెళ్ళిపోతోంటే బెదురుగా చుట్టూ చూసి కంగారుగా అమ్మ వెనకాలే పరిగెత్తింది.

లక్ష్మణుడు చెట్లకింద రాలిన పండుటాకులు పోగు చేస్తూ అటుపోయే మనుషుల్ని వాకబు చేశాడు, గుహుడి గురించి.

గుహుడు ఆ చిన్న ప్రాంతానికి రాజు. అక్కడున్న జనం అంతా బోయ జాతి. గుహుడు, కోసల రాజునీ, అతని కొడుకుల్నీ ఎరిగినవాడే. దశరథ మహారాజు కొడుకులు వొచ్చారని విని గుహుడు సంతోషపడుతూ సేవకులతో వచ్చాడు. ఎన్నో రకాల తినే పదార్థాలూ, పళ్ళూ, పానీయాలూ, విశ్రాంతి తీసుకునేందుకు పక్కలూ, పాన్పులూ అన్నీ అతని సేవకులు మోసుకు వచ్చారు.

గుహుడు అసలు విషయం విని ఎంతో దుఃఖపడి తల్లడిల్లుతూ అనాగరిక ప్రేమ ఉప్పొంగి, కన్నీళ్ళతో రాముణ్ణి కావలించుకున్నాడు – "అయ్యో, నాయనా! నీ తండ్రి వేరూ, నేను వేరూనా? కోసల రాజ్యం లేక పోయిందని విచారించకు! నా రాజ్యం నువ్వే పరిపాలించు! నేను నీ సేవచేస్తూ జీవిస్తాను" అని ఒక గొప్ప మహారాజు కొడుకుని ఓదార్చిన తృప్తితో చూశాడు.

రాముడు గంభీరంగా నిట్టూర్చాడు. గుహుడు తన తండ్రిపట్ల వున్న స్నేహ ధర్మంతో, తనకు కలిగిన కష్ట వార్త విన్న వూపులో ఆ విధంగా మాట్లాడినా, ఆ ఓదార్పు

లాంఛనప్రాయమేనని రాముడికి తెలుసు. రాజు అయిన వాడెవడయినా, రాజ్యం ఎంత చిన్నదయినా, దాన్ని వొదలగలడా? తన అధికారం ఇంకో వ్యక్తికి ఇవ్వ గలడా? అయినా సమస్త సిరి సంపదలతో తులతూగే విశాల కోసల రాజ్యాన్ని పోగొట్టుకున్న దుఃఖం, పది బారలు లేని బోయ రాజ్యాన్ని పరిపాలిస్తే తీరుతుందా?

రాముడు తల పంకించి గంభీరంగా గుహుడితో సంభాషణలోకి దిగాడు.

"మా సంగతి వినగానే నువ్విలా మాకు సేవలు చెయ్యడానికి రావడం చాలా సంతోషంగా వుందోయ్! క్షత్రియులు వొకరి కివ్వడమేగానీ, వొకరినించి ఏమీ తీసుకోకూడదు. దానం చెయ్యాలే గానీ, దానం పట్టే స్థితిలో వుండకూడదు. క్షత్రియులు, తమ వీరత్వంతో మాత్రమే సిరి సంపదలు పోగుచేసుకోవాలి .... మా కోసం తినడానికేవో కమ్మని పదార్థాలు తెచ్చినట్టున్నావు గానీ, నేనేమీ తినను. నాకు నిద్రాహారాలమీద మమ కారం లేదు. తండ్రి ఆజ్ఞ కన్నా ఎక్కువేముంది నాకు? విచారించి లాభమేముంది? ఋషులలాగా కంద మూలాలు తింటూ తపస్సు చేసుకోవడం తప్ప, ఈ రుచులూ సుఖాలూ ఇహలోక విషయాలూ నా కెందుకు? నా గురించి దుఃఖపడకు .... ఏమిటి విశేషాలు? నీ రాజ్యంలో అల్లరులేమీ లేవుగదా? నీ బంధుమిత్రు లందరూ క్షేమంగా వున్నారు కదా? నీ ధనం నానాటికీ వృద్ధి అవుతూ వుందికదా? రాజు అన్నవాడు ముందు బొక్కసం విషయం చూసుకోవాలి" అంటూ రాజ కిరీట మయినా ముట్టని రాముడు, ఎన్నో సంవత్సరాలనించీ రాజ్యం చేస్తోన్న ఆ వృద్ధరాజుకి ఇంకా చాలా రాజకీ యాలూ, ధర్మసూక్ష్మాలూ ఉపదేశించాడు.

గుహుడు అవేమీ వినిపించుకోలేదు. రాముడి వనవాసం వార్త చెవిన పడ్డప్పటినించీ అంత తొందరగా తేరుకోలేక దిగులు పడుతూనే వున్నాడు. "పళ్ళు తిను నాయనా!" అన్నాడు.

రాముడు మొహం అడ్డంగా తిప్పి – "నా కేమీ వొద్దు. గంగనీళ్ళు తప్ప నేనేమీ ముట్టను. అవిగో ఆ గుర్రాలు నా తండ్రివి. వాటికి సంరక్షణ చేయించు. ఆ మాత్రం చేస్తే నన్ను పూజించినట్టే" అని గంభీరంగా చూశాడు. లోకంలో అందరూ తననే పూజిస్తారని రాముడి నమ్మకం.

గుహుడు కొంచెం చిన్నబుచ్చుకున్నాడు – తను ఆప్యాయంగా పలకరిస్తోంటే 'పూజించడం' అంటా డేమిటి – అని! "వొరే! ఆ గుర్రాలకి పాలు తాగిం చండిరా!" అని పనివాళ్ళ వేపు ఒక కేక పెట్టాడు.

గుహుడు వెంటబెట్టుకు వచ్చిన వంటకాల పరిమ ళాలు, పూలవాసనల్ని మించి చుట్టూ ఆక్రమిస్తున్నాయి. గాలి నిండా మాంసం కూరల కమ్మదనాలు తేలు తున్నాయి.

రాముడు గంగానది వేపు మొహంతిప్పి ముక్కు పుటాలు ఉబ్బించి నోరు చప్పరించాడు. మూడు రాత్రుళ్ళ నించీ పచ్చి మంచినీళ్ళు తప్ప ఏమీ ముట్టుకోలేదు. పుట్టిన తర్వాత ఎన్నడూ ఇంత ఆకలి బాధ అనుభ వించలేదు. అంత వీరత్వమూ ఏమైందో, నీరసం ముంచుకొస్తోంది – "లక్ష్మణా! గంగాజలం తీసుకు రావోయ్!" అని గొణిగి నీరసంగా చెట్టుకి చేరబడ్డాడు.

లక్ష్మణుడు ఆకు దొన్నెతో నదిలోంచి నీరు తెచ్చి అందించాడు. తర్వాత, "అన్నగారూ! విశ్రమించండి!" అంటూ ఆకుల కుప్ప చూపించాడు.

రాముడు మంచినీళ్ళు తాగి నీరసంగా వొరుగుతూ, "లక్ష్మణా! వనవాసంలో ఇది రెండో రాత్రి. ఇంకా మనం 13 సంవత్సరాల 11 నెలల 28 రోజులు గడిపితే చాలు. ధైర్యంగా వుండు! ఆ మూట గట్టిగా వుందా? ఆభరణా లేవీ పడిపోలేదు కదా?" అని మూట వేపు చూశాడు.

"చిత్తం! తమ దయ! పడిపోలేదు అన్నగారూ!" అని లక్ష్మణుడు నమస్కరించాడు.

భర్త తినలేదని సీత కూడా ఏమీ తినలేదు. కొంచెం మంచినీళ్ళు తాగి ఓపిక లేక మూటకు జారబడి నిద్ర పోయింది.

సుమంత్రుడు, గుహుడు తెచ్చిన పదార్థాలన్నీ కడుపునిండా తిని సుఖనిద్రకు పడ్డాడు.

లక్ష్మణుడు మంచినీళ్ళు కూడా మానేసి గుహుడితో దుఃఖం వెళ్ళబోసుకోవడం ప్రారంభించాడు. "చూశావ టోయ్! ఈ లోకంలో ఎన్నడయినా ఇంత ఘోరం జరిగిందా? నిన్న మహారాజు కావలసిన మహానుభావుడు ఇవ్వాళ కటిక నేలమీద నిద్రపోతున్నాడు. ఆ సీతమ్మ తల్లిని చూడు! నేలమీద కాలు మోపి ఎరుగునా? ఈ ఘోరం నేనింకా ఎంత కాలం చూడాలో కదా?" అని దీర్ఘంగా నిట్టూర్చాడు.

గుహుడు ఎంతో ప్రేమతో జాలిపడుతూ "చ్చొ.... చ్చొ .... చ్చొ .... చ్చొ ...." అంటూ నోట్లో నాలిక పైకి అంటించి చప్పుళ్ళు చేస్తూ వింటున్నాడు.

"మమ్మల్ని యజ్ఞాలూ యాగాలూ చేసి కన్నాడట మా తండ్రి. ఏం లాభం? చివరకి పెద్ద కొడుక్కి ఈ గతి పట్టించాడు" అంటూ లక్ష్మణుడు కళ్ళు వొత్తుకున్నాడు.

గుహుడు – 'ఎంత ఘోరం! ఎంత ఘోరం!' అన్నట్టు నాలికతో మళ్ళీ పెద్ద పెద్ద చప్పుళ్ళు చేశాడు.

లక్ష్మణుడు చేతులు తిప్పుతూ – "ఆయన మాత్రం ఏమి చేస్తాడు? ఆడదాని చేతిలో చిక్కిపోయాడు. లేకపోతే ఆయనకి మా అన్నగారంటే ప్రేమే. మేం వస్తూంటే బావురుమని ఏడ్చాడు. ఈ పెద్ద వయసులో, ఈ

దుఃఖంతో, ఇంకేం బతుకుతాడు? ఆయన పోయాక భూమి అంతా విధవ అయిపోతుంది. మా తల్లులెవరూ బత కరు. జనం మాత్రం ఏం బతుకుతారు? ఇప్పుడు పోయి చూస్తే కైక తప్ప అయోధ్యలో ఎవ్వరూ బతికే వుండరు. ఊరంతా చీకటైపోయి పిల్లులూ, గుడ్లగూబలూ తిరుగుతూ వుంటాయి. తండ్రి పోయేటప్పుడు దగ్గరే వుండి మంచీ చెడ్డా చూసే భాగ్యం మాకు లేకపోయింది. ఆయన శవానికి దహన సంస్కారాలు చేసే అదృష్టం మాకు లేదు" అంటూ కళ్ళనీళ్ళు కార్చటం మొదలు పెట్టాడు.

గుహుడు కంగారుపడి, నోట్లో చప్పుళ్ళు మాని "దశరథ మహారాజు పోయినాడని వార్తేమైనా తెలిసిందా నాయనా?" అంటూ ముందుకు వొంగాడు.

లక్ష్మణుడు ఎడం పక్కకి ముక్కు చీది, వేళ్ళు పంచెకు తుడుచుకుంటూ – "వేరే వార్త తెలియాల టోయీ? ఇంకా ఏం బతికి వుంటాడు? ఉత్త మాట. ఈ పాటికి తనువు చాలించే వుంటాడు. ఆఖరి ఘడియల్లో కన్నతండ్రిని చూచుకునే భాగ్యం మాకు లేకపోయింది" అని మళ్ళీ బొటబొటా కన్నీళ్ళు కార్చాడు.

గుహుడు శాంతంగా – "ఊరుకో నాయనా, ఊరుకో! నీ తండ్రి పోయివుండడు, ఊరుకో! ఏం చేస్తాం? రాముడు రాజయితే నా కెక్కువ సదుపాయంగా వుంటుందని సంతోషించాను. ఇరుగు పొరుగు రాజ్యాల వాళ్ళం కదా? భరతుడి వ్యవహారం ఎలా వుంటుందో యేమో! ఏమీ చిక్కులు పెట్టడంటావా? సరేలే నాయనా! ఏదో ఒకటి జరుగుతుందిలే. నువ్వు పడుకో! నేనూ, నా మనుషులూ చూస్తూ వుంటాం. మా వంటి వాళ్ళకు నిద్రాహారాలు లేకపోయినా ఫర్వాలేదు. రాచ కులంలో పుట్టారు మీరు. మీరు కష్టపడటం ధర్మం కాదు. పొద్దు పొడిచే దాకా నడుం వాల్చు నాయనా!" అని చాలాసేపు చెప్పాడు.[48]

లక్ష్మణుడికి నిద్ర ధ్యాసలేదు. పొడి కళ్ళు పడ్డాయి. గుహుడితో మాట్లాడుతోంటే మనసు కాస్త తేలిక పడు తోంది. గంగానది దాటి అడవుల్లోకి పోయాక ఇక తెలి సిన వాళ్ళెవరు కనపడతారు? – అప్పుడప్పుడూ మూటనీ, సీతనీ చూస్తూ చాలా సేపు మాట్లాడుతూనే కూర్చున్నాడు. లక్ష్మణుడు నిద్రపోతాడేమో కాస్సేపు చుట్ట కాల్చుకోవాలని చూస్తోన్న గుహుడికి, ఆ రాత్రికిక ఆ ఆశ తీరేట్టు కనపడలేదు.

రాముడు పడుకున్నాడేగానీ, నిద్రపట్టలేదు. గుహుడూ, లక్ష్మణుడూ మాట్లాడుకునే మాటలన్నీ వింటూనే ఉన్నాడు. ఆకలితో కడుపంతా కుంచుకు పోతోంది. చెవులు, 'గీ' మని ఇలకోళ్ళలాగ కూతలు పెడుతున్నాయి. కళ్ళు మూసినా, తెరిచినా వొక్కలాగే చీకట్లు కమ్ముతున్నాయి. ఆకుల పక్క కుదరనేలేదు. గుహుడు తెచ్చిన మెత్తని శయ్యలూ, కమ్మని పదార్థాలూ పక్కనే పడివున్నాయి. "ఏమిటీ బలహీనత? ఆత్మని జయించలేనా? తండ్రిని మించిన దైవం లేదని .... వేదాల్లో .... అబ్బా! ...." తుళ్ళిపడి లేచి వీపు దులుపు కున్నాడు.

మిడత వెళ్ళి లక్ష్మణుడిమీద పడింది. లక్ష్మణుడు ఉలిక్కిపడి చెయ్యి ఝాడించాడు. మిడత ఆకులమీద పడి మొహం చిట్లించింది – "ఏవిటీ అన్నదమ్ములు .... మరీనూ" అనుకుంటూ.

అందరికీ అర్ధరాత్రి వరకూ జాగారమే అయింది. తెల్లవారుజామునే కొంచెం నిద్రలు పట్టాయి.

పక్షులు లేచి వొకటే కూతలూ, ఎగురుళ్ళూ, దూకుళ్ళూ! ఏమిటో ఆ సంతోషం! లేచింది మొదలూ గంతులే! సూర్యనమస్కారాలు లేవు. సంధ్య వార్చడాలు లేవు. వేదపఠనాలూ యజ్ఞ యాగాలూ లేవు. ఇంకా ఎన్ని జన్మలు మోక్షమార్గం చూసుకోకుండా అట్లా అరుస్తూ, రెక్కల చప్పుళ్ళతో కొమ్మ కొమ్మకీ దూకుతూ, ఈ క్షుద్ర లోకంలో మళ్ళీ మళ్ళీ పిట్టల్లాగే పుడుతూ వుంటాయో!

నదిమీద చలిగాలికి సీత, నిద్రలోనే వొణికింది.

దగ్గిరే వొక కోయిల కూస్తోంటే దూరం నుంచి ఇంకో కోయిల జవాబిస్తోంది – ఏం మాటలో మరి! నెమళ్ళ కేకలు ఎక్కణ్ణుంచో! గాలి వీచినప్పుడల్లా నది వొడ్డంతా పూలు జల జల రాలుతూ, కొన్ని పూలు వచ్చి నిద్రపోయే వాళ్ళమీద పడుతున్నాయి.

చెట్లచాటున సూర్యుడు తొంగి తొంగి చూస్తూ బయల్దేరాడు – 'ఇవ్వాళేం ఘోరాలు చూడాలో' అని సిగ్గుపడుతూ. చెట్ల నీడలు పదింతలు పెరిగి నది అంతా ఆక్రమించాయి.

కళ్ళమీద బాగా వెలుగుపడి రాముడు లేచేసరికి సీత నది వొడ్డున పూలు ఏరుకొంటోంది. ఆమె, స్నానం చేసి చెట్లకింద ఆరబెట్టిన చీర పూలతో నిండి పోయింది. రాముడు కాలకృత్యాలు తీర్చుకొని నదిలో స్నానం చేసి సూర్య నమస్కారాలు చేశాడు.

గుహుడు మళ్ళీ తాజాపళ్ళు తెప్పించి తినమని ప్రార్థించాడు రాముణ్ణి. కానీ రాముడు "నేనుండవలసిన

**48.** ఉన్నత కులాలవారిని, తక్కువ కులాలవారు ఎంత ఘనంగా ఎంత గౌరవంగా చూస్తారో ఈ మాటలవల్ల చూడొచ్చు. "స్త్రీల బుద్ధి నీచమైంది" అని స్త్రీలు నమ్మినట్టుగానే, "తక్కువ కులాలవారు ఎటువంటి కష్టాలుపడ్డా ఫర్వాలేదు" అని తక్కువ కులాలవారే భావిస్తారు. వీటిని చూస్తే, ఇవి సహజ ధర్మాలుగా ఎంత బలంగా స్థిరపడిపోయాయో అర్థమవుతుంది. ★

అరణ్యాల్లో అడుగుపెట్టే వరకూ మంచినీళ్ళు తప్ప ఏమీ ముట్టను" అని పళ్ళవేపు చూసి మొహం తిప్పుకున్నాడు.

రాముడు పళ్ళు కూడా తినకుండా పితృవాక్య పరిపాలన చెయ్యడం గుహుడికేమీ నచ్చలేదు. మళ్ళీ బతిమిలాడి ప్రయోజనం లేక చాలా బాధపడి, "నాయనా! నీ వంటి పుణ్యాత్ముడికి రావలసిన కష్టాలు కావివి. ఈ లోకంలో నీ కీర్తి ఎల్లకాలం నిలిచిపోతుంది" అని మెచ్చుకున్నాడు.

రాముడికి తృప్తితో కడుపు నిండిపోయింది. రోజూ అలా కీర్తించే వాళ్ళుంటే ఎన్ని వందల సంవత్సరాలైనా తిండి లేకుండా వుండగలననిపించింది ఆ క్షణంలో. రాత్రి ఆకలికి లొంగి బాధపడ్డందుకు చాలా సిగ్గు కలిగింది.

గంగానది దాటడానికి పడవ సిద్ధమైంది. చీరల మూటా, కవచాలూ, కత్తులూ అన్నీ పడవలో జేర్చారు.

సుమంత్రుడు విచారపడుతూ రాముడి ముందు నిలబడ్డాడు.

రాముడు చిరునవ్వుతో – "రథం తోలుకుని తొందరగా ఇంటికి వెళ్ళు! మా తండ్రికి మా క్షేమ సమాచారాలు చెప్పు! మా తల్లులందరికీ, ముఖ్యంగా మా కైక పినతల్లి గారికి కూడా మా నమస్కారాలు చెప్పు! ఆవిడ బహుయోగ్యురాలు. పుణ్యాత్మురాలు. ఆవిడ కోరికలు సంతోషంగా పాటిస్తున్నానని చెప్పు!" అని శాంతంగా చూశాడు. అంత ప్రశాంతంగా నిర్మలంగా వున్న రాముడి మొహం చూస్తే అక్కడ వున్న వాళ్ళందరికీ మనసులు ద్రవించాయి.

"ఎంతటి ధర్మాత్ముడికి ఎంతటి కష్టాలు వొచ్చాయి!" అని గుహుడు కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

అల్లారు ముద్దుగా పెరిగిన రాజకుమారుల్నీ, ఆ సుకుమారినీ, ఆ గంగవొడ్డున విడిచి పోవాలంటే సుమంత్రుడికి చాలా దుఃఖం వొచ్చింది. రాముణ్ణి ప్రేమగా చూస్తూ – "నాయనా! నువ్వు చిన్నతనం నుంచీ సదాచారాలతోనే పెరిగావు. వేదాలన్నీ చదివావు. నిష్ఠలూ, నియమాలూ పాటిస్తోనే వున్నావు. అలాంటి నీకే ఇంత కష్టం వొచ్చింది. అసలీ ధర్మాలవల్లా, వేదాలవల్లా మనుషులకేమీ పుణ్యం రాదేమోనని తోస్తోంది నా కిప్పుడు" అని సందేహంగా చూశాడు.

రాముడు చాలా కంగారుపడ్డాడు – తను ఇన్నాళ్ళూ నమ్ముకున్న వాటివల్ల నిజంగానే పుణ్యం రాదేమోనని! అటు రాజ్యమూ రాక, ఇటు పుణ్యమూ రాక .... ఇంకా నయం! రాముడికి కోపం కూడా వొచ్చింది సుమంత్రుడి మీద! – "పెద్దవాడివి నువ్వు కూడా ఇటువంటి అపవిత్రమైన మాటలు మాట్లాడ వొచ్చునా? ఏనాడో ఋషులు పెట్టిన ధర్మాలను శంకించవొచ్చునా? కష్టాలుపడ్డ వారికే పుణ్య లోకాలూ, కీర్తీ దక్కుతాయి. అసలు సుఖాలలో ఏముంది అంతా మాయేగానీ ...." అన్నాడు లోపల ఏదో జంకుతో.

రాముడి ఆత్మ నిగ్రహాన్నీ, ధైర్యాన్నీ చూస్తే సుమంత్రుడికి చాలా తేలికపడింది మనసు. "సంతోషం నాయనా! నా బాధకొద్దీ నేను ఏమో అన్నాను. నీ కీర్తి అన్ని లోకాలకూ విస్తరిస్తుందని నాకు తెలుసు" అని సంతృప్తి పడ్డాడు.

రాముడికి తన కీర్తి లోకాల వెంట పాకడం మీద అప్పటికి నమ్మకం కలిగింది. గంభీరంగా చెప్పడం మొదలుపెట్టాడు, "సుమంత్రా! నేను నిర్విచారంగా వనవాసం గడుపుకుంటున్నానని మా తండ్రికి చెప్పు! రాజ్యం త్యజించినందుకు ఏమీ బాధపడడం లేదని మరీ మరీ చెప్పు! మా కోసం ఎంతమాత్రం దుఃఖపడవొద్దని చెప్పు! ఆయన పెద్దవాడైపోయాడు. కానీ ఆడవాళ్ళ పిచ్చి పోలేదు. కొంచెం ఆయన్ని కనిపెట్టుకుని వుండు! భరతుణ్ణి తొందరగా తీసుకు వొచ్చి పట్టాభిషేకం చేయించమన్నానని చెప్పు! భరతుడు రాజ్యం తీసుకోనని తిరస్కరిస్తాడేమో! తండ్రి గారి మాట పాటించాలని నేను చెప్పానని భరతుడికి చెప్పు! భరతుడికి శ్రద్ధగా సేవలు చెయ్యమన్నానని నా తల్లితో నా మాటగా చెప్పు! రాజైనవాడు ధనంవల్ల పెద్ద అవుతాడుగానీ, వయసు వల్ల కాదు. భరతుడు, రాజ లాంఛనాలన్నీ పెట్టుకుని, కిరీటం ధగ ధగ మెరుస్తూ కోసల సింహాసనంమీద కూర్చోవడం చూశావంటే ఇక నీకీ దుఃఖమెందుకు వుంటుందిలే. నన్ను చక్కగా మరచిపోవచ్చు" అని నిష్ఠూరం ధ్వనించేటట్టు కొంచెం నవ్వుతూ హాస్యమాడాడు, సుమంత్రుడితో.

సుమంత్రుడు, రాముడి మాటల్లో దోషం ఊహించలేక ఆ నవ్వు చూసి మనసు తేలికపడి సంతోషించాడు.

రాముడు తన వ్యంగ్య ధోరణికి తనే కొంచెం సిగ్గుపడి భరతుడి గురించి తను అయిష్టంగా మాట్లాడినట్టు సుమంత్రుడు గ్రహిస్తాడేమోనని తన ధోరణి మార్చి గంభీరంగా – "సుమంత్రా! నాకు చెయ్యాలనుకున్న సేవలన్నీ భరతుడికి చెయ్యాలి సుమా! అతడు కూడా దశరథ మహారాజు పుత్రుడే! రఘువంశంలో పుట్టినవాడే! అతణ్ణి సంతోషపెట్టే విధంగా ప్రవర్తించాలి మీరందరూ. రాజులు, అప జయాల్నీ దుఃఖాల్నీ భరించడానికి ఇష్టపడరు. తమ కోరికలన్నీ తీర్చుకోవాలనీ, తలపెట్టిన కార్యాలు నిర్విఘ్నంగా నెరవేర్చుకోవాలనీ, వాంఛిస్తారు.

అందుకే రాజ్యాలు చెయ్యాలని కలలుగంటారు. నా వంటి రుషి సంగతి వేరు. నాకీ లోక వాంఛలలో ఎంత మాత్రం మోహంలేదు సుమా!" అని నిర్వికారంగా చూశాడు.

"అవున్నాయనా! మేం సామాన్యులం కాబట్టి సుఖ దుఃఖాల మాయలో పడిపోతాం. కానీ .... నువ్వు ...." అంటూ చేతులు జోడించి నమస్కరించాడు సుమంత్రుడు.

రాముడు గుహుడితో – "మఱ్రిపాలు తెప్పించు. జడలు కట్టుకోవాలి" అన్నాడు.

గుహుడు ఇద్దరు మనుష్యుల్ని పిలిపించాడు – "ఈయనేదో అడుగుతున్నాడు. అదేంటో తెచ్చిపెట్టం డిరా!" అని వాళ్ళని ఆజ్ఞాపించాడు.

రాముడు జుట్టంతా అట్టలు కట్టించుకుంటాడంటే, సీత కలవరపడింది. ఆందోళనతో భర్తవేపు చూసింది. నల్లగా, వొత్తుగా ఎంతో చక్కని జుట్టు. నిత్యమూ అభ్యంగన స్నానాలు చేస్తూ, పరిమళ తైలాలు రాస్తూ, మెత్తగా పట్టుకుచ్చులాగ పెంచుకున్న జుట్టు! ఏకాంతంలో పడక టింట్లో ఆ జుట్టు తన వేళ్ళతో సర్దిన ఎన్నో జ్ఞాపకాలు! "అవన్నీ గుర్తులేవా?" అన్నట్టు సీత చాలా కలవరంతో రాముడి మొహంలోకి చూసింది. కొత్త మనుషుల ముందు ఎన్నడూ భర్తతో మాట్లాడి ఎరగదు సీత. దిగాలు పడుతూ చూసింది.

వెళ్ళిన మనుషులు మఱ్రి ఆకులన్నీ దూసిపోసి గిన్నెలోకి కాసిన్ని జిగురుపాలూ, పక్షి ఈకలూ సంపాదించి – "అయోధ్యలో మఱ్రిచెట్లు వున్నాయా లేవా? ఈయన ఇక్కడ జుట్టు కట్టుకోటం ఎందుకూ?" అని తర్కించుకుంటూ, వాదించుకుంటూ వొచ్చారు.

రాముడూ, లక్ష్మణుడూ, పక్షి ఈకలతో జుట్టుకి జిగురు పట్టించుకోడానికి సిద్ధపడుతోంటే, సీత ఇక ఆగలేక అప్రయత్నంగా రాముణ్ణి వారిస్తూ "వొద్దు" అంది.

రాముడు ఆశ్చర్యంగా చూశాడు.

సీత సిగ్గుపడుతూ "బాగుండదు" అంది.

రాముడు తెల్లబోయి "ఏమిటి?" అన్నాడు.

సీత ఎన్నడూ ఎరగనంత ధైర్యం తెచ్చుకుని కళ్ళతో ప్రార్థిస్తూ "స్వామీ! జుట్టు ఇలాగే వుండనివ్వండి! తప్పే ముంది?" అంది.

"ఎందుకు? ఇంకా ఈ దేహానికీ, జుట్టుకీ సంస్కారా లెందుకు?"

"సంస్కారమేముంది? నదిలో స్నానమే కదా? సహజ సౌందర్యానికి కూడా నియమాలెందుకు?"

రాముడికి చాలా కోపం వొచ్చింది. పురుషుల ముందు .... రాచ స్త్రీ .... భర్తతో .... ఏమిటీ తర్కం? .... అందరూ బోయవాళ్ళు కాబట్టి సరిపోయింది గానీ .... గంభీరంగా చూశాడు భార్యని. "ఇది రుషుల ధర్మం అని తెలుసు కదా?"

భర్త సౌందర్యంమీద వున్న కాంక్షతో సీత సాహసించి చిరునవ్వుతో చూసింది – "సహజ వైరాగ్యంవల్ల దేహ సౌందర్యం నశించాలి గానీ, జిగురు రాసి జుట్టు అట్టలు కట్టించుకోవడం వైరాగ్యమవుతుందా? లోక సుఖాలన్నీ త్యజించి వొచ్చిన మీకన్నా రుషులెవరు?" అని భక్తిగా చూసింది.

రాముడికి ఏం చెయ్యాలో తోచలేదు. ఆ జిగురంతా జుట్టుకి పట్టించుకోవాలంటే, తనకీ అయిష్టంగానే తోచింది. ఇంత ప్రయత్నమూ చేసి, ఇంత మంది ముందు, స్త్రీ మాట ప్రకారం నడవడమా! ఎంత సిగ్గు చేటు! తన తండ్రి చేసిన దుష్కార్యం అదే కదా? రేపు రుషులెవరైనా అడిగితే "నా భార్య వద్దన్నది" అని చెప్పాలా? ఎంత అపకీర్తి!

రాముడు కొంచెం కఠినంగా సీతని చూస్తూ "నువ్వు స్త్రీవి. ధర్మాధర్మ పరిజ్ఞానం నీకేముంది? పూర్వ రుషుల ధర్మాలనే నేను పాటిస్తున్నాను" అంటూ లక్ష్మణుణ్ణి ముందుకు లాగి, గబగబా అతని జుట్టునిండా జిగురు పూశాడు.

ఆ జిగురు పూతలు గుహుడికి కూడా నచ్చక "లక్ష్మణుడిక్కూడా రుషి వేషం ఎందుకు నాయనా? అతడు రుషిగా వుండాలని కైకమ్మ అడగ లేదుగా?" అనాలని తటపటాయించి అనకుండానే వూరుకున్నాడు.

బోయవాళ్ళందరికీ, రుషుల మహత్యం అర్థం గాక వింతగా చూస్తూంటే, రాముడు తన జుట్టుకి కూడా జిగురు పట్టించుకున్నాడు. అప్పటికి, స్త్రీ మాట తిరస్కరించి గొప్ప ధర్మాన్ని పాటించిన తృప్తి కలిగింది.

సీత చెట్టు కొమ్మకు ఆనుకుని నదివేపు మొహం తిప్పుకొంది. కళ్ళనిండా నీళ్ళు వూరి చెంపల మీదకు రాబోయాయి. చటుక్కున కొనగోళ్ళతో కన్నీటి బొట్లు విదిలించుకొని తమాయించుకొంది. భర్తచేసే ఏ కార్యానికయినా భార్య మనసుకి బాధ కలగడం ఎంత తప్పో జ్ఞాపకం వొచ్చి సిగ్గుపడిపోయింది. కొంతసేపు మొహం చాటుచేసుకుని, మనసులో ఖేదం పోగొట్టుకుని, ఉత్సాహంలేని నవ్వుతో రాముడి వేపు చూసింది.

గాలికి చక్కగా ఎగురుతూ, చెంపల మీదకి జారుతూ వుండే జుట్టు వొంకులన్నీ జిగురులో బంధించుకుపోయి, మఱ్రిపాలు ఎండి, అట్టకట్టి నెత్తి మీద మట్టిమూకుడు బోర్లించినట్టు కనపడింది.

లక్ష్మణుడివేపు చూస్తే – ఇంకో మూకుడు!

సీత నిట్టూర్చి మళ్ళీ నదివేపు మొహం తిప్పుకుంది.

మఱ్రిపాలు మెడమీదా, ఎడం చెవిమీదా పడి లక్ష్మ

ణుడికి బాగా దురద పుడుతోంటే, చిన్న పుల్ల తీసి గోక్కుంటూ నించున్నాడు.

లక్ష్మణుడికి రాసింతర్వాత తను రాసుకోవడం వల్ల, జిగురు కారకుండా జుట్టుకి పట్టించడం కొంచెం తెలిసి, తను రాసుకునేప్పుడు పాలు చర్మానికి అంటకుండా రాసుకోగలిగాడు రాముడు.

ఆ వ్యవహారం ముగిశాక గుహుడు "నాయనా! పడవ నిలబడి వుంది. పొద్దు ఎక్కుతోంది. ఇక్కడ ఏమీ తిన్నావు కాదు. తొందరగా అరణ్యాలకు పోయి కాస్త ఎంగిలి పడ్డం మంచిది" అని జాలిపడి తొందర చేశాడు.

"లక్ష్మణా! ఆ చీరల మూట ...."

"చిత్తం! పడవలో పెట్టించాను అన్నగారూ!"

రాముడు పడవవేపు చూసి – "మంచిది. ముందు సీత ఎక్కడానికి సహాయం చెయ్యి! పడవ కదలకుండానే వుంది. ఫర్వాలేదు. భయం లేదు. వీరోచితంగా ఎక్కు!" అని తను కదలకుండా నించున్నాడు.

లక్ష్మణుడు, పడవ ఎక్కే బల్ల గట్టిగా పట్టుకుని ముందు సీత ఎక్కడానికి సహాయపడి, తర్వాత తను ఎక్కి సీతకి దూరంగా నించున్నాడు.

రాముడు పడవ దగ్గిరికి నడుస్తూ సుమంత్రుడితో – "నాకు రాజ్యం పోయినందుకు ఏమీ విచారంగా లేదని మా తండ్రి గారికి చెప్పు! సంతోషంగా వనవాసం గడుపుకుంటానని మరీ మరీ చెప్పు!" అంటూ పూర్వం చెప్పిన మాటలే మళ్ళీ మళ్ళీ చెప్పాడు – "నీ రాజభక్తికి చాలా సంతోషించాను. ఇక వెనక్కి వెళ్ళు" అని సుమంత్రుడి భక్తికి మెప్పుదల ప్రకటించాడు.

కన్నీళ్ళు పెట్టుకుంటూ నించున్న గుహుడితో "రాజ్యం జాగ్రత్త! రాజ్యాలు రక్షించుకోవడం మహా కష్టం సుమా! చతురంగ బలాలు వృద్ధిచేసుకో! బొక్కసం ఎప్పుడూ నిండుగా వుండాలి సుమా! శత్రువులు ఆక్రమించడానికి వీల్లేకుండా దుర్గాలు పటిష్టం చేసుకోవాలి. దేశంలో ఏం జరుగుతోందో ఏమరపాటు లేకుండా తెలుసుకుంటూ వుండాలి .... పడవ కదలదు కదా?" అని బల్ల దగ్గిరే నిలబడ్డాడు.

తన పెద్దతనం అయినా గుర్తించకుండా రాజ్యం ఎలా చెయ్యాలో రాముడు అన్నిసార్లు చెప్పడం చూస్తే గుహుడి మనసుకి కష్టం తోచింది. మళ్ళీ పడవ ముందు నించున్న రాముణ్ణి చూస్తే అడవుల్లో జీవించడానికి వెళుతున్నాడని కరుణ ముంచుకొచ్చింది. "ఎక్కు నాయనా!" అన్నాడు బొంగురు కంఠంతో.

రాముడు కళ్ళు మూసుకుని 'నావారోహణ మంత్రం' జపించుకుని, బోయ మనుషులు గట్టిగా పట్టుకున్న బల్లమీదనించి కదలని పడవని వీరోచితంగా ఎక్కి, ఏ మంత్రాలూ తెలియక ఎక్కి నించున్న వాళ్ళ పక్కన ధైర్యంగా నించున్నాడు.

ఏ అనాది కాలంలోనో తొలిమానవులు జలయాత్రలు ప్రారంభిస్తూ ప్రకృతి శక్తులన్నిటినీ తమ కార్యానికి సుముఖులుగా వుండమని ప్రార్థించిన ప్రార్థన, రాముడికి ధైర్యం ఇచ్చిన 'మంత్రం' అయింది.

బోయవాళ్ళు పడవని నదిలోకి గెంటి, చేపల్లా దాని అంచుల వెంట పాకి ఎగిరి పడవలోకి దూకి తెడ్లు చేతుల్లోకి తీసుకున్నారు. చూస్తూండగానే పడవ వొడ్డు నించి అందరికీ దూరంగా నది మధ్యకు పోయింది.

ఒడ్డుమీద గుహుడూ సుమంత్రుడూ పడవని చూసి చూసి వెనక్కి తిరిగారు.

"ఈయనే రాజు అయితే రాజ్జెం మా బాగా జేసును సుమంత్రయ్యా!" అన్నాడు గుహుడు, 'రాజ్యం ఎలా చెయ్యాలో' తనకు అన్నిసార్లు చెప్పాడనే బాధ లోపల దాచుకోలేక.

సుమంత్రుడి మొహం తామరాకంత విప్పారింది "నా రాజభక్తి ఇవ్వాళే తెలిసిందా చెప్పు గుహుడూ! ఈ పిల్లలు పుట్టక ముందునించీ నేను దశరథ మహా రాజుని కొలుస్తున్నాను. 'నీ రాజభక్తికి సంతోషించాను' అంటాడు చూడు! ఇంత పెద్దవాణ్ణి! ఇప్పుడు అనవలసిన మాటేనా అది?" అని తల ఝాడిస్తూ చెప్పుకున్నాడు.

"ఏదోలే మంత్రయ్యా! పెద్ద కష్టంలో వున్నాడు. మన బిడ్డ లాంటాయన."

"అదేలే! నేనూ అలాగే అనుకున్నాను. అది కాదు, ఈయన ఇంతకు ముందు ఇంత మాట్లాడే వాడు కాదయ్యా!"

"ఎంత చెప్పినా ఒక్క పండన్నా తిన్నాడుగాదు చూడు, అదేం రొతమో గానీ, దాని దుంపతెగిన రొతం! రుసులు మాత్రం తిండి తినరంటయ్యా?"

"ఏమోలే, ఆయన రోజులు అలా మారాయి! వెళ్తాను గుహుడూ! అటు చూడు! పడవ మాయమైపోయిందే!"

సుమంత్రుడి రథం నెమ్మదిగా సాగిపోయింది.

★ ★ ★

గంగా నదిలో పడవ హంసలాగా సాగుతోంది. చుట్టూ ఎంతో స్వచ్ఛమైన నీళ్ళు, సూర్యకిరణాలు సూటిగాపడి బంగారం ద్రవించి ప్రవహిస్తున్నట్టు మెరుస్తున్నాయి. కెరటాలమీద కాంతులు అందరి మొహాలమీదా ప్రతిఫలిస్తూ తరంగాల వలే జారుతున్నాయి. నిర్మలంగా వున్న ఆకాశంలో అక్కడో పక్షీ అక్కడో పక్షీ చాలా ఎత్తున ఎగురుతున్నాయి. తీరాల మీద చెట్లు, గడ్డిపోచలంత చిన్నవై పోయాయి. పడవ నెమ్మదిగా ఊగుతోంది.

గాలివాటం పడవకి అనుకూలంగా వుంది. తెడ్లు

వేసే మనుషులు, ఉత్సాహం ఆపుకోలేక గంగమ్మతల్లి పాట ఎత్తుకున్నారు.[49]

లక్ష్మణుడికి ఎడం చెవిమీద చర్మంరేగి గాలి తగిలినప్పుడల్లా దురదపెడుతోంది. పుల్ల దొరక్క పంచెతో గట్టిగా రాసుకుంటూ కూర్చున్నాడు.

సీత అంత నీటిని చూసిన సంతోషంతో చేతులు జోడించి నమస్కరించింది – "గంగమ్మతల్లీ! మేము వనవాసం ముగించి తిరిగివొచ్చి మా రాజ్యం మాకు దక్కిన తర్వాత నీకు మద్య మాంసాలతో పూజలు చేయిస్తాను.[50] నీ తీరం పొడుగునా వున్న పుణ్యక్షేత్రాలన్నీ తిరిగి, బ్రాహ్మలకు గోదానాలూ, భూదానాలూ, వస్త్ర దానాలూ చేయిస్తాను. ఈ పద్నాలుగేళ్ళూ సురక్షితంగా గడిచి మేము సుఖంగా అయోధ్యకు వొచ్చేటట్టు అనుగ్రహించు తల్లీ!" అని ప్రార్థిస్తూ 'మొక్కు' మొక్కింది. గంగమ్మతల్లి తప్పకుండా అనుగ్రహిస్తుందని సీతకు ఎంతో నమ్మకం కలిగింది. ఆమె మొహం కొత్త సంతోషంతో వెలిగింది.

సీత మొక్కుకోవడం విన్న రాముడు, సీతని మెచ్చుకున్నట్టు చూశాడు.

కానీ, .... ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. ఆందోళనా తరంగం ఒకటి లేచింది. పద్నాలుగేళ్ళ తర్వాత రాజ్యం తీసుకునే హక్కు తనకే వుంటుందా? కైక కోరింది అది కాదుగదా? రాజ్యం ఎప్పుడూ భరతుడికే వుండాలని ఆమె ఆశ కదా? భరతుడు రాజుగా స్థిరపడడం కోసమే తనకు వనవాసం కదా? ... ఎంత తెలివైందో! ఆడదైతే యేం? స్త్రీలలో కూడా ఎంతెంత దుష్టులైనా వున్నారు. ఏనాటికైనా రాజ్యం తన కెందుకు వస్తుంది? ... ఏమో! ఏమి జరగనున్నదో! విధి కృతాన్ని ఎవరెరుగుదురు? పద్నాలుగేళ్ళు ఓపికపడితే! .... ఆందోళన క్రమంగా తగ్గింది.

కెరటాలు చూస్తూ పడవ అంచుకి ఆని నిలబడ్డ సీతకి కూడా హఠాత్తుగా వొక సందేహం వచ్చింది. తల వొంచుకుని కొంతసేపు ఆలోచించి, ఎటూ తోచక భర్తవేపు సందేహంగా చూస్తూ – "అడగనా, వొద్దా?" అని సందేహంలో పడింది.

రాముడు ప్రసన్నంగా వుండడం వల్ల – "ఏం కావాలి? మంచి నీళ్ళా? లక్ష్మణా!" అని పిలవబోయాడు.

సీత వారించి కొంచెం సిగ్గుతో, తడబాటుతో తల కొంచెం ఎత్తి – "స్వామీ .... చిన్న సందేహం" అని తల వొంచింది.

"చెప్పు సీతా! భయమెందుకు?"

సీత కొంచెం తల ఎత్తింది – "మన రాజ్యం మనకు రావాలని గంగాదేవిని పూజించానేగానీ, మనం వనవాసం నుంచి తిరిగి వొచ్చినా కోసల రాజ్యం మన కెందుకు వొస్తుంది? శాశ్వతంగా భరతుడే రాజుగా వుండాలని కదా మీ తండ్రిగారి కోరిక? వనవాసం తర్వాత మిమ్మల్ని మళ్ళీ రాజ్యం తీసుకోమని ఆయన కోరలేదు కదా? మీరు తండ్రి ఆజ్ఞ అక్షరాలా పాటించే పితృవాక్య పరిపాలకులు. ఇక గంగానదిని నేను ప్రార్థించి మాత్రం ఏం ప్రయోజనం?" – ఆ నాలుగు మాటలూ నెమ్మదిగా అని దిగులుపడుతూ తల వొంచుకుంది.

రాముడు మారు మాట లేకుండా వుండి పోయాడు. సీత స్పష్టంగా పైకి అనగలిగింది గానీ, ఆ సందేహం తనని మొదటినించీ బాధిస్తూనే వుంది. పద్నాలుగేళ్ళ వనవాసానికేమీ బాధ లేదు. అది ఎలాగో గడిచిపోతుంది. ఆ తర్వాత సంగతేమిటి? తండ్రి ఏ మాట చివరన్నా – "తిరిగివచ్చి నువ్వే రాజ్యం తీసుకో!" అంటాడేమోనని చూశాడు. ఆయనకా తలంపే లేదు. అయితే, ఎప్పటికీ భరతుడే కదా రాజుగా వుండవలసింది? తను వనవాసం నించి తిరిగిరావడం అంటే, తనకు వనవాస శిక్ష పూర్తి అయినట్టూ, మళ్ళీ అయోధ్యలో నివసించడానికి అనుమతి లభించినట్టూ మాత్రమే అర్థం. అంతేగానీ, తను అప్పుడు రాజ్యం తీసుకోవాలని కాదు. రాజ్యం ఎప్పటికీ భరతుడిదే! అయితే మరి, తను తిరిగి వచ్చిన తర్వాత

---

**49.** సాధారణంగా మనం వినే కథల్లో రాముణ్ణి గంగ దాటించడానికి గుహుడే పడవ నడిపాడని వింటాం. అది నిజం కాదు. గుహుడు, తన మనుషుల్ని పంపించాడు గానీ, తను రాముడితో వెళ్ళలేదు. ★

**50.** **అయోధ్యా, సర్గ 52, శ్లోకాలు 86, 87, 88**: వనవాసానికి వెళ్తోన్న రాముడికీ, సీతకీ, రాజ్యం గురించి ఎటువంటి అభిప్రాయం వుందో చూడండి. వనవాసం తర్వాత "తిరిగి రాజ్యంబు నొందిన పిమ్మట" ఏ మొక్కు బళ్ళు తీర్చాలో సీత మొక్కిన దాన్ని బట్టి, రాజ్యం మళ్ళీ తమకు వొస్తుందనే అభిప్రాయంతోనే వారు వనవాసానికి బయలుదేరినట్టు స్పష్టమవుతుంది. వారావిధంగా భావించడానికి కారణం ఏమిటి? ఆధారం ఏమిటి? 'పద్నాలుగేళ్ళ వనవాసం' అంటే, ఆ వనవాసం ముగిసిపోయిన తర్వాత రాజ్యం మళ్ళీ రాముడికే రావాలనే నిబంధన ఏమైనా వుందా? – అలా లేదు. రాజ్యం ఎప్పుడూ భరతుడికే. రాముడు, వనవాసాన్ని ముగించి, తిరిగి దేశంలోకి వచ్చి వుండవచ్చు, అంతే. కానీ, సీత ఎప్పుడూ 'మా రాజ్యం మాకు రావాలి' అన్నట్టే మొక్కులు మొక్కుకుంటూ వుంటుంది. దాన్ని చూసి రాముడు ఆనందిస్తూ వుంటాడు. రాజ్యాన్ని మళ్ళీ తనే తీసుకోవాలని కోరుకుంటే తండ్రి ఆజ్ఞని ఎక్కడ పాటించినట్టు? ★

భరతుడి అధికారంలో, అతని దయతో వుండవల సిందేగా? ఆ భాగ్యానికి రాజ్యానికి తిరిగి రావడం మాత్రం ఎందుకు? పద్నాలుగేళ్ళేమిటి? నూరేళ్ళూ .... అక్కడే .... అడవుల్లోనే జీవించి చచ్చిపోతే మంచిది.

రాముడు భరించలేనంత అసహనంతో అటు తిరిగి, మొహం అటు తిప్పుకున్నాడు.

సీత, గంగవొడ్డున పుణ్యక్షేత్రాలన్నీ తిరిగి మొక్కులు తీర్చే భాగ్యం కలుగుతుందో లేదోనని ఆందోళనగా చూసింది.

రాముడు కొంతసేపటికి ఇటు తిరిగాడు. మొహం మబ్బులుపట్టి వుంది – "సీతా! నువ్వు స్త్రీవి! ఈ ధర్మా ధర్మ చర్చ నీకెందుకు? బ్రాహ్మలూ, పురోహితులూ ఎలా నిర్దేశిస్తే అలా జరుగుతుంది" అన్నాడు. ఆ చివరి మాటలు ఎవరో తన ఆత్మలో ఉపదేశించినట్టు అప్ర యత్నంగా అన్నవే. అవును, బ్రాహ్మలు న్యాయం చెప్పరా? రుషులు తనకు అండగా నిలబడరా? ఎలాగూ అడవుల్లో నివసించాలి కాబట్టి ఈ వనవాస కాలంలో రుషుల మెప్పు సంపాదించాలి.

రాముడికి ఎంతో ధైర్యంవొచ్చి సంతోషం కలిగింది. మొహం విప్పారింది.

భర్త మాటలకు చిన్నబుచ్చుకున్న సీత నదివేపు మొహం తిప్పి కెరటాలు చూస్తూ నిలబడింది.

లక్ష్మణుడు ఎక్కడో పుల్ల సంపాదించి మెడ గోక్కుం టున్నాడు.

మిట్ట మధ్యాహ్నానికి పడవ అవతలి వొడ్డు చేరింది. తీరం అంతా ఇసకతో చదునుగా వుంది. సూర్యుడు మహా తీక్షణంగా వున్నాడు. ఇసక, చిత్రిక పట్టిన బంగారం లాగ ధగధగ మెరుస్తోంది.

పడవ మనుషులు – చీరల మూటా, కత్తులూ, విల్లులూ, అమ్ముల పొదులూ, కవచాలూ, గంపా, పలుగూ అన్నీ, ఇసకంతా దాటించి చెట్ల కింద పెట్టారు.

రాముడూ, లక్ష్మణుడూ, సీతా పడవ దిగి చెట్ల కిందకు చేరారు.

రాముడు పడవ మనుషులతో గంభీరంగా "మీ సేవకు చాలా సంతోషించాను. మీకు ధన ధాన్యాలు సిద్ధిస్తాయి!" అని చెయ్యెత్తి ఆశీర్వదించాడు.

పడవ మనుషులు వొకరి మొహం ఒకరు చూసు కున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని వాళ్ళకి ఈ మర్రి పాలాయన చెయ్యాడించినంత మాత్రాన ధన ధాన్యాలెలా సిద్ధిస్తాయో వాళ్ళకి అర్థం కాలేదు "ఎల్తాం బాబయ్యా!" అని దణ్ణాలు పెట్టి వెనక్కి తిరిగారు.

రాముడు వొకసారి తలతిప్పి చుట్టూ చూశాడు. ఒక్క సూర్యకిరణం కూడా కింద పడనంత వొత్తుగా వున్నాయి చెట్లు. గాలి హోరు తప్ప, ఎటు చూసినా నిర్జ నంగా వుంది. రాముడికేదో హఠాత్తుగా సందేహం వొచ్చి, పడవ మనుషుల్ని చప్పట్లు కొట్టి వెనక్కి పిలిచాడు – "ఇదిగో! ఇక్కడేమన్నా పులులూ సింహాలూ అవీ వున్నాయా?" అని గట్టిగా అరిచి అడిగాడు.

"లేవు బాబయ్యా! ఎవరూ సూసినట్టు సెప్పుకోరు. అయినా మేం ఏటాడం బాబయ్యా. రాజుగారి కాడ వుద్దో గాలు సేత్తన్నాం" అని వాళ్ళ 'ఉద్యోగాల్ని' వాళ్ళు మురిసి పోతూ నవ్వు మొహాలతో చెప్పుకున్నారు.

"మంచిది! శెలవు తీసుకోండి! పులులవీ వుంటే ఇప్పుడే చంపేద్దామని అడిగాను."

పడవ మనుషులు మళ్ళీ దణ్ణాలు పెట్టి, ఈ మర్రి పాలాయన మళ్ళీ పిలుస్తాడేమో నన్నంత భయంతో, పడవ దగ్గిరికి పరుగులెత్తారు. పడవని నీళ్ళలోకి గెంటి పక్షుల్లా ఎగిరి అందులో పడ్డారు. చూస్తూండగానే పడవ దూరమౌతోంది .... క్రమంగా .... క్రమంగా.

వొక్క మానవ ప్రాణి అయినా లేని ఆ అడవి మధ్య, ఆ చెట్ల కింద, ఆ నీళ్ళవార నిలబడి, దూరం అయి పోతోన్న పడవని చూస్తోంటే ఆ ముగ్గురికీ తమకే అర్థంగాని విచారమో, భయమో, దిగులో, ఆవరించింది. ఎవరి కఠిన వ్రతాలు వారికి గుర్తొచ్చాయి.

రాముడికి – పితృవాక్య పరిపాలన!

లక్ష్మణుడికి – భ్రాతృవాక్య పరిపాలన!

సీతకి – పాతివ్రత్యం!

ఏ వ్రతాలూ లేని బోయవాళ్ళు సంతోషంగా గొంతు లెత్తి పాడుకుంటూ, అడవులకు దూరంగా ఇళ్ళ వేపు, మనుషులవేపు, సాగిపోతున్నారు.

సీత బేలగా భర్తవేపు చూసింది. లక్ష్మణుడు బరు వెక్కుతోన్న గొంతు సవ్వరదీసుకుని "అన్నగారూ! ఏమి శెలవు?" అని తలవొంచాడు.

రాముడికి ఎందుకో చాలా కంగారుగా, అధైర్యంగా, ఇంకా ఏమిటో అంతుపట్టని రకంగా అయింది మనసు. చప్పట్లు కొట్టి పడవని వెనక్కి పిలుద్దామా అన్నంత గాభరా కలిగింది. నదివేపు చూశాడు. అంతవరకూ నీళ్ళ మీద తేలుతోన్న పడవ పూర్తిగా కనుమరుగై పోయింది!

రాముడు చుట్టూ చూసి విల్లు భుజానికి తగిలించు కుని, కత్తి నడుంకి కట్టుకున్నాడు – "లక్ష్మణా! ఇక మనం అడవుల్లోకి వచ్చేశాము. నువ్వు మా ఇద్దర్నీ రక్షిస్తూ వుండాలి! ఇదివరకెన్నడూ చూడలేదు ఈ అడవులు. ఇంకా ముందు ముందు ఎలా వుంటాయో యేమో! జాగ్రత్త సుమా! తర్వాతేం జరిగినా విచారించి లాభం లేదు. జనం వున్నచోటే కదా అని ఎక్కడయినా మమ్మల్ని మర్చిపోయి వుండకు! జనం వున్నచోటయినా, లేని చోటయినా వొక్కలాగే, శ్రద్ధతో చూస్తూ వుండు! ఏదీ, కత్తి పట్టుకో ముందు! కాస్త నెమ్మదిగా నడుస్తూ

పోదాం” అని చుట్టూ చూశాడు.[51]

పడవ మనుషులు దించి పడేసిన వొస్తువులన్నీ చెట్టుకిందే కనబడ్డాయి. “ఇవన్నీ ఎలా తీసుకు వెళ్ళడం?” అని రాముడికి అప్పుడు ధర్మసందేహం వొచ్చింది. తండ్రి ఇస్తున్నాడన్న సంబరమేగానీ అవన్నీ అడంగుకి ఎలా చేరతాయనే ధ్యాసే లేదు, తీసుకునే టప్పుడు.

రాముడు మొహం చిట్లిస్తూ చాలాసేపు ఆలోచించాడు – ఈ మూట దానికదే ఎగరటానికి ఏ ధర్మాలూ పనిచెయ్యవా? వేదాలన్నీ చదివాను. ఎన్నో దాన ధర్మాలు చేశాను. ఇంత పితృభక్తీ .... అన్నట్టు సీత ఏవన్నా తన పాతివ్రత్యంతో మూటని ఎగిరించగలదేమో అడగనా?– “నా కన్నా మీరే శక్తిమంతులు కదా స్వామీ?” అంటుందా? ఆ మాటా నిజమే – అనిపించింది రాముడికి. ఆమెకు, వొక్క పతిభక్తేగానీ, తనకు చాలా శక్తులున్నాయి కదా? పితృవాక్య పరిపాలనా, సత్యవ్రతం, అన్నిటికన్నా ముందు విష్ణు అంశా, ఇంకా చాలా వున్నాయి. తన శక్తితోనే ఆజ్ఞాపించాలి – అని మూటని గంభీరంగా చూశాడు. వెంటనే కళ్ళు మూసుకున్నాడు. “ఓ చీరల మూటా! కత్తులారా! కవచములారా! నేను దైవాంశ గల శ్రీరామ చంద్రుణ్ణి! ఇలలో సాటిలేని పితృవాక్య పరిపాలకుణ్ణి! రుషులు నిత్యమూ నన్నే కీర్తిస్తూ వుంటారు. అటువంటి మహానుభావుణ్ణి నేను మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాను. మీరు ఆకాశంలో తేలుతూ మా వెంట వొస్తూ వుండండి! ఊఁ... కదలండి!” అని మనసులో మంత్రం జపించినట్టు ఆజ్ఞాపించాడు.

ఆ మూట అలాగే బొత్తిగా మొహమాటం లేకుండా పర్వతంలాగ పడి వుంది! కత్తులూ కదల లేదు, కవచాలూ కదలలేదు! వాటికి, రాముడెవరో తెలిసినట్టే లేదు.

“ఏమిటీ? నా ఆజ్ఞకేమీ శక్తిలేదా?” అని రాముడు సందేహంలో పడి నమ్మలేకపోయాడు. చెట్టుమీద గోల గోలగా అరుస్తోన్న పక్షుల్ని తోలే నెపంతో గంపని తీసి పైకి ఎగరేశాడు. అది ఆకాశంలో తేలలేదు. దుబ్బున కిందపడింది. అప్పటికి రాముడు అసలు సంగతి గ్రహించాడు. ‘విధి వెన్నంటి బాధిస్తోండగా ఏ శక్తులూ పని చెయ్యవు’ అని! అయితే, మూట సంగతేమిటి? వదిలెయ్యాలా ఇక్కడే? లేకపోతే, ఎవరు మోస్తారు? తనకేమీ పట్టనట్టు మొహం తిప్పుకుని నదివేపు చూస్తూ నించున్నాడు.

లక్ష్మణుడు కాస్సేపు దీర్ఘంగా ఆలోచించి పనిలోకి దిగాడు. గబగబా మూట విప్పి కవచాలూ అస్త్రాలూ అందులో పడేసి కట్టాడు. విల్లు భుజానికీ, అమ్ముల పొది వీపుకీ, కత్తి నడుంకీ తగిలించుకున్నాడు. కాసేపు తటపటాయించి, మూటని నెత్తికెత్తుకున్నాడు. గంపా, పలుగూ చేత్తో పట్టుకున్నాడు.[52]

ఆ ఆకారంలో లక్ష్మణుణ్ణి చూస్తే, సీతకి కడుపు తరుక్కుపోయింది. కళ్ళు నీళ్ళతో నిండాయి. భార్యని వొదిలీ, భోగాలు వొదిలీ, తమతో వొస్తోన్న లక్ష్మణుడంటే సీతకి మొదటినుంచీ దయే. – “అయ్యో పరిచారకులలాగు మూటలు మోస్తావా? రాజ కుమారుడివేనా నాయనా?” అని మాతృప్రేమ పొంగిన కన్నతల్లిలాగ బాధపడింది.

రాముడూ లక్ష్మణుడూ రాజకుమారులంటే, చూసే వాళ్ళ సంగతెందుకూ, ఇప్పుడు ఆ అన్నదమ్ములే నమ్మే స్థితిలో లేరు. మిసమిస మెరిసే పట్టు బట్టలూ, వజ్రాభరణాలూ, అలంకారాలూ తీసేసిన్నాడే రాముడికి తన దేహంమీద నించి శక్తంతా పోయినట్టనిపించింది. రాజలాంఛనాలు పోయిన క్షణంలోనే మొహంలో గాంభీర్యం అంతా పోయింది! ఇంకా అక్కడ, ఆ మందిరంలో, తండ్రి ఎదట, బ్రాహ్మలు కీర్తిస్తోంటే ఉత్తేజం కలిగి కొంత తేజస్సు అయినా మిగిలినట్టు తోచిందిగానీ, అయోధ్య వొదిలి, ఆశలన్నీ వొదిలి, రాజ్యభ్రష్టుడై వొచ్చేస్తోంటే, స్థాన బలం పోయి, అలంకార బలం పోయి, దాస దాసీలపై అధికార బలం పోయి, సిరుల బలంపోయి, అన్ని బలాలూ పోయి – ఆత్మలోంచి సమస్త బలమూ

---

**51.** **అయోధ్యా, సర్గ 52, శ్లోకం 94:** రాముడు గంగ ఒడ్డున పడవ దిగి వొక్క అడుగయినా ముందుకు సాగకుండా తన రక్షణ భారం, సీత రక్షణ భారం, లక్ష్మణుడికి వీరోచితంగా అప్పగించాడు. జనం లేని ప్రదేశాల్లోనే గాదు, వున్న ప్రదేశాల్లో కూడా తమని జాగ్రత్తగా రక్షించాలని రాముడి ఆజ్ఞ! యజమాని, సేవకుడికి కార్య భారం అప్పగిస్తూ ఏ విధంగా ఆజ్ఞాపిస్తాడో, అదే స్వభావాన్ని రాముడి ఆజ్ఞల్లో చూడండి! రాముడికీ, లక్ష్మణుడికీ మధ్య ఉన్నది – అన్నదమ్ముల అనుబంధం కాదు, యజమానీ బానిసల సంబంధం. ఈ విషయం ముందు ముందు ఇంకా స్పష్టంగా కనపడుతుంది. ★

**52.** రాముడు వనవాసానికి బయలుదేరేముందు దశరథుడు – సీతకోసం చీరలూ, ఆభరణాలూ, అలంకార వస్తువులూ; కొడుకులకు కవచాలూ, అస్త్రాలూ, గంపా పలుగూ; ఇంకా ఎన్నో ఇచ్చాడని ఇంతకు ముందు తెలిసిన విషయమే. ఆ వస్తువులన్నిటినీ రథంమీద సర్దడం గురించీ, గంగ దాటేటప్పుడు పడవలోకి వాటిని ఎక్కించడం గురించీ, మూల కథలో విపులంగానే వుంది. కానీ ఆ తర్వాత ఆ వస్తువులన్నీ అడవుల్లోకి ఏ విధంగా వెళ్ళాయో ఇక ఆ కథలో చెప్పలేదు. కవి, ఆ సంగతి ఎత్తకుండా గడుసుతనంగా వదిలేశాడు – మరి ఆ వస్తువుల్ని ఎవరు మోశారు అడవుల్లో తిరిగేటప్పుడు? ★

పోయింది! రాజభోగాలన్నీ వదిలి వచ్చిన మొదటి రాత్రే, నేలమీద పడుకుని, వీపుమీద చీమల్ని దులుపుకుంటోంటే 'అసలు నేను రుషులు పొగిడే శ్రీరాముణ్ణేనా?' అని సందేహం వొచ్చింది శ్రీరాముడికి. ఎవరయినా రుషిపుంగవుడు కనబడితే – "స్వామీ! నేనెవరినో శలవీయండి!" అని అడిగి తెలుసుకోవాలనే కోరిక కలిగింది అప్పుడప్పుడూ.

పూర్వం ఎన్నడోగానీ కోపం వొచ్చే అవసరం వుండేది కాదు. పరిచారకులు భయభక్తులతో సేవలు చేసేవారు. పురోహితులూ, మంత్రులూ కూడా 'కాబోయే మహారాజు' అని వినయ విధేయతలతో మెలిగేవారు. ఎటు చూసినా ప్రజలనుంచీ విన్నపాలూ, ప్రార్థనలూ! ఇప్పుడు అవన్నీ ఏవీ? ఈ రెండు మూడు రోజుల్లోనే అనేకసార్లు కోపం వచ్చింది. సీతని చూసినా, లక్ష్మణుణ్ణి చూసినా, పూర్వం కలిగినంత సంతోషం కలగడం లేదు. తన మనోస్థితి తనకే ఆశ్చర్యంగా వుంది రాముడికి. అంతులేని ఆలోచనలతో భరించలేనంత అసహనం కలుగుతోంది. నీరసంతో కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. వొక్క అడుగుకూడా కదలకుండా నించుని లక్ష్మణుణ్ణి చూశాడు.

మూట నెత్తికెత్తుకుని, మిగిలినవన్నీ వొంటి నిండా పేర్చుకున్న లక్ష్మణుణ్ణి చూసి రాముడు సంతోషించాడు. లక్ష్మణుడు, తన సేవకోసమే వొచ్చాడు కదా? సేవకుడి ధర్మం యజమానికి ఉపచారాలు చెయ్యడమూ, యజమానిని ఎల్లవేళలా రక్షించడమూ కదా?

రాముడు, ఆ గంపా పలుగూ పట్టుకోవచ్చు. కానీ, రాముడు, శ్రీరాముడు కదా?

ఎడమ చేత్తో మూటని పడిపోకుండా నొక్కి పట్టుకుని, కుడిచేత్తో గంపా పలుగూ పట్టుకుని, కాలు కదపటానికి అన్నగారి అనుమతికోసం చూస్తోన్న లక్ష్మణుడితో రాముడు – "లక్ష్మణా! నువ్వే మమ్మల్ని రక్షిస్తూ వుండాలి సుమా! ఇక నువ్వు ముందు నడువు! నీ వెనక సీత నడుస్తుంది. భయం లేదు. నేను వెనక నడుస్తాను. మిమ్మల్ని వెనకనించీ రక్షిస్తూ వుంటాను" అని ఇక సాగటానికి అనుమతించాడు.[53]

సీత ఆశ్చర్యంగా భర్తవేపు చూసింది. "అడవుల్లో రక్షించేవాళ్ళే ముందు నడవాలిగానీ, వెనక నడిస్తే రక్షించడం ఎలాగు? వెనకదారి మనం క్షేమంగా నడిచి వొచ్చినదే కదా?" అని అడగాలనుకుంది. రాముడి గాంభీర్యం చూసి ధైర్యం చాలక వూరుకుంది.

లక్ష్మణుడు, మూట బరువుతో మెడ కుంచుకుపోతూ దారితీశాడు.

అతని వెనకాల సీత!

ఆ వెనకాల రాముడు – ధైర్యంతో! తనకేమీ ప్రమాదం రాదనే ధైర్యంతో!

నది వొడ్డునే చెట్లకిందనించి నడుస్తున్నారు.

ఆలోచిస్తోంటే, ఈ ఏర్పాటు చాలా ఉత్తమమైందనిపించింది రాముడికి.

భర్త, భార్యని తన కళ్ళముందే కనిపెడుతూ వుండడం చాలా మంచిది. లోక మర్యాద కూడానూ. అపనిందలకు వెరవక తప్పదుకదా?

ఆ ఆలోచన వెంట సీత మీద కొంచెం కోపం కలిగింది – "చూడు, చెప్తే విన్నావు కాదుగదా సీతా! ఈ కాలి నడక ఏం సుఖం నీకు? మావంటి పురుషులకు ఫరవాలేదుగానీ, అయినా అప్పుడే ఏమయింది? ఇంకెన్ని కష్టాలో! చక్కగా అంతఃపురంలో ఎందరో కాపలాలు కాస్తోంటే, దాసీలు సేవలు చేస్తోంటే, ఎంత బాగుండేది నీకు!" నిరుత్సాహంగా నవ్వాడు.

తన భర్త, తన కష్టం చూడలేక అంత బాధపడుతున్నందుకు సీత చిరునవ్వు నవ్వింది – "స్వామీ! మీ పాదాలు ఈ నిర్జనారణ్యాలలో తిరుగుతోండగా నేనా అంతఃపురాలలో సుఖాలనుభవించగలనా?" అని భక్తిగా చూసింది.

రాముడికి కొంచెం సంతోషం కలిగింది. "అవును, నీవంటి పతివ్రత భర్తను విడిచి ఎలా జీవించగలదు?" అని తల పంకిస్తూ నడిచాడు.

ముగ్గురూ చెట్లకిందనించి నెమ్మదిగా సాగుతున్నారు.[54] ఏ చెట్ల నుంచో, ఏ పూలనుంచో తెలీని అడవి వాసన తెలుతోంది గాలి నిండా. సీత నడకతో పాటు గాజులూ, అందెలూ, ఘల్లుఘల్లున మోగుతున్నాయి. ఆమె వొంటినిండా వున్న ఆభరణాలు, రకరకాల చప్పుళ్ళు చేస్తున్నాయి, అంత అడవిలో. నగలు పెట్టుకున్న స్త్రీ నడక శబ్దాలకు – పక్షులతో, జంతువులతో, పూలతో పళ్ళతో, అడివంతా ఆశ్చర్యంగా

---

**53. అయోధ్యా, సర్గ 52, శ్లోకాలు 95, 96, 99:** లక్ష్మణుణ్ణీ, సీతనీ ఏ విధంగా నడవమని రాముడు ఆదేశించాడో, తను వారి వెనక నడవడానికి కారణం ఏం చెప్పాడో చూడండి! అడవుల్లో రక్షణభారం తీసుకోవలసిన వ్యక్తి, ముందుభాగాన వుండాలో, వెనక వుండాలో ఆలోచించవలసిన విషయమే. ★

**54.అయోధ్యా, సర్గ 55, శ్లోకం 29:** రాముడికీ, లక్ష్మణుడికీ మధ్య నడుస్తోన్న సీతని – "రెండు మొగ ఏనుగుల మధ్య నడిచే ఆడ ఏనుగులా వుంది సీత" అని వర్ణించాడు కవి. ఆయన ఇంత వావీ వరసా చూడకుండా లక్ష్మణుణ్ణి మొగ ఏనుగుని చేసి, సీతని ఆడ ఏనుగుని చేస్తాడని రాముడు ఊహించి వుండడు. ఊహిస్తే ఏం జరిగేదో! – ఏమో, మనం ఊహించలేం. ★

చూస్తోంది సీతని.

ఎక్కడ చూసినా నేరేడు చెట్లెక్కువగా వున్నాయి. సీత, చెట్లకింద పడివున్న పళ్ళు ఏరుకుంటూ నడిచింది. చుట్టూ చూస్తూ – "అదేం చెట్టు? ఇదేం చెట్టు? అదిగో! దూరంగా ఆ పచ్చ పూలపొద పక్కన దాని .... పేరే మిటి?" అంటూ కుతూహలంగా అడగటం మొదలు పెట్టింది. రాముడు – 'మద్దిచెట్టు .... పలాస చెట్టు.... కరక చెట్టు....గానుక చెట్టు' అంటూ కొన్ని పేర్లు చెప్పాడు. తెలియని వాటిని గురించి "నాకు తెలియదు" అనడం ఇష్టం లేక – "నువ్వు స్త్రీవి! నీకు చెట్ల పేర్లెం దుకు?" అనబోయి, అప్పటిదాకా కొన్ని పేర్లు చెప్పేశాడు కాబట్టి, అది కుదరక, జవాబులివ్వకుండా మౌనం వహించాడు.

సీత కూడా, భర్త ఉపవాసాలవల్ల నీరసంగా వుండటం గ్రహించి అడగటం మానేసింది.

ఎండ తీక్షణంగా వున్నా చెట్లకిందనించి నడవటం వల్ల సుఖంగానే వుంది రాముడికి. చెట్ల కొమ్మల్ని చేతుల్తో తప్పించుకుంటూ చిక్కని నీడల్లోంచి ఆకుల్ని రాసు కుంటూ నడవాల్సి వస్తోంది. అటువంటి చోట లక్ష్మ ణుడు దూరంగా పక్కదారికి మళ్ళి, మళ్ళీ వచ్చి కలుస్తు న్నాడు.

సీతకు ఆకుల్ని రాసుకుంటూ నడవటం ఆటలాగ ఎంతో సంతోషంగా వుంది. మధ్య మధ్య కొన్ని కొమ్మలు, ఉయ్యాలలలాగ వొంగి సీతతో – "వెళ్లొవుగానిలే సీతా! కాసేపు కూర్చోరాదూ?" అని చీర కుచ్చెళ్ళో, పైట కొంగో పట్టుకుని అడుగుతున్నాయి. సీత నవ్వి ఆ కొమ్మమీదకు వాలి అవతలకు దూకుతోంది. అక్కడక్కడా కొత్తపూలు ఏరుకుంటూ – "మన తోటలో పూలకంటే ఈ పూలు ఎంత బాగున్నాయో!" అంటూ రాముడికి చెప్పి ఆశ్చర్య పోతోంది.

లక్ష్మణుడికి జుట్టులోంచి చెమట మెడమీదకు కారుతూ మర్రిపాల పుండు మంట ప్రారంభించింది. గంపా, పలుగూ, కిందపెట్టి కొంతసేపు మెడ గోక్కుని, మళ్ళీ గంపా, పలుగూ అందుకున్నాడు.

"లక్ష్మణా! మూట భారంగా వుందటోయి?"

లక్ష్మణుడు తడబడుతూ, మెడ వొంగిపోతూ, "ఎంతమూట అన్నగారూ! మీ దయ వుండాలేగానీ ఈ మూట ఏమిటీ, భువనాలే మొయ్యనా మీ కోసం?" అని కొంచెం పైకిలేచి తిన్నగా నడవడానికి ప్రయత్నించాడు.

"అవును లక్ష్మణా! నువ్వు సద్గుణ సంపన్నుడివి! మన వంశానికి కీర్తి తెస్తావు! (మూటలు మోసి!) ముల్లో కాలలో నువ్వు ఎప్పుడూ నాతోనే వుంటావు."

"మహాభాగ్యం అన్నగారూ!" నమస్కారం పెట్టడానికి చేతులు తియ్యబోయి మూట జారుతుందని వూరు కున్నాడు. అన్నగారి మెప్పుదలతో కొత్త శక్తి వచ్చి గబ గబా అడుగులు వేశాడు.

ఆ అడవి బొత్తిగా మనుషులు సంచరించని ప్రదేశం కాదు. అక్కడక్కడా ఒకరిద్దరు మనుషులు కట్టెలు కొట్టు కుంటూ కనబడ్డారు, గోచీలతో.

దూరంగా పండుటాకుల మీదనించీ వొక్కో జంతువు పరుగులు! పొదల్లో తెల్లని కుందేళ్ళ మెరుపులు!

"ఇవేనా అడవులు?" అని అడిగింది సీత చుట్టూ చూస్తూ.

"అప్పుడే ఏం చూశావు? ఇంకా ముందు ముందు, ... చెప్తే... విన్నా...." అనబోతూ వూరుకుని, కళ్ళు చిట్లించి దూరంగా చూస్తూ – "లక్ష్మణా! అక్కడేదో వూరు కనబడుతోంది. వత్సదేశం అనుకుంటాను. ఇక భయం లేదు. మనం ఈ పొదలో ఆగుదాం" అని చుట్టూ పరీక్షగా చూశాడు.

లక్ష్మణుడు ఒక చెట్టుకింద ఆగి, గంప కింద పెట్టి, మూట దించుకోబోయాడు. ఊడి రాలేదు. జుట్టు గుప్పె ళ్ళలో లాగినట్టు నొప్పెట్టింది. మర్రిపాల జిగురికి చీరల మూట నెత్తికి అంటుకుపోయింది. ఎలాగో పళ్ళు బిగబట్టి – బలవంతంగా వూడదీశాడు. మూట అడుక్కి గుప్పెడు జుట్టు వూడి వొచ్చింది. తలమీద చేత్తో రాసుకుంటూ ఎదురుగా చూశాడు.

దూరంగా వొక నల్లచారల దుప్పి ఆకులు తింటూ కనబడింది.

రాముడు కూడా దాన్ని చూశాడు. చాలా ఉత్సాహం వచ్చింది. రాముడికి వేట చాలా ఇష్టం. దుప్పి మాంసం అంతకన్నా ఇష్టం. వెంటనే బాణం తీసి దుప్పిని కొట్టాడు. అప్పుడే లక్ష్మణుడి బాణం కూడా దూసుకు వెళ్ళి దానికి తగిలింది. అది బాధతో ఒక రకం కేక పెట్టి మూలుగుతూ నేలమీద పడి దొర్లడం మొదలెట్టింది. పక్షులు బెదిరి కేరు కేరుమంటూ చెట్ల మీద నుంచి లేచి పోయాయి. కొంత సేపటికి దుప్పి మూలుగు ఆగి పోయింది.

మళ్ళీ వొక అడవి పంది మూలుగు విని పక్షులు భీతావహంగా ఎగిరిపోవడం మొదలెట్టాయి.

రాముడికి వేట ఉత్సాహం ఇనుమడించింది. వేటలో తప్ప, జంతువుల్నిగానీ మనుషుల్నిగానీ చంప డంలో తప్ప, ఏ క్రీడలోనూ అతనికి అంత ఆనందం కలగదు. భయంతో పొదలలోకి పరిగెత్తుతోన్న ఇంకో దుప్పికి బాణం కొట్టాడు. రెండో బాణం!... మూడో బాణం!... నాలుగో బాణం!... అది కొంతదూరం పరి గెత్తి, ఇంకో బాణం తగిలి అక్కడే కాళ్ళువొంచి కూలబడి పక్కకి వొరిగి తల వాల్చేసింది.

రాముడు చుట్టూ చూశాడు, రక్త దాహంతో! వొక

మనుబోతుపిల్ల, వేటగాళ్ళని పోల్చలేనంత చిన్నది, పొదలోంచి మొహం బయటకి పెట్టి నల్లటి కళ్ళతో తల్లి కోసం చూస్తోంది. రాముడి బాణం దాని కంఠానికి తగిలింది. ఆ కళ్ళు అలాగే నిలిచిపోయాయి! మనుబోతుపిల్ల ఇంకా పొదలోంచి చూస్తున్నట్టే వుండిపోయింది!

ఇక జంతువులు కనబడక రాముడు నిరుత్సాహంగా చెట్టు కిందకి నడిచాడు.[55] అంతా కనురెప్పపాటులో జరిగిపోయింది.

సీత అంతసేపూ వానలో తడిసిన పిట్టలాగ వొణుకుతూ నించుంది. మనుబోతుపిల్ల కళ్ళు చూసి, దయతో కరిగి, ఉద్వేగం ఆపుకోలేక రాముణ్ణి చూస్తూ "స్వామీ! రుషులు వేటాడవచ్చునా!" అంది, ఆశ్చర్యపడుతూ.

రాముడు అర్థంకానట్టు చూశాడు.

"రుషి జీవనానికి సిద్ధపడి వచ్చిన మీరు ...."

రాముడు అంతవరకూ ఆ విషయం ఆలోచించనే లేదు. అవును, రుషులు వేటాడరు!

"ఆత్మరక్షణ అనుకోవడానికైనా ఇవి క్రూర జంతువులు కూడా కావే!" – సీత మళ్ళీ!

రాముడు విస్మయంగా చూశాడు – సీతేనా! అంతఃపురం నించి బయటపడింది మొదలూ ఏదో వొక ప్రశ్న అడుగుతూనే వుంది. ఏమిటీ ధోరణీ? స్త్రీలు తెరలుదాటి లోక సంచారులైతే ఇంకెన్ని ఉప ద్రవాలు సంభవిస్తాయో కదా! – "ఎక్కణ్ణించి వస్తున్నాయి నీకీ ఆలోచనలు? ఎన్నడైనా నాతో తర్క వితర్కాలు జరపడం తెలుసునా నీకు? ఆహారం కోసం వేట దోషమని ఏ శాస్త్రాలూ చెప్పలేదే!" అని తీక్షణంగా చూశాడు, ఆ భర్త.

సీత భయపడి తలవంచుకుందే కానీ, ఆమె మనసు అనేక ప్రశ్నలతో సతమతమయింది. ఆహారం కోసం వేటా ఇది? ఇన్ని జంతువులు ఆహారం కోసమా? చుట్టూ చెట్లనిండా పళ్ళ రాసులుండగా ఇంత నిర్దయగా ఇన్ని జీవుల్ని చంపడం దోషమని వేరే శాస్త్రాలు చెప్పాలా? ఆ చిన్న మను బోతుపిల్ల కళ్ళు, పరుగులు మాని నిశ్చలంగా పడి వున్న ఆ నిర్జీవ కళేబరాలు, మట్టినిండా పాకి ఇంకిన ఆ రక్తపు మడుగులు, అవేమీ చెప్పడం లేదా ఇది దోషమని?

సీత, నదివేపు మొహం తిప్పి మూట వెనక కూర్చుంది.

గాలిలో, నిమ్మపూల వాసనలో రక్తం వాసన కలిసింది.

లక్ష్మణుడు కత్తి తీసుకుని జంతువుల్ని కోసే కార్యంలో మునిగాడు. రెండు జంతువుల్ని మాత్రమే అక్కడక్కడా చేతనైనట్టు కండలు కండలు కోసి మాంసం తయారుచేశాడు. ఇంకా రెండు జంతువులు అలాగే పడి వున్నాయి. చుట్టూ తిరిగి ఎండు కర్రలన్నీ పోగుచేశాడు. రెండురాళ్ళు రాపిడిపెట్టి నిప్పుకోసం ప్రయత్నాలు చేశాడుగానీ చేతకాలేదు. చుట్టూ చూశాడు ఎవరైనా కనిపిస్తారేమోనని.

వొక గోచీ మనిషి నెత్తిమీద కట్టెల మోపుతో వూగుతూ పోతూ కనిపించాడు.

లక్ష్మణుడు చప్పట్లు కొట్టి పిలిచాడు. కట్టెల మనిషి ఆగి వెనక్కి తిరిగి వొచ్చాడు. సంగతి విని మోపు కింద పడేసి క్షణంలో నిప్పు అంటించాడు. కర్రలన్నీ వాటంగా పేర్చి, పెద్ద మంట వొచ్చేవరకూ వూది వూది నిప్పు తయారుచేసి లేచాడు. లక్ష్మణుడు పెద్ద పెద్ద మాంసం కండలు నిప్పుల్లో కాలుస్తూ కూర్చున్నాడు.

"వొక చెయ్యేస్తవా సామీ?" అని కట్టెల మనిషి మోపు ఎత్తుకోడానికి సాయం అడిగాడు.

లక్ష్మణుడు కాలిన కండల్ని చాటుగా పెడుతూ, వల్లకాదని చెయ్యి ఆడిస్తూ – "కుదరదు, కుదరదు, నిన్నంటుకోవడం మాకు కుదరదు. మేము క్షత్రియులం" అని తల తిప్పేశాడు.

కట్టెల మనిషి అర్థంకానట్టు చూసి మోపుని మోకాటి మీదకు లేపి, ఊపిరిబిగబట్టి 'హుమ్మ'ని హూంకరిస్తూ ఒక్కవూపుతో నెత్తికెత్తుకొని చకచక వూగుతూ వెళ్ళిపోయాడు.

వేట ఉత్సాహం తీరకుండానే నిద్రకిపడ్డ రాముడు,

---

**55.** **అయోధ్యా, సర్గ 52, శ్లోకం 120**: రాముడూ, లక్ష్మణుడూ ఆహారం కోసం పందినీ, మనుబోతునీ, దుప్పినీ, నల్లచారల దుప్పినీ చంపారు. రాముడి రుషి జీవితం మొట్టమొదటి పూట నించే మాంసంతో ప్రారంభమైంది. కానీ, రాముడు ప్రతీవాళ్ళతోటీ కందమూల ఫలాలు తింటూ రుషి జీవితం గడుపుతున్నానని చెపుతూ వుంటాడు. ఒక్కపూట ఆహారంకోసం అన్ని జంతువుల్ని చంపాలా? ఇది, కేవలం 'చంపడం'లో క్రూరంగా పొందే ఆనందం!

ఇంకో సంగతి ఆలోచించండి! ఈ కథలో మొదట, వాల్మీకి నోటివెంట కవిత్వం ఎప్పుడు వచ్చింది? వేటగాడు చెట్టుమీద వున్న పిట్టల జంటలోనించి ఒక పిట్టని పడగొడితే, రెండోపిట్ట దుఃఖపడుతూ వుంటే, ఆ దుఃఖం చూడలేక వాల్మీకికి కవిత్వం పుట్టుకొచ్చింది కదా? ఈ కవి, ఆ తర్వాతే ఈ కథ రాశాడు కదా? రాముడు, అడవుల్లో, తన ఆహారానికి అవసరంలేనన్ని జంతువుల్ని చంపి పోగులుపెడుతూ వుంటాడు. పక్షుల్లోనో, జంతువుల్లోనో ఏ జంటనీ విడదియ్యకుండానే, ఏ జంటకీ దుఃఖం కలిగించకుండానే వేటాడతాడా? ఈ కథరాసే కరుణామయుడైన వాల్మీకి, రాముడితో అన్ని జంతువుల్ని చంపించడం ఎందుకు? అది ఆశపోతుగుణం! ★

మాంసం కాలుతోన్న చమురు వాసనకు ఎవరో లేపినట్టు లేచాడు. పక్షులు బెదిరేటట్టు ఆవులించి, నదిలో కాళ్ళూ, చేతులూ కడుక్కుని వచ్చాడు.

లక్ష్మణుడు, అన్నగారికీ వొదినగారికీ, కాలిన మాంసం ముక్కలు ఆకుల్లో వడ్డించాడు.

సీత, వొకటి రెండు ముక్కలు తిని లేచి రేగిపళ్ళు ఏరుకుంటూ దూర దూరంగా తిరిగింది.

అన్నదమ్ములిద్దరూ ఆవురావురుమంటూ తిన్నారు.

"లక్ష్మణా! బహు రుచిగా వుందోయీ!"

"చిత్తం! కడుపారా భుజించండి అన్నగారూ! రక్తం కడగకుండా నిప్పుల్లో కాల్చాను."

"కొంచెం ఉప్పు వుంటే బాగుండేదోయీ!"

ఉప్పా? అయ్యో! తండ్రి, ఒక బస్తా ఉప్పు కూడా ఇచ్చి వుంటే బాగుండేది! తను దాన్ని కూడా మోసు కుంటూ తిరగగలడు.

ఈ అడవిలో ఉప్పు ఎలా దొరుకుతుంది?

అన్నగారికోసం ఉప్పు సృష్టించలేని జన్మెందుకని లక్ష్మణుడు చాలా సిగ్గుపడిపోయాడు.

రాముడికి ఆకలి బాగా తీరింది. తిండి తిని మూడు రాత్రుళ్ళయింది. రోజూ మాంసం వేపుళ్ళు తినడమే రాముడికి ఇష్టం! వంటవాళ్ళు, నెయ్యిపోసి మాంసం కండలు కమ్మగా వేయిస్తారు. లక్ష్మణుడు కాల్చిన కండలు, ఉప్పు లేకపోయినా అంతకన్నా కమ్మగా వున్నాయి. ఆకలి వల్లనేమో!

సీత వొడినిండా రేగిపళ్ళూ నేరేడుపళ్ళూ, ఉసిరి కాయలూ పోసుకొచ్చి ఇద్దరికీ ఇచ్చింది.

రాముడు "అడవి పళ్ళన్నీ వళ్ళో పోసుకుంటా వెందుకు? చీర కర్రులవుతుంది" అని మందలించాడు.

సీత చిన్నపిల్లలాగ నవ్వి వూరుకుంది. రాముడు, ఆ పళ్ళు కూడా కాసిన్ని తిని నదిలో నీళ్ళు తాగి మళ్ళీ చెట్టుకింద కూర్చున్నాడు.

అప్పటికి పొద్దు బాగా వాలింది.

దిక్కులన్నీ సిందూరం గుమ్మరించినట్టు ఎర్ర బడ్డాయి. నదిలో నీళ్ళన్నీ ఎర్రబడ్డాయి. తెల్లని సీత చెంపలు ఎర్రబడ్డాయి.

రాత్రి అక్కడ గడపడంవల్ల పెద్ద ప్రమాదం వున్నట్టు కనపడలేదు రాముడికి. ఎంతమేర చూసినా చుట్టూ చెట్లూ పొదలేగానీ, పులులూ సింహాలూ వుండే గుహలూ పర్వతాలూ లేవు. పడవ మనుషులు చెప్పింది అబద్ధం కాదన్నమాటే.

రాముడు కూర్చున్న చెట్టుమీదకి చేరడానికి జంకుతూ పక్షులన్నీ ఆకాశంలో గోలపెడుతూ ఎగురు తున్నాయి. వొక పాలపిట్ట, పచ్చపిట్టతో – "మరేం చేద్దాం వొదినా? ఎంతసేపిలా తిరుగుతాం? వాళ్ళు కది లేట్టులేరే! ఈ రాత్రికి ఇక్కడే వుండిపోతారేమో! ఆ నల్లటి వాడు కాళ్ళు కూడా బారజాపి కూర్చున్నాడు. అయినా ఆ జట్టు ముళ్ళూ, పంచెలూ చూస్తోంటే మంచివాళ్ళలాగే వున్నారే!" అంది.

"నువ్వు మరీ తెలివితక్కువ దానివమ్మా! ఆ విల్లులూ, బాణాలూ, వాళ్ళ మొహాలూ చూడరాదూ? అటు చూడు, ఎన్ని జంతువుల్ని చంపి పోగులు పెట్టారో! మంచివాళ్ళట, మంచివాళ్ళు! ఇంకా నయం, దేవుళ్ళ న్నావు కాదు."

"మరేం చెయ్యనమ్మా! నా పిల్ల ముండ తెగ పిలు స్తోంది గూట్లోంచి. అరిచి అరిచి నోరెండి చచ్చి పోతుందో ఏమో! ఏదో ఒకటి అవుతుంది. పోతాను" అంటూ పాలపిట్ట రివ్వున చెట్టు మీద గూట్లోకి వచ్చి దూరింది.

దాని వెనకాల చాలా పిట్టలు గూళ్ళల్లో దూరేశాయి.

పాలపిట్ట పిల్ల వాళ్ళమ్మని కావలించుకుంటూ, "అమ్మా, అమ్మా! నువ్వు రావేమోనని ఎంత భయం వేసిందోనే! మన ఇంటికింద అవేమిటే కూచున్నాయీ? ఇప్పటిదాకా పొద్దుగ్గా నడిచాయే! సింహాలంటావు ఇవేనా?" అని కిందకి చూపించింది.

"ఛా! సింహాలెంత మంచివో! మనల్నేమీ చెయ్యవు. ఇవి మనుషులు! ప్రపంచంలో ఇంతకన్నా చెడ్డవి లేవు. ఇలాంటివెప్పుడన్నా కనపడితే జాగ్రత్త సుమా! ఆ సూది పుల్లలు పెట్టి మన పొట్టల్లో తగిలేటట్టు కొట్టేస్తాయి."

"అవునే అమ్మా! ఇందాక ఆ నల్లటివేం చేశాయను కున్నావూ?"

"తల అలా బయటకిపెట్టకే పిచ్చి ముండా! ఏమి టనుకుంటున్నావు? వాటి కిచ్చెయ్యనా?"

"అమ్మో! వొద్దే."

"మరి అటు చూడకైతే. చీకట్లో వాటిని చూస్తే జడుసుకుంటావు."

"చూడన్లే .... అమ్మా! ...."

"మళ్ళీ ఏవిటి?"

"బూచోళ్ళంటావు ఇవేనా?"

"అబ్బ! ఏం విసిగిస్తున్నావే! అవి ఇటు చూస్తా యేమోనన్న భయమన్నా లేదు నీకు. ఓ నల్ల బూచీ! ఇల్లా రా! మా పిల్లని తీసుకు ఫో!"

"అమ్మా, అమ్మా! పిలవకే, పిలవకే!" అంటూ తల్లిని కావలించుకుంది పిట్ట పిల్లముండ.

సీత నవ్వుతూ రాముడితో – "ఆ పై కొమ్మ మొదట్లో పాలపిట్ట పిల్ల చూడండి, వాళ్ళమ్మ రెక్కల్లో ఎలా దాక్కుందో!" అని, అటు చూపించింది.

రాముడు తలవూపి – "అవును. పాలపిట్ట మాంసం చాలా రుచి. మన వంటవాళ్ళయితే ఎంత కమ్మగా

చేస్తారో! .... లక్ష్మణా! ఈ చీరల మూట ఏదన్నా పొదలో పెట్టరాదూ, ఎందుకన్నా మంచిది" అని చుట్టూ చూశాడు.

"చిత్తం అన్నగారూ! అదే అనుకున్నాను. కానీ మీ ఆజ్ఞకోసం చూస్తున్నాను" అంటూ లేచి మూటని దగ్గర్లో వొక రెల్లు పొదలోకి దింపి చెదిరిన రెల్లుని బాగా సర్ది వొచ్చి అన్నగారి ముందు తలవొంచుకుని కూర్చున్నాడు.

పక్షుల సందడి బాగా తగ్గింది. అప్పుడప్పుడూ వొక్కో మొగ పక్షి, ఆలస్యంగా ఇంటి కొచ్చే గుణంతో వొంటరిగా అరుస్తూ వొస్తోంది. నదిమీద నక్షత్రాల వెలుగు తప్ప చుట్టూ చీకటి ఆవరించింది.

చెట్ల వాసన, పిట్టల రెట్ల వాసన, రెల్లు వాసన, పూల వాసన, అన్నీ కలిసిన అడవి వాసన – మత్తుగా, ఘాటుగా వుంది. కీచురాళ్ళు పోటీలు పెట్టుకున్నట్టు నాటకాల్లో రాగాలలాగ, వొకదాన్ని మించి వొకటి 'గీ' పెడుతున్నాయి. మిణుగురు పురుగులు అడివంతా ఎగురుతూ నక్షత్రాలు దొంగాట ఆడుకుంటున్నట్టు ఆడుకుంటున్నాయి.

ఎంతో దూరం నడిచి నడిచి అలిసిపోయిన సీత, నిద్రలోకి జారిపోయింది. కొన్ని మిణుగురులు ఆమె జుట్టుమీద మెరిసి ఎగురుతున్నాయి.

రాముడికి పాలపిట్ట మాంసంతోపాటు వంట వాళ్ళూ, అంతఃపురాలూ విలాస మందిరాలూ, రాజకీయాలూ అన్నీ గుర్తొచ్చాయి. ఆలోచనల్లో మునిగిపోయాడు.

ఇంత వొంటరి రాత్రి, ఇంత చీకటి రాత్రి, రాముడికి జీవితంలో ఎన్నడూ ఎరగని రాత్రి! పట్టాభిషేకం ఆగిపోయింది మొదలూ తన మనసులో రేగిన కల్లోలాన్ని ఇంతవరకూ ఎవరిముందూ బయట పెట్టలేకపోయాడు. తల్లితో మాట్లాడినా, భార్యతో మాట్లాడినా, తన అభిప్రాయాలన్నీ మరుగునపర్చే మాట్లాడాడు. చుట్టూ జనం తన మొహం ఆసక్తిగా చూస్తూ వుంటారని లోపల విషాదం బయటికి పొక్కకుండా నిగ్రహించుకున్నాడు. అయోధ్య విడిచింతర్వాత అయినా సుమంత్రుడు తమతోనే వున్నాడు. ఎటొచ్చీ మనసు విప్పి ఏం మాట్లాడినా ఫర్వాలేదనే ధైర్యం చిక్కింది ఈ రాత్రే. అదికూడా లక్ష్మణుడి ముందు! అతడు తనని పూజించడం తప్ప ఇతరత్రా ఆలోచించడు. శంకించడు. ప్రశ్నించడు. తర్కించడు.

తనకు జరిగిన దారుణం గురించి రాముడి మనసు ఉద్వేగంతో కుతకుతలాడుతోంది. మాటి మాటికీ నిట్టూరుస్తూ – "లక్ష్మణా! మనం లేమన్న దుఃఖం వల్ల దశరథ మహారాజు సుఖంగా నిద్రపోగలడంటావా?" అని తమ్ముడి ధోరణికోసం సందేహంగా ఆగాడు.[56]

తన తండ్రి గతరాత్రే చచ్చిపోయాడని నిర్ణయించుకుని గుహుడి దగ్గిర పుత్ర ధర్మంగా శోకించడం కూడా ముగించిన లక్ష్మణుడు – "అవును అన్న గారూ! మహారాజు సుఖంగా నిద్రపోలేడు. చాలా దుఖిస్తూ వుంటాడు" అని వొప్పుకున్నాడు. "అసలు రాజ్యంలో అందరూ దుఖిస్తూనే వుంటారు అన్నగారూ!" అని నిట్టూర్చాడు.

రాముడు ప్రారంభించాడు – "ఎందరు దుఃఖించినా కైక దుఃఖించదు కదా? ఆవిడకేం బాధ? ఎందుకు దుఃఖిస్తుంది? పైగా సంతోషిస్తుంది కూడాను. తన కోరిక ఈడేరింది కదా అని సంతోషంగా నిద్రపోతూ వుంటుంది. భరతుడు రావడానికి ఇంకా పదిహేను రోజులు పడుతుంది కదా? అప్పటి వరకూ మహారాజుని పీడిస్తూ వుంటుంది కావున్ను. కొడుకు వొచ్చాక 'ఇక ఫరవాలేదు, రాజ్యం దక్కినట్టే' అని నమ్మకం కలిగి భర్తని కాస్త బతకనిస్తుంది. లక్ష్మణా! అసలు ఆలోచిస్తోంటే నాకేమనిపిస్తోందో తెలుసా? ఈ మహాతల్లి మన తండ్రిని చంపి, మన రాజ్యం హరించటానికే అంత దూర దేశం నించి మన ఇంటికి దాపరించింది. కట్టుకున్న పెనిమిటి కెలాగూ వయసు మీరిపోయింది. ఆయన రేపో మాపో కన్ను ముయ్యక తప్పదు. ఇక తన కొడుక్కే రాజ్యం వస్తుంది. అంతకన్నా ఇంకేం కావాలి? చేతిలోకి అధికారం వొచ్చి, సిరిసంపదల్లో మునిగి తేలు తోంటే, మదం ఎక్కకుండా వుంటుందా?[57] కన్నూ మిన్నూ కన బడుతుందా? రేపట్నించీ ఇక సవతుల్ని బతకనిస్తుందా? నా తల్లికేం కీడు కలిగిస్తుందో కదా!

హు! .... ఎంత ఘోరం జరిగిపోయిందోయీ! ఆ

---

**56. అయోధ్యా, సర్గ 53, శ్లోకాలు అన్నీ:** రాముడు, తన మనసులో బాధ, దుఃఖం, తండ్రిమీద కోపం, కైకమీద కక్ష, ఎంత స్పష్టంగా, ఎంత నగ్నంగా, బయటపెట్టాడో చూడవొచ్చు. భరతుడు రాజు కాబోతున్నందుకు రాముడు, ఎంత అసూయపడ్డాడో, తన దురదృష్టానికి ఎంత విచారించాడో, తండ్రిని ఎన్ని శాపనార్థాలు పెట్టాడో చూసి "ఇతడు శ్రీరాముడేనా?" అని విస్తుపోవచ్చు. "రాజ్యం పోయినందుకు నాకెంత మాత్రం దుఃఖం లేదు" అనీ, "తండ్రి ఆజ్ఞని సంతోషంగా పాటిస్తాను" అనీ, మాటిమాటికీ చాటుకోవడంలో పితృభక్తి ఎంత నిజమో పరిశీలించవొచ్చు. ఈ సర్గ అంతటిలోనూ రాముడు, తండ్రిని తెగ దూషిస్తాడు! ★

**57. అయోధ్యా, సర్గ 53, శ్లోకం 15:** ఈ 'మదం' అనే మాట రాముడు కైకని తిడుతూ అన్నదే. "సౌభాగ్య మదమోహితా" అని వాడాడు కవి. 'సౌభాగ్యంతో మదం ఎక్కినటువంటిది' అని. ★

రోజు మన తండ్రి నన్ను రహస్యంగా పిల్చి ఎన్నో జాగ్రత్తలు చెప్పాడు సుమా! చివరికి ఆయనే ఆవిడ మత్తులో పడిపోయాడు! తెల్లారేపాటికి వింతగా మారిపోయాడు! అసలారాత్రి కైక ఇంటికి వెళ్ళనివ్వకుండా వుంటే ఇంత ముంచుకొచ్చేది కాదు. ఆయన బుద్ధి అంత హఠాత్తుగా మారిపోవటం చూస్తే అసలు మానవుడు ధర్మానికన్నా, అర్థానికన్నా, కామానికే పూర్తిగా లొంగిపోతాడని తోస్తోంది. అయినా ఇంత వయస్సు వొచ్చి, ఇంకా ఆడ వాళ్ళ పిచ్చి ఏమిటి? అంత మంచీ చెడ్డా తెలియని కామం ఏమిటి? లేకపోతే ఎంత బుద్ధిహీనుడైనా, ఎంత పామరుడయినా, తను చెప్పినట్టు వినే కొడుక్కి ఇంత ద్రోహం చేస్తాడా? నేను తండ్రిగార్ని ఎంత పూజించే వాణ్ణి! ఎంత వినయంగా మసిలేవాణ్ణి! ఎన్నడన్నా ఎదురు తిరిగి తలెత్తి మాట్లాడానా? రేపు భరతుడొస్తే తండ్రినెంత గౌరవిస్తాడో మనమే వింటాంగా! తల్లీ కొడుకులు కలిసి ఎన్ని ఇబ్బందులు పెడతారో బాగా తెలిసొస్తుంది అయ్య గారికి. పెట్టవలసిందే. ఇలాంటి వాళ్ళకి బాగా బుద్ధి రావాలి. మంచీ చెడ్డా ఆలోచించకుండా ఆడదాని మాటలు వినేవాళ్ళకి దశరథ మహారాజుకి పట్టిన గతే పడుతుందని లోకం ఎల్లకాలం చెప్పుకోవాలి.”

రాముడు గబగబా మాటలు దూసిపోస్తోంటే, అన్న గార్ని ఆ రకంగా ఎన్నడూ ఎరుగని లక్ష్మణుడు నిర్ఘాంత పోయి స్థాణువులాగ అయిపోయాడు. ‘ఏమిటీ వింత? శ్రీరామచంద్రుడేనా? మహావిష్ణువేనా తండ్రిని ఇలా దూషిస్తోంది! పితృవాక్య పరిపాలకుడేనా తండ్రిని ఇంతగా శపిస్తోంది! పినతల్లి దోషమే లేదన్నాడే! దైవ నిర్ణయం అనీ, విధి కృతం అనీ, నచ్చచెప్పాడే! తండ్రి సత్యవ్రతాన్ని రక్షించాలన్నాడే! ఇప్పుడీ ధోరణి ఏమిటి? రాజ్యంకోసం పరితపిస్తున్నాడా? తండ్రి క్షుద్ర కామానికి లొంగిపోయాడని గ్రహిస్తే, ఆ తండ్రిని అంతగా గౌర వించింది ఎందుకు? పితృవాక్యాన్ని ధిక్కరించి రాజ్యం తనే ఆక్రమించవచ్చునే! ఏమిటీ మర్మ గుణం?’ లక్ష్మణుడి ఇంగితం తెగ ఆశ్చర్యపడిపోతూ ఆలోచి స్తోంది. “తప్పు, వూరుకో! తప్పు, ఊరుకో, తప్పు!” అని లక్ష్మణుడు తన ఇంగితాన్ని మందలిస్తూనే వున్నాడు.

రాముడు ఉద్వేగం ఆగక చీకట్లో పిడికిళ్ళు విసురుతూ– “చేతగాక వూరుకున్నా ననుకున్నావా? నా శక్తి సామర్థ్యాల్ని రుషులు కీర్తిస్తారు, విన్నావుగా? రాజ్యం ఆక్రమించుకోమని నువ్వు ఎన్నో విధాల చెప్పావు. ఎందుకు వూరుకున్నానంటావు? నా పుణ్య లోకాల కోసంగానీ, తండ్రి సంతోషం కోసమా? తండ్రి సంతోషం, నా సంతోషం అవుతుందా? ‘ఛీ! ఈ రాజ్యాలు శాశ్వతమా, ఈ దేహాలు శాశ్వతమా, కీర్తి తెచ్చుకోవాలిగానీ అపకీర్తి తెచ్చుకోకూడదు కదా, తండ్రిని ధిక్కరించి పుణ్యలోకాలెందుకు దూరంచేసు కోవాలీ’ అని ఆలోచించి, వూరటపడ్డాను గానీ ....”

రాముడు కుతకుతలాడిపోతున్నాడు – “లక్ష్మణా! నేనే తల్చుకుంటే ఒక్క అయోధ్య ఏమిటి? ఈ లోకాన్నే బాణాలువేసి కొట్టేస్తాను .... అబ్బ .... ఏం చీమలు! చంపుతున్నాయి. నిన్ను కుట్టడం లేదూ?” అంటూ తొడల మీదెక్కి విలాసంగా తిరుగుతోన్న చీమల్ని గబ గబా దొరికిన వాటిని నలిపేసి, దొరకని వాటిని దులి పేశాడు. కొన్ని చీమలు జుట్టులో జిగురుకి అంటుకుని వూడిరాలేక గుర గుర లాడుతున్నాయి.

రాముడు, రెండు చేతుల్తోటీ కాస్సేపు తల బరు క్కున్నాడు.

లక్ష్మణుడు ఎందుకో సిగ్గుతో మాట్లాడలేకపోతు న్నాడు. అన్నగారు అన్ని రకాలా అంత పతనం చెందటం భరించలేకపోతున్నాడు.

“పుణ్యలోకాలే సిద్ధించే ఏర్పాట్లు చేసుకున్న తర్వాత క్షుద్ర రాజ్యకాంక్ష ఎందుకు నీ అన్నకి?” అని లక్ష్మణుడి ఇంగితం లక్ష్మణుణ్ణి వెటకారం చేసింది.

లక్ష్మణుడు నసుగుతూ – “అబ్బే! రాజ్యకాంక్ష కాదు, వూరికే .... మరీ .... అసలూ ....” అని తడ బడ్డాడు.

“చాల్లే, ఎందుకు నసుగుతావు? నీ అన్న గుణం అంత స్పష్టంగా కనబడుతోంటే. నన్ను మాయ బుచ్చాలని చూస్తావెందుకు?” – ఎవరో శత్రువులు అడిగి నట్టు అడుగుతోంది ఇంగితం.

లక్ష్మణుడికి ఒళ్ళు భగభగలాడింది. “ఇదుగో! పోనీ గదా అని నిన్ను మాట్లాడనిస్తోంటే ఏమిటి నీ వ్యవ హారం? బుద్ధి లేదూ? శ్రీరామచంద్రుణ్ణి విమర్శించేపాటి దానివయ్యావా? నేనూరుకోను సుమా! పెద్దా చిన్నా వుండాలి. ఏదో ఆయన, కష్టం సుఖం, మంచీ చెడ్డా మాట్లాడుతున్నాడు గానీ .... రాజ్య కాంక్షతోనా? ఆయ నకి ఈ రాజ్యాలు ఒక లెక్కా?”

ఇంగితానికీ పౌరుషం వొచ్చింది – “సరేలే. ఇవ్వాళ కాకపోతే రేపయినా మీ తంతులన్నీ తెలుస్తాయి లోకా నికి. నాకెందుకు మధ్య? నీ అన్నా నువ్వూ గంగలో దూకండి, పక్కనే వుందిగా?” అని చీదరించుకుని వూరుకుంది.

“మేం దూకితే నువ్వు కూడా గంగలో మునిగి చస్తావు” అన్నాడు లక్ష్మణుడు కోపంతో గట్టిగా.

ఆలోచనల్లో వున్న రాముడు ఉలిక్కిపడి – “గంగలో మునిగి చావడం ఏమిటి? ఎవర్నంటున్నావూ?” అన్నాడు తెల్లబోతూ.

లక్ష్మణుడు కంగారుపడిపోయి చీకట్లో నమస్కారం పెడుతూ – “అబ్బే, తమర్ని కాదు అన్న గారూ! తమర్ని

కాదు" అంటూ చీకట్లో నమస్కారం కనబడదేమోనని చేతులు చాచి తడిమి అన్నగారి పాదాలు పట్టుకున్నాడు.

రాముడు ఇంకేం ప్రశ్నించలేదు.

ఆ నిర్జనారణ్యంలో ... గాఢాంధకారంలో ... అన్నదమ్ములిద్దరూ నిశ్శబ్దంగా దిగులుపడుతూ కూర్చున్నారు.

గాలి, భయం లేకుండా చీకటంతా తిరుగుతోంది. పండుటాకులు మెత్తమెత్తగా తేలుతూ రాలు తున్నాయి.

సీత, కలలో మనుబోతు పిల్ల కళ్ళు కనబడి నిద్రలోనే రాముడి వేపు జరిగి కరుచుకుంది.

ఆ స్థితిలో భార్యని చూస్తే రాముడికి దుఃఖం పొంగింది – "ఇంతకీ నేను దురదృష్టవంతుణ్ణి లక్ష్మణా! నా భార్య దురదృష్టవంతురాలు! భరతుడి లాగ కోసల రాజ్యానికి మహారాజునయ్యే అదృష్టం నాకు లేక పోయింది. అతని భార్యల్లాగ భోగ భాగ్యాలనుభవించే అదృష్టం నా భార్యకు లేకపోయింది. భరతుడు చక్కగా శతృపక్షం లేకుండా మహారాజయి పోతాడు. పోనీ రాజ్యం పోతే పోయింది అనుకుంటే, ఈ ఖర్మ ఏమిటి? చెట్ల వెంటా, పుట్ల వెంటా పడియేడవడం ఏమిటి? రాజద్రోహులకు వేసే శిక్ష నాకు వెయ్యడం ఏమిటి? ఏనాడో నా తల్లి, ఎవరో తల్లీబిడ్డల్ని విడదీసి వుంటుంది" అని నిట్టూర్చాడు.

లక్ష్మణుడి ఇంగితానికి ఒళ్ళు మండిపోయింది. "ఎంతసేపూ నేరం ఇతర్ల మీదకు తోసే గుణం పోదు కదా నీకు? నీ తల్లినంటావెందుకు? నువ్వే తల్లినీ బిడ్డనీ విడదీశావేమో! నువ్వు చేసుకున్న పాపం వల్లనే అన్నిటికీ దూరమయ్యానని అనుకోరాదూ?" అని అది రాముణ్ణి చివాట్లు పెట్టాలనుకుంది గానీ బాగుండదని వూరుకుంది.

తల్లినీ, తమ్ముణ్ణీ, భార్యనీ కూడా వొదిలి వచ్చిన లక్ష్మణుడు వినయంగా వింటున్నాడు, అన్నగారి మాటలు ఇంకా, ఇంకా.

అన్నగారు ఇంకా చెప్పుకుంటున్నాడు – "చిన్నతనం నుంచీ నా తల్లి ఎన్ని ఆశలతో పెంచిందో నన్ను! ఏమిటో ఈ పితృవాక్య పరిపాలనవ్రతం పెట్టుకుని తల్లిని వొదిలి వొచ్చేశాను. ఏ తల్లికయినా నా లాంటి కొడుకులెందుకు? కాల్చనా? నా వల్ల నా తల్లికేం సుఖం? ఆవిడ పెంపుడు పక్షులు కూడా కైకని తిట్టి ఆమెకెంతో సంతోషం కలిగిస్తాయి. అంతమాత్రం కూడా చెయ్యలేకపోయాను నేను" అంటూ రాముడు, తల్లికి సేవ చేసే భాగ్యం లేక పోయినందుకే తను దుఃఖిస్తున్నట్టూ, తల్లికి సేవ చెయ్యకపోతే తన జన్మే వ్యర్థం అయిపోయి నట్టూ, దుఃఖించడం ఉధృతం చేశాడు. చెలియలి కట్టని తెంచుకునే సముద్రంలాగ కపట గాంభీర్యం దాటి బయట పడుతోంది దుఃఖం. మంటలు లేని అగ్ని గోళంలాగ అంత వరకూ కనపడని క్రోధం దుఃఖంగా మారి, రాముడు, తల వొంచుకుని భుజాలు వూగేటట్టు కదిలి కదిలి ఏడ్చాడు.

అన్నగారి స్థితికి లక్ష్మణుడు కంగారుపడిపోయి ఏమీ మాట్లాడలేక నోరు పెగలక చూస్తూ వుండిపోయాడు.

కొంతసేపు నిశ్శబ్దంగా గడిచింది, రాముడి వెక్కిళ్ళతో అప్పుడప్పుడూ అది భంగపడుతోన్నా.

రాముడు కొంతసేపు ఏడ్చి, లక్ష్మణుణ్ణి గురించి ఏమీ ఆలోచించక తన సుఖదుఃఖాలే తను వెళ్ళబోసుకున్నందుకు కొంచెం సిగ్గు కలిగి, లక్ష్మణుడి కేమీ దురభిప్రాయం కలగకుండా తన మాటల సరళి కొంచెం మార్చాడు – "లక్ష్మణా! నీ తల్లిని విడిచి నువ్వు నాతో వుండడం ఎందుకు? రేపు ప్రాతఃకాలంలో బయలుదేరి ఇంటికి వెళ్ళు![58] నా కష్టాలు నేను పడతాను. నా తల్లిని కూడా కొంచెం కనిపెట్టి వుండు! కైక ఏ దురాగతం చేస్తుందో చెప్పలేం!" అంటూ తలెత్తి, లక్ష్మణుడు లేకపోవటం ఊహించి హడలిపోయి బావురుమన్నాడు.

లక్ష్మణుడు చలించిపోయి అన్నగారి దైన్యం భరించలేక – "అన్నగారూ! ఏమిటీ బేలతనం? మీ ధీరత్వం అంతా ఏమైపోయింది? మహావీరులు మీరే ఇంత దుఃఖ పడితే వొదినగారూ, నేనూ ఏమైపోవాలి? ధైర్యంగా వుండగలమా మేము? మిమ్మల్ని విడిచి నేను స్వర్గానికయినా వెళతానా? మీ సేవ తప్ప నాకేమీ అవసరం లేదు. మనం ఒక మంచి చోటు చూసుకుని, చిన్న ఇల్లు కట్టుకుని, సుఖంగా వుందాం. అన్నీ నేను చేస్తాను. మీకు చెప్పతగ్గవాణ్ణి కాదు. ధైర్యంగా వుండండి!" అన్నాడు ధైర్యంగా. ఆ చీకటి ఏకాంతంలో భవిష్యత్తుని తల్చుకుని నిరుత్సాహపడిపోతోన్న అన్నగార్ని ఓదార్చి ధైర్యం చెపుతోంటే లక్ష్మణుడి శరీరం పులకరించింది. తను రాకపోతే అన్నగారి కెంతో కష్టమైపోయేదని తను ఎంతో విచారిస్తోంటే, అన్నగార్ని విడిచి వెనక్కి వెళ్ళడం కూడానా?

లక్ష్మణుడికి ఆశ్చర్యం తగ్గి అన్నగారి స్వభావం కొంత అర్థం చేసుకోగలిగాననుకున్నాడు. 'అన్నగారు అందరూ అనుకునేటంత గంభీరుడు కాదు. ఎంత శక్తి

---

**58.** రాముడు, లక్ష్మణుణ్ణి ఇంటికి వెళ్ళమన్నాడేగానీ, అసలు లక్ష్మణుడు లేకపోతే రాముడు గంగ వొడ్డునించే వెనక్కిపోయి కైక పాదాలమీద పడేవాడే, దేశంలో వుండనివ్వమని! రాముడు వనవాసం పూర్తిచేశాడంటే ఆ ఘనతంతా లక్ష్మణుడిదే. ఇలా అనడానికి ఆధారం ఏమిటో ముందు ముందు చూడండి! ★

మంతుడో అంత నిస్సహాయుడు కూడా. లోకం ముందు ఎలావున్నా ఆప్తుల ముందు కష్టసుఖాలు తలపోసు కోకుండా వుండలేడు. ఆయన బాధ అంతా, తమ్ముణ్ణి కాబట్టి, నాతో చెప్పుకున్నాడు. అందరితోటీ చెప్పు కుంటాడా?' అన్నగారి గురించి అలా ఆలోచిస్తోంటే, ఏడ్చే బిడ్డని తల్లి అక్కున చేర్చుకుని ఓదార్చినట్టు అన్న గార్ని కౌగిలించుకుని ఓదార్చాలనిపిం చింది లక్ష్మణు డికి. కానీ, అన్న భుజంమీద చెయ్యివేసే స్నేహం లేక, పాదాలు పట్టుకుని – "అన్నగారూ! దుఃఖించకండి! శోకించకండి! విచారించకండి!" అంటూ ప్రార్థించాడు.

లక్ష్మణుడు ప్రార్థిస్తోన్నకొద్దీ రాముడికి దుఃఖం ఎక్కు వైంది. ఎంతో సేపు ఏడుస్తూనే వున్నాడు. లక్ష్మణుడు కూడా బొటబొటా కన్నీళ్ళు కార్చుతూ కూర్చున్నాడు. మధ్య మధ్య ముక్కు తుడుచుకుంటూ – "అన్నగారూ! మీరు లేని అయోధ్యలో మునుపటి అంద చందాలు వుంటాయనుకున్నారా? ఉత్త మాట! అయోధ్య బొత్తిగా కాంతిహీనం అయిపోతుంది. నా మాట నమ్మండి! ఇప్పుడు అయోధ్య ఏమీ బాగుండదు. సూర్యుడు రాడు. చంద్రుడు రాడు, నక్షత్రాలు వెలగవు. గాలి వీచదు. పక్షులు నీళ్ళు తాగవు. క్రూర మృగాలు వేటాడవు. అసలు ప్రజలే బతకరు. పిల్లులూ, గబ్బిలాలూ పట్టపగలే సంచ రిస్తూ వుంటాయి. అక్కడ సుఖసంతోషాలతో కాలం గడిపే వాళ్ళెంకెవరు?" అని, చటుక్కున వీపు మీద చీమ కుట్టి, అన్నగారి పాదాలు వొదిలి వీపు దులుపుకున్నాడు.

తను లేని అయోధ్య సర్వనాశనం అయిపోయి పాడుపడిపోతుందని నమ్మకం కుదిరిన తరవాత రాము డికి చాలా సంతృప్తి కలిగింది.దుఃఖం కూడా తగ్గింది. కొంచెం సేపు వూరుకుని పంచతో ముక్కూ, కళ్ళూ తుడుచుకున్నాడు – "లక్ష్మణా! కైకేయి దుర్మార్గురాలే గానీ, భరతుడు మంచివాడు కాదంటావా?" అని సందేహంగా చూశాడు. రాముడి మనసులో ఇంకా కొంత ఆశ మినుకు మినుకు మంటూనే వుంది. భర తుడు చిన్నతనంలో తనంటే చాలా వినయ విధేయత లతో ప్రవర్తించిన సంఘటనలు కొన్ని గుర్తొచ్చాయి. అలాంటివాడు, అన్నగారికి అన్యాయం జరిగిందని విని కూడా రాజ్యం తీసుకోడానికి వొప్పుకుంటాడా? ఏమో! చెప్పలేం. రాజ్యమా, మరొకటా? పైగా అతడు వెళ్ళి పది సంవత్సరాలకు పైగానే అయింది. మనిషెంత మారాడో! మనసెంత మారిందో! – ఆ మాటలు పైకి అనడం ఇష్టంలేక – "భరతుడు మంచివాడే! నా తల్లిని గౌరవం గానే చూస్తాడనిపిస్తోంది. ఏమంటావు?" అని తన తాపత్రయమంతా తల్లి క్షేమం కోసమే అన్నట్టు, లక్ష్మ ణుడి వేపు చీకట్లో ఆశగా చూశాడు.

లక్ష్మణుడికేమీ నమ్మకం లేదు భరతుడిమీద. పెద్ద తల్లిగార్ని గౌరవంగా చూడడం మాత్రమేనా మంచితనం అంటే? అన్నగారికోసం రాజ్యం అయితే వొదలడు కదా? ఇక అటువంటి మంచితనం కూడా మంచితన మేనా?

"అతణ్ణి కూడా నమ్మలేం అన్నగారూ!" అన్నాడు కోపంగా.

"అంతే అంటావా లక్ష్మణా! అయ్యో నా తల్లి..."

"పెత్తల్లి గారికేమీ ఫర్వాలేదు... అన్నగారూ! విశ్ర మించండి! చాలా రాత్రి గడిచింది. సుఖంగా నిద్రిం చండి!" అని లక్ష్మణుడు మళ్ళీ ప్రార్థించాడు.

రాముడికి, మనసులో మాటలు కొన్నయినా చెప్పు కోవడంవల్ల చాలావరకు దుఃఖం ఉపశ మించింది. తాము 'గొప్ప వారమని' అహంభావం గల మనుషు లెప్పుడూ, తమకన్నా చాలా అల్పులని నమ్మకం కలిగిన వాళ్ళతో మాత్రమే మనసులో మాటలు చెప్పుకుంటారు. రాముడు, మనసు కొంత తేలికపడి, నెమ్మదిగా నేల మీదకు వొరిగి చెయ్యి తల కింద పెట్టుకుని పడు కున్నాడు.

లక్ష్మణుడు రాముడి పాదాలు వొత్తుతూ కూర్చు న్నాడు.

కొంత సేపటికి, రాముడికి, మనసులో కొత్త విచా రంతో పశ్చాత్తాపం ప్రారంభమయింది! లక్ష్మణుడు తన కన్నా ఎన్నో విధాల అల్పుడు. తన సేవకుడు. అలాంటి వాడితోనా తను గాంభీర్యం విడిచి ఏమిటేమిటో మాట్లా డింది! తన బేలతనం అంతా బయటపెట్టుకున్నది! ఇక అతడు రేపటినించి తనంటే ఏం గౌరవం చూపుతాడు? తన ధీరత్వం మీద ఏం నమ్మకం వుంచుతాడు? అసలు చిన్నతనంనించి, తను మహారాజవుతాడనే కదా లక్ష్మ ణుడు తనపట్ల అంత వినయంగా వుంటున్నాడు? తన దురదృష్టం వల్ల రాజ్యంపోయి తనూ లక్ష్మణుడితో సమానం అయిపోయాడు! తను రాజ్యభ్రష్టుడైనందుకే అతడు తనని ఎక్కడ చులకన చేస్తాడోనని జంకుతూనే వున్నాడు తను. ఇప్పుడీ తెలివి తక్కువ పని చేసి వున్న గౌరవం అంతా పాడుచేసుకున్నాడు. పైకి అలా మర్యా దగా మాట్లాడినా మనసులో ఏదో వొకటి అనుకోక పోతాడా? – ఏవనుకుంటున్నాడో తెలిస్తే బాగుండును. అయినా చాలా పొరపాటయిపోయింది. చాలా పొర పాటు! అంత అల్పుడితో తన మనసులో మాట చెప్పు కోవడం ఏమిటి! చాలా పొరపాటు!

అన్నగారికి నిద్రపట్టిందని లక్ష్మణుడు నెమ్మదిగా పాదాలు వొదిలి కొంచెం దూరంగా జరిగాడు ఆలో చిస్తూ.

"లక్ష్మణా!"

తుళ్ళిపడి లక్ష్మణుడు – "నమస్కారం అన్న గారూ!

ఏమి శలవు?" అంటూ ఎగిరి లేచాడు.

"లక్ష్మణా! నేనన్న మాటలకు నువ్వేమయినా కల వరపడుతున్నావటోయీ! లోకరీతిగా మాట్లాడానే గానీ, నాకు రాజ్యకాంక్ష వుండి కాదు సుమా! రాజ్యం విడిచి నందుకు నేను దుఃఖపడుతున్నాననుకోకు సుమా!"

"ఎంత మాట! తమరు లోక క్షేమంకోసం రాజ్యం పాలించాలని కోరారే గానీ, తమకు క్షుద్ర రాజ్యకాంక్ష వుంటుందా? నేను గ్రహించలేనా అన్నగారూ?"

"మంచిది. ఇక ఆ సంగతి మర్చిపో. ఇది మన వన వాసంలో మూడవ రాత్రి. ఇంకా మనం 13 సంవత్స రాల 11 నెలల 27 రోజులుంటే సరి పోతుంది. జాగ్రత్త! మూట .... సీత ...." అంటూ ఆవలిస్తూ కళ్ళు మూసు కున్నాడు రాముడు.

★ ★ ★

బాగా తెల్లవారింది. పక్షులు చెవులు చిల్లులు పడిపోయేటట్టు అరుస్తున్నాయి.

సీత చీకట్నేలేచి స్నానంచేసి చీర ఆరవేసింది. నీళ్ళల్లో నిమ్మపూలు రాలి నీళ్ళు ఒకటే పరిమళంగా వున్నాయి. సీత జుట్టు గాలికెగురుతూ నిమ్మ సువాసన లీనుతోంది.

పిట్టల కేకలు ఎక్కువయ్యాయి. చింతచెట్టుమీద ఒాక పిట్టకీ, మామిడి చెట్టుమీద ఒాక పిట్టకీ ఏదో జగడం వొచ్చినట్టుంది. అవి రెండూ వొకదాన్ని చూసి వొకటి తెగ అరుచుకుంటున్నాయి. కొన్ని పిట్టలు దాని వేపూ, కొన్ని పిట్టలు దీనివేపూ అరుస్తున్నాయి. అంతా గందరగోళంగా వుంది.

రాముడూ, లక్ష్మణుడూ లేచి స్నానాలు ముగించి, సూర్య నమస్కారాలు ముగించి, కడుపుల నిండా పళ్ళు తిన్నారు.

పిట్టల పోట్లాట కొంత సద్దుమణిగింది.

సీత కుతూహలంగా రాముణ్ణి చూస్తూ "స్వామీ! పక్షులకు కూడా భాష ఉంటుందా?" అని అడిగింది.

"అన్నిటికీ ఉంటుంది."

"అవేం మాట్లాడుకుంటున్నాయో మనకెలా తెలు స్తుంది?"

"ఇంకేం మాట్లాడుకుంటాయి సీతా? శ్రీరామ వన వాసం గురించి చెప్పుకుంటూ ఉంటాయి."

సీతకి నమ్మకం కలగలేదు. ఊరుకుంది, చిన్న నవ్వుతో.

మళ్ళీ ముగ్గురూ ప్రయాణానికి సిద్ధమయ్యారు. సీత, పాలపిట్ట పిల్లకోసం చెట్టువేపు చూసింది.

ఆ పిల్ల, వాళ్ళమ్మకి సీతని చూపిస్తూ – "అమ్మా అమ్మా! ఆ తెల్లది చూడవే, ఎలా నవ్వుతోందో! రేపు కూడా ఎన్నోసార్లు నవ్విందే నన్ను చూసీ! .... అమ్మా! అదికూడా వెళ్ళిపోతోందే!" అంటూ బిక్కమొహం వేసింది.

"పోనీయ్యవే! పీడ వొదులుతుంది."

"పాపం అదేం చేసిందే మనల్నీ? దాని దగ్గర బాణం పుల్లలు లేవుగా?"

"లేకపోతేనేం? వాటి దగ్గర వున్నాయిగా? అవి బాణాలు కొడుతోంటే ఇది చూస్తూ వూరుకుందిగా? అలా కొట్టొద్దని వాటితో పోట్లాడిందా చెప్పు?"

అయినా పాలపిట్ట పిల్లకి సీతని వదలబుద్ధి వెయ్య లేదు. గూట్లోంచి ముక్కు బయటికి పెట్టి మెడ వొంచి – "ఓ తెల్లా! నువ్విక్కడే వుండు! అవి పోతాయిలే" అని కేక పెట్టింది. వాళ్ళమ్మ నవ్వి "పిచ్చి ముండకి అప్పుడే మాట లొచ్చేస్తున్నాయి" అని మురిసిపోతూ దాన్ని ముద్దెట్టు కుంది.

లక్ష్మణుడు తన సామానంతా తగిలించుకున్నాడు. ముగ్గురూ నడక సాగించారు. లక్ష్మణుడికి కళ్ళు మండు తున్నాయి. తెల్లవార్లూ మెలకువగా వుండి, తూరుపు తెలతెలవారుతోంటే కాస్త కన్ను మూశాడు. నిద్ర చాలక తలంతా బరువుగా వుంది. మర్రిపాల పుండు మీద నిన్న వొక కొమ్మగీరుకుని ఎర్రగా చర్మం లేచింది. అది నీరుపట్టి బాధపెడుతోంది.

మూట నిన్నటికన్నా బరువెక్కినట్టు తోచింది. శరీర బాధల్ని విస్మరిస్తే, లక్ష్మణుడి మనసు మాత్రం, అన్న గారంటే పూర్వంకన్నా భక్తితో, వినయంతో, తొణికిస లాడుతోంది. అన్నగారికి మాటిమాటికీ నమస్కారం పెట్ట బుద్ధి అవుతోంది – చేతులు ఖాళీగా లేవుగానీ. మంచి దారి చూసుకుంటూ ముందు నడుస్తున్నాడు.

ఎటు చూసినా అంతులేకుండా వున్న చెట్లని చూస్తూ సీత మైమరచిపోతూ నడుస్తోంది. ఆమె గాజుల చప్పు ళ్ళతో, అందెల చప్పుళ్ళతో, ప్రకృతి లయబద్ధంగా నృత్యం చేస్తున్నట్టువుంది. ఏ చెట్టుని చూసినా పూలో పళ్ళో, విరగపూసో విరగకాసో వున్నాయి. రేగుపళ్ళు కొమ్మలనిండా పగడాల్లా మెరుస్తున్నాయి. పేర్లు తెలియని ఎన్నో రకాల చెట్లు, పళ్ళ గుత్తులతో కొమ్మలు నేలకి వొంగి బరువుగా వేళ్ళాడుతూ భూమి అంతా విస్తరించి వున్నాయి. ఎక్కడ చూసినా తెల్లపూల గుత్తులూ, పసుపు రంగు గొట్టం పూలూ! తీగలు నేలమీద పడి, తీగల మీదకి తీగలు పాకి, అల్లుకుని, నేలంతా రంగురంగుల పూలతో నేలే పూలు పూసినట్టు వుంది. ఎన్నడూ చూడని పక్షులు ఎన్ని రకాలో! ఎన్నెన్ని వింత చప్పుళ్ళో! వీణ తీగల స్వరాలలాగ ఎంత అద్భుత కంఠాలో! ఎంత మెత్తని కూతలో! చెట్లనిండా తెల్ల పిట్టలు వాలి, గుత్తులు గుత్తులుగా తెల్ల పూలు పూచినట్టు వున్నాయి.

దూరంగా వొక ఎలుగుబంటి, వెనక కాళ్ళమీద

నిలబడి కొమ్మని వొంచుకొని ఏవో పళ్ళు తింటూ కన బడింది.

సీత కెంతో సరదావేసి – "అటు చూడండీ" అని రాముడికి చూపించింది.

రాముడు బాణం తియ్యబోయాడు.

సీత బిత్తరపోయి – "వొద్దు వొద్దు" అంటూ వారిం చింది.

రాముడు కూడా సందేహించాడు. ఏవేవో జ్ఞాప కాలు .... విశ్వామిత్ర కథలు .... ఎలుగులు.... కోతులు .... మమకారాలు .... రావణవధ! "యుద్ధాలలో ఇవి ఏ విధంగా సహాయం చేస్తాయి?" అని నుదురు చిట్లిస్తూ బాణం వేసే ప్రయత్నం మాని ముందుకు సాగాడు.

ఎలుగుబంటి, మనుషుల అలికిడికి మెరుపులా మాయమైంది.

సీత మనసు కుదుటపడింది. మళ్ళీ వన సౌందర్యం చూడడంలో మునిగింది.

రాముడికి, గతరాత్రి విషయం, అదే ... లక్ష్మణుడి ముందు అలా ప్రవర్తించిన విషయం, ముల్లులాగ బాధపెడుతూనే వుంది. తెల్లవారిందగ్గిరనించీ లక్ష్మణుడి మొహం చూడకుండా సాధ్యమైనంత వరకూ తప్పుకోవ టానికే ప్రయత్నిస్తున్నాడు.

లక్ష్మణుడు మాత్రం, పుట్టినప్పట్నించీ వెన్న మీగడ లతో, కొవ్వు మాంసాలతో కూడబెట్టిన కండల్ని అన్నగారి సేవకే శక్తివంచన లేకుండా కరిగిస్తున్నాడు. చెమ టోడుస్తూ వురుకు పరుగులు తీస్తున్నాడు.

మూటలు మోస్తూ తిరిగేవాళ్ళని అప్పుడప్పుడూ చూస్తూ వుండే పక్షులు లక్ష్మణుణ్ణి చూసి చలించడం లేదు.

తీక్షణమయిన చూపులతో, ఎవరిమీదో కక్షతో, మాటిమాటికీ విల్లుని చేతిలోకి తీసుకుంటూ క్రోధంగా భూమి అదిరేటట్టు నడుస్తోన్న రాముణ్ణి చూసీ చూడగానే పక్షులన్నీ భీతావహంగా అరుస్తూ చెట్లమీదనించి ఎగిరి పోతున్నాయి. జంతువులు పారిపోతున్నాయి.[59]

సీత ఏదో జ్ఞాపకం వొచ్చి చుట్టూ చూస్తూ – "సింహాల్ని చూద్దామని చాలా సరదాపడ్డాను. ఈ అడ విలో లేనేలేవే! .... పులులన్నా కనిపించడంలేదు. పర్వతాలంతంత పాములు దారికడ్డంగా పడుకుంటా యన్నారు. పోనీ అవన్నా లేవేం?" అని నిరుత్సాహంగా భర్తని అడిగింది.

రాముడేవో ఆలోచనల్లో మునిగి వున్నాడు. జవాబు చెప్పలేదు.

లక్ష్మణుడు సీతతో, భక్తిగా – "ఈ అడవిలో అటు వంటి భయాలేమీ లేవు వొదినగారూ!" అన్నాడు.

"భయాలు కాదయ్యా! మీ అన్నగారు వుండగా భయం ఎందుకు? సింహాల్ని నేనెప్పుడూ చూడలేదు. అడవుల్లోనన్నా దొరక్కపోతే ఇంకెక్కడ చూస్తాం? .... పోనీ నువ్వెప్పుడయినా చూశావా సింహాల్ని?"

"లేదు వొదినగారూ!"

"మీ అన్నగారయినా చూశారా?"

"చూడలేదు వొదినగారూ!"

"అయ్యో! అలాగా?" అంటూ సీత ఆలోచనలో పడింది. తను అడవులకు వొస్తానన్నప్పుడు రాముడు చెప్పిన వింతలన్నీ, సింహాల్ని చూడకుండా చెప్పినవేనా? .... ఎన్నెన్నో క్రూర జంతువులన్నారు. సర్పాలన్నారు. కాలుమోపే వీలే లేని కంటకాలన్నారు. కీటకాలన్నారు. తర్వాత ఇంకెక్కడయినా తటస్థపడతాయేమో! చుట్టూ ఇంత సౌందర్యం .... ఇన్ని చెట్లు .... ఇన్ని పువ్వులు!

బుడబుక్కల వాళ్ళు కొందరు పాడుకుంటూ పోతు న్నారు.

సీత సింహాల సంగతి మర్చిపోయి వాళ్ళని చూడ్డం మొదలుపెట్టింది. అప్పుడప్పుడూ పల్లెటూళ్ళ మనుషులు – బిచ్చగాళ్ళో, కట్టెల మనుషులో, తట్టలతో బుట్టలతో కావిళ్ళతో, ఎదురుపడుతూనే వున్నారు. మంచెల మీద నించి పిట్టల్ని కొట్టే కేకలూ, చప్పట్లూ, అప్పుడప్పుడూ మనుషులు కనపడకుండా గాలిలో తేలే పాటలూ!

సీతకు ఏది చూసినా వింతగానే వుంది. అంతఃపురా లలో దాసీలూ, పరిచారికలూ కూడా చక్కని చీరలు కట్టుకుంటారు. నగలు పెట్టుకుంటారు. ఎన్నో అలం కారాలు చేసుకుంటారు. ఇక్కడ, ఈ మనుషులు, స్త్రీల యినా పురుషులయినా, వొక్కలాగే అర్ధ నగ్నంగా కని పిస్తున్నారు. దుస్తుల సొంపు లేదు. అలంకారాల సొంపు లేదు. జుట్టులకయినా తైల సంస్కారం వుండడం లేదు.

వాళ్ళ మొహాలు .... ఎన్నెన్ని భావాలో! అంతః పురాలలో మనుషుల మొహాలకీ, ఈ మొహాలకీ, పోలికే లేదు. అంత గాంభీర్యం, అంత వినయం, అంత భక్తీ, ఈ మొహాలలో మచ్చుకయినా కనబడవే! ఎవ్వరూ ఎవరికీ వినయం చూపరు. ఎవరికీ నమస్కారాలు చెయ్యరు. ఎవ్వరూ ఆజ్ఞాపించరు. ఎవ్వరూ భయం ప్రక

---

**59. అయోధ్యా, సర్గ 54, శ్లోకం 9:** రాముడి 'అద్భుతాకారం' చూసి మృగాలూ, పక్షులూ, ఎలా బెదురుతాయో చూడండి. పక్షులూ, జంతువులూ ఎందుకు బెదురుతాయి? వేటగాళ్ళని చూసి మాత్రమే బెదురుతాయి. లేదా, సాధు ప్రవర్తన లేకుండా క్రూరంగా, భీకరంగా కనపడే వాళ్ళని చూసి కూడా బెదురుతాయి. పక్షుల్నీ, జంతువుల్నీ బెదరగొట్టగలగడం – చూపుల్లో, చేష్టల్లో, క్రూరత్వానికి నిదర్శనం. ★

టించరు. ఎవ్వరి మొహంమీదా గాంభీర్యం వుండదు. జంతువులంత, పక్షులంత సహజమయిన చూపులు! స్పష్టమయిన భావాలు!

చిన్నపిల్లని తిరునాళ్ళకు తీసుకొచ్చినట్టు, సీత, దారిలో తారసపడ్డ మనుషుల్ని నవ్వు మొహంతో పరికించిచూస్తూ నడుస్తుంది. వాళ్ళ పాటలు ఏమీ అర్థం గాకపోయినా శ్రద్ధగా వింటుంది. ఆ పాటల నిండా ఎన్నడూ వినని మాటలు .... ఆ మాటల నిండా ఎంతో విచారం! ఎందుకో కష్టాలు! నిరాశ. దేవుడికి దణ్ణాలు. మొక్కులు. మళ్ళీ సంతృప్తి. అలా పాడుతోంటే వాళ్ళ మొహాల్లో అప్పుడే విచారం, అప్పుడే సంతోషం! వాళ్ళ జీవితాల సొగసు చూసి వాళ్ళే నవ్వుకుంటున్నట్టు అంత లోనే నిర్లక్ష్యం! కష్ట సుఖాలు కలబోసుకుంటూ జీవితా లనే పాడుకుంటోంటే ఆ పాటలు, ఆ వొణికే గొంతులు, ఆ చెమ్మగిల్లే కన్నులు, గంపెడాశతో ఆకాశానికి చేసే నమస్కారాలు ... వారిని చూస్తోంటే సీత కెంతో దయ కలుగుతుంది. ఆ జానపదుల పాటలు, వినగా వినగా, అంతఃపురాలలో సంగీతాలకన్నా, విద్వాంసుల రాగాల కన్నా, గొప్పగా, సుఖంగా, కమ్మగా వున్నట్టు తోస్తాయి. ఆ పాటలు వింటే, మనసు ఎందుకో ఎంతోసేపు అంతు పట్టని నిరుత్సాహంతో కొట్టుకుంటుంది.

బుడబుక్కలవాళ్ళు కొంతదూరం వచ్చి అడ్డదారి వెంట పాడుకుంటూ దూరంగా కనబడుతోన్న పల్లె వేపు వెళ్ళిపోయారు.

సీత విచారంగా చూస్తూ – "వాళ్ళేదో ప్రార్థిస్తారే దేవుళ్ళని! మీకేమయినా బోధపడుతోందా?" అని అడి గింది భర్తని.

రాముడు అదిరిపడ్డట్టు చూశాడు. కాకులంత, కుక్క లంత క్షుద్రమయిన మనుషుల గురించి తను ఆలో చిస్తాడా? తన భార్యకు మాత్రం ఇవేం ఆలోచనలు?

"జానపదుల పాటలు చిత్రంగా వుంటాయి. శ్రద్ధగా విన్నారా మీరు?" – సీత మళ్ళీ.

రాముడు మొహం చిట్లించి – "లల్లాయి పదాలన్నీ పాటలేనా? పైగా దేవుణ్ణి కూడా ప్రార్థిస్తారా? ఏం ప్రార్థి స్తారు? రాజకుమారులు కాబట్టి రాజ్యాలిమ్మంటారా? యజ్ఞయాగాలు చేస్తారు కాబట్టి స్వర్గాలిమ్మంటారా? ఇటువంటి పామరులు ఎన్ని వేల జన్మలకైనా ముక్తి పొందుతారా? అంత అల్పమానవుల గురించి ఆలోచన లెందుకు నీకు? చుట్టూ ఈ వన సౌందర్యాన్ని చూసి సంతోషించరాదా?" అన్నాడు మందలింపుగా.

సీత నిరుత్సాహంగా తల వంచింది. ఒక వృద్ధుడు, బిచ్చగాడు, భుజానికి జోలి వేళ్ళాడుతూ కర్రపోటు వేసు కుంటూ నడుస్తున్నాడు.

సీత, పిట్టల అరుపులతో తల ఎత్తి చుట్టూ చూసి ఒక పొదనిండా గుత్తులు గుత్తులుగా వేళ్ళాడుతోన్న నల్లని పళ్ళు కొయ్యబోయింది. వెనక నడుస్తోన్న వృద్ధుడు ఆమెని చప్పున వారించాడు – "కొయ్యకమ్మా, కొయ్యకు! తెలియని పళ్ళేవీ కొయ్యకు తల్లీ! ఎన్నో విష వృక్షాలుం టాయి. వాటి పువ్వులూ, పళ్ళూ చాలా చెరుపు చేస్తాయి! పాముల ఆశ్రయానికి తప్ప ఆ వృక్షాలు ఏ జీవికీ పనికి రావు. ప్రతి మొక్కమీదా చెయ్యి వెయ్యకు తల్లీ!" అంటూ వాత్సల్యంతో హెచ్చరించాడు.

సీత జంకి ఆ పళ్ళు కొయ్యడం మాని ముందుకు నడిచింది.

"అబ్బా!" అంటూ లక్ష్మణుడు హఠాత్తుగా గంప కిందపడేసి కాలు పట్టుకున్నాడు. సూది అంత ముల్లు కుడికాలిలో దిగి తొంగిచూస్తోంది.

"ఏమిటయ్యా, ఏమయింది?" అంటూ సీత కంగారుపడింది.

"ఏమీ లేదు వొదినగారూ! చిన్న ముల్లు. అంతే. మీరు కంగారుపడకండి!" అని లక్ష్మణుడు పళ్ళు బిగపట్టి ముల్లుని బయటికి లాగాడు. అంతా వొచ్చినట్టే కన బడింది. మళ్ళీ నడవడం మొదలెడితే కరేల్ కరేల్‌మని ఎక్కడో గుచ్చుకుని నసాళాని కంటుతోంది చురుకు. కాలు నేలకి ఆన్చడం అంటే భయం వేస్తోంది. "ఎవ రయినా ముల్లు తీస్తే ....?" అని ఆశ మెరిసింది.

"ఉన్నాడుగా అన్నగారూ? తియ్యమనరాదూ? ఇంకెవరొచ్చి తియ్యాలీ?" అంది లక్ష్మణుడి ఇంగితం చటుక్కున వెక్కిరింతగా.

లక్ష్మణుడు అదిరిపడి – "అన్నగారా! అన్న గారు నా పాదం ముట్టుకుంటారా? నోటి కెంతొస్తే అంత పేల్తావా?" అంటూ ఇంగితాన్ని ఛెళ్ళుమని చెంపపెట్టు పెట్టాడు. ఇంగితం కళ్ళ నీళ్ళుపెట్టుకుని "ఛీ, ఈ సారి నీ జోలికొస్తే అడుగు" అంటూ చిన్న బుచ్చుకుని మొహం చాటుచేసుకుంది. ఇంగితానికి సరిగ్గా బుద్ధి చెప్పాననే తృప్తితో లక్ష్మణుడు గబగబా నడవబోయాడు. కరేల్ మంది ఎక్కడో. ప్రాణం కడంటింది.

"కుంటుతున్నావేమోయీ లక్ష్మణా?" – అప్పటికి తలతిప్పి చూశాడు రాముడు.

"నమస్కారం అన్నగారూ! ఏమీ లేదు. క్షుద్ర కంటకం వొకటి .... ఎప్పుడో తొలగించాను" – తెల్లా రాక అన్నగారు చాలా సేపటికి పలకరించినందుకు సంబరపడిపోయాడు లక్ష్మణుడు. ముల్లు దిగడం ఎంత అదృష్టమో అని మురిసిపోయాడు.

"అటులనా? మార్గం శ్రద్ధగా చూసుకుంటూ నడవా లోయీ!"

"చిత్తం అన్నగారూ! మీ ఆజ్ఞ పాటిస్తాను."

ఇంగితానికి ఒళ్ళు మండిపోయింది – "ప్రస్తుతం

అరికాలి రాజ్యంలో సింహాసనం ఆక్రమించిన ముల్లు రాణిని రాజ్యభ్రష్టురాల్ని చేస్తేకదా అన్నగారి ఆజ్ఞలు పాటించేది!" అని దెప్పి పొడిచింది వూరుకోలేక.

లక్ష్మణుడు కిక్కురుమనలేదు. పాదం నేలకి తగల నివ్వకుండా ప్రాణం బిగబట్టి కుంటుతూనే నడక సాగించాడు.

ఆవుల్ని తోలుకుంటూ కొందరు పిల్లలు, పిల్లంగ్రోవులు వాయించుకుంటూ పోతున్నారు.

ఒక చాకలి, లల్లాయి పాటలు పాడుకుంటూ గాడిద మీద బట్టల మూట లేసుకుని తోలుకొస్తున్నాడు.

గాడిద, లక్ష్మణుణ్ణి క్రీకంట జాలిగా చూసింది.

చాకలి, పాట ఆపి లక్ష్మణుణ్ణి చూస్తూ – "అట్టా కుంటుతున్నావేందబ్బాయ్?" అని దయగా పలకరించాడు.

లక్ష్మణుడికి ప్రాణం లేచివొచ్చింది "వెధవ ముల్లు వొకటి దిగిందోయీ!" అని, "కొంచెం చూస్తావా?" అనబోయేంతలో, …. "ఏదీ? ఇట్టా కూకో, సూత్తాను" అని చాకలి గాడిదని నిలబెట్టి చుట్టూ చూసి వొక ముల్లు పట్టుకొచ్చాడు.

లక్ష్మణుడు మూటా ముల్లే దింపి దూరంగా పెట్టివొచ్చాడు.

రాముడూ సీతా, ఒక చెట్టుకింద నిలబడ్డారు.

చాకలి నేలమీద చతికిలబడి లక్ష్మణుడి పాదం వొళ్ళో పెట్టుకుని కళ్ళు చిట్లించి పరీక్షలు చేసి – "ఓసి దీని సికదరగ! ఎంత లోతు దిగిందో! కళ్ళు మూసుకో బుల్లోడా! దీని యవ్వారం నేను తేలుత్తాను" అంటూ, ముల్లుని బండబూతులు తిడుతూ, మొత్తంగా కాస్సేపటికి దాన్ని బయటికి లాగాడు.

లక్ష్మణుడికి చాకలి ఇంద్రుడిలాగ కనబడి చెవి మీద పుండు కూడా చూపించాడు.

"అయ్యయ్యో, ఇట్టా చేసుకున్నా వేందబ్బాయ్?" అంటూ చాకలి రెండు పచ్చటి ఆకులు తెంపుకొచ్చి నలిపి పుండుమీద రసం పిండాడు – "ఇంటికెల్లి సొంటి కొమ్మరగదీసి రాయి బుల్లోడా! ఏ వూరుమన్దీ?" అంటూ ముల్లు దిగిన కాలుని సవరదీస్తూ లక్ష్మణుణ్ణి పరకాయించి చూస్తూ కూర్చున్నాడు. చాకలికి, లక్ష్మణుడి రూపురేఖలు బాగా నచ్చినై. ఇంట్లో పెళ్ళికెదిగిన కూతురు జ్ఞాపకం వొచ్చింది, ఇల్లరికం పెట్టుకోవాలని మంచి కుర్రాడి కోసం చూస్తున్నాడు. చాకలి, లక్ష్మణుణ్ణీ దూరంగా మూటనీ ఎగాదిగా చూస్తూ – 'వొప్పుకుంటాడా? వొప్పుకుంటే మంచి మనువే. వొళ్ళొంచి పని చేసుకునే రకం లాగే వున్నాడు. పిల్లదానికి ఈడూ జోడూ సరిపోతాడు' అని పిల్ల పెళ్ళిని తల్చుకుని ముచ్చట పడిపోయాడు. – "అబ్బాయ్! రోజుకెన్నిళ్ళు వుతుకుతావు? మూట శానా పెద్దదేనే! గింజలు కొలుత్తారా, రొక్కవేనా? వొక గాడిదని కొనుక్కోక పోయావా? నా దగ్గిర రెండు గాడిదలున్నాయిలే, …. నీ కిట్టమైతే …. మా రత్తిని నీకిచ్చి …."

లక్ష్మణుడు, ముల్లు పీడ పోయిన సుఖంలో, చాకలి, కాలుని సవ్వరదీస్తూ వుంటే, రాజభోగాల స్మృతుల్లో తేలుతూ అసలు చాకలి మాటలేవీ వినిపించుకోలేదు. తమ కష్ట సుఖాలు వెళ్ళబోస్తూ "మడేలూ! మేమెవరను కున్నావు? దశరథ మహారాజు పుత్రులం! దేవతలు శాపవశాన భూలోకంలో జన్మించినట్టు, మేము ఏ జన్మలోనో దోషంచేసి ఈ వనవాసానికి బయల్దేరాం" అని మొదలుపెట్టాడు.

చాకలి తెల్లబోయి ఆశ్చర్యంగా, జాలిగా, చూశాడు. "అయ్యో, పాపం! మత్సెడిందన్నమాట! ఇంకా నయం, ఎర్రగా బుర్రగా వున్నాడని మంచీ సెడ్డా సూడకండా పిల్లదాన్నిచ్చాను కాను. నా పేణానికిబడి వుసూరుమని ఏడిసేది" అనుకుంటూ నెమ్మదిగా లేచాడు.

లక్ష్మణుడు కూడా లేచి కాలు ఝాడించి, రెండడుగులు నడిచి, విప్పారిన మొహంతో మూట నెత్తికెత్తుకుని, గంపా, పలుగూ పట్టుకున్నాడు.

మళ్ళీ అందరూ నడకలు సాగించారు.

చాకలి, రాముడి పక్కనించి గాడిదని తోలుకు నడుస్తూ – "ఆ పిచ్చోడితో అన్ని మోయించకపోతే, ఆ మూట కాస్సేపు నువ్వెత్తుకోరాదంటయ్యా? …. అలా సేతులూపుకుంటా నడిత్తే కందలొత్తయ్యా? ఠర్ …. ఠర్ …. ఇటు …. ఇటు …. సెరువుదారి మరిసి పోయినావంటే, అటు పోతన్నావ్?" అంటూ రాముణ్ణీ, గాడిదనీ కలేసి చివాట్లు పెట్టాడు.

రాముడు గంభీరంగా మొహం ముడుచుకుని నడక వేగం హెచ్చించాడు.

చాకలి గాడిదని మళ్ళించుకుని చాకిరేవు చెరువు వేపు పోయాడు.

"లక్ష్మణా! ఆ క్షుద్రుడికి మన పూర్వచరిత్ర తెల్పలేదా?" అంటూ రాముడు చాలా నిష్ఠూరంగా చూశాడు.

లక్ష్మణుడు వొణుకుతూ – "తెల్పాను అన్నగారూ! నమ్మలేకుండా వున్నాడు" అని విన్నవించాడు.

రాముడి కోపం కైక వేపు తిరిగింది. "దుర్మార్గురాలు! పంతంపట్టి పంపింది అడవుల్లోకి! దుష్టురాలు! రాజ్యాధికారం చేజిక్కించుకుని విర్రవీగుతూ వుండి వుంటుంది. పెనిమిటిని దుఃఖపెట్టిన స్త్రీ నరకానికి పోక తప్పుతుందా?"

ముగ్గురూ మాటల్లేకుండా చాలాదూరం నడిచారు.

ఎండ తీక్షణం అయింది.

సీత చాలా అలసటగా పాదాలు భారంగా వేస్తూ

నడిచింది.

దూరంగా ఏదో చెరువు, నేలమీద అద్దంబిళ్ళ పడి మెరుస్తున్నట్టు మెరుస్తోంది.

"కొంచెంసేపు కూర్చుందాం" అంది సీత.

చెరువు గట్టుకు చేరారు. వొడ్డంతా చెట్లతో చల్లగా మంచు పర్వతం లాగ వుంది. చెరువునిండా తామ రాకులూ, తామర పువ్వులూ కూడబలుక్కుని నీళ్ళని దాచెయ్యాలని ప్రయత్నం చేస్తున్నాయి.

ఒక చెట్టుకింద కొందరు మనుషులు ఏదో తగూ పడుతున్నారు. ఎవరో తీర్పు చెబుతున్నారు. గోలగా వుంది.

ఇంకో చెట్టుకింద, కలప కొట్టుకునే మనుషులు, చెట్టుచాటున చితుకులు మంటపెట్టి ఏదో వండు తున్నారు.

రాముడికి అక్కడ ఆగడం ఇష్టం లేదు. సీత నడవ లేనని నెమ్మదిగా చెట్టుకింద కూర్చుంది. రాముడు మొహం చెరువువేపు పెట్టి చెట్టుని ఆనుకొని కూర్చు న్నాడు.

సీత, చుట్టూ చూసింది. దూరంగా ఇంకో చెట్టు మొదట్లో కుంకంబొట్లతో కనిపిస్తోంది ఏదో రాతి బొమ్మ. పిల్లలు ఆడుకుని పారేశారో, కొత్త శిల్పి సగం చెక్కి వొదిలేశాడో, దారేపోయే భక్తులు దాన్నిండా సిందూరం పూసి కాసిన్ని పూలు పడేశారు.

సీత అటు తిరిగి ఆ రాతికి భక్తితో నమస్కారం చేసింది.

ఆ పక్కనే రాతిమీద తలపెట్టుకుని పడుకున్న కట్టెల మనిషి, కళ్ళుమూస్తూ తెరుస్తూ అంబలి వాసనకి ముక్కులు ఎగబీలుస్తూ – "అయ్యిందంటే?" అంటు న్నాడు.

వొండే ఆమె కఱ్ఱముక్కతో అంబలి కలబెడుతూ – "ఏంటా తొందరా? నీకెట్టకుండా నే నొక్కదాన్నీ తినన్లే" అని కసురుతోంది. నాలుగయిదేళ్ళ పిల్లాడు దిసమొలతో మట్టిలో కూర్చుని బొంగరంతో ఆడుతున్నాడు.

లక్ష్మణుడు చెట్టుచాటున మూట దింపి, దాని మీద గంప బోర్లించి, పలుగు దానిమీద బరువుపెట్టి చెర్లోకి దిగాడు.

సీత, కుత కుత చప్పుడు చేస్తోన్న కుండవేపు ఆశ్చర్యంగా చూస్తోంది.

"అదేమిటి? ఆ నల్లటి దాంట్లో?" – సీత.

"ఏదో వొండుకుంటున్నారు" – రాముడు.

"ఏం చేస్తారు?"

"ఏం చేస్తారేమిటి? తింటారు."

"తింటారా? ఏం బాగుంటుంది?"

"పామరులు. వాళ్ళకదే బాగుంటుంది."

లక్ష్మణుడు తామరాకులు దొన్నెగా చేసి మంచి నీళ్ళు తెచ్చాడు. సీతకీ, తర్వాత రాముడికీ.

బొంగరంతో ఆడుతోన్న పిల్లవాడు గబగబా తల్లి దగ్గిరికి పరిగెత్తి వీపుమీద పడి – "అమ్మా! అమ్మా! ఆళ్ళె వరే?" అని అడిగాడు.

వాళ్ళమ్మ కఱ్ఱముక్కతో జావతీసి నాలిక్కి రాసు కుంటూ – "నాకేంటి తెల్సురా? ఎవళ్ళో మన్లాగే కట్టె లోళ్ళో, సాకలోళ్ళో" అంటూ సీత వేపు చూసి సందే హంలో పడింది.

ఆమె పెనిమిటి ఆమెని మందలించాడు. "ఏడిసి నావులే. ఆ యమ్మని సూడు, పెద్దింటోరి బుల్లి లాగుంది. ఆ సాకళ్ళిద్దరూ తోడుండి అత్తింటికో, పుట్టింటికో తీసికెల్తన్నట్టున్నారు" అన్నాడు.

"నడిపించి తీసుకెల్తారేంటయ్యా నీ సోద్దెంగానీ .... పల్లకీలుండవా?"

కొన్ని కొన్ని ముక్కలు రాముడి చెవినీ, లక్ష్మణుడి చెవినీ పడుతున్నాయి.

రాముడు మళ్ళీ చెరువువేపు మొహం తిప్పు కున్నాడు.

లక్ష్మణుడు ఆమె ముక్కువేపు తీక్షణంగా చూశాడు – కొయ్యడానికి వీలుగా వుందా అని. అతనికి అక్కడ మనుషులందరి మీదా చాలా కోపం వొచ్చింది – "ఓ మూర్ఖులారా! అందరూ వినండి! మేము దశరథ మహా ...." అనబోయి వూగి వూరుకున్నాడు.

వాళ్ళు వుడుకు వుడుకు అంబలి ఆకుల్లో పెట్టుకుని, ఆవురావురుమంటూ తింటున్నారు. వాళ్ళని సీత వొకటే విస్మయంగా చూస్తోంది.

ఆ ఆడమనిషి అద్దకం చుక్కలచీర కట్టుకుంది. దాన్నిండా చుక్కచుక్కకీ చిరుగే. చీర అన్న పేరేగానీ పేలికలు పేలికలుగా చిరిగి వుంది. రవికె లేదు. పమిటి చెంగు వీపునీ, భుజాల్నీ దాచడం లేదు.

లక్ష్మణుడు చీరల మూట జాగ్రత్తగా వుందో లేదో అని అటు చూశాడు. దాని నిండా పట్టుచీరలే!

పిల్లాడు కొంత అంబలి తాగి, బొంగరం జ్ఞాపకం వొచ్చి దాని దగ్గరికి పరిగెత్తాడు. దానికి వూడిపోయిన తాడు చుట్టి నేలమీదకి వొదిలాడు. అది గిరగిరా తిరుగుతూ లక్ష్మణుడి దగ్గిరికి వొచ్చింది. పిల్లాడు పరి గెత్తుకుంటూ వొచ్చి బొంగరం ఆగేంతవరకూ దుమ్ములో బోర్లాపడి చూసి, ఆగగానే గబుక్కున లేచి దాన్ని పట్టు కున్నాడు. వాడి గంతుల్తో దుమ్ము బుక్కాలాగ లేస్తోంది.

రాముడు మొహం గంభీరంగా పెట్టి, "బాలుడా! ధూళి లేపకోయీ!" అన్నాడు.

ఆ పిల్లాడికేం అర్థంగాక – "నీకొచ్చా బొంగరా లాట?" అంటూ రాముడి మీద మీద కొచ్చాడు.

"వొరే, ఇల్రారా! ఈ కుసింతా నాకి పో" అని పిల్లాడి తండ్రి పిలిచాడు.

"నేన్రాను" అని పిల్లాడు, బొంగరానికి తాడు చుట్ట డంలో మునిగాడు.

"బాబ్బాబు. వొక్కసారి రా."

"నా కొద్దురో అయ్యా!" అని పిల్లాడు విసుక్కున్నాడు.

ఆ పిల్లాడి అవినయాన్ని రాముడు భరించలేడని గ్రహించిన లక్ష్మణుడు పిల్లాడితో – "తండ్రిని అట్లా అనకూడదబ్బాయీ! తప్పు! తండ్రిగారూ అనాలి" అని మందలించాడు.

పిల్లాడి తండ్రి అంబలి మిగిలిన ఆకు తీసుకుని కొడుకు దగ్గిరికి వొస్తూ లక్ష్మణుడి మాటలు విని సిగ్గు పడిపోతూ – "అల్లాంటి మాటలన్నీ పెద్ద పెద్దోరికిగానీ మా కెందుకయ్యా? ఆడు 'వొరే అయ్యో!' అంటే నా వొళ్ళంతా సంతోషవై పోతుందయ్యా! వొక్కోసారి 'లంజి కొడకా, గాడ్డికొడకా!' అని బూతులుకూడా తిడతా దయ్యా! అబ్బో! మాటలన్నీ వొచ్చేసినాయి. వొరే! ఇలా రారా! ఈ ఆకు నాకి పో" అని పిల్లాడి వెంటపడి ఆకు లోది వేళ్ళతో తీసి నాకించాడు.

అప్పుడు రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ పరకాయించి చూస్తే పెద్దింటోరేమోనని అనుమానం వొచ్చిందతనికి. "ఏవి ట్లయ్యా తవరు?" అని కొంచెం వినయంగా అడిగాడు లక్ష్మణుణ్ణి.

లక్ష్మణుడు నిట్టూర్చి – "ఎందుకు లేవోయీ! నమ్మ శక్యమైన విషయం కాదు. కావడానికి మహా రాజులమే. కారణవశాన విధి వంచితులమైనాము" అని తల వొంచుకున్నాడు.

కట్టెలతను చెంపలేసుకుని – "మాకు తెల్దు సామీ! మీరు రాజులో మారాజులో ఎట్టా తెలుత్తాది సామీ? వొంటినిండా నగలుండాల. జిగజిగలాడే గుడ్డలుండాల. అయ్యి లేకపోతే మాలాంటోళ్ళెట్టా గురుతడతారు సెప్పండి? కాళ్ళూ సేతులూ మారాజుకీ వుంటాయి. పేదోడికీ వుంటాయి, అసలు గొప్పంతా ఏసంలోనే వుంది సామీ!" అని నొచ్చుకున్నాడు.

అంతలో అతని భార్య జావకుండ చెర్లో కడిగి, గంపలో సర్ది నెత్తి కెత్తుకుంది. రెండు కుండలూ, పిండి పిడతా, రెండు గుడ్డ పీలికలూ, మొత్తం సంసారం అంతా చిన్న గంపలో ఇమిడిపోయింది. సంవత్సరాల పాదు గునా సరిపోయే బట్టలూ, అస్త్రాలూ, కవచాలూ ఏమీ లేవు వాళ్ళకి. రాత్రికి సరిపోయే పిండికూడా లేదు. ముందు జాగ్రత్తలు చేసుకోగలిగే రుషి జీవనం కాదు వాళ్ళది. రేపటి తిండికోసం భగవంతుడిమీద భారంవేసే క్షుద్ర సంసార్లు వాళ్ళు.

"లెగు మావా! ఇంకా కూకున్నావేంటి?" అని మొగుణ్ణి తొందరచేసిందామె.

"ఎల్తా సామీ!" అని కట్టెల మనిషి లేచి, పరిగెత్తు తోన్న కొడుకుని బలవంతంగా భుజాన్నేసుకుని వెనక్కి వెనక్కి చూస్తూ ముందుకు నడిచాడు.

పిల్లాడి చేతిలో బొంగరం తాడు నేలకి రాసుకుంటూ దుమ్మురేపుతూ వాళ్ళ వెనకే వెళ్ళింది.

సీత రాముడి తొడమీద తలపెట్టుకుని నిద్రలోకి జారింది.

చెట్టుకిందవాళ్ళ తగువుని వినగా వినగా, అది తండ్రీ కొడుకుల ఆస్తి పోట్లాటగా తేలింది. పెద్దమను షులు నచ్చచెప్పలేక మొహాలు చిన్నబుచ్చుకుని ఎవరి దారిన వాళ్ళు లేచిపోయారు. కొడుకు, తలపాగా తీసి దులుపుతూ తండ్రితో – "వస్తే ఇంటికి రా! లేకపోతే పో! నేను తాగే గంజే నీకూ పోస్తాను. నా దగ్గిర నీ రాజ భోగాలు జరగాలంటే కుదరదు" అనేసి అంగ లేసు కుంటూ వెళ్ళిపోయాడు. ముసలి తండ్రి దగ్గుకుంటూ రాముడు కూర్చున్న చెట్టుకిందకి చేరాడు. తను చెప్పేది వింటున్నారో లేదో పట్టించుకోకుండా రాముడితో సొదంతా వెళ్ళబోసుకున్నాడు – "నాకేం ఆస్థా పాస్థా నాయనా? చేతిలో చిల్లిగవ్వలేని తండ్రిని, కొడుకు లెందుకు గవురవిస్తారయ్యా? నేను చచ్చాకయినా నాలుగు డబ్బులు ఆడికి దక్కేటట్టయితే కళ్ళల్లో పెట్టుకుని చూసేవాడే! రెండెకరాల పొలం పాడుచేసేశాను నాయనా! బుద్దిలేనోణ్ణి" అంటూ నొచ్చుకుంటూ, కళ్ళ నీళ్ళెట్టుకుంటూ కూర్చున్నాడు.

చుట్టూ ఆ రకం మనుషుల్ని చూస్తోంటే, వాళ్ళ మాటలు వింటోంటే, రాముడికి తను స్వర్గంనించి జారి, భయంకరమయిన అగాధంలో, మహా పాప కూపంలో పడిపోయినట్టనిపించింది. 'ఈ పామరుల మధ్య, ఈ క్షుద్రులమధ్య, వొక్క క్షణం గడపడం కన్నా, ఘోరారణ్యా లలో జంతుజాలాల మధ్య జీవించడమే ఎంతో ఉత్తమం! పుణ్యం! అక్కడ కన్నుల పండువుగా నిత్యం రుషుల దర్శనం అవుతూ ఉంటుంది!' – తొందరగా పల్లెలు విడిచి పోవాలని రాముడికి ఆరాటం మొదలయింది.

కొంత సేపటికి సీత లేచింది.

మళ్ళీ నడక సాగించారు.

అడవి పలచబడి దారులు నలిగి వున్నాయి. అక్క డక్కడా నేలని సేద్యం చెయ్యడానికి రెల్లు దుబ్బులకూ, పొదలకూ మంటలు పెడుతున్నారు. కలప కోసం కొట్టి పడేసిన మొద్దులు ఎన్నో చోట్ల కనబడుతున్నాయి. కొన్ని చెట్లింకా కొడుతున్నారు. పాటలు పాడుతూ దుంగలకు తాళ్ళేసి లాగుతున్నారు. గోచీలు తప్ప ఎవ్వరి వంటిమీదా మూరెడు గుడ్డ లేదు. ఆడవాళ్ళు కూడా అంత నగ్నం గానూ వున్నారు. వాళ్ళకి పనిధ్యాస తప్ప రెండో చూపు

లేదు. ఆ దుంగలకన్నా బరువయిన జీవితాల్ని ఈడ్చే వాళ్ళకి ఆ లాగుడు పని ఏమంత కష్టంగా వున్నట్టు లేదు. పాటలు పాడుకుంటూ మనసుల్ని మచ్చిక చేసుకుంటు న్నారు.

సూర్యాస్తమయం వేళకి లక్ష్మణుడూ, సీతా, రాముడూ గంగా యమునల సంగమ ప్రదేశానికి చేరారు. నదుల హోరు దూరంనించే వినవస్తోంది. ఆ ప్రదేశమంతా పూర్వపు అడవులకన్నా సుందరంగా వుంది – పళ్ళ చెట్లతో, పూల చెట్లతో.

చీకటిపడే వేళకి భరద్వాజ మహర్షి ఆశ్రమం చేరగలిగారు. ఆశ్రమ ప్రాంతాన్ని చూడగానే రాముడికి ప్రాణం లేచివచ్చింది. రుషులను దర్శించి ఎన్నో యుగాలు అయినట్టు తోచింది. రుషిదర్శనం కాకుండా దినం గడపడం కన్నా దురదృష్టం ఇంకేమీ వుండదని పించింది. రుషుల ఆశీస్సులే తన బలమంతా అనిపిం చింది.

వేటగాడిని చూసి ఆశ్రమాల చుట్టూ పక్షులన్నీ బెదిరి పైకెగిరి గోల మొదలుపెట్టాయి.

ఆశ్రమాలలోంచి పొగ పావురాల కంతాల్లా సుళ్ళు సుళ్ళుగా లేస్తోంది. ఏవో శ్లోకాలు చదువుతోన్న కంఠాలు దూరానికే వినవొస్తున్నాయి.

భరద్వాజ రుషి అప్పుడే సంధ్యాకాల హోమం ముగించాడు. ఆ రుషి చుట్టూ ఇంకా కొందరు రుషులూ, శిష్యులూ కూర్చుని వున్నారు.

రాముడు రుషులందర్నీ చూసి – ఆనందమూ, విచారమూ ముంచుకువొచ్చి, ఉద్వేగంతో కన్నీళ్ళతో అందరికీ నమస్కారాలు చేసి వినయంగా నించున్నాడు. లక్ష్మణుడు కూడా మూటా ముల్లే దింపుకుని నమ స్కారాలు చేశాడు.

రాముడు వినయంగా మొదలుపెట్టాడు. "భరద్వాజ మహర్షీ! మేము దశరథ మహారాజు పుత్రులం. ఈమె నా భార్య సీత. నా తండ్రి ఆడదాని మాట విని నన్ను రాజ్యభ్రష్టుణ్ణి చేసి ఈ విధంగా వనవాసానికి ...." చెప్పటం ఆపి తల వొంచుకున్నాడు.

భరద్వాజుడు గడ్డం సవరించుకుని కళ్ళు మూసి తెరిచాడు. – "విన్నాను. నాయనా, విన్నాను! నీ తండ్రి నిన్ను నిష్కారణంగా అడవికి పంపాడని విన్నాను. నీ తండ్రి బహు దుష్కార్యం చేశాడు" అని విచారించాడు. రుషులందరూ – "అవును, అవును, దశరథుడు సము చితంగా ప్రవర్తించలేదు" అని నొచ్చుకున్నారు.

తనకు జరిగిన అన్యాయాన్ని మహా రుషులంతా గుర్తించినందుకు రాముడికి చాలా సంతృప్తి కలిగింది. అసలు తనకు అంత అన్యాయం జరిగి నందుకు సంతోషం కూడా వేసింది. లేకపోతే అంత మంది రుషుల ముందు తన కీర్తి అంత గొప్పగా........!

రాముడు భరద్వాజ మహర్షిని గంభీరంగా చూస్తూ చెప్పుకున్నాడు – "నా తండ్రి ఏ విధంగా చేసినా నాకు ఆనందమే స్వామీ! పితృభక్తి కలవాణ్ణి కాబట్టి నా తండ్రి ఆజ్ఞకే బద్ధుణ్ణయి రాజ్యం విడిచి వచ్చేశాను. నా భార్య మహా పతివ్రత కాబట్టి, నన్ను విడవకుండా ఈ ఘోరా రణ్యాల్లోకి వచ్చింది. నా సోదరుడు భాతృ భక్తి కలవాడు కాబట్టి, నా సేవతో తరించాలని నా వెంట వచ్చాడు. మేమిక అరణ్యాలలో కందమూల ఫలాలు తింటూ ధర్మాన్నే ఆచరిస్తూ జీవిస్తాము" అని వొంగి నమస్క రించాడు.60

భరద్వాజుడు పొడుగుపాటి గడ్డం నిమురుకుంటూ "సంతోషం నాయనా! మీ ముగ్గురి వ్రత ధర్మాలూ చూస్తోంటే బహు ముచ్చటగా వుంది. జరిగిన దానికి విచారించే పనిలేదు. ఈ సంగమ క్షేత్రం చాలా పుణ్య స్థలం. ఇంకో ప్రదేశానికి పోవడం మాత్రం ఎందుకు? ఇక్కడే వొక ఆశ్రమం నిర్మించుకొని సుఖంగా వుండండి!" అన్నాడు.

సీతకి ఆ మాటలు చాలా నచ్చాయి. ఆశ్రమం చుట్టూ ఎటుచూసినా, పరిసరాలు దారులుతీరి సుఖంగా వున్నాయి. లేళ్ళూ, జింకలూ, నెమళ్ళూ, పావురాలూ, ఎన్నెన్నో రకాల పక్షులు, ఆశ్రమాల నిండా స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. అడవి జీవనం అనే కష్టం లేదు. చుట్టూ ఎందరో రుషులు నివసిస్తు న్నారు. సమీపంలోనే పుణ్య నదులు! సీతకి చాలా సంతోషం కలిగింది.

రాముడు తలవొంచి ఆలోచనలో పడ్డాడు. ఆ క్షేత్రం చుట్టూ అనేక పల్లెలున్నాయి. ఇంతకాలం రాజ భోగా లతో బ్రతికి, ఇప్పుడు ఆటవిక జీవితం గడుపుతూ, నిత్యం ప్రజలకు కనబడుతూ జీవించాలంటే రాముడికి ఇష్టంగా లేదు. తలవాల్చి వినయంగా "మన్నించండి స్వామీ! ఈ పుణ్యక్షేత్రంలో మీ పాదసేవ చేసుకుంటూ జీవించడం మహాభాగ్యమే. కానీ, ఈ పరిసరాల్లో అనేక గ్రామాలున్నాయి నేనిక్కడే వున్నానని తెలిస్తే, జనులు నన్ను చూడాలని తండోపతండాలుగా వొస్తూ వుంటారు.

**60.** **అయోధ్యా, సర్గ 54, శ్లోకం 16:** వనవాసంలో అన్ని రకాల మాంసాలూ తినే రాముడు, 'కందమూల ఫలాలు తింటూ' ధర్మాన్ని ఆచరిస్తానని ఎందుకు చెప్పవలసివొచ్చింది? మాంసం తినడం రుషి జీవనంలో అధర్మం అయినట్టేగా? మాంసం తినడం మాని, కేవలం కందమూలాలతోనే జీవిస్తే ఆ విషయం ప్రత్యేకించి చెప్పవొచ్చును గానీ, జంతువుల్ని కొట్టి మాంసం తినేటప్పుడు కందమూల ఫలాలు తింటూ రుషి జీవనం చేస్తాననడంలో అర్థమేమిటి? ★

నా వల్ల ఈ ఆశ్రమ ప్రశాంతత భంగపడుతుంది. అది నాకెంత మాత్రం ఇష్టం కాదు. నా తండ్రి కోరినట్టే ఈ జన సమ్మర్దానికి బహుదూరంగా వుండదల్చుకున్నాను. అందుచేత ఇంకెక్కడయినా సురక్షితంగా వుండే ప్రదేశం, స్త్రీలు వుండడానికి అనువైనది ఎక్కడో సెలవిస్తే ....” అని చేతులు జోడించాడు.

రుషులందరూ కలసి ఆలోచించి తలో చోటూ చెప్పారు.

చివరికి భరద్వాజుడు ఒక స్తలం గురించి చెప్పు కొచ్చాడు – “నాయనా! ఇక్కడికి 10 క్రోసుల దూరంలో చిత్రకూట పర్వతం వుంది. అది ఇంత కన్నా పుణ్యస్థలం. ఆ పర్వత శిఖరాల్ని చూసినంత మాత్రానే మానవుడిలో పాపబుద్ధి నశిస్తుంది. పుణ్యం చేసుకోవాలనే సద్బుద్ధి పుట్టుకొస్తుంది. అక్కడ రుషులు ఎంత ఘోర తపస్సు అయినా అవలీలగా, ఆటలాగా చేస్తారు. కాళ్ళు పైకెత్తి, తల భూమికి ఆన్చి కపాలాసనం వేసి నిశ్చల తపస్సు చేస్తారు. శిరస్సు మీద వెంట్రుకలన్నీ రాలిపోయి కపాలం మాత్రం మిగిలి, సశరీరంగా స్వర్గానికి వెళ్ళిపోతూ వుంటారు. అంత పుణ్య స్దానం అది! మహర్షులంతా అక్కడే ఎక్కువగా ఉంటారు. రామా! అక్కడే నువ్వు నివసించడం చాలా మంచిది” అని చిత్రకూట మహత్యం వివరించాడు.

భరద్వాజుడి శిష్యులలో వొక చిన్న శిష్యుడు, ఇంకా వినయ విధేయతలు వొంటబట్టనివాడు, “మనం కూడా అక్కడికే పోదాం గురుదేవా! చిత్రకూటం అంత పుణ్య స్థలం అయితే, మనం ఇక్కడ వుండడం ఎందుకు గురు దేవా?” అని దురుసు ప్రశ్న వేశాడు.

“ఏమిటో నాయనా! ఈ ఆశ్రమం అలవాటయి పోయింది” అంటూ ఇహలోక కోరికల్ని జయించిన భర ద్వాజుడు, గృహస్థు తన సిరిసంపదలు చూసుకున్నట్టు, చుట్టూ ఆశ్రమ పరిసరాల్ని మమకారంతో చూశాడు.

రాముడు వినయంతో వొంగి – “స్వామీ! ఆ చిత్ర కూట పర్వతంలో .... పులులూ .... సింహాలూ .... సీత అబల కదా జడుస్తుందేమోనని ....” అంటూ చేతులు ముడిచాడు.

“లేవు నాయనా! కోతులూ, కొండముచ్చులూ, భల్లూకాలూ ఎక్కువ. ఆ ప్రాణులన్నీ నీ సేవకే కదా? ఏనుగులు మందలు మందలుగా వుంటాయి. నెమళ్ళు గుంపులు గుంపులు. తేనె అతిగా దొరుకుతుంది. తియ్యని ఫలాలకు లోటే లేదు. జనం వుండరు.”

చిన్న శిష్యుడికి తేనెకోసం ప్రాణం మళ్ళీ పీకింది. నోరు చప్పరించి వూరుకున్నాడు.

రాముడికి బాగా నచ్చింది. సింహాలు లేవు, రుషులు తప్ప పామర జనులూ ఉండరు. అక్కడికే ప్రయాణం నిశ్చయించుకున్నాడు.

చెట్లవెనక చంద్రోదయమవుతోంది. సీత, మొహం ఎత్తి అటు చూస్తూ చెంపల మెరుపుతో చంద్ర కిరణాల్లో మునిగిపోయింది.

ఆ రాత్రి, రాముడు రుషులతో ఆధ్యాత్మిక చర్చల్లో మునిగాడు.

లక్ష్మణుడు, రుషులు పెట్టింది తిని సుఖంగా నిద్రపోయాడు.

మర్నాడు ఉదయం బయల్దేరేముందు భరద్వాజుడు రాముడికి మార్గం వివరాలన్నీ చెప్పి, తను కూడా కొంతదూరం వెంట నడిచాడు – “ఏమీ భయం లేదు. కౄర జంతువులుండవు. నేను చెప్పిన మార్గమంతా గుర్తేకదా? తెప్ప కట్టుకుని నది దాటండి. అక్కడ శ్యామా నికి నమస్కరించడం మర్చి పోవద్దు! అటుతర్వాత తిన్నగా వెదుళ్ళ వనం వెంట .... భయం లేదు. దారి మంచిది. నేను చాలాసార్లు చిత్రకూటంలో మునుల దర్శనానికి వెళ్ళివొస్తూనే వుంటాను. జాగ్రత్తగా వెళ్ళండి” అని చెప్పి వెనక్కి వెళ్ళిపోయాడు.

లక్ష్మణుడూ, సీతా, రాముడూ నడక సాగించారు.

ఆశ్రమాలనించి బయల్దేరిన ఇద్దరు బ్రాహ్మలు, చేతుల్లో ఉపాదానం చెంబులతో గుస గుసలాడుకుంటూ రాముడికి దూరంగా వెంబడించారు.

“రాజపుత్రులట. ఆ మూట మొయ్యడం ఏమిటీ? దాన్ని ఏ బ్రాహ్మడికో దానం చెయ్యరాదూ?”

“చేస్తారు, చేస్తారు. కాస్త దూరం నడుద్దాం. మొయ్య లేక తప్పకుండా మనల్ని పిలిచి ఇచ్చేస్తారు.”

అందరూ సంగమ ప్రదేశం తొందరగానే చేరారు. యమున వొడ్డు వెంట నడుస్తూ రాముడు “లక్ష్మణా! నది దాటవలసిందని మహర్షి చెప్పాడు కదా? ఎక్కడ దాటవచ్చునో ఆలోచించు!”

లక్ష్మణుడు నదివేపు చూచి తలతిప్పుకుని, “మన్నిం చండి అన్నగారూ! నేను మీ దాసుణ్ణి. నది ఎక్కడ దాట వచ్చునో నేను ఆలోచిస్తే, నేను స్వేచ్ఛగా ప్రవర్తించిన వాణ్ణి అవుతాను. మీరే సెలవిస్తే నేను మిగిలిన ఏర్పాట్లు చేస్తాను” అని విన్నవించాడు.

లక్ష్మణుడి వినయానికి చాలా సంతోషించి రాముడు చిరునవ్వుతో అటూ ఇటూ చూసి – “సరే! ఇక్కడే దాటడం మంచిదనుకుంటాను” అని అక్కడే వొక చెట్టుకింద చతికిలబడ్డాడు.

“చిత్తం! మీ ఆజ్ఞ ప్రకారమే చేస్తాను” అంటూ లక్ష్మ ణుడు మూటా ముల్లే దింపి కింద పెట్టి, కత్తీ, గొడ్డలీ తీసుకొని తెప్ప వ్యవహారంలోకి దిగాడు. కొయ్యలు నరికాడు. వెదుళ్ళు నరికాడు. చెట్ల తీగలు నరికి తాళ్ళుగా జతచేసి వెదుళ్ళు పేర్చి ముళ్ళేశాడు. తెప్ప

తయారయింది. దాని మీద వొత్తుగా తీగలతో, గడ్డితో అన్నగారికీ వొదినగారికీ మెత్తలు తయారు చేశాడు. తెప్పని నదిలోకి గెంటి దానిమీద సామానంతా సర్ది, "అన్నగారూ! దయచేయండి!" అని వొంగి నిలబడ్డాడు.

రాముడు లేచి తెప్పని తేరిపారచూస్తూ – "లక్ష్మణా! తీగలు చక్కగా ముడివేశావు కదా? ఊడవు కదా? సీత భయపడవొచ్చును. స్త్రీ కదా?" అని సీతవేపు చూశాడు.

సీత సంతోషంగా చూస్తోంది ప్రవాహాన్ని.

లక్ష్మణుడు – "చిత్తం అన్నగారూ! నా భుజశక్తి అంతా ఉపయోగించి తెప్ప దృఢంగా కట్టాను" అని విన్నవించాడు.

రాముడు వెంటనే – "అవును లక్ష్మణా! నువ్వు సమర్థుడివి. మన రఘువంశానికి కీర్తి తెస్తావు" (తెప్పలు కట్టి!) అని మెచ్చుకున్నాడు. తర్వాత సీతతో "సీతా! ఇటు రా! భయం లేదు. తెప్ప దృఢంగానే వుంది. మరి అడవు లలో జీవనం అంటే ఏమిటనుకున్నావు?" అని కొంచెం హాస్యమాడాడు.

సీత సిగ్గుపడుతూ తెప్ప ఎక్కి కూర్చుంది.

లక్ష్మణుడు తెప్ప కదలకుండా పట్టుకున్న తర్వాత రాముడు కూడా ధైర్యంగా ఎక్కాడు. "దుర్మార్గురాలు! అడవుల్లోకి పంపింది కదా? రాజ పుత్రుల్ని కష్టాలపాలు చేసింది కదా?" అంటూ కైకని తిట్టుకుంటూ తెప్పమీద సర్దుకుని కూర్చున్నాడు.

లక్ష్మణుడు తెప్పని ప్రవాహంలోకి గెంటి, తను కూడా ఎగిరి ఎక్కి తెడ్డుకోసం చెక్కిన చెక్కని చేతిలోకి తీసుకున్నాడు.

ఉపాదానాల బ్రాహ్మలు విస్తుబోయి – "వీళ్ళేం రాజకుమారులయ్యా? అన్నీ మోసుకుపోతున్నారు గానీ వొక్కటీ వొదిలారు కాదే!" అని నిరుత్సాహ పడిపోయి చెంబులు చంకల్లో పెట్టుకుని పిలకలు ఝూడించి ముళ్ళేసుకుంటూ వెనక్కి తిరిగారు.

తెప్ప, విలాసంగా కదులుతూ ప్రయాణం సాగిం చింది.

నీటిలో వెదుళ్ళు నానిన కసరు వాసన, గాలిలో.

సీత వొక పూలతీగతో నీటిని కదిలిస్తూ సంతోష పడుతూ కూర్చుంది. చల్లగాలికి గిలిగింతలలాగ నవ్వు పుడుతోంది.

రాముడు – "లక్ష్మణా! తీగలు గట్టిగా ముళ్ళే శావా?" అని మళ్ళీ అడగబోయి మాని, చుట్టూ చూశాడు. నదీ ప్రవాహంలో నీటిని అంటుకుని తేలుతూ ప్రయాణించడం అద్భుతంగానే వుందిగానీ, తనకు ఈత రాదన్న సంగతి మాటిమాటికీ గుర్తొచ్చి అంత సుంద రానుభూతినీ పాడుచేస్తోంది. సీతవేపు చూస్తూ, "భయంగా వుందా? భయం ఎందుకు? తెప్ప దృఢంగానే వుంది" అని బుజ్జగించాడు.

సీత సిగ్గుపడుతూ – "ఎంతటి ఆపదలోనయినా రక్షించే మహావీరులు మీరుండగా నాకు భయమా?" అంటూ చిరునవ్వు నవ్వింది.

తెప్ప, ప్రవాహంతోపాటు కొట్టుకుపోతూ లక్ష్మ ణుడి తెడ్డు సాయంతో ఎప్పటికప్పుడు దారి మళ్ళు తోంది. "లక్ష్మణా! జాగ్రత్త సుమా!" అని రాముడు కంగారుతో ధైర్యం చెబుతున్నాడు, మధ్య మధ్య.

సీత కెరటాల వేపు చూస్తూ చేతులు జోడించి "తల్లీ! యమునా నదీ! మేము సుఖంగా వనవాసం ముగించు కొని తిరిగి అయోధ్యకు చేరాక నీ వొడ్డునే బ్రాహ్మలకు వెయ్యావుల్ని దానం చేస్తాను.[61] వారు కోరినంత ధనం ఇస్తాను. వెయ్యి బానల మద్యంతో పూజలు చేయిస్తాను" అని మొక్కుకుంది. ఈసారి, సీత, 'రాజ్యం' సంగతి ఎత్త దల్చుకోలేదు. అది మొగ వారి వ్యవహారం. తను మొక్కుకుని మాత్రం ఏం ప్రయోజనం?

తెప్ప చాలా కష్టంమీద ప్రవాహ వేగంలోంచి మళ్ళీ ఒడ్డు చేరింది. రాముడు వొక్క దూకు దూకాడు వొడ్డు మీదకి. లక్ష్మణుడు కూడా దిగి సామాను దించాడు. తెప్పని నీటి అంచువరకూ లాగి సీత దిగడానికి సహాయం చేశాడు. తెప్పని నదిలోకి తోసి వదిలేశాడు.

మళ్ళీ యథాప్రకారం ముగ్గురూ వొడ్డువెంట నడక సాగించారు.

కొంతదూరం నడిచాక బ్రహ్మాండమయిన మర్రి చెట్టు కనపడింది.

"లక్ష్మణా! భరద్వాజ మహర్షి చెప్పిన శ్యామం ఇదేననుకుంటానోయీ!"

"చిత్తం! ఇదే ననుకోండి అన్నగారూ!"

ఆ మర్రిచెట్టు చాలా పాతకాలం నాటిది. చుట్టూ దిగిన ఊడలు కూడా పెద్ద పెద్ద వృక్షాలై మళ్ళీ ఊడలు దించాయి. ఆ మర్రిచెట్టు, చుట్టూ చెట్లతో ఆ ప్రదేశ మంతా ఆక్రమించి, అడవిని పరిపాలిస్తోన్న మహారాజు అత్యవసర రాచకార్యంమీద అక్కడే కొలువుదీరినట్టు వుంది.

సీత, ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ, "శ్యామమా! నీ దయవల్ల నా భర్త వనవాసం సుఖంగా పూర్తికావాలి. నేను మళ్ళీ నా భర్తవెంట అయోధ్యకు పోయి నా అత్త మామలను పూజించే భాగ్యం కలగాలి"

---

**61.** **అయోధ్యా**, సర్గ 55, **శ్లోకాలు 20, 21:** సీత, యమునా నదిని ప్రార్థించింది. ఈసారి రాజ్యం సంగతి ఎత్తలేదు. తిరిగి అయోధ్యకు రావాలని మాత్రమే కోరుకుంది.

★

అంటూ కోరుకుంది.[62]

సీత ఎప్పుడూ భర్త క్షేమం గురించీ, అత్తమామల క్షేమం గురించీ ప్రార్థించడం చూస్తే రాముడికి చాలా తృప్తి కలిగింది. సీత మీద ప్రేమ పొంగి వొచ్చింది – "లక్ష్మణా! నువ్వు ముందు నడుస్తున్నావు కదా? సీత ఏ పువ్వు అడిగినా, ఏ పండు అడిగినా, వెంటనే ఇస్తూ వుండు!" అని ఆ ఇచ్చే వ్యవహారం తమ్ముడికి పురమాయించి, తన ప్రేమ ప్రకటించాడు.

"మహాభాగ్యం అన్నగారూ! తమ ఆజ్ఞ పాటిస్తాను" అని లక్ష్మణుడు గంప కింద పడేసి, నమస్కారం పెట్టి, మళ్ళీ గంప పట్టుకుని దారితీశాడు.

ఆ దారి, రెండు వేపులా చెట్లతో, రంగురంగుల పూలతో, సౌందర్యంతో పొంగుతూ వర్ణనాతీతంగా వుంది.

పెద్ద పెద్ద చెట్లకిందనించీ .... పూలకొమ్మల కింద నించీ .... పక్షుల రెక్కల వూపులతో కదిలే గాలి తెరల కిందనించీ ... నడుస్తున్నారు.

కనుచూపు దూరంలోనే వెదుళ్ళవనం తగిలింది. పచ్చని వెదుళ్ళు, చిగుళ్ళతో గాలిలో వూగుతూ ఈలలు వేస్తున్నాయి. వెదురుపొదల్లో గాలి జొరబడి నవ్వుతూ వింత వింత శబ్దాలు చేస్తోంది.

సీత ప్రతి చెట్టునీ, ప్రతి పుట్టనీ, వెర్రి ఆనందంతో చూస్తూ మాటి మాటికీ వెనకబడుతోంది.

"సీతా! తొందరగా అడుగువెయ్యి! చాలాదూరం నడవాలి మనం. సాయంత్రానికల్లా ఏదయినా ఆశ్రమానికి చేరుకోకపోతే .... క్రూరజంతువులు లేవన్నారు గానీ .... ఏమో, ఎవరు చెప్పగలరు? ఇంత ఘోరారణ్యంలో పులులయినా వుండవొచ్చును .... ఈ కష్టాలన్నీ ఎందుకు నీకు? చెపితే వినలేదు కదా!" అంటూ రాముడు సీతని మందలించాడు, ప్రతిసారీ ఈ భర్త మందలింపుల కన్నా ఆ పులి వచ్చి ఎత్తుకు పోతేనే బాగుండుననిపించేటట్టు.

సీత చిన్న బుచ్చుకుంది – "అదిగో! అక్కడ నేల నిండా ఎర్రపూల తీగ ఎలా పాకిందో చూడండీ" అన బోయిన సీత, ఆ మందలింపుతో సిగ్గుపడి తల వొంచుకుంది. మాటిమాటికీ ఎందుకీ మాటలు? ఈ అరణ్యాలు చూసి తను ఎంత ఆనందిస్తోందో గ్రహించలేరా? ఏదయినా ఆపద సంభవిస్తే తనను రక్షించే శక్తి ఆ మహావీరుడికి లేదా? – ఎటూ చూడకుండా తలవొంచుకుని నిరుత్సాహంగా నడిచింది కొంతసేపు.

నేలమీద నీలం పువ్వులు పక పక నవ్వుతూ సీత ఏకాగ్రత పాడుచేసేసి –"సీతా! దొంగా! మావేపు చూడకుండా వెళ్ళిపోతున్నావు కదూ? నీ పెనిమిటి మీద అలగాలి గానీ, మా మీద ఎందుకమ్మా కోపం?" అంటూ సీత పాదాలచుట్టూ తలలెత్తి పోట్లాడాయి.

సీత నవ్వి అన్నింటినీ చేత్తో ముట్టుకుని – "ఛ, లేదమ్మా! మిమ్మల్ని చూస్తోనే వున్నాను. ఎంత చక్కగా పూచారు మీరు! నాకు కూడా ఇక్కడే ... మీ దగ్గిరే వుండిపోవాలనిపిస్తోంది" అని మళ్ళీ నవ్వింది.

"ఉండు సీతా! ఉండు, ఇక్కడే ఉండు! ఉండవూ? అయ్యో! నెమ్మదిగా వెళుతున్నావే, ఉండవూ?"

చుట్టూ పూలతో మాట్లాడుతూ, నవ్వుతూ, వొక చెట్టువేపు చూస్తూ సీత "ఆ పూలు ఎంత బాగున్నాయో చూడండి" అంది భర్తతో, మందలింపులన్నీ అప్పుడే మర్చిపోయి.

రాముడు వినిపించుకోలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు – పులుల గురించో, కైక గురించో!

లక్ష్మణుడు గంప కిందపడేసి, చటుక్కున మూట దింపి, సీత చూస్తోన్న చెట్టుమీదకి ఎగబాకి పూలరెమ్మ ఒకటి ఫెళ్ళున విరిచి తెచ్చి – "స్వీకరించండి వొదినగారూ!" అంటూ అందించాడు.

సీత తెల్లబోయి, నొచ్చుకుంటూ – "అయ్యో! నీ కెందుకయ్యా అంత శ్రమ? మీ అన్నగారు ఇస్తారని అడిగాను" అంటూ పూలరెమ్మ అందుకుంది. అప్పటి నించీ సీత, ఎంత ముచ్చటేసినా, అందని పూలయితే అడగకుండానే నడిచింది.

బూరుగు చెట్లు, విరగబూసీ కాసీ గాలి నిండా దూదిరేకులు ఎగురగొడుతున్నాయి. మంచులాగ ఎగురుతోన్న దూది, చుట్టూ చెట్లనిండా చిక్కుకుంటోంది. వొక చోట నేలనిండా పట్టు దారాలలాగ పచ్చనితీగలూ, వాటి కణుపులనిండా చిన్న చిన్న నక్షత్రాలలాంటి తెల్ల పూలూ! వాటిని తొక్కకుండా నడవడానికి దారే లేదు.

మధ్యాహ్నం వరకూ నడిచి వొక చెట్టుకింద ఆగారు.

ఆగడమే ఆలస్యంగా రాముడూ, లక్ష్మణుడూ

**62. అయోధ్యా, సర్గ 55, శ్లోకం 25:** సీత మర్రి చెట్టుని – "మహా వృక్షమగు శ్యామమా! ...." అని సంబోధించి తమ వనవాసం సుఖంగా ముగిసేటట్లు తమని కరుణించాలని ప్రార్థిస్తుంది. శ్రీరామచంద్రుడి భార్య అయిన సీత, చెట్లనీ పుట్లనీ, రాళ్ళనీ రప్పల్నీ, నదుల్నీ ప్రార్థిస్తూ వుంటుంది. ఈ విధంగా, ఎక్కువ వయసువున్న చెట్లనీ, కొండల్నీ, నదుల్నీ, సముద్రాల్నీ, ప్రకృతిలో పెద్ద పరిమాణంతో కనపడే ప్రతీ విశేషాన్నీ, భయభక్తులతో ప్రార్థిస్తారు. అవి కోరికలు తీరుస్తాయని నమ్ముతారు. ఇది, ఆటవిక కాలంనాటి మానవులు చేసేవారు. ఆ విశ్వాసాల అవశేషాలే ఈ విధంగా ఇప్పటికీ వున్నాయి. 'చెట్లూ, నదులూ మన కోరికలు తీర్చవు' – అనే శాస్త్ర జ్ఞానం తెలిసినప్పుడే ఈ మూఢ విశ్వాసాలు పోతాయి. ★

జంతువుల వేటలో పడ్డారు.

సీత తను కూర్చున్న చెట్టునిండా చిలకల్ని చూసి ఆశ్చర్యపడింది. అన్ని చిలకల్ని వొక్కసారి ఎన్నడూ చూడ లేదు. ఏ కొమ్మ చూసినా చిలకలే! కూతలూ, ఎగు రుళ్ళూ, చప్పుళ్ళూ, ఎంత సందడో!

వేరే చెట్లమీద పచ్చపావురాలు గుంపులు గుంపులు!

బాణాలు తగిలి నేలకూలే జంతువుల మూలుగు లకు, పక్షులన్నీ భీతితో లేచిపోయి ఆకాశం నిండా పరుచుకున్నాయి.

కాల్చిన మాంసం కండలు తిని కొంతసేపు విశ్ర మించి మళ్ళీ నడక సాగించారు.

కోతులెక్కువగా కనిపించడం ప్రారంభించాయి. అవి కొమ్మలమీద నుంచి లక్ష్మణుడి మూటని లాగే ప్రయత్నాలు చేశాయి. రాముడు బాణంతో బెదిరించ బోతే ఆ బాణం లాగే సాహసం చేశాయి. అక్కడక్కడా భల్లూకాలు తారసపడ్డాయి.

అడవిలో పూర్వం కనపడ్డ చెట్లు తగ్గి, కొత్త కొత్త చెట్లు కనబడి కొత్త అడవిలోకి ప్రవేశించినట్టు తోచింది. మద్దిచెట్లూ, వావిలిచెట్లూ ఎక్కువగా వున్నాయి. ఇప్ప పూల పరిమళాలు గుప్పుమంటున్నాయి. పెద్దపెద్ద రాళ్ళు, నేలలో కప్పడి, వాటిమీద గడ్డి మొలిచి, ఆ గుట్టల నిండా పూలతీగలు పాకి, ఎవరికోసమో దారి మధ్య ఎత్తుగా పరిచిన పూల పాన్పులలాగ ఎదురు చూస్తు న్నాయి. చెట్ల చుట్టుపట్ల కూడా రాసులు రాసులుగా, పూలు! అక్కడక్కడా రకరకాల జంతువుల అడుగులూ!

"ఏనుగుల అడుగులు చూడండి వొదినగారూ!"

సీత పుట్టినప్పటినుంచీ ఏనుగుల్ని చూస్తూనే వుంది. "సింహాలు కనపడవుగా?" అని నిట్టూర్చింది.

రాళ్ళ గుట్టలమీద నించి పోయే వాగులు దాటారు. ఒక్కొక్క చోట రాళ్ళమీద పల్చని నీళ్ళలో సీత పాదాలు మాత్రం మునిగి తెల్లగా పద్మాలయ్యేవి. వాగులనిండా ప్రవాహంలోపడి కొట్టుకుపోతూ రాళ్ళ మధ్య చిక్కు కుంటోన్న పువ్వుల్ని సీత అక్కడక్కడా తప్పించి నీళ్ళలోకి వొదిలేది.

సిందూరం పూసినట్టు కొమ్మలనిండా గుత్తులు గుత్తులుగా తురాయి పువ్వులు! మంకెన పువ్వులు! సీత, గుప్పిటినిండా ఏరుకున్న రంగురంగుల పక్షి ఈకల్ని, వొకచోట నీళ్ళలో విడిచిపెట్టింది.

నెమళ్ళు పింఛాలు ముడుచుకుని బారెడు బారెడు తోకలతో చెట్ల కింద నడుస్తున్నాయి. సీత వొడినిండా నెమలి ఈకలు ఏరుకుంది.

ఒక చెట్టుకింద చుక్కలు రాలుతోన్న తేనెపట్టు కింద నిలబడి వొక ఎలుగుబంటి తేనె తాగుతోంది.

రాముడు బాణం తీస్తాడేమోనని సీత భయపడింది. "ఈ నెమలి కన్ను చూడండి, ఎంత పెద్దదో! ఎంత అందంగా వుందో!" అని రాముడి మొహానికి దాన్ని అడ్డం పెట్టింది.

అక్కడక్కడా పాములు పిట్టల గూళ్ళకోసం చెట్ల మీదికి జరజర పాకడం, నెమలి రెక్కల్లో రివ్వున బాణాలు తగలడం, ఎగిరే ఎగిరే పిట్టలు ఆఖరి కూతతో నేల రాలడం – ఎన్నెన్నో విషాద దృశ్యాలు కూడా చూసింది సీత. ప్రాణుల ఆర్తనాదాలెన్నో వింది. దిగులుపడుతూ నడిచింది.

చీకటి పడుతోంటే ఒక సరోవరం దగ్గిర ఆగారు. దాన్నిండా తామరపూలు విప్పారి వున్నాయి. నీటి బాతులు పడవలలాగ ఈదుతూ, తామర పువ్వుల్ని తప్పించుకుంటూ పూలమధ్యనించీ నీళ్ళని చారలు చారలుగా చీలుస్తూ వొడ్డుకి చేరుతున్నాయి.

సరోవరం చుట్టూ చెట్లనిండా కొంగలు, చిలకలు, పావురాలు, పచ్చపిట్టలు, తెల్లపిట్టలు, గుంపులు గుంపు లుగా, అదంతా పిట్టల లోకంలాగ వుంది. సరోవరం ఒడ్డున, సన్నని తీగల మాదిరి గడ్డి, దుబ్బులు దుబ్బు లుగా వుంది. గాలి వీచినప్పుడల్లా సువాసనలు జిమ్ము తోందా గడ్డి.

సీత కొంచెం గడ్డి తెంపి నలిపి అరిచేతులకు రాసు కుని వాసన చూసింది. వొకసారి హారతి కర్పూరం లాగూ, ఒకసారి వట్టివేళ్ళలాగూ, ఒకసారి సంపెంగ పూలలాగూ పరిమళం వొచ్చింది. సీత, అరిచేతులు రాముడి మొహంమీద పెట్టి, "చూడండి, ఎంత బాగుందో వాసన!" అని నవ్వుతూ చూసింది.

సీతకి అంతఃపురాలలో ఉన్నప్పటికన్నా భర్తతో చనువు ఎక్కువయింది. అక్కడ భర్త రాచకార్యాలన్నీ తీరి ఏ అర్ధరాత్రో మందిరానికి వొచ్చేవాడు. ఏ వేళైనా తీరిక చిక్కినా, ఎందరో దాసీలమధ్య గంభీరంగా మసలవలసి వొచ్చేది. ఏకాంతం చిక్కడమూ, ఆనందించడమూ ఎప్ప టికో! ఇక్కడ – ఈ అరణ్యాలూ, కష్టాలూ, ఎంతో దగ్గిర చేశాయి భర్తని తనకి. ప్రతీ క్షణమూ, వొకర్ని ఒకరు చూసుకో వచ్చును. ఏ ఆలోచన కలిగినా ఒకరితో ఒకరు చెప్పుకో వచ్చును. నిజమయిన సహ జీవనం ఇదేకదా? "ఏం, బాగుండలేదూ వాసన? మన ఉద్యానవనాల్లో ఎక్కడా ఇటువంటి గడ్డి లేదే!" అంటోన్న సీతని రాముడు విస్మయంగా చూశాడు.

'అంతఃపురాలలో కన్నెత్తి చూడడానికే సిగ్గుపడేది. పలకరించడానికే సంకోచించేది. ఘడియ ఘడియకీ 'ప్రభూ! .... స్వామీ!' అంటూ వినయం చూపేది. అంతః పురాలు విడిచి బయలుదేరిన తర్వాత, చూడగా చూడగా ఆ భయ భక్తులే మరిచి పోతున్నట్టు తోస్తోంది' అని తలపోస్తూ తలపంకించి వూరుకున్నాడు.

అంతలో, సీత, ఒక అద్భుత దృశ్యం చూస్తూ తన్మయత్వంలో మునిగింది. సరోవరం వొడ్డున ఒక మొగ నెమలి, పింఛం విశాలంగా విప్పి, అప్పుడే జరుగుతోన్న చంద్రోదయానికి ఎదురుగా నిలబడి ఆడుతోంది. ఆ మసక వెన్నెల్లో నెమలి పింఛం నీడ సరోవరం నిండా పడి నెమలి పర్వతాకారంతో నించున్నట్టు కనబడుతోంది. సీత, అంత ఆనందాన్ని తను ఒక్కతే భరించలేక, "అటు చూడండి! .... నెమలి నీడ .... నీళ్ళ నిండా" అంటూ రాముడి చెయ్యి పట్టుకుంది ఉప్పొంగుతూ.

"లక్ష్మణా! ఇక్కడ మనం విశ్రమించవచ్చునంటావా?"

"నే నననుఅన్నగారూ!.... మీ భృత్యుణ్ణి! .... అంత స్వేచ్ఛ తీసుకో ...."

"అదికాదోయీ! ఈ పరిసరాల్లో క్రూర జంతు భయం లేకుండా సురక్షి ...."

"ఎంతమాట అన్నగారూ! నా బాహుబలాన్ని శంకించడం లేదు కదా? మీరూ, వొదినగారూ విశ్రాంతి తీసుకోండి! నేను తెల్లవార్లూ మెలకువతో వుండి కాపలా కా ...."

"అవునోయీ! నాకు తెలుసు. నువ్వు అంతటి సమర్థుడివే! మన రఘు వంశానికి కీర్తితెస్తావు" (కాపలాలు కాసి!)

ఎక్కడినించో ఒక పిట్టకూత వినబడింది. ఆడే నెమలి ఆట ఆపింది. పింఛం ముడిచి మెడ సారించి మత్తుగా కూసింది, తను కూడా ఆ కూతలాగానే.

"లక్ష్మణా! ఆ నెమలి చాలా బలిసివుందే! నెమలి మాంసం చాలా రుచి..."

"ప్రభూ! ...." అని కలవరపడింది సీత.

నెమలి అప్పటికే ఎగిరిపోయింది, కూత వెనక.

చంద్రుడు ఆకాశం ఎక్కుతోన్నకొద్దీ అడవి మాటు మణిగింది.

రాముడూ, సీతా సుగంధాలీనే గడ్డిలో విశ్రాంతిగా కూర్చున్నారు.

గాలిలో మంచిగంధం వాసన!

లక్ష్మణుడు విల్లూ కత్తీ పట్టుకుని కొంచెం దూరంలో చుట్టూ తిరుగుతూ కాపలా కాయడం మొదలుపెట్టాడు.

వెన్నెల్లో సరోవరం రెండో చంద్రుడిలా మెరుస్తోంది. అడవి, ప్రశాంతంగా మౌనంలో మునిగింది.

సీత ఎటో చూస్తూ "అటు చూడండి! చంద్రకాంతిలో .... దిక్కులూ .... వృక్షాగ్రాలూ ఎంత సుందరంగా మెరుస్తున్నాయో! ఈ నగ్నప్రకృతిని చూస్తోంటే ఉద్యానవనాలెంతో కృత్రిమమని తోచడం లేదూ?" అని పరవశించింది.

రాముడు చుట్టూ చూశాడు. ఎటుచూస్తే అటు వెన్నెల కురుస్తోంది! చక్కని నీలంరంగు ఆకాశం కింద చెట్ల తలలు మెరుస్తున్నాయి! అప్పుడప్పుడూ పండుటాకులు గాలిలో మెత్తగా ఎగురుతున్నాయి. అన్నీ చూసి నిట్టూర్చాడు. "ఎందుకీ వెన్నెల ఇంత వృథాగా కాస్తోంది ఆకాశంలో? అందుకే కదా 'అడవి కాచిన వెన్నెల' అంటారు పెద్దలు?" అని అయిష్టం ప్రకటించాడు.

సీత విస్మయంగా చూసింది – ఇంత సుందర వనసీమలో విరక్తి తోచే మాటలా! భర్తని చూసి ఆమె కెంతో నిరుత్సాహం కలిగింది – "ప్రభూ! అడవి కాచిన వెన్నెల వ్యర్థమవుతుందా? ఈ పక్షులూ, జంతువులూ, మహావృక్షాలూ, ఈ గడ్డిలో ప్రతీ ఈనే, ఈ పూలలో ప్రతీ రేకూ, సమస్త క్రిమికీటకాలూ, వెన్నెలలో తడిసి ఆనందించవా? ఈ శీతలత్వంలో సేదదీరి విశ్రమించవా? ఇంతకన్నా మిన్నగా వెన్నెలతో మానవులు సుఖించగలరా? ఈ చంద్రకాంతికీ, ఈ పువ్వులకూ, ఈ మేఘాలకూ అంకితమై, ఈ అరణ్యాలలో జీవించడం కన్నా మహాభాగ్యముందా? ఇది సామాన్య భూలోకమా, ఏ అసమాన్య సౌందర్య లోకమో గానీ ....!" అంటూ సీత తన్మయత్వంలో మునిగింది.

రాముడు చుట్టూ చూసి, మహా విరక్తితో, "సీతా! ఎంత అజ్ఞానివి! ఈ లోక సౌందర్యం శాశ్వతమా? ఒక్క క్షణంలో ఈ పువ్వులన్నీ రాలేవే! ఈ మబ్బులన్నీ మారేవే! చంద్రకాంతిని చూసి ఇంతగా మురుస్తున్నావుగానీ జీవితాయుర్దాయంలో ఒక రాత్రి గడిచిపోతోందని గ్రహించలేకపోతున్నావు. మానవులు పగలు కాగానే డబ్బు సంపాదించుకోవచ్చునని మురుస్తారు. రాత్రి కాగానే కామభోగాలనుభవించ వొచ్చునని సంతోషిస్తారు. అంతేగానీ, రోజులు గడుస్తోన్న కొద్దీ మృత్యువు తరుముతోందనీ, ఆయువు తరుగుతోందనీ, వయస్సు పెరుగుతోందనీ, గ్రహించరు. ఋతువులు మారినప్పుడు, చెట్లు చిగిర్చి కాయలు కాస్తాయనో, పొలాలు పండుతాయనో, వర్షాలు కురుస్తాయనో, ఆనందిస్తారు. కానీ, నెలలూ, సంవత్సరాలూ గడిచిపోతున్నాయని దుఃఖించరు" అంటూ నిట్టూర్చాడు.[63]

సీత అయోమయంగా చూసింది. వొక్క మబ్బు తునకైనా అడ్డురాకుండా ఆకాశంలో ధగ ధగ మెరుస్తోన్న

---

**63.** **అయోధ్యా, సర్గ 105, శ్లోకాలు 23, 24, 27:** జనన మరణాల గురించీ, మనుషులు స్వర్గ సుఖాలకోసం ఏర్పాట్లు చేసుకోవలసిన విధం గురించీ, రాముడు భరతుడితో చాలా వివరంగా చెప్పాడు. రాముడు ఎవరితో ధర్మ చర్చలు చేసినా ఆ అభిప్రాయాలనే వ్యక్తం చేస్తాడు. ★

చంద్రుణ్ణి చూడమంటే, తన భర్త చేస్తోన్న తత్త్వ విచారం ఆమెకు అర్థంకాని విచారం కలిగించింది. సంకోచం గానే, వినయంతో – "స్వామీ! సూర్యోదయ, సూర్యాస్త మయాలు జీవితాన్ని తరుగు చేస్తాయని గ్రహించాను. కానీ, అది, ఎంత దుఃఖించినా ఆగని లోక సహజ కార్యమే కదా? దుఃఖించినా ఆయుష్షు తరుగుతూనే వున్నప్పుడు, దుఃఖించి ఏమి ప్రయోజనం? జీవిత కాలాన్ని సంతోషంతో, రక్తితో, ఆసక్తితో, సౌందర్య కాంక్షతో నింపుకోవాలనే ప్రయత్నం అజ్ఞానమేనా స్వామీ?" అని అమాయకంగా చూసింది.

రాముడు ఒక జ్ఞానహీనురాలికి జ్ఞానబోధ చేసే ఆతృతతో – "అందుకే, మానవుడు ఆత్మవిచారం చేసు కోవాలి సీతా! జీవితం వృథా చేసుకోకూడదు. యౌవ్వ నంలోనే స్వర్గ ప్రాప్తికి ప్రయత్నాలు చేసుకోవాలి. లేక పోతే వృద్ధాప్యంలో పుణ్యం సాధించుకో గలడా? ఈ సూర్యోదయాలూ, చంద్రోదయాలూ చూసి సంతోషిం చడంలో మునిగితే, ఈ సంతోషం, పరలోక సౌఖ్యాలు సంపాదించుకోవడాని కెందుకూ పనికిరాదు" అన్నాడు.

"స్వామీ! ఇక్కడి సుఖాల్ని నిరసించేది, మళ్ళీ ఇంకోచోట సుఖాల కోసమేనా?"

రాముడు, మొహం చిట్లించాడు – "ఇవి ఇహ లోక సుఖాలు. ఇవి క్షుద్రమైనవి. అశాశ్వతమైనవి. పరలోక సుఖాలు ఇటువంటివి కావు. మహోన్నతమైనవి. శాశ్వత మైనవి. మానవుడు పరలోక సుఖాల కోసం పుణ్యం చేసు కోవాలి. అటువంటి వారే మానవులు. కానివారు మృగాలు. ఈ లోకంలో వుండే సిరిసంపద లెందుకు? పురుషుణ్ణి బాధలలో కీడ్చే సంసార లంపటాలెందుకు? భార్యాబిడ్డలూ, మిత్రాదులూ, తాత్కాలికంగా కలిసి విడి పోయే సంబంధాలు. అంతా మిథ్య! సంసార సుఖాలు మధ్యలోనే తెగిపోయే బంధాలు!" అంటూ కళ్ళు మూసు కున్నాడు.[64]

సీతకి పట్టరాని దుఃఖం వచ్చింది. భర్త వియోగం భరించలేక, అతని సామీప్యం వదలలేక, కష్టమో సుఖమో, ఒక్క ప్రాణంగా ఒక్క దేహంగా పంచు కుంటూ అతనితో కలిసి బతకాలని వొచ్చిన తనతో తన భర్త – "ఎందుకీ సంసార లంపటాలు? పురుషుడి కెందుకీ అశాశ్వత బంధనాలు? భార్య మిథ్య .... దాంపత్యం మిథ్య .... సమస్తం మిథ్య ...." అంటోంటే ... సీత కళ్ళు నిండి చెరువులయ్యాయి.

'భార్యా భర్తల బంధం ఎన్నటికీ వీడనిది. జన్మ జన్మలకూ శాశ్వతంగా నిలిచేది' అని బ్రాహ్మలు చెప్పడం సీత అనేకసార్లు విన్నది! ఇప్పుడు భర్త ఇంకో విధంగా బోధిస్తున్నాడే! రాముణ్ణి జ్ఞానీ, సర్వజ్ఞుడూ అని బ్రాహ్మలు కీర్తించడం కూడా సీత అనేకసార్లు విన్నది. అంతటి సర్వజ్ఞుడి జ్ఞానాన్ని ప్రశ్నించే సాహసం లేదామెకు. నిరుత్సాహంగా గడ్డి దుబ్బు మీదకు వొరిగి తల వాల్చింది.

రాముడు నాలుగైదుసార్లు ఆవలించి, అరణ్యాలూ, సింహాలూ మిథ్య కాదనే జ్ఞాన సంపదతో లక్ష్మణుణ్ణి హెచ్చరిస్తూ – "లక్ష్మణా! జాగ్రత్త సుమా! మన వన వాసంలో ఇది ఐదవ రాత్రి. ఇంకా మనం 13 సంవత్స రాల, 11 నెలల, 25 రోజులుంటే సరిపోతుంది. తిరిగి అయోధ్యకు పోవచ్చును" అని లెక్కలు చెప్పాడు. 'ఒక రోజు గడిస్తే విచారించాలి' అని చెప్పే రాముడు, రోజులూ, సంవత్సరాలూ గబ గబా గడిచిపోవాలని కలలు కంటూ పడుకున్నాడు!

రాముడికి, సూర్యోదయ, సూర్యాస్తమయాలు చాలా ఇష్టమే, వనవాసంలో వొక రోజు గడిచి పోయింది కదా అని! అప్పుడే ఐదు రోజులు గడిచి పోయినందుకు చాలా సంతోషిస్తున్నట్టు కనపడ్డాడు. ఎందుకయినా మంచిదని వొకసారి చుట్టూ చూస్తూ వెన్నెల మడుగుని చూసి ఆవ లిస్తూ – "ఇలాంటి సరోవరాల దగ్గిరికి రాత్రులు దేవ తలు స్నానాల కొస్తారు" అని, మత్తుగా కళ్ళు మూసి నిద్రకిపడ్డాడు.

సీత ఆశ్చర్యంగా తలెత్తి ఆకాశంవేపు చూసింది, దేవతలు ఎటునించి వస్తారో అని!

వెన్నెల తొందరగానే పోయింది.

చుక్కలు మరీ కాంతిగా మెరుస్తున్నాయి.

అప్పుడప్పుడూ వొక్కో చుక్క తెగి జారి పడుతోంది.

ఆ చుక్కని చూసి "దేవేంద్రుడు శపించాడేమో!" అనుకుంటోంది సీత. వొక్కోసారి కన్నుమూత పడినా, హఠాత్తుగా ఉలిక్కిపడి సరోవరం వేపు చూస్తోంది, స్నానాలకొచ్చే దేవతలు కనబడతారేమోనని.

ఏ దేవతలూ కనబడలేదుగానీ, ఏవో జంతువులు నీళ్ళకోసం రాబోతే లక్ష్మణుడు అదిలించి బెదర గొడు తూనే వున్నాడు తెల్లవార్లూ.

---

**64. అయోధ్యా, సర్గ 105, శ్లోకాలు 26, 27:** పురుషుడి మోక్షానికీ, స్వర్గానికీ సంసారం ఒక లంపటం! భార్యాబిడ్డలు తాత్కాలికంగా కలిసి, విడిపోయే బంధాలు! కానీ ఇవే సూత్రాలు స్త్రీకి వర్తించవు. స్త్రీ మోక్షానికి – భర్తా, సంసారమూ లంపటాలు కావు. అవి, స్త్రీ మోక్షాన్ని ఆటంకపరిచే బంధాలు కావు. స్త్రీకి భర్త సేవే స్వర్గం. అది తప్ప స్త్రీకి వేరే సాధించవలసిన లక్ష్యాలేమీ లేవు. అంటే పురుషుడిలాగ స్త్రీ, మానవ ప్రాణి కాదు. స్త్రీ, జంతుజాతికి సంబంధించినదో, కీటక జాతికి సంబం ధించినదో, జీవ శాస్త్రజ్ఞులు కనిపెట్టవలసిన విషయం. ★

లక్ష్మణుణ్ణి చూస్తే సీత మనసంతా దయతో నిండి పోయింది. పగలంతా బరువు మోస్తాడు. రాత్రుళ్ళు నిద్రలేకుండా కాపలాలు కాస్తాడు. ఎప్పటికి ఇతని కష్టం తీరుతుందో! మనసు ద్రవించి కళ్ళు నిండి పోయాయి.

★ ★ ★

మళ్ళీ సూర్యోదయం! మళ్ళీ సౌందర్యోదయం!

సీత చీకట్నే లేచి స్నానం చెయ్యడానికి సరస్సు వొద్దకి వెళితే తడి మట్టిలో ఎన్ని అడుగు జాడలో! రాత్రి చీకట్లో లక్ష్మణుణ్ణి ఏమార్చి నీళ్ళుతాగి వెళ్ళినట్టున్నాయి జంతువులు. ఎన్నెన్ని కొత్త పువ్వులు విచ్చుకున్నాయో సరస్సు నిండా!

చుట్టూ చెట్లన్నీ సీతకన్నా ముందే లేచి ముస్తాబు చేసుకుని తలల నిండా పూలు పెట్టుకున్నాయి. ఎర్ర పూల చెట్లు కణకణ మండుతున్నాయి. పూలన్నీ కళ్ళు విప్పార్చుకొని చిన్న చిన్న మొహాలు పైకెత్తి, "అమ్మా, అమ్మా! ఆకాశం ఎంత బాగుందోనే! .... ఏమిటీ అంత బాగా ఎగురుతున్నాయి? మనం కూడా అలా ఎగిరితే? .... అమ్మా! ఈ గాలి చూడవే ఎలా జడిపిస్తోందో! అమ్మా! అమ్మా! సీత వొచ్చిందే! నన్ను ముద్దు పెట్టుకుని వెళ్ళిపోతోందే! .... ఇదిగో సీతా! నిన్నే! ఏమిటమ్మా అంత గర్వం? వినిపించు కోవేం? .... ఇక్కడే వుండ రాదూ? .... చక్కగా రోజూ మనం స్నేహంగా... రా సీతా! రావూ?" అని పిలుస్తున్నాయి సీతని.

సీత నవ్వుతూ చెట్లన్నీ తిరిగింది. పువ్వుల్ని బుజ్జగించి – "ఎట్లా వుండను మరి? నా భర్తతో వెళ్ళవొద్దా? అమ్మ వుందికదా మీకు? చాలా కాలం తర్వాత మళ్ళీ వొస్తానుగా? తప్పకుండా వొస్తానుగా?" అంటూ వాగ్దానాలు చేసింది.

ముగ్గురూ మళ్ళీ ప్రయాణం సాగించారు.

అరణ్యం ఇంకా దట్టం అవుతోంది. చెట్లు వొకదాన్ని ధిక్కరించి వొకటి విస్తరించి వున్నాయి. ఏవేవో, జంతువుల అరుపులూ పరుగులూ దగ్గర దగ్గరగానే విన్పిస్తున్నాయి. ప్రతీ చెట్టుకీ ఎన్నెన్ని పళ్ళో! జీడి చెట్లు, పై కొమ్మల్లో విరగకాసి పక్షుల కిచకిచల్తో నిండి పోయాయి. ఎన్నో కొమ్మలకు తేనెపట్లు బరువుగా వేళ్ళాడుతున్నాయి. ఎటు తలతిప్పినా నెమళ్ళో, కోయిళ్ళో! రంగురంగు ఈకల పిట్టలు గుంపులు గుంపులు! ఘీంకారాలూ, క్రేంకారాలూ, కలిసి పుడుతోన్న ధ్వనులు!

అది వృక్షలోకం! స్వప్నలోకం! అలౌకిక సౌందర్య లోకం! ఆ లోకంలో పక్షులూ, జంతువులూ తప్ప మానవుల అలికిడి వికృతంగా తోస్తోంది. ఆ చెట్లు మనుషుల్ని దోషుల్ని చూసినట్టు చూస్తున్నాయి. "ఆ మానవుల్ని తొందరగా పోనివ్వండి! వారితో వైరం పెట్టుకోకండి! మానవులు నిర్దయులు. హృదయ శూన్యులు. వారిని తొందరగా దాటిపో నివ్వండి!" అని అడివి, తమను ఆజ్ఞాపించినట్టు, క్రూర జంతువులూ విషసర్పాలూ మనుషుల జోలికి రాకుండా తప్పుకున్నాయి.

దూరంగా చిత్రకూట పర్వత శిఖరాలు, దిగంతాలకు దిగుతోన్న మేఘాలలాగు పొగమంచు కప్పుకొని, చిత్రపటాల మాదిరి కన్పిస్తున్నాయి.

సాయంత్రం వరకూ నడిచారు.

మధ్య మధ్య అప్పుడప్పుడూ సీత, రాముడికి ఏవేవో దృశ్యాలు చూపించబోయి వూరుకుంది ఎన్నో సార్లు.

భరద్వాజ మహర్షి చెప్పిన గుర్తులన్నీ కన బడ్డాయి. దూరంగా ఆశ్రమాలలో సంధ్యాహోమాల నించి పొగ లేస్తోంది. రాముడు కళ్ళు విప్పార్చి చూశాడు–"లక్ష్మణా! మనం గమ్యం చేరామోయి!"

"చిత్తం! తమ దయవల్ల చేరాం అన్నగారూ!"

ముగ్గురూ వాల్మీకి ఆశ్రమానికి చేరారు. రాముడు వాల్మీకి మహర్షికి నమస్కారంచేసి మొదలు పెట్టాడు – "మహర్షీ! మేము దశరథ మహారాజు పుత్రులం. మా పినతల్లి నిర్దయతో మమ్మల్ని ఈ ఘోరారణ్యాలకు పంపింది. నా తండ్రి ఆడదాని మాట విని నా వంటి పుత్రుడికి వనవాసం ఆజ్ఞాపించాడు. నేను పితృవాక్య పరిపాలకుణ్ణి కాబట్టి తండ్రి ఆజ్ఞ ప్రకారమే సంతోషంగా వనవాసానికి వచ్చాను స్వామీ!" అని నిట్టూర్చాడు.

వాల్మీకి మహర్షి విచారించి – "నీకు శుభం కలుగుతుంది నాయనా! ఇక్కడ నువ్వు మాతోపాటే జీవించ వొచ్చును" అని ధైర్యం చెప్పాడు.

రాముడు వాల్మీకి ఆశ్రమంలో మట్టి అరుగుమీద విశ్రాంతిగా కూర్చున్నాడు. చుట్టూ పరిసరాలు దారులు ఏర్పడి వున్నాయి. సమీపంలోనే మందాకినీ నది. "లక్ష్మణా! ఈ ప్రదేశం సురక్షితంగానే వుంది. ఇల్లు కావాలని నా మనసు కోరుతోంది. పెద్ద పెద్ద చెట్లుకొట్టి ఇల్లు కట్టవోయి!" అంటూ రాముడు గోడకి చేర బడ్డాడు.[65]

**65.** **అయోధ్యా**, సర్గ **66**, **శ్లోకాలు 19**, **20**: రాముడు ఇల్లు కట్టమని ఒక శ్లోకం చెప్తే, "లక్ష్మణుడు మానులు కొట్టితెచ్చి పర్ణశాల నిర్మించెను" అని కవి 20వ శ్లోకంలో చెప్పాడు. ఆ ఇల్లు లక్ష్మణుడు ఒక్కడే కట్టాడు. రాముడు, ఇక్కడ పుల్లతీసి అక్కడ పెట్టలేదు! పనులన్నీ లక్ష్మణుడే చెయ్యాలి.

రామ లక్ష్మణులు, పైకి మాత్రమే అన్నదమ్ములు. వారి మధ్య అసలైన సంబంధం యజమానీ బానిసల సంబంధం. బానిసలు, యజమానులకోసం చేసే శ్రమలన్నీ లక్ష్మణుడి పాత్రద్వారా కనపడతాయి. లక్ష్మణుడు ఎన్నడూ స్వంత ➔

లక్ష్మణుడు నమస్కారం పెడుతూ– "మహా భాగ్యం! మీ మనసు ఆనందపడే విధంగా ఇల్లు కడతాను" అని గొడ్డలి పట్టుకుని లేచాడు.

అప్పటి నించి నిద్రాహారాలు లేకుండా శ్రమించాడు. పెద్ద పెద్ద చెట్లు కొట్టాడు. కొమ్మలు నరికాడు. నేల చదును చేశాడు. స్తంభాలు పాతాడు. దూలాలు ఎక్కించాడు. వెదుళ్ళు నరికి పైకప్పు తయారు చేశాడు. తాటాకులూ, మద్ది ఆకులూ, రెల్లుగడ్డీ ఇంటి మీద కప్పి, తీగలతో, నారతో తాళ్ళు కట్టాడు. దేవుడి పూజకీ, వంటకీ, అన్నగారు శయనించడానికీ, వేరు వేరు గదులుగా ఏర్పాటుచేసి, కొమ్మలు పాతి, వాటి నిండా జిగురుమట్టి పూతలుపెట్టి, కిటికీలతో సహా గట్టి గోడలు తయారుచేశాడు. బలులు సమర్పించడానికి వేదికలూ, అగ్ని హోత్రాల్ని నిలిపే స్థలాలూ, ఇంటికి ముందువేపు ఏర్పాటు చేశాడు. ఇంటి చుట్టూ ఆవరణంతా ముళ్ళ తుప్పలు నరికి చదును చేశాడు. ఆవరణ చుట్టూ వెదుళ్ళు పాతి, తీగలు చుట్టి జంతువుల భయం లేకుండా దడి తయారుచేశాడు. నది నుంచీ, ఇతర రుషుల ఆశ్రమాలనుంచీ, ఇంటికి సుళువుగా దారులు తెలియడానికి దారి పొడుగునా చెట్టుకొమ్మలకు దర్భలూ, నార పోగులూ చుట్టి గుర్తులు పెట్టాడు. రామదాస్య ఐశ్వర్య మంత్రం ప్రతీ క్షణమూ చెవుల్లో ధ్వనిస్తూ, లక్ష్మణుడికా శక్తి సామర్థ్యాలిచ్చింది. అంతే కాదు. ప్రతీ పనిముందూ కైకా భరతుడూ గుర్తొస్తారు. వార్ని నరకాలనే కక్ష, చెట్లనీ పుట్లనీ నరికే బలం ఇస్తూ వుంటుంది.

ఇల్లు పూర్తిచేసిన తర్వాత, అప్పుడు లేచి నిలబడ్డాడు లక్ష్మణుడు.

అప్పటిదాకా రుషులతో వేదాంత చర్చలు జరుపుతోన్న అన్నగారి అనుగ్రహానికి ఎదురుచూస్తూ "అన్నగారూ! మీ గృహం తయారై సిద్ధంగా ఉన్నది. ఏమి శెలవు?" అని అడిగి వినయంగా నిలబడ్డాడు.

రాముడు, ఇంటిని చూసి చాలా సంతృప్తిపడ్డాడు "లక్ష్మణా! చాలా సంతోషించాను. నా సంతోషం కన్నా నీకేం కావాలి? కృష్ణ మృగాన్ని చంపి తీసుకు రావోయీ! శాస్త్రాలలో రాసిన ప్రకారం లేడి మాంసంతో వాస్తు దేవతలకు నైవేద్యం పెట్టి శాంతి చెయ్యాలి" అన్నాడు.

"ఇప్పుడే తీసుకు వొస్తాను అన్నగారూ!" అని, లక్ష్మణుడు వెంటనే విల్లు తీసుకొని అడవిలోకి పోయాడు. నల్లలేడిని కొట్టి, మాంసం కోసి ఆకుల్లో పెట్టి తీసుకొచ్చి నిప్పుల్లో కాల్చాడు.

రాముడు నదిలో స్నానంచేసి కొత్త ఇంటికి వొచ్చి వాస్తు దేవతల్ని ఆహ్వానిస్తూ పూజలు చేశాడు. ఆ ఇంట్లో సమస్త దోషాలూ హరించి శాంతి కలిగే బలులు సమర్పించాడు. "లక్ష్మణా! ఈ ముహూర్తం చాలా మంచిది. గృహశాంతి జరిగింది. ఇక యజమానికి స్థిరత్వం కలుగుతుంది[66] ఎన్నడూ ఈ గృహం విడిచే పని వుండదు" అంటూ సీతతో కలిసి ఇంట్లో ప్రవేశించాడు. "లక్ష్మణా! బహు సమర్థుడి వోయీ! రఘు కులానికి కీర్తి తెస్తావు" (పాకలు కట్టి!) అని మెచ్చుకున్నాడు.

ఆ పొగడ్తతో లక్ష్మణుడి శరీరం పొంగి, ఒక్క క్షణం కూడా విశ్రాంతి లేకుండా ఆ ఇంటికోసం ఇంకా ఇంకా పనులు చేస్తూనే వున్నాడు. వంటకి ఎండుకట్టెలు కొట్టి నిలవపెట్టాడు. అడివంతా తిరిగి పేడకళ్ళు పోగేసి తెచ్చి ఎండబెట్టాడు. అన్నగారికీ, వొదినగారికీ, మెత్తని రెల్లుతో పరుపులు తయారు చేశాడు. నదినుంచి నీళ్ళు తేవడమూ, అడివంతా తిరిగి దుంపలూ, పళ్ళూ సంపాదించడమూ, వేట మాంసం కాల్చి సిద్ధం చెయ్యడమూ – నిత్య కృత్యాలు. ఎండిన సొరకాయ డొల్లలు సంపాదించి తేనెతో నింపి ఉట్లమీద జాగ్రత్త చేశాడు.

సీత, నిప్పుల్లో మాంసం కాల్చడం, దుంపలు కాల్చడం, నేర్చుకుంది. తనకు చేతనయిన పనులన్నీ చేసి లక్ష్మణుడి శ్రమ తగ్గించాలని ఆరాటపడుతుంది, ఎప్పుడూ.

రాముడు నిత్య హోమాలతో, పూజలతో, సూర్య నమస్కారాలతో, ఎల్లకాలం ఆధ్యాత్మిక చర్చలలో నిమగ్నుమై వుంటున్నాడు. అప్పటికి, రాముడికి కొంత నిశ్చింత కలిగింది. కాలు కింద పెట్టనివ్వని తమ్ముడూ, వెంట వెంట తిరిగి శుశ్రూషలు చేసే భార్యా, క్రూర జంతువుల భయంలేని ఇల్లూ, ఎటు చూసినా వేటకు లోటులేని పక్షులూ జంతువులూ, చుట్టూ రుషులతో నిత్య ప్రసంగాలూ – రాముడి మనసు కొంత కుదుటపడింది. రాజభోగాలు వొదిలి వనవాసం అనగానే గుండెల్లో

➔ ఆలోచనా స్వంత నిర్ణయాలూ చెయ్యడు. అంతా యజమాని ఆజ్ఞల ప్రకారమే నడుస్తాడు. ఎప్పటికప్పుడు అన్నతో "నేను నీ భృత్యుణ్ణి! స్వతంత్రించను" అని చెప్పి ఆ యజమానిని ఆనందపెడుతూ వుంటాడు. లక్ష్మణుడి బానిసత్వం ఇంకా ఎన్ని రకాలుగా వుంటుందో చూడండి! నదులు దాటడానికి తెప్పలు కట్టింది అతనే. మూటలు మోసింది అతనే. పాక కట్టింది అతనే. ముందు ముందు ఇంకా చాలా చేస్తాడు. ఇక్కడ కనపడే ధర్మాల ప్రకారం, అన్నకి తమ్ముడు – బానిసే. ★

**66.** **అయోధ్యా, సర్గ 56, శ్లోకాలు 22, 25:** "గృహంలో బహుకాలం వుండగోరేవారు వాస్తు శాంతి చెయ్యాలి. యజమానికి స్థిరత్వం కలుగుతుంది" అని అన్ని శాంతులూ చేశాడు రాముడు. అయితే, రాముడు ఈ ఇంట్లో ఎంతకాలం వున్నాడో, యజమానికి ఎంత స్థిరత్వం కలిగిందో, తర్వాత చూడండి! ★

ఏర్పడ్డ బెదురు, ఇక్కడ అన్నీ సుఖంగా అమరిన తర్వాత చాలావరకు తగ్గి కొంత శాంతి ఏర్పడింది. సీత రావడం .... అంతకన్నా లక్ష్మణుడు రావడం, చాలా మంచి దయిందని పించింది. 'సోదర సేవ అతనికీ పుణ్యసాధనే కదా?' అని సంతోషించాడు రాముడు.

ఆలోచనలలో మునిగిన రాముడికి – లక్ష్మణుడు, వినయంగా, ఆకు దొన్నెనిండా తేనె నింపి తెచ్చి "స్వీక రించండి అన్నగారూ!" అంటూ అందించాడు.

★ ★ ★

రాముణ్ణి గంగ ఒడ్డున వదిలేసి విచారపడుతూ రథం మీద వెనక్కి తిరిగిన సుమంత్రుడు, మూడు రోజులకు అయోధ్యచేరి, మహారాజు ముందు కూర్చుని, ప్రయాణం సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెప్పుకొచ్చాడు. "మహారాజా! శ్రీరాముడు, నిర్విచారంగా వనవాసం పూర్తి చేసుకుంటానని చెప్పమన్నాడు. లక్ష్మణుడు మాత్రం నీ మీద నిప్పులు చెరుగుతున్నాడు. 'ఆడదానికి లొంగిపోయిన వాడు నా తండ్రా? నా అన్నగారే నా తండ్రి!' అంటున్నాడు. సీత, కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తోంది. కైక మీద, తన అత్తగారికి ఆనందం కలి గించే మాట లేవేవో చెప్పింది. ఇప్పుడా ముగ్గురూ ఒకచోట పర్ణశాల నిర్మించుకుని సుఖంగానే వున్నారు. గుహుడి వేగుల ద్వారా అంతా తెలుసుకునే వచ్చాను" అంటూ, ఉన్నవీ లేనివీ కల్పించి దబదబా చెప్పు కొచ్చాడు.

తల్లుల రోదనలు మిన్నుముట్టాయి.

మహారాజు నేలమీదపడి పొర్లి పొర్లి ఏడ్చాడు. "ఆడదానికి లొంగిపోయాను! ఛీ! నా బతుకు కాలనా? .... సూతుడా! నన్నూ నా కుమారుడి దగ్గిరికే తీసుకు వెళ్ళు! ఈ అయోధ్యలో నేనుండలేను" అని మళ్ళీ నేల మీద పొర్లాడు.

కౌసల్యా అదే పని చేసింది. జుట్టు విరబోసుకుని, గుండెలు బాదుకుంటూ, వాననీటి గొట్టాలలో నించి నీటిధారలు ప్రవహిస్తున్నట్టు, చెంపల మీద కన్నీటి ధార లతో రోదించింది.

తన కొడుకు గురించి విచారించడం ఏనాడో కట్టి పెట్టిన సుమిత్ర, కౌసల్యని ఓదార్చడంలోనే సతమత మయ్యింది.

కొంతసేపటికి, అందరి ఉద్వేగాలూ తగ్గాయి. దుఃఖాలు సద్దుమణిగాయి. మళ్ళీ మాటలు జరిగాయి. మధ్య మధ్య మళ్ళీ శోకాలు పెల్లుబికాయి.

కౌసల్య, భర్తని బాగా దూషించింది, "ఇదంతా నువ్వు ఆడదానికి లొంగడం వల్లే జరిగింది" అని! మహారాజు అన్నిటికీ తలవాల్చి మౌనం వహించాడు.

కొంతసేపటికి, దూషణలూ నీరసించాయి.

మహారాజు కౌసల్యతో ఏనాడో తను చేసిన దురా గతం ఒకటి చెప్పుకొచ్చాడు – "అప్పటికి మనకింకా వివాహం కాలేదు. ఒకసారి నేను వేటలో పొరపాటున ఒక శూద్రముని కుమారుణ్ణి నా బాణంతో చంపాను. అతని తల్లి దండ్రులు అంధులు. వాళ్ళు నన్ను చాలా విధాల దూషించారు. వాళ్ళు బ్రాహ్మణులు కాకపోవడం వల్ల, బ్రహ్మహత్యా పాతకం నాకు చుట్టుకోలేదనుకో! అయినా, వాళ్ళ శాపాలు ఊరికే పోతాయా? అదే ఈ నాడు అనుభ విస్తున్నాను" అని మళ్ళీ రోదన ప్రారం భించాడు. చివరకు ఏడ్చి ఏడ్చి పది దినాల లోపలే ఒక రాత్రి నిద్రలోనే తనువు చాలించాడు.[67]

తెల్లవారు ఝామున ఎప్పటిలాగే మహారాజుని నిద్రలేపడానికి గంధర్వుల్లా గానాలుచేసే గాయకులూ, వాయిద్యాల వాళ్ళూ, మహారాజుని కీర్తించే వాళ్ళూ, జ్యోస్యాలు చెప్పేవాళ్ళూ – అందరూ మహా రాజు శయన మందిరం ముందు, వాళ్ళ పనులు వాళ్ళు చేసేసి వెళ్ళి పోయారు.

మహారాజుకి పళ్ళు తోమి అభ్యంగన స్నానం చేయించే పరిచారకులూ, ఔషధాలు ఇచ్చే అంద గత్తెలూ, మహారాజు ఇంకా లేవనందుకు కలవర పడుతూ తిరిగారు.

చివరికి, బైటపడింది – అసలు సంగతి!

మళ్ళీ రోదనలు! అంతఃపురాలు దద్దరిల్లాయి! కైకతో సహా అందరూ ఏడ్చారు.

కౌసల్య, కైకని దుమ్మెత్తి పోసింది – "ఆడదానికి మొదటి ఆధారం – భర్త! రెండో ఆధారం – పుత్రుడు! మూడో ఆధారం – జ్ఞాతులు! నాకు అన్ని ఆధారాలూ పోగొట్టావు! ఇక నువ్వూ నీ కొడుకూ ఊరేగండి!" అని సవతిని శాపనార్థాలు పెట్టింది.

శోకాలు ఆగాక, మంత్రులు రాజు దేహాన్ని 'తైల ద్రోణి'లో భద్రపరిచారు.

★ ★ ★

---

**67.** 'పుణ్యం చేసుకున్నవాళ్ళు కొడుకుల చేతుల్లో మరణిస్తారని' ధర్మశాస్త్రాలు చెపుతాయి కదా? దశరధుడికి చివరి కాలంలో నలుగురు కొడుకులూ దగ్గిర లేకుండా అయిందేం? 'పుత్ర వియోగంతో మరణిస్తావు' అని దశరధుడికి శాపం వున్నా, నలుగురు కొడుకులూ దూరంగా వుండే స్తితి కలగనక్కరలేదు. ఒక కొడుకు దూరంగా వుండి, మిగతా వాళ్ళు దగ్గిరే వుండి దూరంగా వున్న కొడుకుకోసం దుఃఖంతో మరణించవచ్చు. చివరికాలంలో నలుగురు కొడుకులూ దూరంగా వుంటే, శాస్త్ర ధర్మాల ప్రకారం, ఇక ఆయనేం పుణ్యాత్ముడు?

★

దశరథుడు, తనువు చాలించిన రాత్రే, కన్ను మూసీముయ్యగానే, మహోత్సాహంతో స్వర్గాన్ని వెతుక్కుంటూ బైల్దేరాడు – "రంభా! .... రంభా!" అని అరుస్తూ!

తెల్ల బట్టలతో జుట్టు విరబోసుకుని దగ్గుతూ ఎగురుతున్నాడు. ఆకాశం అంతా చల్లగా, తెల్లగా నిర్మలంగా వుంది. – "ఏదీ రంభ? .... రంభ? .... ఎక్కడుంది? ఎక్కడుంది?" అంటూ దశరథుడు ఆరాటపడిపోతున్నాడు.

ఇంకా ఎగురుతున్నాడు, ఎగురుతున్నాడు .... ఎగురుతున్నాడు – "ఏదీ రంభ? .... రంభ? ...."

"ఇలారా! ఇలారా! ఇటూ .... ఇటూ ...." – ఎక్కణ్ణించో కంఠాలు!

దశరథుడు చుట్టూ చూశాడు. కళ్ళు జిగేల్ మన్నాయి. కాంతి భరించలేక కళ్ళు చిట్లించాడు.

బ్రహ్మాండమైన వృక్షం! 'భూలోకం'లో వేళ్ళూ, 'స్వర్గలోకం'లో కొమ్మలూ విస్తరించి సమస్త లోకాల్నీ ఆక్రమించిన వృక్షం! కళ్ళతో చూడలేనంత తేజస్సుతో ధగ ధగ వెలుగుతోంది. ఆకులు – పచ్చలు! పువ్వులు – నక్షత్రాలు! ఆ కాంతి మధ్య కొమ్మలనిండా ఎందరో మనుషులు. స్త్రీలూ, పురుషులూ బొమ్మలలాగ అంటుకుని వేళ్ళాడుతున్నారు.

దశరథుడు సంతోషంగా అటు తిరిగాడు. అటు తిరిగీ తిరగ్గానే దశరథుణ్ణి ఏదో శక్తి బలంగా లాగేసింది. ఒక్క విసురుతో వెళ్ళి ఒక కొమ్మకు అంటుకుపోయాడు.

"నువ్వూ రంభ కోసమేనా ఏమిటీ?"

"ఏం? మీరంతా రంభ కోసమా? నేను మహా రాజుని ...."

"సర్లే! మేమూ మహా ... రాజులమే. ఇదిగో! ఈయన మహారాజుల కన్నా సిరి సంపదలున్న శెట్టి గారు ...."

"నే నెన్నో యజ్ఞాలూ... యాగాలూ, ధర్మాలూ .... అశ్వ మేధాలూ ...."

"మేమూ చేశాం. నువ్వు అశ్వ మేధాలు చేశావు గానీ, మేం నర మేధాలే చేశాం. మరి ఇక్కడెక్కడా రంభ వున్నట్టు లేదు!"

"లేదూ? ఇంకా నయం! ఎందుకు లేదూ?"

"ఎందుకు లేదేమిటి? లేదంతే!"

"కుదరదు! నే నొప్పుకోను. ఉండాలి! రంభ నా కౌగిట్లోకి రావాలి!"

"నీ కౌగిట్లోకా? నేను నీ కన్నా ముందు వచ్చానయ్యా!"

దూరం నించి ఎవరో – "ముందు వొచ్చిన వాళ్ళం వందల మంది వున్నాం. అసలు రంభేదీ?"

"నిజంగా లేదా? ఎందుకు లేదు?" – దశరథుడు.

ఇంకెవరో అరిచారు – "అవును. ఎందుకు లేదు? ఉండాలి! వేదాల్లో .... స్వర్గం .... రంభా .... అన్నారే!"

"ఆ మాటే అడుగుదామంటే వొక్క రుషీ కన పడ్డంలేదు. అదిగో! ఎవరో బ్రాహ్మడు వొస్తున్నాడు. ఏవయ్యో! ఇలా రా! ఇటూ."

"ఛ! కొంచెం మర్యాదగా పిలవరాదూ?" దశరథుడు చాలా నొచ్చుకున్నాడు.

"ఏం మర్యాద, పాడు మర్యాద? ఎన్నాళ్ళనించో ఇక్కడ పడి ఛస్తున్నాం. దారీ తెన్నూ లేదు. ఓయ్ పంతులూ! ఇలారా!"

అంతలో ఒక తద్దినాల బ్రాహ్మడు రయ్యిన వొచ్చి దశరథుడి పక్కన కొమ్మకి తాపడం అయిపోయాడు.

దశరథుడు మీసాలు తిప్పి కాస్త జరగబోయాడు గానీ వీలు కాలేదు.

"ఏంటి పంతులూ! స్వర్గం .... స్వర్గం .... అని ఇన్నాళ్ళూ మా ప్రాణాలు తీసి, ధనాలూ ధాన్యాలూ బంగారాలూ మూటలకొద్దీ మోసుకుపోయారు. తీరా ఇక్కడికొస్తే ఏదీ కనపడదు! నిజం చెప్పవయ్యా స్వామీ! అసలు స్వర్గం వుందా, లేదా?" – శెట్టి చాలాకోపంగా బ్రాహ్మణ్ణి నిలదీశాడు.

"పోనీ రంభన్నా వుందా?" – దశరథుడు!

బ్రాహ్మడు బిక్కమొహం వేశాడు – "నాకేం తెల్సు రాజుగారూ? నేను పుట్టేటప్పటికే మా తండ్రి ఏవో మంత్రాలు చదువుతున్నాడు. నేను పెద్ద వాణ్ణయినా చదువుతూనే వున్నాడు. అవన్నీ నాకొచ్చేశాయి. అంత కన్నా నాకేమీ తెలీదు. రంభని చూద్దామని నేనూ ఆశతోనే .... నిజంగా లేదా ఏమిటి?"

శెట్టిగారు లబ లబ లాడాడు – "నా కొంప ముంచావు గదయ్యా! పెళ్ళాం బిడ్డలకి కడుపునిండా కూడన్నా పెట్టకుండా ధనం కూడబెట్టి పిలక పంతుళ్ళకి దానధర్మాలు చేసేశాను, రంభ కోసమే గదా?"

"నేను మాత్రం? ఎన్ని యజ్ఞాలు, ఎన్ని యాగాలు చేశానో!...." – ఇంకెవరో!

"ఏవిటీ? నిజంగానే రంభ లేదా ఏవిటీ?" దశరథుడు తెల్లబోతున్నాడు.

"లేకపోతే రంభతో ఆడాల్సిన సరసాలన్నీ నీతో ఆడుతున్నాననుకుంటున్నావా ఏమిటయ్యా? ఇంకేం రంభ, మాయదారి రంభ! లేకపోతే లేకపొమ్మను గానీ .... ఇన్నాళ్ళూ అలా ఎందుకు చెప్పాలి?"

"అది కాదయ్యా! ఈ స్వర్గానికి ఆశపడి నా పెద్దకొడుకుని అడవుల్లోకి పంపేశానయ్యా!"

"మంచి పని చేశావు. స్వర్గానికి కాదులే .... రంభకి ఆశపడి ...."

"అదేనయ్యా! చెప్తోనే వుంటినిగా? ఇంతకీ ...."

"ఇంతకీ లేదు, ఎంతకీ లేదు. రంభ లేదు! సరేనా?"

దశరథుడు బిక్కమొహం వేశాడు – "అంతేనా? నిజమేనా? అయ్యో, నా జ్యేష్ఠ పుత్రుణ్ణి, నిమిషానికో నమస్కారం పెట్టేవాణ్ణి, ఎప్పుడూ వినయంతో భుజాలు వొంచి నిలబడేవాణ్ణి, వీరోచితంగా శత్రు పట్టణాలు జయించేవాణ్ణి, రాజ్య తంత్రాలలో కుతంత్రాలలో ఆరి తేరినవాణ్ణి, ధర్మపత్నికి పుట్టిన పుత్రుల క్షేమం అడిగినట్టు బంధుమిత్రుల క్షేమం అడిగేవాణ్ణి, పితృవాక్య పరిపాలకుణ్ణి, నా పెద్ద కొడుకుని – ఘోరారణ్యాల్లోకి పంపించేశానే! ఎంత మోసం! సత్య లోకాలన్నారు! గో లోకాలన్నారు! స్వర్గ లోకాలన్నారు!"

"వల్లకాడూ, వొసినపరవూనూ! ఏవయ్యా పంతులూ, అలా గుడ్లు మిటకరించుకుని చూస్తావు. మాట్లాడవేం?"

"నాకేం తెలీదని చెప్పాను గదా రాజుగారూ!"

"ఆ మాట ఇక్కడంటున్నావుగానీ అక్కడన్నావా ఎప్పుడన్నా?"

"అంటే వూరుకుంటారా మీరు, రాజుగారూ? నాస్తికుణ్ణని ఏ కీలు కాకీలు వూడదీయిస్తారు కదా మీరే!"

"అందుకని ఇంత మోసం ...."

"మోసం .... మోసం .... అని నన్ను పట్టుకున్నారేవిటి? .... నా బతుకుదెరువు కోసం నేనేదో తద్దినం మంత్రం ముక్కలు నేర్చుకున్నాను. మీరు వేదాలో వేదాలో అని గోలపెట్టి, మీ పుణ్యంకోసం మీరు చేసుకున్నారుగానీ, నా మీద జాలిపడి – 'అయ్యో, పేద బ్రాహ్మడే, ఎలా బతుకుతాడు?' అని కరుణించి నా కోసం దానధర్మాలు చేశారా?"

"చూశారా, చూశారా? పంతులిక్కూడా ఎంత ధైర్యం వొచ్చేసిందో! .... పేద బ్రాహ్మలికి దాన ధర్మాలు చెయ్యలేదటయ్యా మేము?"

"బ్రాహ్మడికి దానాలిస్తే పుణ్యం వొస్తుందని వేదాల్లో వుండబట్టి చేశారు గానీ, మా పేదతనం పోగొట్టాలని చేశారా? అలా అయితే ముష్టి వాళ్ళకి కూడా మాకు చేసిన దానాలన్నీ చెయ్యలేదేం?"

మహారాజులు తెల్లబోయి నోళ్ళు తెరిచారు.

అంతలో వొక సిద్ధుడు, బారెడు బారెడు గడ్డాలూ మీసాలూ వున్న మునీశ్వరుడు, రయ్యిన వొచ్చి కొమ్మలకి లటుక్కున తగిలాడు. సాలెగూట్లో ఈగలాగ గింజుకోవడం మొదలుపెట్టాడు.

"ఏవయ్యా మునీ! నువ్వన్నా చెప్పు! స్వర్గం ఎందుకు లేదు?" – ఈసారి దశరథుడే అడిగాడు కోపంతో.

ముని కళ్ళు మూసి గడ్డం సవరించాడు. "ఉంటుంది నాయనా! ఉండక తప్పదు."

"ఇదిగో! పిచ్చి పిచ్చి మాటలు కట్టిపెట్టు! అక్కడ దాటేసినట్టు దాటేద్దామనుకోకు! ఇంకెక్కడుంది? .... పోనీ మమ్మల్ని నీతో తీసుకెళ్ళు అక్కడికి! రంభని చూపించు ముందు!"

"ఆయన ఇంకెక్కడికి పోతాడు? మనలాగే ఇక్కడే అతుక్కుపోయాడు!"

"నేనా? ఇక్కడా? .... గొప్ప మునిని!"

"ఏయ్ మునీ! ఏవిటి గొణుగుతున్నావు? కాస్త గట్టిగా మాట్లాడు! నీ గడ్డం తుప్పలోంచి మాటలు బయటికి రావటం లేదు. మా దగ్గిర సంచుల కొద్దీ బంగారం మోసుకుపోయి .... స్వర్గం వుందని చెప్పి ...."

సిద్ధుడికి చాలా కోపం వొచ్చింది. "ఏమిటో పేలుతున్నావు రాజా! నోరు సంభాళించుకో! వొక్క చిల్లిగవ్వ అయినా నీ కష్టార్జితం ఇచ్చావా? ఏమిచ్చినా, ఎంతిచ్చినా ప్రజల నించి లాగి కూడబెట్టిందే కదా! నీ రాజభోగాలు నువ్వనుభవించితే, మా దానధర్మాలు మేము స్వీకరించాం! అంతా మా తప్పే అయినట్టు మాట్లాడుతున్నావే!"

"అబ్బ! వూరుకోండి. ఇప్పుడెంత కుమ్ములాడుకున్నా లాభం లేదు. అది కాదు మునీశ్వరా! ఊరికే తెలుసుకోవాలనే ఆసక్తితో అడుగుతున్నాం. అసలు స్వర్గం లేనే లేదంటారా? ఎక్కడా వుండదంటారా?"

"ఎందుకుండదు నాయనా? తప్పకుండా ...."

"అదిగో, మళ్ళీ అదే కూతా? ...." అని అరిచాడు దశరథుడు.

"అబ్బ! మీరూరుకోండి దశరథుడు గారూ ....!"

"నే నూరుకోనయ్యా! అసలు సంగతి తేల్చమను!"

"మిమ్మల్ని మేమేమీ బాధపెట్టం స్వామీ! నిజం చెప్పండి! .... స్వర్గం .... రంభా ....! రంభ చాలు! స్వర్గం ఎవడిగ్గావాలి గానీ ...."

అందరూ రంభ కోసమే! రంభతో సరసాల కోసమే! ఎక్కడాలేని రంభతో!

ముని, తెల్లబోయి చుట్టూ చూస్తూ – "నిజంగా నాకేమీ తెలీదు రాజా! వేదాల్లో చెప్పింతర్వాత స్వర్గం వుండకుండా వుంటుందా అనుకున్నాను. నిజంగానే లేదంటావా ఏమిటి?" అని నిర్ఘాంతపోయాడు.

దశరథుడు నెత్తి బాదుకున్నాడు. "అయ్యో! నిజంగానే నీకు తెలీదా ఏమిటి బాపనయ్యా?"

"కొంచెం వినయ విధేయతలతో మాటాడు రాజా! సంవత్సరాల కొద్దీ కీకారణ్యాలలో ఘోర తపస్సులు చేసిన నన్ను ...."

"చాలుగాని నోరు ముయ్యవయ్యా! నీ సన్నాసి మాటలూ నువ్వూనూ! ఎందుకొచ్చిన తపస్సూ? ఎందుకు పనికొచ్చిందీ? స్వర్గం వుందో లేదో మమ్మ

ల్నడుగుతున్నావు!"

"మునీశ్వరా! రాజుగారి మాటలకేంగానీ, ఏవీ తెలీకుండానే ఎందుకయ్యా తపస్సు .... తపస్సని .... వొళ్ళంతా ఎముకలగూడు చేసుకున్నావు? తినీ తినకా, నీళ్ళల్లో నిప్పుల్లో, చెట్టెక్కీ పుట్టెక్కీ, తల కిందికీ కాళ్ళు మీదకీ .... అబ్బబ్బ! ఏం నరక యాతన పడతారయ్యా! .... మేం సుబ్బరంగా భోగాలన్నా అనుభవించాం. మీకు అదీ లేదే!"

మునీశ్వరుడికి బావురుమని ఏడవాలనిపించింది. స్వర్గం ఎక్కడుందో అంతుచిక్కడం లేదు. అసలు లేనే లేదంటే నమ్మడానికి మనసొప్పడం లేదు.

ఒకాయన మాట్లాడుతూ మాట్లాడుతూ చెట్టు కొమ్మల్లో కనపడకుండా హరించుకుపోయాడు.

కొత్త కొత్త వాళ్ళొచ్చి ఆ వృక్షంలో కొమ్మలకీ, రెమ్మ లకీ అంటుకుపోతున్నారు. మహారాజులూ, బిచ్చగాళ్ళూ, కష్టజీవులూ, మహాపురుషులూ, మహా పతివ్రతలూ – అందరూ, దాని ఆకర్షణ ముందు శక్తిహీనులయి పోతు న్నారు.

"అదిగో! ఆ వొచ్చేదెవరో తెలుసా? అలా చూడ కండి! మహా పాపం. పరమ నాస్తికుడు!" అన్నాడొక రుషి కొమ్మకి వేళ్ళాడుతూ.

అందరూ అటే చూశారు. ఆ నాస్తికుడు అందరి లాగా విసురుగా రాలేదు. ఎక్కడా అంటుకోలేదు. గాలిలో చక్కగా నడుస్తూ, నవ్వుతూ, దగ్గిరికివొచ్చి కొమ్మ మీద చెయ్యివేసి నించున్నాడు.

"ఏమిటి? మీరంతా ఇక్కడ ఆగారేం?" అన్నాడు.

"ఏం, మీరూ ఆగారుగా?"

"అబ్బే! ఏమిటో చూద్దామని వొచ్చాను. పోవాలి" అంటూ కొమ్మమీదనించి చెయ్యితీసి వెళ్ళడానికి సిద్ధ మయ్యాడు.

అందరూ నమ్మలేనంత ఆశ్చర్యంగా వొకరి మొహాలు వొకరు చూసుకున్నారు.

"ఏమిటీ! మీ చెయ్యి అంటుకుపోలేదూ కొమ్మకి?"

"చూస్తున్నారుగా మీరే!" అంటూ కదిలాడు నాస్తి కుడు.

"ఇదిగో నాస్తికుడుగారూ! వుండండి, మాట! మేమందరం ఎన్నెన్ని పుణ్యాలు చేశాం. తపస్సులు చేశాం. ఏమిటి మాకీ గతి? మరి మీరు ...."

"చాలా పాపాలు చేశాను" నవ్వాడు నాస్తికుడు.

"ఇది మరీ బాగుంది. పాపాలు చేస్తేనే పుణ్యం వస్తుందా? ఏవిటా పాపాలు?" ఎందరో ఆతృతగా అడిగారు.

నాస్తికుడు దశరథుడి వేపు చూస్తూ – "నా పాపా లేవిటో మీకు గుర్తులేదా? దేవుడున్నాడంటే నేను వొప్పుకోననీ, కులగోత్రాలు పాటించననీ, పూజా పున స్కారాలు చెయ్యననీ, నాస్తికత్వం ప్రచారం చేస్తున్నాననీ, నా మీద ఆరోపణలు పెట్టి, మీ న్యాయాధిపతులు నాకు దేశ బహిష్కార శిక్ష వేశారు. గుర్తు లేదా? నేను అపరాధం వొప్పుకుని క్షమాపణ కోరితే శిక్ష తగ్గించాలని మీరు న్యాయాధిపతుల్ని ఆదేశించారు. నేను దేశ బహిష్కారానికే ఇష్టపడి దేశం విడిచి వెళ్ళిపోయాను. అవయ్యా, నా పాపాలూ! ఆ తర్వాత వృద్ధాప్యం వల్ల ఇప్పుడు మరణించాను."

"అవును, గుర్తొచ్చింది. మరి అలాంటి పాపాలు చేసి కూడా మీరింత ...."

"స్వేచ్ఛగా వున్నాను!"

"మాకులేని స్వేచ్ఛ మీకెలా వొచ్చింది?"

"మీకు తెలియని 'స్వేచ్ఛ విలువ' నాకు తెలుసు కాబట్టి. నా కాళ్ళతో నేను నడుస్తాను. నా కళ్ళతో నేను చూస్తాను. నా జ్ఞానంతో నేను ఆలోచిస్తాను. మీ అందరి మాదిరిగా నేను, తండ్రులూ తాతలూ చెప్పింది మాత్రమే నమ్మి నా సందేహాలు అణగార్చుకోను. అదే నా స్వేచ్ఛకి మూలం."

"ఏమిటో అంతా తిరకాసుగా వుంది ఇక్కడ. అయితే మీరు స్వేచ్ఛగా లోకాలన్నీ తిరుగుతూ వుంటారుగదా? స్వర్గాన్ని చూశారా?"

"పోనీ రంభని ....? అది చెప్పండి బాబూ ముందు."

నాస్తికుడు నవ్వాడు. "అసలెక్కడా లేని స్వర్గాన్నీ రంభనీ ఎవరు మాత్రం ఎలా చూస్తారు?"

అందరూ నిర్ఘాంతాలు పడిపోయారు – "అయితే స్వర్గం లేదని మీకు ముందే తెలుసా ఏవిటీ?"

"మహా చక్కగా తెలుసు. స్వర్గ నరకాలు ఉండవని మొదటినించీ నేను చెపుతూనే వున్నాగా? అందుకేగా రాజు నాకు శిక్ష వేసిందీ? సరే, ఇక పోతాను."

"అయ్యయ్యో! కొంచెం ఆగండి! చాలా అడగాలి మిమ్మల్ని. ఈ వృక్షం ఏమిటి? ఇది మమ్మల్ని ఎందుకు బంధించింది?"

"ఇంకా తెలియడం లేదా మీకు?"

అంతవరకూ నాస్తికుడి మొహం అయిష్టంగా చాటునుంచీ చూస్తోన్న రుషి – "ఇదిగో, మిమ్మల్నే! మీరు కొంచెం నన్ను ఈ కొమ్మనించి కొంచెం వూడదియ్య రాదూ?" అంటూ ప్రాధేయపడ్డాడు.

"నన్ను కూడా ...."

"మా ఇద్దర్నీ కూడా ...."

"నేను ఎవర్నీ తియ్యలేను. స్వేచ్ఛ వొకరిచ్చేది కాదు. అది మీకు నిజంగా కావాలంటే, దాన్ని మీరే సాధించు కుంటారు. మీ మనశ్శక్తితో మీరే ఈ 'విషవృక్షం' నుంచి

బయటపడతారు.”

“ఏమిటీ? ఇది విష వృక్షమా!”

“మీ సర్వావయవాల్నీ బంధించి, మీ స్వేచ్ఛని హరించి, మిమ్మల్ని ఇంత శక్తిహీనుల్ని చేసిన తర్వాత కూడా దీని స్వభావం గుర్తించలేదా మీరు? మీ తప్పు భావాలే ఈ వృక్షం. దీని ఆకర్షణలో వున్నారు మీరు!”

“ఇంత చక్కగా మెరుస్తోందే!”

“మెరిస్తే యేం? మీకేం మంచి చేసింది? దీని మెరుపులూ, తళుకులూ చూసి మోసపోయినంత కాలం మీ గతి ఇంతే! ఇది ‘విష వృక్షం’ అని ఎవరు గ్రహిస్తారో వారిమీద దీని ఆకర్షణ పనిచెయ్యదు. గ్రహించడం అంటే ‘గ్రహించానని’ నోటితో అనడం కాదు, మీరందరూ, మీరు గడిపిన జీవితాలన్నీ వొక్క సారి సింహావ లోకనం చేసుకోండి! మీ తపస్సులూ, మీ యజ్ఞ యాగాలూ, మీ రాజ్యపాలనలూ, మీ చాతుర్వర్ణాలూ, మీ పాతివ్రత్యాలూ, మీ స్వర్గ నర కాలూ, వాటి సత్యా సత్యాలన్నీ ప్రశ్నించుకోండి! సందేహాలు కలిగికూడా వాటిని పట్టించుకోకుండా, తర్కజ్ఞానం చంపుకుని, ఎవరికి దాసులై బతికారో ఆలోచించుకోండి! మీ దోషాలు మీకు కనబడి, మీ తపస్సులూ, యజ్ఞ యాగాలూ, మీ ధర్మకార్యాలూ, అన్నీ వ్యర్థమనే విశ్వాసం కలిగి, మీ బానిస బుద్ధి వల్లనే మీ జీవితాలు తప్పు దారిలో నడిచాయనే పశ్చాత్తాపం కలిగితే, మీరు స్వేచ్ఛా జీవులు అయినట్టే! అప్పుడు మీ మనో శక్తి గొప్పదై, మీరు ఈ విష వృక్ష ప్రభావం నుంచి బయటపడతారు. ఎప్పటికయినా మీరు స్వేచ్ఛ విలువ గ్రహించకపోతే ఏదో ఒక విషప్రభావానికి బలి అవుతూనే వుంటారు. సరే! నేనిక వెళుతున్నాను.”

“ఆగండి! ఎక్కడికి వెళ్తారు మీ రిప్పుడు?”

“ప్రకృతి అంతా తిరుగుతాను. ప్రకృతిలో వుంటాను” అంటూ ఆయన కదలి గాలిలో స్వేచ్ఛగా ఎగురుతూ వెళ్ళిపోయాడు.

అందరూ దీర్ఘాలోచనల్లో మునిగిపోయారు.

కొంతసేపటికి దశరథుడు – “ఏవిటో బాగా ఆలో చించమంటాడేవిటి? ఎంత ఆలోచించినా నా జీవితంలో ఒక్క తప్పూ కనబడదే!” అని ఇంకో మహా రాజు మొహం చూశాడు.

“అవును. నాకూ ఏం కనబడ్డం లేదు. నేను చేసిన యజ్ఞాలన్నీ తప్పని పశ్చాత్తాపపడాలా ఇప్పుడు? ఏడిసి నట్టే వుంది!”

“నా తపస్సూ తప్పేనట! అయినా నాస్తిక వచనాలు అలాగాక ఇంకెలా వుంటాయి లెండి” – రుషి, గడ్డం వూపుతూ.

“వాణ్ణి దేశం విడిచి పొమ్మన్నానుగాని చిత్రవధ చేసి చంపకపోవడమే తప్పయిపోయింది” అంటూ దశ రథుడు పశ్చాత్తాపం చెందాడు. “ఆ వొక్క తప్పే కన బడుతోంది” అని నొచ్చుకున్నాడు. రాజుగారి పశ్చాత్తాపం అందుకూ.

“మీ పిచ్చిగానీ, వాణ్ణి కోసినా, చీరినా, జంకే రకంలా లేదు.”

“మనలో మనమాట! ఈ నాస్తికులు మహా ధైర్య స్థుల్లెండి! వాళ్ళకి అంతంత ధైర్యాలు ఎలా వొస్తాయో గానీ...”

“చెప్పాడుగా? పెద్ద వాళ్ళు చెప్పింది గుడ్డిగా నమ్మ కుండా స్వతంత్రంగా ఆలోచిస్తాననీ, సందేహాలు కలిగితే వాటిని అణుచుకోననీ చెప్పాడుగా? అదేం పొయ్యే కాలం? దేవుణ్ణి నమ్మడట!”

“మరి, మనం నమ్మి ఏం బాగుపడ్డాం?”

దూరం నించి వొక పతివ్రత – “ప్రభూ! స్వామీ! నాథా!” అంటూ కేకలు వేస్తూ వొస్తోంది.

అందరూ అటు చూశారు.

ఆమె వొంటినిండా పసుపు తప్ప ఏమీ కనిపిం చడం లేదు. పసుపు ముద్దే ఎగురుతూ వొచ్చి వొక కొమ్మకి టక్కున అంటుకుంది. “నాథా! నాథా!” అంటూ కళ్ళు తిప్పి చుట్టూ చూస్తోంది.

“ఏమిటి తల్లీ, నీ బాధ?” అని ఎవరో విసుగ్గా పలకరించారు.

“నా భర్తగారి పాదాల దగ్గిర పసుపు కుంకాలతో కన్నుమూసి వొచ్చేశాను. నా పెనిమిటి కోసం ఎదురు చూస్తున్నాను. ఆయన ఇంకా రాలేదా?”

“ఇంకేం వొస్తాడు? ఈపాటికి కొత్త భార్యతో ....”

“ఏవిటీ, కొత్త భార్యతోనా? ....”

“అంత ఆశ్చర్యం ఎందుకు? భార్య పోగానే పెద్ద కార్యం నాడే మళ్ళీ పెళ్ళి చేసుకుంటే పుణ్యమూ పురు షార్థమూనూ.”

“మరి మా దాంపత్య బంధం?”

“బంధానికేం, అదే వుంటుంది. నువ్వు పెద్ద భార్యవీ, ఆవిడ చిన్న భార్యా!”

“అయ్యో! ఆయన ఆరోగ్యం కూడా మంచిది కాదే!”

“ఆఁ, కొత్త పెళ్ళాన్ని చూస్తే అన్నీ చక్కబడతాయి.”

పతివ్రత కళ్ళనీళ్ళు పెట్టుకుంది. “అంతేనా, అంతేనా?” అంటూ.

అంతలో ఒకాయన దగ్గుకుంటూ, ఎగురుకుంటూ వొచ్చి పతివ్రత పక్కనే టక్కున కొమ్మకి అతుక్కున్నాడు.

పతివ్రత మొహం విప్పారింది – “వొచ్చారా స్వామీ! మీరు ... రెండో పెళ్ళి .... అంతా ఉత్తిదే కదా స్వామీ?”

“చివరికి ఉత్తదే అయిపోయిందిలే. సంబంధం కుదిరి కూడా .... రాత్రికి రాత్రి నాకీ ఆయాసం ముంచు

కొచ్చింది. మొన్న సంబంధం ఖాయం చేసుకున్ననాడు కాసులపేరు కూడా పంపించాను.”

“ఏవిటీ, నా కాసులపేరిచ్చారా? మంచి పని చేశారు! మీరు పెళ్ళే చేసుకుంటారో .... పెడాకులే చేసుకుంటారో, నా నగలు ముట్టుకోమని ఎవరు చెప్పారు మీకు?”

“ఏం, నా పెద్దభార్య పోతే దాని నగలన్నీ నువ్వు పెట్టుకుని కులకలేదూ? అలాగే .... ఇదీనూ!”

“అవున్లెండి. అలాగే అనండి!”

ఎవరో అన్నారు – “నువ్వు రెండో భార్యవా? మరి చెప్పవేం? నీలాగే మూడో భార్య రాదూ మరి?”

వచ్చినాయన దగ్గుకుంటూ చుట్టూ చూశాడు.

“ఇంకా రంభ కనపడదేం? ఎప్పుడొస్తుందీ?”

“రంభెందుకు మీకు? మీ ధర్మపత్నిని నేను లేనూ?” – పతివ్రత.

“స్వర్గానికొచ్చినా నీ పీడేనా? చాల్లే ఇక!”

“అవున్లెండి, నాకిప్పుడర్థమవుతోంది. మీ బుద్ధెప్పుడూ ఇంతే! నేనసలు పతివ్రతగా వుండి ఏం బావుకున్నాను?”

ఎవరో విసుక్కుంటూ – “ఎందుకలా పోట్లాడుకుంటారు? ఇది స్వర్గం కాదు, ఇక్కడ రంభా లేదు. ఊరుకోండీ!” అని కసిరారు.

“మరి ఎక్కడుంది స్వర్గం? ఇంకా దూరం వెళ్ళాలా?”

“సరి, ఆ సంగతి తెలిస్తే ఇక్కడెందుకు చిక్కుకుంటాం?”

“అవునూ, అన్నట్టు ఇక్కడ చిక్కుకున్నాం యేమిటీ?” అంటూ పతివ్రత చుట్టూ చూసింది.

ఎటు చూసినా మనుషులు కొందరు కనబడి, కొందరు మాయమవుతున్నారు.

ఇంకో వృద్ధ పతివ్రత, దూరం కొమ్మనించి వొణికే కంఠంతో తలకాయ వూపుతూ గబగబా చెప్పుకొచ్చింది “మనం మన బుర్రలతో స్వేచ్ఛగా ఆలోచించలేదట వదినా! స్వేచ్ఛగా బతకలేదట! అదేవిటోనమ్మా .... విషమో ఏదో .... అది చెప్పినట్టు వున్నామట! మనం ఎక్కడికి పోయినా ఇలాగే దేనికో ఒకదానికి అంటుకుపోతామట! ఒకాయన ఏవిటేవిటో వాగి వెళ్ళాడమ్మా .... నువ్వురాక ముందే ....”

ఆవిడ మాటలకు ఈవిడ బుగ్గలు నొక్కుకుంటూ విస్తుపోయింది – “ఆడదానికి స్వేచ్ఛేవిటమ్మా? ఎవరా మాటన్నదీ? నాలిక తెగ్గొయ్యకపోయారూ? చిన్నప్పుడు మా పుట్టింట్లో మా తండ్రిగారితో చర్చలకి ఎందరో వేద పండితులు వొచ్చేవారు. వారంతా ఎంత కమ్మటి మాటలు చెప్పేవారనీ! స్త్రీకి తండ్రో, భర్తో, కొడుకో యజమానిగా వుండాలిగానీ, స్త్రీ స్వతంత్రించరాదని, ఎంత కమ్మటి శ్లోకాలు చదివేవారో!” అంటూ ఇంకా బుగ్గలు అలాగే నొక్కిపట్టుకుంది.

“అదే తప్పట! అలా బతకటం తప్పయిందని తెలుసుకోవాలట! ....”

“ఇంకా నయం. చెప్పకు తల్లీ! వినలేను!”

ఆ పేరంటాళ్ళిద్దరూ మరుక్షణంలోనే హరించుకుపోయారు.

తద్దినాల పేద బ్రాహ్మణుడు, ఆ నాస్తిక వచనాలు చెవిన పడ్డప్పటినించీ ఆలోచనలతో సతమతమవుతున్నాడు. క్రమంగా అతని మొహం కాంతితో విప్పారింది – “అవును, ఆయన మాటలు సత్యం! ఇన్నాళ్ళూ అజ్ఞానంలో, మూర్ఖత్వంలో బతికాను. యజ్ఞ యాగాలూ, వర్ణ భేదాలూ, స్వర్గ నరకాలూ – ఇవన్నీ అసత్యాలే. ఇవేవీ లేకపోతే, మనుషులందరూ ఎంతో స్వేచ్ఛతో జీవిస్తారు. ఇప్పుడర్థమవుతోంది నాకు. తద్దినాల మంత్రాలతో నా జీవితం వ్యర్థం చేసుకున్నాను. గడ్డి కోసి అమ్ముకుంటే, నలుగురు పిల్లలకు చదువులు చెప్పుకుంటే, మంచి మార్గంలో బతికేవాడిని!” – ఆ మాటలు అంటూ వుండగానే అతను ఆ వృక్షంనించి విడిపోయాడు. సంభ్రమంతో స్వేచ్ఛగా నడిచివెళ్ళిపోయాడు – “ప్రకృతి అంతా చూస్తాను. ప్రకృతిలో ఉంటాను” అంటూ.

“రంభేదీ .... రంభేదీ? ....” – మళ్ళీ ఎవరో అరుస్తూ వస్తున్నారు.

“ఇలా రా! .... ఇలా రా! ....” అని చెట్టుమీద వాళ్ళు పిలుస్తున్నారు.

ఎన్నో లక్షలూ, కోట్లూ మనుషులు కీటకాలలాగ విసురుగా వొచ్చి ధగ ధగ మెరిసే విష వృక్షానికి అంటుకుపోతున్నారు. అందరూ మనుషులే. వొక్క జంతువు లేదు, వొక్క పక్షి లేదు. వొక్క చీమ లేదు.

కొమ్మల్లో హరించుకుపోతున్న ఒక ప్రాణి “ఇది విష వృక్షమే! దీని మెరుపులూ, సొగసులూ అన్నీ అబద్ధం! దీనివల్ల మానవులకు సుఖం లేదు” అని గ్రహించి – “ఇటు రాకండి! ఇటు రాకండి!” అని అరవబోయాడు. కానీ, “రండి, రండి! ఇలా రండి! మన పెద్దలంతా ఇటువేపే వొచ్చారు. ఈ బాటనే నడిచారు, రండి! ఎంత బాగుందో ఇక్కడ! ఈ పళ్ళన్నీ తినొచ్చు. ఈ పువ్వులెంత పరిమళంగా వున్నాయో! .... రండి, రండి! ....” అని అరుస్తూ కనబడకుండా పోయాడు.

మళ్ళీ మళ్ళీ – ఎవడో – “ఏదీ, రంభేదీ? .... రంభేదీ ....?”

“ఇలా రా! ఇలా రా! .... ఇటూ!”

రంభా లేదు, పాడూ లేదుగానీ, దశరథుడు విష వృక్షానికి వేళ్ళాడుతూనే వున్నాడు.

దశరథుడు పోయిన తర్వాత మంత్రులందరూ వశిష్టుడి చుట్టూచేరి సమావేశమై చర్చించారు.

"రాజులేని రాజ్యంలో మేఘాలు కూడుకోవు. వర్షాలు కురవవు. పంటలు పండవు. వర్తకాలు జరగవు. ప్రయాణాలు సాగవు. భార్యలూ పుత్రులూ అదుపులో ఉండరు. చోర భయాలు ప్రబలిపోతాయి. నాస్తికులు, రాజ దండన శంక లేనివారై ఎదురు తిరుగుతారు. చివరికి, బ్రాహ్మణులు కూడా నియమ నిబంధనలను మీరిపోతారు. రాజు లేనిచోట అరాచకత్వమే రాజ్యమేలుతుంది. రాజే సమస్త ధర్మాలనూ కాపాడతాడు. కాబట్టి, వెంటనే ఇక్ష్వాకు వంశస్తుడిని రాజుగా ప్రతిష్టించాలి!' అని తీర్మానించారు.

వేగంగా పోయే గుర్రాల్ని వేగంగా నడపగల దూతలు, భరతుడికోసం బైల్దేరారు, బహుమానాలు తీసుకుని.

అయోధ్యలో జరిగిన సంగతులేవీ అక్కడ చెప్ప రాదని – నిబంధన!

దూతలు కేకయ దేశం చేరడానికే వారం రోజులు పట్టింది. ఆ సమయానికి – భరతుడు గతరాత్రి ఒక కల గని విచారంలో మునిగిపోయి వున్నాడు. తన తండ్రి, తల విరబోసుకుని, కొండకోన నించి కింద పేడ మడుగులో పడిపోయినట్టూ, దోసిళ్ళతో నూనె తాగుతున్నట్టూ, గాడిదమీద ఊరేగుతున్నట్టూ, సముద్రం ఎండిపోయినట్టూ, చంద్రుడు వెలిసిపోయినట్టూ .... చాలా దుశ్శకునాలు చూశాడు – కలలో!

అప్పటికి భరతుడు తాతగారింటికి వచ్చి పది సంవత్సరాలకు పైగా అయింది. పెళ్ళి చేసుకున్న వెంటనే మేనమామతో కలిసి వచ్చినవాడు మళ్ళీ తిరిగి వెళ్ళలేదు.

అయోధ్యనించి వచ్చిన మనుషులు, దశరథుడు పోయిన సంగతి భరతుడికి చెప్పలేదు. అతని తాతకీ, మేనమామకీ అయినా చెప్పలేదు. పైగా తమతో 30 కోట్ల విలువగల ఆభరణాలూ దుస్తులూ, భరతుడి తాత అయిన కేకయ రాజుకీ, మేనమామ అయిన యుధాజిత్తుకీ, పట్టుకువచ్చారు.[68]

ఆ వచ్చిన దూతల్ని భరతుడు అయోధ్యలో విశేషాలడుగుతూ – "అందరూ క్షేమంగా వున్నారా? పూజ్యులైన తండ్రిగారూ, నా సోదరులూ కుశలమేనా? సద్గుణ సంపన్నులైన నా పెద్దతల్లులు కౌసల్యా, సుమిత్రా, సుఖంగా వున్నారు కదా? దుష్టురాలూ, మూర్ఖురాలూ, కపట స్వభావురాలూ అయిన నా తల్లి ఎలా వుంది?" అని అడిగాడు.[69]

దూతలు ఆశ్చర్యంగా ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"అందరూ క్షేమంగా వున్నారు. నిన్ను లక్ష్మి వరిస్తోంది. నువ్వు అయోధ్యలో ఒక ముఖ్యమైన కార్యం చెయ్యవలసి వుంది. మమ్మల్ని వశిష్టుల వారు పంపించారు. నువ్వు వెంటనే బయల్దేరాలి" అని తొందర పెట్టారు.

భరతుడు తాత దగ్గిరికి వెళ్ళి, తను అయోధ్యకు వెళ్ళవలసిన సంగతి చెప్పాడు.

కేకయరాజు సంతోషించి, భరతుడికి అనేక బహుమానాలిచ్చాడు. వజ్రాలూ, వైఢూర్యాలూ, ఆభరణాలూ, దుస్తులూ, గుర్రాలూ, ఏనుగులూ, ఒంటెలూ, రథాలూ, కొందరు వీరుల్ని కూడా ఇచ్చాడు.[70]

భరతుడు శత్రుఘ్నుడితో కలిసి అయోధ్యకు బయలుదేరాడు.

దశరథుడు పోయిన తర్వాత పదమూడో నాటికి భరతుడు అయోధ్యకు వొచ్చాడు. రాగానే తల్లి దగ్గిరికి వెళ్ళాడు.

---

**68. అయోధ్యా, సర్గ 70, శ్లోకం 5:** ఆ 30 కోట్లూ, రూపాయలో, ఇంకేవిధమైన నాణేలో, వివరం లేదు. వెళ్ళిన దూతలు కేకయ రాజుకి రహస్యంగానైనా దశరథుడు పోయిన సంగతి చెప్పవచ్చు. కానీ, చెప్పలేదు. ఎందుకు చెప్పలేదో ఊహించండి! ★

**69. అయోధ్యా, సర్గ 7, శ్లోకం 10:** అయోధ్యలో జరిగిన గొడవలు ఏమీ తెలియకుండానే భరతుడు తల్లిని నీచంగా తిడుతున్నాడు. అదీ దూతల ముందు! కైకమీద అందరికీ పూర్వంనించీ దురభిప్రాయం వుందా అంటే, అలాంటిదేమీ లేదు. కైక ఎంతో ఉత్తమురాలనీ, తనని ప్రేమించేదనీ రాముడే చాలా సార్లు వొప్పుకుంటాడు. మరి భరతుడి ప్రేలాపనకి కారణం ఏమిటి – భరతుడితో కైకని తిట్టించాలని, కవికి, ఒకటే తొందర! అయోధ్యకు వెళ్ళాక, భరతుడు, కైకని ఎలాగూ తిడతాడు. కానీ, అప్పటిదాకా ఆగలేకపోతున్నాడు కవి! ఆ తిట్టించే పని ఇక్కడే మొదలుపెట్టేశాడు! బొత్తిగా సందర్భశుద్ధిలేని వ్యవహారం! ★

**70. అయోధ్యా, సర్గ 70, శ్లోకం 21:** ధనధాన్యాలూ, ఆభరణాలూ, దుస్తులూ, గుర్రాలూ ఏనుగులూ మొదలైన వాటిలాగే మనుషుల్ని కూడా బహుమానంగానో, దానంగానో ఇవ్వడం! ఆ మనుషులు బానిసలుగా వున్నారని అర్థం. సైనికులయితే యుద్ధాలకు వుపయోగపడతారు. పరిచారకులైతే సేవలు చేస్తారు. భరతుడు ఆ సైనికుల్ని తన అధీనంలో వుంచుకోవచ్చు. లేదా ఇంకేదయినా అవసరానికి ఎవరికయినా ఇచ్చెయ్యవచ్చు. ★

కైక, కొడుకుని చూసి ఉప్పొంగుతూ – "బాగున్నావా నాయనా! అక్కడ అందరూ క్షేమంగా వున్నారా?" అంటూ కొడుకుని దగ్గిరికి తీసుకుని క్షేమం అడిగింది.

భరతుడు తాతగారింటి విశేషాలన్నీ చెప్పి – "నా తండ్రిగారు కనపడలేదే? ఎక్కడున్నారు?" అని అడిగాడు.

కైక కొంతసేపు మౌనం వహించింది – "నాయనా! దుఃఖపడకు. ధైర్యంతో విను. సమస్త ప్రాణులూ చరమ దశలో ఏ స్థితి పొందుతాయో, ఆ స్థితే నీ తండ్రికూడా పొందాడు. ఈ లోకం విడిచి వెళ్ళిపోయాడు" అని చెప్పింది.

భరతుడు సంగతి గ్రహించి తన శోకం మొదలు పెట్టాడు – "అయ్యో! అయ్యో! ఎంత ఘోరం జరిగిపోయింది! నా తండ్రి పోయినాడా? నేను తండ్రిలేని బిడ్డనయినానా? (పదేళ్ళకు వొచ్చి!) అయ్యో! ఇక నన్నెవరు ఆదరిస్తారు? అయ్యో! నా తండ్రి పవ్వళించే శయ్య బోసిపోయిందా? .... అయ్యో! ... ఇక నాకెవరు దిక్కు?" అంటూ శాస్త్రయుక్తంగా కాస్సేపు దుఃఖించాడు. – "నా అన్నగారే నాకిక తండ్రి. ఆయన్ని పిలిపించు! నా అన్నగారికి నమస్కరించి తండ్రి లేనిలోటు తీర్చుకుంటాను" అంటూ బావురుమన్నాడు.

కైక, నిదానంగా – "నాయనా! రాముడు, సీతతో, లక్ష్మణుడితో, వనవాసానికి వెళ్ళాడు" అని చెప్పింది.

"వనవాసానికా? ఎందుకు?"

"అంతా సవిస్తరంగా చెబుతాను, విను! – నీ తండ్రి, రాముడికి పట్టాభిషేకం ఏర్పాటు చేశాడు. అంతకు పూర్వమే నీ తండ్రి ఈ కోసలరాజ్యాన్ని నా బిడ్డకే ఇస్తానని వాగ్దానం చేసి వుండడంచేత, ఈ రాజ్యం నీకే హక్కై వుంది. ఆ విషయం నీ తండ్రికి నేను గుర్తు చేశాను. కానీ నీ తండ్రి వాగ్దానం నిలుపుకోవడానికి తిరస్కరించాడు. అప్పుడు గత్యంతరం లేక, నీ తండ్రి, పూర్వం దేవాసుర యుద్ధంలో నా కివ్వవలసిన వరాలు రెండూ కోరాను – రాజ్యం నీకు ఇవ్వమనీ, రాముణ్ణి అడవులకు పంపమనీ...."

భరతుడు నిర్ఘాంతపోతూ అంతా విన్నాడు. కోసల సింహాసనానికి తనే హక్కుదారుడినని వినడం, వింతగా, ఆశ్చర్యంగా తోచింది అతనికి.

ఈ రాజ్యాధికారాల విషయం చిన్నతనం నించి భరతుడి కేమీ తెలీదు. అతని తాతగానీ, మేనమామగానీ, తల్లిగానీ, ఎన్నడూ ఆ సంగతి అతనితో ప్రస్తావించలేదు. అందరూ దశరథుడి సత్యవ్రతంమీదే నమ్మకం పెట్టుకుని వూరుకున్నారు. తండ్రిరాజ్యం తనకే హక్కు అనే సంగతి భరతుడు ఎంతమాత్రం ఎరగడు. అతనికా రాజ్యం కోసం ఎలాంటి ఆలోచనలూ లేవు. ఎలాంటి మంత్రాంగాలూ లేవు. ముందు జాగ్రత్తలు లేవు. అసలు రాజు కావాలనే ధ్యాసే లేదు. అలాంటి స్థితిలో హఠాత్తుగా రాజ్యం అంతా దక్కినప్పటికీ, తన రాజ్యాధికారం కారణంగానే అన్నగారు అడవులపాల య్యాడనీ, తండ్రి మరణించాడనీ వినగానే, తనకు దక్కిన సిరిసంపదల మీద జుగుప్సే కలిగింది. ఏ అఘాయిత్యాలూ జరగకుండా ఇంకో విధంగా రాజ్యం లభిస్తే చాలా ఆనందపడేవాడే గానీ ఈ పరిణామాలు అతనికి సంతోషం కలిగించలేదు.

"అయ్యో! నా తండ్రి ఎంత పని చేశాడు! నన్ను పిలిపించి ఒక్క మాట అడిగితే నేను రాజ్యం వదులుకోవడానికి సంతోషంగా అంగీకరించేవాడినే! ఇంత పని ఎందుకు చేశాడు?"

"నీదాకా ఎందుకు నాయనా? నన్ను అడిగితే, నేనే సంతోషంగా అంగీకరించేదానిని కాదా? కానీ, నీ తండ్రికి అంత సత్యప్రవర్తన లేదు. రాముడి పట్టాభిషేకాన్ని రహస్యంగా జరిపించాలని చూశాడు. ఒక్కరోజు ఆగితే అంత పనీ జరిగేదే! అందుకే నాకు చాలా బాధ కలిగింది. తన వాగ్దానం నెరవేర్చమని మొదట నేను శాంతంగానే అడిగాను. నీ తండ్రి వింటేనా? అప్పుడు నేను, 'నాకు ఇచ్చిన మాట తప్పి సత్యవ్రతం వదులుకో' మన్నాను" అంది కైక.

"అయ్యో! ఎంత పని జరిగింది!" అని భరతుడు పరిపరి విధాల వాపోయాడు.

చిన్నతనంనించి వంశాభిమానంతోటీ; తండ్రుల, తాతల, ముత్తాతల కీర్తి కథల మత్తుతోటీ, పెరిగిన వాడే భరతుడు కూడా. రాజ కుటుంబాలలో జ్యేష్ఠ పుత్రుడే రాజ్యార్హుడై రాజ్యాలు పాలించడం చూస్తూ వున్నవాడే. ఆ ఆచారాన్ని పాటించడంలో ఎంతో భక్తి గౌరవాలున్నవాడే. ఈ నాడు హఠాత్తుగా తనే రాజ్యం తీసుకోవాలంటే, అతనికి తెలిసిన సాంప్ర దాయం, విశ్వాసం, ధర్మం, నీతీ, అన్నీ అతన్ని "నీ అన్నని ధిక్కరించి నువ్వు రాజ్యం తీసుకుంటావా?" అని పరిహసిస్తున్నట్టు సిగ్గుపడిపోయాడు. తనకోసం తల్లి చేసిన సాహసం మహాదుర్మార్గంగా, పాప కార్యంగా కనబడింది. తన మూలంగానే ఇంత జరిగిందంటే లోకం తననేం నిందిస్తుందో నని అమితంగా భయం కలిగింది.

రాజ్యం గురించి ఏనాడో తన తల్లికి వాగ్దానం చేసిన తండ్రి, ఈ నాడు ఆ వాగ్దానం తప్పినా, అసత్య మార్గం పట్టినా, ఆ తండ్రిలో ఆ కుమారుడికి తప్పు కనబడలేదు. తండ్రిని ధిక్కరించిన తల్లి ప్రవర్తనలోనే దోషం కనపడింది. ఆమె, భర్తని ధిక్కరించడం మహాపరాధంగా కనపడింది.

తల్లిని తీవ్రంగా అసహ్యించుకుంటూ ఏ శాస్త్రాలూ

ఏ ధర్మాలూ వొప్పుని తిట్లు తిట్టాడు.[71] "దుష్టురాలా! మా జీవితాలు సర్వనాశనం చేశావు. మా వంశానికి అపకీర్తి తేవడానికే దాపురించావు. నువ్వు విషసర్పానివని తెలీక మా తండ్రి నిన్ను ఇల్లాలిని చేసుకున్నాడు. ఎదురు తిరిగి కాటు వేశావు. నా తండ్రి రాజ్యం నా అన్న తీసు కుంటే నీకేం నష్టం కలుగుతుంది? తండ్రీ కొడుకుల మధ్య నువ్వెవరు? రాజ్యాధికారం కోసం అన్నదమ్ములలో ఇంత జరిగింతర్వాత ఇక మా వంశం వంటి వంశం లేదని మేమెలా గర్వపడగలం? నా తండ్రిని చంపి నువ్వు బతికి వున్నావు. నువ్వు చచ్చిపోతే సంతోషించే వాణ్ణి. నీ కడుపున పుట్టటం నా దురదృష్టం!" అంటూ, తల్లిని ఎంత ఎక్కువ తిడితే వంశానికి అంత ఎక్కువ కీర్తి తెచ్చిన వాణ్ణి అవుతానని, తల్లిని శక్తివంచన లేకుండా తిట్టాడు.

కైక, అన్నీ శాంతంగా వింది – "నాయనా! వాగ్దా నాలు చేసి తప్పే నీ వంశ గౌరవం నాకు క్షుణ్ణంగానే తెలుసు. రహస్య మంత్రాంగాలు చేసి కుట్రలు పన్నే మీ తండ్రీ కొడుకుల పరువు ప్రతిష్టలూ నాకు చక్కగా తెలుసు. నీకు అన్యాయం జరుగుతోందనే బాధతో, తల్లినై వుండి చూస్తూ సహించలేక, నా హక్కు ప్రకారం నేను చేశాను. నీకోసం సింహాసనం సిద్ధంగా వుంచి నా బాధ్యత నేను నెరవేర్చుకున్నాను. ఇక నీ రాజ్యం నీ కిష్టమైనట్టు చేసుకో! ఇప్పుడు మించిపోయిందేమీ లేదు. ఆడిన మాట తప్పటమే నీ వంశగౌరవం అయితే, దాన్నే మళ్ళీ నిలబెట్టుకో!

నీ తండ్రి వృద్ధుడై మరణించాడేగానీ పుత్ర ప్రేమతో మరణించలేదు. నీ తండ్రి పుత్రప్రేమ, స్వర్గం దొరక దేమోనని జడిసి కొడుకుని వొదులుకున్ననాడే రుజు వైంది. ఆయుష్షుతీరి మరణించిన వృద్ధుడికోసం ఇంత విచారించవలసిన పని లేదు. నీ రాజ్యం నీ దయతో, నీ దాతృత్వంతో ఎవరికైనా దానం చేసుకో! అది నీ ఇష్టం!" అని కైక లోపలి మందిరంలోకి వెళ్ళిపోయింది.

భరతుడు దీర్ఘాలోచనలో మునిగాడు. చివరికి అతను నిశ్చయించుకున్నది – రాజ్యం తిరిగి అన్న గారికే అప్పగించి, తన సద్గుణం, సౌశీల్యం, సోదర ప్రేమా చాటుకుని, లోకంలో కీర్తి పొందాలని!

అంతలో శతృఘ్నుడు మందరని పట్టుకుని నేల మీద ఈడ్చి చంపడానికి సిద్ధమయ్యాడు. మందర కేక లకు, కైక శతృఘ్నుణ్ణి వారించబోయింది.

శతృఘ్నుడు పినతల్లి మాటలు లక్ష్యపెట్టక మందర వెంటపడ్డాడు.

భరతుడు శతృఘ్నుణ్ణి వారిస్తూ "స్త్రీలను చంపరాదు. నా తల్లి చేసిన దుష్టత్వానికి నేను నా తల్లినే చంపేవాడిని. కానీ, తల్లిని చంపితే మహానుభావుడైన మన అన్నగారు కోపిస్తారని ఆ ఆలోచన మానుకున్నాను" అన్నాడు.[72]

దానితో శతృఘ్నుడు, మందరని వదిలిపెట్టాడు.

భరతుడు, వెంటనే పెదతల్లిని కలవాలని ఆమె మందిరానికి వెళ్ళాడు.

కౌసల్యకి, భరతుడి తప్పేమీ లేదని తెలిసినప్పటికీ, బొటబొటా కళ్ళనీళ్ళు కారుస్తూ నిష్ఠూరాలు మొదలు పెట్టింది. "వొచ్చావా నాయనా! నీ తల్లి నీకు చక్కగా శతృబాధ లేకుండా రాజ్యం సిద్ధంచేసి వుంచింది. నా కొడుకుని నిష్కారణంగా నార గుడ్డల్తో అడవుల్లోకి తరి మింది. ఇక నన్ను మాత్రం వెళ్ళగొట్టదా? వొకరు వెళ్ళ గొట్టేదేవిటి, పుణ్యాత్ముడు నా భర్త కళేబరం తీసుకుని, సుమిత్రని వెంట బెట్టుకుని, నేనే నా కొడుకు దగ్గిరికి వెళ్ళిపోతాను. నా కొడుకు అడవుల్లో తపస్సు చేసుకునే చోటికి నన్ను తీసికెళ్ళి విడిచిపెట్టు నాయనా! సిరి సంపద లతో తులతూగే రాజ్యాన్నంతా నువ్వు కోరినందుకేగా నీ తల్లీ పాపిష్టి పని చేసి రాజ్యాన్ని నీకు సంపాదించి పెట్టిందీ!" అంటూ నిష్ఠూరాలాడి భరతు డేమనుకుంటు న్నాడోనని వోర కంట కనిపెడుతూ కళ్ళు వొత్తుకుంది.

భరతుడు బావురుమని ఏడుస్తూ కౌసల్య పాదాల మీద పడ్డాడు – "అయ్యో, నన్ను నిందిస్తావెందుకు పెద తల్లీ? అన్నగారికింత ద్రోహం చేస్తానా నేను? నా తల్లి చేసిన పాపంలో నాకేవన్నా భాగం వుంటే నేను రౌరవాది నరకాలకు పోనా?" అంటూ ఏడ్చాడు.

ఆ ఏడుపు చూస్తే కౌసల్యకెంతో ధైర్యం కలిగింది. 'భరతుడు, తల్లి చేసిన పనికి సంతోషించడం లేదు కాబట్టి, రాజ్యం చచ్చినా తీసుకోడు. ఎలాగయినా మళ్ళీ అన్నకే అప్పగిస్తాడు. ఇక కైకమ్మగారు ఎవరి చెప్పుచేతల్లో మెలుగుతుందో చూద్దాం.' ఆ ఆలోచనలతో కౌసల్య మనసు చాలా తేలికపడింది.

భరతుడితో పరుషంగా మాట్లాడి వ్యవహారం చెడ గొట్టుకో కూడదని తన ధోరణి మార్చుకుంది – "పోనీలే నాయనా! మా కర్మ ఇట్లా రాసి వుంది. నీ తల్లిమాత్రం ఏం చేసింది? ఏదో నిన్ను చూడగానే బాధకొద్దీ అన్నాను

---

**71.** **అయోధ్యా, సర్గలు 73, 74:** మొత్తం ఈ శ్లోకాలన్నీ భరతుడు, మంత్రుల ముందూ, పరిచారికల ముందూ తల్లిని తిట్టిన తిట్లే! కన్న తల్లిని అన్ని రకాల తిట్లు తిట్టగలిగే చాతుర్యం గల ఘన వంశం రఘు వంశమే! అలాంటి కుమారుడి పాత్రని కల్పించిన ఘనత రామాయణ కవిదే! ★

**72.** **అయోధ్యా, సర్గ 78, శ్లోకాలు 8 నించీ 22:** భరతుడి మాటలు – "నా తల్లిని నేనే చంపియుండువాడను. కానీ, శ్రీరామ చంద్రుడు కోపించును." ★

గానీ, మనసులో పెట్టుకోకు. నన్ను నా కొడుకు దగ్గిరికి పంపించెయ్యి నాయనా! ఎలాగో అందరం అక్కడే ఆకో అలమో తిని బతుకుతాం. మాకు భోగభాగ్యాలు రమ్మంటే ఎక్కణ్ణుంచి వొస్తాయి?" అంటూ బొటబొట కన్నీళ్ళు కార్చింది. తను ఏడుస్తోంటే భరతుడెంత విల విల్లాడాడో కౌసల్య స్పష్టంగానే చూసింది. అసలు మొదటనించీ సుమిత్రతో అంటూనే వుంది – "భరతుడు రాజ్యం తీసుకోడేమోనే సుమిత్రా" అని.

భరతుడి వైఖరిచూస్తే, కౌసల్య మొహం ఆనందంతో కలకల్లాడిపోయింది – "విచార పడకు నాయనా! ఎలా రాసిపెట్టి వుంటే అలా జరుగుతుంది" అంది మళ్ళీ.

భరతుడు పెదతల్లి ముందు, తన తల్లిని రక రకాలుగా దూషించి, ఏడుస్తూ సెలవు తీసుకుని వెళ్ళి పోయాడు.

భరతుడి దుఃఖం చూసిన కౌసల్య, ఇక రాజ్యం తన కుమారుడిదేననే ఆనందంతో మూర్ఛపోయింది.

సుమిత్ర, కళ్ళనీళ్ళతో అప్పగారికి సేవలు మొదలు పెట్టింది. ఈ అమాయకురాలు, ఈ ఇంటికి వచ్చి నప్పటినించీ ఈ అప్పగారికి సేవలూ; ఈమె కొడుకు, ఊహ తెలిసినప్పటినించీ ఈ అప్పగారి కొడుక్కి సేవలూ!

సుమిత్రకి, కైకకిలాగ తెలివీ లేదు; కౌసల్యకి లాగ లౌక్యమూ లేదు. అప్పగార్ని ఆశ్రయించి తిరగడమే ఆమె మొదటినించీ నేర్చుకుంది.

కౌసల్య, ఇప్పటికీ సుమిత్రని లొంగదీసే బోధనలు చేస్తూనే వుంటుంది. "నీ కొడుకు, నా కొడుక్కి సేవలు చెయ్యడానికి వెళ్ళాడని బాధపడకు సుమా! అన్నగారికి సేవచేస్తే పుణ్యమే" అంటూ వుంటుంది.

కొడుకు సంపాదించబోయే పుణ్యాన్నో, కీర్తినో, దేన్ని తల్చుకుంటుందోగానీ సుమిత్ర అన్నిటికీ సంతోషిస్తూనే వుంటుంది.

★ ★ ★

**భ**రతుడు, తండ్రి కళేబరానికి దహన సంస్కారాలు ముగించి అన్నగారి కోసం బయల్దేరడానికి పెద్ద ఎత్తున ప్రయాణం ఏర్పాట్లు చేయించాడు. అన్నగారు ఋషుల వేషంతో వెళ్ళాడని తెలిసి, తను కూడా నార బట్టలు కట్టాడు. కానీ మహారాజు లెక్కే రధాలెక్కి, ఏనుగులతో గుర్రాలతో, సమస్త పరివారాన్నీ నగరంలో పెద్దల్నీ వెంట బెట్టుకుని, అడవులకు బయల్దేరాడు – ఋషిత్వమంతా నార గుడ్డల్లో ఇరికించి!

గుహుడి చారులు, రాముడు ఎటు వెళ్ళిందీ భరతుడికి చెప్పారు. గుహుడి పడవల ద్వారానే భరతుడి సైన్యమూ, రధాలూ, గంగ దాటాయి. తర్వాత, భరద్వాజాశ్రమానికి చేరి, అక్కడినించి చిత్రకూటానికి బయల్దేరాడు.[73]

★ ★ ★

**చి**త్రకూట పర్వత శిఖరాలు, చిత్ర శోభలతో, ఒక్కో ప్రదేశం ఒక్కో వర్ణంతో ప్రకాశిస్తున్నాయి.

---

**73. అయోధ్యా, సర్గ 91 పూర్తిగా:** భరతుడు భరద్వాజ ఆశ్రమానికి చేరినప్పుడు ఆ ఋషి భరతుడికి గొప్ప విందు చేశాడు. ఆ విందు వర్ణన ఇది. భరద్వాజుడు మంత్రాలు చదివి, విశ్వకర్మనీ, దేవతల్నీ పిలిచాడు – "భరతుడికి ఈ రాత్రికి ఆతిథ్యం ఇవ్వాలనుకున్నాను. మీరందరూ వచ్చి సహాయం చెయ్యండి! గృహాలు నిర్మించండి! తినడానికీ, తాగడానికీ, అన్నీ సిద్ధం చెయ్యండి! భూమిమీద వున్న నదులన్నీ మద్యాలతో, పానీయాలతో, నిండి ఇక్కడికి రండి! చంద్రుడు వొచ్చి ఇక్కడ రకరకాలయిన అన్నాలూ, మద్యాలూ పూల హారాలూ తయారు చెయ్యాలి" అని దేవతల్ని పేరుపేరునా పిలిచాడు. భరద్వాజుడు ధ్యానం ముగించగానే దేవతలందరూ వొక్కరొక్కరే వొచ్చేశారు – మలయ మారుతం వచ్చింది. పూల వాన ప్రారంభమై కురుస్తూనే వుంది. అన్ని దిక్కుల్లోనూ దేవ దుందుభులు మోగుతూనే వున్నాయి. అప్సరసలు ఆడుతూ, పాడుతూ వున్నారు. అనేక పళ్ళచెట్లతో నిండిన కుబేరుడి చైత్ర రథం (వనం) అక్కడికి వచ్చేసింది. నదులన్నీ వొచ్చేశాయి. మేడలూ, దేవాలయాలూ పూజాగృహాలూ తయారైపోయాయి. బ్రహ్మ పంపగా 60 వేల మంది అప్సరసలు వొచ్చారు. కుబేరుడు పంపగా ఇంకో 60 వేల మంది వొచ్చారు. విశాలమైన ఆసనాలూ, పల్లకీలూ, స్నానాల గదులూ, తినుబండారాలూ అన్నీ వున్న గొప్ప భవనంలో భరతుడు ప్రవేశించాడు. అందులో వొక దివ్యమైన ఆసనం చూసి, దానిమీద రాముడు వున్నట్టుగా భావించి భరతుడు దానికి ప్రదక్షిణలు చేశాడు – తర్వాత పాయసంతో నిండిన నదులు వొచ్చి భరతుడి ముందు నిలబడ్డాయి. (నది, నిలబడితే ఎలా వుంటుందో!) ఆ నదుల తీరాలలో గొప్ప గొప్ప భవనాలున్నాయి (ఒక భవనంలో భరతుడి ముందు నదులూ, ఆ నదుల తీరాలలో భవనాలూ!) నారదుడూ, తుంబురుడూ మొదలయిన గాయకులు వొచ్చి భరతుడి ముందు పాడారు. సౌందర్య రాసులయిన అప్సరసలు ఆడారు. – దేవ వనాల్లో వున్న పూలన్నీ భరద్వాజుడి ఆశ్రమంలో ప్రత్యక్ష మయ్యాయి. కొన్ని చెట్లు, మృదంగాలు వాయించే వారిగా అయ్యాయి. కొన్ని, తాళాలు వేసేవారిగా, కొన్ని చెట్లు సేవకులుగా, లతలన్నీ స్త్రీలుగా అయ్యి, అందరికీ పాయసాలూ, అన్నాలూ అందిస్తూ సేవ చేశాయి. నదీ తీరాల్లో వేడినీళ్ళూ, నలుగుపిండీ, పళ్ళు తోముకునే పుల్లలూ, సుగంధ ద్రవ్యాలూ, చెంబులూ, కొత్త బట్టలూ అన్నీ సిద్ధంగా వున్నాయి (సబ్బులు తప్ప!) ఒక్కొక్క పురుషుడి చుట్టూ ఏడెనిమిది మంది స్త్రీలు జేరి నలుగులు పెట్టి, తల స్నానాలు చేయించి అలంకారాలు చేశారు. (ఎక్కడ చూసినా పురుషులకు స్త్రీల చాకిరీలు! అంతే కాదు, పురుషుల కోసం అప్సరసలు సిద్ధం! సేవకులు సిద్ధం!) ➔

కొన్ని – వెండిలాగా, కొన్ని – బంగారంలాగా! ఇంద్ర నీలాల లాగ కొన్నీ, పుష్యరాగాల లాగ కొన్నీ! కొన్ని – నక్షత్ర కాంతు లతో, కొన్ని – పాదరస ప్రభలతో! చిత్ర విచిత్రంగా ధగ ధగలాడుతున్నాయి.

తలలెత్తి విశాలంగా చూస్తే, చుట్టూ ఎన్ని జాతుల వృక్షాలో! కొమ్మల నిండా పళ్ళతో మామిడి చెట్లు, నేరేడు చెట్లు, పనస చెట్లు, చంద్ర చెట్లు, లొద్దుగు చెట్లు, వేగిస చెట్లు, మోరటిచెట్లు, ఎన్నెన్ని రకాలో! ఎన్ని వర్ణాల పక్షులో! ఎంతెంత శ్రావ్యమైన కూతలో!

కొండలనించి జారే జలపాతాలు, పూలమడుగులు కట్టిన సరోవరాలు, పరిమళభరితంగా వీస్తోన్న చల్ల గాలులు! ఎందరో ఆటవిక స్త్రీ – పురుషులు, కొండ చరియల్లో జంటలు జంటలుగా తిరుగుతున్నారు.

రాముడూ సీతా, తమ తాటాకుల పాక ముందు కొంచెం దూరంలో చెట్లమధ్య వొక రాతిమీద కూర్చుని వున్నారు.

రాముడు చుట్టూ చూస్తూ సీతతో చెప్పడం ప్రారంభించాడు – "సీతా! ఈ చిత్రశోభలు గల చిత్రకూటమే మన అయోధ్య! ఈ రమణీయ మందాకినీ నదే మన సరయూ! ఈ వృక్షాలే – ఛత్రాలు. ఈ వన్యమృగాలే పుర జనులు. ఈ అడవులే కోసల దేశం!"

రాముడు, తను కూర్చున్న రాతిని సింహాసనంగా ఊహించుకుని, ఆ ప్రదేశాన్ని అయోధ్యతో పోల్చు కుంటూ, అక్కడ రాజ్యం చేస్తోన్న ఆనందం అనుభవిస్తు న్నాడు. రుషి జీవితం గడుపుతున్నానని చెప్పుకునే రాముడి ధ్యాసంతా రాజ్యపాలన మీదే![74]

సీత, దూరంగా నదిలో, కెరటాలలో పూలు నీటితోపాటే తేలుతూ కదలడం చూస్తోంది.

"సీతా! లక్ష్మణుడు నాకు సేవలు చేస్తున్నాడు. నువ్వు ఎంతో వినయ విధేయతలతో మెలుగుతున్నావు. ఎక్కడ వుంటే మాత్రం ఇంతకన్నా నాకేం కావాలి?"

రెండు పిట్టలు ఒకే పండుని కొరికి తినడం చూస్తోంది సీత. మధ్య మధ్య అవి వొకదాని రెక్కల్లో వొకటి ముక్కులతో రాచుకుంటున్నాయి. ఆ ఆడ పిట్టకి వినయ విధేయతలేమీ తెలిసినట్టు లేదు.

"సీతా! ఈ వన సౌందర్యానికి గంధర్వులూ, కిన్నెరలూ కూడా వారి లోకాలు విడిచి ఇక్కడికి వొస్తారు. ఈ ఏకాంతం ఎంత కామోద్దీపకంగా వుందో చూడు!"

సీత సిగ్గుపడి తలవొంచుకుంది. రాముడికి అంత ఏకాంతంగా సీతతో గడపటం బాగానే వుంది గానీ, వొక్కోసారి చాలా నిరుత్సాహం కలుగుతోంది. అయోధ్యలో అయితే, వైతాళికుల మేలుకొలుపులతో లేచింది మొదలూ – బంధుమిత్రులతో సంభాషణలూ, వేశ్యల నాట్యగానాలూ, రాచ మంత్రాంగాలతో పదునెక్కే ఆలోచనలూ – క్షణం తీరికలేని కార్యభారాలుండేవి. తను పట్టాభిషేకం చేసుకుని రాజ్యానికి రాగానే, ఏయే శత్రు రాజ్యాల్ని ఆక్రమించాలో, పరిపాలన ఎంత పటిష్టంగా చెయ్యాలో, ఆ జాగ్రత్తలన్నీ ఆలోచించాడు. ఇప్పుడదంతా 'అడవి కాచిన వెన్నెలై' పోయింది. రాజ్యాలు పాలించవలసిన తను అసమర్థుడిలాగ అడవుల్లో కూర్చున్నాడు. – "సీతా! ఈ వనసౌందర్యం చూస్తోంటే రాజ్యం పోయిందన్న సంగతే మర్చిపోయాను. ఈ వనవాసానికి రావడమే మంచిదయింది. తండ్రి ఆజ్ఞ పరి పాలించినట్టూ అవుతుంది; భరతుణ్ణి, సంతోష పెట్టినట్టూ అవుతుంది" అని తల కొంచెం పక్కకు వాల్చాడు. మనసులో – 'నిజంగా రాజ్యం దొరికినందుకు భరతుడు సంతోషిస్తాడా? ఈపాటికి వొచ్చే వుంటాడు. ఏమన్నాడో! తల్లిని దూషించకుండా వుంటాడా? దూషించే వుంటాడు! సరి,

---

➔మేకమాంసాలు, పంది మాంసాలు, జింక – నెమలి – కోడి మాంసాలు, మద్యాలు, తెల్లటి అన్నం, పాయసాలతో నిండిన బావులు, ఖర్జూర రసం చెరువులు, తాలింపు పెరుగు మడుగులు, మజ్జిగ చెరువులు, కోట్లకొద్దీ అన్నం తినే పళ్ళాలు, చెంబులు, గరిటెలు, పీటలు, ఆసనాలు – సమస్తమూ సిద్ధంగా వున్నాయి.

సైనికులంతా తృప్తిదీరా తినీ, తాగీ, ఆనందంతో నాట్యాలు చేస్తూ "ఇది స్వర్గం. మేమిక అయోధ్యకు తిరిగిపోము. దండకారణ్యానికి రాము" అని కేకలు వేశారు. (అయోధ్యలో ఎంత కష్టంగా వుంటుందో పాపం!) ఆ రాత్రి అంతా సంతోషంగా గడిచింది. తెల్లవారగానే అప్సరసలూ, దేవతలూ, భవనాలూ అన్నీ వెళ్ళిపోయాయి. భరతుడు చిత్రకూటం వేపు బయలుదేరాడు.

★

**74. అయోధ్యా, సర్గ 95, శ్లోకం 15:** రాముడు, చిత్రకూటాన్ని అయోధ్యతో పోల్చి, అడవి జంతువుల్ని అయోధ్య ప్రజలతో పోల్చాడు. రాముణ్ణి సత్యవంతుడని రుషులు పొగిడే పొగడ్తలు ఈ విషయంలో మాత్రం చాలా నిజం. ప్రజల్ని జంతువులుగా మాత్రమే చూసే రాజుల గుణాల్ని అతడు చాలా స్పష్టంగా బయటపెట్టాడు. ప్రజలూ, జంతువులూ వొకటే రాముడి దృష్టిలో. ప్రజలు జంతువులే కాబట్టి ప్రజల్ని పాలించినా, గొడ్లని పాలించినా, ఒక్కలాంటి ఆనందమే కలుగుతుంది రాముడికి. అసలు వనవాసం చేస్తూ, రుషి జీవితం గడపవలసిన రాముడు, చిత్రకూటాన్ని అయోధ్యగా ఊహించుకుని, తను అయోధ్యలో ప్రజల్ని పాలిస్తూ వున్నట్టు భావించడం ఎందుకు? రుషి జీవితంలో 'పరిపాలన' సంగతి ఎందుకు? ఎప్పుడూ అదే రంధి! అదే ధ్యాస!

★

అన్నీ క్రమంగా అవే తెలుస్తాయి!' అని నిట్టూర్చాడు.

మళ్ళీ సీతవేపు చూశాడు. "ఇక్కడ ఎన్నివేల సంవత్సరాలు నివసించినా దుఃఖం కలగదు సీతా! అసలు తృప్తే కలగదు నాకు. కానీ, మనం పద్నాలుగు సంవత్సరాలతో తృప్తిపడి వెళ్ళిపోదాం" అని అయోధ్యలో ప్రవేశించే పుణ్యదినాన్ని తల్చుకుంటూ కళ్ళు మూశాడు.[75]

సీత, లేచి ఇంట్లోకి వెళ్ళి కాల్చిన మాంసం ముక్కలు ఆకుల్లో పెట్టి తెచ్చింది.

రాముడు ముక్కలు తింటూ మాంసం రుచిని వర్ణించడం మొదలుపెట్టాడు. "ఈ ముక్క చూడు చక్కగా కాలింది. ఇదిగో! ఈ కార్జ్యం చాలా రుచి. ముందు ఇది తిని చూడు" అంటూ ముక్కలు ఏరి సీతకి ఇచ్చాడు.

ఇక్కడ, మాంసం కండలకూ కార్జ్యాలకూ కొదవ లేదు. ఒక్క లేడినో దుప్పినో పడగొడితే కావలసినంత మాంసం! పిట్టలూ జంతువులూ ఎక్కువగా దొరకని ప్రదేశం అయితే, కాల్చిన కార్జ్యం ముక్కలు ఆకుల్లోకి రాగానే రాముడికి సీత ఎంత గుర్తొచ్చేదోగానీ, ఇక్కడ సీతకి మాంసం ముక్కలు బాగానే అందిస్తున్నాడు!

సీతకు మాంసంకన్నా ఊరగాయ పచ్చళ్ళు ఇష్టం[76]. అవి లేకపోవడంవల్ల సీత పూటపూటా మాంసం తినటానికి అయిష్టం చూపుతోంది. రాముడు అందించే ముక్కలన్నీ సీత నవ్వుతూ అతని నోట్లోనే పెడుతోంది.

రాముడు కార్జ్యం చప్పరిస్తూ దూరంగా కళ్ళు చిట్లించి చూశాడు. దూరంగా దుమ్ము రేగుతోన్నట్టు కనబడింది. జింకలూ, లేళ్ళూ పరుగులు తీస్తున్నాయి. పక్షులన్నీ ఆకాశంలోకి లేచి గోల చేస్తున్నాయి. దూరంగా ఏదో కోలాహలం వినబడుతోంది.

లక్ష్మణుడు అప్పుడే నదిలోంచి నీళ్ళు తెచ్చి వంట గదిలో పెట్టి కట్టెలు కొట్టడానికి సిద్ధపడుతున్నాడు.

రాముడు గట్టిగా లక్ష్మణుణ్ణి పిలిచాడు – "లక్ష్మణా! అటు చూడు, ఏమిటా సందడి? ఎవరైనా మహారాజు వేటకు వచ్చాడా? ఏదయినా క్రూర జంతువు సాధు జంతువుల్ని తరుముతోందా? ఏమిటో కొంచెం చూడు!" అని ఇంకో ముక్క నోట్లో పెట్టుకున్నాడు.

"చిత్తం అన్నగారూ! మీ ఆజ్ఞ పాటిస్తాను" అని లక్ష్మణుడు అడవి జంతువులాగ నేర్పుగా పెద్ద మద్ది చెట్టెక్కి చుట్టూ చూశాడు.

దూరంగా రథాలూ, గుర్రాలూ, ఏనుగులూ, ఎంతో సైన్యం కనబడింది. అన్నిటికన్నా ముందు వస్తోన్న రథానికి 'కాంచెన చెట్టు జెండా' ఎగురుతోంది. ఆ జెండా ఎవరి రథానిదో లక్ష్మణుడికి తెలుసు – "అన్నగారూ! వదినగార్ని గృహంలోకి పంపించి వెయ్యండి! మీరు తొందరగా కవచం తొడగండి! విల్లు ధరించండి! యుద్ధానికి సిద్ధంకండి!" అని పెద్దపెద్ద కేకలు పెట్టాడు చెట్టు మీద నించి.

"యుద్ధమా! యుద్ధమేమిటి ఈ అడవిలో? .... సంగతేమిటి? ఎవరొస్తున్నారు? తిన్నగా చూడు!" అని రాముడు చెట్టుమీదకి వినపడేటట్టు తనూ గట్టి గట్టి కేకలు వేశాడు.

లక్ష్మణుడు కోపంతో మండిపడిపోతున్నాడు చెట్టు మీద. మళ్ళీ అన్నగారికి వినపడేటట్టు పొలి కేకలు పెడుతూ– "అన్నగారూ! ఇంకెవరొస్తారు మనతో కయ్యానికి? కైకమ్మగారి కొడుకొస్తున్నాడు. సామ్రాజ్యమంతా ఆక్రమించినా తృప్తి కాలేదేమో! శత్రుశేషం మిగల్చకూడదని తల్లి బోధించి పంపిందేమో! మనల్ని చంపాలని వురుకులు పరుగులమీద వొస్తున్నాడు. ఇక నేను సహించేది లేదు. అతని వల్లనే కదా, మనం ఇన్ని బాధలు పడవలసి వొచ్చింది? అంత అపకారం చేసినవాణ్ణి గురించి ఇంకా ఉపేక్షించేదేమిటి? నేనూరుకోను. అతన్నీ, అతని పరివారాన్నీ, అతని మిత్రుల్నీ అందర్నీ నరికి పారేస్తాను. నా ఆయుధాలన్నీ పూర్వం యుద్ధాల తర్వాత పనిలేకుండా వున్నాయి. ఈ యుద్ధంలో భరతుడు నా చేతుల్లో చచ్చి తీరాలి.[77] శత్రువులందరూ నాశనం అయిపోయింతర్వాత కోసల రాజ్యం మీకే దక్కుతుంది. మనం రాజ భోగాలతో సుఖంగా వుండ

---

**75.** **అయోధ్యా, సర్గ 94, శ్లోకం 15**: రాముడు చిత్రకూట సౌందర్యానికి తనెంతో ఆనందపడుతున్నట్టు "ఇక్కడ ఎన్ని వేల సంవత్సరాలు జీవించినా తృప్తి కలగదు" అంటాడు. – ఆ సర్గలోనే 27వ శ్లోకంలో: "14 సంవత్సరాలు మాత్రం వుండి సంతృప్తిపడతాను" అంటాడు. వనవాస కాలం పది సంవత్సరాలే అయితే పది సంవత్సరాలకే సంతృప్తిపడేవాడు. 6 సంవత్సరాలయితే 6 సంవత్సరాలకే! చిత్రకూట సౌందర్యాన్ని ఆనందించే కాంక్ష మళ్ళీ రాజ్యం చేజిక్కేవరకే! ఎన్ని వేల సంవత్సరాలున్నా తనకు తృప్తే కలగదని – పైపై మాటలు! చిత్రకూట సౌందర్యానికి తనెంతో ముగ్ధుడైనట్టు మాట్లాడిన రాముడు, ఆ స్థలంలో, సంవత్సరాల మాటకేంగానీ ఎన్ని 'రోజులు' వున్నాడో తర్వాత చూడండి! ★

**76.** **అయోధ్యా, సర్గ 61, శ్లోకం 5**: రాముడు వనవాసానికి వెళ్ళిపోయిన తర్వాత కౌసల్య దశరథుణ్ణి తిడుతూ – "ఊరగాయలతో ప్రియంగా భోజనం చేసే సీత అడవిలో తృణధాన్యాలెట్లా తింటుంది?" అంటుంది. అందుచేత, సీతకి ఊరగాయ పచ్చళ్ళు ఎక్కువ ఇష్టం అనవచ్చు. ★

**77.** **అయోధ్యా, సర్గ 96, శ్లోకాలన్నీ**: లక్ష్మణుడికి కైక మీదా భరతుడిమీదా ఎంత కోపం వుందో చూడండి! ★

వొచ్చును" అని ఆవేశంతో వూగుతూ, కేకలేస్తూ నిల బడ్డాడు చెట్టుమీద.

"ఇంకెవరు? కైకమ్మ కొడుకే వొస్తున్నాడు" అని లక్ష్మణుడన్న తర్వాత, రాముడికి ఇక తర్వాత మాట లేవీ వినపడలేదు. అతని మనసంతా భరతుడెందు కొస్తు న్నాడో గబగబా ఆలోచనలు చెయ్యడంలో సత మతమై పోతోంది – 'అయితే భరతుడు వొచ్చేస్తున్నాడన్న మాట! తను అనుకుంటూనే వున్నాడు, భరతుడు తప్పకుండా వొస్తాడని! తల్లిని బాగా చివాట్లు పెట్టివుంటాడు. రాజ్యం తనకే ఇచ్చేస్తానంటాడేమో! ఏమో చెప్పలేం. చాలా ఉత్తముడే మరి!' రాముడి మనసంతా ఉద్వేగంతో నిండిపోతోంది.

మధ్య మధ్య – "చంపుతాను, నరుకుతాను" అని లక్ష్మణుడు వేస్తోన్న కేకలు కొన్ని కొన్ని చెవిన పడ్డాయి. "ఇతని గల్లంతేమిటి? వ్యవహారం చెడ గొడతాడా ఏమిటి?" అని మొహం బిగించాడు రాముడు.

చాలా కోపంతో చెట్టుదిగి వొస్తోన్న లక్ష్మణుణ్ణి గాంభీర్యంతో చూశాడు రాముడు. "ఏమిటా మాటలు లక్ష్మణా? భరతుడు సద్గుణ సంపన్నుడని ఎరగవా? భరతుడి మీద నిష్కారణంగా ఎందుకు కోపం? అతడు నీకెన్నడయినా చిన్నమెత్తు హాని చేశాడా? ఎప్పుడూ హాని చెయ్యనివాడు ఇప్పుడు అపకారం చేస్తాడని ఎందుకు సందేహిస్తున్నావు?" అంటూ మొదలుపెట్టి చివరికి కఠి నంగా చూశాడు. రాముడికి లక్ష్మణుడి మీద కొన్నాళ్ళ నించి కోపం పేరుకుంటోంది. గంగానది దాటిన రాత్రి లక్ష్మణుడి ముందు తన మనసులో దుఃఖమంతా వెళ్ళ బోసుకున్నప్పటినించీ రాముడికి చీటికీ మాటికీ లక్ష్మ ణుడి మీద కోపం వస్తోనే వుంది. లక్ష్మణుడు వొళ్ళు విరుచుకుని పనులు చేస్తూ వుంటేనే రాముడికి తృప్తిగా వుంటుంది. అతను సేవకుడై, తను అతడికి ప్రభువయిన ఆనందం కలుగుతుంది. అప్పుడప్పుడూ సీత – "లక్ష్మ ణుడు రాకపోతే మనం చాలా ఇబ్బందులు పడేవాళ్ళం. ఎంత ఉత్తముడో! ఎన్ని సేవలు చేస్తాడో!" అనడం రాము డికేం నచ్చదు. "అంత దయ దల్చవలసిందేముంది? నాకు సేవలు చేస్తేనే కదా పరలోకాల్లో పుణ్యం సంపా దించుకుంటాడు?" అని మొహం చిట్లిస్తూ వుంటాడు.

అదీగాక, అంతఃపురంలో పరపురుషుడి కంటయినా పడని సీత ఇప్పుడు రోజంతా మరిదితో మాట్లాడటం చూస్తే, రాముడికి మనసంతా ఏదో బాధపెడుతూ వుంటుంది. అతడు భార్యని విడిచి వుంటున్నాడు. అయో ధ్యలో అయితే అతనికి ఎందరో వేశ్యలు వుండేవారు. ఇక్కడ స్త్రీ సుఖానికి దూరంగా వున్నాడు. – ఎన్నో కారణాలచేత లక్ష్మణుడి మీద పేరుకుంటోన్న కోపంతో, అతన్ని మందలించడానికి అవకాశం కోసం ఎదురు చూస్తోన్న రాముడికి ఇప్పుడు చక్కటి అవకాశం దొరి కింది. ఇతను భరతుణ్ణి దూషించడమా? ఇతను చేసిన ఆ దోషం ఎత్తి చూపించి, మందలించి, తన ఔన్నత్యం ప్రదర్శించి, మళ్ళీ తన గాంభీర్యం తనకు దక్కేటట్టు చేసుకునే మార్గం దొరికింది! – "లక్ష్మణా! మనం బయ ల్దేరేటప్పుడు కూడా తండ్రిగార్ని చంపేస్తాననీ, కారా గారంలో పెట్టేస్తాననీ ఏవేమో అన్నావు. ఇప్పుడు భర తుణ్ణి నరుకుతానంటున్నావు! ఏదో చిన్న ఆపద వొచ్చి నంత మాత్రాన తండ్రినీ, తోడబుట్టిన వాళ్ళనీ చంపేసు కుంటామా? మనసు కెంతతోస్తే అంతా పైకి అనెయ్య డమేనా? అసలు భరతుడు ఎందుకొస్తున్నాడో ఏమిటో తెలుసుకోవద్దా ముందు? తాత గారింటి దగ్గర్నించి వచ్చి అయోధ్యలో జరిగిన ఘోరం అంతా విని వుంటాడు. తల్లిని కఠినంగా తిట్టి రాజ్యం అక్కర్లేదని తిరస్కరించి వుంటాడు. సత్సంప్రదాయం కలవాడు కాబట్టి తన అన్నకి లేని రాజ్యం తనకెందుకని రాజ్యాన్ని పూర్తిగా త్యజించి వుంటాడు. మళ్ళీ రాజ్యం నాకే ఇవ్వాలని, తండ్రిగార్ని ప్రార్థించి, ఎలాగో నన్ను వొప్పించి వెనక్కి తీసుకు వెళ్ళాలని వొస్తూ వుండివుంటాడు.[78] అసలు విషయమేమిటో తెలుసుకోకుండా నువ్విలా అసంద ర్భంగా మాట్లాడతావేం లక్ష్మణా? తండ్రిగారు నాకు పట్టాభిషేకం చేస్తానన్నప్పుడు నేను రాజ్యం చెయ్యడానికి ఇచ్చగించినప్పటికీ, అది నా స్వార్థంకోసం కాదు. నువ్వు నమ్మవేమో, నా ఖడ్గంమీద వొట్టుపెడతాను. మీ అందరి కోసమే. నా తమ్ముళ్ళు భాగ్యవంతులై సిరిసంపదలతో తులతూగుతారని రాజ్యం చెయ్యాలనుకున్నాను.[79] భర తుడి వల్లే రాజ్యం పోయిందని కోపం కదూ నీకు? రాజభోగాలన్నీ అనుభవించడానికి నీకే స్వయంగా రాజు కావాలని వుందా? అదైనా చెప్పు! భరతుడు రాగానే అతనితో చెపుతాను – 'నాయనా, భరతా! లక్ష్మణుడికి

**78.** **అయోధ్యా, సర్గ 97, శ్లోకం 42:** భరతుడు ఎందుకొస్తున్నాడో రాముడికి కూడా తెలీదు. అయినా, భరతుడు తల్లిని తిట్టి, రాజ్యాన్ని తిరస్కరించి, ఆ రాజ్యం తనకు ఇచ్చేయడానికే వస్తున్నాడని రాముడు ఊహిస్తున్నాడు. భరతుడు తల్లి మాట ప్రకారమే పట్టాభిషేకం చేసుకుని, ఒకసారి అన్నగార్ని చూసి వెళ్ళడానికి వస్తున్నాడేమోనని ఎందుకు ఊహించకూడదు? రాముడి రాజ్యకాంక్ష అంతా, అతని ఆశల్లో, ఊహల్లో, మాటల్లో వెల్లడవుతూ వుంటుంది. ★

**79.** **అయోధ్యా, సర్గ 97, శ్లోకం 56:** రాముడు రాజ్యం ఎందుకు చెయ్యాలనుకున్నాడంటే, తమ్ముళ్ళు భోగభాగ్యాలతో తులదూగడం కోసం అట! 'ప్రజల్ని సుఖంగా పరిపాలించడం కోసం' మాత్రం కాదు. ★

రాజ్యం చెయ్యాలని వుందటోయ్! నీ రాజ్యం అతనికి ఇచ్చెయ్యి' అని చెపుతాను. నేను చెప్పానంటే భరతుడు తప్పకుండా వింటాడు. ఆ రాజ్యం నీకే ఇస్తాడు. నీకు తృప్తి కలుగుతుంది.[80] లేకపోతే భరతుణ్ణి చంపాలని అంత క్రోధంగా ఎందుకు మాట్లాడతావు? అసలు అంత సాత్వికుణ్ణి ఎందుకు శంకిస్తావు?" రాముడు, ఆ మాట లన్నీ దూసిపోసేసి లక్ష్మణుణ్ణి తీక్షణంగా చూశాడు.[81]

అన్నగారి ధోరణికి, లక్ష్మణుడు నిర్ఘాంతపోయి, ఖిన్నుడై తలవొంచుకున్నాడు.

సీత కూడా ఆశ్చర్యపోయింది – లక్ష్మణుడు రాజ్యం కోరుతున్నాడా? ఏం మాటలవి? లక్ష్మణుడి ఆరాట మంతా ఎవరికోసమో తన భర్తకు తెలీదా? అతడు ఎవరి మేలుకోసం భరతుణ్ణి శంకించాడో గ్రహించలేరా? .... ఎందుకంతంత కఠినమైన మాటలు, అమాయకుడి మీద? – సీత లక్ష్మణుడి మొహం చూడడానికే సిగ్గు పడింది.

లక్ష్మణుడు, రాముడి మందలింపులకు తల వొంచు కున్నా, అతని ఇంగితం సర్రున ఎదురు తిరిగింది! "ఏంటీ? రాజ్యం నేను చెయ్యాలనా కోరేది? రాజ భోగాలన్నీ నా కోసమేనా ఆశించేది? ఎవరి సౌఖ్యం కోసం ఇంత వూడిగం చేస్తున్నానో నీకు అర్థం కావట ంలేదా? నా సేవలకు నువ్వు చేసే సత్కారం ఇదా?" అని రాముణ్ణి ధిక్కారంగా చూసింది. లక్ష్మణుడి చూపుల్లో తీక్షణతని రాముడు గ్రహించివుంటే, అదిరి పడేవాడే.

ఇంగితం, లక్ష్మణుడితో – "అసలు నీ అంత బుద్ధి లేనివాడీ ప్రపంచంలో వుండడు. నీ అన్న ఎప్పుడూ ఆ భరతుణ్ణే ఎక్కువ చేస్తాడు. కనిపెట్టావా? అహంకారులైన మనుషులెప్పుడూ తమతో సమాన హోదాలో నిలబడే వాళ్ళనే గౌరవిస్తారు గానీ, తమకు వూడిగం చేస్తూ బతికేవాళ్ళని గౌరవించరు. చిన్నతనం నించీ నీ అన్న నిన్ను నిర్లక్ష్యంచేసి భరతుణ్ణి గొప్ప చేస్తూనే వున్నాడు. అయినా నీకు బుద్ధి రావడం లేదు" అని వెటకారంగా నవ్వింది. "రాజ్యం నీకిప్పిస్తాడట, తీసుకోరాదూ? నువ్వు కోరితే మాత్రం నీకెలా ఇప్పిస్తాడో! రాజ్యం నీకిప్పించి తండ్రి ఆజ్ఞని ఏ గంగలో కలుపుతాడు? భరతుణ్ణి ఎందుకు శంకిస్తున్నావు? – అని నిన్ను నిలదీసి అడుగు తున్నాడే? పట్టాభిషేకానికి ముందు, రెండు వారాల ముందు, ఆ భరతుణ్ణి తనెందుకు శంకించాడు? పట్టాభి షేకం జరుగుతుందా లేదా, జరుగుతుందా లేదా, భర తుడి వల్ల ఆటంకం వొచ్చి పడుతుందా? – అని తను సందేహిస్తూనే వున్నాడెందుకు? ఎప్పుడూ వీసమెత్తయినా హానిచెయ్యని భరతుణ్ణి తనెందుకు శంకించినట్టు? ఛీ! నీ అన్న బుద్ధేవిటో నువ్వు ఇప్పటికీ గ్రహించినట్టు లేదు" అంటూ ఇంగితం ఛీత్కారం చేసింది.

లక్ష్మణుడు ఇంగితాన్నేమీ అనలేక చిన్న బుచ్చుకుని నించున్నాడు.

రాముడు కొంచెం తటపటాయించి, లక్ష్మణుడికి కష్టం కలిగించే మాటలన్నానని జంకి, మళ్ళీ అతన్ని మాటల్లోకి దింపుతూ చిరునవ్వు[82] చిందిస్తూ చూశాడు "లక్ష్మణా! అసలు మన తండ్రిగారే బయల్దేరి వొస్తున్నా రేమో! మనం అడవులకు వొచ్చేసింతర్వాత ఆయన బాగా ఆలోచించి వుంటాడు. 'అయ్యో! నా కొడుకులు చిన్నతనం నుంచీ సుఖ భోగాలనుభవించిన వాళ్ళు కదా? ఇప్పుడు అడవుల్లో జీవించడం చాలా కష్టం అవు తుంది' అని అర్థం చేసుకున్నాడేమో! అవును. అంతే అయివుంటుంది. మనల్ని మళ్ళీ ఇంటికి తీసుకుపోవా లని వొస్తూ వుండి వుంటాడు .... రథాలవీ ఈసారి బాగానే కన పడుతున్నాయి. అటు చూడు! అదిగో, మన తండ్రి గారి పట్టపుటేనుగు కూడా వొస్తోంది. నన్ను దాని మీద కూర్చోబెట్టి తీసుకువెళ్ళాలని కావును. సరిగ్గా చూడు! నాయనగారి శ్వేతచ్ఛత్రం ఎక్కడా కనబడడం లేదే! నాకెందుకో సందేహం కలుగుతోంది. ఒకవేళ

---

**80.** **అయోధ్యా, సర్గ 97, శ్లోకాలు 17, 18:** "నీకు రాజ్యం కావాలా" అని రాముడు లక్ష్మణుణ్ణి అడగడం రామదాసులైనా సహించగలరా? భరతుడి మీద రాముడికి మాత్రం కోపం లేదా? లక్ష్మణుడు ఎవరి మేలుకోసం భరతుణ్ణి శంకిస్తున్నాడో రాముడికి తెలీదా? రాముడు, భరతుణ్ణి వెనక వేసుకువచ్చి లక్ష్మణుణ్ణి తిట్టవలసిన అవసరం ఏమొచ్చింది? భరతుడు పాలించవలసిన రాజ్యాన్ని తను లక్ష్మణుడికి ఇప్పిస్తే, అది తండ్రి ఆజ్ఞని ధిక్కరించడం కాదా? ★

**81.** **అయోధ్యా, సర్గ 97, శ్లోకం 14:** "భరతుడు పూర్వం నీ కెప్పుడైనా ఏమయినా అపకారం చేశాడా? ఎప్పుడూ అపకారం చెయ్యనివాణ్ణి గురించి ఇప్పుడెందుకు శంకిస్తున్నావు?" అని అడుగుతున్నాడు రాముడు, లక్ష్మణుణ్ణి. మరి పదిహేనురోజుల కిందటే, పట్టాభిషేకానికి ముందురోజు, తన తండ్రి తనని రహస్య మందిరంలోకి పిలిచి – "నాయనా! భరతుణ్ణి నమ్మడానికి వీలు లేదు. అతడి మనుషుల వల్ల నీకు ప్రమాదం ఉంటుంది. అతడు రాకుండానే పట్టాభిషేకం చేసుకోవాలి" అని గుస గుసలాడినప్పుడు, ఈ శ్రీరాముడు – "భరతుడు మనకేం అపకారం చేశాడు? అతణ్ణి ఎందుకు శంకించవలసి వొచ్చింది!" అని తండ్రిని అడగలేదేం, ఇప్పుడు లక్ష్మణుణ్ణి అడిగినట్టు? ★

**82.** **అయోధ్యా, సర్గ 97, శ్లోకం 21:** తన మందలింపులవల్ల లక్ష్మణుడు మనసు కష్టపెట్టుకున్నాడేమోనని శంకించి, నేర్పుగా మాట్లాడుతున్నాడు రాముడు. ★

ఆయన పోయినాడేమో! ఏమంటావు?" అని సాలోచనగా చూశాడు.[83]

లక్ష్మణుడి ఇంగితం మండిపడుతూ – "ఇదిగో, అతని మాటలేవీ నమ్మకు! నీకు కోపం వొచ్చిందని గ్రహించి నిన్ను మంచి చేసుకోవాలని చూస్తున్నాడు. ఎవరికి తెలియని నాటకం ఇదంతా? ఎందుకిక్కడ పడి గొడ్డులాగ చాకిరీ చేస్తావు? పుణ్యం రాకపోతే మానేలే. ఆ వొచ్చే జనంతో మనం కూడా అయోధ్యకి పోదాం పద! తెలిసొస్తుంది అయ్యగారికి. వేదాంత చర్చలే చేస్తాడో, కట్టెలే కొడతాడో" అంటూ ఎగిరింది.

లక్ష్మణుడికి ఇంగితం మాటలు చాలా నచ్చాయి గానీ, అయినా కష్టమనిపించాయి. "చాల్లే, ఇక నోరు ముయ్యి! కొంచెం మాట్లాడనిస్తే ఇక నిన్ను పట్టలేం. మరీ అంతంత దురుసు మాటలెందుకు? ఆయన నా అన్న. పెద్దవాడు. ఆయన నాలుగు మాటలన్నా, నేను పడ్డా తప్పు లేదు. ఆయన కాకపోతే ఇంకెవరు మందలిస్తారు నన్ను?" అని ఇంగితం మీద తనూ కొంచెం ఎగిరాడు.

"ఎవరో వొకరు మందలిస్తూ వుండాలన్నమాట నిన్ను! నీ బతుకు చెడా! ఇప్పటికే చెడిందిలే. ఎలాగో తగలడు! నేను పోతున్నా. మళ్ళీ కనపడితే అడుగు!"

ఇంగితం వూరుకోగానే లక్ష్మణుడు అన్నగారికి నమస్కరిస్తూ– "అవును, అన్నగారూ! తండ్రిగారి జాడలు కనపడటం లేదు. ఆయన పోయే వుంటాడు" అని నిట్టూర్చాడు.

రాముడికి, తండ్రి వున్నాడో లేడో – ఆ విషయం మీద దృష్టి లేదు – "సరే! విషయం నెమ్మదిగా అదే తెలుస్తుంది. నేను పర్ణశాలలోకి పోయి కూర్చుంటాను. నువ్వు ఇక్కడే నిలబడి ఏం జరుగుతుందో కనిపెడుతూ వుండు!" అంటూ లేచి – "సీతా! నువ్వు కూడా నాతో లోపలికి వొచ్చి కూర్చో!" అని భార్యని వెంటబెట్టుకుని గబ గబా పాకవేపు అంగలు వేస్తూ వెళ్ళిపోయాడు.

★ ★ ★

దూరంగా భరతుడి సేన అంతా ఆగింది. ఏనుగుల్నీ, గుర్రాల్నీ, రథాల్నీ ఆపారు. భరతుడు, రథం దిగి సుమంత్రుణ్ణీ, వశిష్టుణ్ణీ, గుహుణ్ణీ వెంటబెట్టుకుని అన్నగారి గురించి మాట్లాడుతూ నడుస్తున్నాడు. అక్కడక్కడా చెట్లకొమ్మలకు వున్న గుర్తులు సులువుగా దారి చూపెడుతున్నాయి. అన్నగార్ని చూడాలని ఆత్రుత పడుతూ భరతుడు, దారి చూసుకుంటూ తాటాకుల పాక దగ్గరికి చేరాడు.

★ ★ ★

భరతుడు ఆవరణలో ప్రవేశించే సరికి రాముడు గుమ్మం ముందు దర్భాసనం మీద ధ్యానంలో మునిగి వున్నాడు.

సీత లోపలి గది గడపలో తల వొంచుకుని కూర్చుని వుంది.

లక్ష్మణుడు గుమ్మం బయట వినయంగా తలవాల్చి నిలబడి వున్నాడు.

భరతుడూ, శతృఘ్నుడూ, రాముణ్ణి చూడగానే అతని ముందు సాష్టాంగపడిపోయారు. "అన్నగారూ! అన్నగారూ!" అంటూ భోరున ఏడవడం మొదలు పెట్టారు. భరతుడు, ఏడుపు మధ్య వెక్కిళ్ళతో – "అయ్యో, సింహాసనంమీద కూర్చోవలసిన నా అన్నగారికి దర్భల మీద కూర్చునే గతి పట్టిందా? సుఖభోగాలలో తేలవలసిన మహారాజుకి వనవాస దౌర్భాగ్యం కలిగిందా?" అని ఏడుస్తూ, మాట్లాడుతూ, ఏడుస్తూ, అన్నగారి పాదాల మీద తలవాల్చాడు.

రాముడు ధ్యానంలోంచి అప్పుడే కళ్ళు తెరిచి చూసినట్టు తమ్ముళ్ళని గంభీరంగా చూశాడు, వాళ్ళ సంగతి తనకి అప్పుడే తెలిసినట్టు! భరతుణ్ణి చూడగానే రాముడి మనసు – "ఇతడు కూడా రుషుల వేషంలో వొచ్చాడే! రాజ్యం ఏం చేశాడు? చెయ్యనని తిరస్కరించాడా? నా అన్నకే లేని భోగాలు నాకెందుకు – అన్నాడా?" అని తీవ్రంగా ఆలోచనల్లో మునిగింది.

రాముడు శతృఘ్నుడివేపు కన్నెత్తయినా చూడకుండా భరతుణ్ణి మాత్రం దగ్గిరికి లాక్కుని, తొడమీద కూర్చోబెట్టుకుని, తల నిమరడం ప్రారంభించాడు.[84] తాత, మనవణ్ణి బుజ్జగించినట్టు బుజ్జగిస్తూ మొదలు పెట్టాడు – "నాయనా! చాలా మారిపోయావు. నువ్వు తాతగారి ఇంటికి వెళ్ళి చాలా కాలం అయింది. చూడగానే పోల్చలేకపోయాను. క్షేమంగా వున్నావా? అయోధ్యలో జరిగిందంతా విన్నావు కదా? నీ తల్లి నీకోసం రాజ్యం సిద్ధం చేసి వుంచింది. చక్కగా రాజ్యం చేసుకోక ఈ వేషంతో అడవికి వొచ్చా వెందుకు? మహారాజు బతికి వుండగా నిన్ను వొదలడే! ఆయన మరణించాడా ఏమిటి? నేను లేనన్న దుఃఖంతో, ఇంకేమి జీవిస్తాడు మహారాజు?

---

**83.** **అయోధ్యా, సర్గ 97, శ్లోకం 16:** దశరథుడికి సంబంధించిన గుర్తులేవీ కనపడకపోవడంవల్ల దశరథుడు బతికి వున్నాడో లేడోనని రాముడికి సందేహం కలిగింది. అయితే, రాముడు, తండ్రి గురించి తెలుసుకోవడానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చాడో, భరతుడు వచ్చిన తర్వాత తండ్రి గురించి ఎప్పటికి తెలుసుకున్నాడో చూడండి! ★

**84.** **అయోధ్యా, సర్గ 100, శ్లోకం 3:** "రాముడా భరతుని శిరము మూర్కొని, యతనిని కౌగిలించుకుని, ఒడిలో కూర్చుండజేసి యనన్య మనస్కుడై ఇట్లడిగెను." ★

మన తల్లులందరూ సుఖంగా వున్నారా? వొచ్చి నప్పటి నించీ తండ్రికి శుశ్రూషలు చేస్తున్నావా? రుషి వేషంతో వొచ్చావు. అడవుల్లో వుండాలని నిశ్చయించు కున్నావా? రాజ్యంలో నేను లేకపోవడంవల్ల నిన్ను చిన్న వాణ్ణిచేసి, శత్రువు లెవరయినా రాజ్యం ఆక్రమించారా? అసమర్థతతో రాజ్యం పోగొట్టుకున్నావా?" అంటూ ప్రశ్నల వర్షం[85] ప్రారంభించాడు.

తండ్రి గురించి అడిగాడేగానీ, తండ్రి ఎలా వున్నాడో వినాలని రాముడికి ఆసక్తే లేదు. భరతుడి వీపు వెనక కోసల సింహాసనం నవరత్న ఖచితంగా ధగ ధగ మెరుస్తూ కనబడుతోంది. రాజ్యపాలన గురించి ఎన్నెన్నో ప్రశ్నలడగాలని మనసు ఆరాటపడి పోతోంది. భరతుడు రాజ్యం ఎలా చేస్తున్నాడో! ఏం అవకతవకలు చేస్తు న్నాడో! ఎంతైనా తను చేసినట్టు చెయ్యగలడా? తనైతే రాజవుతాడనే నమ్మకంతో ఎంతో కాలంనించీ ఎన్నో రాజకీయ విషయాలు గ్రహించుకున్నాడు గానీ .... భరతుడికేమి తెలుసు రాజ్యం చెయ్యడం?

భరతుడు, రాముడి తొడమీద చోటు చాలక ఇబ్బందిపడి కొంచెం పక్కకి జారబోయాడు. రాముడు గట్టిగా చేతులు బిగించి అతణ్ణి పట్టుకున్నాడు – "నాయనా! తెలివితేటలతో రాజ్యపాలన చేసుకుంటు న్నావా? ఏయే కాలాల్లో హోమాలు చెయ్యాలో తెలుసు కున్నావా? దేవతల్నీ, బ్రాహ్మల్నీ, పురోహితుల్నీ పూజిస్తు న్నావా? ముఖ్యంగా మన కుల గురువు వశిష్ఠులవార్ని నిత్యం పూజిస్తున్నావా? మన ధనుర్వేదాచార్యుల వారికి బహుమానాలిచ్చి సంతోష పెడుతున్నావా.......?"

ధనుర్వేదాచార్యుల వారంటే రాముడికి ప్రత్యేకాభి మానం. ఆయనతో రాముడు రాజనీతులన్నీ చర్చిస్తూ వుండేవాడు. చుట్టుపట్ల రాజ్యాల సంగతులు మాట్లా డుతూ వుండేవాడు. ఆయన ఎప్పుడూ "మహా రాజు వవుతావు నాయనా! సిరిసంపదలతో తులతూగుతావు నాయనా!" అని ఆశీర్వదిస్తూ వుండే వాడు. రాముడు చిరునవ్వుతో–"నేను రాజు నయిన తర్వాత మిమ్మల్ని బహుమానాలతో ముంచెత్తుతాను గురుదేవా!" అని వాగ్దానాలు చేసేవాడు.

ఆ మధురస్మృతులన్నీ జ్ఞాపకం వొచ్చినా రాముడు నిగ్రహించుకొని భరతుణ్ణి గంభీరంగా చూశాడు. "నాయనా భరతా! పెద్దల్నీ, పండితుల్నీ, ధనధాన్యాలూ, రత్నాలూ ఇచ్చి వశీకరించుకోవాలి సుమా! మంచి కులం వారినీ, తెలివయిన వారినీ, ఎదటి వారి మొహం చూడగానే వారి మనసులో ఏముందో కనిపెట్టగలిగే వారినీ, మంత్రులుగా చేసుకున్నావా? రాజ్యానికి సంబం ధించిన విషయాలెప్పుడూ మంత్రులతో మాత్రమే రహ స్యంగా ఆలోచించాలి సుమా! నువ్వొక్కడివే ఆలోచించ కూడదు. అలా అని మరీ ఎక్కువ మందిని చేర్చుకునీ ఆలో చించకూడదు. మంత్రులందరితోనూ ఒకసారి కలిసి ఆలోచించి, మళ్ళీ ఒక్కొక్క మంత్రినీ వేరువేరుగా పిలిచి ఆలోచించాలి. అర్ధ రాత్రులు వొక్కడివే ఏకాం తంగా కూర్చుని రాచకార్యాల గురించి అదే ధ్యాసగా ఆలోచించకూడదు. శాస్త్ర నియమాలు మీర రాదు!"

రాముడికి పూర్వం రాజకీయ సమస్యలతో నిద్ర పట్టేది కాదు. వొక్కడే ఒంటరిగా కూర్చుని, శత్రు రాజుల గురించీ, బలాబలాల గురించీ, జయాప జయాల గురించీ ఆలోచిస్తూ వుండేవాడు. ఒక్కొక్కసారి సీత నిద్రకళ్ళతో లేచి వచ్చి – "చాలా రాత్రి గడిచింది. విశ్రాంతి తీసుకోండి ప్రభూ!" అని ప్రార్థించేది. రాముడు, గుణం కుదిరితే మాట్లాడకుండా వెళ్ళి పడు కుని నిద్రపోయేవాడు. లేకపోతే – "సీతా! నువ్వు స్త్రీవి. రాచ కార్యాల కష్ట నిష్ఠూరాలు నువ్వు గ్రహించలేవు. పోయి నిద్రపో" అని విసుక్కునేవాడు. అలాంటి రాత్రులు జ్ఞాపకం వొచ్చి – "నేనెప్పుడూ రాత్రులు రాజకీయాల ధ్యాసతో గడపలేదు సుమా!" అని భరతుడికి చెప్పాలని రాముడి తాపత్రయం.

"నాయనా! భరతా! స్వల్ప ప్రయత్నంతో అధిక ప్రయోజనం సిద్ధించే కార్యం చెయ్యాలని నిశ్చయించు కుంటావనుకో! ఒక్క క్షణం కూడా జాప్యం చేయ కూడదు. ఆ కార్యం వెంటనే చేసెయ్యాలి ...."

రాముడి అంతరాత్మ విసుక్కుని "ఎందుకోయీ? ఈ సంగతులన్నీ నువ్వు చెప్పడం ఎందుకు? అతడి రాజ్యం అతడికిష్టమైనట్టు చేసుకుంటాడు. మంత్రులున్నారు, పురోహితులున్నారు. వారే నడుపుతారు రాజ్యాంగం. అసలు రాజు చెయ్యవలసినదేముంటుంది? తెలియనట్టు మాట్లాడతావేం?" అని హెచ్చరించబోయింది.

రాముడికి చాలా కోపం వొచ్చింది అంతరాత్మ మీద! "నువ్వింకా బతికున్నావా? సీలమండలోంచి పైకెప్పు డొచ్చావు? నా సోదరుడి రాజ్యం నా రాజ్యంతో సమానం

**85.** 'ప్రశ్నల వర్షం' అన్న మాటలు ఆధారం లేకుండా అన్నవి కావు. 100వ సర్గలో 79 శ్లోకాలున్నాయి. వాటిలో రాముడు భరతుణ్ణి కొన్ని వందల ప్రశ్నలు అడిగాడు. ఏయే సంగతులు అడిగాడో చూడండి! తండ్రి గురించి అడిగాడేగాని దాని జవాబు ఎప్పటికి విన్నాడో చూడండి! పైగా, ఈ వందలకొద్దీ ప్రశ్నల్లో ఏ ప్రశ్నకీ జవాబు వినే ధోరణి లేదు. ప్రశ్నలు కురి పించడమే! ఆ వర్షం ఎక్కడా ఆగదు. నేనే కొంత చొరవచేసి, పరిస్థితిని వివరించడం కోసం, మధ్య మధ్య కొంతసేపు, ప్రశ్నల్ని ఆపాల్సివచ్చింది. 'మూలం'లో మాత్రం ఈ ప్రశ్నలన్నీ ఏకధాటిగా కురుస్తాయి. ★

కాదూ? రేపు వనవాసం ముగించి నేను వెళ్ళేసరికి రాజ్యం మిగిలి వుండాలా, లేదా? అతనికి చేతగాక అవక తవక పరిపాలన చేసి రాజ్యమంతా శత్రుపరం చేస్తే నేనేమైపోవాలి? కొంచెం జాగ్రత్తలు చెపితేనే కదా రాజ్యం నిలబడేది? చుట్టూ ఎందరు శత్రురాజులు పొంచి వుంటారో నీకేం తెలుసు? రాజు సక్రమంగా పరిపాలించకపోతే, అసమర్థుడైపోతే, శత్రువులంతా వొక్క సారిగా మీదపడి ఆక్రమించుకుంటారు. నేను వెర్రివాడనై చెపుతున్నాననుకుంటున్నావా ఈ రాజనీతులన్నీ?" అంటూ ఆత్మని కఠినంగా మందలించాడు. రాముడి ఆత్మ, లక్ష్మణుడి ఇంగితం అంత సాహసం కలది కాదు. ధైర్యంలేక మారు మాట్లాడకుండా మొహం ముడుచుకుని వూరుకుంది.

రాముడు తన ఆత్మకు తను నచ్చచెప్పుకున్నాననే ఉత్సాహంతో భరతుణ్ణి చిరునవ్వుతో చూశాడు – "నాయనా! స్వల్ప ప్రయత్నంతో అధిక ప్రయోజనం అన్నానే! దానికి వివరం చెబుతాను విను! మాట వరసకి, ఇరుగుపొరుగు రాజెవరయినా అస్వస్థుడో, విషయ లంపటుడో అయివుండి, రాచకార్యాలు నిర్వర్తించలేకపోతున్నాడనుకో! చిన్న దాడి మాత్రంతో ఆ రాజ్యం మనకు సిద్ధించేటట్టు అయితే, ఆ కార్యం వెంటనే చేసెయ్యాలి! కార్యం పూర్తిగా ముగిసేవరకూ ఆ విషయం మన సామంతరాజులకు గానీ, ఇతరులకు గానీ, తెలియ కూడదు. ఇలాంటి ఉపాయాలన్నీ చెప్పడానికి తెలివయిన పండితులున్నారా నీ ఆస్థానంలో? తెలివి తక్కువ వారిని వెయ్యి మందిని చేర్చినా లాభం లేదు. పండితుడైతే ఒక్కడు చాలు. ఆపదలో రాజుని రక్షిస్తాడు. అన్నట్టు వశిష్ట పుత్రుణ్ణి సుయజ్ఞుణ్ణి పూజిస్తున్నావా? ఆయన బహుయోగ్యుడు సుమా!

నాయనా! రాజు, తన ఆస్థానంలోనూ, దేశంలోనూ ఉద్యోగాలివ్వడానికి కూడా ఒక క్రమం పాటించాలి. ఉత్తమ కులం వారికి మంచి ఉద్యోగాలివ్వాలి. మధ్యములకు వొకరకం ఉద్యోగాలివ్వాలి. నీచ కులం వారికి తక్కువ రకం ఉద్యోగాలివ్వాలి."**86**

రాముడు, తను రాజ్యానికి రాగానే ఉద్యోగుల విషయంలో చాలా మార్పులు చెయ్యాలనుకున్నాడు. కొందర్ని తీసివేసి, కొందర్ని కొత్తగా పెట్టి, కొందర్ని కిందకు తోసి, కొందర్ని పైకి లాగి, చాలా మార్పులు తెలివిగా చెయ్యాలనుకున్నాడు. కానీ ... హూఁ! "ఈ క్రమం పాటించకపోతే పెద్ద కులం వారనీ, చిన్న కులం వారనీ, తారతమ్యాలు లేకుండా పోతాయి నాయనా! అందుచేత నువ్వుకూడా ఆ విధంగా చేస్తున్నావు కదా?"

భరతుడికి అన్నగారి ప్రశ్నలన్నీ చాలా ఇబ్బందిగా వున్నాయి. అసలు అన్నగార్ని కలుసుకోగానే తండ్రి మరణం సంగతి చెప్పాలనుకున్నాడు. తన కెంతమాత్రం రాజ్యకాంక్ష లేదని వెల్లడించాలనుకున్నాడు. అవతల తల్లులందరూ రథాల్లో వున్నారు. ఎందరో బంధువులూ, ఉద్యోగులూ వొచ్చి వున్నారు. అందరూ రాముణ్ణి చూడాలని ఆతృతగా వున్నారు. ఈ రాజ నీతులేమిటో ... ఇవన్నీ తన కెందుకు?

"ఇంకా నాకెన్ని విషయాలు తెలుసో చూడు!" అన్నట్టు రాముడు తల కిందకీ మీదకీ పంకిస్తూ "నాయనా భరతా! ప్రజలకు కఠిన శిక్షలు వెయ్యకూడదు సుమా!" అన్నాడు.

భరతుడు ఆ శిక్షలన్నీ తనకే పడ్డట్టు ఇబ్బందిగా పెట్టాడు మొహం.

"ఎక్కువ పన్నులు కూడా వసూలు చెయ్యకూడదు నాయనా! నువ్వు ధనాశచే పన్నులు అధికంగా వేసి ప్రజల దూషణలకు గురి కావడం లేదు కదా?"

ఇదేమిటి! తనొచ్చి ఎన్నాళ్ళయింది గనక? పన్నులేవిటి?

భరతుడు కొంచెం తల ఎత్తి నోరు తెరవబోయాడు.

"నాయనా! కొందరు రాజకీయాలన్నీ తెలిసిన ఉద్యోగులు రాజుకి వ్యతిరేకంగా గోతులు తవ్వాలని చూస్తారు సుమా! అలాంటి వారికి నిర్దయగా మరణ శిక్షలు వేసెయ్యాలి. లేకపోతే రాజుకే ప్రాణహాని తెస్తారు. అలాంటి వారెవ్వరూ నీ రాజ్యంలో లేరు కదా?"

భరతుడు మళ్ళీ తెరవబోయాడు నోరు.

"నాయనా! యుద్ధాల్లో రకరకాల వ్యూహాలు పన్నగల వాణ్ణీ, వీరుణ్ణీ విశ్వాసపాత్రుణ్ణీ సేనాపతిగా పెట్టుకున్నావా? యుద్ధాలలో రాజభక్తితో చక్కగా పోరాడే వీరుల్ని సన్మానిస్తున్నావా?"

భరతుడు బిత్తరపోతున్నాడు. అన్నగారి అంచనా ప్రకారం అయినా తను రాజ్యానికి వొచ్చి పది రోజులయింది. అంతలోనే యుద్ధాలేమిటి? యుద్ధాల్లో వీరుల్ని సన్మానించడాలేమిటి?

గుహుడు తెల్లబోయి నోరు తెరుచుకుని చూస్తున్నాడు – రాముడి మొహాన్ని. తమ్ముళ్ళు రాగానే మంచీ చెడ్డా మాట్లాడకుండా, తండ్రి గురించి తెలుసుకోకుండా, ఇప్పుడీ ప్రశ్నలేంటంటా?

రాముడు చెపుతూనే వున్నాడు – "సైనికులకు జీత భత్యాలు ('వేతనమ్' అన్నాడు కవి.) ఇవ్వడంలో ఆలస్యం చెయ్యగూడదు సుమా! వాళ్ళు జీతాలమీదే బతుకుతారు. అవి అందటం ఆలస్యం అయితే ప్రభువుల మీద కోపం

---

**86.** **అయోధ్యా, సర్గ 100, శ్లోకం 25:** ఉద్యోగాలు ఏ క్రమంలో ఇవ్వాలో చెపుతున్నాడు రాముడు. కులాల హెచ్చు తగ్గుల ప్రకారమే మనుషుల్ని గుర్తించాలని చెప్పే రాజనీతి ఇది! ★

పెట్టుకుని ఎన్నో విధాలుగా కీడు తలపెడతారు! యుద్ధాలలో ప్రాణాలకు తెగించి యుద్ధం చెయ్యకపోవచ్చు. శత్రుపక్షంలో కలసిపో వచ్చు. ఏది జరిగినా రాజుకి చాలా ప్రమాదం సుమా! వారి జీతాలు వారికి సకాలంలో ఇచ్చేస్తూ వుంటే, ప్రమాదం కొని తెచ్చుకోనవసరం లేదు. నువ్వు కూడా అలాగే చేస్తున్నావా?"[87]

ప్రశ్నలు అడుగుతున్నాడేగానీ, వొక్కదానికీ జవాబు వినాలనే దృష్టి లేదు రాముడికి – "నేనే రాజునయితే ఎంత నేర్పుగా, ఎంత చాకచక్యంగా, రాజ్యం పాలించే వాడినో తెలుసా?" అనే ధోరణితో ఏది గుర్తొస్తే అది అడిగెయ్యాలని తొందరపడుతున్నాడు.

"నువ్వు ప్రజల్ని కఠినమైన శిక్షలు వేసి పీడిస్తూ వున్నావేమో! అలా చెయ్యకూడదు నాయనా! అలాంటి సమయాలలో నీ మంత్రులయినా నిన్ను వారించాలి. నువ్వు మంత్రుల మాటలయినా వింటున్నావో లేదో! – అన్నట్టు దూతల సంగతి ఆలోచించావా? జ్ఞానవంతుణ్ణీ, నమ్మకస్తుణ్ణీ, నీ దేశంలోనే పుట్టినవాణ్ణీ, వెళ్ళిన పని సాధించుకొచ్చేవాణ్ణీ, ముఖ్యదూతగా చేసుకున్నావా? తెలివి తేటలూ, చాకచక్యమూ గల గూఢచారుల్ని నియమించుకున్నావా?"

ఇతర ఆశ్రమాలనించి కొందరు రుషులు వొచ్చారు, ఇక్కడ జరిగే దేవిటో చూద్దామని. రథాలు ఆగిన చోట దూరంగా నించున్న ఉద్యోగులూ, మంత్రులూ కూడా వొచ్చారు.

గుహుడి చెవిదగ్గర జోరీగ వొకటి చేరి "జ్ జ్ జ్ జ్ జ్ జ్" అంటూ రొద చేస్తోంది. ఎంత సేపట్నుంచో దాన్ని కొట్టాలని చూస్తున్నాడతను. తొడమీద వాలిందని బాద బోతే తీరా అది గూఢచారుల్లాగ చాకచక్యంగా తప్పుకుంది. గుహుడు ఛెళ్ళున తొడ బాదుకుని, ఆ కోపంతో రాముణ్ణి చూస్తూ– "ఇప్పుడీ ప్రశ్నలన్నీ ఏవిటి నాయనా? భరతుడు రాజ్యాంగం అంతా తిరగతోడాడా ఏవిటి? మంత్రులూ, గింత్రులూ, అందరూ పూర్వం వున్న వాళ్ళేగా? ఇక చాలుగానీ అసలు వ్యవహారం ఏమిటో చూడు!" అని కోప్పడదామనుకున్నాడు. అంతలో జోరీగ మళ్ళీ చెవి దగ్గిరి కొచ్చింది. దొరికిందని కోపంగా దాని వ్యవహారంలో పడి అటు తిరిగాడు.

రాముడు, ప్రశ్నలు సాగిస్తూనే వున్నాడు "ప్రధాన ఉద్యోగాలలో వున్న మన క్షత్రియులందరూ నీ మీద అనురాగంతో వున్నారా?[88] అవసరం అయితే నీ కోసం ప్రాణాలిచ్చేంత భక్తితో వున్నారా? నీ మంత్రులూ, కోశాధికారులూ, రాయబారులూ, నీ శత్రువులతో కుమ్మక్కై నీ చాటున మంతనాలు సాగిస్తున్నారేమో కనిపెడుతున్నావా? మంత్రుల మీదా, సేనాధిపతులమీదా, కోశాధికారులమీదా, రాష్ట్ర పాలకులమీదా, ఇంకా అదే విధంగా ఉన్నతోద్యోగులమీదా, వొక్కొక్కరికీ ముగ్గురేసి చారుల చొప్పున నియమించి వారి రహస్య ప్రయత్నాలేమిటో వారి గుట్టుమట్లన్నీ తెలుసుకుంటూ వుంటున్నావా?"

భరతుడు ఇబ్బంది పడుతున్నట్టు తల వొంచుకున్నాడు. మంత్రులందరూ గుమ్మంముందే కూర్చుని వున్నారు. వాళ్ళ మీదే చారుల్ని పెట్టమని చెపుతున్నాడు అన్నగారు! రాముడు ఎవర్నీ గమనిస్తున్నట్టు లేదు. ఎవర్నీ పలకరించడం లేదు.

సీత కొంచెం సాహసం చేసి – "ఇప్పుడా సంగతులెం ...." అనబోయి మాటలు కంఠంలోంచి బయటికి రాక వూరుకుంది.

భరతుడు నెమ్మదిగా రాముడి తొడ మీద నించి జారి పక్కకు.. పక్కకు..కొంచెం దూరంగా జరిగాడు.

రాముడు, తొడ తిమ్మిరెక్కి మొహం చిట్లిస్తూ, "నీకు నమ్మకస్తులైన పురోహితులతో మాత్రం చాలా సన్నిహితంగా వుండవొచ్చును. ఊఁ .... తప్పు లేదు, ఏమీ నష్టం కలగదు, లాభమేగానీ. ఇంకో సంగతి! నువ్వు తరిమికొట్టిన శత్రువులు కొంతకాలం తర్వాత మళ్ళీ వొచ్చారనుకో! ఇక వారేమీ చెయ్యలేరులే, శక్తిహీనులైపోయారులే – అని నిర్లక్ష్యంగా వుంటున్నావా ఏమి? పాముని ఎలా నమ్మకూడదో శత్రువునీ అలాగే నమ్మకూడదు."[89]

లక్ష్మణుడి ఇంగితం పక పక నవ్వటం మొదలు పెట్టింది. లక్ష్మణుడు కాస్సేపు వూరుకుని – "ఎందుకలా పగలబడిపోతున్నావు?" అన్నాడు మొహం ముడుచు

---

**87.** **అయోధ్యా**, సర్గ 100, **శ్లోకాలు 32, 33**: సైనికులకు జీతాలు ఆలస్యం చెయ్యకుండా ఎందుకు ఇవ్వాలో చెప్తున్నాడు రాముడు. వారు ఇబ్బందులు పడకుండా సుఖంగా జీవించడానికి కాదు. వారికి కోపంవచ్చి తిరగబడి రాజుకి కీడు కలిగిస్తారేమోనని! అలా జరగకుండా రాజు సుఖంగా రాజ్యం చెయ్యాలంటే, ముఖ్యంగా రాజుకి సైన్యం లొంగి వుండేటట్టు చేసుకోవాలని చెపుతున్నాడు. ★

**88.** **అయోధ్యా**, సర్గ 100, **శ్లోకం 34**: రాజు క్షత్రియుడు కాబట్టి ప్రధానమైన ఉద్యోగాలలో క్షత్రియులే వుంటారు. వారు పెద్దకులం వారే కాబట్టి పెద్ద ఉద్యోగాలలో వుంటారు. ★

**89.** **అయోధ్యా**, సర్గ 100, **శ్లోకం 37**: భరతుడు శత్రువుల్ని తరిమికొట్టి, కొంత కాలానికి వారు తిరిగి వస్తే వార్ని నమ్మి రాజ్యానికి కీడు తెచ్చేస్తున్నాడని కంగారుపడిపోతున్నాడు రాముడు – ఆ వారం రోజుల్లో! ★

కుంటూ. ఇంగితం పడీపడీ నవ్వుతూ – "నువ్వు కూడా .... అహ్హహ్హా...., నవ్వరాదూ? .... అహ్హహ్హా.... ఎందు కలా నవ్వాపుకోవాలని ప్రయత్నిస్తావూ? అహ్హహ్హహ్హహ్హా! భరతుడొచ్చి ఎన్ని రోజులయిందో నీ అన్నకి తెలీదూ? ఈ పది రోజులకేనా శత్రువుల్ని తరిమికొట్టడం .... వాళ్ళు కొంత కాలం తర్వాత తిరిగి రావడం .... అహ్హహ్హహ్హా.... అబ్బా! కడుపు నొప్పి ...." – లక్ష్మణుడు లఘుశంక నెపం మీద అక్కణ్ణించి లేచి చెట్లచాటుకి పోయాడు. అక్కడ నిలబడి ఇంగితాన్ని ఛడామడా తిట్టాడు – "నలుగుర్లో నిలబడనిచ్చేలా లేవే! ఏవిటింత బరితెగించావు? రేపు రాజ్యం చెయ్యాలంటే జాగ్రత్తగా వుండాలని అన్నగారు చెపుతున్నారు తెలుసా? నా జోలికి రానంటావుగానీ నన్నొదిలిపోవేం? బుద్ధిలేదూ? ఛీ! సిగ్గులేనిదానా!"

ఇంగితం ఆ తిట్లు లెక్కచెయ్యకుండా ముసిముసి నవ్వులు నవ్వుతూ– "కావాలంటే అందరి మొహాలూ చూడు! అందరూ తెల్లబోతూనే వున్నారు, నీ అన్న ప్రశ్నలకి! ఆ చివరివాళ్ళు గుసగుసలు కూడా మొదలు పెట్టారు! నువ్వు నన్ను మాత్రం నిలేసి తిడతావు" అని కళ్ళ నీళ్ళొట్టుకుని, మళ్ళీ ఏదో గుర్తొచ్చి ఫక్కుమంది. లక్ష్మణుడు కాస్సేపు అక్కడక్కడే తిరుగుతూ పాకవేపు వొస్తూన్న జనానికి – "అటు వెళ్ళండి .... అటూ .... ఆ నేరేడు చెట్లవేపు ...." అని దారిచెప్పి, మళ్ళీ ఇంగితంతో "ఈసారి నవ్వావంటే పళ్ళు రాలగొడతాను" అని దాన్ని గట్టిగా హెచ్చరించి మళ్ళీ రాముడి దగ్గిరికి వొచ్చాడు.

దృశ్యం ఎప్పటిలాగే వుంది!

రాముడు తల వూపుతూ ".... తున్నావా? .... తున్నావా?" అంటున్నాడు. ఏమిటో 'తుండడం'! ఏదో ప్రశ్న కావున్ను! పూజిస్తున్నావో! పాలిస్తున్నావో!

"వర్తకాలు చేసుకునే ప్రముఖులందరూ నీ ఇష్ట ప్రకారం నడుచుకుంటున్నారా? వారి కష్ట సుఖాలు విచారించి వారికి కావలసిన సౌకర్యాలన్నీ సమకూరుస్తు న్నావా? రాజు జనులందర్నీ రక్షించవలసిందేగానీ, వర్తకుల్ని మరీ ప్రత్యేకంగా రక్షిస్తూ వుండాలి. వర్తకులు వర్తకాలు చేస్తేనే జనులు సుఖ పడతారు" – కొంచెం కంఠం తగ్గించి "వర్తకులే రాజుకు పెద్ద అండ" అని, మళ్ళీ మామూలు స్వరంతో – "రాజు అనేవాడు అన్ని విషయాలూ గ్రహించాలి. ఎదటివారి మనసులు సూక్ష్మంగా గ్రహించే నేర్పు రాజుకి వుండాలి సుమా!"[90] అని తలాడించాడు – ఎదటివారి మనసుల్ని గ్రహించే నేర్పు తనకు ఎంతో ఉన్నట్టు!

భరతుడు మళ్ళీ నోరు తెరవబోయి, రాముడు గ్రహించడని గ్రహించి, వూరుకున్నాడు.

ఎంతసేపు చెపుతాడో చెప్పనియ్యమని, అందరూ రాముణ్ణి ఆపే ప్రయత్నాలు ఆపి, సర్దుకుని, చతికిలబడి, కొందరు కాళ్ళు మార్చుకునీ, కొందరు బార చాచుకునీ, ఎక్కడి వాళ్ళక్కడ స్థిరపడిపోయి కూర్చున్నారు.

గుహుడి చెవులు రెండూ ఉంగరాల జుట్టుతో నిండి పొదలలాగ వున్నాయని, అవి జోరీగకి బాగా నచ్చాయి. అంత చక్కని పొద చెవులు అక్కడెవ్వరికీ లేవు. వొక్క చెవులోనన్నా దూరి చూడాలని జోరీగ చాలా సరదా పడుతోంది. గుహుడు పడనిచ్చేటట్టు లేడు. చేతులు బారలు జాపి ఇష్ ..... ఇష్ ... అని దాన్ని దూరంగా తరుముతున్నాడు.

రాముడికి, తను చదివిన రాజనీతి ధర్మాలన్నీ అక్కడొకటీ, అక్కడొకటీ గుర్తొస్తున్నాయి – "నాయనా! రాజుకెప్పుడూ ఏనుగుల బలం ఎక్కువగా వుండాలి. ఏనుగులు అడవుల్లో పుట్టి పెరుగుతాయి కాబట్టి, రాజు అడవుల్ని శ్రద్ధగా రక్షించుకుంటూ వుండాలి. ఏనుగుల్ని ఎలా సంపాదించాలో తెలుసుకున్నావా నాయనా? మనకు బాగా మచ్చికైన ఆడ ఏనుగుల్ని, ఆడవులకు తీసుకెళ్ళి మగ ఏనుగుల్ని వశీకరించుకోవాలి. నీ దగ్గర ఆడ ఏనుగులు దండిగా వున్నాయా? ఏవో కొన్ని ఏనుగుల్నీ, కొన్ని గుర్రాల్నీ మాత్రమే సంపాదించి, 'ఇక చాలులే' అని రాజు తృప్తిపడకూడదు – ఎన్ని దొరికితే అన్నిటినీ సంపాదించి వీలైనంత పెద్ద అశ్వదళాన్నీ, గజ దళాన్నీ ఏర్పాటుచేసుకోవాలి. నువ్వు కూడా అలాగే చేస్తున్నావు కదా?[91]

మన దేశం అంతా సుఖంగా ఉందా? నీ తండ్రి తాతలు నడిచిన దారినే నడుస్తున్నావు కదా? వారు పాలించిన ధర్మాల ప్రకారమే పరిపాలిస్తున్నావు కదా? నాకు తెలుసు. నువ్వు బహు యోగ్యుడివి! అలాగే పరిపాలిస్తూ వుండి వుంటావు.

ఇంకో సంగతి. ఒక ఉత్తముడి మీద అతని

---

**90.** **అయోధ్యా**, సర్గ 100, **శ్లోకాలు** 47, 48: రాజు, వర్తకుల్ని ప్రత్యేకంగా రక్షించాలట! ఎందుకు? తనకు అండగా వుండడానికి. దేశంలో వ్యాపారులకూ, ధనికులకూ ప్రత్యేక సౌకర్యాలు కల్పించి వారిని తనకు దన్నుగా పెట్టుకోవడానికే. ★

**91.** **అయోధ్యా**, సర్గ 100, **శ్లోకం** 50: రాజు పెద్ద పెద్ద అశ్వక దళాల్నీ, గజ దళాల్నీ ఏర్పాటు చేసుకోవటం ఎందుకు? ఇతర రాజులమీద యుద్ధాలకూ, రాజ్య విస్తరణకూ. ఇతర రాజుల్ని ఎప్పుడూ భయంలో వుంచి తమకు సామంతులుగా తమ ఆధీనంలో వుంచుకోవడానికి! రాజులందరిలో, ఎవరు ఎక్కువ అర్థ బలం, అంగ బలం సమకూర్చుకో గలుగుతారో వారే సామ్రాజ్యాధిపతులై ఇరుగు పొరుగు రాజ్యాల్ని తమ గుప్పిట్లో వుంచుకోగలుగుతారు. భరతుడు అలాగే చెయ్యాలని రాముడు బోధిస్తున్నాడు. ★

శతృవులు దొంగతనమో, ఇంకో నేరమో ఆరోపించి, నీ దగ్గరికి తీసుకువొచ్చి, అతనికి శిక్షవేస్తే, నీకు పెద్ద మొత్తం ధనం లంచంగా ఇస్తామని ఆశ పెట్టినప్పుడు నువ్వు ధనాశకు లొంగడం లేదు కదా? లేకపోతే, నిజంగా నేరం చేశాడని రుజువైన దోషిని లంచం తీసుకొని విడిచిపెట్టడం లేదు కదా?"[92]

భరతుడు చిన్నబుచ్చుకుని మొహం దించుకున్నాడు. "వొకవేపు నన్ను బహు యోగ్యుణ్ణని పొగుడుతూ, మళ్ళీ 'లంచాలు తీసుకుంటున్నావా' అని ప్రశ్నలేవిటి అన్నగారూ?" అందామనుకున్నాడు. అనలేక తటపటాయిస్తోంటే, రాముడు ఇంకో ప్రశ్నలోకి వెళ్ళిపోయి – "…. చెయ్యవుగదా?" అంటున్నాడు – అదేమిటో భరతుడు సరిగ్గా విననే లేదు. ఏమిటో ఆ 'చెయ్యనిది'!

క్రమ క్రమంగా జనం వొచ్చి కూర్చుంటున్నారు.

జనాల్ని చూస్తోంటే రాముడి ఉత్సాహం ఇనుమడిస్తోంది.

"ధనికుడికీ, దరిద్రుడికీ వ్యవహారం నడిచినప్పుడు నీ మంత్రులు ధనాశతో ధనికుడికే మేలు చెయ్యాలని చూడరుకదా?"[93]

అయ్యయ్యో! మంత్రులందరూ ఎదురుగానే వున్నారు! వాళ్ళ ముందే అడుగుతున్నాడు – వాళ్ళ ధనాశల గురించి!

గుహుడికి జోరీగ దొరక్క ఉక్రోషం వొచ్చి, "చాలు గాని వూరుకోవయ్యా! కుర్రాణ్ణి పట్టుకుని చంపుతున్నావేంటి? అప్పుడు నాకూ ఇలాగే చెప్పావు నీతులు. ఎవడు గద్దెక్కితే వాడికే తెలుస్తాయి అన్నీ. ఏవిటీ సొద జోరీగ లాగ" అనేద్దామా అనుకున్నాడు. అంతలో జోరీగ సుమంత్రుడి మీదికి పోయింది. కొంచెం చిరాకు తగ్గి వూరుకున్నాడు.

"ధనాశకు లొంగి నిర్దోషిని దండిస్తావనుకో, నిర్దోషి కంట నీరుకారితే, అది రాజు కొడుకుల్నీ, పశువుల్నీ, సిరిసంపదల్నీ నాశనం చేస్తుంది సుమా![94]

నాయనా! నువ్వు బుద్ధిమంతుడివి. గ్రామాల ప్రజలూ, పట్టణాల ప్రజలూ, నీ సుఖం కోరుతున్నారా? బ్రాహ్మణ పండితులందరూ నిన్ను రాజుగా అంగీకరించారా? నిన్ను ఎవ్వరూ ఏమీ వ్యతి రేకించలేదు కదా? రాముడే రాజు కావాలనీ, నిన్ను రాజుగా వుండవొద్దనీ, నిన్ను నిరసించలేదు కదా? నాకు తెలుసు నాయనా! నువ్వు జయశీలుడివి! …. బుద్ధి మంతుడివి! ఇంకో సంగతి నాయనా! …."

ఎవరో కొంచెం నవ్వారు – వినపడకుండా!

గుహుడికి జోరీగ దొరికినట్టే దొరికి వేళ్ళల్లో గురగురలాడి తప్పుకుపోయింది.

అరుగుల చివరగా కూర్చున్న వాళ్ళు పొట్టలు పట్టుకుని చెట్టుచాటుకి పోయారు. వాళ్ళకి మర్యాద చేసే బాధ్యత తన మీద వేసుకొని లక్ష్మణుడు గబ గబా బయటికి పరిగెత్తాడు.

రాముడు కుడికాలు తిమ్మిరెక్కి దాన్ని ఎడంకాలు మీదకి మార్చుకున్నాడు – "నాయనా! భరతా! అంతఃపుర స్త్రీల విషయంలో జాగ్రత్తలు పాటిస్తున్నావా? స్త్రీలనెప్పుడూ నమ్మకూడదు. వారికి ఏ రహస్యాలూ చెప్పకూడదు. నువ్వు ఆ విధంగానే చేస్తున్నావు కదా?"[95]

---

**92. అయోధ్యా, సర్గ 100, శ్లోకాలు 56, 57, 58:** కోసల దేశపు మహారాజు కూడా లంచాలకు లొంగడం చాలా సహజమైన విషయం అని రాముడు స్పష్టం చేస్తున్నాడు. రాజులుగానీ, ప్రభుత్వాల్ని పాలించే అధికారులుగానీ, తమ ప్రయోజనాలకోసం, లాభాలకోసం, ధనంకోసం ఎన్ని అన్యాయాలయినా చేస్తారని దీని అర్థం. ఈ 'లంచం' ఏ రూపంలో జరిగినా, మహారాజు కూడా లంచగొండి అయ్యే పరిపాలనలో, ప్రజలకు జరిగే మేలు ఏమీ వుండదు. ఏ రాజు అయినా ప్రజల్ని కన్నబిడ్డల్లాగా చూస్తాడనే మాట పచ్చి కల్ల! ★

**93. అయోధ్యా, సర్గ 100, శ్లోకం 58:** "నీ మంత్రులు నిష్పక్షపాతంగా వుంటున్నారా? ధనికుడికే మేలు చేస్తారా?" అని అడుగుతున్నాడు రాముడు. ఈ మంత్రుల లంచగొండి వ్యవహారాలు ఈనాటివి కాదన్నమాట! అయితే, ఈనాటి మన మంత్రుల ప్రవర్తన గురించి విచారించే పనేం లేదు. మనకు రాములవారి కాలంనుంచీ వొస్తోన్న సాంప్రదాయమే ఇది. ★

**94. అయోధ్యా, సర్గ 100, శ్లోకం 49:** "నిర్దోషి కంటనీరు, రాజుని సర్వనాశనం చేస్తుంది" అని రాముడు వొప్పుకుంటున్నాడు. నిర్దోషుల కంట నీరు కారడం అంటే, దేశంలో అన్యాయాలూ, అక్రమాలూ జరుగుతూ వుండడం అన్నమాట. అలాంటి పరిపాలనలో కొంత కాలానికి ప్రజలు బాధలు భరించలేక రాజుమీద 'తిరగబడతారు'. రాజుని చంపుతారు. రాజు కొడుకుల్నీ, రాజు వారసుల్నీ చంపుతారు. రాజు భోగభోగ్యాలన్నీ సర్వనాశనం చేస్తారు. ప్రజలకు అంత చైతన్యం కలగడానికి వారి కష్టాలే కారణమౌతాయి. రాముడు చెప్పేది శాస్త్రాలు చదివిన నీతి వాక్యాలే కానీ, వాటి అంతరార్థం ఇదే. వాటిలో వున్న అసలు నిజం ఇదే. అది రాముడికి తెలియనిది. ★

**95. అయోధ్యా, సర్గ 100, శ్లోకం 49:** రాముడు స్త్రీల విషయంలో ఎటువంటి నిబంధనలు ఆదేశిస్తున్నాడో చూడండి. "స్త్రీలను నమ్మవు కదా? స్త్రీలకు ఏ రహస్యాలూ చెప్పవు కదా?" అంటున్నాడు. ఈ రాముడు ఈ నాడు కోట్ల కొద్దీ స్త్రీలకు ఆరాధ్య దైవం! రాముణ్ణి నమ్ముకున్నంత కాలం, స్త్రీలు, అతను బోధించే సాంప్రదాయాల సజీవ సమాధుల్లో కూరుకుని చావక తప్పదు. ★

సీతకు తల కొట్టేసినట్టు అయింది. అంతమంది మగవాళ్ళ ముందు తనొక్కతే ఆడదవటం వల్ల సిగ్గుతో ప్రాణం పోయింది. అంతఃపురాల్లో వుండేది ఎవరు? అందరూ తల్లులే కదా? తల్లుల్నీ, భార్యల్నీ అంత చిన్న బరచుకోవచ్చునా? రాముడి మాటలు అసలే అయిష్టంగా వున్న సీతకి, ఈ మాటలతో భర్త మీద చాలా విసుగు కలిగింది.

"నాయనా! .... అతిగా నిద్రపోకూడదు సుమా! రాజుకి సోమరితనం కూడదు. రోజూ చీకట్నే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, నిత్య హోమాలు చేసి, ఔష ధాలు సేవించి, అలంకారాలు ముగించుకొని, సభకు శ్రద్ధగా వెళుతున్నావా? పనివారికి తరచుగా దర్శనం ఇవ్వకూడదు సుమా! వారికి రాజు రోజూ కనపడితే – 'రాజు అంటే ఇంతేనా' అని అలక్ష్యంగా వుంటారు. పనివాళ్ళు రాజుని చూచి భయ పడాలిగానీ, నిర్లక్ష్యంగా వుండేటట్టు రాజు చేసుకోకూడదు. యుద్ధాలూ, యజ్ఞ యాగాలూ వంటి పెద్ద పెద్ద కార్యాలు వొచ్చినప్పుడు, పనివాళ్ళను మంచి చేసుకోవడానికి, అప్పుడప్పుడూ దర్శనం ఇచ్చి వాళ్ళతో గంభీరంగా మాట్లాడాలి."[96]

అంతవరకూ అయ్యాక, రాముడు, భుజాలు పైకెత్తి మెడ సారించాడు. నిటారుగా కూర్చొని, మొహం బిగబట్టి, గంభీరంగా చూశాడు. "రాజు, మంత్రులకూ, పురోహితులకూ అవసరం కోసం దర్శనం ఇచ్చినా తప్పు లేదు" అని తల ఊగించాడు.

"అసలు నాకీ రాజ్యం వొద్దు బాబోయ్! నువ్వే తీసేసుకో! అది చెప్పాలనే వచ్చాను" అనేసి భరతుడు లేచి పారిపోదామనుకున్నాడు. అంతలో సుమంత్రుడి మీద జోరీగ అతన్ని పట్టుకుంది. చేతులు గాలిలో తిప్పుతూ, దాన్ని తప్పించుకునే వ్యవహారంలో పడి పోయాడు.

రాముడు భరతుడి భుజమో, వీపో, తలో నిమురు తూనే వున్నాడు. "ఇంకో సంగతి నాయనా! కోటలన్నీ ధన ధాన్యాలతో, ఆయుధాలతో, యంత్రాలతో, ధను ర్ధారులతో నిండి వున్నాయా? నీ రాబడి అధికంగానే వుందికదా?[97] ఉద్యోగులకు శెలవులు ఎక్కువగా ఇవ్వ కూడదు సుమా! అలా ఇస్తే రెండు నష్టాలున్నాయి. ఉద్యో గులు విలాసాలకూ, విశ్రాంతులకూ అలవాటు పడి పోతారు. శెలవు లెక్కువ కావడంవల్ల పనిచేసే కాలం తక్కువై కార్యాలు ఆలస్యంగా జరుగుతాయి.[98] అది రాజు క్షేమానికి మంచిది కాదు. ఒక కోరిక తీర్చటం మొదలుపెడితే వారి కోరికలకు అంతు వుండదు."

భరతుడికి లఘుశంకకు వెళ్ళాల్సిన అవసరం తోచింది. నెమ్మదిగా జరిగి లేవబోయాడు. రాముడు అతని భుజం నిమురుతూ నొక్కిపట్టి – "ఇంకో సంగతి నాయనా!...." అన్నాడు. రాముడు 'ఇంకో సంగతి' అన్నప్పుడల్లా భరతుడు అదిరిపడుతున్నాడు – 'సంగ తులు ఇంకా వున్నాయా!' అని!

రాముడి ఆత్మ చెవి దగ్గిరికి పాకి – "పోనీ .... చాలా చెప్పావుగా? ఇక ఊరుకోరాదూ? ఇందాకటి నించీ చెప్పాలనుకుంటున్నాను. నన్ను కూడా నోరు తెరవనివ్వటం లేదు నువ్వు. రుషివై వొచ్చిన వాడికి రాజ్యం గొడవలెందుకు? రాజ్యాలు ఎవరు ఎలా చేసు కుంటే నీకెందుకు? నలుగురూ ఏమైనా అనుకుంటా రేమోనని ఆలోచించవద్దూ? వీపు వెనకాల ఎవరో నీ మాటలు వినకుండా ఇంకేవో సంగతులు మాట్లాడు కుంటున్నారు" అంది జంకుతూ.

రాముడు మొహం చిట్లిస్తూ చాలా విసుక్కున్నాడు "నీకీ ధర్మ సూక్ష్మాలేవీ తెలీవు; చెబితే వినవు. అస్తమానూ

---

**96. అయోధ్యా, సర్గ 100, శ్లోకం 52:** రాజుని పనివారు గౌరవించడం, రాజు గుణగణాల్నిబట్టీ, ప్రవర్తననిబట్టీ వుండాలి కదా? రాజు అలంకారాలూ, బట్టలూ, తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం, మెరుపులాగ ఎప్పుడో వొక్కసారి కనబడి మాయం కావడం – ఇలాంటివన్నీ వుండాలని రాముడు చెపుతున్నాడు! రాజు, ప్రజల్ని న్యాయంగా పరిపాలించి, వారి మనసుల్లో స్థానం సంపాదించాలని చూడడు. తన భోగభాగ్యాలూ, సైన్యాలూ, హోదా చూపించి, ప్రజల్ని భయంలో ముంచేసి, తన పటాటోపంతో బెదరగొట్టి, ఆ రకంగా వారిని అణుకువగా వుంచుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. ఆ ఆడంబరం లేకపోతే, ప్రజలు "రాజు అంటే మనలాంటి మనిషే. అతని శరీరంలో మనకన్నా శక్తి సామర్థ్యాలేమీ వుండవు. రాజు బలం అంతా ధనంతో వొచ్చిందే" అని గ్రహిస్తారు. అలా గ్రహించారో, ఇక ఎంతోకాలం రాజు గద్దెమీద కూర్చోలేడు. అందుచేత రాజు ఎప్పుడూ ప్రజలకు మహోన్నతుడిలాగ, సర్వశక్తి సంపన్నుడిలాగ, కనపడటానికే రకరకాల పాట్లు పడతాడు. ★

**97. అయోధ్యా, సర్గ 100, శ్లోకం 53:** రాబడి అధికంగా ఎలా అవుతుంది? పన్నులు ఎక్కువ చేస్తే అవుతుంది. రాజు ఎప్పుడూ చేతినిండా ధనం, ఆయుధాలూ, సైనికులూ వుండేటట్టు చూసుకుంటాడు. అవన్నీ ప్రజలకు ఉపయోగపడే పనులు చెయ్యడానికి కాదు. ప్రజలలో తిరగబాట్లు కనబడితే అణచడానికీ, ఇతర రాజులతో యుద్ధాలకూనూ. ఎంతసేపూ రాజు చేసుకునే ఏర్పాట్లన్నీ తన స్థానం చెక్కుచెదరకుండా వుంచుకోడానికే. ప్రజల కోసం కాదు. ★

**98. అయోధ్యా, సర్గ 100, శ్లోకం 54:** ఉద్యోగులకు శెలవు లెక్కువగా ఇవ్వకూడదట. వీలయినంత తక్కువగా ఇచ్చి వాళ్ళతో ఎప్పుడూ చాకిరీ చేయించుకుంటూ వుండాలన్నమాట! మరి మన ఉద్యోగులందరూ రాముల వారి ఆదేశానికి కట్టుపడాలి కదా? శలవలు అడుగుతారెందుకూ? ★

నన్ను తప్పు పడతావు. ఈ రాజనీతులన్నీ నా కోసం చెబుతున్నానా, లోకంకోసం చెబుతున్నాను గానీ? నలుగురూ ఏమైనా అనుకుంటారా? ఎంత మూఢత్వం నీకు! శ్రీరాముడి నోటివెంట ఏ వాక్కు వొస్తే ఆ వాక్కే పవిత్ర వచనం అవుతుందని ఎరగవా? నీ వీపు వెనక శ్రోతలు నా సత్యవ్రతాల గురించో, నా దైవత్వం గురించో చెప్పుకుంటూ వుండవచ్చును. చూడూ, నువ్వు నన్నిక విసిగించకు! ఎన్నడూ కోపం రాని నాకు కోపం తెప్పించకు. నాకు కోపం వచ్చిందంటే దేవతల్ని కూడా లెక్కచెయ్యను. నువ్వెంత!" అని ఆత్మని కసురుకున్నాడు.

రాముడు, 'ఆత్మ ఘర్షణ'లో పడి కొంతసేపు మౌనం వహించడం వల్ల ఇక మానేస్తాడేమో అనుకున్నారు అందరూ! అందరి మొహాలూ కొంచెం కొంచెం సంతోషంతో విచ్చుకోవడం మొదలు పెట్టాయి. అందరూ తేలిగ్గా నిట్టూర్పులు విడుస్తున్నారు. కొంచెం కదిలి మెడలు తిప్పి కాళ్ళూ చేతులూ కదిపి ఇటూ అటూ చూస్తున్నారు. కోలాహలం తలెత్తింది.

"భరతా! ఇంకో సంగతి నాయనా!"

గతుక్కుమన్నారు అందరూ.

"నటులకూ, విటులకూ, గాయకులకూ హెచ్చుగా ధనం ఇవ్వకూడదు సుమా! వారి విద్యలేవీ గౌరవించదగ్గ విద్యలు కావు.[99] వారు దాన ధర్మాలకు బొత్తిగా అనర్హులు. రాజు అపాత్ర దానాలు చెయ్యకూడదు. నీ సమయమంతా దేవతల పూజలకూ, బ్రాహ్మణ సత్కారాలకూ, బంధుమిత్రుల మర్యాదలకూ, సైన్యంలో వీరులతో చర్చలకూ విని యోగిస్తున్నావు కదా?

కాలజ్ఞుడివి నువ్వు! ఏ కాలంలో ఏ కార్యం చెయ్యాలో కాల నియమాలన్నీ చక్కగా తెలిసిన వాడివి నువ్వు! నే నెరుగుదును. ధర్మార్థ కామాలు దేని సమయంలో అది నెరవేర్చుకుంటున్నావు కదా? ఉదయం వేళల్లో ధర్మం కోసం హోమాలూ, పూజలూ, బ్రాహ్మణ సత్కారాలూ చేసుకోవాలి. భరతా! మధ్యాహ్నం వేళల్లో అర్థార్జన చెయ్యాలి. అనగా ఆ వేళల్లో నువ్వు రాజసభకు వెళ్ళి కార్యాలన్నీ నిర్వర్తించుకోవాలి.[100] రాత్రివేళల్లోనే కామ సుఖాలు చూసుకోవాలి నాయనా! ఆ వేళల్లో స్త్రీలతో యధేచ్ఛగా గడపవొచ్చును. నువ్వు ఏక పత్నీ వ్రతుడవు కావుగదా? ఎందరో భార్యలున్నారు నీకు. ఎందరు స్త్రీలతో గడిపినప్పటికీ, రాత్రి వేళలందు మాత్రమే కామ సుఖాలు అనుభవించాలి. ధనాశచేత ధర్మ కార్యాలు విడిచి పెట్టవు కదా? లేదా కేవలం ధర్మాన్నే చూసుకుంటూ ధనార్జనను నిర్లక్ష్యం చెయ్యవు గదా? ఆ రెండిటినీ విడిచిపెట్టి అన్ని కాలాలలోనూ కామ సుఖాలే అనుభవించవు గదా? దేని వేళలోనే దానిని నిర్వర్తించుకోవాలి నాయనా!"

లఘుశంక వేళలో లఘుశంక తీర్చుకోవచ్చునో లేదో అడగలేక భరతుడు మొహం ఇబ్బందిగా పెట్టుక్కూర్చున్నాడు, అన్నగారు, నోరు మళ్ళీ తెరుస్తున్నాడో లేదో చూస్తూ.

"నాయనా! నాలుగు దారుల కూడలి ప్రదేశాలలో వుండే వృక్షాలకు నమస్కరిస్తున్నావా?"

రథాల దగ్గిర ఆగిన వాళ్ళందరూ కబురుకోసం ఎదురుచూసీ చూసీ, ఇక అక్కడ నిలబడలేక బయల్దేరి వొచ్చేశారు. పాకముందు ఆవరణ అంతా నిండిపోయింది. లక్ష్మణుడు పాకలోకి వెళ్ళే అవసరం తప్పించుకుని, వొచ్చే వాళ్ళందరికీ సంతోషంగా మట్టి పిడతలతో మంచి నీళ్ళందిస్తున్నాడు.

కొంచెం దూరం దూరం జరుగుతోన్న భరతుణ్ణి రాముడు చప్పున మళ్ళీ దగ్గిరికి లాక్కున్నాడు. "నాయనా! పద్నాలుగు రాజ దోషాలున్నాయి. చెబు తాను విను! నాస్తికతా, అబద్ధమాడుటా, మిక్కిలి కోపము కలిగి

---

**99.** **అయోధ్యా**, సర్గ 100, **శ్లోకం** 54: రాముడు 'నీ ధనం అపాత్రులకు (అపాత్రేషు) పోవడం లేదు కదా?' అన్నాడు. 'అపాత్రులు' అంటే ఎవరో, కవి, వివరాలు ఇవ్వలేదు. ఈ మాటకు అనువాదకులు 'నట, విట, గాయకులు' అనే వివరణ ఇచ్చి 'నీ ధనం నట, విట, గాయకులకు పోవడం లేదు కదా?' అని అనువాదాలు చేశారు. 'అపాత్రులు' అనే మాటకి ఈ అర్థమే తీసుకుంటే, అప్పుడు, రాముడు 'నట, విట, గాయకుల్ని అపాత్రులు అంటున్నాడు' అనే అర్థం వస్తుంది. దీనికి మన కళాకారులూ, రాముడి వేషం విప్పని సినిమా వారూ, రాముడి కోసం కృతులు పాడుతూ తొడలు బాదుకునే సంగీత విద్వాంసులూ, ఏమంటారో!

కవి, ఇంకో చోట రాముణ్ణి పొగుడుతూ చేసిన ఇంకో పొగడ్త చూడండి. **అయోధ్య కాండలో 1వ సర్గలో 18వ శ్లోకం:** ".... సంగీతాది శిల్పకళలు చక్కగా నెరింగినవాడు రాముడు". సంగీతం అంతచక్కగా ఎరింగినవాడు, గానాన్ని నీచవిద్య అంటాడా? అక్కడ చెప్పిన దానికీ, ఇక్కడ అనువాదకులు తీసిన అర్థానికీ ఎలా కుదురుతుంది? 'అపాత్రులు' అంటే ఎవరో కవి చెప్పకపోవడం వల్ల ఈ తిప్పలు! ★

**100.** **అయోధ్యా**, సర్గ 100, **శ్లోకం 63:** వనవాసానికి వచ్చింది మొదలూ ఈయన మధ్యాహ్నంవేళ అడవిలోకి పోయి దుంపలూ అవీ తవ్వుకొచ్చినట్టూ, నదినించి నీళ్ళు తెచ్చినట్టూ, తన బట్టలు ఉతుక్కున్నట్టూ కనబడదేం? అర్థార్జన వేళలో కూడా కబుర్లే చెబుతూ వుంటాడేం? ★

యుండుటా ....” అంటూ వేళ్ళు ముడవటం మొదలు పెట్టాడు.

భరతుడు తొడ గోక్కుంటున్నాడు, దర్భలు కుట్టి.

సీత లోపలికి వెళ్ళి పొయ్యికింద కట్టెలు ఆర్పి, మాంసం కూర గట్టుమీద పెట్టి, లోపలి గదిలో పక్క మీద కళ్ళు మూసుకుని పడుకుంది. ఆమె మనసెందుకో చాలా అశాంతిగా వుంది. సిగ్గుపడిపోతూ వుంది.

రాముడు – “ఏమరుపాటుతో నుండుటా, ఆలస్య ముగా పనిజేయుటా, వేదశాస్త్రాలన్నీ చదివిన జ్ఞాన వంతులను లెక్కచేయకుండుటా ....” అని ఇంకో మూడు దోషాలు చెప్పి, తర్వాత గుర్తురాక కాస్సేపు కళ్ళు చిట్లిస్తూ మనసులో గబగబా అన్నీ మొదటినించీ చదువుకున్నాడు – “ఆఁ .... మత్తతా, ఇంద్రియ పరవ శతా, మంత్రులెందుకని తనొక్కడే ఆలోచించుటా, ఏమియు తెలియని మూర్ఖులతో నాలోచించుటా, వొక కార్యం చేయవలెనని నిశ్చయించి కూడా ప్రారంభించ కుండుటా .... భించకుండుటా .... భించ .... భించ ....” అంటూ వేలు మడవబోయి రెండుచేతుల వేళ్ళూ అప్పటికే అయిపోవడం చేత, చటుక్కున భరతుడి ఎడం చెయ్యి పట్టుకుని దాని చిటికెనవేలు మడిచి, తర్వాత వేళ్ళు కూడా మడుస్తూ, “.... ఆలోచించిన దానిని బయ ల్పరుచుటా, .... ఏక కాలమందే సమస్త శత్రువులతోనూ యుద్ధము చేయుటా .... టా ....” అని మళ్ళీ ఇంకేదో గుర్తురాక కాస్సేపు ఇబ్బంది పడ్డాడు, కళ్ళుమూసుకుని.

“బలాత్కారంగా నీతులు బోధించుటా” కూడా ఆ రాజదోషాల్లో వుందేమోనని చాలామంది శ్రద్ధగానే విన్నారుగానీ, తీరా ఆ చివరిది “ప్రాతఃకాలమున అద్దము చూసుకొని అలంకారములు చేసుకొనుట” అయింది.

ఎవరో నవ్వారు – గట్టిగానే! “ ఇదేవిటి? పద్నా లుగు చెపుతానని డెబ్బయ్ నాలుగు చెప్పినట్టున్నాడే!” అన్నారు కూడా!

“పద్నాలుగంటే డెబ్బయ్ నాలుగేనేమో!” అన్నారు ఇంకెవరో! ఎన్నడూ సరదాగా మాట్లాడడం తెలియని వాళ్ళ కడుపులో కూడా హాస్య రసం ఊరడం మొద లైంది.

రాముడు తల తాటిస్తూనే వున్నాడు – “నాయనా! ఈ పదునాలుగూ రాజ దోషములు. ఈ కార్యములను రాజు ఆచరించకూడదు సుమా! .... ఇంకనూ ‘వర్గ ముల’ గురించి చెపుతాను వినూ! పంచ వర్గమూ, సప్త వర్గమూ, అష్ట వర్గమూ, దశ వర్గమూ – అని, అనేక వర్గ భేదాలు వున్నాయి నాయనా! ఒక్కొక్కటీ వివరంగా చెపుతాను, శ్రద్ధగా విను!”

శ్రద్ధగా కాదుగదా, అశ్రద్ధగా కూడా వినడం భర తుడు ఎప్పుడో మానేశాడు. తల వాలేసి వూరుకున్నాడు. దూరంగా కాళ్ళు చాచుకుని కూర్చున్న శతృఘ్నుడి మీద ఎంత అసూయ కలిగిందో భరతుడికి – ఎన్నడూ లేనిది!

ఎవరో వెనకాల గట్టిగా ఆవలిస్తూ చిటికెలు వేసు కున్నారు.

రాముడు ఆ వర్గాలన్నీ చెప్పాడు – ‘ఇంద్రియ వశీకరణ విద్య’ లేవో కూడా చెప్పాడు!

భరతుడి ఇంద్రియాలు వశం తప్పిపోతున్నాయి! ఆ విద్యలన్నీ విన్నా వశీకరణ సాధ్యం కావడం లేదు.

రాముడు – దైవత్వానికీ, మానుషత్వానికీ భేదాలేవో చెప్పాడు!

ప్రకృతి మండల రహస్యాలు చెప్పాడు! “ఇవన్నీ శ్రద్ధగా తెలుసుకున్నావు గదా?” అన్నాడు.[101]

భరతుడికి మాగన్నుగా నిద్రపట్టి తూలి రాముడి మీదపడి గబగబా కళ్ళు విప్పి సిగ్గుపడిపోతూ తేరుకుని సర్దుకుని కూర్చున్నాడు.

“నాయనా! వేదాలలో చదివిన ప్రకారం హోమాలు చేసి నీ విద్య సఫలం చేసుకుంటున్నావా? చక్కగా బ్రాహ్మ లకు దానాలుచేసి నువ్వు తృప్తిగా అనుభవించి, నీ ధనాన్ని సఫలం చేస్తున్నావా? సత్ సంప్రదాయాలతో, సద్ విషయాలతో వున్న శాస్త్రాలు చదివి నీ కృషి సఫలం చేస్తున్నావా? నాయనా! నీ భార్యలు సంతానం పొంది సఫలులయ్యారు కదా?”[102]

గుహుడికి చిర్రెత్తుకొచ్చింది. అంతవరకూ రానంత కోపం వొచ్చేసింది. సుమంత్రుడి దగ్గిరికి జరిగి చెవిలో, “ఏంటండీ పంతులుగారూ! ఈయన ఇక్కడికొచ్చి నెల్లాళ్ళన్నా అవలేదు. తమ్ముణ్ణి పట్టుకుని ‘నీ భార్యలంద రికీ పిల్లలు పుట్టారా’ అంటాడేంటి? ఎంత దూరాభారం అయితేమాత్రం, మహా రాజులాయె, ఒకరి సంగతులు ఒకరు ఆ మాత్రం తెలుసుకోరా? ఆయనకి పిల్లలున్నారో లేదో ఈయనకి తెలవదా? వొకరి కష్టసుఖాలు వొకరు తెలుసుకోకపోతే ఇక ఈ జ్ఞానాలన్నీ ఎందుకు? ఏవిటీ అడగటం? అబ్బబ్బా! ఎప్పటికీ చాలించదే! కాస్త మీర యినా మందలించండీ, పెద్దవారు” అని చిర చిర లాడాడు.

---

**101.** **అయోధ్యా, సర్గ 100, శ్లోకాలు 68, 69, 70:**

ఇంద్రియ వశీకరణ విద్యలూ, ప్రకృతి మండల రహస్యాలూ కావాలంటే, ఈ శ్లోకాలు చదువుకోండి! ★

**102.** **అయోధ్యా, సర్గ 100, శ్లోకం 72:**

“నీ భార్యలు సంతానం పొంది సఫలులయ్యారు కదా?” అంటున్నాడు రాముడు. మరి, తన భార్య సంగతీ? ★

సుమంత్రుడు జంకి చుట్టూ చూస్తూ, "ఆయన్ని మందలించడం ఏమిటి? ఇప్పుడు రాజయ్యేది ఆయనే!" అని గుసగుసలాడాడు.

"అయితే మాత్రం" అని గుహుడు అనాగరిక కోపంతో గొణుక్కుంటూ పూరుకున్నాడు.

"నాయనా, ఇంకో సంగతి ....!" – రాముడు, ఎడంకాలు కుడికాలు మీదకు మార్చుకున్నాడు.

భరతుడు గుహుడివేపు – "కొంచెం నువ్వయినా చెప్పరాదటోయ్!" అన్నట్టు బేలగా చూశాడు.

"అలా బిక్క మొహం పెట్టకపోతే నువ్వే చెప్పెయ్య రాదంటయ్యా! సరిపోయారు అన్నదమ్ములు!" అన్నట్టు గుహుడు భరతుణ్ణి కూడా గుర్రుగా చూశాడు.

ఆ కోపానికి హడలిపోయి భరతుడు మొహం తిప్పేశాడు.

"నాయనా! శ్రద్ధగా వింటున్నావా? నువ్వు నాస్తికుల్ని చేరదియ్యడం లేదు కదా? వారు మహా అజ్ఞానులు. ఏమీ తెలియకపోయినా పండితులలాగ వాగుతారు. (పండితులు వాగినట్టా?) వేదాలూ స్మృతులూ వంటి ధర్మ శాస్త్రా లుండగా వాటిని తిరస్కరించి వితండ వాదాలు చేస్తారు. ప్రజలకు దుర్బోధలు చేసి వారిని ధర్మాచరణ నుంచి తప్పించి ధర్మలోపం కలిగిస్తారు. నాస్తికులు బ్రాహ్మలయినా సరే వారిని ఎంతమాత్రం గౌరవించ కూడదు సుమా!"[103]

పూర్వం అయితే నాస్తికుల మీద భరతుడికేమీ ఆసక్తి లేదుగానీ, ఇప్పుడు మాత్రం – "ఈ సారి నాస్తికులతో మాట్లాడి చూడాలి. అసలు ఏమిటో వాళ్ళ వ్యవహారం చూస్తా ...." అనుకున్నాడు గట్టిగా.

రాముడికి ఇంకేమీ జ్ఞాపకం రావటం లేదు. కొంచెం అలసటగా కూడా అనిపించింది. జోరీగ "జ్ జ్ జ్ జ్ జ్ జ్ ...." మంటూ రాముడి చుట్టూ తిరగడం మొదలెట్టింది.

గుహుడికి జోరీగ మీద హఠాత్తుగా చాలా ప్రేమ కలిగింది. ఈ సారి ఇంటికి వెళ్ళగానే కొన్ని జోరీగల్ని పెంచుకోవాలనే కోరిక పుట్టింది. పెంపుడు జోరీగలు వుండడం ఎందుకయినా మంచిదనిపించింది. అసలు దీన్నే తీసుకుపోతే సరి! చెవులో దూరనిస్తే చేతికి దొరుకుతుంది. 'అవును, అలా దూరనిస్తా ఈ సారి! దామ్మా... దా... దా! నిన్నేమీ చెయ్యను. నా చెవులో ఆడుకుందువుగాని దా!'

రాముడు జోరీగని కొట్టుకుంటూ– 'అన్నీ చెప్పానా? .... మంత్రుల సంగతీ, సైన్యం .... గూఢచారులూ .... బొక్కసం .... సైన్యం .... మంత్రులూ .... బొక్కసం .... రాజ దోషాలూ .... అంతఃపురాలూ .... ప్రకృతి మండల రహస్యాలూ... బొక్కసం ....' అన్నీ గబ గబా గొంతులో గుడ గుడ గొణుగుతూ జ్ఞాపకం తెచ్చు కున్నాడు. అన్నీ చెప్పినట్టే తోచింది.

"చూశావా! రాజవ్వాలంటే ఇన్ని విషయాలు క్షుణ్ణంగా తెలియాలి. మీ అమ్మ గొప్పగా వరాలు కోరి నిన్ను రాజుని చేసేసింది! నీకేమో ఒక్క సంగతీ తెలీదు. ఎలా చేస్తావు నువ్వు రాజ్యం?" అన్నట్టు చూశాడు. "నాయనా! భరతా! ఇప్పుడు నీకు చెప్పినటువంటీ, నాకు న్నటువంటీ, ఈ జ్ఞానం వల్ల దీర్ఘాయువూ యశస్సూ, ధర్మార్థ కామ మోక్షాలూ సిద్ధిస్తాయి. ఇటువంటి జ్ఞానం నీకు కూడా వుందా?[104] ఇప్పుడు నేను బోధించిన

---

**103. అయోధ్యా**, సర్గ 100, **శ్లోకాలు** 38, 39: నాస్తికులు ఎంత మూర్ఖులో, ఎంత లోక భీకర కార్యాలు చేస్తారో, వర్ణిస్తున్నాడు రాముడు. నాస్తికులు నిజంగానే ధర్మ శాస్త్రాల్ని 'తిరస్కరిస్తారు.' ఎందుకు? అవి 'శుద్ధ అధర్మ శాస్త్రాల'ని వారు ఎరుగుదురు కాబట్టి. 'ప్రజల్ని ధర్మాచరణనించి తప్పించడం' అంటే, ఆ ధర్మాలెంత క్షుద్ర ధర్మాలో నాస్తికులు ప్రజలకు వివరంగా చెపుతారన్నమాట! ఎలాగంటే, ప్రకృతి పరిణామంలో దేవుడి ప్రసక్తి లేదనీ, మానవ జీవితంలో ధర్మాలన్నీ సాంఘిక పరిణామ క్రమంలో వచ్చినవేగానీ దేవుడు శాసించినవి కావనీ, స్వర్గ – నరకాలు లేవనీ, యజ్ఞయాగాల వల్ల ప్రయోజనం లేదనీ, జనాలకు బోధిస్తారు. ఈ రకం బోధనలవల్ల ప్రజలు స్వతంత్రంగా ఆలోచించి, ధర్మశాస్త్ర సంకెళ్ళ నుంచి బయటపడే ప్రయత్నాలు చేస్తారు. దేవుళ్ళని పూజించరు. కర్మనీ పునర్జన్మల్నీ నమ్మరు. తమ కష్టాలకు కర్మే కారణం అని గతంలో సరిపెట్టుకునే ప్రజలు, ఈ కొత్త జ్ఞానంవల్ల, తమ కష్టాలకు 'రాజు పరిపాలనే కారణం' అని తెలుసుకుంటారు. మానవుల్లో హెచ్చుతగ్గుల్ని అంగీకరించరు కాబట్టి, చిన్న కులాల వారు, పెద్ద కులాల వారికి లొంగి చాకిరీ చెయ్యరు. కొందరు వ్యక్తులకు మాత్రమే ప్రత్యేక అధికారాలూ, కొన్ని కులాలకు మాత్రమే గౌరవ మర్యాదలూ వుండేలాగ శాసించే ధర్మాల అంతరార్థం గ్రహిస్తారు. స్త్రీలు, పురుషుడికి ఇచ్ఛాపూర్వకంగా లొంగివుండే అజ్ఞానంలో వుండరు. ఈ రకంగా, నాస్తిక బోధనలవల్ల, దోపిడీ ధర్మాలపై ఆధారపడ్డ పరిపాలనా యంత్రాంగానికే దెబ్బ తగులుతుంది. ప్రజలకు ఇలాంటి చైతన్యం కలిగించే నాస్తికులు, రాజుకీ, రాజులవల్ల సుఖపడే ధనిక వర్గానికీ, హాని కలిగించే వారవుతారు. అందుకే ధర్మశాస్త్రాలన్నీ నాస్తికత్వం మీద కత్తి కడతాయి. నాస్తికత్వం ప్రజల్లో వ్యాపించకుండా అరికట్టాలని చూస్తాయి. ★

**104. అయోధ్యా**, సర్గ 100, **శ్లోకం** 73: "నాకున్నంత జ్ఞానం నీకుందా రాజ్యం చెయ్యడానికి?" అని అడుగుతున్నాడు రాముడు భరతుణ్ణి! అంత జ్ఞానం భరతుడికి లేదనీ, అందుచేత అతను రాజ్యం చెయ్యడానికి అనర్హుడనీ, రాముడి అభిప్రాయం! ★

రాజనీతులన్నీ శ్రద్ధగా జ్ఞాపకం పెట్టుకుని, నిత్యం మననం చేసుకుంటూ సక్రమంగా రాజ్యపాలన చేశావంటే ఇహలోక సుఖాలేగాక, స్వర్గలోక సుఖాలు కూడా పొందుతావు" అని, గంభీరంగా మౌనం వహించాడు.

భరతుడు మళ్ళీ – "ఇంకో సంగతి ...." కోసం చూశాడు, కొంతసేపు, అది ఎలాగూ తప్పదు కదా, దానికోసం సిద్ధంగా వుంటే మంచిదని.

గుహుడు లేచి దూరంగా పోయి చెట్లకింద కూర్చుని చుట్ట అంటించాడు.

రాముడు గంభీరంగా నోరు మూసేసి మౌనంగా అయిపోయాడు.

నీతులన్నీ అయిపోయాయంటే భరతుడికి అప్పుడే స్వర్గ సుఖాలు దొరికినంత ఆనందం ముంచు కొచ్చింది – "అన్నగారూ! నేను మూఢుణ్ణి! ఇంత ఘోరమైన రాజ్య పాలన నాకేం తెలుస్తుంది? రాజ్య భారం అంతా మీకు అప్పగించాలనే బయల్దేరి వొచ్చాను" అని బావురు మన్నాడు, ఆనంద బాష్పాలు రాలుస్తూ.

రాముడు, ఆ మాటలు నమ్మలేక స్థంభించి పోయాడు. ఉద్రేకంతో మనసునిండా సంచలనాలు ప్రారంభమయ్యాయి. "నేనన్నట్టే జరిగింది, చూశావా?" అన్నట్టు లక్ష్మణుడు కోసం కళ్ళు తిప్పాడు.

లక్ష్మణుడు బైట వొక్కొక్కరికీ రెండేసిసార్లు బల వంతంగా మంచి నీళ్ళందించే హడావిడిలో వున్నాడు – పాకలోకి రాకండా!

ఎవరో అతని దగ్గిరికి వెళ్ళి – "మీ అన్నగారు మీ కోసం చూస్తున్నాడు" అని చెప్పగానే, నీళ్ళ పిడత అక్కడే విసిరేసి పరుగు పరుగున వొచ్చాడు. వొచ్చేటప్పటికి భరతుడు దుఃఖిస్తూ – "అన్నగారూ! తండ్రి వుండగా కొడుకు రాజ్యం చేయటం ఏమిటని సందేహిస్తున్నారేమో! మన తండ్రిగారు మీ కోసం దుఃఖించి, దుఃఖించి, స్వర్గస్తులయ్యారు! కర్మకాండలు చేసి బయల్దేరి వొచ్చాను" అని మళ్ళీ బావురు మన్నాడు, తను కూడా నోరు తెరిచి మాట్లాడేస్తున్నాననే ఆనందంతో.[105]

రాముడు – పిడుగు వొచ్చి మీద పడిపోయినట్టు, ఎన్నడూ ఊహించని ఘోరవార్త – దారుణ వార్త – విన్నట్టు, జరగరాని ఉపద్రవం జరిగి పోయినట్టు – "హెవిటీ? దశరథ మహారాజు అస్త మించినాడా!" అంటూ ఆ దర్భాసనం మీదే కొంచెం జరిగి సర్దుకుని మూర్ఛబోయాడు – ఏ వేళ చేసే పని ఆ వేళ చేసెయ్యాలని! ఇప్పుడు మూర్ఛపోవలసిన వేళ కదా?

భరతుడేదో చెపుతున్నాడని గుమ్మంలోకి వొచ్చిన సీత, భర్త మూర్ఛపోవటం చూసి – "స్వామీ! స్వామీ!" అంటూ భయపడుతూ దగ్గిర కొచ్చింది.

"అన్నగారూ! అన్నగారూ!" అంటూ తమ్ముళ్ళు చుట్టూ మూగారు.

"రాముడు పడిపోయాడు! తండ్రి మరణ వార్త విని మూర్ఛబోయాడు!" అన్నారెవరో కంగారుగా వొచ్చి గుహుడితో.

గుహుడు మత్తుగా చుట్ట పీలుస్తూ – "ఆయన కన్నీ తెలుసు. ఆయనే లేస్తాడు. ఎప్పుడు లేవాలో అప్పుడు లేస్తాడు. మీరందరూ చుట్టూ మూగి దడి కట్టకండి! గాలి దూరనివ్వండి!" అని మళ్ళీ చుట్టానందంలో మునిగి పోయాడు.

పురోహితులు రాముడి మొహంమీద చల్లటి నీళ్ళు చిలకరించారు.

లక్ష్మణుడు విసరడం మొదలుపెట్టాడు!

రాముడు పంచతో మొహం తుడుచుకుని ఏడుస్తూ లేచి కూర్చున్నాడు. పోయిన వారిని గురించి దుఃఖించే టప్పుడు, వారి గురించి మాట్లాడుతూ దుఃఖించాలనే శాస్త్రధర్మం రాముడికి తెలుసు – "హయ్యో! నా తండ్రి పోయినాడా? దశరథ మహా రాజు పోయినాడా? ఇక అయోధ్యను పరిపాలించ గల వాడెవ్వడు? దశరథ మహారాజుతో సాటియైన వాడెవ్వడు? హయ్యో! తండ్రి గారి చివరికాలంలో దగ్గిర లేకపోయానే! నా చేతుల్తో నా తండ్రికి కర్మకాండలు చెయ్యలేకపోయానే! భరతుడా!

---

**105. అయోధ్యా, సర్గ 101, శ్లోకం 5:** తండ్రి వుండగానే రాముడు రాజ్యం పాలించడానికి సిద్ధపడ్డాడని భరతుడికి తెలిసిన సంగతే కదా? 'తండ్రి వుండగా నేను రాజ్యం ఎలా చెయ్యను' అని రాముడు సందేహిస్తున్నాడని భరతుడు అనుకోవడం ఏమిటి? తండ్రి చచ్చిపోయిన సంగతి చెప్పడానికి ఇప్పటికి నోరు తెరవడం కుదిరింది భరతుడికి! భరతుడు రాగానే రాముడు తండ్రి గురించి అడిగాడేగానీ సంగతి తెలుసుకోనే లేదు! తండ్రి గురించి తెలుసుకోకుండానే – మంత్రులమీద చారుల్ని పెట్టడం, అంతఃపురాల రక్షణా, ఏనుగుల పెంపకం, శత్రువుల్ని జయించే విధం, వ్యాపారులకు ప్రత్యేక సౌకర్యాలు చేయటం, 14 రాజదోషాలూ, 15 తీర్థాలూ, ఇంద్రియ వశీకరణ విద్యలూ, ప్రకృతి మండల రహస్యాలూ – ఇవన్నీ చెప్పకొచ్చాడు! ఇవన్నీ అయింతర్వాత భరతుడు తనకై తనుగా తండ్రిని గురించి చెపితే, అప్పుడా తెలుసుకోవడం? – వాల్మీకిని గొప్పకవి అని పొగడుతారే! ఇదేనా ఆయన సందర్భ శుద్ధి? – దశరథుడు చచ్చిపోయిన విషయం రాముడికి, భరతుడు రాగానే తెలియాలా, అక్కరలేదా? ఆ అన్నదమ్ములు ముందు రాజదోషాలూ, ప్రకృతి మండల విశేషాలూ మాట్లాడుకోవాలా కవిగారూ? ఆ కవి, వాల్మీకి అయితే వాల్మీకి మీదా, గీల్మీకి అయితే గీల్మీకి మీదా ఈ ప్రశ్న వస్తుంది. ★

అయ్యో! నువ్వు చెయ్యగలిగావు. కన్న తండ్రి రుణం తీర్చుకున్నావు. నేను చెయ్యలేకపోయాను. కన్న తండ్రి రుణం తీర్చుకోలేకపోయాను. ఇక ఈ జన్మ ఎందుకూ? అయ్యో! తండ్రిలేని బిడ్డనయిపోయాను, లక్ష్మణా! నువ్వు కూడా తండ్రిలేని పసికందువై పోయావు. సీతా! నువ్వు మామలేని కోడలివై పోయావు. అయ్యో! అయ్యో!" అంటూ బొటబొటా కన్నీళ్ళుకార్చాడు.

రాముడు – లక్ష్మణుణ్ణీ, సీతనీ మాత్రమే ఎందుకు ప్రస్తావించాడంటే, భరతుడూ, శతృఘ్నుడూ ఇంటి దగ్గిరే శోకాలు ముగించుకున్నారు కదా? ప్రస్తుతం ఇక్కడ దుఃఖించవలసింది, తమ ముగ్గురే కదా? అందుకే – "భరతా! నువ్వూ తండ్రిలేని వాడివయ్యావు. శతృఘ్నా! నువ్వూ తండ్రిలేనివాడి వయ్యావు" అనలేదు రాముడు. సీతనీ, లక్ష్మణుణ్ణీ మాత్రమే కన్నీళ్ళతో చూశాడు. అమ్మో! ఆయనకి అన్నీ తెలుసు!

మళ్ళీ మొదలుపెట్టాడు అవే మాటలు "అయ్యో! నా తండ్రి పోయినాడా? దశరథ మహారాజు పోయినాడా? నా తండ్రిలేని రాజ్యానికి నే నేమొహం పెట్టుకుని వెళ్ళను? ఊహూ! వెళ్ళలేను. అయోధ్యకిక వెళ్ళలేను. వనవాసం ముగించిన తర్వాత కూడా వెళ్ళను. అయ్యో, ఇక నాకు పెద్ద దిక్కెవరు"[106] అని విలవిల్లాడుతూ భరతుడి వేపు చూశాడు – "నాయనా! భరతా! మన తండ్రిగారెంత మహాత్ములూ! ఎంత పుణ్యాత్ములూ! ఎంత ...." అని ఆగి – 'వనవాసం ముగిసినా అయోధ్యకు పోను – అని మాట జారానే! ఇప్పుడేం చెయ్యాలి' అని తిక మక పడి, కొంచెం జాగ్రత్తగా ఏడవాలని నిశ్చయించుకుని, నెమ్మదిగా మళ్ళీ సాగించాడు. "తండ్రిగారెప్పుడూ నాకెన్నో రాచకార్యాలు పురమాయించి నాతో సంభాషిస్తూ వుండేవారు. వనవాసం ముగించి నేను రాజ్యానికి వొచ్చిన తర్వాత ఇక నాతో ఎవరు సంభాషిస్తారు? నన్నెవరు బుజ్జగిస్తారు?"[107] అంటూ గిలగిల్లాడడం మొదలుపెట్టాడు.

"రామా! ఊరుకో నాయనా! ఏం చేయగలం? అంతా అయిపోయింది. ఊరుకో" అని పురోహితులు ఓదార్చిన కొద్దీ, దుఃఖం ఆగక రాముడు దర్భలమీద పడి దొర్లడం మొదలుపెట్టాడు – మధ్య మధ్య మూర్ఛలు పోతున్నాడు. కాస్సేపటికి లేచి కూర్చుని రెండు మాటలు అని, మళ్ళీ పడిపోతున్నాడు.

చుట్టూ జనం మూగి గాలి రాక, చెమటలు పోసి, వీపు దురదలు పుట్టి దర్భలమీద దొర్లడం ఎక్కువ చేశాడు.

"తొడమీద వొక్కటి చరిస్తే సరీ, ఏమిటా శోకాలూ?" అన్నారెవరో రహస్యంగా, గుసగుసలతో!

అందరూ రాముడి పితృభక్తికి ముక్కులమీద వేళ్ళేసుకున్నారు, గుసగుసల వాళ్ళు తప్ప.

ఎవరో గుహుడి దగ్గిరికి వొచ్చి– "అవతల రాముడు తండ్రి పోయిన దుఃఖంతో విలవిల్లాడుతోంటే, పెద్ద వాడివైవుండి కాస్త ఓదార్చక, ఇక్కడ కూర్చున్నావేమోయీ? .... ఈ చెట్టుకింద చల్లగా వుందే! అబ్బ! ఎన్ని పళ్ళో!" అని ఆ వొచ్చినాయన చెట్టెక్కే మార్గం ఆలోచిస్తున్నాడు, తల పైకెత్తి.

గుహుడు చుట్ట అయిపోవడం చేత లేచి జనాన్ని చీల్చుకుంటూ బయలుదేరాడు. అతని దగ్గిర చుట్ట కంపుకి చుట్టూ జనం చాలా గౌరవంగా దారి ఇచ్చేశారు.

బాణంలాగ గుహుడు తిన్నగా సరాసరి రాముడి దగ్గిరికి వెళ్ళగలిగాడు. కాస్త మందలింపు స్వరంతో గట్టిగానే – "ఏంటయ్యా ఇదీ? అన్ని సంగతులూ తెలిసిన వాడివి, నీకు మేం చెప్పాలా? మీ తండ్రి పెద్దవాడయింతర్వాత, వెళ్ళిపోక ఎంతకాలం కూర్చుంటాడూ? కొడుకులు మీరందరూ లేరూ రాజ్యం పాలించడానికీ? .... మీరేం పాలు తాగుతున్నారా, వేలు కుడుస్తున్నారా? మీరే పిల్లల్ని కనిపెంచాల్సిన వాళ్ళయ్యాక ఇంకా తండ్రికోసం ఇంత గగ్గోలు పడి యాడవటం ఏమిటి? ఇక నే నూరుకోను సుమా! లేచి స్నానాలు చెయ్యాలేమో చూడు! ఆ మహారాజుకి దోసెడు నీళ్ళు వొదిలిపెట్టు! నువ్వే పెద్ద కొడుకువయ్యే! నీ చేతి నీళ్ళు తాగందే ఆయన సంతోషిస్తాడా? లేచి స్నానాల సంగతి చూడు" అంటూ కోప్పడ్డాడు గబగబా. గుహుడికి అసలు కోపం అది కాదు. ఇంకేదో వుంది!

గుహుడి నోట్లో తుప్పర్ల కింద రాముడప్పటికే సగం

---

**106.** **అయోధ్యా**, సర్గ 102; శ్లోకం 11: వనవాసం అయిపోయిన తర్వాత కూడా నేను అయోధ్యకు వెళ్ళను" అన్నాడు రాముడు. "ఏదో దుఃఖంలో అలా అన్నాడు" అంటారు రామదాసులు. దుఖ్ఖంలో, ఏ అబద్ధాలయినా మాట్లాడవచ్చునా సత్యవంతులు? దుఖ్ఖం లేక, తొందర లేక, విరక్తి లేక, అశాంతి లేక, చక్కగా సుఖంగా ప్రశాంతంగా వున్నప్పుడు మాత్రమే 'సత్యం' మాట్లాడతారన్న మాట! ★

**107.** **అయోధ్యా**, సర్గ 102, శ్లోకం 12: తను నిజంగానే వనవాసం తర్వాత అయోధ్యకు రాడని అందరూ ఎక్కడ నిర్ధారణ చేసుకుంటారోనని, ఇప్పుడే మాట తిప్పుకోవడం మంచిదని, తను వనవాసం ముగించి రాజ్యానికి వొచ్చే విషయం తెలివిగా బయటపెడుతున్నాడు రాముడు. ★

స్నానం చేసి లేచాడు. దుఃఖంతో మూలుగుతూ … “లక్ష్మణా! ఉతికిన పంచలూ ఉత్తరీయాలూ అందుకో నాయనా! … నువ్వూ సీతా కూడా బయల్దేరండి, నేను వెనక నడుస్తాను. అయ్యో! …. తం …. సీతని ముందు నడవనియ్యి![108] … అయ్యో … శ్రాద్ధకర్మలకు వెళ్ళే టప్పుడు స్త్రీలు ముందు నడవాలని శాస్త్రాల్లో …. అయ్యో తండ్రిగారూ! …. ఇక నన్నెవరు పెంచుతారు …….. భరతా! నువ్వు కూడా నదికి వొస్తావా నాయనా?” అని అడిగాడు.

భరతుడు హడలిపోయాడు. నది దగ్గిర అన్న గారికి ఇంకేవన్నా రాజనీతులు జ్ఞాపకం రావొచ్చు కదా? – “మేము ఇంటి దగ్గిర అన్ని కార్యాలూ ముగించుకున్నాం అన్నగారూ! మీరు వెళ్ళిరండి! మీ రాకకోసం చూస్తూ వుంటాము” అని వినయంగా నమస్కారం చేశాడు.

“సరే నాయనా!…. అయ్యో తండ్రిగారూ….” అని రాముడు గిజగిజలాడుతూ బయల్దేరాడు. ‘పదేళ్ళ తర్వాత కలిశాడు కదా, భరతుడు నా వెంట రాకూడదా?’ అని భరతుడు రానన్నందుకు చాలా కష్టం తోచింది రాముడికి.

కొందరు ఉద్యోగులూ, బంధువులూ, మర్యాదస్తులూ రాముడి వెంట నడిచారు. మర్యాదలకన్నా పళ్ళ రుచే బాగుంటుందని గ్రహించిన వాళ్ళు చెట్లవెంట పడ్డారు.

రాముడు, నదిలో మునిగి – “తండ్రిగారూ! తండ్రిగారూ!” అంటూ, చలి సాయంతో వొణుకుతూ, గానుగ పిండిని రేగుపళ్ళతో పిసికి ఆకులమీద పెట్టాడు. “అయ్యో తండ్రిగారూ! మీకు గారపిండి శ్రాద్ధం పెట్ట వలసివొచ్చింది. దశరథ మహారాజుకి గారపిండి శ్రాద్ధమా! లోకానికి ఇంతకన్నా దుఃఖ కారణం వుంటుందా? అయ్యో! …. ఎంత దుర దృష్టం!” అని భుజాలు కదిలించి కుమలడం ప్రారంభించాడు, కుమిలేటప్పుడు భుజాలు కదిలించాలని వేదాల్లో వుండడం గుర్తొచ్చి!

వెంట వొచ్చినవారిలో వొక ధైర్యస్థుడు సాహసం చేసి – “దశరథ మహారాజుకి అయోధ్యలో సమస్త పదార్థాలతోటీ, మహా వైభవంగా శ్రాద్ధకర్మలు జరిగాయి నాయనా! నువ్వు దుఃఖించవలసిన పని లేదు” అంటూ ఓదార్చబోయాడు.

తన దుఃఖాన్ని అంత అనవసరం చేసేసినందుకు రాముడికి ఆ ఓదార్చి నాయన మీద చెప్పలేనంత కోపం వొచ్చింది. ఆయన వేపు గుర్రుగా చూశాడు. తర్వాత దోసిటినిండా నీళ్ళు తీసుకుని – “తండ్రి గారూ! మీ జ్యేష్ఠపుత్రుణ్ణి జల తర్పణ విడుస్తున్నాను. ఈ తర్పణాలు స్వీకరించండి! మీకిక దాహం కలగదు. ఆకలి కలగదు. సంతృప్తులై వుండండి వొక సంవత్సరం వరకూ” అంటూ ఆ నీళ్ళు నదిలో నీళ్ళలోకే విడిచి, గట్టెక్కి, గబగబా పొడి బట్టలు చుట్టుకున్నాడు.

దశరథ మహారాజు తాగవలసిన నీళ్ళల్లో, లక్ష్మణుడు, అన్నగారు విడిచిన పంచలు జాడించి, పిండి, భుజంమీద వేసుకున్నాడు.

అందరూ మళ్ళీ పాకలవేపు నడకలు సాగించారు.

★ ★ ★

**వ**శిష్టుడు రథాల దగ్గిరికి వెళ్ళి రాణులందర్నీ వెంట బెట్టుకుని వచ్చాడు. రాణులందరూ రాగానే రాముడి పాకని చూసి, దడిమీద ఎగిరే పంచెలు చూసి, ఇంకా ఎవరికి కనపడ్డవి వాళ్ళు చూసి, “నాయనా, రామా! ఈ రకంగా జీవిస్తున్నావా నాయనా!” అంటూ బావురుమన్నారు.

రాముడు అందరికీ వినయంగా సాష్టాంగ నమస్కారాలు చేశాడు. అప్పుడే తడిసి ఆరిన వొంటి నిండా – పొట్టకీ మూతికీ, మోకాళ్ళకీ, దుమ్ము బుక్కాలాగ పట్టింది. తల్లులందరూ కలిసి ఏడుస్తూ కొడుక్కి దుమ్ము దులిపారు.

తర్వాత రాముడు తనను చూడడానికొచ్చిన పురుషుల్ని అందర్నీ తండ్రుల్ని లాగానూ, స్త్రీలని తల్లుల్ని లాగానూ కావలించుకున్నాడు.

సీత అత్తగార్లందరికీ నమస్కారాలు చేసింది.

రాముడు మళ్ళీ, పురోహితులందరికీ నమస్కారాలు చేశాడు.

లక్ష్మణుడు తల్లులందరికీ నమస్కారాలు చేశాడు.[109]

---

**108.** **అయోధ్యా, సర్గ 102, శ్లోకం 21:** శ్రాద్ధకర్మలప్పుడు స్త్రీలు ముందు నడవాలట. రాముడు, జీవితంలో వొక్క కార్యమయినా శాస్త్రాలు చెప్పనిది చేశాడో లేదో! ★

**109.** **అయోధ్యా, సర్గలు 103, 104, 112:** రాముణ్ణి చూడడానికి చిత్ర కూటానికి కైక కూడా వచ్చిందా? – ఈ ప్రశ్న వస్తుంది. ఈ సందర్భంలో, కైక ప్రసక్తి ఎక్కడా లేదు. ‘రాజు భార్యలందరూ’ అనీ, ‘రాముని తల్లులు’ అనీ, ‘సీత అత్తలు’ అనీ, ఈ మాటలే వున్నాయి. కౌసల్యా, సుమిత్రా వచ్చినట్టు, ఆ పేర్లతో ప్రత్యేకంగా చెప్పడం వుంది. కానీ, కైక ప్రసక్తి లేదు. కైక వచ్చినట్టు కాదు. ★

సీత పురోహితులందరికీ నమస్కారాలు చేసింది.

లక్ష్మణుడు పురోహితులందరికీ వొంగి వొంగి నమస్కారాలు చేశాడు.[110]

కొంతసేపు ఇటూ అటూ, అటూ ఇటూ, నమస్కార బాణాలు దూసుకుపోయాయి. ధర్మబద్ధ శోకాలూ, రాగాలూ, కైకని తిట్టడాలూ, నమస్కారాలూ, సుఖీ భవలూ, దీవించడాలూ, శుభమస్తులూ, ముగిశాయి.

ఆడవాళ్ళందరూ లోపలి గదిలో కిట కిట లాడుతూ కూర్చున్నారు.

రాముడు మళ్ళీ తన దర్భాసనం మీద గంభీరంగా ఆశీనుడయ్యాడు.

తండ్రి మరణ వార్త వినగానే రాముడు వొక చెంప దుఃఖించే కార్యంలో మునిగాడు గానీ, రెండో చెంప – "రాజ్యపాలన నాకేం తెలుస్తుంది? రాజ్యం మీకే అప్పగించాలని వొచ్చాను" అన్న భరతుడి మాటలే పదే పదే చెవుల్లో గింగురుమంటున్నాయి.

భరతుడు కూడా జడలు కట్టుకుని, నార గుడ్డలతో, రుషి వేషం ధరించి వొచ్చాడు. రాజ్యం తిరస్కరించాడు. ఇప్పుడు తనేం చెయ్యాలి? రాజ్యం స్వీకరించాలా? అతను ఇష్టపూర్వకంగానే ఇస్తానంటున్నాడు కదా? అతని రాజ్యాన్ని అతడు ఏం చేసుకున్నా అది అతని హక్కే కదా? తను దశరధుడి రాజ్యం తీసుకోవడం లేదు కదా? – అయితే … తను సరేనంటే, తమ్ముడు దయతో ఇచ్చిన రాజ్యం తీసుకున్నట్టు అవుతుందా? – రాముడికి ఎటూ తోచడం లేదు. ఎంత కాలంనించో తను తపించిందే జరగబోతూంటే మనసుకి కొంత ఆరాటం తగ్గింది. "రాజ్యం తీసుకోవడం మంచిదా? తిరస్కరించడం మంచిదా? ఏది కీర్తి?' అనే ఆలోచన ప్రారంభమైంది. కొంతసేపు ఆలోచించి, ఆలోచించి 'ఎటూ తేల్చుకో లేకుండా వున్నానే! సరే, సంభాషణ సాగిన కొద్దీ ఎటు మొగ్గడం కీర్తివంతమో అదే తేలుతుంది' అని అప్పటికా ఆలోచన విరమించాడు.

రాముడి మోహం నిర్మలంగా, తేటగా అయింది. దుఃఖచ్ఛాయలన్నీ ఆ మొహంమీద నించి జారుకున్నాయి. తండ్రి కోసం దొర్లి దొర్లి బాగానే ఏడ్చేశాడు కాబట్టి, ఆ ఘట్టం ముగిసింది. ఇక దుఃఖాన్ని కట్టిపెట్టాడు.

భరతుడు పక్కకు తిరిగి చిరునవ్వుతో నెమ్మదిగా శత్రుఘ్నుడితో ఏదో మాట్లాడుతున్నాడు.

"నాయనా, భరతా!" అంటూ రాముడు హఠాత్తుగా భరతుణ్ణి దగ్గిరికి లాక్కున్నాడు.

మళ్ళీ ఏ ముచ్చిందని భరతుడు బిత్తరపోతోంటే, రాముడు గంభీరంగా తను దుఃఖించే ఘట్టం చాలించి, ఏ నాడో దుఃఖించడం ముగించుకున్న తమ్ముణ్ణి ముందుకు లాక్కుని తల నిమురుతూ అతణ్ణి ఓదార్చే ఘట్టం ప్రారంభించాడు – "దుఃఖించకు నాయనా, దుఃఖించకు! మన తండ్రిగారు ఎన్నో పుణ్యకార్యాలు చేశారు. ఇక్కడే ఎన్నో సుఖాలూ, కీర్తీ అనుభవించారు. ఇంతకాలానికి వృద్ధుడై జీర్ణ మానవ దేహం విడిచి దైవ దేహంతో బ్రహ్మలోకంలో విహరిస్తున్నారు.[111] మనం దుఃఖించవలసిన అవసరం లేదు" అంటూ భరతుడి వీపు కూడా నిమురుతూ ఓదార్చాడు. అంతవరకూ దొర్లి దొర్లి ఏడ్చిన రాముడు అప్పుడే తమ్ముళ్ళని ఓదార్చే స్థితికి రావడంతో అందరి ప్రాణాలూ తెరపిన పడ్డాయి.

రాముడు, భరతుణ్ణి కొంతసేపు ఓదార్చి – "నాయనా! ఈ నారగుడ్డలేమిటి? ఈ సంస్కారం లేని జడలేమిటి? రాజ్యం చెయ్యనని తిరస్కరించడమేమిటి? అసలు నీ అభిప్రాయం ఏమిటి?" అంటూ సూటిగా వ్యవహారంలోకి దిగిపోయాడు.

రాముడి కౌగిట్లో వున్న భరతుడు, చేతులు జోడించడానికి ఖాళీలేక కొంచెం వెనక్కి జరిగి కూర్చుని నమస్కారం పెడుతూ – "అన్నగారూ, మన తండ్రి ఆడదాని మాట విని ఇంత అపకీర్తి పని చేశాడు. భర్తతో ఇంత

---

**110.** లక్ష్మణుడు అందరికీ వందలకొద్దీ నమస్కారాలు చేశాడుగానీ, "ఊర్మిళ ఎలా వుంది?" అని ఎవ్వర్నీ అడగలేదు. నమస్కారాలు చేస్తే "వెయ్యేళ్ళు జీవించు నాయనా!" అంటారుగానీ, "ఊర్మిళ ఎలా వుంది?" అని అడిగితే "వెయ్యేళ్ళు జీవించు నాయనా!" అని దీవించరు కదా? ★

**111.** **అయోధ్యా, సర్గ 105, శ్లోకం 37:** ఈ శ్లోకంలో, దశరధుడు బ్రహ్మలోకంలో వున్నాడు!

**34, 35, 36 శ్లోకాల్లో:** "మన తండ్రిగారు స్వర్గంలో వున్నారు". ఈ స్వర్గమూ, బ్రహ్మలోకమూ ఒకటేనా? రాముడికి తెలుసా? చచ్చిపోయింతర్వాత దశరధుడి సంగతేమైందో రాముడు చూశాడా? తండ్రిపోయిన సంగతే ఇతరులు చెప్పేవరకూ తెలీదు కదా? ఆ పోయిన మనిషి ఏ లోకంలో వున్నాడో రాముడికెలా తెలుసు? 'అన్ని పుణ్యకార్యాలు చేశాక ఇంకెక్కడికి వెళ్తాడులే, స్వర్గానికి గాక?' అని అన్న మాటలే ఇవి. ఒక బిచ్చగాడు చచ్చిపోతే – "స్వర్గంలో విహరిస్తున్నాడు" అంటారా? అనరు. అతను ఏ పుణ్యకార్యాలూ చెయ్యలేదు కాబట్టి – "నరకంలో పడ్డాడు" అంటారు. స్వర్గ – నరకాలు, చెప్పుకునే వాళ్ళ నోళ్ళల్లో పుట్టినవే. ఎవ్వరూ చూసినవి కావు. ఎవ్వరికీ తెలిసినవి కావు. గొప్ప కులంవారూ, ధనవంతులూ, మహా పతివ్రతలూ, స్వర్గానికి వెళ్తారు. మిగిలిన వారంతా తప్పకుండా నరకంలో పడిపోతారు! తండ్రి ఫలానా లోకంలో వున్నాడని రాముడితో చెప్పించడం! రాముడు, అన్నీ తెలిసిన మహాజ్ఞాని – అన్నట్టు! ★

పాపిష్టి పని చేయించిన నా తల్లి నరకంలో పడిపోతుంది. నా తల్లి చేసిన దుష్టకార్యాన్ని నేనెంతమాత్రం ఆమో దించలేదు. అపరి మితంగా దుఃఖించాను. మన వంశ సాంప్రదాయాలూ, మన కీర్తిప్రతిష్టలూ నేనెరగనివి కావు గదా? నేనెంత మాత్రం రాజ్యం స్వీకరించరాదని ప్రథమంలోనే...."

"అవున్నాయనా!" అని మధ్యలోనే అందుకున్నాడు రాముడు – "కులీన వంశంలో పుట్టిన వాడివి. ఎన్నో వ్రతాలూ, పూజలూ చేసిన సద్గుణ సంపన్నుడివి. దశరథ పుత్రుడివి. నీవంటి ఉత్తముడు తుచ్ఛమైన రాజ్యంకోసం ఇంత పాపపు కార్యానికెలా వొడిగట్టగలడు?[112] నీ సద్గుణాలు నేను మొదటే ఎరుగుదును. నాకు రావలసిన రాజ్యం నువ్వు తీసుకోవని నేను మొదటే ఊహించా నోయీ! అటు తర్వాతేం జరిగిందో చెప్పు నాయనా!" అని భరతుణ్ణి మళ్ళీ తొడమీదకి ఎక్కించుకోబోయాడు.

భరతుడు కొంచెం ముందుకు మాత్రం జరిగి "ఇంకేం జరుగుతుంది అన్నగారూ? గోడు గోడున ఏడుస్తూ తండ్రిగారి కర్మకాండలన్నీ ముగించి మీ కోసం పట్టపుటేనుగుని తీసుకుని బయల్దేరి వొచ్చాను. మీరిక ఈ అరణ్య జీవనం చాలించి వెంటనే అయోధ్యకు బయల్దేరండి! మన వంశంలో జ్యేష్ఠ పుత్రుడే రాజు కావాలనే సత్సాంప్రదాయం నేనెరగనిది కాదు. మీరు వెంటనే పట్టాభిషేకం చేసుకుని దేవేంద్రుడు స్వర్గాన్ని పాలించినట్టు కోసలని పాలించండి! చంద్రుడి వల్ల శారదరాత్రి ప్రకాశించినట్టు, పెనిమిటి అయిన మీరు, పాణిగ్రహణం చేసి భూమి వైధవ్యం పోగొట్టండి![113] కోసల రాజ్యలక్ష్మిని పరిగ్రహించి మీ బంధుమిత్రులం దరికీ సంతోషం కలిగించండి! ఇదే నా ప్రార్థన!" అని అన్నగారి మొహం వినయంతో చూశాడు.

రాము డేమంటాడోనని అందరూ నిశ్శబ్దంగా అయిపోయి ఆసక్తిగా చూడడం మొదలుపెట్టారు.

రాముడు గంభీర ముద్రతో మౌనం వహించి వూరు కున్నాడు. 'అప్పుడే ఏదో వొకటి నిర్ణయించి తొందరపడి మాట జారితే తర్వాత తిప్పుకోవడం చాలా కష్టం. ఇంకా ఏం జరుగుతుందో కొంతసేపు చూడటం మంచిది!'

అంతకు ముందు రాముడు నదివేపు వెళ్ళి మళ్ళీ వొచ్చేటప్పటికి గుసగుసల వాళ్ళు కాస్సేపు చెట్లవెంట తిరిగివొచ్చి, దూరంగా, మూలగా మంచిచోటు చూసు కుని కూర్చున్నారు. నోరు విప్పితే ఎవరన్నా వింటారేమో ననే భయం లేకుండా మాట్లాడుకుంటున్నారు ఇప్పుడు.

రాముడు ఎంతకీ మాట్లాడకపోయేటప్పటికి, భర తుడు చూసి చూసి ప్రారంభించాడు. "అన్న గారూ! తపో జీవనం వొదిలి రాజ్యపాలన ఎందుకని సందేహిస్తున్నా రేమో! నేను మీకు చెప్పదగ్గవాడిని కాను. తపోజీవనంలో ఇహలోక సుఖాలమీద విరక్తి వల్ల దేవత్వం సిద్ధిస్తుంది. రాజ్యపాలనలో అయితే, సుఖభోగాలపైన రక్తివల్ల దేవత్వం సిద్ధిస్తుంది. రెండు మార్గాల గమ్యమూ వొకటే. అటువంటప్పుడు మీరెందుకీ కఠిన వనవాస జీవితం గడపాలి? పరమ క్రూరురాలైన నా తల్లి, ఈ పాపిష్టి పని చెయ్యకపోయి వుంటే...."

"నాయనా! కన్నతల్లిని దూషించడం ధర్మం కాదోయీ! నీ తల్లి బహు యోగ్యురాలు. ఆమెను పన్నెత్తు మాట అనరాదు సుమా!" అని రాముడు భరతుణ్ణి మంద లిస్తోంటే అందరూ నోళ్ళు తెరిచి రాముణ్ణి గౌరవంగా చూశారు.

కైక తనకు అన్యాయం చేసినప్పటికీ ఆమెను తను క్షమించడమూ, ఆమెను కన్నకొడుకే దూషిస్తూ వుండగా తను మాత్రం ఆమెను ఎప్పటిలాగే పూజించడమూ – అదంతా ప్రజలు చూసి, తనెంత సద్గుణ సంపన్నుడో గ్రహిస్తారని, రాముడు చక్కగానే గ్రహించాడు. భరతుడు

---

**112.** **అయోధ్యా, సర్గ 104, శ్లోకం 16:** రాముడు, భరతుడితో – "నీవంటి సత్పురుషుడు రాజ్యం కోసం ఇటువంటి పాప కార్యమెట్లా చేస్తాడు?" అంటున్నాడు. అంటే, రాముడి అభిప్రాయం ఏమిటంటే – కోసల రాజ్యం తనదేననీ, తన రాజ్యాన్ని తీసుకోవడానికి భరతుడు గనక సిద్ధపడితే అది పాపకార్యం అవుతుందనీ, భరతుడు సత్పురుషుడు గనక అలాంటి పాపానికి సిద్ధపడలేదనీ. ★

**113.** **అయోధ్యా, సర్గ 104, శ్లోకం 11:** "భర్త అయిన మీరు భూమి వైధవ్యం పోగొట్టండి" అన్నాడు భరతుడు రాముడితో. గంగ దాటకముందు లక్ష్మణుడు కూడా గుహుడితో మాట్లాడుతూ – "దశరథుడు పోతే భూమి విధవ అవుతుంది" అన్నాడు. అంటే, కోసలరాజ్యం మొదట దశరథుడి భార్య! రాముడికి తల్లి! ఆమె, తర్వాత భర్తపోయి విధవ అయింది. ఇప్పుడు రాముడు ఆమెని పాణిగ్రహణం చేసి వైధవ్యం పోగొట్టాలి. అప్పటి నించీ ఆ భూమి, రాముడి భార్య! ఎంత జుగుప్సాకరమైన పోలికలివి! దశరథుడు పోయింతర్వాత భూమి వొక్కటే కాదే విధవ అయింది. 353 మంది భార్యలు కూడా విధవలయ్యారే! వారి విధవత్వాన్ని కూడా రాముడు పోగొట్టవచ్చునా? ఈ మాట అడిగిన వాళ్ళు క్షుద్రులో, కిరాతకులో, నాస్తికులో, అన్నీనో అవుతారు. అసలు స్త్రీకి పునర్వివాహాన్ని అంగీకరించని ధర్మశాస్త్రాలు, రాజ్యపట్టాభిషేకాన్ని – 'భూమి విధవత్వం పోగొట్టడం'గా వర్ణించడంలో ఏం జ్ఞానం వుంది? భూమి – తండ్రికీ కొడుక్కీ కూడా భార్యేనా? ఏం వాగుళ్ళు ఇవి? ఇదేనా రామాయణం కవి వివేకం? ★

తన పక్షమే అని తేలిపోయింది కాబట్టి, ఇక కైక శక్తిహీనురాలై పోయింది. ఇక ఆమెవల్ల ఎటువంటి హానీ జరిగే అవకాశం లేదు. కాబట్టి ఆమె మీద తన కోపాన్ని పైకి ప్రదర్శించడం తెలివయిన పని కాదు. తను, వినయంతో ఆమెను శ్లాఘిస్తే ఆమెకు పశ్చాత్తాపమూ కలుగుతుంది; ప్రజలు, తన క్షమాగుణాన్ని కీర్తించడమూ చేస్తారు. .... రాముడు తల పంకించి చిరునవ్వుతో, "నీ తల్లి చేసిన కార్యానికి కూడా కారణం లేకపోలేదు నాయనా! మన తండ్రిగారు నీ తల్లిని వివాహం చేసుకున్న సందర్భంలో, నీ తాతగారితో – 'కైక కొడుక్కే రాజ్యం ఇస్తాన'ని వాగ్దానం చేశాడు.**114** ఆ కారణం చేతనే నీ తల్లి అంత పట్టు పట్టింది. అందుచేత నీ తల్లి నెప్పుడూ దూషించకు సుమా!" అంటూ తల తాటించాడు.

తల్లిని దుర్భాషలాడినందుకు భరతుడు సిగ్గుపడి తల వొంచుకున్నాడు.

కౌసల్య కొంచెం మూతి విరుస్తూ సుమిత్రని వోరగా చూసింది – "ఇంత మందిలో కైకని పొగడ్డం ఎందుకూ?" అన్నట్టు.

సుమిత్ర, కౌసల్యకి వంతపాడే గుణంతో – "మన రామయ్యెప్పుడూ పిచ్చివాడేగా అక్కా! రామయ్యకి మాయామర్మాలేం తెలుసూ?" అని చేతులు తిప్పింది.

"ఆహా! రాముడు రాముడే! మహా సద్గుణ సంపన్నుడు!" అన్నారెవరో చాలా గట్టిగా.

రాముడికి అటు చూడాలనిపించిందిగానీ, ఆ అన్నదెవరో తర్వాత లక్ష్మణుడు చెబుతాడని అటు చూసే వాంఛ నిగ్రహించుకున్నాడు.

గుసగుసల వాళ్ళకి ఉత్సాహంగా పని తగిలింది.

"అదన్నమాట సంగతి! 'రాజ్యం భరతుడికే హక్కయ్యా' అని నేను చెప్తే నువ్వు నమ్మావా? ఇప్పుడు చూడు, రాముడు తన నోటితో తనే బయట పెట్టాడు. అదంతా మంచితనం అనుకోకు! రాజ్యం ఎలాగూ తనకే ఇవ్వటానికి భరతుడు వొప్పుకున్నాడు గదా అని ఇలా అంటున్నాడుగానీ, ఇందాకేమన్నాడో గుర్తు లేదూ? 'నా రాజ్యాన్ని నువ్వు తీసుకోవని నాకు తెలుసు' అన్నాడేం ఇందాక? 'నా రాజ్యం' ఏమిటి? ఈయన రాజ్యమా?" అంటూ ఆ మూల సాగిన గుస గుసలు రాముడి చెవి దాకా పోలేదు.

"అన్నగారూ! వెంటనే తమరు అయోధ్యకు ...."

"నాయనా! తండ్రి ఆజ్ఞ ధిక్కరించవచ్చునా?" నిర్లిప్తంగా చూశాడు రాముడు.

"ఏమిటీ, రానంటాడా ఏవిటీ!" అన్న ఆలోచనల సందడి రేగింది, అందరి మొహాల్లోనూ!

గుసగుసల వాళ్ళుకూడా కొంచెం ముందుకు జరిగారు – "ఇతనికి నిజంగా రాజ్యకాంక్ష లేదా ఏమిటీ?" అని ఒకరంటే, "నీ పిచ్చిగానీ ఎందుకుండదూ?" అని ఇంకోరు కొట్టిపారేశారు.

రాముడి మాటలకు కౌసల్య కలవరపడింది గానీ, కొడుకు మొట్టమొదటే వొస్తానని వొప్పుకోవడం కూడా అంత బాగుండదనీ, రాముడు అలా అనడమే నలుగుర్లోనూ మర్యాదగా వుందనీ, చాలా సంతోషించింది.

అందరి చూపులూ, రాముడి వీపునీ, భుజాల్నీ, మొహాన్నీ గుచ్చుకుంటున్నాయి.

భరతుడు కంగారుపడుతూ – "అంతమాట అనకండి అన్నగారూ! నేనూ, మంత్రులూ, పురోహితులూ, అందరం మీరే రాజు కావాలని నిర్ణయించుకొని వొచ్చాము. మిమ్మల్ని ప్రార్థించి తీసుకు వెళ్ళాలని పుర ప్రముఖులందరూ వొచ్చారు. మన తల్లులందరూ వొచ్చారు. మీ రాజ్యం మీకే విడిచి పెడుతున్నాను నేను. స్వీకరించండి! మా అందర్నీ అనుగ్రహించి వెంటనే బయల్దేరండి!" అంటూ నమస్కారం చేశాడు. రాముడు అయోధ్యకు రావడానికి వెంటనే వొప్పుకోక కొంచెం వ్యతిరేకత చూపడంతో భరతుడికి అన్నగారిమీద భక్తి ఎక్కువయింది.

"అవును, అవును. భరతుడికి కుటిల బుద్ధి లేదు. రాముడికే రాజ్యం ఇవ్వాలనే వొచ్చాడు. అన్నగార్ని చక్కగా అడుగుతున్నాడు" అని కొందరు గట్టిగానే చెప్పుకుంటున్నారు.

రాముడు, మెడ రిక్కించి చెవులతో చూశాడు వాళ్ళని. 'రాజ్యం ఇచ్చేవాణ్ణే ఇంత మెచ్చుకుంటున్నారు. తీసుకోకుండా తిరస్కరించే వాణ్ణి ఇంకెంత మెచ్చుకుంటారో గదా!' – రాముడి ఆలోచనలు ఎటూ తేలటం లేదు. రాజ్యం వొదలడం అంటే మాటలు కాదు. భరతుడు ఎలా వొదులుతున్నాడో గానీ, .... అసలు భరతుడు నిజంగా ఇవ్వాలనుకుంటున్నాడా, 'అలా అనకపోతే బాగుండదులే' అని పైపైకి అలా అంటున్నాడా?

---

**114.** **అయోధ్యా, సర్గ 107, శ్లోకం 3:** ఈ ఒక్క శ్లోకం మీదే వాల్మీకి రామాయణం అంతా ఆధారపడి వుంది. రాముడే స్వయంగా భరతుడితో చెబుతున్నాడు – **"నీ తల్లి అన్యాయంగా ఈ పని చెయ్యలేదు. మన తండ్రి, నీకే రాజ్యం ఇస్తానని మీ తాతకి వాగ్దానం చేసి వున్నాడు"** అని వొప్పుకున్నాడు. ఈ విషయం తెలిసికూడా రాముడు తన పట్టాభిషేకానికి ఎలా సిద్ధపడ్డాడు? పైగా, కైకని తిడుతూ వుంటా దెందుకు? రాముడి ప్రవర్తనలో, మాటల్లో, ఏమైనా సత్పురుష లక్షణాలున్నాయా? రాముడు, ఈ రహస్యాన్ని ఇప్పుడైనా ఎందుకు బయట పెట్టాడంటే, ఇక ఆ సంగతి చెప్పినా ఫరవాలేదనీ, రాజ్యాన్ని భరతుడు తనకే ఇస్తానన్నాడనీ! ఈ పురుషోత్తముడే మన ఆరాధ్య దైవం! ★

ఏమో, ఎలా ఇవ్వగలడోగానీ, .... అలా అని తను తీసుకోవడానికి ఒప్పుకోవడం అంత కీర్తిదాయకం అవుతుందా? అయినా, తను జాగ్రత్తగా మాట్లాడాలి. లేకపోతే భరతుడు, తన అభిప్రాయం సరిగా గ్రహించక, తను రాజ్యాన్ని ఎప్పటికీ తీసుకోడని అర్థం చేసుకున్నా చేసుకోవచ్చు. "సరే అన్నగారూ! నే నింకేమి చెయ్యగలను? వెళ్ళి వొస్తాను" అనేస్తాడేమో! అలాంటి పరిస్థితి రానివ్వకుండా కొంతసేపు లోకరీతిగా ప్రస్తావించడం మంచిది కదా?

రాముడు, మొహం మీద చిరునవ్వుతో చూశాడు – "నాయనా! నీ ప్రార్థన నేను గ్రహించాను. నీవంటి ఉత్తముడిలో దోషముందనీ, నువ్వీ దుష్టకార్యానికి తలపడ్డావనీ నేనెప్పుడూ భావించలేదు. పెద్ద వారెప్పుడూ ... అనగా పురుషోత్తములు ... తమ భార్యల్నీ, బిడ్డల్నీ, తమ ఇష్టానుసారం ఆజ్ఞాపించడం లోక సహజమే కదా? ... నాయనా! నువ్వు సౌమ్యుడివి. నే నెరుగుదును. మనల్ని అనుగ్రహించినా, ఆగ్రహించినా మన తండ్రికే అధికారం వుంది. దేనికైనా ఆయన సమర్థుడు. నన్ను మహారాజును చేసినా, మానినా, మన తండ్రి అభీష్టం ప్రకారమే జరుగుతుంది. ధర్మవేత్తలలో మేటివి. నీకు తెలియని దేమున్నది? తండ్రిపట్ల ఎంతటి గౌరవం వుంచాలో, కొడుకులు, తల్లి పట్ల కూడా అంత గౌరవం వుంచవలసిందే! నా తల్లి పాదసేవ కోసమైనా నేను అయోధ్యకు రావొచ్చును" అని, తనను అయోధ్యకు పిలవడానికి భరతుడికి తోచని కారణం కూడా గుర్తుచేశాడు – "కానీ నా తల్లి నీకు మాత్రం తల్లి కాదా? నువ్వు ఆమె బిడ్డవు కావా? నువ్వే ఆమెను పూజిస్తూ వుండవొచ్చును" అని, తన మనసంతా తల్లి పూజ కోసమే ఆరాటపడిపోతూన్నట్టు తల వూగించాడు.

ఇంతకీ ఏం చెపుతాడో ఎవ్వరికీ బోధపడలేదు. రాజ్యాంగ మంత్రాంగాలలో, తర్కవితర్కాలలో ఆరి తేరిన పండితులూ, విద్యావేత్తలూ అందరూ వున్నారు అక్కడ. వాళ్ళుకూడా ఎటూ తేల్చుకోలేకపోయారు.

గుసగుసల వాళ్ళు ఇంకా కాస్త వెనక్కి జరిగారు "చూడు, ఎటూ తేల్చడే! నలుగురూ ఇంకా బతి మాలుతారు లెమ్మని వెనకా ముందూ చూస్తున్నాడు. భరతుడికి పిచ్చిగానీ, అతని రాజ్యం అతను చేసుకోకూడదూ?"

"పిచ్చేవిటి, నీ మొహం! అతని కీర్తి తాపత్రయం అతనిదీ. అన్నగారికి రాజ్యం ఇచ్చేస్తే – 'ఆహా, భరతుడెంత మంచివాడమ్మా' అంటారనీ! అన్నీ పైపై వేషాలు గాకపోతే రాజ్యం వద్దనే రాజెవడుంటాడు?"[115]

"మాట్లాడకు! వాళ్ళు చూస్తున్నారు."

వాతావరణం నిశ్చలంగా తయారయింది. గాలికి ఉడకబోసి ఊపిరాడక చల్లగాలికోసం బైటికి పోయింది. అందరి మొహాలమీదా చెమటలు రేగుతున్నాయి.

లక్ష్మణుడు ఆకుల విసనకర్ర తెచ్చి రాముడికి విసురుతూ వొంగున్నాడు.

అందరి మొహాల్లోనూ కొంచెం కొంచెం విసుగులు బయటపడి వొకదాన్నొకటి పలకరించుకుంటున్నాయి. "అబ్బ, చిరాగ్గా లేదూ? ఏదో ఒకటి తేల్చరాదూ?"

రాముడు కాలు మార్చుకున్నాడు. ఆ కాలిమీద దర్భల చాప ఈనెలన్నీ అచ్చు పడ్డాయి. "నాయనా! తండ్రిమాట ధిక్కరించటం మన ఇద్దరికీ ఏమి ధర్మం? ఆ పుణ్యాత్ముడు మనకు ఎలాంటి ఆజ్ఞలు ఇచ్చాడో ఆ ప్రకారమే మనం నడవాలి. ఆయన నీకు రాజ్యాధికారం ఇచ్చాడు. అది నువ్వు అనుభవించు! నాకు పద్నాలుగేళ్ళ వనవాసం ఇచ్చాడు. అది నేను అనుభవిస్తాను. ఆయన ఎవరి భాగానికి ఏది ఇచ్చాడో అదే తీసుకుందాం. పద్నాలుగేళ్ళ ఈ ఘోరారణ్యాల్లోనే పడివుండి తండ్రి నాకిచ్చిన ఈ జీవితాన్నే అనుభవిస్తాను .... పద్నాలు గేళ్ళు .... పద్నాలుగేళ్ళూ ...." అంటూ ఆగి తల వొంచి కాలు సవ్వరలో పడ్డాడు.

అసలే నిశ్శబ్దంగా వున్న వాతావరణాన్ని విసుగూ నిరుత్సాహాలు ఆక్రమించాయి. వాటికి జతగా అక్క డేదో బామికుందామని సందేహాలు కొన్ని తోసు కొచ్చాయి.

కొత్త సంగతేం చెప్పాడు? వనవాసం చేస్తా! తండ్రి ఆజ్ఞ! పద్నాలుగేళ్ళు! అదేగా చెప్పింది? ఆ తర్వాత? రాజ్యం తనదేనా? భరతుడికి రాజ్యం ఇచ్చేది పద్నాలు గేళ్ళేనా? ఆయన తల్లి అలాగే అడి గిందా? పద్నాలుగేళ్ళ తర్వాత ఏం జరగాలో దశరథ మహారాజు రాముడికి చెప్పాడా?

'పద్నాలుగేళ్ళు ... పద్నాలుగేళ్ళు' అంటాడేవిటి?

నిశ్చలమైన నీటిలో రాయి పడినట్టయింది. అందరి మనసుల్లోనూ ఆలోచనా తరంగాలే! పురో హితులూ మంత్రులూ అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటున్నారు. రాజ్యాన్ని భరతుడికి పద్నాలుగేళ్ళవరకే వదలాలనీ, ఆ తర్వాత రాముడే దాన్ని పాలించాలనీ, దశరథుడు రాముడికి చెప్పాడా? – అందరి కళ్ళూ విస్మయంతో ఇటూ అటూ దొరికే కళ్ళతో మాట్లాడుకుంటున్నాయి.

గుహుడికి మనసు వుండబట్టక, 'ఎవర్ని అడుగుదామా' అని చుట్టూ చూశాడు. తనలాగే ఇటూ అటూ

**115.** భరతుడు కీర్తి కోసమే రాజ్యం వదిలేశాడు. ఆ మాట అతనే స్వయంగా చెప్పే ఘట్టం ఈ కథలోనే వుంది. ఇంకా ముందు మీరే చూస్తారు. ★

చూస్తోన్న సుమంత్రుడు కనపడ్డాడు. గుహుడి దగ్గర చుట్ట వాసన భరించలేక అంతకు ముందు దూరంగా కూర్చున్న సుమంత్రుడు, గుహుడికి బాగా దగ్గిరికి జరిగాడు.

"పద్నాలుగేళ్ళ తర్వాత రాజ్యం రామయ్యదేనా పంతులుగారూ? నీ కేవన్నా తెలుసునా?" అన్నాడు గుహుడు గొంతు తగ్గించి.

'ఎవరికి చెబుదామా' అని ఆరాటపడుతోన్న సుమంత్రుడు, ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసి, కంఠం చిన్నది చేసి – "లేదోయి! మొదటి నుంచీ నేను దగ్గరే వున్నానుగా! కైకమ్మ కేకలేగానీ మహారాజు నోరు విప్పాడా అసలు? తీరా ఈయన అడవికి బయల్దేరేటప్పుడు మాత్రం బావురుమన్నాడనుకో. రాజ్యం సంగతీ, సంవత్సరాల సంగతీ, ఆయనేం ఎత్తలేదే! నాకు తెలీకుండా ఏవన్నా జరిగిందేమో నోయీ ....! అబ్బ! ఆ చుట్టల కట్ట బొడ్లోంచి తీసి అవతల పారెయ్యవయ్యా, చంపుతున్నావూ!"

"ఉండు పంతులుగారూ! చుట్టల గోలెందుగ్గానీ .... అసలేవీ జరిగివుండదు. అన్నీ ఈయనే కల్పించు కోగలడు. రాముడంటే ఏవిటో అనుకున్నానుగానీ, అమ్మో, మా గడుసుపిండం!"

జాబాలి వశిష్ఠుడి వేపు క్రీగంట చూశాడు, "పద్నాలుగేళ్ళ తర్వాత ఏం జరగాలి?" అన్నట్టు.

లక్ష్మణుడి ఇంగితం లక్ష్మణుడితో – "నీకన్నా తెలుసా రాజ్యం గురించి? కాసిన్ని ధనధాన్యాలు తీసి కెళ్ళడానికే కైక వీల్లేదంటే నోరు మూసుకున్నాడే ముసలాయన. వనవాసం చేసివచ్చి ఈ కొడుకునే రాజ్యం తీసుకోమని ఎప్పుడు చెప్పాడయ్యా? ఇహి .... హి .... హి .... హి .... పద్నాలుగేళ్ళ తర్వాత రాజ్యం తనదేనని నీ అన్న బాగా కలలు కంటు న్నాడే!" అని వెటకారంగా నవ్వింది. లక్ష్మణుడు పళ్ళుబిగించి ఇంగితంమీద కోపంతో విసన కర్ర రాముడికేసి కొట్టాడు.

సీత అత్తగారి వేపు చూస్తూ నెమ్మదిగా ధైర్యం తెచ్చుకుని – "అత్తగారూ! వనవాసం ముగిసిన తర్వాత ఏం జరుగుతుందండీ?" అని వినయంగా అడిగింది చిన్న కంఠంతో.

కౌసల్య – "ఏమో తల్లీ! మనకేం తెలుస్తుంది?" అని వూరుకుంది చుట్టూ సవతులుండడం చేత.

భరతుడు కూడా ఆశ్చర్యంతో – కొంతసేపు తికమక పడ్డాడు. చివరికి తేరుకున్నాడు – "అన్న గారూ! సమస్త రాజ్యాన్నీ ఈ క్షణం నించీ మీరే స్వీక రించవలసివుండగా పద్నాలుగేళ్ళ ప్రసక్తి ఎందుకు? మీరిక జాప్యం చేయక వెంటనే వొదిన గార్ని వెంట బెట్టుకుని పట్టపుటేనుగు మీద .... బయల్దేరండి..."

"నాయనా" – రాముడు విరక్తిగా చూశాడు. "విధి మనల్ని నడిపిస్తూ వుండగా మనకెలా ఇష్టమైతే అలా చెయ్యడానికి కుదురుతుందా? సిరులెన్ని సంపా దించినా చివరికి నాశనం అయిపోయేవే! వొకసారి ఉన్నత స్థానం పొందిన వాళ్ళు తర్వాత తప్పకుండా అధమ స్థానం పొందవలసిందే! భార్యలతో, పుత్రు లతో, మిత్రులతో, ఈ సంబంధాలేవీ శాశ్వతం కాదు. సముద్రంలో రెండు పుల్లలు కలిసి విడిపోయినట్టు విడిపోవలసిందే. పుట్టిన ప్రాణి చావక మానదు. ప్రతీ క్షణం ఆయుష్షు తరిగి పోతూ వుంటుందని ప్రజలు దుఃఖించనే దుఃఖించరు. రాత్రింబవళ్ళూ శరీర సౌఖ్యాలకోసం ఆరాటపడతారు. పరలోక చింతనే పెట్టుకోరు. అందుచేత మానవు డెప్పుడూ, ఏ పని చేసినా, ఏది కీర్తివంతమో, ఏది స్వర్గ దాయకమో ఆలోచించకుండా నిర్ణయించుకోకూడదు" అని నిట్టూర్చాడు.

గుహుడికి పర లోకాల సంగతి విన్న తర్వాత కూడా మళ్ళీ చుట్టమీదకే మనసు పోయింది. చుట్ట సంగతి సుమంత్రుడు జ్ఞాపకం చేసినప్పటి నించీ మనసు అటు లాగుతూనే వుంది. నెమ్మదిగాలేచి జనాన్ని తప్పించు కుంటూ నేరేడు చెట్టు కిందకిపోయి కూర్చున్నాడు.

అక్కడ బోలెడు మంది తల గుడ్డలు పరుచుకుని గురకలు తీస్తున్నారు.

కొందరు చెట్ల వెంటపడి దొరికిన పళ్ళన్నీ తింటూ ఇంటి దగ్గర గొడవలు మాట్లాడుకుంటున్నారు.

"ఏవిటి? వొస్తానంటున్నాడా?" అని అడిగా రెవరో గుహుణ్ణి.

"ఏమో! ఇంకా తేల్చలేదు. నోరు తిమ్మిరెక్కి లేసొచ్చాను."

"మనం వొచ్చి చాలాసేపయింది. కాస్సేపు వెళ్ళి కూర్చుందాం పదండి" అని కొందరు పాక వేపు బయల్దేరారు.

భరతుడు అన్నగారికేవో ధర్మాలు చెపుతున్నాడు. తనని అన్నగారు 'నువ్వు జ్ఞానివి. పండితుడివి' అని ఎలాగూ అన్నాడు కదా అని, తన జ్ఞానం అంతా ప్రజలకు చూపిస్తున్నాడు – "అన్నగారూ! మీరు సర్వజ్ఞులు కాబట్టే వృద్ధులు కూడా మిమ్మల్ని పూజిస్తారు. పెద్దల్ని గౌరవించడం కోసమే మీకేమీ తెలియనట్టు వారిని ప్రశ్న లడుగుతారుగానీ, జ్ఞానమంతా మీకే తెలుసు. చచ్చి పోయిన వాళ్ళమీద ద్వేషం వుండనట్టే బతికి వున్న వారి మీద కూడా ద్వేషం వుండదు మీకు. లేని వస్తువుమీద కోరిక లేనట్టే వున్న వస్తువుమీద కూడా కోరిక కలగదు మీకు. మీరు కష్టాలకు దుఃఖించరు, సుఖాలకు సంతోషించరు. అలాంటి జ్ఞానులు మీరీ వనవాస కష్టాలు పడకూడదు. నామీద మీకింకా ఆగ్రహం పోయినట్టు

లేదు. అసలు మీకు చేసిన అక్రమానికి నా తల్లిని చంపె య్యాలని ఆలోచించికూడా, ధర్మానికి జంకి వూరు కున్నాను. కన్నతండ్రిని ఇంతమంది ముందు నిందిం చడం ఎందుకని సందేహిస్తున్నానుగానీ, ధర్మం తెలిసిన వాడెవ్వడైనా ఆడదానిమాట కోసం ఇంత పాపిష్టికార్యం చేస్తాడా? వినాశకాలంలో విపరీత బుద్ధులు పుడతా యంటారు పెద్దలు. అదే సత్యమని దశరథ మహారాజు రుజువు చేశాడు. నా తండ్రి అధర్మం చేశాడుగానీ, దశరథ పుత్రుణ్ణి నేనెలా అధర్మాని కొడిగడతాను? తండ్రి దోషం చేసినా, దాన్ని చక్కదిద్దడమే కదా కొడుకుల ధర్మం? మీరు సత్పురుషులు కాబట్టి మన తండ్రిగారి పాప కార్యాన్ని సరిదిద్దాలి. కోసల ప్రజలమీద అను గ్రహంతో మీరు వెంటనే బయల్దేరండి అన్నగారూ!"

గుసగుసల వాళ్ళు చెవులు కొరుక్కొంటున్నారు. "ఏవిటో ఈ అన్నాదమ్ములేం మాట్లాడతారో వాళ్ళకే తెలీదు. కాస్సేపు తండ్రిని తిట్టిపోస్తారు. మళ్ళీ అంతలోనే 'ధర్మాత్ముడి కొడుకులం' అంటారు .... కష్టాలకు దుఃఖిం చనే దుఃఖించడట రాముడు. మళ్ళీ వనవాస కష్టాలు పడకూడదట! అబ్బ, విసుగొస్తోంది. ఇందాక రాముడికి కోపమే రాదన్నాడా భరతుడు, మళ్ళీ 'నామీదింకా కోపం పోలేదా?' అంటున్నాడు. పోదాం పద. రేగుచెట్ల నిండా ఎన్ని పళ్ళో! ఎందుకిక్కడ?"

"కాదులే. ఏం చెప్తాడో విందాం. మళ్ళీ మళ్ళీ రాజ కుమారుల్ని చూస్తామా, పెడతామా? అయోధ్యకి పోతే వాళ్ళెక్కడో, మన మెక్కడో!" అని వూరుకున్నాడు రెండో ఆయన.

జనం ఎవరికి వాళ్ళే గట్టిగా మాట్లాడుకుంటున్నారు.

అందరూ భరతుణ్ణి మెచ్చుకుంటున్నారు – "అవును. రాముడు బయల్దేరడమే ధర్మం. భరతుడు చెప్పింది చాలా న్యాయంగా వుంది. భరతుడికి అన్నీ తెలుసు. ఆయన చెప్పింది ఎవరైనా వినవలసిందే!"

భరతుడు తనకి ధర్మాలు చెప్పడం రాముడి కెంత మాత్రం నచ్చలేదు. కానీ, అంతకుముందు అనేకసార్లు తనే భరతుణ్ణి – "నువ్వు జ్ఞానివి, పండితుడివి" అని పొగడడంచేత తన అయిష్టం కొంత అణచుకోక తప్ప లేదు. కానీ, ఇంతమంది ముందు తండ్రిని భరతుడు ఇంత నిర్భయంగా దూషించడం ఏమిటి? ముఖ్యంగా తన ముందు! తండ్రిని తిట్టడం తనకీ ఇష్టమే అయినా, తను వింటూ వూరుకోవడం ప్రజల ముందు బాగుం టుందా? అదీగాక, వొక కొడుకు తండ్రిని నిర్లక్ష్యంతో దూషిస్తూ వుండగా, ఇంకో కొడుకు శ్రద్ధతో పితృభక్తి ప్రదర్శించడం చూస్తే, ఎవరు ధర్మాత్ములో ప్రజలు గ్రహి స్తారు. తను భరతుడి తర్క వితర్కాలకు లొంగిపోతే... 'ఏదో విధంగా భరతుడే రాముణ్ణి వొప్పించి తీసుకు వొచ్చాడు. భరతుడు అడిగిన ప్రశ్నలకు రాముడు ఇంకేమీ చెప్పలేక బైల్దేరి వచ్చాడు' అనుకోరా అందరూ? రేపటినించీ భరతుడి నేర్పరితనాన్నీ, తెలివితేటల్నీ, త్యాగబుద్ధినీ కీర్తిస్తారు జనం. తను దీనికి లొంగకూడదు. అసలు తను రాజ్యం స్వీకరించడం కన్నా, తిరస్కరించ డమే ఎక్కువ కీర్తివంతంగా కనపడుతోంది – రాముడు కొంతసేపు ఆలోచనల్లో మునిగి తేరుకున్నాడు.

అందరూ తననే చూస్తోండగా రాముడు తల పంకించి చిరునవ్వుతో భరతుణ్ణి చూశాడు. "నాయనా! ఎన్నెన్నో యజ్ఞయాగాలూ, దానధర్మాలూ చేసిన పుణ్యా త్ముడు మన తండ్రి. తండ్రిని తప్పు పట్టడం పుత్రుల ధర్మం కాదు. భర్తని తప్పు పట్టడం స్త్రీల ధర్మం కాదు. మన తండ్రి అకార్యమే చేసినప్పటికీ పితృవాక్య పరి పాలకుణ్ణి నేను కూడా నీవలే దూషించగలనా? నేను ఎన్నటికీ తండ్రి ఆజ్ఞ మీరను. నా వనవాసం ముగిసే వరకూ అయోధ్యకు తిరిగి రాను. నువ్వే అయోధ్యకు పోయి పట్టాభిషేకం చేసుకుని చక్కగా రాజ్యపాలన సాగించు. నేనీ వనవాస కష్టాలతోనే కాలం గడుపుతాను. తండ్రి ఆజ్ఞ పాటించడం కన్నా నేను కోరేదేమీ లేదు. పరలోక సుఖాల్ని ప్రసాదించే ధర్మాలు ఆచరించాలిగానీ, ఇహలోక సిరిసంపదలతో పనేమిటి?" అని ఇంకేమీ మాట్లాడే అవసరం లేదన్నట్టు మొహం పైకి పెట్టి ఎటో చూస్తూ కూర్చున్నాడు.

విషయం తేలిపోయిం తర్వాత జనంలో సందడి పుట్టింది.

"ఆహా! ఎంత ధర్మాత్ముడు! నేను మొదటే అను కున్నాను, రాముడు తండ్రి ఆజ్ఞ మీరడని."

"రాముడు రాముడేనోయీ!"

"రాముడు కూడా ధర్మం తప్పితే లోకాలు నిలు స్తాయా?"

గుసగుసల వాళ్ళు దగ్గిరికి అతుక్కుపోయారు "నిజంగానే రాడంటావా ఏమిటీ?"

"ఏమో మరి. అప్పుడే నమ్మలేం. ఎటయినా మార్చెయ్యగలడు."

"మా బాగా అన్నావు."

"ఊరుకో. గట్టిగా అనకు. వెధవ బొంగురు కంఠం నువ్వూనూ."

వొకాయన గుహుడి దగ్గిరికి పరుగెత్తుకుపోయి "రాముడు రానంటున్నాడయ్యో!" అని తనే ఆ వార్త ముందు అందించానని సంబరపడిపోయాడు.

గుహుడు నోట్లోంచి చుట్ట తియ్యడం ఇష్టంలేక తలా డిస్తూ "అలాగా?" అన్నట్టు అలాగే వుండి పోయాడు.

కౌసల్య నోటమాట రాకుండా గోడకానుకుని మతిపోయిన దానిలాగ కూర్చుండిపోయింది. 'ఏదో

మాటవరసకి అంటున్నాడులే' అనుకుంటే, ఆఖరికి ఇలా తేల్చాడేవిటి? రాజ్యం అప్పుడు వొద్దంటే వొద్దన్నాడు. ఇప్పుడు కూడా వొద్దనడం ఎందుకూ? తండ్రి మాటా, సింగినాదమా? ఎవరికీ లేని పితృభక్తి ఈ కొడుక్కే వొచ్చిందా? – కొడుకు ధోరణి ఏమిటో అంత గడుసు తల్లికి కూడా అంతుపట్టలేదు.

రాముడు అడవులకు బైల్దేరినప్పటినించీ, కౌసల్య, తన ఆశలన్నీ భరతుడి మీదే పెట్టుకుంది, .... అతడు రాజ్యం తీసుకోడని! అనుకున్నట్టే అయింది. ఆ పుణ్యాత్ముడు రాజ్యం వదులుకోడానికి సిద్ధంగానే వున్నాడు! ఇందాక రథాలు దిగి వస్తూ వున్నప్పుడు సుమిత్రతో నవ్వుతూ నవ్వుతూ అంది – "నీ కొడుకు ఇక్కడ ఊడిగం చేసుకుంటూ బతుకుతున్నాడని బాధపడుతున్నావేమో గానీ, భరతుడు రాజ్యం ఇచ్చేస్తున్నాడుగా? రాముడు రాజయ్యాక, నీ కొడుకు రాజభోగాలన్నీ అనుభవించడా?"[116] అంటూ సవితితో కొంచెం సరస మాడింది. ఇన్ని ఆశలు పెట్టుకుని ఇంతదూరం వొస్తే, రాముడు రాజ్యమే తీసుకోనంటున్నాడే! – కౌసల్య బలవంతంగా కన్నీళ్ళు దిగమింగుకుంది. సుమిత్ర మొహం చూడ్డానికే ధైర్యం చాలలేదు. భరతుణ్ణి లోపలికి పిల్చి– "నువ్వెలాగయినా రాముణ్ణి వొప్పించు నాయనా!" అని చెప్దామా అని ఆరాటపడింది. కానీ, భరతుడు అడుగుతూనే వున్నాడయ్యే!

సీత, అత్తగారి ఆందోళనకు కారణం తెలీక దిగులు పడుతోంది.

అన్నగారు అయోధ్యకి రానని తేల్చిచెప్పెయ్యడంతో, అన్నగారి మీద భరతుడి భక్తి గౌరవాలు పదింతలయ్యాయి. అంతటి సత్పురుషుణ్ణి ఎలాగయినా తీసుకు వెళ్ళాలనే ఆరాటం పట్టుకుంది. చుట్టూ కూర్చున్న జనాన్ని పక్కలకు తప్పుకోమని, అన్నగారి పాదాల ముందు బోర్లా పడుకుని, సాష్టాంగ నమస్కారం చేసి పాదాలకు తల ఆనించి లేచి కూర్చుని మళ్ళీ నమస్కారం చేశాడు – "అన్న గారూ! లోకాలన్నీ పాలించగల సమర్థులు మీరు. కోసల సామ్రాజ్యాన్ని మీరు తప్ప ఎవరు పాలించగలరు? మీరెరిగిన రాజనీతులూ, లోక ధర్మాలూ నేనెరిగిన వాడినా? జ్యేష్ఠులు మీరుండగా నేను రాజ్యం చెయ్యవొచ్చునా? నేను గాడిదని. మీరు జాతి గుర్రం! గుర్రమూ, గాడిదా వొకటేనా? గద్దా, గరుత్మంతుడూ వొకటేనా? నేను అజ్ఞానిని. మూఢుణ్ణీ, హీనుణ్ణీ. నే నెట్లా రాజ్యం పరిపాలించగలను?[117] దేవ, బ్రాహ్మణ, పితృ రుణాలు తీర్చుకుంటూ, శత్రువుల్ని జయిస్తూ, మిత్రులకు సంతోషం కలిగిస్తూ, బ్రాహ్మణ – క్షత్రియ – వైశ్య – శూద్రులు వారి వారి కులధర్మాలు అతిక్రమించకుండా కాపాడుతూ రాజ్యం చెయ్యడం మాత్రం తపోధర్మం కన్నా గొప్ప ధర్మం కాదా? అసలు తపస్సువల్ల ఏం ఫల మొస్తుందో ఎవరికి తెలుసు? వస్తుందో లేదో సందేహమే కదా? ఫలానా ఫలం కలుగుతుందని నిరూపించడం కష్టసాధ్యం కదా? తపస్సు తర్వాత కలగబోయే ఫలం రుజువు లేనిదే కదా? అందుచేత తమరు తపో జీవనం వొదిలిపెట్టి, మమ్మల్ని అనుగ్రహించి అయోధ్యకు బయల్దేరండి అన్నగారూ! రాజు లేక అనాథలమై వున్న మమ్మల్ని పరిపాలించండి!" అని ఆశగా చూశాడు.[118]

"నిజమే, భరతుడన్నది బాగుంది. ఈ తపస్సుల వల్ల ఏం వొస్తుంది? మన్ను! పిచ్చి గాకపోతే ...." అంటున్నారెవరో ధైర్యంగా, మూలనించి కనపడకుండా!

రాముడికి చాలా కోపం వచ్చింది భరతుడి మీద. 'తపోధర్మాన్నే శంకించేటంతటి ఘనుడా ఇతడు' అని అతని అవినయంమీద ఆగ్రహం కలిగింది. కానీ,

---

**116.** **అయోధ్యా**, సర్గ 103, శ్లోకం 7: రాముడు రాజయ్యాక లక్ష్మణుడు కూడా రాజభోగాలు అనుభవిస్తాడని కౌసల్య సుమిత్రని సంతోషపెడుతోంది. "నీ కొడుకు ఇక్కడ ఊడిగం చేస్తున్నాడని బాధపడకు" అంటోంది. ★

**117.** **అయోధ్యా**, సర్గ 105, శ్లోకం 6: + సర్గ 106, శ్లోకం 24: భరతుడు తనని తను గాడిదగా, సామాన్య పక్షిగా, హీన బుద్ధిగలవాడిగా చెప్పుకుంటున్నాడు. కానీ, మనం, గాడిద మనసు తెలుసుకోగలిగితే, దానికీ ఆత్మాభిమానం వుంటుంది. భరతుడికి అది లేదు. కవి, రాముడి పాత్రని అందలం ఎక్కించి రాముణ్ణి మహోన్నతుణ్ణి చెయ్యడం కోసం, ప్రతీ పాత్రనీ తక్కువ చేస్తాడు. "నేను చాలా అల్పుణ్ణి రాముడి కన్నా" అని ఆ పాత్రే వొప్పుకుంటుంది! భరతుడు కూడా సమర్థుడైతే రాముడి ఔన్నత్యం తగ్గిపోతుందా? అందరూ వెధవలైపోతే రాముడు సత్పురుషుడవుతాడు గావున్ను! ఏ చెట్టూ లేని చోట ఆముదం చెట్టే మహావృక్షం అయినట్టు! ★

**118.** **అయోధ్యా**, సర్గ 106, శ్లోకం 20: అన్నగార్ని ఒప్పించడంకోసం ఇక్కడ భరతుడు 'నాస్తికత్వం' మాట్లాడుతున్నాడు. 'తపస్సులవల్ల ఏం ఫలితం వస్తుందో, అసలు వస్తుందో రాదో, ఎవరికి తెలుసు?' అంటున్నాడు! వాళ్ళకి ఎప్పుడు ఎలా కావాలో అలా తిప్పేస్తారు వాదాల్ని! తపస్సులు చేసే వాళ్ళు కూడా 'తపస్సుల వల్ల ఏమీ రాదు' అనుకుంటూనే వుంటారు. ఎందుకంటే, దాని ఫలితాన్ని చూసిన వాళ్ళెవరూ వుండరు. 'తపస్సు చేస్తే పుణ్యం వస్తుంది, స్వర్గం వస్తుంది' అని పెద్దవాళ్ళు చెప్పిందే నమ్ముతారు. ఆ పెద్దవాళ్ళకి కూడా తెలిసిందేమీ ఉండదు. సుఖాలు విడిచిపెట్టడమే అంత పుణ్యం అయితే, ఏనాడూ సుఖాల మొహం ఎరగని, సుఖాలాసే లేని కోట్లాది పేదలకెంత పుణ్యం రావాలి! ★

వెంటనే సరైన జవాబు చెప్పడానికేమీ తోచలేదు. 'ఫలానా తపశ్శాలికి ఫలానా ఫలితం కలిగింద'ని చెప్పి, నోరు మూయించడానికేమీ ఆధారం కనపడ లేదు. తపస్సులు చెయ్యనివారూ చచ్చిపోతున్నారు, చేసిన వారూ చచ్చిపోతున్నారు! వారేమవుతున్నారో ఏ రుషులూ చెప్ప లేక పోతున్నారు. వేద ధర్మాలు పాటించిన వారంతా స్వర్గానికి చేరతారని అనడమే గానీ, చూసిన వారెవరూ లేరు. నిజా నిజాలెవరూ ఎరగరు. భరతుడి మాటలకు చప్పున ఏ జవాబూ దొరకనందున రాముడి మనసంతా ఉక్రోషం ఆక్రమించింది. ఆ చర్చలోకి దిగకపోవటమే తెలివయిన పని అని గ్రహించేటంత తెలివి కలిగించింది. మొహం గంభీరంగా పెట్టి – "భరతా! తపస్సు వల్ల ఫలితం వస్తుందో రాదో ఆ సంగతి విడిచిపెట్టు! నేను సత్యవ్రతుణ్ణి! మాట తప్పను. పితృవాక్యాన్ని ధిక్క రించి నేను అయోధ్యకు రానే రాను" అని మొహం పైకెత్తి పాక కప్పువేపు చూస్తూ ఉండిపోయాడు. "ఏం చేసు కుంటావో చేసుకో!" అన్నట్టు.

భరతుడు బిత్తరపోయాడు. అంత గాంభీర్యం వహించిన అన్నగారితో ఇంకేమీ మాట్లాడే ధైర్యంలేక చుట్టూ చూశాడు.

"ఆహా! రాముడు మాట తప్పడయ్యా!"

"ఏమి స్థయిర్యం! ఏమి స్తిరత్వం:"

"ఇంతకీ తపస్సువల్ల ఏం ఫలం వొస్తుందో చెప్ప లేదేం?"

"వేరే చెప్పాలా ఏమిటి? పుణ్యం రాదూ?"

"ఇంకెవరయినా అయితే రాజ్యం దొరికిందే చాలని తీసుకోరూ?"

"నువ్వయితే మొదటే తీసేసుకుంటావులే."

"ఏం, నువ్వు తీసుకోవా?" – ఒక మూల చిన్న జగడం రేగింది.

"రాముడు నిజంగానే రానంటున్నాడయ్యో! నువ్విక్కడ కూర్చున్నావేమిటయ్యా, నీ చుట్ట తగలడా!" అంటూ వొగురుస్తూ వొచ్చి ఒకాయన గుహుణ్ణి మందలించాడు.

గుహుడి చుట్ట ఎలాగూ తగలడింది. తగలడి పోయిన చుట్ట ముక్క పారేసి – "నిజంగానే రానంటున్నాడా?" అని కొంచెం ఆశ్చర్యంగా చూశాడు గుహుడు.

"ససేమిరా రానంటున్నాడు."

"కాస్త బతిమాలితే వొచ్చేట్టు కనపడ్డాడుగా?"

"ఇందాక అలాగే అనుకున్నాంగానీ, ఎందుకో మరి మొండి పట్టు పడుతున్నాడు."

"పద, చూద్దాం!" అంటూ లేచాడు గుహుడు.

జనం గబగబా తప్పుకుని రాజ బాట వొదిలారు. గుహుడు సరాసరిపోయి రాముడి ముందు చతికిల బడ్డాడు.

అప్పటికి జాబాలి రాముడికేదో బోధిస్తున్నాడు.[119] "భార్యాబిడ్డల సంబంధాలు అశాశ్వతాలని నువ్వే అన్నావు గదా నాయనా! తండ్రికి బిడ్డలతో సంబంధం అశాశ్వతం అయితే, బిడ్డలకు తండ్రితో సంబంధం కూడా అంతే కదా? జీవిత ప్రవాహంలో ఎవరి దారిన వాళ్ళే కొట్టుకు పోయేటప్పుడు, వొకరి కోసం వొకరు వ్రతాలూ పూజలూ చెయ్యడం వ్యర్థం అని తెలియడం లేదా? రామా! పర లోకాలు లేవు. ఉన్నది ఒకటే లోకం! అది ఈ లోకమే. ఈ తపస్సులన్నీ వ్యర్థం! ఇహలోక సుఖాలు విడిచి, తపస్సులు చేసేవాడు, రెంటికీ చెడ్డ రేవడి అవుతాడు. దశరధుడి ఆజ్ఞ పాటించాల్సిన అవసరం నీకేమీ లేదు. అతడొక రాజూ, నువ్వొక రాజువీ. నీ తండ్రి పర లోకంలో వున్నాడనేది ఉత్త భ్రమ. చచ్చిపోయే ప్రాణులన్నీ ఏమౌతాయో, నీ తండ్రీ అదే అయ్యాడు. అదే, జీవుల స్వభావం. ఈ శ్రార్ధాలూ, పిండాలు పెట్ట డాలూ, ఇవన్నీ శుద్ధ వ్యర్థం! ఇక్కడ పెట్టిన తిండీ నీళ్ళూ పరలోకానికి అందేటట్టయితే, ఇంకో గ్రామంలో ఉన్న వారికి కూడా, ఇక్కడ మన గృహంలో పెట్టిన భోజనం అందాలి కదా? కానీ, అలా జరగదు. ఈ ధర్మాలన్నీ కొందరు స్వార్ధపరులు స్వార్ధ బుద్ధితో రాశారు. వారి ధన సంపాదనకోసం ఏమేమో కల్పించారు. అందుచేత నాయనా! భరతుడు రాజ్యం ఇస్తానంటున్నాడు. నిన్నే పాలించమని అంతగా ప్రార్ధిస్తున్నాడు. నిస్సందేహంగా తీసుకో! మహా రాజువై రాజభోగాలు అనుభవించు!" అని జాబాలి చిరునవ్వుతో చెప్పాడు.

జనంలో కలకలం రేగింది.

అందరూ భరించలేనంత సంభ్రమంతో, ఉత్కంఠలో మునిగిపోయారు.

నిత్య పూజలుచేసే వారందరికీ చాలా కోపాలు వచ్చాయి.

గుసగుసలవాళ్ళు రాముడేమంటాడోనని కను రెప్పలు వెయ్యకుండా చూస్తున్నారు.

రాముడికి రకరకాల ఆలోచనలతో భరించలేని క్లేశం కలిగింది. – 'ఏమిటీ నాస్తిక దుర్గంధం!' అని అతని సర్వాంగాలూ కుంచించుకున్నాయి. అతని మనసు మాత్రం కొంచెం శాంతం తెచ్చుకుంటోంది. 'జాబాలి బ్రాహ్మడు. పండితుడు. ఇతని వాదం సజావుగానే వుంది. ఈయన అయోధ్యలో వొక్కసారీ ఇటువంటి మాటలు చెప్పలేదే!' అని గిజ గిజ లాడుతోంది.

రాముడు జాబాలి వేపు తీక్షణంగా చూశాడు.

**119.** అయోధ్యా, సర్గ 108లో శ్లోకాలు అన్నీ: జాబాలి రాముడికి హేతు వాదం బోధిస్తున్నాడు. ★

"నువ్వు మా పురోహితుడివి కాబట్టి నేను గౌరవించ వలసిందేగానీ, ఈ నాస్తిక తర్కం నేను భరించ లేకుండా వున్నాను. నాస్తికులు ఎన్నో అసత్యాలు చెబుతారని నేను అనేకసార్లు విన్నాను. నువ్వూ అటువంటి అసత్యాలే చెపుతున్నావు. దేవేంద్రుడు నూరు యజ్ఞాలు చెయ్యబట్టే స్వర్గాధిపత్యం పొందాడు. రుషులు తపస్సులు చెయ్యబట్టే స్వర్గానికి వెళ్ళారు. 'మనకెలా తెలుసు?' అంటారేమో నాస్తికులు. వేదాల్లో రాశారు.[120] రుషులు, ఆకాశంలో నక్షత్రాలై వెలుగుతూ వుండడం చూస్తూనే వున్నాము. అంతకన్నా రుజువేం కావాలి? వేద ధర్మాలు సత్యం! స్వర్గ నరకాలు సత్యం! దేవతలూ, రుషులూ, 'సత్యమే పరమ ధర్మం' అని చెప్పారు. లోకంలో కొందరు రాజ్యాలు పాలిస్తే, కొందరు వారి భృత్యులై జీవిస్తారు. కొందరు స్వర్గానికిపోతే కొందరు నరకానికి పోతారు. ఈ తేడాలు సత్యా సత్యాల వల్లనే కలుగుతున్నాయి.[121] నేనే ఈ సత్యం విడిచిపెడితే రాజ్యంలో ప్రజలందరూ చెడిపోతారు. ఇక నువ్వీ నాస్తిక వచనాలు చాలించు! అసలు, పండితుడయిన వాడు నాస్తికుడి ఎదుట నిలబడ కూడదు" అంటూ రాముడు కోపంగా మొహం పక్కకు తిప్పుకున్నాడు. కానీ, ఇంకా కోపం తీరక మొహం మళ్ళీ తిన్నగా తిప్పి చెప్పడం సాగించాడు – "బుద్ధుడు దొంగ వంటి వాడు. బుద్ధుడికీ, నాస్తికుడికీ ఏమీ భేదం లేదు.[122] ఇంత వేద విరుద్ధమైన బుద్ధి గలవాడివీ, వైదిక వేషం వేసుకుని అంతరంగంలో మహా నాస్తికుడివై నాస్తిక ప్రచారం చేసే వాడివీ, ధర్మమార్గం వొదిలి అధర్మ మార్గాన నడిచేవాడివీ, దశరథ మహారాజు ఆస్థానంలో ఎలా ఆశ్రయం సంపాదించగలిగావు? నిన్ను చేరదీసి నా తండ్రి కూడా మహా దోషి అవు తున్నాడు" అని రాముడు, పక్కకి మొహం తిప్పుకున్న సంగతి మరచి పోయి జాబాలిని కోపంగా చూస్తూ కళ్ళెర్ర జేశాడు.

రాముడికి అంత కోపం రావడం చూసి జాబాలి చాలా భయపడ్డాడు. – "నీకు రాజ్యం అక్కర్లేకపోతే నాదేం పోయింది మధ్య? తెలివి తక్కువగా నా ప్రాణాలమీదకు తెచ్చుకోవడం ఎందుకు" అనుకుంటూ తల వాల్చి ఆలోచనలో పడ్డాడు. తను నాస్తికుడని రాముడికి బాగా విశ్వాసం కుదిరింది. అతడి అభిప్రాయం మార్చకపోతే తన జీవితానికి చాలా దెబ్బ. నాస్తికుల్ని ఉపేక్షించరాదని భరతుడికి ఎన్నో విధాల చెప్పాడు. తనకు మరణ శిక్షో, దేశ బహిష్కార శిక్షో వేయిస్తే ఈ వృద్ధాప్యంలో .... ఇంత బతుకూ బతికి .... ఇప్పుడు దేశాలుపట్టి తిరగడం .... ఎందుకింత కర్మం తనకి? ఎవరు రాజ్యం చేస్తే తన కొచ్చిన నష్టమేముంది?

జాబాలి వినయంగా రాముణ్ణి చూశాడు. "నాయనా, రామా! నిన్ను ఎలాగయినా అయోధ్యకు తీసుకుపోవాలని ఆ విధంగా మాట్లాడానుగానీ, నేను నాస్తికుణ్ణి కాను సుమా! ఎవరయినా నాస్తికత్వం మాట్లాడినా నేను సహించలేను. తీవ్రంగా ఖండిస్తాను. పరలోకాలు లేవని నా అభిప్రాయం ఎంత మాత్రం కాదు నాయనా! నువ్వు లేకుండా నేను అయోధ్యకు తిరిగి వెళ్ళలేక, ఏదో విధంగా కార్యం సమకూరితే చాలని .... ఆ విధంగా మాట్లాడాను సుమా!" అంటూ నచ్చజెప్పబోయాడు.[123]

---

**120.** **అయోధ్యా, సర్గ 109, శ్లోకం 29:** తపస్సులవల్లా, యజ్ఞాలవల్లా ఏం మంచి జరిగిందో చెపుతున్నాడు రాముడు. 'అలా అని వేదాల్లో రాశారు కాబట్టి, దాన్ని నమ్మి తీర'మంటున్నాడు. 'ఇక్కడ మనం పెట్టే పిండాలు పరలోకాలకు అందేటట్టయితే, ఒక ఊళ్ళో పెట్టిన భోజనం ఇంకో ఊళ్ళో వాళ్ళకి కూడా అందాలి కదా?' అని అడిగాడు జాబాలి. జాబాలి ప్రశ్నలకు సూటిగా జవాబులు చెప్పకుండా, దాటవేతలూ బెదిరింపులూ చేస్తున్నాడు రాముడు! ★

**121.** **అయోధ్యా, సర్గ 109, శ్లోకం 15:** లోకాన్ని పాలించే రాజులు సత్యసంధులవ్వడం వల్లనే పాలకులవుతారని శెలవిస్తున్నాడు రాముడు! అంటే ధనికులందరూ సత్యం మాట్లాడే వారన్నమాట. పేదలందరూ అబద్ధాలు మాట్లాడి ఆ గతి తెచ్చుకున్నారన్న మాట! కొందరు మనుషులు యజమానులై, కొందరు మనుషులు సేవకులై ఉండడానికి కారణం, వారి సత్యాసత్యాలే అనుకోవాలని అర్థం! ★

**122.** **అయోధ్యా, సర్గ 109, శ్లోకం 34:** రాముడు బుద్ధుణ్ణి నిందిస్తున్నాడు. 'రామాయణం' గురించీ, 'బుద్ధుడి' గురించీ చెప్పే కాలాల లెక్కల ప్రకారం, రామాయణం బుద్ధుడికన్నా పూర్వ కాలపు రచన. అలాంటప్పుడు, బుద్ధుడి పేరుని రాముడు ప్రస్తావించడం ఏమిటి? వాల్మీకి మూలకథకి తర్వాత కవులు ఎన్నో విషయాలు చేర్చారు – అనేది ఇలాంటి సందర్భాలవల్ల రుజువవుతుంది. బౌద్ధ మత ప్రభావంవల్ల ప్రజల్లో యజ్ఞయాగాల మీదా, తపస్సులమీదా, విముఖత ప్రారంభమై వుంటుంది. ప్రజలు హేతువాదం వేపు ఆసక్తి కనబరుస్తున్నారనుకోవాలి. వేద ధర్మాల్ని సమర్థించే కవులు, నాస్తికత్వాన్ని దుయ్యబట్టడం కోసం, రాముడి పాత్రతో బుద్ధుణ్ణి తిట్టించడానికి, ఈ 'బుద్ధుడి సంఘటన'ని కొత్తగా చేర్చి వుంటారు. అయినప్పటికీ ఇది కథలో ఏనాటి నించో వున్నదే కాబట్టి దీన్ని కూడా రామాయణంలో భాగంగానే తీసుకోవాలి. ★

**123.** **అయోధ్యా, సర్గ 109, శ్లోకాలు 38, 39:** జాబాలి నాస్తికత్వం, కత్తికి జడిసి ఐదు నిమిషాల్లో ఎగిరిపోయింది. కవి, ఈ ఘట్టంలో జాబాలి పాత్ర ద్వారా కొంత నాస్తికత్వం జొప్పించి, తర్వాత మళ్ళీ జాబాలి పాత్రచేతనే – "నేను నాస్తికుణ్ణి ➔

రాముడికి కోపం తగ్గలేదు. జవాబు చెప్పకుండా మౌనం వహించాడు మొహం బిగించి.

జాబాలికి దడ ప్రారంభమైంది. రాముడు ఏ క్షణంలో హఠాత్తుగా మొహం తిప్పి – "భరతా! జాబాలికి వెంటనే మరణశిక్ష విధించవోయ్! దేశంలో నాస్తికుల్ని తుడిచిపెట్టు!" అంటాడోనని జాబాలికి సర్వాంగాలూ వొణకడం మొదలెట్టాయి. మనసులో అదురుతూ వశిష్టుడి వేపు కంగారెత్తి చూస్తూ "ఇదేం తద్దినం? ఇంకెప్పుడూ ఇట్లా ప్రాణాల మీదకు తెచ్చుకోను. నువ్వు కొంచెం రాముడికి నచ్చచెప్పు" అని కళ్ళతో ప్రార్థించాడు.

వశిష్టుడు జాబాలికి చిరునవ్వు కళ్ళతో ధైర్యం చెప్పి, రాముడివేపు తిరిగాడు. "నాయనా, రామా! జాబాలి, నీ మీద అనురాగం చేతనే ఆ విధంగా మాట్లాడాడుగానీ, అతడెంత మాత్రం నాస్తికుడు గాడు సుమా! అతడికి వేద ధర్మాలన్నీ తెలుసు. మానవులు చచ్చిపోయిన తర్వాత వారి పాప పుణ్యాలను బట్టే ఇతర లోకాలకు వెళ్తారని అతడు ఎరుగును. నాయనా! జాబాలి నిన్ను చూడకుండా జీవించలేక, నువ్వు అడవులలో కష్టాలు పడడం సహించలేక, నిన్ను అయోధ్యకు తీసుకుపోవ

➔కాను. నాస్తిక తర్కం వింటే నాకు పరమ ద్వేషం. పర లోకాలున్నాయని నాకు చక్కగా తెలుసు" అని చెప్పిస్తాడు. ప్రజల్లో నాస్తికత్వం ప్రచారం కాకూడదనే అభిప్రాయంతో చేసిన ప్రయత్నం ఇది. ముందు నాస్తికత్వం మాట్లాడిన పాత్ర చేతనే– 'నాస్తికత్వం ఆచరించదగ్గది కాదు' అని చెప్పిస్తే ప్రజలు కూడా నాస్తికత్వాన్ని తిరస్కరిస్తారని కవి అంచనా! కానీ, ఈ ఘట్టంలో జరిగింది జాబాలి, 'తర్కంలో ఓడిపోవడం'కాదు. రాముడేవో గొప్ప ప్రశ్నలు వేసి, వాటికి జాబాలి జవాబులు చెప్పలేక తెల్లమొహం వేస్తే, అతను ఓడిపోయాడు అనుకోవచ్చు. అసలు జాబాలి ప్రశ్నల్లో దేనికీ రాముడు జవాబులు చెప్పలేదు. ఏ గ్రంధాలు పనికిరావని జాబాలి అన్నాడో, ఆ గ్రంధాలనే రాముడు మళ్ళీ ప్రమాణంగా చూపించాడు. "చచ్చిపోయిన వాళ్ళకి మనం వేసే పిండాలు అందుతాయా?" అని జాబాలి అడిగిన ప్రశ్నకి రాముడు తిన్నగా జవాబు చెప్పాలిగానీ, "ఈ శాస్త్ర ధిక్కారమేమిటి? వేదాల్లో అలాగే రాశారు. అంతే, నోరు ముయ్యి!" అంటే, అది ఆ ప్రశ్నకు జవాబు చెప్పినట్టు అయిందా? ఇది, నాస్తికత్వాన్ని తర్కంతో ఓడించినట్టా? ఇక్కడ ఓడిపోయింది, నాస్తికత్వం కాదు. ఆ నాస్తికుడు, మరణ భయంచేత నోరు మూసుకుంటే, అది అతన్ని ఓడించినట్టు కాదు.

కానీ, ఈ ఘట్టంవల్ల సామాన్య ప్రజలకు పైకి కనబడేది ఏమిటంటే – జాబాలికీ, రాముడికీ వాదం జరిగినట్టూ, అందులో జాబాలే ఓడిపోయి 'నాస్తికత్వం తప్పే' అని వొప్పేసుకున్నట్టూ, వేద ధర్మాలే మానవులకు ఆచరణీయం అయినట్టూ, రాముడి మాటల్ని మించిన సత్యం ఏదీ లేనట్టూ, చివరికి అదే తేలినట్టూ, కనబడుతుంది. – భరతుడికి చెప్పి జాబాలికి శిక్ష వేయించగల అధికారం రాముడికి లేకపోతే, ఈ చర్చలో జాబాలే నెగ్గి రాముడు కిక్కురు మనకుండా నోరు మూసుకునేవాడే.

సంఘంలో పరిస్తితులు మారుతున్న కొద్దీ, అనేక అనుభవాలవల్ల ప్రజల్లో ఆలోచనాశక్తి పెరుగుతుంది. వారు హేతువాదంవేపు మళ్ళుతూ వుంటారు. అది పాలక వర్గానికి నచ్చదు. ఎందుకంటే, ప్రజలు మూఢ నమ్మకాలతో వుంటేనే దానికి లాభం. కాబట్టి, పాత మత గ్రంధాల్లోకి కూడా హేతువాదాన్ని దుయ్యబట్టే కొత్త కొత్త ఘట్టాలు జొరబడుతూనే వుంటాయి. లేదా, మత గ్రంధాల్ని బోధించే పూజారులూ పండితులూ వంటివాళ్ళు, ఆ బోధనా సమయాల్లో, కొత్త జ్ఞానాన్ని వ్యతిరేకిస్తూ వుంటారు.

బౌద్ధ మతం అవతరించి ప్రజల్ని ఆకర్షించడం ప్రారంభమైన తర్వాత, 'నాస్తికత్వం చీడ'ని అరికట్టడానికి 'వాల్మీకి రామాయణం'లో కొన్ని సర్గలు కొత్తగా వెలిసి వుండాలి. అలాగే, ఇప్పుడు 'సోషలిజం పీడ'ని కూడా అరికట్టడానికి రామాయణంలోకి ఇంకా కొన్ని సర్గలు మళ్ళీ కొత్తగా జొరబడవలసివుంది. ఈసారి రాముడికీ, ఒక విప్లవ పండితుడికీ 'వర్గ భేదాలమీద', హోరాహోరీ చర్చ జరుగుతుంది. 'రాముడి కాలం నాటికి మార్క్సు లేడు కదా' అనకండి! రాముడి కాలంనాటికి బుద్ధుడు కూడా లేడు. ఏదీ వుండాల్సిన పని లేదు. రాముడు ఏదైనా మాట్లాడెయ్య వొచ్చును. సోషలిజం మీద చర్చ జరిగితే, చివరికి రాముడు కళ్ళెర్రచేస్తాడు – "ఏమిటీ వర్గ దుర్గంధం? వేదాల్లో ఇదేమీ చెప్పలేదే? మార్క్సు దొంగ వంటి వాడు. ఇంత విప్లవ కారుడివై మార్క్సు బోధనలు ప్రచారం చేసే నిన్ను, దశరథ మహారాజు నమ్మి తన ఆస్థానంలో ఎలా పెట్టుకున్నాడు? ఈ దారుణం నేనిక సహించను" అంటాడు. "ఇతడు వర్గ శత్రువు. ఇతణ్ణి తొందరగా పంపించెయ్యి లోకం నుంచి" అని హెచ్చరికగా భరతుడివేపు చూస్తాడు. దాంతో, మన విప్లవ పండితుడు బెదిరిపోయినట్టూ, తన అభిప్రాయం మార్చుకున్నట్టూ, కవి రాస్తాడు. ఆస్థాన సుఖాలు మరిగిన వాడవడంచేత మన పండితుడు నిజంగానే బెదిరిపోతాడు కూడానూ. – "నాయనా! రామా! నువ్వు రాజ్యానికి రావాలని అలా అన్నాను. నాకు కూడా వర్గ పోరాటంలో నమ్మకం లేదు. వర్గ చైతన్యాల గురించి ఎవరైనా సంభాషిస్తే నాకు పరమ ద్వేషం. తప్పకుండా వేద ధర్మాలే ఆచరణీయాలు. కర్మే మానవుల్ని పాలించే శక్తి. పర లోకాలు మాత్రమే సత్యం ...." అని రివిజనిస్టు అయిపోయి ప్రాణాలు దక్కించుకుంటాడు. ప్రజల్ని సోషలిజం నించి మళ్ళించడానికి, ఈ ఘట్టం కూడా వీలైనంత తొందరగా రామాయణంలోకి జొప్పించవలసిన బాధ్యత బూర్జువా కవులందరిమీదా వుంది. ★

టానికి మాత్రమే ఆ విధంగా మాట్లాడాడు సుమా!" అని శాంతంగా చిరునవ్వుతో చెప్పాడు.[124]

రాముడికి అప్పటికి కోపం తగ్గింది. పరలోకాలున్నాయని అందరూ వొప్పుకున్నారు. నాస్తికత్వం ఓడిపోయింది! తన సత్యవ్రతాలు సత్యం! తన వన వాసం వ్యర్థం కాదు! తనకు స్వర్గం లభించడం నిశ్చయం!

"అవును మరీ, స్వర్గ నరకాలు లేకపోతే ఇంకేమన్నా వుందా?" అని సెలవిస్తున్నాడు ఒక శెట్టిగారు, ఐదు వేళ్ళకీ వజ్రాల ఉంగరాలు పెట్టుకున్న చేతిని తిప్పుతూ. "మొన్న మా పక్కింటి పెద్ద మనిషి మా పెరట్లో చెట్టువి రెండు నిమ్మకాయలు కోసేశాడయ్యా! అతగాడికి నరకం గాకపోతే స్వర్గం వొస్తుందా?" అన్నాడు పక్కాయనతో.

"మీ నిమ్మకాయలకే నరకం వొస్తే, మా దానిమ్మ కాయలు కోసిన వాళ్ళకో?"

"చెప్పాలా? రౌరవాది నరకం!"

"బాగుంది, బాగుంది" అని సంతోషించాడు దానిమ్మకాయలాయన.

వశిష్టుడికి రాముడి మీద ఇంకా అనుమానం గానే వుంది – అతనికి జాబాలి మీద కోపం పూర్తిగా తగ్గ లేదేమోనని. దేవుళ్ళ గురించి ఏవైనా కొన్ని మాటలు చెప్తే తప్ప రాముడి ధోరణి మారదని పించింది. రాముడి వేపు జరిగి చిరునవ్వుతో – "నాయనా! లోకాలెలా సృష్టి అయ్యాయో ఆ క్రమం అంతా చెపుతాను విను!" అంటూ తల వూగిస్తూ ప్రారంభించాడు.

"అమ్మో! ఇప్పుడు లోకాల సృష్టి క్రమమా!" అని కెవ్వుమన్నారెవరో. ఆ గోలలో ఆ కెవ్వు బైట పడనే లేదు.

వశిష్టుడు మొదలుపెట్టాడు – "మొట్టమొదట అంతటా జలం వుంది... ...."

"ఆ జలం ఎలా వచ్చింది? దాన్ని ఎవరు సృష్టించారు?" అంది వశిష్టుడి లోపలి కంఠం. చుట్టూ చూశాడు – ఎవరైనా అడిగారేమోనని.

అందరూ నిశ్శబ్దంగా వున్నారు.

రాముడు శ్రద్ధగా వింటున్నాడు.

వశిష్టుడికి ఆ కంఠం తనదేనని అర్థమైంది. కానీ దాన్ని తోసిపారేసి, ఆ లోపలి కంఠం అడిగిన ప్రశ్నల్ని దాటవేసి, ముందుకి సాగాడు – "ఆ జలంలో భూమి పుట్టింది. తర్వాత, బ్రహ్మ, దేవతలూ పుట్టారు! వారికి వారే పుట్టారు. వారిని ఎవరూ సృష్టించలేదు" అన్నాడు గబగబా ఎవరికో జవాబు చెపుతున్నట్టు![125]

"బ్రహ్మ అంటే?" అనబోయి చటుక్కున ఆగాడు రాముడు. ఇంకా నయం! అడిగితే ఎంత అప్రతిష్ట పాలయ్యేవాడు! ఇంత కాలమూ బ్రహ్మ అంటేనే రాముడికి తెలియదని ఈ ప్రజలందరూ అనుకోరూ? చెప్పేది మౌనంగా వింటూ వుంటే సరి! – తన శ్రద్ధ ప్రకటించడానికి రాముడు ఇంకా ముందుకు జరిగాడు.

వశిష్టుడి మాటలకు పురప్రముఖులందరూ "ఆహా! ... ఓహో!" అని తలలెగరేస్తున్నారు. శెట్టి గారు, ఉంగరాల చేతులు కూడా.

గుస గుసల జంటలో ఒకాయన కునికిపాట్లు పడుతోంటే రెండో ఆయన కునుకులాయన్ని చెవ్వు మెలేసి తిప్పి లేపాడు – "వశిష్టుడేదో చెపుతున్నాడు, దేవుళ్ళ గురించి!"

"అబ్బా! శిద్రొస్తోంది."

"మళ్ళీ ఇలాంటి సంగతులు మనకెలా తెలుస్తాయి?"

"మళ్ళీ ఇళాంటి శిద్ర...."

"ఇదుగో! నేనూరుకోను."

శిద్రాయన బలవంతంగా కళ్ళు తెరుస్తూ "ఇంత వరకూ ఏం చెప్పాడు?" అన్నాడు.

"ఏమో! ఏవిటో అన్నాడు, బ్రహ్మో ఏవిటో...."

"వెధవ బ్రహ్మకేనా నా శిద్ర పాడుచేశావు?" అని విసుక్కుంటూ లేచినాయన వశిష్టుడి వేపు చూశాడు.

వశిష్టుడు కళ్ళు మూసి తెరుస్తున్నాడు. లోపలి కంఠం ఇంకా ఏమిటో అంటోంది – "జలాన్ని ఎవరు సృష్టించారో చెప్పకపోతే చెప్పకపోయావు. బ్రహ్మ అంటే ఏమిటో, దాన్నెవరు సృష్టించారో కూడా చెప్పకుండా దాటవేస్తే నేనూరుకోను" అనో ఏవిటో!

ఆ కంఠానికి భయపడుతూ వశిష్టుడు, శాంతంగా గడ్డం సవరించుకుంటూ – "వేదాల్లో చదివిన విషయాలే నేను చెబుతున్నాను నాయనా!" అన్నాడు.

"చెప్పండి స్వామీ, చెప్పండి!" అని ఇంకా ముందుకి వొంగాడు రాముడు – వశిష్టుడు లోపలి కంఠానికి చెప్పుకున్న మాటలు తనకే అనుకుని.

"బ్రహ్మ తనకు తనే పుట్టిన తరువాత....

బ్రహ్మకు మరీచి పుట్టాడు!

మరీచికి కశ్యపుడు!

---

**124.** **అయోధ్యా, సర్గ 110, శ్లోకాలు 1, 2:**

జాబాలి నిర్దోషి అనీ, నాస్తికుడు కాడనీ వశిష్టుడు రాముడికి నచ్చజెపుతున్నాడు. ★

**125.** **అయోధ్యా, సర్గ 110, శ్లోకం 3:** వశిష్టులవారి ప్రకారం, ముందు జలమూ భూమీ సిద్ధంగా వుంటే తర్వాత దేవుడు (బ్రహ్మ) పుట్టాడు! దేవుడికి కోపం రాదూ వశిష్టుల వారిమీద, తనని జలం కన్నా భూమికన్నా చివర్లో పడేసినందుకు? ★

కశ్యపుడికి సూర్యుడు!

సూర్యుడికి............."

గుసగుసల వాళ్ళ చెవులు అప్పటికే మందార పూల లాగ ఎరుపెక్కిపోయాయి.

"ఏవిటీ! భార్యలు లేకుండానే!"

"ఉంటారు. భార్యల్ని చెప్పరు. వాళ్ళు అనవసరం."

"ఏం, ఎంచేతా? అసలు బిడ్డల్ని కనేది వాళ్ళేగా?"

"ఊరుకో, చెప్పేది వినేహే!"

వశిష్టుడు ఎన్నెన్నో పేర్లు చెప్పేస్తున్నాడు.

"........ కొడుకు భగీరథుడు!

భగీరథుడి కొడుకు కకుత్సుడు!

అందుకే నాయనా! మీరు కాకుత్సులయ్యారు.

కకుత్సుడి కొడుకు రఘువు!

అందుకే మీరు రాఘవులయ్యారు నాయనా!

................ ..................... నాయనా!

..................................... నాయనా!

.... .... ....... కొడుకు నాభాగుడు!

నాభాగుని జ్యేష్ట పుత్రుడు అజుడు!

అజుని జ్యేష్ఠ పుత్రుడు దశరథుడు!

దశరథుని జ్యేష్ఠ పుత్రుడు శ్రీరాముడు!

శ్రీరాముడి జ్యేష్ఠ........" అని చప్పున ఆగి, "ఇదీ నాయనా! లోక క్రమం...." అంటూ ముగించాడు వశిష్టుడు.

అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. "ఇదేంటి? లోకం అంటే రాముడి వంశమేనా? మరి మనమంతా లోకంలో వాళ్ళం కామా?" అంటూ గబ గబా మాట్లాడుకున్నాయి అందరి కళ్ళూ.

గుసగుసల వాళ్ళకి, పిచ్చి కోపంతో ఒళ్ళులు మండిపోయాయి.

వశిష్టుడు రాముణ్ణి చూస్తూ – "నాయనా! లోకో త్పత్తి క్రమం చూశావు కదా? జ్యేష్ఠ పుత్రులే రాజ్యార్హు లయ్యారు. అందుచేత నువ్వే రాజ్యార్హుడివి. నువ్వే కోసల దేశాన్ని పాలించాలి సుమా!" అని తేల్చాడు చివరికి.

రాముడికి ఒళ్ళు మండిపోయింది. –'అయోధ్యలో ఏం చేశాడీ పెద్ద మనిషి? 'రాజ్యాన్ని పెద్ద కొడుకే పాలించాలయ్యా' అని దశరథుడికే చెప్పలేక పోయాడా? ఈ దండకం అంతా దశరథుడి మొహం మీద చదివి ఆయన్నే ఒప్పించలేక పోయాడేం? అక్కడ తనకేమీ పట్టనట్టు పూరుకున్నాడేం? ఛీ! ఈ బ్రాహ్మలు ఎంత కయినా తగుదురు' –అని కేకలేసింది అతని ఆత్మ, కోపం ఆపుకోలేక. రాముడు ఆత్మనేమీ అనకుండా పూరు కున్నాడు. ఆత్మ కేకలు అతనికి చాలా నచ్చాయి కూడా! అతని పట్టుదల ఇంకా ఎక్కువయింది. ఆస్థాన పురో హితులై వుండి, ఎప్పుడేది చెప్పాలో అది చెప్పకుండా – ఈ పండితులందరూ అప్పుడు తమకేమీ పట్టనట్టు పూరుకున్నారు. వాళ్ళకిష్టమైనప్పుడు రమ్మని పిలిస్తే వెళ్ళే దెవరు? ఏమయినా సరే వెళ్ళకూడదంతే! అంతే అంటే అంతే!

రాముడు మౌనంగా వుండడం చూసి ఒప్పుకునే విధంగానే ఉన్నాడని భావించి, వశిష్టుడు చిరు నవ్వుతో, "నాయనా! గురువులూ, పురోహితులూ చెప్పినదాన్ని పాటించడంలో తప్పు లేదు. నీ తల్లి కూడా నిన్ను అయో ధ్యకు రమ్మని కోరుతోంది. తల్లి ఆజ్ఞ వల్లనే నువ్వు తిరిగి అయోధ్యకు వొచ్చావని లోకం గ్రహిస్తుంది. నీ దోషం ఏమీ వుండదు, ఆలోచించు!" అని పూరుకున్నాడు.

చిత్రకూటంలోనే నివసించే మునులు కొందరు వశిష్టుడితో వినయంగా అన్నారు. "వశిష్ఠ మహర్షీ! రాముడు సత్యానికి కట్టుబడి అడవులకు వొచ్చాడు. మీరు ఇంతగా వొత్తిడి చెయ్యడం ధర్మం కాదు. అతడు రావణ వధ చెయ్యవలసి వుంది. ఆ రాక్షస రాజు రోజు రోజుకీ మితిమీరిపోతున్నాడు. అతన్ని సంహరించే ఏర్పాట్లు ప్రారంభించాలి. అందుకోసమైనా రాముడు ఈ వనవాసం సాగించాలి.[126] అదిన్నూగాక, నాయనా! భరతుడా! మీ తండ్రి స్వర్గంలో సుఖంగా వుండాలని కోరేవాడివైతే రాముణ్ణి అయోధ్యకు పిలిచే ప్రయత్నాలు విరమించుకోక తప్పదు. కైకకిచ్చిన వరాలు అబద్ధమై పోతే దశరథుడు స్వర్గంలో నివసించలేడు సుమా!" అని హెచ్చరించారు.

అందరూ మౌనాలు వహించారు.

రాముడు తీవ్రంగా ఆలోచించాడు. 'ఇంతసేపూ నిగ్రహించి ఇప్పుడు అయోధ్యకు బైల్దేరితే తప్పకుండా కీర్తి నశిస్తుంది. ఇక్కడ .... వీసమెత్తు కష్టంలేకుండా లక్ష్మణుడి సేవా.... సీత వినయ విధేయతలూ .... అంతా సుఖంగానే వుంది. పైగా ఋషులతో ఆలోచనల వల్ల రావణ వధ చేసే మార్గాలు కనపడుతున్నాయి. తండ్రి ఆజ్ఞ వమ్ము చేయడంవల్ల సత్య లోకాలూ దూరం గాక తప్పదు. తండ్రికేకాదు, ఆ లోకాలు తనకీ దూరం అవుతాయి. అన్ని విధాలా వనవాసమే ఆచరించదగ్గదిగా తోస్తోంది. పద్నాలుగు సంవత్సరాలనగా ఎంత? అవే గడిచి పోతాయి.'

---

**126.** **అయోధ్యా, సర్గ 112, శ్లోకం 4:** రాముడు, రావణుణ్ణి చంపాలని ఋషులంతా చాలా పట్టుదలగా వున్నారు. శూర్పణఖ వ్యవహారంతో సంబంధం లేకుండానే, దానికన్నా ఎంతో ముందునించే, రావణుణ్ణి చంపాలనే ఆలోచనలు సాగుతున్నాయి. అసలు వ్యవహారం ఇదే. ★

రాముడి మనసు కొంత తేలికపడింది. వశిష్ఠుడికి నమస్కారం చేస్తూ – "మహర్షీ! మన్నించండి! నేను పితృ వాక్యం మీరలేను. వనవాసం వొదిలిపెట్టి అయోధ్యకు రాలేను. లోకాలు తల్లక్రిందులయినా, సముద్రాలు ఇంకినా, గాలి స్థంభించినా, కాంతి చంద్రుణ్ణి విడిచినా, నేను పితృవాక్యాన్ని విడిచే పుత్రుణ్ణి కాను" అని స్పష్టంగా చెప్పేసి, మౌనం వహించాడు.

అందరూ నిట్టూర్పులు విడిచారు.

రాముణ్ణి మెచ్చుకుంటూ అందరూ గట్టిగా మాట్లాడు కోవడం మొదలు పెట్టారు.

"రాముణ్ణి మొదటినించీ ఎరుగుదుం."

"లోకంలో రాముడి వంటి పుత్రుడింకెక్కడున్నాడు?"

"ఇక పుట్టబోడు కూడా!"

"నా కొడుకు నా మాట ఎన్నడూ వినడేమయ్యా?"

"మనలో మనమాట, నువ్వెన్నడన్నా నీ తండ్రి మాట విన్నావూ?"

"పాపపు మాటలెందుగ్గానీ, వినలేదనుకో!"

"మరిహనేం? మీ వంశ సాంప్రదాయం అదీ!"

అంతవరకూ రాముణ్ణి సరిగా అర్థం చేసుకోనం దుకు గుహుడికి పశ్చాత్తాపం మొదలైంది. "ఆ తండ్రికి తగ్గ కొడుకువి నాయనా!" అని కళ్ళ నీళ్ళెట్టుకున్నాడు.

ఋషులందరూ ఏకకంఠంతో రాముణ్ణీ, భరతుణ్ణీ పొగిడారు – "ఆహా! ఇద్దరూ ధర్మాత్ములే! ఇద్దరూ సత్య వ్రతులే! ఇంత ఉత్తములయిన కొడుకు లిద్దరు వున్నారు దశరథుడికి" అని నవ్వు మొహాలతో చూశారు.[127]

లక్ష్మణుడు చిన్నబుచ్చుకున్నాడు. శతృఘ్నుడు లక్ష్మ ణుడి మొహం చూడలేక తలవొంచుకున్నాడు.

రాముడికి చాలా తృప్తి కలిగింది. రాజ్యానికి బయ ల్దేరితే ఇంత కీర్తి వొచ్చేదా? తన పితృవాక్య పరిపాలన ఇంత లోక విదితం అయ్యేదా? అప్పుడు తను కూడా పూర్వ రాజుల మాదిరే వొక సాధారణమైన రాజు మాత్రమే అయ్యేవాడు. కైకేయి మంచిపనే చేసింది. అందువల్లనే కదా తన మహత్యం లోక ప్రచారం అవు తోంది?

ఆ రాత్రి, అందరూ రాముణ్ణి కీర్తించడంతోనే గడి చింది.[128] కౌసల్య మాత్రం చీకట్లో కూర్చుని కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది.

**మ**ర్నాడు జనమంతా తిరుగు ప్రయాణానికి సిద్ధ మయ్యారు. రథాలు కట్టారు. గుర్రాలకు జీనులు వేశారు. పట్టపుటేనుగు మీద అంబారీ అమర్చారు. రాముణ్ణి వొదల్లేక కౌసల్య కావలించుకుని ఏడ్చింది. ఆడవాళ్ళం దరూ దుఃఖాలు ఆపుకోలేక కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ బావురుమన్నారు.

గుహుడు రాముణ్ణి వాటేసుకుని – "నాయనా, మళ్ళీ ఎప్పుడు చూస్తానో!" అని చాలా విచారపడ్డాడు.

భరతుడు పట్టుబట్టల్లోంచి వొక చెప్పుల జత తీసి రాముడి ముందు పెట్టాడు. కొత్త తోలు నల్లగా నిగ నిగ లాడుతోంది. పదును చేసిన తోలైనా, చెప్పులు బయటకు తియ్యగానే తోలు వాసన గుప్పుమంది. వాటి పట్టీల నిండా బంగారపు రేకుల నక్షత్రాలు మెరుస్తున్నాయి. నగిషీలతోటీ, పట్టీలనిండా నూనెతోటీ, ధగధగ మెరుస్తు న్నాయి చెప్పులు.

భరతుడు రాముడికి నమస్కారం చేశాడు "అన్న గారూ! ఈ పాదుకల మీద మీ పాదాలుంచండి! కోసల సామ్రాజ్యాన్ని ఇవే పరిపాలిస్తాయి. ప్రజల యోగక్షేమాలు ఇవే చూస్తాయి. వీటివల్లనే ధర్మం స్థిరంగా నిలబడు తుంది. మీ పాదుకలనే సింహాసనంపై వుంచి నేను నామ మాత్రపు ప్రతినిధిగా మాత్రమే నిలబడతాను. అనుగ్ర హించండి!" అని వినయంగా వొంగాడు.[129]

రాముడు గంభీరంగా చూశాడు. తన పాదుకలే కోసల సింహాసనాన్ని అధిష్టిస్తాయా? భరతుడు తన ప్రతినిధిగా మాత్రమే రాజ్యం చేస్తాడా?.... మహా బాగు! ఇక సామ్రాజ్యం గురించి తను సందేహించవలసిందేమీ లేదు. అది ఎప్పటికీ తనదే!

రాముడేం చేస్తాడో చూడాలని జనం చుట్టూ మూగారు. దూరదూరంగా వున్నవాళ్ళు – "ఏమిటి? ఏమిటీ?" అంటూ తోసుకుంటూ వచ్చారు.

"రాముడు .... చెప్పులు" అని దగ్గిరవాళ్ళు, అంతూ పొంతూలేని ముక్కలు విసురుతున్నారు, దూరం వాళ్ళకి.

---

**127.** **అయోధ్యా, సర్గ 112, శ్లోకం 3:** దశరథుడు – రాముణ్ణీ, భరతుణ్ణీ కని పుణ్యాత్ముడయ్యాడని ఋషులందరూ ఆ ఇద్దర్నే పొగుడుతున్నారు. ఇద్దరూ రాజులు కాబోయే వాళ్ళు కాబట్టి! లక్ష్మణుడి మొహం, శతృఘ్నుడి మొహం చూసేవాళ్ళు లేరు. ★

**128.** భరతుడు గడపలో కాలెట్టగానే, రాముడు అతన్ని బంధించి, బోధించిన రాజనీతులన్నీ, ఈ రాత్రి వేళగానీ, మర్నాడు గానీ బోధిస్తే సందర్భం బాగుండేది కదా? మొదట భరతుణ్ణి చూడగానే రాముడు వెంటనే తండ్రి గురించి మాట్లాడాలి. తర్వాత మైలస్నానాలూ తర్పణాలూ అన్నీ అవ్వాలి. తర్వాత రాముడు అయోధ్యకు రానని చెప్పడం అయిపోవాలి. ఇక రాజ్యం చెయ్యవలసింది భరతుడే కాబట్టి, అప్పుడు అతనికి జాగ్రత్తకోసం ఆ రాజనీతులన్నీ చెప్పవచ్చు. అలా జరిగితే అది సందర్భోచితంగా వుండేది. రాత్రివేళైతే భరతుడు నిద్రకి పడతాడని కావున్ను – తెలివిగా వొచ్చీరాగానే పట్టుకున్నాడు పాపం! ★

**129.** **అయోధ్యా, సర్గ 112, శ్లోకాలు 21, 24:** చెప్పులు ప్రజల్ని ఏ విధంగా రక్షిస్తాయో చెప్తున్నాడు భరతుడు. ★

ఎవరికి వారే జరిగేది చూడాలని ఎగబడుతున్నారు.

రాముడు ముసి ముసి నవ్వుల్తో లేచి నిలబడి గంభీరంగా చెప్పుల్లో కాళ్ళు పెట్టి విడిచిపెట్టాడు.[130]

భరతుడా చెప్పులు కళ్ళకద్దుకున్నాడు. పైకెత్తి అందరికీ కనిపించేట్టు పట్టుకున్నాడు. మంత్రులూ, ఉద్యోగులూ, జనంలో ముందుభాగంలో వున్న వాళ్ళూ, చెప్పుల వేపు చేతులు ఆడించారు, హారతి కళ్ళకద్దుకున్నట్టు! వెనక వాళ్ళు నెమ్మదిగా వెనక్కి తప్పుకున్నారు.

"ఆ చెప్పులేం చేస్తారు?" అంటున్నారెవరో, నోటికి నేరేడు పళ్ళ రంగు వేసుకొచ్చి.

"వాటిని సింహాసనం మీద పెడతారట! అవే రాజ్యం చేస్తాయట! అవే పరిపాలిస్తాయట!"

"హేవిటీ? హెవర్ని?"

"మనల్నే! ఇంకెవర్ని?"

"ఇంకా నయం! నేనే దేశవన్నా పోతానుగానీ, చెప్పులు పాలిస్తోంటే సిగ్గులేకండా ఆ దేశంలోనే కూర్చుంటానా?"

"బొత్తిగా చెప్పులనకు! పాదుకలట!"

"ఏవిటీ? సంస్కృతంలో అన్నంతమాత్రాన చెప్పులు చెప్పులు గాకుండా పోతాయా? పాదుకలైతే కాళ్ళకి మానేసి మెళ్ళో వేసుకుంటారా? ఇంతకీ నాతో నువ్వు వస్తావా రావా? గుహుడి రాజ్యంలోకి పోదాం."

"నేను రాను. నువ్వూ వెళ్ళవు. ఇల్లూ వాకిలీ, గొడ్డూ గోదా అన్నీ వొదిలేసి ఎక్కడికి పోతాం? సింహాసనం మీద రాముడు కూర్చుంటే ఏమిటి, చెప్పులు కూర్చుంటే ఏవిటి, బండ రాయి పెడితే ఏవిటి? అన్నీ వొకటే! మన కొరిగేదేవీ లేదు."

"మా బాగా అన్నావు. ఆ మాటా నిజమే అనుకో. మరి భరతుడెక్కడ కూర్చుంటాడూ?"

"ఏమో మరి, చూద్దాంలే."

ఇంకోచోట గుసగుసలవాళ్ళు ఒక మూల నుంచుని తర్కించుకుంటున్నారు "అసలు చెప్పులివ్వడానికి రాముడెలా వొప్పుకున్నాడంటా? తండ్రి ఆజ్ఞ, తండ్రి ఆజ్ఞ, అన్నాడే! మరి దీని అర్థం ఏమిటి? తను సింహాసనం ఎక్కితేనేం, తన వస్తువు దానిమీద పెట్టి దాన్ని తన ఆధీనంలో వుంచుకుంటేనేం? రెండూ ఒకటే కదా? రాజ్యాన్ని రాముడు తీసుకున్నట్టే అవుతుంది కదా? అసలతను చెప్పులు ఇవ్వకూడదు."

"చెప్పులు ఇస్తే మాత్రం, రాజ్యాన్ని తన ఆధీనంలో వుంచుకున్నట్టా?"

"ఎందుక్కాదూ? సింహాసనం మీద చెప్పులు వుంటాయనుకో. ఆ చెప్పులెవరివీ? రాముడివి. అంటే, సింహాసనం మీద రాముడు వున్నట్టే లెక్క కాదూ? తమ్ముడితో ఖచ్చితంగా చెప్పొద్దూ? 'నువ్వే రాజువి. నువ్వే రాజ్యం చెయ్యాలి. నువ్వే సింహాసనం మీద కూర్చోవాలి. నాకు సంబంధించిందేదీ రాజ్యం చెయ్యటానికి నే నొప్పుకోను' అని తన వస్తువు ఇవ్వడానికి తిరస్కరించొద్దూ?"

"అయితే పద, రాముణ్ణి అడుగుదువుగాని ...."

ఆ ఆవేశపరుడు ఉద్రేకం తగ్గి, తల తడుముకున్నాడు. రాముణ్ణి అడిగితే, తల దాని చోట్లో అది వుండదని అతనికి తెలుసు.

భరతుడు, చెప్పుల్ని బంగారపు పళ్ళెంలో పెట్టి, వాటిమీద పూలు జిమ్మి, ఆ పళ్ళాన్ని నెత్తిమీద పెట్టుకుని అన్నగారి ఎదుట నిలుచున్నాడు.

"రాముడు రాడని ముందే తెలుసా ఏమిటీ? ఆ పళ్ళెం అవీ ఎందుకు తెచ్చారూ?"

"అబ్బ! నువ్వూరుకుందూ? కాళ్ళు కడగాలని తెచ్చారో ఏమో!"

"మరి ఆ చెప్పులెందుకు తెచ్చారు?"

"రాముడు వాడుకుంటాడని తెచ్చారేమో!"

"రుషులు అలాంటి చెప్పులు వాడతారా? అయితే, వాటిని రాముడి దగ్గిరే వదిలెయ్యాలి కదా?"

"ఇప్పుడు అవి సింహాసనం ఎక్కాలిగా? అందుకే తీసుకుపోతున్నారు."

భరతుడు ఆ చెప్పులు మొయ్యటం అదీ గుహుడికి నచ్చలేదు. ఏవిటో ఈ అన్నదమ్ముల వ్యవహారం మొదట్నించీ తలతిక్కగానే వుంది అతనికి. రఘు వంశం వాళ్ళకేవన్నా వేపకాయంత .... వుందో ఏవిటో!

రాముడు భరతుణ్ణి గంభీరంగా చూశాడు ... "నాయనా భరతా! నీ తల్లి లోభంచేతనో, అత్యాశ చేతనో, దుర్బుద్ధికి లొంగి ఇంత పాపకార్యం చేసిన సంగతి మర్చిపోవాలి సుమా!" అని, "నిజంగానే మర్చిపోతావా?" అన్నట్టు చూశాడు.[131] "నాయనా! నువ్వు తెలివిగలవాడివి. ఈ భువనాలన్నీ పాలించ గల సమర్థ

---

**130.** **అయోధ్యా**, సర్గ 112, **శ్లోకం 22**: రాముడు తన చెప్పులు సింహాసనం మీద పెట్టడానికి ఏమీ వ్యతిరేకత లేకుండా చెప్పులు కాళ్ళకి తొడుక్కుని విడిచిపెట్టాడు. అంటే, ఆ రాజ్యం, రాముడి ఆధీనంలో వున్నట్టే అర్థం. ★

**131.** **అయోధ్యా**, సర్గ 112; **శ్లోకం 19**: కైకని క్షమించమని చెప్పేవాడు ఆమె తప్పుని "లోభం చేతనో, మోహం చేతనో, దుర్బుద్ధిచేతనో చేసింది" అంటూ వర్ణించి, దాన్ని జ్ఞాపకం చెయ్యడం ఎందుకు? అసలు అర్థం "నీ తల్లి చేసిన దాన్ని మర్చిపోకు సుమా!" అని చెప్పడం! కానీ కైకని తను క్షమించినట్టు లోకానికి కనపడడం! ★

డివి. జాగ్రత్తగా ఆలోచించి రాజ్యం చెయ్యాలి సుమా! అయోధ్యకు పోయి సుఖంగా జీవించు! నీ తల్లినేమీ అన కూడదు సుమా! ఏమన్నా అన్నావంటే, సీతమీద వొట్టే! భోగాలతో .... సుఖంగా .... జీ .... విం .... చు!"

భరతుడు నెత్తిమీద చెప్పుల పళ్ళెంతో రాముడి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ – "అన్నగారూ! మీకు లేని భోగాలు నాకూ వొద్దు! మీరు వొచ్చే వరకూ నేను కంద మూల ఫలాలు తింటూ, నారచీరెలు కట్టి, తపోజీవనం సాగిస్తాను. పట్టణ సుఖాలనుభవిస్తూ నేను అయోధ్యలో వుండను. ఒక మారుమూల గ్రామంలో వుంటాను. ఈ పవిత్ర పాదుకలకే రాజ్య పరిపాలన అంతా అప్ప గిస్తాను" అని శిరస్సు వొంచబోయి, పళ్ళెం కింద పడు తుందని వూరుకున్నాడు.

రాముడు గంభీరమైన చిరునవ్వుతో – "మంచిది నాయనా! నీకు శుభం కలుగుతుంది. నీ భ్రాతృభక్తి గొప్పది. ఈ సమస్త లోకాలలో నిన్ను మించిన సోదరుడు లేడు. రఘువంశానికి కీర్తి తెస్తావు. (చెప్పులు మోసి!). రాజ్య పాలన బహుకష్టం సుమా! మంత్రులతో, పురో హితులతో ఆలోచిస్తూ జాగ్రత్తగా రాజ్యం చేసుకుంటూ వుండు! నీ తల్లి లోభంచేత ఇంత దుష్టకార్యం చేసిందని ఎన్నడూ గుర్తుపెట్టుకోకూడదు సుమా!" – కొంచెం కంఠం తగ్గించాడు – "రాజ్యం జాగ్రత్త! మంత్రుల్ని వొక కంట కనిపెడుతూ వుండాలి. ఒక్కొక్కరిమీదా ముగ్గురేసి చారుల్ని నియమించాలి. ఎప్పటికప్పుడు ధనాగారాలూ, బొక్కసాలూ, సైన్యం ...."

భరతుడు జంకి – "చిత్తం! చిత్తం! తమరు బోధిం చినవన్నీ గుర్తున్నాయి అన్నగారూ, గుర్తున్నాయి!" అంటూ ఈసారి పళ్ళెం గట్టిగా పట్టుకుని నమస్కారం చేశాడు – "మీ రాకకోసం 14 సంవత్సరాల వరకూ ఎదురుచూస్తాను. మీరు రాకపోతే ఆ మరుసటి దినం అగ్నిహోత్రంలో ప్రవేశించి ప్రాణ త్యాగం చేస్తాను అన్న గారూ!"[132]

రాముడు గంభీరంగా తల పంకించాడు.

ఒక్కొక్కరూ బళ్ళెక్కీ, రథాలెక్కీ, గుర్రాలెక్కీ సాగు తున్నారు.

భరతుడు పట్టపుటేనుగు మీద అంబారీలో చెప్పుల పళ్ళెం నెత్తిమీద పెట్టుకుని కూర్చున్నాడు. శత్రుఘ్నుడు పట్టు విసనకర్రతో చెప్పులకు నెమ్మదిగా విసురు తున్నాడు.[133]

క్రమంగా అందరూ కదిలారు. లక్ష్మణుడు ఒక కొండ మీదకెక్కి వెళ్ళిపోతున్న వాళ్ళని చూస్తూ శిలా విగ్రహంలాగ నిలబడ్డాడు.

బళ్ళ గంటల మోతలతో దూరం అవుతున్నాయి.

"నీకూ వెళ్ళాలని వుంది కదా?" అంది దయగా అతని ఇంగితం.

లక్ష్మణుడు మాట్లాడలేదు.

"నేనూ అయోధ్య వెళ్ళిపోతాను అన్నగారూ! అని చెప్పి వెళ్ళిపోరాదూ?" అంది ఇంగితం మళ్ళీ ప్రేమగా.

లక్ష్మణుడు ఉలిక్కిపడ్డాడు. "ఛ! ఎంత పాపపు టాలోచన్లు! ఛీ! ఎంత తప్పు! ఛ! ఎంత దోషం!" అంటూ లెంపలేసుకొని గబగబా కొండ దిగిపోయాడు.

సీత బొగడ పూల చెట్టుకింద నిలబడి కొమ్మ మీదకు వొంగి గుర్రాల వెనక ఎగిరే దుమ్ము చూస్తోంది. ఆ దుమ్ము కూడా నెమ్మదిగా తగ్గిపోయింది. సందడి అంతా పోయింది. మళ్ళీ వొంటరితనం! .... మళ్ళీ .... ఎప్ప టికో! 'అయ్యో, ఏమిటిది?' అంటూ కంగారుపడింది. ఇలా ఆలోచిస్తున్నానేమిటి? – అని ఆశ్చర్యపడింది. 'భర్త ఎక్కడ వుంటే అక్కడే సంతోషంగా జీవించాలని వొచ్చిన నేను.... అందుకేనా స్త్రీలు చపలచిత్తులంటారు పెద్దలు?' అని ఖిన్నురాలైంది. రాముడు రాజ్యాన్ని తిరస్కరించి నప్పటినుంచీ సీతకు భర్తమీద భక్తి వెయ్యిరెట్లెక్కువైంది. అంత ఉత్తముడికి సేవ చేసుకుంటూ బతకడం కన్నా తనకు కావలసిందేముంది? – తల వొంచుకుని పశ్చా త్తాపంతో ఇంటి వేపు నడిచింది.

రాముడికి కొత్త అశాంతి ఒకటి ప్రారంభమైంది. ఆకుల పందిరి కింద ఇటూ అటూ తిరగడం మొదలు పెట్టాడు. 'భరతుడికి రాజనీతులు చెప్పడంలో ఏమైనా లోటుచేశానా?' అని తీవ్రంగా ఆలోచిస్తే, చాలా పెద్ద

---

**132.** **అయోధ్యా, సర్గ 112, శ్లోకం 25:** భరతుడికి 'వేపకాయంత' కాదు. కాస్త పెద్ద మోతాదులోనే వుంది. ★

**133.** **అయోధ్యా, సర్గ 112, శ్లోకం 29:** "భరతుడు రాముడి పాదుకలను మృత్యుం జయమనే నుత్తమ గజంబు శిరస్సున నుంచెను" అని వుంది.

**సర్గ 113, శ్లోకం 1:** "భరతుడు రామపాదుకలను తన శిరస్సున నుంచుకుని శత్రుఘ్నునిగూడి రథంబు నారోహించెను" అని వుంది. కవిగారికి, ఆ చెప్పుల్ని ఎక్కడ పెట్టాలో తోచడం లేదు. ఏనుగు మీద పెట్టాలో, రథంమీద పెట్టాలో! ఏనుగు నెత్తిన పెట్టాలో, భరతుడి నెత్తిన పెట్టాలో! రెండిట్నీ విడదీసి చెరోదాని మీదా పెట్టాలో తోచక తికమక పడిపోయి రెండు రకాలూ రాశారు! ★

లోటు వొకటి బైటపడింది. మంత్రుల మీద మగ్గురేసి చారుల్ని పెట్టాలని చెప్పాడుగానీ, ఆ చారుల మీద కూడా చారుల్ని పెట్టాలని చెప్పలేదు. ఆ సంగతి గుర్తొచ్చినప్పటి నుంచీ రాముడు ఏమీ తోచక పాకలోకీ బయటికీ తిరుగుతూనే వున్నాడు.

కొంతసేపటికి విసుగొచ్చి దర్భల చాపమీద కూర్చుని కళ్ళు మూసుకున్నాడు. – "చారులమీద చారులు! .... మళ్ళీ ఆ చారులమీద చారులు! మళ్ళీ .... ఆ చారులమీద కూడా చారులు! చారులు .... చారులు .... చారులమీద చారుల .... మీద .... చారులు! .... కోసల .... పితృవాక్యం .... వన వాసం .... చారులు .... వనవాసం ...." లోపల శబ్దాలు గందరగోళం చేస్తున్నాయి. కనుకొలుకుల్లోంచి కన్నీటి బొట్లు చెంపల మీదకు జారుతున్నాయి. ఎందుకో తెలీని బాధ! అశాంతి! దుఃఖం! ఎందుకు?

సీతా, లక్ష్మణుడూ వొచ్చి రాముడి ముందు మోక రిల్లి కళ్ళు మూసుకున్నారు. వారి కన్నీటిబొట్లు దర్భల మీద పడ్డాయి.

★ ★ ★

ఒక రోజు తెల్లవారు ఝామున రాముడు చీకట్నే నది వేపు 'గురు శంఖ' నిమిత్తం దూరంగా వెళ్ళి వొస్తూంటే, ఇద్దరు రుషులు కనిపించారు. ఆ చుట్టు పట్ల ఆశ్రమాల రుషులందరూ చీకట్నే అటు రావడం, తనకు తారసపడ్డ రుషులందరికీ రాముడు చేతిలో పిడత కింద పెట్టి నమస్కారాలు చేస్తూ క్షేమం అడగడం – మామూలే. ఆ విధంగానే రాముడు నదిలో కాళ్ళు కడుక్కుని వొడ్డెక్కి ఎదురుగా వొస్తోన్న రుషుల్ని చూసి వినయంగా – "కాలకృత్యాలు సుఖంగా జరిగినవా మునీశ్వరులారా?" అని అడిగాడు.

ఆ రుషులు, వొక్కసారి రాముడి వేపు చూసి జవాబు ఇవ్వకుండా తలలు వొంచుకుని గబగబా నది వేపు వెళ్ళిపోయారు.

రాముడు ఆశ్చర్యంగా నుదురు చిట్లిస్తూ ముందుకు నడిచాడు.

నాలుగడుగులు వేసేటప్పటికి ఇంకో మునీశ్వరుడు కంగారుగా వొస్తూ ఎదురుపడ్డాడు.

రాముడు చిరునవ్వుతో నమస్కారం చేస్తూ, "విరోచనం సుఖంగా అయిందా గురుదేవా?" అని అడిగాడు.

ఆ ముని కంగారు ఇంకా హెచ్చింది. రాముణ్ణి చూసి భయపడి పోయినట్టు పరుగు ప్రారంభించాడు.

రాముడు ఆశ్చర్యపోయాడు. దూరంగా ఇంకో ఇద్దరు సిద్ధులు రాముణ్ణి చూసి వొచ్చే వొచ్చే దారి మార్చుకుని చెట్లలోకి తప్పుకున్నారు.

రాముడి కేమీ అర్థంకాలేదు.

గబగబా నదిలో స్నానం ముగించుకుని ఇంటికి వెళ్ళాడు.

ఆ రోజు రాముడి ఇంటికి రుషులెవ్వరూ రాలేదు. పందిట్లో నిలబడి చూస్తే కొందరు రుషులు రాముడి వేపు చూస్తూ ఏవేవో సైగలు చేసి చెప్పుకుంటూ గబగబా వెళ్ళిపోయారు.

రాముడు చాలా కంగారుపడ్డాడు. ప్రతి దినం ఎంతో ప్రేమగా, దయగా తనతో సంభాషించే రుషులు ఈ రోజు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారు! నిత్యం రుషులు తననెంతో కీర్తిస్తూ రాక్షస నాశనం గురించి ముచ్చటించే వారే. "నీవంటి వీరుడికి రావణ వధ అసాధ్యం కాదు. నీ చేతిలోనే ఆ దుర్మార్గుడు మరణించాలి. నువ్వింక ఆ ప్రయత్నాలన్నీ ప్రారంభించాలి. ఈ వనవాస కాలం ఆ సత్కార్యానికే వినియోగించాలి" అంటూ ఎన్నో విధాల తనకు కర్తవ్య బోధ చేస్తూ వుండేవారే! తను కూడా రావణ వధ చెయ్యాలని ఉవ్విళ్ళూరుతూనే ఉన్నాడు. "రాక్షసులందర్నీ సంహ రించి మిమ్మల్ని కాపాడతాను" అని నిత్యం వాగ్దానాలు చేస్తూనే ఉన్నాడు. ఇంతలోనే ఈ మార్పు! .... రుషులకు తనను పలకరించటమే కంటకింపుగా ఉన్నట్టుంది. ఏం జరిగి వుంటుంది? ఎవరివల్ల అపరాధం జరిగి వుంటుంది? – అని ఎంతో సేపు మధన పడి, చివరికి 'రుషులందరికీ చాలా కోపం వొచ్చి నట్టుంది. లక్ష్మణుడో, సీతో ఏదో చేసి వుంటారు' అని తేల్చుకున్నాడు.

"లక్ష్మణా!" అని ఒక పెద్ద కేక పెట్టాడు.

లక్ష్మణుడు, రాముడి ముందు భూమిలోంచి పుట్టు కొచ్చినట్టు ప్రత్యక్షమయ్యాడు – "ఏమి శెలవు అన్న గారూ?"

"నువ్వేమన్నా, రుషుల్నేమన్నా, తొందరపడి అన్నావా ఏమన్నా?"

లక్ష్మణుడు తెల్లబోయి – "లేదు అన్నగారూ! నే నేమీ అనలేదు. రుషుల్ని పూజించడం తప్ప ఏమన్నా అన గలనా అన్నగారూ?" అని చేతులు జోడించాడు.

రాముడి కేకకి సీత కూడా బయటికి వొచ్చింది.

రాముడు సీతని కోపంగా చూస్తూ – "రుషు లెవ రయినా మన పర్ణశాలకు వొస్తే, సేవలు చెయ్యడంలో అలక్ష్యం చేశావా సీతా?" అని గద్దించాడు.

సీత భయపడుతూ – "లేదు స్వామీ! రుషులెప్పుడు వొచ్చినా నమస్కరించి దర్భాసనాలు వేసి కూర్చోబెడ తాను. పండో, కాయో తేనో ఏది వుంటే అది స్వీకరించ

మని ప్రార్థిస్తాను. మంచితీర్థం అయినా ఇవ్వకుండా పంపనే! నేనేమీ పొరపాటు చెయ్యలేదు స్వామీ!" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

రాముడు కొంతసేపు ఆలోచించి వెంటనే బయ ల్దేరాడు. ఒక వృద్ధ రుషిని కలుసుకుని చేతులు జోడించి వినయంగా అడిగాడు "గురుదేవా! రుషులందరూ నా పట్ల అనాదరం చూపుతున్నారే! మా అపరాధమేమిటి? లక్ష్మణుడుగానీ, సీతగానీ రుషి పుంగవుల సేవకేమైనా లోపం కలిగించారా స్వామీ?" అని అడిగాడు.

ఆ వృద్ధ రుషి కూడా కంగారుపడి ఇటూ అటూ చూస్తూ – "లక్ష్మణుడు మహా బుద్ధిమంతుడూ, సీత మహా ఉత్తమురాలూనూ! వారివల్ల మాకేమీ ఆపద కలగలేదు నాయనా! ఆపదంతా నీ వల్లే సంభవించింది."

"ఎంత మాట స్వామీ! నా వల్లనా?"

"నీ వల్లనే నాయనా! నువ్వీ ఆశ్రమానికి వొచ్చిన తర్వాత మమ్మల్ని రాక్షసులు బాధించడం ఎక్కువయి పోయింది. పూర్వం ఇంత రాక్షస పీడ లేదు. అప్పు డప్పుడూ ఆగడాలు చేసినప్పటికీ, వాళ్ళు మా మీద మరీ ఇంత కక్ష గట్టలేదు, రావణుడి తమ్ముడు, ఖరుడనేవాడీ మధ్యనే కొందరు అనుచరులతో వొచ్చిపడ్డాడు. వాళ్ళొ చ్చిన దగ్గర్నుంచీ రుషుల్ని పట్టుకుని నానా విధాలా ప్రశ్నలు వేసి చంపుతున్నారు."

రాముడు ఆతృతగా అడిగాడు – "ఏమని ప్రశ్నిస్తు న్నారు గురుదేవా?"

"ఇంకేమని నాయనా! నీ గురించే! రాముడెవడు? ఈ ప్రాంతాల కెందుకొచ్చాడు? ఇక్కడేం మంత్రాంగాలు జరుపుతున్నాడు? ఎవర్ని కూడగట్టుకుంటున్నాడు?– అంటూ ఏవిటేవిటో అడుగుతున్నారట. వాళ్ళ చేతు ల్లోంచి తప్పించుకుని వొచ్చిన రుషులంతా వొకటే గగ్గోలు పెడుతున్నారు. 'రాముడి సంగతులు మేమేం ఎరుగం మొర్రో' అంటే వినరట! 'తండ్రి ఆజ్ఞ చొప్పున వనవాసం చెయ్యడానికి వొచ్చాడం'టే నవ్వుతున్నారట! 'తండ్రి ఆజ్ఞ చొప్పున వచ్చాడా, మేనత్త ఆజ్ఞ చొప్పున వొచ్చాడా?' అని వెటకారాలు చేస్తున్నారట! ఇంకా ముందు ముందు ఏం ఆపదలు ముంచుకొస్తాయో! మేమీ బాధలు పడలేం నాయనా! మంచి చోటు చూసుకుని ఎక్కడికైనా పోతాం. బతికుంటే బలుసాకు తిన వొచ్చును....."

రాముడికి పరిస్థితి అంతా అర్థమైంది. రావణ వధ గురించి తను కొందరు రుషులతో చేస్తోన్న ఆలోచనలు ఎలాగో శతృవులు గ్రహించారు. రావణుడికి మంచి విశ్వాసపాత్రులైన చారులు వున్నట్టున్నారు. అందుచేతే ఈ చిత్రకూటంలో జరిగేదేవిటో కనిపెట్టాలని ఖరుడొచ్చి వుంటాడు. ఇక మీదట తను ఇంకా రహస్యంగా ఆలో చించవలసిందే.

రాముడు మునీశ్వరుడికి నమస్కారం చేశాడు – "మునీశ్వరా! నేను దైవాంశ సంభూతుణ్ణని మీరెరుగరా? రావణ వధకే జన్మించానని విన్నారు కదా? 11 వేల మందితో వొక్కసారిగా యుద్ధం చేయగల వాణ్ణీ, ఎన్నో అస్త్ర శస్త్రాలు తెలిసిన వాణ్ణీ కదా? నేను మిమ్మల్ని రక్షిస్తాను. ఆ రాక్షసులందర్నీ నేనూ, నా తమ్ముడూ ఒక్క వేటుతో ...."

వృద్ధ రుషి గడ్డం ఆడిస్తూ – "ఆ మాటలకేమిలే నాయనా! రాజుల్ని ఎన్నో విధాల కీర్తిస్తారు బ్రాహ్మలు. అవన్నీ నమ్ముకుని కూర్చుంటే మా ప్రాణాలు మాకు దక్కవు. మమ్మల్ని రక్షించడందాకా ఎందుకుగానీ నిన్ను నువ్వు రక్షించుకోవడం కూడా కష్టమే. భార్యతో వున్నావు. ఎంత సమర్థుడివైనా అంత మంది శత్రువులతో ఏం యుద్ధం చేస్తావు నాయనా? ఎందుకొచ్చిన ధైర్యంగానీ పెద్దవాణ్ణి చెబుతున్నాను, విను. రుషులు పొగిడారు కదా అని అవన్నీ నమ్మి కష్టాల్లో పడబోకు! నువ్వు కూడా బయల్దేరి ఎక్కడికైనా వెళ్ళిపోవడం మంచిది. భార్యతో నాలుగు కాలాలపాటు సుఖంగా బతకవొచ్చును. ఈ పూటే మేమందరం బయల్దేరి పోతున్నాం. తర్వాత నీ ఇష్టం!" అని మొహం తిప్పుకున్నాడు మునీశ్వరుడు.

అప్పుడే రుషులు కొందరు ప్రయాణానికి సిద్ధపడి అంగ వస్త్రాలూ పంచెలూ గోచీలూ, మూటలు గట్టుకొని గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు.

రాముడికి తల తీసేసినంత అవమానంగా తోచింది. తను వుండగానే రుషులు రాక్షసులకు భయ పడి పారిపోవడమా? తను రక్షిస్తాడని నమ్మకం లేదా? .... నిజంగానే తను రక్షించలేడా? మరి ....? 11 వేల మందిని .... అవన్నీ అసత్యాలేనా? ముఖస్తుతులేనా?

రాముడికి తల్చుకోవడానికే అయిష్టంగా తోచింది. ఎలాగయినా రుషుల ప్రయాణాలు ఆపాలని – "మునీ శ్వరా! చిత్రకూటం ఎంతో పుణ్యస్థలం కదా? ఇటువంటి చోటు విడిచిపోవటం భావ్యమా?" అని వినయంగా చూశాడు.

వృద్ధుడు నిస్పృహతో – "జీవం ఎక్కడ నిలిస్తే అక్కడే పుణ్యస్థలం నాయనా! ప్రాణ హాని సంభవిస్తోంటే పుణ్యం కోసం కూర్చోగలమా?" అంటూ శుద్ధ నాస్తికత్వం మాట్లాడాడు.

రాముడేమీ చెయ్యలేక, రుషుల మొహం చూడలేక, తలవొంచుకుని ఇంటి ముఖం పట్టాడు.

ఆ రోజే రుషులందరూ మూటలూ, గంపలూ పట్టుకుని గుంపులు గుంపులుగా వెళ్ళిపోయారు.[134]

"రుషులందరూ వెళ్ళిపోయారేం స్వామీ?" అని సీత చాలాసార్లు అడిగింది. సీత అడిగినప్పుడల్లా రాముడు 'పర బ్రహ్మం' గుర్తొచ్చి 'ధ్యానంలో' మునిగిపోయాడు. "రాక్షస భయంతో వెళ్ళిపోయారు" అని చెప్తే "మీరుండగానే రాక్షస భయమా?" అంటుంది. అందుచేత రాముడు ధ్యానం విడిచి లేవనే లేదు.

సీత ప్రశ్నలు విని లక్ష్మణుడే చెప్పాడు – "రాక్షసులు విచ్చలవిడిగా తిరుగుతున్నారు వొదినగారూ! అందుకే రుషులు భయపడి వెళ్ళిపోతున్నారు."

సీత సంబరపడుతూ – "రాక్షసులు తిరుగుతున్నారా? మనం చూడవొచ్చునా?"

"కనపడరు వొదినగారూ! కామ రూపులు. అంటే, మారువేషాల్లో వుంటారు. మనం గుర్తించలేము."

"అయితే రుషులెక్కడికి పోయినా రాక్షసులూ వెళ్తారుగా?"

లక్ష్మణుడు మాట్లాడలేదు.

సీతకి చాలా నిరాశ కలిగింది.

రెండు మూడు రోజులు చాలా వొంటరితనంతో గడిచాయి రాముడికి. చుట్టూ పరిసరాలన్నీ నిర్మానుష్యం అయిపోయాయి. అక్కడక్కడా ఆటవికులు తప్ప ఎక్కడా రుషుల సంచారం లేదు. రాముడు ఆట వికులతో ఎన్నడూ మాట్లాడి ఎరగడు. వాళ్ళెంతసేపూ కట్టెలు కొట్టడం, చాపలల్లడం, దుంగలు మొయ్యడం .... ఎంతసేపూ పొట్ట సొదే! మోక్ష మార్గం చూసుకోరు. రుషుల జీవనం అటువంటిది కాదు. మహోన్నతమైంది. వారు ఈ లోకం గురించి గాక, స్వర్గం గురించే ఆలోచిస్తారు. రుషులందరూ వున్నప్పుడు ఏ ఆశ్రమంవేపు చూసినా అగ్నిహోత్రాల వెలుగులు కనబడుతూ, వేద ఘోష వినబడుతూ వుంటే, ఆత్మకెంతో ధైర్యం, శక్తీ వొచ్చేవి. దేవతలూ, పితృ దేవతలూ, వేదాలూ, రుషులూ, అందరూ తనను రక్షిస్తున్నారనే నమ్మకం కలిగేది. రుషులు లేని చోట జీవించడం దుర్భరంగా తోస్తోంది. వారి అండ వదలకూడదు. రుషులెక్కడ వుంటే అక్కడికే వెళ్ళడం మంచిది.

రాముడు, లక్ష్మణుణ్ణి 'ఎంతో ఆప్యాయంగా' పలకరిస్తూ – "లక్ష్మణా! మనం కూడా ఈ ప్రదేశం విడిచి వెళదామోయీ!" అని వోరగా చూశాడు.

"చిత్తం అన్నగారూ! తమ ఆజ్ఞ!"

అలా అన్నాడేగానీ, 'ఈ ఇల్లు విడిచి వెళ్ళడమా?' అని లక్ష్మణుడు చాలా ఆశ్చర్యపోయాడు. వచ్చిన దగ్గిర్నించీ ఈ ఇంటికి చేసిన చాకిరీ ఇంతా అంతా కాదు. ఆవరణంతా గట్టిగా రాతిలాగ చదును చేశాడు. వర్షాకాలం ఇబ్బంది లేకుండా ఎండు కట్టెలెన్నో పేర్చి పెట్టాడు. అన్నివేపులా దారుల్లో ముళ్ళ చెట్లన్నీ నరికాడు. ఇంటికి దగ్గరగా వున్న నదివొడ్డు బాగుచేసి మెట్లు తవ్వాడు. 'మళ్ళీ మొదటి కొచ్చిందా?' అని వొక్క క్షణం ఆ ఇంటిమీద మమకారంతో సందేహిస్తూ నిలబడ్డాడు.

రాముడు, లక్ష్మణుడి ముఖ కవళికలు గ్రహించి, "లక్ష్మణా! ఈ పరిసరాలన్నీ, మొన్న భరతుడు వొచ్చినప్పుడు ఏనుగులూ గుర్రాలూ వేసిన లద్దెలతో పాడైపోయాయి సుమా! ఇటువంటి చోట జీవించడం మంచిది కాదు. అంతేగాక, భరతుడూ, నా తల్లులూ, పదే పదే గుర్తు వొస్తున్నారు. వారంతా ఇక్కడికి రావడం, ఈ పర్ణశాలలో కూర్చోవడం గుర్తువొచ్చి, వారి దుఃఖాలూ సంభాషణలూ చెవుల్లో మెదిలి, ప్రతీక్షణం ఎంతో మనస్తాపం కలుగుతోంది" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడా స్థిత ప్రజ్ఞుడు.

లక్ష్మణుడు అన్నగారి దైన్యం భరించలేకపోయాడు. "అన్నగారూ! దుఃఖించకండి! మనం ఈ రోజే ఈ చోటు విడిచి వెళ్ళిపోదాం. నా రెక్కల్లో శక్తి వున్నంత కాలం మీ కోసం ఎక్కడైనా క్షణాల్లో మళ్ళీ ఏర్పాట్లు చెయ్యగలను. ఈ పూటే బయల్దేరి పోదాం" అని లక్ష్మ ణుడు వెంటనే పాకలోకి పోయి చీరల మూటా, తట్టా బుట్టా బయటపెట్టాడు.

'మళ్ళీ ప్రయాణమా!' సీత నిర్ఘాంతపోయింది. ఆ చోటు విడిచిపోవడం అంటే సీతకి పుట్టెడు దిగులు

---

**134. అయోధ్యా, సర్గ 116, శ్లోకాలన్నీ:** రాముణ్ణి చూస్తూ రుషులు సైగలు చేసుకొని వెళ్ళిపోవడం, రాముడు సీతనీ లక్ష్మణుణ్ణీ సందేహించడం, ఒక వృద్ధ రుషిని అడిగితే ఆ రుషి ఖరుడి రాక గురించి చెప్పడం, చివరికి రుషులు ఆ ప్రదేశం వదిలిపెట్టి వెళ్ళిపోవడం – ఈ సర్గలో విషయాలు. ముఖ్యంగా 10, 13 శ్లోకాలలో, "నీ వల్లనే మమ్మల్ని రాక్షసులు బాధిస్తున్నారు. నువ్వు వచ్చాకే పీడ ఎక్కువైంది" అనడం! 22వ శ్లోకంలో, "భార్యతో వున్నావు. ఎంత వీరుడివైనా రక్షించుకోవడం చాలా కష్టం. నువ్వుకూడా ఈ ఆశ్రమం విడిచిపెట్టి వెళ్ళిపో" అని చెప్పడం! 23వ శ్లోకంలో – "ఈ ప్రకారంగా మాట్లాడుతున్న రుషుల్ని రాముడు ఎన్ని విధాల చెప్పి కూడా ఆపలేకపోయాడు!" అంటే, రాముడు తమని రాక్షసుల్నించి రక్షిస్తాడని రుషులకు నమ్మకం లేదు. రాముడు సిగ్గుతో తలెత్తుకోలేక పోవడానికి ఈ ఒక్క సంఘటన చాలదూ? ★

కలిగింది. లక్ష్మణుడు కొత్తగా బాగుచేసిన నది వొడ్డున రేవులో వొక పొన్న చెట్టు వుంది. అది ఎంతో ముద్దుగా గుబురుగా బొమ్మలాగ వుంటుంది. సీత ఆ రేవులో స్నానంచేసి, ఆ చెట్టుకింద తల ఆరబెట్టుకొని, ఇంటికి వొస్తుంది. ఇంటిముందు పర్వతపాదం కింద తెల్ల పూల చెట్లు! ఏ కొమ్మకి కొత్త పువ్వు పూసినా సీతకి తెలిసిపోతూ వుంటుంది! ఈ చెట్లు సీతకి మనుషులంత పరిచితం. పాకదగ్గిరే మామిడి చెట్టు మీద గూళ్ళు కట్టుకున్న పిట్ట లన్నీ బాగా అలవాటయ్యాయి. సాయంత్రాల వేళ అవి గోల చేస్తూంటే, ఎంతసేపు చూసినా సంతోషంగానే వుంటుంది. మధ్యాన్నం వేళల్లో వొక లేడిపిల్ల చెట్లలోంచి ఎగురుతూ, దూకుతూ వొచ్చి వాకిలంతా గంతులేసి, పట్టుకోబోతే అందకుండా పోతూ వుంటుంది. గుమ్మంలో లేత గరిక పడేసి సీత చాటున నించుని చూస్తోంటే, ఆ లేడి పిల్ల నాలుగు రోజుల్నించీ గంతు లేస్తూ వొచ్చి గదుల్లో కూడా తిరుగుతోంది. వొకసారి సీత వెనకాల తిరిగి చీర కొంగంతా నమిలి ముద్ద చేసింది .... రేపట్నించీ వొక్కతే గదుల్లో వెదుక్కుంటుంది కావున్ను.

సీత కళ్ళు చెమర్చాయి.

ఇంత చక్కని పర్ణ శాల! లక్ష్మణుడెంత కష్టపడి కట్టాడు! మళ్ళీ ప్రయాణమా!

మర్నాడు ఉదయాన్నే ముగ్గురూ బయల్దేరారు.[135]

సీత వెనక్కి వెనక్కి చూస్తూ నడిచింది.

గృహస్థు స్థిరత్వం కోసం శుభలగ్నం చూసి, వాస్తు శాంతిచేసి, గృహ ప్రవేశం చేసిన గృహ యజమాని రాముడు, నెల తిరక్కుండానే ఇల్లు విడిచి బయట పడ్డాడు!

లక్ష్మణుడు నెత్తిమీద మూటతో, చేతిలో గంపతో, ముందు దారి తీశాడు!

★ ★ ★

**భ**రతుడు చిత్రకూటం నించి తిరిగి అయోధ్య వెళ్ళేటప్పుడు దారి పొడుగునా చెప్పుల పళ్ళెం నెత్తిమీదే పెట్టుకుని కూర్చున్నాడు. కాస్సేపు శత్రుఘ్నుడు దాన్ని తన నెత్తిమీదకి తీసుకోబోయినా దాన్ని భరతుడు ఇవ్వలేదు. ప్రయాణం చేసినన్నాళ్ళూ పగలంతా నెత్తి మీదా, నిద్రపోయేటప్పుడు తల దగ్గిరా!

ఆ చెప్పుల చుట్టూ, కిందా మీదా ఘుమ ఘుమలాడే పువ్వులూ, సుగంధాలీనే అత్తర్లూ, పన్నీరులూ, పరిమళ ద్రవ్యాలూ అన్నీ కలిసి, తోలు వాసనని ఓడించి అది ఎటోపోయి తల దాచుకునేలాగ చేశాయి.

భరతుడు అయోధ్య చేరగానే, తల్లులందర్నీ అంతః పురాలలోకి పంపించేశాడు.

తర్వాత పురోహితులతో, మంత్రులతో "నా తండ్రి గారూ అన్నగారూ లేని ఈ అయోధ్యలో నేనిక జీవించ లేను. ఈ నగర సౌఖ్యాలు నాకు అక్కరలేదు. నంది గ్రామంలో అయితే ఈ దుఃఖాన్నంతా ఎలాగో సహించి వుంటాను" అని చెప్పాడు.

పురోహితులందరూ ఓదార్చి – "మంచిది నాయనా! అలాగే కానియ్యి!" అని అంగీకరించారు.

వెంటనే భరతుడు చెప్పులు నెత్తిన పెట్టుకుని నంది గ్రామానికి ప్రయాణం సాగించాడు. అతని వెంట రధాలూ, గుర్రాలూ, ఏనుగులూ సైన్యాలూ – అన్నీ నడి చాయి. ఉద్యోగులందరూ నందిగ్రామం ప్రయాణాల య్యారు. ఆసక్తి వున్న ప్రజలందరూ బయల్దేరారు.

నందిగ్రామం చేరిన తర్వాత చెప్పుల పట్టాభిషేకా నికి ఘనంగా ఏర్పాట్లు జరిగాయి. ఇరుగు పొరుగు దేశాల రాజులందరూ వొచ్చారు. రాజ బంధువులందరూ వొచ్చారు. ఆ గ్రామమే ఒక నగరంగా తయారయ్యింది.

ఆ సభలో భరతుడు ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగిం చాడు – "ప్రజలారా! నా అన్నగారు శ్రీరాముడు, తన రాజ్యాన్ని నా దగ్గిర రక్షణకోసం మాత్రమే వుంచాడు. వారి పాదుకలే సింహాసనం అధిరోహించి వారి హక్కుని కాపాడతాయి. ఈ పాదుకలే మిమ్మల్ని రక్షిస్తాయి. ఇవే మీ యోగక్షేమాలు చూస్తాయి" అన్నాడు.

ప్రజల్లో గుసగుసలు బయల్దేరాయి. వారం రోజుల కిందట చిత్రకూటానికి వెళ్ళొచ్చిన వాళ్ళు చెప్పుల సంగతి చెప్పినప్పుడు, అక్కడికి వెళ్ళని జనం ఆ మాటలు నమ్మలేదు – "చెప్పుల్ని సింహాసనం మీద పెట్టడం ఏమిటీ? అవి రాజ్యం ఎట్లా చేస్తాయి? ఇదేం చోద్యం? పోండెహే! మీ వెధవ్వేషాలూ మీరూనూ" అని వాళ్ళు ఆ మాటలన్నీ ఎగరగొట్టారు.

తీరా ఇప్పుడు భరతుడు చెప్పుల్ని చూపించి – "ఇవే మిమ్మల్ని పరిపాలిస్తాయి. ఇవే మీ యోగక్షేమాలు చూస్తాయి" అంటోంటే బుగ్గలు నొక్కుకుని, చెవులు కొరు

**135.** భరద్వాజుడు ఈ చిత్రకూటం గురించి "చిత్రకూటంలో పాప బుద్ధి నశిస్తుంది. పుణ్య కార్యాలు చెయ్యాలనే కోరిక తప్ప ఇతర కోరికలు కలగవు" అన్నాడు కదా? కానీ, రాముడికి – 'లక్ష్మణుడు కోసల రాజ్యంకోసం ఆరాటపడుతున్నాడు' అని లక్ష్మణుణ్ణి శంకించే పాప బుద్ధి ఇక్కడే పుట్టింది! అక్కడ రుషులందరూ తపస్సులతో గడిపినట్టు తనుకూడా ఆ తపస్సేదో చేసుకోక, రావణ వధ ప్రయత్నాలు ఇక్కడే ప్రారంభమయ్యాయి! ★

క్కోవటం తప్ప, ఏమీ చెయ్యలేక పోయారు.

గుసగుసల స్నేహితులిద్దరూ జనం తోపుళ్ళాటలో విడిపోయి ఎంతో సేపట్నించి ఒకరికోసం ఒకరు వెతుక్కుంటున్నారు.

భరతుడి ఉపన్యాసం సాగుతోనే వుంది – "పద్నాలుగు సంవత్సరాల తర్వాత రాజ్యం నా అన్నగారికి అప్పగించేశానంటే, నాకు రాజ్యాన్ని మించి నాలుగురెట్లు కీర్తిప్రతిష్ఠలు కలుగుతాయి" అని ఉపన్యాసం ముగించాడు.[136]

గుసగుసల వాళ్ళిద్దరూ హఠాత్తుగా ఒకర్నొకరు పట్టుకున్నారు.

"చూశావా? భరతుడు గొప్ప కోసం కాకపోతే రాజ్యం వూరికే ఇచ్చేస్తాడా ఏవిటని నేను మొదటే చెప్పలేదూ?"

"నువ్వన్నట్టే అయింది సుమా! రెండు రెట్లు కాదు, మూడు రెట్లు కాదు, నాలుగు రెట్ల కీర్తట! ఎంత సిగ్గు లేకుండా చెపుతున్నాడో!"

"సరే! ఎన్ని రెట్లయితే ఏవిట్లే. మొత్తంగా కీర్తి వొస్తుందని రాజ్యం ఇచ్చేశాడబ్బాయ్! అదీ సంగతి! రాముడేమో తన చెప్పులు సింహాసనం మీద పెట్టి తన అధికారం జాగ్రత్త చేసుకున్నాడు. చూడు! మనం హరికథకి వెళ్ళినప్పుడు మన చోటెవరన్నా కాజేస్తారని తలగుడ్డ తీసి, అక్కడ పెట్టి కాస్సేపు బయటికి వెళ్ళొస్తాం చూశావా? అలాగే కావున్ను ఇది కూడా!"

"అటు చూడు. చెప్పులకేమిటో చేస్తున్నారు. నూనె బాగా పట్టించినట్టున్నారు. మెరుస్తున్నాయి."

సింహాసనం చుట్టూ జ్యోతులు వెలిగించారు.

పురోహితులు చెప్పుల్ని పళ్ళెంలోంచి తీసి సింహాసనం మీద పెట్టారు. కొందరు అక్షింతలూ, పువ్వులూ జిమ్ముతూ వేద మంత్రాలు చదువుతున్నారు. పరిచారకులు పట్టు వింజామరలతో చెప్పులకు విసురుతున్నారు.

వాయిద్యాల ఘోష మిన్నుముట్టింది. రాజోద్యోగులందరూ సింహాసనం ముందుకు వొచ్చి, వినయంగా వొంగి చెప్పులకు నమస్కారాలు చేస్తున్నారు.

కొందరు పురోహితులు చెప్పులకు హారతులు పడుతున్నారు.

సామంతరాజులందరూ వొక్కొక్కరూ ఎవరు తెచ్చిన బహుమతులు వారు సింహాసనం ముందు పెట్టి, చెప్పులకు వినయంగా నమస్కారాలు చేస్తూ "కోసల మహారాజా! శ్రీరామచంద్రా! తమరు దయతో మా కానుకలు స్వీకరించండి! ఎల్లకాలమూ మాకు మీ సేవా, శుశ్రూషలు చేసుకుని తరించే భాగ్యం ప్రసాదించండి!" అంటూ ఒకర్నిమించి ఒకరు భూమిలోకి వంగి భక్తి శ్రద్ధలు ప్రకటిస్తున్నారు.

రాజ్యంలో మేటి నాట్యకత్తె లందరూ చెప్పుల ముందు నాట్యాలు చేశారు.

సంగీత సరస్వతులు చెప్పుల్ని కీర్తిస్తూ పాటలు పాడారు.

భరతుడు, రుషి బట్టలతో సింహాసనం పక్క వినయంగా చేతులు కట్టుకుని నిలబడి, పట్టాభిషేక కార్యక్రమం అంతా నడిపించాడు.

ప్రజలు చెప్పుల పట్టాభిషేకం కళ్ళారా చూసి, ఇంకా నమ్మలేనంత ఆశ్చర్యంతో, సభకు రాని వాళ్ళకీ చోద్యం వర్ణించి చెప్పాలనే తొందరతో ఇళ్ళదారులు పట్టారు.

ఆ రోజు నించి కోసల దేశంలో చెప్పుల పరిపాలన ప్రారంభమయింది!

ఉద్యోగులు, రాచకార్యాలన్నీ సింహాసనం ముందు నిలబడి చెప్పులకే విన్నవిస్తారు.[137]

ఒకనాడు ఒక తగవు వొచ్చింది న్యాయ స్థానానికి.

ఒక బ్రాహ్మణ ధనికుడు, ఒక శూద్ర దరిద్రుడికి, అప్పు ఇచ్చాడు ఎప్పుడో. దరిద్రుడు గడువు ప్రకారం అప్పు తీర్చలేకపోయాడు. ధనికుడు "చెప్పుల మహారాజుకి" విన్నపం పంపుకున్నాడు.

న్యాయాధిపతులు తగువంతా చెప్పులకు విన్నవించారు – "మహారాజా! శ్రీరామచంద్రా! ఈ ధనికుడు, తన కష్టార్జితం అప్పుగా ఇచ్చాడు. ఈ దరిద్రుడు ఆడిన మాట తప్పి, అప్పుని ఎగవేశాడు. ఈ ధనికుడు న్యాయం కోసమై మహారాజుని ప్రార్థిస్తున్నాడు. శెలవిప్పించండి మహారాజా!" అని చెప్పులకు నమస్కారాలు చేశారు.

రాముడి చెప్పులు రాముడిలాగే గంభీర ముద్రతో మౌనం వహించాయి. అవి ఎల్లకాలమూ అట్టి గాంభీర్య ముద్రనే ధరించి అలరారుతూ వుంటాయని పురో

---

**136.** **అయోధ్యా**, సర్గ 115, **శ్లోకం 21:** భరతుడు తన రాజ్యం రాముడికి ఎందుకు ఇచ్చేశాడో, భరతుడే స్వయంగా కారణం చెబుతున్నాడు చూశారా? రాజ్యాన్ని మించి నాలుగురెట్ల కీర్తి వస్తుంది – అని అట! అదన్నమాట అసలు విషయం! ★

**137.** **అయోధ్యా**, సర్గ 115, **ఆఖరి శ్లోకం (27వది):** "రాజ్య కార్యమేమయిన కల్గినప్పుడుగానీ, ఎవరయినా సామంతులు గొప్ప కానుకలు దెచ్చినప్పుడుగానీ భరతుడు మొదట పాదుకలకు నివేదించి అటుపిమ్మట గార్యము నడుపును." ★

హితులూ మంత్రులూ ఉద్యోగులూ ప్రజలూ కవులూ అందరూ ఎరిగిన విషయమే.

"న్యాయ శాస్త్రాలు తిరగవెయ్యండి!" అని ఆదే శించాడు భరతుడు.

వెంటనే తిరగవేశారు. ఆ శాస్త్రాల్లో అది చాలా పెద్ద నేరంగా బయటపడింది. న్యాయాధిపతులు, గజ గజ వొణుకుతూ చెప్పులకు విషయమంతా నివేదించారు – "మహారాజా! రుణదాత ఎవరో కాదు. సాక్షాత్తూ బ్రాహ్మ ణుడు! దాన ధర్మాలతో మణుగుల కొద్దీ బరువుగల వెండి బంగారాల మూటలు మొయ్యలేక మొయ్యలేక మోసి, కష్టపడి సంపాదించుకున్న ధనం! బ్రాహ్మణ ధనాని కెన్నడూ హాని కలగరాదని సమస్త శాస్త్రాలూ ఘోషిస్తున్నాయి. మహా ప్రభో! ఈ దరిద్రుడు అనేక నేరాలు చేశాడు. ఆడిన మాట తప్పాడు. అప్పు ఎగ వేశాడు. అందునా, బ్రాహ్మణ ధనం ఎగవేశాడు. ఒక బ్రాహ్మణోత్తముడికి, న్యాయంకోసం రాజ సభకు రావలసి నంత కష్టం కలిగించాడు. ఇవన్నీ ఈ దరిద్రుడి నేరాలు. ఇతనికి కఠినమైన శిక్ష విధించి బుద్ధి చెప్పవలసిందిగా మహా రాజుగారిని ప్రార్థిస్తున్నాను. న్యాయశాస్త్రాలన్నీ ఈ దోషికి కఠిన శిక్షనే శాసిస్తున్నాయి ప్రభూ!"[138]

భరతుడు రౌద్రంగా కళ్ళెర్రచేసి – "దోషిని ప్రశ్నిం చండి!" అని ఆజ్ఞాపించాడు.

తర్వాత, ఆ దోషి మీదకి ఈ ప్రశ్నలన్నీ ఉరికాయి.

"ఏమిరా! అప్పు తీసుకున్నావా?"

"తీసుకున్నాను పెబో!"

"ఎందుకు తీర్చలేదు?"

దరిద్రుడు – గజగజ వొణుకు!

"బ్రాహ్మణ ధనం అని ఎరుగవా?"

దరిద్రుడు – గజగజ గజగజ వొణుకు!

"నీ ఆస్తిపాస్తులేమిటీ?"

"అయ్యేటో ...."

"మూర్ఖుడా! నీకు భూమి వుందా?"

పిచ్చి చూపు!

"నివసించే గృహం వుందా?"

తేల కళ్ళు!

"మాట్లాడవేమిరా దౌర్భాగ్యుడా?"

"రొండు కోళ్ళూ, వొక మేకపిల్లా, మట్టి తవ్వుకునే పారా.... తాటాకుల గుడిసీ .... ఈ గోసీ ...."

"అవన్నీ విక్రయించి, రుణ దాతకు అప్పగించండీ."

"మకాపెబో! మకాపెబో!"

భరతుడు – "ఓరీ దుష్టుడా! బ్రాహ్మణ రుణం ఎగ వేసి, ఆడిన మాట తప్పితే రౌరవాది నరకాలకు పోతా వురా? రాజు వేసే శిక్ష ఆనందంగా అనుభవించడం నీకే మంచిది. స్వర్గానికి పోతావు" అని భటులవేపు చూసి– "వీడు దోషి! శిక్షార్హుడు! వెంటనే కారాగారంలో పడెయ్యండి! ఇది శ్రీరామ పాదముల ఆజ్ఞ!" అని చెప్పులవేపు తిరిగి నమస్కారం చేశాడు.

భటులు రుణగ్రస్తుణ్ణి లాక్కుపోయారు – అతణ్ణి రుణ విముక్తుణ్ణి చెయ్యడానికి!

ఆ విధంగా, కోసల సింహాసనం చెప్పులపాలై, ప్రజల్ని ఏ విధంగా పరిపాలించాలో ఆ విధంగానే, న్యాయంగానూ, శాస్త్రోక్తంగానూ పరిపాలిస్తూ, మిక్కిలి వైచిత్ర్యంతో విరాజిల్లుట ప్రారంభించింది.[139] ★

---

**138.** బ్రాహ్మణ ధనం దొంగిలించడం గానీ, అప్పులు తీసుకుని ఎగవెయ్యడంగానీ, మహాదోషాలనే విషయం అనేక సందర్భాల్లో చెప్పారు. ఉదా॥ అయోధ్య కాండ, సర్గ 72, శ్లోకం 44: సర్గ 111, శ్లోకం 17. ★

**139.** దశరథుడు కైకకి రెండు వరాలు ఇవ్వాలి కదా? భరతుడి పట్టాభిషేకమూ, రుషిగా రాముడి వనవాసమూ. మొదటి వరం గురించి చూడండి! భరతుడికి పట్టాభిషేకం జరగనేలేదు! దశరథుడు కైకకి ఇచ్చిన మాట నెరవేరాలంటే, మొదట భరతుడికే పట్టాభిషేకం జరగాలి. ఆ తర్వాత, అతడు ఆ రాజ్యాన్ని ఎవరికైనా ఇచ్చుకోవచ్చు. అది అతని ఇష్టం! భరతుడికి పట్టాభిషేకం జరిగిన తర్వాత వెంటనే రాముడి చెప్పుల్నే సింహాసనం ఎక్కించవచ్చు. అలా జరగలేదు కాబట్టి, మొదటి వరం నెరవేరలేదని అర్థం.

రెండో వరం సంగతి కూడా అంతే. ఇప్పటి వరకూ జరిగిన కథ చూస్తే, రాముడు వనవాసం చేస్తున్నాడు గానీ రుషి జీవితం గడపడం లేదు. అసలు ఈ రెండో వరంలో 'రుషి జీవితం' అనే నిబంధన కుదరదు. ఎందుకంటే, రాముడి అవతారమే రావణ వధకోసం. వనవాసంలో జరగవలసింది రావణుడితో యుద్ధమే. అలాంటి పాత్రకి రుషి జీవితం ఎలా పొసుగుతుంది? 'రుషి జీవితం' అనే నిబంధన లేకుండా, 'రాముడు రాజకుమారుడిగాగాక, సామాన్యుడిగా వనవాసం చెయ్యాలి' – అనే రకంగా కథ వుండవచ్చు. అప్పుడు, అతడు వేటాడినా, యుద్ధాలు చేసినా, అది వేరు. ఒక రాజ కుమారుడు అడవుల్లో సామాన్యుల జీవితం గడుపుతున్నాడంటే, అప్పుడు కూడా కథ ఇప్పటి లాగే నడుస్తుంది. ఇప్పుడు వున్న కథ ప్రకారం చూస్తే, రాముడు తండ్రి ఆజ్ఞల్ని రెంటినీ పాటించలేదని అర్థం! కానీ, ఆ విలువలే కపటపు విలువలు గనక, ఇలాంటి కథలు ఇలాగే వైరుధ్యాలతో వుంటాయి. ★

# లింకు-2

# 2వ కథ తర్వాత 3వ కథ వరకూ

[2వ కథ - భరతుడు, రాముడి చెప్పులకు పట్టాభిషేకం చేసి రాజ్యం పరిపాలిస్తూ వుండగా ముగిసింది. 3వ కథ - చిత్రకూటంనించి బయల్దేరిన రాముడు, 10 సంవత్సరాల తర్వాత పంచ వటిలో నివసిస్తూ వుండగా, అక్కడికి శూర్పణఖ రావడంతో ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య వున్న భాగం ఇది. ఈ భాగంలో కొంత వరకూ 'అయోధ్యా కాండ' వుండి, తర్వాత 'అరణ్య కాండ' ప్రారంభమవుతుంది. ఈ భాగంలో కూడా బోలెడు మహిమల సంఘటనలు ఉంటాయి. వాటిని ప్రకృతి జ్ఞానంతోనూ, సామాజిక జ్ఞానంతోనూ కూడా అర్థం చేసుకుంటూ వుండాలి.]

చిత్రకూటం నించి బయల్దేరిన తర్వాత లక్ష్మ ణుడూ, సీతా, రాముడూ అదే వరసలో నడుస్తూ అత్రి మహాముని ఆశ్రమానికి చేరారు.

అత్రి మహాముని భార్య అనసూయ. అత్రి, రాముడితో – "రామా! పూర్వం 10 సంవత్సరాలు వర్షం లేక లోకాలన్నీ దగ్ధం అయిపోతూ వుంటే, నా భార్య అనసూయ, మహా పతివ్రత కావడంచేత, రుషుల కోసం చెట్లకు పళ్ళూ, గంగలో నీళ్ళూ సృష్టించింది. ఈమె 10 వేల సంవత్సరాలు తపస్సు చేసిన గొప్ప తపశ్శాలిని. ఎన్నో ఉగ్ర వ్రతాలు చేసింది. రుషుల కెన్నడైనా తపో విఘ్నాలు కలిగితే వాటిని నివారిస్తూ వుంటుంది. పూర్వం దేవకార్యం నిమిత్తం 10 రాత్రుల్ని వొక్క రాత్రిగా చేసింది. సీతాదేవి ఈ మహా పతివ్రతను పూజించడం బహు పుణ్యదాయకం" అని చెప్పాడు.[140]

రాముడికి చాలా సంతోషం కలిగింది. ('పాతి వ్రత్యం' గురించి సీత ఎక్కడో కథల్లో వినడం గాకుండా ఒక మహా పతివ్రతని కళ్ళారా చూస్తే, పతి భక్తి ఇంకా గట్టిగా నేర్చుకుంటుందని.)

"సీతా! మహా ముని వాక్కులు విన్నావు కదా? ఈ మహా పతివ్రతను పూజించుకో!" అని ఆదేశించాడు.

భర్త ఆదేశించిందే తడవుగా సీత లేచి అనసూయకు ప్రదక్షిణాలు చేసి నమస్కరించింది.

అనసూయ వృద్ధురాలు. దేహమంతా ముడతలు పడింది. జుట్టంతా తెల్లగా నెరిసింది. గడగడ వొణుకు తోంది. సీత వినయానికి సంతోషించింది. "భాగ్యశాలివి తల్లీ! భర్తతో అడవులకు వొచ్చావు. నీ పతి భక్తి కొనియాడదగిందే. భర్త ధనికుడయినా, దరిద్రుడయినా, స్త్రీలోలుడయినా, పెనిమిటే స్త్రీకి దైవం. కాముకులయిన స్త్రీలకు ధర్మం తెలియదు. అటువంటి స్త్రీలకు ఇహ లోకంలో అప కీర్తే కాదు, పరలోకంలో నరకం కూడా ప్రాప్తిస్తుంది. నీ వంటి స్త్రీలు మాత్రం స్వర్గంలో విహ రిస్తారు.[141] ఇక ముందు కూడా నువ్వు ఈ విధంగానే

**140.** **అయోధ్యా కాండ, సర్గ 117, శ్లోకాలు 5 నించి 13 వరకూ:** అనావృష్టి కాలంలో, అనసూయ, చెట్లకి పళ్ళూ, గంగలో నీళ్ళూ సృష్టించిందట! సరే, సృష్టించింది! ఎవరికోసం? రుషులకోసం! '10 రాత్రుల్ని ఒక్క రాత్రిగా' చేసింది! ఎవరికోసం? దేవతలకోసం! ఎవరి తపశ్శక్తి అయినా, దేవతలకో, రుషులకో, రాజులకో మాత్రమే ఉపయోగపడాలి! అనావృష్టితో సామా న్యులు మాత్రం బాధపడరా? "అనసూయ సర్వజనుల కోసమూ పళ్ళూ, నీళ్ళూ సృష్టించింది" అని ఎందుకు చెప్పకూడదు?★

**141.** **అయోధ్యా, సర్గ 117, శ్లోకం 23....27:** పతివ్రతలంతా ఇతర స్త్రీలను తిడుతూనే వుంటారు. కౌసల్యా ఈ మాటలే, సీతా ఈ మాటలే, అనసూయా ఈ మాటలే. పాతివ్రత్యం అంటే పురుషుడికి బానిసగా మారడమే అని ఆ స్త్రీలకు తెలీదు. ఉగ్గులు తాగే వయసులోనే, వాళ్ళ తలల్లోకి, జోలపాటల్లోంచి, పాతివ్రత్యపు విషం జొరబడింది. రహస్య మందిరాలలో పెరిగి పెరిగి, శరీరాలు బలహీనంగానూ, మనసులు బానిసత్వంతోనూ కలుషితమయ్యాయి. మనుషులు, పతివ్రతలుగా మిగిలి, మళ్ళీ ఆ విషాన్ని పసిబిడ్డల ఉగ్గుల్లో, జోలల్లో, నీతుల్లో విరజిమ్ముతారు. తనొక జీవచ్ఛవమై, ఇంకా జీవచ్ఛవాల్ని తయారుచేసే నికృష్టజీవి – పతివ్రత!
★

ధర్మం ఆచరిస్తూ వుండాలి సుమా!" అని బోధించింది. (ముందు ముందు కాలంలో, జీవితానుభవాలవల్ల, సీతకు పతిభక్తి సన్నగిల్లుతుందేమోనని, అనసూయకు సందే హంగా వుంది. బహుశా అనసూయ అనుభవం అలాంటిదే అయివుండాలి.)

సీత సిగ్గుపడుతూ – "స్త్రీకి పెనిమిటే దైవమని నాకు తెలుసు. నేను చిన్నతనం నుంచీ నేర్చుకున్నది అదే. ఒకవేళ, నా భర్త దుష్టుడైనా, నేనతనికి సేవలు చెయ్య వలసిందే కదా? గుణవంతుడూ, మోహనా కారుడూ, నామీద అనురాగం కలవాడూ, ఎప్పుడూ నాకు హితం చెప్పేవాడూ అయిన భర్తని సేవించమని వేరే చెప్పాలా ఏమి?

(సద్గుణాల్ని గౌరవించే మనసు, దుర్గుణాల్ని కూడా ఎలా గౌరవించ గలుగుతుంది? – అప్పుడు గౌరవించేది ఏ 'గుణాల్నీ' కాదు. ప్రాణం వున్న భర్త కళేబరాన్నే. ఆ కళేబరాన్ని పూజించాలనే ఆచారాన్నే! ఈ మాత్రానికి భార్యలు, భర్తల సౌశీల్యాల్నీ, సౌందర్యాల్నీ, వర్ణించు కోవడం ఎందుకు?)

మా అత్త కూడా నాకు పాతివ్రత్యం గురించి చెప్పింది. అన్నీ గుర్తున్నాయి. సావిత్రి కథ విన్నాను. నీ గురించి కూడా చిన్నతనంలోనే విన్నాను. రోహిణీ దేవి చంద్రుణ్ణి విడిచి వుండదు కదా? ఎందరో పతివ్రతలు స్వర్గంలో వున్నారని ఎన్నో కథలు విన్నాను."

(సీతకు, 'పాతివ్రత్యం' మీద ఆసక్తి ఏ కారణాల వల్ల కలిగిందో చూడండి. పుట్టినప్పటినించీ అదే పాఠం! తల్లి అదే చెప్పింది. తండ్రి అదే చెప్పాడు. గురువులూ అదే. బ్రాహ్మలూ అదే, చుట్టాలూ, బంధువులూ అదే. కథలూ, గాథలూ అవే. పెళ్ళయిం తర్వాత భర్త చెప్పిందీ అదే. అత్త చెప్పిందీ అదే. మామ చెప్పిందీ అదే. ముసలి పతివ్రతలూ అదే. ఎటు చూసినా, ఎక్కడ విన్నా, ఆ మాటే. ఇక ఏ స్త్రీ అయినా పతివ్రత కాకుండా, కావా లనుకోకుండా, ఆ వుచ్చునించీ తప్పుకోడానికి వీలుందా? – అయినప్పటికీ, కొందరు స్వేచ్ఛా జీవులు, పతివ్రతలు కాకుండా నరకానికే సిద్ధమౌతున్నారన్న మాట! ఆశ్చర్యమే!)

సీత వినయ సంపత్తికి అనసూయ చాలా సంతో షించి – "సీతా! నేను సంపాదించిన తపస్సు నా దగ్గిర చాలా అధికంగా వుంది. నీకేం కావాలో కోరుకో. నీ కోరిక తీరుస్తాను" అంది.

"నాకేమీ ఒద్దు. నీ దయ చాలు" అంది సీత. (చెట్లనీ, పుట్లనీ, వరాలడిగిన సీతకి, ఏమి వొద్దట! ఏమీ అడగకపోతే రాముడు విసుక్కుంటాడన్న ఆలోచనయినా లేనట్టుంది!)

అనసూయ మళ్ళీ సంతోషించింది – "సీతా! నువ్వ డగకపోయినా నేనే ఇస్తాను. నా దగ్గిర దివ్య పుష్ప మాలికా, ఆభరణాలూ, అంగరాగం, పరిమళ గంధం వున్నాయి. ఇవన్నీ ఎప్పటికీ నశించవు. తరగవు. ఇవన్నీ ధరిస్తే నిత్య యవ్వనవతిగా వుంటావు. నీ సౌందర్యం దివ్యంగా వెలుగుతూ వుంటుంది. ఈ అంగరాగం, పూసుకుని నీ భర్తకు మిక్కిలి సంతోషం కలిగించు" అంటూ అవన్నీ ఇచ్చింది. (మరి, తన భర్త మాటేమిటి? అత్రి మునికి భార్య గారి ఆ ముగ్గు బుట్ట తలే ఇష్టమా ఏమిటీ? ఈ పతివ్రత, నిత్య యవ్వనం కలిగించే అన్ని పదార్థాలు దగ్గిర వుంచుకుని, లోకాతీత కార్యాలు చెయ్యగలిగే తపశ్శక్తి వుంచుకుని, తను వృద్ధాప్యంతో వొణకడం ఎందు చేత?)

సీత ఆ వస్తువులు తీసుకుంది.

తర్వాత అనసూయ – "నీ స్వయంవరం గురించి చెప్పు తల్లీ! వినాలని కోరికగా వుంది" అని అడిగింది.

ఈ విధంగా చెప్పింది సీత – "జనక మహా రాజు మిథిలా నగరాన్ని శాస్త్రోక్తంగా పరిపాలిస్తూ వున్నాడు. ఒకనాడు ఆ మహారాజు యజ్ఞకార్యంలో నాగలితో భూమిని దున్నుతూ వుండగా నేను బయటపడ్డాను. (స్వయంవరం గురించి చెప్పమంటే, పుట్టడం దగ్గిర్నించీ ఎత్తుకుంది సీత!)

అప్పుడు ఆకాశ వాణి – "జనక మహారాజా! ఇది నీ కూతురే! ఇది నీ కూతురే!" అని చెప్పింది. జనక మహారాజుకి సంతానం లేకపోవడంచేత నన్ను సంతోషంతో తీసుకువెళ్ళి మొదటి భార్య కిచ్చాడు.

(ఇంకా ఎందరు భార్యలు? మూడు వందల వరకూ లెక్కవేసుకోవచ్చు. ఎందుకంటే, దశరథ మహారాజుతో సరితూగగల రాజే ఈయన. ఎందరు భార్యలున్నా దశరథుడికీ పిల్లలు లేరు చాలా కాలం. ఈయన సంగతీ అలాగే వుంది. వీరు చేసుకున్న 'పుణ్యాలు' ఇంత గొప్పగా వున్నాయి!)

ఆవిడ నన్ను తల్లివలే పెంచింది. నాకు యుక్త వయస్సు వొచ్చింది. లోకంలో ఆడపిల్ల తండ్రి దేవేంద్రుడయినా, సరివారిలోనూ, తక్కువ వారిలోనూ తిరస్కారం పొందుతాడు కదా? (ఆడపిల్లని కనడం ఎంత హీనమో చూడండి! తను పుట్టడం ఎంతో హీనమని ఆడపిల్లే భావించడం ఇంకెంత హీనమో చూడండి!)

నా తండ్రి దుఃఖ సముద్రంలో తెప్ప కానని వానివలే దుఃఖించి నాకు స్వయంవరం ప్రకటించాలని ఆలోచించాడు. పూర్వం వరుణుడు నా తండ్రికి ఇచ్చిన

ధనుస్సూ, తరగని అమ్ముల పొదులూ, వున్నాయి. ఆ ధనుస్సు చాలా బరువైనది. (ఆ ధనుస్సు దేవరాతుడనే రాజునించీ వచ్చిందని ఇంతకు పూర్వం చెప్పారు. ఇప్పుడు సీత ఇంకోలాగ చెపుతోంది.)

నా తండ్రి రాజులందర్నీ పిలిచి – 'ఈ ధనుస్సు ఎక్కుపెట్టిన వానికి నా కుమార్తెనిస్తాను' అని ప్రకటించాడు – (అది బల ప్రదర్శన అవుతుందిగానీ, సీత తన ఇష్టంతో వరుణ్ణి నిర్ణయించుకునే 'స్వయంవరం' ఎలా అవుతుంది?)

రాజులందరూ ధనుస్సుని ఎక్కుపెట్టలేక తిరిగి పోయారు. తర్వాత చాలాకాలానికి రాముడూ, లక్ష్మణుడూ, విశ్వామిత్ర మహర్షితో కలిసి వొచ్చారు. రాముడు విల్లు విరిచాడు. నా తండ్రి ఎంతో సంతోషించి నన్ను కన్యాదానం చేయడానికి సిద్ధపడ్డారు. రాముడు అంగీకరించక – 'నా తండ్రి అభిప్రాయం తెలుసుకోకుండా పరిగ్రహించను' అన్నాడు. (అప్పుడు తండ్రి వొద్దంటే మానేస్తాడన్నమాట! విల్లు విరిస్తే సీతని పెళ్ళి చేసుకోవాలని తెలుసు కదా? పెళ్ళికి తండ్రి ఆజ్ఞ కావలసిన వాడు, ముందే తండ్రిని అడిగి విల్లు ముట్టుకోవాలి కదా?)

ఇప్పటి రామారావులు కూడా చాలా మంది తమ పెళ్ళి నిర్ణయాల్ని తండ్రికే అప్పజెప్పి "మా ఫాదర్ ఇష్టం. మా ఫాదర్‌ని అడగాలి" అంటారు. అంటే, ఈ నాటి రామారావులు కూడా శ్రీరాముడి కాలంలోనే వున్నారన్న మాట!)

అప్పుడు నా తండ్రి అయోధ్యకు దూతల్ని పంపి దశరథ మహారాజుని పిలిపించి నా వివాహం జరిపించాడు. నా చెల్లెలు ఊర్మిళని లక్ష్మణుడి కిచ్చాడు నా తండ్రి. అప్పటినించి నా పెనిమిటీ, నేనూ ధర్మం చొప్పున కాపరం చేసుకుంటున్నాము" అని చెప్పింది సీత. (ధర్మం చొప్పున! ధర్మ శాస్త్రాలన్నీ చెప్పిన చొప్పున!)

అప్పటికి సాయంత్రం అయింది. ఆ రాత్రి అక్కడే వున్నారు. తెల్లవారి బయల్దేరేటప్పుడు మునులందరూ "రామా! ముందు ముందు అడవి చాలా భయంకరమైనది. పురుష మాంసం తినే రాక్షసులున్నారు. క్రూర మృగాలున్నాయి. జాగ్రత్త" అని హెచ్చరించారు.

(రాక్షసులు, పురుష మాంసమే తింటారట! వాళ్ళు ఎంత మంచివాళ్ళో కదా? సీతని వదిలేసి రాముణ్ణీ లక్ష్మణుణ్ణీ తినేస్తే కథ ఎంత బాగుంటుందో!)

రాముడు గంభీరంగా తల పంకించి లక్ష్మణుడి వేపు చూశాడు, దారి తియ్యమని.

ముగ్గురూ మళ్ళీ ప్రయాణం సాగించారు.

[ఇక్కడితో '**అయోధ్యా కాండ**' ముగుస్తుంది. తర్వాత, '**అరణ్యా కాండ.**' అరణ్యాలు ఎప్పుడో ప్రారంభమయ్యాయి కదా? ఇక్కడి దాకా 'అయోధ్యా కాండ' ఏమిటి?]

**ము**గ్గురూ దండకారణ్యంలో ప్రవేశించారు! పూర్వం దండకుడనే రాజు దేశం అది. శుక్రుడి శాపంతో అది అరణ్యమైపోయింది.

(శాపం ఎందుకో చెప్పలేదు కవి. చెప్పకపోయినా మనం ఊహించవచ్చు. శుక్రుడు వచ్చినప్పుడు ఆ రాజు చప్పున లేచి నమస్కారం పెట్టి వుండడు!)

అప్పటినించీ ఆ అరణ్యమంతా రుషుల ఆశ్రమాలతో, వేద ఘోషతో, హోమాలతో నిండిపోయింది. (ఆ ప్రదేశం అంతా రుషులు ఆక్రమించారన్న మాట!)

లక్ష్మణుడూ, సీతా, రాముడూ, వొస్తోంటే రుషులంతా గుంపులు గుంపులుగా చూస్తూ నిలబడ్డారు. అందరూ సీతని వెర్రిగా చూసి, అంతలో 'రుషులం' అని గుర్తొచ్చి, రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ, చూశారు.

"రుషులారా! మేం దశరథ మహారాజు...." అంటూ లక్ష్మణుడు తన పాఠం అప్పగించాడు. అంతా విని రుషులంతా రాముణ్ణి సంతోషంగా చూశారు – (ఇప్పుడు కాకపోయినా 14 సంవత్సరాల తర్వాత రాజయ్యేవాడు ఈయనే కదా అని!)

"రామా! రాజు అంటే ఇంద్రుడిలో నాలుగో అంశ. (ఎంత ఖచ్చితమైన లెఖ్ఖ!) సింహాసనం మీద వున్నా, అరణ్యంలోవున్నా రాజు శక్తిమంతుడే. నువ్వే మమ్మల్ని రక్షించాలి. రాక్షసులు మమ్మల్ని నానా బాధలూ పెడుతున్నారు. మాకు రాక్షసుల్ని శపించేంత శక్తి వుంది. (లేదని వీళ్ళు ఎక్కడనుకుంటారో నని.) కానీ, మేం ఇంద్రియాల్ని జయించిన వాళ్ళం కదా? మాకు కామ క్రోధాలు కలగవు. అందుచేత రాక్షసుల్ని శపించలేకుండా వున్నాము (ఇదేనా శక్తి?) నువ్వే రాక్షసుల్ని నాశనం చేసి మమ్మల్ని రక్షించాలి" అని అడిగారు. (ఇంద్రియాల్ని జయించిన వాళ్ళకి బాధలెలా తెలుస్తాయి? తెలిస్తే ఇంద్రియాల్ని జయించింది ఎక్కడా?)

రాముడు చిరునవ్వుతో గంభీరంగా తల పంకించాడు. ఆ రాత్రి అక్కడ గడిచింది. మర్నాడు ఉదయం మళ్ళీ ప్రయాణం సాగించారు. (ఎక్కడికీ ప్రయాణం? అడవులు వొచ్చేశాయి కదా? ఎక్కడా ఆగడేం? రావణుడి రాజ్యందాకా వెళ్ళాల్సిందేనా?)

అరణ్యం మధ్యకు వొచ్చారు.

సీతకు సంతోషంగా వుంది, ఘోరారణ్యాలు చూస్తుంటే.

అలా నడుస్తూ వుండగా వొక భయంకరాకారం గల రాక్షసుడు ఆమడకో అంగ వేస్తూ పిడుగుల లాగ గర్జిస్తూ వొచ్చాడు. పర్వతమంత దేహం. గుట్టలాగ పొట్ట. గుహ లాగ నోరు. లోయల్లాగ కళ్ళు. వొంటి నిండా కాలవల్లాగ రక్తం. ఎగుడు దిగుడుగా వున్న అవయవాలు, మొల చుట్టూ రక్తం కారే పులి తోలు. (అతని మొలచుట్టూ తిరగాలంటే అంతపెద్ద చర్మం కావాలి కదా? ఎంత పెద్ద పులో! పులుల్లో రాక్షస పులులు వుంటాయన్నమాట!) భుజంమీద ఉక్కు శూలానికి 3 సింహాలూ, 4 పులులూ, 2 తోడేళ్ళూ, 10 చుక్కల జింకలూ, వొక ఏనుగు తలా గుచ్చి వున్నాయి. (ఎంత ఖచ్చితమైన లెక్కో!) ఉరుములలాగ అరుస్తూ మీదిమీదికొచ్చాడు.

రాముడు వెనకవాడు వెనకే ఇంకా వెనక్కి తప్పుకున్నాడు.

లక్ష్మణుడు మూట అడుగున మనిషే కనబడ లేదు.

సీత దొరికిపోయింది!

(రక్షించేవాడు, వెనక నడవాలో, ముందు నడవాలో మహా బాగా అర్ధమై వుంటుంది రాముడికి.)

రాక్షసుడు సీతని బొమ్మని ఎత్తుకున్నట్టు చంకలో ఎత్తుకుని కొంచెం దూరం పోయి వెనక్కి తిరిగి నవ్వాడు. (హాస్య ప్రియుడే!) "నేనెవరిననుకున్నారు? విరాధుడనే ప్రసిద్ధిగల పేరు వినలేదా? ఆ విరాధుణ్ణి నేనే!" (శ్రీ రాముడు, తన పేరుని ఎంత గర్వంగా చెప్పుకుంటాడో అంత గొప్పగానూ చెప్పుకున్నాడు ఈయన కూడా తన పేరు. కాకి పేరు కాకికి ముద్దు గదా?) "మీరిద్దరూ రుషుల వేషంతో వున్నారే! తపస్సులు చేసుకునే మీకు స్త్రీ ఎందుకు? (మా బాగా అడిగావు విరాధుడూ!) ఈమె ముద్దుగా వుంది. నాకు భార్య అవుతుంది లెండి" అన్నాడు విరాధుడు.

సీత రాక్షసుడి చంకలో గజగజ వొణుకుతోంది. (అన్నాళ్ళూ రాక్షసుల కోసం, సింహాల కోసం ఎంతో ఎదురు చూసింది, మహా వీరుడైన భర్త వున్నాడనే ధైర్యంతోనే. రాక్షసుడొచ్చి తనని ఎత్తుకునే దాకా భర్త చూస్తూ వూరుకుంటాడని సీత ఎన్నడైనా సందేహించిందా?)

రాముడికి కాళ్ళూ చేతులూ ఆడడం లేదు. అందరికీ అభయ హస్తం ఇచ్చే రాముడికి భయంతో వొణుకు మొదలైంది – "లక్ష్మణా! చూడు, చూడు, నా భార్య! నా అర్ధాంగి! .... రాక్షసుడు ఆలింగనం చేసుకుంటున్నాడే! అయ్యయ్యో, కైకమ్మ కోరిక తీరింది! కక్ష కట్టి అడవుల్లోకి తరిమిందిగా? తన కొడుక్కి రాజ్యం ఇప్పించాలనే కాదు సుమా, నన్ను చంపాలని కూడా ఈ ఉపాయం పన్నిందని నాకిప్పుడు చక్కంగా అర్ధమవుతోంది. (రాముడు, భరతుడితో ఏం చెప్పాడు? 'నీ తల్లి చేసిన తప్పు మర్చిపో సుమా, మర్చిపో సుమా!' అని భరతుడికి లక్షసార్లు బోధించి, కైకనేమీ అనకూడదని సీతమీద కూడా వొట్టు పెట్టిన శ్రీరాము డీయనే! వొట్టు తీసి గట్టున పెట్టేశాడు!) "అయ్యో నేనెవరికైనా ద్రోహం చేశానా? సర్వ భూతాలకూ హితుడిగా వున్నానే! అయ్యయ్యో! పరపురుషుడు ముట్టేసుకున్నాడే సీతని. రాజ్యం పోయినప్పుడూ, తండ్రి పోయినప్పుడూ కూడా నా కింత దుఃఖం కలగలేదే?[142] అదిగో! సీత నడుం మీద చెయ్యేశాడే!" అని విలవిల్లాడుతూ, బొటబొటా కన్నీళ్ళు కారుస్తూ, చేష్టలు దక్కి నిల్చున్నాడు, వీరాధి వీరుడైన రాముడు! (భయంకరంగా, వికృతంగా వున్న రాక్షసు డెత్తుకుపోయినా, అది 'పర పురుష స్పర్శే' అన్నమాట! మొగ సింహం లాక్కు పోయినా, అది 'పరపురుషుడు ముట్టుకున్నాడన్న' గోలే కావున్ను.)

అన్నగారి దుఃఖం చూస్తే లక్ష్మణుడికి పౌరుషం వచ్చింది. కొంచెం విసుగ్గా మొహం చిట్లిస్తూ "అన్నగారూ! ఎందుకలా బెంబేలు పడుతున్నారు? మీరు మహా వీరులుగానీ సామాన్యులా? మీతోపాటు నేను లేనా? ఆపద, మీద పడ్డప్పుడు పిరికివాని వలె దుఃఖించడం

---

**142.** **అరణ్య కాండ, సర్గ 2, శ్లోకం 21, 22:** రాముడు కళ్ళ నీళ్ళు పెట్టుకుని ఏడవడం, లక్ష్మణుడు చివాట్లు పెట్టడం చూడండి! వనవాసానికి బయల్దేరినప్పుడే తెలుసుకదా రాక్షసులో, పులులో, సింహాలో, సర్పాలో, ఆపదల్లో పడేస్తాయని? ఊహించనిదేదో జరిగిపోయినట్టు వొకటే గోల! సీతని రాక్షసుడు ఎత్తుకుపోతోంటే, ఆమెని వెంటనే రక్షించాలిగానీ, కైకను తిట్టి, తనను తను పొగుడుకోడానికి అదా సమయం? – అసలు రాముడు వుండగానే సీతని రాక్షసుడు ఎత్తుకోగలిగాడంటే, ఇది రాముడి వీరత్వాన్ని అపహాస్యం చేసే సంఘటన అవదా? ఏ రాత్రో ముగ్గురూ అలిసి నిద్రలో వున్నప్పుడో, సీత నదిలో దూరంగా స్నానం చేస్తున్నప్పుడో, రాక్షసుడు వొచ్చిపడి సీతని ఎత్తుకుని నడుస్తూ వుండొచ్చు. రాముడు, దూరంనించి చూసి వెంటపడాలి. అంతేగానీ, పక్కన రాముడు వుండగానే అలా జరగకూడదు. ★

ఏమిటి? ఈ రాక్షసుడి పని నేను పడతాను. అసలు నాకు, రాజ్యం కోరిన భరతుడి మీద కక్ష తీరనే లేదు.[143] ఆ పగంతా వీడిమీద చూపిస్తాను." (లక్ష్మణుడికి ఎప్పుడూ భరతుడిమీద అసూయే, అన్నగారు తనకన్నా భరతుణ్ణే గొప్ప చేస్తాడని. దానికి రాముడి మీద కోపం వుండాలిగానీ భరతుడి మీద ఎందుకు?)

లక్ష్మణుడు కోపంగా మూట కింద పడేసి తట్టా బుట్టా దూరంగా విసిరి, కత్తి చేతిలోకి తీసుకుని రాక్షసుణ్ణి వెటకారంగా చూస్తూ – "ఎవడురా నువ్వు?" అని గట్టిగా కేకపెట్టాడు. (వాడెవడో తెలిస్తేగానీ, తనేమీ చెయ్యడానికి వీల్లేనట్టు!)

"మీరెవరు? ముందా సంగతి చెప్పండి!" అని పిడుగుల్లాగ గర్జించాడు విరాధుడు.

రాముడు వినయంగా – "మాది ఇక్ష్వాకు వంశ మోయీ! మేము క్షత్రియులం!" అంటూ వివరాలు చెప్పు కొచ్చాడు. (రాక్షసుడితో యుద్ధం ప్రారంభించక, ఇవన్నీ చెప్పడం ఎందుకు? పులివొచ్చి మీదకి వురుకుతోంటే – "మేము క్షత్రియులమోయీ" అని చెపుతాడన్న మాట!)

తన వివరాలన్నీ చెప్పి తర్వాత రాక్షసుడితో, "నువ్వెవరో ఈ దండకారణ్యంలో ఎందుకు సంచరిస్తు న్నావో .... కొంచెం చెబితే...." అని నసిగాడు రాముడు, ఆ రాక్షసుడి ముందు! (రాక్షసుడే రాముణ్ణి అడగాల్సిన ప్రశ్న అది – "ఈ అరణ్యాల్లో మీ రెందుకు తిరుగు తున్నారు?" అని.)

విరాధుడు నిర్లక్ష్యంగా – "నా పేరు చెప్పాగా? మా తండ్రి జయుడు. తల్లి శతహ్రద. పూర్వం నేను గొప్ప తపస్సు చేసి బ్రహ్మవరం పొందాను. నాకు ఆయుధాలతో చావు లేదు. ఎందుకు మీకీ వృధా ప్రయాస? ఈ స్త్రీని వొదిలి పరిగెత్తిపోండి. మిమ్మల్నేమీ చెయ్యను" అని తన దారి పట్టాడు.

సీత ఘొల్లుమంది. రాముడికి అప్పటికి పౌరుషం వచ్చింది. "నీచుడా! నించో! చంపుతాను" అని, (నించుని నాతో చంపించుకోమని) బాణం వొదిలాడు. వెంట వెంట ఏడు బాణాలు వొదిలాడు. (రాముడిది వొకే బాణం, ఒకే మాటా అంటారే! శుద్ధ తప్పు! ఎన్నో బాణాలూ, ఎన్నెన్నో మాటలూ!)

బాణాలన్నీ విరాధుడికి అక్కడక్కడా గుచ్చుకుని, అతడు వొక్కసారి వొళ్ళు విదిలించడంతో అన్నీ కింద పడ్డాయి. విరాధుడికి కోపం వొచ్చి సీతని దించి, శూలం పట్టుకుని రాముడి మీద కొచ్చాడు.

రాముడూ, లక్ష్మణుడూ మళ్ళీ బాణాలు కురిపిం చారు – విరాధుడు నవ్వి అన్నీ దులిపేశాడు. రాముడు ఇక లాభం లేదని విరాధుణ్ణి ఒదిలి అతని శూలంమీద వీరత్వంతో బాణాలు కురిపించాడు. శూలం విరిగింది. విరాధుడు కోపంతో రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ పిడికిళ్ళతో ఎత్తి భుజాలమీద పడేసుకుని, అంగలేసుకుంటూ నడక ప్రారంభించాడు. (రాక్షసుడు తమని నోట్లో పడేసు కోకుండా, భుజాల మీద కూర్చోబెట్టుకోడంతో రాముడికి ప్రాణాలు లేచి వొచ్చి వుంటాయి).

రాముడు – "లక్ష్మణా! మనం కూడా అరణ్యంలోకే పోవాలి కదా? మనం పోవాలనుకున్న దారినే వీడూ పోతున్నాడు. మనం వీడి భుజాల మీదే కూర్చుని సుఖంగా పోవచ్చు. ఇదీ మంచిదే" అని రెండో భుజం మీద లక్ష్మణుడికి వినిపించేటట్టుగా గావుకేకలు పెట్టాడు. (మరి సీతేం అవుతుంది రాముడూ? రాక్షసుడి చేతుల్లో ఇరుక్కుని, వాడు తీసుకుపోతూ వుంటే, 'మనం కూడా ఈ దారినే వెళ్ళాలి కదా?' అని వెర్రి తర్కం మాట్లాడితే, ఎంత మూర్ఖుడైనా అంగీకరిస్తాడా, ఈ కవి తప్పు?)

వెనకాల సీత ఎన్నడూ ఎరగనంత భయంతో ఎలుగెత్తి ఏడుస్తోంది – "అయ్యో! మహావీరుడైన రాముణ్ణి రాక్షసుడు తీసుకుపోతున్నాడే! (ఇంకా మహా వీరుడేవిటి సీతా? పెళ్ళాలెప్పుడూ మొగుళ్ళని ఇలాగే పొగుడుతూ వుంటారు!)

నన్నిక పులులో, తోడేళ్ళో తింటాయి గావున్ను. ఓ రాక్షసోత్తమా! వారిని విడిచిపెట్టి, నన్ను తీసుకుపో! నీకు దణ్ణం పెడతాను"అంటూ కేకలు పెడుతూ ఏడ్చింది.[144] తనని తీసుకుపొమ్మని రాక్షసుణ్ణి బతి మాలింది.

---

**143.** **అరణ్య, సర్గ 2, శ్లోకం 25:** "రాజ్యం కోరిన భరతుడి మీద నాకు కలిగిన కోపం విరాధుడి మీద విడిచి పెడతాను" అంటాడు లక్ష్మణుడు. భరతుడు రాజ్యం కోరలేదని నమ్మనే లేదు వీళ్ళు! తన రాజ్యమంతా త్యాగం చేసిన భరతుడి మీద, తన సుఖం వొదులుకుని నారగుడ్డలతో సింహాసనం పక్కన కూర్చున్న భరతుడి మీద, ఇంకా కోపం వీళ్ళకి! భరతుడు ఎంతో భక్తితో రాముడి పాదుకలు తీసుకుపోయిన తర్వాత కూడా, రాముడు కైకని తిట్టడం, లక్ష్మణుడు భరతుణ్ణి తిట్టడం, ఏ విధంగా సమర్థనీయం? ఈ రకం ప్రవర్తన, ఆ పాత్రల్ని హీనపరుస్తుందనే జ్ఞానంలేదా కవికి? ★

**144.** **అరణ్య, సర్గ 3, శ్లోకాలు 14 .... 24:** "ఆ రాక్షసుడు బాణములచే పీడితుడై సీతాదేవిని ఒక ప్రక్క నేలపై నుంచి శూలము దాల్చి రామలక్ష్మణుల పైకి పరిగెత్తెను." – విరాధుడు, ఆ అన్నదమ్ములిద్దర్నీ ఎత్తుకుని తీసుకుపోతున్నాడు. వెనకాల సీత పెద్ద కంఠంతో ఏడుస్తోంది. రాముడు ఇలా అంటున్నాడు – "లక్ష్మణా! ఈ రాక్షసునికెట్లు అభిమతమో అట్లే మనలను ➔

సీత ఏడుపు విన్న తర్వాతగాని రాముడికి అర్ధాంగీ, ధర్మపత్నీ, సహధర్మచారిణీ, అనురాగవతీ అయిన సీత సంగతి జ్ఞాపకం రాలేదు. అప్పటికి కొంత తెగింపు కల్గింది. బొడ్లోంచి కత్తి తీసి విరాధుడి భుజం నరికాడు. లక్ష్మణుడు కూడా ఇంకో భుజం నరికాడు. (వీళ్ళకి వచ్చిన విద్య – ఈ నరకడాలే.)

ముగ్గురూ కిందపడ్డారు. రాక్షసుడు లేవలేక దొర్లుతూ కేకలు పెట్టాడు. రాముడూ, లక్ష్మణుడూ రాక్షసుణ్ణి పూర్తిగా చంపడానికి, తన్నీ, గుద్దీ, కత్తుల్తో పొడిచీ, చాలా కష్టపడ్డారు. పని జరగలేదు. రాముడు చేతులు దులుపుకుంటూ "ఇతనికి తపోబలం ఎక్కువగా వుంది. ఇతన్ని చంపడం సాధ్యం కాదు, గొయ్యి తీసి పూడ్చి పెడదాం" అన్నాడు. (తపోబలం, గోతుల్లోంచి బైటికి లాగలేదన్నమాట! హమ్మయ్యా! తపస్సు వల్ల జరగని పని వొక్కటైనా కనపడింది ఇప్పటికి.)

విరాధుడు రాముడి మాటలు విని – "నువ్వు నన్ను యుద్ధంలో ఓడించావు. అందుచేత నువ్వు రాముడివని నాకిప్పుడు తెలిసింది. పూర్వం నేను తుంబురుడనే గంధర్వుణ్ణి. రంభ ప్రేమలో మునిగి సమయానికి సేవ చెయ్యలేదని కుబేరుడు నన్ను రాక్షసుడివి కమ్మని శపించాడు. (కుబేరుడు – ఇతనికి యజమాని. ఇతను – సేవకుడు. సేవకులు, సేవలు సరిగా చెయ్యకపోతే ఆ సేవకుల్ని యజమానులు శిక్షిస్తారు. అదే శపించడం! దేవతల్లో కూడా 'యజమానులూ – సేవకులూ' వుంటారు. మానవ సమాజంలో వున్న భేదాలే దేవతల్లో కూడా వున్నట్టు కథలు తయారవుతాయి.)

దశరథ పుత్రుడు నిన్ను యుద్ధంలో చంపినప్పుడు మళ్ళీ స్వర్గానికి వొస్తావని కుబేరుడు నాకు శాప విముక్తి చెప్పాడు. నీ వల్ల నాకీ రాక్షస జన్మ నించి శాప విమోచనం కలిగింది. ఇక నేను స్వర్గానికి పోతాను. నా ప్రాణం పోయిన తర్వాత నన్ను గుంటలో పూడ్చిపెట్టు. చచ్చి పోయిన రాక్షసుల్ని గుంటలో పూడిస్తే వారికి పుణ్యలోకాలు కలుగుతాయి. రామా! ఇక్కడికి అర్ధ యోజనం దూరంలో శరభంగ మహర్షి అగ్ని ప్రవేశం చేస్తున్నాడు. ఆ మహామునికి కూడా నీ దర్శన భాగ్యం కలిగించు. నీ దర్శనంతో అతడు బ్రహ్మలోకం పొందుతాడు" అని చెప్పి విరాధుడు ప్రాణాలు విడిచాడు. (రాముడు, తన వీరత్వంతో ఇక్కడ చేసిందేమీ లేదు. తనూ, లక్ష్మణుడూ చెరో భుజం నరికారు. ప్రాణాలేమో వాడికి వాడే విడిచి పెట్టాడు. మరి రాముడు శాప విముక్తి కలిగించిం దెక్కడో!)

అప్పటికి రాముడు పూర్తిగా ధైర్యం తెచ్చుకుని "లక్ష్మణా! వీణ్ణి పూడ్చడానికి విశాలమైన గుంట తవ్వు" అని ఆజ్ఞాపించి "ఎందుకైనా మంచిది. వీడు లేవకుండా చూస్తాను" అని తను రాక్షసుడి కంఠం మీద కాలుపెట్టి తొక్కిపట్టి గంభీరంగా నించున్నాడు. (చచ్చిపోయిన వాడిమీద! పని ఎగ్గొట్టడానికి ఎత్తు.)

లక్ష్మణుడు పారా, పలుగూ తెచ్చుకుని విరాధుడి పక్కనే పెద్ద గొయ్యి తవ్వాడు. రాముడు అలిసిపోయి కాలు తీశాడు. రాక్షసుణ్ణి గుంటలోకి దొర్లించి మట్టి పోసి పూడ్చాడు లక్ష్మణుడు.

సీత వొచ్చి రాముణ్ణి ఏడుస్తూ కావలించుకుంది.

రాముడు (గొప్ప వీరుడిలాగ) సీతని ఓదార్చాడు "భయమేల సీతా? ఈ రాక్షసుడొక లెక్కా? 11 వేల మందిని వొక్క సారిగా.... చంపగలనని రుషులు నన్ను కీర్తించడం ఎరగవా? ...."

("మరి ఇంత జాప్యం చేశారేం స్వామీ! ఆ దుర్మార్గుడు నన్నెత్తుకోకముందే వాణ్ణి సంహరించవొచ్చునే" అని అడిగి భర్తని ఇబ్బంది పెట్టలేదు సీత. పతివ్రతల వల్ల అదే సుఖం. భర్తల్ని వాళ్ళు ఏదీ అడగరు.)

రాముడు లక్ష్మణుడితో – "లక్ష్మణా! ఈ అడవి మనకు కొత్త. ఇంకా ముందుకు పోవడం కష్టంగా తోస్తోంది. (ఇప్పటికే చావుదప్పి కన్ను లొట్ట పోయింది) ఈ సమీపంలోనే శరభంగ మహర్షి ఆశ్రమం వుందని విన్నాం కదా? అక్కడికి పోదాం, బయల్దేరు! నువ్వు ముందు నడువు. నేను వెనకనించి రక్షిస్తూ వుంటాను" అంటూ కత్తీ, విల్లూ సర్దుకున్నాడు.

లక్ష్మణుడు వెనక్కిపోయి చీరల మూటా, తట్టా, బుట్టా తెచ్చుకుని ముందు దారితీశాడు.

శరభంగుడి ఆశ్రమానికి చేరారు. అక్కడ కనపడ్డ వింతదృశ్యం ఇదీ: మహా తేజశ్శాలి వొకడు చుట్టూ జిగేల్మని కాంతి జిమ్ముతూ, పట్టుబట్టలతో, ఆభరణాలతో, చుట్టూ దేవతలతో, భూమిని అంటుకోకుండా గాలిలో తేలుతూ నిలబడి వున్నాడు! అతడే దేవేంద్రుడు. గుర్రాలు కట్టిన రథం కూడా ఆకాశంలో తేలుతూ ఆగి వుంది. గుండ్రని ఛత్రం ధగ ధగ లాడుతూ ఆకాశంలో తేలుతూనే దేవేంద్రుడికి నీడ పడుతోంది. పరిచారికలు తేలుతూనే దేవేంద్రుడికి విసురుతున్నారు. చుట్టూ దేవతలు

---

➔ మోసికొని పోనిమ్ము! వీడు పోవుచున్న మార్గముననే మనమూ ప్రయాణించవలసి యున్నది" – సీతని వదిలేసి పోవడం రాముడికి ఇష్టం లాగే వుంది! ★

తేలుతూనే వినయంగా పూజిస్తున్నారు. (కవిగారు ఈ ఘట్టం ఊహల్లో తేలుతూనే రాశారు.)

ఆ రకంగా గాలిలో తేలుతూ దేవేంద్రుడు శరభంగుడితో మాట్లాడుతున్నాడు.

రాముడు దేవేంద్రుణ్ణి గురించి అంతవరకూ వినడమేగానీ ఎన్నడూ చూడలేదు. "లక్ష్మణా! మీరిద్దరూ ఇక్కడే ఆగండి. నేను ముందు వెళ్ళి చూసి వొస్తాను" అంటూ బయల్దేరాడు రాముడు.

రాముడు తన వేపుకే వొస్తూ వుండడం చూసి దేవేంద్రుడు శరభంగుడితో – "రాము డిక్కడికే వొస్తున్నాడు. అతడితో నేనిప్పుడు మాట్లాడను. రావణుణ్ణి చంపిన తర్వాత, అతడి కార్యం ముగిసిన తర్వాత, అతడు నాతో మాట్లాడవొచ్చును" అని తొందరగా రథం ఎక్కి తేలుతూ పైకి వెళ్ళిపోయాడు. (రావణుణ్ణి చంపాకే రాముడితో మాట్లాడతాడట! అందాకా మాట్లాడట!)

రాముడు శరభంగుడి దగ్గిరికి వెళ్ళాడు.

వెనకాలే, సీతా, లక్ష్మణుడూ వొచ్చారు. (అక్కడే నించోమంటే వాళ్ళు వెనక రావడం ఏమిటి? మళ్ళీ రాముడు కబురు పంపేవరకో, పిలిచేవరకో వాళ్ళు రాకూడదని మర్చిపోయాడు కవి.)

ముగ్గురూ శరభంగ మహర్షికి నమస్కారాలు చేశారు. రాముడు కుతూహలంగా – "మహర్షీ! ఇంద్రు డెందుకు వచ్చాడు?" అని అడిగాడు.

శరభంగుడు గడ్డం పూపుతూ – "నాయనా! ఘోరమయిన తపశ్శక్తి వుంటేగానీ, బ్రహ్మలోకానికి పోయే ఆత్మజ్ఞానం రాదు. అలాంటి జ్ఞానం నాకుందని, బ్రహ్మ నన్ను తీసుకురమ్మని దేవేంద్రుణ్ణి పంపించాడు. రామా! నిన్ను చూడకుండా ఎలా వెళ్ళగలను? నీ కటాక్షం కూడా పొంది వైకుంఠానికి వెళతాను. బ్రహ్మలోకంలోనూ, స్వర్గలోకంలోనూ నాకు కొన్ని పుణ్యస్థానాలున్నాయి. (పార్లమెంటులో సీట్ల లాంటివి కావున్ను.) అవి నీకిస్తాను. పరిగ్రహించు" అన్నాడు.

రాముడు సంతోషించి, వినయం అధికం చేసి "అటులనే స్వామీ! స్వీకరిస్తాను" అని వొప్పుకున్నాడు. క్షత్రియు లెప్పుడూ ఇవ్వాలేగానీ తీసుకో కూడదని చెప్పే రాముడు, ఏమీ అనకుండా తీసుకోవడం బాగుండదని "మహర్షీ! ఈ పుణ్య స్థానాలన్నీ నేనే ఇతరుల కివ్వగలను" అని తనను తను కీర్తించుకున్నాడు. తర్వాత "ఈ అడవిలో ఎక్కడ నివసించడం సుఖంగా వుంటుందో తెలియజేస్తే అక్కడ గృహం నిర్మించుకుంటాను" అని అడిగాడు.

"రామా! ఈ సమీపంలోనే సుతీక్ష్ణ మహర్షి వున్నాడు. అతడే నీకా వివరాలన్నీ చెబుతాడు. ఇప్పుడు నేను అగ్నిలో పడి దేహం విడిచి స్వర్గానికి పోతాను, చూడు!" అని లేచాడు శరభంగుడు.

దూరంగా అగ్ని గుండం కాలుతోంది. చుట్టూ రుషులు మంత్రాలు చదువుతూ అగ్నిలో నెయ్యి పోశారు. మంటలు ఒక్కసారి ఆకాశాన్నంటాయి. శరభంగుడు మంటల్లోకి వెళ్ళి నించున్నాడు. జుట్టూ, చర్మం కాలి బూడిద అయ్యాయి. వెంటనే మంటల్లోంచి ఒక బాలుడు బయటికి వొచ్చి, అందరూ చూస్తూండగా పైకి ఎగిరి వెళ్ళిపోయాడు. – అలా వెళ్ళిన ఆ రుషి, లోకాలన్నీ దాటి వైకుంఠం వెళ్ళి పరబ్రహ్మని చూశాడు. శ్రీమన్నారాయణుడు ఆ రుషికి స్వాగతం చెప్పాడు.

శరభంగ రుషి వెళ్ళిపోయిన తర్వాత మిగిలిన రుషులందరూ రాముడి చుట్టూ చేరారు. వారిలో అనేక విధాలుగా తపస్సులు చేసే వారున్నారు. బ్రహ్మ తోకనించీ, (బ్రహ్మకి తోక!) బ్రహ్మ గోళ్ళనించీ పుట్టిన వారూ, ఎప్పుడూ స్నానం చేస్తూనే వుండేవారూ; సూర్య చంద్ర కిరణాలు మాత్రమే భుజించేవారూ, రాళ్ళతో దేహం చితగ్గొట్టుకునే వారూ, ఆకులు మాత్రమే తిని పూరుకునే వారూ, ఎప్పుడూ కంఠం వరకూ నీటిలో మునిగి వుండే వారూ, దేహాన్ని వంచకుండా ఎప్పుడూ నిలబడే వుండే వారూ, చలిలోనూ వానలోనూ కూడా దేహాన్ని కప్పుకోకుండా వుండే వారూ, గాలిని మాత్రమే పీల్చుతూ ఎన్నడూ ఆహారం తిననివారూ, కొంచెం జలం మాత్రం తీసుకునే వారూ; రాలిన ఆకులు మాత్రమే తినేవారూ, దుంపలతో గడ్డలతో మాత్రమే సంతృప్తి పడేవారూ; ఎప్పుడూ భూమిని ముట్టుకోకుండా చెట్లమీద మాత్రమే వుండేవారూ, దర్భలు పరుచుకుని ఎప్పుడూ పడుకొనే వుండేవారూ (ఎప్పుడూ నించుని వుండేవారికీ, ఎప్పుడూ పడుకుని వుండే వారికీ, ఒక్క రకంగానే పుణ్యం వస్తుందా, వేరే వేరే రకాల పుణ్యాలు వస్తాయా? నా అభిప్రాయం అయితే, వేరే వేరే జబ్బులొస్తాయి. ఎప్పుడూ నించుని వుండేవారికి మోకాళ్ళ జబ్బూ, ఎప్పుడూ పడుకుని వుండేవారికి గూళ్ళ జబ్బూ! పుణ్యాల సంగతి పండితులు తేల్చాలి); ఎప్పుడూ తడిబట్ట మాత్రమే కట్టుకునే వారూ (అది ఆరిపోతోంటే మళ్ళీ నీళ్ళలో ముంచుతూ వుంటారన్న మాట. దాన్ని తడపడంతో సరిపోతుంది కాలం. తపస్సు అదే.) ఎప్పుడూ వేదాలు చదువుతూ వుండే వారూ, ఎప్పుడూ పంచాగ్నుల మధ్య కాలుతూ వుండే వారూ, (గజ్జివారూ, దురదలవారూ, పాచిపళ్ళ వారూ) – అందరూ రాముడి చుట్టూ చేరి పొగడడం ప్రారంభించారు. – "రామా! నువ్వే, మీ వంశంలో అధి

కుడివి. నువ్వే ఈ భూమికంతకీ నాధుడివి. నువ్వే పితృ భక్తికీ, సత్య ధర్మాలకూ మారు రూపానివి! నువ్వే, మమ్మల్ని రక్షించగల సమర్థుడివి! (నువ్వే, నువ్వే, నువ్వే, నువ్వే, నువ్వే!) రామా! రాక్షసులు మమ్మల్ని నానా బాధలూ పెడుతున్నారు. (రాళ్ళతో వొళ్ళు చితగ్గొట్టుకుని, నీళ్ళలో నాని, నిప్పుల్లో కాలి, చలిలో గడ్డకట్టి, తిండి లేకుండా కడుపులు మాడ్చుకుని, భూమికి అంటు కోకుండా చెట్లకు వేళ్ళాడి తమని తామే అన్ని బాధలు పెట్టుకునే వాళ్ళకి, రాక్షస బాధలొక లెక్కా? రాక్షసులు ఇంత కన్నా ఏం బాధలు పెడతారు? అవి కూడా తపస్సులో భాగం అని ఆనందించరాదూ? "రాక్షసులు మమ్మల్ని బాధలు పెడుతున్నారు" అని 'బాధ'ని గ్రహించ గలవాళ్ళు, తపస్సు పేరుతో ఈ 'బాధలన్నీ' ఎందుకు పడుతున్నారు? ఈ బాధ లెందుకు పడాలో శాస్త్రాన్ని అడగరేం?) "రామా! ఈ రాక్షసుల నించి మమ్మల్ని రక్షించు" అని అడిగారు రుషులందరూ. (రాక్షసుల నించి కాదు, తపస్సుల నించీ, శాస్త్రాలనించీ రక్షణ అడ గాలి! రాముణ్ణి కాదు, రాక్షసుల్నీ, నాస్తికుల్నీ అడగాలి.)

రాముడు తలవొంచి గంభీరంగా ఆలోచించాడు. తను రాక్షసులతో యుద్ధానికి సిద్ధమై రాక్షస రాజ్యాలు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తే, ఈ రుషులంతా తన పక్షంగానే వుంటారని గ్రహించాడు. కొంచెం నవ్వుతూ "మీరందరూ ఇంతగా అడగాలా? రాక్షసుల్ని సంహ రించడం నాకే లాభం కదా? పితృ వాక్యం చొప్పున వనవాసానికి వొచ్చినప్పటికీ, ఈ వనవాసం నాకు గొప్ప ఫలం ఇస్తుందని తెలుసు" అన్నాడు.[145]

రుషులందరూ సంతోషించారు.

రాముడి మాటలు సీతకేమీ రుచించలేదు.

అక్కడి నించి బయల్దేరి సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమానికి వెళ్ళారు.

ఆ రుషి తపస్సులో మునిగి వుండడం చేత అతడి జుట్టు మట్టి పెళ్ళలతో అట్టలు కట్టి వుంది.[146] (అన్ని సంవత్సరాల తపస్సుకి ఆయన సంపాదించింది జుట్టు నిండా ఆ మట్టి అచ్చులన్న మాట! బహుశా పేలూ, గజ్జీ కూడా! జుట్టు నిండా మట్టి పేరుకోవడం కూడా గొప్ప కీర్తి అయినట్టే రాస్తున్నారు కవిగారు.)

రాముడు ఎప్పటి విధంగానే తన గొప్ప పేరు చెప్పుకున్నాడు.

సుతీక్ష్ణుడు – "రామా! నీ గురించి విన్నాను. నీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఇంద్రుడు శరభంగుడి దగ్గరికి వొచ్చినప్పుడు నా దగ్గిరికి కూడా వొచ్చి 'నువ్వు తపస్సుతో పుణ్యలోకాలు పొందావు' అని చెప్పాడు. (శుభలేఖలు పంచి పెట్టినట్టు, స్వర్గారోహణ పిలుపులు పిలుస్తూ, ఒక్కసారే కొన్ని వ్యవహారాలు చూసుకుని వెళ తాడు కావున్ను ఇంద్రుడు) రామా! నేనింకా నీ కోసమే స్వర్గానికి పోలేదు. నా దగ్గిర పుణ్యం చాలా వుంది (మట్టే కాకుండా!). నా పుణ్యం అంతా నీకిచ్చేస్తాను. తీసుకో" అన్నాడు.

తీసుకోవడం తప్ప, ఇవ్వడం ఎరగని రాముడు చాలా సంతోషించాడు. "అలాగే తీసుకుంటాను. అసలు పుణ్యలోకాల్ని ఇతరులకు ఇచ్చేవాణ్ణి నేనే. ఇంతకీ నేను ఎక్కడ నివసించడం సౌఖ్యంగా వుంటుందో చెప్పండి స్వామీ!" అని అడిగాడు (ఇతరులకు పుణ్యలోకాలు ఇచ్చే వాడికి మంచిచోటు మాత్రం ఎవరో చెప్పాలి! పుణ్యం అనేది ఎవరి సత్కార్యాలతో వాళ్ళు సంపాదించుకోవాలి గానీ, ఇతరులు ఇస్తే తీసుకో వచ్చునా? కవి, రాముడి కోసం అందరి దగ్గర నించీ పుణ్యాలు పోగేసి, మూటలు కట్టి పెడుతున్నాడు, రాబోయే యుద్ధంలో జయించడం కోసం.)

"ఈ ఆశ్రమం చాలా మంచిది నాయనా! అన్ని కాలాల్లోనూ ఫలాలు దొరుకుతాయి. ఇక్కడ రుషులు చాలా మంది ఉంటారు. కొంచెం క్రూరమృగాల బెడద వుంది. బెదిరించే వాళ్ళెవరూ లేక తరుచుగా వొచ్చి తపోభంగం కలిగిస్తూ వుంటాయి. అంతకన్నా ఇబ్బంది లేదు."

అక్కడ 'క్రూరమృగాలున్నా'యంటే రాముడికి నచ్చ లేదు. పూట పూటా వాటితో ఎవరేగ గలరు? "మహర్షీ! నాకీ స్థలం ఇష్టం లేదు. నా గొప్ప ధనుస్సుతో భయంక రంగా ధ్వనులు పుట్టిస్తూ క్రూర మృగాల్ని చంపుతూ వుంటే ఈ ఆశ్రమ ప్రశాంతతకు భగ్నం కలుగుతుంది. అది నాకిష్టం లేదు" అని సంభాషణ ఆపి వూరు కున్నాడు.

---

**145.** **అరణ్య, సర్గ 6, శ్లోకం 24:** "ఈ వనవాసం నాకు గొప్ప ఫలం ఇస్తుంది" అంటున్నాడు రాముడు. ఏ రకం ఫలం? రాక్షసుల్ని చంపి, రాక్షస రాజ్యాలు ఆక్రమించడమో, వారిని సామంతుల్ని చేసి, తన అధీనంలో వుంచుకోవడమో చేసే ఫలం! ★

**146.** **అరణ్య, సర్గ 7, శ్లోకం 5:** "మలపంక జటాధరమ్" అని, రుషి నెత్తినిండా మట్టిని చూసి మురిసిపోతున్నాడు కవి. ఎన్నడూ నీళ్ళ మొహం చూడని తపస్సు కావున్ను ఇది! జుట్టుకి ఎంత మురికి పేరుకుంటే అంత పుణ్యమా? జుట్టు శుభ్రంగా వుంటే పాపమా? ★

ఆ రాత్రి అక్కడ గడిచింది. తెల్లవారాక రాముడు "ఇతర రుషుల ఆశ్రమాలు కూడా చూస్తాం" అని బయల్దేరాడు.

సీతకి, భర్తతో మాట్లాడే అవకాశం అప్పటికి దొరికింది. ఎప్పటి నించో భర్త ధోరణి ఆమెకు అయిష్టంగా వుంది. కొంచెం చొరవచేసి – "స్వామీ! లోకంలో అసత్యమాడడం, పరస్త్రీలతో పోవడం, విరోధం లేకుండా హింస చెయ్యడం, గొప్ప దోషాలు. మీరెన్నడూ అసత్యమాడరు కాబట్టి మొదటి దోషం మీకు అంటదు. (రాముడు లక్ష అసత్యాలాడడం చూస్తూనే వుంది సీత. మచ్చుకి – మాంసం తింటూ కంద మూలాలే తింటున్నానని చెప్పడం.) మీరు ఎన్నడూ పరస్త్రీలను కోరరు కాబట్టి రెండో దోషమూ మీకు అంటదు. (భర్తకి ఎప్పుడయినా, ఏ స్త్రీ మీదయినా ఆసక్తి కలుగుతుందేమోననే భయంతో, సీత, 'మీరా దోషం చెయ్యనే చెయ్యర'ని నిర్ధారణ చేసేస్తోంది.) ఇక, మూడో దోషం – 'వైరం లేకుండా హింస చెయ్యడం' ఎందుకు? వైరాగ్యంలో లక్ష్మణుడి కన్నా మీరే అధికులని రుషులు కీర్తిస్తారు. మీకేమీ హానిచెయ్యని రాక్షసుల్ని చంపుతానని ప్రతిజ్ఞ చెయ్యడం ధర్మం కాదు. ఇది నాకు సముచితంగా తోచడం లేదు. మూర్ఖులూ, అజ్ఞానులూ, రౌద్రం పేరు పెట్టుకుని హింసని వ్యసనంగా ఆచరిస్తారు. ఈ బాణాలూ, కత్తులూ, ఆయుధాలూ పట్టుకుని అడవుల్లోకి ప్రవేశించడం కూడా ధర్మం కాదు. చేతిలో ఆయుధం వుంటే ఏదో ఒక హింస జరగక మానదు. తపో జీవనంలో ఆయుధం ఎంత కీడు కలిగిస్తుందో నేను విన్న కథ వొకటి చెబుతాను.

పూర్వం ఒక రుషి చేస్తోన్న తపస్సుని చెడగొట్టాలని ఇంద్రుడు సైనికుడి రూపంలో వొచ్చి, తన చేతిలో కత్తిని ఆ రుషికి ఇచ్చి, తను మళ్ళీ వొచ్చి అడిగేవరకూ దాన్ని రక్షిస్తూ వుండమని చెప్పి, వెళ్ళిపోయాడు. రుషి, ఆ కత్తిని జాగ్రత్తగా వుంచాలనే తాపత్రయంతో ఎప్పుడూ తన దగ్గిరే పెట్టుకుని తిరుగుతూ వుండేవాడు. క్రమంగా తపస్సు మర్చిపోయాడు. హింస చెయ్యడంలో ఆసక్తి కలిగింది. దుర్మార్గంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. చివరికి నరకానికి పోయాడు. అందుచేత, అసలు ఆయుధం ధరించడమే మంచిది కాదు. మీకు ఒక వేపు తపో జీవనం ఏమిటీ, రెండో వేపు క్షత్రియ ధర్మమేమిటీ? ఒకదాని కొకటి విరుద్ధంగా వున్నాయి. ఇక్కడ వున్నంత కాలం ఆయుధాలు త్యజించి తపోధర్మం ఆచరించాలి. మళ్ళీ అయోధ్య చేరాక రాజధర్మం పాటించవచ్చును. అసలు మనం దండకారణ్యానికి పోవడం మాత్రం ఎందుకు? ఇక్కడే ఆశ్రమం నిర్మించుకోవడం మంచిది. వైరంలేని రాక్షసులతో యుద్ధం ఎందుకు? వనవాస జీవనంలో, తపస్సుతోనే సుఖశాంతులు పొందాలి. మీ శ్రేయస్సు కోరేదాన్ని కాబట్టి మీ ప్రవర్తన గురించి నా మనస్సు చాలా వ్యాకులపడుతోంది" అని ఆగింది. ఆవేశంతో ఏమేమో అన్నందుకు భర్తకెక్కడ కోపం వొస్తుందోనని చివరికి వినయంగా – "స్త్రీ చాపల్యంకొద్దీ ఇవన్నీ చెప్పానుగానీ, మీకు ధర్మాలు చెప్పడానికి ఎవరు సమర్థులు?" అని తల వొంచుకుంది.[147]

సీత అన్ని మాటలు అడుగుతుందని రాముడు కలలో కూడా ఊహించలేదు. గంభీరంగా చూశాడు. "సీతా! రుషులే నా శరణు కోరడం చూశావు కదా? వారి బాధలు పోగొడతానని మాట ఇచ్చాను. వారు కోరకపోయినా నేను రక్షించాలి. ఇక కోరితే చెప్పాలా? నేను ఎన్నడూ మాట తప్పను. లక్ష్మణుణ్ణయినా విడుస్తాను, నిన్నయినా విడుస్తాను, సత్యవ్రతాన్ని మాత్రం విడువను. నువ్వు నా ధర్మపత్నివి. నా సహ ధర్మచారిణివి. నేను ఏ ధర్మం ఆచరిస్తే నాతోపాటు నువ్వూ ఆ ధర్మమే ఆచరించాలి. నేను ఏ కార్యం చేస్తే అదే నువ్వూ సంతోషంగా, సందేహం లేకుండా, అంగీకరించాలి. గ్రహించు!" అంటూ మందలింపుతో హెచ్చరికగా చూశాడు.[148]

(సీత అడిగిన ప్రశ్నలన్నీ తార్కికమైనవే. ధర్మమైనవే. రాముడు, వొక్క దానికీ సమాధానం చెప్పలేదు. "రుషి జీవనానికి సిద్ధపడి వొచ్చిన తర్వాత ఈ క్షత్రియ ధర్మమేమిటి?" అని అడిగింది సీత. దానికి జవాబు చెప్పలేదు రాముడు. "రుషులకు మాట ఇచ్చాను" అంటున్నాడు. "అసలు ఆ మాట ఎందుకు ఇవ్వాలి?" అన్నదే సీత ప్రశ్న. "14 సంవత్సరాలూ రుషులవలె జీవిస్తాను" అని తండ్రికి మాట ఇవ్వడంతోనే అతని క్షత్రియ ధర్మం పోయింది కదా? రుషులకు మాట ఇచ్చింది దాని తర్వాతే కదా? "రాక్షసుల్ని చంపి మమ్మల్ని రక్షించు" అని రుషులు, ఇంకో రుషిని అడుగుతారా? అడిగినా ఆ రుషి వొప్పుకుంటాడా? రాముడు కూడా రుషిననే చెప్పు

**147.** **అరణ్య, సర్గ 9, శ్లోకాలు 9, 13, 27:** సీత రాముణ్ణి అడిగిన మాటలు చూడవొచ్చు. ★

**148.** **అరణ్య, సర్గ 10, శ్లోకాలు 9, 12:** రాముడు సీతనయినా విడుస్తాడట! లక్ష్మణుణ్ణయినా విడుస్తాడట! సత్యాన్ని విడువడట! లక్ష్మణుణ్ణి ఒక్కరోజు విడిస్తే తెలుస్తుంది వ్యవహారం! అయ్యగారు ఏం తింటాడో! ★

కుంటున్నాడు కదా? "నా తండ్రికి మాట ఇచ్చాను. నేను రుషి జీవనమే గడపాలి. క్షత్రియ ధర్మం ఆచరించడానికి నాకు హక్కు లేదు" అని రుషులతో చెప్పాలి కదా? పైగా "నేను ఎన్నడయినా మాట తప్పుతానా? సత్యవ్రతం మీరతానా?" అని ఓట్రిస్తున్నాడు సీతని. రుషి జీవితం గడుపుతానని తండ్రికి ఇచ్చిన మాటని తప్పాడా లేదా? "ఒక వేపు తపోజీవనం, ఇంకోవేపు క్షాత్ర ధర్మం, పరస్పర విరుద్ధంగా వున్నాయి" అంది సీత. రాముడు దబాయించినంత మాత్రాన ఆ వైరుధ్యం పోయిందా?

రాముడి పాత్రమీదికి ఎటువంటి విమర్శలు రావ డానికి అవకాశం వుందో ఆ విమర్శల్ని కొన్నిటిని సీత ద్వారా అడిగించాడు కవి. కానీ, చివరికి – "నువ్వు నా సహ ధర్మచారిణివి. నేనేం చేసినా నువ్వు అంగీకరిం చాలి" అని రాముడితో అనిపించి, సీత తర్కం అంతా ఎగరగొట్టాడు. సీత అయితే రాముడి సహధర్మచారిణి కాబట్టి ఆమెకి రాముడేం చేసినా వొప్పుకోవలసిన ఖర్మ పట్టిందిగానీ, ఆ ప్రశ్నలే ఇంకెవరయినా అడిగితే? "రుషినని చెబుతున్నావు. రుషిగా జీవించమని నీ తండ్రి ఆజ్ఞాపించాడు. రాక్షసులతో యుద్ధాలు చేస్తానని వొప్పు కోవడం ఏమిటి? రావణుణ్ణి చంపాలని కలలు గనడం ఏమిటి?" అని ఏ గుహుడైనా అడిగితే, ఏం చెపుతాడు రాముడు? "నువ్వు నా ధర్మపత్నివి. నా ఇష్ట ప్రకారం వుండు" అని అతని నోరు మూయిస్తాడా? అలా మూయించడానికి వీల్లేదు కదా? అప్పుడు రాముడికి జవాబేమిటి? మాట ఇచ్చానంటాడా? తండ్రికీ మాట ఇచ్చాడు కదా? పాత మాటలన్నీ వొదిలేసి కొత్త మాటలు ఇచ్చుకుంటూ వెళ్తాడా? కవి, సీతతో ప్రశ్నలు అడిగించి, చివరికి సీతే "నా ప్రశ్న లన్నీ అజ్ఞానంతో అడిగిన ప్రశ్నలు" అని వొప్పుకునేటట్టు చేశాడు. రాముడితో "మాట ఇచ్చాను" అని అవక తవక జవాబు చెప్పించి, సీత తర్కాన్ని ఓడించాననుకున్నాడు కవి. కానీ, వాస్త వంగా జరిగింది మాత్రం రాముడు, జాబాలిని 'రాజరి కం'తో బెదిరించినట్టు, సీతని 'భర్తరికం'తో బెదిరించడం మాత్రమే.)

అస్తమానూ వెనక నడవటం బాగుండదని ఇప్పుడు ముందు నడవడం ప్రారంభించాడు రాముడు. (లేకపోతే సీత ఇంకా ప్రశ్నలడుగుతుందనో ఏమో! అంతే అయి వుంటుంది.)

అడవి మనోహరంగా వుంది. కొండలూ, నదులూ, ఇసుక తిన్నెలూ, పూల చెట్లూ, పక్షులూ, రక రకాల జంతువులూ కంటబడుతున్నాయి. ఒక చోట అందమైన సరస్సు కనపడింది. దాన్నిండా ఎన్నో పద్మాలూ, హంసలూ, ఏనుగులూ, సర్పాలూ వున్నాయి. ఆ చెరువు లోంచి, నీళ్ళ అడుగునించి, అద్భుతమైన సంగీతం, వీణలూ, మృదంగాలూ, తాళాలూ మ్రోగడం వినబడు తోంది. (అబ్బే, అదంతా కప్పల సంగీతం అయి వుంటుంది.) చుట్టూ ఎక్కడా మనుషులు లేరు. "ఈ వింత ఏమిటి మహర్షీ?" అని రాముడు తమతో వున్న రుషులలో ధర్మభృతుడనే రుషిని అడిగాడు.

ఆ రుషి చెప్పింది – "రామా! దీని పేరు పంచాప్సర సరస్సు. మాండకర్ణి అనే రుషి 10 వేల సంవత్సరాలు గొప్ప తపస్సు చేశాడు. దేవతలంతా ఆ రుషి తమతో ఎవరి పదవిని కోరతాడోనని భయపడి రుషి తపస్సు పాడుచేయాలని ఐదుగురు అప్సరసల్ని పంపించారు. (ఒక్కరు కాదు, ఐదుగురు! అంత మంది ఆడవాళ్ళతో తిరగాలని ఆశ!) రుషికి అంతా తెలిసి కూడా, 'దేవ కార్యం కదా' అని మన్మధ వశుడయ్యాడు – ('తపశ్శాలి కామానికి లొంగ వచ్చునా' అంటారని, 'దేవకార్యం కాబట్టి లొంగాడ'ని కవి సమర్ధన!) తపో మహిమచేత 'యౌవ్వన వంతుడై' ఐదుగురు అప్సరసలతో సుఖించ డానికి ఈ సరస్సు సృష్టించాడు. ('10 వేల సంవత్సరాల వృద్ధుడు స్త్రీలతో సుఖించడం ఏమిటి' అంటారని, 'తపో మహిమ'ని అడ్డం వేశాడు. తపస్సులు ఇందుకా?) ఆ అప్సరసలందరూ వీణలూ, మృదంగాలూ, తాళాలూ వాయిస్తూ ఆనందిస్తున్నారు. అదే ఈ సంగీతం" అని చెప్పాడు ఆ రుషి. (ఇప్పుడు వాళ్ళందరూ ఆ సరస్సులో వున్నారన్నమాట – నీళ్ళల్లో కప్పల్లాగ!) రాముడు కళ్ళు విప్పార్చుకుని "ఇలాంటివన్నీ వుంటాయి గావున్ను" అని ఆశ్చర్యపడ్డాడు.

తర్వాత దగ్గిర్లో వున్న రుషుల ఆశ్రమాలకు వెళ్ళారు. అక్కడే చాలా కాలం వున్నారు. అక్కడినించీ మళ్ళీ పాత రుషుల ఆశ్రమాలకు కూడా తిరిగారు. 10 సంవత్సరాల వరకూ.[149]

(ఆ పదేళ్ళల్లో లక్ష్మణుడి మూట తేలిక పడింది.)

**149.** **అరణ్య, సర్గ 11, శ్లోకాలు 25, 26:** వనవాసంలో 10 సంవత్సరాల కాలం 2 శ్లోకాల్లోనే గడిచిపోయింది. రుషుల ఆశ్రమాల్లో వున్న కాలాలు – నెలా, నెలన్నరా, సంవత్సరం, పదకొండు నెలలూ, నాలుగు నెలలూ, మూడు నెలలూ – ఇలా సాగుతుంది. ఈ మాటలు ఇలా ఎందుకు వచ్చాయంటే, ఆ శ్లోకాల పాదాల్లో 'ప్రాస' సరిపోయే మాటలు పడడంకోసం! మాసా, దశాన మాసా, చతురోమాసా, తీన్‌మాసా షడ్మాపరా – ఇలా, '10 సంవత్సరాలు గడిచాయి' అని చెప్పేశారు. రాముడు, ఆ కాలమంతా, 'రాక్షసోపద్రవాన్ని పరిహరించే పని' చేస్తూనే వున్నాడు. ★

మళ్ళీ సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమానికి వొచ్చారు. అక్కడ కొంతకాలం వుండి రాముడు సుతీక్ష్ణుడితో, "అగస్త్య మహర్షి ఈ అరణ్యంలోనే ఎక్కడో వున్నాడని విన్నాను. ఆ చోటు నాకు తెలియలేదు. ఎక్కడ వున్నాడు? అక్కడికి వెళ్ళి ఆ రుషిని కూడా పూజించి వస్తాను" అని అడిగాడు. (10 సంవత్సరాల నుంచీ రాముడికి అగస్త్యుడి ఆశ్రమం తెలియలేదట! సిగ్గు సిగ్గు! ఆ సంగతే అతనికి ఇంత వరకూ ఎవరూ చెప్పలేదన్న మాట! అంత పలుకుబడి వుంది రాముడికి!)

సుతీక్ష్ణుడు సంతోషించాడు – "రామా! నేనే చెప్పాలనుకున్నాను! అంతలో నువ్వే అడిగావు. దక్షిణంగా నాలుగు యోజనాలు వెళ్ళు. అగస్త్యుడి తమ్ముడైన సుదర్శన మహర్షి ఆశ్రమం వొస్తుంది. తర్వాత అగస్త్యుడి దగ్గిరికి వెళ్ళు. ఇప్పుడే బయల్దేరు!" అని తొందర పెట్టాడు. (పనీ పాటా లేని చుట్టాలు వొచ్చి సంవత్సరాల తరబడీ తిష్ట వేస్తే, రుషులకు కూడా కష్టమేనన్నమాట! అందుకే ఆ రుషి, రాముణ్ణి "ఇప్పుడే వెళ్ళు" అని తొందరపెట్టాడు.)

రాముడు మళ్ళీ బయల్దేరాడు. దారిలో లక్ష్మణుడికి అగస్త్యుడి కథ చెప్పాడు. "లక్ష్మణా! పూర్వం ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఇల్వలుడూ, వాతాపీ అనే రాక్షస అన్నదమ్ములిద్దరు వుండేవారు. ఇల్వలుడు, బ్రాహ్మణ వేషంతో సంస్కృతం మాట్లాడుతూ, బ్రాహ్మల్ని శ్రార్ధ భోజనాలకు పిలుస్తూ వుండేవాడు. మేక రూపం ధరించిన వాతాపిని చంపి కూర వండి, బ్రాహ్మలందరికీ భోజనాలు పెట్టేవాడు. (బ్రాహ్మణులు సుష్టుగా మాంసం తినేవారన్న మాట!) భోజనాలయ్యాక, ఇల్వలుడు – "వాతాపీ! బయటికి రా!" అని పిల్చేవాడు. అన్న పిలవగానే వాతాపి మేకలాగ అరుస్తూ బ్రాహ్మల కడుపులు చీల్చుకుని బయటికి వొచ్చేసేవాడు. (ఒక్కొక్కరి కడుపులోంచి వొక్కో ముక్క చొప్పున బయటికి వచ్చి బయట అతుక్కునేవాడా వాతాపి? అలా ఆ ముక్కలన్నీ అతుక్కునేటప్పుడు చూడ్డం ఎంత సరదాగా వుంటుందో కదా?)

ఆ విధంగా, ఆ రాక్షసులు, వేలకొద్దీ బ్రాహ్మల్ని చంపుతూ వుండేవారు. దేవతలందరూ అగస్త్యుణ్ణి ప్రార్థించారు – బ్రాహ్మల్ని రక్షించి రాక్షసుల్ని శిక్షించ మని. ఒక నాడు అగస్త్యుడు ఇల్వలుడి ఇంటికి వెళ్ళి యథాప్రకారం మాంసంతో భోజనం చేశాడు. ఇల్వలుడు ఎప్పటి మాదిరిగానే – "వాతాపీ! బయటికి రా!" అని పిలిచాడు. వాతాపి బయటికి రాలేదు. అగస్త్యుడు నవ్వుతూ "నీ తమ్ముడు నా పొట్టలో జీర్ణమై నరకానికి పోయాడు" అని చెప్పాడు. (ఆయన పొట్టే నరకం కావున్ను.)

ఇల్వలుడికి కోపం వచ్చి అగస్త్యుడి మీదకి వురికి చంపబోయాడు. వాణ్ణి కూడా అగస్త్యుడు కంటి చూపుతో మాడ్చి చంపేశాడు" – రాముడు చెపుతోన్న ఈ కథ ముగిసేసరికి సుదర్శన మహర్షి ఆశ్రమానికి చేరారు. ఆ రాత్రి అక్కడ వుండి మర్నాడు మళ్ళీ బయల్దేరారు (పాపం, ఈ ముని ఏమీ ఘన కార్యాలు చేసినట్టు లేదు.)

దారిలో రాముడు లక్ష్మణుడితో "లక్ష్మణా! పూర్వం వింధ్య పర్వతం సూర్యుణ్ణి అడ్డగించాలని జూసింది. అగస్త్యుడు కోపంగా దాన్ని 'ఆగు' అని ఆజ్ఞాపించాడు. అప్పటినించీ ఆ పర్వతం అలాగే ఎదగకుండా వుంది. లక్ష్మణా! అగస్త్యుడి ఆశ్రమంలో రుషులు విమానాలెక్కి స్వర్గానికి పోతూ వుంటారు. ఆ రుషులందరికీ దేవతలు యక్షత్వమో, అమరత్వమో, రాజ సుఖాలో ఇస్తూ వుంటారు." (అగస్త్యు డెక్కడుంటాడో కూడా తెలీనివాడు, ఆ ఆశ్రమం గురించి అంతా తనకే తెలిసినట్టు చెప్తున్నాడు. 'అలా విన్నాను' అని కూడా కాదు.)

"లక్ష్మణా! నేను వనవాసం పూర్తయ్యేవరకూ ఈ ఆశ్రమంలోనే గడుపుతాను. అదిగో ఆశ్రమం. నువ్వు ముందువెళ్ళి, నేను వొచ్చానని చెప్పు!" అని ఆజ్ఞాపించాడు.[150] ('మనం గడుపుదాం ఇక్కడ' అనడం కాదు. 'నేను గడుపుతాను' అట!)

లక్ష్మణుడు ఆశ్రమంలోకి వెళ్ళి మూట దింపి, అక్కడ వున్న అగస్త్యుడి శిష్యులకు నమస్కారాలు చేస్తూ "దశరథ మహారాజు పెద్ద కొడుకైన శ్రీరాముడు భార్యతో సహా వొచ్చాడు. నేను ఆయన తమ్ముణ్ణి. లక్ష్మణుడంటారు నన్ను. మా తండ్రి, స్త్రీ లోలుడై మమ్మల్ని అన్యాయంగా అడవుల్లోకి పంపించాడు. అగస్త్య మహర్షిని చూడాలని వొచ్చాం" అని కళ్ళు మూసుకుని పాఠం అప్పగించి కళ్ళు తెరిచాడు.

శిష్యులు లోపలికి వెళ్ళి గురువు గారికి ఆ పాఠమే చెప్పారు.

"రాముణ్ణి తీసుకురండి!" అన్నాడు అగస్త్యుడు.

రాముడు పూజా గృహంలోకి వెళ్ళి, అక్కడ సమస్త దేవతా విగ్రహాల్నీ చూశాడు.

అగస్త్యుడు రాముడితో ఇలా చెప్పాడు. "రామా! నీ తండ్రి నిన్ను అన్యాయంగా అడవులకు పంపించాడని

---

**150.** **అరణ్య, సర్గ 11, శ్లోకం 88:** రాముడు మిగతా వనవాస కాలాన్ని అగస్త్యుడి దగ్గిరే గడుపుతానని లక్ష్మణుడితో చెబుతున్నాడు. కానీ, ఎక్కడ గడిపాడో తరువాత చూడండి! ★

నా తపో మహిమవల్ల తెలుసుకున్నాను. విచారించకు" అని ఓదార్చాడు. (తపో మహిమలో కూడా రాముణ్ణి వనవాసానికి పంపడం అన్యాయం గానే కనపడింది!) అగస్త్యుడు అతిథుల్ని ఆదరించి, రుషులకు అనువైన కంద మూల ఫలాలతో భోజనం పెట్టాడు. (చుట్టాల కోసం 'మాంసం కూర' వండ లేదన్న మాట! గడుసు వాడే రుషి.) తర్వాత, రాముడికి కొన్ని ఆయుధాలు చూపించాడు! "రామా! ఈ ధనుస్సు విష్ణువుది. ఈ ఖడ్గం బ్రహ్మ ఇచ్చాడు నాకు. ఈ అమ్ముల పొది ఇంద్రు డిచ్చాడు. ఈ ఖడ్గం కూడా ఇంద్రుడిదే. ఇవన్నీ నీ కిస్తాను, తీసుకో!" అని అవన్నీ ఇచ్చాడు. (భోజనాలు పెట్టేటప్పుడు రుషులకు పెట్టినట్టు కంద మూలాలతో పెట్టడం, తర్వాత రాజులకు ఇచ్చినట్టు ఆయుధాలు ఇవ్వడం! అసలు, తపస్సులు చేసే రుషులకు దేవతలు ఆయుధాలు ఎందుకిస్తారు? – పూర్వం, 'గణ సమా జం'లో, వృద్ధులైన వాళ్ళు తమ ఆయుధాల్ని తమలోనే ఇతరులకు ఇచ్చేవాళ్ళు కదా? అదే ఇక్కడ కథా రూపం లోకి మారింది. కానీ, సందర్భానికి సరిపోకుండా! రుషి జీవనం గడపవలసిన వాడికి ఆయుధాలేమిటి?)

తర్వాత అగస్త్యుడు సీతని చూసి మెచ్చుకున్నాడు. "రామా! నీ భార్య నీతో అడవులకొచ్చి ఎన్నో కష్టాలు పడుతోంది. భర్త సుఖంగా వున్నప్పుడు అనురాగం చూపడం, దుర్దశ కలిగినప్పుడు ఉపేక్ష చేయటం, స్త్రీల స్వభావం. జగము పుట్టినప్పటి నుంచీ స్త్రీల స్వభావం అదే. స్త్రీలు చంచలులు. కౄరులు. ఆలోచన లేకుండా పనులు చేస్తారు. (ఎన్ని చోట్ల వీలయితే అన్నిచోట్లా స్త్రీలని తిట్టకపోతే కవికి తోచడం లేదు.) కానీ, రామా! నీ భార్య అటువంటిది కాదు. అరుంధతివలే మహా పతివ్రత" అంటూ సీతని పొగిడాడు.

రాముడు అగస్త్యుడికి నమస్కరిస్తూ – "అగస్త్య మహర్షీ! నేను ఆశ్రమం ఏర్పరచుకోవడానికి అను వయిన ప్రదేశం ఎక్కడో శెలవీయండి" అని అడిగాడు. (మిగతా కాలం అంతా అగస్త్యుడి ఆశ్రమంలోనే గడి పేస్తాను – అని వొక్క పూట ముందు లక్ష్మణుడితో చెప్పిన మాటలు గాలిలో కలిసిపోయాయి. 10 సంవత్స రాల తర్వాత ఇప్పటికి గుర్తొచ్చింది ఇంటి సంగతి.)

అగస్త్యుడు ఆలోచించాడు – "నాయనా! రెండు యోజనాల దూరంలో పంచవటి అనే ప్రదేశం వుంది. ఫలాలకూ, జలాలకూ, మృగాలకూ లోటు లేదు. (రుషుల భోజనం పెట్టినవాడు, 'వేటకోసం మృగాల' సంగతి చెప్పడం ఎందుకు?) – గోదావరి చాలా దగ్గిర. ప్రదేశం చాలా అందంగా వుంటుంది. గడ్డలూ, దుంపలూ, విశేషంగా దొరుకుతాయి. పరిశుభ్రంగా, మనోహరంగా వుంటుంది. జనం వుండరు. అక్కడ పర్ణ శాల నిర్మించుకుని మిగిలిన వనవాసం పూర్తిచెయ్యి! భార్యతో వున్న నువ్వే రుషుల్ని రక్షించడానికి సమర్థుడివి"

("భార్యతో వున్నావు. నిన్ను నువ్వే రక్షించుకోవడం కష్టం" అని ఇదివరకు చిత్రకూటంలో, ఇంకో రుషి చెప్పాడు. ఇప్పుడు ఈ రుషి "భార్యతో వున్న నువ్వే .... మమ్మల్ని రక్షించగలవు" అంటున్నాడు. రుషుల లైన్సులో భేదాలున్నట్టున్నాయి)

"అదిగో! ఆ ఇప్ప చెట్ల తోపులో నించి పోతే వొక పెద్ద మర్రిచెట్టు కనబడుతుంది. దాన్ని దాటిపోతే ఒక పర్వతం కనబడుతుంది. దాని సమీపంలోనే వనమంతా పూసి సుందరంగా వుంటుంది" అని వివరాలు చెప్పాడు.

రాముడు నమస్కారం చేసి మళ్ళీ ప్రయాణం సాగిం చాడు.

లక్ష్మణుడి మూట మళ్ళీ ఆయుధాలతో బరు వెక్కింది.

దారిలో అగస్త్యుడు చెప్పిన మర్రిచెట్టుమీద బ్రహ్మాం డమయిన పక్షి వొకటి కనపడింది. రాముడు దాన్ని, రాక్షసుడే అనుకున్నాడు. రెండడుగులు వెనక్కి వేసి గంభీ రంగా – "నీ వెవడవు?" అని కేక పెట్టాడు. (ఎవడో తెలిస్తే తర్వాత నడవడమో, పరిగెత్తడమో నిర్ణయించుకో వచ్చుననా?)

ఆ పక్షి స్నేహ పూర్వకంగా – "నాయనా! నేను నీ తండ్రికి మిత్రుణ్ణి" అంది.

రాముడు వొక్క అడుగు ముందుకొచ్చి సందే హంగానే పక్షికి నమస్కారం చేశాడు– "నీ కులమూ, గోత్రమూ వివరంగా చెప్పు!" అన్నాడు. (మనం చాలా నయం. మనుషుల్ని మాత్రమే 'కులాలు' అడుగుతాం. రాముడు, పక్షుల్ని కూడా కులాలు అడుగుతున్నాడు.)

ఆ పక్షి, తన కులంతోపాటు సకల జంతువుల ఉత్పత్తి క్రమాన్నీ ఈ విధంగా చెప్పింది – "రామా! పూర్వం ఎందరో ప్రజాపతులు వున్నారు. వారిలో దక్ష ప్రజాపతికి 60 మంది కూతుళ్ళు. వారిలో 8 మందిని, కాశ్యపుడు వివాహం చేసుకుని – 'నాలాగ వీరులయిన బిడ్డల్ని కనండి' అని చెప్పాడు (పిల్లల్ని కనమన్నది కూడా ఆజ్ఞే!)

ఆ స్త్రీలలో అదితి, దితి, కాళిక, దను – అనే నలుగురూ భర్త మాట మీద శ్రద్ధ వున్నవారు. అదితి ద్వాదశాదిత్యుల్నీ, అష్ట వసువుల్నీ, ఏకాదశ రుద్రుల్నీ, అశ్వినీ దేవతల్నీ కన్నది. దితి – రాక్షసుల్ని కన్నది. దను అశ్వగ్రీవుడనే కొడుకుని కన్నది. కాళిక – నరకుడు,

కాళికుడు అనే కొడుకుల్ని కన్నది. ఈ నలుగురూ భర్త మాటమీద శ్రద్ధ వున్నవారు.

మిగిలిన నలుగురూ శ్రద్ధ లేక హంసల్నీ, డేగల్నీ, సింహాల్నీ, శార్దూలాల్నీ కన్నారు. కోతుల్నీ, కొండ ముచ్చుల్నీ, గోవుల్నీ, గుర్రాల్నీ, సర్పాల్నీ కన్నారు. ఒక భార్య 'నత' అనే కూతుర్ని కన్నది. నత కూతురు వినత. మను అనే భార్య, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులనే మానవ జాతిని కన్నది. (హోరినీ! బ్రాహ్మలూ, శూద్రులూ అన్నదమ్ములే నన్నమాట!)

ఒక భార్య పళ్ళచెట్టుని కన్నది. ఒకామె ఆది శేషుణ్ణి కన్నది. (కథలు వినేవాడు రాముడయితే, ఆ కథలు ఇలాగే వుంటాయి.)

రామా! వినత అనే ఆమె గరుడుడూ, అరుణుడూ అనే కొడుకుల్ని కన్నది. అరుణుడు నా తండ్రి, (వినత తల్లి నత, తన భర్త మాటమీద శ్రద్ధలేని భార్య. అంటే, ఈ పక్షి అమ్మమ్మ, పతివ్రత కాదు).

నా పేరు జటాయువు. నా మాటల మీద నీకు నమ్మకం వుంటే నేను కూడా నీతోపాటు వస్తాను. ఈ అడవి భయంకరమైనది. నీవూ, లక్ష్మణుడూ బయటకు వేటకు పోయినప్పుడు, నేను సీతను రక్షిస్తూ వుంటాను" అన్నాడు జటాయువు.

రాముడికి ప్రాణం లేచి వొచ్చింది. జటాయువును కావలించుకుని తప్పకుండా రమ్మన్నాడు.

రాముడు, రాక్షసుల్ని చంపాలనే పట్టుదలతో పంచవటిలో ప్రవేశించాడు.

ఆ ప్రదేశం చెట్లతో అందంగా వుంది. రాముడికి సురక్షితంగా తోచింది.

రాముడు ఒక చెట్టుకింద కూర్చుంటూ – "లక్ష్మణా! మనం ఎక్కడ పర్ణశాల నిర్మించుకుంటే బాగుంటుందో ఈ ప్రదేశమంతా శ్రద్ధగా చూడు" అని చెప్పాడు.

లక్ష్మణుడు మూట దించి నమస్కారం చేస్తూ – "నేను అస్వతంత్రుణ్ణి. మీ సేవకుణ్ణి. స్వతంత్రంగా ఏ నిర్ణయమూ చెయ్యను. మీరే స్థల నిర్ణయంచేసి ఆజ్ఞాపిస్తే పర్ణశాల నిర్మిస్తాను" అని వొంగి నించున్నాడు.[151]

రాముడు చాలా సంతోషించాడు. (అందరూ వొంగుని వుంటే రాముడికి చాలా ఇష్టం.) లేచి నాలుగు వైపులా చూచి ఆ పక్కనే ఒక ప్రదేశం నిర్ణయించాడు.

పక్కనే గోదావరి నది. చుట్టూ పెద్ద పెద్ద చెట్లు. ఎత్తుపల్లాలు లేవు. ఆ చెట్లమీద జటాయువు నివసించ డానికి అనువుగా వుంది. రాముడు గంభీరంగా చిరు నవ్వుతో లక్ష్మణుడి చేతులు పట్టుకుని – "లక్ష్మణా! ఈ ప్రదేశం సమతలంగా వుంది. నేనే నిర్ణయించాను. పర్ణ శాల నిర్మించు" అన్నాడు. (రాముడు ఎన్నడైనా లక్ష్మ ణుడి చేతులు పట్టుకున్నాడా? ఇప్పుడు ఇల్లు కట్టాలి కదా? అవసరమైతే కాళ్ళు కూడా పట్టుకుంటాడు.)

అన్నగారు తన చేతులు పట్టుకున్నందుకు లక్ష్మ ణుడు పొంగిపోయి పనిలోకి దిగాడు. చెట్లు కొట్టాడు. కొమ్మలు చెక్కాడు. స్థంభాలు నాటాడు. దూలా లెక్కిం చాడు. వెదుళ్ళు నరికి కప్పు తయారు చేశాడు. తాటాకు కుట్టాడు. బంకమట్టి మెత్తి గోడలు తయారుచేశాడు. నేలంతా బాగుచేశాడు. దారులు ఏర్పాటు చేశాడు. నది రేవులో మెట్లు తవ్వాడు. అంతా పూర్తిచేసి వాస్తు శాంతికి ఏర్పాట్లు చేసి అన్న గారికి ఇల్లు చూపించాడు. (అంత వరకూ రాముడు సుఖంగా నిద్రపోయి వుంటాడు. లేకపోతే జటాయువు మీదెక్కి షికార్లు కొట్టి వుంటాడు.)

లక్ష్మణుడు కట్టిన ఇల్లు చూసి ఎక్కువగా మెచ్చు కోవడం ఇష్టం లేకపోయినా పైకి చాలా సంతోషం చూపిస్తూ రాముడు లక్ష్మణుణ్ణి దగ్గిరికి లాక్కున్నాడు "లక్ష్మణా! నువ్వు చేసిన సేవకు నేను చాలా సంతోషిస్తు న్నాను. ఇదిగో! నిన్ను ఆలింగనం చేసుకుంటున్నాను. నీ సేవకు నేనిచ్చే బహుమానం ఇది. నా దయకన్నా నీకు ఇంకేం కావాలి? నా అభిప్రాయాలు ఎప్పటి కప్పుడు నువ్వు గ్రహించగలవు. నాకు సేవచేసి నన్ను ఏ విధంగా ఆనందపెట్టాలో నీకు తెలుసు. నా కష్ట సుఖాలు గ్రహించే నిన్ను చూస్తోంటే, నా తండ్రి మరణించలేదని తోస్తోంది. తండ్రి, బిడ్డను చూసుకునే విధంగా నువ్వు నన్ను చూసుకుంటావని తెలుసు" అని పొంగవేశాడు లక్ష్మణుణ్ణి.[152] (తండ్రితో అయితే తను కూర్చుని ఇల్లు కట్టిస్తాడా? తమ్ముడు – తండ్రి లాంటి వాడట! అన్న – కొడుకు లాంటి వాడు! తమ్ముడి కష్టసుఖాలు అన్న చూడాలా, తమ్ముడే అన్న కష్ట సుఖాలు చూడాలా? ఈయన వ్యవహారం మొదటినించీ తల్ల కిందులుగానే వుంది.)

లక్ష్మణుడు అయోమయావస్థలో పడిపోయాడు. తను రాముడికి తమ్ముడో అన్నో, తండ్రో కొడుకో, సేవకుడో – ఏదీ తెలీని స్థితిలోనే ఆనందించాడు.

---

**151.** అరణ్య, సర్గ 15, శ్లోకం 7: లక్ష్మణుడు అస్వతంత్రుణ్ణనీ, రాముడికి సేవకుణ్ణనీ చెప్పుకుంటున్నాడు. ★

**152.** అరణ్య, సర్గ 15, శ్లోకాలు 28, 29: ఇల్లు కట్టినందుకు రాముడు లక్ష్మణుణ్ణి మెచ్చుకుంటూ ఎంత మాయబుచ్చే మాటలు అంటున్నాడో చూడండి! ★

జీవితం మళ్ళీ వొక దారిలో పడింది.

సీతకి సుఖంగా వుంది.

"ఇంకా మూడు సంవత్సరాల పైనే .... ...." అనుకున్నాడు రాముడు.

పంచవటిలో నివాసం ప్రారంభించిన తర్వాత శరదృతువు గడిచి హేమంత రుతువు వొచ్చింది.

ఒకరోజు రాముడు నదికి స్నానానికి వెళుతోంటే లక్ష్మణుడు చెంబు పట్టుకుని వెనకాల వెళుతూ (రోజూ వీపు తోమాలి గావున్ను), సంభాషణలోకి దిగాడు. అన్నగారు తనని కావలించుకున్న దగ్గిర్నించీ లక్ష్మణుడికి అన్నగారి దగ్గిర కొంచెం చనువు దొరి కింది – "అన్న గారూ! చుట్టూ చూడండి! హేమంత రుతు ఆగమనం కనిపిస్తోంది. ఈ రుతువులో ప్రజలు కామాతురులవు తారు. (తను తప్ప!) రాజులు దండ యాత్రలకు సిద్ధ పడుతూ వుంటారు. వెన్నెల రాత్రులు, మంచుతో నిండి ప్రకాశం తగ్గి, 'ఎండ వడకు సొక్కిన సీత వలే' వున్నాయి." (ధైర్యంగానే వుంది లక్ష్మణుడి వ్యవహారం!)

ఆ రకంగా మొదట కొంతసేపు హేమంత రుతు వర్ణన సాగిన తర్వాత ఆ ధోరణి కైకని తిట్టడంలోకి దిగింది. "భరతుడు మీ దర్శన భాగ్యానికి దూరమై, మిమ్మల్ని ఎడబాసి ఎలా జీవిస్తున్నాడో! సమస్త సుఖాలూ, స్త్రీలతో భోగాలూ విడిచి, కటిక నేలమీద పడుకుంటున్నా డేమో! (రుషి జీవనంతో భార్యల్ని వొదలాలా? రుషులకు భార్యలెందుకు వున్నారు మరి? రాముడు భార్యతోనే వున్నాడేం?)

జనులు నిందిస్తారనే సిగ్గుచేత, సరయూ నదిలో స్నానానికి పట్టపగలు వెళ్ళకుండా, అర్ధరాత్రులు వెళు తున్నాడేమో! లోకంలో మగ బిడ్డలు తండ్రి స్వభావం ఆచరించక, తల్లి స్వభావం అనుసరిస్తారనే ప్రతీతి వుంది. దాన్ని భరతుడు అసత్యం చేశాడు. (తండ్రి స్వభావం మంచిదీ, తల్లి స్వభావం చెడ్డదీ అవుతుందన్న మాట. సాధారణంగా కొడుకులు తల్లిలాగే చెడ్డవాళ్ళ వుతూ వుంటారట. భరతుడు మాత్రం తండ్రిలాగా మంచివాడయ్యాడు. భరతుడి గురించి రాముడి అభి ప్రాయం ఎలా వుందో గ్రహించి, తన కోపం బయట పెట్టాలని చూస్తున్నాడు లక్ష్మణుడు.)

కైకకి దశరథుడి వంటి ఉత్తముడు భర్త అయినా, భరతుడి వంటి సాధువు కొడుకు అయినా, ఆమెకి ఎంత దుష్టబుద్ధి కలిగిందో!" (కైకని తిట్టడం రాముడికి సంతోషం కలిగిస్తుందని లక్ష్మణుడికి తెలుసు. అతని సేవా ధర్మంలో కైకని తిడుతూ వుండడం కూడా వొక భాగం.)

లక్ష్మణుడి మాటలకు రాముడు పైకి సంతోషించి నట్టు కనబడలేదు. (ప్రస్తుతం రాముడు ఏ రాక్షసుడి చంకలోనో వొణుకుతూ లేదు. ఇల్లూ, ఇల్లాలూ, దాసీ తమ్ముడూ, ఆపదలేవీ రాకుండా రక్షించే జటాయువూ అంతా ప్రశాంతంగానే వుంది పరిస్థితి. పైగా, వనవాస కాలం కూడా ముగిసిపోబోతోంది. అందుచేత కైక మీద కొంచెం కోపం తగ్గింది. లక్ష్మణుడి మాటలకు కొంచెం మందలింపుగా – "లక్ష్మణా! కైకేయిని దూషించకు. ఆమె మన తండ్రిగారి మధ్యమ భార్య!"[153] అన్నాడు.

"కైకని దూషించడం మనకు ధర్మం కాదు" అని కూడా అన్నాడు రాముడు. "భరతుణ్ణి గురించి ఇంకే మైనా చెప్పు, వింటాను. భరతుణ్ణి గురించి నా మనసు తహ తహలాడుతోంది" అన్నాడు.

లక్ష్మణుడికి నిరాశ కలిగి ఇంకేమీ మాట్లాడ కుండా చెంబు వూపుకుంటూ నడిచాడు.

**[ఇక్కడితో 'అరణ్య కాండ'లో 16 సర్గల వరకూ పూర్తి అయింది.**
**తర్వాత 17వ సర్గ, శూర్పణఖ వచ్చే ఘట్టం.**
**అది 3వ కథగా తర్వాత వుంటుంది.]** ★

---

**153.** అరణ్య, సర్గ 16, శ్లోకం 37: దశరథుడికి 353 మంది భార్యలనే సంగతి కవి చెప్పిందే. అందులో ముఖ్యంగా ముగ్గురు మాత్రం కథకు సంబంధించి వుంటారు! వారిలో కైక చిన్నది. కానీ, ఇప్పుడు కైక, రాముడి మాటల్లో 'మధ్యమ భార్య' అయింది! బహుశా దశరథుడు కైక తర్వాత కూడా ఇంకా ఇద్దర్ని పెళ్ళి చేసుకున్నాడేమో! అలాగైతేనే కైక, 'మధ్యమ భార్య' అవుతుంది. ఈ రహస్యం రాముడికి మాత్రమే తెలిసి వుండాలి. లేకపోతే 'చిన్న భార్య' అల్లా 'మధ్యమ భార్య' ఎలా అవుతుంది? కవిగారికి, మరీ ఇంత మతి మరుపా? ★

## కథ-3

# ఇలాగే జరిగింది!

వాల్మీకి రామాయణంలో, **అరణ్య కాండ**లో, 17, 18 సర్గలలో,

**శూర్పణఖ** కథ ఇలా ఉంది:

రాముడు పర్ణశాలలో కూర్చుని సీతకు కథలు చెపుతూ ఉన్నాడు. మోహనాకారుడయిన రాముణ్ణి శూర్పణఖ, చూసి, మోహించి పర్ణశాలకు వచ్చింది.

ఆమె ఆకారం – వికారమైన మొహం, అసహ్యమయిన చూపు, పెద్ద పొట్ట, రాగి వెండ్రుకలు, భయంకరమైన బొంగురు స్వరం, వృద్ధురాలు, వక్ర భాషిణి, ఎగుడు దిగుడు అవయవాలు!

రాముడి ఆకారం – బహు సుందరమైన మోమూ, ఆజానుబాహువులూ, సన్నని నడుమూ, విశాలమైన కన్నులూ, గంభీరమైన కంఠధ్వనీ, శాస్త్రోక్త ప్రవర్తనా!

శూర్పణఖ, రాముణ్ణి చూస్తూ దగ్గరకు వచ్చింది – "ఎవరు నువ్వు? ఋషి వేషంలో ఉన్నావు. విల్లూ, బాణాలూ ధరించావు. (ఇంట్లో కూర్చుని కథలు చెప్పేటప్పుడు కూడా విల్లు ధరిస్తాడు!) నువ్వు వచ్చిన పని ఏమిటి?" అని అడిగింది.

రాముడు సత్యవంతుడు కావడంచేత తన పుట్టు పూర్వోత్తరాలూ, సీత పుట్టు పూర్వోత్తరాలూ, తన పినతల్లి దుర్మార్గం వల్ల వనవాసానికి రావడమూ – అన్నీ చెప్పాడు. (రాక్షసవధ కోసం పంచవటికి వచ్చిన సంగతీ, రాక్షస రాజయిన రావణుణ్ణి చంపాలనే ప్రయత్నాల్లో వున్న సంగతీ మాత్రం దాచి! అదీ సత్యవంతుడి లక్షణం!)

రాముడు, తన వివరాలు చెప్పిన తర్వాత శూర్పణఖతో – "నువ్వు అందవికారంగా వున్నావు. రాక్షసి వలే తోస్తున్నావు. ఎవరు నువ్వు? ఏ జాతి? నీ తల్లిదండ్రులెవరు?" అని అడిగాడు. (తను చెప్పిన దానికి పదిరెట్లు ఎక్కువగానే అడిగాడు. రాక్షసితో తీరిగ్గా సంభాషణ! ఇక ఆ రాక్షసి భయంకరత్వం ఏమిటో! – అంటే రాక్షసులు సింహాల లాగానో, సర్పాల లాగానో, చూసిన వెంటనే బాణాలు వేసి చంపదగ్గ వాళ్ళేం కాదన్న మాట. పక్కన కూర్చోనిచ్చి, వాళ్ళతో బాగానే మాట్లాడవచ్చున్న మాట!)

ఆ రాక్షసి – "రామా! నేను శూర్పణఖ అనే రాక్షసిని. కోరిన రూపం ధరించగలను" అంది.

(కోరిన రూపం ధరించగలిగే శక్తిమంతురాలు, ప్రేమనర్థించడానికి వికారరూపంతో, ఎదటి వారికి అసహ్యం కలిగించే రూపంతో వస్తుందా? తను ఎలాంటి రూపంతో వచ్చిందో అలా ఉండడమే అందం – అనుకుందా శూర్పణఖ? అందుకే అలాంటి రూపంతో వచ్చిందా? – కాదు. ఆమె దృష్టిలో కూడా అందం అంటే అలాంటి ఆకారం కాదు. తర్వాత సీతని చూసినప్పుడు ఆమె, సీతమీద ద్వేషంతో, 'సీతకి బానపొట్ట, వృద్ధురాలు, అంద వికారంగా ఉంది' అంటుంది. అంటే, అలాంటి ఆకారంతో ఉండడం అందం కాదని ఆమెకి తెలుసునని అర్థం. కానీ, కోరిన రూపం ధరించగల ఆమె, అందం అంటే ఏమిటో తెలిసి కూడా, అందవికారమైన ఆకారం తోనే వచ్చింది! కవి తెలివి ఇలా వుంది. ఇంకా శూర్పణఖ ఎలా చెపుతోందో చూడండి!)

"నేను సకల ప్రాణులకూ భయం కలిగిస్తూ ఈ అరణ్యంలో తిరుగుతున్నాను. రావణుడూ, కుంభకర్ణుడూ, విభీషణుడూ, ఖరదూషణులూ నా సోదరులు. విభీషణుడు రాక్షస చేష్టలు లేని ధర్మాత్ముడు. (విభీషణుడికి అధర్మ రాక్షస చేష్టలు లేవు. నాకు చాలా అధర్మ గుణాలున్నాయి. అందరికీ భయం కలిగిస్తాను. నేను చెడ్డదాన్ని – అని చెపుతోంది!) నా సోదరులందరినీ విడిచి నేనీ అరణ్యంలో స్వేచ్ఛగా తిరుగుతాను. రామా! నిన్ను చూసింది మొదలూ నా మనసులో నువ్వే నా భర్తవనుకున్నాను. నువ్వు నాకు దీర్ఘకాలం భర్తగా వుండాలి. మనం ఈ అరణ్యంలో విహరించుదాం. సీత ఎందుకు నీకు? వికారమైన మొహం, బాన పొట్ట, వృద్ధురాలు" అంది. (ఏ లక్షణాలు అంద విహీనమో శూర్పణఖకి తెలుసు. కానీ ఆ ఆకారంతోనే తను వొచ్చింది! శూర్పణఖ రాముణ్ణి తాత్కాలికమయిన కామాతురతతో గాక, శాశ్వతమయిన బంధంతో ఉండాలని కోరుకుంటున్నట్టు చెపుతోంది.

రాముణ్ణి చూసి పురుషులు కూడా మోహిస్తారని కవి వర్ణిస్తూ వుంటాడు. అలాంటప్పుడు ఒక స్త్రీ మోహించడంలో ఆశ్చర్యం లేదు. అంతే కాదు, పురుషులు అనేక పెళ్ళిళ్ళు చేసుకోవడం అన్నిచోట్లా జరిగేది. రాముడు తనని కూడా పెళ్ళి చేసుకోవచ్చుని శూర్పణఖ అనుకుంది. కాబట్టి అలా అడిగింది.)

రాముడు నవ్వుతూ – "నా భార్య నా దగ్గిరే వుంది.

(తన భార్య తన దగ్గిర లేకపోతే వొప్పుకునే వాడే నన్నమాట!) నా తమ్ముడికి భార్య లేదు. అతడు భార్యతో సుఖం అనుభవించి చాలా కాలమైంది. భార్యని అనుభవించాలని ఆపేక్ష పడుతున్నట్టున్నాడు. నీ వంటి స్త్రీకి సవతి ఉండడం కూడా మంచిది కాదు. లక్ష్మణుణ్ణి భర్తగా చేసుకో" అన్నాడు వెటకారంగా. (రాముడు నవ్వడం ఎప్పుడైనా చూశామా? పర స్త్రీతో మాట్లాడే టప్పుడు నవ్వులూ, వెటకారాలూ! తనని కోరే స్త్రీకి తన తమ్ముణ్ణి చూపిస్తున్నాడు రాముడు! తను చేసుకుంటే చేసుకుంటానని చెప్పాలి. లేకపోతే లేదని చెప్పాలి. అంతేకదా? రాక్షస జాతి స్త్రీ కదా అని ఆ హేళన!)

వెంటనే శూర్పణఖ లక్ష్మణుడి దగ్గిరికి వెళ్ళి అడిగింది. "నీ అందానికి నేనే తగిన భార్యని. నాతో ఈ అరణ్యం అంతా విహరించు!" అంది.

లక్ష్మణుడు వెటకారంగా నవ్వి – "నేను రాముడికి దాసుణ్ణి. దాసుడికి భార్యవై నువ్వు కూడా దాసిగా ఎందుకవుతావు? (రాముడికి దాస్యం చెయ్యడం గౌరవప్రదం కాదని లక్ష్మణుడికి తెలుసునన్న మాట!) రాముడికే చిన్న భార్యగా ఉండు! సీతని విడిచి నిన్నే వరిస్తాడు" అన్నాడు.[154]

శూర్పణఖ మళ్ళీ రాముడి దగ్గిరికి వెళ్ళింది – "సీత మూలాన్నే నువ్వు నన్ను స్వీకరించడం లేదు. సీతని చంపుతాను" అంటూ సీతవేపు పరిగెత్తింది.

రాముడు కోపంగా – "లక్ష్మణా! నీచులతో పరిహాసం కూడదు. వికారమైన రూపంగల దీనికి అంగ వికారం కలిగించు" అని ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు, రాముడి సమీపంలో వున్న కత్తి తీసుకుని శూర్పణఖ ముక్కూ, చెవులూ కోశాడు. శూర్పణఖ రక్తధారలతో అరుస్తూ పారిపోయింది.

ఇదీ వాల్మీకి రామాయణంలో శూర్పణఖ కథ.

తమ్ముడి దగ్గిరికి వెళ్ళమని అన్నా, అన్న దగ్గిరికి వెళ్ళమని తమ్ముడూ చేసిన అవమానాలు చాలు! శూర్పణఖని ఏమీ చెయ్యకుండానే రాముడు సీతని రక్షించ వొచ్చును. 'రావణుడి చెల్లెల్ని బాధపెట్టాలి' అనే అభిప్రాయం లేకపోతే, శూర్పణఖ ముక్కూ చెవులూ కొయ్య నక్కరలేదు.

శూర్పణఖ రాగానే రాముడు మొదట ఆమెతో కొంతసేపు సంభాషించి, తను వనవాసానికి ఎందుకు వచ్చాడో, తన పినతల్లి తనకు ఎంత ద్రోహం చేసిందో ఆమెతో చెప్పుకుని, కొంతసేపు ఆమెతో పరాచికాలు కూడా ఆడి, చివరికి ఆమెని హింసించి వదిలాడు.

సీతని చంపబోయింది గనక ఆమెని అలా చెయ్యవలసిందే – అని కవి చాలా సంతోషిస్తూ చెప్పాడు ఈ ఘట్టం.

[**'ఇలాగే జరిగింది'** అనే ఈ విష వృక్షం కథలో, శూర్పణఖ మానవ స్త్రీయే. అందరు స్త్రీల లాంటిదే. రాముణ్ణి చూసి, అతని రూపురేఖలకు ఆకర్షితురాలై, అతనికి భార్య అవ్వాలని ఆశపడింది. అతన్ని అడిగింది. అతనికి ఇష్టమైతే అంగీకరించవచ్చు; లేకపోతే తిరస్కరించవచ్చు. రాముడితో ఆమె 'ఈ అరణ్యాలలో విహరించుదాం' అంటుంది. అంటే ఆమెకు అరణ్యాలలో జీవితం ఇష్టం. మానవ స్త్రీ అయిన శూర్పణఖ సీతని చంపడానికి పరిగెత్తే ప్రసక్తి ఈ కథలో ఉండదు. ఆమె రావణుడి చెల్లెలనీ, తమ శతృజాతి మనిషి అనీ తెలిసి, రాముడూ లక్ష్మణుడూ ఆమెని పీడించారు. శతృవుల్ని కత్తులతో గాయపర్చడం, హింసించడం, చంపడం, గొప్ప వీర కార్యాల కింద చలామణీ అవుతూ వుంటాయి. రామలక్ష్మణులు వీరులే కదా? ఎక్కడ సందు దొరికితే అక్కడ ఆ క్రూర కార్యాలు చెయ్యడమే వారి నీతి!]

**సా**యం సమయపు నీరెండలో .... ఆ వన సీమలో .... ఒక యవ్వనవతి .... లావణ్యవతి పరవశంగా చెట్లకింద వెలుగు నీడలలో నడుస్తూ .... ఆలోచనల్లో మునిగి ఉంది.

---

**154**. రాముడికి సీతగాక ఇంకా వేరే భార్యలు ఉన్నారా – అనే విషయం పరిశీలించడానికి, మొదట మందర దగ్గిర ఒక సందర్భం చూశాం. ఇది రెండో సందర్భం. రాముడు, శూర్పణఖతో "నా భార్య నా దగ్గిరే వుంద"ని చెపుతాడు. అంటే, అతనికి ఇతర భార్యలు లేరని అర్థం. లక్ష్మణుడు కూడా శూర్పణఖతో, "రాముడికి నువ్వు చిన్న భార్యగా ఉండు" అంటాడు. అంటే, రాముడికి సీతగాక చిన్న భార్యలు లేరని అర్థం. ఈ రకంగా, రాముడికి సీతగాక వేరే భార్యలు ఉన్నారనే అర్థాలు తియ్యడానికి, ఈ రెండో సందర్భంలో కూడా ఆధారాలు లేవు. రాముడు ఆచరించే వ్రతాల గురించి 'ఏక పత్నీ వ్రతం' అనే మాటగానీ, దానికి సంబంధించిన చర్చలుగానీ మూల కథలో ఎక్కడా లేవు. కానీ, నేను, **'ఇలాగే జరిగింది'** కథలో, 'ఏక పత్నీ వ్రతం' అనే మాటని వాడాను. ఎందుకంటే, 'రాముడికి సీత తప్ప ఇతర భార్యలు లేరు' అనే అర్థంతో. రాముడు పర స్త్రీలను కోరలేదు – అనడానికి, మొత్తం కథలో, శూర్పణఖ సంఘటన తప్ప ఇంకే సంఘటనా లేదు. ★

ఆమె చుట్టూ పక్షులు యధేచ్ఛగా ఎగురు తున్నాయి. అక్కడక్కడా లేళ్ళు సంచరిస్తున్నాయి. కొమ్మల మీదకు ఎగురుతూ నెమళ్ళు కూస్తున్నాయి.

దీర్ఘంగా సాగిన చెట్ల నీడలలోంచి నడిచి ఆమె ఒక చెట్టుకింద ఆగి కొమ్మకు ఆని నిలబడి, తల ఎత్తి భారంగా కదిలే మేఘాలలోకి చూసింది. గత రాత్రి ఆమెకు కలలో కనిపించిన మోహనాకారం క్షణ క్షణమూ ఆమెని వివశురాల్ని చేస్తోంది. ఆ విశాల నయనాలు .... ఆ ఆజాను బాహువులు .... ఆ నీలిమేఘ శరీర వర్ణం .... సుందర మందహాసం ఎన్నడూ చూడని ఆ అద్భుత రూప లావణ్యం, ఎంతో సత్యంగా కళ్ళకు కట్టినట్టే ఉంది. అటువంటి మానవుడీ భూలోకంలో ఉన్నాడా? ఎక్కడున్నాడు? ఏ పుణ్యవతి గర్భాన జన్మిం చాడు? ఏ భాగ్యశాలి హృదయాంగణంలో ప్రవే శించాడు? .... ఎక్కడ? ఎక్కడ దర్శనమౌతాడు?

భ్రమ .... అంతా భ్రమ .... కల .... నీటి బుడగ లాగు చెదిరిపోయిన కల!

అంతేనా! .... కలేనా! అబద్ధమేనా!

ఆమె ముఖమంతా విచారం ఆవరించింది. అక్కడ నిలబడలేక పరధ్యానంగా కదిలి మళ్ళీ నడక సాగిం చింది.

ఇన్ని దినాలు .... ఇన్ని సంవత్సరాలు .... ఈ అరణ్య సీమలో ఎంత సౌఖ్యంగా .... ఎంత నిర్వి చారంగా .... జీవించాను! ఎన్నడూ .... ఎన్నడూ .... ఇంత ఆవేదన కలగలేదే! ఏ స్వప్నమూ ఇంత దుఃఖ పూరితం కాలేదే! ఇంత మధురానుభూతి పొందలేదే! ప్రేమ ఇంత సుందరమా? ఇంత సుఖకరమా? చీకటి లోకానికి సూర్యోదయం వలే ఈ శూన్య హృదయానికి ప్రేమోదయమా?

ఎవరా సుందరుడు? ఆయన, దర్శనం ఇవ్వాలే గానీ, పాదాక్రాంతనైపోనా? ప్రార్థనలతో ఆయన ప్రేమ సాధించనా? ఆయన సహచర్యంతో ఈ జన్మ ధన్యమై పోదా? .... ఆహా! తలపు మాత్రానికే శరీరమంతా పులకరిస్తోందే! ఎంత సుందర స్వప్నం! ఎంత మధుర సంభాషణం! .... నేడు ఎంత అపూర్వ సుదినం!

ఆశా నిరాశల మధ్య ఊగిసలాడుతూ .... స్వప్న లోకాలలోకి చూసే చూపుతో .... విచార వదనంతో .... ఆ అరణ్యం మధ్యలో అతి మెల్లగా సంచరిస్తోన్న ఆ ప్రేమారాధకురాలు .... ఆ సౌందర్య రాశి .... శూర్ప ణఖ! సర్వ సంపదలలో దేవతలనే మించిన లంకాధిపతి రావణుని ముద్దుల చెల్లెలు ఆమె. సామాన్య రాచస్త్రీల స్వభావానికి ఆమె స్వభావం భిన్నం! ఆమె పరిచారకుల సేవలు కోరదు. అంతఃపురాలలో హంస తూలికా తల్పాలను వదిలి దండ కారణ్య పర్వత సానువుల్నీ వన సీమల్నీ తన నివాసాలుగా ప్రేమించి సంచరిస్తూ ఉంటుంది. అన్నల అనురాగాలకుగానీ అధికారాలకు గానీ తల దించని స్వేచ్ఛాజీవి. ఎప్పుడూ తన చుట్టూ పక్షులతో, జంతువులతో నిర్భయంగా, స్నేహపూరితంగా ఆడు కొంటూ ఉంటుంది. అడవిలో ప్రతి పూల మొక్కనీ పలకరించి తన కిష్టమైన పూలన్నీ కోసుకుని తను అలంకరించుకుని పక్షులకూ, జంతువులకూ కూడా అలంకరించి నవ్వుతుంది. ఆమె హృదయం ఎంత నవ నీతమో ఆమె శరీరం అంత కోమలం. ఆమె కళ్ళకి ఆహారం వనసీమల ప్రకృతి సౌందర్యం.

ఆ రోజు ఆమె ఆ సౌందర్యానికి కూడా అనాసక్తు రాలై కొత్తగా వికసించిన పూలని గానీ .... మబ్బుల అంచుల్లో మెరిసే సూర్యకాంతుల్ని గానీ చూడక, దీర్ఘాలోచనలో మునిగి, పంచవటికి సమీపంగా గోదావరి తీరంలో సంచరిస్తూ ఆశ్చర్యకరంగా సుదూరంలో ఒక అద్భుత దృశ్యం చూసింది! .... ఆ సుందరాకారుడే! అదే రూపం .... ఆ నేత్రాలు .... ఆ బాహువులు .... తనకి చాలా పరిచితం! అదే శరీర వర్ణం .... ఆయనే .... ఆయనే తన కలల ప్రియుడు! ఇది మళ్ళీ కల కాదు గదా? ఆయనే సాక్షాత్కరించారా! తన స్వప్నమే సత్యమై నిలిచిందా!

శూర్పణఖ తన్మయత్వంతో అడుగులు వేస్తూ, కన్నార్పక ఆ రూపాన్నే తిలకిస్తూ ముందుకు సాగింది.

ఆయన ఎవరో కాదు. తండ్రి ఆజ్ఞకు బద్ధుడై అడ వుల్లో కాలం గడుపుతోన్న రాముడు! ఆ వ్యక్తి శూర్పణఖకి ఎందుకంత మహోన్నతుడుగానూ, మహా సుందరుడు గానూ కనిపించాడో గానీ, ఆ అస్తవ్యస్తపు జుట్టు ముడీ, నీరుకావి రంగు ముతక నారగుడ్డలూ, భుజానికి వేళ్ళాడుతూ విల్లూ, వొరలో కత్తీ, శరీరం అంత నలుపూ .... మనిషి బాగా ఎత్తు కావడంచేత చేతులు పొడుగు ... నిత్యమూ అడవుల్లో తిరిగే శూర్పణఖ, అటువంటి వేటగాళ్ళని ఎందరినో చూసే వుండాలి. అయినా ఆమెకు వేటగాడివంటి ఆ వ్యక్తిలో ఏమి ప్రత్యేకత కనిపించిందో! ఆమె, అలౌకిక స్వప్న ప్రభావంతో తలమున్కలవుతూ వుండ వొచ్చును. ఆ వ్యక్తిని చూస్తోన్న కొద్దీ ఆమె హృదయ చలనాలు అధిక మయ్యాయి. తన ప్రకృతి సంచారాలకు మెచ్చి, ఏ వన దేవతో ప్రత్యక్షమైనదా – అని సందేహించి ఆగింది.

రాముడు ఏ కాల కృత్యాల కోసం పోయి వస్తు న్నాడో గోదావరి రేవులో కాళ్ళు కడుక్కుని అంగ లేసు కుంటూ వొడ్డెక్కాడు. తన చుట్టూ పరిసరాల ధ్యాస లేదు. తీరం పొడుగునా చెట్లు నది మీదికి వొంగి, నది గర్భంలో ఇంకో అరణ్యం కనిపిస్తోంది. చెట్లన్నీ నిండుగా పూసి వున్నాయి. పూసిన కొమ్మలు కొన్ని నీటిలోకి విరిగి

పడి పూల తెప్పలలాగ కెరటాలతో పాటు సాగుతున్నాయి. చెట్లనిండా పిట్టలు అవ్యాజమైన సంతోషంతో, కిచకిచ అరుపులతో, ఎగురుతూ వాలుతూ ఆడుకుంటున్నాయి. దూరంగా ఒక ఏనుగు తొండంనిండా నీళ్ళుపట్టి తన నీడవేపు చిమ్ముతోంది. కుందేళ్ళు పొదల్లో చటుక్కున మెరిసి మాయమవుతున్నాయి. రాముడి తలపైన నడిచే చెట్లమీద నెమళ్ళు మబ్బుల్ని చూస్తూ ఉత్సాహంతో కేరింతలు కొడుతున్నాయి.

రాముడు తీరం వెంబడి అంగలేసుకుంటూ నడుస్తోనే వున్నాడు. ఏ దృశ్యంలోనూ, ఏ శబ్దంలోనూ, అతనికి నూతనత్వం లేదు. కాలకృత్యాలు ఎంత అలవాటో, నదీతీర పరిసర సౌందర్యం అంత అలవాటై పోయింది!

ఆ పురుషుడు తనని గమనించకపోవడంతో, శూర్పణఖ నిరుత్సాహంగా ఆగిపోయింది. అతన్ని అంత వడివడిగా వెంబడించడానికి సిగ్గు కలిగింది. కానీ అతడు దూరమౌతోన్న కొద్దీ ఆమెకు కలవరం కలిగింది. ఆ సుందరుణ్ణి కోల్పోతాననే ఊహకే ఆమె హృదయమంతా శూన్యమైపోయింది. తనకే తెలీని ఆవేదనతో, తీవ్ర ఆరాటంతో అతని వశమై, అతనినే అనుసరించింది.

అంగలేస్తూ నడుస్తోన్న రాముడు చటుక్కున వెనక్కి తిరగాల్సి వచ్చింది. అతని జుట్టు ముడిలో ఒక పూల కొమ్మ తగిలి అతన్ని నిలేసింది. రాముడు కొంచెం కనుబొమలు చిట్లించి, జుట్టునుంచి కొమ్మని విడిపించే ప్రయత్నంలో వెనక్కి చూశాడు. తెల్లబోయాడు. కొమ్మని వూడదీసే వ్యవహారం మరిచిపోయి, సమీపంలో కనపడుతోన్న యువతిని చూస్తూ నిలబడ్డాడు. ఆ పూలకొమ్మ అతని జుట్టులోకి వొంగి, మనిషే చెట్టయి మొలిచాడో, చెట్టే మనిషిని పూసిందో తెలుసుకోలేనట్టు అయింది.

శూర్పణఖ సిగ్గుపడి ఆగి తల వొంచుకుంది.

రాముడు తేరుకొని కొమ్మని విరిచి నీటిలోకి విసిరి, ముడి సర్దుకుని ముందుకు నడవబోయాడు. లతలు వృక్షాలను అల్లుకున్నట్టు అతని ఆలోచనలు ఆమెని చుట్టుకున్నాయి. కదలని కాళ్ళని తీసుకుని బరువుగా కదలబోయాడు.

మళ్ళీ వెనక్కి చూశాడు – గుండెలో దడతో! పక్షి రెక్కలలాగ భుజాలమీద చెంగు గాలిలోకి ఎగురుతోండగా, ముంగురులు సర్దుకొంటూ సిగ్గుతో నేల చూపులు చూస్తూ అడుగులేస్తూ వస్తోంది – ఆ యువతి!

రాముడి నడక మందగించింది.

'ఎవరీమె? ఇంత అందంగా ఉంది! ఆ తెల్లని వల్లెవాటు .... పూల దండలు .... ఆ నడక సోయగం .... దేవతా స్త్రీలా ఉందే! .... ఎవరయితే నా కెందుకు? నా దారిన నేను వెళ్తాను. ఏ రుష్యాశ్రమానికి వొచ్చిందో! వెనక సేవకులున్నారేమో!'

ఎంత ప్రయత్నించినా రాముడికి నడక సాగ లేదు. వొంగి కాలికింద నలిగిన పూలు తీసి నీటిలోకి విసిరాడు. విల్లు సరిచేసుకున్నాడు. కత్తి సరిచేసుకున్నాడు. పూర్తిగా వెనక్కి తిరగకుండా వార చూపులు చూస్తూ అక్కడకక్కడే తచ్చాడుతూ నిలబడ్డాడు, మొహం ఎటోపెట్టి.

శూర్పణఖ రెండడుగుల దూరంలోకి వొచ్చేసింది. అంత సమీపంగా రాముణ్ణి చూస్తోంటే ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఇంకా జాప్యం చేస్తే తన అపరాధంవల్ల ఆ దేవతామూర్తి ఎక్కడ అదృశ్యుడై పోతాడో నన్నంత ఆతృత పడింది. కానీ తను ఏం చెయ్యగలదో తోచక ఒక్క క్షణం మౌనంగా నిలబడింది.

రాముడు తన సరసన ఆ అందగత్తెని చూస్తూ తనను తను మరిచిపోయి నిలబడ్డాడు. అతనికి అంత సౌందర్యకాంక్ష వుందని అతనికే తెలియదు.

శూర్పణఖ ఏదో చేయాలనే తపనతో .... చేయకుండా ఉండలేని స్థితిలో .... తన మనసంతా మొట్ట మొదటి మాటతోనే వ్యక్తపరచాలనే ఆరాటంతో అప్రయత్నంగా – "ప్రియా! మీరేనా?" అంది.

రాముడు తృళ్ళిపడ్డాడు.

పర స్త్రీలను కన్న తల్లుల్లాగ చూస్తాడని కీర్తి తెచ్చుకున్న రాముడికి శూర్పణఖని కూడా అలా చూసే శక్తి లేకపోయింది. ఆమె మొహం మీదనుంచి చూపులు పక్కకి కూడా తిప్పలేక పోయాడు, కొంత సేపు.

లజ్జా భారంతో నిండిన మృదు మధుర స్వరంతో శూర్పణఖ తన మనసంతా తేటతెల్లం చేయబోయింది ... "ఎన్ని యుగాల నిరీక్షణో కదా మీ దర్శన భాగ్యానికి! స్వప్నంలో మీరు నా కిచ్చిన వాగ్దానం .... మళ్ళీ కలుస్తానని ...."

"సుందరీ! ఎవరు నువ్వు? నీ పేరేమిటి?" అన్నాడు రాముడు గంభీరంగా చూడడానికి ప్రయత్నిస్తూ.

శూర్పణఖ మందహాసంతో చూసింది – "నేనెవరినో మీ రెరుగరా? నా ప్రేమారాధన మీరు గుర్తించరా? నా పేరేనా మీరు కోరేది?"

"సుందరీ! పేరు చెప్పకపోతే నువ్వెవరివో ఎలా తెలుస్తుంది? ఈ అరణ్యంలో ఎందుకు ఉన్నావు? తల్లి దండ్రులున్నారా? ఏం కులం మీది? ఏం శాఖ?" ప్రశ్నలు కురిపించాడు, గాంభీర్యంతోనే.

"ప్రభూ! తమ నోటినుంచి రాదగ్గ ప్రశ్నలా ఇవి? నా పుట్టు పూర్వోత్తరాలకేనా తమ ఉత్సాహం? .... నా పేరు శూర్పణఖ. నాకు ఆప్తులూ, రక్త బంధువులూ ఎందరో ఉన్నారు. అయినా, నేను ఎవరికీ సంబంధించిన దాన్ని కాను. వ్యక్తురాలిని. మీ కుతూహల తృప్తికి ఒక్క సంగతి తెలుపుతాను. లంకాధిపతి రావణ చక్రవర్తి

మా అన్నలలో ఒకరు" అని శూర్పణఖ చిరునవ్వుతో తల వంచింది.

రాముడు ఆశ్చర్యంతో వింతగా చూశాడు.

రావణుడి చెల్లెలా! .... రావణుడి చెల్లెలా!

ఈమె ద్వారా .... అన్నగారి సంగతులేమైనా రాబట్ట వొచ్చునేమో! .... తనకేమీ ఆసక్తి లేనట్టు మాట్లాడి చూడాలి. మనిషి .... మోహించి వచ్చినట్టు కనబడు తోంది!

".... ఆయన పేరు విన్నాను" అని రాముడు శూర్పణఖని చిరునవ్వుతో చూశాడు – "యవ్వనంలో ఉన్నదానివి! సౌందర్యవతివి! ఈ చెట్లలో, పుట్లలో, .... ఇంత ఒంటరిగా ...."

శూర్పణఖ మందహాసంతో చుట్టూ విశాలంగా చూసింది – "ఈ ఎగిరే పక్షులూ .... ఈ అరిచే జంతువులూ, ఇన్ని సాటి ప్రాణుల మధ్య; శరీరాలను స్పర్శించే ఈ గాలీ .... చెవులను తాకే ఈ శబ్దాలూ, కన్నులకు జీవం పోసే ఈ వర్ణాలూ, నిత్యమూ పలకరించే ఈ సూర్యచంద్రులూ, ఈ సహజ సమస్తాను భూతుల మధ్య .... మనిషికి ఒంటరితనమా?" అని విస్మయంగా చూసింది.

రాముడు కొంచెం ఆశ్చర్యపడ్డాడు. మాటలు చక్కగా నేర్చిందే! మంచి గురువుల దగ్గిరే విద్యా బోధన చేసినట్టుంది. రాక్షస స్త్రీలందరూ ఇంత తెలివిగా, ఇంత స్వేచ్ఛగా ఉంటారా? – "సుందరీ! నీకు వివాహం జరిగిందా? అలా తోచడం లేదు" అని శూర్పణఖని తరిచి చూస్తూ అడిగాడు.

శూర్పణఖ తన ప్రియుడిపై అపారమైన విశ్వాసంతో వుండడంవల్ల రాముడి చేష్టల్ని ఉన్నతంగానే భావించింది. అయినా కించిత్తు విచారంతో – "స్వామీ! ఇన్ని సందేహాలెందుకు ఈ దీనురాలి మీద? నేను మిమ్మల్ని ఒక్క ప్రశ్న కూడా అడగలేదే? మీ జన్మ చరిత్రల మీదా, మీ వంశ క్రమం మీదా నాకు కొంచెమైనా ఆసక్తి లేదే!" అని కొంచెం తల వొంచింది.

రాముడు, ఆమె మాటల ధోరణిని లక్ష్యపెట్టకుండా కళ్ళలో గర్వంతో అన్నాడు – "అసలు నేనే చెప్పాలనుకుంటున్నాను. మేము సూర్య వంశస్థులం. మాది కోసల రాజ్యం. అయోధ్యానగరం మా నివాసం. దశరథ మహారాజు మా తండ్రిగారు. శ్రీరామచంద్రుడు నా పేరు" అని కొంచెం ఆగాడు. – తను ప్రకటించిన వివరాలకు ఆమె ఏమన్నా విస్తుబోతోందా అని! తన వంశాన్నీ, ఊరునీ, తండ్రినీ, చివరికి తన పేరునీ కూడా లోకంలో చాలా గొప్ప సంగతులు చెపుతున్నట్టు చెప్పాడు. అంత కన్నా విలువయిన వంశాలూ ఊళ్ళూ తండ్రులూ పేర్లూ ఇంకెవ్వరికీ లేవనే విశ్వాసంతో చూశాడు.

శూర్పణఖ, నదిలో కొట్టుకుంటూ నెమ్మదిగా తెర చాప దించిన పడవలా సాగే పూల తెప్పని చూస్తోంది. ఆ తెప్ప మీద వాలుతూ ఎగురుతూ ఆడుకునే జల పక్షుల్ని చూస్తోంది.

"వింటున్నావా? పుట్టడం గొప్ప రాజపుత్రుడి గానే పుట్టాను. ఏం లాభం?. ఇక రేపో మాపో రాజు నవ్వబోతోంటే మిన్ను విరిగి మీద పడింది. మా పిన తల్లిది మహా కుటిల బుద్ధి. తన కొడుక్కి రాజ్యం ఇచ్చి, నన్ను అడవుల్లోకి పంపించాలని మా తండ్రిని కోరింది. మా తండ్రి ఎప్పుడో ఆవిడకేదో మాట ఇచ్చి వున్నాడు. ఆయన చేసిన పన్లన్నీ ఇలాంటివే. మరి తప్పలేదు. ఇప్పటికి పది పన్నెండేళ్ళనించి ఈ కారడవుల్లో శిక్ష అనుభవిస్తున్నాను. ఏం చెయ్యనూ?" అని విచారంగా చూశాడు.

శూర్పణఖ పక్షుల జంటని చూస్తూనే విస్తుబోతూ వింది, రాముడి మాటలు. ఆమె చక్కని కళ్ళు విశాలమై రాముడి కెంతో చూడబుద్ధి కలిగింది.

"ఏమీ! వనవాసాన్ని శిక్షగా విధించడమా!" విస్మయంగా చుట్టూ చూసింది. ఆమె చూపు ఎటు తిరిగితే అటే ఒక్కొక్క సుందర దృశ్యం గోచరించింది. తల ఎత్తి ఆకాశంలోకి చూసింది. గోదావరిలోకీ చూసింది. వృక్షాగ్రాలను చూసింది. ఎక్కడెక్కడో వున్న సౌందర్యాలను మననం చేసుకుంటున్నట్టు రాముడి కన్నుల్లోకి చూసింది. – "ఈ అలౌకిక ఆనంద సీమకు మీరు శిక్షకై వొచ్చారా! ఈ పరిశుద్ధ మధుర ఫలభరిత వృక్షాలూ, పద్మాలతో నిండిన అతి శీతల సరోవరాలూ, పర్వతాగ్రాల నుంచి దూకే సెల యేళ్ళూ, మేఘాల మధ్య సూర్యచంద్ర కాంతుల్లో ఉత్సాహంగా ఎగిరే పక్షి సమూహాలూ, పొగ మంచులో చంద్రోదయంగా తోచే సూర్యోదయాలూ, ప్రాతఃకాలాలలో పూలు రాలిన కాలిబాటలూ, చల్ల గాలులూ, కాంతులీనే మంచుబొట్లతో పచ్చిక బయళ్ళూ – ఈ ప్రకృతి చిత్రాలు మీరు చూడనివా? ఈ పుష్పభరిత నదీతీరాల శోభనూ .... ఈ వినూత్న పక్షి కూజితాలనూ .... ఈ క్రూరమృగ గర్జనా పులకింతలనూ .... ఈ పరిమళ భరిత వెన్నెల రాత్రులనూ .... ఈ సుందర ప్రకృతీ శోభలో మీ జీవితాన్ని 'శిక్షగా' అనుభవిస్తున్నారా! అంతేనా? ఈ జీవనంలో మీకేమీ ఆనందం లేదా? ఈ అరణ్య సౌందర్యాన్ని అనుభవించే వరం ప్రసాదించిన మీ పినతల్లి పట్ల మీకేమీ కృతజ్ఞత లేదా?" అని విస్మయంగా చూసింది.

రాముడు మాట రానట్టు అయిపోయాడు. కైకేయి తననీ ఘోరశిక్షలోకి పంపిందని లోకమంతా ఒక్క వరసన ఘోషపెట్టి కన్నీళ్ళు కారుస్తోంటే, ఈ మూర్ఖురాలు దండకారణ్య జీవితాన్ని వరంగా వర్ణిస్తోంది!

రాముడు అక్కడే నదివొడ్డున నీళ్ళలోకి సగం మునిగిన పెద్దబండ మీద కూర్చున్నాడు. శూర్పణఖకి నచ్చచెపుతున్నట్టు చూస్తూ – "అడవుల్లో ఆనందం వుంటుందా? ఏం ఆనందం? పితృవాక్య పరిపాలకుణ్ణి కాబట్టి గత్యంతరంలేక వచ్చాను. నిత్యం క్రూర జంతువుల భయమే కదా? ఎప్పుడే మృగం దాడి చేస్తుందో చెప్పలేము కదా? ఎప్పుడూ ఈ బాణాలూ, కత్తులూ ధరించి తిరగాలి. మేం వచ్చిన కొత్తలో ఇక్కడ తేళ్ళూ, పాములూ తెగ వుండేవి. ఏం బాణాలు వేస్తాం వాటి మీద? ఒక రోజేమైందో తెలుసా? ఒక గొప్ప తపశ్శాలి .... రుషి పుంగవుడు ... మా పర్ణశాలలో ఆతిధ్యం తీసుకుని పడుకుని వుంటే మండ్రగబ్బ ఒకటి ఆయన పంచెలో దూరింది. ఇక ఆయన కేకలు వినాలి, గంతులు చూడాలి. అక్కడికీ మా తమ్ముడు వెయ్యికళ్ళతో కాపలా కాస్తూనే ఉంటాడు."

శూర్పణఖ చిరునవ్వుతో వింటోంది.

"ఇంకో బాధ ఏమిటంటే – రాక్షస బెడద! ఏ క్షణంలో ఎవడొచ్చి ఏం మాయలు చేస్తాడో తెలీదు. మొన్న ఒకసారి నా భార్య కాస్సేపు నా పక్కన కునుకు తీస్తూంటే కాకి ఒకటి వచ్చి ఆమెని పొడవడం మొదలు పెట్టింది. కాకే గదా అని నేను ఊరుకుంటే అది కాకి కాదు! కాసురుడట! వాడితో యుద్ధం అయింది. ఆ మధ్య విరాధుడో, బొరాధుడో వొకడు దారిలో అమాం తంగా సీతని చంకకెత్తుకున్నాడు. నా భార్యని ఎక్క డెక్కడ ముట్టుకున్నాడో అని నాకు చెప్పలేని దుఃఖం కలిగింది...."

శూర్పణఖ వినే స్థితిలో లేదు. ఈ పురుషుడికి భార్య ఉందన్న సంగతి ఆమెకి గాఢమయిన విచారం కలిగించింది.

"నా భార్యని పర పురుషుడు తాకితే ఎలా అనిపించిందో తెలుసా? నా రాజ్యం పోయినప్పుడూ, మా తండ్రి పోయినప్పుడూ కూడా అంత విచారం కలగలేదు. రోజూ గండమే, ఈ అడవుల్లో! పురుషులం ఎలాగైనా నెగ్గుకొస్తాం గానీ, స్త్రీని రక్షించడం యాతనగా ఉంది. మిగిలిన రోజులు కూడా ఎలా గడుస్తాయో అని ఎప్పుడూ ఆలోచనే నాకు. ఎప్పటికి ముగుస్తాయోగానీ ఈ పద్నాలుగు సంవత్సరాలూ ...." అని నిట్టూర్చాడు రాముడు.

శూర్పణఖ అంతకన్నా గాఢంగా నిట్టూర్చింది. "తమ వంటి వీరులూ ధీరులూ అనదగ్గ మాటలా స్వామీ ఇవి? ఈ తాత్కాలికమైన ఇబ్బందులే తమ వన జీవితాన్ని అశాంతి పరిచాయా? ఈ గడువు ముగిసిన తర్వాత తిరిగి తమ నగరానికి వెళ్ళి పోవడమేనా!"

"వెళ్ళక? ఎప్పుడెప్పుడా అని నిరీక్షిస్తున్నాను."

"అయ్యో! ఇన్ని సంవత్సరాల ఈ సుందర ప్రకృతీ జీవనం మిమ్మల్నేమీ ఆకర్షించలేదా? ఇంత కాలం ఈ ప్రశాంత పరిసరాలలో జీవించి, ఇంత సౌందర్యాన్ని అనుభవించి, మళ్ళీ ఆ క్షుద్ర రాచ జీవనంలోకే; ఆ నగరాల లోపల, ప్రాకారాల వెనక, ద్వారాల వెనక, ఆ సౌధాలలో ఆ గదుల్లో, పంజరాల పక్షుల జీవితానికా ఇంత ఆరాటం! నిత్యమూ శత్రు భయాలతో, అశాంతులతో, కుతంత్రాలతో కుత కుత లాడే ఆ రాజధానికి ... ఆ భయంకర నిస్సహాయ కారాగార జీవితం కోసమా మీరింత ఆతృత పడుతున్నారు?"

రాముడ తీక్షణమైన చూపులతో విన్నాడు – "సుందరీ! ఎక్కడ నేర్చావీ మాటలు? రాజుకి కొంత స్వేచ్ఛ లేకపోయినా ప్రజల్ని సుభిక్షంగా పరిపాలించడం కోసం అన్నీ భరించాలి. అది మాత్రం తెలియదా నీకు?"

శూర్పణఖ అంత విచారంలోనూ నిర్లక్ష్యంగా నవ్వింది – "సుభిక్షంగానా? రాజులు ప్రజల్ని సుభిక్షంగా పరిపాలిస్తారా? నా అన్న పరిపాలన చూస్తూ వున్న దానినే కదా? ఇతర రాజుల పరిపాలనలు ఎరిగిన దానినే కదా? ఏ రాజు, ప్రజల్ని సుభిక్షంగా పాలిస్తున్నాడు? ఏ మహారాజు పాలనలో అయినా ప్రజలకు కష్టాలు తప్పవు కదా? వాటిని ఎవరు తీర్చగలరు? అటువంటి పరిపాలనకేనా ప్రభూ తమరు ఇంత ఆరాట పడుతున్నది?" అంటూ శూర్పణఖ విచారంగా చూసింది.

రాముడికి చాలా ఆగ్రహం కలిగింది. "నువ్వు స్త్రీవి! రాజ్యపాలన విషయాలతో నీకేం పని? ఆ మంచి చెడ్డలు నీకెలా తెలుస్తాయి? నా ధర్మ పత్నిని చూడు! ఇటువంటి విషయాలు ఎన్నడయినా మాట్లాడుతుందా? తను కోరుకుంటే, ఏ పువ్వో, కాయో ముద్దుగా అడుగుతుంది. తెచ్చి పెడతాను. వంటా వార్పూ చూసుకుంటుంది. బట్టలు ఉతుకుతుంది. పర్ణశాల అలుకుతుంది. పాత్రలు కడుగు తుంది. రుషులు వస్తే భక్తితో సేవలు చేస్తుంది. ఎంత వినయం! ఎంత అణకువ! స్త్రీలు అలా ఉండాలి .... మీ జాతిలో అది లేనట్టు తోస్తోంది" అంటూ శూర్పణఖని మందలింపుగా చూశాడు.

శూర్పణఖ తల వంచుకుంది – రాముడి చూపులో అసహనం రుచించక.

రాముడు ఇటూ అటూ చూసి భుజంనించి విల్లు తియ్యబోయి ఆగి పైకి చూశాడు. కోయిల ఎక్కడుందో కనబడకుండా తెగ కూస్తోంది. కొమ్మే కూస్తున్నట్టు తోస్తోంది. రాముడు చేతులు చాచి "ఉష్! ఉష్!" అని కోయిలని ఎగరగొట్టాలని చూశాడు. "నీ వ్యవహారం నాకు తెలుసులే. నా మీద రెట్ట వెయ్యా లని నీ ఎత్తు! లేస్తావా లేదా? నీ రాక్షసి మాయలు నా దగ్గిర సాగవు, తెలిసిందా? పోనీ గదా అని ఊరుకుంటే ఏ కోయి

లాసురుడో, పిచ్చికాసురుడో బయల్దేరుతాడు మా మీదకి. ఊఁ, లే ....” అంటూ బాణంతో బెదిరించి ఆ కోయిల్నీ, కొన్ని పిచ్చికల్నీ కూడా ఎగర కొట్టాడు. తర్వాత మళ్ళీ చుట్టూ సందే హంగా చూసి .... ఆకులమీద పాకే చీమల్ని కాసేపు దీక్షగా పరికించి .... వాటికెక్కడా చీమాసుర లక్ష ణాలు లేవని నమ్మి, విల్లు తీసి దగ్గిరిగా వొంగిన కొమ్మకి తగిలించి వొళ్ళు విరుచుకున్నాడు. విల్లు తీసేసినా ఇంకా విల్లు అతని భుజానికి వేళ్ళాడు తోన్నట్టే వుంది. అంత తెల్లగా మచ్చ పడిపోయింది భుజం మీద!

శూర్పణఖ రాముణ్ణి మళ్ళీ కొత్త చూపుతో గాఢంగా చూసింది. ఆ భుజాలు ఎత్తుగా, వక్ష స్థలం విశాలంగా .... ఆ పెద్ద కళ్ళూ .... నల్లని చెంపలూ, .... అతనిపై మోహం నూతనంగానే తోచింది. వినయంగా తల వొంచి – “స్వామీ! మీరీ పవిత్ర వనవాసాన్ని విడిచి ఆ కుటిల రాజకీయ జీవనంలోకి ప్రవేశించ వొద్దు! నా మనవి ఆలకించండి!” అంది.

రాముడు పాత కోపం మరిచిపోయి చిరునవ్వు నవ్వాడు – “రామ రాజ్యం కోసం కోసల ప్రజలు ఎంత తహ తహలాడుతున్నారో నువ్వెరగవు.”

“మరి మొదటే ఆ ప్రజలు మీకీ శిక్ష లేకుండా చేయవచ్చునే!”

“ఎలా చేస్తారు? నా పితృవాక్య పరిపాలన?”

“ప్రజల్ని సౌఖ్యంగా పరిపాలించడం కోసం పితృవాక్యాన్ని ధిక్కరించకూడదా? వేలాది ప్రజల అభీష్టం ముందు ఒక్క వ్యక్తి మాటకు అంత విలువా!”

“హరి హరీ!” అని చెవులు మూసుకున్నాడు రాముడు – “కన్న తండ్రి మాట మీరితే ఎంత పాపమో నీ కెవ్వరూ చెప్ప లేదా?”

“ప్రజలకు మేలుచేసే కార్యంలో మీకు పాపం వస్తేనేం? అయినా వనవాసంలో మీకేమీ ఆనందం లేదు. ఆజ్ఞ లెప్పుడూ ఆనందాన్ని ఇవ్వవు.”

రాముడు శూర్పణఖని “ఇది ఆడదేనా?” అన్నట్టు చూశాడు. కాకపోవడం ఏమిటి? తల అటు తిప్పినంత మాత్రాన్నే మన్మథ బాణం లాగ మనస్సంతా బాధిస్తోందే! ఆ అందం .... ఆ యవ్వనం .... ఆ తెలివీ .... మరి ఎందుకిలా పాపపు మాటలు మాట్లాడుతోంది?

రాముడి మౌనానికి శూర్పణఖ కొంచెం బెదిరి వినయంగా చూస్తూ అడిగింది – “మీరులేని ఈ కాలంలో మీ రాజ్యపాలన ఎవరు చేస్తూ వున్నారు స్వామీ?”

రాముడు దర్పంగా “నా పాదుకలు” అన్నాడు.

“పాదుకలా? అనగా?”

“నా చెప్పులు! నా సోదరుడు పట్టుబట్టి నా పాదుకలు తీసుకువెళ్ళి సింహాసనంమీద పెట్టి తను కింద కూర్చుని నా రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు.”

శూర్పణఖ తెల్లబోతూ – “ఏమీ! పాదుకలు ప్రజల్ని పరిపాలించడమా!” అని కొంచెం నవ్వింది “పాదుకలు .... సింహాసనం మీద ....!” అని తల్చి తల్చి నవ్వడం పెద్దది చేసింది.

“పాదుకలు సింహాసనం మీద ....!” అని పగిలి పగిలి నవ్వుతూ చెట్టు కొమ్మమీదకి వాలిపోయింది. ఆమె నవ్వు వేగంగా ఉరికే జలపాతంలాగ, ఒడ్లని మించి ప్రవహించే వానాకాలపు నదిలాగ, పెద్ద ఘోషగా అడవి అంతా ప్రతిధ్వనించింది. పక్షులు, కిచకిచలు మాని విన్నాయి. జంతువులు మోరలెత్తి చూశాయి.

“పాదుకలు .... సింహాసనం మీద ....!” అని ఆమె నవ్వుతూనే వుంది.

రాముడికి ఆగ్రహంతో కళ్ళు ఎర్రబడ్డాయి. కానీ చక్కని ఆడది – ఎలాంటి మర్మాలూ లేకుండా అంత స్వేచ్ఛగా ఈదురుగాలికి ఊగే అడవి మొక్కలాగ ఊగుతూ, నిండా పూచిన తంగేడు లాగ నవ్వుతోంటే, చూడటానికి మనోహరంగా తోచింది. ‘స్త్రీలు, స్వేచ్ఛగా నవ్వితే చక్కగానే వుంటుందనుకుంటాను .... సీత తప్పు!’

అన్నట్టు సీత దొండ కాయలు కోసి ఇవ్వాలంది. సరేలే, కోసుకుంటుంది. లక్ష్మణుడు ఇచ్చే వుంటాడు.

రాముడి మౌనం చూసి శూర్పణఖ చటుక్కున నవ్వు ఆపి – నిగ్రహించలేక మళ్ళీ నవ్వుతూ “శ్రీరామా! మీ అయోధ్యా నగరాన్ని చూడాలని మనసు పుదుతోంది. చెప్పుల చెప్పుచేతల్లో జీవిస్తోన్న ఆ ప్రజల్నీ .... చెప్పుల కింద కూర్చున్న మీ సోదరుణ్ణీ చూడాలని....”

“సుందరీ! అధిక ప్రసంగం చేస్తున్నావు సుమా!” అన్నాడు రాముడు దర్పంగా... మరో దారిలేక.

శూర్పణఖ చటుక్కున తల వొంచుకుంది. ‘సుందర మూర్తిని నొప్పించానే’ అనే ఊహ ఆమెని కొంచెం సిగ్గు పర్చింది. మౌనంగా తలవాల్చి నిలబడింది.

పడమట ఎర్రబారుతోంది. పక్షుల శబ్దాలు ఎక్కు వవుతున్నాయి. రెండు నీటి కాకులు రాముడి మీదుగా నీటి బొట్లు రాలుస్తూ తట తట చప్పుళ్ళతో ఎగిరాయి.

రాముడు జుట్టుముడి విప్పి దులిపి ముడేసుకో బోయాడు. జుట్టు, చిక్కులుపడి ఇబ్బంది పెట్టింది.

శూర్పణఖ ప్రేమగా – “ప్రియా, మీ సిగ నేను అందంగా చుడతాను” అని ఒక అడుగు ముందుకు వేసింది.

రాముడు తన గాంభీర్యమంతా మరచిపోయి, “ఆగుము సుందరీ, ఆగుము! ఆగు మాగుము” అంటూ కెవ్వున, కెవ్వు కెవ్వున అరిచాడు.

శూర్పణఖ తెల్లబోయి ఏమీ అర్థంగాక చుట్టూ

చూసింది. రాముడు ఆదరాబాదరా జుట్టంతా కొప్పు చుట్టుకుని, ఆ వూపులో విల్లు కూడా కొమ్మనించి తీసి చంకకి తగిలించుకున్నాడు. అంతసేపూ ఆ విల్లు లేకపోతే భుజమే లేనట్టు గందరగోళపడింది అతని వొళ్ళు. అప్పుడు అతని ముఖం కొంత శాంత పడింది.

శూర్పణఖ బెదురు చూపుతో – "ప్రభూ! తమరు అంత కలవరపడ్డ హేతువేమిటి?" అని ఆతృతగా అడిగింది.

"పర స్త్రీ స్పర్శ మహా పాపం కాదా?" అన్నాడు రాముడు, అది పాపమో కాదో తేల్చుకోలేకపోయినా, గాంభీర్యం చూపించాలని మొహమంతా జేవురించుకుని.

"పర స్త్రీ! ఎవరు? నేనా పర స్త్రీని మీకు?" అని తనే కలవరపడింది శూర్పణఖ – "నేను నా అంతరాత్మ సహితంగా మీ స్త్రీనేనని నన్ను నేనే మీకు అర్పించుకున్న నేను, మీకు పర స్త్రీనా? ... ప్రభూ! నేను మీ స్త్రీనే! మీకు పర స్త్రీని కాను. భర్తృహీనను నేను. నన్ను మీకు సమర్పించుకునే స్వేచ్ఛ నాకు ఉంది. దయతో నన్ను స్వీకరించి నన్ను ధన్యురాలిని చేయండి!"

రాముడు నిర్ఘాంతపోతూ చూశాడు. ఏమిటీ! స్త్రీకి ఇంత స్వేచ్ఛా జీవితమా? ఏ దేశ ఆచారం ఇది?

కోరి వచ్చిన పరస్త్రీ ప్రార్ధన పురుషుడికి ఎంత దర్పం కలిగిస్తుందో శూర్పణఖ ప్రార్ధన రాముడికి అంత దర్పం కలిగించింది. ఆమెని చిరునవ్వుతో చూశాడు– "సుందరీ! నీవు భర్తృహీనవే కావచ్చును. కానీ నేను వివాహితుణ్ణి! భార్యా సహితుణ్ణి! నా స్త్రీ నాకు వుండగా నువ్వు నాకు పరస్త్రీవే సుమా!"

శూర్పణఖ నిరాశతో కుంగిపోయినట్టు చూసింది. ఆమెకు ఒక సందేహం ప్రారంభమై బాధించసాగింది. తన కలలో అంత మనోహరంగా మాట్లాడిన పురుషుడేనా ఈ పురుషుడు? తన హృదయాన్ని అంతగా ఆకర్షించిన ప్రియుడు ఇతడేనా? తను పొరపడలేదుకదా? ఈయన మాటలు ఇంత నిర్దయగా, ఇంత నిరాసక్తంగా వున్నాయేమి? – "ప్రభూ! మీకు వివాహంతో లక్ష్యమేమిటి? ఎందరు స్త్రీలనైనా మీరు స్వీకరించవచ్చునే!"

రాముడికేదో తపన ప్రారంభమై పక్కకు వాలి వున్న పచ్చని కొమ్మ ఆకులు దూసి పోస్తూ దర్పంగా చూశాడు. "శ్రీరామచంద్రుడి గురించి నీకేమీ తెలిసినట్టు లేదు!"

"మన్నించండి ప్రభూ! నా స్వప్నం ప్రసాదించిన మధుర స్మృతులు తప్ప తమ గురించి నాకు తెలిసిందేమీ లేదు."

"అయితే విను! నేను ఏక పత్నీవ్రతుణ్ణి! నేనా వ్రతం పాటిస్తాను!"

"వ్రతమా? దానికి స్త్రీల ప్రేమ నిషిద్ధమా ప్రభూ?"

"పర స్త్రీల ప్రేమ నిషిద్ధమే."

"అయ్యో! మళ్ళీ అదే నిర్దయా నా మీద? నేనెన్నడూ ఇటువంటి వ్రతం గురించి వినలేదే!"

"విని వుండవు. ఇది ఏ దేశంలోనూ ఏ జాతిలోనూ ఉండదు. మా దేశంలో కూడా దీన్ని ఏ పురుషుడూ పాటించడు, రామ చంద్రుడు తప్ప!"

"అయ్యో! తమరొక్కరూ ఈ బంధనంలో ఎందుకు చిక్కుబడిపోయారు స్వామీ?"

"బంధనమా ఇది? కాదు. కీర్తికి మార్గం! స్వర్గానికి ద్వారం! ఒక్క స్త్రీనే వివాహమాడి, జీవితమంతా ఆ ఒక్క స్త్రీతోనే గడపాలంటే.... అది సామాన్యులకు సాధ్యమా?"

"ప్రేమ దాన్ని సాధ్యం చెయ్యగలదు. మీ పత్నిపై మీ ప్రేమ అంత గాఢమా ప్రభూ?"

"గాఢమో .... నిగూఢమో! .... అది వ్రతం! దాన్ని పాటించి తీరాలి!"

"అయ్యో!" అన్నట్టు శూర్పణఖ రాముణ్ణి చాలా దయగా, సంకెళ్ళలో చిక్కుపడిపోయిన గజరాజుని చూసినట్టు చూసింది. చాలా దిగులుగా, నెమ్మదిగా తల దించి వేళ్ళు మడుస్తూ – "పితృవాక్య పరిపాలన! .... వనవాస శిక్ష! .... ప్రజా పాలన! .... సత్య వ్రతం! .... ఏక పత్నీ వ్రతం కూడానా? అయ్యో!" అని నిట్టూర్చింది.

"ఎందుకలా ఉస్సురంటావూ? ఇవన్నీ కీర్తి కాదూ?"

"ఎవరికి?"

"నాకే"

"మీకు కీర్తి అయితే నాకేం సంతోషం స్వామీ? ఇది నాకు నిరాశే కదా? మా అన్న లెవ్వరికీ ఇటువంటి వ్రతాలు లేవే!'"

"మీరు అసురులు. నీతి నియమాలు పాటించని జాతి మీది! మా సంగతి అలా కాదు."

"మీ తండ్రిగారికి ఎందరో భార్యలని మీరే ఇంతకు ముందు చెప్పారే!"

"అది వేరు. అది వేరు" అంటూ రాముడు చూపు నదివేపు తిప్పాడు.

"మన్నించండి ప్రభూ! ఇదంతా మీ భ్రాంతిగా నాకు తోస్తోంది. మీ తండ్రిగారు ఏక పత్నీ వ్రతులు కారు. ఆయనకు అపకీర్తి కలిగిందా? అనేక సంవత్సరాలు రాజ్యం చేశారు. మీ వంటి పుత్రుల్ని కన్నారు. ఆయన పుణ్యాత్ములు కాకపోతే, ఆయన గర్భాన మీరు జన్మించే వారేనా? అనేక మంది స్త్రీలతో గడిపిన పురుషుడు పుణ్యాత్ముడే అయినపుడు, ఆ పుణ్యం కోసం ఏక పత్నీవ్రతం ఎందుకు? మిమ్మల్ని కోరే నా పట్ల ఇంత నిర్దయా ప్రభూ?"

"సుందరీ! ఇక్కడ దయకు స్థానం లేదు. నా వ్రతం అటువంటిది! లోకంలో ఎంత కీర్తి అది!"

"మీ లోక రీతి నాకు అర్థం కాదు ప్రభూ, నా

ప్రేమ తప్పు!"

"కానీ, నేను పరస్త్రీని కన్నెత్తి చూడను."

"చూసి నిగ్రహించలేకనా?"

"నిగ్రహం నాకు అసాధ్యమా? నేను ఏక పత్నీ వ్రతుణ్ణి!"

శూర్పణఖ కొంచెం నవ్వింది – "ఆ మంత్రమేనా అహర్నిశలూ మిమ్మల్ని కాపాడేది?"

"అధిక ప్రసంగం చేస్తున్నావు" – రాముడి మొహంలో కొంచెం ఆగ్రహం పొడచూపింది. "ఇన్ని సంవత్సరాలుగా నేను నా ధర్మపత్నితోనే శాస్త్రోక్తంగా జీవిస్తున్నాను. సీత నా ధర్మపత్ని! నా అర్ధాంగి! నా ...." ఆ మాటలవల్ల కలిగిన ఉత్తేజంతో దూరంగా తమ పర్ణశాల వేపు చూశాడు.

అక్కడ సుళ్ళు సుళ్ళుగా పొగలేస్తూ కనబడింది. సీత వంట ప్రారంభించినట్టుంది. దొండ కాయల్లో జింక మాంసం వేసి వొండుతానంది. లక్ష్మణుడు దొండ కాయలు కోసే వుంటాడు. మధ్యాహ్నం వచ్చిన రుషి పుంగవులు నిద్రలేచారో లేదో! .... వెళ్ళొచ్చునులే వంట ముగిసేవేళకు.'

శూర్పణఖకి అంత నిరుత్సాహంలోనూ రాముణ్ణి ప్రశ్నించాలని కుతూహలం కలిగింది – "స్వామీ! నా సందేహం తీర్చండి! సీతాదేవిని మీరు మోహించి, మీ జీవితం ఆమె తోడనే గడపాలనే వాంఛతో, ఆమెని వివాహం చేసుకున్నారా స్వామీ?"

"అది మా ఆచారం కాదు. మా అన్నదమ్ములం నలుగురం పెద్దలు కుదిర్చిన వివాహాలే చేసుకున్నాం. నేను విల్లు విరిచి సీతని నా బల ప్రదర్శనతో సీతని గెల్చుకున్నాను!"

శూర్పణఖ మొహం మీద చిన్న హాస్యరేఖ మెరిసింది – "విల్లుని విరవడానికి అనేక మంది వీరులు అనేకసార్లు ప్రయత్నించి వుంటారు కదా? అసలే పాత విల్లు. అందరూ వంచి పెట్టిం తర్వాత ఇక విరవడానికి లెక్కేముందిలెండి. మీ చేతిలో విరగడం మీ అదృష్టం! సీత మీ భార్య అయింది!"

రాముడికి ఎన్నడూ రానంత కోపం వచ్చింది. తనకీ జ్ఞానంలేని స్త్రీతో మాటలేమిటి? తను చేసిన శివ ధనుర్భంగాన్ని ఆనాటి నుంచీ రుషులు ఏక వరసన గానం చేస్తోంటే .... ఆ కీర్తనలూ .... ఆ శ్లోకాలూ .... ఆ పూలవానలూ ... అన్నీ గుర్తొచ్చి ఆగ్రహం అధిక మైంది.

"అదృష్టం నాది కాదు. సీతదే! నేను భర్తగా లభిం చడం తన అదృష్టమని సీత ఎన్నోసార్లు చెప్పుకుంది తెలుసా?"

"స్త్రీలందరూ అలాగే చెప్పుకుంటారు స్వామీ! విజ్ఞులయిన వారు ఆ మాటలు నమ్మకూడదు. ఆ విల్లు ఎవరు విరిస్తే వారికే ధర్మపత్నై, వారితో 'మీరు లభిం చడం నా అదృష్టం' అనేది కాదా సీత?"

రాముడు తీక్షణంగా ఇటూ అటూ చూశాడు. స్త్రీలకు ఇటువంటి తర్కాలా? దూరంగా చెట్లలో వున్న పర్ణశాలల వేపు చూశాడు – ఆ మాటలన్నీ సీతకు వినపడ్డాయేమోనని.

ఆ పాకల చుట్టూ వెదుళ్ళ దడినిండా తీగలు అల్లుకుని వున్నాయి. కప్పుల మీద కూరల పాదులు పాకి వున్నాయి. ఒక పాకలో లక్ష్మణుడు నిర్లిప్తిస్తూ వుంటాడు. ఇంకో పాకలో గడ్డాల చుట్టాలు వస్తే సీతతో పెద్దపెద్ద మాంసం కండలు కాల్పించుకుని తిని, రాముడిముందు కూర్చుని – ఏ శూద్రుడెక్కడ తపస్సు చేస్తున్నాడో, ఏ రాక్షస రాజెక్కడ క్రతువు చేస్తున్నాడో, ఆ అనాచార కార్యాలనెలా ధ్వంసం చేయాలో, ఏ రాజోత్తము డెవరితో యుద్ధం చేసి జయం పొంది శ్లాఘనీయుడయ్యాడో, ఏ రుషి పుంగవుడే వరం పొంది మహనీయుడయ్యాడో – ఆ లోక సమాచారం అంతా చర్చించి, కాస్సేపు మహ దానందంతో చిడతలు బాదుతూ పాటలు పాడి – ఓం కారాలమధ్య తేనుపులతో, ఆవలింతలతో నిద్రలకు పడతారు.

ఆ పెద్ద పాకలో మాత్రం రాముడు తన ధర్మపత్నితో నివశిస్తూ వుంటాడు.

రాముడు అటు చూసేసరికి, సీత దడి పొడుగునా ఆరేసిన నార పంచెలు తీసి దులిపి మడతలు పెడు తోంది.

శూర్పణఖ అంతదూరం నించి సీతని చూస్తూనే వుంది. 'సీత చక్కనిదే! చెక్కిన బొమ్మలాగ వుంది. ఇంత అందమైన భార్య వుండడం చేతనేనా రాముడు ఏక పత్నీ వ్రతుడైనది? అయ్యో! భార్యల అంద చందాలు భర్తలకు కనిపిస్తాయా, పర పురుషులకు కనిపిస్తాయి గానీ?

ఈ పురుషుడు కూడా అటువంటివాడే అయితే, నా ప్రేమనీ, నా సౌందర్యాన్నీ ఇతడికే అర్పించాలని ఇంత తపన కలుగుతుందా నాకు?

సీత మళ్ళీ బయటికి వచ్చి నది రేవులో కడవ ముంచి, నిండు కడవ భుజం మీద ఆన్చుకుని లోపలికి తీసుకుపోతోంది.

సీత చక్కదనం చూస్తోంటే శూర్పణఖకు సంతో షమూ విచారమూ కూడా కలిగాయి. "స్వామీ! నా విన్నపం ఆలకించండి! ఆగ్రహించకండి! తమరు అను మతిస్తే, మీ భార్యని నేనే ప్రార్థించి సుముఖురాల్ని చేసు కుంటాను. నిత్యమూ ఆమె పనులన్నీ నేనే చేసి, ఆమె దయ సంపాదిస్తాను. నన్ను అనుమ తించండి!" అని సిగ్గుతో తలవాల్చింది.

రాముడి నేత్రాలు క్షణకాలం మెరిశాయి. అంతలోనే మొహమంతా నిరుత్సాహం ఆవరించింది – "ఏ స్త్రీ అయినా భర్తని ఇంకో స్త్రీతో పంచుకోవడానికి ఇష్టపడుతుందా సుందరీ?"

"పతివ్రతలు ఇష్టపడతారు స్వామీ కీర్తికోసం. పతివ్రతలు భర్తల్నీ బిడ్డల్నీ సునాయాసంగా త్యాగం చేస్తారు. మా అన్నల భార్యలు, భర్తల ప్రీతికోసం సవతుల్ని భరించడం చూస్తున్నాను కదా? ఎందరో స్త్రీల ప్రవర్తనలు ఎరిగిన దానినే కదా?"

రాముడు తల పక్కకు తిప్పి ఆలోచనలో మునిగినట్టు కనిపించాడు, ఒక్క క్షణం! – సీత మహా పతివ్రతే. తన కోసం అగ్నిలో ఉరకడానికైనా సిద్ధపడగలదు. కానీ .... తన వ్రతం? .... తన కీర్తి?

"ప్రభూ! మరొక్క సందేహం తీర్చండి! నా మనోరథం ఈడేరే మార్గం నాకు గోచరిస్తోంది. పర స్త్రీతో 'వివాహం' జరిగితేనే కదా మీ ఏక పత్నీవ్రతం భంగపడేది? వివాహం లేని స్త్రీ మీకు 'పత్ని' కాజాలదు కదా? నా వల్ల మీ వ్రతానికి భంగం కలగనివ్వను. నేను మీతో వివాహ బంధాన్ని కోరను. మీ ధర్మపత్నితో కాలం గడపగా మిగిలిన ఇటువంటి క్షణాలలోనే నాకు మీ సాన్నిధ్యం ప్రసాదించండి! నా సేవనీ, నా ప్రేమనీ స్వీకరించి మీ అనురాగామృతం ప్రసాదించండి!"

రాముడి ముఖంలో ఒక ఆలోచనా తరంగం పరిగెత్తింది. విస్మయంగా చూశాడు – 'పత్ని కాని స్త్రీతో గడిపితే ఏక పత్నీ వ్రతానికి భంగం కాదా? ఈ సందేహం ఎన్నడూ కలగలేదే! భంగం ఎలా అవుతుంది? .... పత్నికాని స్త్రీ అయినప్పుడు? వివాహమే లేనప్పుడు? అటువంటి స్త్రీని పత్నిగా శాస్త్రాలు ఒప్పుకోవు కదా? పత్నిగాని స్త్రీతో .... అది వ్రత భంగం అవుతుందా?

శూర్పణఖ బిడియపడుతూ తలవంచుకుంది. ఆకాశం మీద ఎరుపు శూర్పణఖ చెంపల మీద ప్రతిఫలిస్తోంది. శూర్పణఖ నీడ నది కెరటాల్లో కదులుతోంది. కెరటాలు గాలితో సరాగాలాడుతున్నాయి. గాలి, కొమ్మల్ని ఊపి పువ్వుల్ని జలజలా రాలుస్తోంది. శూర్పణఖ, జుట్టుమీదా దుస్తుల దారాల మీదా పూలు చిక్కి, విరబూసిన తంగేడు మొక్కలాగ అయింది.

రాముడు, ఆలోచనలతో సతమతమవుతూ, జుట్టు మీదా భుజాల మీదా పూలరేకులు దులుపుకుంటూ, అశాంతిగా చూశాడు – "సుందరీ! నన్నేమి కోరుతున్నావు?"

శూర్పణఖ నిలువెల్లా పులకించింది. కన్నుల్లో నీటితో – "ప్రియా! నన్నే కోరుకోమని శెలవిచ్చారా? మీ కరుణాపూరితమైన చూపులూ .... మీ సుందర బాహుస్పర్శలూ .... మీ మధురాలింగనాలూ, ....! ఈ అరణ్యాలలో, నదీ తీరాలలో, పూల వనాల్లో మీతో .... ఈ ప్రకృతిలో నా మనో శరీరాల ఐక్యం, మీతో నా జన్మ జన్మల బాంధవ్యం ...."

రాముడు తన్మయంగా వింటున్నాడు. చిరునవ్వుతో, అరమోడ్పు కళ్ళతో దీర్ఘంగా చూస్తున్నాడు.

శూర్పణఖ, మాటలు ఆపి తీర్పుకై నిలబడ్డ అపరాధి వలె చూసింది.

రాముడు తల వంచి దీర్ఘాలోచనలో మునిగాడు. పత్ని కాని స్త్రీతో ఐక్యం, ఏక పత్నీవ్రత భంగమేనా? శాస్త్రాలన్నీ నేర్చిన తనే ఈ సందేహ నివృత్తి చేసుకోలేకపోతున్నాడే! .... ఋషులు ఏమని సెలవిస్తారు?

సీత .... దుఃఖపడుతుందా? లక్ష్మణుడు .... విచారపడతాడా? .... ఈ సుందరి ... ధర్మపత్ని కాదు కదా? ఇది శాస్త్రోక్త వివాహమే కాదు కదా?

ఋషులు నిత్యమూ 'శ్రీరామచంద్రా' అని తనని పూజిస్తారు. తన వ్రత నియమాల్ని శ్లాఘిస్తారు. వ్రత భంగం జరిగితే? అసలు ఇది వ్రత భంగమా? .... పత్ని కాని .... వివాహమే లేని ....!

రాముడు ఎంత చతురుడైనా, తన సోదరుణ్ణీ, ధర్మపత్నినీ, ఋషి పుంగవుల్నీ అర్థం చేసుకోలేకపోయాడు.

లక్ష్మణుడు, అన్నగారిలో దోషం వెతికేటంత స్వతంత్రుడు కాడు. అన్నకు వినయ విధేయతలు చూపడమే అతని వ్రతం!

ధర్మపత్ని సీత, మహా పతివ్రత. భర్తవల్ల ఎంత దుఃఖం కలిగితే ఆమెకు అంత ఆనందం! ప్రతివ్రతలు కోరేది భర్తల అనురాగం కాదు; తమ పాతివ్రత్య ప్రదర్శనకు అవకాశాలు ఎక్కువై తమ కీర్తి కాంతులు మరింత ప్రజ్వరిల్లడం! శ్రీరాముడు స్త్రీలోలుడైతే, సీతాదేవి పాతివ్రత్యదీక్ష వెయ్యి రెట్లధికమవుతుంది.

ఋషుల సంగతా? శ్రీరాముడిలో ఏ వికారం పుట్టుకొచ్చినా, ఋషులు దాన్ని కొత్త అర్థాలతో గానం చేస్తారు!

కానీ, రాముడు వారిని అర్థం చేసుకోలేక, నిష్కారణ భయాలతో సంకోచిస్తూ ఇంకా ఆలోచిస్తూనే వున్నాడు.

దీర్ఘాలోచనలో మునిగి, తల వోరగా వంచి రాముడు కూర్చున్న తీరు శూర్పణఖకు అమితంగా ముద్దుగొలిపింది. కళ్ళలో సిగ్గుతో, చెక్కిళ్ళమీద కాంతితో, ప్రేమ పారవశ్యంలో – "ప్రియా!" అంటూ సమీపంగా రాబోయింది.

రాముడు, తృటిలో జరగబోయే ఘోరాన్ని నివారించే తొందరలో "ఆగు సుందరీ! ఆగుమాగుము! ...." అంటూ చేతులడ్డంపెట్టి, వెంటనే చేతులు వెనక్కి లాక్కుని, బాణం అడ్డం పెట్టి కంపిస్తూ తీక్షణంగా

చూశాడు.

శూర్పణఖ సిగ్గుపడిపోయింది. పరాభవం జరిగినట్టు ఖిన్నురాలై తల వాల్చేసింది. మరుక్షణంలోనే శూర్పణఖకి తను చేసిన తప్పు తెలిసి వచ్చింది. ఎదటి హృదయం తనని కోరనప్పుడు, తను ఆ పురుషుణ్ణి ఆకర్షించబోవడం .... ఆ విముఖతని గ్రహించక పోవడం .... ఎంత దోషం! ఎంత ఆత్మాభిమాన రాహిత్యం! అయ్యో, ఎంత వివేకం లేని తనం!

నిరాశగా నిలబడి వున్న శూర్పణఖని ఆపాద మస్తకం పరికిస్తూ రాముడు చిన్న నవ్వుతో "నేను ఏక పత్నీ వ్రతుడినని ప్రకటించానే!" అన్నాడు.

"మన్నించండి స్వామీ! మీనోటి ద్వారా విన్నది ఆ మాటలే. కానీ, మీ నేత్రాలు నాలో చాలా ఆశలు కలిగించాయి. మీ చూపుల్లో శృంగార భావాలు .... మీ చేష్టల్లో రహస్య ఆహ్వానాలు .... నాలో ఎన్నెన్నో భ్రమలు రేపాయి. మీరు సత్యవ్రతులు! అసత్యమెరుగని దీక్షా పరులు! నాకీ సందేహం తీర్చండి! నా దేహాన్ని తాకాలనీ, నన్ను ఆలింగనం చేసుకోవాలనీ, మీకు కోరికే కలగలేదా? మీ నేత్రాలు నాకు అసత్యం చెప్పాయా?"

రాముడు తటపటాయిస్తూ నవ్వాడు – "స్త్రీల అందచందాలు గ్రహించలేని జడుణ్ణి కాను. మిల మిలలాడే నీ విశాల నేత్రాలు .... నీ సన్నని నడుము .... నీ ఉన్నత వక్షోజాలు .... నీ .... సౌందర్యరాశివి నువ్వు .... కానీ, నువ్వు పర స్త్రీవి! .... నేను ఏక పత్నీ వ్రతుణ్ణి! ఇది లోకంలో ఏ పురుషుడూ పాటించని వ్రతం సుమా!"

మనసు, కోరుతోంది! కీర్తి, నిరోధిస్తోంది!

వ్రతం, వ్రతం! కీర్తి, కీర్తి!

శూర్పణఖ నిరుత్సాహంగా నవ్వింది. "శ్రీరామా! భయపడకండి! మీ కీర్తి కాంతులకు నా వల్ల కళంకం రానివ్వను. మీ అంతరంగం నాకు అవగతమయింది. అది చాలు నాకు. సెలవు తీసుకుంటున్నాను" అని ఒక్క క్షణం నిలబడి కదిలింది.

వెనక చూపు లేకుండా పది అడుగులు నిరుత్సాహంగా నడిచింది.

అంతవరకూ శూర్పణఖ నించున్నచోటు శూన్యంగా .... అడవి అంతా శూన్యంగా .... గాలి పరిమళ రహితంగా .... ప్రకృతి నిర్జీవంగా .... హేమంత రుతు సౌందర్యమే వెలవెలబోయినట్టు తోచింది, గోదావరికి. శూర్పణఖ నీడ, నది కెరటాలలో కదిలి, ఆమెని వదల లేని కెరటాలు నిశ్శబ్దంగా నీడ వెంటపడ్డాయి.

రాముడు వెనకనించి "సుందరీ! ఏమా తొందర? వెళ్ళవచ్చును. నిలబడు!" అన్నాడు గంభీరంగా.

శూర్పణఖ నిలబడి వెనక్కి చూసింది ఆశ్చర్యంగా.

రాముడి అంతరంగం రకరకాల ఆలోచనలతో సతమతమవుతోంది, ఆమె ఎవరో తెలిసిన క్షణం నించీ! .... ఈమె రావణుడి చెల్లెలు! రాక్షస జాతి స్త్రీ! .... ఈమెని ఇంత సునాయాసంగా పోనివ్వడమేనా? .... "సుందరీ! నువ్వు నిరుత్సాహం చెందవలసిన పని లేదు. నువ్వు నన్నే చూశావుగానీ నా సోదరుణ్ణి .... లక్ష్మణుణ్ణి చూడలేదు. అతడు నా సేవాభాగ్యం కోసమే భార్యని విడిచి ఒంటరిగా నాతోపాటు అడవులకు వచ్చాడు. ఇన్ని సంవత్సరాలుగా స్త్రీ పొందు లేకుండా ఉన్నాడు. అన్నదమ్ములలో ఎవరైతే నేమి? .... నీ సౌందర్యంతో లక్ష్మణుణ్ణి ఆనంద పెట్టు! ...." అంటూ రాముడు శూర్పణఖని వార చూపుతో మందహాసంతో చూశాడు.

శూర్పణఖ విస్తుపోతూ చూసింది. అవమానం పొందినట్టు తదేకంగా చూసింది – "రామా! నేను నిన్ను కోరానుగానీ, నీ సోదరుణ్ణి కోరానా? పరస్త్రీని ఇంత అగౌరవపరచడమా!"

"లక్ష్మణుణ్ణి ఆనందపెట్టడం అగౌరవమా? కాదు. అతణ్ణి చూస్తే నువ్వే అతణ్ణి మోహిస్తావు .... లక్ష్మణా! .... ఇటు రా!"

రాముడి పిలుపు పూర్తి కాకముందే లక్ష్మణుడు ప్రత్యక్షమయ్యాడు. "ఆజ్ఞాపించండి! ఏమి సెలవు?" అంటూ అన్నగారి పాదాలదాకా వొంగి నమస్కారం చేశాడు.

శూర్పణఖ తల తిప్పకపోయినా లక్ష్మణుడు ఆమె కంటపడ్డాడు.

లక్ష్మణుడు తల వొంచి నడుం వొంచి, శరీరం వొంచి విల్లుమీద వొంగి నిలబడి వున్నాడు. అన్న ముందు వజ వజ వణుకుతున్నాడు. అంతలోనే మళ్ళీ చేతులు మోడ్చి అన్నకు నమస్కారం చేశాడు – "చిత్తం! ఏమి ఆజ్ఞ?" అని ఆజ్ఞాపాలనకు సిద్ధంగా నిలబడ్డాడు.

శూర్పణఖకు లక్ష్మణుడి ప్రవర్తన ఏవగింపు కలిగించింది. అతన్ని వింతగా చూసింది.

రాముడు శూర్పణఖని క్రీకంట పరికిస్తూ, "నా సోదరుణ్ణి చూశావు కదా? ఇతడు అందరి వంటి వాడు కాడు. నా ఆజ్ఞ లేకుండా గాలి కూడా పీల్చడు. రామ లక్ష్మణుల వంటి సోదరులు ఈ భువిలో లేరని ఋషులు కీర్తిస్తూ వుండడం నువ్వు ఎప్పుడైనా విన్నావా?" అన్నాడు.

లక్ష్మణుడు అన్నగారి మాటలకు పులకించి వొణుకుతూ మళ్ళీ నమస్కారం చేస్తూ – "మీ దయ! ఏమి ఆజ్ఞ!" అని మళ్ళీ అర్థించాడు.

ఈ అన్నదమ్ముల వ్యవహారం చాలా వింతగా తోచింది శూర్పణఖకి. తన అన్నలు ఎవరి ఆజ్ఞలకు ఎవరూ బద్ధులు కారు. ఎవరి స్వతంత్ర జీవనాలు వారివి. ఏ రాజకీయ తంత్రాంగంలోనయినా అభిప్రాయ

భేదాలు కలిగితే తీవ్రమైన తర్క వితర్కాలకు తలపడతారు .... ఈ సోదరులు వినోదం కలిగిస్తున్నారే! – తన నిరుత్సాహంలో కూడా హేళనగా నవ్వుతూ రాముడి వేపు చూసింది – "మీ సహోదరుడికేమీ వ్రత నియమాలు లేవా?"

"లేకేమి?" రాముడు దర్పంగా చూశాడు – "భాతృవాక్య పరిపాలనే ఇతడి వ్రతం! భాతృసేవే ఇతడి కర్తవ్యం! అందుకే భార్యని కూడా విడిచి నా వెంట వచ్చాడు."

"ఇతడి భార్య పతివ్రత కాదా?"

"కాకేమి? మహా పతివ్రత!"

"అయినట్లయితే, ఆమె, భర్తవెంట అడవులకు ఎందుకు రాలేదు?"

"సుందరీ! అధిక ప్రసంగం చెయ్యకు!" రాముడు కఠినంగా చూశాడు.

"ఇతణ్ణి ప్రేమ భిక్ష అర్థించు! నీ కోరిక నెరవేరుతుంది."

శూర్పణఖ విభ్రాంతిగా చూసింది. ఆగ్రహంగా రాముడి వేపునించి తల తిప్పింది.

లక్ష్మణుడు తల వేళ్ళాడేసి అన్నగారి పాదాలు చూస్తూ వొంగి భూమికి మూరెడెత్తులో నిలబడ్డాడు.

శూర్పణఖకి అంత నిరుత్సాహంలోనూ, ఆగ్రహంలోనూ ఆ దృశ్యం వినోదభరితంగా కనపడింది. లక్ష్మణుడితో మేలమాడాలనే ఉత్సాహం కలిగింది. "లక్ష్మణా! నిన్ను చూడకముందు ఏమో అనుకున్నాను కానీ ఇప్పుడు నిజం తెలిసింది. నీవే నా స్వప్న పురుషుడవి! నీ కోసమే నేను జన్మించాను. నీలో నా హృదయం గాఢంగా తగుల్కొన్నది. కరుణించి నాకు ప్రేమభిక్ష పెట్టమని కోరుతున్నాను" అని అతణ్ణి అలవోకగా చూసింది.

రాముడు, వినోదం చూసే చూపుతో, వ్యంగ్యమైన నవ్వుతో, నిలబడి వున్నాడు.

లక్ష్మణుడు అన్నగారికి నమస్కరిస్తూ– "అన్నగారూ! ఏమి శెలవు? ఈమెకు ప్రేమభిక్ష పెట్టమంటారా వొద్దంటారా?" అంటూ భూమివేపు మరింత వొంగాడు.

శూర్పణఖ, కోపం అభినయిస్తూ "ఇది పరులను అడిగే విషయమా? నీ సుందరాకారం నన్ను పరవశురాల్ని చేస్తోంది. మన మిద్దరం ఏకమై ఈ అరణ్యమంతా సంచరించుదాం! నా ప్రేమతో అయినా నిన్ను స్వతంత్రుణ్ణి చేస్తాను. రా ప్రియా! నిన్ను ముద్దాడవలెనని నా హృదయం తొందర చేస్తోంది" అంటూ లక్ష్మణుడి వేపు అడుగులు వేసింది.

లక్ష్మణుడు వొణుకుతూ – "అన్నగారూ! ఏమి శెలవు? ముద్దు ఇమ్మంటారా ఒద్దంటారా?" అంటూ అన్నగారి పాదాలవేపు చూశాడు.

శూర్పణఖ హేళనగా నవ్వింది – "పిరికివాడా! ఎందుకీ బానిసత్వం? అల్పాతి అల్ప క్రిమికీటకాలు కూడా స్వేచ్ఛని కోరుతాయే! నోరులేని పక్షులూ జంతువులూ స్వేచ్ఛగా అరుస్తాయే! గాలి, స్వేచ్ఛగా వీస్తుంది. ప్రకృతే స్వేచ్ఛతో ఎదుగుతుంది. మానవులకా ఇన్ని బంధనాలు? ఈ సంకెళ్ళలో మీ ఆత్మలెన్నడూ గింజుకోలేదా? స్వేచ్ఛకోసం మీ శరీరాలెన్నడూ పెనుగులాడలేదా?"

రాముడి కళ్ళల్లో పరిహాసపు చూపు మాయమైంది. క్రోధంతో కళ్ళు జేవురించాయి.

"లక్ష్మణా! విన్నావా దీని మాటలు?"

లక్ష్మణుడు కుపితుడై ఆ ఉద్రేకంతో నడుం ఎత్తాడు. "అన్నగారూ! ఎవత్తీ మూర్ఖురాలు? మీతో సంవాదం జరిపే సాహసమా దీనికి? ఆజ్ఞాపించండి! దీన్ని ఖండ ఖండాలుగా నరికి పోగులు పెడతాను" అంటూ విల్లు మీద ఊగాడు.

శూర్పణఖ నిర్భయంగా చూసింది. "మూర్ఖుడా! నీ మౌఢ్యాన్ని నువ్వు నరుక్కో! నీ బానిసత్వాన్ని నువ్వు హతమార్చుకో! పైనొకటీ లోనొకటీ తలిచే మీ వ్రత కపటత్వాల్నీ, మీ కీర్తి కాంక్షల్నీ, ఛెండాడుకో!

ఎందుకు మీ నిర్జీవ నిరర్థక జన్మలు? ఎందుకు మీ చలన రహిత శూన్య ఆత్మలు? పర స్త్రీని పరిహసించే మీరా ఆదర్శ పురుషులు? ఏమిటి మీరీ లోకానికి ఇచ్చే సందేశాలు? మీ పుటకలు ప్రకృతి ధర్మాలకే విరుద్ధాలు! జగత్ సౌందర్యానికే వికృతాలు! మీ చరిత్రలు మానవేతిహాసంలో కళంకాలు! ...."

లక్ష్మణుడు శూర్పణఖ మీదకు ఉరికి జుట్టు పట్టుకున్నాడు. పట్టలేని కోపంతో ఉగ్రుడౌతూ "అన్న గారూ! ఆలస్యం తగదు. శెలవీయండి!" అంటూ ఆజ్ఞకోసం తొందరచేశాడు.

రాముడు కఠినమైన చూపుతో శూర్పణఖని చూశాడు. – 'ఇది రావణుడి చెల్లెలు! శత్రు జాతి స్త్రీ! దీనికి ఇంత సౌందర్యమా! ఆదర్శ పురుషుల్ని కామంలోకి ఈడ్చి వ్రతభంగాలు చేసే నీచురాలు ఇది! .... నీతిలేని దీనికి .... పెద్దల ఎడల వినయ విధేయతలు లేని దీనికి .... సౌందర్యం ఎందుకు?

పితృవాక్య పరిపాలనే పుణ్యం కాకపోతే, కారడవుల్లో బతకడం శిక్ష కాకపోతే, నా సత్య వ్రతం ఆదర్శం కాకపోతే, ఇన్నాళ్ళూ ... ఇన్నేళ్ళూ ... నేను పడ్డ బాధలన్నీ నిరర్థకం కావలసిందేనా? వాటివల్ల పుణ్యం రాకుండా అన్నీ నిష్ఫలంగా పోవలసిందేనా?

శత్రుజాతి స్త్రీ పట్ల ఆదినించీ తలెత్తిన ద్వేషం .... ఆమె స్వేచ్ఛ మీద రేగిన క్రోధం .... ఆమె సంవాదంతో బయటపడ్డ తన కపటత్వం .... అన్నీ రాముడిలో కార్తి

న్యాన్ని పదింతలు అధికం చేశాయి.

పడమటి దిక్కున సూర్యుడు త్వరత్వరగా అంతర్ధాన మయ్యాడు. ఆ కనుచీకట్లో రాముడు ఎర్రబారిన నల్లని మొహంతో భయంకరంగా చూశాడు.

"లక్ష్మణా! ఇది రావణుడి చెల్లెలు! మన శత్రు జాతి స్త్రీ! నీచురాలు! దీన్ని దయదల్చి ఉపేక్షించే పని లేదు. కానియ్యి! ఆలస్యం చెయ్యకు! దీని అంద చందాలు ఏ పురుషుడికీ పనికిరాకుండా చెయ్యి! దీనికీ శిక్ష తగినదే!" అని హత్యల్లో ఆనందం పొందే చూపుతో కర్కశంగా నవ్వాడు.

శూర్పణఖ శక్తికొద్దీ "దుర్మార్గుడా! వొదులు! వొదులు!" అంటూ లక్ష్మణుడి చేతుల్లో పెనుగులాడింది.

చిన్నతనం నించీ అన్నకి నీడలా మసలుతూ, తనకు జరిగిన ఏ అవమానాన్నీ ఎన్నడూ ధిక్కరించడం నేర్చుకోని లక్ష్మణుడు .... తన అవమానాలన్నిటినీ వ్రత నియమంగా ఇముడ్చుకుని ఇముడ్చుకుని, దేన్ని రక్షించి దేన్ని శిక్షించాలో గ్రహించే ఆత్మోన్నత్యాన్ని అలవర్చుకోని లక్ష్మణుడు .... శూర్పణఖని ఉన్మాద బలంతో ఒడిసి పట్టేశాడు. ఎముకల్లేని లక్ష్మణుడి తోలు చేతులు, బుసలు కొట్టే సర్పాలలాగ శూర్పణఖ శరీరాన్ని .... ఒకచోట విడిపించుకుంటే ఒకచోట చుట్టుకుంటున్నాయి.

శూర్పణఖ అశక్తురాలయి పోయింది. లక్ష్మణుడు కసాయితనంతో శూర్పణఖని వొడిసిపట్టి – "నీచురాలా! నీ పాపానికి శిక్ష అనుభవించు!" అంటూ హత్యకన్నా హీనకార్యంగా ఆమె ముక్కూ, చెవులూ ఖండించాడు.[155]

శత్రుజాతి స్త్రీ పై జరిగిన చిత్రహింసలో శ్రీరామ చంద్రుడు మహదానందం అనుభవిస్తూ గంభీరుడై నిలబడ్డాడు. "చూస్తాను. దీని అన్న ఏమి చేస్తాడో!"

సూర్యుడు శ్రీరామచంద్రుడి చేష్టల్ని ఊహించాడో ఏమో ఎప్పుడో తప్పుకున్నాడు. సూర్యుడి వెనకాలే సూర్యకాంతి కూడా నెమ్మదిగా అంతర్ధాన మయింది. అడవి అంతా చీకటి కమ్మేసింది. పక్షులు గూళ్ళల్లో సర్దుకున్నాయి. జంతువులు పొదల్లో తలలు వాల్చాయి. నది చప్పుడు మానింది. ప్రకృతి అంతా మౌనం దాల్చింది.

అంత నిశ్శబ్దంలో శూర్పణఖ రక్తధారలతో, కోపోద్రిక్త నయనాలతో నిలబడింది. "శ్రీరామ చంద్రా! నీ సమస్త ఆదర్శ వ్రతాలకూ మించిన పుణ్య కార్యం చేశావు! రుషులు కీర్తించే నీ శక్తి సామర్థ్యాలు ఒక నిస్సహాయురాలిమీద ప్రదర్శించావు. నీ మనో వైకల్యం ముందు నా అంగవైకల్యం ఎంత పాటిది! ఈ అంగాలు లేకపోయినా, నాకీ ప్రకృతి కలకలాలూ పరిమళాలూ అనుభవమవుతాయి. నన్ను కురూపిని చేసి, నీ వికృత స్వరూపాన్ని బయటపెట్టుకున్నావు. నిన్ను మోహించి నేను పొందిన ప్రతిఫలం ఇది! ఏ నాటికైనా నువ్వు లోకంలో కీర్తి ప్రతిష్టలు సంపాదిస్తే, జనులందరూ నీ చరిత్రని నా ముఖం మీద చదువు కుంటారు. శ్రీరామచంద్రుడి చరిత్రని, శూర్పణఖ ముఖం మీద!"

శూర్పణఖ మాటలు ఆపి, వెనక్కి తిరిగి చీకటిలోకి, చెట్లలోకి, నిశ్శబ్దంగా నడిచి వెళ్ళిపోయింది.

దూరంగా పాకల వేపునించి – "కౌసల్యా సుప్రజా రామా ...." అంటూ రాత్రి భోజనాల ముందు మహోత్సాహంగా సంకీర్తనలు చేసే రుషుల కంఠాలు అడవి చీకట్లలో తేలుతున్నాయి. ★

# ఈ కథ గురించి:

'విష వృక్షం' కథలన్నిటిలోకీ మొట్టమొదట తయారైన కథ ఇదే.

ఈ కథలో రాముడి పాత్ర చిత్రణ మీద నాకు మొదటినించీ అసంతృప్తిగానే వుంది. రాముడి పాత్రని, 'కావ్యం'లో పాత్రగా చూసినా, 'పౌరాణిక కథ'లో పాత్రగా చూసినా, ఆ పాత్ర ప్రత్యేకతనిబట్టి,

---

**155. అరణ్యకాండ, సర్గ 18, శ్లోకాలు 19, 21:** "లక్ష్మణా! క్రూరులూ దుర్జనులూ నగు వారితో పరిహాసము కూడదు. కురూపియూ, అపతివ్రతయూ, పెద్ద పొట్టకలదియూనగు నీ రాక్షసిని, సీతకు అపకారము తలపెట్టినది గనుక, అంగవైకల్యము కలిగించుము .... రాముడు అట్లు పలుకగా మహాబలుడైన లక్ష్మణుడు, కోపించిన వాడై, కత్తినెత్తి ఆమె ముక్కుచెవులు ఛేదించెను."

ఈ అన్నదమ్ము లిద్దరూ చిన్నప్పుడు తాటకిని చంపి, ఆమె కళేబరానికి ముక్కూ చెవులూ కోశారు. అయోముఖికి కూడా అలాగే చేశారు. ఇక్కడ శూర్పణఖనీ అలాగే హింసించారు. ఈ నీచకార్యాలే రామదాసుల దృష్టిలో వీర కార్యాలూ, పుణ్య కార్యాలూ! ★

దానికి ఒక 'గాంభీర్యం' ఉండాలి, అది కపట గాంభీర్యం అయినా సరే! గాంభీర్యాన్ని చిత్రించడం అంటే గ్రాంధిక భాష రాయడం అని కాదు. ప్రవర్తనలోనే తేడా ఉండాలి. రాముడి పాత్రకి స్వభావంలో ఎంత అల్పత్వం ఉన్నా, ఆ పాత్ర నోటివెంట 'డొక్క చింపుతాను', 'సీతని ఎవడన్నా లేవదీసుకు పోతాడేమో' లాంటి మాటలు రాకూడదు. కానీ, గతంలో ఈ తప్పులు జరిగిపోయాయి. వేరే రచయితలు తయారుచేసిన ఈ కథ, ప్రారంభంలో అలాంటి పద్ధతిలోనే వుంది. నేను, కథా వస్తువు విషయంలో తప్ప, పాత్రల ప్రవర్తనల్లోనూ, సంభాషణల్లోనూ ఎక్కువగా కల్పించుకోకూడదనే అభిప్రాయంతో, మొదట్లో వాటిని అలాగే ఉంచాను. అయినా, తర్వాత ముద్రణల్లో, రాముడి పాత్రలో చిన్న చిన్న మార్పులు చేస్తూనే వచ్చాను. చివరికి ఈ ముద్రణ సమయంలో కూడా (3 భాగాలూ ఒకే సంపుటంగా వచ్చిన మొదటి ముద్రణలో) ఇంకా కొన్ని మార్పులు చేశాను. అలాంటి సంభాషణలు తీసేశాను.

రాముడి పాత్రలోలాగే, లక్ష్మణుడి పాత్రలోనూ, సీత పాత్రలోనూ కూడా ఈ ముద్రణలో కొన్ని మార్పులు జరిగాయి. ఇవి చిన్న చిన్నవే.

శూర్పణఖ పాత్రలో, గతంలో, "స్త్రీ ఒకరిదా? ఒక పురుషుడికి స్వంతమవు తుందా?" లాంటి మాటలు కొన్ని ఉన్నాయి. వీటిని సరిగా అర్థం చేసుకోకపోతే, అనేక రకాల అపార్థాలకు దారితీస్తాయి. వీటిని గురించి, తర్వాత ముద్రణల్లో కొత్త ఫుట్ నోట్లు ఇచ్చాను. కానీ ఇప్పుడు, ఆ ఫుట్ నోట్లతో అవసరం లేకుండా అలాంటి సందర్భాలన్నిటినీ కథలోనే మార్చాను. ఈ కథ పరిధికి తగినంత వరకూ ఆ మార్పులు చేశాను.

ఆ మార్పులవల్ల, గత ముద్రణల్నీ, ఈ ముద్రణనీ చూస్తే, ఈ కథ అక్కడక్కడా ఒకే రకంగా వుండకపోవచ్చు. గతంలో వుండే కొన్ని సంభాషణలు ఇప్పుడు లేకపోవచ్చు. ఇప్పుడు కొన్ని కొత్త సంభాషణలు కనపడవచ్చు. కానీ, ఈ మార్పులేవీ కథ నడకని మార్చేవి కావు. పాఠకులు దీన్ని గమనించాలి. ★

# లింకు - 3

# 3వ కథ తర్వాత 4వ కథ వరకూ

[**3**వ కథ – లక్ష్మణుడు, రాముడి ఆజ్ఞతో శూర్పణఖని ముక్కూ చెవులూ కోసి విడిచి పెట్టడంతో ముగుస్తుంది. **4**వ కథ – శూర్పణఖ, రావణుడి దగ్గరకు వెళ్ళడంతో ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య ఉన్న కథా భాగం ఇది.]

**శూ**ర్పణఖ, ఒంటి నిండా రక్త ధారలతో, అక్కడికి సమీపంలోనే ఉన్న ఖరుడి దగ్గిరికి వెళ్ళింది.[156]

ఆమెని చూడగానే ఖరుడు నిర్ఘాంతపడి, "ఏమిటీ ఘోరం? ఏ దుర్మార్గుడు చేశాడు నిన్నీ విధంగా?" అని గర్జించాడు.

శూర్పణఖ, తను రాముణ్ణి చూడడం, అతణ్ణి వివాహం చేసుకొమ్మని కోరడం, ఆ అన్నదమ్ములిద్దరూ తనని పరిహసించడం, క్రూరంగా తన ముక్కూ చెవులూ

**156.** శూర్పణఖ గత చరిత్ర 'ఉత్తరకాండ'లో తెలుస్తుంది. సర్గ 23, శ్లోకాలు 18, 19 + సర్గ 24, శ్లోకాలు 35..44: ➔

కోయడం – అంతా చెప్పింది.[157]

ఖరుడు పట్టరాని కోపంతో 14 మంది వీరుల్ని పిల్చి "శూర్పణఖకు జరిగిన అవమానం మనం సహించ రానిది. మీరు వెంటనే వెళ్ళి ఆ దుర్మార్గుల్ని అంతం చేసి రండి" అని ఆజ్ఞాపించాడు.

ఆ సైనికులు రాముడి మీదకు యుద్ధానికి వెళ్ళారు.

రాముడు బంగారు కట్ల విల్లు తీసుకుని (రుషికి బంగారు కట్ల విల్లు!) రాక్షసులకు ఎదురుగా నిల్చు న్నాడు. "మేమెవరమో తెలిసే వచ్చారా? దశరథ మహా రాజు పుత్రులం! తపోధర్మంతో కందమూలాలు తింటూ ఆత్మనిగ్రహంతో కాలం గడుపుతున్నాం. మా వంటి నిర్దోషుల్ని హింసించడానికి వచ్చారా?" అన్నాడు.

"నువ్వు, మా రాజైన ఖరుడికి కోపం తెప్పించావు. నిన్ను చంపకుండా మేం తిరిగి పోతామా?" అన్నారు రాక్షస వీరులు.

"అసలు మిమ్మల్ని హతమార్చి రుషుల్ని రక్షించాలనే నేను ఆయుధాలతో అరణ్యాల కొచ్చాను. ప్రాణాలమీద ఆశ వుంటే పారిపొండి" అన్నాడు రాముడు.

రాక్షస సైనికులు, రాజు ఆజ్ఞ గుర్తు తెచ్చుకుని యుద్ధానికే తలపడ్డారు.

కొంతసేపు యుద్ధం జరిగింది.

రాముడు నెగ్గాడు (కవిగారి దయవల్ల!) రాముడు, బంగారు ములుకులు గల బాణాలతో ఆ సైనికులందర్నీ చంపేశాడు.

ఈ సంగతి విని శూర్పణఖ కోపం పట్టలేక, ఖరుడితో – "నువ్వే స్వయంగా వెళ్ళి ఆ దుర్మార్గుణ్ణి చంపు! లేకపోతే ఇక్కడ చేరిన శత్రువులనించి ఈ జన స్థానాన్ని ఎలా రక్షిస్తావు?" అంది.

ఖరుడు 14 వేల మంది సైనికుల్ని తీసుకుని బయ ల్దేరాడు. అతనికి, దారిలో చాలా అపశకునాలు కని పించాయి. మేఘాల్లోంచి ఎర్రటి నీళ్ళు కురిశాయి. ఖరుడి రథంమీద గద్ద వొచ్చి వాలింది. జంతువులన్నీ భయంకరంగా కూశాయి. సరస్సుల్లో తామర పూలన్నీ ఎండిపోయాయి. సైన్యం వెళ్తున్న దారి పొడుగునా చెట్లకు పళ్ళూ పువ్వులూ లేకుండా మాయం అయి పోయాయి. (సైనికులు పళ్ళన్నీ తినేసి, పూలన్నీ కోసే శారు గావున్ను. లేకపోతే, పళ్ళూ పువ్వులూ కూడా రాముడి పక్షమే కాబోలు. ఖరుడి పక్షానికి అందకూడదని

➔ ఖరుడు, శూర్పణఖ పినతల్లి కొడుకు. రావణుడు గతంలో అనేక ప్రదేశాలు జయించి, దండకారణ్యంలో 'జనస్థానం' అనేచోట ఖరుణ్ణి కొంత సైన్యంతో తన తరఫున రాజ ప్రతినిధిగా ఉంచాడు. రావణుడు, గతంలో చేసిన ఒక యుద్ధంలో; శూర్పణఖ భర్త అయిన విద్యుజ్జిహ్వుణ్ణి తెలిసే చంపేశాడు. తర్వాత శూర్పణఖ దుఃఖపడుతోంటే, తను ఆ యుద్ధోన్మాదంలో తెలీక చంపేశాననీ, విచారించవద్దనీ, శూర్పణఖ కేమీ లోటు లేకుండా చూసుకుంటాననీ ఓదార్చి, ఆమెని జనస్థానంలో ఉండమని చెప్పాడు. అప్పటి నించీ శూర్పణఖ అక్కడే ఉంటోంది. ఖరుడు ఆమెని ప్రేమగా చూసుకుంటున్నాడు. శూర్పణఖ, రావణుడివల్లా రాముడివల్లా కూడా నాశనం అయింది. రావణుడు ఆమె భర్తను చంపాడు. రాముడు, ఆమె అవయవాలు నరికించాడు. ★

**157. అరణ్య, సర్గ 19, శ్లోకాలు 14, 15, 16 + సర్గ 34, శ్లోకం 11:** శూర్పణఖ ఖరుడితో చెప్పిన మాటలన్నీ రాముణ్ణి, గొప్పగా పొగుడుతూ చెప్పింది. – "ఆ మహానుభావులు దేవతలవలె వెలిగిపోతూ ఉన్నారు. సౌందర్యరాసులు. ఆత్మ నిగ్రహులు. తపస్సంపన్నులు. పుణ్యాత్ముడైన రాముడు స్త్రీని చంపగూడదని సందేహించే నన్ను చంపకుండా, అవమానం మాత్రం చేసి విడిచిపెట్టాడు" అని చెప్పింది. ముక్కూ, చెవులూ కోసి బాధించిన వాళ్ళని ఎవరైనా పొగుడుతారా? శూర్పణఖే కాదు, మొత్తం రామాయణం చివరి వరకూ రాముడి శత్రువు లందరూ రాముణ్ణి కీర్తిస్తూనే ఉంటారు. రావణుడు కూడా, రాముడి మీద కోపంతో కూడా – "ఆ మహాను భావుణ్ణి సంహరిస్తాను" అంటూ ఉంటాడు. ఇదీ రామాయణ కవిగారి పాత్ర చిత్రణా ప్రతిభ! ఏ పాత్ర ఏ రకంగా మాట్లాడాలో, శత్రువుని అయినా ఏ సందర్భంలో పొగిడి, ఏ సందర్భంలో తిట్టాలో, కవి బొత్తిగా పట్టించుకోడు. రాముడి మీద కవికి భక్తి ఉండొచ్చు. పాఠకులకూ ఉంటే ఉండొచ్చు. రాముడి శత్రువులకు కూడా భక్తి వుంటుందా? శత్రువులకు రాముణ్ణి తిట్టిపోయ్యాలనీ, నరకాలనీ, చంపాలనీ ద్వేషమే ఉరకలేస్తూ ఉంటుంది కదా? అలా ఉన్నట్టే చూపించాలి కవి. కానీ, ఎక్కడా అలా వుండదు.

**ఇంకో విషయం:** శూర్పణఖ, తను రాముణ్ణి పెళ్ళి చేసుకోమని అడిగిన సంగతి వాల్మీకి ప్రకారం, ఖరుడి దగ్గరగానీ, రావణుడి దగ్గిరగానీ చెప్పలేదు. కానీ, రాముడికీ, రావణుడికీ యుద్ధం జరుగుతూ వుండగా, లంకలో జనం చచ్చిపోతూ ఉన్నప్పుడు, లంకలో స్త్రీలు – "అయ్యో! అసలు శూర్పణఖ రాముణ్ణి మోహించడం ఎందుకూ? మనకీ కష్టాలన్నీ ఎందుకూ?" అని ఏడుస్తారు. (యుద్ధకాండలో, 95వ సర్గలో 7 నించి 16 శ్లోకాలు:) దీన్నిబట్టి, శూర్పణఖ రాముణ్ణి పెళ్ళి చేసుకోమని అడిగిన విషయం లంక ప్రజలందరికీ తెలిసిందే అని స్పష్టం అవుతోంది. అందుచేత, ఈ లింకులో, శూర్పణఖ ఏమీ దాపరికం లేకుండా జరిగిందంతా అన్నలకు చెప్పినట్టే రాశాను. ★

మాయం అయ్యాయి.)[158]

ఆకాశంలో దేవతలూ, రుషులూ, విమానాలలో గుంపులు గుంపులుగా కూడి – "ఈ యుద్ధంలో రాముడే జయించాలి. ఈ రాక్షసులందరూ నశించి పోవాలి. బ్రాహ్మణులూ, గోవులూ క్షేమంగా ఉండాలి" అంటూ మాట్లాడుకోవడం ప్రారంభించారు.

రాముడుండే ప్రదేశంలో పక్షులు మధురంగా కూస్తున్నాయి. గాలి చల్లగా వీస్తోంది. రాముడు లక్ష్మణుడితో – "లక్ష్మణా! దూరంగా కనబడుతోన్న ఆ ఉత్పాతాలూ, ఇక్కడ ఈ శుభ శకునాలూ, చూశావా? రాక్షసులంతా నశించిపోతారనీ, మనకే జయం కలుగుతుందనీ, ఈ శకునాలు సూచిస్తున్నాయి. అందుకేమీ సందేహం లేదు. నువ్వు వెంటనే సీతని ఆ చెట్ల మధ్య గుహలోకి తీసుకెళ్ళి కాపాడుతూ ఉండు. శత్రువులందర్నీ నేనే సంహరిస్తాను. ఎదురు చెప్పవద్దు! నా పాదాలు నిన్ను శాసిస్తున్నాయి" అని లక్ష్మణుణ్ణి ఆజ్ఞాపించాడు.[159]

లక్ష్మణుడు సీతని వెంటబెట్టుకుని ఒక గుహలోకి వెళ్ళి, గుమ్మం దగ్గిర కాపలా ఉన్నాడు.

రాముడు కవచం తొడుక్కుని, కత్తి నడుంకి కట్టుకుని, ధనుస్సు పట్టుకుని సిద్ధంగా ఉన్నాడు (ఆహా, రుషీ! రామ రుషీ!)

ఖరుడి సైన్యం వొచ్చి పడింది. ఘోర యుద్ధం ప్రారంభమైంది. 14 వేల మంది రాక్షసులూ రాముడి చుట్టూ జేరి, ఈటెలూ, బల్లేలూ, గండ్ర గొడ్డళ్ళూ, చక్రాలూ, గదలూ, రోకళ్ళూ, బాణాలూ, గుప్పించినా రాముడు అన్నీ ఎగరగొట్టేశాడు. పైగా, రాక్షస సైన్యాన్నంతటినీ– వారి గుర్రాల్నీ, గుర్రాలమీద యోధుల్నీ; ఏనుగుల్నీ, ఏనుగులమీద వీరుల్నీ, ఏనుగుల్ని నడిపే మావటి వాళ్ళనీ; రథాల్నీ, రథాలమీద సేనాపతుల్నీ, రథసారథుల్నీ – భుజాలూ, తొడలూ, నడుములూ, వీపులూ, కంఠాలూ, శిరస్సులూ, ముక్కలు ముక్కలుగా ఎగరగొట్టేస్తూ యుద్ధం చేశాడు.

నూరుమంది శత్రువుల గుంపుమీద నూరు బాణాలూ, వెయ్యి మంది గుంపుమీద వెయ్యి బాణాలూ, ఐదు వేలమంది గుంపుమీద ఐదు వేల బాణాలూ, వేసి చంపేశాడు (ముందు ఆ గుంపులో ఎంత మంది ఉన్నారో శత్రువుల్ని లెక్కపెట్టుకుని, తర్వాత బాణాల్ని లెక్క పెట్టుకుని ....!)

ఆకాశంలో దేవతలూ, బ్రాహ్మణోత్తములూ మహా సంతోషంతో యుద్ధం చూస్తున్నారు. (రాక్ష సులు, నాలుగు కత్తులు పైకి విసిరితే బాగుండేది!)

రాముడు ఒక చేత కత్తితో యుద్ధం చేస్తూనే, రెండో చేత్తో బాణాలు గుప్పించేస్తున్నాడు. (నమ్మకండి, వెధవ అబద్ధాలు!) రాక్షస సైన్యంలో చావగా మిగిలిన వాళ్ళు "శరణు, శరణు" అంటూ ఖరుడి దగ్గిరికి (రాజు దగ్గిరికి) పారి పోయారు.

ఖరుడి ముఖ్య సేనాధిపతి దూషణుడు, సైనికులకు మంచి మాటలు చెప్పి ప్రోత్సహించి మళ్ళీ యుద్ధంలోకే మళ్ళించాడు.[160]

సైనికులు నూతనోత్సాహంతో (చావుకోసం ఉత్సాహంతో), రాముడి చుట్టూజేరి ఆయుధాలు విసురుతూ ముట్టడించారు. రాముడు, చిరునవ్వుతో గాంధర్వాస్త్రం వేశాడు. (రాముడికి రుషులంతా మూటగట్టి ఇచ్చిన మంత్ర తంత్రాలున్నాయి. ఎన్ని వేల బాణాలు తీసినా తరగని అమ్ముల పొదులున్నాయి. రాక్షసులకు అవేమీ లేవు మరి!) సైనికుల్లో చాలా మంది చచ్చిపోయారు.

---

**158.** మత సాహిత్యంలో, అక్కడ జరిగే ఘట్టాన్నిబట్టి దుశ్శకునాలనో, శుభశకునాలనో వర్ణించడం ఒక సాంప్రదాయం. వెనకటి కాలం, ప్రకృతికి సంబంధించిన శాస్త్ర జ్ఞానం లేని కాలం అవడం చేత, వెనకటి వ్యవస్థల్లో మానవులు ప్రతీ క్షణం శకునాల్ని నమ్ముతూ ఉంటారు. సాహిత్యంలో, కవి తను సమర్థించే పాత్రల విషయంలో శుభ శకునాలూ, తను వ్యతిరేకించే పాత్రల విషయంలో అప శకునాలూ వర్ణిస్తాడు. ఒక్కో సందర్భంలో ఆ పాత్రలు చెయ్యబోయే, కార్యం, జరిగేటటువంటిదయితే శుభ శకునాలూ, జరగనిదయితే అప శకునాలూ వుంటాయి. ★

**159.** **అరణ్య, సర్గ 24, శ్లోకం 13:** రాముడు లక్ష్మణుణ్ణి "నేను నిన్ను శాసిస్తున్నాను" అంటే బాగానే ఉండేది. "నా పాదాలు నిన్ను శాసిస్తున్నాయి" అంటున్నాడు. రాముడి పాదాలు, రాముడికి కూడా పూజనీయంగా ఉన్నాయి! "ఆహా! ఇవి శ్రీరామచంద్రుడి పాదాలు కదా!" అని రాముడే అనుకుంటున్నాడు. అటువంటి ఆత్మస్తుతి, తన పాదాలకు తనే నమస్కారం పెట్టుకోవడం లాంటిది! ★

**160.** **అరణ్య, సర్గ 25, శ్లోకాలు 29, 30, 31:** సైనికులు పారిపోవటం, సేనాపతి వారికి మంచి మాటలు చెప్పడం, మళ్ళీ సైనికులు ఉత్సాహం పొంగి యుద్ధంలోకి ఉరకడం, చూడండి. మంచి మాటలంటే – "అసలు ఇప్పుడే మనం ధైర్యం వహించాలి. ఎవరు బాగా యుద్ధం చేస్తే వాళ్ళకి రాజు గొప్ప గొప్ప బహుమతులిస్తాడు. ఒకవేళ యుద్ధం చేస్తూ నేలకొరిగినా వీరస్వర్గం లభిస్తుంది. ఊఁ – రండి! కదలండి! విజయమో, వీరస్వర్గమో!" అని ఉద్రేకపర్చడం అన్నమాట! కాలాన్నిబట్టి యుద్ధాలు చేసే పద్ధతులు మారినా, సైనికుడికి బోధించేది మాత్రం ఎప్పుడూ ఇదే. ★

మిగతా వాళ్ళకీ నూత నోత్సాహం మళ్ళీ పాతబడిపోయి ప్రాణభయంతో వెనక్కి పరిగెత్తారు.

ఈసారి ఖరుడికి సైనికుల మీద అపరిమితమైన కోపం వచ్చేసింది. (ఈసారి మంచి మాటలు కాదు, బెదిరింపు!) – కోపంతో అందర్నీ కూడగట్టి మళ్ళీ యుద్ధంలో కొచ్చాడు.

కొంతసేపటికి ఖరుడి సేనాపతులూ, సైన్యమూ అంతా పోయారు. త్రిశిరస్సు అనే సేనాపతీ, ఖరుడూ మాత్రం మిగిలారు. (రావణుడికి త్రిశిరస్సు అనే కొడుకు ఒకడున్నాడు. కానీ, ఆ త్రిశిరస్సు వేరూ, ఈ త్రిశిరస్సు వేరూ.)

త్రిశిరస్సు ఖరుడితో – "రాజా! నేనుండగా నువ్వు యుద్ధం చెయ్యడం ఏమిటి?" అని తనే రాముడితో యుద్ధంచేసి, అందరూ వెళ్ళిన దారినే తనూ వెళ్ళిపోయాడు ('రాజభక్తి' అలా ఉండాలన్న మాట!)

ఖరుడు ఒక్కడూ మిగిలాడు. కొంత జంకినప్పటికీ యుద్ధానికే ఉరికాడు. త్వరలోనే రథం పోయి, సారథి పోయి, ఆయుధాలు పోయి, భూమి మీద నిలబడ్డాడు.

రాముడు గర్వంతో – "రుషి పుంగవుల్నీ, నిరపరాధుల్నీ హింసించే నీ వంటి దుర్మార్గుల్నీ, నీచుల్నీ చంపడానికే నేను రాజాజ్ఞతో వచ్చాను.[161] నువ్వు కూడా నీ సైన్యం వెనకాలే పోతావు" అంటూ అగస్త్య మహర్షి ఇచ్చిన వైష్ణవ ధనుస్సుతో యుద్ధం ప్రారంభించాడు.

ఖరుడు పెద్ద చెట్టు పీకి తెచ్చి దాంతో యుద్ధం చేశాడు. రాముడా చెట్టుని తునాతునకలు చేశాడు. – "ఇక నీ పని ముగిసింది. నీ భార్యలందరూ సుఖభోగాలు లేనివారై పోయినట్టే. (రాముడు, బూతు మాటలు కూడా మాట్లాడతాడన్న మాట!) నీ వంటి దుష్టుడు హతమారిపోగానే, బ్రాహ్మణులంతా క్షేమంగా ఉంటారు" అంటూ మళ్ళీ బాణాలు గుప్పించాడు.

చివరికి ఖరుడు కూడా చచ్చిపోయాడు. (కవిగారూ, దేవతలూ, బ్రాహ్మణోత్తములూ అంతా రాముడి పక్షాన ఉన్న తర్వాత, ఖరుడు చచ్చిపోక రాముడు చచ్చిపోతాడా?)

ఆకాశంలో వారంతా ఆనందంతో పొంగిపోయి రాముణ్ణి స్తుతిస్తూ పూల వాన కురిపించారు. దేవ దుందుభులు మోగించారు – "రామా! ఈ రాక్షసుల్ని చంపే విషయం గురించి రుషులతో మాట్లాడ్డానికే ఇంద్రుడు ఒకసారి శరభంగుడి ఆశ్రమానికి వచ్చాడు. ఈ పని నువ్వే చెయ్యాలని నిన్ను ఈ ప్రదేశానికి పిల్చుకొని వచ్చాము. ఆహా! గొప్ప కార్యం చేశావు" అంటూ కీర్తించారు.[162]

సీత, గుహలోంచి బయటికి వచ్చి, తన భర్తకేమీ ఆపద సంభవించనందుకు చాలా సంతోషించింది. (ఆ ఆపదలన్నీ ఇతర్ల భర్తలకే సంభవించినందుకు! ఇతర్లు ఎన్ని వేల మంది చచ్చిపోయినా సరే, తన భర్త ఒక్కడూ క్షేమంగా ఉండాలి పతివ్రతలకు!)

అకంపనుడనే గూఢచారి ఒక్కడూ రావణుడి దగ్గిరికి వెళ్ళి జనస్థానంలో జరిగిన యుద్ధం గురించి చెప్పాడు. (అకంపనుడు రాముణ్ణి గురించి చెపుతూ, 'ఆ మహానుభావుడు .... రాక్షసుల్ని చంపేశాడు. ఆ తపశ్శాలి .... ఖరుణ్ణి చంపేశాడు' అని, రాముణ్ణి పొగుడుతూ చెప్తాడు. పైగా అకంపనుడు, సీత అందాన్ని వర్ణించి సీతని ఎత్తుకు పొమ్మని రావణుడికి సలహా కూడా ఇస్తాడు. అకంపనుడు సీతని చూడనే లేదు. సీత, గుహలో వుంది కదా?)

తర్వాత, రావణుడు వెంటనే మారీచుడి దగ్గరికి వెళ్ళాడు. సీతని ఎత్తుకుపోవడానికి తనకి సహాయం చెయ్యమన్నాడు. మారీచుడు రాముణ్ణి పొగిడి రావణుణ్ణి చీవాట్లు పెట్టాడు. రావణుడు, రాముడి పరాక్రమం విని హడలిపోయి వెనక్కి వెళ్ళిపోయాడు.

తర్వాత రావణుడి దగ్గిరికి శూర్పణఖ వెళ్ళింది. శూర్పణఖ వెళ్ళి అంతా చెప్తూ ఉన్నప్పుడు, రావణుడు మళ్ళీ కొత్త విషయం విన్నట్టు విన్నాడు. మొత్తం మీద ఇక్కడ గందరగోళం వుంది. అంటే, ఈ సందర్భంలో రెండు రకాల కథలు కనపడతాయి. ★

---

**161.** **అరణ్య, సర్గ 29, శ్లోకం 10:** "నేను రాజాజ్ఞతో వచ్చాను" అంటున్నాడు రాముడు. అంటే, భరతుడి ఆజ్ఞతో లోకంలో ధర్మం స్థాపిస్తూ తిరుగుతున్నాడట రాముడు! ఈ సంగతి వాలి దగ్గిర ఇంకా స్పష్టంగా చెబుతాడు. కానీ కోసలలో భరతుడేమో, రాముడే రాజని, తను రాముడికి ప్రతినిధిగా రాజ్యం చేస్తున్నాడు. ఇక్కడ ఈయన, భరతుడి ఆజ్ఞల ప్రకారం సంచరిస్తున్నానంటున్నాడు. రాముడి కత్తికి రెండు వేపులా పదునే! ★

**162.** **అరణ్య, సర్గ 30, శ్లోకాలు 30, 31:** రాముడు, రాక్షసులతో యుద్ధం కోసమే రాక్షసుల ప్రాంతానికి వచ్చాడు! 'శూర్పణఖ రావడం చేతనే గదా, ఈ యుద్ధం జరిగింది?' అనిపిస్తుంది. కానీ, రాముడు రాక్షసులతో యుద్ధం కోసం ఎదురు చూస్తూ, దానికి శూర్పణఖ సందర్భాన్ని ఒక సాకుగా ఉపయోగించుకున్నాడు. రాముడు, రావణుడి భూమిలోకే వచ్చి తిష్టవేశాడు. వనవాసం వంకతో రాముడు, రాక్షసుల ప్రాంతం వరకూ చేరాడు! ★

## కథ-4

# అతనికంటే ఘనుడు!

శూర్పణఖ ఆత్మలో, దేహంలో, ప్రతీ అణువూ శత్రువుమీద ప్రతీకారంతో జ్వలిస్తోంది. ఇప్పుడు ఆమెకు చాలా స్పష్టంగా తెలుసు. రాముడు, తమ జాతికే శత్రువు, ఆ రుషి వేషం కపట వేషం– అని!

భర్తని మర్చిపోయిన తర్వాత .... ఇంత కాలానికి .... మళ్ళీ పురుషుడి మీద మోహం .... నూతనాను భవంలాగ ఆమెని తన్మయత్వంతో వెర్రిదాన్ని చేసింది. ఆమె హృదయంనించి వెన్నెలలాగ ఆపుకోలేని అను రాగం ఆ నీచుడి మీద కురిసింది. మరుక్షణంలో ఎంత విషాదం! శూర్పణఖ, రాముడి మీద కలిగిన మోహం గురించి ఆలోచిస్తోంటే, ఇప్పుడు సిగ్గుతో శరీరం కుంచించుకుపోతోంది. దుఃఖంతో ఆత్మ కంపిస్తోంది.

ఆ దుర్మార్గుడు తన శరీరానికే కాదు, తన జాతి ఆత్మాభిమానానికే మాయని గాయం చేశాడు. తనకెంతో ప్రియమైన అన్న మరణం .... జన స్థానంలో సర్వ నాశనం .... అంతా, తన తెలివి తక్కువ మూలంగానే. తను, శత్రువుని గుర్తించలేక పోవడం చేతనే.

లంకా నగరంలో అన్నకీ వార్త తెలిసిందా? ద్వేషంతో బుసలు కొడుతున్నాడా? అన్న, శత్రువుల్ని ఉపేక్ష చేసే అజ్ఞాని కాదు. ఏ రాజు మాత్రం శత్రువుల్ని ఉపేక్ష చేసి ఊరుకుంటాడు? రాజ్య లాభమో, ధన లాభమో, స్త్రీ లాభమో ఉంటే ప్రతీ రాజూ మిత్రుల్ని కూడా శత్రువుల్ని చేసుకుంటాడు. ఇక తన అన్న సంగతా? ఎంత వీరుడో అంత నిరంకుశుడు! అంత స్త్రీ లోలుడు! ఎన్నో యుద్ధాలలో జయాలు సాధించినవాడు! ఈ రాముడి మీద పగతీర్చుకోకుండా విడిచి పెడతాడా?

అన్నని తల్చుకోగానే శూర్పణఖ మనసు కొంచెం శాంతించింది.

శూర్పణఖ వెళ్ళక పూర్వమే రావణుడు చారుల ద్వారా జనస్థానంలో జరిగిన విషయాలన్నీ విన్నాడు. శత్రువుమీద బుసలు కొడుతూనే ఉన్నాడు.

దుఃఖపడుతోన్న శూర్పణఖని ఓదార్చి – “అంతా వివరంగా చెప్పు! పగ సాధించేవాణ్ణి నేనుండగా నువ్వింత బెంబేలు పడుతున్నా వెందుకు?” అంటూ చెల్లెల్ని ఓదార్చి మీసాలు మెలిదిప్పాడు.

శూర్పణఖ ఖరుడికి చెప్పినట్టే అంతా చెప్పింది. “అన్నా! జనస్థానంలో నన్ను క్షేమంగా ఉండమన్నావు. అక్కడంతా నీ శత్రువు ఆక్రమించాడు.”

రావణుడు అంతా విని, కొంతసేపు మౌనం వహించాడు – “ఇక నేను చెయ్యవలసింది ఆ శత్రువుని హతమార్చడమే. అది సరే! ఆ రాముడి భార్య మహా అందగత్తె అని విన్నాను. నిజమేనా? ఆమెని నువ్వు చూశావా?” అని ఆతృతగా అడిగాడు.

శూర్పణఖ కఠినంగా చూసింది – “ఈ స్త్రీ వాంఛ చేతనే ఎప్పుడే ఆపద సంభవిస్తుందో తెలుసుకోలేకుండా ఉన్నావు. నువ్వింత కాముకుడివై సుఖ భోగాలలో తేలుతూ వుంటే, ప్రజలు నిన్ను ఎంతో కాలం గౌర వించరు.”

రావణుడు నిర్లక్ష్యంగా నవ్వాడు – “ప్రజలు ఇచ్చే గౌరవం కోసమూ, ప్రజల ఇష్టాయిష్టాల ప్రకారమూ, రాజు, రాజ్యపాలన చేస్తాడా? ఒకరు చెప్పినట్టు చేసే రాజుని మాత్రం ప్రజలు గౌర విస్తారా? సైన్యం, బొక్కసం, సమృద్ధిగా ఉంచుకునే రాజు, దేనికీ జంకనవ సరం లేదు. రాజు శాసించే నీతే నీతి. సర్వ స్వతంత్రుడు కాని రాజు, సామాన్య జనులతో సమానం అయి పోతాడు. రావణుడికా గతి ఎన్నడూ పట్టదు. .... ఇంతకీ సీత సంగతి చెప్పవేం? అంత చక్కనిదా?” అని మళ్ళీ ఆతృతగా చూశాడు.

“చక్కనిదే. కానీ, మహా పతివ్రత అని కూడా విన్నాను.”

“ఆహా, పతివ్రత కూడానా? .... అయితే తప్ప కుండా సాధించవలసిందే!”

“అన్నా! రాముణ్ణి చంపకుండా ఆమె కాలిగోరు తాకడానికి కూడా సాధ్యం కాదు ఎవ్వరికీ!”

రావణుడు శూర్పణఖ మాటల్లో ఏమీ లక్ష్యం లేనట్టు నవ్వుతూ – “అతగాడు అంత వీరుడా?” అంటూ మళ్ళీ మీసాలు తిప్పాడు.

అన్నగారి ధోరణి చూస్తే, అతడి దృష్టి అంతా సీత మీదే ఉన్నట్టు తోచింది శూర్పణఖకి. “రాముడి మీద పగతీర్చుకోవాలని నీకేమీ ఆరాటం ఉన్నట్టు లేదే!” అని విస్మయంగా చూసింది అన్నని.

“అందుకే గదా తగిన ఉపాయాలు ఆలోచిస్తు న్నాను?”

“ఉపాయాలా? వెంటనే బయల్దేరిపోయి, యుద్ధం

చేసి రాముణ్ణి చంపక ఇంకా ఉపాయాలాలో చిస్తు న్నావా? సమయానుకూలంగా త్వరపడి కార్యాలు చేసు కోని రాజు, రాజ్యభ్రష్టుడై గడ్డిపరకతో సమానం అయి పోతాడంటారే! గడ్డీ గాదం, దుమ్మూ ధూళీ అయినా పనికి వస్తాయి గానీ, ఎంత వీరుడైనా, ఎంత సమర్థు డైనా, రాజ్యంపోయిన రాజు ఎందుకూ పనికి రాడం టారే! రాముడు నీకు ఎంత నష్టం చేశాడో, నీ తోబుట్టు వుని ఎంత అవమానం చేశాడో తెలిసికూడా నువ్వింకా ఉపాయాలు ఆలోచిస్తున్నావా? యుద్ధం చేసి అతణ్ణి చంపటానికింకా వెనకముందు లాడుతున్నావా?"[163]

"తొందరపడకు. అతడు వీరుడని నువ్వే అంటు న్నావు కదా?"

"నువ్వు అతణ్ణి మించిన వీరుడివి కాదా? అన్నా! రాముడి మీద కక్షతో నా హృదయం దహించుకు పోతోంది! నువ్వు వెంటనే బయలుదేరి వెళ్ళి ఆ దుర్మా ర్గుణ్ణి చంపెయ్యి!"

"తొందరపడకు! రాముణ్ణి చచ్చిన వాడితో సమానం చేస్తాను, సరేనా?"

"కాదు. ఆ దుష్టుడు చచ్చితీరాలి!"

"సరే, అదంతా నాకు విడిచిపెట్టు! నువ్వు నిశ్చిం తగా ఉండు!"

"ఆ రాముణ్ణీ, అతని తమ్ముణ్ణీ చంపేశానని నువ్వు నాకు చెప్పినప్పుడే నేను నిశ్చింతగా ఉంటాను."

"పిచ్చితల్లీ! నా పరాక్రమాన్ని శంకిస్తున్నట్టున్నావే! అనేక యుద్ధాలలో, పోరాటాలలో, నా శరీరమంతా మచ్చలతో, బొడిపెలతో ఎలా తయారయిందో చూడు! ఈ చేతులు బల ప్రదర్శనలతో ఆరితేరి ఎంత బండ బారాయో చూడు!" అంటూ రాళ్ళలాగ వున్న అరి చేతులూ, తొడలూ, భుజాలూ చూపించాడు రావణుడు.

"మరి రాముడితో వీరోచితంగా యుద్ధం చెయ్యక, ఉపాయాలెందుకు ఆలోచిస్తున్నావు?"

"పిచ్చిదానా! ఉపాయాలు కూడా యుద్ధంలో భాగమే. కత్తులతో కలబడడమే యుద్ధం అనుకుంటు న్నావా? శత్రువుని వంచించే ఏ కార్యమైనా యుద్ధమే!" అని ఆలోచనలో మునిగాడు రావణుడు.

శూర్పణఖ అసంతృప్తిగా చూసి అన్న దగ్గరినించి వెళ్ళిపోయింది.

దండకారణ్యంలో చెట్ల గుబుర్ల మధ్య, ఒక మారు మూల పాకలో, ఇద్దరు పురుషులు కూర్చుని రాజ కీయాలు మాట్లాడుకుంటున్నారు. అందులో ఒక వ్యక్తి, లంకాధిపతి రావణుడు. రెండో వ్యక్తి, అతని బంధువు మారీచుడు. మారీచుడు వినయంగా చేతులు కట్టుకుని, రావణుడి మాటలు వింటున్నాడు.

రావణుడు కోపంతో ఊగుతున్నాడు – "జన స్థానాన్ని ఆక్రమించడానికి వాడికెన్ని గుండెలు! తనే గొప్ప వీరుణ్ణనే మిడిసిపాటుతో, శూర్పణఖ నా తోబుట్టు వని తెలిసి కూడా, నిష్కారణంగా ఆమె అంగాలు ఛేదించి నాతో యుద్ధానికి కాలు దువ్వుతున్నాడు. తనని దేవతలు రావణ వధకే పుట్టించారని బీరాలు పలుకుతున్నాడట! ఆ దేవత లందర్నీ నా పరిచారకుల్ని చేసుకున్నాననే సంగతి ఆ రాముడికి తెలిసినట్టు లేదు. నా గుండెలు పౌరుషంతో మండి పోతున్నాయి. నా శత్రువుకి పరా భవం చెయ్యకుండా నే నూరుకోను. అతని భార్యని ఎత్తుకొస్తాను. నా తమ్ములూ, నా బంధుమిత్రులూ అందరూ నాకు అండగా నిలబడితే నేనెవ్వరికీ జంకను. ఈ కార్యంలో నువ్వు నాకు సహాయం చెయ్యాలి" అని ఆగాడు.

మారీచుడు గజగజ వణుకుతున్నాడు – సగం రావణుడి మీద భయంతో, సగం రాముడి మీద భయంతో! – "నా వంటి అభాగ్యుడు నీ వంటి మహా రాజుకేం సేవ చెయ్యగలడు?" అంటూ మోకరిల్లాడు రావణుడి కాళ్ళమీద.

"సీతకు పక్షులన్నా, జంతువులన్నా ప్రీతి అని విన్నాను. నువ్వు బంగారు లేడివై సీత కంటబడాలి. సీత నిన్ను పట్టుకోవాలని ప్రయత్నిస్తుంది. నువ్వు దొరక కూడదు. తర్వాత రాముడు నిన్ను పట్టుకోవాలని వెంట బడతాడు. నువ్వు రాముణ్ణి అడవిలో చాలా దూరం తీసుకుపోవాలి. తర్వాత అతడికేదో గొప్ప ప్రమాదం జరిగినట్టు భ్రమ కల్పించాలి. 'లక్ష్మణా! సీతా! రక్షిం చండి!' అని కేకలు పెట్టాలి. లక్ష్మణుడు కూడా రాముణ్ణి వెదుకుతూ బయటికి పోతాడు. సీత వంటరిగా చిక్కు తుంది. వెంటనే నేను ఆమెని నా రథంమీద ఎక్కించు కుంటాను!"[164]

మారీచుడు వెలవెల బోయాడు. ధైర్యం కూడగట్టు

**163. అరణ్య కాండ, సర్గ 33, శ్లోకాలు 17,18,19:** శూర్పణఖ రావణుణ్ణి హెచ్చరిస్తోంది. రాజు బలం అంతా ఆ వ్యక్తి స్వంత వీరత్వంలోనూ, స్వంత సామర్థ్యంలోనూ ఉండదు. 'రాజ్యం' అనే సంపదలో వుంటుంది. ఆ స్థానం ఇచ్చే అధికారంలో ఉంటుంది – అని తేలుతోంది. ★

**164. అరణ్య, సర్గ 36, శ్లోకాలు 18, 19:** మారీచుడు లేడిగా మారడం – అనే కల్పనని నిజానికి వాస్తవంలోకి మార్చుకోవాలి. కానీ, ఇలాంటి కొన్ని కల్పనల్ని ఇలాగే వుంచేశాను. దీన్ని వాస్తవంలోకి మార్చితే, రావణుడు సీతని ఎత్తుకు పోవడానికి మారీచుడు అనేవాడు ఏదో ఒక రకంగా సహాయపడ్డాడని అర్థం. ★

కుని – "మహారాజా! నేను నీ బంధువుని. నీ హితం కోరేవాడిని. రాముడి గురించి నీ కెవరో చాలా ద్వేషం కలిగేటట్టు చెప్పారు. రాముడంటే ఏమిటనుకొంటున్నావు? సాక్షాత్తూ ధర్మదేవత! సాధు పుంగవుడు! ఇంద్రుడు దేవతల కెట్లా రాజో, రాముడు సర్వ ప్రపంచానికీ రాజు కాదగిన వాడు. అటువంటి మహానుభావుడి భార్యని ఎత్తుకు పోతావా? రాముడితో వైరం పెట్టుకుంటావా? నీకీ ఆలోచన ఎవరు చెప్పారు? విభీషణుడి తోటీ, మిగిలిన మిత్రులతోటీ శ్రద్ధగా ఆలోచించావా? నా మాట విని ఈ కార్యం విరమించు...." అంటూ వొణుకుతూ హితబోధ ప్రారంభించాడు.

ఈ మారీచుడు ఎవరో కాదు, రుషుల కుట్రలకు బలై ప్రాణాలు విడిచిన తాటకి కొడుకే! రాముడు తన తల్లిని చంపాడనే ద్వేషమైనా లేకుండా, ఈ నాటికి రాముడికి దాసుడై రాముణ్ణి కీర్తిస్తున్నాడు.

మారీచుడి పొగడ్తలు భరించలేక రావణుడు కళ్ళెర్రజేసి మండిపడుతూ – "నీచుడా! నా ముందే నా శత్రువుని కీర్తించడానికి నీ కెన్ని గుండెలు?" అంటూ కత్తి తీశాడు.

మారీచుడు వినయంతో వొణుకుతూ – "మహారాజా! మన్నించు, శాంతించు! నీ కన్నా నాకు ఎవ్వరూ అధికులు గారు. రాముడి వీరత్వం కళ్ళారా చూసిన వాణ్ణి గనక, ఆ మంచి చెడ్డలు నీకు విన్నవిస్తున్నాను. నేను కేవలం రాముడి పరాక్రమానికి మాత్రమే జంకుతున్నాను. రాముడు చిన్నతనంలో ఒకసారి విశ్వామిత్ర యాగాన్ని రక్షించడానికి వచ్చినప్పుడు నా తల్లినీ, సుబాహుణ్ణీ బాణాలువేసి చంపేశాడు. నేను మాత్రం ఎలాగో తప్పించుకుని బయటపడ్డాను. రాముడు దండకారణ్యానికి వచ్చిన తర్వాత కూడా నేను పాత పగవల్ల, ఇద్దరు అనుచరుల్ని తోడు తీసుకుని అతడి మీదకి యుద్ధానికి పోయాను. అప్పుడు కూడా అతడి వీరత్వానికి తాళలేక పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాను. నాతో వచ్చిన వాళ్ళిద్దరూ రాముడి చేతిలో ప్రాణాలు విడిచారు. అప్పట్నించి నేను రాముడి మీద వైరం విడిచి పెట్టేసి, ఈ రుషి వేషంతో రుషులకు సేవ చేసుకుంటూ జీవిస్తున్నాను. రాముడి వీరత్వం ఒక్కసారి చవిచూసిన వాళ్ళు మళ్ళీ రాముడి జోలికి పోరు. ఎటుచూస్తే అటు రాముడి బాణాలే కనపడతాయి నాకు. నిత్యం, కలలో కూడా రాముడి భీకరత్వమే!" అంటూ చుట్టూ చూశాడు.

రావణుడు మళ్ళీ మండిపడుతూ– "మూర్ఖుడా! నా శత్రువుని కీర్తించడం మానలేదు కదా? నువ్వు పిరికి పందవై వీర కార్యాలన్నీ విడిచిపెట్టావు గానీ, రాముడు అంత వీరుడే అయితే, సిగ్గులేక ఆడదాని మాట ప్రకారం రాజ్యం వదులుకొని అరణ్యాలలో కెందుకొస్తాడు?" అని వెటకారంగా నవ్వాడు.[165]

మారీచుడు కొంచెం ధైర్యం పుంజుకున్నాడు. "రాముడు తండ్రి సత్యవ్రతాన్ని కాపాడడానికే అరణ్యాలకు వచ్చాడుగానీ అసమర్థుడై కాదు సుమా! నా మాట విను మహారాజా! రాముడితో శత్రుత్వం వద్దు! నీ రాజ్యం రక్షించుకుని, నీ ప్రాణాలు రక్షించుకుని, సుఖంగా బతుకు! నీకీ మాటలు ఇష్టంగా ఉండవని తెలిసికూడా నీ హితం కోరి...."

"ఇక చాలించు నీ హితబోధ! నేను సీతని అపహరించి తీరాలి. ఒకసారి నిర్ణయించుకున్న తర్వాత ఇక నా నిర్ణయం ఇంద్రుడైనా మార్చలేడు. నేను నిన్ను 'నా కార్యం మంచిదా, చెడ్డదా' అని సలహా లడగలేదు. అడిగితే చెప్పినా సబబే" అంటూ ఉగ్రుడయ్యాడు రావణుడు. "నువ్వు చెప్పేది నాకు హితం అయినా సరే, క్షేమం అయినా సరే, గౌరవం గల రాజు ఇతరుల నిర్ణయాల ప్రకారం నడవడు. రాజు అంటే ఏమిటనుకున్నావు? యముడూ, అగ్నీ, ఇంద్రుడూ, చంద్రుడూ, వరుణుడూ వంటి దేవతలందరి శక్తి సామర్థ్యాలూ, తేజస్సూ రాజుకి ఉంటాయి. అందుకే రాజుని గౌరవించి పూజించాలి. రాజు వచ్చి స్వయంగా నీ వల్ల ఒక కార్యం జరగాలని అడుగుతూ వుంటే .... మూర్ఖుడా! .... నాకే నీతులు చెప్తున్నావు. నా గుణదోషాలు వల్లిస్తున్నావు. నీ ధిక్కారం నేను సహించను. వెంటనే బయల్దేరు!" అంటూ ఉరిమాడు.[166]

మారీచుడు రావణుడి కాళ్ళమీద పడ్డాడు. "నన్నీ మారుమూల ప్రాణాలతో బతకనివ్వాలంటే .... నాకీ పని చెప్పకు రాజా! నన్ను కనికరించు! నన్ను విడిచి పెట్టు! .... నన్ను ...."

---

**165.** **అరణ్య, సర్గ 40, శ్లోకం 5:** రాముడు ఆడదాని మాట విని అడవులకు రావడం పౌరుషం లేని పని అని రావణుడు పరిహాసం చేస్తున్నాడు. ఆడవాళ్ళ గురించి, రాముడికి ఎలాంటి తేలిక అభిప్రాయం ఉందో, రావణుడికీ అలాంటి అభిప్రాయమే ఉంది. 'తండ్రి మాట వినడం' అన్నా, ఇంకో పురుషుడి మాట వినడం అన్నా, ఇద్దరికీ వ్యతిరేకత లేదు. 'స్త్రీ మాట' ప్రకారం ప్రవర్తించడంలోనే అవమానం అంతా! ★

**166.** **అరణ్య, సర్గ 40, శ్లోకం 12:** 'రాజు దైవాంశ సంభూతుడ'నే అభిప్రాయం రాముడికి ఉన్నట్టే, రావణుడికి కూడా ఉంది. రాజు మహనీయుడనీ, పూజనీయుడనీ, రాజుని ధిక్కరించరాదనీ ప్రజలకు బోధించి, ప్రజలు వారికై వారే 'రాజు' అంటే మనసుల్లోంచి లొంగి వినయంగా ఉండేలాగ చేసే ప్రచారం ఇది. ఏ దేశం రాజైనా, ఏ జాతి రాజైనా, ఇదే చేస్తాడు. ★

"వీల్లేదు. నీ కిష్టం లేకపోయినా సరే, నువ్వీ కార్యం ఎలా చెయ్యవో చూస్తాను. రాజుకి హితం చెయ్యనివాడు ఏ కాలంలోనూ సుఖపడలేదు. రాముడితో విరోధం పెట్టుకుంటే ఎప్పుడు చస్తావోగానీ, నాతో విరోధం పెట్టుకుంటే ఇప్పుడే చస్తావు. నిన్ను చంపిన తర్వాతే లంకకి తిరిగి వెళ్తాను. నువ్వీ పని చక్కగా పూర్తి చేశావా, నా రాజ్యంలో సగం రాజ్యం ఇస్తాను. నా రథంలో ఎక్కించుకుని నిన్ను కూడా లంకకి తీసుకుపోతాను. ఆలోచించుకో! నాకు మంచి చెడ్డలన్నీ చెప్పావు. నీ కేది మంచో, నువ్విప్పుడు ఆలోచించుకో!" అని భీకరంగా చూశాడు.[167]

మారీచుడు రావణుడి మాటలేవీ నమ్మలేదు. అర్ధ రాజ్యం సంగతి అసలే నమ్మలేదు. నమ్మకం అంతా రావణుడి కత్తి దెబ్బ మీదే. లేచి నిలబడి చేతులు కట్టుకున్నాడు. – "రాజు కార్యంలో నా ప్రాణాలు పోయినా నాకు సంతోషమే రాజా!" అని తల వొంచుకున్నాడు.

రావణుడు సంతోషించి – "ఇప్పుడు నువ్వు వీర మారీచుడివి! పిరికిపందవు కావు" అని మెచ్చుకున్నాడు.

"నిన్ను మించిన పిరికిపంద లెవరు? వీరుడివైతే రాముడితో యుద్ధం చెయ్యరాదా?" అని లోపలే కేకలు పెట్టాడు మారీచుడు.

★ ★ ★

ఇంటి ముందు మొక్కల్లో తిరుగుతూ పూలుకోస్తోంది సీత. ఆమె గాజులూ అందెలూ చప్పుడవుతోంటే దూరంగా చెట్లమీద పక్షులు సీతవేపు చూస్తున్నాయి.

అరిటి చెట్లలో పరుగులు వినబడితే సీత అటు చూసింది. కొత్త లేడి ఒకటి చిన్న తోక ఎత్తుకుని గంతు లేస్తోంది. పచ్చగడ్డి మీదకి మూతి వొంచి, అంతలోనే ఇంకో చోటికి ఉరుకుతోంది. కొత్త మొక్కల్లో గంతులేస్తూ లేత చిగుళ్ళన్నీ కొరుకుతోంది. పాకలో ఏదో చప్పుడయితే మట్టి అరుగుల వరకూ పోయి వెనక్కి పరిగెత్తింది. సీత పువ్వులు కోయడం ఆపి, నవ్వు మొహంతో లేడిని చూస్తోంటే, అది కూడా దూరంగా నిలబడి – "నువ్వేనా సీతవి?" అన్నట్టు కదలకుండా నిలబడి చూసింది.

'నించుంది' కదా అని సీత రెండడుగులు ముందుకు వెయ్యబోతే అది పది బారలు పరిగెత్తి – "ఇప్పుడు పట్టుకో, ఇక పరిగెత్తన్లే" అన్నట్టు కదలకుండా నిలబడింది మళ్ళీ.

సీతకి ఆ లేడిని చూస్తోంటే ఎంతో ముచ్చటేసింది. దాని కాళ్ళూ, మెడా, కళ్ళూ, శరీరం అన్నీ చక్కగా, పొందిగ్గా ఉన్నాయి. రోజూ దూరంగా అక్కడక్కడా చక్క చక్కని లేళ్ళూ, జింకలూ కనబడుతూనే ఉంటాయిగానీ, ఇది మరీ ముద్దుగా వుంది. దారి తప్పి దడి దాటి వచ్చినట్టుంది. కొంచెం చొరవచేసి పట్టుకుంటే దొరుకుతుందేమో!

సీత నవ్వు మొహంతో నెమ్మదిగా అడుగులేస్తూ "రా! రా! రావూ? రావాలి మరి! ఎందుకు అంత బెదురుతావూ? ఇలా రా! నీ కళ్ళెంత బాగున్నాయో! ఏదీ, చూడనీ బాగా .... నా దగ్గిర ఉండిపోతావా? .... అయ్యో! పారిపోతున్నావు కదూ? సరేలే, నీతో పరిగెత్తి పట్టుకుంటాను చూడు! పారిజాతం చెట్టుకి కట్టేసి అసలు విడిచి పెడతానేమో చూడు! మొక్కల చిగుళ్లన్నీ కొరికి పాడు చేస్తున్నావు కదూ?" అంటూ లేడివేపు పరిగెత్తింది.

లేడి, సీతని ఆట పట్టిస్తున్నట్టు పచ్చికంతా గంతు లేసింది. సీత నవ్వుతూ, పరిగెడుతూ, కొంగులో పూలన్నీ వాకిలి నిండా పారబోసుకుంది.

సీత నవ్వుతూ మధ్య మధ్య – "లక్ష్మణా! ఏం చేస్తున్నావోయి?.... చప్పున రావాలి. మన ఆశ్రమాని కెవరొచ్చారో చూడు! మీ అన్నగార్ని కూడా తొందరగా పిల్చుకురా! తొందరగా రావాలి! ఈ దొంగ దొరకటం లేదు" అంటూ కేకలు పెట్టింది.

సీత నవ్వులూ, కేకలూ విని మొహం చిట్లిస్తూ, విల్లు సర్దుకుంటూ బయటి కొచ్చాడు రాముడు. అప్పటికీ సీతకి అందకుండా గంతులేస్తోన్న లేడి, రాముడి విల్లు చూసి వొక్క పరుగు తీసింది, దూరంగా చెట్లలోకి.

సీత, భర్తని చూడగానే తప్పు చేసిన దానిలాగ పరుగులూ నవ్వులూ ఆపి, బిడియపడుతూ నెమ్మదిగా దగ్గిరికొచ్చింది – "ఇంతసేపూ ఇక్కడే గంతులేసింది. మిమ్మల్ని చూడగానే బెదిరి పరిగెత్తింది. అదిగో! ఆ చూత వృక్షం కింద నిలబడింది చూడండి. అబ్బ! ఎంత బాగుందో! ఏ రుషి ఆశ్రమం నుంచో తప్పించుకు వొచ్చినట్టుంది. పెంపుడు లేడే అనుకుంటాను. దారి తప్పినట్టుంది. లక్ష్మణా! కనిపిస్తోందా నీకు?" అంటూ అటు చూపించింది.

లక్ష్మణుడు అటు చూసి – "దడి తలుపు కట్టేస్తే ఇక్కడే ఉండేదిగా వొదినగారూ!" అన్నాడు.

"అయ్యో! నాకా ఉపాయం తోచలేదే!" అని నొచ్చుకుంది సీత.

రాముడేమీ ఉత్సాహం చూపించలేదు, లేడి

---

**167.** అరణ్య, సర్గ 40, శ్లోకాలు 23, 25: రావణుడు మారీచుడికి 'సగం రాజ్యం' ఇస్తానన్నాడు. చెప్పిన పని చెయ్యకపోతే చంపేస్తానన్నాడు. సేవకుడికి అర్ధ రాజ్యం ఇస్తాడా? రాజులు ఎంత నీచులై, ఎంత నిరంకుశంగా, అబద్ధపు వాగ్దానాలతో తమ పనులు చేయించుకుంటారో దీన్నిబట్టి తెలుసుకోవచ్చు. ★

గురించి.

సీత రాముడికి నచ్చజెప్తున్నట్టు – "ఎంత చక్కగా, పొందిగ్గా, అందంగా ఉందనుకున్నారూ? ఇంద్ర నీలాల లాగ ఉన్నాయి కొమ్ములు. కుంద పుష్పం లాగ తెల్లగా వుంది పొట్ట. లేతగా, ఎర్రగా వజ్రాలలాగ ఉన్నాయి గిట్టలు. మోకాళ్ళెంత సన్నగా ఉన్నాయనీ! ధనుస్సులలాగ వొంగుతున్నాయి. ఆ రాగి చర్మం మీద ఎర్రని చుక్కలు, రత్నాలలాగ ధగ ధగ మెరుస్తున్నాయి. మధూక పుష్పం లాగ నున్నగా జారుతోంది వీపు. పద్మాలంతంత కళ్ళు! ఎవరో మొహం మీద ముద్దు పెట్టుకుంటే అక్కడ రంగు కరిగి పోయిందేమో, నుదుటిమీద తెల్లని మచ్చ ఉంది. మెడ కొంచెం ఎత్తు. ఎండలో అది గంతు లేస్తోంటే, వజ్రం మీద సూర్యకిరణాలు పడ్డట్టు కళ్ళు మిరిమిట్లు గొలిపాయి. లక్ష్మణా! నువ్వు చూడలేదు గానీ, అది ఇక్కడ గంతులేస్తోంటే మన ఇంటికే అందం వచ్చింది సుమా!" అంటూ సంతోషంతో, పొంగుతూ లేడి అంద చందాలు వర్ణిస్తూ, ఒక్కో మాట రాముడికీ, ఒక్కోమాట లక్ష్మణుడికీ చెప్పింది.

ఇద్దరూ దూరంగా చూశారు. చెట్ల నీడలో పడు కుంది లేడి. సీత వర్ణనలేవీ కనపడలేదు. లక్ష్మణుడు అరిటిచెట్ల దగ్గిర బోదులు సరిచేస్తూ – "ఏదో ఒక్కసారి ఎండలో చూస్తే అలా అనిపించిం దేమో వొదినగారూ!" అన్నాడు.

"కాదోయీ! ఒక్కసారి కాదు. చాలాసార్లు చూశాను. అందుకే నిన్ను చప్పున రమ్మని పిలిచాను. ఎంత అందంగా ఉందనుకున్నావూ!"

"అంత అందంగా ఉందంటే అదేదో రాక్షస మాయే! అసలు రాక్షసులే లేళ్ళ రూపాలు ధరించి రాజులు వేటకి వొచ్చినప్పుడు దూర దూరంగా తీసుకుపోయి చంపే స్తారు వొదిన గారూ!"[168]

సీతకి లక్ష్మణుడి మీద కోపం వొచ్చింది – "ఏం మాటలు లక్ష్మణా! ఎంతెంతో అందమైన పూలనీ, పక్షుల్నీ, జంతువుల్నీ, చూడ్డం లేదూ మనం? మనుషుల్లో చక్కగా, పొందిగ్గా, కనుముక్కు తీరుతో ఎంతో అంద మైన వాళ్ళు ఉండరూ? అలాగే, అది అందమైన తల్లి దండ్రులకు పుట్టి ఉంటుంది" అంటూ నవ్వుతూ రాముడి వేపు చూసింది – "లక్ష్మణుడి మాటలకేం గానీ మీరు చూస్తే నా మాట కాదనరు. ఆ లేడి మన ఇంట్లో వుంటే .... చక్కగా ఎప్పుడూ దాంతో .... ఆడుకుంటూ ...." అంటూ ఆగింది.

"బాగుంది. ఇంకా చిన్నపిల్లలాగ ఆటలా నీకు?" అని నవ్వాడు రాముడు.

సీత సిగ్గుపడింది – "నా కోసం కాదు. దానికోసం. దాన్ని ఆడించాలిగా? మన వనవాసం అయిపోయిన తర్వాత దాన్ని మనతోపాటే అయోధ్యకు కూడా తీసుకు పోవచ్చును. మన ఉద్యానవనంలో పెట్టుకుందాం. అందరూ దాన్ని చూస్తారు. 'ఎంత బాగుందో, ఎంత బాగుందో, ఎక్కడ దొరికింది?' అంటూ అత్తలూ, భర తుడూ అందరూ ముచ్చట పడతారు" అని కొంచెం సేపు ఆగి – "దాన్ని మీరు తేలేరూ?" అని సందేహంగా చూసింది.[169]

"ఎందుకు తేలేనూ, గురి చూసి ఒక్క బాణం వేస్తే సరి" అంటూ చెట్ల కింద లేడివేపు చూశాడు.

ఆ లేడి – "ఋషులు విల్లు పట్టుకోడం ఎక్కడా చూడ లేదే!" అని కొత్తగా సందేహంలో పడ్డట్టు చూస్తోంది.

సీత అయిష్టంగా – "అయ్యో! అంత అందమైన దాన్ని గాయపరుస్తారా? నెమ్మదిగా పొదివి పట్టుకుని తెస్తే ...." అంటూ ఆగింది. "దొరుకుతుందా?" అన్న సందేహంతో చూసింది. భర్తని ఇబ్బంది పెడుతున్నా నేమోనన్న జంకుతో, కొంచెం బిడియంగా, "పతివ్రతలు భర్తల్ని అది కావాలి, ఇది కావాలి అని కోరగూడదని ఎరుగుదును. కానీ...." అంటూ తల వొంచుకుంది.[170]

శ్రీరాముడికి భార్య భయభక్తులూ, వినయ విధేయ తలూ చాలా ఆనందం కలిగించాయి. భార్య కోరిక తీర్చి, ఆమె సంతోషపడుతోంటే గంభీరంగా చూడవచ్చునుగానీ .... ఇదేం కోరిక? పువ్వో, కాయో అడిగితే శ్రమ లేకుండా తెచ్చి పెట్టవచ్చుగానీ – పరుగెత్తే లేడిని పొదివి పట్టుకుని తెచ్చి పెట్ట మంటుందేమిటి? మెరుపులా మాయమయ్యే జంతువు దొరుకుతుందా పట్టుకోడానికి? ఆ మాటలంటే 'మీ అంతటి మహావీరులు లేడిని పట్టుకో

---

**168.** **అరణ్య, సర్గ 43, శ్లోకం 4:** "ఆ లేడి రూపంలో వచ్చింది మారీచుడే" అంటాడు లక్ష్మణుడు. ఆ సంగతి రాముడికి మాత్రం తెలీదు. పరకన్నర దేవుడికి తెలిసిన సంగతి, అర్ధ దేవుడికి తెలీకపోవడం ఆశ్చర్యం! ★

**169.** **అరణ్య, సర్గ 43, శ్లోకాలు 9, 15, 16:** "ఆ లేడితో ఆడుకుంటాను. దాన్ని అయోధ్యకు తీసుకుపోదాం" అంది సీత. "భరతుడు కూడా మెచ్చుకుంటాడు" అంది. భరతుడు రాజప్రతినిధిగా, ఒక గొప్ప పదవిలో ఉండడం చేత, ప్రతి విషయానికీ భరతుణ్ణి తలుస్తూ ఉంటారు. శతృఘ్నుణ్ణి ఎక్కడా ఎవ్వరూ తలచరు. ఆ పేరే ఎత్తరు. ★

**170.** **అరణ్య, సర్గ 43, శ్లోకం 20:** ఉత్తమ స్త్రీలు భర్తల్ని ఏమీ కోరరాదట! ఈ నీతి భర్తలు నేర్పేదే! ఎంత సిగ్గులేదో ఈ భర్తలకి! "ఇదిగో! నువ్వు నన్నేమన్నా కోరితే చెడ్డ దానివి. కోరకుండా ఉంటే మంచి దానివి" అని చెప్పడం అన్నమాట! ఈ భర్తలకు ఏది ఇబ్బంది కలిగించకుండా వుంటుందో అది గొప్ప ధర్మం! ★

లేరా?' అంటుందేమో కూడా. ప్రశ్నలు వెయ్యడం మాత్రం మహా చక్కగా నేర్చుకుందిగానీ, భర్తకి ఎటువంటి కార్యాలు చెప్పాలో, ఎటువంటి కార్యాలు చెప్పగూడదో, పతివ్రత నేర్చుకోవద్దా?

రాముడు కొంచెం నుదురు చిట్లించి– "సీతా! లేడిని పట్టుకోవడం మాటలా? ఇలా కనపడి అలా మాయమవుతుంది. దొరుకుతుందా ప్రాణాలతో?" అన్నాడు.

సీత ఆలోచనలో పడింది. భర్తకి తన కోరిక అయిష్టంగా ఉన్నట్టు తోస్తోంది. ఆ లేడిని ప్రాణాలతో తెచ్చిపెట్టలేడని అర్థమవుతోంది. "లేడిని బాణంతో కొట్టకుండా తెచ్చిపెట్టు! లేకపోతే నాకు ఒద్దు" అని కోరితే, అది దొరక్కపోతే? తన కోరిక తీర్చలేనందుకు తన భర్త అవమానపడే స్థితి సంభవిస్తుంది కదా? .... పోనీ "ఆ లేడి నాకు వద్దులెండి" అంటే? ఇంతసేపూ దానికోసం ఎంతో ఆశపడి, ఎంతో సంబరపడి, ఇప్పుడు వొద్దంటే, 'నువ్వు తెచ్చి పెట్టలేవు కాబట్టి, నా కోరికని విరమించుకుంటున్నాను' అన్న అర్థం వస్తుంది. అందుచేత, ఇప్పుడు తన కోరికని మానుకోవడానికీ వీలు లేదు, లేడిని గాయపర్చకుండా తెమ్మని అడగడానికీ వీలులేదు. అసలు, పతివ్రతలు భర్తల్ని కోరికలు కోరడమే దోషం. ఇక కష్టసాధ్యమైన కోరికలు కోరడం కూడానా? అలాంటి పని తను ఎన్నడూ చెయ్యకూడదు. ఆ లేడిని తన భర్త ఏ విధంగా తేగలిగితే ఆ విధంగానే తెమ్మని కోరాలి. అప్పుడు ఆయనకు భార్య కోరిక తీర్చలేని పరిస్థితి కలగదు గదా?

సీత ఎంతో ఆశగా ఆ లేడివేపు చూపిస్తూ, "అదిగో! అది లేచి ఎండలోకి వచ్చింది, చూడండి! దాని చర్మం ఎంత కాంతిగా మెరుస్తోందో! నా మనసంతా ఆ చర్మంమీదే ఉంది. అది ప్రాణాలతో దొరక్కపోతే, చంపేసి అయినా సరే .... ఆ చర్మం నాకు తెచ్చి పెడితే చాలు. ఆ చర్మం మన ధర్మాసనం మీద వేసుకుని కూర్చుంటే ఎంతో బాగుంటుంది నిత్యం మన ఆశ్రమానికొచ్చే రుషులందరూ దాన్ని చూసి మెచ్చుకుంటారు" అంది నవ్వుతూ.[171]

లక్ష్మణుడు సీతని ఆశ్చర్యంగా చూశాడు. సీత ధోరణి చాలా విషయాలలో చాలాసార్లు లక్ష్మణుడికి అంతుపట్టకుండా ఉంటోంది. ఒక్కోసారి ఎంత ప్రేమగా ప్రవర్తిస్తుందో, మరుక్షణంలోనే అంత కఠినంగా వ్యవహరిస్తుంది.

సీత, ఈ పది పన్నెండేళ్ళ కాలంలో చాలా మారింది. ఆమె హృదయంలో సౌకుమార్యం చాలా వరకు నశించింది. పక్షుల్నీ జంతువుల్నీ చూసి ఎంత సంతోషించినా, పూర్వంలాగ అవి కళ్ళముందు చచ్చిపోతున్నా దిగులుపడడం లేదు. అదీగాక, నిత్యం రుషులు వస్తూ పోతూ, సీత చేసే సేవలన్నిటినీ మెచ్చుకుంటూ "మహా పతివ్రతవు తల్లీ! .... నీకు నువ్వే సాటి తల్లీ!" అని కీర్తిస్తూ ఉండడంచేత, సీత తన గొప్పతనానికి తనే ఆశ్చర్యపోతూ ఉంటుంది. "నేను సామాన్య స్త్రీల వంటిదాన్ని కాను సుమా!" అంటూ ఉంటుంది, రోజూ ఏదో ఒక సందర్భంలో.

రాముడు కూర్చున్నా, పడుకున్నా, సీత రాముడి పాదాల దగ్గరే కూర్చోవడమో, పడుకోవడమో చేస్తుంది. – "మీ పాదాల దగ్గిర నేనిలా కళ్ళుమూసి వెళ్ళిపోతే ఈ జన్మకు చాలు" అని నిట్టూరుస్తుంది. సీత ఎన్నడైనా ఆ మాటలు అనడం మర్చిపోయి నిద్రపోతే, ఇక రాముడికి సుఖంగా నిద్రపట్టదు. సీత మళ్ళీ ఆ మాటలు అనే వరకూ రాజ్యభ్రష్టుడైనప్పుడు కలిగినంత ఆందోళన కలుగుతూ ఉంటుంది. అందుకే, సీత తను చూసిన లేడి గురించి ఎంత సంబరపడినా – "పతివ్రతలు భర్తనేమీ కోరగూడదని నాకు తెలుసు .... కానీ ......." అంటూ వినయం ప్రకటించే వరకూ ఆ కార్యం మీదకి రాముడి మనసు పోలేదు.

సీత ఆ లేడిని ప్రాణాలతో తెచ్చి పెట్టమంటుందేమోనని రాముడు భయపడ్డాడుగానీ – "నా మనసంతా దాని చర్మంమీదే ఉంది" అనేసరికి రాముడికి అంతులేని ఉత్సాహం వొచ్చింది. బాణాలేసి పిట్టల్నీ జంతువుల్నీ, చంపడం అంటే .... ఉత్సాహానికీ వీరత్వానికీ లోటేముంది? పదేళ్ళకు పైగా రాముడికి అడవి జీవితం బాగానే అలవాటైంది. – "లక్ష్మణా! అదిగో ఈసారి స్పష్టంగా కనబడుతోంది, చూడు! బలిసిన తొడలూ .... అదీ .... అందంగానే ఉంది. చిక్కక ఎక్కడికి పోతుంది? నువ్వన్నట్టు రాక్షస మాయ అయినా దాన్ని చంపాలిగా?"

---

**171.** **అరణ్య, సర్గ 43, శ్లోకాలు 18,19:** సీత, ప్రాణం అంతా ఆ లేడి చర్మం మీదే ఉన్నట్టు 'చర్మం' గురించి అడుగుతోంది. చర్మం మీదే ఇష్టం అయితే, మరి మొదట లేడితో ఆడుకుంటాననీ, దాన్ని అయోధ్యకు తీసుకెళ్దామనీ సరదా పడింది ఎందుకు? ఒక లేడిని ప్రాణాలతో తెచ్చియిచ్చే సమర్థత లేదా శ్రీరామచంద్రుడికి? – చిన్న తనంనించీ, రుషులందరి దగ్గిరా నేర్చుకున్న రకరకాల మంత్రాలూ, ఎదటి వాళ్ళని కట్టిపడేసే సమ్మోహనాస్త్రాలూ, బ్రహ్మాస్త్రాలూ, అన్నీ ఏమయ్యాయి? మొదట లేడిని కావాలని కోరిన సీత, తర్వాత 'చర్మం' ఎందుకు కోరింది? లేడిని, ప్రాణాలతో భర్త తీసుకురాలేడని గ్రహించి, భర్తని ఇబ్బంది పెట్టకుండా అలా కోరింది. భార్యలు తమ కోరికల్ని బయట పెట్టకుండా అణుచుకోవటంవల్లనే, భర్తలు గొప్ప సమర్థులుగా చలామణీ అవుతారు! ★

అంటూ కత్తి కూడా అందుకుని, "సరే! నేను వెళతాను. నువ్వు ఎక్కడికీ వెళ్ళకు, రుషులెవరైనా వస్తారు. సీత ఒక్కతే ఉంటుంది" అంటూ వాకిలి దాటి లేడికి కనబడ కుండా పొదలచాటుగా నడక సాగించాడు.[172]

సీత అరుగుమీద నిలబడి కొంచెంసేపు చూసి లోపలికి వెళ్ళింది.

లక్ష్మణుడు, అరిటిచెట్ల కన్నిటికీ బోదెలుచేసి గాలికి వొంగిపోయిన పూల మొక్కలు సరిజెయ్యడంలో ముని గాడు.

★ ★ ★

సీత ఆందోళన పడుతూ లక్ష్మణుడి దగ్గర కొచ్చింది – "లక్ష్మణా, మీ అన్నగారి కంఠస్వరం వినబడ లేదూ నీకు? .... అయ్యో! నువ్వింకా ఇక్కడే ఉన్నావే!" అంటూ కంగారుపడింది.

లక్ష్మణుడు వినయంగా – "శాంతించండి వొదిన గారూ! శాంతించండి! ఎందుకు మీరింతగా భయపడు తున్నారు?" అంటూ పనిలోంచి లేచాడు.

సీత వెలవెలబోతూ – "మీ అన్నగారి కేదో గొప్ప ఆపద సంభవించి ఉంటుందోయీ అడవిలో! 'సీతా! లక్ష్మణా! రక్షించండి, రక్షించండి!' అంటూ ఆర్తనాదాలు చేశారే! నువ్వు వినలేదా? అయ్యో! ఏం జరిగిందో? .... నా ప్రాణాలు తల్లడిల్లి పోతున్నాయే!" అంటూ బొట బొటా కన్నీళ్ళు కార్చింది.

లక్ష్మణుడు చెక్కు చెదరకుండా – "శాంతించండి వదినగారూ! నా మాట ఆలకించండి! ఎవరో శత్రువులు మనకు భీతి కలిగించాలని ఆ విధంగా అరచి ఉంటారు. శ్రీరామచంద్రుడికి ఆపద సంభవిస్తుందా ఎన్నడైనా? ఆయన మహావీరులని మీరెరుగరా? ఎందుకింత బెంబేలు పడుతున్నారు?" అని నచ్చచెప్పబోయాడు.

ఒక్క క్షణం సీతకికూడా లక్ష్మణుడి మాటలు సబబు గానే తోచాయి. అయినా భయం తగ్గలేదు. "అయ్యో! మీ అన్నగారు నిజంగానే ఆపదలో చిక్కుకున్నారేమో లక్ష్మణా! .... 'రక్షించు సీతా! లక్ష్మణా!' అని ఆర్తనాదాలు చేశారే ...." అని మళ్ళీ బేలగా చూసింది.

లక్ష్మణుడు నిర్భయంగా– "భ్రమ పడుతున్నారు వొదినగారూ! శ్రీరామ చంద్రుడంతటి మహావీరుడు, ఇక్ష్వాకు వంశంలో పుట్టిన పురుషుడు, ఎంత ఆపదలో చిక్కితే మాత్రం 'సీతా, రక్షించు' అని ఒక స్త్రీని అడుగు తాడా?[173] దాన్ని బట్టి అయినా, అలా అరిచింది మా అన్నగారు కాదని మీకు తోచడం లేదా? నన్ను నమ్మండి వొదినగారూ! అదంతా రాక్షస మాయ. ఖరుడితో యుద్ధం జరిగినప్పటి నుంచీ మన చుట్టూ శత్రువుల కుట్రలు ఎక్కువగా ఉన్నాయి."

"అందుకే నేనింతగా భయపడుతున్నాను లక్ష్మణా! మీ అన్నగార్ని ఆ శత్రువులేం ఇబ్బంది పెడుతున్నారో! .... పోయి చూడాలి. వెళ్ళు, తక్షణం బయల్దేరి వెళ్ళు!"

"ధైర్యం వహించండి! అన్నగారు ఇక కొంత సేపటికి ఆ దుర్మార్గులందర్నీ చీల్చి చెండాడి ఆశ్రమానికి క్షేమంగా వస్తారు. ఏమీ భయం లేదు. దేవతలైనా తేరి చూడలేని శ్రీరామచంద్రుణ్ణి శత్రువులు జయించగలరా?"

సీతకి చాలా ఆగ్రహం కలిగింది. పతివ్రతల పూనకం ఆవరించింది – "లక్ష్మణా! నీ అలక్ష్యం నాకు కంపరం కలిగిస్తోంది. మీ అన్నగారికేమి ఆపద కలి గిందో పోయి చూడమంటే .... కాలు కదపకుండా ఉన్నావే! ఇంతకాలం అన్న మీద ప్రేమ వొలకబోశావు గానీ .... నిజంగా ఆపదలో చిక్కుకున్నప్పుడు అన్నని రక్షించాలని నీకే కోశానా ఆతృత లేదే! దుర్మార్గుడా! నా

---

**172.** చీటికీ మాటికీ అపశకునాలో, శుభశకునాలో కనబడే రాముడికి ఈ మాయలేడి కోసం బయల్దేరుతున్నప్పుడు మాత్రం ఏ శకునాలూ కనబడలేదు. ఎందుచేతంటే, కనబడితే అపశకునాలే కనబడాలి కదా? అలా కనబడితే రాముడు బయల్దేరకూడదు గదా? అప్పుడిక కథ జరగదు కదా? అంచేత కవిగారు ఇక్కడ శకునాల్ని వర్ణించే ఉత్సాహం అంతా అణగదొక్కుకున్నారు. కానీ, రాముడు వెనక్కి వొచ్చేటప్పుడు మాత్రం అపశకునాలన్నీ కనబడ్డాయి. (అప్పటికి, సీతని ఎత్తుకుపోయే పని జరిగిపోయింది కాబట్టి) అసలు శకునాలు ఎప్పుడు కనబడతాయి? వాటిని నమ్మేవాళ్ళ ప్రకారమే చూస్తే, ఒక పని జరగడానికి ముందా, వెనకా? ★

**173.** **అరణ్య, సర్గ 59, శ్లోకం 11:** "దేవతల్ని కూడా రక్షించే రాముడు, ఒక స్త్రీని రక్షించమని అడిగి, గొప్ప వంశంలో పుట్టినవాడు చెయ్యగూడని పనిచేస్తాడా?" అంటున్నాడు లక్ష్మణుడు. దేవతల్ని కూడా రక్షించే రాముడు "లక్ష్మణా! నన్ను రక్షించు" అని లక్ష్మణుణ్ణి కూడా పిలవకూడదు కదా? "రాముడు నన్ను మాత్రం రక్షించమని అడుగుతాడా?" అని కూడా లక్ష్మణుడు అంటే, పోనీ ఇదంతా రాముడి గొప్పతనంగా వొదిలెయ్యొచ్చును. కానీ, లక్ష్మణుడు అనేది – 'రక్షించమని పురుషుడు, స్త్రీని అడగడమా!' అని! ఎప్పుడూ పురుషుడే స్త్రీలను రక్షిస్తూ వుండాలి! స్త్రీలకు ఆ శక్తి వుండదు.

ఇక్కడ 'గొప్ప వంశం' వ్యవహారం కూడా ఒకటి ఉంది. ఏదో చెత్తాకారీ వంశం వాడయితే, (అంటే, రాజవంశం కానివాడయితే), పోనీ ఆడదాన్ని రక్షించమని ఎప్పుడన్నా నోరుజారి అడిగితే అడగవొచ్చునేమో! గొప్ప వంశం పురుషుడు మాత్రం ఆ పని ఎన్నడూ చెయ్యకూడదు! ★

భర్త క్షేమం కోసం నా హృదయం ఇంత కలవర పడుతోంటే, అన్నగారి కోసం నీకు ఆందోళనే లేకుండా ఉంది. నువ్వింత వంటి దుష్టుడివని ఇంతకాలానికి గానీ బోధపడలేదు. నీచుడా! నా భర్తని వీరోచితంగా ఎదిరించలేక, ఆ మహానుభావుడు శత్రువుల చేతుల్లో పడి సర్వనాశనం అయిపోయే రోజు కోసం ఎదురు చూస్తున్నావా. ఎలాగయినా నన్ను నీ వశం చేసుకోవాలని ఇంత కుట్రపన్ని దుర్బుద్ధితో మా వెంట బయల్దేరావు. నువ్వూ, భరతుడూ పన్నిన కుట్రే ఇది! ఇప్పుడు నా కంతా విశదంగా తెలుస్తోంది" అంటూ తనేం మాట్లాడుతోందో తెలియకుండా అహంకారంతో మాటలు విసిరింది.[174]

సీత మాటలు వింటూ లక్ష్మణుడు కొయ్య బారిపోయాడు. వాటి అర్థం పూర్తిగా బోధపడేసరికి అంతులేనంత కోపం వచ్చింది. అతికష్టం మీద తనను తను సంబాళించుకున్నాడు. ఎంతో కష్టంతో వినయం ప్రదర్శిస్తూ – "వదినగారూ! శాంతించండి! మా అన్నగారి ఆజ్ఞ పాటించడమే నా ధర్మమని భావించాను. మా అన్నగారి పరాక్రమం మీద నాకెటువంటి సందేహమూ లేదు. నేనిలా సమాధానం చెపుతున్నానని అగ్రహించ వద్దు! మీరు నాకు దైవ సమానులు. ఇంత కఠోరమైన నిందలు పల్కడం మీకు ధర్మం కాదు. శ్రీరామచంద్రుడికెటువంటి ఆపదా కలగదని నమ్మండి!" అంటూ ప్రార్థించాడు.

సీత ఆత్మ ఇంకా పాతివ్రత్యపు పూనకంతో ఊగుతూనే ఉంది.

"ఛీ! మూర్ఖుడా! నీ కపట వేషం ఇంక చాలించు!" అంటూ ఉరిమింది. "దుర్మార్గుడా! నీ ప్రయత్నాలేమీ నెరవేరవని తెలుసుకో. నేను నా భర్తని తప్ప అన్య పురుషుణ్ణి కన్నెత్తి కూడా చూడను. నా నాథుణ్ణి విడిచి ఒక్క క్షణం కూడా జీవించను!" అంటూ కళ్ళెర్రజేసింది.

ఆమె ఆత్మలో ఒక పక్క – "లక్ష్మణుణ్ణి ఈ మాటలంటున్నది నేనేనా! నేనేనా!" అని తన నోటి నుంచి వచ్చిన మాటలకు తనే విస్మయంలో మునిగిపోతోంది. ఇంకోపక్క – "నేను మహా పతివ్రతని! నా పాతివ్రత్య మహత్యం ఏమిటో ఈ మూర్ఖుడికి చాటి చెబుతాను" అని ఆరాటపడుతోంది.

సీత పాతివ్రత్యపు వ్యాధి, కొంత కాలంనించి అహంకారపు వ్యాధిలోకి మారింది. పర పురుషులందరూ తననే కోరతారనే అహంకారపు వ్యాధి అది! లక్ష్మణుడూ.... భరతుడూ.... శత్రుఘ్నుడూ.... అందరూ తన పాతివ్రత్యం పాడుచెయ్యడానికే కుట్రలు పన్నుతున్నారనే విచిత్రమైన ఆలోచనలు! పర పురుషులు తనని కోరాలనీ, తను వారిని తిరస్కరించి తన పాతివ్రత్యం లోకానికి స్పష్టం చెయ్యాలనీ సీతకి నిత్యం తహ తహ! ఆ ఆరాటం వల్లనే సీతకి నిష్కారణంగానే లక్ష్మణుడి మీద సందేహం ప్రారంభమై, మరుక్షణంలోనే అది కొండంత ప్రమాణానికి పెరిగిపోయింది. లక్ష్మణుడి ప్రార్ధనకి మరింత రెచ్చిపోతూ – "కల్లబొల్లి మాటలతో నన్నెన్నటికీ మభ్యపెట్టలేవు. నీ అన్న మీద నీ కెన్నడూ భక్తి లేదు. నా భర్తకే ఆపద వచ్చినప్పుడు నేను గోదావరిలో పడి ప్రాణాలు విడుస్తాను. విషం తినో, ఉరిబోసుకునో, అగ్నిలో బడో, కొండమీదనించి ఉరికో, ప్రాణత్యాగం చేస్తానుగానీ, పర పురుషుణ్ణి కాలితోనయినా ముట్టను" అంటూ పైట చెంగు భుజం నిండా తీసి కప్పుకుంది.[175]

లక్ష్మణుడికి సీత మాటలు దుర్భరంగా అనిపించాయి. తన చెవుల్ని తనే నమ్మలేకుండా అయ్యాడు. ఆ అపనమ్మకంతోనే వదిన గారిమీద పట్టలేని కోపం వచ్చింది – "స్త్రీల స్వభావం ఎంత నీచమైనవో నాకు బాగా తెలుసు. స్త్రీలకు వినయ విధేయతలుండవు. శుద్ధ చపలచిత్తులు. ఎప్పుడూ కఠినంగానే ప్రవర్తిస్తారు. ఏ విషయంలోనయినా ఉచితానుచితాలు గ్రహించకుండా దుష్టపు మాటలు మాట్లాడతారు. అది ఆడవాళ్ళకు అలవాటే. ఇద్దరు అన్నదమ్ముల్లో, రక్త బంధువుల్లో స్నేహంగా వుంటే, వారి మధ్య కలతలు పెట్టి వారి స్నేహం భంగం చేసే వరకూ స్త్రీలు ఊరుకోరు" అంటూ లక్ష్మణుడు, లోకంలో పురుషులందరి తరఫునా, స్త్రీ లందరినీ తిట్టిపోసి, "నేను వెళుతున్నాను" అని విల్లు పట్టుకుని గబగబా అంగలేసుకుంటూ దడి దాటి వెళ్ళిపోయాడు.[176]

---

**174.** **అరణ్య, సర్గ 45, శ్లోకాలు 24, 25:** సీత, లక్ష్మణుణ్ణీ, భరతుణ్ణీ తిడుతోంది. – అసలు సీత పువ్వు అడిగినా, కాయ అడిగినా, ఏది అడిగినా వెంటనే ఇవ్వమని రాముడు లక్ష్మణుడికే పురమాయించాడు పదేళ్ళ కిందటే. అప్పట్నించీ లక్ష్మణుడే ఆ వ్యవహారం చూస్తున్నాడు. అనేక పనులు లక్ష్మణుడే చేస్తున్నాడు. లేడికోసం లక్ష్మణుడే ఎందుకు బయల్దేరలేదు? లక్ష్మణుడే వెళ్తే ఏమయ్యేది? ★

**175.** **అరణ్య, సర్గ 45, శ్లోకాలు 36, 37:** రాముడు లేకపోతే, తను ఎలా చచ్చిపోతుందో చెప్తోంది సీత. "నా నాథుణ్ణి విడిచి ఒక్క క్షణం కూడా జీవించను" అన్న సీత, ఆ నాథుణ్ణి విడిచి ఎంత కాలం జీవించిందో తర్వాత చూడండి! ★

**176.** **అరణ్య సర్గ 45, శ్లోకాలు 28, 29:** స్త్రీలు ఎంత నీచులో, ఎంత మూర్ఖులో, ఎంత అధములో, ఎంత దుష్టులో, ఎంతెంత ఘోర కార్యాలు చేస్తారో, కవిగారు నేర్పుగా వర్ణిస్తున్నారు. స్త్రీలను దుయ్యబట్టడానికే, సీతతో అసలు అన్ని మాటలు అనిపించడం. "అవును మరి. లేకపోతే పాపం లక్ష్మణుణ్ణి పట్టుకుని ఆ మాటలేవిటి?" అని పురుష పుంగవులకు ➔

జరిగిందేమిటో తనకే అర్థం కానట్టు విస్మయ పడుతూ కూర్చున్న సీత – ఉపనిషద్వాక్యాలు వల్లె వేస్తూ ఆవరణలోకి వస్తోన్న రుషి పుంగవుణ్ణి చూసి కన్నీళ్ళు తుడుచుకుంటూ తడబడుతూ లేచింది. “దయచేయండి స్వామీ! దయచేయండి!” అంటూ వొంగి రుషి పాదాలకు నమస్కరించింది. చప్పున వాకిట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కునే నీళ్ళు తెచ్చి భక్తితో రుషికి అందించింది. “ఈ ఆసనం మీద విశ్రమించండి స్వామీ!” అంటూ మెత్తని దర్భాసనాలు పేర్చి వినయంగా ప్రార్థించింది, ఇంట్లో సిద్ధంగా వున్న రకరకాల పళ్ళు అరిటాకు నిండా సర్ది తెచ్చి ఆసనం ముందు పెట్టింది. “భుజించండి స్వామీ! అన్నం కూడా సిద్ధంగానే ఉంది. నా భర్త వేటకు వెళ్ళారు. అడవి పంది మాంసం, ఉడుము మాంసం తీసుకు వస్తారు” అంటూ రుషికి ఎదురుగా నిలబడి వినయంగా తల వొంచుకుంది.[177]

రావణుడు, వచ్చినప్పట్నించీ సీతని తీక్షణంగా తేరిపార చూస్తూనే ఉన్నాడు. ఎందరో స్త్రీలను ఎరిగిన రావణుడికి సీత సౌందర్యం ఎంతో ప్రత్యేకమైనది గానే కనిపించింది. నఖశిఖ పర్యంతం సీతని పరీక్షిస్తూ మందహాసంతో చూశాడు– “అమ్మాయీ! ఇంత అడవిలో ఒంటరిగా ఉన్నావు. ఎవరు నువ్వు? నీ భర్త పేరేమిటి? సౌందర్య దేవతవలే మెరిసిపోతున్నావు. ఎంతో సుకుమారంగా ఉన్నావు. కుందన పుష్పాల మాలవంటి పలువరస ... విశాలమైన కళ్ళు .... సన్నని నడుము .... బంగారంవంటి శరీరచ్ఛాయ .... నీ వంటి స్త్రీని నేనెక్కడా చూడలేదే! .... ఎవరు నువ్వు? భూదేవివా? శ్రీదేవివా? రతీదేవివా? నీ పేరేమిటి?” అంటూ సంభాషణ ప్రారంభించాడు.[178]

---

➔ అనిపించేటట్టు! గతంలో అనేకసార్లు రాముడు లక్ష్మణుణ్ణి నానా మాటలూ అన్నాడు. “నువ్వు భరతుణ్ణి చంపాలని చూస్తున్నావు” అన్నాడు. “నీచుడిలాగ వాగుతున్నావు” అన్నాడు. “రాజ్యం కోసం ఆశపడుతున్నావు” అన్నాడు. ఇంకా చాలాసార్లు చాలా అన్నాడు అన్యాయంగా. అప్పుడు ఈ కవిగారు, లక్ష్మణుడితో రాముణ్ణి ఒక్క మాటన్నా అనిపించలేదు. “ఉచితానుచితాలు తెలీకుండా మాట్లాడుతున్నావే! ఇంత చాకిరీ చేస్తూంటే నన్ను శంకిస్తున్నావే!” అని లక్ష్మణుడు అన్నగార్ని అన్నట్టుగా కవి రాశాడా? లేదు. ఇప్పుడు వదినగారి మాటలకు కూడా అలాగే ఊరుకోవచ్చు కదా లక్ష్మణుడు? అలా ఊరుకోలేదు. ఈవిడ ‘ఆడది’ కదా? ఆడవాళ్ళు దుర్మార్గులు కదా? కాబట్టి, కవి, ఆడవాళ్ళని తిట్టించాడు. లక్ష్మణుడు బయటికి పోతూ ఇంటి ముందు గీతలు గియ్యడం, సీతతో వాటిని దాట వొద్దనడం – ఇవేవీ, ‘వాల్మీకి రామాయణం’లో లేవు. ★

**177.** **అరణ్య, సర్గ 46, శ్లోకం 2:** రావణుడు రుషి వేషంతో వచ్చాడు. రాముడు కూడా రుషి వేషంతోటే రాజకీయాలు నడుపుతున్నాడు. (ఈ విషయం ముందు ముందు తెలుస్తుంది) మోసగించాలన్నా, రహస్య వ్యవహారాలు జరపాలన్నా – రుషి వేషమే చక్కని వేషం అన్నమాట! ఈ దొంగ సన్యాసుల వ్యవహారం మనకు గొప్ప సాంప్రదాయంగా వస్తోంది, వేల సంవత్సరాలనించీ. ★

**178.** **అరణ్య, సర్గ 46, శ్లోకాలు 17, .... 22:** రావణుడు, సీత అవయవాలన్నిటినీ ఎలా వర్ణిస్తున్నాడో నేనిక్కడ రాయక తప్పదు. దాన్ని గురించి చర్చించాలి కాబట్టి. కళ్ళూ, పళ్ళూ, చెంపలూ అన్నీ వర్ణించడం అయ్యాక – “సుందరీ! లక్ష్మీదేవి వలె ప్రకాశిస్తూ ఉన్నావు. నీ పిరుదులు ఇసుక తిన్నెలవలే ఎత్తుగా ఉన్నాయి. నీ పొత్తికడుపు ప్రదేశం విశాలంగానూ, ఉన్నతంగానూ వుంది. నీ నడుము పిడికిట్లో ఇమిడే విధంగా ఉంది. నీ తొడలు బలిసిన ఏనుగు తొండాలలాగా ఉన్నాయి. నీ రొమ్ములు గుండ్రంగా, ఎత్తుగా పెద్ద పెద్ద మొనలతో ఒకదాన్ని ఒకటి వొరుసుకుంటూ తాటిపండ్లవలే బరువుగా కదులుతూ ఉన్నాయి. నీ రొమ్ములు చక్కని వెంట్రుకలతో నిండి, మనోహరంగా కదులుతూ నా మనసు నెంతో ఆకర్షిస్తున్నాయి ....” ఈ ఘట్టంలో ఇంతటితో ఆగింది ఈ వర్ణన. సీతని ఈ రకంగా వివస్త్రని చేసి చూసినవాడు రావణుడు కాదు. కవి పుంగవుడే. కవులు పతివ్రతల్ని – లక్ష్మీదేవులు, పార్వతీదేవులు అంటూనే నిమిషానికోసారి, వారి రత్నహారాలూ, పట్టుచీరలూ, జలతారు రవికెలూ తప్పించుకుంటూ ఎక్సరే కళ్ళతో వారి స్తనాలూ, భుజాలూ, పొత్తి కడుపులూ, తొడలూ, నడుములూ, పిరుదులూ చూసి వచ్చి వాటిని చక్కగా వర్ణించి, అందరికీ చెప్పి ఆనందపెడుతూ ఉంటారు. రవి చూడని స్థలాలు కూడా కవి చూస్తాడంటే ఇదే అన్నమాట.

ఈ ఘట్టంలో, ‘రావణుడు కాముకుడు కాబట్టి, కవి ఈ రకంగా రాశాడు’ అనడానికి వీల్లేదు. ఇక్కడే కాదు, ప్రతీచోటా ఇలాంటి వర్ణనలు ఉన్నాయి. నేను ఈ కథల్లో ఈ రకం వర్ణనలన్నీ వదిలెయ్యడం వల్ల, ఇవి మొదటినించీ ఉన్నాయనే సంగతి పాఠకులకు తెలీదు! – సీతతో లక్ష్మణుడు మాట్లాడినా, హనుమంతుడు మాట్లాడినా, ఆఖరికి రుషులు మాట్లాడినా – ‘మంచి పిర్రలు గలదానా!’ (సుశ్రోణీ!), ‘మంచి నడుము గలదానా (సుమధ్యే) అనవలసిందే!

ఈ కావ్యం శ్లోకాలతో రాయడంచేత, ఛందస్సుకి అనువుగా ఉండడంకోసం, శ్లోక పాదాల్ని పూరించడంకోసం, ఆ సందర్భాన్ని బట్టీ, మాట్లాడుకునే పాత్రల సంబంధాన్ని బట్టీ అవసరమైనప్పుడు – “సుందరీ! మానినీ! సుకేశినీ!” లాంటి మాటలు వుంటే, దాన్ని అర్థం చేసుకోవచ్చు. అంతేగానీ, లక్ష్మణుడు – సీత తొడల్నీ, హనుమంతుడు – సీత నడుమునీ వర్ణిస్తోంటే దాన్ని ‘ఛందస్సుకోసం, ప్రాసకోసం’ అంటే, ఆ వాదం పనికి రాదు. ➔

సీత కొంచెం సిగ్గుపడింది. ఋషులెవరు వచ్చినా ఆమెని చూసి – "లక్ష్మీదేవి లాగ ఉన్నావు తల్లీ! పార్వతిదేవి లాగ ఉన్నావు తల్లీ! .... నీవంటి సౌందర్య రాసికి ఈ కష్టాలేమిటి? నీవంటి పతివ్రతకి ఈ వన వాసం ఏమిటి?" అని ఆమె అందాన్ని ప్రశంసించి, ఆమె దురదృష్టానికి విచారించడం మామూలే.

సీత ఋషి పొగడ్తలు వింటూ తలుపు నానుకుని వినయంగా నిలబడింది. "దశరథ మహారాజు కోడలిని స్వామీ నేను. శ్రీరామచంద్రుడి భార్యని. నన్ను సీత అంటారు. మా మామగారు ఆఖరిభార్య మాట విని నా భర్తకు రాజ్యం ఇవ్వలేదు. పైగా నా భర్తకు పద్నాలుగు సంవత్సరాలు వనవాసం విధించారు. నేను నా భర్తను విడిచి సుఖ భోగాలతో జీవించలేక, నా భర్తతో పాటే వనవాసానికి వచ్చాను స్వామీ! మా మరిది కూడా మాతో వచ్చాడు" అంటూ ఆతృతగా బయట చెట్ల వేపు చూసింది – "నా భర్త, ఎదటివారు కోరింది ఇస్తారేగానీ, ఎదటి వారినించి ఏమీ పుచ్చుకోరు స్వామీ! ఎల్లప్పుడూ సత్యమేగానీ .... అసత్యం పలకరు ...." అంటూ మళ్ళీ బయట వేపు చూసింది – "కడుపు నిండా పళ్ళు భుజించండి స్వామీ! ఇంతకు పూర్వం తమ దర్శనం ఎన్నడూ చేసుకోలేదు మేము. నా భర్తా, నా మరిదీ తమర్ని చూసి ఎంతగానో సంతోషిస్తారు స్వామీ! .... తమ నామధేయం .... వంశం .... గోత్రం .... శెల విప్పనే లేదు స్వామీ!" అంటూ వినయంగా మాట్లాడుతూ నించుంది.

రావణుడు, వచ్చిన కార్యం త్వరగా ముగించాలనే తొందరతో, సీతని గంభీరంగా చూసి మందహాసం చిందిస్తూ – "సుందరీ! నీ సౌందర్యం నా మనసుని అమితంగా ఆకర్షిస్తోంది. నీ వంటి సుకుమారి నగరాలలో, ఉద్యానవనాలలో విహరించాలి. అక్కడి సిరిసంపదలు అనుభవించాలి" అంటూ అసలు వ్యవహారంలోకి దిగిపోయి, ఆసనం మీదనించి లేచి నిలబడ్డాడు. చిరునవ్వుతో – "సుందరీ! లంకాధిపతి రావణుణ్ణి గురించి విన్నావా? .... ఆ రావణుణ్ణి నేనే! దేవతలందర్నీ జయించిన వాణ్ణి నేనే! ఇంతకు పూర్వమే నీ సౌందర్యం గురించి విని, ముగ్ధుణ్ణయి, నిన్ను నాతో తీసుకుపోవడానికే ఈ వేషంలో వచ్చాను. నేను ఎందరో సౌందర్యరాసుల్ని అపహరించి తెచ్చి, నా భార్యలుగా చేసు కున్నాను. కానీ, నిన్ను చూడగానే నాకా స్త్రీలందరి మీదా ఉండే ప్రీతి పోయింది. నిన్నే నా ప్రియభార్యగా చేసుకుంటాను. వెంటనే నాతో బయలుదేరి వచ్చెయ్యి!" అంటూ సీతకి దగ్గిరగా నడిచాడు.

సీత నిర్ఘాంతపోతూ రావణుడి మాటలు వింది. అంత ఆశ్చర్యంలో కూడా అసలు విషయం ఆమెకు వెంటనే అర్థమైంది. తన భర్త లేకుండా, ఒంటరిగా వున్న సమయంలో, పర పురుషుడు, మహా పతివ్రత అయిన తనని వాంఛిస్తున్నాడు – అని గ్రహించింది.

సీత భయంతో కంపిస్తూ – కోపంతో ఉద్రేక పడుతూ – తలుపువెనక్కి తప్పుకుంది. అప్పుడు సీతని పతివ్రతలకు వచ్చే నిజమైన పూనకం ఆవరించింది. పర

---

➔ఎంతసేపూ – "నీ తొడలు బలిసి ఉన్నాయి. నీ పిరుదులు బలిసి ఉన్నాయి. నీ స్తనాలు బలిసి ఉన్నాయి" – ఇదీ కవిత్వం! స్త్రీల అవయవాలు బలిసి ఉండాలి. కవులూ, పండితులూ లొట్టలేస్తూ, కావ్యాల్లో ప్రబంధాల్లో స్త్రీల అవయవాల వెంట ఊహా విహారాలు చేస్తూ – పైకి మాత్రం, 'ఆ పతివ్రతామతల్లి, ఆ లక్ష్మీదేవి' అని పేలుతూ ఉంటారు. – పైగా దానికి శృంగారం అని ఒక దొంగపేరు! – ఈ కవులు, ఊర పందులలాగ బలిసి, కొవ్వెక్కి, ఈ 'కొవ్వు కవిత్వం' రాస్తారు. ఇది దోపిడీ సంస్కృతి లక్షణం. ఈ సంస్కృతి, స్త్రీని, కామానికీ, చాకిరీకీ, పురుషుడి ఆధీనంలో వుండటానికీ నిర్దేశిస్తుంది. అందుచేతనే, ఫ్యూడల్ సాహిత్యం స్త్రీలను పతివ్రతలుగా, భోగవస్తువులుగా, చాకిరీ చేసే బానిసలుగా చిత్రిస్తూ ఉంటుంది. పురుషుల్ని మాత్రం వీరులుగా, సమర్థులుగా, సాహసికులుగా వర్ణిస్తుంది. వారి శరీరావయవాల్ని కొంచెం వర్ణించినా, వారి గుణగణాల్నీ, శక్తి సామర్థ్యాల్నీ, అధికంగా చిత్రిస్తుంది.

బూర్జువా వ్యవస్థలో కూడా స్త్రీకి గౌరవ స్థానం ఉండదు. సరుకు ఉత్పత్తే సర్వస్వంగా వుండే బూర్జువా వ్యవస్థ స్త్రీల శరీరాన్ని ప్రదర్శించి సరుకుల అమ్మకాలకి ప్రచార సాధనాలుగా వినియోగించుతుంది. అందుకే బూర్జువా సాహిత్యంలో కూడా స్త్రీ పాత్రల్ని, ఆత్మగౌరవం గల వారిగా, వ్యక్తిత్వం గలవారిగా, చిత్రించడానికి వీలుండదు.

ఫ్యూడల్ సంస్కృతినీ, బూర్జువా సంస్కృతినీ అసహ్యించుకునే చైతన్యం కలిగింతర్వాత, పురుషులు, స్త్రీల అవయవాల మీద దృష్టి నిల్పకూడదు. స్త్రీని శృంగార వస్తువుగా చూడకూడదు. ఆమె అభిప్రాయాల్ని బట్టీ, ఆలోచనా విధానాన్ని బట్టీ, ఆమె వ్యక్తిత్వాన్ని గుర్తించాలి. "నువ్వెంతో అందంగా ఉన్నావు. నీ కళ్ళు .... నీ చెంపలు .... నీ నడుము .... నీ వక్షం ... నీ నవ్వు .... నీ నడక" అని పురుషుడు అన్నప్పుడు, స్త్రీ మురిసిపోగూడదు. తన శరీరావయవాల్నీ, శరీర లక్షణాల్నీ, మాత్రమే పురుషుడు గుర్తించడం అవమానంగా స్త్రీ భావించాలి. "నువ్వు చాలా అందగత్తెవి" అని ఒక అబ్బాయి అనగానే, అతను తనని శృంగారం దృష్టితో చూస్తున్నాడని అర్థం చేసుకుని, ఆ అమ్మాయి అతన్ని లాగి లెంపకాయ కొట్టాలి. చెప్పుతో అయితే మరీ మంచిది! ★

పురుషుణ్ణి ఆగ్రహంగా చూస్తూ – "దుర్మార్గుడా! రుషి వేషంలో వచ్చి, ఆతిథ్యం పొంది, ఒంటరిగా వున్న స్త్రీతో ఇంత దుర్భాష లాడుతావా? శ్రీరామచంద్రుడంటే ఎవ రనుకున్నావు? మహావీరుడు! పురుషోత్తముడు! మహేం ద్రుడితో సమానుడు! అటువంటి వీరుడి భార్యని, పర పురుషుడు కోరి సాధించగలడా? నా భర్తతో వైరం సాక్షాత్తూ యముడితో వైరమేనని తెలుసుకో!" అంటూ కళ్లెర్రజేసి కంపిస్తూనే రావణుణ్ణి భయ పెట్టాలని చూసింది.

కొన్ని క్షణాల కిందట – వినయంతో వణుకుతోన్న లక్ష్మణుణ్ణి నిందిస్తున్నప్పుడు, పర పురుషుణ్ణి తిరస్కరిస్తు న్నాననే సంతృప్తేమీ కలగలేదు సీతకి. భీకరంగా వున్న పర పురుషుడి కోరిక విన్న ఈ క్షణంలో, అతణ్ణి తిరస్క రిస్తూ సీత, ఉద్వేగంతో, నిజంగా కలిగిన భయంతో, కంపించిపోతూ నించుంది.

రావణుడు నిర్లక్ష్యంగా నవ్వుతూ – "నీ భర్త వీరత్వం వర్ణిస్తున్నావు. నా వీరత్వం కూడా విను! నా పేరు వినగానే శత్రువులంతా బాణం చూసిన పిట్టల్లాగ చెల్లాచెదురైపోతారు. కుబేరుడే నా కోసం లంకని వదిలి కైలాసానికి పారిపోయాడు. అతడితో యుద్ధం చేసి, పుష్పక విమానం గెల్చుకున్నాను. నా ప్రతాపం నీకేమి తెలుసు? నేను చెట్లకింద నించి నడుస్తూ వుంటే ఆకులు భయంతో కదలవు. నదుల పక్కనించి నడుస్తూ వుంటే, జలం ప్రవహించదు. సూర్యచంద్రులే నాకు ఊడిగం చేస్తారు. ఒక్కసారి నా లంకని చూశావంటే, నువ్విక భర్తనీ, బంధు మిత్రుల్నీ తలచనే తలచవు. దశరధుడు తన ముద్దుల కొడుక్కి రాజ్యం ఇచ్చి, నీ భర్తని అడవులకు సాగనంపాడు. రాజ్య భ్రష్టుడితో నువ్వేమి సుఖపడ తావు? నేను నిన్ను కోరడం నీ భాగ్యం అనుకో! నన్ను తిరస్కరించడం వివేకం కాదు. నీ భర్త నా చిటికెన వేలికైనా సమానుడు కాదు సుందరీ! జాప్యం చెయ్యకు! వెంటనే బయల్దేరు!" అంటూ రావణుడు కామోద్రేకం చిందే చూపుతో సీతని ఆలింగనం చేసుకోబోయాడు.

సీత భయంతో వణుకుతూ, తన పాతివ్రత్య మహత్యం ఆత్మలో మెదిలి కుపితురాలవుతూ ఉద్వేగంతో "నీచుడా! నీ ప్రేలాపన చాలించు! ఇంద్రుడి భార్యని కోరినా ఇంద్రుడు నిన్నేమీ చెయ్య లేదేమోగానీ, నన్ను కోరితే నా భర్త నిన్ను విడిచి పెట్టడు. నా వంటి పతి వ్రతని తాకడానికైనా నీకు సాధ్యమవుతుందనుకోకు! దుర్మార్గుడా! .... వెంటనే వెళ్ళిపో! లేకపోతే నా భర్త నిన్ను బతకనివ్వడు.." అని కొంచెం వెనక్కి జరిగింది.

రావణుడు ధిక్కారంగా చూశాడు – "నా వీరత్వం నీకింకా బోధపడలేదు. భూమిని భుజాలతో పైకెత్తేస్తాను. సముద్రాలు పీల్చేస్తాను. మరణ దేవతనే చంపేస్తాను. సూర్యగమనాన్నే అడ్డగిస్తాను. లోకాలన్నీ వెతికినా, నీకు తగిన భర్తని నేనే" అంటూ సీత చుట్టూ చేతులు వేసి అదిమి పట్టుకున్నాడు.[179]

భయంతో కెవ్వున అరిచింది సీత.

రావణుడి వీరత్వం మీద ఆమెకి వీసమెత్తయినా నమ్మకం లేదు. తన భర్త వీరత్వం ముందు ఎవరి వీరత్వ మైనా గడ్డి పరకతోనే సమానమని ఆమె విశ్వాసం. కానీ హఠాత్తుగా .... ఈ పర పురుషుడు చేస్తోన్న దౌర్జన్యాన్ని నమ్మక తప్పలేదు. సీత, భయంతో, చీత్కారంతో, అతణ్ణి వదిలించుకోవాలని పెనుగులాడింది.

రావణుడు భీకరంగా, సీత జుట్టు ఎడం చేత్తో పట్టి, కుడి చెయ్యి ఆమె తొడల కింద వేసి, జింక పిల్లని ఎత్తినట్టు ఎత్తి, గబగబ నడుస్తూ – కాలికి అడ్డం వచ్చిన దర్భాసనాలూ, పూజాద్రవ్యాలూ – చెల్లా చెదురుగా తన్ని, చెట్లచాటున ఉన్న రథంవేపు దారి తీశాడు.[180]

సీత, పరిస్థితి గ్రహించుకుని భయంతో – "అయ్యో! అయ్యో! రక్షించండి! రక్షించండి!" అంటూ కేకలు పెట్టింది.

రావణుడు, రథంలో కూర్చోగానే, సీతని తొడ మీద కూర్చోబెట్టుకున్నాడు. రథం కదిలి పరుగు ప్రారంభిం చింది. సీత ఉన్మత్తురాలిలాగు వలవలా ఏడుస్తూ రథం లోంచి దూకాలని పెనుగులాడింది.

తనని తాకీ తాకగానే పర పురుషుణ్ణి భస్మం చెయ్యా వలసిన మహా పతివ్రత, పర పురుషుడి రాక్షస పట్టు లోంచి తప్పుకోలేక "రక్షించండి! రక్షించండి! అయ్యో! నన్నెవరూ రక్షించేవారే లేరా?" అంటూ నిస్సహాయంగా కేకలేస్తూనే వుంది.

సీతకి అలవాటైన పక్షులు కొన్ని కొంత దూరం సీత వెంట ఎగిరి చెట్లమీద వాలి అయోమయంగా చూస్తూ వుండిపోయాయి.

★

---

**179.** **అరణ్య, సర్గ 49, శ్లోకాలు 3, 4:** రావణుడు, తన వీరత్వం వర్ణించుకుంటున్నాడు. కథలో ప్రతీ పాత్రా తనని తను పొగుడుకుంటూనే ఉంటుంది. వీరత్వం అంతా మాటల్లోనే. తీరా పని చెయ్యబోతే ఏ సమర్థతా ఉండదు. "నేనింతవాణ్ణి, అంతవాణ్ణి" అని డాంబికాలు చెప్పుకోవడం, ఫ్యూడల్ మనస్తత్వం. ★

**180.** **అరణ్య, సర్గ 49, శ్లోకం 17:** సీతని రావణుడు ఏ విధంగా తీసికెళ్ళాడో చూడండి! రావణుడు, రథంలో కూర్చోగానే, సీతని తొడమీద కూర్చోబెట్టుకున్నాడు. రథం సాగింది. ★

# లింకు-4

# 4వ కథ తర్వాత 5వ కథ వరకూ

[4వ కథ- రావణుడు, సీతని రథంమీద కూర్చోబెట్టుకుని బయల్దేరడంతో ముగిసింది.
5వ కథ - సీత గురించి రాముడు శాస్త్రోక్తంగా దుఃఖించడంతో ప్రారంభమవుతుంది.
ఈ రెండు కథలకూ మధ్యనున్న భాగం ఇది.]

**కం**చర గాడిదల రథం ఆకాశమార్గాన పోతూ వుంది.

రావణుడు సీతని బలవంతంగా తొడమీదికి లాక్కుని, విడిపించుకోడానికి వీలులేకుండా ఆలింగనం చేసుకుని కూర్చున్నాడు.

సీత, ఏడుస్తూ, రావణుణ్ణి తిడుతూ, కేకలు పెడు తోంది - "రామా! లక్ష్మణా! ఈ దుర్మార్గుడు నన్ను ఎత్తుకు పోతున్నాడు! అయ్యో! నన్ను రావణుడు ఎత్తుకు పోయాడని మీ కెలా తెలుస్తుంది? ఈ దుష్టుడెప్పుడు నశిస్తాడు? వీడికి కాలం ఇంకా ఆసన్నం కాలేదా?[181] ఆ దుష్టరాలు కైకేయి కోరిక తీరింది. ఇక ఆమె క్షేమంగా సంతోషంగా ఉంటుంది" అంటూ ఏడుస్తూ చుట్టూ చూసింది.

"ఓ కర్ణికా వృక్షమా! నన్ను రావణుడెత్తుకు పోయా డని నా భర్తకు చెప్పాలి సుమా!" అంది. ప్రస్రవణ పర్వతాన్ని చూసి నమస్కరిస్తూ "ప్రస్రవణమా! ఈ దుష్ట వార్త నా పెనిమిటికి చెప్పు తండ్రీ!" అంది. గోదావరిని చూస్తూ - "గోదావరి తల్లీ! ఈ నీచుడు నన్నెత్తుకు పోతు న్నాడని నువ్వయినా నా భర్తకి చెప్పు తల్లీ!" అంది. (ఆ పర్వతం గాడెలాగూ చెప్పడనా?)

సీతకి, వనదేవత లందరూ గుర్తొచ్చారు - "వన దేవతలారా! మీరైనా చెప్పాలి సుమా!" (ఈసారి గోదావరి మీద కూడా అనుమానమే!) సీత, చుట్టూ భయంతో చూసింది. (అసలు వీళ్ళు చెపుతారా అని గావున్ను) "ఓ పక్షులారా! నా భర్తకు నేను ప్రాణాల కన్నా ఎక్కువ దానిని. అసలీ వార్త నా భర్తకు తెలియాలే కానీ, రావ ణుడు నన్ను స్వర్గంలో పెట్టినా, నరకంలో పెట్టినా, నా భర్త ఈ నీచుణ్ణి జయించి నన్ను రక్షించి తీసుకు వొచ్చేస్తాడు!" అని అరిచింది.[182]

ఆ విధంగా దుఃఖిస్తూ, మంచి పిరుదులుగల సీత (సుశ్రోణి), దూరంగా చెట్టుమీద నిద్రపోతూ వున్న జటాయువుని చూసింది. (పిరుదులతో చూసింది కావున్ను. దూరంగా ఉన్న వాళ్ళని చూడాలంటే స్త్రీకి మంచి పిరుదులు ఉండాలన్న మాట! పోనీ, 'మంచి కళ్ళుగల సీత' అన్నా బాగుండును!)[183]

"ఓ జటాయు పక్షీ! ఈ దుర్మార్గుడైన రావణుడు నన్ను తీసుకుపోతున్నాడు. నా మీద నీకు జాలి కలిగినా ప్రయోజనం లేదు. ఇతణ్ణి అడ్డగించడం నీ వల్ల కాదు. ఈ నీచుడి దగ్గిర ఆయుధాలన్నీ ఉన్నాయి. ఈ సంగతి మాత్రం నా భర్తకు చెప్పు!" అని కేకలు పెట్టింది. ('నువ్వ

---

**181.** **అరణ్య కాండ, సర్గ 49, శ్లోకాలు 27, 28:** "దుష్టుడి పాపకార్యమునకు ఫలము వెంటనే కలుగదు. కాలము రావలయును" అని దుఃఖిస్తోంది సీత. రాముడి దైవత్వమూ, సీత పాతివ్రత్యమూ ఎందుకూ పనికిరావా? - అనే ప్రశ్న వచ్చే అవకాశం ఉంది కదా? కాబట్టి - "దుష్టుడు నశించటానికి కాలం రావాలి. రావణుడి దుష్టత్వానికి తక్షణమే శిక్ష ఉండదు" అనడం! ★

**182.** **అరణ్య, సర్గ 49, శ్లోకాలు 34, 35:** "నా భర్తకు నేను ప్రాణముల కన్నా ఎక్కువయిన దానను" అంటోంది సీత. రాముడు, చాలాసార్లు సీత ఎవరెవరి కన్నా తక్కువో, నిర్మొహమాటంగానే చెప్పాడు. సీతకి అవన్నీ పరగడుపు అయిపోయాయి. ఈ పాత్రల మధ్య అన్నీ భ్రమలూ, నటనలూ, ఆత్మవంచనలూ. ★

**183.** **అరణ్య, సర్గ 42, శ్లోకం 40:** సుశ్రోణి అయిన సీత, జటాయువుని చూసి దుఃఖిస్తూ చెప్పింది. 'సునయన' అనో, 'సులోచన' అనో అనకూడదూ? ★

విడిపించలేవులే; నీ వల్లకాదులే' అంటోంది సీత! జటాయువు తననెక్కడ విడిపిస్తాడోనని భయంగా ఉన్నట్టుంది సీతకి. రావణుడి తొడ, కూర్చోడానికి సదుపాయంగానే ఉన్నట్టుంది.)[184]

జటాయువు సీత కేకలకు ఉలిక్కిపడి లేచాడు. రథంలో వ్యవహారం చూశాడు. కోపంతో రెక్కలు కొంచెం కదిలించి, మెడ సాగదీసి దాన్ని కొమ్మ మీద నించి రథం దగ్గిరికి పెట్టాడు. "రావణా! నువ్వు తీసుకు పోతూ వున్న స్త్రీ ఎవరనుకున్నావు? లోకాలన్నింటికీ ప్రభువైన శ్రీరామచంద్రుడి భార్య! శ్రీరాముడు, లోకాలన్నిటికీ హితమే చేస్తాడు. నేను జటాయువుని. సనాతనంగా వొస్తూన్న దాస్య ధర్మంతో శ్రీరాముడికి సేవ చేసుకుంటూ ఉన్నాను.[185] శ్రీరాముడికి అపచారం జరుగుతూ వుంటే చూస్తూ ఊరుకుంటానా? పురుషుడు, తన భార్య నెంత జాగ్రత్తగా రక్షించుకుంటాడో పరుల భార్యలను కూడా అలాగే రక్షించాలి కదా? సత్పురుషులు, ధర్మ శాస్త్రాల్లో చెప్పని ధర్మార్ధ కామాలు అనుభవించ వచ్చునా? రాజు, ముఖ్యంగా రాచ స్త్రీలను కాపాడాలి కదా? నువ్వూ రాజువే కదా?[186]

శ్రీరాముడు, నీ విషయంలోగానీ, నీ రాజ్యం విషయంలో గానీ, అధర్మం చేశాడా? ఖరుడేగదా శూర్పణఖ మాట విని ముందు యుద్ధానికొచ్చాడు? మీది మీది కొచ్చిన శత్రువుని రాముడు చంపాడు. అందులో తప్పేముంది? వెంటనే సీతని విడిచిపెట్టు! లేకపోతే మహా సర్పాన్ని కంఠానికి చుట్టుకున్నట్టే! నా కిప్పుడు అరవై వేల సంవత్సరాలు. కాస్త పెద్ద వాణ్ణయిన మాట నిజమే గానీ, నిన్ను మాత్రం క్షేమంగా పోనిస్తాననుకోకు! నా కళ్ళముందే సీతను తీసుకు పోనిస్తానా? ఖరుడికి పట్టిన గతే నీకూ పడుతుంది. రా! యుద్ధంతో విందుచేస్తాను నీకు!" అంటూ జటాయువు చెట్టుమీద నించి ఎగిరి రావణుడి మీదకు ఉరికాడు.

ఇద్దరికీ పెద్ద యుద్ధం జరిగింది.

రావణుడు – బాణాలతో!

జటాయువు – గోళ్ళతో!

జటాయువు, రావణుడి ధనుస్సుని కాళ్ళతో విరిచేశాడు. రావణుడు రథంలోంచి ఇంకో ధనుస్సు అందుకుని, జటాయువు చుట్టూ గూడు కట్టినట్టు బాణాలు గుప్పించాడు.

జటాయువు, రెక్కలతో ఆ బాణాల గూడు చెల్లాచెదరు చేసేసి, ఆ ధనుస్సు కూడా విరిచేశాడు. గోళ్ళతో లాగి రావణుడి కవచం ఎక్కదీశాడు. కంచర గాడిదల్ని ముక్కుతో పొడిచి చంపేశాడు.

రథంలో రావణుడి వెనక నుంచుని గొడుగు పట్టుకున్న పరిచారకుణ్ణీ, చామరాలతో విసిరే వాళ్ళనీ, చంపేశాడు. రథ సారధిని చంపేసి కిందికి తోశాడు. రథ చక్రాలు ఊడదీసి, రథం విరగ్గొట్టేశాడు. (సీత ముందు ఎంత అవమానమో రావణుడికి, పాపం! బొత్తిగా మోటుగా చేస్తున్నాడు కదూ జటాయువు?)[187]

రథం విరిగిపోగానే రావణుడు సీతని ఒడిలో పెట్టుకుని కింద పడ్డాడు. (రావణుడి తొడమీద కూర్చోడం సీతకి చాలా మంచిదైంది. లేకపోతే ఎంత దెబ్బ తగిలేదో!)

రావణుడు కిందపడగానే, సకల ప్రాణులూ పక్షిరాజుని–"మంచి పని చేశావు! మంచి పని చేశావు!" అని పొగిడాయి.

జటాయువు అలిసిపోయాడని రావణుడికి అర్ధమైంది. ధైర్యంగా సీతని ఎత్తుకుని ఆకాశంలోకి ఎగిరాడు. గాలిలో బాసింపట్టు వేసుకుని సీతని మళ్ళీ వొళ్ళో

---

**184.** **అరణ్య, సర్గ 49, శ్లోకం 40:** జటాయువు, రావణుడితో పోట్లాడి చివరికి ఓడిపోతాడు కాబట్టి, "జటాయువుకి ఆయుధాలు లేవు కదా? అందుకే ఓడిపోయాడు" అని చెప్పడం! ★

**185.** **అరణ్య, సర్గ 50, శ్లోకం 3:** జటాయువు – "సనాతనమగు దాస్య ధర్మములో నుండువాడను" అంటున్నాడు. దాస్య ధర్మం! అదీ సనాతనం! అంటే, పూర్వకాలం నించి వున్న దాస్య ధర్మం. ఏమిటి అది? అది, బానిస వ్యవస్థకి సంబంధించిన ధర్మం – అని అర్ధం చేసుకోవాలి. మత కథల్లో, ఇలాంటి మాటల వల్లనే వెనకటి చరిత్ర తెలుస్తుంది. ★

**186.** **అరణ్య, సర్గ 50, శ్లోకం 6, 7, 8:** పురుషుడు తన భార్యని జాగ్రత్తగా ఎందుకు రక్షించుకుంటాడు? పర పురుషుల భయంవల్ల. ఏ పురుషుడూ, పర స్త్రీలకు హాని చెయ్యని పరిస్తితి వుంటే, ఎవరి భార్యని వాళ్ళు రక్షించుకోవలసిన అవసరమే ఉండదు కదా? రాజు పర స్త్రీలని కాపాడాలిగానీ, ముఖ్యంగా "రాచస్త్రీలని" కాపాడాలట! మిగతా వాళ్ళని అంతగా కాపాడకపోయినా ఫర్వాలేదు. ప్రతీ విషయంలోనూ ఈ నీతులు ఇలాగే వైరుధ్యాలతో వుంటాయి. ★

**187.** **అరణ్య, సర్గ 56, శ్లోకం 18:** రాజు ఒక స్త్రీని ఎత్తుకుపోతూ వుంటే, రథంలో కూడా పరిచారకులు గొడుగు పట్టడం, విసరడం అట! ఈ పరిచారకులు బొత్తిగా పిచ్చి మొహాలుగానీ, ఆ జటాయువు మీదకొస్తూంటే, ఆ గొడుగులూ, విసన కర్రలూ అవతల పారేసి, రథం దూకి, కాలి కొద్దీ పరిగెత్తవొద్దూ? సేవకులు అలా చెయ్యరు. విసురుతూ, విసురుతూ, విసురుతూ, విసురుతూనే (సేవలోనే) మరణిస్తారు, రాజు కోసం. సేవకులు, అలా సేవలు చెయ్యాలని చెప్పడం అన్న మాట! ★

కూర్చోపెట్టుకుని ఎగురుతూ ప్రయాణం సాగించాడు. (అలా ఎగిరితే ఎంత బాగుంటుందో! సీతా! నువ్వు అతని వొళ్ళోనే కూచో! మళ్ళీ కిందపడ్డా దెబ్బ తగలదు. ....! ఏమో చెప్పలేం.)

జటాయువు కోపంగా వెంటబడ్డాడు. "దుష్టుడా! రావణా! ఆగు, నిలబడు! (బాసింపట్టు తియ్యి!) శ్రీరాముదంటే ఎవరనుకుంటున్నావు? కకుత్స వంశస్థుడు. వీరుడివైతే, నాతో యుద్ధంచేసి, వెళ్ళు!" అని అరుస్తూ రావణుడి వెనకే ఎగురుతూ వచ్చి రావణుడి వీపుమీద దభీమని కూర్చున్నాడు. (అబ్బ! మరీ మోటు!)

మావటివాడు, మాట వినని ఏనుగుని అంకుశం పోట్లు పొడిచినట్టు, జటాయువు రావణుడి వీపంతా ముక్కుతో పొడిచి చీల్చేశాడు. (రాముడు చంపడాని కేమీ మిగల్చకుండా రావణుడి వ్యవహారం జటాయువే తేల్చేసేటట్టున్నాడు. ఈ కథ ఇక్కడే అయిపోతుందేమోనని భయం వెయ్యడం లేదూ?)

జటాయువు, రావణుడి పది తలలమీదా జుట్టంతా పీకేశాడు. (రథం విరగ్గొట్టినా ఫర్వాలేదు, వీపు చీరేసినా ఫర్వాలేదుగానీ, తలలు చెరిపేస్తే ఏం బాగుంటుంది పాపం? భలే కోపం వొస్తుంది కదూ? పక్కన సీతకూడ ఉందయ్యే!)

రావణుడికి అప్పటికి కోపం వచ్చి (తలలు చెరిపేసినందుకు! అవును మరి! నేనన్నానా?) జటాయువుతో యుద్ధానికి వెనక్కి తిరిగాడు. (జటాయువు రావణుడి వీపుమీదే ఉన్నాడు)

రావణుడు, ఎడం భుజం కింద పది చేతుల్తో సీతని అదిమి పట్టుకుని, కుడి పది చేతుల్తో వీపుమీద జటాయువుతో యుద్ధం ప్రారంభించాడు.

జటాయువు, రావణుడి ఎడం భుజంమీద ముక్కుతో పొడిచి, పొడిచి, ఆ పది చేతుల్నీ గుత్తిలాగ ఊడదీసేశాడు. (అయ్యయ్యో! సీత, ఆ భుజం కిందే వుంది కదా? అదేం పని జటాయువూ?) – ఆ చేతుల గుత్తి ఇలా ఊడిందో లేదో, పుట్టలోంచి పాములు బుస్సున లేచి వచ్చినట్టు మళ్ళీ పది చేతులు అలా పుట్టుకొచ్చేశాయి. (ఇలా అయితే ఎవరు యుద్ధం చెయ్యగలరు బాబూ? చక్కగా యుద్ధాల్లో చప్పున చచ్చిపోవాలిగానీ, నరికేసినవన్నీ మళ్ళీ పుట్టు కొచ్చెయ్యడాలుంటే, అవతలి వాళ్ళకి ఉడుకు మోత్తనం వొస్తుందా, రాదా?)

ఇక లాభంలేదని రావణుడు సీతని కిందకి దించి జటాయువుతో కాళ్ళా చేతులా యుద్ధం ప్రారంభించాడు. జటాయువు రెక్కల్నీ, కాళ్ళనీ కత్తితో నరికేశాడు. జటాయువు, భూమిమీద పడిపోయాడు.

సీత పరుగెత్తుకొచ్చి జటాయువుని కావలించుకుని ఏడ్చింది – "అయ్యో! నన్ను రక్షించాలని వచ్చి ఈ పక్షి రాజు నాశనం అయిపోయాడే! రామా! ఈ సంగతి నీకింకా తెలియనేలేదా? నీకు ఏ అపశకునాలూ కనపడలేదా? నీ ఎడమ కన్ను అదరలేదా? పక్షులు వికృతంగా అరవలేదా?" అంటూ, చంద్రుని వంటి ముఖంగల సీత, శోభనాంగి అయిన సీత, చాలా ఏడ్చింది.

జటాయువు పడిపోయాక రావణుడు మళ్ళీ సీత దగ్గిరికి వచ్చాడు. సీత, చెట్ల వెంట పరిగెత్తి పెద్ద పెద్ద చెట్లని గట్టిగా కావలించుకుంటూ తప్పించుకోబోయింది.

రావణుడు – "వొదులు! వొదులు!" అని సీత జుట్టు పట్టుకుని గుంజుతూ లాక్కుపోయాడు.

జగములన్నీ చీకట్లు కమ్మాయి. గాలి ఆగింది. సూర్యకాంతి తగ్గింది.

బ్రహ్మ, దివ్య దృష్టితో చూశాడు. అసలు సంగతి తెలిసింది – రావణుడు సీతని ఎత్తుకుపోతున్నాడని చాలా సంతోషించాడు – ఇక రావణుడి చావు దగ్గిర పడింది కదా – అని!

దండకారణ్యంలో రుషులంతా రావణుడు సీతని తీసుకుపోతూంటే మొదట దుఃఖించి తర్వాత ఆనందించారు.[188]

"రామా! లక్ష్మణా! రక్షించండి, రక్షించండి!" అంటూ విల విల్లాడుతోన్న సీతని మళ్ళీ సందిటేసుకొని రావణుడు ఆకాశంలో కెగిరాడు. బాణంలాగ దూసుకు పోవడం మొదలెట్టాడు.

సీత, రాముడో లక్ష్మణుడో కనబడతారని కిందకి చూస్తోంది. సీత అందెలూ, గాజులూ, కాసుల పేరులూ చప్పుడు చేస్తున్నాయి. ఆ చప్పుడుతో రావణుడు ఎగురుతోంటే మేఘం గర్జిస్తూ ఎగురుతున్నట్టుగా వుంది.

సీత జడలో పూల దండ తెగి, ఘుమఘుమలాడే ఎర్రని పూల రేకులన్నీ రావణుడి భుజం మీదనుంచి కిందకి పూల వాన కురిశాయి. (అన్ని పూలు పెట్టుకుందా!) సీత ఎడం కాలి గజ్జెలు వూడి ఘల్లుమంటూ కింద పడ్డాయి. ఇంకా కొన్ని నగలు జారి, ఆకాశం

**188.** **అరణ్య, సర్గ 52, శ్లోకాలు 13, 14:** "దండకారణ్యంలో నుండిన రుషులందరూ రావణుడపహరించుకొని పోవుచుండు సీతని జూసి, దుఃఖించి .... రావణుడికి వినాశ కాలము వచ్చినదని తలచి సంతోషించిరి". మహానుభావులయిన రుషులంతా వొణుకుతూ పొదల్లో దూరి ఉంటారు. సీతని రావణుడు తీసుకుపోతున్నాడనే సంగతి, సీత కేకలవల్ల రుషులందరికీ తెలుసు. వాళ్ళంతా రాముడి ఇంటికి చుట్టుపక్కల వాళ్ళే. ★

నించి నక్షత్రాలు తెగి రాలుతోన్నట్టు కింద పడ్డాయి. (ఎన్ని నగలు పెట్టుకుందో!)

సీత స్తనాలమీద వుండే రత్నహారం తెగి కింద పడుతూ, అకాశంనించి దిగుతోన్న గంగానది లాగ మెరిసింది. ('సీత కంఠంలో మెరిసే రత్నహారం' అన కూడదూ? కవిగారి దృష్టి 'సీతా మహాతల్లి' పిరుదుల్నీ, స్తనాల్నీ వదిలి ఇవతలికి రాదు, ఎందుచేతో!)

బంగారపు శరీరచ్ఛాయగల సీత, మేఘాలలో మెరుపులలాగ తళుక్కున తళుక్కున మెరుస్తోంది.

అందమైన ముక్కు గల సీత మొహం, దుఃఖంతో వాడిపోయింది. (హమ్మయ్య! సీత ముక్కు అందంగానే ఉంటుందన్నమాట! సీత ముక్కు ఎలా ఉంటుందో ఏవిటో అని బెంగెట్టేసుకున్నాం ఇప్పటి దాకా!) సీత జుట్టు, అందంగా, నొక్కులుగా, కొసలు ఉంగరాలు తిరిగి వుంది. సీత పెదిమలు ఎర్రగా, పళ్ళు తెల్లగా, మొహం పగటి చంద్రుడిలాగ కాంతి తగ్గివుంది.

నల్లని రావణుడి చెయ్యి, సీత నడుం చుట్టూ చుట్టుకుని, నీలాలు పొదిగిన వడ్డాణం పెట్టుకున్నట్టు సీత నడుము అందంగా ప్రకాశించింది. – (ఇహనేం మరీ? సీత నడుం చుట్టూ రావణుడి చెయ్యి ఎప్పుడూ ఉంటేనే బాగుంటుంది.)[189]

కింద చెట్లు గాలికి తలలూపుతూ – "సీతా! భయపడకు సుమా!" అని చెప్తున్నట్టుగా వున్నాయి.

సీత, రాముడికోసం కిందకి చూస్తూనే ఉంది.

అరణ్యంలో ఉన్న సింహాలూ, పులులూ, రావణుడి మీద కోపంతో కింద అతని నీడ వెంట పరిగెత్తాయి. (సీత ఇప్పుడన్నా సింహాల్ని చూసి ఉంటుంది.)

పర్వతాలన్నీ జలపాతాలతో సీత కోసం ఏడుస్తు న్నట్టున్నాయి.

సమస్త భూతాలూ ఆకాశంలో చేరి – "అయ్యో! రావణుడు సీత నెత్తుకుపోతున్నాడే! లోకంలో ధర్మం ఎక్కడుంది? సత్యం ఎక్కడుంది?" అని దుఃఖించాయి.

సిద్ధులూ, చారణులూ – "ఇక రావణుడి జీవితం ముగిసిపోయింది" అని చెప్పుకున్నారు సంతోషంగా.

వనదేవతలంతా రావణుణ్ణి చూసి పారిపోతున్నారు ఎక్కడికక్కడ.

సీత జుట్టంతా చిక్కులు పడింది. బొట్టు చెదిరింది. "రావణా! దుర్మార్గుడా! సిగ్గులేని వాడా! మాయో పాయంతో ఎత్తుకుపోతున్నావే. ఇంత వేగంగా పోతూ వుంటే నా భర్త మాత్రం ఏం చెయ్యగలడు? కొంచెం నిలబడ్డావంటే నా పెనిమిటి వీరత్వం నువ్వే చూస్తావు. రామ లక్ష్మణుల బాణాల వేడి నువ్వెరగవు. నీకు వినాశకాలం దాపురించింది. యమలోకంలో కణకణ మండే అగ్ని స్థంభాన్ని కావలించుకుంటావు, తప్పదు" అని దూషిస్తూ, కింద ఒక పర్వతంమీద కొందరు వానరుల్ని చూసింది. చీర చింపి, కొన్ని ఆభరణాలు ఊడదీసి, మూటగట్టి, కింద పడేసింది – రాముడు తనని వెతుక్కుంటూ వస్తే సంగతి తెలుస్తుందని. (పడిపోయి నవేగాక, మూట గట్టినవేగాక, ఇంకా ఎన్నో నగలు వున్నాయి సీత ఒంటిమీద!)

రావణుడు బాణంలాగ దూసుకుపోతూ సముద్రం దాటి, లంకలో ప్రవేశించాడు. రాజ మార్గంలో ఎగురు కుంటూ (ఎగిరే వాళ్ళకి రాజ మార్గాలు! ఇళ్ళమీదనించి ఎగురుకుంటూ పోక, వీధి వెంట ఎగురుకుంటూ పోతు న్నాడు. బొత్తిగా తెలివి తక్కువ ఎగురుడు!), గుమ్మాల వెంట ఎగురుకుంటూ, చివరికి సీతని అంతఃపురంలోకి తీసుకొచ్చి దించాడు. (పోనీలే, ఎక్కడా పడెయ్యకుండా బాగానే తీసుకొచ్చాడు. సీత ఎక్కడో అక్కడ బతికుంటే అంతే చాలు!)

రావణుడు దాసీల్ని పిల్చి – "ఈ సీతని నా ఆజ్ఞ లేకుండా, పురుషులుగానీ, స్త్రీలుగానీ, ఎవ్వరూ చూడ కూడదు. తెలిసిందా? ఈమె, బంగారం నగలూ, పట్టుబట్టలూ, రత్నాలూ, ముత్యాలూ, ఏం అడిగితే అది చప్పున ఇచ్చెయ్యండి! ఈమెకి ఇష్టంలేని మాట లెవరన్నా మాట్లాడారో ఇక వాళ్ళు చచ్చినట్టే!" అని దాసీల మీద హుంకరించి అంతఃపురంలోంచి బయటికి వెళ్ళాడు.

ఎనిమిది మంది వీరుల్ని పిల్చి – "మీరు వెంటనే ఆయుధాలతో జనస్థానానికి వెళ్ళండి! ఇక రాముడికీ,

---

**189.** అరణ్య, సర్గ 52, శ్లోకం 25: "నీలమణులు పొదిగిన బంగారపు వడ్డాణము ప్రకాశించినట్లుల సీత, రావణుని నల్లని అంగముల నాశ్రయించి ప్రకాశించినది."– అదండీ కవిత్వం! సీతకి ఇష్టం లేకుండా, ఆమె నడుం చుట్టూ రావణుడి చెయ్యి చుట్టుకోడం ఎలాంటి విషయం? ఆమె శరీరం అసహ్యంతో జలదరించే విషయం. చూసేవాళ్ళకి కూడా పరమ అసహ్యంగా కనపడే విషయం. 'నడుం చుట్టూ నల్లత్రాచు చుట్టుకున్నట్టు సీత భయంతో వొణికింది' అనో, ఇంకేదో అనో అనాలిగానీ, 'ప్రకాశించడం' ఏమిటి? పురుషులు స్త్రీలని బలాత్కారాలు చేస్తూ ఉంటే కవికి మహా సొగసుగా, ముచ్చటగా కనబడుతుందన్న మాట! రావణుని అంగాల ద్వారా సీత అంత అందంగా మెరిసిపోతోంటే, ఆ మెరుపు అలా ఉండాల్సిందే కదా? సీతకి, రాముడి చెయ్యి ఒక నీలాల వడ్డాణం; రావణుడి చెయ్యి ఇంకో నీలాల వడ్డాణం! 'సీతకి రెండు వడ్డాణాలెందుకూ' అని ఎవరన్నా అంటారా? – రెండే కాదు. ఎన్ని వడ్డాణాలున్నా తప్పు లేదుకదా, అవి 'ప్రకాశించేవి' అయితే? ★

నాకూ విరోధం ప్రారంభమైంది. మీరు రాముడికి సంబంధించిన వార్తలు ఎప్పటికప్పుడు నాకు తెలియ జేస్తూ ఉండండి! (అదెంత భాగ్యం? రాకలూ, పోకలూ ఎగురుళ్ళేనాయే!) రాముడు నా శత్రువు. ప్రతీ క్షణం రాముణ్ణి చంపడానికే మీరు ప్రయత్నిస్తూ ఉండాలి. (రాముడు నీ శత్రువు కాబట్టి నువ్వే చంపుకో. ఎవరి శత్రువుని వాళ్ళే చంపుకోవాలి గానీ, ఇవేం చంపుళ్ళమ్మా! ఒకరి శత్రువుని ఇంకొకరు చంపడాలైతే, కథేం బాగుం టుందీ?)[190] మీరు మహావీరులు, అనేక యుద్ధాల్లో మీ వీరత్వం నే నెరుగుదును. అందుకే మిమ్మల్ని జనస్థానం పంపుతున్నాను. భయపడకండి! ధైర్యంగా ఉండండి! మీరు పౌరుషం ప్రదర్శించగలరు" అంటూ వారిని పొగిడాడు. (ఉబ్బేశాడన్న మాట! వీరులకు ఎగురుళ్ళూ దూకుళ్ళేగాక, 'ఉబ్బుళ్ళు' కూడా ఉంటాయి గావున్ను!)

వీరులు ఉబ్బుకుంటూ వెళ్ళిపోయారు. రావణుడు నవ్వుకుంటూ – మళ్ళీ సీత దగ్గిరికి వచ్చాడు. సీత ఏడుస్తూ ఉంది.

రావణుడు, ఏడ్చే సీతని వెంటబెట్టుకుని, తన సిరిసంపదలన్నీ చూపించడానికి అంతఃపురాలన్నీ తిప్పాడు. (సీత ఎందుకు వెళ్ళిందో! అవున్లే, రానంటే ఊరుకుంటాడా ఏమన్నానా? మళ్ళీ నడుం చుట్టూ వడ్డాణం చెయ్యి చుట్టి తీసుకు పోతాడయ్యే!)

ఆ అంతఃపురాలనిండా వేలకొద్దీ స్త్రీలు వున్నారు. (అందరూ ఈ రకంగా ఎత్తుకొచ్చిన వాళ్ళే!) ఆ అంతః పురాలన్నీ వెండి స్థంభాలతో, బంగారపు ద్వార బంధాలతో, అరుగులతో, మెట్లతో, ధగధగ మెరిసి పోతు న్నాయి. ఆవరణ నిండా ఎన్నెన్నో పెద్ద విమానాలూ, చిన్న విమానాలూ, వాటికి బంగారంతో చేసిన కిటికీలూ! (అన్ని విమానాలు పెట్టుకుని గాడిదల రథం ఎక్కుతాడా ఎవడన్నా, పిచ్చోడు గాకపోతే?) నేలంతా ముత్యాలపోడీ, మణులూ తాపడం చేశారు. (ఏం బాగుంటుందమ్మా? నడుస్తోంటే అరికాళ్ళు చీరుకుపోవూ?)

ఉద్యానవనాలలో ఎక్కడికక్కడే సరోవరాలు! (ఓస్! అడవుల్లో ఎన్ని చూసిందో సీత!)

రావణుడు గర్వంగా చూశాడు – "చూశావుగా నా భోగభాగ్యాలు? ముప్పది రెండు కోట్ల రాక్షస జాతికి నేను ప్రభువుని. ఏ కార్యానికయినా వేలకొద్దీ వీరుల్ని నియో గించగలను. నన్ను ఎవ్వరూ జయించలేరు. ఇక రాము డెంత? అసలు రాముడిక్కడికి ఎలా రాగలడు? (ఆ మాట నిజమే, దేనికదే అనుకోవాలి. అతను ఎగరగలడా ఏమన్నానా?) నిన్ను ఇక్కణ్ణించి ఎవ్వరూ తీసుకు పోలేరు .... నీ పిరుదులు చక్కగా బలిసి ఉన్నాయి సీతా! ఏం పాపం చేశావో ఇంతకాలం వనవాసం చేశావు. ఇక నాతో సుఖాలనుభవించు! నీ తొడలు బలిసి చక్కగా ఉన్నాయి. నా దగ్గిర పుష్పక విమానం ఉంది. దాంట్లో మన మిద్దరం విహరించుదాం. యౌవ్వనం అస్థిరం సుమా! నాతో కామ భోగాలతో సుఖించు! ఈ రాజ్య మంతా నా ఆధీనం! నేను నీ ఆధీనం! నువ్వు తిరస్కరిస్తే నా ప్రాణాలు నిలబడవు!" అన్నాడు (ఎన్ని వేల మంది స్త్రీలకు చెప్పాడో ఈ మాటలు! కంఠతా వచ్చేశాయి!)[191]

సీత జలజలా కన్నీళ్ళు రాలుస్తూ కొంగుతో మొహం కప్పుకొని ఏడ్చింది.

"సీతా! భర్తని విడిచిపెట్టి, పర పురుషుణ్ణి ఎలా స్వీకరించనా అని సిగ్గుపడుతున్నట్టున్నావు. ఇందులో దోషం లేదు. ఇది దైవనిర్ణయమే.[192] ఋషులు చెప్పిందే.

---

**190.** **అరణ్య, సర్గ 54, శ్లోకాలు 22, 23:** రావణుడు వీరుల్ని పిల్చి – "నేను జనస్థానంలో ఉంచిన నా సేనని రాముడు చంపేశాడు. నాకూ, రాముడికీ వైరం కలిగింది" అంటున్నాడు. "మన సేనని రాముడు చంపేశాడు. రాముడు మన శత్రువు" అనడం లేదు. ఎంతెంత యుద్ధాలు జరిగినా అదంతా రాజుకొక్కడికీ సంబంధించిన వ్యవహారమే. "ఫలానా రాజు జయించాడు, ఫలానా రాజు ఓడిపోయాడు" అంటారు. వేలకొద్దీ సైన్యం చచ్చిపోయినా సరే, అది రాజు ఒక్కడి వ్యవహారమే. ఇది భూస్వామ్య (ఫ్యూడల్) వ్యవస్థ లక్షణం.

అదే పెట్టుబడిదారీ (బూర్జువా) వ్యవస్థ అయితే – ఈ మోసం ఇంత స్పష్టంగా ఉండదు. 'మా జాతి', 'మా దేశం' అనే ముసుగులు వేస్తారు. సైనికులకు, జాతి రక్షణా, దేశ రక్షణా మత్తు ఎక్కిస్తారు. బూర్జువా యుద్ధాలవల్ల కూడా సైనికులకు జరిగే మేలేమీ వుండదు! లాభపడేది, పరిపాలించే వర్గాలే. దేశాల కోసం, జాతుల కోసం, సైనికులు మాత్రం ప్రాణాలు ఇచ్చెయ్యాలి! ★

**191.** **అరణ్య, సర్గ 55, శ్లోకం 22:** "యౌవ్వనము అస్థిరమైనది. ఈ గృహములో నాతోడ భోగించుము" అంటున్నాడు రావ ణుడు. రావణుడు సీతని తల్లిలా చూశాడనీ, భూదేవిలా భావించాడనీ, కొందరు హరిదాసులు దొంగ అర్థాలు చెబుతారు. ★

**192.** **అరణ్య, సర్గ 55, శ్లోకాలు 34, 35:** "ఇందులో దోషం లేదు. ఇది దైవ నిర్ణయమే" అనడంలో అర్థం, స్త్రీలను పురుషులు బలాత్కారంగా తమ వీరత్వంతో తెచ్చుకోవడంలో తప్పు లేదు – అని. వెనకటి కాలంలో ఇటువంటి సాంప్రదాయాలూ, ఆచారాలూ చాలా జాతుల్లో ఉండేవి. ★

నన్ను వివాహం చేసుకుని నా భార్యలందరి మీదా పెద్ద భార్యవై నా పట్టమహిషిగా ఉండు![193] నా కోరిక ఈడేర్చు! నీ పాదాలకు మొక్కుతాను. నీ సౌందర్యం మీద కాంక్షతో నీకు మొక్కుతాననంటున్నాను గానీ లంకాధిపతి రావణుడు ఒక స్త్రీకి మొక్కుతాననడమా? ఇంత నీచమైన మాటలు నా నోటి నుంచి ఎలా వచ్చాయో నాకే[194] ఆశ్చర్యంగా ఉంది" అని ఇక సీత సంతోషంగా ఒప్పుకుంటుందని అహంకారంగా చూశాడు.

సీత దుఃఖంతో తల వొంచుకొనే వుంది. పతివ్రతలు పర పురుషుడితో సంభాషించకూడదని సీతకి తెలుసు. ఒక గడ్డిపరక తీసి ఎదురుగా పెట్టి దానికి చెప్పడం ప్రారంభించింది.[195] "నీచుడా! నువ్వు వీరుడివా? నా భర్తలేని సమయంలో నన్నెత్తుకు వచ్చావు. నా భర్త సూర్య చంద్రుల్ని కూడా ఆకాశం నుంచి కిందికి పడగొడతాడు. అలాంటి వీరుడు, తన భార్యని శత్రు హస్తాలనుంచి రక్షించలేడా? యజ్ఞ వేదికను ఛండాలుడెలా ముట్టుకోలేడో, అలాగే నన్ను నువ్వు ముట్టుకోలేవు. నన్ను ఎన్ని చిత్రహింసలయినా పెట్టు! నా ప్రాణాలు రక్షించుకోవాలని నాకు కాంక్ష లేదు. ఇంతకుమించి నేను నీతో సంభాషించేదేమీ లేదు" అని, ఆ రెండు మాటలూ గడ్డి పరకకు చెప్పి, మౌనం వహించింది.[196]

రావణుడు కోపంతో – "నా మాట ధిక్కరిస్తున్నావు. ఒక్క సంవత్సరం మాత్రమే నీకు గడువు ఇస్తాను. అప్పటికీ నీ మనసు మార్చుకోకపోతే ఇక నీకు చావే గతి. ఆలోచించు" అని హెచ్చరించి అక్కడి నించి కదిలాడు.[197] కొందరు దాసీ స్త్రీలని పిల్చి – "సీతని అశోకవనంలో ఉంచండి! అది రహస్య స్థలం. జాగ్రత్తగా కాపలా కాస్తూ ఉండండి! ఆమె ఎలాగయినా నాకు వశం అయ్యేటట్టు అన్ని విధాలా ప్రయత్నించి చూడండి! మంచిగా నచ్చ చెప్పండి, భయపెట్టండి. చాలా అహంకారంతో ఉంది. దయ తల్చవద్దు. క్రూరంగా బెదిరించండి!" అంటూ భీకరంగా చూశాడు దాసీల్ని.

దాసీలంతా – "చిత్తం ప్రభూ! తమ ఆజ్ఞ అక్షరాలా పాటిస్తాము" అంటూ వొంగి నమస్కారాలు పెట్టారు.

రావణుడు సీతని దూరంనించి చూసి వెళ్ళిపోయాడు.

దాసీలంతా సీత చుట్టూచేరి సీతని అశోక వనానికి తీసుకు వెళ్ళారు. అక్కడ చెట్లనిండా పక్షులు గోలగోలగా వున్నాయి. ఎన్నడూ చూడని కొత్త రకం పూలు వున్నాయి. చుట్టూ చూస్తే ఆ ప్రదేశం కొంచెం సంతోషం కలిగించింది సీతకి. ★

---

**193. అరణ్య, సర్గ 55, శ్లోకాలు 26, 27:** సీతతో రావణుడు – "నా పట్ట మహిషిగా ఉండు" అంటున్నాడు. ఎన్నాళ్ళు? ఇంకో వారంలో ఇంకో సీతని తెచ్చేవరకే! ★

**194. అరణ్య, సర్గ 55, శ్లోకం 36:** "రావణుడు ఒక స్త్రీకి అతని శిరముచే నమస్కరించడు. ఇట్టి నీచమగు మాటలు చెప్పితిని. ఆశ్చర్యము" అంటున్నాడు రావణుడు. స్త్రీలు తక్కువ వారు – అని భావించడంలో, రాముడూ, రావణుడూ, ఇద్దరూ ఒకటే. ఇద్దరూ పురుషాహంకారులే. రాముణ్ణి తిట్టి, రావణుణ్ణి పొగిడేవారు ఇలాంటి విషయాలు గమనించాలి. అన్ని విలువల్లోనూ ఇద్దరూ ఒకటే – అని తెలుస్తుంది. సీత వంటి మహాపతివ్రతకి రావణుడి వంటి దుర్మార్గుడితో అయినా నమస్కారం చేయించడం కవికి ఇష్టం లేదు. "ఇటువంటి నీచమైన మాటలు అన్నాను. ఒక స్త్రీకి నమస్కరించడమా?" అని రావణుడితో అనిపించి, ఎంత చెత్త వెధవ పురుషుడయినా సరే, ఎంత ఉన్నతురాలయిన స్త్రీకి అయినా సరే, నమస్కారం చేయడం నీచకార్యంగా చెపుతున్నాడు కవి. ★

**195. అరణ్య, సర్గ 56, శ్లోకం 1:** "సీత .... శోకముచే .... పతివ్రతలు పర పురుషులతో ముఖాముఖిగా సంభాషింపరాదను భావముతో మధ్యలో నొక తృణమును ఉంచుకొని ఇటులనెను" – పతివ్రతలు అసలు పర పురుషులతో మాట్లాడనే కూడదు. ఇలాగే తప్పనిసరై మాట్లాడవలసి వస్తే, ముఖాముఖిగా మాత్రం మాట్లాడకూడదు. అందుకే 'మంచి' స్త్రీలు, పర పురుషుణ్ణి చూడగానే తలుపుల చాటుకో, బల్లల చాటుకో, కుర్చీల చాటుకో, అక్కడ ఏది ఉంటే దాని చాటుకి, తప్పుకోవాలి. ★

**196. అరణ్య, సర్గ 56, శ్లోకం 21:** సీతకి ప్రాణ భయమూ లేదు, చిత్ర హింసల భయమూ లేదు. సీత మళ్ళీ ఈ కాలంలో పుడితే, 'మార్క్సిజం' చదివి ('రామాయణం' కూడా చదివి) విప్లవకారిణి అవుతుంది. ఫ్యూడల్ వ్యవస్థలో పుట్టబట్టి అంత పతివ్రత అయింది. ఈ 56వ సర్గలో సీత రావణుడితో ఇంకా చాలా మాట్లాడింది. ఇవే విషయాలు మళ్ళీ 'సుందర కాండ'లో కూడా, హనుమంతుడు వచ్చినప్పుడు మాట్లాడింది. అదంతా ఒక కథగా వస్తుంది. ('సీతా రావణులు' అనే కథలో.) అందుచేత సీత మాట్లాడిన విషయాలు ఇక్కడ ఎక్కువగా చెప్పడం లేదు. ★

**197. అరణ్య, సర్గ 56, శ్లోకాలు 24, 25:** రావణుడు సీతని ముట్టుకోకుండా గడువు ఇవ్వడం ఏమిటి? ఆశ్చర్యంగా లేదూ? కానీ, ఇందులో ఏం కిటుకు వుందో! ★

# కథ-5

# రావొద్దంటే విన్నదా?

చెట్లు, పచ్చని పర్వతాల్లాగ కదలకుండా నించున్నాయి. సూర్యుడు వాలు చూపులతో చెట్ల కిందకి తొంగి చూస్తున్నాడు. పక్షులు మేతకోసం బయల్దేరడానికి హడావుడి పడిపోతున్నాయి. గూళ్ళల్లో ఉండడానికి మారాం చేస్తోన్న పిల్లలకు నచ్చజెప్పలేక కోప్పడి, ముద్దెట్టుకుని ఎగురు తున్నాయి. ఎగిరే ఎగిరే పక్షులు కొన్ని, దూరంగా రాముణ్ణి చూసి చప్పున దొరికిన చెట్లమీద వాలి ఆకుల్లో దాక్కుంటున్నాయి.

"నల్ల రుషి .... నల్ల రుషి .... దాక్కోండి, దాక్కోండి" అంటూ కొన్ని వీర పక్షులు, రాముణ్ణి చూసుకోకుండా ఎగురుతోన్న వాటికోసం కేక లేశాయి.

చెట్లన్నీ దయతో ఆకాశం దాకా చేతులు చాచి దొరికిన పిట్టలన్నిటినీ కొమ్మల్లో దాచేశాయి.

ఆకుల్లో దాక్కున్న పిట్టలు గుస గుస లాడుకుంటున్నాయి. "రోజూ బయల్దేరతాడు, ఆ బాణా లేసుకుని! ఎంత తింటాడో గానీ .... పాడు తిండి, .... రోజూ చంపుళ్ళే!"

"ఎలా బలిశాడో చూడరాదూ? ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టడు. పాపం చాకిరీ అంతా ఆ లక్ష్మణుడే ........"

"వాడూ ఏం కరుణాత్ముడు కాడు. ఇద్దరూ ఇద్దరే! మొన్న వాడు నీళ్ళకొచ్చి నేను దూరంగా నీళ్ళు తాగుతోంటే నా మీద బాణం కొట్టాడు. ఒక్క రెప్ప పాటులో తప్పుకున్నాననుకో. అబ్బ! ఇప్పటికీ ప్రాణం దడ దడ లాడుతోంది."

"అసలు వీళ్ళిద్దరూ రాకముందు ఈ కీకారణ్యంలోకి వేటగాళ్ళెవరూ వొచ్చే వారు కాదమ్మా! ........ ఎప్పుడన్నా వొచ్చినా ఏ నెలకో ఆర్నెల్లకో, ఆ కాస్సేపూ దాక్కుంటే సరిపోయేది. వీళ్ళతో రోజూ చావొచ్చి పడింది!"

"ఆ రుషులున్నారుగానీ .... ఎందుకొచ్చిన పాపం మాటలు వాళ్ళ మీద .... దేనికదే చెప్పుకోవాలి. ఏ గడ్డో గాదమో తింటారు. ఏ కాయలో కసుల్లో నములుతారు. తల్లకిందులుగా వేళ్ళాడ్డమో, అడ్డదిడ్డంగా నించోడమో, మడత లేసుకుని కూర్చోడమో, .... ఏదో వాళ్ళ తపస్సేవిటో .... వాళ్ళేవిటో గానీ .... మన జోలికీ సొంఠికీ రారు పాపం!"

"పిచ్చిదాని లాగున్నావే! వాళ్ళు మనల్ని బాణా లేసి చంపరుగానీ మాంసం ముక్కలు కాల్చి పెడితే లొట్టలేసుకుంటూ తింటారు, తెలుసా? నేను అప్పుడప్పుడూ సీతని చూద్దామని వాళ్ళ ఇంటి వేపు వెళ్తూ ఉంటాగా? వాళ్ళ ఇంటి ముందు మర్రి చెట్టు లేదూ? పై కొమ్మల్లో కూచుంటే సీత పెరట్లో ఎక్కడ తిరిగినా కనబడుతూ వుంటుంది. లక్ష్మణుడు రుషులికి, మాంసం ముక్కలు కాల్చి పెట్టడం చాలా సార్లు చూశాను తెలుసా?"

"అలాగా? వాళ్ళూ తింటారా? పోనీలే, వాళ్ళ చేతుల్తో వాళ్ళు మనల్ని చంపరు కదా? వాళ్ళు వొచ్చినా దాక్కోనక్కర లేదుగా? అదీ కొంచెం నయం కాదూ? ఈ నల్లవాడు మరీ పచ్చి కలి! ఆకులు దూసిపోసినట్టు దూసి పోసేస్తాడు పిట్టల్నీ .... జంతువుల్నీ. అబ్బబ్బ .... కంటినిండా నిద్రే పట్టడంలేదు వీడొచ్చాక."

"అవునమ్మా! నా బిడ్డని ఈ పాపిష్టి వాడే పొట్టన పెట్టుకున్నాడు. వీడికి పోయే కాలం రానూ! వీడు కొట్టిన బాణం నా బిడ్డ గుండెకి తగిలి ఎగరేసుకు పోయింది. పిల్లాడు మళ్ళీ నా కంటబడలేదు .... వీడికి నా ఉసు రెప్పుడు తగులుతుందో గానీ ...."

"ఊరుకో వొదినా, ఊరుకో ....! ఏం చేస్తాం? పుట్టినప్పట్నించీ చూస్తున్నాం. పిట్టలేవిటీ, మనుషు లేవిటీ, ఎవరి పొట్టకి వాళ్ళు తాపత్రయ పడతారు, తప్పదు."

"పొట్టకే అనుకున్నావా? వీడసలు ఆటకే చంపుతాడు."

"ష్! ఊరుకోండి! .... మన చెట్టు కిందకే వొస్తున్నాడు. జింక కోసమో, దేని కోసమో, మాటు వేస్తున్నాడు."

"ఆ కళ్ళు చూడు, ఎలా చిట్లించి చూస్తాడో!"

"ఇక్కడికి రానిచ్చి రెట్ట వెయ్యనా మీద?"

"చాల్లే! ప్రాణాల మీదికి తెచ్చేట్టున్నావు. వేట గాడితో ఆటలేవిటి?"

అంతా నిశ్శబ్దం!

చెట్టు కిందకి వచ్చాడు రాముడు.

చెట్టు – "ఇక్కడెవరూ లేరు, ఇంకెక్కడి కన్నా వెళ్ళు! అలా పైకి వెళ్ళు!" అన్నట్టు, రాముడి వ్యవహారం తనకేం పట్టనట్టు నించుంది.

రాముడు చెట్టుకింద నిలబడి కళ్ళు చిట్లించి చుట్టూ

చూస్తున్నాడు. ఆశ్చర్యపడుతున్నాడు. "ఎంతో స్పష్టంగా కనబడిందే! మెరుపులాగ తప్పుకు పోయింది. ఈ పొదలో జొరబడి, ఆ పొదలో తేలుతుంది! ఈ చెట్టు కింద నిలబడి, ఆ చెట్టు కింద కన బడుతుంది! దీని అంతు తేల్చక వదలను. ఎవరనుకుందో! శ్రీ రాముడను కుందో, శ్రీరాముడు కాదనుకుందో!"

పక్క పొదలోంచి కుందేలు పిల్ల బయటికి దూక బోతే, వాళ్ళమ్మ దాన్ని వెనక్కి లాగి చావగొట్టి చెవులు మూసింది – "ఇందాకట్నించీ చెబుతున్నానా కద లొద్దనీ! వెధవ అల్లరీ నువ్వూనూ. నీకు పరుగొచ్చిం దగ్గర్నించీ ఛస్తున్నాను నీతో. అదుగో చూడు! ఆ బాణాల వాడు, .... ఏం, కనబడ్డాడా?"

కుందేలు పిల్ల పొద కంతలోంచి రాముణ్ణి చూసింది. భయంగా వాళ్ళమ్మని వాటేసుకుని – "ఎంత నల్లగా ఉందో! దెయ్యమేనా?" అని బిక్క మొహం పెట్టింది.

"ఛీ! వెధవ మాటలు. ఎక్కడ నేర్చుకున్నావు? మీ నాన్న చెప్పే వెధవ కథలన్నీ నమ్మకు. ఏదో సరదాకి చెబుతాడు. దెయ్యాలూ భూతాలూ ఉండవు. మనుషులే ఉంటాయి. ఇన్నాళ్ళ నించీ నేను ఒక్క దెయ్యాన్నీ చూడ లేదు, మనుషుల్ని చూశాను గానీ. తెలిసిందా?" అని కసిరింది వాళ్ళమ్మ.

కుందేలు పిల్ల ముండ తల వూపి కంతల్లోంచి మళ్ళీ చూసింది. రాముడి చేతిలో బాణాలూ, విల్లూ చూసి "అమ్మా! అల్లాంటివి నాకూ కావాలే! నే నాడు కుంటానే!" అని వాళ్ళమ్మని కుమ్ముతూ రాగం మొదలెట్టింది.

పొదలో అలికిడికి రాముడు అటు తల తిప్పి బాణం ఎక్కుపెట్టాడు.

కుందేలు గజ గజ వొణుకుతూ "పడుకో, పడుకో! చంపేస్తాడు, చంపేస్తాడు" అంటూ పిల్ల నోరు మూసి దాన్ని నేలకి తాపడం చేసింది.

రాముడు కళ్ళు చిట్లించి, దూరంగా అలికిడి విని, కొంచెం గురి మార్చి ఇంకో వేపుకి బాణం వొదిలాడు. అది రయ్యిన కొమ్మల్లోంచి దూసుకుపోగానే, కెవ్వున లేడి కేక అడవంతా ఆక్రమించింది.

కుందేలు పిల్ల బెంబేలెత్తిపోతూ తల్లి పొట్టలో దూరింది – "అమ్మా! లేడి అరిచిందే! ఎందుకూ?"

"గట్టిగా మాట్లాడొద్దన్నానా? నల్లవాడు దాన్ని ఆ పుల్లతో కొట్టాడు. అరవకేం చేస్తుంది?"

"అమ్మో, ఎందుకూ? లేడికి నెప్పెయ్యదూ?"

"నెప్పేస్తే వేటగాడికేం జాలా?"

"ఛీ! ఆ పుల్లలు విరిచి పడెయ్యాలి."

ఆ పూటకి చావు తప్పిందని తల్లి కుందేలు నీర సంగా నిట్టూర్చింది.

★ ★ ★

రాముడు చుట్టూ పరికిస్తూ ఆలోచిస్తూ నడుస్తు న్నాడు.

లక్ష్మణుడన్నట్టే అయింది. ఇదంతా రాక్షస మాయే! మారీచుడు చావబోతూ 'సీతా! లక్ష్మణా! రక్షించండి! రక్షించండి!' అని అరిచాడు, నా కంఠం వంటి కంఠంతో! నేను జనస్థానంలో నివసిస్తూ వున్నందుకే ఈ రాక్షసులకు నా మీద విరోధం కలిగింది.[198] నాకు హాని కలిగించా లనే సుమా ఈ పన్నాగం. మారీచుడి కేకలు విని సీతా, లక్ష్మణుడూ చాలా భయపడి ఉంటారు. సీత, నా కోసం వెళ్ళ మంటుందేమో లక్ష్మణుణ్ణి![199] వస్తాడా లక్ష్మణుడు నా ఆజ్ఞ మీరి? అంత స్వతంత్రించుతాడా? ఎన్నడూ చెయ్యడు. సీత, భయపడుతోందేమో! భయంతో క్షేమంగా వుందో లేదో!

ఆలోచనల్లోంచి రాముడి కన్ను దూరంగా తిరుగు తోన్న ఒక జింక మీద పడింది. 'ఎంత బలిసిందో! కొవ్వుతో తొడలు, నిగ నిగలాడుతున్నాయి. దీన్ని వదల కూడదు' – రాముడి మనసంతా సీత క్షేమం మీదనించి బలిసిన జంతువు తొడల మీదకి తిరిగింది. బాణం ఎక్కు పెట్టి దాని వెంటపడ్డాడు. చుట్టుపక్కల జంతువులన్నీ ప్రాణభయంతో అరుస్తూ చెల్లా చెదురుగా పరుగు లెత్తాయి. నక్కలు రాముణ్ణి చూసి సంతోషంగా కూశాయి. రాముడు ఎప్పుడు జంతువుల్ని చంపినా కొన్ని భాగాలు మాత్రమే పట్టుకుపోతాడు. తర్వాత నక్కలకే విందు!

రాముడు తరుముతోనే వున్నాడు జింకని. చివరికి అది ఒక పొదలో చిక్కి తప్పుకోలేకపోయింది. రామ

**198.** **అరణ్య కాండ, సర్గ 57, శ్లోకం 9:** జనస్థానములో నివసించు నిమిత్తముచే రాక్షసులతో నాకు వైరము కలిగినది – అనుకుంటున్నాడు రాముడు. శూర్పణఖని బాధించినందుకు కాదన్నమాట, రాముడితో రాక్షసులకు వైరం! శూర్పణఖ విషయంతో తనకేం సంబంధం లేనట్టు వ్యవహారం. జన స్థానం రాక్షసుల భూమి. రాముడు, వనవాసం కోసం రాక్షసుల భూమిదాకా ఎందుకు వెళ్ళాలి? ★

**199.** **అరణ్య, సర్గ 57, శ్లోకాలు 5, 6:** "మారీచుడి కేకలు సీతా, లక్ష్మణుడూ కూడా విన్నట్టయితే, అది నా కంఠమే అని తలచి, లక్ష్మణుడు సీతచే పంపబడి, శీఘ్రముగా నా వద్దకు వచ్చును" అనుకుంటున్నాడు రాముడు. తన కంఠస్వరం లాగే ఉన్న కేకలు విని సీత భయపడడం, లక్ష్మణుడు రావడం చాలా సహజంగానే తోస్తోంది రాముడి మనసుకి. కానీ, తర్వాత అలాగే జరిగితే మాత్రం ఊరుకోడు. అలా జరిగినప్పుడు ఏం చేస్తాడో చూడండి! ★

బాణం దిగబడిపోయింది దాని డొక్కలో. జంతువు, నేలమీద పొర్లుతూ లేచి పరిగెత్తాలని పెనుగులాడుతూ నెమ్మదిగా తల వాల్చి కళ్ళు మూసేసింది.

రాముడు ఒరలోంచి కత్తి తీసి, జంతువు తొడల మీద దెబ్బలు వేసి, అక్కడక్కడా మాంసం కండలు కోసి ఆకుల్లో చుట్టబెట్టి అది తీసుకుని అంగలేసుకుంటూ బైల్దేరాడు.[200] "బాగా కొవ్వు పట్టింది. ఎంత రుచో ఇంత కొవ్వితే! ..... వెళ్ళగానే ఈ కార్జ్యం ముక్కలు కాల్చ మనాలి సీతని .... సీత క్షేమంగా వుందా అసలు? .... అదేమిటి నక్కలు కూస్తున్నాయి? ఆశ్చర్యంగా ఉందే! అశుభానికి గాకపోతే నక్కలెందుకు కూస్తాయి? సీత ఇంకెక్కడ క్షేమంగా ఉంటుంది! రాక్షసుడి కేకల కేమిటి, ఆశ్చర్యం లేదు. ఈ నక్క కూతలే మిక్కిలి వింతగా ఉన్నాయి! చక్కని పిరుదులు గల సీత .... అయ్యో! ఈ పక్షులు ఎడం వేపు నుంచి ఎగురుతున్నా యేమిటి?

రాముడు, ముందు వేపు చూస్తూ తెల్లబోయి నిల బడ్డాడు. ఎదురుగా లక్ష్మణుడు అంగలేసుకుంటూ వొస్తూ కనపడ్డాడు. రాముడు నిర్ఘాంతపోయి చూస్తు న్నాడు. 'ఏమిటీ! ఇతడు నా ఆజ్ఞ ధిక్కరించాడే!.... భాతృ వాక్య పరిపాలనా వ్రతం వమ్ము చేశాడే! .... ఎంత సాహసం! .... ఆశ్రమం కదలవొద్దని చెప్పానే!'

అంగలేసుకుంటూ వొస్తున్న లక్ష్మణుడు రాముడి సమీపానికి రాగానే విల్లులాగ వొంగి, నడుం వొంచి, భుజాలు వొంచి, మనిషే వొంగి, వినయంగా నమస్క రించాడు. తను ఎందుకు వచ్చాడో చెప్పాలని నోరు తెరిచి "అన్నగా...." అనబోయాడు.

రాముడు నిప్పులు కురిసే గాంభీర్యంతో చూశాడు "లక్ష్మణా! .... ఆశ్రమం విడిచి వచ్చావే! ఇంత నిందార్హ మైన పని చెయ్యగలవని నే నెన్నడూ తలచలేదే![201] నా చుట్టూ ఎన్ని అపశకునాలో చూశావా? నక్కలు కూస్తు న్నాయి ఆశ్చర్యంగా! పక్షులు నన్ను చూసి వికృతంగా అరుస్తున్నాయి. వింతగా ఉంది. ఇంకా సీత క్షేమంగా ఉంటుందా? నాకు విశ్వాసం లేదు. రాక్షసులామెని చంపి తినేసి ఉంటారు. అయ్యో! చక్కని తొడలు గల సీత ...." అంటూ తల వాల్చి దుఖిస్తూ మళ్ళీ నడక సాగించాడు.

లక్ష్మణుడు కంగారుపడ్డాడు. సీతని రాక్షసులు తినెయ్యడమేమిటి? ఆమె ఆశ్రమంలో క్షేమంగా ఉందే! ఆమె కఠినంగా మాట్లాడితేనే తను వచ్చాడే! లక్ష్మణుడు కంగారుతో అన్నగారి వెనకబడ్డాడు. తను పర్ణశాల విడిచి వచ్చినందుకు అన్నగారికి చాలా కోపం వచ్చిందని అర్థమైంది. తన దోషం లేదని అన్నగారికి చెప్పుకోవాలని చేతులు కట్టుకుని గొంతు సర్దుకుంటూ అన్నగారు మాటలాపగానే చెప్పుకోవాలని ఆతృతగా ఎదురుచూస్తూ వినయంగా వెంట నడిచాడు.

చెప్పుకుపోతున్నాడు రాముడు. కుడి చేతిలో మాంసం దొన్నె ఎడం చేతిలోకి మార్చుకుని గట్టిగా పట్టు కున్నాడు – "లక్ష్మణా! ఆ లేడి మాయ లేడే సుమా! నన్ను బహు దూరం తీసుకుపోయి నా కరకు బాణం దెబ్బతో చచ్చి నేల కరిచింది.... అయ్యో! నా ఎడమ కన్ను అదురుతోంది.[202] ఇంకెక్కడి సీత? సందేహం లేదు. రాక్షసులు చంపేసి ఈ పాటికి కమ్మగా తినేసి వుంటారు. ఆమెని రక్షించే వారెవరూ లేరు గదా? నా వంటి మహా వీరుడికి భార్య అయి కూడా దీనురాలయి

---

**200.** అరణ్య, సర్గ 44, శ్లోకం 27: "శ్రీరాముడు మారీచుని చంపి, దాని ధ్వనిని విని, ఇంకొక మృగమునుగూడ జంపి, దాని మాంసమును బుచ్చుకొని త్వరగా జనస్థానమున కభిముఖముగ బోయెను." – మారీచుడి కేకలు విని అక్కడ సీతకేమైనా ప్రమాదం జరిగిందేమోనని భయపడి కూడా, మళ్ళీ ఇంకో జింకని తరిమి, వేటాడి, చంపి, కోసి, మాంసం పట్టుకుని బయల్దేరాడు రాముడు. – 'మంచివాడి బుద్ధి మాంసం దగ్గిర తెలుస్తుంది' అంటారు పెద్దలు, ఇందుకేనా? పక్షులూ జంతువులూ కనపడ్డాయంటే వాటిని చంపి తీరవలిసిందే! ఒక బోయవాడు, పక్షుల జంటలో ఒక పక్షిని చంపితే రెండో పక్షి దుఃఖంతో ఏడ్చిందనీ, ఆ పక్షి శోకం వినడం వల్లనే వాల్మీకికి కవిత్వం పుట్టుకొచ్చిందనీ రామాయణంలో మొట్టమొదట్లో చెప్పారు కదా? రాముడు, వేటాడినప్పుడల్లా ఏ పక్షుల జంటల్నీ, ఏ జంతువుల జంటల్నీ విడదియ్యలేదా? బోయవాడు చేసింది దుర్మార్గం అయితే, రాముడు చేసింది ఏం మార్గం అవుతుంది? అడవుల్లో పక్షులూ జంతువులూ తెగ దొరుకుతాయి కాబట్టి, ఎప్పుడూ వాటిని చంపుకుని తినాలన్నదే కవి దృష్టి! అవసరం లేనంతగా!

ఇక్కడ అసలైన సంగతి గమనించారా? రాముడు, బంగారు లేడిని చంపాడేగానీ, సీత కోరినట్టుగా దాని చర్మం తియ్యనే లేదు. పైగా, ఇంకో జంతువుని కూడా చంపి ఆ మాంసం పట్టుకుని బైల్దేరాడు! ★

**201.** అరణ్య, సర్గ 57, శ్లోకాలు 18,19: లక్ష్మణుడు రాగానే రాముడు కోపంగా – "అయ్యో! ఆశ్రమం విడిచివొచ్చావే!" అన్నాడు. ఇక లక్ష్మణుడు ఎప్పటికి జవాబు చెప్పాడో చూడండి! లక్ష్మణుడు నోరు తెరిచి ఏమీ చెప్పకుండానే రాముడు, నక్క కూతల ఆధారంతో ఏ విధంగా వాపోతున్నాడో చూడండి! రాముడి వరస మనకి కొత్త కాదనుకోండీ! ★

**202.** రాముడి ఎడమకన్ను, పట్టాభిషేకానికి సిద్ధమైంది మొదలూ ఎప్పుడూ అదరడమే! ఒక రోజూ రెండు రోజులూ కాదు, పద్నాలుగు సంవత్సరాలు! రుషులెవరన్నా కాస్త వైద్యం చేసినా బాగుండేది పాపం వాళ్ళకీ అదురుతూనే ఉంటాయి – గూడలో, మోకాళ్ళో! ★

పోయింది సీత. ఆమెని ఒంటరిగా చూసి, రాక్షసులు చుట్టూ జేరి, అవును .... మంచి అవకాశమే వారికి .... అయ్యో, చక్కని సుందరాంగి నా సీత ....” మాట్లాడు తూనే ఉన్నాడు రాముడు. తన చేతిలో మాంసం దొన్నె లక్ష్మణుడు అందుకోడేం – అని ఆశ్చర్యపడిపోతున్నాడు. ఇతడు స్వతంత్రుడవుతున్నాడా? దాస్య గుణం విడిచి పెడుతున్నాడా?

లక్ష్మణుడు స్వతంత్రించి తన ఆజ్ఞ మీరడం ఎంత దోషమో రుజువు కావడానికి, తప్పకుండా సీత కేదన్నా ఆపద జరిగితేనే సంతోషించేటట్టు వున్నాడు రాముడు. ఒక వేళ ప్రస్తుతానికేమీ జరక్కపోయినా అసలు తన ఆజ్ఞ మీరడం వల్ల ఎంత ఘోరం జరిగి వుండేదో, అలా జరక్క పోతే ఎంత ఘోరం తప్పి పోయినట్టో, వర్ణిస్తున్నాడు – “.... సందేహం లేదు నాకిక. ఇంకెక్కడి సీత? ఏ క్రూర మృగాలో మీదబడి చీల్చి చెండాడి .... తినేసి వుంటాయి. అయ్యో! నాథుడు ఉండికూడా ఎంత అనాథ అయిపోయిందో సీత!”

రాక్షసులు, అంత మంచి అవకాశం చక్కగా విని యోగించుకున్నందుకు మెచ్చుకుంటున్నట్టు వర్ణిస్తు న్నాడు. – “.... సీతని రాక్షసులందరూ కలిసి .... కాళ్ళూ చేతులూ విరిచి .... అవును .... మెడ విరిచి .... కమ్మగా రక్తం తాగి .... ముక్కలు ముక్కలు చేసి పంచు కునే వుంటారు. అయ్యో, నా సీత .... నాకు ....”

లక్ష్మణుడికి కంగారెక్కువయి పోతోంది. అన్న గారి దుఃఖం చూడలేకపోతున్నాడు. తను పర్ణ శాల విడిచి రావడం తప్పే అయిందేమోనని సందేహంలో పడి పోయాడు. తను వొచ్చేవరకూ వదినగారు క్షేమంగానే వుంది. ఆ తర్వాత నిజంగానే ఏమన్నా జరిగిందేమో!.... ‘అలా జరక్కూడదు, అలా జరక్కూడదు’ అని వెయ్యి దేవు ళ్ళకు మొక్కాడు. అసలు సంగతి చెప్పాలని “అన్నగా....” అంటూ మళ్ళీ నోరు తెరవబోయాడు.

“అయ్యో! నా ఎడం భుజం అదురుతోంది” అంటూ రాముడు ఎప్పుడూ బరువు మోసే అలవాటు లేక ఘడి యకోసారి మాంసం దొన్నెని చేతులు మార్చుకుంటు న్నాడు.

లక్ష్మణుడికి అప్పటికి తోచింది. చటుక్కున మాంసం దొన్నె అందుకున్నాడు. అంతసేపూ పర ధ్యాన్నంలో పడిపోయి ఆ దొన్నెని అన్నగారితో మోయిం చినందుకు పశ్చాత్తాపంతో కుంచించుకు పోయాడు.

రాముడు గాఢంగా నిట్టూర్పు విడుస్తూ తన దుఃఖం కొనసాగించాడు – “లక్ష్మణా! సీత నన్ను వదలక నా వెంట వచ్చి, నా దుఃఖమంతా తనూ అనుభవిస్తోంది. సన్నని నడుము గల సుందరాంగి నా సీత. ఆమెను విడిచి ఇంద్ర పదవి కూడా కోరను సుమా![203] సీత నా ప్రాణాల కన్నా మిన్న. సీత కోసం నేను వెంటనే మర ణించకుండా జీవించలేను. పితృ ఆజ్ఞ చొప్పున పదు నాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తానని వచ్చాను. నా వాగ్దానం అబద్ధమై పోదు గదా? నువ్వు అయోధ్యకు పోకతప్పదు లక్ష్మణా! ఇక కైక వాంఛితం కలకాలం ఈడేరుతుంది. నా తల్లే దురదృష్టవంతు రాలవుతుంది. పుత్రుడు పోయి, నా తల్లి దుఃఖసాగరంలో మునిగి పోతుంది. పుత్రుడూ, రాజ్యమూ అన్నీ దొరికి, కోరికలన్నీ ఈడేరిన కైకను సేవించుకుంటూ నా తల్లి ఇక సవతి చెప్పుచేతల్లో బ్రతకవలసిందే గదా? మళ్ళీ ఎంత కష్టం సంభవించిందో నీ మూలంగా!”

లక్ష్మణుడు అదిరిపడ్డాడు.

లక్ష్మణుడి ఇంగితానికి, రాముడి మీద కన్నా లక్ష్మ ణుడి మీద కోపం ముంచుకొచ్చేసింది. – “ఏమిటీ వ్యవ హారం? నోరు తెరవనివ్వడు, మాట జారబడనివ్వడు. నించోబెట్టి దులిపేస్తున్నాడు. అసలు ఎందుకొచ్చావో ఏమిటో మాట వినడేం? అన్యాయంగా నింద మోపు తోంటే ఎంతసేపు నోరు మూసుకుని ఊరుకుంటావు? ఎక్కడో అక్కడ సందు చేసుకుని ధైర్యంగా జారబడలేవూ? నీ నసుగుడు తగలడిపోనూ! ఎన్నేళ్ళొచ్చినా బుద్ధి రాకుండా వుంది నీకు!” అంటూ ఇంగితం లక్ష్మణుణ్ణి చెడామడా చివాట్లు పెట్టేసింది.

లక్ష్మణుడు ఈ సారి కాస్త ధైర్యంగానే మాట్లాడాలను కున్నాడు, అన్నగారితో.

“అన్నగా ...........”

“లక్ష్మణా! సీత జీవించి వుంటేనే పర్ణశాలకు వస్తాను. లేకపోతే ....” అంటూ రాముడు అంత వరకూ దుఃఖిస్తూ మంద గమనంతో నడుస్తున్న వాడల్లా ఆ నడక కూడా మాని, ఒక చెట్టు కింద నిలబడిపోయాడు. “సీత చచ్చిపోయినట్టయితే ఇక్కడే .... ఈ చెట్టు కిందే .... ప్రాణాలు విడుస్తాను!” అని, ‘చూశావా, నువ్వు నా ఆజ్ఞ మీరడంవల్ల ఎంత ప్రమాదం జరుగుతోందో!’ అన్నట్టు చూశాడు.[204]

లక్ష్మణుడు హడలిపోయి, ఏమీ తోచక, నడుం ఇంకా కిందికి వొంచి నేల చూపులు ప్రారంభించాడు. “సీత ఉందో, లేదో అక్కడికి వెళ్ళి చూస్తే తెలుస్తుందా,

---

**203.** అరణ్య, సర్గ 58, శ్లోకం 5: “లక్ష్మణా! సీతను విడిచి దేవాధిపత్యమునూ, భూపతీత్వమునూ గోరను” అంటున్నాడు రాముడు. భూపతీత్వం కోసం (రాజరికం కోసం) సీతను వదులుతాడో లేదో అందరికీ తెలిసిందే. ★

**204.** అరణ్య, సర్గ 58, శ్లోకం 9: “సీత జీవించి వుంటేనే ఆశ్రమానికి పోతాను. లేకపోతే ప్రాణాలు విడుస్తాను” అంటున్నాడు రాముడు. ఇంకా లక్ష్మణుడు నోరు తెరవనే లేదు. అసలేం జరిగిందో రాముడు ఇంకా వినలేదు. ఇక్కడే చచ్చిపోతానంటున్నాడు! ★

ఇక్కడే కూర్చుంటే తెలుస్తుందా? అబ్బ! ఏం తిరకాసో నీ అన్నతో!" అని పళ్ళు నూరింది ఇంగితం మళ్ళీ.

రాముడు, వంగిన కొమ్మ మీదికి తల వాల్చి – "లక్ష్మణా! ఆశ్రమానికి పోగానే సీత నవ్వు మొహంతో కనబడకపోతే సర్వ నాశనమేనోయీ!" అంటూ కళ్ళు మూశాడు.

ఇంగితం వెటకారంగా నవ్వింది. లక్ష్మణుడి చెవిలో – "హమ్మ! ఆశ్రమానికి వొస్తాడన్న మాట! ఇక ఇక్కణ్ణించి కదల్నే కదలడేమో అనుకున్నాను. కానీ అక్కడ సీత క్షేమంగా వుంటే సరే, లేకపోతే నీ ప్రాణాలు తోడేశాడన్న మాటే! ఊ బెంబేలు పడిపోకు! ధైర్యంగా వుండు! నీ తప్పేమీ లేదు. సీత తిడితేనే నువ్వు వచ్చావు కదా? ఆ మాటే చెప్పు! నేను చెప్పినట్టు వింటే నువ్వెప్పుడో బాగు పడేవాడివి" అని మళ్ళీ రుస రుస లాడింది ఇంగితం. లక్ష్మణుడంటే దానికి చాలా జాలి.

ఇంగితం చివాట్లు మహా ప్రసాదంలా తోచాయి లక్ష్మణుడికి. కొంచెం ధైర్యం చిక్కింది.

రాముడు కొమ్మమీద నించి హఠాత్తుగా తలెత్తి కళ్ళు తెరచి – "లక్ష్మణా! ... నిజం చెప్పు ... నిజం చెప్పు. సీత జీవించే ఉందా? నీ అజాగ్రత్త వల్ల రాక్షసులు తినేశారా? అయ్యో! నా ప్రియురాలికీ, నాకూ ఎడబాటు కలిగింది. సత్యం! వియోగమే ఇది. సీతని నువ్వు రక్షిస్తావనే విశ్వాసంతో వచ్చానే! .... సర్వ నాశనం అయిపోయానే" అని మళ్ళీ పూర్తిగా కొమ్మ మీదికి వాలాడు.

ఆ కొమ్మ వొణుకుతూ వాళ్ళమ్మతో, "అమ్మా! ఈ రాముడు చూడవే ... ఎంత బరువో! నన్ను విరగ దీసేట్టున్నాడే! చచ్చిపోతున్నానే!" అంటూ బావురుమంది.

కొమ్మ విరుగుతోందని చెట్టు గ్రహించుకుంది – "లేదమ్మా, నీకేం భయం లేదు. నిన్ను నేను గట్టిగా పట్టుకున్నాను. కొంచెం ఓర్చుకో! రాముడి చెంపలు కుట్టడానికి ఇప్పుడే కండ చీమల్ని పంపిస్తాను. ధైర్యంగా ఎవరు వెళ్తారో అడుగుతాను" అని కొమ్మని ఓదార్చింది వాళ్ళమ్మ.

చెట్టునిండా తిరుగుతోన్న నల్ల – తెల్ల – పచ్చ చీమలన్నీ "నేను వెళ్తాను, నేను వెళ్తాను" అంటూ ముందుకొచ్చాయి. రాముడు వాలి వున్న కొమ్మవేపు శరవేగంతో పాకడం మొదలెట్టాయి.

రాముడు కళ్ళు మూసుకుని కొమ్మమీద వాలే ఉన్నాడు. లోపల, ఆత్మ కొంచెం నసుగుతూ విన్న వింతలు మొదలుపెట్టింది. ".... పోనీ లక్ష్మణుడు ఎందు కొచ్చాడో.... కొంచెం చెప్పనివ్వరాదూ? .... అబ్బే! నీకు చెప్పేపాటి దాన్ని కాదు. ఊరికే .... అన్నాను అంతే .... ఊరికే అంతే.... ఊరికే" అంటూ అంతర్ధానమై పోయింది.

చెంపకి తేలు కుట్టినట్టు ఎగిరిపడ్డాడు రాముడు. చెంప రుద్దుకున్నాడు. గంభీరంగా వీపూ, చంకలూ దులుపుకున్నాడు.

ఆ పోరాటంలో నాలుగయిదు కండ చీమలు వీర మరణం చెందాయి.

రాముడు కొమ్మవేపు చూశాడు. తెలివయిన సేనాధిపతి యుద్ధ వ్యూహం పన్నినట్టు – కొమ్మ పొడుగునా సైనికుల బారులలాగ చీమల బారులు! రాముడు గబగబా చెట్టు కింద నించి బయటికి దాటాడు.

రాముడి ఎడం చెంపమీద కప్పపిల్ల లాగ దద్దురు తేలింది. చంక కింద ఇంకో కప్పపిల్లా! ఆ నల్ల కప్ప పిల్లలు లక్ష్మణుడి కంటపడ లేదు.

రాముడికి చీమలమీద కోపం, ఎప్పుడో అంతర్ధానమైపోయిన 'ఆత్మ' మీదకి తిరిగింది. – "లక్ష్మణుడు చెప్పేది వినాలా? ఏం వినాలి? ఎందుకు వినాలి? నా ఆజ్ఞ మీరాడు, అంతే! ఇంకేం వినాలి?" అని కేక లేసుకున్నాడు. లక్ష్మణుణ్ణి రౌద్రంగా చూశాడు – "రాక్షసుడి కేకలు విని సీత భయపడి నిన్ను పంపి ఉంటుంది. అంతే కదా? ఇంకేం చెబుతావు నువ్వు మాత్రం?[205] ఎంత దుష్టకార్యం చేశావోయీ! ఖరుణ్ణి చంపినప్పటి నుంచీ నాకు రాక్షసులతో ప్రత్యక్ష వైరం మొదలయింది. నా శత్రువులు నాకు తిరిగి అపకారం చెయ్యడానికి చక్కగా వీలు కలిగించావు.[206] అయ్యో! నా హృదయంలో

---

**205.** **అరణ్య, సర్గ 58, శ్లోకాలు 13, 14:** రాముడు లక్ష్మణుడితో అంటున్నాడు. "మారీచుని కేకలు విని సీత భయపడి ఉండును. బహుశా ఆమె నిన్ను పంపి ఉండును. బహుశా నీవు వచ్చి ఉందువు – అని నేను ఊహించుచున్నాను" అంటున్నాడు. ఇంత ఊహించినవాడు సీత ఏమైందో కూడా ఊహించరాదూ? బహుశా తెలిసి ఉండదు. భార్య వియోగం గురించి చక్కగా దుఃఖించాలని రాముడికి చాలా ఉత్సాహంగా ఉంది. తీరా ఆశ్రమానికి వెళ్ళేటప్పటికి సీత బాగానే వుంటే దుఃఖించడం కుదరదు కాబట్టి, ఈ లోపలే మొదలు పెట్టేసి వైన వైనాలుగా దుఃఖిస్తున్నాడు. ★

**206.** **అరణ్య, సర్గ 58, శ్లోకం 15:** "పాపులగు రాక్షసులు నాకు తిరిగి అపకారము చేయుటకు వీలు కలిగించినావు" అంటున్నాడు రాముడు. తను జనస్థానంలో నివసించడం వల్లనే ఖరుడు యుద్ధానికి వొచ్చాడనీ, తను ఖరుణ్ణి చంపడం వల్ల రాక్షసులు మళ్ళీ ఈ విధంగా సీతని చంపి అపకారం చేస్తారనీ, రాముడి అభిప్రాయాలు. రాక్షసుల స్థలంలోకి రావడం తప్పు కాదా? ఈ వైరం, తనకీ రాక్షసులకూనట! దానితో లక్ష్మణుడికేం సంబంధం లేదు! అతడు దాసుడు. జరిగేదంతా యజమానికి సంబంధించిన వ్యవహారం. అందుకే, 'నాకు అపకారం జరుగుతుంది' అంటాడు గానీ, 'మనకి' అనడు. ★

ఎడమ పార్శ్వం అదురుతోంది. ఎన్ని కష్టాలలో మునిగి పోయానో! ఇప్పుడు నేనేం చెయ్యగలను? కార్యం చెడి పోయింది. అనుభవించవలసిందే గదా?" అంటూ లక్ష్మణుణ్ణి నిష్ఠూరంగా చూచి, తల తిప్పి మళ్ళీ నడక సాగించాడు.

అన్నగారి దీనత్వం చూస్తోంటే లక్ష్మణుడికి తప్పే చేశానని పూర్తిగా నమ్మకం కలిగింది. దుఃఖం ఆపుకోలేక పోయాడు. అక్కడ వదిన గారేమో వినలేని మాటలు, కాల్చిన శలాకలు చెవులకు అంటించినట్టు! 'నీచుడా! నువ్వు అన్నగారి చావు కోరుతున్నావు. నా పొందు కోసం కుతంత్రాలు పన్ని మా వెంట వచ్చావు' అన్నందుకే గుండె దుఃఖంలో ఈదులాడుతోంటే, ఇప్పుడు అన్నగారి దోషారోపణ! "నా ఆజ్ఞ ధిక్కరించావే! ఆశ్రమం విడిచి వచ్చావే!" అని!

లక్ష్మణుడు భరించలేక జల జల కన్నీళ్ళు రాలుస్తూ, అన్నగారి పాదాలకు నమస్కారం చూస్తూ విన్నవించాడు – "మన్నించండి అన్నగారూ! మీ పవిత్రమైన పాదాలపై ఒట్టు వేసి చెబుతున్నాను. నేను స్వతంత్రుణ్ణి కాను. నాకై నేనుగా మీ పవిత్రమైన ఆజ్ఞ ధిక్కరించలేదు.[207] "సీతా! లక్ష్మణా! రక్షించండి" అంటూ జాలిగొలిపే ఆర్తనాదాలు వినిపించగానే వదినగారు మిక్కిలి భయపడిపోయారు. మీకు ఘోరమైన ప్రమాదం సంభవించి ఉంటుందని ఆమె దుఃఖపడుతూ, 'లక్ష్మణా! తొందరగా మీ అన్నగారి దగ్గిరకు వెళ్ళు, వెళ్ళు' అని నన్ను తొందర పెట్టారు. నేను మీ శౌర్య ధైర్యాల గురించి ఎంతగానో చెప్పాను. 'శ్రీరామచంద్రుడు దేవేంద్రుణ్ణయినా జయించగలడు కదా, నీచ రాక్షసుడి చేతిలో హతుడవుతాడా? ఆ కేకలు మా అన్నగారు పిల్చినవి కావు సుమా! రఘు వంశంలో పుట్టిన శ్రీరాముడు ఒక స్త్రీని రక్షించమని నీచంగా అడుగుతాడా? ధైర్యంగా ఉండండి వదిన గారూ! మా అన్నగారి కేమీ హాని జరగదు. మా అన్నగారిని యుద్ధంలో జయించే వారు ఇప్పటికి పుట్టలేదు. ఇక ముందు పుట్టబోరు' అని ఎన్ని విధాలో చెప్పాను. కానీ ఎంత చెప్పినా ...." లక్ష్మణుడు నమస్కారం విప్పకుండా చెప్తోనే వున్నాడు.

రాముడి మొహం తామరాకులాగ వికసిస్తూ .... వికసిస్తూ .... వికసిస్తూ .... వికసిస్తూ .... తామరాకు కొలతలు కూడా దాటిపోయింది.

".... వదినగారు నా మాటలు విశ్వసించనే లేదు. పైగా నా మీద ఎన్నెన్నో అభాండాలు వేసి ...." లక్ష్మణుడు బొంగురుపోతున్న కంఠం సర్దుకుంటూ, "నేను ఆమెతో పొందుకే వచ్చాననీ ...." చెప్పలేక ఆగి పోయాడు.

తృళ్ళిపడ్డాడు రాముడు – "ఏమన్నదీ?"

లక్ష్మణుడు సిగ్గుపడిపోయాడు ".... ఆ మాటలు నా నోట చెప్పలేను .... నేను దుష్ట తలంపుతోనే మీ వెంట వచ్చానట! ఆమె పొందుకోసమే నిరీక్షిస్తున్నానట! 'నీచుడా! నీ దుష్టత్వం ఇంత కాలానికి తెలిసింది. అన్నగార్ని రక్షించడానికి పోకుండా వున్నావు' అంటూ వదినగారు దూషిస్తోంటే, నేనిక నిలబడలేక వెంటనే బయలుదేరి వచ్చాను అన్నగారూ! నా దోషం వుంటే శిక్షించండి! మీ ఆజ్ఞ మీరే సాహసం చెయ్యగలనా?"

రాముడి కేమీ వినిపించలేదు. 'సీత, లక్ష్మణుణ్ణి అంత మాట అన్నదా? ఎందుచేత అని ఉంటుంది? ఉత్త పుణ్యానికే అని ఉంటుందా? .... ఎప్పుడయినా .... ఈ దుష్టుడు .... ఆమెని .... ఏకాంతంలో .... లేకపోతే అంత మాట అంటుందా? సీత ఎన్నడూ చెప్పలేదే తనకి! .... తన ఆగ్రహానికి జంకిందా? లక్ష్మణుడు దుశ్చింత గల వాడయితే .... సీత అన్నవన్నీ తనంత తనే విన్న విస్తున్నాడే! .... సీత చెప్పక ముందే తను చెప్పుకోవా లనా?' – రాముడికి తల తిరిగిపోతోంది. లక్ష్మణుణ్ణి చూస్తోంటే అతని మీద కలబడి కంఠం నొక్కి చంపె య్యాలనిపిస్తోంది. – "నిజం చెప్పు, దుర్మార్గుడా! నా చాటున .... సీత నెప్పుడయినా .... వశం చేసుకోవాలని ప్రయత్నించావా? .... అవును, ప్రయత్నించావు కదూ? .... ఆమె కొంగు పట్టి గుంజావు కదూ?" అని నిలదీసి అడగాలని మనసు ఉరకలు వేస్తోంది. ఆ కోపంలో రాముడు భూమి అదిరేటట్టు అడుగులు వేస్తూ నడిచాడు.

లక్ష్మణుడు వినయంగా పక్కన నడుస్తూ "ఈ దాసుడు స్వతంత్రించి మీ ఆజ్ఞ మీర .... మీ పాద సేవ చేసుకుని తరించడమే ఈ జన్మకు సార్థ...." అంటూ మాటలు మింగుతున్నాడు.

రాముడు రౌద్రంగా – "లక్ష్మణా! నా ఆజ్ఞ మీరిందే గాక ఈ ప్రార్థనలూ, విన్నపాలూ ఎందుకు? వ్యర్థ

**207.** అరణ్య, సర్గ 59, శ్లోకాలు 5, 6: "లక్ష్మణుడు, పూర్వము సీత పలికిన పలుకులు విని దుఃఖాక్రాంతుడుగ నుండి, ఇపుడు శ్రీరాముడు, "నీవు అకృత్యము చేసితివి' అని చెప్పగా, విశేషముగ దుఃఖించిన వాడై, రామునితో నిటులనెను – "నేను నా స్వాతంత్ర్యముచే సీతని విడిచి ఇచటకు రాలేదు ...." లక్ష్మణుడు స్వతంత్రించాడా, అన్నగారి ఆజ్ఞకి బద్ధుడయి వున్నాడా? అన్నదే ఇక్కడి సమస్య. తను స్వతంత్రించలేదని చెప్పుకుంటున్నాడు లక్ష్మణుడు. భూస్వామ్య సంస్కృతిలో ఇది ఒక ముఖ్య విషయం. భార్యలూ, బిడ్డలూ, తమ్ములూ, సేవకులూ, స్వతంత్రిస్తారేమోనని క్షణ క్షణం హడలు ....! ధర్మాలతో, నీతులతో, వ్రతాలతో, వాళ్ళ కాళ్ళూ చేతులూ, నోళ్ళూ, కట్టెయ్యాలని ఆరాటం! ★

మోయి! నా ధైర్య సాహసాలు నీకు తెలియనివి కావు గదా? స్త్రీలు కోపంలో ఏదో అన్నారని వారికి హాని కలిగించే విధంగా ప్రవర్తిస్తాడా వివేకవంతుడు? సీత మాటలకు కోపం ఎందుకు కలిగింది నీకు? నా ఆజ్ఞ మీరి సీతను వంటరిగా విడిచి వొచ్చావే! ఎంత పొర పాటు! నాకు సర్వ విధాలా అన్యాయం చేశావే!" అని నిప్పులు కురిపిస్తూ చూశాడు.[208]

లక్ష్మణుడు ఖిన్నుడయి – ఆ మహా పతివ్రతకీ, ఈ మహా వీరుడికీ మధ్య నలిగి, గుడ్ల నీరు గుడ్ల గుక్కు కుంటూ తల వంచుకున్నాడు. ఇంగితం కూడా ఏమీ తోచక పళ్ళు నూరి ఊరుకుంది. నడుస్తూ వున్నంత సేపూ ఆశ్రమంలో సీత ఉందో, లేదోనని లక్ష్మణుడి గుండె 'ఉందా, లేదా; ఉందా, లేదా?' అని దడ దడ కొట్టుకుంటూనే వుంది.

రాముడు ఆశ్రమానికి వెళ్ళేవరకూ తర్జన భర్జన పడుతూ లక్ష్మణుణ్ణి వార కంట చూస్తోంటే, రాముడి ఆత్మ చీమ తలకాయంత చొరవ చేసి – "లక్ష్మణుడి మీద అపోహ.... సీతని కాముక దృష్టితో చూస్తున్నాడనే నింద .... పొరపాటు సుమా! తొందరపాటు సుమా! .... సుమా!.... సుమా!" అని నసుగుతూ, జంకుతూ, బెదురుతూ, గొణిగింది.

రాముడు, తల పంకించి ఊరుకున్నాడు. "నా పాద సేవకుడే మరి .... విశ్వాసపాత్రుడే మరి .... స్త్రీలను నమ్మ రాదు. మూర్ఖులు. చపల చిత్తులు. అన్యాయమైన నిందారోపణలు చేస్తారు. అంతే .... అంతే మరి – అర ణ్యాలకు రావొద్దంటే విన్నది కాదు. అరణ్యాల్లో పులులూ సింహాలూ వుంటాయని చెప్పినా జంకలేదు.... చీమలు వుంటాయని చెపితే జంకే దేమో! ఆc, .... జంకేదే..." అని ఆలోచనలో మునిగాడు.

★ ★ ★

పర్ణశాలంతా చిందర వందరగా ఉంది. దర్భాస నాలన్నీ ఇటూ అటూ పడగొట్టి ఉన్నాయి. పువ్వులూ, పళ్ళూ నేలంతా జిమ్మి ఉన్నాయి.

సీత లేదు! ఎక్కడా లేదు! పెరట్లో .... మొక్కల్లో కూడా లేదు!

లక్ష్మణుడికి మతిపోయినట్టు అయింది.

రాముడు, బాణాలు విడిచినట్టు ప్రశ్నలు గుప్పిస్తు న్నాడు. –"సీతని రాక్షసు లెత్తుకుపోయారా? చచ్చి పోయిందా? భయపడి ఎక్కడైనా దాక్కుందా? లేకపోతే ఏ పూలైనా కోసుకోడానికి వెళ్ళిందా? స్నానానికి వెళ్ళిందా? నీళ్ళు తేవడానికి వెళ్ళిందా?[209] బట్టలుతక టానికి వెళ్ళిందా? ఆశ్రమం సర్దుకోకుండా, తలుపు లయినా జేరవెయ్యకుండా వెళ్ళిందే!"

ఇద్దరూ ఇంటి చుట్టూ తిరుగుతున్నారు.

"సీతా! సీతా!"

"వదినగారూ! వదినగారూ!" అంటూ కేకలు వేశారు కొంతసేపు.

"సీతా!...."

"వొదినగారూ!...."

సీతకి ఇష్టమైన చెట్ల దగ్గిర చూశారు.

లక్ష్మణుడికి భయం మొదలైంది. ఏవిటిది? నిజంగా ఏమైనా జరిగిందా?.... అయ్యో! వదిన గారికి ప్రమాదం జరిగిందా? తన దోషంవల్ల .... తన అపరాధంవల్ల వదినగారు ఆపదలో చిక్కుకున్నారా? .... ఎంత పొరపాటు జరిగింది! .... అయ్యో!

రాముడికి విరహం మొదలైంది. ఎన్నడూ ఈ విధంగా జరగలేదే! ...ఎక్కడికీ సీత ఒంటరిగా పోయేది కాదే! .... పొరపాటంతా లక్ష్మణుడిదే! – ఇప్పుడు సీత ఎట్లా కనబడుతుంది? .... వియోగమేనా ఇది? సీతకూ,

---

**208.** అరణ్య, సర్గ 59, శ్లోకాలు 23, 24: లక్ష్మణుడు అసలు సంగతంతా చెప్పింతర్వాత కూడా రాముడు – "నీ విషయంలో నేను సంతోషించలేను. సీత మాటల వల్ల కోపమునకు వశమై, నా యాజ్ఞనుల్లంఘించితివి. నీవు అన్ని విధములలోనూ అన్యాయము చేసితివి" అంటున్నాడు. అంటే, చివరికి లక్ష్మణుడు తప్పు చేసినట్టు తేల్చాడు కవి. తిట్టడం సీత తప్పు. తిట్టినా, అన్నగారి ఆజ్ఞ మీరడం లక్ష్మణుడి తప్పు. రాముడిది మాత్రం ఎన్నడూ ఏ తప్పూ ఉండదు.

మారీచుడి కేకలు విన్నప్పుడే రాముడికి మిక్కిలి భయం కలిగింది. సీత కూడా మిక్కిలి భయపడి లక్ష్మణుణ్ణి తనకోసం పంపుతుందని రాముడికి సహజంగానే అనిపించింది. కానీ, అలాగే జరిగితే, అది – 'ఆజ్ఞ మీరడం' అయింది. లక్ష్మణుడు, అలా రాకపోతే "అక్కడ నేను చచ్చినా అంతేనా? నన్ను రాక్షసులు ముక్కలు ముక్కలు చేసినా అంతేనా? ఆ కేకలు నేను వేసినా నువు కదిలేవాడివి కావు గదా?" అంటాడు. ఏమో బాబూ! రాముడి మనస్తత్వం బయటపడుతోన్న కొద్దీ రాముడు రావణుళ్ళా అయిపోతున్నాడు. 'రామాంజనేయ యుద్ధం' నాటకం రాసినట్టుగానే, రాముడికీ, లక్ష్మణుడికీ ఒకరి మీద ఒకరికి కోపాలొచ్చే ఈ ఘట్టాన్ని ఆధారం చేసుకుని 'రామ లక్ష్మణ యుద్ధం' రాయవచ్చును, చక్కగా. ★

**209.** అరణ్య, సర్గ 60, శ్లోకాలు 8, 9: రాముడి సందేహాలు – "సీత పూలు కోయుటకు పోయినదా? జలము తెచ్చుటకు పోయినదా? స్నానమునకు పోయినదా? ఎచటనయిన భయముతో దాగినదా?" – ఈ రకంగా. మరి రాక్షసులు తినేశారో, ముక్క ముక్కలు చేసేశారో – అని మొదటే గోల ఎందుకు, లక్ష్మణుణ్ణి సాధించడానికి కాకపోతే? ★

తనకూ ఎడబాటేనా ఇక? హా సీతా![210]

సర్వ శాస్త్రాలూ చదివిన రాముడు, 'శృంగార శాస్త్రం' కూడా చదివిన వాడే. ఇంతకాలమూ సంయోగ శృంగారమే గానీ, వియోగ శృంగారం చవి చూడలేక పోయాడు. వివాహమైంది మొదలూ, సీత, భర్తని అంటి పెట్టుకునే ఉంది. పురుళ్ళకోసం పుట్టింటికి పోయే అవస రాలు కూడా రాలేదు. ఇద్దరి మధ్యా వియోగమూ లేదు, విరహమూ లేదు, విరహ శృంగారమూ లేదు .... ఇప్పుడు ఇది వియోగమే.

రాముడు కొంచెంసేపు ఆలోచించి వియోగ శృంగార లక్షణాలు గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిం చాడు.

ఎడబాటు కలిగిన ప్రేయసీ ప్రియులుగానీ, భార్యా భర్తలుగానీ, ఆ వియోగాన్ని పది రకాలుగా అనుభ వించాలి. – అభిలాష, మనస్సంగమము, సంకల్పము, గుణ వర్ణనము, ప్రద్వేషము, తాపము, అభిమత త్యాగము, ఉన్మాదము, మూర్ఛ, మూ .... ర్ఛ ...., అప్పటికి తొమ్మిది అవస్థలు గుర్తొచ్చాయి. పదవది .... పదవది .... పదవ .... ఎంత ఆలోచించినా ఆ పదో అవస్థ గుర్తు రాలేదు. మళ్ళీ మొదటి నుంచీ – 'అభిలా .... మనస్సం .... సంకల్ప్ .... గుణ వర్ణ్ .... ప్రద్వేష్' అంటూ గబ గబా వల్లించాడు. ఈ సారి ఇంకా కొన్ని మర్చిపోయాడు. చివరిది గుర్తు రానేలేదు.

పోనీ, మొదట ఈ తొమ్మిది అవస్థలూ అభినయిస్తూ వుంటే ఆ పదోది అప్పటికి గుర్తు రాక పోతుందా – అని ఆశ కలిగింది.

మళ్ళీ ఒకసారి ప్రయత్నించి చూద్దామని .... కళ్ళు మూసుకుని కొంచెం శాంతంగా – "అ.. భి... లాషా, మనస్సంగమమూ – సంకల్పమూ ....' అంటూ యోగి లాగ జపం చేశాడు. చటుక్కున మధ్యలోనే గుర్తొచ్చే సింది, ఆ పదో అవస్థ! అది మరణము .... మరణము .... మరణము! అవును! మూర్ఛ తర్వాత మరణమే. తొమ్మిది రకాలుగా దుఃఖించినా ప్రియురాలు సమీపానికి రాకపోతే, చివరికి మరణించాలి! ప్రియురాలు కూడా అక్కడ అలాగే మరణించాలి. కానీ, సీత ఆ శృంగార శాస్త్రాలేవీ అంతగా చదువుకోలేదు. ఈ అవస్థలన్నీ తెలుసుకుంటుందా? సీత పాటించకపోయినా, తను మాత్రం ఈ శాస్త్ర విధులన్నీ పాటించాలి. ఇప్పటికే కొన్ని అవస్థలలో కొంత కొంత భాగం శాస్త్రాల్లో చెప్పిన విధం గానే పాటించాడు. సీతకోసం 'అభిలాష' చూపించాడు. సీత గుణ గణాలు చక్కగా వర్ణించాడు. సీతకోసం తన అభిమతాలన్నీ త్యాగం చేస్తానన్నాడు. అయోధ్యకే పోన న్నాడు .... ఇప్పుడిక మిగిలిన అవస్థలన్నీ పాటించాలి. శాస్త్ర విధుల్ని నిర్లక్ష్యం చెయ్యకూడదు కదా?

"హా సీతా!" అని కేక పెట్టాడు గట్టిగా, చేతులెత్తి.

లక్ష్మణుడికి దుఃఖం ఆగడం లేదు. తన పొరపాటు వల్లే ఇదంతా జరిగిందని మధన పడిపోతున్నాడు. వదినగార్ని శత్రువులు ఎక్కడికో తీసుకుపోయి ఉంటారు. లేకపోతే పరిసరాల్లోనే ఏ గుహలోనో దాచి ఉంటారు. తొందరగా వెతికితే దొరక వచ్చును.

అన్నగారి మొహం చూడడానికే సిగ్గు పడుతూ, తల వొంచి రాముడి పాదాలకు నమస్కరిస్తూ – "అన్నగారూ! మనం వెంటనే ...." అంటూ విన్న వించబోయాడు.[211]

రాముడు – భార్యకోసం శోకంతో, మోహాతి రేకంతో, అచేతనాలను చేతనాలుగా భావించి వాటితో సంభాషించే అవస్థ అభినయిస్తున్నాడు. "ఓ కదంబ

---

**210.** **అరణ్య కాండలో, 57వ** సర్గ నుంచీ రాముడికి పట్టాభిషేకం అయ్యి మనస్సు స్థిమితపడే వరకూ, కిష్కింధా కాండ మీదుగా, సుందర కాండ మీదుగా, యుద్ధ కాండ మీదుగా – రాముడు సీతకోసం 'వియోగ శృంగారం' అనుభవించే ఘట్టాలు కొల్లలుగా చూస్తాం. – 'వియోగం' అంటే – ఎడబాటు. స్త్రీ పురుషులిద్దరూ తాత్కాలికంగా విడిపోతారు. ఎవరెక్కడున్నారో ఇద్దరికీ తెలియాలి. కొంత కాలం తర్వాత తప్పకుండా కలిసే పరిస్థితి ఉండాలి. ఆ లోగా ఎవరికీ ఏ ప్రమాదమూ ముంచుకు రాదనే విశ్వాసం ఉండాలి. అలాంటి వియోగాన్ని, కష్టంగా అయినా, 'విరహ శృంగారం' లాగ అనుభవించవచ్చును. కానీ, ఇక్కడ పరిస్థితి అది కాదు. సీత ఏమయిపోయిందో రాముడికి తెలీదు, రాముడేమై పోయాడో సీతకీ తెలీదు. (లేడిని తెస్తానని వెళ్ళిన వాడు రానే లేదు. పైగా, 'రక్షించండి, రక్షించండి' అని అడివిలో నించి చావు కేకలు!) – సీతని రాక్షసులు చంపేసి .... తినేసి .... జీర్ణం చేసేసుకున్నారని రాముడి గాఢ నమ్మకం. – అలాంటి స్థితి, విరహం అనుభవించే సందర్భమా? రాముడు సీతకోసం విరహంతో ఎదురు చూస్తున్నట్టుగా కవి వర్ణిస్తున్నాడు. సందర్భ శుద్ధి అనేది ఏ ఘట్టంలోనూ కనపడడం లేదు. ★

**211.** **అరణ్య, సర్గ 60, ఆఖరి శ్లోకాలు:** "శ్రీరాముడు అరణ్యములలోనూ, నదులలోనూ, కొండలలోనూ, సెలయేళ్ళలోనూ, ప్రవేశించుటకు సాధ్యముగాని ప్రదేశములలోనూ, పదే పదే తిరిగి సీత కొరకై గాలించెను." అంత శ్రద్ధగా, అన్ని ప్రదేశాలు గాలిస్తే, ఆశ్రమం సమీపంలోనే పడివున్న జటాయువు ఎందుకు కనిపించలేదు మొదట్లోనే?

**అరణ్య, సర్గ 61, ఆఖరి శ్లోకం:** "లక్ష్మణుని పలుకులు లక్ష్యపెట్టక – రాముడు 'ఓ ప్రియురాలా!' అని మరియు గొంతెత్తి బిలుచుచుండెను." – లక్ష్మణుడు చెప్పింది వినేదీ లేదు, వెతికేదీ లేదు. ★

వృక్షమా! నీ పువ్వులు కొయ్యడానికి వచ్చిందా సీత? ఓ అర్జున వృక్షమా! నీ పువ్వుల మీద మిక్కిలి ప్రీతిగల సీతను ఎరుగుదువా? బిల్వ వృక్షమా! బిల్వ ఫలాల వంటి రొమ్ములు గల సీతను చూశావా? అయ్యో, ఈ మద్రి చెట్టుకి తెలిసే వుంటుంది. చెప్పడం లేదే! అశోకమా! నా శోకం పోగొట్టవా? తాళ వృక్షమా! తాటి పండ్ల వంటి స్తనాలు గల నా భార్య .... మద్రి మొదలు వంటి తొడలు గల నా సీత .... సంపెంగ వంటి ఛాయ గల నా సీత .... ఏం జరిగింది? నిర్భయంగా చెప్పండి నాతో. భయపడకండి! మీ భయం నే పోగొడతాను. నా దుఃఖం మీరు పోగొట్టండి!"

"అన్నగారూ! ఈ పరిసరాలన్నీ గాలించుదాం. మనం కొంచెం తొందరగా.... దూరంగా వెళ్ళి...."

"ఓ మాధవీలతా! నా సీతని చూశావా!" అని రాముడు ఎడం పక్కకి తిరిగాడు. - "మల్లె తీగా! ఎత్తయిన పిరుదులు గల సీత కనబడలేదా నీకు?" అని కుడి పక్కకి తిరిగాడు. "సన్నజాజీ! .... నీ వలే మృదువుగా ఊగిసలాడే నడుము గల సీతను చూడలేదా నువ్వు?" అని ఆరాటపడుతూ అడిగాడు. అక్కడే వున్న మాధవీలత చూడని సీతని, అక్కడే వున్న మల్లె తీగ చూసిందేమోనని! అక్కడే వున్న మల్లె తీగ చూడని సీతని, అక్కడే వున్న సన్నజాజి చూసిందేమోననీ!

అక్కడ గుబురుగా ఉన్న మొక్కలన్నింటినీ, కొమ్మ కొమ్మనీ, తీగ తీగనీ, ఆకు ఆకునీ, పేరు పేరునా అడుగుతూ నించున్నాడు.

రాముడి ఆత్మ కొంచెం జంకుతూ, బెదురుతూ - "మొక్కల్ని .... అడగడం .... ఎందుకూ? .... చెపుతాయా, పెడతాయా? .... అబ్బే! .... మొక్క లెప్పుడూ .... మనతో మాట్లాడవు గదా అనీ, ఊరికే .... సందేహం వొచ్చీ ...." అనేసి సిగ్గుపడి పోయింది.

రాముడు కఠినంగా - "అవును, నీ కెప్పుడూ సందేహాలే .... వియోగ శృంగారం ఇలాగే అనుభవించాలని శాస్త్రాల్లో రాశారు. తెలీనట్టు నసుగుతావేం? ముందు మొక్కల్ని అడగాలి. తర్వాత పిట్టల్ని, జంతువుల్నీ అడగాలి. ఏనాడో పెద్దలు చెప్పిం తరవాత ఇక సందేహాలెందుకూ? శాస్త్ర ధర్మాల్ని ధిక్కరించమంటావా ఏవిటి నన్ను?" అని జగడానికి దిగాడు ఆత్మతో.

"ఛ, ఛ, ఎంత మాట! అబ్బే, నే నంటానా అంత మాట? ఛ, శ్రీరాముడు శాస్త్రాన్ని ధిక్కరిస్తాడా? ఊరికే...."

"లేకపోతే ఏమిటి? నీకు సందేహం ఎందుకూ?"

"ఎబ్బే! సందేహం ఎప్పుడో పోయింది. పూర్తిగా పోయింది. అవును మరి, శాస్త్రాలు చెప్పినట్టు నడవాలి గానీ .... అదిగో! ఆ సంపెంగ పూలనడుగు. సీతని చూసే వుంటాయి" అని రాముడికి సంపెంగ పూలని చూపించి తప్పుకుంది ఆత్మ.

రాముడు అటు చూశాడు! పసుపు పచ్చ సంపెంగలు, వాళ్ళమ్మ వొళ్ళో ఊగుతున్నాయి.

రాముడు ఒక పువ్వు వేపు చూశాడు - "ఓ సంపెంగ పుష్పమా! నీ ఛాయా, సీత ఛాయా ఒకటే. సీతని రాక్షసులు కమ్మగా తినేశారు సుమా!" అని 'నిన్ను తినలేదే' అన్నట్టు చూశాడా పువ్వుని.

రాముడు అంత దీక్షగా చూస్తోంటే ఆ పువ్వుకి భయం వేసి - "అమ్మా! రాముడు చూడవే, ఎలా జడిపిస్తున్నాడో!" అని బావురుమంది.

"అబ్బే, అది జడిపించడం కాదమ్మా! సీత కనపడడం లేదు కదా? నువ్వేమన్నా చూశావేమోనని అడుగుతున్నాడు."

"ఇందొక నిన్ను అడిగాడుగా, మళ్ళీ నన్నెందుకూ? ఇలాగైతే ఇంకెప్పుడు వెతుకుతాడు సీతని?"

"వెతకాలని కాదు. అప్పుడే దొరికితే ఎలాగ? విరహం ఎలా అభినయించాలో వాళ్ళ శాస్త్రాల్లో చెప్పినట్టు చేస్తున్నాడు, అంతే!"

"ఏమోనే అమ్మా! నాకు భయం వేస్తోందే! కోపంగా చూస్తున్నాడే!"

"లేదులే, అదుగో, ఇంకో వేపు పోతున్నాడులే"

రాముడు ఇంకో పువ్వు దగ్గిర నించున్నాడు.

లక్ష్మణుడు ఆతృతగా చుట్టూ చూస్తున్నాడు - హఠాత్తుగా సీత ఎటన్నా కనబడుతుందేమోనని.

రాముడు - చూత, పిప్ప, పనస, కర్ణికార, బాడిస, కరక, లొద్దుగు, మద్దిలి, వావిలి చెట్లన్నింటినీ అడి గాడు - "సీతని చూశారా?" అని!

అన్నీ ఊరుకున్నాయి.

మద్రిచెట్టు మీదికి పాకిన ఎర్రపూల తీగ మద్రితో గుస గుస లాడుతూ - "పాపం రాముడు దుఃఖపడుతున్నాడు, చెప్పేద్దామా?" అంది.

"వొద్దు. ఎలా విడిపిస్తాడో చూద్దాం సీతని. 'ఇంత వాణ్ణి, అంతవాణ్ణి' అని గొప్పలు చెప్పుకుంటాడుగా?"

"గొప్పలేవిటి? వీరుడేగా?"

"వీరుడయితే ఏడుస్తాడేం?"

"పాపం సీత సంగతి తెలీనే తెలీదుగా?"

"తెలియకపోతే తెలుసుకోమనూ, దేవుడేగా?"

ఎర్రపూల తీగ కొంచెం ఆలోచించి - "రాముడి కోసం కాదు .... పోనీ, సీత కోసమన్నా చెప్పొద్దూ? .... ఆ రావణుడు సీతని చంపేస్తాడో యేమో...." అని భయపడింది.

"ఛ! ఎందుకు చంపుతాడూ? పెళ్ళి చేసుకోవాలని ఎత్తుకు పోయాడుగానీ .... చంపడానికైతే .... ఇక్కడే

చంపేవాడు కాదూ?"

"పెళ్ళెలా చేసుకుంటాడేం? సీతకి భర్త ఉన్నాడుగా?"

"ఏం, ఉంటే? ఎవడు వీరుడయితే వాడే భర్త! అబ్బో! .... ఇలాంటివి ఎన్ని చూశానో! స్త్రీని ఎత్తుకు పోవడమే వీరత్వం! నీకేం తెలుసు! నిన్నగాక మొన్న పుట్టావు ...." అంది మర్రి చెట్టు!

"నువ్వెప్పుడు పుట్టావేమిటి?"

"నేనా? .... వెయ్యేళ్ళు దాటిందేమో! నా కళ్ళ ముందు ఎంత ప్రపంచం మారిందో! .... నా చిన్న తనంలో మనుషులు ఎంత అమాయకంగా బతికే వాళ్ళో! మా తాత చెప్పేవాడు ఈ పాతివ్రత్యాలూ సింగినాదాలూ అప్పుడు లేనేలేవట, తెలుసా?"

"అవి లేవేమోగానీ, 'ప్రేమ' ఉండదా? అది ఎప్పుడూ ఉంటుంది. సీతకి ప్రేమ లేకుండా రావణుడు తీసుకుపోవడం తప్పు కాదూ? వాడికి శాస్తి జరగాలి .... పాపం రాముడు పిట్టల్ని అడుగుతున్నాడు, నాకు జాలేస్తోంది."

రాముడు ఆకుల మధ్య ఝుమ్మంటోన్న తుమ్మెదల్ని అడుగుతున్నాడు. కొమ్మల వేపు చేతులు జాపి పక్షుల్ని అడుగుతున్నాడు. పక్షులు తొట్రుపడి ఎగిరి పోతున్నాయి.

"లక్ష్మణా! ఈ జింకలన్నీ, రాక్షసులు సీతని తినేశారని చెప్పుకుంటూ వున్నట్టున్నాయి, చూడు"[212] అని లక్ష్మణుడికి చెప్పి రాముడు జింకల్ని అడుగుతున్నాడు – "జింకా! నీ కన్నుల వంటి కన్నులు గల ప్రియురాలు నా సీత. లేడి వలే బెదిరే సుకుమారి నా సీత. మీ జింకల గుంపులో చేరి వుంటుంది. నీ నాధుడు వచ్చాడని చెప్పవా సీతకి?"

జింకలు భయంతో పరుగులు తీశాయి.

రాముడు ఏనుగుల్ని అడిగాడు – "సీత తొడలు మీ తొండాల్లాగే ఉంటాయ"న్నాడు. "సీత మీ గుంపులోనే ఉంటుంద"న్నాడు.

ఏనుగులకు వియోగ శృంగార శాస్త్రాల మీద బొత్తిగా గౌరవం ఉన్నట్టే లేదు. చెవులు తట తట కొట్టుకుంటూ రాముడి మాటలు చెవుల్లో జొరబడక ముందే ఎగరగొట్టి నదివేపు వెళ్ళిపోయాయి.

"రాముడు రాజట కదూ?" అంది ఒకటి.

"ఔను. ఇప్పుడు రుషి వేషంలో వున్నాడు గానీ, రేపు రాజ్యానికి పోయాడంటే మనల్నందర్నీ తోలించుకు పోతాడు, ఏనుగుల సైన్యం పెంచుకోటానికి."

ఏనుగులన్నీ తలో మాటా అన్నాయి.

"అమ్మో! రాజుల్ని నమ్మకూడదు. ఎంత ప్రమాదమో! క్రూరులు వాళ్ళు."

"అస్తమానూ యుద్ధాలే వాళ్ళకి. రాజూ రాజూ గుద్దుకునో, తన్నుకునో, పోట్లాడుకోరాదూ? బలవంతంగా మనల్ని తీసుకుపోయి యుద్ధాలు చేయించుకుంటారు. ఛీ! ఎంత సిగ్గుండదో వాళ్ళకి!"

"అయ్యో! తమలాంటి మనుషుల్తో కూడా యుద్ధాలు చేయించుకుంటారు. ఇక మనల్ని వొదులుతారా?"

ఒక వృద్ధురాలైన ఏనుగు మిగతా వాళ్ళందరికీ చెప్పుకొచ్చింది – "రేపట్నించీ రాముడి ఇంటివేపు వెళ్ళకండి. మన మీద కన్నేశాడంటే తోలించుకు పోతాడు. ఎందుకయినా మంచిది. కీడెంచి మేలెంచాలి" అంది.

"వెళ్ళం, వెళ్ళం" అని వొప్పుకున్నాయి పెద్దవి అన్నీ.

సరిగ్గా నడవకుండా గంతులేస్తోన్న పిల్ల ముండలతో కూడా చెప్పాయి, వాళ్ళ అమ్మలు "నల్లరుషి ఇంటివేపు వెళ్ళకండి" అని.

"ఏం, వెళ్తే ....?"

"అమ్మో! వాళ్ళ రాజ్యం తీసుకుపోతాడు."

"ఏం, తీసుకు పోతే?"

"అమ్మో! యుద్ధాలు చేయించుకుంటాడు."

"ఏం, చేయించుకుంటే?"

"అమ్మో! చచ్చిపోతాం."

"ఏం, చచ్చిపోతే?"

"ఏమో నర్రా! మీతో వాగలేం."

"అమ్మో! మనం చక్కగా రాముడితో ఊరెళ్దామే .... చచ్చి పోదామే .... అమ్మో! చచ్చిపోదామే" అని ఏడుపు లంకించుకుంది ఒక పిల్ల ముండ. వాళ్ళమ్మకి వొళ్ళు మండి దాన్ని తొండంతో ఒక్కటేసింది.

పక్క ఏనుగు – మేనత్తలూ పిన్నమ్మలూ – "అయ్యో! దానికేం తెలుసూ, కుర్ర సన్యాసి. అంత దెబ్బ వేశావు. చాల్లే ఊరుకో" అని కోప్పడ్డాయి తల్లి ఏనుగుని.

రాముడు దుఃఖిస్తూ పెద్ద పెద్ద వృక్షాల్ని అడుగు

**212.** అరణ్య, సర్గ 62, శ్లోకం 9: "ఈ జింకల గుంపు, 'నిశాచరులు సీతను భక్షించిరి' అని చెప్పినటులున్నది" అంటున్నాడు రాముడు. తన అభిప్రాయాలే – పక్షులూ, జంతువులూ, చెట్లూ, పుట్టలూ అన్నీ మాట్లాడతాయనుకుంటాడు రాముడు. తను సంతోషంగా ఉంటే, అవన్నీ "రాముడికి శుభం" అనుకుంటాయి. తనకి రాజ్యం పోతే, అవి, "రాముడికి వనవాసమా?" అనుకుంటాయి. సీతని రావణుడెత్తుకు పోయింతర్వాత జింకలేవన్నా అనుకుంటే "అయ్యో! సీతని రావణుడెత్తుకు పోయాడే" అనుకుంటాయిగానీ, "సీతని రాక్షసులు తినేశారు" అనుకోవు కదా? అంటే, జింకలేమనుకుంటున్నాయో రాముడేమీ గ్రహించలేడన్న మాట! తనకి ఎలా అనుకూలమో అలాగే జంతువులూ, పక్షులూ అనుకుంటాయని రాముడు అనుకుంటాడు ఎప్పుడూ! ★

తున్నాడు, సీత కోసం.

మామిడి చెట్టుమీద చిలక పిల్ల వాళ్ళమ్మని విసిగించి చంపుతోంది – "అమ్మా! సీత మనల్ని చెప్పమందిగా రాముడితో? పాపం చాలా ఏడుస్తూ చెప్పిందిగా? రాముడికి చెప్పవేం మరీ?" అని.

అమ్మ కోపంగా అంది "ఇవ్వాళ ఆపద వచ్చిందని అలా ఏడుస్తూ చెప్పింది గానీ రోజూ రాముడు బాణాలు వేసి మనల్ని చంపుతోంటే చూస్తూ వూరుకోదూ సీత? ఆ లేడి .... పాపం .... ఎంత అందంగా ఉందీ! .... దాన్ని చంపి చర్మం తీసుకు రమ్మని చెప్పలేదూ సీత? రావణుడు ఎత్తుకుపోతున్నప్పుడు, ఏడుస్తూ చెపితే మాత్రం మనకెందుకూ జాలి? రాముడు సీతని వెతుక్కుంటూ వెతుక్కుంటూ ఇక్కణ్ణించి పోతే చాలు. రేపట్నించీ మనం చక్కగా హాయిగా ఉండొచ్చు."

చిలక పిల్ల ఎర్రటి ముక్కు గూట్లోంచి బయటికి పెట్టి "రాముడూ! సీత సంగతి మాకు తెలుసుగానీ .... మేం చెప్పం! నువ్వే వెతుక్కోవాలోచ్!" అని అరిచింది.

రాముడు విన్నాడేమోనని ఆ పిల్లా వాళ్ళమ్మ జడుసుకుంది. పిల్లని తిట్టి రెక్కల్లో దాచుకుంది.

దూరంగా జింకలు పొదల్లో గుంపుగూడి ఆశ్చర్యంగా చెప్పుకుంటున్నాయి – "చెట్లనీ పుట్లనీ, కాకుల్నీ పిచికల్నీ అడుగుతాడు గానీ రుషుల్ని అడగడేం?"

"అసలు వాళ్ళయినా వచ్చి, వాళ్ళు చూసిందంతా చెప్పరేం? ఇదెక్కడి చోద్యమర్రా మరీనూ?"[213]

"వాళ్ళ గోల మనకెందుకు గానీ .... ఇక రాముడి పీడ విరగడై పోతుంది మనకి. రుషులంతా రావణుడి పీడ వదిలించమంటారు గానీ .... అసలు రాముడి పీడే వదలాలి మనకి."

"అవును. నదిలో దిగి నీళ్ళు తాగడానికీ భయమే, కాలికొద్దీ పరిగెత్తి మేత మెయ్యడానికీ భయమే, ఎంత సూటిగా కొడతాడో బాణాలు! వాడి చేతులు విరగా!"

"మంచి పని అయ్యిందిలే ఇన్నాళ్ళకి! ఇక పోతాడు!"

లక్ష్మణుడికి, గబ గబా అడివంతా తిరిగి వెతకాలని చాలా ఆరాటంగా ఉంది. రాముడు చెట్టు చెట్టు దగ్గిరా ఆగుతున్నాడు. పిట్ట ఎగురుతోంటే దాని వెంటబడి అడుగుతున్నాడు. "సీతా! నీ పలు వరస .... నీ ముక్కు .... నీ చెవులు .... నీ అధరాలు .... నీ స్తనాలు... నీ తొడలు... నీ..." అంటున్నాడు.

"అన్నగారూ! మనం తొందరగా ...."

రాముడు వినిపించుకునే ధోరణిలో లేడు. "సీతా! నువ్వు ఇంత అధికంగా పరిహాసం చెయ్యలేదే ఎన్నడూ! దాగితే మాత్రం ఇంత జాగు చేస్తావా? భర్తని కూడా ఉపేక్ష చేస్తున్నావే .... లక్ష్మణా! రాక్షసులు సీత కాళ్ళూ చేతులూ పంచుకుని తినేసి ఉంటారోయీ!"

".... అన్నగారూ! .... నన్ను దండించండి! శిక్షించండి! శిక్షార్హుణ్ణి! శిక్షార్హుణ్ణి" అంటూ బొట బొటా కన్నీళ్ళు కార్చాడు లక్ష్మణుడు.

ఉన్మాదావస్థలోకి దిగాడు రాముడు.

"నా ప్రియురాలి ముఖం ఎంత సుందరమైనది! ఆమె ధరించిన కర్ణాభరణాలు ఎంత ధగ ధగ మెరిసేవి! ఆ కంఠాభరణం .... ఆ రత్నహారాలు .... ఆ దండ కడియాలు .... అదుగో నా సీత! ప్రియురాలా! ఆగవేల? .... వృక్షాలలో దాగినావే!" అంటూ ఒక చెట్టు దగ్గిరికి పరిగెత్తాడు.

లక్ష్మణుడూ, పరిగెత్తాడు. అన్నగారి వెనకాల.

రాముడు గిర్రున వెనక్కి తిరిగి – "లక్ష్మణా! నా ప్రియురాలిని చూశావా ....!" అని లక్ష్మణుణ్ణి పట్టుకున్నాడు.

లక్ష్మణుడు దుఃఖంతో తల వంచుకున్నాడు.

'ఉన్మాదావస్థ' ఎప్పుడు అభినయించాలో రాముడికి కొంచెం సందేహంగానే ఉన్నప్పటికీ, సీత వియోగాన్ని శృంగార శాస్త్ర సమ్మతంగా అనుభవిస్తున్నాననే సంతృప్తితో ఉద్వేగంతో తొందరగానే ఉన్మాదావస్థలోకి దిగిపోయాడు – "అదిగో నా ప్రియురాలు! నా సీత .... హా ప్రేయసీ! హా సీతా ....!" అని కేకలు పెడుతూ చెట్టు చెట్టుకీ పరిగెత్తుతున్నాడు. రాముడు ఏ చెట్టుకింద కెళ్తే ఆ చెట్టుమీద పక్షులు గోల గోలగా లేస్తున్నాయి. చెల్లా చెదురవుతున్నాయి. ఏడుపులు! కూతలు! తిట్లు! రెట్టలు! అరుపులు!

అన్నగారి స్థితి చూస్తే లక్ష్మణుడికి కళ్ళు రెండూ వూట బావులలాగ నీళ్ళూరిపోతున్నాయి. అన్నగార్ని వదల్లేక తనూ అన్నగారి వెంట పరిగెత్తుతున్నాడు. అంత కన్నా ఏం చెయ్యాలో తోచడం లేదు. ముందు ఆశ్ర

**213.** "రాముడు సీత గురించి రుషుల్ని అడగడేం?" అనే ప్రశ్న జంతువుల కయినా వస్తుంది గానీ రామదాసులకు మాత్రం రాదు. ఆ దండకారణ్యం నిండా రుషులే. సీతని రావణుడెత్తుకు పోవడం వాళ్ళు చూశారు కూడానూ. రాముడు అంత ఏడుస్తోంటే, అక్కడ రుషుల ప్రసక్తే వుండదు. అంతకన్నా వింత సంగతి. సీతని రక్షించడానికి, పర్ణశాల దగ్గిరే ఒక చెట్టు మీద జటాయువు వుండాలనే సంగతే రాముడు పట్టించుకోడు. అవన్నీ పట్టించుకుంటే, విరహ శృంగారాలు అభినయించడం ఎలాగ? కథ అంతా కవిగారి ఇష్టాయిష్టాల ప్రకారమే నడుస్తుంది. నిరంకుశులయిన రాజుల కథలు రాసేటప్పుడు కవులు కూడా నిరంకుశులే అయిపోతారు! చదివే వాళ్ళు మాత్రం క్రిములో, కీటకాలో అవుతారు. ఏం చెప్పినా నమ్మేస్తారు. ప్రశ్నించే ప్రశ్నే వుండదు! ★

మానికి పోయి అన్నగారికి నాలుగు మాంసం ముక్కలు కాల్చిపెట్టాలా? లేకపోతే వదినగార్ని వెతుకుతూ వెళ్ళి పోవడమేనా? వెళ్ళవలసి వస్తే ఆశ్రమంలో వదినగారి నగలూ, చీరలూ వదిలెయ్యడమేనా? – ఎటూ తోచడం లేదతనికి.

"ఈ రకంగానే వెతకడం అయితే మీరు ఆశ్రమం దాటి పోయేది లేదులే. నగల గురించీ, చీరల గురించీ బెంగపడకు! ఇంటివేపు ఓ కన్నువేసి ఉంచవచ్చులే" అంది ఇంగితం వెటకారంగా.

లక్ష్మణుడు వినిపించుకోనట్టు ఊరుకున్నాడు.

అన్నగారితో సంభాషిస్తే ఏం చెయ్యాలో నిర్ణ యించుకోవచ్చును. కానీ, అన్నగారీ లోకంలో లేరు! దుఃఖసాగరంలో మునిగిపోయి వున్నారు.

ఆలోచిస్తూ నించున్న లక్ష్మణుడు, రాముడు ఎటో పరిగెత్తడం చూసి, తనూ పరిగెత్తాడు. కొంత సేపు పరుగులతో ఇద్దరూ ఇంటి చుట్టూ, చెట్ల చుట్టూ, గుట్టల చుట్టూ తిరిగారు. తిరిగి తిరిగి మళ్ళీ మొదటికొచ్చారు. అక్కడికే! బైల్దేరిన చోటుకి!

ఎండ మండుతోంది. సూర్యుడు నడినెత్తికొచ్చాడు.

రాముడికి ఆకలితో .... పరుగులతో అలసటా నీరసం మొదలయ్యాయి.[214] సీత అంతసేపు కన పడక పోయేసరికి రాముడికి కొంచెం కోపం ప్రారంభమైంది. లక్ష్మణుణ్ణి కోపంగా చూశాడు. "స్త్రీలు ఒంటరిగా పోవచ్చునా? ఆశ్రమం విడిచి పోవద్దని సీతకి నువ్వు చెప్పలేదా?" అని హుంకరించాడు.

వదినగారితో అలా చెప్పినట్టు లక్ష్మణుడికి గుర్తు లేదు. గజగజ వొణికాడు.

హఠాత్తుగా రాముడికి వియోగ శృంగారంలో ఇంకో అవస్థ గుర్తుకొచ్చింది. కొంచెం కఠినంగా – "సీతా! ఇక నీ పరిహాసం చాలు. అడవి అంతా తిరిగి శ్రమపడి వచ్చిన భర్తతో ఈ విధంగా ప్రవర్తించడం బాగులేదు సుమా! ఋషులుండే ఆశ్రమాల్లో .... ఇంత మితిమీరి భర్తతో పరిహాసాలాడడం, వినయంగా, మర్యాదగా ఉండదు. ఇక నీ ఆటలు చాలించి బయటికి రా!...." అని ఒక పొదని కేకలేశాడు.

పొద కదల్లేదు.

"వదినగారూ! మేం వచ్చాం. మీకేం భయం లేదు. ఎక్కడైనా దాక్కుని వుంటే బయటికి వచ్చెయ్యండి!" అంటూ లక్ష్మణుడు దుఃఖంతో పూడుతోన్న కంఠం పెగల్చుకుని శక్తికొద్దీ గావుకేక లేశాడు.

రాముడు విశాలమైన ఫాలభాగం కుంచించి, చిట్లించాడు – "సీతా! నీ పరిహాసం పూర్వం ప్రియంగా ఉండేది. ఇప్పుడు రుచించడం లేదు సుమా!" అంటూ ఆ చిట్లింపుని మొహమంతా పాక నిచ్చాడు.

పొదని వదిలి, నాలుగడుగులు వేసి ఒక పర్వతం ముందు నించున్నాడు. దాన్ని గంభీరంగా అడిగాడు "చెప్పు, సీతని చూశావా?"

పర్వతం, అంత గంభీరంగానూ అడిగింది రాముణ్ణి! "చెప్పు, సీతని చూశావా?"

రాముడు రుద్రుడయ్యాడు – "ఏమిటీ? నాతో పరి హాసమా నీకు? నా చక్కని సీతని నా కప్పగించక పోయావో .... కాచుకో, నా బాణముల దెబ్బలతో నిన్ను ముక్క ముక్కలుగా విడగొట్టేస్తాను. నీ మీద చెట్టూ చేమా మొలవకుండా చేస్తాను. గ్రహించావా? సీతని చూపించు తొందరగా" అని గర్జించాడు.

రాముడితోపాటే మాట్లాడింది పర్వతం. చిట్ట చివర భీకరంగా – "సీతని చూపించు తొందరగా!" అని గర్జిం చింది రాముణ్ణి.

పర్వతంతో తలపడేట్టున్న అన్నగార్ని చూసి బెదిరి పోయి లక్ష్మణుడు అన్నకి నమస్కరిస్తూ విన్న వించాడు. "అన్నగారూ! శాంతించండి! మిమ్మల్ని పరిహసించ డానికి పర్వతానికెన్ని గుండెలు? దాని సహజ ధర్మంతో అది ప్రతిధ్వనిస్తోంది."

"అంతేనా లక్ష్మణా?"

'అంతే, అంతే. అంతే అన్నగారూ, అంతే!"

రాముడు భీకరంగా అంగలు వేస్తూ కొంత దూరం నడిచి గోదావరి ఒడ్డున నిలబడ్డాడు – "గోదావరీ! అరిటి బోదెలవంటి తొడలు గల సీత నిన్ను దర్శించడానికి వచ్చిందా? నీలో స్నానమాడిందా? తొందరగా చెప్పు!" అని చేతులు చాపి అడిగాడు.

ఆటలో మునిగిపోయిన బాలికలాగ గోదావరి, తీరం పొడుగునా ఎప్పటి కప్పుడు కెరటాలలోకి రాలి పడుతోన్న పూలని ముద్దులాడుతూ, మురిసిపోతూ వాటితో కబుర్లాడుతూ తన్మయత్వంతో, రాముణ్ణి చూడ కుండా ముందుకు సాగుతోంది.

రాముడు ఉగ్రుడయ్యాడు – "లక్ష్మణా! ఈ నది గర్వంతో పలకకుండా ఉంది. నా బాణముల దెబ్బలతో ఈ నదిని ఇంకించేస్తాను సుమా!"

"శాంతించండి అన్నగారూ! గోదావరిని కరుణిం చండి! ఈ దీనురాలు మీతో సంభాషించడానికే భయ పడుతోంది."

"అంతేనా లక్ష్మణా?"

---

**214.** **అరణ్య, సర్గ 58, శ్లోకం 19:** పాపం రాముడి ఆకలిని, కవి బాగానే గ్రహించాడు. "దీనుడై యుండు లక్ష్మణుని నిందించుచూ .... ఆకలి .... శ్రమ .... దాహములచే .... నిట్టూర్పులు విడుచుచూ, ముఖము వాడి .... కాంతి హీనుడై రాముడు ...." అంటూ రాముడి కష్టాన్ని వర్ణించాడు.

★

"అంతే, అంతే. అంతే అన్నగారూ, అంతే."

లక్ష్మణుడి ఇంగితానికి వొళ్ళు మండిపోతోంది. ఇంకా ఓర్చుకోవాలని చూసింది గానీ, ఇక సాధ్యం గాక పళ్ళు నూరుతూ లక్ష్మణుణ్ణి చివాట్లెయ్యడం మొదలు పెట్టింది. "నీ అన్నకి బుద్ధి లేకపోతే లేక పోయింది. నీకన్నా లేదూ? .... ఇద్దరూ కలిసి సీతని వెదికేదేమన్నా ఉందా, లేదా? నీ అన్నకి ఉగ్గుపాల నించీ ఆ సంస్కృత గ్రంధాల వెర్రి వెధవ కవిత్వం అలవాటయిపోయిందని నీకు తెలీదూ? ఆయన అలాగే విరహ వేదనతో మెలికలు తిరుగుతూ ఉంటాడు. నువ్వన్నా పోయి దూరంగా వెతక రాదూ?"

లక్ష్మణుడు నసుగుతూ చెప్పాడు ఇంగితానికి ... "మరి అన్నగార్ని వదలిపోతే .... భార్యా వియోగంతో మతి చలించివున్న స్థితిలో ...."

"మతి చలించిందా, నీ మొహం చలించిందా? మతి చలిస్తే ఆ కవిత్వం ఏమిటి? .... గతి తప్పకుండా, ప్రాస తప్పకుండా, ఛందోబద్ధంగా ...."

"అవుననుకో. అవుననుకో. అవునుగానీ .... విద్యావంతులకు మతి చలించినా భాషా జ్ఞానం ఉంటుంది.

"ఏడిసినట్టే వుంది. భా .... షా .... జ్ఞానం!"

ఎండ మండుతోంటే రాముడు చెట్టు నీడలోకి తప్పు కుని కళ్ళు చిట్లించి చూస్తూ సూర్యుణ్ణి అడుగుతున్నాడు, సీత గురించి! రయ్యిన గాలి వీస్తే గాలిని అడిగాడు, సీత జాడలు!

"అన్నగారూ మనం తొందరగా .... దూరంగా పోయి .... చూడాలి."

రాముడు మంద గమనంతో సాగుతూ నిట్టూర్చాడు – "లక్ష్మణా! ఈ పూల పొద చూడు! ఎత్తయిన ఈ తిన్నె చూడు! ఇక్కడే కదా సీత నా సరసన కూర్చుని నీతో మాట్లాడింది?" అని ఆ పొద దగ్గిర ఆగాడు. ఆ పొదలూ, తిన్నెలూ అన్నీ, పర్ణశాలకి బారెడు బారెడు దూరాల్లోనే! సీతా రాముడూ ఆ తిన్నెల మీదే కూర్చునేవారు.

లక్ష్మణుడికి దుఖ్ఖం ముంచుకొచ్చింది – అయ్యో! ఇంకా ఆశ్రమ ప్రాంతాలే దాటలేదే! ఇంత విశాల మయిన ఈ ఘోరారణ్యంలో .... ఎప్పటికి వదినగారిని చూస్తాం? "అన్నగారూ, తొందరగా వెత ...."

"లక్ష్మణా! సీతను విడిచి నేను బతకలేనోయీ!" అని పనస చెట్టు మొదలు వేపూ, కొమ్మలవేపూ, తీక్షణంగా చూసి, మొదలుకి చేరబడి కూర్చున్నాడు.

లక్ష్మణుడు చేతులు కట్టుకుని ఎదురుగా వొంగు న్నాడు.

"లక్ష్మణా! నేను తండ్రిగారి సన్నిధికే చేరుతాను. అప్పుడు తండ్రిగారు కోపంతో .... 'దుష్టుడా! పదు నాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తానని నాకు వాగ్దానం చేసి, వాగ్దానం పూర్తి చెయ్యకుండానే వచ్చావు కదా? నువ్వు స్వతంత్రుడివి. పితృభక్తి లేని వాడివి. అబద్ధీకుడివి' అని దూషించవచ్చును. అయ్యో సీతా! నన్ను అసత్యవాదిని చేశావు గదా?" అని తల వంచు కున్నాడు రాముడు.

లక్ష్మణుడు కొంచెం నిర్భయం ప్రదర్శించి తీరా లనుకున్నాడు, భయం భయంగా. కొంచెం సాహసం చేశాడు వినయంగా – "అన్నగారూ! దుఖ్ఖించి ప్రయో జనం లేదు. మీరు ధైర్యంగా ఉండాలి. ఈ అడవి అంతా గుహలతో, పొదలతో, నిండి వుంది. వదిన గారికి చెట్లన్నా, నదులన్నా ప్రాణం .... ఏ సరస్సులన్నా చూడా లని వెళ్ళి దారి తప్పారో ...."

"ఏవిటీ! .... సీత వంటరిగా తిరుగుతూ వుంటుందా? ఏం .... నేను లేనప్పుడు ఎప్పుడయినా వెళ్ళిందా?"

"లేదు. లేదు, ఎన్నడూ వెళ్ళలేదు అన్నగారూ! నేనే .... సందేహించి ...."

"హు! సందేహం! .... ఇంకెక్కడి సీత! క్రూర మృగాలో .... రాక్షసులో ...."

"అన్నగారూ! నిరాశపడవద్దు. మీరు మహా వీరులు. మహా విష్ణువు బలిని అణిచి భూమిని పొందలేదా? అలాగే మీరు, వదినగారు ఎక్కడ ఉన్నా శోధించి .... సాధించి పొందగలరు. మనం తొందరగా ఈ అడవి నలుమూలలా వెదకాలి."

రాముడు అయోమయంగా చూశాడు. 'ఏవిటీ! సీత నిజంగానే పోయిందా ఏవిటి? .... దుఖ్ఖిస్తే చాలదూ కవిత్వంతో? .... వెదకాలి కూడానా?' అన్నట్టు దీర్ఘంగా నిట్టూర్చాడు. అలసటతో, ఆకలితో కళ్ళు మూతలు పడు తున్నాయి. శరీరం నిద్రావస్థలోకి జారుతోంది. "లక్ష్మణా!" అన్నాడు బలవంతంగా కళ్ళు విప్పుతూ "ఇక నువ్వు అయోధ్యకు తిరిగి పోవోయీ! నేనిక్కడే కళ్ళు మూస్తాను. కోసల రాజ్యం భరతుణ్ణే పరిపాలించమన్నా నని చెప్పు! తల్లులందర్నీ గౌరవించమని శ్రీరాముడి ఆజ్ఞగా చెప్పు! నా కోసం నా తల్లి నిరీక్షిస్తూ ఉంటుంది. చివరికి కైక కోరికే నెరవేరిందిలే. హా కైకా!" అంటూ మూర్ఛిల్లాడు.

లక్ష్మణుడు కంగారు పడిపోయాడు – రాముడు శోకంతో ప్రాణాలు విడుస్తాడా – అని. కైక మీద క్రోధంతో మూర్ఛిల్లాడో, సీత మీద మోహంతో మూర్ఛిల్లాడో తెలీక, తర్జన భర్జన పడుతూ లక్ష్మణుడు వొంగునే అవస్థలోంచి నెమ్మదిగా, రహస్యంగా కూర్చునే అవస్థలోకి మారిపోయాడు. ప్రాణం లేచి వచ్చినట్టు అయింది. నడుం సవ్వరదీసుకుంటూ వుండిపోయాడు.

మూర్ఛలోంచి రాముడు తుళ్ళిపడుతూ కళ్ళు

తెరిచాడు.

లక్ష్మణుడు బంతిలాగ ఎగిరి వొంగున్నాడు.

రాముడు, తనకు నిద్రపట్టిన సంగతి లక్ష్మణుడికి తెలిసిపోయిందేమోనని తికమక పడుతూ, బలవంతంగా రెప్పలెత్తి నిద్ర కళ్ళతో గంభీరంగా చూడాలని ప్రయత్నిస్తూ, విఫల ప్రయత్నాల్లో మునిగాడు.

లక్ష్మణుడు, తను కూర్చున్న సంగతి అన్నగారికి తెలిసి పోయిందేమోనని సిగ్గుపడిపోతూ, పశ్చాత్తాపంతో 'అన్నగారి ముందు కూర్చున్నానే' అని మధన పడిపోతూ తల వొంచుకున్నాడు.

రాముడు మూర్ఛావస్థలోంచి తొందరగానే శోకావస్థలోకి మారాడు. "లక్ష్మణా! నా వంటి దుర దృష్టవంతు లెవరయినా ఉంటారా? పూర్వజన్మలో ఎన్ని పాపాలు చేశానో! రాజ్యం పోయింది. తండ్రి పోయాడు. బంధు మిత్రులకు దూరమయ్యాను. కఠినమైన వనవాసం గడుపుతున్నాను. ఇవన్నీ చాలవన్నట్టు, ఇప్పుడీ భార్యా వియోగం! అయ్యో! ఎన్ని కష్టాలో నాకు! .... కష్టం మీద కష్టం! దుఃఖం మీద దుఃఖం! పూర్వ జన్మలో ఎన్ని పాపాలు చేశానో![215] ఫలితం అనుభవిస్తున్నాను. అయోధ్య చేరినపుడు ... సీత గురించి జనక మహారాజుకేమని చెప్పను? సీత లేకుండా అంతఃపురంలో ఎలా ప్రవేశించను?"

లక్ష్మణుడు తెల్లబోతూ చూశాడు. ఇంగితం మండిపడిపోతూ "చచ్చిపోతానంటున్నాడు. అప్పగింతలు పెట్టాడు. మళ్ళీ ఇప్పుడీ అంతఃపురాల గోల ఎందుకంట, సీతని వెదకటం మానేసి?" అంది చిరాకు పడిపోతూ.

"లక్ష్మణా! అయ్యో! సీత లేకపోతే స్వర్గం మాత్రం ఎందుకు నాకు?...." అంటూ రాముడు తల వాల్చేశాడు. "సీత, రొమ్ములకు మంచి గంధం పూత పూసుకునేది. అయ్యో, ఆ రొమ్ముల్ని చీలికలు చేసి ఏ రాక్షసుడో తింటూ వుంటాడా? కాదు.... కాదు."[216]

లక్ష్మణుడు అధైర్యంగా వొణుకుతూ ధైర్యం చేసి – "అన్నగారూ! ధైర్యం వహించండి! వదిన గారికి ఎవరు హాని కలిగించినా ఆ దుర్మార్గుల్ని మీరు చీల్చి చెండాడగలరు. మహా శూరులు మీరు! మనం వదిన గార్ని అన్వేషిస్తూ ఈ అడవి అంతా... తిరుగుదాం".

"సీతా!.... సీతా!........... అయ్యో! నాకిక రాజ్యాలెందుకు? భోగభాగ్యా లెందుకు?" అంటూ లేచాడు రాముడు, పిట్టలు అదిరిపోయే కేకలతో.

★ ★ ★

గబ గబా కొంత దూరం నడిచారు.

దూరంగా విరిగి పడివున్న రథం కనిపించింది. కంచర గాడిదలు చచ్చిపడి ఉన్నాయి. రథ సారథి చచ్చిపోయి వున్నాడు. వీరులు ధరించే కవచం, రథం మీద వుండే గొడుగూ, ధనుస్సూ, బాణాలూ, అన్నీ చెల్లా చెదురుగా కనబడ్డాయి. అక్కడక్కడా నేలంతా రక్తంతో తడిసి ఉంది.

లక్ష్మణుడు నిర్ఘాంతపోతూ అన్నీ చూస్తున్నాడు, ఇటూ అటూ పరుగులెత్తుతూ.

రాముడు, గొప్ప సంగతి కనిపెట్టినట్టు ప్రారంభించాడు – "లక్ష్మణా! సీతని తినాలని ఇద్దరు రాక్షసులు పోట్లాడి ఉంటారు. సీతని ముక్క ముక్కలు చేసి తిని ఉంటారు"[217] అన్నాడు గంభీరంగా. రాత్రింబవళ్ళూ మాంసం కండలకోసం ఆరాటపడే రాముడికి, ఎంత సేపూ మాంసం ముక్కల వర్ణనే! రౌద్రంగా, చుట్టూ చూశాడు – "రాక్షసులు సీతని చంపుతూంటే వన దేవతలేం చేస్తున్నారు? పోనీ ధర్మదేవత ఏం చేస్తోంది? నా కింత అప్రియం చేయగలిగిన సమర్థుడెవ్వడు? లోకాలన్నిటికీ ప్రభువునీ, పరాక్రమవంతుణ్ణీ అయిన నన్ను దేవతలందరూ అసమర్థుడిగా భావించినట్టున్నారు. మెత్తని హృదయం గల వాడిని! సర్వలోకాలకూ హితం కోరేవాడిని![218] ఈ నదులూ, కొండలూ, సర్వ

---

**215. అరణ్య, సర్గ 63, శ్లోకం 4:** రాముడు కూడా పూర్వ జన్మలో పాపాలు చేశానని చింతిస్తున్నాడు. ఈ పాపాల గురించి ఇంకో ఫుట్‌నోట్‌లో వివరంగా చూస్తాం. ★

**216. అరణ్య, సర్గ 63, శ్లోకం 8:** ఈ ఒక్క శ్లోకానికీ తాత్పర్యం రాయలేదు గట్టుపల్లి శేషాచార్యులుగారు. "ఈ శ్లోకమున కర్థము స్పష్టముగనే యున్నది" అని రాసి ఊరుకున్నారు. చెప్పడం ఇష్టంలేకనే కావచ్చు. ఇదీ పండితుల నిజాయితీ! ఈ శ్లోకం అర్థం, శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి అనువాదంలో ఇలా వుంది: "కుంకుమ పువ్వు కలిపిన మంచి గంధం పూతకు తగినవీ, గుండ్రనివీ అయిన నా సీత శోణిత దగ్ధ స్తనాలు (రక్తంతో తడిసిన స్తనాలు) ఏ రాక్షసుడో భక్షిస్తూ ఉంటాడు." ఇంత దుఖంలో కూడా సీత స్తనాల్ని కవి విడిచి పెట్టలేకపోయాడు. ప్రమాదాల సమయంలో కూడా 'స్తనాలనే' చూడాలి! వాటినే వర్ణించాలి! ★

**217.** సీతని ముక్క ముక్కలుగా ఊహించుకుంటున్నాడు రాముడు. సీత అవయవాలన్నీ ఛేదించేవాడు రాముడే, రాక్షసులు కారు. ★

**218. అరణ్య, సర్గ 64, శ్లోకాలు 54, 55:** రాముడు – తనెంత మంచివాడో, ఎంత ఉత్తముడో, ఎంత కరుణాత్ముడో చెప్పుకుంటున్నాడు! ★

భూతాలూ నన్ను నిర్లక్ష్యం చేసి, నా శత్రువులకే సహాయం చేయాలని చూస్తున్నాయి. లక్ష్మణా! నా బాణ ములతో లోకాలన్నిటినీ కప్పి, ప్రాణుల సంచారాన్ని ఆపేస్తాను. నేను కోపంతో అల్లెతాడు చెవి వరకూ లాగి ఈడ్చి బాణం వదిలానో .... గ్రహాలన్నీ భయంతో ఒక్కచోటే గుమిగూడుతాయి. నా బాణ సముద్రంలో సూర్య చంద్రులు కనపడకుండా మునిగిపోతారు. అగ్నీ, వాయువూ కంపించిపోతారు. పర్వతాలన్నీ గజ గజ వణికి కూలిపోతాయి. నదులూ, సరస్సులూ ఆవిరై ఇంకిపోతాయి. మహావృక్షాలన్నీ ఫెళ్ళున విరిగి నేల కూల్తాయి. సముద్రాలు కల్లోలపడి నశించిపోతాయి. పక్షులూ, మృగాలూ, క్రిమి కీటకాలూ సర్వ నాశనం అయిపోతాయి. నేను బాణం విడిచానంటేనా...."

లక్ష్మణుడికి, ఆ విరిగిన రథమూ, శవాలూ, ..... నేలలో ఆ నెత్తురు మడుగులూ చూసినప్పటి నించే ఆందోళన ఎక్కువైంది. తొందరగా ముందుకు పోతే ఇంకా సమాచారం తెలుస్తుందని ఆతృతగా ఉంది. రాముడు ఒక్క అడుగు కూడా ముందుకి కదిలేటట్టు లేదు. ప్రేలాపనావస్థలో మునిగి ఉన్నాడు.

లక్ష్మణుడు కొంచెం ముందుకు నడుస్తూ పరిసరా లన్నీ గాలిస్తున్నాడు.

"లక్ష్మణా!"

"చిత్తం! అన్నగారూ...." అంటూ వెనక్కి పరి గెత్తుకొచ్చాడు తమ్ముడు.

"ఇదిగో! ఈ బాణాన్ని క్రోధంతో విడిచానంటేనా .... ఇక జగత్తులో రాక్షసులే లేకుండా చేసేస్తాను. బహు సుందరమైన పిరుదులు గల నా సీతని నాకు తెచ్చివ్వక పోతేనా .... ఈ లోకాలకు నాధుడెవరో గానీ...." – ఆ కోపంలో లోకాలకు నాధుడు తనేనని మర్చిపోయాడు రాముడు. "నా సీతని నాకు తెచ్చి ఇవ్వకపోతే ఈ లోక నాధుడు నా పరాక్రమం చవిచూస్తాడు. దేవతలు నా శౌర్య ధైర్యాలు గ్రహించ లేకుండా ఉన్నారు. శ్రీరామ చంద్రుడంటే ఏమిటో అనుకుంటున్నారు. మృత్యువునీ, విధినీ, ఎలాగైతే తప్పించుకోలేరో అలాగే నా క్రోధాగ్నిని కూడా తప్పించుకోలేరు. ఈ లోకాధిపతులు, రాక్షసులు తినేసిన నా సీతని నాకు వెంటనే తెచ్చి ఇవ్వకపోతే లోకా లన్నిటినీ అస్తవ్యస్తం చేసేస్తాను. చరాచరా లన్నింటినీ నిర్జీవం చేసేస్తాను. జగాలన్నీ ముక్క ముక్కలై, తునా తునకలై, దుమ్ములో, ధూళిలో కలిసి పోతాయి లక్ష్మణా! కాచుకోమను! ... సర్వ భూతాల్నీ కాచుకోమను! .... నా బాణాఘాతంతో...."[219]

"బుద్ధి వున్న వాగుడేనా?" అనేసింది లక్ష్మణుడి ఇంగితం. లక్ష్మణుడు హడలిపోయి దిక్కులు చూశాడు. "నోటి కెంతవస్తే అంత మాటే!" అన్నాడు కోపంగా ఇంగితంతో – "నోటి దురుసు తగ్గాలి నీకు. ఆయన హృదయం ఎంత బాధపడుతోందో నీకేం తెలుస్తుంది? ఆయనేం తెలివి తక్కువ వాడనుకున్నావా? ఎన్ని శాస్త్రాలో చదివిన వాడు. ఎన్ని ధర్మాలో తెలిసిన వాడు. ఆయన్ని తప్పు పట్టేటంత దానివా? కాస్త నోరు సంబా ళించుకుని మాట్లాడు" అంటూ గబగబా చివాట్లేశాడు ఇంగితాన్ని.

ఇంగితం, కొంచెం తప్పయిపోయినట్టు, "మరి, తొందరగా వెతకడేం? అందుకని అన్నానూ" అని సిగ్గు పడి నసుగుతూ చెప్పుకుంది.

"వెతుక్కుంటాడు. ఎందుకు వెతుక్కోడూ? .... వెతుక్కోక? .... ఆయనే వెతుక్కుంటాడు. వెతుక్కోడా?" అని తనకి తను నచ్చచెప్పుకుంటూ రాముడి మొహం ఎగా దిగా చూస్తూ నిలబడ్డాడు లక్ష్మణుడు.

"లక్ష్మణా! చూస్తావేమోయీ! సూర్య చంద్రులకు చెప్పు! కాచుకోమను! ఈ బాణం విడిచానంటేనా ...."

రాముడు, బాణం వదిలే వ్యవహారం లక్ష్మణుడికేం కనపడ లేదు.

కొత్తగా ప్రేమలోపడ్డ ఒక ఆడ జింక, ప్రియుణ్ణి బేలగా చూస్తూ "రాముడు లోకాలన్నీ ధ్వంసం చేసే స్తానంటున్నాడే! మనం విడిపోతామా ప్రియుడా!" అని భయంగా అడిగింది.

మొగ జింక దర్పంగా చూస్తూ "చెయ్యనీ! ధ్వంసం చెయ్యనీ! సూర్య చంద్రుల్ని పడగొట్టనీ! ఆకాశం బద్దలు చెయ్యనీ! .... ఎవ్వరూ మనల్ని వేరు చెయ్యలేరు. నిన్ను నేను రక్షిస్తాను ప్రేయసీ!" అని మీసం మెలేశాడు.

"ప్రియా! నువ్వు అంతటి వీరుడివే నోయీ!" అని ప్రియురాలు జింక అతణ్ణి ప్రేమ మోజులో ఆరాధనగా చూసింది.

---

**219.** **అరణ్య, సర్గ 61, శ్లోకాలు 70, 71:** రాముడు లక్ష్మణుడితో అంటున్నాడు – "లోకాధిపతులు, అపహరించబడిన సీతను, లేక చచ్చిపోయిన సీతను .... అట్టి సౌందర్యముగల నా ప్రియురాలగు సీతను, దెచ్చి ఈయక పోయినటులయితే.... చరాచరములతో గూడియుండు లోకములను ధ్వంసం చేసేస్తాను" అని. అది సరే, 'అట్టి సౌందర్యం' అంటే ఎట్టి సౌందర్యం? ఎత్తయిన పిరుదులూ, తాళ ఫలముల వంటి స్తనములూ వగైరాలు గల సౌందర్యం! ఆ సీత కొంత కాలానికి బెంగతో, భయంతో, చిక్కిపోయిందంటే, చిక్కిపోయిన సీతనిగాని తెచ్చి ఇచ్చారంటే, "అబ్బే! కుదరదు. ఎత్తయిన పిరుదులు గల సీతని తెచ్చి ఇవ్వండి! ఈ సీత, నా సీత కాదు. నా సీతకి .... తాళ ఫలముల వంటి రొమ్ములే ఉండాలి" అని పేచీ పెట్టేటట్టు వున్నాడు రాముడు. సీత చిక్కిపోకుండా వుంటేనే దేవేంద్రుడికి మాట దక్కుతుంది. ★

"లక్ష్మణా! .... ఇదుగో! బాణం విడుస్తున్నాను" అని గర్జించాడు రాముడు.

అన్నగారు కోపోద్రిక్తులయినప్పుడల్లా ఆయన్ని శాంతపరచవలసిన కర్తవ్యం తనదని తమ్ముడికి తెలుసు. వెంటనే అన్నగారి పాదాలకు నమస్కరిస్తూ స్తోత్రం ప్రారంభించాడు – "తమరు అంత పరా క్రమవంతులే. జగత్తుని తల్లక్రిందులుగా మార్చెయ్య గలరు. తమ వంటి కరుణాత్ములు, ఆత్మ నిగ్రహులు, ఇంత క్రోధం వహిం చడం తగదు. సూర్య చంద్రులకు కాంతి ఒక్కటే సుగుణం. గాలికి గమనం మాత్రమే. భూమికి క్షమ ఒక్కటే. తమకు మాత్రం సమస్త సుగుణాలూ కలిసి ఉన్నాయి. మహాత్ములయిన తమరే దుఃఖం భరించలేక పోతే ఇక సామాన్యులెంత? ప్రజలకు దుఃఖం పుట్టకతోనే సిద్ధించింది. వశిష్టుల వారి నూరుమంది పుత్రుల్నీ, విశ్వా మిత్రుల వారు ఒక్క రోజునే చంపేశారు! ఆ మహాను భావుడు దుఃఖం ఓర్చుకోలేదా? వర్షాలు కురిపించే సూర్యుడూ, ఔషధాలు పండించే చంద్రుడూ కూడా రాహువు వల్ల దుఃఖం పొందడం లేదా? మాంధాతా, నలుడూ వంటి మహానుభావులు కూడా దైవ సంకల్పం మీరలేక పోయారు గదా? దేవేంద్రుడికి కూడా సుఖ దుఃఖాలున్నాయని వింటున్నాం కదా? తమ వంటి జ్ఞానులూ, యోగులూ ఎన్నడూ దుఃఖించరు. మన కర్మ వల్లనే మనం ఫలితం పొందుతాము. పూర్వ జన్మలో మనం చేసిన పాప పుణ్యాలు 'ఇవీ' అని నిర్ధారణ చేయడానికి సాధ్యం కాదు. వాటి ఫలితాన్ని ప్రత్యక్షంగా చూడటానికి సాధ్యం కాదు. వాటిని సుఖ దుఃఖాల రూపంలో అనుభవించక తప్పదు.[220] ఈ సత్యాలన్నీ నావంటి అల్పులకు తమరు బోధించినవే గదా?"

రాముడి మొహం వికసించడం ప్రారంభించింది.

లక్ష్మణుడు మాటలాడుతూ పరధ్యానంగా వాళ్ళోకి తీసుకున్న చేతుల్ని మళ్ళీ చప్పున రాముడి పాదాల మీద పెడుతూ తల వొంచి స్తోత్రం మళ్ళీ మొదలుపెట్టాడు. "కోసల మహారాజా! రాజులు అపరాధం చేసిన వార్ని శిక్షించవలసిందే, దండించవలసిందే. సమస్త లోకాలకూ శిక్షకులూ, రక్షకులూ కూడా తమరే. కానీ ఒక దుర్మా ర్గుడి అపరాధానికి లోకాలన్నిటినీ సర్వ నాశనం చేయడం ధర్మం కాదు గదా? ముఖ్యంగా దేవతల్నీ, బ్రాహ్మణుల్నీ చంపకూడదు గదా? శ్రీరామచంద్రుడి భార్యకు ఆపద సంభవించినందుకు లోకంలో ఎవరు మాత్రం సంతోషిస్తారు? తమ పరాక్రమం అంతా శతృవుల మీద మాత్రమే ప్రయోగించాలి. కొంత కాలం వేచి చూడమని ప్రార్థిస్తున్నాను. తమ సద్గుణాల చేతా, సాధు వాదము చేతా కూడా వదిన గార్ని పొందలేకపోతే .... అప్పుడు తమరు లోకాలన్నీ సర్వ నాశనం చేసెయ్య వచ్చును. సూర్య చంద్రుల్ని పడగొట్టి .... పర్వతాల్ని విడగొట్టి ... సముద్రాల్ని ఇంకించి .... అప్పుడు, అప్పుడు, తప్పకుండా తమరు తలపెట్టిన కార్యం ముగించవచ్చును" అంటూ లక్ష్మణుడు వినయంతో అన్నగారి పాదాలు నిమిరి అప్పటికి వందోసారి నమ స్కారం చేశాడు.

లక్ష్మణుడి మాటలు గొప్పగా నచ్చాయి రాముడికి – ప్రస్తుతానికి సూర్య చంద్రుల్ని పడగొట్టి, సముద్రాల్ని ఇంకించి, లోకాలన్నీ సర్వనాశనం చేసే బెడద తప్పించి నందుకు! ఏదో ఉద్రేకంలో అనేశాడేగానీ తీరా బాణం వదిలితే అది ఏ మిడతనో, ఉడతనో చావగొట్టి, ఏ చెట్టు కొమ్మల్లోనో చిక్కడి ఊరుకుంటే? పూర్వం బాణాలు వేసినప్పుడు చాలా సార్లు అలాగే జరిగింది, కానీ, .... ఇంత తొందరగా విరమించడమేనా? .... ఇంత భీకరత్వమూ చాలించడమేనా? .... కుదరదు! కుదరదు!

"లక్ష్మణా! నీ మాటలు ధర్మబద్ధంగానే ఉన్నాయి. కానీ ఉదయించే సూర్యుడు, చల్లని చంద్ర కాంతిని ధిక్కరించే విధంగా, నా క్రోధం వృద్ధి పొందుతూ, నా మనసు, నా సహజ స్వభావాన్నీ, మెత్తని గుణాల్నీ విడిచి పెడుతోందోయ్! ఈ లోకాలకు నా పరా క్రమం చవి చూపక తప్పదు సుమా! ఇదిగో, బాణం .... చెవి వరకూ లాగి .... విడిచానంటే ...."

"శాంతించండి! శాంతించండి ప్రభూ! .... కరు ణించండి! లోకాలన్నింటినీ సర్వనాశనం చేసే రామ

**220.** **అరణ్య, సర్గ 66, శ్లోకాలు 7, 16:** లక్ష్మణుడు, రాముడి స్తోత్రం కూడా చేస్తూ వుంటాడు. "ఈ దుఃఖ సంబంధము జనులకు పుట్టుక చేతనే కలిగినది. ప్రత్యక్షముగా జూచుటకు సాధ్యముగానటువంటి, సుఖ దుఃఖ రూపముగనుండు నటువంటి, పూర్వజన్మలో నిట్టి కార్యములు చేసినటుల నిర్ధారణ జేయుటకు సాధ్యము గానటువంటి, అట్టి కర్మములు చేయక, ఇట్టి సుఖ దుఃఖ రూపమగు ఫలము గలుగదు." – ఈ ప్రకారం, కష్టాలూ, బాధలూ కిందటి జన్మలోంచి వస్తాయి మనుషులకు. 'ఫలానా తప్పు చేశాం' అని స్పష్టంగా తెలీదు. ఫలితాలు సుఖ దుఃఖాల రూపంలో ఉంటాయి. అంటే మనకు బాగా డబ్బు వుండి, సుఖంగా వుంటే – "ఓహో, గతంలో చాలా పుణ్యం చేశాం" అనుకోవాలి. డబ్బు లేక, కూడు లేక, గూడు లేక, ఆరోగ్యం లేక అలాంటి వాళ్ళు కనబడితే "వాళ్ళు పాపం చేశారు" అనుకోవాలి. వాళ్ళు కూడా "మేం పాపం చేశాం" అని తెలుసుకోవాలి. – ఈ రకంగా, రాముల వారి గాథ, మానవులకు జ్ఞాన బోధ చేస్తోంది. ఎవరికయినా ఆకలి తీరక ఏడుపొస్తే "అలనాడు శ్రీరామచంద్రుడే కష్టాలు పడలేదా?" అని గుర్తు చేసుకుని, వారి కథ చెప్పుకుని, కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకోవాలి. ★

బాణాన్ని ఉపసంహరించండి! ఇంద్రుడు సీతాదేవిని తెచ్చి మీ పాదాల ముందు సమర్పించకపోతే అప్పుడు .... తప్పకుండా మీరన్నట్టే .... ఇప్పుడు .... శాంతించండి ప్రభూ!" లక్ష్మణుడు గజ గజ వణుకుతూ ప్రార్థించాడు. అలా వొణికితే అన్నగారు సంతోషిస్తాడని తమ్ముడికి తెలుసు.

రాముడు గంభీరంగా తల పంకించి, విల్లు దించాడు. లక్ష్మణుడి విన్నపం మన్నించి మాత్రమే శాంతించినట్టు, రౌద్రంగా చూశాడు. "నువ్వు చెప్పింది ధర్మమే లక్ష్మణా! నా కార్యం ఉపసంహరించాను. ఇక భయపడకు" అని చుట్టూ చూసి – "ఇప్పుడు మన కర్తవ్యమేమిటి? సీతనెట్లా చూడగలం? ఆలోచించు!" అని ఆలోచించమని ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు ఇకనయినా వదినగార్ని వెతక వచ్చుననే సంతోషంతో తన ఆలోచన చెప్పాడు. "ఈ స్థలమంతా రక్తంతో తడిసి, నలిగి వుంది. ఎవరో ఇక్కడ యుద్ధం చేశారు. ఈ మార్గం వెంట శీఘ్రంగా వెతుకుతూపోదాం. వదినగారు కనబడవచ్చును అని నా విశ్వాసం."

రాముడు, సీత జాడ చెప్పని చెట్లమీదా, కొండల మీదా కోపంతో భీకరంగా అడుగులు వేస్తోంటే, పది అడుగులయినా సాగలేదు. ఆ సమీపంలోనే రెక్కలు తెగి, పర్వతం లాగ పడి వున్న జటాయువు, రక్తం మడుగులో కంటపడ్డాడు.

రాముడు జటాయువుని రౌద్రంగా చూశాడు – "లక్ష్మణా! వీడే సీతని తినేసి ఉంటాడు. సందేహం లేదు. వీడు రాక్షసుడే. కమ్మగా సీతని తిని ఆదమరిచి నిద్ర పోతున్నాడు. ఈ దుర్మార్గుణ్ణి ఇప్పుడే నా కరకు బాణాలతో వీరోచితంగా సంహరిస్తాను"[221] అంటూ బాణం ఎక్కుపెట్టి, జటాయువు వేపు నడిచాడు. రాముడికి చాలా సేపట్నించి బాణం వేసి ఎవరినో ఒకరిని చంపెయ్యాలని రంధిగా వుంది. ఇప్పటికి, కదలకుండా పడివున్న ప్రాణి ఒకటి దొరికింది.

జటాయువు అతి ప్రయాస మీద తల ఎత్తి రక్తాలు వోడుతూ రాముణ్ణి చూశాడు. రాముడికి సీత వార్త అందించగలననే సంతోషంతో, ప్రాణం పోక ముందే సంగతంతా చెప్పెయ్యాలని ఆతృతపడుతూ చూశాడు – "రామా! నువ్వు సీతకోసం వెతుకుతున్నావు, నాకు తెలుసు. సీతని రావణు డెత్తుకు పోయాడు. ఆ దుర్మార్గుడితో కలబడి యుద్ధం చేశాను. వాణ్ణి రథం మీదనించి కిందికి తోసి రథం ముక్కలు చేశాను. ఈ ధనుస్సూ, కవచమూ, అన్నీ వాడివే. ఆ దుష్టుడు నా రెక్కలూ, కాళ్ళూ కత్తితో నరికి తప్పించుకున్నాడు నాయనా! రావణుడే నన్ను చంపేశాడు. నువ్వు కూడా నన్ను చంపుతావా?" అని దీనంగా చూశాడు.

రాముడు, జటాయువు మాటలు వింటూ నిర్ఘాంత పోయాడు. 'రావణుడా! రాక్షస రాజు! .... పర పురుషుడు! .... ఎందుకు ఎత్తుకుపోయాడు సీతని? .... పురుషులు పర స్త్రీలను ఇంకెందుకు ఎత్తుకుపోతారు? .... స్త్రీ లోలత్వం! .... కాముకత్వం! .... సీతని .... పర పురుషుడు .... కాముకుడు ....' రాముడు, గిర్రున తల తిరిగి విల్లు జారవిడిచి మూర్ఛపోయాడు.

శాస్త్ర బద్ధమైన మూర్ఛ రెప్పపాటు కాలం కన్న ఎక్కువ సేపు పోనక్కరలేదని రాముడికి తెలుసు. మూర్ఛ లోంచి వెంటనే తేరుకున్నాడు – "రావణుడా? కాముకుడు .... పర స్త్రీ వ్యామోహితుడు .... ఎత్తుకుపోయాడా సీతని? నమ్మవచ్చునా ఈ మాటలు?" అని కేకలేస్తూ నమ్మలేనట్టు చూశాడు జటాయువుని.

అవయవాలు తెగిన జటాయువు బాధతో మూలుగుతున్నాడు.

రాముడు ఉద్వేగంతో ప్రశ్నలు మొదలుపెట్టాడు. "జటాయు పక్షీ! నా తండ్రితో సమానుడవు నువ్వు. జరిగిందంతా చెప్పు! రావణుణ్ణి నువ్వెప్పుడు చూశావు? ఎటువంటి పరాక్రమం వాడిది? ఎటుపోయాడు? ఎక్కడ నివసిస్తాడు? నేనేం చేశానని నా భార్యని తీసుకు పోయాడు? అంతాచెప్పు!" అని ఆతృతగా అడిగాడు.[222]

జటాయువు అతి కష్టంతో కళ్ళు తెరిచాడు. – "దక్షిణం వేపు వెళ్ళాడు నాయనా! .... నా శక్తి .... ఉడిగిపోతోంది. కళ్ళు .... మూతలు పడిపోతున్నాయి

---

**221.** **అరణ్య, సర్గ 67, శ్లోకం 11:** సీతని రక్షించడానికి జటాయువు ఉన్నాడన్న సంగతే గుర్తు లేదు రాముడికి. అతను కనపడగానే, ఇంతసేపూ అతన్ని అడక్కుండానే దుఃఖిస్తున్నందుకు దుఃఖించక, అతను జటాయువే కాదని అనుమానం! 'అసలు జటాయువు ఏమయ్యాడు?' అనే ప్రశ్నే రాదు. ★

**222.** **అరణ్య, సర్గ 68, శ్లోకాలు 5, 7:** రాముడు జటాయువుని అడుగుతున్నాడు – "నేను చేసిన ఎట్టి అపరాధమును జూసి రావణుడు సీత నెందుకపహరించెను?" అని. రావణుడు రాక్షస రాజని తెలుసు. తనకూ రాక్షసులకూ శత్రుత్వం సాగుతోందనీ తెలుసు. ఏమీ ఎరగనట్టు అమాయకంగా "నేనేం చేశాననీ?" అని అడుగుతున్నాడు. శూర్పణఖ రాముడితో మాట్లాడినప్పుడు, 'రావణుడు రాక్షస రాజు' అనీ, 'విశ్రవసు కొడుకు' అనీ, తన అన్న అనీ .... అన్ని వివరాలూ చెప్పింది. "రావణుడెక్కడ నివసిస్తాడు?" అని అడుగుతున్నాడు రాముడు. రావణుడి దేశం ఏదో తెలియకుండానే ఇంత కాలం నించీ 'రావణ వధ.... రావణ వధ' అని హోరు పెడుతున్నారా రుషులంతా? ★

.... దుఃఖపడకు .... నీ భార్య నీకు దక్కుతుంది. రావణుడు, విందముహూర్తంలో సీతని ఎత్తుకుపోయాడు. ఆ ముహూర్త బలాన్ని బట్టి చూస్తే, పోయిన వస్తువు యజమానికి తొందరగానే దొరుకుతుంది. రావణుడా సంగతి గుర్తించలేదు. సీత, వాడి దగ్గర ఎంతో కాలం నిలవదు. విచారించకు నాయనా![223] రావణుడు నశించిపోతాడు. నీ భార్యతో నువ్వు .... సుఖంగా ఉంటావు."

రాముడు మళ్ళీ ఆతృతగా అడిగాడు – "రథం ఇక్కడే విరిగిపడిందే! వాడు సీతనెలా తీసుకు పోయాడు? తొందరగా చెప్పు! చెప్పకుండా చచ్చిపోకు సుమా!"

"‥‥ బాహువుల్లో అదిమిపట్టి! శరీరానికి హత్తుకుని .... నడుం చుట్టూ చెయ్యివేసి .... ఎగురుతూ .... ఒళ్ళో తొడమీద కూర్చోబెట్టుకుని .... ఎగురుతూ ...."

మూర్ఛిల్లాడు రాముడు గి(రున తల తిరిగి. చప్పున లేచి – "ఏదీ? ఎలా పట్టుకున్నాడూ? మళ్ళీ చెప్పు తండ్రీ! తొందరగా చెప్పు ...."

"నడుం చుట్టూ చెయ్యి .... ఒళ్ళో .... తొడమీద కూర్చో ...."

మూర్ఛగిల్లాడు రాముడు మళ్ళీ గి(రున తల తిరిగి.

జటాయువు మీద రాముడికి పట్టరాని కోపం వచ్చింది – రావణుడి రథం విరగ్గొట్టినందుకు. ఆ రథమే వుంటే సీతని అందులోనే కూర్చోబెట్టే వాడు కదా? సీత, ఆ దుష్టుడికి దూరంగా కూర్చునేది కదా? రథాన్ని విరగ్గొట్టడం ఎందుకూ?

"తండ్రీ! రథంలో సీత ఎక్కడ కూర్చుంది మొదట?"

"‥‥ రావణుడి తొడ మీదే .... సీతని అసలు వొదిలాడా?"

" ఆఁ ...." – మళ్ళీ గి(రున తల తిప్పు! మూర్ఛ .... ధర్మబద్ధంగా!

రాముడి ఆవేశం అంతా సీతవేపు తిరిగింది. ఇంత సేపూ, సీతని క్రూర మృగాలు తినేశాయనీ, రాక్షసులు చంపేశారనీ, ఎంతో దయతో దుఃఖపడ్డాడు గానీ .... తీరా చేస్తే, పర పురుషుడు .... అందునా రావణుడు .... బహు కాముకుడు .... శరీరానికి అదిమిపట్టి .... హు! అసలు రావొద్దంటే విన్నదా? పురుషులతో సమానంగా .... అడవులలో రాచ స్త్రీ ....! అంతః పురాలలో ఎంత రక్షణ! .... విన్నదా రావొద్దంటే? ఎంత చెప్పాడు తను!

"తండ్రీ, తొందరగా చెప్పు! .... సీత ఏం చేస్తోంది? ఆమె మొహం ఏ విధంగా ఉంది? మిక్కిలి దుఃఖిస్తోంది గదా? భయపడుతోంది గదా? .... ఊఁ .... తొందరగా .... చెప్పకుండా చచ్చిపోతావా యేమిటి?"

జటాయువు ప్రాణాలు, మరణ వేదనతో సంకట పడుతున్నాయి.

"చెప్పు .... చెప్పు .... తొందరగా చెప్పు! .... సీత ముఖం ఎలా ఉంది?"[224]

జటాయువు కళ్ళు విప్పలేక పోతున్నాడు.

రాముడు, తన కష్టాలకు శోకించడం మొదలు పెట్టాడు. "అయ్యో! నా వంటి దురదృష్టవంతుడుంటాడా? ఎన్ని కష్టాల పాలైనానో గదా! రాజ్యం పోయింది. తండ్రి పోయాడు. భార్య పోయింది. ఇప్పుడీ జటాయువు కూడా పోయినట్టే. ఇంత దుఃఖానికి అగ్ని కూడా దహించుకు పోతాదే!" అని అగ్ని కష్టానికి దుఃఖించాడు కొంతసేపు. చప్పున వియోగ శృంగారం గుర్తొచ్చింది.

"లక్ష్మణా! నాకూ సీతకూ వియోగం సంభవించింది .... ఈ వియోగ తాపం చల్లారడానికి సముద్రంలో మునుగుతాను. ఈ వేడికి అది కూడా ఆవిరి అయిపోతుందేమో! అయ్యో!" అని సముద్రం కష్టానికి దుఃఖించాడు మరి కొంతసేపు.

మరణ వేదన పడుతూవున్న జటాయువు తల వాల్చేసి కాళ్ళు సారించాడు.

రాముడికి దుఃఖం మిక్కుటమైపోయింది. "లక్ష్మణా! జటాయువు మన తండ్రి వంటివాడే సుమా! ఈ అరణ్యంలో బహుకాలం జీవించి నా కోసమే ప్రాణాలు విడిచాడు. అయ్యో! సీత పోయినా నాకింత దుఃఖం కలగలేదే! నాయనా! .... చితి పేర్చే ప్రయత్నాలు చెయ్యి. నేను అగ్ని సంస్కారం చేస్తాను. దుఃఖంతో నా హృదయం తల్లడిల్లిపోతోంది" అని దుఃఖిస్తూ కూర్చున్నాడు.

లక్ష్మణుడు చప్పున కదిలి ఎండు కర్రలు కుప్ప వెయ్యడం ప్రారంభించాడు

రాముడి మనస్సంతా రావణుడి బాహువుల్లో వున్న సీతని తల్చుకుంటూ భగ భగ మండుతోంది. 'అసలు రావొద్దంటే విన్నదా? ఆశ్రమంలో లక్ష్మణుణ్ణి కాపలా

---

**223.** **అరణ్య, సర్గ 68, శ్లోకం 12:** రాముడు సీతని మళ్ళీ తెచ్చుకోగలిగితే అది ఆ 'విందముహూర్తం' గొప్పే గానీ, రాముడి గొప్పేమీ కాదన్నమాట! విందముహూర్తంలో పోయినట్టయితే, ఆ వస్తువు ఎలాగూ దొరకవలసిందే కదా? ★

**224.** **అరణ్య, సర్గ 68, శ్లోకాలు 6, 18:** "రావణుడపహరించుకు పోవునపుడు చంద్రునితో సమమై మనోహరముగనుండు సీత ముఖ మెటులుండెను?" అంజలి జేసికొని "చెప్పుము, చెప్పుము" అని శ్రీరాముడు అడుగుచుండగా, జటాయువు ప్రాణములు శరీరము విడిచిపోయెను. సీత చాలా దుఃఖిస్తూ ఉంటుందనే రాముడనుకోవాలి కదా? 'సీత ఎలా ఉంది?' అనే సందేహం ఎందుకు? దుఃఖిస్తోందో లేదోనని అనుమానం అన్నమాట! ★

పెడితే ఉండనిచ్చిందా? ఆ దుర్మార్గుడు ఆశ్రమంలో జొరబడి సీతని బలాత్కారంగా ఎత్తుకుపోయి ఉంటాడా? మహా పతివ్రతే కదా? నిగ్రహించ వచ్చునే! కంటి చూపుతో ఆ నీచుణ్ణి దగ్ధం చెయ్య వచ్చునే! .... ఇష్టపడే వెళ్ళలేదు కదా?'

ఉలిక్కిపడ్డాడు రాముడు – ఏమిటీ ఆలోచనలు? .... మహా పతివ్రత సీత! పర పురుషుణ్ణి కోరుతుందా? .... ఏమిటీ సందేహం?

"అన్నగారూ! కాష్టం సిద్ధం చేశాను."

"అయ్యో! .... తండ్రీ! .... అయ్యో! ...." అంటూ లేచాడు రాముడు, ఉత్సాహంగా శాస్త్రకర్మ నిర్వహించ డానికి.

జటాయువు చుట్టూ ఎండు కర్రలూ, కంపలూ పేర్చి గుట్ట చేశాడు లక్ష్మణుడు. నిప్పు రాజేసి ఉంచాడు. రాముడు వల వలా ఏడుస్తూ ఆ గుట్టకి నిప్పు అంటిం చాడు. "పక్షి రాజా! నేను నీకు అగ్ని సంస్కారం చేస్తు న్నాను. యజ్ఞ యాగాలూ, దాన ధర్మాలూ, తపస్సులూ చేసే పుణ్యాత్ములకు లభించే ఉత్తమ లోకాలన్నీ, శ్రీరాముడు సంస్కారం చేయడం చేత నీకు కూడా లభి స్తాయి. నిన్ను పుణ్య లోకాలకు పొమ్మని నేను ఆజ్ఞాపిస్తు న్నాను" అంటూ దుఃఖించాడు.[225]

తర్వాత రాముడూ లక్ష్మణుడూ, విల్లులు సర్దుకుని జింకల్ని చంపి, జటాయువుకి పిండం పెట్టడానికి మాంసం సిద్ధం చేశారు.

మరణించిన వారి ఆత్మలు స్వర్గానికి పోవడానికి బ్రాహ్మణులు ఎటువంటి మంత్రాలు చదువుతారో, అవన్నీ చదువుతూ రాముడు పిండ ప్రదానం చేశాడు. గోదావరిలో జల తర్పణాలు విడిచారు. శాస్త్ర విధులు నిర్వర్తించినంత సేపూ రాముడు దుఃఖమంతా మరిచి పోయాడు.

ఆ కార్యక్రమం అంతా ముగిసింతర్వాత లక్ష్మణుడు "అన్నగారూ! ఏమి శెలవు?" అని అడిగాడు.

రాముడు చుట్టూ దిక్కులు చూశాడు. ఏమి శెల వివ్వాలో ఏమీ తోచలేదు.

రావణుడు, సీతని ఎత్తుకుని, రాముడి మనసంతా ఎగురుతున్నాడు.

రావణుడితో వైరం .... ఇంత కాలానికి!

రావణ వధ .... రావణ వధ .... అని చిన్న తనం నించీ కలలు కంటున్నాడు. రాక్షసులందర్నీ చంపుతానని ఋషులకు ఏనాడో పదీ పన్నెండు సంవత్సరాల కిందట మాట ఇచ్చాడేగానీ ఇప్పుడు యుద్ధం .... రావణుడితో! .... ఎంత సైన్యం కావాలి! తనొక్కడూ .... ఈ లక్ష్మణుడూ! .... ఋషులంతా సైన్యంలో కలిస్తే ....? రావణ రాజ్యాన్ని జయిస్తే ....? ఆ దుర్మార్గుణ్ణి రామ బాణంతో సంహరిస్తే?

సీతని, పర పురుషుడు ఎత్తుకు పోయాడంటే ఎంత అప కీర్తి! .... లోకం హర్షిస్తుందా? .... సీత శీలం? లోకం విశ్వసిస్తుందా? హూ .... రావొద్దంటే విన్నదా?

రాముడు ఆలోచనలతో సతమతమౌతున్నాడు. లక్ష్మణుడి కేమీ సెలవివ్వలేదు. తల పంకిస్తూ, అంగ లతో ముందుకు సాగాడు. వెనకాల లక్ష్మణుడు! పంగలతో! ★

---

**225.** **అరణ్య, సర్గ 87, శ్లోకాలు 30, 31:** "నాచే సంస్కరించబడిన వాడవై, నా యాజ్ఞచే సర్వోత్తమమగు లోకములకు బొమ్ము" అంటున్నాడు రాముడు. తనేమో ఎన్నో పాపాలు చేసుకుని కష్టాలనుభవిస్తున్నానని వాపోతాడు. అలాంటి తను, ఇతర్లని ఉత్తమ లోకాలకు పంపిస్తాడు! అంతా తిరకాసు వ్యవహారం, లక్ష్మణుడి ఇంగితం అన్నట్టు! ★

# లింకు-5

# 5వ కథ తర్వాత 6వ కథ వరకూ

[5వ కథ – సీతని, రావణుడు ఎత్తుకు పోయాడన్న విషయం రాముడికి చెప్పి జటాయువు కన్ను మూయడంతో ముగిసింది. 6వ కథ శ్రీరాముడి మన్మధావస్థని శాస్త్రోక్తంగా వర్ణించడంతో

ప్రారంభమవుతుంది. ఈ 2 కథలకూ మధ్య వున్న కథా భాగం ఇది.]

జటాయువుకి కర్మకాండలు చేసి రాముడు, లక్ష్మణుడు ముందు నడుస్తోండగా, పడమర దిక్కుగా సీతను వెతుకుతూ బయల్దేరాడు. (రావణుడు పోయింది దక్షిణం వేపు అయితే, వెతకడం పడమర వేపు!)

మహా వృక్షాలతో, వెదురు పొదలతో, మిట్ట పల్లాలతో, ఏనుగులతో సింహాలతో నిండివున్న కీకా రణ్యంలో మూడు క్రోసులు నడిచి (జనస్థానం నించి 6 మైళ్ళు), దండకారణ్యం దాటి క్రౌంచారణ్యంలో ప్రవేశించారు. క్రూర మృగాలతో, సర్పాలతో నిండిన ఆ వనం కూడా దాటి మతంగ ముని ఆశ్రమ ప్రాంతంలో ఒక చోట చిమ్మచీకటిగా ఉన్న పాతాళ గుహ చూశారు. ఆ గుహ దగ్గిర ఒక భయంకరమైన రాక్షసి కనిపించింది. ఆమెకు పెద్ద పొట్ట, కోర పళ్ళు, వంకర చూపు, మందపాటి చర్మం, చింపిరి దుబ్బు జుట్టు, వికారమైన మొహం .... వేయేల? సమస్తమైన రాక్షస లక్షణాలూ ఉన్నాయి.

ఆమె, ముందుగా కనిపించిన లక్ష్మణుణ్ణి చూసి దగ్గిరికి వస్తూ "రమ్ము, సుఖించుదాము" అంటూ ఆలింగనం చేసుకుంది – "వీరుడా! నా పేరు అయో ముఖి. నీవు నాకు నచ్చావు. ఈ వనమంతా కలిసి విహరించుదాం!" అంది.

లక్ష్మణుడు కుపితుడై సర్రున కత్తి తీసి అయో ముఖి ముక్కూ చెవులూ, స్తనాలూ కోసేశాడు. (అన్నగారి ఆజ్ఞ లేకుండానే!)

అయోముఖి ఏడుస్తూ పారిపోయింది.

లక్ష్మణుడూ, రాముడూ ముందుకు పోతూ వున్నారు. లక్ష్మణుడు సందేహిస్తూ "శ్రీరామా! నా ఎడమ భుజం అదురుతోంది. అపశకునాలు తోస్తున్నాయి. (చిత్రం! రాముడి భుజం అదరడం లేదు!) వంజుళక పక్షి మనకు జయం కోరినట్టు కూస్తోంది" అన్నాడు (శుభా శుభాల ఐక్యం.)

అంతలో ఆకాశం విరిగి పడిపోయినట్టు ఫెళ్ళున చప్పుడైంది. పొదల్లో పెద్ద పర్వతం లాగ కూర్చున్న రాక్షసుణ్ణి చూశారు. వాడికి తల లేదు, కాళ్ళు లేవు. మొహం పొట్టలో వుంది. కన్ను రొమ్ము మీద ఉంది. నల్లగా కాటుక కొండలాగ ఉన్నాడు వొత్తు జుట్టుతో. కోర పళ్ళు కత్తుల్లా ఉన్నాయి. ఆ వొక్క కన్నూ నిప్పు గుండంలా మెరుస్తోంది. చేతులు పొడుగ్గా యోజనం దూరం ఉన్నాయి.[226]

ఆ చేతుల్తో పక్షుల్నీ, జింకల్నీ, ఎలుగుబంట్లనీ, ఏనుగుల్నీ, సింహాల్నీ దగ్గిరికి లాక్కుంటున్నాడు. (పాపం జంతువుల్ని లాక్కోడంలో, పక్ష పాతం లేదు.) అతడి పేరు కబంధుడు.

లక్ష్మణుడూ, రాముడూ, కబంధుణ్ణి చూసేటప్పటికే కబంధుడు ఇద్దర్నీ పట్టేసి దగ్గిరికి లాక్కున్నాడు. (తినికే నక్కమీద తాటి కాయ పడ్డట్టు, ఇదో కొత్త కష్టమా! రాముడు మళ్ళీ కైకని తిడతాడు కాబోలు!)

రాముడు భయపడలేదు. (ఎంత అబద్ధమో!) లక్ష్మణుడు భయపడుతూ (ఇంకెంత అబద్ధమో!) "శ్రీరామచంద్రా! కబంధుడికి నన్ను ఇచ్చి నువ్వు తప్పించుకు పో! త్వరలోనే నీ భార్య నీకు లభిస్తుంది. పిత్రార్జితమైన రాజ్యమూ దక్కుతుంది. నన్ను మాత్రం మర్చిపోకు" అన్నాడు.

"వీరుడా! భయపడకు!" అని ధైర్యం చెప్పాడు రాముడు. (అంతకు ముందు లక్ష్మణుడు తనకు ధైర్యం చెప్పాడు కాబట్టి, ఇప్పుడు తను లక్ష్మణుడికి ధైర్యం చెప్పి అప్పు తీర్చేస్తాడు కాబోలు!)

కబంధుడు మేఘం ఉరిమినట్టు నెమ్మదిగా నవ్వుతూ, "భలే ఉన్నారే బలిసీ! ఎద్దుల్లా ఉన్నారే! (వృషభాలని కబంధుడన్నాడు. వృషభాలంటే ఎద్దులే మరీ!) ఓహో! కత్తులూ బాణాలూ కూడా ఉన్నాయే! ఈ అరణ్యంలో పనేమిటి మీకు? ఇటొచ్చారేం? .... సరేలెండి. నాకు ఆకలి దహిస్తోంది" అంటూ, ఇద్దర్నీ పరికించి చూశాడు. (రాముడి పొట్ట నిగ నిగలూ, కొవ్వుబట్టిన భుజాల తళ తళలూ, బలిసిన పిరుదుల మిస మిసలూ – అన్నీ చూసి, ముందు బూరిని కొరికినట్టు రాముడి పొట్ట కొరకాలని సరదా పడి వుంటాడు). "మీరిక నా చేతుల్లోంచి తప్పించుకో లేరు" అన్నాడు ముసి ముసి నవ్వుల్తో.

రాముడి మొహం వెల వెల బోయింది.[227] "సత్య

**226.** "'యోజనం' అన్నా, 'ఆమడ' అన్నా వొకటే (8 మైళ్ళు)" – అన్నారు కొందరు. "ఒకటి కాదు, యోజనం యోజనమే; ఆమడ ఆమడే" అన్నారు ఇంకొందరు. "యోజనానికి 800 మైళ్ళు" అన్నారు మరి కొందరు. ఇది మనకి తెలిసే వ్యవహారం కాదు లెమ్మని యోజనానికి ఎన్ని మైళ్ళో చెప్పే పని మానుకున్నాను. ★

**227.** **అరణ్య, సర్గ 69, శ్లోకం 47:** "దురాత్ముడగు కబంధుని మాట విని శ్రీరాముడు వాడిన ముఖము గలవాడై లక్ష్మణునితో నిటులనెను." – 'వాడిన మొహం' ఎందుకు వీరుడికి? తెచ్చి పెట్టుకున్న ధైర్యం ఎంతసేపు వుంటుంది చెప్పండి? ఈ కథలో మొట్టమొదట, వాల్మీకి ముని, నారద మునిని 'ఈ లోకంలో గొప్ప పురుషుడెవడైనా వున్నాడా?' అని అడిగినప్పుడు, నారద ముని, రాముణ్ణి గురించి చేసిన వర్ణనలో, 'ఎన్నడూ అధైర్యపడని వాడు' అని కూడా చెపుతాడు. కానీ, కథలో మాత్రం అది తారుమారవుతూ వుంటుంది. రాముడి ప్రవర్తనలో ఎన్నడూ ధైర్యం కనపడదు. ★

మైన పరాక్రమం గల లక్ష్మణా! (సత్యమైన పరాక్రమం లక్ష్మణుడిదేనని ఒప్పుకుంటున్నాడు) అన్ని దుఃఖాలతో పాటు ఈ ప్రాణ హాని కూడానా? అయ్యో! జీవులన్నీ కాలానికి కట్టుబడవలసిందే గదా? మృత్యువును ప్రసాదించడంలో దైవానికి తార తమ్యాలు లేవు సుమా! వీరులైనా, శూరులైనా, అస్త్ర శస్త్ర విద్యల్లో పండితులైనా, పోయే కాలం సమీపించగానే, ఇసుకతో కట్టిన వారధుల లాగ కూలిపోవలసిందే గదా? (ఇసుక వంతెన్లు! అవి కాంట్రాక్టర్లు తప్ప ఎవరు కడతారు? ఆ కాలంలో కూడానా!) లక్ష్మణా, అంతా విధి వశమోయి!" అంటూ నిట్టూర్చాడు.

కబంధుడికి సరదాగా వుంది. చేతిలో వాళ్ళని నోట్లో పెట్టుకోకుండా వాళ్ళతో మాటలు మొదలు పెట్టాడు. (కొంచెంసేపు ఏడిపించి తినొచ్చులే అనా?) నవ్వుతూ – "భయంగా ఉందా? మరి వీరులు గదా మీరు? విధీ .... దైవమూ .... అంటూన్నారే! మిమ్మల్ని నాకా దైవమే ఇచ్చాడు అనుకోండీ. విధి ప్రసాదమే ఇది. తెలుసా?" అన్నాడు. (మా బాగా అన్నావు కబంధుడా!)[228]

లక్ష్మణుడు తొందరగా తేరుకుని ధైర్యం తెచ్చుకున్నాడు – "శ్రీరామా! రాక్షసుడు మనల్ని రెప్ప పాటులో తినెయ్యబోతున్నాడు సుమా! తొందరగా వీడి చేతులు నరికేద్దాం" అని కర్తవ్య బోధ చేశాడు శ్రీరాముడికి.

"ఏమిటీ, నా చేతులు నరుకుతారా?" అని కబంధుడు మండిపడుతూ ఇద్దర్నీ నోట్లో పెట్టుకోబోయాడు. (ఈ పని ఎప్పుడో చెయ్యవలసింది కదా కబంధుడా?)

అతని చేతులు రెండూ తెగిపడ్డాయి. (అరరే, చూశావా? ఆలశ్యం చేస్తే ఏమవుతుంది మరి?)

రాక్షసుడు పెడబొబ్బలు పెట్టాడు. ఆ బొబ్బల మధ్యే "మీ రెవరు?" అని ఇంకో బొబ్బ పెట్టాడు.

లక్ష్మణుడు నిదానంగా, అన్నగార్ని చూపిస్తూ – "ఈ మహానుభావుడు దశరథ మహారాజు పుత్రుడు. (తను కాదూ?) నేను ఈ మహానుభావుడి తమ్ముడిని. (చిన్న మహాను భావుడిని!) ఈ మహానుభావుడి భార్యను ఒక రాక్షస మహాను... కాదు, కాదు, రాక్షసు డెత్తుకు పోయాడు. మేము ఆ ఉత్తమురాలిని వెదుకుతూ ఇటు వొచ్చాం. (నువ్వు మా పని పట్టించావు) నీ సంగతి చెప్పు. నువ్వెవడివి? ఈ పొట్టలో మొహం ఏమిటి? (నీ మొహంలాగే ఉంది)" అని అడిగాడు. (రాముడికి మాత్రం ఇంకా నోట మాట రావటం లేనట్టుంది నోరు తెరవడేం మరీ?)

కబంధుడు చాలా సంతోషించి బొబ్బలు మానేశాడు. పై పెచ్చు – "వీరులారా! మీరు నా చేతులు నరికారు. అది నా అదృష్టం!" అని పొంగిపోయాడు. "నా కథ చెబుతాను వినండి" అని తనతో మాట్లాడుతోన్న లక్ష్మణుణ్ణి వొదిలిపెట్టి, రాముడితో మొద లెట్టాడు – "రామా! పూర్వం నేను కూడా, ఇంద్రుడి లాగ, చంద్రుడి లాగ, బహు సుందరంగా వుండేవాణ్ణి (నమ్మలేం లెద్దూ!) అంత అందమైన నేను ఈ వికార రూపం వేసుకుని రుషుల్ని భయపెడుతూ ఉండేవాణ్ణి (రుషులతో ఆటలేం సరదా? కావాలంటే సింహాలతో ఆడుకోవాలిగానీ!) 'స్థూల శిరస్సు' అనే రుషి, పళ్ళు ఏరి తెచ్చుకుంటూ ఉంటే, ఆ రుషిని జడిపించి పళ్ళు లాక్కున్నాను. (తీరా జేస్తే పళ్ళు లాక్కోడం! జడిపించడం అంటే అంతేనా?) ఆయనకు కోపం వొచ్చి – "సరే! నీకీ వికృత రూపమే శాశ్వతంగా ఉంటుందిలే" అని శపించాడు. నేను భయపడి శాప విమోచన అడిగాను. "శ్రీరాముడొచ్చి నీ భుజాలు నరికి, నిన్ను దహనం చేసినప్పుడు నీ సుందర రూపం నీకు మళ్ళీ వస్తుంది" అని తెలిపాడా రుషి. (కాలి బూడిద అయ్యాక ఇంకేం వొస్తుంది సుందర రూపం? అయినా, రాముడు, వొక్క చెయ్యే నరికాడు కదా మరి?)

కబంధుడు అంతవరకూ చెప్పి, వెంటనే ఇంకో రకం కథ చెప్పాడు – "రామా! నా తండ్రి పేరుదను. నేను గొప్ప తపస్సుచేసి బ్రహ్మ వరం వల్ల దీర్ఘాయుష్షు పొంది, మిక్కిలి గర్విస్తూ ఇంద్రుడి మీదకు యుద్ధానికి వెళ్ళాను (రాక్షసులంతా ఒక్క బళ్ళోనే చదువుతారు కావున్ను. అందరూ ఇంద్రుడి మీదకే పోతారు, ఎందుకోగానీ) ఇంద్రుడు వజ్రా యుధంతో నా నాభి కింద కొట్టాడు. నా తలా, కాళ్ళూ శరీరంలో ఇరుక్కుపోయి ముద్ద అయిపోయాను. బ్రహ్మ నాకు దీర్ఘాయుష్షు ఇచ్చినందువల్ల ఇంద్రుడు నన్ను చంపలేదు. నేను ఇంద్రుణ్ణి – 'ఇలా అయిపోయాను గదా? ఆహారం ఎలా సంపాదించుకోను? ఎక్కువ కాలం జీవించకపోతే బ్రహ్మ వరం అసత్యమై పోతుంది గదా?' అని అడిగాను. (గొప్ప తర్కం!) ఇంద్రుడు నాకు యోజనం పొడుగున్న చేతులిచ్చి, కడుపులో ఒక కన్ను కూడా ఇచ్చి, అందులో సూదుల్లాంటి పళ్ళు ఇచ్చాడు. (అబ్బ, ఇంద్రుడు చేసే పనులన్నీ ఇంతే! కడుపులో కన్నూ, కన్నులో పళ్ళూ!) శ్రీరాముడు నీ బాహువులు ఛేదించినప్పుడు స్వర్గానికి

---

**228.** అరణ్య, సర్గ 70, శ్లోకం 2: "క్షత్రియ శ్రేష్ఠులుగనుండు మీరు నన్ను జూసి భయపడవలసినది లేదు. ప్రాణములను విడువ బోవుచుండు మిమ్ము దైవమే నాకు ఆహారముగ నిచ్చెను" చూశారా? కబంధుడు తర్క పండితుడు! అవును, కబంధుడూ! వీళ్ళిద్దర్నీ నీకు దేవుడే ఇచ్చాడు. ఇద్దర్నీ తినెయ్యి! వీళ్ళు అందర్నీ చంపుతూ వుంటారు. సీత నీకు కనపడితే ఆమెని తినకూడదు సుమా! ఆమె ఎవర్నీ చంపదు. ఆమెని జాగ్రత్తగా నీ భుజం మీద కూర్చోబెట్టుకుని వాళ్ళ దేశం తీసుకుపోయి, వాళ్ళ అమ్మ దగ్గిర దించు! ★

వెళ్ళిపోతావు – అని చెప్పి తను స్వర్గానికి వెళ్ళి పోయాడు.[229] అప్పటి నించీ అన్నిటినీ లాక్కుని తింటు న్నాను. రామా! నీ కోసం ఎదురు చూస్తున్నాను (లాక్కుం దామని?)" అని రెండో కథ ముగించాడు కబంధుడు. (మీకే కథ నచ్చితే అది నచ్చుకోండి, మీ ఇష్టం.)

రెండు కథలూ ముగించి కబంధుడు రాముణ్ణి చూస్తూ – "రామా! నువ్వు నన్ను దహనం చేసిన తర్వాత, నేను నీకో ఉపకారం చేస్తాను. నీకు సహాయం చెయ్యగల మిత్రుణ్ణి చెపుతాను" అని ఆశ పెట్టాడు.

ఆ మాటలు వినగానే రాముడు – (ప్రాణం లేచి వొచ్చి) – "అలాగే దహనం చేస్తామోయీ! ఏనుగులు పడగొట్టిన ఎండు చెట్లు తెచ్చి, పెద్ద గుంట తవ్వి అందులో నిన్ను దహనం చేస్తాం సుమా! (తనేం చెట్లు తేవాలా, గుంట తవ్వాలా? మాటలు చెప్పేస్తే చాలు కదా?) నేనూ, నా తమ్ముడూ అడవిలోకి పోయినప్పుడు రావణుడు నా భార్యని ఎత్తుకు పోయాడోయీ! అతడి పేరు మాత్రమే నాకు తెలిసింది. నివాస మెక్కడో ఏమిటో, అతడి పరాక్రమం ఎలాంటిదో ఏమీ ఎరగను. కబంధుడా! నే నెప్పుడూ పరోపకారం చేసేవాడినే సుమా! ('రుషోపకారం' అంటే సబబు) ఇప్పుడు నా కెవరూ దిక్కు లేక, రక్షించే వారు లేక, దుఃఖంలో మునిగి పోయి ఉన్నాను. నన్ను నువ్వు కరుణించాలి.[230] రావ ణుడి వివరాలన్నీ నీకు తెలిస్తే చెప్పు!" అని తొందర పెట్టాడు.

కబంధుడు ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు "రామా! నాకు దివ్య జ్ఞానం ఉండేదిగానీ, ఈ శాపం తర్వాత పోయింది. దహనం చేస్తేనే గానీ, నా రూపం నాకు రాదు. నా జ్ఞానం నాకు రాదు. సూర్యా స్తమయం లోగానే నన్ను దహనం చెయ్యాలి! (లక్ష్మణుడు బంతి లాగ ఎగిరి చెట్లు ఈడవడం ప్రారంభించి ఉంటాడు.) నా జ్ఞానం నాకు వచ్చాక, రావణుణ్ణి ఎరిగిన వాణ్ణి గురించి చెప్తాను. అతడికి తెలియని విషయమే లేదు లోకంలో. (అంటే, అతడు రాముడి కన్నా పెద్ద మహాను భావు దన్నమాట! పాపం ఇంత అవమానం రాముడు కిక్కురుమనకుండా భరిస్తున్నాడు. ఇంతకీ ఎవరో ఆయన! మనం కూడా తొందరగా చెట్లు ఈడ్చి లక్ష్మణు డికి సాయం చేస్తే, ఆయనెవరో తొందరగా తెలుసు కోవచ్చు.) ఆయన రావణుడి గురించి అన్ని వివరాలూ చెప్పగలడు. మరి తొందరగా కాల్చండి నన్ను" అంటూ కబంధుడు తొందరపడి పోయాడు కాలడానికి!

లక్ష్మణుడు అప్పటికే అంతా సిద్ధం చేశాడు. పర్వతం పక్కనున్న గుంటలో కబంధుణ్ణి పడదోసి అన్న గార్ని పిల్చాడు. తర్వాత, పని ముగిసే వరకూ కాష్టం దగ్గిర నించుని కాల్చాడు.

కొంతసేపటికి చక్కగా సుందర రూపంతో లేచాడు కబంధుడు. పట్టు బట్టలూ, పూల హారాలూ ధరించి, ఉంగరాలు కూడా పెట్టుకున్నాడు. కాంతిగా ప్రకాశించే హంసల రథం మీద – (హంసలతో కూడా రథాలు లాగించుకోవాలనే బుద్ధే!) చితి లోంచి పైకి లేచాడు. ఆ రథంతో ఆకాశంలో తేలుతూ "రామా! సీత దొరికే మార్గం చెబుతానన్నాను. విను" అని ప్రారంభించాడు – "లోకంలో – సంధీ, విగ్రహం, యానం, ఆసనం, ద్వైదీ భావం, సమాశ్రయం – అని, ఆరు ఉపాయాలున్నాయి. కష్టాలలో ఉన్నవాడు కష్టాలలో ఉన్న వాడితోనే స్నేహం చెయ్యాలి. సమాశ్రమ మార్గం అనుసరించు. (సమా శ్రయం అంటే, సమమైన వాళ్ళనే ఆశ్రయించడం.) నువ్వు, భార్య పోయి దీనావస్థలో మునిగి వున్నావు. అలాగే, సుగ్రీవుడనే వానర రాజు కూడా దేశ బహి ష్కారం పొంది దురవస్థలో మునిగి వున్నాడు. సుగ్రీవుడు రుక్ష రజస్సు అనే వానరుడి కొడుకు. సూర్యుడికి ఔరస పుత్రుడు. పరాక్రమశాలి, ప్రతాపవంతుడు, సత్య వంతుడు, నీతిమంతుడు, బుద్ధిమంతుడు, ధైర్యశాలి, గొప్పవాడు, ప్రాజ్ఞుడు, సమర్థుడు (ఇన్ని గొప్పలా!) అటువంటి తమ్ముణ్ణి, ఇంద్రుడి కొడుకైన వాలి, రాజ్యం నించి వెళ్ళ గొట్టాడు, ఇప్పుడు సుగ్రీవుడు నలుగురు సహచరులతో, పంపా సరస్సు తీరంలో రుష్యమూక పర్వతం మీద భీతితో కాలం గడుపుతూ ఉన్నాడు.[231] (ధైర్యశాలి, భీతిశాలి అయిపోయాడు!)

---

**229.** అరణ్య, సర్గ 71, 7 శ్లోకాల వరకూ మొదటి కథ. తర్వాత శ్లోకం నించి రెండో కథ: రెండు కథలెలా వొచ్చాయో మనకి అనవసరం. రెంటిలోనూ శ్రీరాముణ్ణి రుషుల్నీ గొప్పచేసి, ఇంకో జాతి రాక్షసుల్ని హీనపర్చడం ఉంది. అదే ముఖ్యం. ★

**230.** అరణ్య, సర్గ 71, శ్లోకం 24: "పరోపకారం చేయుటలో నాసక్తి గల వారుగనూ, దుఖ్ఖాక్రాంతులుగనూ, రక్షకులు లేనివారుగానూ నుండి, ఈ విధముగ సీతను వెదుకుచుండు మాకు నీవే కరుణ చూపవలయును" అంటున్నాడు రాముడు కబంధుడితో. తమని రక్షించే వారు లేరట! కవులు, తమ పాత్రల్ని ఇంత అవమానం చేస్తోంటే, ఏ మనిషి ఊరుకుంటాడు, రాముడు దేవుడు కాబట్టి ఊరుకుంటాడు గానీ? ★

**231.** అరణ్య, సర్గ 72, శ్లోకం 21: "సుగ్రీవుడు, రుక్ష రజస్సు పుత్రుడు. సూర్యుని ఔరసపుత్రుడు."

**ఇదే సర్గ, శ్లోకం 11:** "ఇంద్రుని కొడుకుయునూ, సుగ్రీవుని అన్నయునూ నగు వాలి, సుగ్రీవుని, రాజ్యం నుండి వెడల గొట్టెను." ➔

రామా! సుగ్రీవుడు వానరుడని చిన్న చూపు చూడకూడదు సుమా నువ్వు! ఎందుకంటే, అతడు వానర ప్రజలకు అధిపతి. (భీతి గుడిచే అధిపతి!) సహాయం కోరుతూ ఉన్నవాడు. చేసిన మేలు మరిచే వాడు కాడు. శీఘ్రంగా పోయి సుగ్రీవుడితో, అగ్ని సాక్షిగా, ఆయుధాల సాక్షిగా, స్నేహం చేసుకో! అతడు నీ భార్యని వెతకటానికి సహాయం చేస్తాడు. అతనికి రాక్షసుల సంగతులన్నీ తెలుసు. తన సైన్యాన్ని ఆజ్ఞాపించి కొండల్లో, కోనల్లో, అతడే వెదికిస్తాడు సీతని. (ఇంకా వెతకాలన్న మాట! బాగానే ఉంది. వెతక్కుండానే తెస్తాడనుకున్నాం.) నీ భార్య పాతాళంలో ఉన్నా నీకు తెచ్చి ఇస్తాడు. సుగ్రీవుడికి కావలసిన కార్యం మాత్రం నువ్వు చేసిపెట్టు! రామా! నువ్వు చెయ్యగలవు. నువ్వు చేసిన కార్యం ఫలించినా, ఫలించకపోయినా, సుగ్రీవుడు నీకు సహాయం చేయక మానడు. (రాముడు చేసే కార్యం ఫలించకపోవడం కూడా ఉంటుందన్న మాట! మరి ఫలించకపోతే, సుగ్రీవుడు రాజు కాకపోతే, అతని చేతిలోకి సైన్యం రాకపోతే, సీతని వెదకటానికి ఎలా సహాయం చేస్తాడు? ఫలించకపోయినా చేస్తాడట! ఆ నగలూ, బట్టలూ, వొచ్చిం తర్వాత కబంధుడు ఉత్త అబద్ధాలకోరు అయిపోయాడు!) – రామా! దుఃఖించకు, జరిగేది జరక్క మానదు. విధిని మార్చడం సాధ్యం కాదు. (ఇదన్నమాట చివరికి తేల్చింది!) – ఇక రుష్యమూక పర్వతానికి పోయే మార్గం చెబుతాను విను!

అటు పడమర వేపుగా చెట్లన్నీ దాటి పోవాలి. (తర్వాత ఇక చెట్లు ఉండవా?) ఇంకో వనం తగులుతుంది. అక్కడ చెట్ల నిండా ఎప్పుడూ పళ్ళు ఉంటాయి. ఆ వనం కూడా దాటింతర్వాత పంపా సరస్సు వస్తుంది. ఆ సరస్సు రక రకాల పూలతో మనోహరంగా ఉంటుంది. అందులో తిరిగే హంసలకూ, క్రౌంచ పక్షులకూ భయం తెలియదు. మిమ్మల్ని చూసి అవి భయపడవు. నేతి ముద్దల లాగ ఉంటాయి కొవ్వుతో. చక్కగా వాటిని బాణాలతో కొట్టుకుని తినండి! (అప్పుడన్నా భయం తెలిసి దాక్కోడం నేర్చుకుంటాయి.) ఆ సరస్సులో చక్కని చేపలూ, రొయ్యలూ కూడా ఉంటాయి. వాటిని బాణాలతో కొట్టి, ఇనుప కాడకు గుచ్చి, నిప్పుల్లో కాల్చి, లక్ష్మణుడు నీకు ఇస్తాడు. రామా! చక్కగా తిను.[232] (అయ్యో, ఎందుకు తినడూ? అది సరే! ఈ 'రాముడు – రుషి' ఇనప కాడ కూడా తెచ్చుకున్నాడన్న మాట! అట్ల పెనం ఒక్కటే తక్కువైె నట్టుంది. లేకపోతే అదీ వుందో!) అక్కడ, పందులు, బలిసి ఎద్దుల్లా తిరుగుతూ ఉంటాయి.[233] ఆ పంపా తీరంలో మతంగ ముని శిష్యులు యోగాభ్యాసం చేస్తూ ఉంటారు. ఆ శిష్యులు గురువుకోసం పళ్ళు తెస్తూ ఉండగా, వాటి బరువుల

---

➔ ఈ 'తండ్రులూ – కొడుకులూ' సంబంధాల్ని అర్థం చేసుకుంటే, బోలెడు విషయాలు తెలుస్తాయి. వాలి సుగ్రీవులు అన్నదమ్ములు. ఇద్దరూ ఒకే తల్లి బిడ్డలో కారో కథలో వివరాలు లేవు. అయినా, ఇద్దర్నీ ఒకే తల్లి బిడ్డలే అనుకుందాం. ఆ తల్లికి భర్త, రుక్ష రజస్సు. అతను వానరుడు. అయితే, వాలి సుగ్రీవులు, రుక్ష రజస్సుకి పుట్టిన వాళ్ళ కారు. వాలి – ఇంద్రుడి వల్లా, సుగ్రీవుడు – సూర్యుడి వల్లా, పుట్టారు. ఇవి, రహస్య సంబంధాలు కావు. స్త్రీకి ఇంకా పాతివ్రత్యం ఏర్పడక ముందు, 'జంట పెళ్ళి దశ'కు సంబంధించిన పద్ధతి ఇది. ఈ పిల్లలు, రుక్ష రజస్సుద్వారా పుట్టకపోయినా, అతడే ఈ పిల్లలకు తండ్రి. ఎందుకంటే, ఈ పిల్లల తల్లికి అతడే భర్త కాబట్టి. ఆ స్త్రీ, రుక్ష రజస్సుకి భార్య కాబట్టి, ఆమె కనే పిల్లలకు అతడే తండ్రి అవుతాడు.

స్త్రీకి, భర్త వల్లగానీ, భర్తకాని పురుషుడి వల్లగానీ, పిల్లలు, ఏ సంబంధం వల్ల పుట్టినా, ఆమె కడుపున పుట్టిన బిడ్డలు ఆమె స్వంత బిడ్డలే. కానీ, పురుషుడికీ, బిడ్డలకూ వుండే సంబంధాలు అలా వుండవు. అవి రక రకాలుగా వుంటాయి. క్షేత్రజ పుత్రుడు = తన భార్యకు, తన వల్లగాక, ఇంకో పురుషుడి వల్ల పుట్టిన కొడుకు. క్షేత్రం = భార్య. ఆ క్షేత్రం ద్వారా వచ్చిన పిల్లలు క్షేత్రజులు. రుక్ష రజస్సుకి, వాలి సుగ్రీవులు క్షేత్రజ పుత్రులు. ఔరస పుత్రుడు = ఒక పురుషుడికి, భార్య ద్వారాగానీ, భార్యకాని స్త్రీ ద్వారాగానీ పుట్టిన కొడుకు. ఇంద్రుడికి వాలీ, సూర్యుడికి సుగ్రీవుడూ, ఔరస పుత్రులు. వాలీ సుగ్రీవులకు అసలు తండ్రులు ఈ దేవతలే అయినా, ఈ పిల్లలు, తల్లి లాగానూ, తల్లిని పెళ్ళి చేసుకున్న తండ్రి లాగానూ వానరులు అయ్యారు. ★

**232.** **అరణ్య, సర్గ 73, శ్లోకాలు 15, 16:** "రామా! పంపా సరస్సులో గల ఉత్తమమైన గండు చేపలూ, సొర చేపలూ, రొయ్యలూ, లక్ష్మణుడు బాణాలతో జంపి, వాని చర్మమునూ, రెక్కలనూ దీసివైచి, ఇనప కాడ కొనలో నుంచి, అగ్నిలో పక్వము చేసి, ముండ్లను తీసి వేచి, భక్తితో ఇచ్చును" అంటున్నాడు కబంధుడు. అంచేత, 'రాముడూ – రొయ్యలూ' అనో, 'రాముడూ – చేపల వేపుడూ!' అనో ఎవరన్నా కథలు రాస్తే అది వాల్మీకికి విరుద్ధం అవదు. పంపకు వెళ్ళాక లక్ష్మణుడు ఎలాగూ చేపల కూరలు వండుతాడు లెండి. ★

**233.** **అరణ్య, సర్గ 73, శ్లోకాలు 18, 19:** "మిగుల స్థూలముగనూ, వృషభముల వలే కూయుచుండునవిగానూ నుండు పందులను, పంపలో నీవు చూచెదవు."

రామ లక్ష్మణుల్ని ఎద్దులతో పోల్చి, పందుల్ని కూడా ఎద్దుల తోటే పోల్చారు కవిగారు. ఇప్పుడు ఇలా చూడొచ్చు. ➔

వల్ల వారికి చెమటలు పట్టి, ఆ చెమట బిందువులు గాలిలో తేలి, చెట్లమీద పడి పువ్వులయ్యాయి.[234] అందుచేత ఆ వనంలో పువ్వులు ఎన్నడూ వాడవు. (వాడవు సరేలే! చెమట పువ్వులు చెమట కంపు రావూ? మనం పంప వేపు వెళ్తే ఆ పువ్వుల్ని ముట్టుకోకూడదు.) అవి చెట్లనించి రాలవు. అక్కడ రుషులకు ఉపచారాలు చేస్తూ శబరి అనే వృద్ధ సన్యాసిని చాలా కాలం నించి చిరంజీవినిగా ఉంది. రామా! ఆ శబరి నిన్ను చూసిన తర్వాతే స్వర్గానికి పోతుంది.

పంపకు తూర్పున రుష్యమూక పర్వతం వుంది. బ్రహ్మ, పూర్వం దానికొక స్వభావం కలిగించాడు. పాపాలు చేసుకున్న వారెవ్వరూ ఆ పర్వతం ఎక్కలేరు. జాతీ, ఆచారాలూ విడిచిన పాపి ఆ పర్వతం ఎక్కితే (అసలు ఎక్కగలడన్న మాట!) వారిని, నిద్ర పోయే టప్పుడు రాక్షసులు లేపి చావగొడతారు. (పాపులైన రాక్షసులెలా ఎక్కగలరు ఆ పర్వతం మీదకి?) ఆ పర్వతం మీద ఎవరికి ఏ కల వొస్తే అది, లేచాక నిజమవుతుంది. కలలో ధనం దొరికితే లేచిన తర్వాత నిజంగా దొరుకుతుంది.[235] (ఇంకేం? అందరూ ఆ పర్వతం మీదే పక్క లేసుకోడం మంచిది.) ఆ పర్వతం మీద పాములు విపరీతంగా ఉంటాయి. పాములే దాన్ని రక్షిస్తూ ఉంటాయి. (ఏడిసినట్టే ఉంది, ఇంకేం పక్కలు?) రామా! ఆ వనమంతా కొవ్విన ఏనుగులూ, ఎలుగ్గొడ్లూ, పెద్ద పులులూ, విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటాయి. వాటిని చూస్తూ నీ దుఃఖం మరిచిపోతావు. (దడలో పడా?) మతంగ ముని మహిమ వల్ల ఆ క్రూర మృగాలు ఆశ్రమాల్ని పాడు చెయ్యవు.

ఆ పర్వతం మీదే ఒక గుహలో సుగ్రీవుడు ఉంటున్నాడు. అతణ్ణి ఆశ్రయించు. నీ కార్యం నెర వేరు తుంది. ఇక పోయి వస్తాను" అని చెప్పి కబంధుడు సంతోషంగా ఎగిరిపోయాడు. (అంతసేపూ మెడలెత్తి ఆకాశంలోకి చూడ్డమేనన్న మాట!)[236]

కబంధుడు, చెప్పిన విధంగా రాముడు, లక్ష్మణుడి వెనక, ముందుకు నడక సాగించాడు. ఒక రాత్రి గడి చింది. తెల్లవారి పంపకు పడమటి తీరంలో శబరి ఆశ్రమం చేరారు.

శబరి యోగాభ్యాసాలతో ఉగ్రమైన తపస్సు చేసిన వృద్ధురాలు. అతిథుల్ని చూడగానే శబరి మందహాసంతో కాళ్ళకు నీళ్ళిచ్చి శాస్త్రోక్తమైన మర్యాదలన్నీ చేసింది. (కీకారణ్యంలో కూర్చున్నా చుట్టా లేనయ్యే, పాడు!)

రాముడు, కూర్చుని గంభీరంగా తల పంకిస్తూ ఆ వృద్ధురాలిని యోగ క్షేమాలడగడం సాగించాడు – "నీ తపస్సు వృద్ధి అవుతోందా? కామాదులు జయించావా? (అంత వృద్ధురాల్ని పట్టుకుని!) కోపం లేకుండా ఉన్నావా? ఆకలిని అరికట్టుకున్నావా? (నే నైతే అరికట్టు కోలేదనుకో. పంపలో రొయ్యల కోసం పోతున్నాను.) వ్రతాలన్నీ ఫలించి నీ మనసు సుఖంగా ఉందా? నీ గురు పూజ సఫలమైందా?" అంటూ కుశల ప్రశ్నలు వేశాడు.

శబరి భక్తితో చేతులు జోడించింది – "రామా! నీ దర్శనంతోనే నా తపస్సు ఫలించింది. ఇప్పుడే నా గురు పూజలన్నీ సార్థకమయ్యాయి. నా జన్మ ధన్యమైంది. నీ కరుణా కటాక్షంతో పునరావృత్తి లేని (మళ్ళీ మళ్ళీ జన్మలు లేని) పరమ పదం పొందుతాను. రామా! నువ్వు చిత్రకూటంలో ఉన్నప్పుడు, నేను సేవలు చేసే గురువు లందరూ విమానా లెక్కి స్వర్గానికి పోయారు. 'శబరీ! ఈ ఆశ్రమానికి శ్రీరాముడు వస్తాడు. ఆయనకు ఉప చారాలు చెయ్యి. ఆయన దర్శనంతోనే, నాశనం లేని స్వర్గం పొందుతావు' అని నా గురువులు నాకు చెప్పారు. (ఇంతకీ, శబరి భక్తి అంతా స్వర్గం కోసం అన్నమాట!

➔రామ లక్ష్మణులు = ఎద్దులు.
పందులు = ఎద్దులు.
ఎద్దులు = ఎద్దులు.
రామ లక్ష్మణులు = పందులు.

అయినా, మనకి వరాహావతారం ఎలాగూ ఉండనే ఉంది గదా! ★

**234.** **అరణ్య, సర్గ 73, శ్లోకాలు 13, 14, 15:** ".... రుషుల తపః ప్రభావముచే వృక్షముల పై బడిన ఆ స్వేద బిందువులు పుష్పములయినవి." – చెమటతో పూలు పూయడం చక్కగానే ఉందిగానీ, అది రుషుల చెమటతో కాదు. శ్రామికుల చెమటతో. శ్రామికుల చెమటే పువ్వులూ పూయిస్తుంది, కాయలు కాయిస్తుంది, పంటలూ పండిస్తుంది. ★

**235.** **అరణ్య, సర్గ 73, శ్లోకాలు 32, 33:** "రామా! ఆ పర్వతము మీద నిద్రించుచుండు పురుషుడు కలలో విత్తమును బడసి నటులైతే, అది నిద్ర లేచిన పిమ్మట వారికి లభించును" – రుషుల జీవితాలూ, పుణ్యాత్ముల జీవితాలూ కూడా 'ధనం' చుట్టూనే తిరుగుతాయి. 'విత్తం'సంగతి ఎందుకు వీళ్ళకి? ఆకాశంలో తేలే గంధర్వుడు కూడా ధనం గురించి మాట్లాడడమే! ★

**236.** ఇంతకీ కబంధుడికి కొత్త రూపంతో పాటు నగలూ అవీ వచ్చాయిగానీ, కొత్తగా వచ్చిన జ్ఞానం ఏమిటి? సుగ్రీవుడి గురించి మొదటే చెప్పాడు. అదే తర్వాత మళ్ళీ చెప్పాడు. రావణుడి గురించి ఒక్క ముక్కా చెప్పలేదు. రాముణ్ణి చేపల కలల్లో ముంచి చక్కగా తప్పుకు పోయాడు. ★

అదా సంగతీ?) రామా! నీ కోసం ఈ పరిసర వనాలలో దొరికే పళ్ళన్నీ సంపాదించి ఉంచాను" అంది. (రాముడు 'చిత్రకూటం'లో ఉన్నది కనీసం 13 సంవత్సరాల కిందట. అప్పటి నించీ పళ్ళు దాస్తోనే ఉందన్న మాట!)

రాముడు ఆ పళ్ళ మాట పట్టించుకోకుండా (పళ్ళు తిన్నాడని కవి రాయలేదు.) "శబరీ! కబంధుడి ద్వారా మతంగ ముని మహిమలు విన్నాను. ఇప్పుడు వాటిని చూడాలని కోరుతున్నాను" అన్నాడు.

శబరి – లక్ష్మణుణ్ణీ, రాముణ్ణీ మతంగ వనానికి తీసుకు వెళ్ళింది. "రామా! మతంగ మహర్షి ఇక్కడే యాగాలు చేశాడు. వృద్ధాప్యం వలన నదుల దగ్గిరికి పోలేక నదుల్నీ, సముద్రాల్నీ ఇక్కడికే పిలిపించాడు. అప్పటి నించీ అవి ఇక్కడే ఉన్నాయి. (నదుల్నీ, సముద్రాల్నీ పిలిపించగలడు గానీ, వృద్ధాప్యాన్ని జయించ లేడు!) అవిగో! ఆ సముద్రాలూ, నదులూ చూడు! (ఆశ్రమం పెరట్లో నదులూ, సప్త సముద్రాలూ!) నా గురువుల అంగవస్త్రాలు ఇప్పటికీ చెట్లలో తడిగా మెరుస్తున్నాయి చూడు. (అంత జిడ్డు!) రామా! ఈ ఆశ్రమమంతా చూశావు గదా? ఇక నేను ఈ జీర్ణ దేహం విడిచి పెట్టి నా గురువుల సేవకే వెళ్ళి పోవాలనుకుంటున్నాను" అని భక్తిగా రాముడికి నమస్కరించింది.

రాముడు గంభీరంగా "నన్ను భక్తితో పూజించావు. నువ్వు కోరిన లోకానికి వెళ్ళు!" అని అనుమతించాడు.

వృద్ధురాలు శబరి, అగ్ని గుండంలో దూకి, వెంటనే ఆభరణాలతో పట్టుబట్టలతో చితిలోంచి లేచి, ఆకాశంలోకి వెళ్ళిపోయింది. (అన్నాళ్ళ తపస్సుకీ ఫలితం – ఆభరణాలూ, పట్టు బట్టలూ, స్వర్గం! అక్కడ మళ్ళీ గురువులకు సేవ!)

రాముడూ, లక్ష్మణుడూ మళ్ళీ నడక ప్రారంభించారు.

రాముడు, లక్ష్మణుడితో – "లక్ష్మణా! గొప్ప మహిమలు గల మతంగ ముని ఆశ్రమం చూశాం. జింకలూ, పులులూ కలహించుకోకుండా స్నేహంగా ఉండడం చూశాం.[237] ఆశ్రమంలో వున్న సప్త సముద్రాలలో స్నానం చేసి పితృ దేవతలకు తర్పణాలు విడిచాం. కీడు తొలగిపోయి ఇక శుభం కలుగుతుంది. ఇప్పుడు నా మనసెంతో సంతోషంగా ఉంది. మనం తొందరగా వానర రాజైన సుగ్రీవుణ్ణి కలుసుకోవాలి" అన్నాడు.

లక్ష్మణుడు అంతకన్నా తొందరపడుతూ "అవును శ్రీరామా! మనం తొందరగా పోవాలి"[238] అంటూ నడక వేగంపెంచాడు.

ఇద్దరూ గబగబా నడుస్తూ పంపా సరస్సు చేరారు. రుష్య మూక పర్వతం చూశారు.

రాముడు – "లక్ష్మణా! సుగ్రీవుడు ఆ కనిపించే పర్వతం మీదే ఉన్నాడని కబంధుడు చెప్పాడు గదా? అతడి దగ్గిరకి ముందు నువ్వు వెళ్ళి రా!" అన్నాడు. అంతలోనే కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ – "లక్ష్మణా! రాజ్య భ్రష్టుణ్ణయి దీనుణ్ణయి పోయాను. ఆ దుఃఖం మరిచి పోవాలని సీత మీదకు మనసు మళ్ళించుకున్నాను. సీత కూడా లేకపోతే ఎలా జీవించగలను?" అని కొంతసేపు దుఃఖించాడు.[239]

చుట్టూ వన సౌందర్యం చూశాడు. పంపా సరోవర సౌందర్యం చూశాడు. మన్మధ పీడా సాగరంలో తల మునకలుగా మునిగిపోయాడు రాముడు!

[ఇక్కడితో **'అరణ్య కాండ'** ముగిసింది.
తర్వాత నించి **'కిష్కింధా కాండ'** ప్రారంభమవుతుంది.] ★

---

**237.** **అరణ్య, సర్గ 75, శ్లోకం 3:** రాముడు – "లక్ష్మణా! పరస్పరం కలహించు కొనక, విశ్వాసముతో గూడి యుండు జింకలు, పులులు గల, మహాత్ముల ఆశ్రమమును జూచితిమి" అంటున్నాడు. పులులూ, జింకలూ, కలహించుకోకుండా కలిసి వున్నాయట! మరి రుషులూ, రాక్షసులూ అలాగే కలహించుకోకుండా ఉండరాదా? రాక్షసుల్ని చంపించడానికి రుషులు ఇన్ని ఎత్తులేస్తారేం? ఒక రాక్షసుడికి హాని జరిగితే 'శుభం! భుభం!' అని కేకలు పెడతారేం? రాక్షస జాతిని సర్వనాశనం చెయ్యాలని కంకణాలు కడతారేం? అయ్యా, ఇలాగే ఉంటాయి దొంగ నీతులు! ★

**238.** **అరణ్య, సర్గ 75, శోకాలు 8, 9:** "సుగ్రీవుని జూచుటకు నేను త్వరపడుచున్నాను" అన్నాడు రాముడు. దానికి లక్ష్మణుడు – "అచటకు త్వరగా బోవుదము. నా మనసునూ త్వరపడుతున్నది" అన్నాడు. అయితే, రాముడు, సుగ్రీవుడి దగ్గిరికి 'ఎంత త్వరగ' బోవునో తర్వాత చూడండి! ★

**239.** **అరణ్య, సర్గ 75, శ్లోకం 28:** "లక్ష్మణా! రాజ్య భ్రష్టుడనై, అందుచేతనే దీనుడనై, అట్టి దీనత్వమును పోగొట్టుకొనుటకై సీత యెడల లయించిన మనసు గల నేను, ఆమెను విడిచి యెటుల జీవింతును?" అంటున్నాడు రాముడు. సీత మీద మనసు ఎందుకు లయించినట్టు రాముడు చెప్పుకుంటున్నాడు? రాజ్యం పోయి, అందుచేతనే దీనుడయి – ఆ దుఃఖం మరిచిపోవడానికట! అందుకట సీత మీదకు మనసు మళ్ళించుకోవడం! రాజ్యమే వుంటే, సీతని ఎవడెత్తుకు పోయినా ఈయన ఇలా వాపోయేవాడు కాడన్న మాట! 'నిజం' అదే కాబట్టి, రాముడి నోట్లోంచి అదే బైటపడింది. ఈయన, కామంతో చాలా బాధపడి పోతున్నాడని ('మదనాభి పీడితా') కవి చాలా జాలిపడుతున్నాడు. ★

# కథ-6

# కామ శాస్త్రులు

గాలి, కలవపూల పరిమళాలు మోసుకుంటూ అడివంతా తిరుగుతోంది. పంపా సరోవరం, భూమి నంతా ఆక్రమించినంత విశాలంగా వుంది. జాజులూ, పున్నాగలూ, వాసంతులూ, నాగ మల్లికలూ, నీల కోశలూ, పూర్ణికలూ, శిరీషలూ, కర వీరలూ – ఎన్నెన్నో లతలన్నీ, జట్టు కట్టి పెన వేసుకుని – "రండ్రా! పంపని చూద్దాం" అని పంప చుట్టూ చేరి ఇక వెళ్ళడం మర్చి పోయినట్టున్నాయి.

పంపలో నీరు ఎటూ ప్రవహించకుండా నిశ్చలంగా ఉంది. ఒడ్ల నిండా లతలు పూసి, నీటి నిండా ఎర్ర తామరలూ, తెల్ల తామరలూ, నల్ల కలువలూ, సౌగంధి కాలూ విరగబూసి, పంప అంతా పూల రథం లాగ ఉంది. రంగు రంగుల పూల కాంతులు నీళ్ళల్లో ప్రతి ఫలిస్తూ, మణులతో, స్ఫటికాలతో మెరిసే రత్న కంబళం లాగ ఉంది పంప. నీళ్ళల్లో ఎర్రబడ్డ ఎర్ర తామరలు, అలల్లో ప్రతిఫలించే సూర్యబింబాల లాగు, ఒక్కొక్క అలలో ఒక్కొక్క బింబమై ప్రకాశిస్తున్నాయి. నీటి నిండా హంసలూ, నీరు కోళ్ళూ, రంగు రంగుల జల పక్షులూ, అలలలో సూర్య బింబాల్ని చెదరగొడుతూ, పూల మధ్య నించీ రెక్కలతో పూలని వొరుసుకుంటూ, ఆట లాగు ఈదుతున్నాయి.

నీటి మీద గాలి తగ్గి, నీటిలో అలలు తగ్గి నిశ్చలం అయినప్పుడు, అందాకా నీటి పొరల్లో దాక్కున్నట్టున్న చేపలు ఈదుతూ పైకి లేస్తున్నాయి.

సరస్సులో అక్కడక్కడా ఇసక దిబ్బల మీద పొదలు విరగబూసి, వాటి నిండా శతపత్ర పక్షులూ, అర్జున పక్షులూ, సారస పక్షులూ, చిలకలూ చేరి, పొదలు, రొద చేస్తున్నాయి. దిబ్బల మీద సువాసనలీనే గరిక ఏపుగా పెరిగి దుబ్బులు కట్టింది. చెట్ల తోపులలో నించి జంతు వులు నిర్భయంగా వచ్చి దగ్గర మడుగుల్లో నీళ్ళు తాగి నెమ్మదిగా తలలెత్తి వెనక్కి పోతున్నాయి. సరస్సు ఒడ్ల నిండా పాకి పూసిన లతలూ, నీటి నిండా ఊగే పువ్వులూ, ఈదే పక్షులూ, ఇసక దిబ్బల మీద పొదలూ, గడ్డి దుబ్బులూ అన్నీ, నీటి అడుగున ప్రతిఫలిస్తూ, పంప గర్భంలో ఇంకో పంప ప్రత్యక్షమౌతోంది.

పంప సౌందర్యం చూడాలని వచ్చిన నేరేడు చెట్లూ, మొరడి చెట్లూ, పనస చెట్లూ, కర్ణికారి చెట్లూ, తొమ్మిరావి చెట్లూ, మామిళ్ళూ, తిలకాలూ, నీలి అశోకాలూ, కదంబాలూ, రక్త చందనాలూ, స్పందనాలూ – ఎన్నెన్నో మహా వృక్షాలు, పంపా సరోవరం చుట్టుపట్ల పరిసరా లన్నీ విశాలంగా ఆక్రమించి అక్కడే విశ్రమించి నట్టు న్నాయి. చెట్ల కొమ్మలన్నీ చుట్టూ విస్తరించి, భూమి పైకి లేచిన పర్వతాల లాగానూ, ఆకాశంలో తేలుతోన్న మేఘాల లాగానూ ఉన్నాయి. వృక్షాలన్నీ, తమ చుట్టూ అల్లుకున్న లతలు పూసి, పూల గొలుసులు కట్టు కున్నాయి.

గాలి, చెట్లతో ఆటలాడుతోంది. చెట్ల కొమ్మల్ని కదిపి పారిపోతోంది. పూలలో తుమ్మెదల్ని లేవగొడు తోంది.

కొమ్మల చివర్లు, ఊగుతూ ఎదటి కొమ్మల్లో చిక్కు కొని, కొమ్మలూ కొమ్మలూ, పూలగుత్తులూ గుత్తులూ గాఢాలింగనాలు చేసుకుంటున్నాయి. కొమ్మల కౌగిళ్ళలో నలిగిన పూలు, ఉక్కిరి బిక్కిరై సొమ్మసిల్లి జల జల రాలు తున్నాయి. ఆటలాడే గాలి, రాలే పూలని మోసుకుపోతూ పూల మేఘాలు సృష్టిస్తోంది. గాలి పట్టు తప్పించుకున్న పూలు కిందకు రాలి, భూమి అంతా, పూలశయ్య అయి పోతోంది. గాలి, కొమ్మల్ని ఊగించీ, పూలని రాలగొట్టీ, తుమ్మెదల్ని చెదరగొట్టీ, నవ్వుతూ చెట్లలో జొరబడి కొత్త పరిమళాలతో పారిపోతోంది. తుమ్మెదల రొదతో, పక్షుల కూతలతో, చెట్లు సంభాషించు కుంటున్నాయి.

"వకుళా! ఎంత చక్కగా పూశావే ఈ పూట!" – ఉద్దాలక!

"అబ్బే! నీకంటేనా? నువ్వు చూడు, ఎంత విరగ బూశావో?" – వకుళ!

"అవును, ఉద్దాలకే బాగా పూసింది" – పారి జాతం!

"ఏమోనర్రా! ఏం పూశానో! ఈ గాలి గిలిగింతలు పెట్టి ప్రాణాలు సతమతం చేస్తోంది."

"ఎవరో కొత్త వాళ్ళొస్తున్నట్టుంది" – జాజి!

చెట్ల కిందనించి నడుస్తోంటే, దట్టంగా మబ్బులు పట్టిన నీలాకాశం కింద నడుస్తున్నట్టుంది.

లక్ష్మణుడు ఆతృతతో దూరంగా రుష్యమూక పర్వతం వేపు చూస్తున్నాడు – ఎవరైనా కనబడతారా అని. రాముడు పంపనీ, చుట్టూ పరిసరాల్నీ పరిశీలిస్తు న్నాడు, ఎటునించి ఏం వొచ్చి మీద బడుతుందోనని!

సరోవరం మీదనించీ గాలి, సుఖ శీతలంగా, పరి మళ భరితంగా వీస్తోంది. అడివంతా తొలకరి చినుకు లలా పూల వాన కురుస్తోంది. కోయిళ్ళు విరామం లేకుండా కూస్తున్నాయి. కూతల వెంట ఎగురుతు న్నాయి. నెమళ్ళు కొమ్మల్లో పింఛాలు విప్పబోయి చిక్కుపడి చెట్ల కిందకి దూకుతున్నాయి. వాటి పింఛాలు, ఏవేవో సుందర లోకాలకు తీసుకు పోయే మణి ద్వారాలలాగు ధగ ధగ మెరిసి పోతున్నాయి.

రాముడు గంభీరంగా – "లక్ష్మణా! .... ఈ పంపా సరస్సు .... ఈ కోయిళ్ళు .... నెమళ్ళు .... ఈ పరిమ ళాలు .... చల్లగాలులు మిక్కిలి కామోద్దీపకంగా ఉన్నాయి! ఇది వసంత రుతువోయి!" అన్నాడు. రాము డికి వసంత రుతు వర్ణనలన్నీ గుర్తు వొచ్చాయి.

లక్ష్మణుడు రుష్యమూకం వేపు చూస్తూ దృష్టి మార్చకుండా – "చిత్తం అన్నగారూ!" అని వసంత రుతు వుని వొప్పుకున్నాడు.

"లక్ష్మణా! అసలే రాజ్యం పోయిన వాణ్ణి. దీన త్వంతో ఉన్నాను. సీత మీదకు దృష్టి మరల్చుకుని జీవిస్తు న్నాను. ఇప్పుడు సీత లేకుండా ఎలా జీవిస్తానోయీ? ఈ వసంత రుతు శోభ సీతలేని నాకు దుఃఖమే కలిగి స్తోందోయీ!"

"చిత్తం! మీకు దుఖ్ఖమే కలిగిస్తుంది అన్నగారూ!"

"ఈ పంపా సరోవర సౌందర్యం చూడు! ఎంత దుఃఖంలోనైనా సంతోషం కలిగిస్తుంది సుమా!"

"చిత్తం! మీకు సంతోషమే కలిగిస్తుంది అన్న గారూ!"

లక్ష్మణుడు రుష్య మూక పర్వతం ఎక్కలేనేమోనని దిగులు పడుతున్నాడు. కనిపించినంత మేర ఎక్కడా పైకి పోయేదారి లేదు. వొత్తుగా చెట్లూ, పొదలూ! అందులో పాములు తప్ప జంతువులు కూడా కాలు మోపే వీలు లేదు. కొండచుట్టూ అక్కడక్కడా ఎర్ర పూల చెట్లు విరగ బూసి గాలికి ఊగుతూ, కొండ కొనలు అంటుకుని మంటలు నాలికలు చాచి పైకి లేచి భగ భగమండు తున్నట్టున్నాయి. రెక్కలకోసం తపస్సు చేసి ఎగరగలిగితే తప్ప ఆ పర్వతం మీదకు చేరడం అసాధ్యంగా తోస్తోంది.

"లక్ష్మణా! వనమంతా వృక్షాగ్రాలకు లతలు పాకి కౌగలించుకుంటున్నాయి చూడు! కొండలన్నీ పూల రాసులవుతున్నాయి చూడు! ఆ మర్రిని పెన వేసుకున్న కేతకీలత ఎంత విరగబూసిందో చూడు! అయ్యో! ఈ వసంతంలో సీతా వియోగం నన్నెంతగానో బాధిస్తోందే! .... ఆ నీరు కోళ్ళు చూడు! సరస్సులో ఎట్లా ఈదు తున్నాయో! ఎట్లా కూస్తున్నాయో! జల పక్షుల కూతలు వినగానే సీత నన్ను పిలిచి నవ్వుతూ చూపించేది గదా?" – రాముడు అంతర్ముఖుడైనట్టు ఆగి ఆలోచనలో ముని గాడు.

సీత, పర పురుషుడి బాహువుల్లో .... ఆ దుర్మార్గుడు .... కాముకుడు .... దుఃఖిస్తూ ఉంటుందా? మహా పతివ్రత .... ఆ నీచుణ్ణి దగ్ధం చెయ్యవచ్చునే! .... శక్తి లేదా? .... ఎంత మాట! .... మరి? .... ఈ అరణ్య వాసానికీ, కష్టాలకూ విసిగిపోయిందా? రాజ భోగాలకూ .... సౌఖ్యాలకూ లొంగిపోతుందా? .... ఇష్టపడే వెళ్ళిందా? .... ఏమిటీ దుష్ట తలంపు? .... పాములు చుట్టుకున్నట్టు మనసంతా ఈ ఆలోచన లేమిటి? ఏమిటి?

వనవాసానికి, తనే ఇష్టపడి వచ్చిందే! అడవుల్లో ఉన్నంతకాలం ఎంతో సంతోషం కనబరిచిందే! .... ఎన్న డయినా .... అధిక శ్రమతో అలిసిపోయి నప్పుడు కొంచెం నిరుత్సాహపడేది గానీ .... అంతలోనే ఎంతో సిగ్గుపడేది. నొచ్చుకునేది. ఎప్పుడూ తనకూ, రుషులకూ సేవలు చెయ్యాలని ఆరాట పడేది. ఎప్పుడేం లోటు చేస్తానో అని జంకుతూ తిరిగేది. ఎందరెందరో పతి వ్రతల కధలూ, చరిత్రలూ విని గొప్ప పతివ్రత కావాలని కలలు కనేది .... అంత మరిచిపోతుందా? గతమంతా విస్మరిస్తుందా? .... అట్లా జరగదు. ఎన్నటికీ జరగదు. సీతని పర పురుషుడు బలాత్కారంగా ఎత్తుకు పోవచ్చు గానీ అంతకన్నా ఏమీ జరగదు!

రాముడి మనసు, మహా భారం తగ్గి దూది పింజ కన్నా తేలికైపోయింది. మంద హాసంతో చుట్టూ చూశాడు. వసంత రుతు సౌందర్యం పదింతలు ఇనుమ డించి కనిపించింది.

వృక్ష శాఖలన్నీ కోయిళ్ళయి కూస్తున్నాయి. గాలిలో మంచిగంధం పరిమళాలు తేలుతున్నాయి. తుమ్మెదలు పొదల చుట్టూ రొద చేస్తున్నాయి. విరగ బూసిన చెట్లు, పట్టు బట్టలూ ఆభరణాలూ ధరించిన పురుషుల వలే కనిపిస్తున్నాయి. పంప చుట్టూ, గురివింద పొదలనిండా, గుత్తులు గుత్తులుగా కాయలు వేళ్ళాడుతున్నాయి.

"లక్ష్మణా! వనాలు చూచినప్పుడు సీత ఎంతో సంతోషించేది. ఈ ఎర్రని చిగుళ్ళు చూస్తోంటే సీత పెదిమలే గుర్తు వొస్తున్నాయి నాకు. ఆ సన్నని కను రెప్పలూ .... నున్నని చెంపలూ .... మెత్తని కురులూ .... అయ్యో! ఈ వసంత రుతువు సీత అందాలన్నీ గుర్తుచేసి నన్ను బాధిస్తోందే!"

సీత వుంటే, ఆ అడవులన్నీ తిరిగితే, నిజంగానే పంపని చూసి చాలా సంతోషించేది. ఆ గురివింద పొద లన్నీ తిరిగి గురివింద కాయలన్నీ వొలిచి గింజలన్నీ వొడినిండా పోసుకునేది. ఆ పచ్చగొట్టం పూలు నోట్లో పెట్టుకుని తేనె పీల్చేది. ఆ కొత్త పూలన్నీ తీగతో కట్టి రాముడి మెడనిండా వేసేది.

మొగలి పొదలంటే సీతకి కొంచెం జంకు. "మొగలి పొదల్లో నల్ల తాచు లుంటాయంటారే!" అంది ఒకసారి.

"మొగలి పొదల్లో ఏమిటి? అంతఃపురాల్లో కూడా ఉంటాయి" అన్నాడు రాముడు, కైక ఆలోచనల్తో.

సీత కొంచెం తెల్లబోయి – "అంతఃపురాల్లో కూడా తాచులు ఉంటాయా?" అంది.

రాముడు కొంచెం సర్దుకుని గంభీరంగా "ఉండిన ఉండవచ్చును, లేకుండిన లేకుండవచ్చును" అన్నాడు. సీత నవ్వింది.

రాముడు నిట్టూర్చి – "లక్ష్మణా! వసంత రుతువు ఎంత కౄరమోయీ! నా ప్రియురాలు కూడా కౄర మైనదే!" అని మళ్ళీ నిట్టూర్చాడు.

"అన్నగారూ! .... పర్వతం మీదకు దారి .... ఎక్కడా ...."

"అసలే దుఃఖంలో ఉన్న నన్ను .... అటు చూడు .... ఆ కోయిల ఎట్లా వెక్కిరిస్తోందో!"

లక్ష్మణుడు కోపంగా అటు చూశాడు.

కోయిల మెడ సారించి ఎటో కూస్తోంది.

"అది వెక్కిరింత కాదు అన్నగారూ! వసంతా గమనం చూసి దానికి కలిగిన పులకింత!" – వసంత గాలుల్లో లక్ష్మణుడికి కూడా కొంచెం కవిత్వం అబ్బింది.

"అంతేనా లక్ష్మణా?"

"అంతే, అంతే అన్నగారూ! అంతే!"

"అయ్యో! .... ఆ చందన వృక్షం కింద మొగ నెమలి చూడు, పురుషావేశంతో పురివిప్పి ఆడుతూ .... భార్యని సరసన ఉంచుకుని దర్పంతో, భార్యలేని నన్ను పరిహసి స్తోంది. నా భార్యని పర పురుషుడు తీసుకుపోయినట్టు దాని భార్యని ఎవ్వరూ తీసుకు పోలేదు గదా?[240] హా సీతా! ఈ వసంతంలో నీ ఎడబాటు సహించలేకుండా ఉన్నాను! .... ఈ విరహాగ్ని నన్ను కాలుస్తోందే!"[241]

లక్ష్మణుడు బాణంతో గబగబా నెమళ్ళ జంటని బెదరగొట్టాడు. మొగ నెమలి ఉత్సాహం ఆపుకుని, ఆట కట్టిపెట్టి, చప్పున పింఛం ముడుచుకుని, తోక ఊపు కుంటూ ఆడ నెమలి వెంట పరిగెత్తింది.

దూరంగా పోయి, మొగ నెమలి మళ్ళీ పింఛం విప్పుతూ – "వాటి గోడు మన కెందుకు? రా చెలీ! నాట్యం చేద్దాము. తల ఎత్తి మబ్బు తెరలు చూడు! చల్ల గాలులు చూడు! పూల మేఘాలు చూడు!" అంటూ ఆటకు దిగింది.

తన దృష్టిని ప్రియుడి మీద నుంచి నల్ల జంతువు మీదకు మరల్చి ఒక క్షణ కాలం వ్యర్థపరచుకున్నందుకు ఆడ నెమలి సిగ్గుపడుతూ ఆటలో కలిసింది.

"లక్ష్మణా! వసంతకాల వైభవమేమో ఎరుగుదువా? పక్షులూ, జంతువులూ కూడా కామ బాధ వల్ల భర్తలకు దూరంగా పోవు. పోలేవు. సీతని రాక్షసుడు ఎత్తుకు పోకుండా ఉండినట్టయితే, ఆమె కూడా ఈ రుతువులో కామ బాధతో నా చెంతకు చేరేది లక్ష్మణా!"

లక్ష్మణుడు తల వాల్చాడు – వదినగారు కామ బాధతో అన్నగారి చెంతకు చేరే దృశ్యాన్ని ఊహించ లేక.

అన్నగారి కామ బాధ వర్ణన సాగుతూనే ఉంది – "లక్ష్మణా! శృంగారానుభవానికి అనుకూలమైన వాంఛ లతో స్త్రీలు ఈ రుతువులో పురుషుల సమీపానికి చేర తారు. ఈ వసంత ...."

హఠాత్తుగా ఆగిపోయాడు రాముడు – సీతకు

---

**240.** కిష్కంధాకాండ, సర్గ 1, శ్లోకం 40: రాముడు – "రాక్షసుడు, ఈ నెమలి యొక్క ప్రియురాలిని అపహరించుకొని పోలేదు. అందుచేతనే, మనోహరమగు అరణ్యములో భార్యతోగూడి అది నాట్యము చేయుచున్నది" అని నిట్టూరుస్తున్నాడు. ఎదటి వాళ్ళు సుఖంగా ఉన్నందుకు సంతోషిస్తూ ఉన్నట్టే పైకి కనపడినప్పటికీ, దాని అంతరార్థం అది కాదు – "మనలాగే వాళ్ళకీ కష్టాలు రాలేదే! వాళ్ళు సుఖంగా ఉన్నారే! మనం మాత్రమే ఇలా కష్టాలు పడుతున్నామే!" అనే ఏడుపుగొట్టుతనం అది! సుఖంగా ఉన్న వాళ్ళందరూ తనని ఎగతాళి చేస్తున్నారనీ, ఏడిపిస్తున్నారనీ, అనుకోవడం ఎందుకు? తనే సుఖంగా ఉండి, ఎదటి వాళ్ళు కష్టంలో ఉంటే, తను అలాగే చేస్తాడన్నమాట! తన గుణ గుణాలే ఎదుటి వాళ్ళకి ఆపాదించి చూస్తున్నాడు రాముడు. కవి, సమాజ ప్రభావంతోటే, పాత్రల చిత్తవృత్తులూ, స్వభావాలూ మలుస్తాడు. రాముడి పాత్ర, దానికి అతీతమైంది కాదు. రాముడి మనస్తత్వానికీ, ఆలోచనా విధానానికీ, ఈ నాటి మనస్తత్వాలకూ ఏమీ తేడా లేకపోవడం గమనించండి! ★

**241.** కిష్కంధా, సర్గ 1, శ్లోకం 41: "ఈ వసంత మాసములో సీత నెడబాసి యుండుట మిగుల దుస్సహముగనున్నది" – వసంత రుతువులో సీత లేకపోవడం రాముడికి చాలా కష్టంగా ఉంది! మండుటెండల కాలంలో అయితే పరిసరాలు 'కామోద్దీపకంగా' ఉండవు కాబట్టి, అప్పుడు సీత లేకపోయినా ఫర్వాలేదు. ఈ భార్యలు అసలు ఎందుకు కావాలో చెప్పడానికి, ఇంతకన్నా రుజువేం కావాలి? ★

కూడా ఈ వసంతశోభ కామోద్దీపనం కలిగిస్తుందా? .... సీత కూడా కామాగ్ని దహించి పురుషాలింగనాలకు తపిస్తుందా? సీత వున్న చోట వసంత రుతువు ఇలాగే ఉంటే ... ఇలా ఉండదా? ఎందుకు ఉండదూ? ఈ రుతు శోభ లోకాలన్నీ వ్యాపిస్తుంది కదా?[242] మరి సీత మన్మథ వశురాలవక తప్పుతుందా? .... అసలే యౌవ్వనంలో ఉంది. కామాను భవానికి దూరంగా ఉంది. పూలనీ, పక్షుల్నీ చూసి మైమరుస్తుంది. ఈ వసంతం, ఎంత జడులకైనా చలనం కలిగిస్తుందే! ... సీత నిగ్రహిస్తుందా?

ముక్కు పుటాలు ఉబ్బి, వీక్షణాలు తీక్షణమై, భూమి అదిరే అడుగులతో ముందుకు నడిచాడు రాముడు.

"అన్నగారూ!.... అదే రుష్యమూక ...."

"లక్ష్మణా! గొప్ప పొరపాటే జరిగింది."

"చిత్తం!"

"సీతను అంతఃపురంలో బంధించి రాకపోవడం .... పొరపాటే సుమా!"

"చిత్తం!"

"స్త్రీలు భర్తల ఆజ్ఞలు ధిక్కరించడం ఎంత దోషం!"

"చిత్తం!"

"అసలు నేను రావొద్దనే అన్నాను సుమా!"

"చిత్తం! .... కానీ ...."

"పర పురుషుడి గృహంలో .... నా భార్య .... ఎంత .... అగౌరవం! .... ఎంత .... అప్‌ర దిష్ ...."

"చిత్తం! .... కానీ .... మన్నించాలి .... అది దైవ నిర్ణయమని .... పెద్దలూ .... రుషులూ ...."

"హు! .... దైవ నిర్ణయం! .... సీతలేని నాకీ వన శోభ దేనికోయీ? .... ఆమె పర పురుషుడి గృహంలో దుఃఖిస్తూ వుంటే .... నేనీ రుతు శోభను అనుభవించ గలనా? .... అసలు నువ్వు సీతని .... ఆశ్రమంలో విడిచి రావడం .... నా ఆజ్ఞ మీరడం .... అయ్యో! ఆ దుర్మార్గులు .... నా ప్రియురాలిని .... ముక్క ముక్కలు చేసి ...."

లక్ష్మణుడు మాట లేకుండా శ్రీరాముడి పాదాల మీద మోకరిల్లాడు.

రాముడు కొంచెం శాంతించి, ఆలోచనలతో ముందుకు సాగాడు.

గాలి, వేప పూత పరిమళాలు మోసుకుంటూ తిరుగుతోంది. పూలు పూసిన చెట్లు, అత్తర్లు రాసుకున్న విలాస పురుషులలాగ ఘుమ ఘుమ లాడుతున్నాయి. పూల గుత్తులు, ఆకుల్లోంచి బయటకొచ్చి ఊగుతూ లక్ష్మణుడి చెంపలకూ, భుజాలకూ తగిలి దాక్కుంటున్నాయి.

లక్ష్మణుడు మంచి దారి చూసుకుని తొందరగా పర్వతం ఎక్కి సుగ్రీవుడితో మాట్లాడాలని ఆరాటపడుతున్నాడు.

"అయ్యో! ఈ పద్మాలను చూస్తోంటే సీత ముఖ పద్మమే గుర్తు వొస్తోందే! ఈ వనమంతా, పదే పదే సీతనే గుర్తు చేస్తోందే! .... ఈ విరహతాపం భరించ లేకుండా ఉన్నానే, .... సీత ఎన్ని కష్టాలు పడినా ఎప్పుడూ నా మన్మథ బాధ పొగొట్టేది కదా? ఈ వసంతాగ్నిలో సీత లేకుండా జీవించగలనా?" అని వాపోతున్నాడు రాముడు.

లక్ష్మణుడు కొండవేపు చూస్తూ పరధ్యాన్నంగా, "చిత్తం! జీవించగలరు అన్నగారూ!" అని వొప్పుకున్నాడు. రాముడికి సమాధానాలు వినే అల వాటు లేకపోబట్టి ఆ సంభాషణ సవ్యంగా సాగి పోయింది.

"లక్ష్మణా! ఆ కాకి చూడు! ఒకసారి సీతా నేనూ ముచ్చటలాడుకుంటూ ఉంటే ఇది చుప్పనాతి తనంతో క్రూరంగా కూసింది. ఇప్పుడు చూడు, ఎంత సంతోషంగా కూస్తోందో!"

లక్ష్మణుడు ఆ కాకిని శ్రద్ధగా చూసి, రాముడికి వినయంగా వొంగి నమస్కరిస్తూ – "ఆ కాకీ, ఈ కాకీ, వొక కాకి కాదు అన్నగారూ!" అంటూ విన్న వించాడు.

"అంతేనా లక్ష్మణా?"

"అంతే, అన్నగారూ! అంతే. ఆ కాకి ఆ కాకే, ఈ కాకి ఈ కాకే! ఇది, మందనించి విడిపోయిన ఏకాకిలా ఉంది అన్నగారూ!"

"అయ్యో! ఈ అశోక పూలగుత్తులు చూడు! నన్ను చూసి ఊగుతూ ఎలా వెక్కిరిస్తున్నాయో!"

లక్ష్మణుడికి కోపం వచ్చి దారి పొడుగునా అశోక పూలగుత్తులన్నీ ఫెళ ఫెళా విరిచి దూరంగా పారేశాడు.

దారి పొడుగునా మోదుగ చెట్లు కూడా ఆకులు

---

**242.** **కిష్కింధా, సర్గ 1, శ్లోకాలు 47, 48:** "నా ప్రియురాలుండు చోట వసంత రుతువు ఇటులనే యుండినటులైతే, ఆమె మన్మథవశురాలై, నా వలెనే దుఃఖించుచుండును, నిజము!" "సీతయుండు ప్రదేశములో వసంత రుతువు ఉండదు. నిజము. అటుల అది యుండినచో సీత నన్నెడబాసి యెటుల జీవించి యుండును?"

సీత ఉండే చోట వసంత రుతువు ఉంటుందని కాస్సేపూ, ఉండదని కాస్సేపూ, సతమత మవుతున్నాడు రాముడు. ఉంటే, సీత కూడా కామ బాధ పడాలి కదా? "నన్నెడబాసి సీత యెటుల జీవించియుండును?" అని ఆశ్చర్యపడుతున్నాడు. సీత నెడబాసి తను ఎట్లు జీవించి యున్నాడో మరి!

★

కనబడనంతగా పూశాయి. తురాయి పూల గుత్తులు లక్ష్మణుడికి అందనంత ఎత్తున తలలూపుతున్నాయి. గాలి ఆకతాయి పిల్లలాగ పువ్వు పువ్వుకీ, చెట్టు చెట్టుకీ, కొండ కొండకీ తిరుగుతోంది. గాలి తెరలకు, సరస్సులో పూలు అలలు అలలుగా ఊగుతున్నాయి. పూలలో నుంచి తుమ్మెదలు ఝుమ్మంటూ లేస్తున్నాయి. పూలు వొణికి, ఊగి, మధుర స్మృతులలో మునిగి, నిశ్చలం అవుతున్నాయి. ఘడియకో, క్షణానికో విప్పారే మొగ్గలు ఆకుల చాటునించి అమాయకమైన ఆనందంతో తుమ్మెదల ఝుంకారాలు వింటున్నాయి.

"అయ్యో! ఈ పూలు .... ఈ పరిమళాలు .... ఈ తుమ్మెదలు .... ఇవన్నీ ఇంతగా బాధించకపోతే ఈ విరహం ... ఈ కామం ... సైచుకునే వాడినే[243] అయ్యో! ఈ వసంత రుతువు .... పదే పదే నా భార్యను గుర్తు చేస్తోందే!" అగ్నిపర్వతం లాగ నిట్టూర్చాడు రాముడు. "లక్ష్మణా! ఈ పంపా సమీపంలో, ఈ వన శోభలో, పతివ్రత అయిన సీత, నా సరసన ఉంటేనా .... ఇక నేను స్వర్గమైనా కోరను. అయోధ్యకే తిరిగి పోను" అంటూ మళ్ళీ వడగాల్పులలాగు నిట్టూర్చాడు.[244]

చెట్లు పూలు పూయకపోతే, కోయిళ్ళు కూతలు కూయకపోతే, తుమ్మెదలు ఎగరకపోతే, భార్యని మర్చిపోగలిగే రాముడు – ఆ పంపా సరోవరం, గ్రీష్మ రుతువులో కాచే మండు టెండలకు నీళ్ళన్నీ ఎండి, లత లన్నీ వాడి, చెట్లన్నీ మోళ్ళై, వసంత రుతు శోభనంతా కోల్పోయినప్పుడు, సీతకన్నా అయోధ్యే అధికమవుతుందనే విషయమే మర్చిపోయాడు. "అయ్యో! ఈ వసంతాగ్ని నన్ను క్రూరంగా .... నిర్దయగా కాలుస్తోందే! .... లక్ష్మణా! పంపాజలం తీసుకురా నాయనా!"

లక్ష్మణుడు గబగబా పంప వొడ్డుమీద పూలు తొక్కుకుంటూ లోపలికి దిగి తామరాకులు తెంచి, దొన్నె నిండా నీళ్ళు తెచ్చి అన్నగారికి అందించాడు.

రాముడా నీళ్ళతో మొహం తడుపుకొని – "అయ్యో! పంపా జలం కూడా ఇంత పరిమళ భరితంగా ఉందే! నా కామాగ్నిని వృద్ధి చేస్తోందే!" అంటూ సెగలు గక్కాడు.

అన్నగారి వ్యవహారమేమీ అర్థంగాక, ఏ అగ్నీ తనని కాల్చలేనట్టు భీకరంగా నిలుచున్నాడు లక్ష్మణుడు.

"నువ్వే కామ శాస్త్రాలూ చదివినట్టు లేదే!" అని పరిహాసంగా అడిగింది ఇంగితం. లక్ష్మణుడు మాట్లాడ దల్చుకోలేదు.

"అవున్లే! నీ అన్న 'పాదసేవా శాస్త్రం' తప్ప ఇంకేమీ చదివి వుండవు. చదివితే మాత్రం నీ కెక్కడ గుర్తు? నువ్వేం మహానుభావుడివా?"

"ఏమిటీ నీ దురుసుతనం?"

"ఎందుకంత విసుక్కుంటావు? ఇదే గోల నీతో. నేనెప్పుడూ నీ క్షేమం కోసమే మాట్లాడుతానని అర్థం చేసుకోవు."

"అక్కడికి నువ్వు నా క్షేమం కోరే దానివీ, నా అన్నగారు నా క్షేమం కోరని వాడూనా?"

"ఇన్ని ప్రశ్న లెందుకు గానీ, నిన్నేమీ చెయ్యలేని ఈ పూలూ గీలూ .... నీ అన్నని అగ్నిలో పడేసి కాల్చేస్తున్నాయి. ఏమిటీ సంగతీ?"

"బాగుంది. ఆయన అనురాగం అటువంటిదీ, భార్య మీద."

"నీ మీద నాకు చీదర పుడుతోంది గానీ .... ఎందుకులే .... నువ్వేం చేస్తావు? అంత అనురాగం ఉన్నవాడు తొందరగా సుగ్రీవుడితో మాట్లాడాలని ప్రయత్నమే చెయ్యడేం?"

"ఎందుకు చెయ్యడూ? .... ఆయనే చేస్తాడు. చెయ్యక? చెయ్యడా? ఈ పువ్వులూ అవీ చూసి .... భార్య గుర్తొచ్చి దుఃఖిస్తున్నాడు గానీ ...."

ఇంగితం నోరు మూసుకుంది.

---

**243.** **కిష్కింధా, సర్గ 1, శ్లోకం 69:** "పూచిన వృక్షములు గల వసంత మాసము నన్ను హింసింపక యుండినటులైతే, ఇపుడు కలిగిన కామమును సైచుకొని యుందును" అని తన ప్రత్యేక గొప్పతనం వెల్లడించుకుంటున్నాడు రాముడు. అదీ ఆయన ఇంద్రియ నిగ్రహం! చెట్లు పూయకపోతే, తను గొప్ప జితేంద్రియుడే! కానీ, చెట్లు పూసేస్తున్నాయే మరి! భార్య బతికేవుందో, చచ్చిపోయిందో తెలీదు! ఆమె క్షేమం గురించి ఎటువంటి ఆసక్తీ లేదు, 'కామ బాధో, కామ బాధో!' అని వొకటే గోల! స్త్రీని, పురుషుడు ఎందుకు ఉపయోగించుకుంటాడో, ఆమె తన దగ్గర ఎందుకోసం ఉండాలని కోరుకుంటాడో, ఈ ఘట్టంలో చాలా స్పష్టంగా, ఎటువంటి దాపరికాలూ లేకుండా, తెలుస్తోంది. సీతతో రాముడికి వున్నదంతా శారీరకమైన అవసరమే. అంతకు మించి ఆమె కావాలనుకోవడంలో ఇంకో అవసరం ఏమీ లేదు. ★

**244.** **కిష్కింధా, సర్గ 1, శ్లోకం 95:** "పతివ్రతయగు సీత ఇచట అగుపడి .... ఆమెతోడ ఇచట వసించుటకు గలిగినటులైతే .... నేను ఇంద్ర పదవినీ, అయోధ్యకు బోవుటనూ గోరను" – సీత, 'పతివ్రత అయిన స్థితిలోనే' కనపడాలి. రావణుడు ఆమెని బలాత్కరించి, వొదిలేసిపోయిన స్తితిలో కనబడితే కుదరదు. ఈ అభిప్రాయం రాముడి ఆలోచనల్లో మొదటినించీ ఉంది. ఈ విషయం గమనిస్తూ ఉండాలి. ★

"శ్రీరాముణ్ణే తప్పు పడతావేం?" అని లక్ష్మణుడు, ఇంగితం మీద కోపంగా ఎగిరి తర్వాత అన్నగారి వేపు చూశాడు.

"లక్ష్మణా! ఈ వియోగ బాధతో నేను జీవించ లేను సుమా! .... అదిగో! ఆ మొగలిపొద సమీపంలో నీరు కోళ్ళు చూడు .... ఆడ పక్షి తప్పుకోబోతే .... ఆ పురుష పక్షి .... బలాత్కారంగా .... కుక్కుట న్యాయంతో .... ఎట్లు ...." నోట్లో మాటలు నోట్లో వుండగానే అదిరి పడ్డాడు రాముడు. నవ నాడులూ కుంగిపోయినంత అలజడి కలిగింది. రావణుడు కూడా .... సీతని .... బలాత్కారంగా కుక్కుట న్యాయంతో .... స్త్రీలు అబలలు! బలహీనులు! సీత నిస్సహాయంగా .... లొంగిపోతుందా? .... మహా పతివ్రత! ఇంకెక్కడి పతివ్రత! .... ఆ నీచుడు .... పర పురుషుడు .... నానా శ్రమలకూ వోర్చి .... మృత్యువుకు కూడా వెరవక .... తీసుకు పోయిన వాడు కరుణిస్తాడా? పర స్త్రీ వ్యామోహితుడు .... వాంఛ పరిపూర్తి చేసుకోక వదిలిపెడతాడా?

చేతిలో విల్లు పట్టుదప్పి పోయింది. రాముడు నేల మీదికి వొరగబోతోంటే లక్ష్మణుడు ఆందోళన పడుతూ పట్టుకున్నాడు.

"లక్ష్మణా! సీతని ...."

"అన్నగారూ! ధైర్యం వహించండి!"

రాముడి కళ్ళవెంట జల జలా కన్నీళ్ళు రాలాయి – "ఇంకెక్కడి ధైర్యం లక్ష్మణా! .... ఆ దుర్మార్గుడు .... సీతని .... బలాత్క .... తినేసి వుంటాడా?"

"కాదు అన్నగారూ! అట్లా ఎన్నటికీ జరగదు. ఆ మహా పూజ్యురాలిని .... ఎవ్వరూ తాకలేరు."

"ఏమి పూజ్యురాలు! .... ఎత్తుకు పోతోంటే ఆప గలిగిందా?"

"మన్నించండి అన్నగారూ .... అంతా విధి వశాన .... ఆ మహా పతివ్రతని .... ఎవ్వరూ ...."

"లక్ష్మణా! నీ మాటలు నా కెంతమాత్రం ఊరడి కలిగించడం లేదోయి! అసలు సీత రాకుండా వుంటే ఎంత బాగుండేది! అంతఃపురాలలో స్త్రీలకు ఎంత క్షేమం! ఎంత రక్షణ!...."

"మన్నించండి అన్నగారూ! వదినగారు మీ పాద సేవకు దూరమై అంతఃపురాలలో ఉండగలరా?"

రాముడికి సర్రున కోపం వచ్చింది – "అసలు నువ్వే రమ్మన్నావా ఏమిటీ? అవును, నాకు తెలుసు. బాగా నూరిపోసి తీసుకొచ్చావు" అన్నట్టు చూశాడు, లక్ష్మ ణుణ్ణి.

లక్ష్మణుడు ఆ చూపులకే జంకి, చేతులు జోడించి మౌనం వహించాడు.

దీర్ఘంగా ఆలోచనల్లో మునిగిన రాముడు హఠాత్తుగా తల ఎత్తి "లక్ష్మణా! పతివ్రతల్ని పర పురుషులు ఎత్తుకుపోయిన కథలు ఎన్నడయినా విన్నావా?" అని ఆతృతగా చూశాడు.

లక్ష్మణుడు గబగబా ఆలోచించాడు. ఎందరో స్త్రీలను .... పర పురుషులు బలాత్కారంగా ఎత్తుకు పోయిన చరిత్రలు విన్నాడు గానీ .... ఆ పురుషులెవ్వరూ ఆ స్త్రీలని వదిలినట్టు వినలేదు. "పూర్వం ...."

"ఊఁ ...., పూర్వం? .... తొందరగా చెప్పు!"

"ఇంద్రుడి భార్యని ...."

"ఇంద్రుడి భార్యనే! రావణుడేనా?"

"కాదు అన్నగారూ! .... వేరొక క్షుద్ర రాక్షసుడు! ఆడు వీడు కాదు ...."

"ఊఁ .... ఏం చేశాడు?"

"ఎత్తుకుపోయాడు."

"ఊఁ ... పోయి? చెప్పు!"

"తర్వాత ఇంద్రుడు ఆ రాక్షసుడి మీద యుద్ధం చేసి, భార్యని విడిపించి తెచ్చుకున్నాడు."

"తెచ్చుకున్నాడా? .... అది సరేనోయి! .... ఆ రాక్షసుడు, ఆ పతివ్రతని ...."

"ఏమీ చెయ్యలేదు అన్నగారూ!"

"ఏమీ చెయ్యలేదా? .... అయితే ఎత్తుకు పోవడం ఎందుకూ?"

ఎందుకో చెప్పలేకపోయాడు లక్ష్మణుడు. తల వంచుకున్నాడు. అన్న గారికి ఇంకే కథలూ చెప్ప లేనందుకు చాలా సిగ్గుపడ్డాడు.

రాముడి ఆత్మ .... కొంచెం కోపంగానే .... ధైర్యంగానే విసుక్కుంది. "ఇదేం న్యాయం? .... సీత మహా పతివ్రత అని తెలియదా? ఆమె ఆత్మహత్య అయినా చేసుకుని మరణిస్తుంది గానీ .... పర పురుషుడికి వశమవుతుందా? ఎందుకీ దుష్ట శంకలు? .... నాకు నచ్చలేదు సుమా!" అని ఊరుకుంది.[245]

---

**245.** **కిష్కింధ, సర్గ 1, శ్లోకం 51:** "నా విరహము గల సీత జీవించుటకు సాధ్యం కాదు. ఏలననగా ఆమె పతివ్రత. నా మనస్సులో నిటుల దోచుచున్నది" – 'మనసులో దోచుచున్నది' అంటే, రాముడు ఆలోచిస్తున్నాడని అర్థం. వసంత రుతువులో సీత కూడా విరహ బాధ పడుతుందని రాముడు ఒప్పుకున్నాడు. అయితే మరి అప్పుడు ఆమె ఏం చేస్తుంది అన్నదే రాముడి ప్రశ్న. సీత రావణుడి దగ్గిర ఉండటం వల్లనే ఆమె ప్రవర్తన గురించి ఇంత ఆలోచించవలసి వచ్చింది రాముడికి. విరహ ➔

రాముడికి గొప్ప జ్ఞానోదయం కలిగినట్టు సంతోషం కలిగింది. అవును. సీత పతివ్రత. పతి సేవే .... పతి భక్తే .... ఆమె వ్రతం. ఆమె ఎన్నడూ రావణుడికి లొంగదు! అంత దుర్మార్గానికి వడిగట్టదు!

రాముడి మనస్సంతా పండుటాకులాగ తేలికై పోయింది. పుట్టెడు బలంతో లేచాడు. జగత్తంతా ఆనంద సముద్రమై గోచరించింది.

గాలి కోవిదార పూల వాసనలు మోసుకు పోతోంది. పంపలో రెండు ఏనుగులు దిగి, తొండాలతో చుట్టూ నీళ్ళు జిమ్ముతున్నాయి. ఒక దాని మీద ఒకటి జిమ్ము కుంటున్నాయి ఆటలాగ. తుమ్మెదలు, పూల రుచులు వెదుకుతూ తిరుగుతున్నాయి. చెట్లు, గాలికి తల లూపుతూ, కొమ్మలూ కొమ్మలూ కలుపుకొని నాట్యం చేస్తున్నాయి.

పిట్టలన్నీ హఠాత్తుగా సంతోష వార్త విన్నట్టు గంతు లేస్తున్నాయి. "పంపలో గడ్డి దుబ్బులనిండా బోలెడు పురుగులున్నాయి. ఇప్పుడే కడుపునిండా తిని వొచ్చాను. వెళ్ళండి, తొందరగా వెళ్ళండి!"

"మొన్న తినేశాంగా?"

"కాదు, మళ్ళీ ఉన్నాయి, వెళ్ళండి తొందరగా!"

"ఏం పురుగులు? ఎఱ్ఱవేనా? రుచిగా ఉన్నాయా?"

"అబ్బ! .... మళ్ళీ నా నోరూరుతోంది. పదండి, నేనూ వొస్తాను."

పిట్టలు గుంపులు గుంపులుగా అడివంతా ఎగురుతున్నాయి.

"లక్ష్మణా .... అటు చూడు! పంపకు దక్షిణం వేపు పర్వత పాదంలో మధూక లతలు విరగబూసి నన్ను పీడిస్తున్నాయి సుమా!...."

"అటు చూడకండి అన్నగా ...."

"ఇటు చూడు, జింకలు జంటలు జంటలుగా జింక కన్నుల సీతని గుర్తు చేస్తున్నాయి, చూడు!"

"ఇటు చూడకండి అన్నగా ....!"

"అయ్యో! .... ఈ పక్షులు నాకు కామోద్దీపనం కలిగించడానికే గుంపులు గుంపులుగా చేరుతున్నాయే!"

"ఎటూ చూడకండి అన్నగా ...."

లక్ష్మణుడి సలహాలన్నీ వ్యర్థం అయిపోతున్నాయి. రాముడు రుష్యమూకం వేపు తప్ప అన్ని వేపులా చూస్తున్నాడు.

చెట్లని అల్లుకున్న తీగలు బలిసిన స్త్రీల లాగ కనిపించి, రాముడి మన్మథ తాపాన్ని వృద్ధి చేస్తున్నాయి.[246]

"ఈ వసంత రుతు కుటిల స్వభావం ఆశ్చర్యంగా ఉంది. సీతనే మాటి మాటికీ గుర్తు తెస్తోంది."

సీతని మర్చిపోవాలనే వుంది రాముడికి. కానీ, ఈ రుతువే ఆమెని మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తోంది.

లక్ష్మణుడు చుట్టూ చూస్తున్నాడు, ఎక్కడయినా ఆశ్చర్యంగా సీత కనపడుతుందేమోనని.

రాముడు వెతకడం మానేశాడు, అదంతా లక్ష్మణుడి పని అయినట్టు!

"ఆ మామిడి చిగుళ్ళు ఎఱ్ఱని జ్వాలలై మండుతున్నాయి చూడు .... అయ్యో! లక్ష్మణా! .... ఈ మదనుడు .... మిక్కిలి క్రూరంగా .... హింసిస్తున్నాడే!" అని విలవిల్లాడుతూ మూర్ఛిల్లాడు భూమి మీద.

లక్ష్మణుడు తుళ్ళిపడి గిఱ్ఱున వెనక్కి తిరుగుతూ కత్తి తీశాడు. – "ఎవరు? .... ఎవరు అన్నగారూ! ఎవరు మిమ్మల్ని హింసించింది? .... ఎవడా దుర్మార్గుడు?" అంటూ చుట్టూ చూశాడు.

రాముడు నిట్టూర్పులతో, "ఈ మదనుడు .... పూల విలుకాడు .... వసంతాగ్నితో కుమ్మక్కై ...."

"మదనుడా? .... మదను డెవరు? .... ఓహో! మన్మధుడా?" అని లక్ష్మణుడు ఆవేశం తగ్గి – 'సరి.

---

➔ బాధ వల్ల సీత జీవించడం సాధ్యం కాకపోతే ఆమె బతికే అవకాశం కూడా ఒకటి ఉంది – అది రావణుడికి వశం కావడం. "కానీ, అలా మాత్రం జరగదు. ఆమె పతివ్రత కాబట్టి చచ్చిపోయినా చచ్చిపోతుంది గానీ ఇంకో రకంగా ప్రవర్తించదు" అని రాముడు నిర్ధారణ చేసుకుంటున్నాడు.

వసంత రుతువూ, చచ్చిపోయేంత విరహమూ, ఇవన్నీ ఫ్యూడల్ సాహిత్యంలో అతిశయాలే. సీత విరహంతో చచ్చిపోతే రాముడు సంతోషిస్తాడు గానీ, ఆమె మళ్ళీ కంటబడి బలాత్కారానికి గురైందని తెలిస్తే, ఆమెతో జీవితం ఇష్టపడడు. ఈ విలువల్ని మనం అర్థం చేసుకోవాలి. ★

**246.** **కిష్కింధా, సర్గ 1, శ్లోకం 84:** "ఈ వృక్షములను, మదించిన (బలిసిన) ఉత్తమ స్త్రీల వలే లతలు, ఆలింగనము చేసుకొను చున్నవి." – ఫ్యూడల్ సాహిత్యంలో ఉత్తమ స్త్రీలు అంటే, బలిసిన స్త్రీలు! ఆ బలవడం అస్తవ్యస్థంగా, ఎలాబడితే అలా బలవకూడదు. స్తనాలు బలవాలి. నడుం కనపడనంతగా చిక్కి శల్యం అయిపోవాలి. తొడలూ, పిరుదులూ బలవాలి. పెదాలూ, చెక్కిళ్ళూ పల్చగా సన్నగా, ఆకులలా అయిపోవాలి. ఈ రకంగా. చెక్కిళ్ళు చిక్కీ, స్తనాలు బలిసీ, నడుం చిక్కీ తొడలు బలిసీ – తీగలాగ మెలికలు తిరిగిపోతూ వుంటే – ఆ స్త్రీ ఉత్తమ స్త్రీ! పద్మినీ జాతి స్త్రీ! – పురుషులు ఇలాంటి ఉత్తమ స్త్రీలనే కోరతారు. స్త్రీ శరీరం పురుషుడికి అంత ఆనందం కలిగించని విధంగా ఉంటే, ఆమె శంఖినీ జాతి స్త్రీ! అధమాధమురాలు!

ఈ నిబంధన లేవీ పురుషుడి శరీరానికి లేవు. ★

ఇక వాడినేం చేస్తాం? తుంటరి సన్యాసి' అన్నట్టు కత్తి వొరలో పెట్టి ఆలోచిస్తూ నించున్నాడు.

"లక్ష్మణా! .... ఈ చల్ల గాలి ...."

"అన్నగారూ! .... నాకు శెలవిస్తే .... సుగ్రీవుడి కోసం పోయి వస్తాను."

"సుగ్రీవుడా? సుగ్రీవుడెవడు?" అన్నట్టు చూశాడు రాముడు.

లక్ష్మణుడు తన ధోరణిలో – "అన్నగారూ! .... అదే రుష్య మూక పర్వతం. కబంధుడు చెప్పినట్టు .... అక్కడికి పోవడం కష్టంగానే తోస్తోంది. అయినా ప్రయత్నించి, కార్యం సాధించుకుని వస్తాను. శెల విప్పించండి!" అని వంగి నమస్కరించాడు.

కబంధుడు .... పొట్టలో మొహం .... దహనం.... పంపా సరస్సు .... చేపలూ, రొయ్యలూ .... రుష్యమూకం .... ఓహో! సుగ్రీవుడా? – అంతా గుర్తొచ్చింది రాముడికి. నిరాశగా నిట్టూర్చాడు – రాజ్యం లేని సుగ్రీవుడెలా సహాయం చెయ్యగలడు? రాక్షస రాజుతో యుద్ధం మాటలా? సైన్యం ఉండాలి! బొక్కసం ఉండాలి!

"ఇంతకీ .... మనం సుగ్రీవుడికేదో సహాయం చెయ్యాలన్నాడే కబంధుడు! అదేమై ఉంటుందో ఆలోచించావా లక్ష్మణా?"

"అక్కడికి పోయి అన్నీ తెలుసుకుని వస్తాను అన్నగారూ!"

రాముడు చుట్టూ చూశాడు. అంతా ప్రశాంతంగానే వుంది. పక్షులూ, జింకలూ తప్ప .... క్రూర మృగాలేవీ .... "లక్ష్మణా! నా సీత నాకు దక్కుతుందా? నేనీ శోకంతో విరహంతో .... కృంగి కృశించి, నశించి పోతానోయీ! .... నా భార్య యౌవ్వనవతి. సౌందర్యరాశి. నిర్దోషి. మదించిన ఉత్తమ స్త్రీలవలే ఏపుగా పెరిగిన లతలు వృక్షాలను విడవకుండా పెనవేసుకునే ఉన్నాయి చూడు! గాలి రక రకాల సుగంధాలు తాగి మత్తెక్కి పిచ్చివాడి వలే సంచరిస్తోంది చూడు! ఈ శోభలన్నిటినీ కాంతలతో కూడిన పుణ్యపురుషులే అనుభవించగలరు గదా? ...."[247]

కాంతలు! .... పర కాంతలు! రావణుడు ....! మళ్ళీ ఏమిటీ ఆలోచనలు? .... కూడదు. కూడదు.

"నా సీత సోయగాలు .... చక్కని కను రెప్పలు .... కురులు .... చెక్కిళ్ళు...." భార్యని పర పురుషుడు ఎత్తుకుపోయిన తర్వాతే భార్య అందాలు .... పదే పదే గుర్తు వస్తున్నాయి రాముడికి. అంత అందమైన తన భార్య .... పర పురుషుడి గృహంలో ....! ఈ ఆలోచనలు విడిచిపోకుండా ఉన్నాయే తన మనసుని! ఆశ్చర్యంగా ఉంది! సీతకు తన పట్ల మిక్కిలి అనురాగం .... తనూ ఆమె పట్ల ఆ విధంగానే అనురాగం చూపించాడు. సీత సామాన్యురాలు కాదు సుమా! .... మహా పతివ్రత! నిర్దోషి![248]

---

**247.** **కిష్కింధా, సర్గ 1, శ్లోకం 110:** "మనోహరమైన కనురెప్పలతో గూడిన కన్నులు గలదియూ, సువాసనలు గలదియూ, కాంతిగలదియూ, నిర్దోషి యైనదియూ .... నగు సీత ముఖమును చూడకయుండు నా మనసు దుఃఖించుచున్నది ...."

సీతని రావణుడెత్తుకు పోకముందు, సీత గురించి ఎక్కడ వర్ణన వొచ్చినా ఈ 'నిర్దోషి' అనే మాట ఎక్కడా రాలేదు. ఇప్పుడీ 'నిర్దోషి' అనే మాటకు అర్ధమేమిటి? "ఆమె, దోషం చేసిందా చెయ్యలేదా?" అనే సంఘర్షణకి జవాబు ఇది. "ఆమె దోషం చెయ్యలేదు సుమా! రావణుడితో ఇష్టపడి వెళ్ళలేదు సుమా!" అని రాముడు తనకు తను నచ్చచెప్పుకుంటున్నాడు. లేకపోతే, 'నిర్దోషి అయిన సీత ..., నిర్దోషి అయిన సీత" అని అస్తమానూ గుర్తు చేసుకోవలసిన అవసరం ఏముంది? భార్య యౌవ్వనవతిగా ఉండాలి. సౌందర్య రాశిగా ఉండాలి. నిర్దోషిగా ఉండాలి. అలాంటి భార్య పోతే, భర్త, వసంతకాలంలో కాస్సేపు విరహంతో ఏడుస్తాడు. ఆ రుతువు కాకపోతే అదీ లేదు.

రుతువుల్నిబట్టి కామం కలగడమూ, కలగకపోవడమూ అనేవి, ప్రధానంగా, జంతువుల విషయంలోనే వుంటాయి. మానవ దేహాల మీద కూడా రుతువుల ప్రభావాలు కొన్ని వున్నా, ఇక్కడ (మానవుల విషయంలో) అది ప్రధాన లక్షణం కాదు. ఇక్కడ, స్త్రీ పురుషుల మధ్య అన్యోన్యతా, అనురాగాలే ప్రధాన విషయాలు. అవి, రుతువుల్ని బట్టి వుండవు.

భార్యని శత్రువు ఎత్తుకుపోతే, ఆమె మహా ప్రమాదంలో వుంటే, మహానుభావుడైన ఈ భర్త, 'కామం'కోసం ఏడుస్తున్నాడు! పైగా, పదమూడేళ్ళ నించీ స్త్రీ స్పర్శని మర్చిపోయి నిర్వికారంగా వున్న తమ్ముణ్ణి పక్కన పెట్టుకుని! ఆ తమ్ముడికే తన 'కామ బాధ'ని చెప్పుకుంటూ!

ఫ్యూడల్ కవులు బొత్తిగా మూర్ఖులు! వర్ణనలూ సంఘటనలూ, సందర్భాల్నిబట్టి వుండాలి – అనే ప్రాధమిక విషయం కూడా వాళ్ళకి తెలీదు. ప్రపంచం అంతా, కథా నాయకుడి కామ బాధ గురించే కన్నీరు కార్చాలి – అనుకుంటారు. 'వసంత రుతువుల్లో కామోద్దీప వర్ణనలూ' అవీ, జంతు సంబంధాలకూ మానవ సంబంధాలకూ తేడా తెలియని మూర్ఖ చేష్టలే! ★

**248.** **కిష్కింధా, సర్గ 1, శ్లోకం 52:** "సీత నా యెడల అనురాగమును బాగుగా నుంచి యున్నది. నేను కూడా అటులనే సీత యెడల అనురాగమును సర్వ విధముల చేతనూ యుంచియున్నాను" – ఇది, కేవలం వసంత రుతు వర్ణనో, సరస్సు వర్ణనో కాదు. రాముడు – తనకూ తన భార్యకూ మధ్యవున్న సంబంధం ఎటువంటిదో విమర్శించుకుంటున్నాడు. ఎందుకంటే, ➔

"లక్ష్మణా! సీత పతివ్రతల మార్గం అనుసరించి కష్ట నిష్ఠూరాల కోర్చి నా వెంట వచ్చింది. రాజ్య భ్రష్టుణ్ణయి మతి చెడివున్న నన్ను వొదలకుండా తిరిగింది. అటు వంటి సాధ్వి నాకు దూరం అయి పోయిందే! రేపు అయోధ్యకు పోయిన తర్వాత సభలో 'సీత క్షేమంగా ఉందా? ఏదీ?' అని జనక మహారాజు అడిగితే ఏమి చెప్పగలను? నా కోడలేదని నా తల్లి అడిగితే ఏమి చెప్పగలను? అక్కడ భరతుడు సుఖ భోగాలు విడిచి రుషి జీవనంతో కాలం గడుపుతున్నందుకే దుఃఖంతో కుంగి పోతున్నాను. అంతలో ఈ భార్యా వియోగం! .... అదీ చాలక, నిలువెల్లా దహించి ప్రాణాలు దీసే ఈ మన్మథ బాధ! .... ఇక నేనేమి జీవిస్తాను? లక్ష్మణా! నువ్వు అయోధ్యకు వెళ్ళిపో నాయనా! భరతుడు బహు యోగ్యుడు. సోదర వాత్సల్యము గలవాడు. అతడి దగ్గర సుఖంగా జీవించు. నేనీ వనంలో ప్రాణాలు విడుస్తాను. సీత లేకుండా నేను ఒక్క క్షణమైనా జీవించలేను సుమా!" అని భుజాలు కదిలిస్తూ కుమలడం మొదలు పెట్టాడు.**249**

లక్ష్మణుడికి చాలా సేపట్నించీ దాహంగా ఉంది. పంపలోకి దిగి మంచి నీళ్ళు తాగాలని ఆలోచిస్తున్నాడు. అన్నగారి దుఃఖం చూడగానే క్షుద్ర దాహ వాంఛా, పర్వతం ఎక్కాలనే తొందరా కట్టిపెట్టి, చేతులు ముడిచి, వినయంగా అన్నగారి పాదాలు పట్టుకుని, మోకరిల్లాడు భూమిమీద – "మన్నించండి అన్న గారూ! ఈ అల్పుడు మీకు బోధించదగ్గవాడు కాదు. మీరు బహు ఉత్తములు! ధైర్యస్తులు! వీరాధి వీరులు! మీ ఉత్తమ గుణాలను మీరు విస్మరించడం న్యాయం కాదు. మీ వంటి ధీరులు ఈ విధంగా నిస్పృహ చెందడం ధర్మమేనా? ప్రియమైన వారు విడిపోయి నప్పుడు దుఃఖం కలగడం లోకంలో సహజమే కదా? అయినప్పటికీ దూరంగా వున్న ఆప్తుల మీద విశేషమైన అనురాగం కొంత కాలం తగ్గించుకొని, ధైర్యం వహించాలి .... అహా, మీకు చెప్పగలవాడినని కాదు సుమా! కార్యాలు చెడిపోయినప్పుడు పురుష ప్రయత్నం చెయ్యకుండా కార్యాలు సానుకూల పడవు గదా? ఉత్సాహాన్ని మించిన బలమేముంది? మీ రెరుగని విషయం కాదు. ఉత్సాహమే ఉంటే సాధించలేని కార్య మేముంది? శక్తి సామర్థ్యాలు గల మీ వంటి పురుషోత్త ములు కార్యసాధన విషయంలో ఇంతగా దుఃఖించరాదు గదా?...."

రాముడు గుడ గుడమంటూ కుములుతూనే వున్నాడు.

లక్ష్మణుడు నిరుత్సాహపడ లేదు. మాటలు వేరూ, చేతలు వేరూ కాని లక్ష్మణుడు ఉత్సాహం కూడగట్టు కున్నాడు – "అన్నగారూ! ధైర్యం వహించండి! మీరు ఆత్మ నిగ్రహులు! ఇంద్రియాలు జయించిన వారు! కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు కలగవు మీకు. ఈ క్షుద్ర కామ వాంఛకు మీరు లొంగరాదు కదా? .... ఈ శోకం .... ఈ కామం .... వెంటనే విడిచి పెట్టె య్యాలి. మీకు ఈ బేలతనం కూడదు. మీ ధైర్యం ఏమైపోయింది? మీ ధైర్యసాహసాలతో మీరు వదినగార్ని వెదికి సాధించగలరు. రావణుడు పాతాళ లోకానికి పోయినా .... ఇంకా లోతయిన లోకానికి పోయినా, వాడిని మీ కరుకు బాణాలు విడిచిపెట్టవు గదా? .... ఆ దుర్మార్గుడు .... తనకు తానుగా వదినగార్ని తెచ్చి మీకు

---

➔ ఆమె ఏమైనా తప్పు చేసే అవకాశం వుందా అని చూసుకుంటున్నాడు. ఆమె తనని ప్రేమించింది, సరే! తను కూడా ఆమెని బాగానే ప్రేమించాడు. కష్టపెట్ట లేదు. పోనీ తను ఆమె నేమైనా కష్టపెడితే ఆమె పర పురుషుడి మీద ఇష్టం చూపడానికీ, నీతి తప్పడానికీ, అర్థం ఉంటుంది. తను అట్లా చెయ్యలేదే! – మనసులో సంఘర్షణ ఇది. 'సీత తప్పు చేస్తుందేమో!' అనే ఆలోచనే దీనికి మూలం. భార్య పర పురుషుడి ఆధీనంలో ఉన్నపుడు భర్తకి ఎటువంటి ఆలోచనలూ, సందేహాలూ వస్తాయో అవన్నీ, కవి మనసులోకి వస్తున్నాయి. వాటినే చిత్రిస్తున్నాడు. పైకి – ఆదర్శ దాంపత్యం అనీ, అనురాగం అనీ ఎన్ని తెరలు కప్పినా, ఎంత కవిత్వంతో చెప్పినా, సీతకీ రాముడికీ మధ్య ఉన్న సంబంధాన్ని తర్కించి చూసినప్పుడు, అది, ఫ్యూడల్ సమాజంలో సామాన్యమయిన భార్యాభర్తల మధ్య ఉన్న సంబంధం లాంటిది మాత్రమే. ★

**249.** **కిష్కింధా, సర్గ 1, శ్లోకాలు 5, 113:** "భరతుడు నగరమునకు వెలుపల వసించి, ప్రతోప వాసములు చేయుటచే కలిగిన దుఃఖము చేతనూ, సీతాపహరణము చేతనూ దుఃఖించుచుండు నన్ను వసంత రుతువు బీడించుచున్నది"

భరతుడి గురించి రాముడు పడుతున్న దుఃఖం ఇంతవరకూ మన కళ్ళపడలేదు. చాటుగా కుములుతున్నాడేమో మరి, కవిగారికి కూడా తెలీకుండా! శత్రుఘ్నుడి గురించీ, లక్ష్మణుడి గురించీ మాత్రం ఏ దుఃఖమూ లేదు. "లక్ష్మణా! అయోధ్యకు పొమ్మ" అంటున్నాడు రాముడు. నిజంగా వెళ్ళమనేనా? లక్ష్మణుడెలాగూ వెళ్ళడు కదా అని! వెళ్ళడని బాగా తెలుసుగనకే ఊరికే పైకి అలా అనడం. అంతా నటన! వంచన! తనతో కలిసి జీవిస్తూ, తనతో కష్టాలు పడుతోన్న తమ్ముణ్ణి 'నువ్వెళ్ళిపో నాయనా' అని మాట వరసకి అన్నంత మాత్రాన, ఉత్తముడై పోతాడా అన్నగారు? "సరే అన్నగారూ! వెళ్ళెదను" అని లక్ష్మణుడు వెనక్కి తిరిగితే ఎంత బాగుండును! కానీ, అలా జరగదు. అది తమ్ముడి మనస్తత్వానికి విరుద్ధం. సమాజంలో ➔

అప్పగించకపోయాడో... నేనే.. అక్కడికి పోయి ...."[250]

రాముడు దుఃఖ సముద్రంలోంచి కొంచెం తల ఎత్తి కుములుతూ – "అయ్యో .... పిచ్చివాడా! .... పురుషుడు .... పర స్త్రీని తనకు తానుగా అప్పగిస్తాడా? ...." అని, "నేనైతే అప్పగించను సుమా!" అన్నట్టు చూసి, మళ్ళీ కుమలడానికి తల వొంచుకున్నాడు.

లక్ష్మణుడు వీరావేశంతో, అన్నగారి పాదాల దగ్గిర ఊగుతూ – "అప్పగించడా? సరే! అప్పగించకపోతే సర్వ నాశనం అయిపోతాడు. వాడు ఇంద్రుడి తల్లి గర్భంలో దాక్కున్నా నేను విడిచి పెట్టను. మీ వరకూ ఎందుకు అన్నగారూ? .... నా కరుకు బాణాలే ...."

"అయ్యో .... సీతా! .... ఎక్కడున్నావో గదా! .... సీతా! అయ్యో! .... నిన్ను చూడకుండా .... ఈ వసం తాగ్ని .... అయ్యో! .... నేనెలా జీవించగల ...."

లక్ష్మణుడి నవ నాడులూ కుంగబోయాయి. ధైర్యం వహించాడు. – "అన్నగారూ .... ధైర్యం వహించండి! .... మీకు చెప్పగల వాడిని కాను."

ఆ అన్నదమ్ముల పక్కనే వున్న పూలమొక్కలు తెల్లబోతున్నాయి.

"చందనా! .... ఆయనెవరో నీ కేమన్నా తెలుసా?" – వకుళ తీగ.

"అదే చూస్తున్నాను వకుళా! .... అన్నదమ్ముల్లా ఉన్నారు, అన్నగారు అఖండుడిలా ఉన్నాడు!"

"పాపం ఎందుకో దుఃఖపడుతున్నాడే!"

"అవును. చాలా దుఃఖపడుతున్నాడు .... 'సీతా, సీతా' అంటున్నాడు. భార్య చచ్చిపోయినట్టుంది."

"పోయి ఉండదు. పోలేదనే దుఃఖపడుతున్నాడేమో!"

"ఛ! ఏం మాటలర్రా మీరూ?" అంది పెద్ద అశోకం.

"ఏం మాటలేవిటి? .... మానవ పురుషులు, భార్యలు పోయినంత మాత్రానే దుఃఖపడతారంటావా? భార్యలేం లోటా వాళ్ళకి? బోలెడు మంది దొరుకుతారు."

"సరేలే! ఎప్పుడూ నీ మాటలింతేగానీ .... ఆ అన్న గారేదో అంటున్నాడు. విందాం, ఉండండి!"

"ఏం వింటావు? .... పాపం ఆ తమ్ముణ్ణి ముప్పు తిప్పలూ పెట్టి పంప నీళ్ళన్నీ తాగించేలా వున్నాడు!"

"అబ్బ, ఊరుకుందూ!"

రాముడు, తల భుజం మీద పెట్టి, భుజం మోకాళ్ళ మీద పెట్టి, మోకాళ్ళు నేల మీద పెట్టి, మనిషంతా నేలని కరిచిపెట్టుకుని కుములుతోనే ఉన్నాడు. గడ్డిలో పురుగులు రాముడి మోకాళ్ళ వేపు చూస్తున్నాయి ఆశగా!

ఎండ మారుతోన్న కొద్దీ పంప ముస్తాబు చేసుకుంటోంది, కొత్త పూలతో. ఆ పూట అన్నీ తెల్ల పూలే పూశాయి. తుమ్మెదలు అటు పరుగెత్తుతున్నాయి. గాలి, కొత్త పరిమళాల్ని రాముడి మీదుగా మోసుకుపోయింది. రాముడు తల ఎత్తి, భుజం ఎత్తి, మోకాళ్ళు దులుపుకున్నాడు.

"అన్నగారూ! తమరు జితేంద్రియులు! వీరాధి వీరులు!......"

"అయ్యో!.... సీతా!.... ప్రియురాలా!"

"అన్నగారూ! గాలి తాకిడికి పర్వతాలు చలించవు. మీ వంటి ధీరులు కష్టాలకు చలించరు."

"అలాగా లక్ష్మణా?"

"అలాగే అన్నగారూ!"

"అయ్యో! .... సీతా! .... ప్రియురాలా! .... నువ్వు రాకుండా ఉంటే .... యెంత బాగుం...." చప్పున లేచి పంచె దులుపుకున్నాడు. మర్రి మొదళ్ళ వలే బలిసిన తొడలు దులుపుకున్నాడు.

రెండు మిడతలు ఎగిరి దూరంగా పడి మొహాలు చిట్లించాయి.

**[ఈ కథకీ, తర్వాత కథకీ మధ్య 'లింకు' లేదు.**
**తర్వాత కథ, వెంటనే ప్రారంభమవుతుంది.]** ★

---

➔ మామూలు మనుషులు పైకి మర్యాదకీ, నటనకీ, మొహమాటానికీ మాట్లాడినట్టే రాముడూ మాట్లాడుతాడు. ఆ సమాజ ప్రభావాన్ని మించిన 'ఆదర్శ జీవితం' కవికి తెలియదు. ★

**250.** **కిష్కింధా, సర్గ 1, శ్లోకాలు 116, 128:** లక్ష్మణుడు, రాముడికి ఏ విధంగా ధైర్యం నూరిపోశాడో చూడండి " .... దుఃఖం విడిచిపెట్టు. కామం విడిచిపెట్టు .... మంచి మనసు గల వానినిగానూ .... ధైర్యముగల వానినిగానూ, నిన్ను నీవు తెలుసుకొనలేదు" అంటున్నాడు లక్ష్మణుడు. – ".... రాముని విషయమై, ప్రేమకు చంచలము లేనివాడునూ మిగుల ధైర్యము గలవాడునూ అగు లక్ష్మణుడు, రాముడికి రాజనీతినీ, అతని బలమునూ దెలిపి, దుఃఖము పోగొట్టెను" – రాముడి బలమేమిటో లక్ష్మణుడు చెప్పడం! ★

## కథ-7

# తోడు దొంగలు!

## [రాముడూ-సుగ్రీవుడూ]

సుగ్రీవుడు, పర్వతం మీద బండల చాటు నించి లక్ష్మణుణ్ణీ, రాముణ్ణీ తొంగి తొంగి చూస్తున్నాడు. వాళ్ళ చేతుల్లో పెద్ద పెద్ద కత్తులూ, బాణాలూ ఉన్నాయి. పైగా వాళ్ళిద్దరూ పర్వతం మీదకే దారి వెతుక్కుంటూ వొస్తున్నారు! – వీరాధి వీరుడయిన సుగ్రీవుడికి బాహువుల్లో చిన్న చిన్న కంపనాలు ప్రారంభమయ్యాయి. ఎవరు వాళ్ళు? ఆయుధాలతో వాళ్ళకీ పర్వతం మీదేం పని? ... ఇంకేం పని? వాలే పంపించి ఉంటాడు, తనని చంపేసి రమ్మని. లేకపోతే వాళ్ళకేం పని ఇక్కడ?

ధీరుడైన సుగ్రీవుడు బండల చాటున కూలబడి, కాళ్ళూ చేతులూ పొట్టలో పెట్టుకుని ముడుచుకున్నాడు. ఇక ఒక్క క్షణంలో తన పని అయిపోతుంది! వాళ్ళు .... తప్పకుండా పర్వతం ఎక్కి .... తనని వెతికి పట్టేసుకుని .... ఆ కత్తులు గుండెల్లోంచి వీపులోకో .... వీపులోంచి డొక్కలోకో .... వీపులోంచి వీపులోకో....!

సుగ్రీవుడి హస్త ద్వయం తొట్రుపడుతూ బండల మీద తాళం వేస్తోంటే, సైగలు చేసి పిలుస్తున్నాడనుకుని, దూరంగా చుట్టలు కాల్చుకుంటూ కూర్చున్న నీలుడూ, తారుడూ గబగబా లేచి వొచ్చారు – "ఏమిటేమిటి మహారాజా?" అంటూ.

పరాక్రమవంతుడు కాబట్టి సుగ్రీవుడు, శక్తి సామర్థ్యాలన్నీ ఉపయోగించి నేర్పుగా తాళాలు అరికట్టి, దవడలు బిగబట్టి, దంతాలు బంధించి, వొక్క వేలు విప్పి బండల చాటునించి ఆ 'భయంకర దృశ్యం' చూపించాడు.

"ఎవరో రుషుల్లా ఉన్నారు మహారాజా!" అన్నాడు నిర్లక్ష్యంగా తారుడు. తారుడు సుగ్రీవుడి మామగారే. అల్లుడు మహారాజయితే చూడాలని తారుడి కోరిక. అందుకే, తారుడు అల్లుణ్ణి 'మహా రాజా, మహారాజా' అని పిలుస్తూ ఉంటాడు. మహా రాజుకి చూపే వినయం చూపిస్తూ ఉంటాడు.

సుగ్రీవ మహారాజుకి, వొణుకుని మించిన కోపం వచ్చింది – "రుషులా.... గిషులా? రుషులైతే ఆ కత్తులూ బాణాలూ ఎందుకూ? రుషుల చేతుల్లో అవి వుంటాయా? దొంగ వేషాలన్నీ. వాలి దుర్మార్గుడే పంపినట్టున్నాడు. ఇక మనం...." పట్టుదప్పి రాజు గారి దవడలు టక టక కొట్టుకున్నాయి.

సుగ్రీవ మహారాజుగారి చుట్టుపట్ల చీమ చిటుక్కుమంటే, ఆ చీమని వాలి దుర్మార్గుడు పంపినట్టే లెక్క! తనని చంపెయ్యడానికి కాకపోతే చీమ ఎందుకొస్తుంది పర్వతాల మీదకి? .... దానికేం పని పర్వతాల మీద? .... పోనీ ఆ వొచ్చే వాళ్ళు చీమలూ కారు, దోమలూ కారు. ఆంబోతుల్లా ఉన్నారు. పైగా .... చేతుల్లో .... అంతంత...."

"అవుననుకుంటా, రుషులయితే ఆ కత్తులెందుకూ?"

"మరే! .... ఆ బాణాలెందుకూ?"

తారుడూ, నీలుడూ ఒకే రకం సందేహంలో పడ్డారు. నళుడు కూడా వచ్చి, కత్తులు చూసి, సందేహంలో కలిశాడు.

హనుమంతుడు ఆకులు కాల్చి ముక్కు పొడుం నూరుకునే తొందరలో ఉన్నాడు.

సుగ్రీవుడు దవడలు బిగబట్టి గంభీరంగా బండలోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేస్తూ–"ఇప్పుడేం చెయ్యాలి? .... తేల్చండి గమ్మున! ఆలోచించండి దబ్బున!" అన్నాడు దబదబా. ఆ రెండు ముక్కలూ అనేసి 'మంత్రులు మీరా, నేనా? .... నేను మంత్రినా ఏంటి ఆలోచించటానికి!' అన్నట్టు చిర చిర లాడి పోతూ చుట్టూ చూశాడు.

"కాదు మహారాజా! నువ్వు మంత్రివి కాదు. నువ్వు మహారాజువే మహారాజా! మంత్రులం మేమే."

"మరైతే ఆలోచించండి దబ్బున!"

మంత్రులు ముగ్గురూ ఆలోచనకు ఉపక్రమించారు. కూడబలుక్కున్నారు. "శత్రువు హఠాత్తుగా, మీదకురికినప్పుడేం చెయ్యాలో గుర్తుందా నీకు?" అని నీలుడు తారుణ్ణడిగాడు కంగారు పడుతూ.

"ఊరికే కాదయ్యా ఉరకటం. కత్తుల్తో! కత్తుల్ని కలపండి!" అని విసుక్కున్నాడు సుగ్రీవుడు.

"అదే మహారాజా! అదే ఆలోచిస్తున్నాం. కత్తుల్ని కూడా కలిపే ఆలోచిస్తున్నాం."

"ఊఁ .... సరే! .... గమ్మున .... అన్నట్టు బాణాలు

కూడా కలపండి!"

మంత్రులు గమ్ముగమ్మున రాజ నీతులన్నీ గుర్తు తెచ్చుకున్నారు. అందరికీ వొక్క ధర్మమే గుర్తొచ్చింది. చివరికి గొప్ప జ్ఞానంతో, ఏకాభిప్రాయంతో చక్కని ఆ ఒక్క 'శాస్త్ర ధర్మం' బయట పెట్టారు. – "గమ్మున .... ఎవరి పిక్క బలం వాళ్ళు చూపించవలసిందే, మహా రాజా!"

"కీడెంచి మేలెంచమన్నారు రాజ నీతిలో. కొండ గుహల్లో తలలు దాచేసుకుందాం మహా...."

అప్పటికే బండలమీదనించి దూకుడు ప్రారంభిం చాడు సుగ్రీవ మహారాజు. గుహలో తల దాచెయ్యాలని రాజనీతిలో ఉన్నప్పుడు .... ఎవరు మాత్రం చెయ్యగలిగే దేముందీ?

ఆ దూకే మహారాజుకి 'శత్రు భయంకరుడ'నే గొప్ప బిరుదు ఉంది! 'వీరాధి వీరుడ'నే ఇంకో బిరుదు కూడా ఉంది! 'వెన్ను చూపని వాడ'నే ఏడో బిరుదు ఉంది! 'పరాక్రమవంతుడ'నే పదిహేడో బిరుదు ఉంది! 'ధైర్య శాలి' అనే ఇరవయ్యేడో బిరుదు ఉంది! ఎన్ని బిరుదు లయినా 'కత్తుల' ముందు తీసి కట్టే కదా? తలలన్నీ గుహల్లో దాచెయ్యాలని రాజనీతి హెచ్చరిస్తోంటే నళుడూ, నీలుడూ, తారుడూ, శక్తి కొద్దీ వొకర్ని తోసు కుంటూ వొకరు దాటుళ్ళు సాగించారు.[251]

సుగ్రీవ మహారాజు తల, గుహ దాకా చేరక ముందే నళుడు నీలుడి మీద పడి, నీలుడు తారుడి మీద పడి, తారుడి కాళ్ళల్లో రాజుగారి పట్టు పంచె లుంగలు పడి, రాజుగారు బండల మీద బోర్లా పడ్డారు. రాజుగారి మోకాళ్ళ చిప్పలు రెండూ ఎర్రటి పద్మాలై, కన్నులు రెండూ నల్లటి మేఘాలై, ఆ మేఘాలు బండల మీద జల జలా వర్షించాయి. రాజుగారూ, మంత్రులూ, లుంగలు చుట్టుకుని దొర్లుతున్న ఉపద్రవ దృశ్యం చూసి చెట్ల మీద పిట్టలన్నీ కంగారు పడిపోతూ గోలగోలతో చప్పుళ్ళూ, ఎగురుళ్ళూ, దూకుళ్ళూ ప్రారంభించాయి.

హనుమంతుడు ముక్కుల నిండా పొడుం దట్టించి, మిగిలిన పొడుం ఆకుల్లో చుట్టి బొడ్లో దోపుకుంటూ, దారి పొడుగునా చీదుకుంటూ అప్పటికి లేచి వొచ్చాడు.

సుగ్రీవుడు, బండమీద రాజఠీవితో చతికిలబడి, కళ్ళ నీళ్ళు గంభీరంగా పెట్టుకున్నాడు.

దగ్గరున్న మంత్రులు ముగ్గురూ రాజుగారి మోకాళ్ళ చుట్టూ చేరి శక్తి కొద్దీ ఊదుడు వైద్యం ప్రారంభించారు.

మోకాళ్ళు మంత్రుల కప్పగించి, మహారాజు దవ డల వ్యవహారం తనే చూసుకుంటూ, వాటిని అదిమి పడుతూ – "వాళ్ళకి కత్తులూ కఠార్లూ ఉన్నాయే! వాళ్ళూ మీరూ కలబడితే .... పోనీ నేను కూడా అనుకుందాం .... మన అయిదుగురం .... వాళ్ళిద్దర్నీ చంపెయ్య గలమా?... అబ్బో! .... కష్టమే! కత్తులా, మాటలా?...." అని మోకాళ్ళు ముడవబోయి విలవిల్లాడాడు.

హనుమంతుడు రాగానే సాటి మంత్రులందరూ సైగలు చేసి అతనికి బండల చాటు నుంచి 'అసలు ఘోరం' చూపించారు.

లక్ష్మణుడు కత్తితో పొదల మీద చప్పుడు చేస్తూ, పురుగూ పుట్రాలేని దారి వెతుక్కుంటూ ముందు నడుస్తు న్నాడు. రాముడు నేర్పుగా లక్ష్మణుడు అడుగు తీసిన చోట అడుగు వేస్తూ లక్ష్మణుడి అడుగు జాడలు అనుస రిస్తున్నాడు.

హనుమంతుడు బుగ్గలనిండా గాలి పూరించి, మూతి బిగబట్టి కొంతసేపు ఆలోచిస్తూ చూశాడు.

హనుమంతుడు ఆలోచిస్తోంటే అందరి గుండెలూ తేలిక పడ్డాయి. హనుమంతుడంటే సుగ్రీవుడికీ, మిగతా వాళ్ళకీ కూడా మంచి గురి. ఏదన్నా ఇబ్బంది వస్తే తమందరి కన్నా హనుమంతుడు కాస్త నిబ్బరంగానే ఉంటాడని వాళ్ళకు తెలుసు. అవసరం అయితే వెనకా ముందూ చూడకుండా ఎదటి వాళ్ళ మీద కలబడి పోతాడు. సుగ్రీవ మహారాజుకి మంత్రులందరిలోనూ హనుమంతుడే పెద్ద అండ.

"ఏం, చూశావా?.... చెప్పు... దబ్బున...." మహా రాజు ఆశగా చూశాడు.

హనుమంతుడు బుగ్గల్లోంచి బుస్సున గాలి వొదిలేసి – "ఓస్! ఇంతేనా? .... మీ కంగారు చూసి వాలే వస్తు

---

**251.** **కిష్కింధాకాండ, సర్గ 2, శ్లోకాలు 10 వరకూ:** "మహాత్ముడగు సుగ్రీవుడు, శ్రేష్ఠమగు ఆయుధములు గల వీరులునూ, అన్నదమ్ములునూ నగు రామ లక్ష్మణులను జూచి, భయపడి, దిక్కులు చూచుచు ఒక చోట నిలువలేక పోయెను ... సుగ్రీవుని మనసు స్థిమితపడలేదు ... మిగుల భయపడిన అతని మనసు దుఃఖించెను. గొప్ప బలముగల వానరులందరు ఒక కొండ నుంచి ఇంకొక కొండకు దాటుచూ.. పర్వతములలో పూచియుండిన చెట్లను నాశనము చేసిరి"– సుగ్రీవుడూ, హనుమంతుడూ వాళ్ళూ ఇప్పుడే మొట్టమొదటి సారిగా కథలోకి వచ్చారు. 'సుగ్రీవుడు గొప్ప వీరుడ'ని ఇన్నాళ్ళూ మన అభిప్రాయం కదా? ఆయన 'వీరత్వం' ఇక మనం కళ్ళారా చూడవచ్చు. సుగ్రీవుణ్ణి గొప్ప పరాక్రమవంతుడిగానే కవి ఎక్కడి కక్కడ వర్ణిస్తూ వుంటాడు. అయితే, ఒక వీరుడు, రాముణ్ణి చూసి కూడా భయపడకపోతే, అది రాముడి వీరత్వానికి లోపం అవుతుందని కవి అభిప్రాయం. కానీ, 'ఆ వస్తున్న వాడు రాముడే' అని తెలిసి భయపడితే అది వేరు. అవతలి వాడెవడో తెలీకుండానే, దారే పోతోన్న వాళ్ళని చూసి వణికితే, అది సుగ్రీవుడి పిరికితనమే అవుతుందని కవి గ్రహించుకోలేదు. – తర్వాత కథ అంతా సుగ్రీవుడి 'పిరికితనాన్నే' రుజువు చేస్తూ వుంటుంది. ★

న్నాడేమో అనుకున్నాను, ఇంకా నయం! దారే పొయ్యే దానయ్యల్ని చూసి భయ పడతావేం మహారాజా? అసలు వాలి ఇక్కడికి రాడని తెలుసుగా....?" అంటూ తనూ ఒక బండమీద చతికిలబడ్డాడు.

పగిలిన మోకాలి చిప్పలతో రాజఠీవి ప్రదర్శించ టానికి ఇబ్బంది పడుతూ సుగ్రీవుడు మొహం చిట్లించి – "వాలి రాడుగానీ .... హనుమంతా! ఎవరయినా వీరుల్ని పంపొచ్చు గదయ్యా! లేకపోతే .... మరి వాళ్ళి ద్దరూ .... ఎవరంటావూ?" అని చెక్కిళ్ళు బిగించాడు.

"ఎవరో ఏంటో కనుక్కుంటాం. అంత మాత్రానికి వొణకటం ఎందుకంటా?"

"అబ్బే! ఏం వొణికాం? .... వీళ్ళేదో రాజనీతి అన్నారు కదాని...."

"చాల్లెద్దూ మహారాజా! నీకు మరీ తొందరెక్కువ" అని విసుక్కున్నాడు హనుమంత మంత్రి. సుగ్రీవ మహా రాజు ఆయువు పట్లన్నీ హనుమంతుడి చేతిలో ఉన్నాయి. మహారాజుని మందలించడం అంటే హనుమంతుడికి నల్లేరు మీద బండే. "రాజయిన వాడికి .... ఎంత జ్ఞానం ఉండాలీ .... ఎంత బుద్ధి ఉండాలీ! .... ఆఁ .... ఏదన్నా జరిగితే .... నెమ్మదిగా మంచీ చెడ్డా తెలుసుకోవాలిగానీ .... ఏంటో .... ఇల్లాగయితే – నువ్వేం రాజ్యం చేస్తావో .... ప్రజల్నెలా పరిపాలిస్తావో గానీ..."[252]

"అబ్బ! .... సరేలెద్దూ! .... రాజొక్కడే రాజ్యం చేస్తాడా ఏంటీ? .... మీలాంటి గొప్ప గొప్ప మంత్రులు లేరూ నాకు? .... ఇలా రా! .... వాళ్ళని బాగా చూడు ఈ సందులోంచి. ఎద్దుల్లా బలిసి, అలా కత్తులు తళ తళ లాడించుకుంటూ వొస్తొంటే ఎవరు మాత్రం జడవకుండా ఉంటారు, చెప్పు? అసలే కష్టాల్లో ఉన్నాం. చెట్లూ పుట్టలూ పట్టుకు తిరుగుతున్నాం. కాస్త ముందు చూపు ఉండాలంటావా, అక్కర్లేదా?"

హనుమంతుడు కొంచెం ఆలోచించి – "అయితే వాలే పంపాడంటావా మహారాజా?" అని కొంచెం వినయం చూపించాడు.

"ఆఁ .... తప్పకుండా ఆ దుర్మార్గుడి పనే. అబ్బో! ఎన్ని ఉపాయాలో వాడి పొట్టనిండా. అసలు రాజన్న వాడు శత్రువుల్ని సుఖంగా బతకనిస్తాడంటయ్యా? తిని తిరగమని మన దార్ని మనల్ని వొదిలి పెడతాడా? అసలు వాళ్ళ వ్యవహారం ఏంటో నువ్వెళ్ళి కనిపెట్టి రావాలి మరి" అని ఆగాడు సుగ్రీవుడు.

తారుడు చప్పున "అవును. వాళ్ళలాగానే నువ్వు కూడా ఆ రుషి వేషం కట్టుకుని వెళ్ళాలి" అన్నాడు ఉత్సాహంగా.

సుగ్రీవుడు కంగారుపడుతూ – "ఒక వేళ వాళ్ళ మూలంగా మనకేం చెరుపు లేదనుకో, వాళ్ళసలు మనకు శత్రువులు కారనుకో. 'సరేలే' అని ఊరుకో గూడదు సుమా! మరి ఎందుకిలా వస్తున్నారో తెలుసుకో. బయల్దేరు తొందరగా! నేర్పుగా మాట్లాడి అసలు కిటుకు కనుక్కో. ఇటూ అటూ మాట తూలేవు సుమా! .... ఎవళ్ళతో ఎలా మాట్లాడాలో నీకు బాగానే తెలుసులే. బయల్దేరు మరీ" అని తొందర పెట్టాడు. మాటల మధ్య మోకాళ్ళు కూడ దీసుకుంటూ కెవ్వుమన్నాడు.

హనుమంతుడు ఘన కార్యాలు చేసే ఉత్సాహంతో లేచాడు. పంచె ఊడదీసి సన్యాసుల కట్టులాగ కట్టాడు. బొడ్లోంచి ఊడిపడ్డ ముక్కుపొడుం మూట చెట్టు తొర్రతో పెట్టబోతే, నీలుడు అందుకుని "నే దాస్తాలే" అని అటు తిరిగి మూటని వూడదీసి ముక్కుల్లో కెక్కించేశాడు.

నళుడు, చుట్టుపక్కల దొరికిన పూల తీగలన్నీ పట పటా తెంచి తెచ్చి హనుమంతుడి జుట్టునిండా, మెడ నిండా, చేతులనిండా చుట్టాడు. హనుమంతుడు గుహ లోకి పోయి నీళ్ళ చిప్ప పట్టుకుని బయటికొచ్చాడు.

మహారాజు గంభీరంగా చూశాడు – "జాగర్త సుమా! నేర్పుగా .... చక్కగా .... తెలివిగా .... చక్కగా .... నేర్పుగా మాట్టాడు ....

వాళ్ళసలే ఆంబోతుల్లాగున్నారు ....

నువ్వొచ్చే వరకూ మా తలలు గుహలో .... దాచేస్తాంలే. రాజనీతి అలాగుంది మరి ...."

రాజుగారూ, మంత్రులూ అందరూ బండల చాటున నక్కి హనుమంతుణ్ణి – "దయిర్యంగా వెళ్ళు!" అంటూ సాగనంపారు.

★ ★ ★

లక్ష్మణుడూ, రాముడూ అతి ప్రయాస మీద కొండలు ఎక్కుతోంటే, హనుమంతుడు, కొండలు చక చకా దిగుతూ దూకుతూ వాళ్ళకి ఎదురు వెళ్ళాడు.

ఆ బండల్లోంచి పుట్టుకొచ్చిన రుషిని చూడగానే రాముడికి ప్రాణం లేచి వొచ్చింది. సుగ్రీవుడి సమాచారం ఏమన్నా తెలుస్తుందేమోనని లక్ష్మణుడు ఆతృతగా ఆ వస్తోన్న రుషినే చూస్తూ నిలబడ్డాడు.

---

**252.** **కిష్కింధా, సర్గ 2, శ్లోకాలు 7, 18:** హనుమంతుడు, సుగ్రీవుణ్ణి చివాట్లు పెడుతున్నాడు, వినండి! – "చపల చిత్తుడ వగుటచే నీకు మంచి విచారముగల బుద్ధి లేనందున, నీ శాఖా మృగత్వము వ్యక్తమగుచున్నది. అయ్యా! విశేష జ్ఞానముతో పరుల అభిప్రాయమును తెలుసుకొని పనులు చేయవలెను. బుద్ధీ, జ్ఞానమూ, ఇంగితమూ లేని రాజు ప్రజలను రక్షింపనేరడు." దీనికి సుగ్రీవుడు గొప్ప జవాబు చెప్పాడనుకోండి – "ఆ వీరుల్ని చూసి ఎవ్వరు భయపడకుండా ఉందురో చెప్పు?" అని! అది ఆ వీరుల గొప్పతనమేగానీ, తన పిరికి తనం కానట్టు! రాముడి ఆకారమే అంత భయం కలిగించేదిగా వుందని అర్థం. ★

హనుమంతుడు మొహం విప్పార్చుకుని చేతులు నలుపుకుంటూ – "అయ్యలారా! .... మీ రెవరోగానీ అందంగా, దేవతల్లాగా, మా చక్కగా ఉన్నారు. స్వర్గం నించి వచ్చారో, వైకుంఠం నించి వచ్చారో! .... రుషుల్లాగ ఉన్నారేగానీ .... మీ రసలు రాజులో, మహా రాజులో! అబ్బో, .... చాలా గొప్ప వారై ఉంటారు. మీ వీరత్వం .... మీ పరాక్రమం .... ఆc .... దాస్తే దాగుతాయా? .... అబ్బే! ఎక్కడ దాగుతాయి? మిమ్మల్ని చూడగానే పిట్ట లేవిటి, .... జంతువులేవిటి .... మనుషులేవిటి .... గడ గడ వొణక వలసిందే. సింహాల్ని కూడా చూశాను గానీ .... అబ్బే, మీ ముందు సింహాలెక్కడా? .... ఏనుగు తొండాల్లాగ మీ భుజాలూ .... మీరూ ...." – హనుమంతుడు లక్ష్మణుణ్ణే చూస్తూ మాట్లాడుతున్నాడు.

తనే ముందు నడవనందుకు ఆ క్షణంలో రాముడికి చాలా పశ్చాత్తాపం కలిగింది.

"ఈ వేషా లెందుకు వేసుకున్నారో గానీ .... మీ రసలు మహారాజుల్లాగ సింహాసనాల మీద కూర్చుని రాజ్యాలేలవలసిన వారే! ఈ కొండలూ .... కోనలూ .... అడవులూ .... అసలు భూమండలం అంతా మీరేల వలసిందే! మీ ముక్కులూ మొహాలూ వొక్కలాగే .... ఇద్దరికీ పోలికలున్నాయి! అన్నదమ్ములనుకుంటాను. చక్కగా సూర్యుడూ చంద్రుడూ ఉన్నట్టున్నారు ...."

కొత్త రుషి పొగడ్తలు రాముడి కేమంత సంతోషం కలిగించలేదు. లక్ష్మణుణ్ణి కూడా తనతో కలిపి, ఇద్దర్నీ వొక్కలాగే పొగడడం రాముడికేమీ నచ్చలేదు.

హనుమంతుడు తననే చూసి మాట్లాడుతోంటే లక్ష్మణుడు ఇబ్బందిపడి నెమ్మదిగా వెనక్కి తప్పుకున్నాడు. రాముడు గంభీరంగా ముందుకు అడుగు వేశాడు.

"ఎంత కాంతిగా మెరిసిపోతున్నారో! .... అయ్యో! వొంటిమీద గోరెడు బంగారమైనా లేదు. ఎంత బోసిగా ఉన్నారో! మీ శరీరాల నిండా .... రత్నాలూ వజ్రాలూ మణులూ మాణిక్యాలూ పెట్టి, చక్కగా నగా నట్రా పెట్టి, ముస్తాబు చేస్తే మిమ్మల్ని చూడ్డానికి వెయ్యి కళ్ళన్నా చాలవు."

రాముడి భుజాలు పులకరించాయి, వాటికి నగలు గుర్తొచ్చి.

"నగలు లేకపోతే ఏం లెండి? మీ వొంటి రంగే మేలిమి బంగారం లాగుంది."

రాముడు హనుమంతుణ్ణి వార కంట చూశాడు .... వెటకారం కాదు గదా అని.

"ఆహా! చుట్టూ చూడండి. మీ వొంటి కాంతులు పడి, పర్వతాలూ కొండలూ ఎలా ధగ్ ధగా మెరిసి పోతున్నాయో! .... పంపలో నీళ్ళన్నీ బంగారం కలిపి నట్టయి పోయాయే, చిత్రంగా ఉంది! అసలు మీ విల్లులు మాత్రం? .... బంగారపు కట్లతో ఏం అందం .... ఏం అందం! చూసే వాళ్ళకు గుండెల్లో గుబులు పుట్టిస్తు న్నాయి. ఈ బాణాలు బాణాలు కావు సుమా! పుట్టల్లోంచి బుస్సున లేచిన నాగు పాములే! .... ఇక కత్తులా? .... అబ్బో! వాటి మాట చెప్పనే అక్కర్లేదు. ...."[253]

రాముడు పరవశమై పోతూ అరమోడ్పు కన్నులతో ఎటో చూశాడు.

హనుమంతుడు చాలాసేపు పొగడ్తలన్నీ గుప్పించేసి, దేహ కాంతులూ, ముఖ కాంతులూ, ధనుస్సు కాంతులూ, కత్తి కాంతులూ – అన్నీ వర్ణించేసి, ఇంకేం చెయ్యాలో తోచక – "అయ్యల్లారా! మీ రెవరో మహానుభావులే" అని గుటకలు మింగుతూ నిలబడ్డాడు.

"అబ్బే! ఇద్దరమూ కాదు, నే నొక్కణ్ణే మహానుభావుణ్ణి" అని చెప్పుకోడానికైనా రాముడు తన్మయత్వం లోంచి తేరుకోలేదు.

లక్ష్మణుడు స్వతంత్రించ కూడదని తను కలగ జేసుకోకుండా ఊరుకున్నాడు.

హనుమంతుడి కడుపులో రహస్యం .... బయట పడిపోతానని గుండెల కెగదన్నుతోంది. దాన్ని ఎంతో సేపు నిలవరించలేక–"అయ్యా! నేనీ వేషం కట్టుకుని వచ్చాను గానీ, రుషినీగాను పాడూగాను సుమండీ! మేం వానర జాతి వాళ్ళం. సుగ్రీవుడనే .... మా రాజు .... మాయదారి అన్నగారి మూలాన నానా బాధలూ పడు తున్నాడు. నేనా సుగ్రీవ మహారాజు దగ్గిర మంత్రి ఉద్యోగం చేస్తున్నాను లెండి. నన్ను హనుమంతుడం టారు. నేనంటే మా రాజు గారికి చాలా ఇది. మీతో మాట్లాడమని ఆయన పంపితేనే వచ్చాను. నా గురించి ఈ చుట్టుపక్కల అందరికీ .... అబ్బో, చాలా బాగా తెలుసు" – హనుమంతుడు తన గురించి వర్ణించుకునే ఉత్సాహంలో పడిపోయి ముసి ముసి నవ్వులు

**253.** **కిష్కింధా, సర్గ 3, శ్లోకాలు 5 ... 18:** హనుమంతుడు చేసిన పొగడ్తలన్నీ – "మీరు గొప్ప వీరుల్లా ఉన్నారు, మహా రాజుల్లా ఉన్నారు. ఈ భూమండలమంతా పరిపాలించుటకు తగిన వారుగా నున్నారు. మీ శరీరాల్ని బంగారాలతో, రత్నాలతో అలంకరించాలి" అనేవే. రుషుల ఔన్నత్యాన్ని చెప్పే మాట వాటిలో ఒక్కటన్నా లేదు. రుషుల్ని పట్టుకుని – "మీరు గొప్ప రాజుల్లా ఉన్నారు" అని పొగడడం అంటే, ఆ రుషులకు రుషి జీవనం కన్నా రాజరికమే సంతోషం కలిగిస్తుందని అర్థం అన్న మాట. రుషుల ధ్యాస కూడా ఎప్పుడూ అధికారం మీదా, సిరి సంపదల మీదా మాత్రమే ఉంటుంది. ఈ దేవుళ్ళాట ప్రతీ రుషి మొహం మీదా కనపడుతుంది. రాముడి మొహం మీద ఇంకా స్పష్టంగా! ★

నవ్వాడు.[254]

'సుగ్రీవుడి' పేరు వినగానే లక్ష్మణుడి మొహం కళ కళ్ళాడింది, తొందరగానే వదినగార్ని కలుసుకో వచ్చునని.

రాముడి ప్రాణం లేచివొచ్చింది – సీతని వెదికే పని ఇక సుగ్రీవుడే చూసుకుంటాడని! .... అన్నవల్ల తమ్ముడు నానా బాధలూ పడుతున్నాడా? ఇద్దరికీ వైరం ఎందుకో!

ఈ అన్నదమ్ముల వైరం .... తన కేవన్నా లాభం కలిగిస్తుందేమో! తనకు లాభం .... అన్న వల్లనా? .... తమ్ముడి వల్లనా? .... రాముడి అంతరంగంలో, రాజకీయ కోశంలో, కొత్త కొత్త ఆలోచనా తరంగాలు ప్రారంభమైపోవడం ప్రారంభమైపోయింది.

హనుమంతుడికి, రాముణ్ణీ లక్ష్మణుణ్ణీ చూస్తోంటే, ఆ ఇద్దరిలో ఎవరు ఎక్కువో ఏమిటో, తను ఎవరితో మాట్లాడాలో, ఏమీ అంతుపట్టడం లేదు. ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తూ – "మా సుగ్రీవ మహారాజు మహా వీరుడు. పరాక్రమవంతుడు. మీతో స్నేహం చెయ్యాలనే నన్ను పంపించాడు!" అని "ఏమంటారు?" అన్నట్టు చూశాడు.

సుగ్రీవ మహారాజు మంత్రికి తన ప్రత్యేకతేవిటో స్పష్టం చెయ్యాలని రాముడు గంభీరంగా తల పంకిస్తూ లక్ష్మణుడి వేపు మందహాసంతో చూశాడు. హనుమంతుణ్ణి మెచ్చుకుంటూ – "లక్ష్మణా! విన్నావు కదా? .... ఇతడు సుగ్రీవుడి మంత్రి అట! చక్కగా మాట్లాడుతున్నాడు!.... శాస్త్రాలన్నీ క్షుణ్ణంగా చదివినట్టు ఉన్నాడు. ఇన్ని మాటలు మాట్లాడాడు గానీ ఎక్కడా ఒక్క అపస్వరం రాలేదు సుమా! .... ఉచ్చారణలో తప్పుల్లేవు. శబ్దాడంబరం లేదు .... మాటల కోసం తడుముకున్నాడా? .... ఊహూఁ! అలా అని అర్థం గాకుండా దూసి పోసినట్టు మాట్లాడాడా? ఊహూఁ" అంటూ మాటలు దూసి పోశాడు.

హనుమంతుడు తల వొంచి సిగ్గు పడుతూ రాముడి వేపే భక్తితో చూశాడు. ఆ రెండో ఆయన కన్నా, తనని అంతగా మెచ్చుకున్న ఈయనే గొప్ప తెలివిగల మహానుభావుడని నిర్ధారణ కొచ్చాడు.

రాముడు, హనుమంతుణ్ణి మెచ్చుకోడం ఇంకా పూర్తి చెయ్యలేదు. హనుమంతుణ్ణి గంభీరంగా చూశాడు – "వేదాలన్నీ చక్కగా చదివినట్టే వున్నావు. ఋగ్వేదం, యజుర్వేదం, సామ వేదం, .... చదివే ఉంటావు. అవును, చదవకపోతే, ఇంత చక్కగా మాట్లాడడం సాధ్యమవుతుందా ఎవరికయినా? వ్యాకరణం కూడా చాలా శ్రద్ధగా నేర్చుకున్నా వనుకుంటాను. వేదాలు ఎన్నిసార్లు చదివావు? చాలాసార్లు చదివినట్టున్నావు. ఒక్కసారే చదివితే ఇంత చక్కగా గుర్తుంటాయా ఎవరికైనా? .... వేదాలూ .... వ్యాకరణ పాఠాలూ అన్నీ చక్కగా గుర్తు పెట్టుకుంటూ ఇతరులతో శాస్త్రోక్తంగా సంభాషిస్తూ ఉంటావనుకుంటాను. నువ్వు ఒక్కొక్క శబ్దం ఉచ్చరిస్తోంటే...."

చక్కగా మాట్లాడావని పొగిడితే ఏమో అనుకున్నాడు గానీ, తీరా వ్యవహారం శాస్త్రాల్లోకీ, వ్యాకరణంలోకీ దిగడం చూస్తే, హనుమంతుడికి దడ పట్టుకుంది. ఏదో వేదంలోంచి ఏదో శ్లోకమో, దాని పాదమో చెప్పమంటే?.... హఠాత్తుగా, వ్యాకరణంలో ఏ సంధులో విడదియ్యమంటే? .... ఇంకా నయం .... చిన్నప్పుడు వీపంతా వెయ్యి చెక్కలయింది గానీ పొట్టకి వొక్క ముక్కా అబ్బలేదు. సందులూ, గోడలూ కలేసి దూకడం తప్ప .... విడదియ్యడం అన్న మాటే లేదు.

రాముడు చిరు నవ్వుతో మళ్ళీ చెప్పుకొచ్చాడు. "ఒక్కొక్క శబ్దం ఉచ్చరించేటప్పుడు వ్యాకరణ జ్ఞానంలేని అజ్ఞానులు మొహంలో వికార భావాలు ప్రదర్శిస్తారు. నువ్వు ఆ విధంగా చేయ లేదు. మృదువుగా సంభాషించ డానికి ఆరు లక్షణాలు తెలిసి ఉండాలి. అవన్నీ నీకు చక్కగా తెలిసినట్టే ఉన్నాయి."

హనుమంతుడు బిత్తరపోయాడు. "నాకేం తెలియదు మొర్రో మొర్రో" అనాలనుకున్నాడు – 'ఇదేంటి? వొచ్చి వొచ్చి వ్యాకరణంలో పడ్డాను! తీరా తెలిసినట్టు ఊరుకున్నాక, అవేమిటో చెప్పమంటే?'

రాముడికి, నిజంగా ఆ ఆరు లక్షణాలూ చెప్పమని హనుమంతుణ్ణి అడగాలనే ఉంది, హనుమంతుడు చెప్పలేకపోతే తను చెప్పెయ్యాలని! ఆ వ్యాకరణ పాఠం చక్కగా గుర్తు వచ్చేసింది! "మాధుర్యమూ, అక్షర వ్యక్తమూ, పదచ్ఛేదమూ, అత్వరా, ధైర్యమూ, లయా, ఈ యారున్నూ మాట నుచ్చరించుటలో నుండవలయును" అని లోపల పాఠం గుర గుర లాడుతోంది. వల్లించకపోయినా దానికదే కిందా మీదా తిరుగుతోంది. రాముడు, ఉత్సాహం అణుచుకోలేక "హనుమంతుడా!

---

**254.** కిష్కింధ, సర్గ 2, శ్లోకాలు 24 ... 57: + సర్గ 3, శ్లోకాలు 20 ... 23: సుగ్రీవుడు, హనుమంతుడితో ఏం చెపుతున్నాడు? – "... పరస్పర సంభాషణము చేత వారిని కనిపెట్టవలయును. వారి శుద్ధా శుద్ధ స్వభావమును, వారిమాటల ద్వారా గ్రహింపుము" అని చెప్పి పంపించాడు. కానీ, అవతలి వాళ్ళు నోరు విప్పి ఒక్క ముక్కన్నా మాట్లాడకముందే, వాళ్ళు ఎవరో ఏమిటో తెలుసుకోకముందే, హనుమంతుడు సుగ్రీవుడి సంగతి చెప్పేశాడు. వాళ్ళు నిజంగా వాలి పంపిన శత్రువులే అయితే? "సుగ్రీవుడు ఇక్కడే ఉన్నాడు. నేను ఫలానా వాడిని. వాలితో వైరం సుగ్రీవుడికి" అని అన్నీ చెప్పేశాడు. హనుమంతుడి లాంటి తెలివి తక్కువ దూత ఇంకెక్కడా ఉండదు. ఈ సంగతి ముందు ముందు ఇంకా స్పష్టంగా రుజువవుతుంది. ★

నీ మాటలన్నీ .... హృదయంలో మంద్ర స్వరంలో పుట్టి, కంఠ స్థానంలో ప్రవేశించి, మధ్యమ స్వరంతో బయటకు వస్తున్నాయి సుమా!" అన్నాడు చిరునవ్వుతో.

హనుమంతుడు అపస్వరాలతో గుటకలు మింగు తున్నాడు, కంఠంలోంచి వెనక్కి ... గుండెల అడుక్కి ... పొట్టలోకి!

లక్ష్మణుడి ఇంగితానికి ఒళ్ళు మండిపోతోంది! "సుగ్రీవుడి దగ్గర్నించి మనిషి వస్తే పుట్టెడు సంతోషంతో గబ గబా అతని వెంటబడి పోవాలిగానీ ఈ వేదాలేవిటీ, వ్యాకరణ పాఠాలేవిటీ, కంఠ స్వరాలేవిటీ, మంద్ర స్వరా లేవిటీ! యావన్నా బుద్ధుందాని!.... ఆ వచ్చిన వాడు కోయిల్లా కూసి చెపితే ఏవిటీ, గాడిదలా అరిచి చెపితే ఏవిటీ? .... అసలు సుగ్రీవుడు దొరకడం ముఖ్యంగానీ .... ఇదుగో, అసలు నీ అన్నకి సుగ్రీవుడు దొరకడం కన్నా.... ఈ వ్యాకరణ చర్చతోటే పరమ సంతోషంగా ఉంది.... ఈ శాస్త్రాలు చదువుకున్న వాళ్ళెందుకూ పనికి రారనుకో" అని ఝాడించేసింది లక్ష్మణుణ్ణి.

లక్ష్మణుడు కిక్కురు మనలేకపోయాడు. "అవును .... మరే .... మరే...." అని ఇంగితానికే వంత పాడాడు, కాదంటే ఇంకా పేట్రేగిపోతుందని.

రాముడు చిరునవ్వుతో లక్ష్మణుణ్ణి చూస్తూ – "లక్ష్మణా! ఇంత చక్కగా మాట్లాడితే ఎవరికయినా సంతోషం కలగకుండా ఉంటుందా? నరకాలని కత్తి ఎత్తి మీదకు వచ్చిన శత్రువయినా మనసు మార్చుకుంటాడు సుమా!" అని, హనుమంతుడు తన శత్రువయినా తను నరకబోయి మనసు మార్చుకున్నట్టు దయగా నవ్వాడు.

హనుమంతుడు తెల్లబోయి దిక్కులు చూశాడు. శత్రువులేంటి? నరకటం ఏంటి? అసలు వీళ్ళు ఎవరో, ఏంటో కనుక్కోనే లేదే! – కొంపదీసి చంపుతారా ఏంటి?.... వినయంగా చేతులు కట్టుకుంటూ – "అయ్యా! తమరెవరో శెలవీయనే లేదు. మా రాజు మీతో స్నేహం చేసుకోవాలనీ...." అని ఆగి రాముణ్ణి మళ్ళీ వినయంగా చూశాడు.

హనుమంతుణ్ణి చూస్తోన్న కొద్దీ రాముడికి ముచ్చ టేస్తోంది. వాళ్ళ రాజు పంపగానే, చక్కగా మారువేషంతో వచ్చాడు. ఎదటి వారి మనసులకు సంతోషం కలిగేటట్టు చక్కగా కీర్తించాడు. ఎంత చక్కని దూత! ఇలాంటి దూత ఉంటేనా రాజుకి! ఇంకేం లోటు? .... ఎంతెంత రాచ కార్యాలయినా నిర్వర్తించవచ్చును. భరతుడు ఎటువంటి దూతల్ని పెట్టుకున్నాడో ఏమో! అతడు చిత్రకూటం వచ్చినప్పుడు తను చాలా విషయాలు చెప్పి పంపించాడు గానీ .... చారుల మీద చారుల సంగతి .... హు! అదొక్కటే మర్చిపోయాడు.[255] ఆలోచనల్లోంచి తేరు కుంటూ లక్ష్మణుణ్ణి గంభీరంగా చూశాడు – "లక్ష్మణా! సుగ్రీవుడి మంత్రి మనతో సంభాషించాలని కోరుతూ ఉన్నాడు. అతనితో చక్కగా, మృదువుగా సంభాషించ వోయ్!" అని ఆజ్ఞాపించి – "నేను రాజుని కదా? నేనే మాట్లాడతానా ఏవిటీ? ఆ మాత్రం తెలీదా నీకు?" అన్నట్టు చూశాడు.[256]

"చిత్తం!" అని లక్ష్మణుడు వినయంగా అన్న గారికి నమస్కరించి హనుమంతుడి వేపు తిరిగాడు. – "మీ రాజు గురించి మా అన్నగారు ఇంతకు పూర్వమే విన్నా రోయీ! ఆయన కోసమే బయల్దేరి వస్తూ వున్నారు. నువ్వు కోరిన విధంగానే మీ రాజుతో మా అన్నగారు చెలిమి చేస్తారు" అని సంభాషణకు ఉపక్రమించాడు.

హనుమంతుడి ప్రాణం కుదుటపడింది. ఈ అన్న దమ్ములిద్దరూ 'వాలి' మనుషులు కారన్నమాట! ఇకనేం? ఇద్దరూ వీరుల్లాగే ఉన్నారు. వాలితో యుద్ధం చేసి గెలుస్తారేమో! మళ్ళీ సుగ్రీవుడు రాజైతేనే తమ మంత్రి పదవులు తమకు దక్కుడు!

హనుమంతుడు మరింత వినయంగా రాముణ్ణి చూస్తూ – "అయ్యా! తమరు .... ఈ కారడవుల్లో తమ్ముడితో కలిసి .... ఎందుచేత తిరుగుతూ ఉన్నారో ...." అంటూ ఆగాడు.

రాముడు క్రీగంట చూశాడు. లక్ష్మణుణ్ణి "చెప్పూ!" అన్నట్టు!

లక్ష్మణుడు వినయంగా మళ్ళీ మొదలుపెట్టాడు – "హనుమంతుడా! అంతా నేను చెబుతాను విను. కోసల రాజ్యాన్ని దశరథుడనే మహానుభావుడు చాలా కాలం శాస్త్రోక్తంగా, ధర్మబద్ధంగా పరిపాలించాడు. సంపూర్ణ మైన దక్షిణలిచ్చి గొప్ప గొప్ప యజ్ఞాలూ, యాగాలూ, అనేకానేక పుణ్యకార్యాలూ చేశాడు. అటువంటి మహాను భావుడి జ్యేష్ఠ పుత్రుడోయీ ఈ మహానుభావుడు. పేరు శ్రీరామచంద్రుడు! నీకు తెలిసి వుండదు గానీ సర్వప్రజ లకూ తెలిసిన వాడే ఈ మహానుభావుడు. సకల ప్రాణ కోటినీ రక్షించే వాడు ఈయనే. దశరథ మహారాజు

---

**255.** కిష్కింధా, సర్గ 3, శ్లోకాలు 34, 35: రాముడు హనుమంతుణ్ణి – "ఇట్టి గుణ గణములతో కూడి కార్యము సాధించగల దూత రాజునకు ఉండినటులయితే వారికి సకల కార్యములు సిద్ధించును" అని మెచ్చుకుంటున్నాడు. ★

**256.** కిష్కింధా, సర్గ 3, శ్లోకం 27: రాముడు, అంతసేపూ హనుమంతుణ్ణి పొగిడే వంకతో శాస్త్ర విషయాలు చాలా మాట్లాడాడు. కానీ, అసలు విషయం మాత్రం, అంటే, తమకు సుగ్రీవుడి సహాయం కావాలనే విషయం, లక్ష్మణుడు మాట్లాడాలట! తను చెప్పుకోవడం చిన్నతనం. పక్కన ఒక దాసుడు ఉండి, వాడు వినయంగా తన గురించి అవతలి వాడికి అన్నీ చెప్పాలి. ఈ లక్షణం యజమానులు ప్రదర్శించే 'ఫ్యూడల్ దర్పం!' ★

పుత్రుల్లో ఈయనే మిక్కిలి గుణవంతుడూ, మిక్కిలి వీరాధి వీరుడునూ. మా తండ్రిగారి సద్గుణాలన్నీ మా అన్న గారి కొక్కరికే వచ్చాయి. ఈయన గొప్ప పరాక్రమ వంతుడూ, జ్ఞానీ ....”

ఇంగితం కళ్ళెర్రచేసి – “మేమంతా ఉత్త వెధవలం! దద్దమ్మలం! ఊఁ .... ఇంకా చెప్పు .... ఆగావేం? .... సిగ్గులేదూ? నువ్వూ ఆ దశరథ మహా రాజు పుత్ర రత్నానివి కావా?” అంటూ రయ్యినలేచి అడ్డు తగిలింది.

లక్ష్మణుడు, కంగారుపడుతూ, ఆ ‘వాగుడు’ విని పించుకోకుండా, ఇంగితానికి చెప్పవలసిన సమాధానం హనుమంతుడికి చెపుతూ, “దాని మాటలకేం గానీ నువ్వు వినవోయీ హనుమంతుడా! నేను మా అన్న గారికి సోదరుడినే గానీ, నా అభిప్రాయంలో దాసుడినే సుమా! మా అన్నగారి సద్గుణాలన్నీ చూసి నేను చిన్న తనంలోనే ఈయనకు భక్తుణ్ణయి పోయి ఈ మహాను భావుడికి సేవ చేసుకుంటూ జీవిస్తున్నాను.[257] అది సరే! ఇక విను .... ఇలా ఉండగా గొప్ప రాజ లక్షణాలు గల మా అన్నగారు రాజ్య భ్రష్టులై పోయారు. భార్యతో కలిసి వనవాసం చేస్తూ నానా బాధలూ అనుభవిస్తున్నారు .... తర్వాతేం జరిగిందో విన్నావా?” అని ఆగాడు.

“అయ్! చెప్పండి ....” అంటూ హనుమంతుడు కుతూహలంగా రెండడుగులు దగ్గిర కొచ్చాడు.

గాలి, ముక్కుపొడుం పరిమళాలు మోసుకొచ్చింది, రాముడి మీదకి. కానీ రాముడు, గొప్ప రసవత్తర ఘట్టంలో ఉండడం చేత, గాలి పిల్ల చేష్టలు అంతగా పట్టించుకోలేదు.

లక్ష్మణుడు, వొదినగారు గుర్తొచ్చి దిగులు పడి పోతూ చెప్పుకొచ్చాడు – “మహానుభావుడైన మా అన్న గారూ నేనూ లేని సమయంలో, మహానుభావు రాలైన మా వదినగార్ని, ఒక మహానుభావుడైన రాక్షసుడు ....” ఠక్కున ఆగి, సిగ్గుపడిపోయి, తబ్బిబ్బు పడి, నాలిక సర్దుకుని – “.... పరమ దుర్మార్గుడైన .... రావణుడు .... మా వదినగార్ని .... ఎత్తుకు పోయాడోయీ! సమ స్తమూ గ్రహించగల మా అన్న గారికి, ఆ రావణుడి సంగతొక్కటే తెలీలేదనుకో. ఏం చేస్తాం? ఆ నాటి నించీ మా అన్నగారు కంటికీ మంటికీ ఏకధారగా దుఃఖిస్తూ, కొండలూ కోనలూ పట్టుకుని తిరుగుతున్నారు. కబం ధుడి పుణ్యమా అని మీ రాజు గురించి తెలిసింది. మీ రాజునే వెతుక్కుంటూ వస్తున్నాం” అని ఆగాడు.

“కబంధుడెవడబ్బా!” అని బుగ్గలు ఉబ్బించి ఆశ్చ ర్యంలో పడ్డాడు హనుమంతుడు.

లక్ష్మణుడు, హనుమంతుడి అభిప్రాయం కని పెట్టా లని హనుమంతుణ్ణి ఎగా దిగా చూస్తూ “సుగ్రీవుడు తప్పకుండా సహాయం చేస్తాడని మా అన్న గారికి కొండంత ఆశగా ఉందోయీ! మా అన్నగార్ని గురించి ఎంత చెప్పినా ఇంకా చెప్పాలి. అంత గొప్పవారు! పూర్వం మా తండ్రిగారే లోకాలన్నీ రక్షించే వారు గానీ, .... ఇప్పుడు మా అన్నగారే ఆ పని చేస్తున్నారు. లోకాలు రక్షిస్తూ ఉన్నారు. అలాంటి మహానుభావుడికి ఇంత ఆపద వొచ్చిపడింది” అని నిట్టూర్చాడు. ఇతరుల్ని సహాయం అడుగుతున్నప్పుడు అన్నగారి గురించి అంత కన్నా ఎక్కువ చెప్పడం బాగుండదని లక్ష్మణుడు సందే హించి ఆగాడు.

రాముడు నుదురు చిట్లించి – ‘అంతేనా నా గురించి చెప్పేదీ? మొన్న ఖరుణ్ణి చంపానుగా? ఆ సంగతి కూడా చెప్పరాదూ? .... చిన్నప్పుడు తాటకిని చంపానుగా? .... అహల్యకి శాప విమోచనం .... శివ ధనుర్భంగం .... ఎన్ని ఉన్నాయో! వొక్కటీ చెప్పవేం?’ అన్నట్టు అసం తృప్తిగా చూశాడు.

‘కనుసైగల వేదం’ అంతగా చదవని లక్ష్మణుడు అన్నగారి ఆశలన్నీ వమ్ముచేసి హనుమంతుడి వేపు ఆశగా చూశాడు – “హనుమంతుడా! మా అన్న గారికి సహాయం చెయ్యమని నువ్వు కొంచెం మీ రాజుకి నచ్చ చెప్పాలోయీ! అసలు కోరిన వారందరికీ సిరి సంప దలూ భోగభాగ్యాలూ మోక్షాలూ అవీ మా అన్నగారే ఇవ్వగలరు. కబంధుడికి మోక్షం ఇచ్చారు. శబరికి మోక్షం ఇచ్చారు. .... సుగ్రీవ మహారాజు ఒక్క ‘మాట’ ఇస్తే అదే పది వేలని సంతోషిస్తారు మా అన్నగారు.”

హనుమంతుడు మూతి బిగించి, ఆశ్చర్యంలోంచి తేరుకోలేకపోతున్నాడు, అందరికీ మోక్షాలిచ్చే వాడికి, సుగ్రీవుడి సహాయం ఏంటని!

లక్ష్మణుడు నిట్టూర్చాడు – “ఎంత కీర్తి ఉంటేనేం? ఎన్ని దాన ధర్మాలు చేస్తేనేం? అసలు .... మా రఘు వంశం వారు .... మా తాతలూ .... ముత్తాతలూ ఎంతెంత కీర్తిమంతులనుకున్నావూ? ఈ భూమండలం మా ఇక్ష్వాకు వంశం వారి సద్గుణాల వల్లనే ఇలా నిలిచి

---

**257.** **కిష్కింధా, సర్గ 4, శ్లోకాలు 5 .... 13:** లక్ష్మణుడు రాముణ్ణి గురించి ఎలా చెబుతున్నాడో చూడండి – “హనుమంతుని ప్రశ్న విని లక్ష్మణుడు, రామునిచే ప్రేరేపించబడిన వాడై, ‘శ్రీరాముడు మహాత్ముడు’ అని తెలిపెను. ‘మరియు ... రాముడు ... సామాన్యమైన జనులకు కూడా తెలిసిన వాడు. సకల ప్రాణికోటినీ రక్షించువాడు. దశరథుని కొడుకులలో మిక్కిలి గుణవంతుడు. (ఈ మాటలు అనేది ఇంకో కొడుకు!) సుఖము లనుభవించుటకు తగిన వాడు (గొప్పవారు తప్ప, అందరూ సుఖాలకు తగిన వారు కారని అభిప్రాయం) ... నేను ఇతని గుణములచే వశపరచుకొనబడిన వాడనై ఇతనికి దాసుడుగ నున్నాను” లక్ష్మణుడే స్వయంగా చెపుతున్నాడు, తను రాముడికి దాసుడినని! ★

వుందని మా రాజ్యంలో గొప్ప గొప్ప పండితులందరూ కీర్తిస్తారు .... ఏం చేస్తాం? అంత కీర్తిశాలి ఐన మా అన్నగారు ఇలా తిరగాల్సి వచ్చింది! హనుమంతుడా! మా అన్నగారు సుగ్రీవుణ్ణే శరణు కోరుతున్నారోయి! లోకాలన్నిటికీ శ్రీరాముడే నాధుడుగానీ శ్రీరాముడికి మాత్రం సుగ్రీవుడే నాధుడోయి!"

రాముడికి చాలా కష్టంగానే ఉంది వినడం. సుగ్రీవుడు తనకు నాధుడా? ఏమిటీ ప్రారబ్ధం? – క్రీగంట చూస్తే లక్ష్మణుడి ధోరణి మారుతుంది గానీ .... సరే .... చెప్పనియ్యి! ఎలాగో ఒకలాగ అసలు పని జరగాలి మరి! ఆ రావణుడితో యుద్ధం అంటే .... సైన్యం .... బొక్కసం .... చారులూ .... ఎన్ని కావాలి మరి! ఎవర్నో ఒకర్ని సహాయం అడగవలసిందే మరి ....! ఏం చేస్తాం మరి? తప్పదు మరి! .... మరి!

రాముడు తేరుకునే సరికి లక్ష్మణుడు హనుమంతుడి చేతులు పట్టుకుని దేవుళ్ళాడుతున్నాడు. – "ఎలాగయినా నీ వల్ల మాకీ సహాయం జరగా లోయి! ఇప్పుడు సుగ్రీవుడు అవుననకపోతే మా అన్నగారికి ఇంకో దిక్కు లేదు. ఈ దుఖ్ఖ సముద్రంలోంచి మా అన్నగార్ని సుగ్రీవుడు రక్షించకపోతే ...." అంటూ జలజలా కన్నీళ్ళు కారుస్తున్నాడు.

రాముడు మొహం తిప్పి పంపా సరోవర సౌందర్యం అవలోకించడంలో మునిగాడు.

లక్ష్మణుడికి, వదినగార్ని తల్చుకుంటోంటే రావణుడి చెర లోంచి ఆమెని ఎంతటెంతట విడిపించుకు రాగలమా అని ఆరాటంగా ఉంది. సుగ్రీవుడి సహాయం తప్ప ఇంకో మార్గమేమీ కనిపించడం లేదు. బొంగురు పోతున్న కంఠంతో– "హనుమంతుడా! ఇన్ని మాటలెందుకు? సుగ్రీవుడు శ్రీరాముణ్ణి అనుగ్రహించి సహాయం చేసేటట్టు చేసే భారం నీదే!" అని హను మంతుడి చేతులు విడిచి పెట్టి, కళ్ళు తుడుచు కున్నాడు.[258]

హనుమంతుడు లోలోపల దిగాలు పడి పోయాడు. వీళ్ళేదో మహా వీరులేమో .... వాలి పీడ వదిలిస్తారని ఎంతో ఆశపడితే, తీరా వ్యవహారం ఇలా తిరిగిందేంటి? మనుషులు ఒడ్డూ పొడుగూ బాగానే వున్నారు గానీ బొత్తిగా సామర్థ్యం ఉన్నట్టు లేదు .... ఏమోలే! .... ఏం చెప్పగలం! ఏ పుట్టలో ఏ పాముందో! బాణాలు కొట్టడం వచ్చి వుండాలిలే. ఎందుకన్నా పనికి రాకపోరు.

"ఏమోయి! ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"అబ్బే! అంతగా చెప్పాలా మీలాంటి వారు? మా రాజు మీకు తప్పకుండా సహాయం చేస్తాడు. మీతో స్నేహం చేసుకోవాలనే కదా నన్ను పంపించాడు? రండి, వెళ్దాం."

"అన్నగారూ, దయచేయండి!" అంటూ లక్ష్మణుడు పంపా సరోవర సౌందర్యానుభూతుల్లో లీనమై పోయిన అన్నగార్ని బయటికి పిలిచాడు.

రాముడు మొహం తిప్పి చుట్టూ చూస్తూ – "ఈ కొండ ఎక్కడం మహాకష్టంగా ఉందోయి!" అంటూ లక్ష్మణుడి అడుగు జాడల కోసం ఆగాడు.

"నా వెనకే రండి! తేలిగ్గా పోయే దారి చూపిస్తాను" అంటూ హనుమంతుడు చకచకా బండల మీదనించి అంగలు వేస్తూ నడక సాగించాడు.

★ ★ ★

సుగ్రీవ మహారాజు, ఎందుకైనా మంచిదని రుష్యమూక పర్వతాన్ని కూడా శంకించి, దాని పక్కనే వున్న మలయ పర్వతం మీద గుహలో, మంత్రుల తలల అడుగున తన తల భద్రం చేసి, ఊపిరి బిగ బట్టి ముడుచుకుని కూర్చుని వున్నాడు – రాజనీతి చొప్పున.

హనుమంతుడు, రాముణ్ణీ లక్ష్మణుణ్ణీ రుష్య మూక పర్వతం మీదకి తీసుకొచ్చి, అక్కడ మహారాజ దర్శనం గాకపోవడం చేత, చుట్టుపక్కల గుహలు వెదుక్కుంటూ మలయ పర్వతం మీద కొచ్చాడు. గుహకి కొంచెం దూరంలో రాముణ్ణి ఆగమని సైగజేసి – "అయ్యా! ఇప్పుడే మా రాజుని వెంట బెట్టుకొస్తాను. ఈ బండల మీద సుఖంగా కూర్చోండి" అని రెండు బండల మీదకి అన్న దమ్ముల్ని ఆహ్వానించి, గబగబా గుహ వేపు వెళ్ళాడు.

హనుమంతుడి అట్టహాసం పసిగట్టి మంత్రుల తలలు, రాజు తలతో – "వచ్చినట్టున్నాడు" అని గుసగుస లాడాయి. గుసగుసలు పూర్తి కాకుండానే గుహలో

---

**258.** **కిష్కింధా, సర్గ 4, శ్లోకాలు 17 .... 25:** హనుమంతుడితో లక్ష్మణుడి మాటలు వినండి – "కోరిన వారికి ఐశ్వర్యము నిచ్చు ... సర్వస్వామి అయిన ఈ రాముడు, సుగ్రీవుని తన స్వామిగ ఇచ్ఛగించుచున్నాడు. సర్వ లోకములకూ శరణ్యుడుగా నుండు రాముడు, సుగ్రీవునికి శరణాగతి చేయుచున్నాడు. సుగ్రీవుని తన రక్షకునిగ నమ్ముచున్నాడు. సుగ్రీవుని అనుగ్రహము కోరుచున్నాడు. శోక పీడితుడైన రాముని సుగ్రీవుడే అనుగ్రహించ వలయును. – ఇట్లు లక్ష్మణుడు కంట నీరుపెట్టి జాలి పుట్టునట్లు మాటలాడెను."

"లోకాలను రక్షించే వాడు – తనను రక్షించమంటున్నాడు! లోకాలను కాపాడేవాడు – తనను కాపాడమంటున్నాడు! లోకాలను దయతల్చువాడు – తనను దయదల్చమంటున్నాడు!" అని చెప్పడంలో కవి, తన కవితా చమత్కారమే చూసు కున్నాడు గానీ, అది 'శ్రీరాముడి పాత్రని' ఎంత చిన్న బరుస్తుందో పట్టించుకోలేదు. లక్ష్మణుడు ఒకటే ప్రాధేయపడుతున్నాడు హనుమంతుణ్ణి! ★

జొరబడ్డ హనుమంతుణ్ణి చూసి, మహారాజు తల ఉలిక్కి పడి పోయింది – "అబ్బ! .... నువ్వేనా? .... వాలేమో అను ...." అని ఆపేసి, మొహం బిగించి గంభీరం చేశాడు – "ఊఁ .... ఏమిటి విషయం? .... ఎవరు వాళ్ళు ....? ఏమిటా క ....త్తులు?"

హనుమంతుడు ఘనకార్యం సాధించుకొచ్చిన ఉత్సాహంతో – "వాళ్ళు మనకి శత్రువులు కారు మహా రాజా! అంతా కనుక్కొచ్చాను. చెబుతాగానీ ...." అంటూ బొడ్లో తడుముకుని, ఏమీ దొరక్క పోయినా నిరుత్సాహ పడకుండా చెప్పడం మొదలెట్టాడు – "అబ్బే, మనం భయపడ్డాం గానీ వాలి ముక్కూ మొహం తెలీదు వీళ్ళకి, ఎక్కడో కోసల దేశం అంట వాళ్ళది. దండ కారణ్యం నించి వస్తున్నారు. దశరథ మహారాజు కొడుకులంట. ఇద్దరూ అన్న దమ్ములే. పెద్దాయన పేరు శ్రీరామ చంద్రుడు. బాగా చదువుకున్న వాడు. బుద్ధిమంతుడు. చిన్నాయన లక్ష్మణుడు. మరీ బుద్ధిమంతుడు. అన్న గారంటే ఆ భక్తీ అదీ .... కళ్ళారా చూడవలిసిందే ...."

సుగ్రీవ మహారాజు సుందర వదనంలో చిట పటలు లేచాయి – "తమ్ముడికి అన్న మీద భక్తా?" అని మొహం చిట్లించాడు.

తన తప్పు గ్రహించుకున్న హనుమంతుడు నాలి క్కరుచుకుని నవ్వు మొహంతో చూశాడు –"అబ్బే, నీ సంగతి కాదు, లక్ష్మణుడి సంగతి చెప్పాలే. ఆ దేశం వాళ్ళు అలాగుంటారేమో! నువ్వు నీ అన్న మీద భక్తితో వుండాలని నేనంటానా?"

"ఊఁ, సర్లే! .... ఆ కత్తులేమౌతాయి వాళ్ళకి ....? రుషులికీ, కత్తులికీ చుట్టరికం ఏంటి?" అంటూ సుగ్రీ వుడు ఇంకా కోపం తీరక ఖయ్యి మన్నాడు.

"అదే మహారాజా, చెప్పొచ్చేదేంటంటే .... ఆ రాముడి భార్యని రావణుడనే రాక్షసుడెవడో ఎత్తుకు పోయాడంట! పాపం మనలాగే వాళ్ళూ కష్టాల్లో పడి మిడుకుతున్నారు. నీ సాయం అడగాలనే పుట్టెడాశతో వొచ్చారు."

"నా సాయవా? ఇంకా నయం! కుదరదని చెప్ప లేదూ? ఎందుకొచ్చిన తద్దినం మనకి? కుదరదని చెప్పే శావా లేదా? లేకపోతే వెనక్కెళ్ళి చెప్పేసి రా ముందు!"

"అబ్బే! మనం అంత తొందర పడకూడదు మహా రాజా! శ్రీరాముడు చాలా విషయాలు తెలిసిన వాడి లాగున్నాడు. బాగా చదువుకున్న వాడు. గొప్ప కులం వాళ్ళు! అలాంటి వాళ్ళొచ్చి 'నువ్వే దిక్క'ని శరణడిగితే ...."

"ఏంటీ .... నేనే దిక్కన్నారా ....?"

"అనకపోతే తీసుకొస్తానా? సుగ్రీవుడే మమ్మల్ని రక్షించాలన్నారు. సుగ్రీవుడే మమ్మల్ని కాపాడాలన్నారు. సుగ్రీవుడే మమ్మల్ని దయదల్చాలన్నారు. ఆ చిన్నాయనైతే నా చేతులు పట్టుకుని 'ఊఁ' అనే దాకా వదల్లే! చెప్పొద్దూ, నాకూ జాలేసిందనుకో."

"ఆఁ .... నీకు జాలెయ్యటాని కేంలే! వాళ్ళెవరో, ఏంటో కనుక్కు రమ్మన్నానా, వెంటబెట్టు కొచ్చెయ్య మన్నానా? .... చూసి రమ్మంటే కాల్చి వొచ్చే రకంలా గున్నావే!" అని రుస రుస లాడాడు సుగ్రీవుడు.

హనుమంతుడు కొంచెం బెంబేలు పడ్డాడు – తను చేసుకొచ్చిన పని రాజుగారు వొప్పుకోడా ఏవిటని.

తారుడు కలగజేసుకుని – "అసలు రాముడికి సుగ్రీవుడేం సాయం చెయ్యాలంటావూ? అసలు సంగతి చెప్పవే?" అని సూటిగా వ్యవహారంలోకి దిగాడు.

"ఆయన భార్యని వెతకాలిగా?" అని నసిగాడు హనుమంతుడు.

సుగ్రీవుడు ఖయ్యిమని లేచాడు – "ఇది మరీ బాగుంది. నేను వెతుకుతానా ఏంటి పోయి? .... ఊళ్ళో వాళ్ళ పెళ్ళాలందర్నీ వెతుకుతూ కూర్చుంటాను, రమ్మనీ! నా కిదే పని! నిన్ను ఇదా చేసుకు రమ్మన్నాను?"

హనుమంతుడు నచ్చచెప్పే ధోరణిలో, నేర్పుగా – "మహారాజా! నీ మేలు కోసమే నేనీ కార్యం చేసుకొచ్చాను సుమా ...." అంటూ ప్రారంభించాడు.

"ఏం మేలూ, నీ మొహం మేలూ?" అని సుగ్రీవుడు హనుమంతుడి నేర్పంతా ఎగరగొట్టాడు – "బడితెల్లాగా వాళ్ళ కత్తులూ వాళ్ళూ .... వాళ్ళతో మనకేం స్నేహం?" అని కోపంగా చుట్టూ చూశాడు.

హనుమంతుడు కాస్త చొరవచేసి – "వాళ్ళకి కత్తులుంటే మనకేం భయం మహారాజా, వాలికి భయం గానీ?" అని తర్కానికి దిగాడు.

సుగ్రీవుడు చురుగ్గా మొహం చిట్లించి – "వాలికేం భయం? ఎందుకు భయం? ఎల్లా భయం? ఎప్పుడు భయం? ...." అంటూ ప్రశ్నలు రువ్వాడు.

"అల్లా అడుగు, చెబుతాను. అసలు మనం వాలిని జయించాలా, అక్కర్లేదా? .... బతికినన్నాళ్ళూ ఈ కొండ మీదే పడివుంటామా?"

"ఇంకా నయం. ఉంటే నువ్వుండు .... నేనుం డను."

"మరి మనకి ఎవరన్నా గొప్ప వీరుడి సహాయం కావాలా, అక్కర్లేదా?"

"ఊఁ, అయితే ....?"

"అయితే ఏంటి? .... రాముడితో స్నేహం .... ఎంత బలం ...."

"ఏం బలం? .... ఆ కత్తు ...."

"అదుగో! మళ్ళీ అదే మాటా? ఆ కత్తులు మనల్నేం చేస్తాయి?"

"మరి ఎవర్ని చేస్తాయి?"

"చెప్పేది వినవు గదా? రాముడితో స్నేహం చేసు కున్నావనుకో. రాముడు వాలిని చంపేస్తాడేమో ఎవడికి తెలుసు?"

"ఏంటీ? చంపెయ్యటమే!" సుగ్రీవుడి మొహం తళుక్కున మెరిసి వెంటనే చీకట్లు కమ్మింది – "అబ్బే! వాలి నెవడు చంపగలడూ? .... ఉత్తది ...." అని గట్టిగా నిట్టూర్చాడు.

"మహారాజా! హనుమంతుడు చెప్పేది బాగానే ఉన్నట్టుందే" – తారుడు కొంచెం హనుమంతుడి వేపు జరిగాడు.

"అవును. ఇది బాగానే వుంది. మనం భయ పడే దేమీ లేనట్టే ఉంది" – మంత్రులందరూ హనుమంతుడి వేపే వొరిగారు.

"ఏంటీ బాగుండేది, మీ అందరి మొహం!" అని మహారాజు విసుక్కుని – "ఇంతకీ ఆ రాముడెలా చంపుతాడేంటి వాలినీ?" అని అసలు సిసలు ప్రశ్న వేశాడు.

"ఎలాగేంటి? .... ఆ బాణాల్లేవూ?"

సుగ్రీవుడు వెటకారంగా నవ్వాడు – "ఆ బాణం పుల్లలతో వాలిని చంపుతాడా? .... ఇదుగో! ఇన్ని మాట లెందుగ్గానీ .... ఇదేం జరిగిచచ్చే యవ్వారం కాదు. ఆయన భార్యని ఆయన్నే వెతుక్కోమను! తొందరగా చెప్పెయ్. నీ వెనకాల తీసుకొచ్చేశావా ఏంటి వాళ్ళని? .... వెళ్ళమను ముందు. ఇంకెవర్నన్నా చూసుకోమను. నేను వెతకలేను సుమా ఆయన పెళ్ళాన్ని. చెప్పెయ్ ఆ మాట!" అంటూ హనుమంతుణ్ణి తొందర పెట్టాడు.

హనుమంతుడు బుగ్గలు ఉబ్బించి రాజుని కోపంగా చూశాడు – "నాకు తెలవకడుగుతానూ, ఇందాక ఆ బాణం పుల్లలు చూసి కాదూ మనం హడలి చచ్చిందీ?"

సుగ్రీవుడు తెల్లబోయి – "అవునూ, అయితే?" అన్నట్టు చూశాడు.

అదును చూసి హనుమంతుడు చొరవ చేస్తూ, "మహారాజా! ముందు నువ్వు రాముడితో స్నేహం చేసు కుంటే, తర్వాత ఆ వ్యవహారాలన్నీ మాట్లాడుకోవచ్చు" అని – ఒకసారి చుట్టూ చూసి కంఠం తగ్గించి గుస గుస లాడాడు – "నీ పిచ్చి గానీ .... మనం మాత్రం ఆయనకి ఊరికే సాయం చేస్తామా? ఆయన వాలిని చంపి పెడితే, మనం ఆయన భార్యని వెతికి పెడతాం. అంతే కదా? ఇందమ్మా అంటే ఇందమ్మా! నా మాట విని ...."

"ఆఁ, విన్నాలేగానీ .... నిజంగానే వాలిని చంపి పెట్టగలడంటావా?"

"ముందు నువ్వసలు శ్రీరాముడితో స్నేహం చేసుకో."

"చేసుకుంటానయ్యా! చేసుకుంటే ఏం లాభం? 'నీ శత్రువుని నే నెందుకు చంపుతానూ, నాకు పాపం చుట్టు కోదా?' అంటాడేమో తీరా ...."

"అబ్బో! ఆయనకి శాస్త్రాలన్నీ తెలుసు. ఏ పాపా నికేం ప్రాయశ్చిత్తం చేసుకోవాలో ఆయనకి మా చక్కగా తెలుస్తుంది. అయినా, ఆయన అంటాడో లేదో మన కెందుకా అనుమానం? అన్నప్పుడు చూద్దాం. ఆ మాట అన్నప్పుడు మనం ఆయన భార్యని వెతకడం మానేద్దాం."

"అవును. హనుమంతుడు అన్నది బాగుంది రాజా! నువ్వు కోసల రాజుతో స్నేహం చేసుకుంటేనే బాగుం టుంది" అన్నారు చుట్టూ మంత్రులు.

సుగ్రీవుడికి మంత్రుల మాటలంటే ఎప్పుడూ గురే. ఎవడి పెళ్ళాన్నో వెతికి పెట్టాలంటే వొళ్ళు మండు తూన్నా, మంత్రుల్ని కాదనలేక పోయాడు. ఒక వేళ శ్రీరాముడు నిజంగానే వాలిని చంపగలడేమో! ఏమో, ఎవడు చెప్పగలడు, ఏ పుట్టలో ఏ పాముందో! "ఊఁ! సరే, మీ ఇష్టం! .... మంత్రులందరూ చెప్పిం తర్వాత .... మరి, బాగా కనుక్కున్నావా, వాళ్ళెవరో ఏంటో .... ఫర్వాలేదుగా? వాలి మనుషులు కారుగా? మనకేం భయం లేదుగా? ...." అంటూ గుహలోంచి తల బయ టకు తీశాడు.

"నా మాట నమ్ము మహారాజా, అన్నీ కనుక్కు న్నాను" అని హనుమంతుడు మళ్ళీ మళ్ళీ చెప్పు కొచ్చాడు.

అన్నీ విని సుగ్రీవుడు, తారుడితో – "ఎందు కన్నా మంచిది మామా! నువ్వు కూడా ఆ శ్రీరాముణ్ణి ఒక కంట కనిపెడుతూ వుండు సుమా! పదండి వెళ్దాం" అంటూ వీరోచితంగా రొమ్ము విరుచుకుని ముందుకు నడి చాడు.**259**

రాముణ్ణి చూడగానే సుగ్రీవుడు తబ్బిబ్బు పడి ఆశ్చ ర్యంగా చూస్తూ ఉండిపోయాడు.

సుగ్రీవుణ్ణి చూసిన రాముడు కూడా నిశ్చలంగా,

---

**259. కిష్కింధా, సర్గ 3, ఆఖరి శ్లోకం:** అసలు సుగ్రీవుడికి రాముడితో స్నేహం చెయ్యాలనే అభిప్రాయం లేదు మొదట్లో. వాళ్ళెవరో తెలుసుకుని రమ్మన్నాడేగానీ తీసుకు రమ్మని చెప్పలేదు. రాముడూ, లక్ష్మణుడూ వాలి మనుషులు కారని తెలిసింతర్వాత, హనుమంతుడే రాముడి చేత వాలిని చంపించాలనే ఉపాయం ఆలోచించాడు. "లక్ష్మణుని మాటలు విని మిగుల సంతోషము గల వాడగు హనుమంతుడు, మనసును సమాధాన పరచుకొని, వాలిని గెలుచు నిమిత్తమై, రామ లక్ష్మణులతో సుగ్రీవునికి స్నేహము గలిగించుటకు అభిప్రాయ పడెను." ★

గంభీరంగా కళ్ళు భూమికి దించి ఊరుకున్నాడు. సుగ్రీవుణ్ణి చూసీ చూడగానే రాముడికి చాలా ఏవగింపు కలిగింది. అడవుల్లో నిత్యమూ చూసే మోటు మనుషుల్లాగానే ఉన్నాడు సుగ్రీవుడు కూడా. వొంటిమీద నగలూ అవీ ఏవో ఉన్నాయిగానీ – అవి కూడా ఆటవికులు పెట్టుకునే మాదిరి మోటు నగలే. రాముడికి సుగ్రీవుడి మొహంలో ఎక్కడా అంద చందాలు గానీ, కళా కాంతులు గానీ, కనపడ లేదు. ఈ ఆటవికుడేనా సుగ్రీవ మహారాజు? పైగా ఈయనా తనకు సహాయం చేసేది?

'సుగ్రీవ మహారాజెంత చక్కనివాడో చూడు' అన్నట్టు లక్ష్మణుడి వేపు క్రీగంట చూశాడు.

లక్ష్మణుడు సుగ్రీవుణ్ణి గౌరవంగా చూస్తున్నాడు – "ఇతడేనా మా అన్నగారికి సహాయం చేసేది!" అన్న విస్మయం లక్ష్మణుడి మొహంలో తొణికిసలాడుతోంది.

సుగ్రీవుడు – రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ చూసి ఆశ్చర్యంతో, గౌరవంతో, తల వొంచుకున్నాడు. వారి కను ముక్కు తీరులూ, అంద చందాలూ సుగ్రీవుడి కెంతో ముచ్చట కలిగించాయి. ఇద్దరికిద్దరూ ఎంతో నాగరీకంగా, గొప్ప వారిగా కనిపించారు. వారి తండ్రి తాతల గురించీ, వంశ ప్రతిష్ఠల గురించీ హనుమంతుడు చెప్పిందంతా గుర్తొచ్చి సుగ్రీవుడి గౌరవం ఇంకా పెరిగింది.

హనుమంతుడు కలగజేసుకుని సుగ్రీవుడికి రాముణ్ణి చూపించాడు. "మహారాజా! ఈ మహాను భావుడే శ్రీరాముడు. కోసల నేలవలసిన వాడు. సమస్త శాస్త్రాలూ చదివిన వాడు. ఈయన ఆపదలో చిక్కుకుని నీ శరణు కోరుతున్నాడు ...."

రాముడికి తల తీసేసినట్టయింది. సుగ్రీవుణ్ణి చూడక ముందు ఏమో అనుకున్నాడు గానీ, ఈ ఆటవికుణ్ణి తను శరణు కోరడం అంటే ....

సుగ్రీవుడు సిగ్గుపడుతూ వినయంగా చేతులు నలుపుకుంటూ రాముడితో అన్నాడు – "అయ్యా! నీ గురించి అంతా విన్నాను. నా మంత్రి చెప్పాడు. నువ్వు గొప్ప దేశానికి రాజువి. గొప్ప కీర్తిమంతుడివి. చదువులన్నీ చదివిన వాడివి. నీ వంటి మహాను భావుడు నా లాంటి అడవి మూర్ఖుడితో నేస్తం కడతాననటం .... నా సాయం అడగటం .... అయ్యా! ఇది నా అదృష్టం! నా భాగ్యం!" అని కొంచెం జంకుతూ "నా స్నేహం నీ కిష్టమే అయితే ...." అంటూ సందేహంగా చెయ్యి జాపాడు.

సుగ్రీవుడి మాటలూ, వినయమూ, రాముడికి కొంచెం ఇష్టంగానే తోచాయి. ఇష్టాయిష్టాల మధ్య ఊగిసలాడుతూ రాముడు, సుగ్రీవుడు చెయ్యి చాచే సరికి అప్రయత్నంగా ఆ చెయ్యి పట్టుకుని గంభీరంగా చూశాడు. సుగ్రీవుడా గాంభీర్యాన్ని గుర్తించక, అమాంతంగా రాముడి కాళ్ళ మీదబడి వాటేసుకున్నాడు. సుగ్రీవుడు వొదిలే వరకూ ఆ పట్టు వొదుల్చుకోడం రాముడి తరం కాలేదు.

సుగ్రీవుడి మంత్రులు గబ గబా ఎండు కర్రలు పోగు చేసి నిప్పు రాజేశారు. చుట్టూ కూర్చుని ఊది ఊది పొగ లేకుండా మంట చేశారు. హనుమంతుడు కాసిన్ని పూలు తెంపుకొచ్చి కర్రల చుట్టూ పడేశాడు.

సుగ్రీవుడూ, రాముడూ అగ్ని చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. రాముడు అగ్ని దేవుణ్ణి కొలిచే మంత్రాలన్నీ ఉచ్చరించాడు. తనతో స్నేహం చేస్తున్నందుకు సుగ్రీవుడి సంతోషం చూస్తూ, తన ఆధిక్యతని మననం చేసుకున్నాడు. అగ్ని సాక్షిగా, శాస్త్రోక్తంగా జరుగుతోన్న కార్యం రాముడికి కొంత స్థిమితం కలిగించింది.

ఇంత గొప్పవాడితో స్నేహం చేస్తే వాలికి చావు తప్పదని సుగ్రీవుడికి చాలా సంబరం ప్రారంభమైంది.

ప్రదక్షిణాలూ, మంత్రాలూ, కావిలింతలూ – అన్నీ అయ్యాక, సుగ్రీవుడు చుట్టూ చూసి పూలతో నిండిన కొమ్మ వొకటి ఫెళ్ళున విరిచి కింద పడేసి రాముణ్ణి లాగి దాని మీద కూర్చోబెట్టి తను కూడా సరసన చతికిలబడ్డాడు.

హనుమంతుడు, లక్ష్మణుడికి కూడా ఒక పూల పీట వేశాడు.

సుగ్రీవుడి మంత్రులంతా చుట్టూ జేరారు.

"వాళ్ళేం మాట్లాడుకుంటారో విందాం" అని చెట్ల మీద పిట్టలన్నీ చప్పుళ్ళు మాని కూర్చున్నాయి.

"వాళ్ళేం మాట్లాడుకున్నా నేను వచ్చి మీకందరికీ చెప్పేస్తాగా?" అని గాలి దూర దూరంగా చెట్ల కన్నిటికీ మాటలిస్తోంది.

"అయ్యా! మా అన్న .... పరమ దుర్మార్గుడనుకో! కిరాతకుడనుకో....!"

సుగ్రీవుడికి గబగబా తన గోడు చెప్పేసుకోవాలని ఆరాటంగా ఉంది. రాముడికి కూడా తన దుఃఖ చరిత్ర వినిపించాలని ఆతృతగానే ఉంది. తనే చెబితే బాగుంటుందా, లక్ష్మణుడితో చెప్పిస్తే బాగుంటుందా – అన్న ఆలోచనలతో సతమతమౌతూ వుండిపోయాడు.

"అయ్యా! చెబితే నమ్మవు. నీ కబద్ధం, నాకు నిజం. మా అన్న .... ఎంత దుర్మార్గుడో ...."

"అవునోయీ! .... మా పిన తల్లి కూడా అటు వంటి దుష్టురాలే ...."

"అసలు నేనే తప్పు చెయ్యలేదు సుమా! .... ఉత్త పుణ్యానికే నన్ను రాజ్యంలోంచి ...."

"సరి, నన్నూ అంతే కాదూ? .... నిష్కారణంగా .... నిర్దోషిని .... మా తండ్రి ఆడదాని మాట వినీ ...."

"చెప్పుకుంటే సిగ్గు. నా భార్యని మా అన్నే వుంచేసుకుని నన్ను అన్యాయంగా ...."

"అన్యాయం గాకపోతే ఏం ఉందోయీ లోకంలో?

.... పర స్త్రీ అని ఆలోచించాడా ఆ రావణుడు? అసలా గాథంతా విన్నావంటే ...."

"నా గోడు నువ్వు ఆలకించాలే గానీ .... కడుపు తరుక్కుపోతుందనుకో ...."

"కన్ను మూసి ఎరగననుకో, ఈ కష్టాలతో! ఇంత ఘోరం జరుగుతుందని స్వప్నంలో కూడా అనుకో లేదోయీ ...."

ఆ వ్యవహారం లక్ష్మణుడికి ఇబ్బందిగానే తోచింది. మొహం ఇటూ అటూ తిప్పి కొండ కిందికి చూశాడు. ఎంతెంత లోయలో! 'అసలీ కొండ ఎలా ఎక్కాం?' అన్నంత ఆశ్చర్యం వేసింది. కొండ పక్కనే చిన్న నీటి పాయ రాళ్ళ మీదనించి దూకుతూ పోతోంది. గాలిలో కరక పువ్వు వాసన విచ్చలవిడిగా తిరుగుతోంది.

హనుమంతుడికి హఠాత్తుగా కరకాకు ముక్కు పొడుం గుర్తొచ్చి బొడ్లో తడుంకుని, ఏమీ దొరక్క, పక్కనే నీలుడి బొడ్లో తడిమి, చిన్న చుట్టముక్క సంపాదించి, ఆరిపోతున్న అగ్ని దేవుళ్ళో దాన్ని అంటించాడు. అగ్నీ, చుట్టా, స్నేహం చేసుకున్నాయి. పరిమళాలూ, గాలీ స్నేహం చేసుకున్నాయి. అంత వరకూ నిగ్రహంగానే ఉన్న నీలుడు ముక్కు ఎగబీల్చి నెమ్మదిగా చెయ్యి బొడ్లోకి పోనిచ్చుకున్నాడు. అక్కడ తచ్చాడుతోన్న తారుడి చెయ్యి, నీలుడి చేతితో స్నేహం చేసుకుని, నీలుడి బొడ్డు ఖాళీ చేసింది.

"వాళ్ళు చుట్టలు కాల్చుకుంటున్నారు" అని గాలి, అడివంతా చెప్పేసింది.

"వాళ్ళంటే ఎవరెవరు? .... రాముడు కూడానా?" అన్నాయి చెట్లూ పిట్టలూ ఆశ్చర్యంగా.

వినిపించుకోకుండానే పరిగెత్తింది గాలి.

లక్ష్మణుడి దృష్టి లోయల మీదనించీ, నీటిపాయల మీదనించీ యథాస్థానాని కొచ్చేసరికి సుగ్రీవుడే మాట్లాడు తున్నాడు. రాముడు సుగ్రీవుడికే సందు ఇచ్చి, తను చాలించుకుని, మౌనంగా వినక తప్పని కష్టంలో పడ్డాడు.

"నా అన్నమూలాన్నే నిత్యం గజ గజ లాడుతూ ఈ కొండమీద కాలం గడుపుతున్నాను రామయ్యా!" అని సుగ్రీవుడు గబుక్కున రాముడి చేతులు పట్టుకున్నాడు. – "ఆ దుర్మార్గుడి వల్ల నాకేమీ భయం లేకుండా చేస్తానని నువ్వు నాకు మాట ఇవ్వాలి సుమా! .... గొప్ప వీరుడి వని విన్నాను. ఇవి చేతులు కావు!" అంటూ తన చేతులు గట్టిగా బిగించాడు.

రాముడు, కొంతసేపటి నించీ రాజకీయ తర్క వితర్కాలతో సతమత మౌతున్నాడు. సుగ్రీవుడు స్పష్టంగా పైకి తేల్చి చెప్పడం లేదు గానీ, అతడి అభిప్రాయం వాలిని చంపెయ్యమనే! వాలిని చంపేస్తే .... సుగ్రీవుడు రాజవుతాడు. సుగ్రీవుడు రాజైతేనే అతని చేతిలోకి సైన్యం, బొక్కసం, అధికారం అన్నీ వస్తాయి. అవన్నీ లేకుండా రావణుడితో యుద్ధం చెయ్యడం సాధ్యం కాదు. అంటే – 'రావణుడితో యుద్ధం చెయ్యాలంటే, సైన్యం కావాలి. సైన్యం కావాలంటే సుగ్రీవుడు రాజు అవ్వాలి. సుగ్రీవుడు రాజు అవ్వాలంటే వాలి చచ్చిపోవాలి. చచ్చి పోవాలంటే చచ్చిపోతాడా నిక్షేపంలా ఉన్న వాడు? – మరి ఎలాగో అతణ్ణి తనే చంపెయ్యాలి. వాలి చచ్చి పోతేనే సుగ్రీవుడు రాజవుతాడు. సుగ్రీవుడు రాజైతేనే ....

రాముడు చాలాసేపు ఆ విషయాన్నే కిందకీ మీదికీ ఆలోచిస్తోంటే, అంతరాత్మ నెమ్మదిగా నసుగుతూ ముందుకొచ్చి నిలబడింది వినయంగానే – "మాటవరస కడుగుతున్నాను గానీ, .... ఇప్పుడు సైన్యం .... బొక్కసం .... అన్నీ వాలి చేతిలో సిద్ధం గానే ఉన్నాయి కదా? అతన్నే సహాయం అడగరాదూ? .... ఆతన్ని చంపడం .... అవన్నీ సుగ్రీవుడికి వచ్చేటట్టు చెయ్యడం .... అప్పుడు మన కార్యం జరిపించుకోవడం .... ఈ తిరకాసంతా ఎందుకు? .... అప్పటికి చాలా ఆలశ్యం అయిపోతుంది గదా? .... ఇప్పుడు సుగ్రీవుణ్ణి సహాయం అడిగినట్టే వాలినే సహాయం అడగవొచ్చునే! .... వాలితోనే స్నేహం చేసుకోవచ్చునే! .... ఈ మాత్రానికే వాలిని చంపడం .... అబ్బే! ఊరికే అనుమానం వచ్చీ అడిగాను సుమా!" అని నడుం వొంచి ఆత్మ ఒక పక్కకి తిరిగి నిలబడింది.

రాముడు గంభీరంగా ఎటో చూశాడు – "అవును. నువ్విలా అడుగుతావని నాకు తెలుసు. అన్నీ చెబుతాను. ఈ మాత్రానికే వాలిని చంపడం ఎందుకంటున్నావు కదూ? అసలు రాజకీయాల్లో, 'ఈ మాత్రం, ఆ మాత్రం' అనే మాత్రాలూ సూత్రాలూ ఉండవు. మనం చేసే పని ఎంత చిన్నదైనా దానివల్ల మనకేమైనా లాభం వస్తుందా, లేదా – అన్న సూత్రం ఒక్కటే ఉంటుంది. నువ్వన్నట్టు వాలితోటే స్నేహం చేసుకుంటాం అనుకో. అసలు మన కన్నా గొప్ప స్థితిలో ఉన్నవాడు మనతో స్నేహం చేస్తాడని నమ్మకం ఏమిటీ? .... పోనీ స్నేహం చేస్తే మాత్రం మనం అడిగిన సహాయం చేస్తాడని నమ్మకం ఏమిటీ? .... వాలికీ, రావణుడికీ ఉన్న సంబంధం ఎటువంటిదో? మనకోసం వాలి, రావణుడితో వైరానికి సిద్ధపడతాడో లేదో? – ఇవన్నీ ఆలోచించాలి గదా ....?" అని ఆత్మతో శాంతంగా సంభాషణ ప్రారంభించాడు.

"పోనీ ఎవరి ద్వారానన్నా అడిగించి తెలుసు కుంటేనో? సుగ్రీవుణ్ణి అలాగే అడిగించాం గదా? లక్ష్మ ణుణ్ణి వాలి దగ్గిరికి పంపరాదూ?"

"సరే, నువ్వన్నట్టే వాలి మనకు సహాయం చేస్తాడే అనుకో. ఇక తర్వాత ఎల్లకాలం నేను వాలికి కృతజ్ఞుడిగా ఉండవలసిందే కదా? అతడి సహాయానికి ప్రతిఫలంగా నేను మళ్ళీ అతడికి చెయ్యదగ్గ కార్యమేదీ లేదు కదా?

.... సుగ్రీవుడి సంగతైతే అలా కాదు! సుగ్రీవుడికి నేను ముందే సహాయం చేస్తాను. వాలిని చంపి, రాజ్యం అప్ప గిస్తాను. అప్పుడు సుగ్రీవుడే నాకు ఎల్లకాలం కృతజ్ఞుడిగా ఉంటాడు. రేపు రావణుడితో యుద్ధం చెయ్యడానికి సహాయం చేసినా, అదంతా నేను చేసిన ఉపకారానికి ప్రత్యుపకారమే అవుతుంది. తర్వాత కాలంలో కూడా సుగ్రీ వుడు నా చెప్పు చేతల్లోనే మసులుతాడు. అంటే, కిష్కింధా రాజ్యం, కోసల రాజ్యాధీనంలో ఉన్నట్టే! వాలి వల్లే సహాయం పొందుతాననుకో. సరిగ్గా దీనికి తారు మారౌతుంది. శ్రీరాముడు ఎల్లకాలం వాలికి వినయ విధేయతలతో బ్రతకవలసిన వాడే! .... అవునంటావా, కాదంటావా?"

"…. అవును గానీ …. అయినా …. మరి …. వాలిని చంపితే …. లోకం …."

"అదే, లోకంతో కొంచెం ఇబ్బందే. అదే ఆలో చిస్తు న్నాను. వేదాల్లోంచి ఏమైనా నీతులు దొరుకు తాయే మోనని ఆలోచిస్తున్నాను."

"ఏవిటీ! …. వేదాల్లో 'ఎవరు ఎవర్ని చంపేసినా అస్సలు తప్పులేదనే' నీతులుంటాయా?"

"అలా ఉండవు గానీ …. 'మను ధర్మశాస్త్రం'లో కొన్ని మంచి నీతులే ఉన్నట్టున్నాయి. ఈ సందర్భంలో మనకు పనికి వచ్చేవి రెండు శ్లోకాలు గుర్తు కొస్తున్నాయి. అసలు మను ధర్మశాస్త్రం, మన ధర్మ శాస్త్రమే గదా?"

"అయితే వాలిని చంపెయ్యడమేనా? …."

"తప్పదు మరి. నేనేం చేస్తాను? అతడికి అట్లా రాసిపెట్టి వుంటేనే నాకీ బుద్ధి కలుగుతోందేమో! నేను చేసే పని తప్పెలా అవుతుంది? …. అంతా విధి విధానం …. నేను నిమిత్త మాత్రుణ్ణే! అలాగే చెప్పేస్తాను లోకానికి. లేకపోతే, వాలి సహాయం తీసుకుని, అతనికి శరణాగతుణ్ణయి ఎల్లకాలం బ్రతకమంటావా నన్ను? …. ఒక పని చేస్తున్నాం అంటే, ఎంత ముందు చూపు ఉండాలీ! అప్పటికా పని అయిపోతే చాలనుకోగూడదు. దానివల్ల ముందు ముందు కూడా లాభం చేసుకోవాలి."

"మరి కొడుకులు తండ్రుల్నీ, తమ్ములు అన్నల్నీ భక్తితో సేవించాలి కదా? లక్ష్మణుడు చెయ్యడం లేదూ? అలాగే, సుగ్రీవుడు కూడా తన అన్నని భక్తితో సేవించు కోవాలి కదా? తమ్ముడే అన్నని చంపించాలని చూస్తే, అది ఎంత ఘోరం! ఎంత పాపం!"

"చూడూ! ఈ ఘోరాలూ పాపాలూ నాగరీకులైన రఘు వంశం వారికేగానీ, ఆటవికులైన వానరులకు కాదు. ఈ ధర్మా ధర్మాలు నాకు తెలియనట్టు నన్నెందుకు విసిగిస్తావు?"

"నిజమే, నిజమే! నీకు తెలియదని కాదు. అసలీ ప్రపంచంలో నీకు తెలియని ధర్మాలేమున్నాయి? కానీ …. పోనీ …. ఆ అన్నదమ్ములిద్దరికీ సఖ్యం చేస్తే? వాలి దగ్గిరికి లక్ష్మణుణ్ణి పంపి మాట్లాడితే నువ్వు చెప్పినట్టు వింటాడేమో? …. అప్పుడెలాగూ మనకు సహాయం చేస్తారు ఇద్దరూ. ఎవర్నీ చంప నక్కర్లేదు కూడానూ."

"నాకిలాంటి సలహాలిస్తేనే కోపం వొస్తుంది. వాళ్ళి ద్దరూ కలిస్తే ఇంకా బలం వాళ్ళకి. అప్పుడైనా వాలి వల్ల ఉపకారం పొంది నేను అతడికి అణిగి మణిగి విన యంగా ఉండవలసిందే కదా? ఇంకో రాజుకి కృతజ్ఞతగా ఉండడం నేను ఊహా మాత్రం గానైనా భరించలేను! ఒక రాజ్యం మన ఆధీనంలోకి వచ్చే అవకాశం ఉన్న ప్పుడు వదులుకోవడం ఎంత తెలివి తక్కువ! నేనేం చేసినా అన్నీ ఆలోచించే చేస్తాను. సమస్త శాస్త్రాలూ చది విన వాణ్ణి! నన్ను శంకిస్తా వెందుకు మాటి మాటికీ?"

"అబ్బే …. ఏదో …. ఊరికే …."

"సరిగ్గా చెప్పు! నా ఆలోచన ధర్మబద్ధంగా లేదూ?"

"ఎందుకు లేదూ? నీకు ధర్మాలన్నీ తెలుసు."

"నిజంగా అంటున్నావా? నీ కిష్టమేనా?"

"ఊఁ …. అ …. లా …. గే! నీ …. ఇ …. ష్టం!"

దీర్ఘాలోచనలో మునిగిన రాముడు, తల ఇటూ అటూ తిప్పుతోంటే సుగ్రీవుడు బిత్తరపోయి రాముడి చేతులు విడిచి పెట్టి తెల్లబోతూ దిక్కులు చూశాడు.

రాముడు తేరుకుని చిరునవ్వుతో – "సుగ్రీవా! మిత్రుల కర్తవ్యం ఉపకారం చెయ్యడమే గదా? నీ భార్యను అపహరించిన దుర్మార్గుడు – వాలి. అందుకే అతణ్ణి చంపి తీరుతాను. నిశ్చింతగా ఉండు!" అని తల పంకించాడు.**260**

---

**260.** **కిష్కింధా, సర్గ 5, శ్లోకాలు 26 … 30:** వాలి సుగ్రీవుల మధ్య వైరానికి కారణం ఏమిటో తెలుసుకోకుండానే రాముడు సుగ్రీవుడితో – "వాలిని చంపెదను" అని చెప్పేశాడు! అలా నిర్ణయించుకోడానికి కారణం కూడా చెప్పాడు. "నీ భార్య నపహరించిన వాలిని చంపెదను" అని! ఇక్కడ మనం ఇలా అనుకోవచ్చా? "ఇంకా కారణాలేం తెలియాలి? వాలి, సుగ్రీవుడి భార్యని అపహరించి, సుగ్రీవుణ్ణి రాజ్యంలోంచి వెళ్ళగొట్టిన సంగతి రాముడికి తెలుసు కదా? అందుకే అలా వాగ్దానం చేశాడు" అనుకోవచ్చా మనం? కానీ, తర్వాత కొంత సేపటికి (8వ సర్గలో 42వ శ్లోకంలో) – "సుగ్రీవుడా! వాలికీ, నీకూ కలిగిన వైరమునకు కారణము సవిస్తరముగ వినగోరుచున్నాను. అంతయు విని, బలాబలములను విచారించి, నీకు మేలు చేస్తాను" అంటున్నాడు. వైరానికి కారణం ఏమిటో ఇప్పుడు 'సవిస్తరముగా' వినాలనుకుంటున్నాడు గదా? విన్న తర్వాత వాగ్దానం చెయ్యాలా, వాగ్దానం చేసిన తర్వాత వినాలా? వాలిని చంపాలనుకోవడంలో రాముడికి స్వార్థం ఉందో లేదో తెలియాలంటే, వాలిని చంపడానికి రాముడు ఏం 'కారణాలు' చెబుతాడో ఆ కారణాల్ని బట్టి ఆలోచించాలి. ఆ కారణాల్ని తర్వాత చూస్తాం.

★

సుగ్రీవుడు తన చెవుల్ని తను నమ్మలేక – “నిజమేనా! .... చంపెయ్యడమే వాలిని! నీకేం వినబడిందీ?” అన్నట్టు హనుమంతుడి చెవులవేపు ఆశతో చూశాడు.

హనుమంతుడు, తారుడి చెవుల వేపు చూస్తున్నాడు. తారుడు ..... నీలుడి ....!

సుగ్రీవుడికి పూర్తిగా నమ్మకం కలిగించాలనే ఆరాటంతో రాముడు “సుగ్రీవా! నా బాణాల శక్తి నీకు తెలియదు. ఇంద్రుడి వజ్రాయుధం వంటివి సుమా నా బాణాలు! రామ బాణం గురి తప్పదు .... ఇన్ని మాటలెందుకు? నా కరకు బాణాలు గుండెల్లో దిగి, భూమి మీద పడి దొర్లే నీ అన్నని నువ్వే కళ్ళారా చూస్తావు” అని గంభీరంగా మందహాసం చేశాడు.

సుగ్రీవుడు ఆనందంతో తిన్నగా కూర్చోలేక పోతున్నాడు. వాలిని చంపెయ్యడమే! ఇక కిష్కింధా రాజ్యానికి రాజు తనే? పని జరిగేటట్టే ఉంది. ఇతడు గొప్ప విలుకాడులాగే ఉన్నాడు. బాణాలతో కొడితే వాలీ .... వాలి తాతా కూడా ఊడిపడతారా?” – సుగ్రీవుడు, మళ్ళీ హఠాత్తుగా రాముడి మీదబడి చేతులు లాగి పట్టుకున్నాడు – “రామయ్యా! నీ దయవల్ల అంత పని జరగాలే గానీ నీ రుణం ఉంచుకోను సుమా! నా భార్య మళ్ళీ నాకు దక్కితే .... రాజ్యం కూడా అనుకో .... అది సరే, మరి .... వాలిని ఎప్పుడు చంపేస్తావూ? .... అంత తొందర లేదనుకో, పోనీ బతకనియ్యి కాస్సేపు. మహా విర్ర వీగుతున్నాడు దుర్మార్గుడు. ఎంత కాలం బతుకుతాడో నేనూ చూస్తాను” అంటూ తిన్నగా కూర్చోనివ్వకుండా పిర్రకింద తెగ గుచ్చుకుంటోన్న పూల కొమ్మని గబుక్కున లాగి అవతల పారేశాడు. దాని మీదే కూర్చున్న రాముడు జర్రున జారి వెల్లికిత్తలాపడి మొహం చిట్లించి, పిర్రలు, సర్దుకున్నాడు.

రాముడు వాలిని చంపుతాననడం లక్ష్మణుడికేమంత సమంజసంగా తోచలేదు. అసలా అన్నదమ్ముల మధ్య వైరం ఎందుకో ఏమిటో, ఎవరి పక్షాన న్యాయం ఉందో, వివరంగా తెలుసుకోవాలి గదా? సుగ్రీవుడితో స్నేహం చేసుకోవడంలో తప్పు లేదు. అతని సహాయం కోరడంలోనూ సిగ్గు పడవలసిందేమీ లేదు. అంత మాత్రాన అతని శత్రువుని చంపుతానని వాగ్దానం చెయ్యడం .... ఏమిటో మరి, అన్నగారికి అన్నీ తెలుసు మరి.

సుగ్రీవుడు రాముణ్ణి వినయంగా చూస్తూ, తల తిప్పుతూ అన్నాడు – “రామా! .... నీ కష్టాలన్నీ విన్నాను. .... హనుమంతుడు నాకంతా చెప్పాడు .... నా కడుపు తరుక్కు పోయిందనుకో. ఇంక నీకేం భయం లేదు. నీ భార్య గురించి దిగులు పడకు! నా బలం నీకు తెలవదు. అసలే పిచ్చి కోపం నాకు. లోకాలన్నీ గాలించి నీ భార్యని తెచ్చిపెట్టే పూచీ నాదీ .... నువ్వు మాత్రం .... నా భార్యని .... తప్పకుండా .... కొంచెం ....”

“సుగ్రీవా! నీ భార్యని నీకు అప్పగించే భారం నాదేనోయీ! నిశ్చింతగా ఉండు! కానీ, .... నా భార్య కోసం మాత్రం .... ఎలాగైనా నువ్వు ....”

“రామా! .... నీ భార్య గురించి మర్చిపో, అదంతా నేను చూసుకుంటాను. ఆకాశంలో ఉన్నా, పాతాళంలో ఉన్నా, నీ భార్యని నీకు తెచ్చి ఇచ్చేవాణ్ణి నేనున్నాగా? మరి, నా భార్యని .... ఎలాగైనా .... నీదే భారం ....”

“నా మాట సత్యం సుమా! .... సుగ్రీవా! .... నీ భార్యని రక్షించే వాడిని నేనుండగా ....”[261]

గాలి, చెట్టు చెట్టుకీ తిరుగుతూ – “మనం ఇన్నాళ్ళూ పురుషులు పర స్త్రీలని ఎత్తుకుపోతారనే అనుకున్నాం గానీ .... ఈ మహానుభావులిద్దర్నీ చూడండి! పరస్త్రీలని రక్షించడానికెంత ఉత్సాహపడి పోతున్నారో!” అని చాటి చెపుతోంది.

చెట్లు తలలూపుతూ విన్నాయి. ఒక మర్రిచెట్టు నవ్వుతూ – “అంత ఉత్సాహం ఎందుకనుకున్నావూ? .... పర స్త్రీలు కాబట్టే. ఎత్తుకుపోవడం కుదరనప్పుడు ఆ స్త్రీల కోసం ఏవో పనులు చేసి ఉత్సాహం తీర్చుకుంటారు. అబ్బో! .... ఎందర్ని చూశామో! ఈ మానవుల సంగతి మనకు కొత్తే ముందిలే! పర స్త్రీలని రక్షించినా, శిక్షించినా, పురుషులు తమకు కలిసొచ్చేదే చేసుకుంటారు గానీ, స్త్రీల మీద దయదల్చి కాదులే” అంటూ నిదానంగా తల ఊపింది.

గాలి – “వస్తా నుండండి, వాళ్ళేం చేస్తున్నారో” అని మళ్ళీ పరిగెత్తింది అటు.

సుగ్రీవుడు రాముడికేదో చెపుతున్నాడు అంతా గుర్తుచేసుకుంటూ “.... ఒక రాక్షసుడు .... కొంత కాలం కిందట .... ఒక స్త్రీని ఎత్తుకుపోటం చూశాం. వాడే రావణు డయ్యుంటాడు .... ఏం, మనం చూడ లేదూ?” అని మంత్రుల్ని సాక్ష్యం అడిగాడు.

---

**261.** **కిష్కింధా, సర్గ 5, శ్లోకం 27**: రాముడు సుగ్రీవుడితో – “నీ భార్య నపహరించిన వాలిని నేను చంపెదను. నీ భార్య నీకు దక్కునట్లు చేసెదను.”

**సర్గ 6, శ్లోకాలు 5 ... 8**: సుగ్రీవుడు రాముడితో – “రామా! నీ భార్యను నేను తెచ్చెదను. భార్యా వియోగ దుఃఖము విడిచెదవు. పాతాళంలో నుండిననూ, ఆకాశములో నుండిననూ, నీ భార్యను తెచ్చి ఇచ్చెదను.”

ఎవడి పెళ్ళాన్ని వాడు రక్షించుకోలేదు. ఇతర్ల పెళ్ళాల్ని రక్షిస్తామని ప్రగల్భాలు! వీడి పెళ్ళాన్ని వాడూ, వాడి పెళ్ళాన్ని వీడూ రక్షిస్తారు! ★

"ఒక్క స్త్రీ నేవిట్లే, బోలెడు మంది స్త్రీల నెత్తుకు పోటం చూశాం."

"ఒక్క రావణు దేవిటి? బోలెడు మంది రావణు లెత్తుకుపోటం చూశాం. అబ్బో, ఎన్నిసార్లో! ఎవడికి గుర్తుంటుంది?"

"అది సర్లే! అందరిగోలా మనకెందుకు? .... రావణు డెత్తుకు పోతూ ఉన్నప్పుడు ఆ స్త్రీ 'రామా! లక్ష్మణా!' అని యాడవడం వినలేదూ? .... ఆ స్త్రీ నీ భార్యేనేమో రామా! .... అయ్యో! అసలు సంగతి మర్చే పోయానే! – ఆ మహాతల్లి ఏడుస్తూ నగల మూట ఒకటి మా వేపు విసిరింది సుమా! అప్పట్నించీ దాన్ని జాగర్తగా దాచిపెట్టాం. తెస్తానుండు" అంటూ సుగ్రీవుడు రెండం గల్లో గుహలోకి గెంతి మూట పట్టుకుని ఒక్కంగలో వచ్చి పడ్డాడు.

రాముడు ఆతృతగా మూట విప్పి నగలు చూశాడు. అన్నీ సీతవే. ఆ మూట కట్టిన గుడ్డ కూడా సీత చీరలోదే! పసుపు పచ్చ పట్టు చీర! పైట చెంగు చింపేసిందన్న మాట!

రాముడికి ఒక్క క్షణం సీతని చూసినట్టే అనిపిం చింది. ఆ నగలు పెట్టుకుని, ఆ చీర కట్టుకుని .... ఆ రోజు వాకిట్లో .... లేడి వెనక పరిగెత్తుతోన్న సీతే కన బడింది. రాముడు, కళ్ళు మూసి నెమ్మదిగా రాతి మీదకు వొరిగాడు.

లక్ష్మణుడు తల వొంచుకుని బొట బొటా కన్నీళ్ళు కారుస్తున్నాడు.

"లక్ష్మణా! చూడు నాయనా! .... మీ వదిన ఇదిగో! చూడు నాయనా!" అంటూ నగలు గుండెల మీద పరుచుకున్నాడు రాముడు.

లక్ష్మణుడు అన్న గారిని ఓదార్చడం కోసం గబ గబా కళ్ళు తుడుచుకుని – "అన్నగారూ! .... ఈ భుజ కీర్తులూ, చెవి ఆభరణాలూ వదిన గారివో కావో నేను గుర్తించలేను గానీ .... ఈ అందెలు మాత్రం వదిన గారివే. నాకు బాగా గుర్తు. వీటికి నేను రోజూ నమ స్కారం చేసేవాడిని" అంటూ అందెలకు మాత్రమే నమ స్కారం చేశాడు.[262]

రాముడు నెమ్మదిగా లేచి కూర్చుని, నగలన్నీ దగ్గిర పెట్టుకుంటూ "సుగ్రీవా! ఆ రాక్షసాధముడు ఎటు పోయాడు నాయనా? ...." అని కన్నీళ్ళతో చూశాడు.

సుగ్రీవుడు కాస్సేపు ఆలోచించి, ఇటూ అటూ తల తిప్పి – "దక్షిణం వేపు ...." అని – 'అంతేనా' అని మంత్రుల్ని చూశాడు.

"అవును, అంతే, దక్షిణం వేపే" అన్నారు హను మంతుడూ, నళుడూ.

"దక్షిణం వేపు కాదు, ఉత్తరం వేపు కాదూ?" అని తారుడు దక్షిణాన్ని వ్యతిరేకించాడు.

నీలుడు తూర్పు వేపు కాళ్ళు బారజాపి కునికి పాట్లు పడుతూ, ఉత్తర దక్షిణాల జోలికి పోకుండా ఊరు కున్నాడు.

"ఆ ఇప్పచెట్ల వేపు పోయాడు తెలుసా? దాన్ని దక్షిణం అంటారా, ఉత్తరం అంటారా? సూర్యుడెటు పొడుస్తున్నా డనుకున్నావూ?" అంటూ సుగ్రీవుడు మామని కొంచెం విసుక్కుని, తలెత్తి చూశాడు. పొద్దు తెలీనంత దట్టంగా వున్నాయి మేఘాలు.

లక్ష్మణుడు అటు చూస్తూ – "ఆ దిక్కు అయితే మాత్రం దక్షిణమే" అని సుగ్రీవుడి మాట ఖాయం చేశాడు.

తారుడు నిరుత్సాహపడుతూ – "ఏంటో ఈ కొండ ఎక్కిందగ్గిర్నించీ బొత్తిగా దిక్కులే తెలవటం లేదు. కిష్కింధలో అయితే ఏ దిక్కెటో కళ్ళు మూసుకుని చెబుతా" అని కళ్ళు మూసి తెరిచాడు.

చివరికి, రావణుడు దక్షిణం వేపే పోయాడని తేల్చారు.

రాముడు నగలన్నీ పరికించి చూస్తూ దుఖ్ఖ పడడం కొనసాగిస్తూనే వున్నాడు. "ఆ దుష్టుడు .... ఆ పరమ పతివ్రతని బాధిస్తున్నాడా నాయనా? .... ఏ విధంగా తీసుకు పోతున్నాడు నాయనా మీరు చూసినప్పుడు?"

"బలవంతంగా కావిలేసుకున్నాడు. ఇదుగో ఇలాగే ...." అంటూ సుగ్రీవుడు దూరంగా విసిరేసిన పూల

---

**262.** **కిష్కింధ, సర్గ 6, శ్లోకం 22:** "సీత యొక్క భుజకీర్తులు నాకు తెలియవు. ఆమె కుండలములను చూసినది లేదు. పాదముల అందెలు మాత్రము నాకు బాగుగా తెలియును" అంటున్నాడు లక్ష్మణుడు. అంటే, లక్ష్మణుడు సీత పాదాలనే గానీ, మొహాన్నీ, భుజాల్నీ చూడలేదన్న మాట! లక్ష్మణుడు, సీత ముక్కూ మొహం ఎరగనట్టు మాట్లాడుతున్నాడు. కానీ, అనేక సందర్భాలలో సీత అందచందాలు వర్ణిస్తాడు లక్ష్మణుడు. మచ్చుకి, అరణ్యకాండలో 45వ సర్గలో 34వ శ్లోకంలో – "అందమైన ముఖము గలదానా! విశాలమైన కన్నులు గలదానా!" అంటాడు. ఇంకా చాలా చోట్ల కూడా ఇలాగే. అంటే, ముక్కూ మొహం చూశాడుగానీ, చెవులూ, భుజాలూ చూడలేదన్నమాట!

'మరిది, వదినగారి మొహం చూడడం తప్పు' అనే అభిప్రాయంతో, కవి లక్ష్మణుణ్ణి ఎన్నడూ వదినగారి ముక్కూ మొహం చూడని 'ఆదర్శ మరిదిగా' చిత్రించాలని ప్రయత్నించాడు. బాగానే ఉంది. మరి, ఆ మరిది నోటే 'అందమైన ముఖము గలదానా!' అనిపించ వొచ్చునా? ఇంతకీ, లక్ష్మణుడు, అడవుల్లో ఏ నీళ్ళకో పళ్ళకో వెళ్ళినప్పుడూ, ఒంటరిగా ఉన్నప్పుడూ కూడా సీతకోసం వెతుకుతున్నాడు కదా? సీత కనపడితేమాత్రం ఎలా పోలుస్తాడు ఆమెని? ఎన్నడూ ముక్కూ మొహం చూడనేలేదయ్యే! పాదాల్ని చూసి పోలుస్తాడేమో! ★

కొమ్మ అందుకుని దాన్ని కావిటేసుకుని చూపించ బోయాడు.

అప్పటికే రాముడు పక్కకి వొరిగి మూర్ఛిల్లాడు.

"అబ్బే! అలా కావిటేసుకోలేదు. చంకలో నొక్కి పట్టి ఈడ్చుకుపోతున్నాడు. నేను బాగానే చూశానుగా? .... నా కెందుకని ఊరుకున్నాగానీ" అన్నాడు హను మంతుడు.

రాముడు లేచాడు నెమ్మదిగా.

సుగ్రీవుడు విసుక్కుంటూ, "చంక కింద పట్టుకునే కావిటేసుకున్నాడు. కావాలంటే మా మామ నడుగు! అప్పుడు మామ నా పక్కనే ఉన్నాడుగా?" అని వాదిం చాడు.

"ఏవిటో ఈ కొండ ఎక్కిందగ్గర్నించీ ఏం చూసినా మర్చిపోతున్నాను. అవును .... రావణుడేనా? .... ఆఁ .... రాముడి భార్యనేనా? .... బాగానే పట్టుకున్నాడు నడుం చుట్టూ చెయ్యేసి .... లేకపోతే పడిపోదా కిందకి? నడుం చుట్టూ చెయ్యేసే పట్టుకోవాలి మరి .... చక్కగానే గట్టిగానే పట్టుకున్నాడు."

గిర్రున తల తిరిగి రాముడు మళ్ళీ మూర్ఛిల్లాడు.

రాముడి కష్టం చూడలేక అందరూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు. లక్ష్మణుడు అన్నగారికి పూలకొమ్మతో విసురుతూ దిగాలుపడి కూర్చున్నాడు.[263]

రాముడు మూర్ఛలోంచి లేస్తూనే కోపోద్రేకంతో – "లక్ష్మణా! చంపేస్తానా దుర్మార్గుడిని. నాకు చాలా దుఃఖం కలిగించాడు. కోపం కూడా తెప్పించాడు. నేనిక వాడిని సంహరించక విడిచేది లేదు. యమ లోకానికి పంపిం చేస్తాను. ఎక్కడుంటాడో చెప్పు!" అంటూ సుగ్రీవుణ్ణి ఎర్రగా చూశాడు.

"అయ్యో, ఆ దుర్మార్గుణ్ణి గురించి విన్నాను గానీ, ఎక్కడుంటాడో ఏంటో నాకు తెలీదు సుమా!"

"తెలీదా? కబంధుడు నీ కంతా తెలుసని చెప్పాడే!"

"కబంధుడెవడు?"

"సరి, ఇది ఇంకా బాగుంది. కబంధుడెవడా? కబం ధుడు కబంధుడే. కబంధుడిం కెవడూ? రావణుణ్ణి గురించి నీకంతా తెలుసంటేనే కాదూ నిన్ను వెతు క్కుంటూ బయల్దేరిందీ?" – రాముడు నెమ్మదిగా నగలు గుడ్డలో చుట్టి తొడకింద పెట్టుకున్నాడు.

సుగ్రీవుడు జంకుతూ చూశాడు అటూ ఇటూ. 'ఇదేమిటి! వాలిని చంపుతాడని ఆశపడుతోంటే ఇంతలో ఇలా కోపం తెచ్చుకుంటున్నాడు! ఆ కబంధుడు ముండా కొడుకెవడు మధ్యలో నా ప్రాణానికి?' – కబంధుడి మీద సుగ్రీవుడికి చాలా కోపం వచ్చింది. " ... ఆ కబంధు డెవడో, రావణుడెవడో నా కేమీ తెలీదు రామా! నేనంటే గిట్టని వాళ్ళెవరో .... ఇంకెవరు, మా అన్నే .... ఆ దొంగ కబంధుణ్ణి నీ దగ్గిరికి పంపినట్టున్నాడు. వాడు నా మీద నీకన్నీ నూరిపోసినట్టున్నాడు. జరిగిందంతా మర్చిపో రామా! నీ భార్యని వెతికించి పట్టుకునే పూచీ నాదే నన్నానుగా? రావణుణ్ణి చంపేసి నీ భార్యని నీ కప్పగిస్తానని ఒట్టు పెడుతున్నాను, సరేనా? అప్పుడే చూస్తావు నా బలం ఏంటో."

"హయ్యో! .... సీతా! .... నువ్వు లేకుండా ఎంత కాలం ఈ దుఃఖ సముద్రంలో .... వొంటరిగా .... హా!" అంటూ రాముడు పక్కకి వొరిగాడు.

రాముణ్ణి ఓదార్చడానికి సుగ్రీవుడున్నాడనే ధైర్యంతో, లక్ష్మణుడు మౌనం వహించాడు.

"రామయ్యా! దుఃఖం ఓర్చుకో! నీ లాగే నాకూ భార్య దూరం అయింది. మరి నేను బావురు మన్నానా? వాలి పీడ ఎలా వొదిలించుకుంటాంరా దేవుడా – అన్న ధ్యాసేగానీ ఇంకో ఆలోచన లేదు నాకు. అన్నిటి కన్నా ముందు వీరుడికి ధైర్యం ఉండాలి కదా? .... లేకపోతే పనులేం జరుగుతాయి?" – తన ధైర్యం గురించి మంత్రులు గుస గుస లాడుకుంటున్నారేమోనని సుగ్రీవు డికి అధైర్యం గానే ఉంది. అటు చూడకుండా ధైర్యంగా చెప్పుకు పోతున్నాడు – "ఎప్పుడూ మొహం వేళ్ళాడేసు కుని ఈసురోమంటూ ఉండే వాడెందుకు పనికొస్తాడు రామా? ఏడ్చి ఏడ్చి ప్రాణాలు పోవటం తప్ప ఏం కలిసొస్తుంది? మనం ఏ పని చేసినా ఏదో వొకటి కలిసి రావాలి. ధైర్యం తెచ్చుకో రామా! .... దుఃఖం మంచిది కాదు."

రాముడు అయిష్టంగా నుదురు చిట్లించాడు. ఈ ఆటవికుడు తనకు నీతులు చెబుతున్నాడే! తను భార్య మీద అనురాగం కొద్దీ దుఃఖపడుతున్నాడు గానీ ధైర్యం

---

**263.** **కిష్కింధా, సర్గ 6, శ్లోకాలు 8, 9, 10:** సుగ్రీవుడు రాముడితో చెప్తున్నాడు – "పాపియగు రావణునిచే అపహరించబడి, దీన స్వరముతో 'రామా, లక్ష్మణా' అని ఏడ్చుచు, రావణుడి ఒడిలో ప్రకాశించుచుండు ఒక స్త్రీని జూచితిని ... పర్వతము మీద నలుగురితో నుండిన నన్ను జూచి ఆభరణములు ముడిచి పడవేసెను". అందరూ చూశారన్న మాట రావణుడు ఒక స్త్రీని ఎత్తుకుపోతూ ఉండడమూ, ఆ స్త్రీ ఏడుస్తూ ఉండడమూ! కానీ తమకేం పట్టనట్టు ఊరుకున్నారు. రావణుడి లాగే ఈ సుగ్రీవుడూ, హనుమంతుడూ, అందరూ ఎగరగలరు. గొప్ప వీరులు కూడా. అయినా చూస్తూ ఊరుకున్నారు! ఒక స్త్రీని రక్షించడం కోసం కొంచెమన్నా ఎగిరి, ప్రయత్నించి, సాధ్యం కాక వూరుకుంటే, అది వేరు. 'సీత ఎక్కడున్నా రక్షించి తెస్తాన'ని ఇప్పుడు వీరాలాపాలు పల్కుతున్నాడు సుగ్రీవుడు. తన కళ్ళముందు ఏడుస్తోన్న స్త్రీని రక్షించే ప్రయత్నం ఎందుకు చెయ్యలేదు? – దారే పోయే వాళ్ళందర్నీ రక్షించడంవల్ల తనకేమీ లాభం ఉండదు కాబట్టి. ★

లేకనా? 'అయినా నేనింత దుఖ్ఖ పడుతోంటే నువ్వు ఓదార్చకుండా కూర్చున్నావేం?' అన్నట్టు విసుగ్గా లక్ష్మ ణుణ్ణి చూశాడు.

అన్నగారి విసుగు లక్ష్మణుడు గమనించనే లేదు.

సుగ్రీవుడు మళ్ళీ అందుకున్నాడు. "నువ్వు మహా వీరుడివని నాకు తెలుసు. నీ దుఖ్ఖం చూడలేక అంటు న్నాను గానీ .... నీకు చెప్పగలిగే వాణ్ణి కాను సుమా! ఇక నువ్వు కళ్ళనీళ్ళు పెట్టగూడదు. నా మీద ఒట్టే! వీరుడైన వాడెన్నడైనా నిరుత్సాహ పడ వొచ్చునా?" – సుగ్రీవుడికి ధైర్య సాహసాలన్నీ గొప్పగా తెలుసు, ఇతర్లకి చెప్పడానికైతే.

"అయ్యో! ... సీతా! ప్రియురాలా! ... నిన్నెన్నటికి చూడగలనో కదా?" అంటూ రాముడు పంచెతో ముక్కూ మొహం తుడుచుకుని, నగలు తొడకి గుచ్చుకుంటోంటే మూటని బయటికి తీసి ఇంకా గట్టిగా ముడేస్తూ కొంచెం సందేహంలో పడ్డాడు. – 'ఇంకా చాలా నగలుండాలి. ఎన్ని తీసిందో, ఎన్ని ఉంచుకుందో! అడిగితే గానీ తెలీదు. సుగ్రీవుడికి దొరికినవన్నీ ... ఇచ్చేసినట్టే ఉన్నాడు ... ఏమో, చెప్పలేం. అన్ననే చంపించడానికి చూసేవాడు ... బంగారం కళ్ళబడితే ... సుగ్రీవుడికా బుద్ధి లేక పోయినా ... హనుమంతుడో ... ఎవరో ... ఒక ఉంగర మన్నా దాచుకోకుండా ఉంటారా? ఏమో, నమ్మలేం.' రాముడు మూట కట్టడం పూర్తి చేసి పక్కన పెట్టు కున్నాడు – "సుగ్రీవా ... నువ్వెంతో ఉత్తముడివి కాబట్టి స్నేహితుడు కష్టంలో ఉన్నప్పుడు చెప్పదగ్గ మాటలన్నీ చెప్పావు. మీరందరూ ఇంతగా చెప్తోంటే నేను మాత్రం ఎందుకు దుఃఖిస్తాను నాయనా? నీలాంటి స్నేహితుడు మాత్రం అందరికీ దొరుకుతాడా? ఇలాంటి కష్టకాలంలో అసలే దొరకదు. అయితే మరి ఆ రావణుణ్ణి వెతకడం అదీ తొందరగా చెయ్యాలి కదా? ... నీకు నేనేం చెయ్యాలో కూడా తొందరగా చెప్పు! మంచి భూమిలో ఏ పంట అయినా పండుతుంది చూశావా, అలాగే నేను ఏ కార్యమైనా చెయ్యగలను. ఏదో అతిశయంగా అతి శయాలు చెప్తున్నా ననుకోకు! పుట్టిన తర్వాత నేను ఇంతవరకూ ఒక్క అబద్ధమైనా ఆడలేదు. ఇక ముందు ఆడేది లేదు" అని గంభీరంగా చూశాడు.[264]

హనుమంతుడు నెమ్మదిగా – "మనిషి జన్మెత్తాక ఎప్పుడైనా అబద్ధమాడకా తప్పదు. ఆడితే మాత్రం ఏం పోయిందిలే" అని వొళ్ళు విరుచుకున్నాడు ఆవలిస్తూ.

సుగ్రీవుడికీ ఆవలింత రాబోయింది.

రాముడు, క్రీకంట లక్ష్మణుణ్ణి చూశాడు, "ఈ అడివి మూర్ఖుల మాటలు వింటున్నావా?' అన్నట్టు. మళ్ళీ సుగ్రీవుడితో – "సుగ్రీవా! నేను నీ కోసం ఏం చెయ్యవలసి వుందో..." అంటూ ఆగాడు.

సుగ్రీవుడు పొంగిపోతూ – పొంగు దాచుకుని దిగాలుగా కుంగుతూ – "రామయ్యా! ఏం చెప్పను? ... అంతా నీకే తెలుసు ... నీ దయ ఉంటే దేవతలంతా నా పక్షాన నిలబడ్డట్టే. రఘువంశం రాజుతో స్నేహం చేసు కున్నానంటే మా బంధు మిత్రుల్లో ఎంత గొప్పను కున్నావూ! ... నా సంగతి నేను చెప్పుకుంటే బాగుండదు గానీ ... నీలాంటి గొప్ప గొప్ప వీరులికి ధైర్యం ఎలాగైతే తొణకదో, నాకూ అలాగే తొణకదు" అన్నాడు. హను మంతుడి వేపు చూడాలంటే ధైర్యం తొణికి, రాముడి వీపు వెనక్కి మొహం తిప్పాడు.

అక్కడ రెండు పిచికలు అనుమానం కలిగించేటట్టు కంటబడ్డాయి! –"మారు వేషాలంటావా?" అని పక్కనే వున్న నీలుడి చెవిని అడుగుదామనుకున్నాడు గానీ, నీలుడు బండకి తన్నిపెట్టి సుగ్రీవుడి మీద మీద కొరు గుతూ గుర్రు పెడుతున్నాడు.

సుగ్రీవుడు విసుక్కుంటూ రాముడి మీదకు జరిగి, అన్న మీద కోపం గుర్తొచ్చి – "... నన్నూ నా మంత్రుల్నీ వెళ్ళగొట్టాడా? ... నా భార్యని తన దగ్గిరే ఉంచు కున్నాడా? పోనీ అక్కడితో ఊరుకున్నా డనుకున్నావా? ... నాకు అనుకూలంగా ఉండే వాళ్ళందర్నీ చెరలో పెట్టించాడు. అప్పుడే అయిందా? ... ఓరీ నీ దుంప తెగా! ... ఎంత జరిగినా మీద పడతానే వున్నావే! ఇవతల పెద్ద మనిషితో వ్యవహారం మాట్లాడుతూంటే ... ఇప్పుడా నీకు నిద్ర?" అంటూ సుఖ నిద్రలో వున్న నీలుడి మీద రుస రుస లాడుతూ తనకి ఆవలింత రాబోతే బలవంతంగా దాన్ని చావగొట్టి చెవులు మూశాడు.

వాలి ఎంత తెలివిగా 'పరిపాలన' చేస్తున్నాడో వింటోంటే రాముడికి ముచ్చటేస్తోంది. అవును, శత్రు వుల విషయంలో అలాగే చెయ్యాలి. వాళ్ళని చెరలో పెట్టించినంత మాత్రాన్నే కూడా చాలదు. ఆ చెర దగ్గిర కాపలా వాళ్ళు నమ్మకస్తుల్లో, కారో చూసుకోవాలి. వాళ్ళ మీద చారుల్ని పెట్టాలి. వాలికి తెలుసునో లేదో ఇవన్నీ!

"... నన్ను ఇక్కడ మాత్రం సుఖంగా ఉండ నిచ్చా డనుకున్నావా రామయ్యా? ... బోలెడు మంది సైనికుల్ని నా మీద యుద్ధానికి పంపించాడు. నా మంత్రులూ, నేనూ ఎలాగో వాళ్ళని తరిమేశాం అనుకో. అసలు మిమ్మల్ని కూడా వాలే పంపించాడనుకున్నాం. లేచిం

---

**264.** **కిష్కింధా, సర్గ 7, శ్లోకం 22:** తన మాటలన్నీ అబద్ధమని సుగ్రీవు డనుకుంటాడేమోనని రాముడికి భయంగా ఉంది. అందుకే "నేను అబద్ధ మెపుడునూ చెప్పినది లేదు. ఇక మీద చెప్పబోను. ఇటుల నీకు సత్యముగ ఒట్టు పెట్టుచున్నాను" అని సుగ్రీవుణ్ణి నమ్మించాలని తాపత్రయపడుతున్నాడు. ★

దగ్గర్నించీ భయమే అనుకో, ఎప్పుడేం జరుగుతుందో నని. ఏవిటో, ఈ హను మంతుడూ వాళ్ళే నన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. నేను అడుగు కదపా లంటే, వీళ్ళే ముందు నడుస్తారు. ఎక్కడ కూర్చున్నా చుట్టూ కూర్చుంటారు. నేను రాజయ్యాక వీళ్ళే కదా నా మంత్రులు మరి. ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే ...” – నాభిలోంచి నోరంతా బద్ధలు చేస్తూ పెద్ద ఆవలింత రాబోయింది. ఎలాగో దాన్ని మళ్ళీ అదిమిపట్టి, నీలుడి వేపు మళ్ళీ కోపంగా చూసి తర్వాత తారుడితో – “ఇదుగో మావా! నీలుడు లేచాక రాజు గారికి చాలా కోపం వచ్చిందని చెప్పు! మంత్రులిలా నిద్రలు మిడు కుతూ వుంటే మనమిక రాజ్యం ఏలినట్టే” అని మండి పడ్డాడు, మామ మీద.

“చిత్తం! ఇప్పుడే లేవగొట్టి చెప్పమంటావా మహా రాజా?”

“ఒద్దు. ఎప్పటికి లేస్తాడో చూదు ... గట్టిగా చివాట్లు పెడతాను. నువ్వు కూడా నిద్రకి పడకు” అనేసి సుగ్రీ వుడు మళ్ళీ రాముడి వేపు తిరిగాడు – “మా అన్న సుఖంగా ఉన్నంతకాలం నాకు ఏడుపు తప్పదు రామయ్యా! ఆ దుర్మార్గుడు పోయిన్నాడే నాకు కష్టాలు పోతాయి. వాడు చచ్చిన్నాడే నాకు నిశ్చింత. ఇంకేం చెప్పమంటావు? చల్లకొచ్చి ముంత దాచడం ఎందుకు? నా కడుపులో ఉన్నదంతా సిగ్గు పడకుండా నీ ముందు పెట్టేశాను. పాల ముంచుతావో ... నీట ముంచుతావో! అంతా నీదే భారం. ఆ దుర్మార్గుడు మా చెడ్డ బల వంతుడు. అదే వచ్చింది చిక్కు” అంటూ బొట బొటా కన్నీళ్ళు కార్చి, ముక్కు పిండి నీలుడి పంచెకి తుడిచి, వాలి గురించి రాముడేం చెపుతాడోనని ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

వాలి తెలివి గురించే గాక, ‘బలం’ గురించి కూడా వింటే, రాముడికి కొంచెం ఆలోచన పట్టుకుంది. వాలి పరాక్రమం ఎటువంటిదో ఏమిటో తెలీకుండానే ... చంపేస్తానని అంటే ... సరే! ... ఆలోచించే చెయ్య వచ్చును. ... “సుగ్రీవా! ఇంతకీ, వాలికీ, నీకూ వైరం ఎందుకొచ్చిందంటావూ? అసలు సంగతేవిటో వినాలి గదా? నాకు వాలి మీద కోపం లేదని కాదు. అసలు జరిగిందేవిటో చెప్పు!” అని వ్యవహారం ఎత్తాడు.

సుగ్రీవుడు బిత్తరపోయి – “తీరా విన్నాక నా వల్ల కాదంటాడా?” అన్నట్టు హనుమంతుడి వేపు చూశాడు.

“ఎందుకంటాడూ? అంటే తన పెళ్ళాన్నెలా తెచ్చు కుంటాడూ?” అని హనుమంతుడు కళ్ళతో సమాధానం చెప్పాడు.

సుగ్రీవుడు ధైర్యం కూడగట్టుకుని – “రామా! జరి గిందంతా పూస గుచ్చినట్టు చెబుతాను, విను” అంటూ ప్రారంభించాడు.

★ ★ ★

“కిష్కింధారాజ్యం మా తండ్రిది. వాలి మా అన్న. అదేమిటో మా తండ్రికి మా అన్న మీదే ఎక్కువ ప్రీతి వుండేది. నాకూ మా అన్నంటే మా చెడ్డ ప్రేమే అనుకో. మా తండ్రి పోయింతర్వాత మా అన్నే రాజయ్యాడు. రామా! నాకు తెలీకడుగుతానూ... పెద్ద కొడుక్కే రాజ్యం ఇవ్వాలంటారేంటీ? కొడుకులందరికీ కొంచెం కొంచెం పంచివ్వొచ్చుగా? పెద్ద కొడుక్కే రాజ్యం ఇచ్చేస్తే ... మరి చిన్న కొడుకులు ... అబ్బ! ...” అని చప్పున నోరు మూసేసి పిర్ర తడుంకున్నాడు సుగ్రీవుడు.

హనుమంతుడి గోళ్ళు సుగ్రీవుడి పిర్ర లోతులు కొలిచి – “ఇదిగో! ఇంత లోతుంది నీ పిర్ర” అని చూపి స్తున్నాయి. సుగ్రీవుడు మాటల ప్రమాదంలో మునిగి పోతూ ఉన్నప్పుడు, ఆ గోళ్ళ పడవలే అతన్ని రక్షిస్తూ ఉంటాయి.

సుగ్రీవుడు తన తప్పు గ్రహించాడు. రాముడు కూడా వాలి లాగానే తండ్రికి పెద్ద కొడుకన్న సంగతి గుర్తు తెచ్చుకుని, నాలిక సర్దుకున్నాడు – “అవును మరి. పెద్ద కొడుకు తర్వాతే కదా చిన్న కొడుకు? అందుకే మా అన్నని నేను భక్తితో సేవించుకుంటూనే ఉన్నాను సుమా!” అంటూ ముందుకు సాగాడు.

“ఒకసారేం జరిగిందంటే ...” అని ఆగి హను మంతుణ్ణి చూస్తూ – “జాగర్తగానే మాట్లాడతా గానీ మరీ అంత కసిక్కిన గిల్లుతావా?” అని కళ్ళెర్రజేసి, తల తిప్పి రాముణ్ణి చూశాడు – “... ఎందాకా చెప్పాను?”

“ఒకసారేం జరిగిందో – దాకా చెప్పావు.”

“ఆఁ, అవును ... ఏం జరిగిందంటే ... మాయావి అనే రాక్షసుడికీ, మా అన్నకీ వైరం వొచ్చింది.”

“ఎందుకూ?”

“ఎందుకేంటీ? ... ఎందుకన్నా రావచ్చు. ఒక ఆడ దాని మూలంగా అని విన్నాం. మరి నిజం ఏంటో ... ఆ మాయావి, మయుడి కొడుకు. మయుడికి దుందుభి అని ఇంకో కొడుకు కూడా ఉండేవాడు. చెప్తా! ఆ సంగతీ చెప్తా![265]

---

**265.** రావణుడి భార్య మండోదరి కదా? ఆమె తండ్రే మయుడు. ఆమె అన్నలే ఈ మాయావీ, దుందుభీ. ఈ సంగతి “ఉత్తర కాండ’లో తెలుస్తుంది. సర్గ **12**, శ్లోకాలు **13, 19**:

‘యుద్ధం’ అంటే ఏం లేదు. ఒకళ్ళని ఒకళ్ళు బాదుకోవడమే. ఆటవిక కాలంలో ప్రారంభమైన కొట్లాటలు ఇవి. ఇంకా ఆయుధాలు లేని కాలంలో, శరీరాలే ఆయుధాలు! ★

ఒక రోజు అర్ధరాత్రి ఈ మాయావి ముండా కొడుకు వచ్చి మా అన్నని యుద్ధానికి పిల్చాడు. వాడి కేకలు చెవిన పడ్డాయో లేదో, మా అన్న మండిపడుతూ యుద్ధానికి బయల్దేరాడు … "అర్ధరాత్రి పూట యుద్ధా లేంట'ని ఆడవాళ్ళూ, నేనూ అందరం చెప్పాం. ఎంత చెప్పినా మా అన్న వింటేనా? మహా పట్టుదల మనిషి లెండి. చేసేదేవీ లేక నేనూ అన్న వెనకాలే బయల్దేరాను. ఆ మాయావి గాడు, మా అన్నని చూడగానే హడిలిపోయి పరుగు లంకించుకున్నాడు. ఆ మాత్రానికి యుద్ధాని కెందుకొచ్చాడో పిరికి సన్నాసి. వింటున్నావా రామా! వాడా విధంగా పోయి పోయి ఒక బిలంలో దూరాడు. 'సరే, బయటికి రాకపోతాడా' అని అక్కడే కూర్చున్నాం. ఎంతకీ రాడయ్యే! మా అన్నకీ వొళ్ళు మండిపోయి – 'నేనే లోపలికి పోయి వాడి అంతు తేల్చుకొస్తాను, నువ్వు ఇక్కడే ఉండు' అని నాతో చెప్పి వెనకా ముందూ చూడకుండా బిలంలో కెళ్ళి పోయాడు. మా చెడ్డ ధైర్యంలే మనిషికి! ఇక … అప్పట్నించీ … చాలాకాలం ఆ బిలం దగ్గిరే భయపడుతూ … మా అన్న కేవన్నా ప్రమాదం జరుగుతుందేమోనని దిగాలు పడుతూనే కూర్చున్నాను. కొన్నాళ్ళకి ఆ కన్నంలోంచి రక్తం ప్రవహిస్తూ పైకి వచ్చింది. చెవిపెట్టి విందును గదా లోపల అరుపులూ … కేకలూ … గుద్దులూ! … మా అన్న బాధగా మూలు గుతున్నాడు. ఆ రాక్షసుడేమో సంతోషంతో అరుస్తు న్నాడు. సత్తె పెమాణకంగా చెపుతున్నాను. నా కలాగే వినపడింది మరి! … నా మాట అబద్ధం అయితే నేను చచ్చినంత వొట్టు! నీతో అబద్ధ మాడతానా చెప్పు? … మా అన్న ఆర్తనాదాలు చేస్తంటే, ఆ దుర్మార్గుడు సింహ నాదాలు చేస్తున్నాడు. నా కలాగే వినపడింది మరి, సత్తె పెమాణకంగా …" రాముడు నమ్ముతున్నాడో లేదోనని అర్ధంగాక ఆగాడు సుగ్రీవుడు.[266]

రాముడు గంభీరమైన చిరునవ్వుతో "తర్వాతేం జరిగిందో చెప్పు సుగ్రీవా!" అన్నాడు.

"ఇంకేం జరిగింది రామయ్యా? … ఆ కేకలూ అవీ విని మా అన్నే పోయాడనుకున్నాను. కాస్సేపు ఏడ్చి, గుండె రాయి చేసుకున్నాను. ఇంకా అక్కడే కూర్చుంటే ఆ మాయావి గాడెక్కడ బయటికొస్తాడోనని ఆ బిలానికి వొక పెద్ద బండరాయి అడ్డం పెట్టేశాను. కంటికీ మంటికీ ఏక ధారగా ఏడుస్తూ కిష్కింధకి తిరిగి వచ్చేశాను. మా అన్న పోయిన సంగతి నే నెవ్వరితోటీ అననే లేదు సుమా! ఈ హనుమంతుడూ వాళ్ళూ నా దుఃఖం చూసి … అసలు విషయం గ్రహించేశారు – 'రాజు లేకపోతే ఎలా జరుగుతుందీ ఆవఁటా' అని, నన్ను రాజుని చేస్తామన్నారు. 'నాకే రాజ్యాలూ వొద్దు మొర్రో! అని గోల పెట్టాను. ఈ మంత్రులు వింటేనా? .. మరేం చెయ్యను? అన్న పోయింతర్వాత నేను రాజ్యం వొద్ద నేస్తే … ప్రజలేమైపోతారు? ఎన్ని కష్టాలు పడి పోతారు! ప్రజల క్షేమం కోసం ఒప్పుకోక తప్పింది కాదు.

నా ఖర్మగాలి … సింహాసనం ఇలా ఎక్కానో లేదో … పదేళ్ళన్నా ఆ ముచ్చట తీరిందా, మా అన్న వచ్చి పడ్డాడు మాయావిని చంపేసి!

సింహాసనం మీద కూర్చున్న నన్ను … ఎందుకు లెండి … ఎంత ఎర్రగా చూశాడనీ!… అబ్బ! … ఆ కళ్ళు జ్ఞాపకం వొస్తే …" అంటూ సుగ్రీవుడు కొంచెం హనుమంతుడి వేపు జరిగాడు.

రాముడు కొంచెం వెనక్కి సర్దుకున్నాడు, లక్ష్మణుడి వేపు.

లక్ష్మణుడు ఆసక్తిగా – "అప్పుడేం జరిగింది?" అని ముందుకొచ్చాడు. సుగ్రీవుడు కాళ్ళూ చేతులూ జాగ్రత్తగా దగ్గిర పెట్టుకుని – "ఏం జరుగుతుంది? బలం కూడ దీసుకుని సింహాసనం మీద నించి లేచి అన్నకి నమ స్కారం చేశాను సుమండీ! … తోడ బుట్టిన వాడు నమస్కారం పెట్టాడు కదా అని చక్కగా సంతోషించి 'వెయ్యేళ్ళు బతకరా తమ్ముడా!' అని దీవించ వొచ్చునా? … ఎబ్బే! వాడబ్బ సొమ్మేదో నేను దోచుకు పోయినట్టు మండి పడుతూ నించున్నాడు … ఇంకేం చెయ్యను? … అంతా కంగారయ్యే! తోచి చావదయ్యే! మంత్రులెవరో సైగ చేశారు, నా నెత్తిమీద నించేదో తీసెయ్యమని. అసలు నెత్తి మీదేం ఉందో గుర్తు లేదయ్యే! చూద్దును గదా కిరీటం! ఓహో! అదా సంగతని, ఆ కిరీటం తీసేసి … ఆయన పాదాల దగ్గిర పెట్టాను. అయినా ఆ కోపం తగ్గిందనుకున్నారా? … అబ్బే! ఎన్ని విధాలో నచ్చ చెప్పాను. 'అన్నా! దేవుడి దయవల్ల శత్రువుని చంపి

---

**266.** కిష్కింధా, సర్గ 9, శ్లోకం 18: "బిలములోపల సింహనాదము చేయుచుండు రాక్షసుడి ధ్వని నా చెవిలో బడెను. యుద్ధములో అపజయము పొంది అరచుచుండు నా అన్న ధ్వని నాకు వినవచ్చెను" అంటున్నాడు సుగ్రీవుడు. రాక్షసుడు సంతోషంతోటీ, అన్న దుఃఖంతోటీ అరిచినట్టు వినబడిందట! ఈ విషయంలో సుగ్రీవుడు నిజం చెప్పాడా, అబద్ధం చెప్పాడా – అనే దాని మీదే 'సుగ్రీవుడి పాత్ర విలువ' అంతా ఆధారపడి ఉంటుంది. 'సుగ్రీవుడిదే న్యాయం' అని, సుగ్రీవుడికి సహాయం చెయ్యడానికి రాముడు సిద్ధపడ్డాడు కదా? కాబట్టి, రాముడి నిజాయితీ కూడా ఈ సంఘటనలోని నిజానిజాల మీదే ఆధారపడి ఉంది. వాలి, అపజయంతో బాధగా అరిచి ఉంటేనే కదా సుగ్రీవుడికి అలా వినపడేది? – వాలి అరవనే లేదనీ, సుగ్రీవుడు చెప్పింది అబద్ధమనీ రుజువైతే, సుగ్రీవుడు మోసగాడన్న మాట. సుగ్రీవుడి మోసం గ్రహించి కూడా సుగ్రీవుడి తరుపున నిలబడ్డ రాముడూ మోసగాడేనన్న మాట. సుగ్రీవుడు చెప్పిన దాంట్లో నిజానిజాలు తర్వాత చూడండి! ★

క్షేమంగా వచ్చావూ, అంతే చాలు నాకు. నిన్ను చూడగానే నా కడుపు నిండిపోయింది' అన్నాను. అసలేం జరిగిందో ఆయనకీ చెప్పాను – 'ఆ బిలంలోంచి కేకలూ అవీ విని ఒక వేళ నువ్వే పోయావేమోనని దుఃఖపడిపోయి ... బాధపడిపోయి .. బిలానికి రాయి అడ్డంగా పెట్టి వొచ్చే శానూ. రాగానే ఈ మంత్రులు నన్ను బలవంతం చేసి 'రాజుల్లేని ఇతర రాజ్యాల్ని జయించాలంటే మనకి రాజు ఉండాలి గదా ... ఆవcటాని ఎంత వొద్దన్నా వినకుండా .. నగలూ అవీ పెట్టి ... కిరీటం అదీ పెట్టి ... ఈ సింహాసనం ఎక్కించారూ, నే నసలు ఎక్కనే ఎక్కనన్నాను ... అన్నా! అసలు నీలాంటి వాడే రాజుగా ఉండాలి గానీ ... నేను రాజేంటి నా మొహం! అబ్బే, నువ్వు లేవని అలా కొంచెం సేపు గద్దె ఎక్కానే గానీ ... నీ రాజ్యం నీ కివ్వక ఛస్తానా ఏంటీ! ... నా మీద కోపం పెట్టుకోకు సుమా!' అంటూ కాళ్ళా వేళ్ళాబడి బతిమాలాను, బామాలాను. దణ్ణాలు పెట్టాను. అబ్బే ... ఒక్క ముక్కన్నా విన్నాడా? ... నమ్మాడా? ... ఛీ కొట్టాడు. నా దణ్ణాలన్నీ ఎగరగొట్టాడు. నన్ను రాజుని చేసిన మంత్రులందర్నీ పిలిపించాడు. ఊళ్ళో పెద్దలందర్నీ పిలిపించాడు. అసలు వాలి వచ్చాడని వినగానే కొందరు పెద్దలు పారిపోయా రనుకో.

ఇక అందరి ముందూ నేనేదో గొప్ప తప్పిదం చేసేసి నట్టు 'విచారణ' ప్రారంభించాడు. వాళ్ళతో చెప్పు కొచ్చాడు. 'ఆ రాక్షసుడు నన్ను యుద్ధానికి పిల్చిన సంగతి మీ కందరికీ తెలుసు కదా? ... నేను బయల్దేరితే ఈ దుర్మార్గుడు కూడా నా వెంటబడి వచ్చాడు. అప్పుడు నిజంగా ప్రేమగానే వస్తున్నాడనుకున్నాను. ఆ రాక్షసుడు బిలంలో దూరగానే ఇతనితో ఏం చెప్పానంటే, – నేను లోపలికి పోయి వాడి అంతు తేల్చుకొస్తాను గానీ వాడు నన్ను తప్పించుకుని పారిపోయి బయటికొస్తాడేమో నువ్వు గుమ్మం దగ్గరే ఉండు, వాడొస్తే పట్టుకో" అని చెప్పి లోపలికి పోయాను. వాణ్ణి వెతకటానికే ఎంతో కాలం పట్టింది. మొత్తానికి వాణ్ణీ, వాడి బంధువుల్నీ చావగొట్టి బయటికొచ్చి చూద్దును గదా... గుమ్మానికి పెద్దరాయి అడ్డం! 'తమ్ముడా! ... తమ్ముడా!' అని ఎన్ని కేకలు పెట్టానో! ... అక్కడుంటేనా పలకటానికి? ఎలాగో ఆ బండని ... తన్నీ, తోసీ, గుద్దీ, గెంటీ చివరికి బయటపడ్డాను. ఇక్కడ వ్యవహారం చూస్తే ... ఇదుగో ఇదీ! సింహాసనం ఎక్కాడు!

అసలు ఆ రాక్షసుడు నన్ను చూడగానే భయపడి బిలంలోకి పారిపోయాడే! అలాంటి పిరికిపంద నన్ను చంపేశాడని నా తమ్ముడనుకున్నాడంట! ... నేను బిలంలో ఆర్త నాదాలు చెయ్యనే లేదే! ... నేను బాధతో అరిచినట్టు నా కంఠ స్వరం ఎలా విన్నాడు ఈ పెద్ద మనిషి?' అంటూ ఏవో అడ్డ దిడ్డం ప్రశ్నలు వేసి నన్ను నిందల పాలు చేశాడు మా అన్న" అని ఆగి సుగ్రీవుడు అందరి మొహాలూ చూశాడు – తనని నమ్ముతున్నారా, వాలిని నమ్ముతున్నారా – అని!

హనుమంతుడు అప్పుడప్పుడూ పరాగ్గా బొడ్లో తడుంకుని అక్కడేమీ దొరక్క చిరాకు పడిపోతున్నాడు – "లేనిపోని గోల తెచ్చి పెట్టాడీయన. నిక్షేపంలాగ వాలిని నమ్ముకుని బతుకుతున్న వాళ్ళ కీ గతి పట్టించాడు" అని విసుక్కున్నాడు లోపల. ఆ విసుగులో, సుగ్రీవుడు చెప్పడం ఆపగానే – "అవును మరి, బాగానే అడిగాడు వాలి. చచ్చిన వాడు రాక్షసుడైతే ... బాధపడే కేకలు వాలెందు కేస్తాడూ? వాలే మూలిగాడని నువ్వెలా అనుకున్నావూ?" అని ఆ అనుమానం అప్పుడే తోచి నట్టు కొత్తగా ఆశ్చర్యంగా అడిగాడు సుగ్రీవుణ్ణి.

సుగ్రీవుడు బిత్తరపోయి చూశాడు, "హనుమంతు డేనా, మారు వేషమా?" అన్నట్టు.

హనుమంతుడు తారుడికేసి కోపంగా చూసి పిర్ర తడుంకుంటూ – "అబ్బే ... నా కంతా తెలుసు మహా రాజా! ... నే నెందు కడిగానంటే ... ఈ మాటే రాము డైనా అడగొచ్చు, లక్ష్మణుడైనా అడగొచ్చు. నువ్వేం చెబు తావో అనీ ... అంతే ..." అని తారుడికి దూరంగా జరిగాడు.

సుగ్రీవుడు చిన్న బుచ్చుకుని – "ఏం చెబుతానూ వల్లకాడు! కేకలు అలాగే వినపడ్డాయి మరి. ఎవరడిగినా ఆ మాటే చెబుతాను" అని మూతి ముడిచాడు.

రాముడు తల పంకిస్తూ – "తర్వాతేం జరిగిందో చెప్పు సుగ్రీవా! నీ దోష మేముంది ఇందులో? ... అంతా చెప్పు! తప్పొప్పులు నేను నిర్ణయిస్తాను" అంటూ గంభీ రంగా చూశాడు.

సుగ్రీవుడు పుట్టెడు ధైర్యంతో రాముడికి దణ్ణం పెట్టాడు – "రామా! మహానుభావుడివి నువ్వు. న్యాయా న్యాయాలన్నీ గ్రహించగలవు ... ఇక చెప్పటానికేం వుందిలే ... ఆ విధంగా మా అన్న నా మీద నానా అభాండాలూ వేశాడు. ఆయన రాజ్యం అపహరించాలని ఎత్తు వేశా నన్నాడు. తనని బిలంలోనే బంధించి చంపె య్యాలని చూశానన్నాడు. 'ఇలాంటి నమ్మక ద్రోహిని నా రాజ్యంలో ఒక్క పూటన్నా ఉండనిస్తానా?' అని రంకె లేశాడు. వెంటనే నాకు సహాయం చేసిన మంత్రుల్ని కొందర్ని చెరలో పెట్టించాడు. నన్నూ, ఇదుగో వీళ్ళనీ, రాజ్యంలోంచి వెళ్ళగొట్టాడు. మేం మళ్ళీ ఎక్కడ రాజ్యం లోకి వస్తామో అని మా వెనక తరుముకుంటూ వచ్చాడు. నేనూ, వీళ్ళు నలుగురూ, ఒక గుంపుగా పరిగెత్తాం. మేం ముందూ, ఆ దుర్మార్గుడు వెనకా ... ఒకటే పరుగు! అప్పుడే మేము ఈ లోకమంతా చూశాం. చివరికి హను

మంతుడికి ఈ రుష్యమూక పర్వతం సంగతి గుర్తొచ్చింది. వాలి, ఇక్కడికైతే రాడని జ్ఞాపకం చేశాడు. అదంతా ఇంకో కథలే. బతుకు జీవుడా అని అప్పట్నుంచీ కిష్కింధ దగ్గిరే ... ఈ కొండ మీదే ఉంటున్నాం ... నానా కష్టాలూ పడుతున్నాం అనుకో. భార్య లేక బెంగపడి పోతున్నాను. నా భార్యే ఉంటేనా? నా కింకే భోగ భాగ్యాలూ అక్కర్లేదు. ... అబ్బా!" అని పిర్ర తడుంకుని హను మంతుడికేసి కోపంగా చూసి – 'మళ్ళీ ఏం తప్పు జరిగిందబ్బా' అని ఆలోచనలో పడ్డాడు.

"నీ భార్య పతివ్రత కదా? నీతో వస్తాననలేదా?" అనబోయి రాముడు సుగ్రీవుడి మొహం చూసి – "హు! ఇంత అందగాడితో ఏం పతివ్రతగా ఉంటుందిలే..." అని తల పంకించి ఊరుకున్నాడు.

అప్పటికి సుగ్రీవుడికి తన తప్పేవిటో తెలి సొచ్చింది. భార్య ఉంటే తనకే భోగ భాగ్యాలూ అక్కర్లేదన్నాడే! "సరే, వాలితో మాట్లాడి నీ భార్యని నీకు తెచ్చి పెడతాలే" అంటే రాముడు? ఇంకేవన్నా ఉందా? రాజ్యం లేకపోతే ఎల్ల కాలం ఈ కొండల్లో పడి యాడవ్వలిసిందేగా? హనుమంతుడు బాగానే హెచ్చరించాడు. – సుగ్రీవుడికి, హనుమంతుడి గోళ్ళు చూస్తోంటే ఎంతో ముచ్చటేసింది. వాడిగా ... పొడుగ్గా ... కత్తుల్లా ... ఎంత ముద్దొచ్చాయో ఆ గోళ్ళు! తను రాజవగానే హనుమంతుడినే పెద్ద మంత్రిని చెయ్యాలి.

రాముడు చాలా సేపట్నించి వాలి పట్టుదలకీ, తెలివి తేటలకీ ఆశ్చర్యపడి పోతున్నాడు. వాలి బతికి వుండగా సుగ్రీవుడికి రాజ్యం రావడం కల్లే. సుగ్రీవుడికి రాజ్యం రాకపోతే తన కార్యం జరగడమూ కల్లే. సుగ్రీవుడి కోసం కాకపోయినా, తనకోసం అయినా వాలిని చంపాలి. ఈ అన్నదమ్ముల వైరం తన లాభానికే ఉపయోగపడుతుంది. రేపు పట్టాభిషేకం చేసుకుని రాజైన తర్వాత సుగ్రీవుడు తనకి సామంత రాజుగా వినయ విధేయతలతో మసులుకుంటాడు. వాలిని చంపకుండా కనికరించడం వల్ల ఏం ప్రయోజనం తనకి? ... అనుకున్న విధంగా ఈ కార్యం ముగించి, రావణుడితో యుద్ధం చేసి, ఆ రాజ్యం కూడా తన అధీనంలో ఉండే విధంగా ... అవును. అది కూడా సాధించాలి – నూతనోత్సాహంతో రాముడి మొహం వికసించింది.

"రామా! అంతా విన్నావు కదా? ... ఏ తప్పూ చెయ్యని వాణ్ణి ... ఎన్ని కష్టాలో చూడు ... మా అన్నని నేను చంపలేక కాదు. నేనూ గొప్ప వీరుణ్ణే! తోడబుట్టిన వాణ్ణి ఎలా చంపనా అని వెనకా ముందూ ఆలోచిస్తున్నాను, అంతే. ఎవరన్నా చంపి పెడితే జన్మజన్మలకీ వాళ్ళ రుణం మర్చిపోను. రామా! ... ఆ దుర్మార్గుణ్ణి చంపేసి ... నా కిక వాడి బెడద లేకుండా చెయ్యాలి నువ్వు" అంటూ సుగ్రీవుడు రాముడి చేతులు వాటేసుకున్నాడు.[267]

రాముడు గంభీరమైన చిరునవ్వుతో చూశాడు. "అంతా విన్నాను. నీ దోషమేమీ లేదు. పర స్త్రీని అపహరించిన దుర్మార్గుడు వాలి. అతణ్ణి చంపకుండా విడిచి పెట్టను. మనమిద్దరం ఒకే రకమైన ఆపదలో ఉన్నాం. నా కష్టం ఒకటీ, నీ కష్టం ఒకటీ కాదు. నా భార్య ఒకటీ, నీ భార్య ఒకటీ కాదు. వాలి పీడ పోగొట్టగలనని నీకు అభయ మిస్తున్నాను. నిశ్చింతగా ఉండు" అన్నాడు.

సుగ్రీవుడు అప్పుడే సింహాసనం ఎక్కినంత సంబరంతో – "అవును రామా! నువ్వు అంతటి వాడివే! నేనెరుగుదును. నీ పరాక్రమం ముందు ఇంద్రుడే నిలబడ లేడు. ఇక వాలి ఎంత? నీకు కోపం వొస్తే లోకాలే దహించేస్తావు. అవును, అన్నీ హనుమంతుడు చెప్పాడు" అని హనుమంతుడి వేపు చూశాడు – 'బాగా మాట్లాడుతున్నానా' అన్నట్టు.

"ఇది మరీ బాగుంది. నే నెప్పుడు చెప్పానూ?" అన్నట్టు చూశాడు హనుమంతుడు బుగ్గలు ఉబ్బించి.

సుగ్రీవుడు మంత్రులందరి వేపూ నవ్వు మొహంతో చూశాడు – "శ్రీరాముణ్ణి గురించి మనం ఎరగని దేముంది? వాలిని తప్పకుండా చంపేస్తాడు. నేను మళ్ళీ రాజునీ, మీరు మళ్ళీ మంత్రులూ!" – సంతోషిస్తూ సంతోషిస్తూ సుగ్రీవుడి మొహం, కొంచెం కాంతి తగ్గింది. తను ఇంత సంబరపడుతున్నాడు గానీ ... వాలి అంటే సామాన్యుడా? ... వాడి దుంప తెగ! అంత బలం ఎలా వొచ్చిందో గానీ ... ఈ బాణాలూ, గీణాలూ వాడినేమన్నా చెయ్యగలవా అసలు? – ఆ ఆలోచన రాగానే హఠాత్తుగా చాలా దిగాలు పడి పోయాడు – "రామా! ... మనలో మన మాట ... ఆ దుర్మార్గుడు మా చెడ్డ బలవంతుడు సుమా! నువ్వు అంత కన్నా బలవంతుడివే అనుకో. అబ్బే, అందుక్కాదు. వాలి గురించి తెలుసు కోటం ఎందుకైనా మంచిదనీ. వాడు చీకట్నే సంధ్యా వందనం ఎక్కడ చేస్తాడను కున్నావూ? ... ఇంట్లో కాదు.. నాలుగు దిక్కులకూ పోయి సముద్రాల్లో చేసి ... సూర్యోదయానికల్లా ఇంటికొచ్చేస్తాడు. వాడు ఆటలాడేది వేటితో అనుకున్నావూ? బంతుల్తో కాదు, కొండల్తో!

---

**267.** **కిష్కింధా, సర్గ 9, శ్లోకం 24**: సుగ్రీవుడు వీరుడు కాడని ఎవరైనా ఎక్కడనుకుంటారోనని అతను ఇలా చెపుతున్నాడు "ఆ పాపిని నిగ్రహించుటకు నాకు శక్తి యుండినను అన్నయను గౌరవముచే నా కట్టి బుద్ధి పుట్టలేదు" అంటున్నాడు. అన్న అనే గౌరవం వల్ల అతనికి ఎదురు తిరిగి ఓడించలేదట! ఆ అన్నని, గూడుపు ఠాణీ చేసి చంపించవొచ్చును! తను చంపడు గానీ ఇతరులతో చంపిస్తాడు! ఎంత సిగ్గులేని మాటలో!

★

పర్వతాల్ని గోళీకాయల్లాగ ఎగరేసి పట్టుకుంటాడు. అడవుల్లో మహా వృక్షాల్ని గడ్డి పోచల్లాగ పైకి పీకి పారేసి పోతాడు.”

రాముడి లోపల రాముడు, గాంభీర్యమంతా ఒక వారకి గెంటి – “ఓరి నాయనో! ... అయ్య బాబో!” అని నిర్ఘాంతాలు పోతున్నాడు.

లక్ష్మణుడు, సుగ్రీవుడి మాటల్లో నమ్మకం లేనట్టు చిరునవ్వుతో వింటున్నాడు.

హనుమంతుడు ఎప్పుడు లేచాడో, దూరంగా పొదల్లో ఏవో ఆకులు వెతికి వెతికి తెంపుతూ తిరుగుతున్నాడు.

సుగ్రీవుడు, వాలి వీరత్వం వర్ణించే ఉత్సాహంలో పడిపోయాడు – “ఒకసారేమైందో తెలుసా రామా? ... ఆ మాయదారి మాయావి లేడూ? ... వాడి అన్న దుందుభి అనేవాడు సముద్రంతో దెబ్బలాటకి వెళ్ళాడు. వాడు సముద్రుడితో “నీ గొప్పేవిటో చూస్తాను. నాతో యుద్ధానికి రా సముద్రుడా!” అని తొడలుగొట్టి సముద్రుణ్ణి పిలిచాడు.

“సముద్రుడితో యుద్ధమే!” – రాముడికి సరదా వేసింది. చిన్నప్పుడు విశ్వామిత్ర మహర్షి దగ్గిర ఇలాంటి చక్క చక్కటి కథలెన్నో విన్నారు. మళ్ళీ అలాంటి కథలు దొరకనే లేదు. – “ఊఁ, సముద్రుడు దుందుభిని చంపేశాడా?” అని ఉత్సాహంగా అడిగాడు.

“అబ్బే! సముద్రుడు జడిసిపోయి అసలు యుద్ధానికే దిగందే! ‘నా గొప్పేం వుందిలే నాయనా! నీతో నే నెక్కడ యుద్ధం చెయ్యగలనూ? నాలాంటి వాడితో చేస్తే నీకు మాత్రం ఏం కీర్తి? ... హిమవంతుడనీ వొక పర్వత రాజున్నాడు. అతడితో చేస్తివా, నీ ఉత్సాహమూ తీరుతుంది. కీర్తీ దక్కుతుంది. వెళ్ళి రా నాయనా!’ అని ఆ పీడ వొదిలించుకున్నాడు, సముద్రుడు. ‘సరేలే! ఈ పిరికివాడితో నా కెందుకులే. యుద్ధం చెయ్యలేనని మిడుకుతున్నాడు’ అని దుందుభి సముద్రుణ్ణి విడిచిపెట్టి, హిమవంతుడి మీదకే పోయాడు. ఆ కొండల నిండా రాళ్ళన్నీ కూలదోసి – ‘రా! నాతో యుద్ధానికి రా!’ అని హిమవంతుణ్ణి పిలుస్తూ కేకలేశాడు...”

“వాడి పొగరంతా హిమవంతుడు అణిచేసే ఉంటాడు” అని తల పంకించాడు రాముడు.

“అబ్బే! ... విను మరీ! ... హిమవంతుడు హడలి పోయి – ‘నాయనా దుందుభీ! నేను యుద్ధ వీరుణ్ణి కాను సుమా! ... గిట్టని వాళ్ళెవరు చెప్పారో గానీ ... ఆ గుద్దులేవిటో, ఆ యుద్ధాలేవిటో నా కేవీ చాతకావు. ఇదిగో, ఇక్కడ తపస్సు చేసుకునే ఈ సన్నాసుల్ని పూజించుకుంటూ, వాళ్ళకో కాయో, పండో అందించి సేవలు చేసుకుంటూ ... బతుకుతున్నాను. నన్ను బాధ పెడితే నీకు మాత్రం ఏం వొరుగుతుంది?’ అని గోల పెట్టాడు...”

రాక్షసుడితో హిమవంతుడు అలా గోల పెట్టడం రాముడికేమీ నచ్చలేదు.

సుగ్రీవుడు చెప్పుకుపోతున్నాడు – “దుందుభికి కోపం వచ్చి, ‘ఏడిసినట్టే ఉంది. నువ్వేదో ఊడ బొడుస్తావని చెప్పాడే సముద్రుడూ? మీ ఇద్దరికీ పడిచావదా ఏంటీ? వెధవ అబద్ధాలూ వాడూనూ. తెలవకపోతే తెలవదనాలి గానీ, నీ పేరు చెప్పడం ఎందుకూ?’ అని విసుక్కుని – ‘సరేగానీ ... ఎవడయినా గొప్ప వీరుడున్నాడేమో ఎరుగుదువా నువ్వు? నాకు తగిన వాడితో యుద్ధం చెయ్యాలని మా చెడ్డ కోరికగా ఉందయ్యా సామీ!’ అని హిమవంతుడి ప్రాణం తీశాడు.

అప్పుడు హిమవంతుడు బాగా ఆలోచించి ఎవరి పేరు చెప్పాడో తెలుసా? మా అన్న పేరే! ‘అయ్యో! లేకేం నాయనా? ... వాలి అనే వానర రాజు కిష్కింధలో ఉన్నాడు. గొప్ప బలవంతుడు. ద్వంద్వ యుద్ధంలో దిట్ట. మీ రిద్దరూ కలబడ్డారంటే మదపు టేనుగులు కలబడ్డట్టే. మీ యుద్ధం చూడాలని దేవతలు కూడా వస్తారు! మరి వెంటనే బయల్దేరి వెళ్ళు!’ అని హిమవంతుడు దుందుభిని పంపేసి ప్రాణం దక్కించుకున్నాడు. – ‘నీ తీట వొదుల్తుందిలే’ అని లోపల అనుకునే ఉంటాడనుకో.

దుందుభి పొగరు మొత్తనంగా – ‘ఓహో! అంతటి వీరుడా వాలి? చూస్తాను అదేమిటో! ఆ సముద్రుడిలాగ నువ్వూ అబద్ధాల కోరువేనేమోలే’ అని వెంటనే కిష్కింధకి వొచ్చాడు. కోట ముందు నిలబడి అర్ధ రాత్రి మా అన్నని యుద్ధానికి పిల్చాడు. మా అన్న వొచ్చేదాకా కూడా ఆగలేక కోట గోడలూ, తలుపులూ బాదుతూ, చెట్లు పీకుతూ, నానా సందడీ చేశాడు. మా అన్న మొదట శాంతంగానే చెప్పాడు సుమండీ! ఏ మాట కామాటే చెప్పుకోవాలి ... ముందుకి ముందు కయ్యానికి కాలు దువ్వే రకం కాదు మా అన్న...”

సుగ్రీవుడి పిర్ర గొప్ప ఉపద్రవంలో పడవలసిన క్షణమే అది. కానీ, హనుమంతుడు నిప్పు రాజేసి, ఆకులు కాల్చే తొందరలో ఉన్నాడు – చుట్టలకోసం.

సుగ్రీవుడు తన అన్న గుణగణాల గురించి, అడ్డూ ఆపూ లేని ఉత్సాహంతో చెప్పుకుపోతున్నాడు – “మా అన్న ఎవరి మీదకీ ముందుకు ముందు కాలు దువ్వే రకం కాదు. దుందుభితో ఎంతో న్యాయంగా – ‘అయ్యా! ఎవరు నువ్వు? ... నీకూ నాకూ అనవస రంగా శత్రుత్వం ఎందుకు?’ అని చెప్తే చెవిన బెట్టాడా వాడు? వాడికి మూడుతోంటే వింటాడు? ... పైపెచ్చు మా అన్ననే వెటకారాలు పట్టించాడు. ‘ఆడ వాళ్ళని వొదిలి రాలేక పోతున్నావా? సరేలే! తెల్లారే దాకా ఆగుతాలే.

చుట్టాల్నీ పక్కాల్నీ చివరిసారిగా పలకరించి వచ్చెయ్యి! రాజ్యం అదీ ఎవరికిస్తావో ఆ ఏర్పాట్లన్నీ చేసెయ్యి!' అంటూ కేకలు పెట్టాడు. చెప్పొద్దూ? మా అన్నకి వొళ్ళు మండిపోయింది. మండదూ మరీ? వెంటనే యుద్ధానికి బయల్దేరి వెళ్ళాడు."

సుగ్రీవుడు, అన్నతో వైరం లేని కాలంలోకి వెళ్ళి పోయి అన్న వీరత్వాన్ని సంతోషంగా వర్ణిస్తున్నాడు. అతని సంతోషం చూస్తోంటే రాముడికి పెద్ద సందేహం రేగింది. సుగ్రీవుడు హఠాత్తుగా ఏ క్షణంలో నన్నా – "మా అన్నకీ, నాకూ వైరం ఏంటి? … ఇంతసేపూ ఏదో బుద్ధిలేక వాగాను గానీ మా అన్న మీద ఈగ వాలిం దంటే ఊరుకోను. నీ దారిన నువ్వు దయ చెయ్యి" అనేస్తాడేమోనని రాముడికి దడ మొదలైంది.

వాలీ, దుందుభీ ఏ రకంగా యుద్ధం చేశారో – సుగ్రీవుడు బంతిలా లేచి, అక్కడే ఇద్దరి పక్షాలూ అభి నయిస్తూ, రాముడి మీది మీది కొచ్చి మంత్రుల కాళ్ళన్నీ చితకదొక్కి యుద్ధం అంతా రాముడి కళ్ళకు కట్టినట్టు చూపించాడు. ఆ గంతుల్లో, హనుమంతుడు కాల్చి పెట్టిన ఆకులన్నీ ఒక్క గంతుతో చితక తొక్కి చూర్ణం చూర్ణం చేసేశాడు.

ఆ రణ రంగంలో సుగ్రీవుడికీ, హనుమంతుడికీ గొప్ప యుద్ధం జరిగేదే గానీ, హనుమంతుడు సుగ్రీవుణ్ణి మెచ్చుకున్నట్టు చూసి, తను కష్టపడకుండా దొరికిన చుట్టల పొడుంని ముక్కుల నిండా దట్టించే కార్యంలో మునిగిపోయాడు.

వాలీ దుందుభీ, ఆ విధంగా యుద్ధం చెయ్యగా … చెయ్యగా … చెయ్యగా … చివరికి వాలే గెల్చాడు. దుందుభి చచ్చిపోయాడు. వాలి, దుందుభి కళేబరాన్ని బంతిలాగ ఎగరదన్నాడు. అది ఒక యోజనం దూరం పోయి ఈ పర్వతం మీదే మతంగ ముని ఆశ్రమం దగ్గిర కొండల్లో పడింది. ఆశ్రమ పరి సరాల్లో రక్తం చిందింది. మతంగ ముని, దివ్య దృష్టితో అంతా గ్రహించి, కోపంతో – 'నా ఆశ్రమ ప్రాంతాల్ని కలుషితం చేసిన దుర్మార్గుడు ఇక్కడికి వచ్చాడంటే, రాగానే మరణిస్తాడు. ఈ శాపం రేపటి నుంచి పని చేస్తుంది' అని శపించాడు. ఆ వనంలో వున్న వానరులు కొందరు వాలి దగ్గరికి పోయి ఆ సంగతి చెప్పారు. వాలి చాలా దుఃఖపడి వెంటనే మతంగ ముని దగ్గరికి పోయి క్షమించమని కోరాడు. మతంగ ముని వాలి మాటే వినకుండా ఆశ్రమంలోకి పోయాడు. చేసేది లేక వాలి విచారిస్తూ వెళ్ళి పోయాడు. అందుకే వాలి ఈ కొండల మీదకి రాడు. వొచ్చాడంటే చచ్చాడే, కానీ రాడుగా? ఇక చచ్చేదెలాగ?

సుగ్రీవుడు ఉత్సాహం తగ్గి ఎప్పటి స్థానంలో కూర్చు న్నాడు. అప్పటికి సుగ్రీవుడికి మళ్ళీ వాలితో వైరం గుర్తొ చ్చింది. తను వున్న కొండ గుర్తొచ్చింది. మంత్రులు గుర్తొచ్చారు. చుట్టూ చూశాడు.

మంత్రులు చుట్టలు కాలుస్తూ అర్ధ నిమీలిత నేత్రాలతో తలొక స్వర్గంలో తేలుతున్నారు.

సుగ్రీవుడికి కూడా మనసు పీకింది ఆ స్వర్గం కోసం. "ఇప్పుడు కాదు. వాలిని చంపి వాడి కాష్టంలోనే చుట్ట ముట్టించుకుంటాను" అని ప్రతిజ్ఞ చేసుకున్నాడు. "మా అన్న సామాన్యుడు కాడు రామా! పరమ కిరాత కుడు! నర రూప రాక్షసుడు! అన్న అయితే మాత్రం దుష్టుడు దుష్టుడే. ఎన్నడు విరగడౌతాడో గానీ … వాడి దుంప ఎప్పుడు తెగుతుందో గానీ …" – సుగ్రీవుడు అన్నని తిడుతోంటే రాముడి చెవులకెంతో ఇంపుగానే ఉంది గానీ … ఆ తిట్లన్నీ లక్ష్మణుడు వినడం … ఏ క్షణంలోనైనా చెప్పలేం … ఈ ధిక్కారం .. అన్నని తమ్ముడు నిందించడం .. అంత మంచిది కాదని పించింది.

అన్నగారి బలం అంతా ఒకసారి గుర్తు చేసుకున్న తర్వాత సుగ్రీవుడికి రాముడి బాణం పుల్లల మీద నమ్మకం పోయింది. పూర్తిగా నిరుత్సాహపడి పోయాడు – "రామా! వాలి ఇక్కడికి రాలేడు కాబట్టే ఇక్కడ నిబ్బరంగా కూర్చుని నీతో మాట్లాడుతున్నాను. అదుగో … అటు చూడు, కుంకుడు చెట్ల వేపు. కనబడుతోందా? అదే దుందుభి కళేబరం. మా అన్న కిష్కింధలో ఒక్క తన్ను తంతే అది వొచ్చి ఇక్కడ పడింది" అంటూ అటు చూపించాడు.

కొండంత అస్థిపంజరం కుప్ప! దాన్ని చూసి రాముడు నిర్ఘాంతపోయాడు. లక్ష్మణుడికి పెద్ద సందేహం ఒకటి వచ్చింది. "మరి, నీ అన్న ఎంత బల వంతుడో తెలుసు కదా? ఆ మాయావే నీ అన్నని చంపేశాడని ఎలా అనుకున్నావోయీ?" అందామను కున్నాడు గానీ, రాముడు గంభీరంగా ఉండడం చూసి, తనేమీ అనకుండా ఊరుకున్నాడు.

"ఇతనికి నా బలం గురించి చాలా అపనమ్మకంగా వుంది. నా సంగతేవిటో చెప్పరాదూ?" అన్నట్టు చూశాడు రాముడు, లక్ష్మణుడి వేపు.

లక్ష్మణుడు సర్దుకుని సుగ్రీవుణ్ణి చూస్తూ – "నీ అన్న పరాక్రమం అంతా చెప్పావు. బాగానే ఉంది. కానీ, మా అన్నగారి మీద నీకు నమ్మకం లేనట్టు కనపడుతోందే!" అంటూ చిరునవ్వు నవ్వాడు.

"అబ్బే బ్బె బ్బె బ్బె! నమ్మకం ఎందుకు లేదూ?"

"సరేలేవోయ్! ముసుగులో గుద్దులాట లెందుకు గానీ, మా అన్నగారేం చేస్తే వాలికన్నా బలవంతుడని నీకు నమ్మకం కలుగుతుందంటావూ?"

"అబ్బెబ్బే! … ఏం చెయ్యటం ఎందుగ్గానీ … మనం

కాస్త ముందే బలం చూసుకుని ... రంగంలోకి దిగటం మంచిది కదాని, అంతే! ... అదుగో, ఆ దుందుబి అస్తి పంజరం వుందిగా? దాన్ని కాస్త అక్కణ్ణించి రెండు వందల ధనుస్సుల ఎత్తు ఎగర గొడితే ... అంతే చాలు. ఇక వాలి చచ్చాడన్న మాటే! ... రామా! ... నీ మీద నమ్మకం లేక కాదు సుమా! అబ్బే ... అసలు నువ్వు ..."

రాముడు గంభీరంగా లేచాడు. లక్ష్మణుడూ లేచాడు.

సుగ్రీవుడూ లేచాడు.

తారుడు, నిద్రపోతున్న నీలుణ్ణి గబగబా భుజం పట్టి గుంజుతూ – "లే, లే! ఎంతసేపు పాడు నిద్ర? రాము దేదో చేస్తున్నాడు. చూద్దాం పద... మళ్ళీ లేపలేదని గోల పెడతావు" అని లేవగొట్టే ప్రయత్నం చేశాడు. ఎంతకీ పని జరక్క, ఎలాగైనా లేపాలని నీలుణ్ణి బండల మీద బర బరా ఈడ్చాడు.

నీలుడు మత్తులో – "అబ్బా! ... ఏంటీ! ఛీ ... పోండీ" అని విసుక్కున్నాడు.

"రాముడేదో చేస్తున్నాడు."

"ఊс ...."

"ఊс ఏంటీ? చూడవా?"

"ఊహూ! ..."

"నీ ఖర్మ! నేనేం చెయ్యను? మళ్ళీ లేపలేదన్నా వంటే చూడు!" అని తారుడు, నీలుణ్ణి వొదిలేసి, మీద నించి తొక్కుకుంటూ అటు పరిగెత్తాడు.

నీలుడు కాళ్ళూ చేతులూ ఆరజాపాడు – "ఆహా! ఎంత హాయి!" అన్నట్టు.

హనుమంతుడు కంగారుగా చుట్టల సరంజామా అంతా కట్టిపెట్టి నీలుడి చెయ్యి తొక్కుకుంటూ పరి గెత్తాడు.

నీలుడు తప్ప అందరూ రాముడి చుట్టూ జేరారు. రాముడు గంభీరంగా కళ్ళు మూసి ఏవో మంత్రాలు చదువుకుంటూ నిలబడ్డాడు.

నళుడు, తారుడి చెవిలో – "మంత్రాలు చదువు కుంటే గొప్పేం లేదు. వాలి అయితే మంత్రాలు లేకుండానే ఎగరగొట్టాడుగా?" అని గుడ గుడ లాడాడు.

తారుడు, చెవి దురదపుట్టి "అబ్బ, ఊరుకో! లక్ష్మ ణుడు చూస్తున్నాడు" అని విసుక్కుని చెవి దులుపు కున్నాడు.

రాముడు మంత్రాలు పూర్తిచేసి, దుందుభి అస్థి పంజరం అడుక్కి కాలు పోనిచ్చి, పైకి ఎగరదన్నాడు. అది చెల్లాచెదురై కొండల చుట్టూ పడింది.

సుగ్రీవుడు కొంచెం సంతోషించి ... నెమ్మదిగా నీరసపడ్డాడు.

రాముడు వీర గర్వంతో సుగ్రీవుడి మొహం క్రీకంట చూసి, తెల్లబోయి, లక్ష్మణుడి వేపు గంభీరంగా మొహం తిప్పాడు.

లక్ష్మణుడు సుగ్రీవుణ్ణి – "మా అన్న గారి బలం ఒప్పుకుంటావా?" అన్నట్టు చూశాడు.

"అబ్బే! నేనెందు కొప్పుకుంటానూ?" అన్నట్టు సుగ్రీవుడు దిక్కులు చూస్తూ "అబ్బో! గొప్ప కార్యమే. కానీ..." అని నసిగాడు.

"ఊс, కానీ? ... ఏమిటి నీ సందేహం సుగ్రీవా? సందేహించక చెప్పు" – లక్ష్మణుడు.

"మనలో మన మాట. మా అన్న దీన్ని కాలితో ఎగరేసినప్పుడు దుందుభి ఎలాగున్నాడనీ? ... మదపు టేనుగులాగున్నాడు... ఇప్పుడో? అబ్బే! ఎండకి తడిసి ... వానకి ఎండి ... ఇంకేం మిగిలిందక్కడ? కంపలాగా తేలికై పోయిందాన్ని ఎగరదన్నడం ... ఏం గొప్పలే" అని మళ్ళీ నిరుత్సాహ పడిపోయి, కూలబడ్డాడు.

రాముడు గంభీరంగా మొహం ముడుచుకున్నాడు.

లక్ష్మణుడు చిరునవ్వుతో "సుగ్రీవా! నువ్వు కోరిన కార్యమే గదా మా అన్నగారు చేసి చూపించారు? సరే! నీకు సంతోషం కలిగే కార్యం మరేదయినా చెయ్యగలరు. సందేహించకు, అడుగు!" అని సముదాయించాడు.

రాముడు మొహం చిట్లించి చుట్టూ చూశాడు – ఇంకేం ఎగరదన్న మంటాడోనని. ఈ ఆటవికుడు తనకు పరీక్షలు పెడతాడా? ... తాటకి వధ! ... శివ ధను ర్భంగం! ... పరశు రాముడితో...!

"అదుగో... ఆ మద్ది చెట్లు చూడు. చూశావా?" అన్నాడు సుగ్రీవుడు వాటి వేపు చూపిస్తూ లక్ష్మణుడితో.

రాముడు, పరశురాముణ్ణి వొదిలేసి సుగ్రీవుణ్ణి చూశాడు.

"మా అన్న ... బోలెడు సార్లు ఈ చెట్లన్నీ వూపి వూపి ... ఆకులన్నీ రాలగొట్టి మోళ్ళు చేశాడు. చూసే వాళ్ళకి కళ్ళు గిర్రున తిరిగి పోవలిసిందే! వాడి బలం చల్లగుండ!" అని కొత్తగా ఆశ్చర్యం వెలిబుచ్చాడు సుగ్రీ వుడు.

నళుడు మళ్ళీ తారుడి చెవిలో – "అదేం తిట్టూ? ... 'వాడి బలం కూలా' అనాలి గానీ ... వాడి బలం చల్లగుంటే మన భరతం బాగానే పడతాడు" అని చిరాకు పడ్డాడు.

తారుడు శాంతంగా – "నువ్వన్నది నిజమేగానీ ... ఏదో తొందర్లో ... కంగార్లో అనేశాళ్ళే. వాడి బలం చల్లగుండమంటే చల్లగుంటుందా ఏంట్లే..." అని అల్లుణ్ణి వెనకేసుకొచ్చాడు.

నళుడికి వొళ్ళు మండింది, అల్లుడి మామ మీద! "చల్లగుండమంటే చల్లగుండకపోతే, 'కూలమంటే' కూడా

కూలదన్న మాటేగా? చల్లగుండమంటే చల్ల గుండక, కూలమంటే కూలక, మరి తిట్లు తిట్టుకోటం ఎందు కంటా నోరు నెప్పీ? తిట్లంటే నీకేం నమ్మకం ఉన్నట్టు లేదే!" అని తారుడి చెవితో వాదనకి దిగాడు.

తారుడు విసుక్కుని – "ఊరుకుందూ! చెవులు దుర దలు పుట్టి చస్తున్నాను" అంటూ పంచె కొసలు మెలిదిప్పి చెవుల్లోకి పోనిచ్చాడు.

రాముడు మద్దిచెట్ల వేపు బాణం గురిచూసుకుంటు న్నాడు. బాణాలతో పరాక్రమం చూపించడంలో అయితే రాముడికి ఎటువంటి సంకోచమూ వుండదు. పైగా ఉత్సాహం కూడా. రాముడు, బాణం ఎక్కుపెట్టి సుగ్రీ వుణ్ణి గంభీరంగా చూస్తూ – "సుగ్రీవా! మీరీ ఆయుధాల శక్తి నెరుగరు. ఇపుడు మీకొక అద్భుతమైన కార్యం చేసి చూపిస్తాను" అంటూ అల్లెతాడు బలంగా లాగి రంగున బాణం విడిచిపెట్టాడు.

ఆ కొండల్లో చెట్లూ పిట్టలూ ఎన్నడూ వినని భయం కరమైన హోరుతో ... చప్పుడుతో ... ఆ బాణం మద్దిచెట్లని బద్దలు చేస్తూ దూసుకుపోయింది.

పిట్టలు గోల గోలగా లేచాయి. పొదల్లో జంతువులు అయోమయంగా పరుగులెత్తాయి.

సుగ్రీవుడూ, అతని మంత్రులూ స్థంభించి పోయారు.

నీలుడు హడలిపోయి లేచి కూర్చుని తేల కళ్ళతో చుట్టూ చూశాడు.

"అంత శక్తి గల బాణం వాలి గుండెల మీద కొడితే ఇంకేమన్నా వుందా?" సుగ్రీవుడు ఆనందం పట్టలేక మూర్ఛబోయాడు.

హనుమంతుడు బుగ్గలు ఉబ్బించి ఆశ్చర్యంగా విల్లునీ, బాణాల్నీ మార్చి మార్చి చూస్తున్నాడు.[268]

"ఏంటి? ఏమైంది?" అని నీలుడు కంగారుగా అడిగాడు తారుణ్ణి.

తారుడు భక్తిగా రాముణ్ణి చూపించి నమస్కారం పెట్టాడు, నోట మాటరాక.

"రాముడా? ఏం చేశాడు?"

తారుడు, దూరంగా మద్ది చెట్లవేపు చూపించి నమస్కారం పెట్టాడు.

"బద్దలు గొట్టెయ్యడవే! ... ఎలా కొట్టాడూ చెట్లనీ?"

తారుడు, బాణాల వేపు చూపించి కళ్ళు తేలేసి నమస్కారం పెట్టాడు.

నీలుడికి అంతా అర్ధమైంది. తారుణ్ణి నిష్టూరంగా చూశాడు – "నన్ను కొంచెం లేపకూడదూ? ... నేను కూడా చూసేవాణ్ణి కదా? ... అమ్మో ... నువ్వేనా? చుప్పనాతి సూరయ్యవి..."

తారుడికి వొళ్ళు మండిపోయి నోటి మాట పెగి లింది. – "చాల్లే, ఊరుకో! పళ్ళు రాలగొడతాను. ఎంత లేపినా లేచి చావవు గానీ ... లేపలేదని నిష్టూరాలు మాత్రం బాగానే వేస్తావు. ఎంత సేపు లేపానో! లేచి చచ్చావా?"

"లేపావా? ... నే నసలు చీమ చిటుక్కుమన్నా లేస్తానే!"

"నీ నిద్ర సంగతి నాకు చెప్పకు. భేరీలు మోగినా, ఏనుగులు తొక్కినా, లేవవు."

"అలా అంటేనే నాకు కోపం వొస్తుంది. చిన్నప్పుడు మా అమ్మ నేనసలు నిద్రేపోనని తెగ తిట్టేది. 'మా నీలుడసలే నిద్రపోడమ్మా! ... కాల్చుకు తింటున్నాడు' అని అందరికీ చెప్పేది."

"చిన్నప్పుడు మీ అమ్మని కాల్చుకు తిని, ఆ నిద్రంతా ఇక్కడ పోయినట్టున్నావు. రాజుకి కూడా చచ్చే కోపం వొచ్చింది. ఆగు, నీ భరతం బాగానే పడతాళ్ళే."

నీలుడు కొంచెం జంకాడు – "నిజంగానే కోపం వొచ్చిందా రాజుకి?" అంటూ సుగ్రీవుడి కేసి వారగా చూశాడు.

సుగ్రీవుడు రాముడి పాదాల మీద బోర్లాపడి ఏమిటేమిటో అంటున్నాడు – "... నువ్వు రామా! నీ

**268.** 'రామాయణం'లో వానర జాతి అంతా – మానవుడు ఏ ఆయుధమూ కనిపెట్టని దశలో, జంతువుల్లో జంతువుల లాగ ఉన్న స్థితిని, ప్రతిబింబిస్తుంది. ఆ దశలో మానవుడికి దేహ బలం తప్ప ఇంకో ఆయుధం లేదు. ఆ కాలంలో, రాళ్ళతోటీ చెట్ల కొమ్మలతోటీ, మృగాలనించీ శత్రువుల నించీ, ఆత్మరక్షణ చేసుకునే వారు. మానవ సమాజంలో మొట్టమొదట కనిపెట్టిన శక్తివంతమైన ఆయుధం – 'విల్లు!' అది మానవులకు జంతువుల మీద అపారమైన బలం ఇచ్చింది. సమాజంలో 'విల్లు'కి ఎంతో 'పవిత్రమైన' స్థానం వచ్చింది.

వాలికి ఏ రకమైన ఆయుధమూ లేదు – శరీర బలం తప్ప. ఆఖరికి కర్ర కూడా లేదు. రాముడికి 'ఆయుధం' వుంది. అదే అతని 'బలం!' రాముడు వాలికన్నా శారీరకంగా బలవంతుడు కాడు. బలవంతుడని సుగ్రీవుడు వొప్పుకోలేదు. ఆయుధ బలం వల్లనే రాముడు వాలికన్నా బలవంతుడయ్యాడు.

**కిష్కింధా, సర్గ 12, శ్లోకాలు 3, 4:** రామ బాణం మహా వృక్షాల్ని చీల్చుకుంటూ పోయి, వెనక వున్న పర్వతాన్ని కూడా బద్దలుగొట్టి, భూమిలో దూరి, రయ్యిన పైకి వొచ్చి, మళ్ళీ రాముడి వీపు మీద అమ్ముల పొదిలో నిలబడుతుంది. ఇది 'కల్పనే' అయినా, ఈ ఘట్టం వల్ల, 'విల్లు చాలా శక్తిగల ఆయుధం' అని అర్థం చేసుకోవాలి. రాముడికి 'కత్తి' కూడా ఉన్నప్పటికీ, విల్లుకి వున్న పవిత్ర స్థానం కత్తికి లేదు. వాలి, కొన్ని గొప్ప వీర కార్యాలు చేస్తే, రాముడు తన ఆయుధంతో వాలి కన్నా గొప్ప వీర కార్యాలు చేసి చూపించాడన్న మాట! ★

గొప్పతనం అర్థం చేసుకోలేకపోయాను. ఇంద్రుణ్ణి బద్ద లుగా చీల్చెయ్యగలవు. ఇక వాలి ఎంత? … ఇంతసేపూ నీతో మాట్లాడుతున్నానేగానీ నాకీ పని జరుగుతుందనే నమ్మకమే లేదనుకో! ఇప్పుడు మాత్రం నా మనసులో సందేహాలన్నీ పటాపంచలై పోయాయి" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నాడు – "ఇతడి వల్ల పని మాత్రం జరుగుతుంది. కానీ, ఇతణ్ణి ఎప్పటికప్పుడు పొగుడుతూ ఉండాలి, అంతే!" అని తనని తను హెచ్చరించుకున్నాడు లోపల.

రాముడు చిరునవ్వుతో సుగ్రీవుణ్ణి లేవదీస్తూ, "సుగ్రీవా! … నీకు పూర్తిగా విశ్వాసం కుదిరినట్టేనా? … సందేహించకు సుమా! నిర్భయంగా అడుగు … ఇంకే కార్యమైనా …" అంటూ వోరగా చూశాడు.

సగం వరకూ లేచిన సుగ్రీవుడు – మళ్ళీ బోర్లా పడ్డాడు "ఎంతమాట! .. ఎంత మాట!" అంటూ.

చుట్టూ అందరి మొహాల్లోనూ తన పట్ల భక్తి గౌరవాలు పెల్లుబకడం చూసి రాముడి మనసు పూర్తిగా సంతృప్తి పడింది.

"శ్రీరామా! … మరి ఆ దుష్టుణ్ణి ఎప్పుడు…?"

"ఎప్పుడో ఎందుకోయీ? … ఇప్పుడే! విల్లుకి అల్లె తాడు బిగించే వుంది. బయలుదేరు, పోదాం! నువ్వు మీ అన్నని యుద్ధానికి పిలువు! నేను కిష్కింధ సమీపంలో చెట్లు దట్టంగా ఉన్నచోట దాక్కుని వుంటాను. మీ అన్నని కవ్విస్తూ నేనున్న సమీపానికి తీసుకురా! మీ రిద్దరూ యుద్ధం చేస్తూంటే, ఆ దుర్మార్గుడి మీద … నా కరకు బాణాలు … గుప్పిస్తాను."

సుగ్రీవుడు ఆనందంతో మళ్ళీ మూర్ఛబోయాడు.

★ ★ ★

"ఓరీ దుష్టుడా! వాలీ! … రారా యుద్ధానికీ! నాతో యుద్ధం చేసి చూడరా! …" అంటూ తొడలు చరుస్తూ దిక్కులు పిక్కటిల్లే వీరాలాపాలు ప్రారంభించాడు సుగ్రీవుడు, కిష్కింధలో కోట ముందు నిలబడి.

సుగ్రీవుడి కంఠం విన్నదే తడవుగా వాలి కోపోద్రేకంతో కోటలోంచి దూసుకుంటూ వొచ్చేశాడు.

"రారా దుర్మార్గుడా! అందుకోరా నన్నూ!" అంటూ సుగ్రీవుడు వాలిని కవ్విస్తూ, రెచ్చగొడుతూ, వెనక్కి పరుగుతీస్తూ, వాలిని అనుకున్న స్థలం వరకూ తీసుకు వొచ్చాడు.

వాలి, భరించలేని కోపంతో సుగ్రీవుడి మీద కల బడ్డాడు. తనని అంత రెచ్చగొట్టిన శత్రువు చేతి కందగానే వాలి ఉత్సాహం హద్దులు దాటిపోయింది. సుగ్రీవుడి వీపుమీద గుద్దుల వాన ప్రారంభమైంది. సుగ్రీవుడు గుద్దు గుద్దుకీ గొప్ప వీరత్వంతో కెవ్వు కెవ్వున అరుస్తున్నాడు. వాలి, సుగ్రీవుడికి వొక్క గుద్దులు మాత్రమేగాక, కాలికొద్దీ తన్నులూ చేతి కొద్దీ చరుపులూ చెంపపెట్లూ డొక్కపోట్లూ శిరో మర్దనాలూ గుభికీలూ దప్పళాలూ దిప్పకాయలూ ఎత్తి కుదెయ్యడాలూ – ఇంకా ఎన్నెన్నో రకాలు మార్చి మార్చి ఉత్సాహంగా ఇస్తూనే వున్నాడు. శత్రు భయం కరుడైన సుగ్రీవుడు తన పరాక్రమం అంతా తార స్థాయిలో అరవడానికే ఉపయోగిస్తున్నాడు. గుద్దు గుద్దుకీ గిర్రున తల తిప్పి చెట్లవేపు చూస్తున్నాడు.

చెట్ల చాటున బాణం ఎక్కుపెట్టి నించున్న రాముడికి కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. ఆ గుద్దుల చప్పుళ్ళకీ, ఆ అన్నదమ్ముల అరుపులకీ, చెవులు గింగిర్లెత్తి పోతు న్నాయి. అంతా గందరగోళంగా అయిపోయింది.

"ఇద్దరూ మెలికలేసుకుని గిరగిరా తిరుగుతున్నారు. ఎవరు ఎవరో తెలీకుండా ఉందే!" అని కంగారు పడ్డాడు, రాముడు, లక్ష్మణుణ్ణి చూస్తూ.

"ఆ గుద్దేవాడు వాలీ, అరిచేవాడు సుగ్రీవుడూ అయి వుంటారు అన్నగారూ!" అన్నాడు లక్ష్మణుడు.

రాముడు వొప్పుకోలేదు – "అరిచేవాడు కూడా బాధుతోనే ఉన్నాడోయ్!"

"ఆఁ …. ఏం బాదుడులెండి అన్నగారూ! పది గుద్దులకో గుద్దూ, పది తన్నులకో తన్నూ! అదీ వొక బాదుడేనా?"

రాముడికి బాణం వదలడానికి సంకోచం పట్టు కుంది. తీరా అది వాలికి తగలకపోతే ….? వాలి వెనక్కి తిరిగి ఈ చెట్లలోకి ఒక్క ఉరుకు ఉరికితే?

రాముడు ఇంకా ఆలోచనల్లోనే, గురిచూసుకుంటూ వుండగానే సుగ్రీవుడు …. అరుస్తూ …. రుష్యమూకం వేపు పరుగు లంకించుకున్నాడు. వెనకాల వాలి తరు ముతూ పోయి, కొంత దూరంలో ఆగి – "…. బతికి పోయావురా దుర్మార్గుడా! …. తప్పించుకున్నావురా!" అని హుంకరించి వెనక్కి తిరిగాడు.

సుగ్రీవుడు కొండల్లోకి పరిగెత్తి పరిగెత్తి కూల బడ్డాడు – కోపంతో, ఉద్రేకంతో బుసలు గక్కుతూ.

అందరూ పరుగులతో సుగ్రీవుడి చుట్టూ చేరారు.

సంకోచిస్తూ, తడబడుతూ రాముడు కూడా జేరాడు.

రాముణ్ణి చూసీ చూడగానే సుగ్రీవుడు ఎగిరి జుట్టు పట్టుకుని వొంగదీసి 'దీస్ …. దీస్ ….' మంటూ కసిదీరా గుద్దుదామనుకున్నాడు. కాళ్ళూ చేతులూ కూడి రాలేదు. చిటికెన వేలు కదిలించే శక్తయినా లేదు. కుప్పలా కూలబడిపోయి ఉక్రోషంతో కళ్ళనీళ్ళు పెట్టు కుంటూ రాముణ్ణి కోపంగా చూస్తూ – "మా బాగా చేశావు పెద్ద మనిషివి! …. ఇంత మోసం చేస్తావా? గొప్ప సత్యవంతుణ్ణన్నావు. ఎన్నడూ అబద్ధాలాడనన్నావు. ఇదన్నా మాట నీ సత్యం! …. ఆ దుర్మార్గుడితో నన్ను చావ గుద్దించాలనేగా, నీ ఎత్తంతా? …. వాణ్ణి చంపనని

మొదటే చెప్పేస్తే .... ఈ కొండ దిగి వాడి ఛాయలకన్నా పోయేవాణ్ణా? .... మా చక్కగా చేశావు ఉపకారం. ఇంకా నయం. బతికి బయటపడ్డాను .... ఇప్పటి కన్నా తెలిసింది నీ అసలు గుణం! సీతని వెతికి పెట్టాలంట, .... సీతని!" అంటూ తిట్లవానకి లంకించుకున్నాడు.[269]

రాముడు, పుట్టిం తర్వాత అంత అవమానం ఎన్నడూ ఎరగడు. తన తల తీసేసి ఎవరో పట్టుకు పోతు న్నట్టనిపించింది. ఒక మూర్ఖుడు .... ఆటవికుడు .... అంత మంది ముందు .... లక్ష్మణుడి ముందు .... అలా ఝాడించేస్తోంటే .... చేష్టలు దక్కి స్తంభించి పోయాడు. .... ఈ మూర్ఖుడికి తొందరగా నచ్చచెప్పడం మంచిది .... లేకపోతే .... ఇంకెన్నెన్ని రకాల .... మాటలు కురిపిస్తాడో!

కొంత గాంభీర్యం తీసి పక్కన పెట్టాడు, శ్రీరా ముడు. కొంచెం సిగ్గూ, లజ్జా కూడా తీసి గాంభీర్యం సరసన పెట్టాడు. తడబడుతోన్న కంఠంతో – "కొంచెం శాంతం వహించు సుగ్రీవా! .... నీ వంటి ఉత్తముడు మంచి చెడ్డలు తెలుసుకోకుండా .... ఇతరుల్ని నిందిం చడం ధర్మం కాదు. .... నా మాట నమ్ము. నిన్నూ వాలినీ నేనసలు పోల్చుకోలేక పోయాను. మీ నగలూ .... బట్టలూ.... రూపు రేఖలూ .... అన్నీ ఒక్కలాగే ఉన్నాయి. వాలి ఎవరో, నువ్వు ఎవరో పోల్చుకోవడం కష్టం అయిపోయింది" అంటూ ప్రారంభించాడు.

"చాల్లే ఊరుకో, అబద్ధాలే ఆడనన్నావు. బట్టలూ గిట్టలూ.... నగలూ గిగలూ, అన్నీ ఒక్కలాగే ఉన్నాయా? .... ఆ దుర్మార్గుడి మెడలో వజ్రాల హారం లేదూ? దాన్ని వాడెవడో ఇచ్చాడు వాడికి. అసలు మహత్యం అంతా అందులోనే ఉంది. నా మెళ్ళో ఎక్కడేడిసిందదీ?" అని మండిపడ్డాడు సుగ్రీవుడు.[270]

రాముడు తెల్లబోయి కొంచెం ఆలోచించాడు. వాలి మెళ్ళో ఆ హారం అదీ చూసిన గుర్తు రాలేదు. అన్న దమ్ములిద్దరూ కిందా మీదా పడుతూంటే, అంతా అయో మయంగా అయిపోయి, కాస్త పరకాయించి చూస్తూండ గానే ఈ మూర్ఖుడు కొండవేపు పరిగెత్తు కొచ్చేశాడు. అప్పుడైనా వాలి మీదకి బాణం వొదిలితే బాగుండేదేమో! "నా మాట విను సుగ్రీవా! ఆ హారం మిగిలిన నగల్లో కలిసిపోయిందో ఏమో, అది నాకు కనపడనే లేదు సుమా! .... తీరా నేను బాణం వొదిలాననుకో, అది నీకే తగిలితే? – నిన్ను రక్షిస్తానని వాగ్దానం చేశానా? .... తెలిసో, తెలీకో నిన్ను చంపితే మహా పాపం చుట్టుకోదూ నాకు? నువ్వు లేకపోయినా, నేను లేకపోయినా, మనం అనుకున్నదంతా తారుమారై పోవలసిందే గదా? నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్నాను. నువ్వే లేకపోతే దిక్కె వ్వరు నాకు? .... నీ వంటి స్నేహితుడే పోతే నన్నెవరు రక్షిస్తారు?" అంటూ తల వాల్చుకున్నాడు రాముడు.

అంత కోపంలోనూ సుగ్రీవుడి మనసు కొంచెం

---

**269.** **కిష్కింధా, సర్గ 12, శ్లోకాలు 25 ... 28:** వనమునకు వచ్చియుండు రాముని జూసి సుగ్రీవుడు సిగ్గుపడి తల వొంచుకుని భూమిని జూచుచు దీనుడై ఇటులనెను. – "వాలిని యుద్ధమునకు బిలువమని నాతో జెప్పి, నీ పరాక్రమమును నాకు దెలిపి శత్రువుచే నన్ను గొట్టించి, ఇపుడు నీవేమి యోచించుచున్నావు? అపుడే వాలిని జంపనని నాకు జెప్పియుండిన యెడల వాలితో బోరుటకు పోయియుండను" – ఈ మాటలనటానికి సుగ్రీవుడికి సిగ్గెందుకూ? పైగా, కోపం అన్నమాటే లేకుండా, "తల వొంచుకుని భూమిని జూచుచు దీనుడై" అన్నాడట! రాముడికీ, సుగ్రీవునికీ మధ్య ఒప్పందం ఏమిటి? వాలిని చంపాలనే కదా? అది జరగలేదు. ఎందుకు జరగలేదో అసలు కారణం సుగ్రీవుడికి తెలియనప్పుడు, సుగ్రీవుడు రాముడితో కోపంగా మాట్లాడతాడా, దీనంగా మాట్లాడతాడా? కవి ఎప్పుడూ రాముడి తరుపునే ఉంటాడు. అన్ని విషయాల్నీ రాముడికి అనుకూలంగా మారుస్తూ ఉంటాడు. ★

**270.** **కిష్కింధా, సర్గ 12, శ్లోకాలు 30, 31, 32:** రాముడు, మొదటిసారి వాలిని కొట్టలేకపోయాడు. దానికి కారణంగా సుగ్రీవుడితో ఏం చెప్పాడంటే – "మీ రిద్దరూ ఒక్కలాగే ఉన్నారు కాబట్టి, వాలిని పోల్చలేకపోయాను" అని చెప్పాడు. 'బట్టల్లోనో, నగల్లోనో, నడకల్లోనో, ఏ చిన్న తేడా అయినా దొరకదా?' అన్న ప్రశ్న వస్తుందేమోనని, కవి చాలా జాగ్రత్తగా ఇద్దరు వ్యక్తుల్లో వేటి వల్లయితే తేడాలు తెలుస్తాయో అవన్నీ ఇందులో ఇరికించాడు. "మీ ఆభరణములు, వేషములు, దేహ ప్రమాణములు, నడకలు, కంఠ ధ్వనులు, దేహ కాంతులు, చూపులు, పరాక్రమాలు, మాటలు, అన్నిటి యందును ఒకరి నింకొకరు పోలియుండుటచే నేను భ్రమ చెందితిని" అంటున్నాడు రాముడు. (పరాక్రమం కూడా ఒక్కలాగే ఉంటే, ఒకాయన కొండల వేపు పరిగెత్తడం ఎందుకూ?)

**సర్గ 11, శ్లోకం 38:** వాలి ఎప్పుడు యుద్ధానికి వెళ్ళినా ఒక హారం వేసుకుంటాడు. వాలి, దుందుభితో యుద్ధానికి బయల్దేరుతూ, తన తండ్రి (ఇంద్రుడు) తనకు మాత్రమే ఇచ్చిన హారం వేసుకున్నాడు. వాలి, సుగ్రీవుడితో యుద్ధం చేసినప్పుడు కూడా ఈ హారం వాలి మెడలో ఉందని కవి వర్ణిస్తాడు. అది సుగ్రీవుడి మెడలో లేదు. ఆ రకంగా ఇద్దరికీ ఆ తేడా ఉంది కదా? వాలికొక ప్రత్యేక హారం సృష్టించి, దానికొక మహత్యం కల్పించి, అంత గొప్ప వీరుణ్ణి కూడా రాముడితో పడగొట్టించాడు కవి, "మీ ఆభరణాలూ, అలంకారాలూ ఒక్కలాగే ఉన్నాయి" అన్నప్పుడు, ఈ 'ప్రత్యేక హారం' సంగతి ఎరగనట్టు, కవి, దాని సంగతి ఎత్తకుండా ఊరుకున్నాడు. 'మీరిద్దరూ ఒక్కలాగే ఉన్నారు' అని రాముడు అంటే, ఆ మాటల్ని ధిక్కరించి ఎవ్వరూ ఆ హారం సంగతి అడగర్లే' అనే కవి ఉద్దేశ్యం. ★

మెత్తబడడం మొదలుపెట్టింది.

"సుగ్రీవా! లేచి మళ్ళీ బైల్దేరు యుద్ధానికి! ఈ సారి అలా జరగనిస్తానేమో చూడు! ఒక్క బాణంతో వాలి గుండెలు. చీల్చేస్తాను. ఊఁ .... లే! బైల్దేరు!"

"మళ్ళీనా! యుద్ధానికా!" – ఖస్సుమన్నాడు సుగ్రీవుడు. "ఇప్పటికే ఎడం గూడు పడిపోయింది. ఇంకా కుడి గూడు ఉండిపోయిందనా? మళ్ళీ యుద్ధానికి వెళ్ళాలా, .... యుద్ధానికి! ...."

సుగ్రీవుణ్ణి చావబాదాలన్నంత కోపం వొచ్చింది లక్ష్మణుడికి. ఎంత చెప్పినా మాట వినిపించుకోడేం? అంత నిర్లక్ష్యం చెయ్యడానికి శ్రీరామ చంద్రుడనుకుంటున్నాడా .... ఎల్లయ్యో, పుల్లయ్యో అనుకుంటున్నాడా? .... ఈ ఆటవికులు పరమ మూర్ఖులు!

కోపమంతా లక్ష్మణుణ్ణి ఆవరించి, ఎక్కడలేని శాంతమూ రాముణ్ణి వరించింది. రాముడు, చిరునవ్వుతో చెప్పడం సాగించాడు – "నా అభి ప్రాయం గ్రహించవోయీ సుగ్రీవా! .... ఈ సారి .... ఈ సారి నిన్ను నేను పోల్చడానికి వీలుగా, ఏదయినా గుర్తు పెట్టుకుంటే వాలిని చంపడం క్షణాల మీద పని" అంటూ చుట్టూ చూసి, "లక్ష్మణా! ఆ గజ పుష్పలత విరగ బూసింది చూడు, అది తెచ్చి సుగ్రీవుడి మెడలో హారంగా వెయ్యి" అని గంభీరంగా చూశాడు.

లక్ష్మణుడు అన్నగారు చెప్పినట్టే ఆ పూల తీగ తెంపు కొచ్చి, దగ్గరికి వెళ్తే సుగ్రీవుడేం ఖయ్యిమంటాడోనని, దూరంగా చూస్తూ నించున్నాడు.

సుగ్రీవుడికి రాముడి మాటల్లో కొంచెం నమ్మకం కలిగింది గానీ .... ఎడం భుజం గూడు కరేల్ కరేల్ మంటూ "నమ్మకు, నమ్మకు" అని గోల గోల పెట్టింది. సుగ్రీవుడు, తల అడ్డంగా తిప్పేస్తూ – "అబ్బే, మళ్ళీ యుద్ధమా? .... లాభం లేదు. ఎలాగో .... ఈ కొండ మీదే బతికినన్నాళ్ళూ ...." అని కాళ్ళు బారజాపేసి కూర్చున్నాడు.

రాముడు ఏమీ తోచక, సుగ్రీవుడి మంత్రులందరి మీదనించీ దృష్టి ఇటూ అటూ తిప్పి, చివరికి హనుమంతుడి మీద నిలిపి ప్రాధేయపడుతూ చూశాడు.

మంత్రులందరూ ధైర్యం చేసి సుగ్రీవుడి చుట్టూ చేరారు – "మహారాజా! శ్రీరాముడి మాటలన్నీ ధర్మ బద్ధంగానే ఉన్నాయి. ఆయన నీ మిత్రుడు. నీకు మేలు చేస్తాడేగానీ కీడు చేస్తాడా? .... మన కష్టాలు గట్టెక్కే సమయం వచ్చింది. నువ్వు మళ్ళీ యుద్ధానికి పోక తప్పదు. జరిగిందంతా మర్చిపో ...." అంటూ విన్నపాలు సాగించారు.

సుగ్రీవుడు మొహం చిట్లించేస్తూ "మర్చిపోదును. ఈ ఎడం గూడో ....? దీన్నెలా మర్చిపోను?" అని ఖయ్యిమన్నాడు.

మంత్రుల్ని విసుక్కున్నాడే గానీ .... సుగ్రీవుడికి కూడా ఆశగానే ఉంది, ఈ సారి వాలి నిజంగానే చచ్చి పోతాడేమోనని. కొంచెం ధైర్యం తెచ్చుకుని బయల్దేరితే? ఆ దుర్మార్గుడు ఈ పూటే చచ్చిపోతే, సాయంత్రం నించే రాజ వైద్యులు .... ఈ గూడుకి వెచ్చగా .... కాపడాలూ .... మర్దనాలూ .... సింహాసనం .... కిరీటం .... కిష్కింధా రాజ్యం శాశ్వతంగా ....!

మూలుగుతూ లేవబోయాడు. నడుం కూడి రాలేదు. యుద్ధ వ్యతిరేకత ప్రదర్శించింది. "నాతో రాక తప్పదు. హమ్మ .... మ్మ .... మ్మ ...." అంటూ సుగ్రీవుడు నడుంకి చెప్పి దాన్ని సాగదీశాడు. లేవడానికీ మంత్రులతోపాటు రాముడు కూడా ఒక చెయ్యి వెయ్య బోయాడు.

"అమ్మ .... మ్మ .... ఎడం గూడు .... మీ దుంప తెగ!" అని ఖయ్యి ఖయ్యిమన్నాడు సుగ్రీవుడు. "ఎడం గూడు మీద చెయ్యి వెయ్యకండి సుమా! .... ప్రాణం జిలార్చుకు పోతోంది" అంటూ లేచాడు ఎలాగో.

సుగ్రీవుడి కాళ్ళు "మేం యుద్ధానికి రాం" అని మొరాయించాయి. సుగ్రీవుడు అడుగు ముందుకు వెయ్య బోతే, కాళ్ళు పక్కలికీ వెనక్కీ తప్పుకో బోయాయి. యుద్ధానికి కలిసిరాని కాళ్ళతో .... గూళ్ళతో .... సుగ్రీవుడు కాస్సేపు అడ్డదిడ్డంగా నడిచి, నడుం నిలబెట్టుకున్నాడు, సాయంత్రానికి రాజవ్వాలని!

లక్ష్మణుడు పూల తీగ పట్టుకుని దగ్గిరికి వొచ్చాడు.

"పురుగులేవన్నా ఉన్నాయేమో చూశావా? కుట్టి చంపుతాయి" అని మళ్ళీ ఖయ్యి మన్నాడు యుద్ధ వీరుడు.

లక్ష్మణుడు పళ్ళు నూరుతూ, నవ్వు మొహంతో – "పురుగులేవీ లేవోయీ!" అని శాంతం మెరిపించాడు.

"దురద గుండ రెమ్మలేమైనా ఉన్నాయేమో చూడు. యుద్ధం మానేసి గోక్కోటంతో సరిపోతుంది నా పని" అంటూ వీరుడు మెడ అప్పగించాడు.

లక్ష్మణుడు, చేతిలో పూల తీగని సుగ్రీవుడి మెడ నిండా చుట్టి గట్టిగా ముళ్ళేశాడు.

రాముడు సుగ్రీవుణ్ణి తేరిపార చూస్తూ – " ఆహా! .... ఎంత అందంగా ఉన్నావోయీ సుగ్రీవా! దేవతల్లో ఇంద్రుడిలాగ మెరిసి పోతున్నావు. ప్రళయకాల సూర్యుడి లాగ వెలిగిపోతున్నావు" అంటూ చిరునవ్వు చిందించాడు.

"ఈ మాటల కేంలే గానీ .... ఈ సారన్నా .... నిజమేనా?"

"నా మాట నమ్మవోయీ సుగ్రీవా! నే నెప్పుడూ

అబద్ధాలా .... నా మాట నమ్ము!"

"నమ్ముతాలే పనయ్యాక. ఇందాకట్లా చేస్తివా .... ఎందుకులే. నువ్వే చూస్తావుగా? మా అన్న మన భాగోత మంతా కనిపెట్టేస్తాడు. ఇక నిన్ను బతకనిస్తాడనుకుంటు న్నావా?"

రాముడు ఎవరి మొహం వేపూ దృష్టి పోనివ్వకుండా వృక్షాగ్రాల సౌందర్యం చూస్తూ నిలబడ్డాడు.

లక్ష్మణుడికి సుగ్రీవుడి మీద ఎప్పటికప్పుడే కల బడాలన్నంత కోపం పొంగుతోంది. ... మూర్ఖుడు! అజ్ఞా నంతో పుట్టుకొచ్చిన సాహసం! శ్రీరామచంద్రుడి కీర్తి ప్రతిష్టలేమి ఎరుగును?

సుగ్రీవుడు కుంటుతూ, కుంటు కుంటుకీ మూలు గుతూ, ఎవరన్నా కాలికీ చేతికీ తగిలితే – "మీ దుంప లైగ! మీ జిమ్మల్లాగ! మీద మీదకొచ్చి పడతారేవ్రా ఎద్దుల్లాగ" అని తిట్టిపోస్తూ, అప్పటికో బారెడు దూరం నడిచాడు.

నీలుడు తారుడి చెవి దొరికించుకుని – "ఇదేం పెళ్ళి నడకా, యుద్ధం నడకా?" అని విసుక్కున్నాడు.

"పాపం ఏం చేస్తాడులే. ఏ కీలు కా కీలు ఊడదీసేశాడా దుర్మార్గుడు!"

"నాకు తెలవ కడుగుతానూ .... అసలు రాముడు బాణం ఎందుకెయ్యలేదంటావూ? .... పోల్చలేదంటా దేవిటీ? .... నిజమేనంటావా?"

"ఏమోలే, వీళ్ళిద్దర్నీ కొత్త వాళ్ళు పోల్చడం కష్టమే నేమో! .... ఇద్దరూ ఒక్కలాగే వుండి ఏడుస్తారయ్యే!"

"నేన్నమ్మను! .... ఆ మాత్రం పోలిక దొరకదా? .... అసలు రాముడు వాలిని చూసి హడలిపోయి 'ఇంత గొప్ప వాడి మీద నా బాణం పని చేస్తుందా' అనుకున్నా డేమో!"

"ఛ! .... పెద్ద పెద్ద చెట్లే బద్దలు గొట్టాడుగా దాంతో?"

"నేన్నమ్మను సుమా! రాముడే బద్దలుగొట్టాడం టావా?"

"అందుకేగా చూస్తావని ఎంతలేపినా లేచావా?"

"అదుగో! ఆ మాటే నేనొప్పుకోను. నే నసలు చీమ చిటుక్కుమన్నా లేస్తాను. నా సంగతి నీకు తెలీదు. చిన్నప్పుడు మా అమ్మ ...."

"మీ అమ్మ చల్లగుండ! ఊరుకో. రాజు అసలే కోపంగా ఉన్నాడు."

"నేను నిద్రపోయినందుకు చాలా కోపం వొచ్చిం దన్నావుగా? నన్నేం అడగలేదేం రాజు?"

"అడుగుతాళ్ళే. ఎప్పుడో తిక్కరేగుతుంది. అప్పు డడుగుతాడు."

అప్పటికి సుగ్రీవుడు నెమ్మదిగా కొండ దిగాడు. హనుమంతుణ్ణి మాత్రమే కాస్త సాయం చెయ్య నిస్తు న్నాడు. చెయ్యి పట్టుకోనిస్తున్నాడు.

రాముడు సుగ్రీవుణ్ణి మాటల్లోకి దించి కోపం పోగొట్టాలని చాలాసేపట్నుంచి తంటాలు పడుతున్నాడు. "అన్నట్టు సుగ్రీవా! రుష్యమూకం మీద ఏ కల వొస్తే ఆ కల జరుగుతుందని విన్నాను. నువ్వేమైనా కలలు గన్నావటోయి?" అని పలకరించాడు చిరునవ్వుతో.

ఖయ్యిమన్నాడు సుగ్రీవుడు "నా కెప్పుడన్నా నిద్రపట్టి ఛస్తేనా కలలు రాటానికి?"

ఊరుకున్నాడు రాముడు.

"ఇందాక నీలుడు నిద్రపోయాడుగా? .... ఏమన్నా కల వొచ్చిందేమో?" అన్నాడు నళుడు.

సుగ్రీవుడికి నీలుడి 'నిద్ర నేరం' గబుక్కున గుర్తొ చ్చింది. నీలుణ్ణి కోపంగా చూస్తూ – "అది సరేగానీ నీలుడూ, నువ్వు మంత్రివి కదా? .... నిద్రపోటం ఏంటీ? .... నాకు చాలా కోపం వచ్చిందని మా మావ చెప్పాడా నీకు?" అని నీలుణ్ణి కోపంగా చూశాడు.

నీలుడు కంగారుపడి – "చెప్పాడు మహారాజా! .... నేనసలు కళ్ళు మూశానే గానీ శ్రీరాముడు బాణం వెయ్యటం అదీ .... అంతా చూస్తూనే వున్నాను మహా రాజా!" అని చేతులు నలుపుకుంటూ చెప్పాడు.

"అదంతా నాకు చెప్పకు! తప్పు వొప్పేసుకో! ఇంకో మహారాజైతే ఉరిశిక్ష వేయించేవాడు, తెలుసా? తప్పు వొప్పుకో!"

"చిత్తం! .... నిద్రపోయి తప్పే చేశాను మహా రాజా!"

"తప్పు వొప్పుకుంటే చాలదయ్యా! ఆ తప్పు ఇంకెప్పుడూ చెయ్యకుండా ఉండాలి."

"చిత్తం! ఇంకెప్పుడూ నిద్రపోయి తప్పు చెయ్యను మహారాజా!"

నళుడు హనుమంతుడి చెవిలో – "అసలు రాజు మనల్నెప్పుడూ నిద్రే పోవద్దంటాడా?" అని సందేహిం చాడు.

"ఎప్పుడూ కాదనుకుంటా. తర్వాత అడుగుదాంలే, ఇప్పుడు కోపంగా ఉన్నాడు."

"ఎప్పటి దాకా ఉంటాడు కోపంగా?"

"ఏమో! నాకేం తెలుసు? వాలి చచ్చిపోయే దాకానేమో."

"ఎప్పుడు చచ్చిపోతాడు వాలి?"

"అబ్బా, ఊరుకో! అది తెలిస్తే ఇంకేం?"

సుగ్రీవుడు నీలుణ్ణి – "నిద్రపోతే పోయావుగానీ .... కలన్నా వొచ్చిందా?" అని మళ్ళీ కోపంగా చూశాడు.

"ఆఁ .... వచ్చినట్టే వుంది .... మహారాజా!"

"ఆఁ, వొచ్చిందా? .... మరి చెప్పవేం? చెప్పు దబ్బున .... ఏం వొచ్చింది?"

"మనందరం పెద్ద అడివిలో ఉన్నామంటా ...."

"ఇప్పుడున్నాంగా?"

"అబ్బే, ఇది కాదు. ఇంకా పెద్ద అడివిలో ...."

"ఏడ్చినట్టే వుంది. ఇంకెంత పెద్ద అడివి? సర్లే, అప్పుడేమైంది?"

"ఏమైందా? .... సరిగ్గా ఏమైందో .... పెద్ద చప్పుడైంది! .... నా నిద్రంతా పాడైంది! కల ఎటో పోయింది మహారాజా!"

"ఇదన్నమాట నువ్వు నిద్రపోయి చేసిన నిర్వాకం! ఇంకో రాజయితే నీ కొచ్చిన కలకి తల తీయించేసేవాడు .... అమ్మ .... అమ్మ .... ఈ మోకాలు చిప్ప కూడి రాదనుకుంటా...."

"నెమ్మదిగా నడువు సుగ్రీవా, తొందరేముంది? ఈ చుట్టుపట్ల సౌందర్యాలు చూసుకుంటూ నెమ్మదిగానే పోవచ్చును" అంటూ రాముడు సుగ్రీవుణ్ణి అనునయిస్తూ, సుగ్రీవుడి సరసనే జాగ్రత్తగా అతని భుజానికి తగలకుండా నడక సాగించాడు.

కొంత దూరాన దట్టమయిన చెట్లతోపు కనపడింది. దాని చుట్టూ అరిటి చెట్లే ఎక్కువగా ఉన్నాయి.

రాముడు ఆ చెట్ల తోపుని ఆశ్చర్యంగా చూస్తూ, "సుగ్రీవా! మొదటిసారి మనం తొందరలో వెళ్ళడం చేత .... ఈ సౌందర్యమంతా చూడనే లేదు సుమా! .... ఈ చెట్ల తోపులు .... ఆహా! .... ఆకాశంలో మేఘాలవలే ప్రకాశిస్తున్నాయి. ఈ పక్షులు నక్షత్రాలవలే మెరిసిపోతున్నాయి. ఈ అరటి చెట్ల వృత్తాంతం యేవిటో చెప్పవోయా!" అని చిరు నవ్వులు చిందిస్తూ అడిగాడు.

"అరిటి చెట్లకేం వృత్తాంతం ఉంటుందయ్యా సామీ, నా బొంద వృత్తాంతం! .... అడవిలో మొక్క మొలవటానికో వృత్తాంతం కూడానా? .... అమ్మ .... ఈ ఎడం గూడు కూడి రాదనుకుంటా. రాజ్యవూ లేదు, వల్లకాడూ లేదు, రెక్క పోయింది .... పోనీలే, ఈ కొండమీదే ఇలాగన్నా బతికి వుంటాను" అంటూ సుగ్రీవుడు హఠాత్తుగా అక్కడే చతికిలబడబోయాడు.

లక్ష్మణుడు – ఆ ఎడం గూడు కాస్సేపు సవ్వర దీస్తే, సుగ్రీవుడికి కోపం తగ్గుతుందనుకున్నాడు గానీ, భుజం ముట్టుకుంటే ఖయ్యిమంటాడని కోపంగా చూస్తూ ఊరుకున్నాడు.

అక్కడే చతికిలబడబోయిన సుగ్రీవుడికి అ అరటి చెట్ల 'బొంద వృత్తాంతం' అంతా జ్ఞాపకం వొచ్చి .... కొంచెం భీతితో గుండెలు దడ దడ కొట్టుకున్నాయి. కాస్సేపు మూలుగులు తగ్గించి .... "రామా! .... ఇందాక ఏదో అనేశాలే గానీ, గూడు నెప్పి మూలాన్న నోరు తడబడిందిలే గానీ .... ఈ వనం, పూర్వం గొప్ప రుషుల ఆశ్రమం సుమా! 'సప్త జనుల'నీ ఏడుగురు రుషులుండేవారంట ఇక్కడ. వాళ్ళు .... గొప్ప గొప్ప తపస్సులు చేసి .... అబ్బో, ఎప్పుడూ నీళ్ళల్లో తలలు ముంచుకుని పడుకునే వారంట! ఇంకా ఏంటోనమ్మా, .... చాలా కబుర్లు చెప్పేవాడు మా తాత ...." అని ఆగాడు.

నళుడు ఉత్సాహంగా అందుకున్నాడు – "అవును, మా తాత కూడా చెప్పేవాడు. సప్త రుషులు ఏడు రోజులికీ వొక్కసారే గాలి పీల్చుకునే వారంట ...."

"ఇంకా నయం! ఏడుగురికీ ఒక్కడే పీల్చుకుంటే బాగుండేదిగా?" అన్నాడు వెటకారంగా నీలుడు.

"ఏంటీ, నువ్వు నమ్మవా, మా తాత చెప్తే ...."

"మీ తాత అయినా, తాత తాత అయినా నే న్నమ్మను! ఒక్కసారి గాలి పీల్చి, ఏడు రోజులెలా బతుకుతారు? మీ తాత మొహంలాగే ఉంది. వెధవ అబద్ధాలు!"

"పళ్ళు రాలగొడతాను, మా తాతనేవన్నా అన్నావంటే. ఒక్క సారి గాలి పీల్చి ఏడు రోజులు కాదు, ఏడు వందల సంవత్సరాలు బతికారు తెలుసా?"

"ఏడు వందలా?" సుగ్రీవుడు సందేహంలో పడ్డాడు! "మా తాత పద్నాలుగు వందలన్నాడే!"

"చిత్తం! మహారాజుగారి తాతనే నమ్ముదాం లెండి మహారాజా! మా తాత పెద్ద వాడయిపోయి .... దగ్గూ, మతి మరుపూ అన్నీ పట్టుకున్నాయి .... మీ తాతే సత్యం లెండి!"

"మహారాజు తాతయినా సరే నమ్మను నేను. ఒక్క పూట గాలి పీల్చకుండా బతకండి, చూస్తాను" అని నీలుడు మొండికెత్తాడు.

"ఓరి సన్యాసీ! .... నీ సంగతీ .... నా సంగతీ కాదురా! .... వాళ్ళు గొప్ప రుషులు! మహా రుషులు! .... సప్త రుషులు!" అని బుగ్గలు ఉబ్బించాడు హనుమంతుడు.

నీలుడు బిత్తరపోయి – "అవును సుమా!" అని నాలిక్కరుచుకున్నాడు. "అయ్యయ్యో, రుషులని మర్చేపోయానే .... ఏదో పరాగ్గా .... మామూలు వాళ్ళ సంగతేమో అనుకున్నాను! .... అయ్యయ్యో .... రుషులు గదా? ఎంత పనైందీ!" అని పశ్చాత్తాపంలో మునిగిపోయాడు.

నళుడు ఒకటే చిటచిట్లాడాడు. "మా తాత చెప్పింది అబద్ధాలంట, అబద్ధాలు! .... అసలు మా వంశంలో ఇప్పటికి ఎవరూ ఒక్క అబద్ధవన్నా ఆడ లేదు తెలుసా? .... మా తాత .... అసలే .... ఆడ లేదు."

కిక్కురు మనలేకపోయాడు నీలుడు.

రాముడు, మొహం పక్కకి తిప్పుకుని చిట్లించుకున్నాడు. లోకంలో అబద్ధాలాడని వంశాలు రఘు వంశం తప్ప ఇంకేం ఉంటాయి? .... ఉత్తిది. మూర్ఖులు! .... ఆటవికులు!

సుగ్రీవుడు మళ్ళీ కధకొస్తూ – "అదన్నమాట! అంత గొప్ప రుషులు .... ఇక్కడ వందలకొద్దీ సంవత్సరాలు బతికి, శరీరాలతోటే స్వర్గాని కెళ్ళిపోయారు. అప్పటి నించీ ఈ ఆశ్రమం అంతా చుట్టూ చెట్లు పెరిగి, కోట లాగ అయిపోయింది. దేవతలు కూడా ఇందులో దూరలేరు తెలుసా? తపస్సు చేసుకునే వాళ్ళకి మాత్రం పళ్ళూ గిళ్ళూ, దుంపలూ గింపలూ, గడ్డీ గాదం, కావలిసినంత దొరుకుతాయి ఇక్కడ" అంటూ చెట్ల వేపు తిరిగి – "అమ్మ, ఈ ఎడం చెయ్యి కలిసి రాకుండా వుంది" అంటూ ఎలాగో చేతులు కలిపి ఆ చెట్లకి దణ్ణం పెట్టాడు.

ఆ చెట్ల తోపులో రుషులు జీవించారని వింటే, రాముడికి శరీరం పులకరించింది. భక్తితో అరటి చెట్లకి నమస్కారం చేస్తూ – "సప్త రుషులారా! నా కార్యం నిర్విఘ్నంగా జరిగిపోవాలని ఆశీర్వదించండి!" అని ప్రార్థించాడు.[271]

సప్త రుషుల వనం నించి కిష్కింధ వేపు సాగారు. ఊరు దగ్గిర పడుతోన్న కొద్దీ సుగ్రీవుడి నడక ఇంకా మందగించింది.

"రామా! ఈ సారి తప్పకుండా .... ఆ బాణం ...."

"నన్ను నమ్ము సుగ్రీవా! .... ఇంద్రుడి వజ్రాయుధం కన్నా వాడి అయింది సుమా నా బాణం ...."

"అబ్బ! వాడి అయిందేనయ్యా! అసలు దాన్ని వదిలితేనా, వాడీ గీడీ?"

"ఎందుకు వదలనూ? ఈ సారి నిన్ను పోల్చగలను కదా?"

"మరే! అందుకే చెబుతున్నాను. అసలు వాలి అంత దూరాన్న ఉండగానే బాణం కొట్టెయ్యి, ఏం? వాడి చెయ్యి నా వొంటి మీద పడితే ఈ సారి చచ్చానే."

"అలాగే చేస్తాను. చూస్తావుగా నువ్వే?"

"ఏం చూస్తానో! .... వాలి నిన్నూ .... నన్నూ ...."

"సుగ్రీవా! ఇన్ని మాట లెందుకు? ఈ సారి నేను వాలిని చంపకపోతే పోనీ అప్పుడే నీ ఇష్టం వచ్చినట్టు నిందించవచ్చును, సరేనా?"[272]

"ఏంటీ! ఇదొకటా!" అని తెల్లబోతూ నిలబడి పోయాడు సుగ్రీవుడు. "నిన్ను నిందించటానికి ఇక నే నెక్కడుంటాను? అదేదో ఇప్పుడే తేల్చు" అని నడవడం మానేసి అక్కడే చతికిల బడ్డాడు.

"అబ్బెబ్బెబ్బెబ్బె! సుగ్రీవా, నా మాట విను. ఏదో మాట వరసకన్నాను" అంటూ రాముడు కంగారు పడి, సుగ్రీవుణ్ణి లేవదీసే ప్రయత్నం చెయ్యబోతే, సుగ్రీవుడు రాముడి చేతుల్లోంచి కిందికి జారాడు. మళ్ళీ ఎత్తబోతే మళ్ళీ జారాడు.

"సుగ్రీవా! మళ్ళీ ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా మాట విశ్వసించు. నే నెన్నడూ అసత్యమా .... డను సుమా! ఎంత ప్రమాదం సంభవించినా సరే, ధర్మలోపం జరుగుతుంది గాబట్టి అసత్యమాడను. లేవోయ్! లేచి

---

**271.** **కిష్కింధా, సర్గ 13 అంతా**: రాముడూ, సుగ్రీవుడూ, అతని మంత్రులూ అంతా, వాలిని చంపడానికి రెండోసారి వెళ్ళేటప్పుడే దారిలో గొప్ప గొప్ప వనాలూ సరస్సులూ, తరులూ గిరులూ చూస్తారు. మొదటిసారి వెళ్ళినప్పుడు కూడా కిష్కింధకు ఆ మార్గంలోనే వెళ్ళారు. అయినా, అప్పుడు వీటిని వర్ణించలేదు కవి. రెండోసారి మళ్ళీ రావలసి వస్తుంది కాబట్టి అప్పుడు వర్ణిద్దాం – అని ఊరుకున్నాడు. కవి, మొదటిసారే సప్త రుషుల ఆశ్రమాన్ని వర్ణిస్తాడనుకుందాం. రాముడు తన కార్యం నెరవేర్చమని రుషుల్ని (అదే, అరటి చెట్లని) ప్రార్థిస్తాడు కదా? రుషుల్ని ప్రార్థించి బయల్దేరితే, తర్వాత కూడా కార్యం జరక్కపోతే, బాగుండదు గదా? ... పోనీ, మొదటి సారే రాముడు వాలిని చంపేసినట్టు రాయవచ్చును గదా? కానీ, అలా రాయడం కవికి ఇష్టం లేదు. ఎందుకంటే, సుగ్రీవుణ్ణి రెండు సార్లు గుద్దించాలని కాదు – 'ఒకే రకం పోలికలున్న వాళ్ళిద్దరు పోట్లాడుతూ వుంటే ఎవర్ని చంపాలో తెలీక తికమకపడే ఘట్టాన్ని వర్ణించాలనే ఉత్సాహాన్నీ, ఆ ఘట్టంలో 'నాటకీయత'నీ వొదులుకోవడం కవికి ఇష్టం లేదు. కేవలం ఈ కారణం కోసం గాకపోతే, రాముడు వాలిని మొదటిసారే చంపలేక పోయినట్టు రాయవలసిన అవసరం ఏమీ లేదు. రాముడు సాక్షాత్తూ విష్ణువనీ, అప్పటికే చాలా ఘనకార్యాలు చేశాడనీ, కొందరికి మోక్షాలు కూడా ఇచ్చాడనీ, కవి చెబుతూనే ఉన్నాడు. అలాంటి రాముడు ఇద్దరు మనుషుల మధ్యా, జంతువుల మధ్యా, తేడా కనుక్కోలేక పోయాడంటే, పైగా, సుగ్రీవుడి మెడలో లేని హారం ఒకటి వాలి మెడలో వుందని చెపుతూ కూడా, అయినా తేడా కనుక్కోలేదంటే, అది రాముడికీ, రాముణ్ణి వెనకేసుకొచ్చే కవికీ కూడా సిగ్గుచేటే. వాళ్ళిద్దరూ ఎప్పుడో వొదిలేశారనుకోండీ ఆ సిగ్గూ! ★

**272.** **కిష్కింధా, సర్గ 14, శ్లోకం 12**: సుగ్రీవుడు రెండోసారి యుద్ధానికి బయల్దేరి, కిష్కింధకి వెళ్ళడానికి భయపడుతోంటే, రాముడు – "వాలి జీవించి తిరిగి పోయినట్లయితే, అప్పుడు నన్ను దోషియని నీవు తెలుసుకుని, పిమ్మట నిందించవొచ్చును" అంటున్నాడు తీరిగ్గా. రెండోసారైనా చంపుతాడో లేదో నమ్మకం లేదు. వాలిని రెండోసారి కూడా చంపలేకపోతే 'అప్పుడు నిందించవొచ్చు'నట! ఈ సారి కూడా అలా జరిగితే వాలి చేతుల్లో సుగ్రీవుడి పనే కాదు, రాముడి పని కూడా అయిపోయినట్టే! ★

వీరోచితంగా నీ శత్రువుని యుద్ధానికి పిలువు. ఈ కిష్కింధా రాజ్యమంతా నీదే. ఒక్క క్షణ కాలంలో నువ్వు సింహాసనం ఎక్కబోతున్నావు. పురోహితులు ధగ ధగ మెరిసే కిరీటం నీ శిరస్సుమీద అలంకరిస్తాను. ఎందరో సుందరాంగనలు .... నీ చుట్టూ .... నీ సేవలో ....”

సుగ్రీవుడి కాళ్ళల్లోకీ, చేతుల్లోకీ కొత్త శక్తీ ఉత్సాహం జొరబడ్డాయి. ముసి ముసి నవ్వులు నవ్వుతూ చెంగున లేచాడు.

★ ★ ★

“ఓరీ దుష్టుడా! వాలీ! .... నాతో యుద్ధానికి రారా! ఈ సారి వచ్చి చూడు, ఏం జరుగుతుందో! .... రా! బయటికి రా!”

“మళ్ళీ వచ్చావా!” – వాలి దిగ్గున లేచాడు.

అంతఃపురంలో స్త్రీలంతా మళ్ళీ సుగ్రీవుడి యుద్ధ నాదాలు విని ఆశ్చర్యపోయారు.

“రా రా యుద్ధానికీ! .... ఒక్కసారి ఏదో ఘన కార్యం చేశానని స్త్రీలతో గొప్పలు చెప్పుకుంటూ కూర్చున్నావా? ఈ సారి రా బయటకి. నీ అంతు చూస్తాను.”

వాలి పిడికిళ్ళు బిగించాడు. కళ్ళు ఎరు పెక్కి నిప్పులయ్యాయి. ఒక్క క్షణం కూడా ఆగలేక – “ఓరీ పిరికి పందా! నీతో ఆట కూడా యుద్ధమేనా?” అంటూ బైటికి దూసుకుపోబోయాడు.

తార ఆందోళన పడుతూ భర్తని ఆలింగనం చేసుకుంది – “వీరుడా! ఒక్క క్షణం నిలబడు! తొందరపడకు! ఇంతకు ముందే నీతో చావు దెబ్బలు తిని పారిపోయిన వాడు .... మళ్ళీ యుద్ధం కోరి వచ్చాడంటే కారణమేమై వుంటుందో ఒక్కసారి ఆలోచించు! నాకు మాత్రం చాలా సందేహం తోస్తోంది. సుగ్రీవుడి దర్పానికి ఏదో బలవత్తర మైన కారణం వుండి తీరాలి .... అదిగో, ఆ సింహ నాదాలు విను! జయం తనదేనని ఎంత విశ్వాసం అతనికి! ఎవరినో గొప్ప వీరుణ్ణి తనకు సహాయంగా తెచ్చుకుని ఉండాలి సుగ్రీవుడు ....”

“గొప్ప వీరుడా? ఎవరా గొప్ప వీరుడు?” అవమాన పడ్డట్టు చూశాడు వాలి. “ఎవర్ని తెచ్చుకుంటే నాకేం? నా శౌర్యాన్ని శంకిస్తున్నావా? .... ఇంకో వీరుడికి జంకి .... పిరికిపందనై ఓటమి అంగీకరిస్తానా? .... విడిచిపెట్టు! వెళ్ళనియ్యి నన్ను తొందరగా ....”

బైటినించి యుద్ధ నాదాలు! “రావేమిరా వాలీ? .... పౌరుషం లేదా? ఈ దెబ్బతో కిష్కింధ ఎవరిదో తేలి పోతుందిరా! ఈ సారి యుద్ధం చేసి సింహాసనం దక్కించుకోరా, దుష్టుడా!”

“అవును. దక్కించుకుంటాను. ఈ సారి కిష్కింధ ఎవరిదో తేల్చేస్తాను. వస్తున్నాను ఆగరా! నీ మదమణిచి నిన్ను యమ సదనానికి పంపిస్తాను” అంటూ వాలి కోపోద్రేకంతో తారని పక్కకి తోసేశాడు.

తార కన్నీళ్ళతో వాలి చేతులు వదలకుండా జంకుతూ చెప్పింది – “మన్నించు, నా మీద ఆగ్రహించకు! ఇప్పుడు వెళ్ళవొద్దు! అంగదుడు చారుల ద్వారా విని నా కంతా చెప్పాడు. సుగ్రీవుడి సింహ నాదాలు వ్యర్థ ప్రలాపాలు గావు. అతడి వెనక శ్రీరాముడనే కోసల రాజు అండగా ఉన్నాడు. ఆయన గొప్ప వీరుడట. ఆయుధాలు ధరిస్తాడట. ధర్మాత్ముడట .... గొప్ప కీర్తి గలవాడట ....”

వాలి నిర్లక్ష్యంగా నవ్వాడు – “వీరుడంటున్నావు. ధర్మాత్ముడంటున్నావు. వీరుడైన వాడు శత్రుత్వం లేని వాడితో యుద్ధం చేస్తాడా? ధర్మ జ్ఞానం తెలిసిన వాడు నిర్దోషికి హాని కలిగిస్తాడా? .... తారా! .... అంతా నీ భ్రమ. నన్ను వెళ్ళనియ్యి!” అని భార్య చేతులు వొదిలించుకున్నాడు.

“నాథా! నా మాటలు పూర్తిగా విను! రాముడూ, సుగ్రీవుడూ ఒకరికొకరు సహాయం చేసుకోవాలని అగ్ని సాక్షిగా స్నేహం చేసుకున్నారట. రాముడు సుగ్రీవుడిదే న్యాయం అని నిర్ణయించి, అతడికే సహాయం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడట!”

వాలి ఉగ్రుడయ్యాడు – “అదే నిజమైతే రాముడు కూడా నాకు శత్రువే. అప్పుడైనా నేను యుద్ధానికి పోక తప్పదు.”

“కానీ .... రాముడి బలం తెలుసుకోకుండా ఇంత తొందరపడి నువ్వు ఒంటరిగా యుద్ధానికి పోవడం వివేకం కాదు. ఆడదాన్ని చెప్తున్నానని అలక్ష్యం చెయ్యకు. నీ తమ్ముడితో విరోధం నీ కెన్నడూ క్షేమం కాదు. మీ రిద్దరూ సఖ్యంగా ఉండడమే ఎంతో బలం నీకు. వెంటనే అతణ్ణి పిలిపించి యువ రాజుగా పట్టాభిషేకం చెయ్యి! అప్పుడు రాముడితో నీకు వైరం ఉండదు. నీ తమ్ముడి మీద ద్వేషం మర్చిపో. నీ సోదరుణ్ణి నువ్వు మన్నించాలి. ప్రేమించి ఆదరించాలి.”

వాలి, తారని ఆశ్చర్యపడుతూ చూశాడు – “నేను సుగ్రీవుణ్ణి ప్రేమించలేదా? అన్యాయంగానే రాజ్యం నించి వెళ్ళగొట్టానా?”

“జరిగిందంతా మర్చిపో. అతడు ఎన్ని తప్పులు చేసినా నీ కన్నా చిన్నవాడే. నీ తోడబుట్టిన వాడే. నీ తమ్ముణ్ణి సంతోషపెట్టి, నీకు విశ్వాస పాత్రుడిగా, మిత్రుడిగా చేసుకోవటం తెలివైన పని. నేను నీ హితం కోరే దాన్ననే విశ్వాసం నీకుంటే నా మాట పాటించు. నీ క్షేమం కోసం అంతకన్నా ఇంకో మార్గం లేదు. ఆయుధాలు గల కోసల రాజుతో వైరం వద్దు నీకు ....”

“రావేమిరా పిరికిపందా! .... యుద్ధం చెయ్యకుండానే సింహాసనం వొదిలేస్తావా? ఓడిపోయానని

వొప్పేసుకో! నిన్నేమీ చెయ్యను. తొందరగా తేల్చు!"

వాలి, భరించలేకపోయాడు – "వింటున్నావా ఆ కారు కూతలు? .... రాముడికి జడిసి ఈ నీచుడితో సఖ్యం చేసుకోనా? ఎన్నటికీ చెయ్యను. శత్రువు నా కోట ముందు నిలబడి తొడలు చరిచి వీరాలాపాలు చేస్తోంటే వింటూ సహించమంటావా? .... ఆ పిరికిపంద యుద్ధ సంరంభం నాకు తెలియనిదా? ఎన్నడూ, ఎవరికీ, తల వొంచని నేను, ఈ అవమానం సహించి ఊరుకోవడం మృత్యువు కన్నా భయంకరం కాదా? .... తారా! నా మీద అమితమైన ప్రేమతో, స్నేహంతో, నీ అభిప్రాయం నువ్వు చెప్పావు. కానీ, నీ మాట పాటించలేను. సుగ్రీవుడి దుర్మార్గం నేనిక సహించను. ఆ రాముడేదో చేస్తాడని నా గురించి భయపడకు. అతడు నన్నేమీ చెయ్య లేడు. ఇక నా వెంట రాకు .... వెళ్ళు! సుగ్రీవుడి యుద్ధోన్మాదం అణిచి నేనిప్పుడే తిరిగి వస్తాను. వాడిని చంపను. గుద్దుల వర్షంతో సత్కరించి విడిచి పెడతాను, సరేనా? దుఃఖపడకు ...." అని బయటికి వెళ్ళాలనే తొందరలో తార వేపు కొంచెం నవ్వు మొహంతో ప్రియంగా చూశాడు.

తార దుఃఖంతో కంపిస్తూ భర్తని ఆలింగనం చేసుకుంది. "ప్రియుడా! నీ పరాజయం నేను సహించ లేను. నువ్వు విజయుడవై రావాలని దైవాన్ని ప్రార్థిస్తాను. మళ్ళీ మనం కలుసుకునే శుభ క్షణాల కోసం నిరీక్షిస్తాను. పోయి రా!" అని కంపిస్తూ చేతులు తీసి భర్తని విడిచి పెట్టింది.

వాలి, సంధించి విడిచిన బాణంలాగ బైటికి దూసుకుపోయాడు.[273]

★ ★ ★

మళ్ళీ ఇద్దరూ కలబడ్డారు! అరుస్తున్నారు!

వాలి – కోపావేశంతో!

సుగ్రీవుడు – బాధావేశంతో!

"ఇందాక తిన్న గుద్దులు చాలలేదా తమ్ముడా నీకు?" అంటూ వాలి సుగ్రీవుడి వీపు మధ్య గుద్దుల వాన ప్రారంభించాడు. సుగ్రీవుడి నాభిలోంచి రక్త జల పాతం ఉరికింది. కళ్ళు గిర గిర తిరిగి పైకి పోయి చుక్కలంటాయి. ఎక్కడా రామ బాణం జాడ లేదు.

"చక్కగా పూల తీగల్తో ముస్తాబు కూడా చేసుకు వొచ్చావే! అలా దిక్కులు చూస్తావెందుకురా తమ్ముడా? .... ఇవిగో అప్పచ్చులు. చక్కగా తిను! వీపు పట్టినన్ని తిను! కిష్కింధ ఎవరిదో తేల్చి చెప్పు ఇప్పుడు. నోటి కొచ్చిన కూతలన్నీ కూశావు గదరా తమ్ముడా! .... ఇప్పుడు చెయ్యి మరి యుద్ధం!" అంటూ వాలి సుగ్రీవుడి పూల హారాలన్నీ తెంపి అవతల పారేశాడు.

సుగ్రీవుడి ఆర్తనాదాలతో చుట్టుపట్ల పక్షులూ, జంతువులూ, భీతావహంగా ఎగురుళ్ళూ దూకుళ్ళూ ప్రారంభించాయి.

సుగ్రీవుడికి రామ బాణం మీద పూర్తిగా నమ్మకం పోయింది. వాలి చేతులు తప్పించుకోవడం కూడా అసాధ్యంగా తోచింది. తిరగబడకపోతే ప్రాణం నిలిచే దారి తోచలేదు. రాముడి మీద భయంకరమైన కోపం పొంగింది. వాలిమీద తిరగబడి, శక్తికొద్దీ పొడిచీ, చరిచీ, కరిచీ, అరిచీ గెలిచే విధంకోసం పెనుగులాట ప్రారంభించాడు. సుగ్రీవుడి పరాక్రమం వాలికే దిగ్భ్రాంతి కలిగించింది. సుగ్రీవుడు, పళ్ళ బిగువున కూడదీసుకున్న శక్తి అంతా గుమ్మరించేసి, ఫెళ్ళున కుడి గూడు విరిగి కెవ్వున మృత్యునాదం చేశాడు.

సుగ్రీవుడు ప్రాణ భయంతో కృంగిపోతూండగా – చెట్ల చాటునించి బాణం ఒకటి గాలిని చీల్చుకుంటూ, భయంకరమైన శబ్దంతో రివ్వున వచ్చి వాలి గుండెల్లో దిగబడి పోయింది. పర్వతం ఎగిరి వచ్చి గుండెల మీద కురికినట్టు వాలి నిర్ఘాంతపోతూ భూమిమీద కూలి పోయాడు.

సుగ్రీవుడు ఆనందంతో మూర్ఛబోయాడు.

రెప్పపాటు కాలంలో – కిష్కింధా నగరం అంతా అక్కడ ప్రత్యక్షమైంది. కిష్కింధ ప్రజల్లో రాముణ్ణి చంపెయ్యాలనే ఉద్రేకం బుస బుస పొంగింది. దానికి అవకాశం లేకుండా సుగ్రీవుడి బలగం విజయోత్సాహంతో ముందుకురికింది.

బలా బలాల మధ్య, 'వీరత్వం' విశ్రాంతి కోసం శయనించింది. వాలి – ఏ క్షణాన్నయినా దిగ్గున లేస్తాడనిపించేంత శక్తి వంతంగా, సజీవంగా, కఠోరంగా, చుట్టూ చూశాడు – ఆ నీచుడి కోసం! శ్రీరాముడి కోసం!

సుగ్రీవుడు మూర్ఛలోంచి తేరి, రక్తం మడుగులో దొర్లుతున్న వాలిని చూసి, ఆనందంతో మళ్ళీ మూర్ఛబోయాడు.

రాముడు, చెట్ల చాటునించి వీరోచితంగా బయటి కొచ్చాడు. వాలి కన్నుమూసి ఉంటాడనే గాఢ నమ్మకంతో వాలి దగ్గిరికి నడిచి నిప్పు కణికలై వున్న వాలి కళ్ళల్లో బందీ అయిపోయాడు.

ఆత్మనీ, దేహాన్నీ, ఉద్రేకపరుస్తున్న క్రోధంతో వాలి,

**273.** **కిష్కింధా, సర్గ 16, శ్లోకాలు 5, 7, 8:** వాలి, తారతో – "నా విషయమై రాముడేమైనను చేయునని నీవు దుఃఖించవలదు. ఏలననగా ధర్మజ్ఞుడగు రాముడు నిరపరాధిని వధించునట్టి పాపము చేయునా? ... యుద్ధంలో సుగ్రీవుని చంపను. అతని అహంకారము నణచెదను. గుద్దులతో సత్కరించి పంపెదను" అంటున్నాడు. వాలి, ధర్మ యుద్ధానికి కట్టుపడ్డవాడు. ఎవ్వరూ అధర్మ యుద్ధాలు చెయ్యరని అతని నమ్మకం. శ్రీరాముడి రాజకీయం అతనికేం తెలుసు? ★

రాముణ్ణి తీక్షణంగా చూశాడు – “నువ్వేనా శ్రీరాముడివి? సత్యగుణ సంపన్నుడివి? లోక ప్రఖ్యాతుడివి? ఇంకొకరితో యుద్ధం చేస్తున్న నన్ను చాటునించి కొట్టి గొప్ప గౌరవం పొందావు! ధర్మాత్ముడివట! .... జ్ఞానివట! .... నీ కీర్తంతా ఈ రకంగా సంపాదించుకున్నదేనా? రాజు అయినవాడు ప్రత్యక్ష పరాక్రమం చూపిస్తాడు గానీ, పిరికితనం ప్రదర్శిస్తాడా? దోషిని వొదిలి నిర్దోషిని దండిస్తాడా? కడుపులో ఇంత కపటం పెట్టుకుని, పైకి నీ కీ సాధు వేషం ఎందుకు?

నీ గురించి నాకు ముందే తెలిసింది. పెద్ద కులం వాడివి .... చదువు సంధ్య లెరిగిన వాడివి .... ఇంత నీచకార్యం చెయ్యవనే విశ్వాసంతో యుద్ధాని కొచ్చాను. నీ కులం గొప్ప ఏమిటో, నీ ధర్మజ్ఞానం ఏమిటో, నీ అసలు రూపం ఏవిటో, నా కిప్పుడు తెలిసింది. నేను సర్వనాశనం అయిపోయిన తర్వాత తెలిసింది. నా పెద్ద భార్య ఎంతో వివేకంతో చెప్పిన మాటలన్నీ పెడచెవిన బెట్టి నీ వంటి నీచుడి చేతిలో పరాభవం పొందాను ....”

చుట్టూ చేరిన ప్రజలందరి ముందూ వాలి ఒక్కొక్క మాట అంటోంటే రాముడి తల భూమిలోకి దించుకుపోతోంది. అసలు వాలిని ఎదుర్కోవలసిన పరిస్థితి వస్తుందని రాముడు ఊహించలేదు. తన బాణం దెబ్బ తగిలీ తగలగానే వాలి కన్ను మూస్తాడనుకుంటే .... తీరా .... ఇలా అయింది!

“ఈ అడవుల్లో మా బతుకులు మేము బతుకుతోంటే నువ్వెక్కడో కోసల దేశం నించి వచ్చి నన్ను కొట్టవలసిన అగత్యమేమి కలిగింది? ఎన్నడైనా నీకో, నీ బంధు మిత్రులకో నేను గోరెడు అపకారం చేశానా? దుర్మార్గుడా! నా లాంటి నిర్దోషిని చంపి, లోకానికేం సమాధానం చెప్పుకుంటావు?”

రాముడికి, ధైర్యం కూడగట్టుకోక తప్పలేదు, కళ్ళెర్ర జేసి వాలిని కఠినంగా చూశాడు – “మూర్ఖుడా! నువ్వేంత మాత్రం నిర్దోషివి కావు, దోషివే. ధర్మార్థ కామ స్వరూపమూ, లౌకిక శిష్టా చారమూ తెలుసుకోలేక నన్ను నిందిస్తున్నావు. ధర్మం ఎరిగిన వాడు, తన తమ్ముళ్ళీ, శిష్యుల్నీ కూడా కన్న బిడ్డల వలె చూచుకోవాలి. .... నువ్వు చేసిందేమిటి? తమ్ముణ్ణి వెళ్ళగొట్టావు. ధర్మం అతిక్రమించి సోదరుడి భార్యతో భోగిస్తున్నావు! ఇవి నీ దోషాలు కావా? .... అందుకే నిన్ను నా కరకు బాణాల కెరజేశాను. గ్రహించావా?”

వాలి ఉగ్రుడయ్యాడు – “నా తప్పొప్పులు నిర్ణయించి, నన్ను దండించే అధికారం నీకెవరిచ్చారు?”

రాముడు చిరునవ్వుతో గంభీరంగా చూశాడు – “వానరుడా! ఈ భూమి అంతా ఇక్ష్వాకు రాజులదే. ఈ కొండలూ కోనలూ, నదులూ, సముద్రాలూ, సమస్త ప్రదేశాలూ వారివే! సృష్టిలో సమస్త జీవుల్నీ, పక్షుల్నీ, మృగాల్నీ, మానవుల్నీ అనుగ్రహించినా, ఆగ్రహించినా వారి సర్వాధికారమే! ఆ వంశస్థుడయిన భరతుడు ఇప్పుడు భూమి అంతా పరిపాలిస్తున్నాడు. ఎవరు ధర్మం తప్పినా శిక్షిస్తున్నాడు. భరతుడి ఆజ్ఞ వల్లనే నేనూ, మరి కొందరు రాజులూ, ధర్మ స్థాపన కోసం భూసంచారం చేస్తున్నాము. పక్షులు గానీ, జంతువులు గానీ, మానవులు గానీ, ఎవరు ధర్మ వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వారిని దండించడమే మా పని. గొప్ప క్షత్రియ కులంలో పుట్టిన వాణ్ణి నేను. ఈ భూమండలం మీద ఎక్కడా అధర్మం జరగనివ్వను. కన్న కూతురితో, తోబుట్టువుతో, సోదరుడి భార్యతో, భోగించే వారిని వధించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ధర్మాధర్మాలు నిర్దేశించే ‘మను ధర్మ శాస్త్రాన్ని’ ధర్మం తెలిసిన వారంతా అంగీకరించారు. ఆ శాస్త్రంలో రాసిన విధంగానే నేను చేశాను. నేనూ శాస్త్రానికి కట్టుబడవలసిన వాడినే. స్వతంత్రుణ్ణి కాను. లోకాచారాలు ధిక్కరించిన నీకు మరణ శిక్ష విధించడం కన్నా వేరే మార్గం లేదు.”

వాలికి – ఉద్రేకంతో గుండెలు బరువెక్కుతున్నాయి. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి.

రాముడి మాటలు సుగ్రీవుడికి కూడా ఆందోళన కలిగించాయి. స్నేహంగా ఉంటానని వొచ్చి, సహాయం చెయ్యమని దేవుళ్ళాడి, ఇప్పుడు – ‘నేనే రాజుని, అంతా నాదే పెత్తనం’ అంటాడేవిటి? ఇవ్వాళ వాలి అయ్యాడు, రేపు తనే అవుతాడు. ఎవర్నయినా ఇంతేనా? రేపు నాతో కూడా ‘నువ్వు నా ఇష్ట ప్రకారం నడవాలి. లేకపోతే నిన్ను నరకడమే నా ధర్మం’ అంటాడా? ఇదేం ప్రారబ్ధం? ముల్లు తీసి కొర్రు దింపు కున్నట్టుంది’ అని బిత్తర పోతున్నాడు.

వాలి, రాముణ్ణి తీక్షణంగా చూశాడు – “లోకానికంతటికీ నువ్వే సర్వాధికారివి అయితే, నేరస్థుల్ని దండించే హక్కులన్నీ నీకే ఉంటే, పిరికిపంద లాగా చెట్టు చాటున దాక్కున్నా వెందుకు? వీరోచితంగా నా ఎదుట కొచ్చి, ‘ఇదుగో! నువ్వు ఇన్ని తప్పులు చేశావు. నీకీ శిక్ష విధిస్తున్నాను’ అని అందరి ముందూ ప్రకటించి, నన్ను దండించక పోయావా? .... నేరస్థుడికి తెలియకుండా దొంగ శిక్షలు వేసే దొంగ అధికారమా నీది? నీ బూటకపు సర్వాధి కారానికి నేను లొంగనని నీకు తెలిసే ఇంత మాయోపాయం పన్నావు. ‘ధర్మం, ధర్మం’ అని చిలక పలుకులు పలుకుతున్నావు .... నీ కన్నా ధర్మహీను డెవ్వడు? .... నీకన్నా నేరస్థుడెవ్వడు? నువ్వు నా ఎదటపడి యుద్ధం చేసి వుంటే, ఈ పాటి కెవరు భూమి కొరిగే వారో తెలిసేది. దొంగ దెబ్బ కొట్టటం గొప్ప ప్రతిష్ఠాకరమని విర్రవీగకు.”

రాముడు చెక్కుచెదరని గాంభీర్యంతో వాలి మాటల్ని తృణీకరిస్తూ మళ్ళీ ఒక చిరునవ్వు మెరిపించాడు –

"మూర్ఖుడా! నువ్వు ఆటవికుడవు. జంతువు వంటి వాడవు. జంతువుకీ, జంతువు వంటి మానవుడికీ వ్యత్యాసమేమీ లేదు. జంతువుల్ని మానవులు చాటుగా, మాటుగా, ఏ విధంగానైనా చంప వచ్చును. తప్పు లేదు. మరదలితో కులికే నీ వంటి జంతు ప్రాయుడినీ, దోషినీ, చాటుగా ఉండి చంపినందుకు నేను సిగ్గుపడవల సిందేమీ లేదు."

వాలి కోపోద్రేకంతో రాముణ్ణి ఛీత్కరిస్తూ చూశాడు – "నువ్వు పిరికిపందవే అనుకున్నాను. జ్ఞాన హీనుడివి కూడానా? నేను జంతువుని అయితే ఇక నా దోషం ఏముంది? జంతువులకు వావి వరస లేమిటి? శాస్త్ర ధర్మాలేమిటి? జంతువుల్లో తల్లే, బిడ్డతో కలుస్తుంది. బిడ్డ, తల్లితో సుఖిస్తుంది. సృష్టిలో పక్షులకూ, మృగాలకూ కూడా తప్పొప్పులు నిర్దేశిస్తున్నావా నువ్వు? ఎక్కడే పిట్టలు, ఏ పురుగులు, ఏ మృగాలు వావి వరసలు పాటించవో గమనించి, అన్నిటినీ సంహరిస్తున్నావా నువ్వు? చెట్లకూ, పిట్టలకూ, జంతువులకూ కూడా ధర్మ శాస్త్రాలు రచించారా మీ పండితులు? వావి వరసలు తప్పే జంతువుల్ని చంపటానికి పూనుకుంటే, ఈ లోకంలో సర్వప్రాణుల్నీ నాశనం చేసెయ్యాలి. దుష్టుడా! ఎందుకు చెబుతావీ కుంటి సాకులు?

నేను మరదలితో సంబంధం పెట్టుకున్నానని ధర్మ పన్నాలు వల్లిస్తున్నావు. తమ్ముణ్ణి, కన్న కొడుకులా చూసు కోలేదని దోషం ఆరోపిస్తున్నావు. ఆ తమ్ముడు నన్ను కన్న తండ్రిలాగే చూసుకున్నాడా? ఎవరి నేరంవల్ల ప్రారంభ మైంది మా మధ్య వైరం? నన్ను బిలంలో బంధించి వచ్చి నా తమ్ముడే మొదట నా భార్య తారతో సంబంధం పెట్టుకున్నాడు. తర్వాత నేను అతణ్ణి వెళ్ళగొట్టి అతడి భార్యతో సంబంధం పెట్టుకున్నాను. ఇప్పుడు చెప్పు, నువ్వు ఎవర్ని తప్పు పడతావు?"[274]

రాముడు మొహం చిట్లించాడు.

సుగ్రీవుడు, ముడుచుకుని హనుమంతుడి వీపు వెనక్కి జరిగి, "రాముడు కోపంగా చూస్తున్నట్టున్నాడు. నన్ను చంపేస్తాడంటావా తారతో వున్నావని?" అని గుస గుస లాడాడు.

"ఏమో మరి, ధర్మం కాపాడతానన్నాడు. చంపే స్తాడనుకుంటాను. ఏదో ఒకటి అవుతుందిలే. ధైర్యంగా వుండు!"

"ఏదో ఒకటా? .... ధై .... ర్యంగా .... ఉం .... డనా?"

"విను! వాలి ఏదో అంటున్నాడు."

"పరదేశీ! అసలు సంగతి గ్రహించావా? మా స్త్రీలకు ఒక భర్త లేనప్పుడు ఇంకో భర్తతో వుండరాదనే నియమం లేదు. ఇది మా జాతి ఆచారం. సుగ్రీవుణ్ణి, రాజ్యం నించి వెళ్ళగొట్టిన తర్వాత నేను అతని భార్యతో ఉండటం నా దోషం కాదు. ఎక్కడ నించో మీ దేశా చారాలూ, మీ నీతులూ తెచ్చి మా మీద రుద్దాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నావు. ఎవరి ధర్మం ఏమిటో గ్రహించ కుండానే నీ సిగ్గులేని లోక పరిపాలన సాగిస్తున్నావు. నీ దుర్మార్గం కప్పిపుచ్చుకోవటానికే నన్ను మూర్ఖుణ్ణనీ, జంతువుననీ నిందిస్తున్నావు. ఎవడు మూర్ఖుడో, ఎవడు జంతువో, లోకం గ్రహించ లేదని మిడిసి పడుతున్నావు ...."

వాలి ధిక్కారం, రాముడి గాంభీర్యాన్ని ఎప్పటి కప్పుడు చెల్లాచెదురు చేస్తోంది. ఒక ఆటవికుడి ప్రశ్నలూ, పరిహాసాలూ తను సహించడమా? .... తన వంటి మహారాజు! కోసలాధిపతి! .... కానీ, మొదలు నరికిన చెట్టులాగు కూలిపోయిన వాడు, ఎంత తర్కించి మాత్రం ఏం సాధించగలడు? ప్రాణాలు పంచ భూతాల్లో కలిసే వరకూ ఏదో ఒకటి వాగుతాడు. వాగనియ్యి!

"పామరుడా! గుడ్డివాడికి గుడ్డివాడే దారి చూపలే నట్టు. బుద్ధిహీనులైన వానరులలో పుట్టి పెరిగిన నీకు, ధర్మాధర్మాలేమి తెలుసు? ధర్మం అనేది, అంత సూక్ష్మ మార్గంలో ఇంద్రియాలకు గోచరమయ్యేది కాదు. దాన్ని తర్కించి ప్రయోజనం లేదు. లోకాని కంతటికీ శుభం కలిగించేవారు రాజులే. రాజులు అష్ట దిక్పాలకుల అంశ కలిగిన దేవతా స్వరూపులు. రాజులు ఏమి చేసినా వారి ఆజ్ఞలు శిరసావహించడం తప్ప వారిని తప్పుపట్టి నిందించరాదు. వారిని ద్వేషించి ధిక్కరించరాదు."

"మరి నేనూ రాజునే కదా? కిష్కింధా రాజ్యానికి పాలకుణ్ణే కదా? .... నా చేష్ట లెందుకు తప్పు పట్టావు? .... నన్ను ద్వేషించి ఎందుకు దండించావు? నీ రాజరి కానికొక ధర్మమూ, నా రాజరి కానికొక ధర్మమూనా?"

"నువ్వు రాజువే అయినా .... నేనే నీపై సర్వాధి కారిని! నిన్ను కూడా దండించే ధర్మాధికారిని!"

"చాలించు, నీ సిగ్గూ, లజ్జా లేని ప్రసంగం! నీ ధర్మం, నీ న్యాయం అందరూ కళ్ళారా చూసిందే. నీకు సర్వాధికారాలు ఇచ్చింది ధర్మం కాదు, నీ దౌర్జన్యమే. దాని బలంతోటే లోకం మీద సార్వ భౌమాధిపత్యం చెలాయిస్తున్నావు. మాటలలో మాత్రమే ధర్మాలూ,

---

**274.** **కిష్కింధా, సర్గ 46, శ్లోకాలు 8, 9:** సుగ్రీవుడు రాజు అయిపోయిన తర్వాత, ఒక సందర్భంలో రాముడితో చెప్తున్నాడు. – "ఆ బిల ద్వారమునకు ఒక బండను అడ్డము ఉంచి, వాలి బ్రతికి యుండునను ఆశ విడిచి, కిష్కింధకు వచ్చి, తార, రుమలతోడ గొప్ప కపిరాజ్యము బడసితిని." – దీన్ని బట్టి, వాలి మరదలితో ఉండడం కన్నా ముందే, సుగ్రీవుడు తారతో వున్నాడని అర్థమవుతుంది!

★

నీతులూ మెరిపించే నీ వంటి రాజు, అధర్మంతోటే, క్రూరత్వంతోటే, ప్రజల్ని పాలిస్తాడు. పూల తీగలతో కప్పడి పోయిన నేల బావిలాంటి వాడివి నువ్వు! దుర్మార్గులయిన భర్తలవల్ల ఉత్తమ స్త్రీలెలా సుఖపడలేరో, అలాగే నీ వంటి రాజువల్ల ప్రజలు సుఖపడలేరు. ఆయుధం ఉందనే అహంకారంతో, పాప భీతీ, లోక భీతీ లేకుండా తిరుగుతున్నావు. నన్ను చంపి సుగ్రీవుడి ద్వారా నీ కార్యం జరుపుకోవాలని ఈ నీచానికి వొడిగట్టావు. నీ అజ్ఞానం బయట పెట్టుకున్నావేగానీ, ఆ సహాయం నన్నే కోరితే దయతలిచి ఏ నాడో చేసిపెట్టే వాడిని."

"నీ దయమీద ఆధారపడవలసిన అగత్యం నాకేమి గల్గింది? నాకు నా తమ్ముడెటువంటి వాడో సుగ్రీవుడూ అటువంటి వాడే. అతడు నాకు సహాయం చేసినా, నేను అతడికి సహాయం చేసినా, అది మా స్నేహ ధర్మం!"

"వానరులందరూ జంతువులన్నావు. జంతువుల్లో ఒక జంతువు నీకు తమ్ముడెలా అయ్యాడు? లేకపోతే, నువ్వే జంతువై సుగ్రీవుడికి అన్న వయ్యావా? .... ఓ అసత్యవాదీ! మీ ధర్మ బద్ధ స్నేహ బండారం నాకు తెలియనిది కాదు. మీ స్నేహం ఏ అవసరాలూ లేని కాలంలో కలిసింది కాదు. ఇద్దరికీ అవసరాలు కలిగి, వాటిని తీర్చుకోటానికే ఒక ఒప్పందం చేసుకున్నారు. దానికే 'అగ్నిసాక్షి!' అదే మీ స్నేహ బండారం! నీ అవసరం కోసం ఒక జంతువుని స్నేహితుణ్ణిగా, తమ్ముణ్ణిగా, చేసుకున్నావు! అంతేనా, ఇంకా బూకరిస్తావా? .... ఇవ్వాళ, వాలిపోతాడు. రేపు, రాముడూ పోతాడు. కానీ వాలిని చంపి, రాముడేం కారణాలు చెప్పాడో విని రేపు లోకం నవ్విపోతుంది! యుగ యుగాల పొడుగునా నీ కీర్తి నిలిచిపోతుంది!"

"నీ వంటి పామరుడితో ధర్మ చర్చ ఈ రకంగానే సాగుతుందని నాకు తెలుసు. బుద్ధిమంతులూ, జ్ఞాన వృద్ధులూ, ఆచార్యులూ అయిన మా గురువుల దగ్గిర ధర్మ స్వరూపాలు తెలుసుకోని వాడివి నువ్వు. నేను, సుగ్రీవుడికి, కోరిన సహాయం చేస్తానని వాగ్దానం చేశాను. అతడు నిన్ను చంపమని కోరాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పేటటువంటి అసత్య వాదిని కాను నేను. సుగ్రీవుడు ధర్మాత్ముడు. అతడి కోసం నిన్ను చంపడంలో నా దోషమేమీ లేదు."

వాలికి ఆగ్రహంతో, బాధతో, కళ్ళు మూతలు పడుతున్నాయి.

హనుమంతుడు సుగ్రీవుడి చెవికి – "రాముడు నిన్ను చంపడు. నువ్వేం తప్పు చెయ్యలేదనేశాడు" అని ధైర్యం చెప్పాడు.

"చంపడు గానీ .... వాలిని నేనే చంపమన్నానని పైకి చెప్పేశాడేంటీ? .... ఇందాకట్నించీ తనే ధర్మం కోసం చంపానంటున్నాడుగా? .... అలాగే అంటే బాగుండేది గానీ .... నేనే చంపమన్నానంటే .... రేపట్నించీ ప్రజల్లో ఏమన్నా బాగుంటుందా? ...."

"ఏంటో ఈయన కొంచెం తెలివి తక్కువ మేళంలాగే వున్నాడు" అని విసుక్కున్నాడు హనుమంతుడు కూడా.

నళుడూ, నీలుడూ తారుడికి చెరోపక్కా చేరి రెండు చెవులూ తూట్లు తూట్లు పెట్టి జల్లెళ్ళు చేసేశారు.

"అబ్బ, ఇద్దరూ ఒక్కసారి మాట్లాడకండి. నాకే చెవ్వూ వినపట్టం లేదు" అని రుస రుస లాడుతున్నాడు తారుడు చాలా సేపట్నించీ.

"వాలి మా బాగా అడిగాడు సుమా రాముణ్ణి!"

"అడగటం కాదు, కడిగేశాడు పట్టుకుని."

"ఎంతైనా వాలి వాలే. జ్ఞానవంతుడు. ఆయన జ్ఞానం మనకెక్కడొస్తుందీ?"

"ఏంటో ఇదంతా నిష్కారణంగా చేశామేమోనని లోపల .... కొంచెం దిగులేస్తోంది నాకు."

"అవును. నాకూ అలాగే ఉంది" అన్నాడు తారుడు కూడా దిగులు పడుతూ.

రాముడు గంభీరంగా వాలికి హితోపదేశం కొనసాగిస్తున్నాడు – ".... నీకు మృత్యువు ఆసన్నమైనదని తపించి ప్రయోజనం లేదు. నీ లాగానే పూర్వం ఒక మూర్ఖుడు పాపం చేశాడు. మా వంశీకుడైన మాంధాత చక్రవర్తి అతడికి ఘోరమైన శిక్ష విధించాడు. ఎంత పాపాత్ములైన వారైనా రాజ దండనకు లోబడిన తర్వాత పుణ్యాత్ములై స్వర్గానికి పోతారు. దోషుల్ని దండించకపోతే ఆ పాపం రాజుకే చుట్టుకుంటుంది. కొందరు రాజులు దోషుల్ని మొదట నిర్లక్ష్యం చేసి, సకాలంలో విచారించరు. తర్వాత ఒక్కసారే మరణశిక్ష వంటి శిక్షలు విధిస్తారు. అయినా అదీ శాస్త్ర సమ్మతమే. నేరస్తుడు, మరణ శిక్ష పడిందని విచారించకూడదు. దానివల్లనే అతని పాపం అంతా పోతుంది. నా బాణం దెబ్బతో మరణించడం వల్ల నీకేమీ హాని లేదు. నీ పాపానికి ప్రాయశ్చిత్తం జరిగినట్టే భావించు. నువ్వింక స్వర్గానికి పోగలవు. నేను నీకు మోక్షం ఇస్తాను. నీ ఆత్మ గురించి విచారించకు ...."

వాలి – గుండె బాధతో, ఉద్రేకంతో, మూర్ఛ బోయాడు.[275]

**275. కిష్కింధా, సర్గ 17, శ్లోకాలు 13 .. 52 + సర్గ 18, మొత్తం 68 శ్లోకాలూ:** ఈ రెండు సర్గల్లోనూ వాలికీ, రాముడికీ జరిగిన సంభాషణ చూడవచ్చు. రాముడి పాత్రని అర్థంచేసుకోవడం కోసం ముఖ్యంగా చర్చించవలసిన ఘట్టాల్లో 'వాలి వధ' ఒకటి. దీన్ని వివరంగా చూడాలి. కవి చెప్పే పద్ధతి ఎలా వుంటుందంటే, రాముడివల్ల బాధలు పడ్డవాళ్ళు కూడా రాముణ్ణే ➔

➔కీర్తిస్తూ వుంటారు. వాలి నేల కొరుగుతూ – "ఆహా! రాముడు చక్కగా బాణం వేశాడే!" అని సంతోషించాడట! "యుద్ధములో వీరుడగు రాముడు మంచి బాణమును ప్రయోగించెనని శ్లాఘించి, అతడెక్కడ అని వాలి మిగుల శ్రమతో జూచుచుండెను." రాముడు దగ్గిరికి వచ్చాక వాలి, "నిష్ఠురముతో గూడి వినయముగ నుండు మాటలు జెప్పెను." – 'నిష్ఠురముతో' అయినా, 'వినయంగానే' చెప్పాడు!

వాలి, రాముణ్ణి చాలా తిట్లు తిట్టాడు. ఎలాగంటే, ".... ధర్మాత్ముడవని వట్టి పేరు పెట్టుకొని, అధార్మికుడుగను, పాపాత్ముడుగను, నీవు ఉండినటుల ఇంతవరకూ నాకు దెలియక పోయెను .... నీవు నీచ కార్యములు చేయు వాడవు. గూఢముగ నుండి, అహితము జేయువాడవు. కోపము గల వాడవు. మర్యాద లేని వాడవు. కేవలము ధనుస్సు ధరించి యుండు వాడవు. కాముకుడవై ఇంద్రియములు ఈడ్చినట్లు పోవుచున్నావు" – ఈ రకంగా చాలా తిట్లు తిట్టాడుగానీ, అవన్నీ కోపంగా కాదు, వినయంగానే! – అన్ని తిట్ల మధ్యా వాలి అడిగినవి రెండే రెండు ప్రశ్నలు. "నన్నెందుకు కొట్టావు? చాటుగా ఎందుకు కొట్టావు?" అని.

వాలి ప్రశ్నలకు రాముడు ఏం చెప్పాడు? **మొదటి ప్రశ్నకి,** 'నువ్వు వావి వరసలు చూడకుండా మరదలితో వున్నావు కాబట్టి' అనీ; రెండో ప్రశ్నకి 'నువ్వు జంతువ్వి కాబట్టి చాటుగా వుండి కొట్టాను' అనీ చెప్పాడు.

కానీ, రాముడు చెప్పిన జవాబులు రెండూ తప్పుడు జవాబులే. వాలి, మరదలితో వుండడం కన్నా ముందే, సుగ్రీవుడు, అన్న భార్య అయిన తారతో వున్నాడు. ఇది రాముడికి తెలుసు. అయినా సుగ్రీవుణ్ణి తప్పు పట్టలేదు.

**రాముడు చెప్పిన రెండో జవాబులో తప్పు**: 'వాలి, జంతువే అయితే, జంతువులకు వావి వరసలేమిటి? వావి వరసలు పాటించక పోవడం జంతువు తప్పెలా అవుతుంది?

వాలికీ రాముడికీ మధ్య సంభాషణ ఎలా జరిగిందో (కవి, ఎలా చెప్పాడో) ఇప్పుడు చూడండి.

వాలి మాటలకు రాముడు – "వాలిచే ధిక్కరింపబడిన రాముడు ధర్మార్థముతో గూడి యుత్తమమగు మాటలు జెప్పెను." అవేమిటంటే – ".... వానరత్వము వల్ల కలిగిన బుద్ధి చపలతచే నన్ను నిందించితివి. (వాలికి, వానరత్వం వల్ల బుద్ధి చపలత అట! సుగ్రీవుడూ, హనుమంతుడూ కూడా వానరులే. అయినా వారికి 'వానరత్వం' లేదు! వారు ధర్మాత్ములు! పైగా వారు సమస్త శాస్త్రాలూ వ్యాకరణాలూ చదువుతారు! వాలికి మాత్రం వానరత్వం!) – "కొండలతోనూ, అరణ్యములతోనూ గూడిన ఈ భూమి ఇక్ష్వాకు వంశంలో బుట్టిన రాజులదే. మృగములను పక్షులను మనుషులను నిగ్రహించుట, అనుగ్రహించుట, వారి కార్యమేను. ధర్మాత్ముడగు భరతుని ఆజ్ఞ చొప్పున నేనూ, మరి కొందరు రాజులూ, ధర్మాభివృద్ధిని గోరి భూమిలో నంతయు సంచరించుచున్నాము."

ఇంతకన్నా పచ్చి అబద్ధం ఉందా? భరతుడు, ఈయన 'చెప్పుల' కింద కూర్చోడం ఏమిటీ, భరతుడే తనని ఆజ్ఞాపించాడని ఈయన చెప్పడం ఏమిటీ! ఆ "మరి కొందరు" రాజులు ఎవరు? .... వాళ్ళు ఇంకెందర్ని చంపుతున్నారో! – తండ్రి ఆజ్ఞ చొప్పున వనవాసం చేస్తున్నానని చెప్పుకునే రాముడు, కథ మార్చేసి "ధర్మాభి వృద్ధికి భూ సంచారం చేస్తున్నా" నంటున్నాడు. ఈ రకంగా చూస్తే రాముడు – ప్రపంచాన్నంతా ఆక్రమించే సామ్రాజ్యవాది! ఈ కథ సారాంశం – ఇతర రాజ్యాల్ని ఆక్రమించడమే!

"కన్న కూతురుతో, తోబుట్టువుతో, సోదరుని భార్యతో – భోగించు వారికి మరణ శిక్ష విధించవలెనని శాస్త్రములు చెప్పుచున్నవి" – (అంటే ఈ శాస్త్రాలు రాయకపూర్వం, కూతుళ్ళతోనూ, చెల్లెళ్ళతోనూ, అన్నదమ్ముల భార్యలతోనూ, కామ సంబంధాలు పెట్టుకోవడం ఉండేది అన్నమాట. దాన్ని కొంతకాలానికి శాస్త్రాలు నిషేధించాయి. కానీ, ఇంకా కొందరు, పాత సమాజ ధర్మాల ప్రకారమే ప్రవర్తిస్తూ ఉన్నారని అర్థం)

"నీవు తమ్ముని భార్యతో భోగించుచున్నావు. పాపము చేసిన వారు రాజ దండనకు లోబడినచో పుణ్యాత్ములగుదురని మను ధర్మశాస్త్రము చెప్పుచున్నది. నీవలె లోక మర్యాదలను విడిచియుండు వారిని శిక్షించుటకు సిద్ధముగ నున్నాము." (న్యాయం పేరుతో, అన్యాయంగా ప్రజల్ని శిక్షించే ఈ నాటి పరిస్థితి, రాముడి కాలం నాటి పరిస్థితే. రాముడికి బదులు, రాముడి వారసులూ, రామ బాణాలకు బదులు తుపాకులూ! తేడా అదే. అసలు విషయంలో తేడా లేదు.)

రాముడు ఇంకా ఇలా అంటున్నాడు – "సుగ్రీవుని యెడల నాకు గల స్నేహము, లక్ష్మణుని యెడల గల స్నేహము వంటిదై యున్నది. 'ధర్మ స్వరూపము నెరిగిన' సుగ్రీవుని నిమిత్తమై, నేను, వానరుల యెదుట నిన్ను చంపెదనని ప్రతిజ్ఞ చేసితిని .... నేను ప్రతిజ్ఞ తప్పువాడను గాను." – ఎంత సిగ్గులేని వాదమో! వాలిని చంపుతానని ప్రతిజ్ఞ చేశాడట! ఆ ప్రతిజ్ఞ తప్పడట.

ఇది వరకు సీత కూడా ఒకసారి – "రాక్షసులతో నీ కేమీ శతృత్వం లేదు కదా? .... రాక్షసుల్ని చంపుతాననడం ఎందుకు?" అని అడిగితే, "రుషులకు ప్రతిజ్ఞ చేసితిని. ప్రతిజ్ఞ తప్పువాడను గాను. నోరుముయ్యి!" అన్నాడు. ఇదీ ఈయన వాదం! ఈ ప్రతిజ్ఞల్లో ధర్మమే ఉందో, దౌర్జన్యమే ఉందో, రామదాసులకే తెలియాలి.

రాముడు, వాలితో "గూఢముగా నుండి కొట్టినందులకు నన్ను నిందించుచున్నావు. మానవులు మృగములను అనేక విధములుగ కపట వ్యాపారములతో చంపెదరు. పాపము లేదు. నీవు వానరుడుగ నుండుటచే, నిన్ను చాటుగా నుండి గొట్టితిని" అంటున్నాడు.

వాల్మీకి, వాలిని జంతువు గానే రాశాడు. జంతువు గాబట్టే రాముడు చంపాడు. మనిషి అయితే చంపేవాడు కాదు ➔

యుద్ధ రంగంలో జరిగిన సంగతి విన్న తార దుఃఖంతో తల్లడిల్లుతూ భర్త దగ్గిరికి బయల్దేరింది. ఆమె అంతఃపురం నుంచి బయటకు రాగానే ఆమె కోసం వేచి వున్న కొందరు వీరులు ఆమెని చుట్టు ముట్టి మహో ద్రేకంతో ఆమె మీద భక్తి చూపించారు. "మహా రాణీ! ఘోరం జరిగిపోయింది! కానీ, మేం పగ తీర్చుకుంటాం. వెంటనే అంగదుడికి పట్టాభిషేకం జరిపించండి! మేమంతా అంగదుణ్ణే రాజుగా కొలుచుకుంటాం. సుగ్రీవుడి అధికారానికి తలలు వొంచం. త్వరలోనే సుగ్రీవుడి బలగమంతా అన్ని ప్రదేశాల నించి కిష్కింధకు చేరు

---

➔ – అనడానికి వీల్లేదు. పక్షులైనా, జంతువులైనా, మనుషులయినా ఒకటే శ్రీరాముడి ధర్మ పరిపాలనకు. మనుషుల మీద కూడా సర్వ హక్కులూ రఘు వంశం వారివే అని చెపుతున్నాడు రాముడు. "రాజులు దేవతా స్వరూపులు. వారిని పీడించరాదు. నిందించరాదు. వారి ఆజ్ఞ మీరరాదు. చపలచిత్తులును, ఆత్మ జ్ఞానము లేనివారును నగు వానరులతో గూడి, తెలివిలేని వాడవుగ నున్నావు. (ఇంకో జాతి అంటే హేళన! తన జాతే గొప్పదనే అహంకారం!) నా దండనచే నీకు పాపము తొలగినది. నిన్ను దండించినది, ధర్మమేనని గ్రహింపుము" – ఈ రకంగా రాముడు వాలికి జవాబులు చెప్పాడు. దీన్ని బట్టి, రాజు అనేవాడు ఎంత నిరంకుశుడో, రాజుల పరిపాలన ఎంత క్రూరంగా వుంటుందో తెలుసుకోవచ్చు.

"నువ్వు జంతువ్వి కాబట్టి, నిన్ను చాటునించి కొట్టాను" అని రాముడన్న తర్వాత, వాలి, 'జంతువులకు వావివరసలేమిటి?' అనిగానీ, 'సుగ్రీవుడు కూడా జంతువే గదా? అతడు నీకు తమ్ముడెలా అయ్యాడు' అని గానీ, అడగలేదు. అసలు కథలో (వాల్మీకి రాసిన దాంట్లో) రాముణ్ణి అన్ని తిట్లు తిట్టిన వాలి ఇంత ముఖ్యమైన ప్రశ్నలు ఎందుకు అడగలేదు? – కవి, వాలితో ఆ ప్రశ్నలు అడిగించలేదు. అడిగిస్తే, రాముడి దగ్గిర ఆ ప్రశ్నలకు జవాబులు వుండవు కాబట్టి. రాముడితో ఒక దబాయింపు ఉపన్యాసం ఇప్పించి, వాలిని ఊరుకోబెట్టాడు. కవి, రాముడి పక్షాన జేరి వాలి నోరు కట్టేసినంత మాత్రాన ధర్మ చర్చలో రాముడు నెగ్గినట్టు కాదు. తర్కం అంటే ఎదటివాడు ప్రశ్నించే అవకాశం లేనంత వరకూ సాగాలి. "జంతువులకు వావి వరస లేమిటి? .... జంతువు తప్పు చెయ్యడం ఏమిటి?" అని వాలి అడక్కపోయినా, తర్వాత ఇంకొకరు అడిగితే, రాముడికేం జవాబు ఉంది చెప్పడానికి? జంతువు, వావి వరసలు పాటించలేదనే కారణం చెప్పి దాన్ని చంపడంలో ఎటువంటి 'ధర్మం' ఉంది?

రాముడి చేష్టలూ, మాటలూ ఇంత అక్రమంగా వున్నా సరే, చివరికి వాలి ఏమంటున్నాడో (కవి, వాలి చేత ఏమని పిస్తున్నాడో) చూడండి, నమస్కారం కూడా పెట్టి! "వాలి అంజలి చేసుకొని ఇటులనెను – సర్వోత్తమా! నీవు చెప్పినది చక్కగా నున్నది. (నన్ను చావగొట్టడం చక్కగా ఉంది. వాలితో ఇలా అనిపించేస్తే, రాముడు నేరం చెయ్యనట్టే అవుతుంది కదా?) నీవు మిగుల జ్ఞానివి. ప్రజలకు హితము చేయువాడవు. ఏ పాపమునకు ఏది దండనమో తెలిసిన వాడవు. నేను నీచుడను. పాపిని. (వాలే ఇలా ఒప్పేసుకుంటే ఇంకేం తగువుండదనుకున్నాడు కవి.) తార అడ్డగించిననూ నీ చేతిలో మరణించుటకే నేను యుద్ధమునకు వచ్చితిని." మరి అలా వచ్చిన వాడు మొదట తిట్టాడెందుకు?– ఈ ప్రశ్న వొస్తుందని, కవి దానికేం జవాబు చెప్పిస్తున్నాడో చూడండి! "బాణముచే కొట్టబడి, మూర్ఛజెంది, తెలివి లేక, నిన్ను దూషించితిని మొదట. అది సరి కాదు," (మరే, ఇదే సరి! మొదట తెలివిలేక తిట్టాడట! ఇప్పుడు తెలివొచ్చింది, బాణంతో కొట్టిన వాణ్ణి తిట్టకూడదనే తెలివి!)

రాముడి సామ్రాజ్యాధిపత్యాన్ని వాలే ఎలా ఒప్పుకుంటున్నాడో చూడండి! – "సుగ్రీవుడు నీ అనుగ్రహమునకు పాత్రుడై, నీ స్వాధీనములో నుండి, నీ చిత్తము ప్రకారము వుండినటులైతే, రాజ్యమును కూడా పరిపాలించి యుండవచ్చును." (సుగ్రీవుడు రాముడి ఆధీనంలో ఉండే విషయం గురించి, వాలి కూడా అంగీకరిస్తే, రాముడికి ఇంకా బలం కదా? అందుకని వాలితో కూడా చెప్పిస్తున్నాడు.)

రాముడి బాణం తగిలిన తర్వాత, వాలి, రాముణ్ణి బొత్తిగా ఏమీ అనకుండా "భలే చక్కని పని చేశావు" అని మెచ్చుకుంటే, బాగుండదు కాబట్టి, కవి, వాలితో రాముణ్ణి మొదట కొంచెం తిట్టించాడు. రెండు ప్రశ్నలు మాత్రం అడిగించాడు. రాముడితో వాటికేవో పిచ్చి జవాబులు చెప్పించి, వాలికి స్వర్గం చూపించి, సంతోష పెట్టేశాడు.

చివరికి వాలి, రాముణ్ణి, "శ్రీరామా! నిన్ను దూషించినందుకు నన్ను క్షమింపుము! పాప కార్యములు చేసిన నన్ను క్షమించితినని చెప్పుము!" అని ప్రార్థించాడు – "నీ బాణం దెబ్బ తినడం నా భాగ్యం!" అని కూడా ఒప్పేసుకున్నాడు వాలి. ఈ ఘట్టం చదివినప్పుడు, కవి 'న్యాయం'గానూ, పాత్రోచితంగానూ రాశాడనే నమ్మకం కలుగుతుందా? రాముడు, వాలిని చంపడంలో న్యాయం ఉందా?

ఈ "తోడు దొంగలు" కథలో మాత్రం, వాలి, రాముడి మాటల్ని అసహ్యించుకున్నాడు గానీ, దేనినీ అంగీకరించలేదు. రాముడి చేతిలో ఆయుధం వుంది కాబట్టి, రాముడి దౌర్జన్యమే జయించింది.

ఈనాటి సమాజంలో ధనికులు – వ్యాపార లావాదేవీలూ, ఆస్తి పంపకాలూ వంటి విషయాల్లో, తమ స్వలాభాల కోసం, తమకు శత్రువులుగా భావించే వాళ్ళని, కిరాయి హంతకుల ద్వారా హత్యలు చేయిస్తారు. డబ్బుకీ, ఇతర లాభాలకూ ఆశపడే నీచులు, తమకు ఏ హానీ చెయ్యని వాళ్ళని, ఇతరుల కోసం హత్యలు చేస్తారు. రాముడు చేసిన పని సరిగ్గా ఇలాంటిదే. తనకు ఏ హానీ చెయ్యని వాలిని రాముడు, సుగ్రీవుడి కోసం హత్య చేసి పెట్టాడు. వాలి విషయంలో రాముడు పూర్తిగా ఒక 'కిరాయి హంతకుడే!'

★

తుంది. శత్రువుకి రాజ్యంలో స్థానం లేకుండా చేస్తాం. అనుమతించండి మహారాణీ!" అంటూ ఆవేశం కురిపించారు.

తారకు అంతా గాఢాంధకారంగా అయింది. తన ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనంగా తోచాయి. ఏమీ నిర్ణయించలేని నిస్పృహతో చూసింది – "వీరులారా! మీ రందరూ విశ్వాస పాత్రులని నే నెరుగుదును. మహా వీరుడూ, ప్రేమ పాత్రుడూ అయిన మన మహారాజే పోయిన తర్వాత ఇక ఈ రాజ్యకాంక్ష లెందుకు? .... ఈ ప్రతీకారాలెందుకు?" అంటూ నిరాశలో కూరుకు పోయింది.[276]

తుఫాను గాలికి వేళ్ళతో కూలిన మహా వృక్షం లాగ, గరిక పోచలకు బందీ అయిన గజ రాజులాగ, భూమి మీద అస్తవ్యస్తంగా పడి ఉన్న భర్తని, తార, నమ్మలేని దానివలె విస్మయంతో చూసింది. భరించ లేని దుఖ్ఖావేశంతో భర్తని ఆలింగనం చేసుకుంది – "మహా వీరుడా! ఎన్నడూ పరాజయం ఎరగని నువ్వు శాశ్వతంగా విశ్రమించావా? బాహు బల ప్రదర్శనంలో శత్రువుల గుండెలు కంపింపజేసే నువ్వు, దెబ్బ తిన్న సింహానివై నేల కొరిగావా? చుట్టూ ఇందరు శత్రువుల మధ్య ఎన్నడూ ఇంత నిశ్చలంగా శయనించి ఎరుగవే! నీ అసమాన శూరత్వం, నీ శత్రు భయంకరత్వం ఏమై పోయినాయి? అధర్మ యుద్ధంలో మోసపోయి, నిస్సహాయుడివై, దుమ్ములో, ధూళిలో, దొర్లుతున్నావా? ప్రియుడా! నీకోసం దుఖ్ఖించే నీ భార్యలను విస్మరించి భూదేవిని ప్రేమతో ఆలింగనం చేసుకున్నావా? ఇంత పరాజయంలో నైనా నీ మొహంలో విషాద రేఖలు గోచరించడం లేదు. ఏ క్షణంలోనైనా నువ్వు చిరునవ్వుతో లేస్తావని నా మనసెంతో ఆశపడుతోంది.

మహారాజా! పౌరులందరూ నీ చుట్టూ జేరి కన్నీళ్ళతో నిన్ను దయనీయంగా చూస్తూ ఉన్నారు, చూడు! లేచి మెత్తని శయ్యమీద విశ్రమించు! నీ పరివారాన్నంతా దుఖ్ఖ సాగరంలో ముంచడానికి ఆ యముడే ఈ రాముడిగా వొచ్చాడని నువ్వు గ్రహించుకోలేదు కదా?

నాధుడా! రానున్న ఆపద గ్రహించి కూడా నిన్ను నిలుపుకోలేని దురదృష్టవంతురాలి నయ్యాను. నీతోనే నా సౌభాగ్యమంతా నన్ను విడిచిపోయింది. నిన్నీ దుర్దశలో చూసి కూడా నా హృదయం బద్దలు గాకుండా వుందే! నీ ముద్దుల కొడుకుని ఎవరి కప్పగించి వెళ్తున్నావు? ఒక్కసారి కళ్ళు తెరిచి అంగదుణ్ణి ఆలింగనం చేసుకో! అతడి శిరస్సు ముద్దాడి, ఊరడించి, మంచి చెడ్డలు నేర్పి వెళ్ళు! ధర్మయుద్ధం చేసిన నువ్వు, స్వర్గంలో కూడా ఇంకో కిష్కింధను స్థాపించుకోగలవు.

నాయనా అంగదా! నీ తండ్రి ఉత్తముడు! ధర్మాత్ముడు! ఇక ఎన్నటికీ తిరిగి రాని బహు దూర దేశం పోతూ ఉన్నాడు. నీ తండ్రి దర్శనం మళ్ళీ దొరకదు! ఇప్పుడే తనివి తీరా చూడు! నీ తండ్రి పాదాలకు నమస్కరించు!

ప్రియుడా! నేను కూడా నీకు నమస్కారం చేస్తున్నాను. నే నెన్నడైనా నీకు అప్రియం చేసినట్టయితే నా అపరాధాలన్నీ మన్నించు! నా సఖుడివీ, ప్రియుడివీ, నాధుడివీ, నా సర్వస్వమూ నువ్వే! నువ్వు లేక నేను దుఖ్ఖ ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉన్నాను ........."

తారకి ఏదో నచ్చచెప్పమనే అర్థంతో రాముడు గంభీరంగా సుగ్రీవుడి వేపు చూశాడు. సుగ్రీవుడు హనుమంతుడి వేపు!

హనుమంతుడు జంకుతూ తార దగ్గిరికి నడిచాడు – ""దుఖ్ఖపడకు తల్లీ! .... ఎవరి కర్మ కెవరు కర్తలు? ఆ మహానుభావుడు చేసుకున్న దాన్నిబట్టే అంతా జరిగింది. అయినా లోకంలో ఏది శాశ్వితం? తనువులు నీటి బుడగల్లాగ విచ్చిపోతాయి. సిరి సంపదలు హారతి కర్పూరం లాగ హరించిపోతాయి. అందరం ఆ స్థితికి చేరవలసిన వాళ్ళమే. ఈ దేహాలకోసం చింతించి ఏం ప్రయోజనం?[277] మంచి చెడ్డలన్నీ తెలిసిన దానివి.

**276.** **కిష్కింధా, సర్గ 19, శ్లోకాలు 14,17:** రాముడు, వాలిని చంపగానే – వాలి పక్షాన ఉండేవాళ్ళు ఏమీ ప్రయత్నాలు చెయ్యకుండా ఊరుకుంటారా? సుగ్రీవుడి అధికారాన్ని అంగీకరిస్తారా? – ఈ రకం ప్రశ్నలు వస్తాయి కాబట్టి, కవి, అది కూడా చూపించాడు. కొందరు వీరులు సుగ్రీవుడి మీద కోపం తెచ్చుకున్నట్టే రాస్తున్నాడు. తారతో కొందరు వీరులు – "పట్టణము యొక్క పెద్ద ద్వారము గాపాడ వలయును. అంగదుడికి పట్టాభిషేకము జేయవలయును. వాలి స్థానములో నుండు అంగదుని వానరులు ఆశ్రయించి యుందురు" అన్నారు. కానీ, అలా అన్నవాళ్ళు ఉత్తములు కారట! అల్పులట! మాట్లాడడానికేదో ఒక అవకాశం దొరికితే చాలనుకునే వాళ్ళట! – "సంభాషించుటకు కొంత అవకాశము పొందియుండు, అల్పబుద్ధి లగువారు, వారికి దోచినటుల జెప్పిన మాటలను తార వినెను."

ఆ వీరులు సుగ్రీవుడి పక్షాన జేరిపోతే, సుగ్రీవుడికే పట్టాభిషేకం జరిపించమని వారు తారకి చెప్తే, అప్పుడు వారంతా చాలా ఉత్తములూ, జ్ఞానులూ అయ్యే వారన్నమాట! ★

**277.** **కిష్కింధా, సర్గ 21, శ్లోకాలు 10 వరకూ:** హనుమంతుడు వేదాంతం వల్లించి తారని ఓదారుస్తున్నాడు – "ఈ శరీరములు నీటి బుడగలవలె అస్థిరములు." (అవును, మంత్రి పదవులు మాత్రమే స్థిరములు! శాశ్వతములు!) – "ఎవరి ఆత్మను గురించి వారు దుఃఖించవలయునే గానీ ఇంకొకరి గురించి దుఃఖించి ప్రయోజనము లేదు." అవును, ఎవరి పదవుల ➔

నీకు ఇతరులు చెప్పవలసిం దేముంది? జరిగిపోయిం దానికి విచారించి లాభం లేదు తల్లీ! జరగవలసిం దేమిటో ఆలోచించు. నీ కొడుకు గురించి విచార పడ వలసిన అగత్యమేమీ లేదు. తండ్రి పోతే మాత్రం అంగ దుడికి లోపం జరుగుతుందా? యువరాజు కావలసిన వాడు అతడే కదా? రేపు నీ కొడుకు సింహాసనం మీద కూర్చోవటం చూశావంటే, భర్త పోయిన దుఃఖం అంతా మరిచే పోతావు."

తార కోపంగా తలెత్తింది. వాలిని వదిలి సుగ్రీవుడి పక్షాన చేరిన హనుమంతుడి కపటత్వం ఆమె ఎరగనిది కాదు. కొడుకు యువరాజు అయితే చాలని సంతోష పడుతుందా తను? .... తన భర్తే ఉంటే, ఆయన మహా రాజే కద? .... అప్పుడు తన కొడుకు ఎలాగూ యువ రాజే కదా? తనకేదో ఎన్నడూ ఎరగని మహా భాగ్యం వొచ్చి పడబోతున్నట్టు తనను మభ్యపెట్టడానికి ప్రయ త్నిస్తున్నాడే ఈ వంచకుడు! – "హనుమంతుడా! కొడుకు పదవిని చూసుకుని, భర్తలేని వెలితిని విస్మరించే ధూర్తు రాలినని భావిస్తున్నావా నన్ను? నూరుగురు కొడుకు లైనా, నూరు యువరాజ పదవులైనా, నా భర్త అను రాగామృతానికి సరిపోతాయా!" అని తృణీకారంగా చూసి, జల జల కన్నీళ్ళు కార్చింది.

వాలి, మరణ వేదన పడుతూ, మూర్ఛలోంచి కళ్ళు తెరిచాడు. రెప్పపాటులో మృత్యువు కబళించనున్నదని గ్రహించాడు. నిరాసక్తంగా సుగ్రీవుణ్ణి చూశాడు – "తమ్ముడా! నువ్వే నన్ను చంపి, రాజ్యం తీసుకుంటే నేను విచారించే వాడిని కాను. నీకా హక్కు ఉంది. రాముడికా హక్కు లేదు. ఆ రాముడి కిచ్చిన వాగ్దానం తొందరగా నెరవేర్చుకో. లేకపోతే నిన్ను కూడా చంపుతాడు. అంత ఆపద తెచ్చుకోకు. అంగదుణ్ణి నీకు అప్పగించి పోతు న్నాను. నీ బిడ్డలాగే చూసుకో! తార తెలివి గలది. పరి స్థితుల్నిబట్టి కార్యా కార్యాలు నిర్ణయించగల సమర్థు రాలు. ఆమె చెప్పినట్టు నడుచుకో! నీకు మంచిది."

సుగ్రీవుడు తలవొంచి నిలబడ్డాడు.

వాలి, తన పక్కనే వొరిగి దుఃఖపడుతోన్న కొడుకుని వాత్సల్యంతో చూశాడు. "నాయనా! నిన్ను ఆలింగనం చేసుకునే శక్తి లేదు .... నీ పిన తండ్రిని ధిక్కరించడాని కెన్నడూ ప్రయత్నించకు! అతడు బలమైన అండ సంపా దించుకుని వున్నాడు. దేశ కాల పరిస్థితులు గ్రహించి మసలుకో!" – అని కళ్ళు తిప్పి, తన సరసన శోక దేవత లాగ దుఃఖిస్తూ కూర్చున్న తారని చూశాడు – "తారా! ప్రియా! నువ్వు ప్రేమతో చెప్పిన హితం చెవిన పెట్టలేదు. నా అజ్ఞానానికి నేనే బలైపోయాను. పుట్టిన ప్రతి జీవికీ మృత్యువు తప్పదు. కానీ .... ఇంత తెలివి తక్కువగా .... ఈ రకమైన .... మృత్యువుకి .... నేను లొంగి పోవటం .... నన్ను .... అమితంగా బాధిస్తోంది ...." అంటూ చివరికి ప్రాణాలు విడిచాడు.

నీలుడు ముందుకొచ్చి వాలి రొమ్ములో బాణం తీసేశాడు.

తార దుఃఖంతో విలవిల్లాడుతూ – "సుగ్రీవుడా! నీ శతృవు నశించిపోయాడు. ఇక ఈ రాజ్యం అంతా నువ్వే ఏలుకో! సంతోషంగా ఏలుకో!" అని, అప్పటికి రాముణ్ణి చూసింది – "రాజా! నా భర్తను చంపిన బాణం తోటే నన్ను కూడా చంపి పుణ్యం కట్టుకో. నా భర్త స్వర్గానికి పోయినా నా కోసమే దుఃఖిస్తూ ఉంటాడు. భార్యా భర్తల్ని విడదీసిన పాపం నీకెందుకు కలగాలి? నువ్వు దయ దలిస్తే మమ్మల్ని ఒక్క క్షణంలో కలపగలవు! ప్రేమా స్పదుడయిన నా భర్త దగ్గిరికే నన్ను పంపించు!" అంటూ రోదించింది.

తార తననేం దూషిస్తుందోనని జంకుతోన్న రాముడు, ఆమె దీనాలాపాలు విని ధైర్యం తెచ్చు కున్నాడు. గంభీరంగా చూశాడు – "జ్ఞానవంతురాలిగా కనిపిస్తున్నావు. విలపించడం తెలివి తక్కువ కార్యం అని గ్రహించలేవా? లోకంలో సుఖంతో పాటు దుఃఖం కూడా సహజమైనదే అంటారు. విధి విధానంగానే ఇదంతా జరిగిందని గ్రహించి శాంతపడు! ఎవ్వరూ ఏ కార్యమూ చెయ్యడానికి స్వతంత్రులు కారు. ఒకరిని ఆజ్ఞాపించ డానికి ఇంకొకరికి అధికారం లేదు. అందరూ ధర్మం చెప్పున నడవవలసిన వారే. భర్త లేకుండా జీవించ లేనననే దుఃఖం విడిచిపెట్టు! నీ భర్త వీరుడు. నువ్వు వీర పత్నివి. వీరుల భార్యలు దుఃఖించరు. నా దయవల్ల నీ

---

➔ గురించి వారు తాపత్రయ పడవలసిందే గానీ, ఇంకొకరి గురించి ఆలోచించి లాభం లేదు. ఈ వేదాంత సారం చక్కగా వొంటబట్టడం చేతనే హనుమంతుడు వాలిని విడిచి పెట్టి 'తన మంత్రి పదవి కోసం' సుగ్రీవుణ్ణి ఆశ్రయించాడు. "ఎవరి కర్మ కెవరు కర్తలు తల్లీ?" – ఈ రెండు ముక్కలూ అసలు వ్యవహారాన్ని తల్లకిందులు చేసేసి కూర్చోబెడతాయి. వాలిని చంపించడం అన్యాయం అని హనుమంతుడికి తెలుసు. అయినా ధైర్యంగా వేదాంతం మాట్లాడుతున్నాడు. వేదాంతం ఎలాంటి అన్యాయాన్నయినా 'వాళ్ళ కర్మ'గా మార్చేస్తుంది. వాలికి జరిగిందాన్ని మాత్రమే 'అతని కర్మ' అనుకోవాలి. సుగ్రీవుడు, తన దేశ బహిష్కారాన్ని 'తన కర్మ' అనుకోడు. రాముడు, భార్యా వియోగాన్ని 'తన కర్మ' అనుకోడు. వాలి పక్షం వాళ్ళు మాత్రమే, 'ఈ కష్టం మన ఖర్మ' అనుకోవాలి. వేదాంతం ఎప్పుడూ నష్టపోయే వాళ్ళ నోళ్ళు మూసేసి, లాభపడే వాళ్ళ పక్షాన నిలబడుతుంది. అది, కొందరికే అనుకూలంగా ఉండే 'ఆధ్యాత్మిక సంపద'ని సృష్టిస్తుంది. ఈ విషయం అనేక సందర్భాల్లో గమనించవొచ్చు. ★

భర్త స్వర్గానికి పోతాడు. నీ కొడుకు యువరాజు అవుతాడు. ఇక నువ్వు దుఃఖించే అగత్యమేమీ లేదు.”

తనలాగే అందర్నీ రాజ్యాలూ, భోగాలూ మాత్రమే సంతృప్తి పరుస్తాయని భావించే రాముడికి, తార కన్నీటిలో విషాదమేమీ గోచరించలేదు.

తారకి అమితమైన అసహ్యం కల్గింది. మనసులో భావం బయట పడనివ్వక తల వొంచుకుంది. .... అంతా శతృవు చేతిలో చిక్కిపోయింది. ఈ దుర్మార్గుడు అంగదుణ్ణి కూడా శతృశేషంగా భావించి నాశనం చెయ్యకుండా కాపాడుకోవాలి తను.

నిర్జీవంగా పడి ఉన్న వాలిని చూస్తూ ప్రజలంతా దుఖ్ఖం ఆపుకోలేక కళ్ళ నీళ్ళు కారుస్తూ భోరున విలపిస్తూ చుట్టూ చేరారు.

సుగ్రీవుడు సిగ్గుపడుతూ తల వొంచుకుని, కళ్ళ నీళ్ళు తెప్పించుకుంటున్నాడు. వాలి, తనని చంప దగ్గ సమయాలలో కూడా దయతో విడిచిపెట్టాడని పది మందికీ తెలుసు. అటువంటి అన్నని, తను మోసంతో చంపించిన సంగతి కూడా అందరికీ తెలిసిపోయింది. ఇప్పుడు తను పశ్చాత్తాపం ప్రకటించుకోకపోతే, రేపటినించి నలుగుర్లో తలెత్తుకో లేడు. అందరూ వాలి కోసమే ఏడుస్తున్నారు. బాధపడుతున్నారు.

సుగ్రీవుడు రాముణ్ణి చూస్తూ దుఃఖించడానికి లంకించుకున్నాడు. “శ్రీ రామా! నీ ప్రతిజ్ఞ నువ్వు నెరవేర్చుకున్నావు. నాకు రాజ్యం సంపాదించి పెట్టావు. కానీ .... నా కిప్పుడు బొత్తిగా రాజ్యం మీద కోరిక లేదు. కన్న తండ్రిలాంటి నా అన్నే పోగా నాకీ రాజ్యా లెందుకు, భోగా లెందుకు? నా అన్న లేకపోతే నాకు స్వర్గం కూడా అక్కర లేదు. సిరి సంపదలెక్కడైనా దొరకవచ్చును గానీ .... మళ్ళీ తోడబుట్టిన వాడెక్కడ దొరుకుతాడు? బతికి నన్నాళ్ళూ నా అన్న నన్ను ఎంతో దయతో చూసుకున్నాడు. కొంచెం కోపం తెచ్చుకునే వాడు గానీ .... నా అన్న మహానుభావుడు. అటువంటి ఉత్తముణ్ణి చంపించుకున్నాను. దుర్మార్గుణ్ణి! నా వంటివాడు తమ్ముడెలా అవుతాడు? .... అయ్యో! .... నేనిక బతకను. నా సైన్యమంతా నీ భార్యని వెతికి పెడతారు. నీ కిచ్చిన మాట తప్పను. అయ్యో! .. నేనిక బతకను ....” అంటూ కుమలటం మొదలుపెట్టాడు.

సుగ్రీవుడు అంత చక్కగా ఏడవడం చూస్తే రాముడికి ముచ్చటేసింది. అన్నగారి మరణం సుగ్రీవుడి కెంత ఆనందం కలిగిస్తుందో, సింహాసనం ఎక్కాలని అతడెంత తహ తహ లాడుతున్నాడో, రాముడికి చక్కగానే తెలుసు .... అన్న కోసం లోకాచారంగా దుఃఖిస్తున్నాడు. అవును .... ధర్మబద్ధంగా దుఃఖించవలసిందే. సుగ్రీవుడి అంత రంగాన్ని గ్రహించే శక్తి, శక్తిమంతుడైన రాముడి కొక్కడికే ఉంది.

“సుగ్రీవుడా! దుఃఖించి లాభం లేదోయి! అంతా దైవ నిర్ణయమని గ్రహించలేదు నువ్వు. చంపించిన వాడివి నువ్వు కాదు. చంపిన వాడిని నేనూ కాదు. చచ్చి పోయిన వాడు వాలీ కాదు. అందరం నిమిత్త మాత్రులం సుమా!” అంటూ క్రీకంట లక్ష్మణుణ్ణి చూశాడు.

వాలి చుట్టూ చేరి ఏడుస్తోన్న స్త్రీలనీ, అంగదుణ్ణీ చూసి జాలి పడుతోన్న లక్ష్మణుడు, అన్నగారి కంటి చూపు హెచ్చరికలతో దీర్ఘంగా నిట్టూర్చి, కదిలి పని కుపక్రమించాడు.

“సుగ్రీవుడా! అంగదుణ్ణి ఓదార్చాలి గానీ .... నువ్వే చిన్న పిల్లవాడిలాగ దుఃఖపడతావేమిటి? ఇక రాజ్యంలో మంచి చెడ్డలన్నీ నువ్వే చూసుకోవాలి. లేచి ప్రయత్నాలన్నీ చెయ్యి! తారుడా! మీ రందరూ ఉండి ఇంత ఆలస్యం చేస్తే ఎలా గోయీ? ఇంకేం చూస్తారు? అంతా అయిపోయింది. ఇలాంటి సమయాల్లో పనులు తొందరగా జరిగి పోవాలి. అన్నగారు తొందర పడుతున్నారు .... శవాన్ని తొందరగా ఎత్తించెయ్యండి!” అంటూ అందర్నీ తొందరపెట్టాడు.

క్షణాలలో పల్లకీ వొచ్చింది.

సుగ్రీవుడు పంచెతో కళ్ళు వొత్తుకుంటూ చెప్పాడు – “హనుమంతుడా! .... మా అన్న గారికి .... వైభోగంగా కర్మ జరగాలి సుమా! ఆఁ .... ఏమీ లోటు చెయ్యకండి! గంధం చెక్కలు బళ్ళకొద్దీ తెప్పించండి! నెయ్యి కుండలకొద్దీ గుమ్మరించండి! బ్రాహ్మణులందరికీ దాన ధర్మాలు చెయ్యండి .... అయ్యో, అన్నా! .... నువ్వు లేకుండా ఎలా బతకను? నన్ను కూడా తీసుకుపో .... అయ్యో!” అని గట్టిగా కంఠం ఎత్తాడు.

వాలిని ఎత్తి పల్లకీలో పడుకోబెట్టారు.

అందరూ పల్లకీ వెంట ఏడుస్తూ నడుస్తున్నారు. ఆ ఏడుపుల్లో తన కంఠం వినపడుతుందనే నమ్మకం లేక సుగ్రీవుడు ఏడవటం కట్టిపెట్టాడు.

చితి పేర్చారు.

రాముడు దూరంగా నిలబడి పురోహితులకు హెచ్చరికలూ... ఆదేశాలూ శాస్త్రోక్తంగా ఇస్తున్నాడు.

అంగదుడు చితి అంటించాడు.

తార దుఖ్ఖంతో – “నాధుడా! .... మమ్మల్ని విడిచి పోతున్నావా? .... ఇక ఎన్నటికీ నిన్ను చూడలేమా? అయ్యో! .... నువ్వులేని మా జన్మ లెంత శూన్యమోయీ!” అంటూ మూర్ఛబోయింది.

సుగ్రీవుడు ఇటూ అటూ చూసి – “నేనిక బతకను

.... చితిలో పడిపోతాను .... దుర్మార్గుణ్ణి, అయ్యో! ....” అంటూ చితి కేసి పరిగెత్తాడు.

హనుమంతుడూ, లక్ష్మణుడూ కూడా వెనకాల పరిగెత్తి, అతన్ని చెరొక రెక్కా పట్టుకుని వెనక్కి లాక్కొచ్చారు.

“వదలండి నన్ను. చచ్చిపోతాను. మా అన్న లేకుండా .... నేను బతకలేను .... వదలండి!” అంటూ మళ్ళీ పరిగెత్తాడు.

“తొయ్యండి గాడిద కొడుకుని మంటల్లోకి! వాణ్ణీ, రాముణ్ణీ కూడా కలిపి తొయ్యండి!” అని ఎవరెవరో గుంపులో నించి ఆవేశంగా అరిచారు.

సుగ్రీవుణ్ణి మళ్ళీ లాక్కొచ్చారు.

ఇక కిక్కురు మనకుండా కూలబడ్డాడు నేల మీద.

హనుమంతుడు, చుట్టూ పది మందినీ పరికిస్తూ – “మీ కందరికీ రాముడి మీద కోపంగా ఉన్నట్టుందే! ఆయన నిమిత్త మాత్రుడు సుమా! పరమ సాత్వికుడు. గంగి గోవు లాంటివాడు. చీమకయినా హాని చేయలేడు. (‘వాలి’కి తప్ప!) ఇన్ని మాటలెందుకు? నోట్లో వేలు పెడితే కొరకలేడు. కావాలంటే చూడండి” అని తను చటుక్కున రాముడి నోట్లో వేలు దోపాడు.

రాముడు తెల్లబోయి, తేరుకుని, గంభీరంగా హనుమంతుడి వేలు మెత్తగా చప్పరించి వదిలేశాడు.

హనుమంతుడు, వేలు బయటకు తీసి – “చూశారా ఎంత సాత్వికుడో! వేలు కొరికాడా? .... ఇప్పుడన్నా నా మాట నమ్ముతారా?” అని ప్రజలందర్నీ నవ్వు మొహంతో చూశాడు.

కొందరు ప్రజలు ఆశ్చర్యంగా – “నిజంగా కొరకలేదా? .... అబ్బ! .... ఎంత మంచివాడో! .... ఏదీ? వేలు చూడనియ్యి” అంటూ హనుమంతుడి చుట్టూ జేరారు. ‘బాణం’ సంగతి మర్చిపోయి, ‘వేలు’ సంగతిలో పడ్డారు!

“రాముడు వేలు కొరుకుతాడా, లేదా?” అనే విషయం మీద కొందరు యువకులు తీవ్రంగా చర్చించుకున్నారు, దూరంగా నిలబడి.

“కొరుకుతాడ”న్నారు కొందరు.

“కొరకడు. మనం చూశాం కదా?” అన్నారు కొందరు.

“హనుమంతుడి వేలు గాబట్టి కొరకలేదు. వాళ్ళూ వాళ్ళూ ఒకటే. మన వేలయితే ఎందుకు కొరకడూ? కావాలంటే నీ వేలు పెట్టి చూడు!”

“ఛీ! నే నెందుకు పెడతానూ? .... అడ్డమైన వాళ్ళ నోళ్ళల్లోనూ నా వేళ్ళు పెడతానా? మాటలు తిన్నగా రానియ్యి!” అని చాలా కోపం తెచ్చుకున్నాడా యువకుడు.

“రాముడి నోట్లో నేను వేలు పెడతానర్రా! ఏం చేస్తాడో చూద్దాం. పోతే పోతుంది వేలు.”

“నిన్ను కొరక్కపోతే నేనూ పెడతాను.”

ఇద్దరు ముగ్గురు వీరులు రాముడి దగ్గిరకి బయల్దేరారు, వేళ్ళు – జెండాల్లా ఎత్తి.

ముందు హనుమంతుడి దగ్గిరికి వెళ్ళి – “రాముడి నోట్లో వేళ్ళు పెట్టాలి మేం” అని ప్రకటించారు కోపంగా.

“అయ్యో, అదెంత పని? .... పెట్టండి, మీకే తెలుస్తుంది ఆయన ఎంత సాత్వికుడో ....” అని హనుమంతుడు రాముడి వేపు తిరిగి వినయంగా నమస్కారం పెట్టాడు.

రాముడు గంభీరంగా మొహం ఎత్తి నిలబడ్డాడు.

ఒక యువకుడొచ్చి రాముడి నోట్లో కోపంగా వేలు దోపాడు – “ఏం చేసుకుంటావో చేసుకో” అన్నట్టు.

రాముడు గుటకలు మింగి ఊరుకున్నాడు.

తర్వాత, ఇంకో యువకుడు రెండు వేళ్ళు దోపాడు. అప్పుడూ రాముడు వాటిని మెత్తగా చప్పరించి వూరుకున్నాడు.

ఇంకా కొందరు యువకులు ఆశ్చర్యంగా ఎడం వేళ్ళూ, కుడి వేళ్ళూ, చుట్ట వేళ్ళూ, ముక్కులు చీది పంచెలకి తుడుచుకున్న వేళ్ళూ, తుడుచుకోని వేళ్ళూ, – అన్నీ గబ గబా పెట్టారు.

రాముడు ఒక్క వేలన్నా కొరకలేదు, ఆశ్చర్యం! అన్నీ చీకి విడిచి పెట్టాడు.

“ఆశ్చర్యంగానే ఉందే!” అని కొందరు రాముణ్ణి భక్తిగా చూశారు.

“ఏం ఆశ్చర్యం లేదు. అదో వేషం. నమ్మకండి!” అని ఒకాయన రహస్యంగా బోధించాడు కొందరికి.

అంతా అయిపోయింది! వాలి .... మట్టిలో .... గాలిలో .... కలిసిపోయాడు! చితి ఆవేశం తగ్గి ఆరిపోయింది. శ్మశానం నుంచి ఇవతలికి రాగానే కొందరికి శ్మశాన వైరాగ్యమూ పోయింది.

హనుమంతుడు రాముడికి నమస్కారం చేస్తూ – “ప్రభూ! నీ కరుణ వల్లనే సుగ్రీవుడు ఇంత దుర్లభమైన రాజ్యం పొందగలిగాడు. ఇక తర్వాతేం జరగాలో నువ్వే ఆజ్ఞాపించు! నీ ఆజ్ఞకు వ్యతిరేకంగా సుగ్రీవుడేమీ చెయ్యడు. పట్టాభిషేకం చేసుకుని, నిన్ను సగౌరవంగా పూజించుకుంటాడు. సుగ్రీవుణ్ణి నీ చేతులతోటే రాజుని చెయ్యి! నువ్వు నిలబడి ఆ పని కూడా జరిపిస్తే .... నిన్నెవరూ ధిక్కరించలేరు” అని వినయంగా ప్రార్థించాడు.

ప్రజల్లో సుగ్రీవుడికి చాలా వ్యతిరేకత ఉన్నట్టు రాముడు గమనిస్తూనే ఉన్నాడు. ఎవ్వరూ స్పష్టంగా వ్యక్తం చేయకపోయినా చాలా మంది వాలి మరణానికి ఆవేశ పడుతూనే ఉన్నారు. సుగ్రీవుడి పట్టాభిషేకానికేమీ ఇబ్బంది కలగక పోవచ్చుగానీ .... వెంటనే రావణుడితో

యుద్ధం మాత్రం జరిగే పని కాదు. ముందు సుగ్రీవుడు కొంత స్థిరపడాలి. సైన్యాన్ని అదుపులోకి తీసుకోవాలి. ప్రజల్ని మచ్చిక చేసుకోవాలి. ఈ రాజ్య విశేషాలు తను కూడా క్షుణ్ణంగా గ్రహించాలంటే కొంతకాలం పడుతుంది. అంతవరకూ వేచి ఉండక తప్పదు.

రాముడు గంభీరమైన చిరునవ్వుతో హనుమంతుణ్ణి చూస్తూ – "హనుమంతుడా! సుగ్రీవుడి పట్టాభిషేక మహోత్సవం మీరే జరిపించండి! నేను వనాలలో తప్ప గ్రామాలలో గానీ, పట్టణాలలో గానీ ప్రవేశించరాదు. అది నా తండ్రి ఆజ్ఞ. మీరందరూ ఉండగా పట్టాభిషేకానికి ఎటువంటి ఇబ్బందులూ సంభవించవు. భయ పడవొద్దు.

సుగ్రీవుడా! అంగదుడు నీ అన్న కొడుకు గదా? యువరాజు కావడానికి అతడే అర్హుడు. అంగదుణ్ణే యువరాజుగా చేసుకో!

ఇక త్వరలోనే వర్షాకాలం ప్రారంభమవుతోంది. సీతని వెతకడానికిది సమయం గాదు. ఈ నాలుగు మాసాలూ గడిచిపోతే, కార్తీక మాసంలో నాకు చెయ్యవలసిన సహాయం చెయ్యవొచ్చును. అంతవరకూ ...."

ఎవరో వెనక గుంపులోంచి – "ఆ రావణుడితో యుద్ధానికి కుదరదేమోగానీ .... పెళ్ళాన్ని వెతుక్కోటానికి వానాకాలం ఏం అడ్డొచ్చింది? .... వానా కాలంలో అందరూ పనులు మానేసుకుంటారా? .... వానలో తడిస్తే మొక్క మొలుస్తాదు గావున్ను" అంటూన్నారు, పక్క వాళ్ళతో.

రాముడు తన మాటలాపి .... బాగానే విన్నాడు దూరం మాటలు. అసలేమీ వినపడనట్టే మొహం గంభీరం చేశాడు – "సుగ్రీవుడా! నేను లక్ష్మణుడితో రుష్యమూక పర్వతం మీద గుహలో కాలం గడుపుకుంటూ వుంటాను. నువ్వు వెంటనే పట్టాభిషేకం చేసుకొని నీ బంధు మిత్రులకు సంతోషం కలిగించు!" అని చిరునవ్వు నవ్వాడు.

"చిత్తం! నీ ఆజ్ఞ!" అంటూ సుగ్రీవుడు భక్తితో వొంగి రాముడి పాదాలకు నమస్కారం చేశాడు.

సుగ్రీవుడికి రాముడి మీద భక్తి అధికమై పోతోంది. బతుకంతా ఆ కొండల మీదే గడిపెయ్యా లేమో అనుకున్నాడు గానీ అంతా మాయలాగ తారుమారై పోయింది.

సుగ్రీవుడి పట్టాభిషేక మహోత్సవాలు మహా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎప్పుడే అవాంతరం ఎదురవుతుందోనని సుగ్రీవుడు బితుకు బితుకు లాడుతూనే ఉన్నాడు. కానీ ... ఏమీ జరగలేదు. బహుశా తార ఆజ్ఞ అయివుండాలి.

తారని గౌరవించి, తన పక్షం చేసుకోవాలని సుగ్రీవుడు ఆమె అంతఃపురానికి వెళ్ళాడు.

తార తల వొంచుకుని జల జల కన్నీళ్ళు రాల్చి ఊరుకుంది.

పట్టాభిషేక ముహూర్తం దగ్గర పడుతోంటే, సుగ్రీవుడికి అందమైన స్త్రీలు సుతారంగా నలుగులు పెట్టి స్నానాలు చేయించారు. చందనం పూతలు పూశారు. వొళ్ళంతా రాజ లాంఛనాలతో అలంకారాలు చేస్తోంటే ... వొంటి నొప్పులన్నీ సర్దుకున్నాయి, గూళ్ళ నొప్పులు తప్ప. నెత్తిమీద కిరీటం ఎక్కేసరికి ఆ గూళ్ళ నొప్పులు కూడా మాయం అయిపోయాయి!

సింహాసనం మీద ఇటూ అటూ కదిలి పక్కకి చూశాడు రాజుగారు. భార్య కనబడింది –"అవును సుమా! నాకు భార్య ఉంది సుమా!" అని ఆశ్చర్యపడ్డాడు. మొహమంతా నవ్వు తెచ్చుకుంటూ – "బాగున్నావా? ... నీ కోసమే ఇదంతా చేశాను, తెలుసా?" అన్నాడు.

రుమ సిగ్గుపడి తల వొంచుకుంది.[278]

తర్వాత బ్రాహ్మలకు దాన ధర్మాలు విరివిగా జరిగాయి.

రాజ్యం నిండా శ్రీరాముణ్ణి గురించి పూజలూ, భజనలూ, స్తోత్రాలూ సాగుతున్నాయి.

ఆస్థాన కవులు, శ్రీరామచంద్రుడి మహోన్నత గుణాల మీదా, అపురూప దేహ సౌందర్యం మీదా, రాత్రిం బవళ్ళూ కూర్చుని రాసిన పాటలు గానం చేస్తున్నారు.

ఆస్థాన పురోహితులు కంఠాలెత్తి – "శ్రీరామచంద్రా! కోసలాధిపతీ! పితృవాక్య పరిపాలకుడా! ఆర్తత్రాణ పరాయణుడా! దుష్ట శిక్షకుడా! శిష్ట రక్షకుడా! కరుణా సముద్రుడా! ..." అంటూ రుష్య మూకానికి వినిపించేటట్టు గావుకేక లేస్తున్నారు.

**[ఈ కథకీ, తర్వాత కథకీ మధ్య కూడా లింకు లేదు. తర్వాత కథ వెంటనే ప్రారంభమవుతుంది.]** ★

---

**278.** కిష్కింధా; సర్గ 26; ఆఖరి శ్లోకం: "సుగ్రీవుడు, తన భార్యయగు రమను బడసి, కిష్కింధలో పట్టాభిషేకము జేసికొని, శ్రీరాముని సన్నిధిలో నీ విషయము దెలిపి, ఇంద్రునివలె రాజ్యము ననుభవించుచుండెను."

కొంత కాలం వాలితో ఉన్న భార్యని సుగ్రీవుడు తిరస్కరించలేదు. ఆ జాతిలో స్త్రీలకు, ఒక భర్త పోయిన తర్వాత ఇంకో భర్తతో వుండరాదనే నియమం లేదు. ★

## కథ-8

# స్నేహ బండారం

ఆకాశంనిండా శ్రావణ మేఘాలు పెళ్ళి మేళం లాగ సందడి చేస్తున్నాయి.

గాలి అడివంతా తిరుగుతూ, "వానొస్తోందర్రా, వానొస్తోంది! తెలిసిందా మీకు?" అని చెట్టు చెట్టుకీ, పిట్ట పిట్టకీ చెప్పుకుంటూ పరుగులు తీస్తోంది.

"రానియ్యి, రానియ్యి" అని చెట్లు సంతోషంతో తల లూపుతున్నాయి.

పిట్టలు ఆకాశం వేపు చూసి, "అబ్బే! అంతా ఉత్త ఆర్భాటమే. నిన్నా ఇలాగే ఉరిమి ఊరుకుంది" అని నిరుత్సాహ పడుతున్నాయి.

"నా ముక్కుమీదో చినుకు పడిందర్రోయ్!" అని అరిచిందో చిలక పిల్ల. నిజంగానే దాని ఎర్రటి ముక్కు మీద ముత్యం లాగ మెరుస్తోంది నీటి చినుకు.

"వానంటే ఎవరే అమ్మా?" అని నిన్న పుట్టిన పావురం పిల్లలు వాళ్ళమ్మని అడుగుతున్నాయి. వాళ్ళమ్మ పిల్లల మాటలకు మురిసిపోతూ నవ్వి "వానంటే .... ఎవరంటే .... ఇప్పుడొస్తుందిగా? చూపిస్తాను. ఆకాశం లోంచి బోలెడు నీళ్ళొస్తాయి" అంటూ పైకి చూపించింది.

"ఎవరింటి కొస్తాయి? మనింటికేనా?"

"ఛ, అందరిళ్ళకీ వస్తాయి."

"ఎవరు పోస్తారు? దేవుడేనా?"

"ఛ, ఆ మేఘాలు లేవూ .... నల్లగా? అవి ఎక్కణ్ణించో నీళ్ళు తెచ్చీ ...."

"ఇదుగో! నా రెక్కమీద కూడా చినుకు పడిందర్రా! ఇవ్వాళ తప్పకుండా వానొస్తుంది" అని అరిచిందో పిచిక దూరం నించీ.

"సరే! రానివ్వండి. అంతకన్నా ఏం కావాలీ?" అంది పక్కగూట్లో పావురం.

పిట్టల సంచారంతో, కప్పల ముచ్చట్లతో, జింకల పరుగులతో, గాలి ఈలలతో – అడివంతా సందడి సందడిగా అయిపోయింది.

రాముడు, గుహ పక్కనే తురాయి చెట్టుకింద రుషి లాగ కాళ్ళు మడత వేసుకుని కూర్చుని ఏదో దీర్ఘా లోచనలో మునిగి వున్నాడు – రావణుడితో యుద్ధం గురించో, కైక మీద ఇంకా తీరని కక్ష గురించో!

తురాయి చెట్టు అల్లరి పిల్ల లాగ తెగ ఊగుతోంది. గాలి పెట్టే చక్కలిగింతలకు గుక్క తిప్పుకోకుండా నవ్వుతూ, కాలు నిలబడకుండా ఊగుతూ, కొండ కింద వాగు మీదకి విరగబడుతోంది. పూలన్నీ వాగులోకి రాలుస్తోంది. "అబ్బ! ఈ పాడు గాలి .... నిలవనివ్వడం లేదర్రా!" అని పక పక లాడుతోంది.

గాలి, విసురుగా వొచ్చి, "అదుగో! నన్నంటా వెందుకూ? నీ కసలు కుదురడిస్తేనా? ఎప్పుడూ నవ్వులూ శివాలేనయ్యే! బుద్ధీ జ్ఞానం లేకుండా పూలన్నీ వాగులో పారబోసుకుంటావు" అంటూ రయ్యిన జవా బిచ్చింది.

"ఏమీ ఎరగనట్టే మాట్లాడతావు. నువ్వసలు నా జోలికి రాకు. అటు మర్రి చెట్ల వేపో, మద్ది చెట్ల వేపో పోరాదూ? వాటి దగ్గిర నీ ఆటలు సాగవులే. .... అస్త మానూ నన్నేడిపిస్తా వెందుకూ?" అంటూ తురాయి చెట్టు గాలితో పోట్లాడుతూ నిలబడాలని ప్రయత్నాలు చేసింది.

బండల చాటునించి మోదుగు చెట్టు కలగజేసుకుని తురాయికి పెద్దతనంతో నచ్చచెబుతూ – "నువ్వింకా చిన్న దానివని గాలి ఆట పట్టిస్తోంది లేమ్మా! చిన్నప్పుడు నన్నూ ఇలాగే చేసేది. అంత మాత్రానికే కోపం తెచ్చు కుంటారా, నవ్వి వూరుకోవాలిగానీ ...." అని, తల పంకించి ఊరుకుంది.

రుష్యమూకం మీద విశాలంగా ఆ గుహా, ఎప్పుడూ కొదవ లేనంత గాలీ, గుహ పక్కనే కొండకింద పారే వాగూ, ఇంకో పక్క – కొండల మధ్య చక్కటి సరస్సూ, దూరంగా రత్న కంబళం లాగు కనపడే పంపా, కిష్కింధ వేపు పొలాల్లో నిత్యం పనులు చేసుకునే రైతులూ, అడివిలోకి పశువుల్ని తోలుకొచ్చే పిల్లల ఆట పాటలూ, చుట్టుపక్కల పల్లెలనించి కిష్కింధకు వొచ్చే పోయే జాన పదులూ – ఎటు చూసినా కాలక్షేపం అవుతూ, రాము డికి, రుష్యమూకం మీద నివాసం – సౌఖ్యంగానే ఉంది.

దండకారణ్యం నుంచి బయల్దేరింది మొదలూ .... ఈ ఐదారు నెలలూ .... తిరిగి .... తిరిగి ఇంత కాలానికి మళ్ళీ ఒక స్థావరం!

రోజులు దొర్లిపోతూనే ఉన్నాయి. కిష్కింధలో సుగ్రీవుడి అధికారం స్థిరపడినట్టే. ఇక, సందేహం లేదు.

ఆలోచనల్లో మునిగి వున్న రాముణ్ణి, గాలి, "వానొస్తోంది. తెలిసిందా నీకు?" అని రాసుకుంటూ పందిరి

కిందకి పోయి, లక్ష్మణుణ్ణి కూడా పలకరించింది.

లక్ష్మణుడు తాటి పళ్ళు కాలుస్తూ, "నువ్విటు రాకు, రాకు, అబ్బ! ప్రాణాలు తీస్తున్నావు!" అంటూ పొయ్యి ముందు గాలికి అడ్డంగా కూర్చున్నాడు.

పిట్టల కోలాహలానికి తలెత్తి చుట్టూ చూశాడు. పిట్టల కూతలన్నీ అర్థమౌతాయి లక్ష్మణుడికి. ఏ పిట్ట ఏ రకంగా కూస్తుందో, ఒక్క పిట్టే ఎన్ని రకాలుగా కూస్తుందో, బాగా తెలుస్తుంది. పిట్టలు, గూళ్ళల్లో తీరిగ్గా కూచుని పలకరించుకునే పలకరింపులూ; దూరంలో స్నేహితుల్ని చూసి అరిచి పిలిచే పిలుపులూ; పళ్ళనో, పురుగుల్నో చూసి సంతోషంతో చేసే సందళ్ళూ; వేట గాళ్ళనో, గూళ్ళలోకి జొరబడే పాముల్నో చూసి కెవ్వున భయంతో అరిచే అరుపులూ – అన్నీ స్పష్టంగానే అర్థ మౌతాయి.

వాన కోసం పిట్టల సంతోషం అర్థమైంది లక్ష్మణు డికి. తలెత్తి ఆకాశం చూశాడు. పర్వతాల మీద పర్వ తాలు తిరుగుతున్నట్టు రుష్యమూకం మీద నల్లటి మేఘాలు తేలుతున్నాయి. మేఘాలు అక్కడక్కడా కిందకి దిగి విశ్రాంతుల కోసం పర్వత శిఖరాల మీద గుమి గూడుతున్నాయి. చక్కగా మేఘాల మెట్ల వెంట ఎక్కి పోయి, సూర్యుడి మెడలో పూల దండ వెయ్యొచ్చని పిస్తోంది.

సన్న సన్నగా చినుకులు ప్రారంభమయ్యాయి! గాలి, చిలిపితనంతో చినుకుల్ని ఎగరగొడుతోంది. పిట్టలు చినుకుల్లో ఎగిరి, రెక్కలు తడుపుకుంటున్నాయి. మేఘాల లోంచి కొంగలు, బారులు బారులుగా, తెల్ల తామర పూల హారాలలాగు ఎగురుతున్నాయి. పువ్వులాగ గుంపుగా ఎగిరే పిట్టలు, పూల రేకులన్నీ విడిపోయినట్టు .... చెల్లా చెదురై గూళ్ళవేపు పోతున్నాయి.

గొడ్లని మేపుకునే పిల్లలు, కేకలతో నవ్వులతో, గొడ్లని కిష్కింధ వేపు తోలుకు పోతున్నారు.

లక్ష్మణుడు ఆకాశం పరికించి, "అన్నగారూ! వర్షం బాగా పడేటట్టే కనబడుతోంది. లేచి పందిరి కింద విశ్రమించండి! మీకు చాలా ఇష్టమని చింత చిగురు వేసి చేపలు వొండాను. తాటి పళ్ళూ, ఎర్ర దుంపలూ కాల్చాను. వేడి వేడిగా భుజించండి!" అంటూ అన్న గారికి విన్నవించాడు.

రాముడు, రావణుడితో చెయ్యబోయే యుద్ధంలోంచి కొంచెం తేరుకుని, ఆకాశం వేపు తల పంకిస్తూ "అవును. ఇది వర్ష రుతువే నోయీ!" అని ఒప్పు కున్నాడు. వెంటనే వర్ష రుతు వర్ణనలన్నీ గుర్తు తెచ్చు కున్నాడు.

వర్ష రుతువులో ఏళ్ళూ పూళ్ళూ ఏకమైపోతాయి. ప్రియాలింగనాల కోసం ఉరుకులతో పరుగులతో పోయే నదులూ; రక రకాల ఓషధుల పరిమళాలతో గుబాళిస్తూ, మద జలం స్రవించే మద గజాల లాగు, సెలయేళ్ళతో నిండిపోయే పర్వతాలూ – అన్నిటి వర్ణనలూ మనసు నిండా మెదిలాయి. 'అవును, వర్ష రుతువు బహు సుందరమైనది' అని తల పంకించాడు.

రాముడి ధ్యాస అంతా యుద్ధాలోచనల మీదే ఉంది. "లక్ష్మణా! మేఘాలు, యుద్ధ భేరీల లాగు గర్జిస్తున్నాయి చూడు! పర్వతాలు యుద్ధాలలో ఏనుగుల లాగు ప్రతిధ్వనులతో ఘీంకరిస్తున్నాయి సుమా! ఈ రుతువులో రాజులు యుద్ధాలు నిలుపు చేస్తారు. యుద్ధ సేనలు స్వస్థ లాలకు తిరిగి వస్తాయి" అంటూ కొంతసేపు యుద్ధాల గురించి ముచ్చటించాడు.

చింత చిగురుతో చేపల కూర వండి, తాటి పళ్ళు కాల్చి, భోజనానికి పిల్చిన లక్ష్మణుడి మీద ఆదరం పుట్టు కొచ్చింది రాముడికి. చిరునవ్వుతో మాటలు సాగిం చాడు.

"లక్ష్మణా! ఆ మేఘ సముదాయం చూడవోయీ! ఆకాశం ఎంత సుందరంగా సంధ్యారాగ చందనం పూసు కుందో చూడు! స్త్రీల కౌగిళ్ళ కోసం ఆతృత పడుతున్న కాముకుడి లాగు ఆకాశం మంద మారుతాలు నిశ్వ సిస్తోంది చూడు! ఈ వర్ష రుతువులో స్త్రీల సామీప్యమే పురుషుడికి అమితంగా సుఖం కలిగిస్తుందోయీ!"

"చిత్తం" అని లక్ష్మణుడు కొంచెం సందేహంలో పడ్డాడు. పురుషుడికి గొప్ప సంతోషం కలిగించేది వసంత రుతువేనని అన్నగారు వసంత రుతువులో చెప్పి నట్టు గుర్తు. ఇప్పుడు, 'వర్ష రుతువే' అంటున్నారు. అయితే ఇదే గొప్పది కావున్ను! అన్నగారికి అన్నీ తెలుసు!

వాన ఎక్కువవుతోంది.

తురాయి కొమ్మలు, రాముడితో ఆటలాగ ఇటూ అటూ తప్పుకుంటున్నాయి. వొళ్ళంతా తడిసి రాముడు బండ మీదనించి గబ గబా లేచాడు.

భూమి, జల్లు జల్లులుగా పడే నీటిని ఆలింగనాలు చేసుకుంటూ ఆతృతతో "వచ్చావా, వచ్చావా" అని లోప లికి తీసుకుంటోంది. – "ప్రియా! నీ ఎడబాటు ఎంత దుర్భరమోయీ! ఎన్ని దినాలుగా నిరీక్షిస్తున్నానో గదా నీ కోసం" అంటూ నీటిని కౌగిలించుకుంటూ, ఉద్వేగంతో ఆవిర్లు గక్కుతూ, వెచ్చగా నిట్టూరుస్తోంది. చెట్టూ చేమా, మొక్కా మోడూ, తడిసి పరవశంతో సొమ్మసిల్లుతు న్నాయి. గాలి, మట్టి పరిమళాలు మోసుకుపోయి చుట్టూ పంచిపెడుతోంది. నెమళ్ళు, వానలో తడుస్తూ కూస్తు న్నాయి. మేఘాలు, నెమళ్ళ లాగానే ఉరిమి వాటిని ఆట పట్టిస్తున్నాయి. తుమ్మెదలు, వర్షానికి జడిసి అందిన ఆకుల అడుగున దాక్కుంటున్నాయి. అన్ని చెట్లకీ నేరేడు పళ్ళే కాశాయేమిటని అడివి ఆశ్చర్యపోతోంది.

వర్ష ధారలతో జగత్తంతా తనని తను అభిషేకం చేసుకుంటోంది.

ఆకాశం, ఉధృతంగా అలలు లేచిన సముద్రం లాగ అయిపోయింది.

సముద్రమంతా భూమికి దిగుతున్నట్టు కురుస్తోంది వర్షం! ఆకాశం తడిసి, మెత్తగా కరిగి, జారి పోతున్నట్టు కురుస్తోంది వర్షం! రుష్యమూకం మీద ఆ గుహ తప్ప, చుట్టూ ప్రపంచమంతా, నీటిలో మునిగి పోయినంత భీకరంగా అయింది. ఫెళ్ళున ఆకాశం విరిగి రాళ్ళు జారి, పర్వతాల మీద పడుతున్నట్టు చప్పుడు చేస్తోంది వర్షం!

"అమ్మా! భయమేస్తోందే!" అంటూ తల్లిని కరుచుకుంది పావురం పిల్ల.

"లేదమ్మా! .... భయం లేదు. తగ్గిపోతుంది. చూడు, అన్న ఎంత ధైర్యంగా ఉన్నాడో!"

"నాకూ భయంగానే ఉందే అమ్మా!" అని అన్న కూడా తల్లి రెక్కల్లో దూరాడు.

"వాన అంటే ఇలా గుంటుందా? .... ఛీ! మన కెప్పుడూ వాన వొద్దే అమ్మా!" అని చెల్లి బిక్కమొహం వేసింది.

"తప్పు, అలా అనకూడదు. వాన లేకపోతే అందరికీ ఎంత కష్టం! రేపు నువ్వే చూస్తావుగా? ఎన్ని కొత్త చెరువులో, ఎన్ని కొత్త వాగులో, ఎన్ని చేపలో, ఎన్ని పురుగులో! ఆరుద్ర పురుగులంటే నీ కెంతో ఇష్టంగా? రేపు పుట్టలు పుట్టలు లేస్తాయి. బోలెడు తెచ్చి పెడతాను మీకు. వాన పోయాక రెండు రోజుల్లో ఎంత బాగుం టుందో తెలుసా? ఎటు చూసినా పువ్వులే. రంగు రంగులు! చెట్లనిండా గుబుర్లు గుబుర్లుగా ఆకులొస్తాయి. మనకేవీ భయం వుండదు. వేటగాళ్ళకు కనబడకుండా ఆకుల్లో దాక్కోవొచ్చు. తర్వాత ఎన్ని పళ్ళో కాస్తాయి. అన్నీ తినొచ్చు."

"ఆకాశం అలా కేకలేస్తోం దెందుకూ?"

"అది కేకలెయ్యడం కాదు. మేఘాల్లోంచి వాన పడు తోందిగా? మేఘాలు, పురిటి నొప్పులు పడుతున్నాయి. అంతే."

"అమ్మా! ఆకాశంలో ఎవరుంటారే?"

"ఏమోనర్రా! నే నెప్పుడూ చూడలేదు."

"మనం ఎగిరి .... ఎగిరి .... పైకి పోయి దేవుడున్నాడేమో చూద్దామే."

"అమ్మో! ఎలా వెళ్తాం? పగలు వెళ్దాం అంటే ఎంత ఎండో! వెళ్ళలేం. రాత్రి వెళ్తే ఎంత చీకటో! అసలే వెళ్ళలేం."

"పోనీ, దేవుడెప్పుడూ కిందకి రాడా?"

పక్క గూట్లోంచి "దేవుడంటున్నారేవిటర్రా?" అని చిలక పలకరించింది.

"వీళ్ళిద్దరూ దేవుణ్ణి చూడాలని సరదా పడుతున్నా రొదినా! అస్తమానూ దేవుణ్ణి చూపించమంటారు. ఎలా చూపిస్తాం వొదినా?"

"దేవుడంటే జ్ఞాపకం వొచ్చింది .... రుష్య మూకం మీద పెద్ద గుహలో .... నల్లటాయన లేడూ? ఆయనే దేవుడట!"

"ఛా, ఊరుకో .... పాడు మాటలు ....!"

"ఊరుకో కాదు. ఆయనే దేవుడట! కావాలంటే రేపు ఆ గుహ దగ్గిరికి పోయి చూద్దాంగా?"

"చూస్తే ఏం తెలుస్తుంది? అసలా పెద్ద గుహలో ఎప్పుడూ పందులుండేవి కాదుటమ్మా? దేవుడెప్పు డొచ్చాడూ?"

"ఆ పందుల గుహ కాదు వొదినా! కిష్కింధ వేపు .... తురాయి చెట్టు దగ్గిర గుహ లేదూ? .... అందులో ఇద్దరు సన్యాసులుండడం లేదూ? వాళ్ళల్లో పెద్ద సన్యాసే దేవుడట! చాలా గొప్ప దేవుడట!"

"ఏదీ! ఆ వాగు వేపు గుహలోనే కాదూ నువ్వనేదీ?"

"ఆఁ, అందులోనే. ఆయన భార్యని ఎవరో ఎత్తుకు పోయారట పాపం! ఆ ఇల్లాల్ని వెతుక్కుంటూ వొచ్చి ఇక్కడుంటున్నారు!"

"అమ్మా! మనకి సన్నాసి దేవుడొద్దే! మంచి దేవుణ్ణి చూద్దామే!" అని పిల్లలు ఇవతల ఒకటే గొడవ. మాటలు వినపడనిస్తేనా?

వాళ్ళమ్మ విసుక్కుని – "ఎవరితోనన్నా మాట్లాడు తోంటే అల్లరి చెయ్యకూడదని చెప్పానా? బొత్తిగా చెప్పిన మాట వినకుండా తయారయ్యారమ్మా!" అని పిల్లల్ని కోప్పడి, మళ్ళీ పక్క గూటావిడ వేపు తిరిగి – "మరి ఇక్కడే కూచుంటే భార్య ఎలా దొరుకుతుందీ? ఎటన్నా పోయి వెతుక్కుంటున్నాడా?" అని మాటల్లోకి దిగింది.

"అబ్బే! ఇక ఈయన వెతుక్కో నక్కర్లేదట! అదంతా సుగ్రీవుడే చూసుకోవాలి. అలా వొప్పందం చేసుకున్నాక ఈయనకేం పట్టింది వెతుక్కునేదాకా? సుగ్రీవుడే వెతికి పెట్టాలి. ఎవడి కోసం వెతికి పెడతాడూ? ఈయన ఆయన అన్నని చంపి పెట్టాడుగా? ఆయన, ఈయన భార్యని వెతికి పెట్టాలి. మొన్నటిదాకా ఈయన వెతు క్కుంటూనే ఉన్నాడట. ఈ ఒప్పందం తర్వాతే మానేశాడు గానీ ...."

"బాగానే వుంది వొప్పందం! ఎలా తెలుస్తాయో గానీ ఎక్కడెక్కడి కవుర్లూ నీకే తెలుస్తాయి వొదినా!"

"నువ్వీ మధ్య పిల్లల్తో తెమలక దూరంగా రావడం లేదు గానీ, కిష్కింధ వేపు పోతే సుగ్రీవుడి మందిరాల వేపు ఎన్ని పాటలో ఈయన్ని గురించి! చిన్నప్పట్నించీ చాలా గొప్పవాడట ఈయన!"

"ఏమోనమ్మా! ప్రతీ మాటా నమ్మకూడదు. ఉన్నవీ లేనివీ కల్పించి చెబుతారు. ఈయన్ని గురించి ఎవరింట్లో ఏం గుస గుస లాడుకుంటున్నారో మనకేం తెలుస్తుంది, పాటలూ కేకలే పైకి వినబడతాయి గానీ?"

"బాగా అన్నావు. ఈయన మీద పాడే పాటలన్నీ ఏవిటో తెలుసా? .... ఈయన చిన్నప్పట్నించే ఎవ రెవర్నో చంపాడట .... తాటకిని చంపాడట! ఖరుణ్ణి చంపాడట! మారీచుణ్ణి చంపాడట! ఎవరెవరో ఆడ వాళ్ళకి ముక్కులూ చెవులూ కోయించాడట! ఇంకా కూడా ఎవరెవర్నో నమ్మా! ఆ పేర్లన్నీ మరిచిపోయి చచ్చానూ ...."

"వాలినీ చంపాడుగా?"

"ఆఁ, అదీ! నిన్న మొన్న నిష్కారణంగా వాలిని చంపాడు! ఇంకా ఎవరెవర్నో చంపి రాక్షస సంహారమో ఏదో చేస్తాడట!"

"ఛీ! మనకి చంపే దేవుడొద్దే అమ్మా!" అని పిల్లలు అమ్మ చివాట్లు మర్చిపోయి మళ్ళీ పేచీ మొదలెట్టాయి.

అమ్మ వినిపించుకోకుండా వొదినతో మాటల్లో పడి పోయింది. "చంపడమంటే గుర్తొచ్చింది వొదినా! వాలిని చంపడం నా కళ్ళారా చూశానమ్మా! ఆ పాడు బాణాలతో కొట్టాడు! ఆ బాణాల గురించి మన కేనాడన్నా తెలు సునా, చచ్చునా? అందుకేనమ్మా నేను రుష్యమూకం వేపు వెళ్ళనే వెళ్ళడం లేదు" అని పిల్లల్ని దగ్గిరికి తీసు కుంది.

"మన జోలికి రాడులే వొదినా! ఈ మధ్య పంపలో చేపల మీద పడ్డాడు. రుష్యమూకం నిండా పాములుంటా యని అసలా గుహ వొదిలి బయటికి రావడం లేదు. చాకిరీ అంతా చిన్న సన్నాసేగా? వాడు, చేపల్ని ఇనప కాడకి గుచ్చి కాల్చిన వాడు కాల్చినట్టే ఉంటాడు. పూట పూటా అదే పని!"

"అమ్మా! మనకి గుహలో దేవుడొద్దే. ఆకాశంలో దేవుణ్ణి చూద్దామే!" అని పిల్లలు గోల పెడుతోనే ఉన్నాయి.

అమ్మ పిల్లల్ని ముద్దెట్టుకుంటూ – "అలాగే వెళ్దాం, మీరు పెద్దయ్యాక. ఏం, మరి దారిలో ఎత్తుకోమని యాడవకూడదు. సరేనా? ఇక పడుకోండి. రేపు తొందరగా లేచి బోలెడు పురుగులు తినొచ్చు."

"ఎర్ర పురుగులేనా? ...."

"అమ్మా! నాకు చెద పురుగులు కావాలే" అంటూనే పిల్లలు నిద్రకి పడ్డాయి.

పాలు తాగుతూ తాగుతూ కళ్ళుమూసి నిద్రకి పడ్డ శిశువులాగే అడివంతా వర్షంలో తడిసి తడిసి సందడి తగ్గి నిశ్శబ్దం అయింది.

★ ★ ★

ఆకాశం బూచాడిలాగ జడిపిస్తోనే ఉంది. ఎక్కడో తళుక్కున మెరిసి, గుహ ఒక్కసారి వెలిగి, చీకట్లు కమ్మింది.

రాముడి మనసులో, రావణుడి బాహువుల్లో సీత .... తళుక్కున మెరిసి, మనసంతా కారు చీకట్లు కమ్మింది.

గాలి, పూర్తిగా వానలో తడిసి, చెట్లలోంచీ, కొండ ల్లోంచీ, గుహలో తల దాచుకోడానికొస్తోంది. వచ్చినప్పు డల్లా కిష్కింధ వేపునించీ గజ్జెల మోతలూ, మృదంగాల దరువులూ వెంట తెస్తోంది. మాటి మాటికీ రాముడితో, "సుగ్రీవుడు నాట్యాలు చూస్తున్నాడు. పాటలు వింటు న్నాడు. తెలుసా నీకు?" అని గుస గుస లాడుతోంది. ఎప్పటి కప్పుడు వార్తలు మోసుకొస్తోంది.

"అవును. వింటున్నాను. రోజూ వింటున్నాను" అంటూ నిట్టూరుస్తున్నాడు రాముడు.

సుగ్రీవు డెంత అదృష్టవంతుడో! నిత్యం సుఖ భోగాలలో మునిగి తేలుతున్నాడు. రాజ్యం దొరికింది! భార్య దొరికింది! తనూ అలాగే .... అయోధ్యలో పట్టాభి షేకం చేసుకుని, సీతతో .... సీతతోనా? .... సీత .... శీలం? .... ఇంత కాలం పర పురుషుడి గృహంలో ఉన్న భార్యని స్వీకరించ వొచ్చునా? .... లోకం మెచ్చు తుందా?

పర పురుషుడితో భోగించిన స్త్రీని సుగ్రీవుడు నిస్సం దేహంగా స్వీకరించాడే! .... అతడు ఆటవికుడు. వన చరుడు. మృగతుల్యుడు. తనవంటి ఉత్తముడూ, జ్ఞాన వంతుడూ, అంత నీచ కార్యం చెయ్యకూడదు. విద్యాధి కులూ, పండితులూ, రుషులూ నిర్దేశించిన శాస్త్ర ధర్మాలు, శీలవతిగాని స్త్రీని భర్త స్వీకరించడాని కెంత మాత్రమూ అంగీకరించవు.

ఏమిటీ ఆలోచనలు! .... సీతని త్యజించడమా! .... మహా పతివ్రత సీత, పర పురుషుడికి లొంగుతుందా? అది ఎన్నటికీ జరగదు. ఎంతో ఉత్తమురాలు సీత! సీత తల్లికూడా మహా పతివ్రతే! సీత అమ్మమ్మ కూడా గొప్ప పతివ్రతేనని చెబుతారు. సీత చెల్లెళ్ళు మాత్రం? అందరూ పతివ్రతలే .... అసలు సీత పుట్టిన వంశమే పతివ్రతల వంశం! అంత గొప్ప వంశంలో పుట్టిన సీత, రావణుణ్ణి కన్నెత్తయినా చూస్తుందా? చూడదు. సందేహం లేదు.

ఆ దుర్మార్గుడితో యుద్ధం గురించే ఆలో చించాలి. అంతా సుగ్రీవుడి మీదే ఆధారం. రావణుణ్ణి చంపడం, వాలిని చంపినట్టు సామాన్యమైన పని కాదు. రాక్షస రాజుతో యుద్ధం! గొప్ప సైన్యం కావాలి. బొక్కసం కావాలి. సుగ్రీవు డేం చేస్తాడో! ఏం జరుగుతుందో! జయాప జయా లెవరివో! రావణుణ్ణి కూడా చంపి, ఆ

రాజ్యం కూడా ప్రత్యక్షం గానో, పరోక్షంగానో ఆధీనంలో ఉంచుకో గలిగితే .... అంతలో ఈ వన వాసం ముగు స్తుంది. అయోధ్యకు పోయే శుభ క్షణాలు రానే వస్తాయి. కానీ, అనుకున్నదంతా అనుకున్నట్టు జరుగుతుందా? తానొకటి తలిస్తే దైవ మొకటి తలుస్తాడు!

దీర్ఘంగా నిట్టూర్చాడు రాముడు – "లక్ష్మణా! నా వంటి దురదృష్ట వంతుడుంటాడా ఎక్కడైనా? .... రాజ్యం వొదిలింది మొదలూ ఎన్ని కష్టాలు! ఈ వనవాసం చక్కగా ముగిసి మనం సుఖంగా అయోధ్యకు తిరిగిపోతే ఎంత బాగుండును! ఆ దుర్మార్గుడు, ఒంటరిగా ఉన్న సీతని .... ఆమె తప్పేముంది? .... స్త్రీలు అబలలు, నిస్సహాయులు. నా ధర్మపత్నితో ఈ ఎడబాటు ఇంకెంత కాలమో గదా? ఈ వర్ష రుతువు .... ఈ చల్ల గాలులు .... ఈ పువ్వులు .... ఈ పక్షులు .... రాత్రింబవళ్ళూ ఈ ఎడబాటు .... అయ్యో! నన్ను దహిస్తోందే!"

"అన్నగారూ! దుఃఖించవొద్దు. ధైర్యం వహించండి!"

"ఏమి ధైర్యమోయీ! ఈ విరహాగ్ని కాలుస్తోంది. రావణుడితో యుద్ధం గురించి తల్చుకుంటూ వుంటే ధైర్యం పూర్తిగా నశిస్తోంది."

"ఎంత మాట అన్నగారూ! మీరు పూర్తిగా దుఃఖ సాగరంలో మునిగి అధైర్య పడుతున్నారేగానీ మీ రెంతటి పరాక్రమవంతులో మీ రెరుగరు. ధైర్యం వహించండి! ఇక ఎంతో కాలం పట్టదు. ఈ వర్షా కాలం గడిచిపోతే శత్రువుని చంపడానికి అన్ని ప్రయత్నాలూ చేసుకొని, యుద్ధానికి పోవచ్చును. వదిన గార్ని తప్పకుండా ఆ దుర్మార్గుడి చెర నుంచి విడిపించ వొచ్చును. ఏ కార్యం ఎలా నిర్వర్తించుకోవాలో తెలిసిన మహానుభావులు మీరు. ధర్మాత్ములు. దైవ నిష్ఠాపరులు. ఆస్తికులు. జ్ఞానులు. మీరు తలుచుకుంటే సముద్రాల్నీ, కొండల్నీ, అరణ్యాల్నీ, సూర్య చంద్రుల్నీ, అసలు భూమండలాన్నే తల్లకిందులు చేసెయ్యగలరు. ఇక రావణుడెంత?"

లక్ష్మణుడి నోట్లోంచి వానాకాలపు నదీ ప్రవాహం లాగ దూకుతున్నాయి మాటలు. ఎన్నో సంవత్సరాల నుంచీ అలవాటై పోయింది, అన్నగార్ని పొగడడం. రాముడికి కూడా అలవాటై పోయింది, పొగిడించు కోవడం. లక్ష్మణుడు తనని శ్లాఘించి, ధైర్యం చెప్పని పూట రాముడి మనసంతా నిరుత్సాహంతో నిండి పోతుంది. రావణుణ్ణి జయించడం ఎన్నటికీ సాధ్యం కాదనే అధైర్యం కలుగుతూ ఉంటుంది.

ఎప్పటికప్పుడు లక్ష్మణుడు చెప్పే ధైర్య వచనాలే రాముడికి శ్రీరామ రక్ష! కొండంత బలం! రాముడు నిట్టూర్చి, "లక్ష్మణా! నా క్షేమంగోరి నువ్వింతగా చెబు తోంటే నేనిక విచారించి లాభమేముంది? ధైర్యం వహించక తప్పుతుందా?" అని గంభీరంగా తల పంకించాడు.

తురాయి చెట్టు, గాలితో విసిగి పోతోంది. గుహ పక్క పందిరి మీదకు వాలి నీరసంగా పడుకుంది. లక్ష్మణుడు గుమ్మం వేపు చూసి – "చెట్టు విరిగేటట్టు ఉందే!" అని గబ గబా బయటికి వచ్చాడు.

తురాయి చెట్టు వొళ్ళంతా తడిసి వొణుకుతూ లక్ష్మణుణ్ణి చూడగానే సంతోషంతో మొహం ఎత్తింది. "ఎంత వాన! ఎంత వాన! చూశావా చిన్న సన్యాసీ? .... పందిరి విరగదీస్తా ననుకుంటున్నావా? .... కాస్సేపు గాలికి తప్పుకుని ఇటు వొరిగాను, అంతే. మీ అన్న చాలా గొప్ప వాడని రోజూ కీర్తిస్తావు. నేను వింటూనే ఉన్నాను. ఇందాక కూడా .... ఏవిటో .... సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ భూ మండలాన్నీ ఏవిటో చేస్తాడంటున్నావు. సరిగా వినపడ లేదు. ఈ వాగు హోరు వొకటీ, కొంచెం మీ అన్నకి చెప్పి .... ఈ గాలి విసురు తగ్గిస్తాడేమో అడుగుతావూ? చచ్చిపోతున్నాను దీనితో. నిలబడ నిచ్చే లాగ లేదు. ఈ కష్టంలో నన్నెవరు ఆదుకుంటారు పెద్ద సన్యాసి గాక?" అంటూ లక్ష్మణుడి వేపు వొంగింది.

లక్ష్మణుడు చెట్టు వేపు చూసి పందిరికేమీ ప్రమాదం లేదని గ్రహించి గుహలో కెళ్ళిపోయాడు.

అతని వెనకాలే గాలి గుహలోకి జొరబడి రాముడి దగ్గిరికి పరిగెత్తింది. – "అబ్బ! నా కసలు కిష్కింధ నించి రా బుద్ధి వెయ్యడం లేదు. సుగ్రీవుడు ఎంత చక్కని నాట్య కత్తెల మధ్య కూర్చున్నాడో తెలుసా రాముడూ?" అంది.

రాముడి ఆలోచనలన్నీ సుగ్రీవుడి చుట్టూనే తిరుగు తున్నాయి. పట్టాభిషేకం చేసుకున్నది మొదలూ ఒకటే విలాసాలు! .... మద్యపానం .... స్త్రీలతో భోగం .... ఇంతగా విలాసాలలో మునిగి తేలేవాడు ఇక తనకి సహాయం ఏం చేస్తాడు? నమ్మడానికి వీల్లేదు. రాజ్యాధి కారం దక్కింది. ఇంకేం స్నేహం? ఉపకారానికి ప్రత్యుప కారం చేసే వాడెంతటి ఉత్తముడై వుండాలి! అందరూ అంత ఉత్తములవుతారా?

"లక్ష్మణా! సుగ్రీవుడు నిత్యం కామ సుఖాలలో మునిగి తేలుతూ ఉన్నాడు. నాకు చేసిన వాగ్దానం గుర్తు పెట్టుకుంటాడంటావా? అన్నమాట ప్రకారం సహాయం చేస్తాడంటావా?"

"ఎంత మాట అన్నగారూ! మీ ఆజ్ఞ ధిక్కరించే సాహసమా వానర రాజుకి?"[279]

**279.** **కిష్కింధాకాండ, సర్గ 27, శ్లోకాలు 17,18,19:** రాముడు – సుగ్రీవుడి గురించీ, తన గురించీ, రావణుడి గురించీ ఏ విధంగా ఆలోచిస్తున్నాడో చూడండి. "శత్రువును జయించి, భార్యతో గూడి, గొప్ప రాజ్యములో నుండి సుగ్రీవుడు గొప్ప సుఖము ననుభవించుచున్నాడు. నేను రాజ్యమును విడిచి వచ్చి, భార్యను పోగొట్టుకొని, నది వొడ్డు కూలినటుల ➔

రాముడి మనస్సు కొంత తేలిక పడింది.

మేఘాలు కొండ శిఖరాల మీద ఆగి విశ్రమించి తేలికపడి లేస్తున్నాయి.

వాన ఉధృతం తగ్గుతోంది.

గాలి కూడా చలికి జడిసి పరుగులు మానుకుంది. వర్షం తగ్గుతోంటే, రుష్య మూకం, చుట్టూ నీటితో సముద్రంలోంచి లేస్తోన్న చంద్రవంక లాగ అయింది. పర్వతం నిండా నీటి పాయలు బండల్ని దొర్లించు కుంటూ పక పక నవ్వుల్తో కిందికి దూకుతున్నాయి.

ఆకాశం కురిసి కురిసి, అలిసి, ఎర్రబారింది.

కొండల మీద వర్షం వెలిసింది.

నీటి పాయలు దూకి దూకి ఊరుకున్నాయి. వాగు పట్టలేని సంతోషంతో, ఆర్భాటంతో, పరుగులు తీస్తోంది.

ఒడ్డు మీద చెట్లూ తీగలూ, వాగుని చూస్తూ, "ఎప్పుడూ చక్కగా, నిదానంగా మాట్లాడుతూ వెళ్ళే దానివి, నిలబడకుండానే పోతున్నావే?" అని మాటి మాటికీ అడుగుతున్నాయి.

వాగు నవ్వి – "ఆ రోజులు వేరూ, ఇప్పుడెలా కుదురుతుందర్రా? .... వెళ్ళాలి, అంతే. ఏం చెయ్యనూ? .... మిమ్మల్ని మర్చిపోనుగా?" అంటూ చెట్ల పాదాలు ముట్టుకుంటూ వొట్లు పెడుతూ పరుగులు తీస్తోంది.

"అత్తారింటికి పోతున్నావు. అదీ నీ తొందర. మాకూ తెలుసులే" అని హాస్యాలాడుతున్నాయి చెట్లూ, తీగలూ.

లక్ష్మణుడు లేచి ఆరిపోతున్న నిప్పుల్లో రెండు దుంగలు పడేసి నెగడు ఎగదోశాడు.

పందిరి కొంచెం వొరిగినట్టే అయింది. రేపు చీకట్నే లేచి గుంజలు గట్టిగా పాతాలి. అసలే వానా కాలం .... ఒకటే ముసుళ్ళు .... పందిరి పడిపోయిందంటే నిప్పు రాజెయ్యడానికి వీలే ఉండదు – అని స్వగతం చెప్పు కున్నాడు. అన్నగారికి నిద్రపట్టిందని గ్రహించి తను కూడా పడుకోడానికి సిద్ధపడుతూ కత్తి దగ్గిర పెట్టు కున్నాడు – "ఈ రాత్రి ఎలా జొరపడతాడో నేనూ చూస్తాను. ఒక్క దెబ్బతో నరికి ముక్కలు చేస్తాను" అను కుంటూ గుమ్మంలో నడుం వాల్చాడు. ఆ కత్తి, మన్మధుడి మీద యుద్ధం కోసం! ప్రతీరాత్రీ అన్నగారి కేకలూ, లక్ష్మణుడు నిద్రమత్తుతో లేచి, యుద్ధం ఎందుకో ఎవరి మీదో మరిచిపోయి... గంతులూ – అన్నీ సాగవలిసిందే!

చల్ల గాలి, లక్ష్మణుడి వీపూ భుజాలూ నిమురుతూ "పగలంతా చాకిరీతో సతమత మవుతావు. ఇప్పుడన్నా సుఖంగా పడుకో. నిద్రపో" అంటూ జో కొడుతోంది.

మబ్బులు చాలా వరకూ విడిపోయాయి. ఆకాశం

---

➔ దుఃఖించుచున్నాను. నా శోకము గొప్పదిగ నున్నది. వానాకాలము, సైచుటకు తగనిదిగ నున్నది. రావణుడు మహా శత్రువుగ నున్నాడు. వీడిని జయించుట సాధ్యము కాదని తోచుచున్నది."

రావణుడితో యుద్ధం గురించి రాముడు చాలా భయపడుతున్నాడు. దుఃఖపడుతున్నాడు.

**లక్ష్మణుడి ఓదార్పు:** "రామా! లోకములో నీవు కార్య శీలుడవుగను, దైవ నిష్ఠా పరుడవుగను, ఆస్తికుడవుగను ఉన్నావు. సముద్రములతో, కొండలతో గల భూమిని తల్లక్రిందులు జేయుటకు నీకు శక్తి గలదు. ఇక రావణుడెంత మాత్రము?"

రాముడు దైవ నిష్ఠాపరుడు. ఆస్తికుడు. అంటే, రాముడు దైవాన్ని విశ్వసిస్తాడు. నిష్ఠతో పూజిస్తాడు. అంటే, రాముడే దైవం కాదు. దైవం వేరే ఇంకెవరో!

రావణుడు బలిష్ఠుడైన రాజు అని కవి ఎప్పుడూ చెపుతూ వుంటాడు. ఎందుకంటే, అంత గొప్పవాణ్ణి రేపు రాముడు జయిస్తాడు గనక. కానీ, ప్రస్తుతంలో తాడూ బొంగరం లేని రాముడు, రావణుడితో యుద్ధం చెయ్యాలంటే, అది రాముడికి ఎంత కష్టంగా కనపడుతోందో కవి చెపుతూ వుంటాడు. మళ్ళీ రాముడు భయపడడం బాగుండదు కాబట్టి, లక్ష్మణుడి చేత కవి క్షణానికోసారి రాముడి పరాక్రమం గురించి దండోరా వేయిస్తూ వుంటాడు. రాముణ్ణి, లక్ష్మణుడు చాలా కీర్తించి చివరికి "రామా! నిద్రించే నీ పరాక్రమమును నేను నిదుర లేపుచున్నాను!" అంటాడు. "రాముడికి పరాక్రమం ఉంది సుమా!" అని చెప్పడం. ఉంది గానీ, అది నిద్రపోతూ ఉంటుంది! భయం మాత్రం ఎప్పుడూ మేలుకునే ఉంటుంది. దానికి నిద్దర్రాదు మరి!

సుగ్రీవుడికి పట్టాభిషేకం అయిపోయిన తర్వాత, రాముడు రుష్యమూకం మీద నివాసం ప్రారంభించింది మొదలూ, సుగ్రీవుడు తనకు సహాయం చేస్తాడో లేదోనని శంకిస్తూనే ఉన్నాడు. కొన్నాళ్ళు పూర్తి విశ్వాసంతో ఉండి, తర్వాత శంకించడం అయినా కాదు. మొదటినించీ సందేహమే. తన శంకలు అణచుకోవడానికి ప్రయత్నిస్తూ, "సుగ్రీవుడు మంచి వాడే మరి! మాట తప్పని వాడే మరి!" అని తనకు తను నచ్చజెప్పుకుంటున్నాడు. "సంకేత కాలము సమీపించుట సుగ్రీవుడే గ్రహించుకొని, ప్రత్యుపకారము చేయుటకు యత్నించును. సందేహము లేదు. (అంటే సందేహం ఉందన్న మాట!) ఉపకారము బొందియుండు వీరుడు ప్రత్యుపకారము తప్పక చేయును (చెయ్యడేమోనని భయం!) ఉపకారమును మరిచి ప్రత్యుపకారము సేయని వానిని సత్పురుషులు నిందించెదరు." (లోక నిందకు జడిసి అయినా తనకు సహాయం చేస్తాడని ధైర్యం.)

అన్నగారికి లక్ష్మణుడు ఓదార్పు! "నీ కోరికలన్నియు తొందరలోనే వానర రాజు పూర్తి జేయును. శరత్కాలము సమీపించు వరకూ దృఢ చిత్తముతో నుండుము."

★

వాగులో మునిగి లేచినట్టు కాంతిగా, నిర్మలంగా అయింది. వాన తగ్గిందో లేదో చూద్దామని గాలి అడి వంతా తిరుగుతోంది.

వాన కురిసినంతసేపూ చంద్రుడు ఎక్కడో దాక్కుని వానని వెలవనిచ్చి బైటికొచ్చి కొండ లెక్కుతున్నాడు.

లక్ష్మణుడికి అప్పుడే మాగన్నుగా కన్ను అంటు తోంది.

".... హా! లక్ష్మణా! .... సైచలేను. సైచలేను. ఈ దుర్మార్గుడు .... బాణాలు .... బాణాలు ... అయ్యో! .... లక్ష్మణా! ...."

తుళ్ళిపడి లేచాడు లక్ష్మణుడు. "ఎవరు? .... ఎవరు? .... అన్నగారూ! ఎక్కడ? .... ఎక్కడ? .... దుర్మార్గుడు?" అంటూ కంగారుగా కత్తి అందుకున్నాడు.

"లక్ష్మణా! అయ్యో! .... ఈ కాముడు .... విరి శరాలు .... గుప్పిస్తున్నాడే!"

"విరి శరాలా? .... కాముడా? కాముడెవడు? చంపేస్తాను వాణ్ణి ...." – లక్ష్మణుడి కళ్ళు కూరుకు పోతోంటే, నిద్ర మత్తుతో కత్తి ఎత్తి గుహలో గిర గిర తిప్పాడు కాముడి కోసం.

రాముడు మెత్తని గడ్డి పరుపు మీద మెలికలు తిరుగుతున్నాడు ".... ఈ మన్మథుడు .... పూల బాణా లతో .... అయ్యో! .... మిక్కిలి బాధిస్తున్నాడే! తాళలేను .... ఈ ఎడబాటు .... వర్ష రుతువు .... ఈ మన్మథుడి కాఠిన్యం ...."

"మన్మథుడా! మళ్ళీ వచ్చాడా? .... వాణ్ణి శిక్షించే మార్గమేమీ లేదా? .... ప్రతి రాత్రీ ఈ ఆగడం ఏమిటి?"

"అయ్యో! .... లక్ష్మణా! ఈ మదనుడు .... ఇంత నిర్భయంగా ...."

"మన్నించండి అన్నగారూ! .... నేను గుమ్మంలోనే పడుకున్నాను. మదనుడు రావడానికి వీలు లేదే!"

"అయ్యో! మదనుడు అనంగుడోయీ! శరీరం లేని వాడు ...."

"శరీరం లేనివాడు బాణాలెలా పట్టుకుంటాడు అన్నగారూ? మీ మీద బాణాలు ఎలా వేస్తున్నాడు?" అనబోయి లక్ష్మణుడు ఆ ప్రశ్నలు బలవంతంగా ఆపుకున్నాడు.

"ఆ బాణాలకు కూడా శరీరాలు లేవోయీ!" అంటారేమో అన్నగారు!

"మరి ఆ బాణాలు మన శరీరానికెలా తగుల్తాయి అన్నగారూ?" అని అడగ బుద్దేస్తుందేమో తనకి. అన్న గారు అసలే బాధపడుతోంటే .... ఈ అర్ధ రాత్రి ఎందుకొచ్చిన చర్చలు? ....

"హా సీతా! .... ప్రియురాలా! .... నీ ఎడబాటు నేనిక భరించలేను సుమా! .... ఈ వర్ష రుతువు .... ఈ చల్ల గాలులు .... పరిమళాలు .... అన్నీ నన్ను బాధిస్తున్నాయే! అయ్యయ్యో! .... ఈ వాడి పూల బాణాలు ...."

"అన్నగారూ! కొంచెం శాంతించండి. అవి పూల బాణాలు కావనుకుంటాను అన్నగారూ! పూల బాణాలైతే అంత వాడిగా తగలవు సుమండీ! ఈ చుట్టు పట్ల అడివి దోమలు ఎక్కువగా ఉన్నాయి. తేనెటీగ లంతంత ఉన్నాయి. ఈ పూట వర్షానికి బాగా లేచాయి. నేను సుఖంగా విసురుతాను. హాయిగా నిద్రించండి అన్న గారూ!" అంటూ లక్ష్మణుడు చీకట్లో గుహ అంతా పాకి, ఇటూ అటూ తడిమి ఆకుల విసనకర్ర పట్టుకున్నాడు.

"హయ్యో! దోమలు కాదోయీ లక్ష్మణా! మదనుడి క్రూర కార్యమే ఇది. మన్మథ బాణాలు రామ బాణాల కన్నా వాడియైన వోయీ! ఈ వర్ష రుతువు మదనుడికి తోడు పలుకుతోంది. మేఘ జలం తాగి .... చాతక పక్షులు .... పొదల్లో జంటలు జంటలుగా కూస్తున్నాయి, విను! .... సీతా! ప్రేయసీ! నీ ఎడబాటు వల్లనే .... మదనుడు .... ఇంత నిర్దయగా ...."

లక్ష్మణుడికి సందేహంగానే ఉంది – అన్న గారికి తాటి పళ్ళేవన్నా పడక కడుపు నొప్పి పుడుతోందేమోగానీ మన్మథుడి దుర్మార్గం కాదేమోనని! పాపం మాటలు, ఆ మన్మథుడెప్పుడూ తన మీద ఒక్క బాణమన్నా వెయ్యలేదే! ఏమో, చెప్పలేం .... ఏం కారణమో! .... అన్నగారి మీద బాణాలు పడకపోతే ఆయన మాత్రం ఎందుకింత తపన పడతారూ?

గాలి రుష్యమూకం అంతా తిరుగుతూ – "రాముడి కేకలు వింటున్నారా? ఈయన జితేంద్రియుడని ఎంతెంత గొప్ప పాటలు పాడతా రనుకున్నారూ అయో ధ్యలో? ఈ మధ్య కిష్కింధలో కూడా మొదలు పెట్టా రుగా?" అంటోంది చెట్టు చెట్టుతోటీ, పుట్ట పుట్టతోటీ.

"జితేంద్రియుడంటే కేకలు బాగా వేస్తాడని గావున్ను."

"ఛ! .... జితేంద్రియుడంటే ఇంద్రియాలు జయిం చిన వాడట!"

"ఇంద్రియాలంటే?"

"కళ్ళూ చెవులూ, మూతీ ముక్కూనూ."

"వాటిని జయించడం ఏమిటీ, శత్రువుల్ని జయించి నట్టూ? ఇంద్రియా లేవన్నా శత్రువులా? .... ఇంతకీ వాటిని జయించే దెవరూ? మనసా?

"అబ్బే, ఆత్మ! ఆత్మకి ఇంద్రియాలన్నీ శత్రువులేనట! ఇంద్రియాలు, సుఖాలు మరిగి, ఆత్మకి మోక్షం రాకుండా చేస్తాయట! అందుకే ఇంద్రియాలకు లొంగకూడదు. దేని మీదా మోహమూ ఉండకూడదు, ద్వేషమూ ఉండ కూడదు. దేని మీదా ఆశా ఉండకూడదు, నిరాశా ఉండ

కూడదు. కష్టం, సుఖం ఒక్కలాగే భరించాలి. మట్టీ, బంగారం ఒక్కటే అనుకోవాలి. అలా ఉంటే జితేంద్రియుడవుతారన్న మాట!"

"ఏడిసినట్టే ఉంది జితేంద్రియుడవ్వడం! ఆశ లేక పోతే నిరాశ ఉంటుంది. నిరాశ లేకపోతే ఆశ ఉంటుంది. వెలుతురు గాకపోతే చీకటీ, చీకటి గాకపోతే వెలుతురూ! చావు గాకపోతే బతుకూ, బతుకు గాకపోతే చావూ! అవి ఒక దాని కొకటి వ్యతిరేకం కదా? వాటిని పట్టుకుని, 'రెండూ ఒకటే' ఎలా అనుకుంటాం? అలా అనుకోడం పిచ్చి వాళ్ళకే చెల్లుతుంది. జితేంద్రియులంటే పిచ్చి వాళ్ళేనేమో! లేకపోతే, ఒక్క శరీరంలోనే ఇంద్రియా లకీ, మనస్సుకీ శత్రుత్వం ఏమిటీ?"

"మనసు కాదు .... ఆత్మ ...."

"పోనీ ఆత్మే .... అదీ శరీరంలోనే వుంటుందిగా?"

తురాయి చెట్టు వొణుకుతూ – "రాత్రుళ్ళు ఆత్మల సంగతెందుకర్రా? భయం వేస్తోంది. తెల్లారిం తర్వాత చెప్పుకోరాదూ?" అంది.

"సరేలే, మానేస్తాంలే" అని తురాయికి ధైర్యం చెప్పి, రుష్యమూకం నవ్వుతూ గాలితో చెప్పు కొచ్చింది. "నువ్వు గాలి జన్మా, నేను కొండ జన్మా ఎత్తాం గాబట్టి ప్రకృతి ధర్మాల చొప్పున బతుకుతున్నాం గానీ, ఖర్మగాలి మనం కూడా మానవ జన్మలు ఎత్తి వుంటే 'ముక్కుల్ని జయిం చండి, మూతుల్ని జయించండి' అని మనల్ని కూడా వాళ్ళ వేదాంతంతో చంపేసే వాళ్ళే, తెలుసా?" అని, జడిపించింది గాలిని.

రాముడు కంఠం తగ్గించి మూలుగుతూనే ఉన్నాడు. లక్ష్మణుడికి మన్మధుడి మీద పట్టరానంత కోపంగా ఉంది. ప్రతీ రాత్రీ నిద్రపోయే వాడిమీద బాణాలు గుప్పించడం ఏమిటి? ధైర్యం వుంటే ఎదట బడి పోట్లా డాలిగానీ .... చాటుగా మాటుగా ఇవేం పనులు? తుంటరి పనులు!

"నీ అన్న చాటునించీ బాణాలు కొట్టలేదూ వాలి మీద? ఎదటపడి పోట్లాడాలా? అప్పుడు అడగలేదేం నువ్వీమాట?" అన్నారెవరో!

లక్ష్మణుడు గిర్రున తల తిప్పి చుట్టూ చూశాడు. అంతా చీకటి! నిశ్శబ్దం! అన్నగారి విరహ వేదనల నిట్టూర్పులు తప్ప!

లక్ష్మణుడు, విసురుతూ .... విసురుతూ .... విసురుతూనే .... విసనకర్ర రాముడి మీద పడేసి తను పక్కకి వొరిగాడు.

★ ★ ★

రుష్యమూకం చుట్టూ, పశువులు, కాలికొద్దీ తిరిగి గడ్డి మేస్తున్నాయి. పశువుల్ని తోలుకొచ్చిన పిల్లలు పెరుగు ముంతలు చెట్లకి వేళ్ళాద గట్టి ఆటలకు దిగారు.[280]

వాళ్ళ ఆటలు చూస్తుంటే రాముడికి చాలా ఆశ్చర్యంగా ఉంటుంది ఎప్పుడూ. – ఎంతో నేర్పుగా కోతులలాగే రయ్యిన చెట్లెక్కేస్తారు! కొమ్మలు పట్టుకుని ఎలుగ్గొడ్ల లాగ వేళ్ళాడతారు! ఎంత ఎత్తు నుంచైనా సరే పిట్టలలాగ సునాయాసంగా దూకుతారు! చెట్ల చుట్టూ ఒకటే పరుగులూ, దొంగాటలూ!

అడివంతా వాళ్ళతో కలిసి ఆడుతుంది. కొండలన్నీ వాళ్ళతో కలిసి నవ్వుతాయి. వాళ్ళు, పిల్లం గోవులు వాయిస్తూ వుంటే గాలి మురిసిపోతూ వాళ్ళ వెనకాలే తిరుగుతుంది. అడివంతా తిరుగుతూ, ఎక్కడెక్కడి పువ్వులూ కోసి బారెడు బారెడు దండలు కట్టి వాళ్ళ గేదెలకీ, ఆవులకీ వేస్తారు. వాళ్ళ మెడల నిండా వేసు కుంటారు.

ఆడుతూ పాడుతూ, చెట్లూ పుట్టలూ తిరిగి, దొరికిన పళ్ళన్నీ కోసుకుంటారు. దుంపలు తవ్వి కాల్చుకుంటారు. అన్నీ తిని పెరుగు ముంతలన్నీ ఖాళీ చేస్తారు.

సాయంత్రం ఎలా అవుతుందో వాళ్ళకి తెలీదు. పొద్దు వాలుతోంటే గొడ్లన్నిటినీ వాగులోకి తోలు కొస్తారు.

రాముడు తురాయి చెట్టుకింద కూర్చుని వాగులో వాళ్ళ ఆటలు చూస్తూనే వుంటాడు. వాళ్ళు గేదెల తోకలు పట్టుకుని వాగులోకి దిగుతూంటే, గేదెలు నావలలాగ వాళ్ళని రయ్యిన ప్రవాహంలోకి లాక్కుపోతూంటే, వాళ్ళ నవ్వులూ .... అరుపులూ .... ఎంత ఆనందమో! వింతగా ఉంటుంది రాముడికి! .... ఎంత సేపో నీళ్ళల్లో ఈతలు కొడతారు. చేపల్లాగ .... నీళ్ళ అడుగున దాక్కుంటారు. ఇక్కడ మునిగి ఎక్కడో తేలతారు. నీటి

---

**280.** కిష్కింధ, సర్గ 30, శ్లోకాలు 48 51: రుష్యమూకం చుట్టూ పశువుల్ని తోలుకొచ్చే పిల్లలు తిరిగినట్టుగా కొత్త సంఘటనలు సృష్టించడం వాల్మీకి విరుద్ధం కాదు. రైతుల సంగతీ, గోపాలుర సంగతీ కవి ప్రస్తావించిందే. రాముడు శరదృతువును వర్ణించే సందర్భంలో, పంట పొలాల గురించీ, వేణుగానాల గురించీ కూడా ఇలా వర్ణిస్తాడు. – "పండి పక్వమైన శాలి ధాన్యము భుజించి, ముక్కులతో వెన్నులను ద్రుంచి తీసుకొని పోవుచుండు రమ్యమయిన కొంగల గుంపు పూల హారమువలె ఆకాశములో బోవుచున్నది .... గోపాలురు సేయు వేణు గానము ప్రకాశించుచుండు తూర్య ధ్వనితో గూడి, ప్రాతఃకాలము గాలితో వృద్ధిపొంది, వ్యాపించియుండు భాండములు, గోవులు, వృషభములచే ధ్వని ఒండొంటినీ వృద్ధిచేయు నటులున్నది."

★

పిట్టల లాగ సగం తేలి ఈదుతారు. ఎంత సేపో ఈది ఈది, ఆడి ఆడి, నేరేడు పళ్ళ లాగ నిగ నిగ మెరుస్తూ .... నల్ల రాళ్ళలాగ మెరిసే గేదెలెక్కి .... పిల్ల యముళ్ళ లాగ కిష్కింధ వేపు బయలు దేరుతారు.

వాళ్ళ ఆటలు చూస్తూంటే రాముడికి అప్పుడప్పుడూ .... తన చిన్నతనం గుర్తొస్తూ ఉంటుంది. ఎప్పుడూ బంతులతోటో .... ధనుస్సులతోటో .... కత్తులతోటో .... ఆడే ఆటలే తను ఆడినవన్నీ. ఒంటి నిండా ఆభరణాలతో పట్టు బట్టలతో, గుర్రాల మీద స్వారీలు చేయిస్తూ తిప్పేవారు. వస్తాదులు వచ్చి రెండు పూటలా వ్యాయామం చేయించే వారు. దాసీలు, చుట్టూ జేరి తైల మర్దనాలు చేసి, స్నానాలు చేయించేవారు. సాయంత్రం వేళల్లో చక్క చక్కని రథాల్లో వ్యాహ్యాళి తిప్పేవారు .... ఏది చేసినా .... దాసీలో, పరిచారకులో, గురువులో చేయించడమే గానీ .... ఈ వానరుల పిల్లల లాగు ఎన్నడూ స్వతంత్రించి ఆటలాడింది లేదు.

ఒక్కసారి గేదె మీద ఎక్కితే ఎలాగుంటుందో! – ఆలోచనల్లో మునిగిన రాముడు కంగారు పడిపోతూ చుట్టూ చూశాడు. అలాంటి ఆలోచనలు వొచ్చినప్పుడల్లా రాముడు చాలా కంగారు పడుతూనే వుంటాడుగానీ, అవి రాకా మానవు, అతను కంగారు పడకా మానడు. ఎంత గంభీరంగా ఉండబోయినా, ఎన్నడూ ఎరగని ఆలోచన లొచ్చేస్తాయి. హఠాత్తుగా.

ఎంత క్షుద్రమైన ఆటలు ఇవి? అల్పులూ .... పామరులూ ఆడే ఆటలు! తన వంటి రాజ కుమారులు ఇటువంటి క్షుద్ర క్రీడల జోలికి పోరు. గురువులు అంగీక రించరు – అని మొహం చిట్లించుకుంటాడు. లక్ష్మణుణ్ణి పిలిచి, వేదాంత చర్చలోకి దిగుతాడు.

లక్ష్మణుడు – పంపలో చేపలకో, ఎండు కట్టెలకో, నీళ్ళకో, దుంపలకో పోతే రాముడు చుట్టూ అడివిని చూస్తూ కూర్చుంటాడు. కొండల్లో పగుళ్ళూ, లోయలూ, బిలాలూ చూసి – దేవత లెంత నేర్పుగా తయారు చేశారో! – అనుకుంటాడు. లక్ష్మణుడు దుంపలు కాలు స్తూనో, గుహ చుట్టూ పరిసరాలు శుభ్రం చేస్తూనో సమీపంలోనే ఉంటే, రాముడు గంభీరంగా లక్ష్మణుడికి దేవతలెలా జన్మించారో, వారంతా ఎన్ని లోకాలలో నివసిస్తారో, వారు ఎంతెంత మహిమలు గలవారో, వారి అనుగ్రహం ఎలా ఏ పూజల ద్వారా పొందవచ్చునో – అన్నీ చెబుతాడు.

నీళ్ళకోసం మందలు మందలుగా పోయే ఏనుగుల్ని చూసి రాముడు "ఏనుగులు సరస్సులో దిగి, ఈదులాడి బురద చేస్తాయి" అని విసుక్కుంటాడు. ఏనుగులు అడవుల్లో ఎంత వ్యర్థంగా తిరుగుతున్నాయో అని దిగులు పడుతూ వుంటాడు. రాజులు ఏనుగుల్ని వేటాడి, వాటి దంతాలూ, అస్థికలూ ఎలా సేకరించాలో, ఏనుగుల సైన్యాన్ని ఏర్పర్చుకునే రాజుకి ఎంత బలం కలుగు తుందో – వివరంగా చెబుతాడు.

రాముడు గుహలోకి పోయి ఆకుల పరుపు మీద వొరిగి కళ్ళుమూసి విశ్రాంతి తీసుకునేటప్పుడు తప్ప, బయట చెట్ల కింద కూర్చున్నప్పుడు మాత్రం దూరంగా పొలాల్లోంచి రైతుల కేకలో, జానపదుల పాటలో, గొడ్లని మేపుకునే పిల్లల నవ్వులో, ఏదో ఒక సందడి వినపడు తూనే వుంటుంది.

పశువుల్ని కాచే పిల్లలు వెదురు బద్దలతో బాణాలు తయారు చేసుకున్నారు. రోజూ గురి నేర్చుకుంటున్నారు. బాణాలు విసరడంలో పందాలు వేసుకుంటున్నారు. అన్ని ఆటలూ మర్చిపోయి, పూర్తిగా బాణాల ఆటల్లో పొద్దు బుచ్చుతున్నారు.

బాణాలు దూరంగా కొట్టడంలో ఎప్పుడూ సూరడు నెగ్గుతూ వుంటాడు.

"రాముడు వాలిని చంపే ఆట ఆడదామా?" అన్నాడు ఒకనాడు సూరడు హఠాత్తుగా.

"ఆడదాం, ఆడదాం" అంటూ పిల్లలందరూ సూరడి చుట్టూ చేరారు. కొత్త ఆట అనేటప్పటికి అందరికీ చెప్ప లేనంత ఉత్సాహం వొచ్చింది.

"పెద్ద రాజూ, చిన్న రాజూ దెబ్బలాడుకుంటూ వున్న ప్పుడు రాముడు చెట్టుచాటు నించి బాణం ఏసి పెద్ద రాజుని చంపేశాడుగా? .... మనం అదంతా ఆడదాం" అన్నాడు సూరడు.

పిల్లలు గోల గోల చేస్తోంటే, రాముడు గుహలోంచి తురాయి చెట్టు కిందకు వచ్చి నిలబడ్డాడు, దూరంగా గంతులేస్తోన్న పిల్లల్ని చూస్తూ.

"వాలి ఎవరుంటారు?" అన్నాడు సూరడు.

"నేను ...."

"నేనుంటాను,"

"నేనే ఉంటాను."

"నేనూ ఉంటాను."

"అట్లా పోట్లాడుకోకండెహె! .... ఎవళ్ళో ఒక్కళ్ళే ఉండాలి గానీ .... అందరూ వాలే వుంటే ఎలా కుదు రుద్ది? .... అసలు రాముడెవరుంటారో చెప్పండి."

"............."

"మాట్లాడరేంటి?... నువ్వుంటావా చంద్రుడూ?"

"ఛీ! నేను రాముడుండను. వాలే ఉంటాను."

"నువ్వుంటావా కుసుముడూ?"

"నేనూ ఉండను .... వాలైతేనే ఉంటాను."

"పోనీ ఎవరుంటారు రాముడు?"

"ఎవ్వడూ ఉండడు. రాముడెవడుంటాడు బుద్ధి లేకండా?"

"చంద్రుడా! .... పోనీ నువ్వు సుగ్రీవుడుండు!"

"ఛీ ఛీ! నేను వాలే ఉంటాను."

సూరడికి వొళ్ళు మండింది – "అయితే చంకలు నాకండి! .... అందరూ వాలే ఉంటే ఇంక ఆట ఎలా గాడతాం?"

"కావలిస్తే నువ్వుండరాదూ రాముడు? మమ్మ ల్నుండమంటున్నావు గానీ."

"ఛీ! రాముడా? నేనా? .... " అని మొహం చిట్లిం చేశాడు సూరడు. వెంటనే తేరుకుని – "సరే! నేనుంటా లెండి. ఆటేగా? .... ఆటలో ఉంటే తప్పేంటి? ఎవరూ ఉండకపోతే ఆటెలా సాగుద్ది? మరి నువ్వు సుగ్రీవు డుంటావా కుసుముడూ?"

కుసుముడు తల అడ్డంగా తిప్పేశాడు – "కావా లంటే నేను లక్ష్మణుడుంటాను. సుగ్రీవుడూ ఉండను, రాముడూ ఉండను."

"అలాగయితే నువ్వసలు ఆట మానెయ్!"

"ఆఁ .... మానేస్తాలే. నాకేం అక్కర్లేదు ఎదవాట" అని కుసుముడు కోపంగా, దూరంగా పోయాడు.

పిల్లలందరూ వాడి చుట్టూ జేరి బతిమిలాట ప్రారం భించాడు. సూరడు కూడా వాడి దగ్గిరికేపోయి – "…. ఆటాడదామని మీరందరూ అన్నారుగా? ఆడాలంటే మరి సుగ్రీవుడూ, రాముడూ కావాలా, అక్కర్లేదా? నేను రాముడుంటం లేదూ? అలాగే ఇంకెవరన్నా సుగ్రీవు డుంటే గమ్మున ఆట మొదలెట్టె య్యొచ్చు కదా?" అని నచ్చ జెప్పేట్టు చూశాడు.

కుసుముడు మొరాయించి చలించకుండా నించు న్నాడు.

తేరుడు సాహసంగా ముందుకొచ్చి – "సరే! నేను సుగ్రీవుడుంటాను. కుసుముణ్ణే వాలి ఉండనిద్దాం" అని వ్యవహారం ఒక కొలిక్కి తెచ్చాడు.

"అవును, కుసుముడు వాలి ఉంటే చాలా బాగుం టుంది" అన్నారందరూ.

కుసుముడికి పదో యేడే గానీ లావుగా, ఎత్తుగా ఎలుగ్గొడ్డులాగ ఉంటాడు. వాళ్ళమ్మ వాడికి ఎనిమిదేళ్ళ దాకా పాలిచ్చింది. ఇంకా ఇవ్వాలని చూసింది గానీ, వాడే ఆటల్లో పడి తాగటం మానేశాడు.

తేరుడికి హఠాత్తుగా గుర్తొచ్చి – "ఇవ్వాళ ఒక్కరోజే నేను సుగ్రీవుడుంటాను. రేపు నేనే వాలి, తెలుసా?" అని రేపటి సంగతి తేల్చుమన్నట్టు నిలబడ్డాడు.

"అవును నిజమే. రోజు కొకళ్ళుండాలి" అన్నారు అందరూ.

"ఇంక ఆట మొదలెట్టేద్దాం" అన్నాడు సూరడు ఉత్సాహంగా. "అందరూ దూరంగా నుంచోండి. ముందు వాలీ, సుగ్రీవుడూ కొట్టుకుంటూ ఉండాలి. నేనేమో చెట్టుచాటు నుంచి బాణం కొడతాను. వాలి, కింద పడిపోవాలి. అప్పుడు నేను దగ్గిరకొస్తాను ...."

తురాయి చెట్టుకింద కూర్చున్న శ్రీరాముడు కళ్ళు చిట్లించి చూస్తున్నాడు. చెవులు రిక్కించి వింటున్నాడు. మాటలన్నీ సరిగ్గా వినపడటం లేదు. గాలి, పిల్లల ఆట చూడాలని అటే పరుగెత్తుకు పోతోంది.

కుసుముడూ, తేరుడూ చితక బాదుకుంటున్నారు. చుట్టూ నిలబడ్డ వాళ్ళు కుసుముణ్ణి ప్రోత్సాహం చేస్తు న్నారు.

తేరుడికి కోపం వొచ్చేసింది – "ఇల్లాగయితే నేనాడ నంతే" అని దూరంగా పోయి నించున్నాడు.

చెట్టు చాటునించి సూరడు పరిగెత్తుకొచ్చి – "మీరం దరూ ఏమీ అనకూడదు. చూస్తూ నించోవాలంతే" అని అందర్నీ కేకలేసి మళ్ళీ చెట్టు చాటుకి పరిగెత్తాడు.

మళ్ళీ వాలీ, సుగ్రీవుడూ దెబ్బలాట మొదలెట్టారు. కుసుముడు తేరుణ్ణి చావు గుద్దులు గుద్దుతున్నాడు. "నీకు నాతో దెబ్బలాటంటరా? నీ బతుక్కి నన్ను జయిస్తా వంటరా?" అంటూ భీకరంగా బాదుతున్నాడు. తేరుడు బిక్క మొహం పెట్టి చుట్టూ చూస్తున్నాడు.

రయ్యిన చెట్టు చాటునించి బాణం వొచ్చి సుగ్రీవు డికి తగిలింది! అసలే గుద్దులు తింటూ ఏడుపు మొహం వేసుకున్న తేరుడు భుజం మీద బాణం తగలగానే బావురుమని ఏడుపు లంకించుకున్నాడు.

సూరడు గబ గబా చెట్టు చాటునించి బయటికి పరిగెత్తుకొచ్చాడు.

కుసుముడికి గొప్ప అవమానం జరిగినట్టు కోపం వొచ్చింది, సూరడి మీద. "వాలి నేనా, ఆడా? .... ఆణ్ణి కొట్టావేం?" అని పోట్లాటకి దిగాడు.

సూరడు కుసుముణ్ణి బతిమాలుతూ – "నే నసలు నిన్నే కొడదామనుకున్నాను. ఆడు అడ్డం వొచ్చేశాడు. ఈ సారి నువ్వు చెట్టు వేపు నించో. ఏం? .... ఇంత దూరం కాదు. ఇంకా దగ్గిరిగా వొచ్చి కొట్టుకోండి. నిన్నే కొడతాను" అని వాడికి మళ్ళీ మళ్ళీ చెప్పి వాడి కోపం పోగొట్టాడు.

ఆ లోగా పిల్లలందరూ తేరుడి చుట్టూ జేరి, "పాపం సూరడు మాత్రం ఏం చేస్తాడు? తప్పయి పోయి బాణం నీకు తగిలింది. ఆటల్లో ఏడవకూడదు ...." అని వాడికి నచ్చజెప్పి ఓదార్చారు.

సూరడు బాణం తీసుకుని మళ్ళీ చెట్టుచాటుకి పరిగెత్తాడు.

'వాలి సుగ్రీవుల' యుద్ధం మళ్ళీ ప్రారంభమైంది. తర తరాల నించీ శతృత్వం ఉన్నట్టు బాదుకుంటున్నారు,

ఇద్దరూ.

రయ్యిన బాణం వొచ్చి కుసుముడి వీపులో గుచ్చుకుంది. కెవ్వున కేక పెట్టాడు కుసుముడు. బాణం అంటే అంత దెబ్బ తగులుతుందని వాడనుకో లేదు. ఇందాక తేరుడెందు కేడిశాడో ఇప్పుడు అర్థమైంది వాడికి. కోపం పట్టలేక – "ఎంత సూదిగా చెక్కుకున్నాడో చూడండి బాణం! ఎంత గట్టిగా కొట్టాడో చూడండి!" అని బాణం మొన అందరికీ చూపించి "ఆడి పని పడతానుండు" అని బాణం పట్టుకుని చెట్టు వేపు పరిగెత్తాడు.

చెట్టు చాటునించి గర్వంగా బయటికి రాబోతున్న సూరడు బిత్తర పోయి వెనక్కి పరుగు లంకించుకున్నాడు. ముందు సూరడూ, వాడి వెనకాల కుసుముడూ! వాళ్ళ వెనకాల పిల్లలందరూ!

అందరూ కలిసి వాలిని పట్టుకున్నారు – "ఆటల్లో కోపాలు తెచ్చుకుంటే ఎలా గేంటిరా! .... బాణం కొట్టాలి గాబట్టి కొట్టాడు. పాపం సూరడేం చేస్తాడూ?" అని వాలితో పోట్లాడారు.

"ఆటైతే మాత్రం? ఎంత గట్టిగా కొట్టాడో తెలుసా? .... ఉండు. ఈ సారి నేనే రాముడుండి నీ ఈపు బద్దలు గొడతాను." అని ఎగిరాడు కుసుముడు, సూరడి మీద.

"సరేలే. అలాగే చేద్దువు గానిలే. మరి ఇప్పుడు నువ్వు కిందపడి పోవాలి, లేకపోతే ఆటంతా చెడిపోద్ది" అన్నారు అందరూ.

వాలి, నేల మీద రాయీ రప్పా చూసుకుని, కాలితో రాళ్ళు ఇటూ అటూ తోసి నెమ్మదిగా కిందకి వాలాడు.

పిల్లలు బాణం తెచ్చి వాలి చంకలో నించోబెట్టి చెయ్యి దగ్గిరికి పెట్టారు.

వాలి మూలుగు ప్రారంభించాడు.

రాముడు బితుక్కు బితుక్కుమంటూ దగ్గిరి కొచ్చాడు.

వాలి మూలుగు ఆపేసి, లేచి కలబడేటట్టు రాముణ్ణి కొర కొర చూశాడు.

రంభుడు వాలి మీదకి వొంగి – "నువ్వు రాముడితో మాట్లాడాలి. ఎందుకు కొట్టావని అడగాలి" అని గుస గుస లాడాడు.

"అడుగుతాలే. నాకు తెలుసులే" అని వాలి విసుక్కున్నాడు. సూరణ్ణి కోపంగా చూస్తూ "నన్నెందుకు చంపావ్‌రా? నేనేం తప్పు చేశాను?" అని అరిచాడు సగం లేచి. పిల్లలు నొక్కి పెట్టారు వాలిని.

"చెప్పవేం? నన్నెందుకు చంపావ్?" అని అరిచాడు వాలి మళ్ళీ.

రాముడు గుటకలు మింగుతూ – "మరి .... నువ్వు .... మీ తమ్ముణ్ణి .... ఊళ్ళోంచి గెంటేశా ... వెందుకు?" అన్నాడు.

"గెంటేస్తే గెంటేస్తాను, అది నా ఇష్టం. నీ కెందుకురా? నువ్వెక్కణ్ణించొచ్చావ్?" అని అరిచాడు వాలి.

రాముడు రెండడుగులు వెనక్కి వేసి – "నేను, నేను .... నేనేమో .... నేను ...." అంటూ ఇటూ అటూ చూశాడు.

రంభుడు రాముడి చెవిలో ఏదో గుస గుస లాడాడు.

"ఆఁ, నేనే పెద్ద రాజుని. నీ కన్నా పెద్ద రాజుని. తెలుసా? .... తప్పు చేసే వాళ్ళందర్నీ నేనే చంపేస్తాను. మరి నువ్వు తప్పు చేశావెందుకూ?" అని కోపంగా చూశాడు 'సూరడు – రాముడు.'

"నేను తప్పు చేశానా? మళ్ళీ అను, పళ్ళు రాల గొడతానంతే. మా తమ్ముడే తప్పు చేశాడు. ఆడే నన్ను చంపెయ్యాలని చూశాడు. ఆణ్ణి చంపక నన్ను చంపావెందుకురా?"

రాముడికేం చెప్పాలో తోచలేదు. రంభుడి కేసి చూశాడు. రంభుడికీ తోచలేదు. వాడు గింభుడికేసి చూశాడు.

"చెప్పవేం? .... నన్నసలు చెట్టు చాటునించి చంపావెందుకో చెప్పు ముందు!" అని గర్జిస్తున్నాడు వాలి, పైకి లేచి.

రంభుడు చటుక్కున వాలి మీద పడి నొక్కిపెట్టి, "ఎందుకు కొట్టావూ – అనాలి. చంపావన కూడదు. నువ్వింకా చచ్చి పోలేదు తెలుసా?" అని కేకలేశాడు.

కుసుముడు కోపంగా – "మన పెద్ద రాజు చచ్చి పోయాడుగా? .... చంపేశావంటే యేం? నే నలాగే అంటాను" అని మళ్ళీ రాముణ్ణి చూస్తూ గర్జించాడు – "చెప్పకుండా నుంచున్నావేం, చింత మొద్దులాగ? నన్ను చాటు నుంచీ ఎందుకు కొట్టావో చెప్పసలు!"

'సూరడు – రాముడు' తత్తర పడుతూ దిక్కులు చూస్తూ, "మరి ఎదురుగా అయితే .... నువ్వు చూసేస్తావుగా?" అని నసిగాడు!

పిల్లలందరూ ఘొల్లున నవ్వారు.

"ఆఁ .... ఎదురుగా అయితేనా? డొక్క చింపిడోలు కట్టేవోణ్ణి. కావాలంటే నాతో దెబ్బలాడు!" అంటూ వాలి తెయ్యిన లేచి కూర్చోబోయాడు.

అందరూ వాలిని నొక్కి పెట్టారు. "అబ్బ! .... నువ్వు చచ్చిపోవాలి" అని విసుక్కున్నారు.

రాముడు కొంచెం మాట సర్దుకుని – "అది కాదు, ఇందాక తప్పు చెప్పాను. నిన్నెందుకు చంపానంటే .... సుగ్రీవుడికి వొట్టేశానుగా?" అని వాలిని ధైర్యంగా చూశాడు.

"ఎందుకేశావూ?" అన్నాడు వాలి గర్జిస్తూ.

"ఏశాగా మరి?" అన్నాడు రాముడు, బింకంగా.

"అదే .... ఎందుకేశావంట!"

"ఎందుకేంటీ .... ఏశానంతే. నా ఇష్టం!"

వాలి రయ్యిన లేచిపోయాడు – "నీ ఇష్టవంట్రా?" అంటూ రాముణ్ణి వాటేసుకోబోయాడు.

రాముడు భీతెత్తి కేకలేస్తూ చెట్ల వెంట పరుగు లంకించుకున్నాడు. రాముడి వెనక బూతులు తిడుతూ వాలి! వెనక కేకలేస్తూ మిగిలిన వాళ్ళూ! అందరూ అడివంతా పరుగులెత్తారు. చివరికి వాలి, రాముణ్ణి పట్టేసుకుని చావ గొట్టిం తర్వాత, రాముడి ఏడుపుల్తో పెడబొబ్బల్తో, ఆట ముగిసింది.

కుసుముడు, వాలి – పూనకం వొదిలిం తర్వాత సూరణ్ణి చితకదన్నినందుకు చాలా ఇదయ్యాడు. బిక్కమొహం పెట్టాడు. "ఈ సారి కొట్టను .... అస్సలు కొట్టను" అని చాలా సార్లన్నాడు. వొట్టు కూడా వేశాడు.

సూరడు ఏడుస్తూ "నేనసలు రాముడుండను. నువ్వే ఉండు" అని పోట్లాడాడు.

చాలా రోజులు మహోత్సాహంతో ఆ ఆట ఆడారు పిల్లలు. ఆటలోకి నెమ్మది నెమ్మదిగా తారా, హనుమంతుడూ, అంగదుడూ, లక్ష్మణుడూ అందరూ దిగారు.

ఇప్పుడు వాలి ఉండటాని కెవ్వరూ వొప్పుకోడం లేదు. అందరూ రాముడే ఉంటామంటున్నారు. అది ఆటే అని అందరికీ తెలిసిందిగానీ, రాముడి బాణానికి తెలియటం లేదు. అది నిజం బాణం లాగానే వొచ్చి కత్తి లాగ వాలి వీపులో దిగబడిపోతోంది మరి!

రుష్యమూకం మీద శ్రీరాముడు ఈ మధ్య తురాయి చెట్టు కింద కూర్చోడం మానేశాడు.

★ ★ ★

వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. మేఘాలు లోకానికి జల భిక్ష పెట్టామనే సంతోషంతో తేలికపడి, దూదిపింజల్లాగ తేలిపోతున్నాయి. ఆకాశం నిర్మలంగా చిరునవ్వులతో, శాంతి దేవత లాగ అయింది. ఎటు చూసినా భూమి అంతా పచ్చ పట్టు కంబళాలతో నిండిపోయింది. కన్ను ఆనినంత మేర కొత్త మొక్కలూ, కొత్త పువ్వులూ!

మోళ్ళన్నీ గుబుర్లయ్యాయి. కొండలన్నీ పొదలతో కప్పడ్డాయి. వాగు వొడ్ల నిండా రెల్లు దుబ్బులు, నక్షత్రాల పూలతో నిండాయి. కొండ చరియల నిండా అశోకాలూ, సర్జలూ, వేగిసలూ, సప్త వర్ణలూ, కోవిదారలూ, ప్రేంకణాలూ, నిత్యం విరగబూస్తున్నాయి. కాశీ పూలకి అంతు లేదు. బండల నిండా కుప్ప తెప్పలుగా రాలుతున్నాయి.

ఉదయా స్తమయాలలో రుష్యమూకం పక్షుల రాజ్యం అయిపోతోంది. ఎన్నెన్నో రంగుల పక్షులు, పూల గుత్తుల్లాగ, పూల దండల్లాగ, నీరెండలో వాటి నీడలు పదింతలై, కొండల నిండా నీడలు పరుచుకుంటూ, రెక్కలతో పర్వతాల్ని కప్పేస్తూ ఎగిరిపోతాయి.

గాలి, పంపకీ, రుష్యమూకానికీ అదే పనిగా తిరుగుతోంది. ఎన్నెన్నో పరిమళాలు సంపాదించుకుని, సంపన్నుల్లాగ విర్రవీగుతోంది.

శరద్రాత్రులు, వెన్నెల పూతలు పూసుకుంటున్నాయి.

శ్రీరాముడు రుష్యమూకం మీద తురాయి చెట్టు కిందో, మోదుగు చెట్టు కిందో కూర్చుని, అనేక కష్టాలతో వనవాసం చేస్తోంటే – దూరంగా పొలాల్లో రైతులు చాలా సుఖంగా భూమి దున్ని, విత్తనాలు జల్లి, కోతలు కోసి, వ్యవసాయం చేస్తున్నారు.

మహా జ్ఞాని అయిన రాముడు సంధ్యా వందనాలతో, వేదాంత చర్చలతో 'ఉత్తమ జీవనం' గడుపుతోంటే, చుట్టు పట్ల మూర్ఖ జానపదులు, అజ్ఞానంలో పడిపోయి, సంసార బంధనాలలో ఇరుక్కుపోయి, తట్టలూ బుట్టలూ అల్లుకుంటున్నారు. కుండలూ ముంతలూ చేసుకుంటున్నారు. నాగళ్ళూ కొడవళ్ళూ చెక్కుకుంటున్నారు. దుంగలూ కొయ్యలూ నరుక్కుంటున్నారు. క్రిమి కీటకాల్లాగ క్షుద్ర జీవితాలలో బడి కొట్టుకుంటున్నారు.

ధర్మపత్ని ఎడబాటు సహించలేక శ్రీరాముడు భార్యా వియోగంతో, దుఃఖంతో కృంగిపోతోంటే – వందల కొద్దీ, వేల కొద్దీ సైనికులు, సంతోషంగా భార్యాబిడ్డల్ని త్యజించి, యుద్ధాలకు పోతున్నారు. యుద్ధాలలో వీర మరణాలు పొందుతున్నారు.

గాలి, రుష్యమూకానికి మొగలి వాసనలు మోసుకొచ్చి రాముడితో "అబ్బ! .... పంప చుట్టూ ఎంతెంత మొగలి డొంకలో! వాటిల్లో జొరబడాలంటే నాకే భయం వేస్తోంది .... కత్తుల్లాగ ఎంతెంత మొగలి పొత్తులో! కావాలంటే లక్ష్మణుణ్ణడుగు" అంది.

"అవును, అవును. ఇది శరదృతువు" అని రాముడు గంభీరంగా తల పంకించాడు.

గాలి నవ్వి వాగువేపు పరిగెత్తింది.

రాముడికి శరదృతు వర్ణనలన్నీ గుర్తొస్తున్నాయి. ఈ రుతువులో మన్మథుడు మరింత సాధన సంపత్తి సమకూర్చుకుంటాడు. కోయిళ్ళూ, నెమళ్ళూ, హంసలూ, చక్రవాకాలూ, తుమ్మెదలూ, పువ్వులూ – అన్నీ అతని పక్షమౌతాయి.

సీత అసలే తనకు దూరంగా ఉంది. ఈ శర

ద్రాత్రులు .... పర పురుషుడి నిర్బంధంలో ....!

రాముడి మనస్సంతా పోటెత్తిన సముద్రం లాగ అల్లకల్లోలం అయిపోతోంది. గత రాత్రి భయం కరమైన స్వప్నం! సీత, ఒంటినిండా చిత్ర విచిత్రాలైన ఆభరణా లతో .... అలంకారాలతో .... చిరునవ్వులు చిందిస్తూ సుఖంగా ఉంది! పిట్టలతో లేళ్ళతో ఆడుకుంటోంది! సంతోషంగా ఆడుకుంటోంది! రుష్య మూకం మీద ఇలాంటి కల వస్తే జరగకుండా ఉంటుందా? .... ఈ కొండ ఎక్కిన దగ్గిర నుంచీ ఎటువంటి స్వప్నాలు వస్తాయోనని భయపడుతూనే ఉన్నాడు తను! తన కల నిజమేనేమో! నిజం కాకపోతే, ఈ పర్వతం మీద ఇలాంటి కల ఎటా వస్తుంది? హూ! అయితే, సీత సుఖం గానే ఉందన్న మాట! .... తనకు దూరమైనా సంతోషం గానే ఉందన్న మాట! సమస్త సుఖ భోగాలలో తేలుతూ వుండి ఉంటుంది. బహు సుందరమైన మందిరాలలో విహరిస్తూ ఉంటుంది .... ఇంకెక్కడి సీత! .... ఆ దుష్టుడి అంతం చూసేది ఎప్పుడో! వాడి జాతినంతా సమూ లంగా తుడిచిపెట్టేదెప్పుడో! రాక్షసుల్ని సంహరించమని రుషులంతా ఎప్పుడో కోరారు. అలాగే సంహరిస్తానని తను వాగ్దానం చేశాడు. పద మూడు సంవత్సరాలు దాటిపోయాయి. ఆ శూర్పణఖ కారణంగా ఖరుణ్ణి చంపడం అయింది గానీ రాక్షస రాజుతో యుద్ధం సాధ్య మౌతుందా? ఎక్కడున్నాడో కూడా తెలియని శతృవుతో యుద్ధం!

ఆత్మ నెమ్మదిగా చేతులు నలుపుకుంటూ విన యంగా – “తల్చుకుంటోంటే చాలా సిగ్గుగా ఉంది. సీత పోయి ఎనిమిది నెలలు దాటిపోయింది! ఇంత వరకూ ఎక్కడుందో ఏవిటో .... కనుక్కోలేక ....”

రాముడు మొహం చిట్లించాడు “కనుక్కుంటాం మరి. రాక్షసుడితో వ్యవహారం .... మాటలా మరి? .... ఈ వర్ష రుతువు అడ్డు రాబట్టి గానీ ....”

“అబ్బే, అదే! నేనూ అదే అంటున్నాను. దేవుడి లాగ సుగ్రీవుడు అండగా ఉండనే ఉన్నాడు .... రేపో మాపో ఎలాగూ కనుక్కుంటాం. నెలలూ, రుతువులూ గడిచి పోతున్నాయే అని .... అంతే ....”

రాముడు గంభీరంగా నిట్టూర్చాడు. “అవును. కాలం గతించి పోతూనే వుంది” చెట్టుకి జేరబడి కళ్ళు మూసుకున్నాడు.

లక్ష్మణుడు ఎండు కట్టెల మోపుతో కొండ ఎక్కుతూ, దూరం నించి అన్నగార్ని చూశాడు. గబ గబా మోపు గుహ ముందు పడేసి దిగాలు పడి కూర్చున్న అన్నగారి దగ్గిరికి వచ్చి వినయంగా నించున్నాడు – “అన్నగారూ!”

“లక్ష్మణా! .... వచ్చావా?”

“అన్నగారూ, దుఃఖించవద్దు! ధైర్యం వహించండి!”

“లక్ష్మణా! సీతా వియోగం భరించలేకుండా ఉన్నా నోయీ! ఈ శరదృతువులో కాముడు నూతనోత్తేజంతో నా వలే ప్రియాలింగనాలకు దూరమైన పురుషుల్ని బాధిస్తాడు.”

లక్ష్మణుడు మొహం తిప్పి నెగడుకేసి చూశాడు, నిప్పు వుందో ఆరిపోయిందో అని. చటుక్కున వెళ్ళి రెండు కర్రలు పడేసి వచ్చాడు.

“.... ఈ రుతువు మిక్కిలి దుఃఖం కలిగిస్తోం దోయీ!” అంటున్నాడు రాముడు.

ఇదివరకైతే .... వర్షరుతువో .... వసంత రుతువో .... మిక్కిలి దుఃఖం కలిగిస్తుందని చెప్పినట్టు గుర్తు. ఇదే అన్నిటి కన్నా దుర్మార్గపు రుతువు గావున్ను! అన్న గారికి అన్నీ తెలుసు!

నెగడులోంచి నెమ్మదిగా పొగ లేస్తోంది.

లక్ష్మణుడు అన్నగార్ని వినయంగా చూస్తూ, “అన్న గారూ! .... మీకు చెప్పగల వాడిని కాను. మీ వంటి పరాక్రమవంతులు కామ వాంఛకు లొంగి నిత్యం కామాన్నే తలుస్తూ దుఃఖించడం ఆత్మ గౌరవం కాదు. మనస్సుని సమాధాన పరచుకోవాలి. శరీరాన్ని నిగ్ర హించుకోవాలి .... మీ వంటి ఉత్త ....”

“లక్ష్మణా! .... ఈ దుఃఖమంతా నా కోసం కాదోయీ ....! ఎంతో కాలంగా నాకు దూరమై పోయిన సీత .... నా అర్ధాంగి .... సుఖంగా జీవించి ఉంటుం దంటావా? .... ఆ దుర్మార్గుడు అమెని ....”

అన్నగారి దుఃఖమంతా భార్య శీల సంపత్తి గురించే నని లక్ష్మణుడికి తెలుసు. “అన్నగారూ! .... మీ సంశయం విస్మరించి నిర్భయంగా ఉండండి! మీ వంటి పరాక్రమవంతుడి భార్యని ఆ రావణు డెన్నటికీ పొంద లేడు. మీ వంటి మహా వీరుడితో ఎవరు మాత్రం వైరం పెట్టుకోగలరు?”

రాముడి మొహం కొంచెం తేటబడింది. లోపల .... ఏవో కదలికలు .... ప్రశ్నలు .... భయాలు! నిజమే, తను గొప్ప పరాక్రమ వంతుడే! వీరుడే! మరి .... సీత అంత పరాక్రమ వంతురాలు కాదు గదా? అబల ...., లతాంగి ...., పుష్పాంగి ...., సుందరాంగి ...., ఎక్కడో ఉన్న తన పరాక్రమానికి భయపడి .... ఆ కాముకుడు .... నీచుడు .... ఆమెను విడిచి పెడతాడా? తనతో ఇప్పుడు కొత్తగా వైరం పెట్టుకునేది మాత్రం ఏముంది? సీతను ఎత్తుకు పోయిన నాడే వైరానికి సిద్ధమైనాడు గదా?

“అన్నగారూ! మీరింత దుఃఖించకూడదు. ఇంత నిరు త్సాహ పడకూడదు. మీ పరాక్రమం మీ రెరగరు. నివురు

గప్పిన నిప్పు వంటి పరాక్రమం మీది. ఎల్లవేళలా మనస్సు ధైర్యంగా ఉంచుకోవాలి మీరు. మీ ప్రయత్నాలు మీరు ఉత్సాహంతో చెయ్యాలి. నేను మీకు అండగా ఉంటాను. సుగ్రీవు డెలాగూ సహాయం చేస్తాడు. ఇంకా మీ కార్యం నెరవేరదని సందేహించవద్దు! .... మన్నిం చండి అన్నగారూ! మీ వంటి మహానుభావులకు నేను చెప్పదగిన వాణ్ణికాను"[281]

రాముడి మనసంతా ఆ క్షణంలో గొప్ప ఉత్సా హంతో నిండింది. – అవును. తను గొప్ప పరాక్రమ శాలి! వీరాధివీరుడు! తన వెంట .... లక్ష్మణుడు! సుగ్రీవుడు!

సుగ్రీవుడి సంగతి గుర్తు రాగానే అంత గొప్ప ఉత్సాహమూ నీరైపోయింది. సుగ్రీవుడి వ్యవహారం ఏమిటో రాముడికి అంతుపట్టకుండా ఉంది. పట్టాభి షేకం చేసుకున్న తర్వాత అతడు ఒక్కసారి కూడా తన దగ్గిరికి రాలేదు! తనంటే ఎంతో గౌరవంతో, విన యంతో, భయభక్తులతో నిత్యం తనకు సేవ చేసు కుంటూ కాలం గడుపుతాడనుకుంటే .... అసలు తన సంగతే గుర్తు ఉంచుకున్నట్టు లేదు. తన విలాసాలేమో .... తన సుఖభోగాలేమో తనేమో! సుగ్రీవుడే తనకు సహాయం చెయ్యకపోతే ఈ దుఃఖ సముద్రంలోంచి గట్టెక్కే మార్గమేముంది? సీతని కనిపెట్టడం ఎలాగ? తెచ్చుకోవడం ఎలాగ? సుగ్రీవుడు, ఆడిన మాట తప్పడు గదా? – రాముడి సర్వావయవాలూ కంపిస్తున్నాయి – "లక్ష్మణా! సుగ్రీవుడేమైనా యుద్ధ ప్రయత్నాలు చేస్తూ వున్నట్టు విన్నావా?"

లక్ష్మణుడు ఒక్క క్షణం తటపటాయించాడు. "మన్నించండి అన్నగారూ! వినలేదు. ఒక వేళ రేపో .... మాపో ...."

"హూ .... ఇంకేమి చేస్తాడోయ్! తను మహా రాజు అయ్యాడు. ఇక నా వంటి మిత్రుణ్ణి ఎందుకు గుర్తు ఉంచుకుంటాడు? నా మీద అతనికి కనికరం ఎందుకు ఉంటుంది? ఎంత అదృష్టవంతుడో! నిత్యం సుఖ భోగాలలో మునిగి తేలుతూ ఉన్నాడు. నేనో? .... ఒడ్డు కూలిన నదిలాగు దుఃఖ సముద్రంలో ఈదులాడు తున్నాను. నా కర్మ నన్నీ విధంగా బాధిస్తోంది. రాజ్యం పోయింది. భార్య పోయింది. స్నేహితుడూ ఆడిన మాట తప్పాడు. తననే శరణు కోరానన్న జాలి అయినా లేకుండా నా సంగతే పూర్తిగా నిర్లక్ష్యం చేశాడు ...." నిట్టూర్చాడు రాముడు, అగ్ని సెగలతో.

లక్ష్మణుడు కోపంతో ఊగుతున్నాడు – "అవును అన్నగారూ! సుగ్రీవుడు ఆడిన మాట తప్పాడు. మీరు చేసిన మేలు పూర్తిగా మరిచిపోయాడు. కృతఘ్నుడు! అటువంటి దుర్మార్గుణ్ణి దయ దలచకూడదు. శిక్షించ వలసిందే."

రాముడికి కర్తవ్యం తోచింది. ఆలోచనలో ముని గాడు. సుగ్రీవుడి ధైర్యసాహసాలు తనకి తెలియనివి కావు. మిక్కిలి భయస్తుడు. మూర్ఖుడు. ఎంత రాజు అయినా, ఎంత సైన్యబలం ఉన్న వాడైనా, తనను ధిక్క రించే సాహసం చెయ్యలేడు. చేశాడో, సర్వ నాశనం చెయ్యగలనని బెదిరించాలి. జంకకపోడు.

సుగ్రీవుడు మాట తప్పడమూ, అతన్ని తను దండించే అవకాశం కలగడమూ, సుగ్రీవుడు తనను క్షమాపణ కోరి వినయ విధేయతలతో లొంగి ఉండ డమూ – ఆలోచిస్తోంటే, రాముడికి ఇదే చక్కగా ఉన్నట్టు తోచింది. ఆటవికుడికి, ఎప్పుడే కార్యం నిర్వర్తించు కోవాలో గ్రహించే టంతటి జ్ఞానం ఉంటుందా? అంత జ్ఞానం ఉన్న వాడైతే తనతో సమానుడే అవుతాడు కదా? ఉత్తమత్వంలో, వానర రాజు, తనకు సాటి కాగలడా? ఎన్నటికీ కాలేడు. అందుచేతనే, కృతఘ్నుడిగా ప్రవర్తిస్తు న్నాడు. ఈ అపచారం వల్ల అతడు తన పట్ల పూర్వం కంటె ఎక్కువ భక్తితో మసులుకుంటాడు. – సుగ్రీవుడి తప్పిదాల గురించి ఆలోచిస్తోన్న కొద్దీ రాముడి మనసు ఎంతో తృప్తిపడుతోంది.

---

**281.** **కిష్కింధ, సర్గ 30, శ్లోకాలు 14 .... 18:** లక్ష్మణుడు అన్నగారికి సేవ చెయ్యడమూ, ఎప్పటికప్పుడు ఓదార్చడమూ చూడండి: "లక్ష్మణుడు పండ్లు దెచ్చుటకై పర్వతము పక్కలలో దిరుగుచూ .... వచ్చి .... శోకముచే మూర్ఛబోయి .... ఏకాకిగనుండు శ్రీరాముని జూచి ఇటులనెను .... పూజ్యుడా! ఎల్లకాలమూ కామమునే స్మరించుట, నీ పరాక్రమము నవమానించుట, తగదు. అపుడపుడు చిత్తమును సమాధాన పరుచుకొని యుండవలయును. ధీరుడా! నీ ప్రయత్నమూ, మనో నిశ్చలతా, ధైర్యోపాయములూ, సుగ్రీవాదుల సహాయ సంపత్తీ – ఇవి అన్నియు నీ కార్యము సిద్ధించుటకు కారణములని తెలుసుకొనుము."

ఇక, సీత విషయంలో రాముడి అనుమానం ఏమిటో లక్ష్మణుడికి స్పష్టంగానే తెలుసు. సీత దొరుకుతుందో లేదోనని కాదు, రాముడి భయం. సీత చెడిపోతుందేమోనని! ఆ భయం లేకుండా చేయాలని లక్ష్మణుడు ఏమంటున్నాడో చూడండి "నిన్ను నాధునిగ బడసియుండు జానకిని పర పురుషు డెన్నటికినీ పొందలేడు. మండుచుండు అగ్ని జ్వాలలో బడి దహింపబడని వాడుండునా?"

లక్ష్మణుడి పని, అన్నగారికి చాకిరీ చెయ్యడమే కాదు, ఆయనకు పూటపూటా ధైర్యాలు చెప్పడం కూడా! ★

"లక్ష్మణా! మిత్రుణ్ణి దండించడం ధర్మం కాదని ఆలోచిస్తున్నాను కానీ, మిత్రుడు శత్రువైతే దండించక తప్పుతుందా? తన అవసరం తను తీర్చుకున్నాడు. చక్కగా రాజై కూర్చున్నాడు. నిత్యం నీచమైన కామ సుఖాలలో మునిగి తేలుతూ ఉన్నాడు. మద్యపానాలతో .... విలాసాలతో .... మంచి చెడ్డలు విస్మరించి కాలం గడుపుతూ వున్నాడు. వర్ష రుతువు దాటి పోయిన తర్వాత సీతను వెదికించాలని ఎరగడా? .... దురహంకారం గాకపోతే నా కిచ్చిన వాగ్దానం తప్పుతాడా? నమ్మించి తన అవసరం తీర్చుకున్నాడే! చెయ్యవలసిన కర్తవ్యం మాత్రం పాటించడా? శ్రీరాముడంటే ఎవరనుకున్నాడో! 'రాజ్యం లేనివాడు, సైన్యం లేనివాడు, నన్నేమీ చెయ్యగలడులే' అని నిర్భయంగా ఉన్నట్టున్నాడు. లక్ష్మణా! .... నువ్వు వెంటనే కిష్కింధకు బయలుదేరి వెళ్ళు! ఆ దుర్మార్గుడి వ్యవహారం ఏమిటో తేల్చుకుని వెంటనే రా! తనకు చేసిన ఉపకారం మరిచిపోయిన వాడికంటే అల్పుడుండ డన్నానని చెప్పు! రాత్రీ పగలూ తేడా తెలియకుండా స్త్రీలతో భోగించడం కన్నా క్షుద్రత్వం లేదన్నానని చెప్పు! రామ బాణం దెబ్బ చవిచూడాలని కోరికగా ఉందేమో అడుగు! వాలినైతే ఒక్కడినే చంపాను గానీ, తననైతే బంధుమిత్రులతో సహా సర్వనాశనం చేస్తానన్నానని చెప్పు! కామ భోగాలతో మునిగి తేలడం కాదు, రామ బాణాలతో ముంచెత్తుతానని చెప్పు! దుర్మార్గుడు, తిన్నగా వెళ్ళి అన్నని కలుసుకుంటాడు. ఇప్పుడు చెప్పినవన్నీ విన్నావుగా? అన్నీ గుర్తు పెట్టుకుని .... నాకు ఎంత ఆగ్రహం కలిగిందో .... బాగా అర్థమయ్యేటట్టు చెప్పు! ఈ పూటే బయలుదేరు! ఇంకా ఆలశ్యం ఎందుకు?"

"చిత్తం, చిత్తం! అన్నగారూ! మీరు భోజనం చేసిన తర్వాత .... ఈ పూటే బయలుదేరతాను. మీరు చెప్పిన కార్యం చెప్పినట్లే చేసుకొస్తాను. ఎంత దుర్మార్గుడు గాకపోతే మీ కిచ్చిన మాట నిర్లక్ష్యం చేస్తాడు! .... మీ దయ వల్లనే గదా కిష్కింధా రాజ్యం సంపాదించుకోగలిగాడు? మీ కార్యాన్నే విస్మరించినప్పుడు .... సుగ్రీవుణ్ణి ఇక రాజుగా ఉండనివ్వకూడదు. రాజ భోగాలన్నీ ఆ దుర్మార్గుడనుభ వించడం ఎందుకు? మీరు తలుచుకుంటే ఒక్క ఘడియలో సుగ్రీవుణ్ణి రాజ్యభ్రష్టుణ్ణి చెయ్యగలరు. ఆ కృతఘ్నుణ్ణి తల్చుకుంటూ ఉంటే నాకు కోపం ఆగడం లేదు. మీకు శ్రమ లేకుండా నేనే అతన్ని ఒక్క దెబ్బతో యమ లోకానికి పంపించేస్తాను. అంగదుణ్ణే రాజుని చెయ్యవచ్చును. అతడే వదినగార్ని వెతికి పెడతాడు .... సుగ్రీవుణ్ణి మాత్రం బతక నివ్వను" – తన మాటలు అన్న గారికి చాలా సంతోషం కలిగిస్తాయని లక్ష్మణుడు సుగ్రీవుడి మీద రౌద్రంతో మండిపడిపోయాడు.

లక్ష్మణుడి ఆవేశం చూసి రాముడు గంభీరంగా మొహం చిట్లించాడు – తనేదో సుగ్రీవుణ్ణి బెదిరించాలనుకుంటే .... ఇతను నిజంగానే చంపుతానంటా డేమిటి? వాలిని చంపినందుకు సుగ్రీవుడు అండగా ఉన్నాడు గాబట్టి సరిపోయిందిగానీ, సుగ్రీవుణ్ణి కూడా చంపితే .... కిష్కింధ నుంచి బతికి బయటపడే మార్గం ఉంటుందా? సుగ్రీవుడికీ, అంగదుడికీ శతృత్వం ఉన్నమాట నిజమే అయినా, ప్రస్తుతం రాజ్యంలో అంగదుడి కన్నా సుగ్రీవుడికే బలం ఎక్కువ కదా? అలాంటి వాడితో వైరం పెట్టుకుంటే అంగదుడు తనతో కలుస్తాడనే నమ్మకం ఏమిటి? తండ్రినీ, పినతండ్రినీ కూడా చంపితే, అంగదుడు తనని విశ్వసిస్తాడా? రావణుడితో యుద్ధం ఇంకెలా జరుగుతుంది? నయాన్నో, భయాన్నో తెలివిగా కార్యాలు సాధించుకోవాలి గానీ, .... ఇతని కోపం చూస్తూ ఉంటే తొందరపాటుతో వ్యవహారం చెడగొట్టేటట్టు ఉన్నాడే!

లక్ష్మణుణ్ణి మందలించే ధోరణితో రాముడు అతణ్ణి గంభీరంగా చూశాడు – "నేను చెప్పినదంతా విడిచిపెట్టి, నువ్వు నీ స్వబుద్ధితో, స్వతంత్రించి కార్యాలు చేసేటట్టు ఉన్నావే లక్ష్మణా! ఏదో కొంచెం పొరపాటు జరిగినంత మాత్రాన స్నేహితుల్ని చంపుకుంటామా ఎక్కడైనా? తొందరపడి ఇటువంటి పాపపు మాటలు మాట్లాడడం ధర్మం కాదోయ్! కోపం నిగ్రహించుకునే వాడే ఉత్తమ పురుషుడు" అని వాత్సల్యంతో లక్ష్మణుడికి జ్ఞానబోధ చేస్తున్నట్టు మందలింపులు సాగించాడు.[282]

**282.** కిష్కంధా, సర్గ 30 31, శ్లోకాలు 66 .... 85: సుగ్రీవుడు సహాయం చెయ్యలేదని రాముడి దుఃఖం, సుగ్రీవుణ్ణి తిట్టడం, ఆ మాటే లక్ష్మణుడంటే అతన్ని మందలించడం, ఇవన్నీ ఇప్పుడు చూడండి. రాముడి దుఃఖం: "రాజ్యము నుండి వెడల గొట్టబడి, భార్య నెడబాసి, దుఃఖించుచుండు నా విషయములో రాజగు సుగ్రీవుడు దయయుంచకున్నాడు. 'ఈ రాముడు రాజ్యభ్రష్టుడు, దిక్కులేనివాడు, రావణునిచే పరాభవించబడి దీనుడై యున్నాడు. ఇల్లు విడిచి బహుదూరము వచ్చి కాముకుడై నన్నే శరణు జొచ్చెను' అని తలచి, దురాత్ముడైన సుగ్రీవుడు నన్ను లక్ష్య పెట్టకున్నాడు. సీతను వెదుకుటకు నాలుగు నెలలు గడువు పెట్టి, అతని కార్యమును దీర్చుకుని, దురాత్ముడయి, సంకేత సమయమును దెలుసుకొనకున్నాడు – ('సీతను వెదకటం' అనే మాటేగానీ, 'యుద్ధానికి సహాయం' అన్నమాట ఎక్కువగా ఎత్తడు రాముడు. యుద్ధానికి సహాయం చెయ్యమని అస్తమానూ అంటే బాగుండదని!) సుగ్రీవుడు దురాత్ముడై నీచమగు సుఖములలో నాసక్తి గలిగి, అంతఃపుర స్త్రీలతో విహరించుచు, మంత్రులతోనూ, బంధువులతోనూ గూడి మద్యపానము జేయుచూ, నా మీద దయయుంచలేదు." (రాముడి మీది దయతో కొంత మద్యం రుష్యమూకానికి పంపించ వలసింది సుగ్రీవుడు!) – ఈ రకంగా రాముడు సుగ్రీవుడి దుర్మార్గాన్నీ, ➔

లక్ష్మణుడు కొంచెం ఆశ్చర్యంతో, సిగ్గుపడుతూ నించున్నాడు. ఇంగితానికి విస్మయంతో నోట మాటే పోయింది.

రాముడు గంభీరంగా తల పంకిస్తూనే ఉన్నాడు. "…. మిత్రుడే గదా అని అంత సామరస్యంగానూ ప్రసంగించవొద్దు, అంత కఠినంగానూ దూషించ వొద్దు. నేను చెప్పమన్న మాటలన్నీ చెప్పు. తప్పకుండా జంకి దారికి వస్తాడు. అంతేగానీ, ఆవేశంతో వైరం పెట్టుకుని కార్యం చెడగొట్టకు. అసలు …. ఆ నాడే నా ఆజ్ఞ నువ్వు ధిక్కరించకుండా ఉంటే, …. ఆశ్రమం విడిచి రాకుండా ఉంటే … నీ స్వతంత్ర బుద్ధితో ఆలోచించకుండా ఉంటే…"

లక్ష్మణుడు, మొహం చిన్నబోయి తలవొంచుకున్నాడు.

లక్ష్మణుడి మౌనం చూసి రాముడు కొంచెం ఇబ్బంది పడ్డాడు. ఇతడేమైనా మనసు కష్టపెట్టుకున్నాడా? మౌనం వహించాడే! ఎప్పుడూ తన పట్ల వినయం చూపేవాడు …. ఇంత మౌనంగా వున్నాడే!

నిట్టూర్చాడు రాముడు – "…. ఇదంతా నా దురదృష్టమోయీ! ఎవరు చేసింది మాత్రం ఏముంది? దైవం నన్నిలా దుఃఖపెడుతున్నాడు ….!" అంటూ తల వాల్చి దుఃఖ సాగరంలో మునిగిపోయాడు.

తురాయి చెట్టు మీద నించి రెండు చిన్న పిట్టలు పంప వేపు తుర్రుమన్నాయి.

"అమ్మా! …. అమ్మా! …. సన్నాసి దేవుడేడుస్తున్నాడే!" అని అమ్మకి చెప్పాయి.

"సన్నాసి దేవుడెవర్రా?"

"అదేనే. గుహలో లేడూ? …. పెద్ద …. గడ్డంతో బూచాడి లాగుంటాడే!"

"అమ్మో! రాముడా? …. ఆయన దగ్గిర బాణాలు లేవూ?"

"మేం కనబడకుండా దాక్కున్నాంగా?"

"ఏమోనర్రా! …. వద్దన్న పనే చేస్తారు మీరు. అమ్మ చెప్పింది కదాని ఒక్క మాటన్నా విన్నారా? …. రాముడు మిమ్మల్ని చూశాడా?"

"అసలు తలపైకి ఎత్తందే! ఏడుస్తున్నాడు."

"ఎందుకూ?"

"పాపం వాళ్ళ భార్యని ఎవ్వరూ వెతికి పెట్టడం లేదనీ …."

"తనే వెతుక్కోరాదూ? …. వర్షాకాలం పోయిందిగా?"

"ఒప్పందం ఉందిగా వొదినా?" పక్క గూట్లోంచి.

"చాల్లెద్దూ, మాయదారి ఒప్పందం! ఒప్పందం …. ఒప్పందం అని కూచుంటే అవతల ఆవిడ కేదన్నా ప్రమాదం ముంచుకు రాదూ?"

"నీకు తెలీదా ఏమిటీ? …. ఆవిడికి ప్రమాదాలవీ రావుట!"

"ఎంచేతా?"

"ఆవిడ మహా పతివ్రతమ్మా! రాముడు తప్ప ఆవిణ్ణెవరూ ముట్టుకోలేరట …."

"అయితే ఇక ఏడ్చీ మొత్తుకునీ వెతకడం ఎందుకూ? ఎప్పుడో అప్పుడు ఆవిడే వొస్తుంది."

---

➔ నీచత్వాన్నీ దుయ్యబట్టి – "లక్ష్మణా! నీవు కిష్కింధకు బోయి దుష్టుడయిన సుగ్రీవునితో నా మాటగా జెప్పుము" అంటు న్నాడు.

ఆ చెప్పమన్న దేమిటంటే – "నేను వాలిని జంపుట, సీతను వెతకవలయుననుటకేను. (వాలిని చంపడం, అతను తప్పు చేసినందుకు కాదన్నమాట! వాలి తప్పు చెయ్యడమూ, ధర్మస్థాపనా ఏ గంగలో కలిశాయో! అసలు గుట్టు సుగ్రీవుడికి తెలిసిందే కాబట్టి అదే గుర్తు చేస్తున్నాడు రాముడు) – సుగ్రీవుడా! నీ అన్న పోయియుండు పరలోకము నశించి పోలేదు. వాలి పోయిన మార్గములోనే నీవూ పోయెదవు. వాలి నొకనిచే జంపితిని. సత్యమును విడిచి యుండు నిన్ను బంధుమిత్రులతో గూడా చంపెదను" (హనుమంతుణ్ణి కూడా కలిపి!). ఈ విధంగా కొంత చెప్పి మళ్ళీ ఒకచోట – "సమయ మతిక్రమించి నందువలన నేను చంపి వేయుదునని సుగ్రీవుడు భయపడవలసినది లేదనుము" (మొదట, చంపుతాననడం ఎందుకు మరి? ఊరికే బెదిరించడాని కన్నమాట! సుగ్రీవుడితో వైరం పెట్టుకుంటే తర్వాత వ్యవహారమంతా ఎలా జరగాలి? అదంతా తెలుసు రాముడికి. సుగ్రీవుణ్ణి చంపక పోవడం దయదలిచి కాదు, వీలుగాకనే.)

**సుగ్రీవుడి మీద లక్ష్మణుడి కోపం:** "సుగ్రీవుడు కృతఘ్నుడై ఉన్నాడు. అట్టి గుణహీనునికి రాజ్యము నీయరాదు. ధర్మమును విడిచియుండు సుగ్రీవు నిపుడే జంపెదను. వాలి పుత్రుడగు అంగదుడు సీతను వెతికి కనిపెట్టును."

సుగ్రీవుణ్ణి చంపుతానన్న మాటలు రాముడు అన్నవే గదా? కానీ ఆ మాటలు లక్ష్మణుడు అంటే, రాముడి కెంత కోపం వచ్చిందో చూడండి. "లోకములో నీ వంటివాడు మిత్రుని జంపుటకు యత్నించు పాపమును జేయరాదు. నీవు మిత్రుని జంపుటకు యత్నించు పాపమును దలచనే రాదు. (నేను మాత్రమే దలచవొచ్చును.)" అంటున్నాడు రాముడు. ఎంతసేపూ ఇతరుల తప్పులు ఎంచడం, ఇతరులకు నీతులు చెప్పటం, తను చాలా జ్ఞానినీ, ఉత్తముణ్ణీ అనుకోవడం, ఈ లక్షణాలన్నీ ఫ్యూడల్ మనస్తత్వం! ★

"అమ్మా! .... పతివ్రతంటే ఏవిటే అమ్మా?" – పావురం పిల్ల.

"పతివ్రతంటే .... భర్తని దేవుడనుకోవాలి."

"మరి ఎవర్ని భర్త అనుకోవాలి?"

"దేవుణ్ణి భర్త అనుకోవాలిరా అన్నయ్యా!" – పిట్ట చెల్లి.

"అబ్బే! అలాక్కాదు. దేవుణ్ణి దేవుడే అనుకోవాలి, భర్తనీ దేవుడే అనుకోవాలి."

"ఇద్దరు దేవుళ్ళెందుకే అమ్మా?"

"ఏమోనర్రా! మనుషుల గోల మనకేం తెలుస్తుంది? .... పోయి రాముణ్ణి అడగండి."

రాముడు భుజాలు వొంచి కుములుతూనే ఉన్నాడు. "..... దురదృష్టం గాకపోతే నాకు రావలసిన రాజ్యం ఎందుకు పోవాలీ .... జంట పక్షుల్లాగ నా వెంట వచ్చిన భార్య ఎందుకు దూరం కావాలీ? .... చివరికి స్నేహితుడు కూడా వాగ్దానం తప్పి .... నన్నింత శోకంలో ...."

లక్ష్మణుడు కంగారు పడుతూ తేరుకున్నాడు. అన్నగారు ఎంత సేపటి నించీ శోకిస్తూ వున్నారో! తను పరధ్యానంలో పడిపోయాడు. "మన్నించండి అన్నగారూ! సుగ్రీవుడి విషయంలో నేను సామరస్యం గానే ప్రవర్తించి కార్యం నెరవేర్చుకొస్తాను. మీరు దుఃఖించవొద్దు. లేచి భోజనం చెయ్యండి. నేను వెళ్ళి వస్తాను" అంటూ గబ గబా పిడతతో నీళ్ళు తెచ్చాడు. కాల్చిన గడ్డలూ, దుంపలూ, ఆకుల నిండా రొయ్యల కూరా పెట్టి తెచ్చాడు. – "అన్నగారూ! ఈ పూట వాక్కాయలు వేసి రొయ్యలు వొండాను. చాలా రుచిగా కుదిరింది. కడుపు నిండా భుజించండి!"

రుచిగా కుదిరిందా! ... తను తినక ముందే అతడు తిన్నాడా ఏవిటి? – రాముడు భోజనానికి లేచి చేతులు కడుక్కుంటూ కూర వేపు క్రీకంట చూశాడు.

లక్ష్మణుడు తన మాట తనకే ఎబ్బెట్టుగా తోచి మాట సర్దుకుంటూ "కూర ఉడుకుతోంటే .... కమ్మని పరిమళాలు చూసి .... రుచిగానే కుదిరిందని ...." అన్న గారికి .... నెమ్మదిగా విసురుతూ నడుం వొంచి నించు న్నాడు.

ఓహో! పరిమళమే చూశాడా?

రాముడు కూర తింటూ ఆలోచనల్లో మునిగాడు. 'పరిమళం' అయినా తను చూడక ముందే లక్ష్మణుడు చూడవచ్చునా? తప్పు లేదా? .... అంతగా లేదను కుంటాను. తినకుండా పరిమళం పీల్చడం తప్పు కాదను కుంటాను. అవును, దోషం లేదు. నోటితో తింటే తప్పు గానీ, ముక్కుతో పీలిస్తే దోషమేముంది? శాస్త్రాలు తప్పు పట్టవు. అవును, శాస్త్ర విరుద్ధం కాదు. కూర .... బహు రుచిగానే ఉంది. రొయ్యలు, చేపల్ని మరిపిస్తున్నాయి!

అన్నగారి భోజనం అయిన తర్వాత లక్ష్మణుడు విసరకర్ర కిందబెట్టి, గుహలో పక్క సిద్ధం చేశాడు. – "అన్నగారూ! విశ్రమించండి. నేను కార్యం కాగానే తిరిగి వస్తాను."

"వెంటనే రావాలి సుమా లక్ష్మణా! చీకటి పడితే...."

"సూర్యాస్తమయం లోగానే వస్తాను. శెల విప్పిం చండి!"

★ ★ ★

లక్ష్మణుడు ఆలోచనల్లో పడి, రాళ్ళూ రప్పలూ తన్నుకుంటూ పోతున్నాడు. ఇంగితం నిర్భయంగా ఏవిటేవిటో అడుగుతోంది – ".... అంత జ్ఞాని కదా? నీ హృదయం ఎన్నడూ గ్రహించదేం ....?" అంటోంది.

లక్ష్మణుడు ఇంగితం వేపు దృష్టి పోనివ్వకుండా ఆలోచనల్ని సుగ్రీవుడి వేపు మళ్ళించుకుంటున్నాడు – తను వెళ్ళగానే సుగ్రీవుణ్ణి నిలదీసి అడగాలి – "ఏం చేశావోయీ నీ వాగ్దానం? మా అవసరం తీరిపోయింది గదా అని ఇక మా అన్నగారి సంగతి మరిచిపోయి విలాసాల్లో మునిగి తేలుతున్నావు – అనాలి మొట్ట మొదట. ఏమంటాడో దుర్మార్గుడు! .... ఇంకే మన గలడు? 'ఇదుగో .... అదిగో' అంటాడు. ఏదో నసుగు తాడు.

"సుగ్రీవుడి సంగతి సరేలే. మీ అన్న సంగతి చెప్పు ముందు. ఎప్పుడూ నిన్ను తప్పు పట్టాలని చూస్తా డెందుకూ?" అంటోంది ఇంగితం.

లక్ష్మణుడు మొహం చిట్లించి – "సుగ్రీవుడి మాట లకు కరిగిపోయి దయదల్చకూడదు. అగ్ని సాక్షిగా స్నేహం చేసుకున్నాడే! .... స్నేహితుణ్ణి గౌరవించాలనే జ్ఞానం లేదా? ఊరుకోకూడదు" – కోపంగా అంగలు సాగించాడు.

"సుగ్రీవుణ్ణి దండించాలని పోతున్నావు గానీ .... ఇంత పౌరుషం .... ఎప్పుడన్నా .... అన్నగారి మీద .... పోనీ .... ఇందులో వందో వొంతన్నా .... ఎప్పు డన్నా ఎదురు తిరిగి జవాబు చెప్పావా?"

"ఇదుగో .... నువ్వస్తమానూ ఇలా సాధించకు. నా జన్మంతా మా అన్నగారి పాదసేవకే అంకితం చేసేశాను. ఆయన తిట్టినా కొట్టినా చంపినా అంతా ఆయన దయే. ఎప్పుడైనా కష్టం తోస్తే .... ఒక్క క్షణం సేపు దిగులు పడతాను గానీ, తర్వాత ఎంత సిగ్గుపడి పోతానో నీకేం తెలుసు? ఇదే ఆఖరిసారి చెప్పడం నీకు. మళ్ళీ ఎప్పు డన్నా నా జోలికి వస్తే ఊరుకోను."

"సిగ్గులేకుండా నువ్వే నాతో చెప్పుకుంటావు" అని నవ్వి ఊరుకుంది ఇంగితం.

లక్ష్మణుడు రుస రుస లాడుతూ నడక సాగించాడు. "రాజై పోయానని ఎంత గర్వం సుగ్రీవుడికి! అన్నగారు తల్చుకుంటే .... ఒక్క ఘడియలో పగ తీర్చుకోగలరు. ఆ సంగతే చెప్పాలి. అన్నగారి పరా క్రమమంతా వర్ణిం చాలి. అప్పుడైనా బుద్ధి తెచ్చుకుంటాడు, దుర్మార్గుడు."

కిష్కింధ చేరాడు లక్ష్మణుడు. కత్తి పిడి మీద చెయ్యి సిద్ధంగా ఉంచుకుని .... విల్లు సర్దుకుంటూ, అంగలేసు కుంటూ నడుస్తున్నాడు.

రాజ వీధిలో ప్రజలు .... లక్ష్మణుణ్ణి ఆశ్చర్యంగా చూసి .... గుర్తుపట్టిన వాళ్ళు .... కొత్త వాళ్ళతో గుస గుస లాడుతున్నారు.

"రుష్యమూకం మీద ఉండడం లేదూ? .... చిన్న సన్నాసి ఈయనే ...."

"రాముడేనా?"

"అబ్బే! రాముడు ఈయన అన్న. ఆయన పెద్ద సన్నాసి. ఆయనైతే ఊళ్ళోకి రాకూడదట. అడవుల్లోనే వుండాలట! వాలిని చంపేసిన్నాడు నువ్వు ఊళ్ళో లేవు గానీ ...."

"ఏంటో .... కోపంగా ఉన్నట్టున్నాడే .... అటు చూడు ...."

"కాస్సేపు పోతే అదే తెలుస్తుంది ఎందుకు వొచ్చాడో"

ఊళ్ళోకి లక్ష్మణుడు వచ్చాడనే వార్త అంచె లంచె లుగా .... సుగ్రీవుడి చెవుల దాకా చేరింది గానీ .... తలలోకి దూరలేకపోయింది.

సుగ్రీవుడు మద్యం తాగిన మత్తులో – "లక్ష్మణు డెవడో నాకేం తెలుసు? పొమ్మను .... మళ్ళీ వచ్చావంటే నీ తల తీయించేస్తాను" అని వార్త తెచ్చినవాడి మీద మండిపడి, ఇంకో వేపు తిరిగి పడుకున్నాడు.

లక్ష్మణుడు రాజ వీధుల్లో, ఇళ్ళూ అంగళ్ళూ కల్లు దుకాణాలూ దేవాలయాలూ చూసుకుంటూ నడుస్తు న్నాడు. కోపం మరిచిపోయి ఆశ్చర్యపడుతున్నాడు. ఇంత కాలానికి అడవుల్లోంచి పట్టణంలోకి .... ప్రజల్లోకి వస్తే .... అందర్నీ పరికించి చూడాలని బుద్ధి పుడుతోంది.

అన్నగారి ఆజ్ఞ గుర్తొచ్చి కుతూహలం అణచుకుని కోపం నిలబెట్టుకుంటూ కోట ద్వారం దగ్గిరికి చేరాడు.

లక్ష్మణుణ్ణి గురించి విని అంగదుడు బయటికి వచ్చాడు.

అంగదుణ్ణి చూడగానే లక్ష్మణుడు గంభీరంగా – "అంగదా! .... నేను వచ్చానని నీ పినతండ్రికి తెలియ పరుచు. శ్రీరామచంద్రుడి దుఃఖం చూడలేక .... నేను నీ పినతండ్రి మీద కక్ష సాధించడానికే వచ్చాను! వెంటనే వెళ్ళి చెప్పు!" అని అంగదుడి ముఖ కవళికలు పరిశీల నగా చూశాడు.

అంగదుడు వినయంగా – "తప్పకుండా తెలియ జేస్తాను" అని లోపలికి వెళ్ళిపోయాడు.

సుగ్రీవుడి మందిరంలోకి వెళ్ళడానికి అంగదుడు తనతో పాటు ఇద్దరు మంత్రుల్ని కూడ జత తీసుకు వెళ్ళాడు.

ముగ్గురూ కూడబలుక్కుని, ధైర్యం కూడగలుపుకుని, సుగ్రీవుడి చుట్టూ జేరారు.

"మహారాజా! .... లక్ష్మణు డొచ్చాడు."

"లక్ష్మణు డొచ్చాడు మహారాజా!"

"గుమ్మంలో ఉన్నాడు ...."

"గుమ్మంలో .... కోపంగా ఉన్నాడు మహా రాజా!"

".... లక్ష్మణు డొచ్చాడు మహారాజా!"

మహారాజు విసుక్కుంటూ, ".... మళ్ళీ వొచ్చాడా? పొమ్మనండి .... మీరందరూ కూడా పొండి" అని వొత్తిగిలి పడుకున్నాడు.

"మళ్ళీ కాదు మహారాజా! .... ఒక్కసారే వచ్చాడు .... రాముడు పంపించాడంట ...."

"రాముడెవడు? అబ్బ! .... చంపుతున్నాడే! పొమ్మ నండి ముందు రాముణ్ణి."

మంత్రులు మొహా మొహాలు చూసుకున్నారు. సుగ్రీవుడి మొహం చూశారు.

మహారాజు పూర్తిగా మత్తులో మునిగి వున్నాడు.

మంత్రులు చెవులు కొరుక్కున్నారు.

రాజ వైద్యుల చెవులు కొరికారు.

మత్తుని విరిచే పానీయాలూ, ఔషధాలూ మహా రాజు పొట్టలో జొరబడ్డాయి.

మహారాజు, పొట్టలో గడబిడకి చిరాకు పడి పోతూ లేచి – "మీరంతా ఇక్కడ ఉన్నారేంటి? సరే! ఉంటే ఉన్నారు. తొందరగా గిన్నెడు మద్యం తెప్పించండి! ఊఁ దబ్బున ...."

"స్వీకరించండి మహారాజా!" అంటూ వైద్యులు ఇంకో గిన్నెడు ఔషధం అందించారు.

మహారాజు గిన్నెడూ తాగి, మొహం చిట్లిస్తూ – ".... ఎక్కడ తెప్పించారిదీ? ఈ అంగడి వాణ్ణి పిలిపించి వెంటనే ఉరి తీసెయ్యండి!" అంటూ గిన్నిని కోపంగా వైద్యుల మీదకి గిరాటుకొట్టాడు.

మంత్రులు గిన్ని దెబ్బ తప్పించుకుని, ధైర్యం చేసి, "మహారాజా! .... లక్ష్మణు డొచ్చాడు. మండిపడి పోతు న్నాడు. కత్తీ విల్లూ కూడా పట్టుకున్నాడు. తర్వాత నీ ఇష్టం" అని ఊరుకున్నారు.

మహారాజు ఎగిరిపడ్డాడు – "లక్ష్మణుడా? కత్తీ విల్లూ పట్టుకున్నాడా? మండిపడి పోతున్నాడా? .... ఎందుకూ? .... ఏవైందీ?"

"ఏమో మరి .... రాముడు పంపించాడంట .... కోపంతో రుద్రుళ్ళా ఉన్నాడంట రాముడు ...."

"రాముడా? .... కోపంతో రుద్రుడా?"

సుగ్రీవ మహారాజుకి నెమ్మదిగా, తెరలు తెరలుగా ఒక్కొక్కటీ గుర్తొచ్చాయి. రాముడు .... వాలి .... బాణం .... పట్టాభిషేకం .... సీత .... రావణుడు ....! బిత్తర పోతూ దిక్కులు చూశాడు. "ఎందుకూ? నేనేం తప్పు చేశానూ? .... అసలు ఎంత మంచివాణ్ణి నేను! రాముడికి నా మీద కోపం ఎందు కొచ్చిందబ్బా? .... నేనంటే గిట్టని వాళ్ళెవరన్నా రుష్యమూకం పోయి రాముడికి నా మీద నూరి పోశారేమో! వాళ్ళెవరో ముందు వెతికించి ఉరి తీసెయ్యండి!"

"తీసేస్తాం మహారాజా! .... అదెంత పని? .... ఆ దుర్మార్గులు ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటాం. ఇంతకీ .... లక్ష్మణుడి సంగతేవిటి? .... మండిపడి పోతున్నాడే! ...."

సుగ్రీవుడు మళ్ళీ అదిరిపడ్డాడు – "లక్ష్మణుడి సంగతా? బాణం ఉందా చంకలో?"

"ఆఁ .... బాణాలూ ఉన్నాయి, కత్తులూ ఉన్నాయి. ఇందాకే చెప్పాంగా?"

"ఆఁ .... కత్తులు కూడానా?" సుగ్రీవుడు కాళ్ళు ముడుచుకుని పట్టు దిళ్ళ మధ్య వొదిగి పొదిగే కోడి పెట్టలాగ కూర్చున్నాడు – "ఎందుకు మండిపడి పోతున్నాడబ్బా? .... ఇదేంటీ? నే నాలోచిస్తున్నానేంటి? నేనే వన్నా మంత్రుల్నా? మీరందరూ ఆలోచించకుండా కూర్చున్నారేం? .... ఇంకా మంత్రుల్నందర్నీ పిలవండి. అసలు లక్ష్మణుడికి కోపం ఎందుకొచ్చిందో ఆలోచించండి. ఊఁ .... దబ్బున .... చప్పున .... ఆలోచించండి! నేను మంత్రుల్నయితే నేనే ఆలోచించే వాణ్ణి."

హనుమంతుడు కూడా వచ్చి మంత్రుల్లో కలిశాడు. మంత్రులంతా ఒక మూల గుమిగూడి ఆలోచించడం మొదలు పెట్టబోతోంటే, ఒక మంత్రికి, ఆలోచించకుండానే ఒక గొప్ప ఆలోచన వొచ్చేసింది. "లక్ష్మణుడికి కోపం ఎందుకొచ్చిందో మనం ఆలోచించడం ఎందుకూ? ఆయన్ని అడిగితే ఆయనే చెపుతాడుగా?" అని తన ఆలోచన విసిరాడు.

"వొద్దు. ఆయన్ని నమ్మకూడదు, అబద్ధం చెపితే? మనమే ఆలోచిద్దాం పట్టు!" అన్నాడు హనుమంత్రి.

సందేహం మంత్రి, పట్టకుండా ఊరుకున్నాడు.

సుగ్రీవుడు హారాలు సర్దుకుంటూ – గోడకి కాళ్ళు తన్ని పెట్టి కూర్చుని, "రాముడంటే నా కేంటో భయం భయం అనుకునేరు. అబ్బే! .... అదేం కాదు, ఊరికేనే .... స్నేహితుడికి అన్యాయంగా కోపం వస్తే ఏం బాగుంటుందనిగానీ .... అయిందా? ఆలోచించేశారా ....?" అని కంగారు పడ్డాడు.

"అవుతోంది మహారాజా! .... ఇంకెంతో సేపు పట్టదు .... మధ్యలో కొచ్చేశాం."

"ఇంకా మధ్యలోనే మిడుకుతున్నారా? స్నేహం బాగానే సంపాదించ వొచ్చునయ్యా! పెద్ద కష్టమేం కాదు .... నాలుగు కర్రలంటించి, నిప్పు రాజేసి దాని చుట్టూ తిరిగితే సరిపోతుంది. తర్వాత స్నేహం నిలబెట్టుకోవటం లోనే ఉంది యాతనంతా. బుద్ధి చంచలమైంది. నిలకడ ఉండి చావదు దానికి. అందుకే స్నేహాలు చెడిపోతాయి .... ఇంకా మధ్యలోంచి కదిలారా లేదా? ఊఁ కాని వ్వండి దబ్బున .... అబ్బా, ఏం మంత్రులో, ఏం పాడో! ఇంతసేపా?"

"చిన్న సందేహం మహారాజా! 'బుద్ధి చంచలం' అన్నావు. 'అందువల్లే స్నేహాలు చెడిపోతాయి' అన్నావు. చంచలం ఎవరి బుద్ధో చెప్పలేదు. రాముడి బుద్ధి చంచలమో, నీ బుద్ధి చంచలమో, సరిగ్గా చెప్పకపోతే .... ఎవరి వల్ల స్నేహం చెడిపోయిందో .... మే మెలా తేల్చగలం మహారాజా? .... రాముడి బుద్ధి చంచలం అనుకోమంటావా? అది కలుపుకుని ఆలోచించమంటావా?"

"అబ్బే! .... రాముడు ఉత్తముడయ్యా, మహా ఉత్తముడు!"

"చిత్తం! .... పోనీ నీ బుద్ధే చంచలం అనుకోమంటావా?"

"నా బుద్ధా? .... హూ!" సుగ్రీవుడు గుటకలు మింగుతూ హారాలు సర్దుకున్నాడు. కాళ్ళు నిగడదన్ని మళ్ళీ ముడుచుకున్నాడు. "ఏదో మిడకండి! మీరే ఏదో చెయ్యండి. మంత్రులు కదా నన్నడుగుతారేం? నేనేవన్నా మంత్రుల్నా?" అని ఖయ్యిమన్నాడు.

మంత్రులందరూ మళ్ళీ మూలకి చేరి గుడ గుళ్ళాడారు.

"అయింది మహారాజా! అయింది!"

"అప్పుడే అయిపోయిందీ? అన్నీ తొందరే మీకు. అదేదో బాగా మిడికారా? సరే, ఏం తేల్చారు?"

"నువ్వు తప్పే చేశావు మహారాజా! రాముడు నీకు ఉపకారం చేస్తే .... నువ్వు మళ్ళీ ఉపకారం చెయ్యడం మర్చేపోయావు."

"ఇది మరీ బాగుంది. ఎక్కడ మర్చిపోయానూ? ఇదా మీరు మిడికింది? రాముడి భార్యని వెతకడానికేగా సైనికులందరూ రావాలని కబుర్లు పంపించానూ? తెలవనట్టు మాట్లాడతారేం? .... ఏం, నీలుడూ! ఆ గోలంతా నిన్ను చూడమన్నాగా? ఏం చేస్తున్నావు? మళ్ళీ నిద్రకి పడ్డావా ఏంటీ?"

"చిత్తం! లేదు మహారాజా! .... రుష్యమూకం మీద

నిద్రపోయి తప్పు చేసిందగ్గిర్నుంచి మళ్ళీ కన్ను మూస్తే వొట్టు మహారాజా! – నీ ఆజ్ఞ ప్రకారం అందరికీ కబుర్లు పంపించాను."

"పది పదిహేను రోజుల్లో రాని వాళ్ళందరికీ మరణ శిక్షలు వేసెయ్యమని చెప్పాగా? ...."

"చిత్తం! రాని వాళ్ళందర్నీ చంపించేస్తాను మహా రాజా!"

"ఇన్ని ఏర్పాట్లు చేయించాను. ఇంకా నా తప్పేంటి మంత్రులూ? ఏం, హనుమంతుడూ, నువ్వు చెప్పు!"

"చిత్తం! ఏర్పాట్లు చేశావుగానీ .... మళ్ళీ నీ విలాసాల్లో నువ్వు మునిగిపోయావు మహారాజా!"

"ఏడిసినట్టే ఉంది. వాళ్ళొచ్చే దాకా నేనేం చెయ్యనూ?"

"................"

"నే నొక్కణ్ణే ములిగానా వి .... లా .... సా .... ల్లో? మీరూ నాట్యాలూ, గీట్యాలూ చూసి లొట్టలేస్తానే ఉన్నారుగా? హనుమంతుడు మొన్న నాతో పాటు తెల్లవార్లూ కూర్చుని తెగ తాగలేదూ? .... ఏం, మాట్లా డడేం?"

"చిత్తం! తాగాం మహారాజా! మా గొప్ప రుచి! ఎన్ని జన్మలెత్తినా మరిచిపోను."

"సరేలే! ఇప్పుడు దాని రుచి ఎందుగ్గానీ, రాముడి కోపం రుచి చూడు."

"అబ్బే! .... కోపం ఎందుకొస్తుంది మహారాజా? ఆయన మహా శాంత పురుషుడు! ఏదో కొంచెం నిన్ను నిష్ఠూరాలాడాలని అలక చూపిస్తున్నాడోమో గానీ ...."

"నీ మొహం లాగానే ఉంది అలక! లక్ష్మణుడు కత్తులూ, బాణాలూ పట్టుకొచ్చాడన్నారుగా? .... కోపంతో మండిపడి ...."

హనుమంతుడు బుగ్గలు ఉబ్బించి ఆలోచనల్లో పడ్డాడు. ఆలోచించి .... ఆలోచించి .... గుడ్లెర్ర జేశాడు. "ఆఁ .... మండిపడితే పడతాడు. ఊరుకోవలిసిందే! తప్పు నీదేనయ్యే! శ్రీరామచంద్రుడంటే మాటలను కున్నావా? ఆ విల్లు చేత్తో పట్టుకున్నాడంటే .... ఎందు కులే .... వాలి ఎలా నేల కూలాడో కళ్ళారా చూశాంగా? .... ఆయుధ బలం గల వాడితో శత్రుత్వం సాగుతుందా నీకు? రాముడు తల్చుకున్నాడంటేనా .... అన్ని లోకాలూ ఆక్రమిం చేసుకోగలడు. నీ మేలు కోరే వాళ్ళం కాబట్టి ఇన్ని మాటలు చెప్తున్నాం. భార్య, భర్త ఆధీనంలో ఎంత వినయంగా ఉండాలో, అలాగ నువ్వు రాముడి ఆధీ నంలో ఉండాలి. ఆయన ఏది కోరితే అది చేసి పెట్టాలి...."

సుగ్రీవుడు తల వొంచి మొహం చిట్లించాడు – "ఏది కోరితే అది చెయ్యాలి మరి .... రావణుడితో యుద్ధం! .... ఎక్కడున్నాడో ఏంటో పాడు రావణుడు! దొరికితే మరణ శిక్ష వేయించెయ్యాలి .... సీతనే ఎత్తుకు పోవాలా? .... లోకంలో బోలెడు మంది ఆడంగులు లేరూ? పోయి పోయి సీతే దొరికిందా? ఇప్పుడు పెద్ద పెట్టున .... యుద్ధం అంటే ...."

"మహారాజా! శ్రద్ధగా విను. రాజయిన వాడు పది కాలాల పాటు స్థిరంగా రాజ్యం చెయ్యాలంటే, తనొక్కడూ క్షేమంగా ఉంటే చాలదు. ధనాగారం వృద్ధి చేసుకోవాలి. సైన్యాన్ని అదుపులో ఉంచుకోవాలి. తనకు అనుకూలించే మిత్రుల్ని కూడా కాపాడుకోవాలి. బొక్కసం, సైన్యం, మిత్రులూ .... బలంగా ఉంటేనే రాజు నిర్భయంగా రాజ్యం చేసుకోగలడు. వెంటనే లక్ష్మణుణ్ణి పిలిపించి, ఆయన్ని బతిమాలుకో. రాముడి పని చేసిపెట్టడానికి నువ్వు మనసులో కూడా ఏమీ అయిష్టంగా ఆలోచించ కూడదు సుమా!"

"అబ్బే! నే నెప్పుడు ఆలోచించానూ?" అని కంగారు పడ్డాడు సుగ్రీవ మహారాజు. "సరే! మీరందరూ పోయి, లక్ష్మణుణ్ణి తీసుకు రండి" అని గంభీరంగా ఆజ్ఞాపిం చాడు.

మంత్రుల్ని వెళ్ళనిచ్చి సుగ్రీవ మహారాజు లక్ష్మ ణుడు రాగానే తనేం చెయ్యాలో, నించోవాలో, కూర్చో వాలో, దాక్కోవాలో, ఆలోచన మొదలుపెట్టాడు.

టంగు టంగు మంటూ ధనుస్సు మోగిస్తోన్న చప్పుళ్ళు వినవచ్చాయి. అంగదుడు లోపలికి వొచ్చి "లక్ష్మణుడు వచ్చాడు" అన్నాడు.

"వచ్చాడూ? ఎలాగున్నాడు?"

"బలిసి ఎద్దులాగున్నాడు."

"అబ్బ! .... అది కాదు. కోపం ఏవన్నా తగ్గిందా?"

"ఇంకా ఎక్కువయ్యింది."

సుగ్రీవుడు వొణుకుతూ లేచాడు – "ఉండు, ఉండు. అప్పుడే తీసుకు రాకు .... నువ్వెళ్ళు .... ఉండు ...." అంటూ ఇటూ అటూ గంతులేసి లోపలికి, తార దగ్గిరకి పరిగెత్తాడు – "తారా! లక్ష్మణుడు చాలా కోపంగా ఉన్నా డంటున్నాడు అంగదుడు. అంత కోపం ఎందుకొచ్చిం దంటావూ నా మీద? గబ గబా ఆలోచించు. నువ్వు చక్కగా ఆలోచించగలవని ఎప్పుడో మా అన్న కూడా అన్నాడు. మరి ఆలోచించు చక్కగా. ఊఁ .... దబ్బున...."

"మంత్రులందరూ ఆలోచించి చెప్పారు గదా మహారాజా!"

"ఏం జెప్పారు, వాళ్ళ మొహం! నాదే తప్పన్నారు. వాళ్ళ మొహం తప్పు. నేనసలు ఎంత మంచి వాణ్ణి! కొంచెం నువ్వు వెళ్ళి లక్ష్మణుడితో మాట్లాడు ముందు. ఎలాగో నచ్చచెప్పు. తర్వాత నేనే మాట్లాడతాను. నాకేం

భయం లేదనుకో. ఎంత కోపంలో ఉన్న వాళ్ళయినా ఆడవాళ్ళనేమీ అనరు. దబ్బున వెళ్ళు మరీ ...."

ఒంటినిండా ఆభరణాల చిరు చప్పుళ్ళతో తార నెమ్మదిగా ఆలోచిస్తూ బయలుదేరింది – సుగ్రీవుడు భయస్థుడు. వాలి వంటి సాహసవంతుడు కాదు. మహా రాజై వున్నా, సైన్య బలం అండగా వున్నా, తన వాగ్దానానికి లోబడి, ఒంటరిగా వున్న రాముడికి జంకుతున్నాడు. ఇతణ్ణి ఆదుకోకుండా విడిచిపెట్టడం మంచిది కాదు. రాముడి పట్ల భయంతో సుగ్రీవుడు మరింత వొంగి, పర దేశపు రాజు ఇచ్ఛానుసారం ప్రవర్తించడం కిష్కింధకు క్షేమం కాదు. లక్ష్మణుడి కోప కారణం గ్రహించి, సమయానుకూలంగా వ్యవహరించాలి.

తార రావడం చూసి లక్ష్మణుడు కొంచెం సిగ్గుపడి గంభీరంగా కూర్చున్నాడు.

తార అనునయంగా సంభాషణ కుపక్రమించింది. "రాజపుత్రా! నీకు కోపం వచ్చిన సంగతి విని మేమం దరం ఎంతో విచారపడుతున్నాం. నీ కోపానికి కారణం ఏమిటో తెలియక మహారాజు చాలా దుఃఖపడుతున్నాడు. చెప్పు నాయనా! మా వల్ల ఏమి పొరపాటు జరిగింది? .... మీ ఆజ్ఞ మీరింది ఎవరు?" అని శాంతంగా పలకరించింది.

లక్ష్మణుడు కోపంగా చూశాడు – "నా కోపానికి కారణం ఏమిటో నా నోటితో నేనే చెప్పాలా? మా అన్నగారి విషయంలో నీ భర్త ఎంత అలక్ష్యంగా వున్నాడో నీకు తెలియదా? నాలుగు మాసాలలో మా అన్నకు సహాయం చేస్తానని వాగ్దానం చేసి, అన్నీ మరిచిపోయి, రాజ సుఖాలలో మునిగిపోయాడే! కోపం తెచ్చుకోక మా అన్నగారి నేం చెయ్యమంటావు?" అన్నాడు గబ గబా.

తార శాంతంగా చూసింది – "సుగ్రీవుడు సుఖలాల సుడై ఉన్నమాట యదార్థమే. కానీ, మీకిచ్చిన వాగ్దానం విస్మరించలేదు సుమా! అందుకోసం ఏర్పాట్లన్నీ చేస్తూనే ఉన్నాడు" అంది, చిరునవ్వుతో.

లక్ష్మణుడు మౌనం వహించాడు, రుస రుస లాడుతూ.

తార మళ్ళీ అంది – "సుగ్రీవుడి వల్ల అపరాధం ఉన్నప్పటికీ మీరింతగా కోపించడం విస్మయం కలిగిస్తోంది. అతడు మీ మిత్రుడే కదా? .... మీ సోదరుడే కదా?.... అగ్నిసాక్షిగా స్నేహితం చేసుకున్నవాడే కదా?"

"......................"

"తపో సంపన్నులయిన మహా రుషులే కామ సుఖాలకు లొంగి, వేల కొద్దీ సంవత్సరాల తపస్సులు భంగ పరుచుకున్నారని ఎన్నెన్నో కథలు విన్నామే! ఇక సుగ్రీవుడెంత? నీ వంటివాడు తెలుసుకోలేని దేముంది చెప్పు? అతడు రాజ జీవనం కోరుకున్నది ఈ సౌఖ్యాల కోసమే కదా?"

"......................"

"మర్యాదలన్నీ తెలిసిన వాడివి కాబట్టి అక్కడే ఆగావు. అంతఃపురంలోకి రా నాయనా! నీ వంటి ఉత్తముడు మంచి మనస్సుతో పర స్త్రీలను చూడడంలో తప్పేమీ లేదు. నా వెంట వస్తే మహారాజు దగ్గిరకి తీసుకు వెళ్తాను" అంటూ తార లక్ష్మణుణ్ణి మర్యాదగా లోపలికి ఆహ్వానించింది.

లక్ష్మణుడు గంభీరంగా లేచాడు. మందిరాలు దాటుకుంటూ సుగ్రీవుడి మందిరంలోకి ప్రవేశించారు.

విశాలమైన ఆసనంలో పట్టుదిళ్ళ మధ్య కూరుకుపోయి ఆడవాళ్ళని చుట్టూ పెట్టుకుని చాటు చాటుగా చూస్తున్నాడు, సుగ్రీవుడు!

ఇంత లోపలికి .... పూర్తిగా సుగ్రీవుడి ఆధీనంలోకి ప్రవేశించి, సుగ్రీవుడితో వైరం పెట్టుకోవడం తెలివైన పని కాదేమోనని సందేహం కలిగింది లక్ష్మణుడికి. తన దగ్గిర ఆయుధాలు ఉన్నప్పటికీ, కోట నిండా కాపలా వారున్నారు. సందేహిస్తూ నిలబడ్డ లక్ష్మణుడు సుగ్రీవుడి బెదురు చూపులు చూడగానే ఉత్సాహంతో కోపం తెచ్చుకుని, కళ్ళెర్ర జేసి రుద్రుడయ్యాడు.

సుగ్రీవుడు, ఆభరణాలు గలగల్లాడించుకుంటూ వొణుకుతూ నెమ్మదిగా లేచి నిలబడ్డాడు.

లక్ష్మణుడు సుగ్రీవుణ్ణి కాల్చేసేటట్టు చూస్తూ, "దుర్మార్గుడా! నీ మిత్రుడు కష్టాల్లో కృంగిపోతూ వుంటే నువ్వు సుఖాల్లో కులుకుతున్నావా? నీ నైజం గ్రహించలేక మా అన్న ఎంతో దయతో నీకు వానర రాజ్యం పట్టం గట్టాడు. లోకంలో ఏ పాపానికైనా ప్రాయశ్చిత్తం వుంది గానీ, చేసిన మేలు మరిచిపోయే పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. నీ వంటి కృతఘ్నుణ్ణి చంపటం ఒక్కటే ధర్మం! రామ బాణాల రుచి నీ అన్నే కాదు, నువ్వూ చూడక తప్పదు" అంటూ మండిపడి తర్వాతేం చెయ్యాలో తోచక, గోడలూ, గుమ్మాలూ, ఆసనాలూ పరికిస్తూ నించున్నాడు.

తార చిరునవ్వుతో – "లక్ష్మణా! చాలా కఠినంగా మాట్లాడుతున్నావు. నీ కోపం నువ్వు వెలి బుచ్చుకున్నావు, మంచిదే. సుగ్రీవుడు మీతో స్నేహం విడిచి పెట్టుకోలేదని మాత్రం గ్రహించు" అని ఊరుకుంది.

లక్ష్మణుడు గంభీరంగా సుగ్రీవుడి వేపు చూపు తిప్పాడు.

సుగ్రీవుడు వొణుకు అదిమిపట్టి రెండడుగులు ముందుకొచ్చి, లక్ష్మణుడి మీదపడి చేతులు దొరకబుచ్చుకుని – "నేను రామయ్యను మరిచిపోలేదు సుమా! ఈ సిరి సంపదలన్నీ నాకు రామయ్యే ప్రసాదించాడు.

అబ్బే! .... నే నెందుకు మరిచిపోతానూ? కొంచెం మత్తుగా నిద్దర పట్టేసి, పది రోజులాలశ్యంగా లేచానంతే. నా తప్పులన్నీ కడుపులో పెట్టుకోవాలి నువ్వు. రామయ్యని తప్పకుండా సేవించుకుంటాను .... నా పొరపాటు మన్నించాలి నువ్వు" అంటూ లక్ష్మణుణ్ణి వాటేసుకున్నాడు.

వచ్చిన పని ఇంత సవ్యంగా .... ఇంత సునాయాసంగా ముగిసినందుకు లక్ష్మణుడు విజయ గర్వంతో పొంగిపోయాడు. అసలు తార మాటలతోటే చాలా వరకు కోపం తగ్గింది. ఇక సుగ్రీవుడి క్షమాపణతో సంతోషం వెల్లివిరిసింది. "సుగ్రీవుడా! అన్నగారి దుఃఖం చూడలేక కొంచెం కఠినంగా మాట్లాడాను. ఏమీ అనుకోకు. మనసులో పెట్టుకోకు."

"ఎంత మాట! .... ఎంత మాట!"

"నీ వినయ విధేయతలూ .... నీ సద్గుణాలూ .... నీ మంచితనం అంతా చూస్తూ వుంటే, వానర రాజ్యం పాలించడానికి నువ్వే అర్హుడవని అర్థమైంది. ఏమో అనుకున్నాను గానీ .... మా అన్నగారికి తగిన మిత్రుడివి నువ్వు .... మీ ఇద్దర్నీ దేవతలే కలిపారు. నీ సహాయమే ఉంటే మా అన్నగారు శత్రువుల్ని జయించడం ఎంత పని!"

"నీ ప్రేమకొద్దీ అంటున్నావు గానీ శ్రీరాముడికి నా సహాయం కావాలా? ఆయన శత్రువుని ఆయనే జయించుకోగలడు. నేను సేవ చేసుకుంటూ వెనకాల ఉంటే చాలు. అంత మహావీరుడికి ఇతర్ల సహాయం చెయ్యడం ఏంటి?"

"సుగ్రీవుడా! అన్నగారు పూర్తిగా దుఃఖ సాగరంలో మునిగి ఉన్నారు. నువ్వు కూడా నాతో పాటు వచ్చి, ఆయన్ని ఓదార్చి ధైర్యం చెప్పాలి. నిన్ను వెంటబెట్టుకుని వెళ్ళానంటే అన్నగారు చాలా సంతోషిస్తారు. ఇందాక నేను దూషించిందేమీ మనసులో పెట్టుకోవద్దు సుమా!"

మండిపడే లక్ష్మణుడు పూర్తిగా చల్లబడ్డాక సుగ్రీవుడి దడ కట్టింది. ముసి ముసి నవ్వుల్తో – "అలాగే వస్తాను .... తప్పకుండా వస్తాను .... ఇప్పుడే వస్తాను ...." అంటూ చుట్టూ చూశాడు.

మంత్రులంతా రెక్కలు కట్టుకు వాలారు. సుగ్రీవుడు ఉల్లాసంగా మంత్రులందర్నీ చూశాడు. – "ఆ మధ్య ఎప్పుడో నే నాజ్ఞాపించానే సైనికులందర్నీ రమ్మనీ .... వొచ్చేశారా?"

నీలుడు ముందుకొొచ్చి – "చిత్తం! .. కొందరు వచ్చారు గానీ .... కొందరింకా రాలేదు మహారాజా!" అంటూ విన్నవించాడు.

మహారాజు కోపంగా మొహం చిట్లించాడు. "సరే, రాని వాళ్ళందరికీ మరణ శిక్షలు వేయిం చెయ్యి! ఇదుగో హనుమంతుడూ! .... మనం శ్రీరాముడి కోసం రావణుడి మీదికి యుద్ధానికి బయల్దేరాలి. ఇప్పుడు మనకి బోలెడు మంది జనం కావాలి. ప్రజలంతా గమ్మున యుద్ధంలోకి వచ్చెయ్యాలని దేశం నిండా దండోరాలు వేయించండి .... ఏం, తెలిసిందా?"

"తెలిసింది మహారాజా! .... అలాగే వేయిం చేస్తాను గానీ, ప్రజలు దండోరాలు వినేసి ఎవరి దార్ని వాళ్ళు పోతారు గానీ యుద్ధంలో కొస్తారంటావా మహారాజా?"

"రాని వాళ్ళందర్నీ లాక్కు రావాలయ్యా! ఇదేనా తెలిసింది నీకు? వేలకొద్దీ ఉద్యోగుల్ని పంపించండి! ప్రజలు యుద్ధంలోకి రాకపోతే, మంచి మాటలతో లొంగకపోతే, దండించి అయినా లాక్కువొచ్చే ఉద్యోగుల్ని పురమాయించండి! కొందరు మూర్ఖులు ఎప్పుడూ కామ భోగాలతో .... విలాసాలతో .... ఎప్పుడూ సుఖపడుతూ ఉంటారు. అలాంటి వాళ్ళందర్నీ నా దగ్గిరికి లాక్కురండి! నా ఆజ్ఞ ప్రకారం పది రోజుల్లో ప్రజలు రాకపోతే మరణ శిక్షలు అమలు చేసెయ్యండి! ఇదుగో, మంత్రులూ! మీరందరూ కలిసి యుద్ధానికి ఏర్పాట్లన్నీ చెయ్యాలి సుమా! హనుమంతుడు మాత్రం మీ అందరి మీదా పెద్ద అధికారి. అతని మాట చొప్పున నడుచుకోండి! తెలిసిందా?" అనేసి మొహం తిప్పి – లక్ష్మణుడి వేపు గంభీరంగా చూశాడు.[283] 'ఏర్పాట్లన్నీ బాగా

**283. కిష్కింధ, సర్గ 37, శ్లోకాలు 9....13:** సుగ్రీవుడు హనుమంతుడితో చెపుతున్నాడు. "కోట్లకొద్దీ వానరులను పిలుచుకొని వచ్చుటకు అనేకులగు వానరులను బంపుము. కొందరు వానరులు కామాసక్తులై కాలము గడుపుచుందురు. సామదానాది ఉపాయాలచే శీఘ్రముగా వానరులను బిలుచుకొని వచ్చుటకు దూతలను బంపుము. (సామ దానాది అంటే సామ, దాన, భేద, దండోపాయాలు – అని అర్థం. ఆ దండోపాయం ఏమిటో చూడండి.) "నా ఆజ్ఞ ప్రకారము పది దినములలోగా రాకుండు, దురాత్ములై రాజు ఆజ్ఞను లక్ష్య పెట్టని, వానరులకు మరణ దండన విధించవలయును."

లక్ష్మణుడు కిష్కింధకు రాక పూర్వమే సుగ్రీవుడు ఒకసారి నిద్ర మత్తులోంచి తలెత్తి సైన్యాన్ని సమీకరించమని ఆజ్ఞాపించి మళ్ళీ పడుకున్నాడు. **కిష్కింధ, సర్గ 29, శ్లోకాలు 30....34:** "సుగ్రీవుడు నీలుని జూచి అన్ని దిక్కులలో గల సేననంతయు జేర్చుటకు ఆజ్ఞాపించెను." "పదునైదు దినములలో వచ్చి చేరని వానరులకు మరణ దండన విధించవలయును. ఈ విషయంలో నా ఆలోచన అక్కరలేదు."

అంటే సుగ్రీవుడు సైన్యాన్ని సమీకరించడానికి మరణ దండనలు వెయ్యవలసిన అవసరం వచ్చిందంటే – ఆ యుద్ధంలోకి రావడం ప్రజలకు ఎంత మాత్రం ఇష్టంలేని పని అన్నమాట! మరణ దండన భయం లేకపోతే, ఒక్కడు కూడా రాడన్న ➔

చేశానా?' అన్నట్టు.

సుగ్రీవుడు చేసే ఏర్పాట్లన్నీ చూస్తూ లక్ష్మణుడు చాలా సంతోషించాడు – "మరి .... మనం .... అన్న గారి దర్శనానికి ...."

"ఇప్పుడే బయల్దేరుదాం! .... ఇదుగో! పల్లకీ తెప్పించండి, నేను శ్రీరాముణ్ణి చూసి రావాలి. ఊఁ .... దబ్బున .... పల్లకీ ...."

మంత్రులు కంగారెత్తి పరుగులు తీశారు.

★ ★ ★

ఋష్యమూకం అంతా భేరీల దరువు లేస్తోంది. శంఖారావాలూ, సన్నాయి తీగలూ, తాళాలూ, మద్దెళ్ళూ భేరీల అడుగున మటుమాయమై పోతున్నాయి.

గాలి, వాగుమీద నుంచి, తురాయి కొమ్మల్లోంచి, గుహలో జొరబడి రాముడితో, "ఎవరొస్తున్నారో చూద్దాం రా! .... పెళ్ళి ఊరేగింపేమో చూద్దాం రా! రా మరి!" అని రాముణ్ణి పడుకోనివ్వకుండా విసిగిస్తోంది.

రాముడు గుహ బయటికొచ్చి కొండ చివర, చూస్తూ నిలబడ్డాడు.

జనం గుంపులు గుంపులుగా ఋష్యమూకం వేపు వస్తున్నారు.

భేరీ వాయిద్యాలతో కొండలు బద్దలవుతున్నాయి.

సూర్యుడి లాగ ధగధగా మెరుస్తూ పల్లకీ కొండ లెక్కుతోంది.

"సుగ్రీవు డొస్తున్నాడు...." అనుకున్నాడు రాముడు. మనసు చాలా చిన్న బుచ్చుకుంది. సుగ్రీవుడు మహారాజ దర్పంతో పల్లకీ ఎక్కి వస్తున్నాడు! మహోపకారం చేసిన తన దగ్గరకు వినయ విధేయతలతో పాదచారిగా రావొచ్చునే! పల్లకీ ఎక్కి రావాలా? నిన్న మొన్నటిదాకా ఈ కొండలన్నీ తిరిగిన వాడే కదా?

బోయీల ఊపులతో, పల్లకీ, కొండలు దాటుతోంది.

పల్లకీలో లక్ష్మణుడు చాలా సార్లు సుగ్రీవుడి మీద పడ్డాడు. ఇద్దరూ కలిసి కింద పడే ప్రమాదాలు చాలా తప్పాయి.

సుగ్రీవుడు కోపంగా హనుమంతుణ్ణి పిలిచి – "ఈ బోయీలకి మరణ శిక్షలు వేయించెయ్యి .... పల్లకీ దింపిం తర్వాత" అని విసుక్కున్నాడు.

"చిత్తం! అలాగే వేయించేస్తాను. నేను మొదటే అను కున్నాను వీళ్ళకి అలాగే చెయ్యాలని" అని హను మంతుడు ఒప్పుకున్నాడు.

బోయీలు, వాళ్ళ కేకల్లో వాళ్ళు మునిగి చెమటలు కక్కుతూ కొండలెక్కుతున్నారు.

రాముడు కొంచెంసేపు నిలబడి, జనం దగ్గిర పడుతోంటే, తురాయి చెట్టు కిందకు పోయి పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు.

భేరీ మేళాలు గుహ ముందుకు జేరాయి. జనం బిలబిల్లాడుతూ కొండలన్నీ ఆక్రమించారు. పల్లకీ వచ్చి రాముడి ముందు ఆగింది.

లక్ష్మణుడూ, సుగ్రీవుడూ దిగారు.

లక్ష్మణుడు రాముడి దగ్గిరకి వచ్చి వినయంగా, "అన్నగారూ! మీరు ఆజ్ఞాపించిన కార్యం నెర వేర్చుకు వచ్చాను. సుగ్రీవుడు మీ దర్శనానికి వచ్చాడు" అని విన్న విస్తూ నమస్కరించాడు.

రాముడు గంభీరంగా కళ్ళు తెరిచాడు.

సుగ్రీవుడు తల వొంచి నమస్కారం చేసి కొంచెం సిగ్గుపడుతూ తల పక్కకి తిప్పి నించున్నాడు.

సుగ్రీవుణ్ణి చూస్తూ రాముడు చాలా ఆశ్చర్యంలో మునిగాడు.

పట్టాభిషేకం అయిన తర్వాత సుగ్రీవుణ్ణి చూడడం ఇదే మొదటిసారి. వొంటి నిండా గొప్ప గొప్ప ఆభరణా లతో, పట్టు బట్టలతో మెరిసిపోతున్నాడు. ఆ కిరీటంతో, మొహంలో రాజ కళ ఉట్టిపడుతోంది. చుట్టూ ఎన్నో వందల మంది పరిచారకులూ, మంత్రులూ, సైనికులూ .... ఎంత అంగ బలం!

సుగ్రీవుడి చుట్టూ పరిచారకులు నిలబడి వింజా మరలు వీస్తున్నారు. గాలి, వింజామరల్ని ఎగర గొట్టా లని విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. కొందరు పరిచార కులు, చెట్టుకింద సుగ్రీవుడి చుట్టూ పట్టు గొడుగులు పట్టారు. గాలి వాటి పనీ పట్టిస్తోంది. తురాయి చెట్టు, దూరంగా జనం మీదకు విరగబడి పూలు రాలుస్తోంది.

రాముడు ఇంకా ఆలోచనల్లో మునిగి ఉన్నాడు.

ఈ బండల్లో .... క్షణ క్షణం ప్రాణ భయంతో తిరిగిన సుగ్రీవుడికి ఎంత భోగం! ఎన్ని సౌఖ్యాలు! ఎంత గొప్ప రాజరికం! .... తనూ అయోధ్యలో ఇంతకు మించిన సిరి సంపదలతో .... భోగాలతో .... సౌఖ్యా లతో!

సుగ్రీవుడికి ఈ బిక్షంతా తను పెట్టిందే! వాలిని చంపకపోతే ... గుర్తు ఉంచుకున్నాడా?

సుగ్రీవుడు రాగానే చాలా కఠినంగా మందలించా లనుకున్నాడుగానీ – ఇంత గొప్ప స్థితిలో ఉన్న వాడిని .... ఇంత బలగం ముందు, అది మంచిది కాదనిపిం చింది.

రాముడు తల పంకిస్తూ – "కూర్చో నాయనా!" అన్నాడు గంభీరంగా.

---

➔ మాట! ఈ సంగతి సుగ్రీవుడికి బాగానే తెలుసు. వానరులు, రామ కార్యానికి అంత విముఖులుగా ఉన్నారు! వాళ్ళు ఇష్టంతో వచ్చేటట్టయితే, మరణదండనలు ఎందుకూ? ★

రాముడి ఆజ్ఞ అయిన తర్వాత సుగ్రీవుడు చప్పున ఎదురుగా చతికిలబడి కూర్చున్నాడు.

వింజామరల మీద నుంచి వొట్టివేళ్ళ పరిమళాలు రాముణ్ణి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

"నాయనా! పట్టాభిషేకం చేసుకున్నది మొదలూ నువ్వు రాత్రింబవళ్ళూ కామ సుఖాలలో మునిగి తేలుతున్నావు. నేను గ్రహిస్తూనే ఉన్నాను. ధనార్జన చేసుకుంటూ కామ సుఖాలు అనుభవించడంలో తప్పు లేదు. దేని సమయం దానికి ఉంది నాయనా! ధర్మార్థాలు విడిచి ఎల్లవేళలా కామ సుఖాలే అనుభ వించే వాడు, కొమ్మ చివర నిద్రపోయిన వాడు కింద పడిపోయినట్టు పతనమై పోతాడు. ఎప్పటి కప్పుడు శత్రువు లందర్నీ సంహరిస్తూ, మిత్రుల్ని పటిష్టం చేసుకుంటూ, సమయానుకూలంగా సుఖాలు అనుభ వించే వాడే ధర్మాత్ముడు."

సుగ్రీవుడు తల వొంచి వింటున్నాడు సిగ్గు పడుతూ.

"నువ్వు నా కిచ్చిన వాగ్దానం సంగతి మరిచిపోయి ఉండవు. నా భార్యను వెతికి, రావణుడితో యుద్ధం చెయ్యాలి మరి. రాజు లందరూ యుద్ధాలకు పోయే కాలం ఇది. నీ మంత్రులతో ఏం ఆలోచించావో, ఏం చేస్తావో మరి, నీ ఇష్టం" అనేసి రాముడు చటుక్కున కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు – "నా భార్య ఆ పర పురుషుడి గృహంలో ఎన్ని ఇడుములు పడుతూ వుందో గదా? .... నేను జీవించి ఉండి కూడా లేని వాడినై పోయాను గదా?" అంటూ తల వొంచుకున్నాడు.

రాముడు ఇంకెంత నిష్ఠూరంగా మాట్లాడతాడోనని జంకుతోన్న సుగ్రీవుడికి రాముడు అంత తొందరగా మందలింపులు ముగించడంతో చాలా ధైర్యం కలిగింది. చేతులు జోడించి వినయంగా ప్రారంభించాడు – "రామా! నీ దయవల్లే నేను మహారాజు నయ్యాను. చేసిన మేలు మరిచిపోయే వాడు అల్పుడని నే నెరుగుదును. నీ మేలు నే నెప్పుడూ మరచిపోను. నీ కార్యం కోసమే నా దేశంలో ప్రజలందర్నీ యుద్ధంలోకి రావాలని ఆజ్ఞాపించాను. ఇప్పటికే అనేక కోట్ల మంది వచ్చారు. ఇంకా కోట్ల కొద్దీ వస్తారు. ఇంక నువ్వు యుద్ధానికి బయలు దేరడమే ఆలశ్యం. మే మందరం నీ వెనక నడవక తప్పదు గదా?"

సుగ్రీవుడు కోట్లకొద్దీ వీరుల్ని సమీకరిస్తున్నాడనే చల్లని వార్తతో రాముడి మనసు శరత్కాలపు మేఘంలాగ ఎంతో తేలిక పడింది. సుగ్రీవుడి సైన్యమే యుద్ధ భారం అంతా నిర్వహిస్తుంది. సందేహం లేదు.

వికసించిన మొహంతో, చిరునవ్వులు చిందించాడు రాముడు – "నాకు తెలుసు సుగ్రీవా! నువ్వు మిక్కిలి ఉత్తముడివని నాకు మొదటి నుంచీ తెలుసు. సూర్యుడు లోకాలకు వెలుగునిచ్చినా, చంద్రుడు వెన్నెల కురిపించినా, వింత ఏముంది? నువ్వు మిత్రుడికి ప్రత్యుపకారం చేయడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. నువ్వు నా ప్రాణ స్నేహితుడవని నేను ఎరుగుదును. అందుకే నా మంచి చెడ్డలన్నీ నీ మీద పెట్టి, నిన్నే నమ్మి, నేను నిశ్చింతగా ఉన్నాను. ఆ రావణుడు తన మృత్యువు కోసమే నా భార్యను అపహరించాడు. నీ అండ వుంటే శత్రువుల్ని జయించడం ఎంతసేపు? .... ఇక ఎంతో కాలం పట్టదు .... అవును .... నాకు తెలుసు ...." రాముడు ఆనందాతిరేకంతో తల పంకిస్తునే వున్నాడు ఎంతోసేపు.[284]

★ ★ ★

**284.** **కిష్కింధ, సర్గ 38, శ్లోకాలు 16....24 + సర్గ 39, శ్లోకాలు 7 వరకూ:** సుగ్రీవుడు, రాముడి దగ్గరికి పల్లకిలోనే వచ్చాడు. సుగ్రీవుడు రాజైపోయాడు కాబట్టి, రాజుల్ని రాళ్ళల్లో, రప్పల్లో నడిపించడం కవికి ఇష్టం లేదు. శ్రీరామచంద్రుడి దర్శనానికి వచ్చేటప్పుడయినా సరే! ఇక్కడ శ్రీరాముడి కన్నా సుగ్రీవుడే గొప్ప, కవికి! సుగ్రీవుడు గొప్ప పదవిలో, సిరిసంపదల్లో ఉన్నాడు కాబట్టి. "శ్రీరాముడు వసించుచుండు శ్రేష్ఠమగు ప్రదేశము జేరి, గొప్ప తేజస్సు గల సుగ్రీవుడు (ఏం రంగు రాసుకున్నాడో! పూర్వం అతనికి ఈ 'తేజస్సు' లేదు!) లక్ష్మణుని తోడ పల్లకీ దిగెను."

ఆ రకంగా పల్లకీ దిగి కూర్చున్న వాణ్ణి పట్టుకుని, కుశల ప్రశ్నలేవీ లేకుండా రాముడు జ్ఞానబోధ ప్రారంభించాడు చూడండి – "వానర రాజా! ఆయా కాలములకు దగినటుల ధర్మార్థ కామములను విభజించి అనుష్ఠించు వాడే రాజు. ధర్మమునూ అర్థమునూ విడిచి కామమునే గోరియుండు వాడు.... చెట్టు కొనలో నిద్రించి కిందబడి, మేలుకొనిన వానివలె నుండును. శత్రువులను జంపి, మిత్రులను జేర్చుకొని, ఆయా కాలములలో ధర్మార్థ కామములను అనుభవించువాడే ధర్మాత్ముడు. (రావణుణ్ణి చంపేసి, రాముణ్ణి రక్షించి, తర్వాతేం జేసుకున్నా ఫర్వాలేదు.) సీతను కనిపెట్టి, రావణునితో యుద్ధము చేయవలసిన సమయము వచ్చినది. మంత్రులతో నాలోచించవలయును. (ఈ ధర్మబోధకు అసలు సారాంశం అదీ, యుద్ధం చెయ్యాలని).

సుగ్రీవుడి జవాబు: "నీ కటాక్షము చేతనే శాశ్వతమగు వానర రాజ్యము నేను బడిసితిని. రావణుని, బంధువులతోడ జంపి సీతను దెచ్చునట్టి, కోట్లకొలది వానరులు నీ సమీపమునకు వచ్చుచున్నారు."

"సీతను వెదుకుటలో సుగ్రీవుని యత్నము జూసి రాముడు సంతోషముతో వికసించిన నీలోత్పలము వంటి ముఖము గలవాడై యుండెను."

➔

కిష్కింధలో ప్రజలు, ఇళ్ళల్లో, పొలాల్లో, తోటల్లో, కొండల్లో, ఎక్కడికక్కడ గుంపులు గుంపులుగా రహస్యంగా తర్జన భర్జనలు పడుతున్నారు.

"మనందరం యుద్ధంలోకి పోవాలంట! లేకపోతే మరణ శిక్షలేస్తాడంట రాజు!"

"ఏదో సామెత చెప్పినట్టుంది. యుద్ధంలోకి పోయినా చావే! పోకపోయినా చావే! అసలు ఇంకో దేశపు రాజు కోసం మనం ప్రాణాలివ్వటం ఎందుకంట?"

"యుద్ధం చేసిపెడతానని మన రాజు ఒప్పందం చేసుకున్నాడంట!"

"ఆఁ చేసుకుంటాడు, ఎందుకు చేసుకోడూ? తనేం యుద్ధం చెయ్యాలా, పెట్టాలా? మందిరాల్లో దూరి కూర్చుంటాడు. తనకేం బాధ?"

"నెమ్మదిగా మాట్లాడు. పీకల మీదికి తెచ్చే లాగున్నావ్."

"అలాగే గానీ .... అసలు రాముడేవన్నాడు, వాలిని చంపినప్పుడు? తమ్ముడి ఆజ్ఞ వల్లనే ధర్మం స్థాపిస్తూ తిరుగుతున్నా నన్నాడా? రావణుడు పర స్త్రీ నెత్తుకు పోవటం అధర్మమే కదా? అధర్మాన్ని అరికట్టి, ధర్మాన్ని స్థాపించమని ఆజ్ఞాపించిన భరతుడు, రావణుణ్ణి దండించి, ధర్మం స్థాపించటానికి కావలసిన ఏర్పాట్లెందుకు చెయ్యడు? వాళ్ళ సైన్యంతోనే యుద్ధం చేసుకోరాదూ? కోసల రాజు, కిష్కింధ వాళ్ళ సైన్యం, బొక్కసం, ఉపయోగించుకుని, ధర్మం స్థాపిస్తాడా? ఆహా! ఏం ధర్మ స్థాపనయ్యా, సిగ్గులేని ధర్మ స్థాపన!"

"పిచ్చిగానీ, వాళ్ళ దేశానికి నష్టం వొచ్చేటట్టు ఎందుకు చేసుకుంటాడయ్యా? .... ఇంకో దేశం వాళ్ళ సైన్యంతో బొక్కసంతో పని జరిపించుకుంటాడు గానీ...."

"నాకు తెలవ కడుగుతానూ, వాలికీ సుగ్రీవుడికీ వైరమే లేదనుకో. వాళ్ళిద్దరూ పూర్వం ఉన్నట్టు కలిసే వున్నారనుకో. అప్పుడు రాముడేం చేసేవాడు? ఎవరి సైన్యం మీద ఆశ పెట్టుకునే వాడు? అప్పుడు సీతనెలా వెతుక్కుంటాడు?"

"వాలికీ సుగ్రీవుడికీ వైరం లేకపోతే, వైరం పుట్టిస్తాడయ్యా! లేకపోతే ఆ అన్నదమ్ములిద్దరికీ సంధి చేసే పాటి సామర్థ్యం లేనివాడా రాముడు? తన తమ్ముళ్ళు తనని భక్తిగా కొలుస్తున్నారే! తనకి దాస్యం చేస్తున్నారే! సుగ్రీవుడు కూడా వాలిని భక్తితో చూసుకోవాలని రాముడికి తెలియదా? మరి వాళ్ళిద్దర్నీ ఎందుకు కలపలేదంటావు? వాళ్ళ వైరం పెట్టుకుంటేనే తనకు కలిసొస్తుంది కాబట్టి."

"మా బాగా చెప్పావు. 'ధర్మం కోసం, ధర్మం కోసం' అన్నాడా? వాలిని, మరదలితో వున్నాడని అధర్మం అని చంపేశాడా? మరి ఇప్పుడు సుగ్రీవుడు అన్న భార్యతో ఉంటున్నాడే! రాముడు కిక్కురు మనడేం? 'నువ్వూ ధర్మం తప్పావు' అని సుగ్రీవుణ్ణి చావగొట్టడేం? పైగా 'ధర్మాత్ముడివి, పుణ్యాత్ముడివి' అని మెచ్చుకుంటున్నాడు చూడు!"

"ఎవరో వొస్తున్నారు. కాస్సేపు ఊరుకోండి."

"ఎవరో కాదు. మన సుముఖుడిలాగే ఉన్నాడు"

"సుముఖం కాదు, దుర్ముఖం వాడిది. పాడు మొహమూ వాడూనూ, నమ్మకూడదు. ఉన్నవీ, లేనివీ కల్పించి మంత్రులికి మోస్తాడు. వాడు సుగ్రీవుడి మనిషే."

"ఇంక ఏమనుకున్నా ప్రయోజనం లేదు. రాజు ఆజ్ఞంటే యముడి ఆజ్ఞే. ఇక్కడ చావటం కన్నా ఆ యుద్ధంలోకి పోతేనే మంచిది. అదృష్టం వుంటే బతికి బయట పడ్డా పడొచ్చు ...."[285]

"సరే! కానివ్వండి. ఏం చేస్తాం? తప్పుతుందా?"

"ధర్మ స్థాపన కోసం మరి ...."

"రాముడికీ నాకూ .... ధర్మం కూడానా?" ★

---

➔ అప్పుడు రాముడు సుగ్రీవుణ్ణి ఎలా కీర్తిస్తున్నాడో చూడండి "సూర్యుడు ఆకాశములో చీకటిని పోగొట్టుట, చంద్రుడతని కిరణములచే భూమిని చల్లగా జేయుట, నీవు మిత్రునకు ప్రత్యుపకారము జేయుట, (శ్రీరాముడు మాటలు మార్చుటా), ఎప్పుడునూ ఆశ్చర్యము గాదు.... నీవు సౌమ్యుడవు. వీరుడవు. నీవే నాకు మంచి మనసు గల స్నేహితుడవు. (సుగ్రీవుడి కన్నా మంచి స్నేహితుణ్ణి సంపాదించలేకపోయాడు రాముడు, అన్నేళ్ళూ తిరిగి!) నీవే సహాయము చేయుటకు తగిన వాడవు (అదీ అసలు విషయం). నీవు సదా ప్రియమైన మాటలు చెప్పువాడవని నే నెరుగుదును." (ఎరుగుదునుగానీ, ఇందాక నిన్ను సరదాకి తిట్టాను.) ★

**285.** **కిష్కింధ, సర్గ 37, శ్లోకం 19:** వానరులు రామ కార్యం కోసం బయలుదేరడంలో అసలు రహస్యం చూడండి. "కాల మృత్యువుతో సమానుడగు రారాజగు సుగ్రీవుని ఆజ్ఞను విని వానరులు మిక్కిలి భయపడిన వారై వచ్చి చేరిరి." మరణ శిక్షలకు భయపడి వచ్చారుగానీ, రామకార్యం చేద్దామని కాదు. ★

# లింకు - 6

# 8వ కథ తర్వాత 9వ కథ వరకూ

[8వ కథ - సుగ్రీవుడు యుద్ధానికి ఏర్పాట్లు ప్రారంభించడంతో ముగిసింది. 9వ కథ, హను మంతుడు లంకకు వెళ్ళి సీతను చూడడంతో ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య వున్న కథా భాగం ఇది. ఇందులో ఎక్కువగా 'కల్పన' చూస్తాం. ఆ కల్పనల్లో పళ్ళచెట్లని శత్రువులనించి రక్షించుకోవడమూ, చెట్ల తోపుల్లో పొదల్లో జీవించడమూ, గుహల్లో బిడ్డల్ని కనడమూ, జంతు చర్మాల డాళ్ళూ గదలూ వంటి వస్తువులు ఉపయోగించడమూ - మొదలైన అనేక విషయాలతో వుండే 'ఆటవిక జీవిత విధానం' చూస్తాం.]

సుగ్రీవాజ్ఞ అంటే యముడి ఆజ్ఞే. కిష్కింధ నుంచి బయల్దేరిన వానర సేనాధిపతులు, రాజ్యం అంతా తిరిగి వానర సైనికుల్ని సమీకరించారు.

పూర్వం హిమాలయాల్లో రుద్రుడు యాగం చేసినప్పుడు నేతులూ, పూజా ద్రవ్యాలూ కిందపడి ఆ ప్రదేశమంతా మొక్కలూ తీగలూ మొలిచాయి. వాటికి కాసే కాయలూ పళ్ళూ ఒకసారి తింటే నెల్లాళ్ళ వరకూ ఆకలి వెయ్యదు. (నెల్లాళ్ళేనా? ఏ పది వేల సంవత్సరాలో అయితే బాగుంటుంది గానీ), అలాంటి పళ్ళూ, పువ్వులూ తెచ్చి వానరులు సుగ్రీవుడి కిచ్చారు. (రాజు గారికి అలాంటి పళ్ళెందుకూ? రోజుకి యాభై సార్లు ఆకలేసే పళ్ళు కావాలి గానీ.)

ఎక్కడెక్కడో, మారు మూల ప్రదేశాల్లో ఉన్న వానరులందరూ రాజాజ్ఞకు భయపడుతూ కోట్లకొద్దీ వచ్చారు. తార తండ్రి సుషేణుడు, అనేక కోట్ల మందిని తీసుకు వచ్చాడు. రుమ తండ్రి తారుడు వెయ్యి కోట్ల మందినీ, హనుమంతుడి తండ్రి కేసరి వేలకొద్దీ కోట్ల మందినీ, తీసుకు వచ్చారు. శతవలీ, గవాక్షుడూ, నీలుడూ, నళుడూ, దరిముఖుడూ, దధి ముఖుడూ, దుర్ముఖుడూ, జాంబవంతుడూ, గంధ మాదనుడూ, రంభుడూ, ధూమ్రుడూ, వనసుడూ, మైందుడూ, ద్వివిధుడూ, అంగదుడూ, ఇంద్ర జానువూ, వహ్నీ - వంటి వేల కొద్దీ వానర వీరులు, కోట్ల కొద్దీ వానరుల్ని సమీకరించుకుని తీసుకు వచ్చారు.

అందరూ వచ్చాక సుగ్రీవుడు రాముడితో, "రామా! నీకు సేవ చేయడానికి నా ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారు. ఇదంతా నీ సైన్యమే. నీకు అప్పగిస్తున్నాను. ఆజ్ఞాపించు!" అన్నాడు వినయంగా.

రాముడు, సుగ్రీవుణ్ణి ఆలింగనం చేసుకుని గంభీరంగా, "అసలు సీత జీవించి ఉందో లేదో తెలుసుకోవాలి. రావణుడి నివాసం ఎక్కడో కూడా తెలుసుకోవాలి. ముందీ విషయాలు తెలిస్తే తర్వాత ఏం చెయ్యాలో ఆలోచించవచ్చును. నీ సైన్యాన్ని నువ్వే ఆజ్ఞాపించు! అంతా నీకే తెలుసు. మహా జ్ఞానివి నువ్వు. నాకు ప్రభువువీ, ప్రాణ స్నేహితుడివీ నువ్వు. సైన్యం గురించీ, బొక్కసం గురించీ, సర్వం తెలిసిన వాడివి నువ్వు. నా కార్యం ఏమిటో గ్రహించి నువ్వే చెయ్యి!" అని తల పంకించి, మౌనం వహించాడు.[286]

---

**286.** కిష్కింధా, సర్గ 40, శ్లోకాలు 10, 15: వానరు లందరూ వచ్చిన తరువాత సుగ్రీవుడు రాముడితో - "పురుషోత్తమా! ఇది అంతయు నీ సైన్యమేను. నీ యాధీనములో నున్నది. అందరు, నీ యాజ్ఞలో నుండి, నీకు హితము సేయుటలో నాసక్తి కలిగి, నీ ఇష్ట ప్రకారము సేయుటకు సిద్ధముగ నున్నారు. ఈ సేనలు సేయవలసిన కార్యమును నేను బాగుగ నెరుంగుదును. అయినను నీవే ఆజ్ఞాపించవలెను" అని చెప్పి, తన సైన్యాన్నీ, తన అధికారాన్నీ, రాముడి అధీనం చేసి, రాముడి ఆజ్ఞకు లొంగి ఉండడానికి సిద్ధపడ్డాడు. (ఈ రకంగా, సుగ్రీవుడు ఎప్పుడూ రాముడి ఆధీనంలో వినయంగా లొంగి ఉండాలని కవి అభిప్రాయం.)

సుగ్రీవుడు అలా చెప్పిన తర్వాత రాముడు "సీత జీవించి యుండునో, లేదో తెలిసి కొనవలయును. రావణుడు నివసించు దేశమును కనిపెట్ట వలయును" అని, ప్రస్తుతం తనకేం పనులు జరగాలో స్పష్టంగా చెప్పాడు. అంతేగాదు, "అటు తరు ➔

సుగ్రీవుడు వెంటనే వినతుడనే సేనాపతిని పిలిచి, "నువ్వు లక్ష మంది వానరుల్ని తీసుకుని తూర్పు దిక్కుగా వెళ్ళు" అని ఆజ్ఞాపించాడు. ఎటు పోవాలో వివరాలు చెప్పాడు.

సుగ్రీవుడికి భూమండలంలో ఎక్కడ ఏం వుందో సమస్తమూ తెలుసు. "ఆ మార్గం గురించి అంతా చెబుతాను విను!" అని మొదలు పెట్టాడు.

"మీరందరూ శ్రద్ధగా సీతనీ, రావణుణ్ణీ వెతకాలి. (ఇద్దరూ ఒక్క చోటే దొరుకు తార్లే.) దారి పొడుగునా పర్వతాలూ అరణ్యాలూ, పల్లెలూ పట్నాలూ, నదులూ సరస్సులూ, అన్నీ వెతకండి. (సీత కోసం – నదులూ సరస్సులూ వెతకడం!) కొంత దూరం పోతే మందర పర్వతం తగులుతుంది. దాని మీద నివసించే వారికి చెవు లుండవు. కొందరికి పెదాలే చెవులుగా ఉంటాయి. కొందరికి ఒక్కొక్క కాలే ఉంటుంది. అక్కడ వెతికిం తర్వాత, కిరాత ద్వీపం వస్తుంది. అక్కడి వాళ్ళు ఎప్పుడూ నీళ్ళలోనే జీవిస్తూ ఉంటారు. ఆ నదుల్లో పూర్తిగా గాలించండి! (ఇంతకీ సీత కోసమా, చేపల కోసమా?) అక్కడ కొందరు, సగం మనిషి రూపం గానూ, సగం పులి రూపం గానూ ఉంటారు. వాళ్ళ ఇళ్ళూ, వాకిళ్ళూ అన్నీ వెతకండి! తర్వాత యవ ద్వీపంలో వెండి గనులూ, బంగారం గనులూ వెత కండి! శిశిర పర్వతం, శోణా నదీ కూడా వెతకండి! ఎక్కడైనా దట్టమైన పొదల్లోనో, గుహల్లోనో సీతా రావణుడూ ఉండవొచ్చు! చాలా శ్రద్ధగా వెతకండి! (రాముడిపై ప్రాణాలు పైనే పోయి ఉంటాయి. ముందు వాటిని వెతకండి!)

తర్వాత సముద్ర ద్వీపాలు చూడండి! అక్కడ భయంకరమైన రాక్షసులుంటారు. ఆ రాక్షసులు, వాళ్ళకి ఎవరైనా కళ్ళబడితే ముందు వాళ్ళ నీడల్ని పట్టుకుని లాగేస్తారు. దాంతో ఆ ప్రాణులు రాక్షసు లకు వశమై పోతాయి. అక్కడంతా వెతకండి! (ఈ వెతికే వాళ్ళ నీడల్ని రాక్షసులు లాగేస్తే?) తర్వాత ఎర్ర సముద్రంలో వెత కండి! అక్కడ రాక్షసులు, బ్రాహ్మలు విడిచే అర్ఘ్యోదకాలు తగిలి సముద్రంలో పడిపోయి, కొంత సేపటికి లేస్తూ ఉంటారు. (బ్రాహ్మల అర్ఘ్యోదకాలకి 'కొంచెం సేపు' పడగొట్టే శక్తే ఉంటుందన్నమాట!). తర్వాత క్షీర సాగరంలో రుషభం అనే పర్వతం ఉంది. దాని మీద సుదర్శనం అనే సరస్సు ఉంది. అదంతా వెతకండి! తర్వాత జలోదం అనే సముద్రం ఉంటుంది. అందులో జంతువులు బడబాగ్నిని చూసి ఏడుస్తూ ఉంటాయి. ఆ సముద్రం లోపల పర్వతాల్లో వెతకండి! దాన్ని దాటితే బంగారపు పర్వతం వస్తుంది. దాని మీద వెయ్యి తలల ఆదిశేషుడు భూమిని మోస్తూ ఉంటాడు. (ఆయన భూమినీ, భూమి ఆయన్నీ మోసుకుంటూ ఉంటారు!) ఆయన నీలం వస్త్రాలు కట్టుకుని ఉంటాడు (యూనిఫారమా? దాన్ని ఎవరు కుడతారో!) దాని తర్వాత

---

➔ వాత, కాలానుగుణముగ నీ తోడ పని చేసెదను" అంటున్నాడు. అంటే, ముందు సీత సంగతీ, రావణుడి సంగతీ తెలిసిన తర్వాత, ఇంకా ఏం చెయ్యాలో నీతో సంప్రదించే చేస్తాను – అంటున్నాడు. అంటే, నిర్ణయించేదంతా రాముడే.

ఇంత స్పష్టంగా చెప్పాడా? మళ్ళీ అంటాడూ – "ఈ కార్యమునకు నేనూ, లక్ష్మణుడూ యజమానులము కాము. (లక్ష్మణు డెలాగూ కాదులే), నా కార్యమిట్టిదని నీకే తెలియును. నీవే వారిని ఆజ్ఞాపింపుము. నీవే దానిని నెరవేర్చవలసిన వాడవు. నీవే ప్రభుడవు. ప్రాజ్ఞుడవు. నాకు హితము సేయుటలో నాసక్తి గల వాడవు. మంచి కార్యములు చేసి యున్నావు. అర్థ శాస్త్రము, చక్కగా తెలిసిన వాడవు" అంటూ కీర్తన సాగించాడు.

రాముడు తనకు తానుగా వానర సైన్యాన్ని ఆజ్ఞాపించడం లేదు. అంటే, కిష్కింధా రాజ్యం మీద ప్రత్యక్షంగా పెత్తనం చెయ్యడం లేదు. సామ్రాజ్యాధిపతులు, సామంత రాజ్యాల మీద ప్రత్యక్షంగా పెత్తనం చెయ్యరు. సామంత రాజుల్ని తమ గుప్పిట్లో పెట్టుకుని, వారిద్వారా పరోక్షంగా పెత్తనం చేస్తారు.

సీతని వెతకాలి అనేది రాముడి ఆజ్ఞే. కానీ, తనే వానర సైన్యాన్ని పిలిచి "మీరు సీతని వెతకండి" అని చెప్పడు. అలా చేస్తే, 'కిష్కింధ రాజ్యాన్ని రాముడే పరిపాలిస్తున్నాడు' అని అందరికీ స్పష్టంగా తెలిసిపోతుంది. అప్పుడు వానర ప్రజలు ఇంకో దేశపు రాజు అధికారం కింద ఉండడానికి ఇష్టపడరు. 'రావణుడితో యుద్ధం చెయ్యాలి' అనేది కూడా రాముడి ఆజ్ఞే. జరగడం మాత్రం సుగ్రీవుడి ఆజ్ఞగా అమలు జరుగుతుంది.

కిష్కింధ, రాముడి ఆధీనంలో ఉండకుండా ఉంటే, అక్కడి ప్రజల మీద సుగ్రీవుడి పెత్తనం మాత్రమే ఉంటుంది. వారు సామ్రాజ్యాధిపతుల ప్రయోజనాల కోసం యుద్ధాలు చేసి, తమ సౌఖ్యాలూ, జీవితాలూ త్యాగం చెయ్యవలసిన అవసరం ఉండదు. వాళ్ళ కష్టాలు తక్కువగా ఉంటాయి.

వాలి ఆధీనంలో స్వతంత్ర రాజ్యంగా ఉన్న కిష్కింధని, రాముడు, తనకు పరోక్ష సామంత రాజ్యంగా చేసుకున్నాడు.

పూర్వ కాలంలో సామంత రాజ్యం అనే దాన్ని, ఈ నాటి కాలంలో, ఒక రకంగా వలస రాజ్యంతో పోల్చవచ్చును. ఆ నాటి పరిస్థితులకూ, ఈ నాటి పరిస్థితులకూ, ఆర్థికంగానూ, రాజకీయంగానూ అనేక మార్పులున్నప్పటికీ. ఆ నాడు మహా రాజులు, సామంత రాజ్యాల్ని తమ ఆధీనంలో పెట్టుకోవడంలోనూ; ఈ నాటి సామ్రాజ్యవాదులు, వలసల్ని ఏర్పాటు చేసు కోవడంలోనూ, వాళ్ళ ప్రయోజనాలు ఒకటే. ★

ఉదయ పర్వతం వస్తుంది. అదంతా బంగారపు ముద్దే. దాని నిండా తాటి చెట్లూ, గోగు చెట్లూ, మద్ది చెట్లూ అన్నీ బంగారమే. (ఓహో పళ్ళన్నీ బంగారం పళ్ళేనా?) శ్రీ మహావిష్ణువు బలి చక్రవర్తిని అణగ దొక్కినప్పుడు, ఈ ఉదయగిరి మీద ఒక పాదం, మేరు పర్వతం మీద ఇంకో పాదం, మోపాడు. ఆ పర్వ తాలు బాగా వెత కండి! సూర్యుడు లోకంలోకి ప్రవేశించడానికి ఆ ఉదయ గిరే మొదటి ద్వారం. ఇక దాన్ని దాటి పోవొద్దు! అక్కడ దేవతలు సంచరిస్తూ ఉంటారు. కటిక చీకటి. ఉదయగిరి వరకూ వెళ్ళి నెల దాటకుండా వచ్చెయ్యండి! రాని వాళ్ళందరికీ మరణ శిక్షలే. ఉత్సాహంగా, సంతోషంగా వెళ్ళండి! నా ఆజ్ఞ! రామ కార్యం ఇది!"

వినతుడు వెంటనే సైన్యాన్ని తీసుకుని వెళ్ళి పోయాడు. (అవును మరి, ఆలస్యం ఎందుకూ? ఎన్ని వెతకాలో! ఒక్క నిమిషం కలిసొచ్చినా కలిసి రావటమే.)

★ ★ ★

**త**ర్వాత సుగ్రీవుడు, దక్షిణానికి వెళ్ళమని ఆజ్ఞా పించిన వారిలో – అంగదుడూ, తారుడూ, హను మంతుడూ, సుషేణుడూ, నీలుడూ, జాంబవంతుడూ ముఖ్యులు.

దక్షిణ దిక్కు గురించి కూడా సుగ్రీవుడు అన్ని వివ రాలూ చెప్పాడు. (సుగ్రీవుడు వాలి తరుముకొస్తూ వుండగా ఆ భయంతో పరిగెత్తుతూ ఈ దిక్కులన్నీ చూసి నప్పుడు హనుమంతుడూ తారుడూ నీలుడూ కూడా అతనితో పాటు ఉన్న వాళ్ళే. సుగ్రీవుడు, వాళ్ళకే ఆ వివరాలన్నీ చెపుతున్నాడు!) "అడవులూ, కొండలూ, నదులూ, సముద్రాలూ, సముద్రాల్లో అడవులూ, అడ వుల్లో సముద్రాలూ అన్నీ వెతుక్కుంటూ వెళ్ళండి! ఒక చోట వింధ్య పర్వతం తగులుతుంది. తర్వాత నర్మదా నదీ, గోదావరి నదీ, కృష్ణా నదీ అన్నీ వెతకండి! తర్వాత ఆంధ్ర దేశం, చోళ దేశం, పాండ్య దేశం, కేరళ దేశం చూడండి![287] సహ్యా పర్వతం మీద చందన వనం ఉంటుంది. ప్రతి చెట్టూ వెతకండి! (సీత చెట్లెక్కిందేమో నని!) కావేరీ నది ప్రాంతంలో అప్సరసలు విహరిస్తూ ఉంటారు. ఆ ప్రాంతమంతా చూడండి! మలయ పర్వతం మీద అగస్త్య మహర్షి సూర్యుళ్ళాగ వెలిగిపోతూ ఉంటాడు. (అలా వెలుగుతాడు గానీ, ఆయన సూర్యుడు కాడు లెండి. అసలు సూర్యుడు వేరే వుంటాడు!) ఆయన దర్శనం చేసుకోండి! (సీత సంగతి అడిగి ఆయన పరువు తియ్యకండి, చెప్పలేదు) తర్వాత పాండ్య నగరం దాటితే మహేంద్ర పర్వతం వస్తుంది. అదంతా బంగారం ముద్దే. అగస్త్యుడు ఆ పర్వతాన్ని సముద్రంలో ఉంచాడు. అక్కడ ఎప్పుడూ దేవతలు విహరిస్తూ ఉంటారు. పర్వ దినాలలో ఇంద్రుడు కూడా అక్కడికి వస్తూ ఉంటాడు. ఇంకా కొంత దూరం పోతే సముద్రం మధ్యలో ఒక ద్వీపం కన బడుతుంది. అదే రావణుడి నివాసం. రావణుడు రాక్షసు లకు రాజు.[288] ఆ ద్వీపం అంతా శ్రద్ధగా వెతకండి! (రావణుడు ఎక్కడ వుంటాడో సుగ్రీవుడికి తెలుసన్న మాట. మరి, ఇన్నాళ్ళూ చెప్పలేదేం?) దక్షిణ సము ద్రంలో అంగారక అనే రాక్షసి ఉంది. అది నీడలు పట్టు కుని ప్రాణుల్ని లాగేస్తుంది. ఆ ప్రాంతం అంతా వెత కండి! లంకా ద్వీపానికి చాలా దూరంలో పుష్పితకం అనే పర్వతం ఉంది. దాని శిఖరాలలో ఒక దాని మీద సూర్యుడూ, ఒక దాని మీద చంద్రుడూ విహరిస్తూ ఉంటారు. కానీ, ఆ పర్వతం కృతఘ్నులకూ, పాపాత్ము లకూ, నాస్తికులకూ కనపడదు. (వాళ్ళందరికీ ఎంత దృష్టం!)

సీత కనపడుతుందేమో ఆ శిఖరాలలో కూడా వెతకండి! (రావణుడి దేశం తెలిసి పోయాక ఇంకా వేరే చోట్ల వెతకడం ఎందుకు?) అక్కడ కుంజరం అనే ఇంకో

---

**287.** **కిష్కింధా, సర్గ 41, శ్లోకాలు 12,13:** ఈ పేర్లు కవి రాసినవే. "దండకారణ్యములో నుండు గోదావరీ ఖండములోనూ, అటులనే, ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య, కేరళ దేశములలోనూ సీతను వెతకవలయును."★

**288.** **కిష్కింధా, సర్గ 41, శ్లోకాలు 24,26:** ఇంతకాలమూ రావణు డెక్కడున్నాడో తెలియకే కదా ఈ గోలంతా? 'రావణుడి నివాసం ఎక్కడో తెలుసుకుని రండి' అనే కదా, వానరుల్ని పంపించేది? ఇప్పుడు సుగ్రీవుడు రావణుడి గురించి చక్కగా చెప్పేస్తున్నాడు! "(దక్షిణ) సముద్రంలో, నూరు యోజనములు వెడల్పు గలదియు, మనుష్యులు పోవుటకు సాధ్యపడనిదియు నగు నొక ద్వీపము గలదు. దురాత్ముడును, పాపియును, ఇంద్రుని వంటి కాంతి గల వాడును, రాక్షసులకు రాజును, వధించుటకు దగిన వాడును నగు రావణునకు అది నివాస స్థానముగ నున్నది." – రావణుడు ఎక్కడుంటాడో సుగ్రీవుడికి ఇంత తెలిస్తే, వానరుల్ని అన్ని దిక్కులకూ పంపడం ఎందుకు?

ఈ సుగ్రీవుడే, మొదట్లో, రాముడితో స్నేహం చేసుకున్నప్పుడేమన్నాడో చూడండి. కిష్కింధా, సర్గ 7, శ్లోకం 2: "దుష్ట వంశములో బుట్టిన వాడును, పాపియును నగు ఆ రాక్షసుడు వసించుచోటు, అతని సామర్థ్యము, పరాక్రమము, కులము నాకు దెలియవు" అన్నాడు.

ఇప్పుడు సుగ్రీవుడు, రావణుడి గురించి చెప్పిన తర్వాత అయినా, "మరి ఇంత కాలమూ నీకు తెలియదన్నావేం?" అని రాముడు అడగలేదు.

★

పర్వతం కూడా ఉంది. దాని మీద విశ్వ కర్మ, అగస్త్య మహర్షి కోసం ఒక భవనం నిర్మించాడు. (అగస్త్య మహర్షి మలయ పర్వతం మీద నించి, కుంజర పర్వతం మీదకి మారతాడు గావున్ను ఆ ఇల్లు పూర్తయ్యాక.) కుంజరం మీద రత్నాలు రాసులు రాసులుగా ఉంటాయి. (అందుకన్న మాట అగస్త్య మహర్షి ఇక్కడికి మారడం!) అక్కడ భోగవతీ పట్టణం ఉంది. సర్పాలకన్నిటికీ నివాసం అది. సర్పరాజు వాసుకి ఉండేది అక్కడే. సీతా, రావ ణుడూ ఉన్నారేమో అక్కడ కూడా వెతకండి!

తర్వాత రుషభ పర్వతం తగులుతుంది. అక్కడ కూడా రత్నాలు రాసులు రాసులుగా ఉంటాయి. (రత్నా లేనా, సంచులు కూడానా? సంచులు లేకండా రత్నాలే వుంటే ఎలా తెచ్చుకుంటాం?) ఆ పర్వతం నిండా పళ్ళ చెట్లూ, చందన వృక్షాలూ ఉంటాయి. వాటిని ముట్టుకో గూడదు సుమా! వాటిని గంధర్వులు కాపలా కాస్తూ ఉంటారు. (చెట్ల నెందుగ్గానీ గంధర్వుల్ని ముట్టుకోండి!) పుణ్యం చేసుకున్న వారు చచ్చిపోయిన తర్వాత సూర్యుడి లాగా, చంద్రుడిలాగా రూపాలు ధరించి ఆ పర్వతం మీదే నివసిస్తారు. (మీరంతా యుద్ధంలో చచ్చిపోయి ఇక్కడికే వస్తారు. ఎవరిచోటు వాళ్ళు ఇప్పుడే చూసు కోండి!) ఇక, అది దాటి వెళ్ళకండి! అవతల అంతా పితృ లోకం. యముడి రాజ్యం. కటిక చీకటి. పెద్ద గొయ్యి. పడిపోతారు. నెలలోగా వచ్చి సీతని చూశానని ఎవరు చెపుతారో వాళ్ళు ఎన్ని తప్పులు చేసినా తప్పు లేదు. మీరంతా గొప్ప వీరులు! మంచి వంశాల్లో పుట్టిన వారు! ఆచార సంపన్నులు! ఎల్లాగయినా సీతనీ, రావ ణుణ్ణీ కనిపెట్టండి!"

★ ★ ★

**త**ర్వాత సుగ్రీవుడు, తార తండ్రి అయిన సుషేణుణ్ణి రెండు లక్షల మందిని తీసుకుని పడమటి దిక్కుకి వెళ్ళమన్నాడు. (సుషేణుణ్ణి ఇంతకు ముందే దక్షిణానికి పంపించేశారు కదా, కవిగారూ!)

సుగ్రీవుడు పడమర దిక్కు వివరాలన్నీ చెప్పు కొచ్చాడు – "సౌరాష్ట్ర దేశం, బాహ్లిక దేశం వెతకండి! అక్కడ నదులూ, అడవులూ, కొండలూ, సరస్సులూ, ముని ఆశ్రమాలూ అన్నీ వెతకండి! (సీతకోసం ముని ఆశ్రమాల్లో వెతకాలా? అవును, మునుల్ని మాత్రం ఏం నమ్మగలం లెండి!) తర్వాత ఎడారుల్లో, కలుగుల్లో, పర్వతాల్లో, గుహల్లో ఉన్నారేమో వెత కండి! సింధు నది సముద్రంలో కలిసే చోట హేమ గిరి పర్వతం ఉంది. దానినిండా రెక్కల సింహా లుంటాయి. అవి చెట్లమీద గూళ్ళు కట్టుకుంటాయి. అవి తిమింగిలాల్నీ, ఏనుగుల్నీ తన్నుకుపోయి గూళ్ళల్లో పెట్టుకుంటాయి. (సీత ఈ గూళ్ళల్లో దొరకొచ్చు తప్పకుండా. ఆమెకి సింహాలంటే సరదా. పైగా రెక్కల సింహాలు! ఇక రాముడి దగ్గిరికేం వస్తుంది?) హేమ గిరి శిఖరాల్లో ఒక శిఖరం బంగారు ముద్దే. (దాని అదృష్టం అదీ!) తర్వాత కొంత దూరం పోతే పడమర సముద్రంలో పారి యాత్ర పర్వతం కన బడుతుంది. అదంతా కూడా బంగారం ముద్దే. (ఇంతకీ బంగారం అంటే 'రాయి' అని అర్థం గావున్ను. మట్టినీ, బంగారాన్నీ ఒక్కలాగే చూడాలి గాబట్టి, కవిగారు, బంగారాన్ని మట్టిలాగ చూడలేక, మట్టినీ రాళ్ళనీ బంగారం లాగ చూస్తున్నారా?) ఆ బంగారపు పర్వతం మీద ఇరవై నాలుగు కోట్ల మంది గంధర్వులున్నారు. వారు పళ్ళ చెట్లకి కాపలా కాస్తూ ఉంటారు. ఆ పళ్ళూ, దుంపలూ, పువ్వులూ ఏవీ ముట్టుకోకండి! గంధర్వులు యుద్ధాని కొస్తారు. అక్కడే వజ్రం అనే పర్వతం ఉంది. దాన్నిండా రత్నాలే. (కవిగారు రత్నాల మొలతాడు చేయించుకోలేక పోయిన దిగులంతా కనబడుతోంది మాటి మాటికీ.) పడమటి సముద్రంలోనే చక్రవంత మనే కొండ ఒకటి ఉంది. అక్కడే శ్రీ మహా విష్ణువు గొప్ప పరాక్రమంతో హయగ్రీవుడనే రాక్షసుణ్ణి చంపి అతని చక్రాయుధాన్నీ, పంచజనుడనే రాక్షసుణ్ణి చంపి పాంచ జన్యమనే శంఖాన్నీ, సంపాదిం చాడు.[289] ఆ ప్రదేశంలో ఏ పొదల్లోనైనా సీతా, రావణుడూ కనపడతారేమో అణు వణువూ వెతకండి!

అక్కడ వరాహం అనే ఇంకో పర్వతం కూడా ఉంది. అదీ బంగారం ముద్దే. దానిమీద ప్రాగ్జోతిషం అనే పట్టణం ఉంది. అక్కడే నరకాసురుడు నివసిస్తున్నాడు. ఇంకా ముందుకు పోతే వందలకొద్దీ గుహలున్న పర్వతాలు కనబడతాయి. ఆ గుహలనిండా బంగారమే. ఇంకా ముందుకు పోతే అరవై వేల పర్వతాలు తగులు తాయి. అన్నీ బంగారం ముద్దలే. వాటి మధ్యలో ఉంది మేరు పర్వతం. మేరు పర్వతం మీద మేరు సావర్ణి అనే

---

**289.** కిష్కింధ, సర్గ 42, శ్లోకాలు 27, 28: "లవణ సముద్రములో చక్రవంతమను కొండ గలదు .... ఆ చక్రవంతములో పురుషోత్తముడగు విష్ణువు, చక్రమును రక్షించుచుండు హయగ్రీవుడను రాక్షసుని జంపి చక్రమునూ, పంచజనుడను రాక్షసుని జంపి అతని దైనటువంటి పాంచజన్యమను శంఖమునూ సంపాదించెను." ఆ రెండు ఆయుధాలూ ఇతరులవి. విష్ణువు వాటిని సంపాదించుకో గలిగాడు. 'పరులకు' సంబంధించిన దేదైనా (ఆయుధాలుగానీ, స్త్రీలుగానీ, రాజ్యాలుగానీ) తన శక్తితో ఆక్రమించుకో గలగడమే 'పరాక్రమం!' ఇలా ఆక్రమించుకుంటే అది గొప్ప కీర్తి కార్యం! ఎంతసేపూ ఇతరుల్ని బాధించి వాళ్ళ వస్తువులన్నీ లాక్కునే వాళ్ళే – మహాత్ములూ, దేవతలూ, పరాక్రమవంతులూ!
★

రుషి పుంగవుడున్నాడు. ఆయన్ని పూజించి, సీత సంగతి అడగండి. (దండగ, ఏం చెప్పలేదు.) సూర్యుడు, మేరు పర్వతం దాటి అస్తగిరికి పోతాడు. అస్తగిరి మీద విశ్వ కర్మ ఎన్నెన్నో మేడలు కలిపి గొప్ప గృహం తయారుచేసి ఉంచాడు. సూర్యుడు రోజూ అందులోనే ఉంటాడు.

ఇక అస్తగిరి దాటిం తర్వాత అంతా అంధకారమే. ముందుకి వెళ్ళలేరు. నెల రోజుల్లో వచ్చెయ్యండి! రాని వాళ్ళందర్నీ చంపించేస్తాను."

అంతా చెప్పి, సుగ్రీవుడు తార తండ్రికి గౌరవంగా నమస్కారం చేశాడు. అల్లుడి నమస్కారం పూర్తికాక ముందే ఆయన బయల్దేరి వెళ్ళిపోయాడు. (అవును మరి, ఎంత తొందరగా బైల్దేరితే అంత మంచిది కదా?)

★ ★ ★

తర్వాత సుగ్రీవుడు శతవలిని ఉత్తరం వేపు వెళ్ళమన్నాడు. – "నువ్వు లక్ష మందితో ఉత్తరానికి వెళ్ళు! శ్రీరాముడు శత్రు పట్టణాలు జయించగల పరాక్రమవంతుడు. అటువంటి శ్రీరాముడికి మన మీద దయ గలిగింది. మనకు చాలా ఉపకారం చేశాడు. (నాకు సింహాసనం, మీకు ఉరి కంబాలూ ప్రసాదిం చాడు.) మనం రాముడికి ప్రత్యుపకారం చేస్తే మన జన్మలు ధన్యమవుతాయి. (యుద్ధం చేస్తే శరీరాలు కూడా ధన్యమౌతాయి!) అందుచేత మీ రంతా చాలా శ్రద్ధగా కార్యం సాధించుకుని రావాలి. మ్లేచ్ఛ దేశమూ, పుళింద దేశమూ, ప్రజ్కల దేశమూ, అరట్టక దేశమూ, టంకణ దేశమూ, దరద దేశమూ, (దురద దేశం కూడా ఉందా? అటు పోకండి! గోక్కో లేక చావాలి!) చీనా దేశమూ, పరమ చీనా దేశమూ అన్నీ వెతకండి! (ఇప్పుడైతే 'జన చీనా'లో వెతికితే లాభం లేదు. అక్కడ పతివ్రత సీత లుండరు.) రావణుడు సీతతో కలిసి లొద్దుగు వనాల్లోనో, దేవ దారు వనాల్లోనో, ఉండవచ్చును. (రాముడు ఇప్ప టికి ఎన్నిసార్లు మూర్ఛబోయి ఉండవొచ్చును?) తర్వాత, సోమా శ్రమం, కాశీ పర్వతం, సుదర్శన పర్వతం తగులు తాయి. అంతా బంగారమే. మూల మూలలా వెతకండి! తర్వాత దేవ సఖమనే పర్వతం వస్తుంది. దాన్నిండా చెట్లుంటాయి. చెట్లనిండా పిట్టలుంటాయి. ఇంకా ముందుకు పోతే కైలాస పర్వతం కనబడుతుంది. అక్కడే కుబేరుడుంటాడు. అతని వనం అంతా వెతకండి! తర్వాత క్రౌంచ పర్వతం ఉంది. దాని లోపల పెద్ద బిలం ఉంది. అందులో గొప్ప గొప్ప రుషులు ఉంటారు. (గబ్బి లాల రూపాల్లో గావున్ను.) ఆ రుషుల బిలం వెతకండి! తర్వాత కామ పర్వతం చూస్తారు. దాని మీద ఒక్క చెట్టయినా ఉండదు. అక్కడికి దేవతలు కూడా వెళ్ళలేరు. అదంతా వెతకండి! తర్వాత మైనాక పర్వతం దాటితే సిద్ధాశ్రమం తగులుతుంది. అక్కడ గొప్ప గొప్ప రుషు లున్నారు. (ఇంతకీ ఎక్కడి రుషులు 'గొప్ప గొప్పా'? అక్కడా, ఇక్కడా? ఎక్కడో సరిగా చెప్పు!) వారు తపస్సు వల్ల సమస్త కల్మషాలూ పోయిన వారు. (మతులు కూడా!) వైఖానస సరస్సులో బంగారు కమలాలుం టాయి. (వాటిని చూస్తూ కూచోకండి!) అక్కడ సార్వ భౌమం అనే ఏనుగు ఎందరో ప్రియు రాళ్ళతో విహరిస్తూ ఉంటుంది. (ఏనుక్కి కూడా ఎందరో ప్రియురాళ్ళని పెడితేనే గానీ తృప్తి లేదు కవిగారికి) ఆ సరస్సు దాటి వెళ్తే సూర్య చంద్రులుండరు. నక్షత్రాలుండవు. కాంతే ఉండదు. మేఘాలుండవు. శబ్దాలుండవు. అక్కడ కొందరు గొప్ప గొప్ప రుషులు ధగ ధగా వెలుగుతూ ఉంటారు. ఆ కాంతివల్ల ఆ ప్రదేశం అంతా వెలిగిపోతూ ఉంటుంది. అక్కడ శైలోద అనే నది ఉంది. దాని గట్ల మీద వెదుళ్ళున్నాయి. అవి ఒక ఒడ్డు మీద నుంచి ఒక ఒడ్డు మీదకు వాలి ఉంటాయి. రుషులు ఆ వెదుళ్ళ మీద నుంచి శైలోద నది దాటుతారు. (ఏం, ధగ ధగల్లో దాటలేరా? నది దాటడానికి వెదుళ్ళు కావాలీ?) తర్వాత ఉత్తర కురు భూముల్లో ఉండే నదుల్లో బంగారం కమ లాలకు వజ్రాల రేకులుంటాయి. అక్కడ నదులనిండా ఇసకకు బదులుగా ముత్యాలూ రత్నాలూ మణులూ మాణిక్యాలూ ఉంటాయి. అక్కడ చెట్లు కోరికలన్నీ తీరు స్తాయి. కొన్ని చెట్లు జలతారు అంచులు గల పట్టు వస్త్రాల్ని కాస్తాయి. కొన్ని చెట్లు చక్కని అలంకారాలతో పరుపులూ తలగళ్ళూ దుప్పట్లూ వేసి చిత్రవిచిత్రంగా ఎంతో సౌకర్యంగా అమర్చిన బంగారం మంచాల్ని కాస్తాయి. (ఈ చెట్ల విత్తనాలు దొరికితే బాగుణ్ణు!) కొన్ని చెట్లు సౌందర్య రాసులైన స్త్రీలని కాస్తాయి. (పురుషుల్ని కాయవుగా? ఎవడిక్కావాలి, పక్ష పాతం చెట్లు?) ఆ చెట్ల ప్రాంతం అంతా బాగా వెతకండి! (ఈ రకం వెతుకుడైతే సీత దొరికినట్టే!) – ఉత్తర కురు దేశం దాటిపోతే ఉత్తర లవణ సముద్రం వస్తుంది. దాని మధ్య సోమగిరి అనే బంగారు పర్వతం ఉంది. దాని మీద బ్రహ్మ, విష్ణువూ, రుద్రుడూ ఉంటారు. అక్కడికి పోవడం ఎవరికీ సాధ్యం కాదు. అక్కడ సీతని వెతకండి! – ఇక ముందుకు పోవద్దు! మీరందరూ మహా వీరులు. విశ్వాసపాత్రులు రామ కార్యం నెరవేర్చుకు వస్తే, నా దయ పొంది సకల సుఖాలతో మునిగి తేలుతారు! (లేకపోతే ఉరికంబాలకు వేళ్ళాడతారు. మీ ఇష్టం మరి! ఏది కావాలి?)

★ ★ ★

అన్ని దిక్కుల వాళ్ళు వెళ్ళిపోయినా దక్షిణం దిక్కు వాళ్ళు ఇంకా కదల్లేదు. ఎందుచేతో?

సుగ్రీవుడు దక్షిణం వేపు పోవలసిన హను మంతు డికి ప్రత్యేక శ్రద్ధతో చెప్పాడు మళ్ళీ. "నువ్వు వీరాధి వీరుడివి. భూమిలో, నీటిలో, గాలిలో, అన్ని మార్గా

ల్లోనూ వెళ్ళగలవు. దేవతల లోకాలన్నీ ఎరుగుదువు. గొప్ప తేజశ్శాలివి! సీతని వెతికే కార్యం అంతా నువ్వే సాధించాలి" అన్నాడు.

సుగ్రీవుడు హనుమంతుడితో అంత ప్రత్యేకాభి మానంతో మాట్లాడి అతడి మీద అంత గొప్ప విశ్వాసం ప్రకటించడం చేత, రాముడు తన కార్యం నెరవేర్చుకు రాగల వాడు హనుమంతు డొక్కడేనని గ్రహించాడు. (మరి అన్ని లక్షల మందిని ఇటూ అటూ తిప్పి చావ గొట్టడం ఎందుకూ? వానరులంతా రాముణ్ణీ, సుగ్రీవుణ్ణీ పట్టుకు తంతే బాగుణ్ణు!)

రాముడు తన పేరు చెక్కిన ఉంగరం హనుమంతు డికి ఇచ్చాడు – (అదెక్కడిదీ? నగలన్నీ అయోధ్యలోనే వదిలెయ్యాలిగా? రుషులకు ఉంగరాలు ఉండొచ్చా? ఇంకా ఎన్ని తెచ్చుకున్నాడో చాటుగా!) – "హను మంతుడా! ఈ ఉంగరం చూపిస్తే సీత నిన్ను నమ్ము తుంది. నా దగ్గిర నుంచి వచ్చావని గ్రహిస్తుంది. నువ్వు మహా వీరుడివి. సుగ్రీవుడెలాగూ కఠినమైన ఆజ్ఞ ఇచ్చాడు. (ఆ భయంతోనన్నా నువ్వు పని చేసుకొస్తావు.) కార్యం సిద్ధిస్తుందనే నాకు తోస్తోంది" అన్నాడు.

హనుమంతుడు ఉంగరం పుచ్చుకుని బయల్దేరాడు.

వానరులంతా నాలుగు దిక్కులకూ వెళ్ళిపోయాక రాముడు సుగ్రీవుడితో కబుర్లేసుకున్నాడు – "సుగ్రీవుడా! నువ్వు భూమండలం అంతా ఎప్పుడు చూశావోయీ?" అని అడిగాడు. (అంతేగానీ, 'మరి ఇప్పటిదాకా రావ ణుడి సంగతి నీకు తెలియదన్నావేం' అని మాత్రం అడగ లేదు!)

సుగ్రీవుడు పాత కథే మళ్ళీ ప్రారంభించి చెప్పాడు. వాలి, బిలంలో ఉండి పోయినప్పుడు, సుగ్రీవుడు రాజ్యానికొచ్చి పట్టాభిషేకం చేసుకోవడమూ (తారని కూడా భార్యని చేసుకుని! అంటే, వాలి, తమ్ముడి భార్యతో ఉండడం కన్నా ముందే సుగ్రీవుడు అన్న భార్యతో ఉన్నాడు), వాలి బయటకు వచ్చి సుగ్రీవుణ్ణి వెళ్ళగొట్ట డమూ, అంతా గుర్తు చేసి – "నేనూ, నా మంత్రులూ భయంతో, నాలుగు దిక్కులకూ పరిగెత్తాము. వాలి మమ్మల్ని మహా వేగంగా వెంటాడుతూనే ఉన్నాడు. అప్పుడే తిరిగ్గా భూమండలం అంతా చూశాం. నాలుగు దిక్కులూ అయిపోయాక, హనుమంతుడికి, కిష్కింధ దగ్గిరే రుష్యమూకం మీదకి వాలి రాడనే సంగతి జ్ఞాపకం వచ్చింది. (అబ్బ! ఎంత మతి మరుపో హనుమంతుడికి! భూమండలం అంతా తిరిగాక, ఊళ్ళోనే ఉన్న కొండ గుర్తొచ్చిందా? ఆ ఉంగరం ఎక్కడ పారేస్తాడో ఏమో!) తర్వాత సంగతి నీకు తెలిసిందే" అని తన భూమండల జ్ఞానానికి కారణం చెప్పాడు. రాముడు సంతోషించాడు.

★ ★ ★

సరే! దక్షిణం దిక్కు వాళ్ళు తప్ప, మిగతా దిక్కుల వాళ్ళు నెల తిరక్కుండానే వచ్చేశారు. "సీత దొరకలేద"ని చక్కగా చెప్పేశారు. పైగా ఏమన్నారంటే – "హను మంతుడు మహానుభావుడు! రావణుడే దిక్కుగా పోయాడో, హనుమంతుడూ ఆ దిక్కుగానే పోయాడు కాబట్టి, ఆ మహానుభావుడే ఆ మహానుభావుర్నాల్ని కని పెట్టి రాగలడూ, అందుకు సందేహం లేదూ" అన్నారు. (వీళ్ళసలు వెతికే ఉండరు. ఏ చెట్ల కిందో కూర్చుని పళ్ళు బాగా తినేసి వచ్చేసి వుంటారు. ఎంత గడుసు వాళ్ళో!)

★ ★ ★

ఇక దక్షిణం దిక్కుకు వెళ్ళినవాళ్ళ సంగతి. అన్నీ వెతుక్కుంటూ పోతున్నారు. కండు మహర్షి ఆశ్రమం తగిలింది. ఆ ఆశ్రమం చుట్టుపట్ల అడివంతా చెట్లు మోళ్ళయి పోయి ఉన్నాయి. కాయలూ, పువ్వులూ లేవు సరిగదా ఆకులు కూడా లేవు. ఆ ప్రాంతాల్లో ఒక్క జంతువు లేదు, ఒక్క పిట్ట లేదు. కారణం ఏమిటంటే, కండు మహర్షి కొడుకు హఠాత్తుగా చచ్చిపోతే, మహర్షికి అందరి మీదా కోపం వొచ్చి, జీవులన్నీ నశించి పోవాలని శపించేశాడు. అంత ఉత్తముడాయన! – ఆ చుట్టు పట్ల సీత కన పడ లేదు. వెతికి వెతికి చాలా అలసిపోయారు. తినడానికీ, తాగడానికీ ఏమీ దొరక లేదు. (కండు రుషిగారేం తింటాడో మరి!)

వెతికి, వెతికి ఒక చోట పెద్ద బిలం చూశారు. దాని పేరు రుక్ష బిలం. అది పొదలతో, చెట్లతో మూసుకు పోయి ఉంది. దాంట్లోంచి ఎన్నెన్నో పరిమళాలు వస్తు న్నాయి. తడి రెక్కలతో పక్షులు వస్తున్నాయి. అందరూ బిల బిలమంటూ ఆ బిలంలో జొరబడ్డారు. కొంత దూరం కారు చీకటి. తర్వాత బంగారం చెట్లు. వాటి మొదళ్ళ చుట్టూ వజ్రాలతో, వైఢూర్యాలతో కట్టిన గట్లు. అక్కడ చాలా మేడలున్నాయి. కొన్ని బంగారానివీ, కొన్ని వెండివీ. (ఛ, వెండా? అన్నీ బంగారమే అంటే నమ్మ రేమోననా కవిగారూ? ఫర్వాలేదు. ఎలాగూ 'ఘంటం'తో కట్టే మేడలే కదా? వెండెందుకు లెండి, అన్నీ బంగారం తోటే కట్టండి!)

అక్కడ అన్నీ బంగారపు సరస్సులే. వాటిల్లో బంగా రపు కలవ పూల మీద, బంగారపు తుమ్మెదలు వాలి, బంగారపు తేనె తాగుతున్నాయి. ఆ బిలంలో ఎక్కడ చూసినా రత్నాలూ, వజ్రాలూ తాపడం చేసిన బంగారపు శయ్యలున్నాయి. బంగారపు ఆసనాలున్నాయి. లోకంలో ఉండే సమస్తమైన వస్తువులూ అక్కడ ఉన్నాయి. అన్నీ బంగారంవే. బంగారం పళ్ళాలతో ఎన్నెన్నో భోజన పదార్థాలూ, పానీయాలూ, మద్యాలూ ఉన్నాయి. కొంత దూరాన ఒక యోగిని కనబడింది.

హనుమంతుడు ఆమెని "నువ్వెవరు?" అని అడిగాడు. (హనుమంతుడు మనింటి కొస్తే 'మీ రెవరు?' అని అడుగుతాడు. తనెవడో, ఎందుకొచ్చాడో చెప్పడు!)

ఆమె చెప్పింది – "మయుడనే రాక్షసు డుండే వాడు. అతడు తపస్సు చేసి, బ్రహ్మవల్ల శుక్ర వాస్తు శాస్త్రం అంతా వరంగా పొందాడు. ఆ మయుడే ఈ బిలంలో మేడలూ, సరస్సులూ నిర్మించాడు. అతడు హేమ అనే అప్సరసను ప్రేమించాడు. ఆ సంగతి తెలిసిన ఇంద్రుడు మయుణ్ణి చంపేసి, ఈ సంపద అంతా హేమ కిచ్చాడు. ఆమె నాకు ప్రాణ స్నేహితు రాలు. ఈ బిలం, నన్ను కాపాడమని నాకు అప్ప గించింది. నేను మేరుసావర్ణి కుమార్తెని. స్వయంప్రభ నా పేరు. మీరు చాలా అలిసి ఉన్నారు. చక్కగా తినండి, తాగండి, సుఖంగా ఉండండి" అని చెప్పింది. (ఆడవాళ్ళు తపస్సులు చేసినా మంచివాళ్ళ లాగానే ఉంటారన్న మాట! అదే ఏ విశ్వామిత్రుడో అయితే అసలు నా బిలంలో కెందుకొచ్చారు? బల్లులై పొండి అని శపించే వాడే) వానరులంతా సంతోషంతో అక్కడ అన్నీ తిన్నారు. తాగారు. విశ్రాంతిగా కొంత కాలం గడిపారు.

స్వయంప్రభ వానరుల్ని, "మీ కార్యం ఏమిటి?" అని అడిగింది. హనుమంతుడు అంతా చెప్పుకొచ్చాడు. "రాముడనే ఒక రాజున్నాడు. (రాముణ్ణి రాజుగానే గానీ, రుషిగా లెక్కగట్టడం లేదు.) ఆయన సర్వ లోకాలూ ఏలతగ్గవాడు. (కోసల రాజ్యం తప్ప!) – అని మొదలు పెట్టి రామాయణం అంతా చెప్పాడు. చివరికి, "సీతని వెతకాలి. గడువు దాటిపోయింది. మమ్మల్ని ఈ బిలం లోంచి బయట పడెయ్యి" అన్నాడు. "కళ్ళు మూసు కోండి" అంది స్వయం ప్రభ. వానరులంతా కళ్ళు మూసుకున్నారు. (కళ్ళు తెరిచి ఉంటే, ఎగిరేటప్పుడు కళ్ళు తిరుగుతాయి లెండి.)

అందరూ వింధ్య సమీపాన, సముద్రం ఒడ్డున ఉన్నారు. చుట్టూ పర్వతాల నిండా చెట్లన్నీ విరగ బూసి ఉన్నాయి. వసంత రుతువు వచ్చేసిందని గ్రహించారు. (సంవత్సరాని కెన్నిసార్లు వస్తుంది వసంత రుతువు?) కిష్కింధకు పోవలసిన గడువు దాటి పోయింది. అందరూ ఒక పూల చెట్టు కింద కూర్చుని చర్చించసాగారు.

అంగదుడు అసలు కిష్కింధకు పోనే పోవద్దన్నాడు. "మనం ఆశ్వయుజ మాసంలో బయల్దేరాం. (కార్తీకం వరకూ వర్ష రుతువన్నాడు రాముడు. తర్వాత కూడా కొంత కాలం గడిచిపోయింది. అంటే, వానరులు బయ ల్దేరింది ఆశ్వయుజంలోనూ కాదు, కార్తీకంలోనూ కాదు.) వచ్చిన పని జరగలేదు. గడువు దాటిపోయింది. ఇప్పుడు తిరిగి వెళ్తే రాజు మనల్ని చంపించేస్తాడు. అసలు సుగ్రీవుడికి నేనంటే చాలా పగ. నాకు యువ రాజు పదవి ఇవ్వడం కూడా అతడు ఇష్టంతో ఇవ్వలేదు. రాముడు చెప్పాడు కాబట్టి నన్ను యువరాజుని చేశాడు. ఈ నేరంతో నన్ను తప్పకుండా చంపించాలని చూస్తాడు. అక్కడ నా మరణం చూసి నా స్నేహితులు దుఃఖించడం ఎందుకు? ఇక్కడే ప్రాయోపవేశం చేసి చచ్చిపోవడం మంచిది" అన్నాడు. (ప్రాయోపవేశం అంటే, ఆహారం మానేసి చచ్చిపోవడం.)

"అవును, సుగ్రీవుడు మొదటి నించీ దుర్మార్గుడే. కిష్కింధకు పోతే చావు తప్పదు" అన్నారు అందరూ, హనుమంతుడు తప్ప.

తారుడు కూడా అల్లుడి దుర్మార్గం తలుచుకుని భయపడి "మనం స్వయంప్రభ బిలంలోనే ఉండి పోదాం. రాముడే గాదు, ఇంద్రుడైనా ఏమీ చెయ్యలేడు" అన్నాడు. (రాముడి గురించీ, ఇంద్రుడి గురించీ మా బాగా అన్నావు తారుడు తాతా!)

వానరులంతా సంతోషంతో "అవును. అలాగే చేద్దాం. అక్కడే ఉందాం" అని ఒప్పుకున్నారు.

అదేమీ హనుమంతుడికి నచ్చలేదు. అంగదుడు, వానరులందరికీ, సుగ్రీవుడి మీద శత్రుభావం కలిగించి, వారిని తనకు అండగా ఉంచుకోబోతున్నాడనే సంగతి హనుమంతుడు గ్రహించాడు. అలా ఎంత మాత్రం జరగ నివ్వకూడ దనుకున్నాడు. అంగదుడు, తండ్రి లాగానే గొప్ప వీరుడు. బుద్ధిబలం గలవాడు. ఉత్తమ గుణాలు గలవాడు. శాస్త్రాలు చదివిన వాడు. పౌర్ణమి చంద్రుడిలాగ బల పరాక్రమాలలో ఆరితేరుతూ ఉన్న వాడు. అటువంటి వాడు విరోధిగా ఉండడం సుగ్రీవుడికి క్షేమం కాదు. హనుమంతుడు అంతా ఆలోచించి, అంగ దుణ్ణి సుగ్రీవుడికి అనుకూలంగా ఉండేటట్టు చెయ్యడానికి పూనుకున్నాడు. ముందు అంగదుడికీ, సైనికులందరికీ విరోధం కల్పించి, తర్వాత అంగదుణ్ణి మందలించాలను కున్నాడు. గొప్ప వాత్సల్యంతో బోధిస్తున్నట్టు ప్రారంభిం చాడు – "అంగదా! యువ రాజా! ఈ వానరులంతా నీ మాటకు కట్టుబడి ఉంటారని భ్రమపడుతున్నావు. ఎంతో కాలం ఉండరు సుమా! (మహా చక్కగా ఉంటారు. ఎందు కంటే, వాళ్ళకీ ప్రాణ భయమే, కిష్కింధకు పోవడానికి.) ఈ జాంబవంతుడూ, నీలుడూ, సుహోత్రుడూ, వీళ్ళంతా నీ మాట ప్రకారం నడుచుకోరు. వాళ్ళే కాదు, నేనూ ఉండను. నన్నెవ్వరూ సుగ్రీవుడికి దూరం చెయ్యలేరు. (సుగ్రీవుడికి కాదులే, 'మంత్రి పదవి'కి!) బలవంతుడు బలహీనుడితో వైరం పెట్టుకోవచ్చు. అది రాజనీతే. (ఎంత మంచి నీతో!) కానీ, బలహీనుడు బలవంతుడితో వైరం పెట్టుకోగూడదు. నువ్వు నీ క్షేమం కోసమే సుగ్రీవు డికీ లొంగి ఉండాలి. స్వయంప్రభ బిలంలో ఉండిపోతే ఏమీ ప్రమాదం రాదనుకుంటున్నావేమో! – ఒక్క బాణం

వేసి ఆ బిలాన్ని ఆకు దొన్నెని చీల్చినట్టు చీల్చెయ్యడానికి రాముడి దాకా ఎందుకు, లక్ష్మణుడు చాలు. నా మాట విని ఇక్కడే ఉండాలనే అభిప్రాయం మార్చుకో. సుగ్రీవుడు అంత కఠినాత్ముడు కాదు. నిన్నెప్పుడూ చంపించడు. నీ తల్లి మీద అతడికి చాలా మోహం. నువ్వు తప్ప అతనికి మాత్రం కొడుకు లెవరున్నారు? సుగ్రీవుడి అడుపాజ్ఞల్లో నమ్మకంగా ఉన్నావంటే తన తదనంతరం రాజ్యం నీకే ఇస్తాడు. నీ పినతండ్రి ఎంతో ధర్మాత్ముడు. ఉత్తముడు. దయగల వాడు. (తనకి మరణ శిక్ష పడదని హనుమంతుడికి బాగా తెలుసు.) ఇంకా నా మాట వినక నువ్వు ఇక్కడే ఉన్నావా, అప్పుడు మాత్రం నీకు చావు తప్పదు. సుగ్రీవుడు నిన్ను విడిచి పెడతాడని మాత్రం అనుకోకు" అని తన శక్తి కొద్దీ భయపెట్టాడు.

అంగదుడు హనుమంతుడి మాటలేవీ చెవిన బెట్టలేదు. – "నువ్వు కీర్తిస్తున్నట్టు సుగ్రీవుడికి ఒక్క సుగుణమైనా లేదు. అతడికి ధర్మం లేదు. హృదయం లేదు. చిత్త శుద్ధి లేదు. పశ్చాత్తాపం లేదు. దయ లేదు. పరాక్రమం లేదు. ధైర్యం లేదు. అన్నను చంపిన వాడు ఉత్తముడవుతాడా? అన్న జీవించి ఉండగానే (వాలి బిలంలో వున్నప్పుడు) 'తల్లి వంటి' వదిన గార్ని నిర్బంధించిన వాడు ధర్మాత్ముడవుతాడా? ('తల్లి వంటి' అనే మాటలు కవి వాడినవే.) సుగ్రీవుడు సీతను వెతికించే ఏర్పాట్లు చేశాడంటే రాముడికి భయపడే గానీ, తన వాగ్దానానికి కట్టుబడి గాదు. అంత దుర్మార్గుణ్ణి ఎవరు నమ్ముతారు? నా కేనాటికీ రాజ్యం ఇవ్వడు. తనకు పుట్టబోయే కొడుకులకే ఇచ్చుకుంటాడు. నే నిప్పుడు కిష్కింధకు వెళితే, నేను తనని తిట్టిన సంగతి ఎవరి ద్వారానైనా విని, నన్ను రహస్యంగా, నా తల్లికి కూడా తెలియకుండా చంపించేస్తాడు. నేను మాత్రం అక్కడికి రాను. నాతో ఎవ్వరూ ఉండవొద్దు. అందరూ వెళ్ళిపోండి. నా తల్లి ఎంతో దయ గలది. ఆమెకు నేనంటే పంచ ప్రాణాలు. ఆమెను మాత్రం ఓదార్చండి" అని అంగదుడు వృద్ధులందరికీ నమస్కారాలు చేసి, ఏడుస్తూ నేలమీద పడుకున్నాడు. వానరులంతా అతని చుట్టూ జేరి బొట బొట కన్నీళ్ళు గారుస్తూ సుగ్రీవుణ్ణి తిట్టి, వాలిని కీర్తించారు. "మనందరం ఇక్కడే చచ్చిపోదాం" అని నిశ్చయించుకున్నారు. (హనుమంతుడి మొహం చూడాలి!)[290]

వానరులందరూ ఏడుస్తూ తమ చావుకి కారణం అయిన సంగతులన్నీ తల పోసుకుంటున్నారు.

అంతలో, సంపాతి అనే ఒక పెద్ద రెక్కలు లేని పక్షి,

---

**290. కిష్కింధ, సర్గ 53, శ్లోకాలు 27 నించీ చివరివరకూ, + 54, 55 సర్గలు పూర్తిగా:** అంగదుడికి పినతండ్రి మీద ఎలాంటి అభిప్రాయం ఉందో చూడండి. "సుగ్రీవుడు పుట్టుక చేతనే క్రూరుడు. పూర్వము నా యెడల బద్ధ ద్వేషము గల వాడును, నన్ను దండించవలయునని కోరియుండు వాడును నగు సుగ్రీవుడు నాకు కఠినమైన శిక్ష విధించును. అతని చేతిలో జిక్కి చిత్రవధ బడయుట కంటే ఇచటనే ప్రాణములు విడుచుట మనకు శ్రేయము."

అంగదుడికి, సుగ్రీవుడి మీద కోపం ఉన్నట్టే, రాముడి మీద కూడా కోపం ఉండాలి కదా? అంతకన్నా ఎక్కువే ఉండాలి. కానీ, కవిగారు అంగదుడితో సుగ్రీవుణ్ణి తిట్టించారే గానీ, రాముణ్ణి ఒక్క మాట అయినా అనిపించలేదు. పైగా పొగిడించారు. అంగదుడు రాముణ్ణి చక్కగా పొగుడుతున్నాడు. "సుగ్రీవుడు నాకీ యువ రాజ్య పట్టాభిషేకము సేయనే లేదు. శుద్ధమైన ప్రవర్తన గల వాడును, మానవోత్తముడును నగు శ్రీరాముడే నాకు ఈ పట్టాభిషేకము జేసెను." ఈ రకంగా మాట్లాడుతున్న అంగదుణ్ణి చూసి, "అంగదునకు రాజ్యము పరిపాలించు సామర్థ్యము గలదని హనుమంతుడు తెలిసికొనెను". తెలుసుకొని ఏం జేశాడంటే – "సామ, దాన, భేద, దండోపాయములలో భేదోపాయములను జెప్పుచూ, వానరుల కందరికిని భేదము గల్పించెను. వానరు లందరును, పరస్పరము భేదించి యుండగా, దండోపాయముతో గూడిన భయంకరమగు, అనేక మాటలచే అంగదునికి హనుమంతుడు భయము కలిగించెను."

**హనుమంతుడు చెప్పిన మాటలు:** "సుగ్రీవునితో విరోధము గల్పించుకొని నీవు బిలములో ఉండినచో వానరులందరూ నిన్ను విడిచిపోదురు. స్నేహితులూ, హితులూ లేనివాడవై తృణ ప్రాయుడ వగుదువు. నీవు వినయముతో కిష్కింధలో ప్రవేశించినచో సుగ్రీవుడు నిన్ను, క్రమముగ, రాజ్యములో స్థాపించును."

అంగదుడు, ఇక్కడే కొంత సైన్యంతో, సుగ్రీవుడి మీద శత్రుభావం పెట్టుకుని వేరుగా ఉండటం ఎప్పటికైనా సుగ్రీవుడికి చాలా ప్రమాదం కదా? అంగదుణ్ణి నయాన్నో, భయాన్నో సుగ్రీవుడికి అనుకూలంగా వుండేటట్టు చెయ్యాలి. అది సుగ్రీవుడికీ, రాముడికీ మేలు కలిగించే కార్యం. కాబట్టి హనుమంతుడు అంగదుణ్ణి భయపెట్టి, మందలించడం గొప్ప కార్యం అనీ, హనుమంతుడు ఉత్తముడనీ, బుద్ధిమంతుడనీ, కవి హనుమంతుణ్ణి శ్లాఘించాడు.

**హనుమంతుడి మందలింపులకు అంగదుడి జవాబు:** "స్థిరమైన బుద్ధీ, ఆత్మశుద్ధీ, దయా, రుజు స్వభావమూ, పరాక్రమమూ, గాంభీర్యమూ, సుగ్రీవుని యందు లేవు. అన్న జీవించి యుండగనే, అతని భార్యను, తల్లితో సమానముగ నుండు అన్న భార్యను, ధర్మమని స్వీకరించిన వాడు లోక నిందితుడు. అన్న, గుహలో ప్రవేశించి యుండగా, బిల ద్వారమును మూసిన వానికి ధర్మమెట్లు తెలియును? లోలోపల అప్రియము జేయువాడును, కఠిన చిత్తుడును, నీచుడును నగు సుగ్రీవుడు, రాజ్యము మీద ఆశగలవాడై నన్ను రహస్యముగ బంధించి, దండించును – అని అంగదుడు రోదించెను." ➔

కొండల మీద నడుస్తూ వచ్చాడు. వానరుల్ని చూసి, "ఆహా! ఎంత ఆహారమో! చక్కగా తింటాను" అని సంతోషించాడు.

సంపాతికి వానరుల మాటల మధ్య జటాయువు సంగతి చెవినబడింది. "వానరులారా! జటాయువు నా తమ్ముడే. అతణ్ణి రావణుడు చంపేశాడని చెప్పుకుంటున్నారు మీరు. ఆ సంగతేమిటో అంతా నాకు వివరంగా చెప్పింది. చాలా కాలం నించి, నా తమ్ము డెక్కడున్నాడో నాకు తెలియలేదు. నా రెక్కలు సూర్యుడి వేడికి కాలిపోయాయి. నన్ను ఈ కొండ మీద నుంచి కిందకు దించండి" అని అడిగాడు.

అంగదుడు సంపాతిని కిందకు దించి, కథంతా చెప్పుకొచ్చాడు. "సీతను వెతికే గడువు దాటిపోయింది. అందుచేత మేం చచ్చిపోవాలను కుంటున్నాం. రావణుడు ఎక్కడుంటాడో, ఏమిటో నీకేమన్నా తెలుసా" అని అడిగాడు. (సుగ్రీవుడు చెప్పాడుగా? మళ్ళీ రావణు డెక్కడుంటాడో చెప్పాలా? రామ కార్య భారంతో వీళ్ళకు మతులు చలించినట్టే ఉంది!)

సంపాతి, కథంతా విని, "రావణుడు సీతని ఎత్తుకు పోవటం నేను కూడా చూశాను. సీత ఏడుస్తూ, నగలు పారేస్తూ ఉంది. రావణుడు కుబేరుడి తమ్ముడు. లంకలో ఉంటాడు. లంక ఇక్కడికి నూరు యోజనాల దూరం. అదుగో, సీత ఇక్కడి నించే కనబడుతోంది నాకు. కాకులూ, డేగలూ అంత దూరం చూడలేవు గానీ, మా జాతి పక్షులం నూరు యోజనాల వరకూ చూడగలం. (మరి నీకు మీ తమ్ముడెందుకు కనపడలేదు నాయనా?) మీరు రావణుణ్ణి సంహరిస్తే నా కక్ష కూడా తీరుతుంది. అసలు రామ కార్యం నా వల్లనే జరగాలి గానీ, నేను వృద్ధుణ్ణయి పోయాను. ఇక నేనేమీ చెయ్యలేను. నన్ను సముద్రం దగ్గిరికి తీసుకు వెళ్ళండి. నా తమ్ముడికి తర్పణాలు విడుస్తాను" అన్నాడు.

వానరులు సంపాతిని సముద్రం దగ్గిరికి మోసుకుపోయి తర్పణాల వ్యవహారం అయ్యాక మళ్ళీ తెచ్చిపడేశారు.

జాంబవంతుడు సంపాతి దగ్గిరికి వెళ్ళి, "పక్షి రాజా! సీత ఎక్కడుంది? ఆమెని ఎవరు అపహరించుకు పోయారు? ఆ సంగతులన్నీ చెప్పి మమ్మల్ని రక్షించు" అని అడిగాడు. (పాపం ఈయనికి పూర్తిగా మతి పోయింది. సీతని ఎవరెత్తుకు పోయారని మళ్ళీ అడుగుతున్నాడు. చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతోంటే అంతే మరి!)**291**

సంపాతి "సీత సంగతి నాకెలా తెలిసిందో, ఎవరి ద్వారా విన్నానో చెబుతా. వినండి. (ఇందాక తనే చూశానన్నాడే!) నేను రెక్కలు కాలిపోయి చాలా కాలం నించీ పర్వతాల మీద ఉంటున్నాను. నా కొడుకే నాకు ఆహారం తెచ్చి పెడుతున్నాడు. ఒకనాడు ఆహారం లేకుండా వచ్చాడు. కారణం ఏమిటని అడిగితే అంతా చెప్పుకొచ్చాడు. "తండ్రీ, నేను జంతువుల కోసం సముద్రం మీద వెతుకుతూ తలకిందులుగా నించున్నాను. అంతలో ఒక పురుషుడు ఒక స్త్రీని తీసుకు వెళ్తూ 'దారి ఇయ్యి' అని అడిగాడు. దారి ఇచ్చాను. తర్వాత సిద్ధులు, అతడు రావణుడనీ, సీతని ఎత్తుకు పోతున్నాడనీ, సీత ఏడుస్తోందనీ చెప్పారు. ఇలా జరగడం వల్ల ఆహారం తేలేక పోయాను" అని చెప్పాడు. రావణుడి మీద నాకు చాలా కోపం వచ్చినా, రెక్కలు లేకపోవడం వల్ల నేనేమీ చెయ్యలేక పోయాను. (రెక్కలు వుంటే ఉద్ధరించే వాణ్ణి!)

నాకు రెక్కలు ఎలా పోయాయో కూడా చెపుతాను, వినండి. (సరే, కానియ్యి! తప్పుతుందా?) వెనకటికి నేనూ, జటాయువూ పందేలు వేసుకుని సూర్యుడి దగ్గిరికి బయలుదేరాం. కొంత దూరం వెళ్ళేటప్పటికి వేడి భరించలేక నా తమ్ముడు స్పృహ తప్పి కిందపడి పోతున్నాడు. వెంటనే, నా తమ్ముడి మీద నా రెక్కలు కప్పాను. వేడికి నా రెక్కలు కాలిపోయి నేను వింధ్య పర్వతం మీద పడిపోయాను. తెలివి వచ్చిం తర్వాత నెమ్మదిగా పాకుతూ నిశాకర మహర్షి ఆశ్రమానికి వెళ్ళాను. నేను వెళ్ళే

---

➔కవి, సుగ్రీవుడి పక్షం కదా? అతన్ని ఎందుకు తిట్టించాడు? అతని దుర్గుణాలు ఎందుకు బయట పెట్టాడు? – అనే ప్రశ్న వస్తుంది. ఈ కవికి, ఎక్కడ ఏ తర్కం పని కొస్తే అక్కడ దాన్ని ఉపయోగిస్తాడు. సుగ్రీవుడి తప్పులు కొన్ని స్పష్టంగానే బైటికే, కనబడుతున్నాయి. అవన్నీ ఈ రకంగా అడిగించాలని ఉత్సాహపడ్డాడు కవి. సుగ్రీవుడి మీద కవికి ప్రత్యేక గౌరవం ఏమీ లేదు. ఆ పాత్రని తిట్టించడంలో ఆయనకు అయిష్టమైనదేమీ లేదు. రాముణ్ణి మాత్రం ఎక్కడా, ఎవ్వరి చేతా, అంగదుడు సుగ్రీవుణ్ణి తిట్టినట్టు, తిట్టించలేదు. రాముడి ప్రవర్తనని ఎక్కడా విమర్శించలేదు.

సరే! ఈ రకంగా అంగదుడు ఏడుస్తూ పడుకున్న తర్వాత "అంగదుని జూచి వానరోత్తములు ఏడ్చుచు, సుగ్రీవుని దూషించుచు, వాలిని శ్లాఘించుచు, వానరులందరూ అంగదుని జుట్టుకొని, ప్రాయోపవేశము జేయుటకు సిద్ధముగ నుండిరి."

వానరులకు సుగ్రీవుడి మీదే కోపంగానీ, రాముడి మీద కోపం లేదు. పైగా భక్తి! శ్రీరాముడి గుణాలన్నీ గానం చేస్తూ కూర్చున్నారు. ★

**291. కిష్కింధ, సర్గ 59, శ్లోకాలు 5 వరకూ:** సీత లంకలో ఉందనీ, తనకు కనబడుతోందనీ కూడా సంపాతి చెప్పడం అయిపోయింది. అయినా జాంబవంతుడు మళ్ళీ "సీత ఎక్కడుంది? ఎవరు ఎత్తుకు పోయారు?" అని అడిగాడు. ★

టప్పటికి ఆ మహర్షి అడవిలోకి వెళ్ళి వస్తున్నాడు. వెనకాల పెద్ద పులులూ, సింహాలూ, ఏనుగులూ, మహా సర్పాలూ ఆశ్రమం వరకూ వచ్చి, ఆయన్ని గౌరవంగా సాగనంపి వెళ్ళిపోయాయి. (ఈయన, సర్కసుల వాళ్ళకి బాగా పనికొస్తాడు.) నేను రెక్కలు కాలిపోయిన సంగ తంతా చెప్పి దుఃఖిస్తోంటే, ఆ రుషి నన్ను ఓదార్చాడు. "నీకు ఇప్పుడే రెక్కలు ఇవ్వగలను. కానీ ఇవ్వను. ఎందు కంటే, భవిష్యత్తులో ఒక గొప్ప కార్యం జరుగుతుందని పురాణ కథల్లో విన్నాను. ఆ సంగతి నిజమేనని నా తపస్సు వల్ల కూడా గ్రహించాను. దశరథ మహారాజుకి, కొన్ని వేల సంవత్సరాల తర్వాత రాముడనే కొడుకు పుడతాడు. (రాముడి పేరు 'సుబ్బడ'ని పెడితే ఏమ య్యేదో! 'దశరథ మహారాజుకి సుబ్బడనే కొడుకు పుడ తాడు' అని చెప్పుకుంటారు గావున్ను రుషులు. 'రాముడు' అనే పేరు కూడా రాముడు పుట్టక ముందే నిర్ణయమై పోయింది!) ఆ రాముడు అడవులకు వస్తాడు. రావణుడు సీతని ఎత్తుకు పోతాడు. సీత, పతీ వియో గంతో ఆహారం ముట్టదు. ఇంద్రుడు ఆమెకు పరమాన్నం పంపిస్తాడు. (ఏదో ఎత్తే!) సీత తీసుకుంటుంది. అందు లోంచి కొంత అన్నం తీసి వేరే ఉంచి "ఇది నా భర్త కోసం. ఆయన జీవించి వున్నా, మరణించినా, ఇది ఆయనకు చెందాలి" అని మిగిలింది తను తింటుంది. (అప్పుడే భర్తకి పిండం వేసేస్తుందన్న మాట!)[292] సీతని వెతుక్కుంటూ వానరులు ఇటే వస్తారు. సీత లంకలో ఉందనే సంగతి నువ్వు వానరులకు చెప్పాలి. అంత వరకూ నీకు రెక్కలు ఇవ్వను. (నిన్ను నమ్మలేం.) సీత వార్త వానరులకు చెప్పగానే నీకు రెక్కలు వచ్చేస్తాయి. నేనిక స్వర్గానికి వెళ్ళిపోతాను. శ్రీరాముణ్ణి చూడాలని ఉందిగానీ, అంతవరకూ ఆగలేను. (అప్పటి దాకా ఎవ డాగుతాడు?) అని చెప్పి ఆ రుషి స్వర్గానికి వెళ్ళిపో యాడు. ఇది జరిగి వంద సంవత్సరాలైంది. (ఒకసారి, కొన్ని వేల సంవత్సరాలూ, ఒకసారి వంద సంవత్స రాలూ! ఏం చేస్తాం?) నేను రెక్కలు లేక చాలా దుఃఖ పడుతూ జీవిస్తున్నాను. రెక్కలు వస్తాయనే ఆశతో మీ కోసమే ఎదురు చూస్తూ కాలం గడుపుతున్నాను." (మరి వానరుల్ని చూడగానే, చంపేస్తానన్నా వెందుకూ? రాముడి కథ నీకు తెలిసిందేగా? తెలియనట్టు అడిగా వెందుకూ?) – అలా చెబుతూ ఉండగానే సంపాతికి, చక్కటి ఎర్రటి రెక్కలు వచ్చేశాయి. యౌవ్వనంలో ఉన్నంత బలం వచ్చేసింది. సంపాతి మురిసిపోతూ, "రావణుణ్ణి చంపే వ్యవహారం మీరు చూచుకోండి" అని రయ్యిని ఎగిరిపోయాడు. (రామ కార్యాన్ని ఎగరగొట్టి! అందుకే మరి ఆ రుషి రెక్కలివ్వనన్నది!)

సంపాతి ఎగిరిపోయాక వానరు లందరూ సముద్రం దగ్గిరికి చేరారు. ఇక సముద్రం దాటి లంకకు పోవాలి! సీత లంకలో వుందని సంపాతి చెప్పాడు కదా?

అంగదుడు – "సముద్రం ఎవరు దాటగలరు? ఎవరు ఎంతెంత దూరం దాటగలరో చెప్పండి" అని అడిగాడు.

ఎవరి శక్తి సామర్థ్యాలు వాళ్ళు చెప్పారు.

సుషేణుడు ఎనభై యోజనాలు దూకగలనన్నాడు.

జాంబవంతుడు, "పూర్వం విష్ణుమూర్తి బలిని భూమిలోకి అణగ దొక్కడానికి త్రివిక్రమావతారం ఎత్తి లోకాలన్నీ ఆక్రమించినప్పుడు ఆయనకు నేను వెయ్యి సార్లు ప్రదక్షిణం చెయ్యగలిగాను. (ఈయన మాటలు నమ్మడానికి వీల్లేదు. సీత సంగతే, ఇలా విని, అలా మరిచిపోయి, మళ్ళీ అడిగాడు. అలాంటి వాడికి పూర్వం సంగతులేం గుర్తుంటాయి?) ఇప్పుడు మాత్రం తొంభై యోజనాలు దాటగలను" అన్నాడు.

అంగదుడు, "నేను నూరు యోజనాలు దాటగలను గానీ, మళ్ళీ తిరిగి రాగలనో లేదో!" అన్నాడు. (లంకలోనే వుండి రావణుడితో స్నేహం చేసుకుని, విమానం మీద వచ్చి, సుగ్రీవుడి మీద దండెత్త వోయ్!)

జాంబవంతుడు అంగదుడితో, "నువ్వు నూరు కాదు, వెయ్యి యోజనాలయినా దాట గలవుగాని, అసలు దాటనే వద్దు. నువ్వు మా స్వామివి. ప్రభువుని సైన్యం రక్షించుకోవాలి. లంకకు పోయే వీరుడెవడో నేను ఆలోచి స్తాను!" అని హనుమంతుడి దగ్గిరికి బయల్దేరాడు.

హనుమంతుడు దూరంగా పోయి ఒంటరిగా కూర్చుని ఉన్నాడు. (పని ఎగ్గొట్టడానికేమో.)

జాంబవంతుడు, హనుమంతుడి దగ్గిరికి వెళ్ళి, "హనుమంతుడా! మా అందరిలో నువ్వే గొప్ప వీరుడివి. గరుత్మంతుడితో సమానమైన బలం గల వాడివి" అంటూ, కీర్తన ప్రారంభించాడు. (హను మంతుడు జాంబవంతుణ్ణి చూడగానే, 'అబ్బే! నేను వెళ్ళలేను సుమా!' అని మొహం చిట్లించి ఉంటాడు. అంత ముఖ్య మైన వ్యవహారం జరుగుతోంటే దూరంగా పోయి కూర్చో

**292.** **కిష్కింధ, సర్గ 62, శ్లోకాలు 7,10:** ఇది నిశాకర మహర్షి సంపాతికి చెప్పిన సంగతి. దాన్ని సంపాతి ఇప్పుడు వానరులకు చెపుతున్నాడు – "పతివ్రత యగు సీత దుఃఖములో మునిగి, భుజించక యుండును. సీత భుజించకుండుట యెరింగి, ఇంద్రుడు ఆమెకు దివ్యాన్నము బంపును. దేవతలకైనా లభించని, యా యన్నమును ఇంద్రుడు బంపెనని తెలిసికొని, సీత దానిని పరిగ్రహించి మొదటి భాగమును శ్రీరాముని ఉద్దేశించి, 'ప్రభువగు నా భర్త, లక్ష్మణుని తోడ జీవించి యుండినను, లేక దేవత్వము బొంది యుండినను, వారికి ఈ యన్నము తృప్తిని కలిగించుగాక' అని దానిని భూమి మీద యుంచును."★

డమే దానికి నిదర్శనం.)

"నాయనా! నీ తల్లి అంజన, పూర్వజన్మలో అప్సరస. నీ తండ్రి కేసరి ఉత్తముడు. (పూర్వజన్మలోనా ఉత్తముడు?) ఒకసారి నీ తల్లి మానవ రూపం దాల్చి, చక్కగా అలంకరించుకుని, పర్వతం మీద విహరిస్తోంటే వాయుదేవుడు కామ మోహితుడై ఆమె వస్త్రాలు తొలిగించి, ఆలింగనం చేసుకున్నాడు. మహా పతివ్రత అయిన నీ తల్లికి కోపం వచ్చి "నా పాతివ్రత్యం భగ్నం చేసే ప్రయత్నం చేస్తున్నదెవరు?" అని అడిగింది. అప్పుడు వాయుదేవుడు "నిన్ను నేను హింసించను. మనసుతో మోహిస్తున్నాను. నా లాగే గొప్ప వీరుడయిన కొడుకు పుడతాడు నీకు. అతడు ఎంత దూరమైనా దూకగలడు, దాటగలడు" అని చెప్పాడు. తర్వాత నీ తల్లి మందర పర్వతం గుహలో నిన్ను ప్రసవించింది. ఆ విధంగా నువ్వు కేసరికి క్షేత్రజ పుత్రుడివీ, వాయుదేవుడికి ఔరస పుత్రుడివీ అయ్యావు.

నువ్వు పుట్టగానే సూర్యుణ్ణి 'పండు' అనుకుని ఆకాశంలోకి ఎగురుతూ పోయావు. మూడు వందల యోజనాలు వెళ్ళావు. నీ వీరత్వం చూసి, ఇంద్రుడికి కోపం వచ్చి నిన్ను వజ్రాయుధంతో కొట్టాడు (చిన్న పిల్లాణ్ణి వజ్రాయుధంతో కొట్టాడంటే, వాడు ఇంద్రుడు కాడు, దుండగుడే.) ఆ దెబ్బకు నువ్వు కింద పడిపోయావు. చెంప పగిలింది. నీ తండ్రికి కోపం వచ్చి గాలి వీచడం మానేశాడు. (సమ్మె చేశాడన్న మాట!) ముల్లోకాలూ తల్లడిల్లి పోయాయి. బ్రహ్మ, ఇంద్రుడూ వచ్చి నీకు వరాలిచ్చారు. నిన్ను ఆయుధాలేమీ చెయ్యలేవు. నువ్వు కోరుకుంటేనే నీకు మరణం కలుగుతుంది. లేకపోతే మరణమే రాదు. ఆ వరాలకు నీ తండ్రి సంతోషించి యధాప్రకారం వీచాడు. అందుచేత నీ గమన శక్తి అపారమైనది. నువ్వే సముద్రం దాటి సీతను వెతికి రావాలి" అన్నాడు.

హనుమంతుడు (ఉబ్బిపోయి) తన శక్తి తెలుసుకొని, శరీరం పెంచడం ప్రారంభించాడు. పెంచి పెంచి, వాగ్ధాటి (వాగుడు) ప్రారంభించాడు. – "మహా వీరుణ్ణి నేను. వాయు పుత్రుణ్ణి నేను. ఈ భూమండలం తీసుకుపోయి సముద్రంలో ముంచెయ్య గలను. (బలవంతుడైతే చేసే పని అదన్న మాట!) నేను ఎగురుతూ, నా వేగంతో సముద్రం నా వెంట బడేటట్టు చెయ్యగలను. సూర్యుడితో పాటే బయల్దేరి, అతడి కంటే ముందే అస్తగిరి చేరి, సూర్యుడింకా మధ్యకైనా రాక ముందే ఎదురు రాగలను. సీత ఉన్న లంకనే ఇక్కడికి తెచ్చెయ్యగలను" అంటూ పొంగిపోయాడు.

పొంగి, పొంగి, మహేంద్ర పర్వతం ఎక్కాడు. ఆ పర్వతం మెత్తని వొత్తిలాగ భూమిలోకి నొక్కుకు పోయి, పాతాళంలోంచి జల ధారలు పైకి చిమ్మాయి. సమస్తమైన ప్రాణులూ పర్వతంలో పడి నలిగిపోతూ భయంకరంగా ఏడ్చాయి. పాములు బండల మధ్య బుస్సున పడగలెత్తి పర్వతం నిండా జండాల్లాగ నిలబడ్డాయి.

ఋషులూ, గంధర్వులూ, భార్యలతో ఆకాశంలోకి ఎగిరారు. తమ ఆశ్రమాలూ, పానశాలలూ (కల్లు పాకలు), మాంసాలూ, కల్లుపాత్రలూ, చర్మాలతో తయారుచేసిన డాళ్ళూ, చక్కని పిడి గల కత్తులూ, గదలూ, విడిచి పెట్టి, ఆకాశంలో కెగిరి, హనుమంతుడి వీరకార్యం గురించి చెప్పుకుంటూ నిల బడ్డారు.

[ఇక్కడితో **"కిష్కింధా కాండ"** సమాప్తం. తర్వాత **"సుందర కాండ"** ప్రారంభమవుతుంది.]

★ ★ ★

['సుందర కాండ' ప్రారంభంలో కూడా మళ్ళీ మహేంద్ర పర్వతం వర్ణనా, హనుమంతుడు శరీరం పెంచడమూ, కొంతసేపు జరిగి, అప్పుడు హనుమంతుడు ఎగురుతాడు.]

ఆ విధంగా హనుమంతుడు శరీరం పెంచి, పెంచి, ఒక్క ఎగురు ఎగిరాడు. నీల మేఘంలాగ, రెక్కల పర్వతం లాగ, సముద్రం మీద ఎగురుతూ పోతున్నాడు.

సముద్రుడు హనుమంతుణ్ణి చూసి, "ఇతడు రామ కార్యం కోసం పోతూ ఉన్నాడు. నేను కూడా రామ కార్యానికి సహాయం చెయ్యాలి. రఘు వంశస్థుడైన సగర చక్రవర్తి పుత్రుల వల్లనే వృద్ధి అయ్యాను నేను" అనుకున్నాడు.

నీళ్ళల్లో వున్న ఒక పర్వతాన్ని పిలిచి – "మైనాకుడా! పాతాళం లోంచి రాక్షసులు పైకి రాకుండా నిన్ను దేవేంద్రుడు ఇక్కడ కాపలా ఉంచాడు. నువ్వు ఎటు అవసరమైతే అటు పెరగగలవు. రామ కార్యం మీద పోతూ హనుమంతుడు నన్ను దాటుతున్నాడు. నువ్వు నాలో ఉన్నావు కాబట్టి నువ్వు హనుమంతుడికి ఆతిధ్యం ఇవ్వాలి. ఎత్తుగా పైకి పెరుగు. అదుగో! హనుమంతుడు వచ్చేస్తున్నాడు. నీ మీద కొంతసేపు విశ్రమించి వెళతాడు" అని తొందర చేశాడు.

"అలాగే"నని మైనాకుడు రయ్యిన ఆకాశం వరకూ పెరిగిపోయాడు.

హనుమంతుడు ఎదురుగా అడ్డం వచ్చిన పర్వతాన్ని చూసి తన కార్యానికి అవాంతరం జరుగుతోందని విచారించాడు. కోపంతో పర్వతాన్ని ఒక్క తోపు తోశాడు.

ఆ వీరత్వానికి మైనాకుడు సంతోషించి, మానవ రూపం ధరించి (అన్ని మహిమలూ మానవ రూపంలోకి

రావలసిందే!) పర్వతం మీద నించుని – "హను మంతుడా! నీకు నేను శత్రువుని కాను. సముద్రుడు నీకు సహాయం చెయ్యమని కోరాడు. కొంతసేపు నా మీద విశ్రమించి, కడుపు నిండా పళ్ళు తిని నీ దారిన నువ్వు వెళ్ళు. నా చరిత్ర చెపు తాను విను. (ఆగు మరీ, ఏవిటా దూకుడూ?) నా పేరు మైనాకుడు. పూర్వం పర్వతాలకు రెక్కలుండేవి. అవి అప్పుడు ఆకాశంలో రయ్యిన ఎగు రుతూ ఉండేవి. (పిచికల్లాగ!) అవి, మీద పడిపోతాయే మోనని రుషులూ, దేవతలూ భయపడిపోతూ ఉండే వారు. (పాడు బుద్ధి! వాళ్ళూ ఎగురుతారుగా?) ఇంద్రు డికి పర్వతాల మీద కోపం వచ్చి వాటి రెక్కలు తెగ నరకటం ప్రారంభించాడు. నా రెక్కలు కూడా నరకాలని నా దగ్గిరికి వచ్చాడు గానీ, నీ తండ్రి వాయుదేవుడు నన్ను సముద్రంలో దాచేశాడు. అప్పట్నించీ ఇక్కడ ఉంటున్నాను. (ఇందాక సముద్రుడే మన్నాడూ? పాతా ళంలోంచి రాక్షసులు రాకుండానో, ఏదో అన్నాడా? ఇప్పుడేమో ఈయన ఇంకో కథ చెపుతున్నాడు. అబ్బ! ఎవరు నోరు తెరిచినా అబద్ధాలే!) నీ తండ్రి నన్ను రక్షించాడు కాబట్టి, నీకు ఆతిథ్యం ఇచ్చి రుణం తీర్చు కుంటాను. (రామ కార్యం కోసం కాదు సుమా! ఆ గోల నా కెందుగ్గానీ) నా మీద విశ్రమించు!" అని అడిగాడు మైనాకుడు.

హనుమంతుడు సంతోషించి, ఆ మాటే చెప్పి, "నే నెక్కడా ఆగనని శపథం పట్టాను. (ఫర్వాలేదు నించుందూ! ఎవరు చూడొచ్చారూ?) ఏమీ అనుకోకు. తొందర కార్యం మీద పోతున్నాను. ఆలశ్యం అయితే చీకటి పడిపోతుంది" అని మైనాకుణ్ణి చేతితో తాకి, ముందుకు దూసుకు పోయాడు.

దేవతలంతా ఆకాశంలోంచి చాలా కీర్తించారు హనుమంతుణ్ణి.

ఇంద్రుడు మైనాకుణ్ణి మెచ్చుకుని "మంచి పని చేశావు. ఇక నువ్వు పూర్వం ఉన్నట్టే స్వేచ్ఛగా ఉండు" అని అభయం ఇచ్చాడు.

హనుమంతుడు మహా వేగంతో ఆకాశాన్ని ఈడ్చుకు పోతున్నట్టు దూసుకు పోతున్నాడు.

దేవతలకూ, రుషులకూ, హనుమంతుణ్ణి పరీక్ష చెయ్యాలనే సరదా కలిగింది (వాళ్ళకి పనేం ఉంది? తిని తిరగడమే గదా? ఇలాంటివే ఏవో చేస్తూ వుంటారు) నాగ మాత అయిన సురసను పిలిచి – "సురసా! నువ్వు భయంకరమైన రాక్షస వేషంతో హనుమంతుడికి అడ్డం వెళ్ళు! ఏం చేస్తాడో చూద్దాం" అన్నారు.

సురస అలాగే భీకర రూపంతో అడ్డం వెళ్ళి "నిన్ను తినేస్తాను" అంది హనుమంతుడితో.

హనుమంతుడు ఆ భీకర రూపానికి నమస్కారం పెట్టి, దశరథ మహారాజు గారి ఘనకార్యాలతో ప్రారం భించి, కైక దుర్మార్గం, రామ వనవాసం, ఘోరమైన కష్టాలూ, బంగారు లేడి, సీతాపహరణం, జటాయువు మరణం, వాలి వధల మీదుగా దూకుతూ చివరికొచ్చి "అదీ విషయం. సీతని వెదకాలి. ఇదంతా రామ రాజ్యమే. నువ్వూ రామ రాజ్యంలోనే ఉన్నావు. అందుచేత శ్రీరాముడికి విధేయతగా ఉండాలి. నన్ను పోనియ్యి! కాదూ కూడదంటావా? (రాముణ్ణి నమ్మనంటావా) పోనీ సీతని చూసి, ఆ కబురు రాముడికి చెప్పేసి వస్తాను. అప్పుడు తప్పకుండా నన్ను తిందువుగాని. ఒట్టు. మరి వెళ్ళనియ్యి!" అన్నాడు. (ఉత్తుది సురసా! నమ్మకు. మళ్ళీ రాడు. అక్కడ మంత్రి పదవో? దాన్ని వదిలి మళ్ళీ వస్తాడా? రాడు. ఇప్పుడే తినెయ్యి!)

హనుమంతుడి ఒట్టుని సురస ఒప్పుకోనంది "కుదరదు. నా కొక వరం ఉంది. నువ్వు నన్ను దాటి పోకూడదు. నా నోట్లోకి రా" అని నోరు తెరిచింది. (బతి మాలి నోట్లోకి పిలిచే వరం!)

హనుమంతుడు సురస నోటి కన్నా పెద్ద శరీరం పెంచాడు. సురస నోరు ఇంకా పెంచింది. హను మంతుడు కూడా ఇంకా! ఆ విధంగా హనుమంతుడు నూరు యోజనాల వెడల్పు పెరిగాడు. (కిష్కింధకూ, లంకకూ మధ్య దూరం నూరు యోజనాలు.) అలా పెరిగి పెరిగి హనుమంతుడు చటుక్కున బొటన వేలంత అయిపోయి సురస నోట్లో దూరి ఇవతలకు వచ్చేశాడు. "నీ వరం అయిపోయింది. ఇక వెళుతున్నాను" అని బయల్దేరాడు.

సురస, రాక్షస రూపం వదిలేసి, సురస రూపం ధరించి– "వెళ్ళు నాయనా! రామ కార్యం సాధించు" అంది.

దేవతలంతా సంతోషించారు.

హనుమంతుడు ఆకాశ మార్గాన పోతూ ఉన్నాడు. మేఘాలు జల ధారలు కురిసే దేశం అది. గంధర్వులు గానం చేస్తూ తిరిగే లోకం అది. మనోహరమైన ఇంద్ర ధనుస్సు నిలిచే స్థావరం అది. పక్షి వాహనాల మీదా, పులుల వాహనాల మీదా, దేవతలు విహరించే ప్రదేశం అది. స్వర్గవాసులైన మహానుభావు లందరికీ నివాసం అది.

అటువంటి మార్గంలో పోతున్నాడు హనుమంతుడు. సింహిక అనే రాక్షసి హనుమంతుణ్ణి చూసి సంతోషించి, అతని నీడని పట్టుకుంది. ఎదురు గాలికి ఆగిపోతున్న ఓడలాగ, హనుమంతుడు ముందుకు కదలలేక పోయాడు. నీడల్ని లాగేసే రాక్షసిని గురించి సుగ్రీవుడు చెప్పిన విషయం గుర్తు వచ్చింది.

(సుగ్రీవుడు చెప్పిన పేరు అంగారక. ఇప్పుడు

సింహిక. పైగా సుగ్రీవుడు చెప్పిన ప్రకారం దక్షిణ సముద్రంలో ఇలాంటి రాక్షసి ఒక్కటే ఉంది. ఇవన్నీ కవికి మాత్రం ఏం గుర్తుంటాయి? ఎన్ని కోట్ల అబద్ధాలు కల్పించాలో రామ కార్యం కోసం!)

హనుమంతుడు శరీరం పెంచి, పెంచి, హఠాత్తుగా చిన్నది చేసి, సింహిక నోట్లో జొరబడి, తిన్నగా కడుపులోకి వెళ్ళిపోయి, పేగులు లాగేసి, ఇంకా నోరు ముయ్యక ముందే బయటికి వచ్చేసి, సింహికని తన్ని, సముద్రంలోకి తోసేసి, తన దారిన తను బయల్దేరాడు.

ఆకాశంలో దేవతలందరూ సంతోషించి, హనుమంతుణ్ణి కీర్తించారు. (వాళ్ళు కూడా హనుమంతుడితో పాటే లంకకు పోతారేమో!)

హనుమంతుడు ముందుకు సాగిపోయాడు. సముద్రానికి అవతలి తీరంమీద ఉద్యాన వనాలు కనబడ్డాయి. నూరు యోజనాలూ దాటేశాడు. (లాంగ్ జంప్!) శరీరం తగ్గించుకుని లంబ పర్వతం మీద దిగి లంకా పట్టణం చూశాడు.

★ ★ ★

త్రికూట పర్వత శిఖరం మీద ఉంది లంకా పట్టణం. దాని చుట్టూ అగాధమైన అగడ్త (కందకం) ఉంది. దానికి రాక్షస వీరులు ఆయుధాలతో కాపలా కాస్తున్నారు. దాని రక్షణ ఏర్పాట్లు చూసి హనుమంతుడు నిరుత్సాహ పడిపోయాడు. 'రాముడు వస్తే మాత్రం ఈ లంక నెలా జయించగలడు?' అనుకున్నాడు. (అవును మరి, ఏ మాట కామాటే అనుకోవాలి.) 'నీలుడూ సుగ్రీవుడూ నేనూ తప్ప, ఇంకెవ్వరూ ఇక్కడికి రానే లేరు మరి. కార్యం ఎలా నెరవేరుతుందో!' అని కొంచెం సేపు దిగులు పడ్డాడు. 'సరే! ముందు సీత కోసం వెతుకుతాను. అసలు కార్యం పాడు చెయ్యను. మూర్ఖుల వంటి దూతలు కొందరు కార్యాలు సర్వనాశనం చేస్తారు. నేనలా చెయ్యను. లంకలో రాత్రి వేళ ప్రవేశిస్తాను' అని దూరం నించి పట్టణం చూస్తూ, లంబ పర్వతం మీద తిరుగుతూ, కాలం గడిపాడు.

రాత్రి అయింది. హనుమంతుడు పిల్లి అంత అయిపోయి లంక వీధుల్లో పడ్డాడు. విశాలమైన రాజమార్గాలు! (లేకపోతే రాక్షసులు పట్టరు కదా?) ఎంతో ఎత్తయిన మేడలు! ఏడంతస్తులవీ, ఎనిమిదంతస్తులవీ కూడా ఉన్నాయి. అన్నీ బంగారమే. (కవి గారికి బొత్తిగా పక్షపాతం లేదు. శతృవుల ఇళ్ళు కూడా బంగారంతోటే కడుతున్నారు. ఎందుకంటే, రేపొద్దున్న అవన్నీ రాముడి పరమే అవుతాయి కదా?) ఇళ్ళ ముందు అరుగులూ, దారులూ అంతా బంగారమే. (అస్తమానూ చెప్పను. ఇల్లో, అరుగో, చెట్టో, గోడో ఏం వచ్చినా, బంగారందే అనుకోండి. బంగారం ఒక్కటే కాదు. దాని మీద వజ్రాలు తాపడం చేసి ఉండాలి. ఒక్కోసారి రత్నాలు! మీ ఇష్టం, మీకేది కావాలంటే అదే తాపడం చేసుకోండి!) లంక నిండా ఇళ్ళకు ముత్యాల దండలూ, బంగారం తోరణాలూ కట్టారు. (చూశారా? ఇలాగే అన్నమాట!)

హనుమంతుడు శ్రీరాముడి పరాక్రమం గుర్తు తెచ్చుకుని, శ్రీరాముడు లంకని ఆక్రమించగలడని సంతోషించాడు. 'కుముదుడూ, అంగదుడూ, మైందుడూ, ద్వివిధుడూ, రుక్షుడూ, కుశపర్వుడూ, కేతుమాలుడూ, సుగ్రీవుడూ, నేనూ మాత్రమే ఈ లంకలో ప్రవేశించగలం' అనుకున్నాడు.[293]

చంద్రోదయం అయింది! తెల్లగా, రాజ హంసలా, ముద్దుగా ఉన్నాడు చంద్రుడు.

లంకా పట్నం ఒక దేవత రూపం దాల్చి, వీధుల్లో తిరుగుతోన్న హనుమంతుణ్ణి చూసింది. "ఎవరు నువ్వు?" అని గర్జించింది.

"నువ్వెవరు?" అన్నాడు హనుమంతుడు, తనూ గర్జిస్తూ.

"నేను లంక దేవతని" అంది లంక దేవత. (అంత గర్జింపూ ఏమైందో తనే ముందు చెప్పేసింది. కవి చేతిలో, లంకలో అందరూ ఇలాగే ప్రవర్తిస్తారు!)

"సరే, అడిగావు కాబట్టి నిజం చెపుతాను. లంకని చూడాలని వచ్చాను. అంతే, చూసి వెళ్ళి పోతాను" అన్నాడు హనుమంతుడు.

లంక దేవత కళ్ళెర్రజేసి "వీల్లేదు. నన్ను జయించ

**293.** సుందరకాండ, సర్గ 2, శ్లోకం 30: లంకకు ఎవరెవరు వెళ్ళగలరో హనుమంతుడు అనుకుంటున్నాడు చూడండి. "పరాక్రమ శాలులగు వానరులలో, వాలి పుత్రుడగు అంగదుడూ, నీలుడూ, ధీమంతుడగు సుగ్రీవుడూ, నేనూ – ఈ నలుగురము మాత్రమే లంకకు వచ్చుటకు శక్తిగల వారము."

**సర్గ 3, శ్లోకాలు 15,16:** ఈ సారి లంకకు ఎంత మంది పోతున్నారో చూడండి. ఇది కూడా హనుమంతుడు అనుకునేదే– "కుముదుడూ, అంగదుడూ, మైందుడూ, ద్వివిధుడూ, సుషేణుడూ, సుగ్రీవుడూ, కుశపర్వుడూ, రుక్షుడూ, కేతుమాలుడూ, నేనూ ఇతరులకు శక్యంగానీ ఈ లంకలో ప్రవేశించి చూడగలము." – చూశారా? మొత్తం 10 మంది! ఇందులో సుషేణుడు 80 యోజనాలు మాత్రమే దూకగలనని చెప్పాడు. ఇక, మొదటి లిస్టులో వున్న నీలుడు, ఈ రెండో లిస్టులో లేదు. కవిగారు ఈ శ్లోకం రాయడానికి కూర్చున్నప్పుడు ఏయే పేర్లు జ్ఞాపకం వస్తే, ఏయే పేర్లు శ్లోకాల్లో ప్రాసలకు సరిపోతే, వాళ్ళంతా లంకకు పోగలుగుతారు. మిగతా వాళ్ళెవరూ పోలేరు! అదన్న మాట లంకకు పోయే రహస్యం! ★

కుండా లంకని చూడ్డానికి వీల్లేదు" అని హనుమంతుణ్ణి ఒక్క చరుపు చరిచింది.

హనుమంతుడు లంక దేవతని ఒక్క పోటు పొడిచాడు.

లంక దేవత కింద బడిపోయి "రక్షించు వానరుడా! నన్ను చంపకు. స్త్రీని. నీ ఇష్టం వచ్చినట్టు సంచరించు. నాకు పూర్వం బ్రహ్మ చెప్పనే చెప్పాడు. ఒక వానరుడొచ్చి నిన్ను జయించినప్పుడు లంకకు కీడు మూడిందని గ్రహించు – అన్నాడు. అలాగే జరిగింది. లంకకి లంకేశ్వరుడు శాపం పెట్టాడు. (రావణుడు, లంకేశ్వరుడి పెళ్ళాన్ని కూడా ఎత్తుకొచ్చాడు గావున్ను.) దుర్మార్గుడైన రావణుడి మూలంగా రాక్షస జాతి అంతా నశించి పోతుంది. నీ ఇష్టం వచ్చినట్టు తిరుగు. సీతని వెతుక్కో!" అని నమస్కారం పెట్టింది. (సీత కోసం వచ్చాడని ఎలా తెలిసింది?)

హనుమంతుడు గుమ్మంలోంచి గాకుండా, శత్రువులు ప్రవేశించే విధంగా ప్రాకారం దూకి, ఇంకా లోపలికి ప్రవేశించాడు. ముందు ఎడం కాలు పెట్టాడు లోపలికి. (ఎడం కాలేనా అంత తీసిపోయింది? పాపం దాని మీద అంత చిన్న చూపా?)

రాజ మార్గాలన్నీ రత్నాలతో, ముత్యాలతో అలంకరించి ఉన్నాయి. (తెలుసులే.)

హనుమంతుడు ఇళ్ళ మీద నించి దాటుతూ పోతున్నాడు. (కోతి బుద్ధి ఎటు పోతుంది?) మేడల్లోంచి, మంగళ వాద్యాలు వినబడుతున్నాయి. స్త్రీలు పాడుతున్నారు. అందెలూ, వడ్డాణాలూ, గాజులూ గల గల లాడుతోన్న చప్పుళ్ళు! కొందరు వేద పఠనం చేస్తున్నారు. కొందరు రావణ స్తోత్రాలు చదువుతున్నారు. (అవును మరి! ఎవడి రాజ్యంలో వాడి స్తోత్రాలే నడుస్తాయి కదా? పుల్లయ్య రాజ్యంలో పుల్లయ్య స్తోత్రాలే!) కొందరు పూజలు చేస్తున్నారు. కొందరికి ఒక్కొక్క కన్నే. కొందరికి ఒక్కొక్క చెవే. కొందరికి ఒక్కొక్క కాలే. (రావణుడు చేయించిన యుద్ధాల్లో కాళ్ళూ, చేతులూ, కళ్ళూ, ముక్కులూ పోయి బతికి బయట పడ్డ ప్రజలేమో వాళ్ళు.)

కొందరు రాక్షసులు అందంగా ఉన్నారు. స్త్రీ పురుషులు. మధుపానం చేసి కులాసాగా కాలక్షేపం చేస్తున్నారు. కొందరు స్త్రీలు మెరిసిపోతూ చంద్ర వంకల్లాగ ఉన్నారు. కొందరు స్త్రీలు పూల రేకుల లాగ ఉన్నారు. కొందరు స్త్రీలు నగ్నంగా, కొందరు వివశంగా, కొందరు పరవశంగా! కొందరు స్త్రీలు ప్రియుల కోసం పోతూ ఉన్నారు. (పాపం, ఎంత దూరం పోవాలో!) కొందరు తమ గృహాలలోనే ప్రియులతో విలాసంగా ఉన్నారు. (ఇదీ, తెలివైన పని!)

హనుమంతుడు, సీత కోసం విభీషణుడి మేడా, కుంభకర్ణుడి మేడా, ఇంద్రజిత్తు మేడా – ఇంకా ఇంకా అనేక వేల మేడలు చూశాడు. ఎక్కడా సీత లేదు. (హనుమంతుడికి దృష్టి లోపం ఉందేమో అన్న సందేహం మనకు వస్తుందని – "ఎంత చిన్న వస్తువునైననూ, ఎంత దూరం నుంచి యైననూ చక్కగా చూడ గల దృష్టీ, తేజస్సూ గల హనుమంతునకు సీత కనపడ లేదు" అంటున్నాడు కవి. అంచేత, 'హనుమంతుడు సరిగ్గా చూశాడా' అనుకోకండి!)

అగ్ని గృహాలూ చూసి, చివరికి రావణ మందిరానికి వచ్చాడు హనుమంతుడు. (ఇంతకు ముందు కూడా ఒకసారి ఇక్కడికి వచ్చి, మళ్ళీ హఠాత్తుగా ఇంకో ఇంటి మీదకి దూకారు కవిగారు, హనుమంతుణ్ణేసుకుని!)

రావణుడి మందిరం ఒక పర్వత శిఖరాన ఉంది. దాని చుట్టూ అగడ్త. అగడ్త తర్వాత ఎత్తయిన ప్రాకారాలు. ప్రాకారాలన్నీ బంగారమే. (తెలుసులే. అస్తమానూ చెప్పక్కర్లేదు.) ప్రాకారాల చుట్టూ ఎందరో సేనాపతులు కాపలాలు కాస్తున్నారు, బంగారపు రథాల మీద! వారి కెన్నడూ శ్రమ తెలియదు. ('శ్రమ' చేస్తే కదా తెలియడానికి? రథం మీద కూర్చోవడం కూడా శ్రమేనా?) బాధ తెలియదు. (అవును. రాజుగారికి కాపలా కాయకుండా ఇంటి దగ్గర విశ్రాంతిగా ఉంటేనే చాలా 'బాధ' కలుగుతుంది వారికి!)

ఆ సేనాపతుల కార్య కలాపాలు కనిపెట్టడానికి ఎందరో గూఢ చారులు కూడా ఉన్నారు. (వాళ్ళ మొహం గూఢ చారులు! శతృవు వొచ్చి అలా ఎడాపెడా తిరిగేస్తోంటే కనిపెట్టలేని పాడు చారులు!)

రావణుడి భవనం చుట్టూ వేల కొద్దీ గుర్రాలూ, ఏనుగులూ, రథాలూ ఉన్నాయి. (అబ్బా, తెల్లవార్లూ అవి అరుస్తూ వుంటే రావణుడికి నిద్రేం పడుతుంది?) ఏనుగుల్లో నాలుగేసి దంతాలు గల ఏనుగులు కూడా ఉన్నాయి. (ఈ జాతి ఎక్కడ దొరికిందో!) ఎటు చూసినా దంతపు విమానాలే. ఎటు చూసినా బంగారపు ఆసనాలే. ఎటు చూసినా రత్న సోపానాలే. (అబ్బా, తెలుసు లెద్దూ! బంగారం! రత్నాలూ! వజ్రాలూ! తెలుసు, తెలుసు, తెలుసు!)

రావణుడి భవనంలో అనేక మందిరాలున్నాయి. క్రీడా శాలలూ, మద్యపాన శాలలూ, ఉదయం వేళల్లో నివసించే గృహాలూ, మధ్యాన్నం వేళల్లో నివసించే గృహాలూ, సాయంత్రం గృహాలూ, రాత్రి గృహాలూ, అర్ధరాత్రి గృహాలూ! (రోజంతా ఇళ్ళు తిరగడంతో సరిపోతుంది రాజుగారి పని. ఒక ఇంట్లోకి పోయి కూర్చోగానే 'లేవండి మహారాజా! మధ్యాన్నం అయింది' అంటారు దాసీలు. మళ్ళీ ఇంకో ఇల్లు! 'లేవండి

మహారాజా! సాయంత్రం అయిందీ!')

చిత్ర శాలలన్నీ చూశాడు హనుమంతుడు. ఆయుధ శాలలు చూశాడు. ధన కనక రత్న రాశులున్న చంద్ర శాలలు చూశాడు. సమస్త లోకాల ఐశ్వర్యం అంతా రావణుడి దగ్గిరే ఉంది. (అదంతా రాముడికే లెండి.)

పుష్పక విమానం ఎక్కాడు హనుమంతుడు. అంతా బంగారం ముద్దే (సరే, సరే! తెలుసన్నానా?) ఆ విమానంలో ఉన్న ఐశ్వర్యమూ, గొప్పతనమూ ఇంతా అంతా కావు. (మరి ఎంత?) మణులు తాపడం చెయ్యని చోటు ఎక్కడా లేదు. ఎన్నెన్నో కాంతులూ, చిత్రాలూ! ఆకాశం, నక్షత్రాలు, సముద్రాలు, భూమండలం, అంతా చెక్కారు దాని మీద!

తామర పువ్వులో బ్రహ్మ కూర్చున్న చిత్రం చెక్కారు. (బ్రహ్మ, జారి నీళ్ళల్లో పడ్డ చిత్రమో?) రుషుల చిత్రాలూ, దేవతల చిత్రాలూ కూడా. పుష్పక విమానంలో ఎక్కిన వారు, దాన్ని ఎలా వెళ్ళమంటే అలా వెళుతుంది. (ఇద్దరెక్కి చెరో వేపూ వెళ్ళమంటే?) ఆ విమానం అక్కడ ఉంటే, దాని అందంతో, వైభవంతో, స్వర్గ పట్టణం ఒకటి భూమిమీద దిగినట్టుగా ఉంది. హనుమంతుడు, ఆ విమానం అంతా వెతికాడు. సీత లేదు!

రావణుడు, భార్యలతో కలిసి నిద్రిస్తోన్న అంతః పురం మనోహరంగా ఉంది. కన్నుల పండువుగా ఉంది. రావణుడి భార్యలు వేల కొద్దీ ఉన్నారు. (ఇది చాలా తెలివైన పని! శతృవులు, ఎంత మంది భార్యల్ని ఎత్తుకు పోయినా ఫరవా లేదు. ఇంకా బోలెడు మంది భార్యలు మిగులుతారు. రాముడికి చూశారా, ఒక్క భార్యే ఉండడం వల్ల, వసంత రుతువులూ అవీ ఆయన్ని ఎంత పీడించాయో!)

అందులో కొందరు రావణుడు పెళ్ళి చేసుకున్న భార్యలే. కొందరు స్త్రీలని, వారిపై మోహం ఉండి గాక, వారి బంధువులతో శతృత్వం ఉండి ఎత్తుకు వచ్చాడు రావణుడు. (ఇదేం న్యాయం అమ్మా? బంధువుల్తో శతృత్వం అయితే, బంధువుల్నే ఎత్తుకు రావాలీ గానీ.)

రత్న కంబళ్ళ మీద వేల కొద్దీ సుందరాంగనలు నిద్ర పోతున్నారు. అందరూ మద్యం సేవించి, ఆడి పాడి, అలిసి సొలిసి, సరస్సులో పువ్వుల్లాగ ఉన్నారు. వారి ఆభరణాలూ, వస్త్రాలూ, పూల మాలలూ, చెల్లా చెదురుగా పడి వున్నాయి. బట్టలు లేని వారి తొడలూ, నడుములూ, స్తనాలూ, నదులలో కనిపించే ఇసక తిన్నెలలాగ ఉన్నాయి. స్త్రీలంతా ఒకరి చేతుల మీద ఒకరు చేతులు వేసుకుని, ఒకర్ని ఒకరు అల్లుకుని, పూల దండల్లా ఉన్నారు. (ఒక్క పురుషుడి కోసం వేలకొద్దీ స్త్రీలు! వాళ్ళ జీవితాల్లో ఎంత సౌందర్యం చూస్తున్నాడో కవి!)

వారిలో రాక్షస స్త్రీలు కూడా ఉన్నారు. (రాక్షస స్త్రీలు కూడా అందంగానే ఉంటారన్న మాట! కవిగారి కెందుకో మరి శూర్పణఖే చాలా కురూపిగా కనబడింది.) మానవ స్త్రీ లున్నారు. గంధర్వ స్త్రీలున్నారు. (సీత కూడా రావణుణ్ణి అంగీకరిస్తే ఇక్కడ ఒక మూల పడుకుని ఉండేది!) ఈ స్త్రీలందర్నీ రావణుడు అవివాహితలుగా ఉన్నప్పుడే తీసుకు వచ్చాడు. ఆ స్త్రీలలో ఒక్కరిని కూడా రావణుడు బలాత్కరించి తేలేదు. (అప్పుడే కవికి పరగడుపు!) అందరూ రావణుడి సౌందర్యాన్ని మెచ్చి వచ్చిన వారే. (కవి దృష్టిలో రావణుడు దుష్ట పాత్ర అయి నప్పటికీ, స్త్రీల విషయం వచ్చేసరికి, కవి, రావణుణ్ణి ఈ స్త్రీల కన్నా గొప్పవాణ్ణి చేస్తున్నాడు. ఎందుకంటే, ఇంత సౌందర్య వంతుణ్ణీ, ఇంత మంది స్త్రీలు అంగీకరించిన వాణ్ణీ, కూడా సీత తిరస్కరించింది – అని చెప్పడానికి.) ఆ స్త్రీలలో ఒక్కరూ తక్కువ వంశస్థులు కారు. ఒక్కరూ కురూపులు కారు. ఎవ్వరూ భర్తకు (రావణుడికి) శుశ్రూష చెయ్యని వారు కారు. అందరూ పతివ్రతలే. అందరూ అందగత్తెలే. అందరూ యౌవ్వనవతులే. (ఉన్నత వంశం, అందం, యౌవ్వనం, పాతివ్రత్యం – ఇవే స్త్రీలకు ఉండవలసిన లక్షణాలు!) ఆ స్త్రీ లెవ్వరూ నీతి తప్పరు. భర్తను తప్ప ఇతర పురుషుల్ని ప్రేమించరు. (భర్త మాత్రం వేల కొద్దీ స్త్రీలని కామిస్తాడు, భార్యని తప్ప! అదే గొప్ప నీతి!) రావణుడు తీసుకొచ్చిన స్త్రీలలో సీత తప్ప పెళ్ళయిన వాళ్ళెవరూ లేరు. (సీతని కూడా పెళ్ళికి ముందే తీసుకొస్తే, రావణుడితో నిక్షేపంలా ఉండేది. రాముడి గొప్పేమీ లేదు. ఎవడు ఎత్తుకెళ్తే వాడే భర్త!)

రావణుడు ఒక సుందరమైన శయ్య మీద పడుకుని నిద్రపోతున్నాడు. ఆ మంచానికి చుట్టూ బయట వేపు దంతం. లోపల బంగారం. (అయ్యయ్యో, బంగారమే బయటికి ఉండాలి కదా? అందరూ చూస్తారు. బంగా రాన్ని లోపలికి పెట్టుకుంటారా ఎక్కడైనా? ఏ కంసాలి చేశాడమ్మా ఇంత తెలివి మాలిన పని!) ఆ మంచం ఎక్కడానికి బంగారం మెట్లు! మంచంమీద పట్టుతో, జలతారుతో చేసిన పందిరి! మంచం దగ్గిరే కుర్చీలు. (మంచం దిగడానికి బోలెడు శ్రమ కదా? మంచం దిగి విశ్రాంతి తీసుకోడానికా కుర్చీలు?)

ఆ మంచం మీద రావణుడు, ఆభరణాలు మెరుస్తూ, నీలాకాశంలాగ ఉన్నాడు. పూల చెట్లతో నిండిన మందర పర్వతం లాగ ఉన్నాడు. సెలయేట్లో ఈదులాడే మదపు టేనుగు లాగ ఉన్నాడు.

అతని భుజాలు యుద్ధాలలో తిన్న దెబ్బలతో కాయలు కాచి ఉన్నాయి. అతని చేతులు ఐదు తలల సర్పాల్లా ఉన్నాయి. అతడు, గుహలో నిద్రించే మహా

సర్పంలాగ బుసలు కొడుతున్నాడు. (అదే! గుర్రు పెడు తున్నాడన్న మాట! అబ్బా, గుర్రుపెట్టే భర్తల్ని వొదిలేసి, గుర్రుపెట్టని వాళ్ళని వెతుక్కోవాలి బాబూ! లేకపోతే వాడి పక్కన నిద్రేం పడుతుంది?) తల మీద కిరీటం కొంచం వొరిగి ఉంది. (పది తలలు కవి గారూ! కొంచెం గుర్తు తెచ్చుకోండి. ఇంకా తొమ్మిది కిరీటాలుంటాయి. అయినా నిద్రపోయేటప్పుడు కూడా నా కిరీటం?) ఆభరణాలు చెదిరి ఉన్నాయి. భార్యలందరూ కాళ్ళ దిక్కున ఉన్నారు. (కాళ్ళ దిక్కునా, అరికాళ్ళ దిక్కునా?)

హనుమంతుడు రావణుని భార్యల్ని చూసి, 'ఇన్ని వేల మంది స్త్రీలు భర్తతో సుఖభోగా లనుభవిస్తున్నారు. శ్రీరాముడి భార్య కూడా భర్తతో ఇలాగే సుఖంగా ఉంటే ఎంత బాగుండేది!' అనుకున్నాడు.

దూరంగా ఇంకొక శయ్య మీద ఒక అందమైన స్త్రీని చూశాడు. ఆమె మండోదరి! సీతే అనుకుని చాలా సంతోషపడ్డాడు. మళ్ళీ సందేహంలో పడ్డాడు – 'సీత మహా పతివ్రత. సనాతనంగా పాతివ్రత్యం ఆచరించే వంశంలో పుట్టింది. తన భర్తతో తప్ప పర పురుషుడితో శయనించదు' అనుకున్నాడు. 'నే నిలా స్త్రీలను చూడ వొచ్చునా?' అని విచారించాడు. మళ్ళీ 'నా దోషం లేదు. నా మనసు నిర్మలమే. ఒక స్త్రీ కోసం, స్త్రీల మధ్య వెతకక తప్పదు కదా?' అని విచారం పోగొట్టుకున్నాడు.

ఎంత వెతికినా సీత కనపడ లేదు. లంకలో నాలు గంగుళాల స్థలం కూడా వెతకకుండా విడిచింది లేదు.

సీత కనపడలేదని హనుమంతుడు ఆలోచనల్లో పడ్డాడు. సీత మరణించే ఉంటుంది. లేకపోతే రావణుడు కోపంతో చంపేసి ఉంటాడు. సీత కనపడలేదని చెపితే రాముడు జీవిస్తాడా? తప్పకుండా కన్ను మూస్తాడు. (మూసినా, మళ్ళీ బాగానే తెరుస్తాడు. చాలా సార్లు మూర్ఛబోయాడు గానీ, చప్పు చప్పునే తేరుకున్నాడు.) రాముడు కన్ను మూస్తే లక్ష్మణుడూ కన్ను మూస్తాడు. తర్వాత భరతుడూ మూస్తాడు. తర్వాత శత్రుఘ్నుడూ, తర్వాత వారి తల్లులందరూ, తర్వాత అయోధ్యలో ప్రజ లందరూ, మూస్తారు కళ్ళు.

ఇక కిష్కింధలో కూడా సుగ్రీవుడు కన్ను మూస్తాడు. రుమా, తారా, అంగదుడూ కళ్ళు మూస్తారు. నేనూ కన్నుమయ్యక తప్పదు. కిష్కింధలో ప్రజలందరూ రాజు కోసం చచ్చిపోతారు. పర్వతాల మీద నుంచి ఉరికి కొందరూ, ఉరి బోసుకుని కొందరూ, కత్తులతో పొడుచు కుని కొందరూ, విషం తాగి కొందరూ, తలలు బద్దలు గొట్టుకొని కొందరూ – అందరూ నశించిపోతారు. ఆ విధంగా రాముడి కోసం అందరూ ప్రాణాలు విడు స్తారు.[294]

ఒకవేళ వారు మరణించకపోయినా, రాముడే వానరులందర్నీ చంపేస్తాడు. (అదేమిటి? ఎందుకూ? అత్త మీద కోపం దుత్త మీద చూపించినట్టు!) అందుచేత నేనసలు కిష్కింధకు పోనే పోను .... అదుగో! అశోక వనం కనబడుతోంది. అదీ చూస్తాను. (ఇందాక, 'నాలు గంగుళాల చోటన్నా వెతక్కుండా ఒదల్లేదన్నారే కవి గారూ? పోనీ, చాలా చోట్లు వెతికాడు, సీత కనపడ లేదు – అంటే బాగుండేది కదా? దశరథుడికి సత్యవ్రతం ఉన్నట్టు, ఈ కవికి అసత్య వ్రతం ఏదన్నా ఉందా ఏమిటి? నోరు తెరిస్తే అబద్ధాలే!)

హనుమంతుడు అశోక వనం ప్రాకారా లెక్కాడు. ఆ వనంలో ఎన్నెన్నో ఉప వనాలున్నాయి. పర్వతాలు న్నాయి. సరస్సులున్నాయి. మేడలున్నాయి (సరే, చాల్లే! మేడలన్నీ బంగారమే!) చెట్లూ బంగారమే. ముందు హనుమంతుడు సీతని వెతకడానికి చెట్ల నిండా పక్షుల్ని లేవగొట్టాడు. (సీత, చెట్లమీద గూళ్ళలో ఉంటుందనా?) పక్షులు నిద్ర కళ్ళతో లేచి గోల గోల చేస్తూ ఎగిరాయి. (పని, చడీ చప్పుడూ లేకుండా చేసుకోవాలి కదా? హను మంతుడు ఏ పని చేసినా తెలివి మాలిన పనే! ఎంత

**294.** సుందర, సర్గ 31, శ్లోకాలు 13, 38: హనుమంతుడు, 'సీత కనపడలేద'ని రాముడి దగ్గిరికి పోయి చెపితే ఏం జరుగుతుందో ఇలా అనుకుంటున్నాడు. "అప్రియమైన మాటలు నేను జెప్పినటులైతే రాముడు ప్రాణము విడుచునే గాని, జీవించి యుండడు. రాముని జూచి బుద్ధిమంతుడగు లక్ష్మణుడు జీవింపడు. రామ లక్ష్మణుల మరణమును విని భరతుడు జీవింపడు. భరతుని మరణమును జూచి శత్రుఘ్నుడు జీవింపడు" – ఈ రకంగా అయోధ్యలో మరణ ప్రకరణం కొంతసేపు సాగింది. తర్వాత కిష్కింధలో – "దురవస్థను బొందిన రాముని జూచి, సత్యసంధుడగు సుగ్రీవుడు ప్రాణము విడుచును. (చుట్ట పొగ విడిచినట్టే నన్నమాట ప్రాణం విడవడం!) రుమ, పెనిమిటి మరణమునకు ప్రాణము విడుచును. తార, శోకా క్రాంతురాలై ప్రాణము విడుచును. ఇక అంగదు డెట్లు ప్రాణము పెట్టుకొని యుండును? వానరులందరూ రాజు పోయిన దుఃఖము గల వారై పర్వత శిఖరముల నుండి గుంపు గూడి క్రిందపడి ప్రాణములు విడిచెదరు. అరచేతులతోనూ, పిడికిళ్ళతోనూ, తలలు పగులకొట్టు కొందురు. విషము తిని, ఉరిబోసుకుని, అగ్ని ప్రవేశము జేసి, ఆహారమును వదలి, కత్తుల పైబడి, ప్రాణములు విడిచెదరు."

అయోధ్యా, కిష్కింధా కూడా సర్వనాశనం అయిపోతాయట రాముడు లేకపోతే! ఒకసారి రాముడు చచ్చిపోతే బాగుండును. అలా జరుగుతుందో లేదో చూసే వాళ్ళం. దశరథుడు పోతే ఏమీ జరగలేదని చూశామనుకోండీ! ★

తెలివి తక్కెవ దూతో!) పక్షుల ఎగురుళ్ళతో పూలన్నీ మీద రాలిపడి హనుమంతుడు వసంతుడయ్యాడు (హను మంతుణ్ణి వసంతుణ్ణి చెయ్యాలంటే, పక్షుల్ని లేపక్కర్లేదు. గాలిని వీచించినా చాలు.) ఆ వనంలో నేలనిండా బంగారం రేకులు తాపడం చేశారు. (జర్రున జారిపడ్డా నికా?) వనంలో ఎన్నో దిగుడు బావులు – రత్నాల మెట్లతో! సెలయేళ్ళలోకి చెట్ల కొమ్మలు వాలి, ప్రవాహాల్ని ఆపుతూ, భర్తను విడిచిపోయే భార్యని ఆగమని బంధువు లంతా బతిమాలుతున్నట్టు వున్నాయి. ఎక్కడి కక్కడ బంగారు వేదికలున్నాయి. వాటి మీద గొడుగులూ! లత లతో కల్ప వృక్షాలతో అశోక వనం, ఇంద్రుడి నందన వనంలాగా, కుబేరుడి చైత్రరథం లాగా, గంధమాదన పర్వతం లాగా ఉంది. (చక్కగా అంత బాగుంటే, ఇక్క ణ్ణించి పోవడం ఎందుకమ్మా సీతా, ఇక్కడే ఉండి పోరాదూ?)

హనుమంతుడు ఒక శింశుపా వృక్షం మీద ఎక్కి చుట్టూ చూశాడు. (శింశుపా వృక్షం అంటే, ఇరుగుడు చెట్టు – అని నిఘంటువు చెప్పే అర్థం.) దూరంగా ఒక మేడ కనపడింది. (సరే! దాని అరుగులూ .... కిటికీలూ బంగారమే కదా? అబ్బ! బంగారం అంటే కడుపులో తిప్పుతోంది! మట్టి వాసన ఎక్కడా లేదా?)

ఆ మేడలో ఒక సౌందర్యరాశి కూర్చుని ఉంది. ఆమె చాలా కృశించి ఉంది. (అయ్యో! కృశించి ఉందా? మరి రాముడు ఒప్పుకుంటాడా? బలిసి వుండాలే ఆయనకీ!) అయినా చంద్ర రేఖ లాగ అందంగా ఉంది, (ఓహో! అందంగానే ఉంది కదా?) స్నానం, అలంకారం లేక మలినంగా ఉంది. అయినా బురద అంటని పద్మం లాగ కాంతిగా ఉంది. (పతివ్రత కాబట్టి, భర్త లేనప్పుడు స్నానం చేసి సుఖంగా ఉండకూడదు. మళ్ళీ అందంగా మాత్రం ఉండాలి!)

ఆ స్త్రీ తల వొంచుకుని దుఃఖిస్తోంది.

'ఈమే సీత' అనుకున్నాడు హనుమంతుడు. రుష్య మూకం మీద ఉన్నప్పుడు రావణుడు తీసుకు పోతూం డగా చూసిన రూపం గుర్తుకొచ్చింది. అప్పుడు చూసిన పసుపు పచ్చ చీరే ఇప్పుడు ఆమె ధరించి ఉంది. కొన్ని కొన్ని నగలు లేక ఆమె బోసిగా ఉంది.

ఆమె చుట్టూ రాక్షస స్త్రీలు ఆయుధాలతో కాపలా కాస్తున్నారు. వారు మహా వికృతంగా ఉన్నారు. కొందరికి చప్పిడి ముక్కులు, కొందరికి బొర్ర ముక్కులు, కొందరికి ముక్కులే లేవు. కొందరికి చేట చెవులు, కొందరికి చెవులే లేవు. కొందరికి ఏనుగు పాదాలు, కొందరికి పాదాలే లేవు. కొందరు పొట్టీ లావూ. కొందరు పొడుగూ సన్నం. కొందరికి బోడిగుళ్ళూ కొందరికి కంప జుట్లూ. కొందరు ఒంటెల్లా ఉంటే, కొందరు గూనితో మరుగుజ్జులు. కొందరివి చేటలంత మొహాలు. కొందరివి కుక్క మొహాలు, కొందరివి నక్క మొహాలు, కొందరికి ఏనుగు మొహాలు, కొందరివి సింహం మొహాలు! (కవిగారు, తమ కొచ్చిన వ్యతిరేక పదాల వ్యాకరణ పాఠం అంతా, ఈ ఘట్టంలో ఛందోబద్ధంగా ఉపయోగించారు.)

అటువంటి రాక్షస స్త్రీల మధ్య ఉన్న సీత, భూమికి జారిన నక్షత్రం లాగ మెరిసిపోతోంది. (సీత సమస్త అవయవాలూ చూశాడు హనుమంతుడు! గుండ్రని స్తనాలూ, నున్నని తొడలూ, రమ్యమైన అరికాళ్ళూ కూడా చూశాడు! స్తనాలు కూడా చూశాడండీ 'గుండ్రనివి' – అని!)

సీతని చూసి ఇలా అనుకుంటున్నాడు.

'సీత సౌందర్యరాశి, మహా పతివ్రత, పతి దర్శనానికే నిరీక్షిస్తోంది. సరుకుల బరువుతో ఓడ సముద్రంలో మునిగి పోయినట్టు, పతి వియోగంతో సీత దుఃఖ సము ద్రంలో మునిగిపోయి ఉంది. – అయ్యో! ఇటువంటి భార్యను విడిచి ఇంత కాలం రాముడు ఎలా ఉండగలి గాడో గదా?' (మాకూ అదే సందేహం హనుమంతుడూ!)

'రాముడికి, రాజ్యం ఎలా పరిపాలించాలో, ఏను గుల్నీ గుర్రాల్నీ ఎలా లొంగదియ్యాలో చక్కగా తెలుసు గానీ, భార్య నెలా ప్రేమించాలో ఏమీ తెలిసినట్టు లేదే! అందుకే నిశ్చింతగా జీవించి ఉన్నాడు. ఈ సీత ఎక్కువా, త్రిలోక రాజ్యాధిపత్యం ఎక్కువా? – సీతే ఎక్కువ. సీత ముందు త్రిలోక రాజ్యాధిపత్యం పదహారో వంతుకైనా సరితూగదు. ఎంత గొప్ప వారికైనా విధి విధానం తప్పదు గదా?[295] శ్రీరాముడు మహా శక్తి సంపన్నుడు. తన దుఃఖమంతా సహించి, దాన్ని అతిక్రమించ గలిగిన పరాక్రమ వంతుడు. రాజ్య భ్రష్టుడైన రాజు మళ్ళీ రాజ్యం పొందినట్టు, రాముడు సీతను చూడగానే మిక్కిలి సంతోషిస్తాడు' అని సంతోషించాడు హనుమంతుడు.

నెమ్మదిగా తూరుపు ఎర్ర బారుతోంది! చీకట్లు విరిగి, తెల్లవారుతోంది! ★

---

**295.** సుందర, సర్గ 15, శ్లోకం 53: "శ్రీరాముడు గజాశ్వములను శిక్షించుటలోనూ, రాజ్య పరిపాలన సేయుటలోనూ సమర్థుడే గాని, భార్య మీద ప్రేమాతిశయమిట్టిదని అతనికి విశద పడలేదు."

**సర్గ 16, శ్లోకం 14:** "మూడు లోకములలోనూ రాజ్యము సేయుట మేలా, సీత మేలా?– యనుటలో, మూడు లోకముల ప్రభుత్వం సీత ఎదుట పదహారవ భాగమైననూ కానేరదు" – ఇలా అనుకున్న హనుమంతుడు, రాముడి విషయంలో అపార్థంతో ఉన్నాడని అర్థం చేసుకోకూడదు. సీతని చూసి అంత భక్తితో ఆలోచించాడని అర్థం. ★

# కథ-9

# సీతా రావణులు

[**ఈ కథ చదివే ముందు ఒక ముఖ్య విషయం:** రావణుడి దగ్గిర సీత చాలా కాలం ఉంది. రావణుడు సీతని బలాత్కరించాడా, లేదా? – ఈ ప్రశ్న ఒకటి వస్తుంది. 'వాల్మీకి రామాయణం'లో, సీతని రావణుడు బల్కారించ లేదు. సీత మహా పతివ్రత కాబట్టీ, ఆమె సౌశీల్యవతిగానే వుండాలి కాబట్టీ, కవి, రావణుడికి శాపం ఒకటి తయారు చేశాడు. యుద్ధ కాండలో 13వ సర్గలోనూ, ఉత్తర కాండలో 26వ సర్గలోనూ, ఈ శాపం సంగతి ఉంది.

'యుద్ధ కాండ'లో ఇలా వుంది: రావణుణ్ణి సీత అంగీకరించడం లేదని విని, మహాపార్శ్వుడనే రావణుడి మంత్రి, రావణుడికి "కోడిపుంజు న్యాయంతో (కుక్కుట న్యాయంతో) సీతని బలాత్కరించు; సందేహించకు" అని చెపుతాడు. అప్పుడు రావణుడు, "నాకు ఒక శాపం ఉంది. అది రహస్యం" అని అసలు సంగతి బయట పెడతాడు. ఒక సారి రావణుడు పుంజకస్థల అనే అప్సరసని బలాత్కరించాడు. ఆమె బ్రహ్మ దగ్గిరికి పోయి చెప్పింది. బ్రహ్మ, రావణుణ్ణి "నిన్ను కోరని స్త్రీని బలాత్కరిస్తే నీ తల వెయ్యి ముక్కలై పోతుంది" అని శపించాడు.

'ఉత్తర కాండ'లో ఇలా వుంది: రుషులు రాముడికి రావణుడి చరిత్ర అంతా, చెపుతూ "రావణుడు రంభని బలాత్కరించినప్పుడు నలకూబరుడు రావణుణ్ణి శపిం చాడు" అని చెపుతారు. – మొత్తంగా సారాంశం ఒకటే. కవి రావణుడికి శాపం ఒకటి కల్పించి, సీత పాతివ్రత్యాన్ని నిలబెట్టాడు.

ఈ కథని వాస్తవ దృష్టితో పరిశీలించేటప్పుడు, రావణుడి శాపాన్ని లెక్కలోకి తీసుకోము. స్త్రీ లోలుడైన ఒక పురుషుడు, పర స్త్రీని ఎత్తుకుపోయి, ఆ స్త్రీ విషయంలో ఎలా ప్రవర్తిస్తాడో, రావణుడు కూడా సీతతో అలాగే ప్రవర్తిస్తాడనే అనుకోవాలి.

అసలు బలాత్కారం అనేది, స్త్రీ – పురుష శరీరాల సంబంధానికి సంబంధించినది మాత్రమే కాదు. ఒక స్త్రీని, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా తాకడం కూడా బలాత్కారమే. ఎత్తుకు పోవడం కూడా బలాత్కారమే. అపహరణే బలాత్కారం. ఎత్తుకు పోయినప్పుడు ఆమె తప్పు లేనట్టే, ఆ తర్వాత ఆ పురుషుడు ఆమెతో ఎలా ప్రవర్తించినా, అందులో ఆమె తప్పు ఉండదు. అందుచేత రావణుడు సీతని బలాత్కరించాడా లేదా – అనే ప్రశ్న అనవసరం.

'విషవృక్షం' కథ కూడా వాల్మీకి ప్రకారమే సాగుతుంది. వాల్మీకి ఇచ్చిన కథా వస్తువుని మార్చడం దీని ఉద్దేశం కాదు కాబట్టి, ఇందులో కూడా రావణుడికి, సీతని ఎత్తుకు రావటం మినహా ఆమెతో శారీరక సంబంధం ఉండదు. రావణుడు, తనని అంగీకరించమని సీతని ఒత్తిడి చేస్తున్నాడు – ఈ విషయాన్నే ఈ కథ చెపుతుంది.]

ధ్యానంతో నిశ్చలంగా, తపోనిష్ఠలో ఉన్న అప్సరస లాగ ఉంది సీత. దుఃఖంతో సొమ్మసిల్లి నేల రాలిన కాశీ పుష్పం లాగ ఉంది సీత. అలంకారాలు లేక, ఆభరణాలు లేక, పద్మాలు లేని సరోవరం లాగా, పూలన్నీ రాలిన జాజి తీగలాగా ఉంది సీత. యోచించి యోచించి అలిసి, నీరసించి, మౌనం వహించి, కరుడు గట్టిన శిల్పం లాగా, విగ్రహం లాగా ఉంది సీత. నిరాశతో నిస్పృహతో, వేటగాడికి ప్రాణాలతో పట్టుబడి పోయిన పక్షి కూన లాగ ఉంది సీత. మహా క్షామంలో తల్లి దండ్రులు గతించి, బంధువులు నిర్దయగా అడవుల్లో విడిచిన బాల లాగ ఉంది సీత! దుఃఖించి దుఃఖించి కన్నీరు కూడా ఇంకి, చల్లారి పోయిన అగ్ని పర్వతం

లాగ ఉంది సీత!

అశోక వనంలో, సీత, శోకంలో మునిగిపోయి వుంది. అయోధ్యలో, సీత అంతఃపురం చుట్టూ వున్న తోట కూడా అశోకమే. కానీ, ఆ అశోక వనంలో వున్న ఆనందం, ఈ అశోక వనంలో లేదు. ఈ వృక్షాలూ ఈ ప్రకృతీ సీతకు రాత్రింబవళ్ళూ భీతి కల్గిస్తున్నాయి. నిత్యమూ పిట్టల అరుపులూ వాటి చప్పుళ్ళూ మాత్రమే కొంచెం ఓదార్పు.

నీలపు జలంలో, తెల్లని హంస ఈదులాడుతూ గట్టు చేరినట్టు, ఆకాశంలో చంద్రుడు, మేఘాల చాటున మాయమయ్యాడు. చల్ల గాలుల్తో, పూల జల్లుల్తో, పక్షుల కల కలలతో, అశోక వనంలో సూర్యోదయం, మనోహ రంగా జరుగుతోంది.

కోరికలే గుర్రాలుగా, మనసే రథంగా, సీత, భర్త దగ్గిరికి ప్రయాణాలు చేస్తోంది. గత స్మృతుల బరువుతో నిట్టూరుస్తోంది. దీనమైన చూపులతో భూదేవిని ఆలిం గనం చేసుకుంటోంది.

చిత్రకూటంలో, పంచవటిలో, గంగా తీరంలో, ఉద యాస్తమయ సౌందర్యాల తలపులు, గత జన్మ లంత దూరం అయిపోయాయి! పతి దర్శనం ఏ నాడో యుగాల వెనక, కల్పాంతాల వెనక అయినట్టు తోస్తోంది. .... ఇక జన్మ జన్మలకూ ఈ నరక కూపం నించి విముక్తి లేదు. ఊహ తెలిసీ తెలియని పసితనం నుంచీ అపారమైన భక్తి శ్రద్ధలతో చేసిన పూజలూ, నోచిన నోములూ, చిల్లి గవ్వకైనా కొరగాకుండా పోయాయి. పుట్టలోంచి పాములు లేచినట్టు, ఆత్మలోంచి వేలకొద్దీ సంశయాలు, తల లెత్తుతున్నాయి. సీతలో సీత, సీతని, నిర్భయంగా, విస్మయంగా, క్షణం క్షణం మళ్ళీ మళ్ళీ మళ్ళీ ప్రశ్నించి ప్రశ్నించి కలవర పెడుతోంది.

ఎన్నడైనా, ఏ పర పురుషుడైనా, తనని కన్నెత్తి చూస్తే ఆ పురుషుడు ఆ మరు క్షణంలోనే భగ భగమండి భస్మం అయిపోతాడనుకునేది సీత. తన పాతివ్రత్య మహిమ, కవచం లాగ తనని కాపాడుతూ, చుట్టూ అగ్ని జ్వాలలు రేపి, పరిసరాలన్నీ దగ్ధం చేస్తుందనుకునేది సీత. కానీ .... ఇంత లోక భీకర కార్యం జరుగుతూ వుంటే, సమస్త భూతాలూ చూస్తూ వూరుకున్నాయి! దేవతలందరూ మౌనం వహించారు! సూర్య చంద్రులు గతులు తప్ప కుండా ఉన్నారు. ఏ దైవమూ తనకు అడ్డుపడలేదు. ఏ మహోన్నత శక్తీ తనని రక్షించ లేదు. చివరికి తన పాతివ్రత్యం కూడా రావణుడి దుర్మార్గం ముందు శక్తి హీనం అయిపోయింది. క్షుద్ర స్త్రీలలాగు విలపించడం తప్ప తను ఏమీ చెయ్యలేకపోతోంది.

పూర్వకాలం నించీ పతివ్రతలు ఎన్నెన్నో ఘన కార్యాలు చేశారని విన్నది తను. మహిమలతో నిండిన కథలెన్నో ఎరుగును తను. సావిత్రి, తన పాతివ్రత్య మహిమతోనే, మరణించిన భర్తని బతికించుకున్నది. అనసూయ, తను సంపాదించిన పుణ్యంతోనే ఉత్తమ కార్యాలెన్నో చేసింది. దమయంతి, మహా పతివ్రత గనకే నల మహా రాజుని దక్కించుకోగలిగింది. అయ్యో! తను ఆ పుణ్య స్త్రీల వంటి పతివ్రత కాదా? తను, పతి సేవలో ఏ నాడైనా లోటు చేసిందా? కానీ, తన మాటకీ కన్నీటికీ, తన కోపానికీ శాపానికీ, ఏ శక్తీ లేకపోయింది! పర పురుషుడు బలాత్కారంగా ఈడ్చి తెస్తూ వుంటే, కంటికీ మంటికీ ఏకధారగా ఏడవడం తప్ప, తనను తను రక్షించుకోలేక పోయిందే!

నా భర్త ఆజ్ఞ లేక నిన్ను శపించకుండా విడిచానని ఆ దుర్మార్గుణ్ణి బెదిరించడానికి అన్నదే గాని, తనకు గడ్డి పోచనైనా కదిలించే శక్తి లేదని రుజువై పోయింది! ఎందరో రుషులు, ఎన్ని వరాలు ఇచ్చారో! ఎంతెంత మహిమలు కలుగుతాయని ఆశీర్వదించారో! రుషుల వాక్కయినా ఫలించలేదే!

తన భర్త శక్తి కూడా ఇటువంటిదేనా! ఇన్ని మాసాల కైనా ధర్మ పత్నిని రక్షించుకునే ప్రయత్నాలు చెయ్యనే లేదే! ఈ దుర్మార్గుణ్ణి ధిక్కరించే కార్యం ఆయనకు కూడా అసాధ్యమేనా! శ్రీరాముడు కూడా సామాన్య పురుషు డేనా!

ఆ ఊహని, ఎన్నడూ భరించలేదు సీత. ఆ సందేహం కలిగితే తనని తను భరించలేనంత విరోధం కలుగుతుంది ఆమెకు. తన భర్త శక్తుల్ని తను శంకించ డమా! ఆయన సామాన్యుడు కాడు. పురుషోత్తముడు! మహా పరాక్రమవంతుడు! శత్రు భయంకరుడు! ఆయన ఇంత కాలం తనని రక్షించ లేదంటే, ఇదంతా తన కర్మ ఫలం. పూర్వ జన్మ సుకృతం. ఏ నాడో చేసుకున్న మహా పాపం. దీనికి ఎవరేం చెయ్యగలరు? అనుభవించక తప్పదు గదా?

ఆ నాడు ఎన్ని దుర్భాష లాడింది తను, లక్ష్మణుణ్ణి! .... అనరాని మాటలన్నది! ఈ నాటికీ ఆశ్చర్యమే! లక్ష్మణుడి మీద అంత శంక ఎలా కలిగిందో అంతు పట్టదు. ఏ నాడైనా అతణ్ణి అతని అన్నగారు, చిన్నగా మందలించినా, విల విల్లాడేది తన ప్రాణం. తనే .... ఆ అమాయకుణ్ణి అనరాని మాటలని దుఃఖ పెట్టింది. శని దేవతే తన నోట్లో ప్రవేశించింది.

జల జలా కన్నీళ్ళు కారుస్తూ, గతం తలపోసు కుంటోంది సీత .... మళ్ళీ మళ్ళీ మళ్ళీ! తన జాడ తెలియక అన్నదమ్ములెంత దుఃఖిస్తున్నారో! జరిగినదంతా జటాయువు చెప్పి ఉండడా? చెప్పక పూర్వమే ప్రాణాలు విడిచి ఉంటాడా? .... ఆశ్రమంలో తను కనబడక ఎంత దుఃఖించారో! ఎంత శంకించారో! .... ఆ లేడికోసం

పోయిన తన భర్త సుఖంగా ఆశ్రమం చేరి ఉండ వచ్చునా? .... ఈ దుర్మార్గుడు తనను అపహరించాలనే దుర్బుద్ధితో శ్రీరాముడికేమీ హాని కలిగించలేదు కదా?

మహా పరాక్రమవంతుడైన శ్రీరాముణ్ణెవరు ధిక్క రించ గలరు? .... సుఖంగా వనవాసం ముగించి, అయోధ్యకు పోయి, ప్రియురాళ్ళతో సుఖ భోగాలలో మునిగి తేలుతున్నాడేమో! ఇంత కాలం తన భర్త ఏకపత్నీ వ్రతుడనే ఆనందంతోనే తను ఎన్ని కష్టాలకైనా ఓర్చగలిగింది. తన భర్త తనని త్యజించి అయోధ్యకు చేరి ఉంటాడా? తన భర్తే తనని తిరస్కరించినప్పుడు ఈ జీవితం ఎందుకు? .... నెలల తరబడీ ఈ నిరీక్షణ ఎందుకు?[296] ఆయుష్షు ఉండగా మరణం సంభవించ దంటారే పెద్దలు! పెద్దల వాక్కు సత్యం కాకపోతే, తను ఇంతకాలం భర్తకు దూరమై జీవించేదా? ఈ శరీరం విడిచి పెట్టాలని ఎంత కోరిక ఉన్నా ఏమి లాభం? .... ఆ కార్యమే అసాధ్యంగా ఉంది. భర్తకు దూరమై ఒక్క క్షణం కూడా జీవించ లేననుకుంది పూర్వం. కానీ, ఇన్ని మాసాలూ ఈ శరీరం సురక్షితంగానే ఉంది! ఈ శరీర ధర్మం అమితంగా సిగ్గు కలిగిస్తోంది.

ఆలోచనలతో విసిగి విసిగి, విధి విలాసాన్ని తల పోస్తూ, తన దౌర్భాగ్యాన్ని దూషిస్తూ, కళ్ళ నీళ్ళు కారు స్తోంది సీత.

"మహారాజు! .... మహారాజు!" అంటూ సీత చుట్టూ పరిచారికలు కలవరపడుతూ లేచారు. దాసీలు

---

**296.** **సుందరకాండ, సర్గ 28, శ్లోకాలు 12 ... 15:** అశోక వనంలో సీత రాముణ్ణి గురించి ఏమనుకుంటోందో చూడండి. "రాముడు దైవమని భావించి యుండుట, శ్రీరాముడే రక్షించు వాడనుకొనుట, ఉపవాసములు చేయుట, భూమి మీద పరుండుట, పతియే దైవమని నమ్ముట – ఇవి అన్నియు వ్యర్థమైనవి. రామా! నేను కృశించి, కాంతిహీననై, నీతో సమాగమము కలుగునను నాశలేని దాననై యున్నాను. నేను జేసిన పుణ్యము వ్యర్థము. రామా! నీవు నీ తండ్రి ఆజ్ఞ ప్రకారము, వనవాసము ముగించి, అయోధ్య చేరి, భయము లేక (ఈ సారి రాజ్యం పోతుందనే భయము లేక) కృతార్థుడవై, సుందరులైన స్త్రీలతో సుఖించెదవు. దుఃఖించుచుండు నేను విషము తిని, కత్తితో గొంతు కోసికొని అయిననూ ప్రాణము త్వరలో విడిచెదను. ఇచ్చట విషమును, కత్తిని, ఇచ్చు వారెవ్వరును లేరు. ఏమి సేతును?" – ఈ రకంగా ఉంది సీత ఆలోచన. సీతకు భర్త మీద చలించని విశ్వాసం లేదు. భర్తను శంకిస్తూనే ఉంది. తన భర్త తనని మరిచిపోయి, అయోధ్యకు పోయి, స్త్రీలతో సుఖంగా ఉంటాడేమో అని దుఃఖపడుతోంది.

ఇక్కడ సీత ఇలా ఉంటే, అక్కడ రాముడు కూడా ఇలాగే 'సీత శీలవతిగా వుందా, లేదా? రావణుణ్ణి అంగీకరిస్తుందా, తిరస్కరిస్తుందా?' అని శంకిస్తూనే ఉన్నాడు. సీతకి, రాముడి ఏకపత్నీ వ్రతం మీద నమ్మకం లేదు; రాముడికి, సీత పాతివ్రత్యం మీదా నమ్మకం లేదు. సమాజంలో అన్ని దాంపత్యాల సొగసూ ఎలా ఉంటుందో, అలాగే ఉంది సీతారాముల దాంపత్యం సొగసు కూడా. కవి, సీతారాముల దాంపత్యాన్ని ఆదర్శ దాంపత్యమని చెపుతూ కూడా, ఇక్కడ సామాన్య దాంపత్యాల ధోరణే చూపించాడు. ఎందుచేత? కవి చూసేది తన చుట్టూ వున్న సమాజాన్నే. అందులో ఉన్న ధర్మాలనే. దాన్ని మించి, దానికి అతీతంగా ఉన్న ఆదర్శం ఆయనకు తెలియదు. సమాజంలో లేని ఆదర్శ దాంపత్యాన్ని చూడడం కవికి కూడా సాధ్యం కాదు. కవి, సమాజం పరిధిలోనే, ఆ హద్దుల్లోనే ఆలోచిస్తాడు. సీతారాముల దాంపత్యంలో ఆదర్శం ఏమీ లేదు. వారు కూడా సమాజంలో వున్న ఇతర దంపతుల వంటి వారే. దంపతుల మధ్య ఉండే – హెచ్చు తగ్గులూ, కోపాలూ, కామాలూ, శంకలూ – అన్నీ వారికీ ఉన్నాయి.

సీత, భర్తని అస్సలు శంకించ లేదనో, అంత కాలం తనని రక్షించకపోయినా దుఃఖించలేదనో రాస్తే, అది చాలా అసహజంగా ఉంటుంది గనక, కవి, సీత దుఃఖాన్నీ సందేహాల్నీ ఎక్కడి కక్కడ సరిగానే రాశాడు. కానీ, చివరికి, సీత, అంతా తన దురదృష్టమేనని చెప్పుకుంటూ వుంటుంది. ఇది కూడా లోకంలో అందరు చేసే పద్ధతే. "రామా! నేను బహుకాలము నీ మీద ఆశయుంచి, వ్రతములు తపములు చేసియు, నాకు జన్మాంతర సుకృతము లేక, అదృష్టహీనురాలనై యుండుట చేత, నీవు నన్ను రక్షించక యున్నావు. ఇది నా పాపమేను. సందేహము లేదు!" అనుకుంటుంది. అంతా సీత పాపమే. రాముడి అసమర్థత ఏమీ లేదు. కవి, ఎప్పటికప్పుడు రాముణ్ణి రక్షించడానికి జాగ్రత్తలు తీసుకుంటూనే ఉంటాడు. ఇక్కడ 'కర్మవాదం' సీత శంకల నుంచి, రాముణ్ణి రక్షిస్తోంది. సీత తన పాతివ్రత్య మహిమ మీదా, భర్త మీదా అనేక శంకలు కలిగి కూడా, వాటిని అణుచుకుంటోంది. తనకు తను నచ్చ చెప్పుకోవాలని ప్రయత్నిస్తోంది.

రాముడికి, సీతగాక వేరే భార్యలు ఉన్నారా – అనే విషయంతో, విమర్శకులు, సీత విరక్తితో మాట్లాడిన ఈ మాటల్ని కూడా ఒక సందర్భంగా తీసుకుంటారు. సీత, రాముడి గురించి 'నువ్వు అయోధ్యకు పోయి, అందమైన స్త్రీలతో సంతోషంగా వుంటావు' అంటుంది కాబట్టి, రాముడికి మొదటి నించీ ఎక్కువ మంది భార్యలు ఉన్నారనే అర్థాలు తీస్తారు. కానీ, సీత విరక్తితోటీ, దుఃఖంతోటీ అన్న మాటలు అవి. ఆ మాటల్ని పట్టుకుని అలాంటి అర్థాలు తీస్తే, ఆ కథని బట్టి అది న్యాయమైన విమర్శ అవదు.

★

అశోక వనం నిండా పరుగులెత్తుతున్నారు. రావణుడు వస్తున్న సందడి వినవస్తోంది. మహారాజు వెంట వచ్చే స్త్రీల ఆభరణాల చప్పుళ్ళూ, రక రకాల కంఠాలూ, నవ్వులూ, .... దారి పొడుగునా హెచ్చరికలూ ....!

తుఫానులో గూడు దొరకని పిట్టలాగ వొణికింది సీత. తన పాతివ్రత్యం భంగ పడుతుందా? తన జీవితం కళంక మౌతుందా? భీతితో జల జలా కన్నీళ్ళు రాల్చింది.

చుట్టూ భార్యల గుంపుతో రావణుడు, సీత ఎదటికి వచ్చాడు.

చెట్టు మీద దాక్కున్న హనుమంతుడు, ఊపిరి బిగ బట్టి రావణుణ్ణి చూస్తూ ఆకుల్లోకి జరిగాడు.

రావణుడు ఎర్రటి దుస్తులతో, ఎర్రటి చందనం పూతలతో, ఎర్ర రాతి శిల్పంలాగ ఉన్నాడు. ఒంటి నిండా ఆభరణాలు. ధగ ధగ మెరిసే కుండలాలు. కాంతు లీనుతూ రత్న ఖచితమైన కిరీటం. గరుడ పక్షి రెక్కల వంటి భుజ కీర్తులు. నడుము చుట్టూ సర్పాకారంలో నీల మణులు తాపిన మొలతాడు. పరిమళ తైలాలతో నిగ నిగలాడే మీసాలు. భుజాల చుట్టూ ఎర్రటి వస్త్రం కప్పుకున్నాడు.

చుట్టూ పరిచారికలు వింజామరలు వీస్తున్నారు. ఛత్రాలు పడుతున్నారు. కొందరు దాసీలు బంగారు పాత్రల్లో రక రకాల మద్యాలు పట్టుకుని అందుబాటులో వినయంగా నిలబడి వున్నారు.

కొందరు దాసీలు కొండంత ఆసనం మోసుకొచ్చి రావణుడి దగ్గిర పెట్టారు.

రావణుడి భార్యలు, నీరెండలో ఆభరణాలతో ధగ ధగా మెరిసిపోతున్నారు.

రావణుడు, భుజాల చుట్టూ వస్త్రం ఇటూ అటూ జరుపుతూ, సీతని తదేకంగా చూస్తున్నాడు.

సీత కంపిస్తోంది. ముడుచుకుంటోంది. తనకే శక్తి వుంటే ఆ క్షణంలో మాయం అయిపోవాలని కోరు కుంటోంది.[297]

"సుందరీ! భయపడకు. నీ సౌందర్యం దాచుకోకు. గుండ్రని నీ స్తనాలూ .... నున్నని నీ తొడలూ .... విశాల మైన నీ కటి భాగమూ .... నీ అంగాంగాలూ .... చూసి నన్ను ఆనంద పడనియ్యి! నీ సమస్తాంగాలూ సౌందర్య నిలయాలే. పద్మాల వంటి నీ కళ్ళూ, ముత్యపు చిప్పల వంటి కను రెప్పలూ, పలుచని చెక్కిళ్ళూ .... సన్నని నడుమూ .... చక్కని పిరుదులూ .... ఆహా! నీ అవయ వాల వేపు ఎటు చూస్తే అటే నిలిచిపోతోంది నా దృష్టి. నీ వంటి సౌందర్య రాశిని పురుషుడైన వాడు కామించ కుండా విడిచి పెట్టగలడా? బ్రహ్మ నిన్ను సృష్టించి ఎలా విడిచాడో ఆశ్చర్యంగా ఉంది. నీ వంటి లోకోత్తర సౌందర్యవతిని నే నెన్నడూ చూడలేదు సుమా!"

రావణుడు ఎప్పుడు వచ్చినా సీత సౌందర్యాన్ని అమి తంగా కీర్తిస్తాడు. సౌందర్యం గురించి చేసే పొగడ్తలు స్త్రీలను సంతోష పరుస్తాయని అతడెరుగును.

రావణుడు సీత సౌందర్యాన్ని పొగుడుతూ ఉంటే, అతని భార్యలు పరిహాసంగా ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటారు. గుస గుస లాడుతుంటారు. తర్వాత ఒకరితో ఒకరు చాలా చెప్పుకుంటారు.

"ఎవరి కన్నా అందంగా ఉందక్కా సీత?"

"లోకంలో స్త్రీ లందరికన్నా అందంగా ఉందమ్మా, మహారాజు కళ్ళకి. మన అందరి అందాలూ పాతబడి పోలేదూ? .... అలాగే ఆమె అందమూ పాత బడుతుంది రేపటికి."

"కానీ, మనం లోబడి పోయాం కాబట్టి మన మీద మోహం చల్లారి పోయింది. మనలాగ సీత ఒప్పు కోదుగా?"

"ఔను, ఒప్పుకుంటుందనుకోను. అందుకే మరీ అందంగా కనబడుతోంది. మనమే చాలా తెలివి తక్కు

---

**297.** సుందర, సర్గ 19, శ్లోకం 3: + సర్గ 20, శ్లోకం 2: "అతన్ని జూచి ఉత్తమురాలగు సీతాదేవి కడుపును తొడలచేతనూ, స్తనములను భుజముల చేతనూ, మూసికొని దుఃఖించుచు కూర్చుని యుండెను" – అలా కూర్చున్న సీతని చూసి రావణుడు, "ఏనుగు తొండము వంటి తొడలు గల దానా! నీవు నన్ను జూసి స్తనములను, గర్భమును మూసుకొని భయపడి, నీ దేహమును జూపకున్నావు" అంటున్నాడు. రావణుడు ఇలా అన్నా, ఇంకెలా అన్నా, అవి ఆ పాత్రకు తగిన మాటలే. రావణుడు అలాగే మాట్లాడాలి. కానీ కవి కూడా, తన వర్ణనల్లో కూడా అలాగే మాట్లాడితే? కవి, సీత స్తనాలు చూడకుండా ఉండలేదు.

సీత దుఃఖాన్ని ఇలా చూపిస్తున్నాడు కవి – "సీత, పెద్దవియగు కుచములను కన్నీటిచే దడుపుచు, భర్తను ధ్యానించుచు, విశేషముగ దుఃఖించుచుండెను. పెద్దవియగు, గుండ్రముగను, వొక దాని నొకటి ఒరిసి కొనునవిగను యుండు స్తనములు వొణుకుచు, సీత భయపడుచుండెను."

సీత భయాన్నంతా స్తనాలలో చూపిస్తున్నాడు కవి. శ్లోకంలో సీతని సంబోధించడం కోసం 'సుశ్రోణీ', 'సుమధ్యే' అనడం కాదు ఇది. అసలు విషయమే ప్రత్యేకంగా 'సీత స్తనాల' మీద నడుస్తుంది. స్త్రీల అవయవాల్ని వర్ణించాలనే ఉత్సాహం ఉక్కిరి బిక్కిరి చేసేస్తూ ఉంటుంది కవుల్ని. సీత అయినా శ్రీ మహాలక్ష్మి అయినా ఒకటే. ఆ రాసే ఘట్టం ఆనంద ఘట్టం అయితే, ఆ స్త్రీ స్తనాలు ఆనందంతో కదులుతాయి. దుఃఖం అయితే దుఃఖంతో కదులుతాయి. ప్రతీచోటా వర్ణన అంతా స్తనాల మీదే! ★

వగా చేసుకున్నాం.”

ఆ స్త్రీలందరూ కన్నీళ్ళతో ఎప్పుడూ ఆ మాటలే చెప్పుకుంటారు.

సీతకి రావణుడి ప్రవర్తన రోజు రోజుకీ ఆశ్చర్యం కలిగిస్తోంది. – తన కాంక్ష అంతా వెళ్ళబోస్తాడు. అంగీక రించమని ప్రార్థిస్తాడు. కీర్తిస్తాడు. మందలిస్తాడు. బెదిరి స్తాడు. – అంతా నోటి మాటలతో మాత్రమే. అంతకు మించి దుష్టత్వం చూపించడు. దయదలచ మంటాడే గానీ దౌర్జన్యానికి పూనుకోడు. ఏ మహాత్ముల శాప ఫలమో! అతడే తనను పరాభవించదలిస్తే తనను తను రక్షించుకో గలగడం కలలో మాటే.

రావణుడు సీతని అశోక వనంలో ఉంచిన నాడే చెప్పాడు – “నిన్ను నేను బలాత్కరించను. నీకు ఇష్టం లేకుండా నిన్ను ముట్టను. నీకు కూడా నా మీద మోహం కలిగి నన్ను నువ్వు కోరాలి” అన్నాడు.

సీత నమ్మలేకపోయింది.

కానీ, ఈ నాటికీ రావణుడు ఆ మాట ప్రకారమే ప్రవర్తిస్తున్నాడు. ఇక ఎంతో కాలం తన పట్ల సహనం చూపడు. ఎప్పటికైనా తనని పరాభవింపక మానడు. ఈ దుర్మార్గుడి చెర నుంచి ఏ నాటికైనా విముక్తి ఉందో లేదో!

“సీతా! నా మాట విను. నా భార్యలలో పట్టపు రాణివిగా ఉండు. ఎందరో అందగత్తెల్ని నా పరా క్రమంతో ఎత్తుకు వచ్చాను. వారందరూ నీకు సేవలు చేస్తారు, నువ్వు కోరినంత ధనం ఇస్తాను. కోరినంత భూమి ఇస్తాను. నీ ఇష్ట ప్రకారమే దాన ధర్మాలు చేసుకో. నీ ఇష్ట ప్రకారమే పూజలూ వ్రతాలూ చేసుకో. నీ బంధువు లందరికీ గొప్ప గొప్ప బహుమానాలిచ్చి సంతోష పెడతాను. వారందరూ నిన్ను చూడడానికి వచ్చిపోతూ వుంటారు. నువ్వు కోరితే ఎన్ని నగరాలైనా జయించి నీ తండ్రి ఆధీనంలో ఉంచుతాను. నీకు కావల సినవన్నీ నన్ను కోరి, నాకు ప్రీతి కలిగించు. నా రాజ్యా నికి నువ్వు సర్వాధికారిణివిగా ఉండు. నీ స్తనాలు గుండ్రంగా చక్కగా ఉన్నాయి.”

రావణుడి భార్యలలో కనుసైగలూ, గుస గుసలూ, నిట్టూర్పులూ జరుగుతున్నాయి. ఒకామె ఇంకొకామె భుజం మీద తల పెట్టుకుని, “సరిగ్గా నాకు ఇలాగే చెప్పా రక్కా!” అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. “నా అందాన్ని ఇలాగే వర్ణించారక్కా!” అని వెక్కిళ్ళతో ఏడ్చింది.

“నాకూ ఇలాగే చెప్పారమ్మా! .... మహారాజుకి మన మీద దయ లేదు. దుఃఖపడకు.”

“నేను లేకపోతే ఒక్క క్షణం కూడా జీవించలేన న్నారు. నిజం అనుకున్నాను .... మన వల్ల మహారాజు కేమీ సంతోషం లేదా అక్కా? .... మహా రాజు ప్రేమ అంతా సీత మీదేనా?”

“పిచ్చిదానా! .... పురుషుడికి స్త్రీ మీద ‘ప్రేమ’ ఏమిటి? ఉన్నదంతా కామమే.”

రావణుడు తన వీరత్వం చాటుతున్నాడు సీత ముందు. తన పరాక్రమం వర్ణిస్తున్నాడు. ఎందరు స్త్రీలు తనకు లోబడి జీవిస్తున్నారో, లెక్కలు చెపుతున్నాడు. తను చెప్పింది పూర్తిగా వింటే, సీత తప్పకుండా అంగీకరిస్తుం దని. రావణుడు అక్కడకు వచ్చిన ప్రతిసారీ తన భోగభాగ్యాలన్నీ ఏకరువు పెడతాడు.

“సీతా! ఎన్నో వందల మంది రాజుల్ని యుద్ధాలలో జయించాను. ఎందరినో హింసించి, ఎన్నో శత్రు పట్ట ణాలు దోచుకుని, అమూల్యమైన సిరి సంపదలు కూడ బెట్టాను. నా భోగ భాగ్యాలకు అధికారిణివి నువ్వే. వీర త్వంలో నాతో సమానమైన వాడు లేడు. నా కీర్తి చూడు! నా పరాక్రమం చూడు! నా ఐశ్వర్యం చూడు! తెలివైన దానివైతే నాతో సుఖించు! నా భోగభాగ్యాలన్నీ అనుభ వించు! రాముణ్ణి మరిచిపో. ఆ అల్పుడు నీకు భర్తగా తగడు.”

రావణుడి మాటలు సీతకు కొత్తగాదు. అయినా పౌరుషపడి ధిక్కారంగా చూడబోయింది. సీతలో సీత – “సీతా! తొందర పడకు సుమా! అతనికి కోపం తెప్పిం చకు. మూర్ఖుడు. తెలివిగా ప్రవర్తించు. అతన్ని ప్రార్థించు. అతని దయ సంపాదించు .... ఎందుకైనా మంచిది. రాముడి పరాక్రమం గురించి ఇతని ముందు కీర్తించకు” అని సీతని హెచ్చరించింది.

రావణుడు పక్కకు తిరిగి పరిచారిక ‘చేతి’లో నించి పాత్ర అందుకుని, మద్యం తాగి, ఉత్తరీయంతో మీసాలు తుడుచుకున్నాడు. “ప్రియురాలా! ఎంత కాలం వ్యర్థంగా దుఃఖిస్తావు? అలంకారాలు చేసుకోవు. నేల మీద పడు కుంటావు. ఈ ఉపవాసాలూ, జాగారాలూ, ఇదంతా ఎంత కాలం? నా మాట విను. ఎందరో సుందరాంగ నలు నీకు అలంకారాలు చేస్తారు. పట్టు వస్త్రాలు, అమూల్యమైన రత్నాభరణాలు, అగరు చందనాలు, పానీ యాలు, శయనాలు, ఆసనాలు, నాట్య గానాలు, వన విహారాలు, – అన్నీ అనుభవించుతూ క్షణం క్షణం మైమరచి బతుకు. నువ్వు చక్కగా అలంకరించుకుని, చిరు నవ్వులతో, రత్న మందిరాలలో తిరుగుతూ వుంటే చూడాలి నేను. నీ తొడలు ఏనుగు తొండాల్ని పోలి ఉన్నాయి. దుఃఖంతో కృశించి ఇప్పుడు నువ్వు పూర్వం కన్నా అందంగా ఉన్నావు. నీ సన్నని నడుము ఇంకా సన్నబడి ఎంత ఆశ కలిగిస్తోందో నాకు! దినం దినం నీ యవ్వనం వ్యర్థంగా పోతోంది. ముందుకు పోయే ఏటి ప్రవాహం ఎన్నడూ వెనక్కి రాదు కదా? అలాగే, కాలం వెనక్కి రాదు. నా మాట విను. నాతో సుఖించు. ఆ

రాముడి మీద మనస్సు మార్చుకో. రాముడు పరమ దరిద్రుడు. ఐశ్వర్యం లేని వాడు. తపస్సులో, బలంలో, పరాక్రమంలో, సంపదలో, దేనిలోనూ రాముడు నన్ను మించలేడు. నాతో సమానుడైనా కాలేడు. ఆ రుషి జీవ నంలో నిన్నేం సుఖపెట్టగలడు? .... అసలు రాముడు జీవించి ఉన్నాడో లేడో సందేహమే. జీవించి ఉండినా ఏమి లాభం? .... ఇక్కడికి రాగలడా? .... ఈ లంకని ఛేదించగలడా? ఎంత కాలం ఈ వ్యర్థమైన ఆశలు పెట్టు కుంటావు? సీతా! రాముడు నిన్ను రక్షించలేడు. అస మర్థుడు ...."

రావణుడి మాటలు వింటోన్న కొద్దీ సీతకు భరించ లేని దుఃఖం కలిగింది. సీతలో సీత, సీతతో – "నిజమే నేమో సీతా! శ్రీరాముడీ లంకకు రాలేదేమో! ... రాగలి గినా రాదలచ లేదేమో! పర పురుషుడు అపహరించిన స్త్రీని తను స్వీకరించనని మౌనం వహించాడేమో!" అంటూ సందేహాలు వెలిబుచ్చింది.

సీత దుఃఖం పట్టలేక జల జలా కన్నీళ్ళు రాల్చింది. రావణుణ్ణి పూర్వమే అనేక సార్లు ప్రార్థించింది. తనను తన భర్త దగ్గరికి చేర్చమని ప్రాధేయ పడింది. పర స్త్రీలను బంధించడం ధర్మం కాదని మందలించింది. తనను తన భర్తకు అప్పగించకపోతే శ్రీరాముడు లంకని సర్వనాశనం చేస్తాడని భయ పెట్టింది. "నా భర్త దయా మయుడు. ఆపద్బాంధవుడు. శరణాగత వత్సలుడు. నిన్ను మన్నించి విడిచి పెడతాడు" అని ధైర్యం చెప్పింది. నయాన్నో, భయాన్నో, ఏ విధాన లొంగుతాడో, ఏ విధాన తన తప్పు గ్రహించి మనస్సు తిప్పుకుంటాడోనని సర్వ విధాలా ప్రయత్నించింది.

దేనికీ రావణుడు చలించలేదు. పైగా – "ఆ మహా త్ముడు ఇంతకాలం నిన్ను రక్షించలేదేం?" అని ఎప్పుడూ పరిహసిస్తాడు.

ఏమని చెప్పడానికీ సీతకి సమాధానం వుండదు. ఆత్మ బలం వుండదు.

"సుందరీ! ఆ రాముణ్ణి మర్చిపో! ఏ జన్మలో పాపం చేసుకున్నావో వనవాస శిక్ష అనుభవించావు. నీ పాపం గతించి పోయింది. ఇక సుఖించడమే మిగిలింది... నీ చెక్కిళ్ళు ఎంత చక్కనివీ! నీ కోసం నేను మన్మథ తాపంతో వేగిపోతూ వున్నాను."

సీత మౌనంగా వుండలేక ధిక్కారంగా తల ఇంకో పక్కకు తిప్పింది – "రావణా! నీకు అనేక పర్యాయాలు స్పష్టం చేశాను. నీ కోరిక తీరేది కాదు. పతివ్రతలు ఒకే భర్తతో జీవిస్తారు. నేను ధర్మం మీరను. మా వంశ మర్యాదలు నువ్వెరుగవు" అంది తీక్షణంగా.

"సుందరీ! మా కులాచారం కూడా నువ్వెరుగవు. పర స్త్రీ గమనం మా జాతిలో దోషం కాదు. స్త్రీలను బలాత్కారంగా అపహరించి తెచ్చుకోవడం మా జాతి ఆచారం.[298] నీకూ నాకూ జరిగేది ధర్మబద్ధ వివాహమే. రాక్షస వివాహం."

"అది నీకు వివాహం. నాకు కాదు. అది మీ కులా చారం, మా కులాచారం కాదు. నాకు ఒక్కసారే వివాహం. ఒక్క పురుషుడే నా భర్త. నువ్వు నన్ను ఎంత కాలం బంధించినా ఈ మాటే చెపుతాను! నువ్వు నీ భార్యలతోనే ప్రీతిగా ఉండు. నన్ను మోహించవొద్దు. ధర్మమార్గాన నడుచుకో. నీ భార్యల్ని నువ్వు రక్షించుకునే విధంగానే, ఇతరుల భార్యల్ని కూడా రక్షించాలి నువ్వు..."

రావణుడు నవ్వాడు – "ఇతరుల భార్యల్ని ఇతరులే రక్షించుకుంటారు సీతా!"

"నీకు సిరి సంపదలున్నాయి. బల పరాక్రమాలు న్నాయి. సన్మార్గం లేదు. సత్ప్రవర్తన లేదు. అది కూడా వుంటే నువ్వు ఉత్తముడివే. నా భర్త నీ వంటి స్త్రీ లోలుడు కాడు. పురుషోత్తముడు. ఏక పత్నీవ్రతుడు. నన్ను తప్ప ఏ స్త్రీనీ కన్నెత్తి చూడడు. అటువంటి పుణ్యాత్ముడు నా భర్త. నా భర్తకు నేను దూరమైనా, ఎప్పుడూ ఆయనతో ఉన్న దానినే. నా ఆత్మనించి నా భర్త దూరం కాలేదు. ఎన్ని ఆపదలు సంభవించినా సువర్చలాదేవి సూర్యుణ్ణి విడిచిందా? శచీదేవి ఇంద్రుణ్ణి విడిచిందా? రోహిణీదేవి చంద్రుణ్ణీ, అరుంధతీదేవి వశిష్ఠుణ్ణీ, లోపాముద్ర అగస్త్యుణ్ణీ, సావిత్రి సత్యవంతుణ్ణీ, సుకన్య చ్యవన మహర్షినీ, శ్రీమతీదేవి కపిలుణ్ణీ, దమయంతి నల మహారాజునీ, మదయంతి సౌదామ రాజునీ, కేశిని సగర చక్రవర్తినీ, అనసూయ అత్రి మహామునినీ – అనుస రించే ఉన్నారు. వారు ఎన్ని కష్టాలైనా భర్త పాదాలు విడిచి పెట్టలేదు. ఆ విధంగానే నా భర్త మీద నా భక్తి సన్నగిల్లదు. సీతాదేవి శ్రీరామచంద్రుణ్ణి అనుసరించి మాత్రమే ఉంటుంది. నీ అంతఃపురంలో అధికారం ఇచ్చి నన్ను మభ్యపెట్టలేవు. నీ సిరి సంపదలన్నీ నా వశం

**298.** సుందర, సర్గ 20, శ్లోకం 5: "పరస్త్రీ గమనము సేయుట, పరస్త్రీలను బలాత్కారముగ నపహరించి తెచ్చుట రాక్షసుల కుల ధర్మము."

పెళ్ళికాని పిల్లల్ని ఎత్తుకెళ్ళడం అయితే, గత చరిత్రతో కొన్ని జాతుల ధర్మంగా కనబడే సంఘటనలు ఉన్నాయి. ఇవి పురాణాల్లో కూడా ఉన్నాయి. కృష్ణుడు రుక్మిణిని ఎత్తుకు పోయాడు ఆమె ఇష్టంతోనే. భీష్ముడు – అంబనీ, అంబికనీ వారి అభిప్రాయాలూ, ఇష్టా ఇష్టాలూ తెలియకుండానే యుద్ధం చేసి ఎత్తుకు పోతాడు. ఇవి అందరికీ బాగా తెలిసిన కథలే. ★

చేసి నన్ను వశపరచుకోలేవు. నా భర్త నీడలో సుఖంగా ఉన్న నన్ను వేరు చేశావు. నా భర్త, ధనుస్సు పట్టినప్పుడు, అగ్నికి వాయువు తోడైనట్టు విజృంభిస్తాడు. వామన మూర్తి రాక్షసుల ఐశ్వర్యం అంతా స్వాధీనం చేసు కున్నట్టు, నా భర్త నిన్ను జయించి నన్ను స్వాధీనం చేసుకుంటాడు. ఋషులు యోగ విద్య నెట్లా వదలరో, నా భర్త నన్ను అట్లా వదలడు. ఆ మహానుభావుడికి కోపం రావాలే గానీ నిన్ను సంహరించి నన్ను రక్షించ డానికి ... ఒక్క క్షణం పట్టదు...."

సీతలో సీత – హెచ్చరికలు చేస్తూనే ఉంది. "నీ భర్తకి కోపం వస్తే ఒక్క క్షణంలో చేస్తాడా? మరి ఇప్పటిదాకా కోపం రాలేదా? ఒక్క క్షణంలో చెయ్యగలిగే వాడేనా ఇన్ని మాసాలు అలక్ష్యం చేసిందీ? ... అంత ప్రగల్భంగా మాట్లాడకు సీతా, తర్వాత సిగ్గు పడవలసి వస్తుంది" అంటోంది.

సీతకి ఆ హెచ్చరికలేవీ చెవికెక్కడం లేదు. ఆవేశం తగ్గలేదు. రావణుణ్ణి ఆగ్రహంతో చూస్తూ "నిన్ను సంహ రించడానికి నా మరిదే చాలు..." అని తల తిప్పింది. "ఇప్పటికైనా నన్ను నా భర్త దగ్గిరికి చేర్చి, శరణు కోరుకో. శరణు కోరే వారిని ఆయన కరుణిస్తాడు. అది నీకు జయం కలిగిస్తుంది."

సీత మాటలు రావణుడికి కొత్త కాదు. నిర్ల క్ష్యంగా నవ్వాడు – "నువ్వు కరుణించడమే నాకు కావాలి సీతా! రాముడు కరుణించడం కాదు. నిన్ను వదులుకోవడం నాకు జయం కాదు. రాముణ్ణి ఇంకా నీ భర్త అంటు న్నావు. నేను సహించను. ఇక నీ భర్త రాముడు కాదు. రావణుడే. నేనే! ఇప్పుడు సీత రావణ పత్ని!"

"రామ, రామ!" అంటూ సీత చెవులు మూసు కుంది. క్రోధంతో కళ్ళెర్రజేసింది – "నీచుడా! నా భర్త నీ నోరు వెయ్యి వక్కలు చేసినప్పుడు సీత ఎవరి పత్నో నువ్వే గ్రహిస్తావు. దశరథ మహారాజు కోడలిననే సందేహమైనా లేకుండా కారు కూతలు కూస్తున్నావు. శ్రీరామ చంద్రుడి పరాక్రమం గ్రహించ లేక మూర్ఖుడి వలె ప్రవర్తిస్తున్నావు. దేవతల వరాన పుట్టి, ఎన్నెన్నో సాహస కృత్యాలు చేసిన వాడు నా భర్త..."

"సీతా! నేనూ వరాన్నే పుట్టాను.[299] ఎందరో వీరాధి వీరులతో యుద్ధాలు చేశాను. రాముడొక్కడే వీరుడని నువ్వు మురుస్తున్నావు."

"రాముణ్ణి మించిన పరాక్రమ వంతుడివే అయితే ... పిరికి పందవై మారు వేషంతో, ఒంటరిగా వున్న అబలని మోసగించి ఎత్తుకొచ్చావు, అదేనా నీ పరా క్రమం?"

"మరి, ఆ శ్రీరాముడు చేసిన వీర కార్యాలు ఏమిటో కూడా చెప్పు! ఒంటరిగా చిక్కిన అబలను బంధించి ముక్కూ చెవులూ కోసి పంపడమేనా ఆ మహానుభావుడి వీరత్వం? నేను పిరికి పందనై నిన్ను అపహరించ లేదు. నా చాతుర్యం ప్రయోగించి, ఆ నీచుడికి తగ్గ శాస్తి చేశాను.[300] సీతా! రాముడు నన్ను జయించగలడనే భ్రమ విడిచిపెట్టు! ఆ అల్పుణ్ణి నమ్ముకుని, నిన్ను కోరే లంకాధిపతిని తిరస్కరిస్తున్నావు. ఇకనైనా వివేకంతో ఆలోచించు. మన్మథుడు పూల బాణాలతో నన్ను నీ వేపు తరుముతున్నాడు. నీ సౌందర్యం నన్ను రోజు రోజుకీ పిచ్చివాణ్ణి చేస్తోంది."

"మూర్ఖుడా! ఎంత చెప్పినా శ్రీరాముడి పరా క్రమం గ్రహించలేని నువ్వు ఉన్మాదివే. నీ ప్రేలాపన నాకు దుర్భరంగా ఉంది. నిన్ను శపించడానికి నేను స్వతం త్రను కాను గనుక, నా భర్త ఆజ్ఞ లేక, ఊరుకుంటు న్నాను గానీ..."[301]

---

**299.** "వరాన్న పుట్టడం" అనే మాటల్ని ఈ నాటి మొక్కులతో, వ్రతాలతో పోల్చుకోవాలి. ఒక వ్రతం చేసిన తర్వాతో, ఒక మొక్కు మొక్కిన తర్వాతో, ఒక స్త్రీ గర్భవతి అయితే, ఆ బిడ్డ ఆ దేవుడి దయవల్ల పుట్టినట్టే అందరూ నమ్ముతారు. అదే వరాన్న పుట్టడం. ★

**300.** శతృవులు, ఒకరి పక్షంలో స్త్రీలను ఒకరు పరాభవిస్తూ వుంటారు. రావణుడి పక్షంలో స్త్రీని రాముడూ, రాముడి పక్షంలో స్త్రీని రావణుడూ పరాభవించారు. ★

**301.** **సుందర, సర్గ 22, శ్లోకం 20:** 'సీత పతివ్రత కదా, రావణుణ్ణి శపించే శక్తి లేదా? మరి శపించలేదేం?' అనే ప్రశ్నలు వస్తాయి కాబట్టి, దానికి కవి, 'అబ్బే, సీతకి ఎందుకు శక్తి లేదూ?' అనే పద్ధతిలో వాదిస్తున్నాడు. సీతకి, రావణుణ్ణి శపించే శక్తి వున్నా, భర్త అనుమతి లేక వూరుకుందట! అదీగాక, రావణుణ్ణి ఇప్పుడే శపించేస్తే, సీత శక్తి ఖర్చయిపోయి, తర్వాత పాతివ్రత్యాన్ని రక్షించుకోడానికి శక్తి మిగలదట! – ఇదీ కవి జవాబు! మొత్తంగా అన్నిటికీ సరిపోయేటంత శక్తి లేదన్న మాట సీతకి! రావణుణ్ణి మొదటే శపించేస్తే, వాడు ఎత్తుకు పోవడమే జరగదు కదా? వాడి బెడద మొదటే పోతే, తర్వాత పాతివ్రత్యానికి ప్రమాదమే రాదు కదా? దాన్ని రక్షించుకోవలిసిన అవసరం ఏం వుంటుంది?

**సీత మాటలు చూడండి:** "భస్మమై పోదగిన వాడా! అపరాధము చేసిన వానిని శపించుటకు రాముని ఆజ్ఞ నాకు లేనందుననూ, పాతివ్రత్యము సంరక్షించు కొనవలసి యుండుట చేతనూ, నా మహిమచే నిన్ను భస్మము చేయలేదు" – అదన్న మాట కారణం! 'పతివ్రత దగ్గిరికి సింహం వస్తుందనుకోండి. భర్తని అడగాలి – "ఏమండోయ్! .. దీన్ని నేను ➔

రావణుడు పరిహాసంగా నవ్వాడు – "నీ భర్త ఆజ్ఞ మాత్రమేనా, మామగారి ఆజ్ఞ కూడా కావాలా?"

"నీచుడా! పతివ్రతను పరిహసిస్తున్నావు. సూర్యుడు జలం పీల్చేసేట్టు, నా భర్త నీ అహంకారం పీల్చేస్తాడు. పర స్త్రీని అపహరించిన పాపం నిన్ను కట్టి కుడపక మానదు. నా భర్త రోషంతో నిన్ను కన్నెత్తి చూస్తే చాలు, అగ్ని జ్వాలల్లో పడి భస్మమై పోతావు. ఛండాలుడు మోక్షం చేరలేనట్టు, నువ్వు నన్ను ఎన్నటికీ పొందలేవు" – రావణుణ్ణి నిందిస్తూ వున్నప్పుడల్లా సీతకి, నూతన మైన, అద్భుతమైన ఆవేశం కలుగుతుంది. పర పురుషుడు తనని వాంఛించడం, తను తిరస్కరించడం! అది ఆమెకు మహానందం కలిగిస్తుంది. జగత్తులో పతివ్రత లందరూ ఆమెలో ఆవేశిస్తారు. తన సౌశీల్యాన్ని దేవతలు చాటుగా పరీక్ష చేస్తున్నారనే గాఢ విశ్వాసం కలుగుతుంది. పతివ్రత పర పురుషుణ్ణి ఎన్ని విధాల దూషించ గలదో అన్ని విధాలా దూషిస్తుంది. పర పురుషుణ్ణి తిరస్కరించే ఆ కార్యంలో సీత, తను మహా పతివ్రతననే ఆత్మానందంతో, దేహంలో అణు వణువూ పులకరించి, దివ్యానుభూతి పొందుతుంది.[302] రావణుడు తనని బలాత్కరించక పోవడానికి కారణం తన పాతివ్రత్య మహిమేనని ఆమెకు గాఢమైన విశ్వాసం. తనలో సత్యం చూసి దేవతలే తనని కాపాడుతున్నారని ధైర్యం! – తనకు శక్తి లేకపోవడం ఏమిటి? మహా శక్తి సంపన్నురాలు తను! తన పాతివ్రత్య మహిమే ఈ దుర్మార్గుణ్ణి అంత దూరాన నిలబెడుతోంది. తన శరీరం తాకే అర్హుడా ఆ నీచుడు? అడుగు ముందుకు వేస్తే భస్మమై పోడా?

"రావణా! ఇప్పటికైనా గ్రహించు. శ్రీరాముడి చేతిలో కోరి మరణం తెచ్చుకోకు. నా భర్త పరా క్రమం నువ్వెరుగవు. సూర్యచంద్రుల్ని పడగొట్టేస్తాడు. భూమండలం తల్లకిందులు చేసేస్తాడు... సముద్రా ..." అని చప్పున ఆగింది సీత.

సీతలో సీత సందేహిస్తోంది. జంకుతోంది. "పూర్వం కథల్లో విన్న సంగతులన్నీ మాట్లాడడం ఎందుకు? సూర్య చంద్రుల్ని పడగొట్టడం ఏమిటి? భూమిని తల్లకిందులు చెయ్యడం ఏమిటి? ... మానవుడు అటువంటి కార్యాలెలా చెయ్యగలడూ? కొంచెం ఆలోచించి మాట్లాడ రాదూ? ..."

"నీకు తెలీదు, నా భర్త మానవుడు కాడు, మానవ రూపంలో ఉన్నాడే గానీ! భగవంతు డెప్పుడూ మానవ రూపంలోనే ఉంటాడు. ... ఆయనే తల్చుకుంటే..." ఆవేశంతో తన్మయత్వం చెందుతోంది సీత.

సీత మౌనం చూసి రావణుడు నవ్వు మొహంతో – "ఊఁ, మాట్లాడు సీతా! ఇంకా ఏం చేస్తాడు నీ భర్త?" అన్నాడు. సీత కోపంగా అయినా తనతో మాట్లాడు తోంటే రావణుడికి ఉత్సాహంగా ఉంది. ఇంకా 'పర స్త్రీగా' వున్న సీత తిట్లూ శాపాలూ, అతనికి ముచ్చటగానే ఉన్నాయి. పాత భార్యల అందాల ముందు సీత అందం వెయ్యి విధాల నూతనంగా, మనోహరంగా కనిపిస్తోంది. సీత కోపం ప్రణయ కలహంగానే గోచరిస్తోంది.

రావణుడు – మీసాలు మెలితిప్పుతూ సీతని చిరునవ్వుతో చూస్తున్నాడు.

సీత, రావణుణ్ణి తీక్షణంగా చూసింది. "నీకు నీతి

---

➔ చంపగలను గానీ చంపమంటారా, వొద్దంటారా?" అని అడిగి, భర్త ఆజ్ఞ పొందాలి. భర్త ఊళ్ళో లేడనుకోండీ, సింహం తినేస్తే వూరుకోడమే! అలాగే, పర పురుషుడు ఎత్తుకు పోతోంటే, వాణ్ణి తప్పించుకునే మహిమ వుండి కూడా భర్త అనుమతి లేదు కాబట్టి, వాణ్ణి ఎత్తుకు పోనివ్వడమే! 'పతివ్రతలకు మహిమలు వుంటాయి' అనే అబద్ధాన్ని కాపాడడానికి దాని వెంట ఇన్ని అబద్ధాలు!

**ఇందులో ఇంకో విషయం:** 'ఈ శక్తి ఖర్చయిపోవడం'లో రహస్యం ఏమిటి? తపస్సులు చేసి చాలా పుణ్యం కూడబెట్టడం, అందులోంచి కొంత పుణ్యం తీసి ఇతరులకు ఇవ్వడం – ఈ ఊహల కన్నిటికీ మూలం – ధనమే. అంటే, డబ్బు. సమాజంలో ధనానికి గొప్ప శక్తి వుంది. దానితో అధికారాలు సంపాదించవచ్చు. గౌరవాలు పొందవచ్చు. ఒక మనిషి కూడబెట్టిన ధనంలోంచి కొంత తీసి ఇంకో మనిషికి ఇవ్వవచ్చు. ఇంకో మనిషి నించి తీసుకోవచ్చు. అది ఒక్కోసారి ఖర్చయి పోతుంది, ఒక్కోసారి మిగిలి వుంటుంది. డబ్బుకి సంబంధించిన ఈ విషయాలే ఆధ్యాత్మికమైన ఆలోచనల్లోకి కూడా ప్రవేశించాయి. తపస్సుల వల్లా, పాతివ్రత్యాల వల్లా, గొప్ప గొప్ప మహిమలు వస్తాయి. అవి, డబ్బులాగే పోగులు పడి వుంటాయి. వాటిలోంచి కొంచెం తీసి ఇతరులకు ఇవ్వవచ్చు, ఇతరుల నించి తీసుకోవచ్చు. ఆ మహిమలూ పుణ్యాలూ ఒక్కోసారి ఖర్చయి పోతాయి. ఒక్కోసారి ఇంకా మిగులుతాయి. అంతా డబ్బు లాగే! డబ్బుని బట్టి పుట్టుకొచ్చిన ఊహలే ఇవి. ★

**302.** **సుందర, సర్గ 22, శ్లోకాలు 10, 11, 12:** "రావణునిచే బెదిరించబడు సీతను జూసి దేవ గంధర్వ కన్యలు దుఃఖించిరి. కొందరు స్త్రీలు పెదవుల సన్నల చేతను, కొందరు ముఖముల చేతను, కన్నుల చేతను, సీతను సమాధానపరిచిరి. ఇట్లు వారిచే సమాధాన పరచబడిన సీత, తన పాతివ్రత్య బలముచే గర్వించినదై యుండెను."

దేవ గంధర్వ కన్యలు ఆకాశంలో ఉన్నారని అర్థమా? – రావణుని భార్యల్లోనే దేవ, గంధర్వ జాతుల స్త్రీలు ఉన్నారనీ, ఆ స్త్రీలు, సీతని చాటు మాటు సంజ్ఞలతో ఓదార్చారనీ అనుకోవాలి. ★

బోధ చేసే వారెవరూ లేనే లేరా? నీ వంటి దుర్మార్గుడికి ఆపదలు సంభవిస్తే అందరూ సంతోషిస్తారు. నీ పాపానికి నిన్ను యముడైనా విడిచి పెడతాడేమో గానీ, రాముడు మాత్రం విడిచిపెట్టడు. నా భర్త పరాక్రమం ముందు, నీ సైన్యమంతా, గరుడ పక్షిని చూసిన సర్పాల లాగు చెల్లాచెదురై పోతారు. నువ్వు ఎన్ని యుద్ధాలైనా చేయవచ్చును. నిన్ను శత్రువు లెవరూ జయించలేక పోవచ్చును. నా భర్త చేతిలో మాత్రం యూప స్తంభానికి కట్టిన యజ్ఞ పశువుకి లాగు నీకు చావు తప్పదు. పిడుగుపాటుకి కూలి పోయే మహా వృక్షంలాగు రామ బాణంతో నువ్వు కూలిపోతావు. నా భర్త, నీ లంకనంతా పీనుగుల మయం చేస్తాడు. నీ రాజ్యం, శ్మశానాల పొగతో, గద్దల గుంపులతో, నిండిపోతుంది. నీ సర్వనాశ నానికే నీకీ బుద్ధి పుట్టింది."

సీత మాటలు వినోదంగా వింటోన్న రావణుడికి, క్రమంగా వినోదం తగ్గి, తోక తొక్కిన తాచుకి లాగ కోపం పొంగింది. "మూర్ఖురాలా! సత్యాసత్యాలు విస్మరించి, జ్ఞాన హీనురాలివై రాముడి అల్పత్వం గ్రహించలేక, భర్త జపం చేస్తున్నావు. అంతటి పరా క్రమవంతుడై కూడా, నీ భర్త నిన్నింత కాలం రక్షించలేక పోయాడెందు చేత?" అని హుంకరించాడు.

"అది నీ భాగ్యం! నీ కింకా మూడలేదు. నీ పాపం పండలేదు. ఆ రోజు ఇంకా తోసుకు రాలేదు."

"నీచురాలా! నీ పరుషోక్తులకే నిన్ను ఖండించాలి. రాముడి పేరు ఎత్తినందుకే నిన్ను దండించాలి. నా వంటి రాజాధిరాజు నిన్ను యాచించడమా? పురుషుడు స్త్రీ పట్ల ఎంత ప్రీతి చూపితే అంత తిరస్కారం పొందుతాడు. నీ మీద నా కోరికే నా కోపాన్ని చంపుతోంది. నీకు ఇంకా రెండు మాసాలు గడువు ఇస్తాను. అప్పుడైనా నువ్వు నా శయ్య మీదకు చేరవలసిన దానివే" అని మళ్ళీ మీసాలు తిప్పాడు రావణ మహారాజు.

సీత పట్టుదల రావణ పత్నులకు విస్మయం కలిగిస్తోంది. వారిలో అనేక మంది, ప్రారంభంలో రావణుడికి వ్యతిరేకత చూపిన వారే. కానీ, తొందరలోనే అతనికి లోబడి అతన్నే భర్తగా అంగీకరించక తప్పలేదు. కానీ ... ఈ సీత...![303]

"ఒసే ధాన్యమాలినీ! ... మహారాజు సీతని ఇంత ప్రాధేయపడతాడెందుకే? ... మన విషయంలో ఇలా ప్రవర్తించాడా?"

"మనం, ఇంత ప్రాధేయ పడకుండానే భయపడి లొంగిపోయాం కదా అక్కా? సీత మనలాగా లొంగడం లేదు కదా?"

"అయితే మాత్రం? మహారాజుకి ఇంత శాంతం వచ్చిందా?"

"అదే నాకూ ఆశ్చర్యంగా ఉంది ... ఇష్టపడని స్త్రీని బలాత్కరించడం జయం కాదని ... మనసు మార్చుకుని ఇలా బతిమిలాడుతున్నాడా? ఏమైనా ... సీత కన్నీరు కార్చడం మనకు క్షేమం కాదు. మహారాజు నిర్దయగా ఉన్నాడు."

దాసీలు కూడా సీత పట్ల భక్తి చూపుతున్నారు. మహారాజు పర స్త్రీలను బంధించడం వారికి కొత్త కాక పోయినా, సీత దుఃఖం చూసి మాత్రం వారు చాలా దయతో ప్రవర్తిస్తున్నారు.

మహా రాజు సీత చుట్టూ వున్న దాసీల మీద గర్జిస్తున్నాడు – "ఇంతకాలం మీరేమీ ప్రయత్నించినట్టు లేదే!"

"చిత్తం! మా ప్రయత్నాలు మేము చేస్తూనే ఉన్నాము

---

**303.** రావణుడు రక రకాల జాతుల స్త్రీలను ఎత్తుకొచ్చాడనే సంగతి, ఉత్తర కాండలో, 24వ సర్గలో తెలుస్తుంది.

ఉత్తర కాండకు గట్టుపల్లి శేషాచార్యులు గారి అనువాదం లేదు. ఈ భాగాలు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి అనువాదంలోవి. రావణుడు దేవతల్ని జయించి లంకకు పోతూ, స్త్రీలను ఏ విధంగా తీసుకు పోయాడో, చూడండి – "దురాత్ముడైన రావణుడు ఇంటికి వెళుతూ దారిలో దేవ కన్యకలనూ, రాజ కన్యకలనూ, ముని కన్యకలనూ, దానవ కన్యకలనూ, మానవ కన్యకలనూ, అనేక మందిని పట్టుకుని విమానంలో ఎక్కించుకున్నాడు. అందగత్తె కనబడితే చాలు. అది కన్యక అయినా, వివాహిత అయినా సరే, దాని బంధువులను చంపి, దాన్ని విమానంలో ఎక్కించుకుంటూ వచ్చాడు.

వారిలో ఒకతె – "నేను లేకపోతే నా పసివాడేమయి పోతాడో" అని ఏడ్చింది.

"నా కోసం నా తల్లిదండ్రులు ఎంతగా ఏడుస్తున్నారో!"

"నాకు నా భర్తే దైవం కదా? ఇక నాకేమి గతి?"

"పూర్వ జన్మలో నేనేమి పాపం చేసుకున్నానో?"

"ఛీ! మనుష్య లోకంలో ధర్మాత్ముడైన వాడే లేడు."

ఈ రకంగా అందరూ తల్లులనూ, తండ్రులనూ, భర్తలనూ, బిడ్డలనూ తలుచుకుంటూ ఏడ్చారు.

రావణుడి భార్యలంతా, రావణుణ్ణి ఇష్టపడి వచ్చిన వారేనని కవిగారు అన్నారు గతంలో. కానీ అది అబద్ధమని ఇక్కడ తెలుతోంది. ఈ స్త్రీలు, ఇష్టపడి వచ్చిన వాళ్ళు కారు. ★

ప్రభూ!"

"మళ్ళీ మళ్ళీ ప్రయత్నించండి! ఈమె నాకు స్వాధీనురాలయ్యేటట్టు చెయ్యండి. మీరు కోరిన బహు మతులిస్తాను."

ధాన్యమాలిని చిరునవ్వుతో రావణుడి హస్తం పట్టుకుంది. "శాంతించు మహా రాజా! ఈ మూర్ఖురాలి తిరస్కారంతో మనసు కలవర బరచుకోకు. నీ వంటి పురుషుడితో సుఖా లనుభవించడానికి ఈమె పెట్టి పుట్టలేదు. నీ భోగ భాగ్యాలు అనుభవించే భాగ్యం ఈమెకు లేదు. ఈమె మన జాతి కాదు. మన కులం కాదు. 'మా వంశాచారమో' అని గోల పెడుతోంది. 'పాతివ్రత్యమో' అని ఏడుస్తోంది. పోనీ కనికరించి విడిచి పెట్టు! ఇంకా ఈమె మీద మోహం పెంచుకుని ప్రయో జనం లేదు. నిన్ను కోరని స్త్రీని ఇంతగా ప్రార్థించడం నీకు అవమానం కాదా? నీ మీద కోరిక లేని స్త్రీతో ఏమి ఆనంద పడగలవు? ... నిన్ను కోరే ప్రియురాళ్ళం మేం మందరం లేమా? నువ్వు ఏరి కోరి తెచ్చుకున్న సౌందర్య రాసు లెందరో లేరా? ... మహా రాజా! సీతని విడిచి పెట్టు. మా ప్రేమతో ఆనందించు."

"అవును ప్రభూ! ... మే మందరం నీ పాద సేవ కోసమే పుట్టిన వాళ్ళం. నీకు మే మెన్నడూ తిరస్కారం చూపలేదే!"

రావణుడి భార్య లందరూ అతని చుట్టూ జేరారు.

రావణుడు సీత వేపు ధిక్కారంగా చూస్తూ – "చూడు, ఎందరు స్త్రీలు నా ప్రేమకోసం, నా కరుణ కోసం, అర్రులు చాస్తూ వున్నారో! నీకు రెండు మాసాలు మాత్రమే గడువు ఇచ్చాను. తర్వాత నా కౌగిటిలోకి రావలసిన దానివే" అని దాసీ లందర్నీ హెచ్చరికగా చూసి అక్కడి నించి కదిలాడు.

అతని భార్యలందరూ సీతని భక్తిగా, విస్మయంగా చూస్తూ మహా రాజుని అనుసరించారు.

హనుమంతుడు చెట్టు దూకి రావణుడి మీద కల బడాలని చాలా సార్లు ఉత్సాహపడి ... రావణుడి భీక రత్వం చూసి ... అన్ని సార్లూ నీరసపడ్డాడు.

సీత, దుఃఖం ఆపుకోలేక తలదించి వల వలా ఏడవడం మొదలుపెట్టింది.

దాసీలు ఏకజటా, హరిజటా, త్రిజటా, వికటా, దుర్ముఖీ, అజుముఖీ, శూర్పణఖీ – అందరూ సీత చుట్టూ చేరారు. మహారాజు ఇవ్వబోయే బహుమానాల మీద అందరికీ ఆశగానే ఉంది.

హరిజట సీత జుట్టు నిమురుతూ – "ఎందుకమ్మా వ్యర్థంగా దుఃఖిస్తావు? పురుషుడు కోరినప్పుడు అంగీక రించడం స్త్రీకి ఎంత మర్యాద!" అంటూ బుజ్జగించింది.

"ఆ పురుషు డేమైనా సామాన్యుడా? సాక్షాత్తూ రావణ బ్రహ్మ! ఎందరు స్త్రీలు ఆయన భార్యలయ్యారో నువ్వే చూశావుగా?" అని ఏకజట అందుకుంది.

"ఆయన భార్యలందరూ ఒకరి కంటే ఒకరు భర్త దయ సంపాదించాలని తహ తహ లాడుతూ వుంటారు. అలాంటి పురుషుడు నిన్ను ప్రార్థిస్తోంటే లక్ష్య పెట్ట కుండా ఉన్నావు! ఏం తెలివి నీది!" అని ఒక దాసీ విసుక్కుబోయింది.

"మహారాజు నిన్ను బలాత్కరించలేక ఊరుకున్నా డనుకున్నావా? నీ మీద ప్రేమ కొద్దీ నిన్ను కష్టపెట్ట లేక సహనం వహిస్తున్నాడు ... మా మహా రాజు ఇంత దీనంగా ఒక స్త్రీని ప్రార్థించడం మే మెన్నడూ చూడలేదు. ఆయన స్థితి చూస్తే మా మనసులు ద్రవిస్తున్నాయి" అని నిట్టూర్చింది ఒక దాసీ.

సీత రోషంగా తల ఎత్తి వారి మొహాలు చూస్తూ "నే నెవరిననుకుంటున్నారు? దశరథ మహారాజు కోడలిని! శ్రీరామచంద్రుడి భార్యని! రఘువంశస్థురాలిని గురించి అనరాని మాట లంటున్నారు మీరు" అని కళ్ళెర్ర జేసింది.

"రఘు వంశం, రఘు వంశం అంటావు. పులస్త్య బ్రహ్మ వంశం కన్నా గొప్పదా, నీ భర్త రఘువంశం? ఆరుగురు ప్రజాపతుల్లో నాలుగవ వాడు పులస్త్యుడు. ఆయన మనుమడే రావణుడు. ఈ లంక, పూర్వం రావణుడి తల్లి వేపు పూర్వీలదైతే, దాన్ని శతృవులు ఆక్ర మించేశారు. రావణుడు పుట్టి పెరిగిం తర్వాత, లంకలో శతృవుల్ని వెళ్ళగొట్టి, లంకని స్వాధీనం చేసుకుని కీర్తి పొందాడు. అటువంటి మహావీరుడు నీకు పనికి రాకుండా పోయాడా!" అని బుగ్గలు నొక్కుకుంది ఏకజట.[304]

---

**304.** **ఉత్తర కాండలో మొదటి నించీ 15 సర్గల వరకూ:** రాక్షసుల పుట్టు పూర్వోత్తరాల్లో రావణుడికి సంబంధించిన విషయాల సారాంశం ఇది. సుమాలి ఒక రాక్షసుడు. అతడు తన అన్నదమ్ములతో కలిసి లంకని నిర్మించుకొని, కొంత కాలం ఉన్నాడు. తర్వాత, శతృవులు, (అంటే రాక్షసులు కాని జాతి వారు), లంకని స్వాధీనం చేసుకున్నారు. రాక్షసులంతా తమ దేశం విడిచిపోయి అక్కడక్కడా తలలు దాచుకుంటూ ఉన్నారు.

విశ్రవసు (విప్రవసు) – రాక్షసుడు కాడు. అతని భార్య దేవవర్ణిని. కొడుకు కుబేరుడు. రాక్షసులు లంకని వదిలేసిం తర్వాత, విశ్రవసు తన కొడుకుని (కుబేరుణ్ణి) లంకలో ఉంచాడు. అంటే విశ్రవసు రాక్షసులకు శతృ పక్షంలో వాడు.

సుమాలికి కైకసి అనే కూతురు ఉంది. కైకసి, మహా వీరుడైన కుబేరుడి వంటి కొడుకుని కనాలని విశ్రవసుని పెళ్ళి చేసుకుంది. (కుబేరుణ్ణే చేసుకోవచ్చుగా? ముసలాయనైతే ముద్దుగా చూసుకుంటాడనేమో!) కైకసికి రావణుడు పుట్టాడు. ➔

"నా భర్త అంతటి వాడు, ఇంతటి వాడు అంటావు. ఎంతటి వాడయితే మాత్రం మా మహా రాజుని జయించి నిన్ను తీసుకు పోగలడా? ఇంకా ఎందుకా అడియాసలు? నీ వంటి స్త్రీకి రావణుడే భర్తగా ఉండాలి. ఏమే ప్రహసా! మన మహా రాజుకీ, సీతా దేవికీ చక్కని ఈడూ – జోడూ కాదూ?"

"అయ్యో, ఎందుకు కాదే? సీత చక్కనిదే, రావణుడూ చక్కని వాడే. ఇద్దరూ భార్యాభర్తలైతే, రతీ మన్మథులు సిగ్గుపడవలసిందే."

"ఇంత మంది స్త్రీలని చూశాంగానీ, సీత అంత సౌందర్య రాశిని ఎక్కడా చూడలేదమ్మా!"

"అందుకే కాదూ మహారాజు అంత కోరి తెచ్చుకున్నాడూ? సీత దయదల్చడం లేదు గానీ..."

"సీతా! మా మాట వినమ్మా! నువ్వు దుఃఖించడం మాకు సంతోషం కాదు సుమా! ... నువ్వు సుఖంగా నవ్వుతూ, తుళ్ళుతూ తిరుగుతోంటే నిన్ను చూసి మేమంతా సంతోష పడతాం. నువ్వు అంగీకరించాలే గానీ రావణుడు నిన్ను భోగభాగ్యాల్లో తేలుస్తాడు."

ఆ మాటలన్నీ దుర్భరంగా వున్నాయి సీతకి! వినలేక చెవులు మూసుకుంటూ "నా భర్త కోసం ఈ భోగభాగ్యాలన్నీ త్యజించి వనవాసానికి వచ్చానని మీ రెరుగుదురు" అని గంభీరంగా చూసింది.

"అసలు నీ భర్తకున్న భోగ భాగ్యాలేపాటివి నువ్వు త్యజించడానికీ? నీ సంగతులన్నీ మాకు తెలుసులే. మా దగ్గిర గొప్పలు చెప్పకు. నీ భర్త అడవులకు పోయింతర్వాత, నువ్వు అంతఃపురాల్లో ఉంటే మాత్రం నిన్నెవరు గొప్ప చేస్తారూ?"

"నీ భర్తకి చిల్లి గవ్వ ఆస్థి లేదటగా? అసలు రాజ్యాధికారమే లేదటగా? అలాంటి సంబంధం ఎలా కుదిర్చాడూ నీ తండ్రి? ఆడపిల్ల నిచ్చేటప్పుడు కొంచెం మంచి చెడ్డలు చూసుకోవద్దూ?"

సీత పౌరుషపడి – "ఈ సంబంధం నా తండ్రి కుదర్చలేదు. బ్రహ్మ కుదిర్చాడు. నా భర్త గొప్ప వీరత్వంతో ధనుస్సు పోటీలో నన్ను గెల్చుకున్నాడు" అని అతిశయంగా చూసింది.

"మరి రావణ చక్రవర్తీ వీరత్వంతోటే నిన్ను తెచ్చుకున్నాడుగా?"

"అది వీరత్వం కాదు. నీచత్వం. నా భర్తలేని సమయంలో బలాత్కారంగా తీసుకు వచ్చాడు."

"పోనీ నీ భర్తతో యుద్ధం చేసి, నిన్ను గెల్చు కుంటే అప్పుడు నీకు ఇష్టం కలుగుతుందా?"

"పతివ్రతలు ఒక్క భర్తతోటే జన్మంతా!" అని మొహం తిప్పేసింది సీత.

అందరూ నీరసపడి మొహామొహాలు చూసుకున్నారు. "లాభం లేదు..." అని కనుసైగలు చేసుకున్నారు.

"ఎవరి కర్మ కెవరి కర్తలు? ... రావణ చక్రవర్తికి భార్య అయ్యే అదృష్టం ఈమెకు లేదు. ఆ రాము డేమిటో దేవుడను కుంటోంది" అని చేతులు తిప్పింది వినత.

అజాముఖి నవ్వు మొహంతో సీతకు దగ్గరగా పోయి కూర్చుంది. – "అమ్మా! ఒక్కసారి నా వేపు చూడు. నువ్వు ఇంతకాలం నీ భర్త వస్తాడనీ, తీసుకు పోతాడనీ, ఎదురు చూశావు. ఉత్తమ స్త్రీలు చేసే పని చేశావు. ఇంకా ఎంత కాలం వైరాగ్యం అనుభవిస్తూ జీవితం నాశనం చేసుకుంటావు? నీ సుగుణాలు చూస్తూ ఉన్న వాళ్ళం కాబట్టి, నీ క్షేమం కోసమే ఇంతగా చెపుతున్నాం. నువ్వు నీ భర్త ఆధీనంలో ఉన్నంత కాలం మీ జాతి కట్టుబాట్లు పాటించావు, బాగానే వుంది. ఇప్పుడింక పాటించవలసిన అగత్య మేమిటి? మా మహా రాజుని వివాహం చేసుకుని ఆయనకే పాతివ్రత్యం పాటించు. ఆయన ముచ్చటా తీరుతుంది, నీ ముచ్చటా తీరుతుంది. మహా రాజు నీ కోసం మండోదరిని కూడా వదిలి పెట్టేస్తాడు, సరేనా? నువ్వు అవునంటే నేనిప్పుడే మహా రాజుకి చెప్పి వస్తాను. ఆయన ఎంత సంతోషపడతాడో నువ్వెరుగవు ... సీతాదేవీ! మేమందరం నీకు పన్నీటితో స్నానాలు చేయిస్తామమ్మా. నువ్వు కోరుకున్న ఆభరణాలతో అలంకారాలు చేస్తాం. నీ సవతులందరూ నీకు ఊడిగం చేస్తారు..."

సీత విస్మయంతో రోషంగా చూసింది.

"మీ రెన్నడూ పతివ్రతల గురించి వినలేదా?"

"ఇంకా వినడం ఎందుకూ? చూస్తున్నాంగా నిన్నూ?"

"పతివ్రతలు భర్తనే సర్వస్వంగా నమ్ముకుని, భర్తతోటే స్వర్గానికి ..."

---

➔ అంటే, రావణుడూ, కుబేరుడూ అన్నదమ్ములే. తండ్రి ఒకడే. తల్లులు వేరు వేరు. రావణుడు రాక్షసుడయ్యాడు. తల్లి రాక్షస జాతి గనక. కానీ, రావణుడి వంశం తండ్రి వంశమే. కుబేరుడు, రాక్షసుడు కాలేదు. రావణుడు పెద్ద వాడయ్యాక, సుమాలి (తల్లి తండ్రి) మనవడితో "లంక మనదే. వేరే వాళ్ళు లాక్కున్నారు. నువ్వు దాన్ని ఆక్రమించు" అని చెప్పాడు. రావణుడు కుబేరుడికి కబురు పంపించాడు – "లంక, నా తల్లి వేపు పూర్వులది. నాకు వదిలేసి వెళ్ళిపో" అని. విశ్రవసు కూడా కుబేరుడితో, "రావణుడు మూర్ఖుడు. బలవంతుడు. లంకని వదిలెయ్యి" అని చెప్పాడు. కుబేరుడు లంకని వదిలేసి వెళ్ళిపోయాడు. అప్పటినించీ లంక మళ్ళీ రాక్షసులకు నివాసం అయింది. (నివాస స్థలాల కోసం పోట్లాటలు ఇవన్నీ.)

రావణుడు సీతని ఎత్తుకుపోయే నాటికి రావణుడి కొడుకులు కూడా వివాహాలైన వారే. ★

"ఆ స్వర్గ సుఖాలన్నీ మా మహారాజు ఇక్కడే చూపిస్తాడుగా? ... స్వర్గంలో తాగే అమృతాలూ ... స్వర్గంలో తిరిగే ఉద్యాన వనాలూ... ఇక్కడే వున్నాయి."

"ఇది స్వర్గం కాదు. మహా నరకం నాకు."

"ఎంత చెప్పినా నీ పట్టుదలే నీది. చెప్పేది చెవిన బెట్టవు. సిరీ సంపదా లేని వాడు నీ భర్త. ఏం బాము కుంటావు అతడితో?"

"సిరి సంపదలు కోరను. నా భర్త పాద సేవే నాకు మహా భాగ్యం!"

"అరణ్యాల్లో పడి తిరుగుతాడు. ఏం సుఖపడతావు?"

"నా భర్త తిరిగే అరణ్యాలే నాకు నందన వనాలు."

"ఏం ఆడదమ్మా ఇది! ఆ దేశంలో ఇలాంటి కొయ్య రకం ఆడవాళ్ళుంటారో యేమో!..."

పరిచారికులందరూ బుగ్గలు నొక్కుకున్నారు.

"నీ భర్త ఎప్పుడొస్తాడమ్మా నీ కోసం?"

"పాపం భార్య జాడలు తెలీక రాలేకపోయాడు లేవే. ఆకాశ వాణి, జాడలు చెప్పగానే తప్పకుండా వస్తాడు."

"ఇంత కాలం ఎందుకు చెప్ప లేదో ఆ జాడలు ఆకాశ వాణి?"

"ఆకాశ వాణికి మాత్రం తెలియ వద్దా?"

ఆ వెటకారాలు భరించలేక సీత కళ్ళ నీళ్ళు పెట్టుకుంది – "మూర్ఖులైన మీరు నన్ను పరిహాసాలు చేస్తున్నారు. నా భర్త నన్ను రక్షించడానికి తప్పకుండా వస్తాడు, నా మరిదితో కలిసి. ఆ అన్నదమ్ములు ఎన్నటికీ ఈ పరాభవం సహించరు. నన్ను దుఃఖ పెడుతున్న మీ రందరూ ఎంతో కాలం సుఖంగా ఉండరు. మీ లంక సర్వనాశనం అయ్యే ఘడియలింకా తోసుకు రాలేదు. మీ రందరూ భర్తలు పోయి, విధవలై దుఃఖిస్తూ వుంటే, నేను చూడక పోను."

"ఒక వేళ నీ భర్తే మరణిస్తేనో?"

"హరి హరీ!" అని చెవులు మూసుకుంది సీత. "ఎందుకమ్మా అటువంటి పాపపు మాటలు ఉచ్చరిస్తారూ? మీ రందరూ నన్ను చంపెయ్యండి. నేను మాత్రం మీరు చెప్పినట్టు చెయ్యను. బ్రాహ్మణుడు శూద్రుడి కెలా మంత్రం ఉపదేశించడో, అలాగే నా శరీరం రావణుడి కివ్వను" అని తల వొంచుకుంది.

"సీతా! కన్నీళ్ళు కార్చకమ్మా! మా మహా రాజు పరితపిస్తాడు. తెలివిగా ఆలోచించు. రావణుడి మీద ప్రీతి కలిగించుకో. తర్వాత ఎంత ఆనందంగా జీవించగలవో చూడు. స్త్రీల యౌవ్వనం అస్థిరం అని ఎరగవా? ... అంత మహా రాజుని నిర్దయగా ఎంతెంత మాటలన్నావు! ... ఆయన నీ మీద దయ చేతా ప్రేమ చేతా సహించాడు గానీ, ఇంకో స్త్రీకైతే మరణ దండన విధించక పోయాడా?"

"ఒసే చండోదరీ! రాజు మరణ దండన విధించే దాకా ఎందుకే? మనమే సీతని చంపేద్దాం. రాజు మనల్ని ఏమీ అనడు. మంచి పని చేశారని మెచ్చుకుంటాడు. అంతేగానీ, ఇంత నెమ్మదిగా బతిమాలతారేం? మహారాజు పిచ్చిగానీ, ఈవిడ కన్నా అందగత్తెలు లేకపోయారా? కాముకుడి కళ్ళకు కోతి కూడా రంభ లాగే కనిపిస్తుంది. లేకపోతే భార్యలందర్నీ వొదిలి ఈవిణ్ణి అందలం ఎక్కిస్తానంటాడా?"

"ముద్దుగా చెపితే వినకుండా ఉన్నావు సీతా! చివరికి నీకు మరణ దండనే రాసి పెట్టి వుంది."

సీత శరీరం జలదరించింది. 'మరణ దండన' అనే మాట సీతకు అర్థంకాని జుగుప్స కలిగిస్తుంది. మహా పతివ్రతకు మరణ దండనా? ... ఎన్నడూ ఏ కథలోనూ వినలేదే, అన్ని కథలలోనూ చివరికి పతివ్రతలే జయించారు గానీ!

సీత ఆవేశం కొద్దీ – 'నన్ను చంపండి ... నరకండి' అంటుందేగానీ ... నిజంగా చంపుతారనే ఊహ వచ్చినప్పుడు ఆమెకు కూడా పతివ్రతల ఆవేశం సన్నగిల్లి, క్షుద్ర స్త్రీలకు కలిగే భయమే కలుగుతుంది.

సీత తల తిప్పి ఇటూ అటూ దిక్కులు చూసింది. హఠాత్తుగా ఏదైనా అద్భుతం జరుగుతుందేమో, ఎవరైనా, ఎలాగైనా వచ్చి తనను రక్షిస్తారేమో అని ఆశ పడింది. నిట్టూర్చింది. 'ఏ జన్మలో ఏం మహా పాపం చేశానో! ఏ పూజలో ఏం లోపం చేశానో! ఏ వ్రతంలో ఏం దానం తక్కువ చేశానో! ... నా పుణ్యం అంతా చెల్లి పోయిందేమో! అందుకే ఈ దుర్మార్గుల చేతుల్లో పడ్డాను. ఇక ఎవరు విడిపిస్తారు నన్ను? – అని తలపోస్తూ బొట బొటా కన్నీళ్ళు కారుస్తూ ఉండిపోయింది.

అప్పుడే వచ్చిన త్రిజట సీత దగ్గిర చేరింది – "దుఃఖించకు తల్లీ! ఏం జరగాలని రాసి పెడితే అదే జరుగుతుంది. ఊరుకో. రాత్రి నాకొక కల వొచ్చింది. అది వింటే, నువ్వు చాలా సంతోషిస్తావు" అని సీతని ఓదార్చింది.

"ఏమిటే అదీ?" అని అందరూ త్రిజట చుట్టూ చేరారు.

"దంతంతో చేసిన తెల్లటి పల్లకీని హంసలు మోస్తున్నాయి. అందులో తెల్లటి వస్త్రాలతో పూల దండలతో శ్రీరాముడూ, లక్ష్మణుడూ లంకకు వచ్చారు. సీత నవ్వు మోహంతో పల్లకీ ఎక్కి కూర్చుంది. తర్వాత మళ్ళీ రాముడు ఏనుగు మీద ఎగురుతూ కనపడ్డాడు. తర్వాత సీత కూడా ఆ ఏనుగెక్కింది. ఏనుగు ఆకాశంలోకి ఎగిరింది. సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ చేతులతో పట్టుకుంది సీత. మళ్ళీ రాముడు, లక్ష్మణుడితో ఎద్దుల బండి మీద ఇక్క

డికి వచ్చాడు. సీతని తీసుకుని పుష్పక విమానం మీద ఎగిరి వెళ్ళిపోయాడు.

మరి రావణుణ్ణి ఎలా చూశానో చెప్పనా? ... అబ్బ! తలుచుకుంటే ఎంత భయం కలుగుతోందో! నల్లటి బట్టలు, బోడి తల. గన్నేరు పూలదండలు. నూనె తాగుతున్నాడు. ఒక స్త్రీ రావణుణ్ణి విమానంలోంచి బయటికి గెంటేసింది. భూమి మీద పడి పోయాడు. మళ్ళీ ఎర్రటి బట్టలు. గాడిదల రథం మీద పోతున్నాడు. పోతూ పోతూ కిందపడి పోయాడు. కింద పడగానే దిగంబరంగా లేచాడు. నూనె పూసుకుంటున్నాడు. జుట్టు విరబోసుకున్నాడు. నవ్వుతున్నాడు. అరుస్తున్నాడు. దుర్గంధంతో నిండిన బురదలో, నరక కూపంలో మునిగిపోయాడు. మళ్ళీ రావణుణ్ణి ఒక స్త్రీ, కంఠానికి తాడు కట్టి ఈడ్చుకుంటూ తీసుకుపోయింది ... కుంభకర్ణుణ్ణి కూడా అలాగే చూశాను. రావణుడి కొడుకు లందర్నీ అలాగే చూశాను. పందుల మీదా, ఒంటెల మీదా కనపడ్డారు, వాళ్ళంతా.

విభీషణుడు మాత్రం తెల్లటి వస్త్రాలతో, పూలహారాలతో ఏనుగు ఎక్కి, మంగళ వాయిద్యాలతో ఆకాశానికి ఎగిరాడు.

లంకలో ప్రజలందరూ మద్యపానంలో మైమరిచి తైతక్క లాడుతున్నారు. లంకలో ఇళ్ళన్నీ కూలిపోయి వున్నాయి. గుర్రాలూ, ఏనుగులూ చచ్చి పడి వున్నాయి. ఒక వానరుడు వచ్చి లంకనంతా కాల్చేశాడు.

ప్రజలందరూ బూడిద పూసుకుంటున్నారు. వీరాధి వీరులందరూ పేడ గుంటల్లో పడి వున్నారు. లంక – చచ్చిన జంతువులతో, విరిగిన రథాలతో, కూలిపోయిన గృహాలతో, శిథిలమై సముద్రంలో మునిగిపోయి ఉంది!"

త్రిజట మాటలు వింటూ సీత పట్టలేని ఆనందంతో దుఃఖం మరిచిపోయింది.

పరిచారిక లందరూ చాలా భయపడి కొయ్యబారి పోయారు.

త్రిజట అందర్నీ చూసి, "సీత మహా పతివ్రత. ఆమెనేమీ బాధించవద్దు. మన తప్పుల కన్నిటికీ శరణు కోరు కోవాలి. సీతని విడిచిపెట్టి దూరంగా పోదాం. ఆమెని సుఖంగా ఉండనివ్వండి!" అని లేచింది.

అందరూ లేచారు. సీతని భక్తిగా చూస్తూ దూరంగా వెళ్ళారు.[305]

సీత చెట్ల కింద తిరుగుతూ ఆలోచనల్లో మునిగింది. – త్రిజట కల వింటున్నప్పుడు కలిగిన సంతోషం అంతా నెమ్మది నెమ్మదిగా హరించిపోయింది. ఈ పరిచారికలు తనని మభ్యపెట్టి, తన దయ సంపాదించడానికి ఎన్నో విధాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఈ రోజు ఈ కల చెప్పి, రేపు ఇంకో కల చెపుతారు.

త్రిజట తన మీద ఎంతో భక్తితో, దయతో ఉంది. అయినప్పటికీ ఈమె కూడా రావణుడి పరిచారికే. ఈ దుష్టుల మాటలూ, చేతలూ నమ్మే పని లేదు. అంతటి శుభ శకునం తనకే కనపడరాదా? ఆ స్వప్నం తనకే రాకూడదా? స్వప్నాలకు కూడా తన మీద విరోధమేనా?

ఒంటరిగా మిగిలిన సీతకు సముద్ర కెరటాల లాగ దుఃఖం పొంగింది. ఈ శత్రువుల మధ్య ఎంత కాలం జీవించినా ఏం ప్రయోజనం? శ్రీరాముడు తనని మరిచిపోయాడా? పర పురుషుడు అపహరించిన స్త్రీని తను కోరనని త్యజించాడా? ... అయోధ్యకు పోయి .., సుందరాంగనలతో సుఖంగా ఉన్నాడా? కంటి కెదురుగా వున్న నాడు మెర మెచ్చుల మాటలే గానీ, ఆపదలో చిక్కుకున్ననాడు కరుణించలేడా? అసలు శ్రీరాముడు రావణుణ్ణి ఒంటరిగా జయించ గలడా? ... అయ్యో! నా మనసు ఇంతగా శంకిస్తోందే? ఆయన ఎటువంటి దుఃఖంలో ఉన్నాడో గదా! నా వల్ల నా భర్తకు కష్టాలే గానీ సుఖం లేదు.[306] ఈ దుర్మార్గుల స్వాధీనంలో ఉండి, ఎంత కాలం పాతివ్రత్యం నిలుపుకోగలను? ఇక శ్రీరాముడు వస్తాడనే ఆశ నశిస్తోంది.

ఆత్మహత్య మహా పాపం అంటారు పెద్దలు. ప్రాణం విడిచే శక్తి అయినా లేదు ఈ శరీరానికి. మహా పతివ్రతలు, కోరినప్పుడు మరణం కూడా తెచ్చుకోలేరా? ఈ పతి భక్తీ, వ్రతాలూ పూజలూ అన్నీ వ్యర్థమేనా? ఇంత కాలం భర్తకు దూరంగా పర పురుషుడి గృహంలో ఉన్నాను. నేనూ పతివ్రతనేనా? ఛీ! ఈ దేహం ఎందుకు? .. ఉరిపోసుకోవడానికైనా మార్గం తోచదే! ... అయ్యో! ఇంత దుఃఖంలో కూడా నా హృదయం బద్దలు కాకుండా ఉందే! నా జన్మ ఎందుకు?

---

**305.** **సుందర, సర్గ 27 అంతా:** త్రిజట రావణుడికి దాసీగా ఉన్నప్పటికీ, ఆమె విభీషణుడి పక్షాన వున్న వ్యక్తి అనుకోవచ్చు. ★

**306.** **సుందర, సర్గ 36, శ్లోకం 20: + సర్గ 26, శ్లోకం: 18 సీత ఆలోచనలు:** "నేను దేశాంతరములో నుండుటవల్ల శ్రీరాముడు నా మీద ప్రీతిని విడిచియున్నాడా?" – "దృఢమైన పరాక్రమముగల శ్రీరాముడు భార్యని రక్షించలేదు. దీని కేమి కారణమో! రామునకు నే నిచట నుండుట తెలియదని శంకించు చున్నాను. తెలిసి యుండినచో తేజస్సు గల రాముడు ఊరకుండునా? కుపితుడై బాణములచే నీ లోకమునందు రాక్షస పురుగు లేకపోవునట్లు చేయును. లంకా నగరమును ధ్వంసము చేయును. సముద్రము నింకి పోవునట్లు చేయును." ★

"అమ్మా! ... సీతాదేవీ! ... దుఖించకు తల్లీ!" – మెత్తని పురుష కంఠస్వరం భక్తిగా, దయగా, ఎటునించో!

సీత ఆశ్చర్యపడుతూ చుట్టూ చూసింది.

"భయం లేదు తల్లీ! నేను శతృవుని కాను. నీ పెనిమిటి నన్ను పంపించాడు. రాత్రి నించీ ఈ చెట్టు మీద దాక్కుని వున్నాను."[307]

సీత విస్తుపోతూ తల ఎత్తి పైకి చూసింది. భయంతో తొట్రుపడింది. దూరంగా పోబోయింది.

"నన్ను నమ్ము తల్లీ! నీ భర్తే నన్ను పంపించాడు. నీ సంగతులన్నీ నాకు తెలుసు. జనక మహారాజు నీ తండ్రి. దశరథ మహారాజు నీ మామ. కౌసల్య నీ అత్త. శ్రీరామ చంద్రుడు నీ భర్త. నీ భర్త, తండ్రి మాట కాదనలేక అడవుల్లో కొచ్చాడు. మీరు దండ కారణ్యంలో ఉన్నప్పుడు ఈ దుర్మార్గుడు నిన్ను ఒంటరిగా ఉండటం చూసి, ఎత్తుకొచ్చాడు. నాకంతా తెలుసమ్మా! అందుకే నీ కోసం వెతుక్కుంటూ వెతుక్కుంటూ వచ్చాను."

సీత విస్మయంతో మునిగిపోయింది, ఏం చూస్తున్నాను? ... ఏం వింటున్నాను? .., కలగంటున్నానా? ... భ్రమ పడుతున్నానా? ... ఉన్మాదినయ్యానా? నిత్యమూ అదే ధ్యాసతో తపిస్తూ ... అదే ఆలోచిస్తూ ... అదే చూస్తున్నానా? ... ఉపవాసాలతో ... నిస్సత్తువతో ... పైత్య రోగంతో ... ఈ మాటలు నాకై నేను కల్పించుకుంటున్నానా? ... కానీ భ్రమకు రూపం ఉండదే! ఊహలు రూపు దాల్చలేవే! ... ఇంత స్పష్టంగా మనిషిని చూస్తున్నాను. ఇంత స్పష్టంగా మాటలు వింటున్నాను. నా జ్ఞానేంద్రియాలతో వాస్తవంగా అనుభవిస్తున్నాను. ఆశ్చర్యంగా ఉందే!..[308]

ఆశ్చర్యం మాత్రం ఏముంది? ఇక్కడ కాపలా స్త్రీలూ, పురుషులూ నన్ను ఏదో రకంగా మాయ పుచ్చాలని ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. నెమ్మదిగా శ్రీరాముడి సంగతులు ప్రారంభించి, తర్వాత రావణుడి గురించే హిత బోధలలోకి దించుతారు. నమ్మరాదు.

హనుమంతుడు అప్పటికే చెట్టు దిగి సీత ముందు వినయంగా నించున్నాడు. "అమ్మా! నీ భర్త నీ కోసం పరితపిస్తున్నాడు."

సీత తన చెవుల్ని తను నమ్మలేక పోయింది. "నా భర్త .. నా కోసం ... పరితపిస్తున్నాడా!" అని సంభ్రమంతో చూసింది. "ఎవరు నువ్వు? ... నా భర్త గురించి మాట్లాడుతున్నావు! ఎక్కడున్నాడు నా భర్త?" అని ఆతృతగా దిక్కులు చూసింది.

---

**307.** **సుందర, సర్గ 30, శ్లోకం 12: + సర్గ 33, శ్లోకం 2:** హనుమంతుడు రాత్రి వచ్చి చెట్లెక్కి కూర్చున్నాడు గదా? తెల్లవారిం తర్వాత రావణుడు వచ్చాడు. కానీ, ఇంకా గత రాత్రే గడుస్తూ ఉన్నట్టు "సూర్యోదయమునకు ముందే సీతతో సంభాషించి, సమాధానము సేయకపోయినటులయితే, ఆమె ప్రాణ త్యాగము సేయును" అనుకుంటున్నాడు హనుమంతుడు. అంతే కాదు, "రాక్షస స్త్రీలు నిద్రించునప్పుడు సీతతో మాటలాడుటకు సమయము గలిగిన వాడాయెను." రెండో రాత్రి వరకూ వుండి అప్పుడే సీతతో మాట్లాడాడేమో అనుకోవచ్చు. కానీ మత గ్రంధాల సాహిత్యంలో ఇలాంటి తర్కాలవీ ఉండవు. కథకోసం ఎక్కడ ఎలా కావాలంటే, తర్కం అలా మారిపోతూ వుంటుంది. హనుమంతుడు అశోక వనం వెతకాలి కాబట్టి – అది రాత్రి. రావణుడు సీత దగ్గిరికి రావాలి కాబట్టి – అది పగలు. హనుమంతుడు సీతతో మాట్లాడాలంటే దాసీలంతా నిద్రపోవాలి కాబట్టి, మళ్ళీ వెంటనే అది రాత్రి. అవసరం అయితే అదే మిట్ట మధ్యాహ్నం! ★

**308.** **సుందర, సర్గ 32, శ్లోకం 11:** సీత హనుమంతుణ్ణి చూసి నమ్మలేక, ఎంతో తార్కికంగా ఆలోచిస్తోంది. 'ఎప్పుడూ రామ రామ అని తలుస్తూ ఉంటాను గదా? అందుచేత అతన్ని గురించి వింటున్నట్టు వూహిస్తున్నానేమో!' అనుకుంటోంది. "రామ రామ యని సర్వకాల సర్వావస్థలలోనూ ధ్యానించుచూ, రామ నామము జపించుచున్నాను. ఈ రామ సంకీర్తనమున కనురూపముగ నుండు కథను వినుచున్నాను. దానినే చూడగలను. నేను ఇప్పుడు నా సర్వ భావములనూ రాముని యందు నిలిపి, అతనినే ఎల్లప్పుడునూ ధ్యానించుచు, అతనిని చూచుచున్నాను" అనుకుంటోంది. కానీ, చూసేది రాముణ్ణి కాదు, హనుమంతుణ్ణి. అదే ధ్యాసలో ఉండడం వల్ల ఆ రూపాన్నే చూడవచ్చును – అనే అభిప్రాయం ఇది. భక్తులందరూ ఇలాంటి వారేనేమో కదా? దేవుడి ధ్యాసలో ఉంటారు కాబట్టి, ఆ విగ్రహాల రూపాన్ని చూస్తున్నట్టు భ్రమ పడతారేమో కదా? కలల్లోగానీ, ఇంకో రకంగా గానీ కనపడ్డ వాటిని చూసి దేవుడే కనపడ్డాడని అనుకోవచ్చునా?

మళ్ళీ సీత సందేహం – "మనో రథమునకు రూపము లేదు గదా?" – ఇది ఎంత శాస్త్రీయమైన విషయం! హేతువాదానికి సంబంధించిన విషయం! కవి, ఇంత హేతువాదానికి ఎందుకు దిగుతున్నాడు? ఇక్కడ అవసరం గనక. సీత హనుమంతుణ్ణి నిజమైన వ్యక్తిగానే నమ్మాలి గనక. "హనుమంతుడి రూపం నాకు కనపడడం నా భ్రమే" అని ఊరుకుంటే, పని జరగదు. అందుచేత సీత "నా భ్రమని నే నెలా చూడగలను? ... నేను చూస్తున్నది భ్రమ కాదు. వాస్తవమే" అనుకోవాలి. ఇంకో విషయం చూడండి – "నా కిది ఉప వాసములచే కలిగిన వాత రోగ సంబంధమైన భ్రమయా?" అనుకుంటోంది. ఉపవాసాల వల్ల వాతరోగం వస్తుందని కవిగారు ఒప్పుకుంటున్నారు. ఈ మాటే ఇంకెప్పుడైనా అయితే ఒప్పుకుంటారా? ... ఏ రుషి గురించి అయినా చెప్పినప్పుడు – "ఈయన పది సంవత్సరాలు నిద్రాహారాలు విసర్జించాడు. గొప్ప మహిమ వచ్చింది" అంటాడు. అప్పుడు వాత రోగం తెల్లమొహం వేస్తుంది – రుషిగార్ని పట్టుకోలేనందుకు. ఎక్కడ ఏది అవసరమో అది! ★

"నా పేరు హనుమంతుడు తల్లీ! ... మేము వానరులం. మాది కిష్కంధ దేశం. నేను సుగ్రీవ మహా రాజు దగ్గిర మంత్రి పని చేస్తున్నాను. మా మహా రాజు నీ భర్తకు మంచి స్నేహితుడు. నా మాటలు పూర్తిగా విను తల్లీ! దుఃఖపడకు! ఈ దుర్మార్గులకు తగిన శాస్తి జరుగుతుంది. నీ భర్త ఇంకా ఇక్కడికి రాలేదు. మా రాజ్యంలో ఉన్నాడు. నేను తిరిగిపోయి నీ కబురు చెప్పగానే గొప్ప సైన్యంతో వచ్చి ఈ దుర్మార్గుల మీద యుద్ధం చేస్తాడు."

"సైన్యంతోనా?... సైన్యం ఎక్కడిదీ? నమ్మ వచ్చునా నీ మాటలు?"

"అయ్యో, నన్ను నమ్ము తల్లీ! ... నీ భర్త కిష్కంధ సమీపానికొచ్చి మా రాజుతో సఖ్యం చేసుకున్నాడు. మా రాజు చాలా ఉత్తముడు. నీ భర్తకు సైన్యం ఇచ్చి సహాయం చేస్తానన్నాడు. శ్రీరాముడు తప్పకుండా ఇక్కడికి వచ్చి యుద్ధం చేసి, ఈ దుర్మార్గులందర్నీ చంపి, నిన్ను తీసుకు పోతాడు."

"నీ మాటలు వింటోంటే నా ప్రాణాలు లేచి వస్తున్నాయి నాయనా! ... కానీ ..."[309]

"సందేహించకు తల్లీ! ... నేను నీ కోసమే వెతుక్కుంటూ వస్తున్నాను. నీ భర్త, నీ ఆనవాళ్ళన్నీ చెప్పాడు. నిన్ను చూడగానే శ్రీరాముడి భార్యవని పోల్చుకున్నాను."

"నువ్వు చూస్తే ఆటవికుడివి. నా భర్తకూ, మీ రాజుకూ సఖ్యం కలిసిందన్నావు. నా భర్త మీ రాజ్యంలో ఉన్నాడంటున్నావు."

"చెపుతాను తల్లీ! అంతా చెపుతాను. నీ భర్తా, నీ మరిదీ నీ కోసం వెతుకుతూ, వెతుకుతూ చెట్లూ పుట్టలూ పట్టుకు తిరిగి తిరిగి మా దేశం దగ్గిరే రుష్య మూక పర్వతం వేపు వచ్చారు. అప్పుడు మా రాజు, అన్నగారితో తగువు పడి ఆ పర్వతం మీద ఉంటున్నాడు. మా రాజు అన్న పేరు 'వాలి' తల్లీ! పరమ దుర్మార్గుడు. తోడబుట్టిన వాణ్ణి నానా బాధలూ పెట్టాడు."

"సరే! అప్పుడేం జరిగింది? తొందరగా చెప్పు నాయనా!"

"నీ భర్తని చూసి మా మహారాజు మొదట కొంచెం జంకాడు. నన్ను పిల్చి ఎవరో ఏంటో కనుక్కు రమ్మన్నాడు. నేను నీ భర్త దగ్గిరికి వెళ్ళి సంగతంతా తెలుసుకుని వాళ్ళిద్దర్నీ వెంట బెట్టుకుని మా రాజు దగ్గిరికి తీసుకొచ్చాను. మా రాజూ, నీ భర్తా మంచీ చెడ్డా మాట్లాడుకున్నారు. సరే అంటే సరే అనుకున్నారు. ఒకరికొకరు సహాయం చేసుకోవాలని అగ్నిసాక్షిగా ఒప్పందం చేసుకున్నారు. నువ్వు దారిలో పారేసిన నగల మూట అప్పుడేనమ్మా నీ భర్తకు చూపించాం. నీ నగలన్నీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. మన సొమ్మయితే మనకే దక్కుతుంది తల్లీ!"

"తొందరగా చెప్పు నాయనా! ... నా భర్త మీ రాజుతో ఒప్పందం చేసుకున్న తర్వాత ఏం జరిగింది?"

"నీ భర్త ధర్మమా అని మా రాజుకి మళ్ళీ రాజ్యం దక్కింది ... మా రాజు అన్న పరమ దుర్మార్గుడని చెప్తిని గదా? తమ్ముడి భార్యతో కులుకుతూ, తమ్ముణ్ణి దేశం లోంచి వెళ్ళగొట్టాడు. ఆ కబురు విని నీ భర్త ఎక్కడా అన్యాయం జరగనివ్వనని, వాలిని బాణంతో కొట్టి చంపేసి మా రాజుకి మళ్ళీ రాజ్యాన్నీ భార్యనీ అప్పగించాడు."

"ఆహా! ఎంత ధర్మాత్ముడు!" సీత మనసు ఆనందంతో నిండిపోయింది.

"నీ భర్త అంత ఉపకారం చేశాడాయె! మరి మా రాజు ఊరుకుంటాడా? ఈ దుర్మార్గుడితో యుద్ధానికి ఏర్పాట్లన్నీ మా రాజే చేస్తున్నాడు ... అసలు నువ్వెక్కడున్నావో ఏంటో చూసి రమ్మని ... చాలా మంది సైనికుల్ని అన్ని దిక్కులకూ పంపించాడు ... నీ జాడ మాకు ఎంతకీ అంతు చిక్కనే లేదు. చివరికి సంపాతి అనే ఆయన ... నీ గురించి ఎలా విన్నాడో యేమోగానీ, నువ్వు లంకలో ఉన్నావని చెప్పాడు. ఒక రాజు పర స్త్రీని ఎత్తుకొచ్చిన తర్వాత, ఆ సంగతి ఆ నోటా ఆ నోటా పది మందికీ తెలియకుండా వుండి పోతుందామ్మా? నువ్వు నా కళ్ళ పడటం నా అదృష్టం తల్లీ! నేను వెళ్ళి ఈ కబురు చెప్పానంటే నీ భర్త రెక్కలు కట్టుకు వచ్చి వాల్తాడు."

హనుమంతుడి మాటలన్నీ నమ్మ దగ్గవిగానే తోచాయి సీతకి. అయినా సందేహం వదల లేదు – "హనుమంతుడా! నా భర్తని చూశానంటున్నావు. ఆయన రూపురేఖ లెలా ఉంటాయో చెప్పు. ఆయన నలుపో, తెలుపో చెప్పు. గుణగణా లేమిటో చెప్పు. విని సంతోషిస్తాను" అంది ఆతృతగా.

"అయ్యో, నీ భర్త కేం తల్లీ? .... ముక్కూ మొహం చూసిన కొద్దీ చూడబుద్ధేస్తాయి. మీ అత్త గారు చాలా అందమైందనుకుంటాను ...." అంటూ హనుమంతుడు, చోటు సరిగ్గా చూసుకుని చతికిలబడి కూర్చున్నాడు.

సీతకి దాసీల సంగతి గుర్తు వొచ్చి భయంగా చుట్టూ చూసింది. "నిన్నెవరన్నా చూస్తారేమో! ఆ పొదచాటున కూర్చుని మాట్లాడితే బాగుంటుందేమో!" అని మళ్ళీ చుట్టూ పరికించింది.

**309.** హనుమంతుడు, రాముడి ఉంగరం తెచ్చాడుగా? ఆ ఉంగరం చూపించరాదూ? అదెక్కడ పారేశాడో! రాగానే చూపించొద్దా? అబ్బా, ఏం మనిషో! రాగానే ఆ ఉంగరం ఎందుకు చూపించలేదో ఊహించండి! ★

హనుమంతుడు కదలకుండా – "చూస్తే చూడ నియ్యి తల్లీ! .... ఏం ఫరవా లేదు. ఒక్కొక్క దాన్నీ పట్టుకుని బాది వొదిలిపెడతాను. వాళ్ళ దిక్కున్నచోట చెప్పుకుంటారు. వచ్చిన పని చెడిపోతుందని తటపటాయించానుగానీ, ఇందాక నీ చుట్టూ మూగిన వాళ్ళందర్నీ చావగొడదా మనుకున్నాను ...." అని కోపంగా చుట్టూ చూసి ఇంకా సర్దుకుని కూర్చున్నాడు.

సీత ఇంకా భయపడుతూ – "నా మాట విన వోయీ! .... ఎందుకైనా మంచిది. నిన్ను వాళ్ళు కని పెడితే చాలా ప్రమాదం. ఆ గురువింద పొదచాటున కూర్చో. నేనిక్కడే తిరుగుతూ నీతో మాట్లాడుతాను" అని ప్రాధేయ పడింది.

హనుమంతుడికి లేవక తప్పలేదు.

"నా గురించేం భయపడకు తల్లీ! .... ఈ కొండలూ కోనలూ మాకు కొట్టిన పిండి. ఎవరైనా చూస్తే .... కను రెప్పపాటులో తప్పుకుపోతాను" అంటూ లేచి, ఒక గంతేసి పొదల మధ్య జొరబడి కూర్చున్నాడు.

సీత అక్కడే మోదుగు చెట్టు కింద కొమ్మ పట్టుకుని నిలబడింది. "హనుమంతుడా! నీ మాటలు వినాలని నా మనసెంతో తొందరపడుతోంది. అన్ని సంగతులూ ఒక్కసారే చెప్పెయ్యి. నా భర్త ఏం చేస్తున్నాడు? నా మరిది ఏం చేస్తున్నాడు? ఎక్కడుంటున్నారు? ఎలా జీవిస్తు న్నారు? వారిని నిజంగా నువ్వు చూసే వచ్చావు కదూ?"

"నీ భర్త కూడా ఇలాగే తల్లడిల్లు తున్నాడమ్మా! 'సీతా, సీతా' అన్న నోటికి మూత లేదు. చెట్టంత మనిషి కంటతడి పెడుతూ ఉంటే .... ఏం చెయ్యగలం? చూసే వాళ్ళ కడుపులు తరుక్కు పోతున్నాయి. ఎలాగో నచ్చ చెపుతాం. ధైర్యం చిక్కబట్టుకుని రోజులు గడుపుకుంటు న్నాడు. అందాని కేంటీ, గుణాని కేంటీ, మా దొడ్డ మనిషి. తనని ఆశ్రయించిన వాళ్ళకోసం ఎంత సాయ మన్నా చేసి పెడతాడు. నిష్ఠా నియమం అంటే మహా పట్టుదల. గిట్టని వాళ్ళని మసి చేసే దాకా నిద్రపోడు. తాచు పాము పగే. వర్ణ సంకరం అంటే బొత్తిగా గిట్టదు. 'ఏ నాడు పెద్దలు పెట్టారో ఈ మంచి చెడ్డలన్నీ, ఇవి ఇలాగే ఉండా లం'టాడు. ఆడవాళ్ళ పిచ్చి రవ్వంతన్నా లేదు సుమా! ఎందుకొచ్చిన పాపం మాటలు .... ఏ ఆడదాన్నీ కన్నెత్తి చూడడు. సన్యాసులన్నా, బైరాగులన్నా ప్రాణం పెడతాడు. బ్రాహ్మలంటే ఎంత భక్తో, వాళ్ళ పాదాలు కళ్ళకద్దుకోకుండా ఉండలేడు గదా! అబ్బో! .... ఆయన పొట్టనిండా చదువే. ధనం బాగా సంపాదించా లంటాడు. బాగా దానం చెయ్యాలంటాడు. ఏ పూట యే పూజ చేసుకోవాలో, ఏ వేళ యే వ్రతం చేసుకోవాలో చక్కగా తెలుసు. ముప్పూటలా స్నానాలు చేస్తాడు. పూజలు చేస్తాడు. ఇక రాచ కార్యాలు మాట్లాడితేనా, అమ్మో, ఎవరన్నా నోరెత్తగలరా? .... తండ్రి మాటకి కట్టుబడి సన్యాసిలాగ ఉన్నాడు గానీ .... లోకవంతా తనొక్కడే ఏలగలడు .... విల్లు పట్టుకున్నాడంటే చూడాలి. ఆవఁడ దూరాన వున్న నల్ల పూసని కూడా సూటిగా కొట్టి, పది చెక్కలు చేస్తాడు. వేటాడటం అంటే మహా సరదా. బాణాలు కొట్టడం మొదలు పెట్టాడంటే మాత్రం మనిషి కాడు. ఆయాసం వచ్చే దాకా కాకినో, గద్దనో కొడుతూనే ఉంటాడు. అదొక్కటే కాస్త .... అయినా మీ రాజుల్లో ఉన్నదే లేమ్మా ఏట పిచ్చి!

నీ పెనిమిటికి ఒక్క దుర్వ్యసనమన్నా లేదు. చుట్టన్నా కాల్చడు. మహా బుద్ధి మంతుడు. ఎప్పుడన్నా మర్చిపోయి చుట్ట చుట్టుకుంటూ నేనెప్పుడన్నా దగ్గిర కూర్చుంటే, మొహం చిట్లించి 'దూరంగా జరగవోయీ!' అని విసుక్కుంటాడు ...."

సీత మనసు ఆనంద డోల అవుతోంది. తనను తను మరిచిపోయి చిరునవ్వుతో వింటోంది – "రూపు రేఖలు కూడా చెప్పవోయీ!" అంది.

"చెప్పానుగా అమ్మా! .... మా చక్కని రూపం. ఆయన కాయనే సాటి. నీకు నువ్వే సాటి.[310] నాకేం వర్ణించటం వచ్చునా, చచ్చునా? .... మా ఊళ్ళో పంతులయ్య అయితే ఉన్నదున్నట్టు బొమ్మ కళ్ళకట్టినట్టు .... నీ పెనివిటిని నీకు చూపించే వాడు .... చారెడేసి కళ్ళూ .... ఆ ముక్కూ .... ఆ మొహం ... ఏనాడూ కష్టం ఎరిగిన వాడు కాడమ్మా! కాళ్ళ మీదా, చేతుల మీదా ఒక్క నరం అయినా తేలి కనపడదు. ఎన్నడూ వొంటికి చెమట పట్టదు. వొళ్ళు నున్నగా నిగ నిగ లాడుతూ, ముట్టుకుంటే పాలు కారేటట్టు ఉంటుంది. ఈగ వాలితే, కాళ్ళకి పట్టు దొరక్క జఁరున జారి

---

**310.** **సుందర, సర్గ 33, శ్లోకాలు 6, 9, 11:** హనుమంతుడు సీతని సంబోధించేటప్పుడు వాడిన మాటలు: "ఓ సుందరములగు పిరుదులు కలదానా!" (వరారోహే), "ఓ చక్కని నడుము కలదానా?" (సుమధ్యమే), "నీ స్తన జఘనాదికము, సాముద్రిక లక్షణములను బట్టి ..." ఇలా సాగింది. ఇక్కడ కూడా కవి, కవిత్వంలో ప్రాసల కోసమే తంటాలు పడ్డాడు. కవిత్వంలో పదాల మధ్య శబ్ద సమన్వయం ఉండవలిసిందే. అది లేకపోతే అది కవిత్వమే అవదు. కానీ, ఆ పదాలు కూడా ఆ పాత్రలకూ, ఆ సందర్భాలకూ తగిన విధంగా వుండాలి కదా? హనుమంతుడు కూడా సీతని 'చక్కని పిరుదులు కలదానా! చక్కని స్తనములు కలదానా!' అంటే, ఇక పాత్రలకు తగ్గ చిత్రణ ఏముంది? 'సుశీలే' అనో, 'గుణవతే' అనో, అలాంటి మాటలేవో వాడవచ్చు కదా? కవి దగ్గిర బోలెడు భాష ఉండదా? కానీ, సీతని హనుమంతుడు వర్ణించినా స్తనాలే! పిరుదులే! అసలు ఆడ మనిషి అంటే, స్తనాలే, స్తనాలే, స్తనాలే. ★

పోతుంది. ఎప్పుడూ గడ్డం, మీసం ఉంచుకోడు. వొంటి మీద కూడా వెంట్రుక లుండవు. అరిచేతులు ఎర్రగా పువ్వుల్లా గుంటాయి. గోళ్ళు కూడా తెల్లగా మల్లె రేకుల్లా గుంటాయి. వెన్నుపట్టు చక్కగా, విశాలంగా బల్ల కట్టులా ఉంటుంది. భుజాల దగ్గిరేంటి, గుండెల మీదేంటి .... ఎక్కడా వొక్క ఎముక కనబడదు. పెదాలు బండగా ఉంటాయి. ముక్కు కాస్త పెద్దది. పొట్ట కొంచెం ఎత్తు ....” – హనుమంతుడు చెప్పుకుంటూ పోతున్నాడు.

సీతకు పూర్తిగా నమ్మకం కలిగింది. పట్టలేని ఆనందంతో వింటోంది. “నా మరిది గురించి చెప్పు.”

“నీ మరిది సంగతా? .... అన్న గురించి చెపితే, తమ్ముణ్ణి చెప్పక్కర్లేదు. ఒకటే ముక్కులు .... ఒకటే మొహాలు .... కాస్త చేతులు మోటు. ఎప్పుడూ చాకిరీ చేస్తాడు కదమ్మా, పొట్ట లేదు, ఇన్ని మాటలెందుగ్గానీ .... నీ పెనివిటికి నీ పెనివిటే సాటి తల్లీ![311]

సీతకి, హనుమంతుడి ధోరణి అర్థమైంది. హనుమంతుడికి తన భర్త మీద అమితమైన భక్తి ఉన్నట్టు గ్రహించింది. హనుమంతుడు తనకు చాలా ఆప్తుడని సంతోషం కలిగింది. “హనుమంతుడా! నీ మాటలు వింటూ వుంటే, ఎండి బీటలు వారిన భూమినిండా వర్షపు జల్లులు కురిసినట్టు వుందోయి! ఇంత కాలానికి ఎంత చల్లని వార్త విన్నాను! నా ప్రాణం రక్షించావు. నీ తల్లి కడుపు చల్లగా వెయ్యేళ్ళు సుఖంగా ఉండు! ... నిన్ను చూడగానే యేమో అనుకున్నాను గానీ .... నువ్వు సామాన్యుడివి కావు. గొప్ప సాహసవంతుడివి. ఈ అశోక వనంలోకి రావటం అంటే, పులి నోట్లో తల పెట్టినట్టే. నీ ధైర్య సాహసాలు నా భర్త గ్రహించబట్టే నిన్నీ కార్యానికి నియోగించాడు. .... నీ తల్లి దండ్రు లెవరో .... కుల గోత్రాలేవిటో అంతా చెప్పు నాయనా!”

సీత తనని పొగుడుతూంటే హనుమంతుడు కొంచెం సిగ్గుపడ్డాడు. తన పుట్టుపూర్వోత్తరాలన్నీ చెప్పు కొచ్చాడు. “అమ్మా! నా తండ్రి దేశాంతరం పోయి నప్పుడు వాయువనే ఆయన వల్ల నేను పుట్టానంటమ్మా!” అని[312] చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చినట్టు బొడ్లోంచి ఉంగరం తీశాడు – “అయ్యో! ఇంతసేపూ మరిచే పోయానమ్మా! ఇదుగో, .... నీ భర్త నీకు చూపించమని ఇచ్చాడు. ఇది చూస్తే నన్ను తప్పకుండా నమ్ముతా వన్నాడు. నా మతి మండా! మరిచేపోయి చచ్చాను”

---

**311.** **సుందర, సర్గ 35, శ్లోకాలు 9 .... 22:** హనుమంతుడు సీత ముందు రాముణ్ణి వర్ణించే సందర్భంలో అసాధారణమైన వర్ణనలు చేశాడు. ఈ వర్ణనలో చాలా విషయాలు కవి స్పష్టంగా తేల్చి చెప్పలేదు. “మూడు స్థిరమైనవి గలవాడూ, మూడు ఎర్రటివి గలవాడూ, మూడు పొడవైనవి గలవాడూ, పద్నాలుగు సమమైనవి గలవాడూ...” – ఇలా చెప్పాడు. మూడు ఎర్రటివి – అంటే ఏయే అవయవాలు? అరిచేతులూ, అరికాళ్ళూ, కను కొలుకులూ – అట! మూడు స్థిరమైనవి అంటే? – వక్షస్థలం, మణికట్టూ, పిడికిలీ అట! నాలుగు రకాల నడక గలవాడు – అంటే, సింహం నడక, పులి నడక, ఏనుగు నడక, ఎద్దు నడక – అట! (జంతువుల నడకలే గానీ మనుషుల నడక లేదు! మనిషికి జంతువుల నడకలే వుండాలా?) ఈ రకంగా, కవి అస్పష్టంగా చెప్పిన విషయాల్ని, విపులీకరించడంలో, అనువాదకులందరూ ఒక్క రకంగానే అభిప్రాయ పడ్డారు. సప్త రుషులు, నవ గ్రహాలు, ఏకాదశ రుద్రులు – వంటి పదాల గురించి పండితులందరికీ, ఒకే రకం అభిప్రాయాలున్నాయి కదా? అలాగే, రాముడి గురించి కూడా.

ఈ రకంగా విపులీకరించిన వర్ణనల్లో కొన్ని విషయాలు వింతగా ఉన్నాయి.

ఒక దానితో ఒకటి సమముగా నుండు వెంట్రుక కొనలూ, మోకాళ్ళూ, వృషణములూ – గలవాడు! స్వేదమూ, నరములూ లేని పాదములు గలవాడు. ఒక రోమ కూపములో, నొకే రోమము గలవాడు! తలలో మూడు సుడులు గలవాడు! నోటిలో ఒక్కొక్క పక్క నాలుగేసి కోర పళ్ళు గలవాడు! ఎనిమిది అడుగుల పొడవు గలవాడు! అతి దీర్ఘముగాని లింగమూ! – ఈ రకంగా ఉంది వర్ణన! రాముడి లింగాన్నీ, వృషణాల్నీ హనుమంతుడు ఎలా చూశాడు? అది సీతకి చెప్పడం! ★

**312.** **సుందర, సర్గ 35, శ్లోకం 89:** హనుమంతుడు వాయు దేవుడికి ఏ కారణం చేత పుట్టాడో చూడండి. “దేవర్షుల యాజ్ఞవల్ల నా తండ్రియగు కేసరి, యుద్ధంలో శంబనాదనుడను రాక్షసుని జంపి దేశాంతరమునకు పోయినప్పుడు, వాయు దేవుని ప్రసాదము వలన నేను పుట్టితిని.”

హనుమంతుడి తల్లిని పెళ్ళి చేసుకున్న భర్త – కేసరి. అతను వానరుడు. అతను, ఒక రాక్షసుణ్ణి (వేరే జాతి వాణ్ణి) చంపి, కొంత కాలం పాటు కనపడకుండా తప్పించుకోవడానికి ఎటో పోయాడు. ఆ కాలంలో, వాయువు అనే ఇంకో జాతి వాడితో హనుమంతుడి తల్లి కలిసింది. వాయువే హనుమంతుడికి అసలు తండ్రి. కానీ, ఈ సంబంధాలు రహస్యాలు కావు. కానీ, ఒక స్త్రీ, తను పెళ్ళి చేసుకున్న భర్తతోటీ, ఇతర పురుషులతోటీ కూడా సంబంధాలతో వుంటే, ఆమె కడుపున పుట్టే బిడ్డకి అసలు తండ్రి ఎవరో తెలిసే మార్గం కొన్ని సార్లు వుండదు. ఇది, జంట పెళ్ళిళ్ళ కాలంనాటి సాంప్రదాయం. (కేసరి ఎటో పోయినప్పుడు, వాయు దేవుడు ఇటు వచ్చి అతని వల్ల హనుమంతుడు పుట్టినట్టే, వాయువు ఇటు వచ్చినప్పుడు అతని భార్య దగ్గిరికి ఇంకే దేవుడు వచ్చి అక్కడ ఎవరు పుట్టారో!) ★

అంటూ పొదలోంచి వొంగి ఆ ఉంగరం సీత చేతిలో పెట్టాడు.[313]

సీత, ఉంగరం చూసి పోల్చింది! తన భర్తదే! చప్పున కళ్ళ నీళ్ళు పెట్టుకుంది – "నా భర్త నన్ను ఇంత కాలం మరిచిపోయాడా? .... ఇప్పటికి గుర్తు వచ్చానా నేను? ఒక్క రోజు కాదు, రెండు రోజులు కాదు, ఈ దుర్మార్గుడు నన్ను చెరబట్టి పది మాసాలు గడిచాయి. ఏం కష్టాలు పడుతున్నానో అనే ఆలోచన కూడా లేదా శ్రీరాముడికి? వివాహం అయింది మొదలూ ఎన్నడయినా భర్తను విడిచి ఉన్నానా? పన్నెండు సంవత్సరాలు రాజభోగా లనుభవిస్తూ అయోధ్యలో కాపురం చేశాను. తర్వాత వనవాసం కూడా గొప్ప ఆనందమే అనుకుని భర్తతో గడిపాను. అలాంటి భార్యని, నన్ను, నా భర్త మరిచే పోయాడా?" అంటూ జల జలా కన్నీళ్ళు రాల్చింది.

"అంత మాటనకు తల్లీ! నీ భర్త నిన్ను తలుచుకుని అల్లాడని రోజు లేదు. నిన్న మొన్నటి దాకా వర్షాకాలమే నాయే! మా రాజు, కొంచెం అశ్రద్ధ మనిషి. ఇదిగో .... అదుగో అని .... రోజులన్నీ గడి పేశాడు. అందుకే నీ భర్తకు కోపం వచ్చి 'అసలు నా భార్యని వెతికించుతావో లేదో చెప్పు ముందు' అని నిలదీస్తే మా రాజు సిగ్గుపడి తప్పు తెలుసుకుని మమ్మల్నందర్నీ రాజ్యాల వెంట పంపించాడు. పాపం నీ భర్త ఒక్కడూ ఏం చెయ్యగల డమ్మా? అలివిగాని పనయ్యే! అర్థ బలం ఉండాలి. అంగ బలం ఉండాలి."

సీత అసంతృప్తిగా తల వాల్చి ఆలోచనల్లో పడింది. ఇతరుల సహాయం లేకుండా తన భర్త తనని రక్షించ లేడా? అంత పరాక్రమవంతుడికీ కూడా ఇతరుల సహాయం ఉండవలసిందేనా? సుగ్రీవుడితో సఖ్యమే కాక పోతే ఏం జరిగేది? .... తన జీవితం ఈ లంకలో తెల్లారవలసిందేనా?

"దుఃఖపడకు తల్లీ! .... ఇక ఎంతో కాలం పట్టదు. నేను పోయి ఈ కబురు చెప్పగానే నీ భర్త వానర సైన్యంతో వచ్చి రావణుడి మీద యుద్ధం చేసి ...."

"యుద్ధమా! .... రావణుడితోనా! .... అయ్యో! జయాపజయాలు దైవాధీనాలు. చివరికి ఏం జరుగు తుందో గదా?"

"జయాపజయాలు దైవాధీనాలే గానీ .... ఆ దైవం మన ఆధీనమే తల్లీ! న్యాయం మనదే. పర స్త్రీని ఎత్తు కొచ్చిన దుర్మార్గుడు నాశనం అయిపోక తప్పదు గదా?"

"వీడు ఎందరో స్త్రీలని ఇంతకు పూర్వం కూడా ఎత్తుకు వచ్చాడు కదా హనుమంతుడా? అప్పుడు వీడికేం హాని జరిగింది?"

"అవునమ్మా, కానీ, ఇప్పటికి మూడింది వీడికి. కాలం ముందుకు రావొద్దూ?"

నిజమే ననిపించింది సీతకు కూడా. కొంచెం ఊరట కలిగింది. "అవునోయి! దుర్మార్గుడు నశించిపోక తప్పదు. రావణుడి తమ్ముడు విభీషణుడు మహా ఉత్త ముడు. నన్ను తీసుకుపోయి భర్తకు అప్పగించమని విభీషణుడు చాలా సార్లు అన్నని ప్రార్థించాడని విన్నాను. విభీషణుడి కూతురు అనల అప్పుడప్పుడూ నా దగ్గిరికి వచ్చి రహస్యంగా తండ్రి గురించి చెపుతూ ఉంటుంది. విభీషణుడి భార్యే, కూతుర్ని నా దగ్గిరికి పంపుతూ ఉంటుంది. ఈ దుర్మార్గుడికి ఎవరు ధర్మబోధ చేసినా జ్ఞానం లేదు. మృత్యువు ఒక్కటే వీడికి బుద్ధి చెప్పగలదు."

"అవును తల్లీ! అలాగే జరుగుతుంది."

సీత నిట్టూర్చింది – "నా భర్త సుఖంగా ఉన్నాడా హనుమంతుడా? నా కోసం దుఃఖం భరించలేక చిక్క శల్యం కాలేదు గదా?"

"నీ నగలు చూసినప్పుడు బావురు మన్నాడమ్మా! ఎప్పుడూ నిన్ను తలుస్తూ కంటతడి పెడతాడు. మొగా యన అంతకన్నా ఏం బయట పడతాడు చెప్పు? దుః ఖవంతా కడుపులో దాచుకుంటున్నాడు. అడవుల్లో బతు కయ్యే! ఏం సుఖం? నీ ధ్యాసలో మునిగిపోయి ఒంటి మీద పురుగూ పుట్రా పాకినా పట్టించుకోడు."[314]

---

**313.** హనుమంతుడు సీతని చూడగానే ఉంగరం ఇవ్వక పోవడానికి కారణం, అతడు ఉంగరం సంగతి మర్చిపోవటం కాదు. – ముందే ఉంగరం ఇచ్చేస్తే, సీత హనుమంతుణ్ణి నమ్మేస్తే, సీతాదేవి భయ సందేహాలూ, హనుమంతుడు శ్రీరామచంద్రుణ్ణి వర్ణించే సుందర ఘట్టాలూ, సర్గల తరబడీ చెప్పవలసిన అవకాశం ఉండదు గదా? అందుకే ఉంగరాన్ని కవిగారు మొదటే ఇప్పించలేదు. కానీ, ఉంగరం మొదటే ఇచ్చినా, సీత తన భర్త గురించి చెప్పమని కోరవచ్చును గదా? అప్పుడు కూడా హనుమంతుడు "నీ భర్త ఇలా వుంటాడమ్మా, అలా వుంటాడమ్మా" అని చెప్పవచ్చు. హనుమంతుడు ఆ ఉంగరాన్ని సీతకి మొదటే ఇవ్వకపోతే, అతను తెలివి తక్కువ దూత అయిపోడూ? అంతేకాదు, ఈ కవి, తెలివి తక్కువ కవి కూడా అయిపోతాడు. ★

**314.** సుందర, సర్గ **36**, శ్లోకం **42**: రాముడు, 'సీతా – శోకం'లో మునిగిపోయి వొంటి మీద పాములు పాకినా పట్టించుకోడం లేదట. "శ్రీరాముడు నీ మీదనే మనసు నిలిపి అడవి ఈగలు, దోమలు, పురుగులు, పాములు బాధించినను వాటిని తన దేహాము మీద నుండి నివర్తించుట లేదు."

ఇది ఒక రకం మన్మధావస్థ అట! మన్మధావస్థో, ఉన్మాదావస్థో! ★

"అవునోయి! .... నా భర్తకు నేనంటే పంచ ప్రాణాలు. తన తల్లికన్నా, తండ్రికన్నా నన్నే ఎక్కువ ప్రేమిస్తాడు. దేవుడు ఇంత కౄరంగా మమ్మల్ని విడ దీశాడు. నా భర్త నా కోసం దుఃఖిస్తున్నాడంటే నా మనసుకెంతో ఆనందంగా ఉంది. కానీ ఆయన దుఖ్ఖంతో కాలం గడపడం నేను సహించలేను. మళ్ళీ మేమెప్పటికి కలిసి సుఖపడతామో, విధి విధానం ఎలా ఉందో గ్రహించలేము" అని నిట్టూర్చింది సీత.

హనుమంతుడికి కూడా దిగులు ముంచు కొచ్చింది. కొంతసేపటికి తేరుకుని 'నీ భర్త మాటకేం గానీ నీ మరిది మాత్రం చాలా దిగులు పడుతున్నాడు తల్లీ, నీ జాడ తెలియక. ఆ మహానుభావుడికి నీ గురించీ దుఖ్ఖమే, అన్నగారి గురించీ దుఖ్ఖమే" అని విచారించాడు.

"అవునోయి! నా మరిది బహు ఉత్తముడు. అన్న గారి సేవే అతడికి పరమ ధర్మం. దేవతలు కూడా కీర్తించ దగ్గవాడు" అని కంట తడి పెట్టింది సీత.

"ఆ అన్నదమ్ముల్ని చూస్తే చేసుకున్న పాపాలన్నీ పోతాయి తల్లీ! నీ మరిది, రాత్రీ పగలూ అన్న గారికి సేవ చేసిన వాడు చేసినట్టే ఉంటాడు. చంటి బిడ్డని సాకినట్టు సాకుతున్నాడనుకో అన్న గారిని."

సీత నిట్టూర్చింది – "మా వల్ల అతనికీ కష్టాలు తప్పలేదు. అన్నగారి మీద భక్తితో సర్వసుఖాలూ విడిచి, ఎందరో ప్రియురాళ్ళని విడిచి, అడవుల కొచ్చాడు. అన్నగారి ఆజ్ఞే వేదవాక్కుగా ఆచరిస్తాడు. లక్ష్మణుడైనా నన్ను రక్షించలేదేమా అని కుములుతూ వుంటానోయి నిత్యం."

"అయ్యో! నిన్ను రక్షించడానికే సర్వ ప్రయత్నాలూ జరుగుతున్నాయి. దుఃఖించకు తల్లీ! .... ఇక నువ్వు నిర్భయంగా ఉండవచ్చును."

సీత కొంతసేపు ఆగి, "కోసల సంగతులేమైనా తెలుస్తున్నాయటనా హనుమంతుడా? మా అత్త గారూ, మా పిన్నత్తలూ, భరతుడూ క్షేమంగా ఉన్నారా? ఈ దుర్మార్గుడితో యుద్ధం చెయ్యడానికి భరతుడు సైన్యాలు పంపుతాడా?" అని అడిగింది.[315]

"ఆ వార్తలేమీ నా చెవిన పడలేదు తల్లీ! యుద్ధానికి మాత్రం వానర సైన్యాలు దండిగానే ఉన్నాయి. ఎన్ని వేల మందినైనా మా రాజు యుద్ధంలోకి పంపుతాడు. దానికేమీ సందేహం లేదు."

"నాకు రావణుడు సంవత్సరం గడువు ఇచ్చాడు మొదట. ఇక రెండు నెలలు మిగిలింది. ఈ లోగా యుద్ధం ముగుస్తుందా? .... నా భర్త వచ్చి నన్ను రక్షిస్తాడా?"

హనుమంతుడు ఆలోచనలో పడ్డాడు. రెండు నెలల్లో యుద్ధం అయిపోతుందా? రావణుడు చచ్చిపోతాడా? .... అయినా, ఈ దుర్మార్గుడు రెండు నెలల వరకూ అయినా ఇచ్చిన మాట మీద నిలబడతాడా? నమ్మదగ్గ సంగతి కాదు – "అమ్మా! నిన్నీ దుర్మార్గుల మధ్య వదిలి పెట్టి పోవటం మంచిది కాదని తోస్తోంది నాకు. ఎలాగా వచ్చాను. నాతోపాటు జాగ్రత్తగా తీసుకుపోతాను. రాత్రి దాకా మళ్ళీ చెట్టెక్కి దాక్కుంటాను. అందరూ నిద్ర పోయాక, ఇటువైపు కొండల్లో పడి పోదాం. ముందు కొంత దూరం తప్పుకుపోతే .... తర్వాత ఎలాగైనా తప్పుకో వొచ్చు. ఏమంటావు?" అన్నాడు.

సీతకి వెంటనే బయల్దేరా లనిపించింది. సంతోషం కలిగింది – "అవును. హనుమంతుడితో కలిసి వెళ్ళిపోతే బాగుంటుంది" అంది సీతలో సీత, ఆతృతగా.

సీత ఆలోచనల్లో మునిగింది. 'హనుమంతుడితో కలిసి వెళ్ళడం ధర్మమేనా? పతివ్రతల్ని భర్తలే రక్షించి తీసుకు వెళ్ళారు చాలా కథల్లో. శచీదేవిని ఇంద్రుడే రక్షించాడు. భార్యని రక్షించే పాలించే కర్తవ్యం భర్తదే. పతివ్రత అయిన భార్య, భర్తని తప్ప పర పురుషుణ్ణి రక్షించమని కోరకూడదు. శ్రీరాముడు సైన్యాలతో వచ్చి, శతృవుని చంపి నన్ను రథం మీద తీసుకుపోతే ఎంత కీర్తి! మహా వీరుడని లోకం నా భర్తని మెచ్చుతుంది. మహా పతివ్రత నని నన్నూ మెచ్చుతుంది.... అంతే గానీ....'

"అవుననుకో .... మరి ఈ దుర్మార్గుడు?" – సీతలో సీత.

"మరీ దుర్మార్గుడు కాడుగా? నన్ను ముట్టుకోవడం లేదుగా? గడువు ఇచ్చాడుగా? ఆ లోగా నా భర్త రాడా? భర్తే రక్షిస్తే ఎంత కీర్తి!"

"సరే! నీ ఇష్టం!...."

"ఏం తల్లీ?" – హనుమంతుడు.

"హనుమంతుడా! నేను నీతో రావటం భావ్యం కాదోయి! తప్పించుకునే శక్తి లేక రావణుడికి వశ మయ్యాను గానీ, నేను పర పురుషుడి వెంట రాను. నా భర్తే వచ్చి నన్ను రక్షించి తీసుకుపోవడం లోక మర్యాద."

---

**315.** సుందర, సర్గ 36, శ్లోకాలు 22, 24: "కౌసల్య, సుమిత్ర, భరతుడు .... వీరి క్షేమమును నా భర్త పలు మార్లు తెలుసుకొనుచున్నాడా?" – కైకని అడగదు ఎక్కడా. సరే! శతృఘ్నుడి సంగతి కూడా ఎత్తదు. ఎప్పుడూ భరతుడి పేరే! లక్ష్మణుణ్ణి అయినా చాకిరీ చేస్తాడనే. శతృఘ్నుడి మీద చూపని ప్రత్యేక శ్రద్ధ భరతుడి మీద చూపడానికి కారణం ఏమిటి? అతడి చేతిలో రాజ్యం ఉంది గనక. "అన్నమీద ప్రీతిగల భరతుడు, అక్షౌహిణీ సంఖ్యగల సేనను నా నిమిత్తము పంపునా?" అని అడుగుతోంది సీత. – పంపునో, లేదో యుద్ధం జరిగే టప్పుడు చూద్దాం. ★

సీత మాటలు హనుమంతుడికి కొంచెం వింతగా తోచాయి. "అది కాదు తల్లీ! ఈ దుర్మార్గుడి చేతిలో .... ఎప్పుడేం అఘాయిత్యం జరుగుతుందో .... ముందు వీడి దగ్గిర్నించి తప్పించుకు పోతే .... తర్వాత నీ భర్త వొచ్చి వీడి పని పట్టిస్తాడులే. వీడు చేసిన దుర్మార్గానికి వీణ్ణి శిక్షించకుండా ఎందుకు విడిచి పెడతాడూ?"

సీత అయిష్టంగా తల తిప్పింది "రావణుడు నన్ను కొంచెం దయగానే చూస్తున్నాడు. చంపదలచుకుంటే ఈ పాటికి చంపేవాడే! .... నేను నీతో రావటం .... ఏ విధంగా చూసినా మంచిది కాదు. ఎక్కడికక్కడే కాపలా కాస్తూ ఉన్నారు. పట్టుబడి పోయామంటే ఇద్దర్నీ చంపేస్తారు. లేకపోతే నిన్ను చంపి నన్ను మళ్ళీ రావణుడికి అప్పగిస్తారు .... అప్పుడు నన్ను తీసుకుపోయి ఇంకెక్కడో దాస్తారు .... ఆలోచిస్తే, అన్నీ అవాంతరాలే తోస్తున్నాయి. నువ్వు తొందరగా వెళ్ళి నా భర్త వచ్చే ఏర్పాట్లు చేయడం శ్రేయస్కరం. ఇన్ని మాటలెందుకు? .... పర పురుషుడి వెంట రావడం నాకు మర్యాద కాదు."[316]

"మంచిది తల్లీ! .... నువ్వన్న మాటా నిజమే. లోకులు కాకులు. ఎన్ని అపనిందలయినా వేస్తారు. నీ అంత ఉత్తమ స్త్రీని నేనెక్కడా చూడలేదు. నువ్వు తప్ప ఇంత బుద్ధిమంతురాలు లోకంలో ఉండదు. మహా పతివ్రతవి. నీకే ఈ కష్టాలన్నీ వచ్చి పడ్డాయమ్మా!"

సీత తన్మయత్వంలో మునిగింది. రేపు తనని తన భర్త రక్షించి తీసుకుపోయిన తర్వాత .... ఇంకెంత మంది .... ఎన్ని రకాల కీర్తిస్తారో! .... బ్రాహ్మలు .... రుషులు .... పండితులు .... వృద్ధులు .... పురోహితులు .... అసలు రావణుడు ఎత్తుకు రావడమే గొప్ప కీర్తి! తను పర పురుషుణ్ణి కోరలేదనే సత్యం తన భర్తకూ తెలుస్తుంది, లోకమూ మెచ్చుతుంది.

"అమ్మా! .... నీ మాటలన్నీ నీ భర్తకు చెపుతాను. ఇంకేమైనా చెప్పమంటావేమో చెప్పు."

"అయ్యో! అప్పుడే వెళతావా?"

"వెళ్ళనులే తల్లీ! .... నీ ఆజ్ఞ అయినప్పుడే వెళ్తాను. నీ భర్తకేం చెప్పమంటావో అన్నీ చెపితే...."

"నేనేం చెప్పను? అంతా నీ కళ్ళతో నువ్వే చూశావు. నా దుస్థితి అంతా వివరించు. శ్రీరాముడి కోసమే ప్రాణాలు నిలుపుకుని వున్నానని చెప్పు. మేము చిత్రకూటంలో ఉన్నప్పుడు ఒకసారి నా భర్త తొడ మీద తల ఉంచుకొని పడుకున్నాను. అప్పుడొక అడవి కాకి వచ్చి నన్ను పొడిచింది. దాన్ని తరమడానికి వడ్డాణం తియ్యబోయాను. నా భర్తకు కాకి మీద చాలా కోపం వచ్చి వెంటనే బాణం వేశాడు. ఆ విషయం గుర్తు చెయ్యి. నన్ను పొడిచినందుకు కాకినే దండించిన వాడు, నన్ను ఎత్తుకొచ్చిన ఇంత దుర్మార్గుణ్ణి విడిచి పెట్టాడేమా అని ఎప్పుడూ దుఃఖపడుతూ వున్నానని చెప్పు."[317]

"ఈ దుర్మార్గుడు కాకి కాదుగా తల్లీ? వీడి చుట్టూ

---

**316.** **సుందర, సర్గ 37, శ్లోకం 29:** వాల్మీకి రామాయణంలో హనుమంతుడు కోతి కదా? .... సీతని తన వీపుమీద ఎక్కించుకుని తీసుకు పోతానంటాడు. సీత – "బహు దూరము నన్ను నీవెట్లు మోసికొని పోగలవు? ఇది నీ కోతి బుద్ధి యనుకొనెదను" అని పరిహాసం చేస్తుంది. ఆ కోతి చేతే సహాయం పొందడం, దానితో కార్యాలు చేయించుకోవడం. దాన్ని పరిహసించడం! వీర కృత్యాలు చేసే వానరుడికి, కోతి బుద్ధి ఎలా ఉంటుంది? సేవలు చేసే పరిచారకుల్ని, అలక్ష్యంగా, తక్కువతనంగా చూసే సమాజ లక్షణం ఇది. అలా పరిహాసం చేసిన సీతకోసం హనుమంతుడు అశోక వనంలో శరీరం పెంచేసి బ్రహ్మాండమైన రూపం చూపిస్తాడు. .... ఎంత సాహసమో కవి గారికి!

"రామ లక్ష్మణులు లంకకు ఎలా వస్తారు?" అని అడుగుతుంది సీత. హనుమంతుడు – "నా వీపు మీద కూర్చుండి, పురుషశ్రేష్ఠులగు రామలక్ష్మణులు నీ సమీపమునకు వొచ్చెదరు" అన్నాడు.

"ఎలా తీసుకొస్తావు నీ కోతి బుద్ధిగానీ" అనలేదు సీత. వాళ్ళు రావటం చాలా అవసరం కదా? (లేకపోతే, పడితే వాళ్ళే పడతార్లే సముద్రంలో – అనేమో!) ★

**317.** **సుందర, సర్గ 38, శ్లోకాలు 15, 40:** సీత, రాముడికి చెప్పమని హనుమంతుడికి చెప్పిన కాకాసురుడి ఉదంతం ఇది. "వనములో, రాముడి తొడపై విశ్రమించితిని. అపుడు ఒక కాకి మాంసమునపేక్షించి నా స్తనముల మధ్యలో పొడిచెను. (ఎక్కడండీ కవిగారూ? స్తనముల మధ్యలోనా? అవున్లెండి. అదే మీకు కనపడే చోటు! కాళ్ళూ చేతులూ కనపడవు. స్తనాలే కనపడతాయి!) నేను దానిని మట్టి బెడ్డతో గొట్టితిని. అది నన్ను విడువక నా స్తనములను బొడుచుచు దాగియుండెను. అపుడు వడ్డాణము తీయబోతిని. పైట జారినది.

రాముడు నవ్వెను. నేను సిగ్గుపడితిని. తరువాత శ్రీరాముని తొడ మీద పండుకొని అలక వహించితిని. మరల శ్రీరాముడు నా తొడమీద నిద్రించెను. ఆ కాకి, మరలా నా స్తనముల మధ్య పొడిచెను. పైకెగిరి మరల మరల పొడిచెను. (కవిగారే ఆ కాకి రూపం దాల్చి, సీత స్తనాలు వదలడం లేదు!) నా స్తనముల నుండి రక్త బిందువులు పడి రాముని దేహము తడిసెను. కాకివల్ల కలిగిన హింసచే శ్రీరాముని నిద్ర లేపితిని. శ్రీరాముడు లేచి కుపితుడై – 'ఏనుగు తొండము వంటి తొడలు గల దానా! ఏ దురాత్ముడు నిన్ను స్తనముల మధ్యలో బొడిచెను?' అని బుస గొట్టెను. గోళ్ళకు రక్తముతో నిలిచియున్న కాకిని ➔

మందీ మార్బలం, సైన్యం....”

“అవును నాయనా, అదే వచ్చింది. ఈ దుష్టుడితో యుద్ధం మాటలా? అన్నట్టు ఒకసారి నా బొట్టు చెరిగి పోతే మణిశిల అరగదీసి నా మొహాన్న బొట్టు ఉంచాడు నా భర్త. ఆ సంగతి కూడా గుర్తు చెయ్యి. నా తిలకం నిలబెట్టిన వాడు నా ప్రాణాలు కూడా నిలబెడతాడో లేదో అడుగు. వెనకటి రోజులన్నీ తలుచుకుంటూ వుంటే శ్రీరాముడేనా నన్నింత ఉపేక్షించిందీ అని విస్మయం కలుగుతోంది హనుమంతుడా! ‘ఆపదలో వున్న వారిని రక్షించాలి’ అనే వాడే! దూరం అయిపోయిన భార్య మీద ఇంకా ప్రీతి ఉంటుందా? నా మీద మనసే వుంటే నన్ను రక్షించ లేడా? నా భర్త పరాక్రమం నేనెరుగనా? ఎన్ని కష్టాలకైనా చలించడు. ఎన్నడూ నిరుత్సాహపడడు. మహా శక్తిమంతుడై వుండి కూడా నా మీద దయ లేకుండా వున్నాడు! .... ఇకనయినా ఇక్కడికి వచ్చి నన్నీ చెర నుంచి తప్పిస్తాడా?” జల జల కన్నీళ్ళు రాల్చింది.

“నువ్విలా మనసు కష్టపెట్టుకోకు తల్లీ! నిన్ను రక్షించడానికేనమ్మా యుద్ధానికి సిద్ధపడుతున్నాడూ నీ భర్త. నిద్రలో కూడా నిన్ను మరిచిపోడు. ఆయన దుఃఖించడం .... నీ మరిది ఓదార్చడం .... నేను చూస్తూనే వున్నాను తల్లీ! నా మాట నమ్ము .... నువ్విక కంట తడి పెట్టకూడదు. ఇంక ఎంతో కాలం పట్టదు.”

“ఎంత చల్లగా మాట్లాడుతున్నావు హనుమంతుడా! నా దుఖ్ఖం పూర్తిగా నువ్వే పోగొట్టాలి. నన్ను నా భర్త పాదాల దగ్గిరికి నువ్వే చేర్చాలి నాయనా! నా భర్తకు ఎలా చెపుతావో, నన్నీ శోక సముద్రం నించి ఎలా గట్టెక్కిస్తావో, అంతా నీదే భారం. లోకమంతా ఏలగల సమర్థుడు నా భర్త. శత్రువుని రూపుమాపి, ధర్మ పత్నిని రక్షించడం ఆయన ధర్మమని గుర్తు చెయ్యాలి సుమా నువ్వు. ఇక్కడ ఈ దుర్మార్గులు నన్ను ఎంత హింసిస్తు న్నారో, అంతా నా భర్తకు చెప్పు. ఈ రోజు నించి ఒక్క నెల రోజులు మాత్రమే జీవిస్తాను. నా భర్త స్వయంగా వచ్చి లంకంతా బీభత్సం చేసి నన్ను తీసుకు వెళ్ళాలి. హనుమంతుడా! నీ మాటల వల్లే నా భర్తకు నన్ను తిరిగి సాధించాలనే పౌరుషం కలగాలి.”[318]

“అలాగే తల్లీ! తప్పకుండా చెపుతాను. చూసిం దంతా చూసినట్టు చెపుతాను. నా మాటల్లో ఏమీ లోపం చెయ్యను. నువ్వు మాత్రం ధైర్యంగా వుండాలి సుమా!”

సీత, చెంగున కట్టి ఉంచిన ఆభరణం తీసింది – “ఈ చూడామణి నా భర్తకు అందజెయ్యి నాయనా! నన్ను కలుసుకున్నావని తప్పకుండా నమ్ముతాడు. సంతోషి స్తాడు. మరిచిపోకు సుమా! వెళ్ళగానే ఇయ్యి!”

“అలాగే తల్లీ! ఈ సారి వెళ్ళగానే ఇస్తాను” అని హనుమంతుడు ఆ నగ అందుకున్నాడు.

సీతకు కళ్ళు నిండుకొచ్చాయి – “ఈ రాత్రి కూడా ఇక్కడే ఉండు నాయనా! నువ్వు ఉన్నావనే ఊహ నాకెంతో ధైర్యం కలిగిస్తుంది. ఇంతసేపూ ఎంత ఊరట పడ్డాను! నువ్వు వెళ్ళిన క్షణం నించీ, మళ్ళీ నా దగ్గిరకు వచ్చే క్షణం వరకూ ఎన్ని కళ్ళతో ఎదురు చూస్తానో! నా ప్రాణం నిలుస్తుందో లేదో! నా భర్త మహా పరాక్రమ వంతుడైవుండి కూడా నన్ను రక్షించకుండా వుండడం నా దురదృష్టమే. నా పాపం పూర్తిగా అనుభవించనిదే నా భర్తకు నన్ను రక్షించాలనే దయ కలగదు.”

“వద్దు తల్లీ! నువ్వు ఇంతగా దుఃఖపడుతూ వుంటే నిన్ను విడిచి నేను వెళ్ళలేను. నా మాట నమ్ము. నీ భర్త పరాక్రమవంతుడు. నిన్ను తప్పకుండా ఈ చెరనించి రక్షిస్తాడు. నన్ను వెళ్ళమని ఆజ్ఞాపించు. సంతోషంగా వెళ్ళి నీ భర్తకీ కబురు అందిస్తాను.”

“అలాగే వెళ్ళు నాయనా! నా భర్త పాదాలకు నేను నమస్కరించినట్టు నువ్వే నమస్కరించు. నా మరిది క్షేమం అడిగానని చెప్పు. సుగ్రీవ మహా రాజునీ, మంత్రు లందర్నీ అడిగానని చెప్పు .... వెళ్ళు నాయనా!”

దూరంగా దాసీల మాటలు వినపడ్డాయి.

సీత చప్పున ఇంకో చెట్టువేపు నడిచింది.

“ఒక్క నెల మాత్రమే జీవిస్తానని చెప్పు!” అంది దూరం నించి. ★

---

➔ జూచి మిక్కిలి కోపంతో ఒక దర్భను తీసి, మంత్రించి, బ్రహ్మాస్త్రము విడిచెను. అది కాకి వెంటబడి ముల్లోకములు తరిమినది. కాకి తొమ్మిది పర్యాయములు ముల్లోకములు తిరిగి, తనను రక్షించు వారిని గానక, రాముని పాదములపై బడెను. రాముని దయతో బ్రహ్మాస్త్రము కాకి కుడి కంటిని మాత్రము నాశనము జేసి ప్రాణములను నిలిపెను” – ఈ మధుర స్మృతిని గుర్తు చెయ్యమంది సీత, భర్తకి. పిచ్చుక మీద కాదు, కాకి మీద బ్రహ్మాస్త్రం! దాన్ని రావణుడి మీద వెయ్యరాదూ? ★

**318.** **సుందర, సర్గ 39, శ్లోకాలు 9 12**: సీత, తన నెలాగయినా ఈ కష్టాల్లోంచి గట్టెక్కించేటట్టు రాముడికి మరీ మరీ చెప్పమని హనుమంతుణ్ణి బతిమాలుతోంది. “హనుమంతుడా! శ్రీరాముడు నన్ను జీవించి యుండునటుల ఎట్లు చేయునో, అటుల నీవు చెప్పవలయును. నీ మాటల సహాయము జేసి పుణ్యము గట్టు కొనవలెను. రాముడు నీ మాటలు విని ఉత్సాహమును, పౌరుషమును, వృద్ధి జేసుకొనును. రాముడు నీ మాటలు వినియే శత్రువుల మీద పరాక్రమమును బాగుగ జూపును.” ★

# లింకు-7

# 9వ కథ తర్వాత 10వ కథ వరకూ

[9వ కథ - హనుమంతుడు సీతతో మాట్లాడి, అశోక వనం నించి బయల్దేరడంతో ముగిసింది. 10వ కథ - హనుమంతుడు రుష్యమూకం వెళ్ళి రాముడికి సీత గురించి చెప్పడంతో ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య ఉన్న కథా భాగం ఇది.]

హనుమంతుడు లంకకు వచ్చిన పని సవ్యంగా ముగిసింది. తర్వాత, "ఈ రాక్షసుల బలా బలా లేమిటో తెలుసుకుని వెళ్తాను" అనుకున్నాడు. "ఎలాగైనా వీరిని కవ్విస్తాను. యుద్ధం పొసిగేటట్టు చూస్తాను. నా వంటి వీరుడి మీదకు ఎంత సైన్యం వచ్చినా సర్వ నాశనం అయిపోతారు" అనుకున్నాడు.[319] అలా అనుకున్న తర్వాత హనుమంతుడు అశోకవనంలో చెట్లన్నీ పీకెయ్యడం ప్రారంభించాడు. మహా వృక్షాలు పెళ్ళగిస్తున్నాడు. కొండలు పిండి చేస్తున్నాడు. బావులూ, తటాకాలూ విరగ దీస్తున్నాడు. మేడలన్నీ కూలదోస్తున్నాడు.

పక్షులు, ఆకాశాన్నంతా కప్పి ఆక్రందనలు చేస్తున్నాయి. గుహల్లోంచి పెద్ద పులులు బైట పడి పరుగులెత్తుతున్నాయి. అశోక వనం నుంచి వినపడే ఫెళ ఫెళలకు లంకలో ప్రజలంతా భయంతో వొణకడం మొదలు

---

**319.** **సుందరకాండ, సర్గ 30, శ్లోకాలు 20 .... 40:** హనుమంతుడు సీతని చూశాడు. మాట్లాడాడు. వచ్చిన పని అయిపోయింది. తర్వాత, లంకలో వాళ్ళతో యుద్ధం చెయ్యాలని ఆలోచిస్తున్నాడు. కానీ, ఈ ఆలోచనకు ముందు అతని ఆలోచన లేమిటో చూడాలి. అశోక వనంలోకి వచ్చి, చెట్టు మీద దాక్కుని, ఇంకా సీతతో మాట్లాడక ముందు – లంకలో తను ఎలా ప్రవర్తించాలో, ఏ యే జాగ్రత్తలు తీసుకోవాలో, ఎలాంటి ప్రమాదాలు రాకుండా చేసుకోవాలో – ఆ విషయాల గురించి ఎలా ఆలోచించాడో చూడండి – "ఈ రాక్షస స్త్రీలు నన్ను జూచినచో పట్టి బంధింతురు. లేదా చంపుదురు. రాక్షసుల మధ్య తగులుకొని, యుద్ధము జేయవలసి యుండినచో, ఆ శ్రమ వల్ల నేను తిరిగి సముద్రము దాటలేను. సీత సమాచారము శ్రీరామునకు తెలియకపోవును. రాక్షసులు సీతను జంపుదురు. నన్ను వీరు చంపిననూ, బంధించిననూ, సముద్రమును దాటి శ్రీరాముని కార్యము జేయగలవా డింకొకడు లేడు. నేను మరణించినటులైతే, ఈ సముద్రము దాటగల వానరుడు యెంత యోచించినను నా కగుపడలేదు. యుద్ధము నందు జయాప జయములు అస్థిరములు. బుద్ధిమంతుడు సందేహాస్పదమైన గార్యములు జేయడు. అహంకారము గల దూతలు మంచి కార్యములు పాడుచేయుదురు" – ఇలా ఆలోచించి, తను బుద్ధిమంతుడైన దూతగా ఉండాలనుకున్నాడు. కానీ, ఇప్పుడు, కయ్యానికి కాలు దువ్వాలనుకుంటున్నాడు.

"నిన్ను వీపు మీద పెట్టుకుని తీసుకుపోతాను" అని హనుమంతుడు సీతతో అన్నప్పుడు సీత ఏమన్నదో చూడండి. **సర్గ 37, శ్లోకాలు 47 నించి 57 వరకూ:** తన సంగతి గానీ, హనుమంతుడి సంగతి గానీ, బయటపడితే ఏం ప్రమాదాలు సంభవిస్తాయో సీత చెపుతోంది – "నన్ను జూచి రాక్షసులు మన వెంట బడుదురు. నన్ను రక్షించుచుండు నీకే యాపద గలుగును. సందేహము లేదు. రాక్షసులు నన్ను గొనిపోయి రావణునకు సమర్పింతురు. లేక నన్ను నరికి వేయుదురు. లేదా, నన్ను దీసుకొనిపోయి, వానరులకును, రామలక్ష్మణులకును తెలియకనుండు రహస్యమైన చోట ఉంచెదరు. అపుడు శ్రీరాముడు జేయు ప్రయత్నములన్నియు వ్యర్థమగును. జయాపజయములు సంశయములు. జయాపజయములను ముందే నిర్ధారణ జేయుటకు సాధ్యము గాదు."

ఈ రెండు సందర్భాలలో ఇలా తర్కించిన కవి, ఇప్పుడు రాక్షసులతో యుద్ధం చేసి, లంకని తగలబెట్టడం కోసం, ఏమని తర్కిస్తున్నాడో చూడండి!

**సర్గ 41, శ్లోకాలు 13 వరకూ:** "ఒక పనికి పంపబడిన దూత పెక్కు పనులను చేయుటకు యత్నించినపుడు మొదటి పనికి భంగము కలుగకుండునట్లు వుండవలయును. అట్లు జేసినవాడే సమర్థుడు. (ఇప్పుడు తను చెయ్యబోయే పని వల్ల మొదటి పనికి భంగం కలగదనీ, తన మీద కోపంతో రావణుడు సీతని చంపడనీ, హనుమంతుడు నిర్ధారణ చేసుకోగలడా?) ఎవడైతే అనేక ఉపాయములచే కార్యమును సాధించగలడో వాడే సమర్థుడు. ఈ రాక్షసుల బలాబలములను తెలుసుకొను విషయములో దండోపాయమే సాధనము. యుద్ధములో కొందరు వీరులు హతులైనచో, మిగిలిన వారు లొంగుదురు. కనుక మంత్రులతోనూ, సేనలతోనూ గూడియుండు రావణుని, యుద్ధములో గలిసి, అతని బలమును తెలుసుకొని, ఇచట ➔

పెట్టారు.

హనుమంతుడు సీత ఉన్నచోటు మాత్రం వదిలి పెట్టి, మిగిలినదంతా ధ్వంసం చేసేసి, ప్రాకారానికున్న పెద్ద ద్వారం మీద ఎక్కి కూర్చున్నాడు.

సీత దగ్గిర నిద్రపోయిన రాక్షస స్త్రీలు లేచారు. (అబ్బా, ఎంత బండ నిద్రో! ఇప్పుడా లేచేది?) సర్వ నాశనం అయిపోయిన అశోక వనం చూశారు. ద్వారం మీద భీకరంగా కూర్చునివున్న కోతిని చూశారు. సీత చుట్టూ చేరి – "ఆ వానరు డెవడు? అతనితో నువ్వెం దుకు మాట్లాడావు?" అని అడిగారు.

"నాకేం తెలుసు? నేనూ మీలాగే భయపడు తున్నాను. మీ రాక్షసుల సంగతులు మీకే తెలుస్తాయి" అంది సీత.

కొందరు దాసీలు రావణుడి దగ్గిరికి పరిగెత్తారు. "ఎవడో ఒక వానరుడు సీతతో మాట్లాడి ఇంకా అక్కడే ఉన్నాడు. సీత ఉన్న చోటుని విడిచిపెట్టి వనమంతా నాశనం చేసేశాడు. వాడి గురించి సీతని అడిగాం గానీ చెప్పడం లేదు" అని చెప్పారు.

రావణుడు మండిపడి, 80 వేల మంది వీరుల్ని పంపాడు. వారంతా ఇనప రోకళ్ళూ పట్టసాలూ శూలాలూ గదలూ బాణాలూ తీసుకుని హనుమంతుణ్ణి చుట్టి ముట్టి, ఆయుధాలు విసరడం ప్రారంభించారు.

హనుమంతుడు శరీరం పెంచేసి, "శ్రీరామ లక్ష్మణు లకు జయం! సుగ్రీవ మహారాజుకి జయం! నేను హను మంతుణ్ణి! వాయు పుత్రుణ్ణి! లంకని సర్వ నాశనం చేసేస్తాను. సీతాదేవి దగ్గిర శెలవు పుచ్చుకొని క్షేమంగా తిరిగిపోతాను" అంటూ భయం కరంగా గర్జించాడు.

ఎగిరే పిట్టలన్నీ ఆ అరుపులకే గుండెలవిసి, పువ్వులు రాలినట్టు కిందకి రాలి పడ్డాయి.

హనుమంతుడు, వాకిలి తలుపుకి వున్న ఇనుప గడియ ఊడదీసి దాన్ని పట్టుకుని ఆకాశంలో కెగిరాడు. (ఎంత మహిమ గలవాడయినా ఉత్త చేతులతో ఏమీ చెయ్యలేడన్నమాట! 'ఆయుధం' ఉండాల్సిందే!)

హనుమంతుడికి, 80 వేల మంది సైనికులతో ఘోరమైన యుద్ధం జరిగింది. హనుమంతుడు ఆ 80 వేల మందినీ చంపేశాడు. (లక్ష మంది అయితే బాగుం డేదిగా కవిగారూ? కొంచెం తక్కువ చేశారేం? మీ శ్లోకంలో ప్రాస కోసం '80 వేల' అనేదే కావలసి వచ్చి నట్టుంది! అంతే కదండీ?) హనుమంతుడు అందర్నీ చంపేసి, మళ్ళీ గుమ్మం ఎక్కి కూర్చున్నాడు.

సైన్యం పోయిన వార్త విని రావణుడు మండి పడి, ప్రహస్తుడనే మంత్రి కొడుకైన జంబుమాలిని యుద్ధానికి వెళ్ళమన్నాడు.

అంతలో హనుమంతుడికి చైత్య ప్రసాదం సంగతి జ్ఞాపకం వచ్చింది.[320] "అది పాడుచెయ్యకుండా విడి చానే!" అని లేచి ద్వారం మీద నించి ఆ మందిరం మీదకి ఒక్క అంగ వేశాడు. దాని శిఖరాలు ఊపి ఊపి మొత్తం మందిరం అంతా కూలగొట్టి, గొప్ప గర్వంతో, "శ్రీరామ చంద్రుడికి జయం! సుగ్రీవుడికి జయం! వెయ్యి మంది రావణుల్నయినా పిండి చేస్తాను" అంటూ అరిచాడు.[321]

కాపలా కాసేవారు నూరు మంది, హనుమంతుడి మీదకి ఆయుధాలు విసిరారు. హనుమంతుడు అక్కడ ఊడి పడివున్న స్తంభం ఒకటి పట్టుకుని, ఆ నూరు మందినీ కొట్టి చంపేసి, చేతిలో స్తంభం గిర గిర తిప్పుతూ తిరిగాడు. స్తంభం, రాళ్ళకు తగిలి నిప్పు

---

➔ నుండి సుఖముగ ప్రయాణము చేసెదను. అసాధ్యమగు పరాక్రమము గల నేను, భయంకరమగు పరాక్రమము గల రాక్షసులను యుద్ధములో గలిసికొని సేనను జంపి సుఖముగ కిష్కింధకు పోయెదను."

ఈ రకంగా, ఇప్పుడు హనుమంతుడి తర్కం మారిపోయింది. మొదట ఏ మనుకున్నాడు? రాక్షసులతో ఇప్పుడే యుద్ధానికి దిగకూడదనుకున్నాడు. యుద్ధం చేస్తే తన శక్తి పోయి తిరిగి వెళ్ళలేననుకున్నాడు. తన రహస్యం బైటపడితే రావణుడు సీతని చంపేస్తాడనుకున్నాడు. అసలు తనే ఓడిపోతానేమో అనుకున్నాడు. జయాపజయాలు అస్థిరాలు కదా అనుకున్నాడు. ఇవన్నీ ఏ గంగలో కలిశాయి? ఇంకా ముందు ముందు చూడండి! సీతకు ప్రమాదం వచ్చే పనులు ఎన్ని చేస్తాడో! ఏ ఘట్టం దగ్గిర, ఆ తర్కం! అప్పుడదీ, ఇప్పుడిదీ! ఈ కవి, ఏ ఎండ కా గొడుగు పట్టగలడు! ★

**320.** చైత్య ప్రసాదం అంటే దేవాలయం – అని గట్టుపల్లి శేషాచార్యులుగారి అనువాదం. చైత్య ప్రసాదం అంటే ఒక మందిరం – అని ఇతర పండితులు అంటున్నారు. ★

**321.** అసలు హనుమంతుడు గూఢచారిగా వచ్చాడు. గూఢంగా సంచరించి, వచ్చిన పని ముగిసిం తర్వాత, ఇంకేమైనా చెయ్యదలిస్తే గూఢంగా వుండే చెయ్యాలి. గూఢచారి కాకుండా అతను దూత అయితే, తిన్నగా రావణుణ్ణి కలుసుకోవాలి. ఈ రెంటిలో దేనికీ చెందడం లేదు హనుమంతుడు. తను రామ దూతనని చెప్పుకుంటున్నాడు. సీతతో మాట్లాడానని రహస్యం లేకుండా చెప్పేస్తున్నాడు. మరి, హనుమంతుడి గురించి కాపలా స్త్రీలు అడిగినప్పుడు, సీత ఎందుకు మరుగుపరిచింది? అతని సంగతి రహస్యంగా ఉంచాలనీ, అది బయటపడవలసిన విషయం కాదనీ, ఆమె అభిప్రాయ పడ్డట్టే కదా? కథలో, తర్వాత, రావణుడి దగ్గర్నించి సుగ్రీవుడి దగ్గిరికి ఒక దూత వస్తాడు. ఆ దూత, దూత లక్షణాలతోటే ప్రవర్తిస్తాడు. మరి హను మంతుడు కూడా అలా ఎందుకు ప్రవర్తించలేదు? ఇంతకీ హనుమంతుడు దూతా, గూఢచారా? ఏదీ కాదు. పెద్ద గూండా! రామ గూండా! ★

పుట్టింది. ఆ నిప్పుకి చైత్య ప్రసాదం పూర్తిగా కాలి పోయింది.

అప్పటికి జంబుమాలి, గాడిదల రథంతో, ఆయుధాలతో, యుద్ధానికొచ్చాడు. రాగానే హనుమంతుడి మీద బాణ వర్షం కురిపించాడు. హనుమంతుడు పెద్ద రాయి ఎత్తి జంబుమాలి మీదకు విసిరాడు. జంబుమాలి బాణాలతో దాన్ని పిండి పిండి చేసేశాడు. హనుమంతుడు పెద్ద మద్ది చెట్టుని వేళ్ళతో ఊడబీకి గిర గిర తిప్పి జంబుమాలి మీద కొట్టాడు. జంబుమాలి దాన్ని కూడా తునాతునకలు చేసేశాడు.

హనుమంతుడు తలుపు గడియ పట్టుకుని దాన్ని పెట్టి రథం మీద మోదాడు. రథమూ, సారథీ, గాడిదలూ, జంబుమాలీ, కంటికి కనపడకుండా అదృశ్యం అయిపోయారు. (మద్ది చెట్టు కన్నా మొద్దు తలుపు గడియలు పెట్టుకున్నారు లంకలో వాళ్ళు! అది వాళ్ళకే ప్రమాదం అయ్యింది!)

హనుమంతుడు మళ్ళీ గుమ్మం ఎక్కి కూర్చున్నాడు.

★ ★ ★

రావణుడు ఆలోచనలో పడ్డాడు. (చావడానికి ఎవర్ని పంపాలా అని. సీతని ఇచ్చెయ్యాలని కాదు.)

ఐదుగురు సేనాపతుల్ని పిలిచాడు. "ఈ సారి మీరు వెళ్ళండి. (ఈ సారి చావవలసింది మీరూ! మీ వంతు వచ్చింది.) జాగ్రత్తగా ప్రవర్తించాలి సుమా! నేర్పు కావాలి మరి. అతడు వానరుడు కాదు. వానరుడికి ఇంత బలం ఎక్కడిది? పూర్వం నేను వాలినీ వాళ్ళనీ చూశాను. వాళ్ళకు ఇంత బలం లేదు. వాళ్ళు ఇంత భయంకరంగా లేరు.[322] వీడు ఏదో భూతం అయివుండాలి. మనం పూర్వం దేవతలందర్నీ జయించాం. వారే మన మీద కోపంతో ఈ భూతాన్ని సృష్టించి పంపి ఉంటారు. ('నేను ఫలానా, నా పని ఫలానా' అని హనుమంతుడు చెపుతూనే వున్నా 'ఇది భూతం' అంటున్నాడు రావణుడు!). ఆ భూతాన్ని చంపకండి! అవమానించకండి! (ముద్దెట్టుకోండి!) జాగ్రత్తగా పట్టుకోండి. మీరు మహా వీరులు! నాకు తెలుసు. మీరు ముల్లోకాలూ ధ్వంసం చేయగలరు. (యుద్ధానికి గెంటేటే పొగడ్తలు!) యుద్ధంలో జయమే కలుగుతుందని గర్వపడకూడదు. మిమ్మల్ని మీరు రక్షించుకుంటూ యుద్ధం చెయ్యాలి. (యుద్ధం నువ్వెంత గొప్పగా చేస్తావో చూస్తాంలే), జాగ్రత్త సుమా" అని హెచ్చరికలతో వారిని పంపాడు రావణుడు.

సేనాపతులు ఆయుధాలతో, సేనలతో బయల్దేరారు.

మళ్ళీ యుద్ధం!

హనుమంతుడు కొండలా శరీరం పెంచి, ఆకాశంలోకి ఎగిరి పిడుగు పడ్డట్టు ఒక సేనాధిపతి రథం మీదకి ఉరికాడు. ఆ రథం గుర్రాలతో సహా భూమికి నొక్కుకు పోయింది.

మిగిలిన సేనాపతులు కోపంతో విజృంభించారు. హనుమంతుడు అందులో ఇద్దర్ని పెద్ద చెట్టుతో మోది చంపేశాడు. మిగిలిన ఇద్దరూ శూలాలూ, పట్టసాలూ విసిరారు. హనుమంతుడు పెద్ద పర్వత శిఖరం ఒకటి వారి మీదకు విసిరి వాళ్ళిద్దర్నీ చంపేశాడు.

సేనాపతులందరూ పోయాక హనుమంతుడు సేననంతటినీ నాశనం చేశాడు. ఏనుగుతో ఏనుగుని కొట్టి ఏనుగులన్నింటినీ చంపేశాడు. గుర్రంతో గుర్రాన్ని కొట్టి గుర్రాలన్నింటినీ చంపేశాడు. సైని కుడితో సైనికుణ్ణి కొట్టి సైనికులందర్నీ చంపేశాడు. (కవిత్వం సొగసులు కుదిరేలాగ చేశాడన్నమాట!)

యుద్ధరంగం, శవాల కుప్పలతో, విరిగిన రథాలతో, తెగిపడ్డ తలలతో మొండేలతో నిండిపోయింది.

హనుమంతుడు మళ్ళీ ద్వారం ఎక్కి కూర్చున్నాడు.

★ ★ ★

రావణుడు కొంచెం విచారించాడు. అక్ష కుమారుడి వేపు చూశాడు, "వెళ్తావా?" అన్నట్టు. అక్షుడు రావణుడి కొడుకే. వయసులో చాలా చిన్నవాడు. మహా వీరుడు. (ఈ వీరత్వం ఎప్పుడూ చంపడానికో, చావడానికో! దాని పని అదే!) ఉత్సాహవంతుడు. అతను, తండ్రి కంటిసైగ చేతనే, అతని ఆజ్ఞ గ్రహించి, యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఆయుధాలతో రథం సిద్ధంగా ఉంది. సేన సిద్ధంగా ఉంది. (చావు సిద్ధంగా వుంది.) బయల్దేరాడు. హనుమంతుణ్ణి చూసి – "ఇతడు చాలా గొప్ప వీరుడే. నాకు తగిన వాడే దొరికాడు" అని సంతోషించాడు. (మరి, మొట్టమొదట నువ్వే వస్తే, వాళ్ళందరూ బతికి వుండేవారుగా మహా వీరుడా?)

ఇద్దరికీ గొప్ప యుద్ధం ప్రారంభమైంది. భూమి గడగడ వొణికింది. పర్వతాలు దొర్లి పడ్డాయి. సముద్రం అల్లకల్లోలమైంది. సూర్యుడు భయపడి కాంతి తగ్గాడు.

---

**322.** సుందర, సర్గ 46, శ్లోకాలు 9 ... 12: హనుమంతుడు ఎంత బలవంతుడో చెపుతున్నాడు రావణుడు – "నేను పూర్వము వాలిని, గొప్ప బలము గల జాంబవంతుని, నీలుని, ద్వివిదుని, మొదలగు వానరులను జూచియున్నాను. వారి తేజస్సు, పరాక్రమము నిట్టివి గావు."

వాలికన్నా బలవంతుడట హనుమంతుడు! మరి, హనుమంతుడు కూడా వాలిని జయించలేక, సుగ్రీవుడికి సహాయం చేసేవాళ్ళ కోసం ఎదురు చూస్తూ, రుష్యమూకం మీద పడి ఏడవటం ఎందుకు చేశాడు కవి గారూ? ★

(అబ్బా, సూర్యుడికి ఎంత అవమానం!)

పర్వతం మీద వాన కురిసినట్టుగా హనుమంతుడి మీద బాణ వర్షం కురిసింది. కానీ, హనుమంతుడు గాలిలాగ బాణాలకు అందకుండా తిరిగాడు. హనుమంతుడికి అక్షకుమారుడి వీరత్వం నచ్చింది. "వీడు చాలా చిన్నవాడు, ఎలా చంపను?" అని జాలిపడ్డాడు. (నీ మొహంలే! నీ మొహానికి జాలి కూడానా?) కానీ, మళ్ళీ "వీడు మహా పరాక్రమ వంతుడు. వీణ్ణి ఉపేక్షిస్తే నేనే ఓడిపోవలసి వస్తుంది. రాజుకునే అగ్నికణాన్ని ఉపేక్షిస్తే మహా జ్వాల అయిపోతుంది. వీణ్ణి చంపడమే మంచిది" అనుకున్నాడు. (అవును, చంపుళ్ళే చాలా మంచివి!)

అక్షకుమారుడు, రథంతో ఆకాశాని కెగిరి హనుమంతుణ్ణి వెంటాడి బాణ వర్షంతో ముంచెత్తడం మొదలు పెట్టాడు.

హనుమంతుడు అక్షకుమారుడి రథాన్ని అరి చేతితో ఒక్క చరుపు చరిచాడు. రథం – ఎనిమిది గుర్రాలతో, సారథితో, ఆకాశం నుంచి భూమి మీద పడిపోయింది. అక్షకుమారుడు మాత్రం ధనుస్సుతో ఆకాశంలో కెగిరాడు. హనుమంతుడు అక్షుడి కాళ్ళు దొరక బుచ్చుకుని గిర గిర తిప్పి బండలకేసి కొట్టి చంపేశాడు.

దేవతలూ, గంధర్వులూ, యక్షులూ, రుషులూ, సిద్ధులూ మిక్కిలి సంతోషించి, హనుమంతుణ్ణి మెచ్చుకున్నారు. (వీళ్ళందరికీ చంపుళ్ళు చూడ్డం పెద్ద వినోదం!).

హనుమంతుడు మళ్ళీ గుమ్మం ఎక్కి కూర్చున్నాడు.

★ ★ ★

రావణుడు, కోపం పట్టలేక వెంటనే యుద్ధానికి వెళ్ళమని ఇంకో కొడుకైన ఇంద్రజిత్తుని ఆజ్ఞాపించాడు. "నువ్వు మహా వీరుడివి. పూర్వం ఇంద్రుణ్ణే జయించావు. బ్రహ్మ వరాలతో అనేక అస్త్రాలు సంపాదించావు. నువ్వు మహా శక్తి శాలివి కాబట్టి నిన్ను పంపడానికి నాకు సందేహం లేదు. ఇంతకు ముందు పంపిన వాళ్ళ మీద నా కింత నమ్మకం లేదు. ఈ కార్యం నువ్వే సాధించ గలవు. (ఈ ఏడుపు మొదటే ఏడిస్తే బాగుండేదిగా?) ఆయుధాల వల్లా, సేన వల్లా ఏమీ లాభం లేదు. మంత్ర శక్తితో సాధించు! బ్రహ్మాస్త్రం ప్రయోగించు! జయం మీదే దృష్టి ఉంచు!" (రావణుడు, ఎంత మంది కొడుకుల్నయినా, సైనికుల్నయినా, ప్రజల్నయినా, బలి ఇస్తాడు గానీ, పర స్త్రీని మాత్రం వదలడు!)

ఇంద్రజిత్తు, తండ్రికి ప్రదక్షిణ చేసి, సింహాల రథం మీద గొప్ప సేనతో బయల్దేరాడు.

యుద్ధం చూడాలని దేవతలు ఆకాశం నిండా కూడారు. (ఆకాశంలో పనా పాటా? గద్దల్లాగ ఎగురుతూ తిరగడమే కదా?)

ఇంద్రజిత్తు బాణాలు కొడుతున్నాడు. హనుమంతుడు ఒక్కోసారి గురి తప్పించుకుని చెట్లూ పర్వతాలూ విసురుతున్నాడు. ఒకరి దెబ్బలు ఒకరు భరించ లేక పోతున్నారు.

ఇంద్రజిత్తు ఆలోచించి బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. హనుమంతుడు చేష్టలుడిగి కొయ్యబారి భూమి మీద పడిపోయాడు. (హమ్మయ్య, పడ్డాడా? సెభాష్ ఇంద్రజిత్తూ!) హనుమంతుడు తన మీద బ్రహ్మాస్త్ర ప్రయోగం జరిగిందని గ్రహించాడు. ఇతడికి, బ్రహ్మ, పూర్వం, "నీ మీద బ్రహ్మాస్త్రం క్షణంసేపు మాత్రమే పని చేస్తుంది" అని ఒక వరం ఇచ్చి వున్నాడు. (బ్రహ్మ ఇలాంటి పనికిమాలిన పనులే చేస్తూ వుంటాడు.)

సైనికులందరూ హనుమంతుడి మీదపడి పట్టుకున్నారు. నార గుడ్డలలో, పగ్గాలతో బిగించి కట్టేశారు.

బ్రహ్మాస్త్ర బంధంలో ఉన్న వారిని, ఇతర బంధాలతో, తాళ్ళతో కడితే, బ్రహ్మాస్త్రం శక్తి పోతుంది. (అవును, తాళ్ళ ముందు బ్రహ్మాస్త్రం ఎంతలే, దాని మొహం!)

హనుమంతుణ్ణి సైనికులంతా తాళ్ళతో కట్టడం చూసి ఇంద్రజిత్తు, "అయ్యో! బ్రహ్మాస్త్రం వదిలేసిందే! కార్యం చెడిపోయిందే!" అని విచారించాడు. (మరి సైనికులికి మొదటే చెప్పి మిడకొద్దూ?) బ్రహ్మాస్త్రం వేసిం తర్వాత ఇతర అస్త్రాలు వేసినా పనిచెయ్యవు. పోనీ, బ్రహ్మాస్త్రం మళ్ళీ వేద్దామా అంటే, అది ఒక్కసారే పని చేస్తుంది. మళ్ళీ పని చెయ్యదు. (అబ్బ! ఏం తిరకాసు అస్త్రం బాబూ!)

కానీ, బ్రహ్మాస్త్రం శక్తి తనమీద లేకుండా పోయిందని హనుమంతుడికి తెలియలేదు. (ఏం కవిగారూ, హనుమంతుణ్ణి ఇంత చిన్నబుచ్చారూ?) ఆ శక్తి ఇంకా తన మీద వుందనుకుని, హనుమంతుడు ఎదురు తిరగకుండా వూరుకున్నాడు.

సైనికులంతా హనుమంతుణ్ణి రాజవీధుల్లోంచి ఉత్సాహంతో ఈడ్చుకు పోతున్నారు. తిడుతున్నారు. తన్నుతున్నారు. గుద్దుతున్నారు. పొడుస్తున్నారు. (లాభం లేదు. బండవాడు. ఆ తన్నులు పని చెయ్యవు.)

"ఎవడు వీడు? దరిద్రుడు! ఎక్కణ్ణించి దాపరించాడు? ఏం పని వీడికిక్కడ?" అని లంక ప్రజలు ఒకర్ని ఒకరు ప్రశ్నలు అడుగుతున్నారు.

"పొడవండి. చంపెయ్యండి. నిప్పంటించండి. (నరకండి కుక్కల కొడుకుని!)" అని కేకలేస్తున్నారు జనం వీధులనిండా.

"పదరా, నడువ్!"

"నడుస్తాడా? గెంటండి. కోతి మొహమూ

వాడునూ."[323]

ప్రజలందరూ హనుమంతుణ్ణి రావణుడి దగ్గిరికి ఈడ్చుకుపోయారు.

రావణుడు, హనుమంతుణ్ణి చాలా ఆశ్చర్యంగా చూశాడు. "గొప్ప వీరుడే! నందీశ్వరుడో, బాణాసురుడో అయివుంటాడు" అని విస్తుపోయాడు.

హనుమంతుడు కూడా రావణుణ్ణి దిగ్భ్రమతో చూశాడు. రావణుడి శరీరం నిండా, 'మనసుచేత చేశారా' అన్నంత చిత్ర విచిత్రాలుగా వున్న ఆభరణాలు చూస్తున్నాడు. (కొడుకులు చచ్చిపోతున్నా తండ్రిగారి ముస్తాబులేం తరగలేదన్నమాట!) రావణుడి వక్షస్థలం మీద మణి హారాలు, మేఘాల మధ్య ఎగిరే కొంగల్లా ఉన్నాయి .... వొంటి నిండా చందనం పూతలు .... పరిమళాలు .... పది తలలు .... ముత్యాల కిరీటం .... (ఎన్నో తలకి?) .... స్ఫటికాలూ రత్నాలూ తాపిన బంగారు సింహాసనం .... దానిమీద పట్టు దిళ్ళున్నాయి. అందగత్తెలయిన యువతులు చుట్టూ వింజామరలు వీస్తున్నారు. (అందం లేనివాళ్ళూ, యువతులు కాని వాళ్ళూ విసిరితే, గాలి రాదా? గాలి కూడా యవ్వన వతుల్ని చూద్దానికే వస్తుందా?) రావణుడు, చుట్టూ అనేకమంది మంత్రులతో, సేనాపతులతో కొలువుదీరి కూర్చుని వున్నాడు.

రావణుణ్ణి చూసి హనుమంతుడు – 'రావణుడు గొప్ప రాజ లక్షణాలు గల తేజశ్శాలే. కానీ, ఏం ప్రయోజనం? పరమ దుర్మార్గుడు. కోపం వస్తే లోకాలన్నీ భస్మం చేసి సముద్రంలో ముంచేస్తాడు. (రాముడూ అదే చేస్తానంటాడుగా?) కోపం లేకపోతే ఇంద్రుడంత గొప్ప వాడయ్యేవాడే!' అనుకున్నాడు.[324] (ఇంద్రుడికి ఎప్పుడూ కోపం రాలేదా?) రావణుడు మీసాలు తిప్పుతూ మంత్రుల్ని చూసి, "వీడి వ్యవహారం ఏమిటో తేల్చండి" అని ఆజ్ఞాపించాడు.

ప్రహస్తుడనే మంత్రి హనుమంతుణ్ణి చూసి, "ఎవరు నువ్వు? ఎందుకొచ్చావిక్కడికి? నిజం చెప్పు" అని అడిగాడు.[325]

హనుమంతుడు సమస్తం ఏకరువు పెట్టాడు. "నేను శ్రీరాముడి దూతని. సుగ్రీవుడి మంత్రిని. హనుమంతుడు, నా పేరు. రావణుడితో మాట్లాడే అవకాశం కోసం అశోక వనం పాడు చేశాను. మీ సైనికులు యుద్ధానికి వస్తే, నా ఆత్మరక్షణ కోసం యుద్ధం చేశాను. నేను ఏ అస్త్రాలకూ లొంగను. కానీ, రావణుణ్ణి చూడడం కోసమే బ్రహ్మాస్త్రానికి కట్టుబడ్డట్టు నటించాను" అన్నాడు. తర్వాత రావణుణ్ణి చూస్తూ, "రావణుడా! సుగ్రీవుడు నీకు సోదరుడి వంటివాడు. (సుగ్రీవుడు అటు రాముడికీ సోదరుడే, ఇటు రావణుడికీ సోదరుడే! అప్పుడు రామ, రావణులూ సోదరులే! సీతకి, రావణుడు బావగారే!) సుగ్రీవుడు నీ క్షేమం అడిగాడు. సుగ్రీవుడే నన్ను పంపించాడు. (మరి తను రామ దూతని అంటాడేం, 'సుగ్రీవ దూత'ని అనాలి గానీ?) రావణా! నీకు హితం చెపుతాను విను! మహా పుణ్యాత్ముడైన దశరథ మహారాజు పెద్ద కొడుకు, మహా పుణ్యాత్ముడైన శ్రీరాముడు. తండ్రి ఆజ్ఞ చొప్పున అడవులకొచ్చాడు. భార్య కనపడక అరణ్యాల్లో వెతుకుతూ మా దేశం వచ్చి సుగ్రీవుడితో స్నేహం చేసుకున్నాడు. శ్రీరాముడు సామాన్యుడు కాడు. వాలిని చంపిన మహా వీరుడు. ఆయన ముందు ఎవ్వరూ నిలబడలేరు. నిన్ను చంపే వారెవరూ లేరని విర్ర వీగవొద్దు. నిన్ను చంపడానికి సుగ్రీవుడు చాలు. అతని బారి నుంచి నిన్నెవరూ రక్షించలేరు. నువ్వు చాలా పుణ్యకార్యాలు చేస్తే చేసి వుండవొచ్చును. ఇంతకాలం సుఖంగా ఉన్నందుకే

**323.** సుందర, సర్గ 48, శ్లోకాలు 56, 57: "వీడెవడు? ఎవని మనిషి? ఎచట నుండి వచ్చెను? వీనికి లంకలో నేమి పని? ఇతని యాశ్రయమెద్ది? – అని అచట నుండిన రాక్షస వీరులు పరస్పరము ప్రశ్నలు వేసికొనిరి. అచట మిగుల కోపము గల కొందరు రాక్షసులు, "వీని జంపుడు. కాల్చివేయుడు. భక్షింపుడు" అని పరస్పరము జెప్పుకొనిరి. ★

**324.** హనుమంతుడు రావణుణ్ణి మొదటిసారి అశోక వనంలోనే చెట్టుమీద నించి చూశాడు. అప్పుడు ఇంత ఆశ్చర్యపడిపోలేదు. హనుమంతుడు రావణుణ్ణి ఒకసారి చూశాడన్న సంగతి కవి, మర్చిపోయాడు. ఇదే మొదటిసారి అన్నట్టు వర్ణిస్తున్నాడు. లేకపోతే, రావణుడు సింహాసనం మీద కూర్చున్నప్పుడు చూసినందువల్ల ఇంత తేజస్సుతో కనిపిస్తున్నాడా హనుమంతుడి కళ్ళకి? అంతే అవ్వాలి. రావణుడి తేజస్సంతా ఆ సింహాసనం మీద కూర్చోడం వల్ల (ఆ అధికారం వల్ల) వచ్చిందే. దాని మీద ఎవరెక్కితే వాళ్ళే అంత తేజస్సుతో వెలిగిపోతూ కనపడతారు. రావణుణ్ణి కవి ఎక్కడి కక్కడ బాగానే పొగుడుతాడు. 'గొప్ప పరాక్రమవంతుడు' అంటూ వుంటాడు. ఎందుకంటే, అంత గొప్పవాడూ రాముడి చేతిలో ఓడిపోతాడు కాబట్టి. వాలినీ ఇలాగే పొగిడాడు. గొప్ప గొప్ప వాళ్ళందర్నీ జయించే గొప్పని రాముడికి కట్టబెట్టాలి కదా? ★

**325.** సుందర, సర్గ 50, శ్లోకాలు 6, 7, 8: "ఈ దుర్మార్గుడు ఎచట నుండి, ఎందు నిమిత్తము వచ్చెనో అడుగుము" అన్నాడు రావణుడు. హనుమంతుడు అశోకవనాన్ని సర్వనాశనం చేసి, అంత మంది సైనికుల్ని చంపేశాడు కదా? అలాంటి వాడితో ప్రహస్తుడు ఎలా మాట్లాడుతున్నాడోచూడండి. "ఓ వానరా! ఊరడిల్లుము. నీకు మంగళ మగు గాక! భయపడవలదు. నిన్ను ఇంద్రుడు పంపియుండినటులయితే, ఆ విషయమును నిజముగ తెలుపుము. విడిచి పెట్టెదను." – హనుమంతుణ్ణి ఇంత బుజ్జగించడం ఏమిటి? 'నిన్ను విడిచిపెడతానని, రాజు ప్రమేయం లేకుండానే మంత్రి అనడం ఏమిటి? అంత బీభత్సం చేసి, అంత మందిని చంపిన వాణ్ణి ముద్దు చేసి విడిచిపెడతాడట! ★

నీ పుణ్యం అంతా ఖర్చయిపోయింది. ఇక నువ్వు పాప ఫలం అనుభ వించవలసిందే. జనస్థానంలో నీ బల గాన్నంతా సర్వనాశనం చేశాడు రాముడు. వాలిని చంపాడు. సుగ్రీవుడితో ఏకమయ్యాడు. ఇక నీకు చావు తప్పదు. అసలు నేనే నిన్ను సంహరించగలను గానీ .... శ్రీరాముడు నిన్ను చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు. కాబట్టి, నేను ఊరుకుంటున్నాను.

సీతాదేవి సామాన్యురాలనుకుంటున్నా వేమో! నీ పాలిట యమ పాశం! కాళ రాత్రి! పర స్త్రీని బంధించడం నీ వంటి బుద్ధిమంతునికి తగదు. (సీతని తీసుకు రాక ముందు రావణుడు బుద్ధిమంతుడే నన్న మాట!) సీతని శ్రీరాముడికి సమర్పించి శరణు కోరుకో! లేకపోతే, మృత్యువు నీ పక్కలోనే ఉంటుంది. శ్రీరాముడి ముందు ఇంద్రుడే నిలబడ లేడు. ఇక నువ్వెంత? ....” అలా సాగించాడు.

“వీణ్ణి వెంటనే చంపెయ్యండి!” అని రావణుడు రౌద్రంగా అరిచాడు. (అబ్బా! ఎంత మంచి రౌద్రమో! అలాగుండాలి రౌద్రం?)

రావణుడి చిన్న తమ్ముడైన విభీషణుడు వినయంగా లేచాడు – “మహారాజా! శాంతించు! కరుణించి నా విన్నపం ఆలకించు! సన్మార్గులైన రాజులు, ఒకరి మాటలు ఒకరికి అందజేసే దూతకు మరణ దండన విధించకూడదు. దూతను చంపడం రాజ నీతికి విరుద్ధం సుమా!” అన్నాడు.

రావణుడు రుద్రుడై, “వీడు దుర్మార్గుడు. వీణ్ణి చంప డంలో తప్పు లేదు. దూతలు ఇంత దుర్మార్గానికి తలపడ వచ్చునా?” అని గర్జించాడు. (ఎంత మంచి గర్జనో! అలాగుండాలి గర్జన!)[326]

విభీషణుడు మరీ వినయంగా వొంగాడు. “మన్నించు మహారాజా! ఈ దూత మనకు అమితమైన హాని కలిగించిన మాట నిజమే. అయినా, దూతకు మరణ దండన విధించ కూడదు. ఇతర శిక్షలు ఏవైనా విధించ వచ్చును. అంగాలు ఛేదించ వచ్చును. తల బోడి చేయవచ్చును. కొరడా దెబ్బలు కొట్టించవచ్చును. వాతలు పెట్టించ వచ్చును. వధ తప్ప ఏ విధంగా నైనా దండించ వచ్చును. సమస్త దేశాల్లోనూ, సమస్త జాతు ల్లోనూ, దూతను చంప కూడదనే నీతిని పాటిస్తారు. నీ వంటి జ్ఞానికి నేను చెప్పదగ్గ వాడిని కాను. నీ వంటి ఉత్తముడికి ఈ కార్యం తగదు. మంచి చెడ్డలన్నీ నీకు తెలుసు. లోకంలో ధర్మమంతా ఎరిగిన వాడివి నువ్వు. కోపం కొద్దీ అంటున్నావు గానీ, కోపానికి లొంగితే శాస్త్ర పాండిత్యమంతా వ్యర్థమై పోతుంది. (ఆ ముక్క కూడా శాస్త్రాల్లో వుండదా? ఉంటే, అది రావణుడికీ తెలుస్తుంది కదా?) ఇతని నేరాలు విచారించి దండించవలసిందే. ప్రాణ హాని మాత్రం కలగనివ్వ కూడదు. ఈ దూతని వదిలిపెట్టి ఇతని స్వామిని దండించాలి. ఇతన్ని విడిచి పెడితేనే ఇతను పోయి ఇక్కడి సంగతులన్నీ తన యజ మానికి చెప్పుకుంటాడు. అప్పుడు నీకూ, రాముడికీ యుద్ధం పొసుగుతుంది. నీ వీరత్వం జగద్విఖ్యాతం అవుతుంది. యుద్ధమంటే నీ కేమీ లక్ష్యం లేదు. నీ మేలు కోరి పోరే శూరులూ, విశ్వాసపాత్రులూ, నీ పోషణలో ఉన్న సైనికులూ కొల్లలుగా వున్నారు. నువ్వు కోరితే ఈ క్షణంలోనే యుద్ధానికి పోవొచ్చును. యుద్ధ లాభం పోగొట్టుకోవడం తెలివైన పని కాదు. నువ్వు మహా వీరు డివే కాదు, మహా జ్ఞానివి కూడా. మహా పండితుడివి. మహా ధర్మాత్ముడివి. శాస్త్రాలన్నీ ఎరిగిన వాడివి. ఉత్తమోత్తముడివి. నీకు సమానుడీ లోకంలో లేడు. నా మాట మన్నించి దూతను విడిచిపెట్టు.”

రావణుడు ఆలోచనలో పడ్డాడు. (కాదులే, పొగ డ్తల్లో పడ్డాడు.) “సరే, ఏదో గట్టి శిక్ష వెయ్యండి! ఆ

**326.** సుందర, సర్గ 52, శ్లోకం 12: రావణుడికి హనుమంతుడి మీద కోపం రాలేదని రాయడానికి కుదరదు కాబట్టి, ఆ కోపాన్ని చూపించక తప్పదు. రావణుడు హనుమంతుణ్ణి చంపుతానన్నాడని రాయక తప్పదు. కానీ అలా అనడం చాలా తప్పు అట! ఎంత తప్పని కవి అంటున్నాడో చూడండి.“అధర్మమునకు మూలముగను, మిక్కిలి దోషముతో కూడినదిగను, నీచులు విని సంతోషించదగినదిగను నుండు రావణుని మాటను, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడగు విభీషణుడు విని, మేలైన అర్థతత్వముతో మాటలాడెను” – కవి, విభీషణుణ్ణి కీర్తిస్తున్నాడు. “దూత అయితే ఇలా చేయవచ్చునా?” అని రావణుడు అనడం, అధర్మమట! దోషం! నీచం! మొత్తం లంకలో విభీషణుడు ఒక్కడు మాత్రం చాలా బుద్ధిమంతుడిగా కనపడుతున్నాడు కవికి. త్రిజట కలలో కూడా – లంకలో వీరులందరూ నరకానికి పోతే, విభీషణుడు ఒక్కడూ ఏనుగు మీద ఎగురుతూ స్వర్గానికి పోయాడు!

అసలు రావణుడూ, కుంభకర్ణుడూ, శూర్పణఖా, పుట్టినప్పుడు మహా వికారంగా ఉన్నారు గానీ, విభీషణుడు అలా లేడట! (ఉత్తరకాండ, 9, 10 సర్గల్లో.) “కైకసి కడసారపు కొడుకు విభీషణుడు. వాడు ధర్మాత్ముడు. వాడు పుట్టినప్పుడు పుష్ప వర్షం కురిసింది. ఆకాశాన దేవ దుందుభులు మోగాయి.”

బ్రహ్మ విభీషణుణ్ణి “నీకేం కావాలి?” అని అడిగినప్పుడు కూడా విభీషణుడు చెడ్డ కోరికలు కోరుకోలేదు. “నా బుద్ధి ఎప్పుడూ ధర్మం విడిచిపెట్టకుండా ఉండాలి” అని కోరుకున్నాడు. ఈయన ధర్మం ఏమిటో, ఈయన్ని బుద్ధిమంతుడని కవి ఎందుచేత కీర్తిస్తున్నాడో, ఇంకా తర్వాత చూస్తాం. ★

తోకని కాల్చి పారెయ్యండి! వెళ్ళి, తన వాళ్ళకి మొహం ఎలా చూపిస్తాడో! తోకకు నిప్పుపెట్టి వీధులన్నీ తిప్పండి" అని ఆజ్ఞాపించాడు మహారాజు.

సైనికులు హనుమంతుడి తోకనిండా గుడ్డలు చుట్టి, నూనె పోసి నిప్పంటించారు. అరుపులతో, డప్పులతో, కేకలతో, నవ్వులతో, ఊరేగింపు బయల్దేరింది.

తనని తన్నుతూ, గుద్దుతూ వీధుల్లో తిప్పుతోంటే హనుమంతుడు, 'రాత్రి ఈ వీధులన్నీ సరిగ్గా చూడ లేదు. పగలు బాగా చూడవచ్చునులే' అని సంతోషించాడు.

పెద్ద గోలతో ఊరేగింపు సాగుతోంది. స్త్రీలూ, వృద్ధులూ, పిల్లలూ, అందరూ ఇళ్ళల్లోంచి బయటికి వచ్చి హనుమంతుణ్ణి తిట్టి సంతోషిస్తున్నారు.

"ఏం దూతవిరా నువ్వు? దరిద్రుడా! (నీ మొహం మండా!)" అని ప్రజలంతా ఉత్సాహంతో తిట్టారు.[327] (లంకలో ప్రజలంతా రాజకీయ చైతన్యం గల వాళ్ళలా తోస్తున్నారు కదూ?)

హనుమంతుడు, వీధుల్లో తిరుగుతూ కొత్త కొత్త విమానాలూ, రహస్య భూ గృహాలూ కూడా చూశాడు.

అశోక వనంలో దాసీలు సీత దగ్గిరికి పోయి సంతోషంగా, "నీ కోసం వచ్చిన ఆ కోతి మొహం వాడి పని అయిందిలే. తోకకి నిప్పుపెట్టి ఊరేగిస్తున్నార్లే!" అని చెప్పారు.

సీత చాలా దుఃఖించి అగ్నిదేవుణ్ణి ప్రార్థించింది. "అగ్నిదేవుడా! పతివ్రతలకు కలిగే ఫలం నాకు కలుగునట్లయితే, హనుమంతుణ్ణి కాల్చకు, చల్లబడు! నాకు నా భర్తని కలిసి జీవించే అదృష్టం ఉండినట్లయితే, హనుమంతుణ్ణి కాల్చకు, చల్లబడు! సుగ్రీవుడు నన్నీ దుఃఖ సముద్రం నుంచి దాటించగల వాడు అయితే, హనుమంతుడికి చల్లబడు! నేను సచ్చరిత్ర గలదానినైతే, హనుమంతుడికి చల్లబడు!" అని మళ్ళీ మళ్ళీ ప్రార్థించింది.

హనుమంతుడికి, తోక, మంటలు మండుతోన్నా బాధ లేకుండా చల్లగా అయింది. హనుమంతుడు శ్రీరాముణ్ణి తలుచుకున్నాడు. "ఇది శ్రీరాముడి దయే. సముద్రం దాటుతూ వున్నప్పుడు కూడా ఇలాగే మైనాకుణ్ణి పంపించాడు. అంతా రాముడి దయే. అగ్ని కూడా శ్రీరామ కార్యానికి సహాయం చెయ్యాలని చల్లబడింది" అనుకున్నాడు. శరీరం పెంచి, కట్లు తెంపేసుకున్నాడు మండే తోకతో, చుట్టూ జనాన్ని బాదేసి, రయ్యిన పైకెగిరాడు. వెంటనే మళ్ళీ ఒక గుమ్మానికున్న ఇనప గడియ ఊడదీసి, కావలి వాళ్ళందర్నీ కొట్టాడు. ఇంకా కోపం తీరక, 'లంకంతా కాల్చేస్తాను. శత్రువుకి ఇంకా హాని కలిగిస్తాను' అనుకున్నాడు. మండే తోకతో నిర్భయంగా ఆకాశంలో మెరుపులాగ ఇళ్ళ మీద ఎగరడం మొదలుపెట్టాడు.

ప్రహస్తుడి ఇల్లూ, మహాపార్శ్వుడి ఇల్లూ, ఇంద్రజిత్తు ఇల్లూ, జంబుమాలీ, సుమాలీ, కుంభకర్ణుడూ, మొత్తం అందరి ఇళ్ళూ వాటికవే అంటుకున్నాయి. (విభీషణుడి ఇంటికి మాత్రం ఈ గాలి సూత్రం వర్తించలేదు!)

హనుమంతుడు ఉత్సాహంతో ఎగురుతూ పోయి రావణుడి మేడలన్నీ అంటించేశాడు.

సుందరమైన గృహాలన్నీ మసిబారి పెద్ద పెద్ద పేలుళ్ళతో భగ భగ మండడం మొదలుపెట్టాయి. కాలి, పెళ్ళలు పెళ్ళలు విరిగి కూలుతున్నాయి.

లంకంతా, ప్రజల రోదనలతో, కేకలతో, ఆర్త నాదాలతో నిండి పోయింది. "నాధుడా! తమ్ముడా! పుత్రుడా! .... స్నేహితుడా .... బిడ్డడా! .... అయ్యో నాయనా! ...." అనే పిలుపులు మిన్ను ముట్టాయి. ప్రజలు, ప్రాణ భయంతో మండుతోన్న గృహాల మధ్య నుంచి పరిగెత్తుతున్నారు. స్త్రీలూ పిల్లలూ ఏడుపులతో కాలుతోన్న గుమ్మాలలోంచి బయటపడే దారి లేక, "రక్షించండి, రక్షించండి." అని ఆర్తనాదాలు చేస్తున్నారు.

పసిబిడ్డల్ని గుండెల కదుముకున్న తల్లులు, మేడలు దిగే దారి లేక ఇటూ అటూ పరుగులెత్తి, తొట్రుపడి కింద పడిపోతున్నారు.

బళ్ళూ, రథాలూ, ఇళ్ళ కప్పులూ, ఫెళ ఫెళ పేలుతున్నాయి.

ఎన్ని శవాలు చచ్చి కిందపడినా భూమి తృప్తి పడలేదు. ఎన్ని కట్టెల్ని కాల్చినా అగ్ని తృప్తి పడలేదు. లంకంతా బూడిదైపోయినా హనుమంతుడు తృప్తి పడలేదు.

(కాలుతోన్న లంక, కవికి, ఎంత సుందరంగా కనపడుతోందో ఇప్పుడు చూడండి!)

అగ్ని జ్వాలలు రక రకాల పూలలాగ ప్రకాశిస్తున్నాయి – కొన్నిచోట్ల ఎర్రగా కుంకుమ పూలలాగ, కొన్నిచోట్ల తెల్లగా బూరుగు పూలలాగ, కొన్నిచోట్ల .... మోదుగు పూలలాగ! మంటల్లోంచి పొగతో లేచే మేఘాలు, నల్ల కలువలలాగ తోస్తున్నాయి.

ఉత్తములైన రాక్షసులు కొందరు గుంపులుగా జేరి, "ఆహా! ఈ హనుమంతుడు సామాన్య వానరుడు కాదు. రాక్షసుల్ని నాశనం చెయ్యడానికి, అద్వితీయమైన విష్ణు

---

**327.** **సుందర, సర్గ 53, శ్లోకాలు 23, 24:** రాక్షసులు ముంగిళ్ళలోనూ, మంటపములలోనూ, రాజ మార్గములలోనూ గూడి, 'ఈ కపియే దూత'యని కేకలు వేసిరి. మందుచుండు తోక గల హనుమంతుని జూడగోరి స్త్రీలు, బాలురు, వృద్ధులు సంతోషముతో ఇండ్ల నుండి గుంపులు గుంపులుగా వీధులలోనికి వచ్చిరి. క్రూర చిత్తులగు రాక్షసులు, పాపిష్ఠులగు రాక్షసులు, హనుమంతుని గొట్టి, తిట్టిరి. ★

తేజస్సే ఈ రూపంలో వచ్చి ఉంటుంది. (ఇలా అను కుంటున్న వాళ్ళూ రాక్షసులే. వాళ్ళ ఇళ్ళూ కాలు తున్నాయి. అయినా వీళ్ళు హనుమంతుణ్ణి పొగుడు తున్నారు. వీళ్ళు విభీషణుడి పక్షం అయినా, ఇలా ఇళ్ళన్నీ తగలబడడం వీళ్ళకి నచ్చుతుందా?) రాక్షసుల మీద బ్రహ్మకు ఉన్న కోపమంతా ఈ వానర రూపు దాల్చిం దేమో! లేక ఇతడు దేవతల ప్రభువైన ఇంద్రుడేమో! లేక చంద్రుడేమో! .... ఇతని తేజస్సు ఎంత గొప్పది! యముడో, సూర్యుడో అయి వుంటాడు!" అని చెప్పు కున్నారు.

(కవి పిలక్కీ, పంచెకీ, నిప్పంటించి విడిచి పెడితే, గంతులేసేటప్పుడు, నోట్లోంచి ఏం మాటలు వస్తాయో తెలుసుకునే వాడు. "ఆహా! ఎంత గొప్పగా జ్వాలలు తీరి వెలుగుతోంది నా పిలక! ఆహా, ఎంత కాంతిగా నాలి కలు చాచి మండుతోంది నా పంచె! .... నా కిలా నిప్పం టించిన వారు దేవతలై వుంటారు. కిన్నరులో, కింపురు షులో అయి వుంటారు. సూర్యులో, చంద్రులో అయి వుంటారు" అని కీర్తిస్తాడో, లేకపోతే ప్రాణభయంతో గంతులేస్తూ ఆర్తనాదాలు చేస్తాడో!)

హనుమంతుడు శ్రీరామ చంద్రుణ్ణి ధ్యానం చేస్తూ తను చేసిన ఘన కార్యాలన్నీ తలుచుకుని సంతోషిం చాడు.

ఆకాశంలో దేవతలంతా హనుమంతుణ్ణి కీర్తిం చారు. లంకకు చాలా హాని కలిగించినందుకు ఎంతో సంతోషించారు.[328]

హనుమంతుడు, తోకని సముద్రంలో ముంచి, చల్లార్చుకున్నాడు. సీత సంగతి గుర్తొచ్చింది. – 'అయ్యో! సీతాదేవి కూడా కాలిపోయే ఉంటుంది. ఎంత తప్పు పని చేశాను! స్వామి కార్యం పాడు చేశానే! నేను చేసిన మంచి పనులన్నీ వ్యర్థమై పోయాయే! అందుకే కోపం నాశనహేతువన్నారు. కోపిష్టులు గురువుల్ని కూడా చంపుతారు. నేను శ్రీరాముడి భార్యను చంపాను. అయ్యో! సీత క్షేమం ఆలోచించలేకపోయానే! సీత మరణించి వుంటే, నే నిక కిష్కింధకు పోయి ఏం లాభం? .... సీత మరణ వార్త విని రామ లక్ష్మణులు మరణి స్తారు. ప్రియ మిత్రుడి మరణం చూసి సుగ్రీవుడు మర ణిస్తాడు. అయోధ్యలో భరతుడూ, శతృఘ్నుడూ మరణి స్తారు. (చావుల్లో మాత్రం శతృఘ్నుణ్ణి కూడా కలుపు తారు!) రఘు వంశం నశించిపోతే ప్రజలంతా భోరున ఏడుస్తారు. ఛీ! ఇదంతా నా కోతి బుద్ధి వల్ల జరిగింది. నేను కిష్కింధకు పోనే పోను. ఇక్కడే ప్రాణ త్యాగం చేస్తాను .... నేనీ విధంగా శంకిస్తున్నాను గానీ .... శ్రీరాముని భార్యని అగ్ని ముడుతుందా? నన్నే దహించ లేదే!' అని ఆలోచనల్లో మునిగి చింతించాడు హను మంతుడు.

ఆకాశంలో దేవతలు చెప్పుకునే మాటలు విన పడ్డాయి. – "ఆహా! లంక అంతా కాలింది గానీ సీతాదేవి ఉన్న ప్రదేశం సురక్షితంగానే ఉందే! లంక ప్రజలంతా రోదిస్తున్నారు గానీ, సీతాదేవి క్షేమంగానే ఉందే! హను మంతుడు గొప్ప కీర్తి గల కార్యం చేశాడు" అని చెప్పు కుంటున్నారు దేవతలు.

హనుమంతుడు సీత క్షేమం తెలిసి, సంతోషిం చాడు. 'నేనే వెళ్ళి స్వయంగా చూస్తాను' అనుకుని, అశోక వనంలోకి ఎగిరి సీత ముందు వాలాడు. "తల్లీ! నువ్వు దైవ యోగం చేత జీవించి ఉన్నావు. నిన్ను మళ్ళీ నేను చూడగలిగాను" అన్నాడు.

---

**328.** సుందర, సర్గ 54, శ్లోకాలు 18 ... 44: లంకా దహన వర్ణనలు చూడండి!

"కోటి సూర్యులతో సమానుడగు అగ్ని, పిడుగులు పడినటుల, నానా విధములగు భయంకరమైన శబ్దములచే, బ్రహ్మాండమును జీల్చు దానివలె, లంక నంతయును జుట్టుకొని వెలిగెను." – "ఓ తండ్రీ! ఓ బిడ్డా! ఓ కాంతుడా! .... ఓ జీవితమా! .... అన్నియు నాశనమైనవి గదా?" అని చెప్పు కొనుచు రాక్షసులు కొందరు బహు విధముల ధ్వనులు చేసిరి." – "కొందరు స్త్రీలు, తలలు విరియ బోసుకుని, చంటిబిడ్డల నెత్తుకొని, కాలుచుండు మిద్దెల మీద నుండి, త్వరగ కిందబడుచు ఆకాశములో మెరుపుల వలె ప్రకాశించిరి." – "అగ్ని, కట్టెల చేతనూ, కసవు చేతనూ తృప్తి గాంచలేదు. రాక్షసుల శవములతో భూమి తృప్తి పొందలేదు. వానర శ్రేష్టుడగు హనుమంతుడు, నిప్పు పెట్టి తృప్తి పొందలేదు." – "అగ్ని జ్వాలలు కొన్ని ప్రదేశ ములలో మోదుగు పూల వలెను, కొన్నిచోట్ల బూరుగు పూల వలెను, కొన్ని చోట్ల కుంకుమ పూల వలెను ప్రకాశించినవి." – "కొన్నిచోట్ల, అగ్ని చల్లారిపోవు సమయములో, పొగ వ్యాప్తమై చేరిన మేఘములు నల్ల కలువల వలె ప్రకాశించినవి." – "లంకలో నుండు ఉత్తములగు రాక్షసులందరును గూడి ఈ ప్రకారము జెప్పుకొనిరి." – "సమస్తమైన దేవతలూ, రుషి శ్రేష్ఠులూ, గంధర్వులూ, విద్యాధరులూ చెప్పుటకు సాధ్యము గాని సంతోష మును బొందిరి." – ఈ విధంగా – పసిబిడ్డల ఆక్రందనలతో, ప్రజల రోదనలతో, ప్రాణభయాలతో చేసే హాహాకారాలతో నిండిన లంకా దహన సౌందర్యమే – 'సుందర కాండ!' ఈ 'సుందర కాండ'ని పారాయణం చేస్తే, వర్షాలు కురుస్తాయనీ, కరువులు పోతాయనీ, శుభం కలుగుతుందనీ, చెపుతారు.

ఏ పరదేశపు రాజో మన దేశం మీద దండెత్తితే, మన సిరి సంపదలు దోచుకుంటే, మన దేవాలయాలు ధ్వంసం చేస్తే, మనకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలిగిస్తే, మనం ఆ రాజుని తిడతామా, పొగుడుతామా? గూండా రామ దూత లంకలో చేసింది ఏమిటి? అతన్ని లంక ప్రజలు ఎందుకు కీర్తిస్తారు? ★

సీత, హనుమంతుడు చేసిన పనికి మిక్కిలి సంతోషించి, కీర్తించింది. "నువ్వు శత్రు సంహారకుడవు. నీ బలమే నీకు కీర్తి కలిగిస్తుంది. నువ్వే వీరినందరినీ చంపగల సమర్థుడవు. వానర సేననంతా ఇక్కడకు తీసుకురాగల ఖ్యాతి కూడా నీకే కలుగుతుంది. శ్రీరాముడు వచ్చి లంకని ఇంకా ధ్వంసం చేసి, సర్వనాశనం చేసి, నన్ను తీసుకుని వెళ్ళినప్పుడే ఆయనకు కీర్తి. శ్రీరాముణ్ణి ప్రోత్సహించు వాడవు నువ్వే."

హనుమంతుడు సీతకు నమస్కరిస్తూ, "శ్రీరాముడు తొందరలోనే, అపారమైన వానర సేనలతో, ఎలుగుల సేనలతో వచ్చి, లంకని ధ్వంసం చేస్తాడు తల్లీ! నిశ్చింతగా ఉండు" అని చెప్పి, అక్కడి నించి ఎగిరివెళ్ళి సముద్రపొడ్డున పర్వతం మీద వాలాడు.

సముద్రం దాటడానికి శరీరం పెంచుతూ పెంచుతూ, పెద్ద పెద్ద పర్వత శిఖరాలన్నీ గులకరాళ్ళ గుట్టలు చేశాడు. హనుమంతుడి పాదాల కింద పర్వత గుహలు పిచ్చుక గూళ్ళలాగ చితికిపోయి, ఆ గుహల్లో సింహాలు భయంకరంగా గర్జనలు చేశాయి. పర్వతం నిండా నివాసం ఉన్న విద్యాధర స్త్రీలు పైటలు జారుతూ, (స్త్రీల పైటల్ని జార్చే వర్ణనల విషయంలో మాత్రం కవిగారెన్నడూ అశ్రద్ధగా ఉండరు.), కంఠాలలో నగలు చిక్కులు పడుతూ ఆకాశాని కెగిరారు. మహా సర్పాలు హనుమంతుడి పాదాల కింద తొక్కుపడ్డాయి. అరిష్ట పర్వతం హను మంతుడి పాదాల కింద నలిగి నలిగి భూ మట్టానికి దిగిపోయింది.

హనుమంతుడు చంద్రుడిలాగ ఆకాశంలో కెగిరాడు. చంద్రుడిలాగ, గురుడుడిలాగ మేఘాల్లో మునిగి తేలుతూ పోతున్నాడు. సూర్య చంద్రుల్నీ, నక్షత్రాల్నీ, తనతో ఈడ్చుకు పోతున్నట్టు పోతున్నాడు. పర్వత గుహలలో గాలి శబ్దాలు చేసేటట్టు, విజయో త్సాహంతో గర్జిస్తూ పోతున్నాడు. హనుమంతుడి గర్జనలు, ఆకాశం ఫెళ ఫెళ విరుగుతున్నట్టు, మహేంద్ర పర్వతం మీద ప్రతిధ్వనిస్తున్నాయి.

మహేంద్ర పర్వతం నిండా ఉన్న వానరులు, హనుమంతుడు వచ్చేస్తున్నాడనే ఉత్సాహంతో గంతు లేశారు. జాంబవంతుడు, "హనుమంతుడు, కార్యం ముగించుకుని వస్తున్నాడు. లేకపోతే అలా సింహ నాదాలు చెయ్యడు" అని సైనికులందర్నీ సంతోష పెట్టాడు. సైనికులందరూ పెద్ద పెద్ద చెట్ల మీద చిటారు కొమ్మల కెక్కి, హనుమంతుడు చూడాలని పూల కొమ్మలు ఆడించారు.

హనుమంతుడు, ఎగురుతూ వొచ్చి వొచ్చి రెక్కలు తెగిన పర్వతం లాగ జారాడు మహేంద్ర పర్వతం మీద. అందరూ సంతోషంతో చుట్టూ చేరారు.

కొందరు పళ్ళూ, దుంపలూ తెచ్చి పెట్టారు.

"సీతను చూశాను!" అన్నాడు హనుమంతుడు.

"చెప్పు. చెప్పు, వివరంగా చెప్పు!" అన్నారు అందరూ సంతోషంగా. (సీత కనపడితే మరణ శిక్ష లుండవనీ, సుఖంగా ఇంటికి పోవొచ్చనీ.)

హనుమంతుడు గంభీరంగా మొదలు పెట్టాడు. "నేనీ పర్వతం మీద నుంచి బయల్దేరాను కదా? .... సముద్రం మీద పడవలాగ పోతూ ఉన్నాను .... అప్పుడు మైనాకుడనే పర్వతరాజు ...." అంటూ ప్రారంభించి, తను మైనాకుడి ఆతిథ్యం తిరస్కరించడం, సురస నోట్లో దూరి బయటపడడం, సింహికని చంపడం, అవతలి గట్టు చేరి రాత్రి లంక దేవతతో పోట్లాడడం, లంకంతా గాలించడం, చివరికి అశోక వనంలో సీతని చూడడం, అక్కడికి రావణుడు భార్యలతో రావడం, వాడు సీతని బెదిరించడం, సీత రావణుణ్ణి తిరస్కరించడం, త్రిజట కలా, తను సీతతో మాట్లాడడం, సీత తనతో రాననడం, చూడామణి ఇవ్వడం, తర్వాత తను అశోకవనం పాడు చెయ్యడం, లంకలో యుద్ధం, చివరికి లంకని కాల్చడం – అన్నీ పూస గుచ్చినట్టు చెప్పాడు. (కొన్ని కల్పించి కూడా! రావణుడు సీతని కొట్టబోయాడనీ, మండోదరి రావణుణ్ణి ఆపిందనీ, సీత రెండు నెలలు మాత్రమే జీవిస్తాననన్నదనీ .... ఇంకా అక్కడ జరగనివి కూడా చెప్పాడు.) హనుమంతుడు లంకలో విషయాలన్నీ చెప్పి, "చక్కని పిరుదులు గల సీత పతివ్రతగానే ఉంది. తీరా ఈ ప్రయత్నాలన్నీ చేసినందుకు వ్యర్థం కాలేదు. రావణుడు కూడా తపస్సంపన్నుడు. అందుకే సీతని ముట్టుకున్నా, నాశనం కాలేదు. సీతకున్న శక్తి అగ్నికి కూడా లేదు. సీతకు పూర్తిగా కోపం వస్తే ఆమె చెయ్యలేని కార్యం లేదు.

మనం కిష్కింధకు పోవద్దు. మళ్ళీ లంకకే పోదాం. రావణుణ్ణి చంపేసి, సీతను తీసుకుని, అప్పుడే కిష్కింధకు పోదాం. (సీత, 'రాను మొర్రో' అన్నా సరే.) జాంబవంతుడూ, అంగదుడూ, పనసుడూ, నీలుడూ అందరూ వెళ్తే లంకని విధ్వంసం చెయ్యడానికి ఒక్క క్షణం పట్టదు. (లంకకు వెళ్ళ గల వీరులు ఇప్పుడు మరికొందరు తయారయ్యారా? వీళ్ళు ఎగరలేమని చెప్పారు కదా గతంలో?) బలిసిన స్తనాలు గల సీత, నిద్రాహారాలు విడిచి కృశించి వుంది. సుందరమైన పిరుదులు గల సీత, పతి వియోగంతో జాలి కలిగించేటట్టు దీనంగా ఉంది. సీత, తన పాతివ్రత్య మహిమతో రావణుణ్ణి చంపలేదంటే కారణం, అది రావణుడి మహత్యమే. (కవిగారికి ఇప్పుడు కొత్త పాయింటు జ్ఞాపకం వచ్చిందన్నమాట 'రావణుడి మహిమ' అనేది!) 'సీతని రక్షించి తీసుకు పోదాం. మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి" అన్నాడు హనుమంతుడు.

అంగదుడు, "అవును. నువ్వు చెప్పింది బాగుంది. సీతని చూశాం గానీ, తీసుకు రాలేదని శ్రీరాముడితో ఎలా చెప్పగలం? పరాక్రమంలో మనల్ని దేవతలు కూడా జయించలేరు గదా? లంకకు పోదాం" అన్నాడు.

కానీ జాంబవంతుడు, "శ్రీరాముని అభిమతం తెలియకుండా మనం ఏమీ చెయ్యకూడదు" అని వారిని ఆపాడు.

★ ★ ★

అందరూ సంతోషంగా కిష్కింధవేపు బయ ల్దేరారు. కిష్కింధ దరిదాపుల్లో కొచ్చారు. అక్కడ మధు వనం అనే ఒక వనం ఉంది. అది సుగ్రీవుడికి చాలా ఇష్టమైన వనం. దాన్ని సుగ్రీవుడి మేనమామ దధి ముఖుడు కొంత పరివారంతో రక్షిస్తున్నాడు. వానరు లందరూ అందులో ప్రవేశించారు. మధు పానం చెయ్య డానికి అనుమతి ఇవ్వమని అంగదుణ్ణి అడిగారు.

హనుమంతుడు అందరికీ అభయమిస్తూ "మీ ఇష్టం వచ్చినట్టు తాగండి. ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించండి. ఎవరైనా అడ్డగిస్తే వాడి పని నేను పడతాను" అని రంకె లేశాడు (ఇంకా లంకలో ఉన్నా ననుకుంటున్నాడు, తాగి తాగి!!)

"హనుమంతుడు గొప్ప కార్యం చేసుకుని వచ్చాడు. అతను చెప్పినట్టే వినండి" అన్నాడు అంగదుడు.

వానరుల ఆగడం ఇంకా ఎక్కువైంది. వన పాల కులు వెళ్ళి దధిముఖుడికి చెప్పుకుని ఏడ్చారు. దధి ముఖుడు కోపం పట్టలేక, ఒక చెట్టు పట్టుకుని సైనికుల్ని కొట్టడానికి బయల్దేరాడు.

అంగదుడు, దధిముఖుణ్ణి నేలమీద పడగొట్టి మోకా ళ్ళతో కుమ్మి, స్పృహ తప్పేటట్టు కొట్టాడు.

దధిముఖుడు కొంతసేపు మూర్ఛబోయి, లేచి, "మహారాజుకి చెపుతాను. తప్పకుండా అంగదుణ్ణి బెత్తా లతో కొట్టిస్తాడు" అని రయ్యిన ఎగిరి సుగ్రీవుడి దగ్గిరికి వెళ్ళాడు.

సుగ్రీవుడు రామ లక్ష్మణుల దగ్గిర ఉన్నాడు. (దధి ముఖుడు, మొదట రాజభవనానికి వెళ్తే, అక్కడ సుగ్రీ వుడు లేకపోతే, మళ్ళీ రయ్యిన రుష్యమూకానికి వొచ్చి వాలి ఉంటాడు. ఎగురుళ్ళేగా?)

దధిముఖుడు సుగ్రీవుడితో, "అంగదుడు సైన్యంతో వచ్చి మధువనం సర్వనాశనం చేశాడు. నేను వారించ బోతే, నా వొళ్ళంతా రక్తాలు కారేటట్టు కొట్టాడు. వన పాలకు లందర్నీ కూడా కొట్టాడు" అని చెప్పాడు.

లక్ష్మణుడు, సుగ్రీవుణ్ణి – "ఈ వన పాలకుడేం చెపు తున్నాడు? ఎందుకు దుఃఖిస్తున్నాడు?" అని అడిగాడు. (వాళ్ళ భాష తెలీదు గావున్ను.)

సుగ్రీవుడు విషయం చెప్పి, "దక్షిణ దిక్కుకు పోయిన వాళ్ళందరూ అంత ఉత్సాహంగా ఉన్నారంటే, కార్యం సాధించుకు వచ్చారన్న మాట! సీత కనబడే ఉంటుంది. ఆ పని హనుమంతుడే సాధించి ఉంటాడు. ఇంకెవ్వరూ చెయ్యలేరు. హనుమంతుడు పరాక్రమవంతుడు. బుద్ధి మంతుడు, ఆలోచనా పరుడు" అని మెచ్చుకుని, దధి ముఖుడితో, "వారు సీతాదేవిని చూసి వచ్చి, ఆ సంతో షంతో మధుపానం చేసి ఉంటారు. సీతాదేవిని చూడక పోతే అంగదుడు తిరిగి రానే రాడు. వారు చేసినదానికి నేను చాలా సంతోషించాను. వారి తప్పేం లేదు. నేను తొందరగా వారిని చూడాలి" అని తొందర పడ్డాడు. ('మహా రాజుతో చెప్తే మరి రెండు తన్నమన్నాడు' అంటారే, సరిగ్గా అలాగే వుంది ఇది.)

దధిముఖుడు కూడా సంతోషించి రయ్యిన ఎగిరి, మధువనంలో అంగదుడి ముందు వాలాడు. "యువ రాజా! నన్ను క్షమించు, మీరు నెరవేర్చుకు వచ్చిన కార్యం సంగతి తెలియక మిమ్మల్ని అడ్డగించాము. మహారాజు మీ రాక కోసం ఆతృత పడుతున్నాడు" అని చెప్పాడు.

అంగదుడు వానరులతో, "మనం సుఖంగా మధు పానం చేశాం. విశ్రాంతి తీసుకున్నాం. మహా రాజు దగ్గిరికి పోదామా? మీ అభిప్రాయం చెప్పండి" అన్నాడు.

"నువ్వే చెప్పు, నువ్వు బుద్ధిమంతుడివి. సిరి సంప దల గర్వం లేని వాడివి. నువ్వు చెప్పినట్టే చేస్తాం" అన్నారు అందరూ.

"అయితే పోదాం రండి!" అని పైకి ఎగిరాడు అంగ దుడు.

అందరూ ఎగిరారు. రుష్యమూకం మీద వాలారు.

హనుమంతుడు శ్రీరాముడి ముందుకు పోయి నమస్కరించి, "సీతాదేవి పాతివ్రత్యంతో క్షేమంగా ఉంది" అని సంతోష వార్త అందజేశాడు.[329]

శ్రీరాముడూ, లక్ష్మణుడూ, సుగ్రీవుడూ చాలా సంతోషించారు. ★

---

**329.** సుందర, సర్గ 64, శ్లోకం 38: "వానరులు మిగుల సంతోషము గలవారై శ్రీరాముని సమీపమున దిగిరి. పిమ్మట గొప్ప భుజములు గల హనుమంతుడు, శిరము వంచి నమస్కరించి, సీతాదేవి పాతివ్రత్య వ్రతము గలిగి క్షేమముగ నుండు నటుల శ్రీరామునికి తెలిపెను."

"సీత క్షేమంగా ఉంది" అంటే చాలదు. "సీత పతివ్రతగా ఉండి, క్షేమంగా ఉంది" అని చెప్పాలి! అదే అసలు క్షేమ సమాచారం! రాముడికి కావలసిన వార్త అదీ! ★

## కథ-10

# కాణీ ఖర్చులేని బహుమానం!

రుష్యమూకం జనంతో కిట కిట లాడుతోంది. కిష్కింధలో సగం జనం అక్కడే ఉన్నారు. దగ్గిర దగ్గిర ఊళ్ళకు పోయే జనం, అదేమిటో చూసి పోదామని అక్కడే జేరారు. సీత కోసం పోయిన వాళ్ళందరూ ఆలశ్యంగా అయినా తిరిగి వచ్చారని అందరికీ సంతోషంగా ఉంది.

తురాయి చెట్టు కింద, రాముడు చూడామణి చేత్తో పట్టుకుని తల వొంచి దుఃఖిస్తున్నాడు. మొదట చూడామణిని అందుకోగానే చాలాసేపు మూర్ఛబోయి అప్పుడే లేచాడు.

లక్ష్మణుడు అన్నగారి పక్కనే వినయంగా కూర్చుని, కళ్ళనీళ్ళు వినయంగా పెట్టుకుంటున్నాడు.

హనుమంతుడూ, సుగ్రీవుడూ, అంగదుడూ, జాంబవంతుడూ వంటి పెద్ద పెద్ద లందరూ రాముడి ముందు కూర్చుని ఉన్నారు.

ధనవంతులూ, పండితులూ, పురోహితులూ, కవులూ- రాజుగారి వెనక వేపు కూర్చున్నారు. సామాన్య జనం పిల్లా మేకా అంతా, రాళ్ళ మీదా, దిబ్బల మీదా చెట్ల మీదా, ఎక్కడ చోటు దొరికితే అక్కడ కబుర్లు చెప్పుకుంటూ, గుంపులు గుంపులుగా కూర్చున్నారు. గొడ్లని కాసే పిల్లలు కొందరు కొండ మీదకి జేరారు గానీ, ఇంకా కొందరు, ఆటల్లో పాటల్లో, ఈతల్లో, మునిగి తేలుతున్నారు. మధ్య మధ్య ఆటలూ పాటలూ ఆపి, ముందు నవ్వే పని ముగించి, మళ్ళీ ఆటల్లోకి జారుతున్నారు. ఒక్కోసారి నేర్పుగా పాడే పనీ, నవ్వే పనీ కలిసే చేస్తున్నారు.

దూరం నించి నవ్వులు వినపడి రాముడి దుఃఖం మరీ ఎక్కువవుతోంది. "అయ్యో! ఇంత విషాదంలో కూడా లోకంలో నవ్వులు వినబడుతున్నాయే! క్షుద్ర మానవులు నవ్వు లెంత దోషమో గ్రహించ లేకుండా ఉన్నారే!' అని వీపూ భుజాలూ కదిలేటట్టు తల భుజాల్లో పెట్టుకుని కుములుతున్నాడు. కుమిలి కుమిలి, "సీతా" అని ఒక్క సారి బావురుమన్నాడు.

కొందరు పండితులు, రాముడి దుఃఖం చూడలేక మొహాలు వంచుకున్నారు. కొందరు, కళ్ళల్లో నీళ్ళు తిప్పుకున్నారు. కొందరు, పక్కవాళ్ళ వేపు తిరిగి ముక్కులు తుడుచుకున్నారు.

దూరం వాళ్ళందరూ ఒక్కసారి మాటలు ఆపి ఊరుకున్నారు.

'ఇదే సందు' అని నిశ్శబ్దం రాజ్యం చెయ్యాలని చూసింది గానీ, రాజ్యాలు అంత తేలిగ్గా దొరుకుతాయా? జనం, మళ్ళీ గుస గుసల్తో, సందడితో, నిశ్శబ్దం పప్పులు ఉడకనివ్వనే లేదు.

సుగ్రీవుడు పెద్దరికం చేసి హనుమంతుణ్ణి చూస్తూ అసలు విషయం ఎత్తాడు. "చూడు, శ్రీరాముడెలా విల విల లాడుతున్నాడో! సీతాదేవి గురించి శుభవార్తలన్నీ నీ నోటితో నువ్వే స్వయంగా చెప్పు! కళ్ళకు కట్టినట్టు చెప్పు! పూసలు గుచ్చినట్టు చెప్పు! నీకు మాటలు దూసి పొయ్యటం బాగానే వొచ్చుగా? కవిత్వాల వాళ్ళు చెప్పినట్టు చెప్పు! అప్పుడన్నా రామయ్య కొంచెం శాంతపడతాడు" అన్నాడు ఉత్సాహంగా.

హనుమంతుడు సిగ్గుపడుతూ కాస్సేపు నేల చూపులు చూశాడు. కంఠం సరాయించుకుని, విచారంగా నిట్టూర్చి, రాముడికి వినయంగా నమస్కారం చేశాడు "ఆ దుర్మార్గుణ్ణి చంపకుండానే వచ్చానే అని చాలా సిగ్గుగా వుంది రామయ్యా! సీతా మహాతల్లిని రక్షించి తీసుకు రాలేకపోయాను. ఛీ! నా బతు కెందుకు, కాల్చనా?" అని తల వాల్చేశాడు.

జాంబవంతుడు కలగజేసుకుని, "హనుమంతుడా, ఊరుకో. శ్రీరామ పాదాల ఆజ్ఞ లేకుండా నువ్వు మాత్రం ఏం చెయ్యగలవు?" అని హనుమంతుణ్ణి ఓదార్చాడు.

లక్ష్మణుడు కళ్ళ నీళ్ళు నిగ్రహించుకుంటూ "హనుమా! మా వదినగారు క్షేమంగా ఉన్నారు గదా? ముందా చల్లని వార్త చెప్పు" అని ఆతృతగా చూశాడు.

హనుమంతుడు మళ్ళీ తల నేలకు వాల్చి విచార పడుతూ, "ఏం క్షేమంలే స్వామీ! భర్తకు దూరమైంది మొదలూ ఆ మహా తల్లి తిండి తిన్నదా, కన్ను మూసిందా? పూచిక పుల్లలాగ చిక్కిపోయి చిక్కిపోయి కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని ఎలాగో బతికి వుంది .... పాపిష్టి వాణ్ణి .... దుర్మార్గుణ్ణి .... ఆ మహా సాధ్విని రక్షించకుండా, నా దారిన నేను వచ్చేశాను" అని ఒక సారి తలెత్తి, మళ్ళీ వాల్చేశాడు.

సీత తన కోసం నిద్రాహారాలు లేక కృంగి కృశించి పోతోందంటే, రాముడికి పట్టలేనంత సంతోషం కలిగింది. "అయ్యో! సీతా!" అంటూ మొహం పక్కకి తిప్పుకున్నాడు.

హనుమంతుడు అసలు సంగతులేవీ చెప్పకుండా అంత జాప్యం చేస్తున్నందుకు, లక్ష్మణుడికి విసుగెత్తు తోంది. "హనుమంతుడా, అన్నగారు మిక్కిలి దుఃఖిస్తున్నారోయీ! చూస్తూనే ఉంటివి కదా! అక్కడ చూసిందంతా తొందరగా విన్నవించి అన్న గారికి సంతోషం కలిగించు. మా వదినగారు ప్రాణాలతో జీవించే ఉన్నారు గదా?"

"ఎంత మాట! సీతాదేవే ప్రాణాలతో లేకపోతే లంకలో ఇంకెవరు ప్రాణాలతో ఉంటారు?" అని కోపంగా బుగ్గలు పొంగించాడు హనుమంతుడు. అతని చూపునిండా – ఆ కొండల్లో కోనల్లో పడి, నదులు ఈదుకుని, గొప్ప గొప్ప అవాంతరాలు దాటుకుని, లంకా రాజ్యం పోయి, అసలు కార్యం సాధించుకుని వచ్చిన వీరత్వం పొంగుతోంది.

సుగ్రీవుడు ఇటూ అటూ చూసి, "శాంతించు హనుమంతుడా!" అంటూ కొంచెం వెనక్కి జరిగాడు. హనుమంతుడికి కోపం వొస్తే, పిచ్చి కోపం వస్తుందని సుగ్రీవుడికి తెలుసు. "నాకు కోపం వొస్తేనా, మనిషిని కాను" అని హనుమంతుడే చెప్పుకుంటూ వుంటాడు కూడా!

గాలిలో .... పాటలూ .... నవ్వులూ .... దగ్గిరి కొచ్చి .... దూరంగా పోయి .... దగ్గిరి కొస్తున్నాయి.

రాముడు మాటి మాటికీ చూడామణిని చూసి తల భూమిలోకి వొంచి కుములుతున్నాడు.

లక్ష్మణుడు వదినగారి గురించి ఆలోచిస్తూ, అన్నగారి సంగతి మరిచిపోయి, తిన్నగా కూర్చుని నడుం సాగదీసుకుని మెడ పైకెత్తాడు.

హనుమంతుడు, బుగ్గల్లో కోపం తగ్గించుకుని రాముణ్ణి వినయంగా చూస్తూ మళ్ళీ నమస్కారం చేశాడు. నమస్కారాలు ఎంత బాగా పనిచేస్తాయో హనుమంతుడికి బాగా తెలుసు. "రామా! ఇక నువ్వు దుఃఖించే పని లేదు. నీ భార్య మహా గుణవంతురాలు. పాతివ్రత్యం కాపాడుకుంటూ క్షేమంగా వుంది" అని అసలు విషయం బయటపెట్టాడు.

"పాతివ్రత్యం కాపాడుకుంటూ ...." అనే మాటలు రాముడి చెవులకు వేద మంత్రోచ్చారణ లాగ వినపడ్డాయి. సంతోషం పట్టలేక బావురుమన్నాడు. "నా సీత .... క్షేమంగా ఉందా నాయనా? .... ఆ పర పురుషుడి దగ్గిర .... ఆ దుర్మార్గుడు .... ఏదీ .... ఆ పలుకులు .... మళ్ళీ ఒక్కసారి చెప్పు నాయనా!" అని తల వాల్చాడు.

"ఆహా! ఏం అనురాగం! .... ఏం అనురాగం!" అని సుగ్రీవుడు ముక్కుమీద వేలేసుకున్నాడు, ముక్కు మీద వేలెప్పుడేసుకోవాలో బొత్తిగా తెలీక.

"అయ్యో! శ్రీరామ చంద్రుడి ఆత్మ ఎంత తపిస్తోందో గదా భార్య కోసం!" అని ఒక పండితుడు నిట్టూర్చాడు.

"అయ్యా! 'ఆత్మ' అంటే ఏమిటండీ?" అని ఆ పక్కనే కూర్చున్న యువకు డొకరు పండితుడి చెవిని పలకరించాడు. 'ఆత్మ' అంటే ఏవిటో తెలుసుకోవాలని ఆ కుర్రవాడికి ఎంతో కాలం నించి కోరికగా ఉంది. ఎందర్నో అడిగాడు. అందరూ తలో రకంగా చెప్పారు. ఆ ప్రకారమే అయితే, ఒక్కో ధర్మాత్ముడికీ వందల కొద్దీ ఆత్మలుండాలని తేలింది. వందల కొద్దీ దుర్మార్గులికి ఒక్కొక్క ఆత్మ కూడా ఉండదని కూడా తేలింది. ఆ యువకుడు ఇంకా ఆత్మ రహస్యం పరి శోధిస్తూనే ఉన్నాడు. ఎవరన్నా " ఆఁ ...." అని నోరు తెరిస్తే చాలు, ఆత్మ .... అంటారేమో, అదేవిటని అడగాలని ఎదురు చూస్తూ వుంటాడు. "అబ్బా, నీ ముందు ఆవలించడం కూడా భయమే" అంటారు అందరూ అతన్ని.

సమయం వచ్చింది గదాని చాలా సంతోష పడుతూ, ఈ పండితుణ్ణి పట్టుకున్నాడు, ఆ ఆత్మ శోధక జిజ్ఞాసి.

"ఆత్మ అంటే పరమాత్మే నాయనా!" అన్నాడు పండితుడు.

"పరమాత్మ అంటే ....?"

"పరమాత్మ అంటే ఆత్మే అని తెలుసుకోలేవూ?"

"ఆత్మ అంటే ....?" అనబోయి, "ఇదేవిటి? ఇలాంటి చిక్కులో పెట్టాడీయన?" అని ఆలోచనల్లో మునిగిపోయాడు.

అప్పటికి హనుమంతుడు శ్రీరాముడికి ఆ శుభవార్త .... ఆ చల్లని వార్త .... మూడోసారి .... ఏడోసారి .... పదోసారి కూడా చెప్పాడు. "అయ్యా! నీ భార్య పతివ్రతగా ఉంది! .... క్షేమంగా ఉంది. పర పురుషుణ్ణి కన్నెత్తి చూడదు. పతివ్రతగా ఉంది! .... పర పురుషుణ్ణి గడ్డిపరకలా భావిస్తుంది .... పతివ్రతగానే ఉంది! సందేహం లేదు. పతివ్రతగా ఉంది!"

వింటోన్న కొద్దీ రాముడికేదో అనుమానం ప్రారంభమైంది. అసలు సీత పతివ్రతగా లేదేమో అని! .... తన నెలాగైనా నమ్మించాలని .... ఒప్పించాలని .... మభ్య పెట్టాలని .... హనుమంతుడే అబద్ధాలు కల్పించి, తనని ఎలాగైనా .... నమ్మించాలని .... ఒప్పించాలని .... మభ్యపెట్టెయ్యాలని .... లేకపోతే ఎందుకు ఇన్ని సార్లు చెపుతున్నాడు? – రాముడి తల గిర్రున తిరిగింది. కళ్ళు

చీకట్లు కమ్మాయి. చెవులు దిబ్బళ్ళు పడ్డాయి. తల వాల్చి .... కళ్ళు మూసి .... వొరిగి .... మూర్ఛపోయాడు. ఈ సారి నిజంగానే!

ఎవ్వరూ కంగారు పడలేదు. పెద్ద పెద్ద లందరికీ రోజూ అది అలవాటే. అది అనురాగ మూర్ఛే గానీ, రోగ మూర్ఛ గాదని, వారికి తెలుసు.

కిష్కింధలో – కొత్తగా ప్రేమలో పడ్డ యువ కులూ, భార్యలు పుట్టిళ్ళకు పోయిన యువకులూ, రాముడి మూర్ఛల సంగతి విని, అలాంటి మూర్ఛలు నేర్చుకోవాలని చాలా ప్రయత్నాలు చేశారు. ఆ మూర్ఛపోయే విధానం వాళ్ళకి ఒక్కసారన్నా పట్టు బడలేదు. కళ్ళు మూసి నేల కొరిగినా, ఏ పొలం పోయే పనో, ఏ కట్టెలు కొట్టే పనో, ఏ నీళ్ళు తెచ్చే పనో, చప్పున గుర్తొచ్చి, మూర్ఛ మాయమయ్యేది. ఆ పని కాస్తా పూర్తి చేసి, సమయం చూసుకుని మళ్ళీ కాస్సేపు మూర్ఛపోబోతే, ఏ స్నేహితుడో వొచ్చి పడి "ఏడిస్తే ఏం లాభం? పద. ఏం చెయ్యాలో చూసుకో" అని చివాట్లు పెట్టి లాక్కుపోయే వాడు. ఆ స్నేహితుడు రాకపోతే, ఇంట్లో మేళం అయితే ఆ మాత్రమైనా పట్టించుకునే దారే లేదు. పిల్లాడు మూర్ఛపోయాడని గ్రహించి విసిరే వాళ్ళన్నా ఉండరు సరికదా "వేళగాని వేళ పడుకున్నావేంరా అబ్బిగా?" అని ముసిలాళ్ళందరూ ఒకటే కేకలు! అలాగే, ఎప్పుడూ, ఏవో ఇబ్బందులతో, ఆటంకాలతో, అవాంతరాలతో, ఒక్కరికైనా సంతోషంగా మూర్ఛపోడానికే వీలయ్యేది కాదు.

"శ్రీరాముడితో మనకు వొంతా? భార్యని వెతికే కార్యభారం అంతా ఇతర్ల మీద పెట్టి .... తమ్ముడు వొండి పెడుతూ వుంటే, అంత చక్కగా, విశ్రాంతిగా .... మాటి మాటికీ అనురాగ మూర్ఛలు పోవడం ఆయనకు చెల్లింది గానీ, మనకెక్కడ సాగుతుంది?" అని కిష్కింధ యువకులంతా నిరాశలు చేసుకుని చాలించుకున్నారు.

అన్నగారు మూర్ఛ పోయినప్పటి నుంచీ, లక్ష్మణుడు వినయంగా వొంగి, ఆకుల రెమ్మతో విసురుతూనే ఉన్నాడు.

అప్పుడప్పుడూ ఆకులు మొహానికి తగిలి, చెంపలు దురద పుట్టి, రాముడు నెమ్మదిగా కళ్ళు తెరిచి లేచాడు. పంచెతో కళ్ళు వొత్తుకుని, చెంపలు గోక్కున్నాడు.

మాట్లాడుకుంటూన్న వాళ్ళందరూ కంఠాలు తగ్గించారు.

రాముడు హనుమంతుడి వేపు పరీక్షగా చూశాడు – 'సీత గురించి నిజం చెప్పుతున్నాడా' అన్నట్టు.

హనుమంతుడు కొంచెం కదిలి, "దుఃఖ పడకు స్వామీ! ధైర్యంగా ఉండు. నీ భార్యని నువ్వు తొందరగానే కలుసుకుంటావు. నా మాట విను .... నీ దుఃఖం నేను చూడలేను ...." అంటూ చేతులు జోడించాడు. "నేను చెప్పేదంతా వింటే నువ్వు చాలా ఆనందపడతావు .... ఆ కొండల్లో .... కోనల్లో .... దారి పొడుగునా .... ఎందరెందరో మంచి వాళ్ళనీ చూశాను, చెడ్డ వాళ్ళనీ చూశాను. మాట వరసకి చెపుతాను. మైనాకుడనే ఆయనతో పెద్ద పోట్లాట పడిందనే అనుకున్నాను. ఆయన్ని చూస్తే దెబ్బ లాటకోరు మనిషి లాగ కనిపించాడు. 'ఇదేంటి? శ్రీరాముడి పని మీద పోతున్నాను. మళ్ళీ క్షేమంగా వెనక్కి రావాలి. దారిలో ఈ పోట్లాటలేంటి? రాముడికి దయ లేదా? ఇటువంటి దుర్మార్గుణ్ణి అడ్డు పంపటం ఏంట'ని చాలా విచారించాను ...."

రాముడు ఆశ్చర్యపడుతూ తలెత్తాడు. మైనాకుడేవిటి? తను అడ్డు పంపడం ఏవిటి? కంగారుపడి – "ఆ మైనాకుడెవరో నా కే పాపమూ తెలీదు నాయనా!" అందామనుకుంటూ ఉండగానే హనుమంతుడు ఉత్సాహంగా చెప్పుకుపోయాడు. "నీ దయ నన్ను వెన్నంటి కాపాడుతూనే వుందిలే రామయ్యా! నువ్వే ఆ మైనాకుడికి ఆ బుద్ధి పుట్టించావు. ఆయన నన్ను ఎంత ఆదరించాడనీ! వాళ్ళింట్లో నాలుగు మెతుకులు తిని, కాస్సేపు నడుం వాల్చి వెళ్ళమని .... మరీ మరీ పట్టుబట్టాడు. ఆయనకి నువ్వు పుట్టించిన బుద్ధే గాకపోతే ...."

ఆ మైనాకుడికి అంత మంచి గుణాలు తనే ఇచ్చినట్టు రాముడు గంభీరంగా మౌనం వహించి ఊరుకున్నాడు. మైనాకుడెవరో తనకు తెలీదని తొందరపడి మాట జారితే ఏమయ్యేదోనని నిర్ఘాంత పడుతూ చూశాడు.

హనుమంతుడు తన ప్రయాణం సంగతులు వర్ణిస్తూ, పొంగుతూ, ఉత్సాహం పొంగులో – తనతో దెబ్బలాటేసుకున్న సింహిక దగ్గిర తేలాడు.

రాముడు, ఆలోచనల్లోంచి తేరుకుని మంద హాసంతో గంభీరంగా, "అవును. ఆమెని కూడా నేనే ...." అనబోయి, హనుమంతుడి ధోరణి చూసి చప్పున మాట ఆపుకున్నాడు.

హనుమంతుడు సింహిక మీద కోపంతో ఊగుతున్నాడు. "నా దారిన నేను పోతన్నానా? అన్యాయంగా పిలిచి కయ్యం పెట్టింది. నాకు వొళ్ళుమండి, నాలుగు బాది, 'నీకు దిక్కున్న చోట చెప్పుకో'మన్నాను" అని, దెబ్బలాట ఎందుకో ఏవిటో వర్ణిస్తున్నాడు.

హనుమంతుడు, ఎక్కడో, ఎవర్నో పట్టుకుని బాదినందుకు, శ్రోతల్లో కొందరు చాలా ఆనందించారు. రాముడు గాఢంగా నిట్టూర్చాడు – సింహిక ప్రమాదం లోంచి కూడా తప్పుకున్నందుకు! – దేనికీ తొందరపడి మాట జారకూడదు. చిరునవ్వు నవ్వుతూ విషయం

పూర్తిగా వినాలి. దాన్ని బట్టి ఎటు అనుకూలమైతే అటు మాట్లాడాలి. చిన్నతనంలోనే తనకీ సంగతి, రాజ నీతులు నేర్పే గురువులు చాలా సార్లు బోధించారు. తను ఇంత కాలం చక్కగానే గుర్తు పెట్టుకుని, ఆ విధంగానే ఆచరిస్తూ వున్నాడు .... ఇప్పుడే .... ఎందుచేతనో ...!

"అయ్యా! .... ఆ రకంగా ఎలాగో లంకా నగరం చేరానా? చీకటి పడేవరకూ ఊరికి దూరంగా కొండల్లో దాక్కుని, రాత్రి కాగానే ఊళ్ళోకి బయల్దేరాను. ఎలాగో అక్కడక్కడా కాపలా వాళ్ళని ఏ మార్చి, చీకటి సందుల్లోంచీ, వీధుల్లోంచీ తిరిగాను. కిటికీల్లోంచి తొంగి చూశాను. గోడలెక్కి వాకిళ్ళలో చూశాను .... చివరికి రావణుడి అంతఃపురంలో జొరబడ్డాను."

ఆ సంగతులన్నీ అంతకు ముందే మహేంద్ర పర్వతంమీదే విన్నవాళ్ళు కొందరు, కొత్త వాళ్ళతో – "ఇక్కడ చెప్పేది చాలా బాగుంటుందిలే! రావణుడి దగ్గిర ఆడవాళ్ళు భలేగా ఉన్నారులే బట్టల్లేకండా" అని పక్క వాళ్ళని ఊరించారు.

దూరంగా ఉన్నవాళ్ళు కొందరు గబ గబా దగ్గిరికి జరిగారు. సుగ్రీవ రాజుగారు కూడా ముందుకి జరక్క తప్పలేదు. జనం వెనక నుంచీ గెంటుకొచ్చారు.

హనుమంతుడు చెపుతూ చెపుతూ కొంచెం ఇబ్బంది పడి, "ఆ ఇళ్ళల్లో చూసిన సంగతులన్నీ ఎవరికి వారు చూడవలిసిందే గానీ, చెప్పటానికి వల్ల కాదు" అని సిగ్గుపడ్డాడు, తీరా అందరూ ముందుకొచ్చాక.

కొందరు కుర్రాళ్ళు నిరాశపడ్డారు. "హోరి, వీడి దుంపతెగ! చెప్పడనుకుంటా!" అన్నారు.

కొందరు అతి ఉత్సాహంతో, "చెప్పు .... చెప్పు .... చెప్పవలిసిందే .... చెప్పకపోతే మాకెలా తెలుస్తుంది?" అని కేకలేశారు.

సుగ్రీవుడి చెవిలో ఎవరో ఏదో ఊదారు. సుగ్రీవుడు ముసిముసి నవ్వులు నవ్వుతూ, "చెప్పు మరీ! చెప్పకపోతే మా కెలా తెలుస్తుంది మరీ?" అని హనుమంతుణ్ణి బలవంతపెట్టాడు.

రాముడు తల పంకిస్తూ, "చెప్పు నాయనా! ఆ దృశ్యాలేమిటో చక్కగా వర్ణించి చెప్పు. వినక తప్పదు గదా?" అని విరక్తిగా నిట్టూర్చాడు.

హనుమంతుడు సిగ్గుపడుతూనే ప్రారంభించాడు – "కొన్ని ఇళ్ళల్లో .... ఆడవాళ్ళూ .... మొగవాళ్ళూ .... ముచ్చట్లాడుకుంటూ .... కావలించుకుని .... నవ్వుకుని .... సంతోషంగా .... వాళ్ళందర్నీ చూసి .... తర్వాత ...."

"అదుగో! దాటేసేశావు, కుదరదు" అని విసుక్కుంటూ కేకలేశారెవరో. ఆ విసుగులో చాలా సబబు కనిపించింది, చాలా మందికి.

హనుమంతుడు ఇంకేమీ చెయ్యలేక సిగ్గు పడకుండా, "శ్రీరామా! ఆడవాళ్ళూ, మొగవాళ్ళూ, చక్కగా సరస సల్లాపా లాడుకుంటూ వుండడం చూశాను. బట్టలు లేకుండా భర్తల్ని కావలించుకున్న ఆడవాళ్ళని చూశాను. భర్తల కావిలింతల్లో మెడలో నగలన్నీ తెగి పడిపోయిన అందగత్తెల్ని చూశాను. అబ్బ! ఏం అందం! ఒక్కొక్కరూ! .... ఆ అందగత్తెలు ...."

"ఎంతదృష్టం! ఎంతదృష్టం!" అని హనుమంతుణ్ణి అసూయగా చూశాడు సుగ్రీవుడు.

లక్ష్మణుడు కోపంగా మొహం వాగు వేపు తిప్పుకున్నాడు.

జనం గుస గుస లాడుకుని, కిసుక్కుమని నవ్వుకుంటున్నారు. వాతావరణం పెళ్ళికి బయల్దేరుతున్నట్టు తయారయ్యింది.

రాముడు హఠాత్తుగా నుదురు చిట్లించి గంభీరంగా చుట్టూ చూశాడు. మరుక్షణంలో నిశ్శబ్దానికి రాజ్యం అప్పగించేశారు అందరూ, చాలా తేలిగ్గా.

హనుమంతుడు, రావణుడి అంతఃపురాన్ని కూడా వర్ణించి చెప్పుకుపోతున్నాడు. ".... అంత చక్కగా ఉన్న గదుల్లో .... అక్కడ .... ఒక శయ్య మీద .... ఒక అందగత్తెని చూశాను...."

"ఆవిడే సీత ...." అంటాడేమోనని రాముడు కంపిస్తూ మొహం ఎత్తాడు.

"ఆవిడ మండోదరి. సీత ఎక్కడా కనపడలేదు ...."

రాముడు తేలిగ్గా నిట్టూర్చి కళ్ళు మూశాడు.

"ఆవిడ మండోదరి అని హనుమంతుడి కెలా తెలిసిందీ?" అన్నాడొక శంకలాయన పక్క వాళ్ళతో.

"ఎందుకు తెలీదూ? కాపలా వాళ్ళ నడిగితే వాళ్ళే చెపుతారు" అన్నాడు ఒక అడ్డగోలాయన.

"హేవిటీ! .... రహస్యంగా తిరుగుతున్న వాడు కాపలా వాళ్ళని అడుగుతాడా?" అని విస్తుబోయాడు ప్రశ్నాయన.

జవాబాయన కొంచెం తప్పు గ్రహించుకుని, "ఓహో, అదా?.... అయితే... అసలు... ఇది మండోదరి మంచం అని మంచం మీద రాసి వుండదూ? .... ఏదో చెప్పేస్తున్నాడు హనుమంతుడు .... విను ముందు. వెధవ సందేహాలూ నువ్వునూ ...." అని విసుక్కుని మొహం తిప్పేశాడు.

అప్పటికి హనుమంతుడు అశోక వనంలో చెట్టెక్కేశాడు. ఆకుల్లో దాక్కున్నాడు. "అక్కడ .... ఒక స్త్రీ శోక దేవతలా కూర్చుని ఉంది ...." అంటు న్నాడు.

లంకలో స్త్రీల సౌందర్యాలు వర్ణించడం గబ గబా

అవగొట్టేసి, అప్పుడే సీత సంగతి ఎత్తుకున్నందుకు కొందరు తెగ నిరుత్సాహ పడి పోయారు.

"రాముడు తొందరపడుతున్నాడని .... అప్పుడే సీత సంగతుల్లోకి దిగాడు గానీ, దారిలో మాకు చెప్పినప్పుడైతే ఎంత బాగా చెప్పాడో ...." అన్నా డొకాయన చుట్టు పక్కల వాళ్ళతో.

"ఏం చెప్పాడో మాకూ చెప్పరాదూ నువ్వు?"

"ఇప్పుడు కాదు. తర్వాత చెపుతాన్లెండి."

హనుమంతుడు, సీత పరిస్థితంతా చెపుతున్నాడు. "నిద్రాహారాలు లేవు. స్నానం పానం లేవు. చిక్కి శల్యమై పోయి వుంది. కంటికీ మంటికీ ఏకధారగా దుఃఖిస్తోంది. రావణుడు ఎత్తుకు పోయిన్నాడు ఏ చీర కట్టుకుందో ఆ చీరే! ఆ చీర మిగల మాసిపోయి పెంకులా ఉంది. ఎన్ని రేవులు పడితే దాని రూపు మళ్ళీ దానికొస్తుందోగానీ ...." అని కాసేపు ఆ చీర మీద సాగించాడు. తర్వాత, "సీతాదేవి మట్టిగొట్టుకున్న పువ్వులాగ ఉంది" అని తేల్చాడు.

రాముడి మొహం మబ్బులు విడుతోన్న ఆకాశం లాగ తేటపడింది.

"అబ్బ! అన్నాళ్ళు నీళ్ళు పోసుకోకుండానా? ఎందుకూ అలా ఉండడం?" అని చాలా మూలల్లో గుస గుసలు రేగాయి. నిశ్శబ్దం, మూలల్లో రాజ్యాలన్నీ పోగొట్టుకుంటోంది.

"పతివ్రతలు అలాగే ఉండాలి. భర్త లేకపోతే స్నానాలూ అవీ ఎందుకూ? ఎవరి కోసం?"

"మరి వొళ్ళంతా దురదలు పుడితే ....?"

"దురదలు పుట్టినా అంతే! గజ్జి పుట్టినా అంతే! గోక్కుంటే సరిపోదా?"

"పతివ్రతలు గోక్కోవొచ్చునా? గోక్కుంటే సుఖం వస్తుంది కదా? .... భర్త లేనప్పుడు అలా గోక్కుని సుఖ పడితే .... తప్పు కాదా?"

"అవును సుమా! నే నాలోచించనే లేదు."

"మరి రాముడు చక్కగా రోజూ స్నానాలు చేస్తా డెందుకూ? లక్ష్మణుడితో వొళ్ళంతా తోమించుకుని మరీ స్నానాలు చేస్తాడే!"

"అబ్బే! మగవాళ్ళకి తప్పు లేదు. వాళ్ళకి వ్రతా లేమీ ఉండవుగా?"

"రాముడికీ ఏక పత్నీ వ్రతం ఉంది, తెలుసా? రాముడు కూడా నీళ్ళు పోసుకోకూడదు. రోజూ చక్కగా స్నానాలు చేసి రాముడు ఆరోగ్యంగా ఉంటాడనుకో. పాపం సీతకి వొంటి నిండా గజ్జి పట్టి, జబ్బు చేసి ఆరోగ్యం, అందం, అన్నీ పోతాయనుకో. అప్పుడు రాముడు, సీతని, నువ్వు నాకు వొద్దంటే ....?"

"అయ్యో! .... అసలు పతివ్రతలకి గజ్జి పట్టడం ఏమిటీ!"

"అలా అంటే నే వొప్పుకోను సుమా! సీత తలా వొళ్ళూ మాసిపోయి మురిగ్గా ఉందని హనుమంతుడు చెప్పలేదూ?"

అవతల, హనుమంతుడు సీత దుస్థితి వర్ణిస్తోంటే, దూరాల వాళ్ళు అటువేపు చెవులు పెట్టకుండా ఎవరి వాదాలు వాళ్ళు చేసుకుంటున్నారు.

సీత, "రామా, లక్ష్మణా!" అని అలమటిస్తోంది. "అయ్యో! నా భర్త నెప్పుడు చేరతానో!" అని పలవరి స్తోంది. కన్నీళ్ళతో నేలంతా తడిచి, నాని, బురద బురద అయిపోయేటట్టు దుఃఖిస్తోంది.

హనుమంతుడు చెప్పే ఒక్కొక్క మాటా, ఒక్కొక్క వరంలాగ వినపడుతున్నాయి రాముడికి.

జనంలో కబుర్లు మరీ ఎక్కువయ్యాయి. "సీత అలా వుండక ఇంకెలా ఉంటుందిలే. నవ్వుతూ .... తుళ్ళుతూ .... గంతులేస్తూ వుంటుందా ఏంటి గానీ .... చెప్పడం మరిచిపోయాను. మీ ఆవు ఈనింది మావాఁ!"

"ఈనిందీ? నే ననుకుంటూనే వున్నాను. మహేంద్ర పర్వతం దగ్గిరే అనుకున్నాను, ఈ పాటికి ఈనే ఉంటుం దని. పెయ్యి నేసిందా?"

"అబ్బే! దూడే .... అయితే యేంలే. ఎంత ముద్దుగా ఉందో! మొహం మీద మచ్చా అదీ ...."

"దాని దుంప తెగ! .... మళ్ళీ దూడేనా? లాభం లేదు. ఈ సారి చూలుతో వున్నప్పుడు అమ్మేస్తాను."

"అప్పుడు పెయ్యినేస్తే ....?"

వెనక నించి ఎవరో వీపులో పొడిచారు, "వెధవ గోల. ఊరుకోండి. రావణుడొస్తున్నాడు ...." అంటూ.

అప్పటికే వచ్చేశాడు రావణుడు, చుట్టూ భార్యలతో, పరిచారికలతో, మద్య పాత్రలతో, ఆసనాలతో, ఆర్భా టంతో!

హనుమంతుడు ఉత్సాహంతో పొంగుతూ వర్ణిస్తు న్నాడు రావణుణ్ణి. ధగ ధగ లాడే ఆ ఆభరణాలూ – ఆ పచ్చల కిరీటం – ఆ నీలాల మొలతాడూ – ఆ ఎర్రటి పల్లెవాటూ – ఆ .... ఆ ....

రాముడు దుఃఖంతో తల వాల్చేశాడు. "నా సీత కబురు చెప్పు నాయనా!"

"రావణుణ్ణి చూసి .... ఆ తల్లి .... వర్షంలో తడిసిన పిట్ట లాగ వొణికింది. రొమ్ములూ .... పొత్తి కడుపూ .... తొడలూ .... ముడుచుకుని .... దాచుకుంది."

రాముడు పడిపోయాడు, సంతోషం పట్టలేక. మూర్ఛలు, దుఃఖం తోటే కాదు, సంతోషంతోటి కూడా వస్తాయని అక్కడ బోలెడు మందికి తెలీదు.

లక్ష్మణుడు వెంటనే విసరడం ప్రారంభించాడు. దగ్గిర దగ్గిర కూర్చున్న వాళ్ళు కొంచెం కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

"భార్యాభర్తల్ని విడదియ్యడం మహా పాపం సుమా!"

"మరి నీ భార్య నెప్పుడూ పుట్టింట్లోనే ఉంచి నువ్వెప్పుడూ పొరుగూళ్ళల్లోనే ఉంటావేం?"

"అది మన ఇష్టం. మన ఇష్టం చొప్పున చేసుకుంటే పాపం లేదు. తప్పు లేదు. ఎవరన్నా విడదీస్తేనే ...."

"మన ఇష్టం అంటున్నావు గానీ .... మొన్న మీ ఆవిడ మా ఆవిడికి చెప్పుకుని ఏడ్చిందట, నువ్వెప్పుడూ ఇంటి పట్టున ఉండవని ...."

"మీ ఆవిడా ఏడుస్తోందేమో నువ్వెప్పుడూ ఇంటి పట్టునే ఉంటావని! ఎవడికి తెలుసు? ఇంటిపట్టు నుండనట .... ఇంటి పట్టున! ఏం, నే నుండకపోతే? ఆడది ఇల్లు కనిపెట్టుకుని గొడ్డూ గోదా, మొక్కా మోడూ చూసుకోరాదూ? పొయ్యిలో పిల్లిలాగ మొగోడు ఎప్పుడూ ఇంట్లో కూర్చుంటాడంటయ్యా?"

"నేను మొగోణ్ణి కాననంటావా?"

"ఏమో ఎవడికి తెలుసు?"

"ఊరుకోండె హే! రాముడు లేస్తున్నాడు" అని ఖయ్యిన అరిచారెవరో.

నెమ్మదిగా ముక్కుతూ మూలుగుతూ లేచాడు రాముడు "అటు తర్వాత ఏం జరిగిందో తొందరగా చెప్పు నాయనా!"

"ఆ విధంగా .... సీతాదేవి .... అరిటి బోదెల్లాంటి తొడలూ .... చక్కటి గుండ్రని రొమ్ములూ ...."

"ఆగు .... ఆగు చెబుదువు గాని రాముడు పడి పోతున్నాడు ...." అంటూ ఉండగానే రాముడు పడి పోయాడు మళ్ళీ!

హనుమంతుడు చాలా చిన్నబుచ్చుకున్నాడు – సీతాదేవి శోకం చెప్పి, రాముడికి దుఃఖం కలిగిస్తున్నానే అని. ఈ సారి ఏమైనా సరే, సీత సంతోషంగా ఉందని కల్పించయినా సరే చెపుతాను .... అనుకున్నాడు.

"ఏ నాడేం పాపం చేసుకున్నాడో .... ఈ వన వాసం ఏవిటీ! .... భార్య పోవడం ఏవిటీ! ఆ మహానుభావుడి ఆత్మ ఎంత తల్లడిల్లి పోతోందో!" అన్నాడొక మహా పండితుడు గట్టిగానే.

మరు క్షణంలోనే ఆత్మాన్వేషి ఆయన్ని పట్టుకున్నాడు. "అయ్యా! 'ఆత్మ' అంటే ఏమిటండీ! .... నేను చాలా మందిని అడిగాను గానీ ...."

"అయ్యో! నన్నే అడిగితే నీ సందేహాలన్నీ ఎప్పుడో తీర్చేవాణ్ణి కదా నాయనా?"

"చిత్తం! ఇప్పటికైనా మీ పరిచయ భాగ్యం కల్గింది నాకు .... చెప్పండీ .... 'ఆత్మ' అంటే ...."

"శరీరం ఉందా నాయనా?"

"ఆయ్! ఉందండీ!"

"అందులో .... అందులో .... ఒక .... ప్రా .... కాదు .... విచిత్రం ఉంది చూశావు? అదే ఆత్మ ...."

"అంటే ...."

"అడ్డు రాకు. పూర్తిగా విను. ఆత్మ నశించదు. ఎప్పుడూ ఉంటుంది."

"శరీరం చచ్చిపోతే?"

"ఆత్మ, చెట్ల మీద ఉంటుంది."

"ఏ చెట్టు మీద?"

"ఎవరికే చెట్టు ఇష్టమైతే ఆ చెట్టు మీద. నీకు రేగుపళ్ళు ఇష్టం అనుకో .... నీ ఆత్మ రేగుచెట్టు మీద ఉంటుంది."

"ఎందుకూ?"

"ఎందుకేమిటయ్యా? రేగుపళ్ళు తింటుందీ."

"ఆత్మకి శరీరం లేదుగా? ఎలా తింటుందీ, నోరు ఉండొద్దూ?"

"చాలా మంచి ప్రశ్న వేశావు. రోజూ మా ఇంటికి వస్తూ ఉండు నాయనా! కొన్ని సంవత్సరాలకు నీకే ఆత్మ జ్ఞానం కలుగుతుంది. మీ ఇంట్లో ఏవన్నా పాదులున్నాయా? ...."

"లేవు లెండి. చెప్పండి, ఆత్మ రేగుపళ్ళెలా తిన గలదు?"

"రేగుపళ్ళు కూడా రాలి కిందపడి పోతాయా? వాటి ఆత్మలు కూడా లేచి చెట్ల మీదకు పోతాయా? అప్పుడు వాటిని పట్టుకు తినలేదూ?"

"రేగుపళ్ళ ఆత్మలు ఇంకో చెట్టు మీదకి పోతే ....?"

"ఈ ఆత్మ, ఆ ఆత్మల వెంటపడి పట్టుకుంటుంది. సరేనా? ఊరుకో ఇక. చాదస్తుళ్ళా ఉన్నావే! ఏం చెప్పినా అర్థం కాదు. ఒకటే అనుమానాలు ...."

ఆత్మాన్వేషి ఎప్పుడో మాయం అయిపోయాడు. అప్పుడే కొండలు దిగిపోతున్నాడు.

ఈ సారి రాముడు లేవడానికి చాలాసేపే పట్టింది. రాముడు లేచీ లేవగానే హనుమంతుడు వినయంగా నమస్కారం చేశాడు. "ప్రభూ! నా అపరాధం మన్నించు .... సీతాదేవి ధైర్యంగా ఉంది. సంతోషంగా ఉంది. నువ్వు తొందరగానే వచ్చి రక్షిస్తావని ...."

రాముడు .... నిర్ఘాంతపడి .... మళ్ళీ పక్కకి వొరుగుతూ .... ఆ చివరి మాటలు విని ఆగాడు.

హనుమంతుడికి ఎలా చెప్పాలో తోచలేదు.

సీతాదేవి దుఃఖిస్తోందన్నా రామచంద్రుడికి మూర్ఛ వస్తోంది, సంతోషిస్తోందన్నా మూర్ఛ వస్తోంది! – సరే! జరిగింది జరిగినట్టు చెపుతాను. ఆ మహానుభావుడే గ్రహించుకోగలడు – అనుకున్నాడు.

రాముడి పరిస్థితి చూసి కొందరు పెద్దలు, "ఏమిటో ఇవ్వాళ మూర్ఛలు చాలా ఎక్కువగా ఉన్నాయి" అనుకున్నారు.

హనుమంతుడు కొంచెం భయపడుతూనే ప్రారంభించాడు. "రామా! ఆ మహా తల్లి భయపడుతూ కూర్చుంది. రావణుడు దగ్గిరికి వచ్చి నించున్నాడు ...."

"ఎంత దగ్గిరికీ? ...." అని అడగాలని రాముడి మనసు చాలా ఊగింది. కానీ ఊరుకున్నాడు.

"సుందరీ! నన్ను చూసి భయపడతా వెందుకు? నీ అందం దాచుకోకు .... నీలాంటి అందగత్తెను చూసి ఏ పురుషుడైనా కామించకుండా ఎలా ఉండగలడూ, అన్నాడు ప్రభూ రావణుడు ...."

"అవును మరీ ...." అన్నాడెవరో పరాకుగా.

రాముడు క్రీకంట అటు తీక్షణంగా చూశాడు. కానీ, అటు నిశ్శబ్దం ఆక్రమించింది.

హనుమంతుడు ఉత్సాహంగా చెప్పుకు పోతున్నాడు. "'చక్కగా అలంకరించుకో. నా సిరిసంపదలన్నీ అనుభవించు. నా పెద్ద భార్యగా ఉండు' అంటూ బతిమాలడం మొదలు పెట్టాడు రావణుడు ...."

"సీత ఏమన్నది నాయనా?" అన్నాడు రాముడు ఆ ప్రశ్న ఆపుకోలేక.

"సీతమ్మ తల్లి తల పైకెత్తనే లేదు. వింటూ ఊరుకుంది."

"ఊఁ ..........."

"ఆ దుష్టుడు నిన్ను దూషించడం మొదలు పెట్టాడు రామయ్యా!"

రాముడు ఉలిక్కి పడ్డాడు – "ఏమిటీ? నన్నా? ...."

"అవును ప్రభూ! నిన్నే .... 'ఆ రాముడు భ్రష్టుడు. నా ముందు ఎందుకూ పనికిరాడు. తపస్సులో, ఐశ్వర్యంలో, పరాక్రమంలో, ఇంకెందులోనూ నాకు సరిపోడు. పూర్వ జన్మలో ఏం పాపం చేశావో ఇంత కాలం వనవాసం చేశావు. రాజ్యం లేని వాడితో ఏం సుఖపడతావు? ఇక నాతో ఇప్పట్నించీ రాజభోగాలన్నీ అనుభవించు' అన్నాడు ప్రభూ! ...."

రావణుడి తర్కజ్ఞానం అక్కడి తర్క పండితుల కందరికీ చాలా ముచ్చట కొలిపింది. ఒక పండితుడు, సహ పండితుడితో తర్కం మొదలు పెట్టేశాడు. "అవును మరి. రావణుడన్న ప్రతిమాటా నిజమే. రాముడు రావణుడి కన్నా తపస్సులో తక్కువే. ఐశ్వర్యంలోనూ తక్కువే. మరి పరాక్రమంలోనా? ఏమో మరి, చూడాలి. అయినా రావణుడు ధనుర్విద్యలో గొప్పవాడే నంటున్నాడుగా హనుమంతుడూ? 'రాముడు భ్రష్టుడు' అని రావణుడు అన్నాడంటే, అందులో అసత్యం ఏముంది? రాజ్యం పోయిన రోజు భ్రష్టుడే కదా? ఆ రాజ్యం మళ్ళీ రావాలనీ, రాజ భోగాలు అనుభవించాలనీ రాముడు కలలు కంటున్నాడు కదా? సీతకి, పద్నాలుగేళ్ళ నించీ రాజ భోగాలు లేని మాట నిజమే కదా? శ్రీరాముడు ఎదురు చూసేది వాటికోసమేగా? ఆ మాటే రావణుడన్నాడు మరి. ఏ విధంగా చూసినా అతడి మాటలు కొట్టి పారెయ్యడానికి వీలున్నట్టు లేదు."

"అవును వీలు లేనట్టే వుంది" అని సహ పండితుడు కూడా ఒప్పుకున్నాడు.

"అప్పుడు కూడా సీత ఏమీ మాట్లాడలేదా హనుమంతుడా?" అన్నాడు రాముడు కోపంతో శాంతంగా.

"అయ్యో! ఎందుకు మాట్లాడలేదు స్వామీ? మొదట కొంతసేపు మౌనం వహించింది గానీ, తర్వాత మాత్రం మాటకు మాట బదులు చెప్పింది. ఆ దుష్టుణ్ణి ఎంతగానో నిందించింది. – 'నీ భార్యల్నే ప్రేమించు. నన్ను కోరకు. నేను నా భర్తని తప్ప పర పురుషుణ్ణి కన్నెత్తి చూడను .... నన్ను తీసుకుపోయి నా భర్తకు అప్పగించు. లేకపోతే నా భర్త నిన్ను సర్వ నాశనం చేస్తాడు' ఆఁటా అని శత విధాలా చెప్పింది. ఆ దుర్మార్గుడు జంకడే! మనసు మార్చుకోడే! ...."

"మరి, ఏవన్నాడేంటీ?" – ఎవరో కుతూహలంగా.

"అదే చెపుతున్నా! తన మాట తనదే! 'నువ్వెంతో అందంగా ఉన్నావు. నీ అందం నా మతి పోగొట్టి పిచ్చివాణ్ణి చేస్తోంది. మన్మధుడు పూల బాణాలతో నన్ను నీ వేపు తరుముతున్నాడు. దయదల్చూ, కనికరించూ, నాతో సుఖించూ' అని గోల పెట్టాడు."

శృంగార కవిత్వాలు రాసే పండితులు, "ఆహా! .... ఆహా!" అని తల లూపారు. "ఆహా! .... ఎంత సరసంగా అడుగుతున్నాడయ్యా! నీ అందం నా మతి పోగొడుతోంది అన్నాడంటే ఎంత దయనీయంగా అన్నాడూ! .... స్త్రీ సౌందర్యం పురుషుడి .... మతి పోగొడుతుంది కదా?"

"అసలు ఇంకో చమత్కారం చూశారూ? 'మన్మధుడు నన్ను నీ వేపు తరుముతున్నాడు' అనడంలో ఆ అందం చూశారూ? రావణుడికి ఎందరు భార్యలుంటేనేం? ఆయనకు ఎందరు స్త్రీలు అందుబాటులో ఉంటేనేం? మనసంతా ఈ స్త్రీ మీదకే లాగుతోందయ్యే! ఇంకో స్త్రీని కోరలేదయ్యే! అలాంటి శృంగారావస్థని .... ఆహా! ఎంత రమ్యంగా చెప్పాడండీ! .... 'మన్మధుడు నన్ను నీ వేపు తరుముతున్నాడ'న్నాడు. అంతేగా మరీ? .... అది తరమడమేగా? మన్మధుడి చిలిపి చేష్టేగా అదీ? .... ఏవంటారు మీరు?" అని ఈ శృంగార పండితుడు, ఆ శృంగార పండితుడితో!

"అయ్యో! కాదుటండీ? .... అదే తలుచుకుని, తలుచుకుని ముగ్ధుణ్ణవుతున్నాను. రావణుడు గొప్ప రసికు

దండీ! గొప్ప శృంగార చక్రవర్తి! .... ఆహా! ఎంత స్వార స్యంగా చెప్పాడండీ!" అంటూ, ఆ కవులు కళ్ళు మూసు కుని ఆనంద పారవశ్యంలో మునిగారు.

రాముడు మన్మధుడి దుర్మార్గం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. సీత మీద మోహం పుట్టిస్తూ, మన్మ ధుడు ఇక్కడ తన మీద బాణాలు గుప్పిస్తున్నాడు కదా? అక్కడ రావణుడి మీదా గుప్పిస్తున్నాడా? .... ఏం తుంటరితనం ఇది? .... కామ భోగాలు అనుభవించ దంలో నియమ నిష్ఠలు పాటించే తనే మన్మధుణ్ణి నిగ్రహించలేకుండా ఉన్నాడే! ఇక నిత్యం సుందరాంగన లతో, సౌఖ్యాలలో మునిగి తేలే ఆ రావణుడెలా నిగ్రహించగలడు? ఇదంతా మన్మధుడి కుతంత్రంలా ఉంది! మన్మధుడీ దుష్టత్వానికి తలపడకపోతే ...."

మన్మధుడి పూల బాణాల మీద దూరం జనంలో కూడా చర్చ జరుగుతోంది.

"మన్మధుడు రావణుడి మీద పూల బాణా లెయ్యటం ఎందుకూ?" అన్నారెవరో మొదట.

"సీత చాలా అందంగా ఉంటుందటగా? ఆమెని మోహించమని మన్మధుడు రావణుడికి చెపుతున్నాడన్న మాట, అలా బాణాలు వేసి!"

"ఏడిసినట్టే వుంది. సీత అంత అందంగా ఉంటే తనే మోహించాలి గానీ .... ఇంకొకరికి చెప్పటం ఏంటి?"

"ఛీ! ఊరుకో. నీకేం తెలీదు. ఉత్త అడివి మా లోకా నివి, మన్మధుడికి అందరి కంటే అందమైన భార్య ఉంది, తెలుసా? ఆవిడ రతీదేవి. ఆయన, అందర్నీ మోహించు కోమని పాపం అలా సాయాలు చేస్తాడంతే ...."

"మరి, రావణుణ్ణి మోహించమని సీత మీద కూడా బాణాలు వేస్తాడా?"

"ఛ! అలా ఎందుకేస్తాడూ? ఆమె దగ్గిర భర్త లేక పోతే, ఆ స్త్రీ మీద వెయ్యడు, పురుషుల మీదైతే ఎప్పుడైనా గుప్పించేస్తాడు."

"ఇదెక్కడి గోలయ్యా .... రావణుడి మీద తెగ బాణాలు గుప్పించేసి, సీత మీద ఒక్కటన్నా వెయ్యక పోతే .... ఇక వాళ్ళిద్దరికీ ఎలా కుదిరేదుస్తుందీ?"

"కుదిరేదవ గూడదుగా?"

"సరే! బాగానే ఉంది. మరి రావణుడి మీద కూడా మానెయ్యరాదూ? .... ముందా మన్మధుణ్ణి పట్టుకు బాదితే వ్యవహారమంతా చక్కబడే లాగుంది."

ఆ మాటల వాళ్ళ మీద, వెనకవాళ్ళూ, ముందు వాళ్ళూ అందరూ ఒక్కసారే విరుచుకు పడ్డారు – "ఎప్పుడూ మాటలే మీకు. వెధవ గోల. ఇక్కణ్ణించి పోండి. ఒక్క మాటా వినపడనివ్వరు" అని కేక లేశారు.

మాటల వాళ్ళు గుసగుసల్లోకి దిగారు. "పోదామా? కాస్సేపలా తిరిగొద్దాం. నేరేడు పళ్ళు దొరుకుతాయేమో చూద్దాం"

"ఇప్పుడు కాదు. ఈ సారి రాముడు మూర్ఛ పోయి నప్పుడు వెళ్దాంలే .... ఇక మాట్లాడకు ...."

"అది కాదు .... ఒక్క మాట .... మళ్ళీ మర్చి పోతానేమో. మన్మధుడు అందరూ మోహించుకోటానికి సాయం చేస్తాడన్నావు కదా? వాళ్ళావిణ్ణే రావణుడెత్తుకు పోతాడనుకో. అప్పుడు కూడా రావణుడి మీద బాణాలేస్తాడా?"

"అబ్బా, ఏం సందేహం తెచ్చిపెట్టావురా నాయనా! పండితుల్నెవర్నన్నా అడుగుదాం. ఊరుకో."

హనుమంతుడు చెప్తూకు పోతున్నాడు. రావణుడు, సీత అవయవాలన్నీ ఎలా వర్ణించాడో చెప్పుకుపోతు న్నాడు. సీత కళ్ళూ, చెంపలూ మెచ్చుకున్నాడు రావ ణుడు. జుట్టు బాగుందన్నాడు. గడ్డం బాగుందన్నాడు. తొడలు బాగున్నాయన్నాడు .... ....

రాముడు ఇంకా మన్మధుడి దుర్మార్గం లోంచి తేరుకోలేదు.

రావణుడు సీత స్తనాల్ని చాలా మెచ్చుకుంటున్నాడు! "సుందరీ! నీ స్తనాలు .... చక్కగా .... గుండ్రంగా .... బలిసి .... పెద్దవిగా ...."

రాముడు కొంచెం తేరుకుని అదిరిపడి "స్తనాలా? .... స్తనా లేమిటి?. స్తనాలెట్లా చూశాడు?" అని మండి పడ్డాడు. అంతలోనే తప్పు గ్రహించుకుని శాంతంగా, "సీతాదేవి .... ఎప్పుడూ .... చక్కగా పైట కప్పుకుంటుం దోయీ!" అంటూ కొంచెం కనుబొమ్మలు ముడిచాడు.

హనుమంతుడు రాముడి కోపానికి జంకి విన యంగా చేతులు జోడిస్తూ చెప్పాడు. "సీతాదేవి దోష మేమీ లేదు స్వామీ! రావణుడు తీసుకు పోతున్నప్పుడు, నగలు మూట కట్టటానికి .... ఆ కంగారులో చీరలోంచి బారెడు గుడ్డో, రెండు బారల గుడ్డో ఇక్కడే చింపేసింది కదా? ఆ మిగిలిన చీరైనా అక్కడక్కడా చిరిగి .... వొంటి నిండా చాలక చాలా ఇబ్బంది పడిపోతోంది. ఆ దుర్మా ర్గుడు అంతకు ముందే తొడలు చూశాడని .... చీరంతా పాదాల కిందకి లాక్కుంది. ఈ సారి భుజాల చుట్టూ కప్పుకోడానికి వీల్లేక .... చీర చాలక .... స్తనాలు .... కనపడిపోయాయి!"

సుగ్రీవుడు కోపంగా, "ఆ దుర్మార్గుడు, చీరలన్నా ఇవ్వలేదా?" అన్నాడు.

"అయ్యో, పాపం మాటలు! ఏ మాట కామాటే చెప్పుకోవాలి. ఎందుకివ్వ లేదూ? సీతాదేవి కట్టుకో నన్నదిగా?"

"ఓహో! అదా? ...." అని శాంతించాడు సుగ్రీ వుడు. పక్కకు తిరిగి నీలుడితో, "కట్టుకుంటేనే బాగుండే

దేమో! ఏమంటావు?" అన్నాడు.

"కట్టుకుంటే ఏం బాగుంటుందిలే మహారాజా! .... పతివ్రత కదా?" అని చప్పరించాడు నీలుడు.

ఆ విషయం మీద జనంలో కొత్త వాదోప వాదాలు చెలరేగాయి.

కొందరు "కట్టుకుంటేనే బాగుండేది" అన్నారు.

"ఏం బాగుండేది నీ మొహం! ఎత్తుకు పోయిన వాడిచ్చిన చీరలు కట్టుకుంటే బాగుండేదా? ఎంత లోకువ పర పురుషుడికి!" అన్నారు మరికొందరు.

"మరి ఆ ఒక్క కోకతో .... వొళ్ళంతా .... కనపడే లాగ ఎన్నాళ్ళుంటుంది?"

"ఆఁ .... పిచ్చి గానీ .... వొళ్ళు కప్పుకుంటే మాత్రం వాడు వర్ణించకుండా ఉంటాడా? ఎంత కప్పు కున్నా, 'నీ స్తనాలు బాగున్నాయి, నీ పిర్రలు బాగున్నాయి' అనక మానతాడా? వాడి బుద్ధి అదీ! ఏదేదో ఊహించి మరీ వాగుతాడు. లేకపోతే సీతాదేవి వాడికి పొత్తి కడుపూ, తొడలూ చూపించిందా ఏంటీ? వాటినీ పొగి డాడుగా?"

"నువ్వన్నదీ నిజమేలే. పట్టుదలంటే పట్టుదలే .... పోనీ వొళ్ళు చూస్తే చూస్తాడు. అంతే గానీ .... వాడిచ్చే గుడ్డలు కట్టుకోకూడదు, నిజమేలే. మా ఆవిడైతేనా, వెనకా ముందూ చూడకుండా మహా చక్కగా కట్టుకునేది. రోజుకి పది కోకలన్నా మార్చేది .... ఇంకా తెమ్మనేది కూడా!"

"అవును మరి. నువ్వేనాడన్నా ఆవిడ మొహాని కో గుడ్డ ముక్క కొంటేనా?"

"ఏడాదికీ జత కోకలు కొంటాను. ఇంకెన్ని కావాలి? చెల్లెలి వరసని వెనకేసుకొస్తున్నావు గానీ, మా ఆవిణ్ణి ఏ రావణుడో ఎత్తుకుపోతేనే గానీ, ఆ కోకల పిచ్చీ, ఆ నగల పిచ్చీ వొదలవులే."

హనుమంతుడు, రావణుణ్ణి వొదలడం లేదు.

రావణుడు, సీతని వొదలడం లేదు. సీతని కాదు, సీత స్తనాల్ని!

రావణుడు, సీత నడుం మీద నుంచి చూపులు తిప్పలేకపోతున్నాడు. "దుఖ్ఖంతో చిక్కిపోయి నీ నడుం మరింత సన్నబడి .... చాలా అందంగా చంద్రరేఖలా ఉన్నావు" అంటున్నాడు.

ఒక మూల నించి ఎవరో రావణుణ్ణి మెచ్చుకుంటు న్నారు. "అవును, బాగా అన్నాడు. ఆ మాట నిజమే. 'చక్కనమ్మ చిక్కినా అందమే, సన్నని బట్ట చిరిగినా అందమే' అనేవాడు మా తాత కూడా. పెద్ద వాళ్ళు ఊరికే అంటారా?" అని ఆయన పెద్ద వాళ్ళందర్నీ కూడా మెచ్చుకుంటున్నాడు.

రాముడికి అంతా అయోమయంగా అయిపోతోంది. సీత తన కోసం దుఃఖంతో కృంగి కృశించి పోయి నందుకు సంతోషించాలా; కృశించి, సన్నబడి, మరీ అందంగా తయారైనందుకు విచారించాలా? పర పురుషుడిచ్చే చీరలు కట్టనందుకు సంతోషం చాలా, పర పురుషుడికి వొళ్ళంతా చూపిస్తున్నందుకు విచారిం చాలా? – ఎటూ, ఏమీ తేల్చుకోలేక పోతున్నాడు.

అసలు ఆ చీర చించడం ఎందుకూ? నగలు ఏ పచ్చగడ్డి మీదో పడేస్తే సరిపోదూ? .... అసలు లక్ష్మ ణుణ్ణి పర్ణశాలలో ఉండనివ్వకుండా పంపడం ఎందుకూ? .... ఇంకా అసలు, తను రావొద్దన్నా విన కుండా అడవుల్లోకి రావడం ఎందుకూ? .... అంతః పురాల్లో ఉంటే .... స్త్రీకి ఎంత రక్షణ! ఎంత మర్యాద! ఈ కష్టాలన్నీ దాపురించేవా? ఆలోచిస్తోన్న కొద్దీ సీత మీద కోపంతో రాముడి తల భారం అయిపోతోంది. మూర్ఛ పోబుద్దేస్తోంది. హనుమంతుడేదో అంటున్నాడని కొంచెం తల ఎత్తాడు.

"ధైర్యం తెచ్చుకో రామా! ఆ పాపిష్టి వాణ్ణి, సీతాదేవి నిర్భయంగానే నిందించింది. వాడు వినిపించుకుంటేనా? 'నా కీర్తి చూడు, నా ఐశ్వర్యం చూడు, రాముడి పేరెత్తితే ఊరుకోను. ఇక నువ్వు రావణ పత్నివే. తెలివైన దానివైతే నాతో సుఖపడు' అన్నాడు దుర్మార్గుడు" అని హను మంతుడు ఆ మాటలు తన నోటితో చెప్పి తప్పు చేసి నట్టు తల వొంచుకున్నాడు.

"సీత తెలివైందేనా?" అని గుస గుసలు బయ ల్దేరాయి, మళ్ళీ!

"తెలివైనదే నేమో! ఎందుక్కాదూ?"

"అయితే రావణుడితో సుఖపడుతుందా?"

"ఛ! అవేం మాటలు?"

"మరి సుఖపడకపోతే తెలివి తక్కువదైపోదూ?"

పురోహితులు కొందరు మొహాలు చిట్లిస్తూ చాలా విస్తుబోయారు. "వివాహం గాకుండానే సీతని రావణ పత్ని అనడం ఏమిటండీ? వాడి అఘాయిత్యం పాడు గానూ! ఇక వైవాహిక కర్మకాండకు విలువెక్కడుం టుందీ?" అని తెగ నొచ్చుకున్నారు కూడా.

"సీతాదేవి అప్పుడేవందీ?" కుతూహలంగా అడి గాడు సుగ్రీవుడు. మంచి కథ వింటున్నట్టుగా వుంది అతనికి.

హనుమంతుడు ఉత్సాహంగా, "సిగ్గొచ్చేలాగా చెప్పిందిలే. 'రావణా! నీకు సిరి సంపదలున్నాయి గానీ సన్మార్గం లేదు. అది కూడా వుంటే నువ్వు ఉత్తముడివే' అంది" అన్నాడు.

"వాడా ఉత్తముడయ్యేది?" క్రీగంట కోపంగా చూశాడు రాముడు హనుమంతుణ్ణి.

" 'నా భర్త నీ వంటి దుర్మార్గుడు కాదు. సర్వ సద్గుణ

వంతుడు .... గొప్ప వరాన్న పుట్టినవాడు .... అలాంటి ఉత్తముణ్ణి విడిచి పెడతానా ఏమిటి?' అని మా బాగా చెప్పిందా తల్లి. అయితే యేం? మనలో మన మాట. .... ఆయనా వరాన్నే పుట్టాడంట! 'రాముడే కాదు, నేనూ వరాన్నే పుట్టాను' అన్నాడు" అని ఆగి, అందరూ ఆశ్చర్య పోతున్నారా లేదా అని, హనుమంతుడు నవ్వు మొహంతో, అందరి మొహాలూ పరకాయించాడు.

'రావణుడూ వరాన్నే పుట్టాడా!' అని ఆశ్చర్య పడ్డాడు రాముడు.

"అంత దుర్మార్గుడికి వరం ఇచ్చిన దేవు డెవరబ్బా?" అని జనం తర్జన భర్జనలు మొదలెట్టారు.

"వరం ఇచ్చేప్పటికి రావణుడు అసలు పుట్టనే లేదుగా? మంచి వాడవుతాడేమోనని వరం ఇచ్చేశాడు. పాపం దేవుడికేం తెలుసూ?"

"అవును, నిజమే. దేవుడు, రావణుడి తల్లిదండ్రు లకు వరం ఇచ్చాడు గానీ రావణుడికి కాదుగా?"

"నేనూ వరాన్నే పుట్టానంట ...." అంటున్నా డొకాయన కొంచెం సిగ్గు పడుతూ, ఒక మూల.

"నువ్వే కాదు. నేనూ వరాన్నే పుట్టాను. అసలు నేను చాలా కాలం పుట్టలేదని మా అమ్మమ్మ నాగేంద్రుడికి మొక్కుకుంటే .... ఒక రోజు .... నాగేంద్రుడు మా తాతకి పొలం గట్టున కనపడీ ...."

"అదేంటీ? .... మీ అమ్మమ్మ మొక్కుకుంటే, మీ తాతకి కనపడ్డం ఏంటీ?"

"ఏమో మరి. ఆయన ఇష్టవా, మన ఇష్టవా? .... ఏం, అలా పొలం గట్టున కనబడీ మాయం అయిపోయా దంట! కొన్నాళ్ళు పోయాక మళ్ళీ కల్లో కనపడీ .... మీకు చాలా మంచి మనవడు పుడతాడూ, చాలా గొప్ప మనవడవుతాడూ' అని చెప్పాడంట! ఆ తర్వాత పదేళ్ళకి నేను పుట్టానన్న మాట ...."

వినే ఆయనకి ఎడం పక్కాయన, తను గణపతి వరాన్న పుట్టుకొచ్చిన కథ ఇంకా చక్కగా తన ఎడం పోరుగాయనకి చెపుతున్నాడు.

వెనక వాళ్ళెవరో పార్వతీదేవి వరాన్న పుడుతు న్నారు. చాలా మంది ఈశ్వరుడి వరాన్న అప్పటికే పుట్టారు.

"ఈశ్వరుడి వరం అంత మంచిదేం కాదు. అంత శక్తి ఉండదు."

"ఎందుకుండదూ? ఆ మాటకొస్తే పార్వతి వరానికే శక్తి ఉండదు. రేపేవన్నా కష్టాలొస్తే ఆడదెలా రక్షిస్తుంది? .... అదే మొగదేవుడైతే ...."

సుగ్రీవుడు నవ్వు మొహంతో నీలుణ్ణి చూస్తూ "నేను కూడా వరాన్నే ...."

"చిత్తం! .... నేనూ కొండ దేవత వరాన్న ...."

"అలాగా? .... సరేలే" అని తల తిప్పేశాడు సుగ్రీవుడు.

మొత్తంగా జనంలో అందరూ వరాల వల్ల పుట్టిన వాళ్ళేనని తేలింది. తల్లి దండ్రుల వల్ల పుట్టిన వాళ్ళు ఒక్కళ్ళూ లేరు, అక్కడ!

"తొందరగా చెప్పు నాయనా! అప్పుడు సీత ఏమ న్నది?" – రాముడు.

"సీతాదేవి చాలా కోపం తెచ్చుకుని, కళ్ళెర్ర జేసింది. 'రావణా! గొప్ప పరాక్రమవంతుణ్ణి అంటున్నావు. నా భర్త లేని సమయంలో పిరికిపంద లాగ వచ్చి నన్ను రహ స్యంగా ఎందుకు తీసుకు వచ్చావు?' అని చక్కగా అడి గింది" అని నవ్వు మొహంతో అందర్నీ చూశాడు హను మంతుడు.

"అడిగిందీ?" అని చాలా మంది సంతోషించారు. ముఖ్యంగా తర్క పండితులు!

"సీతాదేవి చాలా తెలివైనదయ్యా! అప్పుడు రావణ మహారాజేవన్నాడోయీ?"

"ఏం? నీ భర్త చేసిన ఘనకార్యం మాత్రం ఏంటీ? నా చెల్లెల్ని ఒంటరిగా పట్టుకుని ముక్కూ, చెవులూ కోయించలేదా? – అని మహా చక్కగా అడిగాడు సుమా!" అనేసి, హనుమంతుడు చప్పున తప్పు గ్రహిం చుకుని తల పక్కకి తిప్పుకున్నాడు.

రాముడు మొహం చిట్లించాడు. "అబ్బ! ఈ లక్ష్మ ణుడికి కోపమొస్తే మంచీ చెడ్డా తెలీదు. ఆ పిల్లకి, ఆ ముక్కూ, చెవులూ కోసుకోడం ఎందుకూ? చితకదన్ని పంపిస్తే సరిపోయే దానికి .... చూడు, ఇవ్వాళ ఎలా అడిగించుకోవలసివచ్చిందో ....!" – రాముడి మన సంతా గందరగోళంగా అయింది. అస్తస్తమానూ మూర్ఛ పోబుద్ధేస్తోంది.

శూర్పణఖ ముక్కూ చెవులూ కోసం జనంలో అక్క డక్కడా 'చ్చొ, చ్చొ, చ్చొ'లు సాగాయి.

"పాపం చాలా అన్యాయమే. ఆడ కూతుర్ని పట్టు కుని ముక్కు కొయ్యటం ఏంటీ? కట్టుకున్న వాడు ఏలు కుంటాడా?"

"మరే! ముక్కు కోసి ఊరుకున్నాడా? చెవులు కూడా కొయ్యటం ఏంటీ?"

"అసలు చెవులు కోసినా కొంత నయం. ముక్కు కొయ్యడం ఏంటంట .... పోయే కాలం గాకపోతే ...."

"ముక్కో ముక్కో అంటావు, చెవులేనా, అక్కర్లేందీ?"

"అబ్బే, చెవులూ ఉండాలిగానీ .... ముక్కు ఇంకా ఉండాలి కదా?"

"ధర్మాత్ములం, ధర్మాత్ములం అంటారు గానీ అసలీ అన్నదమ్ములిద్దరికీ .... ఎవర్నో ఒకర్ని ఏడిపించడమే బుద్ధి గావున్ను .... పాడు బుద్ధి! మా బాగా చేశాళ్ళే

రావణుడు."

"ష్! ఊరుకోండి. మీ దుంపతెగ! వస పిట్టల్లాగ ఒకటే వాగుడు .... రావణుడు చక్కగా మాట్లాడు తున్నాడు. ఒక్కటీ వినపడనిచ్చి చావరు ...."

రావణుడు సీతని పరిహాసం చేస్తున్నాడు – "నా భర్త ఇంతటివాడు .... అంతటివాడు అంటావు. నిన్ను నీ భర్త ఇంత కాలం ఎందుకు రక్షించలేక పోయాడు?" అని మీసం తిప్పుతూ అడుగుతున్నాడు.

రాముడు నెమ్మదిగా నేలకొరిగి మూర్ఛ పోయాడు.

"పదండి. మళ్ళీ ఆయన లేచేప్పటికి వొద్దాం" అంటూ కొంత మంది గబ గబా లేచారు. లేవడానికి మొదట చొరవ చేసిన వాళ్ళని చూసి ఇంకా కొంత మంది లేచారు.

కూర్చున్న వాళ్ళు బాగా కంఠాలు తగ్గించారు. "రావణు డడిగిన మాట సబబుగానే ఉంది. భార్య మీద అనురాగంతో ఘడియకోసారి మూర్ఛలు పడి పోతు న్నాడు గదా? ఇంత కాలం ఎందుకు తెచ్చుకో లేదు మరి?"

"ఎలా తెచ్చుకుంటాడూ? మాట లేంటీ యుద్ధ వంటే? ఆయనికి చేతనైంది మూర్ఛ తెచ్చుకోటం ఒక్కటే! ఆడవాళ్ళు దొరికితే ముక్కులు కొయ్యటం!"

"గట్టిగా అనకు. బాగుండదు ...."

లేచిన వాళ్ళు చెట్ల వెంట పడ్డారు. కొందరు, వాగులో నీళ్ళు తాగటానికి పోయారు. కొందరు ఇళ్ళ దగ్గిర గొడవలు చెప్పుకుంటున్నారు.

"రండి, రండి" అని మళ్ళీ కూర్చున్న వాళ్ళు దూరం వాళ్ళని కేకలేసి పిలిచారు. "రాముడు లేచాడు .... రండి!"

అందరూ చేరేటప్పటికి హనుమంతుడు చాలా చెప్పేశాడు. రాముడు తలూపుతూ వింటున్నాడు.

"రావణుడు వెక్కిరించినందుకు సీత ఏవందీ?" అని వెనకాల వచ్చిన వాళ్ళు ముందు వచ్చిన వాళ్ళని అడుగు తున్నారు.

"నీ కింకా మూడలేదంది. పాపం పండొద్దూ ఎవరి కైనా?"

సీత, రావణుణ్ణి ఎంత చక్కగా నిందించిందో వింటున్న కొద్దీ రాముడి మనసు చాలా తేలిక పడు తోంది. "నాయనా! ఆ దుర్మార్గుడు .... సీతాదేవిని దండించలేదు కదా? ఆమెకి ఎంత దూరంలో నించు న్నాడు నాయనా?" అని రాముడు, ఎప్పటి నించో తొలుస్తున్న ప్రశ్న అడిగేశాడు.

"అబ్బే! పాపం మాట లెందుగ్గానీ .... ఏమీ దండించలేదు. ముద్దుగా పెంపుడు చిలకని చూసు కున్నట్టు చూసుకుంటున్నాడు. అసలు సీతాదేవి ఎన్ని తిట్టినా కోపం తెచ్చుకోడే! ఆవిడ నోట్లోంచి మాట వస్తే చాలన్నట్టు .... ఒక వేపు తిడుతోంటే, ఒక వేపు ముసి ముసి నవ్వులు నవ్వుతాడు ...."

రాముడికి సీత మీద అంచెలంచెలుగా కోపం మొదలైంది. – అంతర్ముఖుడయ్యాడు – పర పురుషు డితో అన్ని మాట లెందుకూ? ఒక్క మాట చెప్పేసి ఇక ఊరుకో కూడదూ? వాణ్ణి ఆనందపెట్టే లాగ అన్ని మాటలా!

"నాయనా! .... ఇంతకీ ఎంత దూ ...."

"అదే చెపుతున్నా రామయ్యా!" హనుమంతుడు ఇటూ అటూ చూసి, "అదుగో! ఆ మైందుడు కూర్చు న్నంత దూరం .... అబ్బే! అంత దూరం కాదు గానీ .... ఆఁ .... తారుడు కూర్చున్నంత దగ్గిర్లో .... నించు న్నాడు .... అవును .... అంతే ...." అని, హను మంతుడు ఆ దూరాన్ని మళ్ళీ మళ్ళీ అంచనా వేశాడు.

రాముడికి తారుడి మీద కలబడాలనిపించింది అంత దగ్గిరిగా కూర్చున్నందుకు!

"ఊఁ చెప్పు .... తర్వాతేమైంది?" అన్నాడు సుగ్రీవుడు, అప్పుడే గుస గుసల్లోంచి బయటపడి.

"ఇంకేమవుతుందిలే మహారాజా! ఆయన మాట ఆయనా వదలడు, ఈవిడ పట్టు ఈవిడా వదలదు. 'ఎంతకాలం నీ భర్త కోసం ఎదురు చూస్తావు? .... నీ వయసంతా వృధాగా గడిచి పోతోంది కదా? ఏటి ప్రవాహం వెనక్కి వస్తుందా? .... నా మాట విను ....' అంటూ బతిమలాడి చూశాడు ఆయన చాలా సేపు ...."

తర్క పండితులకు రావణుడి తర్కంలో ఈ సారి మరీ సబబు కనిపించింది. "అవును మరీ. అంతే మరీ. రోజులు గడిచిపోతే మళ్ళీ వెనక్కి వస్తాయా? .... అబ్బే! ఒక్క క్షణం రమ్మన్నా రాదు ...." అని తలలు తాటిస్తూ విన్నారు.

కవులకైతే మరీ సంతోషం కలిగింది ఆ పోలికతో. "అందులో సొగసు మీరు గ్రహించారూ?" అని ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. "వయసంతా వృధాగా పోతోందన్నాడా? వయసంటే యవ్వనమేగా? .... ఓహో! యవ్వనాన్ని 'నీటి ప్రవాహం'తో పోల్చాడా? .... చాలా చక్కటి పోలిక సుమండీ! .... ఏవంటారూ మీరూ?"

"రావణుడు శాస్త్రాలన్నీ చదివిన వాడేనండీ! వాడేం సామాన్యుడా? అటు వ్యాకరణ శాస్త్ర నిబంధనలూ .... ఇటు కవిత్వం సొగసులూ, అన్నీ తెలిసిన వాడే .... యవ్వనాన్ని ఏటి ప్రవాహంతో పోల్చిన తర్వాత ఇక ఎవరైనా నోరెత్తడానికి వీలుందా? .... ఒప్పుకోవల సిందే!"

కవులూ, పండితులూ రావణుడి పాండిత్యంతో

ముగ్ధులై పోతున్నారు.

జనంలో ఒకాయనకి, అంతవరకూ రాని అనుమానం ఒకటి వచ్చిపడింది. "అసలు రావణుడు అంతగా బతిమాలటం ఏంటీ? .... మొగాడు ఆడ దాన్ని బతిమాలతాడా ఎక్కడన్నా?" అన్నాడు ఇరుగు పొరుగులతో.

"నీ మొహం, నీకేం తెలుసులే? ముద్దూ ముచ్చటా ఉండవూ? ముద్దుగా అడిగి చూస్తున్నాడూ!"

"ఏం ముద్దూ? మరీ అన్ని నెలలా? మా ఇంటా వంటా ఎరగం. మా తండ్రుల్నాడూ, తాతల్నాడూ కూడా ఆడదాన్ని బతిమాలి ఎరగరు. ఆ రావణుడి వంశం వాళ్ళకి ఎంత సిగ్గులేదో గానీ ...."

రావణుడి వంశం వాళ్ళకి ఎంత సిగ్గు ఉందో హనుమంతుడు చెప్పుకొస్తున్నాడు.

రావణుడికి కోపం వచ్చేసింది. ఎన్ని విధాల బతిమాలినా, బెదిరించినా సీత వినను పొమ్మనే సరికి, రావణుడు ఉగ్రుడై పోయాడు. "సరే! రెండు నెలలు గడువిస్తాను" అన్నాడు, సీతతో.

"అవ్వ! .... ఇంకా రెండు నెలలా? ఇంత కాలం వినలేదు గానీ అప్పుడు మాత్రం వింటుందా? ఆట లాగుందే! వదిలెయ్యరాదూ?"

"అప్పటికీ వినకపోతే, మరణ శిక్ష వేయిం చేస్తాను – అన్నాడు రావణుడు ...."

తుళ్ళిపడ్డాడు రాముడు! "మరణ శిక్షా? .... సీతకా?"

అదిరిపడ్డాడు లక్ష్మణుడు "మరణ శిక్షా? వదిన గారికా? ...."

తెల్లబోయారు అందరూ – "మరణ శిక్షే!"

"అంత మోహం వున్న స్త్రీని ఏ పురుషుడూ చంపించదే!" అని ఆశ్చర్యపడ్డారు పండితులు.

"ఊరికే బెదిరించడానికి అని ఉంటాడా?" శృంగార కవుల్లో కొందరికి వింతగా తోచింది. "అంత కాలం కష్టపెట్టకుండా, ముట్టుకోకుండా బతిమిలాడడం ఏమిటీ, .... తీరా అంత ముద్దుగా చూసుకుని చివరికి చంపేస్తాననడం ఏమిటీ? ఇది శృంగార చరిత్రలోనే గొప్ప విశేషంగా తోస్తోంది సుమండీ!"

"అసలు శృంగారం నుంచే వైరాగ్యం పుడుతుం దండీ! .... మోహంలోనే కక్ష మిళితమై ఉంటుంది. ఏవంటారు?"

"అవును. అల్లాగే తోస్తోంది."

రాముడు కన్నీళ్ళు కారుస్తూ మొహం దించేసుకున్నాడు.

సుగ్రీవుడు, రాముడి చేతులు పట్టుకుని, "శ్రీరామా! విచారపడకు. రెండు నెలల గడువులో మనం సీతాదేవిని రక్షించలేమా? .... ఆ దుర్మార్గుడికి ఆయువు రెండు నెలలే ఉంది. అందుకే రెండు నెలలే గడువిచ్చాడు. నా మాట విను. యుద్ధాలలో ఆరి తేరిన వీరాధి వీరులెందరో ఉన్నారు మనకు. మంచి చెడ్డలు చూసుకుని మనం ఇక యుద్ధానికి బయల్దేరడమే ...." అని ఓదార్చడం మొదలు పెట్టాడు.

ఆ నాలుగు మాటలూ రాముడికి వెయ్యేనుగుల బలం ఇచ్చాయి. దీర్ఘంగా నిట్టూర్చాడు. "తర్వాతేం జరిగిందో చెప్పు నాయనా!"

హనుమంతుడు కూడా విచారంలోంచి తేరుకున్నాడు. "సీత మనసెలాగైనా మార్చమని దాసీ లందర్నీ హెచ్చరించి రావణుడు అక్కణ్ణించి వెళ్ళిపోయాడు ప్రభూ!"

"వెళ్ళి పోయాడా?"

"వెళ్ళి పోయాడు ప్రభూ!"

"వెళ్ళే పోయాడా?"

"ఆఁ, వెళ్ళే పోయాడు ప్రభూ!"

"మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చాడా? పూర్తిగా వెళ్ళే ...."

"అబ్బే! ఇక రాలేదు. పూర్తిగా వెళ్ళేపోయాడు .... ఆ దుర్మార్గుడు వెళ్ళిపోతే ఏమైందిలే. సీత చుట్టూ దుర్మార్గులు లేరూ?"

"మళ్ళీ ఏ దుర్మార్గులు?"

"అదే .... దాసీలు లేరూ? .... వాళ్ళందరూ రావణుడు చెప్పిన మాటలే మళ్ళీ చెప్పడం మొదలు పెట్టారు. 'రావణుడు మహారాజు కదా? అలాంటి వాణ్ణి వద్దంటావెందుకూ? రాముడికేం ఉంది? గుడ్డి గవ్వ ఆస్తి లేదు .... అసలు నీ తండ్రి ఇలాంటి సంబంధం ఎందుకు చేశాడూ?' అని సీతాదేవిని వెక్కిరించడం మొదలు పెట్టారు ...."

లక్ష్మణుడు కోపంతో ఊగుతూ, "దాసీలకు కూడా అంత కండ కావరమా? హనుమా! మనం లంకకు పోయినప్పుడు వాళ్ళందర్నీ నాకు చూపించు, పట్టుకుని ముక్కులూ, చెవులూ, తెగ్గోస్తాను" అని ఉరిమాడు.

రాముడు శాంతంగా, "ఊరుకో లక్ష్మణా! ఆ దాసీలు, వారి ధర్మం వారు నిర్వర్తిస్తున్నారు. రావణుడికి విశ్వాస పాత్రులైన భృత్యులే ఉన్నట్టు తోస్తున్నది" అని ఆ దాసీల్ని మెచ్చుకున్నాడు.

"ఆ విధంగా దాసీలు ఎంత చెప్పినా సీతాదేవి ససేమిరా ఒప్పుకోనంది. నన్ను చంపేసినా సరే, మీరు చెప్పినట్టు చెయ్యనంది."

రాముడి మనసు నిండా ఒక్కసారి వరద లాగ సీత మీద ప్రేమ పొంగింది.

"అంతలో .... త్రిజట అనే ఒక దాసీ వచ్చి మా చక్కటి 'కల' చెప్పింది రామయ్యా!"

"కలా? అబ్బే! కలల్ని నమ్మకూడదు" అని పెదవి విరిచాడు సుగ్రీవుడు. వాలే సింహాసనం మీద కూర్చుని వున్నట్టు సుగ్రీవుడికి ఇప్పటికీ చాలా సార్లు కలలు వొస్తూ వుంటాయి.

హనుమంతుడు ఉత్సాహంగా త్రిజట కల అంతా చెప్పుకొచ్చాడు. "రామయ్యా! గొప్ప రథంలో నువ్వూ, లక్ష్మణుడూ లంకకు పోయారంట! సీతాదేవి రథం ఎక్కిందంట! మళ్ళీ ఏనుగెక్కి వెళ్ళారంట. సీతాదేవి ఏను గెక్కిందంట. మళ్ళీ మీరు దేని మీదో .... ఆఁ ఎడ్లబండి మీద వెళ్ళారు. రావణుడూ, అతని బంధువులూ, తమ్ముళ్ళూ అందరూ, గాడిదలెక్కీ, పందులెక్కీ నరకానికి పోయారంట. విభీషణుడనే తమ్ముడు మాత్రం ఏనుగెక్కి స్వర్గానికి పోయాడంట! ...."

"ఏం? ఎందుచేతా? .... విభీషణు డొక్కడే స్వర్గాని కెందుకు పోయాడూ?" అని అడిగాడు సుగ్రీవుడు.

"ఆయన ధర్మాత్ముడులే మహారాజా! అంతా వరసగా చెప్పుకొస్తాగా? ...."

రాముడు లోలోపల ఆశ్చర్య పడుతున్నాడు. రాక్షస స్త్రీకి అటువంటి కల రావడం ఏమిటి? అయితే యుద్ధంలో చివరికి తనే గెలుస్తాడన్న మాట! .... అంతా దైవ నిర్ణయంలాగే ఉంది.

దూరంగా కూర్చున్న వాళ్ళు, కలల గురించి ముచ్చ టించుకుంటున్నారు.

"తెల్లారగట్ల వచ్చే కలలయితే తప్పకుండా నిజమవు తాయి. ఒకసారి మా ఆనప్పాదు పిందిలేసిందని కలొ చ్చింది నాకు. నాలుగు రోజుల్లో నిజంగానే మా పాదు పిందిలేసింది."

"నేను చచ్చినా నమ్మను."

"ఏంటి? మా ఆనప్పాదు పిందిలేసిందంటేనా?"

"అది కాదు."

"మరేంటి, నాకు కలొచ్చిందంటేనా?"

"అబ్బ! .... అదీ కాదు. ఒకసారి నాకు చాకలి బానంత బంగారం ముద్ద దొరికినట్టు కలొచ్చింది. తెల్లారగట్లే వొచ్చింది. ఇంతవరకూ బంగారం లేదు, గింగారం లేదు. నల్ల పూసంతన్నా దొరకలేదు."

"తెల్లారగట్ల అనుకున్నావు గానీ అది తెల్లారగట్ల కాదేమో, లేకపోతే ఎందుకు దొరకదూ? .... మా ఆనప్పాదు ...."

బంగారం కలాయన సందేహంలో పడ్డాడు, అది తెల్లారగట్ల కాదా అని!

సరే, సీత దగ్గిర దాసీ లందరూ నిద్దర్లు పోయారు.

హనుమంతుడు సీతతో మాట్లాడుతున్నాడు.

సీత హనుమంతుణ్ణి నమ్మటం లేదు. హను మంతుణ్ణి కూడా రావణుడేమో అనుకుంటోంది.

రాముడు ఉలిక్కిపడి, "రావణుడు వెళ్ళిపోయాడన్నా వుగా?" అని కోపంగా చూశాడు.

"మారు వేషంలో వచ్చాడేమోననీ .... సీతాదేవి .... సందేహపడింది."

"అలా ఎప్పుడన్నా వచ్చేవాడా?"

"అబ్బో, బోలెడు సార్లు ...."

"మరి నా వేషం వేసుకుని కూడా ఎప్పుడన్నా ...."

హనుమంతుడు చాలాసేపు ఆలోచించాడు – "నే నడగలేదు రామయ్యా! వచ్చే వుంటాడు దుర్మార్గుడు."

రాముడికి వొళ్ళు మండిపోయింది – ఆ మాట అడగని హనుమంతుడి మీద.

హనుమంతుడు చెప్పుకుపోతున్నాడు. "అంచేత అక్కడి వాళ్ళే ఎవరో మోసం చెయ్యటానికి వచ్చారనుకుని .... ఆ తల్లి నన్ను నమ్మలేకపోయింది మొదట .... ఎంత చెప్పినా సందేహిస్తూనే ఉంది ...." జనం ఇక తర్వాత తను చేసిన ఘనకార్యాలన్నీ వింటారు గదా అని హను మంతుడు ముసి ముసి నవ్వుల్లోకి దిగాడు.

"మరి వెళ్ళగానే ఆ ఉంగరం చూపించలేక పోయా వంటయ్యా!" అని ఎవరో కేక పెట్టారు, గట్టిగానే.

లక్ష్మణుడు కూడా కోపంగా ఆ మాటే అడిగాడు. "అన్నగా రిచ్చిన ఉంగరం చూపించలేదూ?" అన్నాడు.

హనుమంతుడు తత్తరపడి, ఇకిలింపు కట్టి పెట్టి, "అదే .... సీతాదేవిని చూసిన సంతోషంతో ఆ సంగతే మరిచేపోయాను. తర్వాత చూపించాననుకో. చాలా సంతోషించింది. కళ్ళనీళ్ళు పెట్టుకుంది. అందరి క్షేమ సమాచారాలూ అడిగింది. 'నా భర్త క్షేమంగా ఉన్నాడా! నా మరిది సుఖంగా ఉన్నాడా? కోసల కబుర్లు తెలుస్తు న్నాయా? నా భర్త నన్నింత కాలం ఉపేక్షించా డెందుకూ? .... నన్ను తీసుకు పోవాలని తొందరే వుంటే ఇంత జాప్యం చేస్తాడా? .... నన్ను రక్షించకుండా ఇంత కాలం మౌనం వహించాడెందుకూ?' అని వల వలా దుఃఖిస్తూ చాలా నిష్ఠూరంగా అడిగింది రామా!"

రాముడికి మళ్ళీ మూర్ఛ రాబోయింది, తల వాల్చి ఊరుకున్నాడు. "తర్కం మాత్రం బాగా నేర్చింది. ప్రశ్నలు వెయ్యడానికైతే తన తర్వాతే .... అబ్బ! .... ఈ హను మంతు దేవిటి? .... ఏ మాట పైకి చెప్పాలో .... ఏ మాట చెప్పకూడదో ఏమీ ఆలోచించడే! .... బొత్తిగా బండ రకం!"

జనం కొంచెం సందేహంలో పడ్డారు.

"ఆ మాటే రావణు డడిగినప్పుడు, 'నీ కింకా మూడకే నా భర్త ఊరుకున్నా' దందిగా? మళ్ళీ తన కేవీ తెలీనట్టు, నా భర్త నన్ను రక్షించలేదే మంటుం దెందుకూ? .... అయితే రాముడింకా భార్యని రక్షించక పోవడం, రావణుడికి మూడక కాదన్న మాట! .... మరి

ఎందుకంటావూ? ఏదో రహస్యం ఉంది ...."

"ఎందుకేంటి? .... నిన్న మొన్నటిదాకా వానా కాలమే నయ్యే!"

"ఏంటీ? పది నెలలూ వానాకాలమే! వానా కాలం పోయి పాదులన్నీ ఎప్పుడో ఉడిగిపోతేనూ. నీ కసలు మాసాలూ, రుతువులూ తెలుసాని ...."

"నీకు తెలుసులే మహా ...." ఆ చర్చ, ప్రారంభం లోనే పోట్లాటతో అంతమైపోయింది.

రాముడు, భార్య నెందుకు రక్షించలేదో హను మంతుడు చాలా భక్తిగా చెపుతున్నాడు సీతకి. "'అమ్మా! నీ భర్త నీ కోసమే విచారంలో మునిగిపోయి నిన్ను రక్షించే సంగతే మరిచిపోయాడు. నీ కోసమే శోక సము ద్రంలో మునిగిపోయి దీనుడై తనని తనే మరిచి పోయాడు' అని చెప్పాను రామయ్యా!"

హనుమంతుణ్ణి అమాంతంగా కావలించుకో బుద్ధే సింది రాముడికి. "నా పరువు కాపాడావు నాయనా!" అనబోయి నిగ్రహించుకుని పరువు కాపాడుకున్నాడు.

సీతాదేవి ఎలా దుఃఖించిందో హనుమంతుడు చెప్పు కొచ్చాడు. "ఆవిడ దుఃఖించి, దుఃఖించి చివరికి, ఇదంతా నా ఖర్మే, ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? అని నిట్టూర్చింది."

రాముడు ఇంతకాలం భార్యని ఎందుకు రక్షించ లేదా – అని ఆశ్చర్యపోతున్న వాళ్ళందరికీ కను విప్పు కలిగినట్టయింది. "చూశావా! సీత ఖర్మన్న మాట! రాముడు మాత్రం ఏం చెయ్యగలడూ? .... ఎంత గొప్ప వాడైనా ఖర్మ బలానికి లొంగిపోవలసిందే" అంటున్నాడు ఇందాక పోట్లాడి నాయన, తన శత్రువుకి వినపడేటట్టు పక్కాయనతో.

ఆ శత్రువు ఆ మాటలన్నీ విని, 'ఖర్మ'ని కాదనలేక కిక్కురు మనలేక పోయాడు.

సీత, తన ఖర్మని తనే ఒప్పుకున్న తర్వాత రాముడి మనసు చాలా తేలిక పడింది "నా సీత ఇంకా ఏమన్నది నాయనా?"

"రేపు యుద్ధం కోసం, భరతుడు సైన్యాలు పంపు తాడా? అని అడిగింది రామయ్యా!"

రాముడు ముందు తెల్లబోయాడు గానీ .... అటెనక కోపం తెచ్చుకున్నాడు. ఆడదానికి ఆ గొడవలన్నీ ఎందుకు? భరతుడు సైన్యాలు పంపుతాడా అని హను మంతుణ్ణి అడిగితే అతనికేం తెలుస్తుంది? విన్నవాడు విన్నట్టు ఊరుకున్నాడా? పది మంది ముందూ చెప్పేశాడు! రేపు సుగ్రీవుడేమంటాడు? 'భరతుణ్ణి కూడా కొంత సైన్యం పంపమని కబురంపు. కొంత నేనిస్తాను' అంటే? అందుకే స్త్రీలు పెద్ద పెద్ద విషయాల్లో కలగజేసు కోకూడదంటారు.

"చెప్పు నాయనా! .... ఇంకా సీత ఏమందో అన్నీ చెప్పు. ఎన్ని కష్టాలు పడుతోందో కదా ఆ దుర్మార్గుల మధ్య నిత్యం ...."

"దుర్మార్గులంటే గుర్తొచ్చింది. అక్కడ కూడా సీతాదేవిని భక్తిగా చూసుకుంటున్న వాళ్ళున్నారు రామా! .... విభీషణుడి కూతురు, సీతాదేవి దగ్గిరికొచ్చి రహ స్యంగా మాట్లాడి వెళ్తుందంట! సీతతో మాట్లాడి రమ్మని విభీషణుడి భార్యే పంపిస్తుందంట కూతుర్ని. రావణుడు ఇంత దుర్మార్గం చెయ్యటం విభీషణుడి కేమీ ఇష్టం లేదంట. 'సీతాదేవిని వదిలి పెట్టేయమ'ని విభీషణుడు అన్నగారికి నిత్యం చెపుతూనే వున్నాడంట ...."

రాముడు ఆశ్చర్యపోతూ వింటున్నాడు. కళ్ళింతింత చేసుకుని హనుమంతుణ్ణి చూస్తున్నాడు. మనసు చురుగ్గా దాని పని అది చేస్తోంది. రావణుడి తమ్ముడు, రావణు డికి వ్యతిరేకంగా ఉన్నాడా? .... విభీషణుడూ, అతడి భార్యా, సీత విషయంలో అంత శ్రద్ధ చూపడం ఏవిటీ? .... ఎందుచేతా? ఎందుచేతై ఉంటుందీ? .... ఎందు చేతనుకోవాలీ? ఉత్త మంచి తనమేనా? .... ఇందులో ఏమన్నా 'రాజకీయం' ఉందా? రావణుడి చేష్టలు విభీ షణుడు ఇష్టపడటం లేదా? .... ఇవ్వాళ కొత్తగా ఇష్ట పడక పోవడానికేముందీ? అతను ఆడవాళ్ళని ఎత్తుకు పోవడం ఎప్పుడూ జరుగుతోన్న వ్యవహారమేగా? ఈ తమ్ముడు ఎప్పుడూ వ్యతిరేకిస్తోనే ఉన్నాడా? .... లేకపోతే సుగ్రీవుడి లాగానే, అన్న నించీ తనకు రాజ్యాధికారం కోసం చూస్తున్నాడా? .... ఆశ్చర్యంగానే ఉంది ఇది! అంతా వింటే గానీ ఏమీ నిర్ణయించుకోకూడదు.

"ఊ, చెప్పు నాయనా! ఆ దుర్మార్గుల్లో కూడా అంత ధర్మాత్ములున్నారా?"

"అయ్యో! .... విభీషణుడెంత ధర్మాత్ముడో ఇంకా ముందు ముందు మీరే గ్రహిస్తారు .... ఆ విధంగా సీతమ్మ తల్లితో కష్టం సుఖం మాట్లాడుతూ కూర్చున్నాను. 'అమ్మా! నీ పెనిమిటి కేం చెప్పమంటావు?' అని అడిగాను. ఆ తల్లి వల వలా ఏడ్చి కాకి సంగతి చెప్పింది ...."

కాకి సంగతేవిటి? రాముడికి విభీషణుడి సంగతి తెలుసుకోవాలని తొందరగా ఉంది.

హనుమంతుడు ముచ్చటగా చెప్పుకొచ్చాడు.

"ఒక సారి మీ భార్యాభర్త లిద్దరూ చిత్రకూటంలో చెట్టు కింద పడుకుని ఉంటే సీతాదేవిని కాకి పొడిచిందంట కదా? .... ఆ సంగతంతా ముచ్చటగా చెప్పింది ...."

రాముడు కొంచెం మొహం చిట్లించాడు. ఆ విభీష ణుడి సంగతేవిటో, ఆ బాలిక వచ్చి ఏం మాట్లాడేదో,

అన్నీ వివరంగా చెప్పి పంపక, కాకి సంగతీ, పిచిక సంగతీ ఎందుకంట? .... కాకి పొడవడానికి లెక్కేవిటి? .... తననెన్ని సార్లు తన్నిందో నెత్తి మీద! ఎవరికి గుర్తుంటాయి అవన్నీ?

శృంగార కవులు, 'కాకి' ఉదంతానికి తెగ కించపడు తున్నారు. ...అంత సుందరాంగి .... అంత యవ్వనవతి .... బహుకాల వియోగంలో మగ్గుతోన్న జవరాలు ... భర్తకు .... మధుర స్మృతులు జ్ఞాపకం చెయ్యవలసిన సందర్భంలో, ఏ చిలక చెంప మీద కొరికిన సంఘటనో, ఏ పావురం వొళ్ళో వాలిన సంఘటనో గుర్తుచెయ్యాలి గానీ .... కాకి కూతలూ, గాడిద తన్నులూనా గుర్తు చెయ్యాల్సింది? అని.

"సీతాదేవికి శృంగార శాస్త్రం ఏమీ తెలిసినట్టు లేదు ...." అని ఒక కవీ,

"బాగా అన్నారు .... అట్లాగే తోస్తోంది" అని ఇంకో కవీ!

జనం, ఎవరెవర్ని కాకి పొడిచిందో, ఎవరెవర్ని తన్నిందో, ఏది ఎన్నిసార్లో చెప్పుకుంటున్నారు.

"ఒకసారి నేను గోరు చుట్టుకి కట్టు కట్టుకుంటే .... మాయదారి కాకి ఆ కట్టు తన్నుకు పోయింది. గోరు కూడా ఎగిరి పోయింది. చిన్న పిల్లల్లాగ గిల గిల్లాడిపోతూ ఎంత ఏడ్చానో!" అని ఒకాయన ఏడుపు మొహం పెట్టాడు.

కాకులు ఎంతెంత దుర్మార్గాలైనా చేస్తాయని అందరూ ఒప్పుకున్నారు.

హనుమంతుడు సీతాదేవి దగ్గిర శెలవు తీసుకుని బయల్దేరుతున్నాడు. "ఇక అశోక వనం ఎలా దాటాలా అని ఆలోచిస్తున్నాను .... ఎలా చూసేశారో కాపలా వాళ్ళు చూసేసి వెంటబడ్డారు. గుండ్రాళ్ళ లాంటి రాళ్ళు తీసి గిరాట్లెట్టాను. ఇద్దరో, ముగ్గురో చచ్చారు."

"చావడమే!" కంగారు పడ్డాడు సుగ్రీవుడు.

"ఆఁ కణతలకి తగిలి చచ్చారు."

"హనుమంతుడు మా బాగా, సూటిగా రాళ్ళు విసురుతాడు లెండి" అని సుగ్రీవుడు నవ్వు మొహం పెట్టాడు.

"మరి నిన్ను పట్టుకోలేదూ హనుమంతుడూ?" అన్నాడు నీలుడు.

"ఎందుకు పట్టుకోలేదూ? .... రావణుడి దగ్గిరికి లాక్కుపోయారు. నా పని అయిపోయిందే అనుకున్నాను. 'ఎవరు నువ్వు, ఎందుకొచ్చావు, ఏంటీ సంగతీ' అని రావణుడి మంత్రి అడిగాడు."

"ఊఁ, .... చెప్పేశావా ఏంటి కొంపదీసి?" అని కంగారుపడ్డాడు సుగ్రీవుడు.

"ఏం, చెప్పకా? .... అంతా చెప్పేశాను. 'ఇప్పటి కన్నా బుద్ధి తెచ్చుకో. సీతాదేవిని విడిచి పెట్టెయ్యి, లేకపోతే రాముడూ, సుగ్రీవుడూ వచ్చి నిన్ను హత మార్చి సీతాదేవిని తీసుకు పోతారు. లంకంతా నాశనం చేసు కోకూ అవఁటా అని, రావణుడికి మా బాగా గడ్డి పెట్టాను ...."

జనంలో, పండితుల్లో పామరుల్లో కూడా గడ బిడ బయల్దేరింది.

"ఈ పాటికి సీతని చంపేసే ఉంటారు!" అన్నారు కొందరు.

"చంపరు గానీ, రావణుడే రాముడి మీదికి యుద్ధా నికి రావాలని ఏర్పాట్లు చేస్తూ ఉంటాడేమో!"

"అయినా .... నాకు తెలవ కడుగుతానూ, కాపలా మనుషులు పట్టుకోటానికి వచ్చారే అనుకో. వాళ్ళని చావగొట్టటం ఎందుకంట? ఇదుగో, నే నీ పని మీద వచ్చానని చెపితే కాదూ? వాళ్ళ చేతుల్లో సీత ఉన్నప్పుడు .... ఆవిడికి ప్రమాదం వచ్చేలాగ చేసి రావటం ఏంటీ?"

"అంత దూరం కష్టపడి వెళ్ళాడు. ఏం లాభం? ఈన గాచి నక్కల పాలు జేశాడు ...."

"ఇంతకీ అసలు ఎలా బయట పడ్డాడంటావూ?"

లక్ష్మణుడికి, హనుమంతుడి మీద కలబడాలని పించింది. సీతని తీసుకు పోవటానికి ఏర్పాట్లు జరుగు తున్నాయని రావణుడికి తెలిసిపోతే, వాడు ఊరు కుంటాడా? వదినగారికి ఎంత ప్రమాదం వచ్చి పడు తుందో! – హనుమంతుణ్ణి వొంగదీసి చావ బాదాలని పించింది.

సుగ్రీవుడు కూడా నీలుడి చెవిలో మండిపడు తున్నాడు. "నే నసలు మంచీ చెడ్డా చూసి రమ్మన్నాను గానీ ...."

రాముడొక్కడే దీర్ఘాలోచనలో మునిగి ఉన్నాడు. 'హనుమంతుడు క్షేమంగానే వచ్చాడు గదా? అక్కడ ఏదో అనుకూలంగానే జరిగి ఉంటుంది. అంతా పూర్తిగా వినకుండా .... ఏదీ నిర్ణయించకూడదు.'

హనుమంతుడు బిత్తరపోతున్నాడు. జనం తనని మెచ్చుకోడానికి బదులు .... తప్పు చేసినవాణ్ణి చూసి నట్టు చూస్తున్నా రేంటని తెల్లబోతున్నాడు.

"చెప్పవోయీ హనుమా! .... రావణుడి సభలో ఏం జరిగింది?" అని శాంతంగా అడిగాడు రాముడు.

రాముడి శాంతం చూస్తే హనుమంతుడికి పుట్టెడు బలం వచ్చింది. "రావణుడు నన్ను చంపెయ్యమని ఆజ్ఞా పించాడు" అన్నాడు ఉత్సాహంగా.

"చంపేశారా నిన్ను?" ఒకరిద్దరు కంగారుగా అరి చారు.

"అప్పుడు .... విభీషణుడు .... ఆ పుణ్యాత్ముడు .... దూతని చంపకూడదని అన్నగార్ని ప్రార్థించాడు.

మొదట రావణుడు వినలేదు గానీ విభీషణుడు ఊరుకున్నాడా? అబ్బో, చాలా చెప్పాడు. రావణుడికి .... ఇక ఒప్పుకోక తప్పలేదు .... 'సరే, ఏదో శిక్ష వేసి వదిలి పెట్టెయ్యండి' అన్నాడు."

"మరి ఏం శిక్ష వేశారూ? చెరసాల్లో పెట్టేశారా?"

హనుమంతుడు చెప్పలేదు. సిగ్గుపడ్డాడు. కొంచెం నవ్వి ఊరుకున్నాడు.

"కొరడా దెబ్బలు కొట్టి ఉంటారు. ఏం చెపుతాళ్ళే."

"కాదులే. పిర్రల నిండా వాతలేశారేమో! అదుగో! .... సరిగ్గా కూర్చోలేక పోతున్నాడు .... ఏమిటా అనుకుంటున్నాను ఇందాకట్నించీ"

"ఒక సారి మా తాతగారి ఊళ్ళో ఇలాగే .... ఒక దొంగని పట్టుకునీ ...."

తర్క పండితులకు విభీషణుడి తర్కం చాలా ఆశ్చర్యం కలిగించింది. "దూత అయినవాడు దూత లాగ ప్రవర్తించాడా? లేదే! భూతం లాగ మీద పడి నిష్కారణంగా తను సైనికుల్ని చంపితే కూడా ఇంకా దూతే అని వాదించి విడిచి పెట్టించాడే! .... అబ్బే! అదేం తెలివి?"

"దయ చూపించవొచ్చును గానీ, ఇంత తర్క విరుద్ధమైన దయ పనికి రాదు. మీరేవంటారు?"

"అదే! నాకూ ఆశ్చర్యంగా ఉంది."

"రావణుడి సభలో తర్క పండితులు లేనట్టున్నారే!"

"అంతే, అంతే, ఉన్నట్టు లేరు."

శృంగార కవులందరూ, ఇది మనం చర్చించే విషయం కాదని పట్టనట్టు మౌనం వహించారు.

రాముడి ఆలోచనలన్నీ ఒక కొలిక్కి వస్తున్నాయి. మనసంతా ఆనంద సముద్రం అయిపోతోంది. ... తమకు హాని కలిగించిన దోషి మీద కూడా విభీషణుడికి కోపం రాలేదంటే ....? దూత లాగ ప్రవర్తించని వాణ్ణి కూడా, దూతని రక్షించే నీతులు చెప్పి రక్షించాడంటే? .... హనుమంతుణ్ణి రక్షించడంలో విభీషణుడేదో లాభం ఆశిస్తున్నాడు. పైగా .... తన అన్నని శత్రువుతో యుద్ధం చెయ్యమనే ప్రోత్సహిస్తున్నాడు! – ఇదంతా చూస్తోంటే, విభీషణుడు పూర్తిగా రావణుడికి వ్యతిరేకంగా ఉన్నాడనే తోస్తోంది. అన్నగారికి విశ్వాస పాత్రుడిగా లేడన్నమాట! అందుకే విభీషణుడి భార్య, సీత విషయంలో అంత శ్రద్ధ చూపుతోంది. సీత గురించి ఎలాగైనా యుద్ధం పొసుగుతుంది కాబట్టి, ఈ అవకాశం ఉపయోగించుకోవాలని చూస్తున్నట్టున్నాడు విభీషణుడు. రేపు యుద్ధం జరిగినప్పుడు .... విభీషణుడు తప్పకుండా తన పక్షాన్నే ఉండొచ్చు! అన్నగారి పక్షాన లేడన్నది మాత్రం చాలా స్పష్టం! .... మళ్లీ వాలి సుగ్రీవుల వ్యవహారమే ఇది కూడా! 'రాజ్యాధికారం' కోసం అన్నదమ్ముల కలహం!

రావణుడు, తమ్ముణ్ణి ఏమీ సందేహించకుండా బాగానే నమ్ముతున్నట్టున్నాడు. సిరి సంపదల విషయంలో అన్నైనా, తమ్ముణ్ణయినా ఒక కంట కనిపెట్టి ఉండాలనే సంగతి రావణుడికి తెలీదన్న మాట![330] అసలు హనుమంతుణ్ణి వొదిలిపెట్టేశాడంటేనే ఎంత తెలివి తక్కువ రాజో తెలుస్తోంది. లేకపోతే, అది తెలివి తక్కువ కాదేమో! తన నెవ్వరూ ఏమీ చెయ్యలేరని అహంకారమేమో!

అసలు త్రిజట కలకి అసలైన అర్థం ఇప్పుడే కనపడుతోంది. రావణుడు నరకానికి పోతే .... విభీషణుడు స్వర్గానికి పోయాడు! అంటే ఇద్దరికీ శత్రుత్వం ఉందన్న మాట! .... అసలు త్రిజట .... విభీషణుడికే నమ్మకస్తురాలేమో! .... ఆ పరిచారికల బారి నుంచి సీతని రక్షించాలని, వాళ్ళని భయపెట్టడానికి అలా కల ఒకటి కల్పించి చెప్పిందేమో! అయితే .... ఆ కల అసత్యం అయితే .... యుద్ధంలో తను గెలవడం, రావణుడు ఓడడం అదంతా కూడా .... అయితే ఏంలే .... వాస్తవ విషయాలన్నీ చాలా అనుకూలంగా ఉన్నాయి కదా? .... కల కల్పించినదయితే మాత్రం నష్టమేముంది? – రాముడి మొహం, చిరునవ్వులతో మెరుస్తోంది.

అందరి మొహాలూ తెల్లబోతున్నాయి.

హనుమంతుడు చేసుకొచ్చిన నిర్వాకం వల్ల సీతకేం ప్రమాదం ముంచుకొస్తుందోనని అందరూ ఆరాట పడుతోంటే .... రాముడి మొహం మీద మందహాసాలు!

"పాపం .... మతి చలించిందేమో!"

"అవును. ఆయన మాత్రం ఎన్ని కష్టాలు ఓర్చుకోగలడు!"

"చాలుగాని ఊరుకోండి .... నిన్నగాక మొన్న ఇతగాడు మన వాలిని చంపితే .... అదంతా మరిచిపోయి ఈయన మీద జాలిపడి పోతున్నారు, సిగ్గుల్లేవు."

"అవును సుమా! మర్చేపోయాం .... ఇప్పుడు మన ప్రాణాల మీదికి యుద్ధం కూడా తెచ్చిపెట్టాడు .... ఈ సారి జాలీ గీలీ లేకుండా చాలా జాగ్రత్తగా వుందాం. జాలి పడొద్దు."

ఎంత దాచుకోవాలన్నా దాగని మందహాసం చిందుతోంది రాముడి మొహం మీద!

హనుమంతుడు, 'అన్నీ చెప్పానా, లేదా?' అని విషయాలన్నీ ఒకసారి జ్ఞాపకం చేసుకున్నాడు. "అన్నట్టు

---

**330.**రాముడు, ఆస్తిపాస్తుల విషయంలో భరతుణ్ణి కూడా శంకిస్తూ అతన్ని ఎంత శ్రద్ధగా కనిపెట్టి ఉంటాడో ముందు ముందు తెలుస్తుంది.

★

రామయ్యా! ఒక సంగతి మరిచే పోయాను. సీతాదేవి దుఃఖం చూడలేక నాతో తీసుకొచ్చేద్దా మనుకున్నాను .... కానీ ...."

తుళ్ళి పడ్డాడు రాముడు. హనుమంతుణ్ణి తీక్షణంగా చూశాడు. .... లంక మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు తను. విభీషణుడి సంగతి తెలిసిం తర్వాత తన ఆశలన్నీ ఫలిస్తాయని గాఢంగా నమ్మకం కలుగుతోంది. రావణుణ్ణి సర్వనాశనం చేసి లంకని సాధించాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. అసలు రావణుడు సీతని తీసుకుపోవడం .... మంచికే జరిగిందని సంతోషిస్తోంటే ... హనుమంతుడే సీతని తీసుకొచ్చేస్తే .... ఇంకేమన్నా ఉందా? అంతా తారు మారయ్యేది. ఇక యుద్ధం ఏమిటి? .... జయించడం ఏమిటి? .... ఇంకా నయం .... తీసుకొచ్చేశాడు కాదు.

రాముడికి వొళ్ళు మండిపోతోంది హనుమంతుణ్ణి చూస్తోంటే! తీసుకొచ్చేశాడంటేనా? .... తను కఠినంగా చెప్పేసేవాడే! – "వీల్లేదు. మళ్ళీ తీసికెళ్ళి అక్కడే పెట్టేసి రా! నేనే తెచ్చుకుంటాను. నేను నీకు చెప్పిందేవిటి, నువ్వు చేసిందేవిటి? .... కుదరదు .... తీసుకెళ్ళి సీతని రావణుడికే అప్పగించి రా! వాణ్ణి చంపి నేనే తెచ్చుకుంటాను. నువ్వెవడివి నా భార్యని తీసుకు రావడానికి? నా పరువు ప్రతిష్టలేం గాను? నేనే స్వయంగా తెచ్చుకుంటాను .... తీసుకు ఫో ముందు!" అని ఆజ్ఞాపించే వాడే తను.

సీతని తీసుకు వచ్చేసినా, మళ్ళీ పంపెయ్యడానికి వీలుంది గదా అన్న ఆలోచన వచ్చింతర్వాత రాముడికి కొంచెం శాంతం కలిగింది.[331]

రాముడు తనని మెచ్చుకుంటాడని హనుమంతుడు ముసి ముసి నవ్వుల్తో ఎదురు చూస్తున్నాడు.

రాముడు తల వొంచుకుని, "తీసుకు రాకపోయావా నాయనా! .... నా సీతనీ, నన్నూ కలపకపోయావా నాయనా?" అని కళ్ళనీళ్ళు పెట్టుకునే ప్రయత్నం చేశాడు.

హనుమంతుడు భక్తిగా, "తప్పకుండా తీసుకొచ్చే వాణ్ణే స్వామీ! .... ఆ మహా తల్లి రావడానికి ఒప్పుకోలేదు గానీ ...."

"ఏమిటీ? .... ఇక్కడికి రావటానికి ఒప్పుకోలేదూ? ...." అని తెల్లబోయాడు రాముడు.

"అది కాదు .... పర పురుషుడితో రానంది. రావణుడు బలాత్కారంగా తీసుకుపోతే ఏమీ చెయ్య లేక వూరుకున్నాను గానీ .... నా ఇష్టంతో మాత్రం నేను పర పురుషుడి వెంట రాను. నా భర్తే వచ్చి, లంకంతా నాశనం చేసి, నన్ను తీసుకెళ్ళాలి. నా భర్తే స్వయంగా నన్ను తీసుకు వెళ్ళడం .... ఆయనకూ కీర్తి .... నాకూ కీర్తి అంది రామయ్యా!"

రాముడికి సీతమీద చెప్పలేనంత ప్రేమ కలిగింది, తొందరపడి వచ్చెయ్యనందుకు.

ఈ తర్కం, తర్క పండితులకు నచ్చినట్టే ఉంది. తల లూపుకుంటూ విన్నారు.

శృంగార కవులు ఆలోచనలో పడ్డారు. "ఇంత దీర్ఘ వియోగంలో కూడా, ఇంకా వియోగమే కోరడం ఏ రకం అవస్థకి చెందుతుందంటారూ?" అని మొహా మొహాలు చూసుకుంటూ ప్రశ్నించుకున్నారు.

"అబ్బే! ఇది శృంగార శాస్త్రంలో లేదండీ! ఇంకే శాస్త్రానికైనా చెందుతుందేమో గానీ ...."

"మీరు సరిగ్గా వినలేదేవిటి? 'నా భర్తే నన్ను తీసుకువెళ్ళడం .... ఆయనకీ కీర్తి .... నాకూ కీర్తి' అన్నదిగా? దాన్ని బట్టి చూస్తే?"

"మరిహనేం? .... అయితే ఇది 'కీర్తి కండూతి శాస్త్రం'లోకి వస్తుందండీ!"

"పాపం పామర జనానికీ శషభిషలన్నీ అర్థమవుతాయంటారూ?.. శ్రద్ధగానే వింటున్నారు వాళ్ళందరూ."

ఆ పామర జనాన్ని నిజంగానే సీత విషయం అయోమయంలో పడేసింది.

"మా ఆవిడైతేనా? బావురుమని హనుమంతుడి వెంట పడేదే! ఈయనేం పర పురుషుడు?"

"మా ఆవిడా అంతే! పర పురుషుడూ లేదు, వల్లకాడూ లేదు .... మొన్న వాళ్ళ మేనత్త కొడుకుతో కలిసి జాతరకి పోయింది .... పట్టుకు చావబాదు దామనుకున్నాను గానీ .... అలిగి పుట్టింటికి పోతుందని ఊరుకున్నాను."

"మన ఆడవాళ్ళెక్కడా? .... సీతాదేవి ఎక్కడా? మహాత్మురాలు ...."

హనుమంతుడు, 'ఇంకా ఏమన్నా మర్చిపోయానా' అని, అన్నీ గుర్తుతెచ్చుకుని .... సుగ్రీవుణ్ణి చూస్తూ, "మహారాజా! .... నీ పేరు చెప్పి రావణుణ్ణి బాగా జడిపించాననుకో. సుగ్రీవుడొక్కడు నిన్ను చంపడానికి చాలన్నాను. సుగ్రీవుడొచ్చి నీ అంతు తేలుస్తాడన్నాను. హడలి పోయాడనుకో" అని నవ్వు మొహంతో అందర్నీ చూశాడు.

రావణుడేమో గానీ సుగ్రీవుడు హడిలిపోయి వెనక్కి జరిగాడు.

వెనకాల నిద్రపోతోన్న నీలుడు, "అబ్బ! .... మీద

---

**331.** ఒకవేళ హనుమంతుడు లంక నించి సీతని తీసుకు వొచ్చేస్తే .... రాముడి ఆలోచనలు ఎలా ఉంటాయి? రాముడికి, సీత మీద కోపం వస్తుందా, రాదా? హనుమంతుడి మీద కోపం వస్తుందా, రాదా? ఆలోచించి చూడండి! ★

పడతారేంటీ? .... ఛీ!" అని విసుక్కున్నాడు, నిద్దట్లోనే, రాజుగారిని.

సుగ్రీవుడు కోపం పట్టలేక, "నీ నిద్ర మండా! నిన్ను ఉరిదీస్తే తప్ప నిద్ర మానేటట్టు లేవు" అని మండి పడ్డాడు. చప్పున జాంబవంతుడి చెవి వేపు వొంగి – "నే నొక్కణ్ణీ రావణుణ్ణి చంపడం ఏంటీ? చూశావా? ఇదేవన్నా బాగుందా? .... వెళ్ళినవాడు వెళ్ళినట్టు రావాలి గానీ .... ఆ కూతలేంటీ? రావణుడికి నా మీద కోపం రాదూ? .... ఏంటో అంతా గందరగోళం చేసు కొచ్చాడు" అని తెగ విసుక్కున్నాడు.

హనుమంతుడు లంకలో తను చూసిన సంగతు లన్నీ ఒకసారి గుర్తు తెచ్చుకుని, "లంకలో కూడా బ్రాహ్మ ణులున్నారు సుమా!" అని ఆశ్చర్యం ప్రకటించాడు.

"బ్రాహ్మలే!" అని కొందరు పండితులు ముందుకు జరిగారు. "ఏం చేస్తున్నారూ బ్రాహ్మలూ?"

"వేదాలు చదువుకుంటున్నారు."

"ఆహా, అలాగా? ఎంత చక్కని మాట చెప్పావూ? అందుకే లంక ఇంకా నిలిచి వుంది."

రాముడు ఉత్సాహం దాచుకోలేక – "వేదాలు చదువుతున్నారా? .... శిక్షా .... వ్యాకరణం .... ఛందస్సూ .... నియుక్తం .... జ్యోతిషం .... కల్పం .... అన్నీ శ్రద్ధగా చదువుతున్నారా నాయనా?" అని తల పంకిస్తూ అడిగాడు. వేదాలు చదివే బ్రాహ్మణులైతే రావణుడి పక్షాన గాక, తన పక్షాన్నే జేరతారని రాముడి కెందుకో బాగా నమ్మకంగా అనిపించింది.

హనుమంతుడు ఉత్సాహంతో ఊగుతున్నాడు – "అసలు రావణుణ్ణి నేనే చంపేద్దా మనుకున్నాను గానీ రామయ్యా, ఆ పనేదో నువ్వే చేస్తే బాగుంటుందిలే అని ఊరుకున్నాను."

రాముడు విస్తుబోయాడు. ... ఏవిటీ? హను మంతుడే రావణుణ్ణి చంపేసి, లంకని ఆక్రమించేసి, తనని కూడా ఆధీనంలో పెట్టుకుంటాడా? .... ఇంత శక్తి సామర్థ్యాలు గల మంత్రుల్నీ, సేనాపతుల్నీ నమ్మి, ఎప్పుడూ ఊరుకోకూడదు. ఈ హనుమంతుణ్ణి ఒక కంట కనిపెట్టి ఉండాల్సిందే.

హనుమంతుడికి, ఇక ఎంత ఆలోచించినా ఇంకేమీ జ్ఞాపకం రాలేదు. "శ్రీరామయ్యా! అన్నీ విన్నవించు కున్నాను. ఇన్ని మాటలెందుకు? .... నీ భార్య మహా పతివ్రత. నువ్వు లేకపోతే ఎలా వుండాలో అలా వుంది. తొందరగా తీసుకు పొమ్మని నీకు మరీ మరీ చెప్పమని నన్ను బతిమాలింది. ఒక్క నెల మాత్రమే బతికి వుంటా నని సుగ్రీవుడు కూడా వింటూ వుండగా చెప్పమంది."

"ఒక్క నెలా! .... ఇందాక రెండు నెలలన్నావుగా?" అని గంభీరంగా చూశాడు రాముడు.

"అబ్బే! రావణుడిచ్చిన గడువు రెండు నెలలు. సీతాదేవి మాత్రం ఒక్క నెలే ఎదురుచూసి అప్పటికీ రాకపోతే ఎలాగైనా చచ్చిపోతానంది. సుగ్రీవుడు కూడా వినేటట్టు చెప్పమంది ...."[332]

రాముడు సుగ్రీవుడి వేపు, 'మరి ఏమంటావు? చూడు, ఎంతాలశ్యం చేశావో' అన్నట్టు నిష్ఠూరంగా చూశాడు.

సుగ్రీవుడు చటుక్కున తల వొంచుకుని నీలుడి వేపు చూశాడు. నీలుడు ఇంకా .... నిద్ర మిడుకుతూనే కన పడ్డాడు. సుగ్రీవుడికి నీలుడి మీద కోపం సీత మీదకి తిరిగింది. నెమ్మదిగా జాంబవంతుడి వేపు జరిగి, "ఆవిడ నా ముక్కూ మొహం ఎరగదు. నేను వినేటట్టు చెప్ప మంటం ఎందుకూ? .... కావాలంటే తన పెనివిటికి కవురంపుకోవాలి గానీ .... రేపు ఎటుపోయి ఎటొచ్చినా నన్ను నిష్ఠూరాలాడాలని గానీ" అని విసుక్కు న్నాడు.

జాంబవంతుడు శాంతంగా, "అబ్బే, అది కాదులే, సాయం చేసేవాడివి నువ్వే కదా? నీకు దయ కలుగుతుందని అలా అన్నదేమోలే. అయినా కష్టాల్లో పడి దుఃఖిస్తోంది .... ఎలాగో మనమే ఆవిణ్ణి వొడ్డున పడెయ్యాలి .... రాముడి ఒక్కడి వల్లా ఏమవుతుందీ?" అని రాజుకి నచ్చ జెప్పబోయాడు.

"అవుననుకో, నేను మాత్రం కాదన్నానా? కానీ,

---

**332.** సుందర, సర్గ 65, శ్లోకం 23: "నేను ఒక నెలకు పైన బ్రతికియుండను. సుగ్రీవుడు వినుచుండునపుడే ఈ మాటలు చెప్పి, ఈ చూడామణిని రామునకు సమర్పింపుము – అని సీతాదేవి చెప్పెను" అని హనుమంతుడు రాముడితో చెపుతున్నాడు. కానీ, సీత, అశోక వనంలో హనుమంతుడితో మాట్లాడినప్పుడు, "సుగ్రీవుడు వింటూ ఉండగా చెప్పు" అనే మాటలు లేవు. ఆ ఘట్టంలో రాయని విషయం, ఇక్కడ హనుమంతుడు, రాముడి ముందూ సుగ్రీవుడి ముందూ మాట్లాడేటప్పుడు ఎందుకు రాయాలి కవి? 'సీత నెల్లాళ్ళ కన్నా ఎక్కువ బ్రతుకనంది' అన్న విషయం ప్రత్యేకంగా సుగ్రీవుడికి తెలియజేయడంలో అర్థం ఏవిటి? సీతని రక్షించవలసిన బాధ్యత తనదేనని సుగ్రీవుడు భావించాలనీ, పూర్వం లాగ అశ్రద్ధ చెయ్యకుండా యుద్ధానికి తొందరగా బయలేరతాడనీ. సుగ్రీవుడి సైన్యం లేకపోతే రాముడి వల్ల పని జరగదు. జరగవలసిందంతా సుగ్రీవుడి మీద ఆధారపడి వుంది. సుగ్రీవుడితో పని జరిపించుకోడానికే కవి, ఈ ఘట్టంలో ఇలా చెప్పించాడు. హనుమంతుడు లంక నించి తిరిగి వచ్చేటప్పుడు, సముద్రం దాటి లంకలో విషయాలు మహేంద్ర పర్వతం మీద వానరుల కందరికీ చెప్పినప్పుడు, "సీత రెండు నెలలు బతుకుతానంది" అన్నాడు. ఆ ఘట్టంలో రెండు నెలలు! ఈ ఘట్టంలో ఒక్క నెల! ★

రాముడు అస్తమానూ 'ఎవడి కోసం చేస్తావు' అన్నట్టు చూస్తాడు. అందుకే నాకు ఒళ్ళు మండుతుంది."

"పోనీలే. ఊరుకో. మనసు కష్టపెట్టుకోకు. ఆయన మన కోసం వాలిని చంపిపెట్టాడు కదా? మనం కూడా అన్నమాట నెరవేర్చుకుని, ఆయన దారిన ఆయన్ని పంపేస్తే అయిపోతుంది."

"సరేలే" అనేసి, సుగ్రీవుడు అటు తిరిగి రాముణ్ణి చూసేసరికి రాముడు మూర్ఛపోయి వున్నాడు.

"ఒక్క నెలలో యుద్ధానికి పోవాలన్న మాట!" – జనంలో గొడవ గొడవగా మాటలు సాగుతున్నాయి.

"రావణుడే నయం, రెండు నెలలు గడువిచ్చాడు. సీతాదేవి అయితే .... ఒక్క నెలే!"

"నెలైతే ఏంటీ, రెండు నెలలయితే ఏంటీ? మనం అందరం చావవలసిన వాళ్ళమే ...."

"నిక్షేపంగా వాలే వుంటే .... ఈ యుద్ధం పీడ ఉండేది కాదు గదా?"

రాముడు మూర్ఛ నించి లేచి దుఃఖిస్తున్నాడు – "నాయనా, హనుమంతుడా! .... నన్ను నా సీత దగ్గిరికి తీసుకుపో నాయనా! .... నన్ను నా ప్రియురాలి దగ్గిరికి చేర్చు నాయనా! .... నా ధర్మ పత్ని నాకు దూరం అయి పోయింది .... విధి నన్ను చిన్న చూపు చూస్తోంది. దైవం నన్ను కనికరించకుండా వున్నాడు. నా వంటి భర్త వుండి కూడా నా భార్య దిక్కు లేనిదై పోయింది! రాజ్యం పోయి .... భర్తకు దూరం అయిపోయి .... అష్ట కష్టాలు పడి...."

"ప్రభూ! నువ్వింతగా దుఃఖించడం ధర్మం కాదు. సీతాదేవిని నేను అనేక విధాల ఓదార్చే వచ్చాను. ఆ తల్లి నీ కోసం పుట్టెడాశతో ధైర్యంగానే వుంది" అని హను మంతుడు రాముడికి ధైర్యం చెప్పాడు.

సుగ్రీవుడు రాముణ్ణి నవ్వు మొహంతో చూస్తూ "శ్రీరామా! నువ్వు దుఃఖిస్తే నేను చూడలేను. నా మాట విను. అంతా సవ్యంగా జరుగుతుంది. మనం వెంటనే యుద్ధానికి బయల్దేరదాం. ఆ దుర్మార్గుణ్ణి చంపి .... సీతాదేవిని రక్షించి తీసుకు వద్దాం .... నా మాట విను .... నేను మళ్ళీ ఒట్టు పెట్టుకుని చెపుతున్నాను" అంటూ ఓదార్చాడు.

## [ఇక్కడితో 'సుందర కాండ' ముగుస్తుంది. తర్వాత, 'యుద్ధ కాండ' ప్రారంభమవుతుంది.]

రాముడు కుమిలి కుమిలి నెమ్మదిగా శాంతించాడు. "నాయనా! హనుమంతుడా! లోకంలో ఎవ్వరూ చెయ్య లేని ఘనకార్యం చేశావు. చెప్పిన పని చెప్పినట్టు సాధిం చుకు వచ్చావు. నాకు చాలా సంతోషం కలిగిందోయీ!" అని హనుమంతుణ్ణి మెచ్చుకుంటూ చూశాడు.

హనుమంతుడు కొంచెం సిగ్గుపడి వినయంగా తల వొంచుకున్నాడు.

రాముడు గంభీరంగా సభాసదుల్ని చూస్తూ తల పంకిస్తూ సాగించాడు. "సేవకులలో కూడా తర తమ భేదాలున్నాయి. యజమాని చెప్పిన కార్యం ఎంత కష్ట మైనది అయినా, శ్రమ అనుకోకుండా, చక్కగా ఆ పని సాధించి, యజమానికి ఉపయోగించే ఇతర పనులు కూడా శ్రద్ధగా, ఉత్సాహంగా, చేసుకు రాగల వాడు, ఉత్తమ సేవకుడు. యజమాని చెప్పిన పని మాత్రమే చేసి, యజమానికి లాభించేదని తెలిసి కూడా హెచ్చు పని చెయ్యకుండా వచ్చేవాడు మధ్యమ సేవకుడు. ఇక చెయ్యగల సమర్థత ఉండి కూడా, స్వామి చెప్పిన మొదటి కార్యం అయినా నిర్వర్తించుకు రానివాడు అధమ సేవకుడు.[333] హనుమంతుడు సుగ్రీవుడికి బహు ఉత్తమ సేవకుడు. ఎంతో తెలివిగా, శ్రద్ధగా అనేక

---

**333.** **యుద్ధకాండ, సర్గ 1, శ్లోకాలు 8, 9, 10:** సేవకుల్ని ఎన్ని రకాలుగా విభజించాలో రాముడు చెపుతున్నాడు. "తన యజమానిచే ఆజ్ఞాపించబడిన దుష్కరమైన కార్యమును చక్కజేసిన భృత్యుడే ఉత్తముడనబడును. యజమాని చెప్పిన పని చేసి, చెప్పని పని గూడ అది యజమాని కిష్టమైన యెడల, తాను సమర్థుడయ్యును, ఉత్సాహయుక్తుడై చేయని భృత్యుడు మధ్యము డనబడును. యజమాని ఏ కార్యమును జెప్పినను తాను కార్యమును చక్కజేయ సమర్థుడై, కార్యమును సాధించని యెడల, అట్టివాడు అధమ భృత్యుడనబడును" – ఈ విధంగా సేవకుల్లో మూడు రకాలు!

ఒక సేవకుడికి 'ఉత్తమ సేవకుడు' అని బిరుదు వస్తే, అతనికి ఒరిగేదేమిటి? అతని జీవితం ఆ సేవ నుంచి విముక్తి అవుతుందా? ఎప్పుడూ కాదు. కానీ, దాని వల్ల యజమానికి చాలా లాభం. కుక్క లాగ విశ్వాసంగా పడివుండి, ఎప్పుడూ గొడ్డు లాగ బండ చాకిరీ చేసే సేవకుడు యజమానికి దొరుకుతాడు.

సేవకుల్ని ఎప్పుడూ దండించి, భయంలో వుంచి, లొంగదీసి పని చేయించుకోవడం సాధ్యం కాదు గాబట్టి, ఆ సేవకులే ఇష్టంతో చాకిరీ చేసే విధానం వుండాలి. 'ఉత్తమ సేవకులం' అనిపించుకోవటానికి, ఆ సేవకులే, ఇష్టంతో ఎప్పుడూ ఎక్కువ చాకిరీ చేసేటట్టు చేసే ధర్మం ఇది. ఇదే 'సేవకుల ఉత్తమత్వం'లో రహస్యం. ➔

కార్యాలు చేసుకు వచ్చాడు ...."

హనుమంతుడు తెగ సిగ్గుపడిపోతూ తల వాలేశాడు.

"హనుమంతుడు సీతని చూసి వచ్చి చల్లని వార్త చెప్పి నా ప్రాణాలు రక్షించాడు. లేకపోతే నేను ప్రాణాలు విడిచే వాడినే. నేను ప్రాణాలు విడిస్తే లక్ష్మణుడు కూడా ప్రాణాలు విడిచే వాడే! రఘు వంశం అంతా సర్వ నాశనమై పోయేది. హనుమంతుడి వల్ల మా వంశం నిలిచింది."

యుద్ధం గురించి ఆలోచిస్తున్నప్పట్నించీ జనానికి రాముడి మీద కోపం ప్రారంభమైంది.

"ఎవరి వంశాన్ని వాళ్ళు నిలబెట్టుకుంటే గొప్ప గానీ ఇతర్లు నిలబెడితే ఏం గొప్పా?"

"బాగా అన్నావు. ఇతర్ల సాయంతో నిలబడుతూ వుంటుంది కామాల వీళ్ళ వంశం గొప్ప."

"వాళ్ళ కులం, గోత్రం కాని వాళ్ళ సాయంతో! సిగ్గులేని మాటలు!"

రాముడు తల వూగిస్తూ, "ఇంత ఉపకారం చేసినవాడికి .... నేనేం ప్రత్యుపకారం చెయ్యగలను? ఈ చింతతో నాకు సీత క్షేమ సమాచారం విన్నానన్న సంతోషం కూడా లేకుండా వుంది ...." అని తల వాల్చాడు.

"అబ్బే! నాకేమీ వొద్దు రామయ్యా!" అని సిగ్గు పడిపోయాడు హనుమంతుడు.

రాముడు అటు చూడకుండా, "హనుమంతుడికి ఆనందం కలిగించకపోతే నా మనసుకి తృప్తి ఉండదు. అతడికి ఇప్పుడొక బహుమానం ఇస్తాను!" అన్నాడు గంభీరంగా మందహాసంతో.

పండితులూ, పామరులూ అందరూ ఆశ్చర్యంగా, ఆతృతగా, కుతూహలంగా మొహాలెత్తారు.

"ఏమిస్తా దంటావూ? ...."

"ఏమో మరి .... ఏవన్నా డబ్బుందేమో గుహలో! చూద్దం లెండి...."

"ఆc, సీత నగలున్నాయిగా .... అవే ఇచ్చేస్తాడు. చూడండి కావాలంటే ...."

వెనక వాళ్ళందరూ గుంపులు గుంపులుగా ముందుకు తోసుకొచ్చారు, రాముడిచ్చే 'బహుమానం' సరిగ్గా కనబడుతుందో లేదోనని.

నిద్రపోతున్న వాళ్ళందరూ కాళ్ళూ, చేతులూ పచ్చడై లబ లబలాడుతూ లేచారు.

రాముడిచ్చే బహుమానం ఏవిటో లక్ష్మణుడి కొక్కడికే తెలుసు. పంచవటిలో ఇల్లు కట్టినప్పుడు ఆ బహుమానం అతడికి లభించింది.

రాముడు మందహాసంతో లేచి నిలబడి హనుమంతుడి వేపు చూశాడు.

ఎందుకో, ఏవిటో తెలీకుండానే హనుమంతుడు కూడా తెల్లబోతూ లేచాడు.

రాముడు హనుమంతుడి చుట్టూ చేతులు చుట్టి ఒకసారి కావలించుకుని, చప్పున చేతులు తీసేసి, అతణ్ణి వదిలేసి, నించున్నాడు! "నా ఆలింగనం ఇస్తే, సర్వస్వం ఇచ్చినట్టే కదా హనుమంతుడా!" అని గంభీరంగా చూశాడు.

ఇచ్చేశాడు బహుమానం!

హనుమంతుడు ఇంకా తెల్లబోతూనే ఉన్నాడు. బహుమానం ఇవ్వడం అయిందో లేదో అర్థం కాలేదు. నిరుత్సాహంగా నవ్వి వాగు వేపు చూస్తూ బుగ్గలు ఉబ్బించాడు.

"ఆలింగనంలో సర్వస్వం ఉన్నట్టేనా?" అని తర్క పండితులు ఆలోచనలో పడ్డారు.

"స్త్రీ – పురుషుల ఆలింగనం అయితే, ఆ కౌగిలింత అయితే అందంగానీ ...." శృంగార పండితులు గొప్ప ఆశాభంగంలో పడ్డారు.

జనం తల గుడ్డలు దులుపుకుంటూ లేచారు. "చాల్లే సంబడం! లేవండి పోదాం. ఇచ్చాళ్ళే మా గొప్ప బహుమానం .... కాణీ ఖర్చు లేని బహుమానం!"

"సరేలే, ఇంకే విస్తాడు .... మన్ను!" ★

---

➔ శ్రీరాముడు హనుమంతుణ్ణి "నువ్వు ఉత్తమ సేవకుడివి. నీ లాగ, యజమానికి విశ్వాసంతో, ఎక్కువ సేవ చేసేవారే ఉత్తములు" అని పొగిడాడు కదా? ఈ సంగతి, ఏ పురాణ కాలక్షేపంలోనైనా నిరుపేదలు వింటే, వారు తప్పకుండా తమ యజమానికి మరింత విశ్వాసంగా సేవ చెయ్యాలనే అభిప్రాయం ఏర్పర్చుకుంటారు. అంటే, ఈ దోపిడీ ధర్మం, యజమానుల మేలు కోసం పని చేస్తుంది.

రాముడు, సేవకులు చెయ్యవలసిన సేవ గురించేగానీ, వారికి యజమానులు ఇవ్వవలసిన ప్రతిఫలం గురించి గానీ, వారితో ప్రవర్తించవలసిన తీరు గురించి గానీ ఏమీ మాట్లాడలేదు. ఒకసారి భుజం మీద చెయ్యి వేస్తే చాలని చెప్పాడనుకోండి. యజమానుల్లో మాత్రం ఉత్తమత్వం, మధ్యమత్వం, అధమత్వం – అనే రకాలు వుండవు. యజమానులందరూ ఉత్తములే, అందరూ మొదటి రకమే! ★

## కథ-11

# ఎంతో ఉత్తముణ్ణి! ఎన్ని కష్టాలో నాకు!!

రాముడు తలవాల్చి దుఖ్ఖిస్తున్నాడు.

జనం గుంపులు గుంపులుగా కొండలు దిగుతున్నారు. వెళ్ళలేకా, ఉండలేకా ఇబ్బంది పడుతున్న వాళ్ళు, కూర్చున్న చోటు నుంచి వెనక్కి వెనక్కి జరుగుతున్నారు.

"మనం కూడా పోదాం పదరాదూ?"

"ఏం పోతాం, పెద్ద వాళ్ళెవ్వరూ కదలందే! రాముదేవిటో ఇంకా ...."

రాముడి మనసంతా గందరగోళం ఆక్రమించింది. ఇన్నాళ్ళూ ఎలాగో గడిచింది. ఇప్పుడిక యుద్ధం చెయ్యాలి! పుట్టినప్పట్నించీ ఎన్నడూ ఇంత పెద్ద యుద్ధం చెయ్యవలసి రాలేదు. ఇప్పటికే చాలా జాప్యం జరిగింది. ఇంకా కొంత కాలం అయితే సీత దక్కదు. సీత కోసం గాకపోయినా, తన కీర్తి ప్రతిష్టల కోసం, తన వంశ మర్యాద కోసం అయినా, యుద్ధం చెయ్యాలి.

'లంక' అంటే మాటలు కాదు. మహాసర్పం శిరస్సు మీద వున్న మణిలాగ, ఎక్కడో సముద్రం మధ్యలో వున్న దాన్ని పట్టడం!

రాముడు దుఖ్ఖిస్తూ అప్పుడప్పుడూ తలెత్తి సుగ్రీవుడి వేపు, "ఓదార్చవేం?" అన్నట్టు చూస్తున్నాడు.

లక్ష్మణుడు వినయంగా అన్నగారి భుజాల మీదకి వొంగి, "అన్నగారూ! చింతించకండి. ఇక ఎంతో కాలం పట్టదు. వదినగార్ని తొందరలోనే చూస్తారు, దుఖ్ఖించకండి!" అని ఎప్పటికప్పుడు ఓదారుస్తూనే వున్నాడు.

సుగ్రీవుడు కూడా మర్యాదగా, "రామయ్యా! విచారించకు. ధైర్యంగా వుండు!" అని నచ్చజెపుతూనే వున్నాడు. "ఇన్నాళ్ళూ సీతాదేవి ఎక్కడుందో ఏంటో తెలవక విచారించావు గానీ, ఇంకా ఇప్పుడెందుకూ? హనుమంతుడు అన్నీ తెలుసుకొచ్చాడయ్యే! నీ భార్య నీకు దక్కినట్టే అనుకో! సంతోషంగా వుండాలి ఇక ...."

"సుగ్రీవా! ముందు జరగవలసిందంతా తలుచుకుంటే దుఃఖం గాక ఏముందోయీ?" అంటూ రాముడు ఎడం తొడ పక్కన చీది, పంచెతో ముక్కు తుడుచుకున్నాడు. "నా ధర్మపత్ని క్షేమం తెలిసినందుకు ఎంత ఆనందం కలుగుతోందో, ఆ మహా సముద్రాన్ని తల్చుకుంటే అంత దుఃఖం కలుగుతోంది! ఆ భయంకరమైన సముద్రం దాటగలమంటావా సుగ్రీవా? ఈ వానర సైన్యం అంతా అవతలి తీరం ఎలా చేరుతుందంటావు?" అంటూ మళ్ళీ దుఖ్ఖం ముంచుకొచ్చి, తల వాల్చి కుమలడం ప్రారంభించాడు.[334] "అయ్యో! ఎంత ఉత్తముణ్ణి

**334.** **యుద్ధకాండ, సర్గ 1, శ్లోకాలు 17 .... 20:** రాముడు, హనుమంతుడికి 'ఆలింగనం – బహుమతి' ఇచ్చిం తర్వాత మళ్ళీ కూర్చుని విచారంలో మునిగాడు. అప్పటి నించీ 'సముద్రం ఎలా దాటగలం?' అన్నదే రాముడి విచారం అంతా. సుగ్రీవుడి తోటీ, హనుమంతుడి తోటీ ఏమంటున్నాడో చూడండి. "సీతను వెదికి కనిపెట్టినది సర్వప్రకారముల చేతను మిగుల బాగుగ నున్నది. ఆమె క్షేమమును విని మిగుల సంతోషించిన మనసు సముద్రము దాటుట మిగుల కష్టమని భావించి మరియూ దుఃఖము బొందుచున్నది. సముద్రము యొక్క ఆవలి తీరమును, గుంపుగ నుండు వానరులు యెటులపోయి చేరగలరు? సీత సమాచారము నాకు తెలిపిరి. సముద్రమును దాటుటలో వానరులు ఇప్పుడు చేయవలసిన పని యెట్టిది? శత్రు సంహారకుడగు శ్రీరాముడు శోకాక్రాంతుడై ఇటుల జెప్పి పిమ్మట సముద్రము దాటుటలో నుపాయము నాలోచించుచుండెను."

సముద్రం దాటడం ఎలాగ–అని దడ పట్టుకుంది శ్రీరాముడికి. ఏదో కొంచెం సేపు విచారించడం కాదు. తర్వాత కూడా అనేక రకాలుగా, సుగ్రీవుడు విసుక్కుని మందలించే వరకూ సాగిందా విచారం! అంత మహావీరుడు అంత భయపడ్డట్టుగా చెప్పడం, కవికి (ఆ కవి, వాల్మీకి అయినా, గీల్మీకి అయినా,) ఎలా సమంజసం అనిపించిందో! ప్రతీ చోటా అవకతవకలే! ★

యితేనేం? ఎన్ని కష్టాలో నాకు! ఎన్నడూ ఏ పాపమూ చెయ్యలేదు. ఏ ధర్మమూ మీరలేదు. ఎన్ని ఉత్తమ కార్యాలు చేస్తేనేం? .... రాజ్యం పోయింది .... తండ్రి పోయాడు .... భార్య పో ....” చప్పున ఆగాడు.

సుగ్రీవుడు కొంచెం మొహం చిట్లించి, “అస్తమానూ జరిగిందంతా తవ్వి పోసుకుంటావెందుకు రామయ్యా? ఇక ముందు సంగతేంటో ఆలోచించాలి గానీ. మంచి చెడ్డలన్నీ ఎరిగిన వాడివి. సమస్త శాస్త్రాలూ చదువుకున్న వాడివి. ఎప్పుడే కార్యం ఎలా చక్కబెట్టుకోవాలో నీ కన్నా ఎవడికి తెలుసు? మహా జ్ఞానవంతుడివి. మహా బుద్ధి మంతుడివి. మహా శక్తిమంతుడివి. మహా .... అంత గొప్ప వాడివి నువ్వే తెలివి తక్కువ దద్దమ్మ లాగ విచారిస్తే బాగుంటుందా చెప్పు? అసలు నీ అంత వీరుణ్ణి ఎవరన్నా చూశారా? అప్పుడు .... నువ్వు .... ఒక్క బాణంతో మద్ది చెట్లన్నీ బద్దలు గొట్టేశావు. ఆ చప్పుడికి కొండలింకా దద్దరిల్లుతూనే వున్నాయి. ఏవంటావు?” అంటూ ఉత్సాహంగా తల తిప్పి నీలుడి వేపు చూశాడు.

నీలుడు లేచి కొంతసేపైంది. ఇందాక రాముడిచ్చే బహుమానం సరిగ్గా కనపడదేమోనని ముందుకు తోసు కొచ్చిన వాళ్ళెవరో మీద పడ్డప్పుడు విసుక్కుంటూ లేచాడు. లేచిం దగ్గిర్నించీ ఆవలింతల్లో పడ్డాడు. మళ్ళీ బ్రహ్మాండంగా ఆవలింత రాబోయింది గానీ, మహారాజు తన వేపు తల తిప్పేసరికి అది కంగారెత్తి కడుపులోకే జారుకుని, అదిరిపడి నోరు మూశాడు.

సుగ్రీవుడు శ్రీరాముణ్ణి ఓదార్చే ఉత్సాహంలో పడి నీలుడితో, అతడి ఆవిలింతని పట్టుకోకుండానే, “ఆ మద్ది చెట్లు బద్దలు గొట్టటం .... ఎంత గొప్ప .... పనో! .... ఏవంటావు?” అని రెట్టించాడు.

నీలుడి చెవుల్లో .... అప్పుడు .... అంత కమ్మటి నిద్రని చెడగొట్టిన .... అంత పెద్ద చప్పుడు .... గుర్తొచ్చి, “అవును మహారాజా! అంత చప్పుడు చేసే వీరుణ్ణి నే నెక్కడా చూడలేదు” అని తల తాటిస్తూ రాముణ్ణి మెచ్చు కున్నాడు.

సుగ్రీవుడు రాముడికేసి తల తిప్పి మెడలో గొలు సులు సర్దుకుంటూ చిరునవ్వు నవ్వాడు. “ఎప్పుడూ నిరు త్సాహ పడతావెందుకు చెప్పు? నిరుత్సాహ పడితే ఉత్సాహం చెడిపోతుంది. ఉత్సాహం చెడిపోతే విచారం ముంచుకొస్తుంది. విచారం ముంచుకొస్తే ....”

సుగ్రీవుడు రాజయిన దగ్గర్నుంచీ, గంభీరంగా పెద్ద పెద్ద పదాలూ సూక్తులూ ఉపయోగించే ప్రయత్నాలు చేస్తున్నాడు. “పురుషుడికి ధైర్యం ఉండాలి. ధైర్యం పోయిందంటే అధైర్యం పట్టుకుంటుంది. అధైర్యం పట్టు కుందంటే కార్యం చెడిపోతుంది. కార్యం చెడిపోయిం దంటే సర్వనాశనం కలుగుతుంది. సర్వనాశనం కలి గిందంటే .... సర్వ .... నాశనం .... కలిగిందంటే ....” మొహం చిట్లిస్తూ మాటలు ఆపి, ఆశ్చర్యంగా ఆలోచనలో పడ్డాడు! దుఃఖం లోంచి, విచారం లోంచి, అధైర్యం లోంచి, వొచ్చి వొచ్చి సర్వనాశనంలో కొచ్చిందేంటీ వ్యవ హారం! .... అక్కడన్నా ఆగుతుందా? ఆగకపోతే .... ఇంకేం జరుగుతుందబ్బా? .... ఇదేంటి? నేనే ఆలో చిస్తున్నానేంటి? మంత్రుల్నా ఏంటి నేను? సర్వ నాశనం తర్వాత ఏంటి వస్తుంది?

చప్పున తల తిప్పి నీలుడి వేపు వొంగాడు. “ఆలో చించు! ఊఁ .... దబ్బున .... ఇంత సేపూ నేనే ఆలో చించాను తెలుసా?”

“అయ్యయ్యో! ఎంత పనైపోయింది మహారాజా!” – నీలుడు, కొత్త ఆవలింతని నొక్కిపట్టి విచారించాడు.

“ఊఁ సరేలే, ఆలోచించు దబ్బున!”

“చిత్తం! ఏం ఆలోచించమంటావో సెలవిస్తే ....”

“అబ్బ! అదీ నేనే చెప్పాలా? ఇక మంత్రులుండి ఏం సుఖం మహారాజుకి?”

“చిత్తం! ఇళ్ళ కెప్పుడు పోతామో ఆలోచించ మంటావా రాజా?”

“అబ్బ, అది కాదు. చెపితే గాని తెలవదన్న మాట! సర్వనాశనం అయిపోయిం తర్వాత ఏం జరుగుతుందో ఆలోచించు .... ఊఁ .... దబ్బున ....”

“చిత్తం, చిత్తం! ..... ఆలోచిస్తున్నా, మొదలెట్టేశా.”

సుగ్రీవుడు రాముడి వేపు తల తిప్పాడు ఉత్సా హంగా.

కుములుతోనే వున్నాడు రాముడు.

రాముడి కుములుడు చూసి, కంగారు పడుతూ సుగ్రీవుడు “ఏం, అయిందా?” అని నీలుడి వేపు తల తిప్పి ఖయ్యిమన్నాడు.

నీలుడు, ఆలోచన కోసం తల కిందికీ మీదికీ అన్ని దిక్కులకీ బొంగరం లాగ తిప్పాడు. “అప్పుడే అయ్యేట్టు లేదు మహారాజా! నువ్వు దయతల్చి ....”

“ఊఁ .... ఏంటో చెప్పి చావు.”

“ఒక్క సంవత్సరం గడువిస్తే ....”

“ఏంటీ! గడువా? .... ఒక్క సంవచ్చరవా? .... ఇంకా నయం. పదేళ్ళడగక పోయావా? బుద్ధి లేదూ?”

“చిత్తం.”

“మంత్రి జన్మెలా ఎత్తావు?”

“చిత్తం.”

ఎదటి వాళ్ళు ఎంత వినయంగా వొంగిపోతే, సుగ్రీవ మహారాజుకి కోపం అంత తొందరగా తగ్గి పోతుంది. రాజుగారు కోపం తగ్గి, “అయితే గడువు ఇవ్వక తప్పదంటావా? సర్వనాశనం తర్వాతేం జరుగు తుందో గమ్మున తెలుసుకోవాలని సరదా పడ్డానే! సరేలే, అలాగే తీసుకో. ఒక్క సంవత్సరం చాలా? ఇంకో సంవ త్సరం కూడా కావాలా? అప్పటి కన్నా తెలుస్తుం

దంటావా?"

"తెలుస్తుం దనుకుంటాను మహారాజా! అప్పటికి సర్వనాశనం అయిపోతే... తప్పకుండా తెలుస్తుంది."

"అలాగా?"

"కొన్ని సంగతులు ఆలోచిస్తే తెలవ్వు మహా రాజా! జరిగితేనే తెలుస్తాయి. సర్వనాశనం అయిపోయిం తర్వాతేం జరుగుతుందో, సర్వ నాశనం అయిపోయిం తర్వాతే తెలుస్తుంది."

"అవును మరి. బాగానే చెప్పావు. అదేదో దబ్బున జరిగితే బాగుండు. తర్వాతేం జరుగుతుందో దబ్బున తెలుస్తుంది కదా?"

"మహారాజా! నన్నో ఉపాయం చెప్పమంటావా?"

"ఏడిసినట్టుంది. చెప్పమని కాదూ?"

"రాముడు మహా జ్ఞానవంతుడు కదా? సర్వ నాశనం అయిపోయిం తర్వాతేం జరుగుతుందో చెప్ప మనరాదూ? సంవత్సరం పాటు ఆగకుండా ఇప్పుడే తెలిసిపోతుంది కదా?"

"వోహో అదా? .... అవును .... ఆ సంగతి నాకూ తెలుసులే" అని మహారాజు తల తిప్పేశాడు.

రాముడు హనుమంతుడితో చెప్పుకుంటూ దుఖిస్తు న్నాడు. ".... మర్చి పోలేనోయీ! నువ్వు చేసిన మేలు ఇంతా అంతా కాదోయీ! కానీ ఏం లాభం? అంతా అడివి గాచిన వెన్నెలైపోయింది. పామరుడికి బోధించిన జ్ఞానమై పోయింది. ఈ కష్టాలన్నీ గడిచి, నా ధర్మపత్నిని నేను పొందగలనంటావా? ఈ జన్మలో .... మళ్ళీ నా అర్ధాంగిని .... చూడ ...."

లక్ష్మణుడు అన్నగారి దుఖం చూడలేక కళ్ళనీళ్ళు తిప్పుకుంటున్నాడు, మాటి మాటికీ. భుజం మీద గుడ్డ తడిసి ముద్దయింది.

సుగ్రీవుడు కాలు మార్చుకుని తొడ గోక్కుంటూ, "రామయ్యా! భార్య మీద ప్రేమకొద్దీ విచారిస్తున్నావు గానీ .... ఆ దుర్మార్గుణ్ణి చంపకుండా విడిచి పెడతావా? మహా వీరుడివి నువ్వు. నీ బాణాల్ని తప్పించుకుని వాడెక్కడ దాక్కోగలడు? .... ఉత్తమాట. నువ్వు రావ ణుణ్ణి యుద్ధంలో వోడించి తీరతావు" అని నవ్వు మొహంతో చూశాడు.

"ఏవిటీ! నేనొక్కణ్ణేనా ఏవిటి యుద్ధం చేసేది?" అన్నట్టు రాముడు క్రీకంట చూశాడు. ఆ రావణుణ్ణి చంపి సీతని తెచ్చి ఇచ్చే పూచీ తనదేనని వాగ్దానం చేశాడే! చక్కగా అన్నగార్ని చంపించుకుని సింహాసనం ఎక్కి కులుకుతున్నాడు. ఇంకేం జ్ఞాపకం వుంటుంది వాగ్దానం? చివరికి తప్పుకుంటాడు కావును. ఇంతకీ సముద్రం దాటే సంగతి తేల్చడేం? తనకేం పట్టనట్టు వూరుకున్నాడు. అడిగెయ్యనా?

రాముడు అప్పుడప్పుడూ కొంచెం గాంభీర్యం విడిచి పెట్టేస్తూ కూడా వుంటాడు, చుట్టూ వున్న వాళ్ళు వాన రులే గదా అని.

"సుగ్రీవుడా! .... అసలు రావణుణ్ణి చంపాలంటే సముద్రం దాటి వెళ్ళాలి గదోయీ! సముద్రం ఎలా దాటగల మంటావు?" అని, చివరికి కొంత గంభీరం గానే చూశాడు.

సుగ్రీవుడు చప్పున చేతులు అడ్డంగా ఆడిస్తూ, "ఆ సంగతి మాత్రం నాకు తెలవదు రామయ్యా! మా వాళ్ళు యుద్ధం అయితే చేస్తారు గానీ .... సముద్రం గోల .... అదంతా నువ్వే చూసుకోవాలి. అన్నీ తెలిసిన వాడివి, ఎలా దాటిస్తావో యేమో! నేనేం చెప్పలేను సుమా! .... నువ్వు సముద్రం దాటించాలే గానీ, నా సైన్యం లంక చేరిందీ అంటే, రావణుడు చచ్చాడే అనుకో. సముద్రం దాట లేకపోతే మనమేం చెయ్యలేం. మనమే గాదు, దేవతలైనా ఏమీ చెయ్యలేరు. సాక్షాత్తూ దేవేంద్రుడైతే మాత్రం సముద్రం అవతల వున్నవాణ్ణి ఏం చెయ్య గలడు? దారా, తెన్నా?" అంటూ తల ఇటూ అటూ తిప్పి నళుడు కనపడగానే ఉత్సాహంగా "ఏమంటావు?" అని నవ్వాడు చప్పున.

మహారాజు చాలా సేపటి తర్వాత పలకరించి నందుకు మురిసిపోతూ నళుడు "అవును మహా రాజా! నువ్వు చెప్పింది దేవేంద్రుడైనా కాదనలేడు. వొప్పుకోవలి సిందే. మహాజ్ఞానివి నువ్వు" అని మెచ్చుకున్నాడు.

రాముడు లక్ష్మణుణ్ణి వారకంట పలకరిస్తూ, "విన్నావా నళుడి మూర్ఖపు మాటలు? మహాజ్ఞానిని నేనా, సుగ్రీవుడా?" అన్నట్టు నుదురు చిట్లించాడు.

లక్ష్మణుడు అన్నగారి వార చూపులు తిన్నగా గ్రహించుకోలేక, "విచారించకండి అన్నగారూ! వదిన గారిని తప్పకుండా చూడగలరు" అంటూ చూపుల నిండా ఓదార్పు కురిపించాడు.

నళుడు ఇంకా ఉత్సాహం తీరక సుగ్రీవుడితో పౌరు షంగా, "ఆ రావణుడు సముద్రం అవతల కూర్చుంటే కాదు. పౌరుషం వుంటే ఇవతలకి రమ్మను! అప్పుడు చూడు ఎలా యుద్ధం చేస్తానో! ఇవతల అడుగు పెట్టాడో చచ్చాడే!"

"వాడి రాజ్యంలో వాడున్నాడయ్యా! అంత పౌరుషం వుంటే నువ్వే అవతలకి వెళ్ళు" అని కేక పెట్టారెవరో జనంలోంచి.

కిక్కురు మనలేదు నళుడు.

మళ్ళీ సముద్రం సమస్య, సముద్రం అంత భయం కరంగా, సముద్రం అంత గంభీరంగా, సముద్రం అంత బ్రహ్మాండంగా, తలెత్తింది!

మళ్ళీ రాముడికి సముద్రం అంత దుఖం పొంగు కొచ్చింది. అయ్యో! సముద్రం దాటకపోతే .... రావణుణ్ణి చంపకపోతే .... లంకని జయించకపోతే .... సీతని

తెచ్చుకోకపోతే .... ఇంతకీ సీతని తెచ్చుకోవలసిందేనా? .... శీలం చెడిపోయిన స్త్రీని! ఆc, శీలం చెడి పోయిందా? .... ఈ శంక వదలనే వదలదా? .... రావణుడు కోరడం .... సీత తిరస్కరించడం .... హనుమంతుడు కళ్ళారా చూసిందంతా చెప్పాడే! చెబితే మాత్రం? .... తర్వాతేమీ జరక్కుండానే వుందా? సీత అపవిత్ర అయిపోయినట్టేనా? .... అయితే ఈ యుద్ధ ప్రయత్నాలన్నీ ఎందుకు? ఎందుకేమిటి? యుద్ధం జరగవలసిందే! రావణుడు, నా జాతికే శత్రువు. శత్రువుని విడిచే ప్రసక్తే లేదు. జయాపజయా లెవరెవరి పక్షమో! .... త్రిజట కలలో శ్రీరాముడు నెగ్గినట్టు కనపడిందని హనుమంతుడు చెపుతున్నాడే! అలాగే జరుగుతుందేమో! లేకపోతే తన జయం గురించి రాక్షస స్త్రీ కలగనడం ఏవిటి?

రావణుడికి .... వ్యతిరేక పక్షం ఉన్నట్టే కనబడు తోంది. రేపు యుద్ధ కాలంలో, విభీషణుడే అన్నకు వ్యతిరేకం కావచ్చునేమో! .... రాజ్యంలో అతని బలం ఏమిటో .... అతని ప్రయత్నాలేమిటో .... అన్నని వ్యతిరేకించినా, తనకు సహకరిస్తాడో లేదో! .... ముందు లంకకి చేర గలిగితేగానీ విభీషణుడి సమాచారం .... అయ్యో! .... సముద్రం దాటకుండా ఈ ఆలోచనలన్నీ ఏమి లాభం?

మళ్ళీ భయంకరమైన సముద్రం! ఆకాశం ఎత్తు కెరటాలతో భీకరంగా సముద్రం!

సుగ్రీవుడూ, లక్ష్మణుడూ, హనుమంతుడూ ఇంకా ఎవరెవరో ఓదారుస్తోన్న మాటలు .... అప్పుడొకటీ .... అప్పుడొకటీ .... వినబడుతోనే వున్నాయి రాముడికి. దుఃఖం వొద్దంటున్నారు. ఆనందం తెచ్చుకోమంటున్నారు.

రాముడు, ఆనందమే వొద్దనుకుంటున్నాడు. దుఃఖమే తెచ్చుకుంటున్నాడు. రుష్యమూకం మునిగిపోయి అక్కడో సముద్రం అయ్యేన్ని కన్నీళ్ళు కారుస్తున్నాడు.

ఎంత ఓదార్చినా రాముడు ఇంకా దుఃఖిస్తోనే వుండడం చూస్తే, సుగ్రీవుడికి విసుగు పుట్టేసింది కొంచెం చనువుగా మందలించడానికే పూనుకున్నాడు. "చాలా సేపు దుఃఖపడ్డావుగా? ఇక చాలు గాని వూరుకో రామయ్యా! రాజు అన్నవాడికి కాస్త కోపం వుండాలయ్యా! కోపం లేనివాణ్ణి చూస్తే ఎవడు జడుస్తాడు? మెత్తగా వున్నవాణ్ణి అందరూ లోకువ చేసేస్తారు.[335] కోపంతో శత్రువు మీద ఉరకాలి గానీ ...." తల ఇటూ అటూ తిప్పుతూ నీలుడు కంటబడగానే కోపం ముంచు కొచ్చి, "ఇందాకెందుకు నిద్రపోయా?" అంటూ అతని మీద విరుచుకుపడ్డాడు.

నీలుడు అదిరిపడి, తలవొంచి, భుజాలు వొంచి, భూమికి వొంగాడు.

"ఏవిటీ, మళ్ళీ నిద్రే!"

"ఛీ, వొట్టు! ఇదేం నిద్ర? ఊరికే .... అలా కోడి కునుకు ...."

"నిద్రపోతే ఈ సారేం చేస్తానో తెలుసా? మరణ ...."

"చెప్పకు, చెప్పకు, నీ ఇష్టం వొచ్చింది చెయ్యి!"

సుగ్రీవుడు శాంతించి, రాముడి కేసి తల తిప్పి, భుజానికి గుచ్చుకుంటున్న గొలుసులు సర్దుకుంటూ, "కోపం వుండాలయ్యా!" అని నవ్వు మొహం పెట్టాడు.

రాముడు కోపం బాగానే తెచ్చుకున్నాడు, సుగ్రీవుడి మీద! మాటి మాటికీ ఆ గొలుసులు సర్దుకోడం చూస్తే .... పైగా సముద్రం దాటే ఉపాయం ఏమిటో తననే ఆలోచించమన్న దగ్గిర్నుంచీ.

రాముడు కోపగిస్తూ .... ఆలోచిస్తూ .... కోపగిస్తూనే వున్నాడు. కోపాలోచనలో రాముడికి చక్కటి ఉపాయం తోచింది. ఆ కాస్త గాంభీర్యం కూడా అవతల

**335.** **యుద్ధ, సర్గ 2, శ్లోకాలు అన్నీ:** సముద్రం దాటడం గురించి రాముడెలా వున్నాడో, రాముణ్ణి సుగ్రీవుడెలా వోదారుస్తున్నాడో చూడండి. "శోకముతో మిగుల దీనముగ నుండు శ్రీరామునితో సుగ్రీవుడు దుఃఖమును బోగొట్టు మాటల నిటుల జెప్పెను. 'వీరుడా! కేవలము తెలివి లేని సామాన్యుని వలె ఎందుకు దుఃఖించెదవు? ఇటుల చేయవలదు .... సీతా వృత్తాంతము, శత్రువు వుండు చోటు, బాగుగా తెలిసియుండగా నీవు దుఃఖించు కారణము నాకు విశదపడలేదు .... నీవు బుద్ధిమంతులలో నుత్తముడవు, సకల శాస్త్రములను దెలుసుకొనుటలో పండితుడవు. నా వంటి మంత్రులతోటి (తనని రాముడికి లోబరుచుకుంటున్నాడు సుగ్రీవుడు) శత్రువులను జయించుటకు తగియున్నావు. సకల కార్యములను నాశనము జేయునట్టి శోక పరవశమైన బుద్ధిని విడువుము" – ఈ రకంగా సుగ్రీవుడు కొంత సేపు మంచిగా ఓదార్చాడు. కానీ, రాముడు ఇంకా దుఃఖిస్తూ వుంటే సుగ్రీవుడికి వొళ్ళు మండింది. "రామా! దుఃఖించినది చాలును. ఇక వూరుకొనుము. (చాల్లే, ఇక కట్టిపెట్టు!) కోపమును దెచ్చుకొనుము. క్రియా శూన్యులగు క్షత్రియులు మందభాగ్యులు. అందరును కోపము గలవానికి భయపడుదురు. మనము యెటులనైనను కష్టపడి సముద్రమును దాటవలయును" అంటున్నాడు.

'పనీ పాటా లేకుండా ఏడుస్తూ కూర్చునే క్షత్రియులు దౌర్భాగ్యులు. బుద్ధి లేని మూర్ఖుడి లాగ ఏడుస్తావేంటి? ఇంక చాల్లే, వూరుకో!' – ఈ రకం మాటలు రాముడిని గురించి సుగ్రీవుడితో అనిపించడం ఎంత తప్పో కవికేమీ బోధపడలేదు. ఎప్పటి కప్పుడు నీతులు బోధించాలి కాబట్టి, ఆ ఘట్టంలో ఎవరుంటే వాళ్ళతో నీతులు చెప్పించెయ్యడమే! ★

పెట్టి, "అయ్యో, సుగ్రీవుడా! సముద్రం ఎలా దాటగల మోయి?" అంటూ బావురుమన్నాడు.

సుగ్రీవుడికి చిర్రెత్తుకొచ్చేసింది. రాచ మర్యాదలన్నీ వొదిలేసి, మొహానికి ఉందో లేదో తెలీని కాస్త అందం కూడా వొదిలి పోయేలాగ మొహం చిట్లిం చేశాడు. "ఎట్టాగో అట్టా దాటాలి, తప్పుతుందా? మా వాళ్ళం దరూ వున్నారుగా? వాళ్ళే ఏదో చేసి మిడుకుతారు. ఏ అడ్డ కట్టో కడతారు" అని ఖస్సుమన్నాడు."[336]

రాముడు, సుగ్రీవుడి కోపాన్ని అంతగా పట్టించు కోకుండా, పౌరుషపడకుండా, "సముద్రం మీద సేతువు కట్టడమా! సాధ్యమౌతుందా?" అని భయంగా చూశాడు.

జనం అందరూ ఆశ్చర్యంగా మళ్ళీ గుస గుసల్లోకి దిగారు. లక్ష్మణుడి మొహం, తెల్లగా తెల్ల మొహం వేసింది. ఇంగితం ఎప్పటి నించో ఎక సెక్కాలు మొద లెట్టింది. "ఒక్క బాణంతో ఆకాశాన్ని పడగొట్టేస్తా నంటాడు. సముద్రాల్ని ఇంకించేస్తానంటాడు. సూర్య చంద్రుల్ని గతులు తప్పిస్తానంటాడు. ఆ బాణాలు ఉన్నా యిగా? నీ అన్న అంత బెంబేలెత్తుతున్నాడెందుకూ? సముద్రాన్ని ఇంకించరాదూ?" అని మొహం చిట్లిస్తోంది.

అన్నగారి వ్యవహారం లక్ష్మణుడికీ విసుగ్గానే వుంది. ఇంత మంది జనం ముందు అంత బేలగా మాట్లాడడం యేమిటి? సుగ్రీవుడేవన్నా ఈయన కన్నా వీరుడా?

"జనం చూడు, ఎలా గుస గుసలాడుకుంటు న్నారో!" – ఇంగితం.

"జనం ఎప్పుడూ అంతేలే, అజ్ఞానులు."

"జనం అజ్ఞానులైతే, నీ అన్న జ్ఞానం ఏమిటి?"

"అబ్బ! ఊరుకో!"

"నువ్వూ ఆ అన్నకి తమ్ముడివే గద!"

లక్ష్మణుడు, సుగ్రీవుడి మొహం వేపు చూపు తిప్పే శాడు.

సుగ్రీవుడికి కూడా భయంగానే వుంది .... ఏదో అనేశాడే గానీ .... సముద్రం మీద కట్ట కట్టడం .... లంక చేరటం .... రావణుడితో యుద్ధం .... అంతా జరిగి చచ్చేదేనా? జంకుతూనే బింకంగా చుట్టూ చూశాడు.

తన చుట్టూ వందల మంది సేనాధిపతులు! సేనల్ని అదుపులో పెట్టి ఎంతెంత యుద్ధాలయినా, ఎంతెంత కార్యాలయినా చేయించగల సమర్థులు! తన చేతికింద ఇంతింత సమర్థులుండగా ....! గొంతులు సర్దు కుంటూ రాముణ్ణి గర్వంగా చూస్తూ – "ఎందుకు సాధ్యం కాదూ? వానర సేనాపతులందరూ లేరూ?" అని చిరునవ్వు చిందించాడు.

సేనాపతులందరూ తత్తరపడుతూ వొకరి మొహా లొకరు చూసుకున్నారు. సముద్రం మీద అడ్డకట్ట కట్ట డవా? తమ వల్ల అవుతుందా? రాజు తమ మీద పెట్టా దేవిటి? లేచి కట్ట కట్టమంటాడా?– కంగారు పడుతూ దిక్కులు చూశారు.

ఎటు చూస్తే అటు జనం! జనం! గుంపులు .... గుంపులు ....! చెట్ల నిండా .... పుట్ల నిండా .... గుట్ల నిండా! ఇళ్ళ నిండా .... ఊళ్ళ నిండా .... రాజ్యం నిండా!

వాళ్ళ సాహసాలు .... వాళ్ళ శక్తి సామర్థ్యాలు .... వాళ్ళ అమాయకత్వాలు .... రాజుల కోసం వాళ్ళ త్యాగాలు .... వీర స్వర్గాలు ... అలాంటి ప్రజలెందరో వుండగా ....! సేనాపతులకు దడ తగ్గింది. నవ్వు మొహాలతో మహారాజు వేపు చూశారు.

మహారాజు ఇంకో వేపు చూశాడు. అటు ఉన్న సేనా పతులు కూడా నవ్వు మొహాలు చూపించారు.

మహారాజుకి పూర్తిగా భీతి తగ్గింది. రాముణ్ణి మందహాసంతో చూశాడు – "నా మంత్రులూ, సేనా పతులూ అందరూ చాలా ఉత్సాహంగా ఉన్నారు. నువ్వేం చెయ్యమంటే అది చేస్తారు. లంకని పెళ్ళగించి తెమ్మంటే తెచ్చేస్తారు. అందుకేమీ సందేహం లేదు. రావణుడనగా ఎంత? .... సముద్రం దాటాలే గానీ వాడు చచ్చాడన్న మాటే! నువ్వే చూస్తావుగా, మా వాళ్ళు యుద్ధం ఎల్లా చేస్తారో[337] ఇంత చెప్పటం ఎందుకులే,

---

**336.** **యుద్ధ, సర్గ 2, శ్లోకాలు 9 .... 12:** చివరికి సముద్రం దాటే ఉపాయం ఏమిటో సుగ్రీవుడే చెపుతున్నాడు. అది రాముడికి తోచింది కాదు. "శ్రీరాముడా! సముద్రము మీద సేతువు నిర్మించి రాక్షస రాజగు రావణుని పట్టణమును జయించునట్టి ఉపాయమును ఆలోచింపుము. సముద్రము మీద సేతువును గట్టక ఇంద్రునితో గూడిన సురాసురులకును, లంకను నాశనము జేయుట సాధ్యము గాదు. సముద్రము మీద సేతువును మేము నిర్మించినపుడే ఈ వానర సేన యంతయు సముద్రమును దాటునటులను, శత్రువును జయించునటులను తెలిసికొనుము" – ఈ విధంగా సముద్రం మీద సేతువు కట్టే ఉపాయం సుగ్రీవుడు చెప్పిందే. ★

**337.** **యుద్ధ, సర్గ 2, శ్లోకాలు 7, 8:** సేతువు కట్టే ఆశలన్నీ సుగ్రీవుడు ఎవరి మీద పెట్టుకున్నాడు? సేనాపతుల మీద. అంటే సేనని నడిపించే వారి మీద! సుగ్రీవుడు రాముడితో ఏమంటున్నాడో చూడండి. "రామా! ఈ వానర సేనాపతులందరును నీకు ప్రియము చేయుటకై ఉత్సాహము గలిగియున్నారు .... ముఖ వికాసాదులచే ఈ వానర సేనాపతులకు ఉత్సాహము గలదని విశదమైనది. (వీళ్ళ మొహాలు చూస్తే ఉత్సాహంగానే వున్నట్టు తెలుస్తోంది.) ఈ విషయములో నా యూహ కూడ దృఢముగ నున్నది."

➔

అంతా నీకే తెలుసు. మనం తప్పకుండా గెలుస్తాం. శకునాలు కూడా బాగున్నాయి" అని తల పైకెత్తి, మెడ మడతలో గొలుసులు సర్దుకుంటూ, పరిసరాలు పరిశీలించాడు. "ఆఁ .... గాలి బాగుంది .... చెట్లు బాగున్నాయి. అదుగో! .... ఆ పిట్ట అటు ఎగిరింది .... అలా ఎగిరితే చాలా మంచిది .... ఆకాశం కూడా బాగుంది .... అంతా బాగుంది" అని తను కూడా శకునాలు చెప్పగలిగానని గంభీరంగా చూశాడు.

సుగ్రీవుడి ధైర్యం చూస్తోంటే రాముడికి పుట్టెడు ధైర్యం కలిగింది.

సముద్ర తీరానికి చేరాక ఈ వానర సైన్యం అంతా కలసి ఏదో వొకటి చెయ్యక పోతారా – అనే నమ్మకం కుదిరింది.

సముద్రం దాటడం గురించి వానరుల ముందు తను చాలా అధైర్యంగా వ్యవహరించానేమోనని హఠాత్తుగా సందేహం ప్రారంభమై, అది చప్పు చప్పున తాటి చెట్టంతగా విజృంభించింది. రాముడు, లోపల్లోపల కించ పడుతూ, నొచ్చుకుంటూ, కొంచెం చిరునవ్వుతో తల పంకిస్తూ, హనుమంతుడి వేపు చూశాడు. "మీ మహారాజు చెప్పినదంతా ఎంతో చక్కగా వుందోయీ! సముద్రం దాటడం కూడా ఒక ఘనకార్యమేనా? నీరంతా ఇంకించో, సేతువు నిర్మించో, ఏదో విధంగా నా తపశ్శక్తి ఉపయోగించి మిమ్మల్నందర్నీ సముద్రం దాటించే శక్తి నాకు లేకపోలేదు సుమా! .... మీరందరూ ఇంకేమైనా మార్గాలు చెపుతారేమోనని అడిగాను గానీ" **338**

హనుమంతుడు తెల్ల బోయాడు.

సుగ్రీవుడూ తెల్ల బోయాడు.

బాగుండదని వింటున్నారు. తల లూపుతున్నారు.

"మరి ఇంతసేపూ దుఃఖించాడెందుకూ?" అని దూరం వాళ్ళు నిర్మొహమాటంగా తర్జన భర్జనలు మొదలెట్టారు.

"అబ్బ! ఎండ నెత్తులు మాడుస్తోంది. ఇళ్ళకి పోదాం అంటే వొదలడే!"

"వొదలక నిన్ను పట్టుకున్నాడా? రమ్మంటే రావు గానీ పోయే వాళ్ళంతా పోటం లేదూ?"

"అయితే పదండి పోదాం."

ఒక గుంపు మంది లేచారు.

రాముడు గంభీరంగా తల పంకిస్తూనే ఉన్నాడు. హనుమంతుడితో అంటున్నాడు "సముద్రం దాటే సంగతి కేమి గానీ .... లంకా నగర విశేషాలన్నీ చెప్పవోయీ! లంకలో సైన్యం ఎంత వుంటుంది? వారి శక్తి సామర్థ్యాలెట్లాంటివి? వారికి ఆయుధాలెన్ని వున్నాయి? నగరానికి రక్షణ ఏర్పాట్లూ అవీ ఏ విధంగా వున్నాయి? అన్నీ వివరంగా చెప్పు."

పోదామని లేచిన వాళ్ళల్లో కొందరు మళ్ళీ కుతూహలం పుట్టి చతికిలబడ్డారు.

హనుమంతుడు తను చూసి వొచ్చిన విశేషాలన్నీ తల్చుకుంటూ ఉప్పొంగుతూ ప్రారంభించాడు – "అన్నీ చెపుతాను రామయ్యా! పూస గుచ్చినట్టు చెపుతాను. లంక చుట్టూ రక్షణ యేర్పాట్లు ఇన్నీ అన్నీ గావనుకో. అబ్బో, ఆ విషయంలో మాత్రం రావణుడి కెంత పట్టుదలో! ఏ మాట కామాటే చెప్పుకోవాలి. ఆయనకి కూడా నీలాగే జూదం గీదం లాంటి వ్యవసనాలేవీ లేవంట! చక్కగా రోజూ చతురంగ బలాలన్నిట్నీ శ్రద్ధగా పరీక్ష చేసుకుంటాడు. యుద్ధాలొస్తే తనే స్వయంగా బయల్దేరతాడు." **339**

"అది సరేనోయీ!.... లంకలో సైన్యం విశేషాలు చెప్పవోయీ!"

---

➔ రాముడు, సుగ్రీవుడి మీద ఆధారపడి వున్నాడు. సుగ్రీవుడు, సేనాపతుల మీద ఆధారపడి వున్నాడు. సేనాపతులు, సేన మీద! అంటే సామాన్య ప్రజల మీద! మహారాజుల వీర కార్యాల రహస్యం ఇదే. వీరత్వం ఎప్పుడూ పాలకులది కాదు, ప్రజలదే! ★

**338.** **యుద్ధ, సర్గ 3, శ్లోకాలు 2, 3:** సముద్రం దాటడం ఎలాగా – అని రాముడు కొంతసేపు దుఃఖించాడు. సుగ్రీవుడు మందలించాడు. ఓదార్చాడు. ఉపాయం చెప్పాడు. అంతా అయ్యింతర్వాత రాముడేమంటున్నాడో చూడండి. "తపో ప్రభావము వలన గానీ, సేతువు నిర్మించుటచేత గానీ, సముద్రమును ఇంకింపజేసిగానీ, సర్వ ప్రకారముల చేతనూ సముద్రమును దాటుటలో నాకు శక్తి గలదు. లంకలో స్థల, జల, గిరి, దుర్గము లెన్ని గలవు? దాని నంతయు ప్రత్యక్షముగ జూచి నటుల తెలిసికొన గోరుచున్నాను" అంటున్నాడు.

ఒక విషయం గురించి ముందు తను భయపడి, తీరా రెండో వ్యక్తి ఏదో వొక ఉపాయం చెప్పింతర్వాత, "సరేలే, ఆ సంగతి నాకూ తెలుసులే. ఆ పని నే నెలాగో వొకలాగ చేసెయ్యగలను గానీ .... మిగతా సంగతులు చెప్పు" అనడం! ఇలాంటి స్వభావం, ప్రవర్తనా, ఎవరికన్నా ఆదర్శమేనా? ★

**339.** **యుద్ధ, సర్గ 3, శ్లోకం 20:** హనుమంతుడు రావణుడి గుణాలు చెపుతున్నాడు. "రామా! జూదము మొదలగు వ్యసనములు లేనివాడుగను ('ప్రకృతిమ్' అని కవి వాడిన పదానికి, 'వ్యసనములు లేని సుస్వభావము' అని అనువాదకులు అనువాదం చేశారు.) ఎల్లప్పుడూ జాగరూకత గల వాడుగను, దినదినము చతురంగ బలములను జూచుకొను వాడుగను, అతడే యుద్ధము చేయుటలో నాసక్తి గల వాడుగను, రావణుడు ఉన్నాడు." ★

"ఆc .... చెబుతా .... చెబుతా .... అన్నీ చెబుతాగా? అసలు లంకా నగరం అంతా త్రికూట పర్వతం మీద ఉంది. ఆ పర్వతం చుట్టూ గచ్చుకాయి లాగ నున్నగా చెక్కేశారు. దాని మీదకి ఎవ్వరూ ఎక్కలేరు. దేవతలు కూడా ఎక్కలేరనుకో. జర్రున జారిపోతారు."

"మరి నువ్వెట్టా ఎక్కా?" – సుగ్రీవుడు నోరు తెరిచి ఆశ్చర్యంగా చూశాడు.

"నే నెట్టాగో ఎక్కాననుకో" అని, 'దేవతలు ఎక్కలేక పోతే నే నెక్కలేనా యేంటి?' అన్నట్టు చూసి, హనుమంతుడు మళ్ళీ ప్రారంభించాడు. "లంక చుట్టూ పెద్ద గోడ ఉంది. దాని అందం ఏం చెప్పను? ఆహా! చూడాలే గానీ చెబితే తీరదు. అది రాళ్ళతోటో, మట్టి తోటో కట్టా రనుకుంటున్నారా? అబ్బే, బంగారం ముద్దల్తో కట్టారు. ఆ బంగారం నిండా ముత్యాలూ రత్నాలూ వజ్రాలూ వైడూర్యాలూ .... ఇంకా ఏవిటేవిటోనమ్మా, ఆ పేర్లన్నీ నాకు రావు గానీ .... థగ్ థగా మెరిసిపోయే రంగు రంగుల మణులన్నీ తాపడం చేశారు ...."

రాముడు నమ్మలేక పోతున్నాడు.

సుగ్రీవుడు నమ్మలేనట్టు చూస్తున్నాడు.

"బంగారాన్ని పెట్లో దాచుకుంటారు గానీ గోడకి పెట్టుకుంటారా ఎక్కడన్నా? ఎవరన్నా ఎత్తుకు పోరూ?" అని జనం విస్తుబోతున్నారు.

"ఆ దేశంలో దొంగల్లేరేమో!"

"చాల్లే, గోడల నిండా బంగారం వుంటే దొంగ లుండరూ? అది కాదు, గోడల చుట్టూ కాపలాలు పెడతారేమో!"

"బంగారం తెచ్చి గోడ నిండా పెట్టడం ఎందుకూ? దాని చుట్టూ కాపలా లెందుకూ? పిచ్చొడిలాగున్నాడు రావణుడు."

హనుమంతుడు ఆ గోడని వదలడం లేదు. దాని సొగసులే ఇంకా వర్ణిస్తున్నాడు. దాన్ని చూడాలంటే రెండు కళ్ళూ చాలవంటున్నాడు. స్వర్గలోకంలో తప్ప అలాంటి గోడలు దొరక వంటున్నాడు. ఆ వర్ణనలు వింటోన్న కొద్దీ, 'ఆ గోడని చూడని జన్మెందుకూ?' అనిపిస్తోంది అందరికీ.[340] సీత కోసం కాదు గానీ, ఆ గోడ కోసవన్నా లంకకి వెళ్ళాలని పిస్తోంది.

హనుమంతుడు ఆ గోడ ఖ్యాతి వర్ణించి, వర్ణించి "దాని మీద కెవరూ ఎక్కలేరు. హరి బ్రహ్మాదులైనా ఎక్క లేరు" అని తేల్చాడు చివరికి.

"మరి నువ్వెట్టా ఎక్కా?"

"నే నెట్టాగో ఎక్కాననుకో" అని, 'హరి బ్రహ్మాదులు ఎక్కలేకపోతే నే నెక్కలేనా యేంటి?' అన్నట్టు చూశాడు.

"అందరూ అట్టాగే ఎక్కుతారులే, కానియ్యి, తర్వాత చెప్పు!"

"చెపుతున్నాగా? తొందరపెట్టకండి నన్ను. ఆ గోడకి నాలుగు వేపులా నాలుగు గుమ్మాలున్నాయి. వాటిల్లో వొక గుమ్మం మరీ పెద్దది. ఆ గుమ్మాల తలుపుల నిండా అడ్డంగా పెద్ద పెద్ద ఇనప కట్లూ, ఇనప గళ్ళూ .... అబ్బ! ఇనుంతో ఆ గళ్ళు ఏం చేశార్లే!"

"బంగారం అంతా గోడకే పట్టిందయ్యే. గుమ్మానికి ఇనుం గాకపోతే ఇంకేం మిగులుతుంది?"

"ఆ గుమ్మాల పక్కన కాపలా వాళ్ళు కూర్చోటానికి పెద్ద పెద్ద స్తంభాలతో మండపాలున్నాయి. వాటిల్లో వొక్క పిసరన్నా మట్టి అనుకున్నారా? అబ్బే! అంతా బంగారమే!"

"హోరినీ! బంగారం ఇంకా మిగిలిందీ?"

"నిజం చెపుతున్నాడంటావా?" – ఒక మూల ఎవరో!

"ఏమో మరి. చెప్పనియ్యి! మనం వెళ్ళినప్పుడు చూస్తాంగా?"

---

**340.** బంగారంతో గోడలు కట్టడం, బంగారంతో ఇళ్ళు కట్టడం, వాటికి వజ్ర వైఢూర్యాలు తాపడాలు చెయ్యడం లాంటి వర్ణనలు, కల్పన రూపంలో చెప్పినవిగా అర్థం చేసుకోవాలి.

రావణుడు – పది తలలున్న రాక్షసుడూ, హనుమంతుడు – తోక వున్న కోతీ అయిన కథలో, బంగారం గోడల కల్పన కూడా సరిపోతుంది. కానీ, 'విషవృక్షం' కథలో, రావణుణ్ణీ, హనుమంతుణ్ణీ మనుషులుగానే చెప్పుకుంటున్నాం. ఇలాంటప్పుడు, బంగారం గోడల వర్ణన పనికి రాదు. కానీ, ఈ కథల్లో కూడా ఆ వర్ణనలు ఎందుకు ఉంచానంటే, కట్టు కథలు ఎలా వున్నా వాటిని అలాగే నిజమని నమ్మితే ఎంత అప హాస్యంగా వుంటుందో చెప్పడానికే. చాలా మంది జనం, పురాణాల్లో ఉన్న ప్రతీ కల్పననీ, ప్రతి వర్ణననీ, నమ్మేస్తూ వుంటారు. అలా నమ్మేవాళ్ళు, లంకలో బంగారం గోడలు నిజంగా వున్నాయనే అనుకుంటారు.

ఈ బంగారం గోడని వాస్తవంగా అయితే, రాతి గోడగానే అర్థం చేసుకోవాలి. హనుమంతుడు శత్రువుల ప్రదేశం చూసి వొచ్చాడు. ఆ ప్రదేశం చుట్టూ వున్న గోడ బ్రహ్మాండంగా వుంది. దాన్ని గురించి అతను ఆశ్చర్యంగా చెపుతున్నాడు. దీన్ని ఇలాగే, ఇంత వరకే అర్థం చేసుకోవాలి.

లంక చుట్టూ గోడ నిండా రత్నాలూ, వజ్రాలూ తాపడం చేశారన్నాడే హనుమంతుడు, ఊళ్ళో వాళ్ళంతా ఆ గోడ నిండా పిడకలు చరుచుకున్నారేమో!

★

జనం సరిగ్గా వినడం లేదని హనుమంతుడు విసుక్కుంటున్నాడు. "ఇదిగో, ఏంటా మాటలు? ఆ గుమ్మాల్లో కొండ లంతంతేసి రాళ్ళు విసిరే యంత్రాలున్నాయి తెలుసా?"

రాముడు ఆశ్చర్యపోతూ, "రాళ్ళు విసిరే యంత్రాలా?" అన్నాడు.

"రాళ్ళే కాదు, బాణాలు వేసే యంత్రాలు కూడా వున్నాయి. మనుషులు వెయ్యక్కర్లేదు. చక్కగా యంత్రాలే వేసేస్తాయి" అని ఉత్సాహంగా యంత్రాల గొప్పని వర్ణించడంలో పడ్డాడు హనుమంతుడు.

రాముడు మొహం ముడిచేశాడు. ప్రాణం లేని యంత్రాలే బాణాలు వేసేస్తే ఇక తన గొప్ప ఏముంది? తన వీరత్వం ఏముంది?

"…. ఆ గుమ్మాల్లో కొండ లంతంతేసి గదలున్నాయి. వొక్కొక్కటీ నూరేసి మందిని పచ్చడి పచ్చడి చేసి చంపేస్తుంది. అదొచ్చి మీద పడిందంటేనా …."

సుగ్రీవుడు తల పైకెత్తి కంగారుగా చూశాడు. "ఆ ఉపాయాలన్నీ వాళ్ళకెక్కడివంటా?[341]

రాముడికి అంతా అయోమయంగా అయిపోయింది, ఇంకా లంక గోడన్నా దాటకముందే!

"అంతంత యంత్రాలున్న వాళ్ళతో ఏం యుద్ధాలు చేస్తాం?" అంటున్నాడు సుగ్రీవుడు పక్క వాళ్ళతో! బెదురు మొహంతో!

జనానికి కుతూహలంగానే వుంది. యంత్రాల గురించి వాళ్ళు ఎన్నడూ వినలేదు.

"భలే దేశంలే. తప్పకుండా చూడాలి."

"ఆఁ, చూస్తావు, చూస్తావు. వొక బండొచ్చి నెత్తి మీద పడిందంటే బాగా చూస్తావు."

హనుమంతుడు, ఆ గుమ్మాల దగ్గిర తనే కాపలా ఉన్నట్టు భీకరంగా వర్ణిస్తున్నాడు. "ఆ గుమ్మాలు దాటి లంకలో ప్రవేశించడం ఎవ్వరికీ సాధ్యం కాదు, తెలుసా?" తూర్పు వేపు గుమ్మంలో పది వేల మంది సైనికులు కత్తుల్తో, శూలాల్తో కాపలా వుంటారు. దక్షిణం వేపు వొక లక్ష మందీ …."

"అబ్బా! పడమర వేపో?"

"చెపుతున్నాగా? నోట్లో మాట ఊడిపడ నివ్వరేం? పది లక్షల మంది! ఉత్తరం వేపైతే ఇంకా ఎక్కువ. పది వేల కోట్ల మంది! లంక మధ్యలో ఇంకో కోటి మంది!"[342]

"ఎలా లెక్క పెట్టావేంటి నువ్వు?"

---

**341.** యుద్ధ, సర్గ 3, శ్లోకం 24: "అగడ్తలు, ఫిరంగులు, ('శతఘ్ని' అనే మాట ఉపయోగించాడు కవి) నానా విధములగు యంత్రాలు (యంత్రాణి) లంకను గాపాడి శోభించుచున్నవి."

రామాయణం రాసే కాలం నాటికి రక రకాల యుద్ధ యంత్రాలు ఉన్నాయా? చాలా తక్కువ రకం ఆయుధాలేమైనా ఉంటే ఉండవొచ్చు. వాటిని చూసి కవి ఇంకా పెద్ద ఆయుధాల్ని ఊహించి ఉండవొచ్చు. కేవలం పక్షుల్ని చూసిన ఊహ వల్ల పుట్టుకొచ్చిన పుష్పక విమానం లాగ, ఈ యంత్రాలన్నీ ఊహల్లోంచి పుట్టుకొచ్చినవే. ఈ శతఘ్నుల్నీ, బంగారం గోడల్నీ, వజ్ర వైఢూర్యాలు తాపడం చేసిన అరుగుల్నీ, పుష్పక విమానాన్నీ, ఈ మైతాలజీనంతా యధాతథంగా నమ్మేసి "కోసల నాగరికత కన్నా లంక నాగరికతే చాలా గొప్పది" అని వాదిస్తూ ఉంటారు లంక ప్రియులు! కానీ, రామాయణం ప్రారంభంలో దశరధుడి రాజ్యాన్ని వర్ణించేటప్పుడు, అక్కడ కూడా ఈ యంత్రాలన్నీ వున్నట్టే వర్ణనలున్నాయి. ★

**342.** యుద్ధ, సర్గ 3, శ్లోకాలు 25 …. 29: "లంక తూర్పు ద్వారములో 10 వేలమంది. దక్షిణ ద్వారములో ఒక లక్ష. పడమటి ద్వారములో పది లక్షలు. ఉత్తర ద్వారములో పది వేల కోట్లు. మధ్య భాగములో ఒక కోటి మంది …." ఏమిటీ లెక్కలు? – తూర్పు ద్వారంలో పది వేలమందీ, ఉత్తర ద్వారంలో పది వేల కోట్ల మందీ! తూర్పు దిక్కు నుంచి కంటే ఉత్తర దిక్కు నుంచి శత్రువుల తాకిడి ఎక్కువగా వుందా? కథలో, అలాంటిదేమీ లేదు. మరి, గుమ్మాల దగ్గర కాపలాలు ఉండే సంఖ్యలో అంత తేడా ఎందుకు? – ఎందుకంటే, కవికి శ్లోకాలు రాసేటప్పుడు ఛందోబద్ధంగా సరిపోయే పదాలు కావాలి. అందుకూ. ఆ కల్పన మీదా, ఛందస్సు మీదా, ప్రాసల కోసం కావలసిన మాటల మీదా తప్పితే, కవి ఆలోచన వాస్తవ దృష్టి మీద వుండదు. లంక చుట్టూ ఎందరు సైనికులు కాపలా వున్నారో చెప్పే ఈ మాటలు చూడండి.

| | | |
|---|---|---|
| అయుతమ్ | = | 10 వేలు |
| కోటి | = | కోటి |
| నియతమ్ | = | లక్ష |
| సాగ్రకోటి | = | పూర్తిగా కోటి |
| ప్రయుతమ్ | = | 10 లక్షలు |
| అర్బుదమ్ | = | వెయ్యి కోట్లు |
| న్యర్బుదమ్ | = | పది వేల కోట్లు |

ఈ మాటలే వచ్చాయి ఆ శ్లోకాల్లో. కవి తూర్పు గుమ్మం నించీ మొదలు పెట్టాడు.

అక్కడ 'అయుతమ్'. తర్వాత గుమ్మంలో 'నియతమ్'. తర్వాత 'ప్రయుతమ్' ఇలా!

అయుతం రక్షసా మత్ర పూర్వద్వారం సమాశ్రితమ్.
నియతం రక్షసా మత్ర దక్షిణద్వార మాశ్రితమ్.
ప్రయుతం రక్షసా మత్ర పశ్చిమద్వార మాశ్రితమ్.
న్యర్బుదం రక్షసా మత్ర ఉత్తరద్వార మాశ్రితమ్. ➔

“లెక్క పెట్టాలా? అంచనా ఏస్తే తెలవదూ? ఆ గుమ్మాల్లోంచి అంత మంది సైనికుల్నీ, యంత్రాల్నీ తప్పించుకుని ఎవరు వెళ్ళగలరు?”

“నువ్వు వెళ్ళావుగా?”

“నేను వెళ్ళాననుకో! కానీ .... దేవతలు కూడా....”

రాముణ్ణి నిరుత్సాహం దిగలాగుతోంది. “సరే నోయ్! అటు తర్వాత?”

“అటు తర్వాతేంటీ? అసలు అక్కణ్ణించి కదిలే దెట్టా?” అంటూ వొకాయన కాళ్ళు ఇటూ అటూ తిప్పి, బాసింపట్టు వేసుకున్నాడు.

“కదలక అక్కడే వుండి పోతావా? అయితే అసలు బయల్దేరడం ఎందుకూ? ఎట్టాగో అట్టా సముద్రం దాటాలి! ....” అని మళ్ళీ మొదలు పెట్టాడు హనుమంతుడు – “ఎట్టాగో అట్టా ఆ పర్వతం ఎక్కాలి .... ఎట్టాగో అట్టా .... ఆ గోడ దూకాలి ....”

“సరేలే, సరేలే .... తర్వాత?” అని విసుక్కున్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుడికి లంక గురించి ఇంకా వినాలని తొందరగా వుంది.

“నెమ్మదిగా చెప్పుకొస్తున్నానా?” అంటూ తీరిగ్గా వర్ణించే ఉత్సాహంతో తనూ విసుక్కున్నాడు హనుమంతుడు. “ఏం, ఆ గుమ్మాలు దాటిం తర్వాత .... ఇక కందకం సంగతి వినండి! అందులో మంచు గడ్డల్లాగ జివ్వున నరాలు తోడేసేంత చల్లటి నీళ్ళు ఉంటాయి!”

“నువ్వు ముట్టుకున్నావా?”

“ముట్టుకోవాలేంటి? రయ్యిన చలి గాలి కొట్టి బిగుసుకు చచ్చానంటే నమ్మండి!”

“సరే నమ్మాంలే, తర్వాత?”

“అప్పుడే అయిందీ? ఆ కందకం నిండా బల్ల కట్టులంతేసి ....”

“చేపలా?”

“ఇంకా నయం. పాపం కూరొండుకుందా మనుకున్నారేమో! మొసళ్ళు! .... అంతేనా? అదుగో! మైందుడి ముడ్డి కింద నల్ల బండ లేదూ? .... అబ్బే, అదీ చిన్నదే .... అంతంత తాబేళ్ళు ....”

“మరి వాళ్ళెట్టా తిరుగుతారంటావూ?”

“గుమ్మాల దగ్గిర చెక్క పలకలు పరిచి వుంచుతారయ్యా! వాటి మీద నించీ చక్కగా తిరుగుతారు వాళ్ళు.”

“ఇంకేం మరీ? అక్కడ చెక్క పలకలు ఉంటాయిగా? మనం కూడా అట్టాగే తిరగొచ్చు.”

“అబ్బే! అట్టా కుదరదు. శత్రువులు జొరబడతారని తెలిసిందంటే, ఆ పలకలన్నీ ఎత్తేస్తారు. వాటిని ఎత్తేసే యంత్రాలు కూడా ఉన్నాయి.”

“హోరినీ! భలే ఉపాయంలే” – సుగ్రీవుడు నవ్వు మొహంతో, రాముణ్ణి చూశాడు.

లంకవాళ్ళ ఉపాయాలూ, తెలివి తేటలూ, జాగ్రత్తలూ చూస్తోంటే, రాముడికి కూడా ముచ్చటేస్తోంది. ‘అవును. అలా పరిపాలించాలి దేశం, పరిపాలిస్తే.’

“మరి మనం కందకా లెట్టా దాటతామయ్యా?”

“ఎట్టాగో అట్టా దాటాలి మరి.”

అస్తమానూ ఈ ‘ఎట్టాగో అట్టా’ వ్యవహారం ఎట్టా సాగుతుందో ఎవ్వరికీ అంతు పట్టలేదు.

హనుమంతుడు చెప్పుకుపోతున్నాడు. “లంకలో అసలు కాలు పెట్టడానికి వీల్లేదు. లంక నిండా సైన్యమే. ఎన్ని గుర్రాలో! ఎన్ని రథాలో! ఎన్ని ఏనుగులో! ఎన్ని .... లో! .... లో!”

రాముడు దుఖ్ఖిస్తూ “సీతా! నిన్ను చూడలేనా ప్రియు

---

➔ ఈ రకంగా కవిత్వానికి ఎలా వీలవుతుందో, అలాగే లంక గుమ్మాల్లో కాపలాలు వున్నారు. ఛందస్సుకేమీ ఇబ్బంది లేనట్టయితే ఒక గుమ్మంలో మాట తీసికెళ్ళి ఇంకో గుమ్మంలో అయినా పెట్టుకోవచ్చు.

సంఖ్యల్ని తెలపడానికి, ఈ మాటల్నే గాక ఇంకా చాలా చోట్ల చాలా మాటలు వాడాడు కవి.

వాటి వివరాలు 28వ సర్గలో, 34 నించీ 39 శ్లోకాల వరకూ చూడవొచ్చు.

| | | |
|---|---|---|
| లక్ష కోట్లు | = | శంఖం |
| లక్ష శంఖాలు | = | మహా శంఖం |
| లక్ష మహా శంఖాలు | = | బృందం. |

ఈ రకంగా ప్రతి మాటనీ లక్ష రెట్లు పెంచుతూ అర్థం చేసుకుంటూ పోతే, అవి ఇలా వుంటాయి: శంఖం – మహా శంఖం; బృందం – మహా బృందం; పద్మం – మహా పద్మం; ఖర్వం – మహా ఖర్వం; సముద్రం; ఓఘం – మహౌఘం.

వానర సేన ఎన్నో మహౌఘాల, ఎన్నో ఓఘాల, ఎన్నో సముద్రాల, ఎన్నో పద్మాల, ఎన్నో! ఇలా ఉందని వర్ణిస్తూ వుంటాడు కవి. ఇలాంటి వర్ణనలూ, లెక్కలూ ఎక్కడ వచ్చినా, అవి కవిత్వంలో ప్రాస కోసం చెప్పుకున్న పదాలే అనుకోవాలి గానీ, ఇలాంటి విషయాల్ని నిజాలు అని నమ్మకూడదు. ఇంతకన్నా ముఖ్య విషయం ఏమిటంటే: రాముడి బలం అంతా వానర సైన్యం మీదా, రావణుడి బలం అంతా రాక్షస సైన్యం మీదా, ఆధారపడి ఉన్నాయి. వాళ్ళ వీరత్వాలన్నీ జనం శక్తి మీదే! అదీ గమనించవలసిన విషయం!

★

రాలా!" అంటూ ప్రియురాలి సాయంతో చటుక్కున మూర్ఛబోయాడు.

"అసలు లంకని ఎవరన్నా జయించగలరంటావా?"

జనంలో చర్చలు మళ్ళీ మొదలు!

"ఆ యంత్రాలు లేకపోతే ...."

"యంత్రాలు లేకపోతే మాత్రం? .... ఆ గోడ?"

"గోడ దాకా ఎందుకు? సముద్రం దాటవయ్యా ముందు!"

"అసలు హనుమంతుడు చెప్పే మాటల మీద నాకేం నమ్మకం లేదు సుమా! ఆ సైనికుల లెక్కలెలా చెప్పాడో చూడరాదూ? వొక చోట వెయ్యిమందంటాడు, వొక చోట పది వేల కోట్ల మందంటాడు. అసలేవన్నా లెక్కా డొక్కా తెలుసునా అని? మా పిల్లగారి బుల్లోడు ఇలాగే ఇంట్లో ఏం వొండినా తొంభై పదకొండో, డెబ్భై వందలో ఇమ్మంటాడు. రెండో మూడో ఇచ్చి 'డెబ్భై వందలిచ్చాంలే' అంటే ఊరుకుంటాడు. అలాగున్నాయి హనుమంతుడి లెక్కలు. ఏదన్నా సరే, మనం చూస్తే గానీ నమ్మ గూడదు" అని బోధిస్తున్నాడు వొకాయన చుట్టూ వాళ్ళకి.

జనం నవ్వు మొహాలతో నోళ్ళు తెరిచి వింటున్నారు. హనుమంతుడు లంక వర్ణనలన్నీ ముగించి కొంచెం ముందుకు సాగాడు – ".... వాళ్ళు ఎంత గొప్పవాళ్ళైతే మనకేంటి? ఎన్ని యంత్రాలుంటే మనకేంటి? నాలాంటి వీరుడు వొక్కడు చాలడా వాళ్ళని సర్వనాశనం చేసెయ్యటానికి? ఈ సైన్యం అంతా ఎందుకు? మహా అయితే నేనూ, అంగదుడూ వెళ్తే చాలు. లంకంతా తెచ్చి రామయ్య కాళ్ళ ముందు పడేస్తాం!"

"రాముణ్ణి తీసుకుపోయి లంక దగ్గిర పడేస్తే సరీ, లంకే రాముడి కాళ్ళ దగ్గిర వుంటుందిగా?"

"మాట్లాడకు! రాముడు లేస్తున్నాడు ...."

హనుమంతుడి ఉత్సాహం చూసి రాముడు నెమ్మదిగా తేరుకుంటూ లేచాడు. అంగదుడూ, హనుమంతుడూ చేసే పని తను మాత్రం చెయ్యలేడా? లంకలో ఆ గదలూ, ఆ యంత్రాలూ, ఆ కందకాలూ, అన్నిటినీ ధిక్కరించ గలననే ధైర్యం వొచ్చింది రాముడికి. గంభీరంగా తల పంకిస్తూ, "హు! లంక అనగా ఎంత! ఒక్క క్షణంలో నాశనం చేసేస్తాను" అని కోపంగా హూంకరిస్తూ లేచి కూర్చున్నాడు.

"ఇంకా మూర్ఛతేరక కలవరిస్తున్నాడా?" అన్నట్టు చూశాడు సుగ్రీవుడు.

"అబద్ధం కాదు సుమా! .... సత్యమే చెపుతున్నాను. మీరే చూస్తారుగా?" అని సూటిగా చూశాడు రాముడు, సుగ్రీవుణ్ణి![343]

సుగ్రీవుడు కంగారుపడుతూ, "అబ్బే! నే నేం శంకించడం లేదు సుమా! నీ మాటల్లో అసత్యం వుంటుందా? నీ వీరత్వం నే నెరగనంటావా? లంక వొక్కటేనా? భూమండలం అంతా జయించేస్తావు నువ్వు!" అని మెచ్చుకుంటూ భక్తిగా చూశాడు.

"ఇంతకీ యుద్ధానికి బయల్దేరడం ఎప్పుడో ఏమిటో? నిర్ణయించుకుంటే బాగుంటుంది రామయ్యా!" అన్నాడు హనుమంతుడు వినయంగా.

"ఎప్పుడో ఎందుకూ? ఇప్పుడే బయలుదేరదాం" అని గంభీరంగా చూశాడు రాముడు.

"ఇప్పుడా! ఇప్పుడేనా!" అని కంగారు ప్రారంభమైంది జనంలో.

రాముడు పెద్దలందర్నీ చూశాడు. "సూర్యుడు నడినెత్తిమీద ఉన్నాడు. ఈ ముహూర్తం చాలా మంచిది. ఇప్పుడే బయలుదేరితే విజయం కలుగుతుంది. ఇవ్వాళ ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. ఇవ్వాళే మంచిది. రేపు హస్త. హస్త మంచిది కాదు. ఇప్పుడు బయలుదేరితేనే సీత ప్రాణాలతో దక్కుతుంది. శకునాలు కూడా చాలా శుభంగా ఉన్నాయి. నా కుడి కన్ను అదురుతోంది. జయం నాకే అని తెలుస్తోంది. ఈ ముహూర్తంలో బయలుదేరితే సీతని నాకు దక్కకుండా రావణుడింకెక్కడికీ తీసుకుపోలేడు. ఇప్పుడే బయల్దేరాలి ...." అని నడినెత్తి మీద సూర్యుణ్ణీ, దక్షిణంగా ఎగిరే పిట్టల్నీ నమ్ముకుంటూ పుట్టెడాశతో సుగ్రీవుడి వేపు చూశాడు. "సుగ్రీవుడా! పరాక్రమవంతులందర్నీ యుద్ధానికి బయలుదేరించు! అసమర్థుల్ని ఇక్కడే కిష్కింధ రక్షణకు ఉంచు! సైన్యాల్ని సమీకరించే ఏర్పాట్లన్నీ తొందరగా చెయ్యి! ముహూర్తం దాటకుండా బయల్దేరాలి అందరూ ...." అంటూ తొందరపెట్టాడు.

జనం కంగారుగా కొండలు దిగి పోతున్నారు. "ఇందాకట్నించీ ఇంటికి పోదాం రమ్మంటే విన్నారా? మహేంద్ర పర్వతం నించి వచ్చామో లేదో ఇప్పుడు మళ్ళీ యుద్ధానికి బైల్దేరాలి! ఇంటి దగ్గిర వాళ్ళని చూసుకోనే లేదు. పొద్దున్నే పోతే అందరితో కాస్త మాట్లాడుకునే వాళ్ళం కదా?"

"ఏమో, ఇలా ముంచుకొస్తుందని ఎవడికి

---

**343.** యుద్ధ, సర్గ 4, శ్లోకం 2: రాముడు లంకని శీఘ్రంగా నాశనం చేసేస్తాట్ట! హనుమంతుడితో అంటున్నాడు. "భయంకరమైనదని నీవు తెలిపిన లంకను శీఘ్రముగా నాశనము చేసెదను. సత్యముగ చెప్పుచున్నాను."

నిజంగానే చెపుతున్నాను నమ్మమంటున్నాడు. సరే, చూద్దాం. ఎంత శీఘ్రముగా నాశనం చేసేస్తాడో! ★

తెలుసూ?"

"సరేలే, ఇప్పటికైనా లేచాం. పద తొందరగా."

సేనాపతులు హడావిడి పడుతున్నారు. కొండల మీద నిలబడి గావు కేకలు పెడుతున్నారు. "ఎవ్వరూ ఇళ్ళకు వెళ్ళకండి! .... అందరూ వెనక్కి వొచ్చేయ్యండి! ఊళ్ళో వాళ్ళందర్నీ పిలుచుకు రండి! ఇక్కడున్నట్టు రావాలి! రాని వాళ్ళందరికీ మరణ శిక్షే! సుగ్రీవ మహా రాజు ఆజ్ఞ! వెనక్కి రండి! అందర్నీ పిలుచుకు రండి!"

"రండి, రండి!" అని కొండలన్నీ పిలుస్తున్నాయి.

కొండలు దిగుతున్న వాళ్ళంతా నిలబడి పోయారు. క్షణాల మీద ప్రయాణానికంతా సిద్ధమైంది. యుద్ధానికి బయల్దేరే వానర సైన్యం అంతా వొక్కచోట చేరింది. సేనాపతులంతా రాముడి చుట్టూ నిలబడ్డారు.

రాముడు గంభీరంగా ఆజ్ఞాపిస్తున్నాడు. "నీలుడా! నువ్వు కొంత సైన్యంతో సేనకు ముందు నడవాలి. గజుడూ, గవయుడూ, గవాక్షుడూ కూడా సేనకు ముందు వుండాలి. గంధమాధనుడు తూర్పు వేపూ, రుషభుడు దక్షిణం వేపూ సేనని రక్షిస్తూ వుండాలి. జాంబ వంతుడూ, సుషేణుడూ, వేగదర్శీ సేన వెనక భాగాన్ని రక్షించాలి.[344]

నీలుడా! నువ్వు దారి చక్కగా చూసుకుంటూ పోవాలి సుమా! పళ్ళూ, దుంపలూ, మంచి నీళ్ళూ దొరికే మార్గం లోంచి సేనని నడిపించాలి. శతృవులు హఠా త్తుగా మన సేన మీద పడాలని దారిలో అక్కడక్కడా పల్లపు ప్రదేశాల్లో దాక్కుని వుంటారు. మన సైనికులు ఎప్పటికప్పుడు కొండలెక్కీ చెట్లెక్కీ ఎక్కడయినా శతృవులు ఉన్నారేమో చూసుకుంటూ ముందుకు సాగాలి. శత్రు వులు మన కెప్పుడూ హాని చెయ్యాలని ప్రయత్నాలు చేస్తూ వుంటారు. నీళ్ళ మడుగుల్లో విషం కలుపుతారు. పళ్ళచెట్లు ధ్వంసం చేస్తారు. వారి ప్రయత్నాలేవీ సాగ కుండా చూసుకుంటూ వుండాలి."

రాముడు చెప్తోన్న జాగ్రత్తలకు ఆశ్చర్యపోతూ సుగ్రీ వుడు "అవును రామయ్యా! నువ్వు మహాజ్ఞానివి. సర్వజ్ఞు డివి. యుద్ధ నీతులన్నీ తెలుసు నీకు" అని మెచ్చుకుని, సేనాపతుల్ని చూస్తూ, "విన్నారుగా రామయ్య చెప్పింది? అలా నడుచుకోండి. ఇక ఆలస్యం ఎందుకు? తొందరగా బయల్దేరండి!" అని కేక వేస్తూ హడావుడి పడ్డాడు.

సేనాపతులందరూ రాముడి ముందు వొంగి – "నీ ఆజ్ఞలన్నీ పాటిస్తాము ప్రభూ!" అని వినయ విధేయతలు ప్రకటించారు.[345]

★ ★ ★

సేన దక్షిణ దిక్కుగా సాగుతోంది. వరద లాగ కదులుతూ, సముద్రపు హోరు లాగ ఘోష పెడుతూ మేఘ గర్జన లాగ రొద చేస్తోంది. భూమి నిండా ఆ మానవ సమూహం, నేలంతా ఎదిగిన పంట చేనులాగ వుంది.

మహావీరులూ, శతృ భయంకరులూ అయిన శ్రీరాముడూ సుగ్రీవుడూ లక్ష్మణుడూ సేన మధ్యలో, వీరాధి వీరులయిన సైనికులు చుట్టి వుండగా .... ధైర్యంగా, ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. అడవుల మధ్య మధ్య పెద్ద పెద్ద గ్రామాలూ, చిన్న చిన్న గ్రామాలూ, దాటుతున్నారు. కొండ లెక్కి దిగుతున్నారు. నీళ్ళ మడుగుల చుట్టూ చేరుతున్నారు.

దారి పొడుగునా మర్రి చెట్లూ, మామిడి చెట్లూ, బూరుగు చెట్లూ, ఇప్ప చెట్లూ, చంద్ర చెట్లూ, వుసిరిక చెట్లూ, అశోక చెట్లూ, వేప చెట్లూ, నేరేడు చెట్లూ – ఎన్నెన్నో మహా వృక్షాల కిందనించి నడుస్తున్నారు. కొండ ల్లోంచీ, గుట్టల్లోంచీ, నీళ్ళ మడుగులకేసి రాబోతున్న ఎలుగుల్నీ, ఏనుగుల్నీ, పందుల్నీ, జింకల్నీ బెదరగొడు తున్నారు. కనుచూపు మేరలో ఏ జంతువు కనపడ్డా గావు

---

**344.** నీలుడు ఇటు నడవాలి. జాంబవంతుడు అటు నడవాలి. సుషేణుడు ఆ పక్కా, వేగదర్శి ఈ పక్కా – ఈ రకంగా నిర్ణయించడంలో కూడా ఆ పాత్రల ప్రత్యేకతలు ఏమీ లేవు. కొన్ని ముఖ్యమైన పాత్రల్ని తీసుకొని వారిలో ఎవరెటు వుండాలో ఛందోబద్ధంగా సర్దుబాటు చెయ్యడమే ఇది. రాముడు నీలుణ్ణే ముందు నడవమన్నాడు గాబట్టి నీలుడు గొప్ప నేర్పరి అనో, సమర్థుడు అనో, అనుకోకూడదు. అందరూ మహా వీరులే. వీరాధివీరులే. కవిగారి చిత్తం ప్రకారం ఆయనకి ఎవరు ముందు గుర్తొస్తే వారు ముందు నడుస్తారు. ముందు నడవటానికి, కవిత్వమో, అందులో ప్రాసో, వ్యాకరణమో వొప్పుకోకపోతే, వెనక నడుస్తారు. ★

**345.** **యుద్ధ, సర్గ 4, శ్లోకాలు 19,20:** వాల్మీకి రామాయణంలో వానరులు కోతులు గాబట్టి, రాముడూ లక్ష్మణుడూ, నడవకుండా వానరుల మీద ఎక్కుతారు. రాముడు అంటున్నాడు. "ఐరావతము మీద ఇంద్రుడు గూర్చుండి పోవునటుల నేను హనుమంతుని మీద కూర్చుండి సేన మధ్యలో వారికి సంతోషము గలిగించుచు పోయెదను. యక్షరాజగు కుబేరుడు సార్వభౌమ మను ఏనుగు మీద కూర్చుండు నటుల లక్ష్మణుడు అంగదుని మీద నెక్కవలయును." రాముడు, తను హనుమంతుణ్ణి ఎంచుకున్నాడు. పడెయ్యకుండా తీసికెళ్తాడని గావున్ను. అంగదు డెలా మోస్తాడో తెలీదుగా? అందుకే లక్ష్మణుణ్ణి ఎక్కమన్నాడు. ★

కేకలేసి వెంటబడి పరిగెత్తిస్తున్నారు. పిట్టల కూతలు అనుకరిస్తున్నారు. వెక్కిరించి వాటిని ఎగర గొడుతున్నారు. చెట్ల కొమ్మలు వొంగదీస్తున్నారు. వొంగదీసి విరగ్గొడుతున్నారు.

దారిలో దొరికిన పళ్ళన్నీ, దుంపలన్నీ తింటున్నారు. తేనంతా తాగుతున్నారు. సరస్సుల్లో ఈతలు కొట్టి పూలన్నీ తెంపుతున్నారు. గుట్టలెక్కి దిగుతున్నారు. పరిమళాలీనే మొక్కలన్నీ పీకుతున్నారు. సువాసన భరిణెల్లాంటి పూల పొదలన్నీ చితక దొక్కుతున్నారు. నేలనిండా పాకి అల్లుకున్న తీగలన్నీ తెంచుకుంటూ, ముళ్ళపొదలూ గచ్చ పొదలూ మొగలి డొంకలూ చుట్టుకుంటూ దాటుకుంటూ గెంతుకుంటూ పోతున్నారు.

యుద్ధం సంగతి మర్చిపోయినప్పుడల్లా ప్రయాణం మహోత్సాహంగా సాగుతోంది. ఆ సంగతి గుర్తువొస్తే మాత్రం మహా నిరుత్సాహం ఆవరిస్తోంది.

ముందు ముందు పోతున్న వాళ్ళు గుంపులు గుంపులుగా గుట్టల మీద ఆగుతున్నారు. కష్ట సుఖాలు చెప్పుకుంటున్నారు.

"మా ఆవు ముండ ఈనిందన్నారు. చూడన్నా చూడ లేదు. జున్ను తిందామనుకున్నాను."

"ఆవు సంగతికేమొచ్చెలే. మా ఆడదానికి కనే నెలలు. రేపో మాపో అన్నట్టుంది. వొదిలేసి వొచ్చాను. మళ్ళీ చూస్తానంటావా? యుద్ధంలోంచి బతికి బయట పడ్డప్పుడు కదా?"

"సరేలే. ఊరుకో, కళ్ళనీళ్ళు పెట్టుకోకు, శుభం కాదు. ఏం చేస్తాం, ఎవరి ఖర్మ ఎలా వుందో!"

"యుద్ధం తప్పకుండా జరుగుతుందంటావా? లేక పోతే రాముడూ రావణుడూ సంధి చేసుకుంటారా?"

"నాకేం నమ్మకం లేదు. వాడు, సీతాదేవిని వొదలక పోతే సంధెలా కుదురుతుందీ?"

"మీ పిచ్చి గానీ, ఈ యుద్ధం అంతా సీతాదేవి కోసమే అనుకుంటున్నారా?"

"ఇది మరీ బాగుంది. ఇంకెందుకూ?"

"వాళ్ళ రాజకీయాలన్నీ మనకి చెపుతారా? పైకేదో కారణం చెపుతారు. అసలు రహస్యం ఇంకేదో ఉంటుంది."

"నీ మొహం లెద్దూ! ఇంకేం వుంటుందీ?"

"సరేలే. అప్పుడే తెలుస్తుందిగా, ఎవరెందుకు యుద్ధం చేస్తున్నారో."

వెనక నించి సేనా నాయకుల కేకలు!

"ఏయ్, లేవండి! పదండి! ఆగితే కుదరదు, నడవండి!"

కూర్చున్న వాళ్ళంతా లేచారు.

రాముడికి, సీత సంగతులన్నీ హనుమంతుణ్ణి ఏకాంతంగా అడగాలని ఎప్పట్నించో వుంది. చుట్టూ జనం కేకలు .... మాటలు .... గోలలు .... చప్పుళ్ళు!

హనుమంతుడు తన ప్రక్కనే నడుస్తోంటే రాముడు సమయం చూసి పలకరించకుండా వుండ లేకపోయాడు. "హనుమంతుడా! నీ రుణం .... ఎన్నటికీ ...."

"ఎంత మాట రామయ్యా!"

"సీత క్షేమం చెప్పావు. బాగుంది .... నువ్వు వచ్చిన తర్వాత ఆ దుర్మార్గుడు ...."

"వాడు దుర్మార్గుడే గానీ .... సీతాదేవి మహా పతివ్రత స్వామీ!"

"అవును .... నా అర్ధాంగి .... నా ధర్మపత్ని ...." రాముడు కళ్ళ నీళ్ళు తిప్పుకున్నాడు

అంతవరకూ అంగదుడితో సంభాషణలో మునిగి అన్నగారి సేవ విస్మరించిన లక్ష్మణుడు కంగారుగా అన్నగారి సరసకు చేరాడు. "అన్నగారూ! ఇక దుఃఖించవలసిన అవసరం లేదు. యుద్ధం తప్పకుండా జరుగుతుంది. ఆ దుర్మార్గుడు మరణిస్తాడు. లంకని జయించి మీరు భార్యా సమేతంగా అయోధ్య చేరుతారు. మీకు జయం కలగడానికి ఎన్నెన్నో శుభ శకునాలు కనిపిస్తున్నాయి. గాలి సుఖంగా వీస్తోంది. దిక్కులు ప్రశాంతంగా వున్నాయి. మన ఇక్ష్వాకు వంశస్థుల నక్షత్రం విశాఖ, ఎంతో కాంతిగా మెరుస్తోంది. రాక్షసుల నక్షత్రం మూల, మసకేసుకు పోయి వుంది. రాక్షసులకు వినాశం తప్పదని తెలిసిపోతోంది. అన్నగారూ! మీరు ఈ శకునాలన్నీ చూసి సంతోషంగా వుండాలి" అని వినయంగా ఓదారుస్తూ నమస్కారం చేశాడు.

రాముడు, తన చుట్టూ గుర్రాల లాగ పరుగులు తీస్తోన్న వానర వీరుల్ని చూసి ఉత్సాహం తెచ్చుకుంటూ, "అవును లక్ష్మణా! రాక్షసులకు వినాశం తప్పదు. నా బాణ వర్షంతో రావణుణ్ణి ముంచెత్తి సంహరించేస్తాను. లంకనే సమూలంగా నాశనం చేసేస్తాను" అంటూ కొంతసేపు గంభీరమైన కేకలేసి మౌనంలో మునిగాడు.

".... ఆ విభీషణుడు .... ఏ మాత్రం సహకరించినా .... లంకని పట్టడానికి సాధ్యం కానిదేముంది? .... హనుమంతుడు చెప్పిన దాన్నిబట్టి .... ఎన్నిసార్లు యోచించినా .... విభీషణుడు తెలివిగల వాడేనని తోస్తోంది."

సేన సహ్యా పర్వతం, మలయ పర్వతం దాటి, మహేంద్ర పర్వతం చేరింది.

దూరం నించి సముద్రం మహోత్సాహంగా ఆహ్వానిస్తోంది.

★ ★ ★

"సుగ్రీవుడా! సముద్రతీరం చేరామోయీ! ఇక సేనని ఆపించు. చుట్టు పక్కల ఎక్కడయినా శతృవు లున్నారేమో శ్రద్ధగా వెతికించాలి సుమా!" అంటూ రాముడు చుట్టూ చూస్తూ వొక చెట్టుకింద చతికిలబడి సేద తీరాడు.

పెద్దలందరూ రాముడి చుట్టూ జేరారు.

ఎక్కడి వాళ్ళనక్కడ నిలబడమని కేకలేస్తున్నారు సేనాపతులు. "ఏయ్ ఆగండి! .... ఇక నిలబడండి! ముందుకు తోసుకు రాకండి! ఎక్కడి వాళ్ళక్కడే కూర్చోండి! వెనక వాళ్ళకి చెప్పండి!" అంటూ అరుస్తున్నారు.

సేనాపతుల అరుపులు సేన పొడుగునా ప్రతి ధ్వనిస్తున్నాయి. వొక కొస నించి వొక కొసకి ప్రవహిస్తున్నాయి.

సేన ఆగింది, సముద్ర తీరంలో.

మానవుల్ని చూసి ఆనంద పడుతున్నట్టు సముద్రం పొంగుతోంది.

సముద్రాన్ని చూసి రాముడికి దుఖ్ఖం ఉప్పొంగుతోంది. శ్రావ్యమైన ధ్వనితో, కెరటాల హోరుతో సముద్రం రాముణ్ణి చూసి ఆపకుండా నవ్వుతోంది.

రాముడు విశాలమైన సముద్రాన్ని వారకంట పరికిస్తూ, "సుగ్రీవా! .... ఇక సముద్రం దాటే సమయం వొచ్చిందోయీ!" అంటూ నిట్టూర్చాడు.

సముద్రాన్ని వింతగా చూస్తోన్న సుగ్రీవుడు, "అవును వొచ్చింది. దీన్ని దాటడానికి ఏదైనా ఆలోచన కూడా వొచ్చిందా?" అని తిరిగి చూసి "ఆలోచించు మరీ!" అని మొహం తిప్పేశాడు సముద్రం వేపు.

శ్రీరాముడి శోకాంబుధిలో కెరటాల వుధృతం ప్రారంభమైంది! సముద్ర తీరానికి చేరిన తర్వాత వానర వీరులే ఆనకట్ట కడతారని నమ్మించాడే! తన కేమీ పట్టనట్టు ఏమిటీ అలక్ష్యం? ఇప్పుడు సముద్రం దాటడానికి ఏమిటి మార్గం? – మొదటి సందేహమే మళ్ళీ ముంచుకొచ్చింది. ఏమిటి ఉపాయం?

రాముడు తల వాల్చి కళ్ళు మూశాడు.

"అన్నగారూ! .... దుఖ్ఖించకండి. ధై .... ర్య ...."

"లక్ష్మణా! కాలం గడుస్తోన్న కొద్దీ దుఃఖం తగ్గుముఖం పడుతుంది గదా? నాకు మాత్రం క్షణం క్షణం అధికమౌతోందోయీ!"

"మీరు మహా ఉత్తములు అన్నగారూ! సామాన్యులకు వర్తించే పామర సూత్రాలేవీ మీకు వర్తించవు. ధైర్యం వహించండి .... తప్పకుండా .... మీరు ...."

"అయ్యో! ఈ చల్ల గాలి చూడు .... నా విరహ తాపాన్ని అధికం చేస్తోంది. ఓ వాయు దేవుడా! నా ప్రియురాలిని తాకి వచ్చి నన్ను తాకవోయీ! .... అయ్యయ్యో! .... ఈ కౄరుడు .... మన్మధుడు ...."

సముద్రం దాటడం గురించి రాముడేదో మార్గం చెపుతాడని ఎదురు చూస్తున్న వాళ్ళందరూ వొకరి మొహాలొకరు చూసుకుంటున్నారు.

"ఇప్పుడు విరహం ఎట్టా కలుగుతోందిరా నాయనా!"

"ఇప్పుడేంటి, అప్పుడేంటి? తిని కూర్చుంటే ఎప్పుడన్నా కలుగుతుంది గానీ .... వాయుదేవుడు ఆడదంటావా? మొగాడంటావా?"

"ఇంకా నయం! ఆడదంటావు, ఇంకేవన్నా అంటావు."

"మొగాడయితే సీతాదేవిని ముట్టుకోవచ్చంటావా? సీతాదేవిని ముట్టుకుని వొచ్చి తనని ముట్టుకోమంటున్నాడు!"

అవతలాయన వినిపించుకోకుండా రాముడి విరహ తాపం ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

".... ఇంత కాలం ఎలా జీవించానోయీ! ఆకాశంలో చంద్రుణ్ణి చూసినప్పుడల్లా, ఈ చంద్రుణ్ణి సీతాదేవి చూస్తూనే వుంటుంది కాబట్టి, నేను చంద్రుడి ద్వారా సీతనే చూస్తున్నానని ఆనందిస్తాను. .... లక్ష్మణా! ఈ విరహాగ్ని నన్ను దహించేస్తోంది. ఇక భరించలేను. సముద్రంలో పడుకుంటాను. ఆ పూల విలుకాడు నన్నేమీ చెయ్యలేడు .... కానీ నా తాపానికి సముద్రంలో నీరంతా ఇగిరి ఆవిరై పోతుందేమో సుమా!"

"మంచిదేగా? అప్పుడు చక్కగా సముద్రం దాటొచ్చు" అంది చప్పున లక్ష్మణుడి ఇంగితం.

లక్ష్మణుడు కంగారుపడి తల తిప్పుకున్నాడు, "ఏం మాటలవీ?" అంటూ.

"లేకపోతే నీ అన్న ఇంత వికారంగా ప్రవర్తిస్తోంటే, చుట్టూ వున్న వాళ్ళు ఎంత ఆటవికులైతే మాత్రం .... ఆ మాత్రం మంచి చెడ్డలు తెలుసుకోలేరూ?"

"చాల్లే, ఇక ఊరుకో! అన్నగారి కన్నా నీ కెక్కువ తెలుసనుకోకు! వొక్క క్షణం కూడా భార్యని మరిచిపోలేక అంత బాధ పడుతున్నారు గానీ ...."

"సరిపోయిందిలే నీకూ, నీ అన్నకీ! ఆఖరికి నన్నే తప్పు పడతావు ఎప్పుడూ" అంటూ ఇంగితం కళ్ళ నీళ్ళతో మొహం ముడుచుకుని తప్పుకుంది.

"శ్రీరాముడు సముద్రంలో పడుకుంటేనే మంచిది. సముద్రం ఇంకిపోతుంది" అంటున్నారెవరో.

లక్ష్మణుడు అటు చూడలేదు.

వెనక వాళ్ళు విసుగ్గా ముందు వాళ్ళని గూళ్ళల్లో పొడిచి, "అసలేం చేస్తున్నారు ముందు?" అని అడుగుతున్నారు.

".... లక్ష్మణా! ఆ దుర్మార్గుడు ఎత్తుకుపోతూ వుంటే

నా ధర్మపత్ని 'నాథా, నాథా!' అని ఆక్రోశించింది. ఆ పిలుపే నా గుండెల్ని కోతపెడుతోందోయీ! నా చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది."[346]

తెల్లబోయాడు లక్ష్మణుడు. పిలుపేమిటి? .... ఎప్పుడు విన్నాడూ? .... మళ్ళీ ఉన్మాదావస్థ కలుగుతోందా అన్నగారికి? "అన్నగారూ! .... ధైర్య ...."

".... ఇంతకాలం ఎలా జీవించానోయీ! నా అర్ధాంగి జీవిస్తోన్న ఈ భూమి మీదే నేనూ వున్నాను కాబట్టే జీవించానోయీ!"

సముద్రుడు ఆపుకోకుండా నవ్వుతున్నాడు. తెల్లని పుష్పాల లాగ కెరటాల నిండా నురుగు చందనం అరగ దీస్తున్నాడు.

చంద్రుడు ఆ నురుగే గావున్ను తీసుకుపోయి కిరణాలతో దాన్ని అన్ని దిక్కులకూ పూసి తెల్లగా చల్లగా చేస్తాడు ఎప్పుడూ.

"అన్నగారూ! దుఖ్ఖం విడిచిపెట్టండి .... ఇక తొందరగానే .... ఆ దుర్మార్గుణ్ణి చంపి .... వొదిన గార్ని తీసుకు రాగలరు వీరు...."

రాముడు తలవాల్చి నిట్టూర్చాడు. "అయ్యో! .... నా ధర్మపత్నికి దూరమయ్యానని కాదు లక్ష్మణా నా దుఃఖం. నా అర్ధాంగిని శతృవు అపహరించాడనీ కాదు సుమా! .... సీత వయస్సంతా, యౌవ్వనమంతా, క్షణ క్షణం వ్యర్ధంగా గడిచిపోతోందే అని నే నింతగా దుః ఖిస్తున్నాను." [347]

లక్ష్మణుడు బిత్తర పోయాడు.

సుగ్రీవుడు సముద్రాన్ని వొదిలి రాముణ్ణి అయో మయంగా చూశాడు.

హనుమంతుడు ఆశ్చర్యపోయి బుగ్గలు ఉబ్బిం చాడు.

పెద్ద పెద్దలందరూ ఇరుగు పొరుగు వాళ్ళ వేపు తలలు తిప్పారు. కొంచెం కొంచెం జరిగారు ఇటూ అటూ.

రాముడు విరహంలో మునిగి కలలలో తేలు తున్నాడు. ".... సీతని నే నెప్పుడు చూస్తానో! .... ఆ ముఖాన్ని నా ముఖానికి చేర్చుకుని ఎప్పుడు అధరా మృతం గ్రోలుతానో! .... ఆ రొమ్ములు ఆలింగనం చేసుకుని ...."[348]

లక్ష్మణుడు సముద్రం వేపు మొహం తిప్పేశాడు.

సుగ్రీవుడు ముసి ముసి నవ్వులతో నీలుడి వేపు జరిగాడు.

---

**346.** **యుద్ధ, సర్గ 5, శ్లోకం 7:** "రావణుడు అపహరించుకొని పోవునప్పుడు నా ప్రియురాలు హా నాథా! యని పిలిచెను. ఆ పిలుపు నా దేహమును విషము వలె దహించుచున్నది" అంటున్నాడు రాముడు. "సీత అలా పిలిచి ఉంటుంది. ఏడ్చి వుంటుంది" అనడం కాదు. ఆ పిలుపు తను విన్నట్టే మాట్లాడుతున్నాడు. ఆ సేతువు కట్టే ఉపాయం దొరికే దాకా ఈ పిచ్చి తగ్గదు గావున్ను! ★

**347.** **యుద్ధ, సర్గ 5, శ్లోకం 5:** రాముడి దుఃఖానికి ఇప్పుడు కారణం మారింది. భార్యని రక్షించుకోగల శక్తి సామర్థ్యా లున్నప్పుడు అస్తమానూ "సీతని చూస్తానా? సీత నాకు దక్కుతుందా?" అని యాడవటం బాగుండదు కదా? అందుచేత, శ్రీరాముడి దుఖ్ఖానికి, కవి, ఇంకో గొప్ప కారణం కని పెట్టాడు. "ప్రియురాలు దూరముగా నుండుట చేత నేను దుఃఖించ లేదు. ప్రబలమైన శతృవు ఆమెను అపహరించెననియు నేను దుఃఖించలేదు. సీత యొక్క వయస్సు వ్యర్థముగ బోవుచున్నదని దుఃఖించుచున్నాను" అంటున్నాడు. సీత వయస్సంతా శృంగారం అనుభవించకుండా వ్యర్థంగా పోతోందే అని అట రాముడి దుఖ్ఖం!

మరి, భార్యని వదిలేసి వొచ్చిన లక్ష్మణుడి వయస్సు మాటేమిటి? లక్ష్మణుడి భార్య మాటేమిటి? తమ్ముడూ, అతని భార్యా రాముడి దృష్టికి ఎప్పుడూ రారేం? ★

**348.** **యుద్ధ, సర్గ 5, శ్లోకాలు 12,13,14:** అవతల సముద్రం దాటే పని పెట్టుకుని, చుట్టూ వానర సైన్యం ఉండగా, ఈయన ఎంత తీరిగ్గా విరహ తాపం అనుభవిస్తున్నాడో చూడండి! "విశాలమగు కన్నులు గల సీతను నే నెప్పుడు చూడగలుగుదునో! తామర పూవు వలె నుండు సీత ముఖమును కొంచెము పైకెత్తి దొండ పండు వంటి ఆమె అధరమును రోగి ఔషధమును పానము చేయునట్లు ఎప్పుడు పానము జేయుదునో! తాటి పండ్ల వలె బలిసినవీ, ఒకదాని కొకటి చేరి యుందునవీ, నన్ను తాకునపుడు మృదువుగా కంపించునవీ అయిన సీత స్తనాలు నన్ను ఎప్పుడు పొందునో!"

ఇదీ కవిత్వం! విరహతాపానికి ఇదీ సందర్భం! అంతమంది జనం మధ్య సీతాదేవి రొమ్ముల వర్ణనలు! శ్రీరాముల వారి శృంగారం మరి! చెప్పే విషయం బాగుందా, లేదా; సందర్భం కుదిరిందా, లేదా? – అనే ఆలోచన అక్కరలేదు. ఫ్యూడల్ కవిత్వంలో, కావ్య నాయకుడు ఎప్పుడూ విరహ తాపం అనుభవిస్తూ వుండాలి. స్త్రీల రొమ్ముల్నీ, తొడల్నీ వర్ణిస్తూ వుండాలి. అస్తమానూ వాటి సంగతి ఎంత ఎత్తితే అంత గొప్ప కవిత్వం! అంత పవిత్ర కవిత్వం!

ఇంకో విషయం గమనించండి! ఈ విరహం అంతా రాముడికే! సీతకి లేదు! ఆమె ఎక్కడా 'విరహ తాపం, కామం, మన్మధుడూ బాణాలూ' అనదు. సీత, ఆడవాళ్ళ పరువు కాపాడింది. ★

దూరం వాళ్ళు ముందువాళ్ళ భుజాలు గుంజీ, డొక్కల్లో పొడిచీ, "సముద్రం దాటే సంగతేమన్నా ఆలో చిస్తున్నారా?" అని విసిగించి చంపుతున్నారు.

"ఆఁ .... చాలా బాగా ఆలోచిస్తున్నారు. రాముడు, సీతాదేవి నెప్పుడు కావిలించుకుంటానా – అని తెగ ఆలోచిస్తున్నాడు" అని ముందు వాళ్ళు వెనక వాళ్ళకి చెపుతున్నారు.

ఆ వెనక వాళ్ళు ఇంకా వెనక వాళ్ళతో పెద్ద పెద్ద కేకలతో "పెళ్ళాన్నెప్పుడు కావిలించుకుంటానా, ఆ రొమ్ములెప్పుడు ముట్టుకుంటానా అని ఆలోచిస్తు న్నాడంట! మీ వెనక వాళ్ళకి కూడా చెప్పండీ!" అని పురమాయిస్తున్నారు.

"ఈయనకి ఏకపత్నీవ్రతం ఎందుకంట? వొక్క భార్యతో ఉంటం అంటే మాటలా? ఎంత నిగ్రహం ఉండాలి! ఈయనేమో కాస్త చల్లగాలి తగిల్తే కేక లేస్తాడు. పిట్ట లరిస్తే గోల గోల చేస్తాడు. చెట్లు ఊగితే తాళలే నంటాడు .... మన్మధు దంటాడు .... బాణా లంటాడు .... ఇలాంటి పనీ పాటా లేనివాడికి ఏడుగురు పెళ్ళా లుండాలి!"

"మా బాగా అన్నావు. వాళ్ళ తండ్రిలాగే తను కూడా మూడు వందల మందినో, నాలుగు వందల మందినో చేసుకుంటే కాదూ? శతృవులు ఎంత మంది భార్యల్ని ఎత్తుకుపోయినా భార్యలకి కరువు లేకుండా ఉండేది కదా? ...."[349]

"ఇంతకీ మనం సముద్రం దాటేదేమన్నా ఉందా లేదా?"

"దాటిన దగ్గర్నుంచీ యుద్ధమేగా? ఇక్కడే కాస్సేపు బతికి వుందాం. .... ఇంటికెళ్ళి పిల్లల్నన్నా చూసి రాలేదు. వాళ్ళ మొహాలు మళ్ళీ చూస్తామో లేదో!"

"రాముడు మూర్ఛపోయాడు .... మూర్ఛ పోయాడు!" అని వార్త లొచ్చాయి పైనించి.

అంతలోనే, "లేచాడు .... లేచాడు ...." అని మళ్ళీ పాత వార్తల్ని తరుముకుంటూ కొత్త వార్త లొచ్చాయి.

అందరూ కబుర్లలో పడ్డారు.

రాముడికి బాగా దగ్గిరగా హనుమంతు డొక్కడే విసురుతూ కూర్చున్నాడు.

రాముడు నిట్టూర్పులు విడుస్తున్నాడు. ".... ఎన్నడూ ఎవ్వరినీ బాధించలేదే! ఎన్నడూ శాస్త్ర ధర్మం తప్పి నడవలేదే! ఎంత ఉత్తముడికి కూడా కష్టాలు తప్పనట్టేనా? .... నాయనా హనుమంతుడా! .... సీతా దేవి చిక్కి శల్యమై పోయి వుందా నాయనా?"

హనుమంతుడు, ఏం చెపితే శ్రీరాముడికి బాధ కలుగుతుందో, ఏం చెపితే సంతోషం కలుగుతుందో, తేల్చుకోలేకపోతున్నాడు.

"అహర్నిశలూ .... నిన్నే స్మరిస్తూ .... నిద్రాహారాలు మాని...."

"ఆ దుర్మార్గుడేమీ .... బాధించ లేదంటావా నాయనా?"

"ఛ! పాపం మాటలు .... నేను చూసినప్పుడు ...."

"నువ్వు చూడనప్పుడో నాయనా?"

"అబ్బే .... అంత దుర్మార్గం ...."

"నీ కెలా తెలుసు నాయనా?"

"సీతాదేవి మహా ...."

"అవును .... అవును నాయనా! .... అందుకే నా కింత .... నా ధర్మపత్ని ...."

"అన్నగారూ! పొద్దు గుంకుతోంది. సంధ్యా వందనం ...." లక్ష్మణుడు పడమటి దిక్కు వేపు చూస్తూ వినయంగా గుర్తు చేశాడు.

లక్ష్మణుణ్ణి చూస్తోంటే "ఎంత అదృష్టవంతుడో!" అనిపించింది రాముడికి. భార్యని చక్కగా అంతఃపురంలో ఉంచి వచ్చాడు. స్త్రీలకు ఎంత రక్షణ అంతఃపురంలో .... పోతుటీగ కూడా ....! ఊర్మిళ కూడా వనవాసానికి వస్తే ....? రావణుడు ఎవర్ని తీసుకు పోయేవాడో!

ఆ దుర్మార్గుడికి తనతోనేగా వైరం? .... ఊర్మిళ నెందుకు తీసుకెళ్తాడు? .... సీతనే .... ఏం? ఇద్దర్నీ తీసుకుపోయే వాడే! ఎంతమంది పర స్త్రీలతో సుఖభోగా లనుభవిస్తే అంత ....! ఏం చేదా?

సీతతో .... సుఖాలు .... హు ....! రావొద్దంటే విన్నదా? ....

"అన్నగారూ! .... సంధ్యా వంద ...."

రాముడు బడబాగ్ని లాగ నిట్టూర్చి, "అలాగే నాయనా! శాస్త్ర విధులు నిర్వర్తించుకోక తప్పదు కదా? అయ్యో సీతా! .... ప్రియురాలా! నిన్ను, నీ బలిసిన స్తనాలను ఎప్పుడు తాకగలనో కదా?" అంటూ లేచాడు.

చీకటి పడుతోన్న కొద్దీ సముద్రం హోరు హెచ్చింది.

హోరు హెచ్చుతోన్న కొద్దీ శ్రీరాముడి భీతి కూడా హెచ్చింది.

రాముడి భీతికి జడిసి ఉపాయాలేవీ తలలెత్తకుండా ఎక్కడెక్కడో నక్కాయి!

★

---

**349.** రామావతారంలో ఒక్క భార్యతో వున్నందుకే గావున్ను హడిలిపోయి ఈయన, కృష్ణావతారంలో అన్ని వేల మంది భార్యల్ని పెట్టుకున్నాడు!

★

# కథ-12

# మూడో దొంగ

## [వి భీ ష ణు డు]

రాముడు వానర సైన్యంతో లంకారాజ్యం మీదకి యుద్ధానికి బయల్దేరాడనే వార్తలు లంకాధిపతిని ఆందోళన పరుస్తున్నాయి.

మహారాజు సింహాసనం మీద ఎంత గాంభీర్యంతో ఆసీనులై వున్నా, మీసాలు క్షణాని కెన్ని మెలికలు తిప్పు తోన్నా, ఆ చూపుల్లో భీతీ, ముఖ కవళికల్లో అశాంతీ, సభలో వారందరికీ అవగతమౌతోనే వున్నాయి.

యుద్ధ నిర్ణయాల గురించి మంత్రాలోచనకై మహా రాజు అత్యవసరంగా ఏర్పాటుచేసిన ఆ సభలో, మహా మంత్రులూ, వీరాధి వీరులూ, సేనాపతులూ, సలహా దారులూ, పండితులూ, పెద్దలూ అందరూ ఉన్నారు.

ప్రహస్తుడూ, మహాపార్శ్వుడూ, సూర్యశత్రువూ, అగ్ని కేతువూ, రశ్మికేతువూ, ఇంద్రజిత్తూ, ధూమ్రాక్షుడూ, విరూపాక్షుడూ – ఎందరెందరో ఉన్నారు.

రావణుడి తమ్ములు కుంభకర్ణుడూ, విభీషణుడూ కూడా ఉన్నారు.

అందరూ విలువైన ఆభరణాలతో, అలంకారాలతో, ఎవరి స్థానాలలో వారు కూర్చుని నిశ్శబ్దమైన సంభాషణ లతో, కనుసన్నలతో, పరిస్థితిని చర్చిస్తున్నారు.

పుష్కలంగా మదిర సేవించి వొచ్చిన కుంభకర్ణుడు, ఆసనంలో వెనక్కి జారబడి ప్రశాంతమైన నిద్రాసుఖం కోసం ఆరాటపడుతున్నాడు. వీపు వెనుక వింజామరలు ఆగి ప్రశాంతత భంగపడితే మాత్రం మత్తుగా కళ్ళు తెరిచి చూస్తున్నాడు.

విభీషణుడు, చంచలమైన ఆలోచనలతో నిశ్చలంగా కూర్చుని సభనీ, మహారాజునీ, గంభీరంగా పరిశీలిస్తు న్నాడు.

మహారాజు తల వాల్చి మీసాలు మెలిపెడుతూ ఎడ తెగని ఆలోచనలతో సతమతమౌతున్నాడు. .... గతంలో తను ఎంతమంది స్త్రీలను తెచ్చినా, వారి భర్తలూ తండ్రులూ బంధువులూ వారిని వొదిలేసి ఊరుకున్నారే గానీ, తనతో యుద్ధానికి సిద్ధపడలేదు. ఈ సీత భర్త మహా వీరుడని చారులు వర్ణిస్తున్నారు. సుగ్రీవుడు కూడా పెద్ద సైన్యంతో రాముడికి అండగా నిలబడ్డాడని చెపు తున్నారు. రాక్షస నాశనం చేసి, రాక్షస రాజ్యాలన్నిటినీ తుడిచి పెడతానని ఎంతో కాలంగా రాముడు పేలుతూనే ఉన్నాడు. ఇంత కాలానికి భార్య నెపంతో అసలు కార్యా నికి దిగుతున్నాడా?

ఈ యుద్ధానికి తన పరివారం సిద్ధపడుతుందా? సీతని తేవడం వల్లనే లంక యుద్ధానికి లోనవుతోందని భావిస్తుందా? సీతని అప్పగిస్తే యుద్ధం ఆగుతుందా? నమ్మకం లేదు. నమ్మకం ఉన్నా సీతని విడిచేది లేదు. శత్రువుకి భయపడి చేతికి చిక్కిన స్త్రీని విడిచేటంత పిరికిపంద కాడీ రావణుడు! ఆ ఊహనే సమూలంగా నాశనం చేస్తాడు. .... కానీ యుద్ధం! .... లంకా రాజ్యా నికి యుద్ధ ప్రమాదం! .... ఇంతకాలమూ లంకే శత్రు రాజ్యాల్ని జయించింది గానీ, ఎన్నడూ శత్రు ముట్టడికి లోను కాలేదు. ఇప్పుడీ యుద్ధం .... తప్పదా? రాముడి వంటి శత్రువుతో ....!

రావణుడు సింహాసనం మీద పట్టు దిళ్ళ మధ్య క్షణ క్షణం అసహనంగా కదులుతున్నాడు. పరధ్యానంతో కళ్ళు వాల్చి నేలచూపులు చూస్తున్నాడు. ప్రతి చూపు లోనూ విసుగూ, భీతీ వ్యక్తపరుస్తున్నాడు.

సభలో అందరి చూపులూ మహారాజు కదలికల మీదే ఉన్నాయి. నిశ్శబ్ద సంభాషణలు అధికమౌతు న్నాయి. హనుమంతుడు పట్టుబడ్డ దగ్గిర్నించీ, లంకకు యుద్ధ ప్రమాదం తప్పదనే అభిప్రాయం రాజకీయ వేత్త లందరికీ కలుగుతోనే వుంది.

నిశ్చలమైన సరస్సులో రాయి పడి కెరటాలు కదిలి నట్టు చారుల ప్రవేశంతో సభలో సందడి రేగింది. సుదీర్ఘ మైన ఆలోచనలో మునిగివున్న మహా రాజు చారుల రాకతో ఆతృతపడుతూ తలెత్తి చూశాడు.

ప్రధాన చారుడు వినయంగా సింహాసనానికి వొంగాడు – "మహారాజా! శత్రువు సముద్రం అవ తలి తీరానికి చేరాడు. సముద్రం దాటే ప్రయత్నాలలో ఉన్నాడు" అని విన్నవించి, వెనక్కి తిరిగి, వొచ్చినంత వేగంగా తన పరివారంతో సభ నించి నిష్క్రమించాడు.

శత్రువు సముద్రం దాటిన వెంటనే లంక ముట్టడి!

మహారాజు తత్తరపడి సర్దుకుంటూ మీసాలు మెలి పెడుతూ క్రీకంట సభని చూశాడు. కొత్త వార్తలు సభని గందరగోళంలో ముంచాయి. మహారాజు గంభీరమైన మందహాసంతో మాట్లాడటానికి సిద్ధ పడగానే సభ నిశ్శబ్ద

మయింది.

రావణుడు సభని చూస్తూ ప్రారంభించాడు. "ఇంత అత్యవసరంగా మిమ్మల్ని అందర్నీ ఎందుకు పిలిపించానో మీరు గ్రహించే ఉంటారు. లంక యుద్ధ ప్రమాదంలో మునగబోతోంది. మన శతృవు రాముడు, వానర రాజు సహాయంతో లంక మీదకు బయల్దేరాడు. ఇప్పుడు మనం ఏం చెయ్యాలి? మన కర్తవ్యం ఏమిటి? రాముడు లంకని ముట్టడించగలడా? ముట్టడించినా యుద్ధంలో జయించగలడా? – ఈ సంగతులన్నీ ఆలోచించండి! మీ వంటి జ్ఞానవంతులతో, బంధు మిత్రులతో సంప్రదించకుండా నే నీ కార్యం ఎలా నిర్ణయించగలను? మీ అభిప్రాయాలేమిటో విన్నవించండి!" అని గంభీరంగా అందర్నీ చూశాడు.

మహారాజు గాంభీర్యం, యుద్ధ కలవరాన్ని దాచలేక పోతోంది.

సభలో ఎవరికి వారే మహారాజుని ధైర్యపరచి, ప్రోత్సహించి, సంతోషపెట్టి, మహారాజుకి ప్రీతిపాత్రులం కావాలనే ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు. ఒకరిని తరుముకుంటూ ఒకరు, తమ అభిప్రాయాలు ప్రకటించడం మొదలు పెట్టారు.

"మహారాజా! లంకకు యుద్ధ భయం ఎన్నడూ లేదు. శ్రీరాముడే కాదు, ఆ దేవేంద్రుడు దిగినా, లంకని జయించలేడు. మనకు సైనికులు కొదవా? ఆయుధాలు కొదవా? శక్తి సామర్థ్యాలు కొదవా? యుద్ధానుభవాలు కొదవా? దేనికీ లోటు లేదు. యుద్ధాల మొహం ఎరగని వాళ్ళము కాము. భోగవతీ నగరం మీద దండెత్తి నువ్వు నాగరాజుని జయించలేదా? శంఖుడూ, తక్షకుడూ, వాసుకీ, నాగుల్లో మహా వీరులు. అటువంటి వీరులే నీకు లొంగిపోయారే! వరుణ పుత్రుల్నీ, కాలకేయుల్నీ కూడా లొంగదీశావే! మహా వీరుడైన యముడితో కూడా యుద్ధాలు చేశావే! దేవతలే నీకు భయంతో వొణుకుతున్నారే!"[350]

మాట్లాడే వాడిని తోసుకుంటూ ఇంకో వీరుడు లేచాడు. "అంతేనా? నా విన్నపం ఆలకించు మహారాజా! నీ వంటి వీరాధి వీరుడికి యుద్ధ భయం లేదు. గత యుద్ధాలలో శతృవు లెందర్నో సర్వనాశనం చేశావు. ఎందర్నో హింసించి క్షోభపెట్టి నీ బల పరాక్రమాలు ప్రకటించావు. ఇంకా ఎంతో మందిని కుంటి వాళ్ళనీ, గుడ్డి వాళ్ళనీ, అంగ విహీనుల్నీ చేసి గర్వా లణిచావు. నీ వీరోచిత యుద్ధాలలో తల్లీ బిడ్డల్నీ, భార్యా భర్తల్నీ, ఆప్తుల్నీ, హితుల్నీ, మిత్రుల్నీ, వొకరి కొకర్ని దూరం చేసి బుద్ధి చెప్పావు ...."

"మహారాజా! .... కుబేరుడు నీ అన్నే అయినప్పటికీ నీకు చెందవలసిన రాజ్యం ఆక్రమించాడనే రోషంతో అతణ్ణి నిర్దయగా తరిమికొట్టావు."

"శూర్పణఖ నీ తోబుట్టువే అయినా, ఆమె భర్త నీతో యుద్ధానికి తలబడితే సహించలేక హత మార్చావు. నీ పట్టుదల ముందు ఎంత సన్నిహిత బంధుత్వాలైనా నిలబడలేవు."

"కుంభీనసిని మధువు ఎత్తుకుపోతే నువ్వు శక్తిమంతుడవై ఉండి కూడా మధువుని శిక్షించకుండా క్షమా భిక్ష పెట్టావు. శిక్షించటానికైనా రక్షించటానికైనా నువ్వే అర్హుడివి!"[351]

"ఇన్ని సంగతులెందుకు? నీ వంశస్థుల వీరత్వాలకు మెచ్చే కదా నీ మామ నీకు పిల్లనిచ్చి పెళ్ళి చేశాడు? ఎన్నో జాతులతో యుద్ధాలు చేసిన నీకు, వానర జాతి ఏ పాటిది? ఎందరో శూరుల్ని హత మార్చిన నీ కీ రాముడే పాటి? నువ్వు యుద్ధాలు చేసిన వీరులందరిలో ఎవ్వరి తోటీ రాముడు సరితూగడు. సుగ్రీవుడితో కలిసి వొస్తేనేం, లక్ష్మణుడితో కలిసి వొస్తేనేం, సమస్త సైన్యాలతో కలిసి వొస్తేనేం?"

"మహారాజా! ఇంత అల్పమైన విషయానికి నువ్వు కలవరపడడం మా వంటి వీరులకు అవమానం కాదా? ఈ యుద్ధ బాధ్యతంతా మేమే స్వీకరిస్తాం. నువ్వు నిశ్చింతగా వుండు!"

సభలో వారి మాటలు వింటున్నకొద్దీ మహారాజు మొహం తేటపడుతోంది. దాచుకోలేని ఆరాటంతో సభని పరిశీలిస్తూనే వున్నాడు.

---

**350.** నాగరాజులూ, వరుణ పుత్రులూ, కాలకేయులూ, దేవతలూ, యముడూ, దేవేంద్రుడూ, బ్రహ్మదేవుడూ – లాంటి మాటలు ఎక్కడ వచ్చినా వారందరూ మానవులేనని గ్రహిస్తూ వుండాలి. వారిని, 'ఇతర జాతుల వీరులు' అని మాత్రమే అర్థం చేసుకుంటూ వుండాలి. ★

**351.** **యుద్ధకాండ, సర్గ 7, శ్లోకం 8:** రావణుడి పెత్తల్లి కూతురు కుంభీనసి. ఆమెకు పెళ్ళికాకుండా వున్నప్పుడు మధువు అనే రాక్షసుడు ఆమెని ఎత్తుకుపోయాడు. స్వజాతీయుడే ఆమెని తీసుకుపోయాడు. కుంభీనసి, మధువుని ఇష్టపడింది. తన చెల్లెల్ని మధువు ఎత్తుకుపోయాడనే సంగతి రావణుడికి తెలిసి మధువుతో పోట్లాటకు వెళ్ళాడు. తన భర్తని ఏమీ చెయ్యవద్దని కుంభీనసి రావణుణ్ణి కోరింది. రావణుడు మధువుతో స్నేహం చేసుకుని తిరిగి వచ్చాడు. పెళ్ళి అయిన స్త్రీలనైనా, కాని స్త్రీలనైనా పురుషులు ఎత్తుకుపోయి పెళ్ళిళ్ళు చేసుకునే సంఘటనలు రామాయణంలో అనేకం ఉన్నాయి. రావణుడు సీతని ఎత్తుకుపోయిన సంఘటనలో రాజకీయమే ప్రధానంగా ఉంది.

కుంభీనసి సంగతి, ఉత్తరకాండలో కూడా 25వ సర్గలో, 20వ శ్లోకంనించీ 54వ శ్లోకం వరకూ ఉంది. ★

తన మంత్రులూ సేనాపతులూ బంధువులూ అందరూ యుద్ధానికి సముఖంగానే వున్నారు. సీత సంగతి ఎవ్వరూ ఎత్తడం లేదు. ఏ వొక్కరూ యుద్ధ వ్యతిరేక ధోరణి కనబరచడం లేదు. తను యుద్ధానికి దిగడానికి జంకవలసిన అవసరం ఎంత మాత్రం లేదు.

మహారాజు గంభీరమైన చిరునవ్వుతో సభని మళ్ళీ కలియజూస్తూ ప్రసంగించడం ప్రారంభించాడు – "శత్రు భయంకరుడైన ఈ రావణుడికి యుద్ధమంటే కల వరమా? ఆయుధాల మొహమైనా ఎరగని ఆటవిక సైన్యాన్ని చూసి రావణుడు జంకుతాడా? నేను మీతో సంప్రదించేది జంకు వల్లనో నీతి వల్లనో కాదు. లోకంలో పురుషులు ఉత్తములూ, మధ్యములూ, అధములూ అని మూడు విధాలుగా ఉంటారు. ఒక కార్యం చేయవలసి వచ్చినప్పుడు సమర్థులైన మంత్రులతో, తన శ్రేయస్సు కోరే బంధు మిత్రులతో ఆలోచించి, భారం అంతా దైవం మీద మోపి, కార్యం నిర్వర్తించే పురుషుడు – ఉత్తముడు. దైవాన్ని నమ్మినప్పటికీ రెండో వ్యక్తిని సంప్రదించకుండా తను ఒక్కడే ఆలోచించి కార్యం నిర్వర్తించుకునే పురుషుడు – మధ్యముడు. దైవాన్ని నమ్మక, ఎవరినీ సంప్రదించక, తనకు తోచినట్టు తను స్వతంత్రించి చేసుకునేవాడు – అధముడు ...."

సభలో రేగుతోన్న గందరగోళానికి కుంభకర్ణుడికి నిద్ర చెడి కోపం తలెత్తడం ప్రారంభమైంది.

మహారాజు ప్రసంగం ఇంకా కొనసాగుతూనే ఉంది! ".... పురుషులలో భేదాలు ఉన్నట్టే, ఆలోచనలు కూడా ఉత్తమమైనవీ, మధ్యమమైనవీ, అధమమైనవీ – అని మూడు రకాలుగా ఉన్నాయి. పూర్వం నుంచీ పెద్దలు శాస్త్రాలలో చెప్పిన విషయాలనే, అందరూ ఐకమత్యంతో అంగీకరిస్తే, అది ఉత్తమమైన ఆలోచన. ఆలోచించవలసిన విషయం గురించి, అందరూ ఎవరికి తోచినట్లు వారు ఆలోచించి, చివరికి ఏకాభిప్రాయానికి వస్తే, అది మధ్యమమైన ఆలోచన. ఆలోచించే వారందరూ ఎవరి ఆలోచన వారు ప్రధానంగా ఎంచుకుని ఏకాభిప్రాయంలో క్షేమం లేదని తలిస్తే, అది అధమమైన ఆలోచన.[352] అందుచేత పెద్దలు చెప్పిన విధంగా నడుచుకునే నేను మీ అందరితోనూ సంప్రదిస్తున్నాను. మీరు

---

**352.** యుద్ధ, సర్గ 6, శ్లోకాలు 13, 14, 15:

(1) పూర్వం నుంచీ పెద్దలు ఏం చెపుతున్నారో ఆ విధంగానే ఆలోచిస్తే, అది ఉత్తమం. (పూర్తిగా మంచి అట!) (2) ఎవరికి తోచినట్టు వారు ఆలోచించి, చర్చలూ వాదనలూ చేసి, చివరికి ఏకాభిప్రాయానికి వొస్తే, అది మధ్యమం. (పూర్తిగా మంచి గాక, కొంత చెడ్డ.) (3) ఎవరి ఆలోచనే వారు ప్రధానంగా ఎంచుకుని ఏకాభిప్రాయంలో క్షేమం లేదని తలిస్తే, ఆ ఆలోచన అధమం. (పూర్తిగా చెడ్డ.)

ఈ నీతులు, ఎలా తల్లకిందు లవుతాయో చూడండి!

(1) పూర్వం నుంచీ పెద్దలు చెప్పే వాటినే తర్వాత తరాల వాళ్ళు అంగీకరించడం అంటే, అందులో ఇక తర్వాత తరాల వాళ్ళు ఆలోచించేది ఏముంది? పెద్దలేం చెప్పారో దాన్ని గుర్తుతెచ్చుకోవటం మాత్రమే అందులో వుంటుంది. తమ స్వంత ఆలోచనకీ, స్వంత ఇష్టాయిష్టాలకూ, తర్వాత కాలంలో దొరికే అనుభవాల్ని తీసుకోవడానికీ తావు లేని ఈ పద్ధతే – అధమం. (పూర్తిగా చెడ్డ)

(2) వాదనలూ, చర్చలూ చాలా అవసరం. అదే అభివృద్ధికి మార్గం. కానీ అంత వాదించి కూడా చివరికి అందరూ వొకే అభిప్రాయానికి కట్టుబడాలి – అంటే, వారిలో కొందరు తమ అభిప్రాయాలు వొదులుకుని రాజీలు పడడమే. ఇందులో, పట్టుదలతో నిలబడడం ఏముంది? కానీ, చర్చలు అంటూ కొంత ఆలోచించే అవకాశం ఇందులో వుంటుంది. ఎక్కువ మంది చెప్పే దాని ప్రకారం, మిగిలిన వాళ్ళు నడవవలసి వుంటుంది. ఇది కొంత మంచే. (పూర్తిగా చెడ్డ నించి మంచి వేపు మార్పు.)

(3) ఏకాభిప్రాయంలో క్షేమం ('శ్రేయః' అనే మాట వాడాడు కవి) లేదని తలిచినప్పుడు, ఒక వ్యక్తి తన అభిప్రాయం తను ఉంచుకోవడమే మంచిది. అనేక రకాల అభిప్రాయాలతో, పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలతో, ఐకమత్యం కుదరదు. అసలు అది ఏకాభిప్రాయం అవదు. ఏకాభిప్రాయం క్షేమం కాదని తెలిసినప్పుడు, ఎవరి అభిప్రాయం వారు, ఎవరి ఆలోచనా విధానం వారు, ఎవరి సిద్ధాంతం వారు, నిలబెట్టుకోవడమే ఉత్తమమైన విషయం. తను నమ్మిన మార్గం కోసం ఒంటరిగా అయినా సరే నిలబడాలి. (ఇదే పూర్తిగా మంచి.)

ఈ రకంగా, మనం ఆలోచించి చూస్తే, కవి చెప్పిన నీతులన్నీ తల్లకిందులవుతాయి. "మీరేమీ ఆలోచించకండి, పెద్దలు చెప్పినట్టే చెయ్యండి, అదే ఉత్తమం" అనడంలో అర్థం ఏమిటి? ప్రజల్ని ఆలోచించకుండా చెయ్యడమే. ఇది ఫ్యూడల్ నీతుల లక్ష్యం. ప్రజలు స్వతంత్రంగా ఆలోచించకూడదు. రాజులు చెప్పే నీతి శాస్త్రాలనే అంగీకరించాలి. ఆ ధర్మాలకే కట్టుబడాలి! ఈ నీతులన్నీ రాజులకూ, ధనికులకూ, ఉన్నత కులాలకూ మేలు చెయ్యడానికే.

"ఒక కార్యం చెయ్యవలసి వచ్చినప్పుడు, బంధు మిత్రులతో మంత్రులతో ఆలోచించి చేసేవాడే ఉత్తముడు" అంటున్నాడు కదా రావణుడు? కానీ, ఆ ఉత్తమత్వాన్ని రావణుడే పాటించడు. ఈ సంగతి తర్వాత చూడండి. ★

కూడా ఐకమత్యంతో ఆలోచించి .... నా రాజ్యానికీ .... నా పట్టణానికీ, క్షేమం కలిగే విధంగా చెప్పండి!"[353]

అన్నగారి ఉత్తమ ప్రసంగం చెవిని బడుతున్న కొద్దీ కుంభకర్ణుడికి మత్తు సన్నగిలి కోపం పొంగుతోంది. ఈయనకి స్వంత ఆలోచనలు ఎక్కువ. దేనికీ జంకడు. అనదల్చుకున్న మాటలు నిర్భయంగా అనేస్తాడు. మహా రాజంటే మక్కువే అయినా కోపం ఆపుకోడు. నిద్ర చెడి ఎరుపెక్కిన కళ్ళతో సింహాసనం వేపు అసహనంగా చూశాడు – "ఎందుకోయీ, అస్త వ్యస్తపు కబుర్లు చెపుతావు! ఉత్తమ పురుషుణ్ణంటావు. ఉత్తమ కార్యాలంటావు. సీత కోసం బయల్దేరే ముందు ఈ ఉత్తమత్వం ఏమైపోయింది? సీతని తెచ్చేకార్యం ఎవరితో సంప్రదించి చేశావు? శతృ స్థావరంలోకి ఒంటరిగా వెళ్ళావు. రాముడు నిన్ను చంపితే ఏమైపోయే వాళ్ళం? అప్పుడే అందరం ఆలోచించి కార్యం చేస్తే ఇంతకంటే మంచి నిర్ణయం జరిగేదేమో![354] .... సరేలే! కానియ్యి. నీకు తోచినట్టు చేసినా మంచి పనే చేశావు. శతృవుని క్షోభ పెట్టే పని చేశావు. దాని పర్యవసానం ఎదుర్కోక తప్పదు గదా? ఈ యుద్ధానికి జంకవలసిందేమీ లేదు. రాముడే రానియ్యి, దేవుడే రానియ్యి! మనకేమీ భయం లేదు. నా భయంకరమైన ఆయుధాలతో యముణ్ణి కూడా యమ లోకానికి పంపించేస్తాను. నువ్వు నిశ్చింతగా ఉండు. హాయిగా మద్యపానం చేసి సుఖ భోగాలతో తే .... లు .... తూ .... ఉండు!" అంటూ ఆసనంలోకి వొరిగి మత్తులో మునిగిపోయాడు.

కుంభకర్ణుడి మాటలు ఆగడంతో, ఉరుములు ఉరిమి ఆగినట్టయింది. మహారాజు, చిరునవ్వుతో, నిద్ర పోతూన్న తమ్ముణ్ణి ప్రియంగా చూసి తేలిగ్గా నిట్టూర్చాడు. మహారాజు చూపులు, వొక్కొక్కరినీ స్పృశిస్తూ ఆలోచనా సముద్రంలో మునిగి వున్న విభీషణుడి మీద కొంతసేపు ఆగి, ప్రహస్తుడి మీదకు మళ్ళాయి.

ప్రహస్తుడు – ముఖ్య సేనానీ, మంత్రీ కూడా. ఇతడు, మహారాజు మనోవాంఛలకెప్పుడూ అను కూలం గానే ప్రవర్తిస్తాడు. రాజు చూపు తన మీద పడగానే భక్తిగా లేచి సింహాసనానికి నమస్కరించి వీరోచితంగా ప్రారంభించాడు – "మహారాజా! లంకని రక్షించే బాధ్య తంతా నా మీద పెట్టు! నన్ను ఆజ్ఞాపించు! నువ్వు గతంలో చేసిన యుద్ధాల ముందు ఈ వానర సైన్యంతో యుద్ధం కూడా యుద్ధమేనా? నువ్వు 'ఊఁ' అనాలే గానీ ఈ చరాచర జగత్తులో వానరుడనేవాడు లేకుండా చేసెయ్యనా? నా వంటి వీరులెందరో నీ ఆధీనంలో ఉన్నారు. మన ఇంద్రజిత్తు, దేవ సైన్యాలతో ఎంత వీరోచితంగా యుద్ధం చేశాడో మరిచిపోయావా? ఆ చతురంగ బలాల్లో, గజ దళాల్లో, అశ్వ దళాల్లో, ఆ ఆయుధ వర్షంలో వీర విహారం చేస్తూ ఇంద్రజిత్తు దేవేంద్రుణ్ణి బంధించి లంకకు తెస్తే, బ్రహ్మ కదా దయదలిచి అతణ్ణి విడిచి పెట్టించాడు? అంతటి మహా వీరుడు ఇంద్రజిత్తు ఉండగా రాముడితో యుద్ధానికి సందేహమా మనకు?"

ఇంద్రజిత్తు ముసి ముసి నవ్వులతో సభని చూస్తూ కూర్చున్నాడు.

"ఇంద్రజిత్తు వరకూ ఎందుకు మహారాజా?" అంటూ దుర్ముఖుడు కోపంగా లేచాడు – "వానర మూకతో యుద్ధానికి ఇంద్రజిత్తు కావాలా? నే నొక్కణ్ణీ చాలనా?"

వజ్రదంష్ట్రుడు లేచాడు మహోత్సాహంగా – "శతృ సైన్యాలన్నింటినీ నే నొక్కణ్ణీ హతమార్చి సుఖంగా వెనక్కి తిరిగి వొస్తాను. సుగ్రీవుణ్ణి చితకదన్ని, హనుమంతుణ్ణి హతమార్చి, రాముణ్ణీ లక్ష్మణుణ్ణీ యముడికి చుట్టాలుగా పంపించేస్తాను. దానికేమీ సందేహం లేదు. కానీ నాకు తోచిన ఉపాయం ఒకటి మనవి చేస్తాను. మన వీరులు

---

**353.** యుద్ధ, సర్గ 6, శ్లోకం 19: "వానరులతోడ వైరము సంభవించగా నా పట్టణమునకును, నా సేనకును హితము గలుగునట్టి కార్యమును మీరు బాగుగా ఆలోచింపవలయును" అంటున్నాడు రావణుడు. 'మన రాజ్యం, మన పట్టణం, మన సైన్యం' అనడం లేదు. రాజ్యాలూ, నగరాలూ, సైన్యాలూ అన్నీ తమ స్వంతమేనని రాజులు భావిస్తారు. ఇంకెవ్వరినీ అందులో కలుపుకోరు. రాముడు కూడా ఇలాగే మాట్లాడతాడు. 'నేను, నేను' అనడం తప్ప, రాముడు, తన గొప్పలో లక్ష్మణుణ్ణి అయినా కలుపుకోడు. అలాగే, రావణుడు, తన తమ్ముల్ని అయినా కలుపుకోడు. ★

**354.** యుద్ధ, సర్గ 21, శ్లోకాలు 27, 28, 29: "రావణుని రోదనమును విని (సీత మీద 'కామ బాధ'తో రోదనం) కుంభకర్ణుడు మిక్కిలి కోపముతో నిటులనెను. "మహారాజా! నీలోనే నీవే యోచించుకొని రాముని భార్యయగు సీతను అపహరించుకొని వచ్చితివి. అపుడే నీవు మా తోడ ఆలోచించినటులైతే నీ చిత్తము స్థిరముగ నిలిచియుండును. (నువ్వు బాధపడే అవసరం ఉండేది కాదు.) ఇపుడు ఆలోచించుట గత జల సేతుబంధనము వలె నున్నది. ఇపుడు సేయుచుండు మంత్రాలోచనమును సీతనపహరించుటకు మునుపే నీవు మాతోడ చేసి యుండినటులైతే మా కార్యము బాగుగనే యుండి యుండును."

ఇదీ రాజుల ధర్మాచరణ. రావణుడు దుర్మార్గుడైన పాత్ర గాబట్టి చెప్పేదొకటీ, చేసేదొకటీగా కవి చూపించాడేమో – అనుకోనక్కర్లేదు. రాజులు నీతులు చెప్పడమే గానీ, వాటిని పాటించరు. ఈ ప్రవర్తన – దశరథుడికీ, రాముడికీ, సుగ్రీవుడికీ, అందరికీ ఉంది. ★

కొందరు మారువేషాలతో రాముడి దగ్గిరకే వెళ్ళి – 'మేం కోసల నించి వచ్చాం. మమ్మల్ని భరతుడు పంపించాడు. నీతో భరతుడికి చాలా అవసరమైన పని ఉందట. నిన్ను తక్షణం వెనక్కి వొచ్చెయ్య మన్నాడు' అని చెప్పాలి. రాముడు నమ్మేసి సైన్యంతో వెనక్కి వెళ్ళిపోతాడు. యుద్ధమూ ఉండదు, ఏమీ ఉండదు. గోళ్ళతో పొయ్యే దానికి గొడ్డళ్ళెందుకు? ఏమంటారు?" అని నవ్వు మొహంతో చుట్టూ చూశాడు.

అందరూ నవ్వులు కురిపించారు.

కొందరు విసుక్కున్నారు – "రాముడు అంత తెలివి తక్కువవాడై ఉండడు. యుద్ధ కాంక్షతో వచ్చిన వాడు అంత తేలిగ్గా వెనక్కి మళ్ళడు. ఏం చెప్పినా నమ్మడు" అన్నారు గబ గబా.

"ఏమో! నమ్ముతాడేమో!" – ఒక మూల చర్చ మొదలైంది – "అయినా ప్రయత్నించి చూస్తే యేం? చారుల్ని పంపి అలా చెప్పించండి! యుద్ధం గోలపోతుంది."

నికుంభుడు లేచాడు. అతడు కుంభకర్ణుడి కొడుకు. "రాముడితో యుద్ధానికి ఇన్ని ఉపాయాలు ఆలోచించడం చూస్తే నాకు నవ్వుగా ఉంది" అని నవ్వేసి కూర్చున్నాడు.

"అవును. నాకూ అలాగే ఉంది" అని వజ్ర హనువు మందహాసంతో లేచాడు – "మీరెవ్వరూ యుద్ధానికి రావొద్దు. అందరూ సుఖంగా ఇళ్ళ దగ్గర విశ్రాంతిగా ఉండండి. మీ కిష్టమైన మద్యాలు తాగుతూ, మాంసాలు తింటూ, సుఖభోగాలలో తేలుతూ ఉండండి. నే నొక్కణ్ణే యుద్ధరంగానికి వెళ్ళి .... పని పూర్తిచేసుకుని వస్తాను."

సభలో ఉన్న వాళ్ళందరూ శతృవుల్ని వొక్కొక్క చేత్తోనే చంపగల వాళ్ళై పోతున్నారు. ఎవరికి వారే మహా రాజు మెప్పు కోసం ఆరాటపడుతున్నారు. యుద్ధం అంటే ఒకరో ఇద్దరో చేసేది కాదని అందరికీ తెలుసు. "నే నొక్కణ్ణే వెళ్తాను" అన్నంత మాత్రాన ఒక్కడే వెళ్ళక్క ర్లేదని కూడా తెలుసు. ఒంటరిగా యుద్ధం చేసి రాగల మహా వీరులు ఇంకా ఇంకా పుట్టుకొస్తూనే, లేచి ప్రసం గిస్తూనే వున్నారు.

సభలో అందరూ వీరోచితంగా ప్రతిజ్ఞలు చేస్తు న్నారు – విభీషణుడు తప్ప!

సభ అంతటా ఉత్సాహం ఉరకలు వేస్తోంది – యుద్ధం కోసం!

విభీషణుడి మనసు కూడా ఎదురు తెన్నులు చూస్తోంది – యుద్ధం కోసమే! లంకకు రాముడి రాక కోసం సీత కన్నా ఎక్కువగా ఆరాటపడుతున్నది – విభీష ణుడే! మహారాజు ఏ స్త్రీని తెచ్చినా, ఆమె బంధువులు లంక మీద దండెత్తకపోతారా – అనే ఆశతో ఎంతో కాలంగా నిరీక్షిస్తోన్న విభీషణుడికి .... సీత ద్వారా .... ఆ ఆశ నెరవేరే మార్గం .... ఇంత కాలానికి కనపడింది! .... లంక మీద రాముడు దండెత్తితే తను ఎలా వ్యవహ రించాలీ– అనే ఆలోచనలతో... సతమత మౌతున్నాడు. కొంత కాలం నించీ నిత్యం వేధిస్తోన్న ఆ ఆలోచనలే విభీషణుడి మనసు నిండా సుళ్ళు తిరుగుతున్నాయి .... మళ్ళీ .... మళ్ళీ!

రాముడు తన అన్నను మించిన మహా వీరుడని వింటూనే ఉన్నాడు. ఈ యుద్ధంలో తన అన్న ఓడి .... రాముడే జయిస్తే .... లంకా రాజ్యం రాముడు సొత్తే అవుతుంది. అలా జరిగితే తనకు ప్రయోజన మేముంది? లంక తనకే సంక్రమించేటట్టు చేసుకోవాలి. యుద్ధంలో రాముడే జయించాలంటే, తను రాముడి పక్షంలో జేరి రాముడికి సహకరించాలి. .... కానీ రాముడు తనని విశ్వసిస్తాడా? .... శతృవనే సందేహం లేకుండా తనని తమలో చేర్చుకుంటాడా? – చేర్చు కుంటాడనే నమ్మకం కలుగుతోంది. లంకలో జరిగిన విశేషాలన్నీ హనుమంతుడు చెప్పకుండా వుంటాడా? .... తను రావణుడికి వ్యతిరేకమనే విషయం రాముడు గ్రహించకుండా వుంటాడా? .... రాముణ్ణి గురించి వింటోంటే ఆయన గొప్ప రాజకీయవేత్త అని తోచడం లేదా? వాలి ద్వారా గాక సుగ్రీవుడి ద్వారా కిష్కింధని పట్టడంలోనే ఆయన రాజనీతిజ్ఞత స్పష్టం అవడం లేదా? అటువంటివాడు తను రావణుడి పక్షం కాదని గ్రహించ లేడా? .... రాముడికి నమ్మకం కలిగించే విధంగానే తను వ్యవహరించాలి!

సభలో గందరగోళానికి విభీషణుడి ఆలోచనలు చెదిరిపోతున్నాయి.

సభ, యుద్ధోన్మాదంలో ఊగుతోంది. వీరాలా పాలతో దద్దరిల్లుతోంది.

విభీషణుడు వార కంట మహారాజుని పరికిస్తు న్నాడు. సందేహిస్తున్నాడు. మహారాజు రాముడి వీరత్వం గురించి జంకుతున్నాడా? యుద్ధానికి తల పడకుండానే సీతని అప్పగిస్తాడా? ... ఏవిటీ వెర్రి ఆలోచన? .... మహారాజు దానికి మాత్రం అంగీక రించడని తెలీదా? .... ఒక వేళ అంగీకరించి సీతని అప్పగించితే? .... రాముడు యుద్ధానికి దిగకుండానే వెనక్కి తిరుగుతాడా? ఎంత వెర్రి! రాముడు యుద్ధానికి దిగుతున్నది భార్య కోసమేనా? .... సీతని తీసుకురాక పూర్వం కూడా రాముడు రాక్షస నాశనానికి పథకాలు వేయటం లేదా? సీతాపహరణం జరగకపోయినా, రాముడు రాక్షస రాజ్యాల మీదకు దండెత్తే వాడే. అప్పుడు .... భార్య నెపం గాక ఇంకో నెపం వెతుక్కునేవాడు.

రాముడు దండెత్తేది భార్య కోసమే అనుకో నక్కర్లేదు. .... అసలు రాముడు భార్యని మళ్ళీ స్వీకరి స్తాడో లేదో సందేహమే. ఎక్కడో ఆటవిక జాతుల్లో తప్ప,

నాగరిక జాతుల పురుషులు, పర పురుషులు స్వాధీన పర్చుకున్న స్త్రీలను మళ్ళీ స్వీకరించగలరా?

రాముడు దండెత్తేది రాజ్య విస్తరణ కోసమే గానీ భార్య కోసం కాదు. రావణుడు యుద్ధానికి జంకి సీతని అప్పగించినా, రాముడు యుద్ధం విరమిస్తాడనే భయం అవసరం లేదు. ఏ విధంగానైనా లంకని ముట్టడించి తీరుతాడు. అప్పుడు తను ఎలా వ్యవహరించాలి?

రాముడి పక్షానికే అంగ బలం అధికంగా ఉంది. రాముడు జయించటానికే ఎక్కువ ఆస్కారం ఉంది. ... ఏదో విధంగా ఈ దేశం నించి పోయి రాముడితో కలవాలి. తన శక్తి యుక్తులన్నీ వినియోగించి రాముడి జయానికే తోడ్పడాలి. రాముడు జయించకపోతే తన ఆశలన్నీ వ్యర్థమైపోతాయి. రెంటికీ చెడ్డ రేవడి అయి పోతాడు తను.

ఇంతకీ .... ఇక్కడి నుంచి నిష్క్రమించే విధానం ఏమిటి? రహస్యంగా పారిపోవడం తెలివైన పని కాదు. లోకం దృష్టిలో తను దోషిగా కనపడకూడదు. మహారాజే కోపంతో తనని దేశం నించి వెళ్ళగొట్టే విధంగా చేసు కోవాలి. అది ఒక్కటే చక్కటి మార్గం.

ఇప్పుడు చెయ్యవలసిందంతా మహారాజుకి కోపం తెప్పించడం మాత్రమే. రాముడితో యుద్ధం వొద్దని వ్యతి రేకించాలి. సీతని అప్పగించక తప్పదని హెచ్చరించాలి. శతృవుల వీరత్వాన్ని అమితంగా పొగడాలి. శతృవుల్ని పొగిడితే ఏ రాజూ భరించలేడు. తన అన్న కూడా పట్టు దల ఇంకా వృద్ధి చేసుకొని శతృవుల్ని పొగిడినందుకు తనకు దేశ బహిష్కార శిక్ష విధిస్తాడు .... తను దేశం నుంచి సుఖంగా బయట పడవచ్చు .... ఒకవేళ .... మరణ శిక్ష విధిస్తే? .... బహుశా అలా జరగదు. జరి గితే అప్పుడు ఆలోచించవచ్చు. చెరసాల నుంచి తప్పించుకునే విధానం తనకు అసాధ్యమేమీ కాదు.

విభీషణుడు క్షణ క్షణం ఆతృతతో సభని పరికిస్తూనే వున్నాడు. ఎప్పటికప్పుడు లేవబోయి సాహసం చాలక సంకోచించి ఆగుతున్నాడు.

మంత్రులూ, సేనానులూ కురిపించే వీరోచిత వాగ్దా నాలకు మహారాజు పట్టలేని సంతోషంతో పొంగుతు న్నాడు. వీరావేశంతో గత యుద్ధాల విశేషాలు వర్ణిస్తు న్నాడు. తన మీద దండెత్తుతోన్న రాముడి అజ్ఞానాన్ని ఛీత్కరిస్తున్నాడు – ".... ఇంద్ర కుబేరాది వీరాధి వీరులే నా ఎదుట నిలబడ లేకపోయారు. ఈ రాముడెంత? వెర్రి వాడు. నిద్రపోతోన్న సింహం జూలుతో ఆటలాడు తున్నాడు. మృత్యు దేవతనే మేల్కొలుపుతున్నాడు. నా శక్తి సామర్థ్యాలు ఎరగకే నా మీద యుద్ధానికి సిద్ధమౌ తున్నాడు. కొరకంచులతో ఏనుగులకు వాతలు పెట్టి నట్టు, నా బాణ ప్రవాహంతో రాముణ్ణి ముంచెత్తుతాను! అల్పాతి అల్పుడైన ఈ రాముడెంత?" అంటూ మీసాలు మెలికలు తిప్పుతున్నాడు.

గంభీరమైన చూపులతో లేచాడు విభీషణుడు.

సభ ఒక్కసారిగా నిశ్శబ్దం అయింది.

విభీషణుడు వినయంగా వొంగి సింహాసనానికి నమస్కరించాడు. భక్తిగా దోసిలి పట్టి నించున్నాడు. "మహారాజా! నీ భృత్యులంతా ఎవరికి తోచిన విధంగా వారు విన్నవించారు. నేను కూడా నాకు తోచిన విధంగా మనవి చేస్తాను. దయతో ఆలకించు! గతంలో మనం ఎన్నో యుద్ధాలు చేసి, దిగ్విజయాలు పొందిన మాట నిజమే. మన సైనికులందరూ మహా వీరులే. వారి సాహసాలకూ, శక్తిసామర్థ్యాలకూ లోటేమీ లేదు. కానీ .... మన వీరత్వమే కాదు, శత్రువుల వీరత్వం కూడా గమనించాలి. వానరులు ఆటవికులైనా, ఆయుధం లేని వారైనా, సామాన్యులు గారని విన్నాను. వారిలో ప్రతి ఒక్కడూ వీరుడే. ప్రతి ఒక్కడూ హనుమంతుడే. ప్రతి ఒక్కడూ ...."

"ఆపు విభీషణా! ఆపు .... చాలించు ...." సభలో అనేక మంది వీరులకు కోపాలు రేగాయి విభీషణుడి మీద. "అంతటి వీరులా వారు? మనమేనా అంత అస మర్థులం?"– పరుషమైన ప్రశ్నలెన్నో దూసుకు వచ్చాయి నలువేపుల నించీ.

విభీషణుడు చిరునవ్వుతో వినయంగా వొంగాడు. "మనమూ వీరులమే. కానీ .... వారు మనని మించిన వీరులు. వారిని నడిపే శ్రీరాముడు మహా శక్తి సంప న్నుడు. మనకన్నా ఎక్కువ వీరత్వం గల వారితో యుద్ధా లకు దిగటం రాజనీతి కాదని మీ అందరికీ మనవి చేస్తున్నాను."

"విభీషణా! ఏమిటీ వితండ వాదం? ఆయుధం ఉన్నవారి కంటే ఆయుధం లేనివారే మహా వీరులా? శత్రువుల బలాన్ని గోరింతలు కొండంతలు చేస్తున్నావు. నువ్వు భయపడి, మమ్మల్ని భయపెట్టాలని చూస్తున్నావు. శతృవు దండెత్తి మీదపడుతోంటే బుద్ధి చెప్పకుండా విడిచి పెడతామా?"

విభీషణుడు చిరు కోపంతో చూశాడు – "బుద్ధి చెప్పకోవలసింది మనకే గానీ రాముడికి కాదు. లంక మీద దండెత్తడంలో రాముడి అపరాధమేమీ లేదు. తన భార్యని అపహరించిన శతృవుతో తలపడటంలో అతడి దోషమేముంది?" అని నిస్సంకోచంగా చూశాడు.

విభీషణుడి మాటలు అందరికీ వింతగా తోచాయి.

మహారాజు, నుదురు చిట్లించి తీక్షణంగా చూశాడు.

ఒక సేనాని కరుకుగా లేచాడు – "విభీషణా! వెను కటి సంగతులన్నీ విస్మరించి, ఏమీ ఎరగని నంగ నాచి లాగ మాట్లాడుతున్నావే! మహారాజు అన్యాయంగా

రాముడి భార్యని ఎత్తుకు వొచ్చాడా? రాముడు దండ కారణ్యంలో చేసిందేమిటో మరచిపోయావా?"

విభీషణుడు గంభీరమైన చూపులతో చిరునవ్వు చిందించాడు– "రాముడు దండకారణ్యంలో మన ఖరుణ్ణి చంపాడు, నిజమే. కానీ, ఖరుడే ముందు దెబ్బలాటకు దిగటం చేత రాముడు ఆత్మ రక్షణ కోసమే ఆ పని చేశాడు. అందులో కూడా రాముడి అపరాధం ఏమీ లేదని మనం గ్రహించాలి" అంటూ శాంతంగా చూశాడు.[355]

విభీషణుడి ధోరణి సభలో అందరికీ అమి తాశ్చర్యం కలిగిస్తోంది. కొందరికి భరించలేని కోపం తెప్పిస్తోంది. "విభీషణా! రాముడి అపరాధ మేమీ లేదని వాదించడానికి నీకు సిగ్గు లేదా? ఖరుడు అన్యాయంగా రాముడితో కొట్లాటకు వెళ్ళాడంటున్నావే! రాముడు శూర్పణఖని అవమానించి, అవయవాలు ఖండించి పంపలేదా? రాముడు చేసిందంతా నువ్వు మరిచిపోతే మేమూ మరిచిపోయామను కుంటున్నావా?"

విభీషణుడు శూర్పణఖ సంగతి ఎత్తదల్చుకోలేదు. చలించకుండా వినయ విధేయతలు ప్రదర్శిస్తూ సభని చూశాడు – "శ్రీరాముడు ధర్మాత్ముడనీ, కరుణా సముద్రు డనీ, నీతి శాస్త్ర కోవిదుడనీ విన్నాను. అటువంటి మహానుభావుడు ఏ కార్యం చేసినా అనుచితంగా చెయ్యడు. ఆ సంగతి గ్రహించ లేక శ్రీరాముడి మీద పగబట్టి అతడి భార్యను బంధించి వుంచడం న్యాయమా? పర స్త్రీ వాంఛ పురుషుడికి ఎన్నడూ వాంఛ నీయం కాదు."

"ఓహో! ఈ నాడు కొత్త కొత్త ధర్మపన్నాలు బోధిస్తు న్నావు! మహారాజు ఇంతకు పూర్వం కూడా అనేక మంది పర స్త్రీలను తెచ్చి, నయాన్నో భయాన్నో వివాహాలు చేసుకుంటూనే వున్నాడే!"

"నేను ఎప్పుడూ మహారాజుని వ్యతిరేకిస్తూనే వున్నాను."

"ఇంత తీవ్రంగా ఎన్నడూ వ్యతిరేకించలేదు నువ్వు!"

"అవును. ఇంత ప్రమాదం ఎన్నడూ ముంచుకు రాలేదు. ఇప్పుడు లంకని సర్వనాశనం చేసే యుద్ధం, కాల యముడి లాగ గుమ్మంలో కాచుకు కూర్చుంది. శ్రీరాముడు దండెత్తి వచ్చిన తర్వాత ఇక లంకని రక్షిం చడం ఎవ్వరికీ సాధ్యం కాదు. రాముడితో వైరం వెయ్యి తలల మహా సర్పం లాంటిది."

మహారాజు కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. శత్రు కీర్త నలు సభకు దుర్భరంగా ఉన్నాయి.

ప్రహస్తుడు మండిపడుతూ లేచాడు – "విభీషణా! యుద్ధాల మొహం, శత్రువుల మొహం ఎరగని వారికి చెప్పు నీ మాటలు. ఇంతకు పూర్వం మనం యుద్ధాలు చేసిన శత్రువులంతా అసమర్థులేనా? ఇంతకాలమూ పిరికి పందలతో మాత్రమే యుద్ధాలు చేసి జయిం చామా? ఆటవిక సైన్యాల్ని వెంటబెట్టుకుని వచ్చే రాముణ్ణి మహా వీరుణ్ణి చెయ్యకు! నా రక్షణలో లంకకేమీ హాని జరగదు. నిశ్చింతగా వుండు!" అని నవ్వి కూర్చు న్నాడు.

విభీషణుడు ప్రహస్తుణ్ణి తీక్షణంగా చూస్తూ – "శ్రీరా ముడి శక్తి సామర్థ్యా లెరగకే నువ్వింత గర్వపడుతున్నావు. ప్రహస్తా! రామ బాణాలు సామాన్యాలు కావు సుమా! అవి బ్రహ్మ దండాలు. కాల పాశాలు. అవి ప్రాణాంత కంగా నీ మీద బడి నీ శరీరాన్నంతా చీల్చలేదు కాబట్టే నువ్వింత దంభాలు పల్కుతున్నావు. నావ లేనివాడు సముద్రం దాటలేనట్టే శక్తి లేనివాడు రాముణ్ణి జయించ లేడు.[356] వ్యసన పరుడైన మన మహారాజు మంచి చెడ్డలు గుర్తించలేక మీ మాటలు విశ్వసిస్తున్నాడు. రాజు దారి తప్పితే మంత్రులూ, ఆప్తులూ అందరూ కలిసి

---

**355.** యుద్ధ, సర్గ 9, శ్లోకాలు 13, 14: విభీషణుడు రాముణ్ణెలా వెనకేసు కొస్తున్నాడో చూడండి! ".... రాక్షస రాజగు రావణునకు శ్రీరాముడేమి అపకారము చేసెను? ఖరుడే అతిక్రమించి రామునిపై బడవచ్చినందున తన్ను తాను గాపాడుకొనుటకై రాముడు ఖరుని జంపెను. లోకములో ఎవరి బలమునకు తగినటుల వారు ప్రాణములను రక్షించు కొనవలసినదే గదా?"

'ఖరుడే యుద్ధానికి వెళ్ళాడు గాబట్టి అతణ్ణి రాముడు చంపాడు. రాముడి తప్పేం లేదు' అని వాదిస్తున్నాడు విభీషణుడు. అసలు ఖరుడు యుద్ధానికి ఎందుకు వెళ్ళాడో ఆ సంగతేమీ పట్టించుకోడం లేదు. శూర్పణఖని రాముడు బాధించిన సంగతి ఎత్తడం లేదు. ★

**356.** యుద్ధ, సర్గ 14, శ్లోకం 12: "నావ లేనివానికి సముద్రమును దాటుట కెటుల సాధ్యము గాదో అటులనే సమర్థుడగు రాముని వధించుటకు నా చేతను, నీ చేతను, రాక్షసులందరి చేతను కాదు."

నావ లేకపోతే సముద్రం దాటడం సాధ్యం కాదు పొమ్మంటున్నాడు విభీషణుడు. 'ఎగిరి దాటడం సాధ్యం కాదు' అనే కదా? కానీ, హనుమంతుడు ఎగిరే సముద్రం దాటాడు. రావణుడు ఎగిరే దాటాడు. నావ లేకపోతే కుదరదని చెప్పిన విభీషణుడూ తర్వాత ఎగిరే సముద్రం దాటతాడు. కవి, కథలో అనేక పాత్రల చేత ఎగిరించి సముద్రాలు దాటిస్తూనే ఉన్నాడు. అయినా 'నావ లేకపోతే సముద్రం దాటడం కుదరద'ని తర్కం మాట్లాడుతున్నాడు. పోనీ లెండి, 'ఎగరడం' కుదరదని మాత్రం చెప్పేశాడు. నిజం అదే కాబట్టి, ఆ నిజం చెప్పకుండా ఉండలేకపోయాడు. ★

ఒత్తిడి చేసి అయినా, రాజుని మంచి మార్గంలోకి తేవాలి. మీరందరూ మహారాజుకి శతృవులే గానీ మిత్రులు కాదు. నేను వొక్కడినే రాజు క్షేమం కోరి నిర్భయంగా సత్యం చెపుతున్నాను. శ్రీరాముణ్ణి క్షమాపణ కోరి మనం ఈ ప్రమాదం లోంచి బయటపడాలి. అంతటి వీరుడితో యుద్ధం వాంఛనీయం కాదు. మన రాజ్యంలో మహా వీరులైనా అతడి ముందు నిలబడలేరు ప్రహస్తా! నువ్వే కాదు. నికుంభుడూ, ధూమ్రుడూ, ఇంద్రజిత్తూ .... చివరికి మహారాజు కూడా యుద్ధ రంగంలో శ్రీరాముడి ఎదురుగా ....”[357]

“ఆగు. ఇక నోరు విప్పకు ....” ఇంద్రజిత్తు బుసలు కొడుతూ లేచాడు – “సిగ్గు విడిచిన నీ మాటలు నే నిక వినలేను. పిన తండ్రివైనా, పెద్ద వాడివైనా, నిన్ను ధిక్క రించకుండా వుండలేను. మహారాజునే అవమానించే సాహసానికి దిగావా? రాముణ్ణి క్షమాపణ కోరాలని ఎంత సిగ్గు లేని మాట మాట్లాడావు! మన జాతి స్త్రీని అవమానించినందుకూ, మన దండకారణ్యంలో కాలు పెట్టి మనకు హాని కలిగించినందుకూ, రాముడే లంకాధి పతిని క్షమాపణ కోరాలి. శతృవు చేసిన పనికి పౌరుష పడని పిరికి పందనీ, శక్తి హీనుణ్ణీ, పులస్త్య వంశంలో నిన్ను ఒక్కణ్ణే చూస్తున్నాను. రాముడితో సంధి ప్రసక్తి లేదు. ఇది మన జాతి కీర్తి ప్రతిష్టలకు సంబంధించిన విషయం. ఈ యుద్ధం జరిగి తీరుతుందని గ్రహించు!” అని హెచ్చరించి వెంటనే కూర్చున్నాడు.

విభీషణుడు చలించని గాంభీర్యంతో నిర్భయంగా, తీక్షణంగా చూశాడు. “నాయనా! నువ్వింకా చిన్న వాడివి. ఆపదలు వచ్చినప్పుడు ఆవేశం పనికి రాదు. ఆలోచన విడిచిపెట్టి, రోషం పెంచుకుంటున్నావు, రాము డితో వైరం నీకే హాని అని తెలుసుకోలేక పోతున్నావు. నువ్వు మహా వీరుడివే గానీ మూర్ఖుడివి. మహారాజుకి పుత్రుడవే గానీ శత్రువువి. మహారాజుని యుద్ధానికి ప్రోత్సహించి మృత్యు ముఖానికి నడుపుతున్నావు. శ్రీరాముడు లంకని సర్వ నాశనం చేస్తాడని నే నెంత చెప్పినా వినకుండా మిడిసి పడుతున్నావు! అన్నీ నీకే తెలుసుననే అహంకారంతో నా హితోక్తులు ధిక్కరించి ప్రగల్భాలు పల్కుతున్నావు. తెలిసీ తెలీక తొందరపాటు నిర్ణయాలు చేసే నీ వంటి మూర్ఖుణ్ణి నిర్దయగా వధించాలి. నీ వంటి అజ్ఞానిని ఆలోచన కోసం రాజకీయం లోకి పిలిచిన వాణ్ణి కూడా వధించాలి.[358]

లంక క్షేమం గురించి మీ రెవ్వరూ యోచించినట్టు

---

**357.** **యుద్ధ, సర్గ 14, శ్లోకం 6:** రాముడితో ఎంతెంత రాక్షస వీరులైనా చాలలేరని చెబుతున్నాడు విభీషణుడు. “కుంభ కర్ణుడు, ఇంద్రజిత్తు, మన రాజు, మహాపార్శ్వ మహోదరులు, నికుంభకుంభులు, అతికాయుడు, యుద్ధములో రాముని ముందు నిలుచుటకు సమర్థులు కారు” అంటున్నాడు. రాజుని పట్టుకుని, “నువ్వు అసమర్థుడివి. నీ శతృవు మహా ఘనుడు. నువ్వెందుకూ పనికిరావు. నామాట విను” అని చెప్పడం నిజంగా రాజుకి నచ్చజెప్పే విధానమేనా? రాజుకి కోపం తెప్పించాలనే విభీషణుడి ప్రయత్నం అంతా. ★

**358.** **యుద్ధ, సర్గ 15, శ్లోకాలు 10, 11, 12:** విభీషణుడు ఇంద్రజిత్తుని ఎలా తిడుతున్నాడో చూడండి! “నిన్నే చంపవలయును; లేదా బాలుడుగను, దుందుడుకు స్వభావము గలవాడుగను, పట్టిన పట్టు విడువని వాడుగను నుండు నిన్ను మంత్రాలోచన చేయగల వారి సమీపమునకు ఈ సభకు బిలుచుకొని వచ్చిన దుర్మతిని అయినా చంపవలయును.” (రావణుణ్ణి చంపాలని విభీషణుడి అర్థం!)

“కృత్యాకృత్య వివేకశూన్యుడుగను, పెద్దలచే శిక్షింపబడని వాడుగను, క్రూరమైన స్వభావముగల వాడుగను, అల్పబుద్ధిగల వాడుగను, దురాత్ముడుగను, మూర్ఖుడుగను నుండు నీవు, బాల్యముచే నిటుల చెప్పుచున్నావు. నీవు, కొడుకని పేరు పెట్టుకొని, స్నేహితుడుగ నగుపడుచు, రావణునికి శతృవుగ నున్నావు!” – ఈ రకంగా సాగింది విభీషణుడి తిట్ల ప్రవాహం! విభీషణుడు వర్ణించినట్టు, ఇంద్రజిత్తు మూర్ఖుడా? రాజకీయాలు మాట్లాడటానికి పనికిరాని అసమర్థుడా? గొప్ప గొప్ప యుద్ధాలు చేసి జయించిన వాణ్ణి యుద్ధ విషయాలు మాట్లాడటానికి పిలవడం తెలివి తక్కువ పనా? విభీషణుడి మాటల్లో ఒక్క మాటైనా సమర్థనీయంగా ఉందా? ఇంద్రజిత్తుని చంపెయ్యాలట! ఇంద్రజిత్తుని సభకి పిలిచిన వాణ్ణి కూడా చంపెయ్యాలట! ఇంద్రజిత్తుని సభకి పిలవటం, అంత తప్పన్న మాట! విభీషణుడి మాటలు సమంజసంగా లేకపోవటానికి కారణం, అతని ఆలోచనలు కపటంగా ఉండటమే.

విభీషణుణ్ణి ఉత్తముడిగా చూపించటానికి కవిగారు తెగ తంటాలు పడుతున్నారు. విభీషణుడు కపటం లేని ఉత్తముడే అనుకుందాం. లంక, యుద్ధ ప్రమాదంలో చిక్కటం ఇష్టం లేక, లంకని రక్షించాలనే ఆరాటంతో మాత్రమే, రావణుణ్ణీ ఇంద్రజిత్తునీ, చనువు వల్ల తీవ్రంగా తిట్టాడనుకుందాం. తమ దేశ క్షేమం కోసం అలా తిడితే తిట్టవచ్చు. కానీ, తమకు శతృవైన రాముడి మీద అంత భక్తీ, అంత గౌరవం ఉండవలసిన అవసరం ఏమిటి? రాముడి తప్పేమీ లేదని వాదించవలసిన అవసరం ఏమిటి? రాముడి ముందు రాక్షసులెవ్వరూ నిలబడలేరని తమ జాతిని అవమానించుకోవలసిన అవసరం ఏమిటి? యుద్ధం వద్దని వాదించటానికి, శతృవు మీద భక్తీ, గౌరవం, చూపించాలా? విభీషణుడి మాటల వల్లా, ప్రవర్తన వల్లా, ఎప్పటికప్పుడు అతని కపటత్వం బయటపడుతూ వుంటుంది. ★

లేదు. రామ బాణాల మహత్యం మీరేమీ గ్రహించినట్టు లేదు. అవి సామాన్యాలు కావు సుమా! వాయు వేగాలు! వజ్రాయుధాలు! వాటికి చిక్కకుండా తప్పుకోవాలంటే అది మీ వల్ల కాదు...."

"విభీషణా! రామ బాణాల్ని అంతగా వర్ణిస్తున్నావు. వాటి దెబ్బ లెప్పుడు రుచి చూశావు?" అని అరిచా రెవరో.

విభీషణుడా హేళనను లక్ష్య పెట్టకుండా గాంభీర్యం ప్రదర్శిస్తూ తన ప్రసంగం తను కొన సాగించాడు – "శ్రీరాముడు ధర్మాత్ముడు. మహా రథికుడు. ఇక్ష్వాకు వంశంలో పుట్టిన పరాక్రమవంతుడు. సమస్తమైన ప్రజ లకూ ప్రీతి పాత్రుడు. ఆ మహాను భావుడి యుద్ధ కౌశలం గ్రహించలేక మూర్ఖుల్లాగ మాట్లాడుతున్నారు మీరు. యమ దండాల వంటి రామ బాణాలు మీదపడి రాక్షసుల శిరస్సులు ఛేదించక ముందే శ్రీరాముడి ధర్మ పత్నిని ధనధాన్యాలతో, బహుమానాలతో, సమస్తమైన ఆభరణాలతో, శ్రీరాముడికి అప్పగించి, ఆ కరుణా సముద్రుడి పాద పద్మాల మీద మోకరిల్లి ...."

రావణుడు రుద్రుడై మహాసర్పం లాగ బుసలు కొడుతూ, "చాలించు మూర్ఖుడా, నీ నీచోక్తులు! ...." అంటూ గర్జించాడు. "నా ఎదటే నా శత్రువుని ఇంత అధికంగా కీర్తిస్తున్నావు. ఎంత సాహసం నీకు! నాకు మిత్రుణ్ణనీ, ఆప్తుణ్ణనీ చెప్పుకుంటూనే శత్రువు పక్షాన నిలబడుతున్నావు. సీతని విడిచి పెట్టమని నా అభీష్టానికి విరుద్ధంగా చెప్పడంలో నీ ఆంతర్యం ఏమిటి? రాముడు చేసిన దౌర్జన్యానికి ప్రతీకారం తీర్చుకోవాలనే పౌరుషం లేదా? నువ్వు మాత్రమేనా లంక క్షేమం కోరేవాడివి? నీ హితోక్తుల నైజం నేను గ్రహించలేదని భ్రమపడకు సుమా! నేను లంకాధిపతినీ, ఐశ్వర్యవంతుణ్ణీ, శత్రు భయంకరుణ్ణీ కావడం నువ్వు సహించలేకపోతున్నావు.

జ్ఞాతుల ఔన్నత్యం జ్ఞాతులే ఓర్వలేరనే లోక నీతిని నిజం చేశావు. ఏనుగుల్ని పట్టడానికి ఏనుగులే సహాయం చేసేటట్టు జ్ఞాతుల్ని నాశనం చెయ్యడానికి జ్ఞాతులే సహకరిస్తారు. స్త్రీలలో చాపల్యం ఉన్నట్టు, బ్రాహ్మణుల్లో నిగ్రహం ఉన్నట్టు, జ్ఞాతుల్లో దుర్మార్గం ఉంటుంది.[359] నీవంటి నీచుడు ఇక నా రాజ్యంలో ఉండటానికి అర్హుడు కాదు" అంటూ కళ్ళతో నిప్పులు కురిపించాడు.

మహారాజు నోటి నించి వొచ్చిన ఆ చివరి మాటలు విభీషణుణ్ణి ఆనంద పారవశ్యంలో ముంచెత్తాయి. మొహంలో విషాదం గుమ్మరిస్తూ ఖిన్నుడై తలవంచి మహారాజుకి నమస్కారాలు చేశాడు – "మహారాజా! నీకు ఆగ్రహం కలిగించాను. మన్నించు. నీ మేలు కోరడం తప్ప నాకు రెండో ఆలోచనే లేదు. ఆవేశపడకు. కోపం ధర్మగుణాన్ని నాశనం చేస్తుంది. సుఖ శాంతుల్ని హత మారుస్తుంది. ఈ సేవకుడి మాటలు కొట్టిపారెయ్యకు. సీతాదేవిని విడిచిపెట్టడం తప్ప వేరే మార్గం లేదు. కలహ కారణం అయ్యే వస్తువుని ఎంత మక్కువ ఉన్నా విడిచి పెట్టెయ్యాలి. లంక క్షేమంగా ఉండాలి. లంకని రక్షించే నువ్వు క్షేమంగా ఉండాలి. సీతాదేవిని శ్రీరాముడికి అప్ప గించి ధర్మం పాటించు. అధర్మం విడిచిపెట్టు."

"ఇక చాలించు నీ ప్రేలాపన. నాకు ధర్మా ధర్మా లెవరూ బోధించే అగత్యం లేదు. హద్దులు మీరి ప్రవ ర్తించకు!" అని రావణుడు తీక్షణంగా చూసి మౌనం వహించాడు.

మహారాజు క్షమించి ఊరుకుంటాడేమోనన్న సందేహం కలిగింది విభీషణుడికి. మహారాజుకి ఇంకా తగినంత కోపం రానందుకు చాలా నిరుత్సాహం కలి గింది. ఇంకా ధైర్యంగా మాట్లాడి మహా రాజుకి భరించ లేనంత కోపం తెప్పించాలనే ప్రయత్నంతో నిర్లక్ష్యంగా చూశాడు – "మహారాజా! నా హితోక్తులు నీ చెవికెక్క లేదు. నీకు వినాశకాలం దాపురించింది. నీ ఆయుష్షు ముగిసిపోయింది. శ్రీరాముడి బారి నుంచి నిన్ను ఎవరూ తప్పించలేరు. ఆకాశానికి ఎగిరినా, పాతాళంలో నక్కినా, మృత్యువు వొళ్ళో దాక్కున్నా, దేవతలంతా కలిసి నిన్ను రక్షించినా, ప్రాణాంతకాలైన రామ బాణాలు నిన్ను విడిచి పెట్టవు. ఇప్పటికైనా నా మాటలు విని ...."

రావణుడు ఉగ్రుడైపోయాడు – "ఛీ, రాజద్రోహీ! నువ్వే నా మాటలు విను! నీకు దేశ బహిష్కార శిక్ష విధి స్తున్నాను. తక్షణం నా రాజ్యం విడిచి వెళ్ళు! కాల సర్పంతో కలిసి జీవించవచ్చును గానీ, మిత్రుడి రూపంలోనున్న నీ వంటి శత్రువుతో, సహ జీవనం మహా దోషం. నీచుడా! .... ఈ క్షణంలోనే లంకా రాజ్యం విడిచి వెళ్ళు .... తోడబుట్టిన వాడివనే కనికరంతో మరణ శిక్ష వెయ్యకుండా విడిచి పెడుతున్నానని గ్రహించు!"[360]

---

**359.** **యుద్ధ, సర్గ 16, శ్లోకం 9:** "గోవులకు, సంపద కలగజేయు స్వభావము గలదు. బ్రాహ్మణుల యందు ఇంద్రియ నిగ్రహము గలదు. స్త్రీల యందు చపలత గలదు. జ్ఞాతుల యందు అపాయము కలదు" అంటున్నాడు రావణుడు. బ్రాహ్మల పట్లా, స్త్రీల పట్లా, రాముడికి ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయో, రావణుడికీ అలాంటి అభిప్రాయాలే ఉన్నాయి. బ్రాహ్మణుల మీద భక్తీ, స్త్రీల మీద చులకనా! ★

**360.** రావణుడు విభీషణుడికి మరణ శిక్ష వెయ్యలేదు. పోనీ చెరసాలలోనైనా పెట్టలేదు. విభీషణుడితో రాముడికి చాలా అవసరం ఉంది కాబట్టి, కవి, విభీషణుడికి దేశ బహిష్కార శిక్ష వేయించాడు. విభీషణుణ్ణి వెంటనే లంక నించి రాముడి ➔

మహారాజు గర్జనతో విభీషణుడు తల వాల్చేశాడు. "మహాప్రసాదం ప్రభూ! నువ్వు నాకు తండ్రితో సమానుడివి. నన్ను రక్షించడానికైనా శిక్షించడానికైనా నువ్వే అర్హుడివి. కానీ, నీ సర్వ నాశనం కోరి చెప్పిన వారంతా నీకు మిత్రులై, నీ క్షేమం కోరిన వాణ్ణి నేను నీకు శత్రువునయ్యాను. నా మీద దారుణమైన నిందలు మోపి నిర్దయగా నన్ను దూరం చేస్తున్నావు. నేను లేక పోవడమే నీకు సంతోషం అయితే, నే నిప్పుడే వెళ్ళి పోతాను. నువ్వు సుఖంగా ఉండడమే నాకు కావాలి. నిన్ను నువ్వు రక్షించుకో. లంకని రక్షించు. రాక్షస జాతిని రక్షించు. ఎప్పుడూ నీకు శుభం కలగాలి. జయం కలగాలి. ఇక నీ పాదాల ముందు నుంచి శెలవు తీసు కుంటాను ...." అని ఉత్తరీయం కొంగుతో కళ్ళు వొత్తు కుంటూ మళ్ళీ నమస్కారం చేసి వినయంగా వెనక్కి తిరిగాడు.

సభ నిశ్శబ్దం అయింది. మహారాజు నిర్ణయాన్ని ఎవ్వరూ వ్యతిరేకించనట్టు అందరూ మౌనం వహిం చారు.

విభీషణుడు కళ్ళ నీళ్ళు వొత్తుకుంటూ తలవొంచి ప్రముఖుల ఆసనాల ముందు నించి నడుస్తూ వెళ్ళాడు.

అగ్ని పర్వతం బద్దలై శాంతించినట్టు, రావణుడు, కోపోద్రేకం తగ్గి శాంతించాడు.[361]

సముద్రం విసుగు లేకుండా ఆడుకునే పిల్లల లాగ విసుగు లేకుండా హోరు పెడుతోంది. 'మానవుడు నన్ను దాటగలడా?' అని క్షణ క్షణం గర్వపడుతోంది.

తీరం పొడుగునా చెట్టు కింద వానర సైన్యం విశ్రాంతి తీసుకుంటోంది.

శత్రుజాడల కోసం అన్వేషిస్తోన్న సైనికులు అప్రమత్తులై కాపలాలు తిరుగుతున్నారు.

దూరం నించి ఐదుగురు వ్యక్తులెవరో తమ దిక్కుగా నడిచి రావటం ఆ దిక్కుగా ఉన్న వానరులందరూ చూశారు. ఆ వచ్చే వ్యక్తులు విలువైన బట్టలతో, ఆభరణా లతో, ఆయుధాలతో, మెరిసి పోతున్నారు.

సుగ్రీవుడు కూడా ఆ కొత్త వారిని చూశాడు. చూడటమే తడవుగా మంత్రుల్లోకి తప్పుకున్నాడు. వాళ్ళ గూళ్ళ సందుల్లోంచి కళ్ళు చిట్లించి చూస్తూ, "ఆ వచ్చే వాళ్ళు రాక్షసులే .... .... సందేహం లేదు. వాళ్ళ వేషాలూ, .... కత్తులూ చూడరాదూ? ఇంకెందుకూ? మనల్నందర్నీ చంపడానికే వొచ్చేస్తున్నారు. అసలే రాక్షసులు మహావీరులు. పైగా చేతుల్లో ....... బడితెల్లాగ అంతంత .... కత్తు .... త్తు .... త్తు ...." అతి కష్టం మీద వొణుకు ఆపుకుంటున్నాడు.[362]

వానరులందరూ కుతూహలంగా ఆ వొచ్చే వాళ్ళనే చూస్తూ నించున్నారు – "రాక్షసులే గానీ, వాళ్ళు మనల్ని

---

➔ దగ్గరికి పంపించాడు. యుద్ధ సమయంలో శతృవుల పక్షాన చేరటానికి సిద్ధంగా వున్న రాజ ద్రోహిని, రావణుడు, దేశం నించి బయటికి పంపించాడంటే, రావణుడు బొత్తిగా తెలివి తక్కువ వాడన్నమాట. కవి, రావణుణ్ణి ప్రతి క్షణం తెలివి మాలిన వాణ్ణి చేస్తూ ఉంటాడు.

విభీషణుడూ, రాముడూ కలుసుకునే విధంగా కథ నడవాలంటే విభీషణుడికి దేశ బహిష్కార శిక్షే వెయ్యక్కర్లేదు. చెరసాలలో పెట్టినా, విభీషణుడు తప్పించుకుని పారిపోవొచ్చు. అప్పుడు రావణుడు తెలివి తక్కువగా ప్రవర్తించినట్టు అవదు. కథ దారిన కథా నడుస్తుంది. కవికి ఎప్పుడూ రాముడికి అనుకూలమైన పనులు చెయ్యాలనే ఆరాటం తప్ప, రెండో ఆలోచన ఉండదు. ★

**361.** వాల్మీకి రామాయణంలో, విభీషణుడు రావణుడికి నీతులు చెప్పడం మూడు ఘట్టాల్లో, ఒకసారి జరిగిందే మళ్ళీ జరుగుతుంది.

మొదటిసారి: సభలో, యుద్ధం వొద్దనీ, సీతని ఇచ్చెయ్యమనీ, నీతులు చెపుతాడు. (ఈ సభలో కుంభకర్ణుడు వుండడు.) రెండోసారి: రావణుడి అంతఃపురానికి వెళ్ళి, దేశంనిండా అపశకునాలెలా ఉన్నాయో చెప్పి, నీతులు చెప్పి వస్తాడు. మూడోసారి: మళ్ళీ సభలో తిట్లూ, నీతులూ, హెచ్చరికలూ కొనసాగిస్తాడు. (ఈ సభలో కుంభకర్ణుడు కూడా ఉంటాడు.) ఈ సభలో, రావణుడు, కుంభకర్ణుడితో – "నువ్వు ఆరు నెలలు నిద్రపోయి ఇప్పుడే లేచావు. అందుచేత నేను సీతను తెచ్చిన సంగతి నీకు తెలీదు" అంటాడు. (సీతని తెచ్చి పది నెలలైంది. ఆరు నెలలు కాదు.) ఈ సభలో విభీషణుడు, ప్రహస్తుణ్ణీ, ఇంద్రజిత్తునీ, మహారాజునీ తెగ తిట్టి నీతులు చెపుతాడు. (తిట్లు ఫర్వాలేదు గానీ, ఈ 'నీతుల్లో' ఎంత విసిగించాడో!) అప్పటికి మహారాజుకి వొళ్ళు మండి విభీషణుడికి దేశ బహిష్కార శిక్ష వేశాడు. ఈ మూడు ఘట్టాల్లో సంగతులన్నిటినీ నేను ఒక్క ఘట్టంలోకే చేర్చి రాశాను.

'వాల్మీకి రామాయణం'లో, విభీషణుడు, రావణుడు వెళ్ళిపొమ్మనగానే తన అనుచరులతో కలిసి రయ్యిన ఆకాశంలోకి ఎగిరి, అక్కడ కాస్సేపు నిలబడి రావణుణ్ణి మళ్ళీ తిట్టి, అప్పుడు ఎగురుకుంటూ వెళ్ళిపోతాడు. ★

**362.** **యుద్ధ, సర్గ 17, శ్లోకాలు 2 .... 5:** విభీషణుడు నలుగురు అనుచరులతో ఆకాశంలో నిలబడి ఉన్నాడు. "మేరు శిఖరము వంటి ఆకారము కలిగి ఆకాశములో నుండి వెలుగుచుండు మెరుపు వలె నుండు విభీషణుని, భూమి మీద నుండిన వానర సేనాపతులు, ఏక కాలములో చూచిరి." ➔

చంపడం ఏమిటి? .... నువ్వు సరే నను మహారాజా! వాళ్ళనేం చేస్తామో చూడు" అంటూ వాళ్ళని చితకదన్నె య్యాలని ఉత్సాహపడి పోయారు.

సుగ్రీవుడు మళ్ళీ మంత్రుల చంకల సందుల్లోంచి చూసి – "వాళ్ళ దుంపలెగ! ఇటే వొస్తున్నారే!" అంటూ ఇంకా లోపలికి లోపలికి .... దూరాడు.

ఆ వొచ్చేవాళ్ళు జంకూ గొంకూ లేకుండా వొచ్చే శారు. వారిలో ఒక వ్యక్తి ఇంకా ముందుకు వచ్చాడు.

సుగ్రీవుడి చుట్టూ ఉన్న వీరులు గబ గబా ఇటూ అటూ తప్పుకుని – "ఈయనే మా రాజు. మా రాజులం మేము కాదు" అన్నట్టు సుగ్రీవుణ్ణి బయట పెట్టారు.

సుగ్రీవుడు నేరుగా వెనక్కి వెనక్కి జొరబడాలని ప్రయత్నించాడు గానీ, సందు దొరక్క పళ్ళు బిగబట్టి వీపు నీలుడికి ఆన్చి వొణుకు అరికట్టుకుంటూ నిల్చు న్నాడు.

రాక్షసుల్లోంచి ముందుకు వచ్చిన వ్యక్తి సుగ్రీవుణ్ణి చూస్తూ – "అయ్యా! మీరెవరో నే నెరుగను. నా పేరు విభీషణుడు. లంక నుంచి వచ్చాను. రావణుడి గురించి మీకు తెలుసు. ఆ పరమ దుర్మార్గుడికి తమ్ముణ్ణి నేను. మా అన్న, సీతాదేవిని చెరబట్టడం, నా కెంత మాత్రం ఇష్టం లేదు. ఆది నుంచీ మా అన్న చేష్టలు వ్యతిరేకిస్తూనే వున్నాను. సీతాదేవిని శ్రీరామచంద్రుడికి సమర్పించమని మా అన్నని ఎన్నిసార్లో ప్రార్థించాను. పోయే కాలం వచ్చినవాడు ఔషధాన్ని తిరస్కరించినట్టు, ఆ మూర్ఖుడు నా మాటలు చెవిని పెట్టలేదు. పైగా నిండు సభలో నన్ను అవమానించి దుర్భాషలాడి దేశ బహిష్కార శిక్ష విధిం చాడు. భార్యా బిడ్డల్ని కూడా విడిచి నాకు నమ్మకస్తులైన అనుచరుల్ని మాత్రం వెంట బెట్టుకొని శ్రీరాముణ్ణి శరణు కోరాలని వచ్చాను. శ్రీరాముడు కరుణా సముద్రుడని విన్నాను. ఆ మహానుభావు డెక్కడున్నాడు? నా మీద దయదల్చి ఆ పుణ్యాత్ముడికి నా సంగతులన్నీ విన్న వించండి" అని వినయంగా చేతులు ముడిచి నించున్నాడు.

సుగ్రీవుడికి కొంచెం వొణుకు తగ్గింది. దవడల నాట్యం, దంతాల సంగీతం, ఆగాయి. విభీషణుణ్ణి నొసలు చిట్లించి చూసి ఏమీ జవాబు చెప్పకుండా మొహం తిప్పేశాడు. నెమ్మదిగా .... పక్కకి, .... వెనక్కి .... తప్పుకుంటూ, దారి దొరికించుకుంటూ వెళ్ళి రాముడి దగ్గర పడ్డాడు. "విభీషణుడంట! రావణుడి తమ్ముడంట! లంక నించి వొచ్చేశాడంట .... ఏమో! ఎవడు నమ్ముతాడు? .... శత్రువులా ..... మరొకటా? .... అలాగే చెప్పి జొరబడతారు. గూఢ చారులేమో! .... నెమ్మదిగా .... ఆనూ పానూ కనుక్కుని గాని .... రానివ్వకూడదు ...." అంటూ చెప్పుకొచ్చాడు.

రాముడు సంభ్రమంతో వింటున్నాడు. "విభీష ణుడా! వచ్చాడా! మన దగ్గరకి వచ్చాడా!" రాముడి మొహం సూర్యుణ్ణి చూసిన పద్మం లాగ విప్పార బోయింది. పట్టలేని సంతోషంతో కల కల్లాడబోయింది. చప్పున .... ఆపుకున్నాడు – "సుగ్రీవా! ఎవరు చెప్పారు నీకీ వార్త?"

"ఎవరు చెప్పటం ఏంటీ? నాతోటి మాట్లాడా డాయన. అన్నగారు దేశం నించి వెళ్ళగొట్టాడంట. ఎవడు నమ్ముతాడు? నిన్ను శరణు కోరాలని వొచ్చా డంట! నే న్నమ్మను సుమా! .... నెమ్మదిగా మనలో జొరబడి... అసలైన వాళ్ళందర్నీ చంపెయ్యాలనీ .... అమ్మో, ఇంకెవర్ని? నన్నూ .... నిన్నేగా? .... వొద్దు .... రాక్షస జాతి వాళ్ళని చచ్చినా నమ్మకూడదు. వాళ్ళ కెన్ని తెలివితేటలో! ...."

రాముడికి ఆపుకోలేనంత ఆనందం కలిగింది .... సుగ్రీవుడి మాటలేవీ చెవిన పడటం లేదు. ఆనందం కట్టలు తెంచుకుంటోంది.

లంకలో విశేషాలు హనుమంతుడు చెప్పిన దగ్గ ర్నుంచీ రాముడి ధ్యాస అంతా, విభీషణుడి మీదే. విభీష ణుడి దగ్గిర నించీ ఏమైనా వార్తలు వొస్తాయేమోనని ఎదురు చూస్తూనే వున్నాడు. వార్తలెందుకూ? అతనే వొచ్చాడు! అదే అసలైన వార్త!

విభీషణుడు గూఢచారి కాడు. శత్రుపక్షంలో వాడు కాడు. పూర్తిగా నమ్మదగ్గవాడే. అతడు, తన అన్న నాశ నమే కోరుతున్నాడు. సుగ్రీవుడి లాగానే రాజ్యకాంక్షతో ఉన్నాడు. అతడు తన పక్షాన చేరడం ఎంతో అవసరం. లంక రహస్యాలెన్నో తెలుస్తాయి. యుద్ధంలో తేలిగ్గా జయం దొరుకుతుంది.

రాముడి పెదిమలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. కళ్ళు ఆశతో మెరుస్తున్నాయి.

సుగ్రీవుడు ఇంకా చెపుతూనే ఉన్నాడు – ".... గుడ్లగూబ కాకుల్లో జేరి కాకుల్నే చంపేస్తుంది, చూశావా? అలాగే .... వీళ్ళు మనల్ని చంపేస్తారు .... నమ్మగూడదసలు. విభీషణుడికి మరణ శిక్ష వేసెయ్య వలిసిందే. అంతకన్నా మార్గం లేదు. ........ ఏం చేస్తాం మరి?"

---

➔ విభీషణుణ్ణి చూసి సుగ్రీవుడు ఏమంటున్నాడో చూడండి! "వానరులారా! సకల ఆయుధములు గల ఈ రాక్షసుడు, నలుగురు రాక్షసుల తోడ మనలను జంపుటకే వచ్చుచున్నాడు! వీనిని చూడుడు. ఇందుకు సందేహము లేదు" – మహా పరాక్రమవంతుడైన ఈ సుగ్రీవ మహారాజు, తన చుట్టూ కోట్ల కోట్ల కోట్ల వీరుల్ని పెట్టుకొని, ఐదుగురు శత్రువుల్ని చూసి ఎంత వీరోచితంగా వణుకుతున్నాడో! ★

రాముడు గంభీరమైన చూపుతో, "ఆయన ఎక్కడు న్నాడోయి!" అని నిదానంగా అడిగి ఆతృత ఆపుకో గలిగాడు.

"ఉన్నాడులే. మన వాళ్ళందరూ చుట్టూ ఉన్నారు. కదిలాడంటే తాట వొలుస్తారు. కల్లి బొల్లి కబుర్లు చెప్పేస్తే నమ్మేస్తారనుకున్నాడు పాపం! బత్తెం తీసుకుని పనిచేసే వాళ్ళనైనా నమ్ముతాం గానీ శతృవు లొచ్చి చేరతామంటే నమ్ముతామా?[363] ఇంకా ఆలశ్యం ఎందుకూ? ఆ మరణ శిక్షేదో .... దబ్బున వేసేద్దాం." సుగ్రీవ రాజు గారికి బాగా నచ్చే శిక్ష అదే.

రాముడు గంభీరంగా తల పంకించాడు. అంగ దుణ్ణీ, హనుమంతుణ్ణీ, జాంబవంతుణ్ణీ, చుట్టూ వున్న ప్రముఖులందర్నీ చూశాడు. "మీ మహారాజు చెప్పిన మాటలన్నీ సమంజసంగానే వున్నాయి. అవును, మనం ఆలోచించకుండా ఏ పనీ చెయ్యకూడదు. విభీషణుడి విషయం ఏం చేస్తే బాగుంటుందో జాగ్రత్తగా ఆలో చించాలి. మీరందరూ కూడా ఏమనుకుంటున్నారో చెప్పండి" అని తల వాల్చాడు.

వానర ప్రముఖులందరూ పొంగిపోతూ, "అయ్యో! నీకు తెలియందేముంది రామయ్యా? నీ మంచితనం వల్ల మమ్మల్ని అడుగుతున్నావు గానీ, ఏ కార్యం ఎలా చక్క బెట్టుకోవాలో అంతా నీకే తెలుసు. అన్ని శాస్త్రాలూ తెలి సిన వాడివి. నీకు వొకరు చెప్పాలా?" అంటూ రాముణ్ణి కీర్తిస్తూ సంతోషించారు.

అంగదుడు ప్రారంభించాడు–"విభీషణుడి మాటలు నేనూ విన్నాను. నమ్మకస్తుడిలాగే మాట్లాడుతున్నాడు. అంతమాత్రాన శత్రు పక్షంలో వాణ్ణి ఎలా నమ్ముతాం? సమయం దొరికేవరకూ నమ్మకంగానే మసులుతారు. తీరా వాళ్ళు అనుకున్న పనేదో చేసిం తర్వాత గానీ అసలు సంగతి తెలుసుకోలేం. విభీషణుడు వొచ్చి శరణు కోరాడు కదా అని మనలో చేర్చేసుకుంటే మేలు కంటే కీడే ఎక్కువ" అని ఆగాడు.

---

**363.** **యుద్ధ, సర్గ 17, శ్లోకం 22:** సైన్యాలలో ఉండే తేడాల గురించి సుగ్రీవుడు ఇలా చెపుతున్నాడు: "మిత్రులు పంపిన బలమును, ఆటవికుల బలమును (మిత్రాటవీ బలం), పరంపరగ వచ్చుచుండు సేనను (మూల బలమ్), భత్యమిచ్చి ఏర్పరచుకొను సేననూ (భృత్య బలమ్) గ్రహించవచ్చును. శతృ పక్షము నుండి వచ్చిన సేనను విడిచి పెట్టవలయును."

మూల బలమ్: రాజు దగ్గిర ఎప్పుడూ కొంత శాశ్విత సైన్యం ఉంటుంది. రాజు నించి ఈ సైన్యానికి పోషణ అందుతూ ఉంటుంది. ఇది, మూల బలమ్.

భృత్యు బలం: యుద్ధ సమయాలలో మూల బలం మాత్రమే చాలదు. తాత్కాలికంగా కొత్త సైన్యాల్ని ఏర్పర్చుకోవలసి ఉంటుంది. బత్తెమిచ్చి కొంతకాలం వరకే ఏర్పర్చుకునే సైన్యం భృత్యు బలం. (మూల బలానికి కూడా రాజు నించి ఏదో ఒక పద్ధతిలో, 'పోషణ' అందుతుంది. ఈ రకంగా చూస్తే, మూల బలం కూడా భృత్యు బలమే).

మిత్ర బలం: యుద్ధ సమయాల్లో ఒక రాజుకి మిత్రులైన రాజులు, తమ సైన్యాన్ని సహాయంగా పంపిస్తారు. అలాంటి సైన్యాలు, మిత్ర బలాలు.

ఆటవిక బలం: రాజు తన సైన్యాల్ని వృద్ధి చేసుకోవలసి వచ్చినప్పుడు, అత్యవసరం అయితే, సైనిక విషయాలలో ఏమీ క్రమశిక్షణ ఎరగని వారినీ, యుద్ధ కౌశలం అంతగా లేనివారినీ కూడా, కొత్త సైన్యంలోకి తీసుకుంటాడు. అలాంటి బలమే, ఆటవిక బలం.

సైన్యాలకు సంబంధించి ఈ లక్షణాలు రాజుల కాలానికే కాదు, ఈ నాటి మిలటరీకి కూడా ఉంటాయి. ప్రతీ ప్రభుత్వానికీ 'రెగ్యులర్ సైన్యాలు' ఉంటాయి. దీన్ని 'మూల బలం'గా తీసుకోవొచ్చు. ఇతర దేశాల నించి ఆయుధాలు కొన్నట్టే సైన్యాల్ని కూడా దిగుమతి చేసుకుంటూ వుంటారు. ఇవి కేవలం ఆర్థిక షరతుల మీదే ఒక దేశాన్నించి వొక దేశానికి వస్తాయి. ఇవి తాత్కాలికంగా పనిచేసే కిరాయి సైన్యాలు (మెర్సినరీస్) వీటిని భత్యం కోసమే పనిచేసే 'భృత్యు బలం'తో పోల్చవచ్చు.

ఈ నాడు ఒక ప్రభుత్వం ఇంకో ప్రభుత్వానికి, తమ రాజకీయ స్వభావాన్ని బట్టి, అవసరమైన సమయాలలో సైన్యాన్ని పంపడం ఉంది. ఇలాంటి సైన్యం, మిత్ర బలమే.

ప్రభుత్వం – అత్యవసర సమయాల్లో కొన్ని పనుల కోసం, మిలటరీలోకీ, పోలీసు శాఖలోకీ, గూండాల్నీ జేబుదొంగల్నీ బిచ్చగాళ్ళనీ వ్యభిచారిణుల్నీ, (లంపెన్ ప్రోలిటేరియట్ = అలగా శ్రామిక జనాల్ని) ఉపయోగిస్తూ వుంటుంది. అంతేగాక, జైళ్ళలో ఉండే ఖూనీకోరుల్నీ, బందిపోటు దొంగల్నీ, జైళ్ళ నించి విడుదల చేసి తనకు కావలసిన పనుల్లో వినియోగించుకుంటుంది. ఇటువంటి జనంలో, సైన్యానికి సంబంధించిన శిక్షణా, నేర్పరితనం ఉండవు. ఇలాంటి బలాన్ని, అటవీబలంతో పోల్చవచ్చు.

సుగ్రీవుడు చెప్పిన సైనిక భేదాలు, రాజుల కాలం నించీ ఈ నాటికీ సాగుతూనే ఉన్నాయి. కారణం – ఆ నాటి వ్యవస్థా, ఈ నాటి వ్యవస్థా 'దోపిడీ స్వంత ఆస్తి' పునాది మీద ఏర్పడ్డవిగా ఉండడమే.

'సైనికులు' అనేవాళ్ళందరూ శ్రామిక వర్గాల ప్రజలే. వీరు కేవలం బతుకుదెరువు కోసమే ఆ వృత్తిలోకి దిగి యుద్ధాల్లో ప్రాణాలు ఇస్తారు. ★

"విభీషణుణ్ణి మనలోనే ఉంచుకొని అతని చేష్టలన్నీ కనిపెడుతూ వుంటే సరి" అంటూ శరభుడనే సేనాపతి ముందుకు తోసుకొచ్చాడు, ఆ ఉపాయం ఇంకెవరైనా చెప్పేస్తారేమోననే కంగారుతో.

జాంబవంతుడు మాట్లాడబోతోంటే, పెద్దవాడు గదా అనుభవంతో చెపుతాడని అందరూ శ్రద్ధగా విన్నారు – "రావణుడు మనకు బద్ధశత్రువు. అతని తమ్ముడు కూడా మనకు శత్రువే. అన్నతో విరోధం పెట్టుకుని, తమ్ముడితో స్నేహం చేస్తామా? ఎప్పటికైనా వాళ్ళూ వాళ్ళూ ఒకటే అవుతారు .... అతణ్ణి వెళ్ళిపొమ్మనడం మంచిది" అని వూరుకున్నాడు జాంబవంతుడు.

రాముడు చాలా అసంతృప్తిగా, "ఊఁ ...." అని తల పంకించి మిగిలిన వాళ్ళవేపు చూశాడు.

మైందుడు ముందుకొచ్చాడు. "పూర్తిగా వెళ్ళి పొమ్మని చెప్పక్కర్లేదు గానీ శరభుడు చెప్పినట్టు విభీష ణుణ్ణి మనలోనే ఉంచుకుని కొన్నాళ్ళ వరకూ చాటుగా కనిపెడుతూ వుండాలి. అన్నగార్ని మన ముందు తిట్టా డుగా? చాటుగా అయితే ఏం మాట్లాడతాడో చూడాలి" అన్నాడు కుతూహలంగా. విభీషణుడి మీద గూఢచారి చర్యలు తనే చెయ్యాలన్నంత ఉత్సాహం ప్రకటించాడు మైందుడు.

ఎవరికి తోచిన ఉపాయాలు వాళ్ళు గబ గబా చెపుతున్నారు. కొందరు, ససేమిరా విభీషణుణ్ణి ఉంచుకో వద్దంటున్నారు. కొందరు, అతనికి కాళ్ళూ చేతులూ నోరూ కట్టేసి వుంచుకో వచ్చంటున్నారు.

మొత్తానికి అందరూ విభీషణుణ్ణి సందేహిస్తూ అతన్ని చేర్చుకునే విషయంలో వ్యతిరేకంగా వుండడం చూస్తే, రాముడికి చాలా ఇరుకున పడ్డట్టు అయింది.

ఆలోచనలతో రాముడి మనసులో కలవరపాటు మొదలైంది. సుగ్రీవుడి మంత్రులు విభీషణుణ్ణి గురించి కాస్త ఆలోచించటానికైనా ఒప్పుకుంటున్నారు గానీ .... సుగ్రీవుడైతే విభీషణుణ్ణి వెంటనే చంపెయ్యాలంటు న్నాడు. ఇంత మంది అభిప్రాయాలు ధిక్కరించి తను ఇంకోలా నిర్ణయిస్తే బాగుంటుందా? సుగ్రీవుడికీ, అతని విశ్వాస పాత్రులకూ కోపం రాకుండా వుంటుందా? కానీ విభీషణుణ్ణి వదులుకోవటం ఎంత తెలివి తక్కువ! అంత కన్నా అజ్ఞానం ఇంకేమీ వుండదు. ఈ మూర్ఖుల మాటలు లక్ష్యపెట్టకూడదు. తను విభీషణుణ్ణి చేర్చుకోక పోతే లంకని జయించడం కల్ల!

ఆలోచనల్లోంచి తేరుకుంటూ రాముడు, హను మంతుడేమీ మాట్లాడలేదని గ్రహించి, "నువ్వూ అంతేనా?" అన్నట్టు అతని వేపు చూశాడు.

హనుమంతుడు కూడా విభీషణుణ్ణి గురించే ఆలో చిస్తున్నాడు. రాముడు, చూపులతో పలకరించ గానే కొంచెం సిగ్గుపడుతూ నమస్కారం చేశాడు. "నీకు చెప్పేవాడినా రామయ్యా? అందరికన్నా ఎక్కువేం తెలుసు నాకు? శత్రువుని నమ్మాలంటే భయం కలిగే మాట నిజమే. కానీ .... విభీషణుణ్ణి గురించి సందే హించక్కర్లే దనిపిస్తోంది నాకు" అని ఆగాడు. మహారాజు అవునన్నది తను కాదంటే సుగ్రీవుడి కెక్కడ కోపం వస్తుందోననే జంకుతో అతి వినయం ప్రదర్శిస్తూ తన తెలివి తను బయట పెట్టాడు. ".... నన్ను లంకలో కాపాడింది విభీషణుడే కదా? లేకపోతే మళ్ళీ మీ మొహాలు చూసేవాడినా? .... ఆయన ఎప్పుడూ అన్నకి వ్యతిరేకంగానే వున్నట్టున్నాడు. అన్న దుర్మార్గుడని ఆయనకి మాత్రం తెలీదా యేంటి? .... రామయ్యా! నీ గురించి ఇదివరకే విన్నాడు కదా? .... నువ్వు వాలిని చంపటం .... సుగ్రీవ మహారాజుకి రాజ్యం ఇవ్వటం .... అందరికీ తెలిసిన సంగతులే కదా? .... నిన్ను ఆశ్రయిస్తే తనకి అలాంటి లాభం కలుగుతుందని ఆశ పడి వుంటాడు. నిజంగానే నీ పక్షంలో చేరే ఉద్దేశంతో వొచ్చి వుంటాడు. అలాంటివాడు మనకి మేలు చేస్తాడు గానీ కీడెప్పుడూ చెయ్యడు. మైందుడూ వాళ్ళూ తమకేదో తెలిసినట్టు విభీషణుణ్ణి కనిపెడుతూ వుండాలని చెపు తున్నారు గానీ, ఆ పనెలా కుదురుతుందీ? మనం నమ్మటం లేదంటే ఆయనెంత చిన్నబుచ్చుకుంటాడూ! ఆయనేదో కుట్రతో వచ్చాడని నాకేమీ అనుమానం కలగటం లేదు మరి" అని ముగించాడు.

విభీషణుడి ఆంతర్యం అంతా హనుమంతుడు గ్రహించగలిగాడంటే రాముడికి అమితమైన ఆశ్చర్యం కలిగింది. తనవంటి గొప్ప జ్ఞానులకూ, రాజకీయ వేత్త లకూ మాత్రమే అవగతమయ్యే రహస్యాలు ఇంత ఆటవికుడు కూడా గ్రహించగలిగాడే!

విభీషణుడు తన స్వార్థం కోసమే శత్రుపక్షంలో చేరా లని వచ్చిన సంగతి నలుగురూ గ్రహిస్తే, అటువంటి వాడిని చేరదీసినందుకు తనని తప్పుబట్టరా? అది రాజ నీతేనని సమర్థించగలిగినా, తన లాభం కోసం అన్నతో వైరం పెట్టుకుని నిర్భయంగా వచ్చిన వాడికి శరణు ఇవ్వ డంలో తన కారుణ్యం ఏముంటుంది? ... విభీషణుడి స్వార్థం గురించి తను అంతగా ప్రస్తావించకూడదు.

రాముడు గంభీరమైన చూపులతో అందర్నీ పరి కిస్తూ తల పంకించాడు. "మీరందరూ చెప్పిన ఆలోచన లన్నీ ఎంతో చక్కగా ఉన్నాయి. విభీషణుడు స్వార్థంతోనే వచ్చి వుండవచ్చు. లేక ఏ స్వార్థమూ లేకుండా కేవలం రావణుడు విధించిన శిక్షకు లోనై వచ్చి వుండవచ్చు. అతడు ఇక్కడికి మిత్రభావంతో వచ్చాడో శత్రుభావంతో వచ్చాడో దానితో నాకేమి అవసరం? ఆపదలో చిక్కుకుని నన్ను శరణు కోరుతూ వచ్చాడు. అదే నాకు ముఖ్యం. శరణు కోరిన వారిని సత్పురుషు లెన్నడూ తిరస్కరిం చరు" అని గంభీరంగా తలవాల్చి మౌనం వహించాడు.

"అయితే మా అభిప్రాయాలు ఎందుకు అడిగి నట్టు?" అన్నా రెవరో వొళ్ళు మండి .... మూలనించి.

అంత సాహసం చేసిన వారెవరో లక్ష్మణుడు కళ్ళతో ఎంత వెతికినా ఆ జనంలో పట్టుకోలేకపోయాడు.

విభీషణుడు రాజ్యం కోసం అన్నని వొదిలేసి రాముడితో చేరటానికి వొచ్చాడని హనుమంతుడు అన్న దగ్గర్నుంచీ .... సుగ్రీవుడికి ..... తనూ అలాగే రాముడితో మంతనాలు జరపడం .... అన్నని చంపించి రాజ్యం ఆక్రమించడం .... అన్నీ మనసు అడుగున మెదులుడు ప్రారంభమైంది.

"విభీషణుడూ నీలాంటి వాడేనన్నమాట!" అన్నా రెవరో లోపల ధైర్యంగా.

"ఛీ! నే నలాంటి వాణ్ణి కాను" అని లోపల ఎవరి మీదో కేకలేసి మొహం చిట్లించాడు సుగ్రీవుడు. రాముడి వేపు కోపంగా చూస్తూ, "శతృవు గురించి ఇంతసేపు ఆలోచించడం ఏంటో నాకేం నచ్చులేదు సుమా! .... అతన్నీ, అతని మంత్రుల్నీ ఈ పాటికి చంపెయ్యవలిసింది .... బోలుడు ఆలస్యం అయిపోయింది .... అవతల అన్నగార్ని ఇంత కష్ట కాలంలో వొదిలేసి శతృవు దగ్గిరికి వస్తాడా? .... అలాంటి వాడు ఇక్కడ మాత్రం ఏం నిర్వాకం చేసి మిడుకుతాడు? .... అన్నని ఆపదలో వొదిలేసి .... ఛీ! అంతంత దుర్మార్గాలెలా చేస్తారో గానీ .... ఎంత దుష్టత్వం!" నేనైతే అలా చెయ్యలేను సుమా అన్నట్టు మొహం చిట్లించాడు.

రాముడు సుగ్రీవుణ్ణి క్రీకంట చూశాడు – 'అవును, నువ్వేమీ దుర్మార్గాలు చెయ్యలేవు. నువ్వెంత ఉత్తముడివో అందరికీ తెలుసు' అన్నట్టు తీక్షణంగా హెచ్చరికగా చూసి, లక్ష్మణుడి వేపు తల తిప్పి చిరు నవ్వు నవ్వాడు. "సుగ్రీవుడెలా మాట్లాడుతున్నాడో చూశావా లక్ష్మణా! నీతి శాస్త్రాలేమీ చదవని వాళ్ళే ఈ విధంగా మాట్లాడుతారు. పోనీ శాస్త్రాలు చదవకపోయినా సుగ్రీవుడు పెద్దల ద్వారా అనుభవ జ్ఞానం అయినా తెలుసుకున్నట్టు లేదు"[364] అని మళ్ళీ తన చుట్టూ పెద్దలందర్నీ చూస్తూ ప్రారంభించాడు.

"రాజు ఎప్పుడూ ఒక ముఖ్యమైన నీతిని జ్ఞప్తిలో ఉంచుకోవాలి. తన దాయాదులూ, ఇరుగు పొరుగు దేశాల రాజులూ, ఎప్పుడూ తనకు శతృవులే. సమయం చిక్కితే వారు హాని కలిగించడానికే చూస్తారు. అది లోక సహజం. కానీ, ఉత్తములైన దాయాదులు కూడా ఉంటారు. అయినప్పటికీ, దాయాదులు దుర్మార్గంగా ఉంటారనే భయం వల్ల, ఎంత ఉత్తములైన రాజులైనా, మంచి దాయాదుల్ని కూడా శంకిస్తూనే వుంటారు. ఇక దుర్మార్గులైన రాజులు, దాయాదుల్ని శంకించకుండా వుంటారా? విభీషణుడు ఉత్తముడే అయినా, రావణుడు దుర్మార్గుడు గదా? తోడబుట్టిన వాణ్ణి అక్రమంగా శంకించి, అవమానించి, దేశంనుంచి వెళ్ళగొట్టించి వుంటాడు. అన్నదమ్ములైనంత మాత్రాన అందరూ ఉత్తములుగా ప్రవర్తిస్తారా? .... తండ్రి అంటే వినయ విధేయతలతో మసిలే నా వంటి పుత్రుడూ .... భరతుడి వంటి సోదరుడూ ఇంకెవ్వరూ ఉండరు" అని సుగ్రీవుణ్ణి క్రీకంట చూశాడు.

సుగ్రీవుడు చిన్నబుచ్చుకున్నట్టు తల వొంచుకుని వుండటం గ్రహించాడు – వెంటనే మొహం మీద నవ్వు మెరిపిస్తూ, "సుగ్రీవుడా! .... నీ వంటి మిత్రుడు కూడా లోకంలో ఎక్కడా ఉండడు సుమా! స్నేహితులకు ఉపకారం చెయ్యడంలో నీ సాటి ఎవ్వరూ రారు" అని మళ్ళీ చిరునవ్వుతో చూశాడు.

'భరతుని వంటి సోదరుడు' అన్న మాటలు చెవిన పడ్డప్పటినించీ, లక్ష్మణుడి ఇంగితం బుసలు కొడుతోంది. "భరతుడి వంటి సోదరుడా? మరి, లక్ష్మణుడి

---

**364. యుద్ధ, సర్గ 17, శ్లోకం 27: + సర్గ 18, శ్లోకాలు 5, 6:** విభీషణుడి విషయంలో సుగ్రీవుడి అభిప్రాయాలు చూడండి!

"పాపియగు రావణుని తమ్ముడగుటచే ఈ విభీషణుని, అతని మంత్రులతోడ బాగుగ దండించి చంపివేయవలయును .... ఈ రాక్షసుని పరిత్యజించవలయును గాని జేర్చుకొనరాదు. ఈ విభీషణుడు ఆపదలో నుండు అన్నను విడిచి పెట్టెను. ఇట్టివాడు లోకములో ఆపద కాలములో నెవ్వని అనుసరించి యుండును?" అంటున్నాడు సుగ్రీవుడు. తన అన్నకి తను చేసిందేమిటి? అన్న (వాలి), శతృవుతో (దుందుభితో) పోట్లాడుతూ ఉండగా, అన్నని ఆపదలో వొదిలేసి అతను బిలంలోంచి బయటికి రాకుండా రాయిపెట్టి వొచ్చెయ్యలేదా? తప్పులు చేసేవాళ్ళు, తమ తప్పులు లోకం మరిచిపోయేటట్టు చెయ్యాలని ఆరాటపడుతూ వుంటారు. "ఛీ! వాళ్ళెలా చేశారో! నేనయితే అలా చెయ్యను సుమా!" అని చెప్పుకుంటూ, ఉత్తముల్లా చలామణీ అవ్వాలని ప్రయత్నిస్తూ వుంటారు. సుగ్రీవుడి ఆరాటం అదే. కానీ, 'సుగ్రీవుడు ఎంత కపటంగా ఉన్నాడో చూడండి' అని చెప్పాలని కవి అభిప్రాయం కాదు. సుగ్రీవుడు ఉత్తముడనీ, ఉత్తముడు కాబట్టే, రాముడి క్షేమం ఆలోచించి విభీషణుణ్ణి చేర్చుకోవద్దంటున్నాడనీ, కవి చెపుతున్నాడు.

**యుద్ధ, సర్గ 18, శ్లోకాలు 6, 7, 8:** సుగ్రీవుడి మాటలకు రాముడేమంటున్నాడో చూడండి!

శ్రీరాముడు నవ్వుచూ లక్ష్మణునితో నిటులనెను – "శాస్త్రములు జదువక, పెద్దలకు సేవ జేసి విశేషార్థములు గ్రహించని వాడే, వానర రాజగు సుగ్రీవుడు పలికి నటుల పలుకును" అంటున్నాడు. సుగ్రీవుడు విభీషణుణ్ణి చేర్చుకోవద్దన్నాడనే కోపంతో రాముడు, సుగ్రీవుణ్ణి వెటకారం చేస్తున్నాడు – 'నీకేం చదువా, సంధ్యా? నీకేం తెలిసిచచ్చు? నా మాటని తిరస్కరిస్తున్నావు?' అనడం అన్నమాట! ★

భక్తి మాటేమిటి?" అంటోంది.

లక్ష్మణుడు చిన్నబుచ్చుకోవడం రాముడి మనసు లోకి జొరబడలేదు.

సుగ్రీవుడు కొంచెం కదిలి తలెత్తి గొలుసులు సర్దు తున్నాడు.

సుగ్రీవుడి గొలుసుల చప్పుడుకి రాముడు చప్పున తల తిప్పుకున్నాడు.

రాముడు తనని మెచ్చుకోటం, మంచి స్నేహితు డనటం, సుగ్రీవుడికి బాగుంది గానీ, విభీషణుణ్ణి కూడా మెచ్చుకోటం, ఉత్తముడనటం .... విభీషణుడు కూడా తనంత ఉత్తమ సోదరుడేనా?

రాముడు విభీషణుణ్ణి చేరదీస్తే? .... తన వొక్కడి తోటే గాకుండా విభీషణుడితో కూడా స్నేహం చేస్తే? .... ఊహూఁ – తల ఝాడించాడు సుగ్రీవుడు.

రాముడు చేసిన వెటకారాలన్నీ ఎగరగొట్టి, రాముడు బోధించిన ఉత్తమ నీతులన్నీ పెడచెవిన బెట్టి, సుగ్రీవుడు మళ్ళీ ".... అయితే మరి .... ఎప్పుడు .... విభీషణుణ్ణి చంపెయ్యటం? ...." అని ఆరాటంగా చూశాడు.

రాముడి కళ్ళు కోపంతో నిప్పు కణికలయ్యాయి. సుగ్రీవుణ్ణి తీక్షణంగా చూడబోయి .... కోపం ఆపు కున్నాడు – "సుగ్రీవా! విభీషణుణ్ణి చంపే ప్రసక్తే లేదు. విభీషణుడు నన్ను శరణు కోరాడు. శరణు కోరినవాణ్ణి రక్షించకుండా నేను విడిచి పెట్టను" అని దృఢంగా ప్రకటించాడు. ".... వెనకటికి ఒక బోయ వాడు, ఒక పావురాన్ని, తన ఆకలిని తీర్చి రక్షించమని శరణు కోరాడు. ఆ బోయవాడే తన భార్యను చంపిన కిరాత కుడని గ్రహించి కూడా ఆ పావురం, శరణు కోరిన వారిని రక్షించాలని న్యాయ శాస్త్రాలు చెపుతూ వున్నాయి కాబట్టి, తన శరీరం ఇచ్చి ఆ బోయని ఆకలి నించి రక్షించింది. ఒక పావురమే ఆ విధంగా శరణార్థిని కాపాడినప్పుడు, సమస్త శాస్త్రాలూ చదివిన నేను, కోరిన వారికి శరణు ఇవ్వకుండా ఉండగలనా? అపరాధికైనా సరే శరణు ఇవ్వాలని కందు మహర్షి చెప్పాడు. దానివల్ల కీర్తీ స్వర్గమూ లభిస్తాయని శాస్త్రాలు చెపుతున్నాయి.

విభీషణుడు దుష్టుడైనా, నా వంటి మహా వీరుడి కేమీ హాని కలిగించలేడు. అతణ్ణి రక్షించక నేను విడిచి పెట్టను. సుగ్రీవా! నువ్వు శరణు కోరితే నిన్ను రక్షించ లేదా? .... ఎవరి విషయం అయినా అంతేనోయ్! రావ ణుడు వచ్చి శరణు కోరినా రక్షిస్తాను, తెలిసిందా? ... వెళ్ళు! విభీషణుణ్ణి తీసుకురా!" అని ఆజ్ఞాపిస్తూ, ఎంత ప్రయత్నించినా కోపం ఆపుకోలేక తీక్షణంగా చూశాడు.[365]

సుగ్రీవుడు, రాముడి కోపం గ్రహించి కొంచెం జంకుతూ నవ్వు మొహంపెట్టాడు. "అవును, నీకు మంచి చెడ్డలన్నీ తెలుసు. మహా ధర్మాత్ముడివి నువ్వు .... ఏంటో శత్రువు కదా అనీ .... ఎందుకైనా మంచిది, మనల్ని చంపుతాడో యేంటో అనీ, అన్నిసార్లు అన్నాను గానీ .... సరే! అలాగే కానియ్యి .... నువ్వన్నట్టు .... మంచి

---

**365.** **యుద్ధ, సర్గ 18, శ్లోకాలు 11 .... 35:** విభీషణుణ్ణి చేర్చుకోవటానికి రాముడి వాదనలు:

"రాక్షసులయందు గూడ పండితులుందురు గనుక, విభీషణుని పరిగ్రహించవలయును" (మొత్తం రాక్షసుల్లో విభీషణుడు ఒక్కడే పండితుడిగా తేలాడు! ఒంటరి పండితుడు!) "విభీషణుడు రావణునికి భయపడి వచ్చియున్నాడు. గనుక పరిగ్రహించవలయును." (స్వార్థంతో వచ్చాడని హనుమంతుడు చెప్పినా, దాన్ని రాముడు బయటపెట్టడం లేదు.)

ఈ రకంగా రాముడు ఎన్ని వాదనలు చేసినా సుగ్రీవుడు వొప్పుకోలేదు. 'కాదూ గూడదు, విభీషణుణ్ణి చంపాల'నే కూర్చున్నాడు. అప్పుడు రాముడు ఆఖరి నిర్ణయం తేల్చి చెప్పేస్తున్నాడు. "శరణు గోరిన వానిని రక్షింపక పోయినటులైతే అది పర లోకమునకు బాధాకరమగును. కందు మహర్షి వాక్కు ప్రకారము నడుచుకొనెదను .... విభీషణుడు దుష్టుడైనా నన్నేమి చేయగలడు? భూమిలో గల పిశాచులను, యక్షులను, దానవులను, రాక్షసులను అందరిని బొటనవ్రేలి కొనతో, నేను గోరినటులైతే, చంపగలను. (అవును, నీ వ్రేలి శక్తీ, కాలి శక్తీ అంతా మాకు తెలుసులే! ఏదన్నా చిన్న ఆపద వస్తే ఎంత వణుకుతావో, నీకు ఎంత మంది ధైర్యం చెప్పాలో, నీ కన్నా మాకే బాగా తెలుసు.) "శరణము గోరిన వానిని సర్వ భూతముల నుండి రక్షించెదను. ఇదే, నా వ్రతము. శరణు గోరిన వాడు విభీషణుడుగా నుండినను, రావణుడిగా నుండినను, అట్టివాని కభయ మిచ్చెదను. కపి శ్రేష్టుడా! అతని బిలుచుకొని రమ్ము!" – ఈ విధంగా రాముడు చివరికి తను విభీషణుణ్ణి స్వీకరించడానికి ప్రధాన కారణం, తనని అతను శరణు కోరడమేనని తేల్చేశాడు – ఈ మాత్రానికి, "మీ అందరి అభిప్రాయాలూ చెప్పండి, నేను వొక్కణ్ణే నిర్ణయించలేను" అనడం ఎందుకూ? మొదటే – "విభీషణుడు వచ్చాడా? తీసుకు రండి! శరణు కోరాడు కదా? నేను చేర్చుకుంటాను" అంటే సరిపోయేదిగా? – సైన్యం అంతా సుగ్రీవుడిది అయినప్పుడు, శత్రువుల్ని చేర్చుకోవాలో లేదో సుగ్రీవుడి ఇష్ట ప్రకారం జరగాలి. కానీ, సైన్యానికి సంబంధించిన సమస్తమైన అధికారాలూ రాముడి చేతిలోనే ఉన్నాయి. ఎందుకంటే, సుగ్రీవుడే రాముడి చేతిలో ఉన్నాడు!

రాముడికి, విభీషణుణ్ణి చేర్చుకోవాలని వుంటే, దానికి ఇంకో వాదం చెప్పాలి. "విభీషణుడు స్వార్థంతోనే వచ్చాడు. అన్నని చంపాలనే కోరుతున్నాడు. అందుచేత మన జయానికే తోడ్పడుతాడు గానీ మనకు కీడు చెయ్యడు. ఈ విశ్వాసంతోటే మనం విభీషణుణ్ణి చేర్చుకోవచ్చు" అని రాముడు ఆ వాదాన్నే ప్రకటించవచ్చు. కానీ, ఆ కారణం చెప్తే, తను విభీషణుడికి శరణు ఇచ్చినట్టుగా గొప్ప రాదు.

➔

వాడేనేమోలే .... కాకపోతే మాత్రం .... ఇంతమంది వుంటే మనల్నెలా చంపగలడులే[366] ఇదుగో! అంగదుడూ! నువ్వెళ్ళి ఆయన్ని తీసుకురా! .... జాగర్తగా తీసుకు రావాలి సుమా! మన వాళ్ళందర్నీ చుట్టూ పెట్టి తీసుకురా! .... ఇదుగో .... విన్నావా? .... జాగర్త! .... అయ్యో, వెళ్ళిపోయాడు. విన్నాడో లేదో! ....” అని గొలుసులు సర్దుకుని కొంచెం హనుమంతుడి వేపు జరిగాడు.

విభీషణుడు వినయంగా చేతులు ముడుచుకుని తల వొంచి గంభీరమైన నడకతో వచ్చాడు. రాగానే రాముడి ముందు నేలమీద మోకరిల్లాడు. “ప్రభూ! నిన్ను శరణు కోరుతున్నాను. నన్ను కరుణించు! నేను లంకా రాజ్యం విడిచి వచ్చాను. ఇప్పుడు నా ప్రాణాలూ, నా సర్వ సౌఖ్యాలూ నీ ఆధీనంలో ఉన్నాయి.”

రాముడు విభీషణుణ్ణి గంభీరమైన చూపులతో తదేకంగా చూస్తూ అడిగాడు. “మీరు ఎంతమంది అన్నదమ్ములు?”

“ముగ్గురం. రావణుడూ, కుంభకర్ణుడూ, నేనూ. మా అన్న లిద్దరూ మహా వీరులే. అనేక యుద్ధాలలో పోరి ఆరితేరిన వారు. వారికి యుద్ధాలంటే జంకు లేదు.”

“లంకలో ముఖ్యులయిన వీరులెవ్వరు? ఎవరెవరు ఏ యే పదవుల్లో ఉన్నారు? బొక్కసం ఎంత ఉంటుంది? ఆయుధా లెన్ని ఉన్నాయి? సైన్యాల వివరాలేమిటి?”

తను అడిగిన వివరాలన్నీ చెబుతాడో లేదోనని రాముడు వారకంట చూస్తున్నాడు, విభీషణుణ్ణి.

విభీషణుడు వినయ విధేయతలతో చేతులు ముడుచుకుని అన్ని వివరాలూ చెప్పాడు.

దూరంగా ఒక వానర సైనికుడు, పక్కవాడితో “అదేవిటి? శరణు అడిగిన వాడితో ‘సరే, అలాగే’ అని చెప్పకుండా ‘ఆయుధాలెన్నీ, బొక్కసం ఎంతా’ అంటాడేవిటి?” అని అతని చెవుల్లో గింగిర్లెత్తిస్తున్నాడు.

“రమ్మన్నాడుగా? రమ్మంటే శరణు ఇచ్చినట్టు కాదూ?”

“రాగానే రహస్యాలన్నీ అడగాలా?”

“అబ్బ, ఊరుకుందూ! అవతలేం మాట్లాడుకుంటున్నారో విననియ్యి!” చెవులాయన విసుక్కున్నాడు.

విభీషణుడు చెబుతోంటే, రాముడు ఒక చెంప ఆశ్చర్యంలో, వొక చెంప ఆనందంలో మునిగిపోయాడు.

రావణుడు ఇంత తెలివితక్కువ వాడా! యుద్ధ కాలంలో .... ఇంత ఆపద సమయంలో .... దేశ రహస్యాలన్నీ తెలిసిన ముఖ్యుణ్ణి బయటికి పోనివ్వ వచ్చునా, చెరసాలలో బంధించి కట్టుదిట్టమైన కాపలా ఉంచాలి గానీ ....!

విభీషణుడు రావటం తన మంచికే జరిగిందని రాముడి మనసు పరమానందంతో పొంగుతోంది. విభీషణుడి సహాయం ఉంటే లంకని జయించడం అసాధ్యం కాదు. సుగ్రీవుడి లాగానే విభీషణుడు కూడా తనకు లోబడి తన సామ్రాజ్యాధిపత్యం అంగీకరించక తప్పదు. విభీషణుడు మనస్సు మార్చుకుని లంకకు పోకుండా తనకు అనుకూలుడై వుండేటట్టు చేసుకోవాలి.

రాముడు చిరునవ్వుతో గంభీరంగా తల పంకిస్తూ పలికాడు – “నీకు నేను అభయం ఇస్తున్నాను. రావణుణ్ణి సంహరించి లంకా రాజ్యానికి నిన్నే పట్టాభిషిక్తుణ్ణి చేస్తాను. నా తమ్ముల మీద ఒట్టు పెట్టి చెపుతున్నాను” అని శపథం చేశాడు.

విభీషణుడు సంతోషం పట్టలేక రాముడి పాదాల మీద మళ్ళీ మోకరిల్లాడు – “శ్రీరామా! ప్రభూ! నీ జయా

---

➔ రాముడు, ఈ సందర్భంలోనే, తనూ, భరతుడూ ఎంత గొప్పవారో, ఎలా చెపుతున్నాడో చూడండి! సర్గ 18, శ్లోకం16: “తమ్ములందరు భరతుని వలె నుండరు. నా వంటి పుత్రుడు, నీ వంటి (సుగ్రీవుడి వంటి) మిత్రుడు, భరతుని వంటి తమ్ముడు, నుండరు” అన్నాడు. మంచి సోదరుడిగా గుర్తించవలసి వచ్చినప్పుడు, భరతుణ్ణే గుర్తించాడు గానీ, లక్ష్మణుణ్ణి గుర్తించలేదేం? – లక్ష్మణుడు, భార్యనీ, సమస్త సుఖాలనీ, వదిలి వచ్చాడే! పద్నాలుగేళ్ళ నుంచి ఎంతో శ్రద్ధతో సేవలు చేస్తున్నాడే! వాటి విలువేమీ గుర్తించలేదేం రాముడు? భరతుణ్ణే మెచ్చుకోడానికి కారణం, రాజ్యం అతనిదే అయినప్పటికీ, తనకు ఇచ్చేశాడనే కదా? సిరి సంపదల ముందు, ప్రేమలకూ సేవలకూ విలువేమీ వుండదు. అందుకే భక్తితో సేవలు చేసే లక్ష్మణుడి కన్నా రాజ్యం ఇచ్చిన భరతుణ్ణే ఉత్తమ సోదరుడిగా గుర్తించాడు రాముడు.

రాముడి అభిప్రాయం – తన తమ్ములు తన పట్ల వినయ విధేయతలతో ఉత్తమ సోదరులుగా ఉండాలి. కానీ, ఇతరుల విషయంలో అయితే, తమ్ముళ్ళు అన్నల్ని మోసాలు చెయ్యాలి! అన్నల్ని చంపేసి, ఆస్తుల్ని ఆక్రమించాలి! సుగ్రీవుడు, వాలిని మోసం చెయ్యాలి! విభీషణుడు, రావణుణ్ణి మోసం చెయ్యాలి! అన్నల్ని మోసాలు చేసే తమ్ముళ్ళే ఉత్తములు! ★

**366.** **యుద్ధ, సర్గ 18, శ్లోకం 38:** విభీషణుణ్ణి చేర్చుకోక తప్పదని రాముడు నిరంకుశంగా, ఎవరి అభిప్రాయాన్నీ లక్ష్య పెట్టకుండా, చెప్పేశాక సుగ్రీవుడు తన పట్టు వొదిలేశాడు – “విభీషణుని వధింపవలెనని కోరిన నాకును అతడు శుద్ధుడేయని దోచుచున్నది. విభీషణుని ముఖ వికాసాదుల చేత, లోపలను వెలుపలను, అతడు పరిశుద్ధుడేనని బాగుగా విశదమైనది. (విభీషణుడు పరిశుద్ధుడై పోయాడు అప్పుడే!) రామా! నీవు ధర్మ సూక్ష్మము నెరిగిన వాడవు. నీవు ఆశ్రితులను రక్షించుటలో నాశ్చర్యమేమి గలదు?” – ఈ రకంగా కీర్తన ప్రారంభించాడు! ★

నికీ, లంక అపజయానికీ నాకు చేతనైన కార్యాలన్నీ చేస్తాను. నీ పక్షాన్నే నిలబడి యుద్ధంలో రాక్షసుల్ని చంప డానికి నా శక్తి సామర్థ్యాలన్నీ ధారపోస్తాను. నన్ను విశ్వసించు!"[367]

వానర సైన్యం నిండా గుస గుస చర్చలు సాగు తున్నాయి, ఎప్పటి నించో!

"విభీషణుడు వొచ్చాడంటే, సంధి కోసమేమో, యుద్ధం ఆగుతుందేమో అనుకున్నాను. ఎంత సిగ్గు లేకుండా చెపుతున్నాడో రాక్షసుల్ని చంపుతానని! వాళ్ళ వాళ్ళనే చంపిస్తాడంట!"

"విభీషణుడు రావటం మనకే మంచిది లెండి. యుద్ధంలో మనం తప్పకుండా గెలుస్తాం."

"అందరం చచ్చాక .... గెలిస్తే ఏంటయ్యా?"

"అవుననుకో .... అవతల అన్నని వొదిలి వచ్చాడు, దుర్మార్గుడు!"

"ఆస్తి ముందు అన్ననీ చూడరు, తమ్ముణ్ణీ చూడరు. గట్టిగా అనగూడదు గానీ .... మన రాజు చెయ్యలా? .... అన్యాయంగా అన్నని చంపించాడు .... పైగా తనేంతో ఉత్తముడైనట్టు, విభీషణుడు అన్నని వొదిలి పెట్టాడేంటని ఆశ్చర్యపడుతున్నాడు. అధికారంలోకి ఎవడు వస్తే వాడే ఉత్తముడు! మన రాజులాగే .... విభీష ణుడూ అన్న చావుకి కంకణం కట్టాడు. ఆస్తి దొరుకు తుందంటే, అన్నని తమ్ముడూ చంపుతాడు, తమ్ముణ్ణి అన్నా చంపుతాడు! తండ్రిని కొడుకూ, కొడుకుని తండ్రి

---

**367.** **యుద్ధ, సర్గ 19, శ్లోకాలు 1 .... 26:** రాముడు రమ్మని కబురు పంపేవరకూ విభీషణుడు మంత్రులతో ఆకాశంలోనే తేలుతూన్నాడు! – విమానాలు, ఎయిర్ పోర్టులో దిగటానికి వీలు కానప్పుడు ఆకాశంలోనే తిరుగుతూ వుంటాయే, అలాగన్న మాట! "విభీషణుడు అభయము కోరినప్పుడు, శ్రీరాముడు అభయమిచ్చినటుల జెప్పగా, మిగుల ప్రాజ్ఞుడగు విభీషణుడు శ్రీరాముని గుణములను ప్రత్యక్షముగ జూచినందున మిగుల వినతుడై భక్తులగు మంత్రులతోడ సంతోషించి ఆకశమునుండి భూమికి దిగెను."

ఆ రకంగా దిగి శ్రీరాముని పాదాలపై మోకరిల్లాడు – "నేను రావణుని తమ్ముడను. అతనిచే అనుమానింపబడిన వాడనై, సమస్త ప్రాణికోటులకు రక్షకుడవగు, పరిపూర్ణుడవగు నిన్ను శరణాగతి సేయుచున్నాను .... నా ప్రాణములు, రాజ్యము, భోగములు, నీ యధీన మందున్నవి" అని చెప్పాడు. (నన్ను చంపడం – చంపకపోవడం, నాకు రాజ్యం దక్కడం – దక్కక పోవడం, నీ ఇష్టా యిష్టాలమీద ఆధారపడి ఉన్నాయి అంటున్నాడు! లంకా రాజ్యం తనకు దక్కేలాగ చెయ్యమని అడుగుతున్నాడు! విభీషణుడు తనకు శరణు ఇమ్మని అలా అడిగిన తర్వాత, రాముడు వెంటనే 'సరే' అనలేదు. – "రాక్షసుల బలాబలములను నిజముగ నాకు దెలుపుము" అని నిక్కచ్చిగా అడిగాడు. "ఏమీ దాచకు సుమా! నువ్వు నిజం చెపుతావో లేదో చూస్తాను. అప్పుడు గానీ నీకు అభయం ఇచ్చే సంగతి ఆలోచించను" అని చెప్పడం అన్నమాట!

విభీషణుడు నిజాలన్నీ చెపుతాడో లేదో, ఏమైనా దాస్తాడేమో అనే అనుమానం లేకపోతే, "నిజంగా చెప్పు!" అనడం ఎందుకు? రాముడికి కావలసిన సంగతులన్నీ విభీషణుడు చెప్పిం తర్వాతే రాముడు విభీషణుడికి సంతోషం కలిగించే మాటలు ఇలా చెప్పాడు. "స్థిర పరాక్రముడైన శ్రీరాముడు విభీషణుని మాటలు విని అంతయు బాగుగ నాలోచించి ఇటులనెను –– విభీషణుడా! రావణుని బంధుమిత్రుల తోడను, ప్రహస్తుని తోడను జంపి, నీకు లంకలో పట్టాభిషేకము జేసెదను. ఇది సత్యమని నీకు దెలుపుచున్నాను. నా తమ్ముల మీద ఒట్టుబెట్టి చెప్పుచున్నాను."

ఈ విధంగా, రాముడు విభీషణుడి దగ్గిర్నుంచి కొంత సమాచారం లాగిం తర్వాత, అతన్ని తనతో చేర్చుకుంటానని చెప్పాడు. ఆ రకంగా శరణు ఇచ్చిన తర్వాత, "శుద్ధ చరిత్రుడగు రాముని మాటలు విని ధర్మాత్ముడగు విభీషణుడు, శిరసా వందనము జేసి" ఏమంటున్నాడో చూడండి! "రాక్షసులను చంపుట యందును, లంకను జయించుట యందును, నా శక్తి కొలదిగ నీకు సహకరించెదను."

రాక్షసుల్ని చంపెయ్యడానికి సహకరిస్తానంటున్నాడు! రాక్షసులంతా చచ్చిపోతే తను ఎవర్ని పరిపాలిస్తాడు? ఈ ధర్మాత్ముడేనా, లంకలో రాక్షస జాతి క్షేమం, లంక జయం, కోరింది? విభీషణుడి గురించి రామ దాసులు ఎలా సమర్థిస్తారంటే: విభీషణుడు, రావణుణ్ణి విడిచి రాముడి దగ్గిరికి వచ్చి చేరి లంకకీ, తన జాతికీ హాని కలిగించడంలో తప్పేమీలేదని! రావణుడు దుర్మార్గుడు కాబట్టే విభీషణుడు అతణ్ణి విడిచి పెట్టాడని వాదిస్తారు. రావణుడు దుర్మార్గుడిగా వున్నది ఇప్పుడే కాదు, చాలా కాలం నించీ దుర్మార్గుడిగానే వున్నాడు. సీతని తెచ్చి కూడా చాలా కాలం అయింది. విభీషణుడు, అన్న దుర్మార్గానికి ఇంతకు ముందే అసహ్యించుకుని రాజ్యం విడిచి ఎందుకు వెళ్ళిపోలేదు? ఇప్పుడు యుద్ధం వొచ్చింది కాబట్టే, అన్నని చంపే అవకాశం కుదిరింది గాబట్టే, శత్రుపక్షంలోకి వెళ్ళాడు. అంతేగానీ, రావణుడు సీతని తెచ్చినందుకు విభీషణుడికి కోపం ఏం కాదు. అలాంటి కోపమే ఉంటే, సీతని తెచ్చిన తర్వాత అంత కాలం ఆగకుండా ఎప్పుడో రాజ్యం వదిలి వెళ్ళిపోయేవాడే.

విభీషణుడు లంక నించి వచ్చాడని వినగానే రాముడికి మొట్టమొదట ఏం గుర్తు రావాలి? – సీత సంగతి గుర్తు రావాలి. సీత ఎలా ఉందో అడగాలి. మొదటే అడగకపోయినా, చివరికైనా అడగాలి. లంకలో బలాల గురించీ, రాజకీయాల గురించీ, అడిగిన తర్వాత మాటవరసకైనా "సీత ఎలా ఉంది, నీకేమైనా తెలుసా?" అని అడిగాడా? అసలు ఆ గుర్తేదీ? అసలు కావల సింది లంకని ఆక్రమించే సమాచారమే.

★

చంపుకుంటారు! .... ఎవడికి తెలీని బాగోతం ఇదంతా? పైకి 'న్యాయం' అంటారు, 'ధర్మం' అంటారు, ప్రేమ లంటారు, స్నేహాలంటారు! అన్నీ ఆస్తికే అనుకో."

రాముడు లక్ష్మణుణ్ణి గంభీరంగా చూస్తూ, "లక్ష్మణా! సముద్ర జలంతో విభీషణుణ్ణి అభిషేకించు" అని ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు మహోత్సాహంతో సముద్రంలోంచి నీళ్ళు తెచ్చి, "లంకాధిపత్యం నీకు సిద్ధిస్తుందోయీ!" అంటూ విభీషణుడి తల మీద నీళ్ళు చిలకరించాడు.

రాముడు చిరునవ్వుతో లేచి, "విభీషణా! ఇక లంకాధిపతివి నువ్వే! లంకా రాజ్యం నీదే!" అంటూ విభీషణుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు.

"మహాప్రసాదం ప్రభూ!" అంటూ విభీషణుడు రాముడి చేతుల్లోంచి పాదాల మీదకి జారాడు.

రాముడు విభీషణుణ్ణి ఆలింగనం చేసుకుంటున్న దృశ్యం చూడలేక సుగ్రీవుడు సముద్రం వేపు మొహం తిప్పేశాడు. ఇంత కాలం తను వొక్కడే రాముడికి సహా యంగా ఉన్నాడు. తను వొక్కడే రాముడికి స్నేహితుడిగా ఉన్నాడు. ఇప్పుడు ... తన కన్నా విభీషణుడే ముఖ్యుడు! విభీషణుడే మిత్రుడు! ఇక తన గురించి రాముడు గుర్తు పెట్టుకుంటాడా?

"మహారాజా! .... మహారాజా! ఇంకోడొచ్చాడు .... ఇంకో రాక్షసుడొచ్చాడు ...." అంటూ కొందరు వాన రులు పరిగెత్తుకొచ్చారు. – "రావణుడు నీ దగ్గిరికి పంపించాడంట! నీతో మాట్లాడాలంటున్నాడు" అంటూ ఉత్సాహంగా సుగ్రీవుడి చుట్టూ మూగారు.

సుగ్రీవుడు భయంతో మొహం చిట్లిస్తూ, "వాణ్ణి గట్టిగా పట్టుకోండి .... నాతో ఏం పని వాడికి? .... రావణుడు పంపించాడా? సరిగ్గా విన్నారా? నా దగ్గిర కెందుకూ? .... లాక్కు రండి వాణ్ణి .... జాగర్త! వొది లించుకుంటాడేమో!" అంటూ వుండగానే కొందరు సైనికులు కొత్త వాడి చుట్టూ జేరి అతన్ని సంబరంగా తీసుకు వొచ్చారు.

ఆ వ్యక్తి కూడా, విభీషణుడూ అతని మంత్రులూ ఉన్నట్టే మంచి మంచి ఆభరణాలతో, అలంకారాలతో, మెరుస్తూ వున్నాడు. రాగానే సుగ్రీవుడెవరో తెలుసుకుని వొంగి నమస్కారం చేశాడు – "సుగ్రీవ మహారాజా! నా పేరు శుకుడు. లంక నుంచి వొచ్చాను. రావణ మహా రాజు నన్ను నీ దగ్గిరికే పంపించాడు. తన మాటలుగా నన్ను నీకు కొన్ని మాటలు చెప్పమన్నాడు. నువ్వు అను మతి ఇస్తే ఆ మాటలు విన్న విస్తాను" అని వినయంగా ఆగాడు.

రాముడు క్రీకంట ఆశ్చర్యంగా చూస్తున్నాడు శుకుణ్ణి.

విభీషణుడు నెమ్మదిగా జనంలోకి తప్పుకున్నాడు.

సుగ్రీవుడు బిత్తరపోతూ ఇటూ అటూ చూసి, "ఊఁ .. చెప్పు.. ఏంటా మాటలూ?" అని మూతి బిగబట్టాడు.

శుకుడు మళ్ళీ నమస్కారం చేసి మొదలుపెట్టాడు – "మా మహారాజు నీకు చెప్పమన్న మాటలు చెపుతాను విను మహారాజా! – సుగ్రీవుడా! నువ్వు నాకు సోదరు డితో సమానుడివి. నాతో నీకు వైరం ఎందుకు? నేను రాముడి భార్యని తీసుకు వొచ్చినందువల్ల నీకు కలిగే నష్టం ఏమిటి? నువ్వు మహా వీరుడివి. పరాక్రమవంతు డివి, రాముడితో చేరవలసిన అవసరం నీకేమిటి? తెలివి తక్కువగా ప్రవర్తించకు. వానరులే విధంగానూ లంకని ముట్టడించలేరు. నీ సైన్యాలను తీసుకొని కిష్కింధకు వెళ్ళి సుఖంగా ఉండు! – అని మా మహారాజు నీతో చెప్పమన్నాడు" అని చెప్పి ఊరుకున్నాడు.

సుగ్రీవుడేం చెపుతాడా – అని చుట్టూ అందరి చూపులూ అతడి మొహంనిండా వాలాయి.

రాముడు తల వంచి సుగ్రీవుణ్ణి గంభీరంగా క్రీకంట పరికించాడు.

సుగ్రీవుడు ఏమీ తోచక, చిరాకు పడుతూ, మంత్రుల మొహాలు చూశాడు.

వాళ్ళకేమీ తోచక, మహారాజు మొహం చూస్తు న్నారు.

"ఏం చెప్పమంటావు?" అన్నట్టు సుగ్రీవుడు రాముడి వేపు చూశాడు.

ఆయన అరమోడ్పు కళ్ళతో గాంభీర్యంలో మునిగి వున్నాడు.

అంతక్రితం రాముడు విభీషణుణ్ణి కావిలించుకు న్నప్పట్నించీ సుగ్రీవుడికి కంపరంగానే వుంది. "నే నెంత మంచి స్నేహితుణ్ణో చూడు" అని రాముడి కెలాగైనా చెప్పాలని ఆరాటంగా వుంది. రావణుడి దూతతో, రాము డికి నచ్చే మాటలు చెపితే సరి.

"సుగ్రీవ మహారాజా! నన్నేం చెప్పమంటావో సెలవిస్తే ...." అన్నాడు శుకుడు వినయంగా.

సుగ్రీవుడు కోపంగా మొహం చిట్లించాడు – "మీ మహారాజు నాకేదో స్నేహితుడైనట్టు నాకు రాయబారం పంపటం ఏంటి? నేను చెప్పేది సరిగ్గా విని మీ రాజుతో చెప్పు! – 'రావణుడా! నువ్వు నాకేవన్నా సాయం చేశావా, రాముడు చేశాడు గానీ? రాముడు నా స్నేహితుడు. నువ్వు నా స్నేహితుడికి విరోధివి కాబట్టి నాకూ విరోధివే'...." 'ఎలా చెపుతున్నానో చూశావా' అన్నట్టు సుగ్రీవుడు మధ్య మధ్య రాముణ్ణి చూస్తూ, రాముడి సంతోషం కనిపెడుతూ, మళ్ళీ ఉత్సాహంగా శుకుడితో కోపంగా కొనసాగించాడు – 'రావణుడా! నా సోదరుడి లాంటి వాణ్ణి అంటున్నావు. అయినా నువ్వు దుర్మార్గుడివి కాబట్టి వాలిని చంపినట్టు నిన్నూ చంపవలిసిందే.

రాముడు మహా వీరుడు. నిన్ను విడిచి పెడతాడనుకోకు. మేం లంకని తప్పకుండా ముట్టడిస్తాం. నీ అంతం చూస్తాం' ఇలా అన్నానని చెప్పు శుకుడా! ఏం, తెలి సిందా? ఇక పో!" అని శుకుణ్ణి కసిరి నవ్వు మొహంతో రాముడి వేపు చూశాడు.

తన నోట్లోంచి అన్ని మాట లెలా వొచ్చాయో, అంత ధైర్యంగా ఎలా మాట్లాడాడో, సుగ్రీవుడికే ఆశ్చర్యమై పోయింది.

"చిత్తం!" అని వెనక్కి తిరిగాడు శుకుడు.

"తెచ్చాడయ్యా మా గొప్ప రాయబారం! యుద్ధం మానెయ్యాలంట!" అన్నాడెవడో యుద్ధోన్మాది.

"అసలు వీడు దూతో కాడో! నాకైతే నమ్మకం లేదు. ఆనుపానులు చూడాలని వొచ్చాడేమో!" అన్నాడు అంగ దుడు.

సుగ్రీవుడు కంగారు పడిపోతూ, "అయితే పట్టు కోండి, పట్టుకోండి వాణ్ణి! వొదలకండి, కట్టెయ్యండి!" అని కేకలేశాడు.

అప్పటికే కొందరు వీరాధివీరులు శుకుడి మీద పడి తన్నటం, పొడవటం, రక్కటం, బట్టలూ నగలూ పీకె య్యటం, కాళ్ళూ చేతులూ మెలి తిప్పటం, ఉత్సాహంగా చేసేశారు. ఇంకా చేస్తున్నారు. నోటికొచ్చిన తిట్లు తిడుతున్నారు.

శుకుడు బాధతో అరవడం మొదలు పెట్టాడు! "అయ్యో! నేను గూఢచారిని కాదు. నా మాటలు నమ్మండి. మా రాజు దూతగా పంపితేనే వచ్చాను. మా రాజు చెప్పమన్న మాటలే చెప్పాను. నే నేమీ కల్పించ లేదు .... అయ్యో! నా గుడ్లు పీకేస్తున్నారు. నా చేతులు విరిచేస్తున్నారు. అయ్యలారా! మీకు దణ్ణం పెడతాను. నన్ను వొదలండి. అయ్యో, ఎవరికి చెప్పుకోను?" అని కేకలేసి ఏడుస్తున్నాడు[368]

దూతని బాధించగూడదని రాజనీతు లెన్నో చెప్పి, లంకలో హనుమంతుణ్ణి విడిపించిన విభీషణుడు, కిక్కురు మనకుండా చూస్తూ నించున్నాడు.

శుకుడి కేకలు విని, రాముడు గంభీరంగా "అతణ్ణి బాధించకండి" అని మళ్ళీ మౌనం వహించాడు.

అప్పటికే బాధించడాలన్నీ ముగిసిపోయి, వానర వీరుల ఉత్సాహం చాలా తగ్గింది.

శుకుడి ఏడుపు ఉత్సాహంగా వింటున్న సుగ్రీవుడు మొహం చిట్లించి, "సరే! వాణ్ణేమీ చెయ్యకండి! కాళ్ళూ చేతులూ నోరూ అన్నీ కట్టిపడేసి ఉంచండి! .... జాగర్త. విడి పించుకుంటాడేమో.. గట్టిగా కట్టండి!" అంటూ ఆజ్ఞ పడేసి రాముడి వేపు తిరిగాడు, నవ్వు మొహంతో! ★

---

**368.** **యుద్ధ, సర్గ 20, శ్లోకాలు 32 .... 36:** శుకుడు దూతగా వచ్చాడు. దూతగా వచ్చిన వాణ్ణి ఇక్కడ ఏం చేశారు? "పిమ్మట సుగ్రీవుని యాజ్ఞచే వానరులు, ఆకాశమున కెగిరి అనాథ వలె నేడ్చుచుండు శుకుని బట్టుకొని గట్టివేసిరి. సమర్థులగు వానరులు శుకుని బట్టుకొని మిగుల బాధించగా అతడు మహాత్ముడగు రాముని పెద్ద గొంతుతో బిలుచుచు, 'రామా! నా రెక్కలను ఛేదించి నా కన్నులను బొడిచి వేయుచున్నారు' అని ఏడ్చెను."

దూతగా వచ్చి, ఎంతో వినయంగా మాట్లాడి తిరిగి వెళ్తూవున్న వాణ్ణి ఆ రకంగా బాధపెట్టారు. శుకుణ్ణి పట్టుకోమని రాముడే ఆజ్ఞాపిస్తే బాగుండదు గాబట్టి, "సుగ్రీవుడే అలా చేశాడు" అని ఆ నెపం సుగ్రీవుడి మీదకు తోస్తున్నాడు కవి. శుకుణ్ణి బాధలు పెట్టమని సుగ్రీవుడే ఆజ్ఞాపించినట్టుగా రాశాడు. సుగ్రీవుడు కూడా గొప్ప రాజనీతిజ్ఞుడేగా? గొప్ప ధర్మాత్ముడేగా? దూత విషయంలో ఎలా ప్రవర్తించాలో తెలీని మూర్ఖుడా అతను? హనుమంతుడు లంకలో చేసిన దుర్మార్గాల్లాంటి వేమన్నా చేశాడా శుకుడు? మరి అతనికి శిక్ష ఎందుకు? వానరులు శుకుణ్ణి పట్టుకోకుండా అతని దారిన అతన్ని పోనిచ్చినట్టు ఎందుకు రాయకూడదు కవి? శుకుడు రాక్షస దూత కాబట్టి అతన్ని చితకదన్ని పంపించాలని కవికి కోరిక! ఏ నెపం అయినా తోసెయ్యడానికి వానరులు (కోతి మూక) ఉన్నారు గదా? శుకుణ్ణి పట్టుకోమని సుగ్రీవుడితో ఆజ్ఞ ఇప్పించి (రాముడితో గాకుండా), అతన్ని, తన కసిదీరేట్టుగా తన్నించాడు కవి.

"దూతని తన్నడం తప్పు కదా?" అనే ప్రశ్న వొస్తే, దానికి జవాబు "సుగ్రీవుడు అలా చేయించాడు" అని! "వానరుడు గదా? ఏం తెలిసి ఛస్తుంది వాళ్ళకి? రాముడైతే అలాంటి పని చేయిస్తాడా? పైగా శుకుణ్ణి రక్షించాడు కూడానూ" అని జవాబు చెపుతాడు కవి. సుగ్రీవుడికి మాట వచ్చినా ఫర్వాలేదు, రాముడికి రాకుండా వుంటే చాలు. పైగా రాముడికి, శుకుణ్ణి రక్షించాడని కీర్తి! శుకుడు, విశ్వాసపాత్రుడైన దూత. తమ రాజు ఇష్టప్రకారమే తూచా తప్పకుండా ప్రవర్తించాడు. సుగ్రీవుడితో చెప్పడానికి మాత్రమే వచ్చాడు. అలాంటి వాడు, రాముణ్ణి కీర్తిస్తాడా? రాముడు ధర్మాత్ముడనీ, పుణ్యాత్ముడనీ, అనుకుంటాడా? – శతృవులతో కూడా రాముణ్ణి పొగిడించడమే! ఏ పాత్ర, ఏ స్వభావంతో మాట్లాడాలో, కవి పట్టించుకోడు. రాముడి భజన తను చేసేదీ, రుషులతో చేయించేదీ చాలక, శతృవులతో కూడా చేయిస్తాడు. సుగ్రీవుడు మూర్ఖుడై శుకుణ్ణి బంధించినట్టూ, శ్రీరాముడు ధర్మాత్ముడై అతన్ని విడిపించినట్టూ, రాముడికి ఇంకో తట్టెడు కీర్తి పోగేసిపెట్టాడు. రాముడికి కీర్తి కలిగించడం కోసం కవి, ఎవర్నయినా అపకీర్తిపాలు చేసేస్తాడు – లక్ష్మణుణ్ణయినా, భరతుణ్ణయినా, సుగ్రీవుణ్ణయినా! ఒకవేపు సుగ్రీవుడితో సహాయాలు పొందుతూ వుండడం, మళ్ళీ అతన్ని వెటకారాలు చేస్తూ వుండటం! ఈ కవికి, రామ దాస్యం తప్ప ఎక్కడా 'నీతి' అనే మాట ఉండదు. ★

# లింకు-8

# 12వ కథ తర్వాత 13వ కథ వరకూ

[12వ కథ – విభీషణుడు, అన్నని వొదిలేసి రాముడి పక్షాన చేరడంతో ముగుస్తుంది. 13వ కథ – రావణుడు, శత్రుసేనల్ని పరిశీలించడంతో ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య ఉన్న కథా భాగం ఇది.]

సుగ్రీవుడు, నవ్వు మొహంతో విభీషణుణ్ణి చూస్తూ, "విభీషణా! ఈ వానరసైన్యంతో మనం సముద్రం ఎలా దాటగలమంటావు? ఏమీ ఉపాయం తోచటం లేదు!" అన్నాడు.

(రాముడికి ఉపాయాలేం తోచవని సుగ్రీవుడికి అర్థమైపోయినట్టుంది. ఇక ప్రతి దానికీ విభీషణుణ్ణి పట్టుకుంటారు గావున్ను! పాపం ఎరక్కపోయి వొచ్చాడు)[369]

విభీషణుడు కొంచెం ఆలోచించి – "ఈ సముద్రమంతా ఇక్ష్వాకు వంశస్థులైన సగర పుత్రులే తవ్వారు (సగరుడు పిల్లల్ని కనక ముందు లోకంలో సముద్రాలు లేవన్నమాట!) రాముడూ ఇక్ష్వాకు వంశస్థుడే కాబట్టి సముద్రుడు కృతజ్ఞతతో రాముడికి సహాయం చెయ్యాలి మరి. రాముడు శరణు కోరితే సముద్రుడు సాయం చెయ్యకుండా ఉంటాడా?" అన్నాడు.[370]

సుగ్రీవుడు సంతోషంతో విభీషణుడు చెప్పిన ఉపాయం రాముడికి అందించాడు!

విభీషణుడు చెప్పిన ఉపాయం మహా జ్ఞాని అయిన శ్రీరాముడికి చాలా నచ్చింది. (ఉపాయాలు ఎవరు చెపుతారా – అని ఎదురుచూస్తూ వుంటుంది మహాజ్ఞానం!)

రాముడు చిరునవ్వుతో లక్ష్మణుణ్ణీ, సుగ్రీవుణ్ణీ చూశాడు – "విభీషణుడు చెప్పిందే బాగుంది లక్ష్మణా! నీకూ సుగ్రీవుడికీ కూడా ఎలా తోస్తోందో చెప్పండి! సుగ్రీవుడు గొప్ప పండితుడు! నువ్వు కూడా చక్కగా ఆలోచించగలవు. మీరిద్దరూ కలిసి ఆలోచించి ఏం చేస్తే బాగుంటుందో చెప్పండి! (ఊరికే అడుగుతున్నాను గానీ, మీరు చెప్పేదాన్ని నే నెలాగూ ఎగరగొడతాను)" అన్నాడు.

లక్ష్మణుడూ, సుగ్రీవుడూ ఏక కంఠంతో చెప్పారు "మాకు విభీషణుడు చెప్పిందే బాగుంది (మళ్ళీ ఎవడాలోచిస్తాడు?) సముద్రుణ్ణి ప్రార్థించి సేతువు కట్టే ప్రయత్నం చెయ్యాలి. సేతువు లేకపోతే దేవతలు కూడా లంకకు పోలేరు. (హనుమంతుడి ఎగురుడూ, విభీషణుడి ఎగురుడూ, పచ్చి అబద్ధాలేనన్న మాట!) కాలం మించిపోతోంది. ఇంకా ఆలస్యం ఎందుకూ? సముద్రుణ్ణి ప్రార్థించు!" అని రాముణ్ణి తొందర పెట్టారు.

లక్ష్మణుడు గబ గబా సముద్రం వారన దర్భలు కుప్ప పెట్టాడు.

వెంటనే రాముడు గంభీరంగా సముద్రం దగ్గిరికెళ్ళి దర్భలు పరుచుకుని (కాస్త గడ్డి పడేసుకుని) తూర్పు దిక్కుగా తిరిగి నమస్కారం చేశాడు – "నా కిప్పుడు సముద్ర తరణమో, లేదా మరణమో ఏదో వొకటే దారి" అనుకుంటూ కుడి చెయ్యి తలకింద పెట్టుకుని పడుకున్నాడు. (ఇదేవిటి? ఇదేం ప్రార్థన?)[371]

ఆ చేతికి, అంతకు పూర్వం, ఎన్నో రకాలైన ఆభర

---

**369.** **యుద్ధ, సర్గ 19, శ్లోకాలు 29, 30:** హనుమంతుడూ, సుగ్రీవుడూ – విభీషణుణ్ణి సముద్రం దాటే ఉపాయం అడుగుతున్నారు! "విభీషణా! గొప్ప తేజస్సు గల వానర సేనతో గూడి మనమందరం సముద్రం నెటుల దాటగలము? ఇందుకు ఉపాయము స్ఫురించుట లేదు" అంటున్నారు. సముద్రం దాటే ఉపాయం విభీషణుడు చెప్పాలన్న మాట! రాముడి పక్షానికి విభీషణుడు ఉపయోగపడడం, అప్పుడే ప్రారంభమైపోయింది! ★

**370.** ఒక వ్యక్తి ఇంకో వ్యక్తికి సహాయం చెయ్యడం, ఆ సహాయం పొందిన వ్యక్తి అది చేసిన వ్యక్తికి ఏదైనా ఉపకారం చేసి తన కృతజ్ఞత తెలుపుకోవడం – ఇది, మానవ సమాజంలో జరిగేదే. సమాజంలో వుండే అంశాలనే, దేవుళ్ళ కథల్లో పక్షుల కథల్లో, జంతువుల కథల్లో, అన్ని రకాల కథలోనూ చూస్తాం. దేవుళ్ళ కథలు ఎక్కడ నించో రావు. దేవుళ్ళ కథలన్నీ మానవులు తయారు చేసుకున్నవే. ఇవి మానవులకంటే ముందే ఉన్నవి కావు. ★

**371.** **యుద్ధ, సర్గ 21, శ్లోకం 8:** ఈ శ్లోకానికి ఉండే అర్థం మీద కొంచెం వివాదం ఉంది. ➔

ణాలు ఉండేవి. (పద్నాలుగేళ్ళ కిందటి ముచ్చట!) ఉత్తమ స్త్రీ లెందరో ఆ చేతికి అలంకారాలు చేసేవారు.[372] అగరు చందనాలతో ఆ చెయ్యి ఎంతో సుందరంగా ఉండేది. సీతా, రాముడూ వొకే శయ్య మీద పడుకు

➔సముద్రం దగ్గిర పడుకుంటూ రాముడు అనుకున్న మాటలు ఇలా ఉన్నాయి: "అద్యమే మరణం వాథ తరణం సాగరశ్యవా." – అద్య = నేడు; మే = నాకు; మరణంవా = మరణం గానీ; అథ = లేక; సాగరస్య = సముద్రము యొక్క; తరణంవా = దాటడం గానీ; అంటే, రాముడు, "ఇవ్వాళ నేను సముద్రం దాటడం గానీ, లేకపోతే మరణించడం గానీ జరగాలి" అనుకున్నాడు. కానీ, చాలామంది అనువాదకులు, ఈ శ్లోకానికి ఈ అర్థం చెప్పడం లేదు. "సముద్రం దాటలేకపోతే చచ్చిపోతాను" అని రాముడు అనుకున్నాడంటే, ఈ పండితులకు తలలు కొట్టేసినట్టు అయిందేమో! ఈ శ్లోకానికి ఇంకో రకంగా అర్థాలు చెప్పారు. "నేను ఇప్పుడు సముద్రం దాటడం గానీ, లేకపోతే సముద్రాన్ని నాశనం చేసెయ్యడం గానీ" అని రాముడు అనుకున్నట్టుగా అనువాదాలు చేశారు.

"సముద్ర తరణమో, నాకు మరణమో" అనే దానికి, "సముద్ర తరణమో, లేక సముద్ర మరణమో" అని అర్థం చెపుతున్నారు. ఆ 'మరణం', సముద్రానికి పెడుతున్నారు. సముద్రాన్ని దాటలేనివాడు, సముద్రాన్ని నాశనం ఎలా చేస్తాడు? సముద్రాన్ని నాశనం చేసెయ్యగలిగేవాడు దాన్ని సుఖంగా దాటగలడు. సముద్రాన్ని నాశనం చేసే శక్తి గానీ, దాన్ని దాటే శక్తి గానీ లేకపోతే, అప్పుడు 'మరణం' అనే మాట రాముడికే వర్తిస్తుంది గానీ సముద్రానికి కాదు. కాబట్టి, రాముడు "సముద్ర తరణమో, నాకు మరణమో" అనుకున్నట్టుగా అర్థం చెప్పడమే సరైంది. అయితే, రాముడు 'నాకు మరణం' అనుకోవడం బాగుంటుందా – అనే ప్రశ్న వచ్చింది పండితులకు. ఏది బాగుంది గనక, ఇది బాగుండకపోడానికి? 'మరణిస్తాను' అనే మాట రాముడు చాలాసార్లు అన్నాడు.

సాధారణంగా, మనుషులు కష్టమైన పనులు చెయ్యాలని ప్రయత్నించేటప్పుడు, "ఇది సాధించనైనా సాధిస్తాను. లేకపోతే నా ప్రాణాలైనా వొదిలేస్తాను" అంటూ వుంటారు. రాముణ్ణి దేవుడని కవి ఎంత వర్ణిస్తూ వున్నా, ఆ పాత్రకు మానవ ప్రవర్తనే ఉంటుంది. మానవుడి లాగ గాక, దేవుడి లాగ ప్రవర్తించడం ఎలాగో, కవికి తెలియదు. ఎందుకు తెలియదంటే, అసలు ఆ విషయాలు సమాజంలో ఉండవు కాబట్టి. దేవుడనే వాడు మానవుల కల్పనే. దేవుడే లేకపోవడం వల్ల, దేవుడి మాటలూ, దేవుడి ప్రవర్తనా – అనేవి ఏవీ మనుషుల జీవితాల్లో ఉండవు. దేవుడెక్కడుంటాడు? ఎలా ప్రవర్తిస్తాడు? ఎలా మాట్లాడతాడు? అతని సమస్య లేమిటి? అతనికి కష్టాలు వస్తాయా? ఆ కష్టాలెలా ఉంటాయి? అవి ఎలా పరిష్కారం అవుతాయి? – ఇలాంటివన్నీ మానవుల ఊహలే. మానవుల కల్పనలే. ఆ కల్పనలు ఎలా ఏర్పడతాయంటే – మానవులు, తమ సమాజ జ్ఞానాన్ని బట్టే ఆ కల్పనలు చేస్తారు. అందుకే కవులు (మానవులు) సృష్టించే దేవుళ్ళ పాత్రలు, మానవుల్లాగే ప్రవర్తిస్తాయి. మనుషుల రకంగా గాక ఇంకో రకంగా (దేవుడి రకంగా) ప్రవర్తించడం ఎలాగో కవికి తెలియదు. అందుకే రాముడు ఎప్పుడూ మానవుడిలాగే (కపట మానవుడిలాగ) ప్రవర్తిస్తూ వుంటాడు. ★

**372.** **యుద్ధ; సర్గ 21; శ్లోకం 3:** రాముడికి సీత కాకుండా వేరే భార్యలు కూడా ఉన్నారా – అనే విషయం చర్చించడానికి ఇది కూడా ఒక సందర్భం. కాబట్టి దీన్ని కొంచెం వివరంగా చూడాలి.

ఉత్తమ స్త్రీలు రాముడి చేతిని అలంకరించడం గురించి కవి ఇలా అన్నాడు.

" ..................

భుజై పరమ నారీణా మభి మృష్ట మనేగధా"

పరమ నారీణామ్ = ఉత్తమ స్త్రీల యొక్క; భుజైః = హస్తములచేత; అనేకధా = అనేక విధములుగా; అభిమృష్టమ్ = ఈ పదానికి తర్వాత వివరణ అంతా చూడండి:

మృజ్ = తుడవడం, తోమడం, రుద్దడం, శుభ్రపరచడం, అలంకరించడం, సింగారించడం.

'మృజ్'కి భూతకాల రూపం మృష్ట. అంటే – తుడిచెను. తోమెను. రుద్దెను. సింగారించెను. అలంకరించెను.

మృష్టమ్ = తుడప బడెను. తోమ బడెను. రుద్ద బడెను. సింగారించబడెను. అలంకరించబడెను.

'అభి' అనే మాట, ఉప సర్గ. ఇది, విడిగా రాదు, ఇంకో మాటతో కలిసి వస్తుంది. ఇది, ఏ మాటకి ముందు చేరుతుందో, ఆ మాటకి ఉండే అర్థాన్ని పెంచుతుంది. వృద్ధి – అభివృద్ధి; మానం – అభిమానం – ఇలా.

అభి మృష్టమ్ = ఎంతో తుడవబడెను. ఎంతో తోమబడెను. ఎంతో సింగారించబడెను – ఇలా.

"అయితే, ఈ కార్యాలు చేసేవారు దాసీలు కదా? దాసీలను 'ఉత్తమ స్త్రీలు' అని కవి ఎలా అంటాడు? ఆ స్త్రీలను రాముని భార్యలే అనుకోవాలి" అని కొందరు విమర్శకుల వాదం. రాముడు ఏక పత్నీ వ్రతుడు కాదనటానికి ఈ వర్ణనని చాలా ముఖ్యమైన అంశంగా తీసుకుంటారు, ఈ పక్షం వారు.

రెండో పక్షం వారి వాదం ఇలా ఉంటుంది: రాముడి చేతికి ఆ అలంకారాలన్నీ జరిగింది, పూర్వం. (పురా – అనే మాట వాడాడు కవి.) 'పూర్వం' అంటే, 'రాముడి చిన్నతనంలో' కావొచ్చు. రాముడి తల్లీ, పినతల్లులూ అమితమైన ప్రేమతో, ➔

న్నప్పుడు, ఆ చెయ్యి, సీతకు తలగడగా ఉండేది. శత్రువు లందరికీ దుఃఖమూ, మిత్రులకు సంతోషమూ కలిగిస్తుంది, ఆ చెయ్యి! రాముడు అలాంటి చేతిని తల కింద పెట్టుకుని (రాముడి చేతుల్లో కుడి చెయ్యే చాలా గొప్పదన్న మాట!) మూడు రాత్రులు నిష్టగా పడు కున్నాడు!

రాముడు మూడు రోజులు నిష్టగా పడుకున్నా, సముద్రుడు ప్రత్యక్షం కాలేదు . (సముద్రాన్ని ఇక్ష్వాకు వంశస్తులు తవ్వారనేది నిజం కాదని తెలిసిందా?)

రాముడికి చాలా కోపం వచ్చింది. కళ్ళెర్రజేశాడు – "లక్ష్మణా! చూశావా? సముద్రుడు కనబడనే లేదు. ఎంత గర్వమో ఇతనికి! గుణహీనుల యెడల శాంతం పనికిరాదు. గర్విష్టుల్నీ, దుష్టుల్నీ, తమని తాము పొగుడు కునే అహంభావుల్నీ, లోకం పూజిస్తుంది. (అందుచేత, నేనూ అలాగే నన్ను నేను పొగుడుకునే వాడిలాగా అయ్యి పూజలందుకుంటాను.) శాంతంగా, మృదువుగా ప్రవర్తించి లాభం లేదు. శాంతం వల్ల కీర్తి రాదు. ఇక నా బాణముల దెబ్బల్తో సముద్రమంతా అల్లకల్లోలం చేసేస్తాను, చూడు! ముక్క ముక్కలుగా తెగిపోయిన మొసళ్ళతో, సర్పాలతో, చేపలతో, సముద్రం నిండి పోతుంది చూడు! (చూస్తాడులే. ఎందుకు చూడడూ? బాణాలు వెయ్యి మరీ!) గొప్ప యుద్ధం చేసి సముద్ర జలం అంతా ఇంకించేస్తాను, చూడు! (ఇంకించు మరీ, మేమూ చూస్తాం!) అప్పుడు వానరులంతా, నడిచే లంకకు పోతారు. నా సహనం చూసి ఈ సముద్రు డేవిటో అసమర్థుణ్ణి అనుకుంటున్నాడు. ఇటువంటి దుష్టుడి దగ్గిరా నా క్షమ? ఇంతవరకూ నా మంచితనం వల్ల ఇతను ప్రత్యక్షం కాలేదు, చూశావా? ఇక లాభం లేదు.[373] ఏదీ? నా ధనుస్సూ, సర్పాల వంటి నా బాణాలూ తీసుకురా! నాకు కోపం ఎక్కువైపోతోంది. ఇక క్షమించను. సముద్రుణ్ణి ఎన్నడూ ఎరగనంత క్షోభ పెట్టే స్తాను. (ఏదో ఒకటి చేసి సముద్రం మాత్రం దాటుదూ!) నీరంతా చెలియలి కట్టలు దాటి, పొంగి పొర్లి పోయే టట్టు చేసేస్తాను. (నువ్వూ కొట్టుకు పోతావోయ్!) ఇక ఊరుకోను సుమా!" అంటూ ధనుస్సు అందుకుని సము ద్రంలోకి బాణాలు వేశాడు. అవి భగ భగ మండుతూ వెళ్ళి సముద్రం మధ్య పడ్డాయి.

సముద్రం నిండా పొగలు లేచాయి. కెరటాలు మొసళ్ళతో, చేపలతో, సర్పాలతో నిండి, వింధ్య పర్వతం అంతంత ఎత్తున ఎగిరాయి. పాతాళంలో ఉండే నాగులూ, రాక్షసులూ, భయపడిపోయారు. సముద్రం అంతా ఉడుకుతూ అల్లకల్లోలం అయిపోయింది.

---

➔ ముద్దుతో, రాముడికి స్వయంగానే నలుగులు పెట్టి, స్నానాలు చేయించి, అలంకారాలు చేసి ఉండవచ్చు. – ఇలా వాదించడానికి రెండో పక్షం వారికి అవకాశం ఉంది.

కానీ, పిల్లల మీద తల్లులకు ఎంత ముద్దు వున్నా, ధనిక కుటుంబాల్లో, పిల్లలకు తల్లులే స్వయంగా సపర్యలు చెయ్యడం, ఎక్కడా జరగదు. ఆ పనులన్నీ దాసీలే చేస్తారు. లేదా, ఒక రాజుకి ఎక్కువ మంది భార్యలు ఉన్నా ఆ భార్యలే ఆ భర్తకి స్నానాలు చేయిస్తారా? – ఆ పనులన్నీ దాసీలే చేస్తారు. ఏ రకంగా చూసినా, అవి దాసీలు చేసే పనులే. ఆ దాసీలనే కవి, 'ఉత్తమ స్త్రీలు' అంటున్నాడు. అలా ఎందుకు అంటున్నాడో అర్థం చేసుకుంటే సరిపోతుంది.

రాముడికి సేవలూ అలంకారాలూ చేసే భాగ్యం దొరికిన స్త్రీలు, దాసీలైనా ఎంతో ఉత్తములని కవి అభిప్రాయం కావచ్చు. వారు ఎంతో పుణ్యం చేసుకున్న వారు కాబట్టి, శ్రీరాముడికి సేవలు చేసే భాగ్యం పొందగలిగారు. అలాంటి స్త్రీలు కవి దృష్టికి ఉత్తములే కదా?

ఒక పురుషుడికి భార్యలతో సంబంధాన్ని గానీ, వేశ్యలతో సంబంధాన్ని గానీ, వర్ణించాలంటే – ఎప్పుడూ శృంగార చేష్టలో, భక్తి చేష్టలో వర్ణించడమే జరుగుతోంది. కథలో దాదాపు ప్రతిచోటా – భార్య అనగానే 'కామ సంబంధాన్నే' వ్యక్తపరుస్తున్నాడు కవి. ఆ చెయ్యి ఎందరో స్త్రీల చేత ఆలింగనం చేసుకోబడ్డది, చుంబించబడ్డది, పూజించబడ్డది – అని వర్ణించినట్టయితే, 'ఆ స్త్రీలు భార్యలేనేమో' అనడానికి కొంతైనా అవకాశం ఉండేది. కానీ, ఇక్కడ అర్థాలన్నీ 'శుభ్రం చెయ్యడం, అలంకరించడం' అనేవే. కాబట్టి, 'పరమ నారీణామ్, అభిమృష్టమ్' అనే పదాల సాయంతో, 'రాముడికి ఎక్కువ మంది భార్యలు ఉన్నట్టే' అని వాదిస్తే, అది అర్థం లేని వాదం. ఆధారాలు లేని వాదం. కాబట్టి రాముడి భార్యల్ని కనిపెట్టాలని చూస్తే విమర్శకులకు ఈ సందర్భం కూడా పనికిరాదు. ★

**373.** ఎవరితోనైనా మనకేదన్నా పని ఉంటే, మొదట చాలా వినయంగా, అడుగుతాం. కానీ, అవతలి వాళ్ళు మనకు సహాయపడేటట్టు కనపడకపోతే, ఇక చూడండి మన శివాలు! – అవతలి వాళ్ళెందుకు సాయం చెయ్యలేదో, ఇష్టం లేక చెయ్యలేదో, శక్తి లేక చెయ్యలేదో, వాళ్ళ ఇబ్బందేవిటో మనకేం పట్టదు. ఇతర్లు మనల్ని అడిగినప్పుడు, వాళ్ళ కోసం మనం సాయాలు చేస్తామో లేదో, అదీ పట్టదు. మనం అడగ్గానే మనకి సాయం అందకపోతే, అవతలి వాళ్ళమీద సూటీ పోటీ మాటలూ, దుష్ప్రచారాలూ, కోపాలూ, కక్షలూ, అన్నీ వరస క్రమంగా సాగుతాయి. సరిగ్గా ఇలాగే ప్రవర్తిస్తున్నాడు రాముడు! ముందు నమస్కారాలు పెట్టి అడగడం, తర్వాత, 'నిన్ను అలా చేస్తాను, ఇలా చేస్తాను, నీ అంతు చూస్తాను?' అని బెదిరించడం! ★

(అన్నంత పనీ చేశావోయీ రాముడూ! సరేలే, చేపలు దొరికాయిగా? లక్ష్మణుణ్ణి చేపల కూర వొండమను!)

రాముడు కోపం తీరక ఇంకో బాణం వెయ్యబో తోంటే, లక్ష్మణుడు అడ్డొచ్చి, "వొద్దు, వొద్దు" అంటూ వారించాడు.

రాముడు రౌద్రంగా, "ఓయీ సముద్రుడా! నిన్ను పాతాళానికి అంటుకుపోయేటట్టు చేస్తాను సుమా! నీ జలమంతా కాలి, ఇగిరి, ఆవిరై, శుష్కించిపోతుంది. నీలో జీవరాశులన్నీ శోషపడి చచ్చి పోతాయి. (ప్రాణు లన్నిటినీ చంపెయ్యడం రాముడి కెంత ఇష్టమో!) నా బాణ వర్షంతోటే సేతువు కట్టి వానరుల్ని సముద్రం దాటిస్తాను. గ్రహించావా?" అంటూ మళ్ళీ ధనుస్సు ఎక్కుపెట్టి బ్రహ్మాస్త్రం వెయ్యటానికి సిద్ధమయ్యాడు. (లక్ష్మ ణుడు వొద్దన్నాడు గానీ అతని మాటెవడు వింటాడులే.)

భూమీ, ఆకాశం గొప్ప ధ్వనితో బద్దలై పోయాయి. సూర్య చంద్రులూ, నక్షత్రాలూ, గతులు తప్పిపోయాయి. పర్వత శిఖరాలు, గులకరాళ్ళలాగు దొర్లిపోయాయి. లోకం అంతా దిక్కులూ, దారులూ తెలీకుండా పొగతో నిండిపోయింది. ఫెళ ఫెళమంటూ ఆకాశం నించి పిడు గులు పడ్డాయి. కణ కణ మండే నిప్పులతో వర్షం కురి సింది. నదులూ సరస్సులూ అస్తవ్యస్తమై కలతపడి పోయాయి. సమస్త ప్రాణులూ భయంకరంగా హాహా కారాలు చేశాయి. జీవరాసులన్నీ స్పృహ తప్పి మూర్ఛి ల్లాయి.

సముద్రం భూతాలతో, సర్పాలతో, రాక్షసులతో నిండి భయపడి తీరం దాటి పారిపోయింది (కవి గారూ! రాముడు బాణం ఎత్తేప్పటికి లోకాలెలా తల్లకిందులై పోయాయో మీరు వర్ణించిందంతా చక్క గానే ఉంది గానీ .... మా పాఠకులు నమ్మరనుకుంటానండీ!)

సముద్రుడు భయపడడం చూసి రాముడు బాణం వొదలకుండా గంభీరంగా నించున్నాడు.

మేరు పర్వతంలో సూర్యోదయం అయినట్టు సము ద్రంలోంచి ఒక మహా పురుషుడు ఎర్రని బట్టలతో, పూల దండలతో, వజ్ర వైఢూర్యాలు తాపడం చేసిన బంగారు ఆభరణాలతో, పైకి లేచాడు. (ఏ ఊరి కంసాలి చేశాడో సముద్రుడి నగలన్నీ?)

ఆ మహానుభావుడి చుట్టూ రాక్షసులూ, సర్పాలూ, మొసళ్ళూ భయపడి దాక్కున్నాయి. ఆ జంతు జాలా లన్నిటినీ వెంటబెట్టుకుని సముద్రుడు, వినయంగా రాముడి దగ్గిరికి వొచ్చి నమస్కారం చేశాడు. "రామా! భూమీ, ఆకాశం, గాలీ, నీరూ, అగ్నీ - ఇవి పంచ భూతాలు. ఇవి, తమ తమ స్వభావాల్ని మార్చకుండా శాశ్వతంగా ఉంచుకుంటున్నాయి. మిక్కిలి లోతుగా ఉండి, దాటడానికి అసాధ్యంగా ఉండడం నా స్వభావం. ఇష్టపడి గానీ, భయపడి గానీ, నేను నా స్వభావం విడిచి పెట్టకూడదు. రామా! నాకు చేతనైన విధంగా నీకు సహాయం చేస్తాను. సేతువు కట్టడానికి వీలు కల్పి స్తాను. మొసళ్ళ వంటి క్రూర జంతువులు వానరుల కేమీ హాని చెయ్యకుండా చూస్తాను" అన్నాడు.

అప్పుడు రాముడు - "నేను ఎక్కుపెట్టిన ఈ దివ్య బాణాన్ని విడిచి పెట్టకుండా ఆపడానికి వీలు లేదు. దీన్ని ఎక్కడ ప్రయోగించమంటావు?" అని అడిగాడు.

"రామా! నాకు ఉత్తర భాగంలో ద్రుమకుల్యం అనే స్థలం ఉంది. నీ లాగే అది లోకంలో చాలా ప్రసిద్ధి కెక్కింది. కొందరు పాపాత్ములు అక్కడ నిత్యం మంచి నీళ్ళు తాగుతూ వున్నారు. వారి స్పర్శ నేను సహించ లేకుండా వున్నాను. ('అస్పృశ్యత' ఈయన వల్లే పుట్టిం దన్న మాట!) నీ మహాబాణం ఆ పాపుల మీద ప్రయో గించి వారిని సర్వనాశనం చెయ్యి" అని కోరాడు. (వాళ్ళు చేసిన పాపం ఏమిటంటే - మంచినీళ్ళు తాగడం! అది ఈయన భరించలేక పోతున్నాడు!)

రాముడు వెంటనే సముద్రుడు చెప్పిన చోట పడే టట్టు బాణం వొదిలాడు. ఆ దెబ్బ సహించలేక భూమి ఆర్తనాదం చేస్తూ బద్దలైంది. అక్కడ, పాపాత్ములు తాగే నీరంతా ఇంకిపోయింది. అప్పటి నించీ ఆ స్థలం మరు కాంతారం (చవిటి పర్ర) అని ప్రసిద్ధి చెందింది. (రాముడు చేసే పనులు - ప్రాణులన్నిటినీ చంపడమే కాదు, కమ్మటి నీళ్ళు దొరికే సారవంతమైన భూమిని చవిటి పర్రగా చెయ్యడం కూడా!)

శ్రీరాముడు ఆ విధంగా పాపాత్ములకు 'జలం అంద కుండా' నాశనం చేశాడు. "సముద్రుడా! ఇక మీదట ఈ మరుకాంతారంలో పశువుల మేత సమృద్ధిగా ఉంటుంది. పాలూ, పెరుగూ, నెయ్యీ వృద్ధి అవుతాయి. తేనే, పళ్ళూ, కందమూలాలూ ఉంటాయి. వ్యాధులు కలగవు" అని వరం ఇచ్చాడు.[374]

సముద్రుడు సంతోషించి, "వానర ప్రముఖుడైన

**374.** **యుద్ధ, సర్గ 22, శ్లోకాలు 32 .... 42:** "ఈ బాణం ఎక్కడ వెయ్యమంటావు?" అని రాముడు అడిగినప్పుడు, సముద్రుడు తన కష్టం ఏమిటో చెప్పుకుంటున్నాడు, చూడండి:

"ఉగ్రమైన చూపులూ, క్రౌర్యములూ గల పాపులగు దస్యులు, నా నీటిని పానము చేయుచున్నారు" (దస్యులు - అంటే, దేవతలకు శత్రువులు, నీచులు చేయుచున్నారు" (దస్యులు - అంటే, దేవతలకు శత్రువులు, నీచులు, వికార రూపులు, దుష్టులు, జాతి బహిష్కృతులు - వంటి అనేక అర్థాలున్నాయి.)

సముద్రుడి మాటలు: "పాపాః పిబంతి సలిలం మమ" = పాపులు, నా నీరు తాగుతున్నారు. ➔

నళుడు విశ్వకర్మ కొడుకు. తండ్రి ఇతనికి గొప్ప వరం ఇచ్చాడు. ఇతడు నా మీద సేతువు నిర్మించగలడు. (మరి నళుడు చెప్పడేం ఇన్నాళ్ళూ? 'నేను సేతువు కట్టగలను' అని చెప్పొద్దూ? భలే వాడివే నళుడూ!) నేనా సేతువు నీటిలో మునిగి పోకుండా పట్టుకుంటాను. నా మీద సేతువు కట్టి నన్ను దాటండి!" అని చెప్పి అంతర్ధానమై పోయాడు. (అంతర్ధానం అయ్యాక ఎక్కడుంటాడు వెళ్ళి?)

నళుడు ముందుకొచ్చి, "రామా! నువ్వు సముద్రుణ్ణి దండించడం మంచి పని అయింది. కృతజ్ఞత లేని వారి విషయంలో దండోపాయమే ఉత్తమం. ఈ విశాలమైన సముద్రం మీద నేను సేతువు నిర్మించగలననే సంగతి నాకు ఇప్పటివరకూ జ్ఞాపకం లేదు. సముద్రుడు చెప్పడం వల్ల ఇప్పుడు గుర్తు వచ్చింది. నేను విశ్వకర్మ వల్ల పుట్టాను. విశ్వకర్మకు ఔరస పుత్రుణ్ణి. నేను కూడా విశ్వ కర్మ అంత గొప్పవాణ్ణి (తెలుస్తూనే ఉందిలే, నీ వాలకం). ఎవరూ చెప్పకపోతే నా శక్తి సామర్థ్యాలు నాకు గుర్తు రావు" అన్నాడు. (సేతువు కట్టడం యేమో గానీ, అబద్ధాల కోటలు మాత్రం మా బాగా కట్టగలవు!)[375]

"సరే! సేతువు నిర్మించండి!" అని ఆజ్ఞాపించాడు

---

➔ ఆ దస్యులు చేసే పాప కార్యం ఏమిటంటే – సముద్రుడికి సంబంధించిన నీళ్ళు తాగటం. అందుకే వాళ్ళు సముద్రుడికి శత్రువులయ్యారు. ఇటువంటి సంఘటనలు పూర్తిగా ఆటవిక సమాజానికి చెందినవే. 'నీళ్ళ మడుగుల' కోసం ఆటవికుల కొట్లాటలే ఇవి. సముద్రుడు, శత్రువుల చేతిలోంచి తన నీళ్ళ మడుగుని తను తీసుకోలేకపోయాడు. ఆ మడుగుని శత్రువులకు దక్కకుండా నాశనం చేయించాడు. రాముడు ఆ ఘన కార్యం చేశాడు.

ఒక గుంపు ఆక్రమించిన స్థలాలను, ఇంకో గుంపు ఆక్రమించాలని ప్రయత్నించడాలూ, రెండు గుంపుల మధ్య కొట్లాటలూ, మంచి ప్రదేశాల్నీ, నీటి వనరుల్నీ, శత్రువులకు దక్కకుండా ధ్వంసం చేసేయ్యడాలూ – ఇదంతా ఆటవిక సమాజ జీవితం. పశువుల మేత కోసం, నీటి కోసం, పళ్ళ చెట్ల కోసం, ఎవరి మనుగడ కోసం వారు, శత్రువులతో పోరాడడం, ఆటవిక మానవులకు తప్పనిసరి అవసరం. శత్రువుకి నీరు అందనివ్వకుండా చేసి శత్రువుల్ని సర్వనాశనం చెయ్యడం, ఆనాడు వీర కార్యమే.

"శ్రీ రాముడు మరుకాంతారమును ఆ పాపుల నుండి విడిపించి దానికొక వరము నిచ్చెను."

ఆ వరం ఎటువంటిదో చూడండి: "పశువులకు హితమగు మేత గలిగి, రోగములు లేక; ఫలములు, మూలములు, తేనె, నేయి, పాలు, నానా విధములగు ఓషధులు గలిగి, రాముని వర దానముచే మంచి ప్రదేశము గలిగి, ఆ మరుకాంతార ముండినది."

ఆటవికులకు కావలసినవి – పళ్ళ చెట్లూ, నీళ్ళ మడుగులూ, పశువుల మేతా, సురక్షితంగా వుండే నివాస స్థలాలూ. ఇవన్నీ దొరకడం 'వరం'తో సమానమే. అందుకే దేవుళ్ళు అలాంటి వరాలు ఇచ్చినట్టుగా కథలు! మానవ సమాజ పరిణామ దశల్లో, 'ఆటవిక' సమాజమే ప్రారంభ దశ కాబట్టి, ఆ జీవితానికి సంబంధించిన సంఘటనలే క్రమంగా తర్వాత కాలంలో కథల రూపంలోకి మారాయి. మానవ సమాజం – ఆటవిక దశని దాటి, కొంత ఎదిగి, ఇళ్ళు కట్టుకోవడం, వ్యవసాయం చెయ్యడం – వంటి నాగరికత సంపాదించిన తర్వాత కూడా, గత సమాజ విశేషాలే, కథలుగా కొనసాగుతూ వున్నాయి.

'రామాయణం'లో అనేక సంఘటనలూ, అనేక సందర్భాలూ ఆటవిక దశల్ని ప్రతిబింబించేవే. ★

**375.** **యుద్ధ, సర్గ 22, శ్లోకం 51:** నళుడికి సేతువు కట్టడం తెలిస్తే, ఇన్నాళ్ళూ చెప్పడేం – అనే ప్రశ్న వొస్తుంది గదా? కాబట్టి, "ఎవ్వరూ చెప్పకపోతే అతనికి జ్ఞాపకం రాదు మరి. గుర్తులేదు మరి. మర్చిపోయాడు మరి" – ఇదీ కవి జవాబు! నళుడికి – తను సముద్రం మీద సేతువుని కట్టగలననే విషయం మొదటే గుర్తు ఉంటుందనుకోండి. "నేను సేతువు కట్ట గలనులే రామా! నువ్వు విచారించకు, నిన్ను సముద్రం దాటించే పూచీ నాదీ" అనాలి కదా? కథ అలా జరిగితే – రాముడు, సముద్రం దాటలేనివాడూ, నళుడు దాటించగలిగిన వాడూ అవుతారు గదా? రాముడికన్నా నళుడే గొప్ప వాడవుతాడు కదా? అది బాగోదు కాబట్టి, గొప్పతనం అంతా రాముడిదే అయ్యేటట్టు చూడాలి! రాముడు తన పరాక్రమంతో సముద్రుణ్ణి భయపెట్టి, లొంగదీసేటట్టు చేసుకున్న తర్వాత, ఆ సేతువుని నళుడు కట్టినా, ఎవడు కట్టినా, ఆ గొప్పదనం రాముడికే దక్కుతుంది. కథ అలా నడవాలి కాబట్టి, నళుడు సేతువు సంగతి మొదట మర్చిపోయాడు.

హనుమంతుడూ ఇలాగే అన్నీ మరిచిపోతూ వుంటాడు. కథకి కావలసినప్పుడే, మరిచిపోయిన దాన్ని గుర్తు తెచ్చుకుంటూ వుంటాడు.

సముద్రం మీద సేతువు కట్టడం అసాధ్యమైన విషయం – అని కవికి తెలుసు. కానీ, "సముద్రుడు సేతువుని మునిగి పోకుండా పట్టుకుంటే ఎందుకు మునిగి పోతుంది?" అని కవి వాదం!

"రాముడి మహిమతో, సేతువు లేకుండానే అందరూ సముద్రం దాటరాదూ?" అంటే,

"అబ్బే, అదెలా కుదురుతుంది? అందరూ ఎగరలేరుగా?" అంటాడు కవి.

"ఎగర లేరని మీకు తెలుసు గానీ, సముద్రం మాట్లాడదని నీకు తెలీదా?"

"ఎందుకు మాట్లాడదూ? రాముడు బ్రహ్మాస్త్రం వెయ్యబోయాడుగా?"

➔

రాముడు.

వానరులంతా లేచారు. అడవుల వెంటబడి మద్ది చెట్లూ, తాటి చెట్లూ, మర్రి చెట్లూ, మారేడు చెట్లూ, కొబ్బరి చెట్లూ, వేప చెట్లూ, చంద్ర చెట్లూ, ఎన్నెన్నో రకాల చెట్లు పెళ్ళగించి ఈడ్చుకుంటూ తెచ్చి సముద్రంలో పడెయ్యడం మొదలుపెట్టారు. కొందరు పర్వతాల మీదకు పోయి ఏనుగులంతేసి బండలు యంత్రాలతో తెచ్చిపడేశారు. (కవిగారూ! మీరు లంకలో లేరండీ! అక్కడికి వెళ్ళినప్పుడు యంత్రాలు చూద్దురుగాని, ఇక్కడే అంత తొందర పడితే ఎలా చెప్పండి?)

తయారవుతోన్న సేతువు వంకర టింకరగా రాకుండా, కొందరు వానరులు, తిన్నని కర్రలూ, తాళ్ళూ పట్టుకుని ఎప్పటికప్పుడు కొలతలు చూశారు.

ఆ విధంగా వానరులందరూ కలిసి పగళ్ళు మాత్రమే పని చేసి (రాత్రుళ్ళు చీకటి గదా – అనే ప్రశ్న వస్తుందేమోనని, పగళ్ళు మాత్రమే పని చేశారని చెప్పడం!) 10 యోజనాల వెడల్పుతో సేతువుని, మొదటి నాడు 14 యోజనాల పొడుగూ, రెండోనాడు 20 యోజనాలూ, మూడోనాడు 21 యోజనాలూ, నాలుగో నాడు 22 యోజనాలూ, ఐదోనాడు 23 యోజనాలూ మొత్తం 100 యోజనాల పొడుగు సేతువుని కట్టేశారు.[376]

సేతువు తయారై సముద్రం అవతలి తీరంలో సువేల పర్వతాన్ని తాకింది.

సముద్రానికి పాపిడి తీర్చినట్టున్న ఆ సేతువుని చూడాలని దేవత లందరూ ఆకాశంలో గుమి గూడారు. (పనేం ఉంది దేవతలకి? ఎప్పుడూ ఇటూ అటూ తిరుగుదేగా?)

సుగ్రీవుడు రాముడితో, "సముద్రం చాలా విశాలంగా ఉంది. మీరు ఆకాశమార్గాన రండి" అని చెప్పాడు. (ఆకాశమార్గాన వెళ్తే, సముద్రాన్ని దాటే దూరం తగ్గుతుందా?)

రాముడు హనుమంతుడి మీదా, లక్ష్మణుడు అంగదుడి మీదా ఎక్కారు.[377] (గట్టిగా పట్టుకో రాముడూ!)

వానరులు సేతువు నిండా తోసుకుంటూ నడుస్తున్నారు. కొందరు నీళ్ళల్లో పడుతున్నారు. కొందరు ఎగురుతున్నారు.

శ్రీరాముడి కరుణ వల్ల అందరూ సముద్రం దాటారు!

ఆకాశంలో దేవతలందరూ రాముణ్ణి పుణ్యోదకాలతో అభిషేకించి, "రామా! శత్రువులందర్నీ నాశనం చేసి ఈ భూమండలం అంతా పాలించు!" అని ఆశీర్వదించారు. (ఇదే అసలు సంగతి. 'భూమండలం అంతా ఆక్రమించడానికే' ఈ వ్యవహారం అంతా. దేవతలు

---

➔"అసలు బ్రహ్మాస్త్రం ఏమిటండీ? రాముడికి విల్లు వుంటే వుంటుంది. అది వేటాడడానికి పనికి వొస్తుంది. అందులో నించి పొగలూ సెగలూ రావడం ఏమిటండీ?"

"ఎందుకు రావూ? రాముడికి విశ్వామిత్రుడు వరం ఇచ్చాడుగా?"

ఈ రకంగా, కథలో ప్రతీ ఘట్టంలోనూ, వాస్తవాలూ, కల్పనలూ కలగలిసిపోయి వుంటాయి. వాటిని విడి విడిగా అర్థం చేసుకోవాలి. ★

**376.** సేతువుని, ఎంత వాస్తవంగా కట్టారో చూశారా? చెట్లు కొట్టారు. బండలు కొట్టారు. కష్టపడి ఈడ్చుకుంటూ తెచ్చారు. మామూలు రకం తాపీ పనులన్నీ చేశారు. కొలతలన్నీ సరిగ్గా చూశారు. పగళ్ళే పని చేశారు.

ఇంత వాస్తవంగా – సేతువుకి, ఏయే వస్తువులు కావాలో అవన్నీ తెచ్చి, ఏ రకంగా కట్టాలో ఆ రకంగా 100 యోజనాలు (800 మైళ్ళకు పైగా) నీళ్ళ మీద 5 రోజులు కట్టారు. మాయలతోటో, మంత్రాలతోటో సేతువు ఒక్క చిటికెలో తయారవ్వలేదు సుమా! ఎంతో వాస్తవంగా 5 రోజులు పట్టింది!

**యుద్ధ, సర్గ 25, శ్లోకాలు 2, 3:** సముద్రం మీద సేతు నిర్మాణం గురించి తెలిసినప్పుడు, రావణుడు ఇలా ఆశ్చర్యపోయాడు. "ఇంతకు పూర్వం ఏ కాలములోనూ కని విననట్టి సేతువును రాముడు సముద్రం మీద నిర్మించెను. ఏ విధము చేతనైనను సముద్రములో సేతువు గట్టిన విషయము నమ్మలేను."

నదుల్ని దాటాలనేదీ, అవతలి ప్రదేశాలకు చేరాలనేదీ, ఆటవిక మానవులకు కలిగే పెద్ద కోరిక. చిన్న చిన్న నీటి పాయల్నీ, బోదెల్నీ సునాయాసంగా దాటడం నిత్యకృత్యమే. కొంచెం వెడల్పైన నీళ్ళ మడుగుల్లో పెద్ద పెద్ద బండలో, చెట్ల మొదళ్ళో అడ్డం పడేసి దాటడం కూడా మామూలే. ఆ రకంగానే మహా నదుల్ని కూడా దాటగలిగితే? సముద్రాల్ని కూడా దాటగలిగితే? ఇవి, 'అవసరాలు' కూడా. నిత్యజీవితంలో ఎంతో అవసరమైన విషయాలే తీవ్రమైన కోరికలుగా తలెత్తుతాయి. వాటిని సాధించాలనే ఆరాటంతోనే ఊహలు సాగుతాయి. ఆటవిక సమాజంలో మానవులకు ఏం కావాలో అవే వారి కథల్లో సంఘటనలు అయ్యాయి. ఈ నాడు మనకేం కావాలో అవి మన కథల్లో సంఘటనలు అవుతాయి. ఈ సముద్రం దాటడాన్ని వాస్తవికంగా అర్థం చేసుకోవాలంటే, నావల మీదే దాటినట్టు అర్థం చేసుకోవాలి. ★

**377.** ఈ 'లింకు' భాగాలు వాల్మీకి రామాయణ కథని యథాతథంగా చెప్పే భాగాలు గనక, ఇక్కడ రాముడూ లక్ష్మణుడూ వానరుల మీద ఎక్కినట్టే రాయాలి. 'విషవృక్షం' కథల్లో మాత్రం అందరూ మనుషులే కాబట్టి రాముడూ లక్ష్మణుడూ కూడా నడుస్తారు. ★

బాగానే గ్రహించారు. లేకపోతే, 'సీతతో సుఖంగా ఉండు' అని దీవించరాదూ?)

రాముడు సముద్రం దాటి హనుమంతుడి మీద నించి దిగగానే లక్ష్మణుణ్ణి కావలించుకున్నాడు. (అంత భయం వేసింది గావున్ను!) – "లక్ష్మణా! పుష్కలంగా పళ్ళూ, నీళ్ళూ ఉండే ప్రదేశం చూసి ఈ సేననంతా గరుడ వ్యూహం తీర్చి ఉంచుదాము. రాక్షసులకూ, వానరులకూ కూడా మహా నాశనం కలిగే విధంగా అపశకునాలు కనబడుతున్నాయి. గాలి, కఠినంగా వీస్తోంది. భూమి, గడ గడ వొణుకుతోంది. పర్వతాలు, దొర్లుతున్నాయి. మహా వృక్షాలు, కూలుతున్నాయి. మేఘాలు, గద్దల్లా అరుస్తున్నాయి. ఆకాశం, రక్తం కురుస్తోంది. సూర్య మండలంలో నుంచి భగ భగమండుతూ అగ్ని శిఖ ఉరుకుతోంది. చంద్రుడు, కాంతి తగ్గిపోయాడు. నక్షత్రాలు, మసక బారాయి. భూమి, రక్త మాంసాలతో నిండిపోతోంది. ఎవ్వరూ ఆక్రమించలేని లంక మీద ఇప్పుడే దండెత్తుదాము" అన్నాడు.

వానర వీరులు కోలాహలంగా ఉన్నారు. వారిని చూసి రాముడు ఉత్సాహభరితుడయ్యాడు.[378]

లంకానగరం నుంచి భేరీధ్వనులు వినిపిస్తున్నాయి. వానరులు యుద్ధోత్సాహంతో సింహ నాదాలు చేశారు.

రాముడు లంకని చూసి దుఃఖిస్తూ, "జింక కన్నుల వంటి కన్నులు గల సీత ఈ లంకలోనే ఉంది గదా!" అని పెద్ద నిట్టూర్పు విడిచాడు. (ఇప్పుడు మళ్ళీ మొదలు పెడతాడా విరహం?) లక్ష్మణా! విశ్వకర్మ నిర్మించిన ఈ లంక, త్రికూట పర్వత శిఖరాన, ఆకాశాన్ని అంటుతున్నట్టు ఉంది, చూడు! నగరం నిండా ఎన్నో విమానాలు ఎగురుతూ, మేఘాలలో నిండిన ఆకాశంలాగ ఉంది లంక. (ఈ దేశం మనదే అవబోతోందిలే!) ఎటు చూసినా ఉద్యాన వనాలే! అన్నీ పూలతో, పళ్ళతో, పక్షుల కూతలతో నిండి మనోహరంగా ఉన్నాయి. (ఈ అందాలన్నీ మనం ఇప్పుడు నాశనం చేద్దాం!) తుమ్మెదలు మధుపానం చేసి మత్తెక్కి ఉన్నాయి. పిట్టలు పళ్ళు తిని మదించి ఉన్నాయి. (రాముడు, పిట్టల్ని తిని మదించి ఉన్నాడు. మాట మాట్లాడితే, ఈ 'పిట్టల కవిత్వం' వొకటీ!.) మంద మారుతాలు చక్కగా వీస్తున్నాయి. పూల గుత్తులు చక్కగా ఊగుతున్నాయి." (అపశకునాలన్నీ ఏమయ్యాయి?)

రాముడు, తర్వాత వానరుల్ని చూస్తూ ఇలా ఆజ్ఞాపించాడు – "అంగదుడూ, నీలుడూ సైన్యానికి రొమ్ము భాగంలో ఉండాలి. రుషభుడు దక్షిణ భాగాన, గంధమాదనుడు ఎడమ పక్క ఉంటారు. నేనూ లక్ష్మణుడూ సేనకు ముందు భాగంలో ఉంటాము. (నువ్వు కూడా ముందే వుంటావా? నువ్వు, వెనకాల నడవాలిగా?) జాంబవంతుడూ, సుషేణుడూ కడుపు భాగంలో ఉంటారు. సుగ్రీవుడు సేనకు వెనుక భాగంలో ఉంటాడు." (అవును. ఆయనకు వెనక భాగమే చాలా నచ్చుతుంది. నీకు కూడా అదే నచ్చుతుంది కదా?)

ఆ విధంగా రాముడు సేనని నిలబడమని ఆజ్ఞాపించాడు.

సేన అంతా ఆ విధంగానే ఏర్పాటైంది.

అప్పుడు రాముడు సుగ్రీవుడితో, "సేన అంతా సిద్ధంగా ఉంది. ఇక శుకుణ్ణి విడిచి పెట్టించు!" అన్నాడు. (అప్పటి దాకా శుకుణ్ణి బంధించి వుంచడం రాముడికీ అంగీకారమే!)

సుగ్రీవుడు శుకుణ్ణి విడిచిపెట్టించాడు.[379] ★

---

**378.** **యుద్ధ; సర్గ 23; శ్లోకం 16:** "శ్రీరామునకు ప్రియము కలిగించుటకై, ధైర్యము గల వారును, వీర్యవంతులును నగు వానరుల యొక్క కార్యకలాపములచే శ్రీరాముడు సంతోషించెను."

వానరులు సంతోషంగా ఉన్నారా, లేదా; యుద్ధం చెయ్యాలనే ఉత్సాహంతోనే ఉన్నారా, లేదా? – ఈ రకం సందేహాలు కలుగుతున్నా యన్నమాట రాముడికి. వానరులు యుద్ధానికి అనుకూలంగానే ఉండడం చూసి సంతోషిస్తున్నాడు రాముడు. ★

**379.** శుకుడు రావణుడి దగ్గిర్నించి దూతగా వచ్చాడు గదా? అతన్ని బాధలుపెట్టి బంధించారు. తర్వాత, ఎప్పుడు విడిచిపెట్టారు? – ఈ విడిచి పెట్టడం గురించి, రెండు చోట్ల రెండు రకాలుగా ఉంది.

**యుద్ధ, సర్గ 20, శ్లోకం 37:** "వచ్చిన దూతను విడిచి పెట్టవలెను" అన్నాడు రాముడు. అయితే, దూతను ఈ సందర్భంలో విడిచి పెట్టలేదు. విడిచిపెడితే అప్పుడే ఎగిరి వెళ్ళిపోయే వాడే కదా?

**సర్గ 24, శ్లోకాలు 23, 24:** వానర సైన్యమంతా సముద్రం దాటి లంకని చేరిన తర్వాత – "పిమ్మట గొప్ప తేజస్సు గల రాముడు, సుగ్రీవునితో ఇటులనెను – 'మన సేనను బాగుగ విభజించియుంచి యున్నాము. ఇక శుకుని విడిచి పెట్టవలయును'".

"గొప్ప బలము గల సుగ్రీవుడు (ఓహో, రాముడికి తేజస్సు అయితే, ఈయనకి తేజస్సు లేని బలం – అన్నమాట!) రాముని మాట విని, అతని యాజ్ఞ ప్రకారము, 'దూతయగు శుకుని విడిచి పెట్టించెను."

దూతని, ఇప్పటికి వదిలారు! దూతగా వచ్చిన వాణ్ణి, ఏమీ దుర్మార్గంగా ప్రవర్తించని వాణ్ణి, ఇంతకాలం బంధించి పడేసి వుంచారు! రాముడి కళ్ళముందే! సముద్రం దాటిన తర్వాత, రాముడు, సుగ్రీవుడితో, "ఇక శుకుణ్ణి వొదిలి పెట్టించు" అన్నాడు కదా? అంటే, అప్పటి దాకా శుకుణ్ణి బంధించి ఉంచింది, రాముడి ఆజ్ఞ మీదే అన్నమాట! ★

## కథ-13

# రాముడు పోయాడా?

మంచు కప్పిన పర్వత శిఖరం లాగ, తెల్లగా ఎత్తుగా ఉందా మేడ! రావణుడు పై భాగం కంత లలో నించి శత్రు స్థావరాల్ని పరికిస్తూ నిర్ఘాంత పడు తున్నాడు.

ఎటు చూస్తే అటు అంతులేని సైన్యం! పర్వత చరి యల నిండా, లోయల నిండా, చెట్ల నీడల నిండా, ఎక్కడి కక్కడే గుంపులు గుంపులుగా శత్రు సైన్యం!

తన ఊహలకూ, అంచనాలకూ మించిన శత్రు బలాన్ని రావణుడు గంభీరమైన ఆందోళనతో చూస్తు న్నాడు. ఆలోచనలో మునిగి మీసాలు మెలిదిప్పు తున్నాడు.

రాముణ్ణీ, సుగ్రీవుణ్ణీ విడదియ్యాలని చేసిన ప్రయత్నం వ్యర్థమైంది! అంతేగాక, విభీషణుడు కూడా వెళ్ళి శత్రుపక్షంలో జేరాడు! శత్రువు, లంక ముట్టడికి సిద్ధంగా ఉన్నాడు! రావణుడి చుట్టూ నిలబడ్డ చారులు శత్రుసేన విశేషాలు చెప్పుకుపోతున్నారు.[380] "మహా రాజా! శత్రుసైన్యం అపారంగా ఉంది. నీ ఆజ్ఞ ప్రకారమే మేము శత్రుసైన్యంలో జొరబడి కొంత సమాచారం సేక రించగలిగాము. వానర సైన్యం అంతా యుద్ధోత్సా హంతో పొంగి పోతోన్నట్టే మాకు తోచింది."

రావణుడు మొహం చిట్లించాడు – "వారిలో ముఖ్యు లెవరు? మహా వీరు లెవరు? సేనాధిపతు లెవరు?"

"ముఖ్య సేనాధిపతి నీలుడు. అతడు మహా వీరుడని విన్నాము. అంగదుడు, తండ్రిని మించిన పరాక్రమ వంతుడట. నళుడూ, శ్వేతుడూ, కుముదుడూ, రంభుడూ, శరభుడూ, పవసుడూ, వినతుడూ, క్రోధుడూ, ధూమ్రుడూ, ప్రమాథీ, శతవలీ – వాడనీ, వీడనీ ఎందుకు మహారాజా! సేనా పతులందరూ యుద్ధా నికి అనుకూలంగానే ఉన్నారు. ప్రతీ సేనాపతికీ అనేక దళాల సైన్యం ఉంది. ఆ సైనికులందరూ కూడా బలా ఢ్యులే. మదించిన అడవి ఏనుగుల్లా ఉన్నారు."

"సామాన్య సైనికుల ధోరణి ఏ విధంగా ఉందో గ్రహించారా?"

చారులు కొంచెం సేపు ఒకరి మొహా లొకరు చూసు కున్నారు. "మహారాజా! నువ్వు శాంతంగా ఆలకించాలి. వారి ధోరణి కూడా మన సైనికుల ధోరణి విధంగానే ఉంది. మొదట్లో వారంతా యుద్ధానికి విముఖంగానే ఉన్నట్టు తెలిసింది. సుగ్రీవ మహారాజు, నిర్బంధంగా సైన్యాన్ని సమీకరించే విధానం అవలంబించాడని విన్నాము. మరణ శిక్షల భయం వల్లనే అంత సైన్యం యుద్ధానికి కదిలింది .... మహారాజా! నువ్వు గ్రహించ లేని దేముంది? యుద్ధ రంగంలోకి దిగిన సైనికుడు ఉత్సాహం ప్రదర్శించక ఏమి చెయ్యగలడు? తన ఆత్మరక్షణ కోసమైనా తెగించి యుద్ధం చేస్తాడు గదా? లంక సైన్యం లంకాధిపతికి సహకరించినట్టే కిష్కింధ

---

**380.** యుద్ధ, సర్గ 24, శ్లోకాలు 25, 26: రాముడు లంక చేరిన తర్వాత శుకుణ్ణి విడిచి పెట్టించాడు గదా? శుకుడు రావణుడి దగ్గిరికి వెళ్ళగానే రావణుడు శుకుణ్ణి చూసి, "నీ రెక్కలు తాళ్ళతో కట్టబడినవా యేమి? ముక్క ముక్కలుగా నరకబడినట్లు గనపడుచున్నావు. వానరులు నిన్ను తమ స్వాధీనములో నుంచుకొనిరా యేమి?" అని నవ్వుచు (ప్రహసన్నేవ = నవ్వుచునే) అడిగెను.

తను పంపిన రాయబారి ఇంకా తిరిగి రానే లేదే – అన్న ఆలోచనే లేదు రావణుడికి. పైగా అతను వచ్చినప్పుడు – "వానరులు నిన్ను బాధలు పెట్టారా?" అని చిరునవ్వుతో అడిగాడట! శుకుణ్ణి బాధలు పెట్టడం కవికి సంతోషంగా ఉంటుంది గానీ, తన రాయబారిని శత్రువులు బాధలు పెట్టారంటే, అది రావణుడికి నవ్వుగా ఉంటుందా? ఇంతా జేస్తే, శుకుడు తను ఏం పని మీద సుగ్రీవుడి దగ్గిరికి వెళ్ళాడో ఆ పని గురించి రావణుడికి చెప్పనే లేదు. "నువ్వు చెప్పిన సంగతి వానరులకు చెప్పాను" అన్నాడే గానీ, సుగ్రీవుడేం జవాబు చెప్పాడో రావణుడికి చెప్పలేదు. పైగా, శ్రీరాముణ్ణి కీర్తించడం ప్రారంభించాడు. సీతని ఇచ్చెయ్యమన్నాడు. దానికి రావణుడు యధాప్రకారంగానే కోపగించుకున్నాడు.

**తర్వాత**, సర్గ 25: రావణుడు – శుకుడూ, సారణుడూ అనే వారిని పిలిచి – "మీరు వానర సైన్యంలో ప్రవేశించి రహస్యాలన్నీ తెలుసుకు రండి" అని ఆజ్ఞాపించాడు. (ఈ శుకుడు మొదటి శుకుడే అనుకోనవసరం లేదు. మొదటి శుకుడే అయినా, ఈ సారి ఇతను రాయబారి కాడు. గూఢచారి.)

ఈ శుక – సారణులు గూఢచారులు. వాళ్ళిద్దరూ తమ పరివారంతో తిరిగి వచ్చి రావణుడికి శత్రుసేన గురించి చెపు తున్నారు. ★

సైన్యం ...."

రావణుడు అసహనంతో వింటూ, చూపులు మళ్ళీ శత్రుసైన్యం వేపు తిప్పాడు.

"మహారాజా! మమ్మల్ని మన్నించాలి. నీకూ, లంకకూ ఒక దుర్వార్త మోసుకొచ్చాము. విభీషణుడు శత్రుపక్షంలో నిస్వార్థంగా చేరలేదు. రాముడు విభీషణుణ్ణే లంకాధిపతిని చేస్తానని వాగ్దానం చేశాడట! ...."

రావణుడు వెటకారంగా నవ్వాడు–"వాడు జయించి నప్పటి మాట కదా?" అని మీసం మెలి దిప్పాడు.

"అంతే కాదు మహారాజా! విభీషణుడు కూడా రాముడి జయానికే సహకరిస్తానని శబధం చేశాడట!"

రావణుడి మొహం భరించలేని కోపంతో జేవురించింది – "ఈ సమాచారం నిజమైందేనా?"

"మన్నించు మహారాజా! విభీషణుడి ప్రవర్తనే మా మాటలకు రుజువు. మేమింకా ఎంతో సమాచారం సేకరించక ముందే విభీషణుడు మమ్మల్ని కనిపెట్టి పట్టేశాడు. వెంటనే మమ్మల్ని వానరులందరూ తిట్టుకుంటూ, తన్నుకుంటూ, రాముడి దగ్గరికి తీసుకుపోయారు.[381] మేమిక ప్రాణాలమీద ఆశలు వొదిలేసుకున్నాము .... కానీ ...."

చారుల మొహాల మీద వొక్కసారి ప్రాణ భయం తారట్లాడింది. ఆందోళనతో నిట్టూర్పులు విడుస్తూ, నోరు విప్పటానికి తటపటాయిస్తూ, మహారాజుకి వొంగి నమస్కారాలు చేశారు. "మహారాజా! మమ్మల్ని మన్నించు; శాంతంతో ఆలకించు. ఆ శ్రీరాముడే మాకు ప్రాణ భిక్ష పెట్టాడు. గూఢచారుల్ని దయదల్చవలసిన ధర్మం ఏ రాజుకీ లేదు గదా? కానీ .... ఆ కరుణా సముద్రుడు .... దయ జూపకపోతే ఈ పాటికి ఏ లోకంలో ఉండే వారమో! .... ఆ పుణ్యాత్ముడే ...."

"చాలించండి!" – రావణుడు మండిపడుతూ గర్జించాడు. "శత్రువు దయతో ప్రాణాలు దక్కించుకున్నందుకా ఇంత సంతోషం? ఆ నీచుణ్ణి కీర్తించడం మాని జరిగిందేమిటో చెప్పండి!"

మహారాజు గర్జనకు వణుకుతూ చారులు తలలు వొంచారు– "మన్నించు, మన్నించు ప్రభూ! శాంతించు!" అంటూ నమస్కారాలు చేసి మళ్ళీ వినయంగా ప్రారంభించారు – "జరిగిందే చెపు తాము మహారాజా! రాముడు మమ్మల్ని చూసి కోపం ప్రదర్శించలేదు సరి గదా, మాతో చిరునవ్వుతో సంభాషించాడు. 'చారులారా! మీ ప్రభువు చెప్పిన కార్యమంతా ముగించారా? ఇక మీ దేశానికి నిర్భయంగా తిరిగి వెళ్ళండి! మీ మహారాజుతో నేను చెప్పినట్లుగా కొన్ని మాటలు చెప్పండి!' అంటూ కొన్ని మాటలు చెప్పాడు ప్రభూ!"

"ఏవిటా కూతలు?"

"'రావణా! నువ్వే బలంతో నా భార్యను ఎత్తుకుపోయావో ఆ బలం అంతా యుద్ధంలో చూపించు! రేపు తెల్లవారగానే నేను లంక మీద దండెత్తబోతున్నాను. నా వీరత్వం ఏమిటో నువ్వు యుద్ధంలోనే చూస్తావు, నీ వీరత్వం ఏమిటో కూడా ప్రదర్శించు!' అన్నానని చెప్పండి! ఇక వెళ్ళండి! – అని మాతో దయగా సంభాషించి మమ్మల్ని విడిచిపెట్టించాడు ప్రభూ!"[382]

---

**381.** **యుద్ధ, సర్గ 25, శ్లోకం 14:** విభీషణుడు రాముడికి ఎలాంటి సహాయాలు చేస్తున్నాడో గమనిస్తూ ఉండండి! "గొప్ప తేజస్సు గల విభీషణుడు (రాముడి పక్షాన చేరిపోయే వాళ్ళందరికీ తేజస్సులు వొస్తాయి!) వానర వేషం దాల్చి యుండు శుక – సారణులను జూచి శీఘ్రముగ వారిని బట్టుకొని వచ్చి రాముడికి దెలిపెను." ★

**382.** **యుద్ధ, సర్గ 25, శ్లోకాలు 18 .... 22:** శుక సారణులతో రాముడు మాట్లాడిన మాటలు చూడండి. "సేననంతయు జూచి యుండినను, మమ్ము మీరు బరీక్షించి యుండినను, రావణుడు చెప్పిన కార్యములు మీరు చేసియుండినను, మీ ఇష్ట ప్రకారం పోవచ్చును. మీరు మా సేనను జూడనటులైతే మరియు జూడవచ్చును. లేక విభీషణుడైనను మా సేనను మీకు జూపగలడు."

శత్రువులు గూఢచారులుగా వచ్చి రహస్యాలన్నీ సేకరించుకున్న తర్వాత పట్టుపడితే, "మా రహస్యాలన్నీ బాగా తెలుసుకున్నారా? మీ రాజు చెప్పిన పనులన్నీ చక్కగా చేసుకున్నారా? మా రహస్యాలు మీకింకా బాగా తెలియకపోతే మా వాళ్ళు మీ కన్నీ చెప్పేస్తారు. అన్నీ తెలుసుకుని మరీ వెళ్ళండి" అంటాడా బుద్ధీ జ్ఞానం ఉన్నవాడెవడైనా? శత్రువుల నుంచి రహస్యాలు కావాలనే గదా రావణుడు గూఢచారుల్ని పంపించాడు? వారు మారు వేషాలతో రహస్యంగా వచ్చారు. శత్రువులు వచ్చి తమ రహస్యాలు తీసుకుపోవడం వల్ల ఇవతలి పక్షానికేమీ నష్టం లేకపోతే, ఆ సమాచారం శత్రువుకి మాత్రం ఏం ఉపయోగపడుతుంది?

రాముడు ఇంకా ఏమంటున్నాడో చూడండి – "విభీషణుడు పట్టుకొని వచ్చిన మీ ప్రాణముల విషయమై మీరు భయపడవలదు. ఆయుధములు లేక పట్టుబడిన దూతలను (దూతౌ – అనే వాడాడు కవి) వధించరాదు."

దౌత్యానికి వెళ్ళేవాడు – దూత. రహస్యాల సేకరణ కోసం వెళ్ళేవాడు – గూఢచారి. గూఢచారికీ, దూతకీ తేడా తెలీదు రాముడికి! మారువేషాలతో వచ్చి రహస్యాలు సేకరించుకునే శత్రువులు దూతలో, రాయబారులో అవుతారా? గతంలో వచ్చిన శుకుడు మాత్రమే దూత. ఇప్పుడు వచ్చిన వాళ్ళిద్దరూ గూఢచారులు. దూతలు కారు. (లంకకు వెళ్ళినప్పుడు ➔

రావణుడు మీసాలు మెలిదిప్పుతూ, "రావణుడు యుద్ధానికి జంకక పోతాడా – అని చాలా ఆశపడు తున్నట్టున్నాడే రాముడు!" అని గాంభీర్యం ప్రదర్శిస్తూ చూశాడు.

చారులు అతి వినయంతో తలలు వొంచారు. "మహారాజా! దయతో మా విన్నపం మన్నించు! లంకకు క్షేమం కలిగించి మా భీతి పోగొట్టు! శ్రీరాముడూ, సుగ్రీవుడూ విభీషణుడూ శత్రుపక్షంలో ఎంతో బలాఢ్యులై ఉన్నారు. వారి ఆధ్వర్యం కింద వానర సైన్యం లంకని జయించి తీరుతుంది. నువ్వు శ్రీరాముడితో సంధి చేసు కుని ఈ యుద్ధ బీభత్సం నుంచి లంకను రక్షించాలి. లేకపోతే శ్రీరాముడు తన పరాక్రమంతో ...."[383]

రావణుడు ఉగ్రుడై పోయాడు. "ఏమిటీ ప్రేలాపన? నా అనుగ్రహం మీద ఆధారపడి కూడా నాకు అప్రియం కలిగించాలని చూస్తున్నారా? రాజ నీతి తెలిసిన చారు లేనా మీరు? ఇంతకాలం మీ వంటి ద్రోహుల్నే విశ్వాస పాత్రులని నమ్మానా? శత్రు కీర్తనలు చేసిన విభీషణుడి కే గతి పట్టిందో మీకూ ఆ గతే పట్టాలి. మీ వంటి కృత ఘ్నులు నా రాజ్యంలో ఉండడానికి వీలు లేదు. మీరం దరూ తక్షణం నా రాజ్యం విడిచి వెళ్ళిపోండి. లంకకు ఎటువంటి ప్రమాదమూ రాదు. లంకకు వచ్చిన రాముడు మళ్ళీ ప్రాణాలతో తిరిగి వెళ్ళలేదు. ఇక వెళ్ళండి. మళ్ళీ మీ మొహాలు నాకు చూపించవద్దు!" అని గర్జించాడు.[384]

---

➔హనుమంతుడూ దూత కాదు.) దూతలు చేసే పనికీ, గూఢచారులు చేసే పనికీ తేడా వుంది. దూతల విషయంలో అయితే, వారిని అవమానం చెయ్యగూడదనీ, చంపగూడదనీ, కొన్ని నిబంధనలు పాటిస్తారు. గూఢచారుల విషయంలో ఏ నిబంధనలూ పాటించరు. కానీ, "శ్రీరాముడు ఎంతో ఉత్తముడు సుమా! ధర్మాత్ముడు సుమా! ఎవర్నీ చంపించలేదు సుమా!" అని చెప్పాలని కవి తాపత్రయం. శ్రీరాముడికి కీర్తి ప్రతిష్టలు పోగేసి పెడదామనుకున్నప్పుడల్లా, అది అపకీర్తి గానో, శుద్ధ తెలివి తక్కువ గానో రుజువైపోతూ వుంటుంది.

దూతగా వచ్చి, ఎంతో వినయంగా ప్రవర్తించిన శుకుణ్ణేమో నానా హింసలూ పెట్టి, కట్టి పడేసి వుంచారు. గూఢ చారులుగా వచ్చి రహస్యాలు సేకరించిన వాళ్ళని, మర్యాదలు చేసి 'రహస్యాలు ఇంకా కావాలా? ఎన్ని కావాలంటే అన్నీ మా వాళ్ళు మీకు చెప్పేస్తారు, తీసుకోండి!' అని చెప్పి, వాళ్ళని సాగనంపారు. రహస్యాలు సేకరించుకున్న గూఢచారులు పట్టుబడితే, వాళ్ళని వెళ్ళనివ్వకుండా తమ ఆధీనంలోనే ఉంచుకోవాలి. కానీ, శ్రీరాముడు కరుణా సముద్రుడు! ఆ సముద్రుడు ఎప్పుడెలా ప్రవర్తిస్తాడో ఆయనకే తెలీదు. ★

**383.** **యుద్ధ, సర్గ 25, శ్లోకాలు 29 .... 34:** శుక సారణులు రావణుడితో ఎలా మాట్లాడుతున్నారో చూడండి! "పురు షోత్తములగు నలుగురు (రాముడూ, లక్ష్మణుడూ, సుగ్రీవుడూ, విభీషణుడూ – అని అర్ధం), లోకపాలురతో సములై, శూరులై, అస్త్ర విద్యావంతులై, స్థిర పరాక్రములై, ఐకమత్యము గలిగి యున్నారు. ఈ నలుగురు, లంకను ప్రాకార రహితముగా పెళ్ళగించి ఇంకొక చోట నుంచుటకు శక్తిగల వారై యున్నారు. (మిగిలిన సైన్యం అక్కరే లేదు – అని అర్ధం.) రాముని రూపమును, అతని ఆయుధములను జూచినటులైతే అతడొకడే ఈ లంకను నాశనము జేయగల వాడుగా తోచును. (ఆ ముగ్గురూ కూడా అక్కరలేదన్నమాట! మళ్ళీ మాట్లాడితే రాముడు కూడా అక్కర్లేకుండానే దాని కదే అయిపోతుంది పని!) రామునితో పగ వలదు. శాంతి పొందుము. సీతను రామునికి సమర్పించుము."

యుద్ధం వొద్దనీ, సీతని ఇచ్చెయ్యమనీ, మహారాజుకి చారులూ చెప్పడమే, దూతలూ చెప్పడమే! శత్రు పక్షపు చారులతోటీ, దూతలతోటీ కూడా రాముణ్ణి పొగిడించడమే! ★

**384.** **యుద్ధ, సర్గ, శ్లోకాలు 5 .... 12:** దూతలు గానీ, చారులు గానీ, మంత్రులు గానీ, రాజుకు విశ్వాసపాత్రులై ఉండకుండా ఎదురు తిరగడం ఎంత తప్పో, ఎందుకు తప్పో చెప్పాలని, కవి అభిప్రాయం. ఆ రాజ నీతులన్నీ చెప్పడానికి, కవి, రావణుడి చారుల్ని ఎదురు తిరిగించి, ఆ సందర్భం ఉపయోగించుకుని చెపుతున్నాడు.

రాముడి పక్షంవారు మాత్రం ఎవ్వరూ, ఎప్పుడూ ఎదురు తిరగరు.

చారులు ఎదురు తిరిగితే రావణుడు ఏమంటున్నాడో చూడండి! "రాజు వద్ద జీవనము చేయువారు రాజునకు అప్రియమైన మాటలు చెప్పుట తగదు గదా? వ్యతిరేకులై, యుద్ధమునకు వచ్చుచుండు శత్రువులను మీరు కీర్తించుట తగునా? రాజనీతి శాస్త్రములో సేవక ధర్మ సారాన్ని మీరు గ్రహించలేదు. ఆచార్యుల ద్వారా మీరు విశేషముగ జ్ఞానమును సంపాదించినను, ఆ శాస్త్రార్ధములు మీకు అనుభవమునకు రాలేదు. (ఊరికే చదువుకున్నారే గానీ, ఆ చదివిన దాన్ని ఉపయోగించుకోవడం లేదు.) నీతి శాస్త్రము తెలియని మూర్ఖులగు మంత్రులతో గూడి, దైవ సహాయముచే మాత్రమే, రాజ్యము పాలించుచున్నాను. నన్ను చూసి పరుషోక్తులాడుటకు మీకు భయము లేదా యేమి? ఆజ్ఞ చేయుటకు శక్తి గల నా నాలుక చలనమే మీకు మృత్యువును గాని, శుభమును గాని, ఇచ్చును." (నేను నోరు తెరిచి ఒక్క మాట మాట్లాడానంటే మీకు చావో బతుకో అయిపోతుంది! – అంత నిరంకుశత్వం రాజులకు!) ➔

చారులందరూ వినయంగా మహారాజుకి నమస్కారాలు చేసి తలలు వొంచి నిష్క్రమించారు.[385]

రావణుడు కొంతసేపు మంత్రులతో రహస్య సంభాషణలు సాగించి – "నేను తక్షణం అశోకవనానికి వెళ్ళాలి. ఏర్పాటు చెయ్యండి!" అని ఆజ్ఞాపించాడు.

★ ★ ★

సీత ముందు మందహాసాలతో నిలబడ్డాడు రావణుడు. "సీతా! నిన్ను చూస్తే నా మనసు దయతో నిండిపోతోంది. భర్త కోసం ఎంత కాలంగానో ఎదురుతెన్నులు చూస్తున్నావు. పిచ్చిదానా! చివరకు నీ ఆశలన్నీ వ్యర్థమయి పోయాయి" అన్నాడు సీతని చూడగానే.

సీత, భయంతో తలెత్తి చూసింది.

"సుందరీ! నీకు నాథుణ్ణి నేనేనని చెపితే విన్నావా? ఎంత కాలం వ్యర్థం చేశావు! నీ తొడలు ఎంత ఆకర్షణీయంగా ఉన్నాయో!.... ఇప్పటికైనా నువ్వు నన్ను అంగీకరించక తప్పదు సుమా! నీ భర్త ఈ పాటికి స్వర్గంలోనో .... నరకంలోనో ...."

సీత తెల్లబోతోంది! కంపిస్తోంది!

రావణుడు విలాసంగా నవ్వాడు. "నా మాటల్లో నీకింకా నమ్మకం లేదా సీతా? నిన్ను శాశ్వతంగా పొందే భాగ్యం నాదేనని నాకు నమ్మకమేలే. నీ భర్త ఎలా మరణించాడో చెపుతాను, వింటావా? రాముడు వానర సైన్యంతో లంకని ముట్టడించాలనే వచ్చాడు. కానీ మార్గాయాసంతో వానర సైన్యం అంతా గాఢ నిద్రలో మునిగిపోయింది .... సమయం చూసి అర్ధ రాత్రివేళ నేను ప్రహస్తుణ్ణి పెద్ద సైన్యంతో శత్రువు మీదకి పంపించాను. నా సైన్యం, నిద్రపోతోన్న శత్రు సైన్యం మీద పడి స్వేచ్ఛగా ఆయుధాలన్నీ ఉపయోగించి సర్వనాశనం చేసి తిరిగి వచ్చింది ...."

సీత నమ్మలేనట్టు నిర్ఘాంతపడి వింటోంది. వానర సైన్యం లంకని ముట్టడించబోతోందని విన్నప్పుడు హనుమంతుడు చెప్పినట్టే జరుగుతోందని చాలా సంతోషించింది. తన భర్త లంకలో పాదం మోపాలే గానీ తన చెర వదలక తప్పదని, ఆ శుభ ఘడియల కోసమే ఎదురు

---

➔రావణుడు ఈ రకంగా తిట్టి, ఆ చారులకు దేశ బహిష్కార శిక్ష వేశాడు. శత్రుపక్షానికి అనుకూలంగా మారిన ఈ చారులకు, చెరసాల శిక్షలో, మరణ శిక్షలో పడవు. ఎందుకంటే, శ్రీరాముణ్ణి కీర్తించిన వారికి మేలు జరగాలే గానీ, కీడు జరుగకూడదు గదా? దేశ బహిష్కార శిక్ష అయితే సుఖంగా, స్వేచ్ఛగా వెళ్ళిపోవచ్చు.

ఈ చారులకు రావణుడు మరణ శిక్ష వెయ్యకుండా, దేశ బహిష్కార శిక్ష వేసేటట్టు కవి ఆలోచించిన ఉపాయం ఏమిటో చూడండి. రావణుడు చారులతో ఇలా అంటున్నాడు – "నాకు కలిగిన కోపము ఇంతకు ముందు మీరు చేసిన ఉపకారముచే శాంతపడక పోయినటులైతే, శత్రుపక్షమును స్తోత్రము చేయుచుండు మిమ్ములను నేను చంపువాడను. మిమ్ము చంపుటకు నాకు ఇష్టము లేదు. మీరు పూర్వం చేసిన ఉపకారమును స్మరించుచున్నాను."

ఈ చారులు రాజుకి పూర్వం ఉపకారం చేశారు గాబట్టి రావణుడు వారిని చంపించలేదట. అంటే, రావణుడు ఎంతో ఉత్తముడైనట్టే కదా? కానీ, రావణుణ్ణి ఉత్తముణ్ణి చెయ్యాలని కవి అభిప్రాయం కాదు. కానీ, ఆ చారులకు మరణ శిక్షలు వెయ్యకుండా తప్పించాలంటే, ఏదో ఒక కారణం కావాలి కదా? "మీరు చాలా ఉపకారాలు చేశారు గాబట్టి మీకు మరణ శిక్షలు వెయ్యను" అంటున్నాడు రావణుడు. శుక సారణులు రావణుడికి విశ్వాసపాత్రులైన వారే – అని మొదట చెప్పడం! వాళ్ళే రాముణ్ణి కీర్తించేదం! – అది చాలా ఉత్తమ కార్యం అన్నట్టు.

మళ్ళీ ఆ ఉత్తమ కార్యమే ఎంత తప్పో, శత్రువుల్ని కీర్తించడం దౌత్యనీతికి ఎలా విరుద్ధమో, ఆ నీతులన్నీ ఏకరువు పెట్టడం! ఆ నీతి తప్పినందుకు చారులకు శిక్షలు వెయ్యడం! ఆ శిక్షలు తేలికైన, సుఖమైన శిక్షలు వెయ్యడం! రాముడి పక్షానికి జనాన్ని కూడగట్టాలని ఎన్ని పాట్లో కవికి! ★

**385. యుద్ధ, సర్గ 29, శ్లోకాలు 16 .... 28: + సర్గ 30 పూర్తిగా:** శుక సారణులు వెళ్ళిపోయిన తర్వాత రావణుడు మళ్ళీ కొందరు "నీతి విశారదులైన" చారుల్ని పిలిపిస్తాడు. "మీరు వానర సైన్యంలోకి వెళ్ళండి. రహస్యాలన్నీ తెలుసుకు రండి. శత్రువుల రహస్యాలన్నీ తెలిస్తే చాలా సుఖంగా జయించవచ్చును" అని వారిని పంపిస్తాడు. వారి నాయకుడు శార్దూలుడు.

మళ్ళీ ఈ చారులు కూడా విభీషణుడుకి పట్టుబడిపోతారు. (వీళ్ళేం గూఢచారులు? వీళ్ళ మొహం చారులు!) వీళ్ళని కూడా వానరులు బాధలు పెడతారు. యథాప్రకారంగానే కరుణా సముద్రుడైన శ్రీరాముడు వారిని రక్షిస్తాడు! ఆ నీతి విశారదులైన చారులు, తిరిగి వొచ్చి రావణుడి ముందు రామ కీర్తన ప్రారంభిస్తారు. "శ్రీరాముడు సింహాలను కూడా అవలీలగా చంపగలడు. మహావీరుడు. జనస్థానంలో రాక్షసులందర్నీ చంపేశాడు. అతని శౌర్యం ఇంతా అంతా కాదు. అతనితో యుద్ధం లాభం లేదు. నువ్వు జయించలేవు. సీతని ఇచ్చెయ్యి!" అంటారు. రావణుడు కోపం తెచ్చుకోకుండా ఊరుకుంటాడు. (వీళ్ళు ఇంకెన్ని గొప్ప ఉపకారాలు చేశారో! ఏం కవిగారూ! అంతేనా?) రావణుడు తర్వాత సీత దగ్గిరికి బయల్దేరుతాడు. ★

తెన్నులు చూస్తోంది. ఇంతలోనే ఈ దారుణ వార్త!

రావణుడు చెపుతూనే వున్నాడు – "ప్రహస్తుడు వెళ్ళి గాఢనిద్రలో ఉన్న రాముడి శిరస్సు ఖండిం చేశాడు. విభీషణుణ్ణి కూడా చంపబోయాడు గానీ, ఆ దుర్మార్గుడు దొరకలేదు. లక్ష్మణుడు కూడా తప్పించుకున్నాడు. సుగ్రీవుడు కంఠం తెగి చచ్చిపడి నేల కరిచాడు. నిన్ను రక్షిస్తానని బీరాలు పల్కిన హనుమంతుడు కూడా దీర్ఘ నిద్రలో మునిగాడు. జాంబవంతుడు కాళ్ళు తెగి ...."

"ఇక చెప్పకు, చెప్పకు ...." అంటూ సీత భోరున ఏడుస్తూ చెవులు మూసుకుంది.

రావణుడు మందహాసంతో మీసాలు తిప్పుతూ చూశాడు – "వానర యోధుల్లో కొందరు చచ్చారు. కొందరు చావబోతూ యుద్ధ రంగంలో పడి మూలుగుతున్నారు. కొందరు పిక్కబలం కొద్దీ పారిపోయారు! .... ఇంకా నీ భర్త వచ్చి నిన్ను రక్షిస్తాడనే కలలు గంటున్నావా? .... ఆ మహా వీరుడి కే గతి పట్టిందో చూడు...." అని పక్కనే ఉన్న పరిచారికల వేపు చూపు తిప్పాడు – "విద్యుజ్జిహ్వుణ్ణి పిలుచుకు రండి! యుద్ధ రంగంలోంచి వాడే రాముడి శిరస్సు తెచ్చాడు. తొందరగా పిలుచుకు రండి వాణ్ణి!" అని ఆజ్ఞాపించాడు.

విద్యుజ్జిహ్వుడు ఒక చేతిలో మనిషి తలా, ఒక చేతిలో ధనుస్సూ అమ్ముల పొదీ తెచ్చి భూమి మీద పెట్టి రావణుడికి వొంగి నమస్కారం చేశాడు.

"ఇక్కడ కాదురా! సీత ముందు పెట్టు! పాపం భర్త మొహం కడసారి చూసుకుంటుంది."

విద్యుజ్జిహ్వుడు ఆ తలని జుట్టు పట్టుకుని ఎత్తి సీత ముందు పడేశాడు.

సీత దుఃఖంతో, భయంతో, సర్వావయవాలూ కంపిస్తూ, ధారాపాతంగా కన్నీళ్ళు కారుస్తూ, భర్త మరణం గురించి ఇంకా మినుకు మినుకు మంటోన్న అవిశ్వాసంతో, ఆ శిరస్సు వేపు చూసింది!

రుషి జుట్టు ముడితో ఉన్న తల! నల్లని చెంపలు! మొహం నిండా రక్తం!

చూస్తోండగానే సీత కళ్ళు మూతలు పడి పోయాయి.

రావణుడు క్రీకంట విద్యుజ్జిహ్వుణ్ణి చూశాడు.

అతను వెంటనే ఆ తలా, ధనుస్సూ పట్టుకుని వెళ్ళిపోయాడు.

సీత గజ గజ వొణుకుతూ, వల వలా ఏడ్చింది! "రావణా! నా భర్త కళేబరంతో పాటే నేనూ సహ గమనం చేస్తాను. నన్ను నా భర్త నుంచి విడదీయకు. ఎన్ని జన్మల్లోనైనా, ఎన్ని లోకాల్లోనైనా, శ్రీరాముడే నా భర్త! భర్త పట్ల భక్తి చూపే భార్యలకు సమస్తమైన పుణ్య లోకాలూ సిద్ధిస్తాయని బ్రాహ్మలు వేదాలు చదవడం విన్నాను. నేను నా భర్తను విడిచి జీవించేది లేదు. రావణా! నీ మీద నాకు కోపం లేదు. నువ్వెంతో ఉత్త ముడివి. నా ఆఖరి కోరికైనా మన్నించు. నా భర్తకూ, నాకూ కలిపే దహన సంస్కారాలకు ఏర్పాటు చేయించు!"

రావణుడు మీసాలు మెలిపెడుతూ చిరు నవ్వుతో సీతని పరికిస్తూ నిలబడ్డాడు.

"మహారాజుకి జయం!" అంటూ వొక పరిచారకుడు వచ్చి దూరంగా నిలబడి వొంగి నమస్కారం చేశాడు – "మహారాజా! నీ మంత్రులందరూ నీ దర్శనానికై ఎదురు చూస్తూ ఉన్నారు. వారికా భాగ్యం కలిగించు" అని విన్నవించి వెనక్కి తిరిగి వెళ్ళి పోయాడు.

రావణుడు బయల్దేరడానికి సిద్ధమౌతూ సీతని చూసి, "సుందరీ! ఎందుకింకా వ్యర్థంగా దుఃఖిస్తావు? అంతా అయిపోయింది. ఇక విచారించి ప్రయోజనం లేదు. మనస్సు గట్టి చేసుకో. రాముడికి భార్యవై ఈ జన్మలో అనుభవించిన బాధలు చాలవా? జన్మ జన్మలకూ కూడా రాముడికే భార్యవై బాధలు పడతావా? మూర్ఖురాలా! నీ మనస్సు మార్చుకోకపోతే నే నిక క్షమించను సుమా! నీ వంటి సుందరాంగికి దుఃఖం పనికి రాదు. నీ రొమ్ములు నాకు మన్మథ తాపం కలిగిస్తున్నాయి. నా వంటి మహా రసికుడితో కలిసి నువ్వు సుఖ భోగాలలో తేలాలి. నిన్నెలా విడిచి పెట్టగలను? ఇంకా ఎందుకు దుఃఖం? నీ భర్తని యుద్ధంలో జయించాను నేను. నువ్వు నన్ను అంగీకరించక తప్పదు. నీ తొడలు బలిసి చక్కగా ఉన్నాయి. రాముడు పోయాడనే దుఃఖం విడిచి పెట్టెయ్యి! నా శయ్య మీదకు చేరడానికి సిద్ధంగా ఉండు. నా మాటలన్నీ విన్నావా? ఆలోచించుకో!" అని కఠినంగా చూసి కదిలాడు.

మహారాజు వెళ్ళగానే సీత చుట్టూ దాసీలు ఎక్కడి వాళ్ళక్కడ తప్పుకున్నారు.

సీత దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. "చివరికి ఇలా జరిగిందా! నేను నా భర్త మరణం చూడవలసి వచ్చిందా! మహా పతివ్రతనైన నాకూ వైధవ్యం ప్రాప్తించిందా! భార్యా భర్తలలో, భర్తే ముందుపోతే, అది భార్య చేసిన దోషమే నంటారు పెద్దలు. నేనేం దోషం చేశానో గదా! పూర్వ జన్మలో ఎన్ని పాపాలు చేశానో గదా! ఏ దాన ధర్మాలలో లోపాలు చేశానో గదా! నేను చేసిన పాపమే నా భర్తను తీసుకుపోయింది. నా దురదృష్టమే నా భర్తకు చుట్టుకుంది.

స్త్రీలకు వైధవ్యం కలిగించే లక్షణాలేవీ నా శరీరం మీద లేవే! నా నేత్రాలూ, నా హస్తాలూ, నా పాదాలూ, కనురెప్పలూ, పెదిమలూ జుట్టూ, నా సర్వాంగాలూ సాముద్రిక శాస్త్రాలలో చెప్పిన విధంగానే ఉన్నాయే! అయినా నాకీ దౌర్భాగ్యం ఎందుకు కలిగింది?

నాథా! శ్రీరామా! నిన్ను దీర్ఘాయుష్మంతుడి వన్నారు బ్రాహ్మణులు. మహారాజువై వందలకొద్దీ, వేలకొద్దీ, యజ్ఞ యాగాలు చేస్తావన్నారు. నేను నిత్య సుమంగళిగా ఉంటానన్నారు. మహావీరులైన పుత్రుల్ని కంటానన్నారు. అందరి వాక్కులూ, అసత్యాలై పోయినట్టేనా?

నువ్వు మహా పండితుడివి! జాతకంలో ఎన్ని దోషాలు ఉన్నా వాటిని తొలగించుకునే శాస్త్రాలు తెలిసిన వాడివి. అటువంటి నీకే మరణం సంభవించిందా! ఈ లోకంలో నిన్ను మించిన ధనుర్విద్యా పారంగతుడు ఉన్నాడా? సమస్తమైన అస్త్ర శస్త్ర విద్యలూ ఎరిగిన వాడివి కదా నువ్వు? అటువంటి నువ్వే మృత్యువాత బడి పోయావా?

రామా! బాల్యం నుంచీ నిన్నే నమ్ముకున్న దాన్ని నేను. నా పాణిగ్రహణ కాలంలో నన్నెన్నడూ విడిచి పెట్టనని పంచ భూతాల సాక్షిగా వాగ్దానం చేశావు. మరిచే పోయావా? నీ పూర్వులందరినీ చూడాలని వెళ్ళి పోయావా? ఆకాశంలో నక్షత్రమై ప్రకాశిస్తున్నావా? నన్ను నీతో తీసుకుపోకుండా వెళ్ళావే! ఈ దుర్మార్గుడి చెర నుంచి నువ్వే నన్ను రక్షించ లేకపోతే, ఇంకెవరు రక్షించగలరోయీ?

నాథుడా! శుభ చందనాలతో, దివ్యాభరణాలతో, నా ప్రేమాలింగనాలతో ప్రకాశించిన నీ శరీరాన్ని, యుద్ధ భూమిలో భయంకరమైన కాకులూ గద్దలూ పీడుస్తున్నాయా? అయ్యో! ఎన్నెన్నో పుణ్యకార్యాలు చేసిన నీ కళేబరానికి దహన సంస్కారాలు లేకుండా పోయాయా? జగత్తులో ఇంత ఘోరం ఎన్నడైనా జరిగిందా?

ఒంటరిగా ఇంటికి జేరిన లక్ష్మణుణ్ణి చూసి నీ తల్లి, నీ మరణం గురించీ, నా అపహరణం గురించీ విని, గుండె పగిలి చచ్చిపోతుంది సుమా! అమ్మా, కైకేయీ! ఇంత కాలానికి నీ కోరిక సంపూర్ణంగా నెరవేరింది తల్లీ! నీ దుర్బుద్ధితో రఘు వంశాన్నే సర్వనాశనం చేశావు కదా! .... ఎంతటి మహాను భావులైనా కర్మఫలాన్ని ధిక్క రించలేరా?"[386]

**386. యుద్ధ, సర్గ 32 అంతా**: రాముడు చచ్చిపోయాడనే అబద్ధపు వార్తలు సీత వినడం రెండు సార్లు జరుగుతుంది. యుద్ధం ప్రారంభం కాకముందు ఒకసారీ, యుద్ధం జరుగుతూ వుండగా ఇంకోసారీ. ఆ రెండు సార్లూ సీత దాదాపు వొకే రకంగా అనుకుంటూ ఏడుస్తుంది. ఆ విషయాలన్నీ ఈ కథలో ఒకే సందర్భంలో పొందుపరిచాను. సీత, మొదట కైకని తిట్టడంతో ప్రారంభించింది, ఇలా: "కైకేయీ! నీ కోరిక పూర్తియైనది. కలహ స్వభావముగల నీవు రఘు వంశమునంతను నిర్మూలనము చేసితివి. .... లోకంలో స్త్రీకి భర్త మరణము ముఖ్యమైన ఆపదయని చెప్పుదురు. భర్త చరమావస్థను జూసి విధవనైతిని. ('విధవ' అనే మాట కవి వాడినదే.) రామా! బ్రాహ్మణులు నీకు దీర్ఘాయువు గలదని చెప్పిరి. బ్రాహ్మణుల మాట అబద్ధమైనది. (రామడు చచ్చి పోలేదు గాబట్టి, బ్రాహ్మణుల మాట అబద్ధం కాలేదనీ, ఎప్పుడూ అబద్ధం కాదనీ, చెప్పడం). ప్రాజ్ఞుడవూ, సత్పురుషుడవూ అయిన నీవు మరణమును తప్పించుకొనలేక పోతివి. పితృ దేవతలతోడ స్వర్గంలో నున్నావు. నిజము. (కొంచెం సందేహంగానే ఉంది గావున్ను స్వర్గానికి వెళ్ళాడో లేదోనని.) అంతరిక్షములో నక్షత్ర రూపముగ నుండి జూచు చున్నావు. (గొప్ప గొప్ప వారు చచ్చిపోతే నక్షత్రాలవుతారనే నమ్మకం!) కులనాశని నైన నన్ను రాముడు వివాహము చేసుకున్నాడు. రామునకు భార్యయే మృత్యువైనది. నేను పూర్వజన్మలో కన్యాదానము చేయు వారిని అడ్డగించియుందును. అందుచేతనే ఈ జన్మలో దుఃఖించు చున్నాను. (కర్మల్నీ, పూర్వ జన్మల్నీ చెప్పడం!)

**సర్గ 48, శ్లోకం 1 .... 21**: "నాకు పుత్రులు గలుగును అనీ, విధవత్వము గలుగదు అనీ, చెప్పిన జ్ఞానులు అసత్య వాదులైరి. పద్మము మొదలగు శుభ రేఖలు గల స్త్రీలు భర్తలతోడ రాజ్యమునకు పట్టాభిషిక్తులగుదురు. నా పాదములలో అట్టి పద్మ రేఖలున్నవి. ఏ లక్షణముల చేత స్త్రీలు భాగ్యహీనులై వైధవ్యమును పొందుదురో అట్టి లక్షణములు నా శరీరములో నగుపడవు. నా తల వెంట్రుకలు మిగుల సన్నముగను, సమముగను, నీలముగను, ఉన్నవి. కను బొమలు ఒక దానితో నొకటి చేరక యున్నవి. మోకాళులు గుండ్రముగను, రోమములు లేకను యున్నవి. నా దంతములు సందులు లేక యున్నవి. నా కన్నులు, కనుబొమలు, చేతులు, పాదములు, చీలమండలు, తొడలు, బలిసి యున్నవి. నా చేతుల వేళ్ళు, గోళ్ళు, గుండ్రములై సమముగా నున్నవి. చేతుల వేళ్ళు సందులు లేక యున్నవి. నా స్తనములు బలిసి ఒకదాని కొకటి ఒరుచుకొనుచు ఉన్నవి. (ఇన్నాళ్ళూ, సీత స్తనాల్ని మొగవాళ్ళు వర్ణించడమే సాగింది. ఇప్పుడు, సీత, తన స్తనాల్ని తనే వర్ణించుకుంటోంది! కవికి, మతి, పూర్తిగా పోయినట్టే వుంది. ఒక పాత్ర ఏ సందర్భంలో ఎలా మాట్లాడాలో, ఎలా మాట్లాడకూడదో, ఆ సందర్భ శుద్ధి, ఈ కవికి ఏ కోశానా లేదు. ఇంకా చూడండి! సీత, తన స్తనముల మొనలు ఎలా ఉంటాయో కూడా చెప్పుకుంటోంది!) నా స్తనముల మొనలు, వ్యక్తము గాక అణిగి యున్నవి. (మగ్నచూచుకౌ = మునిగిన చను మొనలు గల. అంటే స్త్రీలు ఎంతో దుఃఖంలో ఉన్నా, కవుల దృష్టి స్త్రీల స్తనాల మీదే వుంటుందన్న మాట!) నా నాభి లోతునకు పోయి దాని చుట్టూ పార్శ్వములు మృదువుగ నున్నవి. నా పాదములు భూమికి బాగుగ ఆని యున్నవి. కాని, నా శుభ లక్షణములన్నియు వ్యర్థమైనవి. ➔

పరి పరి విధాల దుఃఖిస్తోన్న సీతని చూస్తూ సరమ, "అమ్మా, సీతాదేవీ! నా మాట విను తల్లీ!" అంటూ సీత జుట్టు నిమురుతూ ఓదార్చుతూ కూర్చుంది.

సరమ విభీషణుడి భార్య. రావణుడు సరమని సీత దగ్గిర కాపలా ఉంచాడు. సీత, సరమనీ, త్రిజటనీ సంపూర్ణంగా నమ్ముతుంది.

సరమ దూర దూరంగా తిరుగుతోన్న పరిచారికల్ని వారకంట కనిపెడుతూ, కంఠం తగ్గించి గుస గుసలతో చెప్పుకొచ్చింది. "ఆ దుర్మార్గుడు చెప్పింది నిజం కాదు సుమా! నిన్ను వంచించి లొంగదీసు కోవాలని ఈ ఉపాయం పన్ని వుంటాడు" అంటూ సీతకు ధైర్యం కలిగించే ప్రయత్నం చేసింది. "నువ్వు చూసింది రాముడి శిరస్సు కాదు. రాముడు క్షేమం గానే వున్నాడని నా చారులు ఇప్పుడే చెప్పారు. నువ్వు రావణుడి మాటలు నమ్మకూడదు సుమా!"

సీత, సరమ మాటలే నమ్మలేనట్టు విస్మయంగా చూసింది. "నువ్వు చెప్పింది నిజమేనా సరమా?"

"నా మాట సత్యం తల్లీ! శ్రీరాముడు మహా వీరుడని మరిచిపోయావా? రాముణ్ణి ప్రహస్తుడి వంటి అల్పుడు చంపగలడా, పిచ్చిదానా?"

"సరమా! సత్యమేదో, అసత్యమేదో గ్రహించే శక్తి పోతోంది నాకు. నే నేమీ ఆలోచించలేను. నువ్వే చెప్పు. రాముడు క్షేమంగా ఉన్నాడనే చల్లని వార్త మళ్ళీ మళ్ళీ చెప్పు!" దూరం నించి భేరీ ధ్వనులు భయంకరంగా వినిపించాయి. ఏనుగుల ఘీంకారాలూ, గుర్రాల సకిలింతలూ, రథ చక్రాల టక టకలూ, అంతా గందరగోళంగా వినవస్తోంది.

"సీతా! ఆ సందడంతా వింటున్నావా? రాక్షస సైన్యం యుద్ధానికి సిద్ధమౌతోంది. గుర్రాల్నీ ఏనుగుల్నీ సిద్ధం చేస్తున్నారు. రథాలు పూనుస్తున్నారు. సైన్యం నగరమంతా తిరుగుతోంది. రాముడు రాత్రే చచ్చిపోతే, శత్రువు లందరూ పారిపోతే, ఈ సన్నాహాలన్నీ ఎందు కంటావు? ఇప్పటికైనా గ్రహించావా తల్లీ? ఇదంతా ఆ దుర్మార్గుడు పన్నిన కుట్రే సుమా!"

"సరమా! నువ్వన్నదంతా నిజమేనా? ఇంకా యుద్ధం జరగనే లేదంటావా?"

"అయ్యో! ఇంకా నమ్మకం లేదా? రాజు అంతఃపురంలో ఏం జరిగినా నాకు నమ్మకంగా చెప్పే పరిచారకులు కొందరున్నారు. రాజకీయాల గురించి రావణుడు ఎప్పుడే ఆలోచన చేసినా నాకు తెలుస్తుంది. మా అత్త, యుద్ధం వద్దని చాలా విధాల బోధించిందట. ఈ దుర్మార్గుడు వింటేనా? తన వినాశనం తనే తెచ్చుకుంటున్నాడు. నీ భర్త రావణుణ్ణి సంహరించి నిన్ను అక్కున చేర్చుకునే ఘడియ త్వరలోనే వస్తుంది తల్లీ! మీరిద్దరూ ఆనందంతో కలుసుకోవడం నేను చూడక పోను."[387]

సరమ, సీత చెంపలు నిమిరి హాస్యం చేస్తూ, "పచ్చని పంట చేలతో భూమికి శోభ కలిగినట్టు నీ పెనిమిటిని చూసిన ఆనందంతో నీ ముఖానికి కొత్త అందం వస్తుంది" అని నవ్వింది.

సీత మొహం మీద అప్రయత్నంగా చిరునవ్వు చిందింది.

చెంపలు ఇంకా తడి తడిగానే వున్నాయి. ★

---

➔దైవమును జయించుటకు సాధ్యము కాదు" – ఈ రకంగా విచారించింది సీత. (భర్త చచ్చిపోవడానికి స్త్రీలు చేసిన పాపమే కారణం. స్త్రీల శరీర లక్షణాలే కారణం. స్త్రీలు, శరీర లక్షణాల్ని బట్టే ఉత్తములు గానో, నీచులు గానో వుంటారు. ఈ దోషాలేవీ పురుషుడి విషయంలో ఉండవు.) భర్తలు చచ్చిపోతే స్త్రీలు ఎలా ఏడవాలో చెప్పడమే ఇక్కడ కవి లక్ష్యం. అంతే కాదు, భార్యలు పోయినప్పుడూ, సోదరులు పోయినప్పుడూ, స్నేహితులు పోయినప్పుడూ, ఏ సందర్భంలో శోకం ఎలా ఉండాలో కూడా ఇంకా తర్వాత ఘట్టాల్లో వస్తుంది. ★

**387. యుద్ధ, సర్గ 33, శ్లోకాలు 1 .... 5:** సరమ విభీషణుడి భార్య కదా? విభీషణుడు శత్రుపక్షంలో చేరాడు కదా? విభీషణుడి భార్యని సీత దగ్గిర ఇంకా కాపలా ఉంచుతాడా రావణుడు?

సీత చాలా దుఃఖంతో ఉంది కాబట్టి, ఇప్పుడు సీతకి ధైర్యం చెప్పడానికి, త్రిజట లాటి పరిచారిక గాక, ఇంకా ఎక్కువ అంతస్తు గల స్త్రీ ఉండాలని కవి అభిప్రాయం. సీతకి అనుకూలంగా ఉండేది విభీషణుడి భార్యే. ఈ సరమని సీత దగ్గిర రావణుడే నియమించినట్టు గాక, సరమ రహస్యంగా సీతని కలుసుకుని నిజం చెప్పి ఓదార్చి వెళ్ళినట్టు చెప్పవచ్చు గదా? రావణుడే సరమని నియమించాడంటే, రావణుడు తెలివి గల రాజు అవుతాడా? ఎంత తెలివి తక్కువ వాడైనా ఆ పని చేస్తాడా? కవికి, విభీషణుడు ఉత్తముడైనట్టే, సరమ కూడా ఉత్తమురాలైంది. 'మృదుభాషియగు సరమ' అనీ, 'సువ్రతయగు సరమ' అనీ, సరమని ఎంతో గౌరవంతో వర్ణించాడు. "అప్పుడు సీతను మృదుభాషిణియగు సరమ సమాధాన పరిచెను. రావణాసురుడు ఆజ్ఞాపించగా కావలి యుండునదియు, దృఢమైన వ్రతము గలదియు, ఆయా సమయములలో రాముని వృత్తాంతమును దెలిపి రక్షించుచుండు నదియు నగు సరమను, సీత, సఖిగ చేసుకొనెను."

ఎవరైనా సరే, రాముడి పక్షంలో చేరిపోతే చాలు, వాళ్ళు మృదు భాషణులూ, దయామయులూ, సువ్రతులూ అయిపోతారు! వారి మొహాలకు గొప్ప తేజస్సులు కూడా వచ్చేస్తాయి! ★

# లింకు-9

# 13వ కథ తర్వాత 14వ కథ వరకూ

[**13**వ కథ – సీతని, సరమ వోదార్చడంతో ముగిసింది. **14**వ కథ – హనుమంతుడు మళ్ళీ సీత కోసం అశోకవనానికి వెళ్ళడంతో ప్రారంభ మవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య యుద్ధం జరుగుతుంది. దీనికే **'రామ – రావణ యుద్ధం'** అని పేరు. అది అంతా ఈ భాగంలో వస్తుంది.]

**రా**వణుడు సభ తీర్చి ఉన్నాడు. వానరులు వాయించే డప్పులూ, అరిచే అరుపులూ, ఆ సభలోకి కూడా వినబడుతున్నాయి.

రావణుడికి తాత వరస అయ్యే మాల్యవంతుడు లేచి, రావణుడికి నీతి బోధ ప్రారంభించాడు – "రాజా! రాజనీతి శాస్త్ర ప్రకారంగా పరిపాలించే రాజే చాలా కాలం సుఖంగా రాజ్యం చెయ్యగలుగుతాడు. తను ప్రబలంగా ఉన్నప్పుడు మాత్రమే రాజు శత్రువుతో యుద్ధానికి దిగాలి. తన బలం క్షీణించి ఉన్నప్పుడు శత్రువుతో తెలివిగా సంధి చేసుకోవాలి.

శ్రీరాముడు మహా పరాక్రమవంతుడు. ధర్మాత్ముడు. అటువంటి వాడితో యుద్ధం ఎందుకు? పూర్వం, బ్రహ్మ, దేవతల కోసం ధర్మమూ, రాక్షసుల కోసం అధర్మమూ, సృష్టించాడు. అందుకే దేవత లెప్పుడూ ధర్మం ఉన్న చోటే ఉంటారు. నీ అధర్మ కార్యాల వల్లనే నీ శత్రువులు బలవంతు లవుతున్నారు. మహాపురుషులు నీ మీద కోపం పెట్టుకుంటున్నారు. రాముడిలో ధర్మం ఉండడం చేత దేవతలందరూ రాముడి జయమే కోరుతున్నారు. (వీడు విభీషణుడి పక్షమే అయివుంటాడు.).[388]

లంకకు అపజయం కలుగుతుందనడానికి సూచనగా అప శకునాలెన్నో కనబడుతున్నాయి. మేఘాలు భయంకరంగా గర్జిస్తూ రక్తం కురుస్తున్నాయి. (రావణుడికి కనబడడం లేదా రక్తం వాన?)

గుర్రాలూ, ఏనుగులూ కన్నీళ్ళు కార్చి ఏడుస్తున్నాయి. (యుద్ధం చెయ్యాలని భయం కదా?)

గృహాల బయట వేసే పిండాల్ని కుక్కలు తినేస్తున్నాయి. (పితృదేవతలు, కాకుల వేషాలు చాలించి, కుక్కల వేషాలు ధరిస్తున్నారేమో!)

ఆవులకు గాడిద పిల్లలు పుడుతున్నాయి. ఎలకలు ముంగిసలతో ఆటలాడుతున్నాయి. పిల్లులు పులులతోటీ, పందులు కుక్కలతోటీ, కిన్నెరలు రాక్షసులతోటీ, కలిసి మెలిసి ఉంటున్నారు. (రాక్షసులు కొందరు, అంటే విభీషణుడి గుంపు, రాముడితో కలిసి మెలిసి ఉంటున్నారు కదా? అదే పెద్ద అప శకునం లంకకి!)

నల్లగా, వికారంగా, బోడి తలతో భయంకరంగా ఉన్న కాల యముడు సాయంకాలం వేళల్లో అందరి ఇళ్ళల్లోకీ తొంగి చూస్తున్నాడు. (రావణుడి ఇల్లు వొదిలేసి అందరిళ్ళకీ తిరుగుతున్నాడు గావున్ను!)

నల్లగా, వికారంగా ఉండే స్త్రీలు, పళ్ళు బయటికి పెట్టి నవ్వుతూ ఇళ్ళల్లో వస్తువులన్నీ ఎత్తుకుపోతున్నట్టూ, పోట్లాడుతున్నట్టూ, కలలు వస్తున్నాయి. (ఓస్, కలలే గదా? మన వస్తువులు మనకే ఉంటాయి.)

జెండాలు మునుపటి విధంగా కాంతిగా ప్రకాశిస్తూ ఎగరడం లేదు. (పాతబడిపోయి, మెత్తబడిపోయి, చిరిగిపోయి వుంటాయి. ఎలా ఎగురుతాయి? కొత్తవి కుట్టించుకోండి! ఆ మాత్రం తెలీదా? మహా చక్కగా

---

**388.** **యుద్ధకాండ, సర్గ 35, శ్లోకాలు 12 .... 15:** మాల్యవంతుడి మాటల్లో కొన్ని: "దేవ రుషులు, గంధర్వులు, అందరును, రామునికి జయమును గోరుచున్నారు. సర్వజ్ఞుడైన పితామహుడు (బ్రహ్మ) సురాసురులకు ఆశ్రయములుగా ధర్మాధర్మములను రెంటినీ సృష్టించెను. గొప్ప స్వభావము గల దేవతలు ధర్మము నాశ్రయించుచున్నారు. దుష్టులైన రాక్షసులు అధర్మము నాశ్రయించుచున్నారు" – ఈ మాటలు అనే వ్యక్తి రాక్షసుడే! బ్రహ్మే రాక్షసుల కోసం అధర్మం సృష్టించి ఇస్తే, ఇక రాక్షసులు మంచిగా ఉండవలసిన అవసరం ఏముంది? ఉండాలన్నా అది ఎలా సాధ్యమౌతుంది? 'రాక్షసులు చెడ్డవాళ్ళు' అని రాక్షసుల తోటే చెప్పించడం! దేవతల్నీ, శ్రీరాముణ్ణీ రాక్షసులతో పొగిడించడం! ★

ఎగురుతాయి.)

మంత్రాలు జపిస్తూ హోమాలు చేసినా, అగ్ని హోత్రాలు ప్రకాశించడం లేదు. (మంత్రాలకు మంటలు మండవు గానీ, ఎండు కర్రలు పడేసి విస రండి!)

వంట శాలల్లో, అగ్నిహోత్ర శాలల్లో, సర్పాలు కన పడుతున్నాయి. (వెచ్చదనం కోసం వొస్తున్నాయేమో! ఎటునించి వొస్తున్నాయో కనిపెట్టి, అటు వేపు బందో బస్తు చేసుకుంటే సరి!)

పాలూ, పెరుగూ, బెల్లం వంటి పూజా ద్రవ్యాలకు చీమలు పడుతున్నాయి. (అబ్బా! బెల్లానికి చీమలు పడితే అదీ అప శకునమేనా? అసలు పూజలు జరిగేచోట చీదర చీదరగా ఉంటుంది. అక్కడ చీమలూ దోమలూ చేరకపోతే చిలకలూ తుమ్మెదలూ చేరతాయా?)

గుర్రాలు గడ్డి ముట్టడం లేదు. ఆవుల పొదుగుల్లో పాలు ఎండిపోతున్నాయి. గాడిదలకు వెంట్రుకలు రాలి పోతున్నాయి. ఎన్ని విధాల చికిత్సలు చేసినా వాటికి ఆరోగ్యం చిక్కటం లేదు. (మీ మొహం చికిత్సల్లే! ఆ వైద్యుల్ని మార్చండి!)

కాకులు గుంపులు గుంపులుగా ఎగురుతున్నాయి. (వడియాలు పెట్టుకునే కాలం గావున్ను.)

మాంసం తినే క్రూర మృగాలు భయంకరంగా అరు స్తున్నట్టు వినబడుతోంది. (వినపడితే వినండీ! మీదేం పోయింది ఏ మృగం ఎలా అరుస్తుందో తెలుస్తుంది కదా?)

రావణా! ఈ అప శకునాలన్నీ లంకకు వినాశనం తప్పదని సూచిస్తున్నాయి.[389]

శ్రీరాముడు మానవమాత్రుడు కాడు. సాక్షాత్తు విష్ణువు. లోకంలోకెల్లా ఆశ్చర్యకరంగా సముద్రానికి సేతువు కట్టాడు. అటువంటి మహాత్ముడితో విరోధం ఎందుకు? సీతని ఇచ్చి సంధి చేసుకో!" – ఈ రకంగా, మాల్యవంతుడు, రామభక్తితో రావణుడికి నీతిబోధ చేశాడు. (రావణా! వీడికి కూడా దేశ బహిష్కారం వేసేద్దూ! బైటికిపోతాడూ. ఈ నీతుల గోల తప్పుతుంది.)

రావణుడు కోపంగా, "నా హితం కోరినట్టు నటిస్తూ నా నాశనం కోరుతున్నావు. నా పట్ల అసూయతో శత్రు పక్షాన మాట్లాడుతున్నావు. రాజ్యం పోగొట్టుకుని, అడ వులు పట్టి తిరుగుతూ, వానర సైన్యాన్ని నమ్ముకుని యుద్ధానికి వచ్చిన రాముడు గొప్ప సమర్థుడా? రాక్షస జాతికే రాజునైన నేను అసమర్థుడినా? నేను సాధించి తెచ్చుకున్న స్త్రీని శత్రువుకి జడిసి తిరిగి అప్పగిస్తానా? సముద్రంలో సేతువు కట్టడం ఘన కార్యమా? నా ముందు దేవతలు కూడా నిలబడలేరని ఎరగవా? ఆ రాముణ్ణి, అతని సైన్యాలన్నిటితో కలిపి హతమారుస్తాను. నా తల ఎగిరిపోయినా సరే నేను శత్రువుకి లొంగను. చూస్తూ ఉండు!" అంటూ మండిపడ్డాడు.

మాల్యవంతుడు రాజుకి ఆశీర్వచనం చెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు. (అయ్యో! ఇతనికి శిక్ష లేదా? ఏవిటి రావణుడూ, నువ్వు మరీ ఇంత తెలివి తక్కువ వాడివా?)

తర్వాత, రావణుడు, లంకకు రక్షణ ఏర్పాట్లు చేశాడు.

| | | |
|---|---|---|
| తూర్పు ద్వారంలో | – | ప్రహస్తుడు. |
| దక్షిణ ద్వారంలో | – | మహాపార్శ్వ మహోదరులు. |
| పడమట | – | ఇంద్రజిత్తు. |
| ఉత్తరాన | – | శుక సారణులు. |

**389.** **యుద్ధ, సర్గ 35, శ్లోకాలు 27 .... 37:** ఈ అప శకునాలన్నిట్నీ గమనించండి! నిత్య జీవితానికి కష్టం కలిగించే విషయాలనే అప శకునాలుగా అనుకోవడం ప్రారంభమయింది.

– పశువులకు జబ్బులు చెయ్యడం, పాలు ఎండిపోవడం, దొంగలు సామాన్లు ఎత్తుకుపోవడం, అతి వృష్టిగా వర్షాలు కురవడం, నిప్పు అంటకపోవడం, కట్టెలు మండక పోవడం, నివసించే ప్రదేశాలు పాములూ తేళ్ళూ వంటి విష కీటకాల వల్ల ప్రమాదకరంగా ఉండడం, తినే పదార్థాలు పాడై పోవటం, క్రూర జంతువుల వల్ల భయం కలగడం – ఇలాంటివే అప శకునాలంటే! తమకు అనుకూలంగా ఉండి సుఖం కలిగించేవైతే అవి శుభ శకునాలు. ఈ శకునాల దృష్టి, అనుకూల వాతావరణంనించీ, వ్యతిరేక వాతావరణం నించీ పుట్టిందే.

ఈ అప శకునాల్లో ఉన్న లోకజ్ఞానాన్ని గమనించండి: జంతువులకు జబ్బులు చేశాయి. 'ఎన్ని చికిత్సలు చేసినా' జబ్బులు తగ్గటం లేదు. అంటే, జబ్బులు కొన్ని కారణాల వల్ల వస్తాయనీ, చికిత్సలు చేస్తే జబ్బులు తగ్గుతాయనీ, గ్రహించడం ఇందులో ఉంది. ఇది తార్కికమైన దృష్టే. కానీ, 'చికిత్సలు చేసినా తగ్గడం లేదు' కాబట్టి, అది అప శకునం. మంచి చికిత్సలు వారికి ఇంకా తెలీవు. వారి శక్తికి మించిపోయిన పరిస్థితి అది.

ఆవులకు గాడిద పిల్లలు పుడుతున్నాయి అంటే, ఆవులకు ఆవు పిల్లలు పుట్టడమే ప్రకృతి సహజం. గాడిద పిల్లలు పుట్టడం సహజం కాదు. అలా ఎక్కడా జరగదు. సహజత్వానికి విరుద్ధంగా జరిగితే, అది అప శకునం.

ఈ అప శకునాల్లో, నల్లగా ఉన్న స్త్రీ పురుషుల గురించి, కవి చాలా వ్యతిరేక దృష్టితో, అయిష్టంతో, ప్రస్తావిస్తాడు. నల్లటి స్త్రీ పురుషులు ఎదురుపడడం కూడా అప శకునంగానే చెప్పాడు. ఈ నల్ల రంగు, కవి జాతికి శత్రువులైన, 'శత్రుజాతి – రంగు' అయివుండొచ్చు. ★

(శుక సారణులకు దేశ బహిష్కార శిక్షపడిన సంగతి మరిచేపోయాడు కవి!)

ఉత్తర ద్వారానికి, తర్వాత తను కూడా వస్తానన్నాడు రావణుడు.

నగరం మధ్యలో – విరూపాక్షుడు.

ఈ రకంగా ఏర్పాట్లు చేసి ఇక లంకకేమీ భయం లేదనుకున్నాడు రావణుడు.

★ ★ ★

మహా వీరులైన శ్రీరాముడూ, సుగ్రీవుడూ, హనుమంతుడూ మొదలైన వారంతా, లంకలో ప్రవేశించే ఉపాయం గురించి ఆలోచిస్తూ కూర్చున్నారు. "దేవతలు కూడా జొరబడలేని ఈ లంకలో మనం ఎలా ప్రవేశించగలం? చక్కగా ఆలోచించాలి!" అనుకుంటూ వుండగా విభీషణుడు కొన్ని సంగతులు చెప్పాడు. "నా మంత్రులు పక్షి రూపాలతో లంకలో ప్రవేశించి ఇప్పుడే అంతా చూసి వచ్చారు. లంక చుట్టూ ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉన్నాయట. రావణుడు స్వయంగా ఉత్తర ద్వారంలో ఉన్నాడట! రామా! రావణుడు మహావీరుడు సుమా! లంకలో ప్రతీ సైనికుడూ రావణుడి వంటివారే. నే నిలా చెపుతున్నానని కోపం తెచ్చుకోవద్దు. నీకు పౌరుషం కలగడానికి చెపుతున్నాను గానీ నిన్ను భయపెట్టడానికి కాదు.[390] నువ్వు దేవతల్ని కూడా జయించ గల మహావీరుడివి గదా! రావణుణ్ణి జయించడం నీకు ఎంత?" (ఆ దేవతల్ని రాముడూ జయిస్తాడు, రావణుడూ జయిస్తాడు! వాళ్ళెంత పనికి మాలిన పిరికి సన్నాసులో గానీ!)

విభీషణుడు చెప్పింది విని రాముడు తన పథకం చెప్పాడు. "తూర్పు ద్వారంలో ప్రహస్తుడి మీదకి నీలుడు వెళ్ళాలి. దక్షిణ ద్వారానికి అంగదుడు. పడమట ఇంద్రజిత్తు మీదకి హనుమంతుడు సరిపోతాడు. రావణుడు పరమ దుర్మార్గుడు. సమస్త లోకాల జనులకూ హాని కలిగిస్తున్నాడు. అందుచేత అతని మీదకి నేనూ, లక్ష్మణుడూ వెళ్తాం. (లక్ష్మణుడి సాయం ఉండాల్సిందేనా నీకు?) సుగ్రీవుడూ, జాంబవంతుడూ, విభీషణుడూ సేన మధ్యలో ఉంటారు.

వానరులెవ్వరూ మానవ రూపాల్లో ఉండకూడదు. వానర రూపాల్లో ఉంటేనే వానరులెవరో రాక్షసులెవరో గుర్తించగలం. (మానవ రూపాల్లో ఉంటే మాత్రమేం? అప్పుడు, మానవులెవరో, రాక్షసు లెవరో గుర్తించవచ్చు కదా? వానరులు వానర రూపాల్లోనే ఉన్నా, రాక్షసులు కూడా వానర రూపాల్లో కొస్తే?)"[391]

అంత వరకూ చెప్పి, తర్వాత రాముడు విభీషణుడితో ఇలా అన్నాడు – "రావణుడు పరమ దుర్మార్గుడు. మంచీ చెడ్డా ఆలోచించకుండా నా భార్యని తీసుకుపోయాడు .... (రావణుడు నీతో కలిసి మంచీ చెడ్డా ఆలోచించలేదు గానీ, అతని మట్టుకు అతను ఆలోచించే ఆ పని చేశాడులే!) నీచమైన రాక్షస బుద్ధితో అంత పని

---

**390.** **యుద్ధ, సర్గ 37, శ్లోకాలు 23, 24:** విభీషణుడి మాటలు: "పరాక్రమము, వీర్యము, తేజస్సు, ధైర్యము, దర్పములలో నీ రాక్షసులునూ దురాత్ముడగు రావణుని వంటి వారేను. ఈ సమయంలో, రామా! నీకు కోపము వలదు. నీకు రోషము కలిగించుచున్నాను. నీకు భీతి కలిగించుట లేదు. పరాక్రమముచే దేవతలను నిగ్రహించుటకును నీవు సమర్థుడవు!"

రాముడు మహావీరుడు కాబట్టి, అతని శత్రువు కూడా మహావీరుడై వుండాలి! అందుకే, రావణుణ్ణి కూడా మహావీరుడిగానే వర్ణిస్తాడు కవి. అలాంటి మహావీరుణ్ణి రాముడు జయించాలి. ★

**391.** **యుద్ధ, సర్గ 37, శ్లోకాలు 34, 35, 36:** ఈ సందర్భంలో రాముడు ఇంకో విషయం ఇలా చెప్పాడు!: "మేము ఏడుగురం మనుష్య రూపంలో ఉండి యుద్ధం చేస్తాం" అన్నాడు. ఆ ఏడుగురూ ఎవరెవరటా? ఈ విషయంలో, అనువాదకులు, మూలంలో లేని అర్థాలు చెప్పారు. కాబట్టి దీన్ని కొంచెం వివరంగా చూడాలి. ఆ ఏడుగురూ ఎవరెవరో రాముడు వివరంగా చెప్పలేదు. మొదట, "నేనూ, లక్ష్మణుడూ మనుష్య రూపాల్లో వుంటాం" అని, తమ ఇద్దర్నీ గురించి చెప్పాడు. అసలు రాముడూ లక్ష్మణుడూ మనుషులే కదా? ఇతర రూపాల్లోకి మారలేరు కదా? తమ గురించి చెప్పుకోడం ఎందుకు?

ఇక మిగిలిన ఐదుగురూ ఎవరు? రాముడు ఇలా అన్నాడు. "ఆత్మనా పంచ మశ్చాయం సఖామమ విభీషణః"

మమ = నా యొక్క; సఖా = స్నేహితుడును; ఆత్మనా = తన చేత; పంచమః = అయిదవ వాడైన; అయమ్ = ఈ; విభీషణశ్చ = విభీషణుడునూ; విభీషణుడు అయిదవ వాడైతే, అతనితో వున్న ఆ నలుగురూ ఎవరు? అతని మంత్రులే అనుకోవాలి. అంటే, "విభీషణుడితో కలిసి వాళ్ళయిదుగురూ, నేనూ, లక్ష్మణుడూ, ఈ ఏడుగురం, యుద్ధంలో, మనుష రూపాల్లోనే ఉంటాం" అంటున్నాడు రాముడు. వానరుల్ని, వానర రూపాల్లోనే ఉండమన్నాడు.

రాముడి మాటల అర్థాన్ని, కొందరు అనువాదకులు, ఇలా చెప్పారు: "నేనూ, లక్ష్మణుడూ, నాకు ఐదవ సోదరుడిలాంటి వాడైన విభీషణుడూ, సుగ్రీవుడూ, హనుమంతుడూ, అంగదుడూ, జాంబవంతుడూ, ఈ ఏడుగురం మనుష రూపాల్లో ఉంటాం" అని. కానీ, రాముడి మాటల్లో వానరుల పేర్లు లేనే లేవు. ★

చేశాడు. ఒక్కడు చేసిన పనికి రాక్షసులందర్నీ చంప వలసి వస్తోందే అని ఆలో చిస్తున్నాను. జాతిలో ఒక నీచుడుంటే వాడి వల్ల జాతి పూర్తిగా నాశనమైపోతుంది. అబ్బ! ఆ రావణుడి పేరు తలిస్తేనే నాకు కోపం ముంచు కొచ్చేస్తోంది. భరించలేను. (పౌరుషం తెచ్చుకోవాలని ప్రయత్నం గావున్ను!) ఆ దుర్మార్గు డెక్కడున్నాడో ఒకసారి చూస్తాను" అంటూ లేచి బయల్దేరాడు.

అందరూ బయల్దేరారు. లక్ష్మణుడు రాముడి వెన కాలే!

సువేల పర్వతం ఎక్కారు అందరూ.

లంక కనబడింది. (ఇంతకు ముందే లంక కన పడింది. దాన్ని రాముడు వర్ణించాడు కూడా. మళ్ళీ కనపడింది. మళ్ళీ వర్ణిస్తాడు గావున్ను, అబ్బా!)

అప్పటికి రాత్రి అయింది. ఆ రాత్రి అక్కడ విశ్ర మించి తెల్లారిన తర్వాత లంకని చూశారు.

లంకలో ఉన్న వనాలన్నీ కనపడ్డాయి. అవి చక్కగా సమతలంగా, విశాలంగా, సుందరంగా ఉన్నాయి. ఆ వనాల నిండా అన్నీ సువాసన జిమ్మే పూలే. అన్నీ రుచి కరమైన పళ్ళే. (ఇంకేం? తొందరగా జయించెయ్యండి, అన్నీ తినొచ్చు.)

ఆ వృక్షాల నిండా గోరువంకలూ, చిలకలూ, తుమ్మె దలూ, కోయిళ్ళూ! (చీమలో? చీమలు లేవా రాముడూ? చీమలు లేని దేశమేమో! నీకు మరీ మంచిది!)

సరస్సుల నిండా రక రకాల జల పక్షులు! పరి మళాల్ని మోసే గాలి!

లంకనిండా – బంగారు మేడలు. వెండి మేడలు. రత్నాలు తాపడం చేసిన గోడలు. దేవాలయాలు. రాజ గృహాలు. విమానాలు. వెయ్యి స్తంభాల చైత్యభవనం. యంత్రాలు.

100 యోజనాల పొడుగూ, 30 యోజనాల వెడల్పూ ఉన్న ఆ లంకని చూసి రాముడు చాలా ఆశ్చర్య పోయాడు! నిర్ఘాంతపోయాడు! (ఏ నాడన్నా రెండో దేశం మొహం చూస్తే కదా?)

రావణుడు ఒక గోపురం చివర సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు. పరిచారికలు వింజామరలు వీస్తు న్నారు. గొడుగులు పట్టారు. (అవును, గోపురం మీద ఎంత ఎండో!)

రావణుడి వక్షస్థలం, ఇంద్రుడితో యుద్ధం చేసి నప్పుడు అతని ఐరావతం ఏనుగు దంతాల పోట్లు తగిలి కాసిన కాయలతో నిండి ఉంది. (అబ్బా! ఏనుగు కన్నా బండవాడు!)

ఎర్రటి గంధం పూసుకుని రావణుడు ఆకాశంలో సంధ్యాకాంతి పడ్డ మేఘంలా ఉన్నాడు. బంగారం పూలు కుట్టిన వస్త్రాలు కట్టుకున్నాడు. వజ్ర వైఢూర్యాలు తాపడం చేసిన ఆభరణాలు పెట్టుకున్నాడు. కుందేటి రక్తం అంత ఎర్రని పైపంచి కప్పుకున్నాడు.

వానరులందరూ రావణుణ్ణి చూశారు. సుగ్రీవుడికి మాత్రం అతన్ని చూసీ చూడగానే కోపం కట్టలు తెంచు కుంది (సుగ్రీవుడికా? ఎలా నమ్ముతాంలే) వొక్క గంతుతో రావణుడు ఉన్న గోపురానికి ఎగిరాడు. రావ ణుడి ముందు వొక్క క్షణం నిలబడ్డాడు – "నే నెవర్నో ఎరుగుదువా? శ్రీరాముడి భృత్యుణ్ణీ మిత్రుణ్ణీ కూడా. నిన్నిక విడిచిపెడతానా?" అంటూ వొక్క ఎగురు ఎగిరి రావణుడి కిరీటాన్ని కిందకి పడ దోశాడు.

రావణుడు అప్పటికి లేచి – "నువ్వు సుగ్రీవుడివా? (సుగ్రీవం = మంచి మెడ) నీకు గ్రీవం లేకుండా చేసే స్తాను" అంటూ సుగ్రీవుణ్ణి వొక్క తోపు తోసి కింద పడేశాడు.

సుగ్రీవుడు బంతిలాగ ఎగిరి రావణుణ్ణి పడదోశాడు. రావణుడు లేచి మళ్ళీ సుగ్రీవుణ్ణి పడ దోశాడు. (అబ్బ! అస్తమానూ పడదోసుకోడాలేనా? విసుగొస్తోంది. ఇంకే దన్నా చేసుకోరాదూ? దెబ్బలాట రక రకాలుగా చేసు కోడం రాదా మీకు?)

ఇద్దరూ వొక్కసారి కలబడ్డారు. గుద్దుకున్నారు. తన్నుకున్నారు. చరుచుకున్నారు. అరుచుకున్నారు. కరుచుకున్నారు. పొడుచుకున్నారు. బరుక్కున్నారు. గిచ్చు కున్నారు. .... (అమ్మో! ఎంత బాగా పోట్లాడు కోడం వొచ్చో వీళ్ళకి! రావణుడి గొలుసులూ, సుగ్రీవుడి గొలు సులూ ఏం చిక్కులు పడిపోతున్నాయో! దూరంగా ఉండి తిట్టుకోరాదూ?) వొకర్ని వొకరు ఎన్ని మెలికలు తిప్ప డానికి వీలుందో అన్నీ తిప్పుకున్నారు, అన్నీ చేసు కున్నారు. అన్ని మడతలూ పెట్టుకున్నారు.[392] చివరికి రావణుడు తన మాయ బలం ప్రయోగించడానికి పూను కోగానే సుగ్రీవుడు ఎగిరి వెళ్ళిపోయాడు. (కాలికి బుద్ధి చెప్పాడు!)

సుగ్రీవుడు తిరిగి రాగానే వానరులందరూ ఆనం దంతో సింహ నాదాలు చేశారు. (బతికి బట్ట కట్టాడు కదా అని!)

రాముడు కూడా చాలా సంతోషించి సుగ్రీవుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు – "నాతో అనకుండానే ఎంత సాహసం చేశావోయ్! రాజులెప్పుడూ ఇలా తొందరపడ కూడదు. (నేను రాజుని కాబట్టే తొందర పడలేదు.)

---

**392.** **యుద్ధ, సర్గ 40, శ్లోకాలు 13 .... 26**: మల్ల యుద్ధం మీద ఆసక్తి ఉన్నవాళ్ళు రావణుడూ, సుగ్రీవుడూ చేసిన మల్ల యుద్ధం ఏ రకంగా సాగిందో, ఈ శ్లోకాల్లో చూసుకోండి! ★

నీకేమైనా అపాయం సంభవిస్తే ఇక నాకు సీత ఎందుకు? లక్ష్మణుడెందుకు? భరతుడెందుకు? శతృఘ్నుడెందుకు? అసలు నేను బ్రతికి ఉండడం ఎందుకు? నువ్వు తిరిగి రానే రావేమో అనుకున్నాను. రాకపోతే, నేను యుద్ధం మాత్రం చేసి, లంకలో విభీషణుడికీ, అయోధ్యలో భరతుడికీ పట్టాభిషేకాలు చేసేసి, నేను ప్రాణాలు విడిచేద్దామనుకున్నాను" అన్నాడు గబ గబా.

సుగ్రీవుడు పొంగిపోతూ, "నా వీరత్వం ఎంత గొప్పదో, నా శక్తి ఏమిటో నీకు తెలుసు కదా? అందుకే వెళ్ళాను. నీ భార్యని హరించిన దుర్మార్గుడు నా కళ్ళబడితే నేను ఊరుకోగలనా? వాణ్ణి చూడగానే నాకు కోపం వచ్చేసింది" అన్నాడు గర్వంగా.**393**

రాముడు సుగ్రీవుణ్ణి మెచ్చుకుని లక్ష్మణుడితో, "లక్ష్మణా! పళ్ళూ, నీళ్ళూ ఉన్న ప్రదేశం చూసుకుని వ్యూహం పన్నుకుని ఉందాము. (ఎన్నిసార్లు పన్నుతావు వ్యూహం?) శకునాలేవీ క్షేమకరంగా లేవు. గాలి పరుషంగా, కఠినంగా, వీస్తోంది. భూమి, గజ గజ వొణుకుతోంది. పర్వతశిఖరాలు ఊగు తున్నాయి. (అయ్యో! తల తిప్పు మళ్ళీ వొచ్చింది గావున్ను!) మహా వృక్షాలు కూలు తున్నాయి. ఆకాశం పిడుగులు కురుస్తోంది .... (ఈ రకంగా పాత వర్ణన అంతా మళ్ళీ సాగింది ఇక్కడ.) సూర్యమండలంలో నల్లని చుక్క కనపడుతోంది. నక్షత్రాలు ఎప్పటి మాదిరిగా లేవు. లోక నాశనం కలగబోతోంది. మనం ఇప్పుడే యుద్ధానికి బయల్దేరాలి" అంటూ సువేల పర్వతం దిగి లంక వేపు బయల్దేరాడు.

వానర సైన్యం, భల్లూక సైన్యం, సింహనాదాలు చేసుకుంటూ రాముణ్ణి అనుసరించారు. వారి కేకలకు సింహాలూ, ఏనుగులూ ఇటూ అటూ పరుగు లెత్తాయి.

వానరులందరూ చెట్లూ కొండలూ పెళ్ళగించి చేతులతో పట్టుకుని పైకెగిరారు. కొందరు వానరులు, పది ఏనుగుల బలం గలవారు. కొందరు, వంద ఏనుగుల బలం గలవారు. కొందరు, వెయ్యి ఏనుగులు. కొందరు, లక్ష ఏనుగులు. కొందరు కోటి ఏనుగులు. కొందరు కోటి కోట్ల ఏనుగులు! (ఎవ్వరూ పద్నాలుగు ఏనుగులో .... డెబ్బయ్యారు ఏనుగులో, నూట పదమూడు ఏనుగులో – లేరు. కవిత్వం రాయడానికి వీలుగా, అందరూ, – పదీ, వందా, వెయ్యీ, లక్షా, కోటీ ఏనుగుల బలాలతోటే ఉన్నారు!)

కొంతసేపటికి అందరూ లంక చేరారు. (త్రికూట పర్వతాన్ని దేవతలైనా ఎక్కలేరు అన్నాడే హనుమంతుడూ! అన్నీ అబద్ధాలే! అందరూ ఎక్కేశారు!)

వానరులు చుట్టుముట్టగానే, త్రికూట పర్వతంలో సముద్రం పొంగుతున్నట్టుగా ఘోష పుట్టింది. లంక అంతా దద్దరిల్లిపోయింది!

రాముడు చెప్పినట్టుగానే వానర సేనాపతులందరూ, ఎవరే గుమ్మం దగ్గిర కాయాలో అక్కడికి, కోటి కోటిమంది సైనికుల్ని వెంటబెట్టుకుని వెళ్ళారు.

సుగ్రీవుడు 36 కోట్ల మందిని చుట్టూ పెట్టుకుని ఉత్తర ద్వారానికీ పశ్చిమ ద్వారానికీ మధ్య, గోడ వెనక, జాగ్రత్తగా చేరాడు. (గోడ వెనుక ఉండటానికే 36 కోట్ల మంది!)

ఉత్తర ద్వారంలో, రావణుడు, సేనతో, ఆయుధాలతో సిద్ధంగా ఉన్నాడు. అక్కడికి రాముడు, లక్ష్మణుణ్ణీ, సైన్యాన్నీ వెంటబెట్టుకుని వెళ్ళాడు. అక్కడ సేననీ, ఆయుధాల్నీ, యంత్రాల్నీ చూశాడు. విభీషణుడితో ఆలోచించి రావణుడి దగ్గిరికి దూతను పంపటానికి నిశ్చయించుకున్నాడు. (ఆ యంత్రాలూ అవీ చూశాక యుద్ధం కంటే సంధే మంచిదిలే – అనుకున్నట్టున్నాడు.)

అంగదుణ్ణి పిలిచాడు – "అంగదా! నువ్వు రావణుడి దగ్గిరికి దూతగా వెళ్ళి రావాలి. అతనితో చెప్పవలసిన మాటలు చెపుతాను విను. 'రావణా! నీకు చావు మూడింది. నీకు వినాశ కాలం దాపురించింది. నీ దుర్మార్గాల కన్నిటికీ ఇప్పుడు నా చేతిలో ఫలితం అనుభవిస్తావు. (ఇక, సంధి కుదిరినట్టే!) నా భార్యను నాకు

---

**393.** **యుద్ధ, సర్గ 41, శ్లోకాలు 2 .... 9:** సుగ్రీవుడు చేసిన పని గురించి రాముడేమంటున్నాడో చూడండి! "నాతో ఆలోచింపక నీవు సాహసమైన కార్యము చేసితివి. రాజులు ఇట్టి సాహస కార్యములు చేయరు. (అవును, సాహసాలు చేసి, ప్రాణాలిచ్చే సేనలుండగా రాజులు, ప్రాణాల మీదకు తెచ్చుకోవలసిన ఖర్మేమిటి?) ఇక మీదట ఇటువంటి సాహస కార్యములు చేయకుము. నీకు ఆపద కలిగినటులైనచో సీత నా కెందుకు? తమ్ములగు భరత లక్ష్మణ శతృఘ్నులతో నేమి పని? నా ప్రాణములు ఎందుకు? నీ పరాక్రమము నాకు తెలిసియున్నను నీవు వచ్చుటకు ముందు .... నే నిటుల నిశ్చయించుకొని యుంటిని. రావణుని యుద్ధములో జంపి, విభీషణునికి లంకలో పట్టాభిషేకము జేసి, భరతుని స్వాధీనములో రాజ్యమును విడిచిపెట్టి, నా దేహమును విడుచునటుల నిశ్చయించుకొని యుంటిని."

సుగ్రీవుడు పోతే తను కూడా పోతాడట. ఎంత దొంగమాటలో!

సుగ్రీవుడి గొప్ప చూడండి! "రామా! నీ భార్య నపహరించిన రావణుని జూసి నే నెటుల ఓర్చుకొనగలుగుదును?" అంటున్నాడు. మరి సుగ్రీవుడా! ఎవరి భార్యనో ఎత్తుకుపోయిన వాణ్ణి చూస్తేనే కోపం పట్టలేక పోయావే! నీ భార్యని తన స్వంతం చేసుకున్న వాలిని చూస్తే కోపం రాలేదూ? ఋష్యమూకం ఎక్కి కూచున్నావేం అంత కాలం? ★

అప్పగించి నా పాదాల మీదపడి శరణు కోరకపోతే లంకంతా ఒక్క రాక్షస పురుగైనా లేకుండా నాశనం (అరాక్షసం) చేసేస్తాను. ధర్మాత్ముడైన విభీషణుడు నన్ను శరణు కోరాడు. (శరణు కోరినందుకే ధర్మాత్ముడయ్యాడు!) నీ వంటి పాపాత్ముడు రాజ్యభోగాలనుభవించడానికి తగడు. లంకా రాజ్యం అంతా విభీషణుడికే అప్పగిస్తాను. నువ్వు నా బాణాల పాలబడి అప్పటికైనా పవిత్రం అవుతావు. పక్షివై ఎన్ని లోకాలు ఎగిరిపోయినా, రామ బాణాలు నిన్ను వదలవు. పర లోకాల కోసం చేసుకోవలసిన కార్యాలన్నీ ఇప్పుడే చేసుకో. నీ రాజ్యం అంతా ఆఖరిసారి బాగా చూసుకో. అన్నిటి మీదా ఆశలు వదులుకొని యుద్ధానికి రా!' అని చెప్పవోయి! భయపడకు, వెళ్ళు!" అన్నాడు.

అంగదుడు వెంటనే అగ్ని శిఖలాగ రయ్యిన ఎగురుతూ వెళ్ళిపోయాడు.

రావణుడు తన మందిరంలో మంత్రులతో ఆలోచిస్తూ కూర్చుని ఉన్నాడు.

అంగదుడు రావణుడి ముందు దిగాడు. "రావణుడా! రఘుకుల తిలకుడైన శ్రీరామచంద్రుడు నీకు చెప్పమన్న మాటలు చెపుతాను విను ...." అంటూ రాముడు చెప్పిన మాటలన్నీ యధాతథంగా అప్ప చెప్పాడు.

రావణుడు కోపం పట్టలేక, "వాణ్ణి పట్టుకోండి! నరకండి! చంపెయ్యండి!" అంటూ కేకలేశాడు.

నలుగురు సైనికులు వచ్చి అంగదుణ్ణి పట్టుకున్నారు. అంగదుడు తన బలం చూపించడానికే వాళ్ళకు పట్టుబడ్డాడు. రాక్షసులు తనని పట్టుకోగానే అంగదుడు వారిని నలుగుర్నీ రెండు చేతులతోటీ దొరక పుచ్చుకుని రయ్యిన పైకెగిరి రావణుడు చూస్తుండగా వారిని కిందకి విసిరేశాడు. తర్వాత రావణ మందిర శిఖరాన్ని కాళ్ళతో తన్ని పడగొట్టేసి, "అంగదుడంటే ఏమనుకుంటున్నావు?" అని అరిచి ఎగిరి వెళ్ళిపోయాడు.

రావణుడు తనకు వినాశం తప్పదని నిట్టూర్పులు విడిచాడు.

(యుద్ధం అంటే రావణుడు మొదటి నుంచీ భయపడుతూనే వున్నట్టు కవి చిత్రణ! రావణుడు ఎప్పటికప్పుడు నిట్టూర్పులు విడుస్తూ వుంటాడు. విచారపడుతూ వుంటాడు. తనకు జయం కలగదని శంకిస్తూనే ఉంటాడు.)

ఇంకా వానర సైన్యం సముద్రం దాటి వస్తూనే వుంది.

వానర సేనల్ని చూసి రాక్షసులు భయంతో, ఆశ్చర్యంతో, హాహాకారాలు చేశారు.

రాముడు లంకని ముట్టడించాడనే వార్త కొందరు సైనికులు రావణుడి మందిరానికి వెళ్ళి చెప్పారు.

రావణుడు మండిపడుతూ మేడ ఎక్కి వానర సైన్యాల్ని చూసి చాలా విచారపడ్డాడు.

రాముడు కూడా జింక కన్నులవంటి కన్నులు గల సీతని తల్చుకుంటూ విచారపడుతూ, "యుద్ధం ప్రారంభించండి!" అంటూ ఆజ్ఞ ఇచ్చాడు.

వానరులు మహోత్సాహంతో బండ రాళ్ళూ, వృక్షాలూ విసిరి కందకాలు పూడ్చేశారు. (ఇవేనా దేవతలు కూడా దాటలేని కందకాలు?) ద్వారాలూ, ప్రాకారాలూ కూలదోసేశారు. (దేవతలు కూడా ఎక్కలేని ద్వారాల మీదకీ, ప్రాకారాల మీదకీ కవిగారు వానరుల్ని ఒక్క శ్లోకంతో ఎక్కించేశారు!)

"సుగ్రీవుడికి జయం! రామ లక్ష్మణులకు జయం" అని అరుస్తూ వానరులు లంకలో జొరబడిపోయారు. కొందరు వానరులు, యుద్ధంలో అలిసిపోయే సైనికుల కోసం శిబిరాలు ఏర్పాటు చెయ్యడంలో మునిగారు. (యుద్ధం పీడ తప్పించుకోవాలని శిబిరాల పనిలో పడ్డారు.)

అప్పుడు, రాముడు మళ్ళీ నాలుగు గుమ్మాల దగ్గిరా కొత్త కొత్త వానరుల్ని ఏర్పాటుచేశాడు. ఈ సారి కుముదుడు 10 కోట్ల వానరులతో తూర్పు ద్వారంలో ఉన్నాడు. శతవలి 20 కోట్ల వానరులతో దక్షిణ ద్వారంలో. సుషేణుడు 60 కోట్ల వానరులతో పడమటి ద్వారంలో. విభీషణుడూ, సుగ్రీవుడూ కూడా రాముడికి సాయంగా ఉత్తర ద్వారంలో.

ఈ రకంగా, వానరులు లంకని ముట్టడించడం చూసి రావణుడు కోపంతో రాక్షస సేనని యుద్ధం చెయ్యమని ఆజ్ఞాపించాడు.

రావణుడి ఆజ్ఞ కాగానే రాక్షస సైన్యం మహోత్సాహంతో వానర సైన్యంతో కలబడింది. ఘోరమైన యుద్ధం ప్రారంభమైంది. రాక్షసులు - శూలాలతో, గొడ్డళ్ళతో, గదలతో, కత్తులతో, బాణాలతో!

వానరులు - రాళ్ళతో, చెట్లతో!

"శ్రీరామచంద్రుడికి జయం!" అని వానరుల కేకలు!

"రావణ చక్రవర్తికి జయం!" అని రాక్షసుల కేకలు!

ఇరు పక్షాల వారూ ఒకరి నొకరు కొట్టుకోవడం మొదలుపెట్టారు. పొడుచుకుంటున్నారు. చీరుకుంటున్నారు. నరుక్కుంటున్నారు. చంపుకుంటున్నారు.

"శ్రీరామచంద్రుడంటే ఏంటనుకుంటున్నార్రా, రాక్షస వెధవల్లారా? రఘువంశస్థుడని గ్రహించండిరా!"

"రావణ చక్రవర్తి అంటే మీరేంటనుకుంటున్నార్రా, కోతి వెధవల్లారా? పులస్త్య వంశం ముందు రఘు వంశం

ఎంతపాటిదిరా!"

ఇటు నించీ అటు నించీ అరుపులూ, కేకలూ, తిట్లూ! ఎక్కడి కక్కడ భీకరంగా కొట్టుకుంటున్నారు. ఒక్క దెబ్బతో చంపుకుంటున్నారు. రక్తంతో భూమి మెత్త బడుతోంది.

విభీషణుడూ, అతని అనుచరులూ, రాక్షస సైన్యంతో పట్టలేని కోపంతో పోట్లాడుతున్నారు.

యుద్ధరంగమంతా ఎక్కడికక్కడ ద్వంద్వ యుద్ధాలు సాగుతున్నాయి.

ఇంద్రజిత్తు – అంగదుడితో. సుగ్రీవుడు – ప్రఘను డితో. లక్ష్మణుడు – విరూపాక్షుడితో. విభీషణుడు – మిత్రఘ్నుడితో. నళుడు – వ్రతపనుడితో. రాముడు – అగ్నికేతుతోటీ, రశ్మికేతుతోటీ. (రాముడు రావణుడితో కాదన్నమాట!) హను మంతుడు – జంబుమాలితో. నీలుడు – నికుం భుడితో. సుషేణుడు – విద్యున్మాలితో.

ఇద్దరేసి కలబడి బాదేసుకుంటున్నారు. ఒక్క దెబ్బతో తలలు తెగి పడుతున్నాయి. (రాక్షసుల తలలే.)

గుర్రాలూ, ఏనుగులూ కూలిపోతున్నాయి. రథాలు విరిగిపోతున్నాయి. చక్రాలు దొర్లిపోతున్నాయి. డాళ్ళూ, కత్తులూ, గదలూ విరిగిపోతున్నాయి. రక్తాలు పాయలు గట్టి పారుతున్నాయి. హాహాకారాలు మిన్ను ముట్టు తున్నాయి.

సూర్యుడు అస్తమించాడు. నలుమూలలా చీకటి ఆక్రమించింది. యుద్ధం సాగుతూనే ఉంది.

"చంపండి! .... నరకండి! .... తల తెగ్గొట్టు! .... పోనిస్తావేం? .... వెనక నించి పొడు! .... నించోరా! .... పరిగెడతావేం?" అని కేకలు అన్ని దిక్కుల్లోనూ చీకట్లని చీల్చుకుంటూ పోతున్నాయి.

రామ బాణాలు యుద్ధరంగమంతా దూసుకు పోతు న్నాయి. రాక్షసుల్ని కుప్పతెప్పలుగా సంహరిస్తున్నాయి.

ఇంద్రజిత్తు అంగదుణ్ణి కొండలాంటి గదతో కొట్టాడు. (ముందు రాక్షసులే కొడతారు. రాముడి పక్షం వారు మాత్రం ముందు కొట్టరు. చాలా ధర్మంగా నడు స్తారు. ప్రతీ చోటా గమనిస్తూ ఉండండి!) అంగదుడు – ఇంద్రజిత్తు రథాన్నీ, గుర్రాల్నీ, సారథినీ సర్వనాశనం చేసేశాడు. ఇంద్ర జిత్తు ఎగిరి మాయం అయిపోయాడు. రుషులూ, దేవతలూ ఆకాశంలో నిలబడి అంగదుణ్ణి వేనోళ్ళ కీర్తించారు. (వాళ్ళ వీపుల మీద ఇంద్రజిత్తు వొక్కొక్కటి తగలనిస్తే బాగుణ్ణు!)

జంబుమాలి గొప్ప ఆయుధంతో హనుమంతుణ్ణి గుండెల మీద కొట్టాడు. హనుమంతుడు అరిచేతి దెబ్బతో జంబుమాలి రథం మీద కొట్టి, అతన్నీ, అతని రథాన్నీ, సారథినీ, గుర్రాల్నీ సర్వనాశనం చేసేశాడు. (హనుమంతుడు సీతని వెతకడానికి లంకకు వెళ్ళి నప్పుడు, లంకలో చేసిన యుద్ధంలో జంబుమాలిని చంపాడు. ఇప్పుడు మళ్ళీ జంబుమాలిని చంపాడు!)

వ్రతపనుడు నళుణ్ణి పిడుగుల్లాంటి బాణాలతో కొట్టి బాధించాడు. నళుడు అతని మీద కురికి కళ్ళు పీకి చంపేశాడు.

నికుంభుడు నీలుణ్ణి బాణాలతో కొట్టి నవ్వాడు. నీలుడు నికుంభుడి రథచక్రాన్నే ఊడదీసి దాంతో ఆ రథాన్నీ, గుర్రాల్నీ, సారథినీ, నికుంభుణ్ణీ కొట్టి కొట్టి చంపేశాడు.

అశనిప్రభుడు ద్వివిధుణ్ణి బాణాలతో కొట్టాడు. ద్వివిధుడు సాలవృక్షంతో అశనిప్రభుడి రథాన్నీ, గుర్రాల్నీ, సారథినీ నాశనం చేసేశాడు.

మైందుడు, వజ్రముష్టి రథం మీదకు ఉరికి సారథినీ, గుర్రాల్నీ, వజ్రముష్టినీ చంపేశాడు.

విద్యున్మాలి, సుషేణుణ్ణి బాణాలతో కొట్టి సింహ నాదాలు చేశాడు. సుషేణుడు పెద్ద కొండ శిఖరం ఊడబీకి విద్యున్మాలి రథం మీదకి విసిరాడు. విద్యున్మాలి నేర్పుగా రథంలోంచి ఉరికి తప్పుకుని సుషేణుణ్ణి గదతో కొట్టాడు. సుషేణుడు ఇంకో బండ విసిరి విద్యున్మాలిని చంపేశాడు.

ఆ విధంగా, యుద్ధం చాలాసేపు వానరులకే జయ సూచకంగా సాగింది.

★ ★ ★

మాయం అయిపోయిన ఇంద్రజిత్తు ఎక్కడ ఉన్నాడో వెతికి పట్టుకోమని, రాముడు పదిమంది వానర సేనాపతుల్ని ఆజ్ఞాపించాడు. వారు అన్ని దిక్కులకూ ఎగురుకుంటూ పోయారు.

ఇంద్రజిత్తు అన్ని దిక్కుల్లోనూ బాణాలతో అడ్డగించి వానరులు ముందుకు రాకుండా ఆపేసి, పెద్ద కంఠంతో అరిచాడు. "నన్ను దేవేంద్రుడైనా పట్టుకోలేడు. కోతి మొహాలూ మీరూనూ, మీరెక్కడ పట్టుకుంటార్రా? నా చేతిలో రాముడికీ, లక్ష్మణుడి మూడిందే' కాచుకో మనండి!' అని రాముడి మీదకీ, లక్ష్మణుడి మీదకీ నాగాస్త్రాలు గుప్పించి ఆనందంతో సింహనాదాలు చేశాడు.

ఇంద్రజిత్తు వేసిన బాణాలు వచ్చి శరీరాల నిండా తగలగానే మహా వీరులైన రామ లక్ష్మణులు వృక్షాలు కూలినట్టు భూమి మీద పడిపోయారు. దేహాల నిండా, కొనగోటి చివరల వరకూ, నాగ పాశాలు చుట్టుకుని వారికి అమితమైన బాధ కలిగించడం మొదలు

పెట్టాయి.[394]

ముందుగా రాముడు పడిపోవడం చూసి లక్ష్మణుడు తన ప్రాణాల మీద ఆశ వొదిలేసుకున్నాడు. రాముడి కోసం చాలా దుఖ్ఖపడ్డాడు.

రాముడూ లక్ష్మణుడూ పడిపోగానే ఇంద్రజిత్తు తమ సైన్యాలకు ధైర్యం కలిగిస్తూ, "రామలక్ష్మణుల్ని చంపేశాను. ఇక వారిని ఎవ్వరూ రక్షించలేరు" అని అరిచాడు. ఆ ఉత్సాహంతో, నీలుణ్ణీ, హనుమంతుణ్ణీ, జాంబవంతుణ్ణీ, దొరికిన వానర వీరులందర్నీ బాణాలతో చితకగొట్టాడు. "ఈ వార్త నా తండ్రికి చెపుతాను" అంటూ సంతోషంగా నగరంలోకి వెళ్ళిపోయాడు.

రాముడి దగ్గిరే కూర్చుని దుఖ్ఖిస్తోన్న సుగ్రీవుణ్ణి విభీషణుడు చాలా ఓదార్చాడు – "రాముడికి ప్రాణ భయమేమీ లేదు. చచ్చిపోయిన వాళ్ళ మొహాలు ఇంత కాంతిగా ఉండవు. (చచ్చిపోయారో, బతికే వున్నారో తెలుసుకోడానికి, గాలి పీలుస్తున్నారో లేదో చూడరు. మొహాల కాంతి పుంజాలు పరిశీలిస్తారు!) మనకు అదృష్టం ఉంటే రామ లక్ష్మణులు తప్పకుండా మూర్ఛ తేరతారు. (అదృష్టం ఉందా మరి?) యుద్ధాలు ఇలాగే ఉంటాయి. ఏదో ఒక పక్షానికే జయం కలుగుతుందనే నిశ్చయం ఉండదు. (ఏదో ఒక పక్షానికే జయం కలుగుతుందనే నిశ్చయం ఉండదని తెలిసి కూడా నువ్వు లంకలో ఉన్నన్నాళ్ళూ, 'రాముడే జయిస్తాడు, రాముడే జయిస్తాడు' అని పాట పాడేవాడి వెందుకూ?) జయాపజయాలు మారుతూ ఉంటాయి. సుగ్రీవుడా! నువ్వు ధైర్యంగా ఉండి నాకు ధైర్యం కలిగించాలి గానీ ఇటువంటి సమయంలో విచారిస్తూ కూర్చోవడం వల్ల ప్రయోజనం లేదు. సత్యం, ధర్మం కోరేవాళ్ళకు మృత్యు భయం ఉండదు. (చచ్చిపోయే వాళ్ళంతా, అసత్యం, అధర్మం కోరే వాళ్ళన్నమాట!) వానరులారా! ధైర్యంగా ఉండండి!" అంటూ వానరులందరికీ ధైర్యం కలిగించాలని చూశాడు. కానీ వానరులు గడ్డి పరక కదిలినా రాక్షసులే వొచ్చి మీదపడుతున్నారని భయపడిపోతూ రాముడి చుట్టూ కూర్చున్నారు.

ఇంద్రజిత్తు, తండ్రి దగ్గిరికి వెళ్ళి నమస్కారాలు చేసి, "రామ లక్ష్మణుల్ని చంపేశాను" అని ప్రకటించాడు.

రావణుడు ఆనందం పట్టలేక ఇంద్రజిత్తుని ఆలింగనం చేసుకుని చాలా విధాల కీర్తించాడు. రామ లక్ష్మణులు చచ్చిపోయారని నగరం అంతా చాటింపు వేయించాడు. అలంకారాలు చేయించాడు.

అశోకవనం నించి రాక్షస స్త్రీలను పిలిపించి, "ఇంద్రజిత్తు రామ లక్ష్మణుల్ని చంపేశాడని సీతకు చెప్పండి! సీతని పుష్పక విమానం మీద యుద్ధ రంగానికి తీసుకుపోయి అంతా చూపించండి! ఇక తనకై తనే అలంకారాలు చేసుకుని నా దగ్గిరికి వొస్తుంది. సీతని తొందరగా తీసుకువెళ్ళండి!" అని ఆజ్ఞాపించాడు.

రాక్షస స్త్రీలు వెంటనే అశోకవనానికి పుష్పక విమానం తీసుకుపోయి సీతని ఎక్కించుకుని యుద్ధ రంగానికి తీసుకువెళ్ళారు.

రామలక్ష్మణులు పడిపోయి ఉండడం, వానరులు ఎంతగానో దుఖ్ఖపడుతూ ఉండడం, రాక్షసులు సంతోషంతో పొంగిపోతూ ఉండడం, అంతా చూసి సీత దుఖ్ఖించడం ప్రారంభించింది. "అయ్యో! నాకు విధవత్వం సంభవించిందా? నేనేం పాపం చేసుకున్నాను? స్త్రీలకు దౌర్భాగ్యం సంభవించే లక్షణాలేమీ నా శరీరం మీద లేవు గదా! బ్రాహ్మణులు చెప్పిన జోస్యాలన్నీ వ్యర్థమైపోయినాయే! దీర్ఘ సుమంగళిగా ఉంటానన్నారు. పుత్రుల్ని కంటానన్నారు. నా భర్త మహారాజు అవుతాడన్నారు. యజ్ఞయాగాలు చేస్తాడన్నారు. (యుద్ధంలో స్పృహ తప్పి పడతాడన లేదా?) నా శరీరాంగాల మీద ఉన్న పద్మరేఖలన్నీ ఫలితం ఇవ్వకుండా వ్యర్థమైపోయాయి గదా! శ్రీరాముడే నన్ను రక్షించలేకపోతే, ఇంకెవరు రక్షించగలరు?" అంటూ భోరున ఏడ్చింది.

(సీత, పుష్పక విమానం మీద నించి రాముణ్ణి చూసి ఏడ్చే ఘట్టంలో అన్న మాటలన్నీ – "రాముడు పోయాడా?" కథలోనే వచ్చాయి.)

త్రిజట సీతని ఓదార్చింది. "రామ లక్ష్మణులు మరణించలేదు తల్లీ! వానరులందరూ కలవరపడకుండా ధైర్యంగానే ఉన్నారు. రాముడు పోతే ఆ విధంగా ఉంటారా? మహేంద్రుడొచ్చినా రాముణ్ణి జయించలేడు. (మహేంద్రుడు ఈ అవమానాలన్నీ ఎలా భరిస్తున్నాడో యేమో!) రామ లక్ష్మణులు మరణించి ఉంటే, ఈ పుష్పక విమానం నిన్ను తనలో ఉంచుకునేది గాదు. (కిందకి పడగొట్టేదా? రేపు రాముడు బతికివొచ్చి తనని దండిస్తాడేమోననే భయంతోనే సీతని ఉండనిచ్చింది గానీ, రాముడు చచ్చిపోయాడని నమ్మకంగా తెలిస్తే, ఆ విమానం, సీతని కిందకి పడగొట్టి రావణుడి దగ్గిరికి వెళ్ళిపోయే దేనన్న మాట! – కవి ఏదో తర్కం లేవనెత్తబోయి బోల్తాపడుతూ వుంటాడు.) సీతా! నువ్వు మహా పతివ్రతవు కాబట్టి నీ మీద భక్తి చేత చెప్తున్నాను సుమా! నే నెన్నడూ అబద్ధం చెప్పలేదు. ఇక ముందు కూడా చెప్పను. (ఇంతకన్నా అబద్ధాలేం వుంటాయి?) రామ

**394.** శ్రీమహావిష్ణు స్వరూపుడూ, సమస్త అస్త్ర శస్త్ర విద్యలు తెలిసిన వాడూ అయిన శ్రీరామచంద్రుడు, యుద్ధం మొదలుపెట్టీ పెట్టగానే మూర్ఛపోతే ఏమన్నా బాగుంటుందా? యుద్ధం ప్రారంభం, కథా నాయకుడి మూర్ఛతోటా! ★

లక్ష్మణుల మొహాలలో కళ పోలేదు. వారు మరణించ లేదు. నా మాటలు నమ్మి ధైర్యంగా ఉండు!" అని చెప్పింది.

సీత కొంచెం ధైర్యం తెచ్చుకుంది. "నువ్వు చెప్పినట్టే జరిగితే ఎంత బాగుండును!" అంటూ నిట్టూర్చింది.

పుష్పకం అశోకవనానికి తిరిగి వెళ్ళిపోయింది.

★ ★ ★

శ్రీరాముడు ధైర్యం గలవాడూ, శూరుడూ కాబట్టి మూర్ఛ నించి తొందరగా తేరుకున్నాడు. (మూర్ఛలు ఎంత తొందరగా తేరుకోవాలో బాగా తెలిసిన వాడు కాబట్టి! అవి ఎప్పుడూ అలవాటే!)

రాముడు లేచేటప్పటికి లక్ష్మణుడు ఇంకా మూర్ఛ లోనే ఉన్నాడు. ఇక రాముడు సోదరుడి కోసం శాస్త్రో క్తంగా దుఃఖించడం ప్రారంభించాడు. (లంకించుకు న్నాడు.) "అయ్యో, యుద్ధంలో ఓడిపోయి నేల మీద పడిపోయి వున్నాడు నా తమ్ముడు. ఇక నాకు సీత ఎందుకు? నా ప్రాణాలు మాత్రం ఎందుకు? భూలోకం అంతా వెతికితే సీతలాంటి స్త్రీ దొరుకుతుంది గానీ, సర్వ కాలాలలోనూ సహాయం చేసే లక్ష్మణుడిలాంటి తమ్ము డెక్కడ దొరుకుతాడు? (ఆ మాట నిజమే, రేపటి నించీ నీ వెనకాల ఎవరు వొంగుంటారు! రాముడూ? బాగా అర్థం చేసుకున్నావు.)[395]

రాముడి శోకం ఇంకా ఇలా సాగింది. "లక్ష్మ ణుడే పోతే నే నిక జీవించను. ప్రాణాలు ఇక్కడే వొదిలేస్తాను. (ప్రాణా లొదిలేస్తాను, ప్రాణాలొది లేస్తాను అంటావేమిటి రాముడూ అస్తమానూ? మొన్న సుగ్రీవుడి కోసమూ ఇలాగే వొదిలేస్తానన్నావు. ప్రాణాలు అప్పుడే వొదిలేసి ఉంటే, ఇప్పుడేం వొదులుతావు? రేపు మళ్ళీ ఇంకెవరి కోసం వొదలాల్సి వొస్తుందో! అయినా, నిజంగా వద లవులే. ఊరికే అనడమే! సరే, అలాగే చెప్పుకో!)

లక్ష్మణుడు లేకుండా అయోధ్యకు వెళ్ళి నా తల్లికేం చెపుతాను? (వెళతావన్న మాట అయోధ్యకి? జరిగిందే చెప్పూ!) సుమిత్రకేం చెప్పను? యశో వంతుడు భరతుడు, అతని కేం చెప్పను? (అందరికీ వొకే రకంగా చెప్పవా? తలో రకంగా చెపుతావా ఏమిటి? వొకరికి చెప్పేదే అందరికీ చెప్పూ!)

లక్ష్మణా! ఎప్పుడూ నన్ను వోదార్చేవాడివి. ఎంత దుఃఖిస్తోన్నా ఇప్పుడు వోదార్చవేమోయి? (లక్ష్మ ణుడు లేచి, "లక్ష్మణుడు పడిపోయినందుకు విచా రించకండి అన్నగారూ!" అని వోదార్చాలన్నమాట!)

లక్ష్మణా! నాతో అడవులకు వచ్చి, నా వల్లనే ఇన్ని ఆపదల పాలయ్యావు. (పోనీలే. ఆ మాత్రం గ్రహిం చావు!) నా కెంత కోపం వచ్చినా నా మాట కెన్నడూ ఎదిరించి చెప్పలేదు. నాతో పరుషంగా ఒక్క మాటైనా మాట్లాడలేదు. (అంత మంచివాడి మీద నీకు కోపం ఎందుకు రావాలీ, పొగరు గాకపోతే?)

వానరులారా! దేహం నిండా బాణాలు గుచ్చు కున్నా లక్ష్మణుడు కిరణాలు విరజిమ్మే సూర్యుడిలా ఉన్నాడు, చూడండి! (నీకూ గుచ్చుకున్నాయిగా? నువ్వు ఇంకా పెద్ద సూర్యుడివి!) లక్ష్మణుడు బాధతో నోరు విప్పలేక కంటి చూపులతోటే తన ప్రేమని వ్యక్తం చేస్తున్నట్టు ఉన్నాడు. ('పడుకున్నానని ఏమీ అనుకోకండి అన్న గారూ! లేచింతర్వాత వొంగుం టాను' అంటున్నాడేమో!)

లక్ష్మణా, మహా వీరుడివి నువ్వు! కార్తవీర్యార్జును డైతే వెయ్యి చేతులున్నప్పటికీ అయిదు వందల బాణాలే వెయ్యగలడు. నువ్వు రెండు చేతులతోటే అంతకన్నా

---

**395.** యుద్ధ, సర్గ 49, శ్లోకం 6: రాముడి మాటలు – "భూలోకంలో వెదికి చూచినటులైతే సీత వంటి స్త్రీ దొరుకుట సాధ్యమే. సర్వ కాలములలో సహాయము చేయువాడుగను, యుద్ధ సమర్థుడుగను నుండు లక్ష్మణుని వంటి తమ్ముడు ఎచటను లభించడు."

రాముడు లక్ష్మణుడి కోసం దుఃఖిస్తున్నాడు. బాగానే వుంది. ఈ సందర్భంలో సీత సంగతి ఎత్తడం ఎందుకు? "భూలోకంలో వెతికితే సీత లాంటి స్త్రీ దొరుకుతుంది" అనే మాటలు రాముడు, అనవొచ్చునా? "రాముడు లాంటి పురుషుడు నాకు దొరక్కపోడు" అని సీత అంటుందా? పతివ్రత కాబట్టి అనదు. అలాగే, రాముడు కూడా ఏకపత్నీ వ్రతుడు కాబట్టి, రెండో స్త్రీ సంగతి ఎత్తకూడదు.

కథలో, రాముడు లక్ష్మణుడి కోసం ఇంకోసారి కూడా దుఃఖించే ఘట్టం వస్తుంది – (102వ సర్గలో 13వ శ్లోకం.) అప్పుడు కూడా, "ఏ దేశంలోనైనా భార్యలు దొరుకుతారు. బంధువులు దొరుకుతారు. తమ్ముళ్ళు దొరకరు" అంటాడు.

ఏకపత్నీ వ్రతులు కాని పురుషులైతే – "ఒక భార్య పోతే ఇంకొక భార్య వస్తుంది" అంటే, అది వేరు. ఆ మాటలు ఏకపత్నీ వ్రతుడెలా అంటాడు?

అసలు, ఏకపత్నీ వ్రతం అంటే ఏమిటో ఆ నాటి సమాజంలో ఎవరికీ తెలీదు. ఎందుకంటే, అది అసలు సమాజంలో లేదు. అది, కవి ఊహ! దాన్ని కవి ఆదర్శంగా చెప్పాలనుకున్నాడు. కానీ, ఆ ఊహ చేతకాలేదు. సమాజ జీవితంలో ఉన్నది, 'ఒక భార్య పోతే ఇంకో భార్య దొరుకుతుంది' అనే దృష్టే! ఈ వాస్తవమే కవి చిత్రణలో ప్రతిబింబించింది. ఏకపత్నీ వ్రతుడి నోటి నించి కూడా సమాజంలో అందరూ అనుకునే సామాన్యమైన మాటలే వచ్చాయి! ★

ఎక్కువ బాణాలు వెయ్యగలవు. (రాముడు ఇలా అన్నా డని కార్తవీర్యార్జునుడికి తెలిస్తే బాగుణ్ణు!)

లక్ష్మణా! దేవేంద్రుణ్ణి మించిన పరాక్రమ వంతుడివి నువ్వు! (దేవేంద్రుడికి మళ్ళీ అవమానం! లక్ష్మణుణ్ణి చక్కగానే పొగుడుతున్నావు. లక్ష్మణుడు నీ కష్టం ఉంచు కోడులే. ఈ సారి నువ్వు పడి పోయినప్పుడు అతను ఇంతకన్నా గొప్పగా దుఃఖి స్తాడు!) అంత మహావీరుడివి, కటిక నేలమీద పడుకున్నావా? ఈ వానరుల ముందే నేను నా ప్రాణాలు వొదిలేస్తాను. ఇక జీవించను. నువ్వు నాతో అడవులకు వచ్చావు. నేను నీతో యమలోకానికి వస్తాను. (లక్ష్మణుడు యమలోకానికి వెళ్ళడు రాముడూ! నువ్వు మాత్రం అక్కడికే. మీ ఇద్దరికీ పొత్తు కుదరదు. నీ దారి నువ్వు చూసుకో!)

అయ్యో! విభీషణుడికి లంకా రాజ్యం ఇస్తాన న్నాను. నా మాట అసత్యం అయిపోయిందే!

సుగ్రీవా! నీ సైన్యం అంతా వెంట బెట్టుకుని నీ రాజ్యం నువ్వు వెళ్ళిపో నాయనా! హనుమంతుణ్ణీ, అంగ దుణ్ణీ, జాంబవంతుణ్ణీ, నీ మంత్రులందర్నీ తీసు కుని తొందరగా వెళ్ళిపో! (నువ్వు చెప్పక్కర్లేదోయా! కొంచెం ఆగితే, ఆయనే పరుగుచ్చుకుంటాడు.) లేకపోతే నేను చచ్చిపోయాక రావణుడు నిన్ను బతకనివ్వడు. (నీ కళ్ళ ముందే సుగ్రీవుడు రావణుడితో ఘోర యుద్ధం చేశాడే, మర్చిపోయావా?)

ఇంతవరకూ వానరవీరులందరూ, అంగదుడూ, హనుమంతుడూ, జాంబవంతుడూ, నీలుడూ, నళుడూ, అందరూ వీరోచితంగా పోరాడారు. (నేను తప్ప!) ఎంత చేస్తే మాత్రం ఏం లాభం చెప్పు? మానవులు దైవ సంకల్పం ధిక్కరించలేరు గదా? (నువ్వు మానవుడివే నన్నమాట!)

సుగ్రీవా! మీ అందరికీ నేను అనుమతి ఇస్తున్నాను. వెళ్ళిపోండి. (అందరూ నిజంగా వెళ్ళిపోతే బావుణ్ణు!)" రాముడు ఈ రకంగా దుఃఖించి దుఃఖించి ముగించాడు.

అప్పటికి విభీషణుడు, సైనికులందరికీ భయపడ వొద్దని చెప్పి వొస్తున్నాడు. అతన్ని చూసి ఇంద్రజిత్తే అను కుని వానరులందరూ పరుగులు ప్రారంభించారు. (వాన రులు విభీషణుణ్ణి ఎరగరా? ఇంద్రజిత్తునే ఎరుగుదురా?)

"ఏమిటిది? ఈ సేన అంతా ఎందుకిలా చెల్లా చెదు రౌతోంది?" అని సుగ్రీవుడు అంగదుణ్ణి అడిగాడు.

"రామ లక్ష్మణుడు పడిపోయారు గదా? అందు చేత అందరూ భయంతో పారిపోతున్నారు" అన్నాడు అంగదుడు.

"అబ్బే! అందుక్కాదు. విభీషణుణ్ణి చూసి ఇంద్ర జిత్తు అనుకుని పారిపోతున్నారు" అన్నాడు మళ్ళీ సుగ్రీవ మహారాజే. "పారిపోయే వాళ్ళందరికీ చెప్పండి! ఇంద్ర జిత్తు కాదని చెప్పండి! వెనక్కి రమ్మని చెప్పండి!" (రాని వాళ్ళకి మరణ శిక్షలే!) అన్నాడు.

అప్పుడు జాంబవంతుడు వెళ్ళి, పారిపోతున్న వానరులందరికీ ధైర్యం చెప్పి వెనక్కి తీసుకువచ్చాడు.

★ ★ ★

విభీషణుడు వచ్చి మూర్ఛపడి ఉన్న రామ లక్ష్మ ణుల్ని చూశాడు. (రాముడు ఒకసారి మూర్ఛలోంచి లేచి, తమ్ముడి కోసం ఏడ్చి, మళ్ళీ మూర్ఛపోయి ఉన్నాడు!) విభీషణుడు, వారి కళ్ళని నీళ్ళతో తుడిచి, గొంతెత్తి ఏడవడం మొదలుపెట్టాడు. (ఏడవడం ఇప్పుడు ఈయన వొంతు!) "రాక్షసులు కపట యుద్ధం చేసి రామ లక్ష్మణులకు ఇలాంటి దురవస్థ కలిగించారు. ఇంద్రజిత్తు నీచ రాక్షస బుద్ధితో ఇంత మోసం చేశాడు. ఎవరి పరా క్రమం నమ్ముకుని ప్రతిష్ట పొందాలనుకున్నానో వారు మరణానికి సిద్ధంగా వున్నారు. నా రాజ్య కాంక్ష వ్యర్థమై పోయింది. నా ఆశలన్నీ నిరాశలై పోయాయి. నా శత్రువు రావణుడు అన్ని విధాలా ఉన్నతుడయ్యాడు. తనే జయిం చాలనే కోరికా తీర్చుకున్నాడు. శత్రునాశనం చేస్తాననే ప్రతిజ్ఞా నెరవేర్చుకున్నాడు. ఇక నేను బతికినా చచ్చినా ఒకటే. జీవించి వుండి ఇంకా కష్టాలపాలై పోవడం తప్ప సుఖమేమీ వుండదు" అంటూ దుఃఖించాడు.

దుఃఖిస్తోన్న విభీషణుణ్ణి సుగ్రీవుడు ఆలింగనం చేసుకున్నాడు. "రామ లక్ష్మణులకేమీ భయం లేదు. మూర్ఛ తేరారంటే మనల్ని వారే రక్షిస్తారు. నువ్వు ధర్మాత్ముడివి. లంకా రాజ్యం నీకే దక్కుతుంది. (నేను ధర్మాత్ముణ్ణి కాబట్టి కిష్కింధా రాజ్యం నాకే దక్కింది.) చివరికి రావణుడే నశించిపోతాడు."[396] అని విభీషణు డికి ధైర్యం చెప్పాడు. తర్వాత సుషేణుడితో "ఇదిగో!

---

**396.** **యుద్ధ, సర్గ 50, శ్లోకాలు 13 .... 21:** విభీషణుడి దుఃఖం: "ధర్మాత్ముడగు విభీషణుడు తడి చేతితో రామలక్ష్మణుల కన్నులు తుడిచి పెద్ద గొంతుతో ప్రలాపించెను." "రామ లక్ష్మణుల పరాక్రమము నాశ్రయించి కీర్తి ప్రతిష్టలు పొందగలుగుదునని కాంక్షించి యున్నాను. ఇప్పుడు వీరు మరణోన్ముఖులై యున్నారు. నేనిపుడు జీవించియు చచ్చిన వాడను. నా రాజ్యకాంక్ష వ్యర్థమైపోయినది. శత్రువగు రావణుని కోరిక పూర్తియైనది .... ఈ విధముగా విలపించుచుండు విభీషణుని నాలింగనము చేసికొని సుగ్రీవుడిటుల ఓదార్చెను – ధర్మాత్ముడా! లంకలో రాజ్యమును పొందెదవు. సందేహము లేదు."

ఈ రకంగా, విభీషణుడు రాముడి దగ్గరికి ఎందుకు చేరాడో కవి స్పష్టంగానే చెపుతూ వుంటాడు. అలా చేరటం తప్పు కాదనే అభిప్రాయం వల్ల, ఆ విషయాలు దాచడానికి ప్రయత్నించడు. ★

సుషేణుడూ! ఈ అన్నదమ్ములిద్దరూ లేచింతర్వాత ఇద్దర్నీ తీసుకుని, మన సైన్యాలన్నిటినీ కూడా వెంటబెట్టుకుని కిష్కింధకి వెళ్ళిపో! నే నొక్కణ్ణే రావణుణ్ణీ, అతని బంధు వుల్నీ, కొడుకుల్నీ, సైన్యాల్నీ, అందర్నీ నాశనం చేసేసి సీతని వెంటబెట్టుకుని తీసుకు వస్తాను" అంటూ కేక లేశాడు. (భయంతో మతి తప్పినట్టే వుంది!)[397]

అప్పుడు సుషేణుడు ఒక ఆలోచన చెప్పాడు. "పూర్వం దేవాసురులకు యుద్ధం జరిగినప్పుడు, అస్త్ర శస్త్రాలు తెలిసిన రాక్షసులు, దేవతల్ని యుద్ధంలో చాలా విధాల ఆయుధాలతో కొట్టారు. దేవతలు అమితంగా చచ్చిపోతూ వుంటే, బృహస్పతి మృత సంజీవనిని మంత్రించి వైద్యం చేశాడు. తర్వాత దేవతలు ఆ ఔషధ లతల్ని తీసుకుపోయి పాల సముద్రంలో చంద్రము, ద్రోణము అనే కొండల మీద పెట్టారు. తొందరగా వెళ్ళ గల వానరులెవరైనా పాల సముద్రానికి వెళ్ళి ఆ ఓష ధులు తీసుకు రావాలి. హనుమంతుడు వెళ్ళడం మంచిది" అన్నాడు.

అంతలో బ్రహ్మాండమైన గాలి వీచింది. భూమి గడ గడలాడింది. మహా వృక్షాలన్నీ కూలిపోయాయి. సముద్రం అల్లకల్లోలమై పోయింది. ఎగిరే అగ్నిగోళం లాగ గరుత్మంతుడు వొస్తూ అందరికీ కనపడ్డాడు. (కొంచెం నెమ్మదిగా రాకూడదూ? చెట్లని కూలగొట్టు కుంటూ రావాలా?)

అంతవరకూ రామలక్ష్మణుల్ని బాణాల రూపాలతో పీడిస్తోన్న సర్పాలు, గరుత్మంతుణ్ణి చూడగానే పారిపో యాయి. గరుత్మంతుడు రామ లక్ష్మణుల్ని చూసి సంతో షిస్తూ, వారి ముఖాలు చేతులతో తడిమాడు. ('చేతుల్తో' అంటే, కాళ్ళతోటేనా?) తక్షణం వారి బాధ అంతా మాయమైపోయింది. గొప్ప తేజస్సు కలిగింది. పూర్వం ఉండే పరాక్రమం, ధైర్యం, స్థైర్యం, వివేకం, జ్ఞానం, జ్ఞాపక శక్తీ – వంటి దివ్య లక్షణాలన్నీ రెట్టింపయ్యాయి. (కైక మీద కోపమో? అది మూడు రెట్లయి వుంటుంది.)

రాముడు గరుత్మంతుణ్ణి చూసి, "నీ దయవల్ల మేము ఆపదలో నించి బయటపడ్డాం. ఇప్పుడు పూర్వం లాగే ఆరోగ్యంగా వున్నాం. నిన్ను చూస్తే మా తండ్రినో, తాతనో చూసినట్టు ఆనందంగా వుంది. చక్కగా అందంగా పూల దండలూ, వస్త్రాలూ ధరించి వున్నావు. ఎవరు నువ్వు?" అని అడిగాడు.

"రామా! నేను నీ స్నేహితుణ్ణి. నా స్నేహం గురించి నీకు తర్వాత తెలుస్తుంది. ఇంద్రజిత్తు నాగ పాశాలతో మిమ్మల్ని బంధించాడని విని (ఎవరు చెప్పారేంటి?) మీకు సహాయం చెయ్యాలని వచ్చాను. ఈ నాగ పాశాలు నేను తప్ప దేవేంద్రుడైనా విడిపించలేడు. (రాముడి స్నేహితుణ్ణనగానే నువ్వెలా మాట్లాడుతావో తెలిసి పోయిందిలే.) రాక్షసులు కపట యుద్ధం చేస్తారు. మీరు జాగ్రత్తగా వుండాలి. ధర్మాత్ముడివి నువ్వు. శత్రువుల్ని కూడా వాత్సల్యంతో చూస్తావు. యుద్ధంలో నువ్వు తప్ప కుండా జయిస్తావు. వృద్ధుల్నీ, పిల్లల్నీ విడిచి మిగిలిన శతృవులందర్నీ నాశనం చెయ్యి! (మధ్య వయసు వాళ్ళం దరూ నాశనమైపోతే వృద్ధుల్నీ పిల్లల్నీ ఎవరు సంరక్షి స్తారు?) ఇక నాకు అనుమతిస్తే వెళ్తాను" అని రాముణ్ణి ఆలింగనం చేసుకుని విడిచి వెళ్ళిపోయాడు.[398]

వానర సైన్యం మళ్ళీ సింహనాదాలు చేస్తూ యుద్ధా నికి సిద్ధమైంది.

★ ★ ★

లంకలో అందరూ వానరుల కేకలు విన్నారు.

రావణుడు ఆశ్చర్యపడి, "వానరులకు ఇంత సంతోషం ఎలా కలిగింది? అసలేం జరిగిందో చూసి రండి" అని కొందరు చారుల్ని పంపించాడు. (అన్నీ ఆయనే చూసుకోవాలి పాపం! మంత్రులందరూ ఏమై పోతారో! ఏమీ పట్టించుకోరు!)

వెళ్ళిన చారులు తిరిగివొచ్చి, "రామలక్ష్మణులు

**397.** రాముడి కోసం లక్ష్మణుడు దుఖించడం; లక్ష్మణుడి కోసం రాముడు దుఖించడం;

రాముడి కోసం సుగ్రీవుడు దుఃఖించడం; సుగ్రీవుడి కోసం రాముడు దుఃఖించడం; (యుద్ధం మానేసి అందర్నీ వెళ్ళిపొమ్మని చెప్పటం;) రాముడి కోసం విభీషణుడు దుఃఖించడం; విభీషణుడి కోసం రాముడు దుఃఖించడం (విభీషణుడికి రాజ్యం ఇవ్వలేకపోయానే – అని); రాముడి కోసం సీత దుఃఖించడం; సీత కోసం రాముడు దుఃఖించడం; సుగ్రీవుడు విభీషణుణ్ణి ఓదార్చడం; విభీషణుడు సుగ్రీవుణ్ణి ఓదార్చడం;

కథలో ఘట్టాలు ఈ రకమైన ఆదర్శ ప్రేమలతో, త్యాగాలతో, నడుస్తూ వుంటాయి. ★

**398.** గరుత్మంతుడు వచ్చి, నాగపాశ బంధం విడిపించడం – అనే కల్పనని వాస్తవంలోకి మార్చుకుంటే, గరుత్మంతుడనే ఆయనవొచ్చి, తనకు తెలిసిన వైద్యం చేసి మంచీ చెడ్డా మాట్లాడి వెళ్ళాడన్న మాట. వాస్తవంలో జరిగేది అదే. వైద్యం చెయ్యడం మానవ సమాజానికి సంబంధించిన విషయమే. గద్దలకూ, పాములకూ వైరం ఉండడం – ప్రకృతికి సంబంధించిన విషయం. ప్రకృతి లోనూ, సమాజం లోనూ ఉండే వాస్తవాల ఆధారం తోటే ఈ రకం కట్టు కథలు (మైతాలజీ) తయారవుతాయి. ★

మహా పరాక్రమంతో మదపుటేనుగుల్లాగ యుద్ధానికి సిద్ధంగా వున్నారు. అందుకే వానరులు ఆనందంగా వున్నారు" అని చెప్పారు.

రావణుడు మళ్ళీ ఆశ్చర్యపడి, విచారించాడు. "మహా బలవత్తరమైన నాగ పాశాలే విడిపించుకుని శత్రువు బయటపడ్డాడే! ఇక నా బలం నాకు జయం కలిగిస్తుందనుకోవడం పొరపాటే" అనుకున్నాడు. ధూమ్రాక్షుణ్ణి పిలిచాడు. "ధూమ్రాక్షా! నువ్వు భయంకరమైన పరాక్రమం గలవాడివి. గొప్ప సైన్యాన్ని తీసుకుని యుద్ధానికి వెళ్ళి, రాముణ్ణి చంపేసి రా!" అని ఆజ్ఞాపించాడు.

ధూమ్రాక్షుడు మహా సంతోషంతో కావలసినంత సైన్యాన్ని తీసుకుని, గదలూ కత్తులూ శూలాలూ గొడ్డళ్ళూ బల్లేలూ దండాలూ పట్టసాలూ వంటి ఆయుధాలెన్నో తీసుకుని, యుద్ధానికి బయల్దేరాడు. కొందరు గుర్రాల మీదా, కొందరు కంచర గాడిదలు కట్టిన బంగారు రథాల మీదా బయల్దేరి, పడమటి ద్వార రక్షణ కోసం హనుమంతుడి మీదకు వెళ్ళారు.

ధూమ్రాక్షుడి రథాన్ని ఆకాశంలో పక్షులు అడ్డగించాయి. (పక్షులన్నీ రాముడి పక్షం గావున్ను!). ఆ జెండా మీద గద్దలు వాలాయి. తలలేని మొండెం వొకటి రక్తం కారుతూ, వికారంగా అరుస్తూ ధూమ్రాక్షుడి రథం దగ్గిర పడింది. ఇంకా అనేకమైన అప శకునాలు కనపడ్డాయి.

యుద్ధానికి బయల్దేరిన రాక్షసులందరూ భయ పడి మూర్ఛబోయారు. (ఏడిసినట్టే వుంది. లేవండి తొందరగా! ఇప్పుడా మూర్ఛ?)

ధూమ్రాక్షుడు కొంచెం విచారించి, తర్వాత ధైర్యం తెచ్చుకుని యుద్ధానికి దిగాడు. (అదీ తెలివి అంటే!)

మళ్ళీ భయంకరమైన యుద్ధం ప్రారంభమైంది.

రాక్షసులు వానరుల్నీ వానరులు రాక్షసుల్నీ, చంపుకుంటున్నారు.

(యుద్ధం సంగతి తెలిసిందేగా? రాక్షసులు బాణాలు వేస్తారు. వానరులు చెట్లూ, బండలూ విసురుతారు. అస్తమానం అదే యుద్ధం! మళ్ళీ మళ్ళీ మళ్ళీ అదే యుద్ధం!)

వానరులు రాక్షసుల్ని చెట్లతో పుట్లతో, రాళ్ళతో రప్పలతో, గోళ్ళతో నోళ్ళతో, బాది, కొరికి, చీరి, చరిచి, కరిచి, చంపేస్తూంటే, రాక్షసులు భయపడి పారిపోవడం మొదలుపెట్టారు.

ధూమ్రాక్షుడికి వానరుల మీద చాలా కోపం వచ్చి వారినందరినీ బాణ ప్రవాహంతో ముంచెత్తి తరిమి తరిమి కొట్టాడు.

అది చూసి హనుమంతుడు పెద్ద కొండ శిఖరం తెచ్చి ధూమ్రాక్షుడి రథం మీదకి విసిరాడు. (యుద్ధం అవకుండానే కొండ శిఖరాలన్నీ అయిపోతాయోయేమో! తర్వాతేం విసురుతారో!) ధూమ్రాక్షుడు ముళ్ళ గద పట్టుకుని రథం లోంచి బయటికి ఉరికేసి దాంతో హనుమంతుడి నెత్తిమీద వొక్క పెట్టు పెట్టాడు. (ఒక్కటేం సరిపోతుంది, ఆ బండవాడి నెత్తికి? ఇంకోటన్నా పెట్టు!)

హనుమంతుడు ఇంకో బండ తెచ్చి ధూమ్రాక్షుడి మీదకి విసిరాడు. ధూమ్రాక్షుడు దాని కిందబడి చచ్చిపోయాడు. (తెలుసులే, అదే జరుగుతుంది.)

హనుమంతుడు పెద్ద చెట్టు పీకి రాక్షస సైన్యాన్ని బాది బాది చంపేశాడు. తప్పించుకో గలిగిన వాళ్ళు లంకలోకి పారిపోయారు.

★ ★ ★

ధూమ్రాక్షుడు చచ్చిపోయాడని విని రావణుడు కోపంతో మహా సర్పంలా బుసకొట్టి, వజ్రదంష్ట్రుణ్ణి పిలిచి యుద్ధానికి వెళ్ళమన్నాడు.

వజ్రదంష్ట్రుడు కూడా ధూమ్రాక్షుడు బయల్దేరినట్టే ఆర్భాటంగా బయల్దేరాడు. ఒంటెల్ని కూడా వెంట బెట్టుకున్నాడు. (కాసిన్ని నగలు కూడా ఎక్కువ పెట్టుకున్నాడా?) అంగదుడు ఉన్న దక్షిణ ద్వారం మీదకి బయల్దేరాడు.

సరే! దారిలో ఎప్పటిలాగే అప శకునాలన్నీ కనపడ్డాయి. సూర్యకాంతి తగ్గింది. (సూర్యకాంతి తగ్గితే అది రాక్షసులకే అప శకునమా కవిగారూ?) ఆకాశంనించి తోక చుక్కలు రాలాయి. పక్షులూ, జంతువులూ 'రాక్షసులకే కీడు' అని చెప్పేశాయి.

అయినా వజ్రదంష్ట్రుడు ధైర్యం తెచ్చుకుని ముందుకే సాగాడు. (అవును మరి, శకునాల్ని నమ్మకూడదు.)

మళ్ళీ రెండు పక్షాల వాళ్ళూ కలబడ్డారు. యుద్ధం భయంకరంగా సాగింది.

రాక్షసులూ, వానరులూ కూడా, ఎక్కడికక్కడే, కాళ్ళు తెగి, కంఠాలు తెగి, గుండెలు పగిలి, వీపులు పగిలి, నేలకొరుగుతున్నారు. మట్టి కరుస్తున్నారు.

వాయిద్యాల దరువుల్తో, రథ చక్రాల టక టకల్తో, జంతువుల అరుపుల్తో, యోధుల సింహనాదాలతో, యుద్ధరంగం, అల్లకల్లోలమై పోతున్న సముద్రంలా అయింది. వానర సేన విజృంభించి రాక్షసులకు అమితంగా హాని కలిగిస్తోంది.

వజ్రదంష్ట్రుడు యముడిలాగ వానర సేన మీద పడ్డాడు. అంగదుడు ప్రళయాగ్నిలాగ ప్రజ్వలిస్తూ పెద్ద చెట్టు తీసుకుని, క్షుద్ర మృగాల్ని సింహం ఛెండాడినట్టు రాక్షసుల్ని ఛెండాడుతూ వీర విహారం చేశాడు. వజ్రదంష్ట్రుడు చూస్తూ వుండగానే రాక్షసులంతా నాశనమైపోయారు.

వజ్రదంష్ట్రుడు కోపం పట్టలేక (కోపం వస్తే మాత్రం నువ్వేం చెయ్యగలవులే. కవిగారు నీ పక్షమా ఏవిటి?) వానరుల మీదకి బాణ వర్షం కురిపించాడు. అంగదుణ్ణి

కూడా మర్మ స్థానాలలో కొట్టాడు.

అంగదుడు ఒక మహా వృక్షం తెచ్చి వజ్ర దంష్ట్రుడి మీదకి విసిరాడు. వజ్రదంష్ట్రుడు దాన్ని బాణాలతో ముక్క ముక్కలు చేసేశాడు. అంగదుడు ఈ సారి పెద్ద కొండ తెచ్చి వజ్రదంష్ట్రుడి రథం మీద విసిరాడు. అప్పుడు వజ్రదంష్ట్రుడు (తెలుసులే. నేర్పుగా రథం లోంచి దూకేస్తాడు) పెద్ద గద పట్టుకుని రథం లోంచి ఎగిరి అంగదుడి మీద పడ్డాడు. (మా బాగా చేశాడు.) అంగదుడు, ఆ గద లాక్కుని అవతల పారేసి, పెద్ద బండ తెచ్చి వజ్రదంష్ట్రుడి మీదికి విసిరాడు. వజ్రదంష్ట్రుడు మూర్ఛబడి పోయి కొంత సేపటికి లేచి ఇంకో గద తీసుకుని దాంతో అంగదుణ్ణి కొట్టి, తర్వాత ముష్టి యుద్ధానికి దిగాడు.

ముష్టియుద్ధం కొంతసేపు చేసిం తర్వాత అంగదుడు వొరలోంచి కత్తీ, డాలూ తీసి (డాలు ఒరలోంచి కాదనుకోండీ! కత్తి వొరలోంచే.) వాటితో కొంతసేపు యుద్ధం చేసి చివరికి కత్తితో వజ్రదంష్ట్రుడి తల నరికేశాడు. ఆ తల కిందపడి రెండు చెక్కలై పోయింది. (తల నరికించినా కోపం తీరలేదు కవికి. దాన్ని ఇంకా ఏదో కూడా చెయ్యాలి!) మిగిలిన రాక్షసులు లంకలోకి పారిపోయారు.

★ ★ ★

వజ్రదంష్ట్రుడు చచ్చిపోయాడని విని రావణుడు మహా వీరుడైన అకంపనుణ్ణి యుద్ధానికి వెళ్ళమన్నాడు.

అకంపనుడు యుద్ధ ప్రియుడు. శతృవుల్ని ఎదిరించగలవాడు. రాజుకి విశ్వాసపాత్రుడు. ఎవ్వరూ అతన్ని కంపింప జెయ్యలేరు. అందుకే అతడు అకంపనుడు. మహారాజు ఆజ్ఞాపించిన వెంటనే అకంపనుడు పెద్ద సేనతో బయల్దేరాడు.

దారిలో ఎన్నో అప శకునాలు కనపడ్డాయి. రథాలకు కట్టిన గుర్రాలు దీనంగా అయిపోయాయి. తొట్రుపడ్డాయి. అకస్మాత్తుగా అందరికీ అధైర్యం కలిగింది. అకంపనుడి ఎడమ కన్ను అదిరింది. మొహం పాలిపోయింది. ఆకాశం మేఘాలతో మూసుకుపోయింది. పక్షులూ, జంతువులూ కీడు చెపుతూ కూశాయి. అయినా అకంపనుడు ధైర్యంగా ముందుకే సాగాడు.

మళ్ళీ రెండు పక్షాలూ కలబడ్డాయి. ధూళి మేఘాలు లేచి లోకాన్ని కప్పేశాయి. ఎవరెక్కడున్నారో ఎవ్వరికీ కనబడలేదు. అరుపులతో, కేకలతో, తిట్లతో, రణరంగం మార్మోగిపోయింది.

వానరులూ, రాక్షసులూ కుప్పలు కుప్పలుగా నేల కూలుతున్నారు (వానరుల్లో చచ్చిపోయే వారంతా సామాన్యులే. ప్రముఖులైన వారెవరూ చచ్చిపోరు. రాక్షసుల్లో మాత్రం వీరులందరూ చచ్చిపోతూ వుంటారు.)

రక్తం, మడుగులు కట్టి నేలంతా బురద బురద అయిపోయింది. దుమ్ము అణిగింది.

అకంపనుడు రథాన్ని వొకచోట నిలపకుండా యుద్ధరంగం అంతా పరిగెత్తిస్తూ బాణాలు గుప్పించి వానరసేనల్ని తరిమి తరిమి కొడుతున్నాడు. వానరులు భయపడి హనుమంతుడి దగ్గిరికి పోయి దాక్కున్నారు. (రాముడి దగ్గిరికైతే లాభం లేదని.)

అకంపనుడు హనుమంతుడి మీద కూడా బాణ వర్షం కురిపించాడు. హనుమంతుడు పెద్ద పర్వతం పెళ్ళగించి తెచ్చి అకంపనుణ్ణి తరుముకుంటూ పరిగెత్తాడు. అకంపనుడు అర్ధచంద్ర బాణంలో హనుమంతుడి చేతిలో కొండని పిండి పిండి చేసేశాడు. హనుమంతుడు మళ్ళీ అశ్వకర్ణ వృక్షం పెళ్ళగించి తెచ్చి రాక్షస సైన్యాల్ని బాదటం మొదలుపెట్టాడు! అకంపనుడు హనుమంతుడి మీదకి 14 బాణాలు కొట్టాడు. ఆ బాణాలు దిగిన హనుమంతుడు, వృక్షాలతో ఉన్న పర్వతం లాగ, రక్తం కారుతూ, పూచిన అశోకం లాగ, పొగలేని అగ్నికణం లాగ, ప్రకాశించాడు. హనుమతుడికి చాలా కోపం వచ్చి (అంత ప్రకాశం కలిగితే కోపం ఎందుకు?) పెద్ద వృక్షం తెచ్చి అకంపనుడి మీదకి విసిరాడు.

వెంటనే అకంపనుడు చచ్చిపోయాడు. మిగిలిన రాక్షసులు కూడా భయపడి స్పృహ దప్పి కిందపడి చచ్చిపోయారు. ఇంకా ప్రాణాలు పోని వాళ్ళని వానరులు వీరోచితంగా బాది చంపేశారు. తప్పించుకోగలిగిన రాక్షసులు జుట్టు చెదిరిపోయి, బట్టలు ఊడిపోయి, ఒకర్ని ఒకరు తోసుకుంటూ, తొక్కుకుంటూ లంకలోకి పారిపోయారు.

దేవతలు హనుమంతుణ్ణి పూజించారు. రాముడు కూడా పూజించాడు.

★ ★ ★

అకంపనుడు చచ్చిపోయాడని విని రావణుడు ఉగ్రుడయ్యాడు.

తన సైన్యాలన్నీ చూసుకున్నాడు. ప్రహస్తుడితో, "ప్రహస్తా! రాజ్యం కాపాడుకోవాలంటే మనకు యుద్ధం తప్ప వేరే మార్గం లేదు. నేనో, నువ్వో, కుంభకర్ణుడో, ఇంద్రజిత్తో మాత్రమే ఈ భారం వహించాలి. నువ్వు వెంటనే యుద్ధానికి వెళ్ళు! నీ పరాక్రమం ముందు వానరులు నిలబడలేరు. రాముడు తప్పకుండా నీకు పట్టుబడతాడు. ఒకవేళ మనం జయించలేకపోతే యుద్ధరంగంలో మరణించడమే మంచిది. అంతేగాని యుద్ధం మానుకుని శతృవుకి లొంగడం మంచిది కాదు. ఏమంటావు?" అన్నాడు.

ప్రహస్తుడు వినయంగా, "సీత నిచ్చేయడం అన్ని విధాలా మంచిదే. ఇచ్చే ఉద్దేశ్యం లేకపోతే మాత్రం

యుద్ధం చెయ్యకుండా మానుతామా? ఇంత కాలమూ ఎన్నో విధాలుగా నన్ను ప్రేమించావు. ఎన్నో బహుమానా లిచ్చి సత్కరించావు. నా ఆపదలన్నింటికీ ఆదుకున్నావు. అటువంటి నిన్ను ఆపదలో విడిచి వూరుకుంటానా? నా సిరి సంపదలనైనా, నా భార్యా బిడ్డలనైనా, చివరికి నా ప్రాణాలనైనా, నీ కోసం సంతోషంగా విడిచిపెడతాను. యుద్ధానికి ఇప్పుడే బయలుదేరతాను" అని వెంటనే ఏర్పాట్లన్నీ చేసుకుని పెద్ద సైన్యంతో బయల్దేరాడు.

అగ్నిలో నెయ్యి పోసి బ్రాహ్మలు పూజలు చేసి నప్పుడు వచ్చే నేతి వాసనలతో, మంచి గంధం వాసన లతో, గాలి వీచింది. రాక్షసులందరూ, విజయం కల గాలని మంత్రించిన పూల మాలలు వేసుకుని బయ ల్దేరారు. దారిలో యధావిధిగా అప శకునాలన్నీ కన బడ్డాయి.

తోకచుక్కలు రాలాయి. (పండుటాకులేమో?) నవ గ్రహాలు ఒక దానిమీద ఒకటి పడ్డాయి. (గ్రహాలు ఒక దాని మీద ఒకటి పడితే, తోకచుక్కలు రాలితే, అవన్నీ రాక్షసులకే నష్టమా?) రక్త వర్షం కురిసి సేనంతా రక్తంతో తడిసిపోయింది. ప్రహస్తుడి రథం మీద గద్ద వాలగానే అతని మొహంలో కాంతి అంతా మాయం అయిపోయింది. ప్రహస్తుడి రథ సారధి చేతిలో నించి కొరడా కింద పడిపోయింది. ఎత్తు పల్లాలు లేకుండా సమతలంగా వున్న మార్గంలో కూడా గుర్రాలు తడ బడ్డాయి.

అగ్నిలోకి మిడతలు ఉరికినట్టుగా ప్రహస్తుడి సైన్యాలు యుద్ధానికి ఉరికాయి. యుద్ధం మళ్ళీ ప్రారంభ మైంది!

రక రకాల ఆయుధాలు, రాళ్ళతో ఢీకొనే చప్పుళ్ళు! పరుగులు! కేకలు! తిట్లు! శబధాలు! ఏడుపులు! నవ్వులు!

వెచ్చటి నెత్తురు కురుస్తోంది. కళేబరాల కుప్పలు పెరుగుతున్నాయి.

నరాంతకుడూ, మహానాధుడూ, సమున్నతుడూ – గొప్ప రాక్షస వీరులు. తారుడూ, జాంబవంతుడూ, వారితో పోట్లాడి కొండలు విసిరి వారిని చంపేశారు.

ప్రహస్తుడు కోపంతో వానరసేన మీదకు బాణాలు గుప్పించాడు. నీలుడు మహా వేగంతో ప్రహస్తుణ్ణి అడ్డగిం చాడు. సాల వృక్షంతో అతని గుర్రాల్ని కొట్టి చంపేశాడు. ప్రహస్తుడి చేతిలోంచి ధనుస్సు లాక్కుని విరిచేశాడు. ప్రహస్తుడు రోకలి పట్టుకుని రథంలోంచి దూకి దాంతో నీలుడి మొహం మీద కొట్టాడు. నీలుడు, మొహం బద్దలై, ఆ కోపంతో పెద్ద బండ తెచ్చి ప్రహస్తుడికేసి కొట్టాడు. ప్రహస్తుడు, తల బద్దలై, సెలయేళ్ళలాగ రక్త ధారలు ఉబికి కిందపడి చచ్చిపోయాడు.

మిగిలిన రాక్షస సేన యుద్ధరంగంలో నిలబడ లేక దుఃఖపడుతూ వెళ్ళిపోయింది.

శ్రీరాముడు నీలుణ్ణి శ్లాఘించాడు.

★ ★ ★

ప్రహస్తుడు కూడా పోయాడని విని రావణుడికి కోపం, దుఃఖం ఒక్కసారే ముంచుకొచ్చాయి. "ఇక ఈ రాముణ్ణి ఉపేక్షించకూడదు. నేనే యుద్ధానికి వెళతాను" అని తనే పెద్ద సైన్యంతో బయల్దేరాడు. (దారిలో అప శకునాలేమీ వర్ణించలేదు కవి. ఏవిటో సంగతి!)

యుద్ధ రంగానికి వచ్చిన సైన్యాన్ని చూసి రాముడు, "ఈ గొప్ప సేన ఎవరిది?" అని విభీషణుణ్ణి అడిగాడు.

విభీషణుడు రాక్షస సేనలో ప్రముఖులందర్నీ చూపిస్తూ, "అదుగో! ఆ ఏనుగు మీద బాలసూర్యుడిలా వెలిగిపోతున్నాడే, అతను అకంపనుడు. అటువేపు రథంలో ఇంద్రుడిలాగ ధనుస్సు తిప్పుతూ .... కొంచెం కోర పళ్ళు .... సింహం జెండా లేదూ? అతను ఇంద్ర జిత్తు! ఆ ఎత్తుగా వున్న వాడు అతికాయుడు. అదుగో! గాడిదలా కూస్తున్నాడే! వాడు మహోదరుడు. (ఇదిగో! రాముడి పక్కన కుక్కలా నించున్నాడే, వీడు విభీషణుడు!) ఇటు గుర్రం మీద ఉన్నవాడు పిశాచుడు. ఎద్దు మీద వాడు త్రిశిరస్సు. సర్పరాజు జెండా ఉంది చూడు వాడు కుంభుడు." – ఆ రకంగా కొందర్ని చెప్పి అప్పుడు రావ ణుడి కూడా చూపించాడు. "అదుగో! పులి మొహాల వాళ్ళూ, ఒంటె మొహాల వాళ్ళూ, ఏనుగు మొహాల వాళ్ళూ, అందరూ చుట్టూ ఉన్నారే, ఆ మధ్యవాడే రావ ణుడు! రుద్రుడిలాగ, ఇంద్రుడిలాగ, వెలిగిపోతున్నాడు, చూడు!" అన్నాడు.

(రాముడు, రావణుణ్ణి అంతకుముందే చూశాడు – సుగ్రీవుడు రావణుడి మీద దూకినప్పుడు. అయినా ఇప్పుడే మొదటిసారి చూస్తూ వున్నట్టు మాట్లాడతాడు!)

రాముడు, రావణుణ్ణి ఆశ్చర్యంగా చూశాడు. "రావ ణుడు చాలా పరాక్రమవంతుడే! కళ్ళతో చూడటానికి వీలు లేని సూర్యుడిలాగ వెలిగిపోతున్నాడే! దేవతలకు కూడా ఇంత కాంతి ఉండదే! ఆశ్చర్యంగా ఉంది! (మరేం టనుకున్నావు? కాంతి అంతా నీ బాబుగారి సొమ్మను కున్నావా?) దేవుడి దయ వల్ల ఈ దుర్మార్గుడు నా కంట పడ్డాడు. నా కోపం అంతా ఇప్పుడు తీర్చుకుంటాను" అంటూ రాముడు ధనుస్సు సిద్ధం చేసుకుని లక్ష్మణుడితో పాటు యుద్ధానికి నించున్నాడు. (రాముణ్ణి వొంటరిగా రావణుడి మీదకి పంపటానికి కవిగారికి చాలా భయం. లక్ష్మణుడు లేకుండా రాముడు ఒక్క అడుగు కూడా వెయ్యడు!)

రావణుడు తన సైన్యంతో, "మీరందరూ లంకలోకి వెళ్ళిపోండి! నేను అక్కడ లేనని తెలిస్తే వానరులు లంక అంతా పాడు చేసేస్తారు. మీరు వెళ్ళి లంకని రక్షిస్తూ

వుండండి!" అన్నాడు.

రావణుడి సైన్యం అంతా వెనక్కి వెళ్ళిపోయింది. రావణుడు, సముద్రంలో కొట్టుకునే పెద్ద చేపలాగ వానర సైన్యంమీద పడ్డాడు.[399]

సుగ్రీవుడు పెద్ద పెద్ద చెట్లతో నిండివున్న పర్వతం ఒకటి పెళ్ళగించి పట్టుకుని రావణుడి మీదకి ఎగిరాడు. రావణుడా కొండని పిండి పిండి చేసేసి వజ్రాయుధం వంటి బాణాలతో సుగ్రీవుణ్ణి కొట్టాడు. సుగ్రీవుడు స్పృహ తప్పి పడిపోయాడు. (రాముడు మళ్ళీ శాస్త్రోక్తంగా శోకాలు తీస్తాడా?)

రావణుడు వానర సేనని చెల్లాచెదురు చేసేస్తోంటే వానరులు నిలబడలేక శ్రీరాముణ్ణి శరణు కోరారు. (అబ్బే, శ్రీరాముడితో లాభం లేదు. హనుమంతుడి దగ్గిరికి పరిగెత్తండి!)

కరుణా సముద్రుడైన శ్రీరాముడు గొప్ప ధనుస్సుతో యుద్ధానికి కదలబోయాడు. లక్ష్మణుడు రాముడికి నమస్కారం చేసి "మహాప్రభూ! ఈ దుర్మార్గుణ్ణి చంపటానికి నువ్వే సమర్థుడివి. కానీ ఈ నీచుణ్ణి చంపటానికి నీ అంతటివాడు రావడం ఎందుకు? నేను చంపుతాను (నేనూ సమర్థుణ్ణే!) అనుజ్ఞ ఇయ్యి!" అని ప్రార్థించాడు.

రాముడు (బ్రతుకు జీవుడా అని) "అలాగే చెయ్యి!" అని గమ్మున ఒప్పేసుకున్నాడు. తర్వాత కొన్ని నీతులు చెప్పాడు. "చాలా జాగ్రత్తగా ఉండాలి సుమా! రావణుడు మహా పరాక్రమవంతుడు. అతనికి కోపం వస్తే ముల్లోకాలూ ఏకమైనా అతన్ని జయించలేరు. (రావణుడికి కోపం రానివ్వకుండా చక్కలిగింతలు పెడుతూ, నవ్వుల్లో పెట్టి యుద్ధం చెయ్యవోయీ లక్ష్మణా!) అతని లోపాలు కనిపెట్టు! నీ లోపాలు తెలియనివ్వకుండా జాగ్రత్తపడు!" అన్నాడు. (అతనూ జాగ్రత్త పడతాడులే. నువ్వు చదివిన శాస్త్రాలు అతనూ చదివాడు. ఇంతింత తెలివిమాలిన నీతులు విశ్వామిత్రుడేనా నీకు నేర్పింది?)

లక్ష్మణుడు, రాముణ్ణి పూజించి బయల్దేరాడు. (రాముణ్ణి ఇంకా రంగంలోకి దించడం లేదు కవి. ఎందుకో ఆలోచించండి!)

అంతలో హనుమంతుడు రావణుడి రథం దగ్గరికి వెళ్ళి చెయ్యెత్తి, "రావణుడా! దేవతల వల్ల కూడా నీకు చావు లేదు. కానీ వానరుల వల్ల మాత్రం నీకు కీడు మూడుతుంది. (వానరుల వల్ల కాదులే. మానవుల వల్ల! రావణుణ్ణి చంపే గొప్ప నువ్వు కొట్టెయ్యకు!) ఇదుగో చూడు! ఈ చేత్తోటే నీ ప్రాణాలు తీసేస్తాను" అని హూంకరించాడు.

రావణుడు నిర్లక్ష్యంగా, "ఎంతమాత్రం కొడతావో కొట్టు, నీ సత్తా ఏమిటో నేనూ చూస్తాను" అని నిలబడ్డాడు.

"ఇదివరకు నీ కొడుకుని చంపాను. గుర్తుందా, లేదా?"

రావణుడికి ఒళ్ళు మండిపోయి పిడికిటితో హనుమంతుడి గుండెల మీద గుద్దాడు. హనుమంతుడు అదిరిపడి, సర్దుకుని, తను కూడా రావణుడి గుండెలమీద గుద్దాడు. ఆ దెబ్బతో రావణుడు పెద్ద కొండ ఊగినట్టు ఊగిపోయాడు.

ఆకాశంలో ఋషులూ, దేవతలూ హనుమంతుణ్ణి చాలా మెచ్చుకున్నారు. (అక్కడ కూర్చుని ఉత్తుత్తి మెచ్చుకోళ్ళెందుకూ? కిందకొచ్చి మీరూ ఒక చెయ్యి వెయ్యరాదూ?)

రావణుడు కూడా హనుమంతుణ్ణి మెచ్చుకుంటూ, "శత్రువ్వి అయినా మెచ్చుకోదగ్గ వాడివే! గొప్ప పరాక్రమవంతుడివే" అన్నాడు.

"ఏం పరాక్రమంలే, నిన్ను ఒక్క దెబ్బతో చావగొట్టలేకపోయాను. అదీ పరాక్రమమేనా? ఈ సారి కొట్టు, అప్పుడు చూస్తావు నా అసలు పరాక్రమం!"

రావణుడు కోపంతో హనుమంతుణ్ణి మళ్ళీ గుండెల మీద గుద్దాడు. హనుమంతుడు మూర్ఛబడి పోయాడు. (ఇదన్న మాట, అసలు పరాక్రమం!)

తర్వాత రావణుడు నీలుడి వేపు దూసుకెళ్ళి శర పరంపర కురిపించాడు. నీలుడు పెద్ద పర్వతం విసిరాడు. (పర్వతాలు అయిపోలేదా ఇంకా?)

అంతలో హనుమంతుడు మూర్ఛనించి లేచి రావ

---

**399.** **యుద్ధ, సర్గ 39, శ్లోకాలు 33, 34, 35**: రావణుడు మొదట సేనల తోటే బయల్దేరాడు. యుద్ధ రంగానికి వచ్చిన తర్వాత సేనల్ని వెనక్కి పంపించేశాడు – 'లంకని రక్షించండి!' అని చెప్పి. ఒంటరిగా యుద్ధానికి దిగాడు! వీడికి నిజంగా మతిపోయినట్టే వుంది. కానీ, రావణుడు, తన సైన్యాన్ని వెనక్కి పంపించేసినట్టు కవి ఎందుకు రాశాడో ఊహించండి!

రావణుడి పక్షంలో మహా మహా వీరులు చచ్చిపోతున్నారు గదా? ఇంకా రావణుడు యుద్ధానికి కదలకుండా ఉంటే (ఇంకా యుద్ధానికి రాలేదని రాస్తే), సమంజసంగా వుండదు. కాబట్టి రావణుడు యుద్ధానికి దిగాలి. కానీ, అప్పుడే చచ్చిపోకూడదు. అప్పుడే చచ్చిపోతే, కథలో ఎన్నో చమత్కారాలు లేకుండా పోతాయి. కాబట్టి రావణుడు అప్పుడే చచ్చిపోకుండా ఓడిపోయి మాత్రం వెళ్ళిపోవాలి. ఓడిపోవాలంటే, సేనలు లేకుండా ఒంటరిగా ఉండాలని కవి అభిప్రాయం. రావణుడు సైన్యాన్ని వెనక్కి పంపించాడంటే, సైన్యాన్ని మొదట తనతోపాటు ఎందుకు తీసుకు వచ్చాడు? కవి, ప్రతీచోటా, 'రావణుడు ఎంత మూర్ఖుడో' అనిపించేలాగ చిత్రిస్తూ, తను ఎంత మూర్ఖుడో రుజువు చేసుకుంటూ వుంటాడు. ★

ణుణ్ణి చూసి, "ఇంకొకరితో యుద్ధం చేస్తున్నావు గనక నీ మీదకు రాకూడదని ఊరుకుంటున్నాను. లేకపోతేనా?" అంటూ తొడలు చరిచాడు.

రావణుడు హనుమంతుడి తొడల్ని లక్ష్య పెట్ట కుండా నీలుడు విసిరే చెట్లనీ, పర్వతాల్నీ ముక్క ముక్కలు చేసెయ్యడంలో మునిగాడు. (అవును మరి, దిక్కులు చూడకుండా తన పని తను చేసుకోవాలి.)

నీలుడు తన శరీరం వేలంత చిన్నది చేసేసుకుని, రావణుడి రథం మీద జెండా కొయ్యమీద ఎక్కాడు. అక్కణ్ణించి రావణుడి ధనుస్సు కొన మీదకీ, కిరీటం మీదకీ గంతులేశాడు. (ఈ వింతలన్నీ వానరులే చేస్తారు. రాక్షసులు చెయ్యగలిగినా చెయ్యరు, ఎందుకో మరి!)

నీలుడి గంతులు చూసి వానరులందరూ ఆనందం పట్టలేక రావణుణ్ణి పరిహసిస్తూ కేకలేశారు. రావణుడు బిత్తరపోయి ఏమీ తోచక కొంతసేపు నిలబడిపోయాడు. తర్వాత ఆగ్నేయాస్త్రం వెయ్యటానికి సిద్ధమౌతూ నీలుడితో, "చాలా నేర్పరివే గానీ ఈ దెబ్బ కాచుకుని ప్రాణం దక్కించుకో" అంటూ బాణం కొట్టాడు. నీలుడు స్పృహ తప్పి కింద పడిపోయాడు. (అయిందా నీలుడూ నీ పని?) కానీ, అతని తండ్రి మహిమ వల్ల, నెమ్మదిగా మోకాళ్ళ మీద పడడంచేత నీలుడికి ప్రాణం మాత్రం పోలేదు. (కవిగారూ! మీరు రాముడి పక్షం అయితే అవ్వచ్చు గానీ బొత్తిగా ఇంత పక్షపాతం బాగోలేదండీ! చదివే వాళ్ళు మీ పక్షపాత బుద్ధిని కనిపెట్టేస్తారు. తర్వాత మీ ఇష్టం!)

నీలుడు మూర్ఛబోవటం చూసి, రావణుడు, రథం ఇంకోవేపు పోనిచ్చాడు. లక్ష్మణుడు ఎదురుపడి, "రాక్షస రాజా! నీ యుద్ధం వానరులతో ఏం చేస్తావు గానీ నాతో చెయ్యి!" అని పిలిచాడు. (వానరుల కన్నా ఈయనా, ఈయన అన్నా వీరులా? వానరులు లేకపోతే వీళ్ళకి గతే లేదు, మళ్ళీ వానరులంటే చిన్న చూపు!)

"ఓహో! నువ్వా లక్ష్మణుడివి? ఇప్పటికి కన బడ్డావు. యమలోకానికి ప్రయాణం కట్టడానికి సిద్ధంగా వుండు! నా బాణాల మహిమ చూడు ఇప్పుడు!" అన్నాడు రావణుడు.

లక్ష్మణుడు నవ్వాడు. "గొప్ప వాళ్ళెప్పుడూ ఆత్మ స్తుతి చేసుకోరు. (నీ అన్న నోరుతెరిస్తే అదే చేస్తాడుగా? అసలు, ఆత్మస్తుతికే నోరు తెరుస్తాడే!) నిన్ను నువ్వే పొగుడుకుంటున్నావే! నీ పరాక్రమం నేనూ చూశానులే, రా!"

రావణుడు కోపంతో 7 బాణాలు కొట్టాడు. (కవిత్వం లెక్క!) లక్ష్మణుడు వాటిని (తెలుసులే) ముక్కలు ముక్కలు చేసేశాడు. ఇద్దరిమధ్యా బాణ యుద్ధం జరిగింది కొంతసేపు. లక్ష్మణుడు రావణుడి ధనుస్సు విర గ్గొట్టేశాడు. రావణుడు, 'శక్తి' ఆయుధంతో లక్ష్మణుణ్ణి కొట్టాడు. లక్ష్మణుడు, శక్తి తగలగానే శ్రీ మహావిష్ణువుని ధ్యానించాడు. కానీ, మూర్ఛపోయాడు. (శ్రీ మహా విష్ణువు - గొప్ప, పని చెయ్యలేదా?)

రావణుడు, లక్ష్మణుణ్ణి తనతో తీసుకుపోవడానికి, అతన్ని ఎత్తాలని ప్రయత్నించాడు గానీ ఎత్తలేక పోయాడు. ఎవ్వరికైనా, మహా పర్వతాలతో, మహా సముద్రాలతో ఉన్న ముల్లోకాలూ ఎత్తడం సాధ్యమౌతుందేమో గానీ, యుద్ధరంగంలో వున్న లక్ష్మణుణ్ణి ఎత్తడం మాత్రం సాధ్యం కాదు.

అంతలో హనుమంతుడు పరిగెత్తుకుంటూ వొచ్చి రావణుణ్ణి గుండెల మీద గుద్దాడు. (అబ్బా! ఈ హనుమంతుడు ఎంత మొరటో! అవతల వాళ్ళకి ఎంత నెప్పేస్తుందో బొత్తిగా ఆలోచించడు.)

రావణుడు రక్తం కక్కుతూ భూమి మీద పడి పోయాడు. (భూమౌ = భూమియందు.) రావణుడు చేష్టలుడిగి రథంలో పడివున్నాడు. (రథోపస్థే = రథము నడుమను. ఒక శ్లోకంలో, భూమిమీద పడ్డాడు. తర్వాత శ్లోకంలో, రథంలో పడ్డాడు. మొదటి శ్లోకం రాసిం తర్వాత కవిగారు ఏం పనిమీద లేచారో! మళ్ళీ వొచ్చి కూచునేప్పటికి రావణుడు ఎక్కడ పడ్డాడో మరిచి పోయారు!) రావణుడికి మెలుకువ వచ్చినా పూర్వంలాగ ధైర్యం చెయ్యలేకపోయాడు. (అబ్బా, ఎందుకొచ్చిన యుద్ధాల్లే రావణుడూ? ఆ హనుమంతుడితో గుద్దు లెందుకు తింటావు గానీ, సీతని పంపెయ్యి!)

రావణుడికి శక్తి పోయినందుకు ఆకాశంలో రుషులూ, దేవతలూ చాలా ఆనందించారు. (వీళ్ళకి ఇదే పనా ఆకాశంలో!)

అంతలో హనుమంతుడు లక్ష్మణుణ్ణి ఎత్తుకు వెళ్ళి రాముడి దగ్గిర పడుకోబెట్టాడు. (ఆశ్చర్యంగా లేదూ? లక్ష్మణుణ్ణి యుద్ధరంగంలో ఎవ్వరూ ఎత్త లేరన్నారే? 'శత్రువులే ఎత్తలేరు; మిత్రులైతే ఎత్తగలరు' అని, విమర్శక మూర్ఖులు కిక్కురు మనలేని 'పాయింటు' పెట్టడం మరిచిపోయాడు కవి.) లక్ష్మణుడి శరీరంమీద నించి రావణుడు కొట్టిన శక్తి వెళ్ళి పోయింది.

అప్పటికి రావణుడు ధైర్యం పుంజుకుని మళ్ళీ ధనుస్సు పుచ్చుకున్నాడు. రావణుడు లేవడం చూసి వానరులు భయపడి పారిపోవడం మొదలుపెట్టారు. రాముడు, రావణుడి రథాన్ని తరుముతూ పరుగెత్తాడు. (ఇప్పటికి రాముడు, రావణుడి ముందు కొచ్చాడు!)

హనుమంతుడు రాముడితో, "రామా! శ్రీ మహా విష్ణువు గరుడుడి మీద కూర్చున్నట్టు నువ్వు నా వీపుమీద కూర్చో" అన్నాడు. (ఊఁ .... ఎక్కూ! ఇంకా ఆలశ్య మెందుకూ?)

రాముడు వెంటనే హనుమంతుడి మీద ఎక్కాడు. హనుమంతుడు ఎగురుతూ రాముణ్ణి రావణుడి దగ్గరికి తీసుకుపోయాడు. రాముడు రావణుడితో, "రాక్షసుడా! నించో, నిన్నిక విడిచిపెట్టను. ఎన్ని లోకాలు తిరిగినా నన్ను తప్పించుకోలేవు. నన్నెవరను కుంటున్నావు? జన స్థానంలో పద్నాలుగు వేల మంది రాక్షసుల్ని చంపింది నేనే! (జన్మాని కంతటికీ ఆ వొక్క ముచ్చటే గావున్ను!) నా క్రోధమంతా తీర్చుకుంటాను ఇప్పుడు" అని అరి చాడు.

అంతలో రావణుడు హనుమంతుడి మీదకి ప్రళ యాగ్నిలాంటి బాణం వేశాడు. (హనుమంతుడు రావణు డితో కలబడాలని రాముణ్ణి కింద పడేస్తాడేమో!) అసలే తేజశ్శాలి అయిన హనుమంతుడికి ఆ బాణం దెబ్బ తిన్నాక తేజస్సు ఇంకా హెచ్చింది. (అయితే, బాణం దెబ్బలు ఎంత తింటే అంత మంచిదే!)

రాముడికి కోపం వచ్చి (హనుమంతుడి తేజస్సు హెచ్చిందనా?) అనేక బాణాలు వేసి రావణుడి రథం విరగ్గొట్టేశాడు. (అంత మంచి రథాన్ని! మళ్ళీ చేయించు కోవాలంటే ఎంత ఖర్చు!) రావణుడి గుండెలమీద బాణాలతో తీవ్రంగా కొట్టాడు.[400]

రావణుడి చేతిలోంచి ధనుస్సు కింద పడిపోయింది. వజ్రాయుధం దెబ్బలకూ, పిడుగులకూ కూడా చలించని రావణుడు, రామ బాణాలకు చలించి మూర్ఛపోయాడు. రాముడు ఇంకో బాణంతో రావణుడి కిరీటం పడ గొట్టేశాడు (తనకి కిరీటం లేదు కాబట్టి, ఎవరి కిరీటాలు చూసినా రాముడికి కోపమే.) "రావణుడా! ఇంతవరకూ గొప్ప పరాక్రమంతోటే యుద్ధం చేశావు. గొప్ప గొప్ప వానర వీరులందర్నీ మూర్ఛలు పోగొట్టి, నాకు సహాయం లేకుండా చేశావు. నేను ఒంటరిగానే యుద్ధం చేస్తు న్నాను. (రావణుడు మొదటి నించీ ఒంటరిగానే చేస్తు న్నాడుగా? అతని వెనకాల ఎవ్వరూ లేనప్పుడు, నీ వెనకాల సహాయం ఎందుకు వుండాలి?) నువ్వు చాలా అలసిపోయి వున్నావని నిన్ను చంపకుండా విడిచి పెడుతున్నాను. నీకు అనుమతి ఇస్తున్నాను. నగరంలోకి వెళ్ళిపో! విశ్రాంతి తీసుకుని, సైన్యాల్ని వెంటబెట్టుకుని, రథం ఎక్కి రా! అప్పుడు చూస్తావు నా వీరత్వం" అని రాముడు యుద్ధం విరమించాడు. (రాముడు, రావణుణ్ణి చంపకుండా వొదిలిపెట్టి నందుకు ఆశ్చర్య పడక్కరలేదు. చివరి కెలాగూ చంపుతాం కదా – అని ధైర్యమే. రాముణ్ణి గొప్ప దయాహృదయుణ్ణి చెయ్యడానికీ, కథలో చమ త్కారాలు ఇంకా పెంచడానికీ, రావణుణ్ణి అప్పుడే చంప కుండా ఉంచాలి.)

రావణుడు అమితంగా సిగ్గుపడిపోయాడు. కిరీటం పోయింది. రథం పోయింది. సారథి పోయాడు. దుఃఖ పడుతూ లంకలోకి వెళ్ళి పోయాడు.

ఆకాశంలో దేవతలూ, ఋషులూ (ఆకాశంలో ముఠా), రావణుడి పరాజయం చూసి చాలా ఆనం దించారు.

★ ★ ★

సింహం ఏనుగుని బాధించినట్టూ, గరుత్మంతుడు సర్పాన్ని బాధించినట్టూ, శ్రీరాముడు రావణుణ్ణి బాధించాడు గదా? రావణుడు రామ బాణాలకు భయ పడిపోయి గర్వం అణిగి సిగ్గు పడుతూ లంకలో ప్రవే శించాడు. బ్రాహ్మణ శాపాల లాగ, మహా శక్తిగల రామ బాణాల్ని తల్చుకుంటూ, విచారపడుతూ, సింహాసనం మీద కూర్చుని సభలో వాళ్ళకు చెప్పడం మొదలు పెట్టాడు. "ఇంద్రుడితో సమానుణ్ణి నేను. అలాంటి నన్ను ఒక మానవుడు అవమాన పరిచాడు. నా తపస్సంతా వ్యర్థమై పోయింది. 'నీకు మానవుల వల్ల కీడు జరుగుతుంది' అని బ్రహ్మ చెప్పిన మాట అక్షరాలా నిజం అయింది. మానవుల వల్ల చావు కలుగుతుందని అనుకో లేదు నేను. రఘు వంశ నాథుడు అనరణ్యుడు (వీడె వడు? కొత్త మొహం! ఈ రఘు వంశం వాళ్ళు ఇంకా ఉన్నారా?) పూర్వం నాతో ఏమన్నాడంటే – ఓ రాక్షసుడా! దుర్మార్గుడా! నీచుడా! నిన్ను సర్వ విధాలా నాశనం చేసేవాడు మా వంశంలోనే పుడతాడు, తెలుసా? – అన్నాడు. సరిగ్గా అలాగే జరిగింది. ఈ రాముడు రఘు వంశం వాడే. నన్ను చంపడానికే పుట్టాడు – అనుకున్నాను.

పూర్వం నేను వేదవతిని బలాత్కరించినప్పుడు,

---

**400.** రాముడు, రావణుడితో యుద్ధానికి దిగేటప్పటికి, రావణుడు మాత్రం అప్పటికే కొంతమంది వీరులతో యుద్ధం చేసి వున్నాడు. హనుమంతుడితో చేశాడు. నీలుడితో చేశాడు. లక్ష్మణుడితో చేశాడు. మళ్ళీ హనుమంతుడితో చేశాడు. అప్పటికే రావణుడి శక్తి పోయింది. కొంత సేపు మూర్ఛకూడా పోయాడు. లేచిన తర్వాత కూడా హనుమంతుడి మీద తిరగబడలేనంతగా అలిసిపోయాడు. వెనకాల సైన్యం లేనే లేదు.

అలాంటి పరిస్థితిలో, మన మహా వీరుడు రాముడు అప్పటిదాకా విశ్రాంతులు తీసుకుని, తీసుకుని, తీసుకుని, అలిసిపోయి వున్న రావణుడి మీదకి యుద్ధానికి వచ్చాడు. చూశారా, కవి, రాముణ్ణి ఎంత తెలివిగా (ఎంత పిరికిగా), యుద్ధానికి ఎప్పటికి దించాడో! ఇద్దరు పోట్లాడుకునేటప్పుడు, ఎక్కువగా అలిసిపోయిన వాడే ఓడిపోతాడు కదా? రావణుడు ఎంత తొందరగా ఓడిపోతాడో చూడండి! ★

ఆమె నన్ను శపించింది. ఆ వేదవతే ఇప్పుడు సీతగా పుట్టింది.

పూర్వం, పార్వతీ, నందికేశ్వరుడూ, రంభా – వాళ్ళందరూ ఎలా అన్నారో అలాగే జరిగింది.

రుషుల మాటలు కూడా అసత్యాలు కావు గదా? (అయ్యో, అసత్యాలంటూ వుంటే, అవి రుషుల మాటలే.)

నా మీద ఉన్న ఈ శాపాలన్నిటినీ బాగా తెలుసుకుని శతృవుల్ని జయించడానికి మనం చాలా శ్రద్ధ వహించాలి.[401]

కుంభకర్ణుడు మహా పరాక్రమవంతుడు. ఈ యుద్ధం ఇంకా తొమ్మిది రోజులకు ప్రారంభమౌతుండ నగా కుంభకర్ణుడు మనందరితో కలిసి మంత్రాలోచన చేసి నిద్రపోవటానికి వెళ్ళాడు. ఎప్పుడూ ఏడేసి నెలలో, ఎనిమిదేసి నెలలో నిద్రపోతూ వుంటాడు. నే నింత ఆపదల్లో మునిగి వుంటే, ఆ మూర్ఖుడు సుఖంగా నిద్ర పోతున్నాడు. ఆపదలో ఆదుకోకపోతే ఎంత పరాక్రమ వంతుడైతే మాత్రం ఏం లాభం? కుంభకర్ణుడు లేచా డంటే మాత్రం నాకేమీ భయం ఉండదు. అతడు తప్ప కుండా రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ చంపెయ్యగలడు. వెంటనే వెళ్ళి అతన్ని లేపండి!" అని మంత్రుల్ని ఆజ్ఞాపించాడు.

రాక్షసులు కొందరు, కుంభకర్ణుడి కోసం తినే పదార్థాలన్నీ తీసుకుని అతను ఉండే చోటుకి వెళ్ళారు.

కుంభకర్ణుడు అందమైన బంగారం తలుపులు గల గుహలో పర్వతం లాగ పడుకుని నిద్రపోతున్నాడు. అతను విడిచే ఊపిరి తుఫాను లాగ ఉంది. అది గుహలో జొరబడ్డ వాళ్ళని వెనక్కి కొట్టేస్తోంది. దాన్ని తట్టుకుని ముందుకు నడవటం కష్టమై పోయింది. (పీల్చే ఊపిరి మళ్ళీ ముందుకు లాగెయ్యదూ?) ఎలాగో ప్రయత్నం చేసి అతి కష్టంమీద లోపలికి జొరబడ్డారు. కుంభకర్ణుడి ముందు అన్నం రాసులూ, రక రకాల మాంసం రాసులూ, కల్లుకుండలూ, నెత్తురు కుండలూ, పెట్టారు.

మొదట మేలుకొలుపులు పాడారు. తట్టి లేపటానికి ప్రయత్నించారు. ఏమీ ప్రయోజనం లేక పోయింది. శంఖాలూ, డోళ్ళూ, భేరీలూ వాయిస్తూ అందరూ శక్తి కొద్దీ అరిచారు. దానివల్లా ఫలితం కనబడలేదు. కుంభ కర్ణుడి జుట్టు పట్టుకుని లాగారు. చెవులూ, ముక్కులూ కొరికారు. చెవుల్లో కుండలకొద్దీ నీళ్ళు పోశారు. అదీ పని చెయ్యలేదు. రాళ్ళూ, చెట్లూ, రోకళ్ళూ, స్తంభాలూ, గదలూ పట్టుకుని బాదటం మొదలుపెట్టారు. బాది బాది అలసిపోవడం తప్ప ప్రయోజనం కనపడలేదు. కుంభ కర్ణుడు మహా సుఖంగా గురకలు కొడుతున్నాడు. రాక్షసు లందరూ ఆలోచించి గుర్రాల్నీ, ఒంటెల్నీ, ఏనుగుల్నీ కుంభకర్ణుడి మీద ఎక్కించారు. వెయ్యి ఏనుగులు అతని మీదనించి పరిగెత్తాయి.

అప్పటికి కుంభకర్ణుడు కాస్త వొత్తిగిలి అతి ప్రయాస మీద కళ్ళు తెరిచాడు. (పక్కలో ఏనుగుల్ని చూసి నల్లులనుకున్నాడేమో!) లేచీ లేవగానే తిండి మీద పడ్డాడు. పందుల్నీ, దున్నపోతుల్నీ తిన్నాడు. కల్లూ, నెత్తురూ తాగాడు.

చాటున దాక్కున్న రాక్షసులందరూ కుంభకర్ణుడి ఎదటికి వొచ్చి నమస్కారాలు చేశారు.

"ఎందుకు లేపారు నన్ను? ఏవిటి సంగతి? రాజుకేమైనా ఆపద కలిగిందా? లేకపోతే మా అన్న నన్ను లేపించడే! దేవతల్నయినా సరే, దండించి అన్న భయం పోగొడతాను" అన్నాడు కుంభకర్ణుడు. (పోనీలే నాయనా! చల్లని మాట అన్నావు. తొందరగా లే మరీ! బోలెడు పని ఉంది!)

యలాపాక్షుడు ముందుకొచ్చి విన్నవించాడు. "మనకు దేవుడి వల్ల భయం ఎప్పుడూ లేదు. (దేవుడు లేడు కాబట్టి.) మనుషుల వల్లే కీడు కలగబోతోంది. వానరసైన్యం లంకని ముట్టడించింది. రఘువంశస్థుడైన రాముడు ('ఫలానా వాళ్ళ కుర్రాడు' అన్నట్టు) రావణుణ్ణి చచ్చేంత అవమానం చేసి విడిచి పెట్టాడు" అన్నాడు.

కుంభకర్ణుడికి పట్టలేనంత కోపం వొచ్చేసింది. "అలాగా? ఆ రఘు వంశం వాడు అంత ఘనుడా? సరే! వాడి అంతు తేల్చింతర్వాతే అన్న దగ్గిరికి వొస్తాను" అని లేచాడు. (అదీ! పౌరుషం అంటే అలా ఉండాలి.)

"తొందర పడవద్దు కుంభకర్ణా! మంచి చెడ్డలు ఆలోచించి బయల్దేరాలి" అన్నారు లేపిన వాళ్ళు.

కుంభకర్ణుడు 'అలాగే'నని అంగీకరించాడు. స్నానం అదీ చేసి, అలంకారాలు చేసుకుని, రెండు వేల కుండల మద్యం తాగి (కవిగారి ఇంట్లో వున్న పిడతల్లాంటి కుండలు) బయలుదేరాడు.

కుంభకర్ణుడు వీధుల్లోంచి నడుస్తూంటే సూర్యుళ్ళాగ ప్రకాశించాడు. (అప్పుడు, అసలు సూర్యుడెలా ప్రకా శించాడూ? కాంతి తగ్గిపోయాడా? రాముడి శతృవుల్ని

---

**401.** **యుద్ధ, సర్గ 60, శ్లోకాలు 6 .... 13:** రాముడు తనని చంపటానికే పుట్టాడని రావణుడు ఒప్పుకుంటున్నాడు. తనని శపించిన వారి శాపాలన్నీ నిజం అవుతాయనే నమ్ముతున్నాడు. రుషుల మాటలన్నీ సత్యం అంటున్నాడు.

ఇదివరకు అయితే, విభీషణుడో, మాల్యవంతుడో, ఇంకొకడో రావణుడితో, 'నీకు మూడుతుంది' అన్నారు గానీ, ఇప్పుడు రావణుడే, తనకు తనే, 'నాకు మూడుతుంది, నన్ను చంపేవాడు శ్రీరాముడే' అని చెప్పుకుంటున్నాడు! పోనీ, అలా చెప్పుకునే వాడు, యుద్ధం మానెయ్యాలి గదా? యుద్ధం చేస్తూనే వున్నాడు! రావణుడి పాత్ర చిత్రణ ఇంత అస్తవ్యస్తంగా వుంటుంది! ★

కూడా కవి, సూర్యుళ్ళనీ చంద్రుళ్ళనీ వర్ణిస్తూ వుంటాడు, ఎందుకంటే, అంత గొప్ప గొప్ప వాళ్ళని కూడా రాముడు జయించేశాడంటే అది రాముడికి కీర్తి కదా?)

పర్వతంలాగ నడుస్తూన్న కుంభకర్ణుణ్ణి దూరం నించి చూసి వానరులు కొందరు స్పృహ దప్పి పడి పోయారు. కొందరు రాముణ్ణి శరణు కోరారు. రాముడు అందరికీ అభయం ఇచ్చాడు. లంక వీధుల్లో నడుస్తోన్న కుంభకర్ణుణ్ణి ఆశ్చర్యంగా చూస్తూ, రాముడు విభీషణుణ్ణి అడిగాడు. "విభీషణా! అత నెవరు? అంత ఎత్తు వీరుణ్ణి నే నెప్పుడూ చూడలేదే! (మరేంటనుకున్నావు? ఇంకా నువ్వు చూడని ఎత్తైత్తు వీరు లెంతమంది వున్నారో నీకేం తెలుసు? ఇప్పటికైనా, 'నేను ఇంతవాణ్ణి, అంతవాణ్ణి' అనే గర్వం తగ్గించుకో!) అతని గురించి వివరంగా చెప్పు!" అన్నాడు.

విభీషణుడు కుంభకర్ణుణ్ణి గురించి అంతా చెప్పాడు. "వాడు కుంభకర్ణుడు. విశ్వవసు కొడుకు. ('మా అన్న' అనడం నామోషీ గావున్ను.) మహా పరా క్రమశాలి. దేవతలందర్నీ జయించాడు. పుట్టినప్పుడే లోకాలన్నీ తినెయ్యడం మొదలుపెట్టాడని బ్రహ్మ కోపంతో, 'నువ్వు అందర్నీ బాధిస్తున్నావు. ఎప్పుడూ చచ్చినట్టు పడివుండు' అని శపించాడు. అప్పుడు రావణుడు బ్రహ్మని ప్రార్థించాడు – తన తమ్ముణ్ణి ఎప్పుడూ పడివుండేటట్టు చెయ్యొద్దని. అప్పుడు బ్రహ్మ తన శాపం కొంచెం మార్చాడు. "కుంభకర్ణుడు ఆరు నెలలు నిద్రపోయి ఒక్క పగలు మాత్రం మెలుకువగా ఉంటాడు. మళ్ళీ ఆరు నెలలు నిద్రపోతాడు" అని. అప్పటినించీ కుంభకర్ణుడు అలాగే నిద్రపోతున్నాడు. ఇప్పుడు అతన్ని రావణుడే యుద్ధం కోసం లేపించాడు.

కుంభకర్ణుణ్ణి చూస్తే వానరులు భయపడి పారి పోతోంటే, విభీషణుడు రాముడికి ఒక ఉపాయం చెప్పాడు. "కుంభకర్ణుడు ప్రాణం ఉన్న రాక్షసుడు కాదనీ, పెద్ద యంత్రం అనీ, వానరులకు చెప్పాలి మనం. లేకపోతే వానరులు యుద్ధరంగంలో నిలబడరు" అన్నాడు విభీషణుడు. (పాలకులు ప్రజలతో ఇలాగే అబద్ధాలు చెపుతారన్నమాట! రాముడు, ఆ అబద్ధానికి ఒప్పుకున్నాడన్నమాట!)

రాముడు నీలుణ్ణి పిల్చి, "మళ్ళీ యుద్ధం జరగబో తోంది. అందరూ సిద్ధంగా వుండేట్టు చెయ్యి!" అని ఆజ్ఞా పించాడు "చిత్తం! అందరూ సిద్ధంగానే ఉన్నారు (పరి గెత్తటానికి)" అన్నాడు నీలుడు.

★ ★ ★

కుంభకర్ణుడు రావణుడి భవనానికి వెళ్ళి సింహాసనం మీద కూర్చున్న అన్నని చూశాడు. (తర్వాత శ్లోకంలో – 'పుష్పక విమానంలో దుఃఖిస్తూ కూర్చున్న అన్నని చూశాడు!')402

కుంభకర్ణుడు అన్నగారి కాళ్ళకు నమస్కారం చేసి, "అన్నా! ఏమిటి సంగతి?" అని అడిగాడు.

రావణుడు చెప్పుకొచ్చాడు – "రాముడు మన బలాలన్నిటినీ నాశనం చేస్తున్నాడు. రాక్షస ప్రముఖులే పోయారు గానీ వానరులెవ్వరూ పోలేదు. ఇది చాలా పెద్ద ఆపద. ఇప్పుడు నువ్వే కాపాడాలి. ఇంతకు పూర్వం నే నెప్పుడూ నీకెలాంటి పనీ అప్పగించలేదు. నువ్వే శత్రుసేనల్ని తరిమికొట్టాలి" అని ప్రాధేయపడ్డాడు.

కుంభకర్ణుడు చాలా అయిష్టంగా ప్రారంభించాడు. "సీతని ఎత్తుకు రావడంవల్ల ఎంత హాని కలుగుతుందో ఆలోచించలేదు నువ్వు. నువ్వు చేసిన తెలివి తక్కువ పనికే ఇలాంటి ఫలితం కలిగింది. ఇప్పుడు ఎంత ఆలోచించి ఏం లాభం? ఐశ్వర్యం గల వాడెప్పుడూ ముందు చెయ్యవలసిన పని వెనకా, వెనక పని ముందూ చేస్తాడు ........" ఈ రకంగా మొదలుపెట్టి కుంభకర్ణుడు మొత్తం ప్రపంచంలో ఉన్న నీతులన్నీ అన్నకి చెప్పాడు. రాజు ఎంత జాగ్రత్తగా ఆలోచించి కార్యాలు చెయ్యాలో, ఏ యే వేళల్లో ధర్మార్థ కామాలు నెరవేర్చుకోవాలో, ముఖ్యంగా కామం ఎప్పుడు అనుభవించాలో, ఎప్పుడు అనుభవించ కూడదో, సామ దాన భేద దండోపాయాలు ఎప్పుడెప్పుడు – ఎవరెవరిమీద – ఎందుకెందుకు – ఎలా ఎలా ప్రయోగించాలో, ఎలాంటి మంత్రుల్ని నమ్మాలో – నమ్మి ఏం చెయ్యాలో, ఏం చేస్తే ఆపదలు రాకుండా వుంటాయో (ఇతన్ని ఎరక్కపోయి లేపించాడే పాపం రావణుడూ! పోయి పడుకోవోయీ! ఈ నీతుల గోలకన్నా ఆ యుద్ధమే వెయ్యి రెట్లు నయం!) చెడ్డ మంత్రుల విషయంలో రాజు ఎలా ప్రవర్తించాలో – అవన్నీ చెప్పి చెప్పి చెప్పి, చివరికి "విభీషణుడు మొదటే

---

**402.** యుద్ధ, సర్గ 62, శ్లోకాలు 4, 6: కుంభకర్ణుడు వెళ్ళేటప్పటికి రావణుడు ఎక్కడ ఉన్నాడు? "అపుడు కుంభకర్ణుడు .... వెలుగుచుండు రావణుని భవనములో ప్రవేశించి దేవేంద్రుడు బ్రహ్మను జూచినటుల, సింహాసనములో కూర్చుండిన అన్నయగు రావణుని దూరములోనే చూచెను."

తర్వాత – "కుంభకర్ణుడు రావణుని గృహములోనికి బోయి కక్ష్యములను దాటి లోపలకు ప్రవేశించి పుష్పక విమానములో భయపడి కూర్చుండిన అన్నని జూచెను."

ఏమిటిది? కట్టు కథల్లో కథా వస్తువూ సవ్యంగా వుండదు, చెప్పే విధానమూ సవ్యంగా వుండదు. ★

చెప్పాడా, సీత నిచ్చెయ్యమని? అదే మంచి పని. అలాగే చెయ్యి!" అన్నాడు.[403]

కుంభకర్ణుడి మాటలన్నీ విని రావణుడు మొహం చిట్లించాడు – "తప్పు చేసిన శిష్యుణ్ణి గురువు మంద లించినట్టు మందలిస్తున్నావు నన్ను. బాగానే వుంది గానీ (గురువు మాటలు ఏ శిష్యుడు వింటాడు గానీ), ఆ సంగతులన్నీ ఇప్పుడెందుకు? అజ్ఞానం చేతో, అహం కారం చేతో, ఏదో ఒక కారణం చేత ఇంత వరకూ తెచ్చుకున్నాం అనుకో. జరిగిందంతా తవ్వి పోసు కోవటం ఎందుకు? (తన పనులన్నీ అజ్ఞానంతోటీ, అహంకారం తోటీ చేసినట్టు రావణుడు ఒప్పేసుకున్న ట్టుగా కవి చిత్రించడం!) ఇప్పుడేం చెయ్యాలో ఆలో చించు! ఆపదలో వున్నవాణ్ణి ఆదుకోవడమే స్నేహం. సమయానికి సహాయం చేసేవాడే బంధువు. నా మీద నీకు ప్రేమే ఉంటే, యుద్ధం కొనసాగించక తప్పదని నీకు తోస్తే, కార్యానికి దిగు. నా అజ్ఞానంతో జరిగిన తప్పుని, నీ పరాక్రమంతో సరిచెయ్యి!" అన్నాడు.

అన్నకి కోపం వచ్చిందనీ, మనసు కష్టపెట్టుకున్నా డనీ గ్రహించి కుంభకర్ణుడు శాంతించాడు. అన్నని ప్రేమగా చూశాడు. "రాక్షస రాజా! హితం చెప్పాలి కాబట్టి చెప్పాను గానీ, నువ్వు దుఃఖ పడుతోంటే నేను చూడలేను సుమా! రాముణ్ణి చంపి నీ దుఃఖం నేను పోగొడతాను. నీకు నేను మంచి మిత్రుణ్ణో కాదో రుజువు చేసుకుంటాను. యుద్ధంలో బంధువులందరూ పోయి దుఃఖిస్తోన్న లంక ప్రజలు, రాముడి మరణం చూసి ఎంతగా ఆనందిస్తారో చూడు!

నా పరాక్రమం నీకు తెలియదా? సూర్యుణ్ణి నక్షత్రాలతో సహా వూడగొట్టేస్తాను. అగ్నిని మింగేస్తాను. సముద్రాల్ని తాగేస్తాను. (అయ్యో, కుంభకర్ణుడూ! ఇలాంటి గొప్పలెందుకు చెప్పు? నువ్వూ రాముడిలాగ మాట్లాడితే ఎలాగోయీ?) రాముడికి సహాయంగా వచ్చిన ఆ సుగ్రీవుణ్ణీ, లంకని తగలబెట్టి వెళ్ళిన హను మంతుణ్ణీ, ఎన్ని తిప్పలు పెడతానో చూడు! నీకేం భయం లేదు. నువ్వు నిశ్చింతగా సుఖాలనుభవిస్తూ వుండు. సీత నీకే దక్కుతుంది" అంటూ అన్నకి ధైర్యం చెప్పాడు.

మహోదరుడు కుంభకర్ణుడి మాటలు విని అతన్ని దుయ్యబట్టడం ప్రారంభించాడు. (ఈ మహోదరుడి మాటలు గందరగోళంగా వుంటాయి. ఇతను ఎవరి పక్షాన మాట్లాడుతున్నాడో అర్థం కాదు. రాముణ్ణీ పొగుడుతాడు, రావణుణ్ణీ పొగుడుతాడు. అంతా గందరగోళం! అన్ని పాత్రలూ గందరగోళమే గానీ, ఇది ఇంకా గందరగోళం!)

మహోదరుడు కుంభకర్ణుడి మీద మండిపడుతూ ఇలా చెప్పుకొచ్చాడు. "కుంభకర్ణా! మంచి జాతిలోనే పుట్టావు గానీ, నీ బుద్ధి నీచమైన బుద్ధి. మహా అహం కారివి. నీతి ఏమిటో నీకే తెలిసినట్టూ, మహారాజుకి తెలియనట్టూ, మాట్లాడుతున్నావు. రాజుకన్నా నీకేం శాస్త్రజ్ఞానం ఏడిసింది? రాజు అన్నీ ఆలోచించుకునే వున్నాడు. ధర్మం, అర్థం, కామం, వేరు వేరు వేళల్లో అనుభవిస్తే మంచి ఫలితాలు కలుగుతాయన్నావు. నీ కెలా తెలుసు? (అస్తమానూ నిద్రే మిదుకుతావు!) ఆ ఫలితాలు ఏ రకంగా ఉంటాయి? (అంటే – ధర్మం, అర్థం, కామం, అనే వాటిని శాస్త్రాల్లో చెప్పినట్టు కాకుండా, దానికి వ్యతిరేకంగా చేసినా, ఏమీ ముంచుకు పోదు; వ్యతిరేక ఫలితాలేమీ కలగవు – అంటున్నాడు. ఇక్కడ ఇలా అన్నాడా? మళ్ళీ తర్వాత ఏమంటున్నాడో చూడండి!)

కుంభకర్ణుడా! ఏ సుఖ దుఃఖాలకైనా కర్మే కారణం. (అంటే, మన పనుల్ని బట్టే సుఖ దుఃఖాలు కలుగుతాయి; కాబట్టి, ఆ పనులన్నీ ధర్మంగా శాస్త్రాల్లో చెప్పినట్టే చెయ్యాలి – అని అర్థం. ఆ తర్వాత కూడా మళ్ళీ ఏమం టున్నాడో చూడండి!)

చెడ్డ పనులకు కూడా మంచి ఫలితాలు కలుగుతూ వుంటాయి. చెడ్డ పనులు చేస్తే ఒక్కోసారి దుఃఖం కలుగు తుందేమో గానీ, ఒక్కోసారి సుఖం కూడా కలుగుతుంది. (అయితే, 'మంచి పని చేస్తే సుఖం, చెడ్డ పని చేస్తే దుః ఖం; మన కష్టసుఖాలకు మన కర్మలే కారణం' అని మొదట అనడం ఎందుకోయీ?)

ఇహ లోక, పర లోకాల కోసం కొన్ని ధర్మాలు ఆచ రిస్తూ వుంటారు పురుషులు. కానీ, అలా ఆచరించక పోయినా, ఎంత అధర్మంగా నడిచినా కూడా, ఏమీ కీడు జరగకుండా సుఖపడుతూనే వున్నారు.

రావణుడు సీతని తెచ్చుకుని తప్పు చేశాడనో, పాపం చేశాడనో, అనటానికి వీలు లేదు. ఆ పాపం

---

**403.** **యుద్ధ, సర్గ 63, శ్లోకాలు 1 .... 22:** కుంభకర్ణుడు రావణుడికి చెప్పిన నీతులన్నీ ఈ శ్లోకాల్లో చూసుకోవచ్చు. రావ ణుడి విషయంలో, కుంభకర్ణుడూ విభీషణుడూ ఒకే రకం వాళ్ళు కారు. అన్న మీద భక్తి గల వాడు కుంభకర్ణుడు. అన్నకి ద్రోహం చెయ్యడానికి పూనుకున్న వాడు విభీషణుడు. అలాంటప్పుడు, ఈ రెండు పాత్రల ప్రవర్తనలకూ, తేడా వుండాలా, అక్కర్లేదా? రావణుణ్ణి విభీషణుడు తిట్టినట్టే కుంభకర్ణుడు కూడా తిడితే, ఇక తేడా ఏమిటి? 'విభీషణుడు చెప్పిందే బాగుంది. అలాగే చెయ్యి' అంటాడా కుంభకర్ణుడు? కవికి ఎంత తాపత్రయం అంటే – కుంభకర్ణుడితో కూడా విభీషణుణ్ణి పొగిడించడమే! ★

ఇలాంటిదని స్పష్టంగా చెప్పడానికి కూడా వీలులేదు.[404] (ఇలా రావణుణ్ణి సమర్థించాడా? తర్వాత రాముణ్ణి పొగుడుతాడు!)

అది సరే! నువ్వు ఒక్కడివే శత్రువులందర్నీ చంపేస్తానంటున్నావు. అవతల శత్రువు ఎంత గొప్పవాడో తెలీకే అలా పేలుతున్నావు. శ్రీరాముడు మహానుభావుడు. జనస్థానంలో పద్నాలుగు వేల మందిని అతడు ఒక్కడే చంపేశాడు. (ఆ రాముడి కంటే కుంభకర్ణుడు బలవంతుడేమో! కాదని నీకెలా తెలుసు? రాముడితో యుద్ధం చేసి కుంభకర్ణుడు ఓడిపోతే ఇతడు రాముడి కన్నా బలవంతుడు కాదని తెలుస్తుంది గానీ, యుద్ధానికి వెళ్ళక ముందే కుంభకర్ణుడి కన్నా శ్రీరాముడే గొప్పవాడని తేలుతుందా?)

రాముడు మహా కోపం గల సింహమని తెలియదు నీకు. నిద్రపోతున్న సర్పాన్ని లేపినట్టు రాముడి మీదకి పోతున్నావు. మహా తేజశ్శాలి రాముడు. మృత్యువుని జయించలేనట్టే రాముణ్ణి ఎవరూ జయించలేరు. రాముడితో యుద్ధం సంగతి ఇక ఆలోచించకు!

యుద్ధం లేకుండా మనం అందరం సుఖంగా వుండటానికి నేనో ఉపాయం చెపుతాను. (ఆ ఉపాయం ఏమిటో చూడండి!)

మహారాజా! సీత, నీ ఆధీనంలోనే ఉంది గదా? ఎప్పుడు కావాలంటే అప్పుడు నీకు వశపడుతుంది. ఎందుకు విచారిస్తావు? (ఎన్ని కుండలు తాగి వచ్చాడో!) మహారాజా! మేము కొంతమందిమి వొంటి నిండా రక్తం పూసుకొని యుద్ధంలో రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ చంపేశామని నీ దగ్గిరికి వొచ్చి చెపు తాము. నువ్వు మాకు మంచి మంచి బహుమానా లియ్యి! (బహుమానాల కోసం అన్నమాట ఈ ఎత్తు!) రామ లక్ష్మణులు చచ్చిపోయారని చాటింపు వేయించు. భర్త పోయాడనుకుని సీత ఇక సుఖపడాలని నీకు వశపడుతుంది. యుద్ధం చెయ్యకుండానే సుఖంగా వుండొచ్చు. ఎలా వుంది నా ఉపాయం?" అన్నాడు. (నీ మొహంలా వుంది నీ ఉపాయం!)

మహోదరుడి మాటలకు, కుంభకర్ణుడు మండిపడ్డాడు. "కురవని మేఘం వ్యర్థంగా ఉరుముతుంది గానీ, శూరులు వ్యర్థంగా గొప్పలు చెప్పుకోరు. పైకి చెప్పకుండానే చెయ్యవలసిన పనులు చేసి చూపిస్తారు. (మీ శూరు లెవ్వరూ అలా లేరు నాయనా! చేసేది తక్కువా, వాగేది ఎక్కువా!)

నీ వంటి పిరికిపందల మాటలు వినడం చేతనే రావణుడికీ గతి పట్టింది. (రావణుడు యుద్ధానికి సిద్ధపడ్డాడే గానీ, యుద్ధం వొద్దనుకోలేదు గదా? పిరికి పందల మాట వినడం ఎక్కడ? ఈ తర్వాత చూడండి! కుంభకర్ణుడు రావణుణ్ణి ఘోరంగా నిందిస్తున్నాడు!) – రావణుడు లంకకు మిత్రుడిగా పైకి కనపడుతున్నాడే గానీ, నిజానికి లంకకు శత్రువే. అందుకే లంక ఇంత దీనస్థితిలోకి వచ్చింది. సైన్యం నశించింది. బొక్కసం నశించింది. ఏదో రాజు వున్నాడనే పేరుకి మాత్రం రాజు మిగిలి వున్నాడు.[405] సరే! ఇంతకాలం లంకకు జరిగిన నష్టమంతా నేను పోగొడతాను. ఇప్పుడే శత్రువుని నాశనం చేసి లంకని రక్షిస్తాను" అన్నాడు.

రావణుడు నవ్వుతూ (కుంభకర్ణుడు తననే తిట్టాడని అర్థం కాలేదు గావున్ను. ఎలా అవుతుందిలే. కుంభకర్ణుడి సంస్కృతం మహా పండితులకే అర్థంగాక రక రకాల అర్థాలు చెప్పారయ్యే!) "కుంభకర్ణా! మహోదరుడు రాముడంటే భయపడి పోతున్నాడులే. నీ వంటి వీరుడెవడూ లేడు. నీ మీద నమ్మకంతోటే నిన్ను నిద్ర లేపించాను. నువ్వు ఇప్పుడే యుద్ధానికి బయల్దేరు. నిన్ను చూస్తే వానరులందరూ పారిపోతారు. రామ లక్ష్మణులు కూడా భయపడి పోతారు" అని తొందర చేశాడు.

కుంభకర్ణుడు శూలం పట్టుకుని, "నాకు సేన అక్కరలేదు. నే వొక్కణ్ణే వెళ్తాను" అంటూ లేచాడు.

"వొద్దు, సేన ఉండడమే మంచిది. వొంటరిగా వెళ్తే

**404.** **యుద్ధ, సర్గ 64, శ్లోకాలు 10 వరకూ:** మహోదరుడు శాస్త్ర నిబంధనల్ని శంకిస్తూ మాట్లాడుతున్నాడు. ఈ సందేహాలన్నీ కవి మనసులో వున్నవే. మనం చేసే కర్మల ప్రకారమే సుఖ దుఃఖాలు కలుగుతాయి అని శాస్త్రాలు చెప్పడమే గానీ, జీవితాల్లో అలా జరగటం లేదు. శాస్త్రాల్లో చెప్పే దానికీ, జీవితాల్లో జరిగే దానికీ సంబంధం లేకపోవడం, కవిని చాలా గందరగోళ పరుస్తోంది. 'ధర్మ శాస్త్రాల్లో చెప్పినట్టు లోకంలో జరగడం లేదే!' అని కవి సందేహం! ఇలాంటి సందేహాల్ని కవి కథలో అక్కడక్కడా దుష్టపాత్రల ద్వారా మాట్లాడిస్తూ ఉంటాడు. కొన్ని సార్లు లక్ష్మణుడి ద్వారా కూడా. ★

**405.** **యుద్ధ, సర్గ 65, శ్లోకం 7:** కుంభకర్ణుడి మాటలు చూడండి! కుంభకర్ణుడు, రావణుణ్ణి పట్టుకుని "నువ్వు లంకకు మిత్రుడిగా కనపడే శత్రువువి" అంటున్నాడు! రావణుడి కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడ్డ కుంభకర్ణుడు అనవలసిన మాటలా ఇవి? ఈ పాత్రని కవి ఇలా చిత్రించడం బాగా లేదు కాబట్టి, కొందరు అనువాదకులు ఈ శ్లోకానికి వేరే అర్థం చెప్పారు – కుంభకర్ణుడు రాజుని గాక, మంత్రుల్ని తిట్టినట్టు! "బొక్కసం, సైన్యం అంతా పాడు చేసేశారు మీరు. రాజుని శత్రువుగా భావించినట్టు ఉన్నారు మీరు" అని మంత్రుల్ని తిట్టినట్టు అర్థం చెప్పారు. కానీ, ఆ శ్లోకానికి ఈ అర్థం పనికిరాదు.

కవి చేసిన తప్పుని దాచాలని ప్రయత్నిస్తే, అది శిష్యులు చేసే తప్పు అవుతుంది! ★

వానరుల పరాక్రమం ముందు నిలబడలేవు. (ఒొంటరిగా వెళ్ళినందుకు నాకు బాగా బుద్ధి వొచ్చింది)" అంటూ లేచి రావణుడు కుంభకర్ణుడి మెడలో రత్నహారం వేశాడు. భుజాలకు భుజ కీర్తులు పెట్టాడు. (అవి పెట్టు కుంటే భుజాలకు కీర్తి!) వేళ్ళకు ఉంగరాలు తొడిగాడు. చెవులకు కుండలాలు తగిలించాడు (ఈ బరువుల్తో ఇక యుద్ధం చేసినట్టే!) మెడనిండా పూల దండలు వేశాడు. (అయ్యో, ఇందాకటి రత్నాల హారం కనబడుతుందా మరి?)

ఆభరణాలన్నీ పెట్టుకున్న కుంభకర్ణుడు అగ్నిలాగ వెలిగిపోయాడు. (ఆభరణాలు పెట్టుకుంటే అగ్నుల్లాగ వెలిగిపోతారు! ఆ గొప్ప ఆభరణాలదే గానీ పెట్టుకున్న వాళ్ళది కాదు!)

తర్వాత కుంభకర్ణుడు గొప్ప కవచం తొడుక్కు న్నాడు. (అయ్యయ్యో, ఇంక నగలేం కనపడతాయి?) ఆ కవచాన్ని ఏ ఆయుధాలూ ఛేదించలేవు. (రామ బాణాలు తప్ప!)

కుంభకర్ణుడు మహోత్సాహంతో యుద్ధానికి బయల్దేరాడు. 600 ధనుస్సుల ఎత్తూ, 100 ధనుస్సుల వెడల్పూ, బండి చక్రాలంతంత కళ్ళూ, మహా పర్వతం లాగ వున్నాడు. (ఒక ధనుస్సు ఎత్తు అంటే ఒక మనిషి ఎత్తు. కుంభకర్ణుడు 600 మంది మనుషుల ఎత్తూ, 100 మంది మనుషుల వెడల్పూ!)

కుంభకర్ణుణ్ణి రావణుడు ఆశీర్వదించాడు. (నాకు జయం కలగలేదు గానీ, నీకు కలుగు గాక అనా?)

కుంభకర్ణుడు చతురంగ బలాలతో బయల్దేరాడు. (అమ్మయ్య! ఇప్పటికి కదిలాడు!)

సర్పాలూ, సింహాలూ, ఒంటెలూ, లేళ్ళూ, జింకలూ కూడా అతన్ని అనుసరించాయి. (సర్పాల్నీ, సింహాల్నీ, జింకల్నీ, ఒంటెల్నీ కూడా వాహనాలుగా చేసుకుని, సైనికులు కుంభకర్ణుడి వెంట వెళ్ళినట్టుగా అర్థం చేసు కోవాలని కొందరు అనువాదకులు చెపుతున్నారు. సరే! అలాగే చేసుకుందాం అర్థం!)

కుంభకర్ణుడు ముందుకు సాగుతూ, "వానరులు మనకేమీ అపకారం చెయ్యలేదు. రామలక్ష్మణులే మన శతృవులు. వారినే చంపేస్తాను" అన్నాడు.

(ఇందాకే గదా సుగ్రీవుణ్ణి చంపుతాను, హను మంతుణ్ణి చంపుతాను - అన్నదీ? వానరులేమీ అప కారం చెయ్యలేదా? హనుమంతుడు లంకని తగల బెట్టడం మాటేమిటి? ఈ మతి మరుపు, కుంభ కర్ణుడిదా, కవిగారిదా?)

దారిలో నక్కలు కూశాయి. సూర్యకాంతి తగ్గి పోయింది. గాలి పరుషంగా వీచింది. కుంభకర్ణుడి ఎడమ కన్ను అదిరింది. అతని నెత్తి మీద గద్ద వాలింది. తోకచుక్క ఒొకటి ఒొచ్చి అతని కాళ్ళ దగ్గిర పడింది. అయినప్పటికీ కుంభకర్ణుడు ధైర్యంగానే యుద్ధ రంగానికి వెళ్ళాడు.

కుంభకర్ణుణ్ణి చూసి వానరులు పారిపోవటం మొదలుపెట్టారు. కుంభకర్ణుడు సింహనాదాలు చేసి వాళ్ళని మరీ మరీ చెదరగొట్టాడు. వానరులు పారి పోతోంటే అంగదుడు కోపంగా అరిచాడు–"మీ రెంతెంత పరా క్రమవంతులో, ఎంతెంత గొప్ప వంశస్థులో అంతా మరిచిపోయి సామాన్యమైన కోతుల్లాగ ప్రవర్తిస్తున్నా రేమిటి? (వెధవ కోతి వేషాలూ మీరూనూ) ప్రాణాలు దక్కించుకుని పారిపోతారా? (మరేం చెయ్యమన్నావు? నువ్వు గూడా పరిగెత్తు. బతికుంటే బలుసాకు తినొొచ్చు.) ఆ పెద్ద ఆకారం యుద్ధం చేసే రాక్షసుడు కాదు. ఊరికే భయపెట్టే బొమ్మ మాత్రమే. మన పరాక్రమంతో దాన్ని నాశనం చేసెయ్యవచ్చు. రండి, వెనక్కి రండి" అని అరి చాడు. (వద్దు, రావద్దు! అంగదుడు రాముడికి బంటుగా మారి అబద్ధాలు చెప్తున్నాడు. నమ్మకండి, వెళ్ళిపోండి!)

వానరులందరూ వెనక్కి వచ్చారు. కుంభకర్ణుడి మీదకి కొండలూ, చెట్లూ గుప్పించారు.

పూల జల్లులా అయింది కుంభకర్ణుడికి. వానర గుంపుల్ని బాది చంపటం మొదలుపెట్టాడు. (ఇప్పుడు తెలిసిందా వానరులూ, అంగదుడి అబద్ధాల నిజం?)

వానరులు మళ్ళీ పరుగులు లంకించుకున్నారు. (అదీ! అదే మంచిది!)

అంగదుడు మళ్ళీ అరుపులు లంకించుకున్నాడు. "నించోండి, వెళ్ళకండి! వెనక్కి రండి! (చాల్లే, నోరు ముయ్యి! నువ్వు చెడ్డది గాక వాళ్ళనెందుకు చెడగొడ తావు?) ఇంత పిరికిపందలైపోతే మీ రెక్కడికి వెళ్ళినా సుఖం వుండదు. రండి, యుద్ధం చెయ్యండి! ప్రాణాలే ముఖ్యమనుకుని పారిపోవడం నీచుల లక్షణం. (ప్రాణాల కన్నా రాజుల సేవే ముఖ్యం అనుకోవాలా?) యుద్ధం నించి పారిపోయిన వారిని భార్యలు కూడా పరిహసి స్తారు. (అయితే, ఆ భార్యల్ని వెళ్ళమనండి యుద్ధానికి!) అంతకన్నా మరణం ఏం వుంటుంది? దానికన్నా యుద్ధంలో మరణించడమే కీర్తి. పది మంది మధ్యా ప్రగల్భాలు పల్కుతారే! గొప్పలు చెప్పుకుంటారే! అన్నీ ఏమైపోయాయి? పిరికిపందల్ని చూసి లోకం నవ్వు తుంది. నలుగురూ నిర్లక్ష్యంగా చూస్తారు. అందుకే మహావీరుల మార్గంలో నడవాలి. రండి, వెనక్కి రండి! (వెనక్కి తిరగ్గూడదు! తప్పు, వెళ్ళిపోండి!)

కుంభకర్ణుణ్ణి చంపగలిగితే మనకే కీర్తి. మనమే చచ్చిపోతే ఎవ్వరికీ దొరకని బ్రహ్మలోకం దొరుకుతుంది. పారిపోవటం ఎంత అపకీర్తో ఆలోచించండి! రాముడుండగా కుంభకర్ణుడు తప్పించుకోగలడా?" అని అంగదుడు అరుస్తూనే వున్నాడు. (రాముడున్నప్పుడు ఇక సైనికు లెందుకూ? ఆ పని రాముణ్ణే చేసుకోమనూ!)

వానరులు అంగదుడి అరుపులు పట్టించుకోకుండా "కుంభకర్ణుడు మమ్మల్ని చంపేస్తాడు. మాకు ప్రాణాలే ముఖ్యం!" అంటూ పిక్కబలం చూపిస్తున్నారు.

అంగదుడు అరిచి అరిచి, స్వర్గంలో ఎన్ని రకాల మద్యాలుంటాయో, ఎందరు వేశ్యలుంటారో కూడా వర్ణించి వర్ణించి చివరికి అందర్నీ వెనక్కి తీసు కొచ్చాడు. (గడుసు వాళ్ళెక్కడో దాక్కునే వుంటారు.)[406]

వానరులందరూ ఎలాగూ చావు తప్పదని వీరోచితంగా పోట్లాటకు దిగారు. (వీరోచితంగా పోట్లాడకపోతే రంభ దొరకదేమోనని భయం!)

కుంభకర్ణుడు వానరుల్ని కొండంత గదతో మోది, ఒక్కో దెబ్బకి నూరేసి నూరేసి మందినీ, ఒక్కో దెబ్బకి ఏడేసి ఎనిమిదేసి వేల మందినీ చావ గొడుతున్నాడు. పదహారేసి మందినీ, పద్దెనిమిదేసి మందినీ నోట్లో పెట్టుకుని మింగేస్తున్నాడు. (అదేనా వానరులు చేరే బ్రహ్మలోకం? మరి శ్రీరాముల వారేం చేస్తున్నారు? తన సైనికులు చచ్చిపోతోంటే, వారు ఎక్కడ దాక్కున్నారు?)

హనుమంతుడు కుంభకర్ణుడి మీద కొండలూ, చెట్లూ, గుప్పించాడు. కుంభకర్ణుడు ఆ రాళ్ళన్నీ అవతల పారేసి, ఆ చెట్లన్నీ చీపురు పుల్లల్ని విరిచినట్టు విరిచేసి ఎగరేశాడు. హనుమంతుడు ఈ సారి ఇంకా పెద్ద పర్వతం తెచ్చి విసిరాడు. కుంభకర్ణుడికి కోపం వొచ్చి (రాదా మరి?) శూలంతో హనుమంతుడి గుండెల్లో పొడిచాడు. హనుమంతుడు ఆర్తనాదం చేస్తూ పడిపోయి రక్తం కక్కి మూర్ఛపోయాడు. హనుమంతుడు పడిపోవటం చూసి రాక్షసులు ఆనందంతో కేకలేశారు. (ఆకాశంలో మాత్రం కిక్కురుమనలేదు!)

అప్పుడు నీలుడు వొచ్చి కుంభకర్ణుడి మీద పెద్ద కొండ విసిరాడు. (అబ్బ! ఎప్పుడూ పాత యుద్ధమే. విసుగొస్తోంది. ఆ రాముడు దిగడేం యుద్ధానికి?)

ఆ కొండని కుంభకర్ణుడు .... పిండి (తెలుసుగా?) పిండి చేసేసి నీలుణ్ణి కింద పడేసి మోకాళ్ళతో కుమ్మాడు. శరభుణ్ణి పిడికిలితో పొడిచాడు. గవాక్షుణ్ణి అరిచేత్తో చరిచాడు. గంధమాధనుణ్ణి వొక్క తన్ను తన్నాడు.

అందరూ మూర్ఛలు పడిపోయారు. (మూర్ఛలేనా? మళ్ళీ లేస్తారా అయితే?)

వానర సైనికులందరూ కోపంతో కుంభకర్ణుడి మీద ఎక్కి గంతులేశారు (కొండ ఎక్కిన పిల్లల్లాగ.)

కుంభకర్ణుడు, భుజాలమీద వాళ్ళనీ, తలమీద వాళ్ళనీ గుప్పిళ్ళతో పట్టుకుని నోట్లో పోసుకుని (అటు

---

**406.** **యుద్ధ, సర్గ 66, శ్లోకాలు 18 .... 32:** పారిపోతున్న సైనికులతో అంగదు డేమంటున్నాడో చూడండి! "వానరులారా! నిలవండి. తిరిగి రండి! పౌరుష హీనులారా! ప్రాణములు రక్షించుకొనుటకు పారిపోవుట తగదు. (మీ ప్రాణాలు రక్షించుకోవడం తప్పు. మీ ప్రాణాలు ఇచ్చేసి రాజుల ప్రాణాలు రక్షించండి! అదే చాలా ఒప్పు.) పోరు విడిచి పారిపోయి జీవించియుండు వారిని భార్యలు కూడా పరిహసించెదరు. అదియే పారిపోవు వారికి మరణము." (భార్యలు క్షుద్రులు కదా? అంత క్షుద్రులు పరిహసిస్తే, పురుషుడికి ఎంత అవమానం! ఆ అవమానం కన్నా యుద్ధంలో చావు ఎంత గొప్పది! సైనికుణ్ణి యుద్ధంలో నిలబెట్టడానికే, అతన్ని స్త్రీ కన్నా అధికుణ్ణి చెయ్యడం. సైనికుడు స్త్రీ కన్నా అధికుడై ఆ ఆధిక్యతతో తన కోసం ఏం లాభం పొందుతాడు? తన కోసం కాదు, తనని పాలించే వారికోసం ఉపయోగపడతాడు. వారి కోసం ప్రాణాలిచ్చేస్తాడు.

అంగదుడింకా ఏమంటున్నాడో చూడండి. "వానరులారా! భయపడి పారిపోవుచుండు మీరు వట్టి నీచులేను."

(అనార్యః – అన్నాడు కవి.)

"పిరికి వారిని గురించి లోకములో నిందితమైన మాటలు చెప్పుదురు." (లోక భీతి కలిగించడం. యుద్ధం నుంచి పారిపోతే ఆ పనిని పిరికితనంగా విలువ కట్టడం!) "కుంభకర్ణుని, మనము చంపినటులైతే మనకు గొప్ప కీర్తి. లేదా, మన ప్రాణాలు పోయినటులైతే, వాటిని మూల్యంగా ఇచ్చి బ్రహ్మలోకము పొందెదము" – సైనికుల్ని వంచించడానికి ఎన్ని మార్గాలో చూశారా? వారికై వారే యుద్ధంలో దూకేటట్టుగా చేసే మార్గాలు!

ఇన్ని చేసినా సైనికులు ఏమంటున్నారో చూడండి! ".... వానరులు పారిపోవుచూ, శూరులకు నిందితమగు మాటలు (శూరులకు పనికిరాని మాటలు) ఇటుల చెప్పిరి – కుంభకుర్ణుడు మమ్ము ఛిన్నాభిన్నముగ వధించుచున్నాడు. నిలుచుటకిది సమయము కాదు. ప్రాణమే మాకు ముఖ్యముగ నున్నది అని చెప్పిరి."

సైనికులెప్పుడూ ప్రాణాలు పోగొట్టుకోటానికి ఇష్టపడరనీ, బ్రతకడానికే ఆశ పడతారనీ, యుద్ధాల నించి పారిపోతూ వుంటారనీ (బ్రహ్మ లోకాల్నీ, ఇంద్రలోకాల్నీ ఎగరదన్ని!) కవికి తెలుసు. అందుకే అనేక సార్లు రాక్షస సైనికులూ, వానర సైనికులూ కూడా పారిపోతూ వుంటారు. రాముడి కోసం తన ప్రాణాలివ్వడం ఏ వానర సైనికుడికీ ఇష్టం లేదు. అంగదుడు లాంటి వాళ్ళు సాధారణ సైనికులు కారు. వాళ్ళు ప్రాణాలిచ్చే అవసరం రాదు.

★

కులు పోసుకున్నట్టు) మింగడం మొదలెట్టాడు.

కొందరు వానరులు కుంభకర్ణుడి ముక్కుల్లోంచీ, చెవుల్లోంచీ బయటికి దూకి పరుగులు లంకించుకుంటు న్నారు. (కవిగారికి, చంటి పిల్లలకు కథలు చెప్పే అలవాటు బాగా వున్నట్టుంది. అదే ఈ రామాయణ రచనకు పురికొల్పినట్టుంది!)

కుంభకర్ణుడు వానరుల మీద పడి చంపేస్తోంటే, వాళ్ళందరూ అనాథలలాగ ఏడ్చారు. (ఏం? అసలైన 'నాథుడే'మయ్యాడూ? మళ్ళీ విరహంలో మునిగాడా?)

వానరులందరూ రాముణ్ణి శరణు కోరారు. అంగదుడు వొచ్చి (రాముణ్ణి శరణు కోరితే అంగదుడు రావడం ఏమిటి?) కుంభకర్ణుడి మీదకి కొండ శిఖరం విసిరాడు. కుంభకర్ణుడు శూలం విసిరాడు. అంగదుడు నేర్పుగా తప్పుకుని, ఎగిరి కుంభకర్ణుడి గుండెల మీద చేత్తో గుద్దాడు. కుంభకర్ణుడు మూర్ఛ బోయి (కవిగారికి కూడా విసుగొచ్చింది. కుంభ కర్ణుడు మూర్ఛపోయినట్టు, కథ కొంచెం మార్చారు) వెంటనే లేచి అంగదుణ్ణి పిడికిలితో పొడిచాడు.

అంగదుడు మూర్ఛపోయాడు. (చాలులే మూర్ఛ. లే, మళ్ళీ నువ్వు కొట్టాలి.)

కుంభకర్ణుడు కొందరు వానరుల్ని గుప్పిటితో తీసు కుని వొక్కొక్కళ్ళనీ, నోట్లో పడేసుకుని జీడీలు మింగినట్టు మళ్ళీ మింగడం మొదలుపెట్టాడు.

(ఊరికే పడేసుకుంటే చెవుల్లోంచీ, ముక్కుల్లోంచీ పారిపోతారు కుంభకర్ణుడూ! చప్పరించడం తెలివైన పని! లేకపోతే, పళ్ళకింద నొక్కు!)

సుగ్రీవుడు కుంభకర్ణుడి మీద కోపంగా, "ఆ సామాన్యుల మీద ఎందుకు చూపిస్తావు నీ పరా క్రమం? (ఈ అసామాన్యుడి మీద చూపించు!) ఇదుగో! కొండ విసురుతున్నాను, కాచుకో" అని అరిచి కొండ విసిరి తప్పుకున్నాడు. (అది వొచ్చి తన మీదే పడుతుందేమో నని.)

"ఓహో! సుగ్రీవుడివి నువ్వేనా? ఏంటీ రంకె లేస్తు న్నావు?" అంటూ కుంభకర్ణుడు ఆ కొండని పిండి చేసేసి, ఇంకో జీడీ తీసి నోట్లో పడేసుకుని, తన చేతిలో శూలం సుగ్రీవుడి మీదికి విసిరాడు. ఆ శూలం, వెయ్యి భారాల ఇనుముతో తయారైంది. హనుమంతుడు వొక్క వూపుతో పైకెగిరి ఆ శూలం అందుకుని మోకాలి కింద పెట్టి విరిచి అవతల పారేశాడు. కుంభకర్ణుడు కోపంతో పెద్ద కొండ తెచ్చి సుగ్రీవుడి మీద గిరాటేశాడు. సుగ్రీ వుడు స్పృహ తప్పి కింద పడిపోయాడు. (యుద్ధం ఇప్పుడు బాగుంది!)

కుంభకర్ణుడు అతన్ని ఎత్తి చంకలో ఇరికించుకుని లంకలోకి పరిగెత్తాడు.

ఆకాశంలో దేవతలు కలవరపడ్డారు. (మీరింకా వున్నారూ? కుంభకర్ణుణ్ణి పట్టుకుని సుగ్రీవుణ్ణి విడిపించ రాదూ? మీ వల్ల కాదా? మీరేం దేవతలు, మీ మొహం దేవతలు! పొండి అవతలకి! మీ మొహాలు చూస్తేనే రోత పుడుతోంది.)

హనుమంతుడు – "నేను సుగ్రీవుణ్ణి రక్షించగలను గానీ, నేను రక్షిస్తే సుగ్రీవుడికి అవమానం కదా? తనను తనే రక్షించుకో గలడులే! (నాకెందు కొచ్చిన గోల?)" అని ఊరుకున్నాడు.

కుంభకర్ణుడు లంకలో నడుస్తోంటే అక్కడి ప్రజలు ఆనందంతో అతని వీపు మీద పరిమళాలు జల్లారు. అవి సుగ్రీవుడి మీద పడి సుగ్రీవుడికి మెలు కువ వొచ్చేసింది. (అయ్యయ్యో, ఎంత పిచ్చి పని చేశారు లంకలో వాళ్ళు! సరేలే, లేచి కుంభకర్ణుడి చంక వంక చూస్తే మళ్ళీ స్పృహ తప్పి ఉంటుందిలే) సుగ్రీవుడు కొంచెం ఆలోచించి గోళ్ళతో కుంభకర్ణుడి చెవులు గిల్లేసి, పళ్ళతో ముక్కు కొరికేసి, డొక్కలు చీరేశాడు. కుంభకర్ణుడు సుగ్రీవుణ్ణి నలిపి కింద పడేశాడు. సుగ్రీవుడు చక్కగా ఎగిరి రాముడి దగ్గరికి వెళ్ళిపోయాడు.

కుంభకర్ణుడు మళ్ళీ వెనక్కి పరిగెత్తుకు వొచ్చి యుద్ధరంగంలో వానరుల్ని తరిమి తరిమి పట్టుకుని వందేసి మందిని, ఏడేసి మందిని, ఇరవయ్యేసి మందిని, తినెయ్యడం మొదలుపెట్టాడు.

వానరులు రాముణ్ణి శరణు కోరారు మళ్ళీ. (లాభం లేదు. అతనేం చెయ్యలేడు.)

లక్ష్మణుడు కుంభకర్ణుడి మీద ఏడు బాణాలు కొట్టి, మళ్ళీ కొన్ని బాణాలు కొట్టాడు. (చూశారా? రాముణ్ణి శరణు కోరితే లక్ష్మణుడు వెళ్ళాడు!)

కుంభకర్ణుడు లక్ష్మణుణ్ణి లక్ష్యపెట్టకుండా రాముడి వేపు పరిగెత్తాడు. రాముడు రౌద్రాస్త్రం వేశాడు (అబ ద్ధాస్త్రం లేదా?) కుంభకర్ణుడు కోపం పట్టలేక కొండ తెచ్చి విసిరాడు. రెండు వందల మందిని చంపబోయిన ఆ కొండని రాముడు పిండి పిండి చేసేశాడు. అప్పుడు లక్ష్మణుడు "రామా! వానరులందరూ కుంభకర్ణుడి మీద ఎక్కితే ఆ బరువుకి వాడు కిందపడిపోతాడు, అప్పుడు చంపెయ్య వొచ్చును" అని ఉపాయం చెప్పాడు. (ఉపాయం అపాయం అవుతుందేమో చూడు.)

వానరులందరూ కుంభకర్ణుడి మీద ఎక్కారు. కుంభకర్ణుడు వొక్కసారి వొళ్ళు విదిలించాడు. వీరాధి వీరులందరూ ఎక్కడెక్కడికో పోయి పడ్డారు.

రాముడు కోపంగా ధనుస్సు ఎత్తి, "నేను స్వయంగా వచ్చాను యుద్ధానికి! (ఆహా! ఎంత తొందరగా వొచ్చావూ!) ఇక నువ్వు ఎంతోసేపు నిలబడలేవు" అన్నాడు. (అయితే నువ్వు మొదట్లోనే వొస్తే అంతమంది

వానరులు మృత్యువాత పడేవాళ్ళు కారు గదా?)[407]

కుంభకర్ణుడు వెటకారంగా నవ్వాడు. (మా బాగా నవ్వావోయీ!) – "నువ్వా రాముడివి? నన్ను విరాధుడో, కబంధుడో, వాలో అనుకుంటున్నావా? నేను ఎవరో తెలుసా? కుంభకర్ణుణ్ణి! నీ పరాక్రమం ఏమిటో చూపించు, చూస్తాను" అని మళ్ళీ నవ్వాడు. (మళ్ళీ మా బాగా నవ్వావోయీ!)

సప్త సాల వృక్షాల్ని ఛేదించిన బాణంవంటి బాణంతో, వాలిని చంపిన బాణంవంటి బాణంతో, రాముడు కుంభకర్ణుణ్ణి కొట్టాడు. ఆ మహా బాణం కుంభకర్ణుడి శరీరానికి నీటి జల్లులాగ తగిలింది. రాముడు ఎన్ని బాణాలు ప్రయోగించినా కుంభ కర్ణుడు తన ఆయుధంతో వాటిని తిప్పి కొట్టేస్తూనే వున్నాడు.

రాముడు వాయవ్యాస్త్రం వేసి కుంభకర్ణుడి చెయ్యి నరికేశాడు. ఆ చెయ్యి కింద పడిపోతూ వేల మంది వానరుల్ని చంపేసింది. కుంభకర్ణుడు రెండో చేత్తో చెట్టుని పెళ్ళగించి రాముడి మీదకు విసిరాడు. రాముడు ఆ చెయ్యి కూడా బాణాలతో నరికేశాడు. తర్వాత పాదాలు నరికేశాడు. అయినా కుంభకర్ణుడు రాముణ్ణి మింగటానికి నోరు తెరుచుకొని పరుగెత్తుకుంటూ వొచ్చాడు. రాముడు కుంభకర్ణుడి నోటి నిండా బాణాలు కొట్టాడు. కుంభకర్ణుడు కింద పడిపోయాడు. రాముడు మళ్ళీ ఇంద్రాస్త్రం వేశాడు. అది కుంభకర్ణుడి తల నరికేసింది. దాంతో కుంభ కర్ణుడి మరణం పూర్తి అయింది.

ఆకాశంలో దేవతలందరూ శ్రీరాముణ్ణి శ్లాఘించి పూజించారు.

★ ★ ★

కుంభకర్ణుడు పోయాడని విని రావణుడు మూర్ఛ పోయాడు. కుంభకర్ణుడి బంధువులందరూ దుఃఖించారు.

రావణుడు మూర్ఛ లేచి శోకం ప్రారంభించాడు – "అయ్యో! కుంభకర్ణుడా! తమ్ముడా! ఇంతకాలం నాకు కుడి భుజంగా వున్నావు. నిన్ను నమ్మి నేను ఎంతో ధైర్యంగా వున్నాను. నీ వంటి మహావీరుణ్ణి రాముడెలా చంపగలిగాడు? నువ్వు లేకపోతే నాకు రాజ్యమెందుకు? సీత ఎందుకు? నా ప్రాణాలెందుకు? విభీషణుడు చెప్పినట్టే జరిగింది అంతా. అతడు చెప్పినట్టు వినలేదు నేను. పైగా అంత ఉత్తముణ్ణి రాజ్యం నించి తరిమేశాను. ఆ పాపమే నన్నిలా కట్టికుడుపుతోంది. నా తమ్ముణ్ణి చంపిన రాముణ్ణి నేను చంపకపోతే నే నిక బ్రతకటం వ్యర్థమే. నేనిప్పుడే యుద్ధ రంగానికి వెళతాను" అంటూ పరి పరి విధాల దుఃఖించాడు.[408]

త్రిశిరస్సు, రావణుడి కొడుకు. అతనికి మూడు తలలు. అతను తండ్రితో, "మహారాజా! సామాన్యుడి వలే దుఃఖిస్తావెందుకు? నువ్వు ముల్లోకాలూ అవ లీలగా జయించగలవు. రాముణ్ణి చంపటానికి నీ అంతటివాడు కావాలా? నేను వెళ్తాను" అన్నాడు.

నరాంతకుడు, దేవాంతకుడు, అతికాయుడు కూడా రావణుడి కొడుకులే. వారు కూడా యుద్ధానికి సిద్ధ మయ్యారు. (బోలెడు మంది భార్యలు వుంటే ఇదే లాభం! బోలెడు మంది కొడుకులు వుంటారు.)

రావణుడు సంతోషించి, మత్తుడూ, యుద్ధోన్మత్తుడూ అనే తమ్ముళ్ళని కూడా యుద్ధానికి వెళ్ళమన్నాడు.

ఆ ఆరుగురూ సేనలతో బయల్దేరారు. (ఈ సారి అప శకునాలు కనపడలేదు. అస్తమానూ శకునాల్ని వర్ణించడం బాగుండదనుకున్నా రేమో!)

యుద్ధం ప్రారంభమయింది. ఎప్పటిలాగే మొదట్లో రాక్షసులే విజృంభించి యుద్ధం చేశారు.

వానరులు పర్వతాలూ, చెట్లూ విసరడం; రాక్షసులు వాటిని పిండి .... పిండి చేసెయ్యడం! ఆర్త నాదాలూ సింహ నాదాలూ; నెత్తురు కాలవలూ; తిట్లూ కేకలూ, ఆకాశంలో దేవతల సంతోషాలూ – అంతా మామూలే! బొత్తిగా పాత యుద్ధమే!

ఆ రకంగా కొంతసేపు జరిగింతర్వాత అంగదుడు

---

**407.** కుంభకర్ణుడు యుద్ధరంగానికి వచ్చిం తర్వాత, రాముడు యుద్ధానికి ఎప్పటికి దిగాడో చూడండి! అప్పటికి కుంభకర్ణుడు ఎంతమంది వీరులతో యుద్ధం చేశాడో లెక్కపెట్టండి. హనుమంతుడితో చేశాడు. నీలుడితో చేశాడు. అంగదుడితో చేశాడు. సుగ్రీవుడితో చేశాడు. మళ్ళీ హనుమంతుడితో చేశాడు. లక్ష్మణుడితో చేశాడు – ఇంతమంది వీరులతోనే గాక వేలకొద్దీ సైనికులతో చేశాడు. ఇంత యుద్ధం జరిగిపోయిం తర్వాత, కుంభకర్ణుడి చెవులూ ముక్కులూ డొక్కలూ పోయి మూర్ఛపోయి అలసిపోయిం తర్వాత, అప్పుడు మన వీరుడు యుద్ధానికి దిగాడు. కుంభకర్ణుడు ఎంత తొందరగా ఓడిపోతాడో చూడండి! శ్రీరాముడు దిగింతర్వాత శత్రువు ఎంతోసేపు బతికి ఉండకూడదు కదా? ★

**408.** యుద్ధ, సర్గ 68, శ్లోకాలు 21, 23: కుంభకర్ణుడు పోయిన తర్వాత కూడా రావణుడు యుద్ధం మానుకోలేదు. యుద్ధంలో శత్రువుని ఓడించాలనీ, శత్రువుని చంపెయ్యాలనీ, ఆశ పడుతున్నాడు. అలాంటి రావణుడు, ఎలా మాట్లాడుతున్నాడో చూడండి! "మహాత్ముడగు విభీషణుని మాట నేను అజ్ఞానముచే (అజ్ఞానాత్ = అజ్ఞానము వలన) వినకపోతిని. ధర్మాత్ముడగు విభీషణుని నేను తరిమి వేసితిని. అట్టి పాప కార్యమే నాకు దుఃఖము కలిగించునటుల ఇట్లు ఫలించినది." కవి, ఇంత కాలమూ విభీషణుణ్ణి ఇతర రాక్షసులందరి తోటీ పొగిడించాడు. ఇప్పుడు రావణుడితో కూడా పొగిడిస్తున్నాడు! ★

నరాంతకుడి గుర్రాన్ని గోళ్ళతో చీల్చి చంపేశాడు. నరాంతకుడు కోపం పట్టలేక అంగదుణ్ణి పిడికిలితో గుద్దాడు. అంగదుడు మూర్ఛపోయి లేచి (మూర్ఛ ఎంత చవకై పోయిందో!) నరాంతకుణ్ణి గుద్ది చంపేశాడు. నరాంతకుడు పోగానే మిగిలిన రాక్షస యోధులందరూ అంగదుణ్ణి చుట్టుముట్టి యుద్ధం చేశారు. అంగదుడు వీస మెత్తు దెబ్బయినా తగలకుండా ఎవ్వరూ ఊహించలేని చాకచక్యంతో అందర్నీ ఎదుర్కొన్నాడు.

అంతలో హనుమంతుడు వొచ్చి దేవాంతకుణ్ణి గుద్ది చంపేశాడు.

నీలుడు పెద్ద పర్వతం విసిరి మహోదరుణ్ణి ఏనుగుతో సహా కూలగొట్టి చంపేశాడు.

హనుమంతుడు త్రిశిరస్సు గుర్రాల్ని గోళ్ళతో చీల్చి చంపేశాడు. తర్వాత త్రిశిరస్సు కత్తినే దొరక బుచ్చుకుని దాంతో త్రిశిరస్సు తలలు మూడూ నరికేశాడు.

ఆకాశంలో దేవతలు ఆనందించారు. (రాముడి పక్షానికి కలిసి వొచ్చే పని జరిగినప్పుడల్లా ఆకాశంలో మురా ఆనందిస్తుందనీ, లేకపోతే కిక్కురు మనదనీ మీరే గ్రహించుకోండి! అస్తమానూ చెప్పిందే చెప్పిందే చెప్పిందే చెప్పలేను.)

రుషభుడు - మత్తుణ్ణి గదతో మోది చంపేశాడు. గవాక్షుడు - ఉన్మత్తుణ్ణి అరిచేత్తో చరిచి చంపేశాడు.

రాక్షససేన పారిపోవటం మొదలుపెట్టింది. అతికాయుడు కోపంతో రథం ఇటు తిప్పించుకొని వొచ్చాడు. (ఇంతసేపూ ఎటు తిరుగుతున్నాడో మరి?)

రాముడు అతన్ని చూసి ఆశ్చర్యంగా విభీషణుణ్ణి అడిగాడు - "వెయ్యి గుర్రాల రథం మీద వొస్తున్నాడు. నలుగురు సారథులున్నారు. రథంలో ఒక చోట ఇరవయ్యి, ఒక చోట పదీ, ఒక చోట ఎనిమిదీ అంబుల పొదులు వున్నాయి. నాలుగేసి మూరల బంగారం పిడులతో పదేసి మూరల కత్తులు రెండు వున్నాయి. సూర్యుడిలా, చంద్రుడిలా వెలిగిపోతున్నాడే! ఎవరతడు?" అన్నాడు.

"మహా తేజశ్శాలీ, మహోత్సాహవంతుడూ, కుబేరుని తమ్ముడూ, రాక్షసులకు రాజూ అయిన రావణుడి కొడుకు ఇతడు. ధాన్యమాలినికి పుట్టిన వాడు. పేరు అతికాయుడు. తండ్రి అంతటి పరా క్రమవంతుడు. సకల అస్త్ర శస్త్ర విద్యలూ ఎరిగిన వాడు. ఇతనికి దేవతల వల్ల చావు లేదని బ్రహ్మవరం వుంది. ఆ రథం, కవచం బ్రహ్మ ఇచ్చినవే. ఇంద్రుడి వజ్రాయుధం కూడా ఇతని బాణాల ముందు పనికిరాకుండా పోయింది. (నీ బతుకెందుకు ఇంద్రుడూ? ఇన్ని అవమానాలతో ఇంకా బతికి వున్నావా?) ఇతన్ని ఆలశ్యం చెయ్యకుండా తొందరగా చంపెయ్యటం మంచిది" అన్నాడు విభీషణుడు. (ఇతన్ని ఎంత తొందరగా చంపేస్తే నాకు అంత తొందరగా రాజ్యం వొచ్చేస్తుంది.)

వానరు లందరూ అతికాయుణ్ణి ముట్టడించారు. మళ్ళీ యుద్ధం!

పర్వతాలూ, వృక్షాలూ - మళ్ళీ మళ్ళీ ఎగిరాయి. దూకాయి .... పిండి .... పిండి .... పిండి! అతికాయుడికి, ఈ పిండి దంచడం విసుగొచ్చింది. "ఈ చెత్త మొహాలతో ఎంతసేపు యుద్ధం చెయ్యను? ఎవరన్నా ఉత్తములు రండి!" అని కేకలు పెట్టాడు. లక్ష్మణుడు బయల్దేరాడు. (నువ్వెళ్ళ రాదూ రాముడూ? ఉత్తముల్ని రమ్మని పిలుస్తోంటే కదలవేం? ఓహో! నువ్వు ఉత్తముడివి కావు గదా?)

అతికాయుడు లక్ష్మణుణ్ణి చూసి, "నీ మొహంలే. నీకేం తెలుసు యుద్ధం చెయ్యడం? ఫో అవతలికి! (నీ అన్నని రమ్మను.) నా అంత గొప్పవాడితో యుద్ధం చెయ్యటానికి నీ అంత కుర్ర కుంకా?" అని నవ్వాడు.

లక్ష్మణుడు గొప్ప రోషం తెచ్చుకుని, "గొప్ప వాణ్ణని చెప్పుకున్నంత మాత్రాన గొప్ప వాడివై పోవోయీ! నువ్వలా గొప్పలు చెప్పుకోకు. (నేను చెప్పుకుంటాను.) ధనుస్సు ఎత్తానంటే చూడు, ఏం చేస్తానో! నీ తల తాటి పండు పడగొట్టినట్టు పడగొట్టేస్తాను. చిన్నవాడినని పరిహాసిస్తున్నావు. చిన్నవాడైన మహావిష్ణువు తన పాదాలతో ముల్లోకాలూ ఆక్ర మించలేదా?" అన్నాడు.

లక్ష్మణుడి హేతువాదం విని (హేతుమత్ = కారణముతో కూడినది; సహేతుకముగా నున్నది), అతికాయుడికి వొళ్ళు మండిపోయింది. (అవును మరి! మహావిష్ణువుని కీర్తించే హేతువాదం వింటే, వొళ్ళు మండిపోదూ?) లక్ష్మణుడి మీదకి బాణాలు గుప్పించాడు. లక్ష్మణుడు కూడా గుప్పించాడు. ఒకరి బాణాలొకరు ఖండించేసుకున్నారు. ఒక గొప్ప బాణం వొచ్చి అతికాయుడికి గొప్పగా తగిలింది.

లక్ష్మణుడి బాణం తనకు అంత గొప్పగా తగిలినందుకు అతికాయుడు మురిసిపోతూ "ఆహా! ఎంత గొప్ప వీరుడివోయీ!" అని లక్ష్మణుణ్ణి మెచ్చుకుని ఆ బాధ ఓర్చుకోలేక రథాన్ని పట్టుకుని పడిపోకుండా ఎలాగో నిలదొక్కుకున్నాడు.

తర్వాత అతికాయుడు ఎంతెంత గొప్ప బాణాలు వేసినా లక్ష్మణుడు అతి జాగరూకుడై తప్పించుకుంటూనే వున్నాడు. లక్ష్మణుడు ఆగ్నేయాస్త్రం వేశాడు. అతికాయుడు సూర్యాస్త్రం వేసి దాన్ని కొట్టేశాడు. తర్వాత మళ్ళీ ఒకరు ఇషీకాస్త్రం, ఇంకొకరు ఐంద్రాస్త్రం. ఆహా! ఈ రెండు బాణాల యుద్ధం చూసి తీరవలసిందే గానీ

చెప్పనలవి కాదు. తర్వాత మళ్ళీ ఒకరు యామ్యాస్త్రం, ఇంకొకరు వాయవ్యాస్త్రం!

ఆ లోగా లక్ష్మణుడు కాస్సేపు మూర్ఛబోయి లేచి గొప్ప గొప్ప బాణాలు వేసి అతికాయుడి రథాన్నీ, గుర్రాల్నీ, సారథుల్నీ ధ్వంసం చేసేశాడు. (బ్రహ్మ ఇచ్చిన రథమే మరి! ఏ పాత డొక్కు బండి పంపించాడో! బ్రహ్మల్నీ గ్రహ్మల్నీ నమ్మకూడదు.)

ఎంతెంత గొప్ప బాణాలు వేసినా అతికాయుడి కవచం మాత్రం చెక్కు చెదరలేదు. (ఎక్కడ కుట్టించాడో గానీ!)

లక్ష్మణుడి కేం చెయ్యాలో తోచలేదు. (మీ అన్నని పిలవ్వోయ్! ఇంకా రాడేం ఆ వీరుడూ?)

అంతలో గాలిదేవుడు వొచ్చి లక్ష్మణుడి చెవుల్లో, "ఆ కవచం బ్రహ్మ ఇచ్చింది. దాన్ని ఇతర బాణాలతో నాశనం చెయ్యలేవు. (బ్రహ్మ ఇచ్చిన రథాన్ని మాత్రం నాశనం చెయ్యగలవు.) దాని మీద బ్రహ్మాస్త్రమే వెయ్యాలి" అని గుస గుసలాడి వెళ్ళిపోయాడు. (బ్రహ్మకీ, గాలి దేవుడికీ పడదు గావున్ను! ఏం పోట్లాడుకు చచ్చారో!)

లక్ష్మణుడు మహా వీరత్వంతో బ్రహ్మాస్త్రం వొదిలాడు. దాన్ని చూసి అతికాయుడు చాలా భయ పడిపోయాడు. దాన్ని ఎలాగైనా ఆపాలని గద తోటీ, గొడ్డలి తోటీ, శక్తి తోటీ, ఇంకా చాలా ఆయుధాల తోటీ కొట్టి విశ్వ ప్రయత్నాలు చేశాడు. కానీ ఏదీ ఫలించలేదు. బ్రహ్మాస్త్రం వొచ్చి అతికాయుడి శిరస్సు ఖండించేసింది. రాక్షసులు పారిపోయారు. (ఆకాశంలో మందకి ఆనందం!) లక్ష్మణుడు రాముడి దగ్గిరికి వెళ్ళి మళ్ళీ వొంగున్నాడు.

★ ★ ★

అతికాయుడు పోయాడని విని రావణుడు చాలా కోపం తెచ్చుకున్నాడు. "రాక్షసులందర్నీ రాముడు హత మార్చేశాడే! ఆహా! రాముడు ఎంత పరాక్రమవంతుడో! అతడు, ఎన్నటికీ నాశనం లేని శ్రీమన్నారాయణుడే అనుకుంటాను. రాముణ్ణి చంపేవాడు కనపడడం లేదు. లంకనీ, అశోకవనాన్నీ అన్ని వేళలా జాగ్రత్తగా కాపాడుతూ వుండండి!" అని రాక్షసులకు ఆజ్ఞాపించి విచారిస్తూ ఇంటికి వెళ్ళిపోయాడు. (ఇంటి కెందుకోయీ? యుద్ధ రంగానికి వెళ్ళు!)

తర్వాత, రావణుడు, రాక్షస వీరుల మరణాల్ని తల్చుకుంటూ మూర్ఛబోయాడు. (ఇంటికెళ్ళి చేసిన పని ఇదా?)

ఇంద్రజిత్తు తండ్రిని ఓదార్చాడు. "ఇంద్రజిత్తు జీవించి వుండగా నువ్వు మూర్ఛపోవలసిన అగత్యం లేదు. రామలక్ష్మణుల్ని చంపేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. దేవతలు నా పరాక్రమం చూసి నిర్ఘాంతపడి పోతారు చూడు" అని ధైర్యం చెప్పి, తండ్రి ఆశీర్వదించిన తర్వాత కంచర గాడిదల రథంలో యుద్ధానికి బయల్దేరాడు.

అతని వెనక సైన్యం అంతా గుర్రాల మీదా, ఏనుగుల మీదా, వొంటెల మీదా, పందుల మీదా, పులుల మీదా, నెమళ్ళ మీదా, తేళ్ళ మీదా, పాముల మీదా ఎక్కి బయల్దేరారు. (చీమల మీదో?) ఇంద్ర జిత్తు యుద్ధ రంగానికి వచ్చి అగ్నిహోత్రం వెలిగించి నల్ల మేకని బలి ఇచ్చి హోమం చేశాడు. అగ్ని, పొగ లేకుండా ఒక్కసారే భగ్గున మండి, అగ్నిజ్వాలలు ఎడమ నించి కుడికి ప్రదక్షిణంగా తిరిగి, శుభాన్ని సూచించాయి. అగ్నిదేవుడు స్వయంగా వచ్చి హవిస్సు అందుకున్నాడు.

ఇంద్రజిత్తు తన రథాన్నీ, గుర్రాల్నీ, ఆయుధాల్నీ అన్నింటినీ మంత్రించుకుని (రథం బయల్దేరినప్పుడేమో కంచర గాడిదలు! .... ఇక్కడి కొచ్చేప్పటికి గుర్రాలు! ఏం చేస్తాం? పవిత్ర గ్రంథమయ్యే!) రథం ఎక్కి ఆకాశంలోకి ఎగిరి మాయం అయిపోయాడు.

మళ్ళీ యుద్ధం ప్రారంభం! మళ్ళీ కొండల వర్షం! పిండి వర్షం! చెట్ల వర్షం! పిండి వర్షం!

ఇంద్రజిత్తు వానరులకు కనపడకుండానే ఆకాశం వర్షించినట్టు బాణ వర్షం కురిపించడం మొదలు పెట్టాడు.

"శ్రీరాముడి కోసం ప్రాణాలర్పిస్తాం" అంటూ వానరులు, కొండలూ చెట్లూ పట్టుకుని ఎగురుతున్నారు. నేల కొరుగుతున్నారు.

ఇంద్రజిత్తు కురిపించే బాణ వర్షంతో, వానర సైన్యం అంతా పడిపోయింది. కొందరు చచ్చిపోయారు. కొందరు మూర్ఛపోయారు. ఇంద్రజిత్తు – గంధమాధనుణ్ణి 18 బాణాలతో, నళుణ్ణి 9 బాణాలతో, మైందుణ్ణి 7 బాణాలతో, గజుణ్ణి 5 బాణాలతో, జాంబవంతుణ్ణి 10 బాణాలతో, నీలుణ్ణి 30 బాణాలతో – ఆ రకంగా, అనేక కోట్ల మందిని కొట్టి చంపేశాడు.

ఇంద్రజిత్తు ఎక్కడ వున్నాడా – అని ఆకాశంలోకి చూస్తోన్న వాళ్ళ కళ్ళల్లో బాణాలు కొట్టి పడ గొట్టేశాడు.

సుగ్రీవుణ్ణీ అంగదుణ్ణీ కూడా బాణాలతో కొట్టి చంపేశాడు!

చివరికి రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ బాణాలతో బాదడం మొదలుపెట్టాడు.

శ్రీరాముడు లక్ష్మణుణితో మొరపెట్టాడు. "లక్ష్మణా! ఈ ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్ర మంత్రంతో మనలను 'పీడించుచున్నాడే!' ఇతనిని ఎట్లు చంపగలము? ఇది బ్రహ్మాస్త్రం. దీని బాధ నువ్వు భరించాలి సుమా! (నేనూ భరిస్తున్నాననుకో.) ధైర్యంగా వుండు! వానర యోధులందరూ పడిపోయారు. మనం కూడా పౌరుషం విడిచి

పడిపోయిం తర్వాత ఇంద్రజిత్తు జయం తనదే అనుకుని లంకలోకి వెళ్ళిపోతాడు" అన్నాడు.

అంతలోనే ఇంద్రజిత్తు వేసిన బాణాలు తగిలి ఇద్దరూ మూర్ఛపోయారు.

ఇంద్రజిత్తు సంతోషంతో సింహనాదాలు చేస్తూ లంకలోకి వెళ్ళిపోయాడు.

వానరులు దుఃఖిస్తూ వుంటే విభీషణుడు వారిని ఓదారుస్తూ- (ఈయన బ్రహ్మాస్త్రానికి లొంగడు గావున్ను, రాజ్యాస్త్రానికి తప్ప!) "ఇది విచారించవలసిన సమయం కాదు. (నిజమే, రాముడు పడిపోయాడు కాబట్టి, ఇది వానరులందరూ సంతోషించవలసిన సమయం. యుద్ధం ఆగిపోతే ఇళ్ళకు పోవొచ్చు.) బ్రహ్మాస్త్రాన్ని పూజించాలి కాబట్టి రామ లక్ష్మణులు దానికి కట్టుబడి మూర్ఛబోయారు గానీ చేతగాక కాదు సుమా!" అని చెప్పాడు.

హనుమంతుడు బ్రహ్మని గౌరవించడం కోసం కొంతసేపు మూర్ఛబోయి లేచి (బ్రహ్మని గౌర వించడం కొంతసేపు చాలనుకుని లేచి) విభీషణుడితో, "చావగా మిగిలిన వాళ్ళని మనం ఓదార్చాలి" అన్నాడు.

హనుమంతుడూ, విభీషణుడూ కాగడాలు పట్టుకుని ఆ చీకట్లో యుద్ధరంగమంతా తిరిగారు. సైనికులందరూ కాళ్ళూ, చేతులూ, డొక్కలూ, మూతులూ, తోకలూ, శిరస్సులూ ఎక్కడికక్కడ తెగిపోయి, బద్దలై పోయి, ప్రాణాలు పోయి, పడివున్నారు. సుగ్రీవుడూ, నీలుడూ, నళుడూ, అంగదుడూ – ఇంకా ఎంతో మంది చచ్చి పడివున్నారు.[409]

ఇంద్రజిత్తు ఆ పగటిపూట కాస్సేపట్లోనే 67 కోట్ల మంది వానర వీరుల్ని బాణాలు వేసి ఆ విధంగా చంపే శాడు.

విభీషణుడూ, హనుమంతుడూ, ఆ కళేబరాల కుప్పల్లో జాంబవంతుడి కోసం వెతుకుతూ తిరిగారు. చివరికి దొరికాడు. విభీషణుడు జాంబవంతుణ్ణి చూస్తూ, "నీ ప్రాణాలు పోలేదు గదా?" అని పలకరించాడు. ('పోయాయి' – అని చెపుతాడు గావున్ను!)

జాంబవంతుడు బాధపడుతూ, "నువ్వు విభీషణుడి వేనా? నిన్ను చూడలేను. నా కళ్ళకు బాణాలు తగి లాయి. హనుమంతుడు బతికి వున్నాడా?" అని మూలు గుతూ అడిగాడు.

"రాముణ్ణి గురించి కూడా అడగకుండా హను మంతుణ్ణి గురించి అడుగుతున్నావేమిటి? రాముడి మీద కన్నా, సుగ్రీవుడి మీద కన్నా, ఎక్కువ ప్రేమా నీకు హనుమంతుడి మీద?" అని ఆశ్చర్యపడ్డాడు విభీషణుడు.

"నే నెందుకు అడిగానంటే (ప్రేమా కాదు, పాడూ కాదు గానీ), హనుమంతుడు బతికి వుంటే, అందరూ బతికినట్టే. అతనే పోతే ఇక ఎవ్వరూ బతికే దారి వుండదు. (రాముడు కూడా మూర్ఛలోంచి బయటపడే దారి లేదన్నమాట!) అందుకే అతణ్ణి అడిగాను" అన్నాడు జాంబవంతుడు.

హనుమంతుడు జాంబవంతుడి పాదాలు పట్టుకుని, "నేనే" అని చెప్పుకుని, నమస్కారం చేశాడు. (ఎందుకులే దండగ, కనపడదు.)

జాంబవంతుడు సంతోషంగా అన్నాడు "రా నాయనా! నువ్వేనా? వానరుల్ని నువ్వే రక్షించాలి! సముద్రం దాటి హిమాలయ పర్వతాల మీదకు వెళ్ళు! అక్కడ రుషభ పర్వతానికీ, కైలాస పర్వతానికీ మధ్య ఓషధ పర్వతం వుంది. (ఈ ఓషధుల పర్వతం, పాల సముద్రంలో వుందని ఇది వరకు సుషేణుడు చెప్పాడు. ఇప్పుడు హిమవద్గిరి మీద! సరే, ఎక్కడో అక్కడలే!)

మృత సంజీవనీ (చచ్చిపోయిన వార్ని బ్రతి కించేది); విశల్యకరణీ (బాణాల వల్ల తగిలిన గాయాల్ని బాగుచేసేది); సావర్ణ్య కరణీ (మంచి రంగు కలిగించేది); సంధాన కరణీ (తెగిపోయిన అవయవాల్ని అతికేది) ఈ ఓషధులన్నీ అక్కడ వున్నాయి. నువ్వు తొందరగా వెళ్ళి అవి తీసుకువొచ్చి వానరుల్ని రక్షించు. రామ లక్ష్మణుల బాధ పోగొట్టు. ఇప్పుడే బయల్దేరి వెళ్ళు!" అని తొందర పెట్టాడు.

హనుమంతుడు గబ గబా దేహం పెంచటం ప్రారం భించాడు. (ఉబ్బడానికి మన తర్వాతే ఎవరైనా!) హను మంతుడి పాదాల వొత్తిడికి ఆ పర్వతం భూమిలోకి కుంగిపోయింది. ముక్క ముక్కలయిపోయింది. పర్వతం వూగుతోంటే వానరులు నిలబడ లేకపోయారు. (చచ్చి పోయిన వాళ్ళని బతికించడం యేమో గానీ, బతికివున్న వాళ్ళని కూడా పర్వతం కింద పడేసి చావగొడతాడు గావున్ను!)

---

**409.** **యుద్ధ, సర్గ 73, శ్లోకాలు 43, 44, 45:** "గొప్ప పరాక్రమము గల ఇంద్రజిత్తు – మర్మస్థానమును చీల్చునట్టి బాణములతో మైందుని, గజుని, జాంబవంతుని, నీలుని, సుగ్రీవుని, అంగదుని, .... ప్రాణములు దీసివేసెను" (నిష్ప్రాణాన్ = ప్రాణములు లేకుండా; అకరోత్ = చేసెను.) ఈ చచ్చిపోయిన వారి లిస్టులో జాంబవంతుడు కూడా ఉన్నాడు గదా? మళ్ళీ హనుమంతుడూ వాళ్ళూ వెతికేసరికి జాంబవంతుడు బతికే వున్నాడు!

**యుద్ధ, సర్గ 74, శ్లోకాలు 10, 11:** సుగ్రీవుడు, అంగదుడు, నళుడు, నీలుడు, సుషేణుడు (ఇంకా చాలామంది) చచ్చి పడి యుండుటను హనుమంతుడు, విభీషణుడు చూచిరి.

★

ఆ పర్వతం ఊగుతోంటే లంకలో ఇళ్ళన్నీ కూలి, ద్వారాలన్నీ విరిగి పడిపోతూ లంక నాట్యం చేస్తున్నట్టుగా కనపడింది.

హనుమంతుడు మలయ పర్వతం మీద ఎక్కి అక్కణ్ణించి ఎగిరేముందు శ్రీరాముణ్ణి ప్రార్థించి (నన్ను ఎగిరిస్తే నిన్ను బతికిస్తా!) రయ్యిన ఎగిరాడు. హను మంతుడు ఎగిరే వేగానికి సముద్రం అల్లకల్లోలమై పోయింది. చెట్లూ, పర్వతాలూ ఎవరో లాగేస్తున్నట్టు వాటి కవే పెళ్ళగించుకుపోయి హనుమంతుడి వెంట పడ్డాయి.

హనుమంతుడు మహా సముద్రం దాటి, గులక రాళ్ళలాంటి మహా పర్వతాల్నీ, దారాలలాంటి మహా నదుల్నీ, సరస్సుల్నీ, జలపాతాల్నీ, సిరిసంపదలు గల దేశాల్నీ చూసుకుంటూ హిమాలయాలు సమీపించాడు. హిమాలయాల్లో, దేవ రుషుల ఆశ్రమాలు చూసుకుంటూ వెళ్ళాడు. (ఓహో, అక్కడా వున్నా యన్నమాట ఈ జంతు వులు!)

ఇంకా – బ్రహ్మకోశం (బ్రహ్మస్థానం) శుక్రాలయం (ఇంద్రాలయం), రుద్రశర మోక్షమ్ (రుద్రుడు బాణాలు వేసిన చోటు! ఏ శత్రువుల మీదో?) బ్రహ్మశీర్షం (శివుడు బ్రహ్మ శిరస్సు కోసిన చోటు. దేవుళ్ళకు కూడా పీకలు తెగ్గోసుకునేటంత కక్షలు!) యమ కింకరస్థానం (యమ కింకరులు వుండే చోటు. హిమాలయాల్లో వాళ్ళు ఎందుకు వుంటారో? అస్తమానూ నూనె మూకుళ్ళ దగ్గిరా, నిప్పు స్తంభాల దగ్గిరా వేగి వేగి, కాస్సేపు చల్ల గాలి కోసం మంచు పర్వతాల వేపు వస్తారు గావున్ను); సూర్యుని బంధనం (సూర్యుణ్ణి బంధించిన చోటు. ఏ పతివ్రత ఆపిందో అక్కడ?), బ్రహ్మాసనం (బ్రహ్మ సింహా సనం. బ్రహ్మ ఇక్కడికి వొచ్చి కూర్చుని వెడతాడా?), వసుంధర నాభి (పాతాళంలోకి పోయే దారి. అమ్మో! అట్నించి రాక్షసులు పైకి వొస్తే?) కైలాస పర్వతం, మేరు పర్వతం – ఇవన్నీ కూడా చూశాడు హనుమంతుడు.

అగ్నిజ్వాల లాగ వెలిగిపోతోంది ఓషధుల పర్వతం! హనుమంతుడు ఆ పర్వతం ఎక్కి తిరగడం మొదలు పెట్టాడు. ఓషధులన్నీ, తమని తీసుకుపోవడానికి ఎవరో వొచ్చారని గ్రహించేసి కనపడకుండా అయిపోయాయి. (ఎంత గడుసు ఓషధులో! అయితే ఇవి తప్పకుండా పని చేస్తాయి.)

హనుమంతుడికి చాలా కోపం వచ్చి సింహ నాదం చేశాడు. "ఓషధ పర్వతమా! రాముడి మీద నీకు దయ లేదా? ఇంకా నువ్వు ఓషధుల్ని చూపిం చకపోతే నా భుజబలంతో నిన్ను పిండి పిండి చేసేస్తాను సుమా!" అంటూ ఏనుగులతో, మహావృక్షాలతో వున్న ఆ పర్వతాన్ని పెళ్ళగించి, దాన్ని చేతిలో పెట్టుకుని దేవతలు కూడా ఆశ్చర్యపోయేటట్టుగా ఎగురుకుంటూ తిరుగు ముఖం పట్టాడు.

శ్రీ మహావిష్ణువు ధగ ధగ మెరిసే చక్రం పట్టు కున్నట్టు హనుమంతుడు సూర్య బింబంలా వెలిగే ఓషధ పర్వతం పట్టుకుని సింహనాదాలు చేసుకుంటూ వొచ్చే శాడు. రాగానే ఉత్తములైన వానరులందరికీ నమ స్కారాలు చేసి విభీషణుణ్ణి కావ లించుకున్నాడు. (బతికి బయట పడ్డాననే సంతోషం గావున్ను!)

రామ లక్ష్మణులు, విశల్యకరణిని వాసన చూసి సుఖంగా లేచారు. సుగ్రీవుడూ అంగదుడూ, వానరు లందరూ లేచారు.

అందరి శరీరాల్లోంచీ బాణాల ములుకులు కింద పడిపోయి గాయాలు మానిపోయి బాధలు పోయి అందరూ నిద్రలు లేచినట్టు లేచారు.**410**

ఓషధుల పర్వతం వాసన వల్ల రాక్షసులకు మాత్రం ఏమీ ఉపయోగం లేకపోయింది. ఎందు కంటే, లంకలో యుద్ధం ప్రారంభమయింది మొదలూ చచ్చిపోయిన రాక్షసుల్ని ఎప్పటికప్పుడు సముద్రంలో పడెయ్యమని రావణుడే రాక్షసులందర్నీ ఆజ్ఞాపించాడు. లేకపోతే తమ సైనికులు ఎంతమంది చచ్చిపోయారో శత్రువులకు తెలిసి

**410.** ప్రతి కల్పనకీ, వాస్తవమైన విషయమే ఆధారం. హనుమంతుడు బాగా ఎగురుతాడు అంటే, 'బాగా నడవగలిగే' శక్తి గలవాడన్న మాట! పొరుగూరికో, చుట్టుపక్కల వున్న కొండల మీదకో వెళ్ళి, వైద్యుడు తెమ్మన్న మూలికలూ, ఆకులూ తెచ్చాడన్న మాట. ఆ ఆకులేవో సరిగ్గా తెలీకపోతే ఆ రకం మొక్కలన్నీ పీక్కు వొచ్చాడన్న మాట.

హనుమంతుడు ఓషధులు తెచ్చి చచ్చిపోయిన వాళ్ళందర్నీ బతికించాడు. అలా బతికించే ఏర్పాటు ఉంది కాబట్టే, కవి, సుగ్రీవుణ్ణీ, అంగదుణ్ణీ కూడా చంపాడు. మళ్ళీ మరుక్షణంలోనే బతికించాడు.

రావణుడు కుంభకర్ణుడితో మాట్లాడినప్పుడు "రాక్షస వీరులే పోయారు గానీ వానర వీరులెవ్వరూ పోలేదు" అన్నాడు, చూశారా? అలాగ, అంత యుద్ధం జరుగుతున్నా, వానరుల్లో ప్రముఖులెవ్వరూ చచ్చిపోలేదేమనే విమర్శ వస్తుంది కదా? కవి, చాలా నిజాయితీగా కనపడాలని, కొందరు వానర ప్రముఖుల్ని కూడా చంపాడు. కానీ, వారు వెంటనే బతకడం వల్ల రాముడి పక్షానికి నష్టం లేకుండా అయింది. చూశారా? వొడ్డించే వాడు మనవాడైతే కడ బంతిని కూర్చుంటేనేం? అలాగే, రాసే కవి మన వాడైతే .... కాస్సేపు చచ్చిపోతే మాత్రం యేం?

★

పోతుందని, అలా ఆజ్ఞాపించాడు. అప్పటి నించీ బతికి వున్న రాక్షసులు చచ్చిపోయిన వారిని ఎప్పటికప్పుడు సముద్రంలో పడేస్తూ వచ్చారు. ('సంజీవి పర్వతం గాలి రాక్షసులకు మాత్రం తగలదా, వారు మాత్రం లేవరా?' అనే ప్రశ్నలు వొస్తాయని, దానికోసం అన్నమాట ఈ ఏర్పాటు! చచ్చిపోయిన రాక్షసులందర్నీ సముద్రంలో పడేశారు - అని! ప్రతీ చోటా కల్పనలోనే వాస్తవం కోసం పెనుగులాట!)

వానరులందరూ లేచిం తర్వాత హనుమంతుడు మళ్ళీ హిమాలయ పర్వతాల దగ్గిరికి వెళ్ళి, ఓషధుల పర్వతాన్ని పెట్టేసి, తిరిగి వొచ్చి రాముడి దగ్గిర విన యంగా నించున్నాడు.

(ఇంకా యుద్ధం పూర్తి కాలేదుగా? మళ్ళీ ఆ మొక్కలతో అవసరం రాదూ? ఆ పర్వతాన్ని ఇక్కడే ఉంచుకో కూడదూ? మళ్ళీ అవసరం వొస్తే మాత్రం అదెంత భాగ్యంలే! వొక్క గంతేసి తెచ్చేస్తాడు.)

★ ★ ★

సుగ్రీవుడు హనుమంతుడితో - "రావణుడికి ఇంకేం బలం ఉంది? కుంభకర్ణుడు పోయాడు. కొడు కులు పోయారు. రావణుడు ఇంకేం యుద్ధానికొస్తాడు? మీలో బలవంతులందరూ వెళ్ళి లంకని కాల్చెయ్యండి!" అన్నాడు.

బాగా చీకటి పడింతర్వాత వానర వీరులు నిప్పు కట్టెలు తీసుకుని లంకలో ప్రవేశించారు. లంకని రక్షించే వాళ్ళందరూ వానరుల్ని చూసి పారి పోయారు.

వానరులు మహోత్సాహంతో లంకలో అన్ని మూలలా కోటలకూ, మేడలకూ, ప్రతీ వీధి లోనూ, ప్రతీ సందు లోనూ, అన్ని ఇళ్ళకూ నిప్పు అంటిం చేశారు. (రాక్షసులు ఎన్ని మాయలు తెలిసినా, ఎన్నెన్ని కామ రూపాలు ధరించగలిగినా, ఎంత కపట యుద్ధం చేసే వారైనా, వానరులకు వ్యతిరేకంగా ఏమీ చెయ్యకుండా నోళ్ళు మూసుకుని ఊరుకుంటారు. మాయలన్నీ వాన రులే చేస్తూ ఉంటారు!)

లంక భగ భగ మండడం మొదలైంది. పర్వతా ల్లాంటి మేడలు అగ్ని జ్వాలలు తీర్చి వెలుగుతూ వుంటే, ఆ అందం ఎవరు చెప్పగలరు? మహాసౌధాలు, చందనం చెక్క ద్వారాలు, దివ్య శయనాలు, ఆసనాలు, నార వస్త్రాలు, పట్టు వస్త్రాలు, వెండి బంగారాలు, వజ్ర వైఢూ ర్యాలు పొదిగిన ఆభరణాలు, గొర్రె బొచ్చు కంబళ్ళు, జంతు శాలలు, ఆయుధా గారాలు, రథాలు, కవచాలు, కత్తులు, విల్లులు, అమ్ముల పొదులు చర్మాసనాలు, సుగంధ ద్రవ్య రాసులు - ఇదీ అదీ అని లేదు; సమస్తం కాలి బూడిదై పోయాయి. (విభీషణుడా! 'లంక క్షేమం, లంక క్షేమం' అన్నావు. చూసుకుంటున్నావా లంక క్షేమం? అన్నీ కాలి మసైపోయాక ఇంకేం రాజ్యం చేస్తావు? బొగ్గుల వ్యాపారం చేస్తావా ఇరుగు పొరుగు దేశాలతో?)

లంకలో ప్రజలందర్నీ అగ్ని దహించేసింది. మంచి మంచి వస్త్రాలు కట్టుకుని పూల హారాలు వేసుకున్న వారినీ, మద్యమాంసాల మత్తుతో తూగుతూ వున్న వారినీ, ప్రియురాళ్ళతో శృంగార సీమల్లో తేలుతూ వున్న వారినీ (ఎంత బీభత్సంలో అయినా, కవిగారు, శృంగారం మరిచిపోరు! బుర్ర నిండా అదే కుళ్ళు!) పసి బిడ్డల్ని ఎత్తుకుని పరుగులు తీస్తున్న స్త్రీలనీ, అందర్నీ అగ్ని దహించేసి, మరీ మరీ ప్రకాశించింది.

విమానాలలో పడుకున్న ఉత్తమ స్త్రీలు హాహా కారాలు చేస్తూ రోదించారు.

గుర్రాలకూ, ఏనుగులకూ సంరక్షణలు చేసే వారు, జంతుశాలలకు నిప్పు అంటుకోగానే జంతువులన్నిటినీ విప్పేశారు. గుర్రాల్ని చూసి ఏనుగులూ, ఏనుగుల్ని చూసి గుర్రాలూ, భయంతో అన్ని దిక్కులకూ పరుగు లెత్తాయి. అగ్ని జ్వాలలు తీర్చి మండుతోన్న గృహాలు, విరగబూసిన మోదుగు చెట్లలా ప్రకాశించాయి. పొగలో, మంటల్లో పడి అరుస్తోన్న స్త్రీల కంఠాలు పది యోజనాల దూరం వరకూ వినిపించాయి. (రాముడికి తప్పు!)[411]

లంక నిండా గృహాలూ, ద్వారాలూ మండుతూ లంక తళుక్కున మెరిసే ఆకాశంలాగ వెలిగిపోయింది. లంక వెలుగంతా చుట్టూ సముద్రంలో ప్రతిఫలించి సముద్రమంతా ఎర్ర సముద్రం అయి పోయింది.

అగ్నితో మండుతోన్న రాక్షసులతో యుద్ధం చెయ్యా లని, వానరులు, వారిమీద కెగిరారు.

మహాత్ముడైన రాముడు, లంక గోపురం మీద బాణాలు వేసి దాన్ని ముక్క ముక్కలు చేసేశాడు. (ఎన్ని ప్రయత్నాలో లంక నాశనానికి!)

రాక్షసులు తిరగబడుతూనే వున్నారు. యుద్ధం చేస్తూనే వున్నారు. ఆ సంకుల సమరంతో ఆ రాత్రి కాళ

**411.** రామ లక్ష్మణుల్ని ఇంద్రజిత్తు నాగపాశాలతో బంధించినప్పుడు వైద్యం చెయ్యటానికి గరుత్మంతుడు వచ్చాడే, అప్పుడేం చెప్పాడు రాముడితో? "చంటి పిల్లల్నీ, వృద్ధుల్నీ ఏమీ చెయ్యవద్దు - అని చెప్పాడు కదా? మరి, ఈ మంటల్లోంచి వృద్ధుల్నీ, పిల్లల్నీ ఎవరు రక్షించారు? "పసి బిడ్డల్నీ, స్త్రీలనీ, వృద్ధుల్నీ, హింసించకూడదు. చంపకూడదు" అనేది ధర్మశాస్త్రాలు చెప్పే నీతి. కానీ, దాన్ని ఏ యుద్ధాల్లోనూ పాటించరు. ఈ నాటి యుద్ధాల్లో కూడా పాటించరు. శతృవుల నివాసాల్ని తగలబెట్టడం, తగలబడే వాళ్ళ రోదనలు వినడం - ఇవన్నీ నీచుల, క్రూరుల ఆనందాలు! ★

రాత్రి అయింది. (రాక్షసులు ఏమీ చెయ్యకుండా ఊరుకున్నారు – అని చెప్పడం బాగుండదు కాబట్టి, రాక్షసులు గొప్పగానే యుద్ధం చేశారు – అని చెప్పటం. ఎంత గొప్పగా యుద్ధం చేస్తే ఏం లాభం? కవిగారు వాళ్ళని నెగ్గనివ్వరు గదా?)

సుగ్రీవుడు వానర వీరుల్ని పిలిచి, "అందు బాటులో వుండే ద్వారాలు ముట్టడించండి! నా ఆజ్ఞ ధిక్కరించే వానరుల్ని అక్కడి కక్కడే చంపెయ్యండి!" అని ఆజ్ఞాపించాడు.[412] ('రామాయణ' పవిత్ర గ్రంథం నిండా 'చంపడం, నరకడం' అనే మాటలు తప్ప ఇంకో మాట వుందేమో వెతకండి! దీని పవిత్రత అంతా ఇదే!)

వానర వీరులు, మండుతోన్న కట్టెలు తీసుకుని రావణుడు వున్న మందిర ద్వారం దగ్గిరికి వెళ్ళారు.

అప్పుడు రావణుడికి చాలా కోపం వచ్చింది. (అప్పుడే ఏం కంగారు కోపానికీ? కోపం, ఒక సంవత్సరం పోయాక తెచ్చుకోవచ్చులే.) కోపోద్రేకంతో లేచి, కుంభుణ్ణీ, నికుంభుణ్ణీ, యూపాక్షుణ్ణీ, శోణితాక్షుణ్ణీ, గొప్ప సేనతో యుద్ధానికి పంపించాడు.

రాక్షస సేన, గంధాలు పూసుకుని పూల హారాలు వేసుకుని, అలంకారాలు చేసుకుని, ధగ ధగ మెరిసే కత్తులతో, గొడ్డళ్ళతో, బాణాలతో, శూలాలతో, బయల్దేరింది. (ఇక్కడ, ఇంకా చాలా చాలా సంస్కృతం ఆయుధాలున్నాయి. వాటిని అనువాదకులెవ్వరూ తెలుగు చెయ్యలేదు.)

మిడతల దండు అగ్నిలో ఉరికినట్టు రాక్షస సేన యుద్ధంలో ఉరికింది.

మళ్ళీ యుద్ధం!

(యుద్ధం – అంటే, కొట్టుకోడం, చంపుకోడం! యుద్ధాలు మానేస్తే తప్ప, అవి ఎవరి మధ్య జరిగినా, ఏ కాలంలో జరిగినా, చంపుళ్ళు జరగవలిసిందే!)

రాక్షసులు రక రకాల ఆయుధాలతో వానరుల్ని నరికారు. వానరులు రాక్షసులను కొరికారు, చీల్చారు.

కొట్టేవాడిని, ఇంకొకడు కొట్టాడు.
తోసేవాడిని, ఇంకొకడు తోశాడు.
తిట్టేవాడిని, ఇంకొకడు తిట్టాడు.
కరిచే వాడిని, ఇంకొకడు కరిచాడు.
"ఇదిగో! నా దగ్గిరికి రా! నాతో పోట్లాడు!"
"నే నొస్తున్నారా!"
"రారా! నీకు మూడిందిలే."
"వాడు రాడులే. నీ పని నే పడతా, ఆగు".
"ఎందుకలా కష్టపడతావు? నన్ను నువ్వు గెలిచేది లేదులే".
"ఇదిగో! నించో, నిన్నే!"

అలా అరుచుకుంటూ, కొట్టుకున్నారు రెండు పక్షాల వాళ్ళూ.

కొందరికి బట్ట లూడిపోయాయి. కొందరి ఆయుధాలు పడిపోయాయి. జుట్టు ముళ్ళు విడిపోయాయి. పారిపోతున్న రాక్షసుల్ని వానరులు తరిమి తరిమి కొట్టారు.

రాక్షస సేన వచ్చినప్పటి నించీ అంగదుడు కంపనుడితో యుద్ధం చేస్తూనే వున్నాడు. కంపనుడు గొప్ప గదతో అంగదుణ్ణి కొట్టాడు. అంగదుడు గొప్ప పర్వతం తెచ్చి కంపనుడి మీద విసిరాడు. కంపనుడు కంపించి కిందపడి చచ్చిపోయాడు.

కంపనుడు చచ్చిపోవటం చూసి శోణితాక్షుడు రథంతో అంగదుడి దగ్గిరికి వొచ్చి భయంకరమైన బాణాలతో అంగదుణ్ణి తీవ్రంగా కొట్టాడు. అంగదుడికి కోపం వొచ్చేసి పెద్ద పర్వతం విసిరి శోణితాక్షుడి రథం నాశనం చేసేశాడు. శోణితాక్షుడు కత్తీ, డాలూ పట్టుకుని ఆకాశాని కెగిరాడు. అంగదుడు కూడా ఎగిరి శోణితాక్షుడి చేతిలో కత్తి లాగేసుకుని దాంతో అతని భుజం మీద నించి జంధ్యం వేసుకునేటట్టుగా (యజ్ఞోపవీతము వలె) దెబ్బ కొట్టాడు. అయినా శోణితాక్షుడు మళ్ళీ గొప్ప గద పట్టుకుని అంగదుడి మీద పడ్డాడు. యూపాక్షుడూ ప్రజంఘుడూ కూడా వచ్చి శోణితాక్షుడికి సహాయంగా అంగదుడితో యుద్ధం ప్రారంభించారు.

మళ్ళీ– బాణాలూ × చెట్లూ = పిండి!
పర్వతాలూ × బాణాలూ = పిండి!

అంగదుడు ప్రజంఘుడి చేతి మీద పిడికిలితో కొట్టాడు. అతని చేతిలో కత్తి కింద పడిపోయింది. ప్రజంఘుడు కోపంతో, (అబ్బ! ఇదేం పేరో! నోరు తిరగదు. వాళ్ళమ్మకి ఈ పేరే దొరికిందా? ఆ ఊళ్ళో బేపనాయ నెవరో ఈ పేరు పెట్టి వుంటాడు!) అంగదుణ్ణి పిడికిలితో పొడిచాడు. అంగదుడు వొక్క క్షణం మూర్ఛపోయి లేచి

**412.** యుద్ధ, సర్గ 75, శ్లోకాలు 42, 43: "సమీపములో నుండు లంకా ద్వారములను ముట్టడి చేసి యుద్ధము చేయవలయునని మహాత్ముడగు సుగ్రీవుడు వానరుల కాజ్ఞాపించెను. మీరు అచ్చటచ్చట నుండి నా యాజ్ఞ నతిక్రమించిన వారిమీద ఎగిరిపడి తక్షణము చంపివేయ వలయును." అంటే, కొందరు వానర సైనికులకు ఈ లంకని తగల బెట్టడం, మందిరాలు ముట్టడించడం – ఇదంతా అయిష్టంగా ఉందన్న మాట. అలాంటి వాళ్ళు ఉత్సాహంగా పనిచెయ్యరు. అలాంటి వాళ్ళని కనిపెట్టి తక్షణం చంపెయ్యమంటున్నాడు సుగ్రీవుడు.

రాజు చెప్పిన ప్రతీ పనీ చెయ్యడం సైనికులకు ఇష్టం లేకపోయినా, తమ చావుని తప్పించుకోవాలి గాబట్టి, రాజు ఆజ్ఞ ప్రకారమే ఎదుటి వాళ్ళని చంపుతారు. ★

కత్తి అందుకుని ప్రజంఘుడి తల నరికేశాడు.

వెంటనే అంగదుడి మీదకి యూపాక్షుడు వచ్చాడు. ద్వివిధుడు వచ్చి యూపాక్షుణ్ణి పట్టేశాడు. శోణితాక్షుడు వచ్చి ద్వివిధుడి గుండెల మీద గదతో మోదాడు. ఆ గదని లాగేశాడు ద్వివిధుడు. అంతలో మైందుడు వచ్చి యూపాక్షుణ్ణి కొట్టాడు.

శోణితాక్ష – యూపాక్షులకూ, మైంద – ద్వివిధులకూ జరిగిన యుద్ధం చూడాలంటే, రెండు కళ్ళూ చాలవు.

అంతా ఉత్తదే. అన్నీ తన్నులూ – గుద్దులూ, కాట్లూ – పోట్లూ, అరుపులూ – చరుపులూ ... అంతా ఇలాగే! నమ్మకపోతే చూడండి ఇప్పుడు.)

ద్వివిధుడు శోణితాక్షుణ్ణి గోళ్ళతో బరికి కింద పడేసి కాళ్ళతో తొక్కి తొక్కి చంపేశాడు. మైందుడు యూపాక్షుణ్ణి చేతులతో నొక్కి నొక్కి చంపేశాడు. రాక్షససేన కుంభుడి దగ్గిరికి పారిపోయింది.

కుంభుడు ద్వివిధుడి మీద బాణ వర్షం కురిపించాడు. ద్వివిధుడు మూర్ఛపోయాడు. మైందుడు గొప్ప పర్వతం తెచ్చి కుంభుడి మీద విసిరాడు. కుంభుడు దాన్ని ఐదు బాణాలతో పిండి పిండి చేసేసి, ఇంకో బాణంతో మైందుణ్ణి మర్మస్తానంలో కొట్టాడు. మైందుడు కూడా కింద పడిపోయాడు. వెంటనే అంగదుడు పెద్ద పర్వతం పట్టుకు వచ్చాడు. మళ్ళీ బాణాలకూ, పర్వతాలకూ ఘోర యుద్ధం జరిగింది. కుంభుడు గొప్ప బాణాలతో అంగదుణ్ణి నుదురు మీద కొట్టాడు. రక్తం జల పాతంలాగ ఉరికి అంగదుడి కళ్ళు మూసుకుపోయాయి. అంగదుడు ఒక చేత్తో కళ్ళు మూసుకుని, రెండో చేత్తో సాలవృక్షం పెళ్ళగించి కుంభుడి మీద విసిరాడు. (అంగదుడి వీరత్వం ప్రదర్శించటానికి, ఒక్క చేత్తోటే చెట్టుని లాగించాలంటే, ఒక చేతికి దెబ్బ తగిలితే సరిపోతుందిగా? రెండో చేత్తో చెట్టు లాగుతాడు. అంతేగానీ, కళ్ళకి దెబ్బ తగలడం, ఒక చేత్తో కళ్ళు మూసుకోడం, ఆ చెయ్యి ఖాళీ లేక రెండో చేత్తో మాత్రమే చెట్టు లాగవలసి రావడం, ఈ తిరకాసంతా ఎందుకూ?) తీరా అంత కష్టపడి అంగదుడు చెట్టు విసిరితే కుంభుడు దాన్ని పిండి పిండి చేసేశాడు, పైగా అంగదుణ్ణి మూర్ఛబోయేటట్టు కొట్టాడు.

అంగదుడు మూర్ఛ తేరకుండా పడివున్నాడు. (చూశావా హనుమంతుడూ? ఆ ఓషధుల పర్వతాన్ని హిమాలయాల్లో పెట్టేసి వొచ్చేశావు. అంతా కంగారే నీకు. ఇప్పుడెలాగ?)

అంగదుడు మూర్ఛబోయాడని వానరులు రాముడికి చెప్పారు. (ఎందుకు? రాగం ఎత్తుకోమనా?)

రాముడు జాంబవంతుణ్ణి పిల్చి కుంభుడి మీదికి పొమ్మని ఆజ్ఞాపించాడు. (ఏం చేస్తున్నారయ్యా మీరంతా? గోళ్ళు గిల్లుకుంటున్నారా? వెళ్ళి వాళ్ళని గబ గబా చంపండి!)

జాంబవంతుడూ, సుషేణుడూ, వేగదర్శీ వంటి వీరులంతా మహా పర్వతాలూ, మహా వృక్షాలూ పెళ్ళగించుకుని కుంభుడి మీదకి పోయి పడ్డారు. (ఈ యుద్ధంలో వానరులు ఎన్ని పర్వతాలూ ఎన్ని వృక్షాలూ ఉపయోగించారో, అవి ఏ యే రకాలో రామ దాసులెవరైనా రీసెర్చి చెయ్యవచ్చు. పర్వతాల గురించి వొకరూ, వృక్షాల గురించి వొకరూ, వేరు వేరుగా చెయ్యాలి గానీ, ఉత్సాహం కొద్దీ రెంటి గురించీ ఒకరే ప్రారంభిస్తే, ఒక్క జన్మ చాలదు – రాముడి దయవల్ల ఆరు వందల సంవత్సరాలు బతికితే తప్ప!)

సరే! కుంభుడు బాణ వర్షం కురిపిస్తున్నాడు. కొండలన్నీ పిండి చేసేస్తున్నాడు. కుంభుడు కురిపించే బాణ వర్షం లోంచి ముందుకు వెళ్ళలేక వానర వీరులంతా తోకలు ముడిచి నిలబడిపోయారు. అప్పుడు సుగ్రీవుడు అశ్వకర్ణ వృక్షాలు తెచ్చి విసిరాడు. (సాల వృక్షాలు అయిపోయినట్టేనా?)

కుంభుడు ఆ అశ్వకర్ణ వృక్షాల్ని తన కరకు బాణాలతో – పిండి! సుగ్రీవుడు కుంభుడి ధనుస్సు లాక్కుని విరిచేసి వెటకారంగా నవ్వాడు – "గొప్పగా కొట్టావులే బాణాలు. మహేంద్రుడి అంత వాడివి! నీ తండ్రీ, నీ తాతా, ఎందర్ని ఏడిపించారో! వాళ్ళ బుద్ధులే వొచ్చాయి నీకు. నిన్ను వొక్క దెబ్బతో చంపేద్దును గానీ, ఇంతసేపూ మహావీరులందరితో యుద్ధం చేసి అలిసిపోయావు. ఇలాంటప్పుడు నిన్ను చంపితే, 'సుగ్రీవుడు చూడండి, ఏమీ దయా దాక్షిణ్యాలు లేకుండా అలిసివున్న వాడిమీద పడి చంపేశాడు' అంటారు నలుగురూ. బాగుండదని ఆలోచిస్తున్నా. వెళ్ళు. కాస్సేపు కూర్చుని రా! అప్పుడు చంపుతాను. అప్పుడు చూడు నా బలం ఏమిటో" అన్నాడు. (కాదులే. అతన్ని వొదిలేస్తే యుద్ధం తప్పుతుందని నీ ఎత్తులే! చాలా మందితో పోట్లాడి, అలిసిపోయిన వాడితో యుద్ధం చెయ్యకూడదంటున్నాడు కదా సుగ్రీవుడు? మరి, రాముడు యుద్ధ రంగంలో దిగినప్పుడల్లా చేస్తోంది ఏమిటి?)

సుగ్రీవుడి మాటలకు కుంభుడు రోషంగా సుగ్రీవుడి మీద కలబడ్డాడు. (అదీ! అదీ పౌరుషం!) ఇద్దరూ ఏనుగుల్లా గుద్దుకున్నారు. బర బరా ఈడ్చుకున్నారు. (అబ్బ! వీపులు కొట్టుకుపోవూ?) వాళ్ళ గంతుల్తో భూమి పెద్ద పెద్ద గోతులు పడిపోయింది! సముద్రం పొంగింది! సుగ్రీవుడు కుంభుణ్ణి ఎత్తి సముద్రంలోకి గిరాటేశాడు.

కుంభుడు ఎగిరివొచ్చి (నీ అమ్మ కడుపు బంగారం గానూ! సముద్రం లోంచి బయటపడ్డావే!) సుగ్రీవుణ్ణి వొక్క పోటు పొడిచాడు. వజ్రాయుధం దెబ్బతో మేరు పర్వతానికి తేజస్సు కలిగినట్టు కుంభుడి పోటుతో సుగ్రీవుడి శరీరానికి గొప్ప తేజస్సు కలిగింది. (ఇంకేం మరీ? ఎప్పుడూ సుగ్రీవుణ్ణి పొడుస్తూ వుంటే సరీ!) అంత తేజస్సు కలిగినా సరే ఏమీ కృతజ్ఞత లేకుండా సుగ్రీవుడు వజ్రాయుధం లాంటి పిడికిలితో కుంభుణ్ణి గుద్దాడు. ఆ గుద్దుతో కుంభుడికి తేజస్సు రాలేదు సరిగదా కిందబడి ప్రాణాలే విడిచేశాడు! సుగ్రీవుడు చేసిన సాహస కృత్యానికి కొండలతో, అడవులతో, సముద్రాలతో వున్న భూమి అంతా గజ గజలాడిపోయింది.

కుంభుణ్ణి చంపినందుకు నికుంభుడు సుగ్రీవుణ్ణి కాల్చేసేట్టు చూస్తూ, పర్వతంలా ఉన్న పరిఘ గిర గిర తిప్పుకొంటూ, కోపంగా గర్జిస్తూ వచ్చి పడ్డాడు. అతని మెడ నిండా బోలెడు పతకాలు వేళ్ళాడు తున్నాయి. (తాయెత్తు లేమో!) ఆ పరిఘ తిప్పే వేగానికి గాలి ఏడు రకాలుగా అయిపోయింది. గ్రహాలతో కలసి ఆకాశం కంపించిపోయింది. నికుంభుడి పరిఘుని చూసి వాన రులు భయపడిపోయి పరుగు లెత్తారు.

హనుమంతుడు రొమ్ము విరుచుకుంటూ నికుం భుడి మీదకి వొచ్చాడు. నికుంభుడు పరిఘ గిర గిర తిప్పి హనుమంతుడి గుండెల మీద వొక్కటి పెట్టాడు. (అదీ! అలా పెట్టాలి!) కొండకు కొండ ఢీకొన్నట్టు పరిఘ తునాతునకలై ఎగిరిపోయింది. హనుమంతుడు పరిఘ దెబ్బకి కోపం వచ్చి, పిడికిలి బిగించి నికుంభుడి గుండెల మీద గుద్దాడు. నికుంభుడి గుండెలకు హనుమంతుడి పిడికిలి తగలగానే భగ్గున నిప్పు రవ్వలు పుట్టాయి. గుండెలు బద్దలై, రక్తం వరదలై, కోపం పట్టలేక నికుం భుడు హనుమంతుడి మీదపడి అతణ్ణి సందిటేసుకుని లాక్కుపోవటం మొదలుపెట్టాడు.

వానరులు భయంతో కేకలేశారు. హనుమంతుడు నికుంభుణ్ణి గుద్దీ, పొడిచీ, కరిచీ, పెనుగులాడీ, పట్టు తప్పించుకుని పైకెగిరి కొండలాగ నికుంభుడి మీద పడ్డాడు. రెండు చేతులతో అతని మెడ దొరక బుచ్చుకుని పిసికి మెలికలు తిప్పి ఫెళ్ళున విరిచేశాడు.

ఆ సాహస కార్యానికి భూమి వొణికింది. ఆకాశం బద్దలైంది.

★ ★ ★

కుంభుడూ, నికుంభుడూ చచ్చిపోయారని విని రావణుడు మండిపడిపోయి మకరాక్షుడితో, "నాయనా! నువ్వు యుద్ధానికి వెళ్ళు! రాముణ్ణీ, వానరుల్నీ చంపేసి రా!" అని ఆజ్ఞాపించాడు.

మకరాక్షుడు ఖరుడి కొడుకు. మహారాజు ఆజ్ఞకి అతను చాలా సంతోషిస్తూ, గొప్ప సేనతో, ఆయుధా లతో, ఉత్సాహంగా బయల్దేరాడు. (యుద్ధానికి బయ ల్దేరటం, చచ్చిపోవటం! మళ్ళీ బయల్దేరటం, మళ్ళీ పోవటం! .... మళ్ళీ .... మళ్ళీ .... ఇలా ఎంత కాలం జరుగుతుందో! విభీషణుడు తప్ప రాక్షసులందరూ అయి పోయేదాకా జరగాలి గావున్ను. తర్వాత లంకలో విభీష ణుడికి వొక్కడికీ భయం వెయ్యదూ?)

మకరాక్షుడు రథంలో వస్తోంటే, దారిలో, సారథి చేతిలోంచి కొరడా జారి పడిపోయింది. (జారితే యేం? నీకు మూఢ నమ్మకాలున్నాయా సారథీ? అబ్బే, అలాంటి పిచ్చి నమ్మకాలు పెట్టుకోకు!) రథం మీద జెండా వూడి కిందపడిపోయింది. (కంగారులో సరిగ్గా కట్టి వుండరు.) ఎన్ని అప శకునాలు కనబడినా చలించక రాక్షస సేన ముందుకే నడిచింది. (అదీ! అలా వుండాలి!)

మళ్ళీ యుద్ధం ప్రారంభమైంది. పూర్వం దేవా సురు లకు జరిగిన యుద్ధంలాగ, ఈ యుద్ధం కూడా శరీరాలు గగుర్పొడిచేటట్టుగా భయంకరంగా జరిగింది.

వానరులూ – రాక్షసులూ మహోత్సాహంతో వీరో చితంగా, అవిరామంగా కొట్టుకున్నారు. కాళ్ళూ చేతులూ విరిచేసుకున్నారు. కడుపులూ వీపులూ చీరేసు కున్నారు. కంఠాలు పిసికేసుకున్నారు. గుండెలు చీల్చేసు కున్నారు. శిరస్సులు బద్దలు కొట్టేసుకున్నారు. రక్తాలు కక్కారు, కక్కించారు. ఆ ఘోర యుద్ధంలో రాక్షసులే పైచెయ్యిగా అయ్యారు. (మొదట అలాగే అయ్యి, తర్వాత ఓడిపోతారు.) వానరులు నిలబడలేక పారిపోవటం మొదలు పెట్టారు.

రాముడు, ధనుస్సు మోగిస్తూ మకరాక్షుడి మీదకి వచ్చాడు. (ఇప్పటికా! రాముడు రావడం! ఇప్పటిదాకా విశ్రాంతులేనా?)

మకరాక్షుడు రాముడితో, "నా తండ్రిని (ఖరుణ్ణి) చంపిన దుర్మార్గుడివి నువ్వు. నిన్ను చూస్తోంటే నాకు కోపం కట్టలు తెంచుకుంటోంది. ఇన్నాళ్ళకి దొరికావు. ఇక యమలోకానికి వెళ్ళి, నువ్వు చంపిన వాళ్ళతోపాటు కలుస్తావులే. ఇన్ని మాటలెందుకు? కత్తులతో చేస్తావో, బాణాలతో చేస్తావో, ఉత్త చేతులతో ముష్టి యుద్ధం చేస్తావో, నీకెలా ఇష్టమైతే అలా చెయ్యి! రా యుద్ధానికి! మన ఇద్దరిలో ఎవరెలా చేస్తారో అందరూ చూస్తారులే" అన్నాడు. (కొట్టుకోడం ఏం చూస్తాం? మేం చూడం.)

మకరాక్షుడి మాటలకు రాముడు పరిహాసంగా నవ్వాడు (రాముడికి కూడా నవ్వడం వచ్చా? ఇతడు నవ్వడం ఎప్పుడూ చూడలేదే!) "ఎందుకలా పేలతావు? ఉత్త మాటలతోటే యుద్ధం జరుగుతుందా? నే నంటే

ఏమిటనుకుంటున్నావు? (నువ్వంటే ఏమిటో అతనికి తెలీదులే. నిన్ను గొప్ప వీరుడివను కుంటున్నాడులే.) దండ కారణ్యంలో 14 వేల మందిని చంపాను, తెలుసా నీకు? దుర్మార్గుడా! నీ మాంసం కండ కండలుగా కోసి కాకులకూ, గద్దలకూ ఎగరేస్తాను, చూసుకో!" అని గర్జించాడు.

మకరాక్షుడికి ఒళ్ళు మండిపోయింది. (అవును. మండకపోతే అది ఒళ్ళే కాదు.) రాముడి మీద బాణాలు గుప్పించాడు. (రాక్షసులే ఎప్పుడూ కయ్యా నికి కాలు దువ్వుతారు. పాపం, రాముడి పక్షం వారే పాపమూ ఎరగరు.)

మకరాక్షుడి బాణాలన్నీ శ్రీరాముడు విరగొట్టి, తిర గ్గొట్టేశాడని వేరే చెప్పాలా? ధనుస్సుల శబ్దాలు ఉరుము ల్లాగ ప్రతిధ్వనించాయి. రాముడూ, మకరాక్షుడూ ఒకరి కొకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు. ఒకరి బాణాలు ఒకరు ఛేదించేసుకుంటున్నారు. నేల మీద యుద్ధం చూడాలని, ఆకాశంలో దేవతలూ ఋషులూ, కిన్నరులూ కింపురుషులూ, ఉరగులూ నాగులూ అందరూ, గుంపులు గుంపులుగా చేరారు. (అక్కడ యుద్ధాలు చేసుకోరు గావున్ను! ఎప్పుడూ యుద్ధాలకు మొహం వాచినట్టు ఎగబడి చూస్తారు.)

రాముడూ, మకరాక్షుడూ కురిపించే బాణాల వర్షంతో, అన్ని దిక్కులూ, మూలలూ, కిందలూ మీదలూ అన్నీ మూసుకుపోయాయి! (పాపం, ఆకాశంలో వాళ్ళకేం కనపడుతుంది?)

రాముడు 8 బాణాలతో మకరాక్షుడి ధనుస్సు విర గొట్టి, సారథిని పడగొట్టగలిగాడు. (ఒక్క బాణంతో కాదన్నమాట! 8 బాణాలు వెయాల్సి వచ్చిందా?) మరి కొన్ని బాణాలు వేసి రథాన్నీ, గుర్రాల్నీ చంపగలిగాడు. మకరాక్షుడు రథం మీద నుంచి దూకేస్తూ భయంకర మైన శూలం ఒకటి రాముడి మీదకి విసిరాడు. సరే! రాముడు దాన్ని బాణాలతో కొట్టేసరికి అది తునాతునకలై తోక చుక్కల్లా నాలుగు వేపులా చెదిరిపోయింది. (తోక చుక్కలంటే ఎంత అలుసుగా వుందో కవిగారికి!)

మకరాక్షుడు పిడికిళ్ళు బిగించి రాముడి మీద కొచ్చాడు. రాముడు వెటకారంగా నవ్వి ఆగ్నే యాస్త్రంతో ....! మకరాక్షుడు నేలమీద పడి ప్రాణాలు విడిచాడు. ఆకాశంలో వాళ్ళు రాముణ్ణి చాలా రకాలుగా మెచ్చు కున్నారు. రాక్షసులు లంకలోకి పారిపోయారు.

★ ★ ★

మకరాక్షుడు పోయాడని విని రావణుడు కోపంతో రుద్రుడైపోయాడు. ఇంద్రజిత్తుని పిలిచి, "నువ్వు వెంటనే యుద్ధానికి వెళ్ళు! ఇంద్రుణ్ణే జయించిన నీకు రాము డెంత? (ఇంద్రుణ్ణి జయించకపోతే మాత్రం రాము డెంత?) తొందరగా వెళ్ళు! (తొందరగా చచ్చిపో)" అని ఆజ్ఞాపించాడు.

ఇంద్రజిత్తు అగ్నిలో హోమాలు చేశాడు. నల్ల మేకని బలి ఇచ్చాడు. అగ్నిజ్వాలలు పొగ లేకుండా ప్రదక్షిణంగా తిరుగుతూ మండి జయాన్ని సూచించాయి. అగ్నిదేవుడు స్వయంగా వొచ్చి హవిస్సు పుచ్చుకున్నాడు. (మరి, ఇప్పటి భక్తుల దగ్గిరికి దేవుళ్ళు స్వయంగా వొచ్చి పుచ్చు కోరేం? నిజంగా పుచ్చుకుంటే, ఈ భక్తులు పెట్టర్లే.)

ఇంద్రజిత్తు రథం, రక రకాల ఆయుధాల తోటీ, వజ్ర వైఢూర్యాల తోటీ అలంకరించిన జెండాలతో సిద్ధంగా వుంది. ఇంద్రజిత్తు, రథం ఎక్కి, "ఋషులం అంటూ దొంగవేషాలు వేసుకుని వనవాసానికి వచ్చిన రామ లక్ష్మణుల్ని చంపేసి నా తండ్రికి ఆనందం కలి గిస్తాను" అనుకుంటూ ఆకాశంలోకి ఎగిరి అంతర్ధానమై పోయాడు.

మళ్ళీ యుద్ధం ప్రారంభం! ఇంద్రజిత్తు రామ లక్ష్మ ణుల మీద బాణ వర్షం కురిపించడం మొద లెట్టాడు. రామ లక్ష్మణులు కూడా ఆకాశం వేపు బాణాలు కొడు తున్నారు. ఆ బాణ వర్షంతో ఆకాశం అంతా మూసుకు పోయి కటిక చీకటై పోయింది.

ఆకాశంలో ఇంద్రజిత్తు ధనుస్సు ధ్వని గానీ, గుర్రాల గిట్టల చప్పుళ్ళు గానీ, రథ చక్రాల టక టకలు గానీ వినిపించడం లేదు. (ఆకాశంలో దేనికి తగిలి చప్పుళ్ళవు తాయి?)

ఆకాశానికీ భూమికీ జరిగే యుద్ధంలాగే బాణ యుద్ధం భయంకరంగా సాగింది. ఇంద్రజిత్తు బాణాల దెబ్బల్తో వానరులు నేలకొరుగుతున్నారు. రామ లక్ష్మ ణులు రక్తాలు చింది, పూచిన మోదుగు చెట్లయి పోయారు. ఇంద్రజిత్తుకి రామబాణం ఒక్కటి కూడా తగలడం లేదు. (శతృవుల గురించి చాలా నిజాయితీగా చెప్పినట్టు కనపడాలని ఈ ఎత్తు. మొదట్లో శతృవులే పైచెయ్యిగా వున్నట్టు చెప్పడం! తర్వాత వాళ్ళనెలాగూ ఓడగొడతాం గదా – అని.)

ఇంద్రజిత్తుని జయించలేక పోతున్నందుకు లక్ష్మణు డికి చాలా కోపం వచ్చింది. రాముడితో, "బ్రహ్మాస్త్రం ప్రయోగించి రాక్షసులందర్నీ చంపేద్దాం" అన్నాడు.

రాముడు శాంతంగా, "మహావీరుడా! ఒక్కరి తప్పు కోసం అందర్నీ చంపడం అధర్మం. యుద్ధం చేయని వారినీ, దాగివున్న వారినీ, రక్షించమని కోరే వారినీ, పారిపోతున్న వారినీ, పరాకుగా వున్న వారినీ, చంపడం న్యాయం కాదు. (సందు దొరికితే నీతులు గుప్పించడం న్యాయమేనా? లంకా దహనాల్లో మూకుమ్మడి హత్యల మాటేవిటి నీతి శాలీ?) ఇంద్రజిత్తుని మాత్రమే చంపాలి

మనం.[413] వానరుల కళ్ళబడితే ఇక జీవించగలడా ఇంద్రజిత్తు? పాతాళంలో నక్కినా, (దాక్కున్న వాళ్ళని చంపకూడదన్నావుగా? అప్పుడే మళ్ళీ అది పరగడుపు!), ఆకాశంలో కెగిరినా, (ఇప్పుడు ఆకాశంలోనే వున్నాడుగా?), నా బాణాల దెబ్బల్తో కిందపడగొట్టేస్తాను" అని దిక్కులన్నీ చూశాడు.

ఇంద్రజిత్తు హఠాత్తుగా మళ్ళీ లంకలోకి వెళ్ళాడు. మాయ సీతని సృష్టించుకుని రథంలో పెట్టుకుని అందరికీ కనపడేలాగ పడమటి ద్వారం దగ్గిరికి వచ్చాడు.

హనుమంతుడు కోపంగా గొప్ప పర్వతం పెళ్ళగించుకొని ఇంద్రజిత్తు మీదికి ఎగిరి, రథంలో వున్న సీతని చూశాడు.

అశోకవనంలో చూసిన సీతే! మాసిన చీర ... అలంకారాలు లేవు ... "రామ, రామ" అంటూ దుఃఖిస్తూ వుంది. ఇంద్రజిత్తు తొడ మీద కూర్చుని వుంది.

"సీతని ఇక్కడికి తెచ్చాడేమిటి?" అని ఆశ్చర్యపడ్డాడు హనుమంతుడు.

వానరులందరూ చూస్తూ వుండగా ఇంద్రజిత్తు సీత జుట్టు పట్టుకుని ఈడ్చి దెబ్బలు కొట్టాడు.

హనుమంతుడు కోపం పట్టలేక, "దుర్మార్గుడా! నీకు చావు మూడబట్టే సీత జుట్టు పట్టుకున్నావు. బ్రహ్మర్షి వంశంలో పుడితే ఎందుకూ? రాక్షస స్త్రీకి పుట్టావు కాబట్టి రాక్షస బుద్ధే నీది.[414] సీత నీకేం అపకారం చేసిందని ఇంత పాపానికి ఒడిగట్టావు? మూర్ఖుడా! దుష్టుడా! క్రూరుడా! సీతని చంపావంటే నువ్విక నా చేతిలో బతకవు. స్త్రీ హత్య చేసేవాళ్ళు పోయే లోకాలన్నీ నీ కోసం కాసుకు కూర్చున్నాయి" అని అరుస్తూ వానర సేనని వెంట బెట్టుకుని ఇంద్ర జిత్తు మీదికి వెళ్ళాడు.

రాక్షస సేన, వానర సేనని అడ్డగించింది. ఇంద్ర జిత్తు హనుమంతుడితో, "సీతని మీకు దక్క నివ్వను సుమా! ఇప్పడే చంపేస్తాను. తర్వాత, మీ అందర్నీ, విభీషణుణ్ణి కూడా, చంపేస్తాను. స్త్రీ హత్య పాపకార్యం అని ఎవడు చెప్పాడు నీకు? (ఇంకెవడు చెపుతాడు? రాముడే చెప్పి వుంటాడు.) శత్రువుకి దుఃఖం కలిగించే పని ఏదైనా చెయ్యవచ్చును" అంటూ రౌద్రంగా కత్తి తీసి సీత భుజం మీద వొక్కవేటుతో నరికేసి సంతోషంతో సింహనాదం చేశాడు.

ఇంద్రజిత్తు సీతని నరికెయ్యగానే వానరులందరూ భయపడి పారిపోవటం మొదలుపెట్టారు.

హనుమంతుడు వెనక నించి అరిచి, "యుద్ధం నించి పారిపోతున్నారే! సిగ్గు లేదా? పౌరుషం లేదా?" అంటూ తిట్టి, రోషం తెప్పించి, అందర్నీ వెనక్కి పిల్చి, ఇంద్రజిత్తు మీదకి దండెత్తాడు.

మళ్ళీ ఘోర యుద్ధం జరిగింది. హనుమంతుడు ఇంద్రజిత్తు మీద గొప్ప పర్వతం విసిరాడు. ఇంద్ర జిత్తు సారధి, నేర్పుగా రథం తప్పించేశాడు గానీ, ఆ పర్వతం కిందపడి బోలెడుమంది రాక్షసులు చచ్చిపోయారు. కొంతసేపు యుద్ధం చేసి హనుమంతుడు వానరులతో, "సీత పోయిన విషయం రాముడికీ, సుగ్రీవుడికీ చెప్పి ఏం చెయ్యమంటే అది చేద్దాం. ప్రస్తుతం యుద్ధం నిలుపుచేద్దాం" అని యుద్ధం ఆపి రాముడుండే చోటుకి బయల్దేరాడు.

వానరులు యుద్ధం ఆపి వెళ్ళిపోగానే ఇంద్రజిత్తు హోమం చెయ్యటానికి నికుంభిలా దేవాలయానికి వెళ్ళాడు. అక్కడ యాగం చేశాడు. హోమంతో తృప్తి చెందిన అగ్ని, జ్వాలలు తీర్చి వెలిగింది. యాగ విధులన్నీ సక్రమంగా జరిగేటట్టు కొందరు రాక్షసులు శ్రద్ధగా చూస్తూ వున్నారు.

హనుమంతుడు ఇంకా యుద్ధం ఆపకముందు, రాముడు, యుద్ధరంగం నించి వినబడుతోన్న ఘోష విని జాంబవంతుణ్ణి పిలిచి "హనుమంతుడు చాలా సాహసంగా పోరుతున్నాడు. నువ్వు సేనలతో వెళ్ళి సహాయం చెయ్యి! (నేను విశ్రాంతిగా పడుకుంటాను.)" అన్నాడు.

జాంబవంతుడు ఎలుగుబంట్ల సేనల్ని తీసుకుని పడమటి ద్వారానికి వస్తూంటే, హనుమంతుడు ఎదురు పడి అందర్నీ వెనక్కి మళ్ళించి తీసుకు పోయాడు.

---

**413.** **యుద్ధ, సర్గ 80, శ్లోకాలు 37 .... 40:** "లక్ష్మణుడు మిగుల కోపము గలవాడై రాక్షసుల నందరినీ చంపుటకై బ్రహ్మాస్త్రమును ప్రయోగించునటుల అన్న యగు రామునితో జెప్పెను .... రాముడిటులనెను .... ఒకని నేరమునకై భూమిలోనుండు రాక్షసులనందరినీ జంపుట తగదు. యుద్ధము సేయని వారిని, దాగియుండు వారిని, శరణు కోరు వారిని, పారిపోవు వారిని, చంపుట తగదు."

యుద్ధ రంగంలో ఉన్న శత్రు సైన్యమంతా యుద్ధం చేసేవాళ్ళే కదా? అక్కడ యుద్ధం చేయని వాళ్ళెందుకుంటారు? ఎప్పుడూ గొప్ప గొప్ప నీతులు వల్లించాలని ఒకటే రంధి రాముడికి! ★

**414.** **యుద్ధ, సర్గ 81, శ్లోకం 19:** హనుమంతుడు ఇంద్రజిత్తుని తిడుతూ, "రాక్షస యోనికి పుట్టావు" అంటున్నాడు. రాక్షసుల్ని తిట్టేటప్పుడు ఈ మాట వాడడం ఇంకా కొన్ని సందర్భాల్లో ఉంది. "వారే! మాలదాని .... కి పుట్టావురా! మాదిగోడి .... కి పుట్టావురా!" అని తిడతారే, అలాంటి తిట్టే ఇది. సంస్కృతంలో చెప్పినంత మాత్రాన ఇది 'బూతు తిట్టు' కాకుండా పోదు. హనుమంతుడి పాత్రకి బూతు తిట్లు తగినవే. అది వేరే సంగతి. ★

రాముడి దగ్గిరికి వెళ్ళి దుఃఖిస్తూ సంగతంతా చెప్పాడు. "రామా! మేము యుద్ధం చేస్తూ వుంటే ఇంద్రజిత్తు సీతని తెచ్చి మేము చూస్తూండగానే చంపేశాడు. ఈ దుఃఖవార్త నీకు చెప్పాలని వచ్చాము" అన్నాడు.

రాముడు వెంటనే కిందపడి మూర్ఛబోయాడు.

లక్ష్మణుడు అన్నగారి దగ్గిర దుఃఖిస్తూ కూర్చుని ధర్మా ధర్మాల చర్చ ప్రారంభించాడు. "అయ్యో! ఎంత కష్టం వచ్చింది నీకు! ఎప్పుడూ ధర్మ మార్గంలోనే నడిచావు. కష్ట సుఖాలు ఒక్కటిగానే భావించావు. నీ ధర్మ ప్రవర్తన నీకు కష్టాలు లేకుండా చెయ్యలేక పోయింది. అసలు 'ధర్మం, ధర్మం.' అనడమే గానీ ధర్మం ఎక్కడుంది? ధర్మమే వుంటే, ధర్మ మార్గాన నడిచిన నీకు కష్టం వస్తుందా? (నీ అన్న నడిచింది ధర్మ మార్గం కాదేమో నోయీ లక్ష్మణా! లేకపోతే కష్టం వొస్తుందా? కష్టం వచ్చింది గాబట్టి, అది ధర్మమార్గం కాదని తెలుసుకో లేవూ?)

దుర్మార్గుడైన రావణుడే సుఖంగా ఉన్నాడు. నువ్వు ఎంత ధర్మాత్ముడివైనా కష్టాలు పడుతున్నావు.

లోకంలో చెడ్డవాళ్ళే సుఖపడుతున్నారు. ధర్మానికి మంచీ, అధర్మానికి చెడ్డా జరగాలి కదా? అలా జరుగు తోందా? ధర్మంగా నడిచే వాళ్ళు సుఖపడి, అధర్మంగా నడిచే వాళ్ళు కష్టపడితే, ధర్మాధర్మాలకు తగిన ఫలితాలు ఉన్నాయని నమ్మవచ్చు. కానీ, అలా జరక్కపోతే ధర్మం మంచిదని ఎలా నమ్ముతాం?

నీకు పట్టాభిషేకం చేస్తానని చెప్పి, చెయ్యకుండా అసత్య మార్గాన ప్రవర్తించిన తండ్రిని నువ్వు ఎందుకు ధిక్కరించలేదు? అసత్య కార్యానికి తోడ్పడితే నువ్వు కూడా అసత్యవంతుడివి అయినట్టే కదా? (దశరథ మహారాజు ప్రవర్తన 'అసత్యమే' అని తేలుస్తున్నాడు కవి. దశరథ మహారాజు స్వర్గంలో వున్నాడో, నరకంలో వున్నాడో తెలిస్తే బాగుణ్ణు! రాజ్యం రాలేదన్న బాధ నిత్యం కెలకవేస్తూనే వుంది ఈ అన్నదమ్ములికి!)

ఎప్పుడేది మనకు అవసరం అయితే అదే పాటిం చాలి. ధర్మం అయినా సరే, అధర్మం అయినా సరే! నువ్వు సిరి సంపదలన్నీ త్యజించావు. కానీ, ధనం ఉన్న వాడే మహా పురుషుడు. బుద్ధిమంతుడు, పండితుడు, (అవతల ఇంద్రజిత్తు సీతని చంపాడనే వీళ్ళనుకుంటు న్నారు. ఇప్పుడు ధనం మీద చర్చలు!) ఒకటేమిటి? ధనం ఉన్నవాడు సకల సద్గుణ సంపన్నుడే. ధనం వల్లనే కీర్తి ప్రతిష్ఠలు వస్తాయి. ధనం వల్ల కోరికలన్నీ తీర తాయి. ధనం వల్ల పది మందిలో దర్పంగా ఉండ వచ్చును. ధనం వున్న వాడికి కోపం వచ్చినా చెల్లు తుంది. అతడు సహనం వహించితే కీర్తి కలుగుతుంది. ధనం ఉంటే ఏ గుణం అయినా రాణిస్తుంది. (ధనానికి ఇంత విలువ ఇవ్వటం, లక్ష్మణుడికి – అంటే కవికి, నీచంగా, తప్పుగా, కనపడడం లేదు. లోకం తీరు అలా వుంది కాబట్టీ, లోకంలో ధనానికి అంత విలువ ఉంది కాబట్టీ, ధనం తప్పకుండా ఉండాలి' అంటున్నాడు. అధర్మంగా అయినా సరే, ధనం సంపాదించుకుని దాని వల్ల వచ్చే సుఖాలన్నీ పొందాలి – అంటున్నాడు!)

సిరి సంపదలు అక్కర లేదని తిరస్కరిస్తే మళ్ళీ ధనం సంపాదించడం తేలిక కాదు. దానికోసం పాపకార్యాలు చెయ్యాలి. (దీని అర్థం – ధనం సంపాదించడం, పాప కార్యాలు చెయ్యకుండా సాధ్యం కాదు – అని! ధనం ఉందంటే, అది పాపకార్యాలు చెయ్యడం వల్ల వచ్చిందే అన్నమాట!)

అసలు మొదట సిరి సంపదలు పోగొట్టు కోవడమే తప్పు. నువ్వు రాజ్యం ఎందుకు వదిలేశావో నాకు అర్థం కావటం లేదు. (ఏ నాడో రాజ్యం సంగతి ఇప్పుడా! లక్ష్మన్నా! నీ అన్న ఆ నాడు తండ్రి మీద తిరగబడి బల వంతంగా రాజ్యం లాక్కుని వుంటే, ఇక 'రామాయణం' కథ ఎవడు రాస్తాడోయీ? ఈ కీర్తి అంతా బస్తాల కొద్దీ అప్పుడు మీరు ఎలా పోగేసుకుంటారు?)

సిరి సంపదలు వదులుకుని, ఉందో లేదో తెలియని ధర్మాన్ని నమ్ముకోవడం వల్ల ఏం సుఖపడ్డావు? (రాముడు రాజ్యం తీసుకోలేదని ఎంత సాధిస్తున్నాడో కవి!) తండ్రి మాట వింటే ఏం వొరిగింది నీకు, అష్ట కష్టాల పాలయ్యావే గానీ? (మరి, లక్ష్మణా! నీ సంగ తేమిటి? అయోధ్యలోనే వుండి సుఖపడక, ఉందో లేదో తెలీని భ్రాతృసేవా ధర్మాన్ని నమ్ముకుని అడవికి వొచ్చా వెందుకు? ఏం వొరిగింది నీకు?)

పురుషోత్తముడా! నువ్వు పరమాత్ముడివని నిన్ను నువ్వు తెలుసుకో! ఇంద్రజిత్తు చాలా దుఃఖం కలిగించాడు నీకు. నీ దుఃఖం నేను పోగొడతాను. సీత పోయిందనే దుఃఖంతో ఇదంతా మాట్లాడాను. ఇక లంకని సర్వ నాశనం చేసేస్తాను" అంటూ వీరత్వంతో దుఃఖించాడు లక్ష్మణుడు.[415]

అంతలో ఏనుగు వంటి పరాక్రమవంతుడైన విభీష

**415.** యుద్ధ, సర్గ 83, శ్లోకాలు 14 .... 44: విచారిస్తూ పడుకుని వున్న రాముడితో, లక్ష్మణుడు చెప్పిన మాటల్ని ఇప్పటిదాకా చూశాం. వాటిలో కొన్ని: "నరుడు సమస్తమూ యథేచ్ఛగా చేయుట మంచిదే."

అంటే, 'ఎలా ఇష్టమైతే అలా చెయ్యవచ్చు. ధర్మాధర్మాలు ఉన్నాయనుకో నక్కరలేదు' అని అర్థం. ఇష్టం అవడం, ఇష్టం అవకపోవడం అనేవి మాత్రం ఎలా కలుగుతాయి? 'ఇది ధర్మం, అది అధర్మం' అని ఏ సమాజం చెప్తుందో, 'దీన్ని ఇష్టపడాలి, దాన్ని ఇష్టపడకూడదు' అని ఆ సమాజమే చెప్తుంది. 'ధర్మం' అని సమాజం చెప్పేదాన్నే మనం ఇష్టం చేసుకుంటాం. ➔

ఖుడు, తన అనుచరులతో (నాలుగు ఏనుగులతో) వొచ్చాడు.

దుఖిస్తోన్న లక్ష్మణుణ్ణీ, వానరుల్నీ, లక్ష్మణుడి తొడ మీద పడుకుని వున్న రాముణ్ణీ, చూశాడు. సంగతేమిటని అడిగాడు. (సంగతేమిటో ఈ ఏనుగు పరాక్రమవంతుడికి ఇప్పటిదాకా తెలీదు. ఇంతసేపూ ఎక్కడ పచార్లు మిడుకుతున్నాడో!) ఇంద్రజిత్తు సీతని చంపేశాడని వానరులు చెప్పారు.

విభీషణుడు రాముడికి ధైర్యం చెప్పాడు. "ఇంద్రజిత్తు సీతని చంపడం ఎన్నటికీ జరగదు. (జరిగింది కదోయ్?) సముద్రం ఎండిపోవడం ఎలాంటిదో ఇదీ అలాంటిదే. (రాముడు తన బాణాలతో సముద్రాన్ని ఎండగడతానని చాలాసార్లు అన్నాడే! అది జరిగేది కాదా?) రావణుడికి సీత అంటే అంతులేని మోహం. అలాంటి సీతని చంపటానికి అతడు వొప్పుకుంటాడా? ఇంద్రజిత్తు ఏదో మాయ చేశాడు. రామా! దుఖం విడిచి పెట్టు! (లేచి పనిచెయ్యి!) ఇంద్ర జిత్తు నికుంభిలా దేవాలయానికి వెళ్ళాడు. (నీకెలా తెలిసిందేంటి? ఇంద్రజిత్తు వానరుల్తో చెప్పి వెళ్ళాడా?) ఇంద్రజిత్తు హోమం చేసి వచ్చాడంటే ఇక అతన్ని చంపడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ఇక మనం అందరం చచ్చిపోయినట్టే. ఇంద్రజిత్తుని చంపటానికి ఇప్పుడే లక్ష్మణుణ్ణి నాతో పంపు రామా! 'నువ్వు ఇక్కడే వుండు. (హాయిగా కూర్చో!) ఇంద్రజిత్తుతో బ్రహ్మ చెప్పాడు – నువ్వు నికుంభిలకు పోకుండా, హోమం పూర్తి చెయ్యకుండా ఎవడు నిన్ను అడ్డగిస్తాడో వాడే నిన్ను చంపేవాడు' అని చెప్పాడు. కాబట్టి ఇంద్రజిత్తుని హోమం చెయ్యకుండా ఆపాలి మనం. (విభీషణుడు, రాముడికి ఎప్పటికప్పుడు ఇలాంటి రహస్యాలన్నీ చెపుతున్నాడు.) ఇంద్రజిత్తు చచ్చిపోతే ఇక రావణుడు పోయాడే అనుకో. రామా! నువ్వు దుఖిస్తూ వుంటే నాకూ దుఖం వస్తోంది. (అయితే నువ్వూ దుఖించూ! దుఖించడంలో రాముడికి సాయం చెయ్యి!) – ఇంద్రజిత్తు చేస్తోన్న యాగం చెడగొట్టి, తర్వాత అతన్ని చంపెయ్యాలి. ఇక ఆలస్యం చెయ్యకు. లక్ష్మణుణ్ణి నాతో రమ్మని చెప్పు! (నేను రమ్మంటే రాడు)"

విభీషణుడు చెప్పింది విని రాముడు నెమ్మదిగా లక్ష్మణుడి తొడమీద నించి లేచాడు. (తొడమీద నించి రాముడు లేచాక, తొడ తిమ్మిరి తగ్గి, లక్ష్మణుడి ప్రాణం తేరుకుని వుంటుంది.) "విభీషణా! ఇంద్రజిత్తు మహా పరాక్రమవంతుడు. (తెలిసొచ్చినట్టే ఉంది!) అతనికి బ్రహ్మాస్త్రం తెలుసు. మాయలన్నీ తెలుసు. (నీకూ తెలుసుగా – సముద్రాల్ని జడిపించడం, పర్వతాల్ని బెదిరించడం, అన్నీ!) ఆకాశంలో ఎగిరాడంటే ఎక్కడ తిరుగుతాడో కూడా తెలీదు. (ఎక్కడ తిరుగుతాడో నీకు చెప్పి తిరగాలా?) – లక్ష్మణా! నువ్వు వెంటనే హనుమంతుడితో, జాంబవంతుడితో, సేనలతో, వెళ్ళు! విభీషణుడు తీసుకెళ్తాడు. వెళ్ళి ఇంద్రజిత్తుని చంపేసిరా!" అని లక్ష్మణుణ్ణి ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు రాముడి పాదాలకు నమస్కరిం చాడు. "నా గొప్ప బాణాలు ఇంద్రజిత్తు మీదపడి అతన్ని చీల్చుకుంటూ లంక మీదకు పోయి పడతాయి" అని బయల్దేరాడు.

విభీషణుడు అందర్నీ ఇంద్రజిత్తు ఉండే చోటికి తీసుకు వెళ్ళాడు. అక్కడ, మళ్ళీ రాక్షసులకూ, వానరులకూ యుద్ధం ప్రారంభమైంది. హనుమంతుడు వీర విహారం చేసేస్తూ రాక్షసుల్ని చంపెయ్యడం ప్రారంభించాడు.

ఇంద్రజిత్తు, యాగం పూర్తి కాకుండానే లేచి వచ్చేశాడు. హనుమంతుడి వేపు రథం పోనివ్వమన్నాడు. కత్తులూ, గొడ్డళ్ళూ, పట్టసాలూ, ఇంకా రక రకాల ఆయుధాలూ విసురుతూ యుద్ధం ప్రారంభించాడు.

(దీని తర్వాత, కథ, మళ్ళీ వెనక్కి వెళ్ళి వచ్చింది!)

విభీషణుడు లక్ష్మణుణ్ణి తీసుకుని నికుంభిలా వనానికి వెళ్ళి హోమం జరుగుతున్న చోటు చూపించాడు. "అదుగో! ఆ మర్రి చెట్టు చూడు! ఇంద్రజిత్తు అక్కడే బలి ఇచ్చి హోమం పూర్తిచేసి యుద్ధానికి వస్తాడు. ఇంద్రజిత్తుని మర్రి చెట్టు కిందకి వెళ్ళ నివ్వకుండా చెయ్యాలి. వెంటనే చంపెయ్యి!" అని తొందర చేశాడు.

లక్ష్మణుడు ఇంద్రజిత్తు సమీపానికి పోయి, "నిన్ను యుద్ధానికి పిలుస్తున్నాను, రా!" అన్నాడు.

---

➔ధర్మం కాని దాన్ని అయిష్టంతో వొదిలెయ్యాలని ప్రయత్నిస్తాం. ఇష్టాయిష్టాల ప్రకారం ప్రవర్తించడం అంటే అర్థం, ఆ నాటి సమాజ ధర్మా ధర్మాల ప్రకారం ప్రవర్తించడమే.

"ధనము గలవాడే పురుషుడు." అంటే, ధనం లేనివాడు స్త్రీతో సమానుడు. అసమర్థుడు! అని అర్థం.

"ధనము గలవాడే పండితుడు." – ధనహీనుడు ఎంత విద్యావంతుడైనా గుర్తింపు ఉండదు. ధనం ఉంటే, చదువు లేకపోయినా పండితుడే!

"ధనము గలవాడే ప్రసిద్ధుడు. బుద్ధిమంతుడు. సకల సద్గుణ సంపన్నుడు." ధనం వున్నవాడు ఎన్ని నీచాలు చేసినా అవన్నీ సద్గుణాలు ఐపోతాయి. స్త్రీ వ్యామోహం – రసికత్వం అవుతుంది. దోపిడీలు చేస్తే – పరాక్రమం అవుతుంది. హత్యలు చేస్తే – దుష్ట శిక్షణ అవుతుంది. ధనం ఉంటే, ఈ రకంగా అర్థాలు మారిపోతాయి. ★

ఇంద్రజిత్తు అంతా గ్రహించాడు. విభీషణుణ్ణి చూశాడు. "ఓరీ దుర్మార్గుడా! పినతండ్రివై వుండి కూడా ఇంత ద్రోహానికి తలపడ్డావా? నీకు నీతి లేదు. జాతి లేదు. (న జాతి = జాతి లేదు. జాతిని వొదిలేసిపోయావు – అని అర్థం.) మర్యాద లేదు. మమకారం లేదు. ధర్మచింతైనా లేదు. స్వజనాన్ని వదిలి పెట్టి శత్రువు దగ్గిర సేవకుడిగా (భృత్యః – అని వాడాడు కవి) బ్రతుకుతున్నావు. తన వారికీ, పరాయి వారికీ భేదమేమిటో తెలుసుకోలేకపోయావు. శత్రువు గుణవంతుడైనా, స్వజనుడు గుణహీనుడైనా, స్వజనుడి వల్లే మేలు జరుగుతుంది గానీ, శత్రువు వల్ల ఎన్నటికీ మేలు జరగదు. (రాముడు గుణవంతుడనీ, రావణుడు గుణహీనుడనీ, ఇంద్రజిత్తు కూడా భావిస్తున్నట్టు, కవి చూపించడం!) శత్రువు ఎప్పుడూ శత్రువే. నిన్ను తన అవసరాలకు ఉపయోగించుకొని, తన కార్యం ముగించుకొని, తర్వాత నిన్ను ఓడిస్తాడు. ఆ సంగతి గ్రహించలేక శత్రు పక్షంలో చేరి ఇంత దుర్మార్గానికి వొడిగట్టావు, నీచుడా!" అని ఛీత్కరించాడు ఇంద్రజిత్తు.

విభీషణుడు కోపంతో కళ్ళెర్రజేశాడు. "అహంకారంతో ఎందుకలా పేలతావు? పినతండ్రిననే మర్యాద లేకుండా మాట్లాడకు. (చంపించటానికి వొచ్చినందుకు పినతండ్రికి గౌరవంతో నమస్కారం పెట్టవోయీ ఇంద్రజిత్తూ!) దుర్మార్గాలు చేసే రాక్షస జాతిలో పుట్టాను గానీ, నేను దుర్మార్గుణ్ణి కాను. నేను ఎవర్నీ హింసించలేదు. ఎవ్వరికీ ద్రోహం చెయ్య లేదు. నాకు తోడబుట్టిన వాడై వుండి రావణుడు నన్ను దేశం నించే వెళ్ళగొట్టేశాడు. అది తప్పు కాదా? (దేశ బహిష్కార శిక్ష లేకపోయినా, విభీషణుడు బైటికి పోయి రాముడితో కలిసే వాడే!)

పరుల సొమ్మునీ, పరుల భార్యల్నీ, అపహరించే దుర్మార్గుడు రావణుడు. ఎప్పుడూ పాపాలే చేస్తాడు. రుషుల్ని చంపటం, దేవతలతో యుద్ధాలు చెయ్యటం, శత్రుత్వాలు పూనటం, పరుల శ్రేయస్సు కోరక పోవటం – అన్నీ దుర్గుణాలే. అలాంటి వాణ్ణి నేను వది లెయ్యడంలో తప్పేముంది? చేతిలో ఉన్న విషాన్ని పారేసి సుఖంగా ఉండడంలో తప్పేముంది?

స్నేహితుల్ని సందేహించే దుర్మార్గుడు రావణుడు. నన్ను సందేహించి వెళ్ళగొట్టాడు. (రాముడైతే, తమ్ముళ్నీ భార్యనీ కూడా సందేహిస్తాడే!) నువ్వు అహంకారివి. గర్విష్టివి. మంచి మర్యాదలు లేని వాడివి. నోటికొచ్చినట్టు వాగుతున్నావు. యమపాశాలు సిద్ధంగా వున్నాయి నీ కోసం. నీ కింక మూడిందిలే. ముందు ఈ మహానుభావుడితో యుద్ధం చెయ్యి. (తర్వాత పెద్ద మహానుభావుడితో చేద్దువు గాని) నీ ఇష్టదేవతా ప్రార్థన యమలోకంలో చేసుకుందువు గానిలే" అని వెటకారాలు చేస్తూ విభీషణుడు ఇందజిత్తుని కవ్వించాడు.[416]

ఇంద్రజిత్తు కోపం పట్టలేక యుద్ధానికి దిగి లక్ష్మణుణ్ణి చూశాడు. "నా బాణాల రుచి గుర్తులేదా? అందరూ వరసగా మూర్ఛలకు పడ్డారే! మరిచిపోయావా, మళ్ళీ వొచ్చావు?" అన్నాడు.

"గొప్పలెందుకోయీ! పని చేసి చూపించు! (మళ్ళీ బోర్లా పడేట్టు కొట్టి చూపించాలి గావున్ను!) దొంగలాగా, చాటుగా యుద్ధం చెయ్యడం గొప్ప కాదు. వీరుడైన వాడు అలా చెయ్యడు. (ఏదీ లక్ష్మణా! నీ మొహం ఒకసారి ఇటు చూపించు! వాలి విషయంలో నీ అన్న ఏం చేశాడోయీ?)

లక్ష్మణుడు ఇంకా – "నీ బాణాలతో ఎప్పుడో మమ్మల్ని మూర్ఛ పోగొట్టానంటున్నావు! ఎప్పుడో జరిగిన సంగతెందుకు? ఇప్పుడు నీ పరాక్రమం చూపించు!" అన్నాడు.

ఇంద్రజిత్తు కోపంగా బాణాలేసి, అవి లక్ష్మణుడికి తగలగానే, "ఇక ఫో! నీ అన్నకి చూపించుకో" అన్నాడు.

"ఎందుకా అహంకారం? (నాకేం తగల్లేదులే)

---

**416.** **యుద్ధ, సర్గ 87, శ్లోకాలు 19... 30:** ఇంద్రజిత్తు మాటలకు విభీషణుడి జవాబు: "రాక్షసుడా! దుర్మార్గుడా! నా శీలము నెరుగక ఎందుకు ఇట్లు మొరుగుచున్నావు? నేను నీకు పినతండ్రినై, గౌరవించబడవలసిన వాడనై యున్నాను. కఠినమైన మాటలు చెప్పవలదు. పాప కార్యములు సేయు రాక్షస కులములో నేను పుట్టితిని. అయినను, నా స్వభావము క్రూరమైనది కాదు. సత్పురుషుల స్వభావమే నా స్వభావము. పరులకు హింస కలిగించుట నాకు ఇష్టము కాదు. (పూర్తిగా చంపించుట మాత్రమే నాకు ఇష్టము.) మహర్షులను చంపుట, సకల దేవతలతో భయంకరమైన యుద్ధములు చేయుట, కోపము, వైరము, వ్యతిరేకతా ఇవి రావణుని దోషములు. ఈ దోషము లుండినందుననే నేను రావణుని విడిచిపెట్టితిని."

రావణుడు యుద్ధాలు చేసేది ఎవరితో? తన శత్రువులతో! అతని శత్రువులు రుషులూ దేవతలూ. శత్రువుల మీద కోపం పెట్టుకోక, వ్యతిరేకత పెట్టుకోక, యుద్ధాలు చెయ్యక, ఏం చేస్తారు? దేవతలు, తమ శత్రువులతో యుద్ధాలు చెయ్యడం లేదా? రాముడు, తన శత్రువులతో యుద్ధాలు చెయ్యడం లేదా?

విభీషణుడు: "రాక్షసుడా! నీవు మూర్ఖుడవు. వివేక శూన్యుడవు... నీవూ, నీ తండ్రీ నాశనమై పోదురు. నీవు ఇప్పుడు హోమము చేయలేవు. రామ లక్ష్మణులను తిరస్కరించి నీవు జీవించలేవు. హతుడవై నీ ఇష్టదేవతా ప్రార్థనము యమలోకములో చేయవచ్చును. నీవిక నన్నేమియూ చేయలేవు." (వొరే, నువ్వు నన్నేం చెయ్యగలవురా? – అన్నట్టు.) ★

వ్యర్థంగా ఆత్మస్తుతి చేసుకుంటున్నావు. నీలాగ గొప్పలు చెప్పుకోకుండానే, పరుషంగా మాట్లాడకుండానే, నిన్ను చంపుతాను చూడు" అంటూ లక్ష్మణుడు 5 బాణాలు వేశాడు. (చంపడం సుతారంగా చేస్తాడు గావును!)

ఇంద్రజిత్తు 3 బాణాలు వేశాడు. ఇద్దరికీ గొప్ప యుద్ధం జరిగింది. భూమిలో అంతవరకూ అలాంటి యుద్ధం జరగలేదు. (ఏంటి? 5 బాణాలకీ, 3 బాణాలకీ గొప్ప యుద్ధమా? చెప్పుకుంటే సిగ్గు!) యుద్ధం ఎంత గొప్పగా జరిగిందంటే – చెప్పడం కుదరదు. (మళ్ళీ ఇంద్రజిత్తూ, లక్ష్మణుడూ వొచ్చి చేసి చూపించాలి, అంతే!)

ఇంద్రజిత్తు మొహం కొంత కాంతి తగ్గినట్టు అయింది.

విభీషణుడు లక్ష్మణుడితో, "ఇంద్రజిత్తు మొహం కాంతి తగ్గింది. ఇక ఎంతోసేపు పట్టదు. తొందరగా చంపెయ్యి!" అని ప్రోత్సహించాడు.

లక్ష్మణుడు ఉత్సాహంతో బాణ వర్షం కురిపించాడు. ఇంద్రజిత్తు కవచం పగిలింది. ఇద్దరూ, అందంగా, ఆశ్చర్యంగా, నేర్పుగా, భయంకరంగా, యుద్ధం చేస్తున్నారు. ఇద్దరూ, రక్తాలు కారుతూ, పూచిన బూరుగు చెట్లలాగ, సెలయేళ్ళు ప్రవహించే పర్వతాలలాగ, అయ్యారు. (కవికి, రక్తాల్నీ, హింసనీ వర్ణించడం ఎంత ఇష్టమో!)

విభీషణుడి అనుచరులు కూడా వీరోచితంగా పోరుతూ రాక్షస సేనని నాశనం చేస్తున్నారు. (రేపు మంత్రి పదవులు దొరుకుతాయనే ఉత్సాహం!)

విభీషణుడు వానర సేనలో తిరుగుతూ వాళ్ళకు యుద్ధోన్మాదంతో వెర్రెత్తేలాగ అరుస్తున్నాడు. "ఈ ఇంద్రజిత్తు తప్ప ఇక రావణుడి కేమీ బలం లేదు. ఇతన్ని చంపేస్తే రావణుణ్ణి జయించేసినట్టే. ప్రహస్తుణ్ణీ, కుంభకర్ణుణ్ణీ, ధూమ్రాక్షుణ్ణీ, జంబుమాలినీ, కుంభ నికుంభుల్నీ, నరాంత దేవాంతకుల్నీ – ఎందరెందరో రాక్షస వీరుల్ని చంపేశారు మీరు. ఇంద్రజిత్తు మాత్రం మీకెంత? ఇప్పుడే మీ పరాక్రమం చూపించాలి. ఇతన్ని చంపేస్తే యుద్ధం అయిపోయినట్టే! ఇంద్రజిత్తుని నేనే చంపేవాణ్ణి గానీ, ఎంతైనా పిన తండ్రిని గదా, నేను చంపితే బాగుండదని ఆలోచిస్తున్నాను. కానీ, శ్రీరాముడి కోసం ఏ పనైనా చేస్తాను. తీరా ఇంద్రజిత్తుని చంపాలనుకుంటే నాకు దుఃఖం వొస్తోంది. అందుచేత నేను చంపను. లక్ష్మణుడు చంపుతాడు. మీరందరూ ఇంకా ఉత్సాహం చూపించాలి!" అంటూ ఉత్సాహ పరుస్తోంటే వానర సేన యుద్ధోత్సాహంతో ఊగిపోయింది.[417]

మళ్ళీ భీకర పోరాటం జరిగింది. ఇరు పక్షాల వారూ సరిసమానంగా పోరుతున్నారు. జయం ఎవరికో తెలీడం కష్టం అయింది. బాణ వర్షంతో దిక్కులు మూసుకుపోతున్నాయి. రక్త నదులు ప్రవహిస్తున్నాయి. ఆకాశంలో దేవతలు భయపడి కొంచెం దూరం పోయి నించున్నారు. (బాణాలు తగులుతాయనా?)

కొంతసేపటికి లక్ష్మణుడు ఇంద్రజిత్తు సారథిని తల నరికి చంపేశాడు. ఇంద్రజిత్తు స్వయంగా రథం నడుపుకుంటూ యుద్ధం సాగించాడు. అది శ్రీరాముడు మాత్రమే చేయగలిగే పని!

నలుగురు వానరులు ఆకాశంలో కెగిరి ఇంద్రజిత్తు రథానికి ఉన్న గుర్రాల మీద ఉరికి వాటిని చంపేసి, రథం విరిచేశారు.

ఇంద్రజిత్తు రథం లోంచి బయటపడి రాక్షసులతో, "నేను లంకకు పోయి ఇంకో రథం తెచ్చుకుంటాను. నేను లేనట్టు తెలీకుండా మీరు శత్రువుల్ని అడ్డగించండి" అని లంకకు బయల్దేరాడు. (రథం నువ్వే వెళ్ళి తెచ్చుకోవాలా? నువ్వు ఇక్కడే ఉండి ఎవర్నన్నా పంపవోయీ! ఇంత తెలివి తక్కువ వాడివైతే ఎలా నెగ్గుతావు?) ఇంద్రజిత్తు లంక నించి వెంటనే ఆయుధాలతో నిండుగా ఉన్న ఇంకో రథంతో వొచ్చేశాడు. (తెలివైన వాడివే అయితే.)

మళ్ళీ భీకరంగా యుద్ధం జరిగింది. లక్ష్మణుడు మళ్ళీ ఇంద్రజిత్తు ధనుస్సు విరిచేశాడు. ఇంద్రజిత్తు ఇంకో ధనుస్సు తీసి నారి బిగించుకున్నాడు. లక్ష్మణుడు దాన్ని కూడా విరగొట్టేశాడు. ఇందజిత్తు మళ్ళీ ధనుస్సు తీసుకుని బాణాలు గుప్పించాడు. ఆ బాణాలన్నిట్నీ లక్ష్మణుడు తన మీదకు రాకుండా మధ్యలోనే ఛేదించేసి ఇంద్రజిత్తు తెచ్చుకున్న రెండో సారథి తల కూడా నరికేశాడు.

ఇంద్రజిత్తు కోపంలో విభీషణుడి మొహం మీద 3 బాణాలు కొట్టాడు. (మూడేనా? విభీషణుడి మీద అంత తక్కువ కోపమా ఇంద్రజిత్తూ నీకు?)

ఇంద్రజిత్తు, శక్తిని తీసి విభీషణుడి కేసి కొట్టాడు.

---

**417.** యుద్ధ, సర్గ 90, శ్లోకాలు 7... 19: ".... ఉత్తముడగు విభీషణుడు వానరులను పురిగొల్పుచూ సమయము జూచి ఇటులనెను. వానరులారా! ఎందుకు ఊరుకున్నారు? పాపియగు ఈ ఇంద్రజిత్తు చచ్చిన పిమ్మట రావణునకు బలము లేదు. బలవంతులైన రాక్షసులందరూ యుద్ధమునకు వచ్చి చచ్చిరి. ఈ పని మాత్రమే మిగిలియున్నది. తండ్రినగు నేనే కొడుకును చంపుట తగదు. (కొడుకుని చంపించుట తండ్రికి తగును!) అయినను రాముని కోసం, అన్న – పుత్రుని చంపెదను. ఇంద్రజిత్తుని చంపుటకు గోరుచుండు నా కంటిని బాష్పములు అడ్డగించుచున్నవి. ఇతనిని గొప్ప భుజములు గల లక్ష్మణుడు చంపును..."

★

లక్ష్మణుడు దానిని దారిలోనే ముక్కముక్కలు చేసేశాడు. ఇంద్రజిత్తు యముడిచ్చిన బాణం ఎక్కుపెట్టాడు. (అలాంటివి పని చెయ్యవులే ఇంద్రజిత్తూ!)

అది చూసి లక్ష్మణుడు తనకు కుబేరుడు కలలో ఇచ్చిన బాణం తీసి ఎక్కుపెట్టాడు. (కలలో బాణమా? దాని మొహం, అదేం పని చేస్తుందీ?)

ఆ బాణాలు రెండూ ఢీకొట్టుకొని ముక్క ముక్కలై పోయాయి. (చూశారా, కుబేరుడు, లక్ష్మణుడి మోహాన ఎలాంటి బాణం పడేశాడో!) లక్ష్మణుడు మళ్ళీ వారుణాస్త్రం వేశాడు. (ఇదెవడిచ్చాడో? వరుణుడేనా?) ఇంద్రజిత్తు రౌద్రాస్త్రం వేశాడు. అది నిష్ఫలం అయిపోయిందని మళ్ళీ ఆగ్నేయాస్త్రం వేశాడు. లక్ష్మణుడు దాన్ని సౌరాస్త్రంతో కొట్టేశాడు. ఇంద్రజిత్తు, అసురాస్త్రం వేశాడు. ఆ అస్త్రంలోంచి కత్తులూ, గొడ్డళ్ళూ, శూలాలూ, గదలూ, రోకళ్ళూ, ఎన్నెన్నో పుట్టుకొచ్చేశాయి. అంతలో లక్ష్మణుడు మహేశ్వరాస్త్రం ప్రయోగించి దాన్ని నాశనం చేసేశాడు.

ఆకాశంలో దేవతలంతా నిర్ఘాంతపోతూ లక్ష్మణుడి నెత్తి మీద జేరారు. (బాణాలు తగుల్తాయి పొండి! ఏం చేస్తారూ, వాళ్ళు కొట్టుకు ఛస్తొంటే?)

ఇంద్రుడితో సహా దేవతలందరూ లక్ష్మణుణ్ణి రక్షిస్తూనే వున్నారు. (అక్కడ కూర్చునా రక్షించడం? వచ్చి సాయం చెయ్యరాదూ?అయినా, ఇంద్రుడికి, తనని జయించిన ఇంద్రజిత్తంటే భయం లేదా?)

లక్ష్మణుడు బ్రహ్మాండమైన ఐంద్రాస్త్రం తీశాడు. అది పూర్వం దేవాసుర యుద్ధంలో పని చేసింది. (సరేలే, అది ఎప్పుడో తుప్పు పట్టేసి వుంటుంది.) అది, గొప్ప పరాక్రమం కలది. తిరుగులేనిది. అలాంటి ఐంద్రాస్త్రంతో లక్ష్మణుడు "ఓ ఐంద్రాస్త్రమా! శ్రీరాముడు ధర్మాత్ముడూ, పరాక్రమవంతుడూ, సత్య సంధుడూ అవడం సత్యమే అయితే (పాపం, ఐంద్రాస్త్రాన్ని మొహమాటంలో పెట్టేస్తున్నాడు), నువ్వు ఇంద్రజిత్తుని చంపెయ్యాలి!" అంటూ దాన్ని ప్రయోగించాడు.

అది, ఇంద్రజిత్తు శిరస్సుని కిరీటంతో సహా తెంచేసింది. ఆ శిరస్సూ, మొండెమూ ఆభరణాలతో ధగ ధగ మెరుస్తూ నేలమీద పడి దొర్లాయి. రాక్షసులందరూ పారిపోయారు. వానరులందరూ ఆనందంతో కోలాహలంగా కేకలేశారు.

పాపాత్ముడైన ఇంద్రజిత్తు చచ్చిపోగానే సూర్యుడు గొప్ప తేజస్సుతో ప్రకాశించాడు. గాలి సుఖంగా వీచింది. లోకాలన్నీ సుఖంగా అయ్యాయి. (కవి ధైర్యంగా అబద్ధాలు రాసుకున్నాడు.) దేవతలూ, దేవేంద్రుడూ కూడా ఆనందించారు. (ఆనందించి లాభం లేదు. ఇంద్రజిత్తు యుద్ధరంగంలో వీర మరణం పొందాడు. స్వర్గానికి వెళ్ళి ఇక ఎప్పుడూ ఇంద్రుడి దగ్గిరే తిష్టవేసి కూర్చుంటాడు.)

దేవతలూ, రుషులూ, బ్రాహ్మణులూ, 'ఇక సుఖంగా సంచరించగలం' అనుకున్నారు. వానరులూ, దేవతలూ అందరూ, శ్రీరాముడి కథ మళ్ళీ మళ్ళీ చెప్పుకుని ఆనందించారు.

లక్ష్మణుడు వానరసేనని వెంటబెట్టుకుని రాముడి దగ్గిరికి వెళ్ళి, వినయంగా నమస్కారం చేసి, ఇంద్రజిత్తు వధ గురించి వినయంగా (అంటే ఏం లేదు, వొంగుని) చెప్పాడు.

విభీషణుడు కూడా ఉత్సాహంతో పొంగిపోతూ, "లక్ష్మణుడు ఎంతో నేర్పుగా ఇంద్రజిత్తు తల నరికేశాడు రామా! ఆహా! గొప్పగా యుద్ధం చేశాడు" అని అంతా వర్ణించి చెప్పాడు.[418]

రాముడు చాలా సంతోషించి సిగ్గుపడుతున్న లక్ష్మణుణ్ణి దగ్గిరికి లాక్కుని తొడ మీద కూర్చోబెట్టుకున్నాడు. "వీర్యవంతుడగు రాముడు లక్ష్మీ వర్ధనుడైన లక్ష్మణుని శిరస్సు మూర్కొని సిగ్గు పడుచుండు నతనిని ప్రేమతో తొడ మీద కూర్చుండ బెట్టుకుని బాగుగా నాలింగనము చేసుకొని, దేహమును తడిమి పలుమారు చూచుచుండెను." (తన పరువు నిలబెట్టి నందుకన్నమాట అంత ప్రేమ నటన!)

"లక్ష్మణా! ఇంద్రజిత్తు పోతే రావణుడి కుడి భుజం పోయినట్టే సుమా! ఇక నేను జయించినట్టే, (అహం = నేను, విజయా = విజయుడను - అంటున్నాడు రాముడు. "మనం జయించాము" అనకూడదూ? లక్ష్మణుణ్ణి కూడా తనలో భాగంగా చేసుకోవడం ఇష్టం లేదు. ఇక్కడ విశ్రాంతిగా కూర్చుని తను జయించాడట!)

ఈ పనికి మూడు రాత్రులూ, మూడు పగళ్ళూ పట్టింది. హనుమంతుడూ, జాంబవంతుడూ, విభీషణుడూ అందరూ వీరత్వంతో కార్యం నిర్వర్తించారు! (నేనైతే ఏమీ చెయ్యకుండానే జయించాను చూడండి!) ఇక పుత్రశోకంలో ఉన్న రావణుణ్ణి నేను చంపేస్తాను." అని రాముడు సుషేణుణ్ణి పిలిచాడు. "చూడవోయి! లక్ష్మణుడు శరీరం నిండా బాణముల ములుకులు విరిగి బాధపడుతున్నాడు. వెంటనే చికిత్స చెయ్యి. మిగిలిన వానరులందరికీ కూడా చెయ్యి!" అని ఆజ్ఞాపించాడు. (లక్ష్మణా! ఇక అన్నగారి తొడ మీద నించి దిగరాదూ? మెచ్చుకోడం అయిపోయిందిగా? తోసేదాకా కూర్చుం

**418.** **యుద్ధ, సర్గ 92, శ్లోకం 6:** "మహాత్ముడగు లక్ష్మణుడు ఇంద్రజిత్తు యొక్క తలను నరికెనని విభీషణుడు సంతోషించి రామునకు తెలిపెను."

★

టావా ఏంటి?)

సుషేణుడు – లక్ష్మణుడికీ, విభీషణుడికీ, మిగిలిన వానరులందరికీ, మూలికలు వాసన చూపించాడు. (మూలిక లెక్కడివీ?)

తక్షణం అందరూ గాయాలు పోయి, బాధలు పోయి, ఆరోగ్యంతో కళ కళలాడారు. "ఆహా, ఇంద్రజిత్తు పోయాడు కదా!" అని ఆనందించారు.

★ ★ ★

ఇంద్రజిత్తు పోయాడని విని రావణుడు మూర్ఛపోయాడు. కొంతసేపటికి లేచి దుఃఖించడం ప్రారంభించాడు. "అయ్యో నాయనా! నువ్వు పోయావా? ఇంద్రుణ్ణి జయించావు. మందర గిరినే బద్దలు చేశావు. లక్ష్మణుడి వశమైపోయావా? మహా వీరులకు యుద్ధ మరణమే గొప్ప మరణం. ప్రభువు కోసం మరణించే వాడు స్వర్గానికి పోతాడు.[419] నీ శత్రువులందరూ నువ్వు లేవని సుఖంగా నిద్రపోతారు. కానీ, నువ్వు లేని నాకు ముల్లోకాలూ శూన్యమే. అంతః పురంలో స్త్రీలందరూ నీ కోసం రోదనం చేస్తారు. నీ తల్లిదండ్రుల్నీ, భార్యనీ, లంకనీ విడిచి ఎక్కడికి పోయావు నాయనా? నేనే ముందు పోయి నువ్వు నాకు కర్మలు చేయవలసి వుండగా, అదంతా ఇప్పుడు తారుమారైంది. నీ శత్రువు రాముడు ఇంకా జీవించి వుండగానే నన్ను రక్షించకుండా వెళ్ళిపోయావా?"

రావణుడికి దుఃఖంతో పాటే రోషం కూడా వొచ్చింది. సీతని వెంటనే చంపెయ్యాలనుకున్నాడు. "ఇంద్రజిత్తు సీతని చంపినట్టు మాయ చేశాడు గానీ, నేను ఇప్పుడు నిజంగానే చంపుతాను" అంటూ రావణుడు కత్తి పట్టుకుని భార్యలతో, మంత్రులతో కలిసి, అశోక వనానికి బైల్దేరాడు.

కత్తితో తనని చంపడానికి వస్తోన్న రావణుణ్ణి చూసి సీత, "అయ్యో! ఈ దుర్మార్గుడు నన్ను చంపేస్తాడు. తనను పెళ్ళాడమనీ, తనతో రమించమనీ, కోరాడు. (రమస్య = రమించుము. ఎంత దుఃఖ సన్నివేశంలోనైనా కవులు, విషయాన్ని, 'రమించడం' లోకో, 'స్తనాల' మీదకో లాగవలిసిందే!) నేను తిరస్కరించాను. నేను వశపడలేదని నన్ను చంపడానికి సిద్ధపడుతున్నాడు. రామ లక్ష్మణుల్ని చంపేశాడేమో! లేకపోతే వారిని చంప లేక కక్షతో నన్ను చంపుతున్నాడో! అయ్యో! ఆ నాడే హనుమంతుడు తీసుకు పోతానంటే విన్నాను కాను. మంచీ చెడ్డా ఆలోచించలేకపోయాను. హనుమంతుడి వీపు మీద ఎక్కి వెళ్తే ఈ పాటికి నా భర్తతో సుఖంగా వుండేదాన్నే కదా? (సుఖంగా ఉండడం ఉత్తదేలే. హనుమంతుణ్ణి ముట్టుకున్నందుకు మీ ఆయనకి చాలా కోపం వొచ్చేది. 'ఏలుకోను పొమ్మ'నేవాడు. అప్పుడు రావణుడి దగ్గిర వుండనందుకు విచారించే దానివేమో!)[420] కొడుకు పోయాడని తెలిస్తే కౌసల్య జీవిస్తుందా? (జీవించకపోతే పోతుంది. పెద్ద వాళ్ళెంత కాలం వుంటారు? ఆవిడ గోల నీ కెందుకు? ముందు నీ సంగతి నువ్వు చూసుకుందూ!) కౌసల్య, రాముడి బాల్య చేష్టల్నీ, యౌవ్వన చేష్టల్నీ తల్చుకుని తల్చుకుని దుఃఖిస్తుంది. ఇంకేం జీవిస్తుంది? (అబ్బ! ఈ మాటలన్నీ రాసేసినవే కవిగారూ! అవతల రావణుడు కత్తితో వొచ్చేస్తున్నాడు!)

కౌసల్య ఇక బతకనే బతకదు. కొడుకుల కోసం శ్రాద్ధకర్మలన్నీ చేసి తను అగ్నిలో పడి చచ్చిపోతుంది. లేకపోతే నీళ్ళల్లో పడి చచ్చిపోతుంది. (ఈ రెండేనా? ఇంకేమీ లేవా చచ్చిపోయే మార్గాలు?)

అసలు కౌసల్యకు ఇంత దుఃఖం కలిగించిన మందరని ఛీత్కరించాలి." (కొంపదీసి కథ మళ్ళీ ఇప్పుడు వెనక్కి వెళ్తుందా ఏవిటి? అవతల రావణుడు కత్తితో వచ్చేస్తున్నాడు! ....)

ఆ రకంగా దుఃఖిస్తోన్న సీతని సుపార్శ్వుడనే రావణుడి మంత్రి చూశాడు. సుపార్శ్వుడు మిక్కిలి బుద్ధిమంతుడు. ఉత్తముడు, మేధావి. (కవి సుపార్శ్వుణ్ణి ఈ రకంగా పొగుడుతున్నాడంటే, అతను రాముడికి అనుకూలమైన పనేదో చేస్తాడని ఊహించ వచ్చు.)

ఆ మంత్రి, రావణుణ్ణి ఆటంక పరిచాడు. "దశగ్రీవుడా! అన్యాయంగా సీతని చంపాలని ఎందు కను

---

**419.** **యుద్ధ, సర్గ 93, శ్లోకాలు 9, 10:** రావణుడి మాటలు: "బాగుగ యుద్ధము చేయువాని మరణమున కిదియే మంచి మార్గము... తన యజమానికై ప్రాణము విడుచువాడు స్వర్గమునకు బోవును."

సైనికులూ, సేవకులూ ప్రభువుల కోసం ప్రాణాలిచ్చేస్తే స్వర్గం దొరుకుతుందని బోధించడంలో రాముడూ, రావణుడూ ఒకటే! తేడా ఏమీ లేదు. ★

**420.** **యుద్ధ, సర్గ 93, శ్లోకాలు 54, 55:** సీత విచారం చూడండి: "క్షుద్రురాలనైన నేను హనుమంతుడు చెప్పినట్లు చేయకపోతిని. ఉత్తమురాలనైన నేను, అపుడు హనుమంతుని వీపు మీద కూర్చుండి పోయినటులైతే, భర్త తొడమీద గూర్చుండి, ఇపుడిటుల దుఃఖించుదానను గాను గదా?"

హనుమంతుడి వీపెక్కడం పతివ్రత లక్షణం కాదనీ, తనని తన భర్తే రక్షించాలనీ, అప్పుడు అన్నది కదా? అప్పుడు ఆ వాదం అది! ఇప్పటికి మారిపోయింది.! మహా పతివ్రత, చావుకి భయపడి ఈ రకంగా మాట్లాడ వొచ్చునా? ★

కుంటావు? వేద విద్యలు ఎరిగిన వాడివి. స్త్రీని చంపడం పాపం కాదా? సీత సుందరాంగి. నీ కోపం అంతా రాముడి మీద చూపించు. ఇవ్వాళ కృష్ణ పక్ష చతుర్దశి. రేపే అమావాశ్య. రేపటికి రాముణ్ణి చంపేస్తే సీత నీకే దక్కుతుంది" అని బోధించాడు.

రావణుడు సుపార్శ్వుడి మాటలు విని సీతని చంపడం మానేసి సభకు వెళ్ళిపోయాడు.[421]

రావణుడు కోపంతో, దుఃఖంతో సింహాసనం మీద కూర్చున్నాడు. మహావీరులందర్నీ చూస్తూ, "మీరందరూ యుద్ధానికి బయల్దేరండి! రథాలతో, ఏనుగులతో, గుర్రాలతో పోయి, వర్షాకాలం మేఘాలు వర్షించినట్టు బాణ వర్షం కురిపించి రాముణ్ణి చంపెయ్యండి! ఇవ్వాళ మీరు చంపలేకపోతే, నా తీక్షణ బాణాలతో రాముణ్ణి రేపు నేను చంపేస్తాను. (శ్వః = రేపు; విహంతాస్మి = వధింప గలను)" అన్నాడు.

మళ్ళీ కోట్లకొద్దీ సైన్యం యుద్ధానికి బయల్దేరింది. యుద్ధం పొద్దున్నే ప్రారంభమైంది.

రాక్షసుల బాణాలతో, వానరుల పర్వతాలూ; వృక్షాలతో శూలాలూ ఖడ్గాలూ; పర్వతాలతో పరిఘలూ; వృక్షాలతో గదలూ; పట్టసాలతో వృక్షాలూ; గదలతో వృక్షాలూ; ఖడ్గాలతో వృక్షాలూ.

(విసుక్కోకండి! ఆ యుద్ధం అలాగే జరిగింది మరి!)

రాక్షసులే పైచెయ్యిగా అయ్యారు! వానరులు శ్రీరాముడి దగ్గిరికి పోయి శరణు కోరారు.

అప్పుడు శ్రీరాములవారు కోపం పట్టలేక యుద్ధానికి దిగారు. (లేకపోతే, పాపం అప్పటికీ దిగేవారు కారు.)

శ్రీరాముడి యుద్ధాన్ని వర్ణించడానికి వెయ్యి నాలుకలు గల ఆదిశేషుడైనా చాలడు. (ఎందుకూ? ఒక్క నాలిక వున్న కవిగారే సరిపోతారు.)

దిక్కులు మూసుకుపోయే బాణ వర్షం! రాముడి సమీపానికి రాక్షసులెవ్వరూ పోలేకపోతున్నారు. అసలు రాముణ్ణి కళ్ళతో చూడలేక పోతున్నారు. రాముడు అగ్ని జ్వాలల వంటి బాణాలతో శతృసేనల్ని ఛిన్నాభిన్నం చేసేశాడు. కొందర్ని అడ్డంగా నరికాడు. కొందర్ని నిలువుగా. కొందర్ని దహించాడు. అవమానించాడు. కొందర్ని .... కొందర్ని .... కొందర్ని .....! రాక్షస సేన భయపడి పోయి, సాటి రాక్షసుణ్ణి చూసే రాముడనుకుని, రాక్షసుల్ని రాక్షసులే చంపేసుకోవడం మొదలుపెట్టారు.

రాముడు గాంధర్వాస్త్రం వేశాడు. రాక్షసులందరూ మతి తప్పి దాని మోసంలో పడిపోయారు. వారికి యుద్ధ రంగమంతా రామమయంగా కన పడింది. ఎటు చూసినా రాముడే! వేల కొద్దీ రాముళ్ళు! లక్షల కొద్దీ రాముళ్ళు! (ఒక్క రాముడితోటే ఇంత గందర గోళపు రామాయణా లొస్తే .... ఇక వేల కొద్దీ లక్షల కొద్దీ రాముళ్ళా?)

రాక్షసులు అన్ని దిక్కుల్లోనూ ఎందరో రాముళ్ళని చూస్తున్నారు. మరుక్షణంలో ఒక్క రాముణ్ణే చూస్తున్నారు. మళ్ళీ ఆ రాముణ్ణి కూడా చూడలేక పోతున్నారు. (రాక్షసులు మొదట్లో ఎందరో దేవుళ్ళని నమ్మేవారు గావున్ను. తర్వాత దేవుళ్ళందరూ ఒక్కటే అనుకుని, ఒక్క దేవుణ్ణే నమ్మారేమో! తర్వాత నిజం గ్రహించుకుని ఆ ఒక్కణ్ణీ కూడా వొదిలేసి వుంటారు!)

శ్రీరాముడి విల్లు, మండుతోన్న కొర కంచు గిర గిర తిరిగినట్టు, కాంతులీనుతూ యుద్ధరంగమంతా కాంతి చక్రాలతో తిరగడం మాత్రమే చూడగలిగారు రాక్షసులు.

ఆ దినం, 7 ఘడియల కాలంలో, శ్రీరాముడు అగ్ని జ్వాలల వంటి బాణాలతో

| | |
|---|---|
| 7,29,00,000 | – మహా వేగం గల రథాల్నీ, |
| 13,12,20,000 | – మదపు టేనుగుల్నీ, |
| 10,20,60,000 | – గుర్రాల్నీ, |
| 145,80,00,000 | – కామరూపులైన రాక్షస |

యోధుల్నీ నాశనం చేసేశాడు (అట!)[422]

చావగా మిగిలిన రాక్షసులు పారిపోయారు. యుద్ధ రంగం రుద్రుడి నాట్యరంగం అయిపోయింది. ఆకా

**421.** రావణుడికి శతృవుల వల్ల ఎంతెంత ఘోరమైన నష్టాలు కలిగినా, తన కొడుకులు పోయినా, తమ్ములు పోయినా, శతృవుల మీద ఎంత కక్ష పెరుగుతోన్నా, సీతని చంపకుండా వుంటాడా? – ఈ ప్రశ్న వొస్తుంది కదా? అందుకని, రావణుడు సీతని చంపాలని ఆలోచించినట్టే రాశాడు కవి. కానీ, సీత చచ్చిపోకూడదు కాబట్టి, ఎలాగో దాన్ని ఆపించేశాడు. కానీ, దాని వల్ల రావణుడు స్త్రీ హత్య చెయ్యనివాడూ, ఎవరైనా మంచి చెప్తే వినేవాడూ అయ్యాడు కదా? ఈ విషయంలో రాముడికన్నా ఉత్తముడు అయ్యాడు. ★

**422.** **యుద్ధ, సర్గ 94, శ్లోకాలు 31, 32, 33:** ఈ లెక్కలన్నీ కట్టుకథలే గానీ, ఆ కట్టు కథలు ఎలా ఉన్నాయో ఒకసారి చూద్దాం. రాముడు చేసిన యుద్ధం లెక్కలు ఈ విధంగా ఉన్నాయి:

అనీకం దశ సహస్రం రథానాం = 10 వేల అనీకాల రథాలూ,

అష్టాదశ సహస్రాణి కుంజరాణాం = 18 వేల అనీకాల ఏనుగులూ,

చతుర్దశ సహస్రాణి వాజినామ్ = 14 వేల అనీకాల గుర్రాలూ,

పూర్ణేశత సహస్రేద్వే రాక్షసానాం = పూర్తిగా 2 లక్షల అనీకాల రాక్షసులూ..

ఈ రకంగా, చక్కగా కవిత్వ ప్రాసలకూ, నిబంధనలకూ అనుకూలంగా రాముడు ➔

శంలో దేవతలూ, రుషులూ, 'బాగు, బాగు' అని శ్రీరాముణ్ణి శ్లాఘించారు.

శ్రీరాముడు, తన చుట్టూ జేరిన సుగ్రీవుడూ, విభీషణుడూ, హనుమంతుడూ, జాంబవంతుడూ మొదలైన వారందరితో – "ఇంత గొప్ప అస్త్ర బలం నాకూ, రుద్రుడికీ మాత్రమే ఉంది. ఇక ఎవ్వరికీ లేదు" అని చెప్పాడు. (రుద్రుడికి మాత్రం ఎందుకూ? నీ కొక్కడికే వుంటే బాగుంటుందిగా రాముడూ? "ఇంత బలం నాకొక్కడికే ఉంది. రుద్రుడికి కూడా లేదు" అంటే, నీ మాట ఎవరు కాదంటారూ?)

★ ★ ★

లంకలో రాక్షస స్త్రీలు ఎక్కడికక్కడ గుంపులు కూడి దుఃఖంలో మునిగిపోయారు. అందరూ – భర్తలో, తండ్రులో, కొడుకులో, తోబుట్టువులో, బంధువులో పోయిన వారే. (ఈ దుఃఖిస్తోన్న స్త్రీలు కూడా రాముణ్ణీ, విభీషణుణ్ణీ ఎలా పొగుడుతారో గమనించండి.)

"ఆ పాడు ముసలి చుప్పనాతి శూర్పణఖ బాన పొట్ట వేళ్ళాడేసుకుని మన్మథుడి లాంటి శ్రీరాముడి దగ్గిరికి ఎందుకు పోయిందో గదా? (ఎందుకేమిటి? అంత మన్మథుడు గదా అని!) ఆ బుద్ధి లేని నీచురాలు, లోకులందరూ నిందించే దుర్మార్గం చేసింది. శూర్పణఖ వల్లనే గదా రావణుడికి రాముడితో విరోధం కలిగింది? రాక్షస నాశనానికే రావణుడు సీతని తెచ్చాడు. సీతని కోరినందుకు విరాధుడికే గతి పట్టిందో, రావణుడికీ ఆ గతే పడుతుంది.

శ్రీరాముడు మహానుభావుడు. ధర్మాత్ముడు. సద్గుణ సంపన్నుడు. జన స్థానంలో పద్నాలుగు వేల మంది క్రూర రాక్షసుల్ని చంపేశాడు కదా? (ఇంకా జనస్థానం ముచ్చటేనా? ఇందాక యుద్ధరంగంలో కోట్ల కోట్ల అనీకాల మందిని చంపేశాడుగా? కోట్ల కంటే వేలే ఎక్కువనుకుంటున్నారా? మీరు చదువుకో లేదా లంక స్త్రీలూ?)

రాముడు, మహా నీచుడైన కబంధుణ్ణి చంపెయ్యలేదా? మహా బలిష్ఠుడైన వాలిని చంపేసి సుగ్రీవుణ్ణి రక్షించలేదా? పుణ్యాత్ముడైన విభీషణుడెంత ధర్మమైన మాటలు చెప్పినా ఈ దుర్మార్గుడు చెవిన బెట్టనే లేదు. ఆ

---

➔ యుద్ధం చేశాడని కవి వర్ణన! అయితే, 'అనీకం' అంటే ఎంతో తెలిస్తేనే కదా రాముడి వీరత్వం మనకు అర్థమయ్యేది? 'అనీకం' – అంటే ఏమిటో, ఎంతో, కవి ఏమీ చెప్పలేదు. కానీ, అనువాదకులందరూ అనీకం అంటే 7290 అనే లెక్క ప్రకారమే, రాముడి యుద్ధాన్ని లెక్కలు కట్టి అందరూ ఒకే రకంగా వివరించారు.

అనీకానికి సంబంధించిన వివరాలన్నీ నేను – 'చెదలవాడ సుందర రామశాస్త్రులు' గారి అనువాదం నించి తీసుకున్నాను. (సుందరరామ శాస్త్రులు, చెదలవాడ; శ్రీమద్వాల్మీకి మహర్షి ప్రణీత శ్రీ మద్రామాయణము. యుద్ధకాండము. ప్రతి పదాంధ్ర టీకా తాత్పర్య సహితము. చెన్నపురిః శారదాంబా విలాస ముద్రాక్షరశాల, 1897వ సంవత్సరం).

ఈ లెక్కలు ఎంత తల కాయలేని పిచ్చి లెక్కలో తెలుసుకోవాలంటే ఈ వివరాలన్నీ చూడాలి. ఈ వివరాల వల్ల పూచిక పుల్లంత ఉపయోగం కూడా ఉండదు. కానీ, మతగ్రంథాల పండితులు ఎంత మూర్ఖులుగా వుంటారో తెలుసుకోవచ్చు. ఆ ఉపయోగం ఉంటుంది తప్పకుండా.

1 ఏనుగూ, 1 రథం, 3 గుర్రాలూ, 5గురు సైనికులూ – కలిసి, 'పత్తి' అవుతుంది. (అట!)

1 పత్తి అంటే, 10 శాల్తీల దండు.

| | | |
|---|---|---|
| 3 పత్తులు | = | 1 సేనాముఖం (30) |
| 3 సేనాముఖాలు | = | 1 గుల్మం (90) |
| 3 గుల్మాలు | = | 1 గణం (270) |
| 3 గణాలు | = | 1 వాహిని (810) |
| 3 వాహినులు | = | 1 పృత్తిన (2430) |
| 3 పృత్తినలు | = | 1 చమువు (7290) |

చమువు – అంటే అనీకమే. అంటే అనీకము = 7290

ఒక అనీకంలో రథాలూ, గుర్రాలూ, ఏనుగులూ, ఏవి ఎన్నేసి వున్నాయో విడదీసి చూస్తే:

ఏనుగులు – 729, రథాలు – 729, గుర్రాలు – 2187, సైనికులు – 3645.

ఇవన్నీ కలిస్తేనే ఒక అనీకం. రాముడు 10 వేల అనీకాల రథాల్ని పడగొట్టాడు – అనడం ఏమిటి? అనువాదకులందరూ కిక్కురుమనకుండా, అనీకాన్ని (అంటే 7290ని) పది వేలతో హెచ్చవేసేసి, రాముడు 7 కోట్ల, 29 లక్షల రథాల్ని పడగొట్టేశాడు – అని రాసేశారు. అవన్నీ రథాలేనా? అందులో గుర్రాలూ ఏనుగులూ సైనికులూ అన్నీ కలిసి వున్నాయి కదా? ఈ ప్రశ్నలే లేకుండా గుడ్డెద్దు చేలో పడ్డట్టు అనువాదాలు చెయ్యడమేనా!

'అనీకం' అంటే ఏమిటో కవి చెప్పలేదు. ఈ అనువాదకులు చెప్పే అర్థం కుదరడం లేదు. కాబట్టి, "రాముడు పది వేల అనీకాల రథాల్ని పడగొట్టాడు" అని కవి అన్నప్పుడు, ఏ లెక్కా చెప్పకూడదు. అది ఒక 'కల్పిత పదం' (నిజమైన అర్థంలేని పదం) మాత్రమే! కట్టు కథలు ఇలాగే ఉంటాయి. చదివి, నవ్వి, వొదిలెయ్యాలి. ★

నాడే విభీషణుడు చెప్పిన మాటలు వింటే, లంక ఇలా శ్మశానమయ్యేదా? (శ్మశానమయ్యేది కాదు గానీ. రాముడితో సంధికి దిగితే, శ్మశానం కన్నా భయంకర మైన బానిస రాజ్యం అయ్యేది!) కుంభ కర్ణుడు పోయినా, ఇంద్రజిత్తు పోయినా, రావణుడు మూర్ఖుడై శ్రీరాముడి ప్రభావం తెలుసుకోలేక పోయాడు.

"అయ్యో! నా కొడుకు పోయాడే!"

"నా భర్త పోయాడే!"

"నా పుత్రుడు గతించాడే!"

"ఈ శ్రీరాముడు శ్రీ మహావిష్ణువేమో! రుద్రుడేమో! ఇంద్రుడేమో!" (ఈ లంక స్త్రీలకు సిగ్గులేదేమో! లజ్జ లేదేమో! బుద్ధి లేదేమో! శత్రువు ఎంతెంత బాధలకు గురి చేసినా ఈ పొగడ్త లేమిటి? ఈ కథలో బ్రహ్మాండమైన తప్పు – ఏ పాత్రకీ, దానికి తగిన నడక లేకపోవడం! శత్రువులందరూ రాముణ్ణే కీర్తిస్తూ వుంటారు! రావణుడు కూడా రాముణ్ణి 'మహానుభావుడు' అంటూనే వుంటాడు! పాత్రోచితమైన చిత్రణ ఎక్కడా వుండదు.)

పూర్వం రావణుడు లోకాలన్నీ పీడిస్తున్నాడని, దేవతలు తపస్సు చేశారు. అప్పుడు బ్రహ్మ దేవతల్ని ఓదార్చి, "మీకు భయం లేదు" అన్నాడు. ఒక సంగతి ఇలా చెప్పాడు. "పూర్వం, ఇంద్రుడితో కలిసి కొందరు దేవతలు రుద్రుణ్ణి శరణు కోరారు. అప్పుడు రుద్రుడు, 'దేవతలారా! మీకు మేలు చెయ్యడానికే, రాక్షసుల్ని నాశనం చేసే స్త్రీ పుడుతుంది' అని చెప్పాడు.

(కథలో ఇక్కడ, సన్నివేశం హఠాత్తుగా ఆగి పోయింది. మళ్ళీ లంక స్త్రీల యేడుపులు సాగుతాయి.)

"పూర్వం, ఆకలి, రాక్షసుల్ని నాశనం చేసేసినట్టుగా, దేవతలు పంపిన ఈ సీత, మనల్ని నాశనం చేసేస్తుంది. రావణుడు దుర్మార్గుడు. మనకు చావు తప్పదు. శ్రీరాముడి వీరత్వం నుంచి మనల్ని ఎవరు రక్షించ గలరు? విభీషణుడు చక్కగా చేసుకున్నాడు. ఎవరి వల్ల ఆపద కలుగుతుందో గ్రహించి, అతనినే శరణు కోరాడు. సుఖంగా బతికాడు."

ఆ రకంగా రాక్షస స్త్రీలు పెద్ద పెద్ద కంఠాలతో ఏడ్చారు.

★ ★ ★

రావణుడు, ఇంటింటా స్త్రీల రోదనలన్నీ విన్నాడు. దీర్ఘంగా నిట్టూర్చి, బాధపడి కుపితుడయ్యాడు. "మహీ ధరుణ్ణీ, మహాపార్శ్వుణ్ణీ, విరూ పాక్షుణ్ణీ, సేనలతో సహా యుద్ధానికి సిద్ధం కమ్మనండి!" అని గర్జించాడు. "ఇప్పుడు చూడండి! ప్రళ యాగ్ని లాంటి నా తీవ్ర బాణా లతో రామ లక్ష్మణుల్ని యమలోకానికి పంపేస్తాను. నీళ్ళ మడుగుల్ని ఏనుగులు తొక్కి ధ్వంసం చేసినట్టు వానర గుంపుల్ని ధ్వంసం చేసేస్తాను. వానరుల కళేబరా లతో ఇక భూమి కనపడదు. నా బాణ వర్షంతో దిక్కు లన్నీ మూసుకుపోతాయి. (బాణ వర్షం యేమో గానీ, మాటల వర్షం మాత్రం బాగా కురిపిస్తున్నావు. రాముడూ నువ్వూ వొక్క బళ్ళోనే చదివినట్టున్నారే! మీ పంతుళ్ళు మీకు వాగుడు బాగా నేర్పారు!)

శత్రునాశనం చేసి, లంకలో దుఃఖించే స్త్రీల కన్నీరు తుడుస్తాను. నా రథం సిద్ధం చెయ్యండి! .... నా ధనుస్సు అందించండి! లంకలో వున్న రాక్షసులందరూ నాతో యుద్ధానికి రండి!" అని ఆజ్ఞాపించాడు.

సేనాపతులందరూ లంకలో ఇల్లిల్లూ తిరుగుతూ, "యుద్ధానికి రండి! శత్రువుల్ని నాశనం చెయ్యాలి. యుద్ధా నికి రండి!" అని అందర్నీ పిలిచారు.

మరుక్షణంలో అందరూ మహోత్సాహంతో, ఎవరి ఆయుధాలు వాళ్ళు పట్టుకుని గుంపులు గుంపులుగా బైల్దేరారు. నిలువు కత్తులూ, అడ్డ కత్తులూ, శూలాలూ, బల్లాలూ, గదలూ, చక్రాలూ, శక్తులూ, రోకళ్ళూ, ఇనప కర్రలూ, ముళ్ళ కర్రలూ, దుడ్డు కర్రలూ, గొడ్డళ్ళూ, ముద్గరాలూ, పట్టసాలూ, బండివాలాలూ – ఇంకా అనేక రకాల ఆయుధాలతో సేన కూడింది.

రావణుడు 8 గుర్రాల రథం మీద ఎక్కాడు.

మహోత్సాహంతో సేన కదిలింది.

దారిలో అప శకునాలన్నీ, యధావిధిగా దారి తప్ప కుండా, కనపడ్డాయి. సూర్యుడు కాంతి తగ్గిపోయాడు. దిక్కులు చీకటైపోయాయి. పక్షులన్నీ వికారంగా కూశాయి. జంతువులు అప్రదక్షిణంగా తిరిగాయి. గుర్రా లన్నీ తడబడ్డాయి. రావణుడి రథం మీద గద్ద వాలింది. రావణుడి ఎడం కన్ను, ఎడం భుజం, అదిరాయి. ముఖ కాంతి తగ్గిపోయింది. తోక చుక్క వొకటి రాలిపడింది. ఆకాశం నించి రక్తం కురిసింది. రావణుడి మరణాన్ని సూచించే అప శకునాలెన్నో కనపడ్డాయి. అయినా రావ ణుడు లక్ష్య పెట్టక (లేకపోతే, రాముళ్ళాగ కంగారెత్తు తాడా?) ముందుకే నడిచాడు.

మళ్ళీ గొప్ప యుద్ధం పారంభమైంది. "రండిరా, రండి!" అంటూ వానరులూ రాక్షసులూ వొకరిని వొకరు యుద్ధానికి పిలుచుకోవడం, కొట్టుకోవడం మొదలు పెట్టారు.

రావణుడి బాణ వర్షంతో వానర సేన కుప్ప తెప్ప లుగా నేలకొరుగుతోంది. చేతులు తెగి, కాళ్ళు తెగి, కంఠాలు తెగి, తలలు బద్దలై, గుండెలు బద్దలై, కళేబరాల గుట్టలు పెరిగిపోతున్నాయి.

సుగ్రీవుడు గొప్ప వృక్షం పట్టుకుని యుద్ధ రంగంలో వీర విహారం చేస్తున్నాడు. పర్వతాల వాన కురిపిస్తు న్నాడు.

రాక్షస సేన నాశనమైపోవడం చూసి విరూపాక్షుడు

రథం దిగి, ఏనుగెక్కి, "నే నెవరినో తెలుసా? విరూపాక్షుణ్ణి!" అంటూ సుగ్రీవుడితో యుద్ధానికి దిగాడు. సుగ్రీవుణ్ణి బాణ వర్షంతో ముంచెత్తాడు.

సుగ్రీవుడు పెద్ద వృక్షం తెచ్చి విరూపాక్షుడెక్కిన ఏనుగు తల మీద కొట్టాడు. అది అరుస్తూ వెనక్కిపోయి నేల మీద కూలి కన్ను మూసింది. విరూ పాక్షుడు కత్తీ, డాలూ తీసుకుని సుగ్రీవుడి మీదకు రాబోతోంటే సుగ్రీవుడు పెద్ద పర్వతం పెళ్ళగించి విసిరాడు. విరూపాక్షుడు తప్పుకుని కత్తితో సుగ్రీవుణ్ణి కొట్టాడు. సుగ్రీవుడు కాస్సేపు మూర్ఛబోయి లేచి విరూపాక్షుణ్ణి పిడికిలితో పొడిచాడు. విరూపాక్షుడు కత్తితో సుగ్రీవుడి కవచం చీరేసి కాలితో సుగ్రీవుణ్ణి ఒక్క తన్ను తన్ని పైకి ఎగరేశాడు. (ఈ వీరుడు చాలా బాగున్నాడు! నాకు చాలా నచ్చాడు. ఇతని వల్ల సుగ్రీవుడికి ఒక్క తన్ను అయినా ముట్టింది!)

సుగ్రీవుడు కిందపడి లేచి అరిచేత్తో విరూపాక్షుణ్ణి చరిచాడు. విరూపాక్షుడు సుగ్రీవుణ్ణి గుద్దాడు. సుగ్రీవుడు మళ్ళీ విరూపాక్షుడి నొసలు మీద గుద్దాడు. విరూపాక్షుడు నేలకూలి, రక్తం కక్కుతూ, కంటి చూపులు వికృతంగా మారి, బాధతో తన్నుకుంటూ ప్రాణాలు విడిచాడు.

★ ★ ★

విరూపాక్షుడు పోయాడని విని రావణుడు దుఃఖించి మహోదరుణ్ణి పిలిచి, "నేను జయించాలంటే ఇక నా ఆశలన్నీ నీ మీద వున్నాయి. ఇంత కాలం నేను నిన్ను పోషించినందుకు నువ్వు నాకు సేవ చేయవలసిన కాలం వచ్చింది" అన్నాడు.

మహోదరుడు అంగీకరించి యుద్ధానికి బయల్దేరాడు.

మళ్ళీ భయంకరమైన యుద్ధం జరిగింది. మహోదరుడి ధాటికి తట్టుకోలేక వానరులు సుగ్రీవుడి దగ్గిరికి పారిపోయారు.

సుగ్రీవుడు గొప్ప పర్వతం పెళ్ళగించి విసిరాడు. అది మహోదరుడి బాణాలతో పిండి పిండి అయిపోయింది.

మళ్ళీ సాలవృక్షం పిండి!

సుగ్రీవుడు ఇటూ అటూ చూసి పరిఘ అందుకుని (పర్వతాల కన్నా ఆయుధమే గొప్పదని గ్రహించాడు!) దాంతో మహోదరుడి గుర్రాల్ని కొట్టి చంపేశాడు. మహోదరుడు గద పట్టుకుని రథం లోంచి దూకేశాడు. ఇద్దరూ ఆయుధాలతో కలబడ్డారు. పరిఘా, గదా – ఒకదాన్ని ఒకటి గుద్దుకుని రెండూ విరిగిపోయాయి. సుగ్రీవుడు మళ్ళీ అటూ ఇటూ చూసి బంగారు కట్లున్న ఇనప రోకలి అందుకున్నాడు. మహోదరుడు ఇంకో గద తీశాడు. మళ్ళీ ఆ రెండూ విరిగిపోయాయి. (ఇంత చెత్త రకం ఆయుధాలు ఏ దేశం నించి దిగుమతి చేసుకున్నాడో రావణుడు!)

ఇద్దరూ ముష్టి యుద్ధానికి దిగారు. (అదీ! మొదటే ఇలా యాడవకూడదూ?) చరుచుకున్నారు. గుద్దుకున్నారు. భుజాలతో పొడుచుకున్నారు. తోసుకున్నారు. ఒకర్ని ఒకరు ఎత్తి కుదేసుకున్నారు. పట్టు కోసం ఒకరి చుట్టూ ఒకరు గుండ్రాలు తిరిగారు. మహోదరుడు చుట్టూ చూసి కత్తి అందుకున్నాడు. సుగ్రీవుడూ ఇంకో కత్తి తీశాడు. ఖణేల్ ఖణేల్‌మంటూ కత్తుల యుద్ధం జరిగింది. మహోదరుడి కత్తి సుగ్రీవుడి డాలులో దిగబడి పోయింది. మహోదరుడు డాలు లోంచి కత్తి వూడలాక్కుంటూ ఉండగా సుగ్రీవుడు కత్తి దూసి మహోదరుడి తల తెగ గొట్టేశాడు. అది కిరీటంతో, కుండలాలతో ధగ ధగ మెరుస్తూ భూమి మీద పడిపోయింది!

రాక్షస సేన పారిపోయింది.

మహోదరుడు పోగానే మహాపార్శ్వుడు కోపంతో అంగదుడి మీదకు వెళ్ళాడు. తన బాణ వర్షంతో వానర సేనని చెల్లాచెదురు చేసేశాడు.

అంగదుడు కోపంతో పరిఘ తీసి మహాపార్శ్వుడి మీదకు విసిరికొట్టాడు. అది తగిలి మహాపార్శ్వుడి రథం కూలిపోయింది.

జాంబవంతుడూ, గవాక్షుడూ, గొప్ప గొప్ప పర్వతాలు పెళ్ళగించి ఇంకా బతికున్న గుర్రాల మీదకి విసిరి చంపేశారు. మహాపార్శ్వుడు వానర వీరులందరి మీదా బాణ వర్షం కురిపించాడు. అంగదుడు, చేతుల్లో పరిఘ గిరగిర తిప్పి మహాపార్శ్వుడి కేసి కొట్టాడు. అతని ధనుస్సూ, కిరీటం కిందపడి పోయాయి. అంతలో అంగదుడు మహాపార్శ్వుడి దగ్గిరికి పోయి వజ్రాయుధం లాంటి పిడికిలితో గూబ మీద గుద్దాడు. మహాపార్శ్వుడు, పర్వతం లాంటి గొడ్డలితో అంగదుడి ఎడం భుజం మీద కొట్టబోయాడు. అంగదుడు నేర్పుగా తప్పించుకుని మహా పార్శ్వుడి గుండెల మీద గుద్దాడు. మహాపార్శ్వుడు మాత్రం (నేర్పు లేక) అంగదుడి దెబ్బ తప్పించుకోలేక భూమి మీద పడి ప్రాణాలు విడిచేశాడు.

రాక్షసులు భయపడి రావణుడి దగ్గిరికి పారిపోయారు.

దేవతలూ, వానరులూ ఆనందించారు.

★ ★ ★

మహాపార్శ్వుడు పోయాడని విని రావణుడు కోపంతో ఉగ్రుడైపోయాడు. "సారథీ! సీత అనే ఫలం గల రామ వృక్షాన్ని సమూలంగా నాశనం చేసి లంక పీడ పోగొడతాను. రథం రాముడి దగ్గిరికి పోనియ్యి!" అని గర్జించాడు. (అరుపులు కట్టిపెట్టి చెయ్యవలిసిందేదో

చెయ్యి!)

రావణుడి రథం రాముడి దిక్కుగా పరిగెత్తింది. ఆ రథ ఘోష భయంకరంగా లోకాలన్నీ నిండింది. రావణుడు బ్రహ్మ ఇచ్చిన తామసాస్త్రం ప్రయోగించి (బ్రహ్మని నమ్మడానికి వీల్లేదు. అంతా సీనా రేకుతో చేసిన డబ్బా రకం ఆయుధాలిస్తాడు.) వానర సేనని నాశనం చేశాడు.

రావణుడు చేస్తోన్న దురంతం చూసి భరించలేక కరుణా సముద్రుడైన శ్రీరాముడు యుద్ధానికి కదిలాడు. (ఓహో! కదిలాడా? ఇక చూద్దాం ఏం చేస్తాడో!)

లక్ష్మణుడితో ఉన్న రాముడు, విష్ణువుతో ఉన్న ఇంద్రుడి లాగ వున్నాడు. (రాముణ్ణి ఇంద్రుడితో పోల్చి, లక్ష్మణుణ్ణి విష్ణువుతో పోల్చాడు కవి! ఎదరగా రావణుడున్నాడనే దడతో కవిత్వం తడబడ్డట్టుంది.)

విశాలమైన నేత్రాలతో, ఆజాను బాహువులతో, గొప్ప ధనుస్సుతో వున్న రాముణ్ణి చూశాడు రావణుడు! (రామ రావణ యుద్ధం చూడండి ఇక!)

రాముడు, వీరత్వంతో ఆ గొప్ప ధనుస్సు తాటిని టంగు టంగుమని మోగించాడు. ఆ ధ్వని భీకరత్వానికి రాక్షసులూ వానరులూ కూడా అదిరిపడి కింద పడి పోయారు.

రావణుడితో ముందు తనే యుద్ధం చేస్తానని లక్ష్మణుడు యుద్ధానికి దిగి బాణ వర్షం కురిపించాడు. (రాముడికి లక్ష్మణుడు సాయం! రావణుడికి ఎవరూ సాయం లేరు!)

రావణుడు ఆ బాణ వర్షంలో తడవకుండా తప్పు కుంటూ, తనూ వర్షం కురిపిస్తూ లక్ష్మణుణ్ణి లక్ష్యపెట్టక రాముడి మీదికి వెళ్ళి అక్కడ మళ్ళీ బాణ వర్షం కురిపించాడు. రాముడు భల్లాయుధం వేసి రావణుడి బాణ వర్షాన్ని ఛేదించేశాడు. రాముడికీ, రావణుడికీ బాణ వర్ష యుద్ధం జరిగింది. ఎవరికీ జయమూ లేదు, అపజయమూ లేదు. సరిసమానంగా పోరుతున్నారు. రామ రావణులు మృత్యు దేవతల్లాగ పోరాడుతున్నారు.

లోకాలన్నీ భయంతో గజగజ వొణికాయి. బాణ వర్షంతో ఆకాశమంతా మూసుకుపోయింది. (తెలుసులే.) రామ రావణుల యుద్ధం, ఇంద్ర – వృత్రాసురుల యుద్ధంలా అయింది. (దాని సొగసూ ఇంతే గావున్ను!)

రాముడు రావణుడి మొహం మీదా, రావణుడు రాముడి మొహం మీదా, వాడి వాడి బాణాలు కొట్టుకుంటున్నారు. (అబ్బ! గుచ్చుకోవూ? బాణాలు అవతల పారేసి, ప్రజలందర్నీ దగ్గిర పెట్టుకుని, ఎవరి వాదం వాళ్ళు చెప్పుకోరాదూ?)

రాముడు రౌద్రంతో రౌద్రాస్త్రం వేశాడు. (ఇది పాత దేగా? కొత్తదేమన్నా వెయ్య వోయి! అస్తమానూ రౌద్రాలు ఎందుకూ? చిరునవ్వాస్త్రం వుందా? వెయ్యి చూద్దాం. రావణుడికి నవ్వొస్తుందేమో!) రౌద్రాస్త్రం రావణుడి కవచాన్ని చీల్చలేకపోయింది. (చూశావా? కొత్తది వెయ్యమన్నానా? కిత కితలు పెట్టే అస్త్రం వెయ్యి!)

రామ బాణాలన్నీ వ్యర్థమైపోయి సర్పాల్లా కింద పడి పోతున్నాయి.

రావణుడు అసురాస్త్రం ప్రయోగించాడు. దాంతో పాటే సింహం మొహాల్లాంటి మొహాలున్న బాణాలూ, పెద్ద పులి మొహాల బాణాలూ, కాకులూ, గద్దలూ, డేగలూ, నక్కలూ, కోళ్ళూ, తోడేళ్ళూ, పందులూ, పాములూ, గాడిదలూ, అన్ని రకాల జంతువుల మొఖాల బాణాలూ, పక్షుల మొహాల బాణాలూ, గుప్పించాడు. (లంకలో వడ్రంగులు, బాణాల్ని అన్ని డిజైన్లతో చేశారన్న మాట! భలే పని వాళ్ళే!)

రాముడు ఆగ్నేయాస్త్రం వేశాడు. దాంతోపాటు సూర్యుడి మొహం, చంద్రుడి మొహం, అర్ధ చంద్రుడి మొహం, నక్షత్రాల మొహాలూ, నవగ్రహాల మొహాలూ, తోక చుక్కల మొహాలూ – ఆ ఉత్తమ బాణాలన్నీ కూడా వేశాడు. (అయోధ్యలో వడ్రంగులు, బాణాల మీద చంద్రుళ్ళనీ, సూర్యుళ్ళనీ చెక్కారా?)

రామ బాణాల ధాటికి, రావణ బాణాలన్నీ చెల్లా చెదురై పోయాయి. వానరులు ఆనందంతో కేక లేశారు.

తన అస్త్రాలన్నీ వ్యర్థమై పోవడం చూసి రావణుడు కోపంతో మయుడు నిర్మించిన రౌద్రాస్త్రం వేశాడు. (ఇది బ్రహ్మది కాదు గాబట్టి ఏవన్నా పని చేస్తుందేమో చూద్దాం.) రౌద్రాస్త్రం వెయ్యగానే రావణుడి విల్లు లోంచి కత్తులూ, శూలాలూ, గదలూ, రోకళ్ళూ, పట్టసాలూ, ఇంకా రక రకాల బాణాలూ పుట్టుకొచ్చి మహావేగంతో దిక్కుల వెంట దూసుకుపోవడం మొదలెట్టాయి. (ఈ అస్త్రం బాగానే పని చేస్తోందే!) అంతలో రాముడు గాంధర్వాస్త్రం వేసేసి రౌద్రాస్త్రాన్ని నాశనం చేసేశాడు. (అయ్యయ్యో!)

రావణుడు కోపం పట్టలేక సౌరాస్త్రం వేశాడు. వెంటనే విల్లు లోంచి సూర్యచంద్రుల్లాగ ధగ ధగ మెరుస్తూ బంగారం పళ్ళేల లాగ వున్న చక్రాయుధాలు వేలకొద్దీ పుట్టుకొచ్చి యుద్ధ రంగమంతా మహా వేగంతో దూసుకుపోవడం మొదలెట్టాయి.

రాముడు ఇంకో గొప్ప అస్త్రం వేసి (పేరు లేదు. దీనికి ఏం పేరు పెట్టాలో తోచలేదు గావున్ను!) సౌరాస్త్రాన్ని ఎగరగొట్టేశాడు.

రావణుడు కోపంతో రాముడి మర్మస్థానాల్లో 10 బాణాలు కొట్టాడు. (అబ్బే, పదేం చాలతాయి?) రాముడూ అలాగే రావణుడి శరీరమంతా బాణాలు కొట్టాడు. అంతలో లక్ష్మణుడు తీవ్ర బాణాలతో రావ

ణుడి జెండా పడగొట్టేశాడు. (రావణుడు రాముడితో యుద్ధం చేస్తూ వున్నప్పుడు నువ్వు వెళ్ళడం ఏమిటోయ్ లక్ష్మణుడూ? ఇద్దరు వ్యక్తులు యుద్ధం చేస్తూ వున్నప్పుడు, మూడో వ్యక్తి కలగజేసుకోకూడదని హనుమంతుడు చెప్పలేదూ?) లక్ష్మణుడు ఇంకో బాణంతో రావణుడి సారథి తల ఛేదిం చేశాడు.

అంతలో విభీషణుడు, రావణుడి గుఱ్ఱాల్ని గదతో బాది చంపేశాడు. రావణుడు రథం లోంచి దూకేస్తూ విభీషణుడి మీద భయంకరమైన శక్తి విసిరాడు. లక్ష్మణుడు దాన్ని విభీషణుడి మీద పడకుండా ఛేదిం చేశాడు. (రాముడి వేపున ఎంతమంది వున్నారో! రావణుడికి ఎవ్వరూ లేరు!) రావణుడు విభీషణుడి మీద విసరటానికి ఇంకో శక్తి తీశాడు. లక్ష్మణుడు రావణుడి మీద బాణ వర్షం కురిపిస్తోంటే, విభీషణుడు తప్పుకుని పారిపోగలిగాడు.

రావణుడు లక్ష్మణుడితో కోపంగా, "గొప్ప వీరుడివే నోయీ! నీ దయవల్ల ఆ నీచుడు బతికి పోయాడు. సరే, ఇప్పుడు నిన్నెవడు రక్షిస్తాడో చూస్తాను" అంటూ ఆ మహాశక్తిని లక్ష్మణుడి మీదకి విసిరేశాడు.

లక్ష్మణుడి మీద పడటానికి దూసుకువొస్తోన్న శక్తితో రాముడు – "శక్తీ! లక్ష్మణుడు క్షేమంగా వుండాలి. నువ్వు వ్యర్థమై పో" అన్నాడు.

శక్తి అదేం పట్టించుకోకుండా తిన్నగా వొచ్చి లక్ష్మణుడి గుండెల్ని గుద్దింది. (రాముడి గొప్ప దానికేం తెలుసు పాపం? మొత్తానికి రాముడి పరువు తీసింది!)

లక్ష్మణుడు కింద పడిపోయాడు. (రాముడు, తల ఎక్కడ పెట్టుకున్నాడో!) రాముడు కోపం పట్టలేక కింద పడ్డ శక్తిని తీసి దూరంగా విసిరి కొట్టాడు. (అంతకన్నా ఏం చేస్తాడులే.)

అంతలో రావణుడు రాముణ్ణి మర్మస్థానాల్లో కొట్టాడు.

రాముడు సుగ్రీవుడి తోటీ హనుమంతుడి తోటీ – "మీరందరూ లక్ష్మణుణ్ణి జాగ్రత్తగా కాపాడుతూ వుండండి. ఆ దుర్మార్గుడి పని నేను పడతాను. ఇంత కాలానికి నా చిరకాల వాంఛ నెరవేరబోతోంది. ఇప్పుడు రావణుడు పోవడమో, రాముడు పోవడమో (అరావణమో, అరామమో) ఏదో వొకటి జరిగిపోవాలి. (ఏదో వొకటి కాదు, రెండూ జరిగిపోవాలి. ఇద్దరూ నికృష్టులే.)

నాకు రాజ్యం పోవడం, దుర్భర వనవాసం, దండ కారణ్యంలో పడి తిరగటం, సీతని పర పురుషుడు ముట్టడం (యుద్ధ రంగంలో కూడా భార్యని పర పురుషుడు ముట్టడం గురించే ఆలోచన!), సీత రాక్షసుల్లో వుండవలసి రావడం – ఈ కష్టాలన్నీ అనుభవించాను ఇన్నాళ్ళూ. ఇక రావణ వధతో అన్నీ వొదిలించుకుంటాను. (యుద్ధం మానేసి కబుర్లు గుమ్మరిస్తున్నావు. ఇక కదలు అటు!)

ఈ రావణుణ్ణి చంపడానికే, వాలిని చంపి సుగ్రీవుడికి పట్టాభిషేకం చేసి, వానరుల్ని ఇక్కడికి తెచ్చాను. (నీ అవసరం కోసమే గానీ ధర్మస్థాపనకు కాదన్నమాట! పోనీలే. ఇప్పటికైనా నిజం చెప్పావు.) ఈ దుర్మార్గుణ్ణి చంపడానికే సముద్రం మీద సేతువు నిర్మించాను (అందరికీ తెలిసిందే కదోయీ! ఎందుకు ఇప్పుడీ అసందర్భ ప్రసంగం?)

ఈ దుర్మార్గుడు యుద్ధరంగంలో నాకు కనిపించాడు. ఇక నా బాణాల దెబ్బల నించి తప్పుకో లేడు. కళ్ళల్లో విషం వుండే పాము బారినుంచి ఎవ్వరూ తప్పుకోలేనట్టే, రావణుడు నా బారి నుంచి తప్పుకోలేడు. (అంటే, రాముడు, కళ్ళల్లో విషం వుండే పాము లాంటి వాడన్న మాట! పోలికలు ఎలా వుండాలో కవికి ఎక్కడా తెలియడం లేదు!)

వానరులారా! మీరందరూ చక్కగా పర్వతాలు ఎక్కి కూర్చుని నాకూ రావణుడికీ జరిగే భీకర యుద్ధం చూస్తూ వుండండి. ముల్లోకాల్లో గల రుషులూ, దేవతలూ, గంధర్వులూ అందరూ (చెట్లెక్కి) నా రామత్వం చూస్తారు. (అంటే ఇక్కడ రామత్వాన్ని రాముడి వీరత్వంగా అర్థం చేసుకోవాలి. "మీరందరూ రాముడి వీరత్వం చూడండి" అని రాముడే చెప్పడం!)

"చరాచర ప్రపంచంలో, సర్వప్రాణులూ, ఎల్ల కాలాలూ, నా యుద్ధం గురించి ఆశ్చర్యంతో చెప్పుకునే విధంగా ఇప్పుడు యుద్ధం చేస్తాను. ఇప్పుడు చూడండి, మొదలు పెడుతున్నాను!' అంటూ రాముడు, రావణుడి మీద బాణాలు గుప్పించాడు.

రావణుడు కూడా బాణ వర్షం ప్రారంభించాడు. రామ రావణ బాణాలు ఢీకొని బ్రహ్మాండం బద్దలైపోతోన్నట్టు శబ్దాలు పుట్టాయి.

ధనుస్సుల విన్యాసాలూ, శబ్దాలూ, ముల్లోకాలకూ భయాశ్చర్యాలు కలిగిస్తున్నాయి. (మాకు తప్ప!)

రాముడి వీరత్వం ముందు నిలబడలేక రావ ణుడు, గాలి తరుముతోన్న మేఘం లాగ భయంతో పారిపోయాడు.[423]

---

**423.** యుద్ధ, సర్గ 110, శ్లోకం 63: "గొప్ప ధైర్యము గలవాడును, ప్రకాశించుచుండు ధనుస్సు గల వాడును నగు రామునిచే బాణ వర్షము కురిపించ బడినవాడై దుఃఖించి యుండు రావణుడు, శ్రీరామునితో చేరి యుద్ధము జేసి, గాలిచే కొట్టబడిన మేఘము వలె, భయపడి పారిపోయెను."

(యుద్ధం నించి రావణుడు పారిపోయాడు కదా? ఇప్పుడు కథ మళ్ళీ వెనక్కి వెళ్ళి ఇంకో రకంగా జరుగుతుంది.)

రాముడు యుద్ధం చేస్తూనే సుషేణుడితో మాట్లాడుతున్నాడు. "సుషేణా! మహా వీరుడైన రావణుడి శక్తి దెబ్బతో లక్ష్మణుడు భూమి మీద పడి సర్పంలాగ పొరలుతూ నాకు దుఃఖం కలిగిస్తున్నాడు. నా ప్రాణాల కన్నా అధికుడైన తమ్ముడు ఇంత బాధపడుతూ వుంటే నేనెలా యుద్ధం చెయ్యగలను? నా తమ్ముడే మరణిస్తే నేనిక బతకడం ఎందుకు? నాకు రాజ్యమెందుకు? సీత ఎందుకు? యుద్ధమెందుకు? సుఖాలెందుకు? నా పరాక్రమం సిగ్గు పడుతోంది. ధనుస్సు జారిపోతోంది. బాణాలు గురి తప్పుతున్నాయి. కన్నీటితో దృష్టి ఆనడం లేదు. స్వప్నంలో నడుస్తున్నట్టు నా అవయవాలన్నీ తేలిపోతున్నాయి. దుఃఖం ముంచుకొస్తోంది. చచ్చిపోవాలనే కోరిక కలుగుతోంది. ఏ దేశంలో అయినా భార్యలు దొరుకుతారు. బంధువులూ దొరుకుతారు. తమ్ముడెలా దొరుకుతాడు?" (ఉత్త తమ్ముడు కాదు, లక్ష్మణుడి లాంటి, రాత్రింబవళ్ళూ చాకిరీలు చేసే తమ్ముడు అసలే దొరకడు) అంటూ రాముడు దుఃఖిస్తూ నేలమీద పడి దొర్లడం మొదలెట్టాడు. (సుషేణుడితో చెప్పడం మొదలు పెట్టే సరికి బాణాలు వేస్తున్నాడు. ముగించేప్పటికి నేలమీద "పొరలు చుండెను.")

సుషేణుడు రాముణ్ణి సముదాయించటానికి పూనుకున్నాడు. లక్ష్మణుడి మొహం కాంతిగా వుందనీ, అతడు మరణించలేదనీ చెప్పాడు. హనుమంతుణ్ణి పిల్చి, మళ్ళీ ఓషధులు తెమ్మనడం, హనుమంతుడు ఆ పర్వతాన్ని మళ్ళీ తీసుకురావడం అన్నీ మళ్ళీ జరిగాయి.

సుషేణుడు హనుమంతుణ్ణి "మంచి పని చేశావు" అని మెచ్చుకుని, ఔషధాలు చూర్ణం చేసి లక్ష్మణుడికి వాసన చూపించాడు.

లక్ష్మణుడు నిద్రలోంచి లేచినట్టు సుఖంగా లేచి కూర్చున్నాడు. (సుషేణుడూ! ఆ మొక్కల విత్తనాలు జాగత్తగా వుంచు!)

రాముడు, లక్ష్మణుణ్ణి ఆలింగనం చేసుకుని (బతికినందుకు బహుమానం ఆ ఆలింగనం! రాముడికి, లక్ష్మణుడితో చాలా పని వుంది.) "లక్ష్మణా! నువ్వే మరణిస్తే నేను బతకడం ఎందుకు? రాజ్యమెందుకు? సీత ఎందుకు? యుద్ధ మెందుకు? రావణుణ్ణి జయిస్తే మాత్రం ఏం ప్రయోజనం?" అని ప్రేమ కురిపించాడు.

దానికి బదులుగా లక్ష్మణుడు భక్తి కురిపించాడు. "అయ్యో! పామరుడి లాగ మాట్లాడుతున్నావే! విభీషణుడికి పట్టాభిషేకం చేస్తానన్నావు. సత్పురుషులు, చేసిన వాగ్దానం నిలబెట్టుకోవాలి. నా కోసం అన్నిటినీ త్యజించడం ధర్మం కాదు. సూర్యాస్తమయం లోగానే రావణుణ్ణి సంహరించమని ప్రార్థిస్తున్నాను" అని ప్రార్థించాడు. (నీ కోసం అన్నీ వొదిలేస్తాను – అని అన్నగారు అనడం; వొద్దు వొద్దు, నా కోసం వొదలొద్దు – అని తమ్ముడుగారు అనడం – ఈ ఘట్టం వొక్కటే గొప్ప నాటకంగా వేసుకోవచ్చు రామదాసులు.)

---

➔ రాముడు యుద్ధానికి దిగేప్పటికే రావణుడి పక్షంలో సామాన్య సైనికులు తప్ప పెద్ద పెద్ద వీరులందరూ చచ్చిపోయారు. రావణుడు ఒక్కడే యుద్ధంలో ఉన్నాడు. రాముడికి మాత్రం చాలా మంది వీరులు సహాయంగా ఉన్నారు. – అదీ పరిస్థితి! ఈ రకంగా యుద్ధం ప్రారంభం అయ్యీ అవగానే రావణుడు "పారిపోయాడు!"

ఇంతకు ముందే ఒకసారి రాముడికీ, రావణుడికీ యుద్ధం జరిగింది. అప్పుడు రావణుడు 'ఓడిపోయాడు!' ఇప్పుడు 'పారిపోయాడు!' రావణుడు పారిపోయాడంటే, పిరికివాడనే కదా అర్థం? అలాంటి వాడితోనేనా రాముడు చేసే మహా యుద్ధం?

రామ రావణయుద్ధం ప్రారంభమై జరుగుతూ వుండగా, ఆ రకంగానే యుద్ధం కొనసాగించక, రావణుడు పారిపోయినట్టు చిత్రించడం ఎందుకు? ఎందుకంటే, తర్వాత కథ ఎలా జరుగుతుందో చూస్తే దాన్ని బట్టి తెలుస్తుంది. అవతల లక్ష్మణుడు మూర్ఛపోయి ఉన్నాడు కదా? శ్రీరాముడు మళ్ళీ భ్రాతృప్రేమతో ధర్మశాస్త్రబద్ధంగా, వైనవైనాలుగా దుఃఖించాలి కదా? దానికోసం కొంతసేపు యుద్ధం ఆగాలి. యుద్ధం ఆగాలంటే ఏమీ మార్గాలు లేవా? 'రాత్రి అయింది' అంటే సరిపోదా?

కానీ, రావణుడితో యుద్ధం ప్రారంభమయ్యాక రెండు రోజులు పట్టడం శ్రీరాముడి పరాక్రమానికే మచ్చ. ఒక్క రోజులోనే రావణుణ్ణి చంపెయ్యాలి. యుద్ధానికి మధ్యలో రాత్రి రాకూడదు. ఇక, యుద్ధం ఆగే మార్గం ఏమిటి? రావణుడు పారిపోవటం ఒక్కటే! శ్రీరాముడి భ్రాతృప్రేమ పొంగు అణిగింతర్వాత, లక్ష్మణుడు లేచిం తర్వాత, రాముడి పక్షం అంతా సుఖంగా సిద్ధం అయింతర్వాత, పారిపోయిన రావణుడు మళ్ళీ వెనక్కి రావాలి.

అసలు యుద్ధం ఇంత చివరికి వొచ్చేసిం తర్వాత, మళ్ళీ 'లక్ష్మణుడి మూర్ఛ'ని కల్పించడం ఎందుకు? ఎందుకంటే, 'రావణుడు మహా వీరుడు సుమా! రావణుడు విసిరిన శక్తిని రాముడు కూడా ఆపలేకపోయాడు. అంత గొప్ప వీరుడితో రాముడు యుద్ధం చేస్తున్నాడు' అని చెప్పడానికి! రావణుడు – ఒక క్షణంలో, మహా వీరుడు! మరు క్షణంలో, పిరికిపంద! అతన్ని అప్పుడే పొగడడం, అప్పుడే పరిగెత్తించడం! ★

లక్ష్మణుడి మాటలు విని రాముడు వెంటనే ధనుస్సు ఎత్తి రావణుడి మీద బాణాలు గుప్పించాడు. (రావణుడు అప్పటి దాకా బాణాల కోసం ఎదురు చూస్తూ నిలబడి వున్నాడు కాబోలు!)

రావణుడు ఇంకో రథంలో వొచ్చి వీర విహారం మొదలుపెట్టాడు.

దేవతలు ఆఖాశం మీద నించి చూసి, "రాముడికి రథం లేకపోవడం బాగా లేదు" అనుకున్నారు. వెంటనే ఇంద్రుడు తన రథం పంపించాడు.

ఇంద్రుడి సారథి మాతలి, పచ్చని గుర్రాల తోటీ, ఛత్ర చామరాల తోటీ, బాల సూర్యుడిలా మెరిసిపోతున్న బంగారు రథం తోలుకొచ్చాడు "శ్రీరామా! శత్రు సంహార కుడా! నీ కోసం ఇంద్రుడు ఈ రథం, కవచం, ధనుస్సూ, శక్తీ పంపించాడు. రథం మీద నిలబడి యుద్ధం చెయ్యి!" అన్నాడు. (రుషులు రథాలు ఎక్కవచ్చా? ఎప్పుడూ హను మంతుడే ఎక్కించుకుంటాడుగా రాముణ్ణి? ఈ సారి ఎక్కించుకోనన్నాడా?)

రాముడా రథానికి ప్రదక్షిణం చేసి వీరోచితంగా ఎక్కాడు. (ఎన్నాళ్ళయిందో పాపం రథాలెక్కి!)

ఇక రామ - రావణులకు జరిగిన యుద్ధం చూడ లేరు. చెప్పలేరు. అంత ఘోరంగా జరిగింది.

రావణుడు గాంధర్వాస్త్రం వేశాడు. రాముడు కూడా గాంధర్వాస్త్రమే వేసి దాన్ని కొట్టేశాడు. (ఒక గాంధర్వాస్త్రం ఇంకో గాంధర్వాస్త్రాన్ని కొట్టెయ్య గలదా? రెండూ సమానం కాదా?) రావణుడు దైవాస్త్రం వేశాడు. రాముడు కూడా దైవాస్త్రం వేసి దాన్ని కొట్టేశాడు. (రావణుణ్ణి కాపీ కొట్టడమేనా రాముడు చేసే యుద్ధం?)

రావణుడు పన్నగాస్త్రం వేశాడు. వేల కొద్దీ మహా సర్పాలు అగ్ని జ్వాలలు కక్కుతూ, పడగలు విప్పుకుని ఆడుతూ రాముడి మీదకు రావడం మొదలెట్టాయి.

రాముడు గరుడాస్త్రం వేశాడు. భయంకరమైన ముక్కులూ, గోళ్ళూ గల గరుడ పక్షులు పుట్టుకొచ్చి సర్పాలన్నిట్నీ ముక్కుల్తో పొడుస్తూ కాళ్ళతో తన్నుకు పోయాయి. (రావణుడూ! పాముల బాణాలెందుకు గానీ, చీమల బాణాలు వెయ్యి! రాముడేం చేస్తాడో చూద్దాం!)

రావణుడు ఉగ్రుడైపోయి తీవ్రమైన బాణాలతో రాముడి గుర్రాన్ని కొట్టి, రథం మీద జెండాని కూడా కొట్టాడు. అది రథం మీదే పడింది గానీ కింద పడలేదు. (రాముడి జెండా, కిందపడుతుందా ఎక్కడైనా?)

రావణుడి వీర విహారానికి రాముడు అశక్తుడై పోయినట్టు, రావణుణ్ణి ధిక్కరించలేక పోతున్నాడు! వాన రులూ, దేవతలూ మిక్కిలి విచారించారు. సముద్రాలు కలతపడిపోయాయి. దిక్కులు కంపించాయి.

రాముడికి కోపం వచ్చేసి భీకరంగా చూశాడు. అప్పుడు మళ్ళీ లోకాలు కలవరపడ్డాయి. భూమి కంపిం చింది. (భూమికి ఇంకో పనేం లేదా?) రాముడి కోపం చూసి రావణుడే భయపడిపోయాడు.

ఆకాశంలో దేవతలందరూ, "రామా! నువ్వే జయించు!" అని కేకలేస్తూ నించున్నారు. ఆకాశంలో అసురులందరూ ఎవరంటే భూమి మీద "రావణా! నువ్వే జయించాలి" అని అరుస్తున్నారు. (ఆకాశంలో అసురు లందరూ ఎవరంటే, భూమి మీద చచ్చిపోయి ఆకాశానికి వెళ్ళిన వారు. అక్కడికి వెళ్ళి దేవతలతో కలిసిపోకుండా అక్కడ కూడా అసురులుగానే వున్నందుకు వీరిని ఎంతైనా అభినందించాలి! ఆకాశంలో వాళ్ళు, రెండు పక్షాలుగా విడిపోయారంటే, కింద వాళ్ళ నెత్తుల మీద, ఆకాశంలో కూడా ఒక యుద్ధం గావున్ను!)

రావణుడు గొప్ప శూలం ఎత్తాడు. అది పరమ భయంకరమైంది. అంకుశాల్లాంటి ముళ్ళతో, కత్తుల్లాంటి పదును గల అంచులతో, సకల ప్రాణుల్నీ చీల్చి బద్దలు చేసెయ్యగలిగినటువంటిది. అలాంటి భీకర శూలాన్ని రాముడి మీద విసరడానికి ఎత్తాడు రావణుడు.

దేవతలు భయపడిపోయారు. (దూరంగా పోండి! ఆ శూలం మీ మీదకొస్తుంది!) సముద్రాలూ .... లోకాలూ .... అల్లకల్లోలం అయిపోయాయి. రావణుడా శూలం శక్తి కొద్దీ విసిరేశాడు. అది గంటలు మోగించు కుంటూ యమ దండం లాగ రాముడి వేపు దూసు కొచ్చెయ్యడం మొదలుపెట్టింది. రాముడు గొప్ప గొప్ప బాణాలు గుప్పించాడు గానీ ఏమీ పని జరగలేదు. అన్నీ వ్యర్థమై చెల్లాచెదురై పోయాయి. శూలం నిప్పులు కక్కుతూ దూసుకొచ్చేస్తూనే వుంది. రాముడు ఉగ్రుడై పోయి, ఇంద్రుడు మాతలితో పంపిన శక్తి తీసి శూలం మీదకి విసిరేశాడు. ఈ భీకరమైన శక్తి దెబ్బకి, ఆ భీకరమైన శూలం తునాతునకలై పడిపోయింది. (ఇంద్రుడు ఆ శక్తిని పంపకపోతే, ఏమయ్యేదో! - ఏమౌ తుందిలే. కానీ ఇంద్రుడు పంపకపోతే చంద్రుడు పంపు తాడు. ఎవరూ పంపకపోతే రాముడేం చేసేవాడు?)

తర్వాత మళ్ళీ రాముడూ, రావణుడూ బాణాల వర్షం కురిపించుకున్నారు. ఆ వర్షంలో ఏం జరిగిందో ఎవ్వరూ చూడలేకపోయారు. (ఏం జరుగుతుంది? రావణుడు పడిపోయి వుంటాడు. చూడకపోతే మాత్రం ఆ మాత్రం ఊహించలేమా?)

రాముడు రావణుడితో వెటకారంగా, "పిరికి పంద లాగ నేను లేని సమయంలో నా భార్యని ఎత్తుకు పోయావే! (నువ్వు ఉన్న సమయంలో నిన్ను అడిగితే నువ్వు ఇస్తావా మరి నీ భార్యని?) నువ్వు వొక వీరుడివేనా? (నేనే వొక వీరుడిని!) రక్షించే వారు దగ్గిర లేనప్పుడు పర స్త్రీని బాధించి తీసుకుపోయావు. సిగ్గు

లేదా? గొప్ప వీరుణ్ణని విర్రవీగుతున్నావు. నేను చూస్తుండగానే సీతని తీసుకుపోతే ఆ నాడే నువ్వూ చచ్చి ఖరుడి దగ్గిరికి చేరేవాడివి. (రాముడు ఆవేశంలో వున్నాడు లెండి, అలాగే మాట్లాడతాడు. అతను నోరు తెరిచేదే గొప్పల కోసం. ఇప్పుడు మరీనూ.) దైవ వశాత్తూ నా కళ్ళబడ్డావు. ఇప్పుడే నిన్ను యమ లోకానికి పంపుతాను. నీ కళేబరం నిండా కాకులూ, గద్దలూ వాలి కండలు కండలు పీక్కుతింటాయి. పేగులు తన్నుకు పోతాయి" అంటూ తిట్ల వర్షం, బాణ వర్షం సరి సమానంగా కురిపించాడు.

రాముడికి ఆత్మలోంచే అస్త్రాలన్నీ పుట్టుకొస్తున్నాయి. శుభ శకునాలు కనపడుతున్నాయని గుర్తించి మహోత్సాహంతో బాణ వర్షం అధికం చేశాడు.

వానరులు కురిపించిన శిలావర్షం తోటీ, రాముడు కురిపించిన బాణ వర్షం తోటీ రావణుడు గుక్క తిప్పుకోలేక గుండె పగిలి అశక్తుడైపోయాడు. ఆ పరిస్థితి గ్రహించి అతని సారధి రధాన్ని యుద్ధ రంగం నించి దూరంగా తీసుకుపోయాడు. సారధి చేసిన పనికి రావణుడికి చాలా కోపం వొచ్చింది. సిగ్గు కలిగింది. "సారధీ! వీరత్వం, పౌరుషం లేనివాడి విషయంలో చేసినట్టు నా విషయంలో కూడా చేశావు. నా అనుమతి లేకుండా, నా అభిప్రాయం తెలుసుకోకుండా, నన్ను యుద్ధరంగం నించి ఎందుకు వెనక్కి మళ్ళించావు? శతృవు ముందు నాకు తీరని అవమానం కలిగించావు. 'రావణుడు యుద్ధంలో వెన్ను చూపడ'నే కీర్తి అంతా నాశనం చేసేశావు. శతృవు మేలే కోరావు. నా మేలు కోరిన వాడివైతే ఇలా చేస్తావా?" అని కోపంతో తిట్టాడు.

సారధి ఎంతో వినయంతో, "నేను శతృవు మేలెన్నడూ కోరను మహారాజా! నిన్ను అవమాన పరచాలన్నది నా అభిప్రాయం కాదు. నువ్వు చాలా అలిసిపోయి వున్నావు. నీ మొహం శ్రమతో వాడిపోయి వుంది. గుర్రాలు కూడా అలిసిపోయి రొప్పుతున్నాయి. చుట్టూ అనేక రకాల అప శకునాలు కనపడుతున్నాయి. రధం నడిపే సారధి, రధికుడి స్థితిగతులెలా వున్నాయో, శతృవుల బలం ఏ విధంగా వుందో, రధం తిరగవలసిన యుద్ధభూమి సమ తలంగా వుందో లేదో, శతృవు ఎదటికి ఎప్పుడు తిన్నగా పోవాలో, ఎప్పుడు పక్క నించి దూసుకుపోవాలో, అన్నీ ఎప్పటి కప్పుడు గ్రహిస్తూ వుండాలి. అన్నీ గ్రహించే నేనీ పని చేశాను. నువ్వు శ్రమ తీర్చుకున్న తర్వాతే యుద్ధానికి పోవచ్చును. నీ మీద ప్రేమ చేతనే, నీ మేలు కోసమే నే నిలా చేస్తే నువ్వది కీడుగా భావించావు (బుద్ధి లేదా?)" అన్నాడు.[424]

రావణుడు సంతోషించాడు. "అవును. మంచి పని చేశావు" అని ఒక ఆభరణం తీసి సారధికి బహుమానంగా ఇచ్చి, "రధం రాముడి ముందుకు పోనియ్యి!" అన్నాడు. (ఒక నగ తీస్తే బరువు తగ్గి, ఇప్పుడు తేలిగ్గా వుండి వుంటుంది.)

రావణుడి రధం రాముడి కెదురుగా పరిగెత్తింది. రావణుడు మళ్ళీ రావటం చూసి "ఇతన్ని చంపడం ఎలాగా?" అని రాముడు ఆలోచిస్తూ వుండగా, యుద్ధం చూడాలని దేవతలతో కలిసి వచ్చిన అగస్త్యుడు, రాముడి దగ్గిరికి వచ్చాడు. "రామా! శతృవుని జయించే రహస్యం చెపుతాను విను. (అయ్యో, చెప్పు! అంతకంటేనా?) సకల పాపాలూ, వ్యాధులూ, పీడలూ, భయాలూ, చింతలూ పోగొట్టి ఆయుష్షుని వృద్ధిచేసే 'ఆదిత్య హృదయం' అనే మంత్రం చెపుతాను. దాన్ని స్తోత్రం చేసి సర్వేశ్వరుడైన సూర్యుణ్ణి పూజించు!" అని ఆ మంత్రం చెప్పాడు. "దీన్ని నిశ్చలమైన మనసుతో మూడు సార్లు జపించి యుద్ధానికి వెళ్ళు! శతృవుని జయిస్తావు" అని చెప్పి వెళ్ళిపోయాడు. (యుద్ధం చూడకుండానే! ఏంటి కవిగారూ పాపం అగస్త్యుడు యుద్ధం చూడాలని వొస్తే, మంత్రం చెప్పించుకుని పంపించేశారూ?)[425]

---

**424.** **యుద్ధ, సర్గ 106 అంతా**: సారధి తనని యుద్ధరంగం నించి దూరంగా తీసుకు పోయినందుకు రావణుడు సారధిని మందలిస్తున్నాడు. "నన్నవమానించి నీ ఇష్ట ప్రకారం పని చేసితివి. రావణుడు యుద్ధంలో వెనుదీయడను నమ్మకము నాశనం చేసితివి" అంటున్నాడు.

రావణుడు యుద్ధ రంగంలోంచి పారిపోయాడని చెప్పేదీ కవే! సారధి తనని యుద్ధరంగం నించి వెనక్కి తీసుకు పోయినందుకు రావణుడు చాలా అవమానపడ్డాడని చెప్పేదీ కవే. యుద్ధరంగంలో వెన్ను చూపడం అవమానంగా భావించే వాడు, పారిపోవడం ఏమిటి? పారిపోయే వాడు, ఇంత ఆత్మాభిమానంతో మాట్లాడటం ఏమిటి? యుద్ధరంగంలో, రధ సారధి, ఏ యే జాగ్రత్తలు తీసుకోవాలో, ఏ విధంగా రధం నడపాలో చెప్పాలని కవి కుతూహలం! దానికోసం ఈ సందర్భాన్ని ఉపయోగించాడు, అసందర్భంగా! ★

**425.** **యుద్ధ, సర్గ 107, శ్లోకాలు ...24**: "యుద్ధం జూచుటకు దేవతలతో గూడి వచ్చిన అగస్త్య మహర్షి, యుద్ధమునకు తిరిగి వచ్చిన రావణుని తనముందు జూచి చింతించుచున్న వాడగు రాముని సమీపమునకు వచ్చి ఇట్లనియె."

రావణుడు తిరిగి యుద్ధానికి వచ్చేశాడు. రాముడు కంగారుపడి చింతిస్తున్నాడు. అప్పుడు అగస్త్యుడు రాముడి దగ్గిరికి వచ్చి 'ఆదిత్య మంత్రం' చెప్పాడు. మరి అంతసేపూ రావణుడేం చేస్తాడు? – రావణుడి సారధి రధం దూరంగా తోలుకు ➔

అప్పటికి రాముడికి భీతి తొలిగింది. శోకం విడిచి పెట్టాడు. (నష్టశోకః = నశించిన శోకము గలవాడు; అభవత్ = ఆయెను. అంటే, అప్పటి దాకా మనసులో శోకం తోటే వున్నాడన్నమాట!)

రాముడు ఆ మంత్రం మూడు సార్లు జపించి, సూర్యుణ్ణి చూసి ధనుస్సు పట్టుకుని యుద్ధానికి సిద్ధ మయ్యాడు. రాముడి జపానికి సూర్యుడు సంతోషించి, ఆకాశంలో దేవతల మధ్య నించి "రావణుణ్ణి తొందరగా చంపెయ్!" అని కేక పెట్టాడు. (రావణుణ్ణి చంపే భారమంతా రాముడు ఆదిత్య మంత్రం చదివి నీ మీదికి తోస్తే, నువ్వు రాముడి మీదకి తోస్తున్నా వేంటి సూర్యుడూ? భలేగా వున్నారే!)

రావణుడి రథం, జెండాలు రెప రెపలాడించు కుంటూ, ఆయుధాలతో నిండి, నల్ల గుర్రాలతో, గొప్ప ధ్వనితో, యుద్ధరంగంలో తిరిగింది.

రాముడు రావణుడి రథం చూసి (తారెత్తి) తన సారథితో గబ గబా చెప్పడం మొదలుపెట్టాడు. "మాతలీ! రావణ రథం చూడు! మృత్యువాత పడపోతున్నాడు రావణుడు. నువ్వు రథం జాగ్రత్తగా నడపాలి సుమా! రావణుణ్ణి చంపెయ్యాలి ఇప్పుడు. చాలా జాగ్రత్త. ధైర్యంగా ఉండు! అధైర్యపడకు. మనసు కలవరపడ నివ్వకు. దృష్టి చెదిరి పోనివ్వకు. అజాగ్రత్త కూడదు సుమా! కంగారు పడకుండా గుర్రాల్ని చక్కగా నడుపు! (అదేదో నువ్వే నడుపుకుందూ అతన్ని చంపకా! మాతలీ! నువ్వలా వింటూ పూరుకుంటా వేమిటోయ్? "ఇంద్రు డికే రథం నడిపానండోయ్! ఏంటనుకున్నారో! నాకు చేతనైనట్టు తోలతా. అక్కర్లేదంటే చెప్పెయ్యండి, రథం తీసుకుపోతా" అనరాదూ? పిచ్చిమొహంలా అలా పూరుకుంటావేం?)

రాముడు ఇంకా చెప్పుకొచ్చాడు. "నువ్వు ఇంద్రుడి రథ సారథివి. నాకు తెలుసు. నీకేమీ జాగ్రత్తలు చెప్పక్కర లేదు. కానీ, నేను యుద్ధం చెయ్యాలనే ఏకాగ్రతతో ఉన్నా నని నీకు జ్ఞాపకం చేస్తున్నాను. (నువ్వు జ్ఞాపకం పెట్టు కుందూ!) అంతేగానీ నీకు ఉపదేశించడం లేదు" అన్నాడు. (ఒళ్ళు కాస్త దగ్గిర పెట్టుకున్నాడు. ఎందుకో మరి!)

రాముడి మాటలకు మాతలి సంతోషించాడు. (ఇంద్రుడు ఇంతకన్నా సతాయిస్తాడు గావున్ను. రాముడే నయంగా కనపడి సంతోషిస్తున్నాడు సారథి.)

మళ్ళీ భయంకర యుద్ధం!

రావణుడే, ముందు బాణ వర్షం కురిపించాడు. రాముడు తర్వాత కురిపించాడు.

రావణుడి రథం మీద రక్త వర్షం కురిసింది. రథం చుట్టూ సుడిగాలి అప్రదక్షిణంగా తిరిగింది. రావణుడి రథం ఎటుపోతే అటు గద్దలు గుంపులు గుంపులుగా ఎగురుతూనే వున్నాయి. రాక్షస సేన నిండా పిడుగులు పడ్డాయి. తోకచుక్కలు దూసుకుంటూ వొచ్చాయి. రావ

---

➔పోయినప్పుడు, ఇక్కడ సమయం దొరుకుతుంది. అప్పుడు రాముడి దగ్గిరికి అగస్త్యుడు రావడమూ అదీ జరిగితే, సందర్భం కుదురుతుంది. రావణుడు వచ్చేటప్పటికి రాముడు కూడా సిద్ధంగా ఉండొచ్చు. అంతేగానీ, రావణుడు వొచ్చేశాక అప్పుడు రాముడు విచారించడం, అగస్త్యుడు రావటం, ఇరవై శ్లోకాల మంత్రం చెప్పడం, దాన్ని రాముడు మూడు సార్లు జపించడం, అందాకా రావణుడు నించోవాలా? సరే!

'ఆదిత్య హృదయం' అంతా సూర్యుణ్ణి వర్ణించడమే. – "కాంతి మంతుడు. చక్కగా ఉదయించువాడు. దేవాసురులందరి చేతా పూజింపబడు వాడు. భువనేశ్వరుడు. బ్రహ్మ విష్ణు మహేశ్వరాది సమస్త దేవతలూ ఇతడే. ఇతడే అగ్ని. ఇతడే వాయువు. ఇతడే ప్రాణము. ఇతడే కర్త. ఇతడే యజ్ఞాలు. ఇతడే వేదాలు... ఇటువంటి వాడైన సూర్యుణ్ణి నేను ప్రార్థిస్తున్నాను" – ఇదీ, ఆ మంత్రం!

ఇందులో కవి చెప్పిన ప్రతీ మాటకీ ఎన్నెన్ని సొంత కవిత్వాలు తయారుచేశారో ఈ అనువాదకులు! ఉదాహరణకి చూడండి: 'తపనః' అంటే 'తపింప జేయువాడు' అని అర్థం. సూర్యుడు తాపం కలిగిస్తాడనే అర్థం చెపితే చాలు. కానీ, అనువాదకులు చెప్పే అర్థం ఏమిటంటే – సూర్యుడు, తన భక్తుల శత్రువులకు తాపం కలిగించువాడట! భక్తులకు కాదు, భక్తుల శత్రువులకు! శ్లోకంలో లేని అర్థాలు తెచ్చి చెప్పడం!

'తిమిరోన్మథనః' అంటే, తిమిరమును మధించువాడు. చీకటిని పోగొట్టువాడు అనే కదా? అంతే చెప్పి ఊరుకుంటే, ఈ పండితుల గొప్పేం ఉంటుంది?– సూర్యుడు, మూర్ఖుల అజ్ఞానాంధకారాన్ని మధించి పోగొడతాడట! (ఇదే నిజమైతే, సూర్యుడు, ఈ పండిత మూర్ఖుల అజ్ఞానాంధకారాన్ని పోగొట్టే వాడే కదా?) తమోభేదీ – అంటే కూడా చీకటిని భేదించే వాడే. కానీ, దీంతోపాటే పండితులు ఇంకో కొత్త అర్థం కూడా చెప్పారు. ఏమిటంటే – సూర్యుణ్ణి రాహువు మింగుతాడట! సూర్యుడు ఆ రాహువులోంచి బయటికి వొచ్చేస్తాడట! కాబట్టి, 'తమోభేదీ' అంటే రాహువుని భేదించే వాడట! – ఈ రకంగా, ఎంతో స్పష్టమైన మాటల్ని కూడా గందరగోళంలోకి లాగేస్తేనే గొప్ప పాండిత్యం! అదే గొప్ప జ్ఞానం! లేకపోతే అజ్ఞానమే! రామాయణ కవికన్నా, ఈ పండితులు మరీ ఘోరంగా ఉన్నారు! ★

ణుడు ఉన్నచోటే భూమి కంపించింది.

రాక్షసులు వానరులతో యుద్ధం చేస్తోంటే, రాక్షసుల చేతులు ఎవరో పట్టుకున్నట్టు ఆగిపోయాయి. (ఇంకెవరు? కవిగారే పట్టుకున్నారు. ఆ మాత్రం ఊహించలేమా?)

యుద్ధ రంగంలో గాలిదుమ్ము లేచి రావణుడికి దృష్టి ఆనకుండా కళ్ళకు అడ్డం వొచ్చింది. క్రూర పక్షులు పోట్లాడుకుంటూ రావణుడి రథం మీదకి వొచ్చిపడ్డాయి. రావణుడి గుర్రాల కళ్ళ నించి కన్నీళ్ళూ, నడుముల నించి నిప్పురవ్వలూ వొక్కసారే రాలాయి. – ఈ రకంగా రావణుడికి అన్నీ అప శకునాలూ, శ్రీరాముడికి అన్నీ శుభ శకునాలూ కలిగాయి. (కవికి అన్నీ దుర్బుద్ధులూ!)

ఇక రావణుడి మరణం తప్పదని రాముడు చాలా ఆనందించాడు. (శకునాలిచ్చిన ధైర్యంతో!)

రామ రావణ యుద్ధం భయంకరంగా, ఘోరాతి ఘోరంగా, ఆశ్చర్యకరంగా, జరుగుతోంది. (మీ విశేషణాలు మేం నమ్మం. యుద్ధం ఎలా జరుగుతోందో చూసి మేమే నిర్ణయించుకుంటాం.)

రాక్షస సైనికులూ, వానర సైనికులూ, కొట్టుకోవడం మానేసి, పక్క పక్కనే నిలబడి రామ రావణ యుద్ధం చూడడం మొదలుపెట్టారు. (ఈ జ్ఞానం, ఈ ఐకమత్యం, మొదటినించీ వుంటే కాదూ? చక్కగా మీరందరూ కలిసిపోయి, మీ రాజుల్తో, "మీ కోసం మే మెందుకు కొట్టుకోవాలి? మీ రిద్దరే కొట్టుకు చావండి!" అంటే ఎంత బాగుండేది!)

రామ రావణులు దీర్ఘ ద్వేషాలతో కొట్టుకుంటు న్నారు. తనే జయిస్తానని రాముడికి నిశ్చయమే. తను ఓడిపోక తప్పదని రావణుడికీ నిశ్చయమే.[426]

రావణుడు కోపంతో రాముడి రథం మీద జెండా పడగొట్టెయ్యాలని జెండాకి బాణం వేశాడు. కానీ, ఆ బాణం జెండాకి తగలకుండానే కింద పడిపోయింది. రాముడు వేసిన బాణం మాత్రం రావణుడి జెండాని ఎగరగొట్టి దాన్ని నేల మీద పడేసింది.

రావణుడు కోపం పట్టలేక రాముడి గుర్రాల్ని కొట్టాడు. అవి కించిత్తు కూడా బెదరలేదు. భయపడలేదు. తామర తూళ్ళతో కొట్టినట్టు బాణాల దెబ్బల్ని లెక్క చెయ్యకుండా చక్కగా నించున్నాయి. (అసలవి గుర్రాలో, దున్నపోతులో!)

రాముడి గుర్రాలు చలించలేదని గ్రహించి రావణుడు గుర్రాల్ని నమ్ముకోడం లాభం లేదని, రాముడి వేపు తిరిగాడు. అన్ని రకాల ఆయుధాలూ – గదలూ, పరిఘలూ, చక్రాలూ, శూలాలూ, బాణాలూ – అన్నీ రాముడి మీద గుప్పించాడు. విచిత్రం ఏమిటంటే, ఒక్కటి కూడా రాముడి రథం మీద పడలేదు. అవి అన్నీ చుట్టూ వున్న వానరుల మీద పడ్డాయి. (కవికి, వానరులంటే ఎంత హేళనో! వారిని ఉపయోగించుకోవటమే గానీ ఎక్కడా వారిమీద ప్రేమాభిమానాలు చూపించడు. ఆ ఆయుధాలన్నీ నేలమీద పడిపోయాయి – అనొచ్చు కదా? వానరుల మీద ఎందుకు పడాలి?)

రావణుడు బాణాలు కురిపిస్తూనే ఉన్నాడు. రాముడు విలాసంగా నవ్వుకున్నాడు. (రాముడికి నవ్వా? మతి సరిగా లేదేమో!)

రామ – రావణుల బాణ వర్షంతో ఆకాశం కింద రెండో ఆకాశం, గాలి కూడా చొరబడనంత దట్టంగా ఏర్పడింది. ఒకరి బాణా లొకరికి గురి తప్పకుండా తగులుతూనే వున్నాయి. వ్యర్థం కావడం లేదు.

రథాలు రెండూ వొకదాని పక్క వొకటి వొరుసు కుంటూ దూసుకుపోతున్నాయి. ఒక క్షణంలో దగ్గరై, మరు క్షణంలో దూరమైపోతున్నాయి. మేఘాల్లా తేలిపో తున్నాయి. ఒకదాన్నొకటి గుద్దుకుంటున్నాయి. ఒక దాని కాడి ఇంకో దాని కాడికి తగులుకుంటోంది. దాని గుర్రాలూ, దీని గుర్రాలూ, ఎదురెదురై మొహామొహాలు చూసుకుంటున్నాయి. (ఏం చెప్పుకుంటున్నాయో! "ఈ పీడ ఎప్పుడు విరగడౌతుందో? ఈ దుర్మార్గులు మనల్ని కూడా యుద్ధంలోకి దించారేమిటి? కావాలంటే వాళ్ళు కొట్టుకు చావ రాదూ?" అనుకుని వుంటాయి.)

రావణ బాణాలు తగిలినా, రాముడికేమీ బాధ కలగడం లేదు. (బాణాలు తగిలితే, గుర్రాలకీ బాధ లేదు, రాముడికీ బాధ లేదు. రాముడి చర్మం కూడా గుర్రాల చర్మం లాంటిదే గావున్ను!)

వీరుడైన రాముడు "ఇరువది, ముప్పది, అరువది, నూరు, వేయి బాణములను" గుప్పించేస్తూ వున్నాడు. రావణుడు కూడా సకలాయుధాలూ విర జిమ్మి రాముణ్ణి ముంచెత్తుతున్నాడు.

రాముడి ఆపద చూసి సప్త సముద్రాలూ కలత పడిపోయాయి. భూమి అంతయూ కంపించినది. సూర్యుడు తేజో హీనుడాయెను. గాలి స్తంభించెను.

---

**426.** యుద్ధ, సర్గ 109, శ్లోకం 7: "కాకుత్స్థః = రాముడు, జేతవ్యమితి = జయము తప్పక కలుగునని, రావణః = రావణుడు, మర్తవ్యమితి = మరణం తప్పక కలుగుతుందని, ధృత్వా = నిశ్చయించి, యుద్ధములో తమ పరాక్రమమునంతయు జూపిరి." తనే నెగ్గుతానని రాముడికి చాలా గాఢమైన నమ్మకం ఉందట. తను తప్పకుండా ఓడిపోతానని రావణుడికి కూడా అంత స్పష్టంగానూ అర్థమైపోయిందట! మొదట్నించీ రావణుడు, "ఓడిపోతాను, ఓడిపోతాను" అనుకుంటూనే ఉన్నాడు. ఓడిపోతాననుకున్నా వెనక్కి తగ్గలేదు. అంటే, ఎంత పట్టుదల అది! ★

ఆకాశంలో దేవతలు, "గోవులకూ, బ్రాహ్మణులకూ క్షేమం కలుగుగాక! (బ్రాహ్మణులు గొడ్లతో సమానం గావును. వాళ్ళు ఇతర మనుషులతో సమానం అయితే, వాళ్ళని మనుషులతోనే కలుపుతారుగానీ, గొడ్లతో ఎందుకు కలుపుతారు?) లోకాలు శాంతి బొందు గాక! శ్రీరాముడు రావణుని జయించు గాక!" అని అరుస్తున్నారు. "ఆహా! రామ రావణ యుద్ధం ఎంత అద్భుతమో! ఆకాశానికి ఆకాశమే సాటి. సముద్రానికి సముద్రమే సాటి. రామ రావణ యుద్ధానికి, రామ రావణ యుద్ధమే సాటి!" అని చెప్పుకుంటున్నారు.

పిమ్మట గొప్ప భుజాలు గల రాముడు, కత్తిని ధనుస్సులో ఎక్కుపెట్టి రావణుడి తల ఛేదించేశాడు! ఆ తల కింద పడిపోయింది! వెంటనే రావణుడి మెడ మీద ఇంకో తల పుట్టుకొచ్చింది. రాముడు ఆశ్చర్యపడి దాన్ని మళ్ళీ ఛేదించాడు. ఇంకో తల పుట్టుకొచ్చింది. మళ్ళీ ఛేదించాడు. మళ్ళీ పుట్టుకొచ్చింది. (ఎంత గడుసు తలలో!) ఆ విధంగా రాముడు 101 సార్లు రావణుడి తలలు ఛేదించాడు. అయినా ఫలితం లేకపోయింది. (ఆదిత్య మంత్రం ఏ గంగలో కలిసింది? మంత్రాల్ని నమ్ముకుంటే అంతే మరి!)

"నా బాణాలన్నీ వ్యర్థమై పోతున్నాయే!" అని చింతించాడు రాముడు.

రావణుడు, రాముడి మీద ఆయుధ వర్షం కురిపిస్తోనే వున్నాడు. యుద్ధం రాత్రీ, పగలూ విరామం లేకుండా, ఒక్క క్షణం ఆగకుండా సాగుతోంది. రాముడికి మాత్రం జయం కలగడం లేదు.

రాముడు జయించే వ్యవహారమేమీ కనపడలేదు మాతలికి. (రాముడు యుద్ధం చేస్తోన్న తీరు చూస్తోంటే అతనికి వొళ్ళు మండిపోతోంది.)

మాతలి, రాముడితో ఏమంటున్నాడో చూడండి! "రామా! త్వం = నీవు; అజానన్నివ = ఏమీ తెలియని వానివలె; ఏనం = ఈ రావణుని; అనువర్తసే కిం = అనుసరించుచున్నావేమి? (అంటే – నువ్వు రావణుణ్ణి అనుసరించి మాత్రమే యుద్ధం చేస్తున్నావు. అతడు ఒక అస్త్రం వేస్తే, దాన్ని వ్యతిరేకించటానికి మాత్రమే నువ్వు అస్త్రం వేస్తున్నావు. దెబ్బ కాచుకోవడానికి చూస్తున్నావే గానీ నీకై నువ్వు శత్రువుని దెబ్బ కొట్టేటట్టు స్వతంత్రించి యుద్ధం చెయ్యడం లేదు. రావణుడి చేష్టల్నే అనుసరిస్తున్నావు – అని అర్థం. ఇంతా చేసి రాముడు చేసిన యుద్ధం సొగసంతా ఇదన్న మాట! యుద్ధం ఎలా చెయ్యాలో, ఆ మహా వీరుడికి, సారథి చెప్పవలసి వచ్చింది!)

"రామా! రావణుని జంపుటకై బ్రహ్మాస్త్రము ప్రయోగింపుము" అని మాతలి రామునకు జ్ఞాపకము జేసెను.

"మాతలి జ్ఞాపక పరచగా, నిట్టూర్పు విడుచుచుండు, సర్పము వలె వెలుగుచుండు బాణమును రాముడు బుచ్చుకొనెను."

(మాతలి చెప్పిం తర్వాతే బ్రహ్మాస్త్రం వెయ్యాలని తెలిసింది రాముడికి! ఇలాంటి రాముడు అందరికీ గొప్ప గొప్ప బోధనలు చేస్తూ వుంటాడు! రాముడే రథం నడిపి, మాతలే యుద్ధం చేస్తే, మాతలి బ్రహ్మాస్త్రం ఎప్పుడో వేసేసే వాడు. రావణ వధ ఎప్పుడో జరిగిపోయేది. అంతేకదా? రామదాసులు తల లెక్కడ పెట్టుకుంటారో పాపం! యుద్ధం ఎలా చెయ్యాలో చెప్పాలని కవి ఉబలాటం! ఏ మహేంద్రుడో వచ్చి రాముడితో ఆ మాటలు చెప్తే, అది వేరు. రథం నడిపే సారథి, రాముడికి, యుద్ధం ఎలా చెయ్యాలో చెప్తే, ఆ సారథికి తెలిసినంత కూడా రాముడికి తెలియదనే అర్థం రాదూ? ఈ కవి, రాముడి పరువంతా తీసేశాడు చివరికి!)

ఆ బ్రహ్మాస్త్రం రాముడికి అగస్త్యుడిచ్చాడు. అసలు దాన్ని పూర్వం ఇంద్రుడి కోసం బ్రహ్మ తయారుచేసి ఇచ్చాడు. (ఎంత పాతదో! అది ఇంద్రుడి దగ్గిర్నించి అగస్త్యుడి కెలా వొచ్చిందో చెప్పలేదు.)

ఆ బ్రహ్మాస్త్రానికి పక్క భాగాల్లో వాయుదేవుడుంటాడు. (పక్షిలా వుంటుంది గావున్ను.) ముఖంలో అగ్నీ, సూర్యుడూ ఉంటారు. (కొరకంచులా వుంటుందేమో!) శరీరమంతా ఆకాశం వుంటుంది. (సరేలే, ఎలా ఉంటే యేం గానీ, పని చేస్తుందా అసలు? అది ముఖ్యం!)

ఎన్నడూ వ్యర్థము కానిదీ, శత్రువుల రక్తంలో మునిగి తేలినదీ. (అబ్బా, ఆయుధాలు చేసే పని రక్తాల్లో మునిగి తేలడమే కదా?) – అలాంటి మహా బాణం ఎక్కుపెట్టాడు రాముడు.

సముద్రాలు గందరగోళ పడ్డాయి. భూమి కంపించింది. (సరే! భూమి పని అదేలే!)

రాముడు మహా రోషంతో బ్రహ్మాస్త్రం రావణుడి మీద విడిచేశాడు. అది రావణుడి మీద దూకి గుండెలు బద్దలు చేసేసింది. రావణుడు రథం లోంచి భూమి మీద పడిపోయాడు. రావణ వధ ముగిసింది.

బ్రహ్మాస్త్రం వెనక్కి వొచ్చేసి రాముడి అమ్ముల పొదిలో వినయంగా దూరిపోయింది.

రావణుడు ప్రాణాలు విడిచెయ్యగానే రాక్షసులందరూ పారిపోయారు. పారిపోతున్న వాళ్ళని వొదలకుండా వానరులు కేకలేస్తూ వెంటబడ్డారు.

దేవతలు దుందుభులు వాయించారు. నాట్యాలు

చేశారు. రాముడి రథం మీద పూలవాన కురిపించారు. పరిమళ భరితంగా మలయ మారుతం వీచింది. ఆకాశం నిర్మలంగా అయింది.

రుషులు 'శుభం, శుభం' అని అరిచారు.

సుగ్రీవుడూ, లక్ష్మణుడూ, విభీషణుడూ అందరూ రాముడి రథం దగ్గిరికి వొచ్చి స్తోత్రాలు చేశారు. (అసలు ఈ పూజలన్నీ మాతలికి చెయ్యాలి! అతను చెప్పకపోతే రాముడు ఎప్పటికీ జయించే వాడు కాదు.)

★ ★ ★

విభీషణుడు అన్న కోసం 'అమితమైన ప్రేమతో' విలపించడం మొదలు పెట్టాడు. "మహావీరుడా! జగత్ప్ర సిద్ధుడా! నీతిశాస్త్ర కోవిదుడా! ఉత్తమ శయనాలలో పడుకునే వాడివే! ఇప్పుడు చచ్చిపోయి భూమి మీద పడుకున్నావా? అయ్యో! నేను మొదటే చెప్పాను. నా మాటలు నీకు రుచించలేదు. దాని ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నావు. సమస్త నీతులూ తెలిసిన వాడు పోయాడు. సాక్షాత్తూ ధర్మదేవత రూపమే పోయింది. మహా పూజ్యుడు నశించిపోయాడు. మహా వీరుడైన రావణుడు నేలకొరిగాడంటే, సూర్యుడు నేల మీద పడి పోయినట్టే! చంద్రుడు అంధకారంలో మునిగి పోయి నట్టే. రావణుడితో బాటే అగ్నిదేవుడు చల్లారి పోయాడు. ఇక ఉత్సాహమే నిరాశ్రయురాలయి పోయింది.

రాక్షసరాజే ప్రాణాలు విడిస్తే, ఇక ఈ లోకాలకు ఏమి మిగిలింది! (నువ్వు మిగిలావుగా?) రావణుడనే మహా వృక్షాన్ని రాముడనే మహావాయువు పెళ్ళగిం చేసింది. రావణుడనే మదపుటేనుగుని రాముడనే సింహం సంహరించేసింది. రావణుడనే అగ్నిజ్వాలని, రాముడనే మహా మేఘం చల్లబరిచేసింది."

ఆ రకంగా చక్కగా, శాస్త్రోక్తంగానూ, కావ్యోక్తం గానూ దుఃఖిస్తోన్న విభీషణుణ్ణి రాముడు ఓదార్చడం మొదలుపెట్టాడు; "విభీషణా! ఎందుకోయీ దుఃఖిస్తావు? రావణుడు పరాక్రమం లేక పిరికిపందగా మరణించ లేదు. గొప్ప శౌర్యంతో పోరాడి మరణించాడు. పర లోక శ్రేయస్సు కోరే వారే యుద్ధరంగంలో మరణిస్తారు. అటువంటి వారి గురించి దుఃఖించవలసిన అవసరం లేదు. ముల్లోకాలూ జయించిన బుద్ధి మంతుడతడు. (ఆశ్చర్యంగా వుందే! బతికి వున్నప్పుడు ఏ గుణాలు చెడ్డవయ్యాయో, చచ్చిపోయి నప్పుడు ఆ గుణాలే మంచి వవుతున్నాయేమిటి?) యుద్ధం అన్న తర్వాత జయాప జయాలు ఎవరికో తెలియదు. గెలవనూ వచ్చును, ఓడనూ వచ్చును. అందుచేత దుఃఖం విడిచిపెట్టు! తర్వాత జరగవలసింది ఆలోచించు!" (లంకని ఆక్ర మించుదాం, పద!)

విభీషణుడు వినయంగా చూశాడు. "రామా! రావణుడెన్నో దాన ధర్మాలు చేశాడు. గురువుల్ని పూజిం చాడు. ఆశ్రితుల్ని రక్షించాడు. ఎన్నో భోగాలు అనుభ వించాడు. గొప్ప తపశ్శాలి. అతడు, బ్రహ్మతత్వం ఎరి గిన వాడు. అతని కర్మకాండలన్నీ నీ అనుగ్రహంతో చేద్దా మనుకుంటున్నాను" అన్నాడు.

విభీషణుడి కరుణా పూరితమైన మాటలు విని రాముడు, "ప్రాణాలు వున్నంతవరకే శతృత్వాలు. ప్రాణాలు పోయిన తర్వాత కూడా ద్వేషాలెందుకు? మన కార్యం నెరవేరింది. (ఇక లంక మనదే!) రావణుడికి పర లోక హితం కోసం సంస్కారాలన్నీ చెయ్యి!" అని అంగీకరించాడు.

★ ★ ★

రావణుడు పోయాడని వినగానే అంతఃపుర స్త్రీలందరూ భోరున ఏడుస్తూ, జుట్టు ముళ్ళు విడిపోయి, కిందా మీదా పడుతూ లేస్తూ, యుద్ధ రంగానికి వొచ్చారు.

అనేక వేల లక్షల కళేబరాల మధ్య, ఎక్కడికక్కడ తెగి పడిపోయిన అవయవాల మధ్య రావణుడి దేహం చూసి అందరూ దానిమీద పడి ఘొల్లుమని ఏడ్చారు. కొందరు స్త్రీలు, భర్త కాళ్ళు కావలించుకున్నారు. కొందరు చేతులు కావలించుకున్నారు కొందరు, మూర్ఛ పడిపోయారు. కొందరు చేతులెత్తి ఆకాశాన్ని చూసి ఏడ్చారు. "నాధుడా! రాజేంద్రుడా!" అని జల జల కన్నీళ్ళు రాల్చారు. (రావణుడి భార్యలందరూ తమ భర్తనే తిట్టి, శ్రీరాముణ్ణీ, విభీషణుణ్ణీ ఎలా పొగుడుతారో చూడండి!)

"అయ్యో! దేవతల్నే భయపెట్టిన వీరుడివి, భూమి మీద పడివున్నావా? ఎందరెన్ని హితోక్తులు చెప్పినా వినలేదు కదా నువ్వు? నీ మరణం నువ్వే తెచ్చుకున్నావు. నీతో పాటు మేమూ చచ్చిపోయిన వాళ్ళమే. విభీషణుడు ఎన్నో విధాల హితం చెప్పాడు. ఆ నాడే అతని మాటలు వింటే, ఈ యుద్ధం సంభవించేదే కాదు గదా? మేము విధవలమయ్యే వాళ్ళమూ కాదు. నువ్వు కౄరత్వంతో సీతని చెరబట్టడం మూలాన్నే మన మందరం సర్వ నాశనమై పోయాము. ఎంతో ఉత్తముడైన విభీషణుణ్ణి నీ అజ్ఞానంతో దూషించావు.

రాక్షస రాజా! ఇలా జరిగిందానికి నీకై నువ్వు స్వతంత్రించి చేసిందేమీ లేదులే. అంతా దైవ నిర్ణయమే. ప్రతీ పనీ దైవమే చేయిస్తుంది. ముందు దైవం ఎవరికి చావుని నిర్ణయిస్తుందో వారికే తర్వాత ఈ రకంగా మరణం సంభవిస్తుంది. మన భోగ భాగ్యాల చేతా, పరా క్రమాల చేతా, కోరికలచేతా దైవ నిర్ణయాలు మార్చ

లేము” అంటూ దుఃఖించారు.

రావణుడి పెద్ద భార్య మండోదరి, దుఃఖపడుతూ, “నీ వంటి మహా పరాక్రమవంతుణ్ణి, వనవాసం చేసుకునే సామాన్య మానవుడు చంపడం, ఎంత వింత! ఇది నీకెంత సిగ్గుచేటో గదా! రాముడు జనస్థానంలో పద్నాలుగు వేల మందిని చంపాడు. (ఎప్పుడూ ఆ ముచ్చటే!) ఇతడు సామాన్యుడు కాదు. హనుమంతుడు లంకలోకి వచ్చినప్పుడే భయ పడ్డాము. రాముడు సముద్రం మీద సేతువు కట్టినప్పుడే అతడు మానవ మాత్రుడు కాడనుకున్నాము. ఇంద్రుడో, యముడో, నీతో ప్రత్యక్షంగా యుద్ధం చెయ్యలేక ఈ రాముడి రూపంలో వచ్చారు.

శ్రీరాముడు మహాత్ముడు. పరమాత్ముడు. లోకాల శ్రేయస్సు కోసమే శ్రీమహావిష్ణువు మానవుడయ్యాడు. దేవతలందరూ వానరులయ్యారు. దుర్మార్గాలు చేసి ఇంద్రియాల్ని అణిస్తే, ఆ రాక్షసుల్ని నాశనం చేశారు.

పూర్వం నువ్వు తపస్సు చేసి నీ ఇంద్రియాల్ని జయించావు. ఆ ఇంద్రియాలన్నీ నీ మీద పగబట్టినట్టు నిన్ను జయించాయి. (రుషులారా! తపస్సులు చేసి ఇంద్రియాల్ని అణచాలని చూస్తే, ఇంద్రియాలు పగబడతాయని మీరందరూ తెలుసుకున్నారా? ఏ రుషీ ఇంద్రియాల్ని జయించలేదనుకోండీ!)

శ్రీరాముడితో వైరం వొద్దని నేను ఎన్ని సార్లు చెప్పినా వినలేదు నువ్వు. నీ సర్వ నాశనానికే సీతని కోరావు, దుర్మార్గుడా! (దుర్మతీ – అని మండోదరి చేత భర్తని తిట్టించాడు కవి.) మహా పతివ్రతని, భర్త మీద భక్తి గల స్త్రీని, తెచ్చావు. (మరి నీ భర్త మీద నీకెందుకు భక్తి లేదు? భర్త ఎటువంటి వాడైనా భక్తి చూపాలి గదా? – కానీ, రావణుడు ఎప్పుడూ పరస్త్రీలని తెస్తాడని మండోదరికి వొళ్ళు మండిపోయేది గావును. తిట్టడానికి ఇప్పటికి అవకాశం దొరికింది!)

సీతని తెచ్చినప్పుడే నువ్వు నాశనమై పోవలసింది. అప్పుడు నీ తేజస్సు నిన్ను కాపాడింది. ఆ పాప ఫలం ఇప్పటికి అనుభవిస్తున్నావు. మంచి కార్యం చేసిన వాడికి మంచి ఫలం దొరుకుతుంది. చెడ్డ కార్యం చేసిన వాడికి చెడ్డ ఫలం దొరుకుతుంది. విభీషణుడు మంచి కార్యం చెయ్యడం చేతనే చక్కగా సుఖపడతాడు. నువ్వు దుర్మార్గుడివైనందునే నాశనమై పోయావు. నీకు సీత కంటే అందమైన భార్యలున్నారనే సంగతి తెలుసుకోలేక పోయావు. (మా బాగా అన్నావు మండోదరీ! మొగాళ్ళకి, పెళ్ళాల అందాలు కనపడవు, పర – పెళ్ళాల అందాలే గానీ! ఈ మాట నీ భర్త దుష్టుడు బతికి వున్నప్పుడు అన్నావా అసలు?) సీత నా కన్నా వంశంలో గానీ, అందంలో గానీ, చాతుర్యంలో గానీ, అధికురాలు కాదు. నాతో సమానురాలైనా కాదు. నువ్వా సంగతి గ్రహించలేక, సీతతో పాటు అంత దూరం నించి మృత్యువుని తెచ్చుకున్నావు.

ఇక, సీత, భర్తని చేరి సుఖంగా ఉంటుంది. నేను, కామ భోగాలు లేక దీర్ఘ కాలం దుఃఖిస్తాను. నీతో కలిసి నేను కైలాస శిఖరంలో, కుబేర వనంలో, మేరు గిరి మీదా, విహరిస్తూ వుండే దానిని. ఇప్పుడు నా భోగ భాగ్యాలన్నీ హరించిపోయి సామాన్య స్త్రీనై పోయాను. సిరి సంపదలు అస్థిరాలే కదా!

నాథుడా! ఎన్నో విధాల అలంకారాలు చేసుకునే నీ ముఖం ఎంత కాంతి హీనమైపోయిందో గదా! ఇంత కాలమూ నేను, నా తండ్రి దానవ రాజనీ, నా భర్త రాక్షస రాజనీ, నా కొడుకు ఇంద్రుణ్ణి జయించిన వీరుడనీ, గర్వ పడుతూ వుండే దానిని. నా వారిని ఎవ్వరూ జయించ లేరు అనుకునే దానిని. రాముడు నిన్ను చంపాడంటే నేను నమ్మలేను. స్వప్నమా ఇది? సత్యమేనా? నా ఇంద్రజిత్తు పోయినప్పుడే నేను శోకంలో మునిగిపోయాను. ఇప్పుడు నేను కూడా చచ్చిపోయిన దానినే. బంధువులు పోయినా నేను దుఃఖించను. నువ్వు లేక దుఃఖిస్తున్నాను. నన్ను విడిచి నువ్వు స్వర్గానికి పోయావా? నన్ను కూడా తీసుకు వెళ్ళలేదేమి? నువ్వు లేని ఈ జన్మ నా కెందుకు?

నీ భార్యలం అందరం ముసుగులు లేకుండా నడిచి ఇక్కడికి వొచ్చినందుకు మమ్మల్ని చూసి కోప పడవే![427]

ఎందరో పతివ్రతల్ని విధవల్ని చేశావు నువ్వు. ఆ పుణ్య స్త్రీలు నిన్ను శపించారు. పతివ్రతా స్త్రీల కన్నీరు భూమి మీద చిందితే అనర్థం తప్పదని రుజువైంది ఇప్పుడు.

నాథుడా! చూడు! నువ్వు లేకపోవడం చేత సూర్య కిరణాలు భయం లేకుండా లంకలోకి వొచ్చాయి. అయ్యో! నువ్విక లేవు కదా మాకు” అంటూ మండోదరి భర్త మీద పడి దుఃఖించింది.

సవతులందరూ, “ఊరుకో, ఊరుకో. ప్రాణాలూ, సిరి సంపదలూ నశించిపోయేవే గదా? నీకు మాత్రం తెలియదా?” అంటూ మండోదరిని ఓదార్చారు.

మండోదరి, కన్నీటితో స్తనాలు తడిసిపోయేటట్టు దుఃఖించింది – (కవి దృష్టి ఎక్కడుందో చూశారా? మండోదరి స్తనాల మీద!)

---

**427.** **యుద్ధ, సర్గ 114, శ్లోకాలు 63, 64:** మండోదరి మాటలు: “నాథుడా! నీ భార్యలమైన మేమందరము ముసుగులు జారిపోయి కాలి నడకతో ఇచటికి వచ్చినందులకు మమ్ములను జూచి కోపించకున్నావేమి?” – స్త్రీలు, ముసుగుల్లో, తెరల్లో, అంతఃపురాల్లో వుండాలనే కట్టడి రాముడి రాజ్యంలో ఉన్నట్టే, రావణుడి రాజ్యంలోనూ ఉంది! ★

రాముడు విభీషణుడితో, "స్త్రీలందర్నీ పంపిం చెయ్యి! రావణుడికి జరగవలసిన కర్మకాండలేవో ఏర్పాటు చెయ్యి!" అన్నాడు.

విభీషణుడు, "రావణుడు పరమ దుర్మార్గుడు. అధర్మపరుడు. క్రూరుడు. అబద్ధీకుడు. ఇటువంటి వాడికి నేను సంస్కారం చెయ్యను. ఇతడు నాకు అన్న అయినా శత్రువే. అందర్నీ హింసించాడు. అలాంటి వాడికి కర్మ కాండలు చేస్తే లోకులు నన్ను నిందిస్తారు. చెయ్యక పోతేనే మెచ్చుకుంటారు. నేను అతనికి కర్మలు చెయ్యను" అన్నాడు.

విభీషణుడి మాటలకు రాముడు పరమ ప్రీతు డయ్యాడు (పరమ ప్రీతః). "నిజమే నువ్వన్నట్టు రావ ణుడు దుర్మార్గుడే. అధర్మపరుడే. అబద్ధీకుడే. లోకాల నన్నిట్నీ హింసించిన వాడే! కానీ, ఇప్పుడు మరణించాడు కదా? మరణం వరకే ద్వేషం ఉండాలి. అన్న దుర్మార్గుడై నప్పటికీ తమ్ముడు సంస్కారాలు చేశాడని నీకే కీర్తి కలుగుతుంది. తప్పకుండా కర్మలు చెయ్యాలి నువ్వు" అన్నాడు.

విభీషణుడు అంగీకరించాడు. కర్మకాండలకు ఏర్పాట్లన్నీ జరిగాయి.[428] మంచి గంధం చెక్కల చితి పేర్చారు. దాని మీద వట్టివేళ్ళూ, జింక చర్మం పరిచారు. రావణుణ్ణి పడుకోబెట్టి, పాదాల మీద బండీ (శకటం) తొడలమీద రోలూ (ఉలూఖలం), పెట్టారు. పవిత్రమైన పశువుని చంపి (కపిల గోవుని – అన్నారు అనువాద కులు) దాని చర్మం నేతితో తడిపి రావణుడి మీద కప్పారు. గంధం, పూలూ జల్లారు. విభీషణుడు దుఃఖిస్తూ చితికి నిప్పు ముట్టించాడు.

కర్మకాండలన్నీ వేదోక్తంగా (వేద విహితం = వేదములచే విధింపబడిన, బ్రాహ్మ్య = వేదోక్తంగా) ముగిశాయి.

దహనం అయిపోయిన తర్వాత విభీషణుడు స్నానం చేసి, స్త్రీలను అంతఃపురాలకు పంపేసి, తను రాముడి దగ్గర వినయంగా నించున్నాడు.

ఆకాశంలో దేవతలందరూ రాముడి కథ చెప్పు కుంటూ వెళ్ళిపోయారు. రాముడి ఆజ్ఞతో మాతలి కూడా రథం తీసుకొని స్వర్గానికి వెళ్ళిపోయాడు.

రాముడు లక్ష్మణుడితో, "లక్ష్మణా! విభీషణుడు లంకలో పట్టాభిషిక్తుడైతే చూడాలి నేను. ఇతనికి పట్టాభి షేకం చేయించు!" అన్నాడు. (రాముడు ఆ గోడ బయట నించి లంకలోకి వెళ్ళడన్న మాట! వన వాసం చెయ్యాలి కాబట్టి, నగరంలోకి వెళ్ళకూడదు! వనవాసం చెయ్య వలసిన వాడు యుద్ధాలు చెయ్యొచ్చా మరి?)

'అలాగే'నని లక్ష్మణుడు, మనోవేగం గల మహా బలవంతులైన వానరులకు బంగారు బిందెలిచ్చి సముద్ర జలం తెమ్మన్నాడు. (సముద్రం అనగానే – దాని కోసం ఎంతో దూరం పోవాలనే ఊహలోనే వున్నాడు కవి. అందుకే మహా బలిష్టులూ, మనో వేగంగల వారూ, కావాలనుకుంటున్నాడు! కానీ, సముద్రం లంక చుట్టూనే ఉందన్న సంగతి మరచిపోయాడు.)

లంకలో విభీషణుడి పట్టాభిషేకం వేదోక్తంగా జరిగింది. అతని మంత్రులూ, అతని భక్తులూ సంతోషిం చారు.[429] ప్రజలందరూ రక రకాల పువ్వులూ, పిండి వంటలూ (మోదకాన్ = కుడుములు; లాజాన్ = పేలాలు) బహుమానాలుగా ఇచ్చారు.

పట్టాభిషేకం అయిన తర్వాత విభీషణుడు రాముడి కోసం బహుమానాలు తీసుకుని రాముడు ఉన్న చోటికి వెళ్ళాడు.

రాముడా బహుమానాలు స్వీకరించాడు. (పాపం, కుడుములు తిని ఎన్నాళ్ళయిందో!)

తర్వాత హనుమంతుణ్ణి చూస్తూ రాముడు, "హనుమంతుడా! నువ్వు విభీషణుడి అనుమతి తీసుకుని (విభీషణుడి రాజరికాన్ని కాపాడాలనే జాగ్రత్త!) లంకలోకి వెళ్ళు! సీత దగ్గిరికి వెళ్ళి నా క్షేమ సమాచారాలు చెప్పి, రావణ వధ చేశానని చెప్పి, ఆమె సందేశం పట్టుకు రా!" అని ఆజ్ఞాపించాడు.[430] ★

---

**428.** **యుద్ధ, సర్గ 11, శ్లోకాలు 1... 24:** ఈ శ్లోకాలలో విభీషణుడు అన్న కోసం దుఃఖించి, అతన్ని అమితంగా కీర్తించి, అన్నకి కర్మ చేస్తానని రాముణ్ణి అనుమతి అడిగాడు. రాముడు అంగీకరించాడు.

సర్గ 11, శ్లోకాలు 95, 96, 97: ఈ శ్లోకాల్లో – విభీషణుడు అన్నని తిట్టి, కర్మలు చెయ్యనన్నాడు. ★

**429.** **యుద్ధ, సర్గ 115, శ్లోకాలు 17, 18:** "లంకలో పట్టాభిషిక్తుడైన రాక్షస రాజగు విభీషణుని జూసి, అతని మంత్రులు, అతని మీద భక్తి గల రాక్షసులు, సంతోషించిరి."

విభీషణుడు అధికారంలోకి వస్తే విభీషణుడి పక్షం వారే సంతోషించారు. ఏ రాజు విషయంలో అయినా ఇలాగే జరుగుతుంది. ధనిక వర్గంలో కూడా అనేక గ్రూపులు ఉంటాయి. ఒక రాజుని అన్ని గ్రూపులూ సమర్ధించవు. ★

**430.** **యుద్ధ, సర్గ 115, శ్లోకం 25:** రాముడు హనుమంతుణ్ణి సీత దగ్గిరికి పంపేటప్పుడు, "... ఈ సంతోష వార్తలు సీతకు చెప్పి ఆమె సందేశమును తెచ్చుటకు నీవు తగిన వాడవు" అన్నాడు. అంటే 'సందేశం పట్టుకురా' అని అర్థం. ★

## కథ-14

# పంచాయితీ

సీత సంతోషంగా ఉంది!

ఎప్పటి కప్పుడు యుద్ధ వార్తలు వింటూనే ఉంది.

రావణుడి మరణం! శ్రీరాముడి విజయంతో యుద్ధ సమాప్తి!

గతమంతా తలపోస్తూ విస్మయపడుతోంది సీత!

తన భర్త కోసం పట్టాభిషేక ప్రయత్నాలు .... ఆ దుష్టురాలి పన్నాగం ... దుర్భర వనవాసం .... తన సౌందర్యం పట్ల పర పురుషుడి కాముకత్వం .... తన తిరస్కారం .... తన భర్త యుద్ధోత్సాహం .... శత్రు సంహారం .... అంతా .... అంతా .... గడిచి పోయింది! కష్ట కాలమంతా... కలగా .... లీలగా గతించిపోయింది!

ఇక భర్తతో తన సమాగమం .... సుఖ జీవనం ... అయోధ్యకు తిరుగు ప్రయాణం!

సంతోషాతిశయంతో నిట్టూరుస్తోంది సీత. గతం మళ్ళీ మళ్ళీ తలపోస్తూ విస్తుపోతోంది. తన భర్త తన కోసమే శత్రువుని సంహరించాడు! తన మీద ప్రేమ కోసమే ప్రాణ సంకటమైన యుద్ధం చేశాడు!

తను కూడా భర్త కోసమే నిగ్రహంతో నిరీక్షించింది! ఏ సుఖ భోగాలకూ ప్రలోభపడక, మనసు చలించ నివ్వక, బహుకాలం భర్త మీదనే ప్రాణం నిలుపుకుని, ఏ స్త్రీ ఉండగలదు, తను తప్ప? తన వంటి మహా పతివ్రతలు తప్ప?

తను అంగీకరిస్తే .... రావణ సామ్రాజ్యానికి పట్ట మహిషి కాగలిగేదే! రావణ పత్నులందరూ తనకు పాద దాసులయ్యే వారే! అంతంత ఉన్నత పదవులనూ, సిరులనూ, సామాన్య స్త్రీలు తిరస్కరించగలరా, పతివ్రతలు తప్ప! తనవంటి మహా పతివ్రతలకు భోగ వాంఛా, పర పురుష వాంఛా నింద్యమే. తన తిరస్కారం వల్లనే రావణుడు మృత్యు దేవతని తనివి తీరా ఆలింగనం చేసుకున్నాడు. పర పురుషుణ్ణి మృత్యు ముఖానికి నెట్టిన తన సౌశీల్యం, పాతివ్రత్యం, తన భర్తకూ, బంధువులకూ, లోకులకూ విశదం కాకపోతుందా?

సీత మనస్సంతా ఆనంద సముద్రమౌతోంది. ఎన్నడో పూర్వం కథల్లో మాత్రమే విన్నది – పతివ్రతల త్యాగాల గురించీ, సౌశీల్యాల గురించీ! లోకంలో, వారి కెన్ని ప్రశంసలో! ఇక తనకు కూడా .... లోకమంతా .... తనని!

"అమ్మా! క్షేమంగా ఉన్నావా తల్లీ?"

సీత సంభ్రమంగా చూసింది – తన కళ్ళ ముందు హనుమంతుణ్ణి!

"నేను తల్లీ! గుర్తు పట్టావా? .... నీ పెనిమిటి క్షేమంగా ఉన్నాడమ్మా!"

సీత చప్పున కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"అంతా సవ్యంగా జరిగింది తల్లీ! నువ్వూ వినే వుంటావు. ఆ దుర్మార్గుడు నాశనం అయిపోయాడు. నీ భర్తే జయం సాధించాడు. చివరికి నీ కష్టాలన్నీ గట్టెక్కాయి. ఇంతకాలం ఓర్చుకున్నావు తల్లీ! ఓర్చుకున్న గొడ్డుకి తేట నీరు. ఆ దుర్మార్గుడు నీ కేమీ హాని చెయ్యకుండా నువ్వు ప్రాణాలతో దక్కినందుకు నీ భర్త పొంగి పోతున్నాడు! ఆ మాటే చెప్పమన్నాడు నీకు. 'అదృష్ట వశాత్తూ నువ్వు బతికి వున్నావూ, అదే నాకు పదివేలూ, నిన్ను శత్రువు బారి నించి తప్పించాలనే ఇంత శ్రమపడి పరాక్రమంతో యుద్ధం చేశానూ, ఇక లంక నా స్వాధీనంలో వున్నట్టే అనుకో, నువ్విప్పుడు రావణుడి రాజ్యంలో వున్నానని భయపడకుండా సంతోషంగా వుండూ అవంటా' అని నీ పెనిమిటి నీకు చెప్పమన్నాడు తల్లీ! ఇప్పుడేమీ భయం లేదు. నువ్విక కళ్ళనీళ్ళు పెట్టుకోకూడదు" అని సీతని ఆప్యాయంగా మందలించాడు హనుమంతుడు.[431]

సీత ఆనందంతో కళ్ళు ఒత్తుకుని కొంచెం

---

**431.** **యుద్ధకాండ, సర్గ 116, శ్లోకాలు 9 .... 14:** రాముడు హనుమంతుణ్ణి సీత దగ్గిరికి వెళ్ళమని చెప్పినప్పుడు, "నా జయమును సీతకు దెలిపి .... నేను క్షేమముగ నుండుట దెలిపి .... సీత సందేశమును తీసుకు రావలయును" అని మాత్రమే చెప్పాడు. కానీ, హనుమంతుడు వచ్చి సీతతో రాముడు చెప్పని మాటలు కూడా చాలా చెప్పాడు. హనుమంతుడు చెప్పిన మాటలకూ, తర్వాత రాముడు చెప్పే మాటలకూ, చాలా తేడా వస్తుంది. అందుకే, ఇక్కడ హనుమంతుడు చెప్పే మాటలు జాగ్రత్తగా చూడాలి. హనుమంతుడు రాముడి మాటలుగా ఇలా చెపుతున్నాడు – "దేవీ! నీకు ప్రియము గలిగించు వార్త జెప్పుచున్నాను. ధర్మజ్ఞురాలా! (ధర్మజ్ఞే – అని వాడాడు కవి. సీతకు 'ధర్మం దెలియడం' అంటే ఏమిటి? 'పతివ్రతగా ➔

నవ్వుతూ, "లేదు నాయనా! నేను దుఃఖపడడం లేదు. భరించలేని ఆనందంతో నా మనసు ఉప్పొంగుతోంది. నీ రుణం ఎలా తీర్చుకుంటానో తోచడం లేదు. త్రిలోక రాజ్యాలన్నీ, సిరి సంపదలన్నీ ఇచ్చినా, అవన్నీ నువ్వు తెచ్చిన సంతోష వార్తకు సమానం కావు. నీకు తగిన బహుమానం నే నేమీ ఇవ్వలేను సుమా!" అని నిట్టూర్చింది.

"ఎంత మాట తల్లీ! నువ్వు అంత మాటన్నావు, అదే చాలు! అదే నాకు బహుమానం! శ్రీరాముడు శత్రువుల్ని జయించి సుఖంగా వుంటే చూడడం కన్నా బహుమానం ఏం కావాలి నాకు?" అని సిగ్గుపడ్డాడు హనుమంతుడు.

"నువ్వెప్పుడూ ఇలాగే మృదువుగా, ప్రియంగా మాట్లాడతావోయీ హనుమంతుడా! ఎంత వీరుడివో అంత సౌమ్యుడివి. బల పరాక్రమాలకు తగ్గ వినయ సంపత్తి కూడా ఉంది నీ మాటల్లో .... చేతల్లో ...."

హనుమంతుడు సిగ్గుపడిపోతూ తల ఇటూ అటూ తిప్పి, అక్కడక్కడా భయపడుతూ నించున్న రాక్షస దాసీల్ని చూశాడు. వాళ్ళు కంటపడగానే హనుమంతుడికి శాంతం అంతా ఎగిరిపోయి, కోపం ముంచుకొచ్చింది – "ఓహో! మీ రిక్కడే ఉన్నారా? మీ కందరికీ మూడింది లెండి. వొక్కొక్క దాన్నీ .... కొప్పట్టుకుని .... ఉండండి, ఏం చేస్తానో చూద్దురు గాని .... సీతమ్మ తల్లిని మీ రెన్ని బాధలు పెట్టారో చూళ్ళేదనుకున్నారా నేను? ఇప్పుడెలా తప్పించుకుంటారో చూస్తాను. వొక్కొక్క దాన్నీ ఎత్తేదేసి గుద్దులేసి .... వొళ్ళంతా హూనం హూనం చేస్తాను .... సీతమ్మ తల్లీ! నువ్వు సరే అను. ఈ ముండల్ని ఎవడొచ్చి రక్షిస్తాడో చూస్తాను. అందర్నీ కలేసి చితకదన్ని, రక్తాలు కక్కించి, నేల కరిపిస్తాను .... అబ్బ! వొక్కొక్క దాన్నీ చూస్తుంటే వొంటికి కారం రాసుకున్నట్టుంది. ఏమే, దుబ్బు జుట్టుదానా!: సీతమ్మ తల్లి నేం చేశావే? నీ జుట్టు పీకి .... వోసే పార పళ్ళదానా! నీ మూతి మీద వొక్క తన్ను తన్ని పళ్ళన్నీ రాలగొడతానుండు, తొందరపడకు. ఆ మిడి గుడ్ల దాన్ని చూడండి. చెట్టుచాటు నెలా నక్కిందో! .... ఎంతసేపు నక్కుతావో నేనూ చూస్తాలే. .... మిమ్మల్నందర్నీ లక్ష్మణుడు చూశాడంటేనా? కత్తి గిరగిరా తిప్పి మీ ముక్కులూ, చెవులూ ఎగర గొట్టేస్తాడు. అదెంత భాగ్యం? ఆ పని నేనే చేస్తాను... ముందీ పొట్టి దాన్ని పట్టుకుని..." అంటూ మితిమీరిన ఉత్సాహంతో హను మంతుడు అందుబాటులో వున్న రాక్షస దాసీల మీద కురికాడు.

దాసీ లందరూ భయంతో కేకలేస్తూ సీత వెనకజేరి వొణుకుతూ నించున్నారు.

సీత గంభీరమైన చిరునవ్వుతో హనుమంతుణ్ణి వారించింది – "శాంతించు నాయనా! నన్ను కష్ట పెట్టడంలో వీరి తప్పేముంది? దాస దాసీలెప్పుడూ యజమానుల ఆజ్ఞల ప్రకారమే చేస్తారు గదా? ఈ అమాయ

---

➔ఉండడం' అనే కదా? అందుకే అనువాదకులందరూ ఆ మాటకి 'పతివ్రతా ధర్మము తెలిసిన దానా!' అని సరిగానే అనువాదం చేశారు. రాముడు ఇలా అన్నాడంటే, సీత పతివ్రతగా ఉన్నదని రాముడు అంగీకరిస్తున్నాడనే అర్థం వస్తుంది.) అదృష్టవశమున నీవు జీవించియున్నావు. నా పరాక్రమముచే యుద్ధమునందు జయము కలిగినది .... ఈ లంక నా యధీనమైనది. (వశే = వశమునందు, స్థితా = ఉన్నది. ఎవరి వశమో! రాముడి వశమో, విభీషణుడి వశమో, వివరం లేదు. హనుమంతుడు ఈ మాటలు రాముడి మాటలుగా చెపుతున్నాడు కాబట్టి, లంక తన వశంలో ఉన్నట్టే రాముడు అంటున్నాడని అర్థం చెప్పుకోవచ్చు. అనువాదకులు కూడా అదే అర్థం చెప్పారు.) నేను నిన్ను శత్రు హస్తముల నుండి జయించుటకు, దృఢ చిత్తముతో, నిదుర విడిచి, .... శత్రువును చంపవల యునను ప్రతిజ్ఞ నెరవేర్చితిని. (నీ కోసమే, నిన్ను రక్షించడం కోసమే, శత్రువుని చంపాను – అని రాముడు అన్నట్టుగా హనుమంతుడు చెపుతున్నాడు.) ఈ లంక యంతయూ విభీషణుని యధీనము చేయబడినది. ('లంక మొదట నాదే. నా వశమైనదే. తర్వాత నేను దానిని విభీషణుడి ఆధీనం చేశాను' అని అర్థం.)

నీవు స్వగృహమునందే యున్నావు. భయపడవలదు. (స్వగృహే = స్వగృహమునందు; పరివర్తసే = ఉన్నావు.)"

లంక సీతకి స్వగృహమట! రాముడి ధర్మం ప్రకారం – స్త్రీకి భర్త ఇల్లే స్వగృహం. పుట్టిల్లు కూడా ఆమె గృహం అవదు. సీతకు రాముడి గృహమూ స్వగృహమే, విభీషణుడి గృహమూ స్వగృహమేనా? – రాముడు ఇలా అన్నాడని హనుమంతుడు చెప్పవచ్చునా? రాముడు సీతకు ధైర్యం చెప్పాలంటే, "విభీషణుడు మన మిత్రుడే. మిత్రుడి వల్ల హాని కలగదు. మిత్రుడి గృహములో ఉన్నావు కాబట్టి భయం లేకుండా ఉండు" అనాలి. రాముడు అలా అన్నాడని హనుమంతుడు చెప్పవచ్చు. కానీ, చెప్పకూడని పద్ధతిలో చెపుతాడు. "విభీషణుడి ఇల్లు నీ ఇల్లే అనుకో" అని విభీషణుడి ఇంటిని స్వగృహంగా చెప్పడం తప్పు. ఈ మాటలన్నీ రాముడు చెప్పమన్నాడని హనుమంతుడు సీతకు చెప్పాడు. అసలు ఇలా చెప్పమన్నాడా రాముడు? పైగా, ఈ మాటలన్నీ, తర్వాత రాముడు స్వయంగా సీతతో చెప్పే మాటలకు పూర్తిగా విరుద్ధం అయిపోతాయి.

హనుమంతుడు, సీతకి సంతోషం కలిగే మాటలు చెప్పాలనుకుంటే, "అమ్మా! నీ భర్త నీ కోసమే యుద్ధం చేసి శత్రువుని చంపాడు. నీ కిక భయం లేదు" అని, ఆ మాటలు తన మాటలుగా, చెప్పవచ్చు. అంతేగానీ, 'రాముడే ఇలా చెప్పాడు' అని చెప్పడం తప్పు.

★

కుల్ని దండించడం ఏం న్యాయం? ఉత్తములైన వారు, ఎంత పాపాత్ముల్ని అయినా క్షమించాలి. లోకంలో తప్పులు చెయ్యని వారెవరు? అందరూ చేస్తారు. ఏ జన్మలో ఏం పాపం చేశానో! నా కర్మ నేను అనుభ వించాను. నా పాపానికి ఇతరుల్ని శిక్షించి ఏం ప్రయో జనం? ....” అని నిట్టూర్చింది.

హనుమంతుడి ఉత్సాహమంతా నీరైపోయింది. ఆ దాసీల్లో ఎవర్నే రకంగా తన్నాలో, ఎన్ని రకాలుగా ఏడిపించి తిప్పలు పెట్టాలో ఊహించి ఆనందపడు తోన్న వాడు చప్పున శాంతపడలేక, “నువ్వెప్పుడూ ఇంతే తల్లీ! అప్పుడు కూడా ఇంతే. వొక్కదాన్నీ తన్ననిచ్చావు గావు” అని విసుక్కున్నాడు. ఆ దాసీల్ని వోరకంట చూస్తూ, ‘మిమ్మల్ని వొదలన్లెండి. సీతాదేవి చూడకండా మిమ్మల్ని తన్నకపోతే చూడండి’ అన్నట్టు వాళ్ళని బెదిరించే చూపులు చూశాడు. అంతలో రాముడి మాట గుర్తొచ్చి, “అమ్మా! నీ పెనిమిటి ఎదురుచూస్తూ వుంటాడు .... వెళ్తాను మరి .... ఏం చెప్పమంటావు?” అని సీతని వినయంగా అడిగాడు.

సీత కొంచెం సిగ్గుపడింది – “నే నిక చెప్పడాని కేముంది నాయనా? నా భర్తని చూడాలన్నదే నా ఆతృత అంతా. నా స్వామిని ఎంత తొందరగా చూస్తే అంత ఆనందిస్తాను!” అని తల వొంచుకుంది.

“అలాగే తల్లీ! నీ భర్తనీ, మరిదినీ, అందర్నీ చూస్తావు. ఇప్పుడే వెళ్ళి నీ భర్తకి చెపుతాను. సంతో షంగా వుండు” అని చెప్పి హనుమంతుడు అంగలేసు కుంటూ వెళ్ళిపోయాడు.

హనుమంతుడు వెళ్ళిన కొంత సేపటికి విభీషణుడు అశోకవనానికి వచ్చాడు. సరమ, స్త్రీలందరితో సీత దగ్గ రికి వచ్చింది – “అమ్మా! నీ భర్త నిన్ను చూడాలంటు న్నాడు. నీ సేవ కోసం అంతా సిద్ధంగా వుంది. చక్కగా శిరస్నానం చేసి .... అలంకారాలు చేసుకుని ....”

సీత అయిష్టంగా, “వొద్దు. అలంకారాలేవీ వొద్దు నాకు. ఇలాగే వొస్తాను. నన్ను తొందరగా తీసుకు వెళ్ళండి” అంటూ లేచింది.

“అమ్మా! నీ భర్తే నిన్ను అలంకారాలతో తీసుకు రమ్మని ఆజ్ఞాపించాడు. హనుమంతుడు వెళ్ళి చెప్పగానే శ్రీరాముడు నీ విషయంలో నా భర్తని ఆదేశించి పంపిం చాడు. భర్త ఎలా చెపితే అలా నడుచుకోవడం స్త్రీల ధర్మమని నువ్వు ఎరగవా తల్లీ?”

సీత నిరుత్సాహపడి తల వొంచుకుంది. ఇంత కాలం అశోకవనంలో ఉన్న రూపంతోనే భర్త దగ్గిరికి వెళ్ళాలని సీత కోరిక. తను పర పురుషుడి ఇంట, సుఖ భోగాల పట్ల ఎంత విముఖంగా, ఎంత విరక్తిగా, ఎంత మలినంగా, ఎంత పవిత్రంగా .... శోకిస్తూ గడిపిందో, భర్తకూ, ప్రజలకూ చూపాలని సీత వాంఛ!

పట్టువస్త్రాలతో, సమస్తాభరణాలతో, చక్కగా అలంకరించుకుని భర్త ఎదుట నిలబడితే, ఇంత కాలం తను అనుభవించిన దుఖ్ఖం, తన దీనత్వం ఆయనెలా గ్రహించగలడు? హనుమంతుడి వల్ల విని తన దీనస్థితి ఊహించగలడా?... తను ఈ విధంగానే భర్త ముందుకు వెళ్ళాలి. కానీ ....

సరమ, సీతని ఓదారుస్తూ చెప్పుకొచ్చింది – “నీ బాధ, నే నెరుగుదును తల్లీ! భర్తని ఎంతటెంతట చూస్తానా అని ఆతృత పడుతున్నావు. పరిచారికలంతా జాప్యం చెయ్యకుండా నిన్ను సిద్ధం చేస్తారు. నీ భర్త ఉన్నచోట ఎందరో వానరులూ, లంక ప్రజలూ ఉన్నారు గదా? అందరి ముందూ నువ్వు ఈ రకంగా నిలబడితే నీ భర్తకు అవమానం కాదా? నీ సౌందర్యానికి తోడు అలంకారాలు కూడా చేసుకుంటే బంగారానికి తావి అబ్బినట్టే!”

సీత అయిష్టంగానే అంగీకరించింది.

పరిచారికలందరూ మహోత్సాహంగా సీతకు సుగంధ ద్రవ్యాలతో నలుగులు పెట్టి పన్నీటితో శిర స్నానం చేయించారు. గంధాలు పూశారు. పట్టుచీర కట్టి, వొంటి నిండా ఆభరణాలు పెట్టి, అలంకారం పూర్తి చేశారు.

గుమ్మం ముందు మెత్తని పరుపుల పల్లకీ తెచ్చి దించారు.

సీత సిగ్గుపడుతూ తల వొంచుకుని పల్లకీలో కూర్చుంది. బోయీలు పల్లకీ ఎత్తుకున్నారు.

★ ★ ★

రాముడు సీత గురించి ఎప్పుడాలోచించినా, అతని ఆలోచనలన్నీ సీత పాతివ్రత్యం గురించే! రావ ణుడు పోయిన తర్వాత, లంక స్వాధీనమైన తర్వాత, రాముడికిక సీత గురించి స్పష్టం చేసుకోక తప్పలేదు.

సీతని స్వీకరించడమేనా? లేక ....?

అసలు సీత శీలవతిగానే ఉందా?

ఆ దుర్మార్గుడు .... అంత కాముకుడు .... పర స్త్రీని .... బలాత్కరించకుండా .... ఊహూ? .... నమ్మ డానికి వీల్లేదు.

శీలం లేని స్త్రీని .... తన వంటి ఉత్తమ వంశస్థుడు! .... తనవంటి జ్ఞానవంతుడు...!

పర పురుషుడితో గడిపిన భార్యని సుగ్రీవుడు నిరభ్యంతరంగానే స్వీకరించాడు. అనాగరికుడు కాబట్టే పౌరుష హీనమైన పని చేశాడు.

కానీ .... అహల్యని గౌతముడూ స్వీకరించాడే! ....

ఆశ్చర్యమే! .... ఎప్పుడో చిన్నతనంలో విన్న సంగతి .... నిన్న మొన్న విన్నంత గుర్తు! .... రుషుల ధర్మాలు .... వేరు కావచ్చునా? .... ఏది ఏమైనా రఘు వంశంలో పుట్టిన తన వంటి ఉత్తముడు .... శీలవతి గాని భార్యని స్వీకరించ ....

"అయ్యో! 'శీలవతి కాదు, శీలవతి కాదు' అంటా వెందుకు? .... మళ్ళీ శంకిస్తున్నావా సీతని?" అని విసుక్కుంది, లోపలి కంఠం నిశ్శబ్దంగా.

రాముడు మొహం చిట్లించి నేల చూపులు చూశాడు. "అన్యాయంగా శంకిస్తున్నానా? .... రావణుడు వంటి కాముకుడు .... పర స్త్రీని విడిచి పెడతాడా?" అని మండిపడ్డాడు లోపలికి.

"నువ్వయితే విడిచి పెట్టవా?"

"నే నైనా విడిచిపెట్టను" అనేసి, చప్పున మాట సర్దుకుని, "అసలు నే నైతే పర స్త్రీ నెందుకు చెరబడ తాను? నేను ఏక పత్నీ వ్రతుణ్ణనే సంగతి మరచిపోయి మాట్లాడుతున్నావా? పర స్త్రీ విషయంలో నే నెలా ప్రవ ర్తిస్తానో రావణుడూ అలాగే ప్రవర్తిస్తాడా? .... నా లాంటి వాడేనా రావణుడు?" అని రౌద్రంగా ప్రశ్నల వర్షం కురి పించాడు రాముడు.

"రావణుడు నీ లాంటి వాడు కాదు నిజమేకానీ, సీత మాత్రం నీ లాంటిదే. ఏకపత్నీ వ్రతుడిగా వుండడం ప్రతిష్ఠాకరమని నువ్వు భావించినట్టే, పతివ్రతగా వుండడం ప్రతిష్ఠాకరమని సీత కూడా భావిస్తుంది. పర పురుషుడికెంత మాత్రం వశపడకుండా పతివ్రతగా ఉండడానికే ఆమె ప్రయత్నిస్తుంది."

"సీత, తన ఇష్టంతో వశపడుతుందని నా అభి ప్రాయం కాదు. ఆ దుర్మార్గుడు .... అసలే కాముకుడు .... బలాత్కారంగా వశం చేసుకోకుండా పూరుకుంటాడా అని!"

"ఊరుకున్నాడని నీ విశ్వాసపాత్రులందరూ చెపు తున్నారు గదా? హనుమంతుడూ .... విభీషణుడూ ...."

"అసలు నిజం వాళ్ళకేం తెలుసు?"

"విభీషణుడి భార్య అక్కడే వుంది కదా? రాత్రిం బవళ్ళూ దాసీలు కాపలాలు కాస్తూ వున్నారు కదా? జరి గిందేమిటో వాళ్ళకు తెలియదా?"

"........................"

"రావణుడు తనని తాకలేదని సీతే చెపుతోంది కదా? ఆమె అబద్ధమాడుతోందనుకుంటున్నావా? ఏమైనా జరిగి వుంటే తన పవిత్రత పోయిందని సీతే అంగీకరించేది. అప్పుడు తను నీకు తగనని సీతే చెప్పు కునేది. సీత ఒప్పుకునేది."

"......................"

"ఏమిటి ... మాట్లాడవు? ఇంకా .... శంక పోవడం లేదా?"

"ఇంత పౌరుష హీనమైన పని చేస్తే లోకం ఏమం టుంది? 'నా భార్య ఏ పాపమూ ఎరగదు. వాడు పూరికే తీసుకు వెళ్ళాడుగానీ తాకనే లేదు' అంటే లోకం నమ్ము తుందా? నవ్విపోతుంది .... ఎంతోకాలం పర పురుషుడి గృహంలో ఉండి .... శీలం పోయి ...."

"అయ్యో!.... మళ్ళీ... అదే మాటా? అన్యాయం సుమా!"

"కాదు, అన్యాయం కాదు. మళ్ళీ మళ్ళీ మళ్ళీ అంటాను. సీత శీలవతేనా? .... అనవసరపు చర్చలు చెయ్యకు నాతో. శాస్త్రాలన్నీ చదివిన వాణ్ణి! ఎప్పుడెలా ప్రవర్తించాలో తెలిసిన వాణ్ణి! అసలు సీతని వనవాసానికి రావొద్దంటే విన్నదా? భర్త మాట పాటించిందా?"

"అయ్యో! నీ వియోగం భరించలేకనే కదా నీతో పాటు వొచ్చింది? నీ పాదసేవ చేసుకుంటూ బ్రతకాలనే కదా వొచ్చింది? అంత మాత్రం గ్రహించ లేక పోయావా? అడిగితే కోపం వస్తుంది గానీ, సీత రాకపోతే నువ్వు ఏ వంకతో రావణుడి మీద దండెత్తే వాడివి?"

"ఏవిటీ? నేను సీత వంకతో దండెత్తానా? .... సీత కోసం గాకపోతే అసలు నాకు రావణుడి మీద దండెత్త వలసిన అవసరం ఏమిటి?"

"అవసరం లేదా? రావణ వధ? .... రుషుల రక్షణ? .... శత్రు సంహారం? .... ధర్మ సంస్థాపనం? .... సామ్రాజ్యాధిపత్యం? .... ఇవన్నీ ఎలా జరగాలి దండెత్తకపోతే? సీత కోసమే దండెత్తినట్టు .... ఇంకా ఎంత కాలం మభ్య పెడతావు నన్ను? .... నే నెవరిని? నీ ఆత్మని! నీ నిజా నిజాలేమిటో నాకు తెలియ వను కుంటున్నావా?

నువ్వు ఏ వ్యవహారం ఎలా నడిపినా, సీత విష యంలో మాత్రం ఇంత కఠినంగా ఆలోచించడం నేను భరించలేను. నేను నీ ఆత్మననే జ్ఞానమైనా లేకుండా, ఆత్మ ప్రబోధం వినకుండా, ఆత్మ ఎంత క్షోభిస్తోన్నా, ప్రతీ క్షణం ఆ నీతులూ, ఆ ధర్మాలూ, ఆచరించాలనే బాని సత్వం ఎందుకు నీకు?"

"నువ్వు నా ఆత్మవే అయితే నా ఆలోచనలతో ఎందుకు భేదిస్తావు? చిన్నతనం నించీ నేను నేర్చుకున్న జ్ఞానాన్నెందుకు పరిహసిస్తావు? నాకూ నా ఆత్మకూ ఈ వ్యతిరిక్తత ఏమిటి? ఎందుకు?"

"నిన్ను నేను ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తానా? నీ చేష్టల హైన్యం భరించలేనప్పుడు మాత్రమే నీతో ఘర్షణ పడ తాను. నువ్వు నన్ను అనుసరించడం నీకే ఆనందం. అది గ్రహించలేకపోతున్నావు!"

"కాదు, నిన్ను అనుసరించడం నాకు అవమానమే గానీ, ఆనందం కాదు. నేను నిన్నే అనుసరిస్తే నువ్వు నన్ను నవ్వులపాలు చేస్తావు, ఆత్మ లెప్పుడూ లోక ధిక్కారానికీ, ధర్మ ధిక్కారానికీ ఈడుస్తాయి. నీకు – రాజ నీతీ, సంఘ నీతీ, లౌక్యం, వినయం, అన్నీ అయిష్టమే. దేనికీ లొంగనంటావు. నన్ను లొంగనివ్వనంటావు. .... పితృభక్తి చూపవద్దని ప్రబోధించావు, గుర్తు ఉందా? .... వాలిని చంప వొద్దనీ ప్రబోధించావు, మరిచిపోయావా? .... ఇప్పుడు సీతని తిరస్కరించవద్దని ప్రబోధిస్తున్నావు. నీ ప్రబోధాల మీద నాకు విశ్వాసం లేదు. ఈ నాడు నే నింత ఉత్తముడి నెలా అయ్యాను లోకానికి? నా దుఃఖం అణుచుకుని పితృ భక్తిని ప్రకటించటం వల్లనే. ఇందరు మిత్రులూ, సామంతులూ గల మహా రాజు నెలా అయ్యాను? పాపభీతిని వెనక్కి నెట్టి వాలిని చంపడం వల్లనే! మొదటి నించీ నీ మాట ప్రకారం నడిస్తే నే నేమయ్యే వాడిని? నీ ప్రబోధం నన్నెలా ఉద్ధరించేది? నా కీర్తే నా ధర్మం. పురాతన ధర్మ శాస్త్రాలే నా మార్గం! పర పురుషుడు తాకిన భార్యని స్వీకరించమని ఏ ధర్మ శాస్త్రాలు చెపుతున్నాయో చూపించు! నీ ప్రబోధాలు నేను లక్ష్యపెట్టను. శీలంలేని స్త్రీని నే నెందుకు స్వీకరించాలి?"

"నే నిక చెప్పను. నువ్వు పూర్వం కన్నా కఠినుడి వయ్యావు. ఎప్పుడూ ఆత్మని తలెత్తనివ్వక, నీ ఆత్మనే చంపుకునే హీనుడి వయ్యావు .... నీ కెంత కోపం వచ్చినా నేను జంకను... చుట్టూ చూడు, నీ ఉగ్రత్వం అందరూ ఎంత వింతగా చూస్తున్నారో చూడు! సీత పుట్టెడు ఆపద గడిచి, ఎంతో కాలం తర్వాత నిన్ను చూడాలని వస్తోంది. ఆమెతో కూడా ఇంత కఠినం గానే ప్రవర్తిస్తావా?"

"ఆఁ .... ఇంత కఠినంగానే ప్రవర్తిస్తాను .... శీలం పోయిన నీచురాలి మీద కాఠిన్యం గాక కరుణ కురిపించ మంటావా?"

"నేను ఆఖరిసారి చెపుతున్నాను. సీత సద్గుణ వంతురాలు!"

"అంత సద్గుణవంతురాలైతే .... తన దోషమేమీ లేదని రుజువు చేసుకుంటుందా?"

"రుజువా? రుజువెలా చేసుకుంటుంది?"

"ఏమో, ఎలా చేసుకుంటుందో! ఏ రుజువులూ లేకుండానే .... సందేహాస్పదమైన స్థితిలో భార్యని ఇంటికి తెచ్చుకునేటంత పౌరుష హీనుడినా నేను? మా తాత ముత్తాతల కాలం నించీ మా వంశంలో ఇంత సిగ్గుచేటు పని ఎన్నడూ జరగలేదు. ఈ నాటికి నే నా పని చేస్తానా? మా వంశం ... మా కీర్తి ... నేను మాత్రం సీత మీద కరుణ చూపించను."

"సరే! నేను వెళుతున్నాను. నువ్విక ఆత్మని సంపూర్ణంగా నాశనం చేసుకోగల స్థితికి చేరావు. ఆత్మ కదలికనే దుర్భరంగా భావించే నీచుడి వయ్యావు. ఇంకా నిన్ను అంటిపెట్టుకుని, నిన్నేదో సంస్కరించాలని, నీతో ఘర్షణ పడుతూ .... ఎందుకీ వ్యర్థప్రయాస నీ ఆత్మకి?"

దూరంగా పల్లకీ బోయీల కంఠాలు వినవచ్చాయి.

రాముడు రోషపడుతూ భీకరంగా చూస్తూ నించు న్నాడు.

"సీత వొస్తోంది ..... సీత వొస్తోంది" అని అందరికీ చెప్పేసింది గాలి.

జనం సందడి చేస్తూ కలవరపడ్డారు.

సీతని చూడాలనే ఆతృత!

"ప్రాణాలకు తెగించి యుద్ధం చేశాం – ఈ సీత కోసమే. ఎలా వుంటుందో చూడాలి."

"చాలా అందంగా ఉంటుందట! అందుకేగా రావణుడు చావుకి కూడా తెగించాడు!"

"మూర్ఖుడు గాకపోతే ఎంత అందగత్తె అయితే మాత్రం .... చావు తెచ్చుకునేంత మొండి పట్టు పట్టాలా?"

"నువ్వయితే పట్టవులే. నాలుగు రోజులు ఎక్కువ బతికే దారి ఉంటే, కోతితో అయినా కాపరం చేస్తావు."

రాక్షస భటులు బెత్తాలు ఝాడిస్తూ వానర సైనికుల్నీ, లంక ప్రజల్నీ, దూరంగా తరుముతున్నారు. "పొండి .... పొండి .... దూరంగా పొండి .... సీతాదేవి వస్తోంది .... ఉండకూడదు ఇక్కడ. పొండి" అని అరుస్తున్నారు.[432]

జనం, దూరంగా పోయినట్టే పోయి మళ్ళీ జేరుతున్నారు అక్కడికే.

భటులు, జనాన్ని బెత్తాలతో బాది దండించి, పల్లకీ రావడానికి దారి చేశారు.

---

**432.** యుద్ధ, సర్గ 117, శ్లోకం 20: ప్రజల్ని దూరంగా తరిమే భటులెలా వున్నారో చూడండి!

వేత్ర జర్ఝర పాణాయః = బెత్తములచే పరుషములైన హస్తములు గలవారు (కోపంగా కర్రలతో బాదుతూ ఉన్నవారు.) తత్ర = అచ్చట; సమంతాత్ = అంతటను; పరిచక్రయః = తిరిగిరి. లంకలో ఉన్న ఈ భటులకూ, ఈ నాడు మనం చూసే లాఠీ పోలీసులకూ, తేడా ఏమైనా ఉందా? కర్రలతో ప్రజల్ని బాది, దెబ్బల భయంతో అదుపు చెయ్యటం, లొంగదియ్యటం, ఆ నాడూ ఈ నాడూ కూడా, రక్షక భటుల ఉద్యోగ ధర్మం!

★

రాముడు, ఆలోచనలు చెదిరి, తల ఎత్తి చూసి కోపంగా, "అందర్నీ వెళ్ళగొడుతున్నా రెందుకు?" అని విభీషణుడి మీద మండిపడ్డాడు.

"ప్రభూ! సీతాదేవి నీ సన్నిధికి వొస్తోంది .... ఈ ప్రజలందరూ ...."

"తప్పు లేదు. ఉండనివ్వండి! ఆపదల్లో, యుద్ధ రంగాల్లో, వివాహాల్లో, స్వయం వరాల్లో, యజ్ఞ యాగాల్లో, స్త్రీలను అందరూ చూడవచ్చును. దోషం లేదు. స్త్రీకి సౌశీల్యమే రక్షగానీ, తెరలూ, అంతఃపురాలూ రక్ష కావు."[433]

రాముడి ముఖ కవళికలు గమనిస్తోన్న వారందరికీ, రాముడి ధోరణి విస్మయం కలిగిస్తోంది. సీతాదేవి వస్తోన్న సంతోష సమయంలో కూడా రాముడు దీర్ఘా లోచనలో మునగడం .... పరధ్యాన్నం .... చిరు నవ్వు లకు బదులు ఆగ్రహం .... మౌనం .... అందరికీ వింతగా తోస్తోంది.

లక్ష్మణుడు.... ఏదో ఆపద రానున్నదని జంకుతూ, విచారపడుతూ నించున్నాడు.

సుగ్రీవుడు నీలుడి చెవిలో, "రాముడేంటీ అలా రుస రుసలాడుతున్నాడు, ఎందుకంటా?" అని ఆశ్చర్యపడు తున్నాడు.

"అదే చూస్తున్నా .... భార్య మీద కోపంగా ఉందను కుంటా. ఏం చేస్తాడో మరి!"

పల్లకీ దూరంగా ఆగింది.

సీత సిగ్గు పడుతూ దిగింది.

విభీషణుడి వెనకాల తలవొంచి నడిచింది.

రెండు వేపులా జనం తోసుకుని, గెంటుకుని, ఎగ బడి సీతని చూస్తున్నారు.

"అందంగానే ఉంది."

"అంత మరీ ఏం లేదు."

"రంభలా ఉంటుందన్నారే!"

"రంభలాగే ఉందేమో! రంభని చూశావా నువ్వు?"

"అంత గొప్పేం లేదు లెద్దూ! ఆ నగా నట్రా మా ఆవిడికి పెడితే ఇంతకన్నా అందంగా ఉంటుంది."

"రావణుడికి తెలిస్తే మీ ఆవిణ్ణే తెచ్చుకునే వాడు."

విభీషణుడి వెనక సీత అడుగులో అడుగు వేసు కుంటూ రావడం చూస్తున్నాడు – రాముడు!

ఆలోచిస్తున్నాడు! మొహం భీష్మించుకుంటున్నాడు! ఏం చెయ్యను? .... రాగానే పాదాలకు నమ స్కరిస్తుంది .... నమస్కరిస్తుందా? .... ఇంకా అంత భక్తితో .... ఉన్నట్టేనా? .... లేవదీసి .... అక్కున .... ఊహూ! .... ఇక్ష్వాకు వంశంలో పుట్టి .... మరి .... ఏం చెయ్యను?

"శ్రీరామ ప్రభూ! నీ ధర్మపత్ని వచ్చింది, నీ దర్శ నానికి!"

రాముడు మొహం కఠినంగా, చూపులు తీక్షణంగా, నిశ్చలంగా గాంభీర్యంతో, మౌనంతో, చెక్కిన శిల్పంలా నిలబడి ఉన్నాడు.

జనంలో .... నిశ్శబ్దం! .... ఆశ్చర్యం! సందేహాలు! ఏమిటిది ....? భార్య కోసం దుఃఖపడి .... ఆరాటపడి .... ఇంత అలక్ష్యంగా .... ఇంత నిరాపేక్షగా ....!

సీత, రాముడి వేపు అడుగులు వేస్తూ బహుకాల వియోగ భారంతో, సిగ్గుతో, గొప్ప ఆపద గడిచిన ఆనం దంతో, కళ్ళెత్తి భర్తని చూసి, తన ఆతృతలో భర్త ముఖ కవళికలు గమనించలేక, "ప్రభూ!" అంటూ దూరంగా నిలబడి తల వాల్చి జల జల కన్నీళ్ళు రాల్చింది.

సీత – అంత అలంకారంతో, సౌందర్యంతో కంట బడి, సీత కంఠం చెవులబడగానే రాముడి రోషం రెట్టింపైంది.

మొహం భీష్మించి కఠినంగా చూశాడు. "సీతా! నా మాటలు విను! శ్రద్ధగా విను! పర పురుషుడి గృహంలో వున్న నిన్ను నే నిక స్వీకరించను. నేను రావణుడితో యుద్ధం చేసింది, నీ కోసం కాదు. నిన్ను మళ్ళీ తెచ్చు కోవాలని కాదు. నా భార్యని అపహరించిన శతృవు మీద కక్ష తీర్చుకోవాలని మాత్రమే యుద్ధం చేశాను. నన్ను అవమానించిన శతృవుని చంపి నా పగ తీర్చుకున్నాను. నా శ్రమా, నా మిత్రుల శ్రమా ఫలించాయి. నిన్ను మళ్ళీ స్వీకరించే కోరిక లేదు నాకు."

సీత, ఏమీ అర్థంకాక ... ఆశ్చర్యపడి చూసింది.

జనంలో ధ్వని బయల్దేరింది.

శ్రీరాముడి వచనాలు మళ్ళీ! "సీతా! అవమానాలు సహించి ఊరుకునే అసమర్థుడిని కాను నేను. 'భార్యని ఎత్తుకు పోయినా ఏమీ చెయ్యలేక ఊరుకున్నా'డంటే ఎంత అప్రదిష్ట నాకు! నే నెంత సమర్థుడినో బలవంతు డినో, నా మిత్రులెంత సమర్థులో బలవంతులో, లోకానికి చూపడానికే యుద్ధం చేశాను. పర పురుషుడు ఎత్తుకు పోయిన భార్యకోసం కాదు."

---

**433.** **యుద్ధ, సర్గ 117, శ్లోకం 26:** స్త్రీల గురించి రాముడి మాటలు: "స్త్రీలకు, ముసుగులు, తెరలు, ఇండ్లు, ప్రాకారములు, వస్త్రములు, రక్షలు గావు. వారి ప్రవృత్తియే (స్వభావమే) వారికి రక్ష యగును."

భరతుడు చిత్రకూటానికి వచ్చినప్పుడు, రాముడు అతనికి రాజనీతులు చెపుతూ, స్త్రీల విషయం ఏమన్నాడు? అంతఃపురాల సంగతి ఏమని చెప్పాడు? అవన్నీ కట్టుదిట్టంగా ఉండాలన్నాడు. అవే స్త్రీలకు రక్ష అన్నాడు! ★

విషయం అర్థమైంది సీతకి!

నిర్ఘాంతపడి స్థాణువై పోయింది.

రాముడు గంభీరంగా సీతనే పరికిస్తున్నాడు – "నీ శీలం విషయం నాకు సందేహమే. నీలాంటి అందగత్తె చేతికి చిక్కిన తర్వాత .... రావణుడు నిన్ను శీలవతిగా విడిచాడంటే నమ్మేంత మూర్ఖుడినా నేను? మా రఘు వంశం పౌరుషాలకూ, సద్గుణాలకూ పెట్టింది పేరు. అటువంటి వంశంలో పుట్టిన నేను .... కళంకమై పోయిన నీ లాంటి భార్యని ...."

సీత దుఃఖంతో .... కంపించింది. అంతంత కఠిన మైన .... దుర్భరమైన మాటలు .... భర్త నోటి నుంచి! .... తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది. తన భర్త వచ్చి తనని రక్షించి, తన పాతివ్రత్యానికి పొంగిపోయి, ప్రేమతో, లాలనతో, దరిచేర్చుకుంటాడని ... ఇంత కాలం ఎదురుచూస్తే ... చివరికి ఇదా ఫలితం?

తనని స్వీకరించడా? తను శీలవతి కాదా? పతివ్రత కాదా? ఎంత అపనింద! ఇంతమంది ప్రజల ముందు! తన భర్త తనని శంకిస్తున్నాడా? చిన్నతనం నించి తన ఆశలు .... తన పతి భక్తి .... తన సౌశీల్యం .... అన్నీ వ్యర్థమేనా? – సీత నిర్ఘాంతపడి భర్తని చూసింది.

రాముడు తన వంశ కీర్తి ప్రతిష్ఠలూ, తాత ముత్తాతల పౌరుషాలూ, వర్ణించి .... వర్ణించి – "అంత గొప్ప వంశం మాది! శీలం పోయిన స్త్రీని మా వంశంలో ...." అని హేళనతో ముగించాడు.

సీత వలవలా ఏడుస్తూ చెవులు మూసుకుంది. "అయ్యో! ఎంత దుర్భరంగా మాట్లాడుతున్నావు! వినలేక నా చెవులు చిల్లులు పడిపోతున్నాయి. విద్యా జ్ఞానం లేని పామరుడు పామర స్త్రీతో మాట్లాడినట్టు నువ్వు నాతో మాట్లాడుతున్నావు. పతి భక్తే నా వ్రతమనే సంగతి మరిచిపోయి నా నడవడి శంకిస్తున్నావా? ఎవతెనో దుష్ట స్త్రీని చూసి స్త్రీలందరూ అంతే అనుకుంటున్నావా? సీత అంటే ఏమిటనుకుంటున్నావు? ఇంత కాలం వరకూ నా సంగతి నువ్వేమీ గ్రహించనే లేదా?" అని దుఃఖంతో నిష్ఠూరంగా చూసింది.

రాముడు ఉగ్రుడయ్యాడు – "ఏమిటి నీ సంగతి? ఇంత కాలం ఎవడి దగ్గిర ఉన్నావు? వాడు నిన్నేమీ చెయ్యలేదని పతివ్రత కబుర్లు చెపుతున్నావే! నిన్ను ముట్టుకుని, నీ అవయవాలు తాకుతూ తీసుకు వెళ్ళాడా, లేదా?" అని గర్జించాడు.

సీత సిగ్గుతో చితికిపోయింది. కుంచించుకు పోయింది – "తీసుకు వెళ్ళాడు .... అబలని! ధిక్కరించే శక్తి లేని దానిని! ఒక నీచుడు బలాత్కారంగా తీసుకుపోతే అది నా తప్పు అవుతుందా?"

"ఎవరి తప్పో చెప్పకు నాకు! పర పురుషుడు నిన్ను కామోద్రేకంతో పలకరించాడా లేదా?"

"పలకరించాడు. అది నా తప్పా? ఏ విధంగా నైనా నన్ను స్వాధీనం చేసుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేశాడు .... కానీ నేను లొంగానా? నేను ఆ నీచుణ్ణి కన్నెత్తి చూశానా?"

"ఎలా నమ్మమంటావు? రుజువేమిటి?"

"రుజువా? రుజువెట్లా చెయ్యను? రుజువా! .... రుజువా!"

సీత భయంతో గజ గజ వొణికింది. "హనుమంతుణ్ణి అడుగు! రావణుడితో నే నెలా మాట్లాడానో కళ్ళారా చూశాడు. విభీషణుణ్ణి అడుగు! అశోకవనంలో అతనికెందరో గూఢచారులున్నారు. విభీషణుడి భార్య నడుగు! ఆమె ఎప్పుడూ నా తోనే అశోకవనంలో ఉంది. నా చుట్టూ కాపలా వున్న దాసీలందర్నీ అడుగు! .... జరిగినదంతా తెలుసుకున్న తర్వాత న్యాయంగా ఆలోచించి నా నడతని నిర్ణయించు! ప్రభూ .... నా మాట నమ్ము! నువ్వనుకునే దోషం నాలో లేదు. నేను అటువంటి పాపాత్మురాలిని కాను. నా మనస్సు అహర్నిశలూ నిన్నే ధ్యానిస్తూ వుంది. ఒట్టు వేసి చెపుతాను. నా సౌశీల్యం నువ్వే గ్రహించలేకపోతే ఇక నే నెవరితో చెప్పుకోను?" అంటూ విలవిల్లాడింది.

చెవిటి వాడి ముందు శంఖూదినట్టే అయింది – సీత దుఃఖం, సీత తర్కం, రాముడి ముందు! "నువ్వు ఎంతో కాలం పర పురుషుడి ఆధీనంలో ఉన్నావు. అక్కడేం జరిగినా, జరగకపోయినా, నువ్వు అపవిత్రురాలివే. అటువంటి భార్యని తెచ్చుకుని నా వంశ ప్రతిష్ఠ పాడు చేసుకోమంటావా?"

సీత రోషపడుతూ చూసింది – "నువ్వు అలాగే నిశ్చయించుకుని వుంటే, ఆ సంగతి నాకు హనుమంతుడితో నీ ఆభరణం పంపిన నాడే ఎందుకు చెప్పి పంపలేదు? 'నిన్నిక నేను ఏలుకోను. నా శత్రువుని చంపటానికి మాత్రమే యుద్ధానికి వస్తాను' అని ఆ నాడే తెలియబరిస్తే నేను హనుమంతుడి కళ్ళ ఎదటే ప్రాణత్యాగం చేసే దానిని కదా? నువ్వు తప్పకుండా వస్తావని, రక్షిస్తావని, ఆదరిస్తావని, నా మీద ప్రేమతో విరహంతో దుఃఖిస్తున్నావని హనుమంతుడు నా కెన్నో విధాల ధైర్యం చెప్పాడు. చివరికి ఈ నాడు .... నన్నింత మంది ముందు అవమానించి .... ఇంత నిర్దయగా, ఇంత దిక్కు లేని స్త్రీనిగా, అయ్యో ...." సీత కంఠం దుఃఖంతో పూడిపోయింది.

సీత, కన్నీటితో నిష్ఠూరమైన మాటలు మాట్లాడు తోన్న కొద్దీ రాముడికి ఆగ్రహం పెరిగిపోయింది. కర్కశంగా చూస్తూ, "దిక్కు లేకుండా విడిచానని

దుఃఖపడి లాభం లేదు. నీ కిష్టమైన దిక్కుకే వెళ్ళు! లక్ష్మణుడి దగ్గిరో, భరతుడి దగ్గిరో, సుగ్రీవుడి దగ్గిరో, విభీషణుడి దగ్గిరో, నీకు ఎక్కడ ఇష్టమైతే అక్కడ ఉండు!" అన్నాడు.

లక్ష్మణుడు నిర్ఘాంత పడిపోయాడు.

రాముడి మాటలు విన్న వాళ్ళందరూ కొయ్యబారి పోయారు. "నేను విన్నది నిజమేనా? నీకూ అలాగే వినపడిందా?" అన్నట్టు ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు.

లక్ష్మణుడి మొహం ఎఱ్ఱగా జేవురించింది. "ఏమిటి? నీ అన్నకి ఏమైంది? ఈ సారి నిజంగానే మతి తప్పింది! .... ఎందుకలా నిలబడ్డావు? అడగవేం అన్నని?"

ఇంగితాన్ని ఏమీ అనకుండా లక్ష్మణుడు తల వాలేసి కొయ్యబారి ఉండిపోయాడు.

సీతకి, సముద్ర కెరటాలలాగ దుఃఖం ముంచుకొచ్చింది. పరాభవంతో తల ఎత్తలేకపోయింది. భర్తని విడిచి పర పురుషుడి నీడలో జీవించడమే తనకు అంగీకారమైతే, ఆ రావణుడి నీడనే ఉండదా? శాస్త్రాలన్నీ చదివిన జ్ఞాని ఇంతింత .... జ్ఞానహీనమైన మాటలా?" కొంగుతో మొహం కప్పుకుని వల వలా ఏడుస్తూ నిలబడింది.

సుగ్రీవుడికి కొంచెం ఆశ రేగింది – సీత తన దగ్గిర ఉంటానంటుందేమోనని! రావణుణ్ణి చంపటానికి తను చాలా సహాయం చేసిన సంగతి సీతకి తెలుసు .... అయితే మాత్రం, సీత తన దగ్గిర ఉంటుందనుకోవటం తప్పు కాదూ? .... ఏం తప్పూ? రాముడే అన్నాడుగా? అతడు అంటే తప్పు లేదుగానీ సీత తనతో వుంటుందని తను ఆశ పడితే తప్పొచ్చిందా? చాలా అందంగా వుంది. రుమ కన్నా.... తార కన్నా.... వేరే భవనం.... దూరంగా .... కట్టించి .... అందులో పెడితే ....? గబుక్కున నళుడి చెవి మీదకి వొంగి, "రుష్యమూకం మీద మేడ కట్టిస్తే బాగుంటుందా? నీకు మేడలు కట్టించడం వొచ్చుగా?" అన్నాడు.

"ఎందుకూ?" అని తెల్లబోయాడు నళుడు.

"ఎందుకా?" – ఎందుకో గుర్తొచ్చి చెప్పెయ్యడానికి సందేహించాడు సుగ్రీవుడు. అప్పుడే చెపితే బాగుండదని "ఏం లేదు లే. లేదు లే. నిన్ను చూస్తే మేడ కడతావేమోననీ .... ఊరికే అన్నాలే" అని కంగారుపడ్డాడు.

"చాల్లే! ఊరికే మేడ లెందుకూ? మేడలూ మిద్దెలూనూ, ఎన్ని ఉన్నా ఆశ తీరదా?" అని విసుక్కున్నాడు నళుడు.

జనంలో, వానరుల్లో చాలామంది – రాముడి మీద కోపంతో మండిపడుతున్నారు.

"సీతో, సీతో – అని వొకటే ఏడిచాడే! ఇప్పుడీ దుర్మార్గం ఏంటి?"

"మొదటి నించీ ఇష్టం లేదేమో! భార్య కోసం ఏడ్చినట్టు కనబడితేగానీ మనం యుద్ధానికి రావనుకుని అలా ఏడిచాడేమో!"

"నిజం చెప్పావు. సీతాదేవిని రక్షించటానికి గాక పోతే నే నసలు యుద్ధానికి వొచ్చేవాణ్ణి కాను."

"అవేం పిచ్చిమాటల్లే. పొట్టకూటికి తలలమ్ము కున్న వాళ్ళం. రాజు రమ్మన్నాక రాకేం చేస్తాం?"

"ఆ మహాతల్లి అంత భక్తితో దగ్గిరికి వొస్తే .... వంశం .... వంశం .... అంటాడేంటి? మన రాజు, భార్యని నిక్షేపంలా ఏలుకోటం లేదూ?"

"మనం అడివి మనుషులం. వాళ్ళు నాగరీకం ...."

"ఏడిశార్లే! .... నాగరీకం గీగరీకం .... బలం లేని ఆడదాన్ని మొగాడీడ్చుకు పోతే – ఆ ఆడదేం చెయ్యగలదు చెప్పు? ఆ మాత్రం జ్ఞానం లేదా .... వీళ్ళ నాగరీకం సిగ దరగ ...."

"పాడు గోల, ఊరుకోండి. ఎక్కడ జేరినా వాగుడే, మాట వినపడనివ్వరు ...."

రాముడు మళ్ళీ తన వంశ పుట్టుపూర్వోత్తరాలన్నీ ఏకరువు పెట్టాడు. ఆ వంశం ముల్లోకాల్లో, జగత్తులో, చరాచర భూత కోటిలో, ఎంత ఉత్తమమైనదో, ఎంత పవిత్రమైనదో, ఎంత .... దో – ఆ వంశంలో పుట్టిన తను ఎంత ఘనుడో, ఎంత వీరుడో, ఎంత ఉత్తముడో, ఎంత .... డో – వర్ణించి, వర్ణించి, తన ఉత్తమత్వాన్ని నెమరు వేసుకున్న ఉత్సాహంతో భార్యని మరింత చీదరిస్తూ కొర కొరలతో చూశాడు – "నీ మీద నా కేమీ ప్రేమ లేదు సరి కదా, చెప్పలేనంత అయిష్టం కలుగుతోంది. నిన్ను నా కళ్ళ ఎదుట చూడడమే నాకు దుర్భరంగా ఉంది. సందేహాస్పదంగా ఉన్న నిన్ను ఒక్క క్షణం కూడా భరించలేను. తొందరగా వెళ్ళి పో .... నీ కిష్టమైన చోటికి వెళ్ళి పో! తక్షణం వెళ్ళి పొమ్మని నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను" అని గర్జించి మొహం తిప్పేశాడు.

సీత అవమానంతో కంపిస్తూ, సహనం చచ్చి, పట్టలేని కోపంతో చూసింది. "ఎంత జ్ఞానివైతే ఎందుకు? విచక్షణా జ్ఞానం లేని మూర్ఖుడిలాగ, ఆడ దానిలాగ, మాట్లాడావు. నేను రావణుణ్ణే అంగీకరించిన దానినైతే, సుఖ భోగాలలో తేలుతూ అంతఃపురాలలో ఉండక, నీ ధ్యాసలో మునిగి నిరాలంకారంగా అశోకవనంలో పడి దుఃఖిస్తానా? ఆ మాత్రం సత్యం గ్రహించలేకపోయావు!

చిన్నతనం నించీ నీ తోనే జీవించాను. నీ కష్ట సుఖాలు పంచుకున్నాను. నీ పాదసేవ చేసుకుంటూ బ్రతి

కాను. నువ్వే నా సర్వస్వం అనుకున్నాను. నా సౌశీల్యం గ్రహించలేక ఇంత అపనిందపాలు జేశావు .... ఛీ! ఇక నా జీవితం ఎందుకు? కాల్చనా? ఇంత కాలం నే నాచరించిన ధర్మాలూ, సద్గుణాలూ, నా పాతివ్రత్యమూ అన్నీ వ్యర్థమైపోయాయి. భర్త తిరస్కరించిన స్త్రీకి మృత్యువు తప్ప మార్గమేముంది? ....” అని చెంపలు చెరువులవుతూ లక్ష్మణుణ్ణి చూసింది – “ఈ దుర్భర జీవితం అంతం చేసుకుంటాను నాయనా! నా కోసం చితి పేర్పించు! ఇంత అపనిందతో, ఈ కళంకంతో, ఒక్క క్షణమైనా జీవించలేను. ఆలశ్యం చెయ్యకుండా చితి సిద్ధం చేయించు నాయనా!” అని జల జల కన్నీళ్ళు రాలుస్తూ తల వొంచుకుంది.[434]

---

**434. యుద్ధ, సర్గ 118, శ్లోకం అంతా:** రాముడి దగ్గిరికి సీత వచ్చిన తర్వాత జరిగినదంతా ఈ సర్గలో చూడండి! రాముడి మాటలూ, సీత మాటలూ సంభాషణ రూపంలో జరగవు. ఈ కవి అనుసరించే విధానం ప్రకారమే, మొదట రాముడు పూర్తిగా మాట్లాడతాడు. తర్వాత సీత, తను చెప్పవలసిందంతా మాట్లాడుతుంది. ఆ అభిప్రాయాలే నేను సంభాషణ రూపంగా రాశాను.

రాముడి గురించి కవి ఏమంటున్నాడో చూడండి – “సిగ్గుచే నమ్రురాలై ప్రక్కలో నిలిచియుండు సీతని జూచి శ్రీరాముడు హృదయంలో కోపముగల వాడై (హృదయాంతర్గత క్రోధః) ఇట్లు చెప్పుట కుపక్రమించెను – “భద్రే! (మంగళకరమైనదానా!) యుద్ధములో శతృవుని జయించి నిన్ను స్వాధీనము జేసుకొంటిని. పౌరుషముచే చేయవలసిన కార్యము జేసితిని .... శతృవుచే నాకు కలిగిన అవమానమును, శతృవును, ఏక కాలములో నిర్మూలనము చేసితిని .... నేను, నీ కొరకుగాను, ఇంత శ్రమ పడలేదని అందరికినీ తెలియ వలయును. .... నీ సచ్చరిత్ర విషయమై, లోకమునకు సందేహాస్పదురాలవై, నీవు నా యెదుట, కంటి నొప్పి వానికి దీపము వలె, నాకు శతృవుగ నున్నావు .... పౌరుషము గల, ఉత్తమ వంశస్థుడైన పురుషుడెవ్వడు అన్యుని గృహములో నుండు స్త్రీని, మిక్కిలి కోరికతో, అనురాగముతో గూడిన మనసుతో అంగీకరించును? .... రావణుని తొడపై నుండి ఇప్పటికి బయటపడిన దానవు. రావణునిచే దుష్టమైన చూపులచే చూడబడిన దానవు. అటువంటి దానవగు నిన్ను, గొప్ప వంశములో జన్మించిన నేను, ఆ కులమునకు కీర్తి తేవలసిన వాడనైన నేను, మరల ఎట్లు స్వీకరింపగలను? .... మనోహరమగు రూపము గల నిన్ను తన స్వగృహములో నుండుట జూచి, రావణుడు బహుకాలము సహించి యుండడు గదా? .... నాకు నీయం దాసక్తి ఎంత మాత్రమును లేదు. నీకు దోచిన చోటికి బొమ్ము! అనుమతి ఇచ్చితిని. నే నీ మాట చక్కగా ఆలోచించియే చెప్పుచున్నాను. మంగళకరీ! నీతో నాకు పని లేదు.

త్వం = నీవు, లక్ష్మణేన = లక్ష్మణుని యందుగానీ, భరతేవా = భరతుని యందుగానీ, యధా సుఖం = ఎట్లు సుఖమో అట్లు, కురు = చేయుము, సుగ్రీవేవా = సుగ్రీవుని యందుగానీ, విభీషణే = విభీషణుని యందుగానీ, ఆత్మనః = నీకు, సుఖః = సుఖము, యదాః = ఎట్లో అట్లు, మనః = మనస్సు, నివేశయ = ఉంచుము.”

పర పురుషుడి గృహంలో ఉండివొచ్చిన భార్యని రాముడు స్వీకరిస్తే రఘు వంశం అపకీర్తి పాలై పోతుంది. లక్ష్మణుడూ, భరతుడూ కూడా రఘు వంశం వారే కదా? వారు, అపవిత్రురాలైన వొదిన గార్ని తమ దగ్గిర పెట్టుకుంటే, వంశం చెడిపోదా? చెడిపోయిన భార్యని వెళ్ళగొట్టడమే ధర్మమైతే, చెడిపోయిన వదినని కూడా వెళ్ళగొట్టాలి కదా? భార్యల్నే వెళ్ళగొట్టాలి గావున్ను!

రాముడు, తన భార్యని వొప్పుకోడుగానీ, లక్ష్మణుడి భార్యో, భరతుడి భార్యో చెడిపోతే, వారిని తన దగ్గిర పెట్టుకుంటాడన్న మాట!

| | |
|---|---|
| రాముడి భార్య చెడిపోతే, భరతుడి దగ్గిర! | లక్ష్మణుడి భార్య .... రాముడి దగ్గిర! |
| భరతుడి భార్య చెడిపోతే, రాముడి దగ్గిర! | రాముడి భార్య .... లక్ష్మణుడి దగ్గిర! |

ఇలా అయితే గొప్ప కీర్తి! అపకీర్తి లేదు! రఘు వంశంలో పుట్టిన వాళ్ళకి, పిచ్చి పిచ్చి వాగుడే గానీ, ఒక్క ముక్కన్నా తిన్నగా మాట్లాడ్డం రాదు!

“ఇటుల రాముడు పలుకుచుండగా జింక కన్నులవంటి కన్నులు గల సీత కంటతడి పెట్టుకొనెను.” (ఆ కన్నుల అందం అంతా ఏడవడానికే!)

“సీతను జూచుచుండు రామునకు, అగ్నిలో ఆజ్యము పోసినటుల మరియు కోపము హెచ్చెను.” (సీత ఏడుస్తోంటే, రాముడికి కోపం ఎక్కువై పోయిందట!)

**ఇక సీత మాటలు** – సర్గ 119, శ్లోకం 19 వరకూ: “బాణము ములుకుల వంటి, భర్త పలికిన పలుకులచే దేహము కృంగిపోగా సీత విలపించెను .... కన్నీరు నిండిన మొహమును దుడుచుకొనుచు భర్తను జూచి .... ఇటులనెను.”

“వీరుడా! నీవు చెప్పుటకు, నేను వినుటకు దగని, కఠినమైన మాటలను, మూర్ఖుడు మూర్ఖురాలికి జెప్పినట్లు ఎందుకు చెప్పుచున్నావు? నీవు తలచినటుల నేను ఉండలేదు. ఒట్టు పెట్టుచున్నాను. నన్ను నమ్మవలయును .... సామాన్యమైన స్త్రీలను చూచి, స్త్రీ జాతినంతయు సందేహించుచున్నావు .... నన్ను నా వశములో నుంచుకొను శక్తి లేని దాననై యుండినపుడు, ➔

సీత మాటలకు, 'సీతలో సీత' అదిరిపడింది! చచ్చిపోవడమా! .... చితిలో పడి! ఎంత భయం కరమో! .... "తొందరపడకు సీతా! ఈ చావు కన్నా .... ఇంకెక్కడైనా జీవించడం .... పుట్టింటికి వెళ్ళడం .... మంచిది సుమా!"

"ఛీ! ఎంత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నావు! .... పుట్టింటికి జేరి జీవితమంతా దుఃఖపడుతూ, సిగ్గు పడుతూ, గడపనా? భర్త కాదన్న స్త్రీకి .... ఇంతకన్నా .... ఏం మార్గం ఉంటుంది?"

"అయ్యో! ఇంత దారుణమైన మరణమా సీతా?"

"తప్పదు. నాకు మాత్రం ఇష్టమా? .... తప్పదు .... ఇంతే ఈ జన్మకి ...."

సీత తలెత్తి మళ్ళీ లక్ష్మణుణ్ణి చూసింది – "చితి తొందరగా ఏర్పాటు చెయ్యి నాయనా!" అని బొట బొట కన్నీళ్ళు కారుస్తూ పైట కొంగు మొహం నిండా కప్పు కుంది.

లక్ష్మణుడు ఖిన్నుడై అన్నగారి వేపు చూశాడు.

సీత చితిలో పడటం తనకు అంగీకారమే అన్నట్టు నిశ్చలంగా నించున్నాడు రాముడు.[435]

లక్ష్మణుడు దుఃఖపడుతూ కదిలి చితి పేర్చే ప్రయత్నాలు ప్రారంభించాడు.

"ఏమిటిది మూర్ఖుడా! ఏం చేస్తున్నావు? సీత మరణించడం నీకూ అంగీకారమేనా?" అని నిలదీసింది లోపలి కంఠం.

లక్ష్మణుడు కోపంగా, "నా కెందుకు అంగీకార మౌతుంది? సీతాదేవి సుఖంగా బతికివుంటే నా కన్నా సంతోషించే వారుండరు" అని కళ్ళు తుడుచుకున్నాడు.

"మరి ఏమిటీ ప్రయత్నం? ఊరికే ఏడ్చి ఏం ప్రయో

---

➔ నాకు పర పురుషుని స్పర్శ సోకినది. అది నా ఇష్టముచే జరిగిన కార్యము గాదు. అపరాధము భగవంతునిదేను.

యత్ = ఏది, మదాధీనం = నా ఆధీనమో, తత్ = అట్టి, మే = నా యొక్క, హృదయంతు = మనస్సు మాత్రము, త్వయి = నీయందు, వర్తతే = ఉండెను, అనీశ్వరా = అస్వతంత్రురాలనగు (నేను), పరాధీనేషు = పరుల యధీనములో నున్న, గాత్రేషు = అవయవముల విషయమై, కిం = ఏమి, కరిష్యామి = చేయగలను.

సీతని రావణుడు బలాత్కరించడమే నిజమైనా, సీత చెప్పవలసిన జవాబు ఇదే. 'నా శరీరం నా ఆధీనములో లేనప్పుడు, ఎవరే అత్యాచారం చేసినా నే నేమి చేయగలను? అందులో నా తప్పేముంది?' అని! సీత, తన మనసులో భర్తనే కోరుతోందిగానీ, పర పురుషుల్ని కోరడం లేదు. కానీ, ఈ సమాజంలో, ఒక స్త్రీకి పర పురుషుడితో సంబంధం, ఆమె ఇష్టంతో జరిగిందా, బలత్కారంతో జరిగిందా – అని చూడరు. కాబట్టి, సీత, 'నన్ను బలత్కారంగా ఎత్తుకుపోతే నే నేమి చేయగలను?' అని వాదించినా, ఆ తర్కానికి విలువ ఉండదు.

"లంకలో నుండిన నన్ను జూచుటకు వీరుడగు హనుమంతుని బంపితివి. అప్పుడే నన్నేల త్యజించలేదు? అపుడే నా ప్రాణము విడిచెడి దానను."

"నర శార్దూలుడా! కోపమును మాత్రమే అనుసరించుచున్న నీ చేత, అల్పుడైన మనుష్యుని చేత వలే, ఆడ తనమే ముందుంచబడినది. ('స్త్రీత్వమేవ పురస్కృతం')

ఒక వేపు – నరశార్దూలుడా, పురుష శ్రేష్ఠుడా – అనడం! ఇంకో వేపు, అల్పుడి లాగ, ఆడదానిలాగ, ప్రవర్తిస్తున్నావు – అనడం! సీత, రాముణ్ణి తిట్టడంలో ఘోరం లేదుగానీ, స్త్రీలని హీనపర్చడం చాలా ఘోరం! కవి, ఆడవాళ్ళని హీన పరిచే మాటలు ఆడవాళ్ళతోనే చెప్పిస్తూ వుంటాడు. "ధర్మజ్ఞుడా! నీవు నా సదాచారమును తెలిసికొనలేదు." – ఈ రకంగా, సీత తన శక్తికొద్దీ తనను నిర్దోషిగా చూపుకోవటానికి వాదించింది.

"నేను తప్పు చెయ్యలేదు. నన్ను నమ్ము! నా గుణగణాలు నీకు తెలియవా? మంచీ చెడ్డా తెలియకుండా మాట్లాడతావా? దయ లేదా? నన్ను స్వీకరించు!" అనే ధోరణితో దుఃఖపడుతూ, తనని నమ్మమనీ, కనికరించమనీ, తన తప్పు లేదనీ, భర్తని ప్రార్ధించే ధోరణిలోనే మాట్లాడింది. అంతేగానీ, సీత మాటల్ని పౌరుషంతో, ఆత్మాభిమానంతో, భర్త మీద తిరస్కారంతో మాట్లాడిన మాటలుగా అర్ధం చేసుకోకూడదు. అలా మాట్లాడడం ఆ పాత్ర స్వభావానికి సరిపడదు. తిరస్కారం చూపే మనిషి, అగ్ని పరీక్షకో మరణానికో సిద్ధపడదు.

భూస్వామ్య సమాజంలో స్త్రీలు, ఆత్మాభిమానంతో జీవించే పరిస్థితులు లేకపోవడం చేత, స్త్రీల స్వభావంలో ఆ లక్షణాలు ఏర్పడవు. రచనలలో కూడా ఆ లక్షణాలు కనపడవు. సీత రాముణ్ణి ప్రార్ధిస్తుందేగానీ, ఆత్మాభిమానం చూపదు. ఆ పాత్రకి అదే సహజం. ★

**435. యుద్ధ, సర్గ 119, శ్లోకాలు 21, 22:** సీత లక్ష్మణుడితో చితి పేర్చమని చెప్పిన తర్వాత లక్ష్మణుడు రాముడి మొహం చూశాడు. "అటు పిమ్మట, వీరుడగు లక్ష్మణుడు రాముని ఆకారముచే సూచింపబడిన అంగీకారమును గ్రహించి, అతని ఇష్టప్రకారము చితిని ఏర్పాటు చేసెను."

సీత చితిలో పడడం రాముడికి అంగీకారమే! ★

జనం? సీతని ఓదార్చి, చచ్చిపోవద్దని ప్రార్థించరాదా? నువ్వామెకు సేవ చేసుకుంటూ అండగా ఉంటానని చెప్పరాదా? చచ్చిపోతూ వుంటే చూస్తూ వూరుకుం టావా?"

"ప్రయోజనం లేదు. సీతాదేవి భర్తను విడిచి ఇత రుల రక్షణలో వుండడానికి అంగీకరించదు."

"అయితే నీ అన్నని వొప్పించడానికి నీకు చేతనైన ప్రయత్నాలు చెయ్యి! చితి ఏర్పాట్లు ఆపు! నీ అన్నకి ఎదురు తిరిగి వాదించు! 'రావణుడు సీతని ఎత్తుకు పోవడంలో సీత తప్పేమీ లేద'ని వాదించు! 'నువ్వు నీ భార్యని అంగీకరించకపోతే నీ ఉత్తమత్వం మీద నా గౌరవం పోతుంద'ని నీ అన్నతో చెప్పు! 'నీ మీద భక్తి శ్రద్ధలు పోయి, నీ సేవకత్వం మాని, నా దారిన నేను పోతాన'ని చెప్పు. ఆ మాత్రం ధైర్యం చెయ్యి. అన్యా యాన్ని ఎదిరించు!...."

"నీ మాటలు విన్నంతసేపూ అలాగే చెయ్యాలని ఉత్సాహపడతాను .... కానీ .... ఊహూ! .... చెయ్య లేను. అన్నగారి మాట ధిక్కరించేటంతటి వాడినా? భ్రాతృసేవే నా వ్రతం! నా లక్ష్యం! అన్నగారి ఆజ్ఞ ప్రకారం చేయడమే నా ధర్మం. సీతాదేవి చితిలో పడి మరణించినప్పటికీ నష్టమేమీ జరగదు. స్వర్గానికి పోయి సుఖంగానే ఉంటుంది."

"ఛీ! దుర్మార్గుడా! ఎంత కర్కశంగా మాట్లాడు తున్నావు! స్వర్గం లేదన్నావు .... దైవం లేదన్నావు .... ధర్మాధర్మాలే లేవన్నావు...."

"నా అవినయం కొద్దీ అప్పుడలా అన్నానేగానీ స్వర్గ నరకాలు లేకుండా .... ధర్మాధర్మాలు లేకుండా, ఎక్కడికి పోతాయి?"

"ఎంత ఆత్మ వంచన! నీ వంటి హీనుడికి మేధ ఎందుకు? జ్ఞానమెందుకు? .... ఇంతకాలం నిన్ను అంటిపెట్టుకుని ఉన్నందుకు సిగ్గుపడుతున్నాను. తొంద రగా చితి పేర్చు! నీ ఆత్మని కూడా అందులో తగలబెట్టు! ఛీ! మూర్ఖుడా!"

లక్ష్మణుడు కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ సీత దగ్గిరికి వచ్చాడు. "అమ్మా! నీ కోరిక ప్రకారం చితి సిద్ధం చేశాను" అని తల వొంచుకున్నాడు.

"నేను సిద్ధంగానే ఉన్నాను నాయనా! ఇక అగ్నిహోత్రుడే నన్ను కడుపులో దాచుకోవాలి" అంటూ సీత, దుఃఖం ఆపుకోలేక, కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూ, భర్తకు ప్రదక్షిణలు చేసి, చితి వేపు నడి చింది[436]

పెద్దలందరూ రాముడి చుట్టూ జేరి తలో మాటా చెపుతున్నారు. అందరూ ఒకటే మాట – సీత నిర్దోషి అని! మహా పతివ్రత అని!

---

**436.** యుద్ధ; సర్గ 119, శ్లోకాలు 22 నించీ చివరివరకూ: + సర్గలు 120, 121 పూర్తిగా:

సీత చితిని సమీపించి, "నా మనసు రాముని విడిచి ఎన్నడూ అన్యథా పోకపోవుట నిజమైనటులైతే అగ్ని నన్ను రక్షించుగాక!" అని అగ్నిలో దూకింది.

ప్రజలందరూ దుఃఖించారు. అపుడు కుబేరుడు, రుద్రుడు, యముడు, ఇంద్రుడు, బ్రహ్మ విమానాల మీద వారి లోకాల నించి రాముడి దగ్గిరికి వచ్చేశారు. (అప్పటికే సీత చితిలో పడిపోయింది. ఇప్పుడొచ్చి ఏం చేస్తారో!)

వారందరూ చేతులు తిప్పుతూ రాముడితో, "నీవే లోకములో సర్వస్వమునకు కర్తవు. జ్ఞాన శ్రేష్ఠుడవు. అట్టి నీవు సీత అగ్నిలో పడుచుండగా ఎందుకు ఉపేక్షించుచున్నావు?" అన్నారు. (మీరందరూ ఎందుకు ఉపేక్షించిరి ఇప్పటి దాకా?)

రాముడు వాళ్ళు అడిగిన దానికి చెప్పకుండా, "నేను రాముడను. దశరథ పుత్రుడను. నన్ను నేను మనుజునిగా తెలుసుకొనుచున్నాను (నే నింకా మనుషుణ్ణనే అనుకుంటున్నాను. కాదన్నమాట!) నే నెవడను? ఎవని వాడను? ఏ ప్రయోజనమునకై వచ్చిన వాడను? (ఇంకేం ప్రయోజనం? లోకాల్ని ఉద్ధరించాలి కదా?) ఈ సంగతులన్నియు నాకు బ్రహ్మ చెప్పవలయును" అని అడిగాడు.

బ్రహ్మ ప్రారంభించాడు (అమ్మో! అవతల సీత అగ్నిలో ఉంది! ఇప్పుడు ఎంత చెపుతాడో!)

"రామా! నీవు నారాయణుడవు .... లోకములను సృష్టించి, పాలించి, లయింపజేసే క్రీడాకారుడవు. ఒక కొమ్ము గల వరాహావతార మెత్తిన వాడవు. (పందికి కొమ్ములు!) పూర్వం శత్రువులందరినీ జయించిన వాడవు. ఇక ముందు కూడా జయించే వాడవు. నీవే బ్రహ్మవు, విష్వక్సేనుడవు. (విశ్వమంతటా సేనలు గల వాడవు.) .... పురుషుడవు, పురుషోత్తముడవు, ఖడ్గధారివి, ధనుర్ధారివి .... చక్రధారివి .... (దేవుడికి కూడా ఆయుధాలు! శత్రువులు! సేనలు! మానవుడి అవసరాల్ని చూసిదేవుడికి కూడా అవే అవసరాలు ఉంటాయని భావించడం!) నీవు నాశనము లేని వాడవు .... చతుర్భుజుడవు .... ఉపేంద్రుడవు (ఇంద్రుడి తమ్ముడట! తమ్ముడయితే ఏం గొప్ప?) మహేంద్రుడవు. (ఇంద్రుడికి అన్న గాబోలు! లాభం లేదు. ఇంద్రుడు కానప్పుడు, తమ్ముడయితే ఏమిటి, అన్న అయితే ఏమిటి?) .... పద్మనాభుడవు .... జగన్నాధుడవు.... పూర్వము ప్రజాపతులలో ఒకడవు. (ఒక్కడేనా? ప్రజాపతులందరూ రాముడే అవ్వాలిగానీ! అయితే ఆ మిగిలిన ప్రజాపతులు కూడా రాముడంతటి వాళ్ళే కదా? అయితే, రాముళ్ళు ఇంకా ఉన్నారు!) నీవు రుద్రులలో ఎనిమిదవ వాడివి! (అయ్యో! ఏడు →

➔గురి తర్వాతా? ఏం గొప్పా?) నీవు ముల్లోకాలూ సృష్టించిన ఆది కర్తవు. స్వయం ప్రభుడవు. వేదాత్ముడవు. ఓంకారుడవు …. కొండలలో, నదులలో, అరణ్యములలో, సర్వ జగత్తులో, విశేషించి బ్రాహ్మల యందు …. గోవుల యందు …. కనబడుచున్నావు. సర్వప్రాణులతో నిండిన భూమిని నీవే మోయుచున్నావు. పృథ్వికి వినాశ కాలము సంభవించునపుడు, నీవు జలములో శేషతల్ప శాయివై, ముల్లోకములను నీలో ధరించి కనబడుచున్నావు, (పృథ్వి ఎన్నిసార్లు నాశనమైపోయింది ఇప్పటికి? పృథ్వి నాశనమైనప్పుడు 'జలం' మిగిలిందట! పృథ్వి లేనప్పుడు జలం ఎక్కడ వుంటుంది?) శిరస్సులతో, నాల్కలతో, కన్నులతో, పాదములతో ఉన్న జగత్తువు నీవే. జగత్తును మోయువాడవు నీవే. సీత లక్ష్మి. నీవు విష్ణుప్రభుడవు. కృష్ణావతార మెత్తబోవు వాడవు నీవే! (రామావతారం అయింది. ఇక, కృష్ణావతారం! ఇక ఆయనెట్టా వుంటాడో!)

రామా! నేను (బ్రహ్మ) నీ హృదయాన్ని! నా భార్య సరస్వతి నీ నాలుక. (నీ భార్య, రాముడి నోట్లో ఉంటే నీకు కోపం రాదూ బ్రహ్మా?) దేవతలందరూ నీ శరీరం మీద వెంట్రుకలు. అశ్వనీ దేవతలు నీ చెవులు. సూర్య చంద్రులు నీ నేత్రాలు. నీ చూపు పగలు. నీ కళ్ళ మూతే, రాత్రి – (దేవుడు కన్ను మూసినప్పుడు రాత్రి అవుతుందనీ, కళ్ళు తెరిచి వున్నంతసేపూ పగలుగా వుంటుందనీ …. ప్రకృతి జ్ఞానం ఎరగని మానవుడి ఊహ.) నీ నిట్టూర్పులే వేదాలు. జగత్తంతా నీ దేహం. నీ కాఠిన్యమే భూమి. నీ కోపం అగ్ని. నీ ప్రసన్నతే చంద్రుడు ….”

బ్రహ్మ ఈ రకంగా కీర్తిస్తూ, మధ్యలో ఒకచోట, “నువ్వు ఇలాంటి వాడివని (ఇప్పుడు చెప్పిన లక్షణాలన్నీ గల వాడివని) రుషులు చెపుతారు” అంటాడు. (ఇవన్నీ ఎవరో చెప్పినవే గానీ, బ్రహ్మకు తెలిసినవి కావు!)

ఇంకోచోట: “నీ పుట్టుకను, నాశనమును, ఎవ్వరును ఎరుగరు. నీవు ఎవ్వడవో ఎవరికిని తెలియదు” అంటాడు.

'దేవుడంటే ఏమిటో, ఎలా పుట్టాడో, ఎలా సృష్టి చేస్తాడో, ఆ విషయాలు ఎవ్వరికీ తెలియవు' అని చెప్తున్నాడు బ్రహ్మ. తెలియకపోయినా, దేవుడు వున్నాడనీ మనల్ని రక్షిస్తాడనీ, మనం దేవుణ్ణి శరణు కోరుకోవాలనీ, రుషులు చెప్పారని చెపుతున్నాడు. ఆ దేవుడి సంగతి బ్రహ్మకి కూడా తెలిసిన విషయం కాదు. అందరూ దేవుణ్ణి గురించి అలా ఊహిస్తున్నారు. 'పెద్దలు చెప్పారు కదా' అని నమ్ముతున్నారు.

మళ్ళీ బ్రహ్మ మాటలు: “రామా! రావణ వధ కోసమే నీవు మనుష్య రూపంలో భూమి మీద జన్మించావు. ఆ కార్యం ముగిసింది. ఇక వైకుంఠానికి రా. (ఏవిటీ! రాజ్యం చెయ్యకుండానే! – చితిలో పడ్డ సీత ఏమైపోయిందో! ఈ పాటికి వైకుంఠానికి చేరే వుంటుంది, రాముడి కన్నా ముందే!) – నీ దర్శనము …. నీ స్తోత్రము …. వ్యర్థము కావు …. నిన్ను గూర్చి పురాతన ఇతిహాస రూపమగు స్తోత్రము చేయువారికి (పాత పాత పాత అజ్ఞానపు పాట పాడే వారికి), నష్టము లేదు. అపజయము లేదు. నీ భక్తులు ఈ లోకమునందే గాక పర లోకమునందు కూడా భోగాలు పొందుతారు.” – (ఏ లోకంలో అయినా అసలు కావలసినవి భోగాలండీ! ఈ లోకంలో, భోగాలదాకా ఎందుకు, మింగ మెతుకు లేని భక్తులు కోట్ల మంది ఉన్నారు. అలాంటి వాళ్ళని మభ్యపెట్టడానికే, 'దేవుణ్ణి ప్రార్థిస్తే, పరలోకంలో భోగాలు పొందుతారు' అనే ఈ వర్ణనలన్నీ!)

బ్రహ్మ మాటలన్నీ అయ్యాక అగ్నిహోత్రుడు సీతని తొడ మీద కూర్చోబెట్టుకుని చితిలోంచి పైకి లేచాడు. (రావణుడి తొడ మీద కూర్చోడం మాత్రమే తప్పన్న మాట! పతివ్రతలు దేవతల తొడల మీద కూర్చోవచ్చన్న మాట! వాళ్ళు పర పురుషులు అవరా?)

సీత …. ఎర్రని వస్త్రంతో, బంగారు నగలతో, నల్లని ఉంగ్రాల జుట్టుతో యౌవనవతిగా, పూల మాలలతో ఉంది.

అగ్నిహోత్రుడు రాముడితో, “రామా! ఈమె నీ సీత. ఈమెలో పాపము లేదు. ఈమె నిన్ను మనసులోనైనా అతిక్రమించలేదు. …. నిన్నే ధ్యానిస్తూ, నిన్నే దిక్కుగా నమ్మి రావణుణ్ణి తిరస్కరించింది. ఈ నిర్దోషిని స్వీకరించమని నిన్ను నేను ఆజ్ఞాపిస్తున్నాను. ఇంకేమీ మాట్లాడవద్దు!” అని చెప్పాడు.

అగ్ని మాటలు విని రాముడు కొంచెం ఆలోచించి ఇలా అన్నాడు – “రావణుడి దగ్గిర వున్న సీతని నేను స్వీకరిస్తే, లోకం నన్ను ఏమీ ఎరగని మూర్ఖుడిననీ, కాముకుడిననీ అంటుంది కదా? ముల్లోకాలకూ విశ్వాసం కలిగించడానికే సీత చితిలో ఉరుకుతోన్నా నేను చూసి ఊరుకున్నాను. అగ్ని శిఖ వంటి సీత రావణుడిని మనసులోనైనా తలచలేదు. సీత రావణాంతః పురము నందలి ఐశ్వర్యమును కోరదు. నేను సీతనెందుకు విడుస్తాను? లోకపూజ్యులైన మీరు స్నేహంతో చెప్పిన మాట పాటిస్తాను” అని రాముడు సీతని స్వీకరించాడు.

సీత పవిత్రురాలని తనకు తెలుసు – అంటున్నాడు కదా రాముడు? అయితే సీతతో మాట్లాడేటప్పుడు రాముడికి “హృదయాంతర్గత క్రోధం” ఎందుకు? మనసులో 'ప్రేమే' ఉండాలి కదా? సీత ఏడుస్తోంటే, 'నిర్దోషిని పట్టుకుని తిడుతున్నానే' అని రాముడి మనసు విలవిల్లాడి పోవాలి కదా? సీత మాటలకు “అగ్నిలో ఆజ్యం పోసినట్టు” రాముడికి కోపం మరీ ఎక్కువ అయిపోవడం ఎందుకు?

పర పురుషుడి దగ్గిర ఉండి వచ్చిన భార్య మీద పురుషుడికి మితిమీరిన కోపం ఉండడం నిజమే కాబట్టి, మొదట ఆ కోపాన్నే చెప్పాడు కవి. మళ్ళీ రాముణ్ణి మంచివాణ్ణి చెయ్యటానికి తర్వాత ఈ రకంగా మారింది తర్కం. ➔

రాముడు తల వంచి గంభీరంగా వింటున్నాడు.

"రామా! సీత మహా శీలవతి సుమా! నువ్వు లేని సమయంలో ఆ దుర్మార్గుడు అంత సాహసం చేశాడు. ఆమె అబల కనుక ఆ దుష్టుణ్ణి నిగ్రహించ లేకపోయింది. అందులో ఆమె దోషం ఏమీ లేదు. రావణుడు నీ భార్యని తన ఆధీనంలో బంధించాడే గానీ ఏమీ సాధించలేక పోయాడు. ఎన్ని విధాల ఆశలు జూపినా నీ ధర్మపత్ని ప్రలోభపడలేదు. తన పంచప్రాణాలూ నీ మీదే పెట్టుకుని నీ రాక కోసమే ఎదురుచూస్తూ వుంది ...."

రాముడు మౌనం వహించి ఆలోచనల్లో మునిగాడు.

రావణుడు సీతని వశపర్చుకోలేక పోయాడని హనుమంతుడూ, విభీషణుడూ చెప్పే మాటలు అందరూ విశ్వసిస్తున్నారు. తను కూడా విశ్వసించడమే న్యాయమేమో! .... సీత రావణుడి ఇష్ట ప్రకారమే నడిచి వుంటే, దుఃఖపడుతూ ఎందుకు గడుపుతుంది?

సీత దోషి కాదని నలుగురూ అంగీకరించడం చూస్తే, రాముడి మనసులో లోక భీతి తగ్గు ముఖం పట్టింది. అంచెలంచెలుగా తను పెంచుకున్న అసహ్యం కూడా వెనకడుగులు ప్రారంభించింది.

ఏ నాడో వివాహమైన క్షణం నించీ .... ఆమె సేవ ... సౌశీల్యం .... పతి భక్తి .... తనతో వనవాసం .... దుఃఖం .... అవన్నీ భరించింది!

"రామా! మా మాట విను నాయనా! సీతాదేవిని నువ్వింకా సందేహించవలసిన అవసరం లేదు. ఆ తల్లి, చావుకి సిద్ధమై తన నిర్మలత్వం రుజువు చేసుకుంది. స్త్రీ, దుష్టురాలైతే, భర్త తిరస్కారం భరించలేక చావుకి సిద్ధ పడుతుందా? నువ్వే ఆలోచించు! మహా జ్ఞానివి. ప్రాజ్ఞుడివి. శాస్త్రాలన్నీ చదివిన వాడివి. ధర్మాధర్మాలు తెలిసిన వాడివి. నీకు ఇతరులు చెప్పవలసిందేముంది? రఘు వంశంలో పుట్టిన వాడివి కాబట్టే ఇంత పట్టుదల చూపించావు. భార్యని వొదులుకోడానికైనా సిద్ధపడ్డావుగానీ, నీ వంశ ప్రతిష్ట పోగొట్టుకోవడానికి అంగీకరించలేదు. ఇంకో పురుషుడైతే ఇంత పౌరుషం ప్రదర్శించేవాడా? .... నువ్వు కూడా నీ పట్టు విడిచి పెట్టాలి సుమా! సీతలో దోషం లేదు ...."

రాముడి మొహం చిరునవ్వులతో వికసించడం మొదలు పెట్టింది నెమ్మది .... నెమ్మదిగా! మనస్సు విజయ గర్వంతో ఉత్తేజ పడుతోంది.

"సీత పవిత్రురాలు కాదు, స్వీకరించకు" అనే వారెవ్వరూ లేరు. ఇంకా తనకు అభ్యంతరం ఎందుకు?

రాముడు పెద్దలందరికీ నమస్కరించాడు – "నేను ఎంత గొప్పవాడినైనా లోకానికి వెరవ వలసిందే కదా? .... లోక హితం కాని పని నేను చెయ్యగలనా?" అని వినయంగా చెప్పుకున్నాడు.

"రామా! ఎంత ఉత్తముడి వోయీ! నువ్వు నీ ధర్మ పత్నిని స్వీకరించడం లోక హితమే. నువ్వు నీ భార్యతో సుఖంగా జీవిస్తే లోకం సంతోషిస్తుందే గానీ తప్పు పట్టదు."

"నా ధర్మ పత్ని ఉత్తమురాలని నా కెప్పుడూ తెలుసు. రావణుడి సిరి సంపదలు చూసి ఆశపడదని నాకు నమ్మ

➔రాముడికి సీత మీద అసహ్యమూ ఉంది, లోక భయమూ ఉంది. ఈ రెండూ ఒకటే. ఇవి వేరు వేరు కావు. సాధారణంగా, లోకం (ఎక్కువ మంది జనం) దేన్ని తప్పుగా భావిస్తుందో, ఒక మనిషి మనసు కూడా దాన్నే తప్పుగా భావిస్తుంది. స్త్రీకి, భర్తగాని పర పురుషుడితో శరీర సంబంధం ఉండకూడదు – అనేది, లోక ధర్మం. అంటే, సమాజంలో ఉన్న మనుషులందరూ నమ్మే ధర్మం. ఈ భర్త కూడా సమాజంలో వ్యక్తే కాబట్టి, అతను కూడా ఆ ధర్మాన్నే అంగీకరిస్తాడు. దాని ప్రకారమే ఇష్టాయిష్టాలు ఏర్పర్చుకుంటాడు.

రాముడికి 'లోక భీతి' ఎందుకు కలిగింది? లోకంలో, పర పురుషుడితో సంబంధం గల స్త్రీని భర్త అంగీకరించే ధర్మం లేదు కాబట్టి.

రాముణ్ణి ఉత్తముడిగా చెప్పాలనే అభిప్రాయమే కవికి ఉంటే, రాముడికి, సీత మీద హృదయాంతర్గత కోపం ఉందని చెప్పకూడదు. సీతని చూడగానే రాముడు దుఖ్ఖపడుతూ, ఆప్యాయంగా, "సీతా! రావణుడు నిన్ను ఎత్తుకు పోవడంలో నీ తప్పేమీ లేదని నాకు తెలుసు. నువ్వు అతన్ని ఇష్టపడలేదని నేను నమ్ముతాను. నిన్ను స్వీకరించడానికి నాకు అభ్యంతరం లేదు. కానీ, పర పురుషుడి ఇంట ఉన్న స్త్రీని భర్త స్వీకరిస్తే ధర్మ శాస్త్రాలు తప్పు పడతాయి. ఆ శాస్త్రాల ధర్మాన్ని నేను పాటిస్తాను. అందుచేత నిన్ను స్వీకరించలేను" అని చెప్పాలి. నిజానికి, న్యాయం కాని ధర్మాల్ని పాటిస్తాననడం కూడా తప్పే. కానీ, రాముణ్ణి ఉత్తముణ్ణి చెయ్యదల్చుకుంటే, అంతకన్నా మార్గం లేదు. కానీ, మొదట 'హృదయాంతర్గత కోపం' అని చెప్పి, తర్వాత 'అబ్బే, రాముడికి సీత మీద సందేహమే లేదు' అని మాట మారిస్తే, అది సరిపోదు.

సీత అగ్ని ప్రవేశ ఘట్టాన్ని వాస్తవ దృష్టితో అర్థం చేసుకోవాలంటే – సీత ఆత్మహత్యకు సిద్ధమైందనీ (చితిలో పడి ఆత్మహత్యలు చేసుకోవడం రామాయణంలో చాలా చోట్ల కనపడుతుంది. అనేకమంది రుషులు చితుల్లో పడ్డారు. శబరి చితిలో పడింది), అక్కడి పెద్దలందరూ రాముడికి నచ్చ చెప్పారనీ, అర్థం చేసుకోవాలి. భార్యా భర్తల తగువుల్ని, పదిమంది పెద్దలు చేరి చక్కదిద్దడం సమాజంలో జరిగేదే. ఆ రకంగానే పెద్దలంతా రాముడితో మాట్లాడి, రాముడు సీతని అంగీకరించే టట్టు చేశారన్నమాట. వాల్మీకి కథలో అగ్నిహోత్రుడు దేవుడైతే, 'విషవృక్షం' కథలో ఆయన ఆ పేరు గల ఒక పెద్ద మనిషి. ★

కమే. ఈమెని గురించి ఏ పురుషుడైనా దుష్టంగా మనసులో తలచినా సర్వ నాశనమై పోతాడు. అటువంటి అగ్నిశిఖ నా భార్య. నాకు తెలుసు. కానీ, లోకం ఏమం టుందోనని జంకాను. నేను తొందరపడి సీతని స్వీకరిస్తే ఎంత గొప్ప వంశంలో పుట్టి, ఎంత హీనమైన పని చేశాడో – అంటుంది కదా లోకం? చెడిపోయిన భార్యని తెచ్చుకున్నాడంటుంది. మూర్ఖుడంటుంది. కాముకుడం టుంది. అందుకే జంకి, భార్యని విడిచి పెట్టడానికే సిద్ధపడ్డాను. సీత నిర్దోషురాలని మీ వంటి పెద్దలందరూ అంగీకరించిన తర్వాత మీ మాట నా ధర్మంగా పాటించ కుండా ఉంటానా? తప్పకుండా పాటిస్తాను. నా భార్యని స్వీకరిస్తాను" అని సీత వేపు క్రీకంట చూశాడు.

సీత, రాముడి మాటలన్నీ విస్మయంగా వింటోంది. ఆనందంతో నిర్ఘాంత పడుతోంది. తన సౌశీల్యం తన భర్త గ్రహించలేదనుకుందిగానీ .... ఆ ధర్మాత్ముడు అంతా గ్రహించాడు .... తన పాతివ్రత్యం తన భర్తకు తెలియనిది కాదు .... అయితే, లోకానికి వెరిచాడు .... ఎంత ధర్మాత్ముడైనా లోకానికి జంకవలసిందే కదా? నలుగురు పెద్దలూ చేరి మంచి చెడ్డలు ఆలోచించే వరకూ తన భర్త నిగ్రహంతో ఉండడం చక్కగానే వుంది! భర్త తిరస్కరించాడనే దుఃఖంతో చావుకి కూడా సిద్ధపడ్డ తన ఆత్మత్యాగం, అందరూ చూశారు!

తన భర్త నిగ్రహం, తన సౌశీల్యం, రెండూ లోకానికి విదితమైనాయి. ఆ పుణ్యాత్ముడు .... కఠినాత్ముడనీ నిర్ద యుడనీ .... తను ఎంతగానో ఆక్రోశించిందిగానీ, ఆయన ప్రవర్తనే ఉత్తమంగా వుంది .... నలుగురూ తన నిర్దోషిత్వాన్ని వేనోళ్ళ పొగిడారు. తన భర్త పౌరుషాన్ని మెచ్చారు. ఇరు వంశాలకూ ఎంత కీర్తి ఇది! లంకలో, కిష్కింధలో, అయోధ్యలో, .... ఎన్నెన్నో దేశాలలో .... తన పాతివ్రత్యం గురించి .... ఘనంగా చెప్పుకోరా? .... తనను చూసిన వెంటనే భర్త తనని స్వీకరించడానికి అంగీకరిస్తే .... ఇరువురికీ .... ఇంత కీర్తి దక్కేవేనా? .... ఆయన ఎప్పుడూ ధర్మాత్ముడే!

"సీతా! భర్త ధర్మం తలుచుకుని అంత పొంగి పోతున్నా వేమిటి? నలుగురూ అవునన్నారు కాబట్టి సరి పోయింది. కాదంటే ఏమయ్యేది? నిన్ను తెచ్చుకోకూడ దని పెద్దవాళ్ళు అంటే, ఊరుకునే వాడేగా? తను లోకా నికే జంకినట్టు, తప్పంతా లోకం మీదకి గెంటుతున్నాడు గానీ .... తనకు కూడా నీ మీద సందేహం లేదను కుంటున్నావా?"

సీత తలవాల్చి ఎవరినో వింటోంది.

"లేదు. నా భర్తకి ఎన్నడూ నా మీద సందేహం లేదు."

"మరి నీతో ఆ మాటే చెప్పకూడదా? 'నీ మీద నాకు సందేహం లేదు, లోకానికే జంకుతున్నాను' అన కూడదా?"

"ఏవిటా మాటలు? ఆయన ఏం చెప్పాలో, ఏం చెయ్యాలో అన్నీ ఆయనకు తెలుసు ...."

"కోపపడకు .... నిన్ను స్వీకరిస్తానంటున్నాడు. అంగీకరిస్తావా?"

"అయ్యో! అంతకంటేనా? అంగీకరించనా? ఆ పుణ్యం కోసమే కదా వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటు న్నాను? ఎందుకలా అడుగుతున్నావు?"

"నీకు నిజంగా సంతోషంగా ఉందా? ఇష్టంగా ఉందా? నాతో నిజం చెప్పు!"

".... ఇష్టమా? .... ఏమో! .... ఎందుకు లేదూ? ఆయన నా భర్త! నా నాథుడు! నా సర్వస్వం ఆయనే!"

"ఆయనేలే! కానీ ఆయన మొహం చూడాలంటే నీకు బాధగా లేదూ? ఎన్ని మాటలన్నాడు! .... ఎంత కఠినంగా .... ఎంత అవమానంగా ... ఎవరెవరి దగ్గిరికో పొమ్మన్నాడు! అప్పుడే మరిచిపోయావా?"

"మ .... రి .... చి పోలేదు. కానీ, భర్త అయిన వాడు .... దండించినా .... దయదల్చినా .... స్త్రీకి సర్వ స్వమూ భర్తే కదా?"

"అవును .... భర్తే! .... భ .... ర్తే! కానీ ...."

"ఇంకా కానీ ఏమిటి? నన్నిక బాధపెట్టకు! సంతోషంగానే ఉంది నాకు."

ఆలోచనల్లో మునిగివున్న సీత దగ్గిరికి అగ్ని హోత్రుడు వచ్చి తల నిమురుతూ, "అమ్మా! నీ భర్త, నిన్ను దయతో స్వీకరిస్తానంటున్నాడు. రా తల్లీ!" అని ఆప్యాయంగా సీత చెయ్యి పట్టుకుని తన వెంట నడి పించుకుని తీసుకు వెళ్ళాడు.

సీత సిగ్గుపడుతూ తలవంచుకుని రాముడి ముందు నిలబడింది.

అగ్నిహోత్రుడు సీత చెయ్యి రాముడి చేతిలో పెట్టి, "మీ దంపతులిద్దరూ కలకాలం సుఖంగా ఉండండి! అమ్మా, సీతా! భర్తే దైవం నీకు. నీ మనసంతా ఎప్పుడూ భర్త సేవ మీదే లగ్నం చేసుకుని జీవించు! రామా! నువ్వు నీ ధర్మపత్నిని కరుణతో ఏలుకో! ఇద్దరూ సుఖంగా బతకండి!" అని ఇద్దర్నీ ఆశీర్వదించాడు.

"సీత .... భర్త దగ్గిరికే వెళ్ళింది చూశావా?"

"వెళ్ళకేం చేస్తుందిలే పాపం."

"మన ఆడవాళ్ళయితే ఈ పాటికి మొగుణ్ణి దుమ్మెత్తి పోసేసి పుట్టింటికి పోరూ? వీళ్ళకి సిగ్గులుండవను కుంటా! నాగరీకం మనుషులు!" ★

# లింకు-10

# 14వ కథ తర్వాత 15వ కథ వరకూ

[**14**వ కథ – సీతని రాముడు స్వీకరించడంతో ముగిసింది. **15**వ కథ – రాముడు లంక నించి బయల్దేరటంతో ప్రారంభమవుతుంది. ఆ రెండు కథలకూ మధ్య భాగం ఇది.]

రాముడు సీతని స్వీకరించిన తర్వాత రుద్రుడు విమానంలో వచ్చాడు. ఆ విమానంలో దశ రథుడు కూడా ఉన్నాడు.

రుద్రుడు రాముడితో ఇలా అన్నాడు. "రామా! మా అదృష్టం వల్లనే నువ్వు రావణ వధ పూర్తి చేశావు. సమస్త లోకాలకూ భయం పోగొట్టావు. ఇక అయోధ్యకు వెళ్ళు! (వనవాసం ఇప్పటికి పూర్తి అయింది! అసలు ఈ వన వాసం, కిష్కింధనీ, లంకనీ సామంత రాజ్యాలుగా ఆక్ర మించడానికే అన్న మాట! ఆ పని ముగిసేసరికి వన వాసం కూడా ముగిసింది!) నీ కోసం దుఃఖిస్తూ ఉన్న భరతుణ్ణి ఓదార్చి, (శతృఘ్నుడి మాట లేదు) నీ తల్లు లందర్నీ చూసి, పట్టాభిషేకం చేసుకుని, స్నేహితులంద రికీ ఆనందం కలిగించి, ఇక్ష్వాకు వంశ వృద్ధికై సంతా నాన్ని కని, అశ్వ మేధ యోగం చేసి, కీర్తి ప్రతిష్టలు సంపాదించి, బ్రాహ్మణులందరికీ ధనమిచ్చి, (బ్రాహ్మ ణేభ్యః = బ్రాహ్మణుల కొరకు; ధనం = ధనము! దత్వా = ఇచ్చి) స్వర్గానికి వెళ్ళు!

ఈ విమానంలో వున్న రాజుని చూడు! ఇతడు నీ తండ్రి దశరథుడే! (ఇంతసేపూ మాట్లాడడేం, ఆ పెద్ద మనిషీ?) నువ్వు, నీ తండ్రి సత్యవ్రతాన్ని కాపాడడం వల్లనే నీ తండ్రి స్వర్గానికి వెళ్ళాడు. (ఈయన స్వర్గంలో కూడా రాజేనా? అక్కడికి వెళ్ళాక కొడుకులు కూడా పోల్చలేనంతగా మారిపోయాడా?) నువ్వూ, నీ తమ్ముడూ, నీ తండ్రికి నమస్కారాలు చెయ్యండి!" అని చెప్పాడు.

దశరథుడు పట్టువస్త్రాలతో, విమానం మీద, కాంతితో వెలిగిపోతున్నాడు. (విమానంలో వుండే అద్దాల కాంతే అతని మొహం మీద పడి వుంటుంది.)

రాముడూ, లక్ష్మణుడూ, తండ్రికి నమస్కారాలు చేశారు.

దశరథుడు 'ప్రాణము కంటే ఎక్కువ వాడైన' రాముణ్ణి చూసి చాలా ఆనందించాడు. (రాముణ్ణి చూసే! లక్ష్మణుణ్ణి చూసి కాదు.) చక్కని ఆసనం మీద కూర్చున్న దశరథుడు, రాముణ్ణి తొడ మీద కూర్చోబెట్టుకున్నాడు. (పుత్రం = కొడుకుని; అంకం = తొడను; ఆరోప్య = పొందించి. లక్ష్మణుడు చిన్న వాడు కాబట్టి, అసలు లక్ష్మ ణుణ్ణి దగ్గరికి తీసుకోవాలి కదా? రాముణ్ణి వొక్కణ్ణేనా తొడ ఎక్కించుకోడం? 'పాపం ముసలాయన ఇద్దర్నీ ఏం ఎక్కించుకుంటాడులే' అంటారా? అయితే, లక్ష్మణుణ్ణి ఒక్కణ్ణే కూర్చో బెట్టుకోవాలి. కానీ, మోజు అంతా రాముడి మీదే!)

కొడుకుని ఆలింగనం చేసుకొన్నాడు. "రామా! నిన్ను విడిచి, స్వర్గములో సుఖాలనుభవించడం నా కెంత మాత్రం ఇష్టం లేదు సుమా! నా మాట నమ్ము. సత్యంగా చెపుతున్నాను. (స్వర్గానికి వెళ్ళినా అబద్ధాలు మానలేదన్న మాట! అసలు అబద్ధాల వాళ్ళే స్వర్గానికి వెళ్తారా ఏమిటీ?) శతృ నాశనం చేసిన నిన్ను చూసి చాలా ఆనం దిస్తున్నాను. నిన్ను వన వాసానికి పంపమని కైక అన్న మాటలన్నీ నా హృదయంలో వున్నాయి. పూర్వం అష్టా వక్రుడు తన తండ్రిని తరింపచేసినట్టుగా నువ్వు నన్ను తరింపజేశావు.

(అష్టావక్రుడి కథేమిటంటే, అతని తండ్రి ఏకపాదు డట. ఒకసారి ఏకపాదుడు, జనక సభలో, వాదంలో, 'వంది' ముందు వోడిపోతూ వుంటే, అప్పుడు అష్టా వక్రుడు వాదంలోకి దిగి వందిని వోడించి, తండ్రిని గెలి పించాడట! ఇదీ, అష్టావక్రుడు తండ్రిని తరింప జెయ్యడం! ఇది, కవి చెప్పలేదు. అనువాదకుల కథనం.)

ఈ రావణ వధ కోసమే దేవతలు నీ పట్టాభిషేకానికి విఘాతం కలిగించారని ఇప్పుడు అనుకుంటున్నాను. (అయితే ఇప్పుడు మీరందరూ కైకని పొగడాలి.

ఇన్నాళ్ళూ కైకని తిట్టినందుకు లెంపలేసుకోవాలి.) నిన్ను కౌసల్య అయోధ్యలో చూస్తుంది. ఎంత అదృష్టం! (నువ్వూ వెళ్ళరాదూ? విమానమేగా?) నీ పట్టాభిషేకం చూసి ప్రజలు ధన్యులవుతారు. (ప్రజలకేం పొరగదు, నీ కొడుకు పట్టాభిషేకం చూస్తే. తన పట్టాభిషేకం చూసుకుని నీ కొడుకే ధన్యుడౌతాడు!) – రామా! అనురాగంతో, పరాక్రమంతో, శుచీత్వంతో, ధర్మాత్ముడుగా వున్న భరతుడిని నువ్వు కలవాలి. పద్నాలుగేళ్ళు వనవాసం చేసి చాలా బాధలు పడ్డావు. (ఆ బాధల్లో నువ్వు పొచ్చి పలకరించలేదేం? రాజవుతాడనేప్పటికి, ఇప్పుడు ఎగురుకుంటూ వచ్చావు!) దీర్ఘాయుష్షుతో రాజ్యం పరిపాలించు" అని దీవించాడు. (నువ్వెలా పరి పాలించావో ఈయనా అలాగే పరిపాలిస్తాడులే.)

రాముడు తండ్రికి నమస్కారం చేస్తూ వినయంగా అన్నాడు. "కైక మీద కోపంతో, నువ్వు కైకనీ, ఆమె పుత్రుణ్ణీ విడిచి పెడతానన్నావు. కానీ నువ్వు కైక విషయంలో, ఆమె పుత్రుడి విషయంలో, కరుణించాలి. భయంకరమైన నీ శాపం వారికి తగలగూడదు" అని కోరాడు.[437] (మరి, నీ శాపాలో? నువ్వెప్పుడూ కైకని ఏమీ అనలేదా?)

దశరథుడు అలాగేనని చెప్పి లక్ష్మణుణ్ణి అప్పుడు ఆలింగనం చేసుకొన్నాడు – (రాముణ్ణి అయితే తొడ మీద ఎక్కించుకోడం! లక్ష్మణుడి విషయంలో ఏమీ చెయ్యకపోతే బాగుండదని ఇప్పుడు కాస్త కావలించుకోడం!) – "లక్ష్మణా! నువ్వు రాముడికి శుశ్రూష చేస్తూ వుండడం చేత నిన్ను చూసి చాలా ఆనందిస్తున్నాను. శ్రీరాముడి దయవల్ల నువ్వు భూలోకంలో కీర్తీ, పరలోకంలో స్వర్గం, పొందుతావు. (ఆ రెండూ కూడా కళ్ళకి కనపడి చచ్చేవి కావులే. పూర్తిగా అబద్ధాలే లే!) ఎప్పుడూ రాముడికి శుశ్రూష చేస్తూ జీవించు. నీకు మంగళమవుతుంది. (సర్వమంగళం అయిపోతావులే లక్ష్మణా! ఇక నీ బతుకంతా బానిస బతుకే!)

ముల్లోకాల్లోనూ, దేవతలూ, ఋషులూ, రాముణ్ణి పూజిస్తున్నారు. బ్రహ్మ స్వరూపమే శ్రీరాముడిగా అవతరించిందని చెప్పారు గదా? (ఉక్తం = చెప్పబడినది. స్వర్గానికి వెళ్ళినా, దేవుడి సంగతి దశరథుడికీ తెలీదు! 'ఎవరో చెప్పారు గదా' అంటున్నాడు) లక్ష్మణా! రాముడి సేవ చేసుకుంటూ జీవించు" అని మళ్ళీ చెప్పి, ముగించాడు. ('రాముడికి సేవ చెయ్యమ'ని చెప్పటానికే దశరథుడు లక్ష్మణుడితో మాట్లాడాడు. అంతే!)

దశరథుడు లక్ష్మణుడితో మాట్లాడిన తర్వాత సీతని చూస్తూ, "రాముడు నిన్ను పరిత్యజిస్తానన్నాడని రాముడి మీద కోపం పెట్టుకోవద్దు! నీ మంచి కోసమే అలా చేశాడు." (చితిలో పడితే చాలా మంచి!)

మామగారు, కోడలితో అన్న మాటలు చూడండి! 'రాముడు నిన్ను వదిలేస్తానన్నాడని అతడి మీద కోపం పెట్టుకోవద్దు!' అంటున్నాడు. అంటే, నిజానికి, రాముడు అలా అన్నందుకు, సీత, రాముడి మీద కోపం పెట్టుకో వచ్చన్న మాట! కోపం పెట్టుకోవడానికి అది సరైన కారణమే అన్న మాట!)

మామగారు కోడలితో ఇంకా ఇలా అన్నాడు. "అందమైన కనుబొమలు గలదానా! (సుభ్రు – అన్నాడు

---

**437.** **యుద్ధ, సర్గ 122, శ్లోకాలు 25, 26:** రాముడు అంజలి జేసుకొని దశరథునితో ఇటులనెను – "ధర్మజ్ఞుడా! నీవు కైకేయిని జూసి 'పుత్రునితోడ నిన్ను పరిత్యజించితిన'ని పలికితివి. కైకేయీ భరతుల విషయమై ప్రసన్నుడవు కావలయును. భయంకరమైన ఆ శాపము కైకేయికి, భరతునకు, అంటగూడదు."

దశరథుడు కైకేయిని వొదిలేస్తాననడం ఎప్పటి సంగతి? – రాముడు వనవాసానికి బయల్దేరక ముందు సంగతి! తర్వాత దశరథుడు చచ్చిపోయాడు. వనవాసం పూర్తయింది. 14 సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడు రాముడు తండ్రితో, "నువ్వు కైకని వదిలేస్తానన్నావు. వదలకు" అంటున్నాడు! చచ్చిపోయిన వాడు వదలకుండా వుండటం ఏమిటి? "దెయ్యానివై కైకని పట్టుకో! కైకని వదలకు!" అని చెప్పడం గావున్ను! రాముణ్ణి మహా ఉత్తముణ్ణి చెయ్యాలనే తాపత్రయం కవికి, అడుగడుగునా! "రాముడికి కైక మీద కోపం లేదు సుమా! కైక సుఖమే కోరుతున్నాడు సుమా! కైకని బాధించవద్దని తండ్రికి చెప్పాడు సుమా! ఆహా, ఎంత ఉత్తముడో చూడండి రాముడు!" అని చెప్పాలని కవి ఆరాటం! రాముడి గొప్పతనాలు చెప్పడానికి, 'అహల్యని రక్షించాడు. శబరిని స్వర్గానికి పంపాడు. ఇది చేశాడు, అది చేశాడు' అని చెపుతూనే వున్నాడు దారి పొడుగునా. ఇప్పుడు 'కైక క్షేమం కోరాడు' అని కైక సంగతి తీసుకు రావడం ఎందుకు? కవి అర్థం ఏమిటంటే: 'రాముడికి నిజానికి కైక మీద ఎంతో కోపం వుండాలి. అంత ద్రోహం చేసింది కైక. కానీ, రాముడు ఉత్తముడు కాబట్టి, కోపం పెట్టుకోవలసిన మనిషి మీద కూడా కోపం పెట్టుకోకుండా ఆమె క్షేమం కోరాడు' అని చెప్పడం! ఇది ఎంత పచ్చి అబద్ధమో పట్టాభిషేకం ఆగిపోయిన నాటి నించీ ఈ నాటి వరకూ చూస్తూనే వున్నాం. రాముడు ప్రతీ క్షణం కైకని తిడుతూనే వున్నాడు కదా? పది మందీ వున్నప్పుడు మాత్రం చాలా బుద్ధిమంతుడిలాగ కైక మీద భక్తి కురిపిస్తూ వుంటాడు. ఆ భక్తి కురిపించడానికైనా తలకాయ వుండాలా, లేదా? ఏ నాడో పోయిన దశరథుడు ఇప్పుడు కైకని వదలగూడదట! ★

కవి. అంటే 'చక్కని కనుబొమ్మలు గలదానా' అని అర్థం అట! కోడలి కనుబొమలు మామగారికి బాగా నచ్చినట్టే వున్నాయి! కనుబొమల్నే అంత పరిశీలించి చూసిన వాడు, ఇంకా ఏమేం చూశాడో! 'శాంతము గలదానా!' అనరాదూ? 'ఉత్తమురాలా!' అనరాదూ? కనుబొమలు అందంగా వున్నాయట! ... ఇంకా నయం! ... 'అంద మయిన రొమ్ములు గల దానా!' అన్నాడు కాదు. కను బొమలూ, చను మొనలూ – ఇదే కవిత్వం!) భర్తకు సేవ చెయ్యాలనే సంగతి నీకు ఒకరు బోధించవలసిన పని లేదు. కానీ, నేను తప్పకుండా చెప్పాలి కాబట్టి చెపు తున్నాను. (మామగారు, పెద్దరికంతో కోడలికి బుద్ధులు చెప్పడం అన్నమాట!) నీ భర్తే నీ దైవం. భర్తనే పూజించు కుంటూ జీవించు" అన్నాడు.

ఈ రకంగా జెప్పి దశరథుడు గొప్ప కాంతితో తేజ రిల్లుతూ, విమానంలో ఇంద్రలోకానికి వెళ్ళి పోయాడు. (అంత తొందరేం? పిల్లల్ని చూస్తూ ఇంకా కాస్సేపు ఉండకూడదూ? ఇంద్ర లోకంలో అయినా రంభ వుంటుందేమో అనా?)

తర్వాత, ఇంద్రుడు రాముడితో, "నీకేం కావాలో కోరుకో" అన్నాడు. (అది సరేలే. నీ విమానం దశరథుడు తీసుకుపోయాడు. అది చూసుకో ముందు! రాముడూ! ఇంద్రుడు నిన్ను వరం కోరుకోమన్నాడుగా? అతని రాజ్యం ఇచ్చెయ్యమని అడిగెయ్యి!)

రాముడు వినయంగా, "యుద్ధంలో చచ్చిపోయిన వానరులందరూ జీవించాలి. అందరూ సుఖంగా ఇళ్ళకు పోవాలి. వానరులు నివసించే స్థలాలలో, కాలం గాని కాలంలో గూడా, పళ్ళూ దుంపలూ దొరకాలి. నదులు ప్రవహిస్తూ వుండాలి" అని అడిగాడు.[438]

ఇంద్రుడు కొంచెం ఇబ్బందిపడి, "రామా! నువ్వ డిగిన వరం చాలా పెద్దది. అయినా సరే, నేను అన్న మాట తప్పి, అప్పుడొక మాటా, ఇప్పుడొక మాటా అనను గదా? నువ్వడిగింది అలాగే ఇస్తాను" అన్నాడు.

చచ్చిపోయిన వానరులందరూ గాయాలు లేకుండా, ఆనందంగా బతికి లేచారు. "ఏమిటిది?" అని వానరు లందరూ వాళ్ళని వాళ్ళు చూసుకుని ఆశ్చర్యపడ్డారు. రాముడికి నమస్కరించారు.[439]

దేవతలందరూ ఆకాశంలో ఎగిరి నించుని, "రామా! సీతని పూరడించి సుఖంగా వుండు!" అని ఎగు రుకుంటూ స్వర్గానికి వెళ్ళిపోయారు. (దేవేంద్రుడు కూడా విమానం లేక ఎగురుకుంటూ వెళ్ళక తప్ప లేదు!) ★

---

**438.** **యుద్ధ, సర్గ 123, శ్లోకం 8:** అకాలే చాపి = అకాలమునందును, మూలానిచ = దుంపలును, ఫలానిచ = పండ్లును, నద్యశ్చ = నదులును, తిష్టేయః = వుండును గాక.

ఎప్పుడూ పళ్ళూ, నీళ్ళూ దొరకాలనీ, అలాంటి ప్రదేశాలు కావాలనీ – ఇవి ఆటవిక మానవుల కోరికలు! వారి ఊహల్లో ఇవి గొప్ప వరాల వంటివి.

రాముడు సముద్రం మీద బాణం వెయ్యబోయిన సందర్భంలో మరుకాంతారంలో, చక్కని పళ్ళూ, నీళ్ళూ వుండేటట్టు రాముడే సముద్రుడికి వరం ఇచ్చాడు గదా? ఇప్పుడు వాటి కోసమే ఇంద్రుణ్ణి వరం ఇవ్వమని అడుగుతున్నాడు! ★

**439.** **యుద్ధ, సర్గ 123, శ్లోకం 16:** చచ్చిపోయిన వాళ్ళు బతికినందుకు అందరూ ఆశ్చర్యపడుతున్నారు.

వానరాం = వానరులు, విస్మితాః = ఆశ్చర్యము గల వారు, బభూవుః = అయిరి.

చచ్చిపోయిన వారు బ్రతకడం – ప్రకృతిలో అసహజం. అది ఆశ్చర్యం కలగవలసిన విషయం. కానీ, నిత్యమూ అనేక మహిమలు చెయ్యగల దేవుళ్ళూ, దేవతలూ కళ్ళ ముందు వున్నప్పుడు, చచ్చిపోయిన వారు బతికినందుకు అంత ఆశ్చర్యపోవడం ఎందుకు జరగాలి? దేవతలు ఆకాశం నించి వస్తున్నారు, వెళ్తున్నారు. చితిలోంచి అగ్నిదేవుడు వచ్చి మాట్లాడాడు. నిత్యమూ ఇలాంటివి తెలిసిన వారికి, ఏం జరిగినా సహజంగానే వుండాలి గానీ, ఆశ్చర్యం కలగకూడదు కదా? చచ్చిపోయిన వాళ్ళు బతికినా, వైద్యుడు వైద్యం చేసి జబ్బు పోగొట్టినట్టు మాత్రమే వుండాలి. అంతేగానీ, "ఏమిటిది!" అని ఎందుకు ఆశ్చర్యం కలగాలి?

కవి, మహిమల గురించి రాస్తున్నాడే గానీ, వాటి విషయం ఆయనకే అమితాశ్చర్యంగా వుంది. సముద్రం మీద సేతువు కట్టడం కూడా ఇలాగే ఆయనకి చాలా ఆశ్చర్యం కలిగించింది. ఏ మహిమ అయినా సరే ఆయనకు వింతగానే వుంది! అంటే, అసలు మహిమలన్నీ, కవి ఊహించి రాసేవే గానీ, జీవితంలో నిజంగా ఎరిగిన విషయాలు కావన్నమాట. చచ్చిపోయిన వారు బతకడం ప్రకృతిలో జరగదు. జరగదని కవికీ తెలుసు. అందుకే, చచ్చిపోయిన వాళ్ళు బతకడం – అనే ఊహ, ఆశ్చర్యం కలిగించే విషయంలాగ ఉంది. ఆ ఆశ్చర్యాన్నే ఆయన ఎప్పటికప్పుడు వ్యక్తపరుస్తూ వుంటాడు.

మహిమలూ, దేవుళ్ళూ, స్వర్గాలూ, ఎగురుళ్ళూ, అన్నీ కవి ఊహలే. అలా ఊహించి, మహిమల మీద కథలు రాసినా, మళ్ళీ ఆ మహిమల మీద కవికే ఆశ్చర్యం! ★

# కథ-15

# చెప్పుల చోట్లో రాముడు

రాముడి పట్టాభిషేక మహోత్సవాలు మహా వైభవంగా జరుగుతున్నాయి – అతని మనసులో!

అయోధ్యలో... ఈ రుషి వేష విముక్తీ ... రాజరిక స్వీకారం... నగరంలో పెద్దలందరూ, ధనికులూ, వ్యాపారులూ, పండితులూ, పురోహితులూ, తన చుట్టూ ... సంతోషిస్తూ చేరి.... సంతోషమేనా వారికి తన రాజరికం? ఇంకా భరతుడి రాజరికాన్నే కోరరు గదా? ... భరతుడి రాజరికం కన్నా తన రాజరికం ఎక్కువ ప్రయోజనమేనా వారికి? ... ఈ పద్నాలు గేళ్ళ కాలంలో భరతుడు బలవంతుడై స్థిరపడి వుంటాడా? ... ఇంతకాలం తర్వాత ... రాజరికం వదలడానికి అతడు నిజంగా అంగీకరిస్తాడా? ఏ నాడూ రాజకీయాల జోలికి పోకుండా ఎంతో కాలం విలాస జీవితం గడిపిన వాడు మళ్ళీ ఆ విలాస జీవితాన్నే కోరుకోడా? బహుకాలం పదవీభారం... కోరుకుంటాడా? ... రాజ్యంలో ప్రముఖులందరినీ తన పక్షాన ఆకట్టుకునేటంత నేర్పరిగా ఆలోచిస్తాడా? ... ఎందుకు ఆలోచించడూ? ఎంత చాకచక్యాన్నయినా పదవీ వ్యామోహమే నేర్పుతుంది. తన స్థిరత్వానికి అనుకూలమైన ప్రయత్నాలన్నీ చేసుకునే వుంటాడు. భ్రమ గాకపోతే ... ఇంతకాలం రాజరికం చేసినవాడు ఇష్టాపూర్వకంగా ... సునాయాసంగా ... రాజ్యం తనకు అప్పగిస్తాడా? నమ్మరాదు, నమ్మలేము.

కానీ, భరతుడు ... మహోదాత్తంగా ... ఆ నాడే తన కోసం, రాజ్య త్యాగానికి సిద్ధమైనాడే! ... అంత ఉత్తముడి గురించా తను ... ఈ విధంగా...!

అది ఏ నాటి మాటో! ఈ నాటికీ ఆ భక్తి నిలుస్తుందా? ... నమ్మకూడదు.

కైక వాంఛితమే అది గదా? సవతి కొడుకు వనవాసం ముగించి నగరం చేరే కాలానికి, తన కొడుకు రాజ్యంలో స్థిరపడి, వేళ్ళూని, అజేయుడవాలని కోరింది గదా? అలాగే జరిగి వుంటుందా?[440]

రాముడు అశాంతిగా తలవాల్చి నిట్టూర్పులు విడుస్తూ తన తలపోతల్లో తను మునిగిపోయాడు.

"ప్రభూ! రామా!" – విభీషణుడు వినయంతో వొంగి నమస్కరించాడు. "నీ వన వాసకాలం ముగిసిందని నీ తండ్రితోపాటు పెద్దలందరూ అంగీకరించారు. ఇక నువ్వు నగరాలలో ప్రవేశించవచ్చును. తప్పు లేదు. నీ అలంకారానికి సమస్తమూ సిద్ధంగా వుంది. పట్టు వస్త్రాలూ, ఆభరణాలూ, పరిమళ ద్రవ్యాలూ, పూల మాలలూ ... అన్నీ సిద్ధంగా వున్నాయి. అందగత్తెలెందరో నీ పాదసేవ చేసుకునే భాగ్యం కోసం నిరీక్షిస్తున్నారు. నువ్వు నగరంలోకి రావడం మాత్రమే ఆలస్యం రామా!"

రాముడు గంభీరంగా తలఎత్తి చూశాడు. "విభీషణా! నువ్వు జ్ఞానవంతుడివి కాబట్టి, చక్కగా ఎప్పుడే విధంగా నన్ను గౌరవించాలో అర్థం చేసుకున్నావు. నీ భక్తికి సంతోషిస్తున్నాను.. కానీ..." దీర్ఘంగా నిట్టూర్చాడు. "అక్కడ ... అయోధ్యలో... భరతుడు నా కోసం క్షణమొక యుగంగా ఎదురు చూస్తూ వుంటాడోయీ! నా తమ్ముడు బహు ఉత్తముడు. సుఖ భోగాలలో మునిగి తేలవలసిన వాడు, కష్ట భూయిష్టమైన రుషి జీవనం గడుపుతున్నాడు. అటువంటి సోదరుణ్ణి విడిచి నేను ఇక్కడ అలంకారాలు చేసుకోనా? ... నా సంగతి విడిచిపెట్టు! ... సుగ్రీవుడూ, అంగదుడూ, హనుమంతుడూ ... ఆ ప్రముఖులందరికీ స్నానాలు చేయించే ఏర్పాట్లు చేయించు. వారందరూ చక్కగా అలంకారాలు చేసుకుంటారు. నేను మాత్రం అయోధ్యలోనే. ఇక తొందరగా బయల్దేరాలి నేను. చాలా కాలం పడుతుంది ప్రయాణం. వెంటనే బయలుదేరే ఏర్పాట్లు చేయించు!" అని ప్రయాణానికి తొందర పడ్డాడు.

విభీషణుడు మళ్ళీ వినయంతో, "ప్రయాణం గురించి విచారించవలసిన పని లేదు ప్రభూ! ఎంత దూరమైనా క్షణాల మీద తీసుకుపోయే పుష్పక విమానం నీ కోసమే సిద్ధంగా వుంది. ఇక్కడ బయలుదేరిన మరు క్షణంలోనే నిన్ను అయోధ్యలో దింపుతుంది. ప్రయాణం

---

**440.** రాముడి మనసులో భరతుణ్ణి గురించి ఈ రకమైన ఆలోచనలు సాగుతున్నాయని చెప్పటానికి ఆధారమేమిటో ఈ కథలోనే తర్వాత చూడండి!

★

గురించి తొందరపడకు. నా మీద కరుణించి, ఇక్కడ కొంత కాలం సుఖంగా వుండి, నీ సైన్యంతో సహా నా ఆతిథ్యం స్వీకరించు. నే నెన్నడూ నీ భృత్యుడినే. నీకు ఎటువంటి సేవలు కావాలో ఆజ్ఞాపించు!" అని ప్రార్థించాడు.

రాముడు మందహాసం చిందించాడు. విభీషణుడు రాజైన తర్వాత ఏమైనా అవిధేయత కనబరుస్తాడా అని తను సందేహించాడు గానీ, అటువంటి ధోరణేమీ లేదు. మునుపటి వినయ విధేయతలతోనే ప్రవర్తిస్తు న్నాడు. 'రాజు'ని అయ్యాననే ఆనందంలో ... ఉత్సాహంలో కూడా... ఎవరి కరుణ వల్ల తను రాజు అయ్యాడో గుర్తు పెట్టుకున్నట్టే వున్నాడు. "విభీషణా! నువ్వు నన్ను సమస్త విధాలా పూజించావు. నా కేమీ లోపం జరగలేదు. నీ వినయ విధేయతలు నేను గ్రహించలేదని బాధపడకు! నా తమ్ముణ్ణి చూడాలని నా మనసెంతో ఆరాటపడు తోంది. నేను చిత్రకూటంలో ఉన్నప్పుడే నన్ను అయోధ్యకు తీసుకు వెళ్ళాలని వచ్చాడు. నేను అంగీక రించనందుకు నిరాశతో వెనుదిరి గాడు ... ఎలా ఉన్నాడో యేమో! రాజ్య భారంతో ఎంత సతమత మౌతున్నాడో![441] ... నా దేశం విడిచి దీర్ఘ కాలం గడిచింది. నా తల్లుల్నీ, బంధువుల్నీ, పుర ప్రము ఖుల్నీ, ప్రజల్నీ ఎంత తొందరగా చూస్తానా అని ఆదుర్దా పడు తున్నా నోయీ! నీ రాజ్యంలో ఆగక పోవడానికి అంతకు మించిన కారణం లేదు సుమా! (ఇంకోసారి వస్తాను లేవోయీ!)

ఇక్కడ నే నిక చెయ్యవలసిందేమీ లేదు గదా? నీ శత్రువుల్ని హతమార్చి లంక నీ చేతుల్లో పెట్టాను. (ఏం లంక? అన్నీ తగలబడి, మాడి మసై, బొగ్గై పోయిన లంకా?) సిరి సంపదలన్నీ ఇచ్చాను. ఈ సుఖ భోగాలన్నీ తృప్తిగా అనుభవించు. (బొగ్గుల వ్యాపారం చేసు కుంటూ.) సుఖాలలోనే మునిగి రాచకార్యాలన్నీ మరచి పోకు సుమా!" అని కొంచెం హాస్యం చిలికించాడు.

విభీషణుడు వినయంగా తలవొంచి వారకంట సుగ్రీవుణ్ణి చూశాడు, "చూశావా ఏమంటున్నాడో?" అన్నట్టు.

అంతకు పూర్వం, సుగ్రీవుడు విభీషణుడి దగ్గిర రాముడి అహంకారం గురించి మనసు కష్టపెట్టుకుంటూ చాలాసార్లు చెప్పుకున్నాడు – "అస్తమానూ 'నే నిచ్చిన రాజ్యం, నే నిచ్చిన రాజ్యం' అంటాడేమిటి విభీషణుడూ? రాజ్యాలు ఎక్కణ్ణించన్నా తెచ్చి ఇచ్చాడా మనకి? నీ అన్నది నీ కొచ్చింది; నా అన్నది నా కొచ్చింది. ఏమం టావు? తన తాత సొమ్ము తెచ్చి ఇచ్చినట్టు మాట్లాడ తాడే!" అని రుస రుస లాడాడు.

ఆ విషయంలో విభీషణుడికి కూడా రాముడిమీద వొళ్ళు మండుతూనే వుంది. "అవును. నేనూ గమనిస్తూనే వున్నాను. తను చేసిన సహాయం మనం గుర్తు పెట్టు కున్నామో లేదోనని అస్తమానూ ఏదో విధంగా దాని సంగతి ఎత్తుతూనే వుంటాడు."

"ఊరికే చేశాడంటావా స .. హా ... యం? తనకేం లాభం లేకుండానే మన మీద దయదల్చి చేశాడా? ఎంత అణిగి మణిగి వుండబోయినా ఏదో వొక వొంక పెట్టి వెటకారాలు చేస్తూనే వుంటాడు. ఏవన్నా అనబోతే, చదువూ సంధ్యా లేని వాడివి, నీకేం తెలుసు లెమ్మన్నట్టు చూస్తాడు. ఊరికే మాట వరస కంటున్నాననుకో, నీ మనసులోనే పెట్టుకో, ఎక్కడా అనకు సుమా!"

సుగ్రీవుడి మాటలన్నీ చెవుల్లో గింగురుమన్నాయి విభీషణుడికి. గుర్తుకొచ్చాయి. రాముడు మళ్ళీ "నీకు రాజ్యమిచ్చానని అనగానే సుగ్రీవుడికేసి చూశాడు.

సుగ్రీవుడు, "నేనూ విన్నాలే" అన్నట్టు తల తాటించి వూరుకున్నాడు.

విభీషణుడు తన మనసులో మాటలు రాముడికి తెలుస్తాయేమోనన్న జంకుతో మరింత వినయం ప్రద ర్శిస్తూ, "చిత్తం ప్రభూ! అయితే, ఇప్పుడే నీ ప్రయాణానికి ఏర్పాట్లు చేయిస్తాను. ఇంకా ఏమి శెలవు?" అని

---

**441.** **యుద్ధ, సర్గ 124, శ్లోకాలు 5 .... 20:** రాముడు భరతుణ్ణి గురించి ఇక్కడ విభీషణుడితో ఏం చెపుతున్నాడో, తర్వాత హనుమంతుడితో ఏం చెపుతాడో చూడండి!

ఇక్కడి మాటలు: "ధర్మాత్ముడును, సుఖపడ తగినవాడును, సుకుమారుడును, సత్యమైన ప్రతిజ్ఞ గలవాడును నగు ఆ చిన్నవాడు నా కారణముగా శ్రమపడుచున్నాడు. ధర్మము ననుసరించు అట్టి భరతుని విడిచి నాకు స్నానము, వస్త్రములు, ఆభరణముల మీదను ఇష్టము లేదు. నన్ను బిలుచుకొని పోవుటకు అయోధ్య నుంచి చిత్రకూట పర్వతమునకు వచ్చిన భరతుని జూచుటకు నా మనసు త్వరపడుచున్నది. నన్ను బిలుచుకొని పోవుటకు భరతుడు శిరసా యాచించెను. అతని మాట నేను వినలేదు ... సుగ్రీవుని వంటి 'ముఖ్యులను' (సుగ్రీవ ముఖ్యాన్) స్నానము చేయుటకు ప్రార్థింపుము. (పెద్ద పెద్ద వారికే స్నానాలూ, మర్యాదలూ! వానరులందరికీ కాదు. సైనికులందరికీ స్నానాల ఏర్పాట్లు చేయించు' అని ఎందుకు అనకూడదు? వాళ్ళంటే లక్ష్యం లేదు.) రాముడు ఇక్కడ భరతుడి మీద సదభిప్రాయం వున్నట్టు మాట్లాడుతున్నాడు కదా? ఇంకో సందర్భంలో తర్వాత చూడండి!

★

రామాజ్ఞ కోసం ఎదురుచూశాడు.

రాముడు తల ఎత్తి మందహాసంతో చూశాడు. "విభీషణా! వానర ప్రముఖులందరికీ ఎవరికి తగ్గ విధంగా వారికి బహుమతులిప్పించు! లంకని జయించడానికి వారే గొప్ప శక్తి సామర్థ్యాలతో పోరాడారు. వారి సహాయం లేకపోతే ఈ సిరిసంపదలూ, ఈ భోగ భాగ్యాలూ, ఈ రాజ్యాధిపత్యం, నీకు దక్కేవి కావు" అని విభీషణుణ్ణి క్రీకంట చూశాడు. (విభీషణుడూ! దేశం నిండా బొగ్గులు బాగానే వున్నాయిగా? అవే, అందరికీ తలో కుంచెడూ కొలిపించు! ఇళ్ళకి పోయి నీళ్ళు కాచుకుని స్నానాలు అక్కడే చేస్తారులే, పెళ్ళాలతో వీపులు తోమించుకుని!)

విభీషణుడు ఏ భావమూ ప్రకటించకుండా విన్నాడు. వానర ప్రముఖు లెవరెవరో, ఎన్ని వందల మందో, ఏ రకం బహుమానాల కెంతెంత మొత్తం అవుతుందో ఆలోచిస్తూ, ఆ ప్రయత్నాలంతగా ఇష్టం లేనట్టు మౌనంగా నించున్నాడు.

విభీషణుడి వైఖరి గమనించిన రాముడు నుదురు చిట్లించి, గాంభీర్యం వుట్టిపడుతూ చూశాడు. "విభీషణా! వానరులు నీకు సహాయం చేశారనే కృతజ్ఞతతో నువ్వు వారిని సన్మానిస్తే వారెంతగానో సంతోష పడతారోయీ! దాని వల్ల నీకు కీర్తే గానీ, అపకీర్తి రాదు. నిన్ను ధర్మాత్ముడనీ, దయ గల వాడనీ, త్యాగశీలుడనీ లోకులందరూ చెప్పుకుంటారు. అందుకే నే నింతగా చెపుతున్నాను సుమా!" అంటూ, 'నా ఆజ్ఞ చాలదా? ఇంత చెప్పాలా?' అన్నట్టు అసహనంగా చూశాడు.

విభీషణుడు కంగారుపడి "రామా! నువ్వు నోరు తెరిచి ఏ మాట చెప్పినా అది నాకు ఆజ్ఞే! నువ్వు చెప్పినట్టే చేయిస్తాను" అని, మంత్రుల్ని పిలిచి, బహుమానాల వ్యవహారం వెంటనే జరిపించమన్నాడు.442

రాముడికి మళ్ళీ భరతుడి రాజ్యపాలన గుర్తొచ్చి, "విభీషణా! నే నిక బయల్దేరాలి. విమానం తెప్పించు!" అని తొందర చేశాడు.

పుష్పక విమానం వచ్చి రాముడి ముందు వాలింది. చక్కని పతాకాలతో, గజ్జెలతో, అలంకారాలతో ధగ ధగ మెరిసిపోతోందది. దాన్నిండా చక్కని ఆసనాలూ ... పరుపులూ ... వున్నాయి. (దీన్ని తగల బెట్టలేదా? అయ్యో, ఇది కూడా తగలబడితేనే బాగుండేది. రాముడు నడిచిపోయే వాడు.)

వానరులు విమానం చుట్టూ జేరి ఆశ్చర్యపడి పోతూ ఎగాదిగా చూస్తూ నిలబడ్డారు.

"ఇది ఎలా ఎగురుతుందంటావు?"

"పిట్టల్ని చూడ్డంలా? అలాగేనేమో!"

"వాటికైతే ప్రాణాలుంటాయయ్యే! దీనికేం వుంటుందీ?"

"ఏమో మరి, దీనికేం కిటుకుందో!"

రాముడూ, సీతా, లక్ష్మణుడూ విమానం ఎక్కారు.443 రాముడు ఎవరితోటీ మాట్లాడకుండా ఎక్కి కూర్చున్నాడు. 'వెళ్తున్నాన'ని ఎవరితోటీ చెప్ప లేదు.

విమానం వచ్చిన సందట్లో సుగ్రీవుడూ, విభీష

---

**442.** **యుద్ధ, సర్గ 125, శ్లోకాలు 4 ... 8:** రాముడు విభీషణుడికి కర్తవ్యబోధ చేస్తున్నాడు. "ఈ వానరులు యుద్ధములో ప్రాణభయము విడిచి, వెనుదీయకుండా పోరాడుటచేత, జయించుటకు సాధ్యముగాని లంక జయించబడినది. వీరికి రత్నములు, ద్రవ్యములు, ఆభరణములు ఇచ్చి సన్మానించుము. (అందర్నీ సన్మానించమని అర్థం కాదు. ఎవర్ని సన్మానించాలో చూడండి!)

"గౌరవించుటకు అర్హులైనటువంటీ (సన్మానార్హాం), వానరులను పాలించునటువంటీ వారలు, నీచే సన్మానించబడి సంతోషించగలరు" 'వానరుల్ని పరిపాలించే' రాజునీ, మంత్రుల్నీ – అటువంటి పరిపాలకుల్నే సన్మానించమని చెపుతున్నాడు. వాళ్ళే సన్మానాలకు అర్హులు – అంటున్నాడు!)

విభీషణుడికి ఈ సన్మానాల ఖర్చు ఇష్టం లేనట్టుగా వుంది. దానికి రాముడు, "అందరును నిన్ను దయగల వాడవనియు, దాతృత్వము గల వాడవనియు, కీర్తిగల వాడవనియు గ్రహింతురు" అని నచ్చ చెప్పడానికి చూస్తున్నాడు. 'నీకే కీర్తి కలుగుతుంది' అంటున్నాడు. ★

**443.** 'వాల్మీకి రామాయణం'లో పుష్పక విమానం ఎగరడంలో తప్పు లేదు. అది మైథాలజీ కాబట్టి. కానీ వాస్తవ దృష్టితో అర్థం చేసుకునే విషవృక్షం కథలో, పుష్పక విమానం వుండకూడదు. రాముడు లంక నించి పడవ మీద సముద్రం దాటి తర్వాత, ఎడ్లబండి మీదో, గుర్రాల బండి మీదో తిరిగి వెళ్ళాడని మాత్రమే అర్థం చేసుకోవాలి.

కానీ, ఇక్కడ పుష్పక విమానానికి కూడా కొంత 'కథ' వుండడం చేత దాన్ని ఇక్కడ యథాతథంగా వుంచవలసి వచ్చింది. అంత మాత్రాన, రాముడు పుష్పక విమానం మీద వెళ్ళడం నిజమేనని దాన్ని సమర్థించినట్టుగా అర్థం చేసుకోకూడదు.

పుష్పక విమానం బయల్దేరినప్పుడు ఏ మార్గంలో ప్రయాణం చేస్తుందో గమనించండి! ★

ణుడూ వొక మూల నించుని రాముడి చేష్టల గురించి ఆశ్చర్యపడిపోతున్నారు.

"అయోధ్యలో తను పట్టాభిషేకం చేసుకుంటాడు గదా? మనల్ని రమ్మని మాటవరసకైనా అనడేం?" అని సుగ్రీవుడు తల తిప్పి విమానం వేపు చూసి మరింత ఆశ్చర్యపడుతున్నాడు. సుగ్రీవుడికి, విమానం సంగతీ వింతగానే వుంది. రాముడి సంగతీ వింతగానే వుంది. రాముడు తనని తప్పకుండా అయోధ్యకు రమ్మంటాడని ఇన్నాళ్ళ నించీ అనుకుంటున్నాడు ... తమ్ముడివన్నాడు ... స్నేహితుడివన్నాడు ... మాటవరసకన్నా పిలవకుండా విమానం ఎక్కి కూర్చున్నాడే!

విభీషణుడు కూడా విమానం వేపు వారకంట చూస్తూ సుగ్రీవుడితో చెప్పుకుంటున్నాడు – "నా మనసులో మాట అంటాను, నువ్వేమీ అనుకోకు గానీ ... మీ కందరికీ నాతో బహుమానాలిప్పించాడు గదా? .. మరి మీరు తనకు మాత్రం సహాయం చెయ్యలేదా? తను కూడా తనకు తోచిందేదో ఇవ్వాలా, అక్కర్లేదా? మిమ్మల్ని తనతో అయోధ్యకు తీసికెళ్తాననో, లేకపోతే మీ దేశానికి బహుమతులు పంపిస్తాననో, ఏదో వొకటి చెప్పాలంటావా, అక్కర్లేదా? చూడు, తనకేం పట్టనట్టు ఎలా తప్పించుకుని వూరుకున్నాడో!" అని తన బాధ వెళ్ళబోసుకున్నాడు.

"బహుమానా లెవడిగ్గావాలి గానీ... మర్యాదకైనా తన పట్టాభిషేకానికి రమ్మనలేదు చూశావా? పోనీ అడుగుదామా? వాళ్ళ దేశం ఎలాగుంటుందో చూసొద్దాం."

"ఛ! మనమే అడిగి బయల్దేరితే బాగుంటుందా?"

"ఆఁ, బాగేవిట్లెద్దూ! మొండివాడి దగ్గర మొండి తనమే మందు. పద, అడుగుదాం."

సుగ్రీవుడూ, విభీషణుడూ, రాముడు కూర్చున్న దగ్గిరికి వెళ్ళి వినయంగా చేతులు కట్టుకుని నించున్నారు.

రాముడు అందర్నీ గంభీరమైన చూపులు చూస్తూ తల పంకిస్తూ నోరు విప్పాడు – "ఇక మీరందరూ శెలవు తీసుకోండి! నేను అనుమతిస్తున్నాను. సుగ్రీవా! నువ్వు నాకు సహాయం చేసి నీ వాగ్దానం నిలబెట్టుకున్నావు. చాలా సంతోషించాను. ఇక కిష్కింధకు పోయి సుఖంగా వుండు!"

తర్వాత చిరునవ్వు విభీషణుడి కోసం. "విభీషణా! నే నిచ్చిన రాజ్యం సుఖంగా అనుభవించు. నిన్ను శత్రువు లెవ్వరూ ఏమీ చెయ్యలేరు. దేవతలు కూడా నిన్నేమీ చెయ్యలేరు. ఇక నేను బయల్దేరుతాను మరి" అని, 'మీరందరూ నన్నిప్పుడే బాగా చూడండి, వెళ్ళిపోతున్నాను కదా?' అన్నట్టు అందరివేపూ గంభీరంగా చూశాడు.[444] సుగ్రీవుడూ, విభీషణుడూ వొకరి మొహం వొకరు చూసుకున్నారు. సుగ్రీవుడికి వొళ్ళు మండిపోతోంది రాముడి మీద. కానీ విమానం ఎక్కాలనే ఉబలాటం కోపాన్ని అణగదొక్కుతోంది. "..... రామయ్యా! నేను కూడా నా మంత్రులతో ... నీ రాజ్యం వొస్తానయ్యా! ... అక్కడ నీకేమీ ఇబ్బంది లేకుండా ... బుద్ధిగా మసులుకుంటాం.. నీ దగ్గిర ఎక్కువ సేపు వుండంలే రామయ్యా! నీ పట్టాభిషేకం చూసేసి వెనక్కి వచ్చేస్తాం" అనేసి సిగ్గు పడిపోయి చేతులు నలుపుకుంటూ నించున్నాడు.

రాముడు క్షణ కాలం గంభీరుడైపోయి ఆలోచనలో మునిగాడు .... అడవుల్లో వున్న కాలంలో అయితే, ఈ

---

**444.** **యుద్ధ, సర్గ 125, శ్లోకాలూ 13 ... 17:** రాముడు విమానంలో గూర్చుండి ... గొప్ప పరాక్రమము గల సుగ్రీవునితోను, విభీషణునితోను, ఇటులనెను – "వానరోత్తములారా! మీరు మిత్రుని కార్యమును పరిపూర్తి చేసితిరి. నా యాజ్ఞను బుచ్చుకొని మీరందరు మీ కిష్టమైన ప్రదేశములకు బోవచ్చును. సుగ్రీవా! అధర్మములో భయము గల నీవు, స్నేహితుడు చేయవలసిన కార్యమును సంపూర్ణముగ చేసితివి. నీ సేనలతో గూడి త్వరగా నీవు కిష్కంధకు బోయి చేరుదువు. విభీషణా! నేను నీకు ఇచ్చిన లంకలో జీవించుము. ఇంద్రునితో గూడి వచ్చిన దేవతలును నిన్ను తిరస్కరించలేరు."

బహుమతుల సంగతి: వానరులు చేసిన సహాయానికి విభీషణుడే బహుమతులివ్వాలి గాని, తను ఇవ్వవలసిన అవసరం లేదని రాముడి అభిప్రాయం. ఎందుకంటే, తను సుగ్రీవుడికి మొదటే ఉపకారం చేశాడు. ఇప్పుడు సుగ్రీవుడు చేసింది తన ఉపకారానికి బదులుగా ప్రత్యుపకారం మాత్రమే. అతని బాధ్యత అతను నెరవేర్చుకున్నాడు. దానికోసం తను బహుమానాలివ్వవలసిన అవసరం లేదు.

విభీషణుడికి సంగతి అలా కాదు. అతను సుగ్రీవుడికేమీ సహాయం చెయ్యలేదు. సుగ్రీవుడే విభీషణుడికి లంక దక్కేలాగ సహాయం చేసి, లంకని జయించి పెట్టాడు. అందుచేత విభీషణుడు సుగ్రీవుడికి బహుమానా లివ్వవలసి వుంటుంది.

రాముడు సుగ్రీవుడితో, "నేను నీకు సహాయం చేస్తేనే, నువ్వు నాకు సహాయం చేశావు సుమా! నాకేం వూరికే చెయ్యలేదు" అన్నట్టు, "నీ మాట నువ్వు నిలబెట్టుకున్నావు" అని ఇద్దరి మధ్యా వున్న 'వొప్పందం' సంగతి గుర్తు చేస్తున్నాడు.

ఇక అందర్నీ ఎవరిదార్ని వాళ్ళని పొమ్మంటున్నాడు. విమానం కిష్కింధ మీద నించే వెళ్తుంది కదా? వాన రులందర్నీ ఎక్కించుకుని అక్కడ దింపరాదూ? అన్ని నీతులూ తెలుస్తాయి. ఇలాంటి వెందుకు తెలియవూ? ★

ఆటవికులతో స్నేహం చేసినా సరిపోయింది. వీరిని అయోధ్యా నగరానికి తీసుకుపోతే, అక్కడి ప్రజలు, ప్రముఖులు, వీరిని చూసి ... తను ఇంతకాలం ఇటువంటి అనాగరికులతో కలిసి బతికినందుకు ... పరిహసించరా?

కానీ ... ఒక రకంగా ఇది కూడా మంచిదేనా? ... తన రాజ్య విశేషాలూ, భోగభాగ్యాలూ, సైనిక దళాలూ... ఈ ఆటవికులు చూసి, వింతపడి... ఎల్ల కాలం తన ఆధిపత్యం కింద కిక్కురుమనకుండా ...!

మరుక్షణంలో ఆలోచన నించి తేరి చిరునవ్వు చిందించాడు – "సుగ్రీవా! మీరందరూ నా రాజ్యానికి వస్తామంటే అంతకన్నా సంతోషమేముంది నాకు? ... తప్పకుండా బయల్దేరండి. నీ మంత్రులందర్నీ రమ్మను. విభీషణా! నువ్వు కూడా నీ మంత్రులతో బయల్దేరు. మా దేశం చూసి రావచ్చును. అందరూ విమానం ఎక్కండి!" అని తొందర చేశాడు.[445]

వానరులందరూ బిల బిల్లాడుతూ విమానంలోకి జొరబడ్డారు.[446]

రాముడు విమానంతో – "మా ఊరు వెళ్ళవలయును, ఎగురుము" అన్నాడు గంభీరంగా.

విమానం వినయంగా తలవొంచి పైకి లేచింది.

★ ★ ★

పుష్పక విమానం ఆకాశంలో ఎడ్ల బండిలాగ అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తోంది.

వానరుల కేకల్తో, నవ్వుల్తో ఆకాశం నవ్వుల లోకం అయిపోయింది.

విమానం ఎక్కిం దగ్గర్నించీ సుగ్రీవుడు నీలుణ్ణి కావిటేసుకునే వున్నాడు. "హోరినీ! ఎలా ఎగురుతందో! .. పడదంటావా?" అని కళ్ళింతింత చేసుకుని కిందికి చూస్తున్నాడు.

రాముడు గంభీరమైన మందహాసంతో తన సరసనే కూర్చుని వున్న సీతని క్రీకంట పరికిస్తూ, సీతకి దారి పొడుగునా అన్నీ చూపిస్తున్నాడు – "ఇదే యుద్ధ భూమి సీతా! ఇక్కడే నేను నీ కోసం రావణుణ్ణి చంపాను. ఇదుగో! ఇక్కడ కుంభకర్ణుణ్ణి చంపాను. ... ఇక్కడ నీలుడు ప్రహస్తుణ్ణి చంపాడు. ఇదుగో, ఇక్కడ హనుమంతుడు ధూమ్రాక్షుణ్ణి చంపాడు... ఇక్కడ సుషేణుడు విద్యున్మాలిని చంపాడు. ఇటు చూడు, ఇక్కడే లక్ష్మణుడు

---

**445.** **యుద్ధ, సర్గ 125, శ్లోకాలు 19 ... 26:** రాముడు, మొదట తన దేశానికి ఎవ్వరినీ పిలువలేదు. అందర్నీ వెళ్ళిపొమ్మని చెప్పాడు. రాముడిటుల చెప్పగా (అందర్నీ వెళ్ళిపొమ్మని చెప్పగా) వానరులు, విభీషణుడు, అంజలి చేసుకుని అతనితో నిటులనిరి – "రామా! అయోధ్యకు రావలయునని మేము కోరుచున్నాము. నీవు మమ్ము బిలుచుకొని పోవలయును. నగరములోను, వనములలోను, జాగరూకులమై సంచరించెదము. పట్టాభిషేకము చేసికొనిన నిన్ను జూసి, కౌసల్యాదేవి పాదములకు నమస్కరించి, శీఘ్రముగా మా నెలవులకు మేము పోయెదము."

వానరులేమంటున్నారో చూశారా? – "మీ దేశంలో తోటలూ, ఊళ్ళూ, మేము పాడుచెయ్యం. నీ పట్టాభిషేకం చూసి వెంటనే వెళ్ళిపోతాం" అని బ్రతిమాలుకుంటున్నారు రాముణ్ణి, తీసికెళ్ళమని,

యుద్ధాలు చేయించుకోడానికీ, రాయబారాలు నడపడానికీ అయితే వానరులు గొప్ప పరాక్రమవంతులూ, సమర్థులూ, తెలివిగల వారూ! కానీ, అయోధ్యకి రావడానికి మాత్రం ఉత్త అడవి కోతులు! తోటలూ, దొడ్లూ పాడు చేసేస్తారని భయం రాముడికి! అందరూ అడిగింతర్వాత వాళ్ళు రావడానికి రాముడు అంగీకరిస్తున్నాడు.

"వానరులు, విభీషణుడు, ఇటుల చెప్పగా, ధర్మాత్ముడగు రాముడు ఇటులనెను – ... నేను మీతోడ అయోధ్యకు బోయి సంతోషించెదను ... సుగ్రీవా! వానరులతోడ త్వరగా విమానము నెక్కుము. విభీషణా! నీవు మంత్రులతోడ త్వరగా విమానములో గూర్చుండుము."

"పిదప, సుగ్రీవుడు సేనతోడ విమానమెక్కెను. విభీషణుడు మంత్రులతోడ విమానమెక్కెను. ఉత్తమమగు పుష్పక విమానము రాముని యాజ్ఞచే ఆకాశ మార్గములో బోయెను."

(రాముడు, రావణుడి విమానం ఎక్కి, రాజసం ప్రదర్శిస్తున్నాడండీ!)

వానరులు వొస్తామని అడగకముందే రాముడు – "మీరందరూ మా దేశానికి రండి" అని వారిని సంతోషంగా ఆహ్వానించవొద్దూ? కవికి, వానరులంటే చాలా చిన్న చూపు! వానరుల విషయంలో ఏ మర్యాదలూ పాటించనక్కరలేదని కవి అభిప్రాయం. దానివల్ల, రాముడు కృతజ్ఞత లేనివాడై పోతాడనే ఆలోచనే లేదు. వానరులు అడిగిన తర్వాతే రాముడు, "సరే రండి" అన్నాడు. అదీ ఆ ఉత్తముడి జ్ఞానం. ★

**446.** **యుద్ధ, సర్గ 125, ఆఖరి శ్లోకం:** "వానరులును, రాక్షసులును, ఆ విమానమందు ఇరుక్కోనట్లుగా సుఖముగా కూర్చుండిరి." అంటే, ఎంతమంది ఎక్కినా ఆ విమానం ఇరుకు అవదు. ఎక్కిన వాళ్ళందరికీ చోటు వుంటుందని అర్థం. ★

ఇంద్రజిత్తుని హతమార్చేశాడు... ఇక్కడ అంగదుడు ... ఇక్కడ జాంబవంతుడు ...[447]... ఇదుగో, ఇక్కడే మండోదరి సవతులతో వచ్చి భర్త కోసం ఏడ్చింది ... ఇక్కడ చూడు. యుద్ధానికి ముందు ఇక్కడే విడిది చేశాం... ఇక్కడ సముద్రం దాటాం ... ఇక్కడే..." చప్పున కంఠం తగ్గించాడు – "అవును గానీ... ఆ దుష్టుడు ... రావణుడు ఎంత దూరంలో నించునే వాడు?" అని క్రీకంట చూశాడు.

సీత తెల్లబోయి సిగ్గుపడి తల వొంచుకుంది.

రాముడు మళ్ళీ ఉపక్రమిస్తూ, "కిందికి చూడు మరీ ... ఇక్కడే విభీషణుడు నాతో స్నేహం చేసుకున్నాడు. ఇదిగో! నేను ఈ దారి వెంటే వానర సైన్యంతో ప్రయాణం చేసి ... నే నడిగిన దానికి చెప్పనే లేదేం? ఎప్పుడన్నా ముట్టుకున్నాడా? ... దుర్మార్గుడని నాకు తెలుసు. నీ తప్పేముంటుందీ?" అని లాలనగా చూశాడు.

సీత చిన్నబుచ్చుకుని మొహం దించుకుంది. ఈయనకింకా అనుమానం పోలేదా? తన పాతివ్రత్యం గురించి నమ్మకమే లేదా? ఇంకా తన గురించి సందేహ మేనా? 'సీతా, నువ్వు ఎన్ని కష్టాలు పడ్డావో' అనరాదా? 'నీ కోసం దుఃఖిస్తూనే గడిపాను' అనరాదా? తన గురించి ... మళ్ళీ .. మళ్ళీ ... మళ్ళీ ... సందేహమేనా?

"మాట్లాడకుండానే కూర్చున్నావేం? ... కిందకి చూడు. నీ కిష్టమైన పువ్వులెన్నో! చెట్ల నిండా పూల గుత్తు ల్లాగు పిట్టలు చూడు... నీ పైట చెంగుల్లాగు మేఘాలు చూడు!"

"ప్రభూ! ఆ నాడు మిమ్మల్ని ... ఆ లేడి కోసం పంపించానే! ... మీ సహాయానికి పోలేదని లక్ష్మణుణ్ణి కూడా దూషించి ఆశ్రమం నించి పంపిం చేశాను. తర్వాత నేను ఎంత దుఃఖించానో!"

"అంతా మన మంచికే జరిగింది సీతా! ... విధి విధానం ఎవరు తప్పించగలరు? ... మనం సుఖంగా కలుసుకుంటామని నా కెప్పుడూ నమ్మకమే. రావణుడు అందగాడేనా? యుద్ధ భూమిలో చూసినప్పటికీ, ఆ కోపాల మధ్య కవచాలతో... శిరస్త్రాణాలతో ... అంద చందాలేమి గ్రహించగలం? అశోకవనంలో .. నువ్వు చూచినప్పుడు ... అతని రూపురేఖలన్నీ చక్కగా తెలిసి వుంటాయి."

సీతకి కొంచెం ఆలోచన కలిగింది. పర పురుషుడి గురించి తను ఎంత హేళనగా మాట్లాడితే అంత సంతోషం కలుగుతుంది కదా భర్తకి? ".... ఏమి అందం ప్రభూ! ఆ దుర్మార్గుడికి కూడా అందచందాలా?"

"అలా అనకు. దుర్మార్గానికీ అందానికీ ఏం సంబంధం? దుర్మార్గులు కూడా చాలా అందంగా వుండ వచ్చు."

"ఏమో! అతడు ఎప్పుడూ నాకు కురూపిగానే కనపడే వాడు."

"ఒక వేళ అందగాడే అయితే?"

"అయినా నా కెందుకు? నేను పతివ్రతను గానా? మీ కన్నా సుందరులెవరు?"

రాముడు నిరుత్సాహంగా నవ్వి, "అదిగో! చూశావా? ఆ సాల వృక్షాలు..." అని అడవుల సౌందర్యం వర్ణించడంలో మునిగాడు.[448]

సుగ్రీవుడు విమానం ఎగురుడికి ఇంకా ఆశ్చర్య పోతూనే, నీలుణ్ణి అంటిపెట్టుకునే ఉన్నాడు – "ఎక్కడా పడదంటావా ఇది? ... అదంగి చేరుస్తుందంటావా నిజంగా? .... దీని తస్సాదియ్యా! ఏక వరసన, పిట్టలాగే ఎగురుతూ పోతందే! ... ఎవడు చేశాడో గానీ... ఎవడు చేశాడంటా?" అని విభీషణుడి వేపు తిరుగుతూ నీలుణ్ణి డొక్కలో పొడిచాడు.

అప్పుడే నిద్రకి పడ్డ నీలుడు డొక్క పోటుకి విసు క్కుని, "అబ్బ! ఏంటీ?" అని డొక్కని అటు తిప్పు కున్నాడు.

సుగ్రీవుడు విభీషణుడితో, "మీ దేశంలో విమానాలు చేసేవాళ్ళు బాగా ఉన్నారనుకుంటా! మాకో విమానం చేయించి పెట్టు! దానికి మంచి మంచి అద్దాలవీ వుండాలి సుమా! అది కాదు ... ఈ విమానం ఒక్కసారి కూడా పడలేదంటావా? ... రావణుడు భలే వాడయ్యా! చక్కగా అన్ని సొగసులూ చేయించుకున్నాడు. ఎందుకూ, పాపం అనుభవించ లేక పోయాడనుకో! ప్రాప్తం వుండా లిలే దేనికైనా" – పిర్రలోకి హనుమంతుడి గోళ్ళు దిగి, టక్కున నోరుమూశాడు.

విభీషణుడి మొహం రుస రుసలాడుతోంటే, సుగ్రీవు డికి అప్పటికి తెలిసొచ్చింది – "చేసుకొన్న వాడికి చేసు కున్నంత! 'పాపం' చేసిన వాడు అనుభవించక తప్పు తుందా?" అనేసి 'ఇప్పుడు నీ కోపం పోయిందా?' అన్నట్టు విభీషణుణ్ణి నవ్వు మొహంతో చూశాడు.

రాముడు సీతకి నేల మీద విశేషాలు చూపిస్తూనే

---

**447.** యుద్ధరంగంలో ఎక్కడే శత్రువుని చంపారో ఆ స్థలాల దారి వెంటే విమానం నడుస్తోంది! ★

**448.** రాముడు సీతని ఇంకా అనుమానిస్తూనే వున్నాడనటానికి, భవిష్యత్‌లో జరగబోయే సంఘటనలే ఆధారం. ★

వున్నాడు. "అదుగో! దూరంగా కనపడుతున్నదే కిష్కింధ. ఇదే సుగ్రీవుడి రాజ్యం. ఇక్కడే నేను వాలిని చంపి..."

"సుగ్రీవుడి భార్యల్ని కూడా మన దేశం తీసుకు వెళ్తే బాగుంటుంది ప్రభూ!" అంది సీత.

"తప్పకుండా అలాగే చేద్దాము" అని రాముడు సుగ్రీవుణ్ణి పిలిచి, "నీ భార్యలందరినీ చూడాలని సీత అభిలాషపడుతోంది. మీరందరూ దిగి స్త్రీలను తీసుకు రండి" అని విమానం ఆపించాడు.

వానర ప్రముఖులందరూ గంతులేసుకుంటూ దిగారు.

సుగ్రీవుడు కంగారు పడిపోతూ అంతఃపురంలోకి పరిగెత్తాడు. భార్యల్తో, "మీరందరూ గమ్మున బయల్దే రండి. అయోధ్యకు పోతున్నాం ... విమానం ఎక్కుదురు గాని ... ఊఁ ... దబ్బున... ఆలశ్యం చెయ్యకూడదు ... అవతల పెద్ద మనుషుల్తో పని! నగలూ అవీ అన్నీ బాగా పెట్టుకోండి .... అక్కడందరూ గొప్ప గొప్ప వాళ్ళుం టారు ... బుద్ధిగా వుండాలి సుమా? ఊఁ .... లేవండి ... గమ్మున...." అని కంగారు పెట్టి, భార్యలందరూ పాత అలంకారాల మీద ఇంకా ఇంకా కొత్త అలం కారాలు చేసుకున్న తర్వాత అందర్నీ వెంట బెట్టుకు వొచ్చి విమానం ఎక్కాడు.

వానర స్త్రీలందరూ, సీతనీ, విమానాన్నీ వింత పడి చూస్తూ కూర్చున్నారు. అంతవరకూ వాళ్ళు, పతివ్రతల్నీ, విమానాల్నీ చూసి ఎరగరు. రెండూ వింతగానే, రెండూ ఒకటిలాగే వున్నాయి వాళ్ళకి.

"ఆవిడే సీతాదేవి! మహా పతివ్రతట..." అని వొకరి కొకరు చెప్పుకున్నారు.

విమానం కిష్కింధ నించి మళ్ళీ బయల్దేరింది. సుగ్రీవుడు స్త్రీ లందరికీ ధైర్యాలు చెప్తూ తిరిగాడు – "కంగారు పడకండి ... ఏం భయం లేదు... గట్టిగా పట్టుకోండి ... పిట్టలాగ ఎలా ఎగురుతుందో చూశారా? ... మరేంటనుకున్నారు? ... బయటికొచ్చి అన్నీ చూడాలి... విమానం అంటే ఏంటో మీకేం తెలుసు? పడద్దను కుంటున్నారా? ... అబ్బే! ... ఇక్కణ్ణించి పడితే ఇంకే వన్నా వుందా? ..." చప్పున విభీషణుడి వేపు వొంగాడు – "పడనే పడదంటావా? ... ఊరికే అడుగుతున్నాలే. ఎందుకన్నా మంచిదనీ ... అయితే పడదన్న మాట! అవును మరి ... ఎవడు చేశాడో గానీ మా మంచి పనో డయ్యా! మా గొప్ప పనిమంతుళ్ళే..." అని స్త్రీల కందరికీ విమాన సంగతులు చెపుతూ ఇటూ అటూ సంబరంగా తిరుగుతూనే వున్నాడు.

రాముడు భూమి మీద స్థల విశేషాలన్నీ వర్ణిస్తు న్నాడు సీతకి.

పంపా సరస్సుని చూపించాడు. శబరి ఆశ్రమం చూపించాడు. కబంధుణ్ణి చంపిన చోటు చూపించాడు జటాయువూ, రావణుడూ యుద్ధం చేసిన చోటు చూపిం చాడు. పంచవటి ఆశ్రమం చూపించాడు ... అగస్త్య ముని ఆశ్రమం ... సుతీక్ష్ణముని ఆశ్రమం ... శరభంగ ముని ఆశ్రమం ... విరాధుణ్ణి చంపిన స్థలం ... అత్రి ముని ఆశ్రమం ... చిత్రకూట పర్వతం ... గుహుడి రాజ్యం ... అన్నీ చూపించాడు.

దూరంగా అయోధ్య కూడా కనపడింది.

వానరులందరూ విమానంలోంచి అయోధ్యలో మేడలన్నిటినీ ఎగబడి చూశారు.

విమానం భరద్వాజాశ్రమంలో ఆగింది.[449] అందరూ బిలబిల్లాడుతూ దిగారు.

రాముడు భరద్వాజ మహర్షికి నమస్కారం చేసి, "అయోధ్యలో అందరూ క్షేమంగా వున్నారా స్వామీ? నా తల్లులందరూ జీవించి వున్నారా?" అని అడిగాడు.

భరద్వాజుడు రాముణ్ణి వాత్సల్యంతో ఆహ్వానించాడు "అందరూ క్షేమంగానే వున్నారు నాయనా! నీ తల్లులు సుఖంగానే వున్నారు... నువ్వు క్షేమంగా తిరిగి వచ్చావు.

---

**449.** విమానం ఎగిరే దారి ఎలా వుందో గమనించారా? రాముడు లంకకు వెళ్ళేటప్పుడు ఏ దారి వెంట వెళ్ళాడో, ఆకాశం మీద విమానం కూడా ఆ దారి వెంటే వొంపులు తిరుగుతూ వొచ్చింది.

"ఆ ప్రదేశాలన్నీ సీతకి చూపించటానికే ఆ విధంగా తీసుకు వచ్చాడు రాముడు" అంటారా రామ దాసులు? అలా అయితే, పంచవటి వరకూ ఆ రకంగా వచ్చి అక్కణ్ణించి తిన్నగా కోసలకు వొచ్చెయ్యవచ్చు కదా? అయోధ్య నించి పంచవటికి పోయే మార్గం అంతా సీతకు తెలిసిందే గదా? కాలి నడకన పోయే వాళ్ళు నేల మీద వంకర టింకర దారుల్లో పోయినట్టుగా, ఆకాశంలో పోయే విమానం కూడా వంకర టింకరగానే పోతుందా? విమానం అనేది ఎలా ప్రయాణం చేస్తుందో కవికి తెలియకపోయినా, ఊహించడం అయినా (పక్షుల్ని చూసి) చేతకాలేదు.

భరతుణ్ణి తొందరగా చూడాలని ఆరాటపడుతోన్న రాముడు అగస్త్య మహర్షి దగ్గిర గానీ, అత్రి మహర్షి దగ్గిర గానీ, ఇంకో మహర్షి దగ్గిర గానీ ఆగకుండా వచ్చిన వాడు, భరద్వాజ మహర్షి దగ్గిర ఎందుకు ఆగినట్టు? తిన్నగా భరతుడి దగ్గిరికే పోవచ్చునే! ఎందుకో తర్వాత చూడండి! ★

పద్నాలుగేళ్ళ కిందట రాజ్యం పోయి, సమస్త సుఖాలూ విడిచి, కందమూలాలు తింటూ వనవాసానికి వెళ్తోన్న నిన్ను చూస్తే ఎంతో దుఃఖం కలిగింది. ఇప్పుడు నీ కష్ట కాలమంతా గడిచిపోయింది. శత్రువుల్ని జయించావు. స్నేహితుల్ని సంపాదించుకున్నావు, పట్టాభిషేకానికి సిద్ధంగా వున్నావు. చాలా సంతోషం నాయనా! నువ్వు వనవాసంలో పడ్డ బాధలన్నీ విన్నాను. చిత్రకూటం నించి పంచవటి చేరడమూ, అక్కడ సీతని రావణుడపహ రించుకు పోవడమూ, (అమ్మో, ఇప్పుడు అవన్నీ చెపు తాడా?) నువ్వు దుఃఖిస్తూ సుగ్రీవుడితో స్నేహం చేసు కోవడం, వాలిని చంపడం ... యుద్ధంలో రావణుణ్ణి కూడా చంపడం ... అన్నీ విన్నాను. చివరికి నువ్వు సుఖంగా తిరిగి వచ్చావు" అని సంతోషించాడు భర ద్వాజుడు.[450]

రాముడు మళ్ళీ వినయంగా నమస్కారం చేసి, "భరతుడు ఎలా వున్నాడు స్వామీ? శ్రద్ధతో ప్రజా పాలన చేస్తూ వున్నాడు గదా?" అని ఆతృతపడుతూ అడిగాడు.

"భరతుడు సర్వ సుఖాలూ విసర్జించి, నీ రాక కోసమే వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తూ వున్నాడు నాయనా!"

"సర్వసుఖాలూ విసర్జించిన వాడు రాజకీయాలు మాత్రం విసర్జించడా స్వామీ? చుట్టూ శత్రురాజులు ఎంతటెంతటి ఇరుగు పొరుగు రాజ్యాలను కబళించాలా అని..."

"ఆ ప్రమాదమేమీ లేదు రామా! నీ రాజ్యం నీకు అప్పజెప్పాలి కదా? ఆ విషయంలో మాత్రం భరతుడు చాలా శ్రద్ధగా వున్నాడు. నీ పాదుకల ఆజ్ఞతో పరిపాలనా బాధ్యతలన్నీ చక్కగా నిర్వర్తిస్తున్నాడు... తన సుఖభోగాలు మాత్రం విసర్జించి నీ వియోగ భారంతో కృంగి కృశించి పోతూ వున్నాడు నాయనా!"

రాముడు తల పంకించి వూరుకున్నాడు.

భరతుడి గురించి ఎవరెన్ని విధాల చెప్పినా రాముడికి నమ్మకం కలగలేదు – మనసులో! తను చిత్ర కూటంలో వున్న నాటికి భరతుడింకా అనుభవం లేని వాడు కాబట్టి, చేతికందిన రాజ్యం వొదులుకోవ టానికి సిద్ధపడ్డాడు. కానీ ... ఈ నాడూ అలాగే చేస్తాడా? ఇన్ని సంవత్సరాలు రాజరికం చవిచూసిన వాడు అంత సునా యాసంగా పదవి వొదులుతాడా? ఇంత కాలమూ రుషి వేషంలో ఏం అనుభవించాడు? ఇక ఇప్పుడే అన్ని భోగాలూ అనుభవించాలి. సిరి సంపదలూ, పదవులూ, అధికారాలూ వదలుకోవ డానికి మానవమాత్రుల మన స్సులు అంగీకరి స్తాయా? ఆస్తుల కోసం అన్నదమ్ములే పరస్పరం ద్వేషాలు బూనుతారు గదా? కళ్ళ ముందు సుగ్రీ వుడూ, విభీషణుడూ కనబడడం లేదా? తోడ బుట్టిన అన్నల్ని నమ్మించి ద్రోహం చెయ్యలేదా? భర తుడు మాత్రం అంత పని చెయ్యడని ఏమిటి నమ్మకం? తను రాజ్యానికి తిరిగి రావడం ఇష్టం లేక తనని చంపించడానికి రహస్య ప్రయత్నాలు చెయ్య గూడదా? ... భరతుడి ధోరణి ఎలా వుందో తప్ప కుండా తెలుసు కోవలసిందే! అతడు దుర్మార్గమైన ప్రయత్నాల్లో వుంటే, నిర్దయగా బుద్ధి చెప్పవలసిందే! ఈ వానర వీరుల్నీ, రాక్షస వీరుల్నీ వెంట బెట్టుకుని రావడం చాలా మంచి దైంది! ఈ బలగాల్ని చూసి అయినా జంకుతాడు. అసలు, భరతుడి దగ్గిరికి ముందు ఎవరినైనా పంపిం చాలి... ఎవరు వెళ్తే ... ఎవర్ని?

రాముడు గంభీరంగా హనుమంతుడి వేపు చూశాడు.

రాముడి చూపు గ్రహించి హనుమంతుడు, ఆజ్ఞా పించమన్నట్టు చేతులు ముడుచుకుని నించున్నాడు.

"హనుమంతుడా! నువ్వు రాజధానికి వెళ్ళి రావా లోయీ!"

"చిత్తం! నాలుగంగల్లో వెళ్ళిరానా?"

"ముందు శృంగబేరపురం వెళ్ళు. గుహుడికి నే నంటే చాలా భక్తి. నేను క్షేమముగా తిరిగి వచ్చానని

---

**450.** **యుద్ధ, సర్గ 127, శ్లోకాలు 16, 19:** భరద్వాజుడు రాముడు వనవాసం సంగతులన్నీ తన తపో మహిమ చేత గ్రహించినట్టు చెప్పాడు. ఈ సారి ఈయన దూరదృష్టి (ఇంజను) బాగానే పని చేస్తోన్నట్టుంది. భరద్వాజుడు సంతోషించే సమయంలో రాముడు ఒక వరం కోరాడు – "పూజ్యుడా! నేను అయోధ్యకు పోవుచుండగా, మార్గములో గల వృక్షములన్నియు అకాలములో ఫలములు గలిగి, మధువులు స్రవించునవిగ నుండవలయును. ఏ చెట్టు జూచినను, మిగుల రుచి గల అనేక ఫలములతో నిండి యుండవలయునని కోరుచున్నాను."

అలాగేనని భరద్వాజుడు వరం ఇచ్చేశాడు. ఎటు చూసినా నూరు యోజనాల దూరం చెట్లన్నీ కల్పవృక్షాలై పోయాయి. చెట్లన్నీ గబ గబా చిగిర్చి, పూలు పూసి, కాయలు కాసి, పళ్ళై పోయాయి. ఇక తినడమే ఆలస్యం.

రాముడు వానరులకు తిండీ తిప్పలూ పెట్టకుండా, "చెట్లమ్మట పడి ఏది దొరికితే అది తినండి!" అని చుట్టాల్ని చెట్లకి అప్పచెపుతాడు గావున్ను! ★

చెప్పు. నా కష్టాలన్నీ తీరినందుకు చాలా సంతోషిస్తాడు. భరతుడి సంగతులన్నీ అడుగు. తప్పకుండా చెపుతాడు. తర్వాత భరతుడి దగ్గిరికి వెళ్ళు. నేను చిత్రకూటం విడిచి నప్పటి నుంచీ జరిగిన సంగతులన్నీ పూస గుచ్చినట్టు చెప్పు. పంచవటిలో నేను అనేక బాధలు పడుతూ జీవించడం ... ఆ దుర్మార్గుడు సీతను అపహరించుకు పోవడం ... నేను దుఃఖంతో సుగ్రీవుడి స్నేహం చేసు కోవడం ... వాలిని చంపి సుగ్రీవుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చెయ్యడం ... అన్నీ ... ఒక్క సంగతి కూడా విడిచి పెట్ట కుండా చెప్పాలి సుమా! ఇవన్నీ చెపుతూ, భరతుడి ముఖ కవళికలు కనిపెట్టి చూడు! తను కూడా నా దుఃఖానికి దుఃఖపడి, నా సంతోషానికి సంతోషపడతాడో లేదో గ్రహించాలి నువ్వు! నా రాక అతనికి ఇష్టమో కాదో చాలా నేర్పుగా కనిపెట్టాలి సుమా..."

హనుమంతుడు తెల్లబోతూ విన్నాడు.

ఇదేమిటి? రామయ్య, తమ్ముణ్ణి అనుమానిస్తు న్నాడా? ... అంత ఉత్తముణ్ణి! – ఆశ్చర్యంతో నోరు తెరిచి వింటున్నాడు.

సుగ్రీవుడు, విభీషణుడి వేపు జరిగాడు – గుస గుసల కోసం.

వానర స్త్రీలతో అశోక వనం సంగతులు ముచ్చ టిస్తున్న సీత, భర్త మాటలు చెవినబడి ఆశ్చర్య పడుతూ ఆగింది.

రాముడు ఎవరి చూపులూ గ్రహించే స్థితిలో లేడు. గంభీరమైన కంఠంతో హనుమంతుడికి బోధించడంలో మునిగాడు – "మనం సంభాషించేటప్పుడు ఎదుటి వారి మనోభావాలు చక్కగా అర్థం చేసుకుంటూ వుండాలి సుమా! భరతుడు పైకి చక్కగానే మాట్లాడ వచ్చును. మనసులో ఏముందో ముఖ కవళికల ద్వారా, చూపుల ద్వారా, బయటపడుతుంది. నేను సైన్యాలతో, బల గాలతో, వచ్చానని చెప్పు! నా కోసం ప్రాణాలివ్వగల మిత్రులు కూడా నాతో వున్నారని చెప్పు! నేను ఒంటరిగా వున్నాననుకొని నన్ను ధిక్కరించగలనని భ్రమపడతా డేమో! సైన్యాలతో వచ్చానని వింటే తన ప్రయత్నాలన్నీ విరమించుకుంటాడు..."

హనుమంతుడు స్పష్టంగానే తెల్లబోతూ కప్పలాగ నోరు తెరిచేశాడు.

సుగ్రీవుడు, విభీషణుడి చెవి పట్టుకుని వేళ్ళాడు తున్నాడు. "వింటున్నావా, వింటున్నావా! అవ్వ! మనం ఏదో తప్పు చేశాం – అన్నట్టు అస్తమానూ మనల్ని కోర చూపులూ, వార చూపులూ చూస్తాడే! తను చూడు, తమ్ముణ్ణి ఎలా బెదిరిస్తున్నాడో! ... వాళ్ళ అన్నదమ్ము ల్లోనూ కావలసినన్ని లొసుగులున్నాయయ్యా! ఏమం టావు?"

"బాగా అన్నావు, మనమే గాదు, అన్నదమ్ము లందరూ పోట్లాడుకునే వాళ్ళే లెద్దూ!" అంటూ పంచెతో చెవి తుడుచుకుంటూ రాముడి వేపు చూపు తిప్పాడు విభీషణుడు.

అప్పటికి రాముడు అందరి చూపులూ వింతగా తన వేపు వొస్తూ పోతూ వుండడం గ్రహించి, తన ఆరాటం కొంచెం సర్దుకుని గంభీరుడయ్యాడు – "హను మంతుడా! నే నిలా ఎందుకు చెప్పానో గ్రహించావా? సిరి సంపదల విషయంలో మానవులు ఏ విధంగా ప్రవర్తిస్తారో చెప్పాను. ఇంత కాలం రాజ్యం చేసినందు వల్ల భరతుడికి తనే ఎల్లకాలం రాజుగా వుండాలనే కోరిక కలిగి వుండవచ్చును. తప్పు లేదు. అలాంటి కోరిక వుంటే అతనే రాజ్యం తీసుకో వచ్చును. నేను మాత్రం కాదంటానా? కాదని నేను నా పరాక్రమంతో రాజ్యం ఆక్రమించుకోను సుమా! అలా చెయ్యాలంటే వనవా సానికి బయల్దేరకుండానే ఆ పని చేసేవాడిని కదా? అటువంటి పని నా వంటి ఉత్తముడెన్నడూ చెయ్యడు. భరతుడి గురించి ఏ సంగతీ నాకు ముందుగానే తెలి యడం మంచిదని నీకు చెపుతున్నాను. నువ్వు భరతుడికి నా రాక గురించి తెలిపి, అతని మనోభావాలన్నీ కనిపెట్టి, రాజ్యం నా కివ్వడానికి అంగీకారంగా వున్నాడో లేదో, తనే ఏలుకుంటాడో అంతా గ్రహించి, నేను అక్కడికి చేరే లోపలే ఏ సంగతీ నాకు తెలియజెయ్యి" అన్నాడు.

రాముడి మాటలన్నీ హనుమంతుడికీ సమం జసంగానే తోచాయి. "మంచి చెడ్డలన్నీ ఎరిగిన వాడివి రామయ్యా! నీ కన్నా మాకేం తెలుసు? నువ్వు చెప్పినట్టే చేసుకొస్తాను" అని అప్పటికప్పుడే బయల్దేరాడు.[451]

---

**451.** **యుద్ధ, సర్గ 127, శ్లోకాలు 2 .... 5:** రాముడు భరద్వాజుణ్ణి అడుగుతున్నాడు. – "పూజ్యుడా! పురములో సుభిక్షమా? ఆరోగ్యమా? వింటివా? భరతుడు ధర్మయుక్తముగా నున్నాడా?" అని అడిగాడు. దానికి భరద్వాజుడి జవాబు – "భరతుడు జడలు ధరించి దుమ్ముచే గప్పబడిన వాడై, నీ రాక కెదురుచూచుచున్నాడు."

అంతకు ముందు కూడా లంకలో రుద్రుడు రాముడితో – "దీనుడై ఉన్న భరతుణ్ణి ఊరడించు (ఆశ్వాస్య భరతం దీనం)" అన్నాడు. దశరథుడు విమానంలో వచ్చినప్పుడు రాముడితో – "అనురాగము, బలము, ధర్మము నాచరించు భరతుని నీవు జూడవలయును" అన్నాడు.

భరతుణ్ణి గురించి పెద్ద పెద్దలందరూ ఎంత మంచిగా చెప్పినా, రాముడికి అనుమానమే! హనుమంతుడితో ఏమంటు న్నాడో చూడండి. (సర్గ –128, శ్లోకాలు 1 నించి 20 వరకూ.) – "హనుమంతుడా! .... శృంగబేర పురమునకు బోయి ➔

→ … గుహునకు నా క్షేమమును దెలుపుము …. గుహుడు ప్రీతిగల వాడై అయోధ్యకు బోవు మార్గమునూ, భరతుని స్వభావమునూ (ప్రవృత్తి:– అని వాడాడు కవి. భరతుడి ప్రవృత్తి ఎలా ఉందో) సంతోషంతో నీకు దెలుపును. నేను పితృవాక్య పరిపాలన ముగించి తిరిగి వచ్చితినని భరతుడికి చెప్పుము. భరతుడు దీనిని విని అప్పుడు నన్ను గూర్చి ఏ ఆకారమును పొందునో దానిని, ఆ ఆకారమే నీకు తెలియబడ వలసినది. (నేను వచ్చానని వినగానే ఎలా మారతాడో కనిపెట్టు – అని అర్థం.)

అతని తత్వము చేతను, ముఖము యొక్క రంగు చేతను (ముఖము ప్రశాంతంగా అవుతుందో, కోపంగా అవుతుందో), చూపుల చేతను, పలుకుల చేతను, సమస్తములయిన సంగతులును, భరతుని యొక్క ఇంగితములును, తెలియదగినవి. ('అన్ని లక్షణాలూ కనిపెట్టు' అని చెప్పడం!)

"రాముడు – శత్రువులను జయించి, యశస్సు పొంది, గొప్ప బలవంతులైన మిత్రులతో కలిసి వచ్చుచున్నాడని చెప్పుము."

ఈ రకంగా రాముడు భరతుణ్ణి నీచంగా శంకిస్తూ, బెదిరింపుల హెచ్చరిక పంపిస్తున్నాడు. ఒక వేళ భరతుడు రాజ్యం ఇవ్వకపోతే, తన వెంట వున్న బలాలతో రాజ్యాన్ని తనే లాక్కుంటానని బెదిరించడం!

భరతుణ్ణి ఇంత స్పష్టంగా శంకించినట్టు కనపడితే బాగుండదని, అలా శంకించడానికి కారణం ఏమిటో రాముడు మళ్ళీ ఇలా చెపుతున్నాడు. "సర్వకాలముల యందును సమృద్ధిగా నుండునదియు, ఏనుగుల చేతను, గుర్రముల చేతను, రథముల చేతను నిండినదియు; తండ్రి తాతల నుంచి సంక్రమించిన రాజ్యము, ఎవని యొక్క మనస్సును త్రిప్పదు?" ('అలాంటి రాజ్యాన్ని చూస్తే ఎవరి మనసు మారకుండా ఉంటుంది? అంటున్నాడు. రాజ్యభోగాలకూ, విలాసాలకూ భరతుడు తప్పకుండా లోభపడి, లొంగిపోయి, రాజ్యాన్ని తనే ఉంచుకోవాలని ఆశపడతాడని రాముడి అనుమానం. తనైతే, రాజ్యంకోసం ఎంత మోసానికైనా తల పడతాడు. అలా చెయ్యని వాళ్ళు కూడా వుంటారంటే, రాముడికి నమ్మకం లేదు.)

మరి విభీషణుడితో, "ధర్మాత్ముడైన నా తమ్ముడు నా కోసం కృంగి కృశించిపోతున్నాడు" అని ఎందుకన్నాడు? పైకి నాటకం! తన నెవరూ అపార్థం చేసుకోకుండా ఉండాలని ఏమంటున్నాడో చూడండి! "భరతుడు ఇంత కాలము రాజ్య సాంగత్యముచే, తానే రాజ్యమును కోరు వాడైనచో, సమస్తమయిన భూమిని అతడే పరిపాలించవచ్చును" అంటున్నాడు. అంటే, రాజ్యాన్ని భరతుడే ఉంచుకోవాలని అనుకుంటే, తనకేమీ అభ్యంతరం లేదనీ, తను అడ్డు రాననీ చెప్పడం! భరతుడే రాజ్యం తీసుకోవడం తనకేమీ అభ్యంతరం లేకపోతే, "మహా బలవంతులైన మిత్రులతో వస్తున్నానని చెప్పు!" అని బెదిరించడం ఎందుకు? భరతుడి అభిప్రాయం చాటు మాటుగా కనిపెట్టమని చెప్పడం ఎందుకు?

భరతుడి మీద రాముడికి అసలు సందేహమే రాకూడదు. ఒక వేళ సందేహం వస్తే, అది మంచితనంతోనే ఉండాలి. అతను భరతుడితో ఇలా అనాలి – "భరతుడా! పద్నాలుగేళ్ళ కిందట నువ్వు నాకు రాజ్యం ఇచ్చేస్తానన్నావు. ఇప్పటికీ నీకు అదే అభిప్రాయం ఉందా, ఏమైనా మారిందా? ఎప్పుడో నీకు అనుభవం లేని వయసులో, చిన్నతనంలో, తెలిసో తెలీకో రాజ్యం నాకు ఇస్తానన్నావు. ఆ నాడు అలా అన్నావు కాబట్టి, రాజ్యాన్ని ఇప్పుడు తప్పకుండా నాకు ఇచ్చి తీరాలని నేను కోరను. ఆ నాడు చేసిన వాగ్దానం ప్రకారమే జరగాలని నేను నిన్ను అడగను. రాజ్యం నువ్వే ఉంచుకోదల్చుకుంటే అలాగే చెయ్యి! దానికి నేను బాధపడను" అని చెప్పాలి.

రాముడు, హనుమంతుణ్ణి పంపదల్చుకుంటే అతనికి ఏం చెప్పాలంటే: "హనుమంతుడా! భరతుడికి ఇష్టం ఉన్నా లేకపోయినా, రాజ్యం నాకు ఇవ్వడానికే సిద్ధపడతాడేమో! అతనికి ఇష్టం లేకుండా ఇస్తే, ఆ రాజ్యం నేను తీసుకోను. ఎప్పుడో రాజ్యం ఇస్తానన్నాడు కదా అని, 'ఎందుకు ఇవ్వవు' అని నేను అడగను. కానీ, 'రాజ్యం ఇవ్వడం ఇప్పుడు నీకు ఇష్టమా, కాదా' అని అడిగితే, ఇష్టం లేకపోయినా, 'ఇష్టమే' అని పైకి చెప్పవచ్చు. కానీ, ఇష్టం లేకుండా ఇచ్చే వాడికి మొహంలో తప్పకుండా బాధ ఉంటుంది. అదే నువ్వు కనిపెట్టు! అతను బాధపడుతున్నట్టయితే, రాజ్యం అతడు ఇస్తానన్నా నేను తీసుకోను. అందుకే అతని భావం కనిపెట్టమని చెపుతున్నాను" అనాలి.

రాముడి అభిప్రాయం ఇదే అయితే "నేను సైన్యాలతో వచ్చానని చెప్పు! నా కోసం ప్రాణాలు ఇచ్చే మిత్రులు ఉన్నారని చెప్పు!" అని భరతుణ్ణి బెదిరించడానికి ఎందుకు ప్రయత్నిస్తాడు?

భరతుడు తనకి రాజ్యం ఇస్తాడో లేదోనని రాముడికి ఒకటే బెంగ! ఎలాంటి వాళ్ళయినా రాజ్య సుఖాలకు లొంగిపోతారట! తను లొంగిపోతాడు కాబట్టి అందరూ అంతే అని అనుమానం. భరతుణ్ణి గురించి ఎంతమంది మంచిగా చెప్పినా నమ్మకం లేదు. ఆ సంగతులన్నీ తెలుసుకోవడానికే భరద్వాజాశ్రమంలో ఆగాడు.

ఎంత మంది పెద్దలు చెప్పినా నమ్మకుండా రాముడు భరతుణ్ణి శంకిస్తే రాముడు అపకీర్తిపాలై పోతాడని – కవికి తోచలేదు. శ్రీరాముణ్ణి ఎవరు తప్పు పడతారులే – అనే ధీమా కవికి!

రాముడు హనుమంతుడికి ఏం చెప్పాలో అంతా చెప్పి "ఎంత లోపల దూరము పోయిన వారము కామో (అంతలోపల) శీఘ్రముగా వచ్చుటకు తగియున్నావు" అంటున్నాడు. (అంటే, 'మేము దూరం రాకుండానే, ఆ లోగానే మాకు ఎదురు వచ్చి చెప్పు' అని అర్థం.)

→

గుహుడు బాగా పెద్దవాడై పోయాడు. హనుమంతుణ్ణి ఎంతో ప్రేమతో ఆదరించి, రాముడి సంగతులన్నీ విన్నాడు. "అయ్యో! అలా జరిగిందా? .. అంత పని జరిగిందా? చ్చొ ... చ్చొ... అంత కష్టం వచ్చిందా? ... చ్చొ... చ్చొ... అన్ని బాధలు పడ్డాడా?..." అంటూ నోటితో పెద్ద పెద్ద చప్పుళ్ళు చేసుకుంటూ విచారించాడు.

హనుమంతుడు, రాముడి కష్టసుఖాలన్నీ చెప్పి "భరతుడి సంగతులేంటి తాతా?" అని అడిగాడు.

"ఏంటో నాయనా! ఆయనకూ సుఖం లేదు, ఈయనకూ సుఖం లేదు. రాజ్యం పాలిస్తున్నాడన్న మాటే గానీ ధ్యాసంతా అన్నగారి మీదే. అన్నగారి రాజ్యం అన్నగారి కెప్పుడు అప్పజెప్పుతానా అని వెయ్యి కళ్ళతో చూస్తున్నాడు ... తొందరగా వచ్చి తమ్ముణ్ణి చూడక అక్కడ ఆగి నిన్ను పంపించాడా రామయ్య?" అని విసుక్కున్నాడు గుహుడు.[452]

హనుమంతుడు గుహుడితో కాస్సేపు ఇదీ అదీ మాట్లాడి, "భరతుడు నిజంగా అన్నగారికి రాజ్యం ఇచ్చేలాగే వున్నాడంటావా? తనే కాజేసేలాగ వున్నాడా?" అని అసలు విషయం కదలేశాడు.

గుహుడికి రయ్యిన చెప్పలేనంత కోపం వొచ్చింది – హనుమంతుడి మీద. బొడ్లోంచి చుట్ట తీసి ఇవ్వబోయిన వాడే చుట్టని మళ్ళీ బొడ్లో దోపేసుకుంటూ మొహం చిట్లించేసి, "ఆయనకి తగ్గ బంటులాగే వున్నావే! చాలు చాలు గానీ వెళ్ళు!" అంటూ లేచాడు.

"అది కాదు తాతా! ... రామయ్య పోట్లాటకి వొచ్చాడనుకుంటున్నావా? భరతుడు ఇష్టపడి రాజ్యం ఇస్తేనే తీసుకుంటాడు ... లేకపోతే లేదు ... ఆ చుట్ట ముక్క ఇలా పడేద్దూ! మీ దేశం చుట్టలెలా గుంటాయో చూస్తాను" అంటూ గుహుడి వెనకాలపడ్డాడు హనుమంతుడు.

గుహుడు కొంచెం కోపం తగ్గి చుట్ట తీసి గిరాటేశాడు, మాట్లాడకుండా.

హనుమంతుడు కాస్సేపు చుట్ట కాల్చి, కళ్ళు తేలేసి, "చాలా బాగుంది తాతా!" అని చుట్టని మెచ్చుకున్నాడు.

ఇద్దరికీ చుట్టరికం కలిసింది. గుహుడు బాగా మెత్తపడ్డాడు. ఏ యే ఆకుల్తో చుట్టలు రుచిగా వుంటాయో ఇద్దరూ కాస్సేపు చెప్పుకున్నారు.

"కరకాకు చుట్టలు అన్నిటి కన్నా బాగు. మంచి ఘాటు" అన్నాడు హనుమంతుడు.

నిజమేనని వొప్పేసుకున్నాడు గుహుడు.

"వావిలాకు చుట్టలు ఎప్పుడన్నా కాల్చావా తాతా? వాటి రుచే వేరు. కొంచెం చిరు చేదుగానీ..."

దానికీ ఒప్పేసుకున్నాడు గుహుడు. "ఆఁ, కాల్చా. బాగానే వుంటాయి."

ఆ చుట్టరికంతో గుహుడు హనుమంతుడికి ఇల్లూ వాకిలీ అంతా చూపించాడు.

జోరీగల్నీ, కందిరీగల్నీ పెంచుతున్నాడు గుహుడు పదేళ్ళ నించీ.

"పిట్టల్ని పెంచడం చూశాం గానీ ... ఇదేంటీ?" అని విస్తుబోయాడు హనుమంతుడు.

"ఇవి అన్నిటికన్నా ఉపయోగం నాయనా! ఎవరన్నా మనల్ని పట్టుకుని వదలకుండా వాగుతూ వుంటారనుకో, వాళ్ళ మీదకి వొక్క జోరీగని వొదిల్తే ... చూపిస్తానుండు" అని తీగల బుట్ట తెరవబోయాడు గుహుడు.

"వెళ్తాను తాతా! భరతుణ్ణి చూడాలి. చాలా పని వుందిలే ..." అంటూ మాయం అయిపోయాడు హనుమంతుడు.

జోరీగల్ని పెంచడం ఎంత ఉపయోగమో గుహుడికి నిజంగా బాగా అర్థమైంది.

★ ★ ★

హనుమంతుడు గ్రామాల వెంట నడుచుకుంటూ ప్రజల కట్లూ, బొట్లూ, వేషభాషలూ చూసుకుంటూ, అబ్బురపడుతూ నంది గ్రామం చేరాడు.

భరతుడు రుషి వేషంతో ఆశ్రమ జీవితం గడుపుతున్నాడు. రాజాస్థానంలో మంత్రులూ, పురోహితులూ, సేనాధిపతులూ, ఉద్యోగులూ అందరూ కాషాయ వస్త్రాలే కట్టుకుని వున్నారు. అందరికీ వైరాగ్యమే. అందరికీ రామ

---

➔ "ఇటుల రాముడు ఆజ్ఞాపించగా వాయు పుత్రుడగు హనుమంతుడు మనుష్య రూపము దాల్చి అయోధ్యకు ప్రయాణము జేసెను." వానర రూపంలో నించి మనుష్య రూపంలోకి మారాడు కదా? ఇప్పుడు చూడండి, ఎంత చక్కగా ఎగురుతాడో! "పిమ్మట హనుమంతుడు, సర్పమును పట్టుకొనుటకు గరుడుడు మిగుల త్వరగా బోవునటుల, పైకెగిరి వేగముగ బోయెను."

మనిషి, నడుచుకుంటూ వెళ్తాడా, ఎగురుతాడా? – హనుమంతుడు ఎగురుతూనే గంగ దాటి శృంగబేరపురం వెళ్ళాడు, గుహుడి దగ్గిరికి. ★

**452.** **యుద్ధ, సర్గ 128, శ్లోకాలు 22, 23:** హనుమంతుడు గుహుడితో – "గుహుడా! రాముడు నీ క్షేమమును విచారించవలయునని చెప్పెను. నేటి పంచమి రాత్రి భరద్వాజుని అనుజ్ఞ బుచ్చుకొని వచ్చుచుండు రాముని నీవు జూచెదవు" అని చెప్పి, మరల పైకెగిరెను. (భరతుణ్ణి గురించి అడగడం అదీ ఇక్కడ లేదు.) ★

వియోగ భారమే.[453]

రాజ్యపాలన మాత్రం, అందరూ కలిసి ఎటు వంటి అలక్ష్యమూ లేకుండా కట్టుదిట్టంగా, చట్ట బద్ధంగా, నేర్పుగా, తెలివిగా, చాకచక్యంగా, గడుసుగా, సాగిస్తున్నారు.

భరతుణ్ణి చూసీ చూడగానే హనుమంతుడికి, భరతుడు నిజంగానే అన్నగారి మీద భక్తిగా వున్నాడనే నమ్మకం కలిగింది.

అయినా రాముడి మాటలన్నీ చెవుల్లో గింగురుమన్నాయి – "బాగా పరకాయించి చూడు. మనో భావాలన్నీ కనిపెట్టు. ముఖ కవళికలన్నీ ... జాగ్రత్తగా ... నేర్పుగా..." అన్నీ చెవుల్లో మెదిలి భరతుణ్ణి పరిశీలించి చూస్తూ చేతులు జోడించి నిలబడ్డాడు – "మహారాజా! నా పేరు హనుమంతుడు. శ్రీరామ చంద్రుడి బంటుని. శ్రీరామచంద్రుడు వనవాసం ముగించి వొస్తూ వున్నాడు ప్రభూ!" అని వినయంగా చెప్పి నించున్నాడు.[454]

భరతుడు అమితానందంతో మూర్ఛబోయి, లేచి, "నీ మాటలు సత్యమేనా వానరుడా!" అని సంభ్రమంగా అడిగాడు.

"సత్యమే ప్రభూ! శ్రీరాముడు భరద్వాజ ముని ఆశ్రమంలో ఆగి వున్నాడు. ఈ పాటికి బయల్దేరి వొస్తూ వుంటాడు. నన్ను ముందుపోయి ఈ శుభ వార్త నీకు అందించమన్నాడు" అంటూ హనుమంతుడు కళ్ళింతింత చేసుకుని, కనురెప్పలు వెయ్యకుండా, భరతుణ్ణి ఎగాదిగా చూస్తూనే వున్నాడు.

"ఆహా! ఎంత కాలానికి విన్నాను ఇంత చల్లని వార్త! ప్రాణాలతో అంటూ వుంటే జీవించివున్న మనుషులు వందేళ్ళకైనా కళ్ళబడతారంటారు. ఆ మాట నిజమే... అంతా వివరంగా చెప్పు హనుమంతుడా! మా అన్నగారి వనవాసం ఏ విధంగా ముగిసిందో చెప్పు" అంటూ భరతుడు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ చూశాడు.

హనుమంతుడు జరిగిందంతా చెప్పుకొచ్చాడు.[455]

---

**453. యుద్ధ, సర్గ 128, శ్లోకాలు 32, 33:** "కాషాయ వస్త్రములు ధరించిన మంత్రులు, పురోహితులు, సేనాపతుల చేత సేవించబడే వాడగు భరతుని, హనుమంతుడు చూచెను."

కాషాయాలు కట్టుకుంటే భరతుడు కట్టుకోవాలి గానీ ఆస్థానంలో వాళ్ళందరికీ రుషి వేషాలెందుకూ? రాముడికి సుఖం లేకపోతే ఇక ఎవ్వరికీ అది ఉండకూడదు. ఎవ్వరూ సుఖపడకూడదు. తన చుట్టూ ఉన్న మంత్రులూ వాళ్ళూ, నగలూ అవీ పెట్టుకుంటే, తన మనసు కూడా అటే లాగుతుందని భరతుడి భయం గావున్ను. అందుకే అందర్నీ కాషాయ గుడ్డలే కట్టుకోవాలని ఆజ్ఞాపించినట్టున్నాడు. భరతుడి తప్పేమీ లేకుండా చెయ్యడం కోసం కవి ఏమంటున్నాడో చూడండి. "నార వస్త్రములు, కృష్ణాజినములు ధరించువాడును, ధర్మాత్ముడును నగు భరతుని విడిచి, అచట నుండిన మంత్రులూ మొదలగు పుర జనులు, తగిన వస్త్రాభరణముల ననుభవించుటకు ఇష్టపడ లేదు." ఎంత వైరాగ్యమో అందరికీ! రాజుగార్ని ఆనందపెట్టడానికే!

రాజ్యపాలనకి మాత్రం ఎవరికీ ఏ వైరాగ్యమూ లేదు! ★

**454. యుద్ధ, సర్గ 128, శ్లోకాలు 42, 43, 44:** హనుమంతుడు భరతుడి దగ్గిరికి వొచ్చి రాముడు వొస్తున్నాడనే సంగతి చెప్పీ చెప్పగానే భరతుడు ఆనందంతో హనుమంతుడికి కొన్ని బహుమానాలు ఇస్తానన్నాడు. తర్వాత రాముడి సంగతులు వివరంగా అడిగాడు.

భరతుడు హనుమంతుడికి ఇస్తానన్న బహుమానా లేమిటేమిటో చూడండి! భరతుడి మాటలు – "సౌమ్యుడా! నీవు దయతో ఇచ్చటికి వచ్చిన దేవతవా, మనుష్యుడివా? నీవు నా కిటువంటి ప్రియమును చెప్పినందులకు గాను, నీకు లక్ష గోవులను; నూరు ఉత్తమమైన గ్రామములను; మంచి కన్నులు గల వారలును, మంగళకరమైన ఆచారము గల వారలును, బంగారము వంటి శరీర వన్నెగల వారలును, సుందరములయిన ముక్కులూ తొడలూ గల వారలును, చంద్ర బింబముల వంటి ముఖములు గల వారలును, సర్వాభరణములతో గూడిన వారలును, ఉత్తమమైన కులముతో గూడిన వారలును,

కన్యాః = పెండ్లికాని వారలును, భార్యాః = భార్యలు కాదగిన వారలును నగు, స్త్రియః = స్త్రీలను, షోడశ = పదునారు మందిని, దదామి = ఇచ్చుచున్నాను.

హనుమంతుడికి పదహారు మంది భార్యలు! 'వాల్మీకి రామాయణం' ప్రకారమే!

ఈ భార్యలు, మానవ స్త్రీలా, వానర స్త్రీలా? వానర స్త్రీలు, భరతుడి దగ్గిర ఉంటారా? హనుమంతుడికి మానవ భార్యలా? ఎవరికి ఇచ్చెయ్యడానికైనా రాజుగారి చేతిలో బానిస స్త్రీలు కొల్లలుగా ఉంటారన్నమాట!

హనుమంతుణ్ణి 'బ్రహ్మచారి'ని చేసే మన పెద్దలంతా ఏమంటారో ఇప్పుడు? ★

**455. యుద్ధ, సర్గ 129, శ్లోకం 5:** రాముడి వనవాసం గురించి భరతుడికి చెప్పాలంటే – భరతుడు చిత్రకూటం నించి వొచ్చేసింతర్వాత ఏం జరిగిందో, అక్కణ్ణించి ప్రారంభించి చెప్తే చాలును గదా? కానీ, హనుమంతుడు భరతుడితో, ➔

భరతుడు బొట బొట కన్నీళ్ళు విడుస్తూ మాటి మాటికీ మూర్ఛలుబోతూ, తేరుతూ, అంతా విన్నాడు.

భరతుడి దుఃఖం, నిజం దుఃఖమేనని హనుమంతుడు గట్టిగానే నిర్ధారణ చేసుకున్నాడు–"ఈ పాటికి శ్రీరాముడు భరద్వాజాశ్రమం నించి బయల్దేరే వుంటాడు..." అని ముగించాడు.

భరతుడు వెంటనే శతృఘ్నుణ్ణి చూస్తూ, "శ్రీరాముడికి స్వాగతము ఇవ్వడానికి సమస్తమైన ఏర్పాట్లూ చేయించు! నంది గ్రామానికి వచ్చే దారులన్నీ సరి జేయించు! పౌరులందరూ దేవాలయాలలో పూజలు చెయ్యాలి. వీధులన్నీ సుందరంగా అలంకరించాలి. రాముడి కోసం – వేశ్యలూ, వైతాళికులూ, స్తోత్ర పాఠకులూ, పురజనులూ, అందరూ మంగళ వాయిద్యాలతో ఎదురు వెళ్ళాలి. ఒక్క క్షణం కూడా ఆలశ్యం కూడదు. వెంటనే ఏర్పాట్లన్నీ చేయించు! ఇది శ్రీరామ పాదముల ఆజ్ఞ" అని ఆజ్ఞాపించాడు.[456]

రాజాజ్ఞ ముగిసేసరికే ఏర్పాట్లన్నీ ముగిశాయి.

నంది గ్రామంలో ప్రజలందరూ వీధుల్లో గుంపులు గుంపులుగా జేరారు. అయోధ్య ప్రజలు కూడా నంది గ్రామానికి బయల్దేరారు.

భరతుడు తన వెంట పురోహితుల్నీ, పండితుల్నీ, మంత్రుల్నీ, వ్యాపారుల్నీ తీసుకుని అన్నగారి చెప్పులు నెత్తిమీద పెట్టుకుని అన్నగార్ని ఆహ్వానించడానికి, రథంలో బయల్దేరాడు.

సేవకులు భరతుడి తలమీద చెప్పులకు వింజామరలు వీస్తూనే వున్నారు. ఉద్యోగులూ, వ్యాపారులూ నమస్కారాలు చేస్తూనే వున్నారు.

ఊరు బయటికి ఎంతదూరం పోయినా రాముడు వచ్చే జాడ లేమీ కనబడలేదు.

భరతుడు హనుమంతుణ్ణి కోపంగా చూస్తూ, "అసలు నువ్వు చెప్పింది నిజమేనా? మీ అడివి మనుషులకేమీ తెలీదు. నోరు తెరిస్తే చాలు లక్ష అబద్ధాలాడతారు" అని మొహం చిట్లిస్తూ విసుక్కున్నాడు.[457]

హనుమంతుడు చిన్నబుచ్చుకుని – "నా మాటలన్నీ నిజమే ప్రభూ! వానరులు దారి పొడుగునా వింతలు చూసుకుంటూ, ఆటలాడుతూ, పళ్ళు తింటూ వొస్తూ

---

➔"నీ తల్లి కోరిన వరాల వల్ల శ్రీరాముడు అయోధ్య నించి అరణ్యాలకు బయల్దేరాడు" అని కైక వరాల దగ్గిర్నించీ మొదలుపెట్టాడు. భరతుడికి గతమంతా సరిగా గుర్తుందో లేదోనని. 'రాముడు, నీ తల్లి వల్లే బాధలు పడ్డాడు సుమా!' అని చెప్పడం! రాజ్యం ఇచ్చే విషయంలో భరతుడి మనసేమైనా ఊగిసలాడుతోంటే, దాన్ని సరిజెయ్యాలనే ప్రయత్నం! ★

**456.** **యుద్ధ, సర్గ 130, శ్లోకాలు 6, 10:** "నంది గ్రామం నుంచి బయటకు పోవు దారులలో గుంటలను, మిట్టలను సమముగ చేయవలెను."

ఈ నాడు కూడా మంత్రులు వచ్చేముందే అక్కడక్కడా రోడ్లు బాగుచేస్తూ ఉంటారు. ఇది శ్రీరాముడి కాలం నించీ సాగుతోన్న నాటకం అన్నమాట!

"రాజ స్త్రీలు, మంత్రులు, సేనలు, సామాన్య స్త్రీలు, బ్రాహ్మణులు, రాజపుత్రులు, నానా జాతుల వారు, గుంపులు గుంపులుగా రాముని కెదురుగ బోవలయును."

ప్రజలు రాముణ్ణి చూడాలనే ఆసక్తితో వారికై వారే వెళ్ళాలి గానీ – "మీరందరూ రండి" అని ఆజ్ఞాపించి లాక్కుపోతే, అది భక్తి అవుతుందా? మన మంత్రుల సభలకు వూళ్ళ వూళ్ళనించీ లారీలలో జనాన్ని లాక్కురావడానికి దీనికీ తేడా లేదు. ఆ నాటినించీ ఉన్న మోసమే ఇది. ★

**457.** **యుద్ధ, సర్గ 130, శ్లోకాలు 22:** భరతుడు కొంతసేపు నిరీక్షించి వాయు పుత్రుడగు హనుమంతునితో నిట్లనెను – "వానరబుద్ధికి సహజమయిన చిత్త చపలతచే రాముడు వచ్చుచున్నాడని చెప్పితివా ఏమి? పూజ్యుడగు రాముడింకను అగుపడలేదే! వానరులును అగుపడలేదే!"

మాటి మాటికీ వానరులంటే ఎంత హేళనో! 'వానర బుద్ధితో చెప్పావా?' అట!

రాముడి రాక కోసం భరతుడు చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నాడని చెప్పాలని కవి అభిప్రాయం. "అయ్యో! రాముడు ఇంకా రాలేదే! ఎప్పటికి చూస్తానో ఆ సుందర ముఖార విందాన్ని ...." అంటూ వంద శ్లోకాలు రాసుకోవచ్చుగా, రాముడొచ్చే వరకూ! హనుమంతుణ్ణి చిన్నబరచడం ఎందుకు?

రావణుడు సీతని ఎత్తుకుపోవడం – దగ్గిర్నించీ చివరి వరకూ జరిగిందంతా హనుమంతుడు భరతుడికి చెప్పాడు కదా? అందులో, హనుమంతుడు రాముడికి ఎంత సహాయం చేశాడో భరతుడికి అర్థం కాలేదా? అంత ఉపకారం చేసిన వాణ్ణి పట్టుకుని! 'నీ కోతి బుద్ధి' అనడమా? ఈ అన్నదమ్ముల్లో ఎవరికీ 'మనిషి బుద్ధులు' లేవు! హనుమంతుణ్ణి వెక్కిరించకుండా భరతుడి ప్రేమని చూపించే మార్గం దొరకలేదా కవికి? తన అన్నకి హనుమంతుడు చేసిన సహాయానికి భరతుడు కృతజ్ఞత చూపాలా, అక్కర్లేదా? ➔

వుండాలి... అదుగో! దుమ్ములేస్తోంది. చూడు, వానరులు సాల వనమంతా పాడు చేసుకుంటూ వొస్తున్నారను కుంటాను" అంటూ మెడ ఎత్తి, సాగి, నిగిడి, దూరానికి చూస్తూ నించున్నాడు. అందరూ శరీరాలు సాగదీసి, మెడలెత్తి దూరానికి చూశారు. నలక లాగ విమానం ఎక్కడో దూరాన కనపడి, పెరుగుతూ పెరుగుతూ దగ్గ రికి వొచ్చింది.

అప్పటికి, ఎప్పుడో విమానం దిగి గంతులేసు కుంటూ బయల్దేరిన వానరులందరూ వొచ్చేశారు.

విమానం ఆకాశంలో ఆగింది. విమానంలో, ఆకాశంలో వున్న రాముడికి, భరతుడితోపాటు, అతని చుట్టూ వున్న వారందరూ నమస్కారాలు చేశారు.

విమానం కిందికి దిగింది.[458]

భరతుడు తన వెంట బలగంతో విమానంలోకి వెళ్ళాడు.

రాముడి కళ్ళు హనుమంతుడి కోసం వెదుకు తున్నాయి. భరతుణ్ణి పరీక్షగా క్రీకంట చూస్తూ "వచ్చావా నాయనా?" అని అతన్ని చటుక్కున వొళ్ళోకి లాక్కుని, గట్టిగా కావలించుకున్నాడు. "ఎంత కాలానికి చూశాను నాయనా నిన్ను? బాగున్నావా? క్షేమంగా వున్నావా?" అని వొళ్ళంతా నిమురుతూ ఉక్కిరిబిక్కిరి చేశాడు.

హనుమంతుడు, కంటి చూపుల్తో శ్రీరాముడికి ధైర్యం చెప్పాడు, "భరతుడు నమ్మకస్తుడే, భయం లేదు" అన్నట్టు![459]

భరతుడు అన్నగారి ప్రేమాలింగనాల్లోంచి బయట పడి, తేరుకొని లక్ష్మణుడికీ, సీతకీ, నమస్కారాలు చేశాడు.

తర్వాత సుగ్రీవుణ్ణి కావలించుకున్నాడు. "నువ్వు కూడా మాలో వొకడివే నోయీ! మా సోదరుడివే" అని తన సంతోషం ప్రకటించాడు.

విభీషణుణ్ణి కూడా సంతోషంగా పలకరించాడు. "నీ సహాయం వల్లనే మా అన్నగారు అంత గొప్ప కార్యం చెయ్యగలిగారోయీ!" అని తన కృతజ్ఞత చెప్పుకుని అందర్నీ ఆనందపెట్టాడు.

శతృఘ్నుడు కూడా అందరికీ నమస్కారాలు చేశాడు.[460]

రాముడు, శతృఘ్నుణ్ణి చూసీ చూడనట్టు వూరుకుని, తల్లులందరికీ నమస్కారాలు చేశాడు.

---

➔ భరతుడు గతంలో చిత్రకూటం నించి అన్నగారి చెప్పులు తీసుకు వస్తూ – "సరిగ్గా పద్నాలుగేళ్ళయ్యేటప్పటికి నువ్వు రాకపోతే నేను అగ్నిలో పడి చచ్చిపోతాను" అన్నాడు కదా? ఇప్పుడు రాముడి రాకకి ఎదురుచూస్తూ, రాముడింకా రావడం లేదనే నిరాశతో భరతుడు చితి పేర్చమని ఆజ్ఞాపించి, అందులో దూకడానికి సిద్ధంగా ఉండడం .... అంతలో రాముడు రావడం .... ఈ రకం నాటకీయతకు అవకాశం ఉండి కూడా కవిగారు ఆ విధంగా కథని మలచలేదు. ఆయనకు తోచలేదో, భరతుడి ప్రతిజ్ఞ సంగతి మరిచిపోయారో గానీ, రామదాసులకు గొప్ప ఘట్టం ఒకటి లేకుండా చేశారు. ★

**458.** **యుద్ధ, సర్గ 130, శ్లోకం 32:** "ఈ విమానంలో వీరులగు రామలక్ష్మణులు, సీతాదేవి, గొప్ప తేజస్సు గల సుగ్రీవుడు, రాక్షసుడగు విభీషణుడు గూర్చుండియున్నారు." – ఈ మాటలు హనుమంతుడివి.

భరద్వాజాశ్రమం వరకూ మొత్తం అందరూ విమానంలోనే వొచ్చారు కదా? అక్కడ వానరుల్ని దింపేశారన్న మాట! వాళ్ళు ఎగురుకుంటూ, దుమ్ము రేపుకుంటూ వొచ్చారు. అందరూ ఎక్కితే విమానంలో ఇబ్బందా – అంటే, అలాంటిదేమీ వుండదని, లంకలో విమానం బయల్దేరినప్పుడే కవి వర్ణించాడు. ఆ విమానంలో ఎంతమంది ఎక్కినా ఇంకా చోటు ఉంటూనే వుంటుంది. అలాంటి విమానంలోంచి వానరుల్ని దించెయ్యడం ఎందుకు, కుళ్ళు బుద్ధి గాకపోతే? వానరులంటే ప్రతీచోటా చిన్న చూపే. ★

**459.** హనుమంతుడు రాముణ్ణి కలిసి భరతుడి సంగతి చెప్పడం కథలో ఉండనే ఉండదు. వెనక చెప్పిందేమిటో ఎప్పటికప్పుడు మరిచిపోవడమో, నిర్లక్ష్యంగా వొదిలెయ్యడమో! ★

**460.** **యుద్ధ, సర్గ 130, శ్లోకం 40, 48:** రాముడు భరతుడి విషయంలో ఎలా ఉన్నాడో, శతృఘ్నుడి విషయంలో ఎలా ఉన్నాడో చూడండి! "బహుకాలమునకు తన కగుపడిన భరతుని లేవనెత్తి (తన పాదాల మీద నించి) అతణ్ణి తన తొడమీద కూర్చుండబెట్టుకొని రాముడు సంతోషించి ఆలింగనము చేసుకొనెను."

"శతృఘ్నుడు రామలక్ష్మణులకు వందనము జేసి పిదప సీతాదేవి పాదములకు వినయముతో నమస్కరించెను."

ఆ రకంగా నమస్కారం చేసిన శతృఘ్నుణ్ణి రాముడు పలకరించినట్టు గానీ దగ్గరికి తీసుకున్నట్టు గానీ లేదు. రాముడు శతృఘ్నుణ్ణి కూడా పలకరించాలని కవికి తోచనే లేదు.

ఆస్తిపాస్తుల వ్యవహారాలన్నీ భరతుడితోటే కదా? ఏ విలువా లేని శతృఘ్నుణ్ణి తొడ ఎక్కించుకోడం ఎందుకు, మోత దండగ! ★

భరతుడు బంగారం పళ్ళెంలోంచి చెప్పులు తీసి రాముడి పాదాలకు తొడిగి "మహారాజా! ఇంత వరకూ నీ రాజ్యం నేను కాపాడుతూ వున్నాను. బొక్కసం, ధాన్యాగారం, సైన్యం, సమస్తం ఒకటికి పదింతలు చేశాను గానీ, నే నేమీ పాడు చెయ్యలేదు. ఇక నీ రాజ్యం నీకే అప్పగిస్తున్నాను" అని వొంగి నమస్కారం చేశాడు.

రాముడు నమ్మలేనంత ఆశ్చర్యంతో నిర్ఘాంతపడి చూశాడు – భరతుడు ఇంత ఉత్తముడా? చేతికి చిక్కిన రాజ్యాధికారం ... ఇంత సునాయాసంగా వదిలేశాడా? ఇది మానవ మాత్రులకు సాధ్యమౌతుందా?

సుగ్రీవుడూ, విభీషణుడూ కూడా ఆశ్చర్యంతో భరతుణ్ణే చూస్తూ నిలబడిపోయారు.

రాముడు మళ్ళీ భరతుణ్ణి కావిటేసుకుని తొడ మీదకి లాక్కున్నాడు.[461]

విమానం మళ్ళీ ఆకాశంలోకి లేచి ఊరి సరి హద్దుల నించీ నంది గ్రామం చేరింది.

రాముడు అందరితో కలిసి విమానం దిగి, "పుష్ప కమా! నువ్వు ఇక కుబేరుడి దగ్గరకు వెళ్ళి పో" అని విమానాన్ని ఆజ్ఞాపించాడు. విమానం, ఉత్తరం వేపుగా ఎగిరి వెళ్ళిపోయింది.

విమానం వెళ్ళిపోతూ వుంటే విభీషణుడు నిర్ఘాంత పడి చూసి, ఎర్రబడ్డ మొహంతో సుగ్రీవుడి వేపు జరిగాడు. కళ్ళచూపులు తప్ప ఒక్క మాట కూడా చెప్పుకో డానికి వీల్లేని పరిస్థితిగా వుంది. జనం ముట్టడించి చుట్టూ నిలబడి ఎగా దిగా చూస్తున్నారు.[462]

భరతుడు రాముడితో పరవశంగా ఏమిటేమిటో అంటున్నాడు. మాటి మాటికీ నమస్కారాలు చేస్తున్నాడు. "మహారాజా! ఇక ఈ రాజ్యభారం నేను మొయ్యలేను సుమా! ఈ మహత్తర బాధ్యత నువ్వు స్వీకరించవల సిందే. ఎద్దు చేసే పని దూడ చెయ్యగలదా? గుర్రంలాగ గాడిద పరిగెత్తుతుందా? హంసలాగ కాకి ఎగురుతుందా? రాజనీతిజ్ఞుడివైన నీలాగ రాచకార్యాలు నిర్వర్తించడానికి నేను పనికిరాను. ఫలించని పెరటి చెట్ల వల్ల ఏమీ ప్రయోజనం లేనట్టే, నువ్వు పాలించని రాజ్యం

---

**461.** **యుద్ధ, సర్గ 130, శ్లోకాలు 53 .... 58:** ధర్మ స్వరూపము నెరిగిన భరతుడు, తాను చిత్రకూటము నుండి తీసికొని పోయిన పాదుకలను దెచ్చి పురుషోత్తముడగు రాముని పాదములలో జేర్చి అపుడు అంజలి జేసికొని రామునితో నిటులనెను. "రాజా! ఇంతకాలము నేను కాపాడిన రాజ్యము ఇప్పుడు నీకు సమర్పించుచున్నాను. ఇప్పుడు మరల అయోధ్యను పొందిన రాజువైన నిన్ను చూచినందున నా జన్మము సఫలమైనది."

భరతుడు ఇంకా ఏమంటున్నాడో చూడండి. "రాజా! నీవు, కోశమును, ధాన్యాగారమును, పట్టణమును, సైన్యమును చూడుము. నీ తేజస్సు చేత, నేను సమస్తమును పదింతలు పెంచితిని. (దశగుణం = పదిరెట్లు; కృతం = చేయబడినది.)"

రాజాస్థానంలో అందరికీ వైరాగ్యమే! అయినా సరే, పరిపాలన ఇంత ఉత్సాహంగా సాగింది. పద్నాలుగేళ్ళ కాలంలో సంపద పదిరెట్లు ఎలా పెరిగిందో! ఏం చేస్తే పెరిగిందో!

అన్నగారితో అంత భక్తిగా మాట్లాడుతోన్న భరతుణ్ణి చూసి సుగ్రీవుడూ, విభీషణుడూ, కన్నీళ్ళు విడిచారు! – (మనం ఇంత మంచి తమ్ముళ్ళం కామే – అని సిగ్గేసింది గావున్ను!)

"పిమ్మట శ్రీరాముడు, భరతుని, సంతోషముతో తొడ మీద కూర్చుండబెట్టుకొని విమానంలో నంది గ్రామమునకు బోయెను." (మళ్ళీ తొడ మీద! – రాముడి తొడలెక్కే అదృష్టం భరతుడికి మాత్రమే కలిగింది. లక్ష్మణుడికీ లేదు, శత్రుఘ్నుడికీ లేదు. భరతుడికి కూడా ఇక తర్వాత ఉండదు లెండి! రాజ్యం ఇచ్చేశాడుగా?) ★

**462.** **యుద్ధ, సర్గ 130, శ్లోకాలు 59, 60:** "అపుడు రాముడు నంది గ్రామము చేరి విమానం నుంచి దిగి భూమి మీద ఉండెను. రాముడు ఉత్తమమగు ఆ విమానమును చూసి, 'ఇక మీద కుబేరుని వద్దకు బొమ్ము. ఉత్తరువు ఇచ్చితిని' అని చెప్పెను. రాముడు ఆజ్ఞాపించగా ఆ పుష్పక విమానము ఉత్తర దిక్కుగ కుబేరుని భవనమునకు బోయెను."

ఆ విమానం మొదట ఎప్పుడో కుబేరుడిదట. దాన్ని రావణుడు జయించుకున్నాడు. తర్వాత అది విభీషణుడికి అందింది. దాన్ని విభీషణుడు రాముడికి ఇచ్చాడు – ప్రయాణానికి. పోనీ రాముడికి అచ్చంగానే ఇచ్చేశాడనుకుందాం. దాన్ని తన దగ్గిర ఉంచుకునే ఉద్దేశం లేనప్పుడు రాముడు దాన్ని మళ్ళీ విభీషణుడికే ఇచ్చెయ్యాలి కదా? కుబేరుడి దగ్గిరికి పంపడం ఏమిటి? సుగ్రీవుడూ, విభీషణుడూ వాళ్ళూ తిరిగి వాళ్ళ దేశాలకు పోవాలి గద? వాళ్ళు ఎగురుకుంటూ పోవాలా? లంకంతా విభీషణుడికి చెందినప్పుడు, రావణుడు జయించి తెచ్చుకున్న విమానం మాత్రం విభీషణుడికి చెందదా?

కుబేరుడు దేవతల పక్షం. విభీషణుడు రాక్షస జాతివాడు కదా? ఈ వ్యత్యాసం రాముడి మనసులో ఎప్పుడూ ఉంది. విభీషణుడు ధర్మాత్ముడనీ, ఉత్తముడనీ పైకి కబుర్లే గానీ, అతనికి లాభసాటిగా వుండే పని చెయ్యడం రాముడికి ఇష్టం ఉండదు. అందుకే విమానాన్ని కుబేరుడికి పంపేశాడు. ★

వల్ల మాకేమీ ప్రయోజనం వుండదు. నీ పట్టాభిషేకం మేము కళ్ళారా చూడాలి. నిత్యమూ నువ్వు మంగళ వాయిద్యాలతో మేలు కొలుపులతో నిద్ర లేస్తూ వుండాలి. నీ వంటి మహాను భావుడు సమస్త సుఖాలూ అనుభ విస్తూ జీవించాలి. భూమి ఎంతకాలం వుంటుందో, అంతకాలం నువ్వు రాజుగా వుండాలి. దయతో నా కోరిక అంగీకరించు!" అని చేతులు మోడ్చి ప్రార్థించాడు.

భరతుడు తన కోసం రాజ్యం వదులుతాననగానే విస్తుబోయిన రాముడికి ఇప్పుడు అందులో వింతేమీ కనపడలేదు. తన వంటి పరాక్రమవంతుడూ, రాజ నీతి జ్ఞుడూ, శత్రు భయంకరుడూ వుండగా, తనను గాదని రాజ్యం చెయ్యడానికి భరతుడు చాలుతాడా? అతడే చెప్పుకుంటున్నాడు గదా – అసమర్థుడిననీ, అనర్హుడి ననీ. అసమర్థుడైన వాడు సమర్థుడికి రాజ్యం అప్ప గించక ఏం చేస్తాడు? తన ఉత్తమత్వమే తనకు రాజ్యం సంక్రమింపచేస్తుంది. తప్పదు గదా?

రాముడు, హృదయంలో ఆనంద సముద్రాలు పొంగుతూ గంభీరమైన మందహాసంతో తల పంకించి రాజ్యం స్వీకరించడానికి అంగీకారం తెలిపాడు.[463]

జనంలో, భరతుడి మీద మెచ్చుకోళ్ళ రొద సాగు తోంది. "భరతుడు ఎంత ఉత్తముడో చూశావా? ఆ నాటికీ, ఈ నాటికీ, వొక్క మాటమీదే నిలబడ్డాడు."

"ఇన్నాళ్ళూ రుషి వేషంలో వుండి ఏదో నిష్టా నియమం అంటూ గడిపాడుగా? రాజ్యం విలువేమీ అర్థం కాలేదేమో? లేకపోతే ఇస్తాడా? నే న్నమ్మను."

"భరతుడికి రాజ్యం విలువ తెలవకపోవడం ఏంటీ? అతని మంచితనం అదీ."

"రుషులక్కూడా రాజ్యాలే కావాలిగా? కథల్లో వినలేదూ మనం? రుషులు తపస్సులు చేస్తోంటే, వాళ్ళు ఇంద్ర పదవి కోరతారేమోనని ఇంద్రుడికి భయమేసి అప్సరసల్ని పంపి తపస్సులు చెడగొట్టించడూ?"

'భరతుడు మంచివాడా, రాముడు మంచివాడా?' అని వాదాలు చెలరేగాయి జనంలో.

ఒకాయన భరతుడు చేసిన పనికి తెగ విసుక్కుంటు న్నాడు– "కొంతమంది మనుషులు గొప్పకోసం ఎంతెంత త్యాగాలైనా చేసేస్తారు, వాళ్ళకెంత నష్టం వొచ్చినా సరే! మా తోడల్లుణ్ణి చూడరాదూ? ఒంటి మీద గుడ్డలు కూడా వూడదీసి దాన ధర్మాలు చేసేస్తూ వుంటాడు. గోచీ పెట్టుకుని ఇంటికొస్తాడు."

"గోచీ అయినా పెట్టుకుంటాడా? అయితే ఫర్వా లేదు. దాన్ని కూడా దారిలో ఎవరికన్నా ఇచ్చెయ్యడు కదా?"

"మా బాగా అన్నావు. మొగుడు అలా దాన ధర్మాలు చేస్తోంటే, మా వొదినగారు చేటేసుకుని అప్పుల కోసం ఇంటింటికీ తిరుగుతూ వుంటుంది. పైగా ఆయన 'నాకున్న కీర్తి ఎవడికుందిరా ఈ వూళ్ళో?' అని విర్రవీగు

---

**463.** యుద్ధ, సర్గ 131, శ్లోకాలు 1 .... 12: భరతుడి దగ్గర్నించి రాముడు రాజ్యం తీసేసుకోవడం బాగుండదేమోనని కవికి కూడా సందేహంగానే ఉంది. "భరతుడు అసమర్థుడు కాబట్టే రాముడు తీసుకుంటున్నాడు సుమా! లేకపోతే ఎందుకు తీసుకుంటాడూ?" అని కవి గొప్ప కారణం తయారు చేశాడు.

భరతుడు తనను తనే అసమర్థుణ్ణని చెప్పుకుంటున్నాడు. "రాజా! బలమైన ఎద్దు మోయు భారము చిన్నదూడ మోయలేనట్లే, నే నీ రాజ్యభారము మోయుటకు తగిన వాడను గాను. గుఱ్ఱమువలె గాడిద పరుగెత్తజాలనట్లు, హంసవలె కాకి ఎగురజాలనట్లు, నీ వలె నేను రాజ్యభారము వహించుటకు సమర్థుడను గాను ...." ఇంకా ఈ రకంగా చాలా మాటలు చెప్పాడు భరతుడు.

"శత్రుపురములు జయించిన రాముడు భరతుని మాటలు విని అటులనేయని జెప్పి (అవును, నువ్వు అసమర్థుడివే, నేనే సమర్థుణ్ణి – అని చెప్పి) మంగళకరమగు ఆసనము మీద కూర్చుండెను." (సింహాసనం ఎక్కాడండీ!)

రాముడు గుఱ్ఱం అవ్వాలంటే, మిగతా వాళ్ళందరూ గాడిదలు అవ్వాలి! రాముడు హంస అవ్వాలంటే, మిగతా వాళ్ళందరూ కాకులు అవ్వాలి! రాముడికి రాజ్యం అప్పజెప్పాలంటే, భరతుణ్ణి అంత పనికిమాలిన వాణ్ణి చెయ్యాలా? అంత చేతకానివాడు రాజ్యసంపద పది రెట్లు ఎలా పెంచగలిగాడు? – రాముడైతే వెయ్యిరెట్లు పెంచి ఉండేవాడు గావున్ను. ఆ రకంగా చూస్తే మాత్రం భరతుడు అసమర్థుడే.

ఈ పాట్లన్నీ ఎందుకు? భరతుడు, తనని తనే గాడిదనీ, కుక్కనీ చేసుకోవడం ఎందుకు? "అన్నా! నీకు వాగ్దానం చేసినట్టే ఇంతకాలం రాజ్యం చేశాను. ఇక నువ్వే తీసుకో. నీకు సహాయంగా మాత్రమే నేను ఉంటాను" అని చెప్పి రాజ్యం వొదిలేస్తే సరిపోదా కవిగారూ?

"సరిపోతుంది గానీ మరి రాముణ్ణి భరతుడి కన్నా గొప్ప చెయ్యడం ఎట్లా?" అంటారా? ఇప్పుడు మాత్రం భరతుడి కన్నా రాముడు గొప్ప అయ్యాడా మీ రామదాసు బుద్ధి మళ్ళీ తెలిసింది గానీ! <u>ఈ కథ ప్రకారం చూస్తే, అందరి కన్నా భరతుడే గొప్ప. ఆస్తిని సునాయాసంగా వదిలేశాడు!</u>

★

తాడు!"

"మీ వొదినగారు ఎంత అప్పు చేసిందేంటీ మీ ఇంట్లో?"

"నా దగ్గిరా పప్పులేమీ వుడకవులే. మా తోడల్లు ళ్ళాగ గొప్పలకి పోయే వాళ్ళకి అప్పు సప్పు చేపనివ్వను ... భరతుడి పిచ్చి, మా తోడల్లుడి పిచ్చిలాంటిదే లెమ్మని మాట వరసకాయన సంగతి చెప్పా."

"ఎంత పిచ్చి అయితే మాత్రం రాజ్యం వొదులు కునేంత పిచ్చా మరీనూ?"

"చేతగానివాడు వొదులుకోకేం చేస్తాడు లెండి? సుఖంగా తిని తిరగక ఆ గోలంతా ఎందుకనుకున్నా డేమో!"

"చేతగాకపోవడం ఏంటి? ఎంత నేర్పు లేకపోతే బొక్కసం గిక్కసం పది రెట్లు పెంచుతాడు?"

"మరి తనే అన్నాడుగా, చాతకాని వాణ్ణనీ?"

"ఆ ... ఏదో అన్నాడు అన్నగార్ని సంతోషపెట్ట డానికి. అంత మాత్రాన పద్నాలుగేళ్ళు రాజ్యం చేసిన వాడు చేతగాని వాడైపోతాడా?"

"మీరందరూ అయోధ్యకి బయల్దేరుతున్నారా? పట్టాభిషేకం అక్కడేనట."

పదండి చూసొద్దాం. ఏం చేస్తాం ఇళ్ళ దగ్గిర కూర్చునీ?"

జనం గుంపులు గుంపులుగా అయోధ్యవేపు బైల్దేరారు.

రాముడు రాజ్యం స్వీకరించడానికి అంగీకరించిన తర్వాత, మంగళ్ళు వొచ్చి క్షవరాలు చేశారు, అన్నదమ్ము లందరికీ.

రామలక్ష్మణ భరత శతృఘ్న రుషులందరూ మంగళ స్నానాలు చేసి రాజకుమారులైపోయారు.

రాముడికి తల చిక్కులు తీసి, వొంటి నిండా ఆభర ణాలు పెట్టి, పట్టు బట్టలు కట్టి, పద్నాలుగేళ్ళ నించీ జరగని అలంకారాలన్నీ చేశారు.

స్త్రీలందరూ కలిసి సీతకు కూడా అలంకారాలు చేశారు.

అయోధ్య పోవడానికి రథాలు సిద్ధమైనాయి. మహా సుందరంగా అలంకరించిన రథంలో ఎక్కాడు రాముడు. శతృఘ్నుడు గొడుగు పట్టి, లక్ష్మణుడూ విభీషణుడూ వింజామరలు వేస్తూ, భరతుడు రథం నడుపుతూ వుండగా, రాముడు అయోధ్యకు బయల్దేరాడు.

సుగ్రీవుడు ఏనుగు మీద కూర్చున్నాడు.[464]

నాట్యకత్తెలతో, తాళ మేళాలతో ఊరేగింపు బయల్దేరింది.

దారి పొడుగునా జనం రాముణ్ణి ఎగబడి చూస్తూ నిలబడ్డారు. వింతగా చూశారు.

"ఎంత అందంగా వున్నాడో!"

"నీడ పట్టున కూర్చున్న వాళ్ళు అందంగా వుండక పోతే నువ్వూ నేనూ అందంగా వుంటామా?"

"పాపం నానా బాధలూ పడి వొచ్చాడు. ఏం నీడ పట్టున కూర్చున్నాడూ?"

"ఎలా బలిశాడో చూడు. ఏం బాధలు పడ్డాడం టావూ?"

"చాల్లెద్దూ! భయం భక్తీ లేకుండా మాట్లాడతావు. ఇక నించీ ఆయనే మన రాజు. రాజంటే దేవుడితో సమానం అంటారు. తండ్రి, బిడ్డల్ని చూసుకున్నట్టే రాజు ప్రజల్ని పరిపాలించుకుంటాడు. చాటుమాటుగా అయినా సరే మనం రాజు గురించి అంత భక్తి లేకుండా మాట్లాడుకోకూడదు."

"చక్కగా పుష్టిగా కనపడ్డాడు గాబట్టి బలిశాడన్నాను. తప్పేంటీ?"

"చాల్లే, ఊరుకోండి. పాడు కుమ్ములాటలు... మంచీ చెడ్డా లేదు. ఇవ్వాల్టి నించీ చెప్పుల పరిపాలన పోయినట్టేనంటగా?"

"పోతే ఏంటి? మనకేం వొరుగుతుందీ? ఇన్నాళ్ళూ భరతుడు చేశాడు. ఇప్పుడు రాముడు చేస్తాడు. ఏంటి మనకి కొత్తగా కలిసొచ్చేదీ?"

"నీ చోద్యం గానీ మనిషికీ మనిషికీ తేడాయే వుండ దంటావా?"

"నీకూ నాకూ తేడా గానీ, రాజుకీ రాజుకీ తేడా ఏంటీ?"

"దయ గల రాజుంటాడు. దయ లేని రాజుం టాడు."

"దయ గల రాజూ పన్ను తీసుకుంటాడు, దయలేని

---

**464.** యుద్ధ, సర్గ 131, శ్లోకాలు 29, 31: ".... (రథములో కూర్చున్న రాముడికి) రాక్షస రాజగు విభీషణుడు చామరమును వేయుచుండెను .... కొండవలె నుండు శతృంజయమను ఏనుగుపై వానరోత్తముడగు సుగ్రీవుడు యెక్కెను."

రాముడు మొదటి నించీ సుగ్రీవుణ్ణి తన సోదరుడిగా అంటున్నాడు. భరతుడు కూడా సుగ్రీవుడితో "నువ్వు మా అన్నదమ్ముల్లో ఒకడివి" అన్నాడు. ఈ రకమైన 'అన్నదమ్ముల సంబంధం' పెట్టుకున్నారు గదా సుగ్రీవుడితో? సుగ్రీవుడే రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులతో పాటు రథంలో ఉండాలి. విభీషణుడు వేరుగా ఉండాలి. ఈ విషయం కవికి తెలియలేదా? ★

రాజూ పన్ను తీసుకుంటాడు. ఏ రాజు వొచ్చినా వాళ్ళ లెక్క ప్రకారమే రాజ్యం చేస్తాడు. భరతుడు చూశావా ఈ పద్నాలుగేళ్ళలో ఎంత సంపదపెంచాడో! రాముడూ అలాగే పెంచుతాడు."

"మహారాజులు పెంచుకోక మనం పెంచు కుంటామా ఏంటి? ఏ జన్మలో పుణ్యం చేసుకున్నారో వాళ్ళు రాజులయ్యారు. మనం దరిద్రులయ్యాం!"

"చాలు గాని వూరుకోండి గోల... ఊరేగింపు ఆగి నట్టుంది. ఆడవాళ్ళెంత బాగా ఆడుతున్నారో!"

జనం అందరూ, నాట్యాలు చేసే వేశ్యల చుట్టూ చేరారు.

ఊరేగింపు ఎక్కడికక్కడ ఆగుతూ సాగుతూ అయోధ్య చేరింది.

రామ పట్టాభిషేకానికి ఏర్పాట్లన్నీ సిద్ధంగా వున్నాయి.

ఎన్నడూ ఎవ్వరూ కనీ, వినీ ఎరగనంత వైభవంగా పట్టాభిషేకం జరిగింది.

శ్రీరామచంద్రుడు రత్నఖచిత సింహాసనం అధిష్టిం చాడు! సింహాసనం! సింహాసనం! కల ... నెరవేరింది! ఇంత కాలానికి! పట్టాభిషేకం ఆగిపోయిన నాటి నించీ ఈ నాటికి! పదమూడు సంవత్సరాల, పదకొండు నెలల, ఇరవై తొమ్మిది రోజులు గడిచిపోయాయి కిందటి రోజుతో. ఇక తనే రాజు! మహారాజు! – రాముడి మొహం తళ తళ లాడింది.

అప్పటిదాకా ఆ సింహాసనం మీద చెప్పులు ఉండేవి! ఇప్పుడు ఆ చోట్లో రాముడు! చెప్పులైనా రాము డైనా ఒకటే అయిపోయారు! చెప్పులే రాముడు! రాముడే చెప్పులు!

కోసలాధిపతి అయిన శ్రీరామ చంద్రమూర్తికి జయం కోరుతూ వందిమాగధుల జయ జయధ్వానాలు మిన్నుముట్టాయి.

జనం విస్తుపోయి, నోళ్ళు తెరుచుకుని చూస్తూ నిల బడ్డారు.

"యువరాజు ఎవరంటావు?"

"ఇంకెవరు భరతుడే."

"రాముడికి లక్ష్మణుడంటేనే చాలా ఇష్టంగా?"

"అయితే మాత్రం? ... పాపం భరతుడు అంత రాజ్యం వొదులుకున్నాడు. అతన్ని యువరాజుగా అన్నా ఉంచుకోడూ రాముడు?"

"నీకూ నాకూ పందెమేనా?"

"ఆ పందెమే. ఎంతెంత?"

"మీ దొడ్లో నిమ్మకాయలు కోసుకున్నా, కరివే పాకు కోసుకున్నా, మామిడికాయలు కోసుకున్నా, ఏం కోసు కున్నా సరే, మా ఆవిడతో మీ ఆవిడ దెబ్బలాడ కూడదు."

"అలాగే."

శ్రీరామచంద్రుడు ఆభరణాల చప్పుళ్ళతో ధగ ధగలతో లేచాడు. "కోసల సామ్రాజ్యానికి యువ రాజుగా లక్ష్మణుణ్ణి నియమిస్తున్నానని సభాసదులకు విన్నవించు కుంటున్నాను" అని ప్రకటించి చిరునవ్వులతో సభను పరికించి సుఖంగా ఆసీనుడయ్యాడు.

సభలో – అంత నిశ్శబ్దంలోనూ కొంత గందర గోళం బయల్దేరింది.

దొడ్డినిండా నిమ్మ చెట్లూ, మామిడి చెట్లూ, పెంచు కుంటోన్న ఆయన మొహాన వొక్క నెత్తురు బొట్టన్నా లేకుండా పోయింది.

వాళ్ళ పక్కింటాయన, అన్యాయంగా మామిడి కాయలు కోసుకోడానికి సిగ్గేసి "సరేలే, వొద్దులే" అని నవ్వేశాడు.

"ఆఁ అదేం మాట? కోసుకో, నీ ఇష్టం. కాదంటే చెప్పుతో కొట్టు. మాటంటే మాటే!" అని తలెగరేశాడు, మామిడి చెట్లాయన.

లక్ష్మణుడు వినయంతో మహారాజు ముందు వొంగి విన్నవించుకుంటున్నాడు – "మన్నించు ప్రభూ! నా కన్నా పెద్దవాడూ, పద్నాలుగు సంవత్సరాల పాటు రాజ్యం చేసిన వాడూ భరతుడు వుండగా నువ్వు నన్ను యువ రాజుని చెయ్యడం వల్ల నే నంటే నీకెంత దయో గ్రహిం చాను. కానీ, నేనీ రాజ్యభారం మొయ్యలేను. నీ సేవ చేసుకుంటూ జీవించడం తప్ప నే నేమీ కోరను" అని సిగ్గుపడుతూ తల వొంచుకున్నాడు.

రాముడు గంభీరమైన చూపులతో భరతుణ్ణి యువ రాజుగా ప్రకటించాడు.[465]

---

**465.** సర్గ 131, **శ్లోకాలు 86, 87, 88:** రాముడు యువరాజుని నిర్ణయించడం రాముడి పట్టాభిషేకం సందర్భంలో జరగదు. మొదట, రాముడి పట్టాభిషేకం మహా వైభవంగా అయిపోయింది. రాముడు వానరులకూ, రాక్షసులకూ, బహుమానాలిచ్చాడు. అందరూ ఎవరి దేశాలకు వాళ్ళు వెళ్ళి పోయారు. తర్వాత రాముడు రాజ్యం చేస్తూ ఉంటాడు. అప్పుడు యువరాజుని నిర్ణయిస్తాడు. "శతృవులు లేని వాడును, గొప్ప ఔదార్యము గల వాడును నగు రాముడు, మిగుల సంతోషంతో రాజ్యమునంతయు పరిపాలించు చుండెను." (హమ్మ! ఇన్నాళ్ళకి రాజ్య పరిపాలన!) ➔

తదనంతరం – శ్రీరామచంద్ర ప్రభువు బ్రాహ్మణులకు విరివిగా దానధర్మాలు చేశాడు.

సుగ్రీవుడికీ, అంగదుడికీ, ఇంకా వానర ప్రముఖులందరికీ ఎవరికి తగ్గ బహుమానాలు వారికి ఇచ్చాడు.

సీత – మెడలోంచి ముత్యాల హారం తీసి భర్తని చూసి సందేహిస్తూ ఆగింది.

రాముడది గ్రహించి చిరునవ్వుతో, "నీ కెవరు ఇష్టులో వారికి ఇచ్చి సంతోషపెట్టు" అని అనుమతి ఇచ్చాడు.

సీత సంతోషిస్తూ ఆ హారం హనుమంతుడికి ఇచ్చింది.

మహారాజుల గురించీ, పరిపాలకుల గురించీ, క్షణాలమీద పాటలు రాయగల కవులు, రామ వనవాస గాథ అంతా అత్యద్భుతంగా పాటలు రాసి సభలో పాడారు. నాట్యకత్తెలు అభినయం చేశారు.

శ్రీరామచంద్రుడు అనుభవించిన కష్టాలు చూసి ప్రజలందరూ కన్నీరు మున్నీరుగా ఏడ్చి, అదంతా మళ్ళీ మళ్ళీ తల్చుకుంటూ, ఏడుస్తూ, చెప్పుకుంటూ, ఇళ్ళకి బయల్దేరారు.

శ్రీరాముడి కష్ట పరంపర విన్నా కూడా కళ్ళల్లో ఒక్క నీటిబొట్టన్నా చిందని మొండివాళ్ళు, 'రాముడు మంచి వాడా, భరతుడు మంచివాడా' అని మళ్ళీ వాదాలకు దిగారు.

"నాకు తెలియకడుగుతానూ, రెండేళ్ళ కిందట నేను పన్ను కట్టలేదని నా పొలం వేలం వేశారు గానీ మానారా?"

"మరి పన్ను కట్టకపోతే వేలం వెయ్యరూ? ఊరు కుంటారా?"

"రాముడైనా అంతేనా?"

"ఆc, రాముడైనా అంతే, దేవుడైనా అంతే!"

"మరింకేం, ఊరుకో. మంచేంటీ? వల్లకాదు... వాళ్ళ ధర్మం వాళ్ళదీ ... మన కర్మం మనదీ.."

"బొత్తిగా అలా తీసెయ్యకు. భరతుడి కన్నా రాముడు పరిపాలిస్తే ... మనందరికీ చాలా సంతోషంగా ... సుఖంగా ... తప్పకుండా!.."

"సరే! అదీ చూద్దాంలే. ఏం ఉద్ధరిస్తాడో!"[466]

## [ఇక్కడితో 'యుద్ధ కాండ' ముగుస్తుంది.] ★

---

➔ధర్మాత్ముడైన రాముడు, ధర్మాత్ముడైన లక్ష్మణునితో ఇటులనెను. "ధర్మాత్ముడా! మునుపటి రాజులు, బలము చేత పాలించుచుండిన ఈ భూమిని నీవు నాతోగూడ పరిపాలించుము. మన తండ్రి తాతలు వహించిన ఈ రాజ్యభారమును, నీవు నాతో గలసి, యువరాజుగా నుండి ఈ భారము వహించి, పరిపాలించుము."

"సమస్త విధముల చేత, లక్ష్మణుని సమ్మతిని పొందలేక, మహాత్ముడైన రాముడు, భరతుని అభిషేకించెను."

యువరాజుగా ఉండమని ఎంత చెప్పినా వినలేదట లక్ష్మణుడు. అప్పుడు రాముడు భరతుణ్ణి యువరాజుని చేశాడు. లక్ష్మణుడికి తెలిసిన జ్ఞానం, ధర్మం, రాముడికి తెలియనట్టే కదా? కవికి భరతుడి మీద కన్నా లక్ష్మణుడి మీదే నమ్మకం ఎక్కువ. లక్ష్మణుడి వల్ల అయితే, రాముడికేమీ ప్రమాదం ఉండదని! మళ్ళీ కొంచెం జంకు. లక్ష్మణుడికి యువరాజు పదవి ఇస్తే, బాగుండదేమోనని. ఆ సంఘర్షణే ఇది.

ఇక్కడ అసలు ఆలోచించవలసిన విషయం ఏమిటంటే, భరతుడికి రాజుగా పట్టాభిషేకం జరిగిందా? రాముడు, తండ్రి ఆజ్ఞని పాలించింది ఎక్కడ? కైక కోరిన వరాలు నిజంగా నెరవేరాయా? ఆలోచించండి! ★

**466. యుద్ధ, సర్గ 131, శ్లోకాలు 89 నించీ చివరి వరకూ:** రాముడు, పట్టాభిషేకం అయిన తర్వాత రాజ్యం పరిపాలిస్తూ వందలకొద్దీ యజ్ఞ యాగాలు చేశాడు. 'రామ రాజ్యం'లో ప్రజలు చాలా సుఖంగా ఉన్నారని – కవి వర్ణన! 10 శ్లోకాల్లో రామరాజ్య వైభవం వర్ణించి, చివర – "శ్రీమంతుడగు రాముడు తమ్ములతోడ 11 వేల సంవత్సరములు రాజ్యము పరిపాలించెను" అని రాముడి సంగతి ముగించాడు. తర్వాత, వాల్మీకి రచించిన ఈ ఆది కావ్యం వినే వారికి ఏమేమి లాభాలు కలుగుతాయో వర్ణించడం ఉంటుంది. ఈ 'ఫలశృతి' చెప్పడంతో 'యుద్ధకాండ' ముగుస్తుంది. తర్వాత 'ఉత్తరకాండ' ఉంది. ఇది రాముడు రాజ్యపాలన ప్రారంభించిన కొత్త దినాలతో ప్రారంభమౌతుంది.

'యుద్ధకాండ' తర్వాతే ఫలశృతి చెప్పెయ్యడం చేత, వాల్మీకి రామాయణం ఈ కాండతోనే సమాప్తమై పోయిందనీ, తర్వాత ఉత్తర కాండ ప్రక్షిప్తమనీ, అనుకోడానికి ఆస్కారం ఉంటుంది.

ఈ 'విషవృక్షం'లో, 'రామరాజ్యం' గురించి ఇంకో కథ వస్తుంది.

'విషవృక్షం' కథలన్నీ పూర్తి అయిన తర్వాత (ఉత్తర కాండ కూడా ముగిసిన తర్వాత), కవి, యుద్ధకాండ చివర చెప్పిన ఫలశృతి గురించి ఉంటుంది. ★

# లింకు-11

# 15వ కథ తర్వాత 16వ కథ వరకూ

[15వ కథ – రాముడు అయోధ్యకు వచ్చి పట్టాభిషేకం చేసుకోవడంతో ముగిసింది.
16వ కథ – రాముడు రాజ్య పరిపాలన ప్రారంభించడంతో ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య ఉన్న కథా భాగం ఇది.][467]

## 'ఉత్తర కాండ' ప్రారంభం!

రాముడు రాక్షసులందర్నీ చంపి అయోధ్యకు వచ్చి పట్టాభిషేకం చేసుకున్నాడని విని, రుషులందరూ అన్ని దిక్కుల నించీ అయోధ్యకు బయల్దేరారు. కొందరు ఉత్తరం వేపు నించీ, కొందరు తూర్పు వేపు నించీ, కొందరు దక్షిణం నించీ, కొందరు పడమర నించీ వచ్చి అందరూ రాముడి మందిరం ముందు నిలబడి, ద్వార పాలకుడితో, "రుషులందరూ వచ్చారని శ్రీరాముడితో చెప్పు!' అన్నారు.

ద్వారపాలకుడు వెళ్ళి చెప్పగానే రాముడు రుష లందర్నీ లోపలికి పిలిపించి ఎవరికి తగిన విధంగా వారిని గౌరవించి (రుషుల్లో కూడా తేడాలే! గడ్డాల హెచ్చుతగ్గుల్ని బట్టి గొప్పతనాలు నిర్ణయిస్తారు గావున్ను!) వారి క్షేమం అడిగాడు.

రుషులందరూ ఆనందించి, "ఎంతో క్షేమంగా ఉన్నాం రామా! రాక్షసులందర్నీ చంపేశావుగా? ఇక మాకేం కష్టాలుంటాయి?" అన్నారు. (విభీషణుడు పరి పాలిస్తోన్న లంకా, అందులో రాక్షస జనాభా అంతా ఏమై పోయారు?)

తర్వాత, రుషులందరూ కలిసి రాముణ్ణి పొగడ్డం మొదలుపెట్టారు – అంత వాడివీ, ఇంత వాడివీ; నీకు వాడు చాలడూ, వీడు చాలడూ; నువ్వు అది చేశావూ, ఇది చేశావూ – ఈ రకంగా సాగింది కీర్తన. సాగి సాగి

---

**467.** ఈ లింకుతో 'ఉత్తర కాండ' ప్రారంభమవుతుంది. దీనికోసం నేను వావిళ్ళ రామశాస్త్రులు అండ్ సన్స్ సంస్థ వారు 1925లో ప్రచురించిన "శ్రీ మద్రామాయణే ఉత్తర కాండః – ఆంధ్ర తాత్పర్య సహితము" చదివాను. దీని అనువాదకుడెవరో పుస్తకం మీద లేరు. చిరిగిపోయారు. లైబ్రరీల ద్వారా ఆయన పేరు సంపాదించ లేకపోయాను. వాల్మీకి సంస్కృత రామాయణానికి వావిళ్ళ సంస్థ ప్రచురించిన తెలుగు అనువాదాలు 'యుద్ధ కాండ' వరకూ, చదలవాడ సుందరరామశాస్త్రులు గారివే గనుక, ఈ 'ఉత్తర కాండ' అనువాదం కూడా ఆయనదే కావచ్చు – అనుకుంటున్నాను. ఈ విషయం ఇంకా నిర్ధారణ చేసుకోవలసి వుంది. అంతవరకూ అవసరమైన చోట్ల ఆయన పేరే వాడతాను.

ఉత్తర కాండ'లో మొత్తం 124 సర్గలు ఉన్నాయి. వాటిలో 13 సర్గలు పూర్తిగా ప్రక్షిప్తాలే అని, సుందర రామశాస్త్రులు గారి అభిప్రాయం. అవి – 24 నించి 28 వరకూ గల 5 సర్గలూ; 43 నించి 47 వరకూ గల 5 సర్గలూ; 70 నించి 72 వరకూ గల 3 సర్గలూ. ఇవే గాక మిగిలిన సర్గల్లో కూడా ఏ యే శ్లోకాలు ప్రక్షిప్తాలో ఆయన బ్రాకెట్ల ద్వారా మార్కు చేశారు.

'ప్రక్షిప్తాలు' అని నిర్ణయించిన ఈ 13 సర్గలను కూడా ఆయన వరస క్రమంలోనే అనువాదం చేశారు గానీ, వాటికి ఏ నెంబర్లూ ఇవ్వలేదు. 23వ సర్గ తర్వాత, 24వ సర్గ నించీ 28 వరకూ ప్రక్షిప్తాలే కాబట్టి, 29వ సర్గకు, 24వ నెంబరు ఇచ్చారు. – ఈ రకంగా, మొత్తం 124 సర్గల్లోనించి 13 సర్గల్ని తీసివెయ్యడం వల్ల, ఈ అనువాదంలో, 111 సర్గల నంబర్లే ఉన్నాయి.

కానీ, నేను, ఈ ఫుట్‌నోట్లలో సర్గల నంబర్లు చెప్పవలసి వచ్చినప్పుడు, సుందర రామశాస్త్రులు గారు వదిలేసిన సర్గల్ని కూడా కలుపుకుని వరసగా 124 నంబర్లూ ఇచ్చాను. అంటే, ఈ ఫుట్‌నోట్లలో 40వ సర్గ అనే నంబరు ఉంటే, అది సుందర రామశాస్త్రులుగారి అనువాదంలో 35వ సర్గ అయి వుంటుంది. ఈ రకంగానే ఈ తేడాల్ని బట్టి, సర్గల నంబర్లు చూసుకోవాలి. ★

చివరికి – "అసలు ఇంద్రజిత్తుని చంపడం అంటే మాటలా? .... అంత గొప్ప వీరుణ్ణి కూడా చంపేశావు. ఇంద్రజిత్తు పోయాడని విన్నప్పుడు మేమందరం ఆనందంతో ...." అంటూ ఇంద్రజిత్తు పోయినప్పుడు కురిపించిన ఆనంద బాష్పాలన్నీ మళ్ళీ కురిపించి కీర్తన ముగించారు.

రాముడు (లోపల మురిసిపోతూ) చేతులు జోడించుకుని రుషుల్ని వినయంగా అడిగాడు – "మహర్షులారా! రాక్షసుల్లో అనేకమంది మహావీరులు ఉండగా ఇంద్రజిత్తు వీరత్వాన్నే ఇంతగా పొగుడుతున్నారు. ఇంద్రజిత్తు, తండ్రి కంటే కూడా గొప్ప వాడెలా అయ్యాడు? దేవేంద్రుణ్ణి ఎలా జయించాడు? అంతా చెప్పండి" అని కుతూహలంగా చూశాడు. (రాముడికి కథలు వినే గుణం ఉంది గానీ ప్రశ్నలు అడిగే తెలివి లేదు. పిచ్చి కథలన్నీ నమ్ముతాడు.)

అగస్త్య మహర్షి చెప్పడం ప్రారంభించాడు. "పూర్వం కృతయుగంలో (రాముడున్నది త్రేతా యుగం – అని రుషుల లెక్క) ఒక ప్రజాపతికి పులస్త్యుడనే కొడుకు ఉండేవాడు. ఆ కొడుకు ఎంత ఉత్తముడంటే .... అసలు చెప్పడం కుదరదు. అంత సుగుణాల ముద్ద. ఆయన ఒకసారి మేరుపర్వతం మీద ఉన్న తృణబిందు ముని దగ్గిరికి ధర్మం నేర్చుకోడానికి వెళ్ళి, అక్కడ ఇంద్రియాల్ని లొంగదీసుకుని, తపస్సు ప్రారంభించాడు.

ఆ మేరు పర్వత ప్రాంతాలు చాలా అందంగా వుంటాయి. అక్కడికి ఎందరో రుషి కన్యలూ, నాగ కన్యలూ, అప్సరసలూ ఆడుకోడానికి వస్తూ వుంటారు. సుగుణాల పుట్ట అయిన పులస్త్యుడికి, ఆడ పిల్లల ఆటలూ, నవ్వులూ చూసి తపస్సు చెదిరి, కోపం వొచ్చి "నా కంటబడిన కన్య గర్భవతి అయిపోతుంది" అని శపించేశాడు.[468] ఆడుకునే అమ్మాయిలందరూ భయపడిపోయి అక్కడికి రావడం మానేశారు. (చక్కగా పిల్లలు ఆడుకునే చోట్ల తపస్సులేవిటీ, పాడు!)

తృణబిందుడి కూతురు ఈ శాపం సంగతి ఎరగదు. మామూలుగా ఆడుకోడానికి వొచ్చింది. అక్కడ స్నేహితురాళ్ళెవరూ లేరు. పులస్త్యుడి దగ్గిరికి వెళ్ళింది. అతడు ఈమెని చూశాడు. అంతే, ఈమెకి గర్భం వచ్చేసింది. (అంటే ఈ సుగుణాల ముద్ద అయిన రుషి, ఆ అమ్మాయి మీద అత్యాచారం చేశాడన్న మాట!) ఆ పిల్ల భయపడుతూ ఇంటికి వెళ్ళింది.

"ఎవరు నిన్నిట్లా చేశారు? ఎందుకిలా జరిగింది?" అని తండ్రి అడిగాడు.

"నా కేమీ తెలియదు. ఆడుకోడానికి వెళ్ళాను. అక్కడెవరూ లేరు. పులస్త్యుడు ఒక్కడే ఉన్నాడు. ఇలా అయింది" అని చెప్పింది.

తృణబిందుడు దివ్యదృష్టితో ఆలోచించి అంతా తెలుసుకున్నాడు. పిల్లని పులస్త్యుడి దగ్గిరికి తీసుకు వెళ్ళి, "ఈమెని భిక్షగా తీసుకో! ఇంద్రియాల్ని జయించిన నీకు సేవలు చేస్తూ వుంటుంది" అని చెప్పాడు.

పులస్త్యుడు అంగీకరించి ఆమెని పెళ్ళి చేసుకున్నాడు. వారికో కొడుకు పుట్టాడు. పేరు విశ్రవసు. అతడు కూడా తపస్సు చేశాడు. (తండ్రి బుద్ధు లెక్కడికి పోతాయి మరి?)

విశ్రవసు బుద్ధిమంతుడని విని, భరద్వాజుడు, తన కూతురు దేవవర్ణిని విశ్రవసుకి ఇచ్చి పెళ్ళి చేశాడు. వారికి కుబేరుడు పుట్టాడు. కుబేరుడు కూడా తపస్సు ప్రారంభించాడు (పాపం, తండ్రుల వేపు నించి వచ్చే జబ్బు గావున్ను!)

బ్రహ్మ, ప్రత్యక్షమై కుబేరుడితో "ఏం వరాలు కావాలో కోరుకో" అన్నాడు.

"లోక పాలకత్వమూ, ధనాధిపత్యమూ కావాలి" అన్నాడు కుబేరుడు. (ఎంత గొప్ప తపస్సు చేసినా కావలసింది మాత్రం లోకం మీద పెత్తనమూ, ధనమూ! తపస్సులన్నీ వాటి కోసమే!)

బ్రహ్మ, "ఇంతవరకూ ఇంద్రుడూ, యముడూ, వరుణుడూ (వానదేవుడు) – ఈ ముగ్గురే లోకపాలకులుగా వున్నారు. నే నెలాగూ నాలుగో పాలకుణ్ణి నియమించాలనుకుంటున్నాను. సరే! నువ్వే ఉండు. ఇదిగో! ఈ పుష్పక విమానం కూడా పుచ్చుకో. ఇది చాలా గొప్పది" అని దాని గొప్పలన్నీ చెప్పాడు. దాంట్లో అంత వేడిగానూ వుండదు, అంత చల్లగానూ వుండదు. ఇది దాని గొప్పల్లో ఒక పెద్ద గొప్ప. ఈ రకంగా బ్రహ్మ, కుబేరుడికి వరాలిచ్చి వెళ్ళిపోయాడు.

కుబేరుడు, తండ్రి దగ్గిరికి వచ్చి, "నేను ఎక్కడ ఉండాలో బ్రహ్మ చెప్పలేదు. నువ్వు చెప్పు" అని అడిగాడు. (ఎక్కడ ఉండాలో తెలీదు. లోకాలు పాలిస్తాడు! లోకాల్ని పాలించమని ఈయనకి బ్రహ్మ వరాలు ఇచ్చేశాడు!)

తండ్రి చెప్పుకొచ్చాడు. "నాయనా, దక్షిణ సముద్రంలో త్రికూట పర్వతం మీద లంకా నగరాన్ని, విశ్వకర్మ, రాక్షసుల కోసం నిర్మించాడు. రాక్షసులు కొంత కాలం అక్కడ ఉండి, విష్ణువుకి భయపడి, ఆ పట్నం వొదిలేసి పాతాళానికి వెళ్ళిపోయారు. ఇప్పుడు లంక

---

**468.** పెళ్ళి కాకుండా గర్భవతి అవడం అనేది శాపంగా భావించే స్థితి వచ్చిందన్న మాట, సమాజంలో. ఆడపిల్ల కనపడితే రుషులు ఇచ్చే బహుమతి ఇదే! ★

ఖాళీగానే ఉంది. అక్కడ ఉండు" (ఆ మూల లోకం పాలించుకో) అని చెప్పాడు. కుబేరుడు లంకని ఆక్ర మించాడు.

అంతవరకూ విని రాముడు ఆశ్చర్యపడి "లంకలో పూర్వం కూడా రాక్షసులు వుండే వారా? వారి మూల పురుషుడెవరు? వారిని విష్ణువు లంక నించి ఎందుకు తరిమేశాడు?" అని అడిగాడు.

అగస్త్యుడు చిరునవ్వుతో గడ్డం ఊపుకుంటూ మళ్ళీ ప్రారంభించాడు. "మొదట, బ్రహ్మ, నీళ్ళని పుట్టించాడు. (ఇంకా మొదట, అసలు బ్రహ్మని ఎవరు పుట్టించారు స్వామీ?) ఆ నీళ్ళని రక్షించడానికి కొందరు జీవుల్ని సృష్టించాడు. వారు ఆకలి దప్పులతో బాధపడ్డారు. అందులో కొందరు భక్షామః (తినేస్తాం) అంటూ నీళ్ళని తినెయ్యడానికి సిద్ధ పడ్డారు. మరికొందరు రక్షామః (రక్షిస్తాం) అన్నారు. 'భక్షామః' అన్న వాళ్ళు యక్షులూ, 'రక్షామః' అన్న వాళ్ళు రాక్షసులూ అయిపోయారు. (బ్రహ్మ చెప్పిన పని చేసిన వాళ్ళు, అంటే నీళ్ళని రక్షిం చిన వాళ్ళు, రాక్షసులు అయ్యారు! ఎంత వింత!) ఆ రకంగా రాక్షసులు మొదట తయారయ్యారు.[469]

ఆ రాక్షసుల్లో – హేతీ, ప్రహేతీ అని ఇద్దరు అన్నదమ్ములున్నారు. ప్రహేతి ధర్మాత్ముడు. తపస్సు కోసం వెళ్ళిపోయాడు. హేతి అలాంటి ధర్మాత్ముడు కాడు. భయ – అనే భార్యని పెళ్ళి చేసుకున్నాడు. వారికి విద్యుత్కేశుడు పుట్టాడు. విద్యుత్కేశుడి భార్యసాల కంటక. వారికి సుకేశుడు పుట్టాడు. సుకేశుడి భార్య దేవవతి. వారికి మాల్యవంతుడూ, సుమాలీ, మాలీ పుట్టారు. ఈ ముగ్గురు అన్నదమ్ములూ, విశ్వ కర్మని, మంచి నగరం నిర్మించమన్నారు!

విశ్వకర్మ, "త్రికూట పర్వతం మీద లంక సిద్ధంగా ఉంది. అక్కడికి వెళ్ళండి" అన్నాడు. (మళ్ళీ ఎవడు నిర్మి స్తాడు – అన్నాడా?)

ఆ అన్నదమ్ములు ముగ్గురూ లంకలో స్థిరపడ్డారు.

మాల్యవంతుడి భార్య, సుందరి. వీరికి వజ్ర ముష్టీ, విరూపాక్షుడూ ఇంకా కొందరు కొడుకులూ పుట్టారు. (కొడుకులు పుట్టడమే గానీ, కూతుళ్ళు పుట్టడం ఎక్క డన్నా చూశామా?)

సుమాలి భార్య, కేతుమతి. వీరికి ప్రహస్తుడూ, అకంపనుడూ, ధూమ్రాక్షుడూ, ఇంకా కొందరు కొడు కులూ; పుష్పోత్కటా, కైకసీ, కుంభీనసీ, అనే కూతుళ్ళూ కూడా పుట్టారు. (ఆశ్చర్యం! ఇక్కడ కూతుళ్ళు కూడా!)

మాలి భార్య, వసుధ. వీరికి కూడా కొందరు బిడ్డ లున్నారు.

ఈ రాక్షసులందరూ లంకలో స్థిరపడి, ఋషుల్నీ, దేవతల్నీ, బాధించడం మొదలుపెట్టారు. (బాధించడం– అంటే ఏం చేస్తారో వివరాలు లేవు. ఋషుల్ని వెక్కిరించి ఏడిపిస్తారు గావున్ను!)

దేవతలు, శివుడితో రాక్షసుల గురించి మొర పెట్టు కున్నారు. శివుడు తన వల్ల కాదన్నాడు. విష్ణువు దగ్గిరికి వెళ్ళమన్నాడు. అలాగే వెళ్ళారు దేవతలు. విష్ణువు, దేవత లకు అభయమిచ్చి, రాక్షసుల్ని చంపేస్తానన్నాడు. ('చంపే స్తాను' అనడమేగా? ఆ మాట శివుడే అంటే పోయే దిగా?)

ఆ సంగతి రాక్షసులకు తెలిసింది. మాల్యవంతుడు తమ్ముళ్ళతో ఆలోచించాడు. "మనం వేదాలు చదివాం. అనేక దాన ధర్మాలు చేశాం. వరాలు పొందాం .... మనకు రోగాలు రావు. దీర్ఘా యుష్షు ఉండడం వల్ల ప్రాణ భయం లేదు. విష్ణువుతో యుద్ధం చేద్దాం" అని నిశ్చయించుకున్నారు. వెంటనే రాక్షసులందరూ అనేక రకాల జంతువుల మీదా, చేపల మీదా, పాముల మీదా కూడా, (చీమలు తప్ప) ఎక్కి విష్ణువు మీదకి బయ ల్దేరారు. దారి పొడుగునా అప శకునాలే. రాక్షసులు జంకకుండా స్వర్గానికి వెళ్ళారు. (అవును మరి! దారిలో ఎన్ని కష్టాలు వొస్తేయేం?)

విష్ణువు గరుత్మంతుడి మీద ఎక్కి ఆయుధాలన్నీ తీసుకుని ఒక్కడే యుద్ధానికి వచ్చాడు. (ఆయుధాల మీద నమ్మకం!)

భయంకరమైన యుద్ధం జరిగింది.

విష్ణువు సింహనాదాలతో, రాక్షసుల ఆర్తనాదాలతో యుద్ధరంగం మార్మోగిపోయింది. విష్ణువు, తన చక్రంతో మాలి తల నరికేశాడు. సుమాలీ, మాల్యవంతుడూ సైన్యాల్ని తీసుకుని ఇంటి మొహం పట్టారు. పారిపోతోన్న రాక్షసుల్ని విష్ణువు తరిమి తరిమి చంపుతూ వెంట బడ్డాడు. మాల్యవంతుడు కోపంతో విష్ణువుని తిట్టి, "బుద్ధి లేదూ? పారిపోయే వాళ్ళని చంపకూడదనే ధర్మమైనా ఎరగవూ?" అని మళ్ళీ యుద్ధానికి దిగాడు. మళ్ళీ ఓడిపోయాడు.

---

**469.** **ఉత్తరకాండ, సర్గ 43, శ్లోకాలు 13, 14:** ఈ యక్షులూ, రాక్షసులూ, సంస్కృతంలో మాట్లాడి ఇలా అయ్యారు. భక్షామః – అనబట్టి యక్షులయ్యారు. రక్షామః – అనబట్టి రాక్షసులయ్యారు. మరి వీరు తెలుగులో మాట్లాడితే ఏమయ్యేవారో! తినేస్తాం – అంటే తిన్నులూ, కాపాడతాం – అంటే కాపాడులూ అయ్యేవారా? ఇటలీ భాష లోనో, పార్శీ భాషలోనో మాట్లాడితే? ఇంతకీ, రాక్షసులు పుట్టడానికి కారణం (1) బ్రహ్మ చెప్పినట్టు వినడం. (2) సంస్కృతంలో మాట్లాడడం. ఈ రెండు పనులూ చేసేవాళ్ళు చెడ్డవాళ్ళవుతారన్న మాట! ★

ఆ రకంగా రాక్షసులు అనేకసార్లు విష్ణువుతో యుద్ధాలు చేసి ఓడిపోతూనే వున్నారు. చివరికి విష్ణువు పీడ భరించలేక లంకని వొదిలి పాతాళానికి పారి పోయారు. (నివాస స్థలాల కోసమే ఈ పోట్లాటలన్నీ.)

రామా! ఆ విధంగా అప్పుడు రాక్షసుల్ని విష్ణువు హతమార్చాడు. ఇప్పుడు నువ్వు హతమార్చావు. అధర్మం అధికమైనప్పుడల్లా నువ్వు పుడుతూ వుంటావు" అని చెప్పాడు అగస్త్యముని.

ఆ ముని, రాక్షసుల కథ మళ్ళీ ప్రారంభించాడు. "ఒకసారి రాక్షసుడైన సుమాలి తన కూతురు కైకసితో కలిసి తిరుగుతూ వుండగా, కుబేరుడు లంక నించి విమానంలో తండ్రి దగ్గిరికి వెళ్తూ కనపడ్డాడు. కుబేరుడి భోగభాగ్యాలు చూసి సుమాలి చాలా విచారించాడు. "మన లంక మళ్ళీ మనకెలా స్వాధీనపడుతుంది?" అని ఆలోచించాడు. కూతురితో, "నువ్వు కూడా విశ్రవసుని పెళ్ళి చేసుకుని కుబేరుడులాంటి కొడుకుని కను" అన్నాడు.

అలాగేనని కైకసి విశ్రవసు దగ్గిరికి వెళ్ళింది. బ్రాహ్మణుడైన ఆ విశ్రవసువు (ద్విజః – అని వాడాడు కవి) కైకసిని చూసి, "ఎవరి బిడ్డవు? ఎందుకు వచ్చావు?" అని అడిగాడు.

కైకసి కాలి బొటన వేలు నేలకి రాస్తూ, సిగ్గు పడుతూ, "నా పేరు కైకసి. నా తండ్రి నీ దగ్గిరికి వెళ్ళ మన్నాడు. మిగతాది నువ్వు గ్రహించుకో" అంది. ఆయన దివ్యదృష్టితో గ్రహించేశాడు మిగతాది, "ఓహో! నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలా? అలాగే" అన్నాడు. "నువ్వు నా దగ్గిరికి దారుణమైన సంధ్య వేళలో వచ్చావు. (సంధ్య వేళ దారుణమైనదా? అసలు ఏ వేళ అయినా దారుణమైనదా?) నీకు దుర్మార్గాలు చేసే పిల్లలే పుడ తారు" అన్నాడు. (దుర్మార్గాలు చేసే ఈ తండ్రి దుర్మా ర్గాలే నేర్పుతాడు గదా పిల్లలకి?)

అలా జరగగూడదని కైకసి ప్రార్థించింది.

"సరే! నీ ఆఖరి కొడుకు మంచివాడవు తాడులే" అని కనికరించి వరమిచ్చాడు విశ్రవసు. (ఆ పుట్టే వాళ్ళు, ఆమె పిల్లలే గానీ, తన పిల్లలు కానట్టు! పిల్లల మీద తండ్రులకు ఆసక్తి లేని కాలం ఇది.)

కైకసికి నలుగురు బిడ్డలు పుట్టారు. పెద్దవాడు, రావ ణుడు. పది తలలూ, ఇరవై చేతులూ, కోరలూ, పరమ వికారం.[470] రెండోవాడు, కుంభకర్ణుడు. ఎంత పొడుగో! చెప్పలేనంత వికారం. మూడోది, శూర్పణఖ. అన్నల్ని మించిన వికారి. పైగా చుప్పనాతి. ఆఖరివాడు, విభీషణుడు. ఈయన అందం ఇంతా అంతా కాదు. సుగుణాలు ఇన్నీ అన్నీ కావు. ధర్మదేవతే. ఈయన పుట్ట గానే పూల వాన కురిసింది! దుందుభులు మోగాయి. (అబద్ధాల వర్షం కురిసింది! విభీషణుడి తోడబుట్టిన వాళ్ళందరూ రాక్షసులైతే, అంతంత దుర్మార్గులైతే, ఈయన వొక్కడూ అంత బుద్ధి మంతుడెలా అయిపోయా డనే ప్రశ్న వొస్తుంది కదా? అందుకే, 'నీ ఆఖరి కొడుకు ఉత్తముడు అవు తాడులే' అని, తండ్రిగారు, తల్లికి వరం ఇచ్చినట్టు ఈ తక్కాయి బుక్కాయి కథ!)

రావణుడు, ఋషుల్ని బాధపెట్టే దుర్మార్గుడై పోయాడు. విభీషణుడు మాత్రం చక్కగా వేదాలు చదు వుతూ (అవి చదివితేనే కదా కిటుకులన్నీ తెలిసేది?) ఉత్తముడయ్యాడు.

ఒకసారి కుబేరుడు విమానం మీద తండ్రి దగ్గిరికి (విశ్రవశు దగ్గిరికి) వచ్చాడు.

కైకసి, తన పెద్ద కొడుకైన రావణుడికి కుబేరుణ్ణి చూపించి, "చూడు నాయనా! నీ అన్న ఎంత గొప్పవాడో! నువ్వుకూడా అంత వాడివి కావాలి" అంది.

రావణుడు, తల్లి మాట విని, "అలాగే గొప్పవాణ్ణి అవుతానమ్మా!" అని తమ్ముళ్ళతో కలిసి తపస్సుకి వెళ్ళాడు. (అయ్యయ్యో, చదువుకోడానికి వెళ్తే పోయేది కదా?)

కుంభకర్ణుడు కూడా 10 వేల సంవత్సరాలు ఘోర తపస్సు చేశాడు. విభీషణుడు, వొంటికాలి మీద నిలబడి 5 వేల సంవత్సరాలూ, రెండు కాళ్ళ మీద నిలబడి (వొంటి కాలు 5 వేల సంవత్సరాలకి నొప్పెట్టింది గావున్ను) ఇంకో 5 వేల సంవత్సరాలూ ఘోర తపస్సు చేశాడు.

రావణుడు వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసి ఒక తల నరికి అగ్నిలో పడేసి హోమం చేశాడు. (బలి ఇవ్వడం.) మళ్ళీ వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసి రెండో తల నరికి హోమం చేశాడు. (అబ్బా, ఎంత రోత చదవాల్సి వస్తోంది!) ఆ రకంగా 9 తలలు హోమం చేసి, పదో తల నరుక్కోబోతోంటే బ్రహ్మ ప్రత్యక్షం అయ్యాడు. (ఎంత తొందరగా వచ్చాడో!) రావణుడు, "నాకు చావు లేకుండా చిరంజీవిగా వరం ఇయ్యి!" అన్నాడు. బ్రహ్మ, "అది కుదరదు. ఇంకేమన్నా కోరుకో" అన్నాడు. "సరే! అలాగయితే దేవతల చేతా, గంధర్వుల చేతా మాత్రం నాకు చావు లేకుండా చెయ్యి" అన్నాడు రావణుడు. "అలాగే. నీ తలలన్నీ మళ్ళీ వచ్చేస్తాయి. ఏ రూపం కావాలంటే ఆ రూపంలోకి మారగలిగే కామ

**470.** రావణుడి తండ్రి విశ్రవసువు గదా? అతడు బ్రాహ్మణుడూ. ఋషీ. తల్లి, రాక్షసజాతి స్త్రీ. బ్రాహ్మణులకూ, ఋషులకూ శత్రువులు – రాక్షసులు. రావణుడు, తల్లి లాగ రాక్షసుడే అయ్యాడు. వంశం మాత్రం తండ్రి తాతల వంశం. పౌలస్త్య వంశం అట! ★

రూప శక్తి కూడా ఇస్తున్నాను" అని, ఒకటికి రెండు వరాలు ఇచ్చాడు బ్రహ్మ.

తర్వాత బ్రహ్మ విభీషణుడి దగ్గిరికి వెళ్ళాడు. విభీషణుడు వినయంగా, "నాకు ఎప్పుడూ ధర్మబుద్ధి ఉండాలి. (వరం లేకపోతే తన బుద్ధి సరిగ్గా నిలబడదని అతనికీ తెలుసు!) నేను నేర్చుకోకుండానే బ్రహ్మాస్త్రం వొచ్చెయ్యాలి" అన్నాడు. (ఇదేనా ధర్మ బుద్ధి?)

"అలాగే! ఎప్పుడూ ధర్మాత్ముడివే నువ్వు! రాక్షస తల్లికి పుట్టినా రాక్షస బుద్ధి రాలేదు నీకు" అని మెచ్చుకున్నాడు బ్రహ్మ. (బ్రహ్మగా పుట్టినా వీడికి బ్రహ్మబుద్ధి రాలేదు కదా? అలాగన్న మాట!)

తర్వాత బ్రహ్మ కుంభకర్ణుడి దగ్గిరికి బయల్దేరుతోంటే దేవతలందరూ గోలపెట్టారు. "వొద్దు వొద్దు కుంభకర్ణుడు చాలా దుర్మార్గుడు. వరాలు కూడా ఇస్తే ఇంకా దుర్మార్గుడై పోతాడు" అన్నారు. బ్రహ్మ ఆలోచించి సరస్వతిని పిలిచి "నువ్వెళ్ళి కుంభకర్ణుడి నోట్లో ఉండు. నేను అనుకున్నట్టుగానే అతనితో పలికించు" అన్నాడు.

వెంటనే సరస్వతి వెళ్ళి కుంభకర్ణుడి నాలిక మీద కూర్చుంది. (చదువుల తల్లి సరస్వతికి కూడా భర్త చెప్పినట్టు నడిచే దాస్యం తప్పలేదు!) తర్వాత బ్రహ్మ, కుంభకర్ణుణ్ణి "నీకేం వరాలు కావాలి?" అని అడిగాడు. కుంభకర్ణుడు – "వేల వేల సంవత్సరాల కొద్దీ నేను నిద్రపోతూ వుండాలి" అని అడిగాడు. (సరస్వతే ఆ మాటలు అనిపించింది. అయితే, సరస్వతి కూడా నమ్మదగ్గది కాదన్న మాట!) అలాగేనని బ్రహ్మ వెళ్ళి పోయాడు. కుంభకర్ణుడి నోట్లోంచి సరస్వతి కూడా వెళ్ళిపోయింది. కుంభకర్ణుడు తన మాటలకు తనే ఆశ్చర్యపడ్డాడు. "ఇలా అడిగానేమిటి?" అని ఆలోచించాడు. "దేవతలు నన్ను మోసం చేశారు" అని గ్రహించుకున్నాడు.

ఆ రకంగా, ఆ అన్నదమ్ములు వరాలు సంపాదించి ఇంటికి వచ్చేశారు.

రావణుడి తాత సుమాలి రావణుడికి గత విషయాలన్నీ చెప్పి "లంక మనదే. అక్కడ ఇప్పుడు కుబేరుడు ఉన్నాడు కదా? నువ్వు మళ్ళీ లంకని ఆక్రమించాలి" అన్నాడు. రావణుడు దానికి ఇష్టపడలేదు. "కుబేరుడు నా అన్న. అన్నని ధిక్కరించడం తప్పు కదా?" అన్నాడు. ప్రహస్తుడు రావణుడితో, "వీరత్వం విషయంలో అన్నా తమ్ముడూ అనే సంబంధం ఏమిటి? దితి బిడ్డలూ (దైత్యులు), అదితి బిడ్డలూ (దేవతలు) అన్నదమ్ములే గదా? వాళ్ళు, అధికారాల కోసం కలహించుకోలేదా? విష్ణువు, దైత్యుల్ని ఓడించి వారి సంపదంతా దేవతలకిచ్చాడు గదా?" అని చెప్పాడు. ప్రహస్తుడి మాటలు రావణుడికి నచ్చాయి. "సరే! నువ్వే కుబేరుడి దగ్గిరికి వెళ్ళిరా! లంకని ఇచ్చెయ్యాలని అడిగిరా!" అని రావణుడు ప్రహస్తుణ్ణి తన దూతగా కుబేరుడి దగ్గిరికి పంపించాడు. ప్రహస్తుడు లంక పుట్టు పూర్వోత్తరాలన్నీ కుబేరుడికి చెప్పి, "లంక రాక్షసులకే చెందాలి. రావణుడి కేం చెప్ప మంటావు?" అని అడిగాడు.

కుబేరుడు, "రాక్షసులు లేకుండా లంక ఖాళీగా వున్న కాలంలో నేను ఇక్కడికి వచ్చాను. రావణుణ్ణి కూడా ఇక్కడికి వచ్చి ఉండమను. నాతో కలిసి ఉంటాడు" అన్నాడు. మళ్ళీ తన తండ్రి దగ్గిరికి వెళ్ళి, "రావణుడు లంకని ఇచ్చెయ్యమని కబురు పంపించాడు. ఏం చెయ్యమంటావు?" అని అడిగాడు. విశ్రవసు, "రావణుడు దుర్మార్గుడు. కొత్తగా వరాలు సంపాదించాడు కూడా. (కుబేరుడికీ ఉన్నాయి వరాలు. కానీ, అవి పాతబడి పోయాయి! రావణుడి వరాలు 'కొత్తవి' గదా? కొత్త వరాలు బాగా పని చేస్తాయి గావున్ను!) లంకని వొదిలేసి కైలాస పర్వతం మీదకి వెళ్ళిపో. అక్కడ చాలా మనోహరంగా ఉంటుంది. చక్కగా గంగానది ప్రవహిస్తూ ఉంటుంది" అని కొత్త స్థలాన్ని తెగ వర్ణించి చెప్పాడు. (పాతది అందుబాటులో లేకుండా పోతే, కొత్త దాన్నే గొప్ప చేసుకోడం!)

కుబేరుడు లంకని వొదిలేశాడు. రావణుడు రాక్షసులందరితోటీ లంకలో ప్రవేశించాడు. తర్వాత రావణుడు, తన చెల్లెలు శూర్పణఖని, కాలకేయుడైన (ఒక జాతి) విద్యుజ్జిహ్వుడి కిచ్చి పెళ్ళిచేశాడు.

రావణుడు వేటకి వెళ్ళి, మయుడి కూతురైన మండోదరిని చూశాడు. మయుడు రావణుడికి తన వివరాలు చెప్పాడు. "నా భార్య హేమ. అప్సరస. మేము ఐదు వందల సంవత్సరాలు హాయిగా ఉన్నాం. ఇప్పుడు నా భార్య నా దగ్గిర లేదు. దేవతల పనిమీద వెళ్ళిపోయింది. మాయావీ, దుంధుభీ నా కొడుకులు (వాలిని యుద్ధానికి పిల్చి అస్తి పంజరంగా మారింది ఈ దుంధుభే.)"

రావణుడు కూడా తన వివరాలు చెప్పాడు. మయుడు మండోదరిని రావణుడికిచ్చి పెళ్ళి చేశాడు. తర్వాత రావణుడు, తమ్ముళ్ళకు కూడా పెళ్ళిళ్ళు చేశాడు. కుంభకర్ణుడి భార్య వజ్రజ్వాల. విభీషణుడి భార్య సరమ.

మండోదరికి మేఘనాధుడు (ఇంద్రజిత్తు) పుట్టాడు.

కుంభకర్ణుడికి నిద్ర రావడం మొదలుపెట్టింది. రావణుడి దగ్గిరికి వచ్చి, "అన్నా, నాకో ఇల్లు కట్టించు నిద్రపోవాలి!" అన్నాడు. రావణుడు వెంటనే గొప్ప భవనం కట్టించాడు. దాని కొలతలు 2 యోజనాల పొడవూ, ఒక యోజనం వెడల్పూ.

రావణుడు దేవతలను బాధిస్తూ దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నాడని విని కుబేరుడు రావణుడికి ఒక దూతతో సందేశం పంపించాడు. "నే నీమధ్య హిమాలయాలలో 8 వందల సంవత్సరాలు తపస్సు చేశాను. అక్కడ శివుడు

పార్వతితో విహరిస్తున్నాడు. నేను పార్వతి వేపు దుష్ట తలంపు లేకుండానే చూసినప్పటికీ, నా కుడి కన్ను కాలి పోయింది. (దుష్ట తలంపుతో చూస్తే కాలేది కాదేమో!) తర్వాత శివుడితో స్నేహం చేసుకుని తిరిగి వచ్చాను. నీ దుండగాల గురించి విన్నాను. ఇకనైనా బుద్ధిగా ఉండు. మన వంశానికి మచ్చ తీసుకు రాకు" అని ఆ సందేశం.

రావణుడికి కోపం వచ్చి కుబేరుడి దూతని నరికేసి, వెంటనే సైన్యాలు తీసుకుని కుబేరుడి మీదకి యుద్ధానికి వెళ్ళాడు. ఘోర యుద్ధం జరిగింది. కుబేరుడు వోడిపో యాడు. రావణుడు పుష్పక విమానం స్వాధీనం చేసుకుని దాంట్లో ఎక్కి లోకాలన్నీ తిరగడం మొదలుపెట్టాడు. శరవణ వనం దగ్గిర కొండ మీద విమానం ఆగి పోయింది. పర్వతం అడ్డొచ్చి కదలకుండా నించుంది విమానం.

నందీశ్వరుడు రావణుడి దగ్గిరికి వచ్చి, "ఇక్కడ శివుడు క్రీడిస్తున్నాడు. ఎవ్వరినీ రానివ్వకూడదని నన్ను ఆజ్ఞాపించాడు. నువ్వు ఇక్కడి నించి వెళ్ళిపో" అన్నాడు. రావణుడికి కోపం వచ్చి, "శివుడా? (గివుడా?) ఎవడా శివుడు? వెధవ కోతి మొహం నువ్వూనూ" అంటూ నవ్వి విమానం దిగాడు.

నంది కోపంగా, "నన్ను కోతిమొహం అని వెక్కి రించావుగా? అలాంటి కోతుల వల్లే మూడుతుందిలే నీకు" అన్నాడు.

నంది ఆ మాటలనగానే పూల వాన కురిసింది. దేవ దుందుభులు మోగాయి. (ఎప్పుడెవరు మాట్లాడు తారా, డప్పులు కొడదామా - అని కూర్చుంటారు గావున్ను దేవతలు ఆకాశం మీద!)

రావణుడు తన విమానానికి అడ్డం వచ్చిన పర్వ తాన్ని పట్టి వూపి వూడదియ్యడం మొదలుపెట్టాడు. పర్వతం మీద వాళ్ళందరూ భయపడి శివుడి చుట్టూ చేరారు.

శివుడు కాలి బొటనవేలితో పర్వతాన్ని నొక్కి పెట్టాడు. రావణుడు, చేతులు పర్వతం కింద నొక్కుకు పోయి భయంకరమైన బొబ్బలు పెట్టాడు. లోకాలన్నీ అల్లకల్లోలమై పోయాయి. రావణుడి మంత్రులు రావణు డితో, "శివుణ్ణి ప్రార్థించు, వేరే దారి లేదు" అని చెప్పారు.

రావణుడు శివుణ్ణి స్తోత్రం చేస్తూ వెయ్యి సంవత్స రాలు ఉన్నాడు. అప్పటికి శివుడికి దయ కలిగి, పర్వతం మీద వేలు కొంచెం తేల్చాడు. రావణుడికి చాలా వరాలు కూడా ఇచ్చాడు.

రావణుడు మళ్ళీ విమానంలో బయల్దేరాడు. ఒక స్త్రీ తపస్సు చేసుకుంటూ కనబడింది. రావణుడు ఆమెని, "ఇంత అందగత్తెవి, ఈ వయస్సులో తపస్సేవిటి? నీ భర్త ఎవరు? (సంసారం వదిలేసి తపస్సు చేసుకునేంత విరక్తి కలిగించాడా నీకు జీవితం మీద?)" అని అడి గాడు. ఆమె, "బృహస్పతి మనమరాల్ని నేను. నా తండ్రి ఎప్పుడూ వేదాలు చదువుతాడు. వాంగ్మయ కన్యగా పుట్టాను నేను. అందుకే నా పేరు వేదవతి. చాలామంది పురుషులు నన్ను పెళ్ళి చేసుకోవాలని చూశారు. కానీ నా తండ్రి నన్ను విష్ణువుకి తప్ప ఎవ్వరికీ ఇవ్వనన్నాడు. (ఎంత కట్నం ఇస్తాడు నీ తండ్రి విష్ణువుకి? విష్ణువైతే చాలా తీసుకుంటాడు మరి!)

దంభుడనే రాక్షసరాజు నన్ను తనకు ఇవ్వలేదనే కోపంతో మా తండ్రిని నిద్రపోతూ వుండగా చంపేశాడు. నా తల్లి, నా తండ్రి కళేబరంతో పాటు అగ్ని ప్రవేశం చేసింది. నా తండ్రి నన్నెప్పుడూ విష్ణువుకివ్వాలనే కోరు కునే వాడు గదా? అందుచేత నేను కూడా నా మనసు విష్ణువు మీదే పెట్టుకున్నాను. విష్ణువునే పెళ్ళి చేసుకోవా లని తపస్సు చేస్తున్నాను. నీ గురించి నాకంతా తెలుసు. రావణుడివి. లంకాధిపతివి" అని అంతా చెప్పింది.

రావణుడు అంతా విని, "అది సరే! విష్ణువు నాతో సాటి రాడు, నన్ను వరించు" అన్నాడు.

"అలా అనకు, తప్పు. విష్ణువు ముల్లోకాధిపతి" అంది వేదవతి.

రావణుడు కామంతో వేదవతి జుట్టు పట్టుకున్నాడు.

వేదవతి ఒక్కసారిగా రౌద్రంతో మండిపడిపోయి చేత్తో జుట్టు కోసేసుకుంది. "దుర్మార్గుడా! నా జుట్టు ముట్టుకుని నన్ను అవమానం చేశావు. నీ కళ్ళ ముందే చచ్చిపోయి నిన్ను చంపడానికి మళ్ళీ అయోనిజగా పుడ తాను. నీకు శాపం పెడదామా అంటే నా తపస్సు వ్యర్థం అయిపోతుందని ఆలోచిస్తున్నాను" అని అగ్నిలో ఉరి కింది.

వెంటనే తామర పువ్వులో పుట్టింది.

రావణుడు, తామర పువ్వుతోపాటు వేదవతిని లంక లోకి తెచ్చాడు. అతని మంత్రి - "ఈమె నీ ఇంట్లో వుంటే నీకే ప్రమాదం" అని చెప్పాడు. రావణుడా తామర పువ్వుని సముద్రంలో పారేశాడు. ఆ పువ్వు సముద్ర కెరటాలతో కొట్టుకు వచ్చి జనక మహారాజు యజ్ఞ క్షేత్రంలో కప్పడిపోయింది. కృత యుగంలో అలా కప్పడి పోయిన వేదవతి, త్రేతా యుగంలో సీతగా పుట్టింది.

రావణుడు మళ్ళీ విమానం మీద లోక సంచారం ప్రారంభించాడు. ఉశీరబీజం అనే చోట మరుత్తరాజు యజ్ఞం చేస్తున్నాడు. రావణుడు ఆ రాజుని యుద్ధానికి పిలిచాడు. యజ్ఞం కోసం వచ్చి కూర్చున్న దేవత లందరూ మారువేషాలతో పారిపోయారు. ఇంద్రుడు నెమలి వేషంతో, యముడు కాకి వేషంతో, వరుణుడు హంస వేషంతో - ఆ రకంగా! దేవేంద్రుడు పారి పోయినా, మరుత్తరాజు మాత్రం యుద్ధానికి వెళ్ళ

బోయాడు. యజ్ఞకాలంలో యుద్ధానికి దిగకూడదని పురోహితులు రాజుని ఆపుజేశారు.

రావణుడు తనే గెలిచానని, యజ్ఞానికొచ్చిన రుషుల్ని తినేసి వెళ్ళిపోయాడు. (చూశారా! యజ్ఞాలూ యాగాలూ అవీ జరిగే చోట్లకి వెళ్ళకూడదు. అక్కడ బోలెడు చీదరలు ఉంటాయి.)

రావణుడు రాగానే మారు రూపాలతో పారిపోయిన దేవతలందరూ ఎవరే పక్షిగా మారారో, ఆ పక్షులకు గొప్ప గొప్ప వరాలిచ్చారు. ఇంద్రుడు నెమలికి, "నెమలీ! ఇక నించీ నీ పింఛం వెయ్యి కన్నులతో మెరుస్తుంది. వర్షం వొచ్చినప్పుడు నువ్వు ఆడతావు, (శతృవు లొచ్చినప్పుడు నేను పరిగెడతాను)" అని వరం ఇచ్చాడు. (ఈ వరం ఇవ్వక ముందు నెమలి పింఛం రంగులు లేకుండా వుండేదా? నెమలి అప్పుడు ఆడకుండా ఓ మూల కూచునేదా?)

యముడు కాకికి, "కాకీ! ఎవరన్నా నిన్ను చంపితేనే గానీ నీకు చావు ఉండదు. (చంపితే మాత్రం ఉంటుంది. అప్పుడు వరం పప్పులేం వుడకవు!) నీకు రోగాలు రావు. నువ్వు పిండాలు తింటే, చచ్చిపోయిన వాళ్ళకు తృప్తి అవుతుంది" అని వరం ఇచ్చాడు.

వరుణుడు హంసకి, "హంసా! నీ చర్మం చక్కగా, తెల్లగా, మృదువుగా అందంగా అవుతుంది" అని వరం ఇచ్చాడు. (అంతకు ముందు హంసలు, నలుపూ, తెలుపూ కలిసి ఉండేవా?)

కుబేరుడు, తొండకి, దాని శరీరం బంగారం రంగులో మెరిసేటట్టు వరం ఇచ్చాడు.

(అది సరే దేవతలూ! శతృవులొస్తే పరిగెత్తకుండా నిలబడే వరం మీ కెవరిస్తారు?)[471]

రావణుడు రాజులందరి దగ్గిరికీ తిరిగాడు. "వొస్తే యుద్ధానికి రండి, లేకపోతే, 'ఓడిపోయాం' అని వొప్పేసు కోండి (అంతేగా మరీ!)" అని అందర్నీ కవ్వించి పిలిచాడు.

దుష్యంతుడూ, పురూరవుడూ, గయుడూ, ఇంకా కొందరు రాజులు చక్కగా, తెలివిగా, 'ఓడిపోయాం లెమ్మ'ని వొప్పేసుకున్నారు.

రావణుడు అయోధ్య కూడా వచ్చాడు. అప్పుడు అయోధ్యలో అనరణ్యుడు పరిపాలిస్తున్నాడు. అతడు రావణుడితో యుద్ధానికే దిగాడు. కానీ, యుద్ధంలో పూర్తిగా వోడిపోయి రథంలోంచి కింద పడిపోయి, "రావణా! నిన్ను చంపేవాడు మా రఘువంశంలోనే పుడతాడు. దశరథుడనే మహారాజు పుడతాడు. ఆయనకు శ్రీరాముడనే మహారాజు పుడతాడు. ఆయనే నిన్ను చంపుతాడు" అని చెప్పి ప్రాణాలు విడిచాడు.

రావణుడు మళ్ళీ సంచారం చేస్తూ, మేఘాల్లో నడిచి వెళ్తోన్న నారదుణ్ణి "బాగున్నావా?" అని పలకరించాడు. నారదుడు, "బాగున్నాను గానీ …. మానవ మాత్రులతో యుద్ధాలేమిటి నీకు? రోగాలతో, రొష్టులతో, చింతలతో, ముసలితనాలతో కొట్టుకుంటూ వుంటారు మానవులు. నీకు తగ్గ వాళ్ళని నువ్వు చూసుకో. యముడితో యుద్ధం చెయ్యి!" అన్నాడు.

సరేనని రావణుడు విమానం తిప్పుకుని యమ లోకానికి బయల్దేరాడు.

నారదుడు రావణుడి కన్నా ముందే యమ లోకానికి వెళ్ళి యముడితో, "రావణుడు నీ మీదకి యుద్ధానికి వొచ్చేస్తున్నాడు" అని చెప్పేశాడు.

రావణుడు యమలోకానికి వస్తూ, యమ భటులు పాపాత్ముల్ని ఎలా హింసలు పెడుతున్నారో చూశాడు. యమ భటులు కొందర్ని కత్తులతో కోసి ఉప్పులో పడేస్తున్నారు. కొందర్ని కుక్కల చేత పీకిస్తున్నారు. కొందర్ని భగ భగ మండే ఇసకలో దొర్లిస్తున్నారు. కొందర్ని దిశ మొలలతో మల మూత్రాలలో పడేస్తున్నారు. పాపులు చిక్కి శల్యాలైపోయి, ఆకలి దప్పులతో నక నకలాడుతూ వెర్రెత్తినట్టు ఎటుబడితే అటు పరుగులెత్తుతున్నారు.[472]

ఇక పుణ్యం చేసుకున్న వారి సంగతి: భూలోకంలో అన్న దానాలు చేసిన వారు అక్కడ పంచభక్ష్య పరమాన్నాలతో భుజిస్తున్నారు. గోదానాలు చేసిన వారు, పాలు పెరుగులు తాగుతున్నారు. గృహ దానాలు చేసిన వారు దివ్య భవనాలలో విహరిస్తున్నారు. వెండి బంగారాలు దానం చేసిన వారు అనేక ఆభరణాలు ధరించి మురుస్తున్నారు. (అన్నదానం చెయ్యకుండా గోదానం చేసిన వాళ్ళకి, ఎప్పుడూ పాలూ, పెరుగూ, నెయ్యా

---

**471.** ప్రకృతిలో అనేక విషయాలకు కారణాలు తెలీక వాటి గురించి రక రకాల ఊహలతో కథలు అల్లుకోవడం ఇది. నెమలి పింఛంలో అన్ని రంగులు ఎందుకుంటాయో తెలీక, 'ఇంద్రుడు వరం ఇచ్చాడు' అనే కథ! నెమలి పింఛం గురించే ఒక్కో దేశంలో ఒక్కో రకం కథ ఉంటుంది. ప్రకృతి గురించి ఏమీ తెలియకపోవడం చేతే ఇలాంటి కథలు తయారవుతాయని అర్థం చేసుకోవాలి. ★

**472.** యమలోకంలో ఏ యే బాధలు పడతారని చెపుతారో, అవన్నీ శతృవులకు చిక్కినప్పుడు వాళ్ళు పెట్టే బాధలే! శతృవులు ఏ రకమైన బాధలు పెడతారో అవే యమలోకంలో బాధలు! వీటిని ఇంకా సరిగా అర్థం చేసుకుంటే, సమాజంలో బానిసత్వం ప్రారంభమైనప్పుడు, యజమానులు, బానిసల్ని లొంగదియ్యడానికి పెట్టే బాధలు అవన్నీ! ★

మాత్రమే ఇస్తారు గావున్ను. గృహదానం వాళ్ళు, దివ్య భవనాలు చూసుకుని మురవ్వలసిందే. తిండి ఉండదు! సువర్ణ దానాలు మాత్రమే చేసిన వాళ్ళు, కాలే కడుపుతో బంగారం నగలు మోస్తూ ఉండాలి!)

రావణుడు యమలోకం అంతా చూసి యమ భటుల చేతుల్లో బాధలుపడే వాళ్ళందర్నీ విడుదల చేసే శాడు. (ఆహా రావణా! నీ చరిత్రకంతకీ గొప్ప విషయ మోయీ ఇది! నీ తప్పులన్నిటినీ క్షమించెయ్యగలిగేటంత మంచి విషయం ఇది!) యమ భటులకు కోపం వచ్చి రావణుడితో యుద్ధానికి దిగారు.

ఘోర యుద్ధం! చివరికి యముడు రావణుడి మీద విసరాలని కాలదండం ఎత్తాడు. బ్రహ్మ పరు గెత్తు కుంటూ వచ్చి, "అయ్యయ్యో! విసరకు, విసరకు! నా మాట విను. రావణుడికి దేవతల చేతుల్లో చావులేదని వరం ఇచ్చాను. నీ దండం వల్ల ఇతను చచ్చిపోతే, నా మాట అసత్యం అయిపోతుంది. అదీగాక, ఈ కాల దండాన్ని కూడా నేనే సృష్టించాను. దీన్ని ప్రయోగిస్తే వ్యర్థం కాదని దీనికి వరం ఇచ్చాను. ఒకవేళ, రావణుడికి వున్న వరం వల్ల ఇది రావణుడి మీద పని చెయ్యకపోతే, ఈ దండానికి నేను ఇచ్చిన మాట అసత్యం అయి పోతుంది. అంచేత నువ్వేమీ చెయ్యకుండా వూరుకో!" అని యముణ్ణి బతిమాలాడు. (ఎవ్వరూ చంపకుండా ఉంటేనే, రావణుడికి ఇచ్చిన వరం చక్కగా పని చేస్తుంది! కాల దండంతో ఏ పనీ చెయ్యకుండా ఉంచితేనే, దానికి ఇచ్చిన వరం నిలబడుతుంది. ఎంత గొప్ప వరాలో!)

యముడు విసుక్కుని "మరి చంపడానికి వీల్లే నప్పుడు నే నిక్కడ చూస్తూ కూర్చోడం ఎందుకు?" అని అక్కడ నించి మాయం అయిపోయాడు – ఆ రకంగా రావణుడు యముణ్ణి గెలిచాడు.

రావణుడు సముద్రం లోంచి పాతాళం లోకి వెళ్ళాడు. (విమానంతో!) అక్కడ దైత్యులు (ఒక జాతి) యుద్ధానికి వచ్చారు. రాక్షసులకూ, దైత్యులకూ యుద్ధం ఎటూ తేలలేదు. అంతలో బ్రహ్మ పరుగెత్తుకుంటూ వచ్చి దైత్యులతో, "రావణుణ్ణి దేవతలే జయించలేరు. (అలా అని నేను వరం ఇచ్చాను.) మీరు రావణుడితో స్నేహం చేసుకోండి" అని వాళ్ళని బతిమాలాడు. (బ్రహ్మ, ఈ రకంగా తను వరాలు ఇచ్చిన వాళ్ళ వెనకాల పరిగెత్తు కుంటూ తిరగవలసిందేనా?)

రావణుడు, తర్వాత కాలకేయులతో కూడా యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలోనే రావణుడు శూర్పణఖ భర్తని చంపేశాడు.

తర్వాత వరుణాలయం వెళ్ళాడు. అక్కడ కామ ధేనువుని చూశాడు. అది ఎప్పుడూ వట్టిపోకుండా పాలు ఇస్తుంది. దాని పాలతోనే పాల సముద్రం పుట్టింది. పాల సముద్రంలోంచి చంద్రుడు పుట్టాడు. (చల్ల కుండలో తేలే వెన్న ముద్దేనా చంద్రుడంటే?)

రావణుడు వరుణాలయం వెళ్ళినప్పుడు అక్కడ వరు ణుడు లేడు. సంగీతం వినడానికి బ్రహ్మలోకం వెళ్ళాడని తెలిసింది. (యజ్ఞాలకో యాగాలకో గాక, సంగీత కచేరీకి వెళ్ళాడు. మంచి అభిరుచే!)

రావణుడు, వరుణ కుమారుల్తో యుద్ధం చేసి, వారిని ఓడించి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

తర్వాత అశ్మ నగరం వెళ్ళాడు. ఒక గొప్ప భవనం గుమ్మం దగ్గిర పెద్ద పురుషాకారం కనిపించింది. ఆ ఆకారం రావణుడితో "నాతో యుద్ధం చెయ్యాలంటే, ఇక్కడే చెయ్యి. బలి చక్రవర్తితో చెయ్యాలంటే, లోపలికి వెళ్ళు" అంది. రావణుడు లోపలికి వెళ్ళాడు. బలి, రావణుణ్ణి చూసి, దూరంగా ఉన్న చక్రంలాంటి వస్తువు చూపించి "ఆ కుండలం ఇలా పట్టుకురా!" అన్నాడు. రావణుడు దాన్ని ఎత్తాలని ఎంత ప్రయత్నించినా ఎత్తలేక పోయాడు. అప్పుడు బలి, "అది మా తాత చెవి కుండలం. ఆయన పేరు హిరణ్య కశిపుడు. ఆయన ఆ కాలంలో యుద్ధం చేస్తున్నప్పుడు ఈ చెవిపోగు ఇక్కడ పడిపోయింది. అలాంటి గొప్ప వీరుణ్ణి శ్రీ మహావిష్ణువు చంపేశాడు. నా గుమ్మం దగ్గిర బయట కాపలా ఉన్న వాడు ఆ విష్ణువే. నువ్వు కూడా విష్ణువుని పూజించు!" అన్నాడు. (విభీషణుడిలాగ బలి చక్రవర్తి కూడా స్వజాతి ద్రోహేనా? ఈయన హిరణ్యకశిపుడికి మనవడు కదా? అంటే, ప్రహ్లాదుడి కొడుకా?)

రావణుడు కోపంగా విష్ణువుతో దెబ్బలాటకి బయ టికి పరిగెత్తాడు.

రావణుడు వస్తున్నాడని గ్రహించి, విష్ణువు, 'రావణు డికి బ్రహ్మవరం ఉంది కదా' అని అతనితో దెబ్బలాటకి దిగకుండా అంతర్ధానమైపోయాడు. రావణుడికి విష్ణువు కనపడక అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

రావణుడు తర్వాత సూర్యలోకం వెళ్ళాడు. ప్రహస్తు డితో సూర్యుడికి కబురు పంపించాడు. "యుద్ధానికి వొస్తావా, లొంగిపోయానని వొప్పేసుకుంటావా?" అని. సూర్యుడు ఎర్ర బట్టలు కట్టుకుని, పూల దండలు వేసు కుని, బంగారం నగలు పెట్టుకుని వున్నాడు. (సూర్యుడికి ఆ బట్టలు ఏ దర్జీ కుట్టాడో! ఆ నగలు ఏ కంసాలి చేశాడో!) ప్రహస్తుడు చెప్పిన సంగతి విని సూర్యుడు, తన ద్వారపాలకుణ్ణి పిలిచి, "దండీ! నాకు సమయం లేదు. కాలం వృథా చెయ్యలేను. (ఎంత చక్కని మాట న్నావు సూర్యుడూ!) నువ్వే యుద్ధానికి వెళ్ళు. లేకపోతే వోడిపోయానని వొప్పేసుకో" అన్నాడు. (అవును మరి, ఏదో ఒకటి తేల్చి చెప్పెయ్యాలి గమ్మున. నిమిషాలు వృథా చెయ్యకూడదు.)

దండి రావణుడితో, "మా యజమాని నన్నే యుద్ధం చెయ్యమంటున్నాడు నీతో" అని సంగతంతా చెప్పాడు. రావణుడు నవ్వి వెళ్ళిపోయాడు.

తర్వాత రావణుడు చంద్రలోకం ప్రయాణ మయ్యాడు. దారిలో, రథంలో పోతూ స్త్రీలతో సరస సల్లాపాలాడుతోన్న ఒక పురుషుణ్ణి చూశాడు. రావణుడు, ఆ దారే పోతున్న పర్వతుడనే మునిని పిలిచి "ఆ రథం మీదాయన ఎవరు?" అని అడిగాడు. "ఆయన గొప్ప తపస్సు చేశాడు. అందుకే స్వర్గానికి వెళ్తున్నాడు" అని చెప్పాడు పర్వతుడు. అంతలో, ఇంకో రథంలో, ఇంకో ఆయన్ని అప్సరసలు నాట్యాలు చేస్తూ తీసుకు వెళ్తున్నారు. "ఈయన యుద్ధరంగంలో వెన్ను చూపకుండా యుద్ధం చేశాడు. అందుచేత స్వర్గానికి వెళ్తున్నాడు" అని మళ్ళీ చెప్పాడు పర్వతుడు.

ఆ రకంగా రావణుడు ఎందర్నో చూశాడు. ఎవర్ని యుద్ధానికి రమ్మన్నా రాలేదు. అందరూ స్వర్గానికి పోతున్నారు.

అయోధ్య రాజు మాంధాత కూడా స్వర్గానికి పోతోంటే, అతణ్ణి కూడా యుద్ధానికి పిలిచాడు రావణుడు. మాంధాత యుద్ధానికి దిగాడు. రావణుడి తాత పులస్త్యుడు, ఆ సంగతి దివ్యదృష్టితో తెలుసుకుని, వెంటనే వచ్చి మనవణ్ణి మందలించి, మాంధాతకీ, రావణుడికీ స్నేహం కలిపి యుద్ధం ఆపించాడు. (ఈయనెవరో బుద్ధి మంతుళ్ళా వున్నాడు. ఈ కథల్లో ఇలాంటి వాళ్ళసలు కనపడరు!)

రావణుడు తర్వాత ఆకాశంలో ఇంకా పై పైకి పోయి, వాయు మండలాన్ని దాటి, చంద్రలోకానికి వెళ్ళి, చంద్రుడితో యుద్ధం మొదలుపెట్టాడు. (అయ్యో, చంద్రుడూ! నీకు యుద్ధాలెందుకు ఆ మూర్ఖుడితో? ఓడి పోయానని ఒప్పేసుకుందూ! వాడి పీడా పోతుంది. నువ్వు చల్లగా వెన్నెలలు కాచుకో!)

బ్రహ్మ పరిగెత్తుకుంటూ వొచ్చి, "రావణా! చంద్రుడి మీద బాణాలు వెయ్యకు. లోక హితకారి చంద్రుడు. నీకు ఆపదలో భయం లేని మంత్రం చెపుతాను" అని పెద్ద (చేటంత) మంత్రం చెప్పాడు. అది దేవుళ్ళందర్నీ వల్లించే మంత్రం!

తర్వాత రావణుడు వొక గుహలో దూరి వెతుక్కుంటూ లోపలికి వెళ్ళాడు. అక్కడ అందరూ నాలుగేసి చేతుల్తో ఉన్నారు. నారాయణుడు పాము శయ్య మీద పడుకుని ఉన్నాడు. లక్ష్మీదేవి సింహాసనం మీద కూర్చుని భర్తకి విసురుతోంది. (సింహాసనం మీద కూర్చున్నా, స్త్రీకి పతిసేవ తప్పదు!)

రావణుడు లక్ష్మీదేవిని పట్టుకున్నాడు. నారాయణుడు రావణుణ్ణి కోపంగా చూశాడు. ఆ చూపుతోటే రావణుడు కింద పడిపోయి లేచి వెళ్ళిపోయాడు.

రావణుడు తిరిగి లంకకు వస్తూ దారిలో కనపడ్డ అందగత్తెలందర్నీ విమానంలో ఎక్కించుకుంటూ వచ్చాడు.

లంకలోకి రాగానే శూర్పణఖ ఎదురువొచ్చి – "నా భర్తని చంపేశావు. నాకు దిక్కేమిటి?" అని ఏడ్చింది. రావణుడు చెల్లెల్ని వోదార్చి– "యుద్ధంలో తెలియక చేశాను. నీకేం భయం లేదు. ఖరుడితో కలిసి దండ కారణ్యంలో ఉండు" అని నచ్చ చెప్పి లంకలోకి వెళ్ళాడు.

నికుంభిల వనంలో ఇంద్రజిత్తు యజ్ఞం చేస్తున్నాడు. శివుడి వల్ల వరాలు కూడా పుచ్చుకున్నాడు. రావణుడు, కొడుకు చేస్తోన్న పని చూసి, "యజ్ఞం చెయ్యడం మంచి పని కాదోయీ! దేవతలందరూ మనకు శత్రువులే గదా? వారిని పూజించడం ఎందుకు?" అని విసుక్కుని, "సరే! అయిందేదో అయిందిలే, రా!" అని కొడుకుని తనతో నికుంభిలా వనం నించి తీసుకుని వెళ్ళి పోయాడు.

రావణుడు తెచ్చిన స్త్రీలందరూ దుఖిస్తూ విమానం దిగారు.

విభీషణుడు వారిని చూసి అన్నని మందలించి – "ఈ స్త్రీలందర్నీ దుఖపెట్టి తీసుకు వొచ్చావు. నీ లాగే మన కుంభీనసిని మధువు ఎత్తుకుపోయాడు" అని చెప్పాడు. రావణుడు మండిపడి అప్పటి కప్పుడే మధువు మీదకి దండెత్తి వెళ్ళాడు.

కుంభీనసికి మధువుని పెళ్ళాడడం ఇష్టమే. రావణుణ్ణి ప్రార్థించి అన్నకీ, భర్తకీ స్నేహం కలిపింది.

రావణుడు తిరిగి వస్తోంటే, రంభ తన ప్రియుడి దగ్గిరికి వెళ్తూ దారిలో కనిపించింది. రావణుడు ఆమెని కోరాడు. రంభ తిరస్కరించింది. రావణుడు వినకుండా, రంభ ఎంత వ్యతిరేకించినా, బలాత్కారం చేశాడు.

రంభ ఏడుస్తూ తన ప్రియుడైన నలకూబరుడి దగ్గిరికి వెళ్ళి జరిగిందంతా చెప్పింది. నలకూబరుడు కోపం పట్టలేక రావణుడి గురించి, "ఇష్టపడని స్త్రీని బలాత్కరిస్తే రావణుడి తల వెయ్యి చక్కలయిపోతుంది" అని శపించాడు. (ఈయన, రంభ మీద కోపం లేకుండా, ఆమె నిస్సహాయతని అర్థం చేసుకున్నాడు. చాలా మంచి వాడు కదూ?) నలకూబరుడు పెట్టిన శాపం రావణుడు విన్నాడు.

తర్వాత రావణుడు దేవేంద్రుడి మీదికి యుద్ధానికి వెళ్ళాడు. దేవేంద్రుడు విష్ణువు దగ్గిరికి వెళ్ళి ప్రార్థించాడు. విష్ణువు, తల అడ్డంగా తిప్పి, "రావణుడు వర గర్వంతో విర్రవీగుతున్నాడు. ఇప్పుడు ఎదురుపడి లాభం లేదు. కొంత కాలం పోయిన తర్వాత అతన్ని నేనే చంపుతాను. (అప్పటికి అతని వరాలు పాతబడిపోతాయి.) ఇప్పటికి

మాత్రం నువ్వే యుద్ధం చెయ్యి" అన్నాడు. (విష్ణువే చెయ్యలేనప్పుడు నువ్వేం చేస్తావు గానీ, పరుగుచ్చుకో ఇంద్రుడూ!)

దేవేంద్రుడు యుద్ధానికి దిగాడు. ఆ ఘోర యుద్ధంలో, పాముల రథం మీద ఉన్న సుమాలిని, దేవతల్లో ఒకడైన సావిత్రుడు చంపేశాడు.

ఇంద్రజిత్తు కోపంతో, దేవేంద్రుడి కొడుకైన జయం తుడితో యుద్ధం చేశాడు. జయంతుడికి ఆపద రావొచ్చు ననే భయంతో, అతని తాత, జయంతుణ్ణి తీసుకుపోయి సముద్రంలో దాచేశాడు. (సముద్రంలో ముంచితే ఆపద పోతుంది!) జయంతుడు కనపడక పోవడంతో ఇంద్రుడు కోపంగా ఇంద్రజిత్తుతో యుద్ధానికి దిగాడు. రావణుడు ఇంద్రజిత్తుని కొంతసేపు విశ్రమించమని చెప్పి తను ఇంద్రుడితో యుద్ధానికి వచ్చాడు.

దేవేంద్రుడు రావణుడి సారథిని చంపేసి, రథం కూల్చేసి, రావణుణ్ణి పట్టి స్వర్గానికి తీసుకుపోయాడు. వెంటనే ఇంద్రజిత్తు యుద్ధానికి వెళ్ళి, ఇంద్రుడితో ఘోర మైన యుద్ధం చేసి, ఇంద్రుణ్ణి బంధించి తండ్రిని విడి పించాడు. తర్వాత తండ్రితో, "ఇక ముల్లోకాలూ నీవే. యుద్ధం ఆపేసి లంకకు పోదాం" అన్నాడు. "సరే! ఇంద్రుణ్ణి రథానికి కట్టేసి తీసుకు పదండి లంకకి" అన్నాడు రావణుడు. ఇంద్రజిత్తు ఇంద్రుణ్ణి రథానికి కట్టేసి లంకకు తీసుకు పోయాడు.

దేవతలు బ్రహ్మ దగ్గిరికి పరిగెత్తారు. బ్రహ్మ లంకకి పరిగెత్తాడు. రావణుణ్ణి తెగ మెచ్చుకున్నాడు. ముల్లో కాలూ జయించావన్నాడు. పొగిడి, పొగిడి, చివరికి "ఇంద్రుణ్ణి విడిచి పెట్టించు" అన్నాడు. ఇంద్రజిత్తు, "విడిచి పెట్టేస్తాగానీ, నాకు చావు లేకుండా చిరంజీవిగా వరమియ్యి" అని అడిగాడు బ్రహ్మని. "అబ్బే! అదెట్టా కుదురుతుందీ?" అన్నాడు బ్రహ్మ.

"పోనీ ఇంకో వరం ఇయ్యి. నేను యుద్ధానికి వెళ్ళే ముందు అగ్నిహోత్రుడికి హోమం చేస్తాను. వెంటనే నా కోసం అగ్నిహోత్రుడి రథం రావాలి. ఆ రథం మీద ఉండి యుద్ధం చేస్తే మాత్రం నాకు చావు ఉండకూడదు. ఒక వేళ నేను హోమం పూర్తి చెయ్యకపోతే ఆ తప్పు నాదే. అప్పుడు నాకు చావు వొచ్చినా తప్పు లేదు."

"సరే! అలాగే" అన్నాడు బ్రహ్మ.

ఇంద్రుణ్ణి తీసుకుని వెళ్ళిపోయాడు.

ఇంద్రుడు చాలా సిగ్గుపడి కూర్చున్నాడు. (సిగ్గు పడ్డానికి, ఇంకా నీకు సిగ్గెక్కడ మిగిలింది ఇంద్రుడూ? సిగ్గంతా పోయే వుంటుంది కదా?)

బ్రహ్మ ఇంద్రుణ్ణి మందలించి, "నువ్వు చేసుకొన్న పాప ఫలితమే ఇది. నేను అహల్యని గొప్ప అంద గత్తెగా సృష్టించినప్పుడు నీ కిస్తానేమో అనుకున్నావు. నీ కివ్వ కుండా నేను ఆమెని గౌతముడు బుద్ధిమంతుడని అతడి కిచ్చాను. (నీ బుద్ధి మొదటినించీ ఇలాగే ఏడిసింది.) నువ్వు కోపం పట్టలేక అహల్యని బలాత్కరించావు. ఆ పాపం వల్లే నీకు ఇలాంటి అవమానం జరిగింది. నీ కొడుకు జయంతుడు సుఖంగానే వున్నాడు సముద్రంలో. వైష్ణవ యజ్ఞం చెయ్యి. అన్ని కళంకాలూ పోతాయి" అని చెప్పాడు. దేవేంద్రుడు ఆ యజ్ఞం చేసి మళ్ళీ పవిత్రుడూ, కీర్తిమంతుడూ అయిపోయాడు.

అగస్త్యుడు రాముడికి ఇంతవరకూ చెప్పి, "ఇంద్రుణ్ణే జయించిన వాడు ఇంద్రజిత్తు. అలాంటి వాడు నీ పరా క్రమం ముందు కూలిపోయాడు" అని రాముడి పరా క్రమం గురించి మళ్ళీ కీర్తన పాడాడు.

రాముడు – "అంతా బాగుంది. కానీ, రాక్షసులు అంతకాలం భూమి మీద ఎలా వీర విహారం చెయ్యగలి గారు? వారిని అణచడానికి సమర్థులైన రాజులే లేరా?" అని అడిగాడు. (నువ్వు తప్ప ఎవరున్నారోయి? – అని చెప్పించుకోవాలని!)

అగస్త్యుడు మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు. "రావ ణుడు కార్త వీర్యార్జునుడి దగ్గిరికి కూడా యుద్ధానికి వెళ్ళాడు. అతడికి వెయ్యి చేతులు. (రావణుడికి ఇరవై చేతులే. ఇంకోడికి వెయ్యి చేతులు! స్నానం చేసేటప్పుడు అన్ని చేతులు ఎలా తోముకుంటాడు బాబూ! ఒక వేపు వున్న 500 చేతుల్తో ఇంకో వేపు వున్న 500 చేతుల్ని తోముకుంటాడా? అయితే తేలికే.) అతడు అప్పుడు నర్మదా నదిలో భార్యలందరితో కలిసి జల క్రీడలాడు తున్నాడు. (ఓహో! భార్యలున్నారుగా? వాళ్ళు తోము తారు ఆ చేతులన్నీ.) తన వీరత్వం భార్యలకు చూపించ డానికి అతడు ప్రవాహానికి చేతులడ్డం పెట్టాడు. నది వెనక్కి పొంగింది. (గొప్పలన్నీ పెళ్ళాల ముందే!)

అక్కడ రావణుడు శివ పూజ కోసం పెట్టుకున్న పూలన్నీ కొట్టుకుపోయాయి. రావణుడా నదిని, ఎదురు తిరిగిన భార్యని చూసినట్టు చూశాడు.[473] నది ఎందుకు వెనక్కి తిరిగిందో మంత్రుల్ని కారణం తెలుసుకుని రమ్మ న్నాడు. వారు ఎగిరి వెళ్ళి నది కింద భాగంలో ఏం

---

**473.** **ఉత్తరకాండ, సర్గ 37, శ్లోకం 8:** "రావణుడు సగము ముగిసిన తన శివపూజను గాంచి, నియమము విడిచి వ్యతిరిక్తు రాలైన భార్యను జూచినట్లు నర్మదా నదిని జూచెను" – నది వెనక్కి ప్రవహించడం ఎంత అసహజమైన విషయమో, స్త్రీ తన నియమాలు ఉల్లంఘించడం అంత అసహజమైన విషయం అన్నమాట! కానీ స్త్రీలు ఎదురు తిరగడం, ఆ కాలంలో కూడా ఉంటూనే ఉందన్న మాట!

భార్య 'ఎదురు తిరగడం', గొప్ప కోప కారణం పురుషుడికి.

★

జరుగుతోందో చూశారు. కార్త వీర్యార్జునుడు నది నిండా జుట్టు పరుచుకుని, చుట్టూ భార్యల్ని పెట్టుకుని, మహా పర్వతం లాగ నది అంతా ఆక్రమించి, ప్రవాహానికి చేతు లడ్డం పెట్టి ఆటలాడుతున్నాడు. రావణుడు, అర్జునుణ్ణి యుద్ధానికి పిలిచాడు. ఇద్దరూ కలబడ్డారు. అర్జునుడు రావణుణ్ణి పట్టేసి నగరంలోకి లాక్కుపోయాడు. స్వర్గంలో ఉన్న పులస్త్యుడి సంగతి విని మహిష్మతీ నగరం వెళ్ళాడు. అర్జునుడు పులస్త్యుడి మీద గౌరవం కొద్దీ రావణుణ్ణి వొది లేశాడు.

తర్వాత ఇంకోసారి కూడా రావణుడికి పరాభవం జరిగింది.

వాలి, సముద్రంలో సంధ్యా వందనం చేస్తూ వుండగా (సంధ్యా వందనం అంటే చేపలు పట్టడమా?) రావణుడు వాలిని పట్టెయ్యాలని నెమ్మదిగా నడుస్తూ వెనక నించి వెళ్ళాడు. వాలి రావణుణ్ణి దగ్గిరికి రానిచ్చి చప్పున చంకలో ఇరికించి పట్టేశాడు. ఏమీ ఎరగనట్టు నాలుగు సముద్రాలకూ తిరిగి సంధ్యా వందనం చేసి అప్పుడు రావణుణ్ణి విడిచిపెట్టాడు. రావణుడు కిందబడి లేచి, వాలి బలానికి చాలా సంతోషించి వాలితో స్నేహం చేసుకున్నాడు. "నా సిరి సంపదలూ, నా భార్యాబిడ్డలూ అన్నీ మనం కలిసి అనుభవిద్దాం" అన్నాడు రావణుడు. వాలి అంగీకరించాడు.

"రామా! అంత గొప్ప వీరుడు వాలి. అలాంటి వాణ్ణి కూడా చంపావు నువ్వు!" అన్నాడు అగస్త్యుడు. (చాటుగా లేకపోతే, మీ రాముడికి కూడా వాలి చంకలో వేళ్ళాడే గతి పట్టేదే.)

అంతా విని రాముడు, "మహర్షీ! రావణుడూ, వాలీ బలవంతులే గానీ వారి కన్నా హనుమంతుడే బల వంతుడు గదా? ఇతడు చేసిన సాహస కార్యాలు విష్ణు మూర్తి కూడా చెయ్యలేదు. అలాంటి హనుమంతుడు, సుగ్రీవుణ్ణి వాలి ఋష్యమూకానికి తరిమేసినప్పుడు వాలిని చంపకుండా ఎందుకు వూరుకున్నాడు?" అని అడిగాడు. (హనుమంతుణ్ణే అడగకపోయావా రాముడూ? ఇప్పుడు అగస్త్యుణ్ణి అడగడం ఎందుకు?)

"రామా! హనుమంతుడి చరిత్రంతా చెపుతాను విను!" (అమ్మో! వొద్దులే!) అగస్త్యుడు మళ్ళీ మొదలు పెట్టాడు. "హనుమంతుడి చిన్నతనంలో అతని తల్లి పిల్లాణ్ణి ఇంట్లో వొదిలి పళ్ళ కోసం అడివికి వెళ్ళింది. అప్పుడు చిన్న హనుమంతుడికి బాగా ఆకలేసింది. సూర్యుణ్ణి చూసి పండు అనుకుని ఆకాశం మీదకి ఎగి రాడు.

సూర్యుణ్ణి మింగడానికి ఏదో వొస్తోందనుకుని ఇంద్రుడు హనుమంతుణ్ణి వజ్రాయుధంతో కొట్టాడు. చిన్న హనుమంతుడు కిందపడి స్పృహ తప్పిపోయాడు. హనుమంతుడి తండ్రి గాలి దేవుడు కదా? ఆయనకి కోపం వొచ్చి ఎక్కడా వీచకుండా మానేశాడు. అప్పుడు దేవతలందరూ వొచ్చి హనుమంతుడికి చావే లేదని చిరంజీవిగా వరాలిచ్చారు. (చావు లేని వరాలివ్వడం కుదరనే కుదరదన్నారే ఇంతకు ముందు? ఆ వరం హనుమంతుడికెలా ఇచ్చారు? ఈ దేవతల్లో ఎవరు నోరు తెరిచినా అబద్ధాలే.)[474]

అప్పటి నించీ హనుమంతుడు ఋషుల ఆశ్రమాలకు పోయి, వారి గుడ్డలు చింపేసి, కుండలు పగల గొట్టి, నిప్పు ఆర్పేసి, వారిని చాలా విధాల విసిగించే వాడు. ఋషులందరూ కోపంతో హనుమంతుణ్ణి, "నీకు బలం ఉంటుంది గానీ, నీ బలం నువ్వు తెలుసుకోలేవు" అని శాపం పెట్టారు. అందుకే హనుమంతుడు తన బలం తెలుసుకోలేక వాలిని చంప లేదు. (అలాగా? ఆ శాపం సంగతి అందరికీ తెలుసు కదా? సముద్రం దాటడానికి జాంబవంతుడు హనుమంతుణ్ణి ప్రోత్సహించాడు గదా? అలాగే, వాలిని చంపడానికి కూడా సుగ్రీవుడూ వాళ్ళూ హనుమంతుడికి అతని శక్తిని గుర్తు చెయ్యవచ్చు గదా?)

ఆ శాపం వచ్చిన కాలం నించీ హనుమంతుడు విద్యలు నేర్చుకుంటూ బుద్ధిగా వున్నాడు. సూర్యుడి దగ్గర వ్యాకరణం నేర్చుకున్నాడు" అన్నాడు అగస్త్యుడు.[475] (సూర్యుడి దగ్గిర నేర్చుకోవలిసింది వ్యాకరణం కాదు,

---

**474.** ఉత్తర, సర్గ 40, శ్లోకం 55: దేవతలు బ్రహ్మతో వాయుదేవుడు గాలిని కదల నివ్వడంలేదని చెపుతున్నారు. "ఆయుష్షునకు గాలినే అధిపతిని చేసితివి. అతడే కారణముననో తెలియదు, మా ప్రాణములను అడ్డగించి, 'అంతఃపురంబున స్త్రీలను బంధించినట్లు' మా శరీరముల యందు ఊపిరిని బంధించి ఇటు నటు కదలనీయకుండునట్లు చేసియున్నాడు."

శరీరంలో ఊపిరి ఆడకపోతే ఎలా ఉంటుందో, స్త్రీలని అంతఃపురంలో బంధిస్తే వారికి అలా ఉంటుందని, దేవతలు గ్రహించినట్టే ఉన్నారు.

'అంతఃపురాల్లో మగ్గిపోతూ ఉండడం స్త్రీలకు చాలా కష్టం. వారిని స్వేచ్ఛగా వుండనివ్వాలి' అని చెప్పాలని కవి అభిప్రాయమా? కాదు. స్త్రీలు కట్టడుల్లోనే ఉండాలి. కానీ అది స్త్రీలకు దుఃఖకరమైన విషయమే అని మాత్రం కవికి తెలుసు. ★

**475.** హనుమంతుడి కథ అయిన తర్వాత 41వ సర్గ చివర ఋషులందరూ (అగస్త్యుడు కూడా) రాముడి దగ్గిర అనుమతి తీసుకుని ఎవరి ఆశ్రమాలకు వారు వెళ్ళిపోయారు. 42వ సర్గలో – శ్రీరాముడు పట్టాభిషేకం చేసుకున్న తర్వాత ఒక దినం గడిచింది. ఆ రాత్రి సంతోషంగా నిద్రించి, మర్నాడు వంది మాగధుల మేలు కొలుపులతో – 'రామా! నీ రూపం, నీ తేజస్సు, నీ శౌర్యం, నీ అందం, నీ వంశం, నీ .... నీ ....' అనే పొగడ్తలతో మేల్కొని, సింగారించుకొని, మొట్టమొదటి ➔

యుద్ధాలు చెయ్యకపోడం.)

"బాగుంది. వాలి సుగ్రీవుల తండ్రి రుక్షరజస్సు కదా? తల్లి ఎవరు?" అని అడిగాడు రాముడు. (సుగ్రీవుణ్ణే అడగక పోయావా రాముడూ?)

అగస్త్యుడు మళ్ళీ మొదలుపెట్టాడు. (ఒక రోత కథ!) "తల్లి కూడా రుక్షరజస్సే. ఒకనాడు రుక్షరజస్సుడు ఒక సరస్సులో నీళ్ళు తాగుతూ తన నీడనే చూసుకుని సరస్సులో శతృవు వున్నాడనుకుని లోపలకి దూకేశాడు. వెంటనే ఆడదై పోయాడు. ఆ దారినే ఇంద్రుడూ, సూర్యుడూ ఆకాశంలో వెళ్తూ ఆ స్త్రీని చూశారు. వెంటనే వారికి వీర్యస్కలనం అయిపోయింది. ఇంద్రుడి వీర్యం, ఆ స్త్రీ తల మీదా, సూర్యుడి వీర్యం, కంఠం మీదా పడ్డాయి. ఆమె తల వెంట్రుకల మీద నించి వాలీ, కంఠం మీద నించి సుగ్రీవుడూ పుట్టారు. తర్వాత ఆ స్త్రీ మళ్ళీ పురుషుడిగా మారిపోయింది. ఇదీ వాలి సుగ్రీవుల జన్మ వృత్తాంతం. ఈ వృత్తాంతం విన్న వారికి సమస్త కార్యాలూ నెరవేరుతాయి." (ఈ రోత కథ వినని వారికి మనసు ఎంతో హాయిగా వుంటుంది.)

అగస్త్యుడు మళ్ళీ, "సీతని రావణుడెందుకు ఎత్తుకుపోయాడో కూడా చెపుతాను విను" అని మళ్ళీ మొదలు పెట్టాడు. (ఎప్పటికి వొదుల్తావు స్వామీ?) "కృత యుగంలో ఒకసారి రావణుడు సనత్కు మార రుషిని, 'దేవతల్లో బలవంతుడెవరు?' అని అడిగాడు. దానికి సనత్కుమారుడు, 'నారాయణుడే బలవంతుడు. నారాయణుడి చేతిలో మరణిస్తే జన్మలే వుండవు. త్రేతాయుగంలో నారాయణుడే రాముడిగా పుడతాడు' అన్నాడు. రావణుడు, తనకు జన్మలు లేకుండా చేసుకోవడానికి నీ చేతుల్లో మరణించాలనుకున్నాడు. అందుకే సీతని ఎత్తుకుపోయి నీతో వైరం పెట్టుకున్నాడు" అని చెప్పాడు. (మరి రుషులూ, భక్తులూ, రాముడి చేతిలో చావరేం?)

అగస్త్యుడు ఇంకా చెప్పుకొచ్చాడు.

ఒకసారి రావణుడు నారదుణ్ణి "అన్ని లోకాలూ చూశావుగా? ఏ లోకంలో బలవంతులున్నారు?" అని అడిగాడు. "శ్వేతద్వీపంలో" అన్నాడు నారదుడు. రావణుడు శ్వేతదీపం వెళ్ళాడు. అక్కడి స్త్రీలు రావణుణ్ణి చిన్న పిల్లాణ్ణి ఎత్తుకున్నట్టు ఎత్తుకుని నలిపి, గిరాట్లేసి, రావణుడితో బంతాటలాడి, చివరికి సముద్రంలో పారేశారు.

రావణుడు సముద్రంలోంచి లేచివొచ్చి మళ్ళీ సనత్కుమారుణ్ణి, "బాగానే వుంది గానీ .... ఈ లోకాలెవరు సృష్టించారూ?" అని అడిగాడు.

"ఇంకెవరు? విష్ణువే. అతడి పుట్టుక మనకు తెలీదు. అందర్నీ అతడే తరింపజేస్తాడంటారు, తెలిసిన వాళ్ళు. (మంచి మాటే చెప్పావు రుషీ! విష్ణువు సంగతి నీకే తెలిసినట్టు చెప్పకుండా!) విష్ణువు వూపిరి నించి పుట్టిన స్త్రీలే నిన్ను సముద్రంలో పారేశారు."

"ఆ దేవుడు ఎలా కనపడతాడు? అతన్ని ఎప్పటికి చేరగలం?" అని అడిగాడు రావణుడు.

"అంతటా ఉన్నాడతడు. అతడే గతి అని నమ్మి కొల్చుకునే వారే అతణ్ణి చూడగలరు. ఇరవై ఎనిమిదో యుగం వచ్చాక, 'వైవస్వత మన్వంతరం'లో విష్ణువుని సేవించి నాశనం లేని లోకం చేరుకుంటావు" అని చెప్పాడు సనత్కుమారుడు, రావణుడికి.

రామా! నువ్వే నారాయణుడివి. నీ చేతిలో చావు కోసమే రావణుడు సీతను ఎత్తుకుపోయాడు" అని ముగించాడు అగస్త్యుడు.

ఆ సంగతులన్నీ విని రాముడు అమితంగా ఆనందించాడు.

తర్వాత రుషులందరూ వెండి బంగారాల మూటలు మోసుకుంటూ ఆశ్రమాలకు వెళ్ళిపోయారు.

★ ★ ★

ఒక నెల గడిచింది. రాముడు తన పట్టాభిషేకానికి వచ్చిన వారందర్నీ వొదిలించుకోదల్చుకున్నాడు.

రాముడు జనక మహారాజుకి బహుమానాలిచ్చి, "మహారాజా! నిన్ను సాగనంపటానికి భరతుడు వస్తాడు. ఇక నువ్వు నీ నగరానికి వెళ్ళు" అని చెప్పాడు. జనకుడు, ఆ బహుమానాలన్నీ సీతకే ఇచ్చి తన రాజ్యం వెళ్ళిపోయాడు.

రాముడు, భరతుడి మేనమామతో, "నీ తండ్రి చాలా పెద్దవాడై పోయాడు. రాజ్య భారం వహించలేడు. ఇక నువ్వు వెళ్ళిపోవడం మంచిది" అని చెప్పాడు. "అలాగే వెళ్ళిపోతాను" అని యుధాజిత్తు వెళ్ళిపోయాడు.

(రాముడు, తన పట్టాభిషేకానికి భరతుడి మేనమామని కూడా పిలిచాడు! 14 ఏళ్ళకిందట, మొదటిసారి పట్టాభిషేకం చేసుకోవాలని నిర్ణయించినప్పుడు, భరతుణ్ణి కూడా పిలవకుండా ఆ కార్యం రహస్యంగా చెయ్యాలని చూశాడు!)

తర్వాత, రాముడు కాశీరాజుతో, "నీ రాజ్యానికి

---

➔ సారిగా రాముడు సభదీర్చి కూర్చున్నాడు.

మునులు మళ్ళీ కథలు వినిపిస్తారు. 43వ సర్గలో, రాముడు మళ్ళీ అగస్త్యుడితో మాట్లాడతాడు. వెళ్ళిపోయిన రుషులందరూ మళ్ళీ ఇక్కడే వుంటారు. వాల్మీకి భక్తులు, 'ఇది ప్రక్షిప్తం' అని కొట్టిపారేస్తారు అనుకోండీ. ఇది వాల్మీకి రాయలేదు సరే, గిల్మీకి అయినా ఎందుకు రాసినట్టు? అగస్త్యుడు వెళ్ళిపోయాడని ఒక చోట చెప్పినప్పుడు, రాముడు మళ్ళీ అగస్త్యుడితో మాట్లాడినట్టు ఎందుకు రాసినట్టు?

★

తిరిగి వెళ్ళు!" అన్నాడు. ఆయనా వెళ్ళిపోయాడు.

తర్వాత రాముడు 300 మంది సామంత రాజులతో, "మీరు నాకు చాలా సహాయం చేశారు. రావణుడు సీతని ఎత్తుకుపోయాడని తెలిసి భరతుడు మీ అందర్నీ కూడగట్టి తీసుకు వచ్చాడు. మీరందరూ ఇక మీ రాజ్యాలకు వెళ్ళండి!" అన్నాడు.

(లంకలో యుద్ధం కోసం, భరతుడు సామంత రాజుల సైన్యాల్ని తీసుకు వచ్చాడా? – ఇలాంటి వాటినే 'ప్రక్షిప్తాలు' అనుకోవాలన్నమాట! ఈ ప్రక్షిప్తాల కవులు, తెలివిగానే వున్నారు. సీతని రక్షించడానికి, భరతుడు కూడా కొంత సైన్యాల్ని పంపాలి కదా? అలా పంపినట్టు రాయడం తెలివైన పనే!)

సామంత రాజులందరూ రాముడికి రక రకాలుగా నమస్కారాలు చేసి రామ కథ చెప్పుకుంటూ (సామంత రాజులతో రాముడు ఎలా ప్రవర్తిస్తాడో చెప్పుకుంటూ) వెళ్ళిపోయారు. తమ రాజ్యాలకు వెళ్ళి అనేక రకాల బహుమానాల్నీ, అందగత్తెలైన స్త్రీలనీ, గొర్రెల్నీ, మేకల్నీ, కూడా పంపించారు. (రాముడికి బహుమానంగా అందగత్తెలైన స్త్రీలా!)

తర్వాత రాముడు సుగ్రీవుడికీ, విభీషణుడికీ కూడా, "మీ రాజ్యాలకు వెళ్ళండి (ఎన్నాళ్ళు కూర్చుంటారిక్కడ?)" అని చెప్పాడు.[476]

అందర్నీ కావలించుకుని విడిచిపెట్టాడు.

ఆకాశం మీద నించి సన్నని కంఠంతో పుష్పకం పిలిచింది రాముణ్ణి. "రామా! కుబేరుడు నన్ను నీ దగ్గిరికే వెళ్ళమన్నాడు" అని చెప్పింది.

"సరే! నేను పిలిచినప్పుడు వొస్తూ వుండు, అంత వరకూ ఎక్కడికైనా వెళ్ళిపో" అన్నాడు రాముడు. (రాముడు, చుట్టాలతో తెగ విసిగి పోయినట్టున్నాడు. అందర్నీ వొకటే పొమ్మనడం విమానాన్ని కూడా!)

పుష్పకం రెక్కలెగరేసుకుంటూ వెళ్ళిపోయింది.

రాముడు అయోధ్యలో సుఖంగా ఉన్నాడు. ★

---

**476.** **ఉత్తర కాండ, సర్గ 48, శ్లోకాలు 5 .... 26:** రాముడు అందరికీ ఎలా చెపుతున్నాడో చూడండి.

జనక మహారాజుతో: "నృపాలా! తాము రత్నములను గైకొని తమ పురమునకు దరలుడు."

భరతుడి మేనమామతో: "నృపాలా! రాజుగారు (కైక తండ్రి) మిక్కిలి వృద్ధులు. నీవు రానందుకు మిక్కిలి చింతించెదరు. గనుక నేడే నీవు బయలుదేరి పోవుట యుక్తము."

కాశీరాజుతో: "నృపాలా! నీ చే చక్కగా పాలించబడునదియు, రమణీయమైనదియు నగు కాశీపురమునకు నీవు ఇక తిరిగి పొమ్ము."

కాశీరాజును వీడ్కొలిపి, తదుపరి మూడు వందల మంది రాజులం గాంచి రాముడు చిరునవ్వు మెరయుచు నిట్లనెను. "తమ యనుగ్రహ ప్రతాపములచే దుష్టుడైన రావణుడు చచ్చెను. జనకరాజు పుత్రిని రావణుడెత్తుకొని పోయెనన్న వార్త విని భరతుడు మిమ్ములను దోడ్కొని వచ్చెను .... యుద్ధమునకై పూనిన మీ కందరకును గొప్ప కాలయాపనమయ్యెను, గనుక ఇక మీరెల్లరును తమ తమ రాజ్యములకు బోవుట యుక్తమని తలంచెదను."

భరతుడటా, ఈ సామంత రాజులందర్నీ కూడగట్టుకుని ఆ సైన్యాలతో లంకకి వచ్చి యుద్ధం చేసి రావణుణ్ణి చంపాడట! ఇక మీరందరూ తిరిగి వెళ్ళండి – అంటున్నాడు రాముడు.

ఉత్తర కాండలో ఏవేవి ప్రక్షిప్తాలో నిర్ణయించి వాటిని గుర్తులు పెట్టిన సుందర రామశాస్త్రులు గారు, దీన్ని మాత్రం ప్రక్షిప్తాల లెక్కలోకి జేర్చలేదు. భరతుడు సామంత రాజుల సైన్యాల్ని కూడగట్టుకుని లంకకి రావడం యుద్ధకాండలో జరగలేదు.

భరతుడు కొంత సైన్యం తీసుకుని లంకకు వెళ్ళి యుద్ధం చేస్తే బాగుండేదే కదా? కథ అలా నడవక పోవడం పొరపాటే కదా? ఈ పొరపాటుని గ్రహించుకుని, కవి ఇలా చేశాడు. (వాల్మీకో, గీల్మీకో.) వెనక కథకీ ముందు కథకీ కలుస్తుందా లేదా అనే ఆలోచన ఎప్పుడూ లేదు.

భరతుడు కూడా సైన్యాలతో లంకకు వొచ్చినట్టుగా రాముడితో అనిపించేశాడు కవి.

రాముడు సుగ్రీవుడితో ఏమంటున్నాడో చూడండి – (సర్గ 50, శ్లోకాలు 7 వరకూ.)

"సౌమ్యుడా! సుగ్రీవా! దేవాసురులకును జయించ నలవిగాని కిష్కింధకు బొమ్ము"

విభీషణుడితో: "విభీషణా! లంకా రాజ్యమును న్యాయముతో బాలింపుము .... లంకకు బొమ్ము!"

ఈ రకంగా రాముడే అందరికీ "ఇక వెళ్ళండి. వెళ్ళిపోండి" అని చెప్పాడు.

వొచ్చిన వాళ్ళే "ఇక మేము వెళ్తాం రామా!" అని తిరుగు ప్రయాణాలు కడితే బాగుంటుంది గానీ, రాముడే వెళ్ళిపొమ్మంటే బాగుంటుందా? సుగ్రీవుడూ, విభీషణుడూ వాళ్ళకు వాళ్ళే "మీ దేశం వొస్తాం" అని అడిగారు. అప్పుడు వాళ్ళని రమ్మని పిలవకపోవడమూ తప్పే, ఇప్పుడు తనకై తనే వాళ్ళని వెళ్ళిపొమ్మని చెప్పడమూ తప్పే. – మరి ఇలాంటి విషయాలు కవికి తెలియవా? ప్రతీదాన్నీ రాముడి ద్వారానే చెప్పించాలని కవి అభిప్రాయం. రాముడు ఎలా ప్రవర్తించినా తప్పు ఉండదని! ★

## కథ-16

# రామ రాజ్యం సొగసు!

వెన్నెలాకాశం కింద అశోకం!

సీత అంతఃపురం చుట్టూ ఉద్యాన వనం. తోటంతా విరగబూసి గాలినిండా పరిమళాలు! గాలి, చెట్ల మీద నించి ఒక్కోసారి ఒక్కో పరిమళం మోసుకెళ్తోంది.

"సీతా! ఇన్నాళ్ళూ ఎక్కడికి వెళ్ళావూ?" అని అడుగుతాయి చెట్లన్నీ.

"సీతా! మమ్మల్నెరగవూ?" అంటాయి కొత్త మొక్కలూ, పిట్టలూ.

సీత చూడని చెట్లెన్నో, మొక్కలెన్నో పిట్టలెన్నో, తోట నిండా!

సీత .... పరిచారికల వెంట .... తోటంతా .... మొక్క మొక్కకీ తిరుగుతూ, తన వనవాస కష్టాలన్నీ కథలు కథలుగా చెపుతూ వుంటుంది వారికి.

దాసీలు కంటతడి పెడుతోన్నా, కష్టాలన్నీ గడిచి గట్టెక్కిన సీత నవ్వుతూ చెప్పే మాటలు తోటంతా వింటుంది, ప్రతీ సాయంత్రం.

"ఎంత పతివ్రతవు తల్లీ! నీ లాంటి ఉత్తమురాల్ని మేమెక్కడా చూడలేదు" అని సాటి స్త్రీలు కీర్తిస్తోంటే సీతకి ఎంత సంతోషమో! ఇంకా వెయ్యి జన్మల దాకా కష్టాలలోనే బ్రతకాలనుకుంటుందా క్షణం.

కానీ .... అంత సంతోషంలోనూ ఎక్కడో ములుకులాగ సన్నగా దిగులు! దుఖ్ఖం! – భర్త తన నింకా శంకిస్తోనే వున్నాడు! ఆయన మనసులో ఇంకా సందేహమే! ఇంకా ఆరాటమే!

"ఇంకెలా నమ్మించను? ఇంకెలా సంతృప్తి పరచను? .... స్త్రీ జీవితం ఎంత హీనమో కదా? పురుషుడి కరుణా కటాక్షమే స్త్రీకి రక్ష కదా? .... ఎంత సిరి సంపదలతో తులదూగినా, ఎంత కీర్తి ప్రతిష్టలు సాధించినా, శాంతి లేని జీవితం అయిపోయిందే! ఇంతేనా ఈ జన్మకి? ఏ దైవాన్ని ప్రార్ధించను? నా భర్తకు నా మీద విశ్వాసం కలిగించమని ఏ దేవతల్ని వేడుకోను? ...." అని దిగులుపడుతూనే వుంది సీత.

అంత పరధ్యాన్నంలో కూడా సీత ఎంతో ప్రియమైన తన అశోకవనంలో తిరుగుతూ కొత్త పువ్వుల్నీ పిట్టల్నీ చూసి ముచ్చట పడుతోనే వుంది.

"అమ్మా! చాలా అలిసిపోయావు. ఉత్త మనిషివి కూడా కాదు. కొంచెం సేపు ఈ తిన్నె మీద కూర్చో తల్లీ!" అంటూ పరిచారికలు సీతని సరస్సు వొడ్డున కూర్చోబెట్టారు. చుట్టూ పూల తీగలు పాకి, తిన్నె, పూల రాసి లాగ ఉంది. నీటిలోకి జారిన చంద్రుడితో, నిండా విచ్చిన పువ్వులతో సరస్సు, చుక్కలు పొడిచిన ఆకాశం లాగ ఉంది.

గాలి, తెరకొక సువాసన తెచ్చుకుంటోంది.

శ్రీరాముడు, ఆభరణాల ధగ ధగలతో ప్రవేశించాడు.

మహారాజు రాగానే పరిచారికలందరూ మద్యాలూ, మాంసాలూ, పానీయాలూ వారి ముందు అమర్చి దూరంగా తప్పుకున్నారు.

రాముడు, ఎన్నడూ ఎరగనంత ఉత్సాహంగా వుంటున్నాడు – పట్టాభిషేకం తర్వాత. రాత్రిం బవళ్ళూ రాచ కార్యాలతో, సామంత రాజుల రాక పోకలతో, బంధు మర్యాదలతో, సాటి రాజుల మధ్య కీర్తి ప్రతిష్టలతో ....!

ఇంతకాలానికి స్థిరపడ్డాడు – రాజ్యంలో!

చిన్నతనంలోనే జరగవలసిన పట్టాభిషేకానికి విఘాతం .... వనవాసం .... ఒక చెంప దుఃఖంతో .... ఒక చెంప ఆశలతో .... కష్టసుఖాల మధ్య గడిచిపోయింది గతం.

ఇప్పుడు తను కోసలాధిపతి! అనేక సామంత రాజ్యాలపై సామ్రాజ్యాధిపతి!

ఇంకా రాజ్య సంబంధమైన విశేషాలన్నీ స్పష్టం కాలేదు. ప్రజా నాడి బోధపడలేదు. ప్రజలకు తన రాజ్యపాలన బాగుందో .... భరతుడి పరిపాలనే బాగుందో!

తను రాజ్యం స్వీకరించినందుకు ప్రజలేమనుకొంటున్నారో.... తను భార్యని స్వీకరించినందుకు కూడా ఏమనుకొంటున్నారో!

రాచకార్యాల్లో మునిగి వున్నంతసేపూ ఆనందమే.

అంతఃపుర ముఖం పడితే మనసంతా ఆరాటం .... వ్యథ .... అశాంతి ....! ఎవరైనా సీత సంగతి ఎత్తుతారా, తనని పరిహాసం చేస్తారా – అని శంక!

"సీత ఉత్తమురాలు. మహా పతివ్రత. పెద్దలందరూ అంగీకరించారు. అందుకే సీతని స్వీకరించాను" అనబోతాడు, ఎవరికో చెప్పినట్టు!

చప్పున మాట ఆపుకుంటాడు.

సీతని స్వీకరించి తను తొందరపడలేదు కదా, సీత ఉత్తమత్వం తను నమ్ముతూనే వున్నాడు కదా – అని తర్కించుకుంటాడు.

సీతని చూస్తే చాలు రాముడి ఆలోచనలన్నీ గతం లోకి .... లంకలోకి .... ప్రయాణం కడతాయి.

"ప్రభూ ....!"

రాముడు కొంచెం కదిలి సీతని కొత్తగా పరిశీలనగా చూశాడు.

ఆ పిలుపు వీనుల విందుగా వుంటుంది రాముడికి ఎప్పుడూ. ఇప్పుడు సీత ప్రవర్తనలో మరింత అణకువ .... మరింత వినయ విధేయతలు ... గోచరిస్తున్నాయి. ఈ సీత వనవాసం నాటి సీత కాదు.

రాముడు సీత వేపు ఆలోచనగా చూశాడు.

"తమ ఆలోచనకు అంతరాయం కలిగించానా స్వామీ?" తల వాల్చి వినయంగా అడిగింది సీత.

'క్షమించాన'న్నట్టు, రాముడు తల పంకించి ఊరు కున్నాడు, చిన్న నవ్వుతో.

"కార్య భారంతో అలసి పోయారా ప్రభూ? ఈ మద్యం స్వీకరించండి!"

పాత్ర అందుకున్నాడు.

సీత, సరస్సులోకి జారిన చంద్రుణ్ణి చూస్తూ, "ఈ తోట మన తోటేనా అన్నంతగా మారిపోయింది. గమ నించారా ప్రభూ? ఎన్ని రోజులు చూసినా వింతే నాకు. ఈ మెట్ల పక్క పొన్న చెట్టు .... ఎప్పుడు లేచిందో ఎంత వృక్షమై పోయిందో! ఎవరో తెచ్చి ఈ మహా వృక్షా లన్నిటినీ ఇక్కడ పెట్టినట్టుంది. మనం వెళ్ళే నాటికి ఈ సరస్సు వొడ్డు మీద ఈ ఎర్రపూల పొదలు లేనే లేవు. ఈ చందనం కూడా అప్పటికి చిన్న మొక్కే .... ఇప్పుడో? .... మానైపోయింది!"

వనవాసానికి బయల్దేరే నాటికి రాముడి మనసులో సీత మీద సందేహం కూడా చిన్న మొలకే. ఇప్పుడో? .... మహా వృక్షం!

"చూడండి ప్రభూ! ఆ వేగిసలూ .... లొద్దుగులూ .... సప్తవర్ణలూ .... అన్నీ ఎంతెంత వయసు కత్తె లయ్యాయో! వనం నిండా పిట్టలు కూడా ఎన్నెన్ని కొత్త రకాలో ..... 'సీతా! వొచ్చావా? మమ్మల్ని చూశావా?' అంటున్నాయేమో అనుకుంటాను .... ఏం చెప్పను వాటికి? .... నవ్వుతాను ...." సీత చిరునవ్వుతో మాట్లాడుతోంది మొహం ఎత్తి.

చెంపలు వెన్నెట్లో మెరుస్తున్నాయి. జుట్టు నీడలు చెంపల మీద కదులుతున్నాయి.

"ఇంత అందగత్తెని .... ఆ దుర్మార్గుడు ...." రాముడు, మొహం చిట్లిస్తూ చేతిలో పాత్ర కింద పెట్టాడు.

మనస్సులో ఏదో మెరిసి సీత సంతోషంతో చూసింది.

"శత్రువుని హతమార్చడంలో .... తమ శౌర్యం గురించి మన బంధువులందరూ ...."

రాముడు ప్రసన్నంగా నవ్వాడు. తల పంకిస్తూ, మౌనంతో, దయగా చూశాడు– ఎంతో సేపు. "గర్భ వతులు అనేక రకాల కోరికలు కోరుతారంటారే! నువ్వు ఏమీ ...."

సిగ్గుపడి మొహం దించుకుంది సీత చిరు నవ్వుతో.

రాముడి ఆలోచనలు ఎటో .... చెదిరి .... సాగి .... చిక్కులు పడుతున్నాయి. సీతని పరిశీలనగా చూస్తూ వుండిపోయాడు.

".... ఏమీ కోరవా?"

"నేను కోరేది మీ పాద సేవే ప్రభూ!"

"ఇంకేమీ .....?"

"ఎప్పుడూ మీ దయకు పాత్రురాలినయ్యే భాగ్యం కలగాలి నాకు. ఇంకేమీ కోరను."

రాముడు విస్మయంగా చూశాడు. కోరికే లేదా? కోరికే లేనంత సంతోషమా? నిజమా? .... తనకైతే .... ఆ కాశీ రాజు రాజ్యం కూడా .... ఆ గంధర్వుల రాజ్యాలు కూడా .... ఆ ....!

రాముడి ఆలోచనలన్నీ – రాజ్య విస్తరణ మీదా, సామంత రాజుల అవిధేయతల మీదా, భార్య శీలం మీదా, బంధుమిత్రుల కీర్తనల మీదా, అస్తవ్యస్తంగా సాగు తున్నాయి.

"ప్రభూ! మనం చిత్రకూటంలో వుండగా .... ఒకసారి .... భరతుడు .... వొస్తాడనగా కాబోలు ...."

"ఆ దినాల జ్ఞాపకాలెందుకు? ఈ మద్యం తీసుకో."

"అవును, ఆ దుర్భర వనవాసం ఈ నాడు ఊహ లలో కూడా భరించలేము. ఈ సిరులూ, భోగాలూ, ఈ కీర్తి ప్రతిష్టలూ, ఇదంతా ఆనందమే ప్రభూ! కానీ .... అప్పుడప్పుడూ .... ఆ చిత్రకూటం .... పంచవటిలో ఆ గంగాతీరం ... ఆ జ్ఞాపకాలు పోవడం లేదు. తమకు ఈ కార్యభారం నించి కొంత విశ్రాంతి .... తాత్కాలిక మైన మార్పు .... బాగుండదూ? మనం మళ్ళీ వొకసారి ఆ ఋష్యాశ్రమాలన్నీ చూసి .... మన పర్ణశాలని చూసి .... ఇప్పుడు ఎలా వుందో పర్ణశాల!"

"పద్నాలుగు సంవత్సరాలు వనవాసంలో అష్ట కష్టాలూ పడింది చాలక మళ్ళీ వనాలలో విశ్రాంతా?"

".... ప్రభూ!" భర్త మహారాజు అయిన తర్వాత సీతకు పూర్వం చనువు తగ్గింది. పూర్వం కన్నా భక్తి పెరి గింది. "ఇప్పుడు .... వనాలలో కూడా సకలోపచారాలూ చేసే దాస దాసీలు మన వెంట ఉంటారు. ఇప్పుడు పూర్వపు కష్టం ఉండదు. దుఖ్ఖం ఉండదు. ముని పత్ను

లందరికీ బహుమతు లివ్వాలని నా మనసు ఆరాట పడుతోంది.”

బహుమతు లివ్వడమే కాదు, తన పాతివ్రత్య కథనం ముని పత్నులందరికీ వినిపిస్తూ, వారి ముఖాల మీద మెరిసే ఆశ్చర్యానందాలు చూడాలని కూడా సీత మనసు ఆరాటపడుతోంది.

ఆలోచనల్లో మునిగాడు, రాముడు.

★ ★ ★

రాముడి ధ్యాస అంతా తన రాజ్య పరిపాలన గురించి ప్రజలేమనుకుంటున్నారో తెలుసుకోవాలనే.

రాముడికి, ఊహ తెలిసిన దగ్గిర్నుంచీ రాజరికం మీదే మక్కువ. విద్యలన్నింటిలోనూ నేర్చుకున్నది, రాజ్య పాలన గురించే. ఎంతటెంతట రాజ్యపాలన ప్రారంభి స్తానా అని యుక్త వయస్సు నించీ ఎదురు తెన్నులు చూసిన రాముడు ఇంతకాలానికి ఆ కార్య భారాల్లో నిమగ్నమైపోయాడు.

రాజ్యపాలన గురించి శాస్త్రాలలో నేర్చిన జ్ఞానానికి, తండ్రి తాతల అనుభవ జ్ఞానాలు మేళవించి, పట్టాభి షేకం కాగానే, రాజ్య వ్యవహారాలన్నీ తన రాజ నీతి ప్రకారం అనతికాలంలోనే సరిదిద్దుకున్నాడు. భరతుడి రాజరికాన్ని శల్య పరీక్షలు చేసి, అసం తృప్తులు రేగిన ప్రతీ చోటా తగిన మార్పులు చేశాడు.

చిత్రకూటంలో, భరతుడికి బోధించిన రాజ నీతు లన్నీ తన పరిపాలనలో తక్షణం ఆచరణలో పెట్టాడు.

తక్కువ పదవుల్లో వున్న ఉత్తమ కులస్థుల్ని ఉత్తమ పదవుల్లోకి మార్పించాడు. కొందర్ని ఉద్యోగాల నించి తీయించాడు. కొందర్ని కొత్తగా వేయించాడు. కొందర్ని ఉన్నత పదవులకు లాగించాడు. కొందర్ని దిగువ పదవు లకు తోయించాడు.

ఉద్యోగులకు జీతాలు తగ్గించాడు. శలవులూ, విరా మాలూ తగ్గించాడు.

ప్రజల్ని దండనీతితో క్రమశిక్షణలో ఉంచడానికి పాటుపడిన ఉన్నతోద్యోగులకు బహుమానాలు గుప్పిం చాడు.

ఉన్నతోద్యోగులందరి మీదా, నూతనంగా చారుల్ని ఏర్పాటుచేశాడు. చారులమీద కూడా చారుల్ని! ఆ చారుల మీద కూడా చారుల్ని! చారుల నియామకాలు ఎక్కడో అక్కడ ఆపక తప్పలేదు.

ఉన్నతోద్యోగులందరూ తన పట్ల విశ్వసనీయంగా ఉన్నారో లేదో చారులు సేకరించిన సమాచారాలతో సంతృప్తిపడ్డాడు. కానీ, సంతృప్తిపడక తప్పనందుకు సంతృప్తి లేదు.

వర్తక శ్రేష్ఠులందరికీ ప్రత్యేక సదుపాయాలు కలి గించాడు. వర్తకుల్ని ప్రత్యేకంగా రక్షించాలనీ, వర్తకులే రాజుకి అండ అనీ రాముడికి చక్కగానే తెలుసు.

బ్రాహ్మల్నీ, పెద్దల్నీ, పండితుల్నీ, శూరుల్నీ, తనకు కుడి భుజంగా ఉండి తన పరిపాలనకు అనుకూలించే వారినందరినీ ఆకట్టుకునే విధానాలన్నీ పాటించాడు.

నటులకూ, విటులకూ, గాయకులకూ సత్కారాలు తగ్గించేశాడు. ఆట పాటల వల్ల ప్రజలు సోమరులవు తారని రాముడి అభిప్రాయం.

ప్రజల సమయమంతా దేవతల పూజలకూ, పితృ దేవతల పూజలకూ, బ్రాహ్మణ సత్కారాలకూ, యజ్ఞ యాగాలకూ, బంధు మిత్రుల మర్యాదలకూ వెచ్చిం చాలని ఆదేశించాడు.

రాజాంతఃపురాలకు రక్షణ ఏర్పాట్లన్నీ అధికం చేయించాడు. అంతఃపురాల చుట్టూ ప్రాకారాల ఎత్తులు పెరిగాయి.

రాజోద్యోగులు, రాచ కార్యాలలో రహస్యాల్ని ఇళ్ళ దగ్గిర భార్యలకు గానీ, తల్లులకు గానీ, ఒక్క ఆడ పురుగు కైనా చెప్పరాదని కఠినమైన నిబంధనలు ప్రవేశపెట్టాడు.

స్త్రీ లందరూ భయభక్తుల్లో, పురుషుల అదు పాజ్ఞల్లో ఉండాలనీ; భార్యలు భర్తలకూ, కొడుకులు తండ్రులకూ, సేవకులు యజమానులకూ వినయ విధేయతలు చూపా లనీ; రాత్రి వేళలందు మాత్రమే కామ సుఖాలు అనుభ వించాలనీ; శాస్త్ర విధులు ప్రకటించాడు.

సైన్యా లే స్థితిలో ఉన్నాయో పరిశీలించి అన్నిటి కన్నా అసంతృప్తి చెందాడు. అశ్వ దళాలూ, గజ దళాలూ, పదాతి దళాలూ, మొత్తం సైన్యాలన్నిటినీ పెంచే ఏర్పాట్లు ప్రారంభించాడు.

సకాలంలో జీతాలు అందకపోతే సైనికులు అవి ధేయులవుతారని ఎగిరిన రాముడు, సైనికులకు జీత భత్యాలు సకాలంలో అందే ఏర్పాట్లుచేశాడు.

సైనికాధిపతులందరూ, రాత్రింబవళ్ళూ ఏ క్షణ మైనా ఇతర రాజ్యాల ఆక్రమణలకూ, రాజ్య విస్తరణ లకూ సిద్ధంగా ఉండాలని నిబంధనలు ప్రకటించాడు.

న్యాయశాస్త్రాన్ని మరింత కట్టుదిట్టాలతో సవరిం చాడు. దైవాన్ని నమ్మని వారికీ, నాస్తిక ప్రచారాలు చేసే వారికీ, కఠినమైన మరణ శిక్షలే! వర్ణ సంకరం చేసే స్త్రీ పురుషులకు దేశ బహిష్కార శిక్షలు! బ్రాహ్మణ ధనానికీ, బ్రాహ్మణ సుఖానికీ హింస కలిగించిన ఇతర కులస్థులకు చిత్ర హింసలు! శాస్త్ర నీతినీ, సంఘ నీతినీ లక్ష్యపెట్టని ప్రవర్తకులకు చెరసాల శిక్షలు!

రాముడు, రాజ్యపాలనకు వచ్చిన వెంటనే, అనేక మరణ శిక్షలు అమలు చేయించాడు!

అమలు చెయ్యడానికి భరతుడు సందేహించిన మార్పులన్నీ రాముడు, శాస్త్రోచితంగా, నిరంకుశంగా, చెయ్యగలిగాడు.

రాజ్యంలో లోటుపాట్లన్నీ సవరించి రాముడు కొంత స్థిమిత పడ్డాడు.[477] తెలివితేటలతో, చాకచక్యంతో రాచ కార్యాలు చక్కబెట్టుకుంటూ, వనవాసంలో ఉన్నంతకాలం కలలుగన్న రాజ భోగాలలో మునిగి తేలుతూ, కాలం గడుపుతున్నాడు రాముడు.

నిత్యం ఉదయాన్నే వందిమాగధుల మేలు కొలుపులతో లేస్తాడు. వందిమాగధులు నిత్యం రఘు వంశస్థుల కీర్తిని గానం చేస్తారు. మహారాజుని స్తోత్రం చేస్తారు. “మహారాజా! వీరాధి వీరా! పురుష సింహుడా! తెల్లవారుతూ వుంది, మేలుకో! నువ్వు పరాక్రమంలో విష్ణుమూర్తివి. బుద్ధిలో బృహస్పతివి. సహనంలో భూదేవివి. తేజస్సులో సూర్యుడివి. వేగంలో వాయువువి. గాంభీర్యంలో సముద్రుడివి. సౌమ్యతలో చంద్రుడివి. నీ వంటి ధర్మాత్ముడూ, ప్రజాహితుడూ అయిన రాజు ఇంతవరకూ భూలోకంలో ఎక్కడా పుట్టలేదు!” – వంది మాగధులు, తన తాత కోసం, తండ్రి కోసం పాడిన పాటలే, రేపు తన కొడుకుల కోసం మనవల కోసం పాడబోయే పాటలే, తన కోసం పాడిన తర్వాత, గర్వపడుతూ లేస్తాడు రాముడు.[478]

భూలోకంలో రఘు వంశం ఆవిర్భవించకపోతే, అందునా తను జన్మ ఎత్తకపోతే, భూలోక వాసులేమై పోయేవారోనని విచారపడుతూ, నవ యవ్వన వతులైన స్త్రీల పరిచర్యల మధ్య స్నానాలూ, అలంకారాలూ ముగిస్తాడు.

సభలో – రత్న ఖచిత సింహాసనం మీద ఆసీనుడై, గంభీరమైన మందహాసాలు చిందిస్తూ, ‘రామ రాజ్యం’ గురించి కవుల గానాలు వింటాడు.

“రామ రాజ్యంలో సకాలంలో వర్షాలు కురుస్తాయి. ఎప్పుడూ చంద్రుడు చల్లగా వెలుగుతాడు. ప్రజలు సిరి సంపదలతో తులతూగుతూ ఉన్నారు. రామ రాజ్యంలో పాములు లేవు. వ్యాధులు లేవు. దొంగలు లేరు. అనర్థాలు లేవు. హింస లేదు. దుఃఖం లేదు.... రామ రాజ్యంలో చెట్లన్నీ పచ్చని ఆకులతో ఏపుగా ఎదుగుతాయి. పళ్ళతో, పూలతో కలకల్లాడుతాయి .... రామ రాజ్యంలో, ప్రజలు ఎప్పుడూ రామ కథలే చెప్పుకుంటున్నారు. రాజ్యమంతా ‘రామ, రామ’ అంటూ రామ నామమే ప్రతిధ్వనిస్తోంది. భూలోకమే రామ మయం అయిపోయింది.[479]

అటువంటి కీర్తనలు విని రాముడు గంభీరమైన చిరునవ్వుతో కవులకు బహుమానాలిచ్చి సంతోషపెట్టి పంపిస్తాడు.

ఆ కీర్తనలు ఆగిన తర్వాత రాముడికి ఎక్కడో కొంచెం సందేహమే – రామ రాజ్యంలో ప్రజలు అంత సుఖంగా ఉన్నారా – అని! రామ రాజ్యంలో నిజంగానే

---

**477.** రాముడి రాజ్యపాలన గురించి ఈ రకంగా చెప్పడానికి ఆధారం – చిత్రకూటంలో రాముడు భరతుడికి చెప్పిన రాజనీతులే. రాజ్యం ఏ రకంగా పరిపాలించాలని రాముడు భరతుడికి చెప్పాడో, ఆ రకంగానే తను పరిపాలిస్తాడు కదా? ★

**478.** **ఉత్తరకాండ, సర్గ 42:** “ఓ రాజా! నీవు శతృవుల కజేయుడవు. ధర్మము తప్పనివాడవు. ప్రజలకు హితము చేయువాడవు. నీ వంటి రాజు పూర్వము ఎందును జన్మింపలేదు. ఓ పురుషోత్తముడా! నిన్ను కీర్తియు, లక్ష్మియు, విడువలేవు... ఇవియును, మరి ఇతర సుగుణములను, వందులు పొగిడిరి.”

ఈ రకంగా పొగడ్తలు వింటూ రాముడు (రాజులందరూ) ఆనందిస్తాడు.

దశరథుణ్ణీ ఇలాగే పొగిడారు! ‘నీ వంటి రాజు ఎవ్వడూ లేడు’ అని! అతని తండ్రినీ ఇలాగే! తాతనీ ఇలాగే! దశరథుణ్ణి ఇలాగే పొగడ్డం రాముడు వినే వుంటాడు. అయినా ఆ మాటలతోనే అతన్ని పొగిడితే అతనికి సంతోషం! తనే గొప్ప రాజునని అతను నిజంగానే నమ్ముతాడు! ఏ రాజు మట్టుకు ఆ రాజే తనే గొప్పవాణ్ణి అనుకోవడం! తన లాంటి వాడు ఎన్నడూ పుట్టలేదు అనుకోవడం! ఈ పొగడ్తలూ, కీర్తనలూ, భజనలూ, సన్మానాలూ – ఇవన్నీ చేయించుకునే సాంప్రదాయం, వీటివల్ల ఆనందం పొందే మురికి సంకుచితత్వం, ఇంకా ఈ నాటికీ సాగుతూనే వుంది! ★

**479.** **యుద్ధ, సర్గ 131, శ్లోకాలు 93 ... 101:** రామ రాజ్యం ఎలా వుందో వర్ణించే ఈ భాగం ‘యుద్ధకాండ’ నించే. రాముడి పట్టాభిషేకం అయిన తర్వాత, కవి, రామ రాజ్యం ఇలా వుందని వర్ణిస్తాడు. “శ్రీరాముడు రాజ్యము నేలుచుండగా వితంతువుల దుఃఖమే వినపడకుండెను. (రామ రాజ్యంలో స్త్రీలు, భర్తలు పోయినా దుఃఖపడకుండా, భర్తలు పోవడమే సంతోషంగా భావించేటంతగా వారితో విసిగిపోయారేమో! అందుకే వితంతువులైనా దుఃఖించరు.)

సర్పములు, వ్యాధులు, ప్రజలను బీడించలేదు. (రాజే వున్నాడుగా ‘బీడించ’డానికీ! సర్పముల ‘బీడ’ ఒక లెక్కా?) లోకంలో దొంగలే లేకపోయిరి. (లోకః = ప్రపంచము; నిర్దస్యుః = దొంగలు లేనిదిగా; అభవత్ = అయ్యెను. రాముడు, ప్రపంచం అంతా పాలించాలని, కవి ఆశ! రాముణ్ణి మించిపోయాడు కవి, ఆశల్లో!)

రాముడు రాజ్యము సేయుచుండగా జగమంతయు రామమయముగా నుండెను. రామ, రామ, రామయని ప్రజలు రాముని కథలు చెప్పుకొను చుండిరి (కవులు, పుట్టల కొలదీ అబద్ధములు సృష్టి చేయుచుండిరి.)

శ్రీమంతుడగు రాముడు తమ్ములతో 11 వేల సంవత్సరములు రాజ్యమును బరిపాలించెను. (అమ్మో! ప్రజలు 11 వేల సంవత్సరాలు రామ రాజ్యంలో చిక్కుబడి పోయి వున్నారా!) ★

పాములు లేవా – అని! అందుకే రాముడి ధ్యాస అంతా తన రాజ్యపాలన గురించి ప్రజలేమనుకుంటున్నారో తెలుసుకోవాలనే.

ఒక రోజు తనకు విశ్వాస పాత్రులైన చారుల్ని పిలి పించి తన అభిప్రాయం బయటపెట్టాడు, 'ప్రజలనాడి పట్టి చూడమ'ని.

"ప్రభూ! మహారాజుని కీర్తించడం తప్ప మరో విధంగా చెప్పుకునే సాహసమా ప్రజలకు?" అన్నారు చారులు. (వాళ్ళు చారులు కారు, చోరులే!)

మహారాజు గంభీరంగా చూశాడు.

"ప్రత్యక్షంగా అయితే ప్రజలు రాజుని తప్పకుండా కీర్తిస్తారు. కానీ వారిలో వారు రహస్యంగా ఏమని చెప్పు కుంటారో అదే నిజమైన ప్రజాభిప్రాయం. ఆ రహస్యాలే మీరు సేకరించుకు రావాలి."

ప్రజలు తనను ప్రత్యక్షంగా పొగిడినా, పరోక్షంగా అయితే ఇంకో విధంగా చెప్పుకుంటారేమోనని రాముడికి సందేహమే. "నా పట్టాభిషేకం గురించి ఏమనుకుంటు న్నారో, నా భార్య గురించి ఏమను కుంటున్నారో, నా తమ్ములందరి గురించీ ... ముఖ్యంగా భరతుడి గురించీ, కైక గురించీ ... ఏమనుకుంటున్నారో, అన్ని విషయాలూ మీరు తెలుసుకు రావాలి."

"చిత్తం మహారాజా!" అని చారులందరూ మారు వేషాలతో గ్రామాల వెంట బయల్దేరారు.[480]

★ ★ ★

"భరతుడు ఎంత ఉత్తముడో! చేతికి వొచ్చిన రాజ్యం ఎవడు విడిచిపెడతాడూ?"

"ఆ మాట నిజమే. మొన్న మా నల్లపెట్ట ఎక్కడికో పోయి, గుడ్డు పెట్టేసింది. 'ఇదిగో! మీ కోడి మా ఇంట్లో గుడ్డు పెట్టిందల్లా' అని ఎవ్వరూ ఇచ్చారే కాదు. ఇక రాజ్యం దొరికితే ఇస్తారా? అబ్బే."

"భరతుడు మాత్రం ఎందుకిచ్చాడంటావూ?"

"ఎందుకేంటీ? పిచ్చి మారాజు."

"అంత పిచ్చాయనేం కాదు లెద్దూ. తనకి కీర్తి వొస్తుందని తెలుసు గాబట్టే ఇచ్చాడు. అదైనా అన్న గారికి కాబట్టి ఇచ్చాడు గానీ ఇంకెవరికైనా అయితే ఇస్తాడా? వీలు కుదిరితే ఇతర్ల రాజ్యాలు లాక్కోకుండా

---

**480.** **ఉత్తర, సర్గ 53, శ్లోకాలు 5 ... 11:** రాముడు చారుల్ని ఇలా అడుగుతున్నాడు. "నా పురజనులునూ, పల్లెల వారునూ, నన్ను గూర్చి ఏమి చెప్పుకొందురు? సీతను గూర్చి ఏమి పలికెదరు? భరతు నుద్దేశించి ఏమనుకొందురు? లక్ష్మణుని, శత్రుఘ్నుని ఏమనెదరు? తల్లియగు కైకేయి గూర్చి ఏమని పలికెదరు? కొత్త ప్రభుత్వమున, రాజుని గూర్చి చెప్పుకొనెదరు గదా?"

దీనికి చారులు, "దశగ్రీవుని చంపగలిగిన నీ జయమును జనులందరు మిక్కిలి పొగుడుచున్నారు" అన్నారు.

మళ్ళీ రాముడు, "పురజనులేమి యేమి మంచి చెడులను మాటలాడుకొందురో, వాని నన్నిటినీ విడిచిపెట్టక పూస గ్రుచ్చినట్లు నాకు జెప్పుము ... దానినెల్ల విని మంచి పనులు చేసెదను. చెడు పనులను విడిచెదను. పల్లెలయందును పాపులగు వారేమందురో వానిని గూడ తెలుపుము."

రాముడికి, ఏ యే విషయాలు తెలుసుకోవాలని వుందో చూశారా? ప్రజలు తన గురించి ఏం చెప్పుకుంటున్నారో తెలుసుకోవచ్చును గానీ, సీత గురించీ, భరతుడి గురించీ, కైక గురించీ కూడా ఎందుకు? వారి గురించి ప్రజలేంచెప్పుకుంటారని రాముడి అభిప్రాయం? ఏం తెలుసుకోవాలని రాముడి అభిప్రాయం? – ప్రజలు, సీతని, 'శీలవతి' అనుకుంటున్నారో లేదో తెలుసుకోవాలని రాముడి భయం. ప్రజలకు కైక మీద కోపం లేదేమో, కైకని మంచిదేనని మెచ్చుకుంటున్నారేమోనని కూడా భయం. అందుకే కైక గురించి కూడా ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలని ఆరాటం! భరతుడు, తన రాజ్యాన్ని వదిలేసినందుకు, భరతుణ్ణి ప్రజలెలాగూ మెచ్చుకుంటారని రాముడికి తెలుసు. అది చాలదు. ఇంకా రహస్యంగా ఏం చెప్పుకుంటున్నారో కూడా కావాలి. 'భరతుడు అసలు రాజ్యం ఎందుకు వదలాలి?' అని ప్రజలు అనుకుంటున్నారేమోనని అనుమానం!

ప్రజల గురించి తెలుసుకోవలసిన రాజు, ప్రజలెలా వున్నారో, వారి కష్టాలేమిటో తెలుసుకోవాలి. రాజుగారి భార్య గురించీ, అతని తమ్ముళ్ళ గురించీ, అతని సవతి తల్లి గురించీ, ప్రజల మాటలు తెలుసుకుంటే, దానివల్ల ప్రజలకేమన్నా ఉపయోగమా?

'పురజనులు ఏం మంచి చెడ్డలు మాట్లాడుకుంటున్నారో, పల్లెల్లో పాపులు ఏం మాట్లాడుకుంటున్నారో చెప్పండి' అంటున్నాడు రాముడు. అంటే, పట్టణాల్లో వుండే వారు చాలా ఉత్తములు. వారికి మంచి చెడ్డలు తెలుస్తాయి. వారు దేన్ని, 'మంచి' అంటారో దాన్నే రాముడు పాటిస్తాడట. వారు, 'చెడ్డ' అనే దాన్ని వదిలేస్తాడట! పట్టణాల్లో వుండే ఆ ఉత్తములు ఎవరు? ధనవంతులు! వాళ్ళే వ్యాపారులు! వాళ్ళ ప్రకారం నడుస్తాడన్న మాట రాముడు!

ఇక, పల్లెల్లో వాళ్ళు 'పాపులు!' పల్లెటూళ్ళ జనాలమీద చిన్నచూపు! నిర్లక్ష్యం! వాళ్ళకి మంచి తెలియదు. వాళ్ళు మాట్లాడేదంతా చెడ్డే. వాళ్ళు పాపులైతే, మూర్ఖులైతే, వాళ్ళ అభిప్రాయాల్ని లక్ష్యపెట్టడం ఎందుకు? ★

ఊరుకుంటాడా? పదేళ్ళు బతికితే సరి. ఎవరెంత ఉత్త ములో బాగానే చూడొచ్చు."

పిల్లలు చెట్టుచుట్టూ బొంగరాలాట లాడుతున్నారు.

పనులు ముగించుకున్న మొగవాళ్ళందరూ చెట్టు కిందకి జేరుతున్నారు.

చంకల్లో పిల్లలకి అన్నాలు తినిపిస్తూ, ఎద పిల్లలకి తలలు దువ్వుతూ, పాతగుడ్డలు కుట్టుకుంటూ, ఆడ వాళ్ళు కూడా కొందరు చెట్టు కిందకి చేరారు.

"అసలు నాకు తెలవకడుగుతానూ, కైకమ్మ రెండు వరాలు కోరిందంటారు కదా? భరతుడికి పట్టాభిషేకం, రాముడికి వనవాసం. రాముడు వనవాసం చేసి వచ్చా డనుకో, బాగానే వుంది. మరి భరతుడికి పట్టాభిషేకం ఎక్కడ జరిగిందీ? అప్పుడేమో రాముడి చెప్పులకి చేశారు. ఇప్పుడు రాముడు చేసుకున్నాడు. ఇక భరతుడి పట్టాభిషేకం మాటేవిటి?"

"నిజమే సుమా! మంచి మాటే. ముందు భరతుడే పట్టాభిషేకం చేసుకోవాలి. కావాలంటే, తర్వాత తన రాజ్యం ఎవరి కన్నా ఇచ్చుకోవచ్చు.

పిల్లలు గోలగోలగా పోట్లాడుకుంటున్నారు. ఇద్దరు అన్నదమ్ములు కొట్టుకుంటున్నారు – పిల్లంగోవి కోసం.

తల్లి లబ లబ లాడుతోంది – "అయ్యో, తోడ బుట్టిన వాళ్ళకి సఖ్యమే లేదేవ్రా! భరత మహా రాజుని చూడండి, రాజ్యమే ఇచ్చేశాడు! నాయనా, అది అన్నయ్య కిచ్చెయ్యి" అని తల్లి చిన్న కొడుక్కి నీతి బోధ చేసి, తన కున్నదంతా సంతోషంగా ఇచ్చెయ్యడానికి ఉత్తేజం కలి గించబోయింది.

ఆ చిన్నవాడు తనకున్నదంతా తనే అనుభవించ డానికి ఉత్తేజం పెంచుకుని, తల్లి నీతులు ఎగరగొట్టి, పిల్లంగోవి నోట్లో పెట్టుకుని వాయింపు మొదలుపెట్టాడు. అంతలో పెద్దవాడు గద్దలాగ ఒక్క ఎగురు ఎగిరి తమ్ముణ్ణి తన్ని, పడదోసి, మీద ఎక్కి తొక్కి, గుద్ది, పిల్లం గోవి లాక్కుని పరిగెత్తాడు. చిన్నవాడు బోర్లాపడి బొబ్బలు పెడుతూ ఒకటే ఏడుపూ, తిట్లూ!

తల్లి చిన్న కొడుకుని లేవదీసి, పెద్దవాణ్ణి శాప నార్థాలు పెట్టింది – "మొత్తానికి లాక్కున్నావూ? నీ జిమ్మ దియ్య! రాముడిలాగ ఎంత పాడు బుద్ధో నీకు. ఈ సారి నా చేతికి అందు, చెపుతాను. నీ వీపు చీరకపోతే అప్పు డడుగు!" అని గొప్ప గొప్ప వీరులు చెయ్యగల ప్రతిజ్ఞ లన్నీ చేసింది.

"భరతుడికి పట్టాభిషేకం జరిగిందా, లేదా? రాముడు పితృవాక్య పరిపాలన చేసినట్టా, కాదా?" అని వాదాలూ కుమ్ములాటలూ జరుగుతున్నాయి – చెట్టు కింద సభలో.

"కైక కోరిన వరాల్లో ఒక్కటే చేశాడు రాముడు. రెండోది చెయ్యనే లేదు" అని తేల్చారు చివరికి.

"మనలో మన మాట. పాపం శ్రీరాముడు ఆ వన వాసం చేసినంత కాలం అష్టకష్టాలూ పడ్డాడు. రావణు డితో యుద్ధం అంటే మాటలా? మహా వీరుడు కాబట్టే ఆ పని సాధించాడు. సుగ్రీవుడూ, విభీషణుడూ రాముడి ముందు ఎంత వినయంగా మసులుకున్నారో చూశారా?"

"ఎంత వీరుడైతే ఏం గొప్పలే. ఇంకో మగాడు తీసుకుపోయిన పెళ్ళాన్ని పౌరుషం లేకుండా మళ్ళీ తెచ్చుకున్నాడు. రాచ పుటక పుట్టాడు మళ్ళీ. నే నైతేనా? .... అలాంటి దాని మొహం మళ్ళీ చూస్తానా?" అని మీసాలు మెలి తిప్పాడో పురుషోత్తముడు.

"సరేలే. ఇప్పుడైతే మాత్రం, నువ్వు ఇతర్ల పెళ్ళాల మొహాలే గానీ నీ పెళ్ళాం మొహం చూస్తున్నావా ఏవిట్లే" అని ఈసడించారు చుట్టూ వాళ్ళు.

ఆ పెద్ద మనిషి, రోజూ పెళ్ళాన్ని చావబాదవలి సిందే. ఆ ఇల్లాలు నూతికో, గోతికో పరిగెత్తవలిసిందే.

"శ్రీరాముడూ నువ్వన్న ముక్కే అన్నాడంట లే మొదట. నలుగురు పెద్దలూ నచ్చజెప్పిం తర్వాత, మంచీ చెడ్డా తెలిసిన వాడు కాబట్టి, ఆ తల్లి తప్పేమీ లేదని గ్రహించుకుని ఇంటికి తెచ్చుకున్నాడు. నీ లాంటి వాడైతే ...."

"నాకున్న పౌరుషం రాముడి కెక్కడేడిసిందెహే! రాజే ఇంత సిగ్గుమాలిన పని చేస్తే ఇక మనబోటోళ్ళం ఏం చెయ్యాలి? .... నీతి నియమాలు అక్కర్లేకపోతే ఆడదాన్ని పట్టగలమా?"[481]

**481.** **ఉత్తర, సర్గ 53, శ్లోకాలు 16 ... 20:** పౌరులు చెప్పుకునే మాటలు: "... రాముడు పరువును వదిలి సీతను తన ఇంటికి దెచ్చినాడు. రాముడికి సీతతోడి కలయిక వలన సుఖమెట్టిది? ఇంతకు మునుపు రావణుడా సీతను తొడపై నిడుకొని ఎత్తుకొని పోయెను గదా? లంకకు గూడ దీసికొనిపోయి అశోక వనమున నుంచబడినదియు, రాక్షసుల వశమున నున్నదియునైన సీతను దెచ్చుగొనుటకు రాముడెట్లు అసహ్యము నొందలేదు? మనముగూడ మన భార్యలను ఇట్లు మన్నించవలసినదే గదా? రాజు లొనర్చునట్లె ప్రజలు చేయుదురు గదా?" – ఈ రకంగా అన్నది ఎవరో ఒక్క వ్యక్తి కాదు. రాజ్యంలో అనేక మంది అన్నారని, చారులు రాముడికి చెపుతారు. (సాధారణంగా మనం బైట వినే కథలో, సీత గురించి ఇలాంటి మాటలు అన్నది, ఒక చాకలి అని వింటాం. 'చాకలి' అనే మాట ఉత్తర కాండలో లేదు.)

ప్రజలు 'రామ రాజ్యం' కోసం తపించే వాళ్ళయితే, రాముడి మీద అంత భక్తి వుంటే, రాముడు చేసిన పనిని ఇంత హేళన చేసి, రాముడి గురించి ఇంత అవమానకరంగా చెప్పుకుంటారా? అలా చెప్పుకుంటే, ప్రజలకు రాముడి మీద ➔

చెట్టుకింద కంబళీ పరుచుకుని పడుకున్న ముసలి బాటసారి దగ్గుకుంటూ లేచాడు.

"ఏం తాతా? పోతున్నావా?"

"వెళ్తానయ్యా! శెలవు."

"ఈ వయసులో నీకు దేశ సంచారం ఎందుకు తాతా?"

"రామ రాజ్యంలో ప్రజలందరూ ఎలాగున్నారో కళ్ళారా చూడాలని ఆశతో తిరుగుతున్నానయ్యా!"

"సరి. నీకూ ఆ పిచ్చేనన్నమాట. నీ లాగే మా వూళ్ళో కూడా కొంతమంది రామ రాజ్యం మీద పుట్టెడేసి ఆశలు పెట్టుకున్నారులే. మొన్న అయోధ్య నించీ మా చుట్టం కుర్రాడొకడొచ్చాడు. అక్కడ బ్రాహ్మల దగ్గిర పాలేరుతనం చేస్తాడు. ఎన్ని సంగతులు చెప్పాడో! రామ రాజ్యంలో ప్రజలందరూ చెప్ప లేనంత సుఖంగా ఉన్నారని కవులందరూ పాటలు రాసి పాడతారంటగా తాతా! ఆ మాటలలా వుంచు. అసలు రామ రాజ్యంలో పాములే ఉండవని రాశారంటగా? నిజమేనా?"

"నాకు తెలవదు నాయనా!"

"మహారాజూ మేడ దిగడు, ఆ రాసి నాయనా మేడ దిగడు. ఇక వాళ్ళకి పాములేం కనపడతాయి? వొకసారి పొలాల మీదకొస్తే సరి. తాతా! ఊళ్ళు చూస్తున్నానంటు న్నావు. బీదా బిక్కీ కనపడ్డారా లేదా? మనబోటి వాళ్ళు దశరథుడి రాజ్యంలోనూ ఇలాగే వున్నారు, భరతుడి రాజ్యంలోనూ ఇలాగే వున్నారు, ఇప్పుడు రాముడి రాజ్యం లోనూ ఇలాగే వున్నారు. ఇక ఏం మారిందంటావు రామ రాజ్యంలో?"

"అమ్మో, పాము, పాము" అని అరిచారెవరో, జనం గోల గోలగా లేచారు. పిల్లలు ఏడ్చారు. కుక్కలు మొరి గాయి. పాకలో జొరబడ్డ పాముని చంపడానికి జనం అటు పరిగెత్తారు.

ఎవర్ని కరవాలని వొచ్చిందో! 'రామ రాజ్యం' అని తెలుసో లేదో దానికి!

★ ★ ★

విజయుడూ, భద్రుడూ, సురాజుడూ, కాళీయుడూ ఇంకా ఇంకా ముఖ్య చారులు రాముడి ముందు చేతులు కట్టుకుని నించున్నారు. అందరి మొహాలూ వెల వెలబోతున్నాయి.

రాముడు గంభీరమైన చూపులతో చారుల్ని పరికిస్తు న్నాడు – "భద్రా! ప్రజలందరూ క్షేమమేనా?"

"చిత్తం మహారాజా! నీ దయ వల్ల ...."

"మీరు సేకరించిన వార్తలు విన్నవించండి!"

"ప్రభూ! పల్లె ప్రజలు మూర్ఖులు కదా?"

"అయితే?"

"అనేక రకాల మాటలు విన్నాము. మంచీ చెడ్డా, కష్టం సుఖం అన్నీ ...."

"విన్నవించండి! జాప్యం చేయవద్దు."

"మహారాజా! మన్నించాలి, శ్రీరాముడు అసలు పితృవాక్య పరిపాలనే చెయ్యలేదట! భరతుడికి కోసల సామ్రాజ్యాధిపతిగా పట్టాభిషేకం జరగలేదు కాబట్టి, కైక కోరిన కోరికల్లో ఒక కోరిక తీరనే లేదట!"

"భద్రా ...."

"మన్నించు ప్రభూ! నీ దాసుణ్ణి ...."

"ఎవరా మాటలన్నది? ఏ గ్రామములో?"

"ఒక గ్రామంలో కాదు. అనేక గ్రామాలలో మహా రాజు గురించి పొగడ్తలూ, తెగడ్తలూ అన్నీ విన్నాము. మూర్ఖులైన ప్రజల మాటలు లక్ష్యపెట్టవలసిన పని లేదు గదా ప్రభూ?"

"ఇంకా ఏమంటున్నారు? దాచవద్దు, అంతా చెప్పండి!"

"మహారాజు మృదు హృదయానికి కష్టం కలిగించ గలమా ప్రభూ?"

"సందేహించవద్దు .... విన్నవించండి!"

"మహాసాధ్వి అయిన సీతాదేవి విషయంలో కూడా ...."

అంతా విన్నాడు రాముడు, మొహమంతా ఎర్రబారి పోతూ!

"ప్రభూ! మన్నించాలి. సామాన్య ప్రజలు రామ రాజ్యంపై విశ్వాసముంచినట్టు కనపడదు."

గాంభీర్యంతో మౌనం వహించాడు మహారాజు.

చారులు నమస్కారాలు చేసి నిష్క్రమించారు.[482]

---

➔ఏం గౌరవం వున్నట్టు? రాముడు చేసే పనుల మీద ఏం విశ్వాసం వున్నట్టు? ప్రజలందరూ రాముణ్ణి హేళన చేస్తూ మాట్లాడారని కవి రాయవొచ్చునా? అందుకే తర్వాత కవులు తెలివిగా ఎవరో చాకలి పిచ్చివాడు మాత్రమే రాముణ్ణి అలా అన్నాడని వేరే కథలు సృష్టించి వుంటారు. అది తెలివైన పనే. ★

**482.** "భరతుడికి పట్టాభిషేకం అవలేదు కాబట్టి కైక కోరిక తీరనే లేదు" అని ప్రజలన్నారని చారులు చెప్పడం 'వాల్మీకి మూలం'లో వున్నది కాదు. 'మూలం'లో వున్నది కేవలం సీత గురించి ప్రజలేమన్నారో చెప్పడమే.

కానీ, రాముడు చారులతో చెప్పినప్పుడు, భరతుడి గురించీ, కైక గురించీ కూడా తెలుసుకోవాలని చెప్పాడు కదా? ఆ సంగతులేవీ చారులు తిరిగి వచ్చాక చెప్పకపోతే రాముడి ఆజ్ఞ ఏమైనట్టు? కాబట్టి, చారులు భరతుడి గురించీ, కైక గురించీ కూడా చెప్పినట్టు వుండాలి. ➔

రాముడు దీర్ఘాలోచనలో మునిగాడు. ప్రజలకు రామరాజ్యంపై విశ్వాసం లేదా? రాముడిపై, రాముడి నిర్ణయాలపై, విశ్వాసం లేదా? ఎంత భయంకర సత్యం! ఈ స్థితిలో ఏమిటి తన కర్తవ్యం? ప్రజలకు తన ఉత్తమత్వం చాటి చెప్పగల మార్గం ఏమిటి?

శ్రీరాముడు ఉత్తమ ప్రభువనీ, ప్రజాభిప్రాయం కోసం స్వ సుఖమైనా త్యాగం చేస్తాడనీ నమ్మించగల కార్యం ఏమిటి? ... ప్రజలు తమ సందేహాల్ని మరిచి పోయేటట్టు చెయ్యాలి. శ్రీరాముడు ప్రజాభిప్రాయాన్నే అనుసరిస్తాడనే కీర్తి సాధించాలి. అప్పుడే ప్రజలు తమ సందేహాలన్నీ విస్మరిస్తారు. ఈ ప్రయత్నం తనకు ప్రతిష్టా కరమే. కీర్తివంతమే.

★ ★ ★

"లక్ష్మణా!"

"ఏమి శెలవు మహారాజా?"

"ప్రజాభిప్రాయం విన్నావా? సీత మీద అపవాదు .... నా మీద నిందారోపణలు?" కన్నీళ్ళతో రాముడి చెంపలు తడిసిపోతున్నాయి.

"ఎవరా దుష్టులు? ఏ గ్రామస్థులు? అందర్నీ ఇప్పుడే సర్వనాశనం చేయిస్తాను" అని సర్రున కత్తి తీశాడు లక్ష్మణుడు.

"తప్పు నాయనా! ప్రజాభిప్రాయాన్ని రాజు గౌర వించాలి. ఈ స్థితిలో దండోపాయం మార్గం కాదు."

"అందుకని?"

"శ్రద్ధగా విను! నా ఆజ్ఞ మీరవనే విశ్వాసంతోనే నీకు కబురు పంపించాను. రేపు ఉదయాన్నే సీతని రథంలో తీసుకుపోయి గంగ దాటించి వాల్మీకి ముని ఆశ్రమ ప్రాంతాల్లో విడిచి రా. సీతని విడిచి పెట్టడం తప్ప మార్గం లేదు."

"ప్రభూ!"

"ఈ లోకోపవాదు గురించి ఆ నాడే సందేహిం చాను. ఆ నాడే సీతను శాశ్వితంగా త్యజించాలను కున్నాను. కానీ పెద్దలందరూ చెప్పి ఒప్పించారు నన్ను. సీత దోషం లేదనే అంగీకరించాను. కానీ .... మళ్ళీ ఈ అపనింద .... నన్ను అమితంగా సిగ్గుపరుస్తోంది. ప్రజల అపహాస్యం నేను భరించలేను."

"మహారాజా! దయతో నా మాట మన్నించి శాంతం వహించు. రాజు ప్రజల్ని ఆజ్ఞాపిస్తాడు గానీ, ప్రజల మాటలే తను పాటిస్తాడా? ప్రజల మాటలు లక్ష్యపెట్ట వలసిన అవసరం మహారాజు కెంతమాత్రం లేదు గదా?"

"లక్ష్మణా! నా ఆజ్ఞ కెదురు చెప్పకు. పర పురుషుడి గృహంలో ఉన్న భార్యని తిరిగి స్వీకరించాననే అపకీర్తి నే నిక భరించను. లోకంలో అపకీర్తి ఉన్నంతకాలమూ ఆ ప్రాణి నరకంలో పడి కొట్టుకుంటాడు. అందుకే ఉత్తములు కీర్తి కోసం ఆరాటపడతారు."

"ప్రభూ! ఎన్నటికైనా నీ కీర్తికి కళంకమా?"

"కళంకమే ఇది. పర పురుషుడు అవమానించిన భార్యని స్వీకరించాను. పౌరుషహీనుణ్ణి నేను. నన్ను చూసి లోకం నవ్వుతోంది. నవ్వుతోనే వుంది. భార్యని త్యజించి నా కీర్తి నేను సాధిస్తాను. లోకంలో అపకీర్తి కలుగుతుందంటే తోడబుట్టిన మిమ్మలనైనా విడిచి పెట్టేస్తాను. ఇక భార్య ఎంత? సీతని విడిచి పెట్టడం నాకు కీర్తి కారణం గనకే, నా కీర్తి కోసం నే నిలా నిశ్చయించుకున్నాను."

"ప్రభూ! ...."

"ఇక మీరెవరూ నాకు చెప్పవలసింది లేదు. ఇంకా నాకు చెప్పాలని ప్రయత్నిస్తే మీకూ నాకూ విరోధం తప్పదు."

".... .... .... .... ...."

"రామ రాజ్యంలో రాజు సుఖానికి కాదు, ప్రజాభి ప్రాయానికే విలువ. ముని పత్నుల్ని దర్శించాలని కోరింది సీత. ఆ కారణంగా తీసుకు వెళ్ళు!"

"ప్రభూ! .... దయ చూపు! .... వదిన గారు గర్భవతి ...."

"తప్పదు. నా కరుణా కటాక్షానికి అర్హురాలు కాదు సీత.[483]

★ ★ ★

---

➔ భరతుణ్ణి గురించి ప్రజలేమనుకుంటారు? "అన్నకు రాజ్యం ఇచ్చేశాడు. చాలా మంచివాడు" అనుకుంటారు కదా? ఆ సంగతే చారులు రాముడికి చెప్పాలి. అలాగే కైక గురించీ ఇతర్ల గురించీ కూడా చారులు రాముడికి చెప్పాలి. ★

**483.** **ఉత్తర, సర్గ 55, శ్లోకాలు 13 ... 25:** రాముడు లక్ష్మణుడికి చెపుతున్న మాటలు: "... పుర జనులును, పల్లె వాసులును, నన్ను దూషించుచున్నారు... లోకంబున నెవని అపకీర్తి ఎంత కాలము చెప్పుకొనబడునో, యాతడు అంతకాలము నరకమున బడుచున్నాడు. మహాత్ములగు వారందరును కీర్తి కొరకే ప్రయత్నింతురు. అపవాదునకు జంకి నేను ప్రాణ ములనైనను, మిమ్ములనైనను, త్యజింతును. ఇక సీత విషయమున సంశయమేమి? ... గంగానది కావలి గట్టున తమసానది తీరంబున వాల్మీకి ముని యాశ్రమమున్నది.

నొక నిర్జన ప్రదేశమున సీతను వదలిరమ్ము ... ఈ విషయమున నేమియు బదులు చెప్పరాదు. పొమ్ము! ఇచట విచా రము చేయవలదు. మీరెవరైననూ నా మాటకు నడ్డు పలికితిరేని మీ యందు నా కెక్కువ ద్వేషము కలుగగలదు ... మీరు ➔

"నేను మాత్రమేనా వనాలకు?" అని ఆశ్చర్య పడింది సీత.

"మా అన్నగారు రాచకార్యాలలో మునిగి ఉన్నారు. మిమ్మల్ని మునుల ఆశ్రమాలకు తీసుకు వెళ్ళమని నన్ను ఆజ్ఞాపించారు."

"అలాగా? మనం వెళ్ళి వద్దాము. రుషుల భార్యల కందరకూ బహుమతులు తీసుకు వెళ్దాము" అని సీత సంతోషంతో ప్రయాణ సన్నాహాలు చేసి రథం ఎక్కింది.

వనవాసానికి పోయిన మార్గమే. సరసన భర్త లేక పోవడం మాత్రం నిరుత్సాహం కలిగిస్తోంది. తిరిగి వచ్చి విశేషాలన్నీ భర్తకు చెపుతాననే ఆనందంతో సీత సంతోషంగా ప్రయాణం చేసింది.

గంగ దాటారు పడవ మీద. అవతలి వొడ్డున దిగారు. పూర్వం ఈ స్థలం నించే వనవాసం ప్రారంభం. అప్పుడెంత దుఃఖమో!

సీత, పరిసరాలు పరికిస్తోంది.

లక్ష్మణుడు ఆమె పాదాల మీద పడి బావురు మన్నాడు.

సీత కంగారుతో "ఏమిటి నాయనా ఇదీ?" అని వింత పడింది.

"అమ్మా! ఈ శిక్ష కన్నా నాకు మృత్యువే మేలు" అని జల జల కన్నీళ్ళు రాల్చాడు లక్ష్మణుడు.

"అయ్యో! ఏమీ చెప్పకుండా దుఃఖిస్తున్నావే!"

"నేను చెప్పలేను, మీరు వినలేరు."

"ధైర్యం తెచ్చుకో నాయనా! మహారాజు నిన్ను కోపించాడా? బహిష్కరించాడా? చెప్పవోయీ నాతో."

"అమ్మా! నా కోసం నే నింతగా దుఃఖిస్తానా? మహా రాజు తన ధర్మపత్నినే బహిష్కరించాడు. నిన్ను స్వీకరించి నందుకు మహారాజుని పరిహసిస్తున్నారు మూర్ఖ ప్రజలు. తన అపకీర్తి బాపుకోడానికి రాజు ధర్మపత్నిని త్యజించ డమే మార్గంగా నిశ్చయించుకున్నాడు!"

సీత నిర్ఘాంతపడుతూ వింది. నమ్మలేనంత ఆశ్చ ర్యంతో – "లక్ష్మణా! ఏమంటున్నావు?" అని కంపించే కంఠంతో అడిగింది.

"నన్ను మన్నించు తల్లీ! నేను అస్వతంత్రుణ్ణి. రాజు ఆజ్ఞ మాత్రమే నేను పాటిస్తాను. నా దోషం ఏమీ లేదు. రాజు దోషం కూడా ఏమీ లేదు. రామ రాజ్యంలో ప్రజాభి ప్రాయాన్ని తిరస్కరించగలడా రాజు?"

సీతకి విషయమంతా అర్థమైంది. తను పతివ్రత కాదని భర్త సందేహం. ప్రజల సందేహం. ఫలితమే ఈ తిరస్కారం. సీత విస్మయం అంతా నిస్సహాయతలోకి, శోకంలోకి, మారింది – "అయ్యో! జన్మంతా దుఃఖపడ టానికే పుట్టానా నేను? పామర ప్రజల్ని కూడా గౌరవించే రామరాజ్యంలో సీతకు చోటు లేదా? నే నేం పాపం చేశానోయీ? ఈ కారడవుల్లో నాకు దిక్కెవరు? గంగలో పడి ప్రాణత్యాగం చెయ్యడం కన్నా నాకు మార్గమే ముంది?"

"అంత పని చెయ్యకు తల్లీ! ఈ సమీపంలోనే వాల్మీకి ఆశ్రమం ఉంది. అక్కడ నువ్వు సురక్షితంగా ...."

"అయ్యో! భర్త విడిచిన నన్ను సురక్షితంగా జీవించ మంటున్నావా? దిక్కు లేని అనాథనై మునుల ఆశ్రమాల్లో చేరమంటున్నావా? 'ఏం తప్పు చేశావు? నీ భర్త ఎందుకు విడిచిపెట్టాడు?' అని మునులడిగితే నే నేమని చెప్పు కోను? ఇంత వంచనతో నన్ను అరణ్యాలకు పంపిం చాడా నా భర్త? 'సీత లేని నాకు భూమండలాధిపత్య మెందుకు, దేవత్వ మెందుకు?' అనే వాడే! నేను తన సరసన వుంటే అరణ్యాలనైనా స్వర్గంగా భావిస్తానన్న నా భర్తేనా నన్ను తిరస్కరించింది? నా నిర్మలత్వం, నా సౌశీల్యం ఆయన ఎరగనే ఎరగడా? లక్ష్మణా! నాకు ఎప్పుడో తెలుసు. నా శీలం పట్ల ఆయన కెప్పుడూ సందేహమే. లంకలో నన్ను స్వీకరించాడే గానీ ...." సీత చప్పున ఆగి సిగ్గుపడి పోయింది. బొట బొట కన్నీళ్ళు కార్చింది.

పతిని దూషించడమా? ఎంత పాపకార్యం! ఏ జన్మలో ఏ పాప ఫలితమో ఈ శిక్ష తనకి! తన పాతి వ్రత్యానికి మళ్ళీ పరీక్ష ఇది. భర్త కోరిక తను సంతో

---

➔ నా కోరికను విఘాత పరచెదరేని ... నాకు విరోధులయ్యెదరు" – ఈ రకంగా కఠినంగా మాట్లాడాడు రాముడు.

లంకలోనే రాముడు సీతని శంకించడం, సీత పతివ్రతేనని తేలడం, ఇద్దరూ సుఖంగా అయోధ్యకు రావడం, పట్టాభిషేకం జరిగి సుఖంగా బ్రతుకుతూ వుండడం – ఈ రకంగా కథ జరుగుతూ వుండగా, కవి మళ్ళీ ఈ విధంగా, రాముడు సీతని విడిచిపెట్టేసే ఘట్టం ఎందుకు సృష్టించినట్టు? – రాముడు ఎంత ధర్మాత్ముడైన రాజో, ఎంత న్యాయంగా రాజ్యపాలన చేశాడో చెప్పడానికే. "రాముడు ప్రజావాక్యం ప్రకారమే నడిచాడు, (ఆ ప్రజల్ని పాపులని తిడుతూనే), తన భార్యని కూడా విడిచిపెట్టేసి, ప్రజలకు మార్గదర్శకంగా వుండే సాంప్రదాయం కాపాడాడు, ఎంత మంచి రాజో చూడండి" అని చెప్పడానికే.

కానీ ప్రజలు (ఆ హేళన చేసిన వాళ్ళు) అన్నది – 'సీతని మళ్ళీ వొదిలెయ్యమ'ని కాదు. 'అసలు మొదట ఎలా తెచ్చు కున్నాడు? అంత పౌరుషం లేని పని ఎలా చేశాడు?' అని. వాళ్ళ మాటల ప్రకారం – రాముడు సీతని తెచ్చుకున్నాడంటేనే పౌరుషం పోయినట్టు లెక్క. ఆ భార్యని కొంతకాలం వుంచుకొని, తర్వాత ఎవరో ఏదో అన్నారు కాబట్టి వదిలేస్తే, అప్పుడు పౌరుషవంతుడవుతాడా? ★

షంగా నెరవేర్చాలి. సంతోషంగా ....!

"లక్ష్మణా! నా భర్తకు వచ్చిన అపకీర్తి పోగొట్ట వలసిన బాధ్యత నా మీద కూడా ఉంది. నేను సంతోషంగా నా భర్త ఆజ్ఞ పాటిస్తాను. నా భర్త ధర్మాత్ముడు. పరమ పూజ్యుడు. నాకు నా భర్తే దైవం. బంధువు. గురువు. భర్తకు ఇష్టమైన కార్యం కోసం ప్రాణాలు త్యజించడమైనా ఆనందమే నాకు .... ఇక నువ్వు వెళ్ళు! మహారాజుని ఎన్నడూ ధర్మం విడిచి పెట్ట వద్దని నా విన్నపంగా చెప్పు! నా అత్తలందరికీ నా నమస్కారాలు చెప్పు! అంతఃపురాలలో అందర్నీ అడిగానని చెప్పు!"

"అమ్మా! తిరిగి తీసుకు వెళ్తానని నమ్మించి ఇక్కడికి తెచ్చి ...."

"నీ తప్పేముంది నాయనా? రాజు ఆజ్ఞ పాటిస్తున్నావు. నేను నా భర్త ఆజ్ఞ పాటిస్తున్నాను. మనం దుఃఖ పడకూడదు. నా గురించి ఆలోచించకు. తొందరగా బయల్దేరి వెళ్ళు."

"నన్ను మన్నించు తల్లీ! వెళ్తున్నాను" అని లక్ష్మణుడు సీతకు నమస్కారం చేసి తల వొంచుకొని వెనక్కి తిరిగాడు.

లక్ష్మణుడు ఎక్కిన నావ సీత కంటి చూపు నించి దూరం అయిపోయింది.[484]

★ ★ ★

గంగ నిశ్చలంగా ప్రవహిస్తోంది.

సీతకు గంగా ప్రవాహం లాగ దుఃఖం పొంగుతోంది.

పద్నాలుగేళ్ళ కిందట, పురుష సింహం వంటి భర్త నీడలో తను .... ఈ కారడవుల్లో సురక్షితంగా .... అన్ని సంవత్సరాలు జీవించింది. అంత సౌశీల్యంతో గడిపిన భార్యని .... గర్భవతి అనే కరుణ అయినా లేకుండా .... అయ్యో! ఎప్పటికప్పుడు పతివ్రతల ధర్మాలన్నీ నెమరు వేసుకుంటూ దుఃఖాన్ని దిగమింగే ప్రయత్నమే గానీ, ఈ పాతివ్రత్యం, దుఃఖమే కలగకుండా చెయ్యదా?

"సీతా! నీకు భర్త మీద కోపం రాదూ?" – సీతని సీత కోపంగానే అడిగింది.

"ఎందుకు రాదూ? .... ఆఁ ఏమన్నానూ? .... కోపమా? నా భర్త మీదా? .... ఎంత మాట! నాకు నా భర్త మీద కోపమా? రాదు. రానివ్వను."

"మరి, నీ భర్త నిన్నింత అవమానించాడు. న్యాయమేనా?"

---

**484.** **ఉత్తర, సర్గ 58, శ్లోకాలు 3 ... 17:** సీత దుఃఖం – "లక్ష్మణా! బ్రహ్మ నా ఈ జన్మము దుఃఖమునకే పుట్టించెనా? ... పూర్వ జన్మమున నే నెట్టి పాపపు పని చేసితినో! ఎవనిని భార్యతో నెడబాపితినో! ... నేను రాముని పాదముల ననుసరించియుండి వనవాసము చేసితిని. అట్టి నే నిప్పుడు నా దుఃఖము నెవ్వరికి చెప్పుకొందును? 'నీ వేమి చెడు పని చేసితివి, నిన్నెందుకు రాముడు వదలి పెట్టెను?' అని మునులడిగెరేని నే నేమి బదులు చెప్పుదును? నే నిప్పుడే గంగలో పడి ప్రాణములు బాసెదను..." – ఈ రకంగా కొంతసేపు దుఃఖించింది. చివరకు – "లక్ష్మణా! రాజు ఆనతి ప్రకారము నడుచుకొనుము. నన్ను విడిచిపొమ్ము! ... అందరకును నా మ్రొక్కులు సల్పి, నా క్షేమం బెరింగింపుము. (క్షేమం! కారడవిలో!) ... నా నాధునితో నా మాటలను జెప్పుము ... నీ ఎడ నెక్కువ భక్తితో గూడిన దానను, నీకు నెల్లప్పుడు సేవలొనర్చుచుండు దానను ... అట్టి నన్ను నీవు అపకీర్తికి వెరచి విడిచితివి. నీకు లోకనింద వలన గలిగిన అపకీర్తి ఏది గలదో దానిని నేను గూడ పోగొట్టవలసినదేను. ... నాకు భర్తయే దైవము. భర్తయే చుట్టము. భర్తయే గురువు. కావున ప్రాణములను బాసియైనను భర్త కిష్టమైన కార్యము ముఖ్యముగా చేయవలయును" – ఈ రకంగా మాట్లాడింది సీత.

తనని భర్త విడిచినందుకు సీతకు దుఃఖం లేదా? – చాలా వుంది. చచ్చిపోవాలనిపించేంత దుఃఖం. అయినా పతివ్రతల ధర్మాలన్నీ గుర్తు చేసుకుని దుఃఖం అణచుకునే ప్రయత్నం చేసింది.

సీతకి, "మునుల ఆశ్రమాలు చూశాక వెనక్కి వస్తాం' అని చెప్పి తీసికెళ్ళి వొదిలెయ్యడం, సత్యవంతుల లక్షణమేనా? సీతకి అసలు నిజం అయోధ్యలోనే చెప్పాలి. అలా చెప్తే, ఆమె మునుల ఆశ్రమాలకు వెళ్ళడానికి ఒప్పుకునేదే. భర్తకి అపకీర్తి లేకుండా చెయ్యడమే ఆమె పద్ధతి.

రాముడు, సీతని వదిలెయ్యదల్చినా, ఆమెకోసం ఇతర ఏర్పాట్లేమీ చెయ్యకూడదా?

భర్తలు భార్యల్ని అనాధలుగా విడిచి పెట్టెయ్యడం సమాజంలో జరుగుతూ వున్నదే. వొదిలేసిన భార్యల కోసం భర్తలు ఏమీ చెయ్యరు. అలా చెయ్యడం ఎక్కడా జరగదు. ఆ అనాధలు ఏదో ఒక పంచకు చేరి, ఇతర్ల దయాదాక్షిణ్యాల మీద బతుకుతూ వుంటారు. కవి, ఈ లోకజ్ఞానంతోనే సీతని అనాధగా అడవుల్లో వొదిలేశాడు. అంతకన్నా ఇంకో మార్గం సమాజంలో లేదు కాబట్టి, కవి కూడా ఇంకో మార్గం ఊహించలేదు. శ్రీరామచంద్రుడైనా సరే భార్యని, దిక్కు లేకుండా తరిమెయ్యవలసిందే! తరిమేశాడని కవి రాయవలసిందే!

రాముడు, వనవాసానికి వెళ్ళేటప్పుడు, వాల్మీకి ఆశ్రమం చిత్రకూటంలో వుంది, ఇప్పుడు గంగ దాటగానే వుంది! వాల్మీకి, తన నివాసం ఇక్కడికి మార్చుకున్నాడా?

★

"న్యాయాన్యాయాలు ఆయనకు తెలుసు. ఆయన ఏది చేస్తే అదే న్యాయం!"

"మరి దుఖ్ఖపడుతున్నా వెందుకు?"

"లేదు, నాకు దుఖ్ఖం లేదు. నా దుఖ్ఖమంతా భర్తకు దూరమయ్యాననే గానీ నా భర్త నాకు అన్యాయం చేశా డని కాదు. నేను మహా పతివ్రతనని ఎరగనా? సామాన్య స్త్రీ ననుకుంటున్నావా నన్ను? నేను భర్తని కోపిస్తానా? దూషిస్తానా? నా భర్త నిర్ణయానికి దుఖ్ఖిస్తానా?"

సీత చెంపలు చెరువులవుతున్నాయి. కన్నీటితో వొడి నిండుతోంది. ఎంత ప్రయత్నించినా దుఖ్ఖం ఆపుకోలేక పెద్ద కంఠంతో అడివంతా ఏకమై ఏడుస్తోన్నట్టు ఏడ్చింది. ఏడవడం తప్ప ఇంకే జ్ఞానమూ ఎరగని చంటి పిల్ల లాగ ఏడ్చింది.

కఠినాత్ముడైన భర్త, ఉత్తమురాలైన భార్యని అన్యా యంగా శంకించి, కారడవుల్లో విడిచిపెడితే, ఆ అమా యకురాలు[485] ఎలా ఏడుస్తుందో అలా ఏడ్చింది.

ఎంతసేపు ఏడ్చిందో .... ఎన్ని యుగాలు ఏడ్చిందో .... ఏడ్చి ఏడ్చి .... కళ్ళ ముందు రుషిని చూసి పుట్టెడు సంతోషంతో ఆ రుషి పాదాలకు మోకరిల్లింది. "మహర్షీ .... నా భర్త లోక నిందకు జడిసి .... నన్నీ కారడివిలో విడిచిపెట్టాడు ...." అంటూ మరీ మరీ ఏడ్చింది.

ఆ రుషి, వాల్మీకి!

గంగ వొడ్డున వొక స్త్రీ దయనీయంగా ఏడుస్తోందని శిష్యులు చెప్పగా వాల్మీకి సీత దగ్గిరికి వచ్చాడు. విషయం అంతా తెలుసుకుని, "భయం లేదమ్మా సీతా! నా ఆశ్రమం దగ్గిరే ముని పత్నుల ఆశ్రమం ఉంది. వారు నీకే లోపమూ లేకుండా చూసుకుంటారు. సంతోషంగా ఉండు" అని వోదార్చాడు.

సీత పుట్టెడు సంతోషంతో రుషి వెంట నడిచింది.

వాల్మీకి సీతని ముని పత్నులకు అప్పగించి, "ఈమె మహారాజు భార్య అన్న సంగతి గుర్తు పెట్టుకుని శ్రద్ధగా చూడండి" అని తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.[486]

★ ★ ★

లక్ష్మణుడు తిరిగి వచ్చి సంగతంతా రాముడికి చెప్పి రాముణ్ణి వోదార్చాడు.

రాముడు – "ఈ నాలుగు రోజులూ ప్రజల కార్యాలు వదిలేశాను. అందుకు విచారంగా ఉంది. ప్రజా కార్యాలు చక్క బెట్టని రాజుకి ఎలాంటి గతి పట్టిందో చూడు" అని, నృగు మహారాజు కథ చెప్పాడు.

"పూర్వం నృగు మహారాజు కోటి మంది బ్రాహ్మణు లకు కోటి ఆవుల్ని దానం ఇచ్చాడు. అందులో ఒక ఆవు వెనక్కి వచ్చేసి ఆవుల శాలలో కలిసిపోయింది. ఆ సంగతి తెలీక, ఆ రాజు, ఆ ఆవునే ఇంకో బ్రాహ్మడికి దానం ఇచ్చాడు. ఆ ఆవు గురించి ఇద్దరు బ్రాహ్మలూ పోట్లాడుకుని రాజు దగ్గిరికి వచ్చారు. రాజు, వారికి దర్శనమే ఇవ్వలేదు. బ్రాహ్మ లకు కోపం వచ్చి రాజుని తొండ అయిపోవాలని శపించి ఆ ఆవుని ఇంకో బ్రాహ్మ డికి ఇచ్చేసి వెళ్ళిపోయారు. (ఎంత తెలివి తక్కువో! రాజుని తొండగా గాక, ఆవుగా చేసి, చెరో ఆవునీ

---

**485.** **ఉత్తర, సర్గ 58, శ్లోకం 23:** ".... పతివ్రతయైన సీత, నాథుని గానక, దుఖ్ఖమే ముఖ్యగతిగా గలదై, ఎక్కువ వగచే మోమున వెల వెలబాటుదోప, నెమళ్ళ కూతలకు మారుమ్రోగుచున్న యా వనంబున పెద్ద గొంతుపెట్టి ఏడ్చెను." ★

**486.** **ఉత్తర, సర్గ 59, శ్లోకాలు 21... 24:** వాల్మీకి, ముని పత్నుల దగ్గిరికి సీతని తీసుకువెళ్ళి ఇలా అంటున్నాడు. "ఈమె సీత. బుద్ధిమంతుడగు రాముని పత్ని. ఈమెను రాజపత్ని యను గౌరవంబున మిక్కిలి శ్రద్ధతో జూడవలయును." – "వాల్మీకి ముని సీతాదేవిని మాటిమాటికీ నోదార్చి మరలా దన యాశ్రమంబునకు వచ్చి చేరెను."

సీత, గర్భవతి కదా? రేపు ప్రసవించడం వుంటుంది కదా? – అందుచేత ముని పత్నుల ఆశ్రమంలో పెట్టాడు కవి. ఈ మునిపత్నులందరూ ఒక్క చోట ఎందుకు వున్నారో! ... శ్రీరాముడిలాగే మహా మునులు కూడా భార్యల్ని విడిచిపెట్టేశారు గావున్ను.

**సర్గలు 60, 61:** లక్ష్మణుడు గంగ దాటి వెళ్ళిపోయాడు కదా? వాల్మీకి వచ్చి సీతని తీసుకుపోవడం అంతా లక్ష్మణుడు అవతలి వొడ్డు నించి చూసి రథం ఎక్కాడు. లక్ష్మణుడు విచారిస్తూ వుంటే, రథం తోలే సుమంత్రుడు అతనికి కొన్ని సంగతులు చెప్పాడు. 'పూర్వం దేవతల వల్ల వోడిపోయిన అసురులు, భృగు పత్నిని ఆశ్రయించారు. ఆమె వారికి అభయం ఇచ్చిందని తెలిసి విష్ణువు ఆమె తల నరికేశాడు. అప్పుడు భృగు మహర్షి విష్ణువుని, 'నువ్వు మానవలోకంలో పుడతావు. నీకు భార్యా వియోగం కలుగుతుంది' అని శపించాడు. అందుచేత ఆ విష్ణువే రాముడిగా పుట్టాడు. శాపం వల్లనే భార్యా వియోగం కలిగింది.' ఈ సంగతంతా పూర్వం ఒకసారి దూర్వాస ముని దశరథుడికి చెప్పినప్పుడు నేను విన్నాను. ఈ రహస్యం ఇంత కాలానికి నీకు చెపుతున్నాను. బాధపడకు. జరగవలసిందే జరిగింది" అని చెప్పి సుమంత్రుడు లక్ష్మణుణ్ణి వోదార్చాడు.

పూర్వం కథల్లో, స్త్రీలు, పురుషుడు చేసినలాంటి పనులే చెయ్యడం కనపడుతుంది. అసురులు ఒక స్త్రీని ఆశ్రయించడం, ఆమె వారిని రక్షించే బాధ్యత తీసుకోవడం, ఒక పురుషుడు ఆమె మీద పగబట్టడం – ఇలాంటి సంఘటనల ద్వారా, ఒక నాటి కాలంలో, స్త్రీలూ, పురుషులూ ఒకే విధమైన సాంఘిక స్థితిలో వున్నట్టుగా గమనించాలి. ★

తీసుకోకూడదూ? ఏవిటో ఈ బ్రాహ్మలకేమీ తెలీదు, కోపాలూ శాపాలూ తప్ప!)

నృగుడు, బ్రాహ్మల శాపం సంగతి తెలిసి, తను తొండగా మారక తప్పదు కాబట్టి, తొండకి అన్ని కాలాల లోనూ సౌకర్యంగా ఉండేటట్టు చక్కగా గోతులు తయారు చేయించుకుని, వాటి చుట్టూ పళ్ళ చెట్లూ, పూల చెట్లూ వేయించుకుని, తొండలు తినడానికి ఏమేమి కావాలో అన్నీ పెట్టించుకుని, రాజ్యం కొడుక్కి అప్పజెప్పి, నీతులు కూడా చెప్పి, తొండ అయిపోయాడు. (బ్రాహ్మల శాపాలు ఇంత ఆలస్యంగా పని చేస్తాయా?) రాజు, బ్రాహ్మణుల సంగతి పట్టించుకోకపోతే, అలా జరుగుతుంది లక్ష్మణా!"

రాముడు, ఆ కథ చెప్పి – "ఇంకో కథ కూడా చెపు తాను విను" అని, నిమి కథ ప్రారంభించాడు. (భార్యని వొదిలేశాక ఎంత సుఖంగా వుందో ప్రాణం! కథలు చెప్పుకుంటూ గడుపుతున్నాడు!)

నిమి ఒక రాజు. ఒకసారి యజ్ఞం చెయ్యాలనుకుని వశిష్ఠుణ్ణి రుత్విక్కుగా ఉండమని అడిగాడు. వశిష్ఠుడు – "నన్ను ముందు ఇంద్రుడు పిలిచాడు. అక్కడికి వెళ్ళి ఆ యజ్ఞం చేయించి వస్తాను, ఆగు" అని చెప్పి వెళ్ళాడు.

నిమి ఆగలేదు. గౌతముడితో యజ్ఞం చేయిం చేశాడు. వశిష్ఠుడు తిరిగి వచ్చి, సంగతి తెలిసి, రాజు దర్శనం కోసం వచ్చాడు. అప్పుడు రాజు నిద్రపో తున్నాడు. వశిష్ఠుడికి కోపం వచ్చి (ఎవరూ నిద్రలు పోకూడదా?) రాజుని చైతన్యం లేకుండా అయిపోవాలని శాపం పెట్టాడు. రాజు లేచి, (లేచాడా? వశిష్టుడి శాపం పని చెయ్యలేదా?) సంగతి తెలిసి వశిష్ఠుడికి కూడా అలాగే శాపం పెట్టాడు. ఇద్దరూ శరీరాలు విడిచి, వాయు రూపంలోకి వెళ్ళిపోయారు. వశిష్ఠుడు బ్రహ్మ దగ్గిరికి వెళ్ళి శరీరం ఇమ్మని అడిగాడు. బ్రహ్మ ఒక మార్గం చెప్పాడు.

ఒకసారి ఊర్వశిని వరుణుడు కామించి పిలిచాడు. ఊర్వశి "నీ మీద నాకు ఇష్టమే కానీ, నీ కంటే ముందు సూర్యుడు పిలిచాడు నన్ను. వెళ్ళాలి. ఇప్పుడు నీ దగ్గిరికి రాలేను" అంది.

వరుణుడు కామంతో బాధపడుతూ తన వీర్యం ఒక కుండలో విడిచాడు. (అబ్బా, ఈ దేవతల పాడు రోత కథలు ఎన్నిసార్లు?)

ఊర్వశి, సూర్యుడి దగ్గిరికి వెళ్ళింది. సూర్యుడు కోపంగా, "ముందు నేను పిలిచాను. నువ్వు ఇంకొకణ్ణి మనసులో పెట్టుకున్నావు. మనిషివై పుట్టు" అని శపించి, తన వీర్యం కూడా తీసి వరుణుడు పెట్టిన కుండలోనే పెట్టాడు. (సూర్యుడూ! నువ్వు కూడా ఇంత దుష్టుడి వేనా? అయ్యో!) ఆ కుండలోంచి అగస్త్యుడూ, వశిష్ఠుడూ పుట్టారు. ఆ రకంగా, వశిష్ఠుడికి కొత్త శరీరం వచ్చింది. తర్వాత ఇక్ష్వాకు రాజు అతన్ని తన కుల పురోహితుడిగా చేసుకున్నాడు.

ఇక, నిమి శరీరం సంగతి: నిమి ప్రాణానికి మునులు వరం ఇచ్చారు. (ఆ వరం, నిమి శరీరానికి కాదు, ప్రాణానికే!) "నిమి ప్రాణమా! నువ్వు జీవుల కళ్ళల్లో ఉంటావు. నీ సాయంతోనే జీవులన్నీ కళ్ళు మూస్తూ తెరుస్తూ వుంటాయి" అని వరం ఇచ్చి, నిమి శరీరం మీద అరణి ఉంచారు. (అరణి అంటే నిప్పు. అంటే, ఆ శరీరాన్ని దహనం చేశారని అర్థం.)

నిమి శరీరంలోంచి 'మిథి' అనే పురుషుడు వచ్చాడు. అతడికి జనకుడనీ వైదేహుడనీ కూడా పేర్లు. (ఇతడు సీత తండ్రి)" – రాముడు ఇంత వరకూ చెప్పి, తర్వాత సహనం ఎంత గొప్పదో, అది ప్రజల్లో ఎంత అరుదుగా వుంటుందో చెపుతానని, యయాతి కథ కూడా మొదలెట్టాడు. (అవతల సీతని వదిలేసి, అన్న దమ్ము లిద్దరూ తీరిగ్గా కథలు చెప్పుకుంటూ కూర్చు న్నారు!)

యయాతి, ఒక రాజు. అతనికి ఇద్దరు భార్యలు. (అయ్యో, ఇద్దరేనా? అంత తక్కువా?) శర్మిష్ఠ, దేవ యానీ. శర్మిష్ఠ కొడుకు ఊరువు. దేవయాని కొడుకు యదువు. యయాతికి శర్మిష్ఠ అన్నా, ఆమె కొడుకు అన్నా, ఎక్కువ ఇష్టం. యదువు తన తల్లితో – "మనం అంటే రాజుకి ఇష్టం లేదు. చచ్చిపోదాం" అన్నాడు.

దేవయాని, సంగతంతా తన తండ్రి అయిన శుక్రుడికి చెప్పింది. శుక్రుడు అల్లుడి మీద కోపం వచ్చి, "నా కూతుర్ని కష్టపెడతావా? ముసలివాడివై పో" అని అల్లుణ్ణి శపించాడు. (అబ్బా! ఎంత మంచి తండ్రో! అల్లుణ్ణి కుక్క అయిపొమ్మని శపిస్తే ఇంకా బాగుండేదను కోండీ!)

మామగారి శాపం విన్నాడు యయాతి. తిరిగి శాపం పెట్టలేదు! ఓర్చుకున్నాడు. ముసలివాడై పోయాడు. యదువుని పిల్చి, "నా ముసలితనం నువ్వు పుచ్చుకో. నా కింకా కామవాంఛ తీరలేదు. కొంతకాలం అయిన తర్వాత నా ముసలితనం నేను తీసేసు కుంటాను" అన్నాడు.

యదువు కోపంగా, "నీ కిష్టమైన కొడుకు ఉన్నా డుగా? నువ్వు ఎప్పుడూ నన్ను దగ్గిరికి చేరనివ్వ లేదుగా? అతణ్ణే అడుగు" అన్నాడు.

యయాతి, ఊరువుని పిలిచి అడిగాడు.

ఊరువు సంతోషంగా అంగీకరించాడు.

తండ్రి యువకుడయ్యాడు. కొడుకు వృద్ధు

దయ్యాడు. యయాతి కొంతకాలం సుఖాలు అనుభవించి కొడుకు దగ్గిర్నుంచి తన ముసలితనం తను తీసేసుకున్నాడు. తన రాజ్యం అంతా ఊరువుకే ఇచ్చి, యదువుని, "నువ్వు దుర్మార్గుడివి. నీ కడుపున రాక్షసులే పుడతారు" అని శపించాడు.

చూశావా లక్ష్మణా! నిమి రాజు సహనం లేకుండా వశిష్టుణ్ణి తిరిగి శపించాడు కానీ, యయాతి శుక్రుణ్ణి తిరిగి శపించలేదు" అని రాముడు యయాతిని మెచ్చుకున్నాడు.

(మరి, యయాతి, యదువుని శపించాడేం? అతన్ని కూడా దయతో క్షమించ వొద్దా? అడగవేం లక్ష్మణా? నీ అన్న కథలు వినీ వినీ మూర్ఖుడివై పోయావు!)

ఆ రాత్రంతా కథలు చెప్పి, మర్నాటి నించీ రాముడు మళ్ళీ రాజ్య పరిపాలన ప్రారంభించాడు.

★ ★ ★

శ్రీరామ చంద్రుడు ధర్మబద్ధంగా రాజ్యపాలన చేస్తూ వున్నాడు – కుక్కకైనా లోపం జరక్కుండా!

ఒక నాడు రాముడు సభకు రాగానే – "లక్ష్మణా! నా కోసం కార్యార్థు లెవరైనా వచ్చి వున్నారేమో చూడు" అని ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు మందిరం బయటకు వెళ్ళి, "ఎవరైనా వచ్చారా?" అని కేక పెట్టాడు.

ఎవ్వరూ పలకలేదు.

లక్ష్మణుడు రాముడి దగ్గిరికి పోయి, "ఎవ్వరూ రాలేదు ప్రభూ! రామ రాజ్యంలో ప్రజలందరూ సుఖంగా, సంతోషంగా ఉన్నారు. శారీరక వ్యాధులు గానీ, మానసిక వ్యాధులు గానీ, లేవు. అకాల మరణాలు లేవు. రాజ్యమంతా పాడి పంటలతో తుల దూగుతూ వుంది. ఇక ప్రజలకేం కోరికలు ఉంటాయి?" అన్నాడు వినయంగా.

రామ రాజ్యం ఇచ్చే సుఖాలలో రాముడికే నమ్మకం ఉన్నట్టు లేదు. "మళ్ళీ చూసి రా! చేసిన తప్పులు బయట పడితే రాజు దండిస్తాడనే భయంవల్ల ప్రజలే ఒకర్ని ఒకరు రక్షించుకుంటారు. రాజభటులు కూడా ప్రజల్ని రక్షిస్తారు. అయినా మళ్ళీ చూసి రా" అన్నాడు.

మళ్ళీ బయటకి వెళ్ళాడు లక్ష్మణుడు.

ఈ సారి ఒక కుక్క కనపడింది.

"నీకేం కావాలి?" అని అడిగాడు లక్ష్మణుడు.

"రాముడి తోటే మొరపెట్టుకుంటాను నేను. లోపలికి రావొచ్చునో లేదో రాముణ్ణి అడుగు. రాజ భవనాల లోనూ, బ్రాహ్మల ఇళ్ళలోనూ, దేవత లుంటారు. రాముడిలోనే దేవతలందరూ ఉన్నారు. రాముడు సర్వ గుణ సంపన్నుడు. నాకు అనుజ్ఞ ఇస్తాడో లేదో అడుగు" అంది కుక్క.[487]

లక్ష్మణుడు రాముడు దగ్గిరికి వెళ్ళి అడిగాడు.

"కార్యార్థిగా వచ్చింది గనక తప్పు లేదు. తీసుకురా" అన్నాడు రాముడు.

కుక్క లోపలికి వొచ్చి రాముణ్ణి చూసి మొరిగింది.

"ఏమిటి నీ కార్యం? భయపడకుండా చెప్పు?" అన్నాడు రాముడు.

"రాజా! ప్రాణుల్ని రక్షించేవాడూ శిక్షించేవాడూ కూడా రాజే. రాజే ధర్మం పాటించాలి, నువ్వు ఉత్తముడివి. సువ్రతుడివి. పరంధాముడివి" అంటూ (సరేలే చెప్పు! కుక్క మాటలకేంలే.) కుక్క కొంతసేపు రాముడి గుణ గానం చేసి తర్వాత అసలు సంగతి చెప్పింది. "సర్వార్థ సిద్ధి అనే భిక్షకుడు నన్ను నిష్కారణంగా కొట్టాడు" అని అతన్ని కనుక్కోమన్నట్టు చూసింది.

వెంటనే రాజ భటులు పోయి సర్వార్థ సిద్ధిని పట్టుకొచ్చారు.

రాముడు సర్వార్థ సిద్ధితో కోపంగా, "ఈ కుక్కని కొట్టావట ఎందుకు? కోపం మానవుడికి పరమ శతృవు. మానవుడు ఇంద్రియాలను లొంగదీసుకోవాలి. మానవుడికి దుష్ట మనసు చేసే హాని కత్తి గానీ, పాము గానీ, అగ్ని గానీ, చెయ్యలేవు. చెప్పు, ఎందుకు కొట్టావు కుక్కని?" అని అడిగాడు.

సర్వార్థ సిద్ధి చాలా పేద బ్రాహ్మడు. ముష్టి ఎత్తుకుని జీవిస్తూ వుంటాడు. రాజు మాటలకు చాలా సిగ్గుపడ్డాడు. "నేను కుక్కని కొట్టిన మాట నిజమే మహారాజా! భిక్ష కోసం తిరుగుతున్నాను. ఎప్పటికీ నాకు భిక్ష దొరకలేదు. ఆకలితో నా ప్రాణాలు పోతున్నాయి. ఇంకా భిక్ష కోసం తిరుగుతూనే వున్నాను. ఒక చోట ఈ కుక్క మార్గంలో అడ్డంగా నిలబడింది. (నిజమే, కుక్కల బుద్ధి ఇదే. దారుల్లో నించుంటాయి.) అడ్డం లెమ్మని అదిలించాను. కొంత దూరం తప్పుకున్నది గానీ అక్కడ కూడా అడ్డంగానే నిలబడింది. నాకు కోపం వచ్చి కొట్టాను. తప్పే చేశాను మహారాజా! నాకు శిక్ష విధించు. రాజు చేతిలో శిక్షపడితే నరకంలో శిక్ష తప్పుతుంది" అన్నాడా భిక్షకుడు.[488]

---

**487.** కుక్క మాట్లాడడం అనే కల్పనని వాస్తవంలోకి మార్చుకుంటే, రాజు దగ్గిరికి ఒక మనిషి వచ్చి అలా మాట్లాడినట్టుగా అర్థం చేసుకోవాలి. ★

**488.** **ఉత్తర, సర్గ 71, శ్లోకాలు 27 ... 30:** సర్వార్థ సిద్ధి మాటలు: "భిక్షము కొరకు (భిక్షార్థం) తిరుగుచుండు వేళను, భిక్షకై తిరుగుచుండు నేను కోపముతో గూడిన వాడనై, దీని నొక దెబ్బ కొట్టితిని. ఈ కుక్క మార్గమున నుండగా పో ➔

రాముడు సభనంతటినీ చూశాడు. "ఇతడు నేరం అంగీకరించాడు. ఇతనికి ఏం శిక్ష వెయ్యాలో బాగా ఆలోచించి చెప్పండి" అన్నాడు.

భృగువూ, అంగీరసుడూ, వశిష్ఠుడూ, కాశ్యపుడూ మొదలైన మంత్రులూ, రాజ ధర్మంలో ఆరి తేరిన పండితులూ, అందరూ తీవ్రంగా ఆలోచించారు. "మహారాజా! నువ్వు ముల్లోక నాధుడివి. ధర్మాత్ముడివి, అందరినీ శాసించు వాడివి ...." అంటూ కీర్తన ప్రారంభించారు.

కుక్కకి సహనం పోయింది. "మహారాజా! ఈ నేరస్తుడికి ఏం శిక్ష వెయ్యాలో నేనే చెపుతాను. ఇతణ్ణి దేవాలయాల మీద అధికారిగా నియమించు" అంది.

రాముడు వెంటనే అంగీకరించి సర్వార్థ సిద్ధిని ఏనుగు మీద ఎక్కించి ఉద్యోగానికి పంపించేశాడు.

రాముడి మంత్రులు – "దేవాలయాధికారిగా నియమించడం బ్రాహ్మణుడికి వరం అవుతుంది గానీ, శిక్ష అవుతుందా?" అని అడిగారు.

అది శిక్ష ఎలా అవుతుందో రాముడికే తెలియక, కుక్కతో, "ఎందుకలా చెయ్యమన్నావో చెప్పు" అని అడిగాడు.

కుక్క – "నేను వెనకటి జన్మలో దేవాలయాధికారిగానే ఉన్నాను. ధర్మం తప్పకుండా నడిచాను. అయినా ఘోరమైన ఈ జన్మ వచ్చింది నాకు. (ధర్మం తప్పి నడిస్తే బాగుండేది కుక్కా!) ఇక కోపిష్టి అయిన ఈ బ్రాహ్మడి మాట చెప్పాలా? తన క్రూరత్వంతో, మూఢత్వంతో, ఏడేడు జన్మలకు తగినంత పాపం సంపాదిస్తాడు. ఎవరినైనా నరకంలోకి తొయ్యాలంటే దేవ ద్రవ్యంమీదో, బ్రాహ్మణ ద్రవ్యం మీదో అధి కారిగా ఉంచాలి. ఆ వ్యక్తి తప్పకుండా తప్పు చేస్తాడు. ఎంత చిన్న తప్పు చేసినా నరకంలో పడతాడు. నేను ఏ తప్పూ చెయ్యలేదు సుమా! అయినా ఈ జన్మ వచ్చింది నాకు" అంది కుక్క.

రాముడు, కుక్క మాటలు విని, "ఆహా! ఎంత జ్ఞానమో కదా ఈ కుక్కకి!" అని విస్మయం చెందాడు. (జ్ఞానాన్ని కుక్కల నించీ, నక్కల నించీ నేర్చుకునే దశకి చేరాడు రాముడు!)

తర్వాత కుక్క కాశీ వెళ్ళి ప్రాయోపవేశం చేసింది.[489]

---

➔పోయని యంటిని. అంత నది లేచి పోవుచు మార్గమున కొన నడ్డముగా నుండెను. నేను కోపము చేతను, ఆకలి చేతను బురికొల్పబడి, దీని నొక్క దెబ్బ కొట్టితిని రాజేంద్రా! దీనికై నన్ను దండింపుము."

ఆహా! పవిత్ర రామ రాజ్యంలో ఆకలితో అలమటించి పోయే భిక్షకుడు! ఇల్లిల్లూ తిరిగి ముష్టి ఎత్తుకుంటున్నాడు. భిక్షం దొరకడం లేదు. ఆకలి భరించలేక కోపం! రామ రాజ్యంలో బిచ్చగాళ్ళు వున్నారు. ఎంత అడుక్కున్నా బిచ్చం దొరకడం లేదంటే, బిచ్చాలు పెట్టే స్థితిలో ప్రజలు లేరన్నమాట!

రామ రాజ్యంలో బ్రాహ్మలందరూ సుఖంగా వున్నారనడానికి వీల్లేదు. సర్వార్థ సిద్ధి బ్రాహ్మడే. కానీ నిరుపేద బిచ్చగాడు. బిచ్చం దొరకక ఆకలితో అలమటిస్తున్నాడు. సర్వార్థ సిద్ధి, కుక్కని అన్యాయంగా కొట్టాడా? కుక్క దారికి అడ్డంగా ఎందుకు నించుంది? లెమ్మని చెప్పినప్పటికీ కొంత తప్పుకుని మళ్ళీ అడ్డంగా ఎందుకు నించుంది? మార్గంలో నడిచేటప్పుడు, రెండో ప్రాణికి ఇబ్బంది లేకుండా ప్రవర్తించవలసిన అవసరం లేదా, రామ రాజ్యం కుక్కకి?

తన తప్పేమీ లేదని సర్వార్థ సిద్ధికి తెలుసు. ఒక వేపు తనని సమర్థించుకునే వాదం చెపుతూనే వున్నాడు. అయినా తను తప్పే చేశానని వొప్పుకుని ఏదో ఒక శిక్ష ఇమ్మన్నాడు. ★

**489.** **ఉత్తర, సర్గ 71, శ్లోకాలు 39, 42:** " ... దేవాలయాదుల యందధికారము నొసంగుమని కుక్క రామునకు విన్నవించెను. ఇట్లు చెప్పిన మాట విని రాముడు అతనికి (సిద్ధికి) అధికారము నొసంగి ఏనుగు మీద నెక్కించి పంపెను. (అదేం శిక్షో తెలియకుండానే!) రాముని మంత్రులు చిరునగవు నగుచు – "ఇది యొక వరముగ నున్నది గానీ, శాపముగ దోచదు" అని యడుగగా, రాముడు మంత్రులతో నిట్లనియె. "మీరు శాస్త్ర రహస్యము నెరుగని వారు. ఈ శ్వానము దీనికి కారణము నెరుగునని చెప్పి, శ్వానమును జూచి ఏల ఇట్టి దండనము విధించితివని అడుగగా..." కుక్క ఏం చెప్పిందో తెలుసు కదా? రామ రాజ్యాన్ని నడపే మంత్రులు శాస్త్ర జ్ఞానం లేని వాళ్ళూనూ, కుక్క శాస్త్ర జ్ఞానం కలదీనూ! అలా అని రాముడే అంటాడు! ఎంత బాగుందో రామ రాజ్యం! ఇద్దరు వ్యక్తులు పోట్లాడుకుని న్యాయం కోసం వస్తే, ఆ న్యాయం ఏదో రాముడు చెప్పడన్న మాట! దోషికి ఏ శిక్ష వెయ్యాలో రెండో వ్యక్తి ఇష్ట ప్రకారం చేస్తాడు! అదీ రాముడి న్యాయం! రామ రాజ్య న్యాయం! ఇంతకీ పేద సర్వార్థ సిద్ధికి మాత్రం సుఖంగా బతికే పదవి దొరికింది. జీవించినన్నాళ్ళు హాయిగా సుఖపడతాడు.

"రామ రాజ్యంలో కుక్కకు కూడా న్యాయం జరిగింది" అని చెప్పాలని కవి తాపత్రయం. ఆకలితో అలమటించే బిచ్చగాళ్ళున్నారని చెప్పడం వల్ల రామ రాజ్యం పరువు పోతుందనే ఆలోచన లేదు కవికి! బిచ్చగాళ్ళు లేకపోవడం – అనే ఊహే కవికి రాదు. సమాజంలో బిచ్చగాళ్ళు వుండడం సహజమే కాబట్టి, బిచ్చగాళ్ళు వున్నా రామ రాజ్యం గొప్పదే – అని కవి అభిప్రాయం. ★

ఆ విధంగా, శ్రీరాముడి ధర్మ పరిపాలనకు ప్రజలందరూ అమితంగా ఆనందిస్తూ వున్నారు.

★ ★ ★

ఒక కీకారణ్యంలో ఒక చెట్టు మీద గుడ్లగూబ గూడు కట్టుకొంది. ఆ గూటిని బలవంతంగా ఒక గద్ద ఆక్రమించింది. గూబా, గద్దా పోట్లాడుకుని శ్రీరామచంద్రుడి దగ్గిరికి న్యాయం చెప్పమని వచ్చాయి. శ్రీరాముడు పుష్పకం తెప్పించుకుని అడవిలో ఆ గూటి దగ్గిరికి వెళ్ళాడు. (చేతిలో విమానం ఉంది! పిలవగానే వస్తుంది!)

"ఈ గూడు నువ్వెప్పుడు కట్టుకున్నావు?" అని అడిగాడు గద్దని.

"ఈ భూమి మీద మానవులు ఉన్నప్పటి నించీ ఈ గూడు నాది" అంది గద్ద.

"ఈ భూమి మీద చెట్లు ఉన్నప్పటినించీ ఈ గూడు నాది" అంది గుడ్లగూబ

రాముడు, మంత్రుల్ని, ఎవరిది న్యాయమో ఆలోచించమన్నాడు.

(రాముడు ఆలోచించడు. ఎందుకంటే, అతడు రాజే గానీ, మంత్రులు కాడు కదా?)

మంత్రులు రాముణ్ణే కీర్తించారు. రాముడు, "సరే! పురాణాలలో చెప్పిన విషయం చెపుతాను వినండి" అని మొదలుపెట్టాడు. (రాజ్యపాలన అంటే పురాణాల కథలు చెప్పడమేనా ఏమిటి?) "పూర్వం లోకాలన్నీ వొక్కటిగానే కలిసి ఉండేవి. అప్పుడు భూదేవి విష్ణుగర్భంలో ప్రవేశించింది. అప్పుడు విష్ణువు చాలాకాలం సముద్రంలో నిద్రపోయాడు. అప్పుడు విష్ణువు నాభి లోంచి బ్రహ్మ పుట్టాడు. అప్పుడు బ్రహ్మ భూమిని సృష్టించాడు. తర్వాత భూమి మీద చెట్లు సృష్టించాడు. చెట్లు ఉన్నప్పటి నించీ ఈ గూడు తనదని గుడ్లగూబ చెపుతోంది. అందుచేత ఇది గూబదే గానీ గద్దది కాదు. గద్దనే శిక్షించాలి" అని తేల్చాడు.

వెంటనే ఆకాశ వాణి రాముడితో, "ఈ గద్ద శాపవశాత్తూ ఈ జన్మ ఎత్తింది. అతని శాపం తీర్చు రామా!" అని చెప్పింది.

రాముడు, గద్దని ముట్టుకున్నాడు.

వెంటనే గద్ద, పూల దండలు వేసుకున్న దివ్య పురుషుడిగా మారి ఆ పురుషుడు ఆకాశానికి వెళ్ళిపోయాడు.[490] (రాముడికి నమస్కారాలు చెయ్యకుండానే!)

ఈ రకంగా శ్రీరాముడు, క్రిమి కీటకాలకు కూడా శాపాలు పోగొడుతూ కరుణాత్ముడై, ధర్మంతో, కుక్కల్నీ నక్కల్నీ, కాకుల్నీ గద్దల్నీ పరిపాలిస్తూ ఉండగా, ఒకనాడు ఒక పల్లెటూరి వృద్ధ బ్రాహ్మడు దుఃఖపడుతూ వచ్చాడు రాముడి దగ్గిరికి. "రాజా! నా బిడ్డ అకాల మరణం పాలయ్యాడు. నే నెన్నడూ అసత్యమాడలేదు. పాపం చెయ్యలేదు. నాకీ శిక్ష ఏమిటి? రామరాజ్యంలో ఈ ఘోరం ఏమిటి? రాజా! రాజ దోషం వల్లనే ప్రజలు అకాల మృత్యువాత బడతారు. నీ అలక్ష్యం వల్లనే నాకీ శోకం సంభ వించింది" అంటూ రాముణ్ణి నిందించాడు. (ఈయనెవరో గానీ మంచి ధైర్యస్తుడే! చాలా బాగున్నాడు!)

బ్రాహ్మణుడు చేసిన నిందకు రాముడు కలవర పడ్డాడు. "బ్రాహ్మణ బాలుడు మరణించాడా నా రాజ్యంలో? వశిష్ఠ మునీ! దీనికి కారణమేమో యోచించలేరా?" అంటూ బ్రాహ్మలందర్నీ ఆతృతగా చూశాడు.

వశిష్ఠుడూ, వాసుదేవుడూ, జాబాలీ, గౌతముడూ, నారదుడూ, ఇంకా సభలో బ్రాహ్మణులంతా నీతి చర్చలు జరిపారు. చివరికి నారద ముని చెప్పాడు, అసలైన ఆ గొప్ప కారణం ఏమిటో! "రాజా! పూర్వం బ్రాహ్మణులే తపస్సులు చేసేవారు. అప్పుడు ధర్మం నాలుగు పాదాలా నడిచేది. తర్వాత క్షత్రియులు కూడా తపస్సులు ప్రారంభించారు. అప్పుడు కొంత అధర్మం ప్రవేశించింది. ఇప్పుడు నీ రాజ్యంలో ఘోరమైన అధర్మ కార్యం ప్రవేశించింది. శంబుకుడు అనే ఒక శూద్రుడు తపస్సు చేస్తున్నాడు. దాని ఫలితమే నీ రాజ్యంలో ఈ అకాల మరణం!" అని తేటతెల్లం చేశాడు.

"ఏమిటీ? శూద్రుడు తపస్సు చేస్తున్నాడా రామ రాజ్యంలో?" అని ఉగ్రుడౌతూ లేచాడు రాముడు.

"మహారాజా! రాజదోషం వల్లనే ఇటువంటి ఘోరం సంభవించింది."[491]

---

**490.** రాముడి రాజ్యంలో కుక్కలూ, నక్కలూ, గద్దలూ, పిల్లులూ మాత్రమే వున్నట్టున్నాయి. మనుషులూ, మనుషుల సమస్యలూ తోచడం లేదు కవికి. ★

**491.** ఉత్తర, సర్గ 86, శ్లోకం 15; + సర్గ 87, శ్లోకం 4: వృద్ధ బ్రాహ్మణుడు – "రాజుల నేరముల వలననే ప్రజలు అన్యాయముచే బాధితులై యకాల మృత్యువు నొందినారు" అంటున్నాడు. ఈ అకాల మృత్యువు అందరికీనా, బ్రాహ్మలకేనా?

రాముడు న్యాయ చర్చలకు పిలిపించిన బ్రాహ్మణులలో నారదుడు కూడా వున్నాడు. నారదుడు బ్రాహ్మణుడు కాడనీ, దేవ ముని అనీ, శంబుకుడికి మరణ దండన వెయ్యాలని చెప్పిన వాడు నారదుడనీ, దానితో బ్రాహ్మణులకు సంబంధం లేదనీ – ఒక వాదం వుంది. కానీ, నారదుడు బ్రాహ్మణుడని కవి చాలా స్పష్టంగానే చెప్పాడు. బ్రాహ్మణ బాలుడు పోవడానికి కారణమేమిటో చెప్పమంటే, నీతి వేత్తలందరూ చర్చలు జరిపి 'ఒక శూద్రుడు తపస్సు చేస్తున్నాడ'ని చెప్పారు. ★

"సమస్త శాస్త్రాలూ చదివి, సమస్త నీతులూ నేర్చిన శ్రీరాముడు రాజ దోషం చేస్తాడా? .... అది రాజ దోషం కాదు. ఆ దుర్మార్గుడి ఆయుష్షు నిండక పోవడం వల్లనే ఇంకా బతికి ఉన్నాడు" అని రాముడు వెంటనే ప్రయాణమై దిక్కులన్నీ వెతుక్కుంటూ వెళ్ళాడు.

దక్షిణం దిక్కున ఒక పెద్ద కొండ మీద చక్కని సరస్సు వొడ్డున చిన్న ఆశ్రమం ముందు చెట్టు నీడన ధ్యానంలో కూర్చుని వున్నాడు శంబుక రుషి.

రుషులను చూడగానే భయభక్తులతో, ఆనంద పారవశ్యంతో మునిగే రాముడికి, దర్భాసనం మీద నిశ్చలంగా కూర్చుని ఉన్న ఆ శూద్ర రుషిని చూడగానే భరించలేని కోపం వొచ్చింది. "వృద్ధుడా! ధ్యానం విరమించు! కోసలాధిపతి శ్రీరామ చంద్రుడు నిన్ను ఆజ్ఞాపిస్తున్నాడు. ఎవరు నువ్వు? నీ వివరాలన్నీ విన్నవించు" అని గర్జించి అడిగాడు.

శంబుకుడు శాంతంగా కళ్ళు తెరిచి రాముణ్ణి చూసి చిక్కి శల్యమైన మొహంలో ఆనందం వెలిబుచ్చాడు. "స్వాగతం రాజా! .... నా ఆశ్రమానికి దయచేశావు. నాకు సంతోషం కలిగించావు .... ఈ ఆసనం మీద విశ్రమించు. నా ఆతిథ్యం స్వీకరించు" అని సాత్వికంగా రాజుని ఆహ్వానించాడు.

"వృద్ధుడా! వ్యర్థ ప్రసంగం చెయ్యకు. నా ఆతిధ్యమే నువ్వు స్వీకరించబోతున్నావు. నీ పేరేమిటి?"

"శంబుకుడు ప్రభూ!"

"ఏం కోరి తపస్సు చేస్తున్నావు? స్వర్గమా? మోక్షమా?"

"సనాతన రుషులే నా మార్గదర్శకులు. వారందరూ దేన్ని కోరి తపస్సులు చేశారో నేనూ దానికే ...."

"స్వర్గానికై కొందరు, మోక్షానికై కొందరు, సిరి సంపదలకై కొందరు ...."

"నే నీ లోకపు సిరులు కోరను. దేవత్వానికై తపస్సు చేస్తున్నాను."

"బ్రాహ్మణుడివా? క్షత్రియుడివా? ఏ కులం నీది? సత్యం చెప్పు!"

"నే నెన్నడూ అసత్య మెరుగను. శూద్రుణ్ణి రాజా!"

"శూద్రుడికి తపస్సా? నీచుడా! బ్రాహ్మణ క్షత్రియులతో సమానత్వం కోరుతున్నావా?"

"దైవారాధనలో మనుషులందరూ సమానులేనని నమ్ముతున్నాను."

"అంత స్వతంత్రుడివా? దైవం ఎదుట మానవులు సమానులా? – ఎన్నడూ కారు. మానవులలో శూద్రులు అధములు. వారు, పై జాతులకు సేవలు చేసి బ్రతకవలసిన అల్పులు. ఆ సనాతన ధర్మం ధిక్కరించి శూద్రులందరూ నీ విధంగా తపో జీవనం ఆశిస్తే, అధిక వర్ణాలకు సేవలు చేసే వారెవరు?"

"శూద్రులందరూ ఈ అలౌకిక జ్ఞానమే సాధిస్తే, లౌకిక విధులతో వారి కేమి పని? బ్రాహ్మలెవరు, శూద్రులెవరు?"

"మూర్ఖుడా! నీ ప్రయత్నమంతా వ్యర్థమే. పరలోకాలలో శూద్రుడికి స్థానమే లేదని సమస్త శాస్త్రాలూ ఘోషిస్తున్నాయి, తెలియదా?"

"శూద్రుడు చేసిన పాపమేమిటి ప్రభూ?"

"శూద్రుడై పుట్టడమే."

"నే నంగీకరించలేను."

"ఏమీ? శాస్త్రధర్మాలు అంగీకరించక, వాటిని నిశ్శంకగా స్వీకరించక, తర్కించే, ప్రశ్నించే సాహసమా నీకు?"

"శూద్రుణ్ణి హీనపరిచి, అవమానపరిచి, శూద్రుడికే హాని కలిగించే శాస్త్రాలను, శూద్రుడే నిశ్శంకగా స్వీకరించగలడా రాజా?"

"తర్కం విడిచిపెట్టు మూర్ఖుడా! శూద్రుడికి తపస్సు చేసే అర్హత లేదని ఎరగవా? నీ దుష్కృత్యాల వల్ల లోకాలకు కీడు గాదా?"

"రాజా! ఈ కారడవిలో, మారుమూల ఇంత ఒంటరిగా దైవ ధ్యానంతో జీవించే నా వల్ల లోకాలకు కీడు కలుగుతుందా?" శంబుకుడు మందహాసం చేశాడు.

శ్రీరాముడు ఉగ్రుడౌతూ, "నీ పాప ఫలితానికే బ్రాహ్మణ బాలుడు మరణించాడు. ఈ దుష్ట కార్యమే కొనసాగితే రామ రాజ్యంలో ఇక వర్ణ రక్షణ ఎక్కడ? ఈనాడు నువ్వు ఒంటరివే. రేపు నువ్వే శూద్రులందరికీ మార్గదర్శకుడివి కావా? నిన్ను నమ్మిన శిష్యులు నీ విశ్వాసాలను ప్రచారం చెయ్యరా? రామ రాజ్యంలో ఇంత అనర్థం జరగవలసిందేనా? శ్రీరాముడు తన సర్వ శక్తులూ ధారపోసి వర్ణవ్యవస్థను రక్షిస్తాడని ఎరగవా?

శూద్రుడా! దైవ ధిక్కారం .... రాజ ధిక్కారం .... శాస్త్ర ధిక్కారం .... చివరికి నీ ప్రాణ ధిక్కారం కూడా చేసే నీ సాహసం క్షమించరానిది. నీ నేరానికి శిక్ష అనుభవించు!" అంటూ ధర్మ సంస్థాపనకై అవతరించిన శ్రీరామచంద్రుడు, ఉగ్రత్వంతో ఒర నించి సర్రున కత్తి లాగి వొక్క వేటుతో శంబుకుడి తల నరికేశాడు.

ఆ వృద్ధ మొండెం నేలకొరిగి, శూద్ర రక్తంతో భూమి నిండింది. రామ రాజ్యం పునీతమైంది!

బ్రాహ్మణులు ధన్యత చెందారు.[492]

---

**492.** ఉత్తర, సర్గ 88, శ్లోకాలు 16 ... 19; + సర్గ 89, శ్లోకాలు 1 ... 6: రాముడు శంబుకుణ్ణి అడుగుతున్నాడు – "ఓ తపోవృద్ధుడా! నీవే యోని యందు బుట్టినవాడవు? ... నేను రాముడను. దశరథ పుత్రుడను ... నీవేమి కోరుచున్నావు? ➔

శ్రీరాముడా ధర్మకార్యం ముగించి సమీపంలోనే ఉన్న అగస్త్యముని ఆశ్రమానికి వెళ్ళాడు.

అగస్త్యుడు అమితమైన సంతోషంతో రాముణ్ణి కీర్తించాడు. "రామా! నువ్వు శూద్ర మునిని చంపి ధర్మం కాపాడావని ఇంతకు ముందే నా శిష్యుల వల్ల విన్నాను. ఎంతో సంతోషిస్తున్నాను. ఇంతలో నువ్వు రానే వచ్చావు. ఆ శూద్రుడి సాహసం మితిమీరి పోయింది. మూర్ఖుడు. ప్రాణానికే కీడు తెచ్చుకున్నాడు. వర్ణధర్మాలు పాటించ నవసరం లేదట! ఆ శూద్ర శిష్యుల ప్రేలాపనలన్నీ నా శిష్యులు మోసుకొచ్చే వారు. వినలేక చెవులు మూసుకునే వాడిని. రామ రాజ్యంలో ఈ ఘోరమేమిటని కలవర పడ్డాను ఇంతకాలం. ఇప్పటికి నువ్వు కళ్ళు తెరిచి, ధర్మ కార్యం చేసి నా ఆశ్రమాని కొచ్చావు. నీ రాకతో నా ఆశ్రమం పావనమైంది. రామా! నీ వంటి రాజే లోక రక్షకుడు. రాజే ధర్మ పరిపాలకుడు. రాజు దైవాంశతో పుడతాడు. రామా! నిన్ను ఒక్క క్షణం చూసినా సర్వ పాపాలూ పోతాయి. పుణ్యలోకాలు సిద్ధిస్తాయి. నీ నామ స్మరణ చేస్తే చాలు, ముక్తి దొరుకుతుంది. లోకాలన్నిటికీ నువ్వే గతి!" అంటూ రాముణ్ణి వెయ్యి నోళ్ళతో కీర్తించి, ఆతిథ్యం ఇచ్చాడు.

తను చేసిన కార్యం ఎంత ధర్మమో రుషుల కీర్తనల్లో విని విని మరింత సంతోషించాడు రాముడు.

మర్నాడు రాముడు బయల్దేరుతోండగా అగస్త్యుడు, "భయం లేదు ఈ ప్రాంతంలో. జాగ్రత్తగా వెళ్ళు. నిర్భ యంగా వెళ్ళు!" అని లోకపాలకుడికి ధైర్యం చెప్పి సాగ నంపాడు.[493]

★ ★ ★

---

➔ స్వర్గమా? మరి యెద్దియైననా? ... నీవు బ్రాహ్మణుడవగుచో నీకు మేలగును. క్షత్రియుడవా? వైశ్యుడవా? శూద్రుడవా? సత్యము పల్కుము."

శంబుకుడి జవాబు – "శ్రీరామా! నేను శూద్ర యోని యందు బుట్టినవాడను. బొందితో స్వర్గమును గోరుచున్నాను. నేను కల్లలాడను. శూద్రుడనని తెలియుము."

"ఆ శూద్రుడట్లు పలుకుచుండ రాఘవుడు తళ తళ మెరయుచుండు పదునైన కత్తి నొర నుండి తీసి, యా శూద్రుని శిరమును ఖండించెను."

అప్పుడు దేవతలందరూ కీర్తించారు. దుందుభులు మోగాయి. పూల వాన కురిసింది.

వాల్మీకి 'మూలం'లో, రాముడు శంబుకుడితో ఏమీ తర్కించలేదు. 'తపస్సు ఎందుకు చేస్తున్నావు?' అని మాత్రమే అడిగి, 'శూద్రుడు' అని వినీ వినగానే అతని తల నరికేసి ధర్మం కాపాడాడు!

శంబుకుడు శూద్రుడై వుండి కూడా, రామరాజ్యంలో వర్ణ ధర్మాలు మీరకూడదని తెలిసి కూడా, బ్రాహ్మణ క్షత్రియులకు మాత్రమే అర్హతగల కార్యానికి దిగాడంటే, వర్ణ ధర్మాల్ని ధిక్కరించాలనే అభిప్రాయంతోనే దానికి పూనుకున్నాడన్నమాట. రాజ దండనకు కూడా భయపడకుండా తన వర్ణానికి లేని హక్కు కోరుతున్నాడు శంబుకుడు.

రాముడు శంబుకుణ్ణి నరికెయ్యగానే దేవతలు రాముణ్ణి కీర్తించి (సర్గ 89, శ్లోకం 8:) "రఘునందనా! నీ కారణముగా ఈ శూద్రుడు స్వర్గమును పొందువాడు కాడు కదా?" అన్నారు – (అంటే, 'ఈ శూద్రుడు తపస్సు చేసి స్వర్గానికి వచ్చే ప్రయత్నంలో వున్నాడు. నీ మూలాన్న ఇక వీడు స్వర్గానికి వచ్చే ప్రమాదం తప్పిపోయింది' అని అర్థం. రాముడి చేతిలో చచ్చిపోయే వారు స్వర్గానికి వెళ్తారనే విషయం శుద్ధ అబద్ధం అని కవే తేల్చేశాడు!) దేవతలు రాముణ్ణి మెచ్చుకుని – "నీకేం వరం కావాలో తీసుకో" అన్నారు. (శూద్రుణ్ణి చంపినందుకు వరం!)

"బ్రాహ్మణ బాలుణ్ణి బతికించండి! బతికిస్తానని వారికి నేను మాట ఇచ్చాను" అన్నాడు రాముడు.

శంబుకుడి తల ఇలా తెగిందో లేదో, ఆ బాలుడు అలా లేచాడు. సుఖంగా వున్నాడు. తర్వాత దేవతలు, "అగస్త్యముని పన్నెండేళ్ళు జలశయ్యలో వుండి లేచాడు. చూద్దాం రా" అని ఒకరికొకరు చెప్పుకుంటూ వెళ్ళిపోయారు. (అగస్త్యుడు పన్నెండేళ్ళు నీళ్ళలో పడుకుని లేచాడట! అవును, అలాంటి వాణ్ణి చూడాల్సిందే, ఎంత పాచిపోయి, ఎంత నాచు పట్టి, ఎంత గజ్జి పట్టి వున్నాడో!) ★

**493.** **ఉత్తర, సర్గలు 89 నించి 94 వరకూ 6 సర్గలు:** రాముడు వెళ్ళేటప్పటికి అగస్త్యుడు పన్నెండేళ్ళు నీటి మీద పడుకుని తపస్సు చేసి లేచాడట! అగస్త్యుడు రాముడికి ఒక ఆభరణం ఇవ్వబోయాడు. రాముడు – "రాజు ఇవ్వాలే గానీ, తీసుకోకూడదు" అన్నాడు. అగస్త్యుడు – "పూర్వం కృతయుగంలో ప్రజలకు రాజు లేడు. (మానవ సమాజంలో అధికారి వంటి ఏ పరిపాలకుడూ లేని కాలానికి ఇది సంబంధిస్తుంది.) ప్రజలు, రాజు కావాలని బ్రహ్మని అడిగారు. బ్రహ్మ దేవతలందరి నించీ కొంత కొంత అంశ అడిగి రాజుని చేశాడు. రాజు దైవాంశతో పుట్టాడు కాబట్టి నువ్వు ఈ ఆభరణం తీసుకోవచ్చు" అన్నాడు. "ఇది నీ కెలా వచ్చింది?" అని అడిగాడు రాముడు. (ఎవళ్ళనో చంపి సంపాదించి వుంటాడు. లేకపోతే ఆభరణాలు ఎలా దొరుకుతాయి?) ➔

ఒకసారి కొందరు మునులు రాముడి దగ్గిరికి వచ్చారు. "రామా! నువ్వు రావణాసురుణ్ణి చంపావని విని చాలా ఆనందించాం. ఇప్పుడు మాకు లవణాసురుడి వల్ల బాధ వచ్చి పడింది. వాడు కుంభీనసికీ మధువుకీ పుట్టినవాడు. పరమ క్రూరుడు. వాడి బారి నుంచి కూడా మమ్మల్ని నువ్వే రక్షించాలి" అని కోరారు.

రాముడు తమ్ముళ్ళని చూసి, "లవణాసురుణ్ణి మీలో ఎవరు చంపుతారు?" అని అడిగాడు.

శతృఘ్నుడు వెళ్తానన్నాడు. (ఇప్పుడు శతృఘ్నుడు కావలసి వచ్చాడు!)

రాముడు సంతోషించి వెంటనే లవణాసురుడి రాజ్యం శతృఘ్నుడికే చెందేటట్టుగా శతృఘ్నుడికి పట్టాభిషేకం చేయించాడు. శతృఘ్నుడు పెద్ద సైన్యంతో యుద్ధానికి బయలుదేరాడు.

దారిలో వాల్మీకి ఆశ్రమంలో ఆగాడు.

ఆ రాత్రే సీతకు కవల పిల్లలు పుట్టారు. ఇద్దరూ మొగ పిల్లలే. వారికి గాలీ ధూళీ తగలకుండా వాల్మీకి రక్షలు కట్టి, 'కుశ లవుల'ని పేర్లు పెట్టాడు. ఆ తతంగమంతా రాముడి గోత్ర నామాలతోనే చేశాడు.

శతృఘ్నుడు అంతా విన్నాడు. వదినగార్ని పలకరించి క్షేమం అడిగాడు.

సీత కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ "మీ అన్నగారు క్షేమంగా ఉన్నారా నాయనా?" అని అడిగింది. శతృఘ్నుడు అంతా చెప్పాడు. మర్నాడు బయల్దేరి యుద్ధానికి వెళ్ళిపోయాడు.[494]

మధుపురం చేరి, లవణాసురుణ్ణి చంపి, ఆ రాజ్యం

---

➔ అగస్త్యుడు, శ్వేతుడి కథ చెప్పాడు. శ్వేతుడు ఒక రాజు. తపస్సు చేసి బ్రహ్మలోకం వెళ్ళాడు. అక్కడ కూడా అతనికి ఆకలి వేసింది. "బ్రహ్మలోకంలో ఆకలి వెయ్యదు కదా? నాకు ఇక్కడ ఆకలి వేస్తోందేం?" అని బ్రహ్మని అడిగాడు. (అది బ్రహ్మలోకం కాదన్న మాట శ్వేతుడూ! అది చక్కగా ఆకలి వేసే లోకం అన్నమాట! ఇక్కడ ఒక విషయం గమనించారా? ఆకలి తీరేలాగ ఎప్పటికప్పుడు ఆహారం దొరకకపోవడం ఒక సమస్య. అందుకే మనుషులు 'ఆకలి లేని లోకం' కోసం కలలు కంటున్నారు.)

బ్రహ్మ – "నువ్వు తపస్సు చేసినంత కాలమూ ఏమీ కష్టపడకుండా, అడవిలో ఒక్క విత్తనమైనా పాతకుండా, యాచకుడికి పిడికెడు బిచ్చమైనా పెట్టకుండా, నీ శరీరం చక్కగా కాపాడుకుంటూ తపస్సు చేశావు. అందుకే నీకీ బాధ. నీ శవాన్నే నువ్వు తింటూ బతుకు. కొంతకాలానికి అగస్త్యముని నిన్ను ఉద్ధరిస్తాడు" అన్నాడు. అప్పటి నించీ శ్వేతుడు రోజూ ఆకాశం నించి విమానంలో వచ్చి సరస్సులో పడివున్న తన శవాన్ని పూర్తిగా తినేసి వెళ్ళిపోతాడు. మర్నాటికి మళ్ళీ ఆ శవం సిద్ధంగా వుంటుంది. ఇలా కొంతకాలం జరిగింతర్వాత అగస్త్యుడు ఆ అడవికి వచ్చాడు. శ్వేతుడు అగస్త్యుణ్ణి తన బాధ పోగొట్టమని అడిగాడు. ఒక ఆభరణం ఇచ్చాడు అగస్త్యుడు. అది తీసుకోగానే శ్వేతుడి ఆకలి పోయింది. అదే ఈ ఆభరణం" అని చెప్పాడు అగస్త్యుడు. తర్వాత ఇంకో కథ చెప్పాడు. "దండుడు ఒక రాజు. అతని పురోహితుడు శుక్రాచార్యుడు. ఒక సారి దండుడు శుక్రుడి పెద్ద కూతురైన అరజను చూసి కామించి అడిగాడు. అరజ తన తండ్రిని అడగమంది. దండుడు వినకుండా ఆమెని బలాత్కారం చేశాడు. శుక్రుడు ఈ సంగతి విని – "దుమ్మూ వానా కలిసి దండుడి రాజ్యం నాశనమై పోవాలి" అని శపించాడు. ప్రజలందరూ దండుడి రాజ్యం వొదిలి వెళ్ళిపోయారు. శుక్రుడు కూతుర్ని కూడా తిట్టి, ఆమెని ఆశ్రమంలోనే విడిచి వెళ్ళిపోయాడు. తర్వాత దుమ్ము వాన కురిసి దండుడి రాజ్యం దండకారణ్యం అయిపోయింది" అని చెప్పాడు అగస్త్యుడు.

రాముడు ఈ కథలు విని అయోధ్యకు వెళ్ళిపోయాడు. ★

**494.** **ఉత్తర, సర్గలు 78, 79:** వాల్మీకి మూలంలో శంబుకుడి ఘట్టం కన్నా లవణాసురుడికి సంబంధించిన ఘట్టమే ముందు జరిగింది. నేను రాముడి పరిపాలన గురించిన సంఘటనలు ఒక చోట చెప్పాలనే అభిప్రాయంతో శంబుకుడి ఘట్టమే మొదట తీసుకున్నాను.

శతృఘ్నుడు యుద్ధానికి వెళ్ళేటప్పుడు వాల్మీకి ఆశ్రమంలో వున్న రాత్రి వాల్మీకిని, "అదుగో! అక్కడ యజ్ఞం చేసిన గుర్తులు కనపడుతున్నాయే. అక్కడ ఎవరి ఆశ్రమం వుండేది?" అని అడిగాడు.

వాల్మీకి ఒక కథ చెప్పాడు. (అబ్బా, ఇక్కడ మళ్ళీ ఏదో తుక్కు కథా?)

మిత్రసహుడనే రాజు, వశిష్ఠుణ్ణి రుత్విక్కుగా పెట్టుకుని అశ్వమేధ యాగం ప్రారంభించాడు. ఆ రాజు పూర్వజన్మలో ఒక రాక్షసుణ్ణి చంపడం చేత, ఆ రాక్షసుడి స్నేహితుడు ఈ రాజుమీద కోపం పెట్టుకుని, ఈ యజ్ఞం పూర్తయిన రోజున, వశిష్ఠుడి వేషంతో వచ్చి – "రాజా! నాకు మాంసంతో భోజనం పెట్టు" అని అడిగాడు. రాజు అలాగేనని మాంసం వండమని వంటవాణ్ణి ఆజ్ఞాపించాడు. ఆ రాక్షసుడే వంట ఇంట్లో దూరి నరమాంసం కూర సిద్ధంచేసి వుంచాడు. (వంటవాణ్ణి చంపాడు గావున్ను.)

నిజం వశిష్ఠుడు భోజనానికి వచ్చాడు. ఆ రాక్షసుడే వంటవాడి రూపంలో భోజనం వడ్డించాడు. నిజం వశిష్ఠుడు రాజు మీద కోపంతో మండిపడి – "నాకు నరమాంసం పెడతావా? నీకు నరమాంసమే ఆహారం అవుతుంది" అని రాజుని ➔

తను ఆక్రమించి అక్కడ పన్నెండు సంవత్సరాలు ఉండి, ఒకసారి అన్నగారి దగ్గిరికి అయోధ్యకి బయల్దేరాడు. దారిలో మళ్ళీ వాల్మీకి ఆశ్రమంలో ఆగాడు. ఆ రాత్రి ఆశ్రమంలో ఎవరో ఇద్దరు చిన్న పిల్లలు రామ కథ పాడుతూ ఉండడం విన్నాడు.[495]

తర్వాత అయోధ్యకు వెళ్ళి అక్కడ కొన్నాళ్ళు ఉండి, మళ్ళీ తన రాజ్యానికి వెళ్ళిపోయాడు.

★ ★ ★

రాముడు అశ్వమేధ యాగానికి ఏర్పాట్లు ప్రారంభించాడు.

లక్ష్మణుడు, రాముడికి, అశ్వమేధయాగం ఎంత మంచిదో చెప్తూ, ఇంద్రుడి కథ చెప్పాడు.

"ఇంద్రుడు ఒకసారి వృత్రాసురుడనే రాక్షసుణ్ణి చంపాడు. కానీ, ఆ రాక్షసుడు మంచివాడవడం వల్ల ఇంద్రుడికి పాపం చుట్టుకుంది. ఇంద్రుడు స్పృహ తప్పి పడిపోయాడు. అప్పుడు బ్రహ్మ ఇంద్రుడి క్షేమం కోసం అశ్వమేధ యాగం చేశాడు. ఇంద్రుడు బాగయ్యాడు. ఆ యాగానికి అంత ఫలం ఉంది కాబట్టి ఆ యాగం చెయ్యి" అన్నాడు లక్ష్మణుడు రాముడితో.

ఈ సారి రాముడు లక్ష్మణుడికి ఆ యాగం ఎంత గొప్పదో చెప్తూ ఇళుడి కథ చెప్పాడు. "ఇళుడు ఒక రాజు. ఒకసారి వేటకు వెళ్ళి ఒకచోట స్త్రీగా, ఇళగా, మారి పోయాడు. ఆ ప్రాంతంలోనే శివుడు పార్వతితో కలిసి ఆడవేషంతో విహరిస్తున్నాడు. ఇళ పార్వతిని ప్రార్థించింది, తనని మళ్ళీ పురుషుణ్ణి చెయ్యమని.

"ఒక నెల స్త్రీగా, ఒక నెల పురుషుడిగా ఉండు" అంది పార్వతి.

ఇళ వొక సరస్సు దగ్గిర చేరింది. అక్కడ బుధుడనే ముని ఇళని చూసి కామించి, ఆ నెల అంతా ఆమెతో ఉన్నాడు. తర్వాత నెలలో ఇళ ఇళుడిగా మారింది. ఈ రకంగా తొమ్మిది నెలలలో ఇళ పురూరవుడనే బిడ్డని కన్నది. మునులందరూ కలిసి ఇళుడు శాశ్వితంగా పురుషుడిగానే ఉండడం కోసం అశ్వమేధ యాగం చేశారు. దానివల్ల, ఇళుడు ఎప్పుడూ పురుషుడిగానే వున్నాడు. అంత మహిమ గల ఆ యాగం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు రాముడు.

గోమతీ నది వొడ్డున నైమిశారణ్యంలో యజ్ఞశాలలు నిర్మించారు.

బొమ్మ సీతని చేయించారు, బంగారంతో.[496]

రాముడు దేశ దేశాల రుషుల్నీ, సామంతుల్నీ, బంధు మిత్రుల్నీ, అందర్నీ ఆహ్వానించాడు.

విభీషణుడూ, సుగ్రీవుడూ కూడా వచ్చారు – మంత్రులతో. రాగానే రాముడు సీతని విడిచి పెట్టేశాడనే సంగతి విన్నారు.

సుగ్రీవుడు రాముడి మీద కోపం వొచ్చి విభీషణుడితో, "ధర్మాలన్నీ తెలుసంటాడు. మళ్ళీ అను మానపడి భార్యని వొదిలేశాడంట, విన్నావా?" అన్నాడు.

"ప్రజా వాక్యం ...."

"చాల్లెద్దూ ప్రజా వాక్యం, వల్లకాడూనూ. అవన్నీ పైకి చెప్పే మాటలే గానీ, రాజన్న వాడు ప్రజా వాక్యం పాటిస్తాడా? నువ్వు పాటిస్తున్నావా, నేను పాటిస్తున్నానా?

---

➔ శపించాడు. రాజుకి కూడా కోపం వచ్చి వశిష్ఠుణ్ణి శపించాలని నీళ్ళు చేతిలోకి తీసుకున్నాడు. రాజు భార్య, భర్తని వారించింది. రాజు చేతిలో నీళ్ళు అతని పాదాలమీదే పడ్డాయి. పాదాలు నల్లగా అయిపోయి కల్మష పాదుడై, కొంతకాలం శాపం అనుభవించాడు. అతడు యజ్ఞం చేసిన గుర్తులే అవి" అని చెప్పాడు వాల్మీకి.

ఆ రాత్రే సీత కవల పిల్లల్ని కన్నది, ఆ సంగతి శతృఘ్నుడికి తెలుసు. సీతతో మాట్లాడాడు కూడా. ★

**495.** **ఉత్తర, సర్గ 84, శ్లోకాలు 21, 22, 23:** కుశ లవులు రామ కథ పాడడం శతృఘ్నుడు విన్నాడు – "ఎంత బాగా పాడుతున్నారో! ఈ పిల్లలు ఎవరో?" అనుకున్నాడు. కానీ ఈ పిల్లలు ఎవరని వాల్మీకిని అడగలేదు. "మునుల ఆశ్రమాల్లో ఎన్నో అద్భుతాలు జరుగుతాయి. అడక్కూడదు" అనుకున్నాడు. "రామ కథ ఎవరు పాడుతున్నారు?" అని అడగడం తప్పట. అడక్కుండానే వెళ్ళిపోయాడు. కథ ఇలా నడవడం ఎందుకంటే, కుశ లవుల సంగతి శతృఘ్నుడికి తెలిస్తే, రాముడికి తెలుస్తుంది. రాముడికి అప్పుడే తెలిసేటట్టు కథ నడవకూడదు. ఎందుకంటే, తర్వాత రాముడు చేసే అశ్వమేధ యాగంలో కుశ లవులు పాటలు పాడేటప్పుడు, ఆ పిల్లలెవరో తెలీకుండా రాముడు వారితో పాటలు పాడించుకోవాలి. కథ అలా జరగాలి కాబట్టి, శతృఘ్నుడికి కుశ లవుల గురించి తెలీకూడదని కవి అభిప్రాయం. అలాంటప్పుడు అసలు కుశలవులు పుట్టడం కూడా శతృఘ్నుడికి తెలియనట్టుగా కథ నడవాలి కదా? వదిన గారికి కవల పిల్లలు పుట్టారని తెలిసినా, శతృఘ్నుడు, ఆ పిల్లల గురించి మళ్ళీ ఆలోచించడు. ★

**496.** **ఉత్తర, సర్గ 91, శ్లోకం 25:** రాముడు, లక్ష్మణుడితో యాగం కోసం ఏర్పాట్లు చెయ్యమని చెప్తూ "నా భార్య బంగారు విగ్రహాన్ని తీసుకు రా" అంటాడు. (కాంచన మమ పత్నీమ్.) రాముడికి సీతగాక వేరే భార్యలు వుంటే, యాగంలో రాముడి పక్కన ఇంకో భార్య కూర్చునేదే కదా? సీత విగ్రహాన్ని పెట్టుకోడం ఎందుకు? దీని వల్ల కూడా వేరే భార్యలు లేరని తెలుతుంది. ★

కదిల్తే ఉరి శిక్షా, మెదిల్తే ఉరిశిక్షా వేయించేస్తాం కదా, ఈ ప్రజా వాక్యం భాగోతం ఎవడికి తెలియదంటావు? అసలు ఆయనకే పుట్టెడు అనుమానం అనుకో. పోనీ నీ పెళ్ళానికి నిజా నిజాలన్నీ తెలుసుగా? ఆవిడితో కాస్త రాముడికి చెప్పించరాదూ?"

"ఎంత నిజం తెలిసినా, పౌరుషం గల కుటుంబంలో పుట్టిన పురుషుడు పర పురుషుడి దగ్గిర ఉన్న భార్యని సంతోషంగా ఏలుకోగలడా? మీ లాంటి వాళ్ళ సంగతి చెప్పలేం గానీ ...."

సుగ్రీవుడికి వొళ్ళు మండిపోయింది. "అంత పౌరుష వంతుడైతే అప్పుడే వొదిలెయ్యక పోయాడా? ఇంటికి తెచ్చుకుని పిల్లల్నెందుకు కన్నాడూ? మమ్మల్ని ఈసడిస్తున్నావు గానీ మీ పౌరుషాలు ఎవడికి తెలియవంటలే" అని సుగ్రీవుడు చేతులు ఝాడిస్తూ మొహం తిప్పేశాడు.

అంతలో హనుమంతుడు కంగారుగా వొచ్చి సుగ్రీవుడితో, "చూశావా ఎంత పని జరిగిందో?" అని సంగతంతా చెప్పి వాపోయాడు – "ఈ మాత్రానికి నేను సీతమ్మ కోసం కాళ్ళరిగేలాగ ఊళ్ళన్నీ వెతకడం ఎందుకూ అప్పుడు?"

"అంతేనా? ప్రాణానికి తెగించి మనం యుద్ధం చెయ్యడం ఎందుకూ? పిచ్చి గానీ యుద్ధం మాత్రం సీత కోసం చేశాడంటలే" అన్నాడు సుగ్రీవుడు.

"మహారాజా! నువ్వు రామయ్యకు చెప్పరాదూ, సీతమ్మని తెచ్చుకోమని?"

"నువ్వే చెప్పు, తిడితే రెండు నిన్నే తిడతాడు. నన్ను తిడితే ఏం బాగుంటుందీ? రాజుని కదా?"

రాముడు ఒంటరిగా ఉన్న సమయం చూసి హనుమంతుడు దగ్గిర చేరి మాటా మంతీ ప్రారంభించాడు.

"ప్రభూ! సీతమ్మ తల్లిని ...."

"ఇంకే సంగతులైనా మాట్లాడవోయీ! నీ భార్యలందరూ క్షేమమేనా? భరతుడు ఇచ్చిన పదహారు మందేనా? మళ్ళీ ఏమైనా పెళ్ళిళ్ళు చేసుకున్నావా?"

హనుమంతుడు కొంచెం సిగ్గుపడ్డాడు. "భరతుడు నాకు చుక్కల్లాంటి పిల్లల్ని ఇచ్చాడు గానీ, వాళ్ళందరూ కూడబలుక్కుని నన్ను వొదిలి పెట్టి ఎప్పుడు పోతారోనని .... భయంగా వుంది స్వామీ!"

"ఏం? ఎందుకు విడిచి పెడతారు?"

"నన్ను చూడగానే వాళ్ళు నవ్వుతారు. వెక్కిరిస్తారు. పోనీలే అందగత్తెలు కదా అని ఊరుకుంటాను. కానీ నాకు నమ్మకం లేదు. ఎంతో కాలం ఉండరు వాళ్ళు నా దగ్గిర."

"పతివ్రతలు భర్తని విడిచి పెడతారా?"

"మా దేశంలో ఆ ఆచారం లేదుగా రామయ్యా"

"అయితే, నీ భార్యలు నిన్ను విడిచి మళ్ళీ ఈ దేశం పారిపోయి వస్తే, వారిని ఉరి తీయించేస్తాను."

"అబ్బే! అదేం పిచ్చి పని? మళ్ళీ నాకే అప్ప జెప్పెయ్యి!"

"సరే, ఉరి కన్నా వాళ్ళకి అదే మంచి శిక్షా? నీ కోరిక ప్రకారమే చేస్తాను. పూర్వం నువ్వు నా కెంతో ఉపకారం చేశావు ...."

హనుమంతుడు మళ్ళీ సీత సంగతి ఎత్తాడు. ".... రామయ్యా! సీతమ్మ తల్లిని .... విడిచిపెట్టావు. అన్యాయం ప్రభూ! న్యాయా న్యాయాలు తెలిసిన మహానుభావుడివి నువ్వు."

"హనుమా! ...."

"చిత్తం!"

"నేను అన్యాయం చేశానంటావా?"

"అన్యాయం కాదు గానీ .... అన్యాయమే ప్రభూ!"

"కానీ పర పురుషుడు ...."

"వాడు ఏ నాడో పోయాడుగా రామయ్యా!"

"వాడు బ్రతికున్ననాడే .... ఆ నాడు .... అసలు లంకలో ఏం జరిగిందో చెప్పు!"

మళ్ళీ అంతా చెప్పుకొచ్చాడు హనుమంతుడు – "ఆ దుర్మార్గుడు ఎంత బెదిరించినా, ఎన్ని విధాల ప్రలోభ పెట్టినా, సీత వాడికి వశపడకుండా నిద్రా హారాలు మాని, కంటికీ మంటికీ ఏక ధారగా ఏడుస్తూ, అశోక వనంలో ...."

రాముడు ఆలోచనల్లో మునిగిపోయాడు.

★ ★ ★

ముని వేషాలతో వున్న ఇద్దరు పిల్లలు యజ్ఞశాల దగ్గిర మహారాజు గురించి పాటలు పాడుతున్నారు. ఆ బాల కంఠాల మాధుర్యానికి తగ్గ వాయిద్యాలతో పిల్లలు అంత చక్కగా పాడుతోంటే, జనం అంతా ఆ పాటల చుట్టూ జేరారు.

శ్రీరాముడు పుట్టడం, పెరగడం, సీతని పెళ్ళాడడం, అతని కోసం తండ్రి పట్టాభిషేక ప్రయత్నాలు చెయ్యడం, సవతి తల్లి ఉక్రోషం, శ్రీరామచంద్రుడికి వనవాసం, కష్టాలూ – ఆ రకంగా సాగుతోంది కథ.

కథకన్నా ఆ సంగీతం, ఆ పిల్లల అభినయం ముచ్చట గొల్పుతున్నాయి జనానికి.

రాముడా పాటగాళ్ళని పిలిపించాడు.

"ఎవరి పుత్రులు మీరు?"

"వాల్మీకి శిష్యులం!"

"ఈ పాట అంతా ఎవరు రాశారు? ఈ వివరాలన్నీ ఎలా గ్రహించారు?"

"అంతా మా గురువుకి తెలుసు. ఆయనే రాశాడు."

"మీ గురువు ఎక్కడ?"

"ఈ యజ్ఞశాలలోనే ఉన్నాడు."

పిల్లలు మళ్ళీ ఎత్తుకున్నారు. శ్రీరాముడు అనేక బాధలు పడుతూ చిత్రకూటంలో నివసిస్తూ ఉండగా భరతుడు వచ్చి అన్నగారిని తిరిగి అయోధ్యకు రమ్మ న్నాడు .... పితృవాక్య పరిపాలకుడైన శ్రీరామ చంద్రుడు భరతుడి కోరిక తిరస్కరించి పాదుకలు ఇచ్చి పంపిం చేశాడు. మళ్ళీ శ్రీరాముడు సంవత్సరాల కొద్దీ అరణ్యాల వెంట తిరిగి తిరిగి చివరికి, పంచవటిలో నివాసం ఏర్పర్చుకున్నాడు. అలా ఉండగా ఒకనాడు చుప్పనాతి శూర్పణఖ ....

పాట వింటూ ఆలోచనల్లో మునిగిపోయాడు రాముడు.

ఆ పాడే పిల్లలు .... వాల్మీకి శిష్యులు .... సీత కొడుకులేనని గ్రహించాడు.[497]

సీతని మళ్ళీ స్వీకరించడం ధర్మమేనా? ఏ పాపమూ ఎరగనిదా సీత?

"లక్ష్మణా!"

"ప్రభూ!"

"వాల్మీకి మునిని పిలిపించు."

రాజు పిలుపుకి వెంటనే హాజరయ్యాడు, వాల్మీకి ముని.

"మహా మునీ! సీత పతివ్రతే అయితే, ఏ పాపమూ ఎరగనిదే అయితే, నిండు సభలో అందరి ముందూ ప్రమాణం చేస్తుందా?"

"నువ్వు చెయ్యమంటే ఎందుకు చెయ్యదు రామా? భర్త ఇష్టప్రకారమే నడవాలని సీత ఎరగదా?"

"తను పతివ్రతనని సీత ప్రమాణం చెయ్యాలి. సభలో అందరికీ విశ్వాసం కలిగించాలి. అప్పుడే నేను స్వీకరిస్తాను. రాముడి దృష్టిలో స్వ జనులకొక న్యాయం, పరులకొక న్యాయం లేదు."

"రామా! ఇంత కాలానికి నీకు దయగలిగింది. సీత, తప్పకుండా తను పతివ్రతననే విశ్వాసం కలిగిస్తుంది" అని అంగీకరించాడు వాల్మీకి.[498]

మర్నాడు – ఆ ప్రదేశం అంతా జనంతో, నిండి పోయి కిటకిట లాడుతోంది. చుట్టుపక్కల అన్ని ఊళ్ళ

---

**497.** **ఉత్తర, సర్గ 108, శ్లోకం 2:** "ఆ రామ చరితమును కుశ లవులు గానము చేసి ముగించిన పిదప, ఆ గాయకు లిరువురు సీతాదేవి పుత్రులని యెరిగి ..." అప్పుడే తెలిసింది రాముడికి కుశ లవులు తన కొడుకులని.

ఇప్పుడు, కుశ లవులు యుద్ధ కాండ వరకే పాడారు. కుశ లవులు రాముడికి 'రామాయణం' గురించి చెపుతూ, "ఉత్తర కాండగాక ఆరు కాండలు గలది" అన్నారు. (సర్గ 107, శ్లోకం 27)

అశ్వమేధ యాగంలో రాముడు వొదిలిన గుర్రాన్ని కుశ లవులు ఆపడమూ అదీ వాల్మీకి మూలంలో లేదు. ★

**498.** **ఉత్తర, సర్గ 108, శ్లోకాలు 4, 6:** రాముడు వాల్మీకి దగ్గిరికి దూతల్ని పంపుతూ వారితో ఇలా అంటున్నాడు. "సీత పవిత్రమైన నడవడిక గలదిగా నుండెనేని, కల్మషము లేనిదిగా నుండెనేని, వాల్మీకి ముని సమ్మతి గైకొని, తన పరిశుద్ధిని చేయుగాక! తన పాతివ్రత్యమును దెలుపుటకై రేపు ఉదయమున ఈ సభకును, నాకును మ్రోల, ప్రమాణము (శపథం = ఒట్టు) చేయును గాక!" అన్నాడు.

'తన శుద్ధిని చేయుగాక, ప్రమాణము చేయుగాక' అంటే ఏమిటి అర్థం? సీత ఏం చెయ్యాలని రాముడి అభిప్రాయం? "నేను పతివ్రతనే. పవిత్రురాలినే. వొట్టు పెట్టి చెపుతున్నాను" అని నోటి మాటలతో వొట్టు పెట్టాలనా? లేకపోతే ఇంకేదైనా మహిమ లాంటిది చూపించాలనా? రాముడు దూతలకు చెప్పిన మాటలు మాత్రమే చూస్తే ఈ విషయం అర్థం కాదు.

**సర్గ 109, శ్లోకం 17:** వాల్మీకి సీతని సభలోకి తీసుకు వచ్చిన తర్వాత రాముడితో, "ఇప్పుడు, సీత నీకు, విశ్వాసం కలిగిస్తుంది" అన్నాడు.

అప్పుడు రాముడు వాల్మీకితో అంటున్నాడు. సర్గ 110, శ్లోకం 3: "మునుపు (లంకలో) సీత చేత, దేవతల సన్నిధిలో, విశ్వాసం ఇవ్వబడింది. ప్రమాణము కూడా చేయబడింది. అందుచేత నేను ఇంటికి తెచ్చుకున్నాను. ఇప్పుడు సీత జనుల సమక్షమున పరిశుద్ధురాలని తెలిసిన, నా దేహమునందు అనురాగము కలుగును."

సీత లంకలో ఏ విధంగా విశ్వాసం కలిగించింది? అగ్నిలో దూకి బయటికి వచ్చింది. ఒక మహిమ చూపించినప్పుడే రాముడికి విశ్వాసం కలిగింది. ఇప్పుడు మళ్ళీ, రాముడికీ, సభకీ, విశ్వాసం కలిగించాలంటే, మళ్ళీ ఒక మహిమ చూపించే కార్యం ఏదో చెయ్యవలసిందే! "సీత తన శుద్ధిని జేయుగాక, ప్రమాణము చేయుగాక" అని రాముడు అన్నాడంటే, నోటి మాటలతో వొట్టు పెట్టమని అర్థం కాదు. ఏదో మహిమ చూపించమనే! దానికి తగ్గట్టే, సీత ఇక్కడ భూదేవిని పిలిచి మహిమ చూపిస్తుంది. కానీ, ఈ ఘట్టాన్ని మనం వాస్తవ దృష్టితో అర్థం చేసుకునేటప్పుడు సీత భూదేవిని పిలిచినట్టు అర్థం చేసుకోము.

ప్రజలు మాత్రం, అమాయకంగానో, మూర్ఖంగానో, మహిమల మీద నమ్మకం కలిగి వుంటారు కాబట్టి, సీత ఏవన్నా మహిమ చేస్తుందేమో, మహిమ చూపిస్తేనే రాముడు నమ్ముతాడేమో అని, ఏదో మహిమ జరుగుతుందనే దృష్టితోనే ఎదురుచూస్తూ వుండడం సహజం. ★

నించీ, ఆడా, మొగా, కాలి నడకనా, బళ్ళ మీదా కూడా వొస్తున్నారు. రాముడేం నిబంధన పెట్టాడో సరిగ్గా తెల్చుకోలేక జనం ఎవరికి తోచినట్టు వాళ్ళు చెప్పుకుంటున్నారు. తెలియని వాళ్ళకి తెలిసిన వాళ్ళు వివరాలతో బోధ పరుస్తున్నారు.

"సీతాదేవి తను మంచిదాన్నేనని పదిమంది ముందూ రుజువు చేసుకోవాలంట! అలాగైతేనే రాముడు మళ్ళీ ఏలుకుంటాడంట!"

"రుజువు చేసుకోమనలేదు గానీ, అందరికీ విశ్వాసం కలిగించాలన్నాడు. నిన్న నేను స్వయంగా నా చెవుల్తో విన్నానుగా?"

"అదే లెద్దూ! విశ్వాసం కలిగించాలంటే ఎలా కలిగిస్తుందీ? ఏదో చెయ్యాలనే రాముడి ఉద్దేశం. ఊరికే వొట్టేసుకుంటేనే నమ్ముతాడా?"

"ఎందుకు నమ్మడూ? మొన్న మా తోడల్లుడు కావిడి బద్ద పట్టుకుపోయి ఇచ్చేశానని బూకరించాడు. పైగా పెళ్ళాం చచ్చిపోయినంత వొట్టన్నాడు. మరి నమ్మకేం చేశాం?"

"నీ సంగతెందుగ్గానీ .... రాముడు మాత్రం .... ఉత్తుత్తి ఒట్లేస్తే నమ్మడయ్యా!"

"మరి రుజువెలా చేసుకుంటుందీ?"

"ఏమో! ఎలాగో వొకలాగ చెయ్యవలిసిందే. మహా పతివ్రత అంటారుగా? ఆ మాత్రం చెయ్య లేదూ?"

"ఇదిగో! నువ్వు మహా భక్తుణ్ణంటావుగా? నీ భక్తిని రుజువు చేసుకుంటావా? నిప్పుల గుండంలో పారేస్తాం, బయటి కొస్తావా?"

"అఁ, నా మొహం! నేనేం భక్తుణ్ణిలే."

"అందరూ అంతే అనుకో. మంచితనం ఉంటే ఉంటుంది గానీ మహిమలు చూపించమంటే ఏం చూపించగలరు?"

"ఇంతకీ, ఎలా రుజువు చేసుకో మంటాడూ?" – ఇంకొకరు.

"అసలు రుజువు చేసుకోమనన్నాడా?" – ఆ పక్కాయన.

"అన్నాడంటగా?"

"రావణాసురుణ్ణి తెచ్చి, అతని నోటితోనే చెప్పించాలేమో!"

"మాయదారి మొగుడు లేకపోతే పోయాడు గానీ ఈ పరీక్ష లేంటీ? ఎలా చేసుకోమంటాడూ?" అని బుగ్గలు నొక్కుకుంటున్నారు ఆడంగులు.

"ఇంత కాలానికి మళ్ళీ ఏలుకుంటాడా! సిగ్గు లేకపోతే సరీ! ఇన్నాళ్ళూ ఎలా బతికిందో అలాగే బతుకుతుంది, ఆ ముని దగ్గిరే."

"అయ్యో! అలా అనకు, ఆడదానికి అంత తెగింపేంటి? ఇంత కాలాని కన్నా ఆ మహానుభావుడికి దయ కలిగింది. అదే పది వేలు. మిగతా జీవితం అన్నా భర్తతో వుంటుందిగా?"

"పోనీ, ఈ మాట ఆ నాడే అనకపోయాడా? 'ప్రజలు నిన్ను శంకిస్తున్నారు, నువ్వు పతివ్రతవని రుజువు చేసుకుంటావా?' అని అడగకుండానే విడిచి పెట్టేశాడేం?"

"ప్రజల మీద వంకే గానీ, అసలు ఆయన మనసులో ఉన్న భూతమే అది. ఉత్త అనుమాన పిశాచం!"

రాముడి చుట్టూ జేరిన ప్రముఖులు రామ రాజ్యాన్ని వేనోళ్ళ కీర్తిస్తున్నారు. మహారాజుకి స్పష్టంగా వినబడేటట్టు ఒకరి కొకరు చెప్పుకుంటున్నారు. "ఇంత ధర్మాత్ముణ్ణి ఎక్కడైనా చూశామా? భార్యని కూడా పదిమంది ముందూ న్యాయానికి నిలబెట్టాడా ఏ రాజైనా? మన భాగ్యం కొద్దీ రామ రాజ్యంలో ఉన్నాం కాబట్టి ఈ పుణ్యాత్ముణ్ణి కళ్ళారా చూస్తున్నాం గానీ ...."

"శ్రీరామచంద్రుడికి తన వారైనా, పరవారైనా, ఒకటే. అందరికీ ఒకటే న్యాయం. ఒకటే ధర్మం."[499]

జనం ఇంకా ఇంకా తండోప తండాలుగా వొస్తూనేవున్నారు.

"అయిపోయిందా?"

"ఇంకా లేదు. సీతమ్మ తల్లి రానే లేదు."

"రుజువు చేసుకోమనడం ఏంటి? ఎట్టా చేస్తుందీ?" కొత్తవాళ్ళు, ఆశ్చర్యంగా.

"ఏమో మరి. మహా పతివ్రత. ఏమైనా చేస్తుంది."

"నిజంగానే ఏదన్నా రుజువు చూపించి పది మంది ముందూ ఆ మొగుడికి సిగ్గొచ్చేటట్టు చేస్తే బాగుణ్ణు!"

"సిగ్గెందుకొస్తుందీ? నా భార్య ఎంత గొప్ప పతివ్రతో చూడండి. నన్ను తప్ప ఎవ్వర్నీ ఎరగదు – అని గర్వపడతాడు గానీ ...."

"బాగా అన్నావు. మా నాలుగో బామ్మర్ది సంగతి చెప్పానా? ఈ రాముడి తాత అనుకోండీ. పది రోజులకో సారి పెళ్ళాన్ని 'వాడి వేపు చూశావ్, వీడి వేపు చూశావ్' అని ఇంట్లోంచి తరిమేస్తాడు. ఆ పిల్ల నూతికో గోతికో పరిగెత్తితే, కాస్త నలుగురూ కలగజేసుకుని ఆ మహానుభావుడికి నచ్చజెపుతారు. అప్పటికి ఎలాగో వొప్పుకుంటాడు. పెళ్ళాన్ని ఇంట్లోకి రానిస్తాడు గానీ చెవులో జోరీగ లాగ సణుగుతూనే వుంటాడట. సణిగి సణిగి

---

**499.** **ఉత్తర, సర్గ 108, శ్లోకాలు 14, 15:** సీత, సభలో ప్రమాణము చెయ్యాలని రాముడు అన్న దానికి రుషులు సంతోషించారు. 'మహా ధీరుడగు యా రాముని మాటలు విని మునీంద్రులెల్లరును 'మంచిది, మంచిది'యని గొప్పగా నరచిరి. "ఓ రాఘవా! ఇది నీకే తగును. మరి ఎచ్చటను ఇట్టి న్యాయము గానము" అని చెప్పిరి. ★

ఏదో వొక వంకపెట్టి మళ్ళీ ఇంట్లోంచి వెళ్ళగొట్టేస్తాడు. పట్టుమని పది రోజులైనా ఇంట్లో ఉండనివ్వడంటే నమ్మండి!"

"కుక్కల కొడుకుని చావదన్నక పోయారా?"

"అలాగే అనుకున్నాం గానీ ఆ పిల్ల పడనిస్తేనా? 'నా పెనిమిటిని యావన్నా చేశారంటే నూతిలో పడి చస్తా'నని వొకటే ఏడుపు! 'సరేలే. ఆ చావేదో మొగుడి దగ్గరే చావు' అని వొదిలేసి ఊరుకున్నాం."

"చావటం అంటే గుర్తొచ్చింది, మొన్న రాజమ్మ కూతురు నూతిలో ఉరికి చచ్చిపోయిందంట, తెలుసా? వాళ్ళ ఊరు నించి మనిషొచ్చాడు."

"ఎందుకూ?"

"ఎందుకేంటి? ఇలాంటి గొడవలే, ఆ ముదనష్టపు మొగుడు ...."

జనం గోలగోలగా తోసుకుంటూ లేచారు.

వాల్మీకి వెనకాల సీత తల వొంచుకుని నడిచి వొస్తోంది. కాషాయ బట్టలతో యోగిని లాగ ఉంది. భుజాల నిండా ముసుగు కప్పుకుంది. రాముడి ఎదటకు వొచ్చి భూమిలోకి తల వొంచుకుని నిలబడింది.

వాల్మీకి రాముడికి నచ్చచెప్పే ధోరణిలో శాంతంగా మొదలుపెట్టాడు. "మహారాజా! నీ భార్య మహా పతివ్రత. ఈమెని పాపం చేసింది అన్నవాళ్ళు రౌరవాది నరకాలకు పోతారు. (అయితే, రాముడే ఆ నరకాలకు పోతాడన్న మాట.) సీతలో దోషం లేకనే నా ఆశ్రమంలో ఇంత కాలం ఉంచుకున్నాను. ఈ కుశ లవులు నీ బిడ్డలే. ఈ అభాగ్యురాల్ని స్వీకరించి మమ్మల్నందర్నీ ఆనందపెట్టు రామా!" అన్నాడు ప్రాధేయపడుతూ. తర్వాత సీతతో, "అమ్మా! నీ భర్తే నీకు దైవం. నీ భర్తని శరణు కోరుకో తల్లీ!" అని సీతకు హెచ్చరిక చేశాడు.

సీత బొట బొట కన్నీళ్ళు కారుస్తూ, శరీరమంతా కంపిస్తూ, దుఃఖంతో కళ్ళెత్తి చూసే ప్రయత్నం చేస్తూ, భర్త ముందు చేతులు జోడించింది – "ప్రభూ! నేను ఎప్పుడూ నీ శరణు కోరవలసిన దానినే. నేను ఎప్పుడూ పతివ్రతనే. నా చిన్నతనం నుంచీ పతివ్రతల కథలు విన్నాను. వేద పాఠాలలో స్త్రీల ధర్మాలు విన్నాను. నా జీవితమంతా పాతివ్రత్యంతో గడపాలని కలలు గన్నాను. ప్రతీ క్షణమూ, నా ఆత్మనీ దేహాన్నీ, నీ పాదసేవకే సిద్ధం చేసుకున్నాను. నువ్వే నా దైవం అని నమ్మి ఎన్ని కష్టాలైనా ఆనందంగా భావించాను. నా ఊహలోనైనా, కలలోనైనా, ఎన్నడూ ఏ ఆశకూ, ఏ కోరికకూ ప్రలోభ పడక నీ పాదపూజే నా జీవితంగా నమ్ముకున్నాను. లంకలో నువ్వు నన్ను తిరస్కరించినప్పుడే ఈ జీవితం నాకు వ్యర్థం అనుకున్నాను.

ప్రభూ! ఆ నాడు నువ్వు నన్ను దయతో స్వీకరించావు. జీవితమంతా నీ పాదసేవ చేసుకుంటూ బ్రతుకు తానని సంతోషించాను. కానీ నా దౌర్భాగ్యం నన్ను విడిచి పెట్ట లేదు. ఏ జన్మలో ఏ జంటని విడదీశానో! ఏ భార్యా భర్తలకు విరోధం కలిగించానో, మళ్ళీ నువ్వు నన్ను తిరస్కరించి గర్భవతిననే కనికరమైనా లేకుండా అడవుల్లో విడిచిపెట్టించావు.

వాల్మీకి ముని, ఇంతకాలం దయతో నన్నూ, నా బిడ్డల్నీ, కడుపులో పెట్టుకుని కాపాడాడు. ఇప్పుడు మళ్ళీ 'నీ భర్త నిన్ను స్వీకరిస్తాడు రమ్మ'ని ముని నన్ను ఇక్కడికి తీసుకు వొచ్చాడు. నేను పతివ్రతనేనని ప్రమాణం చెయ్యమంటున్నాడు ...."

సీత దుఃఖంతో తడిసిన మొహం ఎత్తి రాముణ్ణి చూసింది. ఎవ్వరూ లేని ఏకాంతంలో ఉన్నట్టు నిశితంగా, నిష్ఠూరంగా చూసింది. "మూర్ఖుడా! నా సౌశీల్యం నీకు తెలియదా? చిన్నతనం నుంచీ నా సద్గుణాలు నువ్వు ఎరగవా? నేను శీలవతినేనని నోటి మాటగా చేసే ప్రమాణం నీకు విశ్వాసం కలిగిస్తుందా? ఎంతో కాలం నాతో నీ సహచర్యమంతా వ్యర్థమేనా?" అంటున్నాయి సీత చూపులు.

రాముడి చూపులు, సీత మొహం మీద ఎన్నో క్షణాలు నిలబడలేక నిశ్శబ్దంగా, మౌనంగా, నేల వాలాయి.

సీత, కంఠం ఎత్తి తన సౌశీల్యం సూర్యచంద్రులకూ, దిక్కులకూ, దేవతలకూ, చెప్పాలని ఆరాటపడింది.

దేవతలందరూ కలిసి, రూపుగట్టి సాక్షాత్కరించిన భర్త ముందే చేతులు జోడించింది. "ప్రభూ! నేను ఎప్పుడూ పతివ్రతనే. ఎప్పుడూ శీలవతినే. ఎప్పుడూ నీ పాద దాసినే. నేను ఎన్నడూ పర పురుషుణ్ణి కోర లేదు. ఎన్నడూ నా మనస్సు చలించలేదు.

నా భర్తే నా దైవం. నా భర్తే నా ప్రాణం. నా భర్తే నా సర్వస్వం.

నా భర్త తిరస్కారంతో నా సర్వశక్తులూ కృంగిపోయాయి. ఇక నాకు జీవితం మీద ఆశ లేదు.

నీ పాదాల ముందు ప్రాణాలు విడిచే ప్రయత్నం తోనే నేను ఇక్కడికి వచ్చాను.

ఇంతమంది ప్రజల ముందు దోషిగా నిలబడ్డాను. సిగ్గుతో నా ప్రాణం చచ్చిపోతూ వుంది. జీవితం మీద నా ఆశలన్నీ నశించిపోయాయి."

మాట్లాడుతూ మాట్లాడుతూ వుండగానే సీత కంఠం క్షీణించిపోయింది. అతి ప్రయాస మీద ఇంకా ఇంకా మాట్లాడాలని ప్రయత్నిస్తూ, కళ్ళు మూతలు పడి, స్పృహ తప్పి భూమి మీద పడి ప్రాణాలు విడిచింది!

"సీత పడిపోయింది! పడిపోయింది!" అని జనం గగ్గోలు పడ్డారు.

ఆ వెనకాలే సీత చచ్చిపోయిందనే వార్త వ్యాపించి జనం దుఃఖసాగరంలో మునిగిపోయారు. "అయ్యో! ఎంత పని జరిగింది!" అంటూ పామరులు బావురు మన్నారు. ఆడా మగా, పిల్లా జెల్లా, గుంపులు గుంపులుగా జేరి ఏడ్చారు.

"చివరికి సీతమ్మ తల్లి కీ గతి పట్టిందా?"

"రాముడే సీత ప్రాణాలు తీశాడు."

"తప్పు. అదేం మాట?"

"ఎలా పోయింది ప్రాణం?"

"ఏదన్నా మింగి ప్రాణం తీసుకుందా? ఎంత విరక్తి పడిందో!"

"మహా పతివ్రతనని రుజువు చేసుకునే పోయింది. ఇప్పుడేమంటాడో రాముడు?"

"రుజువు చూపించమన్నాడుగా? మంచి రుజువే చూపించింది."

"రాముడు పడిపోయాడు. దుఃఖంతో మూర్ఛ పోయాడు..." అని వార్త వచ్చింది, దూరం నించి.

గొప్ప గొప్ప వారంతా చుట్టూ జేరి రాముణ్ణి వోదారుస్తున్నారు. దుఃఖం వోర్చుకోమంటున్నారు.

రాముడు వోర్చుకోలేక మూర్ఛపోతున్నాడు. వెంట వెంటనే తేరుకుంటున్నాడు.

"అయ్యో! నా సీత ... నా అర్ధాంగి ... నా ధర్మపత్ని ... నేనూ ప్రాణాలు విడుస్తాను. విడిచి పెట్టండి నన్ను! సీత లేకుండా ఒక్క క్షణం కూడా జీవించలేను. నా సీత ఎక్కడ వుంటే అక్కడే వుంటాను. నా ధర్మ పత్నితోనే కలిసి వుంటాను" అంటూ రాముడు శాస్త్రోక్తంగా, ధర్మ బద్ధంగా దుఃఖిస్తున్నాడు.

"రామా! దుఃఖపడకు. సీత, కాలం తీరి సుఖంగా వెళ్ళిపోయింది. నీ ఆయుష్షు తీరినప్పుడు నువ్వు సీతని స్వర్గంలో కలుసుకుంటావు. దైవ నిర్ణయం అంతే" అని వోదారుస్తున్నారు వృద్ధులు.500

రాముడు దుఃఖం ఆపుకోలేక భార్య మీద ప్రేమతో

**500.** **ఉత్తర, సర్గ 110, శ్లోకాలు 13 ... 21:** సీత ఎలాంటి మహిమ చూపించిందో చూడండి! "సకల దేశముల నుండి వచ్చిన సకల జనులును ... ఇప్పుడేమి జరుగనున్నదోయని వేచియుండిరి. సీత కాషాయ వస్త్రములు కట్టినదై, సభకేతెంచిన వారి నందరను గాంచి, చేతులు జోడించి, తల వంచుకొని, క్రింది చూపుగలదై ఇట్లనెను – 'నేను రాముని కంటే వేరొక్కనిని మనసుతో నైనను, స్మరింపకుంటినేని, విష్ణుపత్నియగు భూదేవి నాకు సందు నొసగును గాక! నేను రామునే బూజించి యుండినేని ... నేను రాముని దప్ప వేరొక్కని నెరుగనని చెప్పిన మాట వాస్తవముగా నుండెనేని, నాకు భూదేవి దారి ఇచ్చును గాక!' – ఆ విధముగా సీత ప్రమాణము చేయగా ... భూమి నుండి యొక దివ్య సింహాసనము పైకి లేచెను. ఆ సింహాసనము నందు భూదేవి సీతను బాహువులతో కౌగలించుకొని ... సింహాసనమున గూర్చుండ బెట్టుకొనెను. సీత సింహాసనమున గూర్చుండి పాతాళమునకు బోవుచుండగా ఆకాశము నుండి పుష్ప వర్షము కురిసెను."

ఆ విధంగా సీత భూమిలోకి వెళ్ళిపోయింది. శాశ్వితంగా రాముడికి దూరం అయిపోయింది! ఆ రకంగా మహిమ చూపించింది.

రాముడు, భార్య మీద 'అపారమైన ప్రేమ'తో భూమిని కేకలేస్తున్నాడు చూడండి. సర్గ 111, శ్లోకాలు 16 వరకూ: రాముడు శోకము గలవాడై ఇట్లనెను: "ఇంతకు మునుపు నే నెన్నడును బొందని దుఃఖము నా మనము బొందుచున్నది. నేను చూచుచుండగనే సీత కనపడకపోయెను కదా! ఓ భూదేవీ! నా సీతను దెచ్చి ఇమ్ము! ఈయకుంటివా నా సంగతి యెరుగునట్లు నా కోపమును జూపెదను. సీతను దెచ్చి ఇమ్ము! లేక నాకైననూ దారి నొసంగుము. పాతాళమున గాని, స్వర్గమున గాని సీతతో గూడియుండెదను. సీతను ఈయకుంటివా, నిన్ను పర్వతములతోను, వనములతోను, ధ్వంసము చేసెదను. (భూమిని ధ్వంసం చేసి, నీవు ఎచట నుండెదవు? పడవ ఎక్కెదవా?) నా ధనుర్బాణములు దెచ్చి ఇందు! ఇప్పుడే భూమి అభిప్రాయము కనుగొని, బద్దలు చేసెదను' – ఈ రకంగా శ్రీరాముడు కోపంతో, శోకంతో, తల్లడిల్లి పోతూ వున్నాడు.

బ్రహ్మ, దేవతలతో గూడి శ్రీరామునితో ఇట్లనెను – "రామా! నీవు బాధపడవలదు. నీవు విష్ణువు నవతారమయిన వాడవు గావా? నీకు జ్ఞప్తికి దెచ్చునంతవాడను గాను. ఇంచుక యోచించిన నీవు ఎరుగ గలవు. సీత, స్వర్గమునకు సుఖముగ నేగును గాక. స్వర్గమునందు నీకు సీతతో కలయిక కలుగగలదు. ఇది సత్యము. (అంటే అబద్ధమన్న మాట!)"

తర్వాత భూమిలోంచి రాముడికి వినపడ్డ మాటలు – "రామా! సీత నీకు ఇచట చిక్కదు. ఆమె స్వర్గమున నుంచబడినది" (స్వర్గానికి వెళ్ళాలంటే, దారి భూమిలోంచే గావును!)

రాముడి ఎదటే సీత స్వర్గానికి వెళ్ళిపోవడం – అనే కల్పనని, మనం వాస్తవంలో, రాముడి ఎదటే సీత చచ్చిపోవడంగా అర్థం చేసుకోవచ్చును.

సీత కోసం దుఃఖిస్తూ వున్న రాముడితో బ్రహ్మ – "ధర్మబుద్ధితో ఉత్తర కాండ కూడా విను!" అని చెప్పాడు. సర్గ 112, శ్లోకం 2: ఆ మర్నాడు కుశ లవులు రాముడి ముందు ఉత్తర రామాయణం కూడా పాడారు. ★

"సీతా! … ప్రియురాలా!" అని విలపిస్తూనే ఉన్నాడు.

నలుగురైదుగురు సామంత రాజులు ఒక మూల చేరి, "ఇప్పుడే అడిగితే బాగుంటుందా?" అని ఆలోచనలు మొదలు పెట్టారు.

ఆ నలుగురికీ పెళ్ళీడు కొచ్చిన ఆడపిల్లలున్నారు.

"నలుగుర్నీ చేసుకుంటాడా? ఇద్దర్నే చేసుకుంటాడా? అసలు చేసుకోడా?" అని సతమతమౌతున్నారు.

"ఇప్పుడు అడగకపోతే సంబంధం మన చేతుల్లోంచి తప్పిపోతుంది. కౌసల్యాదేవి, ఇంకేదో సంబంధం కుదిర్చేస్తుంది."

"మహారాజు సంబంధం మంచిదే గానీ … మన పిల్లల్నేం బాధలు పెడతాడో!"

"భర్త చేతుల్లో ఎంత బాధపడితే అంత మంచిది. సీతాదేవిని చూడండి. ఎంత కీర్తి తెచ్చుకుందో! అందరూ కంటతడి పెట్టిన వాళ్ళే గానీ తప్పు చేసిందన్న వాళ్ళున్నారా? మనలో మన మాట, ఎవరన్నా అంటే రాముణ్ణి అంటారే గానీ, సీతని అంటారా? ఆడపిల్లలు ఎన్ని బాధలుపడ్డా పుట్టింటికీ, అత్తింటికీ కీర్తే గానీ అపకీర్తి కాదు. అసలు రాముడు చేసుకోవాలే గానీ, నా పిల్లని తప్పకుండా ఇస్తాను."

"సరే అయితే నువ్వే అడుగు" అందరూ రాముడి దగ్గిరికి చేరారు.

రెండో పెళ్ళి మాట చెవిని పడనివ్వకుండా రాముడు మూర్ఛలు పోతూనే ఉన్నాడు.[501]

**రా**ముడు పూర్తిగా రాచకార్యాలలో మునిగి ఉంటున్నాడు. సైన్యం, బొక్కసం పెంపు చేస్తున్నాడు. నిత్యమూ రాజ్య విస్తరణకే దీర్ఘాలోచనలూ చర్చలూ, జరుపుతున్నాడు.

కేకయ రాజ్యం నించి వచ్చిన వార్త రాముడికి అమితానందం కలిగించింది.

కేకయ రాజు యుధాజిత్తు, గార్గ్యమునితో రాముడికి ఒక వర్తమానం పంపించాడు. "గంధర్వ దేశం గొప్ప సిరి సంపదలు గల దేశం. దేశానికి మధ్యగా సింధునది ప్రవహిస్తూ వుంది. నువ్వు ఎలాగైనా ఆ దేశం జయించాలి. నీకు తప్ప దాన్ని జయించడం ఎవరికీ సాధ్యం కాదు. నేను కూడా సైన్యాలతో వచ్చి నీకు సహాయం చేస్తాను. గంధర్వులు మహా వీరులు. తమ దేశాన్ని ప్రాణాధికంగా రక్షించుకుంటున్నారు. ఆయుధాలకు కూడా లోపం లేదు వారికి. అయినా నీ సైన్యం ముందు వారెక్కడ నిలబడగలరు? గంధర్వ దేశం లాంటి దేశాన్ని నువ్వు ఎంతమాత్రం విడవకూడదు. నీ దేశాన్ని నువ్వు రక్షించుకుంటూనే పర దేశాల్ని ఆక్రమించి పిడికిట్లో పెట్టుకోవాలి" – అదీ ఆ వర్తమానం సారాంశం! (మునులు నడిపే వర్తమానాలు ఇలాంటివన్న మాట!)

రాముడు అమితమైన సంతోషంతో గంభీరుడయ్యాడు. యుధాజిత్తు ప్రోద్బలంతోనే ఈ విజయం లభిస్తే, గాంధర్వ దేశం భరతుడికి చెందవలసిందే.

కోసల రాజ్య విస్తరణా జరుగుతుంది, తమ్ములకు కూడా రాజ్యాలు ఇచ్చాడనే కీర్తీ తనకు దక్కుతుంది. గంధర్వ దేశం మీద ముట్టడి అత్యవసరంగా జరిగి తీరవలసిందే.

"మునీంద్రా! మీరు తెచ్చిన వార్త నాకు చాలా ఆనందం కలిగించింది. నేను కూడా సిరి సంపదలు గల రాజ్యాల కోసమే చూస్తున్నాను. మీ సందేశం ప్రకారమే చేస్తాను" అని వినయంగా అంగీకరించాడు రాముడు.

"గంధర్వులు మహా బలవంతులని విన్నాను రామా! వారికి ఆయుధాలకూ, జనాభాకూ కూడా కొదవ లేదట!"

"ఆ భయం లేదు మునీంద్రా! అన్ని విధాలా వారిని మించిన శక్తి సామర్థ్యాలు గల సైన్యాలున్నాయి మనకు. గంధర్వ దేశం మనదే."

గంధర్వ దేశానికి భరతుడి కొడుకులిద్దర్నీ రాజులుగా చెయ్యాలనే నిశ్చయంతో రాముడు, తక్షుడికీ, పుష్కలుడికీ, గంధర్వ రాజులుగా అభిషేకాలు చేయించాడు.[502] వెంటనే భరతుణ్ణి, తగినంత సైన్యం తీసుకుని

---

**501.** **ఉత్తర, సర్గ 112, శ్లోకం 8:** రాముడు మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. "రాముడు సీత కంటే వేరొక భార్యను వివాహ మాడక, యజ్ఞము చేయవలసినప్పుడెల్లా బంగారు సీతనే ప్రక్క నుంచుకొని యజ్ఞము చేయుచుండెను."

సీత బొమ్మ వుంటే చాలు, సీత వున్నట్టే! సీతకీ, బొమ్మకీ తేడా లేదు.

రామాయణం కథలో, కవి, రాముణ్ణి గురించి 'ఏక పత్నీ వ్రతుడు' అని గానీ, **'ఏక పత్నీ వ్రతం' అని గానీ ఎక్కడా వాడలేదు.** కానీ, సీత తప్ప, ఇతర భార్యల ప్రసక్తి మాత్రం ఎక్కడా లేదు.

**సర్గ 112, శ్లోకాలు 15, 16, 17:** రాముడు రాజ్యపాలన చేయుచుండగా కౌసల్యా, సుమిత్రా, కైకా పెద్దవాళ్ళై చచ్చిపోయారు. చచ్చిపోయి చాలా దురదృష్టవంతులయ్యారు. స్వర్గానికి వెళ్ళి అక్కడ దశరథ మహారాజుని కలిసి మళ్ళీ పతివ్రతా ధర్మాలలో చిక్కుకున్నారు. ★

**502.** **ఉత్తర, సర్గ 113, శ్లోకాలు 10 … 13:** యుధాజిత్తు పంపిన వార్త – "సింధునది కిరువైపుల నుండునది గంధర్వ దేశము. ఫల మూలములతో నొప్పునది, మిక్కిలి సొగసైనది … నీ పురమును జాగ్రత్తగా కాపాడుకొనుచు .. ఆ గంధర్వ ➔

యుద్ధానికి బయలుదేరమని ఆజ్ఞాపించాడు.

భరతుడు సైన్యాలతో గార్గ్యముని వెంట బయల్దేరి, మొదట కేకయ రాజ్యం చేరాడు. అక్కడినించి యుధాజిత్తు కూడా సైన్యాలతో బయల్దేరాడు.

వెంటనే గంధర్వ రాజ్యం మీద దండెత్తారు. గంధర్వులు మహావీరులు. ప్రాణాలకు తెగించి శతృవు మీద యుద్ధానికి సిద్ధపడ్డారు.

ఇరుపక్షాలకూ ఘోరమైన యుద్ధం జరిగింది. రక్తం మడుగులతో, శవాల కుప్పలతో, భూమి నిండిపోయింది. ఏడు రోజులు ఎటూ జయం తేలకుండా యుద్ధం సాగింది.

చివరికి ఎనిమిదో నాడు, గంధర్వులలో చివరి వీరుడు కూడా హతుడై పోయిన తర్వాత, దేశం భరతుడి స్వాధీనమైంది.

గంధర్వ దేశం, చక్కని పట్టణాలతో, ఉద్యానవనాలతో, పళ్ళ తోటలతో, సిరి సంపదలతో, దేవాలయాలతో నిండి వుంది.

భరతుడు కొంతకాలం గంధర్వ దేశంలో వుండి, దేశాన్ని రెండు భాగాలుగా విభజించి, కొడుకులిద్దరికీ పట్టాభిషేకాలు చేసి, తమ రాజరికం స్థిరపడిన తర్వాత అయోధ్యకు తిరిగి వచ్చాడు.

భరతుడు చెప్పిన సంగతులన్నీ విని రాముడు చాలా ఆనందించాడు. "శతృఘ్నుడి కొడుకులకూ, నీ కొడుకులకూ, రాజ్యాలు అమిరాయి. నా కొడుకులకు కోసల వుండనే వుంది, ఇక లక్ష్మణుడి కొడుకులకు కూడా స్వంత రాజ్యాలు కావాలి. చక్కగా సిరి సంపదలతో తులదూగే ఇంకో రాజ్యం ఏదైనా చూడండి! ఆక్రమించుకుందాము" అన్నాడు ఆతృతగా, పట్టుదలగా.

భరతుడు అన్ని దేశాల గురించీ సమాచారం సేకరించి అన్నగారికి సంతోషకరమైన వార్త ఒకటి అందజేశాడు. "కారుపథ దేశం అన్ని విధాలా చక్కనిది. సిరి సంపదలు గలది. ఆ దేశాన్ని ఆక్రమిస్తే బాగుంటుంది."

రాముడు, దాని వివరాలన్నీ విని, "అవును, అనుకూలంగానే వుంది. మనకు సుఖంగా త్వరలో వశపడుతుంది" అని వెంటనే కారుపథ దేశాన్ని ముట్టడించమని సైన్యాల్ని ఆజ్ఞాపించాడు.

రాముడి సైన్యాలకూ, కారుపథ దేశస్థులకూ ఘోర యుద్ధం జరిగింది. తొందరలోనే రాముడికి విజయం లభించింది.

లక్ష్మణుడి కొడుకు లిద్దర్నీ – అంగదుణ్ణీ, చంద్రకేతువునీ, కారుపథ దేశానికి రాజులుగా చేసి, భరతుడూ, లక్ష్మణుడూ అయోధ్యకు తిరిగి వచ్చారు.[503]

ఆ విధంగా రాముడు వృద్ధాప్యం వరకూ 'ధర్మ పథంలో' ('ధర్మ పథంలో' అంటే అసలైన అర్థం, 'అధర్మ పథంలో!' అధర్మమే రాజుల ధర్మం!) కోసలని పాలించి,

---

➔ దేశమును నీ వశంబు చేసికొనుచు ... ఆ దేశము మిక్కిలి శ్రేష్టమైనది."

ఈ మాటలు విని రాముడు – "మిక్కిలి యుప్పొంగి, సరేనని గార్గ్యమునితో నిట్లనెను – 'మహర్షీ! ... భరతుని పుత్రులిరువురును ఆ దేశమున నుందురు ... భరతుని ముందిడుకొని ఈ తక్ష – పుష్కలులు, గంధర్వ పుత్రులను జంపి, రెండు పట్టణములను విడదీయుదురు. భరతుడు తన పుత్రుల నచట నియమించి మరలా నా కడకు రాగలడు' అని చెప్పి రాముడు భరతుని సేనాసమేతముగా పయనమున కానతిచ్చి కుమారులకు పట్టాభిషేకము గావించెను."

ఈ కథ ప్రకారం, గంధర్వులు రాముడికి శతృవులు కారు. రాక్షసుల వంటి 'దుర్మార్గులూ' కారు.

రాముడు ధర్మాత్ముడు కదా? తన రాజ్యం తను పరిపాలించుకోక అన్యాయంగా ఇంకో రాజ్యం మీదకు దండెత్తడం ఏమిటి? అంటే, రాముడు ఇతర రాజ్యాల్ని దోచే రకం రాజు! రావణుడి లాంటి దుష్టుడే! ★

**503.** **ఉత్తర, సర్గ 115, శ్లోకాలు 10 వరకూ:** గంధర్వ దేశాన్ని జయించిన తర్వాత రాము దేమంటున్నాడో చూడండి! "లక్ష్మణా! నీ పుత్రులు, అంగద చంద్రకేతు లిరువురూ నీతి నెరిగిన వారు. రాజ్యమును చేయగలుగుదురు. గట్టి పరాక్రమము గలవారు. వీరి కిరువురకును గూడా పట్టాభిషేకము చేయుదును ... రమణీయమైన ప్రదేశమును నిర్ణయింపుము. ఆ ప్రదేశము రాజులకు సుఖవంతముగ నుండవలయును. మునులకు, నితరులకు నాటంకము గలుగనట్లుగ నుండవలయును."

అట్లు రాముడు పలుకగా భరతుడిట్లనియె – "కారు పథమను దేశ మొక్కటి గలదు. అది రమణీయమై యుండు ... ఆరోగ్యము గలదియు ... అని భరతుడు చెప్పిన మాటలు విని, రాముడందుల కంగీకరించి, యా దేశమును ముందుగా వశపరచుకొని ..." ఆ దేశంలో లక్ష్మణుడి కొడుకులకు పట్టాభిషేకాలు చేయించాడు రాముడు.

"రాముడు తన తమ్ముళ్ళకు కూడా రాజ్యాలు ఇచ్చాడు. ఎంత ఉత్తముడో చూడండి" అని చెప్పాలని కవి తాపత్రయం. ఏ విరోధమూ లేని దేశాల మీద అన్యాయంగా దండెత్తి ఆక్రమించడం రాముడికి చాలా అప కీర్తి కలిగిస్తుందని కవి అనుకోలేదు. అప కీర్తి – అనేది, ఈ నాటి దృష్టికే కాదు, ఆ నాటికి కూడా అది అప కీర్తే. ఇతర దేశాల ప్రజల్ని చంపి, ఆ దేశాల్ని ఆక్రమించిన ఆ దండయాత్రలు, ఆ నాటి దృష్టికి కూడా అన్యాయమైనవే. ★

రాజ్యాలు పాలించిన రాజులందరూ ఏమయ్యారో, తనూ
అదే అయ్యాడు.

భూమి మీద జన్మించి, కొంతకాలం జీవించి,
మానవులందరూ ఏమవుతారో అదే అయ్యాడు![504] ★

---

**504.** **ఉత్తర, సర్గలు 116 నించీ 123:** రాముడు 'ధర్మపథంలో' రాజ్యం చేస్తూ వుండగా, యముడు మునివేషంలో వచ్చాడు రాముడి దగ్గిరికి – "రామా! నేను నీతో రహస్యంగా మాట్లాడాలి. మధ్యలో ఎవరన్నా వస్తే వాళ్ళని చంపేస్తానని మాట ఇస్తే, నేను మాట్లాడవలసింది మాట్లాడతాను" అన్నాడు. (వీళ్ళ నోళ్ళల్లో, చంపడం, నరకడం తప్ప ఇంకో మాట వుండదు. రాముడు, ఆ చంపే పనులు తేలిగ్గా చేసేస్తాడని అందరికీ తెలుసు.)

రాముడు అలాగేనని లక్ష్మణుణ్ణి పిలిచి 'లోపలికి రాకు' అని సంగతంతా చెప్పి బయటికి పంపేశాడు. యముడు మొదలుపెట్టాడు – "నేను యముణ్ణి. పూర్వ జన్మలో నీ పుత్రుణ్ణి. (ఇంకా నయం, ఈ జన్మలో అన్నావు కాదు. అయోధ్య నీకే ఇవ్వాల్సి వొచ్చేది.) నన్ను బ్రహ్మ పంపించాడు, నీ దగ్గిరికి. ఏం చెప్పమన్నాడంటే, 'రామా! నువ్వు లోకాలన్నీ లయింపజేసి సముద్రంలో శయనించినప్పుడు నువ్వు నన్ను కన్నావు. (ఏ జన్మలో? అది చెప్పు ముందు!) నాకు సృష్టి భారం అప్పజెప్పావు. (అవును. అప్పజెప్పే ఉంటాడు. రాముడికి పనంటే చాలా బద్ధకం.) జగత్తుని రక్షించడం కోసం అవసరమైనప్పుడల్లా దేవతలకు సహాయం చేస్తూనే వున్నావు. రావణ వధకే రాముడవై జన్మించావు. పది వేల, పది వందల సంవత్సరాలు భూమి మీద వుండాలని నిశ్చయించుకుని మానవజన్మ ఎత్తావు. (10 వేల, 10 వందలా? 11 వేలు అనరాదా కవిగారూ? లెక్కలు రావా? ఛందస్సు కుదరదా?) నీకు ఇంకా భూమి మీద వుండాలని వుందా, లేకపోతే వచ్చేస్తావా?' – ఇదీ నిన్ను అడగమన్నాడు బ్రహ్మ" అని చెప్పాడు యముడు. (ఇదా గొప్ప రహస్యం?)

రాముడు – "అవును. ముల్లోకాల కార్యానికే నేను పుట్టాను. నా పని అయిపోయింది! రావాలనే అనుకుంటున్నాను" అన్నాడు. (అవును రాముడూ! నీ వల్ల జరిగే పని ఏదీ లేదు. నువ్వు వెళ్ళడమే మంచిది.)

అంతలో దూర్వాస ముని గుమ్మం దగ్గిరికి వచ్చి లక్ష్మణుడితో, "నేను వెంటనే రాముణ్ణి చూడాలి" అన్నాడు. లక్ష్మణుడు వినయంగా వొంగి, "మహారాజు చాలా ముఖ్యమైన పనిలో వున్నాడు. ఇప్పుడు పిలవకూడదు. నీ పనేమిటో నాకు చెప్పు. నేను చేస్తాను" అన్నాడు. "అలా కుదరదు. నే నొచ్చానని నువ్వు వెంటనే రాముడికి చెప్పకపోతే మీ అందర్నీ, మీ వంశాన్నీ, మీ రాజ్యాన్నీ, శపించేస్తాను" అని ముని చిందులు తొక్కాడు. ('పోరా ఫో! నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో' అంటే ఎంత బాగుండును!) లక్ష్మణుడి కేం చెయ్యాలో తోచలేదు. "లోపలికెళ్ళి రాముణ్ణి పిలవనా? నాకు మరణ దండన వేస్తాడే, పోనీ చచ్చిపోతే నే నొక్కణ్ణే పోతాను. రాముణ్ణి పిలవకపోతే, ఈ ముని అందర్నీ శపిస్తానంటున్నాడు. రాజ్యానికే సర్వనాశనం అయిపోతుంది" అనుకుని లక్ష్మణుడు రాముడి దగ్గిరికి వెళ్ళి దూర్వాసాయన గంతుల గురించి చెప్పాడు. రాముడు కంగారుపడుతూ యముణ్ణి పంపించేసి పరిగెత్తుకుంటూ దూర్వాసుడి దగ్గిరికి వొచ్చి 'ఏం కావాల'ని అడిగాడు. "వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసి వొస్తున్నాను. ఇప్పుడే పూర్తయింది. చెప్పలేనంత ఆకలిగా వుంది. వెంటనే భోజనం కావాలి" అన్నాడు దూర్వాసుడు. (ఆ సంగతి లక్ష్మణుడికే చెప్పి యాడవకూడదూ? వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసినా, ఆ మాత్రం జ్ఞానం రాలేదా మూర్ఖుడా? తపస్సు వల్ల ఏం వొచ్చింది, దౌర్జన్యం తప్ప?) దూర్వాసుడి మాటలకు శ్రీరాముడు తెగ సంతోషించి అన్నం పెట్టాడు. దూర్వాసుడు, తిండి తిని వెళ్ళిపోయాడు. (హమ్మ! కొంత దుర్వాసన తగ్గింది. రాముడు కూడా పోతే గానీ, మొత్తం వాసనంతా తగ్గదు.)

తర్వాత రాముడు యముడికిచ్చిన వాగ్దానం గుర్తుకొచ్చి దుఃఖపడుతూ కూర్చున్నాడు. ఇప్పుడు లక్ష్మణుణ్ణి చంపెయ్యాలి కదా? అందుకూ ఆ ఏడుపు. లక్ష్మణుడు అన్నగారిని ఓదార్చుతూ – "మహారాజా! నా కోసమేనా ఈ విచారం? వొద్దు. దుఃఖపడకు. మాట తప్పినవాడు నరకంలో పడతాడు. నా కోసం నువ్వు నరకంలో పడవొద్దు. నన్ను చంపేసి నీ మాట నిలబెట్టుకో, ధర్మం కాపాడు" అన్నాడు. రాముడు మంత్రులందర్నీ పిలిపించి ఆలోచించమన్నాడు. అందరూ లక్ష్మణుణ్ణి విడిచి పెట్టెయ్యాలనే చెప్పారు. (ఆ మంత్రులు, ఆ రాజు మంత్రులే గద!) లేకపోతే వాగ్దాన భంగమై ముల్లోకాలూ నశించిపోతాయన్నారు. 'ధర్మం కోసం నీ తండ్రి నిన్ను వొదల్లేదా?' అన్నారు.

రాముడు, లక్ష్మణుణ్ణి వొదలటానికే నిశ్చయించుకున్నాడు. "లక్ష్మణా! నిన్ను విడిచి పెట్టేస్తున్నాను. మంచివాడిని శిక్షించవలసి వచ్చినప్పుడు, వధించినా, త్యజించినా, రెండూ వొకటే, వెళ్ళిపో" అన్నాడు. (రాముడు, 'నీతి'ని కాపాడడం కోసం తన తమ్ములనైనా వొదిలి పెట్టేస్తాడని చెప్పాలని కవి అభిప్రాయం. రాముడికి కీర్తి కుప్పలు పోగేసి పెట్టడానికి ఎంతెంత దుర్మార్గాలైనా చేయించేస్తాడు కవి. ఆయన ప్రకారం, దుర్మార్గాలు చేస్తేనే కీర్తి వస్తుంది!)

లక్ష్మణుడు కళ్ళనీళ్ళతో సరయూనది వొడ్డుకు వెళ్ళి నవ రంధ్రాలూ బంధించుకుని ఊపిరి పీల్చకుండా కూర్చున్నాడు. దేవేంద్రుడు వచ్చి లక్ష్మణుణ్ణి సశరీరంగా స్వర్గానికి తీసుకుపోయాడు. (లక్ష్మణుడు ఆత్మహత్యతో ప్రాణాలు ➔

➔ విడిచాడు. జీవితమంతా రాముడికి సేవ చేసిన ఫలితం ఇది!)

రాముడు, మంత్రులతో – "కోసలని భరతుడికిచ్చి, నేను అడవులకు వెళ్ళిపోతాను. లక్ష్మణుణ్ణే అనుసరిస్తాను. భరతుడి పట్టాభిషేకానికి ఏర్పాట్లన్నీ చెయ్యండి" అన్నాడు. భరతుడు – "నిన్ను వొదిలి నేను రాజ్యం చేస్తానా? రాజ్యం కుశ లవుల కియ్యి. మనం స్వర్గానికి వెళ్తున్నాం కాబట్టి శతృఘ్నుడి కోసం కూడా కబురు పంపు" అన్నాడు. కోసలని రెండు భాగాలుగా చేసి వేరే నగరాల్ని రాజధానులుగా చేసి కుశ లవులకు పట్టాభిషేకాలు చేసి పంపించేశాడు రాముడు. ప్రజలందరూ రాముడి ముందు పడి ఏడ్చారు – "మేమూ నీతో వొస్తాం. మమ్మల్ని కూడా స్వర్గానికి తీసికెళ్ళు" అని. ('స్వర్గం' అంటే ఏమిటనుకుంటున్నారు మీరు? చచ్చిపోతారు నిష్కారణంగా. హాయిగా బతికి వుండండి!) "సరే. అందరూ రండి" అన్నాడు రాముడు.

కొందరు దూతలు శతృఘ్నుడి దగ్గిరికి వెళ్ళారు. సంగతంతా చెప్పి, "అయోధ్యలో జనం లేకుండా అందరూ రాముడితో స్వర్గానికి వెళ్ళిపోతున్నారు. (అయోధ్యాం విజనాం కృత్వా = అయోధ్యను జనం లేకుండా చేసి) నిన్ను కూడా తీసుకు రమ్మన్నారు" అని చెప్పారు. శతృఘ్నుడు, రాజ్యం కొడుకులకు ఇచ్చేసి రాముడి దగ్గిరికి వచ్చేశాడు.

సుగ్రీవుడు కూడా కిష్కింధ రాజ్యం అంగదుడి కిచ్చేసి వచ్చేశాడు. (సుగ్రీవుడూ! స్వర్గాన్ని నమ్ముకుని నిక్షేపం లాంటి రాజ్యం వొదులుకుని వొచ్చేశావా? స్వర్గంలో రంభ వుండదు సుమా!)

విభీషణుడు కూడా వచ్చేశాడు. రాముడు విభీషణుడితో – "నువ్వు చిరంజీవిగానే వుండు. భూమి మీద ప్రజలు వున్నంత కాలమూ (మూర్ఖులుగా వున్నంత కాలమూ), సూర్య చంద్రులు వున్నంత కాలమూ, నీ రాజ్యం వుంటుంది. (అయితే ఇప్పుడు కూడా విభీషణుడు భూమి మీద వుండే వుంటాడు. విభీషణుడు ఎక్కడున్నాడో పట్టుకుంటే రాముడి సంగతులన్నీ వివరంగా తెలుస్తాయి.) ఇక్ష్వాకుల కుల దైవం జగన్నాధుడు. ఆ దైవాన్ని ఆరాధించు" అని విభీషణుణ్ణి లంకలోనే వుండమని ఆజ్ఞాపించాడు.

తర్వాత హనుమంతుడితో – "నువ్వు కూడా చిరంజీవిగా వుండు. నా కథ లోకంలో వున్నంతకాలం నువ్వు జీవించి వుంటావు" అన్నాడు. (రామ కథ బతికి వుంటేనే తను బతికి వుంటాడు కాబట్టి, రామ కథని బతికించి వుంచవలసిన అవసరం తప్పదు గావున్ను హనుమంతుడికి!)

ఆ రాత్రి గడిచి మర్నాడు తెల్లవారు ఝామున అగ్నిహోత్రంతో బ్రాహ్మలు ముందు నడుస్తూండగా రాముడు పట్టు బట్టలు కట్టుకుని, దర్భలు పట్టుకుని గాయత్రి జపిస్తూ మౌనంగా మహా ప్రస్థానానికి (గొప్ప ప్రయాణం) బయల్దేరాడు. సిరి సంపదలూ, వ్యవసాయం, రాముడి ఆయుధాలూ, విల్లూ – అన్నీ మానవ రూపాలతో రాముణ్ణి అనుసరించాయి. వేదాలూ, గాయత్రీ, ఓంకారం కూడా రాముడి వెంట నడిచాయి. మునులూ, బ్రాహ్మలూ, పరిచారికలూ, పిల్లలూ, వృద్ధులూ, అంతః పుర స్త్రీలూ, వానరులూ, మంత్రులూ, యావన్మంది ప్రజలూ, క్రిమి కీటకాలూ, పశువులూ, పక్షులూ, చరాచరాలన్నీ రాముణ్ణి అనుసరించాయి. అయోధ్య శూన్యమైపోయింది. (రాముడు లేకపోతే, ఇక ప్రకృతి నాశనమై పోవాలి! ఏదీ నిలిచి ఉండకూడదు!)

రాముడు సరయూనది వొడ్డుకి చేరి, నీటిలో దిగడం ప్రారంభించాడు. రాముడికి స్వాగతం చెప్పడానికి, బ్రహ్మ, విమానంతో వచ్చి సిద్ధంగా వున్నాడు. "రామా! స్వాగతం నీకు. నీవు ఏ దేహంలో ప్రవేశించాలనుకుంటావో ఆ దేహంలో ప్రవేశించు!" అన్నాడు.

"బ్రహ్మ మాటలు విని మహాజ్ఞాని అయిన రాముడు తమ్ములతో గూడి, విష్ణువు వెలుగున ప్రవేశించెను" (రాముడు నదిలో దిగి ప్రాణాలు విడిచి విష్ణువులో కలిసిపోయాడని అర్థం.)

విష్ణువు బ్రహ్మతో – "ఈ ప్రజలందరూ నా భక్తులు. నా తో వొచ్చారు. వీరందరికీ పుణ్యలోకాలు ఇయ్యి!" అన్నాడు. (వీళ్ళందరికీ మంచి నీళ్ళియ్యి – అన్నట్టే!)

"నీ భక్తులందరూ బ్రహ్మలోకం అవతల సాంతానిక లోకంలో వుంటారు" అన్నాడు బ్రహ్మ. (ఏం, బ్రహ్మలోకంలోనే ఎందుకు వుండకూడదు? సాంతానికి లోకం ఎవడు పోతాడు? అది మరీ దూరం!)

ప్రజలందరూ ఆనందంగా సరయూ నదిలో మునిగి, నవ్వుతూ ప్రాణాలు విడచి, పుణ్యలోకం వెళ్ళిపోయారు. వానరులందరూ ఏ దేవతల నించి వొచ్చారో ఆ దేవతల్లో కలిసిపోయారు.

సుగ్రీవుడు సూర్య మండలం వెళ్ళిపోయాడు. (మళ్ళీ ఎప్పుడొస్తావు సుగ్రీవుడా? కిష్కింధ సింహాసనాన్ని తలుచుకో!)

భక్తులందర్నీ స్వర్గంలో వుంచి వైకుంఠానికి వెళ్ళిపోయాడు విష్ణువు!

## 'ఉత్తర కాండ' సమాప్తం!

## 7 కాండలూ సమాప్తం!

★

# రామాయణం చదివినా, విన్నా లాభాలేమిటి?

'రామాయణం' చదివినా, విన్నా, ఏ రకమైన 'లాభాలు' కలుగుతాయో కవి 'యుద్ధ కాండ' చివరా, 'ఉత్తర కాండ' చివరా చెపుతాడు. యుద్ధ కాండలో, సర్గ 131, శ్లోకాలు 102 నించీ చివరి వరకూ. ఉత్తర కాండలో, 124వ సర్గ పూర్తిగా. ప్రజలతో 'రామాయణం' చదివించడానికి, కవి, ఎన్ని రకాల లంచాలు ఇచ్చాడో చూడండి!

లోకము నందు శ్రీరాముని పట్టాభిషేకమును వినుట చేత (పట్టాభిషేకం వరకూ వుండే కథ – అని అర్థం) ధనమును గోరు వారు ధనమును, పుత్రులను గోరు వారు పుత్రులను, పొందుదురు. (లోకంలో, 'రామాయణం' మొహం ఎరగని దేశస్థులు కూడా పుత్రుల్ని కంటున్నారు కవిగారూ! ధనమునూ పొందుతున్నారు.)

రామాయణమును రాజు విన్నచో, శతృవులను తిరస్కరించి, భూమిని జయించును. (ఆ శతృవులు కూడా రామాయణమును విన్నచో? ఎవరు జయింతురు? ఎవరికి ఎక్కువ బలము వుంటే వారు జయింతురు. అవునా? మరి, రామాయణమును విని ఏమి లాభము?)

స్త్రీలు విన్నచో, కౌసల్య వలె, సుమిత్ర వలె, కైకేయి వలె, జీవించియున్న పుత్రులు గల వారలు (జీవ పుత్రాః) అగుదురు. (భర్తల మరణాలైతే తప్పవులెండి!)

ఎవనికినీ దుఃఖము కలిగించని వాడగు రాముని (అక్లిష్ట కర్మణః = క్లేశము కలిగించని కార్యము గల; రామస్య = రాముని యొక్క) విజయమును దెలుపునట్టి రామాయణమును విన్నచో, దీర్ఘాయువు కలుగును. (ఆ ఆయువంతా రామ జపం కోసమేగా? ఇక ఎంత కాలం బతికితే మాత్రం ఆ ఆయుష్షుతో ఏం లాభం? రాముడు ఇచ్చే ఆయుష్షు రాముడి భజనకే.)

ఎవడు క్రోధమును జయించి (జిత క్రోధః), శ్రద్ధతో రామాయణమును వినునో, అతడు కష్టములను దాటును. (రామాయణం వినడానికి ముందే కోపం జయించాలన్నమాట. అప్పుడిక రాముల వారి దురాగతాలు ఎన్ని విన్నా కోపం రాదు. అంచేత, ముందే కోపం జయించేసి, శ్రద్ధగా వినాలి. శ్రద్ధగా వినరేమోనని కవికి భయమే. శ్రద్ధగా వింటే 'కష్టాలను దాటును.' రాముడే కోపం తెప్పించలేని వాళ్ళని, ఇక కష్టాలేం చేస్తాయి?)

రామాయణమును విను వాని విషయమై, దేవతలూ, పితృ దేవతలూ సంతోషించెదరు. ఆ ఇంటి నుండి కార్య విఘ్నములు కలిగించు భూతములు పారిపోవును. ('రామాయణం' వినలేక!)

రుతు కాలము గలిగిన స్త్రీలు ఉత్తమోత్తములైన (అనుత్తమాన్ = తమ కన్నా ఉత్తములు లేని), పుత్రుల్ని కంటారు. (ఇద్దరు స్త్రీలు రామాయణం వింటే, మొదటావిడ కొడుకు, రెండో ఆవిడ కొడుకు కన్నా గొప్ప వాడు! రెండో ఆవిడ కొడుకు, మొదటావిడ కొడుకున్నా గొప్ప వాడు! పది మంది స్త్రీలు రామాయణం వింటే, మొదటావిడ కొడుకు, మిగతా తొమ్మిది మంది స్త్రీల కొడుకుల కన్నా ఉత్తముడు! మిగతా వాళ్ళూ అలాగే!)

ఈ పురాతన ఇతిహాసమును పూజించుచూ, చదువుచూ యున్నచో, సమస్త పాపములూ నశించును. (పాపములు కాదు, సమస్త జ్ఞానమూ నశించును.)

క్షత్రియులు శిరసా నమస్కరించి దీనిని బ్రాహ్మణుల వలన వినవలెను. ఐశ్వర్యమును, పుత్రులను బడయుదురు. సందేహము లేదు. (ప్రజలు నమ్మరేమోనని సందేహమే కవికి. 'సందేహము లేదు' అని చెప్పినప్పుడల్లా, 'ఏదో సందేహం వుంది' అనుకోవాలి.)

ఈ రామాయణమును ఎల్లప్పుడు వినునట్టి వారి మీదను, పఠించునట్టి వారి మీదను, రాముడు ప్రీతి కలిగి యుండును. (పోనీ ఒకసారి చదివితే చాలదా? 'ఎల్లప్పుడూ'నా!) ఆ రాముడు సనాతనుడు. ఆది దేవుడు. మహా బాహుడు. హరి. నారాయణుడు. ప్రభువు. విష్ణువు. లక్ష్మణుడు ఆదిశేషుడు – అని చెప్పబడుతున్నారు. (ఉచ్యత్ = చెప్పబడుచున్నాడు. అంటే, ఈ వ్యవహారం ఏదీ కవికి తెలిసింది కాదు. ఆయన కన్నా ముందు వాళ్ళు చెప్పుకున్న మాటలు ఇవి. పెద్ద వాళ్ళు అలా అంటారు కాబట్టి, అదే ఈయన చెపుతున్నాడు.)

మంగళకరమైన ఈ కావ్యము విన్నచో, ధన ధాన్యాభివృద్ధి జరుగును. కుటుంబ వృద్ధి జరుగును. (ఏం లాభం? ధన ధాన్యాలు పెరిగి, కుటుంబం కూడా పెరిగితే, మళ్ళీ మామూలేగా?)

– ఉత్తములైన స్త్రీలనూ, సుఖములనూ ఈ భువిలో పొందవచ్చును. (ఏక పత్నీ వ్రతుడి కథ చదివిన వాడికి, ఎక్కువ మంది స్త్రీలు దొరుకుతారటండీ! రామాయణం చదివి, 'ఏక పత్నీవ్రతం' అంటే హడలెత్తి దాని జోలికి పోకుండా ఎక్కువ పెళ్ళిళ్ళు చేసుకుంటారు గావున్ను! ఆ దొరికే స్త్రీలందరూ 'ఉత్తములు.' అంటే, పతివ్రతలు! ఇది విన్న స్త్రీలయితే పతివ్రతలవుతారు గానీ, పురుషులు మాత్రం ఏక పత్నీవ్రతులు కారన్న మాట! ఏక పత్నీవ్రతుడి కథ రాసిన కవి, పురుషులకు పతివ్రత భార్యల్ని ప్రసాదిస్తున్నాడు. మరి స్త్రీలకి? 'రామ కథ విన్న స్త్రీలకు ఏక పత్నీవ్రతులైన భర్తలు దొరుకుతారు' అని కూడా చెప్పవచ్చు కదా? అలా చెప్పరు. ప్రతీ చోటా పురుషుల కోసమే, వారి ఆధిక్యత కోసమే బోధిస్తారు!)

– ఆయుష్షును, ఆరోగ్యమును, యశస్సును, బుద్ధిని, సుఖమును, సోదరుల మీద ప్రీతిని, (రాముడికి సోదరుల మీద ఎంత ప్రీతో అంత ప్రీతినా?) ఇచ్చునట్టి ఈ కావ్యమును, నియమముగా చదవవలెను. (ఎన్ని ఇచ్చినా అది 'బుద్ధి'ని మాత్రం ఇవ్వదు.)

– ఇది పూర్వం జరిగిన చరిత్ర. దీనిని శ్రద్ధతో పఠింపుము. విష్ణువు బలము వృద్ధి పొందును గాక! (విష్ణు భక్తులు ఎక్కువైతే, అదే విష్ణువు బలం వృద్ధి పొందడం.)

– ఆది కవి వాల్మీకి రచించిన ఈ రామ చరిత్రను భక్తితో వ్రాసిన వారును, (వాల్మీకికి తోచని వింతలతో, మహిమలతో, కల్పనలతో, అబద్ధాలతో తిరిగి రాసిన వారు), దీనిని వ్రాయించిన వారును (చేసిన పాపాలు వొదిలించుకోవాలని), స్వర్గంలో నివసిస్తారు. (ఇలాంటి వాళ్ళందరూ స్వర్గానికి పోతే, భూలోకం ఎంత సుఖంగా వుంటుందో!)

ఇంత వరకూ చెప్పింది – యుద్ధ కాండలో ఫల శృతి. అంటే వినడం వల్ల వచ్చే ఫలం. ఉత్తర కాండలో 'ఫల శృతి' కూడా ఇలాంటి లాభాలే చెపుతోంది. కొత్త సంగతులు రెండో మూడో మాత్రమే. అవి ఇవీ:

రామాయణంలో ఒక్క శ్లోకం చదివినా, అందులో ఒక్క పాదం చదివినా, అందులో ఒక్క పదం చదివినా, సమస్త పాపాలూ పోతాయి. (ఎన్ని పాపాలైనా చెయ్యండి, ఏం ఫర్వాలేదు. అన్నీ పోయే మార్గం వుంది. రామాయణంలో వొక్క ముక్క చదవండి చాలు!)

ఒక్క సర్గ చదివితే చాలు. వెయ్యి అశ్వమేధ యాగాలు చేసినంత పుణ్యం. (వెయ్యి గుర్రాల్ని చంపినంత పుణ్యం! అంత పుణ్యం ఏం చేసుకుంటాం? ఎన్ని పాపాలు చేసినా పుణ్యం ఇంకా మిగులుతుందే! ఇంకా ఇంకా పాపాలు చేసెయ్యండి. అవి పోయే మార్గం వుంది!)

రామాయణం చదివిన వాడూ, కురుక్షేత్రంలో సూర్య గ్రహణానికి బంగారం దానం చేసిన వాడూ, ఇద్దరూ ఒక రకంగానే పుణ్యం పొందుతారు. (ఇద్దరూ ఒక రకంగానే మూర్ఖులవుతారు.)

రామాయణము చెప్పువానికి వస్త్రాలూ, బంగారమూ దానం ఇవ్వాలి. అతడు తృప్తిపడితేనే దేవతలు తృప్తిపడతారు. (దేవతలు తృప్తిపడి మన

కేమీ ఇవ్వరు. అనవసరం. బంగారం పాడు చేసు కోకండి!)

రాముడి చరిత్ర అంతా వినేవారు (అంతా వింటేనే సుమా, అదీ షరతు) విష్ణు సాయుజ్యం పొందుతారు. అతని తండ్రులూ, తాతలూ కూడా. సందేహం లేదు. (అంటే సందేహమే. తండ్రులూ తాతలూ మనవళ్ళూ అందరూ 'రంభ' దగ్గిరికే! విష్ణువూ రంభ దగ్గిరికే! విష్ణువుని అలా కలుస్తారు!)

ఈ కథ పూర్వం జరిగింది. ఇది మీకు శ్రేయస్సు కలిగిస్తుంది. తప్పకుండా చదవండి! నమ్మండి! (ఇలాంటి కథల్ని వెనకటి సమాజాల సంగతులేమైనా తెలుస్తాయని చదువుతాం. అంత వరకూ చేస్తాం గానీ, ఈ మహిమల్ని 'నమ్మాలి' కూడానా? అది మా వల్ల కాదు సుమా!)

★ ★ ★

ఈ కవి ప్రకారం, మానవ సమాజంలో అందరి కోరికలూ తీరే మార్గం 'రామాయణం' చదవ డమే, వినడమే!

జీవితాలకు ధనం కావాలి. సుఖాలు కావాలి. ఆరోగ్యం కావాలి. మొగ పిల్లలు కావాలి. అందమైన పతివ్రత భార్యలు కావాలి. శత్రువుల్ని జయించాలి. పొరుగు వాడికన్నా ఆధిక్యం కావాలి. ఇతరులతో సాటి లేని స్తితి కావాలి. పొరుగు ప్రదేశాలకు వెళ్తే సుఖంగా ఇంటికి చేరాలి. తొందరగా చచ్చిపోకుండా ఎక్కువ కాలం జీవించాలి. ఇంటి వ్యవహారాల్లో ఆటంకాలూ, ఇబ్బందులూ లేకుండా వుండాలి. ఎన్ని తప్పులు చేసినా అవి తప్పులు గాకుండా అయి పోవాలి. పుణ్యం కావాలి. బతికినన్నాళ్ళూ సిరి సంపదలతో సుఖంగా బతికి చచ్చిపోయిన తర్వాత దేవుడి పక్కకు వెళ్ళి కూర్చోవాలి.

ఇవన్నీ మానవ సమాజంలో కోరికలు!

"మీ కోరికలన్నీ తీరతాయి. మరి రామాయణం చదవండి" అంటున్నాడు కవి.

ఎన్నో వందల సంవత్సరాల నించీ, ప్రజలు ఆశతో, అమాయకత్వంతో ఈ మాటలన్నీ నమ్ము తూనే వున్నారు.

రామాయణం చదివితే ఎన్నో లాభాలు కలుగు తాయని కవి చెపుతున్నాడు కదా? అది ఎంత నిజమో తెలుసుకోవడానికైనా 'వాల్మీకి రామాయణం' నిజంగానే చదవండి! కానీ, ఒక్క షరతు! దాన్ని ఒక కథని చదివినట్టు చదవాలి. 'రాముడు దేవుడు' అనే విశ్వాసంతో బైల్దేరకూడదు. ఆ పాత్రని ఒక కథలో పాత్రని చూసినట్టే చూడాలి!

మీ ముందుకి ఒక తగువు వస్తే, అందులో మీరు తీర్పు చెప్పవలసి వస్తే, మీ ఇష్టాయిష్టాలూ మీ నమ్మకాలూ అన్నీ పక్కన పెట్టి ఆ తగువుని వింటారు కదా? – అలా చదవండి!

రామాయణం వింటే ధనం ఎక్కణ్ణించి వస్తుంది? ఎలా వస్తుంది? జీవితాల్లో వుండే ఈ పరిస్తితులు ఎలా మారుతాయి? రామాయణం వినడానికీ, కొడు కులు పుట్టడానికీ, సంబంధం ఏమిటి? రామాయణం వినని వాళ్ళకి కూడా కొడుకులు పుడుతున్నారు కదా? – ఇలా ఆలోచిస్తూ చదవండి!

ఒక్క చోట ప్రశ్నించడం ప్రారంభమైతే, ఇక అది అలాగే సాగుతుంది. ఎక్కడా ఆగదు.

రామాయణం చదవడం నిజంగా అవసరం. చదివితేనే కదా దాని సంగతులు తెలిసేది? దాన్ని చదవడం వల్ల మనకు వచ్చేది ధనాలూ స్వర్గాలూ కాదు. శ్రీరాముడి ఉత్తమత్వం అర్ధమవుతుంది. రామాయణ ధర్మాలూ, రామాయణ సంస్కృతీ, ఆ నాటికైనా ఈ నాటికైనా ఎంత అధర్మమో అర్ధమవు తుంది. రామాయణం ఆ నాడూ ఈ నాడూ ఎవరికి అనుకూలమో, ఎవరికి వ్యతిరేకమో అర్ధమవుతుంది, రామాయణం పవిత్ర గ్రంధమనే నమ్మకాలన్నీ చెల్లాచెదురవుతాయి.

**ఎంతోకాలం భ్రమల్లో, మౌఢ్యంలో వున్న ప్రజలకు, రామాయణం చదవడం కనువిప్పే. ఆలోచించడంలోనూ నిజం గ్రహించడంలోనూ ఇది అభివృద్ధే.**

**అభివృద్ధి మార్గంలో ప్రారంభమైన ఈ మార్పు, రామాయణం దగ్గిరే ఆగదు. దాని నడక ఇంకా, ఇంకా ముందుకే! ఇంకా అభివృద్ధికే! అంటే, రామాయణం చదివితే చాలా మంచిదే. అది, కవి చెప్పిన లాభం కాదు. దాని వ్యతిరేక లాభం. అందుకే, రామాయణం చదవాలి!** ★

# 'కవి'గా వాల్మీకి

కథలు చెప్పడమూ, రాయడమూ – అనే కళలు ఇంకా బాల్య దశలోనే వున్న కాలంలో రచన చేసిన కవి – వాల్మీకి. ఈయనే రామాయణ కవి. బాల్య దశ నాటి రచనా విధానంలో ఎన్ని తప్పులు జరగడానికి వీలుందో అన్ని తప్పులూ జరిగాయి, వాల్మీకి రచనలో.

కానీ, వాల్మీకి మహా జ్ఞాని అనీ, తర్వాత కాలం కవుల కన్నా వాల్మీకికే ఎక్కువ తెలుసనీ, వాల్మీకి ఒక్క తప్పు కూడా చెయ్యడనీ, రామాయణంలో తప్పులు వాల్మీకి చేసినవి కావనీ – ఈ రకంగా ఆ కవి మీద మూఢ భక్తితో వాదించే వారి కోసం, ఆయన రచనా వ్యవహారం ఏమిటో కొంచెం చూడాలి.

'రామాయణం' అనేది – వేరు వేరు జాతుల మధ్య జరిగిన యుద్ధాల్లో, జయించిన జాతిని కీర్తించే కథ. అంతేగాక, అది 'దేవుడి' కథ కూడా. అందుకే ఆ కథ రాసిన కవి మీద మూఢ భక్తి. కానీ, ప్రక్షిప్తాల కవులు కూడా ఆ కథని కీర్తిస్తూ రాసిన వాళ్ళే. అయినా, వాల్మీకి భక్తులకు ప్రక్షిప్తాల కవుల మీద నిష్కారణమైన ద్వేషం! ఈ కథలో తప్పులన్నీ ప్రక్షిప్తాల కవులవల్లే సంభవించాయని ఈ భక్తుల వాదం. కానీ, రచనలో తప్పులు, ప్రక్షిప్తాల కవుల వల్లే కాదు, అసలు కవి వల్ల కూడా జరగవచ్చు. ఈ సంగతి వాల్మీకి భక్తులు ఎక్కడా గ్రహించలేదు.

రామాయణంలో తప్పులకూ, లోపాలకూ రెండు రకాల కారణాల్ని ఊహించవచ్చు.

**1.** ఇది, కట్టు కథల రూపంలో (మైథాలజీ పద్ధతిలో) నడిచిన సాహిత్యం అవడం. **2.** కథా వస్తువు అబద్ధపు విషయాల మీదా, అబద్ధపు విలువల మీదా ఆధారపడి వుండడం. – రచనలో అన్ని లోపాలూ, ఈ రెండు కారణాలలో దేనికో ఒక దానికి సంబంధించి ఉంటాయి.

**1. కథ, కల్పన రూపంలో సాగడం వల్ల వచ్చే తప్పుల గురించి:** రచనలో సంఘటనలన్నీ నిజ జీవితాల్లో జరిగినట్టే, వాస్తవ పద్ధతిలోనే జరిగితే – ఒక సంఘటనకూ, ఇంకో సంఘటనకూ వైరుధ్యం వుండదు. కానీ, ఒక సంఘటన, కల్పనగా మహిమలతో జరిగి, ఇంకో సంఘటన వాస్తవ పద్ధతిలో జరిగితే, రెంటికీ సమన్వయం కుదరదు. అక్కడ తప్పు తప్పదు.

ఈ కథలో, ముఖ్య పాత్ర అయిన రాముడు – మానవుడి గానూ వుంటాడు, మానవాతీతుడి గానూ వుంటాడు. అతడు – రాళ్ళకూ, రప్పలకూ శాపాలు పోగొట్టి అందమైన రూపాలూ స్వర్గాలూ ఇవ్వగలిగే, భక్తుల్ని స్వర్గాలకు పంపగలిగే మానవాతీతుడు! కానీ, ఒక నది దాటడానికి పడవ ఎక్కుతాడు! లోకాలన్నిటినీ ఒక్క బాణంతో భస్మం చేసెయ్య గలిగిన మానవాతీతుడు! కానీ, సముద్రం దాటడం ఎలాగో తోచక వొడ్డున కూర్చుని బావురుమని ఏడుస్తాడు! సమస్త మానవులకూ ఐశ్వర్యాలు ఇవ్వగలిగిన మహానుభావుడు! కానీ, తన సిరి సంపదల కోసం, తండ్రి నించి వచ్చే ఆస్తి కోసం, రాజ్య సుఖాల కోసం తల్లడిల్లిపోతూ వుంటాడు! ఇవన్నీ వైరుధ్యాలే! ఈ వైరుధ్యాలు ఎందుకు వచ్చాయంటే, ఒకే పాత్ర, మానవుడి గానూ, మానవాతీతుడి గానూ కూడా వుండడం వల్ల!

రాముడు – సముద్రుణ్ణి దండించి ప్రత్యక్షం చేసుకోగలిగేటంత మహిమాన్వితుడు కదా? – ఇది మానవాతీత లక్షణం. కల్పన! ఈ రాముడే – సముద్రం దాటడం గురించి బెంబేలెత్తుతాడు! – ఇది మానవ లక్షణం వాస్తవం. ఈ విరుద్ధ లక్షణాలు ఒకే పాత్రలో వుంటే, అదే అవక తవక. అది, ఆ పాత్రని అపహాస్యం పాలు చేస్తుంది.

'అనగనగా ఒక రాజు, అతనికి పిల్లలు లేరు'. ఇది వాస్తవ సంఘటన. 'ఆ రాజుకి దేవతలు వరాలు ఇచ్చారు. పిల్లలు కలగడం కోసం పాయసం పంపారు.' ఇది కల్పన; మహిమ. ఇక, అవక తవకలు ప్రారంభం!

కథలో, అన్ని సంఘటనలూ వాస్తవాలే అయితే, అలాంటి కథలు సాంఘికాలే అవుతాయి. లేదా, అన్ని సంఘటనలూ కల్పనే అయితే, అప్పుడు కథే నడవదు. ఎలాగంటే: రాముడు, తన మహిమతో సేతువు నిర్మించడం కల్పన కదా? ఆ సేతువుని, రావణుడు, తన మహిమతో ఎప్పటి కప్పుడు పడగొట్టేస్తూ వుంటే? ఒక

కల్పన మీద ఇంకో కల్పనని ప్రయోగిస్తే? ఇరు వేపులా కల్పనలే వుంటే? ఇక సేతువు నిర్మాణం ఎప్పటికీ జరగదు.

హనుమంతుడు తన మహిమతో లంకని తగల బెట్టడం కల్పన కదా? రాక్షసులకు కూడా మహిమలు వుంటాయి కాబట్టి, వాళ్ళు, ఆ మంటలన్నిటినీ ఎప్పటి కప్పుడు ఆరిపోయేటట్టూ, లంక చెక్కుచెదరకుండా వుండేటట్టూ చేస్తే? లంకకి ఏమీ జరగదు.

అన్నీ కల్పనలే అయితే, కథే వుండదు.

అన్నీ వాస్తవాలే అయితే, సమాజంలో వుండే నిజాల్ని చూపించే కథలే తయారవుతాయి.

కానీ, కొన్ని కల్పనలూ కొన్ని వాస్తవాలూ అయితే, అదే మైతాలజీ. కట్టు కథ. ఇలాంటి కథల్లో కల్పనలూ వాస్తవాలూ కలిసిపోయి వుంటాయి. అలా వుంటేనే కథ నడుస్తుంది. కానీ, దాని వల్ల బోలెడు తప్పులు తయారవు తాయి. ఇలాంటి కథల్లో తప్పులు లేకుండా వుండడం ఎక్కడా జరగదు. ఈ రకం సాహిత్యం ఇలాగే వుంటుంది.

అయితే, కవులు, ఇందులో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఆ జాగ్రత్తలు, కొన్ని అవక తవకల్ని కొంతైనా తగ్గించగలుగుతాయి. ఎలాగంటే: రాముడు, సముద్రం దాటడానికి మరీ అంత దుఃఖ పడక్కర లేదు. 'దీన్ని ఎలా దాటాలి?' అని కొంచెం ఆలోచించినట్టు మాత్రమే చూపిస్తే, అక్కడ అపహాస్యం వుండదు. అలాగే, ఆ పాత్ర ప్రవర్తనలో దుఃఖాన్నీ నిరాశనీ వీరాలాపాల్నీ కొంచెం పరిమితుల్లో వుంచవచ్చు. అలా చేస్తే అది వాస్త వాలకు దగ్గిరిగా వుంటుంది. కానీ, వాస్తవాలకు దగ్గిరిగా వుండడం మైతాలజీ లక్షణం కాదు. కల్పనకీ తర్కానికీ పొసగదు. మైతాలజీలో, తర్కం బొత్తిగా వుండదని అర్థం కాదు. మైతాలజీలో వాస్తవ సంఘటనలు కూడా వుంటాయి కాబట్టి, అలాంటి చోట్ల తర్కం వుంటుంది. కానీ, అది అతిశయాలతో వుంటుంది. ప్రతీ సంఘటనా అతిశయా లతో సాగడమే మైతాలజీ పద్ధతి.

కథలో ఎక్కడ కల్పన వుండాలో, ఎక్కడ వాస్తవం వుండాలో, ఏది ఎంత స్థాయిలో వుండాలో, కవి, కథా గమనాన్ని బట్టి నిర్ణయిస్తాడు. కొన్ని చోట్ల తన పక్షపాత ధోరణిని బట్టి కూడా. లంకలో హనుమంతుడికే విజయం కలగాలంటే, మహిమలన్నీ హనుమంతుడి తోటే చేయిస్తాడు. లంకలో వాళ్ళని ఏమీ చెయ్యలేని స్తితిలో వుంచుతాడు. కథలో, ఒక ఘట్టంలో, రాముడే బాధపడవలసి వుంటే, ఆ ఘట్టంలో రాముడి శతృవులే మాయలు చేస్తారు. రాముడు మానవ మాత్రుడిగా వుండి పోతాడు. కథ ఎలా నడవాలో దాన్ని బట్టి ఒక్క పక్షం వేపే మాయలు జరుగుతాయి. (అతి స్వల్పమైన వాస్తవం మీద ఆధారపడి ఎక్కడికక్కడ ఊహాగానాలతో కల్పనలతో సాగే ఈ నాటి రచనలు కూడా మైతాలజీలే. సోషల్ మైతాలజీలు!)

కథా విధానం మైతాలజీ పద్ధతిలో వుండడం వల్ల పుట్టుకు వచ్చే తప్పుల్ని లెక్క లోకి తీసుకోకూడదు. ఆ విధానంలో ఆ తప్పులు తప్పవు. ఒక భాషని ఇంకో భాషలోకి అనువాదం చేసుకున్నట్టుగా, మహిమల్లో వున్న అసలు విషయాల్ని వాస్తవాలలోకి అనువాదం చేసు కోవాలి. ఆ 'విషయాలే' ముఖ్యం.

**2. కథా వస్తువులో, అబద్ధపు విషయాల వల్లా, అబ ద్ధపు విలువల వల్లా పుట్టుకు వచ్చే వైరుధ్యాల గురించి:** కోసల రాజ్యాన్ని తీసుకునే హక్కు భరతుడిదే – అని రాముడికి తెలుసు. ఆ సంగతి రాముడే భరతుడికి చెపుతాడు. ఆ సంగతి తెలిసి కూడా రాముడు, రాజ్యాన్ని తనే తీసుకోవడానికి మొదట సిద్ధపడతాడు. అలాంటి రాముణ్ణి చాలా ఉత్తముడిగా చూపించాలని కవి ఎంత తెలివిగా, ఎంత చాకచక్యంగా, రచన చేసినా ఆ పని ఎలా చెయ్యగలడు? అది సాధ్యం కాదు. రాజ్యం భరతు డికే హక్కనే సంగతి రాముడికి మొదట తెలీదనీ, ఆ సంగతి తెలియకే రాముడు పట్టాభిషేకానికి సిద్ధ పడ్డాడనీ – ఆ రకంగా కథ నడిస్తే, రాముడు నిర్దోషి అవుతాడు. కానీ, కథని అలా నడిపి, రాముణ్ణి నిర్దోషిని చేసినా, అప్పుడు దశరథుడి మాటేమిటి? దశరథుణ్ణి కూడా నిర్దోషిని చేసే విధంగా కథ నడపడం సాధ్య మేనా? తన రాజ్యాన్నికైక కొడుక్కే ఇస్తానని మాట ఇచ్చి, ఆ వాగ్దానాన్ని ఎగ్గొట్టిన వాణ్ణి గురించి, 'ఈయన గొప్ప సత్య వంతుడు' అని కవి ఏ రకంగా ఒప్పించగలడు? అసలు దశరథుడు ఆ వాగ్దానమే చెయ్యలేదన్నట్టుగా కథ నడవాలి. కథ అలా మారితే, అది రామాయణమే అవదు. అప్పుడు, రాముడి వన వాసమూ, రావణ సంహారమూ, ఏమీ వుండవు.

కథని ఇప్పుడు వున్న విధంగానే వుంచి, అందులో దశరథుణ్ణీ రాముణ్ణీ ఉత్తములుగా చిత్రించాలంటే, అది జగత్తులో ఏ కవికీ సాధ్యం కాదు. ఇదే కథని వాల్మీకి కాకుండా ఇంకో కవి రాసినా, ఎంత తెలివిగా రాసినా,

చిన్న చిన్న లోపాలు లేకుండా చెయ్యగలడు గానీ, ఆ పాత్రల్ని ఉత్తములుగా చెయ్యలేడు.

కానీ, ఆ పాత్రల్ని కవి ఉత్తములు గానే చెపుతూ వుంటాడు. 'తప్పు అంతా కైకది. కైకది కూడా కాదు. మందరది. మందరది కూడా కాదు. అంతా విధిది. విధి అలా చేసింది' అంటూ వుంటాడు. ఆ జవాబుతోనే రామదాసులు ముగ్ధులవుతారు.

వనవాసం ప్రారంభమైన తర్వాత, గంగ వొడ్డున, రాముడు తండ్రిని నానా తిట్లూ తిడుతూ గడిపిన రాత్రిని తీసుకోండి. ఈ ప్రవర్తనకీ, పితృ భక్తికీ పొసుగుతుందా? బిడ్డలకు తల్లి దండ్రుల మీద ఎలాంటి ప్రేమలు వుండాలో అవే, అంత వరకే వుంటే, వాటి వల్ల వైరుధ్యాలు రావు. కానీ ఇక్కడ, పితృ భక్తి అనేది ఒక కపట సాంప్రదాయం. ఆ భక్తి అంతా తండ్రినించి అందే ఆస్తి కోసమే. 'ఆస్తి' మీద ఆధారపడ్డ భక్తి, ఆ ఆస్తి అందనప్పుడు తప్పకుండా కపట భక్తిగా మారుతుంది. అందుకే పితృ వాక్య పరిపాలకుడితో తండ్రిని తిట్టించడం, కవికి, తప్పుగా తోచలేదు.

రాముడు, తన వన వాసం కోసం రాక్షసుల ప్రాంతంలోకి వెళ్ళడాన్ని తీసుకోండి. జనస్తానం అనేది రావణుడి ప్రాంతం. రాముడు అక్కడికి ఎందుకు వెళ్ళినట్టు? 'వన వాసానికే' అంటాడు కవి. కథ ప్రకారం కూడా ఇది పెద్ద అబద్ధం. రాముడు, వన వాసంలో పది సంవత్సరాల కాలం ఎక్కడ గడిపాడో, మిగతా నాలుగు సంవత్సరాలు కూడా అక్కడే ఎందుకు గడప లేదు? చిత్రకూటం లోనూ ఆగలేదు. అగస్త్యుడి ప్రాంతం లోనూ ఆగ లేదు. ఇంకా వెళ్ళి వెళ్ళి రాక్షసుల భూమిలోకి వెళ్ళాడు. అక్కడా వనవాసం? అసలు విషయం, రాక్షసుల భూమిని ఆక్రమించాలని. కథ ఇలా వుంటే, ఈ రాజ్య కాంక్షకీ, 'ఉత్తమత్వం' వర్ణనలకూ ఎలా పొసుగుతుంది?

"రాముడు, రుషి జీవితం గడుపుతున్నాడు" అంటాడు కవి. కానీ, రుషులు వేటాడరు. యుద్ధాలు చెయ్యరు. రాముడు అన్నీ చేస్తాడు. ఏ కవి అయినా దీన్ని ఎలా ఒప్పించగలుగుతాడు?

రాముడి పట్టాభిషేకం ఆగిపోతే, అతనికేదో గొప్ప అన్యాయం జరిగిపోయినట్టూ, అతని హక్కుని ఎవరో లాగేసినట్టూ, రాముడు యుద్ధాలు చేస్తోన్నా అది రుషి జీవితమే అయినట్టూ – ఇలా, వాదిస్తూ వుంటాడు కవి.

ఈ కథా వస్తువులో వున్న ఉత్తమ జాతీ, ఉత్తమ కులం, ఉత్తమ వంశం, పితృ భక్తీ, పాతి వ్రత్యం – ఇవన్నీ అబద్ధపు విలువలే. ఎదటి పక్షాలకు హాని చేసే విలువలే. ఈ రకంగా, మొత్తం కథా వస్తువే అబద్ధాల లోంచి పుట్టుకొచ్చింది. ఒక జాతి, ఇతర జాతుల భూముల్ని ఆక్రమించడానికి పూనుకున్న కథ ఇది. దీన్ని 'ధర్మం' కోసం జరిగిన పోరాటం లాగ చూపించాలంటే, అందులో అబద్ధాలూ, మోసపు వాదనలూ తప్పవు. వాల్మీకి అయినా, గీల్మీకి అయినా, ఈ మోసాలకు తళుకులు అద్దిన వాళ్ళే.

ఈ కథలో తప్పులన్నీ ఒకే రకం కాదు. కొన్ని చాలా చిన్నవి. కొన్ని చాలా పెద్దవి. చిన్న తప్పుల్లో, కవి మతి మరుపుతో చేసిన పొరపాట్లు చాలా వున్నాయి. ఉదా: ప్రశ్రవణ పర్వతం, పంచవటి దగ్గిర ఉంది. రుష్యమూక పర్వతం, కిష్కింధ దగ్గిర ఉంది. అయినా, ఈ సంగతి కవి ఎప్పుడూ గుర్తు పెట్టుకోడు. రుష్యమూక పర్వతాన్ని ప్రశ్రవణ పర్వతం అనడమే చాలా ఎక్కువ సార్లు జరి గింది.

అలాగే, 'అంగారక' అనే రాక్షసి గురించి మళ్ళీ చెప్పవలసి వచ్చినప్పుడు 'సింహిక' అనడం, 'మాయావి' గురించి చెపుతూ 'దుందుభి' అనడం – ఈ రకమైన విషయాలన్నీ మతిమరుపు పొరపాట్ల కోవలోకి వస్తాయి. యుద్ధం జరిగేటప్పుడు, త్రిశిరస్సు, అకంపనుడు, నరాంతకుడు – లాంటి పేర్ల వాళ్ళు చచ్చిపోయినా, అవే పేర్లు మళ్ళీ మళ్ళీ వస్తాయి. ఇది కవి మతిమరుపు కిందకి రావచ్చు; లేదా, ఒకే పేరు గల వేరు వేరు పాత్రలూ వుండవచ్చు.

## వాల్మీకి రచనలో కొన్ని వర్ణనలు!

నదులు గల గల పారుతూ నవ్వుతున్నట్టు; పర్వతాలు జలపాతాలతో ఏడుస్తున్నట్టు; పర్వత శిఖరాల మీద మేఘాలు వాలి పర్వతాలింకా పెరిగినట్టు; వెదుళ్ళ వనంలో గాలి జొరబడి వనమంతా నవ్వుతున్నట్టు; పర్వతాలు మేఘాల్ని కప్పుకున్నట్టు; చుట్టూ వ్యాపించిన మేఘాలతో పర్వతాలు దూరంగా నడుస్తున్నట్టు; సూర్య కిరణాలు భూమిని ప్రేమతో పట్టి పై కెత్తితే అదే పర్వతం అయినట్టు; రాళ్ళు ధగ ధగ మెరుస్తూ కళ్ళు విప్పి చూస్తున్నట్టు; వృక్షాలతో నిండిన భూమి చేతులు పై కెత్తి పిలుస్తున్నట్టు; దూరాన ఉదయిస్తున్న సూర్యుడు,

శీతలత్వం కురిపించే చంద్రుడైనట్టు!

భూమి నిండా దారాల్లాంటి నదులు, మిణుగురులతో ప్రకాశించే పర్వతాలు, మంచు కప్పిన తామర పువ్వులు, పక్షులతో నిండిన ఆకాశం, పూల నక్షత్రాలతో నిండిన చెట్లు – ఇలాంటివి నిజమైన ప్రకృతి వర్ణనలు. వీటిని మనసారా ఆనందించవచ్చు.

కానీ, 'శృంగారం' పేరుతో, ప్రకృతిలో ప్రతీ చోటా కామమే చూసే వర్ణనలు కొల్లలు. ఇలాంటివి, జుగుప్స కలిగిస్తాయి. ఎర్రబడ్డ సంధ్య, కామాతురతతో గంధాలు పూసుకుని వున్న పురుషుడిలా వుండడం; పూసిన మహా వృక్షాలు, పరిమళ ద్రవ్యాలు పూసుకున్న కాముకుల్లా వుండడం; గాలికి వూగే పూలు, తాగి తూలుతూ శృంగారాన్ని కోరే స్త్రీలలా వుండడం; ఎండిన నదుల్లో బయట పడ్డ ఇసుక తిన్నెలు, ప్రియురాళ్ళ రొమ్ముల్లా తొడల్లా వుండడం; స్త్రీల బలిసిన రొమ్ములు, ఒక దాన్ని ఒకటి వొరుసుకునే తాటి పళ్ళలా వుండడం– ఇలాంటి వర్ణనల్లో ప్రకృతేమీ కనపడదు, కవి వికారాలో, ఆ పాత్రల వికారాలో తప్ప!

సమాజంలో మనుషుల స్తితుల్ని చూపించే ఈ వర్ణనలు చూడండి! – ఛండాలుడు ముట్టుకున్న అగ్నివేదిక లాగ; ఉత్తమ కులం విడిచి హీన కులంలో కలిసిన కన్యలాగ; చెడిపోయిన ధన లాభం లాగ; తిరస్కృతమైన ఆజ్ఞ లాగ; వేద మంత్రాలకు తగని శూద్రుడి లాగ – ఈ రకం వర్ణనల్లోనే సమాజం కనపడుతుంది. మనుషుల సంబంధాలు తెలుస్తాయి. ఇలాంటి వర్ణనలు, వెనకటి కాలాల్ని తర్వాత తరాల వారికి చూపిస్తాయి.

## కొన్ని మంచి వర్ణనలు:

'కిరాతుడు పాట పాడి లేడిని వల్లో వేసి చంపినట్టు.'

'నక్కల పెత్తనంలో మేకలు క్షీణించినట్టు ....'

'మహారణ్యంలో ఓషధిని వెతుకుతున్నట్టు ....'

'ఒడిలో పామునుంచుకున్నట్టు, తనకు మృత్యు కారణమైన సీతని రావణుడు తొడ మీద వుంచుకున్నాడు.'

'చంద్రుడు, నిట్టూర్పు గాలి తగిలిన అద్దం లాగ కళా శూన్యంగా వున్నాడు.'

'క్రోధంతో నిండిన రావణుడి కళ్ళ నుంచి వేడి నూనె చుక్కలు రాలినట్టు కన్నీటి చుక్కలు రాలాయి.'

'రాముడు తన బంధు బలగంతో మర్రి చెట్టులాగ విస్తరించి వున్నాడు. రావణా! సూదితో కళ్ళు తుడుచుకోవడానికీ, నాలికతో కత్తి నాకడానికీ చూస్తున్నావు. బురదకీ, మంచి గంధానికీ వున్నంత తేడా, నీకూ రాముడికీ.'

'వజ్రం మింగితే ఈగకి జీర్ణం కానట్టు, నేను నీకు ఇమడను.'

'కృతఘ్నుడికి చేసిన ఉపకారం లాగ, నా పాతివ్రత్యం వృధా అయిపోయింది.'

ఈ రకం వర్ణనలు కథకీ, మాట్లాడే పాత్రల స్వభావాలకూ పూర్తిగా తగినవిగా వుంటాయి.

**కానీ, ఇలాంటి మంచి వర్ణనల్నీ, మంచి పోలికల్నీ మించిపోయే తప్పు వర్ణనలు బోలెడు వున్నాయి, రచన నిండా!**

"హిమాలయాల్లో కిన్నెరుణ్ణి కోల్పోయిన కిన్నెర లాగ, సీత నా కోసం ఏడ్చి యేడ్చి చచ్చిపోతుంది." ఈ మాటలన్నది ఎవరనుకుంటున్నారు? – దశరధుడు! కోడలు – కిన్నెరా, మామగారు కిన్నెరు'డూ!

వాల్మీకి భక్తులు వెంటనే "ఆఁ, అది ప్రక్షిప్తం" అంటారు. సరే, ప్రక్షిప్తమే. ఆ ప్రక్షిప్తం కవి అయినా అలా ఎందుకు రాశాడు? మామనీ కోడలినీ అలా పోల్చకూడదని ఆయనకి మాత్రం తెలీదా? తెలిసినా అలాగే చేశాడు కదా? అలాగే, వాల్మీకి అయినా అదే చేసి వుండొచ్చని ఎందుకనుకోకూడదు?

వర్ణనలు చేసేటప్పుడు, అందులో పోలికలు, ఆ సంబంధాల్ని బట్టీ, ఆ సందర్భాల్ని బట్టీ వుండాలనే స్పృహ లేకపోవడం వింతగా వుంది!

రాముడూ సీతా లక్ష్మణుడూ వనవాసం ప్రారంభించినప్పుడు అడవుల్లో నడుస్తోంటే, కవి వారిని ఎలా వర్ణించాడో గుర్తు వుందా? సీతని, 'రెండు మొగ ఏనుగుల మధ్య నడిచే ఆడ ఏనుగులా వుంద'ని వర్ణించాడు.

అలాగే, సీత నడుము చుట్టూ వున్న రావణుడి చేతిని సీత నడుముకి ఆభరణం వున్నట్టు వుందని వర్ణించాడు. ఇలాంటి పోలికలు సందర్భ శుద్ధి లేని పోలికలు! కేవలం వర్ణన కోసం వర్ణనలు!

"కైక నిశ్శంకగా పలికిన పలుకుల వల్ల దశరథుడు, బలి చక్రవర్తి వామనుని చేత చేయబడినట్లుగా ('ఇంద్రకృతమ్ యధా' – అన్నాడు కవి. ఇంద్రుణ్ణి వామనుడిగా అనువాదకులు చెపుతున్నారు), సత్య బంధాన్ని వదలుటకు శక్తుడు కాలేదు."

అంటే, బలి చక్రవర్తి వామనుడికి 3 అడుగుల నేల ఇస్తానని వాగ్దానం చేసి, తర్వాత వామనుడి ఆలోచనని గ్రహించినా, ఆ వాగ్దాన బంధం నించి ఎలాగైతే వొది లించుకో లేకపోయాడో అలాగే, దశరథుడు కైకకి వరా లిస్తానని వాగ్దానం చేసి, ఆ బంధం నించి తప్పుకోలేక పోయాడు – అని అర్థం. కవి, తన దృష్టిలో ఉత్తముడైన దశరథుణ్ణి బలితో పోల్చి, తన దృష్టిలో దుష్టురాలైన కైకని వామనుడితో పోల్చాడు! వామనుడు దుర్మార్గుడైతేనే కైక దుర్మార్గురా లవుతుంది. ఇంద్రుడంటే వామనుడనే అర్థం తప్పంటారా? పోనీ ఇంద్రుడు ఇంద్రుడే అయినా, ఇంద్రుడు కూడా కవి దృష్టిలో మంచి పాత్రే. అప్పుడు కూడా ఈ పోలికలు తప్పే.

"మహా సర్పంబు లుండుట వల్ల చొరరానిదై (అక్షోభ్యం = ప్రవేశించరాని), గరుత్మంతుడా సర్పంబు లను హరించినప్పుడు వుండు పెద్ద మడుగువలె, రాముడూ సీతా లక్ష్మణుడూ లేనప్పుడు వుండు ఆ భవనమున దశరథుడు ప్రవేశించెను."

నీటి మడుగుకి పీడ కలిగించే పాముల్లాగ రాముడూ, సీతా, లక్ష్మణుడూ, ఆ భవనానికి పీడ కలి గించే వారన్న మాట! మడుగులో సర్పాలకు, వాటి ప్రాణాలు తీసే శత్రువు వున్నాడు. అది గరుత్మంతుడు. రాముడికి కూడా అటువంటి శతృవు వున్నాడని ఒప్పు కోవాలా? రాముణ్ణి సర్పంతో పోల్చి, రాముడి శతృవుని గరుత్మంతుడితో పోల్చడం!

**జటాయువు, రావణుడితో**: "తర్క సూత్రాలతో వేదం ఎలా ఖండించబడలేదో, అది ఎంత అసాధ్యమో, నేను చూస్తూ వుండగా నువ్వు సీతని తీసుకు పోలేవు."

కానీ జటాయువు చూస్తూ వుండగానే రావణుడు సీతని తీసుకు పోయాడు కాబట్టి వేదాల్ని తర్కంతో ఖండించవచ్చని రుజువు అయినట్టే.

"రాముడు వాలిని చంపడం, పెద్ద పులి మృగ రాజుని చంపినట్టుంది."

రాముణ్ణి పెద్దపులి తోటీ, వాలిని మృగరాజు తోటీ పోల్చడం! (ఆ మాట నిజమే అనుకోండీ!)

"రాజ ద్రోహం చేసి పట్టుబడి వధార్హుడిగా వున్న దొంగ దుఃఖిస్తున్నట్టు దుఃఖిస్తున్నాను నేను."

ఏ వ్యక్తి అయినా తనని అలాంటి వధార్హుడితో పోల్చుకుంటాడా?

"గర్భంలో శిశువు బయటపడక పోతే వైద్యుడు శిశువుని గర్భంలోనే ముక్క ముక్కలు చేసినట్టు, ఈ రావణుడు నన్ను ముక్క ముక్కలు చేస్తాడు."

వైద్యుడు, తల్లిని రక్షించడానికే ఆ పని చేస్తాడు. అది మంచి పనే. రావణుడు సీతని చంపడానికీ, వైద్యుడు చేసే మంచి పనికీ, పోలిక కుదరదు.

**సుగ్రీవుడు రాముడితో**: "కృతఘ్నుడు స్నేహం విడిచి పెట్టేటట్టు, నువ్వు దుఃఖం విడిచి పెట్టు." కృత ఘ్నుడు స్నేహాన్ని విడిచి పెట్టడం – చెడ్డపని. రాముడు దుఃఖం విడిస్తే, అది మంచిదే! ఈ పోలిక పనికి రాదు.

**వాలి పోయినప్పుడు సుగ్రీవుడి ఏడుపు**: "పుటం వేసిన బంగారం లోంచి మకిలి పోయి పరిశుద్ధమైన బంగారం మిగిలినట్టు, అన్నని చంపించిన పాపం సైచ లేక నాలో సాధు గుణాలు దూరమవుతున్నాయి."

సాధు గుణాలు దూరమైతే దుర్గుణాలు మిగులు తాయి. అవేనా, పుటం వేసినప్పుడు మిగిలే స్వచ్ఛమైన బంగారం? 'నాలో పశ్చాత్తాపం వల్ల చెడ్డ గుణాలు పోయి మంచి గుణాలు మిగిలాయి అనాలి కదా?

"నదులు, గట్లు అనే పెద్దల్ని ధిక్కరించి, సముద్రు డనే భర్త దగ్గిరికి పోతున్నాయి."

భర్త దగ్గరకు పోవడం, పెద్దల్ని ధిక్కరించే కార్యమా? పైగా, పెద్దల ప్రకారం నడిచే కార్యం.

**వానర సైన్యం, అంగదుడితో**: "యజమానివైన నువ్వు మాకు భార్యవు. మాకు రక్షకుడవైన నిన్ను మేము భార్యని రక్షించుకున్నట్టు రక్షించుకోవాలి."

ఈ రకమైన తప్పు పోలికలకు అంతు లేదు.

## కథలో ఎక్కడి కక్కడ అనవసరపు నాట కీయతా, అనవసరపు వర్ణనలూ కొల్లలు.

రావణుడు రుషి వేషంతో, (మంచి వేషంతో) సీత కోసం వస్తూ వుంటాడు. అటువంటి వాణ్ణి చూసి పిట్ట లన్నీ వొణకడం, జంతువులన్నీ వొణకడం, వృక్షాలు కదలక పోవడం, గోదావరి బిగుసుకు పోవడం – ఇక్కడో తట్టెడు వర్ణన రుషిని చూసి ప్రకృతి ఇలా అయిపోయిం దని చెప్పడం అవసరమా? రావణుడు దుష్ట పాత్ర కాబట్టి వాడు రుషి వేషం వేసుకున్నా భయంకరంగానే వున్నాడని

దీని అర్థం కదా? అలాగైతే ఆ రుషిని చూసి సీత కూడా భయపడాలి. కానీ, సీత మాత్రం అతన్ని చక్కగానే ఆహ్వానిస్తుంది. ఎటొచ్చీ చెట్లకీ పిట్లకే భయం!

రావణుడు సీతని ఎత్తుకు పోతూ వున్నప్పుడు, పువ్వులు రాలడం. నగలు రాలడం గురించిన వర్ణనలు సందర్భానికి అవసరమైనవే. కానీ, అవి సుందర దృశ్యాల లాగ సాగుతాయి.

కథ ప్రకారం సుగ్రీవుడు ఉత్తముడే. రాముడికి మంచి స్నేహితుడే. హనుమంతుడు, రాముడికి గొప్ప భక్తుడూ, దాసుడూ. వానరులంతా సేవకులే. రాముడు రుష్య మూకం మీద వున్న వానా కాలంలో, కిష్కింధ నించి ఒక్కరు కూడా అతని దగ్గిరికి రాలేదనే పద్ధతిలో కథ నడుస్తుంది. కిష్కింధలో సుగ్రీవుడు తన లోపమేమీ లేకుండా సైన్యాల కోసం సకాలంలోనే ఆజ్ఞలు ఇచ్చాడు. హనుమంతుడు కిష్కింధలో కూచుని రాముడి మీద అంతు లేని భక్తి కురిపిస్తున్నాడు. కానీ రాముడి దగ్గరికి రాడు. సైన్యం కోసం ఏం ప్రయత్నాలు జరుగుతున్నాయో చెప్పడు. అందుకే రాముడు కోపం తెచ్చుకున్నాడని చెప్పడం.

ఇక్కడ కథ, కిష్కింధలో జరిగే ఏర్పాట్ల గురించి రాముడికి సకాలంలో తెలిసేలా నడిస్తే, రాముడికి కోపం తెచ్చుకునే అవకాశం వుండదు. కానీ, సుగ్రీవుడు రాముడి దగ్గిరికి రాకపోవడం, యుద్ధ ప్రయత్నాలే మౌతున్నాయో రాముడికి తెలీయకపోవడం, రాముడికి చెప్పలేనంత కోపం వొచ్చెయ్యడం, స్నేహితుణ్ణి సర్వ నాశనం చేసేస్తానని కేకలెయ్యడం, లక్ష్మణుణ్ణి దూతగా పంపడం, లక్ష్మణుడు సుగ్రీవుడి మీద ఎగరడం, సుగ్రీవుడు మూల మూలలకు దూరడం – ఈ రకం ఘట్టాలతో రామ సుగ్రీవుల మధ్య కొంత డ్రామా (నాటకం) సృష్టించాలని కవి అభిప్రాయం.

డ్రామా అనేది, కథ, దాని స్వభావం ప్రకారమే సాఫీగా నడుస్తూ వున్నప్పుడు కూడా సహజంగా రావాలి. 'ఇక్కడ కాసేపు డ్రామా పెడదాం' అని సందర్భం లేని చోట దాన్ని పెడితే అది డ్రామా అవదు.

ఈ రకంగా కథ పొడుగునా సందర్భం లేని చోట్ల డ్రామాలు సృష్టించడానికి కవి చేసిన ప్రయత్నాలు ఇన్నీ అన్నీ కావు.

హనుమంతుడు, అశోక వనంలో సీత దగ్గిరికి వెళ్ళినప్పుడు, తన దగ్గిర రాముడి ఉంగరం వుంచుకుని కూడా వెళ్ళగానే దాన్ని చూపించడు. నోటి మాటలతోనే సీతని నమ్మించాలని చూస్తాడు. సీత హనుమంతుణ్ణి శంకించడం, అతన్ని చూసి భయపడడం – వంటి ఘట్టాలు సృష్టించాలని కవి అభిప్రాయం. ఉంగరాన్ని మొదటే చూపించేస్తే ఈ ఘట్టాలకు అవకాశం వుండదని కవి అనుకుంటాడు. కానీ, ఉంగరం చూపించిన తర్వాత కూడా సీత దాన్ని సరిగా నమ్మక భయపడినట్టే చెప్పవచ్చు.

**అనేక ఘట్టాలలో, అక్కడ చెప్పవలసిన విషయాలకూ, చెప్పిన విధానానికీ కుదరదు.**

పర్ణశాలలో సీత కనపడనందుకు రాముడు దుఃఖించే ఘట్టం చూడండి. ఇక్కడ విషయం ఏమిటి? భార్యని శత్రువులు ఎత్తుకు పోయారో, క్రూర మృగాలు చంపేశాయో, ఆ మనిషి ఏమైందో తెలీదు. అది చాలా పెద్ద ఆపద! ఆ మనిషి కోసం వెతుక్కోవాలి. ఆ పని ఎలా జరిగింది? విరహ శృంగార దశలన్నీ ప్రారంభమయ్యాయి. పువ్వుల్నీ పిట్టల్నీ తూనీగల్నీ అడగడం! ఇది శృంగారాన్ని అనుభూతి చెందే సందర్భమా? ఇక్కడ వుండవలసింది శృంగార వర్ణనా? రాముడు, తన భార్య పిరుదుల్నీ రొమ్ముల్నీ వర్ణిస్తోంటే, 'అయ్యో, ఇతడికి ఎంత కష్టం వచ్చిందో!' అని చదివే వాళ్ళకి అనిపిస్తుందా? దుఃఖంతో నీరై పోవలసిన విషాద ఘట్టంలో అంగాంగాల వర్ణనా?

పువ్వులతో, పిట్టలతో మాట్లాడే విధంగా రచన నడపాలంటే, అది చాలా సంతోషకరమైన ఘట్టం అయి వుండాలి. రాముడూ సీతా తోటలో దాగుడు మూతలాడుకుంటున్నారనుకోండి. సీత ఎక్కడో దాక్కుంది. రాముడు వెతకాలి. అప్పుడు పువ్వుల్ని అడిగినా, పిట్టల్ని అడిగినా, చీమల్ని అడిగినా, బాగుంటుంది. విషయానికీ, విధానానికీ సరిపోతుంది. కానీ దుఖంతో తల్లడిల్లవలసిన సందర్భంలో విరహ వర్ణనలు చేసే కవి, అసలు మతి సరిగా వున్న మనిషి కింద లెక్కకు వస్తాడా?

వానర సైన్యం సముద్రం దగ్గిరికి చేరినప్పుడు చూడండి. రాముడు అక్కడ, అంత మంది మధ్య, విరహ తాపాలూ కామ శోకాలూ మొదలు పెడతాడు, "నా సీత రొమ్ముల్ని ఎప్పుడు ఆలింగనం చేసుకుంటానో!" అని!

ఆ సైనికులందరూ భార్యా బిడ్డల్ని వదిలి పెట్టి, చావుకి సిద్ధపడి వచ్చారు. లక్ష్మణుడు 14 ఏళ్ళ నించీ

భార్య లేకుండా వున్నాడు. ఆ సందర్భంలో ఈ జ్ఞాన వంతుడు ఈ రకం వాగుడు! ఈయన కామ బాధ చూసి అందరూ కన్నీరు మున్నీరై పోవాలా?

**ఈ వైరుధ్యాలు పెద్ద పెద్ద ఘట్టాల్లోనే కాదు, రెండే రెండు మాటలుంటే వాటిలో కూడా వైరుధ్యమే.**

విభీషణుడు రాముడి పక్షంలో చేరడానికి వచ్చినప్పుడు సుగ్రీవుడి మాటలు: "ఈ బుద్ధిమంతుడైన (బుద్ధిమాన్) రాక్షసుడు మనల్ని చంపుతాడు!" – బుద్ధిమంతుడు! చంపడం! విభీషణుణ్ణి గురించి కోపంగా మాట్లాడే సందర్భం అయినా సరే, విభీషణుణ్ణి పొగడాలని కవి తాపత్రయం! కానీ వాల్మీకి భక్తులు ఇక్కడ "ఆ 'బుద్ధిమాన్' అనే మాట ప్రక్షిప్తమే" అంటారను కుందాం! ఈ రకమైన వాదనలతో వీరు వాల్మీకిని రక్షించలేరు.

కట్టు కథల సాహిత్యానికి వుండే లక్షణాల్ని అర్థం చేసుకుంటేనే వాల్మీకికి ఎక్కువ న్యాయం జరుగుతుంది. తర్కానికి స్థానం లేని రచనా విధానంలో, ఏ కవి అయినా ఇంత కన్నా ఏం చేస్తాడు?

**ఈ రచనా విధానంలో కొన్ని లక్షణాలు కనపడతాయి.**

**1.** ఒక పాత్ర మాట్లాడేటప్పుడు, అది పూర్తి అయ్యే వరకూ ఇంకో పాత్ర మాట్లాడదు. దీని వల్ల కొన్ని సందర్భాలు అపహాస్యంగా తయారవుతాయి.

**2.** కథా నాయకుడు ఎప్పుడూ అందరికీ నీతులూ ధర్మాలూ చెప్తూ వుండాలి. దీని వల్ల కూడా చాలా సందర్భాలు అపహాస్యంగా తయారవుతాయి.

**3.** సందర్భశుద్ధి లేకుండా వర్ణనల కోసం వర్ణ నలు! హనుమంతుడు సీత స్తనాల్ని వర్ణిస్తాడు. మామ గారు కోడలు కను బొమ్మల్ని వర్ణిస్తాడు! అన్నగారు, తన కామ బాధని తమ్ముడి దగ్గిర వర్ణిస్తాడు! దీని వల్ల ఎన్ని అపహాస్యాలు పుట్టుకొస్తాయో చెప్పేదేముంది?

**4.** ప్రతీ ఘట్టంలోనూ ఏదో ఒక రసం చిప్పి ల్లుతూ వుండాలి. కరుణ రసం, వీర రసం, శృంగార రసం, ఈ రసం, ఆ రసం – ఇలా. ఆ ఘట్టానికీ ఆ రసానికీ కుదిరినా కుదరకపోయినా, అది అలా సాగవల సిందే. అప్పుడది పైత్య రసమో, అపహాస్య రసమో అయిపోతుంది.

ఇవన్నీ ఈ రచనా విధానంలో కనపడే సాంప్ర దాయాలు.

## పాత్రల చిత్రణ

పాత్రల చిత్రణని తీసుకుంటే, ఏ పాత్రకీ తిన్నని, స్పష్టమైన నడక వుండదు. రాముణ్ణీ, రావణుణ్ణీ, సీతనీ, ఒకసారి క్లుప్తంగా చూస్తే చాలు.

**రాముడు:** ఇతని గుణగణాల గురించి కవి చేసిన వర్ణనలకూ కథ పొడుగునా ఈ పాత్ర ప్రవర్తనకూ సంబంధం వుండదు.

'పితృవాక్య పరిపాలన'లో వున్న అసలు రహస్యం, ఆస్తి వారసత్వం. తండ్రి వల్ల కొడుకులకు ఆస్తి వస్తుంది కాబట్టి, కొడుకులు తండ్రి పెత్తనానికి లోబడి వుంటారు. "నీ ఆస్తీ అక్కర లేదు, నీ ఆజ్ఞలూ అక్కర లేదు" అనే కొడుకులు, ఆ నాటికి ఇంకా పుట్ట లేదు.

పితృ భక్తి కొడుకులకు నిజంగా ఆనందం కలిగించేది అయితే ఏ కొడుకూ ఏ తండ్రినీ దూషించ కూడదు. కానీ, ఈ కథలో, లక్ష్మణుడూ రాముడూ కూడా తండ్రిని తిట్టిన వాళ్ళే. తండ్రిని చెరసాల్లో పడెయ్య మనీ, చంపెయ్యమనీ, లక్ష్మణుడు అన్న గార్ని అనేక సార్లు ప్రోత్సహించాడు.

పితృ భక్తిని, కొడుకులకు నిజంగా ఆనందం కలి గించే విషయం లాగా చూపించాలంటే, కథలోంచి అనేక డజన్ల సంఘటనలు తీసెయ్యాలి. పైగా, అబద్ధాలన్నీ తెచ్చిపెట్టాలి.

రాముణ్ణి నిజమైన రుషిగా చూపించాలంటే, రాముడు ఇంటి నించి ఆయుధాలు తీసుకు పోకూడదు. దేవతలు ఇచ్చే ఆయుధాలేవీ పుచ్చుకోకూడదు. వేటాడ కూడదు. యుద్ధాలు చెయ్యకూడదు. అలాంటి ఘట్టాలన్నీ తీసెయ్యాలి!

రాముణ్ణి సత్యసంధుడిగా చూపించాలంటే, అతడు మొదటే పట్టాభిషేకానికి అంగీకరించకూడదు. చిత్ర కూటంలో భరతుడికి తన పాదుకలు ఇవ్వకూడదు. భర తుణ్ణే రాజ్యం చేసుకోమనాలి. వనవాసం తర్వాత కూడా రాజ్యం తను తీసుకోకూడదు. ఆ ఘట్టాలన్నీ తీసెయ్యాలి!

రాముణ్ణి వీరుడిగా చూపించాలంటే, ఒక కష్టం రాగానే అతను భోరున ఏడ్చిన ఘట్టాలన్నీ తీసెయ్యాలి!

రాముడు నోరు తెరిచాడంటే ఏదో ఒక తప్పుడు మాట మాట్లాడవలసిందే. చిత్రకూటంలో వున్నప్పుడు, మందీ మార్బలం రావడం దూరంగా చూసి, 'భరతుడు, రాజ్యాన్ని నాకు ఇచ్చెయ్యడానికి వొస్తున్నాడేమో! తండ్రి గారే నన్ను తీసుకు పోవడానికి వొస్తున్నారేమో!'

అంటాడు. ఆఖరికి, కథ చివర్లో కూడా భరతుడు తనకు రాజ్యం నిజంగా ఇస్తాడో లేదో అని అనుమానం! రాముడు ఇలా మాట్లాడితే, రాజ్యం కోసం వెర్రెత్తి పోతున్నాడనే అర్థం రాదూ? రాముణ్ణి ఉత్తముణ్ణి చెయ్యాలంటే, అతను నోరు తెరవడానికే వీలు లేదు. అతని సంభాషణలన్నీ తీసెయ్యాలి. ఇన్ని అవక తవక ఘట్టాల్ని తీసేస్తే, ఇక ఏం మిగులుతుంది కథలో? మాటలే వుండని మూగ రాముడే మిగులుతాడు.

మైతాలజీ – అనే రచనా విధానంలో అన్ని రకాల కవితా రసాలూ, ఆ రసాలతో పాటు నాటకీయతలూ, అన్నీ వుండాలి. కానీ, ఎన్ని రకాల చమత్కారాలు ఒలక బోసినా, అసలు నిజం – ‘ఆస్తి’!

రాముడి సమస్యలన్నీ సాంఘికమైనవే. ఆస్తి హక్కూ, భార్య శీలం, జీవిత సుఖాలూ, పరువు మర్యాదలూ, వంశాల గొప్పలూ, రాజ్యాల కోసం యుద్ధాలూ – అన్నీ! రుషులు, తపస్సులు చేసి దేవుళ్ళని కోరేది కూడా – సిరి సంపదలూ, ఆయుధాలూ పతివ్రత భార్యలూ, లోక పాలకత్వాలూ – అన్నీ అవే!

రాముణ్ణి – మొదట పట్టాభిషేకానికి సిద్ధమైన సందర్భం నించీ, వనవాసం ముగిశాక భరతుణ్ణి బెదిరించడానికి హనుమంతుణ్ణి పంపే సందర్భం వరకూ వరసగా ప్రతీ ఘట్టాన్నీ చూసుకుంటూ వెళ్ళండి! అతనిలో ఉత్తమత్వం ఎక్కడైనా కనపడిందా? – పితృ వాక్య పరిపాలన అంటూనే తండ్రిని తెగ తిట్టాడు! రాత్రింబవళ్ళూ సేవలు చేసే లక్ష్మణుణ్ణి చీటికీ మాటికీ శంకించాడు! సుగ్రీవుణ్ణి శంకించాడు! సీతని శంకించాడు! ఆమెని అగ్ని పరీక్షకు గురిచేశాడు! తన కోసం రాజ్యాన్ని వదిలేసిన భరతుణ్ణి శంకించాడు! రాజుగా వుండడానికి భరతుడు అనర్హుడనీ, తనే గొప్ప అర్హుడినీ నమ్మి ఆనందించాడు.

తాటకీ, వాలీ లాంటి నిర్దోషుల్ని చంపాడు. శూర్పణఖ లాంటి స్త్రీలని హింసించాడు.

అన్నిటి కన్నా ఈ మహా వీరుడి పరువు తీసి వేసే విషయం, రావణుడితో యుద్ధం చేసేటప్పుడు రథం నడిపే సారథి రాముణ్ణి మందలించడం! ‘ఇదేం యుద్ధం చెయ్యడం? నీ మొహం లాగ వుంది. ఫలానా రకంగా చెయ్యి’ అని సారథి ఉపాయం చెప్తే తప్ప, ఆ యుద్ధం ఎప్పుడెలా చెయ్యాలో రాముడికి తోచలేదు! కవి, రాముడికి సారథితో ఉపాయం చెప్పించాడంటే, ఈ కవిని ఏ మనగలం? – వాల్మీకి భక్తులు దేనికీ ఆశ్చర్యపోరు.

ఇక, రాముడు సింహాసనం ఎక్కినా అతని ధోరణి మారదు. భార్య మీద మళ్ళీ అనుమానం! మళ్ళీ పరీక్షలు!

కుల భేదాల్ని నిలబెట్టడం కోసం హత్యలు!

ఇరుగు పొరుగు దేశాల మీద దాడులు చేసి, అక్కడి ప్రజల్ని నాశనం చేసి, ఆ రాజ్యాల్ని ఆక్రమించడం!

దేవుడి కథలాగా కనపడే కథ అంతా ఆస్తి హక్కులకూ, ఇతర రాజ్యాల దోపిడీలకూ సంబంధించిందే. కవి, తన సమాజ జ్ఞానం తోటే కథని నడిపించాడు. మహా విష్ణువు పాత్ర అయినా ఆస్తుల చుట్టూ, ఆయుధాల చుట్టూ తిరగవలిసిందే.

ఈ రాముడా ఆదర్శ ప్రభువు? ఈ రామ రాజ్యమా ఆదర్శ రాజ్యం!.

**రావణుడు:** రావణుడు వీరుడనీ, పండితుడనీ, సమస్త శాస్త్రాలూ చదివిన వాడనీ, శత్రు భయంకరుడనీ, ఇలా ఊరికే పొగడ్డం తప్ప, అతని ప్రవర్తనలో, కవి ఆ లక్షణాలేవీ చూపించడు. ‘యజ్ఞాల్ని పాడు చేసే, … రుషుల్ని బాధించే’ రావణుడు, వేద సంస్కృతికి విరుద్ధంగా కనబడడు. (లంకలో వేద పండితులున్నారు. హనుమంతుడు అశోక వనంలో చెట్టు మీద కూర్చుని, క్రతువులు చేసే రాక్షస బ్రాహ్మణుల వేద పఠనాలు వింటాడు. విభీషణుడు ఒక సారి అన్నగారి మందిరానికి వెళ్ళినప్పుడు అక్కడ వేద వేత్తలయిన బ్రాహ్మణులు పూజలు చెయ్యడం చూస్తాడు. కవి, తన వైదిక భక్తిని రావణుడికి కూడా అంటగట్టాడు.)

ఇక, కథ పొడుగునా రావణుడి వ్యవహారం చూస్తే, ఉత్త పిచ్చి మాలోకం లాగ కనబడతాడు. జనస్థానంలో ప్రవేశించిన శత్రువుని అక్కణ్ణించి తరిమే ఏర్పాట్లేమీ చెయ్యడు. హనుమంతుడు వచ్చి లంకంతా నానా బీభత్సం చేసేస్తే, ఆ శత్రువుని సుఖంగా వదిలేస్తాడు. పైగా, తనే రాముణ్ణి కీర్తిస్తూ, “రాముడు మహానుభావుడు. సముద్రం ఇంకించో, ఎండగట్టో తప్పకుండా లంకలోకి వొచ్చేస్తాడు” అని రామ పరాక్రమాన్ని భక్తితో శ్లాఘిస్తూ వుంటాడు.

రావణుడు సంధికి అంగీకరించినట్టూ, యుద్ధం ఆగిపోయినట్టూ, కథ నడపడం కుదరదు కాబట్టి, కవి ఆ పని మాత్రం చెయ్యడు. సంధికైనా అంగీకరించని రావణుడు, రాముణ్ణి పొగడ్డం బాగుంటుందో లేదో ఆలోచించకుండా కవి రావణుడితో కూడా రామ భజన చేయిస్తూ వుంటాడు. రాక్షసులందరూ రాముణ్ణి కీర్తించడమే!

రావణుడు, తనకు శత్రువుగా తయారైన తమ్ముణ్ణి, 'చక్కగా వెళ్ళి శతృవులతో కలిసిపో' అన్నట్టు సుఖంగా వొదిలేస్తాడు. శతృ కీర్తనలు చేస్తోన్న చారుల్ని కూడా ఏమీ శిక్షించకుండా విడిచి పెట్టేస్తాడు.

యుద్ధంలో తమ పక్షానికి ఎంతెంత నష్టాలు జరుగుతోన్నా, సీతకి వీసమెత్తు హాని చెయ్యడు. పైగా తనకు మహా ద్రోహం చేసిన తమ్ముడి భార్యని సీత దగ్గిర పెడతాడు.

ఈ రకంగా కథ పొడుగునా, రావణుడు చేసిన పనుల్లో ఒక్క పని కూడా అతనికి అనుకూలమైంది కాదు. అన్నీ రాముడికే అనుకూలం. రావణుడు ఎప్పుడెలా చేస్తే రాముడికి లాభిస్తూ వుంటుందో, అలాగే కవి రావణుడితో చేయిస్తాడు.

హనుమంతుడు పట్టు పడ్డప్పుడే అతణ్ణి చంపిం చేస్తే? పోనీ విభీషణుణ్ణి చంపించేస్తే? సీతని చంపిం చేస్తే? ముక్కూ, చెవులైనా కోయించేస్తే? – ఇలాంటివేం జరిగినా రాముడికి నష్టమే. కాబట్టి, ఈ పనులేవీ జరగవు.

అసలు రావణుడు సీతని ఎత్తుకు పోవడం రాముడి మేలు కోసమే. రాముడు ఆ వంక తోటే దండెత్తి వచ్చాడు.

సీత పాతివ్రత్యం చెడకుండా వుండాలి కాబట్టి, రావణుడికి శాపం!

ఈ రావణ పాత్రని చూసి రావణ భక్తులు పొంగిపోతూ వుంటారు – "మా రావణుడు చాలా ఉత్తముడు. రాముడు శూర్పణఖని బాధించినట్టు, రావణుడు, సీతని బాధించలేదు" అంటారు. కథ అలా ఎందుకు నడిచిందో పట్టించుకోరు. సీత కురూపి అవడం గానీ, చచ్చిపోవడం గానీ జరిగితే, అది రాముడికి నష్టం కాబట్టి కథ అలా నడవదు. అంతేగానీ రావణుణ్ణి ఉత్తముడిగా చూపించాలని కవి అభిప్రాయం కాదు.

రావణుడి శౌర్యమూ సిరి సంపదలూ అన్నీ రాముడి కీర్తి కోసమే.

రావణుడు ఎంత సౌందర్యవంతుడైనా సీత తిరస్కరించిందని చెప్పాలి కాబట్టి, రావణుడు మహా సౌందర్య వంతుడిగా వుంటాడు.

చివరికి రావణుడి మరణం కూడా రాముణ్ణి గొప్ప చెయ్యడం కోసమే. "రాముడి చేతిలో మరణించాలనే కోరికతోనే సంధి చేసుకోకుండా అంత పట్టుదలతో యుద్ధం చేశాడు" అని చెప్పి కవి, (ఉత్తర కాండలో) రావణుణ్ణి చచ్చిపోయినా విడిచి పెట్టకుండా రాముడి పాదాల దగ్గిర దాసుడిగా పడేశాడు! – ఇదీ కవి చేతిలో రావణుడి పాత్ర!

**సీత:** పాతివ్రత్యం అనేది ఒక కపట ధర్మం. అది, భర్తని యజమాని గానూ, భార్యని బానిస గానూ చేస్తుంది. ఈ ధర్మంలో, స్త్రీల వ్యక్తిత్వాలూ, ఆత్మ గౌరవాలూ వుండవు.

(పాతి వ్రత్యాన్ని కపట ధర్మం అనడం అంటే, స్త్రీలకు అనేక కామ సంబంధాలు వుండాలనీ, అదే మంచి ధర్మం అనీ చెపుతున్నట్టు అర్థం చేసుకోకూడదు. ఇక్కడ చెప్పేది ఏమిటంటే – స్త్రీ, భర్తతో మాత్రమే సంబంధంతో వుండాలంటే; పురుషుడు, భార్యతో మాత్రమే సంబంధంతో వుండాలి. ఏ ధర్మమైనా ఇరు పక్షాలకూ ఒకే రకంగా వుండాలి. ధర్మం అనేది ఒకే పక్షం కోసం వుంటే, అది ధర్మమే అవదు.)

కానీ, ఎంతెంత వైరుధ్యాలు గల ధర్మాలైనా, దీర్ఘ కాలంగా అమలులో వుంటే, అవి, మానవుల జీవితాల్లో లోతుగా వేళ్ళూని, జీర్ణించుకు పోతాయి. అవి ఎలా తయారవుతాయంటే, వాటినే మానవులు కోరే విధంగా, వాటితోనే ఆనందం పొందే విధంగా, తయారవుతాయి. మనుషుల మనస్తత్వాలు, ఆ ధర్మాలకే అనుగుణంగా తయారైపోతాయి. భార్య మీద అధికారిగా ప్రవర్తించడం పురుషుడికి ఇష్టమైనట్టే, భర్తకి లొంగి అతని అదుపాజ్ఞల్లో వుండడం భార్యకు కూడా ఇష్టమవుతుంది.

కానీ, ఆ ధర్మంలో వున్న వైరుధ్యం, ఎంతో కొంత మేరకు దాని పని అది చేస్తుంది. అంటే, అస్వతంత్రతతో బతికే మనుషులు, దాని వల్ల వచ్చే అవమానాలకు స్పందిస్తూ, ఎంతో కొంత ఎదురు తిరుగుతూ కూడా వుంటారు. ఇరు పక్షాలకూ సమానమైన స్థాయి లేని ఏ సంబంధంలో అయినా, ఆ సంబంధీకుల మధ్య ఘర్షణా, విరోధమూ తప్పవు. భార్యా భర్తల మధ్య కూడా అంతే.

సీతా రాముల దాంపత్యం, సమాజంలో ఇతర స్త్రీ పురుషుల దాంపత్యాల లాంటిదే. రాముడు సీతని వన వాసానికి తీసుకెళ్ళనన్న సందర్భంలో, సీత, "పర పురుషుణ్ణి చూస్తానని భయపడకు! అలాంటి దాన్ని కాను. నీకే సేవలు చేస్తాను" అని చెప్పుకుంటుంది. సాధారణంగా భర్త అయిన వాడికి, భార్య ప్రవర్తన పట్ల ఎటు

వంటి శంక కలుగుతుందో దాన్నే దృష్టిలో వుంచుకుని, సీత, తన భర్త భయం పోగొట్టాలని ప్రయత్నిస్తుంది.

సీత, కొన్ని సందర్భాల్లో రాముణ్ణి విమర్శిస్తుంది కూడా. "రుషి వేషం అని చెపుతూ ఈ ఆయుధాలేమిటి? వైరం లేని వాళ్ళని చంపుతానని ప్రతిజ్ఞలు చెయ్యడం ఏమిటి?" అని భర్త చేసే పనుల్ని ప్రశ్నిస్తుంది.

తను అశోకవనంలో వున్నప్పుడు "నేను చచ్చిపోతే మాత్రం నా భర్తకేం? ఏమీ లోపం లేకుండా ఇతర స్త్రీలతో హాయిగా వుంటాడు" అంటుంది కూడా! భార్యలు పోయిన వెంటనే పురుషులు ఇతర స్త్రీలతో వుండడం ఎరుగును కాబట్టి.

తన కష్టకాలంలో, "ఇంతకాలమూ నేను ఆచ రించిన ధర్మాలన్నీ వ్యర్థమేనా?" అని ఆలోచనల్లో పడు తుంది. "అయ్యో! నన్ను శంకిస్తున్నావు. నా సౌశీల్యమే నువ్వు గుర్తించలేదే!" అని భర్తని నిష్ఠూరా లాడుతుంది.

సీతలాగే మహా పతివ్రతగా కీర్తి వంతురాలైన కౌసల్య, "ముసిలాణ్ణి చంపేసి రాజ్యం ఆక్రమించు" అని కొడుక్కి బోధిస్తుంది.

ఈ ఘట్టాలన్నీ ఎందుకు వచ్చాయి? ఏం చెపు తున్నాయి? పురుషుడికి బానిసగా బతకడం స్త్రీకి ఆనందం కాదని చెపుతున్నాయి. సవతులు లేకుండానూ, భర్తకి దాస్యం లేకుండానూ వుండే సంబంధమే స్త్రీకి ఆనందం. కానీ, అలాంటి సంబంధం ఆ నాటికి ఇంకా లేదు. సమాన స్థాయికి అవకాశం లేని భార్యా భర్తల మధ్య, విరోధాలూ, అప నమ్మకాలూ, అసూయలూ, కోపాలూ, ఘర్షణలూ, ఎప్పుడూ వుండి తీరవలసిందే. సీతా రాముడూ అయినా అంతే, ఎంకీ ఎంకడూ అయినా అంతే.

భార్యతో ఘర్షణకు అవకాశం ఇచ్చే సంబంధంలో, భర్త కూడా సుఖంగా వుండలేడు. స్త్రీ పురుషుల మధ్య నిజమైన స్నేహాన్నీ, ప్రేమనీ, ఐక్యతనీ, వైరుధ్యం గల సంబంధం ఇవ్వదు.

కథ ప్రకారం సీత మహా పతివ్రత కాబట్టి భర్తతో అనదల్చుకున్న దేదో అన్నాక అలా అనడం తప్పని ఒప్పేసుకుని, "క్షమించు. స్త్రీ జన్మ ఎత్తాను కాబట్టి చాప ల్యంతో, మూర్ఖత్వంతో అలా అన్నాను. లేకపోతే నిన్ను అనడానికి అర్హురాలినా నేను?" అంటూ వుంటుంది.

కథ చివర సీత భూమిలోకి వెళ్ళిపోతుంది. దీని అర్థం – సీత ఆత్మ గౌరవంతో భర్తని తిరస్కరించి వెళ్ళిపోయిందని కాదు. సీత, రాముణ్ణి ధిక్కరించినట్టు చెప్పాలని కవి అభిప్రాయం కాదు. సీత, రాముడి కోసం స్వర్గంలో ఎదురు చూస్తూ వుంటుందని చెపుతాడు కవి.

రాముడు భూమి మీద వుండవలసిన 11 వేల సంవత్సరాల్లో సీతని వదలక ముందే పది వేల సంవత్సరాల కాలం అయిపోయింది. ఇక కథ ముగింపు దశలోకి వచ్చేసింది. కవి, ఒక్కొక్క పాత్రనీ ఉపసంహ రిస్తున్నాడు. ముందు సీత స్వర్గానికి వెళ్ళిపోయింది. తర్వాత లక్ష్మణుడు. తర్వాత రాముడితో పాటు అందరూ!

'విష వృక్షం' కథలో, సీత చివరికి ఆత్మహత్య చేసు కుంటుంది. అది, భర్త మీద ధిక్కారంతో కాదు; తన మీద తనకే విరక్తితో, నిరాశతో, అశాంతితో, భర్త దగ్గిర గడిపే జీవితం మీద ఆసక్తి లేకపోవడంతో! ఇలా చెప్పడానికి ఆధారం వాల్మీకి కథే. ఆ కథలో, చివరికి, సీత రాముడి దగ్గిరకి రాలేదు. సీతా రాముడూ మళ్ళీ కలిసి జీవించలేదు.

భార్యా భర్తల సంబంధాల్లో, రాముణ్ణో, ఇంకో పురుషుణ్ణో విమర్శించే దృష్టితో, సీతని గానీ ఇంకో స్త్రీని గానీ విమర్శించకూడదు. రాముడి స్థితి వేరూ, సీత స్థితి వేరూ. రాముడు అధికారి. సీత బానిస. బానిసల మీద వుండే సానుభూతే పురుషుడి బానిస అయిన స్త్రీ మీద వుండాలి.

## రామాయణం అందమైన కావ్యమా?

అవును, అందమైన కావ్యమే. ఎవరికీ? దాని బోధనల వల్ల లాభపడే వాళ్ళకి! కానీ, దాని వల్ల కష్ట నష్టాలు అనుభవించే వాళ్ళకి కూడా అది అందంగానే కనపడుతుంది. దాని వల్ల అవమానాలు పడేవాళ్ళు కూడా దాన్ని భక్తి తోటే చూస్తారు. ఎందుకంటే, వారి జ్ఞానం అంత వెనకబడి వుండడం వల్ల.

మూర్ఖత్వంలో పడివున్న సమాజానికి మత గ్రంధా లన్నీ అందమైనవే. కానీ అసలు 'అందం' అంటే ఏమిటి?

కథ నిండా అడవులూ, పర్వతాలూ, నదులూ, సర స్సులూ, పూల చెట్లూ, నెమళ్ళూ, కోయిళ్ళూ, హంసలూ, పువ్వులూ, వుండడమా? అటువంటి స్థలాల్లో కథ జరిగితే, ఆ కథ అందమైందే అవుతుందా? ఒక సూర్యా స్తమయ సమయంలో, ఒక నది వొడ్డున, పక్షుల

కిల కిలల కింద, చల్ల గాలిలో, కొత్తగా విరిసిన పూల పరిమళాలలో, పచ్చని పొదల మధ్య, ఒక కిరాతకుడు, ఒక చంటి బిడ్డని నగల కోసం హత్య చేస్తే, ఆ కథ అందమైందే అవుతుందా? కథ జరిగే పరిసరాల అందం, కథకు అందాల్ని ఇస్తుందా? లేకపోతే, ఆ శిశు హత్యని కవిత్వంలో, గొప్ప గొప్ప శ్లోకాలతో, ఉపమానాలతో, సమాసాలతో, సంస్కృతంలో సమర్థిస్తూ రాస్తే, ఆ కథ అందమైంది అవుతుందా?

రాజ్య కాంక్షతో, కుట్రలతో, స్వార్థంతో, అబద్ధపు వ్రతాల ముసుగుతో సాగే కథ, అందమైందా? స్త్రీల వ్యక్తిత్వాల్ని హరించి, వారిని జీవచ్ఛవాల్ని చేసే కథ అందమైందా? స్త్రీల ముక్కులూ, చెవులూ, స్తనాలూ కోసి వారిని పరిహసించే కథ, అందమైందా? భార్యని శంకించి అగ్ని పరీక్షలపాలు చేసే కథ, అందమైందా? శత్రు పట్టణాలకు నిప్పంటించి, స్త్రీలనీ, శిశువుల్నీ, అమాయక ప్రజల్నీ మంటల్లోకి తోసే కథ అందమైందా? ఇందులో ఏ నీతి, ఏ విలువ, ఏ కార్యం, అందమైంది? ఇలా, ఈ కథలో అంశాల్ని ప్రశ్నించుకున్నప్పుడు, ఆ అందం ఎందులో కనబడుతుంది?

## 'దైవం' గురించీ, 'ధర్మం' గురించీ చర్చలు!

దేవుడున్నాడా? కర్మ ఉందా? విధి ఉందా? ధర్మాధర్మాలు ఉన్నాయా? వీటిని ఎవరైనా చూశారా? తెలుసు కున్నారా? – ఇలాంటి విషయాల గురించి, కవి, కథలో చాలా సందర్భాల్లో చర్చలు చేస్తాడు. కానీ, చివరికి కొత్తదేమీ చెప్పడు. పాత నమ్మకాలనే నిలబెడతాడు.

'అసలు ధర్మం లేదనిపిస్తోంది నాకు' అని సుమంత్రుడు అన్నప్పుడు, రాముడు, 'చాల్లే ఊరుకో! ఏం మాటలవీ?' అనే పద్ధతిలో మొహం చిట్లించాడే గానీ, ధర్మాన్ని ఆచరిస్తే, ఫలితం ఏమిటో చెప్పలేదు.

'దైవం ఉందా?' అని ప్రశ్న వేసిన పాత్ర, ఏ జవాబూ దొరకకుండానే కాస్సేపటికి 'నా అజ్ఞానం కొద్దీ అలా అడిగాను' అని తన అజ్ఞానాన్ని ఒప్పేసుకుంటుంది.

జాబాలి నాస్తికత్వం ఈ రకమే. 'పర లోకాలు లేవు' అన్న జాబాలి, తర్వాత మళ్ళీ 'ఏదో అన్నాను గానీ నేను నాస్తికుణ్ణి కాను' అని ఒప్పేసుకుంటాడు.

యుద్ధంలో రాముడు మూర్ఛపోయినప్పుడు లక్ష్మణుడు శోకాలు తీస్తూ ధర్మం మీద చర్చలు చేస్తాడు. చివరికి, 'ఏదోలే, బాధ కొద్దీ అలా అన్నాను' అంటాడు.

ప్రజలకు కష్టకాలంలో రేగే సందేహాలే కథలో పాత్రల కష్టకాలాల్లో కనపడతాయి.

కథలో, ఆ సందేహాలకు కొత్త జవాబు లేవీ దొరకవు. పోనీ అవి సందేహాలు గానూ వుండవు. 'అసలు ఈ సందేహాలెందుకు? పెద్దలు చెప్పిన దాన్ని అనుసరించడం కన్నా ఇంకేం కావాలి?' అని చివరికి తేలుతుంది. చర్చల సారాంశం – 'చర్చలే అనవసరం' అని!

ఒక ప్రశ్న తలెత్తినప్పుడు, దాని జవాబు కోసం వెతుక్కోకుండా ఆ ప్రశ్ననే వదిలేసి వూరుకుంటే, ఆ ప్రశ్న పరిష్కారమై పోయినట్టా? ప్రశ్న తలెత్తిందంటే, దానికి జవాబు దొరికే వరకూ అది అలాగే వుంటుంది. ప్రశ్న వున్నప్పుడు, దానికి జవాబూ వుంటుంది. దాన్ని తెలుసుకోవడమే మనం చెయ్యవలసింది.

వాల్మీకి లాగ మనం కూడా మన ప్రశ్నల్ని జవాబులు లేకుండా వదిలి వెయ్యాల్సిన అవసరం లేదు. ఈ నాడు మనకు తెలిసిన ప్రకృతి జ్ఞానం, సమాజ జ్ఞానం, వాల్మీకి స్థితి కన్నా ఉన్నతమైనవి. మన ప్రశ్నలకు చాలా స్పష్టమైన జవాబులు వున్నాయి. అవన్నీ 'పీఠిక' లోనే చూశాం.

వాల్మీకి కవి, తను దేవుడి కథ రాస్తున్నాననుకుంటూ, నిజానికి రాసిందంతా మానవుల కథే. ఆ కథలో ఎన్ని లోపాలు వున్నా, అందుకు ఆ కవిని తప్పు పట్టలేము. ఆ రచనా విధానమే అలాంటిది. కానీ, <u>ఆ లోపాల్నీ, కవికి వున్న రామ పక్ష పాతాన్నీ గమనించకుండా వుండ కూడదు.</u> ఈ కథలో ఏ సమాజం కనపడుతుందో ఆ సమాజంలో వున్న సంబంధాల్ని అర్థం చేసుకోవడమే మనం చెయ్యవలసిందంతా! అది ఎలా సాధ్యమవుతుందంటే – విమర్శ వల్లనే.

విమర్శ అనే దానికి విలువ ఇచ్చుకోకపోతే మంచి చెడ్డలు గ్రహించలేము. గత కాలపు సాహిత్యంలో, కళల్లో, లోపాలేమీ లేవనే మూర్ఖత్వంతో విమర్శకి పెడ మొహం పెడితే, తర్వాత కాలంలో ఏ కళనీ ఉన్నత స్థాయిలో, ఉన్నత రూపాలతో, అభివృద్ధి పరచుకోలేము.

★

# దేవుళ్ళూ - భక్తీ

బిడ్డ పుట్టినప్పుడు ఆ మెదడులో ఏ ఆలోచనా వుండదు. ఆ మనసు మీద ఏ ప్రభావమూ వుండదు, ఏ విశ్వాసాలూ వుండవు. కానీ, అప్పటికే బిడ్డ చుట్టూ ఒక సమాజం వుంటుంది. దానికి కొన్ని నీతులూ, కొన్ని ధర్మాలూ, కొన్ని అలవాట్లూ, కొన్ని విశ్వాసాలూ, అన్నీ సిద్ధంగా వుంటాయి. ఈ బిడ్డ కూడా రోజు రోజుకీ తన చుట్టూ వున్న జీవిత విధానం ప్రకారం, సాంప్రదాయాల ప్రకారం, పెరుగుతూ వుంటాడు. తన చుట్టూ వున్న మనుషులు చేసిందాన్నే తనూ చేస్తాడు. చుట్టూ వున్న వాళ్ళు నమ్మిన దాన్నే తనూ నమ్ముతాడు. సమాజ ప్రభావానికి అతీతంగా ఏ బిడ్డా పెరగదు.

"దేవుడికి దణ్ణం పెట్టు!"తో ప్రారంభమౌతుంది బిడ్డని పెంచే వ్యవహారం. బిడ్డకి నెమ్మదిగా కాస్త విషయాలు పరిశీలించే జ్ఞానం వొచ్చేటప్పటికి – ఇంట్లో దేవుడు! పక్కింట్లో దేవుడు! ఎదరింట్లో దేవుడు! ఎదరింటి వాళ్ళ పక్కింట్లో దేవుడు! పక్కింటి వాళ్ళ ఎదరింట్లో దేవుడు! అంతే కాదు. బళ్ళో దేవుడు! పుస్తకాల్లో దేవుడు! కొండెక్కితే దేవుడు! ఆకాశంలో దేవుడు! ఈ దిగ్బంధంలో ఒక మనిషికి, వెన్నెముక నిలబడి తర్క జ్ఞానం తెలిసే టప్పటికే 'దేవుడి జబ్బు' ముదిరిపోతుంది. ఎన్నెన్నో ఆలోచనలూ, తర్క వితర్కాలూ, ఊగిసలాటలూ, సంఘర్షణలూ, చివరికి శరణాగతీ!

పూర్వం భక్తి – స్వర్గం కోసమో, పుణ్యం కోసమో అని చాలా కథల్లో చదువుతాం. కానీ ఇప్పుడు, స్వర్గం కావాలని ఎవ్వరూ అనరు. లోపల అనుకోరు కూడా. స్వర్గ నరకాల మీద విశ్వాసాలు లేక కాదు. వాటి మీద ఎంత నమ్మకం వున్నా, ఈ నాడు దేవుళ్ళని పూజించేది వాటి కోసం కాదు. జీవితాల్లో కావలసినవాటి కోసమే దేవుళ్ళని ప్రార్థిస్తారు.

ఒక రాజు, దేవుళ్ళని ప్రార్థిస్తే, తన రాజ్యం విస్తరించాలనీ, శతృవుల్ని జయించాలనీ, కోరుకుంటాడు. ఒక వర్తకుడు, తన వర్తకం పెరగాలనీ, లాభాలు పెరగాలనీ, కోరుకుంటాడు. ఈ రోజుల్లో ఒక నిరుద్యోగి, ఉద్యోగం కావాలని కోరతాడు. రాతి ముందో, రప్ప ముందో నిలబడి ఒక ఆడపిల్ల తల్లి, కూతురికి పెళ్ళి సంబంధం కావాలని కోరుతుంది. మగ పిల్లాడి తల్లి, కొడుక్కి ఎక్కువెక్కువ కట్నం, లాంఛనాలూ రావాలని కోరుతుంది. అద్దె ఇళ్ళల్లో పాట్లు పడేవాళ్ళు, ఎప్పటికయినా ఒక స్వంత ఇల్లు కట్టుకోవాలని కోరుకుంటారు. ఒక దీర్ఘ రోగి, రోగం కుదిరితే మొక్కుబళ్ళు చెల్లిస్తానని మొక్కుకుంటాడు. ఒక ఉద్యోగి, ప్రమోషన్ రావాలని కోరుకుంటాడు. ఈ రకంగా, ధనిక వర్గంలోనూ, పేద వర్గంలోనూ కూడా ఎవరి అవసరాల కోసం వాళ్ళు కోరుకుంటారు. ఈ కోరికలన్నీ సమాజ పరిస్తితులకు సంబంధించినవే.

భగవంతుడు లేడు కాబట్టి, ఈ ప్రార్థనల్ని వినే వాళ్ళూ, తీర్చేవాళ్ళూ ఎవరూ వుండరు. కానీ, ధనిక వర్గం, దాని కోరికల్ని అదే తీర్చుకోగలదు. ప్రజలు, లేని భగవంతుళ్ళ వేపు మొహాలు తిప్పి ఉన్నంత కాలమూ ధనిక వర్గం కోరికలు నెరవేరుతూనే ఉంటాయి.

సమస్య అంతా పేద వర్గానిదే.

సమాజం, 'నిరుద్యోగం' అనే సమస్యే లేకుండా యువతీ యువకులందరికీ పనులు చేసే అవకాశం కల్పిస్తే, ఉద్యోగాల కోసం దేవుళ్ళకు మొక్కుకోవలసిన పరిస్థితి వుంటుందా? జబ్బులకు – తగిన వైద్య సౌకర్యాల్నీ, శ్రద్ధగా బాధ్యతగా వైద్యం చేసే ఆస్పత్రుల్నీ సమాజం ఏర్పాటు చేసుకుంటే, రోగులు, దేవుళ్ళని ప్రార్థించుకోవలసిన అవసరం వుంటుందా? సైన్సు పరిజ్ఞానమే వుంటే, ఇంకా వైద్యం కనిపెట్టని జబ్బుల్ని కూడా మనుషులు సహనంతో భరించుకోగలుగుతారు. అలాగే, ఏ సమస్య అయినా. పేద ప్రజలు, ఏ అవసరాల కోసమైతే దేవుళ్ళని ప్రార్థిస్తారో, ఆ అవసరాలన్నీ వాళ్ళే ఎంతో సునాయాసంగా తీర్చుకోగలరు. కానీ, ఆ 'జ్ఞానం' ప్రజలకు ఏర్పడాలి. అది జరగకుండా వుండడానికే, దోపిడీ ప్రభుత్వం, ప్రజలు తమ అవసరాల కోసం దేవుళ్ళనే ప్రార్థించుకునే లాగ ప్రోత్సహిస్తుంది, తిరపతికి బస్సు సౌకర్యాలు పెంచీ, భద్రాచలం గుడికి వెండి రేకులు తాపించీ, అన్నవరంలో ... సింహాచలంలో ... ఇంకా ఏదేదో చేసీ, ప్రజలకు దేవుడి గుళ్ళ మీద ఆకర్షణలు పెంచుతుంది. దోపిడీ ప్రభుత్వం చేసే పరిపాలనలో, ప్రజల మూఢ నమ్మకాల్ని చెక్కు చెదరనివ్వకుండా వుంచడం ఒక ముఖ్య భాగం.

ప్రజల్ని మూఢత్వంలో వుంచే మతం, దోపిడీ వర్గానికి పెద్ద రక్షణ కవచం.

సాధారణంగా మనం వినే దేవుళ్ళ కథలన్నీ ఎంతో శ్రావ్యమైన సంగీతం ద్వారా, చక్కని పాటల ద్వారా వింటూ వుంటాం. దేవుళ్ళ గురించి పాడే సినిమా పాటల్లో కూడా చక్క చక్కని వరసలూ, రాగాలూ, కంఠాలూ, కవిత్వాలూ, రక రకాల సమ్మేళనాలతో వుంటాయి. ఆ పాటలు మరీ మరీ వినబుద్ధి వేస్తాయి.

ఆ పాటలు వినాలని మనకు కలిగే కోరికా, పాటలు వింటోంటే కలిగే ఆనందం, 'అదంతా భక్తే' అను కుంటాం. కానీ, పాటలు వింటూ తన్మయత్వం చెందేది భక్తికి కాదు, సంగీత సుఖానికే. ఎంత నాస్తికుడైనా, త్యాగరాజు కీర్తనలూ, కూచిపూడి గానాలూ, ఆనందంగా వింటాడు. భక్తులంతా గుంపుగా కూడి, ఆర్మోనీలతో, మద్దెళ్ళతో, తాళాలతో భజనలు చేస్తున్నప్పుడు, వారికి కలిగే ఆనందం 'ఆ పాటల వల్లనే' అని అర్థం చేసుకోరు. ఎవరు ఉత్సాహంగా పాడితే వారు చాలా గొప్ప భక్తులుగా చెలామణీ అవుతారు. ఒక్క పాటన్నా పాడకుండానూ, వీణలు గానీ మద్దెళ్ళు గానీ తాళాలు గానీ ఒక్క వాయిద్యం అయినా లేకుండానూ, వాటి శబ్దాల వల్ల ఉత్తేజం తెచ్చుకోకుండానూ, ఊరికే కూచుని, భక్తి లోంచి అంత ఉత్సాహం, అంత సుఖం, అంత ఆనందం, పొందమనండి, ఎవరినైనా!

దీన్ని బట్టి, దేవుళ్ళపై భక్తి కలగడానికి 3 కారణాలు కనబడుతున్నాయి. (1) పసితనం నించీ చుట్టూ సమాజ ప్రభావం వల్ల వచ్చే అలవాటు. (2) తమ సమస్యల్నీ, కష్టాల్నీ భగవంతుడే తీరుస్తాడు – అనుకోవడం. (3) గానంలో, సంగీతంలో ఆనందం.

సాధారణంగా 'భక్తి' గురించి తర్క వితర్కాలు జరిగే టప్పుడు అనేకమంది ఒకే సందేహం వెలిబుచ్చుతారు. "ఎందరో గొప్ప గొప్ప మేధావులు, పండితులు, కవులు, ఎంతో చదివిన వారు కూడా దేవుణ్ణి నమ్ముతారే! గాంధీ గారు కూడా... " – ఇదీ ఆ సందేహం! ఇది చాలా సహజమైన సందేహమే. ఇంతకు ముందే చెప్పుకున్నాం, భక్తి కలగడానికి కారణాలు. ప్రతీ వొక్కరి మీదా ఆ పరిస్థితులే పనిచేస్తాయి. గాంధీగారు అయినా, ఇంకో గారు అయినా, ఈ సమాజంలో పుట్టి పెరిగిన మనుషులే.

అయితే, కొంత మంది మనుషులు పెద్దయిన తర్వాత, కొంచెం ఆలోచించడం తెలిసిన తర్వాత, 'హేతువాదం' వంటి సిద్ధాంతాలతో పరిచయం కలిగి, భక్తిని వదిలేస్తారు. కానీ ఇలాంటి వాళ్ళు చాలా తక్కువ. ఇలా మారని వాళ్ళే చాలా ఎక్కువ.

పేద ప్రజల్లో హేతువాదులు మచ్చుకి కూడా వుండరు. ఎందుకంటే, వారికి ఆ జ్ఞానం అందదు. వారికి, ప్రకృతి గురించి తెలుసుకునే చదువులే వుండవు.

చదువులు వున్నా, ఆ చదువులు బూర్జువా చదువులే. అవి, 'దోపిడీ శ్రమ సంబంధాల' గురించి చెప్పవు. పైగా, ఆ నిజాన్ని మరుగుపరుస్తూ అన్నీ అబద్ధాలే చెపుతాయి. కాబట్టి చదువుకున్న వాళ్ళకి కూడా అసలు నిజం అందదు.

అంతేగాక, వర్తకాల్లోనూ దోపిడీ రాజకీయాల్లోనూ వుండే వాళ్ళు, తర్కాన్ని బొత్తిగా చేరనివ్వరు. వాళ్ళని వాళ్ళు మభ్యపెట్టుకుంటూ, ప్రజల్ని మభ్యపెడుతూ, 'భక్తి'ని నిలబెట్టి వుంచడానికే ప్రయత్నిస్తారు.

గాంధీగారు కూడా అంతే. ఆయన, చిన్న కులస్తులందరికీ 'రామ నామ జపాన్ని' పరిష్కార మార్గంగా చెప్పాడంటే, అదంతా కేవలం అమాయకత్వం వల్ల జరిగిందనీ, ఏ స్వప్రయోజనాన్నీ ఆశించకుండా జరిగిందనీ, నమ్మ నక్కర లేదు. ప్రజల్ని అజ్ఞానంలో వుంచడానికి, పాత పండితులందరూ చెప్పిన దంపుళ్ళ నీతులే ఆయనా చెప్పాడు. కాకపోతే, 'అహింస, హరిజనులు, సత్యాగ్రహం' లాంటి జరీ మెరుపుల్తో!

ఈ ప్రకృతి ఏమిటి? దీని సూత్రాలు ఏమిటి? దేవుడు వున్నాడా? ఉంటే ఎక్కడ? – ఇలాంటి విషయాలు తెలుసుకోవాలంటే, ప్రకృతి శాస్త్రాల మీద ఆధారపడి తెలుసుకోవలిసిందే గానీ, తల కిందకీ కాళ్ళు పైకీ పెట్టి పిల్లి మొగ్గలు వెయ్యడం వల్ల తెలుసుకో గలిగేదేమీ వుండదు.

ప్రపంచంలో, పెట్టుబడిదారీ విధానం కన్నా అభివృద్ధి చెందిన ఆలోచనా విధానమూ, శ్రమ దోపిడీని గ్రహించిన శాస్త్రీయ సిద్ధాంతమూ, వచ్చేశాయి. మనం ఇంకా ఏ మూల గుళ్ళోనో, బాబాల పాదాల అడుగునో చేరి "మా పిల్లాడికి ఉద్యోగం దొరుకుతుందా? మా పొలంలో మంచి పంట పండుతుందా? మా పిల్లని ఈ నెలన్నా అత్తారు తీసికెళ్తారా?" అని దేవిరించే స్థితిలో వున్నామంటే, అటు ప్రకృతి శాస్త్రాలు గానీ, ఇటు సామాజిక శాస్త్రాలు గానీ, ఏవీ మన వరకూ రాలేదన్న మాట!

శ్రీరాముడు సాక్షాత్తూ మహా విష్ణువేనని, కవులు బాకా లూదితే అదంతా నమ్ముతూ, ఈ నాటికీ 'రామ రాజ్యం' కోసం అర్రులు చాచే స్థితిలో వున్నామంటే అది మన అజ్ఞానమే.

ఈ భక్తి ఎందుకో, ఇది జీవితాలకేం పనికి వస్తుందో, భక్తులకు కూడా తెలీదు.

రామాయణంలో రాముడే అన్నాడు – దేవుడు ఎప్పుడూ కనపడడని! భరతుడు కూడా – "తపస్సు వల్ల ఫలితం వుందో లేదో తెలీనప్పుడు తపస్సు చేస్తూ జీవితం వృధా చేసుకోవడం ఎందుకు?" అన్నాడు. – ఈ రకంగా, రామాయణంలోనే అనేక పాత్రలు అనేక సందర్భాల్లో 'దైవం' గురించి ఎన్నో సందేహాలు వ్యక్తపరిచాయి. వాటికి జవాబులు దొరకలేదు.

**సీతా, రాముడూ చెట్లనీ, పుట్లనీ పూజిస్తూ వుంటారు – తమ కోరికలు తీర్చమని! అలాంటి వాళ్ళు మన దేవుళ్ళు! వారినీ మనం పూజించటం, మన కోరికలు తీర్చమని!!** ★

# 'రామాయణ సంస్కృతి'ని ఎందుకు తిరస్కరించాలి?

ప్రజలు, రామాయణ సంస్కృతిని తిరస్కరించాలి. ఎందుకంటే, అది, వారికి హాని చేసే సంస్కృతి గనక. అది, ప్రజల్ని దోచడం ద్వారా ఆస్తులూ రాజ్యాధికారాలూ సంపాదించే యజమాని వర్గ సంస్కృతి గనక.

'రామాయణం, సమాజంలో ఎవరికి అనుకూలం?' అని చూడండి! పేదలకా, ధనికులకా? సేవకులకా, యజమానులకా? చిన్న కులాలకా, పెద్ద కులాలకా? ప్రజలకా, పాలకులకా? మూఢ నమ్మకాలకా, హేతు జ్ఞానానికా? స్త్రీల స్వతంత్రతకా, పురుషుల దురహంకారానికా? – ఈ రకం ప్రశ్నలకు సమాధానాలు ఇప్పుడు మనకు తెలుసు.

రామాయణం – ధనిక వర్గానికే, యజమాని వర్గానికే అనుకూలం. పెద్ద కులాలకే అనుకూలం. పురుష దురహంకారానికే అనుకూలం. మూఢ నమ్మకాలకీ, నిరంకుశ పాలనకే అనుకూలం. ఏ కోణంలో చూసినా, అది, దోపిడీ వర్గానికే, దాని భావాలకే, దాని సంస్కృతికే అనుకూలం. అందుకే ప్రజలు దీన్ని తిరస్కరించాలి!

రామాయణాన్ని ప్రజల కోణంలో చూస్తే, అది ఈ నాడే కాదు, దాని రచనా కాలంలో కూడా అభివృద్ధి కరమైనది కాదు. ప్రజలకు అది, ఆ నాడూ – ఈ నాడూ – ఏ నాడూ – అభివృద్ధి నిరోధకమైనదే.

భారత దేశంలో, భూస్వామ్య వర్గ సంస్కృతికి మారు పేరు – రామాయణ సంస్కృతి. భారత దేశపు ప్రజల సాంఘిక సంబంధాలన్నిటిలోనూ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఈ సంస్కృతే సాగుతూ వుంటుంది.

భూస్వామ్య సంస్కృతిలో ప్రకృతి జ్ఞానం దాదాపు శూన్యం. ప్రజల జీవితాల్ని మూఢ నమ్మకాలే నడుపుతూ వుంటాయి. ప్రజల్ని చీలికలు వాలికలు చేసే కులాల – మతాల – జాతుల భేదాలూ, స్త్రీల దాస్యమూ, ఈ సంస్కృతి లక్షణాలే.

'రామాయణం'లో వున్న కథనే తీసుకుంటే, అది ప్రజలకు చేసే మేలు ఏమీ వుండదు. ఈ కథలో, స్త్రీలు చెడ్డవాళ్ళని స్త్రీలే నమ్ముతారు. తక్కువ కులాల వారు, అగ్ర కులాలనే ఉత్తమ కులాలుగా నమ్ముతారు. వానర జాతి చెడ్డదని వానరులే, రాక్షస జాతి చెడ్డదని రాక్షసులే, చెప్పుకుంటారు. మానవ జాతిలో రాముడి వంశమే మహా గొప్పది! అందులో, రాముడే అందరికన్నా గొప్పవాడు! మహానుభావుడు!

రాముడు ఉత్తముడనీ, రావణుడు దుర్మార్గుడనీ, ప్రజల నమ్మకం. కానీ, సీతని ఎత్తుకుపోవడం రావణుడి దుర్మార్గం అయితే, రాముడి దుర్మార్గాలు అంతకన్నా చాలా ఎక్కువ. వాలిని చంపిన సంఘటన ఒక్కటి చాలు, రాముడు సన్మార్గుడో దుర్మార్గుడో నిర్ణయించడానికి.

సీత, రావణుడి దగ్గిర్నించి చెక్కు చెదరకుండా బైటపడింది. మరి, రాముడి చేతిలో శూర్పణఖ పరిస్తితి ఏమైంది? ఆమె అవయవాలు ఆమెకి తిరిగి ఎలా వస్తాయి? ఒక శతృజాతి స్త్రీ కనపడగానే ఆమెని హింసించే పురుషుడా మానవోత్తముడు? జాబాలి నోటి వెంట హేతువాద భావాలు

వినగానే మండి పడిపోతూ, చివరికి అతడు 'నేను నాస్తికుణ్ణి కాను' అంటే గానీ శాంతించని రాముడా సమస్త జ్ఞానాలూ తెలిసిన వాడు?

ఈ కథలో, కీర్తివంతులైన పురుషులు ఇతర ప్రాంతాల మీదా, ఇతర జాతుల మీదా దోపిడీ చేసే వీరులు! స్త్రీలు, బలిసిన తొడలూ రొమ్ములూ గల పతివ్రతలూ, వేశ్యలూ! ధర్మాల్ని మీరితే స్త్రీలకే శిక్షలు; పురుషులకు ఏ శిక్షలూ వుండవు. బిడ్డలకు ఎక్కడా తండ్రులే గానీ, తల్లులు వుండరు. యజమానుల కామ బాధలకే గానీ, సేవకుల ఈతి బాధలకైనా స్థానం వుండదు. రామ భక్తి వల్ల అగ్ర కులస్తులకు సిరి సంపదలు ఒనగూడ వచ్చు గానీ, శూద్రులు ఎప్పుడూ సేవకులే.

భూముల కోసం యుద్ధాలు; జాతుల మధ్య యుద్ధాలు; ఎవరి వంశాన్ని వాళ్ళు పొగుడుకోడం; తోటి మనుషుల్ని చంపడమే గొప్ప వీరత్వంగా చలామణీ అవడం; పురుషుడికి బహుభార్యాత్వం, స్త్రీలకు పాతివ్రత్యం గానీ, వేశ్యరికం గానీ; స్వర్గ నరకాల మతమౌఢ్యం; తర్కజ్ఞానం మీద శిక్షలు; భార్యలు భర్తలకూ, కొడుకులు తండ్రులకూ, ప్రజలు రాజులకూ లొంగిపడి వుండడం – ఇలాంటి కథ నించి ప్రజలు నేర్చుకోవలసిన విలువలూ జ్ఞానాలూ ఏమున్నాయి?

ఈ కథని చూసి ప్రజలు గ్రహించవలిసింది ఏమిటంటే – రాముడూ రావణుడూ ఇద్దరూ రాజులే. ఇద్దరూ ఆ నాటి సమాజాలలో వున్న ధనిక వర్గాల ప్రతినిధులే. ఇద్దరూ నిరంకుశులే. ఇద్దరూ ఇతర రాజ్యాల మీద దాడులు చేస్తూ తమ రాజ్యాల్ని విస్తరించుకున్న వాళ్ళే. ఇద్దరి రాజ్యాల లోనూ వర్గ భేదాలున్నాయి. ధనిక – పేద తేడాలున్నాయి. పురుషాధిక్యతలూ స్త్రీల దాస్యాలూ ఉన్నాయి. వేశ్యరికాలూ, ముష్టితనాలూ, యుద్ధాలూ చంపుళ్ళూ అన్నీ ఉన్నాయి. ఈ ఇద్దరు రాజుల పరిపాలనలకూ స్వభావాల్లో తేడా లేమీ లేవు. అలాంటప్పుడు, శ్రామిక ప్రజలు రాముణ్ణీ కీర్తించనక్కర లేదు, రావణుణ్ణీ కీర్తించనక్కర లేదు. అసలు ఏ రాజునీ కీర్తించ నక్కరలేదు.

ఈ నాడు, ఈ భూస్వామ్య సంస్కృతీ, పెట్టుబడిదారీ సంస్కృతీ, కలిసిపోయాయి. డబ్బు సంపాదనే పెట్టుబడిదారీ సంస్కృతి లక్ష్యం. ఈ రెండు సంస్కృతులూ ఒకటే – చిన్న చిన్న తేడాలతో. ఇది, ప్రజలకు చేసే మేలు ఏమీ వుండదు.

ప్రజలు, ప్రకృతి గురించిగానీ, సమాజం గురించిగానీ నిజాలు తెలుసుకోకుండా వారిని అజ్ఞానంలో వుంచడమే ఈ సంస్కృతి లక్ష్యం. ఈ మోసం నించి బైట పడడానికే ప్రజలు దీన్ని తిరస్కరించాలి!

వందల, వేల సంవత్సరాల నించీ వున్న సంస్కృతిని వదిలిపెడితే, అప్పుడు ఏం మిగులుతుంది? అప్పుడు ఎలాంటి జీవిత విధానం ఉంటుంది? – దీర్ఘకాలంగా పీడిస్తోన్న జబ్బుని పోగొట్టుకుంటే, అప్పుడు ఏం మిగులుతుంది? – ఆరోగ్యం మిగులుతుంది. అనారోగ్యం పోతే, అది ఆరోగ్యం అవుతుంది. కష్టం పోతే, అది సుఖం అవుతుంది. దోపిడీ సంస్కృతి పోతే, అది దోపిడీ లేని, అందరూ శ్రమచేసే, సమాన శ్రమ సంబంధాలు గల సంస్కృతి అవుతుంది.

దోపిడీ వర్గ సంస్కృతి పోవడం అంటే, సంస్కృతే లేకుండా అయిపోవడం కాదు. దోపిడీ సంస్కృతి పోయినప్పుడు, ప్రజలకు హాని కలిగించే జీవిత విధానం పోయి, అందరికీ సుఖశాంతులు గల విధానం ఏర్పడుతుంది. అలాంటి సంస్కృతిని నిర్మించుకోవడానికే ప్రజలు, దోపిడీ సంస్కృతులన్నిటినీ నాశనం చేసుకోవాలి. రామాయణ సంస్కృతి దోపిడీ సంస్కృతే కాబట్టి, అందుకే దాన్ని తిరస్కరించాలి; దాన్ని విడిచిపెట్టాలి. మతాలూ దేవుళ్ళూ వంటి మూఢ నమ్మకాల్ని దరిచేరనివ్వని జ్ఞానమూ, శ్రమ దోపిడీ నించి విముక్తి చెందే జ్ఞానమూ అభివృద్ధి పరచుకోవాలి! ★

# 3వ భాగం
# కొందరు రామాయణ విమర్శకులు
## [ఈ భాగంలో, 8 మంది విమర్శకులు ఉన్నారు]

'వాల్మీకి రామాయణాన్ని' అనేక మంది రచయితలు, అనేక కోణాల నించి విమర్శించారు. ఆ విమర్శల్లో కొన్ని ముఖ్యమైన వాటిని పాఠకుల దృష్టికి తేవడం అవసరమని భావిస్తూ ఇక్కడ **8** మంది రచయితలు చేసిన విమర్శల్ని తీసుకుంటున్నాను.

ఈ విమర్శల్లో కొన్ని అంశాలు అభివృద్ధికరంగా వుంటే, కొన్ని అంశాలు అభివృద్ధి నిరోధకంగా వున్నాయి. కొన్ని అంశాలు - కులాలకూ; కొన్ని అంశాలు - జాతులకూ, పెనవేసుకుని వున్నాయి. కొన్ని - హేతుబద్ధంగా వుంటే, కొన్ని - హేతువిరుద్ధంగా వున్నాయి. కొన్ని - 'మూలం'తో ఏమీ సంబంధం లేనివిగా వున్నాయి.

ఇటువంటి రక రకాల విమర్శల్లో, దేన్ని ఎంత వరకూ అంగీకరించాలో, ఏ యే అంశాల మీద మాత్రమే దృష్టి నిలపాలో గ్రహించాలంటే, ఈ విమర్శల స్వభావాలు తెలుసుకోవాలి.

ఈ విమర్శల్లో - ప్రజల్ని ఆలోచింప జెయ్యడానికీ, వారికి సరైన జ్ఞానం కలిగించడానికీ, అనుకూలించే అంశాల్ని కృతజ్ఞతతో తీసుకోవాలి. అలా కాని వాటినీ, మూలాన్ని ప్రశ్నించినట్టే పైకి కనపడుతూ మూలానికే అనుకూలంగా వున్న వాటినీ, నిస్సంకోచంగా తిరస్కరించాలి.

# 1. నార్ల వెంకటేశ్వరరావు గారి ప్రక్షిప్తాల పరిశీలన!

ప్రక్షిప్తాల' గురించి, ఈ పుస్తకం లోనే, 'పీఠిక'లో, కొంత చూశాం. ఇంకా కొన్ని వివరాలు ఇక్కడ చూస్తాం.

రామాయణాన్ని పరిశీలించే వ్యక్తి, భక్తుడైనా, నాస్తికుడైనా ప్రక్షిప్తాల మాట ఎత్తకుండానూ, ప్రక్షిప్తాల కవుల్ని దుయ్యబట్టకుండానూ వుండరు. ఈ విమర్శకుల ప్రకారం, ప్రక్షిప్తాలు లేని రామాయణం ఏమిటో తెలుసు కోవాలంటే, ఈ నాడు మనకు తెలిసిన రామాయణాన్ని **4** భాగాలు చేసి, అందులోనించి **3** భాగాలు తీసె య్యాలి. రాముడు పుట్టడం ఉండదు. విశ్వామిత్ర యాగం ఉండదు. తాటకిని చంపటం ఉండదు. శివ ధనుర్భంగం ఉండదు. సీతారాముల పెళ్ళి ఉండదు. బంగారు లేడి ఉండదు. లంకా దహనం ఉండదు. కుశ లవులు పుట్టడం ఉండదు. అన్నింటిని మించిన ఘోర ప్రమాదం 'రామ రాజ్యం' కూడా ఉండదు! అంతే కాదు, కథ పొడుగునా అహల్యా శాపం, గంగావతరణం, క్షీర సాగర మథనం, త్రిశంకు స్వర్గం, విశ్వామిత్ర వశిష్టుల యుద్ధం - ఇంకా ఇలాంటి కథలు వందల కొద్దీ ఎగిరి పోతాయి. ఈ రకంగా ప్రక్షిప్తాలన్నిటినీ తీసేసిన తర్వాత మిగిలే 'అసలు కథ', చాలా ఉదాత్తంగా, సహజ సుంద రంగా, తప్పులేవీ లేకుండా వుంటుందని విమర్శకుల అభిప్రాయం!

ఇది నిజమా? ప్రక్షిప్తాలన్నీ తీసేసి, మిగిలిన కథని చూస్తే, ఆ సంఘటనల్లో అవక తవకలేవీ వుండవా?? ఈ ప్రశ్నే వుండదు ఏ విమర్శకుడికీ!

ఈ విమర్శకుల్లో కూడా ప్రక్షిప్తాల మీద ఏకాభిప్రాయం లేదు. ఒకరు 'బంగారు లేడి ప్రక్షిప్తమే' అంటే, ఇంకొకరు 'బంగారు లేడి ప్రక్షిప్తం కాదుగానీ, లంకా దహనం ప్రక్షిప్తమే' అంటారు. ఒకరికి ప్రక్షిప్తంగా తోచింది, ఇంకొకరికి ప్రక్షిప్తంగా కనపడదు. ఎవరి తర్కం వారిదే.

రాముడు అడవుల్లో రుషి జీవితం గడపాలి – అనే విషయం చూడండి! ఇది వాల్మీకి రాసింది కాదని ఎవరూ అనరు కదా? మరి ఇందులో అవక తవక లేమీ లేవా? కథలో రుషులెవరూ వేటాడలేదు కదా? రుషి జీవితం గడపవలసిన రాముడు వేటాడడం ఏమిటి? అడవులకు పోయేటప్పుడు, దశరథుడు రాముడికి బోలెడు ఆయుధాలిచ్చాడు, ఎందుకు? ఆయుధాలతో రుషి జీవితం ఏమిటి?

రాముడికి 'రుషి జీవితం గడపాలి' అనే షరతు లేకుండా, 'అడవుల్లో సామాన్యుడిగా జీవించాలి' అనే షరతు వుంటే, అక్కడ వేటాడినా, యుద్ధాలు చేసినా, తప్పు వుండేది కాదు. వాల్మీకే – రుషి జీవితంలో వేటలూ యుద్ధాలూ పెట్టాడంటే, దాన్ని ఏమనాలి? అది చాలా సవ్యంగా వున్నట్టేనా? భార్యని పులో, సింహమో, రాక్షసుడో ఎత్తుకుపోతే, ఆ భర్త కామ బాధతో గోల పెట్టడం గానీ; కాపలా కోసం ఉన్న జటాయువుని అడగకుండా పువ్వుల్నీ పిట్టల్నీ కొండల్నీ నదుల్నీ అడగడం గానీ; ఇలాంటి వన్నీ ఎంతో సవ్యంగా వున్నట్టేనా? ఇదంతా వాల్మీకిదే కదా?

ప్రక్షిప్తం కాదని అందరూ ఏకగ్రీవంగా అంగీకరించే ఘట్టం ఏదైనా వుంటే, అందులో కూడా లక్ష అవక తవకలు దొరుకుతాయి. ఇలాంటి వాటికి కారణం – ఆ రచనా విధానమే అలాంటిది అవడం. అసలు కథా వస్తువే మహిమలతో నడిచే దేవుడి కథ. అందులోనే, నవ రసాల ఘట్టాలూ రావాలి. జనాలకు బోధించవలసిన నీతులూ ధర్మాలూ రావాలి. ఆధిపత్యాలూ, సేవకత్వాలూ రావాలి. జాతుల వైరాలూ శతృత్వాలూ, పరాయి రాజ్యాల్ని కొల్లగొట్టడాలూ రావాలి. ఇలాంటి కథని అవకతవకలు లేకుండా సృష్టించడం ఏ కవికి మాత్రం సాధ్యమవుతుంది?

మానవ సమాజం ఈ నాటికీ హేతువాదాన్ని జీర్ణించుకోలేదు. మాయలూ, మంత్రాలూ, మహత్యాలూ, జ్యోతిషాలూ, ఇంకా జీవితాల్ని పాలిస్తూనే వున్నాయి. నిన్నగాక మొన్న, పోతన ఇంటికి శ్రీరాముడు వొచ్చి పద్యం పూరించి వెళ్ళాడు! తానీషా దగ్గిరికి వొచ్చి రామదాసుని విడిపించి వెళ్ళాడు. ఈ రకంగా ఈ నాటికీ, మన జీవితాలూ, మన రచనలూ, ఇంత అవాస్తవిక రొంపిలో కూరుకుపోయి వుంటే, ఏ నాడో వేల సంవత్సరాల కిందటి వాల్మీకి మాత్రం రామాయణం అంతా ఎంతో సహజత్వంతో రాశాడా? ఎంత దురభిమానం వాల్మీకి మీద!

నార్ల వెంకటేశ్వరరావు గారు, వాల్మీకి భక్తుల కోవ లోకే వస్తారు. ఈయన, 'జాబాలి' నాటకానికి రాసిన పీఠికలో, కొన్ని ప్రక్షిప్తాల గురించి చర్చించారు.★ వాటినే ఇక్కడ క్లుప్తంగా చూస్తాం.

## 1. లక్ష్మణుడికి పెళ్ళి కాలేదా?

వాల్మీకి ప్రకారం అయితే లక్ష్మణుడికి పెళ్ళి కాలేదనీ, అతని పెళ్ళి ప్రస్తావనలు ప్రక్షిప్తాలేననీ – వెంకటేశ్వరావు గారి అభిప్రాయం. దీనికి ఆయన కొన్ని కారణాలు చెప్పారు. ఈ కారణాల్నీ, అవి ఎలా తప్పో మనం చెయ్యగల వాదనల్నీ, ఇక్కడ వరసగా చూడండి!

**(1) మొత్తం కథలో, లక్ష్మణుడి భార్య ప్రసక్తి రెండు చోట్ల మాత్రమే వుంది. వాల్మీకి అయితే ఇలా చెయ్యడు. ఊర్మిళ గురించి ఇంకా కొన్ని చోట్ల చెప్పేవాడే. అలా చెప్పలేదంటే, అసలు లక్ష్మణుడి పెళ్ళి గురించి వాల్మీకి రాసి వుండడు. ప్రక్షిప్తాల కవులే, ఆ పెళ్ళి జరిగినట్టు చెప్పి, ఊర్మిళ ప్రసక్తి రెండు చోట్లే పెట్టారు.**

**జవాబు:** రాముడితో పాటు నలుగురు అన్నదమ్ములూ ఒక్క ఈడు వాళ్ళే. రాముడికి పెళ్ళయినప్పుడు, మిగతా వాళ్ళకి కూడా పెళ్ళిళ్ళవడమే సహజం. ప్రక్షిప్తాలు లేవని అందరూ ఒప్పుకునే 'అయోధ్య కాండ'లో కూడా సీత, అనసూయతో, ఈ పెళ్ళిళ్ళ విషయాలు చెపుతుంది. దీన్ని ప్రక్షిప్తం అని ఎందుకు అనుకోవాలి?

కథ పొడుగునా సీత కనపడుతోంది కాబట్టి రాముడికి పెళ్ళయినట్టూ, ఊర్మిళ ఎక్కువ సార్లు కనపడడం లేదు కాబట్టి, లక్ష్మణుడికి పెళ్ళవనట్టూ అర్థం తియ్యడం కాదు. కవి, ఊర్మిళ గురించి ఎక్కువ సార్లు ఎందుకు చెప్పలేదో దానికే కారణం చూడాలి. కథకి, ఏ పాత్రలు ఎక్కువగా అవసరమో అవే ఎక్కువగా కనపడతాయి. అంతగా అవసరం లేని పాత్రల గురించి ఎక్కువగా ప్రస్తావించరు.

లక్ష్మణుడు అడవికి పోతున్న సమయంలో అయినా ఊర్మిళ గురించి చెప్తే బాగుండేది. అలాగే, భరతుడు, తన రాజ్యాన్ని రాముడికి ఇచ్చెయ్యాలని నిర్ణయించుకున్న

★ **నార్ల వెంకటేశ్వరరావు**, 1974, జాబాలి (నాటకం) విజయవాడ: నవోదయా బుక్‌హౌస్.

సందర్భంలో అయినా భరతుడి 'భార్యల్ని' గురించి చెప్తే బాగుండేది. కానీ, పాత కాలపు కథల్లో, ప్రతీ విషయమూ ఇంత తార్కికంగా జరగదు. స్త్రీలతో, కథకి ఎంతో అవసరం అయితే తప్ప, ఆ పాత్రల్ని ప్రస్తావించరు. స్త్రీల దాకా ఎందుకు? శతృఘ్నుడి గురించి ఎన్ని సార్లు చెప్పారు? రాముడు, అస్తమానూ భరతుణ్ణి కావిలించుకుంటాడే గానీ, అలాంటి సందర్భాల్లో శతృఘ్నుడి పేరు వచ్చిందా?

ఒక పాత్ర, ఎక్కువ చోట్ల కనపడడం లేదు కాబట్టి, కనపడ్డ సందర్భాల్ని కూడా ఎగరగొట్టేసి, వాటిని అసలు కవి రాయలేదనీ, ఎవరో చేర్చారనీ అనుకోవాలా?

"వాల్మీకి అయితే ఊర్మిళ గురించి ఎక్కువ చోట్ల ఎందుకు చెప్పడు?" అని వాదిస్తున్నారు కదా? మరి, ఇంకో కవి అయినా, ఆ పాత్రని ఎక్కువ చోట్ల ఎందుకు చెప్పలేదు? రెండు చోట్లే ఎందుకు చెప్పాడు? వాల్మీకి చెయ్యని తప్పు, గీల్మీకి ఎందుకు చేస్తాడు?

అసలు, వాల్మీకి రాముడి పెళ్ళి గురించి మాత్రమే చెప్పి, మిగతా వాళ్ళ పెళ్ళిళ్ళ గురించి చెప్పలేదనుకుందాం. ఆ పని ఇంకో కవి ఎవరో చేశాడనుకుందాం. ఇంకో కవి చేసినదే చాలా సరైన పద్ధతి. రాముడి పెళ్ళితోపాటు అందరి పెళ్ళిళ్ళూ చెప్పాలి. ఆ ప్రక్షిప్తం కవే చాలా తెలివైన వాడనే అర్థానికి రావాలి. వాల్మీకి చేసిన లోపాన్ని ఇంకో ఆయన పూరించాడన్న మాట!

**(2) వనవాసానికి బైల్దేరే ముందు రాముడు, తమ మందిరాల రక్షణ గురించి దాసీలతో చెపుతాడు. లక్ష్మణుడికి భార్య వుంటే, ఆమెకే (మరదలికే) చెప్పేవాడు కదా? కాబట్టి, లక్ష్మణుడికి భార్యే లేదని అర్థం.**

**జవాబు:** సామాన్య కుటుంబీకుడైతే, బైటికి పోయేటప్పుడు "ఒసే పోతున్నాను, తలుపేసుకో. ఇల్లు జాగర్త!" అని చెపుతాడు. కానీ, రాముడు రాజ కుమారుడు. తర్వాత కాలంలో రాజు కాబోయే వాడు. అలాంటి వాడు, మరదల్ని పిల్చి "ఇల్లు జాగ్రత్తమ్మాయ్!" అని చెపుతాడా? మందిరాల రక్షణకి అధికార్లు వుంటారు. వాళ్ళు కూడా పరిచారకులే. అలాంటి వాళ్ళతో చెప్పాడనుకోవాలి. ఇక్కడ ఊర్మిళ కనపడలేదు కాబట్టి, లక్ష్మణుడికి పెళ్ళి కాలేదని నిర్ణయించడానికి ఈ కారణం సరిపోతుందా?

**(3) సీత, లక్ష్మణుడి గురించి ఒక సందర్భంలో 'బ్రహ్మచారి' అన్నది.**

**జవాబు:** మనం వాల్మీకి పేరుతో ఏ అనువాదం చదువుతున్నామో, అందులో వున్న మాట కాదు ఇది. రావణుడు సీత దగ్గిరికి ఋషి వేషంలో వచ్చినప్పుడు, సీత, లక్ష్మణుణ్ణి గురించి 'బ్రహ్మచారి' అని వాడినట్టు, వాల్మీకి పేరుతో వున్న ఇతర రామాయణాల్లో వుందట. ఈ సంగతి వెంకటేశ్వర్రావు గారే చెపుతున్నారు. మనం చదివే వాల్మీకి రామాయణంలో 'ధర్మచారి' అని వుంది. అలాంటప్పుడు మనం, మనం చదివే పుస్తకాన్ని తీసుకోవాలా, ఇంకో పుస్తకాన్ని తీసుకోవాలా? మన వాదానికి ఏది అనుకూలంగా వుంటే అది తీసుకుంటామా?

'బ్రహ్మచారి' అనే మాటనే తీసుకున్నా, దానికి 'పెళ్ళి కానివాడు' అనే అర్థం ఒక్కటే కాదు; 'ప్రస్తుతం భార్యతో సంబంధం లేకుండా నియమ నిష్ఠలతో గడుపుతున్న వాడు' అనే అర్థం కూడా వుంది. ఈ అర్థం వాల్మీకిలోనే వుంది.

హనుమంతుడు, అశోకవనంలో సీతతో మొదటి సారి మాట్లాడేటప్పుడు రాముడి గురించి, "చాతుర్వర్ణాల్ని కాపాడతాడు. సాధువుల్నీ బ్రాహ్మణుల్నీ సేవిస్తాడు. బ్రహ్మచర్య వ్రతం పాటిస్తాడు" అని చెపుతాడు. అంటే, 'బ్రహ్మచర్యం' అంటే, రాముడు ఇప్పుడు 'నియమ నిష్ఠలతో కాలం గడుపుతున్నాడు' అని అర్థం. అంతేగానీ, 'పెళ్ళికాని వాడు' అని అర్థం కాదు గదా? అలాగే, సీత, రావణుడితో లక్ష్మణుడి గురించి 'బ్రహ్మచారి' అని వాడి వుంటే, దానికి 'పెళ్ళికాని వాడు' అనే అర్థం రాదు. 'ఇప్పుడు బ్రహ్మచారిగా జీవిస్తున్నాడు' అనే అర్థంతో చెప్పినట్టు తీసుకోవాలి. కానీ, వెంకటేశ్వర్రావు గారు, ఈ సమయమూ సందర్భమూ చూడకుండా, 'బ్రహ్మచారి'కి 'పెళ్ళికాని వాడు' అనే అర్థం తీసి, 'వాల్మీకి ఇదే చెప్పాడు' అంటున్నారు!

అసలు వాల్మీకి లేని మాటని తెచ్చి దాని మీద ఆధారపడి వాదించడం మొదటి తప్పు. ఒక వేళ, ఆ మాట వాల్మీకిలో వున్నా, దానికి 'పెళ్ళి కాలేదని నిర్ణయించడానికి ఈ తప్పు వాదాలు పనికిరావు.

**(4) శూర్పణఖ రాముడి దగ్గిరికి వచ్చినప్పుడు, రాముడు శూర్పణఖతో 'నా తమ్ముడు భార్యలేని వాడు' అన్నాడు. కాబట్టి లక్ష్మణుడికి పెళ్ళి కానట్టే.**

**జవాబు:** రాముడు అన్న మాటలు 'నా తమ్ముడు భార్య లేకుండా వున్నాడు. చాలా కాలం నించి స్త్రీ సంబంధం లేకుండా వున్నాడు" అని. అంటే, 'ప్రస్తుతం అతనికి ఇక్కడ భార్య లేదు' అని అర్థమే గానీ, 'నా తమ్ముడికి పెళ్ళే కాలేదు' అని అర్థం కాదు.

ఒకవేళ రాముడి మాటలకు, 'లక్ష్మణుడికి పెళ్ళే కాలేదు' అనే అర్థమే తీసుకుంటే, అది ఆ సందర్భంలో

పరిహాసానికి అన్న మాటలే. ఆ అన్నదమ్ములిద్దరూ శూర్పణఖని వెటకారాలు చేసే సందర్భం అది.

లక్ష్మణుడు శూర్పణఖతో 'విశాలాక్షీ! (వెటకారం) నువ్వు రాముడికి చిన్న భార్యగా వుండు. సీత కురూపి. వృద్ధురాలు. బానపొట్ట. దుష్టురాలు. నువ్వు సౌందర్య రాసివి' అంటాడు. ఇదంతా నిజం అనుకుంటే, సీతని కురూపి అని ఒప్పుకోవాలి. ఇదంతా వెటకారమే గానీ నిజం కాదు. ఈ వెటకారాలు చూసి, లక్ష్మణుడికి పెళ్ళి కాలేదనే అర్థానికి రావాలా?

కవి, ఊర్మిళ గురించి ఎక్కువ సార్లు చెప్పలేదు కాబట్టి, చెప్పిన సందర్భాలకు కూడా విలువ ఇవ్వకుండా, వాటిని 'ప్రక్షిప్తాలే' అని నిర్ణయిస్తే, అది గొప్ప పరిశోధనా?

కవి, ఇంకా చాలా పాత్రల్ని చెప్పలేదు. రాముడి తర్వాత ముఖ్య పాత్ర రావణుడే కదా? ఆ రావణుడి భార్యల గురించి మాత్రం కవి ఒకటి రెండు సార్లు గాక ఎన్ని సార్లు చెప్పాడు? సుగ్రీవుడి భార్య గురించైతే, ఆ పురస తప్ప, అసలు చెప్పనే లేదు.

వశిష్టుడు చిత్రకూటంలో రాముడికి వంశక్రమం గురించి చెప్పినప్పుడు, పురుష పుంగవుల దండకం చదివాడే గానీ, భార్యల సంగతి చెప్పాడా? అయితే, రాముడి తాతలకీ, ముత్తాతలకీ పెళ్ళిళ్ళు కానట్టేనా? ఒక బిడ్డ పుట్టినప్పుడు ఏ కథలోనైనా తల్లి పేరు చెప్పడం ఉందా, కథకి అవసరం అయితే తప్ప? తల్లుల గురించి చెప్పినా, తండ్రుల తర్వాతే కదా? సమాజంలో, భార్య స్థానం కన్నా, తల్లి స్థానం ఎక్కువ కాబట్టి, అప్పుడప్పుడూ తల్లుల గురించి చెపుతూ వుంటాడు.

భార్యల విషయం అలా ఉంచుదాం. కవి, రాముడి కష్ట సుఖాలు చెప్పే సందర్భాల్లో లక్ష్మణుడి గురించి చెప్పాడా? రాముడు, తల్లిని వదిలేసిన దురదృష్ట వంతుణ్ణని ఏడుస్తాడే గానీ, లక్ష్మణుడు మాత్రం తల్లిని వదల్లేదూ? రాముడికి నిన్న మొన్నటిదాకా భార్య దగ్గిరే వుంది. లక్ష్మణుడికి ఎన్నో ఏళ్ళ నించీ భార్య లేదు. అయినా లక్ష్మణుడి విరహాన్ని చెప్పాడా కవి? ఎందుకు చెపుతాడు? లక్ష్మణుడు, రాముడికి దాసుడు. సేవకుడు. సేవకుడికి కష్ట సుఖాలేమిటి? సేవకుడికి అనుభూతులేమిటి? రాత్రింబవళ్ళూ యజమాని సుఖం కోసం సేవ చెయ్యడమే దాసుడి ధర్మం. ఇళ్ళు కట్టడం, కట్టెలు కొట్టడం, అడవిలో తిరిగి పేడ తెచ్చి పిడకలు చెయ్యడం, ఇలాంటి పనులు చెయ్యడం మాత్రమే లక్ష్మణుడి ధర్మాలు.

భార్యల గురించి చెప్పకపోయినా, దాసుల గురించి చెప్పకపోయినా, కవి చాలా తప్పు చేశాడనుకో నవసరం లేదు.

ఊర్మిళ గురించి ఎక్కువ సార్లు ఎందుకు చెప్పలేదు? – అనే ప్రశ్న వస్తే, ఎందుకు చెప్పలేదో దానికి జవాబు వెతుక్కోవాలి. అంతేగానీ, పెళ్ళి అయినట్టుగా కనపడే సందర్భాల్ని ఎగరగొట్టేస్తే అదా జవాబు? ఊర్మిళ కనపడే సందర్భాల్ని ప్రక్షిప్తాల వాళ్ళ పనిగా నిర్ధారించారు. మరి, ఆ ప్రక్షిప్తాల కవులు అయినా, ఊర్మిళ గురించి రెండు కన్నా ఎక్కువ సార్లు ఎందుకు చెప్పలేదు? ఈ ప్రశ్న రాదా? దానికి జవాబు అక్కరలేదా?

## 2. లంకా దహనం ప్రక్షిప్తమా?

'ప్రక్షిప్తమే' అంటున్నారు వెంకటేశ్వర్రావుగారు. దానికి రెండు కారణాలు చెప్పారు.

(1) హనుమంతుడు లంక నించి తిరిగి వచ్చి రాముడితో విశేషాలు చెప్పేటప్పుడు లంకా దహనం గురించి చెప్పలేదు. లంకలో చేసిన పనులేవీ చెప్పలేదు.

(2) హనుమంతుడు లంకని తగలబెట్టి సర్వ నాశనం చేసేస్తే, మళ్ళీ నెల రోజులకే లంక యథాస్థితికి బాగుపడిందా?

**జవాబు:** ఈ రెండు అభిప్రాయాలూ తప్పే.

(1) హనుమంతుడు లంక నించి తిరిగి వచ్చిం తర్వాత, రాముడితో తనే స్వయంగా, లంకా దహనంతో సహా అన్నీ చెప్పాడు. అయితే, మొదట సీత సంగతి చెప్పి, చివరికే లంకా దహనం సంగతి చెప్పాడు. హనుమంతుడు లంక నించి తిరిగి వచ్చాడనగానే రాముడికి మొదట ఏం చెప్పాలి? సీత గురించి చెప్పాలి. "నా విషయంలో సీత ఎలా వుందో చెప్పు" అన్నాడు రాముడు.

అప్పుడు హనుమంతుడు మిగతా సంగతులన్నీ వెనక్కిబెట్టి సీత సంగతే ముందు చెప్పాడు. సీత చాలా పవిత్రంగా ఉందనే సంగతి చెప్పడానికే ఇక్కడ కవి ఎక్కువ ప్రత్యేకత ఇచ్చాడు. రాముడు అడిగిందానికి హనుమంతుడు ఈ రకంగా ప్రారంభించి చెప్పాడు – "నేను సీతని వెతుకుతూ సముద్రం దాటాను. రావణాంతఃపురంలో సీత కనపడింది. (అశోక వనం కూడా అంతఃపురంలో భాగమే) నిన్నే స్మరిస్తూ వుంది. రావణుణ్ణి అసహ్యించుకుంటూ, ఆత్మహత్య చేసుకోవాలని ఆలోచిస్తూ వుంది. సదాచారం విడిచి పెట్టలేదు. శీలం మరచిపోలేదు. నీ గురించి విని చాలా సంతోషించింది. ఇంత కాలం రక్షించ లేదేమని వాపోయింది. 'నీ భర్త నిన్ను తప్పకుండా రక్షిస్తాడ'ని ధైర్యం చెప్పాను" అని ఆగాడు. చెప్పవలసిన విషయాలు అప్పటికి ఇంకా పూర్తి కాలేదు. ఇక్కడ లంకా దహనం గురించి రాలేదు కాబట్టి, వాల్మీకి దాన్ని చెప్పలేదనీ, లంకా దహనం గురించి తర్వాత

కనపడేది వాల్మీకి రాసిందే కాదనీ, వాల్మీకి రాసిందైతే ఆ ప్రసక్తి ఇక్కడ కూడా వొచ్చేదనీ, వెంకటేశ్వర్రావు గారి అభిప్రాయం. (కానీ, దాని సందర్భం వచ్చినప్పుడు అదీ చెప్పాడు.) అసలు లంకా దహనం దాకా ఎందుకు? మొదటి విషయాలెన్నో చెప్పలేదు. మైనాకుడి సంగతీ, సురస సంగతీ, సింహిక సంగతీ చెప్పకుండానే నేను "సీతని వెతుకుతూ సముద్రం దాటాను" అన్నాడు. సీత గురించే తొందరగా చెప్పాలి కాబట్టి. లంకిణిని చంపడం, సీత కోసం లంకంతా గాలించడం చెప్పకుం డానే "రావణాంతఃపురంలో సీతని చూశాను" అన్నాడు.

ఆ విధంగా అసలు విషయం తొందరగా చెప్పాలి కదా? అలా తొందరగా చెప్పకుండా, తీరిగ్గా సము ద్రంలో మైనాకుడు అడ్డు రావడం, సురస అడ్డు రావడం, సింహిక అడ్డు రావడం, లంకిణి అడ్డు రావడం – ఇవన్నీ వర్ణించుకుంటూ కూర్చుంటాడా?

అలా చెప్తే, "ముందు సీత సంగతులు చెప్పాలి గానీ, ఆ గోలంతా ఎందుకు? అవన్నీ తర్వాత చెప్పు కోరాదా?" అన్న విమర్శ రాదూ? అందుకే కవి ముందు సీత సంగతి చెప్పి తర్వాత లంకలో సంగతులన్నీ చెప్పాడు. ఎంత తెలివి లేని కవి అయినా అలాగే చేస్తాడు.

రాముడు మొదట సీత గురించి విన్న తర్వాత, కాస్సేపు దుఃఖించి, హనుమంతుడికి గొప్ప బహుమానం ఇచ్చాడు. ఆ బహుమానం ఏమిటో మనకు తెలుసు. తర్వాత కొంచెం శాంతపడి, "లంక వివరాలన్నీ చెప్పు" అన్నాడు.

అప్పుడు హనుమంతుడు తను చేసిన ఘన కార్యా లన్నీ చెప్పుకొచ్చాడు – "లంకని నేనే సగం ధ్వంసం చేసేసి వచ్చాను. అగడ్తలన్నీ కూలగొట్టేశాను. లంకంతా తగలబెట్టేశాను. బోలెడు మంది రాక్షసుల్ని చంపేశాను" అని జరిగిందంతా చెప్పాడు.

వెంకటేశ్వర్రావు గారు రామాయణం ఎన్నో సార్లు చదివాను అని చెప్పుకున్నారు. "... రామాయణాన్ని మీరు చదవడం లేదు. మీ వలె గాక నేను దాన్ని చదివాను. ఒకసారీ, రెండు సార్లూ, మూడు సార్లూ గాక, పదే పదే చదివాను..." అంటున్నారు. మరి, పదే పదే చదివి కూడా లంకలో జరిగిన సంగతులేవీ హను మంతుడు రాముడికి చెప్పనే లేదంటున్నారు! ఇది చాలా ఆశ్చర్యంగానే వుంది.

లంకా దహనం సంగతి, ఇక్కడ ఒక్క చోటే కాదు, మిగిలిన కథలో కూడా బోలెడు సార్లు వచ్చింది.

లంకలో యుద్ధం జరుగుతూ ఉన్నప్పుడు, కుంభ కర్ణుణ్ణి నిద్రలేపుతూ "తొందరగా లే. యుద్ధం జరుగు తోంది. ఒక వానరుడొచ్చి లంకంతా తగలబెట్టి వెళ్ళాడు" అని చెపుతారు రాక్షసులు.

రాముడు యుద్ధంలో జయించి అయోధ్యకు తిరిగి పోతూ భరద్వాజ ఆశ్రమంలో ఆగినప్పుడు, ఆ రుషి సంతోషించి – "నాయనా! నీ వనవాసంలో జరిగిన సంగతులన్నీ విన్నాను. సీతాపహరణం, సుగ్రీవుడితో నీ స్నేహం..." ఈ రకంగా ఏమేమి విన్నాడో చెప్పినప్పుడు, బంగారు లేడి గురించీ, లంకా దహనం గురించీ కూడా వచ్చింది.

రాముడికి పట్టాభిషేకం అయింతర్వాత, హను మంతుణ్ణి కీర్తించే సమయంలో – 'నువ్వు అంత వాడివి, ఇంత వాడివి, ఆ కార్యం చేశావ్, ఈ కార్యం చేశావ్' అంటూ రాముడు లంకా దహనం సంగతి కూడా ఎత్తి ప్రశంసించాడు. ఈ రకంగా, అవసరమైన ప్రతిచోటా దాని ప్రసక్తి ఉంది.

లక్ష్మణుడి భార్య సంగతి కథలో ఎక్కువ సార్లు లేదు కాబట్టి అది ప్రక్షిప్తం అయితే, లంకా దహనం సంగతి కథ పొడుగునా వుండి కూడా అది ప్రక్షిప్తం అయింది! అంటే, వెంకటేశ్వర్రావు గారి ప్రకారం, ప్రక్షిప్తం అవ డానికి ఒక రూలేమీ లేదు. ఆ సంఘటన ఉన్నా ప్రక్షిప్తమే, లేకపోయినా ప్రక్షిప్తమే!

(2) లంకా దహనం ప్రక్షిప్తమే – అనడానికి వెంక టేశ్వర్రావు గారు చెప్పిన రెండో కారణం: 'హను మంతుడు లంక నించి తిరిగివొచ్చిన తర్వాత నెల రోజులకే దానిపై వానర సైన్యంతో దండయాత్ర జరిగింది. అప్పుడు లంకా నగరం చెక్కు చెదరకుండా నిలిచి వుంది. హనుమంతుడు బూడిదె పోగులుగా విడిచి వెళ్ళిన నగరాన్ని రావణుడు తన మంత్ర శక్తిచే దానిని యధా పూర్వ స్థితికి నెల లోపలనే తిరిగి తెచ్చాడు కాబోలు!' – ఇది ఆయన అభ్యంతరం!

'మంత్ర శక్తి'తో అయితే 'నెల' దాకా ఎందుకు? ఒక్క క్షణమే చాలు!

ఒక కోతి, తోక నిప్పుతో లంకా నగరం మీద ఎగిరి ఇళ్ళన్నీ తగల బెట్టెయ్యడం – అనేది కల్పన. ఈ కల్పన జరగడం సాధ్యమైనప్పుడు, ఆ నగరం ఒక్క నెలలోనే తిరిగి బాగుపడడం కూడా సాధ్యం అవదా?

లంక తగలబడడం – మొదటి కల్పన. అది నెల లోపల యధాస్థితికి రావడం – ఇంకో కల్పన. రెండు కల్పనలకూ సరిపోతుంది. దాని మీద ప్రశ్నలెందుకు?

వెంకటేశ్వర్రావు గారికి, మొదటి కల్పన మీద ప్రశ్న రాలేదు. అది బాగానే నచ్చింది. రెండో కల్పన మీదే ప్రశ్న వచ్చింది. 'లంక నెల రోజుల్లోనే బాగుపడిందా'

అనే ప్రశ్న. ఇలాటి వాదాలతో, ఈ లంకా దహనం సంఘటనని వాల్మీకి రాయలేదనీ, అది ప్రక్షిప్తం అనీ తేల్చారు. ప్రక్షిప్తం కవి అలా చేసినప్పుడు, ఆ పని వాల్మీకే చేసి వుండకూడదా?

## 3. 'బాల కాండ' ప్రక్షిప్తమా?

'బాల కాండ'లో కథలు రామాయణ కథా గమనానికి అడ్డొస్తున్నాయట! వాల్మీకి అయితే అక్కడ అలాంటి కథలు రాసేవాడు కాడట! అంటే అవన్నీ ప్రక్షిప్తాలే! ఈ అభిప్రాయం కొంత మంది విమర్శకులకు వుంది. వెంకటేశ్వర్రావు గారి అభిప్రాయం కూడా ఇదే.

ఆయన ఏమంటారో చూడండి – " 'బాల కాండ'లో గల విశ్వామిత్రుని పుట్టు పూర్వోత్తరాలు, వశిష్టునితో ఆయనకు కలహం, సగర చక్రవర్తీ – ఆయన పుత్రుల వృత్తాంతం, గంగావతరణ గాథా, మొదలైనవన్నీ రామ కథ ముందుకు సాగటానికి ఏ విధంగానూ తోడ్పడవని గుర్తిస్తారా? కథా గమనాన్ని నిరోధిస్తున్న ఈ భాగాలన్నీ ప్రక్షిప్తాలనుకోవడం ఏ విధంగా తప్పు?".

**జవాబు:** ఇది తప్పో కాదో చూద్దాం. 'బాల కాండ'లో కథలన్నీ, విశ్వామిత్రుడు, రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ అయోధ్య నించి తన ఆశ్రమానికి తీసుకు వెళ్తూ వున్నప్పుడూ, తర్వాత మిథిలకు తీసుకువెళ్తూ వున్నప్పుడూ, దారిలో చెప్పినవే. అడవుల్లో నడిచి ప్రయాణాలు చేసేటప్పుడు, అందులోనూ చిన్న పిల్లలకు పెద్దవాళ్ళు కథలు చెప్పడం – ఎంతో సహజమైన విషయం.

'రామకథ' అంటే – రాముడి పూర్వుల గురించి చెప్పడం, రాముడి గురువు గురించి చెప్పడం, రాముడి తండ్రి చేసిన యజ్ఞయాగాల గురించి చెప్పడం, రాముడి జననం గురించి చెప్పడం – ఇవన్నీ రామకథకు సంబంధించిన విషయాలే. ఆ కథలే లేకపోతే, "వారు అయోధ్య నించి విశ్వామిత్రుడి ఆశ్రమానికి చేరారు" అనీ, "వారు ఆశ్రమం నించి మిథిలకు చేరారు" అనీ మాత్రమే చెప్పవలసి వస్తుంది. దారి పొడుగునా రాముడు ఏ ప్రదేశాన్నో, ఏ నదినో చూసి వివరా లడగడం, దానికి విశ్వామిత్రుడు ఒక కథ చెప్పడం, జరుగుతూ వుంటుంది. ఇది అసలు కథకి ఆటంకం ఎలా అవుతుంది? గురువు, శిష్యులకు కథలు చెప్పడం కూడా అసలు కథలో భాగం అవదా? పైగా ఆ కథలన్నీ ఏవో ఒక రకంగా రాముడికి సంబంధించినవే. ప్రయాణాలు చేస్తూ మార్గమధ్యంలో చెప్పుకున్న ఈ కథలన్నీ ప్రక్షిప్తాలే అయితే, ఈ ప్రక్షిప్తాల కవులు, రామాయణ కథ గమనానికి ఎన్నో వన్నెలు చేకూర్చారని అర్థం. ఈ కథలు, వాల్మీకి రాసినవి కాకపోతే, వాల్మీకికి ఈ కథలు రాయాలని తోచలేదని అర్థం.

"కథా గమనాన్ని నిరోధిస్తున్న భాగాలన్నీ ప్రక్షిప్తాలనుకోవడం ఏ విధంగా తప్పు?" అంటున్నారు కదా వెంకటేశ్వర్రావు గారు?

ఇది, ఒక తప్పు కాదు. రెండు తప్పులు!

అసలు ఈ భాగాలన్నీ కథా గమనాన్ని నిరోధిస్తున్నాయి – అనుకోవడం, మొదటి తప్పు. ఏది కథా గమనాన్ని నిరోధిస్తే అది ప్రక్షిప్తం – అనుకోవడం, రెండో తప్పు.

ప్రక్షిప్తాల మీద ఇంత కక్షా, వాల్మీకి మీద అంత భక్తీ లేకుండా నిష్పక్ష పాతంగా పరిశీలించి వుంటే, ఈ విమర్శలు ఇంకో రకంగా ఉండడానికి వీలయ్యేది.

వాల్మీకి కూడా ఒక్కోచోట తెలివితేటలు ప్రదర్శించి, ఒక్కోచోట తెలివి తక్కువగా ప్రవర్తించాడు. అలాగే, ప్రక్షిప్తాల కవులు కూడా రెండు రకాలుగానూ చేశారు. కొన్ని ఘట్టాల్ని వివరంగా చూస్తే, ఇది తెలుస్తుంది. కానీ, ఇదంతా అనవసరం.

ఒక ఘట్టం అవకతవకగా కనపడగానే, దాన్ని ప్రక్షిప్తమే అని నిర్ణయించడం చాలా తప్పు. అసలు కవి కూడా కొన్ని సార్లు అవక తవకగానే రాస్తాడు కాబట్టి.

సుగ్రీవుడికి భూమండల జ్ఞానం అంతా తెలిసిన ఘట్టం ఒకటి వుంది. దాని ప్రకారం, రావణుడి నివాసం సుగ్రీవుడికి తెలుసు. కానీ, కథలో మొదటి నించీ రావణుడి గురించి సుగ్రీవుడికి తెలియనట్టే సాగుతుంది. తీరా, సీత కోసం వానరుల్ని పంపేటప్పుడు సుగ్రీవుడికి అంతా తెలుసని బయట పడుతుంది. రావణుడు ఎక్కడ వుంటాడో తెలిసినప్పుడు, వానరుల్ని ఆ ఒక్క దిక్కుకే పంపితే చాలు కదా? అన్ని దిక్కులకూ పంపడం ఎందుకు? పోనీ, అన్ని దిక్కులకూ పంపితే, దక్షిణం దిక్కు వెళ్ళే వాళ్ళకే ఉంగరం ఎందుకు ఇచ్చాడు? కానీ, ఆ దక్షిణం వేపు వెళ్ళిన వాళ్ళకి కూడా సంపాతి చెప్పే వరకూ రావణు డెక్కడుంటాడో తెలీలేదు. సుగ్రీవుడు చెప్పినా, సంపాతి ఇంకా కొన్ని వివరాలు ఎక్కువగా చెప్పాడు – అన్నట్టుగా తీసుకోవచ్చు దాన్ని.

కానీ, ప్రతీ చోటా ఇలా సర్దుకోడం కుదరదు. కుదరకపోయినా, అందులో ఏదో ఒకటి ప్రక్షిప్తమే అని తేల్చెయ్యడం కూడా కుదరదు. అసలు మూల కథా విధానమే బోలెడు అవక తవకలకు ఆస్కారం ఇచ్చే విధానం కాబట్టి.

ఇలాగ అడుగడుగునా ప్రశ్నలే వస్తాయి. అందులో ప్రక్షిప్తాల్ని ఏరడం మొదలు పెడితే, మొత్తం కథ అంతా ప్రక్షిప్తమే అవుతుంది. అప్పుడు, ఆ కథే అసలు మూలం అవుతుంది.

ప్రక్షిప్తాలు లేని ఘట్టాలన్నీ గొప్ప నేర్పుగా నడిచాయి – అనుకోనక్కరలేదు. బంగారు లేడి కోసం రాముడు గాక, లక్ష్మణుడే వెళ్తే ఏమయ్యేది? లక్ష్మణుడు ఎన్నో చాకిరీలు చేస్తూనే వున్నాడు కదా? ఈ పనికి కూడా అతనే బైల్దేరితే, రాముడు ఇంటి దగ్గిరే వుంటాడు. లక్ష్మ ణుడి కేకలు వినపడ్డా, సీత, రాముణ్ణి నిందించి పంపిం చదు. అప్పుడు, రావణుడు సీతని ఎలా ఎత్తుకుపోతాడు? లేడి కోసం లక్ష్మణుడు గాక రాముడు బైల్దేరాడు కాబట్టే కథ నడిచింది.

కథ ప్రకారం, రాముడు పుట్టడం రావణుణ్ణి చంప డానికే. రావణుడు సీతని ఎత్తుకుపోక పోయినా, రాముడు రావణుణ్ణి చంపే పద్ధతిలో కథ నడవడానికి కూడా అవకాశం వుండాలి. కానీ, రావణ వధ కోసమే అవతారం ఎత్తిన రాముడికి, అసలు రావణుడు ఎక్కడ వుంటాడో ఏమిటో, వాడి ఊరూ పేరూ తెలీవు – దారే పోయే వాళ్ళు చెప్పేదాకా! కథ ఇలా నడవడం, కవి, దాన్ని నేర్పుగా నడిపినట్టా?

మైతాలజీ కథల్లో, ప్రతీ చోటా ఏదో ఒక అనుకోని సంఘటన జరిగితేనే పాత్రలు ముందుకు కదులు తూంటాయి.

సాహిత్యంలో ఆ నాడే కాదు, ఈ నాటికీ ఇదే విధానం నడుస్తోంది. కళల విషయంలో ఎంతో అభివృద్ధి చెందినట్టుగా కనపడే ఈ నాటి సమాజంలో కూడా, మనం మన రచనల్లో ఎన్నో పొరపాట్లు చేస్తున్నాం. ఇక వేలకొద్దీ సంవత్సరాల కిందటి కవి, గొప్ప సహజత్వంతో చక్కగా, నేర్పుగా, చాతుర్యంతో, రాశాడనుకోవడంలో అర్థమేముంది? సామాన్య తర్కమే లేని కల్పిత గాథలో ఎంతో అభివృద్ధి చెందిన కథా గమనాన్ని ఎలా ఆశిస్తాం?

అందుచేత, ప్రక్షిప్తాల కవుల్ని పట్టుకోవాలని ప్రయ త్నించినప్పుడల్లా వాల్మీకి కూడా దొరికిపోతూ వుంటాడు. ప్రక్షిప్తాల కవులంతా వెళ్ళి ఆయన చుట్టూ దాక్కుంటారు. అందరూ ఆయన ఒరవడిలోనే రాశారు. ఆయన్ని వదిలేసి వీరిని మాత్రమే పట్టుకోడం ఏం న్యాయం?

'రామాయణం' అనే గ్రంథాన్ని ఒక కవి రాయడం, దాన్ని మరికొందరు కవులు పెంచడం అనేది, మనకు నచ్చినా నచ్చకపోయినా, అది చరిత్రలో జరిగిన విషయం. మూలాన్ని భక్తితో తీసుకున్నట్టే, ప్రక్షిప్తాల్ని కూడా అలాగే తీసుకోవాలి.

'సంస్కృత రామాయణం నించి ప్రక్షిప్తాలన్నిటినీ ఏరివెయ్యడం, తీసివెయ్యడం' అనే అభిప్రాయాలు కలగటం అంటే, చరిత్రలో జరిగిన విషయాల్ని లెక్కలోకి తీసుకోకుండా, తిరస్కరించడం అన్నమాట! భారత దేశాన్ని బ్రిటిష్ వాళ్ళు పరిపాలించిన రెండు, మూడు వందల సంవత్సరాల కాలాన్నీ లెక్క పెట్టుకోకపోతే, అది ఎలాంటిదో, రామాయణం లోంచి ప్రక్షిప్తాల్ని తీసుకోక పోవడం కూడా అలాంటిదే. చరిత్రలో జరిగింది మంచి అయినా, చెడ్డ అయినా, దాని ఫలితాలు అనుభవిస్తాం. దాన్నించి అనుభవాలు తీసుకుంటాం. అంతేగానీ, దాన్ని గమనించకుండా తిరస్కరించకూడదు.

ప్రక్షిప్తాలు లేని వాల్మీకి రామాయణం కావాలంటే, అది వాల్మీకి కాలంలో మాత్రమే సాధ్యం. 'ప్రక్షిప్తాలు లేని రామాయణమే కావాలి' అనడం అంటే, 'వాల్మీకి కాలానికే వెళ్దాం, తర్వాత జరిగిన కాలం మనకు వద్దు' అనడమే.

## 4. జాబాలికి ఎంత అన్యాయం!

'రామాయణంలో ప్రక్షిప్తాలు లేకపోతేనే వాల్మీకికి న్యాయం జరుగుతుంది' అనే అభిప్రాయం వున్న వెంక టేశ్వర్రావు గారు, ప్రక్షిప్తం అని ఆయనే వాదించిన ఘట్టాన్నే తీసుకొని "జాబాలి" నాటిక రాశారు. (దానికి ఆయన ఏదో కారణం చెప్పుకున్నారు.) ఎందుకు రాశా రనే ప్రశ్న కాదు ఇది. ప్రక్షిప్త ఘట్టం తీసుకున్నారంటే ప్రక్షిప్తాలకు వున్న స్తానాన్ని గుర్తించవలసి వచ్చింది కదా?

ప్రక్షిప్తాల కవులు రాముడి పాత్రని చెడగొట్టారని అభిప్రాయపడిన వెంకటేశ్వర్రావుగారు, జాబాలి పాత్రకి ప్రక్షిప్తాల కవులు కూడా చెయ్యని అన్యాయం చేశారు.

'రామాయణం'లో జాబాలి, వశిష్టుడంతటి వాడి ముందు కూడా కొంతసేపు నాస్తికత్వం మాట్లాడాడు. కానీ, వెంకటేశ్వర్రావుగారి నాటికలో జాబాలి, వశిష్టుడి ముందు నాస్తికత్వం మాట్లాడ్డానికి ధైర్యం లేని వాడు.

వెంకటేశ్వర్రావుగారు, 'జాబాలి' పీఠికలో, "సాంప్ర దాయిక మత విశ్వాసాలకూ, సాంఘికాచారాలకూ ప్రాతినిధ్యం వహించే వశిష్టుని పరోక్షంలో మాట్లాడినంత నిర్భయంగా, నిష్కర్షగా, ఆయన సమక్షంలో జాబాలి మాట్లాడలేడని నే నూహించడం అసమంజసం కాదను కుంటాను" అన్నారు.

రామాయణంలో జాబాలి, మొదట కొంతసేపు నాస్తికత్వం మాట్లాడి, తర్వాత రాముడి కోపానికి జడిసి, "నేను నాస్తికుణ్ణి కాను" అని చెప్పుకుంటాడు. ఈ జాబాలి పాత్ర ప్రక్షిప్తాల కవులు చేర్చినదే అయితే, ప్రక్షిప్తాల కవుల జాబాలి పిరికి వాడే. కానీ, ఆ పిరికి జాబాలిని ధైర్యస్తుడిగా మార్చాలని వెంకటేశ్వర్రావుగారి ప్రయత్నం. కానీ, ఈయన పాత్ర చిత్రణ ఎలా వుంది? ఈ జాబాలి వశిష్టుడి వెనకాల అయితే నాస్తికత్వాల్ని ధైర్యంగా మాట్లాడతాడట! వశిష్టుడి సమక్షంలో అయితే,

అలా నిర్భయంగా మాట్లాడలేడట! 'ఈ పాత్రని ఇలా ఊహించడం అసమంజసం కాదనుకుంటాను' అంటూ వెంకటేశ్వర్రావు గారు, ఈ జాబాలిని తను చాలా చక్కగా చిత్రించినట్టు చెప్పుకున్నారు. జాబాలికి, ప్రక్షిప్తాల కవులు చేసిన దానికన్నా ఎక్కువ అన్యాయమా కాదా ఇది?

## 5. రామాయణం వాల్మీకి రాయలేదా?

రామాయణం కథని, వాల్మీకి శ్లోకాలుగా తయారు చెయ్యడమే గానీ, వాటిని ఆయనే స్వయంగా రాతలో పెట్టలేదంటున్నారు వెంకటేశ్వర్రావు గారు. "వాల్మీకి మహాముని 'చెప్పిన' రామాయణ కావ్యం చాలా చిన్నదే. ఇక్కడ నేను కావాలనే 'చెప్పిన' అనే మాటను ప్రయోగిస్తున్నాను. రామాయణాన్ని ఆయన వ్రాయలేదు. ఒక పాటగా చెప్పాడు" అన్నారు.

వాల్మీకి, ఆ శ్లోకాలు నోటితో తయారుచేస్తే, తర్వాత కవులెవరో వాటిని తాటాకుల మీదికి ఎక్కించారని (వాల్మీకి పేరనే) వెంకటేశ్వర్రావు గారి అభిప్రాయం.

వాల్మీకికి సంబంధించినవి కనీసం 10 వేల శ్లోకాలని చెపుతున్నారు కదా? అన్ని వేల శ్లోకాల్ని చక్కగా కూర్చే పని చేసి, వాటిని రాయకుండా ఉండడానికి కారణం ఏమిటి? వాల్మీకిని చదువు రాని వాడనుకోవాలా? చదువు రాని వ్యక్తికి ఛందోబద్ధంగా, వ్యాకరణ యుక్తంగా, అన్ని వేల శ్లోకాలు తయారు చెయ్యడం సాధ్యమౌతుందా? అన్ని వేల శ్లోకాల్ని కేవలం నోటితో ఒక వరసలో వల్లించడం సాధ్యమవుతుందా? వాల్మీకి, చదవడం, రాయడం వచ్చిన వాడే అయితే, తను తయారుచేసిన శ్లోకాల్ని తనే తాటాకుల మీద రాయకుండా ఉండడానికి కారణం ఏమిటి? – దీనికి వెంకటేశ్వరరావు గారు రెండు కారణాలు చెప్పారు.

(1) 'బాల కాండ' మొదట్లోనూ, 'యుద్ధ కాండ' చివర 'ఫలశృతి'లోనూ, "నేను ఇది రాస్తున్నాను" అనే పద్ధతిలో చెప్పడం కాకుండా, "ఉత్తమోత్తముడైన వాల్మీకి రచించిన ఈ కావ్యం..." అని వుంది. కాబట్టి, వాల్మీకి పాటని ఎవరో ఇంకో కవి, రాతలోకి 'ఎక్కించాడని' వెంకటేశ్వర్రావుగారి అభిప్రాయం.

కానీ, ఈ నాడు మనకు కనపడే అనేక శతకాల్లో, ప్రతీ పద్యంలోనూ చివరి లైనులో, కవి పేరు వుంటుంది. వేమన శతకం చూడండి. పద్యంలో చివర 'వినుర వేమా' అని వుంటుంది. దీన్ని వేమన గాక ఎవరో రాశారని అర్థమా? సుమతీ శతకంలో, ప్రతీ పద్యం లోనూ చివర 'సుమతీ' అని వుంటుంది. త్యాగరాజ కృతుల్లో చాలా వాటిల్లో 'త్యాగరాజ' అని వుంటుంది. వీటిని చూస్తే ఏం అర్థమౌతోంది? నిన్న మొన్నటిదాకా కూడా కవులు అలాగే రాసుకున్నారు. వెంకటేశ్వ ర్రావుగారు కూడా కొన్ని పద్యాలు రాసి, చివరి పాదాల్లో తన పేరు రాసుకున్నారు, 'నవ యుగాల బాట నార్ల మాట' అంటూ! ఇది ఒక రచనా విధానం. వెనకటి కాలం నించీ వచ్చిన పద్ధతే ఇది. రామాయణం రాసింది వాల్మీకే అయినా, ఆయన 'నేను ఒక రోజున నది దగ్గిర పావురాల్ని చూశాను' అనే పద్ధతిలో కాకుండా, 'వాల్మీకి ఒక రోజున నది దగ్గిర పావురాల్ని చూశాడు' అనే పద్ధతిలో రాశాడని, అర్థం చేసుకోవాలి. ఇది సరైన జవాబు కాకపోతే, వాల్మీకి కొన్ని వేల శ్లోకాల్ని నోటితో తయారు చేశాడనీ, ఆ కొన్ని వేల శ్లోకాల్ని ఎవరో ఇంకో కవి, తాటాకుల మీదకి తర్వాత కాలంలో ఎక్కించాడనీ అనుకోవడం సరైన జవాబు అవుతుందా?

(2) రామాయణం శ్లోకాల్ని రాతలోకి వాల్మీకి ఎక్కించలేదనడానికి వెంకటేశ్వర్రావుగారు చెప్పే ఇంకో కారణం చూడండి! "వాల్మీకి కూర్చగా రామాయణాన్ని మొట్టమొదట పాడిన వారు కుశ లవులు. గనకనే 'కుశీలవుడు' అన్న మాటకు, 'ఊళ్ళ వెంట తిరిగి వీర గాథలను పాడి వినిపించే వాడ'న్న అర్థం వచ్చినట్టు చెపుతారు. అన్నట్టు 'కుశీలవుడు' అంటే 'వాల్మీకి' అని కూడా నిఘంటువులు పేర్కొంటున్నాయి" అన్నారు. వాల్మీకి, ఆ శ్లోకాల్ని పాడి వినిపించే వాడు కూడా కావచ్చును. 'పాడే వాడు' అంటే, 'రాసేవాడు కాదు' అనే అర్థం వస్తుందా? తను రాసుకున్న శ్లోకాల్ని తనే ఊళ్ళ వెంట తిరిగి పాడి వినిపించ కూడదా?

వెంకటేశ్వర్రావుగారు చూపించిన ఈ 2 కారణాలూ, రామాయణం వాల్మీకి 'రాయలేద'నటానికి పనికి వస్తాయా?

అన్ని వేల శ్లోకాలు తయారుచేసిన కవి, వాటిని 'రాతలోకి ఎక్కించలేద'ని వెంకటేశ్వర్రావుగారు అంటున్నారు కదా? తను అలా ఎందుకు అనుకుంటున్నారో కారణాలు చెప్పారు గానీ, వాల్మీకి ఎందుకు రాసి వుండడో ఆ కారణాలు చెప్పలేదు. "వాల్మీకికి చదువు వచ్చి వుండదు. అందుకే ఆయన రాసి వుండడు – అనినే ననుకుంటున్నాను" అని చెప్పాలి. లేదా, తను ఊహించే ఇంకేదైనా కారణం చెప్పాలి. అలాంటిదేమీ చెప్పకుండా "వాల్మీకి రాయలేదు" అన్నారు. ఎందుకు రాసి వుండడో చెప్పలేదు.

ప్రక్షిప్తాల మీద కత్తి కట్టే విమర్శకులు, ఇంకో విషయం అర్థం చేసుకోవాలి.

వాల్మీకి రచనలోకి ప్రక్షిప్తాలు చేరడమే నిజమైతే, అది అలా ఎంత కాలం జరిగి వుంటుంది? అచ్చు

యంత్రాల మీద పుస్తకాలు తయారవడం ప్రారంభ మయ్యే వరకూ మాత్రమే జరిగి వుంటుంది. అచ్చు పుస్తకాల్లోకి ప్రక్షిప్తాల్ని చేర్చడం సాధ్యం కాదు కాబట్టి, అప్పుడు ఇక ప్రక్షిప్తాల వ్యవహారం ఆగిపోయి వుంటుంది. అయితే, తర్వాత కాలపు కవులు, తమ ప్రయత్నాలన్నీ ఆపేసుకున్నారా? రామాయణం కథలోకి ఇంకా కొన్ని కొత్త సంగతుల్ని చేర్చాలనో, పాత సంగ తుల్ని మార్చాలనో తర్వాత ఏ కవులకూ అనిపించలేదా? అప్పుడు ఆ కవులు ఏం చేశారు? – ఏం చేశారంటే, వెనకటి కథలోకే ప్రక్షిప్తాల్ని చేర్చడం కాదు; కొత్త రామాయణాలు రాయడం మొదలుపెట్టారు. వాల్మీకి కథనే ఆధారం చేసుకుని, దానికి ఇంకా చిలవలూ పలవలూ కల్పిస్తూ వచ్చారు. ఈ క్రమం ఈ నాటికీ ఇంకా ఇంకా జరుగుతూనే వుంది. కొత్త రామాయణాలు వస్తూనే వున్నాయి.

ఇప్పుడు మనం మచ్చుకి కొన్ని కొత్త రామాయ ణాల్ని చూస్తే, ప్రక్షిప్తాల దశ తర్వాత ఏం జరిగిందో తెలుస్తుంది.

# కొన్ని ఇతర రామాయణాలలో విశేషాలు!

[ఈ రామాయణాలేవీ నేను చదవలేదు. వీటికి సంబంధించిన వ్యాసాలు చదివాను]

### భాస్కర రామాయణంలో:

తార, రాముణ్ణి శపిస్తుందట. ఈ కవి ఈ మార్పు ఎందుకు చేసినట్టు? తన భర్తని చంపిన వాణ్ణి ఏమీ అనకుండా తార, రాముడికి నమస్కారాలు పెట్టడం (వాల్మీకి పెట్టించినట్టు) బాగుండదు అనే స్పృహ ఈ కవికి కలిగింది. (రాముడికి శాపం పెడితే మాత్రం అది నిలుస్తుందా? ఈ కవే మళ్ళీ ఏ రుషి ద్వారానో ఆ శాపాన్ని వరంగా మార్పించే ఉంటాడు.)

### శ్రీకృష్ణ రామాయణంలో:

సీతాదేవి మీద అభాండాలు వేసిన చాకలిని ఆస్థా నానికి పిలిపించి అడిగితే, అతడు పిచ్చివాడని తేలింది. పిచ్చివాడి మాటలు లక్ష్యపెట్టక్కర్లేదనీ, సీతని విడిచి పెట్టక్కరలేదనీ పురోహితులు చెపితే, రాముడు సీతని అడవికి పంపించకుండా ఊరుకుంటాడు. ఈ కవి, ఈ మార్పు ఎందుకు చేశాడు? సీతని అడవుల్లో వదిలి పెట్టినందుకు రాముడి మీద ఒక విమర్శ వుంది కదా? రాముణ్ణి మంచివాడిని చెయ్యటానికే ఈ మార్పు. కానీ, పిచ్చివాడు కాకుండా మంచివాడే ఆ మాటలంటే? పిచ్చివాడి మాటలకు విలువ ఇవ్వక్కర్లేదంటే, పిచ్చి లేని వాడి మాటలకు విలువ ఇవ్వాలని అర్థమే కదా? పిచ్చి లేనివాడే ఆ మాటలు అని వుంటే, రాముడు సీతని వదలవలసిందే కదా? – రాముణ్ణి రక్షించాలని ఈ కవి, ఇలాంటి ఇరుకులో పడ్డాడు. 'ఉత్తరకాండ'లో, ఆ మాటలన్నది ఒక్క వ్యక్తే కాదు. చాలా మంది అన్నారని చారులు చెపుతారు. రాముడికి ఎవరివల్లా ఏ ప్రమాదం రాకుండా ఉండాలంటే, దేశ ప్రజలందరూ పిచ్చివాళ్ళై పోవాలి. అప్పుడు వాళ్ళు ఎలా మాట్లాడినా, రాముడు, సీతనీ, రాజ్యాన్నీ కూడా వదలకుండా ఉండవచ్చు.

సీత గురించి చెడుగా మాట్లాడిన వ్యక్తి పిచ్చి వాడు – అనే మార్పు ఈ కవి ఎందుకు చెయ్యాలి? 'అతను మంచివాడే; అయినా, ఆ మాటల్ని రాముడు లక్ష్య పెట్ట లేదు. సీతని వదిలి పెట్టలేదు' అని ఈ కవి ఎందుకు రాయలేకపోయాడు? అంత ధైర్యం లేదు. వాల్మీకి చెప్పిందీ, ఈ కవి చెప్పిందీ ఒకటే. కానీ, ఏదో చిన్న మార్పు.

ఈ శ్రీ కృష్ణ రామాయణంలోనే రాముడు శంబు కుణ్ణి చంపకుండా, తపస్సు మాత్రం మాన్పించి విడిచి పెడతాడట. రాముడి మీద విమర్శలకు తావు లేకుండా రాముణ్ణి ఉత్తముణ్ణి చెయ్యాలని ఈ కవి తాపత్రయం. రాముడు ఒక శూద్రుణ్ణి చంపాడనే విషయం ఈ మారుతోన్న సమాజానికి సమంజసంగా తోచదు కదా? అందుకని, ఈ కవి, శంబుకుణ్ణి చంపించ లేదు. కానీ పూర్వం కవులలాగే ఈ కవికి కూడా శూద్రుడు తపస్సు చెయ్యడం ఇష్టం లేదు. తపస్సు జరగకుండా మానిపిం చేశాడు. శూద్రుడు తపస్సు చేసే హక్కుని ఈ కవి అంగీకరించ లేదంటే, ఈయన, శూద్రులకు చేసిన మేలు ఏమిటి?

కవికి ఎంత వరకూ ఇష్టమయితే అంత వరకే రాముడు ఉత్తముడవుతాడు, రేపు సమాజం ఇంకా చైతన్యవంతంగా మారినప్పుడు, ఈ కవుల వ్యవహారం ఇంకా కొంచెం మారుతుంది. అప్పుడు రాసే కొత్త రామా యణాలలో రాముడు శంబుకుణ్ణి తపస్సు కూడా చేసుకో నిస్తాడు. (అయితే, ఆ తపస్సు విష్ణువు గురించే చెయ్య మని ఆజ్ఞాపిస్తాడనుకోండీ!) "చూశారా? రాముడు అన్ని వర్ణాల వారినీ సమానంగా చూశాడు" అనే కొత్త ప్రచారం ప్రారంభమౌతుంది, అప్పుడు!

### అధ్యాత్మ రామాయణంలో:

రాముడు పుట్టగానే కౌసల్యకి భగవత్ స్వరూపం

చూపిస్తాడట! అడవుల్లో ఉన్నప్పుడు, నిజం సీతని అగ్నిలో దాచేసి, 'మాయ సీత'ని ఆశ్రమంలో ఉంచుతాడట! రావణుడు, రాముడి చేతిలో మరణించడం కోసమే ఆ మాయ సీతని ఎత్తుకు పోతాడట! అయితే, రాముడు, నిజం సీత తన దగ్గిరే వుండగా, మాయ సీత కోసం రావణుడితో యుద్ధం చేశాడన్న మాట! ఈ కవి తెలివి ఇలా వుంది!

### అద్భుతోత్తర రామాయణంలో:

రాముడు రావణుణ్ణి చంపేసి రాజ్యం చేస్తూ ఉన్నప్పుడు, ఇంకో రాక్షసుడి మీదకి యుద్ధానికి వెళ్ళి రాముడే చచ్చిపోతాడు! (నిజంగా అద్భుతంగానే ఉంది!) అప్పుడు సీతే యుద్ధం చేసి ఆ రాక్షసుణ్ణి చంపేస్తుంది. అంతలో బ్రహ్మ వచ్చి రాముణ్ణి బతికిస్తాడు.

ఈ రకంగా ఈ నాటి వరకూ వచ్చిన వందలకొద్దీ రామాయణాలలో ఇలాంటి మార్పులూ, చేర్పులూ ఎన్నో! వాల్మీకి రామాయణంలోకి ప్రక్షిప్తాలు చేరడం ఆగిపోయిన తర్వాత, ఈ కొత్త రామాయణాలు పుట్టుకు వచ్చాయి.

పెద్ద పెద్ద కవులు రాసిన పుస్తకాల్లోనే కాదు, ప్రజల్లో ఎన్నెన్నో కల్పనలున్నాయి. కానీ, మొత్తంగా చూస్తే అన్నిటి లక్ష్యమూ ఒకటే. రాముణ్ణి కీర్తించడం! రాముడు పాటించే ధర్మాల్ని కీర్తించడం!

ఈ మార్పుల వల్లా, కొత్త రామాయణాల వల్లా, సమాజంలో మారుతోన్న స్థితిగతులు తెలియడానికి అవకాశం కలుగుతుంది.

'శివ ధనుర్భంగం' ఘట్టాన్ని ప్రక్షిప్తం అనుకుందాం. ఇక్కడ విష్ణు ధనుర్భంగం అనక, 'శివ ధనుర్భంగం' అని ఎందుకు అన్నారు? ఈ ప్రక్షిప్తం వల్ల ఏం తెలుస్తోంది? విష్ణు భక్తులకూ శివ భక్తులకూ వైరం వుందని ఊహించాలి. రాముడు, విష్ణువు అవతారం. అతని చేతిలో శివుడి విల్లు విరిగిపోయింది. అంటే, శివుడి కన్నా విష్ణువు గొప్పవాడని ఈ ఘట్టం చెపుతోంది!

అలాగే, రాముడు బుద్ధుణ్ణి తిట్టే ప్రక్షిప్తం వల్ల, బౌద్ధమత ప్రభావం వల్ల ప్రజల్లో నాస్తిక భావాలు వ్యాప్తిలో ఉన్నాయనీ, రామాయణం ద్వారా నాస్తికత్వాన్ని అణిచే ప్రచారం జరిగిందనీ, అర్థం చేసుకోవచ్చు.

ఇంత స్పష్టంగా ఏ పరిస్తితినీ వెల్లడించని ప్రక్షిప్తాలు అనేకం ఉంటే ఉండవచ్చు. వాటి వల్ల లాభం లేకపోయినా, ఆ కథకి నష్టమేమీ వుండదు. ఒక సందర్భం నిజంగా ప్రక్షిప్తం వల్లనే చెడిపోయింది అనుకుందాం. అది ప్రక్షిప్తం అనే సంగతి మనకు తెలియక, "వాల్మీకి ఇలా, ఇంత అవకతవకగా రాశాడేమిటి?" అని వాల్మీకినే విమర్శిస్తాం అనుకుందాం. మనం విమర్శించేది 'విషయాన్నే' గానీ 'వ్యక్తి'ని కాదు. ఆ తప్పుకి ఏ కవి కారకుడైతే, ఆ విమర్శ, ఆ కవికే చెందుతుంది. మనం వాల్మీకి పేరుతోనే విమర్శించినా సరే, అది ఆయన రాసిన ఘట్టం కాకపోతే, ఆ విమర్శకి కూడా ఆయన బాధ్యుడు కాదు. కాబట్టి, ఒక సందర్భంలో ఏదైనా విమర్శించవలసిన అవసరం వుంటే, "ఇది వాల్మీకి రాశాడో లేదో! మనం అన్యాయంగా ఆయన్ని తప్పు పడుతున్నామేమో!" అని సందేహించనక్కరలేదు. ఎక్కడ, ఎలా అవసరమైతే అలా విమర్శించవలసిందే. ఇంకో కవి పేరు తెలియదు కాబట్టి, ప్రతిచోటా వాల్మీకి పేరే ఉపయోగిస్తాం. అంత మాత్రాన ఆయనకి అన్యాయం జరగదు. ఆ తప్పు ఎవరు చేశారో వారే దానికి బాధ్యులవుతారు. మనం ఆ కవినే విమర్శించినట్టు లెక్క. కాబట్టి, ఒక ప్రశ్న రేకెత్తితే జవాబు కోసం ప్రయత్నించాలి గానీ, ప్రశ్ననే అణుచుకోకూడదు.

### 'రామాయణం'లో ప్రక్షిప్తాలు లేవనే వారి వాదం!

గాయత్రీ మంత్రానికి 24 అక్షరాలట. రామాయణంలో 24 వేల శ్లోకాలట! మొట్టమొదటి శ్లోకం తర్వాత ప్రతీ వెయ్యవ శ్లోకమూ గాయత్రీ మంత్రంలో వుండే వరస అక్షరాలతోనే ప్రారంభమౌతున్నాయట. అందుచేత, ఈ 24 వేల శ్లోకాలూ ఒక్క కవి రాసినవే – అని వీరి వాదం. అంటే, ఇతర కవులు రాసినవి ఏవీ లేవని.

"నిజంగా రామాయణంలో ప్రతీ వెయ్యో శ్లోకమూ గాయత్రీ మంత్రంలో అక్షరాల వరస ప్రకారమే ప్రారంభమై వుంటే, ఈ వాదానికి కొంతన్నా బలం వుంటుంది. కానీ, అలా అనడమే గానీ, శ్లోకాలన్నీ ఆ విధంగా లేవన్న సంగతి కూడా పండితులు చెప్పిందే. అయినా ఈ వాల్మీకి భక్తులు గాయత్రీ మంత్రాక్షరాల మీదే చలించకుండా నిలబడతారు.

## వాల్మీకి రామాయణానికీ, తర్వాత రామాయణాలకూ ఏమిటి తేడా?

ప్రక్షిప్తాలు లేని రామాయణానికీ, అవి వున్న రామాయణానికీ, కథలో గానీ, దాని స్వభావంలో గానీ, ఏమిటి తేడా? మొదటి రామాయణానికీ, కొత్త రామాయణాలకూ ఏమిటి తేడా? – ఏమీ లేదు.

అన్ని రామాయణాల్లోనూ కథా వస్తువు ఒకటే. ఏ రామాయణంలో అయినా రాముడికి రాజ్యార్హత లేదు.

అన్ని కథల్లోనూ రాముడు వనవాసం చెయ్యక తప్పదు. రాముడు తండ్రినీ, పినతల్లినీ, తిట్టుకుంటూనే కాలం గడుపుతాడు. సుగ్రీవుడి తోటీ, విభీషణుడి తోటీ, రాజ కీయపు ఎత్తులతోనే స్నేహాలు చేస్తాడు. రావణుణ్ణి చంపి ఆ రాజ్యాన్ని కూడా తన చెప్పుచేతల్లో వుంచుకుని, తిరిగి తన రాజ్యానికి వస్తాడు. ప్రక్షిప్తాలు వున్నా లేకపోయినా, కథ ఇదే. పాత రామాయణం అయినా, కొత్త రామా యణం అయినా, కథ ఇదే. ప్రక్షిప్తాల వల్ల గానీ, కొత్త రామాయణాల్లో గానీ, మూల కథా, దాని స్వభావమూ ఏమీ మారవు.

ప్రక్షిప్తాల కవులు, కథలోకి కొత్త సంఘటనలు సృష్టించారేమో గానీ, కొత్త స్వభావాలు సృష్టించలేదు. శంబుకుణ్ణి రాముడు చంపేసే సంఘటన ప్రక్షిప్తమే అను కుంటే, దాని స్వభావం, వాల్మీకి సృష్టించిన సంఘటనల స్వభావానికి విరుద్ధం కాదు. శూద్రుణ్ణి చంపిన దశరథు డికి, పాపం అంటలేదు. వర్ణాశ్రమ ధర్మాల ప్రకారం శూద్రుడు తపస్సు చెయ్యడానికి అనర్హుడనే సంగతి వాల్మీకి రాసిందే.

ప్రక్షిప్తాలు ఉన్న రామాయణం కన్నా, లేని రామా యణం, గొప్ప విలువలు కలది కాదు. కాబట్టి, మన దృష్టి ఉండవలసింది ప్రక్షిప్తాలు ఉన్నాయా లేవా – అనే విషయం మీద కాదు. 'సంస్కృతి' మీదే ఉండాలి. ఆ నాటి సంస్కృతి, ఈ నాడు ఎంతవరకూ మారింది? ఆ నాటి ధర్మాలు ఈ నాడు, ఏ రూపాల్లో ఉన్నాయి? ఆ నాటి రాచరికమూ యుద్ధాలూ, ఈ నాడు ఏ రూపాల్లో ఉన్నాయి? – ఈ విషయాల్లో 'రూపం' మాత్రమే మారిందా, 'గుణం' కూడా మారిందా?

ఆ నాడైనా, ఈ నాడైనా, సమాజానికి రామాయణం చేసే మేలు ఏమైనా ఉందా? రామాయణం వంటి మత సాహిత్య గ్రంథాల మీద మన దృక్పథం ఎలా ఉండాలి? – ఈ రకం విషయాల మీదే మన దృష్టి వుండాలి.

వెనకటి తరాల నించీ ప్రజలందరికీ తెలిసింది, ప్రక్షిప్తాలతో వున్న రామాయణమే. కాబట్టి, మన విమర్శ కూడా దాని మీదే వుంటుంది. ఇవ్వాళ, ప్రక్షిప్తాలు లేని రామాయణం కథని ప్రజల ముందు పెడితే ఎలా వుంటుందో సరదాగా ఇప్పుడు ఒక చిన్న కథ రూపంలో చూడండి! – సుబ్బయ్య పంతులు గారి 'పవిత్ర రామా యణం' చూడండి! ★

చిన్న కథ:

# సుబ్బయ్య పంతులు గారి ప్రక్షిప్తాలు లేని పవిత్ర రామాయణం!

సుబ్బయ్య పంతులు, ప్రక్షిప్తాలు లేని 'అసలైన, పవిత్రమైన వాల్మీకి, రామాయణం' తయారు చెయ్యాలని ఆరు నెలలు అహోరాత్రులూ శ్రమపడి చివరికి గత అర్ధరాత్రితో పని పూర్తి చేశాడు. ఇక, ఆయనకి తెల్ల వార్లూ నిద్రపట్టలేదు. ఎవరికైనా దాన్ని చదివి వినిపించా లని ఒకటే తొందర! ప్రక్షిప్తాలు లేని రామాయణాన్నే ప్రజల్లో ప్రచారం చెయ్యాలనీ, ప్రక్షిప్తాల మీద అందరికీ అయిష్టం కలిగించాలనీ, సుబ్బయ్య పంతులికి చాలా కాలం నించీ కోరిక!

చీకట్నే చాకలి వెంకన్న, బట్టల కోసం వచ్చాడు.

సుబ్బయ్య పంతులు తెల్లవారు ఝాము నించీ మొహమన్నా కడుక్కోకుండా పవిత్ర రామాయణం పారాయణం చేస్తూ పొంగి పోతున్నాడు. వెంకన్నని చూడగానే పుట్టెడు సంతోషంతో – "ఒరే వెంకన్నా, ఇలా రా! రామాయణం చదువుతాను, వింటావా?" అన్నాడు.

"అయ్! అంత కంటేనాయ్యా? సదవండి!" అంటూ వెంకన్న దగ్గిరి కొచ్చాడు.

"ఏమన్నా తొందర పని ఉందా?"

"అబ్బే, పనే వుంది లెండి, సాకిరేవే. అదెప్పుడూ ఉండేదే లేండి. తర్వాత సేసుకుంటాను" అంటూ చతికిల బడ్డాడు వెంకన్న.

"సరేలే, తొందరగానే అయిపోతుందిలే."

"ఆఁ ..." అని వెంకన్న నోరు తెరిచాడు – 'రామా యణం తొందరగా అయిపోటం' ఏంటని!

"మొదలు పెడుతున్నాను విను! శ్రీరాముడికి పట్టాభి షేకం చెయ్యాలని దశరథ మహారాజు నిశ్చయించు కున్నాడు..."

తెల్లబోయాడు వెంకన్న – "అదేంటయ్యా? రావ య్యింకా పుట్టందే! దశరద మారాజు యగ్న యాగాలు సెయ్యాల, కవుసల్యా దేవి నీళ్ళాడాల, ఇస్టుమూర్తి రాము లోరి అవతారం ఎత్తాల, రావులోరితో పాటు లచ్చనుడూ, బరతుడూ, సెత్..."

"ఒరే! నేను చెప్పింది విను. అసలు మొట్ట మొదట వాల్మీకి అనే ఆయన ఇలాగే రాశాడు. ఇక్కణ్ణించే మొదలు పెట్టాడు. ఆ మహానుభావుడు అంత గొప్పగా

రాస్తే తర్వాత కవులు ఏం చేశారో తెలుసా? వాళ్ళ ఇష్టం వచ్చినట్టు రాసేసి అవన్నీ తెచ్చి కలిపేశారు … అసలు అవన్నీ వాల్మీకి రాసినవి కావురా.”

“మంచి పనే గదండయ్యా! ఆ రెవరో గానీ రావులోరు పుట్టడం, పెరగటం అన్నీ రాసుకొచ్చారు.”

“అబ్బే! అలా కాదురా … మన ఇష్ట మొచ్చినట్టు మనం రాసేస్తే మొదట రాసినాయనకి ద్రోహం చేసినట్టు కాదూ?”

“అయ్ బాబా, ఇందులో దోగమేటండీ? రాము లోరు పుట్టకండానే పట్టాబిసేకం అవుద్దా యేటండీ? … కత సెప్పేవోరు సక్కగా పుట్టటం, పెరగటం, అన్నీ సెప్పుకు రావాలి గానీ, ఎక్కడో మద్ది నించి మొదలెట్టడం యేటండీ? మిట్ట మద్దేన్నం సాకిరేవు మొదలెట్టినట్టు…”

సుబ్బయ్య పంతులు కొంచెం దిగులు పడ్డాడు, మొదట్లోనే ఇలా అయిందేవిటని. రాముడు పుట్టి తీరా లంటాడేవిటి వీడు? దశరథుడి యజ్ఞమూ, రాముడు పుట్టడమూ ఉండాలా ఏవిటీ? ‘బాల కాండ’ ఉండక తప్పదా ఏవిటి? ఛ్! వీడి మాటా ఒక లెక్కేనా? గుడ్డలు బాదుకునే వాడు…

“సదవండయ్యా. కూకున్నారేంటి?”

“చదువుతా గానీ…” అని కొంచెం సందేహంగా మొదలెట్టాడు. పట్టాభిషేకం ఆగిపోయి రాముడు వన వాసానికి వెళ్ళిపోయే వరకూ వచ్చేసింది – సిటికెలోనే!

“అదేంటయ్యా? రాములోరు అదేదో రాచ్చసిని … అదేంటమ్మా … పేర్లు మరిసిపోయి సత్తాను… ఆఁ … తాటకో యేదో! అమ్మో, దానికెంత బలవో … ఎగురు కుంటా వత్తాది. ఆ రాచ్చసిని చంపుతారు, పెడీలుమని ఇల్లు ఇరిత్తే సీతమ్మ తల్లి సిగ్గు మొగ్గయిపోయి పూల దండ తెచ్చి … ఆ పెళ్ళి సదవండయ్యా!”

“వాల్మీకి, పెళ్ళీ అదీ రాయలేదురా!”

“ఆఁ… పెళ్ళి లేదా? పుట్టటం లేకపోతే మానె! పెళ్ళన్నా లేదా! … ఎందుకు రాయళ్ళేండి … రాసే వుంటాడు … ఆ కాయితా లెక్కడ పడేశారో సరిగ్గా ఎత కండయ్యా! అయ్యే దొరుకుతయ్యి!”

“ఒరే! అసలు ముందు నేను చదివినట్టు విను! ఈ సారెప్పుడన్నా, నీకు కావలసినట్టు చదివి వినిపిస్తాలే, ముందు ఇది విను!”

వెంకన్న అయిష్టంగానే ఊరుకున్నాడు.

సుబ్బయ్య మళ్ళీ ప్రారంభించాడు – రాముడు చిత్రకూటంలో సుఖంగా ఉంటున్నాడు. తండ్రిని పన్నెత్తు మాట అనలేదు, పినతల్లిని కూడా ఒక్క తిట్టు తిట్టలేదు. భరతుడు వెళ్ళి పాదుకలు తీసుకొచ్చాడు. రాముడు దండకారణ్యాలకు వెళ్ళిపోయాడు.

కథ, లేడి లాగ పెద్ద పెద్ద గంతులేసుకుంటూ వెళ్ళి పోతోంది – విరాధుడు లేడు! కబంధుడు లేడు! జటా యువు లేడు!

పూర్వపు విమర్శకులు నిర్ణయించిన ప్రక్షిప్తాలనే గాక, సుబ్బయ్య పంతులు కూడా కొన్ని ప్రక్షిప్తాల్ని కని పెట్టి తీసేశాడు!

“ఆ … పొట్టలో మొకం వుంటది సూడండీ … నల్లగా … కాటుక కొండలాగ … సెట్టు కొమ్మ లంతం తేసి సేతుల్తో … అన్నీ లాక్కుని తింటాడే, ఆడు రాము లోర్ని లాగేత్తాడు గదయ్యా? ఆడూ లేడా?”

“వాడు కబంధుడురా, అవన్నీ తర్వాత కవులు కల్పించి రాసేసి వాల్మీకి పరువు పోగొట్టారు. పొట్టలో మొహం ఉండడం ఏవిట్రా పిచ్చి సన్యాసివి గాకపోతే….”

‘మాకేం తెలుసుద్దయ్యా? … మీలాంటి పంతులోర్లు సెపితేనే, నోర్లు తెరుసుకుని ఇంటాం.”

“అలా వినకూడదురా. నమ్మవచ్చునో లేదో ఆలో చించాలి.”

“ఒక మాటు మా అప్పారావు, కత సెప్పే పంతు లోర్ని యేంటేంటో పెశ్న లడిగాడయ్యా! అలా అడగ్గూడ దని కూకలేశారు పంతులుగోరు. కలికాలం వచ్చేసి రోజులు పాడైపోయాయి గానీ, ఆ కాలంలో ఆ ఇసిత్రా లన్నీ అలాగే జరిగేయంట గదయ్యా? రాచ్చసులికి మాయలూ మంత్రాలూ తెలుసయ్యా!”

“అవన్నీ పిచ్చిమాటలురా. మీలాటి పామర జనం, ఏం చెప్పినా నమ్మేస్తారు. అసలు వాల్మీకి మాత్రం నమ్మ లేని అద్భుతాలేవీ రాయలేదనుకో.”

“అబ్బుతాలేంటయ్యా! రాములోరు రాచ్చసుల్ని సంపలేదా యేంటి? … నమ్మకపోటానికేటుంది? కబం దుణ్ణి సేతులు నరికి సంపేశాడు!” అంటూ వెంకన్న నవ్వు మొహంతో చూశాడు.

సుబ్బయ్య పంతులికి ఆర్నెల్ల శ్రమా బూడిదలో పోసిన పన్నీరైపోయినట్టు తోచింది. పుట్టెడు దిగులు ముంచుకొచ్చింది. వీడికి కొంచెం జ్ఞానం ఉంటే, తను చేసిన పనిలో గొప్పతనం ఏమిటో తెలిసేది కదా – అని జ్ఞానం లేని వెంకన్న మీద సుబ్బయ్యకి చాలా కోపం వచ్చింది. “ఒరే, మీకు బుర్రలుండవురా! … దేవుడు మెదడిస్తే మాత్రం ఏం లాభం? … కాస్తయినా ఆలో చించరు. దశరథుడు వేల కొద్దీ సంవత్సరాలు బతి కాడంటే నమ్ముతారు. హనుమంతుడికి తోక వుందంటే నమ్ముతారు. రావణుడికి పది తలలంటే నమ్ముతారు … ఛీ! బుద్ధులుండవురా మీకూ…”

వెంకన్న కొంచెం చిన్న బుచ్చుకున్నాడు. సిగ్గు పడ్డాడు కూడా. కొంచెం వినయంగా “మాకేం తెలుస్త దయ్యా! సదువుకున్నోళ్ళవా, సచ్చినోళ్ళవా సెప్పండి? .. మీలాంటోరు సెపితేనే గదా ఇనేది? … నా సిన్నప్ప

ట్నించి ఇంటన్నాను ... రాములోరు పుట్టటం ... పెర గడం ... పెద్ద పెద్ద రాచ్చసుల్ని సంపటం ... మీరు సెప్పే కదేటో ఇచిత్రంగా వుందయ్యా!"

సుబ్బయ్యకి చాలా కఠినమైన ప్రశ్న ఎదురైంది, 'అందరూ ఇలాగే అంటారా ఏమిట'ని! ... ఛ! ఇలా ఎందుకంటారూ? ఈ పామర వెధవతో ఏమిటి? మూర్ఖుడు! పొట్ట చింపితే అక్షరం ముక్క లేదు. వీడు ఒప్పుకుంటే ఎంత, ఒప్పుకోకపోతే ఎంత!'

"అమ్మగారూ! బట్ట లడెయ్యండి. మడుసుకుం టాను" అని కేకేసి లేవబోయాడు వెంకన్న.

సుబ్బయ్య కంగారుపడ్డాడు – "కూర్చోరా! కూర్చో! అంత తొందరేం? పనేం లేదన్నావుగా?"

"పనెందుకు లేదండయ్యా? ... అదొక్కటే సాకి రేవులో మిడుకుద్ది..."

"సరే లేరా! వెళ్ళదువు గానిలే, పుగాకు కాడ పట్టుకు పోదువు గానిలే. కాస్సేపు కూర్చో."

వెంకన్న, మొహం చేటంత చేసుకుని కూర్చున్నాడు.

సుబ్బయ్య పంతులు మనస్సు చివుక్కుమంది. 'పవిత్ర రామాయణం' వినిపించడానికి లంచా లివ్వా ల్సిందేనా ఏమిటీ – అని!

"ఎందాకా వచ్చాం? ... ఆс... శ్రీరాముడు ఆ విధంగా బాధలు పడుతున్నాడు గదా? అప్పుడు శూర్ప ణఖ వచ్చింది .... రాముడు దాన్ని దండించి పంపించాడు..."

"అంటే, ముక్కూ సెవులూ కోసెయ్యమన్నాడు లచ్చునా సావిని. అంతే గదయ్యా!" – అది కూడా మారిందేమోనని వెంకన్న సందేహంగా చూశాడు.

సుబ్బయ్య పంతులు కొంచెం ఇబ్బందిలో పడ్డాడు. శ్రీరాముడికి అపకీర్తి కలిగించే ఘట్టాలు కొన్నిటిని, కొందరు కవులు చక్కగా మార్పు చేశారు కదా అని, తను శూర్పణఖ ఘట్టాన్ని కూడా మార్చాలని తీవ్రంగా ఆలోచించి చూశాడు. "శ్రీరాముడు దయామయుడు. స్త్రీని అంత బాధ పెడతాడా? వాల్మీకి అలా రాసి ఉంటాడా? – అబ్బే! రాసి ఉండడు. అది తప్పకుండా ప్రక్షిప్తమే" అని నిశ్చయించుకుని "రాముడు శూర్పణఖని దండించి విడిచిపెట్టాడు" అని ఏం చేశాడో తేల్చకుండా, రాసి ఊరుకున్నాడు. తన గడుస్తనానికి తనే మురిసిపోయాడు, అది రాసిన పూట.

"రాములోరు ఇక్కడే కుసింత తప్పు చేశాడయ్యా! ... రొండు తన్ని పంపిత్తే సరిపోయే దానికి ... ముక్కూ సెవులూ కోసేసి అందం సెడగొట్టెయ్యమని లచ్చునా సామికి ఆగ్గినాపించాడు. ఎంతైనా ఆడకూతురు గదయ్యా? దాన్ని మొగుడు ఏలుకోవొద్దా?"

"ఒరే! అసలు వాల్మీకి అలా రాయలేదురా!"

"ఆయ్!"

"తర్వాత రాసిన వాళ్ళు ఎన్నెన్ని కల్పించారను కున్నావూ!"

"ఆయ్!"

"శ్రీరాముడు అంత కర్కోటకమైన పని చేయిస్తా డంటే నువ్వు నమ్ముతావురా?"

"ఆయ్! ... ఏం సెపుతాం లెండి. ఎంత తెలిసి నోరైనా ఒక్కోసారి తప్పులు సేత్తారు... మరిగంటే..."

"ఏవిటో అడుగు. సందేహించకు."

"పుగాక్కాడ పడేత్తే ఎల్తాను. ఇంకా శానా..."

సుబ్బయ్య తొణకకుండా గాంభీర్యం వహించి – "ఓరి నీ ఇల్లు దొంగల్దోలా! ఒకటే కంగారా? ఎప్పుడూ సాకిరేవేనా? ... పుణ్యం, పురుషార్థం వొద్దురా?"

'మాకెట్టా కుదురుద్దయ్యా? రెక్కాడితే గానీ డొక్కాడ నోళ్ళం..."

"దొంగ వెధవల్లా మీరూ! కాసేపు కూర్చుని శ్రీరామ కథ వింటే నీ సొమ్మేం పోతుంది? సాకిరేవులో నీ పెళ్ళాం ఉండనే ఉందిగా?"

"రేత్తిర్నించీ దానికి నడుం నొప్పయ్యా! ముక్కుతూ మూలుగుతూ ఎల్లింది. పంతులోరి గుడ్డలు తెత్తానని సెప్పొచ్చాను."

"సరే, పోదువు గానిలే. ఇంకొక్క అరగంట కూర్చో ... అయిపోతుందిలే. గబ గబా చదివేస్తాను.... ఆс.. ఎందాకా వచ్చాం? ... శూర్పణఖ సంగతి కాదూ? – అది కుయ్యో మొర్రో అని ఏడుస్తూ వెళ్ళి అన్నగారితో చెప్పుకుని ఏడ్చింది! రావణుడు చాలా కోపం వొచ్చి దండకారణ్యానికి వచ్చాడు. రాముడి ఆశ్రమం దగ్గిరే చెట్లలో దాక్కున్నాడు. రాముడూ, లక్ష్మణుడూ ఎప్పుడు బయటికి పోతారా అని కనిపెట్టుక్కూర్చున్నాడు..."

వెంకన్న ఆశ్చర్యంగా "ఏంటీ, బంగారు లేడి కూడా లేదేంటీ?" అన్నాడు.

లేదని చెప్పడానికి సుబ్బయ్యకి ధైర్యం చాలలేదు. "ఒరే ... అసలూ..."

"సాల్లెండి .. మా బాగా రాశాడు వోల్మీకి. సెప్పు కుంటే సిగ్గు. ... ఆ లేడి ముండ ఎంత ముద్దు ముద్దుగా తిరుగుద్ది! ... సీతమ్మ తల్లి దాని టక్కులు సూసి నమ్మేసి ... దాన్ని తెచ్చి పెట్టమని కోరుద్ది. అప్పుడు కదా రాములోరు బయటికి పోయేది..."

"లేకపోతే బయటికి వెళ్ళడా ఏమిట్రా? రోజూ వేటకి వెళ్ళడూ?"

"ఎల్తే మాత్తరం? మారీసుడు లేకపోతే ... అంత గోరం జరుగుద్దేంటండీ?"

"నువ్వన్నదీ బాగానే వుంది. నే నెందుకు కాదనాలి గానీ .. ముందు ఇది విను. తర్వాత రాస్తాను గానీ..."

"ఏంటీ? మళ్ళీ రాత్తారా? ఇంతకు ముందు వున్నయ్యేగా? ...."

"ఇంతకు ముందు ఉన్నవన్నీ వాల్మీకి రాయలేద న్నానుగా? ... అందుకే నీ అభిప్రాయా లేమిటో తెలుసుకుని ..."

"నా అబిప్రేయాలేంటయ్యా? అందరి అబి ప్రేయాలూ అయ్యే. వోల్మీకి అబిప్రేయాలే తల తిక్కగా వున్నయ్యి."

సుబ్బయ్యకి కోపమూ, దుఖ్ఖమూ ముందు కొచ్చాయి. ఎన్నడూ ఊహించని ఉపద్రవం ఏదో మీద కురికినట్టు నిర్ఘాంతపోతున్నాడు. రేపట్నించీ 'ఈ పవిత్ర రామాయణం' వినిపిస్తే ప్రతి ఒక్కరూ ఇలాగే అంటారా! ఇంకా తను అప్పో సప్పో చేసి దీన్ని అచ్చు కూడా వేయించాలనుకుంటున్నాడు.

వెంకన్న లేచి వసారాలో బట్టలు మడుచుకోవడం మొదలెట్టాడు గబ గబా.

సుబ్బయ్య పంతులు 'వ్రాత ప్రతి' చేత్తో పట్టుకుని వెంకన్న వెనకాలే వసారాలోకి వెళ్ళాడు.

వెంకన్నకి ఉత్సాహం వస్తుందేమోనని హను మంతుడు లంకకి బయల్దేరే ఘట్టం నించి ప్రారం భించాడు.

వెంకన్న నిజంగానే సంతోషిస్తూ చేటంత మొహంతో బట్టల కుప్ప మీదే చతికిలబడ్డాడు.

హనుమంతుడు సీతతో మాట్లాడి, శెలవు తీసుకుని, బుద్ధిగా సముద్రం దాటి వచ్చేశాడు!

వెంకన్న అదిరిపోయాడు – "మరి లంకా దగనవో?"

"నువ్వు అడుగుతావని తెలుసురా..." – కొంచెం ధైర్యం తెచ్చుకుని నవ్వాడు సుబ్బయ్య.

"ఏంటీ? లంకా దగనం కూడా లేనట్టే? ఏం వోల్మీకి దొరికాదయ్యా. ఎక్కడెట్టా రాసుకోవాలో తెలవదన్న మాట! మా అప్పిగాడు ఉత్తర మ్ముక్క రాత్తేనే, ఆ ముక్కా ఈ ముక్కా కాయించి సక్కగా రాత్తాడే! ... రాములోరి కతంటే ఎంతందంగా రాయాల!" – వెంకన్నకి బాగా కోపం వచ్చేసింది. మూట బిగించి కట్టేశాడు.

"ఒరే వెంకన్నా! రామ కథ వింటూ వింటూ వొదిలేసిపోతే... హనుమంతుడు నిన్ను దండిస్తాడు సుమా! ..."

వెంకన్న నిజంగానే కొంచెం భయపడ్డాడు. "అది కాదయ్యా! ... అప్పుడే బారెడె పొద్దెక్కింది. తరవా తెప్పుడన్నా ఇంటానయ్యా!... అమ్మతోడు!..."

సుబ్బయ్య పంతులికి చాలా సిగ్గేసింది. ఛ! వీణ్ణి నిర్బంధించి వినిపించడం ఏమిటి? ఇష్టమైతే వింటాడు, లేకపోతే పోతాడు – "సరే! ఫోరా వెధవా! ఫో! నీకీ విషయాలన్నీ అర్థం కావులే. ఫో!"

వెంకన్నకి హనుమంతుడి భయం వదల్లేదు. "కాసేపు కూకుంటా గానీ, కుసి లవుల కద సెప్పం డయ్యా! ఇనేసి పోతాను."

సుబ్బయ్య మండిపడ్డాడు – "పొమ్మంటే నీక్కాదూ? ఫో! ఆ పనేదో చేసుకో."

"కుసి లవులు కూడా లేరేంటయ్యా? మా గొప్ప వోల్మీకి దొరికాడు. సదువుకో లేదేటయ్యా? ... చదువు కోకపోతే ఎలా రాత్తాళ్ళేండి ... మరదేం ఎవ్వారం? నా లాంటి ఎర్రిముండా కొడుక్కే తెలుత్తాదే మంచీ చెడ్డా. సదువుకున్నోడి కంటే సాకలోడు మేలంటారు, అందుకే గావాల. నాకు సెపితే సెప్పారుగానీ ఇంకెక్కడా అన కండయ్యా! ... సాలు గానీ..." – వెంకన్న, గుండిగంత మూట భుజాన్నేసుకుని ఇల్లు దాటాడు, రుస రుస లాడుతూ.

సుబ్బయ్య పంతులు ఎడతెరిపి లేని ఆలోచనల్లో మునిగిపోయాడు. పోనీ మరీ అవసరం అయితే ఒకటి రెండు ప్రక్షిప్తాల్ని ఉంచవచ్చేమో – అనుకున్నాడు గానీ, ప్రతీదీ కావాలంటే ఎలా కుదురుతుందీ? – ఇక రామా యణంలో పవిత్ర తెక్కడుంటుంది? అయినా ఈ వెర్రి ముండా కొడుకుతో ఏవిటి? చదువా, చట్టుబండలా? ... పదిమంది పండితుల్ని కూడగట్టి వినిపిస్తే, సెభాష నరూ? – అన్నట్టు ఆదిశేషయ్య గారికి ఇప్పుడే చదివి వినిపిస్తాను. ఆయన గొప్ప జ్ఞాని. శాంత పురుషుడు ... పొద్దున్నే ... ఈ వెర్రి వెధవని పట్టుకున్నాను గానీ ...

సుబ్బయ్య పంతులు ఒక్క క్షణం కూడా ఆలశ్యం చెయ్యకుండా, పవిత్ర రామాయణం చంకన పెట్టుకుని ఆదిశేషయ్య ఇంటికి బయల్దేరాడు, ఇంకా మొహం కడుక్కోలేదనే సంగతి గుర్తు లేక.

ఆదిశేషయ్య గాంధేయ వాది. ఎన్నోసార్లు జెయిలుకి వెళ్ళాడు.

సుబ్బయ్య పంతులు వెళ్ళేసరికి ఆదిశేషయ్య అప్పుడే పూజ ముగించుకుని చిద్విలాసంగా, బుద్ధుడు బోధివృక్షం కింద కూర్చున్నట్టు, ఖద్దరు గుడ్డ మడత కుర్చీలో కూర్చుని పేపరు చూస్తూ వున్నాడు. – "రండి, రండి సుబ్బయ్యగారూ!" అంటూ సుబ్బయ్యని పరమా నందంతో ఆహ్వానించాడు.

సుబ్బయ్య పొంగిపోతూ "అయ్యా! ... తమకేవీ తొందర పని లేదు గదా?" అని వినయంగా అడిగాడు.

"లేదు లెండి ... సెలవీయండి."

"తమతో కొంచెం పని పడి వచ్చాను... రాత్రే 'పవిత్ర రామాయణం' పూర్తి చేశాను. తమకి చదివి విని పించుదామనీ..."

"ఎంత మాట! తప్పకుండా వింటాను. కూర్చోండి.

మొత్తానికి పూర్తి చేశారన్నమాట! ప్రక్షిప్తాలు ఏమిటేమిటి తీసివేశారు?"

సుబ్బయ్య కొంచెం గడుస్తనంగా, ముందే చెప్పడం ఎందుకు లెమ్మని – "చాలా పొల్లు పోయింది లెండి. వాల్మీకి పరువు తియ్యడానికి కాకపోతే, ప్రతీ ఒక్కడూ రామాయణంలో వేలుపెట్టడమేనా? అసలు నాలుగింట మూడు వంతులు ప్రక్షిప్తమే కదండీ!"

"అలాగా? మంచి పని చేశారు. దాహం పుచ్చుకుని ప్రారంభించవచ్చును. ముందు ఒక్కసారి 'రామ రాజ్యం' ఘట్టం చదవండి! తర్వాత అంతా మొదటి నుంచీ వింటాను."

సుబ్బయ్య గుండెల్లో పిడుగు పడింది. "అయ్యా! 'ఉత్తర కాండ' అంతా ప్రక్షిప్తమే కదండీ?"

"అంతానా...!"

"అయ్యా, .. అంతా ప్రక్షిప్తమేనండీ! ప్రక్షిప్తాలేవీ ఇందులో చేర్చలేదండీ!"

"రామ రాజ్యం కూడా తీసేశారా ఏవిటీ?"

సుబ్బయ్య పంతులు భయం భయంగా నవ్వాడు – "తీసెయ్యక తప్పుతుందాండీ? ..."

"ఏవిటీ? రామ రాజ్యం తీసెయ్యడమే!"

సుబ్బయ్య గుటకలు మింగాడు.

ఆదిశేషయ్య అప్పటికే చాలా ఆవేశపడుతున్నాడు.

"గాంధీగారు బోధించిందంతా ఏవిటంటారూ? భారత దేశంలో రామ రాజ్యం స్థాపించాలని కాదూ? ... మీరిప్పుడు రామ రాజ్యమే ప్రక్షిప్తం పొమ్మంటే..."

"మన్నించాలి. అది ప్రక్షిప్తమే సుమండీ! ఈ మాట నేనొక్కణ్ణే అంటున్నది కాదు. పండితులందరూ ఏక గ్రీవంగా అంగీకరించారు..."

"అయితే మాత్రం? దానివల్ల రామ కథ కేమి నష్టం జరిగింది? 'రామ రాజ్యం' లేకపోతే అసలు రామా యణం పవిత్రం ఎలా అవుతుందండీ? రాముడు రాజ్యం చేస్తే అది ఎలా వుంటుందో చెప్పాలా అక్కర్లేదా? అది కూడా రాయకపోవడం ఏమిటి వాల్మీకి? ఈ విషయంలో మాత్రం నేను వాల్మీకిని క్షమించను సుమండీ!"

"తమరు ... కొంచెం ... శాంతంగా వింటే" – సుబ్బయ్య ఒక్క సారి అటూ ఇటూ చూసి కొంచెం కంఠం తగ్గించాడు – "మనలో మన మాట. పైకి అనుకో కూడదు గానీ ... రామ రాజ్యంలో ఏమంత గొప్పతనం లేదు సుమండీ! ... అది లేకపోవడమే రాముడి కీర్తికి ... మిక్కిలి..."

"ఏమిటీ, రామ రాజ్యంలో గొప్పతనం లేదా? కుక్కకి కూడా న్యాయం జరిగే లాగ రాజ్యం పాలించాడే రాముడు!"

"అయ్యో! కుక్క సంగతీ, నక్క సంగతీ 'అసలు కథ'లో లేనే లేవండీ!"

"పోనీ లేకపోతే ప్రక్షిప్తాల కవులు పెట్టారుగా? కుక్కకి కూడా న్యాయం చేశాడంటే రాముడి కెంత కీర్తి! చెప్పండి, అది కీర్తా, అపకీర్తా? ఎవరూ పెట్టకపోయినా అలాంటివన్నీ మీరు పెట్టాలి."

సుబ్బయ్య పంతులికి కొంచెం కోపం వచ్చింది. మహారాజుతో చెపితే మరి రెండు తన్నమన్నాడట! అలా ఉంది. ప్రక్షిప్తాలు ఇంకా తెచ్చి పెట్టమంటున్నాడీయన!

"అసలు రామ రాజ్యమే ప్రక్షిప్తం అయితే, ఆ ప్రక్షి ప్తంలో కూడా ప్రక్షిప్తం పెట్టనా? కుక్క మాట్లాడుతుందా? కుక్క సంగతి ఎందుకండీ?"

"మీరు ఎన్ని చెప్పినా సరే! రామ రాజ్యం మాత్రం ఉంచి తీరవలసిందే."

"మీరు రామ రాజ్యం ఉంచమంటే, ఇంకోరు ఇంకోటి ఉంచమంటారు. చివరికి అన్నీ ఉంచవలసి వస్తుంది."

"ఉంచితే ఉంచండి. ఏం మునుగు పోయింది?" అంటూ ఖద్దరు కుర్చీ లోంచి లేచాడు ఆదిశేషయ్య.

సుబ్బయ్య పంతులు కుప్పకూలిపోయాడు. "అయ్యా! అన్నీ తెలిసిన వారు మీరే ఇలాగంటే ...."

ఆదిశేషయ్య ఇంకేం వినిపించుకోలేదు. ఖద్దరు బట్టలు వేసుకుంటూ – "అమ్మాయ్ రామరాజ్యలక్ష్మీ! సుబ్బయ్యపంతులు గారికి కొంచెం మజ్జిగ పట్టుకు రామ్మా!" అని ఓ గావుకేక పెట్టాడు.

సుబ్బయ్య పంతులు నిరుత్సాహ ప్రవాహంలో మునిగిపోయాడు.

ఆదిశేషయ్య కరుకుగా అన్నాడు – "అయ్యా! మరొక్కసారెప్పుడైనా వింటాను. ఇప్పుడు కుదరదు .... ఆ రామ రాజ్యం చేర్చి పట్టుకు వస్తిరా ...."

"మన్నించండి .... నేనా పని మాత్రం చెయ్యను. వాల్మీకికి కెన్నడూ ద్రోహం చెయ్యను."

"అందుకని రాముడికి ద్రోహం చేస్తారా? రాముడి మొహం చూస్తారా, వాల్మీకి మొహం చూస్తారా?"

సుబ్బయ్య పంతులు మారు మాట్లాడకుండా, మజ్జిగ తెచ్చిన రామరాజ్యలక్ష్మి మొహం చూడకుండా బయట పడ్డాడు. వీధిన పడి నడక మొదలుపెట్టాడు. ఎండ నడినెత్తి కొచ్చింది.

రాముడి మీద పాటలేవో చెవిన బడితే హఠాత్తుగా ఆగాడు. అక్కడేదో కథా కాలక్షేపం జరుగుతోంది. జనం బాగానే ఉన్నారు. తన్మయత్వంతో వింటున్నారు. ఓ మూల చాకలి వెంకన్న కూడా ....!

సుబ్బయ్య పంతులుకి వొళ్ళు మండిపోయింది. దొంగ పీనుగు .... చాకిరేవు .... చాకిరేవు .... అని పరిగెత్తుకొచ్చీ ఇక్కడ చేస్తోన్న నిర్వాకం ఇదా? "ఒరే!

మూట రోడ్డు మీద పారేసి నువ్విక్కడ కూర్చున్నావా?" అని అరిచాడు.

"ఏం బయం లేదయ్యా! ఆంజనేయుడే కాపలా కాత్తాడు మూటకి."

"ఇంకా నయం, ఉతికి పెడతాడన్నావు కాదు. అప్పుడే మిట్ట మధ్యాహ్నం అయితే ఇంకెప్పుడెళ్తావు చాకిరేవుకి? సాయంత్రానికి దుప్పట్లన్నీ కావాలి, తెలుసా?"

"ఏంటో .... పొద్దే మరిసి పోయానయ్యా! ఎంత సేపు లెండి! సిటికిలో తెచ్చేత్తాను గానీ .... ఏం ముచ్చటగా సెపుతున్నాడయ్యా! – వోల్మీకి ఇంటేనా, కతయ్యే దాకా కదుల్తాడేంటి? రాసినో డెవడో మా బాగా రాశాడని తెగ మెచ్చుకుంటాడు ...." అనేసి వెంకన్న కథ వినే తొందరలో – "సందేలకి గుడ్డలన్నీ తెచ్చేత్తాను గానీ మీ రెల్లండి ...." అని విసుక్కుని మొహం తిప్పేశాడు.

సుబ్బయ్య ఇంటి మొహం పట్టాడు.

'పవిత్ర రామాయణం', సుబ్బయ్య పంతులుగారి చంకలో .... చెమటలో .... నానుతూ, నానుతూ! ★

# వెంకన్న, విషవృక్షాన్ని ఒప్పుకుంటాడా?

ఇప్పుడు 'విష వృక్షం' మీదకి ఒక ప్రశ్న పెద్దపులి లాగ ఉరుకుతుంది. "రామాయణంలో కొన్ని ఘట్టాలు తీసేస్తేనే ఒప్పుకోని ప్రజలు, దాన్ని 'విష వృక్షం' చేస్తే ఎలా ఒప్పుకుంటారు?" అనే ప్రశ్న.

కానీ, ఈ రెండు పనుల స్వభావమూ ఒకటి కాదు.

**ప్రక్షిప్తాల వాదం చెప్పేదేమిటంటే:** ప్రజ లకు తెలిసిన కథలోంచి అనేక విషయాల్ని మాయం చేసి, ప్రజల జ్ఞాపకాల్ని తుడిచెయ్యాలని చూడడం. ప్రజలందరూ పిచ్చి వాళ్ళయితే తప్ప అది సాధ్యం కాదు. ఈ మార్పు వల్ల ప్రజల ఆనందం కొరవడడమే గానీ, వారికి కొత్తగా కలిగే మేలు ఏమీ ఉండదు. ప్రక్షిప్తాలు లేని రామాయణం వల్ల వారికి కొత్తగా ఏ ప్రయోజనమూ లేనప్పుడు, పాత ఆనందాన్ని కూడా వదులుకుని నష్టపోవలసిన అవసరం వారికి కనపడదు.

కానీ, 'విష వృక్షం' చేసే పని అది కాదు. ప్రజలకు తెలిసిన కథని మాయం చెయ్యడం విష వృక్షం చెయ్యదు. ఆ సంఘటన లన్నిటినీ ఎప్పటిలాగే వుంచి, విష వృక్షం, వాటి మీద తన విమర్శలు చెపుతుంది. ఆ విమర్శలు సమంజసంగా వున్నాయో లేవో ఆలోచించమంటుంది. విష వృక్షం చేసే విమర్శలు సమంజసంగానే తోస్తే, పాఠకులు, రామాయణం మీద తమకు ఇంతకాలమూ ఉన్న భక్తి విశ్వాసాల్ని మార్చుకుంటారు. దేవుళ్ళ దయ కోసమూ రామరాజ్యాల కోసమూ ఎదురు చూడడంగాక, తమ విముక్తి మార్గం తమ చేతుల్లోనే ఉందని తెలుసుకుంటారు. పాత మార్గం పనికి రానిది అని చెప్పే ఏ విమర్శ అయినా, పనికి వచ్చే కొత్త మార్గం ఏమిటో చెప్పగలిగితే, ప్రజలు ఆ కొత్త మార్గం వేపు తలలు తిప్పకుండా వుండరు. తార్కికమైన ఆలోచనా విధానం ప్రారంభమైందంటే, 'రామాయణం లాంటి మత గ్రంథాలన్నీ విష వృక్షాలే, అవి ప్రజలకు చేసే మేలు ఏమీ ఉండదు' అని ప్రజలు స్వయంగానే గ్రహిస్తారు.

రామాయణాన్ని ఒక మైతాలజీ కథ గానూ, ప్రాచీన కాలపు సాహిత్యం గానూ చదవడం వేరూ, దాన్ని భక్తి శ్రద్ధలతో పూజించడం వేరూ! ఆ పుస్తకం సమాజంలో ఏ వర్గాలకు మేలు చేస్తుందో గ్రహించగలిగితే, ప్రజలు, దాన్ని చదివినా, దాన్ని పూజించడం మానేస్తారు.

చాకిరేవు పని మానేసి పురాణ కాలక్షేపం దగ్గిర చతికిలబడ్డ వెంకన్నకి, వర్గాల గురించీ, దోపిడీ వర్గం సృష్టించే మత సాహిత్యాల గురించీ అర్థమైందంటే, అప్పుడు అతను ఏ పురాణ పఠనాల దగ్గిరా నిలబడడు. ఆ గ్రహింపు కలిగిన వెంకన్న, 'రామాయణం విష వృక్షమే' అనే అభిప్రాయంతో విభేదించడు. ఆ గ్రంథాన్ని విష వృక్షంగా ఎవరో చెయ్యడం లేదనీ, దాని స్వభావమే దాన్ని అలా చేస్తోందనీ, అతను సరిగానే గ్రహిస్తాడు.

రామాయణానికి 'కల్ప వృక్షం' అనో, 'అమృత భాండం' అనో, గొప్ప పేరు పెట్టినంత మాత్రాన దాని స్వభావం మారదు. అది, శ్రామిక ప్రజలకూ స్త్రీలకూ విష వృక్షమే.

రామాయణం మీద గతం నించీ ఉన్న భక్తి భావాల్ని తారుమారు చేసుకోవడం ప్రారంభంలో ప్రజలకు చాలా కష్టమే. కానీ, తమ క్షేమాన్నీ, తమ సుఖశాంతుల్నీ వివరించే నూతన భావాల ముందు, భక్తి భావాలు నిష్ప్రయోజనం అయిపోతాయి. క్రమంగా, అవి, ఉపయోగకరమైన నూతన భావాలకు చోటు ఇచ్చి, తప్పుకుంటాయి. కాబట్టి, 'ఒక రచయిత, రామాయణాన్ని విష వృక్షం చేస్తే ప్రజలు సహిస్తారా?' అనే ప్రశ్నకి జవాబు: 'సహించడం' కాదు, ఆ పని వాళ్ళే చేస్తారు.

ఆ రచయిత వేరూ, ప్రజలు వేరూ కాదు. ఆ రచయిత కూడా ప్రజల్లో భాగమే. అంటే, రామాయణాన్ని విష వృక్షంగా భావించే క్రమం ప్రజల్లో ప్రారంభమై పోయిందని అర్థమే కదా? ★

# 2. 'రామాయణ విషవృక్షం' మీద కొడవటిగంటి కుటుంబరావుగారి సమీక్ష గురించి: రామాయణం, 'సాహిత్యం' కాదా?

'రామాయణ విషవృక్షం' మొదటి భాగం విడుదలైనప్పుడు, కొడవటిగంటి కుటుంబరావుగారు, దాని మీద ఒక సమీక్ష రాశారు. (27-12-1974 'ఆంధ్రజ్యోతి' వార పత్రికలో.) ఆ సమీక్షలో ఆయన, 'విష వృక్షం' మీద చాలా వ్యతిరేకాభిప్రాయాలు ప్రకటించారు. ఆ వ్యతిరేకతని, క్రమంగా ఇలా ప్రారంభించారు. ".... సోషల్ ఆంత్రొపాలజీని అధ్యయనం చెయ్య డానికి 'రామాయణం' సరి అయిన గ్రంధం కాదు, అది సాహిత్యంగానే కాదు, సమాజ శాస్త్ర పరిశీలనకు కూడా పనికి రాని గ్రంధమని నా ఉద్దేశం" అన్నారు.

అంటే, 'రామాయణం' అసలు 'సాహిత్యం' కిందకే రాదు – అని కుటుంబరావుగారి మొదటి అభిప్రాయం. దీనికి ఆయన 3 కారణాలు చెప్పారు. 1. అందులో చాలా ప్రక్షిప్తాలు ఉన్నాయి. 2. ప్రక్షిప్తాల కారణంగా నైతేనేం, మూల రచనలో అవక తవకల వల్ల నైతేనేం, అనేక సందర్భాలు ఒకదాని కొకటి అతకవు. 3. రామాయణంలో పాత్ర పోషణ ఏమీ బాగా లేదు.

ఇవీ ఆ కారణాలు.

కుటుంబరావుగారు రాసిన ఈ సమీక్ష మీద నేను ఒక సమాధానం రాశాను. (24-1-1975 తేదీ ఆంధ్రజ్యోతి వారపత్రిక.)

దానికి కుటుంబరావుగారు మళ్ళీ సమాధానం రాస్తూ (31-1-1975) "రామాయణం సమాజ పరిణామాన్ని విశ్లేషించడానికి పనికిరాదనే నేను ఇప్పటికీ అభిప్రాయపడుతున్నాను" అన్నారు.

రామాయణం సాహిత్యం కాదనీ, అది ఆ నాటి సమాజ పరిశీలనకు కొంచెం కూడా పనికి రాదనీ కుటుంబరావుగారు ఒకటికి రెండుసార్లు నొక్కి చెప్పారు. దానికి ఆయన కొన్ని కారణాలు కూడా చెప్పారు. వాటిని చూసే ముందు రామాయణం, సాహిత్యమా కాదా; అది ఆ నాటి సమాజాన్ని గ్రహించడానికి ఏ కొంచెమైనా పనికి వస్తుందా లేదా – అనే విషయాల మీద, మనం ఏదో ఒక అభిప్రాయానికి రావాలి.

దీని మీద నా అభిప్రాయం మొదట క్లుప్తంగా: రామాయణం సాహిత్యమే. అది, వెనకటి కాలం నాటి సాహిత్యం. ఆ కథలో, వెనకటి సమాజపు మనుషుల సంబంధాలూ, లక్షణాలూ కొన్ని అయినా కనపడతాయి. దాన్ని బట్టి మనం ఎంత వీలైతే అంత అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాలే ఇప్పుడు కొంచెం వివరంగా చూడాలి.

అసలు, 'సమాజ పరిశీలన' అంటే ఏమిటి? మానవ సంబంధాల్ని పరిశీలించడమే. ఆ కథలో కనపడే సమాజంలో, ఆర్థిక – రాజకీయ – సాంఘిక సంబంధాలు ఎలా ఉన్నాయో కొంచెమైనా చూడగలిగితే, ఆ కథ, ఆ నాటి సమాజాన్ని పరిశీలించడానికి కొంతైనా పనికి వచ్చినట్టే అర్థం.

అయితే, ఈ పరిశీలించడం అందరూ ఒకే రకంగా చెయ్యరు. 'సమాజం' గురించీ, 'ప్రకృతి' గురించీ, అప్పటికే వారికి ఉన్న అవగాహనల్ని బట్టే ఆ పరిశీలన ఉంటుంది.

రామాయణాన్ని ఒక భక్తుడు చదివితే, అతనికి ఆ నాటి సమాజం అత్యద్భుతంగా ఉన్నట్టు కనపడుతుంది. దశరధుడూ, రాముడూ భరతుడూ రాజ్యాలు పాలించిన కాలంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఓలలాడినట్టూ, అందరూ చివరికి స్వర్గానికి వెళ్ళినట్టూ, నమ్ముతాడు. అతడు ఆ కథని, తన భక్తితో చూస్తాడు.

అదే కథని ఒక నాస్తికుడు చదివితే, అతనికి, ఆ కథలో ఉన్న స్వర్గ నరకాలూ, పాప పుణ్యాలూ, వరాలూ శాపాలూ లాంటి వన్నీ అసహజంగా కనపడతాయి. ప్రజలు మూర్ఖులుగా ఉన్నట్టు కనపడుతుంది. అంతకు మించి ఆ కథ ద్వారా అతను తెలుసుకోగలిగేదేమీ ఉండదు.

అదే కథని ఒక మార్క్సిస్టు చదివితే, ఆ కథలో ఉన్న వర్గ భేదాల్ని చూస్తాడు. ధనిక పేద తేడాల్ని చూస్తాడు. మానవ సంబంధాల్లో, శ్రమ దోపిడీనీ, యజమానీ సేవకత్వాల్నీ చూస్తాడు. రాముడు చేసిన యుద్ధాల్లో సామ్రాజ్య కాంక్షని చూస్తాడు. సీత పాతివ్రత్యంలో, స్త్రీల బానిసత్వాన్ని చూస్తాడు. రామాయణ కథా కాలం నాటికే దోపిడీ వర్గాధిపత్యమూ, దాని రాజ్యాంగమూ ఎంత స్థిరపడిపోయాయో చూస్తాడు.

సమాజంలో ఒక 'దశ'ని గానీ, ఒక 'రచన'ని గానీ, అర్థం చేసుకోగలిగే విధానం, ఆ పరిశీలకుల అవ

గాహనని బట్టే ఉంటుంది.

ఏ సమాజానికైనా పునాది, ఆ మనుషుల మధ్య ఉన్న శ్రమ సంబంధాలే. ఏ కాలాన్ని తీసుకున్నా అక్కడ ఉన్న సంబంధాల్లో శ్రమ దోపిడీ ఉందా లేదా అనే దాన్నిబట్టి, ఆ సమాజ లక్షణాలన్నీ ఉంటాయి. ఆ లక్షణాల్ని చూసి ఆ పునాదిని అర్థం చేసుకోవచ్చు.

అయితే, చరిత్రలో ఒక 'దశ'ని పరిశీలించేటప్పుడు దాని ప్రారంభమూ, అభివృద్ధీ, దాని మార్పు, దానికి కారణాలూ, అన్నీ గ్రహించవలసి ఉంటుంది. కానీ ఒక కథనో, ఒక పాత్రనో పరిశీలించేటప్పుడు, సమాజ పునాదిని గ్రహించడం సాధ్యం కానూ వచ్చు, కాకపోనూ వచ్చు. కానీ, అలాంటి రచన కూడా ఆ సమాజానికి సంబంధించి కొన్ని లక్షణాల్ని అయినా చూపిస్తుంది. ఏ సామాజిక లక్షణాలూ లేని రచన ఏదీ ఉండదు. ఆఖరికి స్వర్గ నరకాల్లో కూడా మానవ సమాజ లక్షణాలే ఉంటాయి.

ఒక రచనని పరిశీలించేటప్పుడు, (అది ప్రాచీన మైనది అయినా, ఆధునికమైనది అయినా), ముందు అందులో 'విషయం ఏమిటో చూడాలి. ఆ విషయం, సమాజంలో ఉన్న ఏ విభాగాలకు అనుకూలంగా వుందో, ఏ విభాగాలకు వ్యతిరేకంగా ఉందో చూడాలి. అది చూస్తే, అది 'విషయాన్ని' చూడడం. తర్వాత, రచనా విధానాన్ని చూడాలి. సాధారణంగా ఈ విధానం, రచనలో ఉన్న విషయానికి తగినట్టుగానే ఉంటుంది. (ఆ విధానాలలో అనేక తేడాలు ఉండవచ్చు. అది వేరే సంగతి..)

'రామాయణం'లో ఉన్న కథ అంతా 'దేవుడి' కథ. 'దేవుడు' అనగానే, అది పెద్ద మహిమ. దేవుడి కథల్ని, మహిమలు లేకుండా సాధారణ మానవుల కథల్లాగే చెప్తే అది దేవుడి కథ అవదు. రామాయణం దేవుడి కథ కాబట్టి, అది కట్టుకథల రూపంలో వుంటుంది. ఇలాంటి కథలన్నీ ఈ పద్ధతిలోనే ఉంటాయి. అయినప్పటికీ, ఆ మహిమల్లోనే సాంఘిక సారాంశం ఉంటుంది. అదే పరిశోధకులకు ముఖ్యం.

రష్యన్ మార్క్సిస్టూ, సాహిత్య విమర్శకుడూ అయిన లునచర్స్కీ, పరిశీలించే విధానం గురించి ఇలా అంటాడు: "ఒక సామాజిక యుగాన్ని (సామాజిక దశని) విశ్లేషించేటప్పుడైతే మార్క్సిస్టు విమర్శకుడు, ఆ యుగానికి సంబంధించిన మొత్తం సమాజ పరిణామపు పూర్తి చిత్రాన్ని ఇవ్వడానికి ప్రయత్నించి తీరాలి. కానీ, ఒక రచయితని గానీ, ఒక రచనని గానీ చర్చించేటప్పుడు, మౌలికమైన ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ తప్పనిసరి కాదు. ఎందుకంటే, .... ఒక యుగంలో (దశలో) ఉండే కళ, ఆ నాటి ఉత్పత్తి విధానాలతో ప్రత్యక్షంగా సంబంధం కలిగి వుండడం, అతి తక్కువ మేరకు మాత్రమే జరుగుతుంది. కళలు, ఉత్పత్తి విధానాలతో, మధ్య మధ్య అనేక ఇతర విషయాల ద్వారా (ఇంటర్ మీడియట్ లింకుల ద్వారా) మాత్రమే సంబంధాలు కలిగి ఉంటాయి. ఎలాంటి విషయాల ద్వారా అంటే, వర్గ ప్రయోజనాల పర్యవసానంగా ఏర్పడే వర్గ మనస్తత్వమూ, సమాజంలోని వర్గ నిర్మాణమూ – వంటి విషయాల ద్వారా" ఎనటోల్ లునచర్స్కీ ("ఆన్ లిటరేచర్ అండ్ ఆర్ట్" పుస్తకంలో. పేజీ 11. ప్రచురణ: ప్రోగెస్ పబ్లిషర్స్, మాస్కో, 1973.)

"మార్క్సిస్టు విమర్శకుడు, తన విశ్లేషణకు లక్ష్యంగా, మొదట, రచనలోని 'విషయాన్ని' (కన్టెంట్ని), అంటే ఆ రచనలో ఉన్న సామాజిక స్వభావాన్ని (సోషల్ ఎస్సెన్స్ని), చూస్తాడు. ఆ విషయానికి, సామాజిక గ్రూపులతో ఉండే సంబంధాల్నీ, సామాజిక జీవితాల మీద ఆ రచన ప్రభావాన్నీ, వివరిస్తాడు. ఆ తర్వాత, 'రూపం' (ఫామ్) దగ్గిరికి వస్తాడు. ఆ రూపం, ఆ రచన నెరవేర్చవలసిన ఉద్దేశ్యాన్ని స్పష్టంగానూ, సమ్మతంగానూ నెరవేర్చగలిగేదిగా ఉందా – అనే దృష్టితో ఆ రూపాన్ని చూస్తాడు." – లునచర్ స్కీ (అదే పుస్తకం. 11, 12)

కుటుంబరావుగారు రామాయణాన్ని సాహిత్యమే కాదనీ, అది పరిశీలనకు పనికి రాదనీ అన్నారు. దానికి ఆయన చెప్పిన కారణాలు – ఆ కథలో అవక తవకలుండడం, అసందర్భాలుండడం, పాత్రల చిత్రణ బాగా లేకపోవడం, ఈ రకం కారణాలు చెప్పారు. అంటే కుటుంబరావుగారు ఆ కథలో ఉండే 'విషయాన్ని' గాక, 'రచనా విధానాన్ని' చూస్తున్నారన్న మాట! కానీ, ఆ విధానం అంతా, ఆ విషయానికి తగినదే. దేవుళ్ళ మహిమల్ని చెప్పే కట్టుకథల సాహిత్యం, అలాంటి లక్షణాలతోటే ఉంటుంది. అంటే, అలాటి విషయం, అలాంటి విధానంతోనే వుంటుంది. దేవుళ్ళ కథ, అవక తవకలూ అసందర్భాలూ లేకుండా ఎలా తయారవుతుంది? బాల్య దశలో వున్న సాహిత్యం, అలాంటి అవకతవకలతో ఉండడం చాలా సహజం.

కుటుంబరావుగారి అభ్యంతరాలన్నీ ఎలా ఉన్నాయో ఇప్పుడు వరసగా చూద్దాం.

1. రామాయణంలో ప్రక్షిప్తాలున్నాయి – అన్నారు. అందుకే అది పరిశీలనకు పనికి రాదు – అన్నారు. విరాధుడి కథ చెప్పి, అతని శాపం సంగతి ప్రక్షిప్తమేనని తేల్చారు.

ఈ ఘట్టంలో కథా వస్తువు ఏమిటో చూడండి! విరాధుడు మొదట తుంబురుడనే గంధర్వుడు. కుబేరుడి దగ్గిర 'దాస్యం' చేస్తూ ఉండేవాడు. ఒకసారి కుబేరుడు తుంబురుణ్ణి రాక్షసుడివై పొమ్మని శపించాడు. ఎందుకో తెలుసా? – ఆ సేవకుడు, సమయానికి వచ్చి సేవ చెయ్య లేదని! తర్వాత తుంబురుడు, యజమానిని వేడుకుంటే "శ్రీరాముడు నిన్ను యుద్ధంలో చంపినప్పుడు నీ శాపం పోయి స్వర్గానికి వెళ్తావు" అని ఆ యజమాని శాప విముక్తి చెప్పాడు. అప్పటి నించీ తుంబురుడు రాక్షసుడి గానే ఉన్నాడు. ఈ సంగతంతా విరాధుడు రాముడికి చెప్పాడు. తర్వాత, "నా కళేబరాన్ని గుంటలో పూడ్చి పెట్టండి. చచ్చిపోయిం తర్వాత కళేబరాన్ని పూడ్చడం రాక్షసుల ఆచారం" అని చెప్పి ప్రాణాలు విడిచాడు. ఇదీ ఆ కథ.

దీని వల్ల ఏ యే విషయాలు తెలుస్తున్నాయో చూడండి.

(1) ఒక యజమాని, సేవకుడికి, వినయ విధేయత లతో సేవ చెయ్యనందుకు చాలా పెద్ద శిక్ష విధించాడు. సమాజంలో సేవకులైన శూద్రుల్ని భయ భక్తులతో ఉంచడానికీ, వినయంగా సేవ చెయ్యకపోతే రాక్షస జన్మ ఎత్తుతారని నమ్మించడానికీ, ఈ కథ పనికి వస్తుంది. ఈ శాపం సంగతి ప్రక్షిప్తం అయితే ఏమిటి? దాని వల్ల సమాజ పరిశీలనకు ఎంతో అవకాశం ఉంది. ప్రక్షిప్తం అవడం వల్ల అది పరిశీలనకు పనికి రాకుండా ఎలా అవుతుంది?

(2) కవి, రాముడి ద్వారా విరాధుడికి శాప విముక్తి చెప్పాడు – "రాముడు ఎవర్ని చంపినా, వారికి స్వర్గమే వస్తుంది. రాముడి చేతిలో మరణించడమే గొప్ప భాగ్యం" అని కవి, రాముణ్ణి దేవుణ్ణి చేశాడు.

(3) రాక్షస జాతిలో, శవాల్ని, 'దహనం చేసే' పద్ధతి లేదు. పూడ్చిపెట్టే పద్ధతే సనాతనాచారంగా ఉంది.

కాకమ్మ కథల్లాగా కనపడే ఈ పిచ్చి కథ వల్ల, యజమానీ సేవకుల సంబంధమూ, రాముడి జాతికీ రాక్షసుల జాతికీ వైరం ఉండడమూ, రాక్షస జాతిలో ఉండే ఒక ఆచారమూ (శవాల్ని పూడ్చిపెట్టే ఆచారం), ఈ లక్షణాలు కనపడుతున్నాయి. మనకి అర్థం చేసుకునే దృష్టి వుంటే, ఈ కథ వల్ల ఇన్ని విషయాలు తెలుసుకో వచ్చు.

తర్వాత కాలంలో, రాముడు, కబంధుడనే ఇంకో రాక్షసుణ్ణి చంపుతాడు. ఆ రాక్షసుడు రాముణ్ణి "నా శవాన్ని దహనం చెయ్యి! దహనం జరిగితేనే నాకు శాప విముక్తి కలుగుతుంది. అప్పుడు నేను నీకో ముఖ్య విషయం చెపుతాను. నా శవానికి దహనమే చెయ్యాలి" అని రాముణ్ణి ఎంతో ప్రార్థిస్తాడు.

విరాధుడేమో తన శవాన్ని పూడ్చిపెట్టమని అడిగితే, కబంధుడేమో తన శవాన్ని దహనం చెయ్యమని అడుగు తాడు. ఈ కథల వల్ల ఏం తెలుస్తోంది? రాక్షస జాతిలో, శవాల్ని పూడ్చిపెడతారా, దహనం చేస్తారా? వెనకటి కాలంలో పూడ్చిపెట్టే ఆచారం ఉండేదనీ, తర్వాత కాలంలో అది దహనం చేసే ఆచారంగా మారిందనీ తెలుస్తోంది. ఈ కథలు ప్రక్షిప్తాలే అనుకుందాం. ప్రక్షి ప్తాలు అయినా కాకపోయినా, వీటి వల్ల కొన్ని విష యాలు తెలుస్తున్నాయా లేదా?

రామాయణంలో ఇంకో ప్రక్షిప్తం సంగతి చూడండి! ఉత్తర కాండ అంతా ప్రక్షిప్తమే – అంటారు. శంబుకుడి కథ అందులోనే వుంది. ఇతను శూద్రుడు. ఈ శూద్రుడు, బ్రాహ్మణులతో సమానంగా ఉండే హక్కుల కోసం పోరాడి, మరణ దండనకు గురి అవుతాడు కదా? ఈ కథ ప్రక్షిప్తమే అయినా, ఈ ప్రక్షిప్తం వల్ల, ఆ సమాజ పరిస్తితులు తెలుసుకోడానికి వీలవుతోందా లేదా? అక్కడ శూద్రులకు అగ్రకులాలతో సమాన హక్కులు లేవనీ, రాముడు శూద్రుల హక్కులకు వ్యతిరేకమనీ తెలుస్తోందా లేదా?

కుటుంబరావుగారు – సమాజ పరిశీలనకు రామా యణం పనికి రాదు గానీ 'భారతం' పనికి వస్తుందం టారు. కానీ, భారతంలో కూడా ప్రక్షిప్తాలు ఉన్నాయనే వాదం ఉంది. ప్రక్షిప్తాల వల్ల, రామాయణం సాహిత్యం కాకుండా పోయినప్పుడు, అదే పరిస్తితిలో ఉన్న భారతం, సాహిత్యం ఎలా అవుతుంది?

2. కుటుంబరావుగారు, రామాయణంలో అవక తవకలకు ఒక ఉదాహరణ ఇస్తూ, రాముడి వయసునీ, సీత వయసునీ చెప్పే సందర్భాలు ఒక దానికొకటి సరి పోవడం లేదంటారు. సరిపోకపోతే, అది, 'రచనా విధా నానికి' సంబంధించిన విషయం అవుతుంది. దానివల్ల, కథలో 'విషయం' మారిపోయేదేమీ ఉండదు. రాముడు వనవాసానికి వెళ్ళేటప్పుడు అతని వయసు ఎంతో సరిగా తేలకపోవడం వల్ల, ఆ కథలో రాజుల నిరంకుశత్వాలు ఎలా ఉన్నాయో అర్థం కాకుండా పోతుందా? సీత వయసు తేలకపోవడం వల్ల, స్త్రీల పాతివ్రత్య ధర్మాల్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదా? ఈ వయసుల సందర్భాలు సరిగా సరిపోయి వుంటే, అప్పుడు రామా యణం సాహిత్యం అయ్యేదేనా? ఎన్ని అవక తవకలు

ఎలా ఉన్నా, కథలో ఉన్న సమాజాన్ని అర్థంచేసుకోడానికి అవి అడ్డు రావు.

3. కుటుంబరావుగారి ఇంకో అభ్యంతరం 'రామాయణంలో పాత్ర చిత్రణ బాగా లేదు. అవును, బాగా ఉండదు. అది మైతాలజీ కథ కాబట్టి అది అలాగే ఉంటుంది. కుటుంబరావుగారు రామాయణాన్ని 'ఆది కావ్యం' అని ఒప్పుకుంటూనే, 'ఆది'లో (సాహిత్యాలు తయారయ్యే ప్రారంభ కాలంలో), పాత్ర పోషణలు బాగా లేకపోవడానికి కారణాలేమీ చూడలేదు. సాహిత్య సృష్టిలో ఆ కాలం, 'బాల్యదశ'. ఆ దశ లేకుండానే ప్రారంభం నించే సాహిత్యం, అవక తవకలు లేకుండానూ, పాత్ర చిత్రణలు చక్కగా ఉండేటట్టు గానూ, ఉన్నత స్థాయిలో ఉంటుందా? మనుషులు, పుట్టగానే, తప్పటడుగులు వెయ్యకుండా లేచి పరుగులెత్తే ఎదిగిన వారి గానూ, మేధావులు గానూ ఉంటారా? తప్పటడుగులు వేసే పిల్లలు, మనుషులు కారా? – మనుషులే. వాళ్ళు పిల్లలు. వాళ్ళు ఇంకా ఎదగాలి. అలాగే, బాల్యదశలో తప్పటడుగులు వేసే కథలు కూడా సాహిత్యమే. పాత్ర చిత్రణల్లో వైరుధ్యాలు లేకుండానూ, కళాత్మక విలువలతోనూ, ఉన్నతస్థాయి వరకూ అవి ఎదగాలి. కానీ, ఆ లోపల అవక తవకలతో పుట్టుకొచ్చిన కథలన్నీ కూడా సాహిత్యమే. అది కట్టుకథల సాహిత్యం. అది అలా ఉండడమే దాని లక్షణం.

కళలు సృష్టి అవుతోన్న ప్రారంభ దశలో, సాహిత్యం అంతా మైతాలజీగా సాగడానికి కారణం చెప్తూ మార్క్స్ – "ఎదగని సామాజిక పరిస్తితులే (ఇమ్మెచ్యూర్ సోషల్, కండిషన్స్)" అన్నాడు. అంటే, ఆ నాటి మనుషులకు ప్రకృతి గురించీ, సమాజ సంబంధాల గురించీ, ఏమీ తెలియదు. ఆ తెలియని తనమే వారి కళల్లో ప్రతిఫలించింది.

సూర్యుడూ చంద్రుడూ ఒక్కోసారి హఠాత్తుగా కనపడకుండా పోతారు. ఎందుకూ? – గ్రహణాల వల్ల. సూర్యుడికీ చంద్రుడికీ మధ్యలోకి భూమి వచ్చినప్పుడు, సూర్యకిరణాలు చంద్రుడి మీద పడక, భూమి మీద వాళ్ళకు చంద్రుడు కనపడడు. అది చంద్రగ్రహణం! భూమికీ సూర్యుడికీ మధ్యలోకి చంద్రుడు వచ్చినప్పుడు, సూర్య కిరణాలు చంద్రుడు ఉన్నంత మేరా భూమి మీద పడక, అక్కడ సూర్యుడు కనపడడు. అది సూర్య గ్రహణం! ఈ నిజాలన్నీ తెలిసి, ఆ జ్ఞానంతో ఒక కథ రాస్తే, అందులో అవక తవకలు రావు.

కానీ, ఇదంతా తెలియని రోజుల్లో కూడా గ్రహణాలు పడుతూనే ఉన్నాయి. సూర్య చంద్రులు కనపడకుండా పోవడం గురించి ఆ నాటి మనుషులు తమ ఊహలకు అందిన పద్ధతిలో అలా చెప్పుకున్నారు. అప్పటికే సమాజంలో తెగల మధ్య కొట్లాటలు వున్నాయి. శతృత్వాలు ఉన్నాయి. కాబట్టి, సూర్య చంద్రుల్ని ఎవరో శతృవులు బాధిస్తున్నారని కథలు అల్లుకున్నారు. ఈ పిచ్చి కథల్లో కూడా ఆ నాటి మానవ సంబంధాలు చక్కగా కనపడుతున్నాయి.

ఈ కథ చూడండి!

రాక్షసులూ, దేవతలూ కలిసి అమృతం కోసం పాల సముద్రం చిలికారు. అమృతం పుట్టింది, దేవతలు దాన్ని రాక్షసులకు దక్కకుండా చెయ్యాలని చూశారు. రెండు పక్షాల వారికీ ఘోర యుద్ధం జరిగింది. విష్ణువు (దేవత), జగన్మోహినీ అవతారం ఎత్తి అమృతం తీసుకు పోయి దేవతలకు పంచడం మొదలు పెట్టాడు. రాహువూ, కేతువూ అనే ఇద్దరు రాక్షసులు, దేవతల్లో కలిసిపోయి అమృతం తాగడానికి కూర్చున్నారు. విష్ణువు, వారికి కూడా అమృతం పోశాడు. వాళ్ళిద్దరూ తాగుతూ వుండగా సూర్యుడూ, చంద్రుడూ (వీళ్ళిద్దరూ దేవతలు), విష్ణువుకి సైగ చేశారు. విష్ణువు వెంటనే చక్రంతో ఆ రాక్షసుల తలలు నరికేశాడు. అప్పటికి అమృతం వారి కడుపుల్లోకి దిగలేదు. కంఠాల్లోనే వుంది. అందుచేత వారి శరీరాలు చచ్చిపోయి తలలు మాత్రం బతికాయి. అప్పటి నించీ రాహువుకీ కేతువుకీ, సూర్యుడి మీదా చంద్రుడి మీదా కోపం. ఇద్దరూ చెరొకళ్ళనీ మింగుతూ వుంటారు. కానీ, వాళ్ళకి పొట్టలు లేవు గదా? సూర్యుడూ, చంద్రుడూ చక్కగా బయటికి వచ్చేస్తూ వుంటారు. కానీ, ఆ రాక్షసుల నోళ్ళల్లో వున్నప్పుడు మాత్రం కొంతసేపు కనపడకుండా పోతారు. అదేనన్న మాట గ్రహణాలు అంటే. ఆ నాటి ఊహలు అవి!

ఇంత పిచ్చి కథ వల్ల కూడా ఎంతో ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. ఈ కథలో, దేవతలూ, రాక్షసులూ అనే శతృపక్షాలు ఉన్నాయి. అందరూ కలిసి సమిష్టిగా చేసిన ఫలితాన్ని (పాల సముద్రం చిలకగా వచ్చిన అమృతాన్ని), అందరికీ పంచడానికి దేవతలు వ్యతిరేకించారు. ఆ అమృతాన్నంతా వాళ్ళే తాగాలనుకున్నారు. రాక్షసుల్లో ధైర్యస్తులు దాన్ని అడ్డుకున్నారు. కానీ ఆ పోట్లాటలో వారు మరణించారు. – గణ సమాజంలో ప్రారంభ కాలంలో సాగిన సమిష్టి జీవితం ఛిన్నాభిన్నం అవడం ఈ కథలో కనపడుతోంది. ఆ రకంగా అది ఎంతో అమూల్యమైన సమాచారాన్ని ఇస్తోంది – మట్టి తవ్వకాల్లో, పాతకాలపు కుండ పెంకో, ఎముక ముక్కో దొరికినట్టు!

మైతాలజీ కళ గురించి **మార్క్సు** నించి కొన్ని మాటలు విందాం:

"ఏ ఎదగని సామాజిక పరిస్తితులైతే ఈ కళకి ('మైతాలజీ'కి) జన్మనిచ్చాయో, ఆ సామాజిక పరిస్తితులు మళ్ళీ తిరిగి రావు"

(ఏ కాంట్రిబ్యూషన్ టు ది క్రిటీక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, పేజీ 217)

"మానవుల ఊహలలో, ఉద్దేశ్య రహితమైన కళాత్మక పద్ధతి ద్వారా ప్రకృతి విషయాలూ, సామాజిక విషయాలూ ఏకమైపోయాయి." (అదే పుస్తకం. పేజీ 216)

పాత కాలపు మానవులకు ప్రకృతి విషయాలు తెలియకపోవడం వల్ల, రాహు కేతువుల్లాంటి కథలు పుట్టు కొచ్చాయి కదా? కానీ, ఈ నాటి మేధావులకూ సైంటిస్టులకూ గ్రహణాల కారణాలు తెలీదా? తెలుసు. అయినా, ఈ మేధావులు కూడా రాహు కేతువుల కథలకే విలువ ఇస్తున్నారు. గ్రహణ స్నానాలు చేస్తున్నారు. కారణం ఏమిటి? – దీనికి కూడా వెనకటి కారణం లాంటి కారణమే ఉంది. వెనకటి మనుషులకు, ప్రకృతి గురించీ, సమాజం గురించీ కూడా, ఈ రెండూ తెలియవు. ఈ నాటి మేధావులకు ప్రకృతి గురించి తెలిసినా, సమాజం గురించి తెలీదు. శ్రమ దోపిడీ గురించీ, అది తెచ్చిపెట్టే సమస్యల గురించీ, దాని సంస్కృతి గురించీ, తెలీదు. లేదా, ఎంతో కొంత తెలిసినా, సాధారణంగా మేధావి సెక్షన్లన్నీ దోపిడీ వర్గానికే అనుకూలంగా ఉంటాయి. తాము కూడా దోపిడీ దారులుగా ఎదగడానికే ప్రయత్ని స్తాయి. దోపిడీ సంస్కృతినే పాటిస్తాయి.

పాతకాలపు మనుషులు, కేవలం అజ్ఞానం వల్లనే మూఢ నమ్మకాల్లో ఉన్నారు కాబట్టి, వాళ్ళు నిర్దోషులే. ఆధునిక కాలపు మేధావులు ప్రకృతి గురించి ఎన్నో తెలిసి కూడా మూఢ నమ్మకాల్ని పాటిస్తున్నారంటే, వీళ్ళు నిజంగా దోషులు!

కుటుంబరావుగారు అన్నట్టుగానే రామాయణంలో పాత్ర చిత్రణ బాగా లేకపోవడం నిజమే. దీనికి అనేక ఉదాహరణలు చూడవచ్చు. కానీ, ఈ 'బాగా లేకపోవడా'నికి కూడా కారణం ఆ రచనా విధానంలోనే వుంది.

రాముడు మహా వీరుడైనా చీటికీ మాటికీ దుఃఖిస్తూనే వుంటాడు. కవి అభిప్రాయం ఏమిటంటే – ఎంత మహా వీరుడికైనా కష్ట సమయాలు ఉంటాయనీ, అలాంటప్పుడు దుఃఖం కలుగుతుందనీ, చెప్పాలని. కానీ, ఆ బాధనీ, ఆ నిరుత్సాహాన్నీ తగిన మోతాదులోనే చెప్పాలి. మోతాదు దాటితే అది అవక తవక పాత్రచిత్రణ అయి పోతుంది. ఇదంతా ఒక తర్కం. కానీ, మైతాలజీ కాలం, సాహిత్య సృష్టిలో తర్క దృష్టి వున్న కాలం కాదు.

రాముడు దుఃఖిస్తూ వుంటే, "వీరుడు ధైర్యంగా ఉండాలి" అని లక్ష్మణుడు నీతులు చెపుతాడు.

సుగ్రీవుడు దుఃఖిస్తూ ఉంటే, హనుమంతుడు అదే రకం నీతులు చెప్పే సుగ్రీవుణ్ణి మందలిస్తాడు.

'ధైర్యంగా ఉండాల'ని హనుమంతుడితో ధైర్యం చెప్పించుకున్న సుగ్రీవుడు, మళ్ళీ తను, రాముడికి ధైర్యంగా వుండాలని చెపుతాడు.

రాజులూ, అధికారులూ వంటి గొప్పవారికి, కష్టాలు వచ్చినప్పుడు, వారికన్నా తక్కువ వారు, వారిని రక రకాలుగా ఓదారుస్తారు. సమానులైన వారితో ధైర్యం చెప్పించుకుంటే అవమానం గానీ, తమ కన్నా తక్కువ వారితో ధైర్యం చెప్పించుకోవచ్చు. తక్కువ వారు, ఎక్కువ వారిని ఓదార్చడం కూడా సేవ చెయ్యడంలో భాగమే. అలా నీతులు బోధించే వారు చివరికి ఏమంటారంటే, "నీకు చెప్పగల వాణ్ణి కాను. నీ దుఃఖం చూడలేక ఇలా చెప్పాను. నీకు తెలీదని కాదు" అంటారు.

భార్యలు, భర్తల్ని విమర్శిస్తారు. కానీ చివరికి "నీకు చెప్పదగ్గదాన్ని కాను. స్త్రీ చాపల్యం వల్ల అలా చేశాను" అంటారు.

పాత్ర చిత్రణ ప్రతీ చోటా ఇలాగే నడుస్తుంది. అది, ఆ నాటి రచనా విధానంలో భాగం.

రచనా విధానం బాగా లేకపోతే, అది అలా ఎందుకు ఉందో కారణాల కోసం పరిశీలించాలి. అది కూడా ఆ సమాజాన్ని పరిశీలించడమే. రామాయణంలో రచనా విధానం బాగా లేకపోతే, 'అది అసలు సాహిత్యమే కాదు' అనడం ఎలాంటిదంటే, ఆటవిక మానవుణ్ణి చూసి "వీడికి చదువూ సంధ్యా లేదు కాబట్టి వీడసలు మానవుడే కాదు" అనడం లాంటిదే. ఆ ఆటవిక మానవుడే క్రమంగా నాగరిక మానవుడవుతాడు. అలాగే, ఆ అవక తవకల సాహిత్యమే క్రమంగా ఉన్నతమైన రచనా విధానానికి చేరుతుంది.

'సాహిత్యం ఉన్నత స్థాయికి చేరినప్పటినించే అది సాహిత్యం. అంతకు ముందు ఉన్న అజ్ఞాన రచనలేవీ సాహిత్యం కాదు' అని భావిస్తే, అది, కళల సృష్టిలో ప్రారంభ దశల్ని అర్థం చేసుకోక పోవడమే. పరిణామ క్రమాన్ని తిరస్కరించడమే.

శాస్త్రజ్ఞానం తెలిసిన సమాజం మళ్ళీ ఆటవిక దశకు వెళ్ళదు. అలాగే, ఉన్నత స్థాయికి చేరిన సాహిత్యం, మళ్ళీ కట్టుకథల స్థాయికి వెళ్ళదు. చంద్రుడు, భూమి లాంటి గ్రహమే అని తెలిసిపోయిం తర్వాత, ఇక చంద్రుడు ఎంతో కాలం శివుడి జటాఝూటంలో కూర్చోలేడు. కార్లూ, రైళ్ళూ, విమానాలూ మానవ జీవితంలోకి జొరపడి పోయింతర్వాత, ఇక గుర్రపు స్వారీలకూ, పల్లకీ ప్రయాణాలకూ, సమాజంలోనూ, సాహిత్యంలోనూ

కూడా చోటు ఉండదు. తుపాకులే ఆయుధాలుగా ఉప యోగపడడం ప్రారంభమైన తర్వాత, బాణాల విలుకాడు కథా నాయకుడు కాలేదు. (వెనకటి కథలనే తిరిగి రాసు కోవడం సంగతి కాదు. కొత్తగా బాణాల నాయకుడు సృష్టి కాదు.)

> మార్క్సు – "మందుగుండునీ, తుపాకు లనూ కని పెట్టిన తర్వాత, 'ఎకిలెస్' సాధ్య మేనా?" అంటాడు. (అదే పుస్తకం. పేజీ 216)

'ఎకిలెస్' అనే పాత్ర, గ్రీసు పురాణాలలో గొప్ప విలుకాడు. మన రాముడి లాంటి, అర్జునుడి లాంటి విలుకాడు. 'తుపాకి'ని కనిపెట్టేసిన తర్వాత కాలపు రచనల్లో, విల్లుతో శక్తి సామర్థ్యాల్ని చూపించే పాత్రల్ని సృష్టించడం ఇక జరగదు.

అయితే, ఒక వ్యక్తి పెరిగి పెద్దవాడై ఎంత జ్ఞాన వంతుడయినా, తన చిన్నతనాన్ని తల్చుకున్నప్పుడల్లా (అల్లరీ, అజ్ఞానం, అమాయకత్వం, బండతనం – లాంటి లక్షణాలతో ఉన్న చిన్నతనాన్ని తల్చుకున్నప్పుడు) ఎలాంటి అనుభూతి పొందుతాడో, మానవ సమాజం లోని సాహిత్యంలో బాల్య దశని చూసినప్పుడు, ఎదిగిన సమాజానికి కూడా అలాంటి వింత అనుభూతి కలుగు తుంది. ఆ అనుభూతిని 'శాశ్వితాకర్షణ' అన్నాడు మార్క్సు.

> "'పెరిగి పెద్ద వాడయిపోయిన మనిషి మళ్ళీ పిల్లవాడు కాలేడు. పిల్లతనపు పసి తనంతోనూ ఉండలేడు. అయినా ఎదిగిన మనిషికి కూడా పిల్లవాడి అమాయకత్వం ఆనందాన్ని ఇవ్వదూ? ఎదిగిన మనిషి, పసి తనపు నిష్కల్మషత్వాన్ని ఉన్నత స్థాయిలో పునరుత్పత్తి చెయ్యడానికి ప్రయత్నించడూ? ప్రతీ యుగంలోనూ పసి పిల్లవాడు, ఆ కాలపు స్వభావానికి తగిన అమాయకత్వానికి ప్రాతి నిధ్యం వహించడూ? మానవ సమాజపు చారిత్రక బాల్యం (హిస్టారికల్ ఛైల్డ్ హుడ్), ఏ యుగంలోనైతే ఎంతో అందమైన రూపాన్ని పొందిందో ఆ యుగం ఎప్పటికీ తిరిగి రాని దశ. కాబట్టి, ఆ బాల్య దశ, శాశ్వతాకర్షణని (ఎటర్నల్ ఛార్మ్) ఎందుకు చూపకూడదూ?"
> – మార్క్సు. (అదే పుస్తకం. పే. 217)

## రామాయణంలో, 'సమాజం' కనపడడం లేదా?

ఏ కాలంలో అయినా, ఒక రచనలో ఉండే సమా జాన్ని చూడాలంటే, ఆ రచనలో ఉండే అవక తవకలూ, అసందర్భాలూ, పాత్రపోషణ బాగా లేకపోడాలూ, ఇవన్నీ ఏ రకంగానూ అడ్డురావు. రామాయణం కథలో, సమా జంలో ఉండే వాస్తవాలు కొల్లలుగా కనపడతాయి. ఇవన్నీ ఆ కథలో ఇంతకు ముందే చూశాం. ఇక్కడ కొన్ని టిని గుర్తు చేసుకుందాం.

హనుమంతుడు లంకలో సీతని వెతుకుతున్నప్పుడు, రావణుడి భార్యలు, రావణుడి కాళ్ళ వేపున పడుకుని ఉండడం చూస్తాడు. 'రావణుడి భార్యలు' అనే మాటల వల్ల, 'అది ఒక పురుషుడికి అనేక మంది భార్యలు గల సమాజం' అని తెలియడం లేదూ? ఆ భార్యలు, భర్త కాళ్ళ వేపున పడుకున్నారని చెప్పడం అంటే, ఆ వర్ణన వల్ల, పురుషుడి ఉన్నత స్తితీ, స్త్రీల నీచ స్తితీ, అర్థం కావడం లేదూ?

ఈ సంఘటన చూడండి! రావణుడు, సీతని ఎత్తుకు పోవడానికి దండకారణ్యానికి రథంలో వస్తూ, దారిలో ఒక బ్రహ్మాండమైన మర్రిచెట్టుని చూస్తాడు. దాని కొమ్మలు నూరేసి యోజనాల పొడవుతో వుంటాయి. ఒక కొమ్మ మాత్రం విరిగిపోయి మోడులా ఉంది. దానికో కథ చెప్పాడు కవి. పూర్వం గరుత్మంతుడు ఒక పెద్ద తాబేలునీ, ఒక ఏనుగునీ తెచ్చుకుని తినడానికి ఆ కొమ్మ మీద కూర్చున్నాడు. అతని బరువుకి ఆ కొమ్మ ఫెళ ఫెళ విరిగిపోయింది. ఆ కొమ్మ నిండా మహర్షులు తపస్సులు చేసుకుంటూ వున్నారు. (ఆటవిక కాలంలో, మానవులు చెట్ల మీద నివాసాలేర్పరుచుకునే వారు. క్రూర జంతువుల నించి రక్షణ కోసం, చెట్ల మీద గుడిసెలు కట్టుకుని జీవించిన దశలున్నాయి. రుషులు, చెట్ల కొమ్మల మీద తపస్సులు చేసుకోవడాన్ని, వాస్తవంలో ఇలా అర్థం చేసుకోవచ్చు.)

కొమ్మ, కింద పడిపోతే మహర్షులందరూ చచ్చి పోతారని గరుత్మంతుడు చప్పున దాన్ని ముక్కుతో పట్టు కుని, ఏనుగునీ, తాబేలునీ కాలి గోళ్ళలో ఇరికించుకుని, ఆకాశంలోకి ఎగిరాడు. కొంత దూరం పోయి, ఆకా శంలో ఒంటికాలి మీద నిలబడి, ఏనుగునీ తాబేలునీ తినేశాడు. తర్వాత ఆ కొమ్మతో కొందరు 'బోయ వాళ్ళని' బాది చంపేసి, 'మహర్షుల్ని' రక్షించి, చాలా సంతో షించాడు. – ఇదీ కథ! మహర్షుల్ని రక్షించాడని చెప్తే చాలదా? 'బోయ వాళ్ళని చంపడం' ఎందుకు? కవి, ఈ ఘట్టం ఎంత పొంగుతూ రాశాడో, ఎవరి క్షేమాన్ని దృష్టిలో పెట్టుకున్నాడో, చూడండి – "ధర్మాత్ముడును, పక్షులందు శ్రేష్ఠుడునునగు గరుడుడు, బోయ వాండ్రను గొట్టి చంపి, మహర్షులను గాపాడి మిగుల సంతో షించెను."

ఈ కథ వల్ల రుషులకు (బ్రాహ్మణులకు) ఉండే ఉన్నత స్థానమూ, శూద్రులకు ఉండే నీచ స్థానమూ కనపడడం లేదూ?

రాముడు, భరతుడికి రాజ నీతులు చెప్పే ఘట్టం గురించి నేను రాసిన పద్ధతిని కుటుంబరావుగారు విమర్శించారు. "రాముడు అరణ్యాలలో భరతుణ్ణి కలుసుకున్నప్పుడు, రాజ ధర్మాల బోధనతో బోరు కొట్టడం గురించి, రంగనాయకమ్మగారు అధిక్షేపించడం వృధా. ఆ ఘట్టంలో రాముణ్ణి గురించి మిగిలిన పాత్రలకు ఎలాంటి వికారాలు కలుగుతాయో వివరంగా రాయడం బొత్తిగా నిరుపయోగం. రామాయణ మూలాన్ని అంత 'లిటరల్'గా (మక్కీకి మక్కీగా – అని అర్థం) తీసుకోవడంలో రచయిత్రి ఆశించిందేమిటో అర్థం కాదు" అన్నారు.

అవును, అర్థం కాదు. అర్థం చేసుకోవడం ఇష్టం లేకపోతే ఏదీ అర్థం కాదు. రాముడు రాజనీతులు చెప్పే ఘట్టంలో, 'రాముడు ఇతర పాత్రల్ని బోరు కొడుతున్నాడే' అని చెప్పడానికి మాత్రమేనా అది రాసింది? ఆ ఘట్టంలో, ఒక సమాజానికి సంబంధించిన విషయాలెన్నో ఉన్నాయి. కావ్య నాయకుడి కపట మనస్తత్వం కనపడుతోంది. అవన్నీ 'కథా వస్తువు'కి సంబంధించినవే.

రాముడు, భరతుడితో, "నీ అసమర్థత వల్ల రాజ్యం పోగొట్టుకున్నావా? (నే నయితే పోగొట్టుకునే వాణ్ణి కాను.) ప్రజలు నిన్ను రాజుగా అంగీకరించలేదా? (నన్నయితే అంగీకరించే వారే.) రాజ్య పరిపాలన తెలివిగా చేస్తున్నావా? (నే నయితే చక్కగా చేసేవాణ్ణి)" – ఇలా ఎన్నో అడుగుతాడు. అంటే, "నీ కన్నా నేను చాలా ఉత్తముణ్ణి. సమర్థుణ్ణి, రాజ్యం చెయ్యడానికి నేనే యోగ్యుణ్ణి" అనే ధోరణితో మాట్లాడతాడు. అందులో వున్న ఫ్యూడల్ దర్పం, అహంకారం, ఎదుటి వాళ్ళని అల్పుల కింద జమకట్టడం – ఇవన్నీ కావ్య నాయకుడి లక్షణాలు. ఈ లక్షణాల్ని పాఠకులకు వివరించడానికి ఆ ఘట్టం పనికి వస్తుంది.

కానీ, ఇదంతా వృధా అని కుటుంబరావుగారి అభిప్రాయం.

రామాయణంలో, పెద్ద పెద్ద ఘట్టాలలోనే కాదు – వర్ణనల్లోనూ, పోలికల్లోనూ కూడా సమాజం కనబడుతుంది. పువ్వులు పూసిన చెట్లు, 'ఆభరణాలు ధరించిన ఉత్తమ పురుషుల' లాగ వుంటాయి. ఆ 'ఉత్తమత్వం' ఆభరణాల వల్ల వచ్చిందే. అంటే, సిరి సంపదల వల్ల! ఆ సంపదలూ, ఆభరణాలూ లేని వాళ్ళు ఉత్తములు కారు. నీచులో, క్షుద్రులో, శూద్రులో!

సీత, రావణుడితో – "బ్రాహ్మణుడు, శూద్రుడికి ఎలాగైతే మంత్రం ఉపదేశించడో, అలాగే నేను నా శరీరం నీకు ఇవ్వను" అంటుంది. ఈ పోలికలో ఉన్న 'విషయాన్నే' చూడండి. అందులో కుల భేదాలు కనపడతాయి.

అడవిలో మొగ ఏనుగుకి కూడా వందలకొద్దీ ప్రియురాళ్ళు వుంటారు. ఆడ ఏనుగుకి ప్రియులు ఉండరు.

ఇదంతా, ఆ కథ ద్వారా సమాజాన్ని పరిశీలించడం కాదా?

మొత్తం మానవ సమాజ పరిణామం అంతా ఒక్క కథలోనే కనబడాలి – అంటే, అలాంటి కథ ఏదీ ఉండదు. ఏ కథ అయినా కొన్ని దశల్నే, కొన్ని పరిస్థితుల్నే చూపిస్తుంది.

రామాయణాన్ని సాహిత్యం కాదనటానికి కుటుంబరావుగారు ఏ కారణాలైతే చెప్పారో, ఆ కారణాల వల్ల అది సాహిత్యం కాకుండా పోదు. పైగా, ఆ కారణాల వల్లే, అది ఒక దశకు సంబంధించిన సాహిత్యం అవుతుంది.

రామాయణం – సాహిత్యమే. 'సాహిత్య చరిత్రలోని బాల్యదశలో సృష్టి అయిన సాహిత్యం! వెనకటి దశల అవశేషాల్ని కలుపుకుని, ఎక్కువగా భూస్వామ్య సమాజపు విలువల్ని ప్రతిబింబించే సాహిత్యం!

## 'సాహిత్యం' గురించి మార్క్సిస్టు విమర్శ ఎలా ఉంటుంది?

కుటుంబరావుగారు, తన సమీక్షలో ఇంకా చాలా అభిప్రాయాలు ప్రకటించారు.

"భౌతిక విశ్లేషణకు పనికి రాని చెత్త రచనలు నేను చాలా చదివాను. సినిమాలు చాలా చూశాను" అన్నారు. కొన్ని రచనల్ని 'చెత్త రచనలు' అనీ, కొన్ని సినిమాల్ని 'చెత్త సినిమాలు' అనీ అనడంలో పొరపాటు లేదు. 'అవి విశ్లేషణకు పనికిరావు' – అనడమే పొరపాటు. వాటిని 'చెత్త' అని చెప్పడమే భౌతిక విశ్లేషణ. చెత్త రచనలూ, చెత్త సినిమాలూ తయారవుతున్నాయంటే, సమాజంలో పరిస్థితులు అలా చెత్తగా ఉన్నాయన్న మాట! ఆ సమాజంలో ఉన్న జన సంఖ్యలో, ఆ 'చెత్త'ని ఉత్పత్తి చెయ్యడం వల్ల లాభపడే వాళ్ళు ఒక వేపునా, ఆ చెత్త తమ జీవితాలకు ఎంత హాని కలిగిస్తుందో తెలియక ఆ చెత్తనే ఆదరించే వాళ్ళు ఇంకో వేపునా, ఉన్నారన్నమాట! అందుకే, 'చెత్త' ఉత్పత్తి అవుతోంది.

ఎంత చెత్త అయినా, ఎంత మంచి అయినా,

సమాజ పరిస్తితులతో సంబంధం లేకుండా శూన్యంలో నించి రావు. ఆ చెత్త విషయాలన్నీ ఆ సమాజానికే సంబంధించి ఉంటాయి. ఆ పాత్రలు, ఆ సమాజంలో వున్న మంచిచెడ్డల్నే ప్రదర్శిస్తాయి. ఒక సమాజం నించే తయారైన పుస్తకాలు (లేదా సినిమాలు), ఆ సమాజ పరిశీలనకు ఎందుకు పనికి రావు?

ఎంత చెత్త పుస్తకాన్ని అయినా వర్గ దృక్పథంతో పరిశీలించగలం. అందులో, ఫ్యూడల్ భావాలు ఉన్నాయా? బూర్జువా భావాలు ఉన్నాయా? రెండూ కలిసి ఉన్నాయా? ఏది దేన్ని అధిగమించి ఉంది? కథా వస్తువు ఏ వర్గానికి అనుకూలంగా ఉంది? ఏ రకంగా అనుకూలంగా ఉంది? ఆ రచన (లేదా, సినిమా) ప్రస్తుత సమాజానికి అభివృద్ధికరంగా ఉందా, అభివృద్ధి నిరోధకంగా ఉందా? – ఇటువంటి విషయాలు గ్రహించడానికి, అందులో ఎంత చెత్త ఉన్నా అడ్డు రాదు. ఆ చెత్త కూడా పరిశీలనకే ఉపయోగపడుతుంది.

ఉదాహరణకి, ఒక చెత్త సినిమా కథ చూడండి! అందులో కథా నాయిక నాగేంద్రుడి భక్తురాలు. పాముల పుట్ట ముందు నిలబడి పూజలు చేసి చేసి, ఒక రోజు పాముని చూసి, పాముతో మాట్లాడింది. అప్పటి నించీ పాము తనని రక్షిస్తూ వుందని ఆమె నమ్మకం. కానీ, కథా నాయకుడికి, పాములంటే కోపం. అతని తల్లి పాము కాటు వల్లనే చచ్చిపోయిందట. అందుకే కోపం. ఒకసారి ఆ పాము, కథా నాయకురాలిని తన వెంట తీసుకు వెళ్ళి, కారులో వస్తోన్న కథా నాయకుడితో కలిసే అవకాశం కలిగించింది. కథా నాయకుడు, రోడ్డు మీద పాముని చూసి, కారుని ఆపి, పాముని చంపాలనే అభిప్రాయంతో దాని మీద నించి కారుని నడపబోయాడు. కారు కదల్లేదు. కథా నాయకుడు తుపాకీ పట్టుకుని కిందికి దిగాడు. కానీ, పాము చెట్లలోకి తప్పుకుంది. హీరో, హీరోయినూ కలుసుకున్నారు. ఇద్దరూ కారులో పోతూ, శతృవుల పన్నాగం వల్ల ఒక రాత్రంతా ఒక భవనంలో చిక్కుబడ్డారు. ఇద్దరూ మర్నాడు కథానాయకి తాత దగ్గిరికి వచ్చారు. ఆ తాత, మనవరాల్ని శంకించి, 'ఇక నిన్నెవరు పెళ్ళి చేసుకుంటార'ని కొట్టబోయాడు. కథా నాయకుడు ఆమెకి అభయమిచ్చి తనే పెళ్ళి చేసుకుంటానన్నాడు. తర్వాత పెళ్ళినాడు, పెళ్ళికూతురి తరఫు వాళ్ళందరూ ఒక బస్సులో ప్రయాణం చేస్తూంటే, అందులో శతృవులు ఒక బాంబు పెట్టారు. ఆ సంగతి నాగేంద్రుడు గ్రహించి, తన భక్తురాల్ని రక్షించాలి కాబట్టి, బస్సు టాపు మీద నించి డ్రైవరు దగ్గిరికి జారాడు. డ్రైవరు బస్సుని ఆపేసి కిందకి పరిగెత్తుతోంటే అందరూ దిగి పోయారు. తర్వాత బాంబు పేలినా బస్సుకి తప్ప ఎవరికీ ప్రమాదం జరగలేదు. తర్వాత పెళ్ళి నిర్విఘ్నంగా జరిగి పోయింది. పెళ్ళిలో కూడా నాగేంద్రుడు భక్తురాలికి కన పడ్డాడు. పెళ్ళికొడుకు నాగేంద్రుణ్ణి చంపే ప్రయత్నాలు చేస్తోంటే, భక్తురాలు మూర్ఛబోయింది. నాగేంద్రుడు, ఆమె పొట్ట మీదికి పాకి ఆమె మూర్ఛని పోగొట్టాడు. భక్తురాలు నాగేంద్రుణ్ణి, వారం వారం తన దగ్గిరికి వచ్చి పాలు తాగి వెళ్ళమని ప్రార్థించింది. అప్పటి నించీ హీరోకీ, హీరోయిన్‌కీ నాగేంద్రుడి గురించి దెబ్బలాటలు ఉధృతం అయ్యాయి. చివరికి నాగేంద్రుడు, భక్తురాలి భర్తని చావు నించి కాపాడి, అతని శతృవులందర్నీ చంపే శాడు. కథా నాయకుడికి, తన తల్లి, పాము కాటువల్ల గాక, ఇంకో విధంగా మరణించిందని తెలిసింది. మొదట్లో మూఢ నమ్మకాలు లేని కథా నాయకుడు కూడా చివరికి నాగేంద్రుడి భక్తుడై పోయాడు – ఇదీ కథ!

ఈ కథ పరమ చెత్తగా ఉందనటానికేమీ సందేహం లేదు. అయినా, ఇది 'సమాజ విశ్లేషణకు' పనికి రాక పోవడం ఉండదు.

నాగేంద్రుడు అనేది, ఫ్యూడల్ దశ కన్నా వెనకటి దశలలో పుట్టిన మూఢ నమ్మకం. తర్వాత కాలంలో ఇది ఫ్యూడల్ సంస్కృతిలో భాగం అయింది.

ఈ కథలో ముఖ్య విషయం అంతా కల్పనే. ఈ కల్పన, అసాధ్యమైన విషయాల్ని సాధ్యమయ్యే విషయాలుగా ఊహించుకునే అవకాశం కలిగిస్తుంది.

ఈ నాడు సమాజానికి కొంత శాస్త్రజ్ఞానం తెలిసినా, అది సమాజంలో అనేక మందికి ఇంకా అందుబాటులో లేదు. అనేకమంది ఇంకా మూఢ నమ్మకాలలోనే మునిగి ఉన్నారు. (మూఢ నమ్మకాలు పోవడానికి శాస్త్రజ్ఞానం తెలియడం మాత్రమే సరిపోదు. జీవిత పరిస్తితులన్నీ మారితేనే అది జరుగుతుంది.)

ఈ కథ అంతా, కారులూ, తుపాకులూ, పిక్నిక్‌లూ, బాంబులూ–వంటి లక్షణాలతో సాగింది. ఇవి, బూర్జువా సమాజ లక్షణాలు.

నాగేంద్రుడి మహిమ మీద నమ్మకం – అనేది, ఆటవిక సమాజంలో పుట్టి, ఫ్యూడల్ (భూస్వామ్య) సమాజంలో వృద్ధి చెంది, బూర్జువా సమాజంలో కూడా నిలబడి వుంది. ఈ కథలో నాగేంద్రుడి మహిమ ముందు కారు కదల లేదు. టైం బాంబు ఏ హానీ కలిగించలేక పోయింది.

ఈ సినిమాని ఏ సమాజంలో తీశారో ఆ సమాజం ఎలాంటిదంటే, అక్కడ సైన్సు జ్ఞానం కన్నా వెనకటి కాలపు మూఢ నమ్మకాలే బలమైన స్థానంలో వున్నాయి. దీన్ని ఒక రకంగా చూస్తే, పెట్టుబడిదారీ యంత్ర ఉత్పత్తి విధానం కన్నా, భూస్వామ్య ఉత్పత్తి విధానమే ఆధి

పత్యంలో వుందని అర్థం. అయితే, కళల సృష్టి అనేది, అప్పుడు వున్న ఉత్పత్తి విధానంతో సరి సమానంగా మారుతూ వుంటుందని అర్థం కాదు. అలా వుండదు. బూర్జువా సమాజం కూడా దోపిడీ సమాజమే కాబట్టి, అక్కడ తయారయ్యే కళలు, వెనకటి దోపిడీ సమాజాల లక్షణాలతో ఐక్యం అయిపోతాయి. ఈ సినిమా కథలో, మూఢనమ్మకాలే శాస్త్ర జ్ఞానాన్ని ఓడిస్తూ, చివరికి అవే నెగ్గాయి. అంటే, ఈ సమాజంలో ఫ్యూడల్ సంస్కృతే బలంగా ఉందని అర్థం. ఈ సంగతి భక్తురాలి పాతి వ్రత్యం ద్వారా కూడా రుజువవుతుంది.

ఈ కథ, మూఢ నమ్మకాలు లేని ప్రధాన పాత్రని చివరికి ఆ నమ్మకాలు గల పాత్రగా మార్చేసింది. ఇది, ప్రజలకు తర్క జ్ఞానాన్ని ఇవ్వదు. నూతన చైతన్యాన్ని ఇవ్వదు. కొంచెం ఆలోచించగల వాళ్ళని కూడా వెనకడు గులు వేసేలాగ చేస్తుంది. ఈ రకంగా ఇది పూర్తిగా దోపిడీ వర్గ ప్రయోజనాలకే ఉపయోగపడుతుంది. అంటే, ప్రజలకు చాలా ద్రోహం చేస్తుంది.

ఇంత మూఢత్వానికి ప్రోత్సాహం దొరికే ఈ సమాజంలోనే, అభ్యుదయ భావాలుగల పుస్తకాలూ సినిమాలూ కూడా వస్తూ వుంటాయి. కానీ అవి చాలా తక్కువ. జనంలో అధిక సంఖ్య మూఢ నమ్మకాల్లోనే ఉన్నారు కాబట్టి.

ఏ చెత్త అయినా, ఏ మంచి అయినా, పరిశీలనకు పనికి వస్తుంది – అనేదే ఇక్కడ గ్రహించవలసిన విషయం.

కానీ, కుటుంబరావుగారు – "మార్క్సిస్టు దృక్ప థంతో విశ్లేషించాలంటే, కౌటిల్యుడి అర్థశాస్త్రమూ, ధర్మ శాస్త్రాలూ; మహాభారతం, హరివంశం వంటి పురా ణాలూ, ఉన్నాయి. రామాయణం దేనికి?" అన్నారు.

భారతాన్ని పరిశీలిస్తే, అది భారతం పరిశీలనే. హరివంశాన్ని పరిశీలిస్తే, అది హరివంశం పరిశీలనే. ఇంకో పుస్తకాన్ని పరిశీలిస్తే, అది రామాయణం పరి శీలన అవదు. కుటుంబరావుగారి సంగతి తెలుసుకోవా లంటే, ముకుందరావుగారినో, గోవిందరావుగారినో చూస్తే తెలుస్తుందా? అలాగే, రామాయణం సంగతి తెలుసుకోవాలంటే, అందులో ఉన్న కథనే, ఆ పాత్రల్నే, ఆ సమాచారమే, చూడాలి. దేని సంగతి దానిలోనే వుంటుంది.

కుటుంబరావుగారు ఇంకో సందర్భంలో – "నేను సాహిత్యంగా రామాయణాన్ని మెచ్చుకోలేను" అన్నారు.

సాహిత్యంగా మెచ్చుకోవడం వేరూ, సాహిత్యంగా ఒప్పుకోవడం వేరూ. రెండూ ఒకటి కాదు. రామాయ ణాన్ని మెచ్చుకుంటామా లేదా – అని కాదు. దాన్ని సాహిత్యంగా ఒప్పుకుంటామా లేదా – అన్నది ప్రశ్న. ఎవరు మెచ్చుకున్నా, మెచ్చుకోకపోయినా – రామా యణం సాహిత్యమే. ఒక కాలపు సాహిత్యం. ఆ సంగతి ఒప్పుకోవలసిందే.

ఒక హేతువాది, ఒక మత గ్రంధాన్ని సాహిత్యం కాదన్నా; ఒక దైవ భక్తుడు, ఒక నాస్తిక రచనని సాహిత్యం కాదన్నా – ఈ రెండు అభిప్రాయాలూ తప్పే.

కుటుంబరావుగారు ఇంకో చోట – "జన బాహుళ్యం ఆరాధించే రాముడి కథ, 'విష వృక్షం'కు ప్రేరణ ఇచ్చింది కానే కాదని నా ఉద్దేశ్యం" అంటు న్నారు. అంటే, జనం ఆరాధిస్తున్నది, విష వృక్షంలో ఉన్న రాముడు వంటి పాత్రని కాదు. 'విష వృక్షం'లో రాముడు ఆరాధనీయంగా కనపడడు. జనం వినే కథలో రాముడు ఆరాధనీయంగా ఉంటాడు. అలాంటి పాత్రనే జనం పూజిస్తున్నారు – అని కుటుంబరావు గారి అర్థం.

జన బాహుళ్యం ఆరాధించే రాముడి కథకీ, విష వృక్షంలో కథకీ, తేడా ఉందా? ఏమీ తేడా లేదు. నేను, 'మూలం'లో ఉన్న కథనే చెపుతూ, ఆ సంఘటనల మీద నా విమర్శలు నేను చేశాను. దానికి, మూలం నించే ఆధారాలు చూపించాను. నేను ఎక్కడా కొత్త సంఘట నలు తెచ్చి పెట్టలేదు.

మూలకథలో ఉన్న కొన్ని విషయాలు ప్రజలకు తెలియవు, నిజమే. కానీ, ప్రజలకు తెలిసిన కథ మాత్రం ఆరాధనీయంగా ఉందా? తండ్రి ఆజ్ఞ ప్రకారం రాజ్యాన్ని వదిలిపెట్టవలసిన రాముడు, తన చెప్పుల్ని సింహాసనం ఎక్కించడానికి ఒప్పుకున్నాడని ప్రజలకు తెలీదా? రుషి జీవనం గడపవలసిన రాముడు, ఎప్పుడూ భుజాన్న విల్లు పెట్టుకుని వేటాడాడనీ, యుద్ధాలు చేశాడనీ, ప్రజ లకు తెలీదా? శూర్పణఖకి ముక్కూ చెవులూ కోయిం చాడని ప్రజలకు తెలీదా? తనకు శతృవు కాని వాలిని చాటుగా చంపిన సంగతి, ప్రజలకు తెలీదా? భార్యని శీల పరీక్ష కోరిన సంగతి ప్రజలకు తెలీదా? చివరికి, భార్యని అడవుల్లో విడిచిపెట్టిన సంగతి ప్రజలకు తెలీదా? ఇవన్నీ ఆరాధించే లక్షణాలా? భక్తి కలిగించే లక్షణాలా? ఇవన్నీ ప్రజలకు తెలుసు. ప్రజలకు తెలి యంది ఏమిటంటే, ఈ విషయాల మీద ప్రశ్నించడం. ఆ కొత్త ఆలోచననే ఇప్పుడు వారికి నేర్పాలి.

ప్రజల జీవితాలన్నీ కష్టాలతో నిండి ఉంటాయి. వారు, ఏదో ఒక దేవుణ్ణి నమ్మక తప్పదు. ప్రతి తరానికీ, వెనక తరం వాళ్ళు, అదే నేర్పుతారు. జనం, చిన్నతనం నించీ మూఢ నమ్మకాల్లో పడిపోతారు. జీవితమంతా అదే కొనసాగుతూ వుంటుంది. దేవుళ్ళ కథల్లో ఉండే తప్పులు గ్రహించకుండా, ప్రజలు దేవుళ్ళని ఆరాధించ

దగ్గ వారిగానే అనుకుంటారు. అయితే ఆ ఆరాధనని అలాగే సాగనివ్వాలా? ప్రజలు అజ్ఞానంలో వుంటే, ఆ అజ్ఞానాన్ని పోగొట్టే ప్రయత్నం చెయ్యక్కరలేదని కుటుంబ రావుగారి అభిప్రాయమా?

అహల్య విషయం ప్రస్తావిస్తూ కుటుంబరావుగారు తన సమీక్షలో – "రుషి పత్నుల వ్యభిచారాలకు అంతే లేదు" అన్నారు.

దానికి నేను, నా సమాధానంలో – "చరిత్ర దశల్ని అర్థం చేసుకున్న వాళ్ళు, అహల్య వంటి రుషి పత్నుల చర్యల్ని వ్యభిచారం అనరు. అది పాత నీతికీ, కొత్త నీతికీ సంఘర్షణ. నీతులు అలా మారడానికి కారణం చూడాలి" అన్నాను.

మళ్ళీ దానికి సమాధానంగా కుటుంబరావుగారు – "అహల్య వంటి రుషి పత్నులు చేసిన దాన్ని పౌరాణికులు వ్యభిచారం అనే అన్నారు. వాళ్ళ మొగుళ్ళు వాళ్ళనూ, వాళ్ళ పిల్లలనూ, శపించారు. నేను వ్యభిచారం అంటే దానికి తప్పు పట్టాలా?" అన్నారు.

అహల్య విషయాన్ని పౌరాణికులు ఏ దృష్టితో చూశారో, భౌతిక వాదిని అని చెప్పుకున్న కుటుంబ రావుగారు కూడా ఆ దృష్టితోనే చూస్తారా? అహల్యని మొదట తిరస్కరించిన భర్తే మళ్ళీ ఆమెని ఎందుకు స్వీకరించాడు? ఆమె కొడుకు కూడా (శతానందుడు), తల్లిని ఎందుకు గౌరవించాడు? బాల రాముడితో విశ్వామిత్రుడు, అహల్యకు, ఎందుకు నమస్కారం చేయించాడు? – ఈ విషయాలేవీ పట్టించుకోకుండా, అహల్య భర్త అయిన గౌతమ మహర్షి అహల్యని వ్యభి చారి అన్నాడు కాబట్టి, కుటుంబరావుగారు కూడా ఆ మాటే అంటారట! 'ఆమె మొగుడు అలా అన్నాడు కాబట్టి, నేనూ అన్నాను' అట! అప్పుడు కుటుంబరావు గారు, 'కుటుంబరావు మహర్షి' అవుతారుగానీ, చరిత్ర దశల్ని అర్థం చేసుకునే మార్క్సిస్టు ఎలా అవుతారు?

మార్క్సిస్టు విమర్శకుడు, సంఘటనల్ని తన సిద్ధాంత జ్ఞానంతో చూడకుండా, దేవుళ్ళని నమ్మే పండితుల దృక్పథంతోటీ, తపస్సులు చేసే మహర్షుల దృక్పథంతోటీ చూస్తే, ఆ వ్యక్తి ఇక మార్క్సిస్టుగా ఉండడు.

**లునచర్స్కీ మాటల్లో:** "మార్క్సిస్టు అయిన వ్యక్తి, తన చుట్టూ వున్న విషయాల మధ్య సంబంధాల్ని వాస్తవికంగా (ఆబ్జెక్టివ్‌గా) గుర్తించలేనప్పుడు, అతడు మార్క్సిస్టుగా ఫినిష్ అయిపోతాడు" (ఇందాకటి పుస్తకం; పేజీ 13)

కుటుంబరావుగారు – "రామాయణాన్ని చెత్త పుస్తకం కింద నేను ఏ నాడో జమకట్టాను. నలభై ఏళ్ళ క్రితమే విశ్వనాథవారు 'రామాయణ కల్పవృక్షం రాస్తు న్నందుకు విమర్శించాను" అంటున్నారు.

ఈయన, రామాయణాన్ని సమర్థించే 'కల్పవృక్షాన్నీ' విమర్శించారు; రామాయణాన్ని వ్యతిరేకించే 'విష వృక్షాన్నీ' విమర్శించారు! అదీ ఆశ్చర్యం!

"రామాయణాన్ని చదవడం మానేసినా తగల బెట్టినా, అర్థం ఉంది గానీ, ఈ విధంగా తిరగ రాయడం ఏమీ అర్థం లేని పని" అని తేల్చారు.

ఈ 'తిరగ రాయడం', రామాయణాన్ని కీర్తించడా నికి చేసినదా? భక్తులు, కొత్త రామాయణాలు రాసి నట్టుగా చేసిన పనా ఇది?

రామాయణాన్ని చదవడం మానేసినా, తగలబెట్టినా అర్థం ఉందట! – మరి దాన్ని చదవడం గానీ, వినడం గానీ, గౌరవించడం గానీ మానెయ్యాలంటే, దాన్ని గురించి నిజానిజాలు తెలియాలా, అక్కరలేదా? అందులో వున్న తప్పు విషయాలేమిటో తెలియకుండానే, పాత నమ్మకాలు మారకుండానే, దాన్ని చదవడాలూ వినడాలూ మానేస్తారా? దాన్ని గురించి తెలియకుండానే, దాన్ని తగలబెట్టేస్తారా?

ఆ కథలో వున్న నిజాలు చెపుతూ, దాన్ని 'తిరగ రాయడం'లో కుటుంబరావు గారికి అర్థం కనపడలేదు. కానీ, ఈ తిరగరాయడం అది పవిత్ర గ్రంథం కాదనీ, దాని వల్ల ప్రజలకు ఏ మేలూ జరగదనీ వివరించడానికే. ఇలాంటి పని ఎంత మంది చేస్తే అంత మంచిది. ఎన్ని రకాలుగా చేస్తే అంత మంచిది. 'ఈ పని చెయ్యక్కర లేదు, దానికి అర్థం లేదు' అనడమే అర్థం లేని పని.

అభివృద్ధి నిరోధకమైన విషయాల గురించి, మార్క్సిస్టులైన వాళ్ళు ఏ రకంగా ప్రవర్తించాలో ఒకసారి **'మావో'** మాటల్లో వినండి!

> "అభివృద్ధి నిరోధకమైనది ఏది అయినా ఒకటే, దాన్ని కొట్టందే పడదు. ఆ పని, నేల మీద దుమ్ము తుడవడం లాంటిదే. చీపురు ఏ మూల తగలకపోతే, ఆ మూల దుమ్ము అలాగే ఉండి పోతుంది. తుడవని చోట దుమ్ము దాని కదే పోదు."

(చైనీస్ లిటరేచర్ సంచిక 6; 1974)

కుటుంబరావుగారు, 'విష వృక్షం' గురించి చివరికి "కేవలం ఉబలాటంతో రాసిందే" అని తేల్చారు.

సరే, ఉబలాటంతో రాసిందే! రామాయణాన్ని విమ ర్శించాలనీ, ప్రజలకేదో నేర్పాలనీ, ఎవరికైనా ఉబలాటం కలిగితే, అది నేరమా? దోషమా? అది ప్రజలకు ద్రోహమా?

★

# 3. కొత్త సత్యనారాయణ చౌదరి గారి "రామాయణ రహస్యాలు" (వాల్మీకము)★

"సంస్కృత భారతమునకు తెలుగు భారతము వచ్చినట్టుగా, వాల్మీకమునకు అనువైన రచన తెలుగున రాలేదు" అని కొత్త సత్యనారాయణ గారి అభిప్రాయం.

సత్యనారాయణగారు – భాస్కర, రంగనాథ, మొల్ల రామాయణాల గురించి ప్రస్తావిస్తూ ఇలా అంటున్నారు. "ఈ రచనలలోని సీత వేరు, వాల్మీకి సీత వేరు. ఆ రాముడు వేరు, ఈ యాధునిక రాముడు వేరు. వాల్మీకి పాత్రలకూ, వీరి పాత్రలకూ; పంచ పాత్రలకూ, మట్టి పాత్రలకూ ఉన్నంత భేదము కన్పట్టును. ఇట్టి ఆధునికుల మాట తలపెట్టక, కేవలము వాల్మీకమునే సమగ్రముగ బరిశీలించి అందలి విశేషములను సమీక్షించితిని" అంటున్నారు. అంటే, ఈయనకు 'వాల్మీకి రామాయణం'లో పాత్రల చిత్రణ మీద చాలా మంచి అభిప్రాయం వుంది. అలా వున్నట్టు చెప్పుకున్నారు. ఇతర రామాయణాల్ని పట్టించుకోకుండా కేవలం వాల్మీకి రామాయణం మీదే ఆధారపడుతూ, ఈ సమీక్ష రాస్తున్నట్టు చెప్పుకున్నారు. తన వ్యాసానికి పెట్టిన పేరులో, 'వాల్మీకము' అనే మాట కూడా చేర్చుకున్నారు. (ఈయన, గ్రాంధిక భాషలోనే రాశారు. ఎక్కడి కక్కడ బండీరాలూ, అరసున్నాలూ కూడా వాడారు, నిన్న మొన్న రాసినా కూడా! గిడుగు రామమూర్తి గారు ఈయన చెవిన పడ్డట్టు లేరు. ఈ కొటేషన్లు ఇచ్చేటప్పుడు గ్రాంధికాన్ని మార్చలేంగానీ, వారి అర సున్నలూ బండీరాలూ ఇవ్వడం లేదు నేను.)

వాల్మీకి పాత్రలకూ, ఇతర రామాయణాల్లో పాత్రలకూ – వర్ణనల్లోనూ, సంఘటనల్లోనూ, సంభాషణల్లోనూ, ఎంత తేడా అయినా ఉండవచ్చు. కానీ పాత్రల స్వభావాల్లోగానీ, వారు ఆచరించే విలువల్లోగానీ, కథ నడకలోగానీ, ఏమీ తేడా వుండదు. వాల్మీకి – సీతా పతివ్రతే, ఇతర కథల్లో సీతా పతివ్రతే. వాల్మీకి రాముడు ఎలాంటి ధర్మాలు గలవాడో, ఇతర కథల రాముడూ అలాంటి ధర్మాలు గలవాడే. ఇతర కథల్లో కవిత్వాల కన్నా, వాల్మీకి కవిత్వమే గొప్పది అయితే, ఆ గొప్ప కవిత్వానిదే అవుతుంది గానీ, పాత్రల స్వభావాలకు సంబంధించింది అవదు.

ఈయన ఈ వ్యాసం ఎందుకు రాశారో ఇలా చెప్పుకున్నారు – "శ్రీరాముడు దైవమా, కాదా? – అన్న చర్చ వేరు. వాల్మీకములో ఆ పాత్ర మానవుడిగా ఎట్లు చిత్రించబడెను? ఆ పాత్రను మనము ఆదర్శముగా ఎందులకు గ్రహింపవలెను? ఇత్యాదంశములు చర్చించుటకే ఈ రచన సాగింది" అన్నారు. అంటే, వాల్మీకి రామాయణంలో రాముడి పాత్ర, 'ఆదర్శవంతమైన పాత్రగా' ఉందని సత్యనారాయణగారి అభిప్రాయం!

వాల్మీకి రామాయణం చదువుతున్నప్పుడు సాధారణంగా విమర్శించదగ్గవిగా తోచే అంశాల్లో కొన్నిటిని, ఈయన కూడా తీసుకున్నారు. కథలో ఉన్న అవకతవకల గురించీ, పరస్పర విరుద్ధతల గురించీ ప్రస్తావించారు. కానీ, అవన్నీ వాల్మీకి చేసిన తప్పులు కావు – అంటారు. "వాల్మీకి ఆది కవి యనియు, ఆర్షకవి యనియు మనమెంత మెచ్చుకొన్నను, ఆ రచన అత్యంత హృద్యమైనదని మనమెంత శ్లాఘించినను, గుణశీలాదులను వర్ణించుటలో పూర్వ పర భేదములు, స్వవచన వ్యాఘాతములు ఎన్నో కన్పించుచున్నవి. అట్టి వానికి వాల్మీకి యనంతరము వచ్చిన పాఠాంతరములు, ప్రక్షిప్తములు, కారణము గావచ్చును" అన్నారు.

అంటే, వాల్మీకి, తను రాసినంతవరకూ చక్కగానే రాశాడనీ, రామాయణంలో ఉన్న పొరపాట్లకు వాల్మీకి బాధ్యతేమీ లేదనీ వాదించే కోవకే ఈయన కూడా చెందుతారు.

ఈయన చర్చించిన కొన్ని సంఘటనల్ని ఇప్పుడు వరసగా చూద్దాం.

దశరధుడు పాయసం తెచ్చి ముగ్గురు భార్యలకూ పంచే పద్ధతి, వాల్మీకిలో ఉన్నది, ఈయనకు నచ్చలేదు. 'చంపూ రామాయణం'లో ఉన్నది నచ్చింది! అందులో, దశరధుడు, పాయసం తెచ్చి కౌసల్యకీ, కైకకీ మాత్రమే చెరి సగం ఇస్తాడు. అప్పుడు కౌసల్యా, కైకా, తమ వాటాల్లోంచి సగం సగం తీసి సుమిత్రకు ఇస్తారు.

---

★ కొత్త సత్యనారాయణ చౌదరి. – 1968. 'రామాయణ రహస్యాలు (వాల్మీకము)'. నిడుబ్రోలు, గుంటూరు జిల్లా, భాషా పోషక గ్రంధ మండలి, 1968 (తొలి కూర్పు)

కౌసల్య ఇచ్చిన పాయసంలోంచి లక్ష్మణుడు పుట్టి రాముడికి అనుకూలంగా అయ్యాడు. కైక ఇచ్చిన పాయంసంలోంచి శతృఘ్నుడు పుట్టి భరతుడికి అనుకూలంగా అయ్యాడు. కాళిదాసు కూడా 'రఘువంశం'లో ఈ పంపకమే రాశాడట. ఆ సంగతి చెప్పి – "ఈ సామరస్యమే సొగసుగా ఉన్నది" అని ఈయన ఆ పంపకాన్ని మెచ్చుకున్నారు. లక్ష్మణుడు ఎప్పుడూ రాముడితోటీ, శతృఘ్నుడు భరతుడితోటీ కలిసి ఉంటారు కదా? అలా ఉండడానికి అసలు కారణం ఏమిటో ఇంత స్పష్టంగా చెప్పిన ఈ 'హేతువాదం', ఈయనకు చాలా నచ్చింది! కౌసల్య ఇచ్చిన పాయసంలోంచి లక్ష్మణుడూ, కైక ఇచ్చిన పాయసంలోంచి శతృఘ్నుడూ పుట్టారనే హేతువాదం! ఇంత చక్కని హేతువాదం ఉండగా, వాల్మీకిలో పాయసాన్ని అంత అవకతవకగా పంచటానికి కారణం ఏమిటో ఈయన కనిపెట్టారు – అది తర్వాత కవుల పనే అని! – "…. వాల్మీకములో వర్ణించిన దానికి సమన్వయము చేయవలెనన్నచో, ప్రక్షిప్త భాగముల వంటివి కారణములు కావచ్చును" అన్నారు.

వాల్మీకి కథలో ఎవరికి ఏ తప్పు కనపడ్డా 'ఇది అనంతర కవుల పనే' అనుకోవాలన్న మాట! వాల్మీకి చెయ్యని తప్పులు, తర్వాత వాళ్ళు మాత్రం ఎందుకు చేస్తారు? వాళ్ళూ కవులే కదా? వాళ్ళూ భక్తులే కదా? అవి తప్పులే అయితే అవి వాల్మీకి చేసినవే కాకూడదా? – ఇలా మాత్రం ఎవరూ ఆలోచించకూడదు!

కానీ, పాయసం పంపకాల్లో కాళిదాసు అనుసరించిన పద్ధతి కన్నా వాల్మీకి పద్ధతే చాలా తెలివైంది. వాల్మీకి పద్ధతిలో – దశరథుడు, ముగ్గురు భార్యలకూ పాయసం ఇచ్చిన వాడయ్యాడు. కాళిదాసు పద్ధతిలో అయితే, దశరథుడు సుమిత్ర మొహం చూడనే లేదు. దశరథుడి గురించి ఇలా చెప్పడం భక్తులు చెయ్యవచ్చా? అంతకన్నా ముఖ్య విషయం – ఈ రెండో పద్ధతి వల్ల, రాముడు, మిగతా తమ్ముళ్ళతో సమానమైన అంశ గల వాడు మాత్రమే అవుతాడు. శతృఘ్నుడు ఎంతో రాముడూ అంతే! వాల్మీకి పద్ధతి వల్ల అలా కాదు. అందులో, రాముడు ఒక్కడే అర్ధాంశ. తమ్ముళ్ళందరూ పరక వాళ్ళూ, పరకన్నర వాళ్ళూనూ. మరి ఇప్పుడు చూడండి! వాల్మీకి చెప్పింది బాగుందా, 'చంపూ రామాయణం' చెప్పింది బాగుందా?

సత్యనారాయణగారు, వాల్మీకి రామాయణంలో చాలా ఘట్టాల్ని తప్పని తేల్చేస్తారు. కానీ వాల్మీకి తప్పు రాశాడంటే బాగుండదు కాబట్టి, వాటిని ప్రక్షిప్తాల్లోకి గెంటేస్తారు! ఈయనకు కథలో ఎక్కడ ఏ సంఘటన నచ్చకపోయినా, ప్రక్షిప్తాలే అలా కథలోకి దూరాయి – అంటారు. వాటి వల్లనే పాత్రలన్నిటికీ అన్యాయం జరిగింది – అంటారు.

"ఈ కోవలో (ప్రక్షిప్తాల కోవలోకి) జేరినవే ఆయా స్థలములలో అనువగు రీతిలో దూర్చబడి, ఆయా పాత్రలకు అన్యాయము కలిగించుచుండు ననుటలో అసత్యము లేదు" అంటారు (పే. 202)

ప్రక్షిప్తాల వల్లనే పాత్రలు పాడై పోయాయనే అభిప్రాయం, ఇంత నమ్మకంగా ఉంటే, ఇక ఆ కథ గురించీ, ఆ పాత్రల తప్పుల గురించీ పట్టించుకోకుండా వదిలెయ్యాలి కదా? వాటి మీద విమర్శలకు పూనుకోవడం ఎందుకు?

సత్యనారాయణగారు, 'పూర్తిగా వాల్మీకి మీదే ఆధారపడి' ఈ రచన చేశాన'ని చెప్పుకున్నారు కదా? తన వ్యాసానికి 'వాల్మీకము' అని కూడా పేరు పెట్టుకున్నారు కదా? కానీ ఈయన, వాల్మీకి మీద కన్నా ఇతర రామాయణాల మీదే ఎక్కువ ఆధారపడ్డారు.

## అహల్య విషయం చూడండి!

వాల్మీకి ప్రకారం – అహల్య భర్త గౌతముడు. వారి కొడుకు శతానందుడు. అహల్య ఇంద్రుణ్ణి ఇష్టంతోనే కలుస్తుంది. ఇంతే వాల్మీకి ఇచ్చిన సమాచారం. సత్యనారాయణగారు ఈ కథని అసలు పట్టించుకోనేలేదు. 'విచిత్ర రామాయణం'లో ఉన్న కథని పట్టుకొచ్చారు. అందులో – అహల్యకు భర్తవల్ల (భర్త గౌతముడే) శతానందుడనే కొడుకే గాక అంజన అనే కూతురు కూడా ఉంది. ఈ కథలో, గౌతముడు బయటికి పోయేటప్పుడు, ఇంటి దగ్గర భార్య పర పురుషులతో తిరుగుతుందేమో నన్న శంకతో, భార్య ప్రాణాల్ని కూడా తనతో పట్టుకు పోతూ వుంటాడు. ఒకసారి అలాగే బయటికి వెళ్తూ గౌతముడు భార్య ప్రాణాలు పట్టుకు పోయాడు. అహల్య కళేబరం, ఆశ్రమంలో పడి వుంది. ఇంద్రుడూ, సూర్యుడూ చాలా కాలంనించి అహల్య కోసం చూస్తున్నారు. అహల్య కళేబరం కనబడగానే ఇంద్రుడు అందులో ప్రవేశించాడు. అప్పుడు ఆ కళేబరానికి ప్రాణం వచ్చింది. ఆమెతో సూర్యుడు తన కోరిక తీర్చుకున్నాడు. అలాగే, తర్వాత సూర్యుడు అహల్య కళేబరంలో ప్రవేశించాడు. అప్పుడు, ఇంద్రుడు తన కోరిక తీర్చుకున్నాడు. ఈ సంగతులేవీ అహల్యకు తెలియవు. తర్వాత అహల్యకు ఇద్దరు కొడుకులు పుట్టారు. ఈ పిల్లలు తన పిల్లలు కారని గౌతముడికి తెలీదు. ఒక నాడు, గౌతముడు ఈ కొడుకుల్ని ఎత్తుకుని అంజనని

నడిపిస్తూ ఎండలో ఎక్కడికో వెళ్తున్నాడు. అంజన, కాళ్ళు కాలి తండ్రితో, "నీ స్వంత కూతుర్ని నడిపిస్తున్నావు. పరాయి వాళ్ళ పిల్లల్ని ఎత్తుకున్నావు" అంది. అప్పుడు గౌతముడు చంకలో పిల్లల్ని సముద్రంలోకి విసిరేసి, "వీళ్ళు నా పిల్లలు కాకపోతే కోతులై పోవాలి" అన్నాడు. వాళ్ళు కోతులైపోయారు. వాళ్ళే – వాలి సుగ్రీవులు! ఇది ఆ కథ. (తర్వాత అహల్య అంజనని – "నా మీద చాడీలు చెపుతావా? కోతివై ఫో" అని శపించినట్టూ, అంజన వానర స్త్రీగా అయినట్టూ ఇంకో కథ. ఈ అంజనకి, తర్వాత వాయుదేవుడి ద్వారా హనుమంతుడు పుట్టాడు. ఈ కథ కూడా 'విచిత్ర రామాయణం'లోదో కాదో, ఇంకెక్కడిదో, నాకు తెలియలేదు. వివరాలు లేవు.)

ఈ 'విచిత్ర రామాయణం' ప్రకారం – శతానందుడూ, వాలి సుగ్రీవులూ అన్నదమ్ములే. హనుమంతుడు ఈ ముగ్గురికీ మేనల్లుడు. అసలు ఈ కథ, వాల్మీకిలోది కాదు. అయినా ఈ కథ ప్రకారమే సత్యనారాయణగారు విమర్శలకు పూనుకున్నారు. "ఆంజనేయునకు గౌతముడు మాతామహుడు (తాత). వాలి సుగ్రీవులు మేనమామలు" అన్నారు. (పే. 20)

రాముడి మామగారి (జనకుడి) పురోహితుడు శతానందుడు కాబట్టీ, శతానందుడి తమ్ముడే సుగ్రీవుడు కాబట్టీ, రాముడికీ సుగ్రీవుడికీ స్నేహం కలిసిందట! (అయితే, రాముడికి వాలితో కూడా స్నేహం కలవాలిగా?) వాలితో మాత్రం విరోధం కలిగిందట! ఆ విరోధం ఎందుకు కలిగిందో కారణం చెప్పలేదు.

".... శతానందుని బట్టీ .... అహల్యను బట్టీ .... శ్రీరామ సుగ్రీవాదుల స్నేహము బలపడింది. ఈ స్నేహము బలపడిన కొలది బలవంతుడైన వాలితో విరోధము దృఢపడింది" – ఇదీ ఈయన కనిపెట్టింది! ఇదంతా వాల్మీకి మీద ఆధారపడి కాదు. 'చంపూ' మీద ఆధారపడి!

అహల్య, రంకు చేసిందట! ఈయన చెప్పే కథ ప్రకారం, అసలు అహల్యకు ఇంద్రుడి గురించీ, సూర్యుడి గురించీ, తెలీనే తెలీదు. ఇక ఆమె తప్పు ఏముంది?

అంజన కూడా రంకు చేసిందట! తన భర్త అయిన కేసరి వల్ల కాకుండా వాయువుతో హనుమంతుణ్ణి కన్నదట! ఈ కథలు ఏ కాలానికి సంబంధించినవో ఆ కాలంలో, స్త్రీ పురుష సంబంధాలు అలాగే ఉండేవనీ, అది ఆ నాడు భర్తలు కూడా అంగీకరించినదేననీ ఈయనకు తెలీదు.

ఈయనకి, గౌతముడి మీద కూడా కోపమే. ఎందుకంటే – అతను బైటికి పోయేటప్పుడు భార్య ప్రాణాల్ని కూడా పట్టుకుపోతాడని కాదు. అందుకు కాదు అతని మీద కోపం. దానికి ఇంకో కథ చెప్పారు. అది కూడా వాల్మీకిలోది కాదు! ఆ కథ ఇదీ: బృహస్పతి, ఒక రుషి ఇంటికి వెళ్ళి, గర్భవతిగా ఉన్న ఆ రుషి భార్యని తన కోరిక తీర్చమని అడిగాడు. ఆమె కడుపులో ఉన్న బిడ్డ – "నీ కోరిక ధర్మం కాదు" అని బృహస్పతిని మందలించాడు. బృహస్పతికి కోపం వచ్చి ఆ బిడ్డని 'గుడ్డివాడివై ఫో' అని శపించి, ఆమెతో, తన కోరిక తీర్చుకుని వెళ్ళిపోయాడు. ఆ బిడ్డ పేరు, దీర్ఘతముడు. గుడ్డివాడై పోయాడు. అతను పెద్దవాడై 'చండిక' అనే ఆమెని పెళ్ళి చేసుకున్నాడు. ఆమెకు పుట్టిన వాడే గౌతముడు. కొంత కాలానికి దీర్ఘతముడు ఏటిలో కొట్టుకు పోతూ వుంటే, అతన్ని ఒక రాజు రక్షించాడు. ఆ రాజుకి పిల్లలు లేరు. ఆ రాజు ప్రార్థన వల్ల, దీర్ఘతముడు, రాజు భార్యలతో కలవడానికి అంగీకరించాడు. దానివల్ల వారికి పిల్లలు పుట్టారు. వాల్మీకిలో లేని ఈ కథని, సత్యనారాయణగారు ఎక్కణ్ణించో పట్టుకు వచ్చి, "ఆ దీర్ఘతముని సొంత బిడ్డలలో చేరిన వారే మన గౌతముల వారు" అని గౌతముణ్ణి వెటకారం చేస్తున్నారు. ఈ కథ ప్రకారం, గౌతముడి తప్పు ఏమైనా ఉందా? ఇక్కడ దీర్ఘతముడి తప్పు మాత్రం వుందా? ఆ రాజే స్వయంగా అతన్ని అడిగాడు. తన వల్ల పిల్లలు కలగడం లేదనీ, పిల్లలు కావాలనీ, అడిగాడు. అందులో రహస్యం ఏమీ లేదు. ఆ నాటి సాంప్రదాయాలు అవీ! ఒక వేళ, దీర్ఘతముడు తప్పు చేశాడని అనుకున్నా, దానితో గౌతముడికి ఏం సంబంధం?

దీర్ఘతముణ్ణి బట్టి గౌతముణ్ణి వెక్కిరిస్తామా? తండ్రుల్ని బట్టీ, తల్లుల్నీ బట్టీ, వంశాల్ని బట్టీ, పిల్లల్ని గౌరవించడం, గౌరవించకపోవడం, ఏ రకం సాంప్రదాయం?

సత్యనారాయణగారు – హనుమంతుడి గురించి కూడా అదే వెక్కిరింత! "..... ఆ యంజనకు వాయుదేవుడు మరొక భర్తగా గుదిరెనట! ఆ ఇర్వురకు బుట్టిన వాడే .... మన ఆంజనేయుల వారు" – ఇదీ విమర్శ! (పే. 20) సత్యనారాయణగారి ప్రకారం అంజన ఉత్తమురాలు కాదు. అలాంటి స్త్రీకి పుట్టడం ఆంజనేయుడి తప్పు!

ఆంజనేయుడు, తను వాయుపుత్రుణ్ణని గర్వంగా చెప్పుకుంటున్నాడే! ఈ స్త్రీ – పురుష సంబంధాలు ఏమీ రహస్యం లేకుండా, ఇంత బహిరంగంగా ఉన్నాయే! గత చరిత్రలో ఇలాంటి సంబంధాలే సర్వ సామాన్యంగా ఉన్నాయా? – ఈ రకం ఆలోచనే లేదు ఈ విమర్శకు

డికి. ఈ సంబంధాల్ని ఈయన ఎంత సిగ్గుచేటుగా వ్యాఖ్యానిస్తారో చూడండి! – “ఇంతకన్నా లోకములో రంకు కథలే ముండును? రంకు కథలతో నిండినదే రామాయణ మనుటలో బొంకేమున్నది?” (పే. 22)

“.... కన్యాప్రాయములో దారినబోవు దానయ్యలను గలిసి, గర్భములు దాల్చి, పుట్టిన పిల్లలను బారవైచి, ఆవల పెండ్లిండ్లు జేసికొని, పతివ్రతా మణులుగ పురాణాలకెక్కిన నాపసాను లెందరో గలరు” (పే. 24)

పెళ్ళి కాకుండా పుట్టిన పిల్లల్ని ‘పారవేసే’ కథల్ని బట్టి ఏం తెలుసుకోవాలి? స్త్రీ పురుష సంబంధాల్లో, అంతకు ముందు ఉండే సాంప్రదాయాలు మారిపో తున్నాయనీ, పెళ్ళి కాకుండా పిల్లల్ని కనడం తప్పు అవుతోందనీ, అర్థం చేసుకోవాలి. ‘పెళ్ళి’ అనే సంబంధం గానీ, దాని ధర్మాలు గానీ, సమాజంలో ప్రారంభ కాలం నించే లేవు. అవన్నీ క్రమక్రమంగా ఏర్పడుతూ వచ్చాయి. అందుకే, ఏ నిబంధనలూ లేని కథలూ, నిబంధనలు ప్రారంభమైన కథలూ, అన్నీ కనపడుతున్నాయి. ఈ విషయాలేవీ సత్యనారాయణగారు గ్రహించలేదు. ఆ నాటి సంబంధాల్ని, ఇప్పుడు ఉన్న పద్ధతుల్ని బట్టే చూస్తు న్నారు. వాటిని అర్థం చేసుకోలేక అదంతా ‘రంకుతనం’ అని తప్పు పడుతున్నారు.

“వాలి తల్లి అహల్య యనియు, అహల్యకు దేవేంద్రు నకు రంకుతనము వలన పుట్టిన సంతానములో వాలి ఒకడనియు వింటిమి” (పే. 164)

“ఈ రంకుల హనుమయ్య ....”

“పురాణాలలో రంకులకు బొంకులకు కొదవలేదన్న మాట జ్ఞప్తియందుంచుకొని ఈ కథను బరిశీలింప గోరుదును” (పే. 24)

ఇవీ సత్యనారాయణగారి విమర్శలు!

## పరశురాముడి గురించి:

గాధి కొడుకు విశ్వామిత్రుడు. కూతురు సత్యవతి. వీరు క్షత్రియులు.

సత్యవతి భర్త రుచీకుడు. బ్రాహ్మణుడు. వీరి కొడుకు జమదగ్ని. జమదగ్నిని బ్రాహ్మణుడిగానే లెక్క వేస్తారు.

జమదగ్ని భార్య రేణుక, క్షత్రియ స్త్రీ. వీరి కొడుకు పరశురాముడు. పరశురాముడు బ్రాహ్మణుడే.

రేణుక నదికి నీళ్ళ కోసం వెళ్ళడం, అక్కడ పర పురుషుణ్ణి చూడడం – ఈ కథ వాల్మీకిలో లేదు.

సత్యనారాయణగారు ఈ కథని కూడా బయటి నించే పట్టుకు వచ్చారు. రేణుక నీటికి వెళ్ళిందట. ఎంతసేపటికీ రాలేదని భర్త దివ్యదృష్టితో చూశాడట. “.... దివ్యదృష్టి యనెడి యద్దంలో జూడగా ఆబిడ (ఈ మాట ‘అచ్చు – తప్పు’ కాదు, ‘ఆబిడే’!) అక్కడ పరాయి వారి ముద్దులలో, సుద్దులలో మునిగి యుండెనట” (పే. 36) ఈ రకంగా సాగింది కథ.

రేణుక ఎంత ‘నీతిమాలినదో’ చెప్పి – “రామాయణ కథలో, జమదగ్ని కొంపలో సంకర జాతుల రంకులో ఉద్భవించిన పరశు రామావతారములోని బండారమిది” అని, ఆ బండారాన్ని తేటతెల్లం చేశారు. (పే. 36)

పరశురాముడు జమదగ్నికే పుట్టాడు గదా? రేణుక పర పురుషుడితో ముద్దులు జరిపిన సంఘటన (ఆ కథ ప్రకారం) పరశురాముడు పుట్టిన తర్వాత జరిగింది కదా? పరశురాముడు రంకులో ఉద్భవించిన వాడెలా అవుతాడు సత్యనారాయణ గారూ? ప్రజలు, పరశు రాముణ్ణి అవతారంగా ఎంచి పూజించడం ఎంత మూర్ఖమో చెప్పాలన్నదే మీ అభిప్రాయం అయితే, దానికి తగ్గ న్యాయమైన తర్కం చూపించాలి గానీ, నోరు తెరిస్తే ఈ బూతులేమిటి? ఈ ‘రంకు’ లేమిటి?

ఇక్కడ చాలా ఆశ్చర్యకరమైన విషయం ఒకటి ఉంది. అసలు బ్రాహ్మణ కులం, క్షత్రియ కులం కల వడం ఈయనకేమీ ఇష్టంలేదు. దాని వల్ల కులాలు సంకరం అయిపోతాయని ఈయన అభిప్రాయం! “క్షత్రి యుడైన గాధేయుడు (విశ్వామిత్రుడు అని అర్థం) సంస్కా రము వలన బ్రహ్మర్షి పదవి నందుకొనగా, బ్రాహ్మణు నకు బుట్టిన జమదగ్నీ, జామదగ్నుడూ (జమదగ్ని కొడుకు అని అర్థం), క్షత్రియ వృత్తికి దిగజారి ....” అన్నారు (పే. 34). జమదగ్నీ, ఆయన కొడుకూ, ఏం క్షత్రియ వృత్తి చేశారో అర్థం గాదుగానీ, వాళ్ళు ‘దిగ జారారని’ మాత్రం సత్యనారాయణగారి అభిప్రాయం. క్షత్రియులు బ్రాహ్మలు కావడం గొప్పే. బ్రాహ్మలు క్షత్రియులు కావడం మాత్రం ‘దిగజారడం’!

ఈయన, ఈ కులాల గురించి ముచ్చటిస్తూ ఇంకో చోట – “అసలు .... ఆ నాటి భూపతులు (రాజ్యాలు చేసే రాజులు), క్షత్రియ సంతానమని గట్టిగా చెప్ప గలమా? ఆ క్షేత్రమెట్టిదో, ఆ బీజమేదో, తత్ఫలిత మెట్టిదిగా మారెనో, సత్కుల సంజాతులెవరో, సంకర జాతి బిడ్డలెవరో నిర్ణయింప దరమా?” అంటున్నారు. (పే. 122.) ఒకే కులంలో పుట్టిన బిడ్డలైతేనే ‘సత్కుల సంజాతులు’! లేకపోతే ‘సంకర జాతి’ వాళ్ళే! పరశు రాముడి తల్లిదండ్రులు ఒక్క కులం వారు కాకపోబట్టే అతను సంకర జాతి వాడై, ఈయన హేళనకు గురి అయ్యాడు.

పరశురాముణ్ణి ఒక అవతార పురుషుడిగా పూజించడం మూర్ఖత్వం అని చెపుతూ, దానికి ఈయన చెప్పే కారణం ఏమిటంటే – పరశురాముడు నీతి లేని స్త్రీకి పుట్టాడు అనటం! పరశురామావతారం మీద కోపంతో మాత్రమే అతని పుట్టు పూర్వోత్తరాల్ని ఈ విధంగా హేళన చేశారేమో – అనడానికి వీల్లేదు. ఇంకో విషయం చూడండి!

దశరథుడు తన చిన్నతనంలో వేటకు వెళ్ళి ఒక శూద్రముని కుమారుణ్ణి చంపుతాడే .... అతని తల్లి దండ్రుల్ని గురించి కూడా, ".... సంకరజాతి మునీశ్వర దంపతులు...." అని వెటకారం చేశారీయన! (పే. 43). వారిని గురించే ఇంకో చోట ".... ఆ మునీశ్వరులకు కులమేదీ? గోత్రమెట్టిది? తండ్రి వైశ్యుడు, తల్లి శూద్ర. వీరికి బుట్టినవాడు ముని కుమారుడట!" (పే. 121) అని ఆశ్చర్యపడ్డారు! పరశురాముడి మీద ఎంత వెటకారమో, ఈ ముని కుమారుడి మీద కూడా అంత వెటకారమే. కానీ, ఈయన, తన వ్యాసానికి రాసిన పీఠికలో, చిన్న కులాల మీద చాలా ప్రేమ వున్నట్టు, "కుల ద్వేషమను మహా జాడ్యముచే తరతరాలుగా క్రింది మెట్టునకు నెట్టబడి అణగ ద్రొక్కబడిన జాతులైన ..." అంటూ (పీఠిక – పే. 7) 'అణగదొక్కబడ్డ' వారి మీద పైకి చాలా సానుభూతి కురిపించారు. కానీ, ఆ 'అణగదొక్కబడ్డ' కులాల మీద ఈయన చేసిన విమర్శలు ఏమిటి? చిన్న కులాల మీద ఈయనకు చిన్న చూపే. అసలు కులాలు కలవడం అంటేనే ఈయనకు వొళ్ళు మంట. వైశ్య మునికీ, శూద్ర స్త్రీకీ పుట్టిన బిడ్డని ముని కుమారుడిగా పూర్వం వాళ్ళందరూ ఒప్పుకున్నారు గానీ, ఈయన మాత్రం వొప్పుకోనంటున్నారు. బ్రాహ్మలకు పుడితేనే ముని కుమారుడవ్వాలి గానీ .... ఇలా పుడితే ముని కుమారుడవ్వడం ఏమిటని ఈయన వాదం. రామాయణ కాలాని కన్నా వెనకపడి ఉన్న వాదం!

ఇలాంటి అభిప్రాయాలు ఉన్న ఈయన, తన రచనలో అనేక చోట్ల, కుల భేదాల్ని పాటించే బ్రాహ్మల్ని గొప్ప గొప్ప గ్రాంధిక తిట్లతో దుయ్యబట్టి ఎప్పటికప్పుడు తమ సంస్కారం చాటుకుంటూ ఉంటారు.

భార్యని 'అదుపులో' పెట్టలేక పోయినందుకు, జమదగ్నిని కోపగించుకుంటూ, ".... ఇంతటి ఆగ్రహానుగ్రహ దక్షులు, శాపాలిచ్చుటలో ప్రవీణులు, తమ కొంపలలో జరుగుచుండు అకార్యములను సరిదిద్దుకోలేకపోవుటకు కారణమేమై యుండునో?" అని విసుక్కున్నారు. (పే.36) జమదగ్ని కొంపలో జరిగిన అకార్యం ఏమిటి? రేణుక సంగతే. దాన్ని 'సరిదిద్దుకోవడం" అంటే ఏమిటి? భార్యని జమదగ్ని గొడ్డలితో తల నరికించేసినా, ఆ కాఠిన్యం ఈయనకు చాలలేదు. అసలు మొదటే భార్యని, పరాయి మొగాడి మొహం చూడని పద్ధతిలో, అంత కట్టడిలో ఎందుకు ఉంచలేదని ఈయన ఆగ్రహం! ఏదో సంగతంటూ జరిగింతర్వాత తల నరికించాడు జమదగ్ని. ఈయన ప్రకారం అయితే, స్త్రీలని మొదటి నించీ కదలకుండా, మెదలకుండా కత్తుల బోన్లో ఉంచాలి!

స్త్రీల గురించి కొంత మంది పురుషులు ఎంత దుర్మార్గపు అభిప్రాయాలతో వుంటారో ఆ దుర్మార్గం అంతా ఈయన ఒంట పట్టించుకున్నారు – "రామాయణము రంకు, భారతము బొంకు అనుటలో సత్యమున్న దనగానే గుండెలు బాదుకొను వారు ఉండవచ్చును. ఈ రెండింటి గాథలకు స్త్రీలే ప్రధాన కారణమైరి. 'స్త్రీ బుద్ధిః ప్రళయాంతకరీ' అన్న మాటలకు గానీ, 'ధిగస్తుయోషితో నామశఠాః స్వార్థపరాయణాః' (యోషితః = స్త్రీలు; శఠాః = శఠులు, మూర్ఖులు; స్వార్థపరాయణాః = స్వార్థ పరులు; నామా = కదా? ధిక్ = ధిక్కారం; నింద; అస్తు = కానిమ్ము! – 'స్త్రీలు నీచులు కదా; చావనియ్యి' అని అర్థం!) ఇత్యాది వాక్యములకు గానీ, రామాయణ భారతములలోని స్త్రీ పాత్రలే కారణమనుట వక్రోక్తి కాదు" (పే. 7) – ఇదీ ఈయన రామాయణం మథించి బయటికి తీసిన గొప్ప రహస్యం!

రామాయణ, భారత కథలకు స్త్రీలే కారణమట! 'స్త్రీ బుద్ధి ప్రళయాంతకం' లాంటి మాటలు, ఈ స్త్రీలని బట్టే వచ్చాయట! ఇక్కడ భారతం సంగతి వదిలేద్దాం. (ఆ పాత్రల్ని మనం చూడలేదు కాబట్టి.) రామాయణంలో సీతని 'చెడ్డది' అనీ, 'నీచురాలు' అనీ, ఎవరైనా అనగలరా, ఈ పురుషాహంకారి తప్ప?

'ఆడవాళ్ళ బుద్ధి మంచిది కాదు. వాళ్ళు నీచులు' అనే రకం మాటలు ఎవరు అంటారు? నీచులూ స్వార్థపరులూ అహంకారులూ అయిన పురుషులు అంటారు. సీత పాత్ర గురించి ఇంత వక్రంగా మాట్లాడడం అంటే, ఈయనకి ఉన్న సంస్కారం ఏమిటి?

ఈయన విమర్శలు ఎక్కడా హేతువాద దృష్టితో సాగలేదు. ఉత్తర భారత దేశస్థులు, దక్షిణ భారతాన్ని పాప భూమిగా పరిగణిస్తారని చెప్పి ఇలా అంటారు. ".... ఐనను పాప పుణ్యములు నిర్ణయించుటకు వాండ్రెవ్వరు? వాండ్రు ఊహించిన ఈ దక్షిణాదిలోనే మహామహులైన ఆచార్య త్రయము అవతరించి యావద్భారతమునకు జ్ఞాన భిక్ష పెట్టిరి. (పే. 40)" అని దక్షిణదేశ పవిత్రతని వివరించారు. 'దక్షిణ భారతం పాప భూమి కాదు సుమా' అని రుజువు చెయ్యడానికి – ఇక్కడ

ముగ్గురు ఆచార్యులు పుట్టారు, ఇది పాప భూమి ఎలా అవుతుంది' అని వాదిస్తున్నారు! 'దక్షిణ భారతం పాప భూమి' అనే మూర్ఖుల కోసం, ఈ వాదన బాగానే ఉంటుంది. కానీ, దక్షిణాది కొంపదీసి, ఆ ఆచార్యులు ఇక్కడ పుట్టకపోతే ఇది పాప భూమి అయ్యేదేనా? అప్పుడు దక్షిణాదిని, 'పాప భూమి' అని ఒప్పుకోవల సిందేనన్న మాట!

సత్యనారాయణగారు దశరథుణ్ణి గురించి ఇలా అంటారు – "…. అతడరువది వేల యేండ్లు దేశమును పరిపాలించినను ఒక్క మగ బిడ్డను కూడా సంపాదింప లేకపోయెను. (దేశాన్ని పరిపాలిస్తే మొగ బిడ్డలు పుడతారా?) బిడ్డలు లేరన్న బెంగచే గానీ, కాంతల మీద మోహము వలన గానీ, కేకయరాజు వద్దకేగి కైకేయిని భార్యగా ఇమ్మని వేడెను. (పే. 73)" – దీన్ని బట్టి దశ రథుడికి కైకని పెళ్ళి చేసుకోకముందే 60 వేల సంవత్స రాలూ గడిచిపోయాయి.

కానీ, ఇంకో చోట – దశరథుడికి, కైకని పెళ్ళి చేసుకున్న తర్వాతే 60 వేల ఏళ్ళు గడిచినట్టు చెపుతారు. అది ఎక్కడంటే: దశరథుడు పెళ్ళి సమయంలో కైక కొడుక్కే రాజ్యం ఇస్తానన్నాడు. రాజ్యాన్ని కైక తన హక్కుగా అడిగితే చాలు. దాని కోసం వరాలు అడగడం ఎందుకు? – అని ప్రశ్న వేసి, దానికి జవాబు ఇలా చెపు తారు – "ఈ రాజ్యశుల్క వార్త ఎన్నడో ఆమె చిన్ననాడు విన్న మాట! అరువది వేల యేండ్లు గడిచిన ఈ ఘట్టములో అది మరిచిపోయి ఆవల లభించిన వర ద్వయమును యాచించి యుండును" (పే. 73)

పెళ్ళయ్యాక 60 వేల ఏళ్ళు గడవడం వల్ల, కైక, రాజ్యం తనదేననే సంగతి మరిచిపోయింది – అని చెప్పడం. ఈ జవాబు ప్రకారం, దశరథుడికి కైకతో పెళ్ళయ్యాకే 60 వేల ఏళ్ళు గడిచాయి. మరి తమ రచనలో, ఒక్క పేజీలో వచ్చిన ఇంత వైరుధ్యానికి ఏం కారణం చెపుతారు? ఇందులో ఏదో ఒక దాన్ని ప్రక్షిప్తం అని వంక బెట్టి ఎవరి మీదకి తోసేస్తారు? – దశరథుడు 60 వేల సంవత్సరాల వయసులో కైకని పెళ్ళి చేసుకున్నా డట! 60 వేల సంవత్సరాలవడం వల్ల, కైక, రాజ్యం హక్కు సంగతి మర్చిపోయిందట! దీని ప్రకారం దశ రథుడి వయసు 1 లక్షా 20 వేల సంవత్సరాలు! శెభాష్ సత్యనారాయణగారూ! వాల్మీకిని మరిపించారు!

భరతుడికి ఇవ్వవలసిన రాజ్యాన్ని రాముడికి ఇచ్చే ఏర్పాట్లు దశరథుడు చేస్తున్నాడు కాబట్టే, తన హక్కుని తోసిపారేశాడు కాబట్టే, కైక తన ఆఖరి ప్రయత్నంగా ఆ వరాలు అడిగింది – ఈ సంగతి సత్యనారాయణగారు అర్థం చేసుకోలేదు.

సత్యనారాయణగారు, రాముణ్ణి, కొన్నిసార్లు విమ ర్శిస్తారు, కొన్నిసార్లు మెచ్చుకుంటారు. కొన్నిసార్లు, ఏం మాట్లాడుతున్నారో కూడా తెలియనివ్వకుండా మాట్లాడ తారు.

పట్టాభిషేకానికి సిద్ధంగా వున్న రాముణ్ణి కైక పిలి పించి, తన వరాల గురించి చెప్పినప్పుడు, రాముడు చాలా గొప్పగా ప్రవర్తించాడని, ఈయన రాముణ్ణి చాలా మెచ్చుకున్నారు. మళ్ళీ అప్పుడే అది 'లౌక్యం కావచ్చు' అంటారు. "రాముడు వచ్చి, తండ్రిని జూచి పినతల్లితో బలికిన పలుకులలో సత్యము, సౌజన్యము, సహనము స్పష్టమగుచున్నవి. పరమ మూర్ఖుడైన లక్ష్మణుని కన్న …. గుణశీలములలో శ్రీరాముడే శ్రేష్ఠుడు గావచ్చును." (పే. 84) మళ్ళీ అంతలోనే ఎందుకైనా మంచిదని – "ఇది అతని నీతియు, నిజాయితీయు గావచ్చును; లేదా, లౌకికము, వ్యవహార దక్షత కావచ్చును." (పే. 86) అంటే, రాముడికి రెండు రకాల గుణాలు ఆపాదించి, రాముడు మంచివాడో, చెడ్డవాడో తన అభిప్రాయం తేల్చకుండా వూరుకున్నారు. ఇది, ఈయన 'లౌక్యం' కావచ్చునా?

రాముడు ఏక పత్నీవ్రతుడు కాడని సందేహం కలిగేటట్టుగా వున్న ఘట్టాల గురించి ఈయన కూడా అందరు విమర్శకుల్లాగానే మాట్లాడారు. చివరికి, రాముడు ఏక పత్నీవ్రతుడు కాడనే అభిప్రాయానికే వచ్చారు. ఈ అభిప్రాయానికి రావడానికి ఈయన వాల్మీకి మీద మాత్రమే ఆధారపడలేదు. 'దౌర్వాస రామా యణం' నించీ, 'బ్రహ్మాండ పురాణం' నించీ, 'పాంచ రాత్ర' నించీ, 'పద్మసహితం' నించీ, 'అగస్త్య రామా యణం' నించీ, ఇలా ఇంకా అనేక రామాయణ కథల నించీ, సాక్ష్యాలు తీసుకున్నారు. ఆ రామాయణా లన్నిటిలోనూ రాముడికి ఎక్కువమంది భార్యలు ఉన్నారు. వాటి కవులు ఆ సంగతి స్పష్టంగానే చెప్పారు. ఇతర రామాయణాల్లో రాముడికి ఎక్కువ మంది భార్యలు ఉన్నారు కాబట్టి, ఆ సాక్ష్యాలతో, వాల్మీకిలో కూడా ఎక్కువ మంది భార్యలు ఉన్నట్టు వాదించడం కుదురు తుందా? వాల్మీకి మీదే ఆధారపడి చూస్తే కూడా రాము డికి ఎక్కువమంది భార్యలు ఉన్నట్టు తేలుతుంది – అంటారా? అలా అనేటట్టు అయితే, మరి ఇతర కథల్ని సాక్ష్యాలుగా తెచ్చుకోవడం ఎందుకు? వాల్మీకి ఘట్టాల ప్రకారం రుజువు చెయ్యలేకనే గదా?

రాముడు వాలితోనే స్నేహం చేసుకుంటే సీతా

వియోగం కలిగేది కాదని సత్యనారాయణగారి అభిప్రాయం. "ఇతరులకు దక్కిన ఫలితమెట్లున్నను రాముసకు దక్కినది సీతా వియోగమే .... వాలితో మైత్రి జేసినచో ఈ రెండవ సమస్య క్షణములో దేలిపోవును" (పే. 153). ఇక్కడ మొదటి సమస్యేమిటో, రెండో సమస్యేమిటో ఏమీ వివరం లేదు.

రాముడు, వాలితో స్నేహం చేస్తే, సీతా వియోగం లేకుండా ఎలా పోయేది? రావణుడు సీతని ఎత్తుకు పోయిన తర్వాతే కదా, వాలితో స్నేహమా, సుగ్రీవుడితో స్నేహమా – అనే ప్రశ్న? సీతని ఎత్తుకు పోవడమే జరగకపోతే, వాలి సుగ్రీవులతో స్నేహం ప్రసక్తి ఎందుకు?

రాముడు వాలినే సహాయం అడిగితే, ఏం జరిగేది? వాలి రావణుడి దగ్గిరికి దూతని పంపుతాడు, సీత నిచ్చెయ్యమని. రావణుడు, రాముడి బండారం అంతా బయటపెట్టి, "నా చెల్లెలికి ముక్కూ చెవులూ కోశాడు. జనస్థానంలో నా తమ్ముణ్ణి చంపేశాడు. నే నూరుకుంటానా? నువ్వేం కలగజేసుకోకు. సీతని ఇవ్వను" అంటాడు.

అప్పుడు వాలి రాముణ్ణి చివాట్లు పెట్టి, "ఇదా నీ పెద్ద మనిషితనం? మరి ఏమీ ఎరగనట్టు మొహం పెడతావేం? ఫో అవతలికి!" అని కసిరి పొమ్మంటాడు. లేదా, రావణుడిదే తప్పని రాముడు వాలిని నమ్మించగలిగితే, వాలి కూడా ఈ వానర సైన్యంతోటే (సుగ్రీవుడు తెచ్చిన సైన్యంతోటే) యుద్ధానికి దిగుతాడు. రావణుడు మాత్రం లొంగడు. వాలి తాత లాంటి వాళ్ళు చాలా మంది చెప్పి చూశారు, యుద్ధం వొద్దని. రావణుడు వినలేదు. వాలి చెపితే వింటాడనుకో నక్కర్లేదు. రాముడు వాలితో స్నేహం చేసినా యుద్ధం లేకుండా పని జరిగేది కాదు. అప్పుడు రాముడే వాలికి నమస్కారాలు చేస్తూ వుండేవాడు. రాముడు సత్యనారాయణగారి కన్నా తెలివైన వాడు కాబట్టి వాలితోగాక, సుగ్రీవుడితో స్నేహం చేశాడు.

హనుమంతుడి దూత – నైపుణ్యము సత్యనారాయణ గారికి ఎంతో నచ్చింది. హనుమంతుడు లంకిణిని చంపకుండా విడిచి పెట్టినందుకు – "స్త్రీలను జంపరాదన్న వీర ధర్మము అతడు పాటించుట చేతనే అంత శక్తి కలిగిన లంకయు అతనికి లొంగి దారికి వచ్చెను. స్త్రీలను జంపరాదన్న నీతికి రామ లక్ష్మణులు దూరమైనను రామదూతయైన హనుమంతుడు పాటించుట గమనించదగిన విశేషము" అంటూ హనుమంతుణ్ణి తెగ మెచ్చుకున్నారు. (పే. 188.)

మళ్ళీ ఇంకో చోట ఏమంటున్నారో చూడండి. "ఎందరినో ఆడువాండ్రను జంపిన రామయ్య భక్తుడైన హనుమయ్య, ఇంద్రజిత్తును స్త్రీ హత్య చేసిన దుర్మార్గుడవంచు దూషించెను. తను చేసిన స్త్రీ హత్యలు హనుమంతునికి జ్ఞప్తి లేవేమో!" (పే. 241)

అతనికి జ్ఞప్తి ఉంది లెండి. ఇందాక చాప్టర్‌లో రాసినది ఇప్పుడు మీకే జ్ఞప్తి లేదు. సత్యనారాయణ గారూ! హనుమంతుడు, స్త్రీ హత్యలు చెయ్యడని ఒక చోటా, చేశాడని ఒక చోటా రాశారే! ఇందులో ఏది ప్రక్షిప్తం? మీకు తెలియకుండా ఎవరు ఇలా చేశారు?

సత్యనారాయణగారు, హనుమంతుణ్ణి అన్నిటికీ మెచ్చుకుంటూనే ఉన్నారు. ఆఖరికి 'లంకని గాల్చడం' గురించి కూడా ఎంత మెచ్చుకున్నారో చూడండి! "(రావణుడు) వేయవలసిన ప్రశ్నలు వేసిన పిదప రవ్వంతయు దాచుకొనక ఉన్నది యున్నట్లు హనుమంతుడు తను వచ్చిన కార్యమును గూర్చి వివరించెను. సమయోచితమైన శిక్ష వేయగా ఆ శిక్ష వాండ్రకే అన్వయించునట్లు లంకా దహనము చేసి, అందరికీ ఆశ్చర్యము, భయము కలిగించి, ఇంటికి పోయెను. చూచి రమ్మనగా కాల్చి వచ్చెనన్న సామెతకు ఈ మహావీరుడే కారణము." (పే.216)– ఈ రకంగా హనుమంతుణ్ణి చూసి ముచ్చటపడి పోయారు సత్యనారాయణగారు. (హనుమంతుడు చేసిన పనులన్నీ వీరికి నచ్చాయి. ఎటొచ్చీ అతని బాబు సంగతి గుర్తొస్తేనే ఈయనకు వొళ్ళు మండిపోతుంది!) అసలీ రామాయణ విమర్శకు దిగడంలో తన లక్ష్యమేమిటో మరిచిపోయి, హనుమాన్ భక్తుల కన్నా మిన్నగా హనుమంతుణ్ణి కీర్తించడంలో మునిగిపోయారు. ఈ మాత్రానికి, రామాయణాన్ని చక్కగా పూజించుకోక, ఈ విమర్శలకు దిగడం ఎందుకూ?

రాముడు వాలిని 'నువ్వు కోతివి కాబట్టి చంపాను' అన్నందుకు సత్యనారాయణగారు, 'యుద్ధాలూ అవీ చేసే వాళ్ళు కోతులా?' అని రాముణ్ణి బాగానే కోప్పడ్డారు. కానీ, మళ్ళీ తనే ఆ వానర జాతిని ఈసడించారు. ".... ఈ కోతి చేష్టలలో దిగినప్పుడు అక్కడి వారు మేల్కొనరా? మేల్కొందురేమో అన్న జ్ఞానము లేదా? పైగా అర్ధరాత్రి గడిచెను గదా? కొందరైనను మేల్కొను సమయము కదా? .... ఏమైననూ కోతి కోతియే గదా?" (పే. 196) అని హనుమంతుణ్ణి మళ్ళీ కోతిని చేసి ఈసడించారు. (హనుమంతుడు, వెధవ కోతి గంతులేసి సత్యనారాయణ గారికి కోపం తెప్పించాడు మరి!)

కోతి అయిన వాడు దూతగా వెళ్ళడం బాగానే ఉంది! అంతఃపురాలు వెతకడం బాగానే వుంది! మనిషి లాగ మాట్లాడడం బాగానే వుంది! ఎటొచ్చీ విసురుగా గంతులెయ్యడమే బాగు లేదు! అర్ధరాత్రి దాటిపోయిందట! కొందరన్నా లేస్తారట! కోతుల కథలో, పాముల

కథలో, చీమల కథలో వాస్తవికతలు కావాలి!

హనుమంతుడు లంకని వెతికినంతసేపూ కవి చేసే వర్ణనల్లో, బంగారం అరుగులూ, బంగారం స్తంభాలూ, రత్నాల ముత్యాల దారులూ .... మణిమయ ఖచిత .... ఇలాంటివన్నీ కుప్పతెప్పలుగా కనపడ్డాయి గదా? వాల్మీకి లంకని అలా ఎందుకు వర్ణించాడంటే, రేపొద్దున్న ఆ సిరి సంపదల్ని రాముడు ఆక్రమిస్తాడు కాబట్టి అలా రాశాడు. అది బికారి దేశం అయితే, అలాంటి దాన్ని ఆక్రమించడం ఏం ఆనందం?

కానీ, పండితులందరూ వాల్మీకి వర్ణనలన్నీ నిజంగానే నమ్ముతారు! రావణ భక్తులు ఆ రకం వర్ణనలు చూసే– 'ద్రావిడ రాజ్యాలు ఎంత సిరి సంపదలతో తులతూగాయో చూడండి! రావణుడి రాజ్యం అంత గొప్పగా ఉందని వాల్మీకే చెప్పాడు కదా?" అంటారు.

సత్యనారాయణగారూ ఆ మాటే అన్నారు. "ద్రావిడ చక్రవర్తియైన రావణుని వైభవ ప్రాభవములకు, నాగరికతకు, సాటి రాగల రాజ్యము ఆ రోజులలో లేదనుట వాల్మీకము వలననే తెలియుచున్నది." (పే. 190)

వాల్మీకి, రావణుణ్ణి 'ద్రావిడ – చక్రవర్తి' అనలేదు. 'పది తలల రాక్షసుడు' అన్నాడు. పది తలల రాక్షసుడి కథలో బంగారు మేడలూ ఉంటాయి, రత్నాలు పోసిన దారులూ ఉంటాయి, మనసుతో నడిపించే విమానాలూ ఉంటాయి. అవన్నీ కట్టుకథల్లో (కల్పనల్లో) ఉండే లక్షణాలు.

రావణుణ్ణి రాక్షసుడిగా ఉంచుకోవడం ఇష్టం లేక, మానవుడిగా, ద్రావిడ రాజుగా చేసుకుని మాట్లాడేటప్పుడు, ఆ బంగారం మేడలూ, అరుగులూ, విమానాలూ, అవన్నీ ఎక్కణ్ణించి వస్తాయి? – రావణ భక్తులు, రావణుణ్ణి, 'మానవుడే' అంటారు, కానీ ఆ బంగారం మేడల్ని మాత్రం వొదలం – అంటారు!

వాల్మీకి వర్ణించింది – బంగారాలూ, రత్నాలే కాదు. లంకలో జనం ఎద్దు మొహాలతో, పంది మొహాలతో, గాడిద మొహాలతో, రెండేసి మొహాలతో, మూడేసి మొహాలతో .... పరమ వికారంగా క్రూరంగా ఉన్నారని కూడా వర్ణించాడు. ద్రావిడ రాజ్యంలో బంగారం మేడలు ఉన్నాయని వాదించే వాళ్ళు, ఈ ఎద్దు మొహాల, కుక్క మొహాల జనం ఉన్నట్టు కూడా వొప్పుకుంటారా? అబ్బే, మళ్ళీ అది కుదరదు. ద్రావిడ ప్రజలు అలాంటి వాళ్ళు కారు. వారు చాలా నాగరీకులు! సౌందర్యవంతులు! – ఇంత సౌందర్య వంతులైన ద్రావిడ జాతి వారిని వికృత రూపులుగా చిత్రించింది ఎవరు? ఇంకెవరు? మళ్ళీ చెప్పాలా? ప్రక్షిప్తాల వాళ్ళే! అనంతర కవులు! వాల్మీకి అయితే, రావణుణ్ణి అసలు రాక్షసుడిగా చెప్పనే లేదని సత్యనారాయణగారి అభిప్రాయం! ".... ఇట్టి నాగరికాగ్రగణియైన జాతిని, వికారముగ, విరుద్ధాచార సాంప్రదాయములు గల వారిగా చిత్రించి వర్ణించి చరిత్రను మార్చివైచిన అనంతర కవుల అంధ పరంపరా గుణము ...." (పే. 190 – 1) అంటూ ఇక్కడ కూడా అనంతర కవుల మీదే పడ్డారు! ద్రావిడ జాతిని రాక్షసులుగా చిత్రించిన తప్పు ఇతర కవుల మీదకే తోసేసి వాల్మీకిని రక్షించారు సత్యనారాయణగారు! (వాల్మీకి గారూ! మీరు ఎన్ని జన్మలెత్తినా సత్యనారాయణగారి రుణం తీర్చుకోలేరు.)

సత్యనారాయణగారి ప్రకారం, లంకలో బంగారం మేడల సంగతులు వర్ణించింది మాత్రం వాల్మీకే. ప్రజల్ని రాక్షసులుగా వర్ణించింది మాత్రం అనంతర కవులు!

లంకలో ప్రజలు రాక్షసులు కారు – మానవులే! లంకలో ఇళ్ళు మాత్రం మట్టివి కావు. బంగారానివీ, రత్నాలవీ!

ఇటువంటి ద్రావిడ భక్తుల గురించి ఇక చెప్పదానికేముంది? వారు ఎప్పుడూ వాల్మీకి రామాయణ పారాయణం లోనే మునిగి బంగారం కలలు కనవలసిందే. రామాయణాన్ని వొదిలేసి వాస్తవ ద్రావిడ రాజ్యంలోకి వెళ్ళారంటే, అక్కడ మట్టి గోడలూ, మట్టి దారులూ, మట్టి కొంపలూ, మట్టి పిడతలూ తప్పవు.

సీత అగ్ని పరీక్ష సందర్భంలో సత్యనారాయణ గారు చెప్పిన విషయాలు కొన్ని, అనాగరిక తెగల్లో వుండే సమారాన్ని ఇస్తున్నాయి. – "ఆడుది అపమార్గమున బోయినచో నిప్పుతో బరీక్షించుట అనార్య పద్ధతి. భారత భూమిలో కొన్ని ప్రాంతములలో ఆటవికులలో, అనాగరికులలో, ఈ యగ్ని పరీక్షలు నేటికినీ ఉన్నవని వినుదుము. తప్పు చేసిన స్త్రీని దోసిలిలో నిప్పులు పోసిగానీ, అగ్నికుండములో నడిపించిగానీ, ఎర్రగా గాలిన లోహమును జేతికి బట్టించిగానీ, పరీక్షించి ఫలితమును గమనింతురు" (పే. 143).

స్త్రీల మీద అనుమానాలు కలిగినప్పుడు పురుషులు వారిని అగ్ని పరీక్షలకు గురిచేసి హింసిస్తారు కదా? అటువంటి దుర్మార్గులైన పురుషుల మీద సంస్కారులైన పురుషులకు చాలా కోపం రావాలి కదా? కానీ, సీతని అగ్ని పరీక్షకు గురిచేసిన రాముడి మీద సత్యనారాయణ గారికి ఎలాంటి విమర్శా వుండదు. పైగా, రాముడికి సీత మీద ఏమీ అనుమానం లేదనీ, ఇతరుల కోసమే భార్యని అగ్ని పరీక్షకు గురిచేశాడనీ సత్యనారాయణగారు రాముణ్ణి వెనకేసుకొచ్చారు. "లంకలో అప్పటికి అక్కడికి జేరిన జాతులలో ఈ యాచారము ఉండవచ్చును. తనకు సత్యము తెలిసినను ఈ జాతుల సంతృప్తికే ఈ

పరీక్ష కావించినట్లు రాముడు భావించి యుండును" అంటారు (పే. 143)

లంకలో ప్రజల్ని 'నాగరీకులైన జాతి' అని ఇంతకు ముందు అన్నారు. ఇప్పుడు ఆ లంక ప్రజలే అగ్ని పరీక్షల్ని కోరే అనాగరికులు అయ్యారు! రాముడు ఒకసారి లంక ప్రజల సంతృప్తి కోసమూ, ఇంకోసారి అయోధ్య ప్రజల సంతృప్తి కోసమో, సీతతో అలా ప్రవర్తించాడన్న మాట! ఆమె మీద అనుమానంతో కాదని ఈయన అర్థం!

రాముడు అయోధ్యకు వస్తూ భరతుణ్ణి పరీక్షించడం కోసం హనుమంతుణ్ణి పంపినందుకు మాత్రం ఈయన రాముడి మీద కొంత కోపం ప్రదర్శించారు – "చూచితిరా శ్రీరాముని వైఖరి? మెత్తని పులి! రాటుదేలిన రాజకీయవేత్త .... గుణగణ్యుడైన భరతుని ఈ రీతిగ శంకింపవచ్చునా?" (పే. 251) అని విమర్శించారు.

కానీ మళ్ళీ తర్వాత – రాముడికి భరతుడి మీద చాలా ప్రేమ అనీ, భరతుడి ప్రేమ కూడా రాముడికి చక్కగా తెలుసనీ, ఈయన రాముడి సౌజన్యం చూసి మురిసిపోయారు! రాముడి కోసం 14 ఏళ్ళ వరకూ చూస్తాననీ, ఫలానా రోజు నాటికి రాముడు రాకపోతే అగ్నిలో పడి చచ్చిపోతాననీ భరతుడు చిత్రకూటంలో అన్నాడు కదా? అతను చచ్చిపోతాడేమోననే భయం తోటే, తను వస్తున్న వార్త భరతుడికి తొందరగా చెప్పమని రాముడు భరతుడి దగ్గిరికి హనుమంతుణ్ణి పంపాడట! భరతుడంటే రాముడికి అంత ప్రేమ అట! ".... చతుర్ధి నాటికి పదునాలుగేండ్లు గడిచిపోవుటచే, భరతుడగ్ని ప్రవేశము గూడ చేయవచ్చును గాన, 'మా వార్త వెంటనే చెప్పవయ్యా' అని శ్రీరాముడు హనుమంతుని ముందుగా బంపెను .... మేము వస్తున్నామని హఠాత్తుగా వినిపించినా అతని ఆనందమతనికి ఉన్మత్తమయి పోవచ్చును ...." అన్నాడట శ్రీరాముడు. (పే. 254)

శ్రీరాముడు భరతుడి విషయంలో, 'రాజకీయపు ఎత్తుగడతో మెత్తని పులిలాగ' ఉన్నాడని ఒక చోట చెప్పారు. అతనికి భరతుడి మీద అపారమైన ప్రేమ అని ఇంకో చోట చెప్పారు! దీనివల్ల, రాముడి గురించి సత్యనారాయణ గారికి ఏం అభిప్రాయం వుందో పాఠకులకేమన్నా అంతుపడుతుందా? సత్యనారాయణగారి వ్యాసంలో ఒక సంఘటనని ఇంకెవరో వచ్చి రాశారా? ఇందులో ఒక దాన్ని ప్రక్షిప్తం అనుకోవాలా?

రాముడు బ్రాహ్మణ భక్తిలో కూరుకు పోవడం వల్ల మాత్రమే తప్పులు చేశాడు గానీ లేకపోతే ఆ తప్పులు కూడా చేసేవాడు కాదని ఈయన అభిప్రాయం. "బ్రాహ్మణ భక్తి వెర్రితలలు వేయుట చేతనే శ్రీరాముడు, తన్నే దైవముగా నమ్ముకొన్న ధర్మపత్ని సీతమ్మను అడవులకు నెట్టించెను" – (పే. 123). సీత విషయంలో, బ్రాహ్మణులేం చేశారు? సీతని వదిలెయ్యాలని రాముడికి బ్రాహ్మణులు బోధించారా?

రామ రాజ్యం గురించి చెపుతూ, రామ రాజ్యం అందరూ అనుకునేటంత ఆదర్శ రాజ్యం కాదని తన మాటల ద్వారా మాత్రమే చెప్పారు. కథ నించి ఒక్క ఉదాహరణ కూడా చూపించలేదు. – "అసలు రామ రాజ్య మనగా అన్నమో రామచంద్రాయని ఆ బాల గోపాలము ఆకలి మంటలచే అలమటించిన రాజ్యము. దేశములో ఆలన పాలన సరిగా లేక, పదునాలుగేండ్లు బుగ్గము పాడై, రాజ్య వ్యవస్థ తారు మారై, పంటలు లేక, తిండి చాలక, 'అలో లక్ష్మణా' అని ఏడ్చిన రోజులు, ఆ రోజులు. లేదా, తను జేసిన ఘనకార్యముల వలన ఇల్లాలు సీత చేతి నుండి జారిపోగా, 'అలో లక్ష్మణా' అని ఏడ్చిన రోజులు, ఆ రోజులు." (పే. 117).

రాముడు రాక ముందు ఆ రాజ్యం 14 ఏళ్ళు బుగ్గము పాడైందట! భరతుడి పరిపాలనలో రాజ్యంలో సిరి సంపదలు పది రెట్లు పెరిగాయని కథ చెపుతున్నా సరే, ఈయన దాన్ని పట్టించుకోలేదు. భరతుడి కాలంలో, రాజ్యంలో కరువు కాటకాలేనట! భరతుడి కాలంలో ప్రజలు కష్టాలు పడితే అది రామ రాజ్యానికి సంబంధించిన విషయం అవుతుందా? భరతుడి కాలంలో బాగా లేదని చెప్పడం అంటే, భరతుడు రాజ్యం వొదిలేశాక, రాముడు పరిపాలన ప్రారంభించాక చాలా బాగుంది – అని అంగీకరించినట్టే కదా? రామ రాజ్యం బాగా లేదనడానికి రుజువు, రాముడు సీత కోసం దుఃఖించడమా?

తన విమర్శలన్నీ వాల్మీకమునకు సంబంధించినవే అని చెపుతూ, రావణుణ్ణి చంపినందుకు రాముడికి బ్రహ్మహత్య పాతకం చుట్టుకోడం – లాంటి, వాల్మీకిలో లేని అనేక విషయాల మీద ఈయన చర్చలు జరిపారు. ఒక మాటకీ ఇంకోమాటకీ పొంతన లేని చర్చలు!

".... గ్రుడ్డి యెద్దు చేలో పడ్డట్టు మొద్దు రూపమున పారాయణము చేయుటయే పారాయణముగా ...." (పీఠిక – పే. 6) భావించడాన్ని వ్యతిరేకించే దృష్టితో విమర్శకు పూనుకోవడం సుగుణమే. కానీ, ఈ విమర్శకుడు చేసిన పని కూడా 'గుడ్డెద్దు చేలో పడ్డట్టు' చేసినదే! ఈయన ప్రకటించిన దంతా రామాయణం మీద గుడ్డి భక్తి గాక ఇంకేమన్నా వుందా? ★

# 4. త్రిపురనేని రామస్వామి చౌదరి గారి "శంబుక వధ"★

శంబుక వధ – ఒక నాటకం.

రామస్వామిగారు ఈ నాటకానికి రాసిన 'ముందు మాట'లో – "రామాయణ కథా కాలము నాడు హిందూ దేశ మెట్లున్నదో" వివరించారు. ఆర్యులు "ఉత్తర కురు భూముల నుండి ...." హిందూ దేశానికి వొచ్చారనీ, అప్పటికి హిందూదేశంలో ఉన్న "ఆదివాసులెల్ల రొక్క జాతిగా" లేరనీ, అన్నారు. "వీరే (ఈ ఆదివాసులే), వేదములూ మొదలగు తొలి పలుకులయందు దస్యులనియు; బురాణములందును, నైతిహ్యములందును, గొన్ని మహాకావ్యముల యందును రాక్షసులనియు; స్మృతులయందు ద్రావిడులనియు, శూద్రులనియు బేర్కొనబడిరి" అని వివరించారు. (రామస్వామి గారి గ్రాంధిక భాష ఎక్కువ కఠినంగా ఉంది. ఈ కొటేషన్లలో వారు వాడిన బండీరాలూ, అరసున్నలూ ఇవ్వడం లేదు నేను.)

ఆర్య – ద్రావిడ యుద్ధాల గురించి చెపుతూ, "ఈ యుద్ధములనే పురాణాదులు, దేవ దానవ యుద్ధములుగా వర్ణించినవి" అన్నారు.

రామస్వామిగారు, ఆర్య రాజుల పరిపాలనలను చాలా మెచ్చుకున్నారు, ఈ విధంగా – "ఈ కాలంబున నార్యులు రాజకీయ విషయంబులం దపార వైదగ్ధ్యంబును గౌశల్యంబును గడించిరి .... తంత్రము విస్తరించెను. కౌటిల్యమును బ్రకటించియైన నభీప్సితంబుల బొందుటకు వెనుదీయరైరి. రుషులకు గూడ రాజ్య రక్షణమే పరమావధియయ్యెను. ప్రత్యేక వ్యక్తి నశించి అంతయు రాజునందు మూర్తీభవించెను .... పొట్ట గూటికై యార్యులు దేశ భ్రమణంబు మాని పల్లెలు గట్టుకొనిరి. పల్లె లెల్లను పట్టణంబులుగా మారెను. భిన్న రాష్ట్రము లేర్పరచుకొని రాజులు ప్రజారంజకముగా నేలుచుండిరి .... జార చోర భీతి లేక రాష్ట్రములు నిత్య కళ్యాణము, పచ్చ తోరణములుగ జెలగుచుండెను .... ఉత్తర హిందూస్థాన మిట్టి స్థితియందుండ శ్రీరామ భద్రుడు సాకేతపుర సింహాసనా సీనుడయ్యెను." (పే. 24)

ఈ రచయితకి, ఆర్య రాజుల పరిపాలనల మీద అపారమైన భక్తి! రాముడు, ఈయనకు, శ్రీరామభద్రుడు! లేదా, శ్రీరామచంద్రుడు!

రాజుల పరిపాలనలు ఎంత నిరంకుశంగా ఉంటాయో, దశరధుడి మాటల్లోనూ రాముడి మాటల్లోనూ కూడా చూశాం.

దశరధుణ్ణి ఆర్యరాజే అనుకుంటే, వాల్మీకి ప్రకారం, ఆర్యరాజులైన దశరధుడి పాలనలోనూ, భరతుడి పాలనలోనూ, రాముడి పాలనలోనూ కూడా 'వేశ్యలు' ఉన్నారు! కానీ, రామస్వామిగారు, ఆ రాజ్యాల్లో నించి "జారత్వాన్ని" తీసేసి, ఆర్య రాజుల పరిపాలనా వైభవాన్ని కీర్తించడంలో వాల్మీకిని వోడించేశారు. ఒక వేపు కౌటిల్యాము బ్రకటించడాలూ, ఇంకో వేపు ప్రజారంజక పరిపాలనలూ! 'బిచ్చగాళ్ళు' ఉన్న ఆ పరిపాలనలు నిత్య కల్యాణాలూ, పచ్చ తోరణాలూ! 'జార, చోర...' అంటూ మాటల కూర్పు చూడడమే గానీ, వాటి నిజానిజాలు గమనించడం లేదు.

రామస్వామిగారికి, రామ భద్రుడి మీద భక్తే కాదు, దానితో సమానంగా రావణ భద్రుడి మీద కూడా భక్తి ఉంది! ఈయన రావణ భక్తి ఇలా ఉంది – "ఇతడు మహా బల పరాక్రమ సంపన్నుడు. అధిక సౌందర్య వంతుడు. మిగుల ధీశాలి, అసమాన శైవ భక్తి ప్రపూర్ణుడు. ధర్మ ప్రభువు .... వేదము లగమ్యారణ్యముగా నున్న యప్పుడు ఛేదించి యిదానీంతనులు వల్లె వేయుటకు దారి జూపె. ఇదియె నేటికిని రావణ భట్టీయమను పేరనున్నది. ధీశాలియే గాక బ్రహ్మజ్ఞాని. ఇందుచేతనే రావణ వధానంతరము రాముని బ్రహ్మహత్యా మహాపాతకము పీడించినది. ఇదియుగాక ఇతడు నవ కోటి శివాలయార్చకుడు." (పే. 30.) ఈ రకంగా సాగింది రావణ కీర్తన. అంటే, ఆర్య రాజుల మీదా భక్తే, ద్రావిడ రాజులమీదా భక్తే! ఎటొచ్చీ భక్తి లేనిది – బ్రాహ్మణుల మీద! ఈ నాటకం ఈ లక్షణాల తోటే సాగుతుంది.

నాటక ప్రారంభంలో – అంగదుడు కిష్కింధ నించి అయోధ్యకు వస్తూ వుంటాడు. రామస్వామిగారు వానరులు కోతులు గారని వాదించి అంగదుణ్ణి మానవుడిగానే చేశారు. కానీ, ఈ మానవుడికి, ఆకాశంలో ఎగిరే గంధర్వ విద్య తెలుసట! అంగదుడు అయోధ్యకు వస్తూ ఇలా అనుకుంటాడు – "అబ్బబ్బా! ఎక్కడి కిష్కింధా పురము, ఎక్కడ సాకేత పురము? తుంగభద్రా నది నుంచి సరయూ నదికి రావలయును. వెర్రికి వేయి

★ త్రిపురనేని రామస్వామి చౌదరి, 1920. శంబుక వధ. తెనాలి: సరళా పబ్లికేషన్స్, 1971.

విధములన్నట్లు నే నీ కాలి నడకన రా బూనుటేల? గాంధర్వ విద్యచే నాకాశ గమనంబున రాక తక్కుటేల? ఈ యార్యుల జన పదములను జూచి యానందింప వలసినది ఏమున్నది?" – ఆర్యుల గ్రామాల్ని చూడాలనే ఉద్దేశంతోనే నడిచి వొస్తున్నాడు గానీ, లేకపోతే ఈ మానవ అంగదుడు, చక్కగా ఆకాశంలో ఎగిరి రాగల డట! ఈ ఎగరడం ఒక్కటే కాదు. మాయం అయిపోయి కనపడకుండా ఉండే విద్య కూడా తెలుసు – మానవ అంగదుడికి! రామస్వామి గారికి వానరుల మీద ఎంత మాయదారి ప్రేమో! ఆ ప్రేమతోటే ఆయన వానరులకు రక రకాల మాయశక్తులు ప్రసాదించారు.

ఈ కథ ప్రకారం, అంగదుడు, రాముణ్ణి గురించి కొంత వ్యతిరేక భావంతో ఉంటాడు. రాముడు క్రమ క్రమంగా వానర రాజ్యాన్ని తన ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నాలు జరుపుతున్నాడేమో అనే ఆలోచనలతో ఉంటాడు – "…. యేదో మిష పెట్టి నన్ను రప్పించు చున్నవాడు. (అంగదుడి కోసం రాముడే కబురంపినట్టూ అందుకే ఇతడు అయోధ్యకు వస్తున్నట్టూ అర్థం.) దీని నంతయు బరిశీలింప, వానర సామ్రాజ్యము తన కైవస మున నుంచుకొనుటకు మమ్ముల బూటకావు చేసినట్టు దోచుచున్నది …. క్రమ క్రమముగ దిన దినము మా స్వాతంత్ర్యము గుంజుకొనుచున్నాడు" అని ఆలోచిస్తూ వుంటాడు.

దారిలో శంబుకుడి శిష్యుడి ద్వారా శంబుకుణ్ణి గురించి విని, అతని ఆశ్రమానికి వెళ్తాడు. అక్కడ శంబు కుడితో తన గురించి చెప్పుకుంటూ, సీతా వియోగం కలిగిన రాముణ్ణి వోదార్చడానికి తనని సుగ్రీవుడు పంపినట్టు చెపుతాడు, ఇలా "…. యకస్మాత్తుగా పట్టాభి రామునకు సంభవించిన యాపత్తు విని సమాశ్వాసింప వానర రాజ్య పట్టభద్రుడు నన్నంపు చుండె" అంటాడు. తనని రాముడే, పిలిపించినట్టు ఒక చోటా, రాముణ్ణి ఓదార్చడానికి సుగ్రీవుడు పంపుతున్నట్టు ఇంకో చోటా! ఆ రెండూ అప్పటి కప్పుడే! పండితులు ఇంత అడ్డ గోలుగా ఎలా ఉంటారో అర్థం చేసుకోవడం చాలా కష్టం!

అంగదుడు, తర్వాత శంబుకుడి తపస్సు గురించి, "స్వామీ! జప తపాలు బ్రాహ్మణ కర్మలు గదా? రాజు వర్ణాశ్రమ ధర్మాలు కాపాడే వాడు కదా? మిమ్మల్ని ఉపేక్షిస్తాడా?" అని అడుగుతాడు.

"శ్రీరామచంద్రుడు యుక్తాయుక్త విచారణ చెయ్యడా? అతని కత్తి నిరపరాధినైన నా కంఠం మీదకు వస్తుందా?" అంటాడు శంబుకుడు.

దానికి అంగదుడు మళ్ళీ – "స్వామీ! శ్రీరామచంద్రు డొక్కడే యయిన నిట్టి యవినీతి కార్యములకు బెగడు గాని ద్విజులు బలవంతబెట్టి చేయించకుందురా? ఇయ్యది దుష్ట శిక్షణ, శిష్ట రక్షణంబని శ్రీరామ చంద్రు నకు బోధింపరా? శ్రీరామచంద్రుని నిమిత్త మాత్రుని జేసెదరు" అంటాడు.

అంటే, రాముడు చాలా ఉత్తముడు! బ్రాహ్మణులు దుర్మార్గులు!

ఈ విధంగా, బ్రాహ్మణుల గురించీ, శ్రీరాముడి గురించీ, రచయిత అభిప్రాయాలు, ఏ రకంగా సాగుతూ వుంటాయో ఈ రచన పొడుగునా గమనించండి!

తర్వాత – రాముడికీ, వశిష్ఠుడికీ జరిగే సంభాషణ నించి:

వశిష్ఠుడు – "…. నేడయోధ్యా పట్టణమంతయు గుస గుసల తోడను, జిటచిటల తోడను, నిండి యున్నది".

రాముడు – "కారణమేమి?"

"ఎన్నడైన వింటివా శంబుకుని పేరు?"

"మా కర్ణ తాడితమైనట్టు కన్పట్టదు."

"ఇతడనార్యుడు. అనగా ద్విజేతరుడు. అనగా ద్రావి డుడు. అనగా మన స్మృతులు పేర్కొన్న శూద్రుడు."

"అయిన నేమి?"

"ఏమియు లేదు. శాంతముతో వినుము. …. నేడే శంబుకుడు సాకేత పురమున కతి సామీప్యమున నొక యాశ్రమము నిర్మించుకొని, ద్విజేతరుల నుండి శిష్యు లను గ్రహించి, స్మృతులను ధిక్కరించి వారికి దిత్త్వోప దేశము గావించుచున్నాడు. అంతటితో విరమింపక పట్టణములకును …. బక్కణ సీమలకును ఛాత్రుల నంపి యార్యులతో సమాన స్వత్వము కలదని శూద్రులకు బోధింపించుచున్నాడు."

"మా ప్రజలెల్లరకు సమానమగు హక్కులుండు టుచితమే కదా?"

రాముడి జవాబులు ఎలా ఉన్నాయి? శంబుకుడు చేసే పని మంచిదేనని అంగీకరిస్తున్నట్టుగా వున్నాయి. రామ రాజ్యంలోనూ, అతని తండ్రి తాతల రాజ్యాల్లోనూ, ఏ నాటి నించో వర్ణ భేదాలుండగా, రాముడు, ఆ భేదాలు వుండరాదంటాడా? శంబుకుడు, అంత వరకూ అమలులో ఉన్న ధర్మాల్ని ధిక్కరించి, ఆర్యులతో సమాన హక్కులు కోరే ఉద్యమం నడుపుతున్నాడని తెలిసినప్ప టికీ, రాముడు, 'ప్రజలందరికీ సమాన హక్కులు ఉండాలి గదా?' అంటాడా? రామాయణ కాలంలోనే

ఎక్కణ్ణించి వచ్చాడీ సోషలిస్టు రాముడు? రాముడు ఆర్య రాజనీ, ద్రావిడులతో శతృత్వం పూని యుద్ధాలు చేసిన వాడనీ, రాక్షస (ద్రావిడ) నాశనానికి కంకణం గట్టిన వాడనీ, రామస్వామి గారు ఎరగరా? అలాంటి రాముడు, తన పరిపాలనలో శూద్రులకు (ద్రావిడులకు) సమాన హక్కులు ఇస్తానంటాడా? ఆ పనికి బ్రాహ్మణులే అడ్డు పడుతున్నారా?

తర్వాత చూడండి!

వశిష్టుడు "…. వర్ణాశ్రమా చారములను నిల్ప నొల్లవా?" అంటాడు రాముడితో ఏదో తేల్చమన్నట్టు.

"నిల్ప బద్ధకంకణులము" అంటాడు రాముడు. వర్ణ భేదాలూ నిల్పుతాడట, ప్రజలందరికీ సమాన హక్కులూ ఇస్తాడట! ఇదెక్కడి మహేంద్ర జాలం?

రాముడు – 'వర్ణ ధర్మాలు ధిక్కరించే వారికి కఠిన మైన శిక్షలు వేస్తాన'ని కొత్త శాసనం చేస్తానంటాడు.

'శాసనాలతో, గీసనాలతో లాభం లేదు. శంబు కుడికి మరణ శిక్ష వేసెయ్యాలి' అంటాడు వశిష్టుడు.

అప్పుడు శ్రీరాముడు నివ్వెరపోయాడట!

"శ్రీరాముడు నివ్వెరగంది, – మీరీ మాటలు జెప్పను దగదు, మేము వినను దగదు. వేయేల? వినజాలను. దుష్ట శిక్షణంబున నారితేరిన యీ హస్తము నిరపరాధుని దుంప జాలదు" అని తల తిప్పేస్తాడు.

రామస్వామిగారూ! శ్రీరామభద్రుడితో ఇంతింత నీతులు పలికిస్తున్నారు! ఈ నీతిశాలి, నిరపరాధి అయిన వాలి నెలా జంపగలిగాడండీ? వాలి కథ మీ చెవిన పడలేదా? మీ కర్ణ తాడితము కాలేదా? రాముడు వాలిని చంపడంలో వాల్మీకికి తప్పు కనపడకపోవచ్చు గానీ, మీకూ తప్పు కనపడలేదా? రాముడు ఒక్క తప్పు పని కూడా చెయ్యనట్టూ, నిరపరాధుల జోలికి పోనట్టూ, సాక్ష్యం ఇస్తున్నారే! బ్రాహ్మల్ని విమర్శించాలంటే, రాముణ్ణి ఇంత వెనకేసుకు రావలసిందేనా?

రాముడు వశిష్టుడితో మాట్లాడుతూ వుండగా, ఒక బ్రాహ్మణుడు, తన కొడుకు చచ్చిపోయాడని తీసుకు వస్తాడు.

ఆ సమీపంలోనే అదృశ్యుడై అక్కడ కూర్చుని ఉన్న మానవ అంగదుడు ఇదంతా చూస్తాడు – "ఔరా, యౌరా! యేమి ఈ కుట్ర …. వశిష్టుల వారెంత తంత్ర జ్ఞులు! మొన్న సాయంకాలము వశిష్టులవా రశ్వనీ దేవతలతో గుస గుసలు బోవుటకు కారణ మిదియా? భూదేవు లాకాసదేవు లొక్కటైరి" అని ఆశ్చర్యపడతాడు.

వశిష్టుడు అశ్వనీ దేవతలతో రహస్యంగా మాట్లాడి, ఆ పిల్లాణ్ణి మూర్ఛ పోగొట్టించాడట! ఇక్కడ కావలసింది మూర్ఛ పోవడమే అయితే, బ్రాహ్మణులు ఏదో మందు సహాయంతో ఆ పిల్లవాణ్ణి మూర్ఛ పోగొట్టారని రాయ వచ్చు కదా? ఆకాశంలో ఉండే అశ్వనీ దేవతల్ని కూడా తీసుకు రావాలా మానవుల నాటకంలోకి?

వశిష్టుని మాటల వల్ల చివరికి శ్రీరామభద్రుడు – "మీ వాక్యముల బ్రతిఘటింపజాలను. మీ యాజ్ఞను నెరవేర్చెద" అని అంగీకరిస్తాడు.

వెంటనే శంబుకుడికి ఒక ఉత్తరం పంపిస్తాడు, దాని సారాంశం: 'నువ్వు శాస్త్రాలు ధిక్కరించి వేదాలు చదువుతున్నావనీ, బ్రాహ్మణులతో సమానమైన హక్కులు కోరుతున్నావనీ, విన్నాము. నీకు ఆ హక్కు ఉందో లేదో నిర్ణయించడానికి రేపు సభ జరుగుతుంది. స్మృతుల ధర్మాన్ని నువ్వు తిరస్కరించిన వాడవైతే నీకు మరణ దండన తప్పదు. రేపు సభకు వచ్చి నీ హక్కు రుజువు చేసుకో!'

శంబుకుడు, రాజు ఉత్తరం చదివి, 'ఆ సభకు వెళ్ళడం దండగ' అనుకుంటాడు. రుషులు తమ మేలు కోసం, శూద్రుల కీడు కోసం స్మృతుల్ని పక్షపాత నీతు లతో చెప్పారనీ, వేదాలు ఆ విధంగా చెప్పలేదనీ, వేద ప్రమాణం తీసుకొనేటట్టు అయితేనే తనకు న్యాయం జరుగుతుందనీ, శంబుకుడి భావం.

రాముడి ఉత్తరం చదివి తన శిష్యుడితో శంబు కుడు: "…. ప్రతిపక్ష రచిత గ్రంథములగుటచే స్మృతులు మన కాదరణీయములు గావను మన మొర నెవరాల కింతురు? …. దీనికి సభాముఖమున బరిష్కార మేము న్నది? వారు వేద ప్రామాణ్యము నంగీకరింపరు. మనము స్మృతి ప్రమాణ్యము నంగీకరింపము …. మనము శిక్షకు బాత్రుల మగుదుము." – అందుచేత వెళ్ళడం వల్ల ప్రయోజనం ఏమీ లేదంటాడు. ఆ మాటలే మహారాజుకి జవాబు రాస్తాడు "…. మీరు వేదములనే ప్రామాణ్యమన్నట్టిచో సభ కేతెంచెద …. యట్లుగాని యెడ …. …." రాను పొమ్మంటాడు. శంబుకుడికి వేదాల మీద చాలా భక్తి!

శంబుకుడి తిరస్కారానికి ఆ మహారాజేమీ కోపం తెచ్చుకోడు. అంత మంచివాడు! పై పెచ్చు, 'శంబుకుణ్ణి చంపవలసి వస్తుందే' అని తెగ బాధపడిపోతూ వుంటాడు – "అబ్బా! రాజ్య మేలుట కత్తి మీద సాము గదా? ఇసుమంతయు అపచారము సలుపని సాధువులను, 'వర్ణా శ్రమాచారములు' అంటూ చంపవలసి వచ్చును గదా! …. శంబుకుని శిక్షింపకున్న యెడల వంశ గురువునకేమి యలుక వచ్చునో గదా? …. …. తత్వ

జ్ఞానుల కంఠ నాళములను గోసి రాజ్యము జేయబోవ లెను (ఇలాంటి పనులు చేయవలసి ఉంటే, రాజ్యం చెయ్యలేను)" అని బాధపడిపోతూ వుంటాడు.

శంబుకుణ్ణి చంపకపోతే 'వంశ గురువులకేమి యలుక వచ్చునో గదా!' అట! అంటే, శంబుకుణ్ణి చంపకపోతే, వశిష్ఠుడు అలుగుతాడట! ఆ 'అలక'కే రాముడు లొంగుతాడన్న మాట! ఇలాంటి రాముడు, రామస్వామిగారి లెక్కలో గొప్ప ధర్మ ప్రభువు! గొప్పగా ప్రజల్ని పాలించిన వాడు!

రాముణ్ణి గొప్ప ధర్మ ప్రభువుగా చెప్పాలి! కానీ, అతను శంబుకుణ్ణి చంపినట్టు కూడా చెప్పాలి! ఇలాంటి వైరుధ్యం మూలాన్నే ఈయన వాదం ఎక్కడికక్కడ అస్త వ్యస్తంగా తయారైంది.

'రాముడి భావాలకూ, బ్రహ్మణుల భావాలకూ, ఏమీ తేడా లేదు' అనే సత్యాన్నే అర్థం చేసుకుంటే, ఈ నాటకం ఇలా ఉండేది కాదు.

తర్వాత కథ చూడండి!

తర్వాత రాముడు శంబుకుడి ఆశ్రమానికి వెళ్తాడు. అక్కడ శంబుకుడి శిష్యుడు ఒక మొక్కని పాతుతూ – "మా గురువుగారిని చూచిపోవుటకై మొన్న కణ్వుల వారు వచ్చి ఈ సోమలత నిచ్చిపోయిరి" అని రాముడితో చెపుతాడు. (మొన్న ఇచ్చిన మొక్కని ఇవ్వాళ పాతు తున్నాడీ శిష్యుడు!)

కణ్వుడు కూడా బ్రాహ్మణుడే. శంబుకుడి మీద బ్రాహ్మణులందరూ కక్షగా ఉన్నారని చెపుతున్నారు కదా? శంబుకుడి ఆశ్రమానికి బ్రాహ్మణ రుషులు వచ్చి పోతూ ఉండడం ఏమిటి? వాల్మీకి రామాయణ కథలో శంబు కుడు చచ్చిపోతే, అగస్త్యుడెంత సంతోషించాడో మనం చదవలేదా? ఇక్కడ, ఈ రచయిత, 'శంబుకుడి మీద బ్రాహ్మణుల్లో కొందరే కక్షగా వున్నారు. మిగిలిన బ్రాహ్మ ణులు అనుకూలంగానే వున్నారు' అని చెప్పదల్చారా? ఇలా చెప్పదలిస్తే, బ్రాహ్మణులందర్నీ తప్పుపట్టడం ఎందుకు? రాముడు, వశిష్ఠుడి మాటలకు అంత విలువ ఇవ్వడం ఎందుకు?

తర్వాత, రాముడు, శంబుకుడి దగ్గిరికి వెళ్తాడు. శంబుకుడి ముందు కూర్చుని అతనితో గొప్ప భక్తితో, వినయ విధేయతలతో మాట్లాడతాడు. (చంపడానికి వెళ్ళిన వాడు!) 'శూద్రులకు వేదములు చదువుటకు గాని, ముట్టుటకు గాని, యధికారము లేకపోవుటయే కాక, మత ప్రసంగమును జేయుటకు గూడ నధికారము లేదు. బ్రాహ్మణులు జెప్పిన నీతులను గ్రహింపవల యును గాని ప్రశ్నింపరాదు' అని వీరి (మహర్షుల) వాదము. దీనికి మీరేమి ప్రత్యుత్తరము జెప్పెదరు?" అని వినయంగా శంబుకుణ్ణి అడుగుతాడు. మహర్షుల వాదం తన వాదం కానట్టు! అది తన అభిప్రాయం కానట్టు!)

".... మేము శూద్ర శబ్ద వాచ్యుల మెట్లగుదుము? ఆ శబ్దమును మా మెడకేల యంట గట్టెదరు? మేము ద్రావిడులము .... మానవ సామాన్యము లయిన హక్కు లను మా యొద్ద నుండి బలవంతముగా గుంజుకొనుట యెట్టి ధర్మము? ఎట్టి నీతి? .... హిందూ మతస్థులమని మేము పిలుచుకొనుచున్నందులకు బ్రతిఫలము మా కజ్ఞాన మొసంగుటా?" – ఈ రకంగా శంబుకుడు హక్కుల కోసం వాదిస్తాడు.

ఈ న్యాయమంతా శ్రీరాముడికి ఎంతో నచ్చు తుంది. ధర్మాత్ముడు కదా? .... మీ ఇష్టం వచ్చినట్టు తపస్సులు చేసేసుకోండి .... "కాని వేదములందుకు సమ్మతించునా?" అంటాడు.

వేదాలు అందుకు సమ్మతిస్తాయో లేదో, వేదాల్లో ఏం ఉందో రాముడికి తెలియదా?

వాల్మీకి – రాముడైతే వేదాలన్నీ చదివిన వాడే. ఇంకా ఏమిటేమిటో శాస్త్రాలన్నీ చదివిన సమస్త శాస్త్ర పారంగతుడు. ఈ రామస్వామిగారి రాముడు, డొక్కశుద్ధి ఉన్న మొహం లా లేడు. వేదాల్లో ఏం వుందో శూద్రుణ్ణి అడుగుతున్నాడు!

దానికి శంబుకుడు – ".... వేదములు హిందువుల కెల్ల దరుణోపాయములుగ నేర్పడినవి. పొరబడితిని. మానవ కోటి కెల్లరకును దరుణోపాయములు" అని చెప్పాడు. అంటే వేదాలు, మానవులందరికీ ఒకే రకం హక్కులు ఇచ్చాయనీ, ఎవరికీ అన్యాయం చెయ్యలేదనీ, అర్థం.

శంబుకుడి మాటలతో రాముడు పూర్తిగా సంతృప్తి పడి తన రాజ్యంలో అందరికీ సమాన హక్కులు ఇచ్చేస్తా నన్నాడు. "మునీంద్రా! తమ మాటలు గ్రాహ్యంబుగ గన్పట్టుచున్నవి. మా రాష్ట్ర వాసులకెల్ల సమానములగు హక్కుల నిచ్చి, పక్ష పాత రహితముగా రాజ్యమేలుట మాకు విధ్యుక్త ధర్మము గాన మీరు నిశ్చింతగా నుండుడు. మేము పోయి వత్తము" అని చెప్పి ఆశ్రమం బయటికి వెళ్ళిపోయాడు.

రాముడు బైటికి వెళ్ళేసరికి అక్కడ వశిష్ఠుడు సిద్ధంగా ఉన్నాడు – ".... ద్రోహిని శిక్షించితివి గదా?" అని అడిగాడు.

"శంబుక సంయమిని శిక్షించుటకు బూర్వము, అతడు ద్రోహియని స్థిరపడవలయును గదా?" అని రాముడు మళ్ళీ మొదటకొచ్చాడు.

వశిష్ఠుడికి ఒళ్ళు మండిపోయింది – "గురువుని తిరస్కరిస్తున్నావు" అని అరిచాడు.

శ్రీరామచంద్రుడేమీ చలించలేదు. పైగా అనార్యులందర్నీ ఎంత ప్రేమతో చూడాలో పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు – " ఒక జాతి సౌభాగ్యమునకయి మరి యొక జాతిని సర్వకాల సర్వావస్థల యందు బానిసత్వము నందుంచి మూర్ఖులను జేయుట రాజనీతి యగునా?" అని అడిగాడు కోపంగా! ఇంత ఉత్తముడైన రాముణ్ణి రామస్వామిగారు ఏ కొలిమిలో తయారుజేయించారో? రామాయణ కథ ప్రకారం, రాముడు, ఈ శంబుక వధ అయింతర్వాత ఇంకా కొన్ని రాజ్యాల మీద యుద్ధాలు చేసి ఆ రాజ్యాలు తమ్ముళ్ళకు కట్టబెడతాడు. ఈ శంబుక కథా ఉత్తర కాండలోదే, ఆ యుద్ధాలూ ఉత్తర కాండలోవే. రామస్వామిగారు, శంబుక వధ ఘట్టంలోనే రాముణ్ణి మానవోత్తముణ్ణి చేసేశారు! ప్రజల్ని న్యాయంగా పరిపాలించడం మీదా, సమాన హక్కుల మీదా, జాతుల సమైక్యత మీదా, రాముడి చేత బ్రహ్మాండమైన ఉపన్యాసాలిప్పిస్తున్నారు.

కానీ, వాల్మీకి కథ ప్రకారం, రాముడు, తర్వాత కాలంలో గంధర్వుల మీద దండెత్తి ఆ జాతిని సర్వనాశనం చేసి, వారి దేశం లాక్కుంటాడు. ఇంకా కొన్ని దేశాలు లాక్కుంటాడు. మరి దీని మాటేమిటి? ఇంకా ముందు ఇలా ప్రవర్తించబోయే రాముడితో జాతి ప్రేమ మీద ఉపన్యాసం ఇప్పించడం ఏమిటి? అసలు ప్రారంభంలోనే అంగదుడు రాముణ్ణి గురించి చాలా వ్యతిరేకతతో ఎలా అనుకున్నాడు? "వానర సామ్రాజ్యమును, తన కైవసమున నుంచుకొనుటకు .... క్రమ క్రమముగ దిన దినము మా స్వాతంత్ర్యమును గుంజుకొనుచున్నాడు" అంటాడు. ఈ రచనలో అంగదుడు దుష్ట పాత్ర కాదు. శంబుకుడి పక్షాన వున్న మంచి పాత్ర. అటువంటి మంచి పాత్రతో, శ్రీరాముడు ఇతర రాజ్యాల్ని ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా చెప్పించారు. మళ్ళీ కథ అంతా శ్రీరాముణ్ణి ఉత్తముడిగా చేసి, అన్ని జాతుల్నీ ప్రేమిస్తున్నాడని చెప్పారు.

శ్రీరాముడి ధర్మోపన్యాసానికి వశిష్ఠుడికి కంపరం పుట్టింది. (మరి, రాముడి బడాయి మాటలకి కంపరం పుట్టదా?) – "ఓడిపోయిన జాతికి (ఓడిపోయిన ద్రావిడ జాతికి – అని అర్థం) సమాన హక్కులు ఇవ్వడం మాత్రం రాజనీతి అవుతుందా?" అని రాముణ్ణి కోపపడ్డాడు.

రాముడు అప్పటికీ వినకుండా – "మీరెంత చెప్పినను శంబుకుని వధకు మనసు పోకున్నది. ఇతడు నిరపరాధియని మా విశ్వాసము" అని పాత పాటే పాడాడు. అంతేగానీ "శంబుకుణ్ణి నిశ్చింతగా తపస్సు చేసుకోమని చెప్పేశాను. ఆ మాట తప్పను" అనలేదు! శంబుకుడికి ఆ మాట ఇచ్చిన సంగతి రాముడే మరిచిపోయాడు. శంబుకుణ్ణి చంపడానికి 'మనసు ఒప్పడం లేద'ట! ఆ కారణమే చెపుతున్నాడు.

వశిష్ఠుడి కేం చెయ్యాలో తోచలేదు.

రామస్వామిగారికీ ఏం చెయ్యాలో తోచలేదు! నాటకం ఎలా నడపాలో తోచలేదు. రాముణ్ణి బొత్తిగా ఇంత మంచివాణ్ణి చేసేస్తే, శంబుక వధ జరగనే జరగదు. అప్పుడు బ్రాహ్మల్ని తిట్టడానికేమీ మార్గం దొరకదు. బ్రాహ్మణుల్ని తిట్టాలంటే, శంబుక వధ జరిగి తీరాలి. రాముడు బ్రాహ్మణుల సంతోషం కోసం శంబుకుణ్ణి చంపినట్టుగా కథ నడిచి తీరాలి. కాబట్టి, రామస్వామిగారు, రాముడి పాత్రని హఠాత్తుగా మార్చేశారు. ఇంతసేపూ ఉత్తముడి పాత్ర ధరించిన రాముణ్ణి హఠాత్తుగా బేషరతుగా కార్యానికి ఒప్పించేశారు. ఇంతసేపూ రాముడి మంచితనాన్ని సాగ లాగి, సాగ లాగి, ఒక్కసారి అతన్ని దుర్మార్గంలోకి తోసేశారు.

రాముడు తనలో తను – "కొంత వరకు సందియం దీరినది" అనుకున్నాడు. ఎలా దీరిందా సందియం? వశిష్ఠుడు 'ఓడిపోయిన జాతికి సమాన హక్కులేమిటి?' అన్నాడు కదా? దానితో రాముడి సందేహం తీరిపోయిందట! అవును, నిజమే. ఓడిపోయిన జాతుల్ని చంపెయ్యాలి గానీ, వాళ్ళకి హక్కులేమిటి? ఇంతసేపూ నేనే సరిగా ఆలోచించలేదు – అనుకున్నాడన్న మాట! శంబుకుణ్ణి చంపడం "న్యాయము గాకున్న ఈ మహనీయుడు (వశిష్ఠుడు) ఇంత పట్టుదలతో నేలజెప్పును?" అనుకున్నాడు. వశిష్ఠుడు చెప్పాడు కాబట్టి అది న్యాయమే – అనే అభిప్రాయానికి వచ్చేశాడు రాముడు.

రామస్వామిగారికి, తప్పంతా బ్రాహ్మణుల మీదికి తోసేసి, రామభద్రుణ్ణి పూర్తిగా మంచివాణ్ణి చేసెయ్యాలని తాపత్రయం. అంతా బ్రాహ్మలే చేయించారు, శ్రీరామచంద్రు దేపాపమూ ఎరగడు. ఉత్త అమాయకుడు. పరమ పుణ్యాత్ముడు. కరుణా సముద్రుడు. బలవంతాన ఒప్పుకున్నాడు గానీ, లేకపోతే ఆ పని చేసేవాడా? – ఇదీ ఈ రచయిత చెప్పదల్చింది.

రాముడు వశిష్ఠుడితో చివరికి ఇలా అంటాడు – "గురువరా! ధర్మాధర్మ విచారణ భారము గురు భుజ స్కంధమున నుండును! గురూపదేశంబు వ్యపగత కల్మషంబుగాన శంబుకుని బరలోక ప్రాప్తుని జేసెదను" అని వెనక్కి తిరిగి మళ్ళీ ఆశ్రమంలోకి బయల్దేరాడు.

ధర్మాధర్మ విచారణ భారం అంతా గురువుదే అను

కున్నవాడు, అంతసేపూ గురువుతో అనవసర తర్కం ఎందుకు చేసినట్టు? వశిష్టుడి మాటలు రాముడికి కూడా నచ్చినట్టూ, తనకు నచ్చడం వల్లనే తన ఇష్టంతోనే రాముడు ఆ పనికి పూనుకున్నట్టూ కథ నడవాలి. అప్పుడు రాముడు కూడా నేరస్తుడవుతాడు. ఇలా చెప్పడం కన్నా వేరే మార్గం వుండదు. కానీ, రాముడు తన ఇష్టంతోనే ఆ పని చేశాడు – అని రాముణ్ణి కూడా దోషిని చెయ్యడం ఈ రచయితకి ఇష్టం లేదు. కానీ రాముడికి ఇష్టం లేకుండానే, గురువు ఆజ్ఞ ప్రకారమే ఆ పని చేశాడంటే, అది రాముడి పాత్రకి అవమానం కాదూ? – కానీ, రచయితకి ఇదంతా అక్కరలేదు. బ్రాహ్మణుల తప్పునే చెపుతున్నాననుకున్నారు. రాముడు శంబుకుణ్ణి చంపితే, అది రాముడు తప్పు కూడా అవుతుందని అర్థం కాలేదు.

రాముడు శంబుకుణ్ణి చంపడానికి ఆశ్రమంలోకి వెళ్ళిపోయిం తర్వాత శంబుకుడి శిష్యుడు వశిష్టుణ్ణి వెటకారం చేసే మాటలంటాడు. దానికి వశిష్టుడు కోపంగా, 'మీ శూద్రులందరూ ఒకటే' అనే అర్థంతో, "లంకను బుట్టిన వారందరూ రాక్షసులే. కొత్తలేమి యుండును?" అని ఈసడిస్తాడు.

దానికి మళ్ళీ శంబుకుడి శిష్యుడు – "మీరు చెప్పినది మాత్రం నిజము కాదు. లంకలో బుట్టిన విభీషణుడు రాక్షసుడు కాడు" అని జవాబు చెప్పాడు. ఈ శిష్యుడు దుష్ట పాత్ర కాదు. ఉత్తమ పాత్రే. శూద్రుల తరఫున, అంటే ద్రావిడుల తరఫున మాట్లాడే పాత్ర. ఈ పాత్ర, 'లంకలో అందరూ రాక్షసులే' అని (దుర్మార్గులనీ, నీచులనీ) ఒప్పుకుని, 'విభీషణుడు మంచివాడే గదా?' – అంటాడు.

రామస్వామిగారికి – లంకలో వాళ్ళందరూ నీచులై, విభీషణు డొక్కడూ మంచి వాడయ్యాడు!

"లంకలో పుట్టిన వాళ్ళందరూ రాక్షసులే" అని వశిష్ఠుడు అన్నప్పుడు, ఇవతలి పాత్ర, ద్రావిడుల ఆత్మ గౌరవాన్ని నిలిపే జవాబు ఏదైనా చెప్పాలి. అలా చెప్పకుండా పైగా 'అందరూ రాక్షసులే గానీ విభీషణుడు మంచివాడే' అనడమా జవాబు? ఏదో జవాబు చెబుతున్నామనే సంబరమే గానీ, ఆ జవాబుకి ఏం అర్థం వస్తుందో, అది ఎవరి పక్షానికి అనుకూలంగా ఉంటుందో రచయితకి ఆలోచనే లేదు.

తర్వాత శ్రీరామచంద్రుడు శంబుకుడి దగ్గిరికి వెళ్ళి కత్తి ఎత్తాడు – "దక్షిణ బాహుదండమా! (కుడి చెయ్యీ!) పూర్ణ గర్భిణి అయిన కులకాంతను నిర్దయగా అడివికి పంపించగలిగిన నీకు (కుడి చెయ్యే పంపింది గావున్ను సీతని అడవికి), ముని శేఖరుడైతే మాత్రం ఒకని ప్రాణం తియ్యడం దుర్భరమౌతుందా? జాలి కలుగుతుందా? (చేతికి జాలి!)" – అని వాపోయాడు.

చివరికి ఎలాగైనా కథ జరక్క తప్పదు కాబట్టి, అంత మంచి రాముడూ స్మృతుల్ని జ్ఞాపకం చేసుకుని – "....శంబుకుని రామచంద్రుడు జంపుచుండె" అని తన పేరుని తనే గొప్పగా చెప్పుకుంటూ, కత్తితో శంబుకుడి తల నరికేశాడు!

అంతకు ముందు "నీ ఇష్ట ప్రకారం తపస్సు చేసుకో" అని అభయమిచ్చిన రాముడు, ఆ మాట తప్పి ఈ పని చేశాడంటే, ఆ పాత్ర ఎంత నీచమైన పాత్ర!

వాల్మీకి – రాముడు, వర్ణాశ్రమ ధర్మాలు కాపాడడం తన ధర్మంగా భావించి, తను నమ్మిన పని తన ఇష్టంతో చేశాడు.

రామస్వామిగారి – రాముడు ఇతరులకు కీలు బొమ్మ అయిపోయి తనకేమీ ఇష్టంలేని పని చేసిన అసమర్థుడు అయ్యాడు.

రామస్వామిగారు, వాల్మీకి రాముణ్ణి తీర్చిదిద్ది మరింత ఉత్తముణ్ణి చెయ్యాలని చూశారుగానీ, అయ్యవార్ని చెయ్యబోతే కోతి అయింది. ఈ రాముణ్ణి, వేదాల మోహం, శాస్త్రాల మోహం ఎరగని వాణ్ణి చేశారు! మంత్రుల చేతుల్లో, పురోహితుల చేతుల్లో, గజ గజ వొణికే పిరికి పందని చేశారు! అన్న మాట నిలుపుకోలేని అబద్ధీకుణ్ణి చేశారు!

ఇదంతా – రాముణ్ణి మహోత్తముణ్ణి చేసి, తప్పంతా బ్రాహ్మల మీదికి నెట్టాలని చూడడం వల్లనే. వర్ణ భేదాల్ని వుంచి, శూద్రుల్ని సేవకులుగా వుంచడంలో రాముడికేమీ ఆసక్తి లేదా? స్వార్థం లేదా? శంబుకుణ్ణి చంపడంలో, బ్రాహ్మలతో పాటు రాముడు కూడా సమాన భాగస్థుడు కాడా? 'శంబుక వధ' అని పేరు పెట్టి, శంబుకుడికి అనుకూలంగా రాయడం అంటే, శూద్రుల హక్కుల కోసం రాయడమే కదా? కానీ, ఈ రచయిత, తన రచన పేరు అలా పెట్టినా, అందులో చేసిందంతా ఆర్య రాజుల భజనే! చూపించిందంతా శ్రీరామభద్రుడి పాదాలకు దాసోహమే!

శంబుకుణ్ణీ సమర్థించడమే; శంబుకుణ్ణి చంపిన వాణ్ణీ సమర్థించడమే!

ఇంత వరకూ, 'శంబుక వధ' నాటకం సంగతి అయింది.

**రా**మస్వామిగారు, ఈ నాటకానికి రాసిన పీఠికలో, ఇంకా కొన్ని విషయాలు చర్చించారు. వాటిలో ఒకటి

రెండు విషయాలు కూడా ఇక్కడ చూడాలి.

హనుమంతుడు సీతని వెతకడం కోసం, కిష్కింధలో బయల్దేరి సముద్రం మీద 100 యోజనాలు ఎగిరి, లంకకి వెళ్తాడు కదా? – దీని మీద పండితులు తెగ చర్చలు చేశారు. ఈ చర్చలేమిటో చూస్తే, ఈ పండితులు ఒక మైతాలజీ కథని ఎంత వివేకంగా అర్థం చేసుకున్నారో తెలుస్తుంది.

హనుమంతుడి ఎగురుడు గురించి పండితులు చర్చించిన విషయాలేమిటంటే: హనుమంతుడు దాటిన సముద్రం ఏది? రావణుడి లంక, ఇప్పుడు భారత దేశానికి దక్షిణంగా ఉన్న శ్రీలంకేనా? శ్రీలంకకీ భారత దేశానికీ 100 యోజనాల దూరం ఉందా? ఇలాంటి విషయాలు. రామస్వామిగారు కూడా ఈ విషయాలు చర్చించారు.

అసలు, ఈ పండితులందరూ మైతాలజీ కథలో ఉన్న కల్పనల్ని కల్పనల్లాగ చూడరు. అవన్నీ నిజంగా జరిగిన వాస్తవ సంఘటనలు అయినట్టూ, ఆ కథ అంతా 'ఒక చరిత్ర' అయినట్టూ చూస్తారు. ఆ కథలో చెప్పిన ప్రదేశాలన్నీ ఎక్కడెక్కడ ఉన్నాయో కనిపెట్టాలని ప్రయత్నిస్తారు. ఆ ప్రదేశాల మధ్య దూరాలు కవి చెప్పినట్టే ఉన్నాయో లేదో లెక్కలు కడతారు. ఆ లెక్కలు తమ వాదనలకు తగ్గట్టుగా సరిపోతే "కవి చక్కగా చెప్పాడు" అంటారు. ఆ లెక్కలు సరిపోకపోతే, "కవికి ఆ ప్రదేశాల గురించి సరిగా తెలియలేదు" అంటారు. మొత్తం మీద ప్రతీ సంఘటనలోనూ కవి చెప్పిన వాటిలో నించి కొన్నిటిని తీసుకుని, కొన్నింటిని వదిలేసి, చర్చని చివరికి గందరగోళంలోకి ఈడ్చి అక్కడ ఆపుతారు. కానీ, ఒక మైతాలజీ కథలో ఉన్న ప్రతీ కల్పననీ, అందులో ఉన్న వర్ణనల ప్రకారం వెతకడం మొదలుపెడితే, అది గొప్ప పరిశోధన అవదు. ఎక్కడా ఏమీ దొరకదు.

బంగారు లేడిని తీసుకోండి! అది – కల్పన. కథలో ఆ లేడి ఏం చేసింది? దాని పాత్ర ఏమిటి? రావణుడు సీతని ఎత్తుకుపోడానికి అది సాయపడింది. ఆ కల్పనని వాస్తవంలోకి మార్చుకుంటే, ఆ లేడి చేసిన పని ఒక మనిషి చెయ్యాలి. మారీచుడు అనే మనిషి, ఏదో ఒక పద్ధతిలో, రాముణ్ణి పర్ణశాలకి దూరంగా తీసుకుపోతే తర్వాత కథ ఎప్పటిలాగే జరుగుతుంది. (అడవిలో ఫలానా చోట చాలా బలిసిన జంతువులెన్నో వున్నాయని మారీచుడు చెప్తే రాముడు తప్పకుండా అటు పరిగెత్తుతాడు. తర్వాత రాముడి కంఠంతో మారీచుడు అరిస్తే, లక్ష్మణుడు కూడా అటు వెళ్తాడు. కథ ఎప్పట్లాగే జరుగుతుంది.)

ఏ కల్పనని అయినా ఇలాగే వాస్తవంలోకి మార్చవచ్చు.

జటాయువు సంగతి తీసుకోండి! కథలో అది ఒక బ్రహ్మాండమైన పక్షి. రావణుడు సీతని ఎత్తుకు పోయే టప్పుడు. ఈ పక్షి నిర్వహించిన పాత్ర, రావణుడితో యుద్ధం చేసి గాయపడి, అసలు సంగతి రాముడికి అందించి కన్నుమయ్యడం.

ఈ పక్షిని, ఒక మనిషిగా ఊహిస్తే, జటాయువు, ఒక ఆటవికుడు. రాముడి పర్ణశాలకి కాపలాగా వుంటాడు. రావణుడితో పోట్లాడి, గాయపడి ఆ సంగతి రాముడికి అందించి చచ్చిపోతాడు.

ఇలాగే, హనుమంతుడు సముద్రం దాటడానికి సంబంధించిన ప్రశ్నలన్నిటినీ కూడా వాస్తవానికి మార్చుకోవచ్చు. కథ ప్రకారం, హనుమంతుడు దాటిన సముద్రం వెడల్పు 100 యోజనాలు. ('యోజనం' అంటే ఎంత దూరమో ఎవరికీ తెలీదు. అది మైతాలజీ భాష. దాన్ని ఇప్పటి అర్థంలో 'ఆమడ' అనవచ్చు అంటున్నారు. ఆమడకి 8½ మైళ్ళు అట. అంటే, 100 యోజనాలు = 850 మైళ్ళు. ఈ దూరాన్ని, కథ ప్రకారం, యోజనాల లెక్కతోనే మాట్లాడుకోవాలి.)

హనుమంతుడు, సీతని వెతకటానికి బైల్దేరేటప్పుడు, సుగ్రీవుడు చెప్పే భూగోళ వివరాల ప్రకారం – వింధ్య పర్వతాలూ, వాటి తర్వాత దక్షిణాపథం, దాని తర్వాత సముద్రం, దాని తర్వాత లంకా – ఇలా, భారతదేశపు దక్షిణ ప్రాంతంగా తోచే వివరాలే వస్తాయి. అందుకే, పరిశోధకులు, 'లంక' కోసం, భారతదేశపు దక్షిణ ప్రాంతం నించి వెతకడం ప్రారంభించారు.

రామాయణాన్ని చరిత్రగా నమ్మే భక్తులు, భారత దేశానికి దక్షిణంగా వున్న శ్రీలంకనే రావణుడు పాలించిన లంకగా నమ్ముతారు. ఈ ప్రకారం చూస్తే, ఈ రెండు దేశాల మధ్య ఇప్పుడు ఉన్న హిందూ మహా సముద్రమే హనుమంతుడు దాటిన సముద్రం అవుతుంది.

కానీ, దీన్ని కొందరు విమర్శకులు ఒప్పుకోరు. ఎందుకంటే, భారతదేశానికీ శ్రీలంక దేశానికీ మధ్య సముద్రం వెడల్పు 23½ మైళ్ళే. దీన్ని యోజనాల లెక్కతో చూస్తే, 3 యోజనాలు కూడా కాదు. కానీ, హనుమంతుడు దాటిన సముద్రాన్ని కవి, 100 యోజనాలుగా చెప్పాడు. కాబట్టి, ఇప్పటి శ్రీలంకనే రావణుడి లంకగా భావించడానికి వీలులేదని ఈ విమర్శకుల వాదం.

అంటే, ఈ విమర్శకులు, కవి చెప్పిన '100 యోజనాల దూరాన్ని' యధాతథంగా నమ్ముతారు.

కవి చెప్పిన 'దక్షిణ సముద్రంలో లంక'ని నమ్మరు. అంటే, వీరి అభిప్రాయం ఏమిటంటే – 100 యోజనాల వెడల్పు గల సముద్రం ఏ రెండు ప్రదేశాల మధ్య ఉంటుందో కనిపెట్టి, అలాంటి ప్రదేశాలు దొరికితే, "ఇదే కవి చెప్పిన సముద్రం. దీనికి ఒక వేపు ఉన్నది కిష్కింధా, ఇంకో వేపు ఉన్నది లంకా" అంటారన్న మాట!

మరి ఆ సముద్రం, వింధ్య పర్వతాలకు ఎటువేపు దొరుకుతుందో చెప్పలేము. అది, దక్షిణం వేపునే దొరకాలి. మళ్ళీ అదో సమస్య!

అసలు కవి చెప్పిన '100 యోజనాల దూరాన్ని' యథాతథంగా నమ్మడం ఎందుకు? దాన్ని నమ్మితే, దశరథుడి 60 వేల సంవత్సరాల వయసునీ, రుషుల వేల కొద్దీ సంవత్సరాల తపస్సుల్నీ కూడా నమ్మాలి కదా? బంగారు లేడీ, జటాయు పక్షీ, విరాధుడూ, కబంధుడూ – అన్నిటినీ నమ్మాలి కదా? కథలో బంగారు లేడి ఉంది కాబట్టి, ఆ ప్రదేశంలో అలాంటి లేళ్ళ కోసం వెతికితే దొరుకుతాయా?

సముద్రం వెడల్పు గురించి ఇంకో వాదం ఇలా ఉంటుంది: వీరికి కవి చెప్పిన '100 యోజనాల దూరం' మీద నమ్మకం లేదు. 'లంక' అనే పేరుగల ప్రదేశం మీదే నమ్మకం ఉంది. రావణుడు, దక్షిణ సముద్రంలో వున్న లంకని పాలించాడు – అని కవి చెప్పాడు కాబట్టి, ఇప్పటి శ్రీలంకనే ఆ నాటి రావణుడి లంకగా వీరు నమ్ముతారు. అయితే, 100 యోజనాల సముద్రం మాటేమిటి? అది ఇక్కడ లేదు కదా? దీనికి వీరేం చెపుతారంటే, 'కవికి దక్షిణాపథం గురించి సరిగా తెలియక అక్కడి సముద్రం అంత వెడల్పు ఉందనుకున్నారు' అని చెపుతారు.

రామస్వామిగారు ఈ రెండో రకం వాదమే చేస్తారు. ఈయన '100 యోజనాల్ని' నమ్మరు. ఇప్పటి శ్రీలంకనే రావణుడి లంకగా నమ్ముతారు.

ఈయన, 100 యోజనాల దూరాన్ని ఎందుకు నమ్మటం లేదు? ఎందుకంటే, 'అది కల్పన' అని కాదు. దశరథుడి 60 వేల సంవత్సరాల వయసుని నమ్మం కదా? ఈ దూరాన్ని నమ్మకపోవడం, అలాగ కాదు. మరి ఎందుకు? ఎందుకంటే, శ్రీలంకనే రావణుడి లంకగా నమ్ముతున్నారు కాబట్టీ, అక్కడ 100 యోజనాల సముద్రం లేదు కాబట్టీనూ.

ఈయన ఏమంటున్నారో చూడండి: "లంకా ద్వీపము హిందూ దేశమునకు నెనిమిది వందల యాబది మైళ్ళదూరము నందుండవలయును. (యోజనానికి 8½ మైళ్ళ లెక్కన, 100 యోజనాలకు 850 మైళ్ళు కాబట్టి.) కాని, అట్లు లేక, అది ఇరువది మూడున్నర మైళ్ళ దూరములో నున్నది. ఈ తారతమ్యమును సమర్థించుటెట్లు? .... వాల్మీకి మహాముని దక్షిణా పథము నెరుంగని వాడగుటచే, వారి వలన, వీరి వలన విని, పొరపడి యుండునని చెప్పి, రామభక్తులకు గోపము రగుల్పవలసి వచ్చినందుకు మిగుల చింతించుచుంటిమి." ('శంబుక వధ' పీఠికలో)

అంటే, రావణుడి లంక, ఇప్పటి శ్రీలంకేనట! కవికి, హిందూ దేశానికీ లంకకీ ఉన్న దూరం గురించి తెలీక, వాళ్ళ వల్లా వీళ్ళ వల్లా విని, ఆ దూరాన్ని 100 యోజనాలు అని రాశాడట!

ఆ దూరం గురించి వాల్మీకికి తెలిసి ఉంటే, ఆయనకి చెప్పిన వాళ్ళు సరిగా చెప్పివుంటే, ఆయన, 23½ మైళ్ళ దూరాన్నే రాసేవాడా? 100 యోజనాల గురించి రాసేవాడు కాడా? – ఇది ఎంత తెలివి మాలిన వాదమో ఎంత తెలివిమాలిన వాళ్ళకైనా తెలిసి ఉండాలి. మరి, వీరికి ఎందుకు తెలియలేదో ఆశ్చర్యంగా వుంది.

వాల్మీకికి 23½ మైళ్ళ సంగతి తెలిసినా, అది రాసేవాడు కాదు. అప్పుడు కూడా 100 యోజనాల దూరాన్నే రాసేవాడు. ఎందుకంటే, హనుమంతుడు 'మహావీరుడ'నే సంగతి చెప్పడం కోసం కల్పనగా సృష్టించిన ఘట్టం అది. సముద్రం ఎవరు దాటగలరు? – అనే ప్రశ్న వొచ్చినప్పుడు, కొందరు వానరులు, 10 యోజనాలు దాటగలం అంటారు. కొందరు '20 యోజనా' లంటారు. కొందరు 30. కొందరు 40. ఈ రకంగా జాంబవంతుడు 90కి చేరతాడు. అంగదుడు 100 యోజనాలూ దాటగలను గానీ, తిరిగి రాలేను అంటాడు. చివరికి హనుమంతుడు ఒక్కడే 100 యోజనాలూ దాటి, తిరిగి రాగల వీరుడిగా తేలతాడు. ఇలాంటి ఘట్టాన్ని వాల్మీకి, కేవలం '23½ మైళ్ళు' అనే సంగతి తెలీకే రాశాడా? తెలిస్తే, హనుమంతుడితో 23½ మైళ్ళు మాత్రమే ఎగిరిస్తాడా? (23 మైళ్ళెగిరిన భాగ్యానికి హనుమంతుడు ఏం గొప్ప వీరుడవుతాడు?) 23½ మైళ్ళ వాస్తవాన్ని పాటించవలసి వొచ్చినప్పుడు, కవి, ఆ 'ఎగిరించడం' కూడా మానుకుని, దాన్ని కూడా వాస్తవ ప్రయాణంలోకే దించాలి కదా?

ఈ దూరం గురించి అయితే, తెలీక 100 యోజనాలని రాశాడనుకుందాం. మరి 'ఎగరడం' సంగతి కూడా తెలీకే రాశాడా? కోతులు మాత్రం అంత దూరం ఎగురుతాయా? రాజులూ రుషులూ వేలకొద్దీ సంవత్సరాలు జీవించినట్టు రాశాడు కదా? అవన్నీ కూడా తెలీకే

రాశాడా? లోకజ్ఞానంతో ఎంతో స్పష్టంగా తెలిసే విషయాల్ని కూడా సహజ విరుద్ధంగా ఎందుకు రాశాడు? ఇవన్నీ తెలియక కాదు. అది, కట్టుకథల పద్ధతిలో చెప్పే రచనా విధానం. దానికి కావలసిన విషయం, నిజ జీవితాల్లో నించే వస్తుంది. దాన్ని చెప్పే విధానం మాత్రం కల్పనగా ఉంటుంది.

హనుమంతుడు సముద్రాల మీద ఎగిరి దాటగలిగే మహా వీరుడు – అనేది కల్పన. ఈ కథలో, సముద్రం వెడల్పు 100 యోజనాలు – అనేది ఇంకో కల్పన. ఈ రెండు కల్పనలకూ సరిపోతుంది. ఇక్కడ 23½ మైళ్ళని తీసుకొచ్చి వాదించడం శుద్ధ తెలివి తక్కువ.

కవి చెప్పిన బంగారు లేళ్ళనీ, జటాయు పక్షుల్నీ వెతికితే అవి ఎక్కడా కనపడనట్టే, కవి చెప్పిన దూరాల్నీ స్థలాల్నీ సముద్రాల్నీ దేవతల్నీ రాక్షసుల్నీ కిన్నెరల్నీ కింపురుషుల్నీ వెతికితే, అవన్నీ ఎక్కడా కనపడవు.

"కవికి తెలీకే ఇలా రాశాడు, అలా రాశాడు" అని వాదించే ఈ నాటి పండితులకే ఏమీ తెలీదు. ఈ నాటి పండితుల నించీ, ఆ నాటి కవి నేర్చుకోవలిసిందేమీ కనపడడం లేదు.

ఈ సమస్య అప్పుడే అయిపోలేదు. కవి చెప్పిన 'దక్షిణ సముద్రం' సంగతి ఇంకా తేల్చుకోవాలి.

## హనుమంతుడు దాటిన సముద్రం ఏది?

సీతని వెతకడానికి దక్షిణం వేపు బయల్దేరిన వానరులు, స్వయంప్రభ బిలంలో జొరబడి, మళ్ళీ బయట పడ్డప్పుడు, వింధ్య పర్వత పాదాన నిలబడ్డారు. అక్కడే దూరంగా కెరటాలతో పొంగుతూ ఉన్న సముద్రాన్ని చూశారు. ఆ వింధ్య పర్వతాల దగ్గిరే అంగదుడు చచ్చిపోతానని పడుకున్నాడు. (ఇదంతా ఈ పుస్తకంలోనే ఒక లింకులో వుంది.) అక్కడికే సంపాతి వచ్చి, 'సీత లంకలో ఉందని చెప్పాడు. అప్పుడు వానరులందరూ సముద్రం వేపు బయల్దేరారు. హనుమంతుడు అక్కడి నించి ఎగిరాడు – ఇదంతా వింధ్య పర్వతాల దగ్గిరే!

వింధ్య పర్వతాల దగ్గిర సముద్రం ఉండటం ఏమిటి? పోనీ అది పడమటి దిక్కు సముద్రమా? (ఇప్పటి అరేబియా సముద్రమా?) హనుమంతుడు పడమటి సముద్రం అంచున వింధ్య దగ్గిర బయల్దేరి, భారతదేశానికి పడమటి అంచు వెంట సముద్రంలో ప్రయాణం చేసి, పడమర నించి దక్షిణానికి తిరిగి, లంక చేరాడా?

కానీ, అలా అనుకోవటానికి వీల్లేదు. ఎందుకంటే, కవి, చాలా ఖచ్చితంగా, 'వానరులు అప్పుడు (హనుమంతుడు బయల్దేరే ముందు) దక్షిణ సముద్రపు ఉత్తరం గట్టున నిలబడ్డారు" అని చెప్పాడు. దక్షిణ సముద్రం అంటే ఇప్పటి హిందూ మహా సముద్రమే అయితే, అది వింధ్య పర్వతాల దగ్గిర ఉండటం ఏమిటి? వింధ్య పర్వతాల నించీ, దక్షిణం వేపు లంక వరకూ, మధ్యలో అంతా సముద్రమేనా? మరి వింధ్య పర్వతాల తర్వాత ఉండవలసిన 'దక్షిణాపథం' మాటేమిటి?

రామస్వామి చౌదరిగారు – హనుమంతుడు భారత దేశంలో పూర్తిగా దక్షిణానికి వెళ్ళి (అంటే ఈ నాటి కన్యాకుమారికి అనుకోవచ్చు. అక్కడికి వెళ్ళి) అక్కడ నించి లంకకు ప్రయాణ మయ్యాడనే అభిప్రాయంతోనే చర్చించారు. కానీ కథ ప్రకారం అది పొరపాటు. కథలో హనుమంతుడు వింధ్య పర్వతాల దగ్గిరే ఎగిరాడు. సముద్రం వెడల్పుని అక్కడి నించే లెక్క కట్టాలి. ఈ సంగతి గమనించకుండానే హిందూ దేశానికీ, లంకకీ మధ్య దూరం గురించి ఎలా చర్చిస్తాం? వింధ్య దగ్గిర దక్షిణ సముద్రం ఏదీ లేదు. దక్షిణ సముద్రం అనేది, కన్యాకుమారి దగ్గిరే వుంది. కానీ, హనుమంతుడు వింధ్య దగ్గిరే ఎగిరాడు. అలా ఎగిరి లంక మీద వాలాడు.

హనుమంతుడు, పర్వతాల మీద నిలబడి, ఆ ఎత్తు మీద నించి ఎగరాలి కాబట్టి, కవి, ఈ ఘట్టాన్ని వింధ్య దగ్గిరి నించే ప్రారంభించాడు. హనుమంతుడు ఎగిరినప్పుడు ఈ పర్వతాలు భూమిలోకి చొచ్చుకు పోతాయి. నీళ్ళ ధారలు పైకి ఉబుకుతాయి. ఇక్కడ బోలెడు వర్ణన ఉంటుంది. ఇదంతా కథకి అవసరం.

వింధ్య దగ్గిరే సముద్రం ఉందని, దాని కోసం వెతికితే, అది కనపడదు. కల్పనల్లో కనపడే ప్రదేశాలూ నదులూ సముద్రాలూ, వాస్తవంలో యథాతథంగా దొరకవు.

రామస్వామిగారు దక్షిణ సముద్రం కోసం చేసిన పరిశోధన అంతా వృథా అయింది. తన పరిశోధన వల్ల, 'రామ భక్తులకు కోపము రగుల్పవలసి వచ్చింది' అంటారు. కానీ, ఈయనా రామభక్తులే కదా? శంబుకుణ్ణి చంపిన నేరం అంతా బ్రాహ్మణుల మీదకే తోసి, రాముడి మీద, ఈగని కూడా వాలనివ్వలేదు కదా? ఇంత కన్నా రామభక్తులెవరు?

**ఈ పండితులు ఇంత అజ్ఞానంలో, ఇంత మూర్ఖత్వంలో, ఇంత అడ్డగోలుగా ఎందుకు వున్నారో, దాని మీదే అసలైన పరిశోధన జరగాలి!** ★

# 5. సురవరము ప్రతాపరెడ్డి గారి "రామాయణ విశేషములు"★

ఈయన వాల్మీకి రామాయణానికి పూర్తిగా అనుకూల విమర్శకులు. రామాయణ కథలో ఎన్నెన్నో అందచందాలూ, నిజాలూ, విశేషాలూ వున్నాయని నమ్ముతూ వాటన్నిటినీ వివరించే లక్ష్యంతో, ఈ రచన చేశారు. దాదాపు అంతా రామభక్తుల వాదమే. 'వాలి వధ' లాంటి ఒకటి రెండు ఘట్టాలలో మాత్రమే కొంత వ్యతిరేక విమర్శ' అదీ వాల్మీకి గౌరవానికీ, శ్రీరాముడి గౌరవానికీ భంగం కలగని పద్ధతిలో వినయంగా చేశారు.

'రామాయణం – 'జరిగినదే' అని ఈయన అభిప్రాయపడ్డారు – "నా అభిప్రాయములో శ్రీరాముడు కల్పిత పురుషుడనుటకు ప్రబలాధారములు కాన రావు. రామాయణములోని ప్రధాన ఘట్టములు జరిగిన వనియే విశ్వసింప వీలు కలదు" అన్నారు. (పే. 1) 'ఈ కథ జరగలేదు' అనడానికి ఆధారాలు లేవట! అలాంటి ఆధారాలు లేవు కాబట్టి, 'ఈ కథ జరిగింది' అని విశ్వసించడానికి వీలుందట!

'ఆధారాలు' అనేవి, ఎప్పుడు ఉంటాయి? దేనికి ఉంటాయి? ఏదైనా ఒక విషయం జరిగినప్పుడు ఉంటాయి. జరిగిన దానికే ఉంటాయి. అవే ఆ విషయం జరిగినట్టుగా రుజువు చేస్తాయి. ఆ విషయమే జరగక పోతే, జరగని దానికి, ఆధారాలేమిటి? అవి ఎక్కడి నించి వస్తాయి? అంటే, ఆధారాలు అనేవి, జరిగిన విషయాలకే ఉంటాయి – అని మొదట అర్థం చేసుకోవాలి. ఒక విషయం జరిగిందా లేదా – అని తెలుసుకోవాలంటే, కొన్ని ఆధారాలు కనపడాలి. ఆ ఆధారాల వల్ల, అది జరిగినట్టుగా రుజువైతే, 'జరగ లేదు' అనే వాదం వీగిపోతుంది. అంటే రామాయణం జరిగినదో కాదో తెలుసుకోవాలంటే, 'జరిగింది' అనే వాళ్ళే దానికి ఆధారాలు చూపించాలి. ఆ ఆధారాలు సరిగా ఉన్నాయో లేవో, రెండో పక్షం వాళ్ళు పరిశీలిస్తారు. అంతేగానీ, ఆధారాలు చూపించి రుజువు చెయ్యవలసిన అవసరం రెండో పక్షం వాళ్ళకు ('అది చరిత్ర కాదు' అనే వాళ్ళకు) ఉండదు. భక్తులు, రామాయణం జరిగిందని రుజువులు చూపించలేరు. కాబట్టి, ఇక వాళ్ళుచేసే మొండి వాదం ఏమిటంటే, రామాయణం 'జరగలేదనడానికి రుజువు లేమిటి, అవి చూపించండి. లేకపోతే జరిగినట్టే' అంటారు. ప్రతాపరెడ్డిగారి వాదం ఇదే. తన వాదాన్ని రుజువు చెయ్యలేక, ఎదటి వాదం వోడిపోతే దాని సాయంతో నెగ్గాలని చూడడం అన్నమాట ఇది!

"రాముని ఉత్తమోత్తమ గుణ సంపదను బట్టి హిందువులతనిని దేవునిగా పూజించుచున్నారు. అందు చేత అతని చరిత్రకు సంబంధించిన విషయాలను మానవాతీతములైనవిగా వర్ణించి పెంచి వ్రాసినారు."

(పే – 1)

'రామాయణం' అనేది జరిగినదేననీ, అది 'చరిత్ర' అనీ, ఈయన అభిప్రాయం. కానీ, అసలు ఇది జరిగిందా లేదా అనేది చర్చనీయాంశం కాదు. అందులో వున్న విషయాలే ప్రధానం.

"రామాయణము ఆర్యుల కాదర్శ గ్రంథము. అందలి ఉత్తమ పాత్రలన్నియు మన కాదర్శ పాత్రములే." (మనం ఆర్యులమైతేనా, ద్రావిడులమైతే కూడానా?)

"రాముని వంటి రాజు, సీత వంటి భార్య, హనుమంతుని వంటి బంటు, లక్ష్మణుని వంటి సోదరుడు, భరతుని వంటి భక్తుడు, సుగ్రీవుని వంటి స్నేహితుడు, దశరథుని వంటి కరుణామయమూర్తి, ప్రపంచ వాఙ్మయములో నెందుకు సృష్టి కాలేదు?" – (ఇటువంటి పాత్రలు లేని ఆ వాంగ్మయం ఎంత ఉత్తమమో కదా?)

ప్రతాపరెడ్డిగారు హిందూ సమాజంలో ఉన్న అస్పృశ్యతనీ, కుల భేదాలనూ కొంచెం వ్యతిరేకించి, అటువంటి సమాజంలో కూడా నీతి నిలబడడానికి కారణం ఏమిటో ఇలా చెప్పారు– "వెయ్యేండ్ల నుండియు పరాధీనతయే సంప్రాప్తమైనను, హిందువులలో నేటికిని

★ సురవరము ప్రతాపరెడ్డి, 'రామాయణ విశేషములు'. 'విభూతి' నుండి పునర్ముద్రితము. హైదరాబాదు: గోలకొండ పత్రికా కార్యాలయము, 1943. ★

విశేషముగా ధార్మిక గుణాలు వ్యక్తమగుచున్నవంటే దానికి కారణము శ్రీమద్రామాయణమే. చదువు రాని వారికిని, స్త్రీలకును, అస్పృశ్యబ్రువులకును, తక్కువ కులాలనబడు వారికిని, బోధ చేయు దిక్కు లేని సంప్రదాయములో, నీతి వర్తనము పుట్టుకొని వచ్చినదంటే, అది శ్రీమద్రామాయణ మహత్త్యమే" (పే - 6)

"…. రామాయణ మూల గ్రంథ రచనయు, రాముని యునికియు, వాల్మీకి కాలమును, క్రీ.పూ. 1400 కంటే పూర్వముదనియు, బహుశా క్రీ. పూ. 2500 ఏండ్ల నాటిదనియు, నేను అభిప్రాయపడు చున్నాను." (పే - 23)

ఈ రచనలో ప్రతాపరెడ్డిగారు - వాల్మీకి రామాయణంలో ప్రక్షిప్తాలూ, వాల్మీకి కాలం, రాముడి కాలం, రామాయణ భాష, కథలో ముఖ్యఘట్టాల కాలాలు, రామాయణ కాలపు సాంఘికాచారాలు, ఆ నాటి ప్రయాణ సాధనాలు, యుద్ధ తంత్రాలు, ఆర్యావర్తం, లంక - కిష్కింధ - వంటి స్థలాల పరిశీలన, అనార్య జాతులు - మొదలైన అంశాల గురించి తమ అభిప్రాయాలేమిటో వివరంగా చర్చించారు.

రామాయణ కథ పొడుగునా పరస్పర విరుద్ధంగా కనపడే అంశాల్లో ఏదో ఒక దాన్ని ప్రక్షిప్తాలలోకి తోసేసి, ఎక్కడి కక్కడ వాల్మీకి గౌరవం కాపాడడానికే ప్రయత్నించారు ఈయన కూడా.

రాముడి జన్మ కాలాన్నీ, గ్రహాల స్థితిగతుల్నీ నిర్ణయించడంలో ఏదో తప్పు ఉందట. వాల్మీకి అయితే ఇంత తప్పు చేస్తాడా? మరి ఈ తప్పెలా జరిగింది? వాల్మీకి మాత్రం చేసి వుండడు. ఎవడో తర్వాత కాలపు కవి మూర్ఖుడి పనే ఇది! ప్రతీ చోటా ఈయన అభిప్రాయం ఇదే. "రామాయణమందు వాల్మీకి పలు తావుల జ్యోతిశ్శాస్త్ర విషయముల నుదహరించినారు. మరి ఇచ్చట ఇంత విపులముగా వర్ణించ ఏల తప్పిపోయెను? ఇది ప్రక్షిప్తమేనా? ఆధునిక జ్యోతిష్కులు నిర్ణయింతురు గాక!" అన్నారు. (పే. 40) - వారు మాత్రం ఏం నిర్ణయిస్తారు లెండి. వారేమంటారంటే - 'రాముడి జన్మకాలాన్ని చెప్పడంలో అంత తప్పు వచ్చిందంటే, అది ప్రక్షిప్తంగాక ఇంకేమౌతుంది? వాల్మీకికి జ్యోతిశ్శాస్త్రం రాదా ఏవిటి?' - అంటారు. బాగానే ఉంది గానీ మరి ప్రక్షిప్తం ఆయనకేనా జ్యోతిశ్శాస్త్రం రానిది? అసలు ఏ శాస్త్రమైనా (అది శాస్త్రమే అయితే) అది తర్వాత కాలంలో ఇంకా ఇంకా అభివృద్ధి చెందుతూ వుంటుంది. ముందు కాలం వాళ్ళ కంటే తర్వాత కాలం వాళ్ళకే బాగా తెలుస్తూ వుంటుంది. ఈ జ్యోతిశ్శాస్త్రంలో తప్పులు, తర్వాత కాలం వాళ్ళకన్నా వాల్మీకికి చెయ్యడానికే ఎక్కువ అవకాశం ఉంటుంది.

రాముడి వయసు విషయంలో, ఈయన కౌసల్య మాటల్నీ, సీత తమ వయసుల గురించి రావణుడితో చెప్పే మాటల్నీ, ప్రస్తావించారు. ఈ రెండు అభిప్రాయాలూ ఒక దానితో ఒకటి కుదరడం లేదట! కాబట్టి అప్పుడేం చెయ్యాలి? ఒక దాన్ని ప్రక్షిప్తాల్లోకి తోసెయ్యాలి! ప్రతీ చోటా అదే చేశారు ఈయన "…. సీతాదేవి రావణునితో చెప్పిన మాటలు ప్రక్షిప్తములనియు, తర్వాత వారి కల్పన యనియు చెప్పవలెను." (పే. 40) చూశారా? ప్రతీ చోటా ప్రక్షిప్తాలే!

రామాయణంలో మాంసాహారం గురించీ, మాంసం వొండే విధానాల గురించీ, నిలవజేసే విధానాల గురించీ కథలో ఆధారాలతోనే వివరంగా చర్చించారు. - "ఈ విధముగా రామాయణమందు సర్వ వర్ణముల వారును మాంసమును పవిత్రమైనదిగా, రుచ్యమైనదిగా భావించి భుజించుచుండిరి …. ఆ కాలంలోని జనులు ఆవుల, ఎద్దుల, మేకల, అడవి పందుల, మనుబోతుల, దుప్పుల, నెమళ్ళను, కోళ్ళను, ఉడుముల, సొరచేపల, రొయ్యల, కుందేళ్ళను, తాబేళ్ళను, మరి ఇతర జంతువులను ఆసక్తితో తినుచుండిరని తెలియుచున్నది." (పే. 50) ఈ మాంసాలన్నీ తిన్నది బ్రాహ్మణులు కూడా! సర్వ వర్ణముల వారునూ!'

రాముడు వనవాసానికి పోతూ తల్లితో - "మాంసం విడిచి మునుల వలె కంద మూలాలు తింటూ జీవిస్తాను" అంటాడు. కానీ వనవాసంలో మాంసం తింటాడు. దీని వల్ల రాముడు అసత్యం చెప్పినట్టో, లేకపోతే వాల్మీకే పొరపాటు చేసినట్టో అవుతుంది కాబట్టి, ఈయన ఏమంటున్నారో చూడండి! - "దీనిని బట్టి రామాదుల మాంస భక్షణమో, లేక తద్వర్ణనమో, ఏదో యొక భాగము ప్రక్షిప్తమైనదనుట స్పష్టము" అంటున్నారు.

రాముడి కీర్తినీ, వాల్మీకి కీర్తినీ నిలబెట్టడానికి, అవసరమైతే ఏ కథా భాగాన్నయినా, ఎన్ని ఘట్టాలనయినా, ప్రక్షిప్తాలుగా తోసెయ్యడానికి ఈ పండితులు ఏమీ సంకోచించరు!

రామాయణంలో మాంసాహారం గురించి చెప్పిన ఘట్టాలలో దాదాపు అన్నీ రాముడికి సంబంధించినవే. రాముడు మాంసం తిననని తల్లికి చెప్పడం, సీత గంగ దాటుతూ సురా, మాంసం సమర్పిస్తానని మొక్కుకోడం,

గంగ దాటగానే జంతువుల్ని వేటాడడం, చిత్రకూటంలో కొత్త ఇంటికి జింక మాంసం నైవేద్యం పెట్టడం, భరతుడు వచ్చేముందు రాముడూ సీతా మాంసం ముక్కలు తింటూ కూర్చోడం, భరతుడికి భరద్వాజుడు మాంసాలతో విందు చెయ్యడం, పంచవటిలో సీత రావణుడితో తన భర్త మాంసం తేవడానికి వెళ్ళాడని చెప్పడం, కబంధుడు రాముడికి పంపలో చేపల సంగతి చెప్పడం, వాలి రాముణ్ణి 'కోతి మాంసం తినరు కదా, నన్నెందుకు కొట్టావ'ని అడగడం – ఈ రకంగా రాముడికి సంబంధించిన మాంసాహార ఘట్టాలు కథ పొడుగునా ఉన్నాయి. ఇవన్నీ ప్రక్షిప్తాలే అనుకుని వీటిని తీసేస్తే, రామాయణంలో ఇక మాంసం సంగతి కనపడే ఘట్టమే ఉండదు, అప్పుడు ప్రతాపరెడ్డిగారు "రామాయణ కాలంలో ఎవ్వరూ మాంసం తినే వారు కారు" అని నిర్ణయిస్తారు గావున్ను! ఎక్కడే తప్పు కనపడినా ప్రక్షిప్తాల మీదకి తోసేసే గుణం వొదిలించుకుంటేనే గానీ, ఎలాంటి విమర్శకులైనా రామాయణ రచన గురించి ఏమీ అర్థం చేసుకోలేరు.

రాముణ్ణి పూజించే ఈ రచయితకి, చాలా సహజంగానే కైక మీద చాలా వ్యతిరేకాభిప్రాయం. ఆమె తల్లిదండ్రుల మీద కూడా! కానీ కోసల రాజ్యం కైకకే హక్కని ఈయన కూడా అంగీకరిస్తారు. అయితే, కైక తండ్రి, దశరథుణ్ణి అతని రాజ్యం తన కూతురికి రావాలని అడగడమే తప్పు – అంటున్నారు. "దశరథుని రాజ్యమును ఓలిగా గొన్న కేకయ రాజు స్వార్థిగా కనబడుచున్నాడు. అతని బిడ్డకు ఆ గుణమే బాగా అబ్బెను" అంటారు. తండ్రి స్వార్థం, కూతురికి వచ్చిందట! (పే. 53.) వృద్ధుడైపోయిన దశరథుడు, చిన్న పిల్లని పెళ్ళి చేసుకోవడంలో మాత్రం స్వార్థమేమీ కనపడలేదు. ఆమె తండ్రి, ఆమె రక్షణ కోసం, కొంత ఏర్పాటు చెయ్యడంలో మాత్రం గొప్ప స్వార్థం కనపడింది ఈయనకి! కైక ఎంత దుర్మార్గురాలో చెప్పటానికి, 'ఆమె కొడుకే ఆమెని గురించి ఏమన్నాడో చూడండి' అంటూ, భరతుడి మాటలు రుజువుగా చూపిస్తున్నారు. దశరథుడు పోయాక, భరతుడి కోసం దూతలు వెళ్ళినపుడు, అయోధ్యలో సంగతులు తెలియకుండానే భరతుడు, తన తల్లి గురించి 'కోపిష్టీ, దుష్టురాలూ అయిన నా తల్లి ఎలా ఉంది?' అని అడుగుతాడే, ఆ మాటలు ఈయనకి చాలా నచ్చాయి! 'అయోధ్యలో సంగతులు తెలియకుండానే భరతుడికి తల్లి మీద అంత కోపం ఎందుకు రావాలి?' అనే ప్రశ్న మాత్రం ఈయనకు లేదు! పైగా, భరతుడి మాటలు ప్రక్షిప్తాలు కూడా కావు! ఈయన దృష్టికి అది వాల్మీకి రాసిన ఎంతో చక్కని ఘట్టమే. దాని మీద ఏ ప్రశ్నా లేదు.

కైక తండ్రి, దశరథుడికీ, భరతుడికీ ఇచ్చిన బహుమానాల్లో కుక్కలూ, గాడిదలూ, కంబళ్ళూ కూడా ఉన్నాయట! కుక్కల్నీ, గాడిదల్నీ, బహుమానాలుగా ఇచ్చే సాంప్రదాయం భారత దేశస్థులకు లేదట! కంబళ్లు ఇవ్వడం చలి దేశస్థుల లక్షణం అట! కాబట్టి, కవి చెప్పిన మార్గాన్ని బట్టి ఆలోచిస్తే, కేకయ రాజు దేశం, ఇరాన్ దేశం కావొచ్చునని ఈయన అభిప్రాయపడ్డారు. అంటే, కైక భారతదేశపు స్త్రీ కాదు కాబట్టే ఉత్తమురాలిగా ప్రవర్తించలేదనే ధ్వనితో ఈయన విమర్శ సాగింది. కైక మీద వ్యతిరేకాభిప్రాయం గల విమర్శకులందరూ ఇటువంటి విమర్శలే చేస్తారు. కైక ఏదో దూర దేశం స్త్రీ అయివుంటుందనీ, అందుకే అంత దుర్మార్గురాలనీ! మనకు దూరంగా ఉన్న దేశస్థులు దుర్మార్గులైతే, వారికి మనమూ దుర్మార్గులమే అవుతాము కదా? 'మన దేశమే గొప్పది. మనమే ఉత్తములం, మిగతా దేశస్థులు మన అంత ఉత్తములు కారు. పైగా దుర్మార్గులు కూడా' అనే అహంకారం నించి వచ్చిన వాదమే ఇది. కైకని ఎలా తిట్టాలో కారణం కనపడక – "దూర దేశం నించీ వచ్చింది. ఆ దేశాల ఆడవాళ్ళు అంతే. కొయ్య రకం!" అని ఏదో కారణం చెప్పి కసి తీర్చుకుంటారు. న్యాయబలం లేని వాళ్ళకే ఈ డొంక తిరుగుళ్ళన్నీ. ఇరాన్ దేశంలో కైక లాగ అంత ధైర్యస్థులైన స్త్రీలే ఉంటే, ఆ దేశం ఎంత గొప్పదో!

రాముడి ఏక పత్నీవ్రతం గురించి అందరూ చర్చించే విషయాలే ఈయన కూడా చర్చించారు – "దీనిని బట్టి రామునికి సీతయేగాక ఇతర భార్యలును ఉండిరనియు, భరతుడికి చాలామంది భార్యలు ఉండిరనియు, అర్థమగుచున్నది" అంటారు. ఇలా ఒకచోట అంగీకరించి, ఇంకో చోట "ఈ వర్ణన లన్నియు ప్రక్షిప్తము లనవలెనా? .... చెప్పజాలము. ఎట్లయితే నేమి పారంపర్యంగా వచ్చు జనాభిప్రాయ ప్రకారము రామ సోదరులు ఏక పత్నీవ్రతులనుటకే ఎక్కువ ప్రమాణము లున్నవనుటలో సందేహం లేదు'" అని ఆ సందేహాల్ని వదిలేశారు. (పే. 54)

రామాయణ కాలంలో స్త్రీలు చాలా స్వేచ్ఛా సుఖాలు అనుభవించారని ప్రతాపరెడ్డిగారి పరిశీలన! సీత వనవాసానికి వెళ్తోంటే అయోధ్య ప్రజలందరూ ఆమెని చూసి – "ఎవర్నయితే ఇంత కాలం ఆకాశంలో సంచరించే భూతాలు కూడా చూడలేకపోయాయో

అలాంటి సీత ఇప్పుడు అందరికీ కనపడుతోంది!" అను కున్నారట. ఆ సంగతి చెప్పి, 'ఏదో అలా చెప్పారే గానీ ఆ నాడు స్త్రీలకు అంత ఘోర స్థితి లేదు సుమండీ' అంటున్నారు – "ఆ కాలమందు రాజ స్త్రీలకు అంతః పుర వాసముండెను. అయితే, అట్లనుటచే వారు గోషాలో ఇరికి అసూర్యంపశ్యలై మగ పురుగునకు కన పడని వారై ఘోర స్థితి యందుండలేదు. వారి ఉత్తమ స్థానమునకు, గౌరవమునకు ఎంత అవసరమో అంత పాటి అంతఃపుర వాసమునే పాటించుచుండిరి" అన్నారు.

స్త్రీల గౌరవమునకు 'ఎంత అవసరమో అంతపాటి' అంతఃపుర వాసం! 'కొంత అవసరమే' అని ఈయన అభిప్రాయం. అది ఎంతో ఎవరు నిర్ణయిస్తారు? ఏ పద్ధతి మీద నిర్ణయిస్తారు? "భూతాలకు కూడా కనపడని సీత ఈ నాటికి కనపడింది" అని కవి చెప్పిన మాటల్ని ఎగరగొట్టారు. స్త్రీలని అంత గోషాలో ఉంచినట్టు కన పడితే రామాయణానికి కీర్తి కాదని గ్రహించారు. రామా యణం స్త్రీలని చాలా స్వేచ్ఛగా ఉంచినట్టు చెప్పాలని, "ఇంత కఠినముగా రాణివాసముండినట్లు కానరాదు" అన్నారు. కానవచ్చిందాన్ని తోసి పారేస్తారు. 'అబ్బే, రాణి వాసం అంత కఠినం కాదు' అంటారు.

రామాయణంలో, స్త్రీలు స్వేచ్ఛగా ఉన్నారనడానికి ఈయన ఒక ఉదాహరణ చూపించారు. రాముడు స్త్రీలకు ఎంతెంత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలిచ్చాడో చూడమని ఈ మాటలు చెప్పారు – "ఆపత్కాలములందు, కష్ట ములు సంభవించినప్పుడు, యుద్ధ భూములందు, స్వయం వరములందు .... స్త్రీలు, పురుషులకు అగ పడుట దోషము కాదు. పైగా భర్త సమీపమందుండి నపుడు అతని యనుమతి చొప్పున స్త్రీ ఇతరులకు కన పడవచ్చుననియు రాముడు చెప్పెను." (పే. 55.) చూశారా రాముడు ఎంత స్వేచ్ఛ ఇచ్చాడో! స్త్రీలు బయటికి కనపడేది పురుషులలాగ అన్ని సందర్భాల్లోనూ కాదు. ఫలానా ఫలానా సందర్భాల్లోనే! అది కూడా భర్త అనుమతితోనే! భర్త కూడా అక్కడ ఉన్నప్పుడే! ఇదంతా గొప్ప స్వేచ్ఛ – అని ఈయన అర్థం! ఈ అర్థంతోనే ఈయన, రామాయణ కాలంలో స్త్రీలు స్వేచ్ఛగానే ఉన్నారు – అని సూత్రీకరించారు. ఇక ఈయన అభి ప్రాయంలో 'కఠినమైన అంతఃపురవాసం' అంటే ఎలా ఉంటుందో!

రామాయణ కాలంలో బ్రాహ్మణులకు కొన్ని ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయని చెప్పారు.

వాటిలో ఒకటి – "రామాయణ కాలమందు వడ్డీ వ్యాపారము జరుగుచుండెను. అందు బ్రాహ్మణులు కూడా చేరి యుండిరి. వారి వ్యాపారానికి ప్రత్యేక సౌకర్య ముండెను. అది ఇతర వర్ణాలకు నిషిద్ధమై యుండెను. అప్పు తీసుకున్న వాడు దానిని చెల్లింపకుండినచో, అప్పిచ్చిన బ్రాహ్మణుడు, వాని ఇంటి గడప కడ్డముగా తన ముఖమును కప్పుకొని భుజింపకుండా ప్రాయోప వేశము చేసి భూమిపై పండు కొనుచుండెను. అప్పు చెల్లించు వరకు ప్రాయోపవేశము సాగుచుండును" (పే. 58) బ్రాహ్మణులు వడ్డీ వ్యాపా రాలు చెయ్యడం! అప్పులు తీసుకున్న వాళ్ళ ఇళ్ళ ముందు తిష్ట వేసి అప్పులు వసూలు చేసుకోడం! – ఇంత మంచి సదుపాయం ఇతర కులాలకు లేదనీ, బ్రాహ్మణులకే ఉందనీ, చెప్పి ఈయన చాలా సంతోషిస్తు న్నారు! ఇటువంటి విషయాలు రామాయణంలో ఉన్నాయని బయటపడితే అది రామాయణానికి అపకీర్తి అవుతుందని ఈయనకి తోచినట్టు లేదు. లేకపోతే దీన్ని ప్రక్షిప్తాల్లోకి గెంటే వారే.

హనుమంతుడి చదువు సంధ్యలన్నిటినీ ఈయన ఎగర గొడుతున్నారు – "హనుమంతుడు గొప్ప విద్వాం సుడనియు, .... వ్యాకరణ సూత్రాలలోను, వార్తికముల లోను, ఛందస్సులోను, శాస్త్రములందును, సకల విద్యలందును, ప్రవీణుడని వర్ణించారు. ఇట్టి వర్ణన వలన హనుమంతుడి పాండిత్య విషయములలో అనుమానము గలుగుచున్నది. వ్యాకరణ సూత్రాలు, వార్తికాలు, క్రీ.పూ. 8వ శతాబ్దానంతరమే ఏర్పడెను. హనుమంతుని కాల ములో అవి లేకుండెను. కావున, ఈ ప్రక్షిప్తాల మూలాన, సుందర కాండలో అతడు సీతతో సంస్కృతములో మాట్లాడజూచిన మాట నమ్మరానిదగుచున్నది" (పే. 60) హనుమాన్ భక్తులందరూ ఏమైపోతారో ఇప్పుడు!

"ఈ కాలములో లంచాలు ఎట్లు స్థిరపడిపోయిన సంఘ జాడ్యమైయున్నదో, అదే విధముగా ఆ నాడును లంచాలను తినుచుండిరి. మంత్రులంతటి వారు కూడా దీని రుచి మరిగిన వారుగా కనబడుచున్నారు .... ఇది రాక్షసాచారమేమోయని సందేహింప వచ్చును. కాని ఆర్యులలోను లంచములు తిను వారుండిరి" (పే. 61) మరి దాన్ని రాక్షసాచారం అనడం ఎందుకు?

నాస్తిక భావాలు ఎందుకు కలుగుతాయో ఈయన తమ కారణం చెపుతున్నారు – "సాధారణముగా మత సంధికాలములో నాస్తికత పొడసూపును. పూర్వ మత మును ఖండించుచూ నూతన మతము విజృంభించి

నప్పుడు జనులలో, అటు పూర్వ మతమందు పట్టు దప్పి, ఇటు కొత్త మత మందు పట్టు దొరకక, నాస్తి కతలో బడుదురు" (పే. 62)

నాస్తికతకు కారణం ఇంత చక్కగా బోధపడింది – ఈ విమర్శకుడికి!

"ఈ కాలములో ఉభయ పక్షాల సైనికులు కలియ బడుటకు పూర్వము, వారికి సారాయి, బ్రాంది త్రాపి, యుద్ధ దుందుభులను (బ్యాండును) మ్రోగించి, యుద్ధములోనికి వదలుదురు. రామాయణ కాల మందును భటులకు మద్యమును త్రాపి యుద్ధ సన్నద్ధు లనుగా జేయుచుండిరి. అట్టి మద్యపానమునకు వీర పాణము అని పేరుండెను." (పే. 65)

ఇలాంటిదంతా ఉత్త సమాచారం. సైనికుల్ని తాగించి చావుకి సిద్ధం చెయ్యడం గురించి ఏ విమర్శా లేదు. ఎక్కడా ప్రజలకు ఉపయోగపడే ఆలోచన లేదు!

శత్రు సేనల్లోకి చారుల్ని పంపడం, రహస్య యుద్ధాలు చెయ్యడం – వంటి చర్యల గురించి చెప్పి, ".... అయితే ఇవన్నీ రాక్షసుల చర్యలు...." అని తేల్చారు. (పే. 65) రాముడు, వాలితో రహస్య యుద్ధం చెయ్యలేదా? రాముడు, చారుల గురించి ప్రస్తావించ లేదా? నిజాల్ని చూడకుండా కళ్ళు మూసుకోవడం కన్నా రాక్షస చర్యలు ఉంటాయా?

ధనుర్విద్య ఆర్యులకే తెలుసుననీ, రాక్షసులకు తెలి యదనీ ఈయన అభిప్రాయం – "ఒక ఇంద్రజిత్తూ, రావణుడూ తప్ప తక్కిన వారెవ్వరును ధనుర్విద్య నెరు గరు. వారిరువురు కూడా ఎరిగి యుండిరో లేదో, అది కవి వర్ణనమేనో ఏమో! .... ఆర్యులలోనే ధనుర్విద్యా ప్రాబల్య ముండెననుటకు రాము డొక్కడే ఖరుని 14,000 రాక్షస సైన్యాన్ని బాణములతోడనే హత మార్చిన దొక నిదర్శనము." (పే. 66) రావణుడికీ, ఇంద్రజిత్తుకీ ధనుర్విద్య వొచ్చో రాదో అని ఈయనకి సందేహం! అది కవి కల్పనేనట! కానీ, రాముడు 14 వేల మందిని చంపడం మాత్రం కవి కల్పన కాదు, కవి వర్ణన కాదు. అది అక్షరాలా నిజం! ఆర్యులకు అను కూలమైన విషయాలన్నీ నిజాలు. రాక్షసులకు అనుకూల మైతే అవి అబద్ధాలే.

ఆర్యుల్ని కీర్తించడమే ఈయన లక్ష్యం. (జాతుల దృష్టితో చూస్తే, ఈయన ద్రావిడ జాతికే చెందుతారు. అయినా ఆర్య భజనే!)

"ధనుర్విద్య ప్రపంచమందు మొట్టమొదట కని పెట్టినది హిందువులైన ఆర్యులేయని నిరాఘాటంగా చెప్పవచ్చును." (పే 66)

"ఆర్యుల నాగరికత, సంస్కృతి, రామాయణ కాలము నాటికే బాగా ప్రబలియుండెను. ఆర్యావర్తన మందు .... పట్టణములు, నగరములు, గ్రామములు, సమృద్ధిగా ఏర్పడి యుండెను .... అయోధ్యా నగరము ఇంచుమించు ఈ నాటి నగరాలవలె గొప్పదియై, నాగరి కత కలదియై, యుండెను. విమాన శిఖరాలుండెను. అనగా ఏడంతస్థుల మేడలుండెను ...." (పే. 67) ఈ రకంగా కవి అయోధ్య గురించి చేసిన వర్ణనంతా ఈయన తిరగరాసి – 'ఆర్యుల నగరాలు ఎంత ఉన్న తంగా వున్నాయో చూడండీ' అంటున్నారు. ఆర్య భక్తులు, కవి, అయోధ్యని ఎలా వర్ణించాడో అవన్నీ తీసుకుంటారు; లంకని పట్టించుకోరు! ద్రావిడ భక్తులు, లంక వర్ణనలన్నీ తీసుకుంటారు; అయోధ్యని పట్టించు కోరు! రెండు వర్ణనలూ అతిశయాలేననీ, అది కట్టు కథల్ని (మైతాలజీ) చెప్పే లక్షణమనీ, ఇరు పక్షాల వాళ్ళూ అర్థం చేసుకోరు.

వాల్మీకి మీద ప్రతాపరెడ్డిగారి భక్తి సూర్య మండ లానికి చేరిపోయింది! – "ఈ నాడు టెలిస్కోపు యంత్రాల ద్వారా చూసి సూర్యునిలో మచ్చలు ఉన్నవని తేల్చినారు. ఇంతమాత్రము ఆ నాడే వాల్మీకికి తెలియక పోలేదు. 'లక్ష్మణా! సూర్యునిలో నల్లని మచ్చ కనబడు చున్నది సుమా' అని రామునిచే, వాల్మీకి చెప్పించినాడు" (పే. 68.) అయితే టెలిస్కోపు ఎందుకిక? దండగే! రామ భక్తులకు దానితో పని లేదు!

"రామాయణ కాలమందు .... సాముద్రిక ముండెనాయని సంశయింప బనిలేదు. ఈ శాస్త్రము జ్యోతిష్యంతో లంకె వేసుకొని యున్నట్టిది. సాముద్రిక మును మొట్టమొదట హిందువులే కనిపెట్టిరి." (పే. 69) అలాగా? ఈ గజ్జిని హిందువులే పాకించారన్న మాట ప్రపంచానికి!

"చికిత్సలలో ఓషధులను వాడుటలో హిందువులే మొట్టమొదటి వారని మరలా చెప్పవలసి యున్నది. విశల్య కరణి, సువర్ణ కరణి, సంధాన కరణి, సంజీవ కరణి అను ఔషధములను మనవారెరిగి యుండిరి. అయితే ఇందు సంజీవ కరణిని వారెరిగియుండి రనుట సంశయాస్పదమే" (పే. 70) హనుమంతుడు ఎగిరి వెళ్ళి తెచ్చిన ఓషధుల పర్వతంలో ఉన్న ఓషధుల పేర్లు ఇవన్నీ. ఇవన్నీ కట్టుకథ కోసం ఊహించిన పేర్లు. రామభక్తులు, కథలో ఉన్న ప్రతీ ముక్కనీ నమ్మేసి దాన్ని పట్టుకుని వేళ్ళాడుతూ వుంటారు. సంజీవ కరణి – చచ్చిపోయిన

వాళ్ళని బతికించే ఔషధం. అది కూడా తమకు తెలుసని చెప్పుకుంటే, చచ్చిపోయిన వాళ్ళని బతికించమంటారు కదా? అది ఇబ్బందే కాబట్టి, దాని సంగతి సంశయమేనని ఒప్పుకుని తప్పుకుంటున్నారు. మిగతావి మాత్రం మన వారికి గొప్పగా తెలుసట!

"రాముని కాలములో ఆర్యులు తమ సంస్కృతిని గంగకు దక్షిణ భాగమందు వ్యాపింపజేయు నుద్దేశముతో, భరద్వాజుడు, అత్రి, అగస్త్యుడు మున్నగు రుషులు, దక్షిణ భాగమందు అందందు ఆశ్రమములను గల వారై యుండినట్లు కానవచ్చుచున్నది .... దక్షిణాపథమందు దుష్టులను శిక్షించి నిర్మూలించుటకై అగస్త్యుడు వెళ్ళెనని రామాయణమందు స్పష్టముగా తెలిపినారు." (పే. 73) – దక్షిణాపథంలో దుష్టులు ఉన్నారు. ఈ ఉత్తములు వచ్చి వారిని శిక్షించాలి. రామాయణంలో ఏది చెబితే దాన్ని ఈయన మెచ్చుకోడం! అజ్ఞానంలో పడివున్న దక్షిణాపథం వారికి తమ గొప్ప సంస్కృతి నేర్పాలనే దయతో అభిమానంతో ఆర్యులు వచ్చారని ఒక సారీ, దుష్ట శిక్షణకు వచ్చారని ఒక సారీ! దక్షిణాపథం వారిని తన్ని, పొడిచి, యుద్ధాలు చేసి, చంపేసి, వీరి సంస్కృతి నేర్పుతారన్న మాట! ఎంత దయో!

– 'రాక్షసుల నీతికి, ఆర్యుల నీతికి, భేదము లేదు. వాల్మీకి అందరి నోటను ఒకే విధమగు రాజ నీతిని ప్రకటించినాడు. (పే. 78) రాక్షసుల నీతికీ, ఆర్యుల నీతికీ భేదం లేదని కవి చెప్పినంత మాత్రాన ఈయన వొప్పేసుకోడం ఆశ్చర్యంగానే ఉంది!

రామాయణ కథలో పాత్రల స్వభావాల గురించి ఈ రచయిత ప్రకటించిన అభిప్రాయాలు కొన్ని చూడండి!

**కైక గురించి:** "మొదట మొదట స్వార్థము లేనట్టిది. అటు తర్వాత ఆమె చంచలయయ్యెను .... ఆమె పారశీకదేశపు స్త్రీయని తెలిపినాను. కైకేయి తల్లి దండ్రులును కఠినులని తెలిపినాను. వారి జాడయే బిడ్డకును పట్టుబడినది" (పే. 94)

**రాముడి గురించి:** ".... ఇతడు ప్రపంచ కథా నాయకులలో అగ్రగణ్యుడు. యౌవరాజ్య పట్టాభిషేక కాలములో రాముని ఉత్తమోత్తమ గుణములు వ్యక్తమయ్యెను .... పిడుగు వంటి వార్త! అభిషేకమప్పుడు ఆనందమును ప్రకటించనూ లేదు, ఇప్పుడు కూలబడి వాపోవనూ లేదు ...." అన్నారు. కానీ, రాముడు బొత్తిగా ఏడవలేదంటే బాగుండదు కాబట్టి, దాన్ని ఎంత చాకచక్యంతో సమర్థిస్తారో చూడండి – "అయితే, రామునిలో అంతయు నిగ్రహమే కాని కష్టకాలమందు వ్యసనపడు మానవ సహజ గుణమే లేదా? – అనిన అదియును కలదు. అతడెవ్వరి యెదుట నిగ్రహము, ప్రసన్నత, గాంభీర్యము చూపించవలెనో బాగా ఎరుగును. తన తల్లి వద్ద కూడా అట్లే చాలాసేపు ఆచరించుకొనెను. కాని ఎంతసేపు? .... తల్లి దుఃఖాన్ని చూచి తుదకు పట్టు లేక రోదనము చేసెను .... ఆమెను (సీతను) చూచిన వెంటనే దుఃఖము నాపుకొనలేక రోదనము చేసెను. ఇది తన అంతరంగికుల యెదట. మరల తుదిమారు తండ్రి సెలవు తీసుకొనునప్పుడు నిగ్రహమును, ప్రశాంతతను, గాంభీర్యమును ప్రకటించెను." (పే. 90). లోపల ఏడ్చి, పైకి గంభీరంగా ఉండడంలో ఈయనకేమీ వింత కనబడలేదు. పైగా, 'రాముడు మాత్రం మానవ మాత్రుడు కాడనుకుంటున్నారా? మానవ మాత్రుడే' అని సమర్థింపు!

".... అరణ్యవాసమునందు ఎన్నడును తండ్రిని కినియలేదు" అట! గంగ వొడ్డున ఏం జరిగిందో కొంచెం గుర్తు తెచ్చుకోండి ప్రతాపరెడ్డి గారూ!

"మహా వ్యసనము ముంచుకొని వొచ్చిననాడు మాత్రము రెండు మూడు మారులు 'ఇక కైకేయి సంతోషపడు గాక' అని మాట జారవిడిచెను .... ఇంకొకరైయుండిన .... రాజ్యము చేయుటకై మరలా రమ్మని ప్రార్థించి యుండిన ఒప్పుకొని యుందురు. రాముడట్లు చేయలేదు .... అయితే వాలి వధ మాత్రము అంతగా సమర్థనీయము కాజాలదు." (కొంత సమర్థనీయమేనా?)

రాముడు లక్ష్మణుణ్ణి ప్రేమతో ఒకసారి తొడ మీద కూర్చోబెట్టుకున్నాడట. రావణుణ్ణి మొదటిసారి చంపకుండా వొదిలేశాడట! (రెండోసారి చంపినా మొదటిసారి వదిలేస్తే, అది దయ అన్నమాట! మొదటిసారి ఎందుకు వదిలేశాడో అది గ్రహించే పని లేదు.) – ఈ రకంగా సాగింది రామ భజన. చివరికి – "రాముడు మహావీరుడు. అతనికి సాటివారు లేకుండిరి" – అక్కడ భజన ముగిసింది.

**లక్ష్మణుడి గురించి:** "ఇతడు రాముడంతటి నిగ్రహుడు కాడు .... రామునిలో ఉత్తమత్వము అతనికి చాలా ప్రియమైనట్టిది. అందుచేత అతనికి స్వయం సేవకుడయ్యెను .... రామునైనను ఇతరులు తేరిపార జూడగలరేమో, కానీ లక్ష్మణునికి కోపము వచ్చెనా అతని నెదిరించుట కష్టము." (పే. 92). ఇందాక

రాముడు గొప్ప వీరుడు! ఇప్పుడు రాముడి కన్నా లక్ష్మణుడు గొప్ప వీరుడు!

**భరతుడి గురించి:** తల్లిని ఎంత బాగా తిట్టాడో చెప్పి, ఉత్తముడని మెచ్చుకున్నారు. "అతనికి తన తల్లి లక్షణాలు బాగా తెలియును .... ప్రజలకు మొదలతనిపై మంచి భావము లేకుండెను. కాని అతని యుద్దేశములు విన్న తర్వాత వారతనిని గౌరవించిరి. రాముడతనిని ప్రథమ సమాగములోనే తొడపై కూర్చుండ బెట్టుకొని గాఢముగా ప్రేమను ప్రకటించెను .... తానును తాప సియై రాముని పాదుకల వద్ద కూర్చుండి ధర్మపరిపాల నము చేసెను" (పే. 94)

**శతృఘ్నుడి గురించి:** "అప్రసిద్ధుడు. మంచి వాడే కాని వీరుడు కాదు .... జోహుకుం సర్కార్ అను నట్టి వ్యక్తిగా కానవచ్చుచున్నాడు." (పే. 94) మరి, లక్ష్మణుడో? 'బాంచన్ దొరా' అనునట్టి వ్యక్తిగా కాన రాలేదా? – రాముడికి శతృఘ్నుడి మీద చిన్నచూపు కదా? అందుచేత, రామ భక్తులకు కూడా శతృఘ్నుడి మీద చిన్నచూపే.

**హనుమంతుడి గురించి:** "ఒకటి చెపితే రెండు చేసుకొనివచ్చు రాముని నమ్మినబంటు. మహా ప్రజ్ఞాధురీణుడు. నిగర్వి. వినయ సంపన్నుడు. సంస్కృ తంలో మహా పండితుడు. బహు భాషల నెరిగిన వాడు." (పే. 95) (ఇందాక ఇతనికి సంస్కృతం రాదన్నారు. అప్పుడే ఇంత సంస్కృత పండితుడెలా అయ్యాడు?)

**సీత గురించి:** "మహా పతివ్రత. ఆమె పేరు భారతీయ స్త్రీలకు ఉత్తమోత్తమ మంత్ర రాజము .... ఆమె ధైర్యము, సహనము ప్రశంస నీయములు" (పే. 95)

**రావణుడి గురించి:** ".... శత్రు భయంకరుడు. విషయాసక్తుడు. వెయ్యి మంది భార్యలు గలవాడు .... సీతను బలత్కార కామమునకు గురిచేయలేదు. రాక్షస వివాహాలలో ఒల్లని స్త్రీలకు ఒక సంవత్సరము గడువిచ్చు చుండిరి. సీతకు అదే గడువిచ్చినాడు. (రాక్షసుల్లో ఈ సాంప్రదాయం ఉందని కవి చెప్పలేదు. ఒల్లని స్త్రీలను కూడా రావణుడు బలాత్కారం చేసిన సందర్భాలున్నాయి. 'సీత పవిత్రంగానే ఉంది సుమా' అని చెప్పడానికే ఈ రచయిత ఈ సాంప్రదాయం గురించి తీసుకు వస్తు న్నారు.) ... ఆర్యులలో బలాత్కారమును గర్హించినట్టు మరి దేనిని కూడా గర్హింపకుండిరి .... రావణునికి ప్రాయశ్చిత్తము తప్పదయ్యెను." (పే. 96)

**విభీషణుడి గురించి:** ".... తన యన్న నీతి బాహ్యుడై నందున రాముని ఆశ్రయింపవలసి వచ్చెను. అతడు రాక్షసులలో తప్పుబుట్టినాడు. శాంత పురుషుడు. ధార్మికుడు, నీతిజ్ఞుడు" (పే. 96)

**వశిష్టుడి గురించి:** "వశిష్ఠుడు రామాయణ ములో పనికిరాని ఒక పంచాంగ పురోహితుని వలె కనబడుచున్నాడు. దశరధునికి కలిగిన చిక్కును తీర్చడు. కైకేయిని గర్హింపడు, (తిట్టడు. ఈ ప్రతాపరెడ్డిగారే దశరధుడి పురోహితుడైతే కైకని ఎలాంటి తిట్లు తిట్టేవారో ఊహించండి!) వశిష్టుని .... ప్రాధాన్యత కానరాదు." (పే. 97)

పురాణకర్తల భౌగోళిక జ్ఞానం గురించి చర్చించారు. పూర్వ కాలం పౌరాణికులకు భౌగోళిక జ్ఞానం బాగా వుండేదట! తర్వాత కాలం వాళ్ళకి ఆ జ్ఞానం అంత లేదట! – ".... యక్ష, రాక్షస, కిన్నర, నాగ, వానరాది జాతులు, మనుష్యులు కానట్టి భూతములు, జంతువులు అని, మన పౌరాణికులు పొరపాటు పడిరి. ఆది పౌరాణికులకా భ్రమ లేకుండెను. తర్వాత పురాణాలను పెంచిన వారికి ఆది కాలపు వారికుండు భౌగోళిక జ్ఞానము లేనందున వారిట్టి పొరపాటులు చేసిన వారైరి" (పే. 99) – బండి వెనక్కి నడవడం అంటే ఇదే! ప్రతాప రెడ్డిగారి బండి ముందుకు మొహం పెట్టి వెనక్కి నడు స్తుంది. వెనక వాళ్ళకే అంతా తెలిస్తే, ఆ వెనక వాళ్ళ జ్ఞానం కొత్త వాళ్ళకు అందాలి కదా? కాలం అనేది వాల్మీకి నించి మన వేపు వస్తోందా, ఇటు నించి వాల్మీకి వేపు వెళ్తోందా? ఈ సంగతి తేల్చుకోవాలి ముందు ఈ రచయిత.

వెనక వాళ్ళకి వున్న జ్ఞానం ఎటూ పోదు. అది తర్వాత వాళ్ళకి అందుతుంది. అంతే కాదు, తర్వాత వాళ్ళ జ్ఞానం, కొత్త అనుభవాలు కూడా కలిసి, ఇంకా పెరుగుతుంది. అంటే, వెనక వాళ్ళ కన్నా తర్వాత వాళ్ళకే ఎక్కువ జ్ఞానం ఉంటుంది. కానీ, ఈ రచయితని చూస్తే, వెనక వాళ్ళ జ్ఞానం కన్నా ఈయన జ్ఞానం ఏ మాత్రమూ పెరిగినట్టు కనపడడం లేదు. ఇదే ఆశ్చర్యం కలిగిస్తోంది!

వాల్మీకి భౌగోళిక జ్ఞానం ఎంత గొప్పదో ఈయన తెగ మెచ్చుకుంటారు. రామాయణంలో చెప్పిన స్థలాలూ, మార్గాలూ, దిక్కులూ కొన్ని, ఈ నాటి భౌగోళిక పరిస్థితు లకు ఎలా సరిపోతున్నాయో చెపుతూ ఈయన చాలా విపులమైన చర్చలు చేశారు. ఈ వివరాలన్నీ ఖచ్చితంగా

సరిపోతే, కవి, స్థలాల గురించి చాలా జాగ్రత్తలు తీసుకుని రచన చేశాడని అర్థమే. ఈ వివరాలలో చాలా విషయాలు గమనించ దగ్గవిగా ఉన్నాయి.

బళ్ళారి జిల్లాలో హంపీ ప్రాంతమే కిష్కింధ – అట! ఈ వాదాన్నే ఈయన సమర్థించారు.

లంక కోసం భూగోళం అంతా వెతికి వెతికి దాన్ని పట్టుకోలేక చివరికి "నాకు తెలియదు" అని ఒప్పేసు కున్నారు. ప్రతాపరెడ్డిగారు లంక కోసం వెదికిన విధానం చూడండి: రామాయణ కథ ప్రకారం కిష్కింధకు దక్షిణంగా లంక ఉండాలి. హనుమంతుడు వింధ్య పర్వ తాల్లో ఉన్న మహేంద్రగిరి దగ్గర్నించి 100 యోజనాల దూరంలో ఉన్న లంకకు వెళ్ళాలి. ఇప్పటి బళ్ళారినే కిష్కింధ అనుకుంటే, వింధ్య పర్వతాలు బళ్ళారికి దక్షిణంగా లేవు సరికదా, ఉత్తరంగా ఉన్నాయి. ఆ పాడు వింధ్య పర్వతాలు అక్కడ ఒక్కచోటే ఉన్నాయిగానీ ఇంకె క్కడా లేవు. హనుమంతుడు ఆ వింధ్య పర్వతాల నించే వెళ్ళాడనడం కుదరదు కాబట్టి, దక్షిణం వేపు ఉన్న ఇంకేదో పర్వతం కోసం వెతుకుడు ప్రారంభించారు. మహేంద్రగిరి కనపడింది ఒరిస్సాలో. కానీ అది కిష్కిం ధకు (బళ్ళారికి) దక్షిణాన్నగాక తూర్పున వుంది. పోనీ ఆ పర్వతానికే దక్షిణంగా ఏదైనా దేశం వుందా అని చూస్తే, సింహళం కనపడింది. హనుమంతుడు ఆ సింహళానికే వెళ్ళాడా – అని సందేహం వచ్చింది. కానీ, సింహళానికి వెళ్ళాలంటే, మొదటే రామేశ్వరం దగ్గిరికి వచ్చి ఎంతో సుఖంగా వెళ్ళవొచ్చునే! ఒరిస్సా కొండల నించి ఎగరడం ఏమిటి? పోనీ సింహళాన్ని వదిలేసి ఒరిస్సాకి 100 యోజనాల దూరంగా, ఇంకెటైనా, ఏ దేశమన్నా దొరుకుతుందా అని చూస్తే, తూర్పున అండ మాన్, నికోబార్ దీవులు కనపడుతున్నాయి. అక్కడంతా ఆటవిక వ్యవహారమే గానీ బంగారం మేడలుండే లంక లాంటి దేమీ కానరాలేదు. రాముడు కిష్కింధ నించి సైన్యంతో బయల్దేరినప్పుడు మహేంద్రగిరికి ఒక్క రోజులో చేరాడని వాల్మీకి కథనం. బళ్ళారి నించి ఒరిస్సాకి నడిచి ఒక్క రోజులో చేరడం వీలవుతుందా? ఒక్క రోజులో చేరగల దూరంలో మహేంద్రగిరి వుండి, అక్కడికి 100 యోజనాల్లో లంక వుంటే, దాన్ని పట్టు కోడానికి కోట్లకొద్దీ వానరులు కావాలా? – ఈ రకంగా ప్రశ్నలు వేసుకుని ఒకదాని కొకటి పొసగక విసుగొచ్చి, చివరికి మరి "లంక యెక్కడ నున్నట్టు? ఏమో! నాకు తెలియదు" (పే. 112) అని వూరుకున్నారు.

కవి చెప్పిన దిక్కు, కవి చెప్పిన పర్వతం, కవి చెప్పిన వంద యోజనాలు, కవి చెప్పిన బంగారం మేడలు, అన్నీ సరిపోవాలి! అప్పుడు లంక నిజంగా ఎక్కడుందో పట్టు కుంటారు. ఈ రకం వెతుకుడైతే, ఈ లోకంలో లంక ఎవరికీ దొరకదు. ఎందుకంటే, అది కేవలం కట్టుకథ కాబట్టి. అది ఎక్కడా లేదు కాబట్టి.

వానరుడు ఎగిరి సముద్రం దాటడం ఎంత కల్పనో, కిష్కింధలూ లంకలూ అన్నీ అంత కల్పనలే. ఆశ్చర్యం ఏమిటంటే – పండితులందరూ ఈ కట్టుకథల్ని పూర్తిగా నమ్మేసి, ఆ దేశాలు నిజంగా ఎక్కడో ఉన్నాయని వాటి కోసం పడీ పడీ వెతుకుతారు. కానీ, కథల్లో తప్ప నిజంగా లేని బంగారాల మేడల దేశం ఎక్కడ దొరుకు తుంది?

హిందువుల రామాయణం గొప్పదని ఏ ఇంగ్లీషు పండితుడు, ఏ జర్మన్ పండితుడు, ఏ యే విదేశీ పండి తులు మెచ్చుకున్నారో ఈయన వివరంగా చెప్పు కొచ్చారు. విదేశస్తులు మెచ్చుకున్నారు కాబట్టి రామా యణం మరీ గొప్ప గ్రంథం!

సర్వ కాలాల లోనూ, సర్వ దేశాల లోనూ 'సుందర మైన రచనలు' అని ప్రఖ్యాతి గాంచిన వాటిలో రామా యణానిదే అగ్రస్థానమట! ఇతర పాశ్చాత్య పండితులును ఇట్టి అభిప్రాయములనే ఇచ్చి యున్నారట!

చివరికి ఈ రకమైన కీర్తనలతో ముగించారు – "…. ఇట్టి పవిత్ర గ్రంథము చదివిన కొలది ఆనంద మతిశయించుచుండును. రామాయణ మందలి సహజ వర్ణనలు, సుందర భావములు, ఉత్తమ నీతివర్తనము కేవలము హిందువులకే కాక ప్రపంచమందలి ధర్మాభి లాషు లందరికినీ ఆదర్శప్రాయములు. ఇట్టి కావ్యము సంస్కృతమందే కాదు, ప్రపంచమందే భాష యందునూ నేటి వరకునూ సృష్టి కాలేదు. హిందువుల సంస్కృతిని, నాగరికతను, భావౌన్నత్యమును, ధార్మికో దాత్తతను, కవితా ప్రాగల్భ్యమును, ప్రతిభా శక్తిని, ఈ వాల్మీకి రామాయణమే సర్వ కాలములందును సర్వ దేశములందును చాటుతూ వచ్చినది. ఇక ముందును చాటుచుండగలదు." (పే. 98)

**ఇక ముందు సంగతి మీరు చెప్పలేరు లెండి!** ★

# 6. ముద్దుకృష్ణ గారి "సింహావలోకనం; అశోకం"★

ముద్దుకృష్ణ గారు – 'వాల్మీకి రామాయణం మీద తన విమర్శల్ని 'సింహావలోకనం' అనే వ్యాసం లోనూ, తన నూతన దృక్పథాన్ని 'అశోకం' అనే నాటకం లోనూ, స్పష్టం చేశారు. ఈ రెండూ కూడా, 'అశోకం' అనే పేరుగల పుస్తకంగా వున్నాయి.

## వ్యాసంలో అభిప్రాయాలు

"వాల్మీకి, రాముణ్ణి, మానవుణ్ణిగానే వర్ణిస్తే ఎవరో మహానుభావులు వాల్మీకి కృతిని దిద్ది దానిలో అపూర్వ కల్పన చొప్పించారు" అని వాల్మీకి భజనతో ప్రారంభిం చారు. (ఇక, తప్పటడుగులు మొదలూ!)

"దశరధుడు ... ముద్దుల భార్యకు లొంగిపోయాడు. అందువల్ల రాముడు రాజ్యభ్రష్టుడైనాడు" అని ఈయన వాల్మీకి అభిప్రాయంతోటే ఏకీభవించారు. అయినప్ప టికీ, తన వ్యాసంలో, రాముణ్ణి నిర్దయుడిగానూ, దుర్మా ర్గుడిగానూ; రావణుణ్ణి ఉత్తముడిగానూ, ప్రేమ పాత్రుడి గానూ చెప్పి, అక్కడక్కడా వాల్మీకిని ధిక్కరించారు.

'లంక' గురించి ఈయన అభిప్రాయాలు ఇలా వుంటాయి: "రావణుడు దక్షిణ దేశాలను పరిపాలిస్తు న్నాడు .... అతని తెగవారు శాస్త్రసాధనతో అనేక యంత్రాలూ, విమానాలూ నిర్మించుకుని మహా బల వంతులై అనుభవిస్తున్నారు." (వ్యాసంలో పే. 89). రావణుడి కాలంలో, లంకలో సైన్సు అభివృద్ధి చెందిం దనీ, ఆ విమానాలూ అవీ సైన్సు ద్వారా వచ్చినవేననీ ముద్దుకృష్ణగారి అభిప్రాయం!

(నిన్న మొన్నటి దాకా ప్రపంచంలో ఎక్కడా విమా నాలు లేవు. కానీ ఈయన, 'రామాయణం' అనే కట్టు కథలో ఉన్న విమానాల్ని, సైన్సు విమానాలే అంటు న్నారు. ఇలాంటి ఆధునికుల్ని ఏ మనాలి? 'సనాతన ఆధునికులు' అనాలా, 'ఆధునిక సనాతనులు అనాలా?)

రావణుడు సీతని తీసుకుపోవడంలో తప్పేమీ లేదనీ, నచ్చిన స్త్రీని తీసుకుపోవడం రాక్షస జాతి ధర్మం కాబట్టి అలా చేశాడనీ అంటారు – "సీతవి కైపు ఎక్కించే కన్నులు. రావణుడు సీత ఎడల ప్రేమోన్మత్తుడు. ప్రేమిం చిన స్త్రీని పొందడం రాక్షసులకు తప్పు కాదు. అందుచేత సీతని అపహరించాడు. నీచమైన కోర్కెతో కాదు" (ఒక మనిషిని అపహరించడం నీచమైన కోర్కెతో కాదట! అది ఉత్తమమైన ప్రేమ!)

ఈయన గొప్ప తర్కం చేస్తున్నట్టు సాగించారు. "ఏ సంఘాన్ని గురించి ఆలోచిస్తామో, ఆ నాటి సంఘ ధర్మాలను సూత్రాలుగా ఎంచి ఆలోచించడం న్యాయ మౌతుంది" అన్నారు. (కానీ, ఈ సూత్రాన్ని ఈయన తన నాటకంలో ఎక్కడా పాటించలేదు!) 'రాక్షస జాతి ధర్మం' అన్నప్పుడు, మొదట ఆ స్త్రీ పురుషులిద్దరూ ఆ జాతివారై ఉండాలి. అది ఆ స్త్రీకి కూడా ఇష్టమై ఉండాలి. ఆమె పెద్దలకు ఇష్టం లేకపోతే, ఆ పెద్దల్ని లక్ష్య పెట్ట కుండా ఆమెని తీసుకుపోవడం తప్పు కాకపోవచ్చు. కానీ, ఇక్కడ 'సీత' రాక్షస జాతి స్త్రీ కాదు. ఆమెకి ఇష్టమూ లేదు. రాక్షస జాతి స్త్రీయే అయినా ఇష్టం లేని స్త్రీని తీసుకుపోవడం తప్పనే విషయం పూర్వీకులే అంగీకరించారు. అలాంటి దౌర్జన్యాలు చేసిన వాళ్ళకి శాపాలు ఇచ్చారు. పూర్వీకులకే తప్పుగా, దోషంగా కనపడ్డ విషయం, ఈ ఆధునికులకు చాలా న్యాయంగా కనపడడం విచిత్రంగా వుంది.

'న్యాయం – ధర్మం' అనే మాటల్ని ఊరికే నోటితో పలకడం తప్ప, ఆ మాటల అర్థాలేమిటో వీరికి అర్థం కాలేదనే అర్థానికే రావలసి వస్తోంది. సీతని రావణుడు అపారంగా ప్రేమించాడనీ, ఆమెనేమీ బాధించక, అవ మానించక, ఎంతో ఆరాధనతో చూశాడనీ, చెప్పు కొచ్చారు. వాల్మీకిలో రావణుడు సీతని ముట్టుకోకుండా వూరుకున్న ఘట్టాల్ని దీనికి సాక్ష్యంగా చూపించారు. (బలవంతంగా ఎత్తుకుపోవడం అవమానించడం కాదనీ, ఆరాధించడమనీ, వీరి నూతన అర్థం!)

"ఆర్యులు సింధు గంగాతీర ప్రదేశాలనే ఆక్రమించు కున్నారు. దండకారణ్యాన్ని దాటి దక్షిణ దేశాలలో ఉన్న జాతులను మొదట జయించినవాడు రాముడే. ఆర్యుల ఆక్రమణని నిరోధించి, వారికి ఇతర అడవి జాతుల వలె సులభంగా లొంగక, అతి తీవ్రంగా యెదిరించి ఢీకొన్న నాగరికులూ, యుద్ధ నిపుణులూ అయిన రావణ తెగ వారిని ఓడించి లొంగదీసిన రాముణ్ణి, ఆ నాటి ఆర్యలోకం ఎంతో ప్రశంసించి ఉంటుంది." (పే. 68)

దీన్నిబట్టి రాముడూ, రావణుడూ శత్రువులని ముద్దు

★ ముద్దుకృష్ణ, 1930, అశోకం, విజయవాడ–2. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1969. ★

కృష్ణగారు చెప్పినట్టే కదా? ఆయన నాటకం ఎలా ఉంటుందో తర్వాత చూడండి!

"…. శంబుకుణ్ణి వధించడం ఏమి న్యాయం? …. రాముడు ఏ కళంకమూ లేని ఆదర్శ పురుషుడిగా మన్ననకు ఎట్లా పాత్రుడౌతాడు? …. ఆ మహా ఇల్లాలిని …. నిండు చూలాలిని …. అడవులలో …. నీచత్వానికి వడిగట్టే విడిచి పెట్టించాడు …. రాముడు ఉత్త కీర్తి కాముడు …." (పే. 73-4) – దీన్ని బట్టి రాముడు నిర్దయుడనీ, నీచుడనీ ముద్దుకృష్ణగారు భావించినట్టే కదా?

"…. ఇటువంటి ధూర్తుణ్ణి ఆదర్శప్రాయమైన భర్తగా ఎంచడం వల్ల, అన్యాయంగా స్త్రీలను ఎంత దిగ దీస్తున్నామో, పురుషుల్ని యెంత పొగరుబోతులను చేస్తు న్నామో, ఇంతకైనా గ్రహించలేకపోతే …." (పే. 77)

రామాయణ కథలో సీత, భర్త దౌర్జన్యానికి బలి అయిందనీ, భర్తను ధిక్కరించగలిగే సాంఘిక, మానసిక స్థితుల్లో లేదనీ, అర్థమే కదా? – ఇలాంటి సామాజిక పరిధిలో మాత్రమే ఉండవలసిన సీత పాత్ర, ఈయన నాటకంలో ఎలా ఉంటుందో తర్వాత చూడండి!

ఇప్పటి వరకూ చూసింది ఈయన వ్యాసంలో సంగతులు.

తరవాత, **'అశోకం'** నాటకం ఇలా ఉంటుంది:

మిథిలలో – సీత, ఉద్యానవనంలో కూర్చుని ఉంటుంది. ఆ మర్నాడే ఆమె స్వయంవరం. చెలికత్తె వచ్చి రావణుడు వచ్చాడని చెపుతుంది. సీత, అతన్ని తీసుకు రమ్మంటుంది. రావణుడు రాగానే, చెలికత్తె దూరంగా తప్పుకుంటుంది.

"ఆ ఆసనం …." – సీత రావణుణ్ణి ఆహ్వానిస్తూ!

"మంచిది" – రావణుడు.

"లంక నించి ఇంతదూరం ప్రయాణం ప్రయాస."

"కాదు. కార్యార్థికి ప్రయాస లేదు."

"సాహసులు …."

"మర్యాద ననుసరించి నీ అనుజ్ఞ పొందడానికే కాదు, మున్ముందు నా హృదయం విప్పి చెప్పడానికి ముఖ్యంగా వొచ్చాను."

"ఏమిటి?"

"సీతా! దాపరికం లేకుండా చెప్తుతున్నాను, క్షమించు! ప్రేమ దహించుతూ ఉన్న నా హృదయానికి శాంతి ఏ దేవి వల్ల – అని ప్రపంచమంతా శోధించాను. ఈ దురదృష్ట జీవికి అది ఎక్కడా లభించలేదు. నిరుటి సంవత్సరం విమానంలో కాశ్మీరానికి వెళ్తూ మిథిల మీదుగా ప్రయాణం చేశాను. అదృష్టవశాత్తూ నీవు సౌధోపరి నుంచి పట్టణాన్ని చూస్తున్నావు. నేనూ పట్టణం శోభ చూడవలెనని 'దూర సూచన'తో చూస్తున్నాను. (రావణుడు, 'బైనాక్యులర్స్'తో సీతని చూశాడు! రావణు డికి అటువంటి యంత్రాలన్నీ ఉన్నాయని రచయిత అభిప్రాయం.) నా భాగ్యం వల్ల నీవు కనిపించావు. నిన్ను కళ్ళారా అచ్చుపడేట్టు చూసుకున్నాను. ('అచ్చు యంత్రం' కూడా ఉందా?) అంతలో నీవు పైకి చూశావు …. అది రాణి వాసం కదా అని వెంటనే మరలినాను …." – అప్పట్నించీ సీత మీద ప్రేమ అట! ఆసలు, ప్రేమ కోసం దహిస్తూ వున్న హృదయానికి శాంతి ఏ దేవి వల్లనా అని – ప్రపంచం అంతా శోధించాడట! సీత నచ్చిందట! ('సీతవి కైపు ఎక్కించే కన్నులు' అని ముద్దుకృష్ణగారు కూడా సాక్ష్యం ఇచ్చారు కదా? మరి, అలాంటి కన్నులున్న సీత, పురుషులందరికీ కైపు ఎక్కించదూ? పురుషులందరూ ఆమెనే ప్రేమిస్తారేమో కదా?)

సీతని విమానం లోంచి చూసినప్పటి నించీ రావణుడు ఆమె కోసం ఎలా పరితపిస్తున్నాడో అంతా సీతకి చెప్పాడు. ఆ తర్వాత ఇంకా ఇలా చెప్పాడు "…. మహేశ్వర ఆరాధకుణ్ణి. శివ కార్ముకాన్ని వంచడమంటే మనస్సు మహా కలవరపడుతూ వుంది. స్వయం వరానికి వొచ్చిన వారిని అందరినీ ఎరుగుదుము …. రాముడు సమర్థుడు …. అతనికి, శివ కార్ముకం అని సంకోచం వుండదు …. శివ కార్ముకాన్ని ఎక్కు పెట్టడంలో శివుడి మీద భక్తి వల్ల హృదయం కంపించి నేను వోడిపో వచ్చును. అప్పుడు జయించేవాడు రాముడే. నీవు రాముడి భార్యవవుతావు. కానీ రాముడు భర్త కాడు. అతని ఆశయం ప్రజలకు ఆదర్శనీయమైన ప్రభువుగా కావలెనని. కానీ, అతని ఆదర్శం, అతనికీ నీకూ సుఖాన్ని కూర్చదు …. జీవిత సమస్తం నీ పాదాల దగ్గిర పెట్టి నిన్ను ఆరాధించగల ప్రియుడు కావలెనని నీ హృదయం ఏ నాడైనా కోరితే, ఆ నాడు కూడా ఈ రావణుడు నీకు లభ్యుడని ఎంచుకో."

రావణుడు ఇప్పుడు సీత స్వయంవరం కోసమే ఈ దేశం వచ్చాడట! (విమానమే కదా? కష్టం వుండదు.) తను శివ భక్తుడు కాబట్టి, శివ ధనుస్సుని విరవలేడేమో నట! రాముడే జయించవచ్చునట! సీతకి భవిష్యత్తులో ఎప్పుడైనా మంచి ప్రియుడు కావాలనిపిస్తే తను లభ్యుడే నట! ఆ సంగతి జ్ఞాపకం పెట్టుకోమంటున్నాడు. ఆ సంగతి చెప్పాలని సీత అంతఃపురంలోకి వచ్చాడు!

సీత జవాబు – "నా స్వబుద్ధి ఇందులో ఏమీ లేదు రావణా! సర్వం విధికీ, జనకులకూ వొదులుతున్నాను."

తర్వాత రావణుడు శెలవు తీసుకుని వెళ్ళిపోతాడు.

రాముడు మంచి రాజు అవుతాడు – అని రావణుడి అభిప్రాయం.

రావణుడు ఏ స్త్రీ వల్లా సంతృప్తి పడలేదు. సీత మీద పూర్తిగా ప్రేమ – ఇవీ రచయిత అభిప్రాయాలు!

తర్వాత సీత దగ్గిరికి, రాముడు వస్తాడు. "మిధిల ఇంత అందమైన ప్రదేశమని అనుకోలేదు" అంటాడు సీతతో!

"అయోధ్యలో ఉన్నంత గొప్ప సౌధాలూ, వింతలూ ఇక్కడ లేవని అంటారే!" అంటుంది సీత. ఈ రకంగా ఇద్దరికీ కొంత సంభాషణ సాగిన తర్వాత, రాముడు తన గురించి చెప్పుకొస్తాడు. మంచి రాజుగా ఉండడమే తన ఆశయమట. ఆ కర్తవ్య నిర్వహణలో తన జీవితం కష్టభూయిష్టంగా ఉంటుందట. తన భార్య కావడం సీతకు అంగీకారమైతేనే తను స్వయం వరానికి వస్తాడట! – ఈ రకంగా, మాట్లాడుతాడు – "సీతా! .... నా భార్య, అన్నింటిలో నా సహ ధర్మచారిణిగా ఉండవలె .... నేను ఎంచుకున్న జీవితం (రాజుగా వుండడం) ఎన్నో కష్టాలకు నన్ను గురి చేస్తుంది.. అవసరమైనప్పుడు నా ఆదర్శం నిమిత్తం సర్వ సౌఖ్యాల్నీ విడనాడడమే కాకుండా, రాజ్యాన్నీ .... కళత్రాన్నీ .... సహితం విస ర్జించుతాను ...." అంటాడు.

సీత – ".... ఈ ఆశయాలు గొప్పవి. ఇవి నన్ను భయపెట్టడం లేదు సరి గదా ఆకర్షిస్తూ ఉన్నవి కూడా. నా భవిష్యత్తు జనకులకు విడిచి పెట్టాను .... రావణుడు కూడా ప్రశ్నిస్తే ఈ సంగతే చెప్పాను ...." అంటుంది. రావణుడితో మాట్లాడిన సంగతి రాముడితో చెపుతుంది.

రాముడు – "నేనూ రావణుణ్ణి కలుసుకున్నాను" అని, రావణుణ్ణి మెచ్చుకుంటూ మాట్లాడతాడు – "ప్రణయ స్వరూపిణి అయిన దేవికై తాను లోకమంతా భ్రమించి ఆ పవిత్రమూర్తిని నీలో దర్శించాననీ, అందు చేతనే శివ కార్ముకమైనా ప్రయత్నిస్తున్నాననీ, నాతో అన్నాడు. అతను పూర్తిగా ప్రియుడు. జీవితం ప్రేమగా సుఖంగా అనుభవించడం వినా ఇతరం ఎరగడు" అంటాడు.

సీత – "అవును. ఏమీ దాపరికం లేకుండా విస్ప ష్టంగా చెబితే విన్నాను."

"కానీ సీతా, నా ఆశయం అందుకు పూర్తిగా భిన్నం."

ఈ రకంగా రావణుడి గురించి ముద్దుగా మాట్లాడు కున్నారు, సీతా రాముడూ!

రావణుడు సీతని ప్రేమించాడని రాముడికి పెళ్ళికి ముందే తెలుసు. దాన్ని రాముడు మామూలు విష యంగా తీసుకున్నాడు. (మరి అంత అందమైన స్త్రీని ఏ పురుషుడైనా ప్రేమించాలి కదా అన్నట్టు!) సీత కూడా రావణుణ్ణి గురించి రాముడితో చాలా 'స్వేచ్ఛగా' మాట్లా డింది. ముద్దు కృష్ణగారు, తన వ్యాసంలో – "ఏ సంఘాన్ని గురించి ఆలోచిస్తామో ఆ నాటి సంఘ ధర్మా లను సూత్రాలుగా ఎంచి ఆలోచించడం న్యాయ మౌతుంది" అన్నారు కదా? రామాయణ కథలో కనపడే సంఘంలో, అంతఃపురంలో ఉన్న సీత దగ్గిరికి, ఒక సారి రావణుడూ, తర్వాత రాముడూ రావడమా! ఆమెతో మాట్లాడడమా! సీత మీద రావణుడికి ఉన్న ప్రేమ గురించి, సీతా రాముడూ సంభాషించుకోవడమా! ఏ కాలం సంగతులు ఇవి?

తర్వాత, పంచవటిలో – సీతా రాముడూ పర్ణశాల ముందు రాతి మీద కూర్చుని ఉంటారు.

రాముడు – "సీతా! ఈ రాముడు నిన్ను ఎన్ని కష్టాలు పెడుతున్నాడు!"

"అట్లా అనవొద్దు. నా రాముడు పక్కగా వుండగా నాకు కష్టాలా?"

".... నీవు సుకుమారివి ...."

"నీవు మాత్రం?"

".... విలువిద్య, గుర్రపు స్వారీ, మల్ల యుద్ధం నేర్వడంలో ఈ శరీరం చాలా శ్రమలకు అలవాటు పడింది ...."

"ఏమీ, నేను మాత్రం విలు విద్యా, గుర్రపు స్వారీ ఎరగనా? నేనూ శ్రమల కోర్చి విద్యలు నేర్చు కున్నాను..." – సీత.

"సీతా! ధైర్య సాహసాలలో, ఓరిమిలో, బలములో నీవు తక్కువని కాదు! స్త్రీవని కాదు. కానీ, అంతః పురాలలో జీవితం ఒకే ఆనందంగా ...."

(రాముడు సీతతో 'సమానత్వం' మాట్లాడుతున్నా డండీ! 'నువ్వు స్త్రీవని కాదు. స్త్రీలు పురుషుల కన్నా తక్కువ అని కాదు' అంటున్నాడు! కానీ, ఆ స్త్రీల నివా సాలు అంతఃపురాలే!)

"రామా! నీవు రమ్మంటే నేను బానిసగా రాలేదు .... రాముడితో జీవితం వినా సీత లేదు ...." (నేను బానిసని కాను – అని సీత చెపుతోంది!)

"సీతా! కృతజ్ఞుణ్ణి, ధన్యుణ్ణి. ఆ నాడు నా అరణ్య వాసమయ్యే వరకు నిన్ను మిధిలలో ఉండమని అన్నాను. నా వల్ల నీకు కష్టాలు ఎందుకనే భావంతోనే ...."

ఈ రకం మాటలే అన్నీ. సీత తన స్వతంత్ర భావాల తోనే పాతివ్రత్యం నెరిపినట్టూ, అది ఆ భార్యాభర్తల మధ్య ప్రేమే గానీ పాతివ్రత్యం కానట్టూ, భార్య ప్రేమని భర్త గొప్ప విలువగా గ్రహించినట్టూ – రచయిత భావాలు! స్త్రీలకు వ్యక్తిత్వాలూ, స్వతంత్ర భావాలూ, ఇష్టా యిష్టాలూ – మళ్ళీ అంతఃపురాలూ!

రాముడు – "సీతా, .... జీవితం ఆనందంగా, .... అమృతప్రాయంగా గడపవలెనంటే నీకు రావణుడే తగిన వాడు! .... తన సమస్తమూ నీకు ధారపోసి ఎడతెగని ఆనందంలో ఓలలాడించే శక్తి గలవాడు అయిన

రావణుడే నీకు ....”

సీత రాముడి నోరు మూస్తుంది. (‘అయ్యో! నిన్ను నేను ఆనంద పెట్టలేనే! రావణుడైతే ఆనంద పెట్టేవాడే! అనుకుంటున్నాడు రాముడు! ఈ రాముణ్ణి ఏ సమాజంలో తయారుచేశారు ముద్దు కృష్ణగారూ?)

అంతలో అక్కడికి రావణుడు మళ్ళీ వస్తాడు. రాముడూ, సీతా, అతన్ని చిరునవ్వులతో ఆహ్వానిస్తారు. సీత రావణుడితో చాలా స్వేచ్ఛగా మాట్లాడుతుంది! రావణుడు, తను కూడా శబరిలాగ రాముడికి భక్తుణ్ణి కాలేకపోయానే అని విచారిస్తాడు.

“ఏమీ చమత్కారం!” అంటుంది సీత.

“లంకేశ్వరులకు ఇటువంటి స్థితులెందుకు?” అంటాడు రాముడు చిరునవ్వుతో. (రాముడి పట్ల భక్తితో ఉండడం శబరికి తక్కువ స్తితి అయినట్టు! ఆ మాట నిజమే అనుకోండీ!)

సీత రావణుడితో చేసే వేళాకోళాలతో, హాస్యాలతో సాగుతుంది సంభాషణ.

రావణుడు, సీతా రాముల్ని తన రాజ్యానికి వచ్చెయ్యమంటాడు. “మీరు అయోధ్య విడిచిన నాటి నుంచీ నేను ఆందోళనలోనే వున్నాను .... మీరు ఈ అడవులలో బాధలు పడడం నాకు కష్టంగా ఉన్నది .... నాకు సీత యెడలా, నీ యెడలా గల ఆదరాభిమానాలూ, ప్రేమా, మీకు తెలుసును .... మీరు లంకాపురికి వొచ్చి అక్కడ మిగతా కాలం గడపండి .... నేను లంకా రాజ్యాన్ని సమస్తమూ మీ ఆధీనం చేస్తాను. నాకు తెలుసును, నేనక్కడ ఉంటే కొంత అపకీర్తి కలుగుతుందని. అందుకని నేను ఇంకా ఆగ్నేయంగా పోయి అక్కడ నూతన రాజ్య స్థాపన చేసుకుంటాను. (ఇంకేదో రాజ్యం మీద దండెత్తుతాడన్న మాట, ఈ ఉత్తముడు! ఇది, ఈ రచయిత దృష్టికి, గొప్ప కార్యం!)

సీత – “ఈ అడవులలో, ఈ చిక్కులు ... చాలా బాధగా ఉన్నది రామా!” (రావణుడి రాజ్యానికే వెళ్ళాలని!)

రాముడు – “రావణా! నీ ఆదరానికి కృతజ్ఞులం. కాని వీలు కాదు.”

సీత – “నీ మనసూ, ఆ పవిత్రతా గ్రహించక అనుకోకు ....”

రావణుడు – “రామా! నేను మునిగి తేలలేని లోతు ఏదో నీలో నించి నన్ను ఆకర్షిస్తూన్నది.”

సీత – “రాముడు నీకు విశదమవుతున్నాడు.”

............................

రావణుడు – “ఎప్పుడు కోరినా లంక మీ అధీనం. నేను మీ ఇష్టానుసార వర్తిని. సీత కోసం ఏది చెయ్యమన్నా సంసిద్ధుణ్ణి!”

సీత – “రావణా! నీవూ రాముడూ నా ప్రశంస మాత్రమే ఆలోచిస్తున్నారు. కానీ నీలో ఒక గొప్ప శక్తి ఓరిమిని తెలుపుతున్నది, నేను వెనుదీసేటట్టుగా.”

రాముడు – “అవును, వీరిలో (రావణుడిలో) ఒక గొప్ప ఉదారత ఉన్నది. నిన్న మీ చెల్లెలు (శూర్పణఖ) వొచ్చి మా కష్ట నిష్ఠూరాలకు తోడ్పడతానని ఎంతో పట్టుపట్టింది ....”

ఈ రకంగా రాముడికీ, రావణుడికీ మధ్య అవధులు లేని స్నేహం! మరి, ఆ జాతుల శతృత్వం ఏ గంగలో కలిసింది? రాముడు, రావణుడి మీదకి దండెత్తాడనీ, రావణుడు రాముణ్ణి ఎదిరించాడనీ, ఈ రచయితే వ్యాసంలో చెప్పాడే! జాతుల వైరాలు అలా ఉండగా, ఆ పాత్రల్ని ఇలా మార్చేస్తే, ఆ జాతుల చరిత్ర అంతర్ధానమై పోతుందా? రచయిత, ఒక చరిత్రనీ, ఒక కాలాన్నీ తనకు తోచినట్టు మార్చెయ్యడమేనా?

రాముడిలో ఏదో ఔన్నత్యం చూసి రావణుడు ముగ్ధుడైపోయినట్టు చెప్పడం రావణుడికి అవమానం కాదా?

సీత మీద రావణుడికి ఉన్న ప్రేమ గురించి ఎంత బహిరంగమైన సంభాషణలో! “నేను లంకలో ఉంటే అపకీర్తి వొస్తుంది కాబట్టి, లంక మీ కిచ్చేశాక దూరంగా వెళ్ళిపోతాను” అంటున్నాడు రావణుడు. అపకీర్తి ఎందుకు వస్తుంది? పరస్త్రీతో ప్రేమని తప్పుగా ఎంచే స్థితిలోనే ఆ సమాజం ఉంది. అలాంటి సమాజంలో ఈ ఉదారులు ఎక్కణ్ణించి వచ్చారు?

(భార్య ప్రియుణ్ణి భర్త మెచ్చుకోడం, భర్త ప్రియురాల్ని భార్య మెచ్చుకోడం – ఈ రకం వాతావరణం ఏ రకం సమాజానిది? తిరుగుబోతు సంబంధాల్ని ప్రోత్సహించే బూర్జువా సమాజానిది! ఈ తిరుగుబోతు నాగరిక కపట ఉదారత్వాల్ని తెచ్చి, రచయిత, వాల్మీకి రామాయణ పాత్రల్లో జొప్పించారు! ఈ వింతలన్నీ ఆ భావాల ఫలితమే.)

రావణుడు పంచవటి నించి వెళ్ళిపోతూ దారిలో శూర్పణఖని కలుస్తాడు.

శూర్పణఖ, అన్నతో – “నీకు సీత లభించేట్లు చేస్తాను ....” అంటుంది. రావణుడు నిరుత్సాహపడి, “సీత హృదయం పూర్తిగా గ్రహించాను. ఆమె రాముణ్ణి అణువణువునా ప్రేమిస్తున్నది” అంటాడు.

“నీవు యుద్ధంలో ఎంత దిట్టరివో స్త్రీల పట్ల అంత అమాయకుడవు. అందుచేతనే ఈ నాటికి కూడా నీకు సంతృప్తినిచ్చే ప్రేమను సాధించుకోలేక పోయినావు .... నేను రాముణ్ణి ప్రేమించాను .... ఎంత చల్లని మనిషన్నా! .... ‘ప్రేమ – జీవితం’లో, స్త్రీలకూ పురుషులకూ, అందులోనూ విస్తారంగా స్త్రీలకు, ఈర్ష్య హెచ్చు! .... నాకు రాముడు ప్రసన్నుడే. నేను రాముణ్ణి దూరంగా తీసి సీతకు ఈర్ష్య కలిగిస్తాను .... సీత చాలా బాధలు

పడుతున్నది రాముడితో. .... వివాహం పవిత్రమైన బంధం అనే పాడు పాటింపు మగవాళ్ళకే. స్త్రీ, పొంగే ప్రేమ ఎక్కడ ఉంటే అటు వాలుతుంది ...." ఈ రకంగా మాట్లాడుతుంది శూర్పణఖ.

(ఈ మాటలు శూర్పణఖవి కావు. రచయితవే. మగ వాళ్ళు, వివాహాన్ని పవిత్రమైన బంధంగా పాటిస్తారట! ఆడ వాళ్ళు, ప్రేమ ఎక్కడ దొరికితే దానికోసమే అటు పోతారట! ఏవిటీ సూత్రీకరణలు?)

'సీతకి నువ్వంటే ఇష్టమే. లంకకు తీసుకుపోయి ఆమె ప్రేమ కోసం ప్రయత్నించు. నేను రాముణ్ణి నా వశం చేసుకుంటాను' అని శూర్పణఖ మాటల సారాంశం.

(చెల్లెలు చెప్పింది కాబట్టి, ఉదాత్తుడైన ప్రేమికుడు, సీతని ఎత్తుకు పోతాడన్నమాట! కథని వాల్మీకి ప్రకారమే నడుపుతున్నట్టు!)

తర్వాత లంకలో:

సీత అశోక వనంలో మరకత వేదిక మీద కూర్చుని ఉంటుంది. ('మరకత' వేదిక మీద! ఏ చెట్టు కిందో కాదు, ప్రేమ జీవితంలో, బంగారాలూ, వజ్ర వైఢూర్యాలూ, మరకత మాణిక్యాలూ ఉండవలసిందే!)

రావణుడు ఆందోళనతో – "సీతా!"

సీత – "రా! ఇలా రా! కూర్చో .... ఎందుకు అంత తొందరపడ్డావు? – అంత తుఫానులా అయిపోయి ఎందుకు నన్ను తీసుకువొచ్చావు? .... ముందు ముందు నీ కెంత అపఖ్యాతి కలుగుతుందో ఆలోచించు కున్నావా?" అంటుంది. అంటే రావణుడు సీతని, బల వంతంగానో, ఆమెకి తెలియకుండానో తీసుకు వచ్చినట్టే కదా? స్వతంత్ర భావాలు గల సీతకు ఇది అవమానంగా వుండాలా అక్కరలేదా? అలాటిదేం ఉండదు. 'నీకు అపఖ్యాతి కదా? నన్ను ఎందుకలా తీసుకొచ్చావు?' అంటుంది, తనకేం ఇబ్బంది లేనట్టు! (రాక్షస జాతిలో, ఆడవాళ్ళని ఎత్తుకు పోవడం ధర్మమే అన్నారుగా? రావణుడికి అపఖ్యాతి ఎందుకు కలుగుతుంది?)

వనవాసం విషయంలో, గతంలో సీత, రాముడితో 'నీతో నేను బానిసగా రాలేదు. నా ఇష్టం తోనే వచ్చాను' అంటుంది కదా? ఇంత వ్యక్తిత్వం గల సీత, తనని ఒక పురుషుడు బలవంతంగా ఎత్తుకొస్తే, వాడితో నాజూకుగా, 'రా, కూర్చో, ఎందుకిలా చేశావు?' అంటోంది. ఈ నవీన సీత, ఎంత గొప్ప వ్యక్తిత్వం అల వర్చుకుందో ముద్దు కృష్ణగారి చేతిలో!

సీత మాటలకు రావణుడు – "నాకు తెలుసు. చరిత్రలో నన్ను క్రూర రాక్షసుడిగా, భయంకరుణ్ణిగా, నిరూపిస్తారు .... నీచమైన కోర్కెతో నిన్ను ఎత్తుకు పోయినా నంటారు. (ఆడవాళ్ళని ఎత్తుకుపోవడం నీచ మైన కోరిక కాదన్నమాట! అది ఔన్నత్యం అన్నమాట!) నా హృదయాన్ని ఈ నాటికైనా గ్రహించావా?" అంటాడు.

"ఏమీ, ఎందుకు గ్రహించలేదూ? .... కానీ ఇంత తెంపరితనంతో వృధాగా ...."

"ఏమి చెయ్యను సీతా? నా హృదయ శాంతి కోసం ఎంత తల్లడిల్లిపోయాను! .... ఎన్ని సౌందర్యాలు స్వాధీన పరుచుకున్నాను! (రావణుడు ఎందరు అందగత్తెలనో ఎత్తుకు వచ్చి, ఆ సౌందర్యాల్ని స్వాధీన పరుచుకున్నాడు! కానీ, పాపం .... అతని హృదయానికి శాంతి దొరక లేదు. ఏం చేస్తాడు మరి? శాంతి కోసం దేన్నయినా ఎత్తుకు రావలసిందే కదా? అంతే కదూ ముద్దు కృష్ణ గారూ?) సీతా! నీకు బాధగా ఉన్నానా? నీకు అపచారం చేస్తున్నానా?"

"కాదు. ఎందుకు ఇంత తొందర పడ్డావు?" (అబ్బే, నాకేం అపచారం? నన్ను ఎత్తుకొచ్చావు. అంతేగా?)

"నిన్ను పొందడానికని నా బ్రతుకూ, నా కీర్తీ, నా రాజ్యం, నా సమస్తం జూదమాడి వేయవలెననిపించింది ...."

"ఎందుకు ఇంత జాలిగా అయిపోతున్నావు? .... రాముడు ఎంత బాధ పడతాడో ఆలోచించావా? .... అంగీకరించగలవా స్త్రీ హృదయంలోని విశ్వ ప్రణ యాన్ని?"

"ఏమిటి సీతా?"

"స్వార్థ మెరుగని ప్రేమ పురుషులకు ఊహాతీత మేమో! స్త్రీ దృష్టి వేరు. స్త్రీ 'ఇచ్చివేసే ప్రేమనే' ఎక్కువ ఎరుగును .... పురుషుడు స్త్రీలోని ఈ విశ్వ సందర్శ నానికి ఆగలేడు. ఈ వైశాల్యంలో, ఆ చిన్నబుచ్చుకోదగిన జానెడు స్వార్థం నింద్యమౌతుంది." (స్వార్థాన్ని జానల్తో కొలవడం తప్ప, సీత మాటలేమిటో ఏమన్నా అర్థ మయ్యాయా?)

రావణుడు సీత పాదాల దగ్గిర మూర్ఛపోతాడు. సీతకి రావణుడి మీద గొప్ప ప్రేమ! ఏమిటో గందర గోళం డైలాగులు చెప్పి, పాపం అతన్ని మూర్ఛ పోగొ ట్టింది.

"స్త్రీ హృదయంలో కష్టాలను ఓర్చుకొనే మహత్తర శక్తి ఉంది" అని రాముడూ,

"సీతా! ఏమి సృష్టి రహస్యాల నిప్పులు! ఏమి వెలు గులు నీ కన్నులలో!" అని రావణుడూ,

"ఇచ్చివేసే ప్రేమనే స్త్రీ ఎరుగును" అని సీతా! స్త్రీ అంటే ఏమిటో లోకాతీతం అయినట్టు!

స్త్రీ, కష్టాలు భరిస్తుంది. (గతి లేక. కష్టాలు సుఖంగా ఉండి కాదు!)

స్త్రీ కన్నులు పురుషుడికి గొప్ప రహస్యాలు చెపు తాయి. (స్త్రీ కన్నులు – కాదు, పర స్త్రీ కన్నులు!)

స్త్రీకి ఇచ్చివేసే ప్రేమనే తెలుసు (తీసుకునే హక్కు లేక!)

ఇవన్నీ సమాజంలో స్త్రీ హీనస్థితిని బట్టి పుట్టు కొచ్చిన సిద్ధాంతాలే. ఈ నవీనులు 'స్త్రీని గొప్ప చేస్తున్నాం' అనుకుంటూ, స్త్రీ హీన స్తితినే కీర్తిస్తారు.

..........................

చివరి ఘట్టం! లంకలో, యుద్ధానంతరం సీత రాముణ్ణి కలిసే ఘట్టం! అగ్ని పరీక్ష కోసం ఏర్పాట్లు జరిగాయి.

అగ్ని జ్వాలలు నాలికలు చాచి మండుతున్నాయి.

రాముడు ఆందోళనగా ఉన్నాడు. సీత భూతలాన్ని పవిత్రీభూతం చెయ్యడానికి అవతరించినట్టు ఉన్నది.

రాముడు – "సీతా! రావణ వధకు పూనుకోవడం విధిగా ఎంచి .... కానీ నీ రాముడి హృదయం నిర్మల మని నీవు ఎరుగుదువు .... ద్వేషానికీ, సంశయానికీ చోటు లేదు ...." – అంటే, 'విధి వల్ల రావణుణ్ణి చంపాను. నన్ను అపార్థం చేసుకోవు కదూ?' అని అడుగుతున్నాడు.

ఈ ఇద్దరూ ఎలా మాట్లాడుకుంటున్నారో చూడండి. తర్వాత అగ్ని పరీక్ష జరగాలి!

సీత – "రావణుణ్ణి అర్థం చేసుకున్నావా?"

"పూర్తిగా అర్థం చేసుకున్నాను .... అవసాన దశలో నీ పేరే జపించాడు."

"స్మృతి వచ్చి మాట్లాడినాడా?"

".... నీ కోసం నశించడమే తన ఆశయం అంటూ .... మరణ సమయంలో హృదయం విప్పి చెప్పి నా గుండెలు కరిగిపోయేటట్టుగా .... 'సీతను ఇకనైనా సుఖ పెట్టు. ప్రజలు అపనిందలు వేస్తారు, పాటించకు' అని దీనంగా వేడుకున్నాడు. నేను అంతర్గతంగా, దుఃఖంగా, కన్నీరుగా, కరిగిపోయాను. ఎంత ఆదర్శప్రాయుడైన ప్రియుడు! సీతా! రావణుడు బ్రతికి ఉన్నట్టు అయితే .... ఈ అగ్ని పరీక్షకు చాలా బాధపడేవాడు."

సీత తలవొంచి – "అవును చాలా బాధపడేవాడు" అని అగ్నిలో ప్రవేశిస్తుంది!

ఇదీ ముద్దుకృష్ణగారి 'అశోకం' నాటకం! ఈ ఆఖరి ఘట్టంలో రాముడూ – సీతా ఎంతో మురిపెంగా రావ ణుణ్ణి గురించి మాట్లాడుకున్నారు. మళ్ళీ అగ్ని పరీక్ష! విధి కోసమట! ప్రజల కోసమట!

ఈ రచనలో రాముడికీ, రావణుడికీ శతృత్వం లేదు. పైగా అపారమైన స్నేహం! రావణుడు, రాముడి ఔన్న త్యాన్ని ఆరాధిస్తూ వుంటాడు. రాముడు, తన భార్య మీద రావణుడి ప్రేమకి ముగ్ధుడైపోతూ వుంటాడు.

రాముడు, చెప్పడానికి వీల్లేనంత ఉత్తముడు. తన భార్య ప్రియుడి గురించి కూడా ముచ్చటగా మాట్లాడ తాడు. రామాయణంలో సీత రాముడి వల్ల చాలా అవ మానాలు పొందిందని ముద్దుకృష్ణగారు చాలా బాధ పడ్డారు. ఈ రచనలో మాత్రం ఆ భార్యాభర్తలు ఏ లోకా నికీ చెందని స్నేహితులు! – ఈ పాత్రలన్నీ ఏ సమాజం నించి వచ్చాయి? ఇంత వరకూ మానవ సమాజంలో ఏ దశలో ఈ రకం మనుషులు ఉన్నారు? ఈ రకం మనుషులే వుంటే, ఇది పతనమా, ఆదర్శమా?

వాల్మీకి చెప్పిన సమాజం వేరే ఉంది. వాల్మీకి చూపించిన పాత్రలు వేరే ఉన్నాయి. కానీ దాన్ని తోసి పుచ్చి దానికన్నా కొత్త సృష్టి చెయ్యాలని రచయిత ఈ పాత్రలు సృష్టించారట! ఈ పాత్రల గురించి రచయిత ఇలా చెప్పుకున్నారు – "ఈ నాటకంలోకి సీతా రాము లను రామాయణంలో కన్నా ఉత్తములుగా, ఎక్కువ గంభీరులుగా, ఉదార స్వభావులుగా, మానవ పరిణా మంలో ఉత్తమ స్థాయి పొంది, సత్యం నిండు తేజస్సును గ్రహించిన పవిత్రాత్ములనుగా నిర్మించడానికి యత్నిం చాను" అన్నారు.

రామాయణంలో పాత్రలు, రామాయణ కాలం పాత్రలుగా వుండాలా, వేరే కాలం పాత్రలుగా వుండాలా? ఫలానా రకంగా జరిగిన రామాయణం కధని, దాని కన్నా భిన్నంగా మారిస్తే, అది రామాయణం కధే అవుతుందా? అంతఃపురాలూ, పాతివ్రత్యాలూ, వన వాసాలూ, అగ్ని పరీక్షలూ, అలాగే ఉన్నాయి! కానీ, ఒకే స్త్రీని ప్రేమించిన ఇద్దరు పురుషుల మధ్య స్నేహం ప్రవేసించింది! యుద్ధాలూ, చంపుకోడాలూ అలాగే ఉన్నాయి. మళ్ళీ ఆ యుద్ధంచేసే వాళ్ళ మధ్య ప్రేమ సంభాషణలు పుట్టుకొచ్చాయి!

"ఈ నాటకంలోని సీత, తన ధర్మాన్నీ, తన నీతినీ, అడుగడుగునా తానే నిర్ణయించుకుని, శీలం నిలబెట్టుకో గల వ్యక్తిత్వమున్న స్త్రీ అయింది" అన్నారు రచయిత. సీత తన విషయాలు తనే ఎక్కడ నిర్ణయించుకుంది? తన పెళ్ళి సంగతి అంతా విధికీ, జనకులికీ, ఆ బండ విల్లుకీ వొదిలింది కదా? పర పురుషుడు బలాత్కారంగా ఎత్తుకుపోతే వాడి మీద కోపం లేకపోవడమే ఆమె సాధించిన ఉదాత్తత!

మళ్ళీ అగ్ని పరీక్షకు లొంగే సాంప్రదాయం!

"రామాయణ నీతుల్ని నేను ధిక్కరిస్తాను. అవి న్యాయంగా లేవు. వాటిని నేను అంగీకరించను" అని రామాయణ పాత్రల్ని దుయ్యబట్టడం! తీరా జేస్తే అంతకన్నా రోతగా రాముణ్ణి కీర్తించడం! సీతనేదో మార్చాననుకొని గతం కన్నా సిగ్గు మాలిన తనాలకు బానిసని చెయ్యడం! వెనకటి సమాజ స్వభావానికి తగి నట్టుగా గతంలో వున్న పాత్రల్ని, అస్తవ్యస్తపు, మతిభ్ర మించిన బూర్జువా వాగుళ్ళ పాత్రలుగా తయారు చెయ్యడం! ఇదే ముద్దుకృష్ణ గారి అశోకం! బ్రహ్మాండమైన గందరగోళం! ★

# 7. చలం గారి "సీత అగ్ని ప్రవేశం"★

[ఇది చిన్న నాటిక. సీతా, రాముడూ – ఈ రెండే పాత్రలు.]

లంకలో యుద్ధం ముగిసింది.

సీత రాముడి దగ్గిరికి వస్తుంది. దీర్ఘ కాల వియోగ భారంతో తపించిపోతూ మాట్లాడుతుంది – "రామా! కల్యాణమూర్తీ! ఎన్ని దినాలకు మళ్ళీ నీ దివ్యమోహన దర్శనమయింది నాకు! .... నీ బాహుబల దర్పాల చేత ఈ క్రూర రాక్షసుణ్ణి సంహరించావు .... ఈ పుణ్య దినం ఎన్నడు వస్తుందా అని జపం చేస్తున్నాను .... ఇంక నా జన్మ అంతా నీ ప్రేమామృతం వల్ల నిర్జరమూ నిర్మర ణమూ అవుతుంది .... నీ కోసం నా హృదయం ఎట్లా అర్పితమయిందో; ఏ ప్రలోభమూ కాని, ఏ మరణ భయమూ కాని, నా హృదయాన్ని చలింపజేయలేదనీ, నీ గాఢానురాగం ఏ కాల పరిమితి వల్లనూ సంకుచిత పడలేదనీ, నిరూపించింది – ఈ మహా యుద్ధము ...." ఇలా సీత ఇంకా ఉద్వేగంతో మాట్లాడుతూ వుంటుంది.

రాముడు మధ్యలోనే అడ్డుపడతాడు – "ఆగు, సీతా! నే చెప్పే మాటలు శ్రద్ధగా విను! విధివశం చేత నీవు స్త్రీవి. శత్రువుల చేత హరింపబడ్డావు. నీవు అన్య స్పృశ్యవు. కళంకితవు .... నాకు పట్ట మహిషివి కాజా లవు" అన్నాడు.

"స్పష్టంగా మాట్లాడండి. అన్య స్పృశ్య అంటే మీ అభిప్రాయం ఏమిటీ?" అంది సీత.

"రావణుడు నిన్ను ప్రేమించాడు."

"నా తప్పా?"

"నిన్ను తస్కరించాడు."

"నా తప్పా?"

"అతని అంతఃపురోద్యానంలో నివసించావు."

"నా తప్పేనా?"

ఈ రచనలో సీత, రామాయణంలో సీత లాగే. అయోనిజే. మానవ స్త్రీకి పుట్టని పవిత్రురాలు. సీత మాటల్లో కనపడే రావణుడు – పది తలల రాక్షసుడే! ఈ పాత్రలు, మైతాలజీ కథలో పాత్రలే. ఈ కథలో కూడా దేవతలూ రాక్షసులూ అందరూ ఉంటారు. కానీ, ఈ సీత, ఆధునిక కాలపు స్త్రీల చైతన్యంతో మాట్లాడు తుంది! మళ్ళీ పూర్తిగా ఆ విధంగానూ కాదు. కొన్నిసార్లు పాత సీత లాగా, కొన్నిసార్లు కొత్త సీతలాగా, మాట్లాడు తుంది.

'నిన్ను పర పురుషుడు తస్కరించాడు కాబట్టి, నువ్వు నాకు పట్టమహిషివి కాజాలవు' అని రాముడు అన్న తర్వాత సీత ఇలా జవాబు చెపుతుంది – "వివాహంలో నాతో సుఖదుఃఖాలు పంచుకుంటానని, నన్నెన్నడూ విచారపెట్టనని, నా భారం వహిస్తానని, నన్ను రక్షిస్తానని, నన్ను నీ అర్ధాంగినిగా స్వీకరించావు. నన్ను శత్రువుల నించి రక్షించుకోవలసిన బాధ్యత నీది. ఏ పురుషుడు గాని నన్ను ప్రేమిస్తే, నన్ను తస్కరిస్తే, మన బాంధవ్యం విచ్ఛేదమవుతుందా? నేను భక్ష్యాన్నా, ఇతరుడు ఎంగిలి చేశాడనే అనుమానంతో విసిరి కాకులకు పారవెయ్యా డానికి? జనకునికి ప్రియపుత్రికను. అయోనిజను. .... నీచమైన స్త్రీ గనకనే కదా ఒక్క మాటతో, దిక్కు లేక పోయిన కుక్క గనకనే కదూ వాగ్దత్తాలు, ప్రేమ, ధర్మము, వివాహ సంస్కారము, అన్నీ ఇంత సులభంగా అతిక్ర మించ గలుగుతున్నారు? .... నీ జీవితమే నా జీవితం వలె భగ్నమైతే, నీ వింత సులభంగా నన్ను పొమ్మన గలవా? .... ఇట్లా తృణీకరించి, తన్ని పొమ్మనిన, నేను కుక్కనై నీ వెంటనంటి, నీ పాదాల పై బడి ఏడ్చి, నేను చెయ్యని తప్పుకీ ప్రాయశ్చిత్తాలకూ లోనై, సమస్తమైన న్యూనతలకూ తల వొంచితే, యుగ యుగాలు పతివ్రత నని నన్ను స్తుతిస్తారు. కొంచెం అభిమానం కలదాన్నై ఈ నీచత్వానికి తిరగబడి, నీ కాఠిన్యాన్ని దూషించి, నా జీవితం నేను చూసుకున్నానా, కులట నౌతాను .... నే నొక యంత్రాన్ని, బిడ్డల్ని కని నీ కిచ్చేందుకు. ఇది

---

★ చలం. సీత అగ్ని ప్రవేశం. (చలం నాటకాలు–1లో) విజయవాడ-2; దేశి కవితా మండలి, 1962. ★

మలినమయిందని తోచింది. ఇంకో కొత్త యంత్రాన్ని తెచ్చుకుంటావు. స్త్రీకి ప్రాణం లేదు. హృదయం లేదు. ధర్మం లేదు ...." ఈ రకంగా సాగుతుంది సీత ధిక్కారం!

ఈ సీత, రామాయణ కథా కాలం నాటి హద్దుల్ని దాటి మాట్లాడుతుంది. నేను భక్ష్యాన్నా, ఎంగిలైపోవ డానికి? స్త్రీ కుక్కతో సమానమా, ఇంత నీచంగా తరమ డానికి? పురుషుడికి ఉన్న హక్కులు స్త్రీకి లేవా? స్త్రీ పిల్లల్ని కనే యంత్రమా? – ఈ రకం ప్రశ్నలన్నీ, ఈ నాటి ఆధునిక సమాజానివి. ఈ ప్రశ్నలు రామాయణ కాలం నాటి సీత, కలలోనైనా ఊహించి వుండదు. ఈ ప్రశ్నలు ఆ నాటి సీత వింటే, ఆ సీతే వీటిని ధర్మ ధిక్కా రంగా భావిస్తుంది. స్త్రీకి సమాన హక్కులా పురుషుడితో? పిల్లల్ని కనడానికి కాకపోతే స్త్రీ ఇంక దేనికి పుట్టింది? – అని విస్తుపోతుంది. పర పురుషుడి వల్ల బలాత్కారమే జరిగితే, స్త్రీ అపవిత్రురాలయి పోయినట్టేనని సీత కూడా నమ్ముతుంది. భర్త పాదాలు సేవిస్తూ పతివ్రతగా జీవిం చడం గొప్ప ధర్మమని భావించే సీతని, భర్త ధిక్కారానికి, తలపడినట్టుగా చూపిస్తే, అది ఆ సమాజానికి అతుకు తుందా?

ఈ రచనలో కూడా సీత, రాముడితో, తన భారం వహించడం, తనని రక్షించడం, అంతా అతని బాధ్యతే అంటుంది. ఈ సీత కూడా (చలం సీత కూడా) సమస్త మైన కార్యాలకూ భర్త మీదే ఆధారపడి వుంటుంది. .... 'నా భారం వహిస్తాననీ, నన్ను రక్షిస్తాననీ, నన్ను నీ అర్ధాంగిగా స్వీకరించావు కదా? నన్ను శత్రువుల నించి రక్షించుకోవలసిన భారం నీదే కదా? నన్ను ఎవరూ ఎత్తుకు పోకుండా నువ్వే నన్ను రక్షించుకోవలిసింది' అనే రకంగా వాదిస్తుంది. ఈ వాదం బాగానే వుంది. కానీ, ఇలా మాట్లాడడం అంటే, ఈ స్త్రీ, భర్త రక్షణలో వుండ డానికి అంగీకరించే స్త్రీయే అవుతుంది. అలాంటప్పుడు – "నాకు స్వేచ్ఛ లేదా? నీకు ఉన్న హక్కులు నాకు లేవా?" అని వాదించే పరిస్థితి ఎక్కడిది?

సీత, శతృవుల నించి, క్రూర జంతువుల నించి, తనను తను రక్షించుకోలేదు. అప్పుడు ఆమెకు తన ఇష్టప్రకారం అడవుల్లో తిరిగే స్వేచ్ఛ ఉంటుందా? ఆమె, తనని రక్షించే వారి ఆజ్ఞల ప్రకారమే మసలవలసి ఉంటుంది. ఆ రక్షించే వ్యక్తి "ఇప్పుడు బయటికి వెళ్ళకు. నీ వెంట నేను ఇప్పుడు రాను" అంటే, ఆమె బైటికి వెళ్ళడం మానెయ్యాలి. "సరే వెళ్ళు. ఆ గడప అవతల పొన్నచెట్టు దగ్గిర మాత్రమే తిరుగు" అంటే, అలాగే చెయ్యాలి. ఎందుచేత? ఏదైనా ప్రమాదం జరిగితే, ఆమె, తనను తను రక్షించుకోలేదు కాబట్టి. కానీ ఆమె – "నాకు స్వేచ్ఛ లేదా? నా ఇష్టం. బైటికి ఇప్పుడే వెళ్తాను. రా, నన్ను రక్షించు! నా భారం వహించు!" అనడానికి వీలవు తుందా? ఇతరుల మీద ఆధారపడటానికీ, స్వేచ్ఛకీ, కుదరదు. ఆమె అడవుల్లో స్వేచ్ఛగా తిరగదల్చుకుంటే, తనను తనే రక్షించుకోవాలి. ఏ విషయంలో అయినా ఇంతే.

వాల్మీకి సీత, స్వేచ్ఛగా జీవించగల స్థితిలో లేదు. స్వేచ్ఛ గురించి మాట్లాడే చైతన్యమూ లేదు. ఆ రెంటికీ సరిపోయింది.

చలం సీత కూడా స్వేచ్ఛగా జీవించగల స్తితిలో లేదు. ఆ స్తితి మారినట్టు చెప్పడం లేదు. ఈ సీత కూడా తనని 'అయోనిజ'గానే చెప్పుకుంటోంది' అంటే, పాత సీత లాగే. భర్తనే తనకు రక్షకుడిగా కూడా చెప్పు కుంటోంది. కానీ, మళ్ళీ ఈ సీతే, స్వేచ్ఛ గురించీ, హక్కుల గురించీ మాట్లాడుతోంది! – "నేను పిల్లల్ని కనే యంత్రాన్నా? స్త్రీల ధర్మం, పురుషుల ధర్మం ఒకటి కాదా?" అని అడుగుతోంది.

రామాయణ కథలో సీతకు అన్యాయం జరిగిందని ఈ కాలం రచయిత గ్రహించడం వేరూ, సీతే గ్రహిం చడం వేరూ.

సీత తరుపున, ఈ కాలం రచయిత మాట్లాడడం వేరూ, సీతే మాట్లాడడం వేరూ.

రామాయణ సీత కూడా, రాముడు అన్న మాటల వల్ల, తనకు అన్యాయమే జరిగిందని గ్రహిస్తుంది, బాధ పడుతుంది. కానీ ఈ నాటి చైతన్యంతో కాదు. ఆమె ఆలోచనలూ, ఆమె కోపమూ ఆమె సాంఘిక స్థితిని దాటవు.

ఇంకో చోట, సీత రాముడితో – "నీకు తల్లి యెడల, తండ్రి యెడల, తమ్ముల యెడల, జనం యెడల, పశు వుల యెడల, రాళ్ళ యెడల, ధర్మాలూ విధులూ ఉన్నాయి. భార్య యెడల లేవు" అంటుంది. కానీ ఎందుకు లేవు? రాముడికి భార్య యెడల కూడా స్పష్టమైన ధర్మాలూ, నీతులూ ఉన్నాయి. 'తండ్రిని గౌర వించవలెను, తండ్రి మాట ప్రకారమే నడవవలెను', అనే ధర్మాలు ఎంత స్పష్టంగా ఉన్నాయో, 'భార్యని గౌరవించ

కూడదు. భార్యని వ్యక్తిగా గుర్తించకూడదు. భార్యని సేవకీ, కామానికీ మాత్రమే ఉపయోగించుకోవాలి. భార్య, పర పురుషుణ్ణి చూసినా, పరపురుషుడు భార్యని చూసినా, ఆమెని కఠినంగా శిక్షించాలి. త్యజించాలి' అనే ధర్మాలు కూడా అంత స్పష్టంగానూ ఉన్నాయి. రాముడు, ఈ ధర్మాలనే భార్య యెడల పాటిస్తున్నాడు. ఇక, భార్య యెడల ధర్మాలూ, విధులూ లేకపోవడం ఏమిటి?

తర్వాత, చలం సీతకు భర్త మీద చాలా కోపం వచ్చింది. ఆ కోపం అంతా రావణుడి మీద ప్రేమగా మారింది. మొదట "క్రూర రాక్షసుడి నించి నన్ను రక్షించావు" అన్నప్పుడు క్రూరుడిగా కనపడ్డ ఆ రాక్షసుడు, ఇప్పుడు సీతకి ఉత్తమ పురుషుడిగా మారిపోయాడు. ఆమె, రావణుడి గురించి రాముడితో ఇలా చెపుతోంది –"…. రావణుడు నన్ను ప్రేమించాడు. రావణుడి ప్రేమ బంధాన్ని నీ నిశిత శరాలు కూడా నాశనం చెయ్యలేక పోయినాయి. ఒక్క నరుడు ఏ మూలనన్నా సంశయిస్తాదేమోనని మాయ సంశయం తోచగానే పటాపంచలయింది నీ ప్రేమ. సర్వ జనులూ, తమ్ములూ, భార్యలూ, మునులూ, దేవతలందరూ అక్రమమంటున్నా; రాజ్యమూ, ఐశ్వర్యమూ, ముద్దు కొడుకులూ, తమ్ములూ ఛస్తున్నా; తన పది తలలూ తెగి దొర్లుతున్నా – ఈషణ్మాత్రమూ చలించనిది అతని ప్రేమ! ప్రేమించాడు! నీ కర్థం కాదు ఆ ప్రేమ. కనక దానికి పశుత్వమనీ, రాక్షసత్వమనీ, పేరుపెట్టి అతన్ని సమూలంగా నాశనం చేశావు. …. పోనీ, నన్ను బలాత్కరించాడా? అతనంత నీచుడు కాదు. నా ప్రేమ కోరాడు. కానీ, తన సంతానం వృద్ధి చేసే యంత్రంగా చూడలేదతను నన్ను. నా సన్నిధిని కోరి, నేను లేని జీవితం వ్యర్థమని, తన సర్వమూ ఆహుతి చేశాడు. అటువంటి ధీరుణ్ణి ప్రేమించక కఠినత్వం వహించిన పాపం ఇట్లా పరిణమించింది" అంటూ సీత, తను రావణుణ్ణి అంగీకరించనందుకు పశ్చాత్తాప పడింది.

రాముడితో ఇంకా ఇలా అంటోంది – "ఆ రాక్షసుడు నన్ను బలాత్కరించాడనుకో. ఆ రాక్షసుడి బలాత్కారం వల్ల న్యూనత పొందిన నా సుకుమార హృదయానికి పరిశాంతి నివ్వవలసిన వాడివి, ఇదా నీవు చూపే కరుణ? నీవు ధర్మాన్ని జరిపే యంత్రం. నేను పిల్లల్ని కనే యంత్రం. నీవు నన్ను త్యజించడం కాదు; నీ వంటి హృదయం లేని యంత్రాన్ని, వంచకుణ్ణి, నీచుణ్ణి, నిన్ను నేనే భర్తగా త్యజిస్తున్నాను. నీ నీచ నామంతో అపవిత్రమైన నా హృదయాన్ని ఈ ప్రణయ ధీరుడి రుధిరం వల్ల, పవిత్రమైన ఈ జ్వాల వల్ల, నిర్మలం చేసుకుంటాను" అని రావణుడి చితిలో దూకింది!

భర్తలో నీచత్వం గ్రహించి, భర్తని తిరస్కరించడం సీతకు ఆత్మగౌరవమే. కానీ, తనని ఎత్తుకుపోయి నిర్బంధించిన వాణ్ణి ఉత్తమ ప్రియుడిగా ఎంచడం ఎలాంటి ఆత్మగౌరవం?

ఈ సీత, రాముడిలో ఏ లోపాలు ఎంచిందో. ఆ లోపాలన్నీ రావణుడిలో కూడా ఉన్నాయి. అంతే కాదు, ఆడవాళ్ళని ఎత్తుకొచ్చి బలాత్కారాలు చేసే నీచత్వం, రాముడిలో లేనిది, రావణుడిలో అదనంగా ఉంది! అలాంటి రావణుడు ఏ స్త్రీకైనా ప్రేమ పాత్రుడెలా అవుతాడు?

'రావణుడు నన్ను పిల్లల్ని కనే యంత్రంగా చూడలేదు' అంది సీత. సీత నెందుకు చూస్తాడు? ఆమె ఇంకా అతనికి భార్యగా మారలేదు. అతని భార్యల్ని అతను పిల్లల్ని కనే యంత్రాలు గానే చూస్తాడు. రాముడు సీతనెలా చూస్తాడో, రావణుడు మండోదరిని అలాగే చూస్తాడు.

పిల్లల్ని కనే యంత్రం ప్రసక్తి ఇక్కడ అనవసరం. రావణుడు సీతని కామం తీర్చే యంత్రంగా చూడలేదా? సీతని బలాత్కారంగా జుట్టుపట్టి ఈడ్చి ఎత్తుకు రాలేదా? రాముడి మీద కోపం వున్నవాడు రాముడి మీదే పగ దీర్చుకోక, తన కక్ష కోసం సీతనెందుకు ఉపయోగించుకోవాలి? సీత ఏం కష్టం కలిగించింది అతనికి? అంటే, రావణుడు సీతని స్వతంత్ర వ్యక్తిగా చూడలేదు. రాముడి ఆధీనమైన వ్యక్తిగానే చూశాడు. రాముడికి కష్టం కలిగించడానికే సీతని ఎత్తుకుపోయాడు. అది సీత మీద ప్రేమతో కాదు. పరస్త్రీలతో వ్యభిచరించే పురుషులు, ఒక స్త్రీ దొరికినప్పుడు, ఆ అవకాశాన్ని వదులుకోరు. రావణుడు కూడా ఆ రకంగానే సీత వెంట పడ్డాడు. అది 'ప్రేమ' కాదు.

రావణుడు సీతతో మాట్లాడుతూ – "మన్మధ బాధ కోసం నిన్నింతగా ప్రార్థిస్తున్నానుగానీ, రావణుడంతటి వాడు ఆడదానికి నమస్కరిస్తాడా?" అంటాడు ఒకసారి. స్త్రీలు హీనులనే దృష్టి రాముడికి ఉన్నట్టే, రావణుడికీ ఉంది.

రావణుడు పోయింతరువాత మండోదరి ఏడుస్తూ, "అంతఃపురాలలో నించి బయటికి వచ్చినందుకు మా మీద కోపం తెచ్చుకోవేం?" అంటుంది. రాముడు తన భార్యని ఏ స్థితిలో ఉంచాడో రావణుడూ తన భార్యల్ని ఆ స్థితిలోనే ఉంచాడు, మండోదరిని ఏ శతృరాజైనా ఎత్తుకుపోయి, కొంత కాలానికి ఆమెని రావణుడు తిరిగి తెచ్చుకుంటే, రాముడు సీతని అగ్ని పరీక్ష కోరినట్టు రావణుడూ మండోదరిని అగ్ని పరీక్ష కోరేవాడే.

రావణుడు సీతని బలాత్కరించలేదంటే కారణం, కథ ప్రకారం, అతని శాపమే. అంతేగానీ, అది అతని ఉత్తమత్వం కాదు. ఎప్పుడూ పర స్త్రీలను ఎత్తుకు వస్తూ, వారిని బలత్కారాలు చేస్తూ ఉండేవాడు ఉత్తముడెలా అవుతాడు? రావణుడు ఏ రకంగా ఉత్తముడైన భర్త అవుతాడు? ఏ రకంగా స్త్రీని గౌరవించే పురుష డౌతాడు? ఉత్తమ భర్త కానివాడూ, స్త్రీ పట్ల గౌరవం లేనివాడూ, ఉత్తమ ప్రియుడెలా అవుతాడు?

చలం సీత – రాముణ్ణి తిరస్కరించి, అంతకన్నా నీచుడైనవాణ్ణి ఎంచుకుంది! అది సీతకు ఏం గౌరవం?

సీత, రావణుడి చితిలోకి దూకిన తర్వాత కూడా రాముడితో ఇలా అంటుంది – "నా హృదయం పవిత్ర మైనా, నా శరీరం మలినమయిందనే సంశయంతో నన్ను త్యజించావు. నా శరీరం నీ వలన మలినమయిం దని తెలిసి కూడా నా హృదయాన్ని మాత్రమే కోరాడు ఈ రాక్షసుడు. ఎవరిది ఉన్నతమైన ప్రేమో నిర్ణయించ గల బుద్ధిమంతులు పుట్టకపోతారా ప్రపంచంలో?"

సీత శరీరం రావణుడి వల్ల మలినం అయిందని రాముడు అనుకోవడంలో అర్థం వుంది. రావణుడు సీతకి పర పురుషుడు కాబట్టి. సీత శరీరం రాముడి వల్ల మలినమయిందని రావణుడు అనుకోవడంలో అర్థం లేదు. రాముడు సీతకు పర పురుషుడు కాదు. స్త్రీ శరీరం ఆమె భర్త వల్ల మలినమవుతుందని ఆ పురుషుడు గానీ, ఆ స్త్రీ గానీ, అనుకోరు. ఆ విధంగా, ఆ స్త్రీని కోరే పర పురుషుడూ అనుకోడు.

సీత, రావణుడి గురించి "ఆ ప్రణయ ధీరుడు నా హృదయాన్నే కోరాడు .... నన్ను ప్రేమించాడు."

ఇలాంటి మాటలు గుప్పించినంత మాత్రాన రావణుడు ప్రణయ ధీరుడైపోడు. అది ప్రేమా అవదు.

పురుషుడికీ పురుషుడికీ ఉన్న కక్షల మధ్య స్త్రీలను ఉపయోగించే రామాయణ పరిసరాల్లో, చలం చెప్పే 'ఉత్తమ ప్రణయానికి' ఆస్కారం ఉండదు.

బానిస బతుకులు బతికే స్త్రీలకు కనువిప్పు కలి గించాలని తహ తహలాడే రచయితలు స్త్రీల పాత్రల్ని నూతన చైతన్యంతో సృష్టిస్తారు. కానీ, ఆ నూతన చైతన్యం, ఆ కథా కాలానికీ, ఆ పాత్రల స్వభావాలకూ అతీతంగా ఉండకూడదు. ఒక రచననీ, అందులో పాత్రల్నీ కీర్తించాలన్నా, విమర్శించాలన్నా, ఆ రచన హద్దుల్ని దాటకూడదు.

'నేను అయోనిజను' అని చెప్పుకునే సీతతో, 'స్త్రీలు పిల్లల్ని కనే యంత్రాలా?' అని అడిగిస్తే, అది నూతన చైతన్యం అవదు. అది, ఆ పాత్ర స్తితికీ, దాని చైతన్యానికీ పొసగని తనం అవుతుంది. పాత కాలంలోకి కొత్త కాలాన్ని జొప్పించడం అవుతుంది. కాబట్టి, స్త్రీల ఆధునిక భావాల్ని రామాయణ సీత ద్వారా చూపించడం కుద రదు. రామాయణ సీతకు, రాముణ్ణి ఆత్మగౌరవంతో తిరస్కరించే స్తితీ శక్తీ ఉండవు.

సీత, లంకలోనే రాముణ్ణి తిరస్కరించి రావణుడి కాష్టంలో పడిపోతే, రాముడితో అయోధ్యకు వెళ్ళిన సీత ఎవరు? లవ కుశుల్ని కన్న సీత ఎవరు? ఇంకా తర్వాత జరగవలసిన కథంతా ఎలా జరగాలి? చలంగారు తీసు కున్న కథ, రామాయణమే కదా? రాముడు, సీతని తిరస్కరించేదాకా అంతా రామాయణం ప్రకారమే సాగింది. సీత లంకలోనే చచ్చిపోతే తర్వాత కథ ఏమవు తుంది? ఇక ఆ కథ లేనట్టేనా?

సీత, భర్త చేసిన అవమానానికి కొంత దుఃఖించి, అతన్ని కొంత దూషించి, చివరికి ఎలాగో సహించి, భర్తతో అయోధ్యకు వెళ్ళవలసిందే. ఆ కథని మార్చడానికి ఇతర రచయితలకు హక్కు వుండదు. ఆ పాత్ర ఏ పరిధిలో ఉండాలో ఆ పరిధిలోనే ఆమె బాధనీ దుఃఖాన్నీ చూపించాలి. రచయిత, తన మాటలుగా, తన విమర్శ లుగా, తన వ్యాఖ్యానాలుగా, ఎటువంటి భావాలైనా ప్రకటించవచ్చు. ఆ నూతన భావాల్ని ఆ పాత్రల మాటల ద్వారా ప్రదర్శించకూడదు.

చలంగారికి సీత మీద చాలా సానుభూతే. కానీ, సీత, రావణుణ్ణి ఎంచుకున్నట్టు చెప్పడం ఆమెకు ఎంత అవమానం!

సీత, రాముణ్ణి తిరస్కరించినా, రావణుణ్ణి ఎంచుకో నక్కరలేదు. ఒక అహంకారిని తిరస్కరించేది, ఇంకో దురహంకారిని ఎంచుకోవడానికి కాదు! ★

# 8. పెరియార్ ఇ.వి.రామస్వామి గారి "రామాయణ-ఎ ట్రూ రీడింగ్"★

[పెరియార్ గారు తమిళ రచయిత. 'పెరియార్' అంటే, 'పెద్ద వారు; పెద్దాయన' అని అర్థం. ఇది, బిరుదు లాంటిది. వీరిని, నేను ఈ వ్యాసంలో, రామస్వామి పేరుతోగాక, 'పెరియార్' పేరుతోనే ప్రస్తావిస్తాను. ఎందుకంటే, ఈ 'రామాయణ విమర్శకుల' భాగంలో, ఇంకో రామస్వామి గారు కూడా ఉన్నారు కదా? కాబట్టి, వీరిని పెరియార్‌గానే చెపుతాను. 'రామాయణం' మీద వీరు రాసింది తమిళం లోనే. ఆ తమిళ పుస్తకానికి ఇంగ్లీషు అనువాదం ఉంది. ఆ ఇంగ్లీషు అనువాదాన్నే ఇక్కడ తీసుకుంటు న్నాను. 'రామాయణం' మీద పెరియార్ అభిప్రాయాలు కూడా ఈ భాగంలోకి తీసుకుంటున్నాను.]

పెరియారు, ఈ రచనలో – ముందు 'రామాయణం' కథ మీద క్లుప్తంగా తన అభిప్రాయాలు చెప్పి, తర్వాత ఒక్కొక్క పాత్రనీ తీసుకుని విమర్శించారు. పెరియార్ అభిప్రాయాలు ఇక్కడ చెప్పడంలో నేను సాధ్యమైనంత స్వేచ్ఛ తీసుకుంటున్నాను. అవసరమైన ప్రతిచోటా ఇంగ్లీషులో వున్న అసలు మాటలు చేరుస్తాను.

'రామాయణం' గురించి పెరియార్ అభిప్రాయాలు ఇవీ:

రామాయణం చారిత్రకమైంది (జరిగింది) కాదు. పూర్తిగా కల్పన (ఫిక్షన్). రాముడు తమిళుడు గానీ, తమిళనాడుకి చెందిన వాడు గానీ, కాదు. అతను ఉత్తర దేశస్థుడు (నార్తనర్). రావణుడు లంక రాజు. లంక అంటే దక్షిణ తమిళదేశం. (సదరన్ తమిళనాడ్).

రాముడిలో గానీ, సీతలో గానీ తమిళ సంస్కృతికి సంబంధించిన అంశాలేమీ లేవు. తమిళ లక్షణాలేమీ లేవు. దైవత్వమనేదేదీ లేదు.[1]

రామాయణ భారతాలు – ఆర్యులు సృష్టించిన కల్పిత గాథలు. ఆర్యులు, తాము పుటకతోనే అధికులమని చాటుకోవడం కోసమే ఈ కథలు సృష్టించారు. ఆర్యుల్నీ, ద్రావిడ ద్రోహుల్నీ గొప్ప చెయ్యడమే – రామాయణం లక్ష్యం. ఇందులో సంఘటనలన్నీ పూర్తి అనాగరికమూ, ఆటవికమూ. ఇందులో, ప్రజలకు ఉపయోగకరమైందీ, ఆదర్శవంతమైందీ, తర్కానికి నిలిచేదీ, కీర్తింపదగ్గదీ – ఒక్క ముక్కయినా లేదు. తమిళులకు అసలే లేదు. బ్రాహ్మల ఆధిక్యం, స్త్రీలను హీనపర్చడం,[2] తమిళుల్ని కించపర్చడం మాత్రమే దీని లక్షణాలు.

ఈ కథలన్నిటినీ, మొదట సంస్కృతంలో రాశారు. ఇవి సంస్కృతంలో ఉండడమే ఆర్యులకు ఉపయోగపడింది. వీటిని ఏ ప్రజల మధ్య ప్రచారం చేస్తారో వారి తెలివితేటల్ని బట్టీ, వారి అమాయకత్వాల్ని బట్టీ, వీరు తమ ఊహాగానాలతో వింత వింత వ్యాఖ్యానాలూ అర్థాలూ చెపుతారు. ప్రపంచాన్ని ఉద్ధరించడానికి స్వర్గం నించి దిగివొచ్చిన పుణ్య పురుషులే ఈ కథలు చెప్పారనీ, ఇవి పవిత్రమైన ధర్మ శాస్త్రాలనీ, ప్రజలందరికీ నీతి బోధకాలనీ, మతానికే మూలస్తంభాలనీ, ఇలా అనేక రకాల పచ్చి అబద్ధాలతో (వైట్ లైస్), ఈ కథలకు లేని ప్రాముఖ్యతంతా వీళ్ళే కల్పిస్తారు.

పూర్వకాలంలో ఆర్యులు, ద్రావిడ ప్రదేశాల్ని ఆక్రమించారు. ద్రావిడుల్ని నీచపర్చి, అగౌరవపర్చారు. జరిగిన ఆ చరిత్రనంతా వక్రీకరించి, దానికి రంగులు పూసి, అబద్ధాలతో కట్టుకథలతో నింపేశారు. అదే రామాయణం![3]

---

★ Ramaswamy. Periyar, E.V. The Ramayana - A True Reading Translation Trichy - 17 Periyar Self - Resect Propaganda Institution Publications, 1972 (Second Edition) ★

ఈ పుస్తకానికి ఇప్పుడు తెలుగు అనువాదం కూడా ఉంది. అడ్రసు: రామాయణం (యదార్థ పరిశీలన). హైదరాబాదు బుక్ ట్రస్టు, 1-1-16/10సి, జవహర్‌నగర్, హైదరాబాదు – 500 020.

1. "Not an iota of Tamil culture ... devoid of Tamil characteristics. Nor there is any thing to be called devine in Rama or Sita." (Preface) ★
2. ".... that the women folk be subdued and subordinate ...." (P. 1-2) ★
3. The Aryans, when they invaded the ancient land of the Dravidas, maltreated and dishonoured the latter and had written a false and coloured history wholly fallacious. It is this they call Ramayana .... (P.3) ★

రామాయణం పవిత్ర గ్రంథమనే భావాన్ని చదువుకోని వాళ్ళకే కాదు, చదువుకున్న వాళ్ళకు కూడా చిన్నతనం నించీ చదువుల్లో ఇంకింపజేశారు. చదువుకున్న వాళ్ళు కూడా ఏ మాత్రమూ విచక్షణా జ్ఞానం లేకుండా ఆర్యులు చెప్పే పర లోకాలన్నీ ఉన్నాయని నమ్ముతారు.[4]

తమిళులు, రామాయణాన్ని కీర్తించడం అంటే, తమని తాము అవమానించుకోవడమే. తమ ఆత్మ గౌరవాన్ని భంగపరుచుకోవడమే. తమిళుడు, ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవాలంటే, ఆర్య బానిసత్వం నించి తనను విముక్తి చేసుకోవాలంటే, ఈ పురాణాల విషపు స్వభావాన్ని (విషియస్ మోటివ్స్) గ్రహించి, దాన్ని బట్ట బయలు చెయ్యాలి.[5]

తమిళులకు అవమానం కలిగించే ఆర్య దేవతల్నీ, వారి ప్రాధాన్యతనీ పీకి పారెయ్యాలి.[6] శుద్ధమైన రక్తం తన నరాల్లో ప్రవహించే ప్రతీ తమిళుడూ, ఈ ప్రతిజ్ఞ నెరవేర్చడమే తన కర్తవ్యంగా భావించాలి.

శుద్ధమైన ద్రావిడ రక్తం – అంటే ఏమిటో ఈయన వివరించలేదు. రక్తాన్ని, 'ఆర్య రక్తం, ద్రావిడ రక్తం' అనే తేడాలతో చెప్పుకోవచ్చునా? దానికి బదులుగా 'ద్రావిడుల ఆత్మగౌరవం' అనే మాటే వాడాలి. 1–8–1956న, తమిళులు వేలకొద్దీ రామ పటాల్ని బహిరంగంగా తగల బెట్టేశారని, పబ్లిషర్స్, ఈ పుస్తకానికి రాసిన నోట్‌లో తెలియజేశారు.)

విద్యావంతులైన తమిళులందరూ, 'రామాయణం' అంటే, 'కంబ రామాయణం' అనే దృష్టితోనే మాట్లాడతారు. (వాల్మీకి రామాయణానికి, కంబన్ అనే తమిళ రచయిత చేసిన అనువాదమే కంబ రామాయణం.) పండితులు తమ బతుకు దెరువు కోసం, తమ పాండిత్య ప్రదర్శన కోసం, ప్రజలకు కంబ రామాయణాన్ని బోధించడం, దాని మీద ఉపన్యాసాలు దంచడం చేస్తారు. ఈ కంబన్ దుర్మార్గుడు ('విలనస్ కంబన్') వాల్మీకి రామాయణ ధోరణినీ, నిజాల్నీ కప్పిపుచ్చి కథనంతా నాజూకుగా వేరుగా తయారు చేశాడు. ఈ విషయం గ్రహించి తమిళులు నిష్పక్షపాతంగా వాల్మీకి సంస్కృత రామాయణానికి సరియైన అనువాదాలు చదివి అసలు సంగతులు తెలుసుకోవాలి. (పెరియారు, తను చదివానని చెప్పిన తమిళ అనువాదాలు: ఆనంద చారియర్ 1877లో చేసిన అనువాదం. తర్వాత కాలంలో – నటేశ్ శాస్త్రియర్, సి.ఆర్.శ్రీనివాసయ్యంగార్, నరసింహ చారియర్లు చేసిన అనువాదాలు కూడా.)

ఈ రకంగా – పెరియారు, ప్రారంభంలో, 'రామాయణం' మీద తన అభిప్రాయాలు క్లుప్తంగా చెప్పారు. ఈ అభిప్రాయాల్లో 'శుద్ధమైన ద్రావిడ రక్తం' తప్ప, మిగతా అభిప్రాయాలన్నీ సరైనవే. వాటితో పూర్తిగా ఏకీభవించవచ్చు.

దీని తర్వాత, పెరియారు, రామాయణంలో పాత్రల గురించి చెప్పడం మొదలుపెట్టారు. వాలినీ, రావణుణ్ణీ తప్ప, మిగతా అన్ని పాత్రల్నీ పూర్తిగా వ్యతిరేకించారు.

ఈ పాత్రల గురించి చెప్పేటప్పుడు, ఆర్యుల పక్ష పాతాన్నీ, ఆర్యుల దురహంకారాన్నీ వివరించే అభిప్రాయాలతో వ్యతిరేకించవలసిందేమీ లేదు. అది పూర్తిగా సరైనదే.

కానీ, ఆర్యులు చేసిన తప్పే పెరియార్ కూడా చేశారు. ఆర్య భక్తులు రాముణ్ణి కీర్తించినంత పక్షపాతంతోనూ ఈయన రావణుణ్ణి కీర్తించారు. ఏమీ న్యాయం లేని సందర్భాల్లో కూడా రావణుణ్ణి అధికుణ్ణి చెయ్యాలని ప్రయత్నించారు.

వాల్మీకి, స్త్రీలని హీనపరిచాడని చెపుతూనే, ఈయన కూడా స్త్రీలని హీనపరిచారు. రాముడి మీద ఎంత కోపం చూపించారో, సీత మీద కూడా అంత కోపం చూపించారు. కారణం సీత ఆర్య స్త్రీ కావడమే. ఆర్య పురుషుడి దగ్గర ఆర్య స్త్రీ బానిసేననీ, ఆర్య పురుషుణ్ణి చూసే దృష్టితో ఆర్య స్త్రీని చూడకూడదనీ, ఈయన గ్రహించ లేదు.

వాల్మీకి, తర్కానికి నిలబడని విషయాలు రాశాడని చెపుతూ, ఈయన కూడా తన విమర్శల్లో అలాంటి పనే చేశారు.

ఇక్కడి నించి పెరియార్ విమర్శల్ని వరసగా చూద్దాం.

"దశరథుడు 60 వేల సంవత్సరాలు బతికినప్పటికీ ఇంకా తన పశు కామానికే లొంగి మొదటి ఇద్దరు భార్యల్నీ తగినంత ప్రేమగా చూడలేదు." (పే. 12)

"రాముడి తండ్రి 60 వేల సంవత్సరాల వయస్సు గల వాడైనప్పటికీ నీతివర్తన లేని కాముకుడే" (పే. 56)[7]

దశరథుణ్ణి గురించి ఒక సందర్భంలో ఇది పెరియార్ విమర్శ. 'దశరథుడు 60 వేల సంవత్సరాలు

---

4. "They believe in the other worlds of the Aryans and enslaved by this belief" (P.2) ★
5. ".... the vicious motives and nature of the legends and puranas should be disclosed." (P.2) ★
6. ".... should be razed out." (Preface - P - iv) ★
7. "Rama's father even after 60,000 years of age was a lewd profligate." (P. 56) ★

బతికినప్పటికీ' అనడం ఏమిటి? మనుషులు 60 వేల సంవత్సరాలు బతుకుతారని అంగీకరించినట్టేనా? కట్టు కథల్లో ఉండే ఇలాంటి విషయాల్ని యుధాతథంగా తీసు కోవడమేనా? 'దశరథుడు ఎంత వృద్ధుడైనప్పటికీ' అన రాదూ?

'దశరథుడు మొదటి ఇద్దరు భార్యల్నీ ప్రేమగా చూడలేదు' అన్నారు. కానీ దశరథుడికి ముగ్గురు భార్యలే కాదు, అంతకన్నా ఎక్కువ మందే ఉన్నారనడానికి వాల్మీకిలోనే ఆధారం వుంది. 'భార్యలు' అని ఆ స్త్రీలని బహువచనంలో తీసుకుంటే, ఇక అక్కడ 'ప్రేమ' ఏమిటి? మొదటి భార్య మీద నిజంగా ప్రేమ ఉంటే, రెండో భార్యే ఉండదు. ఒకరి కన్నా ఎక్కువ మంది భార్యలు ఉన్నారంటే, ఎవరి మీదా ప్రేమ లేదని అర్థం. దశరథుడికి మూడో భార్య అయిన కైక మీద ప్రేమ ఉందనే అర్థానికి రాకూడదు. అది ప్రేమ కాదు. ఆమెకి ఎప్పుడో ఒక మాట ఇచ్చాడు. దాన్ని తప్పించుకోవాలనే చూశాడు. కానీ, ఇది మైతాలజీ కథ కాబట్టి, అతనికి 'సత్య వ్రతం' అనే అడ్డంకి ఉంది. ఆ వ్రతం వల్ల, కైకకి ఇచ్చిన మాట ప్రకారం చెయ్యవలసి వచ్చింది. అంతే గానీ అది కైక మీద ప్రేమా కాదు, కామానికి లొంగ డమూ కాదు. ఈ విషయంలో దశరథుణ్ణి అందరూ 'కామానికి లొంగాడు, ఆడదానికి లొంగాడు' అన్నట్టే, పెరియార్ కూడా అంటే ఎలాగ?

కైక రాముణ్ణి వన వాసానికి పంపమని కోరి నప్పుడు దశరథుడు ఆమె పాదాలు పట్టుకుంటానం టాడు. ఆ సందర్భం గురించి చెపుతూ పెరియార్ – "తనెవరో, తన హోదా ఏమిటో మరిచిపోయి దశరథుడు ఆడదాని కాళ్ళ మీద పడ్డాడు చూడండి" అని దశరథుణ్ణి హేళన చేశారు.[8]

పెరియార్ దృష్టిలో – భర్త, భార్య కాళ్ళు పట్టు కుంటాననడం, తన తప్పుకి క్షమాపణ కోరడానికి భార్య కాళ్ళ మీద పడడం, నీచమైన విషయాలన్న మాట! తనేమిటో, తన స్టేటస్ ఏమిటో మర్చిపోయాడట దశ రథుడు! దశరథుడు మహారాజు అయితే, అతని భార్య మహారాణీ అవదా? రాజు అనేవాడు, భార్య దగ్గిర కూడా రాజు హోదా చూపించవలసిందేనా? దశరథుణ్ణి విమ ర్శించవలసింది, భార్య కాళ్ళ మీద పడ్డాడన్న విషయం లోనా? "అంత గొప్ప మహారాజు, స్త్రీ మర్యాదల నతిక్ర మించిన కైక ముందు అనాథుడిలా ఏడ్చాడు" అన్నాడు వాల్మీకి. ఆ మాటే ఈ విమర్శకుడూ అన్నారు. వాల్మీకికీ, ఈయనకీ తేడా ఏమిటి?

దశరథుడు రాముడికే రాజ్యాన్ని ఇవ్వబోయి నప్పుడు, రాముడు దానికి సిద్ధపడ్డాడు కదా? రాముడికి అసలు, రాజ్యాన్ని తీసుకునే హక్కు వుందా – అనే విషయం మీద పెరియార్ విమర్శలు పరస్పర విరుద్ధంగా వున్నాయి. రాముడికి ఆ హక్కు వుందని ఒక సారీ, లేదని ఒక సారీ!

మొదట ఇది చూడండి!

"రాముడు పెద్దకొడుకు కాబట్టి, రాజ్యం తీసుకునే హక్కు రాముడికే ఉందని వశిష్టుడు ఎంత చెప్పినప్పటికీ, దశరథుడు కైక మీద మోజుతో వశిష్టుడి మాటలు పట్టించుకోకుండా వదిలేశాడు." (పే. 13) (ఇది వాల్మీకి రామాయణానికి ఒక తమిళ అనువాదకుడైన శ్రీనివా సయ్యంగార్ అభిప్రాయం. దీన్ని పెరియార్ కూడా అంగీ కరిస్తూ ఈ మాటలు ఇచ్చారు. దీని అర్థం ఏమిటి? రాజ్యం రాముడికి ఇవ్వకపోవడంలో దశరథుడు తప్పు చేశాడనీ, రాజ్యం తీసుకునే హక్కు న్యాయంగా రాముడికే ఉందనీ, పెరియార్ అంగీకరించడమే.

కానీ, వేరే చోట్ల పెరియార్ విమర్శ రాముడు తనకు హక్కు లేని పట్టాభిషేకానికి సిద్ధపడ్డాడన్నదే! "రాజ్యం కైకకే హక్కు అని రాముడికి చాలా స్పష్టంగా తెలుసు. దాన్ని చేజిక్కించుకోవాలనే తండ్రి పట్లా, కైక పట్లా అంత అణుకువ ప్రదర్శించాడు." (పే. 15)

ఏమిటిది? ఆ హక్కు గురించి ఏం చెప్పినట్టు?

ముఖ్యపాత్రల గురించి పెరియార్ అభిప్రాయాలు కొన్ని చూద్దాం:

## రాముడి గురించి:

"వాల్మీకి, రాముణ్ణి క్రూరుడిగా, మోసగాడిగా, దురాశాపరుడిగా, అబద్ధాలకోరుగా, మాంసాహారిగా, తాగుబోతుగా, హంతకుడిగా, చిత్రించాడు."[9]

రాముణ్ణి దుష్టుడిగా చిత్రించాలని వాల్మీకి ఉద్దేశం కాదు. ఎప్పటికప్పుడు రాముణ్ణి ఉత్తముడనే కవి చెపు తాడు. రాముడు చేసిన పనులన్నీ కవికి అంగీకార మైనవే. కవి, రాముణ్ణి దుర్మార్గుడిగా చిత్రించాడనడం తప్పు. రాముడు చేసిన పనుల స్వభావమే దుర్మార్గమైంది

8. "He forgot who he was and what his status was and fell at her feet." (P. 13) ★

9. ".... Valmiki, the author, depicts that Rama was wicked in thought and deed, was an embodiment of lies, treachery, artifice and cunningness, hard - heartedness, greediness, murder, drunkenness, flesh eating, arrowing at the innocent covertly, wicked associations, unmanliness and what not." (P.5) ★

అవడం చేత, కవి రాముణ్ణి ఎంత ఉత్తముడని వర్ణించినా, రాముడు దుర్మార్గుడిగానే రూపొందాడు. రాముడి దుర్మార్గాల్ని లెక్కించడంలో, పెరియారు, తాగుడినీ, మాంసాహారాన్నీ కూడా చేర్చారు. వీటి వల్ల ఒక వ్యక్తి దుర్మార్గుడు అవడు. అవి ఆహారానికీ ఆరోగ్యానికీ సంబంధించిన అలవాట్లు. ఈ లక్షణాలు రెండూ రావణుడికి కూడా ఉన్నాయనే సంగతి పెరియారు మరిచిపోయినట్టు ఉన్నారు!

రాముణ్ణి పెరియారు – "పచ్చగడ్డిలో పాము" అన్నారు. (పే. 15) – ఇది మంచి పోలికే! రాముడి స్వభావానికి తగినదే.

"ఈ మోసపు బ్రాహ్మలు రాముడి వంటి నిజాయితీ హీనుణ్ణీ, అసమర్థుణ్ణీ, శీల రహితుణ్ణీ, దేవుడిగా చూపించి మనల్ని పూజించమంటారు." (పే. 50)

"వాల్మీకే చెప్పాడు – రాముడు దేవుడు కాడనీ, అతనికి, దివ్యశక్తులు లేవనీ."[10]

రాముడు దేవుడు కాడని వాల్మీకి చెప్పాడా? వాల్మీకి రామాయణాన్ని దృష్టిలో పెట్టుకుని కూడా పెరియార్ ఈ మాటలనడం చాలా ఆశ్చర్యంగా ఉంది! రాముడి పుటకే విష్ణు అంశతో వుండడం, ఎప్పటికప్పుడు మానవాతీత కృత్యాలు చెయ్యడం, శాపగ్రస్తుల శాపాలు పోగొట్టడం, అనేక మంది దేవతలతో సంభాషించడం – ఇవన్నీ దివ్య శక్తులు కావా? రాముడే విష్ణువని కవి కథ పొడుగునా చెప్పాడు. అది, దేవుడు కాడని చెప్పడమా?

**కౌ**సల్య గురించీ, సుమిత్ర గురించీ పెరియార్ ఇలా అంటారు – ".... అసలు భర్తని లెక్క చెయ్యరు. భర్త మీద శ్రద్ధే లేదు. భర్త చచ్చిపోయినా చక్కగా నిద్రలు పోతూనే ఉన్నారు. తెల్లారింతర్వాత దాసీలు వచ్చి ఏడుస్తూ ఉంటే, అప్పుడు తీరిగ్గా లేచారు" (పే. 56)

ఆ ఘట్టం గురించి కవి చెప్పిందాని ప్రకారం చూస్తే – కౌసల్యా సుమిత్రా కొడుకుల కోసం ఏడ్చి యేడ్చి పడుకున్నారు. నిద్రలు పట్టాయి. పక్కన భర్త ఉండగా భార్యకు నిద్రపట్టడం కూడా తప్పేనంటారా? ఆ ముసలాయన మూలుగులూ, రాగాలూ, ప్రతి రోజూ ఉన్నవే కదా? ఆ రాత్రే అన్నీ కట్టిపెడతాడని వాళ్ళకేం తెలుసు? 'ఆర్య స్త్రీలు చూడండి, భర్త మీద ఏమీ శ్రద్ధ లేకుండా ఎలా ఉన్నారో' అని చెప్పాలన్నదే పెరియార్ అభిప్రాయం. దశరథుడు దుష్టుడనీ, కాముకుడనీ, కైక మీద తప్ప, ఈ ఇద్దరు భార్యల మీదా ప్రేమ చూపించలేదనీ, ఈయనే అన్నారు కదా? అలాంటి దుర్మార్గపు భర్తనైనా సరే ఏమీ నిర్లక్ష్యం చెయ్యకుండా, నిద్రాహారాలు మాని, కళ్ళల్లో వొత్తులు వేసుకుని, రాత్రింబవళ్ళూ సేవలు చేస్తూ కూర్చోవాలన్న మాట! అలా చేయలేదనే కదా ఈ స్త్రీలని తప్పు పట్టడం?

ఆ భర్త వల్ల ఏం ప్రేమ పొందారు ఈ భార్యలు, భర్త మీద అంత శ్రద్ధ కలగటానికి? దశరథుడిలాంటి భర్తమీద ద్రావిడ స్త్రీలైనా ఇంతకన్నా గొప్ప ప్రేమ చూపించలేరు పెరియార్ గారూ!

**రావణుడి గురించి:** రాముడి విషయంలో ఎంతో కఠినంగానూ, చాలా చోట్ల సరిగానూ విమర్శించిన పెరియార్, రావణుడిలో ఒక్క లోపమైనా చూడలేకపోయారు – "రావణుడిలో పది సుగుణాలున్నాయని వాల్మీకే రావణుణ్ణి అనేక సార్లు పొగిడాడు" అన్నారు. అంటే, రావణుడికి కవి ఇచ్చిన సుగుణాలన్నిటినీ ఆనందంగా స్వీకరించారు. రావణుడికి ఉన్న ఆ సుగుణాలేమిటంటే: మహా వీరుడు! మహా పండితుడు! అందగాడు! తన ప్రజల్నీ మిత్రుల్నీ దయగా చూసే రాజు! ఘోరమైన తపస్సులు చేసి అనేక వరాలు పొందిన తపశ్శాలి!

ఈ లక్షణాల గొప్ప ఏమిటో చూద్దాం.

**మహా వీరుడు:** వీరుడు చేసే పనులేమిటి? తన కన్నా బలహీనులతో యుద్ధాలు చేసి, వాళ్ళ రాజ్యాలూ సిరి సంపదలూ లాక్కుంటాడు. ఈ కథలో వీరులందరి వల్లా జరిగిన పనులు అవే. అతని వీరత్వం అతని స్వార్థానికే, అతని సుఖాలకే ఉపయోగపడుతుంది. రాముడూ గొప్ప వీరుడే. ఆ వీరత్వంతో ఏం చేశాడు? తాటకినీ, విరాధుణ్ణీ, ఖరుణ్ణీ, కబంధుణ్ణీ, వాలినీ, రావణుణ్ణీ – ఇలా, వరసపెట్టి శత్రువులందర్నీ చంపడానికే దాన్ని ఉపయోగించాడు. రావణుడూ అదే చేశాడు. వీరుడైతే అందులో ఉత్తమత్వం ఏముంది? కీర్తించవలసింది ఏముంది? రాముడు కూడా వీరుడే కాబట్టి ఉత్తముడేనా? దుర్మార్గుడు కూడా వీరుడై ఉంటాడు. వీరత్వాన్ని ఒక ఉత్తమ లక్షణంగా తీసుకోడానికి వీల్లేదు.

**పండితుడు:** ఇది కూడా అంతే. బాగా చదువుకునే అవకాశాలున్న ప్రతీ వ్యక్తీ పండితుడౌతాడు. చదువు అనేది ఒకరికి వచ్చి ఒకరికి రాని విషయమేమీ కాదు. దుర్మార్గుడు కూడా పండితుడై వుండవచ్చు. పండితుడైనంత మాత్రాన అతడు ఉత్తముడు అవడు.

**ప్రజల మీదా, మిత్రుల మీదా దయ:** తన

10. ".... Valmiki himself has stated that Rama is neither a god nor had any divine power in him." (P. 57) ★

పక్షాన ఉండే బంధుమిత్రుల మీద దయ చూపడంలో గొప్ప తనమేమీ లేదు. వాళ్ళు తన పక్షంగా వుంటారు కాబట్టే, ఆ దయ. ఇక ప్రజల మీద దయా? రాముడు కూడా ప్రజల్ని గొప్పగా చూశాడనే కదా కవి చెప్పింది? దాన్ని ఒప్పుకుంటారా పెరియారు? రాజు అన్నవాడు ప్రజల మీద ఎలా దయ చూపిస్తాడు? తన అధికారం నిలబెట్టుకోడానికి అనుకూలమైన పనులే చేస్తాడు. తనకు సహకరించే ధనికులకూ పండితులకూ శూరులకూ సహాయాలు చేస్తాడు. బొక్కసాలూ సైన్యాలూ పెంచుకునే ప్రయత్నాలు చేస్తాడు. ప్రజల కోసం తప్పని సరిగా చెయ్యవలసిన పనులేవో కొన్ని చేస్తూ పరిపాలన సాగిస్తూ వుంటాడు. రాజుల పరిపాలన ఎంత నిరంకుశంగా ఉంటుందో దశరథుడి మాటల్లోనూ రాముడి మాటల్లోనూ చూడలేదా? అందులో దయ ఏముంది? రాముడి దయ లాంటిదే కదా, రావణుడి దయ? ఇద్దరి విషయమూ కవి చెప్పిందే. ఆ విషయంలో రావణుణ్ణి ఉత్తముడని వొప్పుకోవాలంటే, రాముణ్ణి కూడా ఉత్తముడని వొప్పుకోవాలి.

**అందగాడు:** దీన్ని గురించి వేరే చెప్పాలా? అందగాడైతే ఉత్తముడా? రాముడూ అందగాడే! దుర్మార్గుడూ అందంగానే వుంటాడు.

**తపస్సులూ, వరాలూ:** 'రాముడూ, హనుమంతుడూ చేసిన అద్భుత కృత్యాలు తర్కానికి నిలబడవు' అన్న పెరియార్, రావణుడి తపస్సులూ, వరాలూ తర్కానికి నిలబడతాయని ఒప్పుకుంటారా? "రావణుడు పది వేల సంవత్సరాలు ఘోరమైన తపస్సులు చేసి వరాలు పొందాడు" అని వాల్మీకి అంటే, దాన్నేమీ వ్యతిరేకించకుండా, "అవును, మా రావణుడు అలాంటి వాడే" అని వొప్పేసుకుంటే, అది తర్కానికి నిలబడుతుందా? పోనీ రావణుడి వరాల్ని కూడా లెక్కలోకి తీసుకుందాం, అందులో మాత్రం ఉత్తమత్వం ఏ ముంది? తపస్సులు చేసే వాళ్ళ ముందు దేవుడు ప్రత్యక్షమై "నీకేం వరం కావాలి?" అని అడిగినప్పుడు, ఒక్క తపశ్శాలి అయినా, తన కోసం గాక ఇతరుల కోసం వరాలు అడిగాడా? "ప్రపంచంలో జనులందరూ సుఖంగా ఉండాలి. ఎక్కడా పేదతనం ఉండకూడదు. ఎవ్వరికీ జబ్బులు ఉండకూడదు. ఎవ్వరికీ అకాల మరణాలు సంభవించకూడదు. అందరూ సుఖ శాంతులతో జీవించాలి" అని ఒక్కడైనా అడిగినట్టు ఒక్క కథ అయినా ఉందా? "నేను శత్రువులందర్నీ జయించాలి. నాకు సిరి సంపదలు దొరకాలి. నాకు రాజ్యాలు దొరకాలి. నేను ఎప్పటికీ చచ్చిపోకూడదు" అంటూ తమ కోసమే కోరుకుంటారు.

రావణుడైనా అంతే. తనకు కావలసిందే తను కోరుకున్నాడు. ఆ వరాలు తెచ్చి ఎవర్నయినా ఉద్ధరించాడా? ఎవరికైనా సహాయం చేశాడా? ఆ వరాలతో అందర్నీ నాశనం చేసి రాజ్యాలు సంపాదించాడు.

రాముడు గొప్పవాడనీ, రావణుడు గొప్పవాడనీ, కవి వర్ణించిన లక్షణాలేవీ కూడా వారిని ఉత్తములుగా నిర్ణయించడానికి పనికిరావు.

కవి, రావణుణ్ణి వర్ణిస్తూ – "క్రూరం, కర్కశం, దుష్టచారిణమ్, సర్వలోక భయావహమ్, ప్రజానామహిత్ రతమ్ (ప్రజలకు అహితము చేయుటలో నాసక్తి గలవాడు) పర దారాభిమర్శనమ్ (పర స్త్రీలను వేధించుట)" అని కూడా అంటాడు. మరి ఈ లక్షణాల్ని కూడా లెక్కలోకి తీసుకోవద్దా? కవి చెప్పిన చెడ్డ లక్షణాల్ని అంగీకరించరు గానీ, పొగడ్తల్ని మాత్రం ఎలా చెపితే అలా పొల్లు పోకుండా తీసుకుంటారన్న మాట! అసలు, కవి, రావణుణ్ణి ఎందుకు పొగుడుతాడంటే, అంత గొప్పవాణ్ణి రాముడు తర్వాత జయిస్తాడు కాబట్టి. ఆ కీర్తి రాముడికి కట్టబెట్టాలి కాబట్టి. రావణుడు మామూలు వాడే అయితే, అలాంటి వాణ్ణి జయిస్తే, జయించిన వాడికేం కీర్తి వస్తుంది? దీని కోసమే కవి, రావణుణ్ణీ, లంకలో సిరి సంపదల్నీ తెగ వర్ణిస్తాడు. దీన్ని అర్థం చేసుకోకుండా, రావణ భక్తులు, "మా రావణుడు ఎంత గొప్పవాడో చూడండి! ఆ మాట కవే చెప్పాడు!" అంటారు.

ఇంకా ఇతర విషయాల్లో రావణుడి గురించి పెరియార్ అభిప్రాయాలు చూడండి!

"ప్రేమ విషయాల్లో రావణుడు ఎంతో సరసుడని హనుమంతుడే వర్ణించాడు. అంతఃపురంలో ఎందరో అందగత్తెలైన భార్యల మధ్య నిద్రపోతోన్న రావణుడు చుక్కల్లో చంద్రుడిలాగ వెలిగిపోతున్నాడని హనుమంతుడే అన్నాడు" అని రావణుడి సరసత్వం గురించి చెప్పి ముచ్చట పడుతున్నారు పెరియార్.[11]

దశరథుడి విషయంలో అయితే, అంతకు ముందు ఉన్న భార్యల్ని దుఃఖపెట్టి ఇంకో భార్యని చేసుకున్నందుకు తిట్టిపోశారే! "శ్రీమహావిష్ణువు భూమి మీద పుట్టడానికి తన తండ్రిగా ఎన్ని వందల మంది భార్యలున్న ఆదర్శ పురుషుణ్ణి ఎంచుకున్నాడో చూడండి" అని, ఎక్కువ మంది భార్యలు వున్న దశరథుణ్ణి వెటకారం చేశారే! మరి అదే విషయం రావణుడి దగ్గిర 'ఆదర్శం' అయిందా?

11. "He compared Ravana, whom he found sleeping in the Zanana in the midst of most beautiful ladies in sleep to the full moon shining amidst a galaxy of stars." (P.56)

★

కవి, తన కవిత్వం కోసం, స్త్రీల మధ్య రావణుణ్ణి 'చుక్కల మధ్య చంద్రుడ'ని వర్ణిస్తే, పెరియార్‌కి కూడా, అంత మంది ఆడవాళ్ళతో వున్న రావణుడు చుక్కల మధ్య చంద్రుడి లాగే కనపడుతున్నాడే! ఈయనకి తన నీతులూ ఆదర్శాలూ ఏమీ గుర్తు రాలేదా? ఒక్క పురుషుడు, అన్ని వందల మంది స్త్రీలని తన కోసం అంతఃపురంలో బంధించి, తన ఆధీనంలో పెట్టుకోవడంలో, ఎటువంటి ఆటవికతా అనాగరికతా, గోచరించ లేదా? పైగా రావణుడి చర్య చాలా నాగరికం! సున్నితం! రిఫైన్‌మెంట్ అట! తన చుట్టూ వందలకొద్దీ స్త్రీలని పెట్టుకుని ఒక పురుషోత్తముడు పడుకుని ఉన్న సుందర దృశ్యంలో, ద్రావిడ పురుషుడి సరసత్వమే గానీ, ద్రావిడ స్త్రీల బానిసత్వం కనబడ్డం లేదు!

ఈ స్త్రీలందరూ ఇష్టంతో వచ్చిన వారేనట! రావణుడు ఎవ్వరినీ బలవంతం చెయ్యలేదని కవి అన్నాడట! పెరియారు, ఇక్కడ మాత్రం కవి మాటల్ని వినయంతో స్వీకరిస్తున్నారు.

మరి ఆ కవే – ".... రావణుడు కొందరు స్త్రీలను వారి బంధువులతో యుద్ధము చెయ్యగోరి (యుద్ధ కామేన) అపహరించి తెచ్చెను" అని కూడా అన్నాడే! అంతేగాక, రావణుడు అనేక మంది స్త్రీలని బలవంతంగా విమానంలో ఎక్కించుకున్నాడనీ, వారు తల్లి దండ్రుల్నీ భర్తల్నీ బిడ్డల్నీ తల్చుకుంటూ, రావణుణ్ణి తిట్టి పోస్తూ ఏడ్చారనీ కూడా అన్నాడే! కథ ప్రకారం చూస్తే, రావణుడు రంభని బలాత్కరించలేదా? పెరియారు, ఈ సంఘటనలేవీ చూడదల్చుకోలేదు. కవి చెప్పిన దాంట్లో రావణుణ్ణి కీర్తించడానికి ఏది అనుకూలంగా ఉంటే అదే తీసుకున్నారు. అనుకూలంగా లేని దాన్ని ఎరగనట్టు వదిలేశారు.

పోనీ, రావణుణ్ణి అన్ని విషయాల్లోనూ మంచి వాడనే ఒప్పుకుందాం. సీతని ఎత్తుకు పోయిన విషయంలో మంచివాడెలా అవుతాడు? – ఈ ప్రశ్న వస్తుంది. కాబట్టి, ఈ విషయంలో పెరియారు ఏమంటున్నారంటే, "రావణుడు సీతని బలవంతంగా తీసికెళ్ళలేదు, సీతే ఇష్టంతో రావణుడి వెంట వెళ్ళింది" అంటున్నారు! దాన్ని నిరూపించడానికే తన రచనలో ఎక్కువ భాగం కేటాయించారు!

**సీత గురించి:** అసలు సీత స్వభావం ఏ విషయంలోనూ మంచిది కాదనీ, అలాంటి దుష్ట స్వభావం గలది కావడం చేతనే పర పురుషుడితో వెళ్ళిందనీ, ఆమె రావణుడి వల్లనే గర్భం తెచ్చుకుని లవ కుశుల్ని కన్నదనీ, ఇలా వాదించే ప్రయత్నాలు ప్రారంభించారు. "మొత్తం కథలో సీత గురించి మంచిగా చెప్పడానికి ఒక్క ముక్కన్నా లేదు" అంటూ దానికి సాక్ష్యాలు చూపించడానికి పూనుకున్నారు.[12]

ఈ సాక్ష్యాలు ఒకటో రెండో కాదు; మొత్తం 12 సాక్ష్యాలు చూపించారు. తన పుస్తకంలో ఈ విషయం మీదే ఎక్కువ పేజీలు పెట్టారు. ఈ సాక్ష్యాల్లో ఒక్కటి అయినా తర్కానికి నిలబడితే "నిజమే, సీతే రావణుడి వెంట వెళ్ళింది" అని మనం కూడా ఒప్పుకోవచ్చు. ఇప్పుడు ఆ సాక్ష్యాలన్నీ వరసగా చూడాలి.

(1) "అసలు సీత పుటకే సరైంది కాదు. అనుమానించదగ్గది" అని ప్రారంభించారు. సీతని ఎవరో 'నీతి లేని స్త్రీ' కని పారేసిందని పెరియార్ అభిప్రాయం. నూటికి నూరుపాళ్ళూ అలాగే అనుకుందాం. అయితే అది సీత తప్పా? సీత స్వభావం గురించి పరిశీలించేటప్పుడు ఈ పుటక సంగతి తీసుకుంటామా? అలా పుట్టడం సీత తప్పేనని పెరియార్ అంటారా? – అన్నారు! అలా పుట్టడం సీత తప్పే అయితే, ద్రావిడుల్లో పుట్టడం కూడా రావణుడి తప్పే. ఇక దానికేమీ తర్కం లేదు. ఆర్యులు, గెలిచిన జాతి. గెలిచిన వాళ్ళ ముందు ఓడిపోయిన వాళ్ళు అల్పులుగా ఉండవలసిందే. ఇది కూడా ఒప్పుకుంటారా పెరియార్?

"నేను ఇలా పుట్టడం వల్లనే ఏ రాజకుమారుడూ నన్ను పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడలేదు" అని సీతే అన్నదని పెరియార్ చెపుతున్నారు.[13]

సీత అనసూయతో అన్న మాటలు సరిగ్గా ఇవీ – "జనక మహారాజు నేనయోనిజ నగుటం దలపోసి ఎంత యోచించినను, నాకు దగిన పెనిమిటి యాయనకు దొరకదయ్యెను" – అయోనిజ అంటే, సీత, మానవ స్త్రీ గర్భంలో నించి పుట్టలేదనీ, ఆమె మానవ మాతృరాలు కాదనీ, అర్థం. ఈ కథ మైతాలజీ కాబట్టి, కవి, సీత గురించి అలాంటి కల్పనతో చెప్పాడు. సీత సాధారణ మానవ స్త్రీ కాదు కాబట్టి ఆమెకు తగినంత గొప్ప భర్తని చెయ్యాలని జనకుడి ప్రయత్నం. పెరియారు, సీత మాటల్లోంచి, 'సీత నెవ్వరూ పెళ్ళి చేసుకోవటానికి ఇష్టపడలేద'నే అర్థం తీశారు.

రాముడు శివధనుర్భంగం చేసేముందు జనకుడు రాముడితో సీత జన్మ విషయం చెపుతాడు. సీత పుటకని రహస్యంగా దాచవలసిన తప్పు విషయంగా కథలో

12. "In the whole story of Ramayana there is scarcely a word of praise about Sita." (P.23) ★
13. "Her birth is doubtful and questionable" - (P.23). "After I attained my puberty no prince was willing to marry me on account of the dishonour attached to my birth" (P.61) ★

ఎవ్వరూ ఎంచలేదు. అయోనిజ అనే విషయాన్ని చాలా కీర్తిగా తీసుకున్నారు. అదీగాక సీతని ఎవ్వరికీ ఇవ్వ కుండా ఉంచినందుకు కొందరు రాజకుమారులు జన కుడి మీద కోపంతో యుద్ధాలకు కూడా వచ్చారు. ఈ సంగతి కూడా జనకుడు చెపుతాడు. కథలో విషయాలు ఇలా ఉండగా, 'సీతని ఎవ్వరూ పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడలేదు' అనడం ఏ రకం వాదం?

పెరియార్ మాటలు ఇంకా వినండి! – సీతకు పాతి కేళ్ళు వచ్చినా జనకుడు సంబంధాలు కుదర్చలేకపోయా డట! ఇక విసిగిపోయి తన స్నేహితుడైన విశ్వామిత్రుణ్ణి 'పిల్లకేదన్నా సంబంధం చూసిపెడుదూ' అని కోరాడట. అప్పుడు విశ్వామిత్రుడు ఐదేళ్ళ రాముణ్ణి తెచ్చి సీతకి కట్టబెట్టాడట! ఈడూ – జోడూ లేని సంబంధం గురించి సీత గొణగనన్నా గొణగలేదట.[14]

ఈ సంగతులన్నీ తప్పని వేరే చెప్పక్కర్లేదు కదా? కానీ గొణక్కపోవడం కూడా సీత తప్పని, దీన్ని కూడా సీత స్వభావంలోకి చేర్చారు. తమ కన్నా చిన్న వయస్సు భార్యల్ని చేసుకోవడానికి పురుషులు గొణుగుతున్నారా? చిన్న భర్తల్ని చేసుకునే సాంప్రదాయం ఉంటే, స్త్రీలు మాత్రం ఎందుకు గొణుగుతారు? అందులోనూ, ఆర్య స్త్రీలకు గొణుగుళ్ళు అంతగా ఉండవేమో పెరియార్ గారూ!

(2) భరతుడికీ, సీతకీ సంబంధించి పెరియార్ ఇప్పుడు చాలా వింత విషయాలు చెపుతారు, వినండి! వీటిని ఎలా అర్థం చేసుకోవాలో చూడండి. రాముడు వనవాసానికి బయల్దేరుతోంటే సీత అయోధ్యలో ఉండ నని తిరస్కరించే ఘట్టం గురించి పెరియార్ చేసిన విమర్శలు ఇవి.

"పెళ్ళయిన కొన్ని రోజులకే సీత భరతుడి చేత విడిచిపెట్టబడింది."[15]

రాముడు సీతతో – "భరతుడు నిన్ను గౌరవించ డానికి నువ్వు అర్హురాలివి కాదు" అన్నాడు.[16]

"దీనికి సీత కూడా అంగీకరించింది. 'నన్ను అస హ్యించుకునే భరతుడితో నేను ఉండను' అన్నది. 'నే నేం చెయ్యను? భరతుడు నన్ను ఇష్టపడడు. అతనితో నే నెలా ఉండగలను?' అన్నది" (పే. 24)

ఏమిటీ విచిత్రాలు? భరతుడు సీతని పెళ్ళయిన కొన్నాళ్ళకే వదిలెయ్యడం ఏమిటి? భరతుడికీ సీతకీ పెళ్ళయిందా? భరతుడు సీతని అసహ్యించుకోవడం ఏమిటి? అసలు భరతుడు అయోధ్యలో కూడా లేడే! కథ ప్రకారం, భరతుడు తన పెళ్ళి తర్వాత ఎప్పుడో కొన్ని ఏళ్ళ కిందట మేనమామ దగ్గిరికి వెళ్ళిపోయాడు. అప్పటి నించీ రానే లేదు. ఎప్పుడో చిత్రకూటంలో మాత్రమే అన్నని కలుస్తాడు. తమిళ అనువాదాల్లో కూడా, తండ్రి చచ్చిపోయిన తర్వాతే భరతుడు అయోధ్యకు వచ్చినట్టు కథ నడిచింది కదా? సీత 'అయోధ్యలో ఉండను' అన్న మాటల్ని ఆసరాగా తీసుకుని, ఈ వింత వ్యాఖ్యానాలు చేశారు. ఇంతకన్నా ఇందులో ఇంకేమైనా కారణం ఉందా?

(3) "సీతకు నగల పిచ్చి. విలాసాలూ ఆడంబ రాలూ కావాలి. ఈ సంగతి తెలిసే రాముడు 'నువ్వు నాతో వన వాసానికి రావాలంటే నగలన్నీ దానం చేసెయ్యి' అన్నాడు. అయినా సీత కొన్ని నగలు చాటుగా దాచుకుంది" – ఇది ఇంకో నేరారోపణ సీత మీద![17]

"మన సర్వస్వము దానం చేసెయ్యి" అని రాముడు అన్నప్పుడు సీత అలాగే చేసిందని కవి చెప్పాడు – "సీతా దేవి మహా సంతోషము నొంది శీఘ్రముగా బెనిమిటి చెప్పినట్లు (భర్తుర్‌జ్ఞాత్వా) దానములు చేయుట ప్రారం భించెను .... ధార్మికులగు వారలకు, ధనములను, రత్న ములను యధేష్టంబుగా నొసంగ నారంభించెను." కవి, ధనాలూ, రత్నాలూ ఇవ్వడం మాత్రమే చెప్పాడు కాబట్టి, సీత నగలు దాచేసుకుందని పెరియార్ గొప్ప అర్థం తీశారు. 'దానాలు ప్రారంభించెను (ఉపచక్రమే = ప్రారంభించెను)' అన్నాడు కవి. ఇప్పుడే ప్రారంభించింది కదా? తర్వాత నగలు కూడా ఇచ్చిందనే అర్థం తియ్య కూడదా? భర్త చెప్పినట్టే చేసింది – అని కవి చెప్పాడు కదా? దాన్నెందుకు పట్టించుకోలేదు? ఎలాగైనా సీతని నీచ పరచాలనే ఈ నీచపు ప్రయత్నాలెందుకు?

రాముడూ లక్ష్మణుడూ నార బట్టలు కట్టుకున్నారు గానీ, సీత నార బట్టలు కట్టుకోనని వ్యతిరేకించిందట!

---

14. "Janaka finding himself unable to secure a suitable husband for Sita approached his friend Viswamitra to help him in getting a suitable bridegroom for Sita. Sage Viswamitra brought this five - years old Rama and got him married to Sita who was aged not less than 20 years and she did not even murmur for this unequal match" (P.61) ★
15. "She was discarded within a few days after her marriage by Bharatha.' (P.24) ★
16. "You do not deserve the praise of Bharatha' (P.24) ★
17. "Rama having in mind her pompousness and fraility of mind he directed her that she should strip off all her ornaments if she were to accompany him to the forest' - (P.24) - "Sita did accordingly but again she put on some other Jewels unknowingly' (P.25) ★

(పే. 25) – ఇది కూడా శుద్ధ తప్పే. సీత, నార బట్టలు కట్టుకోడానికి కూడా సిద్ధపడింది. పురోహితులే ఆమెకు అవి అవసరం లేదన్నారు. దశరథుడు, బట్టలూ, నగలూ ఇచ్చాడు. అందులో ఆమె ఇష్టా ఇష్టాలేమీ లేవు.

"వనవాసంలో భర్త మాట ప్రకారం బుద్ధిగా వుండమ్మా!" అని అత్తగారు చెపితే సీత "నాకు తెలుసులే" అని తలబిరుసుగా ('Insolently') సమాధానం చెప్పిందట! పోనీ అప్పటికైనా నగలవీ తీసెయ్యలేదట. సీతకి ఇలాంటి పాడు గుణాలు ఉండడం చేతనే భరతుడు ఆమెని అసహ్యించుకున్నాడట. కైక ఆమెని దేశంలో ఉండటానికి వీల్లేదని అడవుల్లోకే పంపేసిందట!

(4) సీత అబద్ధాలకోరు – అని ఇంకో ఆరోపణ!

సీతా రాముళ్ళ వయస్సు లెక్కల్లో ఉన్న తప్పుని ఆధారం చేసుకుని, పెరియార్ తమకిష్టమైన పద్ధతిలో లెక్కలు కట్టారు. చివరికి సీత రావణుడితో మాట్లాడే నాటికి ఆమె వయస్సు 45 సం॥లు ఉంటుందని తేల్చారు. సీత, తన అసలు వయసు దాచేసి రావణుడితో తక్కువ వయసు చెప్పుకుందట.

"సీత చాలా వృద్ధురాలు. ఆ మాట లక్ష్మణుడే అన్నాడు. శూర్పణఖతో మాట్లాడుతూ, 'సీత జారిపోయిన పొట్టతో వికారంగా ఉంది' అన్నాడు" అని, సీత వృద్ధురాలేనని తేల్చారు.[18] మరి అంత వికారంగా ఉన్న దాన్ని రావణుడెలా తీసుకు వెళ్ళాడు – అనే ప్రశ్న లేదు!

లక్ష్మణుడు శూర్పణఖతో హాస్యాలాడుతూ సీత గురించి అలా అన్నాడని గ్రహించే కనీసపు గ్రహణ శక్తి కూడా ఈయనకు లేదు. లక్ష్మణుడు అలా అన్నాడు కాబట్టి సీత వృద్ధురాలే! పైగా తన వయసు గురించి అబద్ధాలాడింది!

సరే, వృద్ధురాలే. వృద్ధురాలవడం నేరమా? ఆ వృద్ధురాలు, తన వయసుని తక్కువ చేసి చెప్పుకుంటే, రావణుడు నమ్మేశాడా? వాడికి కళ్ళు కనపడలేదా? పెరియార్ గారి తల్లి ఎప్పటికీ వృద్ధురాలవలేదా? తను కూడా వృద్ధుణ్ణి అవుతానని పెరియార్‌కి తెలీదా? వృద్ధాప్యం కూడా నేరమేనా?

(5) సీతని రావణుడు ఎత్తుకు పోవడానికి వీలు కలిగించడానికే రాముడు సీతని అడవిలో ఒంటరిగా వదిలిపెట్టాడట! సీత కూడా తనని రావణుడు ఎత్తుకు పోవటానికి ఇష్టపడి, ఆ ప్రయత్నాల్లోనే ఉందట![19]

రాముడు రావణుణ్ణి చంపాలి. రావణుడి మీదికి యుద్ధానికి వెళ్ళటానికి ఏదో ఒక కారణం ఉండాలి. రావణుడు ఋషుల్ని బాధ పెడుతున్నాడనే కారణం చాలదు. రాముడు కలుగజేసుకోవాలంటే రాముడికే సంబంధించిన కారణం ఉండాలి. రావణుడు రాముడి భార్యని ఎత్తుకుపోతే, రాముడు రావణుడితో పోట్లాడే వ్యవహారంలోకి దిగొచ్చు. అప్పుడు రాముడి తప్పు ఉండదు. ఇదంతా నిజమే. కానీ, ఈ ప్లాన్ వేసుకున్నది కవే గానీ రాముడు కాదు. రాముడే సీతని ఒంటరిగా వదిలి చాటుకు తప్పుకున్నట్టుగా కథ నడవలేదు.

(6) "సీత లక్ష్మణుణ్ణి చాలా మోటు తిట్లు తిట్టింది. ఎంత బరి తెగించిన ఆడది అయినా అలా మాట్లాడలేదు. లక్ష్మణుడు భయంతో వొణికిపోతూ తల వొంచుకుని వొదిన గారితో ఎంతో వినయంగా మాట్లాడాడు" అని పెరియారు, ఇక్కడ లక్ష్మణుణ్ణి మెచ్చుకుని సీతని తిట్టారు.[20]

మళ్ళీ ఈయనే లక్ష్మణుణ్ణి విమర్శించే చోట ఏమంటున్నారో చూడండి – "తనని అనుభవించాలనే కోరిక లక్ష్మణుడికి ఉన్నట్టు సీతకు అనుమానం కలిగే విధంగా లక్ష్మణుడు ప్రవర్తించాడు."[21]

సీత గురించి చెప్పే చాప్టరులో సీతని దుష్టురాలిగా నిర్ణయించాలి. కాబట్టి, లక్ష్మణుణ్ణి పొగిడి, 'అంత మంచి వాణ్ణి సీత అకారణంగా తిట్టింది' అనడం! అక్కడ లక్ష్మణుణ్ణి ఉత్తముడనకపోతే సీతని తప్పు పట్టటం కుదరదు. లక్ష్మణుణ్ణి గురించి చెప్పే చోట అతన్ని దుష్టుడిగా చెప్పాలి కాబట్టి, అతనే వదినగారి పట్ల చెడ్డగా కాముక దృష్టితో ప్రవర్తించాడు అనడం!

ఈయన తనకు ఇష్టం లేని పాత్రల గుణగణాల గురించి చేసిందంతా ఈ రకం నేర పరిశోధనే. "ఇంతకీ లక్ష్మణుడు మంచివాడా, చెడ్డవాడా? సీత మంచిదా, చెడ్డదా? పరస్పర విరుద్ధంగా చెపుతున్నారే!" అంటే, ద్రావిడ పెరియార్ ఋషి గంభీరంగా – "వారా? వారు ఆర్యులు!" అంటారు.

(7) "పర పురుషుడు వచ్చి తన అంగాంగాలు వర్ణిస్తూ ఉంటే, రొమ్ములు కూడా వర్ణిస్తూ ఉంటే, సీత ఊరుకుంది. ఆ వ్యక్తికి భోజనం కూడా పెట్టి ఆతిథ్యం

18. "This is confirmed by Lakshmana. He said that Sita was an aged lady with over - lapping belly." (P.53) ★

19. "It was for a set purpose that Sita was left alone in the forest to make it easy for Ravana to carry her away and was making prepartions accordingly." (p.42) ★

20. "Lakshmana shuddered at this and humbly with folded hands said ...." (P.52) ★

21. His behaviour towards Sita was such that made her suspect that he had a love towards her and that he wanted to enjoy her." (P.33) ★

ఇచ్చింది. సీతే సుగుణవంతురాలైతే ఈ రకంగా చేస్తుందా?" అంటున్నారు పెరియార్. (పే. 52). అవును. రావణుడు చెత్త చెత్తగా మాట్లాడిం తర్వాతే సీత అతనికి ఆతిథ్యం ఇచ్చింది. ఆ వర్ణనల వల్ల సీతకేమీ కోపం రానట్టుగానే కథ నడిచింది. ఎందుకంటే, అది మైతాలజీ కథల్లో వుండే సాంప్రదాయం. అలాంటి కథల్లో స్త్రీలని అలాగే కీర్తిస్తారు. 'మంచి రొమ్ములు గలదానా! మంచి పిరుదులు గల దానా!' అంటారు. దీనికి విమర్శించాలంటే, ఆ కవిని విమర్శించాలి గానీ ఆ పాత్రల్ని కాదు. రావణుడు చేసిన వర్ణన వల్ల సీతకేమీ కోపం రాలేదని పెరియారు, సీతని తప్పు పడుతున్నారు. మరి సీతని తప్పు పట్టే పెరియారు, అంత చెత్త చెత్తగా వాగిన రావణుడి విషయం ఏం చెపుతారు? పురుషులు లేని సమయంలో, ఒక స్త్రీని వంటరిగా చూసి, నానా చెత్తా మాట్లాడడం రావణుడి తప్పు అవదా? రావణుడి గుణ వర్ణన చేసేప్పుడు పెరియారు, రావణుడిలో ఒక్క లోపమైనా గమనించలేదేం? 'ఆడది అనుకూలంగా ఉంటే మొగాడు ఎలాగైనా మాట్లాడతాడు. మొగాడికి తప్పేమిటి?' అంటారా? అలాంటి పురుషుణ్ణి ఉత్తముడిగా భావించవలిసిందేనా?

(8) రావణుడు సీతని బలవంతంగా తీసికెళ్ళలేదనీ, సీతే ఇష్టపడి రావణుడితో వెళ్ళిందనీ చెప్పి, దాన్ని రుజువు చెయ్యడానికి అనేక ప్రయత్నాలు చేశారు పెరియార్. "రావణుడికి శాపం ఉంది కదా? సీతని ఎత్తుకు పోయేటప్పుడు ఆమెని ముట్టుకుంటే అతని తల బద్దలై పోవలసిందే కదా? కాబట్టి, దీన్ని బట్టి ఏం తెలుస్తోంది?" అని ప్రశ్నిస్తున్నారు పెరియార్.[22] అంటే, సీతే రావణుడి వెనకాల వెళ్ళింది – అని పెరియార్ అర్థం. కథ ప్రకారం తీసుకుంటే రావణుడికి ఉన్న శాపం ఏమిటి? కవి ఏం చెప్పాడు? రావణుడికి బ్రహ్మ ఇచ్చిన శాపం: "ఇది మొదలు పర స్త్రీని బలత్కారముగ పొందినచో (బలాత్ = బలత్కారముగ; గమిష్యసి – పొందగలవో) అపుడు నీ తల బ్రద్దలగును"

రావణుడికి నలకూబరు డిచ్చిన శాపం:

"ఈ దురాత్ముడెప్పుడు తన్ను గోరని గాంతను బలాత్కారముతో రమింపగోరునో (ధర్షయిష్యతి = రమిస్తాడో) అప్పుడే అతని శిరము వేయి వ్రయ్యలు గాగలదు."

ఈ 'బలాత్కారం' అనేది, కామ సంబంధానికే. తీసి కెళ్ళడంలో బలవంతం చేస్తే, దానికి శాపం వర్తించదు. కవి ఈ శాపానికి ఏ హద్దులు పెట్టాడో దాని ప్రకారమే మన వాదం వుండాలి. ఈ శాపాన్ని పెరియారు, తన అభిప్రాయానికి అనుకూలంగా మార్చుకున్నారు. "రావణుడు సీతని ముట్టుకుంటే, చచ్చిపోయే వాడే కదా? సీత, తన ఇష్టంతోనే వెళ్ళిందని అర్థం కదా?" అంటున్నారు. పోనీ, పెరియారు, ఈ వాదం మీదే స్థిరంగా ఉన్నారా అంటే, అదీ లేదు. ఇంకా ఎన్ని రకాల అభిప్రాయాలు వెలిబుచ్చారో చూడండి!

"రావణుడు సీతని ఎత్తుకుపోవాలనే ఉద్దేశంతో సీత దగ్గిరికి వచ్చాడు. సీతని చూసీ చూడగానే ఆమె సౌందర్యానికి కట్టుబడి ప్రేమలో పడిపోయాడు."[23] రావణుడు సీతని ఎత్తుకు పోవాలనే ఉద్దేశంతోనే సీత దగ్గిరికి వచ్చాడని చెపుతున్నారు! సీత మహా కురూపి అని ఇంతకు ముందు చెప్పారు. ఇక్కడ ఆమె చాలా సౌందర్యవతి! రావణుడు ఇక్కడ సీత ప్రేమలో పడిపోయాడు!

తర్వాత చూడండి – "రావణుడు సీతని ప్రతీకారం కోసమే తీసుకుపోయాడు గానీ, ఆమె మీద ప్రేమతో మాత్రం కాదు."[24]

ఇందాక రావణుడు 'ప్రేమలో పడ్డాడు'! ఇప్పుడు ప్రేమ కాదు, ప్రతీకారం! ఇందాక, సీత రావణుణ్ణి ఇష్టపడి వెళ్ళింది. ఇప్పుడు రావణుడే తీసుకుపోయాడు. అంతేనా?

తర్వాత మళ్ళీ చూడండి! "రావణుడు – సీతే ఇష్టంతో తన వెంట పడేటట్టు చేసుకున్నాడు."[25]

– పెరియారు, ఈ మాటలు తన మాటలు కానట్టుగా, ఎవరి అభిప్రాయమో తను తీసుకున్నట్టుగా, వీటిని కోట్స్‌లో పెట్టి చెప్పారు. ఇవి ఎవరి మాటలో చెప్పలేదు. కానీ ఈ అభిప్రాయాల్ని పెరియారు పూర్తిగా సమర్థించారు. "అవును, సీతే రావణుడి వెంట తన స్వంత ఇష్టంతో వెళ్ళి వుండాలి. లేకపోతే రావణుడు ముట్టుకోవడం కుదరదు కదా? అతనికి శాపం ఉంది కదా?" అన్నారు.

మళ్ళీ ఇంకో చోట చూస్తారా? "రావణుడికి సీత ఆతిథ్యం ఇచ్చిన తర్వాత ఏం జరిగింది? రావణుడు

---

22. "If in the teeth of such curses there had been any physical contact while carrying her his head and body should have been reduced to dust. But nothing did happen to him .... what then does it mean (P.54) ★
23. "Ravana visited Sita's abode with an intention to carry her away. On seeing her he was captivated by her beauty. Ravana fell in love and advanced towards her. (p. 26) ★
24. "Ravana carried away Sita to Lanka as a retaliatory measure and not out of love towards Sita (P.41) ★
25. "Sita ought to have followed Ravana Voluntarilly." (P.28) ★

సీతని తనతో లంకకు రమ్మని అడిగాడు. సీత తిరస్కరించింది. అప్పుడు రావణుడు ఆమె జుట్టు పట్టి తొడల కింద చేతులేసి ఎత్తితీసుకుపోయాడు. ఆమె ఏడ్చింది."[26]

"రావణుడు ఎత్తుకు పోతోంటే అర్ధనగ్నంగా ఉన్న సీత చేతులతో పై భాగాన్ని కప్పుకుంటూ ఉంది."[27]

ఏమిటి ఇదంతా? – ఏమిటంటే, 'ఆర్య స్త్రీకి ఎటువంటి గతి పట్టిందో చూడండి!' అని చెప్పి, ఆమెని వెటకారం చేస్తూ ఆనందించడం! దీని వల్ల, 'రావణుడు ఎంత దుర్మార్గుడో రుజువు చేస్తున్నాన'నే ధ్యాస లేదు. ఒక చోట 'సీతే వెళ్ళింది' అని చెప్పి, ఇంకో చోట 'రావణుడు ఎత్తుకెళ్ళాడు' అని చెప్తే, ఒకే నోటితో శుద్ధీ బుద్ధీ లేకుండా మాట్లాడుతున్నాననే స్పృహ లేదు. ఒక ద్రావిడ పురుషుడు, ఆర్య స్త్రీని జుట్టుపట్టి ఈడ్చడం గొప్ప ఘనకార్యం అనుకున్నారు. కానీ, పెరియార్‌గారూ! ఆర్య పురుషుడెవడైనా ఒక ద్రావిడ స్త్రీని జుట్టు పట్టి ఈడ్చి లాక్కుపోతోంటే, ఆ ద్రావిడ స్త్రీ కూడా ఇంత నిస్సహాయంగానూ అయిపోతుంది సుమండీ! సీత బట్టలన్నీ అస్తవ్యస్తం చేసి, ఆమెని దౌర్జన్యంగా లాక్కుపోవడం రావణుడికి గొప్ప గర్వకారణం అనుకుంటున్నారా? తన బల గర్వంతో స్త్రీని అంత అవమానించిన పురుషుణ్ణి వెనకవేసుకు వచ్చి కీర్తించడం, మీ 'జాతి అహంకారాన్ని' చాటుతుందే గానీ, నిస్సహాయంగా ఉన్న సీత మీద విముఖత కలిగిస్తుందా?

ఇక్కడ పెరియార్ చూపించిన రుజువుల్లో, అసలు సంగతి బయటపడి రావణుడు సీతని బలవంతంగా తీసుకెళ్ళాడనే రుజువైంది కదా?

అప్పుడే అయిందా? ఇంకా చూడండి!

"రావణుడి మందిరానికి చేరగానే సీతకు రావణుడి పట్ల ఉన్న ప్రేమ ఇంకా ఎక్కువైంది."[28]

పెరియార్ వాదనా క్రమం, ఎంత న్యాయంగా, ఎంత నిజాయితీగా ఉందో కదా?

(9) ఇప్పటికి సీతతో రావణుడు తన కొంపకి చేరాడు కదా? ఇక ఇప్పుడు పెరియార్‌గారి ఆలోచనలన్నీ సీతకీ రావణుడికీ శారీరక సంబంధం ఉందా లేదా అనే దాని మీద!

రావణుడు సీతని లంకకు తీసుకు పోయి తనని పెళ్ళి చేసుకోమన్నప్పుడు సీత ఏడ్చిందనీ, పెళ్ళికి అంగీకరించనన్నదనీ కూడా చెప్పారు – "దీన్ని బట్టి రావణుడితో సంగమానికి సీత అంగీకరించలేదని తెలుస్తోంది." అన్నారు.[29] ఇందాక మందిరంలోకి రాగానే సీతకి రావణుడి మీద ప్రేమ ఇనుమడించింది! ఇప్పుడు పోయింది!

ఇక్కడ సీత విషయం మళ్ళీ అనుమానంలో పడింది – "నాకూ రావణుడికీ శారీరక సంబంధం కలగలేదని సీత భర్తతో తిన్నగా చెప్పదు. నా శరీరం నా ఆధీనంలో లేదు; నా మనసు మాత్రం నీ మీదే ఉంది – అని అంతా డొంక తిరుగుడుగా మాట్లాడుతుంది ...." అన్నారు.[30]

అసలు సీత "నా శరీరం నా ఆధీనంలో లేదు. నేనేం చెయ్యను?" అనే మాటలు దేన్ని గురించి చెప్పింది? ఈయన వాటిని దేనికి అన్వయించారు?

సీత మాటలు చూడండి – "ప్రభూ, నేను వివశనై యుండినపుడు పర పురుషుని స్పర్శ నాకు సోకినది. (వివశా= పరాధీననగు; అహం= నేను; గాత్ర సంస్పర్శం = శరీర స్పర్శమును; గతా = పొందిన దానను; అస్మి యది = అగుదునేని; మే = నా యొక్క; కామకారః = ఇచ్ఛ; న = లేదు) ఈ విషయములో అపరాధము దేవుని దేను. ఇతరులచే గ్రహించుటకు సాధ్యపడని నా మనసు నీ మీదనే యుండినది. ఇతరులు గ్రహించుటకు తగియుండు నా శరీరము విషయములో నాకు స్వతంత్రము లేదు. నే నేమి చేయగలను?"

ఈ మాటలు కేవలం రావణుడితో వెళ్ళడం గురించి చెప్పినవే గానీ, "రావణుడితో కామ సంబంధం కలిగింది, నే నేం చెయ్యను?" అనే దృష్టితో చెప్పినవి కావు. ఒక వేళ అలా జరిగినా కూడా సీత తప్పేం ఉంటుంది? అప్పుడు కూడా సీతకి ఇదే వాదం ఉంటుంది. కానీ, ఈ కథ ప్రకారం, సీత – పతివ్రత. తనకు పర పురుషుడితో సంబంధం కలిగితే, తన పవిత్రత పోయినట్టే ఆమె

26. "He revealed to her that he was Ravana and urged her to start with him to Lanka. She refused. Presently with one hand he seized her by the hair and with his other hand on her thighs he lifed her up and placed her on his thigh and carried her away. She cried." (P.54)

27. "While Ravana was carrying her away seated in his lap she was half naked, herself denuding the upper half." (P.27)

28. "As soon as Sita stepped in to Ravana's palace, her love towards Ravana grew more." (P.27)

29. "But Sita closing her eyes, sobbed" .... - ""It may be inferred here that Sita did not give her consent to Ravana to co habit her" - (P.27)

30. "She did not answer to the point. She was beating about the bush. 'I have no control over my body; but I can assure you of purity of my mind' - In such qualified terms she had replied." (P.55)

కూడా భావిస్తుంది. 'అవును, ఇప్పుడు నేను పతివ్రతని కాను' అని ఆమే ఒప్పుకుంటుంది. కానీ, ఇక్కడ సీత మాట్లాడేది అలాంటి సందర్భం గురించి కాదు. రావణుడు తనని బలవంతంగా తీసుకుపోవడం గురించే చెపుతోంది.

కానీ పెరియారు వీటిని కామ సంబంధానికే అన్వయించి – "డొంక తిరుగుడుగా చెపుతుంది గానీ తిన్నగా చెప్పదేం?" అంటున్నారు. సీత చాలా తిన్నగానే చెప్పింది. "నీవు తలచి నటుల నేను ఉండలేదు. ఒట్టు పెట్టుచున్నాను. నమ్మవలయును .... నా విషయమై శంకను విడిచి పెట్టవలయును (శపే = శపథము చేయుచున్నాను; శంకాంతు = సందేహమును మాత్రము, పరిత్యజ = వదలుము)" అని చెప్పింది. ఇంత స్పష్టంగా చెపితే ఇది డొంక తిరుగుడా?

పోనీ! సీత మాటలు కామ సంబంధం గురించే అనుకుందాం. 'నే నేం చెయ్యను? నా శరీరాన్ని నేను రక్షించుకోలేను కాబట్టి అలా జరిగింది' అని అర్థంతోనే సీత అన్నదనుకుందాం. అలా అయితే, సీతకు ఇష్టం లేకుండా, సీత మనసు ఆమె భర్త మీదే ఉండగా, ఆమె శరీరాన్ని రావణుడు బలాత్కారం చేశాడని అర్థం కాదా? అది రావణుడి దుర్మార్గం అవదా? కానీ పెరియార్ అభిప్రాయం ఏమిటంటే – రావణుడికి శాపం ఉంది కాబట్టి అతను బలాత్కరించడు. సీత రావణుడితో ఉన్నప్పుడు ఇష్టంగానే ఒప్పుకుంది. భర్త దగ్గిరికి వచ్చి తన తప్పేమీ లేనట్టుగా ఇలా మాట్లాడుతోంది – అని. కానీ, ఎవరు ఎలా మాట్లాడినా, అది కథలో హద్దుల్ని దాటకుండా వుండాలి. కథలో చివరికి ఏం తేలింది? సీతకి జరిగిన అగ్ని పరీక్షలో, సీత పతివ్రతగానే ఉందనీ, రావణుడితో సంబంధం కలగలేదనీ, తేలింది. కాబట్టి, 'సీత చెప్పిన మాటలు డొంకతిరుగుడుగా ఉన్నాయి' అనే విమర్శ పనికిరాని విమర్శ అయిపోతుంది.

(10) సీతకి రావణుడి మీదే ఇష్టం – అనడానికి పెరియార్ ఇంకో రెండు వింత సాక్ష్యాలు చూపించారు.

**మొదటిది:** చంద్రావతి రాసిన బెంగాలీ రామాయణంలో ఒక సంఘటన ఉందట ఈ విధంగా – "సీత రావణుడి బొమ్మ గీసి గుండెలకు హత్తుకుంటోంది చూడు" అని రాముడి అక్క కుకూవతి అనే ఆవిడ రాముడితో రహస్యంగా చెపుతుందట. (రాముడికి అప్ప ఉంటే, ఆ అప్ప కూడా రాముడిలాగే కుళ్ళుగా ఉంటుందన్న మాట!) రాముడు సీత గదిలోకి వెళ్ళి చూసేసరికి సీత నిజంగా అలాగే చేస్తూ వుందట![31]

**రెండోది:** సి.ఆర్. శ్రీనివాసయ్యంగార్ రాసిన "నోట్స్ ఆన్ రామాయణ" అనే పుస్తకంలో – సీత రావణుడి బొమ్మ గీస్తూ రాముడికి దొరికి పోయిందట![32]

వాల్మీకి రామాయణంలో సీత గుణగణాలు చూపించడానికి, పెరియారు, చంద్రావతీ రామాయణంలో కథనీ, శ్రీనివాసయ్యంగారు రాసుకున్న నోట్స్‌నీ చూపిస్తున్నారు! ఏమనాలి ఇలాంటి పెరియార్లని? అంటే, ఇలాంటి పెద్ద మనుషుల్ని? ఈయనకి ఇంకా 'పెరియార్' అనే పేరు ఎందుకూ?

కంబ రామాయణంలో రాముడి పాత్రని ఎక్కువ తప్పులు లేకుండా నాజూగ్గా చేసినందుకు ఈయన మండిపడ్డారు కదా? "వాల్మీకినే చదవండి, అందులో రాముడు ఎలా ఉన్నాడో చూడండి, ఇతర రామాయణాల మీద ఆధార పడకూడదు. వాటిలో చాలా మార్పులు చేసేశారు" అన్నారు కదా? అలాంటి మార్పులు చేసినందుకు ఆ అనువాదకుణ్ణి 'విలనస్ కంబన్' అని తిట్టారు కదా? మరి సీత గుణగణాల్ని నిర్ణయించడానికి వాల్మీకి రామాయణం మీద కాకుండా ఇతర రామాయణాల మీద ఎలా ఆధారపడుతున్నారు? అన్ని రామాయణాల కథలూ తెచ్చి సీతకి అంటగట్టి– "వాల్మీకి చూపించే సీత ఎలాంటిదో చూడండి!" అంటారా? అన్ని రామాయణాల్లోంచీ దుర్గుణాలూ, తిట్లూ తెచ్చి రావణుడికి కలిపి "రావణుడు ఎంత నీచుడో చూడండి" అనవొచ్చునా? – వాల్మీకి రామాయణంలో సీత ఎలా ఉందో చూడాలంటే, వాల్మీకి చెప్పిన విషయాల మీదే ఆధారపడాలి. ఏ ఇతర కథలూ చేర్చకూడదు. అలాగే బెంగాలీ రామాయణంలో సీతని చూడాలంటే, అందులో విషయాల మీదే ఆధారపడాలి గానీ, వాల్మీకి రామాయణాన్ని చేరనివ్వకూడదు. ఇంత సామాన్యమైన విషయం పట్టించుకోకుండా కుప్పతెప్పలుగా విమర్శలు కురిపించడమేనా పెద్ద మనిషితనం? వాల్మీకి రచనలో ద్రావిడులకు అన్యాయం జరిగిందనే విషయం రుజువు చేసి, ఆర్య భక్తుల నోళ్ళు మూయించడానికి ఎన్నో న్యాయమైన విషయాలు ఉండగా ఇన్ని తప్పుడు దారులు తొక్కాలా పెరియార్‌గారూ?

వాల్మీకి – ఆర్యుల్ని గొప్ప చెయ్యాలనే నీచత్వంతో నానా అబద్ధాలూ రాస్తే, ద్రావిడ పెరియారు కూడా 'మేమూ అంతే' అని చక్కగా రుజువు చేస్తున్నారు.

పెరియారు తన రచన పొడుగునా 'సీత చెడ్డది, సీత చెడ్డది' అని రుజువు చెయ్యాలని అడ్డమైన ప్రయత్నాలూ చేసి చివరికి – "సీత నీతిమంతురాలు కాదు.

---

31. ".... Kukuvathy, approached Rama and said to him .... (P.28) - "He sighed and went out with his sister Kukuvathy to Sita's apartment. She was found sleeping pressing to her breast the hand - fan in which Ravan's picture was drawn" (P.29) ★

32. "Sita was caught redhandedly by Rama that she had drawn the picture of Ravana." (P.29)★

ఆమెకు రావణుడితో అక్రమ సంబంధం ఉంది" అని స్పష్టంగా తేల్చేశారు.[33]

అక్రమ సంబంధం వల్ల సీత చెడ్డది అయితే, అదే అక్రమ సంబంధం వల్ల రావణుడు చెడ్డవాడు అవడా?

ఇంకా చూడండి! "వాల్మీకి రామాయణాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే సీత కడుపు రాముడి వల్ల వచ్చింది కాదని చాలా స్పష్టంగా తెలుస్తుంది" అంటున్నారు.[34]

వాల్మీకి రామాయణాన్ని జాగ్రత్తగానే పరిశీలిద్దాం. అంత జాగ్రత్తగా పరిశీలిస్తే అందులో కుకూవతి చెప్పిన విసనకర్రా, శ్రీనివాసయ్యంగార్ గీయించిన రావణుడి బొమ్మలూ కనబడతాయా పెరియార్ గారూ?

సీత గర్భానికి రాముడు కారణం కాదని (అంటే, రావణుడే కారణం అని) రుజువు చెయ్యడానికి పెరియార్ చేసే ప్రయత్నాలు ఇన్నీ అన్నీ కావు.

వాల్మీకి రామాయణాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అందులో కథ ఇలా కనపడుతుంది:

రాముడు సీతని తీసుకుని అయోధ్యకు వచ్చి పట్టాభిషేకం చేసుకుని రాజ్యం పరిపాలిస్తూ ఉన్నాడు. "సీతా - రాములు సకల భోగములు అనుభవించుచుండ పది వేల సంవత్సరములు గడిచెను" అంటాడు కవి. (అంటే కొంత కాలం గడిచిపోయినట్టుగా, దీన్ని మనం వాస్తవం లోకి మార్చి అర్థం చేసుకోవాలి.)

ఒక నాడు రాముడు - "సీతా! నీ యందు నాకు బుత్రులు బడయుట సన్నిహితమైనది. (నువ్వు ప్రసవించే కాలం దగ్గరపడుతోంది.) నీ వేమి కోరెదవు?" అని అడిగాడు.

సీత - "రాఘవా! .... గంగా తీరంబున రుషుల పుణ్యాశ్రమములను జూడ గోరెద. తుదకొక రేయియైన తపోవనంబున నుండెద" అంది.

వాల్మీకి కథని జాగ్రత్తగా చూస్తే ఇదే కనపడుతుంది.

సీత లంక నించి వచ్చిం తర్వాత, ఈ కడుపు వచ్చే నాటికి మధ్యలో కొంతకాలం (కథ ప్రకారం 10 వేల సంవత్సరాల కాలం) అడ్డు ఉంది కదా? సీతకు రావణుడి వల్లనే కడుపు వచ్చిందని వాదించాలంటే, పెరియార్‌కి కథలో అడ్డంగా ఉన్న కాలం కంటకింపుగా వుంది. కాబట్టి ఆ కాలాన్ని తీసెయ్యాలి.

పెరియార్ సరిగ్గా ఆ పనే చేశారు. సి.ఆర్.శ్రీనివాసయ్యం గారు - "రాముడు సీతని అడవికి పంపేలోగా పది వేల సంవత్సరాల కాలం జరిగిందనే విషయం ప్రక్షిప్తమే" అన్నారట. ఇది ప్రక్షిప్తం కావడం కన్నా ఈ పెరియార్లకి ఆనంద మేముంది? రాముడి భక్తులకు గానీ, రావణుడి భక్తులకు గానీ, వారిలో ఏ పెద్ద మనిషికి ఏది గిట్టకపోతే అది ప్రక్షిప్తమే! కాబట్టి, పెరియార్‌కి ఈ ప్రక్షిప్తం ఎంతో నచ్చింది. ఈ కాలాన్ని 'ప్రక్షిప్తం' అని శ్రీనివాసయ్యం గారు రాయకపోతే ఏమయ్యేది? ఏమవుతుంది లెండి! ఆయన రాయకపోతే ఈయనే రాస్తాడు. ఈయన అయ్యంగారి అభిప్రాయాన్ని ఎంతో చక్కగా సమర్థించారు - "అవును, అది ప్రక్షిప్తమే. లంక నించి రాగానే సీతకి కడుపు వచ్చిందంటే బాగుండదనీ మధ్యలో కొంత కాలం జరిగినట్టు ఎవరో కవి ప్రక్షిప్తం చేర్చాడు. కానీ సీత కడుపు సంగతి లంక నించి వచ్చిన నెల రోజుల్లోనే బయటపడింది. అందుకే రాముడు వదిలేశాడు. ఆమెని లక్ష్మణుడు అడవిలో వదిలేశాడు" అని తమ పరిశోధనా సారాంశం తేల్చారు.[35]

"ఆర్య స్త్రీ గర్భానికి మా ద్రావిడుడే కారణం" అని చెప్పాలనే అహంకారం కాకపోతే ఏం ఉంది ఇందులో?

పెరియార్‌కి సీత పాత్ర మీద ఇంత కక్ష ఎందుకు? - ఎందుకంటే, సీత, ఆర్య స్త్రీ గనక. సీత, రావణుడితో సంబంధాన్ని తిరస్కరించింది గనక.

ఎలాగైనా సీతని రావణుడికి అప్పజెప్పాలని ఈయన పంతం! సీతకి రావణుడితో సంబంధం ఉందని చెప్పి ద్రావిడ భక్తులకు సంతోషం కలిగించాలని ఈ తప్పుడు విమర్శల్లోకి దిగారు. "పర స్త్రీని ఎత్తుకొచ్చిన తర్వాత ఏ జాతి పురుషుడైనా ఆమెతో సంబంధం లేకుండా ఊరుకుంటాడా?" అని ఒక్క మాట అంటే ఈ చెత్త వాగుళ్ళ కన్నా ఎక్కువ సబబుగా ఉండేది. కానీ అలా అంటే రావణుడు దుష్ట పురుషుడౌతాడు కదా? కాబట్టి, సీత విషయంలో పెరియార్ చెప్పేది ఏమిటంటే - 'సీత, రావణుణ్ణి ఇష్టపడే వెళ్ళింది. అక్కడే గర్భవతి అయింది. అంతలో రాముడు, రావణుడితో యుద్ధం చేసి అతన్ని చంపేశాడు. సీత మళ్ళీ రాముడి దగ్గిరికే రావలసి వచ్చింది. కానీ, ఆమె గర్భం సంగతి తెలిసి రాముడు ఆమెని వదిలేశాడు' - ఇదీ ఈయన పరిశోధన సారాంశం!

సీతకీ రావణుడికీ సంబంధం ఉందనే సంగతి రుజువైతే, అది సీతకే అవమానం గానీ, రావణుడికి అవమానం కాదని పెరియార్ అభిప్రాయం. ఆడదే ఇష్టపడితే మగాడికి తప్పేమిటి? - అనే ధోరణి ఆయనది. అందుకే

33. "As regards Sita I say she was not morally pure because of her illicit intimacy with Ravana." (P.29) ★
34. "From a close study of Ramayana by Valmiki it is clear that Sita's pregnancy was not by Rama." (P.30) ★
35. "It is stated that this verse was interpolated to keep Sita beyond suspicion. Thus Sita's pregnancy was found out within a month and there after she was taken to the forest by Lakshmana" (P.31) ★

"ఆ కడుపు మా ద్రావిడ రాజు వల్ల వొచ్చిందే" అని దప్పు వాయించడం!

స్త్రీలని వాల్మీకి హీనపరిచాడని చెప్పి, మరి స్త్రీలకు ఈయన ఇచ్చిన గౌరవం ఏమిటి? – ఏమీ లేదు. ఈయనకి ద్రావిడ స్త్రీల హైన్యమే పట్టలేదు. రావణుడి చుట్టూ వున్న వందల కొద్దీ భార్యల గురించే ఈయనకు స్పందనే లేదు. జాలీ దయా లేవు. ఇక ఆర్య స్త్రీ గురించి ఏం పడుతుంది? ఆమెని ఎంత హీనపరిస్తే అంత సంతోషం! ఎంతెంత కుళ్ళు మాటలు మాట్లాడితే అంత ముచ్చట!

అగ్ని పరీక్ష గురించి చెపుతూ "అసలు ఆ సమయానికి (అగ్ని పరీక్ష సమయానికి) సీతకు మూడు నెలల కడుపు" అంటున్నారు రావణ భక్త పెరియార్![36]

"ఆఖరి సమయంలో రాముడు సీతని పాతివ్రత్యం రుజువు చేసుకోమంటే, అప్పుడైనా రుజువు చేసింది కాదు, భూమిలోకి వెళ్ళిపోయింది గానీ" అంటున్నారు.[37]

భూమిలోకి వెళ్ళిపోవడం రుజువు కాదూ? భూమి లోంచి సింహాసనం రావడం, భూదేవి స్వయంగా వచ్చి సీతని గౌరవంతో తీసుకుపోవడం, సీత తను పతివ్రతనని రుజువు చేసుకోవడం కాదూ? ఇది కూడా రుజువు కాకపోతే రుజువంటే ఇంకేం చెయ్యాలి? ఏం చేస్తే స్త్రీల సద్గుణాల్ని ఈ ద్రావిడ రచయిత అంగీకరిస్తాడు?

ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే – రాముడు, సీతని రెండోసారి కూడా పవిత్రత రుజువు చేసుకోమనడంలో పెరియార్‌కి తప్పు కనపడలేదు. నిజానికి ఇది, రాముణ్ణి దుయ్యబట్టవలసిన విషయం. 'సీత, లంకలోనే అగ్ని పరీక్షద్వారా తన పవిత్రత రుజువు చేసుకుంది కదా? అయినా రాముడికి అనుమానం పోలేదు. ఆమెని వదిలేశాడు. ఇప్పుడు మళ్ళీ పవిత్రత రుజువు చేసుకోమంటున్నాడు. రాముడు ఎలాంటి వాడో చూడండి!' అనాలి. కానీ, ఇక్కడ పెరియార్‌కి రాముడి తప్పు కనపడలేదు, సీత తప్పే కనపడింది. సీత రుజువు చేసుకోనే లేదట! భూమిలోకి వెళ్ళి పోయిందట!

ఇక్కడ, ఆర్య – ద్రావిడ భేదాలు అంతర్ధానమయ్యాయి. పెరియారు, రాముడితో ఏకమయ్యాడు. ఇక్కడ స్త్రీ – పురుష భేదాలే బయటపడ్డాయి. రాముడు, సీతని, రెండో సారి కూడా రుజువు చేసుకోవడం పెరియార్‌కి సబబుగానే కనపడింది!

చివరికి, ఈ రచయిత సీత గురించి తేల్చింది ఇదీ: "సీత, కథ అంతటా చాలా సామాన్య స్త్రీ లాగానే కనపడుతుంది. ఉత్తమ వంశ లక్షణాలు గానీ, అణకువ గానీ, శీలసంపద గానీ ఆమెలో ఏ కోశానా లేవు."[38]

ఇది సీత మీద విమర్శే కాదు, 'సామాన్య స్త్రీలందరి మీదా' విమర్శ కూడా! ధనవంతులు కాని సామాన్య స్త్రీలకు అణకువ గానీ, శీల సంపద గానీ, ఇంకా ఏ రకమైన సద్గుణాలూ ఉండవన్న మాట! అణకువలూ శీల సంపదలూ అంత మంచి గుణాలే అయితే, అవి పురుషులకు కూడా ఎందుకు ఉండవద్దూ? స్త్రీలకే ఎందుకు ఉండాలీ? ఇవన్నీ రావణుడికి వున్నాయా? ఒక మాట మాట్లాడేటప్పుడు దానికేం అర్థం వస్తుందో అనే ఆలోచనే లేదు ఈ రచయితకి.

పెరియారుకి సీత మీద కక్ష – ఆమె రావణుడికి లొంగనందుకే. సీత మీద ఎన్ని రకాల ఆరోపణలు చేసినా, దేనినీ రుజువు చెయ్యలేకపోయారు. సీత నీచత్వాన్ని కాదు, తన నీచత్వమే బైట పెట్టుకున్నారు.

సీత గుణగణాల్నీ, రావణుడి గుణగణాల్నీ ఇంత న్యాయంగానూ, నిష్పక్షపాతంగానూ పరిశీలించిన పెరియారు చివరికి ఇలా తేల్చారు. "రావణుడు సీతని బలాత్కరించాడు – అనే ఫిర్యాదులో నిజానిజాలు పరిశోధించడానికి ఈ విషయమంతా ఒక సి.ఐ.డీ. ఆఫీసర్‌కి అప్పగిస్తే, ఆ ఆఫీసరు తన పరిశోధనంతా తీసుకు వెళ్ళి నిష్పాక్షికంగా ఉండే ఒక జడ్జీ ముందు తీర్పు కోసం పెడితే, రాముడు ఫిర్యాదీ గానూ, రావణుడు నిందితుడు గానూ కేసు నడిస్తే, రావణుడు నిర్దోషి అనీ, అమాయకుడనీ, అతన్ని అన్యాయంగా బ్లాక్ మెయిల్ చేశారనీ, ఆ జడ్జీ రావణుడి పక్షాన్నే తీర్పు ఇస్తాడు. దానికేమీ సందేహం లేదు."[39]

---

36. "If we carefully go through the Valmiki Ramayana we find that Sita was pregnant at that time and the pregnancy was of three months." (P.64) ★

37. "In the end, when Rama asked her to swear as to her purity, she did not do it; but she sank herself down into the earth and disappeared." (P.55) ★

38. ".... with no good qualities that are the requisites of a well - bred, modest and chaste woman." (P.50) ★

39. "If we entrust the entire matter for investigation with a C.I.D. Officer for exploring the truth in the alleged complaint against Ravana that he seduced Sita and the investigation report is placed before an impartial judge for decision and if the case is conducted on behalf of Rama as complainant and Ravana as the accused, we are quite confident that the judge will decide in favour of Ravana by pronouncing that he is an innocent man and that he has been unnecessarily blackmailed." (P.65) ★

ఇక్కడ పెరియారు ఒక ముఖ్య విషయం మరిచి పోయారు – ఆ సి.ఐ.డి. ఆఫీసరూ, ఆ జడ్జీ తన వంటి ద్రావిడ దురహంకారులై ఉండాలని చెప్పడం మర్చి పోయారు. 'జడ్జి, నిష్పక్షపాతంగా ఉండాల'నడం లోనే అతను రావణుడి తరఫునే తీర్పు ఇవ్వాలనే ధ్వని ఉందను కోండీ. జడ్జీ తన తీర్పులో ఎలా చెప్పాలని పెరియారు ఆశిస్తున్నారంటే – "సీతే రావణుడి వెంటబడి వచ్చింది గానీ, రావణుడు బలవంతంగా తీసుకు రాలేదు. సీతే రావణుణ్ణి కోరి ఆ పిల్లల్ని కన్నది" అని చెప్పాలని! అలా చెపితేనే అతను న్యాయంగా ఉన్నట్టు! లేకపోతే అన్యా యమే!

ఆర్య దురహంకారానికీ ఆర్య దుర్మార్గానికీ విరు గుడు, ద్రావిడ దురహంకారమూ ద్రావిడ దుర్మార్గమూ కావని ద్రావిడ పెరియారు బొత్తిగా తెలుసుకోలేక పోయారు!

ఈ రకంగా పెరియారు, వాల్మీకి రామాయణం గురించి తన అభిప్రాయాలు వ్యక్తం చేసి – "రాముడు గానీ, రామాయణం గానీ, మన భక్తి గౌరవాలకు అర్హ మైనవేనా?" అని ప్రశ్నించారు.

ఇంకా ఇలా అంటున్నారు – "ఇంత శాస్త్రజ్ఞానం అభివృద్ధి చెందిన కాలంలో కూడా బ్రాహ్మణులు బ్రాహ్మ ణేతరుల స్తితినీ, అజ్ఞానాన్నీ ఆసరా చేసుకుని రామా యణం పవిత్రమని ఇంకా పాత పాటే పాడుతున్నారు. ఈ విషయాలన్నీ గ్రహించి రామ భక్తుల్ని ప్రశ్నించేటంత జ్ఞానం ప్రజలకు కలిగించాలన్నదే మా కోరిక" (పే. 60)

రామ భక్తుల్ని ప్రశ్నించేటంత జ్ఞానం కలిగిన ప్రజలు, అంతటితోనే వూరుకోరు పెరియార్‌గారూ! రావణ భక్తుల్ని కూడా ప్రశ్నిస్తారు.

పెరియారు తన విమర్శలో మొట్టమొదట్లోనే వాల్మీకి రామాయణంలో ద్రావిడులకు ఉపయోగపడే అంశాలేవీ లేవన్నారు. ద్రావిడులకే కాదు, ఆర్య ప్రజలకూ, ఆర్య స్త్రీలకూ ఉపయోగపడేవి కూడా ఏమీ లేవు. పెరియారు తన విమర్శల్లో ఎక్కడా నిజాయితీ చూపించలేదు. ఈ విమర్శలు ద్రావిడుల ఆత్మ గౌరవంతో సాగిన విమర్శలు కావు.

ఆర్య వాల్మీకికీ, ద్రావిడ పెరియార్‌కీ, ఏం తేడా వుంది?

వాల్మీకి, ఆర్య పక్షపాతంతో రామ భజన చేస్తే, పెరియారు ద్రావిడ పక్షపాతంతో రావణ భజన చేశారు.

లక్ష దుర్గుణాలు ఉన్న రాముడిలో వాల్మీకి ఒక్క లోపం కూడా గమనించలేక పోయినట్టే, లక్ష దుర్గుణాలు ఉన్న రావణుడి విషయంలో పెరియారూ అంతే.

వాల్మీకికి ద్రావిడ స్త్రీల మీద ఎంత కక్షో, పెరి యార్‌కి ఆర్య స్త్రీల మీద అదే కక్ష!

వాల్మీకికి, ఆర్య దురహంకారం అయితే,
పెరియార్‌కి, ద్రావిడ దురహంకారం! ★

ఇంత వరకూ, 'రామాయణం' మీద వేరు వేరు రకాల విమర్శలు చూశాం. వీటిలో కొన్ని– 'ఆర్య × ద్రావిడ' దృష్టితో సాగితే, కొన్ని – 'బ్రాహ్మణ × శూద్ర' దృష్టి తోటీ, కొన్ని – 'స్త్రీ × పురుష' దృష్టి తోటీ, సాగాయి. ఎవరికి ఏ కోణం మీద ఆసక్తి వుంటే అటు చూశారు. ఈ విమర్శలు సవ్యంగా సాగివుంటే, ఈ రక రకాల విమర్శలన్నీ అవసరమే. రామాయణ పవిత్రతకు నీరాజనాలు పట్టడం కన్నా, ఒక జాతి దురహంకారాన్నీ, అగ్రకుల దురహంకారాన్నీ, పురుష దురహంకారాన్నీ బట్ట బయలు చేసే విమర్శలు, పాఠకులకు నూతన జ్ఞానాన్ని ఇస్తాయి.

కానీ, ఈ విమర్శలు సవ్యంగా సాగలేదు. ఆర్య రాజు తప్పుల్ని దుయ్యబట్టిన విమర్శకుడు, ద్రావిడ రాజు తప్పుల్ని నెత్తిన పెట్టుకున్నాడు. బ్రాహ్మణుల్ని దోషుల్ని చేసిన విమర్శకులు, రాజుల్ని నిర్దోషుల్ని చేశారు. స్త్రీలను భర్తల దాస్యం నించి కాపాడదల్చిన విమర్శకులు, వారిని ఇతర పురుషుల దాస్యానికి అప్పగించారు! – ఇలా సాగిన విమర్శలు, ప్రజల్ని, ఒక తప్పులో నించి ఇంకో తప్పు లోకి తీసుకుపోవడం తప్ప, అంతకన్నా ఏం నేర్పగలుగుతాయి?

ఏ మత గ్రంధాన్ని అయినా 'వర్గ దృష్టితో' పరిశీలించగలిగితేనే, అందులో అన్ని కోణాల్నీ సరిగానూ, ఒక సమన్వయంతోనూ అర్ధం చేసుకోవడం సాధ్యమవుతుంది.

శూద్ర కులానికి శతృవు బ్రాహ్మణ కులం కాదు. ఆ కుల భేదాల్ని ప్రారంభించి, వాటిని ఈ నాటికీ నిలబెట్టి ఉంచాలని చూసే దోపిడీ వర్గమే శూద్ర కులానికి శతృవు. ఆ సమాజం, శూద్రులకే కాదు, పేద బ్రాహ్మణులకు కూడా శతృవే. చూడవలసింది, ధనిక × పేద వర్గాల దృష్టితోనే గానీ, కులాల – జాతుల – ప్రాంతాల దృష్టితో కాదు.

అన్ని కులాల లోనూ, అన్ని జాతులలోనూ, అన్ని ప్రాంతాల లోనూ, శ్రమ దోపిడీకి గురి అయ్యే ప్రజలందరూ ఒకటే. మావన సంబంధాల్లో తల ఎత్తే వైపరీత్యాలకు మూలం అదే.

వర్గ భేదాల్ని గ్రహించకుండా, కేవలం 'కుల' భేదాల మీదా, 'జాతుల' భేదాల మీదా చేసే బోధనలు (అవి కూడా తప్పు తప్పులుగా), ప్రజలకు సరైన జ్ఞానాన్ని ఇవ్వలేవు. ఆ భేదాల నించి బైటపడే మార్గాన్ని చూపించలేవు. ★

# 4వ భాగం

# 'విషవృక్షం' మీద కొన్ని అభిప్రాయాలు

## [అనుకూలమైనవీ, వ్యతిరేకమైనవీ కూడా]

'రామాయణ విషవృక్షం' మొదటి భాగం వచ్చినప్పుడు, దాన్ని కొందరు చాలా మెచ్చుకున్నారు. కొందరు చాలా విమర్శించారు. కొన్ని పత్రికలు హర్షించి అనుకూలమైన సమీక్షలు రాశాయి. ఒకటి రెండు పత్రికలు, మండిపడుతూ వ్యతిరేకించాయి. కొన్ని 'గొప్ప' పత్రికలు, సమీక్షల కోసం పంపిన పుస్తకాల్ని దిగమింగి ఊరుకున్నాయి. రేడియో సమీక్షకులు కూడా మౌనం వహించారు.

నాకు వచ్చిన ఉత్తరాల్లో కూడా అన్ని రకాలూ ఉన్నాయి. చాలా సంతోషించినవీ, చాలా వ్యతిరేకించినవీ; కొంచెం సంతోషించినవీ, కొంచెం వ్యతిరేకించినవీ; వ్యంగ్యాలూ, వెటకారాలూ; వ్యక్తి దూషణలూ వ్యక్తి కీర్తనలూ - అన్నీ! వ్యక్తుల ద్వారా విన్న అభిప్రాయాల్లో కూడా రెండు రకాలూ ఉన్నాయి. అలాంటి అభిప్రాయాలనే కొన్నిటిని ఇక్కడ ఇస్తున్నాను.

**ఒక అభిప్రాయం:**

**రామాయణం ఏ నాటిదో! దాన్ని విమర్శనా విషయంగా తీసుకోవడం గాక, సమకాలీన సమస్యలపై శ్రద్ధ చూపడం ప్రయోజనకరం కదా?**

**జవాబు:** మతమూ భక్తీ సమకాలీన సమస్యలు కావా? 'రామాయణం' మీదే కాదు, ఏ మత గ్రంథం మీద విమర్శ అయినా, మూఢ నమ్మకాల మీద విమర్శ. ధనిక వర్గ పరిపాలన మీద విమర్శ. భూస్వామ్య వర్గ సంస్కృతి మీద విమర్శ. ప్రజల్ని భావ దాస్యంలో ముంచి వుంచే ఏ సంస్కృతి అయినా, సమకాలీన సమస్యే. దాస్యాన్నీ అజ్ఞానాన్నీ ప్రసాదించే భావాలనే, సాంప్రదాయాలనే, గొప్ప సత్యాలు గానూ ఆదర్శాలు గానూ ఎంచుతూ వున్న జనాభాకి, ఒక ఆలోచన కలిగించే ఎంత చిన్న ప్రయత్నం అయినా అనవసరపు ప్రయత్నం కాదు. సమకాలీన జీవితాలకు సంబంధం లేని ప్రయత్నం కాదు.

**'రామాయణం, ఫ్యూడల్ సంస్కృతిని చాటుతోంది' అన్నారు. ఈ విషయం వ్యాసాలుగా చెప్పవచ్చును. రామాయణ కథ అంతా తిరిగి రాయడం ఎందుకు?**

**జ:** ఒక విషయం గురించి రాయాలంటే, 'కథ'గా రాయవచ్చు, 'వ్యాసం'గా రాయవచ్చు. 'పాట'గా, 'నాటకం'గా, 'కవిత్వం'గా, ఎలాగైనా రాయవచ్చు. కానీ, ఆ పద్ధతిని ఎంచుకోవడం ఆ విషయాన్ని బట్టి వుంటేనే బాగుంటుంది. రామాయణం మీద విమర్శల్ని కథల్లో చెప్తే, అందులో పాత్రలు కూడా కనపడతాయి కాబట్టి, కొన్ని సందర్భాల్లో అలా బాగుంటుంది. అన్ని చోట్లా కథలే కాదు, వ్యాసాలు కూడా ఉన్నాయి. 'పీఠిక' అంతా వ్యాసమే. ఫుట్ నోట్లు అన్నీ వ్యాసాలే. అయినా, ఏ పద్ధతిలో రాశారని కాదు, రాసింది ఎలా వుందో చూడాలి.

**విశ్వనాథ సత్యనారాయణగారి కల్పవృక్షానికి వ్యతిరేకంగా 'విషవృక్షం' అని పేరుపెట్టారా?**

**జ:** మీరు 'విషవృక్షం' చదివి ఉంటే ఇలా అడుగుతారనుకోను. 'కల్పవృక్షం' పేరు విన్నాను గానీ, అది నా ఆలోచనల్లో లేదు. మార్క్సిజాన్ని తెలుసుకోవడం ప్రారంభమైనప్పటి నించీ ప్రతీ మత గ్రంథమూ విషవృక్షం లాగే కనపడడం ప్రారంభమైంది. ప్రతీ దోపిడీ వ్యవస్థా ఒక విషవృక్షమే. రామాయణానికి దోపిడీ సమాజ లక్షణాలన్నీ ఉన్నాయి. ఆ లక్షణాలన్నీ తెలుసుకుంటే, అది విషవృక్షమే. అందుకే దానికా పేరు!

**ఏ నాడో వేల సంవత్సరాల నాడు రాయబడ్డ రామాయణాన్ని నిన్న మొన్నటి మార్క్సిజం దృష్టితో విమర్శించడం ఏమిటి? ఆశ్చర్యంగా ఉంది!**

**జ:** ఈ సందేహం చాలా మందికి కలిగింది. మార్క్సిజం అంటే ఏమిటో తెలియకపోవడం వల్లనే ఇలాంటి సందేహం కలుగుతుంది.

'మార్క్సిజం' అనే మాట నిన్న మొన్నటిదే. కానీ,

అది చెప్పే విషయం నిన్న మొన్నటిది కాదు. ఆ విషయం రామాయణ కాలం కన్నా వెనకటిది. మార్క్సిజం, శ్రమ దోపిడీ గురించీ, వర్గ భేదాల గురించీ చెపుతుంది. ఆ వర్గాలూ, ఆ శ్రమ దోపిడీ, రామాయణ కాలం కన్నా వెనకటి నించీ కూడా ఉన్నాయి. ఆ సంగతి కనిపెట్ట డానికి ఇంతకాలం పట్టింది.

ఒక ఉదాహరణ చూడండి! భూమి గుండ్రంగా ఉంటుందనే సంగతి మనుషులు నిన్న మొన్నే కని పెట్టారు. అంటే, ఆ సంగతి కనిపెట్టినప్పటి నించే భూమి గుండ్రంగా వుందని అర్థమా? అంతకు ముందు కూడా భూమి గుండ్రంగా వుందా, లేదా?

భూమి, కోట్ల సంవత్సరాల నించీ కూడా గుండ్రం గానే వుంది. కానీ, ఆ సంగతి చాలా కాలం వరకూ మనుషులకు తెలీదు. నిన్న మొన్నే తెలుసుకున్నారు. సరిగ్గా అలాంటిదే 'శ్రమ దోపిడీ' సంగతి కూడా. అది, వేల సంవత్సరాల నించీ సాగుతూనే వుంది. రామాయణం కథలో ఉన్న సమాజం కూడా దోపిడీ సమాజమే. దోపిడీ గురించి తెలుసుకోవడం మార్క్సు ద్వారా నిన్న మొన్నే జరిగింది. ఈ కొత్త జ్ఞానంతో వెనకటి కాలాన్ని చూసి, ఆ కాలం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రామాయణంలో ధనిక పేద తేడాలూ, రాజుల పరిపాల నలూ, భూముల కోసం యుద్ధాలూ, యజమానీ సేవ కత్వాలూ, అన్నీ ఉన్నాయి. ఆ లక్షణాల్ని బట్టి ఆ సమా జాన్ని శ్రమ దోపిడీ సాగే సమాజంగానే అర్థం చేసుకో వచ్చు. ఆ సంస్కృతి ప్రజలకు మేలు చేసేది కాదని అర్థం చేసుకోవచ్చు. మార్క్సిజం అంటే ఏమిటో తెలిస్తే, 'నిన్న మొన్నటి మార్క్సిజంతో, ఏ నాటిదో అయిన రామాయ ణాన్ని పరిశీలించడం ఏమిటి' అనే ప్రశ్న రాదు.

ఏ సమాజంలో అయినా శ్రమ సంబంధాలు వుంటాయి. కాబట్టి, మార్క్సిజం చెప్పే శ్రమ సంబంధాల జ్ఞానంతో ఏ సమాజాన్ని అయినా అర్థం చేసుకోవచ్చు.

**'విషవృక్షం'లో మీరు చేసిన విమర్శలతో నా కేమీ అభ్యంతరం లేదు. కానీ, అక్కడక్కడా కొంచెం అతి అని పించింది.**

**జ:** ఎక్కడెక్కడ కొంచెం అతి అనిపించిందో కొన్ని అయినా చెప్తే బాగుండేది. మీకు 'కొంచెం అతి' అని పిస్తే, కొందరికి 'చాలా అతి' అనిపించింది. మీ ప్రకారం అయితే, 'అతి'ని కొంచమే తగ్గించాలి. అది ఇంకో రకం వారికి నచ్చదు. వారి ప్రకారం, 'అతి'ని, బాగా తగ్గిం చాలి. అది మీకు నచ్చదు. అందరికీ నచ్చేలా చెయ్యా లంటే రచయిత తన స్వంత ధోరణి అంతా వదులు కోవాలి. అయినా అప్పటికీ అందరికీ నచ్చేలాగ చెయ్యడం సాధ్యం కాదు.

**'కావ్యం' అంటేనే దాని కథా వస్తువు, సమాజ ధర్మాలకు దూరంగా ఉంటుంది. దాన్ని సామాన్య వాస్తవ దృష్టితో పరిశీలించడం చాలా పొరపాటు.**

**జ:** సమాజానికి దూరమైన కథా వస్తువు, సమా జానికి ఇవ్వగలిగే సందేశం ఏముంటుంది? అలాంటి కావ్యానికి విలువ ఇవ్వవలసిన అవసరం ఏమిటి? కానీ, కావ్యమే గాదు, ఇంకే రచన అయినా, సమాజ ధర్మాలకు అతీతంగా పోలేదు. కవులు, సమాజానికి దూరంగా రాయాలనే ప్రయత్నిస్తారు. కానీ రాయలేరు. కవులు, తాము సమర్థించే ధనిక వర్గం కథలే రాస్తారు. ప్రజల కథలు రాయరు. ప్రజల కథలు రాయకపోయినా, గొప్ప వారి కథలే రాసినా, అది పూర్తిగా సమాజానికీ, వాస్త వానికీ, దూరం అవవు. రామాయణం కథలో రాజ్యం కోసం ఆశలూ, ఇతర జాతుల భూముల కోసం ఆశలూ, శతృవుల స్త్రీలని హింసించడాలూ ఎత్తుకుపోడాలూ, యుద్ధాలూ, భార్యల మీద శంకలూ – ఇవన్నీ సమా జంలో వున్న వాస్తవాలు కావా? రాముడు, కిష్కింధనీ లంకనీ ఆక్రమించడమే గాక, గంధర్వ దేశం – కారుపద దేశం వంటి దేశాల్ని కూడా, అక్కడి ప్రజల్ని చంపేసి, ఆక్రమించాడు. మహా పవిత్రమైన రామాయణం చెప్పేది కూడా ఇతర జాతుల్నీ, ప్రజల్నీ దోచడమే. ఇవి, సమాజానికి అతీతమైన విషయాలా? కావు. కొన్ని చోట్ల ఎంత చిన్న చిన్న వాస్తవాలు కనపడతాయో చూడండి. సీత కోసం ఏడుస్తోన్న రాముడికి, అంత అనురాగం లోనూ, అంత విరహంలోనూ, 'ఆకలి దప్పులు కలుగు తున్నాయ'నే సంగతి కవి విస్మరించలేకపోయాడు. సీత కోసం లంకంతా వెతుకుతోన్న హనుమంతుడికి 'కంటి చూపు బాగానే వుంది సుమా' అని కవి చెప్పకుండా ఉండలేకపోయాడు. మనం, భూమి ఆకర్షణ శక్తి నించి ఎలాగైతే దూరంగా పోలేమో, అలాగే కళలు, సమాజ ప్రభావం నుంచి దూరంగా పోలేవు.

మీరు చెప్పే దూరం, కథా వస్తువు విషయంలో కాదు, రచనా విధానం విషయంలో ఉంటుంది. కావ్యా లన్నీ కట్టుకథల రూపంలో ఉంటాయి. దాన్ని వాస్తవం లోకి మార్చుకోవాలి. కానీ, కథా వస్తువుని మాత్రం వాస్తవ దృష్టి తోనే ప్రశ్నించాలి.

**బాల రాముణ్ణి విశ్వామిత్రుడు తాటకిని చంపటానికి తీసుకు వెళ్ళాడు కదా? అంత చిన్నవాడు ఎలా యుద్ధం చేస్తాడని తీసుకువెళ్ళాడు?**

**జ:** ఇది మైతాలజీ పద్ధతిలో చెప్పిన కథ. ఇలాంటి

కథల్లో, ఇలాంటి మహిమలే ఉంటాయి. బంగారు లేడీ, పది తలల రావణుడూ, హనుమంతుడు సముద్రంమీద ఎగరడం – ఇలాంటి మహిమల్లాగే, బాల రాముడు తాటకిని చంపడం కూడా ఒక మహిమ. ఇంకో మత గ్రంథంలో కృష్ణుడు అయితే, పాలు తాగే వయసులోనే పూతననీ, ఇంకా కొందరు రాక్షసుల్నీ కూడా చంపుతాడు కదా? ఇది, రచనా విధానానికి సంబంధించిన విషయం. ఒక కల్పన గురించి, 'ఇలా జరుగుతుందా' అని ప్రశ్నించకూడదు. అందులో 'విషయం' ఏమిటో దాన్నే చూడాలి. విశ్వామిత్రుడు అనే రుషి, ఒక ఆటవిక జాతి స్త్రీని చంపించాడు – అనేదే అసలు విషయం. ఆ పని, బాలుడి ద్వారా జరిగినా, పెద్ద వాడి ద్వారా జరిగినా ఒకటే.

**రామాయణం ఆర్య, ద్రావిడ జాతుల మధ్య జరిగిన కథ– అనే విషయానికి మీరు తగినంత స్థానం ఇవ్వలేదు. ఎందుచేత?**

**జ:** రామాయణం రెండు శత్రు జాతులకో, రెండు శత్రు తెగలకో సంబంధించిన కథ – అనడంలో సందేహం లేదు. కానీ, రామాయణం అనగానే జాతుల యుద్ధం అనే అభిప్రాయం ఒక్కటే చాలదు. అందులో ఇంకా ఇతర విషయాలు కూడా ఉన్నాయి. ఇది వేరు వేరు జాతుల మధ్య యుద్ధాల కథే కాదు, ఒక్క జాతిలోనే ఆస్తుల కోసం కలహాలు ఉన్నాయి. రాముడి జాతిలోనే రాజ్యం కోసం కలహం ఉంది, భరతుడు కలహానికి దిగకపోయినా. వానర జాతిలో, వాలి సుగ్రీవుల మధ్యా; రాక్షస జాతిలో, రావణ విభీషణుల మధ్యా, ఆస్తి కలహాలు ఉన్నాయి. అన్ని జాతుల్లోనూ వర్గ భేదాలు ఉన్నాయి. అన్ని జాతుల్లోనూ స్త్రీల స్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇవన్నీ రామాయణంలో వున్న ముఖ్య విషయాలే. కాబట్టి, ఈ కథని చూసేటప్పుడు, జాతుల యుద్ధం అనే దానితో పాటు, ఈ అన్ని లక్షణాల మీదా దృష్టి పెట్టాలి.

**'విషవృక్షం'లో, అసలు రామాయణం కథ అంతా తిరగబడ్డది. తల్లకిందులుగా నించుని చదవాలా మీ పుస్తకం?**

**జ:** రామాయణం కథ తిరగబడి 'విషవృక్షం' అయిందంటే, అందులో నా పాత్రేమీ లేదు. ఆ కథ నిజ స్వభావం అదే. ఫలానా ఘట్టంలో ఫలానా విధంగా ఎందుకు రాయవలసి వచ్చింది – అని అడగండి. దానికి నేను జవాబు చెపుతాను. లేకపోతే ఆ దృష్టితో ఆలోచించండి. మీకే జవాబు దొరుకుతుంది.

**'రామాయణం, క్షత్రియులకూ, బ్రాహ్మణులకూ రేగిన కలహాలకు ప్రతిబింబం. జనక మహారాజు క్షత్రియుల పక్షాన నిలబడ్డ ప్రతినిధి. విశ్వామిత్రుడు క్షత్రియుడే గనక, రాముణ్ణి జనక మహారాజుకి అల్లుణ్ణి చేసి, అతని ద్వారా బ్రాహ్మణుల మీద తిరుగుబాటు నడపాలని చూశాడు: ఈ రకంగా నేను కొన్ని పుస్తకాలలో చదివాను. దీని మీద మీ అభిప్రాయం ఏమిటి?**

**జ:** వాల్మీకి రామాయణ కథా పరిధులు దాటకుండా చూస్తే– బ్రాహ్మణులకూ క్షత్రియులకూ కలహాలు సంభవించింది, విశ్వామిత్ర వశిష్ఠుల విషయంలోనూ, రామ పరశురాముల విషయంలోనూ మాత్రమే. విశ్వామిత్రుడు చివరికి బ్రాహ్మణుడై బ్రాహ్మణ్యాన్ని గౌరవించే స్థితికి మారాడు. అంటే, విశ్వామిత్రుడిలో క్షత్రియ స్వభావం మారింది. అలాగే, పరశురాముడు, రాముడితో రాజీపడి ఊరుకున్నాడు. జనక మహారాజుకి బ్రాహ్మణులతో వైరం ఉందనడానికి ఎటువంటి ఆధారమూ లేదు. కథలో, జనక మహారాజు తన కూతుళ్ళ పెళ్ళి సంబంధాలు కుదుర్చుకున్నప్పుడు, విశ్వామిత్రుడితో – "నా రాజ్యం, నా తమ్ముడి రాజ్యం, దశరథుడి రాజ్యం కూడా మీరే స్వీకరించండి!" అంటాడు. పురోహితుల పట్ల అంత వినయ విధేయతలు గల పాత్ర అది. విశ్వామిత్రుడు, రాముడితో బ్రాహ్మణుల మీద తిరుగుబాటు చేయించాలని ప్రయత్నించాడు – అనే అభిప్రాయానికి రావాలంటే, దానికి 'మూలం'లో కొంచెమైనా ఆధారం కనపడాలి. కానీ, కథలో అలాంటి ఆధారాలేమీ లేవు.

**'విప్లవ కవిత్వాల'లో చదువుతున్నది చాలలేదనా రామాయణంలోకి కూడా పేద వాళ్ళని దించారు?**

**జ:** రామాయణంలోకి పేద వాళ్ళని ఎవరో తెచ్చి దించలేదు. శ్రీరాముడి పక్కనే బిచ్చగాళ్ళూ ఉన్నారు. సీతాదేవి సరసనే వేశ్యలూ ఉన్నారు. రామాయణ పవిత్రత, వారినేమీ ఉద్ధరించ లేకపోయింది. దీన్ని అసలు కథలో మీరే చూసి, ఆ పేద వాళ్ళని రామాయణంలోకి ఎవరు తెచ్చారో మీరే చెప్పండి!

**రామాయణాన్ని ఆధ్యాత్మిక గ్రంథంగా చూడాలి!**

**జ:** చూసే దాన్నే, అందులో 'ఆధ్యాత్మికత' ఉంటే! 'ఆధ్యాత్మికత' అంటే ఏమిటో, అది ఎక్కడ వుందో, ఎక్కడా కనపడలేదు. కనపడ్డదంతా రాజ్యకాంక్షా, సిరి సంపదల కాంక్షా, అధికార కాంక్షా, స్త్రీల అవయవాల కాంక్షా, యుద్ధాల కాంక్షా! ఇన్ని కాంక్షల మధ్య ఆధ్యాత్మికతని చూసే శక్తి, పిచ్చి వాళ్ళకీ, మోసగాళ్ళకీ

మాత్రమే ఉంటుంది.

**వాల్మీకి వంటి కవులు ఒక సమాజానికి కలాల సైన్యంగా పని చేశారని మీ అభిప్రాయం. మీరు కూడా ఇంకో సమాజానికి అదే పని చేస్తున్నారని మా అభి ప్రాయం.**

**జ:** అవును, మీరు సరిగానే అర్థం చేసుకున్నారు. ఏ కాలంలో అయినా, ఏ సమాజంలో అయినా, ప్రతీ రచయితా కలం సైనికుడే. అయితే, ఆ సైనికుడు ఎవరి పక్షాన్న నిలబడ్డ సైనికుడు - అన్నదే ప్రశ్న. ధనిక - పేద వర్గ భేదాలు గల సమాజంలో, ధనిక వర్గం తరు పున ఉండడమూ, పేద వర్గం తరుపున ఉండడమూ - రెండూ ఒకటి కాదు. మొదటిది - అన్యాయం తరుపున నిలబడడం అయితే, రెండోది –న్యాయం తరపున నిల బడడం. వెనకటి కవులు ఇదంతా తెలిసి చేశారని కాదు. కానీ, తెలిసి చేసినా, తెలియక చేసినా, పాత కవులు ధనిక వర్గం కోసం నిలబడడమే చేశారు. అందుకే అది విమర్శలకు గురి అవుతుంది.

**మానవులకు తిండి ముఖ్యమే. కానీ, జీవితం అంతా తిండి సమస్యే అనుకోవటం విడ్డూరం. రామా యణం వంటి సుందరమైన కావ్యాన్ని నిత్యజీవిత సమస్యలతో ముడిపెట్టడం వింతయిన విషయం.**

**జ:** నాలుగు రోజుల వరకూ సరిపడే తిండంతా ఈ పూటే తినేసే వాళ్ళూ, నాలుగు తరాల వరకూ సరి పడే సిరి సంపదలు ఈ నాడే కూడబెట్టుకున్న వాళ్ళూ మాట్లాడే మాటలు ఇవి! 'తిండి ముఖ్యమా, కొంచెం ముఖ్యమే గానీ మరీ అంత ముఖ్యమా?' అనే మాటలు ఏ నిరుపేద నోటి నించైనా వస్తాయా? రిక్షా నడుపు కుంటూ పొట్ట కూటికి తడుముకోవలసిన పరిస్తితే వస్తే కృష్ణశాస్త్రి కూడా రిక్షా బేరాల కోసమే చూస్తాడు. ఇంతకీ, విషవృక్షంలో చెప్పిందంతా తిండి సమస్య ఒక్కటేనా?

**మీరు మార్క్సిజానికి కమిట్ అయినట్టు కనపడు తూంది. ఒక ఇజానికి కమిట్ అయిన రచయిత చెప్పేది సమగ్రంగా ఎలా ఉంటుంది? అది, ఏక పక్షంగా ఉండదా? అప్పుడది అసమగ్రం అవదా?**

**జ:** అది, మనం కమిట్ అయ్యే ఇజాన్ని బట్టి ఉంటుంది. ఆ ఇజం న్యాయమైనది అయితే, దాన్ని అనుసరించడం సమగ్రంగానే ఉంటుంది. అది అన్యాయ మైనది అయితేనే, అది అసమగ్రం అవుతుంది. మన ముందు ఒక కేసు ఉందనుకుందాం. అందులో, 'న్యాయమూ - అన్యాయమూ' అనే 2 పక్షాలు ఉంటాయి. రెండూ ఒక దానికి ఒకటి విరుద్ధం. కొందరు మనుషులు - 'న్యాయం' వేపూ, కొందరు మనుషులు - 'అన్యాయం' వేపూ ఉన్నారనుకుందాం. ఎటు చూసినా, ఆ మనుషులు, ఒక్క పక్షం వేపు ఉన్నట్టే అర్థం. న్యాయం వేపు ఉన్న వాళ్ళతో - "మీరు ఒక్క వేపునే వుండి మాట్లాడుతున్నారు. అలా ఉంటే, అది సమగ్రంగా ఎలా ఉంటుంది? రెండు వేపులా వుండాలి కదా?" అంటారా? అలా అంటే దాని అర్థం ఏమిటంటే - ఆ మనుషుల్ని 'న్యాయం' వేపునా, 'అన్యాయం' వేపునా కూడా ఉండా లని చెపుతున్నారన్నమాట! ఆ మనుషులు రెండు వేపులా ఉండడం జరుగుతుందా? అలాగే, 'అన్యాయం' వేపున ఉన్న వాళ్ళతో కూడా - "మీరు ఒక్క వేపునే ఉన్నారు. అది సమగ్రం కాదు. రెండు వేపులా ఉండాలి కదా?" అంటే, అది కూడా ఎలా ఉంటుంది? వీళ్ళతో కూడా "మీరు అన్యాయం వేపునే కాదు, న్యాయం వేపున కూడా ఉండండి" అని చెపుతున్నారన్న మాట!

ఒక కేసులో, ఒక మనిషి, ఎటో ఒక్క వేపునే ఉండగలడు. ఉంటే 'న్యాయం' వేపున గానీ, 'అన్యాయం' వేపున గానీ. రెండు వేపులా ఉండాలని ప్రయత్నించినా, అది సాధ్యం కాదు. ఇక్కడ, (ఒక కేసులో)

'న్యాయం - అన్యాయం' అనేవి స్పష్టంగా కనపడ తాయి కాబట్టి, ఒక మనిషి రెండు వేపులా ఉండాలని ఎవరూ అనరు. అది ఎంత అర్థం లేని సంగతో, ఎవరి కైనా తేలిగ్గానే అర్థమవుతుంది.

అలాగే - 'భక్తి'నీ, 'నాస్తికత్వా'న్నీ తీసుకోండి! ఒక మనిషి, ఏదో ఒక్క రకంగానే ఉంటాడు. రెండు రకాలు గానూ ఉండలేడు. అలా ఉండాలన్నా సాధ్యం కాదు. ఇది కూడా తేలిగ్గానే అర్థమవుతుంది.

కానీ, మీరు మాట్లాడే 'ఇజాల' సంగతి అంత తేలిగ్గా అర్థం కాదు. తేలిగ్గా అర్థం కాకపోయినా, ఇది కూడా 'న్యాయాన్యాయాల' కేసు లాంటిదే.

మార్క్సిజం అనేది - శ్రమచేసే పక్షం వేపు (ఒక్క పక్షం వేపే) నిలబడే సిద్ధాంతమే. కానీ, అది అలా ఎందుకు చేస్తుందంటే, ఆ పక్షానికి ఘోరమైన అన్యాయం జరుగుతోందని అది గ్రహించింది కాబట్టి. మార్క్సిజం అనేది ఏ సత్యాల్ని కనిపెట్టిందో తెలిస్తే, ఆ సత్యం వేపునే నిలబడడం ఎంత న్యాయమో, అది ఎంత సమగ్రమో కూడా తెలుస్తుంది.

ఈ దేశం, ఆ దేశం అని లేకుండా మానవ సమా జంలో ప్రతీ చోటా, వేల సంవత్సరాల నించీ, ఒక వర్గం, శ్రమ చెయ్యకుండా, ఇంకో వర్గపు శ్రమని దోచుకుంటూ జీవిస్తోంది! ప్రతీ చోటా జనాభా అంతా శత్రు వర్గాలుగా విడిపోయి ఉంది.

శ్రమచెయ్యని వర్గం, ప్రకృతి సహజంగా వున్న భూమినంతా తన స్వంత ఆస్తిగా ఆక్రమించి వుంది. కానీ ఆ భూమిమీద శ్రమచేసేది మాత్రం శ్రామిక వర్గమే. పెట్టుబడులన్నీ కూడా శ్రామిక వర్గం చేసిన శ్రమలతో ఏర్పడ్డవే. పెట్టుబడులతో శ్రమలు చేసేదంతా శ్రామిక వర్గమే. శ్రమ చెయ్యని వర్గానికి ఆదాయాలుగా వుండే భూమి కౌళ్ళూ, వడ్డీ లాభాలూ, ఆ వర్గపు స్వంత శ్రమలు కావు. అవన్నీ 'శ్రమ చేసే వర్గం నించి దుర్మార్గంగా దోచుకునేవే.

ఈ శ్రమ దోపిడీ ఏ నాడో బానిస సమాజంలోనే ప్రారంభమై, భూస్వామ్య సమాజాల మీదుగా, ఈ నాడు పెట్టుబడిదారీ సమాజంలో కూడా ఇంకా సాగుతూనే ఉంది. ఇది వేల సంవత్సరాల నించీ సాగుతోన్నా, ఈ రహస్యం మార్క్సు గ్రహించే దాకా సమాజానికి అంద లేదు. కలిమి లేముల రహస్యాన్ని గ్రహించగలిగిన మార్క్సు, ఆ సిద్ధాంతాన్ని తన 'కాపిటల్' గ్రంథం ద్వారా ప్రపంచం ముందు పెట్టాడు.

శ్రమ దోపిడీకి పరిష్కారం – దోపిడీ వర్గం కూడా శ్రమ చెయ్యడమే. దాని స్వంత శ్రమతోటే అది జీవించాలి. కానీ, అందుకు ఆ వర్గం అంగీకరిస్తుందా? ఏ శ్రమా చెయ్యకుండా, శ్రమ చేసే మనుషుల మీద 'యజమానులు'గా ఉండడానికీ, ఇతరుల శ్రమల ద్వారా సిరి సంపదలు సంపాదించడానికీ మరిగిన వర్గం, తనకై తను శ్రమ చెయ్యడం ప్రారంభిస్తుందా? దాని ఇష్టంతో ఆ పని జరగదు. ఆ మార్పు శ్రామిక వర్గం చేసే పోరాటాల ద్వారానే జరగాలి. ఆ పోరాటాలు, బానిస సమాజంలోనే ప్రారంభమై ఇంకా సాగుతూనే ఉన్నాయి. వర్గ భేదాలు పోయే వరకూ కూడా అవి సాగవలసి వుంది.

శ్రామిక వర్గం, తన పోరాటాల ద్వారా దోపిడీ నించి బయట పడడం అంటే, అది శ్రామిక వర్గానికి విముక్తి. అంతే కాదు, అది దోపిడీ వర్గానికి కూడా విముక్తే. ఎలాగంటే: ఒక మనిషి లేదా (ఒక వర్గం) తన కోసం తనే శ్రమ చేస్తే, ఆ వ్యక్తి ఇతరుల శ్రమని దోచుకునే నీచత్వంతో బతికే పరిస్తితి వుండదు. కాబట్టి, శ్రామిక వర్గం విముక్తిచెందడం అంటే, ఇంకో వర్గపు శ్రమని దోచుకుంటూ బతుకుతోన్న యజమాని వర్గం కూడా తన తర తరాల నీచ జీవితం నించి బయటపడడమే! దీని కోసం జరగవలసింది శ్రమ చెయ్యకుండా వున్న వర్గం శ్రమ చెయ్యడమే. ఆ మార్పు వల్ల, మానవ సమాజం – యజమాని తనాలూ సేవకత్వాలూ లేని, కలిములూ లేములూ లేని, కలహాలూ పోరాటాలూ లేని, యుద్ధాలూ చంపుళ్ళూ లేని, ఏ కోణంలోనూ శత్రు వైరుధ్యాలు లేని – ఉన్నత స్థాయికి చేరుతుంది. అంటే, మానవ సమాజపు రుగ్మతలన్నిటినీ ప్రక్షాళనం చేసుకో గలిగేది, శ్రమ దోపిడీని తీసివెయ్యగలిగే మార్గంలోనే. ఆ మార్గమే అన్యాయానికి గురి అయ్యే జనాభాకి న్యాయాన్ని ఇస్తుంది. అన్యాయం చేసే వర్గపు నీచత్వాన్ని తీసి వేస్తుంది. అందుకే అలాంటి మార్గానికి బద్ధులమై వుండాలి.

'ఒకే ఇజానికి కమిటైతే అది సమగ్రంగా ఉంటుందా?' అన్నారు మీరు. ఆ ఇజం, న్యాయాన్ని చెపుతోంది కాబట్టే, ఆ న్యాయం వేపు కమిటై వుంటే, ఆ అవగాహనే సమగ్రంగా ఉంటుంది. అది అన్యాయాన్ని చెప్పే సిద్ధాంతం అయితే, అప్పుడు మీ విమర్శ సరి పోతుంది.

ఒక వ్యక్తి, భక్తుడి గానూ నాస్తికుడిగానూ కూడా ఉండడం సాధ్యం కానట్టే, ఒక వ్యక్తి శ్రమ దోపిడీకి అను కూలంగానూ వ్యతిరేకంగానూ కూడా ఉండడం సాధ్యం కాదు. కాబట్టి, ఏ వ్యక్తి అయినా ఏదో ఒకే పక్షాన ఉండ వలసిందే. అంటే భూమి కౌళ్ళనీ, వడ్డీ లాభాల్నీ సంపా దించే దోపిడీ ఆస్తి హక్కుల పక్షాన గానీ; ఆ దోపిడీ హక్కుల్ని తీసి వెయ్యాలనీ, ప్రతీ వ్యక్తీ శ్రమ చెయ్యాలనీ చెప్పే న్యాయం పక్షాన గానీ.

ఏ నాటినించో సమాజంలో ప్రతీ వ్యక్తీ ఇదే చేస్తు న్నారు. ఏదో ఒక్క వేపే ఉంటున్నారు. మనుషులు, ఇతర మనుషుల మీద యజమానులుగా ఉండవచ్చనీ, వడ్డీ లాభాలు సంపాదించవచ్చనీ చెప్పే వాళ్ళందరూ, ఆ మార్గంలో జీవించే వాళ్ళందరూ, తమకు తెలిసో తెలీకో దోపిడీ పక్షానే ఉంటున్నారు. 'నేను సమగ్రంగా ఆలో చిస్తాను; ఒకే పక్షాన ఉండను' అని నమ్మే వాళ్ళందరూ, నిజంగా ఉండేది ఒక్క పక్షాన్నే. దోపిడీ పక్షాన్నే.

అన్ని ఇజాలూ, అన్ని సిద్ధాంతాలూ, ఒకటి కాదు. అన్నిటి స్వభావాలూ, లక్ష్యాలూ ఒకటి కావు. మార్క్సిజం అనేది, శ్రామిక వర్గం పక్షాన నిలబడే ఏక పక్ష సిద్ధాం తమే. కానీ, ఆ సిద్ధాంతం, సమాజంలో శ్రమ దోపిడి జరుగుతోందనీ, దాన్ని తీసివెయ్యాలనీ చెపుతోంది కాబట్టి, అది న్యాయానికి అనుకూలం, అన్యాయానికి వ్యతిరేకం. అందుకే దాన్నే అనుసరించాలి. దాన్ని అనుస రించని వాళ్ళు, 'ఏక పక్షానికి కమిటై ఉండకూడదు' అనే పేరుతో, దోపిడీ చేసే ఏక పక్షానికే కమిటై ఉంటు న్నారని అర్థం. కార్మికులు అయినా, శ్రమ దోపిడీ గురించి తెలుసుకోకపోతే, వాళ్ళకి వాళ్ళే ద్రోహం చేసు కుంటున్నారని అర్థం.

**ఈ నాడు వాల్మీకిని విమర్శించి లాభం ఏమిటి?**

**జ:** వాల్మీకి జీవించి ఉన్నాడా, లేడా – అన్నది కాదు ప్రశ్న. వాల్మీకి, ఒక వ్యక్తి కాడు. ఒక వర్గ ప్రతినిధి. వాల్మీకిని విమర్శించడం అంటే వాల్మీకి చేసిన పనిని విమర్శించడం. వాల్మీకి చెప్పే సమాజ ధర్మాల్ని విమర్శించడం. ఈ నాడు కూడా అవే భావాలు కలిగిన వాళ్ళని విమర్శించడం. వెనకటి వాళ్ళు చెప్పిన భావాలు, వాళ్ళ తోటే పోవు. వాటిని సమర్థించే వాళ్ళే, దానికి బాధ్యత వహించవలసి ఉంటుంది.

**మీరు చెప్పాలనుకున్న విషయాలు ఇంకా మృదువుగా చెప్పవచ్చును. కొందర్ని గాయపరిచే విధంగా రాయడంవల్ల ఏం సాధించగలరు?**

**జ:** రామాయణంలో విషయాలన్నీ చాలా మృదువుగానే ఉన్నాయా? "స్త్రీలు నీచులు .... అల్పులు .... చపల చిత్తులు .... ఎప్పుడూ కలహాలకే చూస్తారు. స్నేహాల్ని విడదియ్యడానికే చూస్తారు. స్త్రీలను ఎప్పుడూ శంకిస్తూ ఉండాలి" అనే మాటలు ఎంతో మృదువేనా? అవి ఎవరినీ గాయపరచవా? "శూద్రుడికి మంత్రం నిషిద్ధం. శూద్రుడికి విద్య నిషిద్ధం. శూద్రుడు, పై వర్ణాల వారికి సేవలు చేసుకుంటూ, వినయ విధేయతలతో బతకాలి" అనే మాటలు కూడా చెప్పలేనంత మృదువు కదూ? ఇవి కూడా ఎవర్నీ గాయపరచవు కదూ? మృదుత్వం అనేది, సంస్కృత భాష లోనూ, ఛందోబద్ధ మయిన కవిత్వంలోనూ, ఉంటుందనుకుంటున్నారా? వేల కొద్దీ సంవత్సరాల నుంచీ మత గ్రంధాలు ప్రజలకు చేస్తోన్న గాయాలేవీ కనపడ లేదా మీకు? దీన్ని బట్టే తెలుస్తోంది, మీ మృదుత్వం ఏ కోవకు చెందిందో! మృదుత్వాలూ, కాఠిన్యాలూ – భాషకో, కవిత్వానికో సంబంధించి ఉండవు; న్యాయాన్యాయాలకు సంబంధించి ఉంటాయి. శ్రమ దోపిడీని వ్యతిరేకించే శ్రామిక వర్గ పక్షపాత న్యాయమే మృదుత్వం. దానికి విరుద్ధమైన దంతా – కాఠిన్యం. మృదుత్వం కోసం ఆ రకంగా వెతకండి!

**'రామాయణం'లో ఎక్కువ భాగం కట్టు కథలే. వాటిని ఆధారం చేసుకుని సంస్కృతిని చూడగలమా?**

**జ:** రచనా విధానం కట్టుకథల పద్ధతిలో ఉన్నా, అందులో కూడా సాంఘిక విషయాలు ఉంటాయి. ఆ విషయాల్ని ఆధారం చేసుకునే ఆ సంస్కృతిని చూస్తాం. బంగారు లేడి – కట్టుకథే. కానీ, శతృవులు స్త్రీలని ఎత్తుకు పోవడాలు కట్టుకథ కాదు. లంకా దహనం – కట్టు కథే. కానీ, శతృవుల ప్రాంతాల్ని ధ్వంసం చెయ్యడం, కట్టుకథ కాదు. అగ్ని పరీక్ష కట్టు కథే. కానీ, భర్తలు, భార్యల్ని శంకించడాలూ, తిరస్కరించడాలూ కట్టు కథలు కావు. సమాజంలో నిజాలు – కట్టు కథల్లో కూడా కనపడతాయి. కాబట్టి, కట్టు కథల్లో కూడా సమాజాన్నీ దాని సంస్కృతినీ చూడగలం.

**పావురాల జంటలో మొగ పిట్టని కిరాతకుడు కొట్టగా వాల్మీకి హృదయం శోకభారంతో బరువై ఆ మహాముని నోటి వెంట అప్రయత్నంగా కవిత్వం వచ్చిందంటారు. వాల్మీకి అంత చలించి రాయడం వల్లనే రామాయణం అంత కరుణాత్మకంగా వచ్చింది.**

**జ:** రాముడు అడవుల్లో అన్నేళ్ళు ఉండి అన్ని పిట్టల్ని కొట్టాడే! ఆడ పిట్టనో మొగ పిట్టనో, ఆడ జంతువునో మొగ జంతువునో కొట్టకుండా, ఏ జంటనీ విడదియ్యకుండా, ఏం తిన్నాడు? రాముడు పక్షుల్నీ, జంతువుల్నీ భయపెట్టే భీకరాకారుడని వాల్మీకే పొంగుతూ రాశాడే! రాముడు పిట్టల్ని కొట్టినప్పుడు, వాల్మీకికే కాదు, ఏ ఋషికీ శోకం పొంగలేదేం? ఒక ఆటవిక వేటగాడు, కేవలం జీవనోపాధికి పిట్టల్ని చంపడంలో అంత కిరాతకత్వమే ఉంటే, రాముడు ఆహారానికి అవసరం లేనన్ని జంతువుల్ని వేటాడడం మాటేమిటి? అలా ఎందుకు ఆలోచించలేదు మీరు?

**రామాయణం మీదే కాదు, ఎంతో ప్రాచీనమైన, పవిత్రమైన వేద సంస్కృతి మీద కూడా వ్యతిరేకత కనపడింది మీ పుస్తకంలో.**

**జ:** 'విషవృక్షం'లో వేద సంస్కృతి ప్రసక్తి ఏమైనా వస్తే, అది రామాయణంలో దొరికిన ఆధారాల వల్ల తీసుకున్నదే. అంతకన్నా వేదాల గురించి నాకు తెలీదు. రామాయణ కథ మీదా, ఆ పాత్రల మీదా నా విమర్శలు వేదాల్లో విషయాలకు కూడా సరిపోయేటట్టయితే, ఆ రెండు గ్రంధాల్లో బోధనలూ ఒకే రకంగా ఉన్నాయని అనుకోవాలి. రెండూ ఒకే రకం అయితే రెంటినీ వ్యతిరేకించవలసిందే.

శ్రమ దోపిడీ ప్రారంభమై, అది కొందరు మానవుల్ని బానిసలుగా మార్చిన తర్వాత, దాన్ని సమర్థించే ఏ గ్రంధమూ ఏ సంస్కృతీ పవిత్రమైనవి కావు. వాటిని గౌరవించనక్కరలేదు. 'ప్రాచీనమైన దాన్ని' ఏ దృష్టితో నిలబెట్టుకోవాలంటే, 'ఒకప్పుడు సాహిత్యం ఇలా ఉండేది' అని తెలుసుకోవడానికే దాన్ని జాగ్రత్త చేసుకోవాలి. అంతే గానీ, 'ప్రాచీనమైనదంతా పవిత్రమైనది' అనే దృష్టితో కాదు.

**రావణుణ్ణి కథా నాయకుణ్ణి చేసి, రాముణ్ణి అతని శత్రువుని చేసి, రావణుడి జాతి వారు రాసుకున్న గ్రంథం ఏదయినా ఉందా?**

**జ:** నాకు తెలీదు. గోండులు అనే జాతివారు, రావణుణ్ణి పూజిస్తారని ఒక పాఠకుడు రాశారు. అంతకన్నా నాకు తెలీదు.

**'రామాయణం'లో ఉండే పాతివ్రత్యం ఈ నాడు ఎక్కడా లేదు. 'ఆ సంస్కృతీ, ఈ సంస్కృతీ ఒకటే' అని వాదించడం ఆశ్చర్యంగా ఉంది!**

**జ:** పాతివ్రత్యం అంటే అంతఃపురాల్లోనే ఉండడం కాదు. అగ్నిగుండాల్లోకే ఉరకడం కాదు. రాముడికీ, సీతకీ మధ్యవున్న 'సాంఘిక సంబంధం' ఎలాంటిదో, ఈ నాటి భార్యాభర్తల మధ్య సంబంధం కూడా అలాంటిదే. రామాయణ సంస్కృతిలో సమాజం స్త్రీని 'ఫలానా పురుషుడి భార్య'గా భర్త ద్వారానే గుర్తిస్తుంది. ఈ నాడూ అంతే! రామాయణ సంస్కృతిలో స్త్రీకి ఏ రకమైన స్వతంత్రతా లేదు. ఈ నాడూ అంతే! ఈ నాడు పెట్టుబడిదారీ సమాజ ప్రభావం వల్ల, స్త్రీలు చదువుకోవడం, ఉద్యోగాలు చెయ్యడం లాంటి మార్పులు కొన్ని జరుగుతోన్నా, అవి నూటికి ఎంత మంది విషయంలో? – ఆ చదువులున్న స్త్రీలలో కూడా మార్పు ఎంత వరకూ? కొంచెం డబ్బు సంపాదించడమే గానీ, ఆ డబ్బుని వాడడంలో కూడా నిజమైన స్వతంత్రత ఉండదు. (ఈ సమాజంలో, శ్రామిక పురుషుడికి కూడా యజమానితో ఉన్న సంబంధంలో స్వతంత్రత ఉండదు. అతనూ, యజమాని దగ్గిర బానిసే. కానీ, అతని స్త్రీ, ఆ బానిసకి కూడా బానిస!)

స్త్రీలలో వేశ్యరికం, ఆ నాడూ ఉంది, ఈ నాడూ ఉంది. పర పురుషుడు తాకిన సీతని రాముడు శంకించినట్టు, అదే సంఘటన ఈ నాడు జరిగితే, ఆ స్త్రీకి భర్త వల్ల ఈ నాడూ అదే అవమానం జరుగుతుంది. రాముడు వదిలేసిన సీత అడవుల పాలైపోయినట్టు, అలాంటి పరిస్తితి వస్తే, ఈ నాటి స్త్రీ కూడా కష్టాలపాలై పోతుంది. పోషణకీ, రక్షణకీ, పురుషుల మీద ఆధారపడకుండా జీవించగలిగే పరిస్తితి స్త్రీలకు ఈ నాడూ లేదు. అందుకే ఆ సంస్కృతీ ఈ సంస్కృతీ ఒకటే అనడం.

**మా అమ్మగారు సాధారణంగా పుస్తకాలన్నీ చదువుతారు. మీ పుస్తకాలన్నీ ఆవిడకు ఇష్టమే. 'విషవృక్షం' విషయంలో మాత్రం ఆవిడ చాలా వ్యతిరేకంగా మాట్లాడతారు. 'మన దేశంలో స్త్రీలకు ఉన్న స్తానం ఎక్కడా లేదు' అంటారు. ఆవిడకు సీతకన్నా రాముడే ఎక్కువ ఇష్టం.**

**జ:** 'మన దేశంలో స్త్రీలకు ఉన్న స్తానం ఎక్కడా లేదు' అనడం దేశాభిమానం అవదు. దేశ దురభిమానం అవుతుంది. 'మా దేశమే గొప్ప' అని గర్వించడం అవుతుంది.

'ఈ సమాజం స్త్రీలను ఎంతో గౌరవిస్తోంది' అని స్త్రీలే నమ్మడం అంటే, ఈ సమాజం, స్త్రీలని, అంత మభ్యపెట్ట గలుగుతోందని అర్థం. తర తరాల నించీ, ప్రాచీన సంస్కృతి పేరుతో, కలాల సైన్యం, స్త్రీలని ఎంత చైతన్య రహితుల్ని చేసిందో గ్రహించడానికి ఇంతకన్నా ఏం నిదర్శనం కావాలి? పెద్ద వయసు స్త్రీల విషయం లోనూ, చదువుకోని స్త్రీ – పురుషుల విషయం లోనూ, వారేం మాట్లాడినా కొంత సానుభూతి చూపించవచ్చు. అన్నీ తెలిసి, 'మా సంస్కృతి ఇంత పవిత్రం, అంత పవిత్రం' అని విర్రవీగే వాళ్ళుంటారే, అటువంటి వాళ్ళ మాటలకైతే, ఏ విలువా ఇవ్వనక్కరలేదు.

**మీరు సంస్కృతం చదివారా? అనువాదాల మీద ఆధారపడి విమర్శలు చెయ్యడం సద్విమర్శకుల లక్షణం కాదు. భాగవతాన్ని అర్థం చేసుకోవడానికి భక్తి చాలు. భారతాన్ని అర్థం చేసుకోవటానికి భక్తితో పాటు యుక్తి కూడా కావాలి. కాని, రామాయణాన్ని అర్థం చేసుకోవాలంటే, భక్తి యుక్తులతో పాటు శక్తి కూడా కావాలి. అపారమయిన సంస్కృత పరిజ్ఞానం లేనిదే అది ఎవ్వరి తరమూ కాదు.**

**జ:** నేను సంస్కృతం చదవలేదు. అనువాదాల మీదే ఆధారపడ్డాను. మూడు రకాల అనువాదాల మీద. ఈ కథలో, ఎంత పెద్ద విషయమైనా, ఎంత చిన్న విషయమైనా, స్పష్టంగా అర్థం చేసుకోకుండా నేను రాయలేదు. ఎక్కడికక్కడ ఫుట్ నోట్లు ఇచ్చాను. వాల్మీకి చేసిన వర్ణనలేవీ నేను పాడు చెయ్యలేదు. (విషవృక్షంలో ఉన్న వర్ణనలన్నీ రామాయణంలోవే కావు.) ఇక్కడ నే నడిగే దేమిటంటే – 'రాజ్యం భరతుడికే వెళ్ళాలి కదా, ఆ సంగతి రాముడికి తెలుసు కదా, పట్టాభిషేకానికి ఎలా సిద్ధపడ్డాడు?' అని అడగడానికి సంస్కృతం నాకే తెలిసి ఉండాలా? అనువాదాలు చాలవా? 'వాలిని చంపడంలో రాముడు నీచంగా ప్రవర్తించ లేదా?' అని అడగడానికి, సంస్కృతం గొప్పగా తెలిసి ఉండాలా? అది తెలియక పోతే ఆ ప్రశ్న అడగలేమా? రామాయణానికి అనుకూలంగా మాట్లాడే వారందరూ, గొప్ప సంస్కృత పాండిత్యంతో, ఆ కథని స్వయంగా సంస్కృతంలో చదివి మాట్లాడుతున్న వారేనా? రామాయణాన్ని ఎంతో శ్రమకోర్చి అనువాదాలు చేసిన పండితులందరూ భక్తీ, యుక్తీ, శక్తీ ఉన్నవారే కదా? సంస్కృతం రాని భక్తులు కూడా

ఆ అనువాదాలనే చదువుతున్నారు కదా? అనువాదాల వల్ల, అసలు కథని తెలుసుకోలేకపోతే, మరి ఆ అనువాదాలు ఎందుకు? 'ఈ అనువాదాలేవీ పనికి రావు, వాటిని చదివితే ఏమీ తెలీదు' అని చెప్పండి అయితే. రామాయణాన్నే కాదు, ఏ సంస్కృత గ్రంథాన్ని అర్థం చేసుకోవాలన్నా, సంస్కృత పరిజ్ఞానం అక్కరలేదండీ, అనువాదాలు చాలు. వాటి ఉపయోగం అదే! ఒక పాఠకురాలు రామాయణాన్ని సంస్కృతంలోనే చదివిందనుకుందాం. అప్పుడు కూడా, "రాముడు పట్టాభిషేకానికి ఎందుకు సిద్ధపడ్డాడు? అడవిలో, తండ్రిని ఎందుకు తిట్టాడు? పట్టాభిషేకం భరతుడికే జరగవలసి ఉండగా, సింహాసనం మీద పెట్టడానికి తన పాదుకలు ఎందుకు ఇచ్చాడు? వాలిని ఎందుకు చంపాడు? రుషి జీవితంలో యుద్ధాలు ఎందుకు చేశాడు? శూర్పణఖని ఎందుకు బాధించాడు? తన కోసం రాజ్యాన్ని త్యాగం చేసిన భరతుణ్ణి ఎందుకు శంకించాడు? – ఇలా కొన్ని ప్రశ్నలు అడిగిందనుకుందాం. అప్పుడు 'నీకు సంస్కృతం రాదు' అనలేరు కదా? జవాబులు చెప్పవలసిందే కదా? ఆ జవాబులు ఎలా చెపుతారో, అలాగే విషవృక్షంలో ప్రశ్నలకు కూడా జవాబులు చెప్పాలి. 'నీకు సంస్కృతం రాదు, రామాయణం నీకేం అర్థమవుతుంది?' అని దబాయించడం కాదు.

**భారత దేశంలోనే గాక అనేక దేశాలలో చిలవలు పలవలుగా అల్లుకుపోయిన ఒక గాథ మీద విమర్శలు చేస్తే మీకు కూడా అంతపేరు వస్తుందని మీ అభిప్రాయం అనుకుంటాను.**

**జ:** అవునండీ, సరిగ్గా నా అభిప్రాయం అదే. మీరు చక్కగా అర్థం చేసుకున్నారు. కానీ, ఒక సంగతి చెప్పండి! 'అనేక దేశాల్లో అల్లుకుపోయిన గాథ' అంటే, దానిమీద ఆ జనాలకు చాలా విశ్వాసం ఉందని అర్థం కదా? అంత విశ్వసించే గాథ మీద విమర్శలు చేస్తే, అలా చేసిన వాళ్ళకి, ఆ జనాలలో పేరు వస్తుందా, పేరు పోతుందా? పేరు వస్తే, ఆ విమర్శల్ని ఆ జనాలు ఇష్టపడితేనే అది జరుగుతుంది. జనాలు వ్యతిరేకిస్తే ఆ విమర్శలు చేసిన వాళ్ళకి, పేరు ఎక్కడ నించి వస్తుంది? నే నీ పని చేసింది, పేరు వస్తుందనీ పోతుందనీ కాదు. జనాలకు కొన్ని విషయాలు చెప్పాలనిపించే ఈ పని చేశాను. అది వాళ్ళకి వెంటనే నచ్చకపోయినా, క్రమంగా అయినా ఆలోచిస్తారనే నమ్మకంతో చేశాను.

**విషవృక్షాన్ని తూచి అమ్ముతారో, ఏ లెక్కన అమ్ముతారో చూడాలి.**

**జ:** పుస్తకాల అమ్మకమే పుస్తకం విలువని నిర్ణయిస్తుందనుకోవడం చాలా పొరపాటు. పుస్తకం ఎంత ఎక్కువగా అమ్మితే అంత విలువైంది అవదు.

**శ్రీరామచంద్రుడు తానీషా నవాబుకు డబ్బు చెల్లించి రామదాసుని విడిపించెనంటారు. అంత మహత్యం కనపడు అవకాశములున్నవా?**

**జ:** మీ ప్రశ్నకి జవాబు చాలా చిన్నదే. ఆ కట్టు కథలన్నీ నమ్మకండి – అంటే చాలు. కానీ, ఈ ఒక్క మాటతో సందేహం వదిలించుకోగలగడం కష్టం. ఆ కథ ప్రకారం, రాముడు తానీషాకి డబ్బు ఎప్పుడు చెల్లించాడో తెలుసా? రామదాసుని బందిఖానాలో పెట్టిన తర్వాత 12 సంవత్సరాలకి! అప్పటికి రామదాసు చేసుకున్న పాపం తీరిందట! ఇక అప్పుడు దేవుడు రక్షించేదేమిటి? ఆయన శిక్ష ఎలాగూ పూర్తయిపోతుంది. రామదాసు వంటి మహా భక్తుణ్ణి చెరలో పెడితే, రాముడు రక్షించలేదేమనే ప్రశ్న భక్తులకైనా వస్తుంది కదా? అందుకని రాముడి పరువు కాపాడడానికి కవులు ఇలాంటి కథలు సృష్టిస్తూ వుంటారు. కథ ప్రకారం, రామదాసు కొంత కాలం చెరలో ఉన్నాడనే సంగతి అందరికీ తెలిసిందే. కాబట్టి, రాముడు వెంటనే విడిపించాడనటం కుదరదు. రామదాసు కొంతకాలం కర్మ ఫలం అనుభవిస్తాడు. అప్పటికి శ్రీరాముడికి దయ వస్తుంది. ఆయన ఒక చేత్తో విల్లూ, ఒక చేత్తో డబ్బు మూటా పట్టుకుని తానీషా దగ్గిరికి వస్తాడు. తానీషాకి డబ్బిచ్చి అతను రామదాసుని వదులుతాడో లేదోనని జాగ్రత్త కోసం రశీదు తీసుకుంటాడు! అదండీ సంగతీ! ప్రకృతి ఇచ్చిన మెదడు జ్ఞానంతో, సమాజం ఇచ్చిన అనుభవ జ్ఞానంతో, ఇక మీరే ఆలోచించుకోండి!

**'విషవృక్షం' కొందరి స్త్రీలకు కూడా నచ్చలేదు. దానికేం చెపుతారు?**

**జ:** ఏం చెపుతాం? విషవృక్షం కొందరు స్త్రీలకు నచ్చకపోతే మీ కంత సంబరం ఎందుకూ? అది చాలా మంది పురుషులకు కూడా నచ్చింది. దానికి మీరేం చెపుతారు?

**రాముడి పాత్రలో ఏమైనా లోపాలు ఉంటే అలా రాసినందుకు కవి బాధ్యుడు. అది రాముడి పొరపాటు ఎలా అవుతుంది?**

**జ:** కవే తప్పుల రాముణ్ణి చూపిస్తే, కవితో సంబంధం లేని ఒప్పుల రాముడు మీకు ఎక్కణ్ణించి

వచ్చాడు? వాల్మీకి కంటే పూర్వం ప్రచారంలో వున్న రామాయణ కథ మీకు తెలుసా? మీరు ఆ గొప్ప రాముణ్ణి ఎవరి రచన ఆధారంతో తెలుసుకున్నారు? ఆ కథలో, ఆ రాముడు, పట్టాభిషేకానికి సిద్ధపడలేదా? తాటకిని చంపలేదా? శూర్పణఖని బాధించలేదా? వాలిని చంపలేదా? భార్యని అగ్ని పరీక్షకి గురి చెయ్య లేదా? చివరికి భార్యని అడవుల్లో విడిచి పెట్టలేదా? మీకు తెలిసిన రాముడి కథలో ఈ ఘట్టాలేవీ లేవా? మరి ఆ కథలో ఈ ఘట్టాలేవీ లేకపోతే ఆ రాముడు ఏం చేశాడు? ఏ రాముణ్ణి తీసుకున్నా కథ ఇదే. రాముడిలో తప్పులకు కవి బాధ్యుడైతే, రాముడిలో ఉత్తమత్వానికి కూడా కవే బాధ్యుడు. మంచితనం అంతా రాముడి స్వంతమూనూ, చెడ్డతనం మాత్రం కవి పొరపాటునా? రాముణ్ణి కవి ఏ క్షణంలోనూ చెడ్డవాణ్ణి చెయ్యాలని అను కోలేదు. సమాజ లక్షణాలన్నీ రాముడిలో చూపించాడు కవి. అవి గొప్ప ధర్మాలు – అనుకునే చూపించాడు. కపటం, మర్మం, అహంకారం, కౄరత్వం, అధికార దాహం, ఇవన్నీ రాజుల సమాజానికి గొప్ప ధర్మాలే. వాటి వ్యవహారం ఈ నాడు కొంతైనా తేట తెల్లం అవుతోంది కాబట్టి, తప్పులన్నీ ఎవరి మీదకి గెంటాలో రామదాసులకు తోచడం లేదు. రాముడి పాత్రలో, సమాజం నేర్పిన లక్షణాలే కాదు, అతని వ్యక్తిగత దోషాలూ వున్నాయి. అదే సమాజంలో వున్న భరతుడికి రాజ్య కాంక్ష లేదు. కథ ప్రకారం, రాముడిలో ఏ కోశానా లేని ఉత్తమత్వం భరతుడిలో వుంది. దానితోపాటు బోలెడు లోపాలూ వున్నాయనుకోండీ. అవన్నీ అన్ని పాత్ర ల్లోనూ ఉన్నాయి. ఈ పాత్రల్ని అలా చిత్రించిన కవిలో, (లేదా కవుల్లో) సమాజ ప్రభావాలూ వున్నాయి; వ్యక్తిగత దోషాలూ వున్నాయి.

సమాజ ప్రభావం తోటే రాముడి పాత్రని చిత్రించిన వాల్మీకి దోషి కాదు. ఆ సమాజ ధర్మాల్ని ఇంకా నెత్తి కెక్కించుకుని ఊరేగుతోన్న ఈ నాటి రామదాసులదే దోషం అంతా. రామాయణాన్ని ఒక కాలం నాటి సాహి త్యంగా మాత్రమే ఎంచాలి. అది ఆ నాడు కూడా 'అభివృద్ధి నిరోధకంగానే' ఉందనే సంగతి గ్రహించాలి. దాని పవిత్రతకు నీరాజనాలు పట్టకుండా, దాన్ని లైబ్రరీ లలో జాగ్రత్తగా దాచి ఉంచుకోవాలి.

**పెద్ద పెద్దలెందరో అనేకులు రామాయణాన్ని పరిశీలించారు. వారు గతంలో రక రకాల పద్ధతుల్లో రాశారు గానీ, ఎవ్వరూ దాన్ని 'విషవృక్షం' అనలేదు, ఈ నాటికి దాన్ని విషవృక్షం చేసిన ఘనత మీకు దక్కింది. మీ పరిశీలనలో మీరొక విషవృక్షం చూశారు.**

**జ:** మీ ముందు రెండు మార్గాలు వున్నాయి. మొదటిది: ఎవ్వరూ అనని మాట ఈ నాడు ఒక వ్యక్తి అన్నంత మాత్రాన దానికి విలువ ఇవ్వకండి! రెండోది: ఆ మాట ఎందుకు అనవలసి వచ్చిందో, ఆ వ్యక్తి చెప్పేది ఏమిటో, పరిశీలించండి! ఈ రెండు మార్గాల్లో ఏదో ఒకటి ఎంచుకోండి. దానివేపు కొంచెం దృష్టి పెట్టడం గానీ, లేదా పూర్తిగా తిరస్కరించడం గానీ, ఏదో ఒకటి చెయ్యండి. అంతేగానీ, 'ఇన్నాళ్ళూ ఎవ్వరూ అనలేదు కాబట్టి ఇక ముందు కూడా ఎవ్వరూ అనకండి, దాని పవిత్రతని కలకాలం అలాగే ఉంచండి' అంటే, అది, అనాగరికమే గానీ, సిద్ధాంత చర్చ కాదు. కనీస తర్క జ్ఞానమూ కాదు.

**రాముణ్ణి మానవ మాత్రుడిగా చూడాలని ఎంత తర్కం మాట్లాడినా, రాముడికి సంబంధించిన ఏ కథ చదివినా రాముడు మానవోత్తముడనే తోస్తుంది తప్ప కుండా.**

**జ:** 'ఆ మహానుభావుడు ... ఆ పురుషోత్తముడు ... ఆ కరుణా సముద్రుడు ... ఆ పాప సంహారకుడు' అంటూ, మీ చుట్టూ ఊదరగొడుతోంటే అలాగే అని పిస్తుంది. అదే సమాజ ప్రభావం. పది మందీ, ఏ మాట అంటే ఆ మాట మీదే విశ్వాసం ఏర్పడుతుంది. అది నిజమో, కాదో గ్రహించడానికి కొంత కొత్త ఆలోచన కావాలి. అలా చూస్తే, రాముడు రాజ్యభ్రష్టుడై రాజ్యం కోసం తహ తహలాడుతూ తిరిగిన సాధారణ రాజ కుమారుడి లాగ మాత్రమే కనపడతాడు.

**రామాయణం గురించి ఇంత తతంగం చెయ్య వలసిన అవసరం ఉందని నే ననుకోను. ఇద్దరు మొగాళ్ళు ఒక ఆడదాని కోసం కొట్టుకున్న కథ అది.**

**జ:** ఇద్దరు మొగాళ్ళు ఒక ఆడదాని కోసం కొట్టు కోవడం లోనే ఒక సమాజ పరిస్థితి ఉంది. అది, మగవాళ్ళ కథే కాదు, అందులో ఒక స్త్రీ కూడా వుంది. ఆ మొగాళ్ళ దెబ్బలాటలో, ఆ స్త్రీ పాత్ర ఏమిటి? ఆ స్త్రీ, ఏ మొగాణ్ణి ఇష్టపడింది? స్త్రీ ఇష్టాయిష్టాలతో పని లేకుండా ఇద్దరు మొగాళ్ళు కొట్టుకోవడం ఏమిటి? రామాయణానికి కేవలం మీరు చెప్పిన లక్షణమే ఉన్నప్పు డైనా ఈ విషయాలన్నీ పరిశీలించవలసి ఉంటుంది.

**ప్రాచీన సంస్కృతి మీద ఎందుకీ దాడి? మీరు చెప్పల్చుకున్న కొత్తదేమిటో చెప్పరాదూ?**

**జ:** 'ప్రాచీన సంస్కృతి' అని మీరనేది ప్రాచీన సంస్కృతే కాదు. అదే ప్రస్తుత సంస్కృతి కూడా. దాంట్లో మంచేవిటో చెడ్డేవిటో, దాన్ని ఎంతవరకూ స్వీకరించాలో

ఎంతవరకూ తిరస్కరించాలో, అవి పరిశీలించుకునే మార్గంలోనే కొత్త సంస్కృతిని ఏర్పరచుకుంటాము. అందుకే పాత సంస్కృతిని పరిశీలించాలి. పాత దానిలో చెడ్డని వదిలేసి మంచిని నిలుపుకోవాలి. అందరికీ సమాన హక్కులూ, సమాన బాధ్యతలూ వుండాలనే దృష్టి తోనే ఈ పరిశీలన వుండాలి. అలాంటి దృష్టి ఉంటేనే పాత దాని స్థానంలో ఏ కొత్త భావాల్ని తెచ్చుకోవాలో తెలుస్తుంది. కొత్త సమాజం గానీ, కొత్త సంస్కృతి గానీ (కొత్త జీవనం), పాత దానితో సంబంధం లేకుండా రాదు. పాతది ఒక చోట ఆగిపోయి, తెగిపోయి, అక్క ణ్ణించి హఠాత్తుగా కొత్తది ప్రారంభం కాదు. పాత సంస్కృతిని విమర్శ లేకుండా వదిలేసి, కొత్త దాన్ని సృష్టించుకోలేము. పాతదాన్ని విమర్శించుకునే క్రమం లోనే కొత్తది తయారవుతుంది.

**ఊర్మిళ వాసంతితో మాట్లాడుతూ, తమ పుట్టింట్లో సీతకు నాస్తిక బ్రాహ్మణుడు 'పతివ్రతవి అవుతావు' అని జోస్యం చెప్పేవాడని చెపుతుంది. నాస్తికులకు జోస్యం మీద నమ్మకం ఉండదు కదా?**

**జ:** జోస్యం అంటే, గ్రహాల నడకల్ని బట్టి చెప్పే జోస్యం అని అర్థం కాదు. సీత స్వభావాన్ని పరిశీలించి 'నువ్వు పతివ్రతగా ఉండడానికి ఇష్టపడతావు' అని చెప్పారని అర్థం.

**రామాయణంలో అయినా, ఏ కథలో అయినా, కొంత అధర్మంగా కనబడే విషయాలను విమర్శించ డంలో తప్పు లేదు. కానీ రాముడి ప్రవర్తనలో గాంభీ ర్యాన్ని కూడా విమర్శించడం ఏ పద్ధతికి చెందుతుంది?**

**జ:** వాల్మీకి కథ ప్రకారం, రాముడు ఎప్పుడూ గంభీరంగా మందహాసం చిందిస్తూ ఉంటాడు. కానీ ఒక దాసుడి పాత్ర అంత గంభీరంగా ఉండదేం? రాముడి ముందు లక్ష్మణుడు కానీ, ఇంకో దాసుడు గానీ భుజాలూ, నడుములూ వొంచి మెలికలు బడి నించుం టారు గానీ, ఎన్నడూ గాంభీర్యం ప్రదర్శించరేం? 'దాసులు ఎప్పుడూ హీనంగానే ప్రవర్తిస్తారు, యజ మానులు ఎప్పుడూ ఉత్తమంగానే ప్రవర్తిస్తారు' అను కోవాలా? ఎంత గొప్ప వాళ్ళయినా, ఎంత పేదవాళ్ళ యినా, ఒక్కో సందర్భాన్ని బట్టి గంభీరంగానూ ఉంటారు, ఆందోళనగానూ ఉంటారు కదా? నిజానికి దాసులే ఎక్కువగా కష్టాలలో ఆరితేరి, ఆపదలు సంభ వించినప్పుడు, యజమానుల కన్నా గంభీరంగా ఉంటారు. కానీ పాత కవుల దృష్టిలో, (ఈ నాటి రచ యితల దృష్టిలో కూడా) ధనికుల పాత్రలే గంభీరంగా ప్రవర్తిస్తాయి. గాంభీర్యం ఎప్పుడూ యజమానుల సొత్తే. వారే ఎప్పుడూ ఉన్నతంగా ప్రవర్తిస్తారు. అంటే, ఈ రచయితల ప్రకారం గాంభీర్యం అనేది ఏ పాత్రకైనా ఉండే వ్యక్తిగత లక్షణం కాదు. ఒక పాత్ర సాంఘికంగా గొప్ప స్థాయిలో ఉంటేనే రచయిత ఆ పాత్రకు 'గాంభీర్యాలు' అద్దుతాడు. సమాజంలో సిరి సంపదలూ, ఉత్తమత్వాలూ స్వంతం చేసుకున్న వాళ్ళే ఈ 'గాంభీ ర్యాలూ, మందహాసాలూ' కూడా స్వంతం చేసుకున్నారు. కాబట్టి, ఉత్తమ పాత్రలకు కవి ఇచ్చే ప్రత్యేక లక్షణా లన్నిటినీ ఊడబీకవలసిందే. వీపు మీద చీమలు పాకు తున్నప్పుడు ఎంత రాముడైనా గాంభీర్యం చెదరగొట్టు కోక తప్పదు. దానివల్ల రాముణ్ణి కించపరచిందేమీ లేదు. 'ఉత్తములు ఎల్లవేళలా గంభీరంగానే ప్రవర్తిస్తారు' అనే రచనా సాంప్రదాయాన్ని తిరస్కరించడం అది.

**భూస్వామ్య సమాజ ధర్మాలలో అంతా చెడ్డే గానీ, ఏమీ మంచి లేదా? 'అసూయ చెందరాదు' అనే నీతి ఉందనుకోండి. దాన్ని 'ఫ్యూడల్ నీతి' అనో, 'బూర్జువా నీతి' అనో అనడం ఎందుకు? ఏ సమాజంలో అయినా అది మంచిదా కాదా?**

**జ:** 'అసూయ చెందరాదు' అనడం బాగానే వుంది. దాన్ని విడిగా చూస్తే, అది చాలా మంచి నీతే. కాదని ఎలా అంటాం? కానీ, అసలు 'అసూయ' అంటే ఏమిటి? అది ఎవరికి కలుగుతుంది? ఎందుకు కలుగు తుంది? – ఈ విషయాలు ముందు అర్థం కావాలి. మేడలో, పరుపుల కుర్చీలో కూర్చున్న ధనవంతుడికి, తన గుమ్మం ముందు నిలబడ్డ బిచ్చగాడి మీద అసూయ కలుగుతుందా? తన ఇంట్లోనో, తన పొలంలోనో పని చేస్తున్న కూలీల మీద అసూయ కలుగుతుందా? – కలగదు. ఆ కూలీలకే, ఆ బిచ్చగాడికే, ఆ ధనికుడి మీద అసూయ కలిగితే కలగవచ్చు. అంటే, జీవిత పరిస్థితుల్లో వున్న తేడాలే ఒక పక్షం వాళ్ళలో అసూయని పుట్టిస్తాయి. సమాన స్థాయిలో వున్న వాళ్ళల్లో కూడా అసూయలు వుండడం చూస్తాం. అది కూడా ఆ సమాజ ప్రభావమే. అసూయకి మూలం సమాజ పరిస్థితుల్లోనే ఉంటుంది. అసూయకే కాదు. ఏ దుర్గుణానికైనా, సద్గుణానికైనా, ఆ సమాజంలో వున్న పరిస్థితులే కారణం. అసూయలు కలగడానికి దారి తీసే ఎక్కువ తక్కువలు ఉన్న సమాజం లోనే ఆ దుర్గుణం పుట్టుకొస్తుంది కాబట్టి, ఆ సమాజం లోనే 'అసూయ చెందరాదు' అనే నీతి కూడా అవసర మవుతుంది. మనుషుల మధ్య అసూయలు కలిగించే టంత తేడాలు లేని పరిస్థితులు వున్నాయనుకుందాం. అందరికీ ఉద్యోగాలూ, అందరికీ ఇళ్ళూ, అందరికీ చదు వులూ వుంటాయి. ఆరోగ్యాలు పాడైతే, అందరికీ వైద్యాలు దొరుకుతాయి. సుఖంగా బతకడానికి వీలైన

పరిస్థితులు అందరికీ వుంటే, అసూయలు ఎవరికి ఎవరి మీద కలుగుతాయి? అక్కడ 'అసూయ చెందరాదు' అని బోధించవలసిన అవసరం ఎందుకు వుంటుంది? అసూయ పుట్టడానికి తగిన పరిస్తితులు వుంటేనే ఆ నీతి పుట్టుకొస్తుంది. దానితో అవసరం ఉంటుంది. భూస్వామ్య సమాజంలో, అక్కడ వున్న పరిస్తితుల్ని బట్టి దాని ప్రత్యేక నీతులు దానికి వుంటాయి. అలాగే, పెట్టు బడిదారీ సమాజంలో కూడా దాని పరిస్తితుల్ని బట్టి దాని నీతులు దానికి వుంటాయి. అంటే, ఏ నీతి అయినా, సమాజంతో సంబంధం లేకుండా పుట్టుకొచ్చే విషయం కాదు.

'నీరు పల్లానికి ప్రవహిస్తుంది' అనే సూత్రం ఒక ప్రకృతి సూత్రం. అది ఏ సమాజంలో అయినా జరుగు తుంది. కానీ, 'అసూయ చెందరాదు' అనేది ప్రకృతి సూత్రం కాదు. అది ప్రకృతి సహజంగా పుట్టుకొచ్చే లక్షణం కాదు. అది సమాజంలో వున్న ఎక్కువ తక్కువ సంబంధాల్ని బట్టి పుట్టుకొస్తుంది.

ఫ్యూడల్ ధర్మాలలో ఏమీ మంచి లేదా? – అని అడిగారు. ఎందుకు లేదు? అయితే, ఆ మంచి అంతా ఆ సమాజంలో వున్న పేద వర్గంలోనే ఉంటుంది. ఎలా గంటే, అసూయనే తీసుకోండి. ఒక భూస్వామి ఉన్నాడు. ఒక కూలీ ఉన్నాడు. 'అసూయ చెందరాద'నే ఒక నీతి ఉంది. ఇక్కడ అసూయ చెందకుండా తనకు ఉన్న దానితో తృప్తి పడవలసిన అవసరం ఎవరికి కలుగు తుంది? పేద మనిషికే కదా? ఆ నీతి ఆ మనిషి మీదే పని చేస్తుంది. ఒక వేపు అసూయ కలుగుతోన్నా, దాన్ని అణచుకోడానికీ, మనసుని మంచిగా ఉంచుకోడానికీ ఆ వ్యక్తి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో ఎంత సాధిస్తాడో, అసలు సాధిస్తాడో లేదో, అది వేరే సంగతి. ఈ నీతులన్నీ ఎవరి కోసం ఉన్నాయో వాళ్ళే వాటిని ఎంత అల్పంగా అయినా, ఎంతో కొంత ఒంట పట్టించుకుంటారు. పేద ప్రజలందరూ నీతి చంద్రుల్లా ఉంటారని దీని అర్థం కాదు. వారి పరిస్తితులు వారిని అలా ఉండనివ్వవు. కానీ, వర్గ సమాజంలో, నీతీ నిజాయితీ అనేవి ఎక్కడైనా వున్నాయి అంటే, అవి ధనిక వర్గంలో మాత్రం వుండవు. ఉంటే, పేద వర్గంలోనే ఉంటాయి.

**రాముడి పాత్ర ద్వారా ఏక పత్నీ వ్రతం అవే విలువని బోధించాడు కవి. అది మంచిది కాదా?**

**జ:** మంచిదే. కానీ, దానికి కవి ఏమీ ప్రత్యేకత ఇవ్వలేదు. ఆ మాటలు కవి ఎక్కడా వాడలేదు. రాముడికి సీత తప్ప ఇతర భార్యలు లేరు కాబట్టి, కవి, రాముడి పాత్ర ద్వారా ఏక పత్నీ వ్రతాన్ని చెప్పాడని మనం అను కుంటాం. మనం అనుకోవడమే గానీ, కవి, తన మాటలతో ఆ విషయం గురించి ఏమీ చెప్పలేదు. కథ పొడుగునా అనేక నీతులూ ధర్మాలూ చెప్పిన వాడు, పురుషుడు ఏక పత్నీవ్రతుడిగా వుండడం ఉత్తమమైన సంగతి – అని కూడా చెప్పవచ్చు. కానీ, కవి దృష్టిలో ఈ విషయం వున్నట్టు కనపడదు. పైగా, కథలో ఎక్కువ మంది భార్యలు వుండడం – అనే విషయం మీద సమర్థనే వుందిగానీ వ్యతిరేకత లేదు. వందల కొద్దీ భార్యలు వున్న దశరథుడు – మహా ఉత్తముడు! అలాంటి రాజులందరూ ఉత్తములే. ఈ కథలో రాముడికి ఒకే భార్యతో కథ ఎందుకు నడిచిందంటే, కథకి అదే అవ సరం. ఆ భార్య, భర్తతో పాటు వనవాసానికి వెళ్ళాలి. అక్కడ ఆమెని, శత్రువు ఎత్తుకు పోవాలి. అప్పటి నించీ ఆ భర్త విరహ శృంగారం అనుభవించాలి. ఒక్క భార్య అయితేనే ఈ కథ ఇలా నడుస్తుంది. కథకి అలా అవ సరం కాబట్టే ఒక్క భార్య. అంతేగానీ, ఏక పత్నీవ్రతాన్ని ఒక ఉత్తమ విలువగా చెప్పాలని కవి అభిప్రాయం కాదు. అందుకే దాన్ని గురించి ఎక్కడా ఒక్క మాట అయినా లేదు.

**"కల్ప వృక్షమని ఒకటున్నది. అది ఏది కావాలంటే అది ఇస్తుంది. నేను నా రామాయణానికి దాని పేరు పెట్టుకున్నాను. ఒక స్త్రీ రత్నము, 'విషవృక్షం' అని ఒక రామాయణం వ్రాసింది. మంచిదే. 'విషం' కూడా షడ్రస ములలో ఒకటే. అది జీవులకు పనికి వచ్చేదే. కొన్ని జీవులు కొన్ని రసములలో బ్రతికితే, విష జీవులు విషం తోనే బ్రతుకుతాయి."** [ఈ మాటలు **విశ్వనాథ సత్యనారాయణ గారు,** 1974 డిసెంబరు 14న, విజయ వాడలో జరిగిన ఒక సాహిత్య సదస్సులో ఉపన్య సిస్తూ చెప్పినవి. 'ఆంధ్రప్రభ' డైలీ, పేజి–2; 15-12-1974]

**జ:** కొన్ని జీవులు ఇతర రసాలలో బతికితే, కొన్ని జీవులు విషంలోనే బతుకుతాయి కదా? అలాగే, దోపిడీ జీవులు దోపిడీ రసంలో బతికితే, దాన్ని వ్యతిరేకించే జీవులు 'న్యాయ' రసంలో బతుకుతాయి. ఆ రకంగా, సత్యన్నారాయణగారు చెప్పింది చక్కగానే ఉంది.

సత్యనారాయణ గారు ఇంకా ఇలా కూడా అంటున్నారు.

**"... రామాయణాన్ని ఎవరు ఎలా విమర్శించినా అది ఆ కావ్య కథకు కళంకం కాదు.. జీవుని చిత్త వృత్తి ఎలా వుంటే ఆ కావ్యకథ అలాగే అర్థమవుతుంది."**

**జ:** చిత్త వృత్తి అనేది, వర్గ స్వభావమే. దోపిడీ వర్గ స్వభావం (ఆ భావాలు) ఉన్న వారికి రామాయణం కల్పవృక్షం లాగే అర్థమవుతుంది. దోపిడీని వ్యతిరేకించే వారికి ప్రతీ మత గ్రంథమూ విషవృక్షం లాగ అర్థమవుతుంది. చిత్త వృత్తి రహస్యం ఇదే.

**"... పరమేశ్వరుని అనుగ్రహం పొందడానికి జీవుడు మిత్ర భావం తోనూ మెలగవచ్చు; ద్వేష భావం తోనూ మెలగవచ్చు. ఎలా ప్రవర్తించినా జీవుడు పర మేశ్వరుని దగ్గరకు చేరేవాడే. సనక సనందులు శపిస్తే, జయ విజయులు వైర భక్తితో మూడు జన్మలలోనే విష్ణు మూర్తిని చేరుకున్నారు. నేను మిత్ర భావంతో పర మేశ్వరుని చేరుకుందామని 'కల్పవృక్షం' వ్రాశాను. ఆ స్త్రీ రత్నం, వైర భావంతో ద్వేష మార్గంలో పరమేశ్వరుణ్ణి చేరుకోవడం కోసమే 'విషవృక్షం' రాసిందేమో...!"**

**జ:** విషవృక్షం రాసినా పరమేశ్వరుణ్ణి చేరుకోక తప్పదన్న మాట! ఆ పరమేశ్వరుడు నన్ను చూసి ... "వచ్చావా? తొందరగా రావాలనే విషవృక్షం రాశావా?" అంటాడా? "అబ్బే! ఇక్కడికి రావాలని నాకేం లేదు. పాఠ కులకు ఏదో రెండు మాటలు చెపుదామని రాశానంతే" అంటాను. "మంచిదే. విషవృక్షం రాసిన దానివే వచ్చావు, కల్పవృక్షం రాసినాయన ఇంకా రాలేదేం?" అని పర మేశ్వరుడు ఆశ్చర్యపోవచ్చు.

"ఆ మాత్రం తెలీదా నీకు? నేను నీకు శత్రువుని కాబట్టి మూడు జన్మల్లోనే వచ్చాను. కానీ ఆయన భక్తుడు కదా? భక్తుడు కాబట్టి ఆలస్యంగా వస్తారట! నా లాగ మూడు జన్మల్లో కాదు... ఇంకా ఆలస్యంగా ... ఆరు జన్మల్లో! అదీ ఆయన భక్తి అంటాను!"

**"ఈ రామాయణ విషవృక్షము శాఖోపశాఖలుగా అభివృద్ధి చెంది భావి భారత బాలల హృదయాలలో నిలిస్తే? నిలవకూడదు. నిలిస్తే ఏముందిక? సర్వ భారతీయ సంస్కృతి, సభ్యత, మంట కలిసిపోతాయి" ఇవి కూడా ఆయన మాటలే!**

**జ:** దాని వల్ల భావి భారత బాలలకు పోయేదేమీ వుండదు, ఈ దోపిడీ సంస్కృతి తగిలించే బానిస భావాల సంకెళ్ళు తప్ప!

# కొన్ని అనుకూలాభిప్రాయాలు

[విషవృక్షాన్ని ఇష్టపడే పాఠకులు ఎలా ఆలోచిస్తున్నారో, దానికి ఎలాంటి కారణాలు చెపుతున్నారో, ఇతర పాఠకులకు కూడా తెలియాలి. ఈ ఉద్దేశం తోనే ఈ అనుకూలాభిప్రాయాల్ని కూడా చూపిస్తు న్నాను. ఇందులో, 'పొగడ్తల్లాంటివి' ఉన్నాయి కాబట్టి వీటిని చూపిస్తున్నానని అపార్థం చేసుకోకండి! 'విషవృక్షం' మొదటి భాగం వచ్చినప్పుడు, దాని మీద వచ్చిన అభిప్రాయాలు ఇవి]

**"... ఎం**తో కనువిప్పుగా ఉన్నది. రాసిన రామాయణమే భక్తుల చేత మళ్ళీ మళ్ళీ ఎందుకు రాయ బడుతున్నదో, తీవ్రమైన వర్గ విశ్లేషణలతో చూస్తే తప్ప ఆ విషవృక్షాన్ని సమూలంగా కూల్చలేం."

**".... ఒ**క వర్గం పరమ పవిత్రంగా నిత్య పారా యణ గ్రంథంగా భావించే రామాయణ నిజ స్వరూపం తెలిసిన వాళ్ళు చాలా తక్కువ మంది. నిష్కల్మష హృదయంతో, నిజాన్ని తెలుసుకొనగోరే జిజ్ఞాసువులకూ, ఆబాల గోపాలానికీ, ఇది ఉపకరిస్తుంది."

**"... వి**ప్లవవాదుల మనుకునే వారిలో కూడా రామాయణ భారతాది గ్రంథాల గూర్చి ఒక తరహా చూపు ఉంది. అనవసరంగా వాటి విషయంలో కాలం దుబారా చేయడం దేనికి? – అని వీరంటారు. భారతీయ సంస్కృతిపై వీటి ప్రభావాన్ని వీళ్ళు అంచనా వేయలేక పోతున్నారనే చెప్పాలి. మన సమాజంలో వీటి స్థానం అమోఘమైంది. వీటి పవిత్రతనూ, ప్రతిభనూ కద లించకపోతే – శంకించకపోతే – కాల రాయకపోతే – మనం చేయగలిగింది ఏమీ ఉండదు."

**"... ద**శరథుడు మరణించిన తరువాత ఏమ య్యాడో చెప్పే ఘట్టం పూర్తిగా కల్పితం మాత్రమే అయి రచయిత్రి ఊహాశక్తికీ, కల్పనా సామర్థ్యానికీ తార్కాణంగా నిలుస్తుంది. అయితే ఈ ఘట్టానికి సంబంధించిన వర్ణన, పురాణాలలోని అభూత కల్పనలను పోలి ఉంది. అందులో రాజులూ, వ్యాపారులూ, రుషులూ, పతి వ్రతలూ వగైరాల స్వర్గ కాంక్షల్లోని హైన్య దైన్యాలు వ్యక్త మయ్యాయి. భౌతిక వాదుల ఆత్మ స్వేచ్ఛలోని విశిష్టత వెల్లడించబడింది. అభూత కల్పన అయిన స్వర్గాన్ని అభూత కల్పనల ద్వారానే అపహాస్యం చేసే శిల్పం అవలంబించబడింది. కథాత్మక విమర్శనా పద్ధతిలో ఈ శిల్పం అవాంఛనీయమేమీ కాదు."

**".... రా**మాయణం – ఒక వర్గానికి కల్పవృక్షంగా కోరిన కోరిక లీడేరిస్తే, ఇంకో వర్గానికి విషవృక్షంగా ఎన్నో విషపూరిత ఫలాలను ప్రసాదించి, వాళ్ళను మను షులుగా కాకుండా జంతువుల కంటే హీనంగా నికృ ష్టంగా తయారు చేసింది. నూటికి పది మందికిది కల్ప వృక్షం. తక్కిన తొంబది మందికి విషవృక్షం. అందుకే ఆలోచించి రచయిత్రి ఈ పేరు పెట్టారు."

"**స్త్రీ** జాతిని ఈ వ్యవస్థ ఎట్లా చూసిందో, తయారు

చేసిందో రచయిత్రి స్పష్టంగా వివరించారు."

"దీన్ని ఇతర భాషల్లోకి దింపితే చాలా బాగుంటుంది. ఇందులో మంచి బాణాసంచా వుంది. అరవం, హిందీలు చాలు, నిప్పు పెట్టడానికి."

"... అధిక సంఖ్యాక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని శాస్త్రీయంగా పరిశీలిస్తే, రామాయణం అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ గూడా దోపిడీ వర్గాల కొమ్ముకాసే ధర్మపన్నాలు వల్లిస్తూ, శ్రమ జీవులందరినీ శాశ్విత బానిసత్వంలో మ్రగ్గించేందుకు ఉద్దేశించి రచించబడిన ఆదర్శ గ్రంథమని ఖచ్చితంగా రుజువవుతుంది. అది దోపిడీ వర్గాలకు మాత్రమే కల్ప వృక్షమనీ, పీడిత వర్గాలకు విషవృక్షమేననీ స్పష్టపడుతుంది. పై సత్యాలను నిరూపించడానికి ఈమె వాల్మీకి రామాయణంలోని శ్లోకాలను ఆధారం చేసుకునే తమ కృషి సాగించారు."

"... మొన్నీ మధ్య మా ఊర్లో... అనే తెలుగు మాస పత్రికను విడుదల చెయ్యడానికి ఒక రచయిత్రి వచ్చారు. విషవృక్షం మీద చర్చ జరిగింది. ఆమె చాలా హేళనగా మాట్లాడారు – "ఆ విషవృక్షం పెరిగి, దాని కొమ్మలు విస్తరించి, దాని వేళ్ళు విస్తరించి, విశాలమైతే ఇలాంటి పిల్లలు ఏమౌతారో' అందామె నన్ను చూపించి. మేం ఊరుకోలేదనుకోండీ. గట్టిగా ప్రతిఘటించాం. కొంత రగడ జరిగింది. మేమంతా పాడై పోతున్నామని తెగ బాధ పడిందావిడ."

"... అట్టడుగు వర్గాల పీడిత ప్రజానీకపు ప్రయోజనాల ఎడ ఆసక్తీ, ఆవేదన గల ప్రతీ అభ్యుదయ శీలీ, ముఖ్యంగా మార్క్సిస్టుననుకునే ప్రతి ఆలోచనాపరుడూ, సామాజిక విప్లవానికి పునాదియైన సాంస్కృతిక విప్లవం వైపు దృష్టి సారించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు నిజమైన కృషి ఇప్పుడిప్పుడే సాగుతూంది. అందులో ఒక భాగమే మార్క్సిస్టు అవగాహనకు దగ్గరగా సాగిన రామాయణ విషవృక్షం..."

"... రామాయణ గాథ యొక్క ఆత్మ, సారాంశంలో, ఫ్యూడల్ రాచరిక దోపిడీ వ్యవస్థను కాపాడటమేనన్నది స్పష్టం. అందువల్ల రామాయణాన్ని సామాజిక పరిణామం దృష్ట్యా విశ్లేషించడం ద్వారా, ఈ నాటికీ దాని విష ప్రభావాలకు బలియై పోతున్న ప్రజలకు దాని నిజ స్వరూపాన్ని బట్టబయలు చేయడం ఎంతైనా అవసరం."

"... ఈ కృషి మాత్రమే సామాజిక విప్లవాన్ని సాధించలేని విషయం నిజమైనా, ఇది అందుకు దోహదం చేస్తుందే గానీ, అవరోధం కాదు..."

".... ఇక మరొక బాపతు అభ్యుదయ విమర్శకులున్నారు. వారూ మార్క్సిజం గురించే మాట్లాడుతుంటారు. వారి దృష్టిలో రామాయణంలో రాముని విజయం, మంచికీ చెడుకీ జరిగిన సంఘర్షణలో మంచికి విజయం. రామాయణం భారత దేశాన్ని ఏక సంస్కృతిలోకి మలచిన మహా కావ్యం. రామాయణ సంస్కృతి భారత జాతి మొత్తం గర్వించదగిన సంస్కృతి. భారత జాతి అంటే – అది వర్గాతీతమైనదని వారి భావం కాబోలు! ... చరిత్రనూ, మార్క్సిస్టు మూల సూత్రాలనూ, తారుమారు చెయ్యటానికి వెనుకాడరు వారు. అందువల్ల రామాయణ విషవృక్షంపై ఈ కుహనా మార్క్సిస్టుల విమర్శను ఏ నిజమైన మార్క్సిస్టు విమర్శకుడూ పట్టించుకోవలసిన పని లేదు.

"ఆ రామాయణ కల్పవృక్షం దేశంలోని అధిక సంఖ్యాక ప్రజలకు దోపిడీ విష ఫలాలను అందిస్తే, ఈ రామాయణ విషవృక్షం వారికి వర్గ చైతన్యామృత ఫలాలను అందిస్తుందనడం నిజం."

"... నేను రామాయణ విషవృక్షం చదువుతున్నానని తెలిసి ఒకాయన నన్ను మందలించి 'మన సంస్కృతి ... మన సంప్రదాయం' అన్నాడు. 'అది తెలిసికోవడానికే చదువుతున్నాను. మీరూ చదువుతారా?' అన్నాను. 'వద్దు, వద్దు' అన్నాడు. 'ఏం? చదవగానే నాస్తికుడవై పోతానని భయమా?' అన్నాను నవ్వుతూ. అతనే మళ్ళీ చాలా రోజుల తర్వాత ఈ వేళ చదవటానికి తీసుకెళ్ళాడు విషవృక్షాన్ని."

"... ఆమె తన పీఠికలో అన్నట్టు భారత చరిత్ర పరిణామాల గురించి మనకున్న ఆధారాలు చాలా తక్కువ. ఈ విషయంలో ఇంకా వివరంగా పరిశోధనలు జరగవలసి ఉంది. ఈ పుస్తకంలో ఆమె అభిప్రాయాలన్నీ సమగ్రంగా ఉండకపోవచ్చు. రామాయణ దోపిడీ సంస్కృతికి బలైపోతున్న అసంఖ్యాక పీడిత ప్రజల విముక్తి పట్ల ఆమెకు గల శ్రద్ధాసక్తుల కొద్దీ, ఆమె తనకు చేతనైన ప్రయత్నం చేశారు. సత్యాన్వేషణకై సాగే చరిత్ర సాగర మధనంలో, భవిష్యత్తులో లభించగల కొత్త ఆధారాలను, అనుభవాలను బట్టి ప్రస్తుత లోపాలను సవరించుకునే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. ★

# 'రామాయణ విషవృక్షం' సమాప్తం!

# కొత్తగా చేర్చిన వ్యాసాలు

## [ 4 వ ముద్రణలో, 2012 మార్చిలో ]

### ఈ వ్యాసాలు రాసిన సందర్భం:

**పవని నిర్మల ప్రభావతి** అనే రచయిత్రి, ఒక భక్తురాలు. ఎటువంటి భక్తురాలంటే, రామ కోటి ఒక సారీ, దుర్గ కోటి 10సార్లూ ( 10 కోట్లు ) రాసిన భక్తురాలు. తమ పొలంలో గుడి కట్టించి, రోజూ ఇంట్లోనూ, గుళ్ళోనూ, పూజలే పూజలు! ఈ భక్తురాలిని, 'నవ్య' వార పత్రిక వారు, "నవ్య నీరాజనం" శీర్షిక కోసం ఇంటర్వ్యూ చేసినప్పుడు, ఆవిడ తనకు ఇష్టమైన రచయిత్రిగా "రంగనాయకమ్మ" పేరు చెప్పింది. అది చూసి, నాకు ఆశ్చర్యం కలిగి, ఆవిడికి ఫోన్ చేసి మాట్లాడాను. " మీరు రామ కోటి రాసిన భక్తురాలు. నేను విషవృక్షం రాసిన మార్క్సిస్టుని. మీకు నేను అభిమాన రచయిత్రిని ఎలా అయ్యాను? మీరు విషవృక్షం చదివారా?" అని అడిగాను.

ఆవిడ చాలా సంతోషంగా, " ఒక్కసారా? ఎన్ని సార్లు చదివానో!" అన్నారు.

" భక్తులకు విషవృక్షం నచ్చదు కదా?" అంటే,

" ఇతర్ల సంగతి నాకెందుకు? నాకు నచ్చింది. మీరు చెప్పాలనుకున్నది చెప్పారు" అన్నారు.

ఆవిడతో సాగిన సంభాషణతో నేను, **" నిర్మల పాఠకురాలు"** అనే పేరుతో 'నవ్య' లోనే ఒక వ్యాసం రాశాను. దాని మీద, ఇతర భక్తులు నన్ను తప్పులు పట్టడం ప్రారంభమైంది.

ఆ క్రమంలోనే నేను వరసగా ఇంకా **4** వ్యాసాలు రాశాను. ఆ సందర్భంలో రాసిన మొత్తం **5** వ్యాసాలు, **" మార్క్సిజమే తెలియకపోతే, పుట్టినవాళ్ళం పుట్టినట్టే వుంటాం!"** అనే పుస్తకంలో వున్నాయి. వాటిలో ప్రధానంగా 3 వ్యాసాలు, 'విషవృక్షం' లో కూడా వుంటే, విషవృక్షం పాఠకులకు అవి వెంటనే అందుబాటులో వుంటాయి కాబట్టి ఆ **3** వ్యాసాల్ని ' విషవృక్షం' లోకి కూడా చేరుస్తున్నాను. ఈ వ్యాసాలు, ఆ పుస్తకంలోనూ, ఈ పుస్తకంలోనూ కూడా వుంటాయి.

ఆ వ్యాసాలు చూడండి!

## 'నిర్మల పాఠకురాలు' వ్యాసం నించి కొంత భాగం:

'విషవృక్షం' వచ్చిన తర్వాత, భక్తుల్లో 3 రకాలుండడం చూశాను నేను. ఆ పుస్తకం గురించి వినని, తెలియని భక్తుల సంగతి కాదు. తెలిసిన వారిలోనే 3 రకాలు.

కొందరికి ఆ పుస్తకం మీదా, దాన్ని రాసిన మనిషి మీదా చాలా కోపం. - ఇది మొదటి రకం.

కొందరు, తమ భక్తి నమ్మకాలన్నీ అలాగే వుంచుకుంటూనే ఆ పుస్తకాన్ని ఇష్టంగానే చదువుతారు. ఆ పుస్తకం చదవమని ఇతరులకు కూడా చెపుతారు. - ఇది రెండో రకం.

ఇక మూడో రకం వారు - ఆ పుస్తకం పూర్తి చేసేటప్పటికి తప్పకుండా మారిపోతారు, నాస్తి

కత్వం వరకూ గానీ, మార్క్సిజం వరకూ కూడా గానీ.

ప్రభావతి గారు రెండో రకంలోకి వస్తారు.

అసలు, 'రామాయణం' లో మహా స్పష్టమైన విషయాలు 2 వున్నాయి. వాటిని ఏ భక్తులూ గమనించరు.

రాముడు, కథ ప్రకారం, పితృవాక్య పరి పాలకుడు.

అతడికి, తండ్రి ఇచ్చిన ఆజ్ఞలు 2.

(1) భరతుడికి పట్టాభిషేకం.

(2) రాముడికి, వనవాసంలో రుషి జీవనం.

ఆ కథలో ఆ రెండూ జరగలేదు! భరతుడికి పట్టాభిషేకమే జరగలేదు. అడవిలో వున్న రాముడి దగ్గిరికి భరతుడు వచ్చి పిల్చినప్పుడు, రాముడు ఏం చెప్పాలి? "ముందు నీ పట్టాభి షేకం జరిగి తీరాలి. అది జరగకుండానే ఆ రాజ్యం నేను తీసుకుంటే, నేను తండ్రి ఆజ్ఞని పాటించినట్టు అవదు. కాబట్టి మొదట నువ్వు పట్టాభిషేకం చేసుకుని, అప్పుడు వచ్చి అడుగు" అని చెప్పాలి.

భరతుడు అలాగే చేసి మళ్ళీ వచ్చి, రాముడి 'పాదుకలు' తీసుకు వెళ్ళి వాటికి పట్టాభిషేకం చెయ్యాలి.

నిజానికి, రాముడు 'పాదుకలు' ఇవ్వడం అప్పుడైనా తప్పు. తండ్రి ఆజ్ఞ - రాజ్యం, ఎప్పటికీ భరతుడిదే అని. రాజ్యం భరతుడి హక్కు అయితే, అతడు దాన్ని తన ఇష్టప్రకారం ఎవ్వరికైనా ఇచ్చు కోవచ్చు. కానీ, దాన్ని తీసుకోవడానికి రాముడు అంగీకరించకూడదు. అతడు తండ్రి ఆజ్ఞ ప్రకారం నడవాలంటే, ఆ రాజ్యాన్ని ఎప్పటికీ తీసుకోకూడదు. ఇలా జరిగితేనే, రాముడు, తండ్రి ఆజ్ఞని పాటించినట్టు అవుతుంది. కానీ, ఈ మొదటి ఆజ్ఞని రాముడు పాటించనే లేదు. - కవి, ఈ తప్పుని భక్తులు గ్రహించుకోలేదు.

**రెండో ఆజ్ఞ:** రాముడు, వనవాసంలో రుషి జీవితం గడపనే లేదు. రుషులు వేటాడరు. బాణాలు పట్టుకోరు. యుద్ధాలు చెయ్యరు. కానీ రాముడు అవన్నీ చేశాడు.

కవికి కొంచెం తెలివి వుంటే, ఈ లోపం కూడా జరగకుండా చెయ్యగలిగేవాడు. కైక, రాముడికి, చిన్న మినహాయింపు ఇచ్చినట్టు వుండాలి. "వన వాసంలో నువ్వు రుషి జీవితమే గడపాలి గానీ, నీకు ఆపద ఏదైనా సంభవిస్తే, అలాంటి సందర్భంలో నువ్వు బాణాలు పట్టుకోవచ్చు; యుద్ధాలు చేసుకోవచ్చు" అని, అతడి పట్ల దయతో ఒక అవకాశం ఇచ్చినట్టు వుండాలి.

వనవాసంలో, ప్రారంభ కాలంలో రాముడు వేటాడకూడదు. అది, లక్ష్మణుడు చెయ్యవచ్చు. రావణుడు సీతని ఎత్తుకు పోయిన తర్వాతే రాముడి భుజానికి బాణాలు ఎక్కాలి.

సారాంశం ఏమిటంటే, రాముడు, పితృ వాక్య పరిపాలన చెయ్యనే లేదు.

భక్తులు, ఈ విషయాలేవీ అర్థం చేసుకోరు. కథని, కథగా తీసుకుని, అందులో పాత్రలు ఎలా నడిచాయో, అది సరిగా వుందో లేదో, ఆలోచించరు.

★

# మనుషులనే వాళ్ళు ఆలోచించాలి, ఉక్రోష పడ్డం కాదు!

భక్తుల్లో, **3** రకాలు ఉంటారనీ, నిర్మల ప్రభావతి రెండో రకం లోకి వస్తారనీ, తెలుసు. ఆవిడ పెద్ద భక్తురాలైనా, 'విషవృక్షం' గురించి, "ఆమె పద్ధతిలో ఆమె రాశారు, అది ఆమె ఇష్టం" అంటూ సంస్కారం ప్రదర్శించడం చూశాం.

నేను, ప్రభావతి మీద రాసిన వ్యాసం తర్వాత, కొందరు భక్తులు నాతో, "ఆవిడే కాదు, మేమూ చదివాం లెండి ఆ పుస్తకం. నవ్వలేక చచ్చాం" అన్నారు, చదివిన సంగతులు జ్ఞాపకం చేసుకుంటూ. "అయితే మీరూ ప్రభావతి లాగా రెండో రకం భక్తులవుతారు" అన్నాను.

ఇప్పుడు, మొదటి రకం భక్తుల్లో ఒకరైన రామారావు గారు పత్రికలో కనపడి, పాత వాదనలే కొత్త మాటలతో సాగించారు, "రామాయణం

అంటే రంగనాయకమ్మకి ఎంత ఎకసక్కెం!" అంటూ.

రామారావు గారూ! అది 'ఎకసక్కెం' కాదండీ, తర్కం! దాన్ని 'ఎకసక్కెమే' అనుకుంటే, దానికి అర్హత వున్న గ్రంథమే అది!

ఎక్కడ ఎకసక్కెం అవసరమైతే అక్కడ అది వచ్చి తీరుతుంది. భార్యని ఎవడో ఎత్తుకుపోతే ఆందోళనతో చుట్టు పట్ల వెతుక్కుంటూ పరుగు లెత్తక, ఒక మొక్క దగ్గిర ఆగి, ఒక పువ్వు దగ్గిర ఆగి, ఒక పిట్ట వేపు చూసి, "తాటి పళ్ళ వంటి రొమ్ములు గల నా సీతని చూశావా? అరటి బోదుల వంటి తొడలు గల నా సీతని చూశావా?" అంటూ శృంగార కవిత్వం ఒలకబోస్తే, అది ఎకసక్కెం అవక, సందర్భశుద్ధి అవుతుందా రామారావుగారూ? (అరణ్యకాండ, 61వ సర్గ అంతా).

హనుమంతుడు సీత ముందు కూర్చుని, రాముడి పురుషాంగం ఎలా వుంటుందో వర్ణిస్తే, అది ఎకసక్కెం అవక, ఇంకోటి అవుతుందంటారా? (సుందర కాండ, సర్గ 35, శ్లోకాలు 9 నించీ 22).★

సీత కోసం లంకకి పోవడానికి సముద్రం ఒడ్డుకి చేరి, వానర బృందాలతో అక్కడ విడిది చేసి, అందరి ముందూ శ్రీరాముడు, విరహ గీతాలు మొదలు పెట్టి, 'తాటి పళ్ళ వంటి నా సీత రొమ్ములు ఎప్పుడు తాకుతానో' అని తన్మయత్వంలో మునిగితే, అది ఎకసక్కెం గాక, అపహాస్యం గాక, అస్తవ్యస్తత గాక, శృంగారం అవుతుందా? (యుద్ధ కాండ, సర్గ - 5, శ్లోకాలు 12, 13, 14).

సంతోషం ఎప్పుడో, విషాదం ఎప్పుడో పట్టించుకోని కవిత్వంలో, సందర్భ శుద్ధి ఉన్నట్టేనా?

"భరతుడికి పట్టాభిషేకం జరగనే లేదు, రాముడికే జరిగింది గానీ" అనే విమర్శని ఎగరగొడదామని ప్రయత్నిస్తే, ప్రయోజనం వుండదండీ. రాముణ్ణి పితృ వాక్య పరిపాలకుడిగా చూపించాలంటే, భక్తులు ఇంకో మార్గం ఆలోచించి వుండవలసింది.

ఇలా ఆలోచించి చూడండి:

పట్టాభిషేకం చేసుకోవడానికి భరతుడు తిరస్కరించి అన్నగారి దగ్గిరికే బైల్దేరి, అతణ్ణి రాజ్యానికి తిరిగి రమ్మంటాడు. అన్నగారి పట్ల అది అతడి భక్తి. అన్న గారు, తిరిగి రాజ్యానికి వెళ్ళడానికి తిరస్కరించడం వరకూ సరైనదే. అయితే, అతని 'పాదుకలు' ఇవ్వమని భరతుడు అడిగితే, దాన్ని రాముడు తిరస్కరించడు. "సింహాసనం మీద నా పాదుకలు వుండి, నా పేరు తోనే రాజ్య పాలన సాగితే, పట్టాభిషేకం నాకు జరిగినట్టే అవుతుంది. అది నీకు జంగాలి గానీ, నాకు కాదు. నీకు ఇష్టం లేకపోతే దానికి నేనేమీ నిర్ణయించ లేను. అది నా బాధ్యత కాదు. నా పాదుకలు ఇచ్చే తప్పు పని చేయను" అనాలి.

కానీ, రాముడు చక్కగా లేచి, పాదుకల్లో కాళ్ళు పెట్టి ఒక సారి తొడుక్కుని, తర్వాత వాటిని విడిచి పెడతాడు. (అయోధ్యా కాండ, సర్గ 112, శ్లోకం - 22). అంటే, పట్టాభిషేకం తన పేరున జరగడానికి రాముడు అంగీకరించి తన చెప్పులు ఇచ్చాడు.

కానీ, రాముడు అలా చెయ్యనని తిరస్కరించాలి. భరతుడు వెనక్కి వెళ్ళిపోయి ఏం చెయ్యాలంటే, అన్న గారి చిత్ర పటాన్నో, విగ్రహాన్నో, సింహాసనం మీద పెట్టి, దానికి పట్టాభిషేకం చెయ్యాలి. అలా చేస్తే, దానికి రాముడి బాధ్యత ఉండదు. అది రాముడి తప్పు అవదు. రాముడు, పితృ ఆజ్ఞని తిరస్కరించినట్టు అవదు. అది భరతుడి తప్పు కూడా అవదు. పితృ వాక్య పరిపాలన షరతు, రాముడికే గానీ, మిగతా కొడుకులకు లేదు గనక. కవి, ఇలా చేసి వుంటే, ఈ పట్టాభిషేకం విషయంలో రాముడికి అపచారం జరగదు. పైగా, ఆ పాత్రకి మేలు జరుగుతుంది.

---

★"పురుషాంగం" అనే మాట, వాల్మీకి శ్లోకంలో ఇంత వివరంగా వుండదు. కానీ, "మూడు పొడుగువీ, తొమ్మిది ఎరుపువీ" ఇలా వుంటే, అనువాదకులు వాటిని వివరిస్తారు. ఆ వివరాల్లో ఒక దాని కోసం, "అతి దీర్ఘము కాని లింగము" అని వుంటుంది. నేను చదివిన అనువాద గ్రంథాల్లో, సంస్కృత శ్లోకాలూ, ప్రతిపదార్థాలూ, తాత్పర్యాలూ, అనువాదకుల ప్రత్యేక వివరణలూ అన్నీ వున్నాయి. ఆ అనువాదకులు సంస్కృత పండితులే. ఈ వివరాలు, 'విషవృక్షం' లో, 311 వ ఫుట్ నోట్ లో ఇంకా ఎక్కువ తెలుస్తాయి. ★

కానీ, ఏవిటో భక్తులు అన్నిటికీ దబాయించాలని చూస్తారు. దబాయింపులతో గట్టెక్క గలమను కుంటారు.

ఒకప్పుడు నేనూ భక్తురాలినే, నిద్ర లేవగానే అరిచేతిలో, ' శ్రీరామ' అని రాసుకుని, దాన్ని కళ్ళకి అద్దుకుని, మంచం దిగేదాన్ని. పెన్నుతో కాయితం మీద రాయడానికి మొదలు పెట్టగానే, మొదట ' శ్రీరామ' అని ఒక చోట రాసి, ఆ తర్వాతే రాయ దల్చుకున్నది రాసేదాన్ని. అలాంటి భక్తురాలిని, వీరేశలింగం గారి పుస్తకాల్లో తర్కానికి నెమ్మదిగా ఆలోచిస్తూ, రెండో రకం భక్తురాలిగా మారాను. భక్తిని వదలకుండానే నాస్తిక పుస్తకాలు చదివేదాన్ని. తర్వాత మూడో రకంగా మారాను.

మారే వాళ్ళు మారతారు, లేని వాళ్ళు లేదు.

రామారావు గారు, ' రామాయణ' గ్రంథం మీద సర్వ హక్కులూ తనవే అనుకుంటున్నారు. అది తన ఆస్తి అనుకుంటున్నారు. దాని మీద గానీ, ఏ మత గ్రంథం మీద గానీ, నాస్తికు లెవరూ మాట్లాడ కూడ దనుకుంటున్నారు. కానీ, మత గ్రంథాలన్నీ రామా రావు గారి స్వంత రచనలే అయినా, వాటి మీద కూడా మాట్లాడే హక్కు ఇతరులకు వుంటుంది.

ఒక రచయిత, ఒక రచన చేసి, దాన్ని తన ఇంట్లో, తన పెట్లో దాచుకుంటే, అది వేరు. అది బైట తిరుగుతోందంటే, దాని మీద ఎవరైనా మాట్లాడ వచ్చు. అలా మాట్లాడేటప్పుడు ఎవరి దృక్పథంలో వాళ్ళు మాట్లాడుతారు.

రామారావు గారూ! ప్రపంచం అంతా భక్తుల ఆస్తి కాదండీ! మానవుల్లో, భక్తులూ, నాస్తికులూ అందరూ వున్నారు. మీరూ, మేమూ కూడా వున్నాం. " ప్రపంచం అంతా దేవుడి సృష్టి! రాముడి సృష్టి!" అని భక్తులు అంటే, " కాదు, ప్రపంచం అంతా భౌతిక ప్రకృతి! దేవుళ్ళూ, రాముళ్ళూ అందరూ కవుల కల్పన! అవన్నీ సాహిత్య కళల్లో, సంగీత కళల్లో భాగం" అని నాస్తికులు అంటారు.

అలా అన్న నాస్తికుల్ని, " నీచంగా రాశారు, చవక బారుగా రాశారు" అని భక్తులు అంటే, అంత కన్నా రెట్టింపు మాటలు నాస్తికులు కూడా అనగలరు. " భక్తులు నిజం చూడలేని అంధులు. నిజం ఆలోచించ లేని మూర్ఖులు. సాహిత్య విమర్శ తెలియని అజ్ఞానులు" అనలేరా నాస్తికులు? కానీ, అది చర్చ అవదు. అది వివేకం అవదు. తిట్లు, చర్చలకు ప్రత్యామ్నాయాలు అవవు.

రామారావు గారి లాంటి భక్తులు, నిర్మల ప్రభావతి వంటి భక్తురాలి నించి సంస్కారం నేర్చుకో గలిగితే నేర్చుకోవచ్చు! అది నచ్చక పోతే, 'విష వృక్షం' అనే మాటకీ, ఆ అక్షరాలకీ, చెవులూ కళ్ళూ మూసుకోవచ్చు. అది వారి ఇష్టం. "నువ్వెందుకు చెవులు మూసుకున్నావు? కళ్ళు మూసుకున్నావు?" అని ఎవర్నీ ఎవరూ అడగరు.

కానీ, మత గ్రంథాల్లో కనపడే ఏ అక్రమాలకీ, ఏ హేతు విరుద్ధతలకీ, భక్తులు చలించరు. అలా అని మౌనంగానూ వుండరు. ప్రతి దానికీ దబా యించాలని చూస్తారు. హనుమంతుడు సీత ముందు కూర్చుని రాముడి పురుషాంగాన్ని వర్ణిం చడం ఏమిటి? కవి అలా చేస్తే బాగుంటుందా? "ఈ ఘట్టంలో కవి ఇలా చేసి వుంటే బాగుండేది; అలా చేసి వుంటే బాగుండేది. ఈ పొరపాట్లూ, ఈ వైరుధ్యాలూ తప్పు" అని అనుకోరు. ఉన్న తప్పులనే ఎలా సమర్థించాలా అని తంటాలు పడతారు. సీత అగ్ని లోకి దూకడంలో రాముడి బాధ్యత లేనట్టు దాని మీద భక్తుల సమర్థన! రుషి జీవనంలో వేటా డడం మీద భక్తుల సమర్థన! అన్నిటికీ సమర్థనలే!

పద్నాలుగేళ్ళ తర్వాత అరణ్యవాసం ముగించి తిరిగి అయోధ్యకు పోవడానికి రాముడికి హక్కు వుంటుంది గానీ, అప్పుడైనా ఆ రాజ్యాన్ని తీసుకోవ డానికి హక్కు వుండదు. "రాజ్యం ఎప్పటికీ భరతు డిదే" అని తండ్రి ఆజ్ఞ. రాముడు, తండ్రి ఆజ్ఞ ప్రకారం నడవవలసినవాడు. భరతుడితో సహక రిస్తూ అయోధ్యలో వుండవచ్చు, అంతే.

కానీ, రాముడికి ఆ 14 సంవత్సరాలూ సింహాసనం ఎప్పుడు ఎక్కుతానా అనే తాపత్ర యమే. అయోధ్యకు పోయేటప్పుడు, శ్రీరామ చంద్రుడు ' భరతుణ్ణి శంకించే' ఘట్టాన్ని ఒక్క సారి గుర్తు చేసుకోండి!

భరతుడు పద్నాలుగేళ్ళ నించీ, తను కూడా

రుషి వేషంతో, అన్న గారి రాక మీద ప్రాణాలు పెట్టుకుని, ఆ శుభ దినం కోసం నిరీక్షిస్తూ వుంటే, అలాంటి తమ్ముడి మీద అన్న గారికి లక్ష అనుమానాలు! రాజ్యాన్ని భరతుడు నిజంగా తిరిగి ఇస్తాడా? - అని.

భరతుడి వాలకం కనిపెట్టి రమ్మని, రాముడు తనకు అందరి కన్నా ఎక్కువ బంటైన హనుమంతుడికి బోధించి పంపుతాడు. హనుమంతుడు వెళ్ళి భరతుడితో, "నీ అన్న గారు తిరిగి వచ్చేస్తున్నారు" అని చెప్పాలి. ఆ మాట విన్న వెంటనే భరతుడి ముఖ కవళికలు ఎలా మారతాయో జాగ్రత్తగా కనిపెట్టాలి. సంతోషంగా చూస్తాడా, అయిష్టంగా చూస్తాడా? ముఖంలో రంగు మారుతుందా, ఆకారం మారుతుందా? - ఆ ఆకారాన్నీ, ఆ రంగునీ, ఆ కవళికల్నీ అన్నిటినీ, సూక్ష్మంగా కనిపెట్టాలి. రాముడు, తన బంటుతో ఇంకా ఇలా చెపుతాడు. "సిరి సంపదలతో సమృద్ధిగా వుండే రాజ్యాన్ని వదలాలంటే ఎవరైనా ఇష్టపడతారా? రాజ్యాన్ని వదలాలంటే ఎవరికైనా మనసు ఎందుకు మారిపోదు? రాజ్యాన్ని నిజంగా వదులు తాడా? ఒక వేళ, రాజ్యాన్ని వదలనంటే ఏం చెయ్యాలి? బెదిరించాలి! శ్రీరాముడు మహా బలవంతులైన మిత్రులతో వస్తున్నాడని చెప్పు - అని చివరి బెదిరింపు! ( యుద్ధ కాండ, సర్గ - 128, శ్లోకాలు 1 నించీ 20 వరకూ ).

శ్రీ రామ చంద్రుడు, భరతుణ్ణి ఘోరంగా శంకించే, బెదిరించే ఈ ఘట్టాన్ని కూడా భక్తులు చక్కగా సమర్థిస్తారు! "అయ్యో! ఇంత అన్యాయమా! భరతుణ్ణి శంకించడమా! కవి ఆ రకం మాటలు వాడకుండా వుండవలసింది" అనుకోరు.

"భరతుడు సంతోషంగా రాజ్యాన్ని నాకు అప్పగిస్తేనే తీసుకుంటాను. లేకపోతే నే నేమీ బాధపడను. భరతుడి రాజ్య పాలనలోనే, అతడికి సంతోషంగా సహకరిస్తాను - అనే నిర్ణయంతో రాముడు అయోధ్యకి బయల్దేరాడు" అని రాముడు చెప్పినట్టు రాస్తే, ఆ రాముడి పాత్రకి ఎంతో విలువ వుండేది!

ఏ సంఘటనలోనూ భక్తులకు తర్కం వుండదు. అసలు ఏ గ్రంథాన్నీ ఒక ' కథ' లాగా చూడరు. కవి ఎలా రాశాడో, ఆ పాత్రలు ఎలా నడిచాయో, ఆలోచించరు. అసలు మనుషులనే వాళ్ళు తర్కంతో ఆలోచించాలి. జంతువులు ఆలోచించవు. ఆలోచించడం మనుషుల ప్రత్యేక లక్షణం!

అసలు శ్రీరాముడి కన్నా, లక్ష్మణుడి కన్నా, భరతుడు ఉత్తమ పాత్ర! భరతుణ్ణి శంకించే రాముణ్ణి గురించి, కనీసం ఆ శంకించే సంఘటన మీద అయినా ఆలోచన లేకపోతే, అది మానవ మస్తిష్కం అవదు. ఇంకేదో అవుతుంది. దాని పేరు నాకు తెలీదు.

[ 'నవ్య' వార పత్రిక అక్టోబరు 19, 2010 ] ★

# రాముడు ఏక పత్నీ వ్రతుడే! కానీ, అది ఎందుకో తెలుసా?

రాముడికి, 'సీత' గాక, ఇంకో భార్య గానీ, భార్యలు గానీ ఉన్నట్టు, కథలో ఎక్కడా కనపడదు. దీన్ని బట్టి, రాముణ్ణి ఏక పత్నీవ్రతుడిగానే అనుకోవచ్చు.

అయితే కవి, రాముడికి ఒక్క భార్యనే పెట్టింది, ఏక పత్నీవ్రతాన్ని గొప్ప విలువగా చెప్పాలని కాదు. ఆ విలువని చెప్పదలిస్తే, ఏక పత్నీ వ్రతులు కాని దశరథుడి వంటి పురుష పాత్రల మీద కథలో ఎక్కడో అక్కడ ఒకటి రెండు విమర్శలు చేసేవాడే. కథలో అలాంటి విమర్శలేవీ ఉండవు సరిగదా, ఎక్కువ మంది భార్యలు వున్న పురుష పాత్రలకు కూడా ఎక్కువ విలువ ఇస్తూ వర్ణించడమే కనపడుతుంది. రాముడికి శతృవు అయిన రావణుణ్ణి కూడా, ఎక్కువ మంది స్త్రీల మధ్య పడుకుని వున్నందుకు, "చుక్కల్లో చంద్రుడిలా" వున్నాడని పొగడుతాడు. అది ఆ పురుషుడికి గొప్ప! అంటే, కవి దృష్టిలో, పురుషుడికి ఎక్కువ మంది భార్యలూ, ప్రియురాళ్ళూ,

వేశ్యలూ వుండడం చాలా గొప్ప సంగతే.

అయితే, ఈ కవే రాముణ్ణి ఒక్క భార్య మాత్రమే కలవాడిగా ఎందుకు చేసినట్టు? - ఎందుకంటే, అది ఈ కథకి అవసరం! అత్యవసరం!

రాముడికి పది మంది భార్యలు వుంటే, కనీసం నలుగురు భార్యలు వున్నా, కథ చాలా అడ్డాలు తిరుగుతుంది. లేదా, అడుగడుగునా ఇబ్బందుల పాలవుతుంది.

రాముడు అరణ్యాలకు పోయేటప్పుడు భార్య కూడా వెంట వెళ్ళాలి కదా? ఒక్క భార్యతో కథ ఇప్పుడు ఎలా జరిగిందో మనకు తెలుసు. కానీ, నలుగురు భార్యలైతే? లేదా, తండ్రి గారికి ఉన్నట్టే ఈయనకి కూడా 300 కి పైగా భార్యలైతే? - వాళ్ళందరూ కూడా అడవికి బైల్దేరవలసి రాదూ?

ఆ భార్యల్లో ఒక్క భార్య మాత్రమే బైల్దేరి, మిగతా వాళ్ళు బైల్దేరక పోతే, భర్త వెంట వెళ్ళి నావిడే మహా పతివ్రత అవుతుంది; వెళ్ళని వాళ్ళు, మహా పతివ్రతలు కాలేరు. అలా కాకపోవడం, ఆ భార్యలకూ అవమానమే; మహా పతివ్రతలు కాని భార్యలు ఎందరో వున్న రాముడికీ అవమానమే. ఈ రకంగా, ఎక్కువ మంది భార్యలు వుంటే, ఈ అడవికి పోయే ఘట్టంలో చాలా ఇబ్బంది ప్రారంభమవుతుంది. ఒక్క భార్యే అయితే, ఆమె, మహా పతివ్రత కీర్తితో భర్త వెంట బైల్దేరగలదు.

కానీ, రాముడికి పది మంది భార్యలు వున్నారనీ, అందరూ మహా పతివ్రతలేననీ, అందరూ సీతలే ననీ, సీత లందరూ అడవికి బైల్దేరారనీ, అనుకుందాం. ఇక అప్పటి నించీ తర్వాత జరిగే ఘట్టాలన్నీ చాలా మారిపోవలసి వస్తుంది.

రావణుడు, రాముడి భార్యల్లో నించి ఎవర్ని ఎత్తుకుపోవాలి? రాముడికి ఒక్క భార్యే అయితే, ఆమెనే ఎత్తుకుపోవచ్చు. కానీ పది మంది భార్యలైతే? పోనీ నలుగురు భార్యలైతే? కనీసం ఇద్దరే అయితే? అందర్నీ ఎత్తుకుపోవాలి కదా? - రావణుడు రాక్షసుడే కాబట్టీ, వాడికి రథం వుంది కాబట్టీ, ఎత్తుకుపోగలడనుకోండీ! కానీ, దారి మధ్యలో వాడి రథం ఊడుతుంది. సీతని చంకలో నొక్కిపెట్టి ఎగురుతాడు. పది మంది సీతల్ని ఎత్తుకుపోవాలంటే, వాడికి పది చంకలు లేవు కదా? కాకపోతే, పది తలలు వున్నాయి కాబట్టి, ఒక్కో సీతని, ఒక్కో తల మీద కూర్చోబెట్టుకుంటాడేమో! వదిలిపెట్టడం మాత్రం ఒక్కళ్ళనీ వదిలిపెట్టడు లెండి! ఆడ వాళ్ళని వదిలేసే గుణం కాదు వాడిది. కాకపోతే, వాడి బుర్రల మీద కూర్చున్న వాళ్ళల్లో ఒకరో ఇద్దరో కిందకి పడ్డా పడొచ్చు. కింద పర్వతాల మీద, సుగ్రీవుడూ వాళ్ళ మధ్య పడ్డా పడొచ్చు.

పోనీ రావణుడు, ఆ పది మంది సీతల్నీ ఎగరేసుకుంటూ తీసుకుపోయి అశోకవనంలో క్షేమంగా పడేశాడనే అనుకుందాం.

ఇక ఇక్కడ రాముడి పర్ణశాల దగ్గిర, ఈ భర్త గారి శృంగార విరహ గీతాలు, ఒక్క భార్య కోసమే కాదు; పది మంది భార్యల కోసమూ, మార్చి మార్చి సాగాలి. ఆ భార్యల రొమ్ముల్నీ, తొడల్నీ, పది రకాలుగా లక్ష్మణుడి ముందు వర్ణిస్తూ విరహాలు ప్రదర్శించాలి. ఒక భార్య రొమ్ములు తాటి పళ్ళలా వుంటే, ఇంకో భార్య రొమ్ములు కొబ్బరి బొండాల్లా వుండాలి. పది మంది భార్యల సౌందర్యాలూ పది రకాల పళ్ళలా, వేరు వేరుగా ఉండాలి. (ఆ పళ్ళ పేర్లు నాకు తెలీవు లెండి. కవి గారికి అవన్నీ బాగా తెలుస్తాయి.) 'రొమ్ముల' సంగతి కదా? చాలా ఉత్సాహంగా పది రకాలుగా వర్ణించగలడు. అది అయ్యాక, తొడల సంగతి! అవీ పది రకాలుగా! తన భార్యల లోపలి అందాలు ఎలా వుంటాయో లక్ష్మణుడి ముందు చెప్పుకుంటూ, పూలనీ పిట్టల్నీ అడుగుతూ, చెట్ల వెంటా పుట్ల వెంటా పరుగులెత్తుతూ, పది మంది సీతల కోసం పది రెట్ల కాలాన్ని ఆ పర్ణశాల చుట్టే గడుపుతూ, కవి గారు రాసిన శ్లోకాలన్నీ అయిపోయే దాకా అక్కడక్కడే తిరుగుతూ వుండాలి. పది మంది ఆడ వాళ్ళ రహస్యాంగాల్ని వర్ణించడానికి కావలసిన పది రకాల చాతుర్యాల శ్లోకాలు ఇక్కడ పురుషులకు దొరికే అవకాశం వుంటుంది, రాముడికి పది మంది భార్యలు వుంటే!

రావణుడు ఎత్తుకుపోయిన ఆ పది మంది

ఆడ వాళ్ళూ అశోక వనంలో చెట్ల కింద చేరతారు. అక్కడ మళ్ళీ రావణుడు కూడా ఆ పది మంది స్తనాల్నీ, తొడల్నీ, వర్ణించాలి! పురుషులకు ఎంత ముచ్చట ఇది! అలా వర్ణించి వర్ణించి రావణుడు ఆ పది మందినీ అడగాలి, తన శయ్యా మీదకి రమ్మని!

ఆ పది మందీ, వాణ్ణి తిరస్కరించాలి. వాణ్ణి తిట్టాలి. ఈ పది రెట్ల శ్లోకాలూ సాగాలి ఇక్కడ.

ఇక తర్వాత, హనుమంతుడు అక్కడికి ప్రవేశించి, ఆ పది మంది పతివ్రతల ముందూ కూర్చుని, వారి భర్త పురుషాంగాన్ని, వారిలో ఒక్కొక్కరికీ వర్ణించి వర్ణించి చెప్పాలి. దానికి ఒక వంద శ్లోకాలు!

తర్వాత, 'అగ్ని పరీక్ష' ఘట్టంలో, పది చితుల మీద, పది మంది సీతలూ మంటల్లోకి ఉరకాలి! అందరూ అయోధ్యకి తిరిగి వెళ్ళాక, కొన్నాళ్ళకి రాముడు, భార్యల్ని శంకించాలి. ఆ భార్య లందరూ నిర్దోషులనీ, మహా పతివ్రతలనీ, అగ్ని దేవుడు లంక లోనే చెప్పినా సరే, రాముడికి ఇంకా కడుపులో శంకలే. ఎవడో తాగి తందనాలాడుతూ ఏదో కూశాడని, రాముడికి వంక దొరికింది! మరి, అగ్ని పరీక్ష జరిగింది ఎందుకు? దాని వల్ల ప్రయోజనం ఏమిటి? అగ్ని దేవుడి మాటకే లెక్క లేదా? (రాముడు సీతని వదిలేశాడని అగ్ని దేవుడికి తెలిసిందా? 'నా పరువేం గావాల'ని గోల పెట్టడూ?) రాముడికి, పది మంది సీతలు వుంటే, ఆ పది మంది భార్యలూ అడవి పాలవ్వాలి.

అది సరే, కుశలవులు ఎవరికి పుట్టాలి? - ఎవరికేమిటి? పది మంది సీతలకీ పుట్టాలి. ఒక్కొక్కరికీ ఇద్దరేసి కవలల చొప్పున, మొత్తం 20 మంది కుశలవులు పుట్టాలి!

ఈ పిల్లలు పుట్టడంలో, రాముడికి ఎక్కువ మంది భార్యలు వున్నట్టయితే, అతడికి చాలా అవమానం కలిగించే సంగతి ఎదురవుతుంది. అదేమిటంటే: సీతకి పిల్లలు పుట్టడం, 14 ఏళ్ళ అరణ్య వాసం తర్వాతే జరిగింది. అప్పటికే సీతా రాములకు వివాహం జరిగి కొన్ని ఏళ్ళు అయింది. వివాహం నించీ జరిగిన కాలం బహుశా 20 ఏళ్ళుగా లెక్క తేలవచ్చు. రాముడికి ఒక్క భార్యే అయితే, ఎన్నేళ్ళ దాకా పిల్లలు పుట్టక పోయినా, ఆ లోపం, లేదా ఆ అనారోగ్యం, భార్యదో, భర్తదో, ఎవరిదైనా కావచ్చు. అక్కడ 'భర్తదే లోపం' అని రుజువయ్యే మార్గం వుండదు. (అది ఎవరి లోపం అయినా, అది వాళ్ళ నేరం అవదు. అది వేరే సంగతి.)

కానీ, ఆ పురుషుడికే పది మంది పతివ్రత భార్యలు వుండి, అన్ని ఏళ్ళ దాకా ఏ స్త్రీకీ బిడ్డలు కలగలేదంటే, అది ఆ పురుషుడి లోపంగానే బయట పడుతుంది. అతడి తండ్రికి 300 భార్యలు వున్నా, అదేదో వ్రతం చేసే దాకా బిడ్డలు కలగలేదు కదా? అలాంటి లోపం ఏదో రాముడికీ సంక్రమించిం దేమో అని, అందరికీ అనుమానాలు పుడతాయి. ఈ గోలంతా, ఎక్కువ మంది భార్యలు వుంటేనే! చక్కగా ఒక్క భార్యే అయితే, రాముడి పురుషత్వం పరువు మీద ఏ సందేహాలూ రావు.

ఈ రకంగా, రాముడికి ఒక్క భార్యే గాక, ఎక్కువ మంది భార్యలు వుంటే, కనీసం ఇద్దరు వున్నా, కథ నడక, చాలా ఇబ్బందుల పాలవు తుంది. అడవికి పోవడమూ, అతడి భార్యని శత్రువు ఎత్తుకు పోవడమూ, అగ్ని పరీక్షా, కవలలు పుట్టడమూ - ఈ ఘట్టాలన్నీ వుండే కథ కదా ఇది? ఈ ఘట్టాలన్నీ సవ్యంగా నడవాలంటే, ఒక్క భార్య తోనే కథ నడవాలి. ఎక్కువ భార్యల్ని పెడితే కథ నడవదు. అందుకే, రాముడికి ఒక్క భార్యే! అదే, కథకి అవసరం! అత్యవసరం! దానికి, 'ఏక పత్నీ వ్రతం' అని పేరు పెట్టకుంటే పెట్టుకోవచ్చు! కానీ, ఏక పత్నీ వ్రతాన్ని గొప్ప విలువగా చెప్పాలనే దృష్టి కవికి లేకపోయినా, ఈ కథలో అలాంటి పురుషుడు ఒక్కడైనా కనపడ్డందుకు, ఆడ వాళ్ళు సంతోషించవచ్చు, మగ వాళ్ళు దుఃఖించినా!

[ దీన్ని ఏ పత్రిక్కీ ఇవ్వలేదు. ఇది, "మార్క్సిజమే తెలియకపోతే..." పుస్తకంలోనే మొదటి సారి, 2010 నవంబరులో వచ్చింది. ]

★

# మంత్రాల కన్నా తుప్పర్లే ఎక్కువ!

భక్తుల్లో ఒక రకం వాళ్ళు నోరు తెరిస్తే మంత్రాలు వల్లిస్తారు. ఉత్త మంత్రాలైతే ఫర్వా లేదు. వాటి దారిన అవి గాలి లోకి పోతాయి. కానీ మంత్రాలతో పాటు ఆ చుట్టు పక్కలంతా తుప్పర్లతో చీదర చీదర చేస్తారు. మంత్రాల కన్నా తుప్పర్లే ఎక్కువ అనే సామెత ఒక భక్తుడే అప్పుడప్పుడూ చెప్పి నవ్వుతూ వుంటాడు.

తుప్పర్ల భక్తులికి, మూతులు తుడుచుకోడం తెలీదు. వాళ్ళకి, హేతుబద్ధత అనే మాట గిట్టక, ఏ ప్రవర్తన లోనూ ఒంటి మీద స్పృహ వుండదు.

ఈ తుప్పర్ల వాళ్ళు, మత కథలన్నీ తమ తాతల సొత్తనుకుంటారు. ఏ కథ గురించి ఎవ్వరైనా మాట్లాడవచ్చనే ఇంగితం వుండదు వాళ్ళకి. మనుషులనే వాళ్ళు దేని మీదైనా ఆలోచించ వచ్చని తోచదు వాళ్ళకి. ఆలోచించే వాళ్ళ మీద తిట్లకి దిగి, తిట్లతో నెగ్గగల మనుకుంటారు.

"నిర్మల పాఠకురాలు" వ్యాసంలో, రామాయణం కథ మీద నేను రాసింది ఏమిటీ? - రెండే ప్రశ్నలు! భరతుడికి పట్టాభిషేకం జరిగిందా; రాముడు, ఋషి జీవితం గడిపాడా? అని. ఆ విషయాల మీద ఆసక్తి వున్న వాళ్ళు వాటి గురించే చర్చించాలి. ఆ ప్రశ్నలు నచ్చని వాళ్ళు, వాటి వేపు చూడకుండా వదిలెయ్యాలి. - ఇదీ అదీ ఏదీ లేకుండా, "రంగనాయకమ్మ, తన పుస్తకాలు అమ్ముకోడానికి ఇలా చేస్తోంది. అనారోగ్యంగా వున్న ప్రభావతిని ఉపయోగించుకుంటోంది. రంగనాయకమ్మ బైబిల్ మీదా, ఖురాన్ మీదా రాయగలదా?" అంటూ అసందర్భ ప్రేలాపనలు సాగిస్తున్నారు. ఈ రకం ప్రేలాపనలతో అసలు ప్రశ్నల్ని మాయం చెయ్య గలమనుకుంటున్నారు.

ఏ కథ గురించి పరిశీలించే టప్పుడైనా, "ఆ కథ ఏమిటి? అందులో పాత్రల నడకలు ఏమిటి? ఆ కవి, లేదా ఆ రచయిత, అందులో ఏ సందర్భాన్ని ఎలా చిత్రించాడు?" అనే ప్రశ్నలు వస్తాయి. రామాయణం కథ మీదైనా అలాగే వస్తాయి. ఆ ప్రశ్నలకే జవాబులు వెతుక్కోవాలి. లేకపోతే, వాటి వేపు చూడకుండా వూరుకోవాలి.

తుప్పర్ల భక్తులు మళ్ళీ మళ్ళీ గ్రహించ వలసిందేమిటంటే, 'మత కథలు, వారి బాబుల, తాతల, ముత్తాతల సొమ్ములు కావు' అని! 'అవి, వారి సొంత ఆస్తులు కావు' అని! అవి పబ్లిక్ రచనలు! వాటి మీద ఎవ్వరైనా మాట్లాడవచ్చు, ఎవ్వరైనా చర్చించవచ్చు, ఎవ్వరైనా ప్రశ్నించ వచ్చు. అది సాహిత్య పరిశీలన! సాహిత్య విమర్శ! ఇంత చిన్న విషయం తెలుసుకోకుండా ఎగబడే వాళ్ళు, కొంచెం ఇంగిత జ్ఞానం నేర్చుకోవాలి.

నేను మాట్లాడేది, మీ ఆత్మల్లో వున్న రాముణ్ణి గురించి కాదు; వాల్మీకి కథలో వున్న రాముణ్ణి గురించి. మీ విశ్వాసాల గురించి కాదు, <u>ఒక కథ గురించి!</u> దాని మీద నా అవగాహనతో నేను మాట్లాడతాను. చెప్పుకోగలిగితే చెప్పుకోండి, లేక పోతే మొహాలు తిప్పేసుకోండి!

నేను 2 ప్రశ్నలు వేశాను గానీ, మిమ్మల్ని తిట్ట లేదు. మీరు నన్ను తిట్టడానికి మీకు హక్కులు వుండవు. కాబట్టి మానవ జంతువుల్లా గాక, కొంచెం మానవుల్లా ప్రవర్తించాలని తెలుసుకోండి!

'రామాయణం కథ' మీద అనేక వందల ప్రశ్నలు వున్నాయి. చదివితే చదవండి; మానేస్తే మానెయ్యండి! అది మీ ఇష్టం! ప్రశ్నలు అడిగే వాళ్ళ మీద ఎగబడితే, ఏ దేవుళ్ళూ మిమ్మల్ని రక్షించరు!

దశరథుడి రాజ్యం, అతడి తదనంతరం భరతుడికే హక్కు అని, రాముడికి మహా స్పష్టంగా తెలుసు. ఆ సంగతి రాముడే తన నోటితో తను చెపుతాడు. రాముడు అడవుల్లోకి పోయాక, అతన్ని తిరిగి రాజ్యానికి రమ్మని పిలవడానికి భరతుడు వెళ్ళినప్పుడు, ఇక రాజ్యం తనకే దక్కబోతోందని రాముడికి తెలిసి పోయాక, తను చాలా సత్యాలు మాట్లాడుతున్నట్టు, ఆ సత్యాల్ని తనే స్వయంగా భరతుడికి ఇలా చెపుతాడు: "మన తండ్రి, నీ తల్లిని వివాహం చేసుకునే సందర్భంలో, ఆమె పుత్రుడికే తన రాజ్యం ఇస్తా నని, నీ తాతకి

వాగ్దానం చేసి వున్నాడు. అదే జరగాలని నీ తల్లి అడిగింది" అని. ( అయోధ్యా కాండ, సర్గ 107, శ్లోకాలు 2, 3, 4 )

అంటే, ఈ సంగతి తెలిసి కూడా రాముడు, ఆ రాజ్యాన్ని తనే తీసుకోవడానికి సిద్ధపడతాడు. దశరథుడు మహా సత్యవంతుడని, కథ మొదలవుతుంది. కానీ, కైక విషయంలో చేసిన వాగ్దానాన్ని ఎగరగొట్టి, రాముణ్ణి రహస్య మందిరం లోకి పిల్చి, 'భరతుడితో నీకు చాలా ప్రమాదం రావచ్చు. రేపు నీ పట్టాభిషేకం జరిగే వరకూ నీ మిత్రులందర్నీ చుట్టూ పెట్టుకుని జాగ్రత్తగా ఈ రాత్రి గడుపు' అని చెపుతాడు. ( అయోధ్యా కాండ, సర్గ 4, శ్లోకాలు 24 - 27 ) రాముడు దానికి చాలా ఆనందిస్తూ, భరతుడి మనుషులతో తనకు చాలా ప్రమాదం రావచ్చని తెల్లవార్లూ శంకిస్తూనే గడుపుతాడు.

అన్నిటి కన్నా వింత విషయం. రాముడితో సమాన వయసు వాడై, వివాహితుడు కూడా అయి వున్న భరతుణ్ణి పిలవకుండానే రాముడికే పట్టాభిషేక ప్రయత్నాలు! - ఇందులో తుప్పర్ల వాళ్ళకి వింత కనపడదు. "భరతుణ్ణి పిలవకుండా పట్టాభిషేకం ఏమిటి?" అనే ప్రశ్న రాదు. రాముడి పాత్ర ఇలా ప్రవర్తిస్తే, అది ఎంత దుష్ట పాత్ర అవుతుందో కవి ఆలోచించడు. ఎక్కడి కక్కడ ఆ పాత్రని దుష్ట ప్రవర్తనలతో, అసత్యాలతో, నింపేస్తాడు.

రాముడు, అడవికి పోయేటప్పుడు, "కంద మూల ఫలాలు తింటూ రుషి జీవనం చేస్తాను" అని చెపుతాడు ( అయోధ్యా కాండ, సర్గ 37 ). అడవి లోకి చేరగానే, వెర్రెత్తిన వాడి లాగా, ఒక్క సందర్భంలోనే, దున్నల్నీ, జింకల్నీ, నాలుగు జంతువుల్ని చంపి పడేస్తాడు. ( అయోధ్యా కాండ, సర్గ 52, శ్లోకం 102 ). మరి, 'కంద మూల ఫలాలు తింటూ రుషి జీవనం' అనే మాటలు ఎందుకు?

అసలు ఈ కథ ప్రారంభంలో ఒక వేటగాడు, చెట్టు మీద వున్న జంట పిట్టల్లో నించి ఒక పిట్టని కొడితే రెండో పిట్ట దుఃఖంతో విలపించిందనీ, అది చూస్తే కవి గారికి కవిత్వం పుట్టు కొచ్చిందనీ, వర్ణన వుంటుంది. మరి రాముడు తన బాణాలతో ఏ పిట్టల జంటల్నీ, ఏ జింకల జంటల్నీ, విడదియ్య లేదా? ఇలాంటి పనే, వేటగాడు, తన బతుకు దెరువు కోసం చేస్తే, అది అంత విషాద సంఘటన ఎలా అయింది? - తుప్పర్ల భక్తులు ఇలాంటి ప్రశ్నల్ని ఓర్చుకోలేరు.

రాముడు, అడవుల్లోకి పోయిన రాత్రి, లక్ష్మణుడి ముందు, తన దుఃఖం అంతా వెళ్ళబోసుకుంటూ, తండ్రిని ఎన్ని తిట్లు తిడతాడంటే, తిట్టిన తిట్టు తిట్టకుండా తిడతాడు. తండ్రి తనకు రాజ్యం ఇవ్వ లేదనీ, కైకతో కామానికి లొంగాడనీ, .... ఇదీ అదీ కాదు, నోరు పట్టని తిట్లు! ( అయోధ్యా కాండ, సర్గ 53 ). ఈ పుత్రుణ్ణి పితృ వాక్య పరిపాలకుడిగా చూపాలని కవి ప్రయత్నం!

భరతుడు అన్న గారి కోసం అడవుల్లోకి వస్తూ వుంటే, లక్ష్మణుడు భరతుణ్ణి దూరంగా చూసి, అతణ్ణి చంపుతానంటాడు. దానికి రాముడు, "భరతుణ్ణి ఎందుకు శంకిస్తున్నావు? అతడేం తప్పు చేశాడు? అతడు నాకు రాజ్యం ఇవ్వాలని వస్తున్నాడేమో! అది తెలుసు కోకుండా ఉత్తముడైన భరతుణ్ణి ఎందుకు శంకిస్తున్నావు?" అని లక్ష్మణుణ్ణి ఎన్నో విధాలుగా తిడతాడు ( అయోధ్యా కాండ, సర్గ 97 ). మరి భరతుడి వల్ల తన పట్టాభిషేకం జరుగుతుందో లేదో నని తనే భరతుణ్ణి ఎందుకు శంకించాడు?

రాముడి కథలో 'ఏక పత్నీ వ్రతం' అనే గొప్ప వ్రతం వున్నట్టు తుప్పర్ల వాళ్ళు పొంగిపోతూ వుంటారు. రాముడికి ఒక్క భార్యే వున్నా, అది ఏక పత్నీ వ్రతం కోసం కాదు. ఆ వ్రతాన్ని కవి ఎక్కడా ఎత్తలేదు. పైగా, ఎక్కువ మంది భార్యలు వున్న పురుషుల్ని తెగ పొగిడాడు. దశరథుణ్ణే కాదు, రాముడికి శత్రువు అయిన రావణుణ్ణి కూడా, అనేక మంది స్త్రీల మధ్య పవ్వళించాడని చెపుతూ, ఆ పురుషుడు "చుక్కల్లో చంద్రుడి లాగ" ఉన్నాడని వర్ణించాడు. అంటే, "ఏక పత్నీ వ్రతం" అనే గొప్ప విలువని చెప్పాలనేది కవి లక్ష్యం కాదు. కానీ రాముడికి ఒక్క భార్యనే ఎందుకు పెట్టాడంటే, ఆ

కథ నడవడానికి అదే అవసరం. రాముడు అడవులకు పోతూ వుంటే, సీత కూడా భర్తతో పాటు వెళ్ళాలి. పది మంది సీతలు వుంటే వాళ్ళం దరూ కూడా వెళ్ళాలి కదా? అక్కడ, రావణుడు సీతని ఎత్తుకు పోవాలంటే, ఎవర్ని ఎత్తుకు పోవాలి? పది మందినీ ఎత్తుకు పోవాలి. ఆ తర్వాత, శ్రీరాముడు, పది మంది భార్యల రొమ్ముల్నీ, నడుముల్నీ, తొడల్నీ, పది రకాలుగా వర్ణిస్తూ, పతివ్రతల రొమ్ముల్ని చూడాలని తుప్పర్ల వాళ్ళకి వుండే కుళ్ళు కాంక్షల్ని సంతృప్తి పరిచే లాగా వర్ణించాలి. రహస్య అవ యవాల వర్ణన ఆ నాటి కవితా సాంప్రదాయం అయితే, ఆ నాటి సాంప్ర దాయానికి ఈ నాడు కూడా సమర్ధనలు ఎందుకు? 'రొమ్ముల ప్రదర్శన నిషిద్ధమా?' అని ఒక తుప్పర్ల ఆడది అడుగుతోంది. ఇది గుడ్డలు విప్పి తిరిగే బూర్జువా ఆడదై వుంటుంది. లేదా, ఆడ పేరు పెట్టుకున్న తుప్పర్ల మొగదై వుంటుంది.

పది మంది భార్యలు వుంటే, అగ్ని పరీక్షల ఘట్టంలో కూడా పది చితులు తయారవ్వాలి. "సీత లందరూ నిర్దోషులే" అని అగ్ని దేవుడే స్వయంగా చెప్పినా, రాముడికి అనుమానాలు తీరవు. మళ్ళీ పది మంది సీతల్నీ వదిలెయ్యాలి. సరే, కుశలవులు ఎవరికి పుట్టాలి? ప్రతీ సీతకీ పుట్టాలి. ఒక్కొక్కరికీ ఇద్దరేసి కవలల చొప్పున, మొత్తం 20 మంది కుశలవులు పుట్టాలి! - ఈ రకంగా, రాముడికి ఇద్దరు భార్యల్ని పెట్టినా, ఇన్ని గొడవలు వస్తాయి. కాబట్టే, ఈ కథలో ఒక్క భార్య వుంటేనే కథ సవ్యంగా నడుస్తుంది. అందుకే ఒక్క భార్యని పెట్టడం జరిగింది గానీ, 'ఏక పత్నీ వ్రతం' అనే గొప్ప విలువని చెప్పడం కోసం కాదు.

ఆఖరికి, రాముడు, అయోధ్యకు తిరిగి పోతూ భరతుణ్ణి శంకించడం ఎంత నీచమైన సంగతి?

వాలిని చంపడం లాంటి దుర్మార్గపు ఘట్టాల్ని మళ్ళీ మళ్ళీ చెప్పుకోనక్కర లేదు. 'రామ రాజ్యం'లో బ్రాహ్మణులకే తిండి లేనంత బీద రికం ఉంది ( ఉత్తర కాండ, సర్గ 71 ). చిన్న కులస్తుడైన శంబుకుడు ఎక్కడో అడవిలో కూర్చుని, తన ప్రార్థన లేవో తను చేసుకుంటూ వుంటే, రాముడు అతణ్ణి కత్తితో నరికి తన నీచత్వం ఇంకో సారి ప్రదర్శిస్తాడు. ఇంకా చివరికి, రాముడు అనేక ఆటవిక రాజ్యాల మీద యుద్ధాలు చేయించి, అక్కడి జనాల్ని చంపిం చేసి, ఆ రాజ్యాల్ని, తమ్ముళ్ళ కొడుకులకు కట్ట పెడతాడు! ( ఉత్తర కాండ, సర్గలు 113, 115 ). ఇటువంటి నీచత్వాలు, అడుగడుగునా కొల్లలు! ఈ రాముడా, మహోత్తమ దైవం? ఈ రామ చరిత్రా, మానవ విలువల్ని పెంచి, మానవ జాతిని ఉద్ధరించేది?

నా చిన్నప్పుడు, 'కన్యాశుల్కం' నాటకం చదివినప్పుడు, అందులో గిరీశం పాత్రని చూస్తూ మొదట్లో చాలా ఆశ్చర్యపోయాను - "ఇదేమిటి, కథా నాయకుడు మంచివాడిగా వుంటాడు గానీ, ఇలా వున్నాడేమిటి?" అని. క్రమంగా అర్థమైంది, రచయిత, చెడ్డ పాత్ర గురించే రాస్తున్నాడు - అని.

అలాగే, 'రామాయణం' చదవడం మొదలు పెట్టినప్పుడు కూడా, రాముడి పాత్ర మీద ప్రారంభం నించే, "ఇదేమిటి, ఈ పాత్ర ఇలా వుందేమిటి?" అనే సందేహాలు మొదలయ్యాయి. కానీ ఇక్కడ, కవి, ఈ పాత్రని ఉత్తమ పాత్రగా చెపుతూ, అతడితో చాలా తప్పు పనులు చేయిస్తు న్నాడు. భరతుడికి హక్కు అయిన రాజ్యాన్ని తనే తీసుకోవడానికి, భరతుడికి తెలియకుండా అదంతా జరిపించడానికి, రాముడు సిద్ధపడడం తోనే కథ మొదలవుతుంది. అప్పటి నించీ ఆ పాత్ర మీద సందేహం పుట్టి, ఆ సందేహాలు క్రమంగా బలపడుతూ వచ్చాయి. ఈ పాత్ర గురించి కవి ఎన్ని గొప్ప గొప్ప వర్ణనలు చేసినా, ఆ గొప్పలు ఆ పాత్ర స్వభావంలో వుండవు.

ఆలోచించుకోవడం మానవుల సహజ లక్షణం! తుప్పర్ల వాళ్ళు కూడా ఆలోచిస్తారు. ఆ ఆలోచ నలు కుళ్ళు దారి పట్టకుండా వుంటే, ఎప్పటి కప్పుడు మూతులు తుడుచుకుని శుభ్రం చేసు కుంటూ వుంటే, పరిసరాలు శుభ్రం అవుతాయి. వాతావరణ కాలుష్యం వుండదు. మంత్రాలా? వాటితో ప్రమాదం లేదు, అవి గాలి లోకి పోతాయి! [ నవ్య వార పత్రిక 27-10-2010 ] ★

# రంగనాయకమ్మ రచనలు

**నవలలు — 13** రూ.లు

1. కృష్ణవేణి ................................................ 80
2. పేక మేడలు, 3. చదువుకున్న కమల ......... 13
   (ఈ రెండు పుస్తకాలూ ఒకే సంపుటంగా ) .............. 50
4. బలిపీఠం ................................................ 60
5. కూలిన గోడలు ........................................ 30
6. స్త్రీ ......................................................... 30
7. రచయిత్రి ( సవరించి, పెంచిన ప్రతి ) ................. 70
8. ఇదే, నా న్యాయం! ..................................... 50
9. కళ ఎందుకు? .......................................... 45
10. స్వీట్ హోమ్ ( 3 భాగాలూ కలిసిన సంపుటం ) ..... 140
11. అంధకారంలో... ........................................ 50
12. జానకి విముక్తి ( 3 భాగాలూ కలిసిన సంపుటం ) . 140
13. కళ్ళు తెరిచిన సీత ( యధార్థ గాథ ) ..................... 120

**నవలా పరిచయాలు — 3**

1. స్పార్టకస్ (హోవర్డ్ ఫాస్ట్ నవల)
2. టామ్ మామ ఇల్లు (హారియట్ బీషర్‌స్టోవే నవల)
3. స్వేచ్ఛాపథం (హోవర్డ్ ఫాస్ట్ నవల)
   [ ఈ 3 పుస్తకాలూ, ఒకే సంపుటంగా ] ........ 70

**నవలికలు — 5**

1. ప్రేమకన్నా మధురమైనది!
2. చుట్టాలు
3. ఆండాళమ్మగారు
4. పల్లెటూరు
5. నా డైరీలో ఒక పేజీ ( కొంత భాగం )
   ( ఈ 5 పుస్తకాలూ, ఒకే సంపుటంగా )........ 60

**కథా సంపుటం — 1**

1. అమ్మకి ఆదివారం లేదా? .......................... 170
   (50 కథలు ఒకే సంపుటంగా)

**పెద్ద వ్యాసాలు — 15**

1. నిశిత పరిశీలనా, దగాకోరు పరిశీలనా?
2. జనసాహితితో మా విభేదాలు
3. తీగలాగారు, డొంకంతా కదిలింది!
   [ ఈ 3 పుస్తకాలూ, ఒకే సంపుటంగా ] ...... 90
4. నీడతో యుద్ధం! ....................................... 35
   [నాస్తిక, హేతు, నవ్య మానవ వాదాలపై 3 పుస్తకాలు కలిసిన సంపుటం ]
5. చలం సాహిత్యం ..................................... 30
6. 'అసమానత్వం'లో నించి 'అసమానత్వం'లోకే!
7. తులసిదళం కాదు, గంజాయిదమ్ము!
8. 'యజ్ఞం' కథ మీద 2 వ్యాసాలు
9. ఈ 'చక్కని పాడియావు' ఎవరిది?
   [ 6 నించీ 9 వరకూ, ఒకే సంపుటంగా ] .... 90
10. వాడుక భాషే రాస్తున్నామా? ...................... 30
11. తెలుగు నేర్పడం ఎలా? ............................ 50
12. ఇంటిపనీ - బైటిపనీ ................................ 25
13. దళిత సమస్య పరిష్కారానికి.... ................... 60
14. ఇంగ్లీషు కీకారణ్యంలోకి ప్రవేశించండి! ........ 120
    (తెలుగు విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామరు పాఠాలు)
15. కమ్యూనిస్టు పార్టీ ఎలా ఉండకూడదు? ....... 60

**వ్యాసాల సంపుటాలు — 2**

1. మానవ సమాజం
   [ 'కొండని తవ్వి, ఎలుకని కూడా పట్టనట్టు!' పుస్తకం కూడా దీనిలోనే కలిసి వుంది ] .......... 90
2. మార్క్సిజమే తెలియకపోతే ........................ 100

**ప్రశ్నలూ, జవాబులూ — 2**

1. శాస్త్రీయ దృక్పథం ...............
2. పాఠకుల ప్రశ్నలూ, రంగనాయకమ్మ జవాబులూ
   [ ఈ 2 పుస్తకాలూ, ఒకే సంపుటంగా ] 60

**అనువాదాలు — 2**

1. చైనాలో ఏం జరుగుతోంది? ...................... 50
   [ 'జల్లెడకి ఎన్ని చిల్లులో అన్ని చిల్లులు' పుస్తకం కూడా దీనిలోనే కలిసి వుంది ]
2. చైనాలో సాంస్కృతిక విప్లవమూ, పరిశ్రమల నిర్వహణా! ............................. 50

**ఇతర రచనలు — 4**

1. రామాయణ విషవృక్షం (3 భాగాలూ కలిసి) ... 200
2. మార్క్స్ "కాపిటల్" పరిచయం ............... 330
   [ 2 సంపుటాలు గా ]
3. ఒకటవ తరగతి తెలుగు వాచకము ................................ 15
4. పిల్లల కోసం ఆర్థిక శాస్త్రం ....................... 100

ఈ పుస్తకాలు దొరికేచోటు:

**అరుణా పబ్లిషింగ్ హౌస్**

ఏలూరు రోడ్డు, విజయవాడ - 500 002, (ఫోన్: 0866 - 2431181)



# రామాయణ విషవృక్షం

